

# రైతు కథలు

సమర్పణ

గంధమనేని శివయ్య
GSMS
మెమోరియల్ సొసైటీ

# రైతు కథలు

సంకలనం:

**సాకం నాగరాజ**

గంధమనేని శివయ్య
GSMS
మెమోరియల్ సొసైటీ

**బైరాగిపట్టెడ, తిరుపతి – 517 501**

**రైతు కథలు**

సంకలనం : **సాకం నాగరాజ**

మొదటి ముద్రణ : **మార్చి, 2012**

ప్రచురణ : **గంధమనేని శివయ్య మెమోరియల్ సొసైటీ, తిరుపతి**

ప్రతులకు : **విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు**

ముద్రణ : **విజయవాణి ప్రింటర్స్, చౌడేపల్లె**

ధర : **500 రూపాయలు**

# వంద కథలే గాని వెయ్యి వ్యథలు!

ఏతం తొక్కడం, గూడ వేయడం, కపిలి తోలడం, సద్దాగడం, సంగటి తినడం, చిరు తిండిగా చిమ్మిలి తినడం – అన్నింటా పరిచయం వున్న కుటుంబం మాది. వంతుల వారీగా చెరువు కింది చేలకు నీళ్లు మళ్లించి కాపలా కాసే వాళ్లం.

క్రమంగా మనం తినే తిళ్లతోపాటు సేద్యాలు కూడా మారుతున్నాయి. రైతులు పండించిన వరి, వేరుశనగ, కంది, రాగి, జొన్న, సద్దలు – వీటి నుంచే కొన్ని గింజల్ని విత్తనాలకని పెట్టుకునేవాళ్లు. మా వూళ్లో ఒకే గుంటడు మిరపతోటలో పండని కూరగాయ అంటూ వుండేది కాదు. ఆ కాసింత నేలలోనే మిరపతోపాటు, గోంగూర, అవిశె, చుక్కాకు, టక్కాల, వంకాయ, బెండ, బీర... మిరపతోటలో బంతిపూల నాణ్యం యిప్పటికీ గుర్తుకు వస్తుంటుంది. యీ విత్తనాలన్నీ రైతులు దాచిపెట్టుకుని (బూడిద చల్లి మరీ) నాటుకునేవాళ్లు. కానీ ఈనాడు పేటెంట్ పేరుతో విత్తనాల రంగంలో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు రైతులను శాసిస్తు న్నాయి. విత్తనం కోసం కూడా రైతు 'మార్కెట్'ను ఆశ్రయించాల్సిన దుస్థితి. మట్టిలో వున్న మన మూలాలను, వేర్లను వ్యాపారస్తులు పెకలించి వేయడమంటే యిదే! ఫలితంగా సరళీకరణ, నూతన ఆర్థిక విధానాలు, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలతో గ్రామ రూపురేఖలే మారి పోయాయి. బతుకు తెరువు కోసం గ్రామాలు గ్రామాలు పట్టణాలకు వలసలు పోతున్నాయి.

వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దున్నకం ఎద్దులతో గాక ట్రాక్టర్లతో జరుగుతోంది. ఇది ప్రగతిగానే చెప్పుకోవచ్చు గానీ వున్న ఒక ఎద్దుకూ, రెండెద్దులకు కూడా మేత లేని పరిస్థితీ దాపురించింది. మా చిన్నతనంలో రైతులు బలిష్టంగా వుండేవారు. యిప్పుడు నలభై యేళ్ల రైతు తల నెరిసి పోయి, లొక్కి దవడలతో డెబ్బైయ్యేళ్ల ముసలి లాగా తయారయ్యాడు. రైతులోని శక్తి అంతా 'మార్కెట్' పరమైపోయింది.

ఆనాటి రైతు పచ్చగా కళకళలాడుతుంటే (అప్పుడు సమస్యలే లేవని కాదు) యీ నాటి సూపర్ మార్కెట్లూ, వాల్‌మార్ట్‌లూ కళకళలాడుతున్నాయి. రైతు పొట్టకూటికి పండించుకోవడం గాక, 'మార్కెట్'ను నింపడానికి పండించే దుష్పరిణామమిది.

స్థానిక జల వనరులైన కసిం కాలవలూ, గుంటలూ, చెరువులూ నీళ్లు లేక 'సర్కారు కంప'తో నిండిపోయాయి. జలవనరులకు పట్టిన దుర్గతి అంతా యింతా కాదు. యిప్పుడు రైతులకు 'భూ వనరులు' కూడా పోతున్నాయి.

మరీ ముఖ్యంగా మన రాష్ట్రం కేంద్ర ప్రభుత్వం 'చేతి'లో ప్రయోగశాలగా మారింది, మార్పించబడింది. దేశం మొత్తం మీద మన రాష్ట్రంలోనే ప్రత్యేక ఆర్థిక మండళ్లు (సెజ్‌లు) ఎక్కువగా వున్నాయి. ఎంత ఎక్కువగా అంటే జాతీయ స్థాయిలో మన రాష్ట్రంలోనే 109 ఆమోదించబడగా, నోటిఫై చేసినవి 76 వున్నాయి. మన రాష్ట్రం తర్వాత మహారాష్ట్రది రెండో స్థానం, తమిళనాడుది మూడోస్థానం. 23 రాష్ట్రాలలో సగం మూడు రాష్ట్రాలకిస్తే అందులో మన రాష్ట్రం ప్రథమంగా వుంటే... దాని అర్థం పాలకులకు మన మీద వున్న ప్రేమ గాదు. మన రాష్ట్రాన్ని వారి కుతంత్రాల పాచికకు ప్రయోగశాలగా మార్చాలన్న తలంపే. జల వనరుల్ని ఎప్పుడో పోగొట్టుకున్నాం, విత్తనాలను పోగొట్టుకున్నాం, యిప్పుడు మన కాలికింద వున్న నేలను కూడా పోగొట్టుకుంటున్నాం.

మర్చంట్ పాలసీ పేరుతో థర్మల్ విద్యుత్ కేంద్రాలు మన రాష్ట్రానికే మంజూరవుతున్నాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు చిల్లర వర్తకంలో కూడా చోటు చేసుకునే క్రమంలో వాల్‌మార్ట్‌ల పేరుతో మన రాష్ట్రానికే దాపురిస్తున్నాయి. ప్రస్తుతం మన రాష్ట్రం కేంద్రం అనే 'ధృతరాష్ట్ర కౌగిలి'లో విలవిలలాడుతున్నది.

తాగు, సాగునీరు పారిశ్రామిక రంగాలకు మళ్లించబడుతోంది. విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులో లేకుండా కార్పొరేటీకరణ దిశగా పరుగులిడుతోంది. చివరకు సాంస్కృతిక రంగాల్లో సైతం క్రూరమైన మార్పులు వస్తున్నాయి. మన వీధుల్లో మన కోసం పడిగాపులు కాస్తూ వుండిన తోలు బొమ్మలాటలూ, వీధినాటకాలూ పోయి మన నట్టింట్లోకొచ్చి 'టీవీ సీరియళ్లు' తిష్ఠ వేశాయి. 'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే' అని మార్క్స్ చెప్పిన సూత్రీకరణ గ్రామీణ వాతావరణం అంతటా చూస్తున్నాము.

చివరకు పవిత్రమైన మానవ జన్మ సాంకేతికంగా, యాంత్రికంగా మారి, భవిష్యత్ తరాలకు మ్యూజియంలా మన గత సాంప్రదాయాల్ని భద్రపరచాల్సి వస్తున్నది. మానవత్వం మంటగలిసి, ఆత్మీయంగా యిచ్చి పుచ్చుకునే విధానం, సంబంధాలు పోయి యంత్రాల సంబంధం చోటు చేసుకుంటున్నది. పరిస్థితులు 'టెక్నికల్'గా మారుతున్నా జీవన ప్రమాణాలు పెరగకపోగా ఆత్మహత్యలు, ఆకలి చావులు, వలసల యుగం దాపురించింది.

ఈ నేపథ్యంలో రైతు కథ ఒక వ్యధగా గ్రంథస్తం చేసి 'గంధమనేని శివయ్య మెమోరియల్ సొసైటీ' ఆధ్వర్యాన ప్రజల ముందుకు వస్తున్నందున జనమంతా చదవాలని, చదివి రైతు పదం పాడుతూ, కదం తొక్కుతారని ఆశిస్తూ...

**(డాక్టర్ కె.నారాయణ)**

కార్యదర్శి, సి.పి.ఐ. రాష్ట్ర సమితి

# రాతి మీది సేద్యం నేల మీదికి రావాలి!

మడకల్లేవు, కాడిమాన్లు లేవు, ఎద్దుల్లేవు. పొలాల్లో పంటల్లేవు. బావుల్లో నీళ్లు లేవు. కరెంటు తీగల్లో కరెంటు లేదు. మొత్తానికి రైతు కండ కలిగి లేదు. మన రాష్ట్రంలో 23 జిల్లాలుంటే 23 జిల్లాల్లోనూ రైతు పరిస్థితి ఒక్కటే.

ఎదిగొచ్చిన బిడ్డ పెండ్లి చెయ్యాలంటే కష్టం. చేతికొచ్చిన పిలగాణ్ణి పెద్ద చదువులు చదివించాలంటే కష్టం. బతకలేక ఎద్దును మోసినంత ఆయాస పడుతున్నాడు రైతు.

గ్రామాల్లో విరాట పర్వాలు లేవు, శ్రీకృష్ణ రాయబారాలు లేవు, ద్రౌపదీ వస్త్రాపహరణలు లేవు. జనజీవనంలో ఆనందం అనేది కంట్లో కలికానిక్కూడా లేదు.

రైతులు మండలాఫీసుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ, రాజకీయ నాయకుల చుట్టూ... పనీపాటా లేక జరుగుబాటు లేక... ఏం చెయ్యాలో తోచక... నెత్తిన చేతులు పెట్టుకొని దిగులు పడిపోతున్నారు.

రాష్ట్రంలో యిప్పుడొక విచిత్రమైన వాతావరణం వుంది. వానలు కురవడం లేదు గానీ రైతుల మీద పరిపాలకులు మాత్రం వరాల వర్షాలు కుండపోతగా కురిపిస్తున్నారు. అతివృష్టి అనుకోండి. రూపాయికే బియ్యం అంటున్నారు, ఉచిత విద్యుత్ అమల్లోనే వుంది, బ్యాంకులు కొండొకచో.. ఎన్నికలొచ్చినప్పుడో, రాబోయేప్పుడో, కొత్త ప్రభుత్వాలు ఏర్పడినప్పుడో... రుణ మాఫీలు కూడా అమలు జరిగిపోతున్నాయి.

అయినా రైతు పరిస్థితి ఏం మారడం లేదు. ఎందుకని రైతులు వురేసుకుంటున్నారు, పురుగు మందులు తాగుతున్నారు... భార్యాబిడ్డల్నీ పొలాల్నీ గొడ్డూగోదనీ కన్నతల్లిలాంటి వూరినీ కాదనుకుని తనకలాడి తనకలాడి స్మశానం చేరుకుంటున్నారు? ప్రభుత్వాలిచ్చే పరిహారం కోసం కూడా రైతులు కావాలని చచ్చిపోతున్నారనే పాపాత్ములైన ఏలికలు కూడా మనకు లేకపోలేదు.

– ఈ నేపథ్యంలో రైతు పక్షపాతి, సి.పి.ఐ. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నారాయణ ఆ మధ్య తిరుపతి వచ్చినప్పుడు మా అరసం మిత్రులు సాకం నాగరాజ, కోట పురుషోత్తంతోపాటు వెళ్లి కలిశాను. ఆయన ఆ మాటా యీ మాటా మాట్లాడుతూ, "ఏమయ్యా! మీ జిల్లా ఏర్పాటై వందేళ్లయిన సందర్భంగా వుత్తుత్తి కార్యక్రమం కాకుండా ఏదైనా ఘనంగా చేయకూడదా?" అని అన్నారు. (ఆయనెప్పుడూ ఒక్క చిత్తూరు జిల్లాకే పరిమితం అన్నట్టు మాట్లాడరు. రాష్ట్ర స్థాయి నాయకుడి లక్షణమది.)

మా పురుషోత్తం అప్పుడే, "ప్రభుత్వం ఇటీవలే చిత్తూరు జిల్లా శతాబ్ది ఉత్సవాలు జరిపింది. అంతకంటే మించి మన పార్టీ తరపున చేద్దాం. చిత్తూరు జిల్లా ప్రముఖుల విగ్రహాలు నెలకొల్పడం, సి.ఎం. చేత ఆవిష్కరణ చేయించడం..." యిట్లా మొదలు పెట్టాడు. ప్రజల్లో పని చేసిన నాయకుడుగా నారాయణ ఒక మాటన్నారు.

"అట్లాంటివి ప్రభుత్వాలు చేసే పనులు. కమ్యూనిస్టు పార్టీ రైతుల్లో పని చేయాలి. రైతులొక పక్క క్రాప్ హాలిడేలు ప్రకటించి నరక యాతన అనుభవిస్తుంటే యిలాంటి వేడుకలకు విలువుంటుందంటావా?" అని ప్రశ్నించారు.

అప్పుడు మేము ఆలోచనలో పడ్డాం. నిజమే. ఒక సార్థకమైన పని చేయాలి. ఈ ప్రేరణతో పుట్టినదే 'రైతు కథలు' పుస్తకం.

గుళ్లూ గోపురాల్లో పురాణాలూ వేదాలూ కొలువు దీరేకంటే గ్రామీణ భారతంలోని చుట్టు గుడిసెల్లో, పూరిండ్లల్లో, రచ్చబండల్లోకి రైతు కథలను తీసుకెళితే... అద్భుతం అనిపించింది.

వెంటనే పని మొదలు పెట్టాము. ఎన్నో కథలను ఏర్చి కూర్చాము. అరసం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ కూడా ఒక చేయి వేసాడు.

ఇతర రాష్ట్రాలలో రైతు కథలు ఎలా వున్నాయో గానీ మన తెలుగు రచయితలకు మాత్రం జోహార్లు అర్పిస్తున్నాము.

ఒక వృత్తంలో 360 కోణాలు వుంటే 360 కోణాల్నీ స్పృశించారు మన గ్రామీణ కథకులు.

'వాన కురిస్తే...' అని వొక రచయిత అంటే యింకో రచయిత 'వాన రాలే' అని అంటారు. బోర్లు వేసి రైతు ఎలా గుల్ల అయ్యిందీ ఎన్నో కథలు తేటతెల్లం చేశాయి. రైతు ఎలా 'ఊబి'లో యిరుక్కుపోయేదీ యింకో రచయిత చిత్రిస్తాడు. చెనిక్కాయ రైతూ, చెరుకు రైతూ, టమేటా రైతూ... ఎన్ని పడుబాట్లు వున్నాయో యీ కథల్లో! మహా సముద్రమంత విస్తారంగా రైతు జీవితం యీ కథల్లో మనకు కనిపిస్తుంది. ఒక్కో రచయిత ఒక్కో కోణంలో రైతుని భగవంతుని స్థాయికి తీసుకెళ్లారు. ఒక్క సెజ్ భూతం గురించేనా, ఒక్క కరువు రక్కసి

గురించేనా, అప్పుల గురించేనా.. ఓహ్ కుంగి కునారిల్లిన జీవితం లక్షలాది పెయింటింగులుగా మన రచయితలు చిత్రించారు. తెలంగాణా ఎందుకివ్వాలో తెలంగాణా రచయితల భావజాలాన్ని గమనిస్తే మనకు సలాం చెయ్యాలనిపిస్తుంది. మంచి వఱపులో ఎర్రతోలుతో పుట్టిన... అబ్బా కడుపు కాలిపోతుంది... గ్రామీణ యువతి ఎందుకు వ్యభిచరించాల్సి వస్తోందో తేటతెల్లం చేస్తాయి కొన్ని కథలు.

యీ పుస్తకమంతా చదివితే మన ప్రజల్ని రాజ్యమేలుతున్నది ముఖ్యమంత్రీ, ప్రభుత్వ యంత్రాంగం కాదనిపిస్తుంది. మరి ప్రజల్ని ఎవరు ఏలుతున్నారంటే కరువు రాజ్యమేలుతోంది, అప్పు రాజ్యమేలుతోంది, పురుగుమందు రాజ్యమేలుతోంది.

ఏ జపమూ శ్రేయస్కరం కాదు. జపం చేసేది కొంగ. అది ఎందుకు జపం చేస్తుందంటే ఏట్లో చేప నోట్లోకి రావడం కోసమే గానీ చేపల శ్రేయస్సు కోరి కాదు. మన నాయకులు, పాలకులు చేస్తున్న జపం – రైతు జపం కూడా అలాంటిదే. ఏలికలు రైతన్నలను అన్నదాతలుగా గాక ఓటర్లుగా భావిస్తున్నారు. అందుకే నూకను మింగి వూకను రైతుకిస్తున్నారు.

బియ్యం కిలో 30 రూపాయలు దాటింది. విచిత్రం ఏమంటే కళ్లంలోకి రైతు దగ్గరకు వచ్చి వడ్లు కండ్లకద్దుకొని బస్తాకు వెయ్యి రూపాయలిచ్చే వ్యాపారి లేదు. సూపర్ మార్కెట్‌లో పసుపూ, ధనియాలూ, చింతపండూ, టమేటా... మధ్య తరగతి అందుకోలేనంత ఎత్తున వున్నాయి. కానీ రైతు మాత్రం ఆ సరకులన్నిట్నీ పండించీ వొట్టి చేతుల్తో గిట్టుబాటు లేక ఈసురోమంటున్నాడు. రైతు ఈసురోమని పడివుంటే దేశం బాగు పడదు.

రైతుల పట్ల నిజంగా చిత్తశుద్ధి వుంటే రైతుల గురించి అవగాహన ఏర్పరచుకోవాలి. ఆ అవగాహన కలిగివున్న మేధోగతమైన రచయితల కథలు చదివి పరిస్థితుల్ని ఆకళింపు చేసుకోవాలి. ముఖ్యమంత్రి మొదలు వార్డు మెంబరు దాకా, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ మొదలు వీఆర్వో దాకా రైతుల్ని, రైతుల దుఖాన్నీ, వారి ఆకాంక్షల్నీ తెలుసుకోవాలంటే యీ పుస్తకం ఒక డైరీలాగా వుపయోగపడుతుంది.

ఈ సందర్భంగా ఒక సంగతి గుర్తుకు వస్తోంది. ఆ మధ్య తిరుపతిలో కేంద్ర సాహిత్య అకాడెమీ వారు ఘనంగా రచయితలతో కార్యక్రమాలు జరిపారు. అందులో అకాడెమీకి రచయితలంతా కలిసి ఒక విజ్ఞప్తి చేశారు. తెలుగు కథ వందేళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో 'రైతు కథల' సమగ్ర సంపుటి తీసుకురావాలని. ఏదీ దాని జాడ? అచిరకాలంలోనే గంధమనేని శివయ్య ట్రస్టు యీ పని నిర్వహించినందుకు ఒకింత గర్వంగా వుంది.

మేం చేయగలిగిన పని చేశాం. ఇక మీ పని మీరు చేయండి. మన కడుపుల్ని నిమ్మళంగా వుంచే రైతు కడుపు చల్లగా వుండేలా మనందరం చూద్దాం.

నమస్కారాలతో....

**పి.హరినాథరెడ్డి,** ప్రధాన కార్యదర్శి,

గంధమనేని శివయ్య మెమోరియల్ సొసైటీ.

# పుస్తక సముద్రం

హిందూ మహా సముద్రం, అరేబియా మహాసముద్రం లాగా యిది రైతు మహా సముద్రం. అయితే ఉప్పునీటితో వున్న మహా సముద్రం కాదిది. చల్లటి తాగునీటితో ప్రశాంతంగా పడివున్న మంచినీటి మహాసముద్రం. దోసిలి పట్టి తాగిన వాళ్లకు తాగినంత. ఆదరిస్తే అక్కున చేర్చుకోవడమూ, గేళి చేసి చెలగాటమాడితే సునామీల్ని సృష్టించడం యీ సముద్రానికి వెన్నతో పెట్టిన విద్య. ఈ సముద్రం అయిదేళ్లకోసారి రాజకీయ సముద్రం అవుతుంది. అప్పుడు మాత్రమే చేపలనే ఓట్ల కోసం రాజకీయ నాయకులనే టక్కరి జాలర్లు వలలతో సిద్ధమై ఆగ్రహాన్నో, అనుగ్రహాన్నో చూసి వెళ్తుంటారు. మళ్లీ యీ సముద్రతీరం కేసి చూడరు. కానీ పాఠకులనే చదువరులు అట్లా కాదు. యీ సముద్రతీరంలోనే జీవితాలను అర్థం చేసుకుని సేదతీరుతారు. యీ సముద్రాన్ని ఆబగా ప్రేమిస్తారు. దీని చుట్టూనే చుట్టుకు లాడుతారు. అట్లాంటి వారి కోసమే యీ పుస్తక సముద్రం.

ఇందులోని కథలను లెక్కపెట్ట వచ్చు. కానీ చూపించిన జీవితాలనూ జీవిత కోణాలనూ లెక్కేయడానికి ఏ గణిత సూత్రమూ పనికిరాదు. జలం, మలం ఒకటైపోయిన మునిసిపాలిటీ నీరుకాదిది. కన్నీళ్లూ కూట్నీళ్లూ కలగలిసిపోయిన పవిత్ర జలం.

ప్రూఫుల కోసమే కానివ్వండి వొకటికి మూడుసార్లు కథలన్నీ చదివాక... నోట్లో తడి లేకుండాపోయింది. అంతలోనే దాహం తీరింది. యీ పుస్తకం ఏకకాలంలో దాహాన్నీ కలిగిస్తుంది, దాహాన్నీ తీరుస్తుంది. అట్లాగే కడుపులో దేవేసేలాగా మహా వేంద్రంతో ఆకలినీ సృష్టిస్తుంది. మరుక్షణంలో అరిటాకువేసి మంచి పెరుగన్నమూ పెడుతుంది.

యీ కథలను అసలు ఎట్లా పరిచయం చేయాలి? ఒక కథలోంచి తేరుకుని యింకో కథలోకి వెళుతుంటే మరో నాలుగు కథలొచ్చి మూకుమ్మడిగా దాడి చేసేస్తూంటే... ఎలా నిమ్మళంగా నిలబడి యీ కథల గురించి ముచ్చటించాలి? తప్పదు. కథల కెరటాల వొళ్లో కూర్చుని వుక్కిరిబిక్కిరవుతూనే చెప్పాలి మరి.

మహామహులు కూడా దేన్నీ నిర్వచించలేరు. జీవితం నిర్వచనానికి లొంగదు. అలాంటప్పుడు రైతుకథను మాత్రం ఎలా నిర్వచించాలి? రైతుల మీద రాసిన కథల్లా రైతు

కథ అయిపోతుందా? గాట్లో వున్న గిత్తమీద కథ రాస్తే అది రైతు కథ కాకుండా పోతుందా? రైతు భార్య ఎసుట్లో కలబెట్టే అబక మీద కథ రాస్తే అది కథ కాకుండా పోతుందా? గొడ్డూగోదా తినే జొన్న చొప్ప మీద కథ రాయకూడదా? వూరిని ఆనుకుని వుండే చింతలతోపు మీద కథ రాస్తే అది రైతు కథ కాకుండా పోతుందా? రైతులు వలవలా ఏడిస్తేనే అది మంచి రైతు కథా? రైతులు కిలకిలా నవ్వుకుంటే అది మంచి రైతు కథ కాదా?

యీ ప్రశ్నలన్నిటికీ యీ కథలే సమాధానమిస్తాయి.

యిది ఒక విచిత్రమైన గొప్ప కథా సంకలనం. వూరందరిదీ ఒక దారి అయితే వులిపి కట్టెది ఒక దారి అన్నట్టు వుండదీ పుస్తకం. కోట్లాది చలిచీమలు వెచ్చగా పెట్టుకున్న పుట్ట యీ పుస్తకం. ఎంతటి మహా సర్పమైనా బుద్ధిగలదైతే తొర్ర చూసుకుని ముడుచుకు పడివుండాలే గానీ యీ పుట్టకేసి వచ్చిందో చావాల్సిందే.

గొప్ప సమూహం యీ పుస్తకం. పైకి ఓ వంద మంది రాసిన పుస్తకమే అయినా కొన్ని కోట్ల గొంతులు హోరున వినిపిస్తాయి. నిజమైన ప్రజాప్రతినిధులు వెలుగెత్తి ఆక్రోశించిన పుస్తకం.

ఎంత విచిత్రమంటే... ఒక రచయిత కథను అక్కడికి ముగిస్తే యింకో రచయిత కథను అక్కడి నుంచి ప్రారంభిస్తాడు. ఒక రచయిత చెప్పిందాన్ని మనం మాట వరసకు ఎద్దేవాగా ఏదో అంటే యింకో రచయిత మన మీదికి తగాదాకు వస్తాడు. ఒక రచయిత యింకో రచయితకు మద్దతు. ఇంకో రచయిత యింకో రచయిత చెప్పిందాన్ని ఖండిస్తాడు. మరో రచయిత సమర్ధిస్తాడు. అయినా చీమలకున్న క్రమశిక్షణ. సైనికుల్లా చీమవెంట చీమ వున్నట్టు కథ వెంట కథ.

మీరే చూడండి–

గ్రామీణ భారతంలో ఆత్మీయానురాగాలకు లోటు లేదని ఎన్ని కథలు చెబుతున్నాయో! వరినారుకు ఒక వూరు వెళ్లడమేమిటి? అంత కథ నడిచాక ఒక ఆడకూతురు కొంగుతో కొంగుడు ఆత్మీయత మూటగట్టి యిచ్చిందా లేదా నారాయణస్వామి చెప్పిన 'ఆత్మీయత' కథలో? పోలవరపు కోటేశ్వరరావు కృష్ణమ్మ వొడ్డున శ్రీకాకుళం గ్రామ పొలిమేరల్లో ఏరిన చిల్లపెంకులు వొట్టి చిల్లపెంకులా? ముత్యాల చిప్పలా? అమరేంద్ర గారి మడిచెక్క నిజంగానే 'ఎవరిది?' భూకామందు కూడా మంచితనానికి పోయి ఆ ప్రశ్న వేసుకోక తప్పలేదే? దున్నేవాడిదే భూమి మరి! జమదగ్ని ' అన్నదమ్ములు' చివరికొచ్చేసరికి ఒక కడుపున పుట్టిన వారే అయ్యారు కదా!

అయితే యీ మాయలో మనం వుండగానే యింకో రచయిత రామాచంద్రమౌళి మన గుండెల్ని పిండేస్తూ రియల్ ఎస్టేట్ మాయాజాలంలో పడి యింకో అన్నయ్య రాజకొండ

తండ్రీ పోయాడు. తమ్ముడూ పోయాడు. యిక డబ్బంతా తనదేనని మురిసిపోవడం? తల్లి భూదేవి చచ్చిందో బతికిందో తెలియని ఉన్మాదావస్థని రాజకొండలో చూసి మనం చలించిపోతాం. సముద్రం యిక్కడ అల్లకల్లోలంగా వుంటుంది. ఇదే ఒక రచయిత యింకో రచయితని జీవితం అనే ఆయుధంతో ఖండించడమంటే! ఈ ఖండనతో మనం, 'జీవితం ఆప్యాయతానురాగాల మయం' అని సూత్రీకరించలేం. జీవితం అక్కడక్కడా క్రూరంగా వుంటుంది కూడా అని నిర్ధారించుకుంటాం ఆ కథా సమయానికి.

ఇంకో ముచ్చట. పాతూరి విష్ణు వూరూపేరూ లేని కథా రచయిత. అతని కథ 'మావూరి మహానాటకం' చదివి 'దీన్ని కూడా రైతు కథ జాబితాలో చేర్చారే!' అని పెదవి విరిచేలోపు ఆ యువరచయితకు మద్దతుగా సాక్షాత్తూ సురవరం ప్రతాపరెడ్డి అంత పెద్దాయన, 'జనజీవనంలో ఆపాటి హాస్యాన్ని కూడా వుండనివ్వండయ్యా' అంటూ 'గ్యారాకద్దూ బారా కోత్వాల్' – ఒక అమాయకుడైన కాపు లక్షాధికారి ఎట్లయినాడో హాస్యానికి తన కథ వివరిస్తాడు. ఇక మనం పాతూరి విష్ణు మహానాటకాన్ని వాళ్ళ వూరి వాళ్లు చూడకున్నా చివరకంటా చూసి ముసిముసిగా నవ్వుకుంటామంతే.

కాళోజీ నారాయణరావు కథ 'మనమే నయం' చదివి మనం విస్తుపోతాం– గొడ్లకు మానవజాతి మీద యింత దయా అని. ఆ విస్మయంలోంచి తేరుకోక మునుపే రైతులకూ గొడ్డూ గోదాకు ఎంత విడదీయరాని సంబంధం వుందో వరసన – మంద రామిరెడ్డి, సర్కారు కిస్తు కట్టలేని స్థితిలో బర్రెను తోలుకుని పోతే రైతు భార్య ఎంత విలవిల్లాడిపోతుందో సర్కారు కిస్తు కథలో చెప్తాడు. ఆ కథలోంచి తేరుకోక ముందే త్రిపురనేని గోపీచంద్ 'అగ్రు కడిగిన ఎద్దు' వ్యథని ఎత్తిచూపుతాడు. ఇలా ఒకరా యిద్దరా? కె.సభా 'అంబా' అంటాడు, పేరూరు బాలసుబ్రమణ్యం 'మడకెద్దులు' కసాయికెళ్లిపోతే ఎంత దుఃఖం వుందో చూడండంటాడు. జి.వి.కృష్ణారావు 'చేసుకొన్న కర్మ'లో పూట గడుపుకోవడానికి ఎద్దులను అమ్మడంలో ఎంత నరకం వుందో చూపిస్తాడు. యీ గొడ్డూ గోద మీది కథలకు పరాకాష్టగా చిలుకూరి దేవపుత్ర, బొల్లెద్దు కత చెప్పి మన గుండెల్లో 'నెర్లు' చీలుస్తాడు. ఇంకా పులికంటి కృష్ణారెడ్డి కథ, ఆ ఘోష చెప్పశక్యం కానిది. చదివి తరించాల్సిందే. మరి యశోదారెడ్డి 'వెంకన్న' కథ మాత్రం? గుడికట్టి మొక్కాల్సిన గొడ్లు!

ఇది ఒక కోణం. గొడ్డుని 'పశువు'గా చిత్రించిన కథలు కూడా వున్నాయి మరి. అదేమిటో తెలుసుకోవాలంటే 'దొంగ బర్రెగొడ్లు అప్పులోళ్లతో సమానం ఎట్లా అయ్యాయో, కామందు దృష్టిలో బోయ జంగయ్య 'దున్న' ఎలా అయ్యిందో చదివి చూడండి. ఇంకా జాతశ్రీ 'వ్యక్తిగతం' గంగిరెద్దును ఆడించే ఆయనకు పట్టిన దుర్గతి చూస్తే బతుకు తెల్లారిపోయినట్టనిపిస్తుంది. గోపిని కరుణాకర్‌ను గుంటకు గుక్కెడు నీళ్లు తాపించిన 'దేవరెద్దు'ను చూడండి.

మనసు వికలమైపోయేలా చేసే కథలు యీ పుస్తకంలో ఎన్నో వున్నాయి. సుంకోజి దేవేంద్రాచారి 'ఒక దృశ్యం – మూడు ఆవిష్కరణలు' కథ చదవాలంటే గుండెధైర్యం వుండాలి.

బత్తుల ప్రసాద్ 'కూరాక్కు సచ్చేటోన్నా?' కథ చదివాక ఆ కథను అంతకంటె సున్నితంగా ఎవరూ చెప్పలేరనిపిస్తుంది. మాంసం తినాలన్న కోరికకు తలను మూల్యంగా చెల్లించుకోవలసి వచ్చింది కరువు సీమలో.

ఒక ముఖ్య కోణం. నీళ్లు ప్రకృతికే జీవనాధారం. సేద్యం జరగాలంటే నీళ్లెంత ముఖ్యమో కదా. బోధనం నర్సిరెడ్డి 'బోరుపొక్కలు' పి.చిన్నయ్య 'మెట్టభూమోడు', శశిశ్రీ 'నదీకెపాల్', కేతు విశ్వనాథరెడ్డి 'వానకురిస్తే...' పి.రామకృష్ణ 'కరువు పీల్చిన మనుషులు', బి.ఎన్.స్వామి 'వానరాలే...' సాగు నీటికి పెట్టిన కిరీటాలు.

ఇందులో ఒక రచయిత పేరు అనవసరం... రైతు 'తలపాగా'ను కూడా విడిచిపెట్టలేదు. కథ చెప్పేశాడు.

వాన కురిసి పంటలు పండితే మాత్రం ఏముంది? దళారీ వ్యవస్థ, గిట్టుబాటు ఎంత వికారంగా వేళ్లూనికుని వున్నాయో వల్లూరి శివప్రసాద్ 'గిట్టుబాటు', మొలకలపల్లి కోటేశ్వరరావు కొరివీ... అడివీ... క్షమించాలి విషయం కాస్తా 'కేటలాగ్' లాగా వచ్చేస్తోంది. అపచారం.

శిష్ట్లా ఉమామహేశ్వరరావు 'సిపాయి పెళ్లాం' కూడా రైతు కథేనా అని వెక్కిరించే వాళ్ళు వెక్కిరించుకోవచ్చు. మా బాధ్యతగా సమాధానం ఏమంటే సిపాయికి పెళ్లామే కాని ఆమె రోశి. రైతు కూలీ. కాబూలీ వాలానీ, మరిదినీ ఎట్లా ఎదుర్కొందో శిష్ట్లా చూపిన మొగలాయి. జి.ఆర్.మహర్షి రాసిన 'నన్ను క్షమించు కన్నా!', శ్యామల రాసిన 'వెతల నడుమ చదువు' నిక్కచ్చిగా రైతు కథలే. 'మోహ్నా' రాముల వారి గుడి ముందు... రైతుబిడ్డ నిజాయితీని జాతీయ జెండాలా చూపెట్టిన ఒక గొప్ప చిత్రం.

రైతు పురుగుల మందు తాగి చస్తేనేం మీడియా గొప్పలు చెబితేనేం, వాడొక దళిత ద్రోహి అని నిప్పులు చెరిగిన వినోదినికి మంచి పాఠకులు జేజేలు పలకాల్సిందే. అది రైతు కథ కాదు, యిది రైతు కథ కాదు, రచయితల వివరాలు లేవు, ఏ కథ ఎప్పుడు అచ్చయిందో చెప్పలేదు, కాలక్రమేణా కథలు అచ్చుకాలేదేం?

ఇది సముద్రం. దానికి పుట్టుపూర్వోత్తరాలూ, పరిచయాలూ, తారీకులూ వుండవు గాక వుండవు.

**–సాకం నాగరాజ**

సంకలనకర్త

# ఇదీ వరస


| | | | |
|---|---|---|---|
| మెట్ట భూమోడు | -పి.చిన్నయ్య | - | 17 |
| వఱపు | -చాగంటి సోమయాజులు | - | 34 |
| కూరాక్కు సచ్చేటోన్నా?... | -బత్తుల ప్రసాద్ | - | 37 |
| బోరు పొక్కలు | -బోధనం నర్సిరెడ్డి | - | 41 |
| సిపాయి పెళ్లాం | -శిష్ట్లా ఉమామహేశ్వరరావు | - | 50 |
| నెర్లు | -చిలుకూరి దేవపుత్ర | - | 53 |
| దున్న | -బోయ జంగయ్య | - | 58 |
| మంచివాడు | -ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు | - | 67 |
| కొత్త జూదం | -డా॥ వి.ఆర్.రాసాని | - | 75 |
| వారసత్వం | -పండిత అ.నరసింహశర్మ | - | 81 |
| భూమి | -అల్లం రాజయ్య | - | 85 |
| రావులయ్య | -శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి | - | 95 |
| దృశ్యాలు మూడు.. ఒక ఆవిష్కరణ | -సుంకోజి దేవేంద్రాచారి | - | 101 |
| మనమే నయం | -కాళోజీ నారాయణరావు | - | 113 |
| అన్నదమ్ములు | -జమదగ్ని | - | 116 |
| చావునీళ్లు | -జి.వెంకటకృష్ణ | - | 136 |
| గ్యారా కద్దూ బారా కోత్వాల్ | -సురవరం ప్రతాపరెడ్డి | - | 144 |
| ఒక విలన్ ఆత్మహత్య | -వినోదిని | - | 149 |
| జీపొచ్చింది | -వేంపల్లి షరీఫ్ | - | 158 |
| తల్లీ కొడుకులు | -బి.ఎస్.రాములు | - | 168 |
| ఆత్మీయత | -అందే నారాయణస్వామి | - | 187 |

| | | | |
|---|---|---|---|
| రేగడి మిట్ట | –తుమ్మల రామకృష్ణ | - | 203 |
| దేవరెద్దు | –గోపిని కరుణాకర్ | - | 210 |
| బతికి చెడిన దేశం | –అట్టాడ అప్పల్నాయుడు | - | 219 |
| పులిజూదం | –జి.ఎస్.రామ్మోహన్ | - | 227 |
| స్టేటస్ సింబల్ | –ఎలికట్టె శంకరరావు | - | 235 |
| మట్టి జీవితాలు | –ఎనుగంటి వేణుగోపాల్ | - | 243 |
| గిట్టుబాటు | –వల్లూరు శివప్రసాద్ | - | 251 |
| వ్యక్తిగతం | –జాతశ్రీ | - | 258 |
| మృత్యువు పువ్వు | –పంజాల జగన్నాథం | - | 268 |
| చిల్లపెంకులు | –పోలవరపు కోటేశ్వరరావు | - | 273 |
| బతుకు | –అరుణ | - | 284 |
| చేసుకొన్న కర్మ | –డా॥ జి.వి.కృష్ణరావు | - | 292 |
| ఎక్కడో - నిశ్శబ్దంగానే | –కాశీభట్ల వేణుగోపాల్ | - | 309 |
| నదీ కె పాల్ | –శశిశ్రీ | - | 314 |
| ఆగిసాగిన అడుగులు | –నల్లూరి రుక్మిణి | - | 323 |
| మడకెద్దులు | –పేరూరు బాలసుబ్రమణ్యం | - | 339 |
| కొడి గట్టిన దీపం | –మైనేని కేశవ దుర్గాప్రసాద్ | - | 349 |
| అన్నెమ్మ నాయురాలు | –కాళీపట్నం రామారావు | - | 352 |
| పుట్టినూరు | –కొలకలూరి ఇనాక్ | - | 362 |
| తిరుగుడు గుమ్మి | –గంటేడ గౌరునాయుడు | - | 367 |
| రాముల వారి గుడి ముందు | – 'మోహ్న' | - | 379 |
| విత్తనాలు | –పినాకపాణి | - | 388 |
| ఇజ్జత్ | –భాస్కరభట్ల కృష్ణారావు | - | 397 |
| ఇగ వీడు తొవ్వకు రాడు | –పెద్దింటి అశోక్‌కుమార్ | - | 407 |
| తిరగబడ్డ భూమి | –ఉప్పల నరసింహం | - | 415 |
| జుట్టుమామ | –ఎం.వి.రమణారెడ్డి | - | 425 |
| వానరాలే | –బండి నారాయణస్వామి | - | 434 |
| అగ్రు కడిగిన ఎద్దు | –త్రిపురనేని గోపీచంద్ | - | 443 |

| | | | |
|---|---|---|---|
| సర్కారు కిస్తు | –మంద రామారెడ్డి | – | 448 |
| దళారి | –శాంతినారాయణ | – | 455 |
| పాడె | –సొదుం జయరాం | – | 464 |
| ఊరు పొమ్మంటుంది | –మంచికంటి | – | 472 |
| ఊబి | –సింగమనేని నారాయణ | – | 486 |
| తడి | – సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి | – | 494 |
| కయ్య – కాలవ | –'కరుణకుమార' | – | 506 |
| భూమి దు:ఖం | –రామా చంద్రమౌళి | – | 527 |
| కరువు పీల్చిన మనుషులు | –పి.రామకృష్ణ | – | 537 |
| హైనా | –కె.ఎమ్.రాయుడు | – | 543 |
| భస్మాసుర హస్తం | –కాలువ మల్లయ్య | – | 550 |
| అంబా | –కె.సభా | – | 559 |
| నన్ను క్షమించు కన్నా! | –జి.ఆర్.మహర్షి | – | 569 |
| బతుకు | –మేరెడ్డి యాదగిరిరెడ్డి | – | 574 |
| వాన కురిస్తే...! | –కేతు విశ్వనాథరెడ్డి | – | 586 |
| తలపాగా స్వగతం | –కాట్రగడ్డ దయానంద్ | – | 595 |
| పొలం అమ్ముకోవడమంటే... | –మల్లీశ్వరి | – | 600 |
| మావూరి మహా నాటకం | –పాతూరి విష్ణు | – | 603 |
| జీవనం | –డాక్టర్ లంకిపల్లె | – | 614 |
| జేబులోడు | –నక్కా విజయరామరాజు | – | 626 |
| వలస | –ఇనయ్‌తుల్లా | – | 634 |
| పొలిమేర దాటెళ్లిపోయింది | –వంశీ | – | 646 |
| పంట సేలు | –మాగోఖలే | – | 654 |
| మా ఊరు ఎత్తేస్తారా...! | –ఎద్దుల సత్యనారాయణరెడ్డి | – | 661 |
| ఈరడింటో పెళ్ళి | –అక్కినేని కుటుంబరావు | – | 666 |
| అదృశ్యం | –పలమనేరు బాలాజీ | – | 674 |
| కరువు | –నూకా రాంప్రసాద్ రెడ్డి | – | 682 |
| వినోద ప్రదర్శన | –మధురాంతకం రాజారాం | – | 687 |

| | | | |
|---|---|---|---|
| పరిగె | **–వట్టికోట ఆళ్వారు స్వామి** | – | 693 |
| గుడిసెలు! గుడిసెలు! | **–ముదిగంటి సుజాతారెడ్డి** | – | 698 |
| వెతల నడుమ చదువు | **–గరిశకుర్తి శ్యామల** | – | 709 |
| మా నాయిన ట్రిక్కు నేర్వని కత | **–ఖదీర్‌బాబు** | – | 715 |
| ఎవరిది? | **–అమరేంద్ర** | – | 720 |
| ఎంకన్న | **–డా॥ పి.యశోదారెడ్డి** | – | 725 |
| దొంగ బర్రెగొడ్లు | **–వై.సి.వి.రెడ్డి** | – | 731 |
| పగలూ రేయి శ్రమ పడుతున్నా | **–తుమ్మేటి రఘోత్తమరెడ్డి** | – | 735 |
| బిచ్చగాడు | **–పి.చంద్** | – | 744 |
| అడివి | **–సడ్లపల్లె చిదంబరరెడ్డి** | – | 749 |
| కొరివీ... అడివీ | **–మొలకలపల్లి కోటేశ్వరరావు** | – | 755 |
| మా ఊరి కథ | **–రేగులపాటి కిషన్‌రావు** | – | 764 |
| పరి‘పాల’న | **–వేంపల్లి రెడ్డి నాగరాజు** | – | 772 |
| పచ్చి కరువు | **–ఎం.హరికిషన్** | – | 775 |
| నాయిన కూతురు | **–వి.ప్రతిమ** | – | 783 |
| చింత కింది మల్లయ్య ముచ్చట | **–పూడూరి రాజిరెడ్డి** | – | 794 |
| స్వేదం ఖరీదు...? | **–రెంటాల నాగేశ్వరరావు** | – | 805 |
| చింతల తోపు | **–పాపినేని శివశంకర్** | – | 810 |
| ప్రత్యర్థి | **–మధురాంతకం నరేంద్ర** | – | 828 |
| గూడు శెదిరిన గువ్వ | **–టి.ఆర్.శ్రీనివాసప్రసాద్** | – | 842 |
| భూమి పుత్రుడు | **–ఐతా చంద్రయ్య** | – | 847 |
| గొడ్లు | **–పులికంటి కృష్ణారెడ్డి** | – | 852 |
| నిరసన | **–కె.వరలక్ష్మి** | – | 866 |
| వేరు తొలిచే పురుగు | **–కె.వి.నరేందర్** | – | 876 |
| కృషితో అస్తి దుర్భిక్షమ్ | **–పి.పాపిరెడ్డి** | – | 883 |
| కరువొచ్చె... కక్షలూ వచ్చె | **–పాలగిరి విశ్వ ప్రసాద్** | – | 889 |
| మూడు పదుస్ల వాన | **–వేంపల్లి గంగాధర్** | – | 902 |
| వ్యసనం | **–ఎస్.వి.ప్రసాద్** | – | 912 |
| ఎండమావులు | **–తాడిగిరి పోతరాజు** | – | 922 |

# మెట్ట భూమోడు

**–పి. చిన్నయ్య**

"సాయంత్రం మా అన్నయ్య వస్తుండు.." బండి బయటకు తీస్తుండగ అంది రమ.

"నాలుగైదు రోజులుండి మీ అమ్మానాయనలు చెప్పిపోయింది సాల్లేదా? ఇంకా ఈయనెందుకు రావుడు?" బయటికనలేక జవాబు చెప్పకుండనె బైక్ స్టార్ట్ చేసిన.

"సాయంత్రం తొందరగ వస్తరుగ" అనుమానంతో మళ్లోసారి అడిగింది.

పుండుమీద కారం చల్లినట్లయింది. పాపతో టాటా చెప్పిస్తున్నా పట్టించుకోకుండ బయలుదేరిన.

బాలాజికాలని దాటి నయానగర్ మీదుగ మెయిన్‌రోడ్ మీదికి వచ్చిన. అది తొమ్మిదో నెంబర్ జాతీయ రహదారి. ఆ రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్‌బంక్ చూసేసరికి, మొన్న బండి రిజర్వ్‌లో పడ్డ విషయం గుర్తొచ్చి అటువైపు బయలుదేరిన. రెండు లీటర్ల పెట్రోల్ కొట్టించిన బండిలో.

ఇదే జాతీయ రహదారి మీద రెండు మూడు కిలోమీటర్లు పోయినంక కుడివైపు ఓ బాట వస్తది. ఆ బాటలో నాలుగైదు కిలోమీటర్లు పోతే రామచంద్రాపురం వస్తది. ఆడనే ప్రస్తుతం నా జీవిక.

ఈ వూరి పాఠశాలలో జాయిన్ అయిన మొదట్లో ఎంత ఆనందంగ, ఉద్రేకంగ వుండేది! మండల కేంద్రం కోదాడ నుండి రోజూ దొరికితే బస్సుమీదనో, లేకుంటే ఆటోల మీదనో సైకిల్ మీదో పోయి రావుడు.

దారి పట్టిపోతుంటే చల్లటి వరిచేల గాలులు, కనుచూపు మేరల్లో ఎక్కడ చూసిన వరిపంటే. ఎంత అందంగా కనిపించేవి ఆ దృశ్యాలు. తన ప్రాంతంలో అటువంటివి ఎక్కడున్నవి? ఎప్పుడన్నా వర్షాలు బాగా పడితే వాగులు పారటం, మడుగులు, కుంటలు, చెరువులు నిండిపోవడం తప్ప, నిత్యం పారే ఇటువంటి కాలువలు ఎక్కడివి? కాని రాను రాను ఎందుకో

ఈ పొలాల్ని, పారే కాలువల్ని చూస్తుంటే రోజురోజుకు అసంతృప్తి పెరగసాగింది. ఎట్ల, ఎక్కడ మొదలయింది ఈ అశాంతి?

స్పష్టంగా అది తన ఇంట్లో, తను పనిచేస్తున్న స్కూల్లో, భార్య, అత్తమామలు, బామ్మర్ది, సహోద్యోగులు ఎందుకు శత్రువులుగా కన్పిస్తున్నారు? అవి వ్యక్తిగత గొడవలా? లేక భౌగోళిక వైరుధ్యాలా? ఈ విషయం పట్ల ఎన్నిసార్లు మథనపడలేదు, తర్కించుకోలేదు? రమకు ఎన్నిసార్లు అర్థం చేయించాలని ప్రయత్నించినా అర్థం చేసుకోదు. పైగా 'మీ ఏరియా వేస్టండి...' ఒక్క మాటతో కొట్టేస్తుంది. అత్తో, మామో, బామ్మర్దో తోటి వుపాధ్యాయులో అంటే భరించేటోన్ని. వాళ్ళల్ని లెక్కచేసేటోన్ని కాదు. కాని రమ అనటం భరింపరాకుండయింది నాకు.

మొదట్లో ఎన్ని గొడవలు జరిగినా, రాత్రి పడక దగ్గరకు వచ్చేసరికి గొడవలు సమసిపోయేవి. కాని రాత్రిపూట రమకు దూరంగ ఉండాలని ప్రతీకారం పెరగసాగింది.

అదే అక్కడైతే నా బాధను, భావాల్ని చెప్పుకోవడానికి, ఏడ్వటానికి ఎవరో ఒకరు దొరికేటోడు. కాని ఇక్కడ నా బాధను అర్థం చేసుకునేటోడు ఎవడు? ముందు యిక్కడి నుండి బయటపడితే తప్ప దీనికి విముక్తి లేదు. అదే ఆలోచన నాలో బలంగా నాటుకుంది.

"నమస్తే సార్.. గుడ్‌మార్నింగ్ సార్.." పిల్లల అరుపులతో ఆలోచనల నుండి బయటపడి, రోజులాగే అదే చెట్టుకింద బైక్‌ను పెట్టి ఆఫీసువైపు నడిచిన.

హెచ్.యమ్. ఇంకా వచ్చినట్టు లేదు. రిజిస్టర్‌లో సంతకం పెట్టి పక్కనే ఉన్న స్టాఫ్ రూంలోకిపోయిన. రామారావు, సుబ్బారావు, సుబ్రమణ్యం, మల్లయ్య సార్లు ముచ్చట్లో వున్నట్టుంది. అందరికి విష్ చేసిన. రామారావుసార్ అలా చేయి ఊపి తన మాటల్ని కొనసాగిస్తుండు.

"ఏం గవర్నమెంట్ సార్ ఇది. రెండో పంటకు నీళ్ళు ఇవ్వమంటే కతలు పడుతుంది. ఇట్లయితే బాబు అధికారంలోకి వచ్చినట్లె?"

"అసలు నాగార్జునసాగర్ల నీళ్లు లేవంటున్నారు గద సార్. గవర్నమెంట్ ఏం చేస్తది?" దేశం పార్టీకి దగ్గరిగా ఉండే సుబ్బారావు సార్ అందుకుండు.

"మీరుగూడ అట్ల మాట్లాడుతరేంది సార్, నీళ్లు మొత్తం లేకుంటపోయినయా? మన జిల్లాల కన్నా అందవా?" నిష్ఠూరంగ అండు.

ఎంత దేశం పార్టీకి దగ్గరైన, తన పొలాలు గుర్తొచ్చి, రామారావు సార్ మాటల్లోని నిజాన్ని ఆలోచిస్తూ గమ్మునయిపోయిండు సుబ్బారావు సార్.

"ఎప్పుడో నా చిన్నప్పుడు చూసిన సార్, మళ్లా ఇప్పుడు చూస్తున్న తాగే నీళ్లకు ఇంత కటకట..." పాత జ్ఞాపకాలను స్మరించుకుంటూ అండు తెలుగు సారు సుబ్రమణ్యం.

"ఒక్క కారు పంటకె నీళ్లు ఇస్తున్నప్పుడె భూమి రేట్లు ఇంతపడిపోయిందె. అసలు సాగర్ నీళ్లు రాకుండ ఉంటే మన భూముల్ని కొనేటోడు ఎవడుండడు.." ఇరవై ఎకరాల పొలం గురించి ఆలోచనల్లో పడిండు మల్లయ్య సార్.

"మా ఏరియాలో ఎకరం భూమి పది ఇరవై వేల రూపాయలకే వస్తది..." మాటల సందర్భంలో ఒకసారి స్టాఫ్ రూంలో అంటే విరగబడి నవ్విరి గింత తక్కువాని! ఇప్పుడేమైంది వీళ్ల సంగతి?

...రెండో పంటకు నీళ్లు రాకుంటె గింత బాధపడుతుండ్రు మాకు అసలు నీళ్లే లేవు గదా, వర్షాల మీదే బతకాల్సిందె. మేమెంత ఇబ్బంది పడుతున్నామో ఏనాడైనా ఆలోచించిండ్రా ఈ ఏరియ వోళ్లు.." బయటకననలేక లోలోపల అనుకున్నా.

"సార్ ప్రార్థనకు టైమయినట్టుంది.." నెమ్మదిగ అన్న గడియారం చూసుకుంట.

"అటెండర్ ఎటు పోయిండు?" గబగబా లేస్తు అండు సుబ్బారావు సార్.

"ఏమో సార్ ఎటు పోయిండో?" పిల్లల్ని గంట కొట్టమని చెప్పిన.

గంట కొట్టడం పూర్తయ్యేలోపున హెచ్చెం, అటెండర్, పిల్లలందరు స్కూల్ గ్రౌండ్‌లకు వచ్చి చేరినరు. రెండు మూడు నిమిషాల్లో ప్రార్థనయిపోయిందన్నట్లు అనిపించి ఎవరి క్లాసుల్లోకి వాళ్ళు వెళ్లినరు విద్యార్థులు.

తొమ్మిదో తరగతి రిజిస్టర్ తీసుకుని క్లాసుల్లోకి వెళ్లిన.

ఇంట్ల, స్టాఫ్ రూంల కంటె ఈ క్లాసులోనే ఏదో విశ్రాంతి దొరికినట్టయింది. అటెండెన్స్ తీసుకోవడం పూర్తయిందో లేదో ఓ విద్యార్థి లేచి నిలబడిండు.

"సార్ ఈ రోజు కొత్త పాఠం చెపుతరా?" అడిగిండు.

"లేదు సార్, ఈ రోజు పద్యం కంఠస్తం చేసుకొని రమ్మన్నరు, అడుగుతానని చెప్పిండ్రు" ఇంకోడు లేచి గుర్తు చేసిండు.

"ఎంతమందికి పద్యం వచ్చో నిలబడండ్రా?"

నలభైమంది విద్యార్థులకు పట్టుమని పదిమందిగూడ నిలబడలేదు. 'కొత్తపాఠం చెపుతారా సార్' అడిగినోడు గూడ నిలబడిండు. నేను పద్యం అడుగుతానని ఈ ప్రపోజల్ పెట్టిండు. వాడి తెలివికి నవ్వొచ్చింది! నాకు చెప్పే మూడ్ లేదు. మంచి అవకాశం దొరికినట్టయింది. పద్యం రానోళ్లందరిని నిలబడి చదవమని చెప్పిన. కొద్దిగా తెలివున్నోడు వెంటనే చదివి, పద్యం వచ్చినోళ్ల దగ్గరకుపోయి వప్పజెప్పి వచ్చి బెంచీల మీద కూర్చుంటున్నరు. వాళ్లను గమనిస్తున్నట్టున్నా నా ఆలోచలనలన్నీ కిటికీ గుండ కనిపిస్తున్న పొలాలవైపు.. కనుచూపు

మేరదాక పచ్చటి పొలాలు, పొలాలనుండి చల్లటి గాలులు క్లాసుల్లోకి వీస్తున్నాయి. వరిచేల గట్లమీద తెల్లటిపూలతో మెరిసిపోతున్న రెల్లిగడ్డి గాలులకు వయ్యారంగ ఊగుతున్నది. తన ప్రాంతంలో ఈ రెల్లి పూవు ఉండదు. అందుకే ఈ పూలను వింతగా, అపురూపంగా చూడటం అలవాటయిపోయింది.

ఆరేడేండ్లు కావచ్చు, ఈ స్కూల్‌కు వచ్చి. ఫస్ట్ అపాయింట్‌మెంట్ ఈ స్కూల్లోనే. డి.యస్సిలో హింది పండిట్‌గా సెలక్ట్ గావడం, కౌన్సిలింగ్‌లో తన ప్రాంతంలో ఎక్కడా ఖాళీలు లేకపోవడం, ఓ మిత్రుని సలహాతో దూరమైతేనేంది. 'కాలువ ఏరియా, హైవేరోడ్ పక్కనె' బాగుంటుందని చెప్పడంతో ఈ స్కూల్‌లో జాయిన్ కావటం. రెండు మూడు సంవత్సరాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండ ఆనందంగా గడిచిపోయింది.

రమతో పెండ్లిచూపులు.. సుడిగాలిల పెండ్లి.. జీవితంలో అనుకోని మార్పులు... అంతా తాను ప్రేక్షకపాత్రలాగ ఉండిపోవడం ఆశ్చర్యమనిపిస్తుంది ఒక్కోసారి! ఇదంత ఎట్ల జరిగింది?

టీచర్స్ అటెండెన్స్ రిజిస్టర్‌లో తన పేరుతోపాటు పక్కనె 'కులం' ఉండటం, రామారావు సార్ దీన్ని చూడటం ఈ పరిణామాలకు కారణం.

రామారావు సార్‌ది పక్క ఊరే. తన వూళ్లో ఓ సంపన్న 'యాదవ' మిత్రుడు వుండటం, అతగానికున్న ఒక్కగానొక్క కూతురికి సంవత్సరం నుండి సంబంధాలు వెతకటం, మాటల సందర్భంలో రామారావు సార్ తన గురించి చెప్పడం...

తనను చూడటానికి ఆ పిల్ల తండ్రి రామారావు సార్ దగ్గర ఏదో పని ఉన్నట్లు వచ్చి తనను చూడటం...

రెండోసారి రామారావు సార్ ఎంతో ప్రేమతో ఇంటి దగ్గర ఏదో ఫంక్షన్ ఉందని రమ్మనటం, తనను మరీ ప్రత్యేకించి పిలవడం అర్థంకాలె.

ఫంక్షన్ అయ్యాక ఆ పిల్ల తండ్రి తనను వాళ్ల ఇంటికి తీసుకపోయి మర్యాద చేసిండు. మాటల్లోనె కులగోత్రాలు, ఆస్తులు బయటికొచ్చినయి.

ఆ అమ్మాయే స్వయంగా కాఫీ ఫలహారాలు అందించటం, ఆ అమ్మాయి తల్లి, అన్న తనను ఎగాదిగ చూడటం, చివరికి అర్థమయింది ఇవి పెండ్లి చూపులలాంటివని.

ఇది జరిగిన నెలకే వేసవి సెలవులు ప్రారంభమయినయి. ఆరోజు లాస్టు వర్కింగ్ డే కావచ్చు. ఆ పిల్ల తండ్రి, అన్న హడావుడిగా స్కూల్‌కు వచ్చినరు. అంతకుముందే రామారావుతో మాట్లాడినట్టుంది. వాళ్లు రాగానే పక్క క్లాసులకు తీసుకపోయిండు రామారావు సార్.

సంవత్సర పరీక్షలు అయిపాయె. పిల్లలు లేరు ఉపాధ్యాయులు తప్ప.

"చూడు సత్యనారాయణ, నీ తండ్రంత వయస్సున్నోన్ని, నా మాట విను. ఈ మల్లయ్య నేను చిన్నతనం నుండి మంచి దోస్తులం. ఈయన ఒక్కగానొక్క కూతుర్ని మొన్న చూసినవు గదా, పిల్ల అందానికేం లోటు లేదు. ఇంటర్ ఫెయిల్ అయింది. అమ్మాయిని నీకు ఇద్దామనుకుంటున్నరు. ఎంత కట్నం కావాల్నో అడుగు..." నెమ్మదిగా ముగించిండు రామారావు సార్.

అనుకోని సంఘటనకు నోటమాట రాకుంటయింది. ఏం మాట్లాడాల్నో అర్థం గాకుంటయింది.

"చెప్పు సత్యం ఏమాలోచించినవు?" తిరిగి అడిగిండు రామారావు.

"పెండ్లి గురించి ఇంకా నేనేమి ఆలోచించుకోలేదు సార్, ఇప్పుడేమి చెప్పలేను.." తికమక నుండి తేరుకుంటు అన్న.

"మేనోళ్లుగాని ఏమైన ఉన్నరా?" వెంటనే అందుకుండు మల్లయ్య.

"లేరు..." అస్పష్టంగానే గొణిగాను, సంఘర్షణ మొదలయింది నాలో ఎందుకో.

"బాగా ఆలోచించు సత్యం. మంచి సంబంధం. ఎంత కట్నం కావాలన్న ఇస్తరు. నిన్ను నచ్చినరు వాళ్లు..."

"అదిగాదు సార్, ఇంటి దగ్గర అమ్మానాన్నలతో మాట్లాడాలి నాకు టైం కావాలి.."

"టైంకేంది, మీ వాళ్లతో ఆలోచించు. ఇప్పుడు సెలవులేగదా. సెలవుల్లో మీ ఇంటికి రమ్మంటె వస్తం.." మల్లయ్య.

నేనేమి మాట్లాడలేకపోయిన.

అది అవకాశంగ తీసుకుని రామారావు సార్ అందు

"సత్యం ఇంకా ఏమి ఆలోచిస్తున్నవు చెప్పు. ఇంటికి పోగానే మీవోళ్లకు చెప్పు. మేము వచ్చి అన్నీ మాట్లాడుతము.."

అన్నట్టుగానె, వేసవి సెలవులకు ఇంటికొచ్చిన పదిపదిహేను రోజులకే కారు ఏసుకొని వచ్చినరు. వచ్చి రావటంతోనే అమ్మానాన్నలను పట్టుకొని మాట్లాడసాగిండ్రు. నా అవసరం లేనట్టు.

ఎటు తేల్చుకోలేని పరిస్థితి. రెండు మూడు ఏండ్లకు నెమ్మదిగా చేసుకోవచ్చనుకుంటే, అనుకోకుండ ఈ తతంగం.

మరోవైపు ఇప్పటిదాక నమ్ముకున్న ఆశలు, ఆశయాలు ఎటో కొట్టుకుపోతున్నట్టు బాధ. ఏమైతేనేమి చివరికి లొంగుబాటు.

"అమ్మో.. అయిదు లక్షల కట్నమంట..." ఊరంత మోగిపోయింది. ఎవని నోటవిన్నా ఇదేమాట. ఇంత కట్నం ఇచ్చినోడు లేడు, తీసుకున్నోడు లేడు ఊర్ల.

"గొల్లోనికి గింత కట్నం ఎవడిచ్చిండు?" ఓ కాపాయన బాధ ఆగక అడిగిండు.

"మన దగ్గర ఎవడిస్తడు, కాలువ కిందోడు గనుక ఇచ్చిండు..." ఇంకో రెడ్డాయన జవాబిచ్చిండు.

అమ్మానాన్నలు గూడ సంతోషంగ ఉన్నరు. నాకు మాత్రము మనసు మనసుల లేదు. సమయం చిక్కితెసాలు లక్ష్మి గురించె మాట్లాడె అమ్మా ఈసారి కనీసం గుర్తు చేయటం లేదు.

లక్ష్మి వాళ్ళ నాన్న దేవరకొండ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తుండు. సొంత మేనమామ కాకపోయిన, అమ్మకు దగ్గరి బంధుత్వం. నా మీదే ఆశలు పెట్టుకున్నారని ఓసారి అమ్మచెప్పింది.

పెండ్లికి వారం రోజుల ముందు కావచ్చు. లక్ష్మి దేవరకొండ బస్టాండ్‌లో వంటరిగా కనిపించింది.

"బి.ఎడ్‌కు బాగా ప్రిపేర్ అవుతున్నట్టుందే!" లక్ష్మి చేతుల ఎంట్రన్స్ బుక్ చూసి అడిగిన.

"నా గురించి ఎందుకుగాని పెండ్లి పనులు జోరుగ జరుగుతున్నట్టున్నాయి.." బస్టాండ్‌లో మూలకున్న ఓ బెంచి మీద కుర్చుంటు అంది.

"అవును జరుగుతున్నాయి.." అదే బెంచిమీద చివరికి కూర్చుంటు అన్నాగాని నా మాటలు వినిపించినయో లేదో? ఏదో బాధ మొదలయింది.

చుట్టుపక్కల ఊర్లనుండి జనంతో, ముఖ్యంగ గిరిజనులతో గోలగోలగ ఉంది. బస్టాండంతా ఆ గోలనె.

"ఎందుకట్ల తలవంచుకుంటవు? ఏం తప్పు చేసినవని? నన్నేమి పెండ్లి చేసుకుంటనని ఎప్పుడు అనలేదుగా. ఏదో కలిసి తిరిగినము, ముచ్చట్లు చెప్పుకున్నము, గంతేగా.." కన్నీళ్ళు కారుతున్నాయి లక్ష్మికి.

గునపం తీసుకుని గుండెలో గుచ్చినంత పనయింది.

"కాదు లక్ష్మి..."

"ఏం చెప్పొద్దు సత్యం, ఎంతమందిని చూడట్లేదు. కట్నం ఎక్కువ వచ్చేసరికి ఎవరికైన గంతె. మానాయన ఇచ్చె లక్ష కట్నం ఓ లెక్కా. హక్కులని, అవని గివని ఎన్ని ముచ్చట్లు చెప్పలేదు. నా గురించి బాధపడ్తలేదు. నీవు గిట్లయినవని బాధ.." చెప్పి సరసరా వెళ్లిపోయింది.

ఈడ్చి చెంపమీద కొట్టినంత పనయింది.

ఆలోచనలకు, ఆచరణకు ఎంత భేదముంటదో మొదటిసారి అర్థమయ్యింది. ఆ అస్థిర మనసుతోనె పెండ్లయిపోయింది...

"రెండో గంటయింది సార్.." ఓ విద్యార్థి చెప్పేంత వరకు స్పృహ లేదు.

రిజిస్టర్ పుస్తకాలు తీసుకొని స్టాఫ్ రూం వైపు నడిచిన.

న్యూస్‌పేపర్ అప్పుడే వచ్చినట్టుంది. జిల్లా స్పెషల్ ఒకరు, మెయిన్ ఒకరు, మధ్యపేజి ఇంకొకరు తీసుకొని గబగబా చదువసాగిండ్రు.

రామారావు సారుకు, నాకు రెండో పీరియడు లీజరు. అందరు క్లాసులకు పోయాక చదవడం అలవాటు.

"పులిచింతల పైలాన్ పేల్చివేత..." సుబ్రమణ్యం గట్టిగా చదివిండు. ఇలాంటి వార్తలను ఆయన ఇలా చదవటం అలవాటు.

"దాన్ని పేల్చేస్తే ఏమొస్తది?" సుబ్బారావు అందుకుండు.

"పులిచింతల కట్టొద్దని గదా వాళ్లగొడవ" పేపర్ చదువుకుంటనె అండు సుబ్రమణ్యం.

"ఎందుకు కట్టొద్దంట?"

"అది కడితే ఊర్లకు ఊర్లు కంపెనీలు, ఖనిజ సంపద మునిగిపోతయంట. అంతచేసి ప్రాజెక్టు కట్టినదాంట్ల నీళ్లు డెల్టోల్లకు మూడో పంటకేనంట. మన జిల్లాలకు సుక్క నీళ్లు రావంట..." పేపర్ల ఉన్నది చెప్పిండు సుబ్రమణ్యం.

"ఏ పనిచేసిన లాభాలుంటయి, నష్టాలుంటయి. నష్టాలొస్తయని మంచి పని ఆపుతామా?" తిరిగి వాదన మొదలుపెట్టిండు సుబ్బారావు.

"నష్టాలు మన జిల్లోలకు, లాభాలు కృష్ణా జిల్లోలకు, అందుకే గొడవలు..." నవ్వుతూ అన్న.

ఏదో మాట అందుకోబోయిండు సుబ్బారావు. అంతలో గంటమోగింది. బలవంతంగా లేచారు క్లాసులోకి.

స్టాఫ్ రూంల ఇద్దరం మిగిలిపోయినము. సుబ్బారావు మాటలు మనసులో కలకల మంటున్నాయి. పేల్చివేత వార్తకోసం జిల్లా స్పెషల్‌ను చేతుల తీసుకున్న. పైలాన్‌ను పేల్చిన ఫొటోగూడ వుంది.

... ప్రజలు ఎంత వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం ప్రాజెక్ట్‌ను కట్టి తీరుతామంటుండె. ఎందుకింత మొండితనం ప్రభుత్వానికి? ఏదుంది కిటుకు?..

"ఏమిటి సత్యం తీక్షణంగ చదువుతున్నట్టుంది పేపర్?" ఏదైన అడిగేముందు మెత్తగా అడగడం అలవాటు.

"పులిచింతల వార్త సార్..." పేపర్‌ను పక్కనపెడుతూ అన్న.

"రేపు నల్లగొండకు కౌన్సిలింగ్‌కు పోతున్నవంట, నిజమేనా సత్యం? మీ బామ్మర్ది ఫోన్‌చేసి చెప్పిండు.."

"అవును సార్ నిజమే.."

కొద్దిసేపటిదాక ఏమి మాట్లాడలేదు. నెమ్మదిగా మొదలుపెట్టిండు.

"అక్కడ ఏముంది సత్యం? కోదాడలో ఉండబుద్ది కావటం లేదా? అయినా స్కూల్లో పిల్లల్లో, ఊర్ల జనంల మాకంటె నీకే మంచి పేరుంది. ఎలా పోబుద్ధి అవుతుంది సత్యం?.. మీమామ వాళ్లు బాగా బాధపడుతుండ్రు. బిడ్డమీద అంత ప్రేమ. నీకు అంతగా మీ వూరు చూడాలనిపిస్తే వారానికోసారి పోయిరావచ్చు. ఏముంది చెప్పు అంతా హైటెక్ స్పీడ్. ఆలోచించు సత్యం..." ఒప్పించే ప్రయత్నంలో అండు. ఇంతలో ఎవరో పిలువడంతో బయటకు పోయిండు.

...నా బాధ, ఘర్షణ వీళ్లకెట్ల చెప్పాలి? చెప్పిన వీళ్ళకు అర్థమవుతుందా? ఇక్కడి పిల్లలన్నా సమాజం అన్నా ప్రేమే. మరి ఎక్కడ మొదలయింది ఈ సంఘర్షణ? ఎందుకు ఈ ప్రాంతాన్ని ఈ అస్థిత్వాన్ని ద్వేషిస్తున్నట్టు? శత్రువులు ఎవరు?...

"బావా నీవెన్నన్న చెప్పు మీ ఏరియాలో బతుకుడు కష్టం. పోలీసులు, నక్సలైట్లు సంపుకోటాలు, ఓ తాగే నీళ్ళు బాగుండవు. అంతా ఫ్లోరైడు, పెండ్లి రోజు ఒక్కరోజు మీ వూర్ల ఉండేసరికి పాణం మీదికి వచ్చిందనుకో... అయినా మీ దగ్గర పండించేది ఏం పంటలు బావ? ఏవో జొన్నలు, సజ్జలు, ఆముదాలు, కందిపంటలంట! అవి పండిస్తే ఏమొస్తది బావ? మా దగ్గరైతే ఒక్క కారుకు ఎన్ని ఒడ్లు పండిస్తం!" పెండ్లయిన కొత్తలో ఇంటికి వచ్చినప్పుడల్లా బామ్మర్ది వాదన మొదలుపెట్టెటోడు.

మొదట్లో బామ్మర్ది వాదన తేలిగ్గా తీసుకొని నవ్వేటోన్ని. రాను రాను ఏదో అసంతృప్తి పెరగసాగింది. క్రమంగ ఆ మాటలు నాలో ఏదో అలజడి లేపేవి. ఆ మాటల్ని వ్యతిరేకించాలని ఉండేది. ఎట్ల వ్యతిరేకించాల్నో అర్థంగాకుంట ఉండేది..

సాగర్ అంత దగ్గరున్న మాకు నీళ్ళు రాకుంట, ఇంత దూరంల ఉన్నోళ్లకు నీళ్ళు ఎట్ల వచ్చె? మా ప్రాంతంల నక్సలైట్లు ఎందుకు పుట్టె! పోలీసులకు, నక్సలైట్లకు గొడవలు ఎందువల్ల ప్రారంభమయ్యె? ప్రశ్నలతో మెదడంత గజిబిజి అయ్యేది..

"సత్యం మళ్లోసారి ఆలోచించు, నీకేది గావాల్నో మీ మామతో ఇప్పిస్తా.." ఎప్పు డొచ్చిండో ఏమోగాని, పుస్తకం తీసుకొని స్టాఫ్‌రూంల నుండి బయటకుపోతూ అండు.

ఆ రోజంత అన్యమనస్సుతో, అసంతృప్తిగానె గడిచింది.

స్కూల్ కాగానె ఇంటికి బయలుదేరిన. తీరా కోదాడకు చేరుకున్నాక ఇంటికి పోవాలనిపించలేదు. ఈ పాటికి బామ్మర్ది వచ్చుంటాడు. వాడిది సినిమాల పిచ్చి. ఏ సినిమా ఎట్ల ఉన్నదో ఎన్నిరోజులు నడుస్తుందో విశ్లేషించగల మేధావి. తన అభిమాన హీరోకి వేలాది రూపాయలు నీళ్లలాగ ఖర్చుచేయగల మొనగాడు. అందుకే ఆ వూర్లో, మండలానికే వానికి మెగాస్టార్ సంఘానికి ప్రెసిడెంట్ పదవి దక్కింది. వాడితో పెట్టుకుంటె కష్టమె. ఫ్రెండ్స్ దగ్గరికి పోతే! నిజంగ ఈడ నన్ను అర్థం చేసుకునె ఫ్రెండ్స్ ఉన్నారా? ఎందుకో ఈ ఆలోచన రావడంతోనె నిస్సత్తువ ఆవరించినట్టయింది.

రోడ్డు పక్కనె ఉన్న హోటల్లో స్పెషల్ చాయ్ చేయించుకున్న. ఇటు హైద్రాబాద్‌కు, అటు విజయవాడకు పరుగెడుతున్న వాహనాలను చూసుకుంట, పేపరు చదువుకుంట ఓ అర్థగంట గడిచిపోయింది. అప్పుడు గుర్తొచ్చింది లైబ్రరి.

సక్కగా లైబ్రరికి బయలుదేరిన. బైక్ ఆవరణలో పెట్టి లోపల అడుగుపెడుతుండగానె లైబ్రేరియన్ ఎదురయిండు.

తరచుగ గ్రంథాలయం రావటం వల్ల లైబ్రేరియన్ బాగా దగ్గరయిండు. చివరికి తన పర్సనల్ కష్టసుఖాలు చెప్పుకొనేంత చనువు దాక వచ్చింది.

“ఏంసార్ వారం రోజుల నుండి దర్శనం లేదు!” నవ్వుతు పలుకరించిండు.

“ఏవో ప్రాబ్లమ్స్ సార్!” కుర్చీలో కూర్చుంటు అన్న.

లైబ్రరిలో పెద్దగా సందడి లేదు. నలుగురైదుగురు రీడర్స్ ఉన్నట్టున్నారు. ఏదన్నా చదువుదామంటె మనసు స్థిమితంగ లేదు. లైబ్రరి పక్కనె ఉన్న మీటింగ్ హాల్ నుండి ఏవో ఉపన్యాసాలు వినిపిస్తున్నాయి. ప్రశ్నార్థకంగా చూసిన.

“పులిచింతల మీద మీటింగ్ జరుగుతుంది సార్.” నా మనసుల ప్రశ్నను అర్థం చేసుకున్న వాడిల జవాబు చెప్పిండు.

రెండు మూడు రోజుల క్రితం పేపర్ల చూసిన గుర్తు. ఈ రోజు మీటింగ్ ఉందని. ఈ గందరగోళంలో ఏడ గుర్తుంది? మీటింగ్ హాల్‌వైపు నడిచిన.

జనం గూడ బాగనె హాజరయినట్టుంది. హాల్ నిండిపోయింది. వచ్చిన వాళ్ళలో ఎక్కువ చదువుకున్న వాళ్లె కన్పిస్తున్నరు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చెబుతున్న విషయాలను నిశ్శబ్దంగా వింటున్నారు.

....పులిచింతల ప్రాజెక్ట్ వల్ల ఎన్ని గ్రామాలు మునిగిపోతాయో, ఎంత ఖనిజ సంపద, కంపెనీలు ఆగమవుతాయో ఎంతమంది ప్రజలు నిరాశ్రయులైతారో లెక్కలతో సహా

చెప్పుకుపోతుండు. సాగర్ కుడి ఎడమ కాలువ నిర్మాణంలో ఎంత మోసం జరిగిందో, పక్కనె ఉన్న ప్రజలకు ఎంత అన్యాయం జరిగిందో ఆధారాలతో సహా వివరించసాగిండు. ఇంత చేసిన ఈ ప్రాజెక్ట్ వల్ల నల్లగొండ జిల్లాకు ఏమైన లాభం ఉందా? ఒక్క ఎకరం గూడ పారదంట. కృష్ణా డెల్టా వాళ్ళకు మూడో పంటకు నీరు తప్ప. పులిచింతల ప్రాజెక్ట్‌కు ప్రత్యామ్నాయం టెయిల్ పాండ్‌ను చూపిస్తూ తన ఉపన్యాసాన్ని ముగించాడు ఆ ప్రొఫెసర్. మిగిలిన వక్తలు ఆ ప్రొఫెసర్ మాట్లాడిన విషయాలే తిరిగి తిరిగి మాట్లాడసాగింగ్రు.

ఆడ ఉన్నోళ్ళకు ఏమోగాని, నాకు మాత్రం ఏదో జ్ఞానోదయమయినట్టయింది. సాగర్ పక్కనె ఉన్న నాకు నీళ్లు రాకుండ ఇంత దూరంలో ఉన్నోనికి నీళ్లు ఎవని కుట్రవల్ల వచ్చినయో అర్థం కాసాగింది. నా పక్కన ఉన్న నీళ్లు న్యాయంగ నాకు దక్కకుండ అన్యాయంగ తీసుకున్న ఆంధ్రోడు శత్రువే. నా జిల్లాలోని ఇంకో ప్రాంతం వాడు నాకు శత్రువె. రెండు కార్లకు నీళ్లొచ్చెటోడికి మూడో పంటకు నీళ్లు కావాలి, ఒక కారుకు నీళ్లొచ్చెటోడికి రెండో పంటకు నీళ్లు కావాలి, అసలు నీళ్లు లేని నా సంగతి ఏంది? ఎందుకో ఎప్పుడు రాని కొత్త ఆలోచనలు మనసు నిండ కమ్ముకున్నాయి! ఈ ఆలోచనలతో పొద్దటి నుండి పడుతున్న సంఘర్షణ, బాధ ఎగిరిపోయినట్టయింది. ఈ ఉద్వేగమైన ఆలోచనల్తో ఎట్ల ఇంటికి చేరుకున్నానో ఏమో?..

"ఏంది బావ ఇంత ఆలస్యమైంది?" ఇంట్ల అడుగుపెట్టానో లేదో రవి అడిగిండు.

"ఫ్రెండ్స్ దగ్గర ఆలస్యమైంది.." రూంలకు పోయాను.

వంట రూం నుండి వాసన. చికెన్ ఫ్రై కావచ్చు. ముందు రూంల గ్లాసు చప్పుడు. మందుకు సిద్ధమవుతున్నడన్నమాట.

ఆడికి పోవటం ఇష్టంలేక బెడ్‌మీదనె వొరిగిన.

"ఏంది బావ, బామ్మర్దికి కంపని ఇవ్వొచ్చుగా..."

"వస్తున్న పా.." వాదించడం ఇష్టం లేక అన్న.

ముందు రూంల వాతావరణం చూస్తె, అన్నా చెల్లెల్లిద్దరు వాదించటానికి సిద్ధంగా వున్నట్టుంది. నాగ్గూడ ఏదో తేల్చుకోవాలని ఉంది. మీటింగ్‌ల ప్రొఫెసర్ మాటలు ఇంకా గింగురుమంటున్నాయి చెవుల్లో.

అప్పటికె ఒకటి రెండు రౌండులు పూర్తయినట్టుంది. నోటినుండి ముద్దముద్దగా మాటలొస్తున్నాయి. చాయ్ తీసుకొచ్చి ముందు పెట్టింది రమ. చికెన్ ముక్కలు నములుతూ మొదలుపెట్టిండు.

"రేపు కౌన్సిలింగ్‌కు పోతున్నవ బావ?" భయం భక్తి బాధ కలగలిపి

"పోతున్న.." గ్లాసు నోట్ల పెట్టుకుంటు.

"ఎందుకు బావ అంత నిర్ణయం తీసుకున్నవు? మేము ఏమన్నమని?" చెల్లె వైపు చూస్తూ అండు.

"మీరు ఏదో అన్నారని గాదు, నా ఆలోచనలు నాకున్నవి..."

"ఏం ఆలోచనలు, పనిలేని ఆలోచనలు పిచ్చి పిచ్చి పుస్తకాలు చదివి అదంత.." ఇంకా ఏదో అనబోయింది రమ.

నా కోపాన్ని చూసి బామ్మర్ది అండు "అదేందో చెప్పొచ్చుగా బావ.." రవి.

"అవి చెప్పిన ఆరేవి తేరేవి గాదుగాని, ఇంత పట్టుదల ఎందుకు? మేమేమన్న రాష్ట్రం, దేశం వదిలిపెట్టి పోతున్నమా? ఈ జిల్లే ఇంకో మూలకు, మా సొంత ఏరియాకు పోతున్నం. గీదానికి గింత బాదెందుకో నాకర్థం కావటం లేదు..."

"అది కాదు బావ, చెల్లె మా కండ్ల ముందు ఉండకుండ పోతుందని..." కోడల్ని దగ్గరకు తీసుకుంటు.

"మీరు చూడాలనుకున్నప్పుడు వచ్చి చూసి పోవచ్చుగా, ఎంత దూరం?"

"ఆ నీళ్లు లేని ఏరియాలో, మెట్టభూముల్లో నా కోడలు ఎట్ల పెరుగుతుందో ఏమో!" కోడల్ని ముద్దాడుతు అండు.

నీ కోడలొక్కటి పెరగటం లేదు. చాలమంది పిల్లలు పెరుగుతున్నారు ఆడ.."

"ఏమో బావ, ఆ ఏరియానె మంచిది కాదు. ఎప్పుడు ఏవో గొడవలు. నక్సలైట్లు, పోలీసుల సంపుకోటాలు, ప్రశాంతంగా ఉండదు. ఈ ఏరియాలో అయితే ప్రశాంతంగా వుంటది. నీ ఆలోచన ఏందో అర్థం కావటం లేదు..." చికెన్ ముక్క నోట్ల పెట్టుకుని వాదన మొదలుపెట్టిండు.

"నీ నిర్ణయం మార్చుకోనంటవా?" మధ్యలో అందుకుంది రమ. ఏదో నిర్ణయానికి వచ్చినట్టుంది.

"మార్చుకోను..." దృఢంగానె అన్న.

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నరు అన్నాచెల్లెలు. ఏడ్చుకుంటు బెడ్‌రూంలకు పోయింది రమ.

రవి పెగ్గుమీద పెగ్గు లాగుతున్న బామ్మర్దికి తగ్గుతుందో ఎక్కుతుందో అర్థం కావటం లేదుగాని, మందు మాత్రం కూల్‌డ్రింక్ త్రాగినట్లు మింగుతూనె ఉండు.

పాప ఏడుపందుకుంది. ఏడుస్తున్న పాపను బెడ్‌రూంల ఉన్న చెల్లెలికిచ్చి వచ్చి పక్కనె కూర్చుండు.

“బావ! నాన్న చెప్పమండు. ఈడున్న పోర్షన్లో నాలుగు పోర్షన్లు మీ పేరు మీదనె రాయిస్తనన్నాడు. మీరు ఈడ ఉంటనె..” చివరి మాటలు గట్టిగా పలుకుతూ.

బహుశా ఇది నామీద ఉపయోగించే చివరి అస్త్రం కావచ్చు! ఇల్లు కడుతున్నప్పుడె అనుకున్నరంట నాలుగు పోర్షన్లు రవికి, నాలుగు రమకని. అవి ఇప్పుడు ఈవిధంగ అక్కరకొస్తున్నాయి.

లోపల ఏదో ఆశ! పిసుకులాట మొదలయింది. దాదాపు పది ఇరవై లక్షల ఆస్తి. ఇప్పటికె దిగజారిపోయాను. చాలా విషయాలపట్ల. ఇప్పటికైన నన్ను నేను కాపాడుకోవాలి. కాపాడుకోవాలంటె కొన్ని విలువల పట్ల గట్టిగానె నిలబడాలి. నిలబడాలంటె ఈ గొడవలు తప్పవు..

రవి అట్లనె సోఫాలో ఒరిగిండు.. నెమ్మదిగా రూంలకు నడిచిన.

రమ బిగుసుకొని పడుకుంది. ఆకలవుతున్నా తినాలనిపించలేదు. రేపు ప్రయాణానికి కావాల్సిన సామాను, సర్వీస్ బుక్ బ్యాగ్‌ల సర్దుకున్న.

బెడ్‌మీద ఒరిగానె గాని నిద్ర రావడం లేదు. ముందు గదినుండి రవి గురక. తను కూడా నిద్ర పోవడం లేదనిపిస్తోంది. దగ్గరకు తీసుకొని ఓదార్చాలని ఉంది. ఒప్పించాలని ఉంది. ప్రయత్నాలు గుర్తొచ్చి ఊరకుండిపోయిన.

✡

పొద్దున్నే నాలుగు గంటలకే మొదటి బస్సు. దాన్ని అందుకోవాలని లేచాను. తయారయి మరోసారి బ్యాగు సర్దుకుంటుంటే రమ గూడ లేచి కూర్చుంది. తనకు నాలాగే నిద్ర లేనట్టుంది రాత్రంతా. పలుకరించదలుచుకోలేదు. తనే మొదలుపెట్టింది.

“పోక తప్పదా?”

“తప్పదు..”

“నేను గాని, మావాళ్లుగాని ఏమి తక్కువ చేసినమని?”

“తక్కువ చేసినరని అన్ననా?”

“అట్లయితే పోవాలని ఆలోచన ఎందుకు?”

“చూడు రమ, ఎక్కడికో పోతున్నట్టు మాట్లాడుతవేంది. మన వూరికే గదా?”

“ఇక్కడే ఉంటె ఏమైందని?” మళ్లీ మొదటికె వచ్చింది.

“మనం ఆడికి పోతె ఏమైతది?” మొండిగానె అన్న

"నాకిష్టం లేదు ఆడికి రావడం.."

"నాగ్గాడ ఇష్టం లేదు ఈడుంటం..."

"ఎందుకని?"

"నేను గూడ అదే అడుగుతున్న.."

"అక్కడ! నచ్చదు.."

"ఈ ఏరియా నాకు నచ్చదు..."

"నిన్నొక్కన్ని చూస్తున్న ఈ ఏరియా నచ్చట్లేదనేటోన్ని.."

"నిన్నొక్కదాన్నె చూస్తున్న మొగునితో రాననెదాన్ని.."

"నేను రానంటె ఏం చేస్తవు ఆడికి?"

"వస్తవో రావో నీవే తేల్చుకో..."

"నా మీద ఇదేనా ప్రేమ?"

"నేను గూడ అదె అడుగుతున్న.."

"మనిద్దరం కలువుడు కష్టమె..."

"అది నీ చేతులనె ఉంది..." బయలుదేరబోతుండగ పాప ఏడుపందుకుంది నిద్రలోనె.

కొద్దిసేపటిదాక చూశాను. రమ తీసుకొనెటట్టులేదు. పాపను తీసుకొని నిద్రపుచ్చాను. నెమ్మదిగ మెత్తటి దిండుమీద పడుకోబెట్టాను. తీరా బయలుదేరబోతుండగ తను ఏడుపు అందుకుంది. జాలి పడదలుచుకోలేదు.

రవికి తాగింది ఇంకా దిగనట్టుంది. సోఫాలో పండుకొని నిద్రపోతుండు. లేపి చెప్పాలనిపించలేదు. నెమ్మదిగ బయటపడిన.

నల్లగొండకు పోయే బస్సు సిద్ధంగా ఉంది. బస్టాండ్‌ల కౌన్సిలింగ్‌కు పోతున్న ముగ్గురు నలుగురు టీచర్స్ కూర్చుని ఉన్నారు. వాళ్లందరూ దాదాపు పరిచయమె. విష్ చేసుకుంటు సీట్ల కూర్చున్న.

రాత్రంతా నిద్ర లేకపోవడం వల్ల బస్సు అట్ల కదిలిందో లేదో నిద్ర ఇట్ల ముంచుకొచ్చింది.

బస్సు నల్లగొండ చేరే లోపున ఒక కునుకు తీసి లేచేసరికి మనస్సు కాస్త తేలిక అయినట్టయింది. బస్టాండ్‌లో దిగి కౌన్సిలింగ్ స్థలానికి పోయే సరికి పది దాటింది. వుపాధ్యాయుల సందడి బాగా ఉంది. గ్రౌండ్‌ల ఓ మూలకు చాలామంది సమావేశ మయినరు. అనుమానంగానె ఆ గుంపు దగ్గరకు నడిచిన.

"నిన్న కౌన్సిలింగ్‌ల అక్రమాలు జరిగినయంట. ఒకటి రెండు యూనియన్స్, వాటిని బయటపెట్టి గొడవ చేసేసరికి, నిన్న సాయంత్రం జరగాల్సిన కౌన్సిలింగ్ ఆగిపోయింది. ఈ రోజు జరుగుతాయి..."

"ఏ అక్రమాలు జరిగినయంట..."

"ఏవో తప్పుడు మెడికల్ సర్టిఫికెట్లు చూపించుడు, తప్పుడు స్పౌజ్ కేసు, ఎక్కువ సర్వీసు చూపించుడు..."

"ఈ రోజన్న సక్రమంగ జరుగుతాయో, లేదో?" అంతకు ముందు అడిగిన వుపాధ్యాయుడే మధ్యలో అందుకుండు.

"అంత అధికారుల దయ.." కౌన్సిలింగ్‌కు వచ్చిన ఉపాధ్యాయులంతా చర్చల్లోపడ్డరు.

నిన్న జరగాల్సిన కౌన్సిలింగ్ కాలేదంటె, ఈ రోజు జరగాల్సిన కౌన్సిలింగ్ సాయంత్రానికో, రేపు జరుగుతుందో తెలియదు. నీరసనం ముంచుకొచ్చినట్టయింది. రోడ్డు అవతల ఎదురుగ ఉన్న హొటల్‌లోకి నడిచిన.

రాత్రి తినకపోవడం వల్ల కడుపు కాలిపోతుంది. పది నిమిషాలు ఆగమని చెప్పేసరికి పేపరు అందుకున్న.

ఎప్పుడు వచ్చారో ఏమోగాని సోమయ్య సార్, ప్రభాకర్ సార్ పక్కనె కూర్చున్నారు. నిన్న కౌన్సిలింగ్‌ల జరిగిన అక్రమాలను బయటపెట్టింది వీళ్లే. విష్ చేశాను ఇద్దరికి.

"కౌన్సిలింగ్‌కు వచ్చింద్రా?" చనువుగ అడిగిండు సోమయ్య.

"అవును సార్!"

"ఇప్పుడు ఎక్కడ పని చేస్తున్నారు?"

"కోదాడ మండలం సార్.."

"ఏ ఏరియాకు పోవాలనుకుంటున్నారు..?"

"దేవరకొండకు..."

"మంచి ఏరియా వదిలిపెట్టి గుట్టల ప్రాంతానికి పోతున్నరు ఎందుకు?" ప్రభాకర్ వెంటనె అందుకుండు.

"మా లోకల్ ఏరియా గదా సార్!"

"అట్లనా!" అని దేవరకొండ ఏరియాలో ఎక్కడెక్కడ ఖాళీ ఉన్నయో చెప్పసాగిండు సోమయ్య.

“అటు ఎవరు కోరుకోవటం లేదు” ప్రభాకర్ చెప్పేసరికి ప్రాణం కుదుటపడ్డట్టయింది. అయినా తను అనుకున్న రెండు మూడు ప్లేసుల్లో దొరుకుతుందో లేదోనని దడదడగానే వుంది.

“మళ్లీ కలుస్తం సార్..” ఇద్దరు హడావుడిగా వెళ్లిపోయినరు.

సాయంత్రం బాగా పొద్దుపోయినంక, అనుకున్నట్టుగానె అనుకున్న ప్లేసు దొరికింది!

✡

మబ్బుల్నె నాలుగ్గంటలకు నల్లగొండలో బస్సెక్కి, దేవరకొండలో దిగి, ఆడ్నుండి బస్సెక్కి ఊర్ల దిగేసరికి పది దాటింది.

ఊరంటె ఊరుకాదు.. ఆ వూరుకు బస్‌స్టాప్ అది. అరకిలోమీటరు నడిస్తె ఊరొస్తది.

క్రాస్ రోడ్డుంటం, నాలుగైదూర్లకు బస్టాప్ కావటం వల్ల సెంటర్‌గా మారింది. రెండు మూడు జనరల్ స్టోర్స్. స్టీల్ ఐరన్‌షాప్, మూడు హొటల్స్‌లో రెండు ఫోన్‌బూత్‌లతో కలకలలాడుతుంది.

ఫోన్‌బూత్ చూసేసరికి ఇంటికి ఫోన్ చేయాలని ఆలోచన వచ్చింది. తీరా బూత్‌ల కూర్చునెసరికి అయిదు నిమాషాలపాటు గుంజులాట. చివరికి గట్టిగా నిర్ణయించుకొని రింగ్ చేసిన.

“హలో ఎవరు?” రవి గొంతు

ఇంకా పోనట్టుంది. అయినా ఎట్లపోతడు? టాకీసుల ఉన్న సినిమాలన్ని చూసి పోవాల్నాయె? అయినా రేపు శుక్రవారం వీడి హీరో సినిమా రిలీజాయె. బ్యానర్లు కట్టుడు. పూలదండలు ఏసుడు ఎంత బిజీ పనులో...

“రమను పిలువు..”

“బావా నువ్వా, పిలుస్తా ఉండు”

“ఏంటి?” మూడు నాలుగు నిముషాలకు ఎత్తింది.

“ఏమి లేదు, మనూరికి దగ్గర్లో ప్లేసు దొరికింది. ఈ రోజు జాయిన్ అవుతున్న. ఇల్లు చూసుకొని రేపు, ఎల్లుండిగాని వస్తా, ఆదివారం షిఫ్ట్ చేసుకొని ఈడికి వద్దాం..”

“....” సప్పుడు లేదు. అవతల నుండి.

“మాట్లాడవేంది?”

"ఏం మాట్లాడాలి?"

"నాతో ఉండుడు ఇష్టం ఉందా లేదా నీకు అసలు?"

"నీతో ఉండుడు ఇష్టమె. ఆడ ఉండుడు నాకు ఇష్టం లేదు.."

"చివరి నిర్ణయమా?"

"......" జవాబు లేదు. 7

"చూడు రమ, నీవనుకుంటున్నట్లు ఈ ఏరియాలో రాక్షసులుండరు. ఏ ఘోరాలు జరుగవు. మీ దగ్గరున్నట్టె ఈడ ప్రజలుండరు. వాళ్లకు ప్రేమలుంటయి, మీ ఏరియాలో లాగ కాలువలు, నీళ్లు లేకపోయిన కష్టాలు, కన్నీళ్లలోనైన ఆత్మగౌరవంతో బతికే ధైర్యముంది. నీవు ఏదో వూహించుకొని, ఏదో అనుకుంటున్నవు. ఈడికొచ్చినంక నీకే అర్థమవుతది... ఈడనె వుండమని బలవంతం చేయటం లేదు. నీకు నచ్చితెనె ఈడ వుండు. లేకుంటే నీ ఇష్టం. పాప విషయం తర్వాత మాట్లాడుకుందం.." ఫోన్ పెట్టినట్టె గాని, శరీరమంత కంపించసాగింది.

పక్కనె ఉన్న హొటల్లో టీ తాగాను. దడ తగ్గినట్టయింది కొద్దిగ. నెమ్మదిగ వూరు వైపు నడక మొదలుపెట్టిన.

రోడ్డు కిరువైపుల చేన్లు...

కాలువ ఏరియాకు, మెట్ట ఏరియాకు ఎంత భేదం!

ఆడ కాలువల్తో, పచ్చటి పొలాలు, చల్లటి గాలుల్తో ఒయ్యారం పోతున్నట్టుంటాయి రెల్లి పూలు.

ఈడ.. ఆముదపు చేన్లు, జొన్న చేన్లు, సజ్జ చేన్లు, కంది చేన్లతో చెలుకలు. కొద్ది సేపు ఎందుకో ఆ చేన్లను చూసుకుంటు నిలబడాలనిపించింది.

పక్కనె ఉన్న చెలుకలో ఆముదపు పంట మధ్యలో కందిచేను ఉంది. ఆ రెండు పంటలు కలిపి ఏవో కమ్మటి వాసనలు. ఎంత కాలమాయె ఈ వాసనల్ని కోల్పోయి! గుండె నిండ పీల్చిన. ఏదో ధైర్యం ఆవరించినట్టయింది.

కందిచేను గట్ల మీద విరగబూసిన గునుగు పూవు. సెమ్మెల మీద వెలుగుతున్న జ్యోతుల్లా ఉన్నాయి. వాసన లేకపోయిన తెంపుకొని ముక్కు దగ్గర పెట్టుకున్న.

దీన్ని చూస్తుంటనె కాలువ కింద వరి పొలాల గట్ల మీద పెరిగె రెల్లి పూవు గుర్తొస్తది. గునుగు పూవు కంటె అది పొడవుగ పెరుగుతది. ఎప్పుడు నీల్లు జాలువారె ప్రాంతం కనుక అట్ల పెరుగుతది. కాని ఈ గునుగు పూవుకు నీరెక్కడిది? ఒక్క వర్షం మీదనె విరగబూస్తది.

రెండు మూడు గునుగు పూలు తెంపుకొని నడక మొదలుపెట్టిన వేగంగ.

..... ఈ గునుగు పూవులాంటి మెట్టభూమోనికి, రెల్లి పూవులాంటి నీళ్ల ప్రాంతమోనికి గొడవలు, అసమానతలు ఎప్పుడు పోతయి? బహుశా రెల్లిపూవు పుట్టడానికి కారణమైన కాలువలు, నీళ్లు జాలువారె అవకాశాలు ఎప్పుడైతే మెట్ట భూమోనికి వస్తయో అప్పుడు ఈ గొడవలు పోవచ్చు. ఇవి రావాలంటే వట్టిగ వస్తయా? ఎంత రక్తం పోవాల్నో ఈ మెట్ట భూముల్లో. అయినా ఎంత తెలివివాడికి? నా తలాపున నీళ్లు ఎంత తెలివిగ ఎత్తుక పోతుండు!... ఆలోచనల్నుండి ఉలిక్కిపడ్డట్టయింది.

విచిత్రం! ఊరు మొదట్లోనే ఓ ఇంటిగోడల నిండ... 'ఇంకుడు గుంతలు మాకు– పారే కాలువలు మీకా? పరాయోడు దోపిడి చేస్తే పొలిమేర దాక తరుముతం– ఇక్కడోడే దోపిడి చేస్తే ఇక్కడే పాతరపెడతం, నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి..' పెద్ద పెద్ద అక్షరాలతో నినాదాలు.

ఎవరో ఆత్మీయులు నా కోసమే రాసి నన్ను ఆహ్వానించినట్టనిపించింది ఆ రాతలు. ఆనందంతో ధైర్యంగ ఊర్లకు అడుగుపెట్టిన!

✡

# వలపు

**–చాగంటి సోమయాజులు**

మిట్ట మద్దేన్నం ఎండ నిప్పులు చెరుగుతూ వుంటే గాలికి కొట్టుకు వచ్చిన మేగం – పెద్ద వాన కురిసి పట పట పటాల్ మని పిడుగును వదిలిపెట్టి గాలికి కొట్టుకు పోయింది.

మాం పొలం దున్ని ఏరుశనగ ఏసినాం. దాంతో సరి. మెరుపు పట్టుకున్నాది. కార్తి కార్తి తరవాత కార్తి ఎల్లి పోతున్నాయి. ఏ కార్తీ వొరుపే.

అదిగో మళ్లా మృగకార్తిలో వోనొచ్చింది. పడుతల్లే పడుపడు మని ఆకాశం వంక అర్రులు సాచినాం. సిన్నవాన పడ్డం పడింది. శాన. దాంతో వొరి ఇత్తనాలు నారుమళ్లలో జల్లినాము.

పట్టుకుంది వొరుపు. ఆకాశంలో ఎక్కడా మెరుపేలేని వొరుపు.

నీతీ నిజాయితీ మనుషుల్లో సచ్చినాయి. నీతి – ఆకాశానికీ సచ్చింది. నెలకు మూడు వోనలు కురిసీవట! ఇప్పుడేదీ ఆ నీతి?

దాందర్మమా అని పొద్దు – ఏళకి పొడుస్తున్నది. రేతిరి – ఏళకి అవుతున్నది. ఆ సూరె బగవానుడు – ఆ నీతి తప్పితే మన గతులు ఏటవుతాయి?

పంచాయతీ రేడియో సాయంకాలం అరిస్తే మా కొండల్లోకి ఇనపడతాది. ఇశాకపట్నం కాడ వోయు గుండం వున్నాది. వచ్చి పడిపోతున్నాది. గాలీవానా అంటే పొద్దున్న అదే రేడియో ఏటో సెపుతుంది? వోయు గుండం మన్ని దాటెల్లి పోయి వొడ్డి దేశాన్ని ఓ బాదు బాదిందని సెపుతాది.

ఇక్కడ మనకేటి పడ్డాది? తుంపర్లు పట్టుకున్నాయి. పొలాలకెళ్ళి పచ్చగడ్డి బరకనేము. సిటుకు సటుకు సినుకులు. ఇంట్లో కూకోనేము. వారంరోజులు సిటుకు సటుకు సిన్న సినుకులు.

ఆ దిక్కుమాలిన ఆకాశాన్ని నమ్ముకొని తరతరాలు బతుకొస్తున్నాము.

బూదేవత పెరగనేదు. మాం పెరిగీసినం! మా ముత్తాత ఒక్కడే. ఇప్పుడు మేం పాతికిళ్ళ వాళ్ళం! ఆ బూదేవతను నమ్ముకొని పాతిక సంసారాలు ఆ ఆకాశాన్ని నమ్ముకొనే గండాల బతుకులు బతుకుతున్నాం.

దగ్గరలోనే కొండవాగులున్నాయి. వాటి నీళ్ళు కాస్త పైకెత్తి మా సెరువుల్లోకి మళ్ళిస్తే మాకెందుకీ గతి? సూసేనాదుడు నేడు! చేసే నాదుడు నేడు!

వొరి ఇత్తనాలు ఆకుమళ్ళలో ఏసినామా. అందులో నారు నెగడానికి తడి? బావుల్లో ఊటనేదు, సెర్లో సుక్కనీరు నేదు. ఆకాశంలోంచి టక్కని వొక్క సినుకు నేదు. వొరుపు వొరుపు ఒకటే వొరుపు. ఉసూరుమని సూస్తూ వుండగా వొరాకు సుట్టుకుపోయి సుట్టుకుపోయి ఎండిపోనాది. ఏరుశనగ బెత్తెడు కొనసాగనేదు. ఆకులు నులుచుకుని ముడుచుకుపోతున్నాయి!

ఐపోయింది మా పని. ఇకనేటుంది? ఈ నాటున గేమాలు గేమాల పెజ మలమలమాడి సావవలసిందే! వూళ్ళన్నీ సెల్లాసెదరై పోతున్నాయి. ఆడా, మగ సత్తు వున్నవాళ్ళంతా పట్నాలకి పిట్టల్లా గెగిరిపోయారు. అంతా తలోదారీ పట్టేశారు.

నా కొడుకులిద్దరూ – ఆళ్ళకి ఆళ్ళే – కటకం పోదాం ఆనీసుకున్నారు.

మావి మారుమూల కుగ్రామాలు. కూలీనాలీ చేసుకు బతకడానికి దగ్గరలో పట్నమన్నది నేదు. సుట్టుపక్కల ఎక్కడా మిల్లుగొట్టం నేదు!

నా పెద్దకొడుకు – ఎక్కడ తెచ్చినాడో – నెలకి రూపాయికి పావలా వడ్డీకి అప్పు కటకం వెళ్ళడానికి. అక్కడ మాకు అయినోళ్ళు ఉన్నారు. ఎంటనే కూలి పలుకుతాది. మా వాళ్ళు పనిలో వొళ్ళు దాచుకోరు. ఆళ్ళ పని సూస్తే ఎవ్వళూ వగ్గరు.

పిల్లల్ని మా కాడ వొగ్గేసి పెద్దకొడుకు ఎళ్ళినాడు. పెళ్ళాన్ని మా కాడ వొగ్గేసి సిన్నకొడుకు ఎళ్ళినాడు. సిన్నకోడలు ఎళ్ళడం మాం ఇష్టపడనేదు.

ఎందుకంటారా మా వూరి కుర్రాడే – సిన ఎంకటప్పడు ఆడి పెళ్ళాం కటకం ఎళ్లి ఏటిసేసింది? కటకీ అయ్యింది నెగిసిపోయింది మొగుణ్ణొగ్గేసి ఎవడితోనో. మరి అతీగతీ నేదు!

వయసులో వున్న ఆడదాన్ని కూలికి పంపడం సెడ్డ నఖారా, కటకం ఎళ్ళినారు మా వోళ్ళు.

అక్కడ ఆళ్ళు బతకాల. మాం ఇక్కడ బతకడానికి పంపాల. అప్పులు తీర్చాల. ఎవసాయానికి మదుపులు తేవాల! సంకురు మాణానికి ఇంటికి రారు. శివరేత్రికైనా వస్తారో రారో, రారు. తొలకరి దాగా ఆళ్ల మొకాలు మరి కనబడవు.

గవర్నమెంటోళ్ళు ఆప్పులిస్తున్నారంటే ఎగబడ్డాము. అప్పు పుట్టడానికి కాయితాలు రాయించినాము. వుద్యోగం వూడిపోయిన కరణంగారే రాసినారు. మా వూరి పెసిడెంటు కాణ్నుంచి తాసిల్దారాఫీసు బంట్రోతు దాకా సెయ్యి జూపినోళ్ళ కల్లా ఇచ్చుకోవలసింది

ఇచ్చుకుంటే ఐదొందలు అప్పుకి సేతికి నాలుగొందలే వొచ్చినాయి! తిరిగి మాం ఐదొందలిచ్చుకోవాల. ఐదొందలకి వడ్డీ ఇచ్చుకోవాల. కాబూలోడి అప్పే నయం!

ఎంత నష్టమొచ్చినా ఆ పాటి డబ్బు సేతిలో నేకపోతే గుండె దిటవుండదు.

పంటలన్నీ వొల్లకాట్లో కలిశాక ముసుర్లు పట్టుకున్నాయి. సెరువులూ నిండినాయి.

పచ్చగడ్డి బాగా నెగిసింది. తలో బుంగడు గడ్డీ బక్కురుకొస్తే – పశువుల మొర తీరుతుంది.

ఆకాలపు వోనలైనా ఏదో ఒకటి సెయ్యాలి కదా? గుత్తి ఏరుసెనగ నాలుగు సిన్న మళ్ళు ఏసినాము. సోడిసేను ఊడిచినాము.

అవిగాని కుసింత పండినాయంటే నాలుగు పొద్దులు మా కడుపు మంటుందే అది కాస్త సల్లారుతుందని ఆశ.

సిన్న ఆశ!

✡

# కూరాక్కు సచ్చేటోన్నా?...

**-బత్తుల ప్రసాద్**

వారం కాన్నుండి బాలిగానికి సియ్యాలు కూరాకు మీద శింతపట్టుకున్నెది. కొనక్కచ్చు కుందామంటే చేతిలో లెక్కలేదు. అప్పు తెచ్చుకుందామంటే అట్ట తెచ్చుకుంటే టయానికి ఇయ్యలేదని పొట్టేళ్లను కోసే మస్తాన్ మానం దీసింది గుర్తొచ్చింది... అసలు బాలిగానికి ఈ శియ్యాల శింత ఎట్ట పట్టుకున్నెదంటే...

ఆ మద్య కోర్టుకని బద్వేలుకు పోయినప్పుడు ఓటల్లో బువ్వ తిండానికి పోతే ఎదురుంగ కూకున్నోడు కూరాకన్నం తింటాన్నెడు. మంచి మసాల ఏసి వండినట్టుండారు. గమగమ వాసనొచ్చాంది. బాలిగానికి కూడా తినాలనిపిచ్చింది. అయితే జేబులో ఇంటికి పోడానికి చార్జిగాక ఓ రెండు రూపాయలు మాత్రమే వుందని తెలుసుకాబట్టి గమ్మునుండె. బాలిగాడు పప్పు బువ్వ కలుపుకుంటూ ఎదురుంగ కూకున్నోని తిట్టు సూడ గుడ్డు అనుకుంటానే సూశె. వాడు కూరాకు అంటే లెక్కలేనట్టు– ఎంకలకుండే సగం కూరాకు మత్రమే తిని పక్కనే పడేచ్చాన్నెడు. 'నేనైతే దాన్ని పీల్చి నమిలి ఉయ్యక పోయిందునా' అనుకుండె.

మళ్లీ 'ఛఛ వాడెట్ట దింటే మనకెందుకు వాని తట్టు సూడగుడ్డు' అనుకునె. కూరాకు తిని శాన్నాల్లయింది. ఇంటికిపోయి కోన్ని కోసుకుని తినాలనుకునె. అయితే అది తన పెండ్లాం, పుట్టింటి కాన్నుండి తెచ్చుకున్న కోడిగదా అది ఒప్పుకుంటదా? అనుకుండె. ఒప్పుకోకుండ ఏమిజేచ్చది. ఎట్టన్నగాని కోసుకొని తినాల్సిందే అనుకున్నెడు. కోర్టు కేసు మళ్లీ వాయిదాపడి, బాలిగాడు బస్సెక్కిండు, వాని మనసంతా కోడికూరాకు తట్టే తిరుగుతాన్నెది.

నారాయణమ్మకు ఇద్దరు కొడుకులు. పెద్దోని పేరు సుబ్బరాయుడు చానా మెతకోడు. చిన్నోని పేరు బాలుడు మహా ముక్కోపి. వాని సావాసగాళ్లందరు బాలిగాడు అని పిలుచ్చాంటరు. వీళ్లిద్దరు న్యాదర పిల్లోల్లుగా ఉండంగానే వాళ్ల నాయన రోగమొచ్చి సచ్చిపోయిండు. అప్పట్నుంచి నారాయణమ్మ వున్న నాలుగెకరాలు సాగుజేసుకుంటా పిల్లోల్లను పెంచి పెద్ద జేసింది. ఏ లోటు రాకుండా పెరిగిరి... రెండేండ్ల కిందట అన్నదమ్ములిద్దరు పెండ్లిజేసుకుని ఏరుబోయిరి. వున్న భూమి సెరింత పంచుకుండిరి. నారాయణమ్మ చిన్నకొడుకు కాన్నే వుంటాన్నెది.

ఓ రోజు నారాయణమ్మ సుద్దబాయికి నీళ్లకు పోయింది. బాయిలో నీళ్లు అడుగున ఒడటంతో వాటిని సేదుకుండేకాడ బండోళ్ల గురమ్మతో కొట్లాటపడి, మాటా మాటా పెరిగె. గురమ్మ ఒగ్గిసిది కాడంతో నారాయణమ్మను ఒక్కతోపు తోసింది. ఆ దోవన బోతా ఈ కొట్లాట జూసిన బాలిగాడు ఎనకా ముందు, ఆడమొగా తేడా సూడకుండా గురమ్మ మీదికి దూక ఇద్దరు తన్లాడుకుండిరి. గురమ్మ జాకెట్టు సినిగె. తన కూతుర్ను కాకుండా, ఏరే సంబంధం చేసుకున్నదని కసిపెట్టుకొని వున్న గురమ్మ తల్లి లచ్చుమ్మ, దొరికిందే సందు అన్నట్టు బాలిగాని మీద రేపు కేసు పెట్టిరి. పోలీసు టేషన్‌లో పడితే జామీనిచ్చే నాదుడు లేక బాలిగాని పొలం తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చిరి. మద్యవర్తులు సగం దిని, సగం వకీలుకు గట్టి ఇడిపిచ్చిరి.

"ఉత్త పుణ్ణానికి పొలం అమ్మాల్సి వచ్చెగదరా" అని నారాయణమ్మ బాదపడె.

ఆడదాంతో కలబడ్డం కరెట్టు కాదనె. దానికి బాలిగాడు కోప్పడి,

"నీయమ్మ నీ కోసం ఆ యమ్మితో కలబడ్తే, నాదే తప్పంటావా?" అనె.

నారాయణమ్మ నైతారంగా 'అదిగాదురా నాయనా గాడిదను జంపి గల్లుకు పోయినట్టుంది' అనె.

బాలిగాడు ఇనకపాయె. అట్ట మాటామాటా పెరిగి నారాయణమ్మ పెద్ద కొడుకు కాడికి ఎల్లిపాయె.

బయట మంచం వేసి వసారాలో బాలిగానికోసం సాయంత్రం ఎదురు సూచ్చాన్నెది. ఎండాకాలం కరెంటు లేకపోవడంతో కిరసనాయిలు దీపం ఎలిగిచ్చింది సాయిత్రి. బాలిగాడు ఇంటికొచ్చి దాల్బందరం కాడ చెప్పులిడిసి, ఇంటిపక్కనే వున్న బానలో నీళ్లు తీసుకుని కాళ్లు కడుక్కుని, దండెం మీదుండే తువ్వాలు తీసుకుని ముకం తుడ్సుకుని నులకమంచం మీద కూచ్చుంటాంటే సాయిత్రి రాగిచెంబుతో నీళ్లు తెచ్చిచ్చింది. బాలిగాడు నీళ్లు తాగుతాంటే...

'కోర్టు యవ్వారం ఎంతదాకొచ్చె' అనె సాయిత్రి.

'మళ్లీ వాయిదా ఏసినారు' అనె.

"బువ్వ పెట్టమంటావా" అనడిగె సాయిత్రి.

"ఆ సరేగాని కోడిపెట్ట ఏది" అనడిగె పెళ్లాన్ని.

'దాన్ని గూడ అమ్ముతావేంది' అని రాగందీసె సాయిత్రి.

'అమ్మడానికి కాదు రేపు కోసుకుందామని' అనే తొనక్కుండ.

'ఏం కోడ్ని కోసుకునేంత సుకమేమొచ్చింది. మింగమెతుకు లేకున్నె ఎచ్చులకేం తక్కువలేదు' అంటూ సాయిత్రి గొనుగుడుకు తిరుక్కున్నెది. దాంతో బాలిగానికి ఎప్పుటి మాదిరే

కోపమొచ్చింది. కాలశేత, కాలశేత పెళ్లాన్ని ఆయాసమొచ్చేదాంక తన్నిండు. ఆ పూట బువ్వ తినకుండానే అటొక్కరు ఇటొక్కరు ముడుసుకొని పండుకుంటిరి.

సొగం రాతిరికాడ కోడి పెకాటిచ్చ పెళ్లాం మొగుడు ఉలిక్కిపడి లేసిరి. వాళ్లు తేరుకుండా ర్కల్ల జంబుబిల్లి కోడ్ని లాక్కపాయె. బాలిగాడు కట్టెదీసుకుని ఎంటపడినా లాబం లేకపాయ. మొబ్బయిందాన బాలిగాడి కాలికి రాయిగొట్టుకున్నెది. తూలిపడబోయి తమాయించుకుని కుంటుకుంటా ఇంటికొచ్చిండు. ఒకపక్క కోడిపోయిన బాధ, ఇంగొక పక్క కాలినొప్పి. ఈ రెండు మనసు కుతకుతలాడిచ్చాన్నెయి. సాయిత్రి గూడా బాదపడి ఊరికనల్లా నా మొగుడ్ని బాదపెట్టినే కోన్ని కోసుకోమని సెప్పినా బాగుండు అనుకుండే.

తెల్లార్తానే పక్క వూళ్లో ఉండేవాళ్ల మేనమామ వచ్చె. 'బేస్తారం మా చిన్నోని పెండ్లి పెట్టుకున్నం. తప్పకుండ రావాల. పెళ్లి మాటలకు పిల్సలేదని ఏమనుకోగాకు' అన. బాలిగానికి మళ్లీ కూరాకు మీద ఆశ బతికె. పెండ్లికి ఎట్టైనా పొట్టేళ్లను కోచ్చరు. ఉత్త కూరాకేంది. బోటి కూడా దండిగ తినచ్చు అనుకునె. అట్ల అనుకుంటాంటేనే నోట్లో నీళ్లూర్నెయి.

పైజామ ఏసుకుని, సన్నపంచ కట్టుకుని బుజం మీద కండువా ఏసుకుని, కిర్రుసెప్పులు తొడుక్కుండ బాలిగాడు. సాయిత్రిగూడా తన పెండ్లప్పటి పట్టుసీర కట్టుకునిసోగ్గా తయారయ్యింది. ఇద్దరు పెండ్లికి బయలుదేరిరి. ఎండాకాలం కాడంతో ఎండ చిటపట లాడిచ్చాంది. వానాకాలం జడివాన కురిచ్చే గోడంబడి నీళ్లు జారినట్టు, మనుసుల ఒంటిమీద సెమట కారుతాంది.

ఆకు మండలతో ఏసిన పందిరి, దాని గుంజలకు కట్టిన టెంకాయమట్టలు, గుమ్మానికి కట్టిన మామిడాకులు, గోడలకు సున్నం బోదకొట్టమైనా ఆ ఇండ్లే పెండ్లికూతురు మాదిరి అగపడ్తాంది. పందిరికి కట్టిన మైకులో నుండి సినిమా పాటలు ఇనిపిచ్చాండయి. కొత్తగుడ్డలు ఏసుకున్న పిల్లోల్లు పందిట్లో అట్టిట్ట తిరుగుతూ ఆడుకుంటాండిరి. కొందరు పిల్లోల్లు టెంకాయ మట్టల ఈకలతో పీకలు జేసి పీ, పీ అంటూ ఊదుకుంటాండిరి. మంచి మంచి సీరలు కట్టుకొచ్చిన ఆడాళ్లు తమ సీరలు అందరు సూడాలని అట్టట్ట తిరుగుతాండిరి. ఒగ్గిసి ఆడపిల్లోల్లు లేగదూడల మాదిరి ఎగిరి దూకుతాండిరి. కొందరు మొగోళ్లు మంచాల మీద కూచ్చొని రాజకీయాలు మాట్లాడుకుంటాంటే ఇంకొందరు చెతుర్లాడుకుంటాండిరి. ఇంతలో ఒకడు మైకు తీసుకుని 'ఎన్నో ఏండ్లు గతించిపోయినవి గానీ' అని పద్దెం ఎత్తుకుండే. వాడు పద్దెం పాడతాంటే అందరు మెచ్చుకుంటాన్నట్టు ఇంటాండిరి. ఆ పద్దెం మద్యలో 'ఇచ్చోటనే లేత ఇల్లాలి నల్లపూసల సౌరు' అని ఆపి మళ్లీ మెల్లంగా గంగలో పడి కలిసిపాయె అని పాడ్తాంటే శానామంది అబ్బ ఏంగొంతు అని మెచ్చుకుండిరి.

ఆ పెండ్లికి బాలిగాని అన్న సుబ్బరాయుడు, వాళ్లమ్మ నారాయణమ్మ గూడా వచ్చిండిరి. బాలిగాన్ని చూసి సుబ్బరాయుడు 'ఏమిరా బాగుండవా' అని పలకరిచ్చె. 'ఆ.. బాగుండ' అని మొకం తిప్పుకుండె. నారాయణమ్మ కొడుకు పలకరిచ్చాడేమో అనుకుని ఆశగా ఆ

తట్టు వచ్చింది. వాడు సూసి సూడనట్టున్నెడు, పెండ్లి తంతు ముగిసింది. మాదిగోళ్లు పలకలు బలె లయగా వాంచుతాండిరి. మంగలోళ్లు బాండుతో సినిమా పాటలు బేచ్చాండిరి. కొందరు ఒగిసి పిల్లోళ్లు పలకల ముందు కట్టె తిప్పుతాంటే, ఇంకొందరు బాండు ముందు కులుకు డాన్స్ సేచ్చాండిరి. బాలిగాడు గూడపోయి కాసేపు కట్టె తిప్పి వచ్చిండు. ఇంటి పక్కన వసారాలో కొందరు నాటుసారాయి తాగుతాండిరి. పెండ్లి ఇందు మొదలయింది. పందిట్లో అటొక వర్స, ఇటొక వర్స కూచ్చుండిరి. అందరికి మోదపాకుల ఇస్తరాకులు ఏసిరి. ఒకరు పెద్ద చాటతో తాళింపు అన్నం పెడ్తాంటే, ఇంగొకరు గోవాకు బోటి ఏచ్చాండిరి. ఇంగొకరు యాటకూరాకు బేచ్చాండిరి.

బాలిగాడు అవతల బంతి మద్యలో కూచ్చోనున్నెడు. ఇంతకు కూరాకు ఎవురేచ్చాండిరి అని సూశ. నారాయణమ్మ కూరాకు ఏచ్చాండే. ఇంగేమి నా పంట పండింది. మాయమ్మ అయితే ఎట్టైన ఒక రవ్వ ఎక్కువే ఏచ్చది అనుకుంటా ఇస్తరాకుని నీళ్లతో బాగ తడుపుకున్నెడు. చాటతో బువ్వ తెచ్చినోళ్లు రెండు మూతలు పెట్టిరి. సాలు, సాలు అనే బాలిగాడు. ఇంగొకడు వచ్చి బోటి ఏశె. బాలిగాడు అన్నం మద్దనగుంతదీశె. నారాయణమ్మ కూరాకు ఏచ్చాంటే వాళ్లమ్మ తట్టు సూడకుండా, పక్కోని తట్టు సూచ్చాన్నెడు.

నారాయణమ్మ అందరికంటే కొడుక్కు రెండు గంటెలు ఎక్కువేసింది. బాలిగాడు అది సూచ్చాన్నా సూడనట్టుండే. వాళ్లమ్మ కూరాకు ఏసుకుంటా ముందుకు పోతాంటే, బాలిగానికి ఒక్క రవ్వ ఎక్కువ ఎయ్యడం జూసి గురమ్మ అన్న అబ్బయ్యకు సర్రున మంట మండింది. పుల్లుగా తాగున్నెడు. ‘బంతిలో పచ్చపాతం ఉండగుడ్డు. నీ కొడుకు అని ఎక్కువేచ్చివి. మాకేమో ఇంత పుల్సు ఒక ఎంక పారదొబ్బితివి’ అనె. తాళింపన్నం కలుపుకుని దాంట్లో ఒక కూరాకు ముక్క కలిపి నోట్లో పెట్టుకుంటాన్న బాలిగాడు అబ్బయ్య అట్టనడం, అందరూ నవ్వడం ఇని సర్రున లేసి అబ్బిగాని ఎగిసి ఒక తన్ను తన్నిండు. వాడు ఇర్సుకుని ఎనిక్కిపడె. అందరూవచ్చి బాలిగాన్ని పట్టుకుండిరి. బాలిగాడు బుసగొడ్తా “నేనేమన్నా కూరాక్కు సచ్చేటోన్నా! మాయమ్మ నాతో మాట్లాడదు. అందుకని ఇంగసాలు అని చెప్పలా” అంటాండె.

అబ్బయ్య తమ్ముడు ఈరయ్య బాలిగాని మీదికి లగెత్తె. అట్ట పెనుగులాడ్తాండిరి. ఇంతలో అబ్బిగాడు పొట్టేళ్లను కోసిన కత్తితో బాలిగాడి తలకాయ కసుక్కున నరికె. దాంతో యాడోళ్లు ఆడ చించుకుని ఉరికిరి. బాలిగాడు మాను పన్నట్టు కిందపడిండు. వాని మెడకాన్నుండి రక్తం పారతాంది. వాడి మొకం వానికి పెట్టిన ఇస్తరాకు తట్టున్నెది, వాని కండ్లుగూడా ఆ ఇస్తరాకులో వున్న కూరాకు తట్టు సూచ్చాండె...

ఆ ఊళ్లో జరుగుతాన్నె ఇంగొక పెండ్లి మైకులో నుండి ఇచ్చోటనే లేత ఇల్లాలి నల్లపూసల సౌరు గంగలో పడి కలిసిపాయే అనే పద్దెం మందంగా ఇనిపిచ్చాండె...

✡

# బోరు పొక్కలు

**-బోధనం నర్సిరెడ్డి**

"ఏందల్ల గింత పాపమై పాయె. ఊల్లె గుడ్డబట్టలోళ్ళు బతికేకాలం లేకుంటయ్యింది గద. మా భూమిల మీము బోరేసుకుంటె పొక్క బూడ్చుత మంటరు గిదెక్కడి న్యాయం? యాడజెప్పనేర్సింండ్రో చెప్పురిజెర ఎవ్వారం?"

భార్య సోములమ్మ మందిలకొచ్చి కోపంతోటి మాట్లాడుతుంటె యాపచెట్టు మొదలు సుట్టేశిన అరుగుకు ఆనుకొని భిక్షంరెడ్డి నేలకేశి పుల్లతోని గీతలు గీస్తున్నడు. సర్పంచి మొగడు వెంకటకృష్ణ, ఉపసర్పంచి పర్వతరెడ్డి, ఊరిపెద్ద మడుసులంత చెట్టునీడన కూకున్నరు అక్కడోళ్లు. పనిపాట మానుకున్న జనాలు ఇంకా శానామంది పంచాయితీ ఏమైద్దోనని ఎదురుసూస్తున్నరు.

"ఏందమ్మో అట్లెందుకు మొత్తుకుంటవుగని నువ్వే చెప్పు నాయం. తెల్శినోళ్ళు వోళ్లు జెప్పితేంది? మీమే చెప్పాల్నని యాన్నన్న ఖరారున్నదా? ఏంలేదు గద. మీరు మీ భూమిల్నే బోరేసుకున్నరుగని సుట్టు నాలుగైదు బోర్లు నిలువున ఎండిపొయినయ్. నడూల్లె నీళ్ళటాంకి కేశిన బోర్ల సుక్క నీళ్ళు గూడ ఒస్తలేవు. ఊరందరికి మంచినీళ్ళు లేక గొంతులెండి పోయే కాలమొచ్చింది. నువ్వొక్కదానివి నా భూమిల నీను బోరేసుకున్ననని ఎవసాయం జేసుకుంటె తతిమ్మోళ్ళు నీళ్ళు దొరక్క ఊరిడిశెట్టి పోవాల్నా చెప్పు? గందికనే మీ ఒక్కబోరు బందుబెడితే ఊరందరికీ నీళ్ళు దొరుకుతై లేకపోతే లేదు. నువ్వే చెప్పు ఏంజెయ్యాల్నో"

వార్డు మెంబరు చెన్నకేశవులు మాట్లాడిండు.

"నువ్వన్నదిగూడ నిజమేగని చెన్నకేశవులన్నా! మరి కడుపుల పేగుల్లేనోళ్ళం మీమెక్కడ బోవాలె చెప్పు మాకున్నదే రొండెకరాలు. వరిచేను పొట్టకొచ్చి ఈన మోపులమీదున్నది. గిన్నిగిన్ని బోశిన చిన్నబోరు నిన్న మొన్న బొత్తిగ ఎండిపాయె మీరు సూస్తనే ఉంటిరి. ఎన్ని నీళ్ళు బద్దామాకు ఈ రొండెకరాలే గద! మందంద- రోతిగ పుట్లకుపుట్లు ఒడ్లు పండిచ్చు కుంటింటిమా? ఎకరాలకెకరరాలు తోటలు బెట్టుకుంటిమా? ఓడు దొంగంటె గుడ్డబట్టలోడే

దొంగని మామీదికే ఒచ్చినాది తప్పు? సరే! మరి యాన్నించి దెస్తరో తెచ్చి – ఇప్పుడు బోరుకు మోటరు గలిపి ఇరవైఎయిల రూపాలైనయ్ అంతమట్టుకు గట్టియ్యిరి ఊకుంటం".

తోచిన తీరుగ మాట్లాడింది సోములమ్మ.

చెన్నకేశవులు ఏమనునోగని ఆయిన మాట్లాడకుమందే సర్పంచి రాములమ్మ మొగడు వెంకటకృష్ణ అందుకున్నడు.

"ఏందమ్మో ఏమో లెస మాట్లాడుతున్నవు? మీ పొలానికి ఊరోళ్ళను నీళ్ళు బెట్టమంట వు, బోరేసుకున్నం పైసలియ్యమంటవు! బాగుందే నీ ఎవ్వారం! యాడ దెచ్చిస్తరు మంది? పున్నేనికొస్తయా డబ్బులు? ఏదో మీము మాట్లాడ్తంగని జెరదాలు నువ్వు! ఏందే? నువు సప్పుడు జెయ్యక గూకున్నవు! ఆమేమొ మందిలకొచ్చి మాట్లాడుతుంది".

"ఏందిర ఎట్నో మాట్లాడుతవ్? లెక్కెంట మాట్లాడితందుకు ఓర్లైతేంది? నువు మాట్లాడ్లలే వార? సర్పంచిగిరి మీ ఆమెదైతె ఆమెను మూలకుబెట్టి నువ్వే తిరుగుతంటివి కచ్చీర్లన్ని. మీ చిన్నమ్మ మాట్లాడింది గదగదే మాట్లాడ్త నీను గూడ. చెప్పురి ఏం జెప్పుతరో మరి మీరు? బోరు బందుజేశి పొలానికి నీళ్ళు బెడ్తరో! లేకుంటె మమ్మల్ని తట్టబుట్ట సదురుకోని ఊళ్ళెనించి పొమ్మంటరో!"

భిక్షంరెడ్డికి నోరు తెరిస్తే ఆవేశమాగదు. ఊరు ఊరంత తనను ఎలేశి ఊరెల్ల గొడుతున్న ట్లనిపిస్తుంది. దు:ఖమో కోపమోగని గొంతు ఒనికి గుడ్లల్ల నీళ్ళు గమ్ముతున్నై.

"ఏందిరా! అట్ల కాకులు మొత్తుకున్నట్టు మొత్తుకుంటరు? ఆవేశపడి అరుచుకుంటె ఆయాసం చేటేగని ఏమన్న సంపాయిస్తరా? ఊరందరి కోసమేగా అందరమాలోచించేది! మరి ఊల్లె అందరం బాగుంటెనేగా ఊరు బాగుండేది! ఊరికి నీళ్ళు దొరకవని ఆని బోరు బందుజేశినప్పుడు మరి ఆని బతుకుగూడ యోచన జేస్తెనేగా ఊరు! లేకుంటె ఊరికి అడివికి తేడేముంటది? ఎప్పుడు ఇట్నే కాలం బోతదా? దేవుడు కన్ను దెరిశి ఒక్కేడు చెరువులు నింతె మళ్ళీ నాలుగైదేండ్ల దన్క నీళ్ళు కరువుండదు. మనకీ పంచాయి తులు గూడుండవ్! కాబట్టి నాకు తోచిన మాటజెప్త. జర అందరు నిమ్మలంగినురి".

అని కాసేపు ఆగి జేబుల్నించి అగ్గిపెట్టిదీశి సిగిరెట్టు ముట్టిచ్చుకున్నడు, పించిని పుచ్చుకున్న పంతులు పర్వతరెడ్డి. ఆయిన రిటైరయినంక వార్డు మెంబరై ఊరికి వుపసర్పంచ య్యిండు. కొడుకు ఏదో ఆఫీసరు నౌకరే చేస్తున్నడు. తోట, ఎవసాయం గిట్ట బానే సాగుతున్నది.

ఏం జెప్తవో చెప్పరాదు! అన్నట్లు సూశిండు సర్పంచి మొగుడు.

"ఎవ్వరేం జెప్పినాగని మాకన్నేలం జేస్తె మటుకు మీమూకోం! ముంచి మూడు ఏంచేడు దోశిళ్ళ మన్నుబోస్తం ఊరిమీద!"

రాములమ్మ మాట పూర్తిగాకుంటనే.. ఏందమ్మో కాపామె ఎట్లోనేమాట్లడ్తవ్? పెద్దమడ్శి మాట్లాడ్తనే ఉండె ఊకోరాదు! ఏమోగింత ఓపికలేకుంట ఊర్ని సాపిస్తవ్! ఊకోరాదు!" అన్నరు మందిలనించి ఎవరో–

"అరేయ్ ఎవ్రరా ఆడు మీం మాట్లాడ్తనే ఉంటిమి మీకెందుకుర మజ్జల! పన్లేనోల్లంత జమయింద్రు నోరు మూసుకొని ఇనున్రి. లేకుంటె ఇండ్లల్లబడ్డ దన్కపోరి. నడుమనడుమ మాట్లాడితె మటుకు మర్యాదగుండదు"

కోపంజేశిండు పర్వతరెడ్డి.

మాయదారి కాపోడు కఱ్ఱిర్గకుంట పాము జావకుంట ఏం తీర్మానం జేస్తడో చూద్దామని మంది గమ్మున ఊకుంద్రు.

"ఇగో రాములమ్మ! నోరుందని మొత్తుకోకుగని జర నిమ్మలంగిను. ఈ ఊరోళ్ళంత నీకేం పగోళ్ళుగారు. మీమేం నిన్ను ఊల్లెనించి ఎల్లగొట్టాలని అనుకోలె. ఈ ఎండకాలం ఊరెడుమందికి నీళ్ళు లేకపోతె ఎట్లెల్తది చెప్పుమరి నువ్వే! అందికనే నేనొక్కటి చెప్తున్న సమ్మతైతదేమో సూడు. మా రాళ్ళబాయిబోరు ఓ మోటెడు మోటెడు నీళ్ళుల్తుండె. దానికింద మొత్తం జొన్నచొప్ప అల్కినం– నడుముల్లోతు పైన్నే పెరిగింది. ఇగ దానికి నీళ్ళు గట్టినా కట్టకున్నా ఒకటే. ఒక నాలుగైదు పైపులేస్తే ఆ నీళ్ళొచ్చి మీ పొలంల బడతై. పైపులు గూడ మీరేం దెచ్చుకోవద్దు. తోటలకు నీళ్ళుబెట్టె పైపులు మాయే ఉన్నై. ఎట్లో ఈ యాసంగి కారొక్కటెల్తె ముందుకు జూద్దాం మీ బోర్ని మోటర్ని ఏంజెయ్యాల్నో. గంతేగని ఇంతమందిని గాదని మా బోరు, మా భూమి, మా ఇష్టమని అంటె మటుకు బాగుండదు. అదిగాక ఈ సంవత్సరం కార్తీకం, మార్గశిరంల తుఫాన్లు గూడరాలె. అందుచేత ఈ ఎండకాలంల తుఫాన్లొచ్చినా ఒస్తై. ఓపాలి మంచి నడెండకాలం వైశాఖమాసం ఎల్లుదలల చెరువులన్ని అలుగులెల్లినై. గట్ల గిట్లయ్యెనా ముందుకు అందరం బానే ఉంటం. లేకపోతే అప్పుడు చూద్దాం ఏంజెయ్యాల్నో" అని అలిపిరి దీసుకున్నట్టు ఆగిండు పర్వతరెడ్డి. సిగిరెట్టు పూర్తిగా కాలకుంటనే నేలకురాశి పక్కన పడేశిండు.

సర్పంచి మొగనికిగాని, ఊళ్లె మందికిగాని పర్వతరెడ్డి జెప్పిన తీర్మానముల మతల బెందో అర్థంగాలె. జర నాలుగు పైసలున్నోడు, ఈ నడుమ ఊరికి ఉపసర్పంచైనోడు, కొత్తగా ఊళ్ళె తెలంగాణ పార్టీ బెట్టినోడు. మంచి పంతులని పేరు దెచ్చుకున్నోడు ఊరి కోసం ఉదారంగ నీళ్ళు బెడుతున్నడనే అనుకున్నరుగని ఆయన మనసులున్న తెలివితేటలు ఓళ్ళకు అంతుజిక్కలే.

అందరు సరేనన్నట్టు కూకున్నోళ్ళంత లేశింద్రు.

"ఏంర భిక్షం! ఇంక నువ్వేం దేవులాట బెట్టుకోకు. అంత నీను జూసుకుంటగని. మా జీతగాని పోరన్తోటి పైపులు బంపిస్త. ఇంత అన్నందిని పొయ్యి ఇద్దరు గల్శి పైపులు దగిలిచ్చుకోరి!! అని భిక్షంరెడ్డితోని చెప్పిండు పర్వతరెడ్డి.

అట్ల భిక్షంరెడ్డి బోరుపొక్కను ఆయనకు గాకుంట జేశింద్రు ఊరిజనం. మోటరు దీశేశి మొత్తం పొక్కను దీశెయ్యకుంట కేసింగు మీద మూతబెట్టి మన్నుగప్పింద్రు.

✡

"ఏంరో భిక్షం పొలమంత తేల ఈని అర్రొంచింది గద? ఇంకో పది పదిహేను రోజులకు తడిపదప్పితే బానే ఉంటెట్టుంది"

ఒకనాడు భిక్షంరెడ్డి పొలం కాడికొచ్చి పల్కరిచ్చిండు పర్వతరెడ్డి.

ఏమోనె ఈ ఏటికైతే ఎట్నో తెల్లారితట్టుంది గని ముందకే ఏమయిద్దో తెల్వకుంటుంది" అన్నడు భిక్షంరెడ్డి.

"గదేరా గది మాట్లాడ్దామనే గీడిదాకొచ్చిన. మొన్న మీ అల్లుడొచ్చిన్నాడే ఇంటి దును కొద్దామనుకున్నగాని మండల ఆఫీసుల పనిబడి నల్లగొండకు బోయిన. మీ బుజ్జినిచ్చింది అడిశర్ల పెళ్ళే గదుర అది చిన్నడిశర్ల పెళ్ళా? పెద్దడిశర్ల పెళ్ళా?" అడిగిండు.

"పెద్దడిశర్ల పెళ్ళేగని ఆళ్ళిప్పుడు అంగడిపేట గేటుకాడ రోడ్డుమీదనే ఉంటుంద్రు. ఆడ ఓ నాలుగర్రల ఇల్లు గట్టింద్రు. గుడిపెల్లి శివార్ల శింగరాజుపెల్లి దగ్గర పన్నెండెకరాల భూమికొన్నరు. ఆల్ల బాయి, పొలం అక్కంపెల్లి చెర్ల మునిగిపాయెగదా! దానికొచ్చిన పైశల్తోటి భూమిగొన్నరు. మా అల్లుని ఇద్దరు చెల్లెండ్ల పెల్లిగూడ నిరుడొక్కపాలే చేశింద్రు. ఏదో ఆ భగవంతుని అదురుష్టాన ఆళ్ళు బానే ఉన్నరుగని మాకే ఒచ్చింది టంగు"

భిక్షంరెడ్డి అడిగిన ముచ్చట అడగని ముచ్చట అంతజెప్పిండు బుక్కమలిపినట్లు.

"అదేరా అక్కడ పుట్టంగండి ఎత్తిపోతల నీళ్ళతోటి అక్కంపెల్లి చెర్వు ఖజానా చేశింద్రు గద! దాంట్లెనించి కాలువ దవ్వి మన పానగంటి చెర్ల గలిపింద్రు. పానగంటి చెర్వు కట్టగూడ ఎత్తులేపింద్రు.

ఈ ఏడు వానలు బడక సాగర్ నిండలేదుగని మన కనగల్లు, పానగల్లు రెండు చెర్వులు నింపితె మనకు ఎంత ఎట్టొచ్చినా నీళ్ళ కరువుండదింక"

సానుభూతిగ మాట్లాడిండు పర్వతరెడ్డి. భిక్షంరెడ్డి భూమికి పుటంబెట్టాలన్న తన మనసుల మాటను ఎట్ల బైటబెట్టాల్నో ఆయనకు దబ్బున సమజైతలేదు.

"ఈడ మటుకు నీకోళ్ళున్నర్ర? ఉన్నది ఒక బిడ్డనాయె? బుజ్జి పెండ్లప్పుడు దేవరకొండ వుత్తబెట్టె రాజ్యమని పిల్లనియ్యాలంటె భయపడ్డంగని ఇప్పుడా అక్కంపెల్లి చెరువు సుట్టు పక్కల ఊళ్ళల్ల నీళ్ళ కరువు లేకుంటయ్యింది. కాల్వకిందిరోకు బావులు దియ్యనిస్తలేరు గని పైరోకున్నోళ్ళు కాల్వకట్టకు పది ఇరవై గజాల దూరంగ గూడ బావులు దవ్వు కుంటుంద్రు.

మూడుకోలలు గూడ నిండ తెగకముందే నీళ్ళు బడుతున్నయ్ ఒక్కొక్క తాన. మొన్న పి.ఎ.పెల్లి అదే పెద్దడిశర్లపెల్లి మండలాధ్యక్షుడి బిడ్డ పెండ్లికి బోయినప్పుడు సూశిన నేను.

ఇదంత పర్వతరెడ్డి ఎందుకు చెప్పుతున్నడో అర్థం చేసుకునే తెలివితేటలు భిక్షంరెడ్డికి లేవు. ఆహా! అట్లనానే అనుకుంట ఊకొడుతున్నడు.

“మరేమనుకుంటున్నవ్‌రా! నువ్వేమనుకుంటవోనని ఊకున్నగని మొన్న పంచాయితి నాడే చెప్పుదామనుకున్న నీకు. భూముల ధరలు గూడ ఇంక బాగ పెరుగలేదు అక్కడ. మనకంటె నల్లగొండ దగ్గర జేబట్టి నీళ్ళున్నా లేకపోయినా ఉత్తప్రర దుబ్బలకు గూడ నలభై యాభై వెయిలు పలుకుతున్నది ధర. అక్కడయితె పది పదిహేను వెయిలగ్గాడ ఎకరం దొరకుతున్నదంట భూమి, మాదున్నకాడికి అమ్మి మీంగూడ అటుబోతెనే బాగుండు ననిపిస్తున్నది. మావోని నౌకరుగూడ దేవరకొండకయ్యింది. పట్నంనించి రోజొచ్చి పోతున్నడు”

తను భిక్షంరెడ్డి భూమిని కొనాలన్న మతలబు మతిల ఉంచుకొని తన భూమే అమ్ముతనని మడత మాటలు చెప్పుతున్నడు పర్వతరెడ్డి.

“నిజమానె! మొన్న నీను మా అల్లున్ని అడుగనన్న అడుగనైతిని. నాకు బోరు ఫుల్లుగ బడ్డది నీళ్ళకు ఢోకలేదనుకున్నగని గిట్ల నా బోరుపొక్క నాకు అక్కరకు రాకుంట బోద్దని తెల్వదాయె. ఆడ యాన్నన్న ఒక్కతాన ఆయిమన్న ఖండం దొరుకుద్దేమొ ఈ రొండెకరాలు అమ్ముకొని అటుబోతెనే బాగుంటెట్టుంది”

చివరకట్ల తను చెప్పుదామనుకున్నమాటను భిక్షంరెడ్డిని నోట్లెనించే రప్పిచ్చిండు పర్వతరెడ్డి.

“అవున్ర! నీకు నాకు మజ్జన ఆచాకలోల్ల ఇనాం చీర్కెమటుకే అడ్డం ఉంది. దాన్నిగూడ ఆళ్ళు పొత్తుల పొత్తుల బేరం బెట్టింద్రు. మొన్న మా పిల్లగాడొచ్చినప్పుడు చెప్పిన ఊల్లె పంచాయితి సంగతి గూడ. ఆ చాకలోల్ల చీరికెతోపాటు నీదిగూడ కలుపుకుంటె అంత ఓ పదెకరాలైతదీడ. ఆ ఈదెమ్మ గుంటితోట ముసల్దయిపోయింది. ఇంతలోనుదీశి మల్ల ఈడిన్ని బత్తాయి చెట్లేస్తే బాగుండుననిపిస్తుంది. మావోడైతే ఎందుకే జంజాటమనే అంటున్నడు గని”.

పర్వతరెడ్డి మెల్లగ బైటబడ్డడు.

“ఈ ఊళ్ళె నన్ను ఎట్టయినా నెగల్నియ్యనట్టుంది. ఆ చాకలోల్ల చీరికెతోటి గల్పి నాదికూడ దీస్కో ఇగ. ఇయ్యాల్సింది ఇంటికిపొయ్యి మీకోడలామె తోటి ఇశారిస్తగని, మరి ఎకురం ఎట్ల బెడుతున్నవు ధర” అడిగిండు భిక్షంరెడ్డి.

“నీను కొత్తగ బెట్టేదేందిరా? ఊళ్ళె అమ్ముతలేరా? కొంటలేరా? భూములు. నల్గురు గూకోని ఏది నికురం జేస్తె గదే ధర” అన్నడు పర్వతరెడ్డి.

'అదిగాదె ఎప్పుడో పదేండ్లకింద పడావు బడ్డ భూమి చాకలోల్లదైతె సక్కదనాల బోరుపడి ఎకురం ఐదారు పుట్లుపండే ఏగిలి తరినాదాయె. రొండు ఒక్కటేనంటె ఎట్ల? దేనిధర దానికి జెయ్యొద్దు మరి?"

"సరే అట్నే కానియ్యరాదురా! ఇప్పుడే తొందర పడ్తవెందుకు? ఈయాసంగి వరికోతలై నంక మాట్లాడ్దాం. నువుగూడ అక్కడ మీ అల్లునికి జెప్పి యాన్నన్న మంచి యాకండి కిత్త దొరుకుద్దేమో సూడమను. మల్ల పైశలాగమైపోతై. ఈడివిట్నే అనామతుగ దీస్కపొయ్యి ఆడ గడ్తె బాగుంటది".

సలహా జెప్పిండు పర్వతరెడ్డి.

బాయిసుట్టు తాటిబొత్తలే. మంచి పరుపుదాళ్ళ సీజను. గవుండోళ్ళు ముస్తాదులు గట్టి పొద్దటిపూట కల్లొడుస్తున్నరు. భిక్షంరెడ్డి తాడు నొడిశిలొట్టి దీస్కొని బోరుకాడికొచ్చిండు గవుండ్ల ఎంకటేశం.

"ఏం ఎంకటేసులూ! ఇయ్యాల పొద్దుగలొచ్చినవ్? మరట్నే రొండు రేకలు గట్టియ్య రాదు ఇయ్యాల పెద్ద పటేలు గూడొచ్చిండు. చెర్రొండు ఊటలు ఒంచిపోదువు" అన్నడు భిక్షంరెడ్డి.

ఒద్దులేర భిక్షం! నాకీ మజ్జన గ్యాసొస్తున్నది. మొన్న డాక్టరు కాడికిబోతె కల్లు, విస్క సిగిరెట్టు అన్నీ బందుజెయ్యమన్నడు. మందులు దింటున్న అన్నడు పర్వతరెడ్డి.

మరైతె ఊళ్ళెకే బోతున్నవుగద జర ఇంటిదాక పట్కపోరాదు లొట్టి. నీను జెర్రతాల్నంక మోత్ర బందుజేశొస్త"

ఎంకటేసుల్తోటన్నడు భిక్షంరెడ్డి.

పర్వతరెడ్డి గూడ పెద్ద కష్టం లేకుంటనే తన పాచిక పారినందుకు లోపల్లోపల సంతోష పడుకుంట అట్ల తోటకాడంగ ఎల్లొస్తనని బయల్దేరిండు.

తర్వాత పన్లన్ని సర్రసర్ర జరిగిపొయినయ్. చాకలోల్ల భూమికంటె ఎకురం ఐదు వెయిలు ఎక్కువ జేశింద్రు భిక్షంరెడ్డి భూమికి. అయ్యే పైసల్తోటి అక్కంపెల్లి కాలువ కట్టెమ్మటి అయిదెకరాలు కొనుక్కోని బాయిదవ్విండు అల్లుని దాపున. మూడు కోలల మీదనే నీళ్ళు మస్తుబడ్డయి. దేవులాట లేకుంటయ్యిందని సంతోషంగున్నడు భిక్షంరెడ్డి.

ఇక్కడ పర్వతరెడ్డి కొడుకు జీతంతోటి, పింఛను పైశల్తోటి, బాంకుల తెచ్చిన లోనుతోటి మొకం జూడకుంట చాకలోల్ల చీర్కె భిక్షంరెడ్డి చీర్కె రాళ్ళబాయి గుడ్డం మొత్తం గల్పి కొత్తగ తోట బెట్టిండు. ఇంతల ముప్పారం పైపులైన్నించి మంచినీళ్ళు కనెక్షనిచ్చింద్రు ఊరికి. మంచినీళ్ళకు ఇబ్బంది లేకుంటయ్యిందిగద! భిక్షంరెడ్డి చీర్కెల బందుజేపిచ్చిన బోరు పొక్కకు మోటరు ఫిట్టుజేపిస్తె నీళ్ళు తగ్గకుంట పోస్తున్నది. చెట్లు మంచి తేజుగ బెరుగుతున్నై.

కడుపుల మాయ కలగననట్లే భూమిలోపల మర్మం ఓనికి దెల్వదు. కాలం ఒక్కేడన్న బాగైతదేమోననుకుంటె సాపెన బెట్నట్టు ఏటేట ఎనక్కే పీకబట్టింది. ఆయిటి చినుకులు రాకుంటె రాకపాయెగాని తుఫాన్లు గూడ ఒస్తలేవు. పర్వతరెడ్డి పాతతోట ముసల్దయిందని చెట్లు కొట్టేపిచ్చిండు. మనుమడు బైటికిబోతుండని ఆ గుంటిని బేరం బెట్టిండు. దాంట్లె బోర్లు పీక్కపొయ్యి మెదెడు మెదెడు నీల్లుగూడ ఎల్లలెవ్వు.

యాడికో ఓకాడికి ఆ గుంటిని దీశెయ్యాలనుకుంటున్నడు. పడావుబెద్తె ధర రాదని అల్లగూడ మల్ల సితపాల, సపోట చెట్లు బెట్టిండు జర నీళ్ళ దెబ్బ తట్టుకుంటయని. కాని రోజురోజుకు అండ్లబోర్లు బొత్తిగ పీక్కపొయినై. ఇగ ఇట్లయితె కాదని పుట్టినకాన్నల్ల అప్పుదెచ్చి మూడు కిలోమీటర్ల దూరం పైపులేశిండు ఈ బోరు కాన్నించి ఆ బోరుకాడికి. కొడుకు ఒద్దన్నా ఇనలేదు. తనకేదో గాలిబూనినట్లు పెట్టుబడి పెట్టిండు. ఈలోపల మల్ల సర్పంచి ఎలక్షన్లొచ్చినై. సీటు జనరలైతే పర్వతరెడ్డిని ఏకగ్రీవంగ సర్పంచిని జేశింద్రు ఊరిజనం. అరవై అయిదేండ్లు మీదబడ్డా మనిషింక గట్టిగనే ఉన్నడు. తను అనుకున్నట్టు నడుస్తున్నందుకు సంతోషంగ గూడ ఉన్నడు పర్వతరెడ్డి. సంతోషాన్ని మించిన బలం మనిషికింకేముంటది గనుక.

అట్ల ఎంతమంది ఏంజెప్పినా ధైర్నంజెడని మనిషికి భిక్షంరెడ్డి బోరు ఎనకపట్టు బడితాలకు ఫికరు బట్టుకుంది. మొన్న సంకురాత్రి పండుగకు కొడుకుని, కోడల్ని, పిల్లల్ని ఇంటికి రప్పిచ్చుకుండు. ఎట్నన్న తోటల మల్లో రొండు మూడు బోరుపొక్కలెయ్యాల్నని కొడుకు తోటన్నడు.

“ఎందుకు బాపూ ఒద్దంటుంటె ఇనకుంట పెట్టుబడులున్ని బెట్టి చాతనయ్యి చాతగాక ఈ యవసాయాన్ని బట్టుకొని యాలాడ్తవు? ఉన్నకాడికి గుండుగుత్తగ ఓనికన్న బేరం బెట్టి హైద్రాబాదుకు బోదాంపా! బోర్లొద్దు గీర్లొద్దు”.

కొడుకు మొదట్నించి మాట్లాడిన దానికంటె ఈసారి జర గట్టిగనే అన్నడు. పర్వతరెడ్డి పండుగపూట ఎందుకని జర బతిమాలినట్టు చెప్పిండు కొడుకుతోటి.

“ఎందుకుర నాయినా! నాకు చెప్పినమాటే మాటిమాటికి చెప్పుతవ్! నా చాతగాని నాడు నీకాడికే ఒస్త నేనేడికి బోతగని! ఇగ నన్నించయితట్టు లేదు పెట్టుబడి. మొన్న పైపులైనుకే ఊల్లె పుట్టిన కాన్నల్ల అప్పుదెచ్చిన. ఇప్పుడు మల్ల బోర్లెయ్యాల్నంటె పైసలు బుట్టనట్టుంది. కష్టమో నిష్టూరమో ఈ ఎండకాలమెల్లదీస్తె ముందుకు కాలంగాకపోతాది? రొండు కాపులుగాస్తె మొత్తం పెట్టుబడెల్లి పోద్ది. ఎందుకు తొందరపడాలె? అమ్మదామను కున్నాగని నీళ్ళులేని భూమిని కరువుల ఎవడు గొంటడు చెప్పు? ఓ ఇరవై ముప్పైవెయిలు సుత్తా యించు ఎట్నన్న జేశి”

“ఏమో ఇగ నీ యిష్టం ఇదే ఆఖరుసారి. మల్లనైతె నేను పైస బంపేది లేదు ఎవసాయానికి.” అని కరాఖండిగ జెప్పి ముప్పైవేలు బంపిచ్చిండు కొడుకు.

జియాలజిస్టులతోటి మూడు పాయింట్లు జూపిస్తె ఎవ్వరూ నీళ్లు బడ్తయని ఖచ్చితంగ జెప్పనేలేదు. అయినా దేవునిమీద భారమేసి తనకు తోచినకాడ మూడు పొక్కలేపిచ్చిండు పర్వతరెడ్డి. రెండొందల యాభై, మూడొందల ఫీట్లేశినా దుమ్మేలేశిందిగని గింత తేమగూడ దగల్లేదు. ఇన్నాళ్ళు ధైర్నంగున్న పర్వతరెడ్డికి గుండె దిగజారినట్లయింది. భూమిలోపలికి దింపిన ఒక్కొక్క రాడ్డు తన కడుపులకే దిగినట్టు గిలగిల గొట్టుకున్నడు లోపల్లోపల. రోజు రోజు నీళ్ళు ఎనకపట్టు బట్టి ఊరందర్ని భయపెట్టిన భిక్షంరెడ్డి బోరుగూడ మొత్తం ఎండిపోయింది నిలువున. తోటమొత్తం పూత, పిందె వాడిపోయి రాలిపోతున్నది. ఈ ఏటి మటుకు పూతపిందె పోతెపాయె. చెట్లనన్న బతికిచ్చుకుంటె మంచిదని యాన్నన్న నీళ్ళు దొరికితె ట్యాంకర్ల తోటన్న కొనుక్కొచ్చి పోపియ్యాలనుకున్నడు పర్వతరెడ్డి. కొడుకుతోని మాట్లాడి మల్లగిన్ని పైశలు దేవాల్నని పట్నంబోయిండు.

“ఏందిబాపూ! నీకేమొ పిచ్చి బట్టుకున్నట్టుంది. ఒద్దు ఒద్దంటె మల్లతోట బెడ్తివి. ఒద్దు ఒద్దంటె బోర్లేశి నిన్న మొన్న మల్ల ముప్పయివెయిలు మంట్లెబోస్తివి. మల్లిప్పుడేడ దెమ్మంటవ్ పైశలు. అసలు పైశలిస్తె మటుకు సుట్టుపక్కల యాడ దొరుకుతై నీళ్ళు అసలు మన ఊరుసుట్టు నీళ్లుంటె మన భూమిల మటుకు బడకపోయినయా బోర్లు” అడిగిండు కొడుకు.

“గాపులిమామిడి వాగెమ్మడి ఉశికె బోర్లల్ల ఇన్నన్ని నీళ్లెల్తున్నయంట. వెయ్యి పన్నెండొందలకు ట్యాంకరు చొప్పున అమ్ముతున్నరంట. ముషంపెల్లి, ఎర్రబెల్లి సుట్టుపక్కల ఊర్లోళ్ళు ఒకళ్ళిద్దరు కొని పోస్తున్నరంట” గట్టిగ అడిగితందుకు ధైర్నం లేక భయం భయంగ చెప్పిండు పర్వతరెడ్డి.

కొడుక్కు ఇష్టంలేకపోయినా నోటికాడికొచ్చిన తోట. ఎట్లన్న ఈ రొండునెల్లు చెట్లని కాపాడుకుంటె మంచిదని అనుకున్నడు. సరెనని తండ్రెంట ఊరికి బయల్దేరిండు కొడుకు. పులిమామిడికి బొయ్యి నీళ్ళట్యాంకరును మాట్లాడుదామనుకున్నరు.

“ఏమే పర్వతయ్య పెదనాయినా! ఇయ్యాల తండ్రికొడుకులు ఇద్దరు ఒక్కపాలే కల్శిండ్రు జెర మాసంగతి గూడ చెప్పితె బాగుంటది గద”

అప్పుడప్పుడు చిల్లరమల్లరగ పర్వతరెడ్డికి అప్పిచ్చిన బాకీదార్లు. ఇదే టైమనుకొని అప్పు సంగతి మాట్లాడుదామని ఇంటికొచ్చి అడిగిండ్రు.

“ఏంటిదే ఇప్పుడు మీతోటి మాట్లాడేద్దేముంది కొత్తగ?” అడిగిండు కొడుకు.

“గదేర! నిరుడు మునేడు తోట బెడితప్పుడు నువ్విటు మళ్ళి సూడనే సూడవైతివి. మా దగ్గర తలాయిన్ని డబ్బులు దెచ్చిండు నాయిన. ఇగోయి కాయితాలు” అని అప్పు పత్రాలు జూపిచ్చిన్రు.

మూడులక్షలపైనే ఉన్నై కాయితాలు. బ్యాంకులోను కలుపుకుంటె అంత ఎనిమిది లక్షలకు పైనే ఉన్నది బాకి. ఉక్కోలుగ నీళ్ళుంటె చెట్టల్ల ఏదన్న మెట్టపంటేసుకుంటె కొంతలో కొంతన్న పెట్టుబడెల్తుండె. ఇప్పుడు అసలుకే మోసమొచ్చే కాలమొచ్చింది. ఏం చెయ్యాల్నో తోసుబాటు కావడం లేదు పర్వతరెడ్డి కొడుక్కి. ఈ కానిపోని కాలాన్ని నమ్ముకోని ఎవసాయం జెయ్యొద్దంటె ఇనకపాయె ఇప్పుడింక బిందెడు బిందెడు నీళ్ళు బోశి చెట్లను బతికిస్తనని సూస్తున్నడు ముసలోడు. ఇది అయ్యేపని కాదనుకున్నడు. కట్టలు కట్టలు రూపాలు దెచ్చి ఈ ఎండిపోయే బోరు పొక్కల్ల పోస్తె ఎన్నాళ్ళున్నా ఉన్నకాడికి అమ్ముకోక తప్పదనుకున్నడు.

"ఇగో కోటన్నా! ఇయ్యాల నీనొచ్చిన పని ఒకటైతే ఇంకోటి అయితట్టుందిగని. అయితె అయె. నేను యాన్నించో ట్యాంకర్లమీద నీళ్ళుదెచ్చి మళ్ళో నలభైయాభై వెయిలు ఖర్చుపెట్టి ఈ రొండు నెల్లు చెట్లను బతికిచ్చినా ముందుకు బోర్లు నీళ్ళు బోస్తయన్న నమ్మకం లేదు. మళ్లీ బోర్లేస్తే నీళ్ళు బడ్తయన్న ఆశలేదు. అందికనే మీరే ఎట్నో గట్ట తిప్పలు బడి ఈ తోటను జూసుకొని మీ అప్పుల్తోపాటు ఆ బ్యాంకు కిస్తులు గూడ గటుకోరి. ఇంకో నాలుగేండ్లుగానీ, అయిదేండ్లుగాని, మీ అప్పుల్దీరిందాక నీనిటు దిక్కేరాను" అట్లని కాయితాల పెట్టుకుందాం అన్నడు పర్వతరెడ్డి కొడుకు అప్పు పత్రం చూపిచ్చిన కోటిరెడ్డితోటి.

"అదేందిర అట్ల మాట్లాడుతవ్! మీకు దొరకని నీళ్ళు మాకు దొరుకుతయా? అప్పు దీర్పమంటె తోట జూసుకోమంటవ్" అన్నరు ఆళ్ళు.

"అదంతేనే! బాపు నా ఎంట ఒస్తె ఒచ్చిండు లేకుంటె లేదు. ఆయనతోనే మాట్లాడుకోరి మీరే నాకైతే తెల్వదు" అని బ్యాగు దీస్కోని నల్లగొండబాట పట్టనే పట్టిండు, పట్నం బోతందుకు.

"సరె నువ్వు బోర! నీను రొండు రోజులైనంక ఒస్త" అని అన్నడు పర్వతరెడ్డి.

"ఏందిరా! ఇన్నెకురాల భూమి, బోర్లుండంగ మీ అప్పులు బోతాయిర! ఏదో జేశి ముందొరకు సుత్లాయిద్దాంగని పొయిరారి" అని ఆళ్ళని పంపిచ్చిండు.

ఇంకో పదిరవైరోజులు గడిచినై. బోర్లన్ని బొత్తిగ ఎండిపొయినయ్. చెట్లు వాడుబట్టి పిందెల్తోపాటు ఆకుల్నిగూడ రాల్చుతున్నయ్. ఆటిని జూస్తుంటె పర్వతరెడ్డి కడుపుల కుమ్మ రాములు గూల్తున్నయ్. కడుపున బుట్న పిల్లలకు బువ్వబెట్టలేక అభిమానం చంపుకోని అడుక్కోవడానికి వెళ్లిన తండ్రికి బుక్కెడు బువ్వగూడ దొర్కకుంటె పిల్లలకాడికి పోవాల్నో, ఉరిబొట్టుకొని సావాల్నో తెల్వనట్టుగుంది ఆయన పరిస్థితి. గుండెను చేస్కోని చెట్లనొదిలిపెట్టి భార్యను దీస్కోని పట్నం బయలుదేరిండు కొడుకుతానికి మల్లొస్తనో రానో అని మతిల అనుకుంట పర్వతరెడ్డి.

✡

# సిపాయి పెళ్లాం

**-శిష్టా ఉమామహేశ్వరరావు**

ఈవూరు!

అంచునే గుడిశెలున్నాయి. గుడిశెలకు మధ్య మధ్య తాటి చెట్లున్నాయి.

ఒక గుడిశెలో రోసి ఉంది. దాని మరిది గూడా ఉన్నాడు.

రోసి మగడు మిలిటరీలో చేరాడు.

ఆ గుడిశె పక్కనే మట్టల తాటిచెట్టు లంబాడి దయ్యం అల్లే గుడిశెను చూస్తూ నిటారుగా ఉంది.

రోసి నీటుగలది. స్నానమాడని ఒళ్ళు గలదైనా నీటుగలదే.

రోసి గుట్టుకలది. చిరుగు చిరుగులమధ్య తొడలూ పిక్కలూ కనబడుతున్నా రోసి గుట్టుకలదే!

గుడిసేటిదే రోసి. కాని రోసి రోషంకలదే అని ముఖమే చెబుతుంది.

యదవ సోమాయిగాడు - దాని మరిది.

అంట యదవ సోమాయిగాడు. ఇంట ఉంటాడు పనిపాట లేక. ఊరు తిరుగుతాడు ఊరుకోలేక. తాగుతాడు తన్నేవాళ్ళు లేక. వాగుతాడు వప్పగించేవాళ్ళు లేక. అప్పుచేస్తాడు అడుక్కుతింటాడు. వాడికి తోడు ఒక కుక్క కూడా.

అప్పు చేస్తే చేశాడు యెర్రి యదవ- చేసే అప్పు కాబూలు వాడిదగ్గిరా!

కాబూలువాడు దబాయిస్తున్నాడు వాడ్ని కనబడ్డ చోటల్లా. రోసిని పీడిస్తున్నాడు వీడు. పనీ పాటా చేసుకుని నాలుగు డబ్బులు కూడబెడుతుందది. అది అన్నానికి సరిపోతుంది. మిలిటరీలోంచి మొగుడు కాస్త పంపితే మరిది అప్పులకు పోతుంది. సంసారం నీరసిస్తోంది.

ఓ రోజు దీనంగా మాట్లాడడం మొదలెట్టాడు సోమిగాడు

"వదినా నాదుంప తెగుతోంది!"

"ఎందుకూ, మొద్దల్లే పని సెయ్యవనేనా?"

"పటానోడు నిన్నీడకే వచ్చాదే!"

"పటానోడా! ఈడేం పనీ?"

"డబ్బియ్యాలగా మనం"

"మనం! నువ్వా నేనా?"

"నేనేలేయే నువ్విప్వకపోతే నేనెట్టిత్తానే?"

"ఎంతా?"

"పద్దాలుగున్నర!"

"అమ్మో! జన్మంతా కూడెట్టినా అంతరాదే, మనకి, ఏం సెయ్యాలో్రబాబో?"

"ఆడే సెప్పాడు యేం సెయ్యాలో లంజకొడుకు."

"ఏం సెప్పాడు?"

"నిన్ను సూశాట్ట! నువ్వందం గలదానివంట! ఇంకేదో చెప్పాడు!"

"అయితే?"

"పోతావా?"

"యాడకి?"

"యాడకుందీ!"

"యాడకంటే?"

"నేనేం సెప్పేదే నీ సిగ్గొయ్య!"

"యేంరోయ్! యేంరోయ్! నువు సెప్పేది యిదా? నీ అన్నలేడనేనా? యేందిరా? మొగాన నెత్తురు లేదేంరా నీకు? యేం లావు మడిసివిరా. పోతాలే!"

పోయింది పోయింది పోయింది పోయింది పఠాను కొట్టు దగ్గరకు పోయింది రోసి.

పోతుంటే రోడ్డేమన్నా పొంగిపోయిందా!

సరాసరి పఠాను కొట్టు లోపలికి పోయింది.

గడప గడ గడ లాడిందా!

పరుపు మీద హుక్కా తాగుతూ పఠానుగాడు చూచాడు. వారెవా అనుకున్నాడు.

"యామండీ మా వోడు మీకు బాకంటగా?" అని అడిగింది రోసి.

"బాకీకేంలే, నువ్వొచ్చావుగా" అన్నాడు అర్థం అయ్యీ అవ్వని తెనుగులో.

"నెలకింత తీర్చుకోండని సెప్పండి, నే తీరుత్తా. అంతేగాని ఆడదాన్ని యేడిపించటం యెందుకు సామీ"

"పరవాలేదులే! బాకీ వొద్దు నాకు, నువ్వే కావాలి!"

"నిన్ననే ఓ బామ్మడు హరికథ సెప్పాడు. కబీరంట, కోమటంట. అడిగాడంట. కోమటే కాళ్ల మీద పడ్డాడంట. కబీరు మీవోడేనంటగా"

"మావోడూ! వాడూ వాడూ దద్దమ్మలు!"

"నువ్వు మొనగాడివా?"

"సూడు నా కండలు! సూడు నామీసం!"

"యేందిరా సూసేది. మా వోడితో అక్కడే సెప్పా. ఆడికన్న తాడిసెట్టు మేలని, నీతో సెప్పేదీ? నీతో సెప్పేదీ?"

"ఏమిటీ?"

"మా అసలోడు లేడుగందా అని నువ్వేసుకుంటే, నీ తర్వాత ఆడేసుకుందాం అని గాదూ సోమిగాడి పన్నాగం! యదవల్లారా! కారం లేని కండలు ఏం కండలురా నీయి? అప్పిచ్చి ఆడాళ్ళయెంట పట్టం యేం మొగసిరిరా నీది? దగ్గిర్రావోకు లమ్డీకొడకా! సెప్పుతో కొట్టానంటే కాలికొద్దీ కాబూలు లగెత్తాలి, జాగర్త." అంటూనే వాడు అందుకోకుండానే రోసి పరుగెత్తి రోడ్డు మీదికి చేరింది.

ఇంటికెళ్ళ లేదు రోసి. ఇంకో ఊరుపోయి మొగుడు కోసం ఎదురు చూస్తోంది.

ఆ వూరు!

✡

# నెర్లు

**–చిలుకూరి దేవపుత్ర**

కరువు దెబ్బకి మా ఊర్లో సగం జనం ఊరిడిసినారు.

రాయదుర్గానికీ, కణేకంటికీ, బళ్లారికీ యావన్నా కూలి పనులు చేసుకోని బతికే దానికి ఎల్లిపోయినారు.

సన్న సన్న రైతుల ఇండ్లల్లో, కూలోల్ల ఇండ్లల్లో ముసలీ ముతక తప్పా ఎవురేగాని లేరు. మాపుపారికాడ తోటల కంచెలకీ, చేన్లల్లో ముండ్ల పొదలకి అల్లుకోనిండే 'పాలవాకు' పీక్కోని వచ్చి, రేతిరికి ఉడకేసుకోని తినేది – ఇండ్ల కాడ వుండే ముసిలోళ్లు.

నాకు ఏడో తరగతి పరీక్షలు అయిపోతానే బడికి సెలవులిడిసినారు. దాన్నించి, నేను అనంతపురం నించీ అప్పుడే మా ఊరికి పోయినాను.

మా యవ్వ ఒక్కతే మా తోటలో ఉండే ఇంట్లో వుండేది.

చేన్లన్నీ బోసిపోయి ఎడారి తీరుగా కనిపిస్తా వుండాయి.

వరుపు పెట్టుకోనిండే దాన్నించీ, మా యవ్వకి పూట గడిచేది కూడా కష్టమయి పోయిండాది. ఇంట్లో వుండే గాదెలూ, దొంతు కుండలూ అన్నీ వెల్లకిలా పడినాయి.

మా ఇంటి ముందర ఉండే వేప, చింతచెట్ల కింద పేడా, కసువు సుబ్బరంగా నూకి వుండాది. సందకాడ ఆడే మా ఆవుల్ని కట్టేసేది. వేపచెట్టు కిందన కట్టేసిన ఎద్దుల జత తప్పా ఒక్క పసరము కూడా లేదు. అప్పుడే అన్నీ మేతకి దుద్దేకుంట కల్లా మా జీతగాడు తోలుకోని పోయినాడు. ఆ జత ఎద్దుల్నే మా యావ్వ సేద్దేని కని పెట్టుకోని వుండేది. దాన్లల్లో ఒక ఎద్దు నల్లది. దాన్ని కర్రెద్దు అంటాం. ఇంగొకటి ఎర్రది. దాని మొగం మింద తెల్లమచ్చలు వుండేదాన్నింటి అందురూ దాన్ని 'బొల్లెద్దు' అంటారు.

పెయిటాల అయింది.

ఇంటి ముందరుండే అరుగు మీద కూకోని సంగటీ, ఊరుమిండీ తింటా వుండాను. అల్లంత దవ్వులో వుండే చింతచెట్టు కిందన మా యవ్వ ఎవురో ఇద్దరు మొగోళ్లని నిలబెట్టే

మాట్లాడ్తా వుండాది. వాళ్లు కొత్తోళ్లే! సద్దూరపు మనుషులు. నల్లగా వుండారు. తెల్ల అంగీలు వేసుకోని, తెల్ల అడ్డపంచెలు కట్టుకోని ఉండారు. భుజాల మింద మాసిపోయిన తెల్ల టర్కీ టవ్వాళ్లు వేసుకోనుండారు. చింతచెట్టు కింద కట్టేసి వుండే మా బొల్లెద్దు దిక్కు మాటిమాటికీ జూస్తా వుండారు. బొల్లెద్దు పండుకోని నెమ్మదిగా కండ్లు మూసుకుంటా, తెరుసుకుంటా నెమరువేస్తా వుంది.

నేను బిరిబిరీ సంగటి మింగేసి వాళ్ల తావుకి జేరుకుంటి. వాళ్లలో లావు మీసాలాయప్ప బొల్లెద్దు కాడికి పొయ్యి లెయ్యమన్నట్లు నాలికతో 'లక్‌లక్' మనిపిస్తా, దాని తోకని మెల్లిగా మెలిపెట్టినాడు. అది దడగ్గన లేచి నిలబడింది. చానాసేపు తర్వాత లేచి దాన్నించీనేమో, పెయ్యంతా ఇరుసుకోని ఒక్కసారి నీలిగింది. 'ఓవ్ ఓవ్'మంటూ దాని వీపు మింద మెల్లింగా జవురుతా, ఎద్దుని అంతలక్కా పదేపదే జూస్తా వుండాడు. 'పరకసుడి' లేదు లేమ్మో! అని, మంచి ఎద్దే అన్నెట్లు తృప్తిగా దాని దిక్కుజూస్తానే అన్నేడు.

తర్వాత పేడి మూతి మనిసి, బొల్లెద్దు నోరు తెరచి దాని పండ్లు ఎన్ని వుండాయో జూసి, అన్నీ సరింగా ఉన్నెట్లు తల ఆడిస్తా వుండాడు.

ఇదంతా జూస్తా వుంటే నాకి కొంచెం సేపటికి అర్థమయిపాయె. వాళ్లిద్దురూ వచ్చిండేది మా బొల్లెద్దుని కొనేదానికేనని. వాళ్ల ఊరు గుంతకంటికి అవతల, అంటే ఈడకి ఎనభై మైళ్ల దవ్వులో ఉందని వాళ్ల మాటల్లో తెలిసె.

నేను మెల్లిగా మా యవ్వ పక్కకి జేరి, చెవిలో గుసగుస చెప్తి– 'బొల్లెద్దుని అమ్మొద్దు అవ్వా!' అని.

నా మాటలు వింటానే కండ్లనిండా కోపంతో నన్ని జూసి 'నీకేలరా! పెద్ద సుద్దులు, పిల్లోనివి పిల్లోని తీరుగా ఉండల్ల.. అమ్మొద్దు అంటా వుండాడు– ఈ మేలు మొగోడు... సందకాడయతే ఎసిట్లేకి గింజలు లేవు మడి, తే పోరా!.. మీ అబ్బ గంటు యాడన్నా పూడ్చిపెట్టినావో తేపో!' అంటానని గదురుకొనె.

మాయవ్వకి కోపమొచ్చినా, సంతోసమొచ్చినా పట్టేకే వచ్చేది లేదు. మడి, ఆయమ్మ పాతకాలం మనిసి కదా అని నేనే సర్దుకొనేది. బొల్లెద్దు ఆ కొత్తోళ్లకి నచ్చినాది. మా యవ్వ చేతిలో దుడ్లు పెట్టేసి, వాళ్లు మా బొల్లెద్దుని పట్టుకోని పోతావుంటే నా కండ్లలో నీళ్లు తిరిగె.

కర్రెద్దు ఎప్పుడు పుట్టిందో నాకి గుర్తు లేదుగానీ, బొల్లెద్దు పుట్టుక మాత్రం నాకింకా గుర్తే...

మేము అప్పటికింకా వూర్లోనే కాపురముంటిమి. బొల్లెద్దు తల్లి బొల్లావు.

ఆ పొద్దు సందకాడ ఆవులు ఇంటికి వస్తానే, మా యవ్వ– 'ఒరే! బొల్లావు ఈ రాతిరికి ఈనుతాది రోయ్!' అనింది.

ఆవు ఈనేది అంటే నాకేమీ తెలీని పిల్లాట కదా! రాతిరి అన్నం తిన్నేక సారిసారికీ బుడ్డీ దీపాన్ని పట్టుకోని పశుల కొట్టంలోకి పోయేది. బొల్లావు తోక దెగ్గరికి పోయి చూసేది. అట్ల చూసి చూసి సాలయి పాయె. కడాకి నిద్దరొచ్చి బయట మంచం మిందే పండుకోని నిద్దరపోయినా. అర్ధరాతిరి అయ్యుంటాదేమో మడి. సరింగా అప్పుడు మా యవ్వ తట్టిలేపితే ఉలిక్కిరిపడి లేస్తి–

'లెయ్యరా– నీ పాసుగులా! మన బొల్లావు ఈనుతాంది సూడి!' అనింది సంతోసంతో.

నాకి నిద్దర గిద్దర ఎప్పుడెగిరిపాయెనో, దడగ్గన లేచి కూచోని, కండ్లు నులుముకుంటా, మంచం దిగి, అదాబదా పశుల కొట్టంలోకి దూరితి– మా యవ్వ వెనకాలే. మా జీతగాడు బుడ్డీ దీపం పట్టుకోని ఆడే కూకోని వుండాడు.

బొల్లావు పండుకోని బుసకొడతా, దూడని బయటికి దొబ్బే దానికి తిప్పలు పడతా వుండాది.

దూడ, తలా, ముందరి కాళ్లూ అప్పుడే బయటికి వచ్చేసినాయి. ఇంక రావాల్సింది దాని వెనకల కాళ్లూ, తోకా. దూడ అప్పుడే మమ్మల్ని మికమిక గుడ్లు ఇడుస్తా జూస్తా వుండాది. ముంగాళ్లు, తలా మెల్లిగా ఆడిస్తా వుండాది. రోంత సేపటికి దాని వెనకాల కాళ్లూ, తోకా వచ్చేసి దూడ నేల మింద పడింది. మా యవ్వ దాని దిక్కుముచ్చటగా జూస్తా– 'ఇది తల్లి మాదిరి బొల్లిదేరోయ్!" అనింది.

'ఇది ఆడదా, మగదావ్వా!' అనడిగితి.

'తిక్క నాయాలా! అది మనిసి కాదురా, ఆడా మగా అని అనేదానికి, ఆడదూడని పెయి దూడ అంటారు. మగదూడని కుర్రదూడ అంటారు. ఇది కుర్రదూడరా!' అనింది – నా దిక్కు నగుతా జూసి.

అది దినాము చెంగు చెంగుమంటూ జింక పిల్ల మాదిరిగా ఎగురుతా మా గేర్లో పోతా వుంటే, దాన్ని పట్టుకొనేకి నేను ఉరికెత్తుతా వెంటపడేది. అది నా మింద దయదలిచి చిక్కేదే కానీ, మామూలుగా అయితే నాకి అందేది కాదు. సందకాడ బొల్లావు మేపు నించి తిరిగి వచ్చేదంకా దానితోనే గడిపేది నేను. బొల్లావు ఎంత మంచి ఆవంటే చంటి పిల్లలని పొదుక్కి పట్టించినా తాపుకొనేది. మా గేర్లో పాలుసాలని పిల్లల తల్లులు, బొల్లావు పాల కోసరం పొద్దన్నే మా ఇంటి పడసాలికట్టకు సత్తూ, ఇత్తడి గళాసుల్ని పట్టుకోని కూకోనే వాళ్లు. పాలనీ, మజ్జిగనీ అమ్మేది కాదు మాయవ్వ.

బొల్లిదూడ పెరిగి పెద్దదయినాక దానికి ఎత్తయిన మూపురం ఉంటుందా.. అనేది నా అనుమానం. మా ఊర్లో రెడ్డోళ్ల ఒంగోలు గిత్తలకి వుండే మూపురాల్ని చూసినాక, మా బొల్లిదూడకి కూడా అట్లా ఎత్తయిన మూపురముంటే బాగుంటుందని నా ఆశ. ఒకరోజు పొద్దన్నే మా యవ్వ బొల్లావు పాలు పిండుతాంటే ఆ మాటే అడిగినా.

'మూపురము ఎత్తురంగా ఉండల్లంటే దినాము పొద్దన పూట్ల గోని పట్ట మూపురం మింద వేసి, రెండు చేతులతోనూ అదిమి, పైకి ఎగబీకుతా ఉండల్లరా!' అని చెప్పె మా యవ్వ.

ఇంగ జూడీ – ఆ పొద్దటి నుంచీ దాన్ని గుంజకి కట్టేసేదీ మా యవ్వ చెప్పిట్లే చేసేదీ. అది ఎంత ఎగిరినా, ఏం జేసినా ఇడిసేదిలా. చాన్నాళ్లే కష్టపడినాను. అయినా గుణం కనిపించలా, నాకి జూస్తే అనంతపురంలో చదువు. మా నాయిన తిడతాడని చెప్పి వెళ్లిపోయినా. ఆ తర్వాత అది పెద్దదయి బొల్లి కుర్రయింది. మరింత పెద్దదయి బెల్లెద్దు అయింది. దాని మూపురం ఒంగోలు గిత్త మూపురం మాదిరి కాకున్నా, దాని మింద నాకు మమకారం తగ్గలా.

అట్లా బొల్లెద్దు ఇప్పుడు మాది కాదు. కొనుక్కోనిండే వాళ్లది అయిపోయింది. అని అనుకుంటా వుంటే కడుపులో బొలే సంగటమయితా వుండాది.

✡

సందకాడ మేతలకి పోయిండే ఆవులు ఇంటికొచ్చినాయి. అవిట్లని మా యవ్వ కట్టేస్తా– 'బంగారమట్లా బొల్లెద్దుని అమ్ముకొంటి. ఏనాడన్నా పనికి కుంటుపెట్టి వుండెనా? ఏనాడన్నా దొంగబోయి గెడ్డి దడ్డెండ్లలో దూరిండేనా? ఎట్లా పసరము, ఎంత మంచి పసరము. అట్లా అవసరాన్ని వొరుపు అగ్గిపడిందే దాన్నించీ అమ్ముకొంటి' అంటానని ఏడుపు గొంతుతో, సనుగుతా ఉండాది. అట్ల సనుగుతూనే కొంగుతో కండ్లు తుడుసుకుంటా ఉండాది. ఆ రేతిరికి ఆయమ్మ బొల్లెద్దు మింద దిగులుతో బువ్వ ముట్టనే లేదు.

✡

అప్పటికి రెండు దినాలయింది బొల్లెద్దు మా మద్దిన లేక. మా యవ్వ బొల్లెద్దుని తలవని పూటంటూ లేదు.

రేతిరి నిద్దర పొయ్యేదానికి మేము సిద్ధమయితా వుండాము. అప్పుడే రంకె వినిపిచ్చె. అది కచ్చితంగా మా బొల్లెద్దు రంకే అనిపిచ్చె నాకి. ఆ మాటే యా యవ్వతో అంటి.

'అవునురా! నిజమే. నాకి అట్లే అనిపిస్తా వుండాది' అంటానని బుడ్డీదీపాన్ని ఎత్తి పట్టుకోని ఆత్రంగా చింతమాని కిందికి మాయవ్వ పోతావుంటే, నేనూ వెంటబోతి.

నిజమే!

అది నిజంగా బొల్లెద్దే!!

కర్రెద్దుతాన నిలబడి దాన్ని ప్రేమగా నాకుతాంది.

బెప్పెరపోయి ఇద్దరమూ దాన్నే జూస్తా నిలబడినాము.

ఇంక మా యవ్వ దాని దెగ్గిరికి పోయి– గొంతులో ఏడుపు పొర్లుకోని వస్తా వుంటే – 'ఓరి ఓరి బొల్లిగా! వస్తివేమిరా? ఎనభై మైళ్ల దొవ్వ నడిచి వస్తివేమప్పా! ఎంత నెర్లురా నా మింద నీకి.. పాపిస్టిదాన్నిరా.. నేను దుడ్లకి అవుసరమొచ్చి అమ్ముకొంటిరా!' అంటానని మాట్లాడుతానే, ఏడుస్తా దాని గంగడోలు దువ్వుతా వుంది. అది మాయవ్వ ఇంకో ముంజేతిని ఎంతో ప్రేమగా నాకుతా వుంది.

ఆ మరుసటి దినము బొల్లెద్దుని కొనుక్కోని పోయిన ఆసాములు రానే వచ్చిరి.

దాన్నింక కచ్చితంగా పట్టుకుపోతారని రూఢీ చేసుకొంటి. మా యవ్వ వాళ్లతో రోంతసేపు మాట్లాడినంక– 'అంత నెర్లయిన ఎద్దుని మడీ ఎట్లప్పా! మీ వెంట పంపేది. మీ దుడ్లు మీరు తీసుకోని పోండప్పా! నా కష్టాలు నూరున్నా పడతాను. ఎట్ల అయ్యేది అట్ల అయితాది' అంటనని మా యవ్వ అంటా వుంటే నాకి బొలే సంతోషమైపోయింది.

✡

# దున్న

–బోయ జంగయ్య

**ఊ**ళ్లోని జనం అటూ ఇటూ పరిగెడుతున్నారు. కొందరకు ఇళ్ళల్లో చేరి తలుపులు వేసుకుంటున్నారు. కుర్రకారు వేపచెట్లను, చింతచెట్లను ఎక్కి మిద్దెలున్న వాళ్ళు మిద్దెలెక్కి చూస్తున్నారు. కొన్ని తాటాకు దడులు పడిపోతున్నాయి. మరికొన్ని ఈతాకు పందిళ్ళు కూలిపోతున్నవి. కుక్కలు వెనక్కు వెనక్కు పరిగెడుతూనే మొరుగుతున్నవి. పందులు కంపచెట్లలో నక్కుతున్నాయి. దున్నపోతు మాత్రం తోక పైకెత్తి మూతిని విరిచిపట్టి బుసకొడుతూ ఇష్టం వచ్చినట్టు పరుగులు పెడుతున్నది. దాని వెనకాల కొందరు యువకులు కర్రలతో చింతలతోపు వైపు గెదిమే ప్రయత్నం చేస్తున్నారు.

అప్పుడప్పుడు ఆ దున్నపోతు చెవులు నిక్కబొడిచి వాళ్ళ అలికిడినే వింటూ, కనుగుడ్లను ఓరగపెట్టి వాళ్ళ కదలికలనే చూస్తోంది. బాగా బలిసి నున్నగా, నల్లగా నిగనిగలాడుతూ దృఢమైన కొమ్ములతో భయంకరంగా ఉంది.

ఆ దున్నపోతు వట్టి దున్నపోతు కాదు అది అమ్మవారి దున్నపోతు. ఊళ్ళోవాళ్ళకు ఏ రోగాలు రావద్దని, పంటలు బాగా పండాలని, రెండేళ్ళ క్రితం రెండేళ్ళ దూడను వదిలితే, అది ఆ చేను ఈ చేను మేసి బాగా బలిసి, తిన్నది అరగక అప్పుడప్పుడు పరు గులు పెడుతూ ఉంటుంది. దాన్ని ఎవరైనా ఏమైనా అంటే పగబట్టి వాళ్ళపని పడుతుందట. ఓసారి ఓ పశు వుల కాపరి కర్రచూపి విదిలించినందుకు, వాడిని తన కొమ్ములతో లేపి ఎనుగులో ఎత్తి వేసిందట. మరోసారి మంచెమీదున్న వ్యక్తి వొడిసేల రువ్వితే ఓ రాయి దానికి తగిలిందట, మంచె దిగిందాక మాటుకాచి అతని పక్కటెముకలు విరిగే వరకు పొడిచిందట.

ఇలాంటివే ఇంకా ఎన్నెన్నో...

అది పచ్చని చేను మేసినా, పండిన చేను తొక్కినా దాన్ని కొట్టొద్దు, ఎవరూ కొట్టరు! ఎనుగు విరగదొక్కినా, దొడ్డిని పాడు చేసినా, ఎవరూ ఏమీ అనవద్దు, అనరు!! ఏమన్నా అంటే అమ్మవారికి కోపమొస్తుంది.

"అమ్మవారికి కోపమొస్తే ఊరికి ఆపద వస్తుందని" కరణంగారు మరీ మరీ చెబుతుంటారు. అలా చెప్పింది వినకుంటే కరణంగారికే కోపం వస్తుందట. కరణానికి కోపమొస్తే ఇక చెప్పేదేముంది?

ఈ రోజు దాన్ని కర్రలతో తరుముతున్నారు.

అంటే కరణం ఊళ్ళో లేడన్నమాట.

కరణం ఊళ్ళోలేక పది రోజులు కావస్తుంది. ఆయన ఊరుని ఇన్ని రోజులు వదిలి వుండడం ఇదే మొదటిసారి. కరణీకాలను రద్దు చేసినట్లు రేడియో వార్తల్లో విని జిల్లా కెళ్లి మరునాడు అదేవార్త వివరంగా ఉన్న దినపత్రికను చంకలో పెట్టుకొని వచ్చి మళ్ళీ అదే సాయంత్రం వెళ్లాడంతే. తిరిగి ఊరి మొహం చూడలేదు.

ఊళ్ళోకి జీపు వస్తున్న శబ్దం వినగానే దున్నపోతు బెదరి ఊరవతలికి పరుగుతీసింది. జీపు ఊళ్ళోకొచ్చి ఊరి మధ్యన ఉన్న గుడివైపు దూసుకుపోయింది. అది చూసిన మస్కూరి దాని వెనకాల పరుగెత్తాడు.

"అవునూ! కర్ణపోడు ఇంకా దస్తరం ఒప్పజెప్పలేదట కద!" ఊళ్ళోకి వెళుతున్న జీపు వైపు చూస్తూ ఓ ముదుసలి అన్నాడు.

"అవునట" ఆ రోజు దినపత్రికను చదవడంలో మునిగివున్న నడివయస్కుడు.

"దేశమంత ఇయ్యంగలేనిది ఈనికేమొచ్చిందో, ఇంకెన్నేళ్ళు ఏలుదామనుకుంటుండో ఊరిని" నిష్ఠూరాన్ని వ్యక్త పరుస్తూ మరో వ్యక్తి.

"ఉన్నదంత దోచుకునే! ఏమున్నదింక ఏలటానికి"

"అందరు కలిసి హైకోర్టుకు పోయింద్రట ఏమైద్దో ఏమో చూడాలె" పత్రిక చదువుతున్న వ్యక్తి.

"ఏమయ్యేది లేదు. వాల్ల పని తీరినట్టే, మాలిపటేల్, పోలీస్ పటేల్ ఇచ్చినట్టుగ, ఈయన కూడా కాయితాలొప్పజెప్పి నలుగురితో నారాయణ అనాలె అంతే!" ఇంతకు ముందు నిష్ఠూరాన్ని వ్యక్త పరచిన వ్యక్తి తనని తెలిపాడు.

"ఈనిది ఆనికి ఆనిది ఈనికి పెట్టి, నడుమ కైలాటకం పెట్టె ఆ బట్టేబాజీ చేతలు ఇక సాగవు"

పేపరు చదివే వ్యక్తికి టీ గ్లాసు అందిస్తూ అన్నాడు తన కడుపులోని కసిని కక్కుతూ టీ కొట్టు సాహెబ్. అక్కడ జరిగే చర్చల నిర్ణయాన్ని ప్రకటించే అధ్యక్షుని లాంటి పాత్ర అతనిది.

"అయినా ఈడు కాయితాలను ఎందుకిస్తలేడో" చదివిన పేపర్‌ను మరో వ్యక్తికిస్తూ.

"దాంట్లోనే ఉంది కిటుకు ఇంతకు ముందు సూడలే ఆ దున్నపోతుని బాగ, తినమరిగి" అన్నాడు హోటల్ సాహెబ్.

ఊరి మొదట్లో ఉన్న టీ కొట్లో ఇలా జరుగుతుంది సంభాషణ.

పటేలు పట్వారి వ్యవస్థను రద్దు చేసిన తర్వాత చాలామంది తమ తమ రికార్డులను ప్రభుత్వానికి సమర్పించారు. ఇవ్వని వాళ్ళల్లో ఈ ఊరి కరణం ఒకరు.

ఈయన పేరు రంగారావు. రాంగ్‌రావు అని కొంటె పేరుతో పిలుస్తారు. కొద్దిగా ఇంగ్లీషు నేర్చిన పదో తరగతి ఫేలయిన కుర్రకారు. ఈయన తహసీల్ ఆఫీసులో పిల్లి, ఊళ్ళో పులి.

✡

ఆ ఊరికి రెండు పెద్ద చెరువులున్నాయి. అందుకని వరి పంట ఎక్కువే. చేపలూ పుష్కలం. ఆ ఊరి చుట్టూరా పెద్ద తాటి వనం ఉంది, కాబట్టి కల్లు కావడం ఎక్కువే. కాపులకు, కర్నాలకు, వచ్చే వారికి పొయ్యేవారికి పోను, నాలుగైదు పట్టణాలకు ఇక్కడి నుండే లారీలలో సరఫరా కూడా జరుగుతూ వుంది. ఇక ఊరిరాబడి మనం ఊహించ వచ్చు. అందుకని రంగారావు ప్రభుత్వానికి కాయితాలు అప్పజెప్పకుండా తిరుగుతున్నాడు.

ఆ రోజు మాత్రం కొత్తగా నియమించబడ్డ విలేజి అసిస్టెంట్‌గార్కి చార్జి ఇప్పించడానికి ఆర్.ఐ.గారు వచ్చారు. మస్కూరి ముందు నడవగా గుడిని ఆనుకొని ఉన్న కార్యాలయపు గదిని చేరారు. తాళం విరగొట్టి చూసారు. అందులో ఏమీ లేవు. రెండు ఖాళీ ఆయిల్ సీసాలు, మరో రెండు గడ్డకట్టిన సిమెంటు బస్తాలు తప్ప.

రంగారావు ఇంటిని సోదా చేయడానికి వెళ్లారన్న వార్త ఊరంతా పాకింది. జనం గుంపులు గుంపులుగా రంగారావు ఇంటిచుట్టూ మూగారు. రెండు ఎకరాల ఖాళీ స్థలంలో నిర్మించిన ఆ భవనం నగిషీలు చెక్కిన పెద్ద పెద్ద దర్వాజలతో నవాబుగారి దేవిడీలా వుంది. రంగారావు గారికి వచ్చే జీతం వందల్లో ఐనా వేలు సంపాదించే వ్యక్తి ఇల్లులా ఉంది. ఆ ఇల్లు చూసి ఆయన ఆదాయాన్ని అంచనా వెయ్యొచ్చు. గుమిగూడిన జనంలో రకరకాల మాటలు.

ఆ ఇల్లు నిర్మాణం మూడేళ్ళు జరిగిందట. ఈ వూరి రైతులు కొట్టిచ్చిన బండ్లకొద్దీ తుమ్మచెట్లతో ఇటుకల బట్టీలను కాల్చారట. అంతేకాదు జాగీరు భూములను హరిజనులకు పంచగా వాళ్ళతోటల్లో ఉన్న పెద్ద పెద్ద చింత, మామిడి చెట్లను నరికి సున్నం కాల్పించా రట. ఈ పనులు జరిగినన్ని రోజులు గౌండ్ల వాళ్ళు వంతులవారీగా కుండలకొద్దీ కల్లు పంపేవారట. ఎందరో అధికారులు విస్కిని తలదన్నే ఈ ఊరి గట్టి కల్లును తాగి ఈ భవనంలోనే విశ్రాంతి తీసుకునేవారట.

అటువంటి ఇంటిని సోదా చేస్తామంటే ఆ ఇంటి ఆడవాళ్లు, పిల్లలు అందరూ ఒక్కసారే బిత్తరపోయి చూస్తూ నిలుచున్నారు.

మగవాళ్లు ఊళ్లో లేరు కాబట్టి ఇంటిని సోదా జరపడానికి వీల్లేదని, కరణం భార్య అడ్డు చెప్పింది. అంతేకాదు తాళాలను తియ్యొద్దని అడ్డంకూడ నిలుచుంది. అయినా సోదా జరగడం ఆగలేదు. చుట్టూరా ఉన్న జనం రంగారావు ఇల్లు సోదా జరుగుతుంటే చిరునవ్వుతో చూస్తున్నారు. ఎంతోమంది మగవాళ్ళను బానిసలకంటే హీనంగా భావించి వాళ్ళ వాళ్ళ ఆడవాళ్ళముందే బూతులు తిడుతుంటే తలొంచుకొని నిలుచున్న వాళ్ళందరూ కరణం పరువు బజారులో మురికి కాలువలై పారుతూ ఉంటే కసిగా చూస్తున్నారు. ఇల్లంతా వెదికినా ఎలాంటి కాయితాలు బయటపడలేదు. ఆర్.ఐ.కి అర్థంకాక మస్కూరి వైపు చూశాడు. మస్కూరి పెంటయ్య తన ఉద్యోగరీత్యా కరణం అడుగులకి మడుగులొత్తినా, లోలోపల అతనంటే ఎంతో కోపం, పగ ఉన్నాయి. అతనికి అలా పగ ఉండటానికి కారణం, అతనికి ఇస్తానన్న పొరంబోకు భూమిని మరొకరికి పట్టా చేయించడమే!

ఆ రోజు పెంటయ్య కళ్ళముందు తిరిగింది...

"పంతులుగారు పొరంబోకు చెల్కగుడ్డం నాకిస్తనంటిరి. మరిగ పట్టజేయిస్తే తమరిపేరు చెప్పుకొని బతుకత"

"చూద్దాం చూద్దాం" కరణం

"సూద్దాం అనకుండ్రి సేస్తర అనండ్రి"

"చేయిస్తరా"

"గట్ట అనుండ్రి కాల్మొక్త" అంటూ చేతికర్రను ఎదమీద వొదిలి రెండు చేతులు జోడించి నమస్కరించాడు.

కరణం ఓ చిరునవ్వు నమిలేసి..

"ఎవర్రా! యింతకు ముందు కర్రలు పట్టుకొని అటు ఇటు ఉరుకులం పెడుతుండ్రు"

"ఆల్లా? పందిని కొడుతుండ్రు పంతులు"

"ఎవన్నడిగి కొడుతుండ్రు"

"ఆల్ల పందే అది"

"అవున్రా! ఆల్ల పందే కనీసం నిన్నన్న అడిగిండ్రా"

"యింగ అడిగినట్టే అనుకోండ్రి. ఏదో నాగ్గూడా యింతా" మాటలను మింగుతూ అన్నాడు.

"గింత కాదు, మరింత కావాలను. అది కూడా మంచివార్లే కావాలను అర్థమైందా?"

పెంటయ్య కదిలాడు.

"అరేయ్" కరణం

"ఆ" అంటూ ఆగాడు.

"ఆట్లనే పెద్ద గౌడ్ కాడికి పోయి, ఆ వాగుదగ్గర వంకతాడు లేదు? దానికి ఎల్లిందంత పంపమను. నీల్ల సుక్క కల్వొద్దుసుమా!"

"అయ్య"

"ఆల్లు చింతలకిందనే దిగినట్టున్నరు" గొంతు చిన్నగజేసి అడుగుతు, పెంటయ్య దగ్గరికి వచ్చి ఏదో చెప్పబోయాడు.

"తమరు సెప్పాల్నా"

"అవును వాల్లు ఎన్నాళ్ళుంటరట యిక్కడ"

"నేను అడగలేదయ్యా"

"గుడిసెలు మూడున్నయి. మంది ఎందరు"

"ఒక గుడిసెలో ముసలోల్లుంటరు ఇంకోదాంట్ల ఆని బిడ్డ వుంటది"

"ఆ వయసుది ఆని బిడ్డేనా"

"ఆ"

"దూరం నుంచి సూచిన"

"ఆమ్మో పసుగ్గొమ్ము"

"మొగుడు లేడా"

"యిడిసి పెట్టిండట. పడుసు పోరగాల్లందరూ వూరికే దానినే సూసుకుంట తిరుగుతుండ్రు. అదేమో పొద్దుకూకులు పందుల మేపుకొచ్చి రాతిటేల్ల గుడిసెల పడతది"

"అంటే"

మస్కూరి నవ్వాడు. నవ్వుతూనే అక్కణ్నుంచి కదిలాడు. రాత్రి బాగా చీకటయ్యింది. అప్పుడప్పుడూ వాన చినుకులు రాలుతున్నాయి. చింతచెట్టు మొదట, మొదటి గుడిసె దగ్గర, ఓ మండుతున్న కుంపటి, దాని చుట్టూరా కూర్చుని కల్లుతాగుతున్న వాళ్ళతోనే పెంటయ్య కూడా ఉన్నాడు.

గొడుగు పట్టుకొని, ధోవతిని పూర్తి మోకాళ్ళ వరకు మడిచి పట్టుకొని, మూడవ గుడిసె ముందుకొచ్చి ఒకసారి అటూ ఇటూ చూసి లోపలికెళ్ళి తెచ్చిన గొడుగును విప్పి గుడిసె ద్వారానికి అడ్డంగ పెట్టాడు కరణం.

అంతవరకు పడుకొని ఉన్న స్త్రీ లేచి కూర్చున్నటువంటి విరుపుల చప్పుడు, గాజుల గలగలల శబ్దం ఒకేసారి వినిపించాయి. ఓసారి ఆయన్ను చూసి, ఆ తరువాత తలవంచుకుని,

తన ఎడమ చేతికున్న పచ్చబొట్టును చూసుకుంటున్నప్పుడు "హు కానీయ్ ఆ గ్లాసుల్లో" అంటు పొంగులు పొంగుతున్న కల్లు పటువ వైపు కళ్ళతో సైగ చేశాడు. అప్పుడు ఆమె కల్లు వంచడానికి వంగినపుడు కొంగు బుజం పైనుండి వడిలోకి జారి ఆగింది. పటువను వంచి గ్లాసులను నింపగ, కల్లు అంచులను దాటి పొరలి నేలన ఇంకిపోతున్నట్టు బుస బుస శబ్దం, తడిసిన మట్టివాసన, పుట్టమీద పడుకున్న పాములా ఆమె ఎదమీద పగడాల దండ. ఆమె చేతులకు ఎఱ్రగ పండిన గోరెంటాకు. యివన్ని కరణం మనస్సులో కొత్త కోరికలను రేకెత్తించాయి.

బాగా కాలిన పంది వార్ల మీద మిరియాలపొడి చల్లి గిన్నె నిండ తెచ్చి, గుడిసెకు అడ్డంగ ఉన్న గొడుగును జరిపి, గిన్నెను లోపలికి నెట్టి మళ్ళీ గొడుగు సరిచేసిపోతూ గిన్నె లోపలికి తీస్కొని, ముక్కలను తినుపించుకుంట దొరను కుసీజేసీ, యింత సినగని వస్త్రం అడుక్కో అంటూ వచ్చినంత వేగంగా చింతచెట్టు మొదలు వైపు నడిచింది, గుడిసె లోపలున్న యువతి తల్లి.

కరణం ఎంతో ఇష్టంగా ఆమె అందిస్తున్న మాంసపు ముక్కలను తినసాగాడు. ఆమె తినిపిస్తూ, తాపిస్తూ, నవ్వుతూ నవ్విస్తూంది.

"పందికూర మీరు కూడా తింటర పంతులూ!" విస్తుపోతూ అడిగింది ఆమె.

"పంది పరమాత్ముని స్వరూపం ఇష్టంగా భోంచేస్తాం"

కల్లు పటువ ఖాళీ అవుతూ ఉంది. మాంసం ముక్కలు మాయం అవుతున్నాయి.

"నా యేలు కొరికేవు" అంది మాంస ముక్కను నోట్ల పెడుతూ కవ్వింపుగా.

కొరికితే ఏమవుద్ది అన్నట్టు చూసి, తినిపిస్తున్న ఆమె చేతిని తన చేతితో ఓసారి నొక్కి వదిలాడు. ఆ తర్వాత ఒకరి వీపున మరొకరి చేతులు.

పాతికేళ్ళ పరువం కరణం కళ్ళల్లో ఇమిడిపోయింది.

కోడి కూసింది.

మస్కూరి మైకం కాస్త దిగింది. తెల్లారితే అందరూ చూస్తారు. అందుకని కరణాన్ని లేపడానికి మూడవ గుడిసె ముందుకొచ్చాడు. ఏవేవో గుసగుసలు వినిపిస్తున్నాయి లోపల నుండి.

"నీ సిగ తరగ! ఎంత జానవే నువ్వు. ఎంతటి సుఖాన్ని ఇస్తివి. దొమ్మరింట్లా పుట్టినా దొరసాన్ని మించినవు"

"హు" అంటూ అతని ఎదమీద తన ముఖాన్ని ఆనించి..

"అయితే యిగ నేను ఈ ఊర్లనే ఉంట"

"వుండు, కానీ ఈ సంగతి.."

"ఎవ్వరికి తెల్వకుంట వుంచుత, కానీ.." అంటూ ఎదమీద నుండి లేచి అతని కళ్ళల్లోకి చూసింది. అప్పుడు ఆమె కళ్ళచుట్టూ కరిగిన కాటుక మరీ వెడల్పు అయి, రాత్రంతా నిదుర కరువైనట్లు, ఓ మాదిరి అలసటను సూచిస్తుంది.

"కానీ"

"నాకింత సినగని వస్త్రం ఇప్పిస్తే" అంటూ అతని ధోతిని సరిచేసింది.

"అంటే" అంటూ పగడాలదండ పరుచుకున్న చోట చూపును నిలిపాడు.

అది గమనించిన ఆమె ఓసారి గట్టిగా కౌగిలించుకొని వదిలి కరణం కళ్ళల్లోకి చూస్తూ...

"తెలవదా" అంటూ అతని చెవి దగ్గరికి ముఖాన్ని పోనిచ్చినపుడు రాత్రి తలలో నలిగిన పూలు రాలి కిందపడ్డాయి.

తెలవదు అన్నట్టు తలూపాడు.

ఆమె నవ్వుతూ చెవిలో ఏదో చెప్పింది.

అంతే! తన కిస్తనన్న పోరంబోకు భూమి ఆమె పేర్న పట్టా చేయించాడు కరణం. అది గుర్తొచ్చేసరికి మస్కూరి పగకు పదునొచ్చింది. కసిగ పళ్లు కొరికి తుపుక్కున ఉమ్మి, లోలోపల తిడుతూ ఆర్.ఐ. వైపు చూశాడు. కాయితాలు ఎక్కడ దాచింది చూపిస్తరండని సైగచేశాడు. తను ముందు, ఆర్.ఐ. వెనక నడవగా ఇద్దరూ పిడకలగూడు వరకు వచ్చాడు. పెంటయ్య తన చేతిలోని కర్రతో పిడుకలగూడుని కూలదోసాడు. గూడు మధ్య తెల్లని గుడ్డలమూట బయటపడింది. పెంటయ్య విప్పిచూపి ఆర్.ఐ.కి చూపించాడు. ఆర్.ఐ. అన్నీ తిరగేసి చూశాడు. ఒకరి భూమి మరొకరు కొన్నట్టు కొన్ని దస్తావేజులు, చిట్టాను పట్టి చూస్తే వసూలు చేసిన రకం అంతా ఖజానాలో జమచేసినట్లు చలానుల నమోదు దాఖలాలు ఏమీలేవు. మాఫి అయిన కార్లకు రకము వసూల్ చేసినట్టు కచ్చా చిట్టాలు కనిపించాయి. చౌఫస్లా, పహణీలను చూడగ అన్ని మార్పులు జమాబందీలో అమలు లేవు. రజాకార్ల తర్వాత పాకిస్తాను వెళ్లిన వాళ్ల భూములు మరొకరు కొన్నట్టు దస్తావేజులు ఉన్నాయి. కరువు కాలంలో ప్రభుత్వం మంజూరు చేసిన గడ్డిని ఎప్పుడూ పంచలేదు. అసలు అలాంటి గడ్డి ఊళ్లోకెపుడూ రానేలేదట. కానీ ఒచ్చినట్టగ, రైతులకు పంచినట్టుగ కాగితాలపై వేలిముద్రలు.

అతనికున్న చెలుకలు, బావులు, సీలింగ్‌లో పోకుండా చుట్టాల పేర్న కొంత, తోటలు పెంచి కొంత కాపాడుకుంటూ వచ్చాడు. ఎంతోమంది రైతుల పట్టా కాయితాలు కరణం దగ్గరే ఉన్నాయి.

ఆర్.ఐ. కాగితాలను వివరంగా చదివి వాటిని వేరుచేసి, వాటిల్లోని పట్టాలు ఎవరెవరి పేరుమీద ఉన్నవో వాళ్ళకు ఇచ్చాడు. తరతరాల ఊరిగుట్టు పట్వారి పందిరిదాటి ప్రజల్లో కొచ్చింది. మందిని వరసలో నిలిపి "పటేల్ ఒప్పజెప్పినట్టు ఈ కర్నపోడు ఊకే కాయితాలను

వొప్పజెప్పక ఏందన్న! ఈ బాగోతం" అంటూ మళ్ళీ ఉన్నచోటికే వచ్చి తన చేతి కర్రను సంకకింద ఆసరాగ పెట్టుకుని నిలుచున్నాడు పెంటయ్య.

"ఏం మస్కూరన్నా రాంగ్‌రావు ఈ ఊరికి రానే రాడ" అక్కడున్న కుర్రాళ్ళల్లో ఒకడడిగాడు.

"వస్తడో సస్తడో ఎట్ల సెప్పుతం" ఎడమచేతిని ఓ మాదిరిగా తిప్పుతూ ఏసారినట్టుగా చెప్పాడు పెంటయ్య.

"మీ మీ శిస్తులు సకాలంలో చెల్లించి వీటిల్లో నమోదు చేయించుకోవాలి. మీ భూమి హద్దులమీద మీకేమైనా అనుమానాలుంటే తిరిగి కొలత వేయించుకోండి" అని చెప్పాడు విలేజి అసిస్టెంట్.

అపుడే కాలేజి నుండి వచ్చిన ఉడుకురక్తం కాబట్టి జరిగిన అన్యాయాల్ని చూస్తు వుంటే అతని వళ్లు మండిపోయి కళ్ళు ఎర్రపడ్డవి. అందువల్ల అతను ఉద్రేకంతో కరణం పన్నిన కుట్రలన్నీ విప్పి చెపుతూ ఉంటే ఆ ఊరి జనం ముక్కుమీద వేలేసుకుంటున్నారు. మగవాళ్ళు కళ్ళెర్రజేస్తున్నారు. కాగితాల మీదున్న విషయాలకు జనం చెబుతున్న విషయాలకు ఎక్కడా పొంతన లేకుండాపోయింది. కసితో కోపంతో అక్కడ ఉన్న జనం పిడికిళ్ళు బిగిస్తూ ఉన్నవి. వేడి శ్వాసలను వదులుతూ అందరూ ఒక్కసారే కరణం ఇంటి వైపు చూస్తున్నారు. ఏదో ప్రళయం రానున్నది. గ్రహించిన ఆర్.ఐ. వాళ్ళని వారించే ప్రయత్నం చేశాడు. అయినా జనం వినలేదు. పోలీసుకు రిపోర్టిస్తానన్నాడు. ఎవ్వరూ పట్టించుకోలేదు. కరణానికి ఇంతవరకు నీడలా ఉన్న మస్కూరి ఈ రోజు విలేజి అసిస్టెంట్ వెంట ఉన్నాడు. అందరూ కరణం ఇంటిని చుట్టుముట్టారు. జనం నానా రకాలుగా తిట్టారు. "ఈ ఊరుని తన జాగీరు అనుకునే, అందినకాడిల్ల అందరినీ దోసుకునే! ఎదురు తిరిగినోల్లని ఏదో కేసులో ఇరికించి పోలీసోల చుట్టు కోర్టుల చుట్టు తిప్పిచ్చె, కట్టెకమ్మగిట్ట తెచ్చుకుంటే కట్టేసి కొట్టిచ్చే. ఎవ్వలన్న ఆకలిగొని దూపగొని కల్లుగట్ట దొంగతనంగ తాగితే గుండు కొట్టిచ్చి గాడిదమీద ఊరేగిచ్చే. మరి ఈడు ఇన్ని తప్పులు చేస్తే మరి ఈన్నెందుకు వొదలాలె? ఈ దస్త్రాలను మార్చడం, జనాన్ని డోకచేయడం, కల్లూ కట్టెల దొంగతనం కంటే ఎక్కువ గద! ఈనికి తగిన సిగిచ్చ సెయ్యాలె. ఎన్నాళ్లు దాసుకొని తిరుగుతడు" అన్నాడు ఆవేశంగా మస్కూరి పెంటయ్య. కరణం నౌఖరి ఊడి, తన నౌకరి ఉన్నందుకు మురిసిపోతూ కనిపించిన వాళ్ళందరినీ పలుకరిస్తున్నాడు. రకరకాల వ్యక్తుల రకరకాల మాటలు. ఒక్కొక్కని కళ్ళనుండి ఎప్పటి కోపమో నిప్పులై దూకుతున్నవి.

వీళ్ళ రాకను గమనించిన కరణం భార్య పిల్లలు వరండా వరకు వచ్చి భయం భయంగా చూస్తున్నారు.

మీరంతా కరణం వచ్చేవరకు ఆగాలి. అంతేకాదు మీకు జరిగిన అన్యాయాలను ప్రభుత్వానికి తెలియపరుచుకొని న్యాయం జరిగేటట్టు చూసుకోవాలి. లేదా కోర్టుకు వెళ్లాలి.

ఏది చేసినా చట్ట ప్రకారంగా చేయాలి. కానీ ఇతని ఇంటిమీద పడి ఏవో పాత పగలను తీర్చుకుందా మనుకునే మీ ధోరణి సరైనదికాదు అని అన్నాడు ఆర్.ఐ.

"ఆయన వొచ్చినాక ఓ మీటింగ్ పెట్టి అన్ని విషయాలు అడుగుదాం వదలొద్దు. అన్యాయాన్ని ఎదిరించవలసిందే కాబట్టి మీరందరూ దయచేసి వెళ్లవలసిందిగా కోరుతున్నాను" అని విలేజి అసిస్టెంట్ అనగానే తమలో తామే గొనుక్కుంటూ అందరూ అతికష్టంగా అక్కన్నించి కదిలారు. వినగూడని మాటలను వొదిలారు.

✡

ఊళ్లోకి బస్ వచ్చిపోతుంది కాబట్టి అన్ని డిపార్టుమెంటుల వాళ్ళు వస్తూ వున్నారు. వ్యవసాయశాఖ వాళ్లు, ఆరోగ్యశాఖ వాళ్లు, సినిమా చూపించేవాళ్లు రోజు ఎవరో ఒకరు వచ్చిపోతూనే ఉన్నరు. అన్ని శాఖలవాళ్ళు వచ్చినట్లుగానే ఆరోజు పశువైద్యశాఖ వాళ్లు వచ్చారు. ఊళ్ళో దున్నపోతు సృష్టిస్తున్న దుస్థితిని విన్నారు. గ్రామంలో కొంతమంది బాధితులు దాని ఆగడాలనూ, అరాచకాలను అరికట్టాలన్నారు. ఊరికి మేలు జరిగేమాట అటుంచి దానివల్ల జరిగే కీడుని భరించడం కష్టమైందన్నారు. ప్రజల ఫిర్యాదుల మేరకు పశువైద్య శాఖాధికారులు పగ్గాలను విసిరారు. కాళ్ళు కదలకుండా కట్టేసి కొమ్ములను నేలకు అనగపట్టి సంబంధిత పరికరంతో విత్తుకొట్టారు. కొన్ని రోజులు ఆ చెట్టునీడన ఈ చెట్టునీడన పడుకొని ఆ తర్వాత అది పుట్టిన దొడ్డివైపు పోయిందా దున్న. అంతేకాదు అది మళ్లీ ఎన్నడు పరుగులు పెట్టలేదు. ఊరి జనం అది ఇదని గొనిగినా తర్వాత ఎవరూ పట్టించుకోలేదు.

వారం తర్వాత ఓ రోజు సాయంత్రం మాజీ కరణంగారు బస్సు దిగి తన ఇంటివైపు వెలుతూ వుంటే ఎవరూ పలకరించలేదు. నడిబజార్లో పడుకొని ఉన్న అమ్మవారి దున్న కరణాన్ని చూడగానే లేచి ఓ మాదిరి దీనమైన శబ్దం చేసింది. దున్నపోతుని ఆ ఆకారంలో చూడగానే కరణానికి కళ్లు తిరిగినట్లై, ముసిరిన ఆలోచనలతో ఇంటివైపు నడిచాడు.

కరణానికి గూడ ఏదో జరిగినట్టున్నది, అని గ్రహించిన దున్న మరింత నిరుత్సాహంగ కూలబడింది నిలుచున్నచోట.

✡

# మంచివాడు

**–ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు**

ఇంకా పొద్దుగూకలేదు. పెదరెడ్డి కల్లాంకాడకి బయలుదేరాడు. చేతికి పొన్నుకర్ర. భుజం మీద ఎర్ర పైగుడ్డ. నల్లటి ఒళ్ళు. ఇంతెత్తు మనిషి. వయసు మీదబడి కొంచెం నడుం వంచినా, పొన్నుకర్ర సాయంతో నిటారుగానే నడుస్తాడు.

పెదరెడ్డి వొంట్లో నిస్సత్తువగా ఉంది. నిదానంగా, నీరసంగా నడుస్తున్నాడు. కపిల బావి దగ్గర కాటయ్య ఎదురుపడ్డాడు. పెదరెడ్డి అడుగుల్లో వడి పెరిగింది. వాడిన ముఖంలోకి దర్పం వచ్చింది. కాటయ్య పలకరించాడు.

"ఏం పెదరెడ్డీ, ఇంత పెందలకాడే బయల్దేరినావు? నీకు ఏ కయ్యలబడ్తే అదే లోకం గదా. మాపిటికి ఇంత కూడు దినేసి ఒకేతూరి బయిల్దేరినావు! నీ బోటోడుండబట్టి గదా ముద్దురెడ్డి ఈ దినానికి ఇంతటోడు అయింది. సరేగానీ మనిషేందట్టుండావు. జెరం తగిల్నోడిమాదిరి. సందెకాడ అంత ముద్ద తినేసి గుట్టుగా నడుం వాల్చే రాత లేదు గదా నీకు."

కాటయ్య మాటలు పట్టించుకోనట్టుగానే పెదరెడ్డి ముందుకు నడిచాడు. ఒంట్లోని నీరసాన్ని, ముఖంలోని దిగులును దాచడానికి పొన్నుకర్ర టకటక లాడించుకుంటూ గబగబా నడిచాడు.

కల్లాంకాడ జీలగ చెట్టు నీడలో కూర్చుని నాగయ్య బీడీ తాగుతున్నాడు. అల్లంత దూరాన పెదరెడ్డి కనబడగానే బీడీ ఆర్పేసి మిగిలిన ముక్క చెవి వెనుక దోపుకున్నాడు. లేచి వడ్లు కుప్పదోయడం మొదలుపెట్టాడు.

రోజూ కల్లాం మొత్తం కలదిరిగిగానీ నీడకు చేరని పెదరెడ్డి, ఈ రోజు నేరుగా జీలగ చెట్టు కిందకి నడిచాడు. నులక మంచంమీద గోతాం పట్ట విదిలించి వేసి కూర్చున్నాడు. పొన్నుకర్రను భద్రంగా తన పక్కనే పెట్టుకున్నాడు.

"నాగా! ఆ పిచికిల్ని అట్టగొట్టు. యామారినామంటే వడ్లరాసంతా ముక్కన కరుసుకు బోయి..." అని పని పురమాయించాడు.

నాగయ్య ఆ పిచికల్ని అదిలించి వచ్చి రెడ్డిముందు నిలబడ్డాడు.

"బాయికాడికి బొయ్యి దబర నిండా నీళ్ళు ముంచకరా బో" అని చెప్పి, పైగుడ్డ చుట్ట చుట్టి మంచం కోడు మీద దిండులాగా పెట్టుకుని పడుకున్నాడు. కళ్ళు మూతలు పడుతున్నాయి. కడుపులో దేవినట్టుగా ఉంది. తల వెనుక చేతులు పెట్టుకుని వెల్లికిలా పడుకుని పైకి చూశాడు. జీలగ చెట్టు కొమ్మల్లో పసిరిక పాము కనిపించింది. వడ్లరాసిమీద పొల్లాడి పొల్లాడి అలసి వచ్చి వాలి దీరుతున్న పిచ్చుక కోసం అది కాపేసుకుని ఉంది.

పెదరెడ్డి చివుక్కున లేచి పొన్నుకర్ర అందుకున్నాడు. ష్.. ష్ అని అరుస్తూ కర్రతో కొమ్మలు కదిలించాడు. పిచ్చుక తుర్రున ఎగిరిపోయింది. పసిరిక పాము భయంతో ఇంకో కొమ్మ చాటుకి జారుకునింది. పెదరెడ్డి నిశ్చింతగా నులకమంచం మీద కూర్చున్నాడు.

నాగయ్య నీళ్ళ దబర తెచ్చి మంచం కింద పెట్టాడు. ఇత్తడి చెంబుతో నీళ్ళు ముంచుకుని పెదరెడ్డి నోట్లో పోసుకున్నాడు. తొలిగుక్క గొంతులోకి దిగేటప్పటికి గుండె పట్టినట్టుగా అనిపించింది. నోటికాడి నుంచి చెంబు పక్కకి తీసేశాడు. గొంతులోని నీళ్ళు కడుపులోకి జారాక నిదానంగా గుక్కగుక్కగా తాగాడు.

నాగయ్య విచిత్రపోయి చూస్తున్నాడు.

శేరు పాల చెంబు నోటికాడ పైకెత్తినాడంటే రెడ్డి ఖాళీ అయ్యేదాకా దించడు. అటువంటోడు ఈ రోజు తులసితీర్థం తాగినట్టుగా నిలిచి నిలిచి నీళ్ళు తాగుతుండాడేందబ్బా అనుకుంటూ చూశాడు.

"నాగా, ఆ రెండు కువ్వల మీద గూడా గెడ్డి కప్పేసి నువ్వింక గుడిసికి పో" అని పెదరెడ్డి చెప్పాడు.

"నీకు మాపిటికి కూడెట్ట? తెచ్చిపెట్టేసి పోతాన్లే సామీ" అన్నాడు నాగయ్య.

"చెప్పింది చెవినేస్కో. కల్లాంకాడ నేనుంటాను గానీ నువు పో. ముద్దురెడ్డి పెళ్ళాం కాడికి బొయ్యి కూలి డబ్బులు తీసుకోని పో. పోతాపోతా ఒక పొట్లాం పోసుకొని పొయ్యేవు. మక్కిలిరగతాయి. రూకలు పెళ్ళాం చేతికిచ్చి అరువుగా ఇంత కాసుకుని తాగి గుట్టుగా పడుకో" అన్నాడు.

అయినా, నాగయ్య నసుగుతూనే నిలబడ్డాడు.

"నీకు మాపిటికి కూడు దెచ్చిపెట్టేసి పోతాన్లే సామీ" అన్నాడు.

"మళ్లీ అట్నే అంటావు. ఒకతూరి చెప్తే ఎక్కదేంది నీకు. కూటికేం కొళ్ళబోలేదు గానీ నువు పో. చినరెడ్డి తెస్తానన్నాడ్లే" అని విసుక్కుని నాగయ్యను పంపేశాడు.

పెదరెడ్డి మాటల్లో తొలి అబద్ధపు తడబాటు కనిపించింది.

నాగయ్య కదలకపోతే పెదరెడ్డి పెద్ద చిక్కులోనే పడేవాడు. కూటేళకి పనోడు గడపకాడికి వస్తే కడుపు నిండా పెట్టకుండా పంపే పద్ధతి పెదరెడ్డి ఇంటా వంటా లేదు. పెదరెడ్డి చిన్నతనంలో అయితే పొయ్యి మీద ఎప్పుడూ పనోళ్ళ కోసమని పెద్ద దబర ఉడకతా వుండేది. యాళకి వచ్చిన వాళ్ళకంతా వండి వార్చి వడ్డిస్తా వుండేవాళ్ళు. పెదరెడ్డి పెత్తనం వచ్చేప్పటికి అంత లేదు గానీ, పనోళ్ళ కడుపుకింత పెట్టే ఆచారం మాత్రం మారలేదు. అందుకే పెదరెడ్డికి కూడు తేవడమంటే నాగయ్యకు అంత కుశాల.

కానీ, ఈ రోజు పరిస్థితి వేరు. పొయ్యిలో నిప్పు కల్లు లేదు. తెల్లారి నుంచి ఇంట్లో ఎవ్వరూ ఇన్ని సద్దినీళ్ళు కూడా గొంతులో పోసుకోలేదు. కూటేళకి యానాది నాగయ్య గడపకాడికి వస్తే ఏం పెట్టి పంపుతారు? ఇంట్లో పస్తుంటే వీధిలో తెలీదు గానీ, పనోడికి పెట్టకపోతే వీధంతా రచ్చేగదా!

పెదరెడ్డికి పేగుల్లో జ్వరం కాస్తున్నట్టుగా ఉంది. వడ్ల బొట్ట ఖాళీ అయి నెల రోజులయింది. ఆ ఇంట్లో, ఈ ఇంట్లో అరువు తెచ్చుకుని కడుపు నింపుకుంటున్నారు. ఇదంతా కోడలి సమర్థత. ఈ రోజుటికి ఇంక అప్పు అడగడానికి ఇల్లే లేకపోయింది. ఒకతూరి అడిగిన వాళ్ళనే అడగడానికి మనసు రావడం లేదు. కోడలు తనవల్ల కాదని "ఈదిలోకి బొయ్యి ఇన్ని గింజలు తెచ్చి పొయ్యండి." అని అంటూ వుంది.

"మేం! ఇన్ని దినాలు ఒకరి ముందు చేతులు సాచినోళ్ళం గాదు. ఈ ఒక్క దినం బిడ్డల మొహం జూసైనా ఇన్ని గింజలు దెచ్చి ఉడకేసిబెట్టు" అని కొడుకు బతిమాలుకుంటున్నాడు.

ఈ మాటతో కోడలు ఒంటికాలి మీద లేసింది.

"ముయ్యట్ట నోరు. ఏం, బిడ్డల మొహం జూసేది నేనేనా, మీ అబ్బాకొడకలకి కళ్ళు లేవా? బిడ్డల బాధ బట్టింది నాకేనా, మీ అబ్బా కొడకలకి బట్టదా? ఏ లగ్గాన మా వాళ్ళు నన్నీ కొంపలో ఇచ్చినారోగానీ, ఏనాడైనా ఒక సుకమనేది ఎరుగుదునా? ఒక మిఠాయనీ, ఒక పండనీ ఫలమనీ తిన్నానా? నా బిడ్డల కింత బెట్టానా? కడంతకాలం గొడ్డు మాదిరిగా చాకిరి చెయ్యమని గదా ఆ పాపిష్టిదేముడు నా నెత్తిన రాసినాడు." ఆమె ఆగ్రహం దుఃఖంగా మారింది. ఆమెను సముదాయించే మాటలేవీ అతని దగ్గర లేవు. కొంత మౌనం తరువాత తిరిగి ఆమే నోరు విప్పింది.

"పెగ్గిలికి బొయ్యి ఇంట్లోదంతా ఈదిలో బెట్టి పెళ్ళాం బిడ్డల్ని పస్తులు బెడ్తుండారే మీ అబ్బా కొడుకులు. బూమీ బుట్రా ఆ ముద్దురెడ్డి ఎదాన బెట్టిరే. గుడికనీ బడికనీ, రాయికనీ రప్పకనీ నగనట్రా గూడా ఊడ్చి బెట్టిరే. పెదరెడ్డి మంచోడనీ, చినరెడ్డి మంచోడనీ ఊళ్ళో వాళ్ళంతా నెత్తిన బెట్టుకుంటారని గదా మీరింత కాడికి జేసినారు! అక్కడికి పెదరెడ్డి కోడలే

ఈ ఊళ్ళోళ్ళకి నోటిగల్ల మనిషి, పాపిష్టి ముండ అయింది. ఇద్దో... నేను గూడా పంట రెడ్డికి బుట్టిందాన్నే, నాగ్గూడా పరువుండాది, నాగ్గూడా రోసముండాది. పెళ్ళాం బిడ్డల్ని సాక్కుంటారో సంపుకుంటారో నాకు తెలవదు. సందేళకంతా ఇన్ని గింజలు దెచ్చి ఇంట్లో బొయికపొయినారో నేనూ నా బిడ్డలూ ఏ బాయిలోనన్నా దూకి సస్తాం. అప్పుడు గూడా మీ అబ్బా కొడకలు మానం, మర్రేదా వల్ల బొట్టలో బ్రదంగా దాపెట్టుకోండి."

కోడలి హెచ్చరిక మాటకి పెదరెడ్డి కలవరపడ్డాడు. భయమేసింది. గొంతు సవరించుకుని దగ్గాడు.

కోడలు పెళ్ళోకి జారుకునింది. కొడుకు వీధిలోకి నడిచాడు.

పెదరెడ్డి పైటాలదాకా కల్లాంకాడ గడిపాడు. పొద్దు పడమటికి మళ్ళాక ఇంటికి నడిచాడు. కోపంలో నాలుగు మాటలన్నా కోడలు మంచిది. బిడ్డల కోసమన్నా ఏ ఇంట్లోనో ఒకింట్లో నాలుగ్గింజలు తెచ్చి ఉడకేసి ఉండకపోతుందా అనుకున్నాడు. పెళ్ళో బావి దగ్గరకు కాళ్ళూ చేతులూ కడుక్కోవడానికి పోతూ వసారాలోని పొయ్యి కేసి ఓరగా చూశాడు. బోర్లించిన కుండా చట్టీ బోర్లించినట్టే ఉన్నాయి. దిగులుతో, నిరాశతో కానుగుచెట్టు కింద నులక మంచం వాల్చుకుని పడుకున్నాడు. వసారాలో కోడలు, బిడ్డలు పడుకుని ఉన్నారు. కొడుకు ఇంట్లో లేడు. సందేళ దాకా చూసి పొద్దుండగానే పెదరెడ్డి కల్లాంకాడకి బయల్దేరాడు.

పెదరెడ్డికి ఈ రోజు కూటికి తక్కువైనా మానానికి, మర్యాదకి తక్కువ లేదు. పేదవాడైనా పేరుకి, ప్రతిష్టకి తక్కువ లేదు. ఈ రోజుటికీ పోలూరుకి 'పెదరెడ్డి' పెదరెడ్డే. తాతముత్తాతల నుంచి వారసత్వంగా లభించిన పరువు ప్రతిష్ఠలను పెదరెడ్డి కాపాడుకుంటూనే ఉన్నాడు. ఈ దినానికీ చెంగాళమ్మ జాతరకి తొలి పొటేలు పెదరెడ్డి ఇంటిముందు తెగాల్సిందే. మన్నారు స్వామి గుడిలో ముక్కోటి ఉత్సవానికి తొలి చందా పెదరెడ్డిదే. ఊళ్ళో ఒక తగువు వచ్చినా, ఒక తంటా వచ్చినా పెదరెడ్డి మద్దిస్తం చెయ్యాల్సిందే. పెదరెడ్డి మాటకు తిరుగులేదు.

దానధర్మాలకు పెదరెడ్డి కుటుంబం పెట్టింది పేరు. 'పోలూరు పెదరెడ్డి అరిచ్చెంద్రుడు గదా' అని ఈ చుట్టుపక్కల అంటారు. పెదరెడ్డి మంచితనాన్ని కీర్తించని వాళ్ళు లేరు. పెదరెడ్డి తాతకి రెండొందల ఎకరాల భూమి ఉండేదంటారు. ఆయన్ని కూడా పెదరెడ్డి అనేవాళ్ళు. తాత పేరు మనుమడికి పెట్టడం వాళ్ళ వంశాచారం. పెదరెడ్డి నాయన పేరు చినరెడ్డి. అదే పేరు కొడుక్కి పెట్టుకున్నాడు. పెదరెడ్డి తాతను గురించి ఇప్పటికీ ఊళ్ళో చెప్పుకుంటారు. ఆయన తవ్వించిన చెరువే ఊరికి ప్రాణం పోసిందంటారు. పెదరెడ్డి చెరువనే ఇప్పటికీ దాన్ని పిలుస్తారు. పెదరెడ్డి చిన్నతనంలో ఒకసారి ఊళ్ళో నీళ్ళ కరువు వచ్చింది. ఊరమ్మిడి బీళ్ళన్నీ సాగులోకి రావడంతో పెదరెడ్డి చెరువు నీళ్ళు సరిపోవడం లేదు. రైతులంతా చినరెడ్డే ఏదో ఒక ఆలోచన చెయ్యాలన్నారు.

చినరెడ్డి రెండో చెరువు తవ్వించే పని పెట్టుకున్నాడు. మంచి ఎండల కాలంలో పని. నాలుగడగులు తవ్వేటప్పటికి బండ పడిపోయింది. చినరెడ్డి పని సగంలో ఆగేదానికి లేదు. కడప నుంచి వడ్డోళ్ళు వచ్చారు. ఒకరా, ఇద్దరా? నూరు నూటయాభైమంది. పిల్లా జెల్లా, ముసలీ ముతకా వచ్చి దిగారు. మూడు నెలలు ఊళ్ళో తిరణాల మాదిరిగా ఉండేది. వడ్డోళ్ళకి కూడూ గుడ్డా, నీళ్ళూ నిప్పు అంతా చినరెడ్డి చూసుకోవలసిందే. ఎర్రటెండలో వడ్డోళ్ళు బండలు కొడుతూ ఉంటే వాళ్ళ ఒంట్లో నుంచి చెమట కాలవలు కట్టి పారేది. పొద్దు పడమటకి మళ్ళగానే పని ఆపేసేవాళ్ళు. టెంకాయకల్లు బానలు వచ్చి దిగేవి. తాగినంత కల్లు. నాలుగు రోజులకు ఒకసారి అయిదో ఆరో పొటేళ్ళు తెగేవి. చెరువు పని పూర్తయ్యేటప్పటికి చినరెడ్డి మందలో కాలు భాగం జీవాలు కూడా మిగల్లేదు. కూలి డబ్బుల మాట కాదు గానీ, చినరెడ్డి పెట్టిన తిండి గురించి, పోసిన కల్లు గురించి కడప పక్క వడ్డోళ్ళు ఈ రోజుటికీ చెప్పుకుంటారు. చినరెడ్డికి అదే సంతోషం. చినరెడ్డి చెరువు పూర్తయి పెదరెడ్డి చేతికి పెత్తనం వచ్చేటప్పటికి మిగిలింది పాతిక ఎకరాల నేల మాత్రమే. పెదరెడ్డి అందుకు చింతించలేదు. వంశపారం పర్యంగా వచ్చిన పేరు ప్రతిష్ఠలను కాపాడుకోవడానికి ఆయన చేయగలిగిందంతా చేస్తూనే ఉన్నాడు.

ఒకసారి కచ్చేరి స్కూళ్ళ వార్షికోత్సవం జరిగింది. డి.ఇ.ఒ. వచ్చాడు. వేదిక మీద పెదరెడ్డి కూడా కూర్చున్నాడు. పెదరెడ్డి లాంటి మంచి మనుషులున్న ఊళ్ళో స్కూలుకు సొంత బిల్డింగు లేకపోవడం అవమానమని, యాభై వేలు ఊళ్ళో వాళ్ళు పెట్టుకుంటే మిగతా మొత్తం గవర్నమెంటు ఇస్తుందని, బిల్డింగ్ కట్టుకోవచ్చని డి.ఇ.ఒ. చెప్పాడు. ఆ పనికి పెదరెడ్డి పూనుకుని యాభైవేలు వసూలు చేయాలని కోరాడు. ఒక మంచి పనికి పెదరెడ్డి ఇంకొకరి ముందు చేతులు చాస్తాడా! యాభైవేలు తనే కడ్తానన్నాడు. భవన నిర్మాణ బాధ్యత కూడా పెదరెడ్డి మీదే పెట్టారు, కాంట్రాక్టర్లయితే కట్టుబడి గట్టిగా ఉండదని, పెదరెడ్డి పనంటే మాటలు కాదు గదా! భవనం పూర్తయ్యేప్పటికి ఖర్చు రెండింతలైంది. చెరువుకింద నేల ఏడెకరాలు ముద్దురెడ్డికి అమ్మాల్సి వచ్చింది.

ఇంకొకసారి మన్నారుస్వామి గుడి గోపురం బాగా దెబ్బతినింది. గుడి కమిటీకి పెదరెడ్డి చైర్మన్. మాట పడకూడదు గదా! రిపేర్లు పెట్టుకున్నాడు. అయిదెకరాలు ఖాళీ. పెదరెడ్డి పనులకు చినరెడ్డి కూడా ఎప్పుడూ అడ్డు చెప్పి ఎరుగడు కానీ, కన్నతల్లి, తోడబుట్టిన తమ్ముడు చచ్చిపోయినప్పుడు మాత్రం గుండె కలుక్కుమనింది.

పెదరెడ్డికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. కూతుర్ని నెల్లూర్లో ఉద్యోగస్థుడికి ఇచ్చాడు. మానమర్యాదల మీద బతికే మనిషి కట్నకానుకలకు తక్కువ చేస్తాడా! పెళ్ళి వైభవంగా జరిపించాడు. నిన్న మొన్నటి దాకా కూతురూ, అల్లుడు, వాళ్ళ బిడ్డలు పోలూర్లో నెలకు వారం రోజులైనా గడిపే వాళ్ళు. ఆఖరి అయిదెకరాల నేల నాయుడుపేట బ్యాంకోళ్ళు జప్తు చేసినప్పటి నుంచి రాకపోకల్లేవు.

పెదరెడ్డి పెళ్ళాం మొగుడు మాట మీరిన మనిషి కాదు. ఇంటెడు చాకిరి నెత్తినేసుకుని పనోళ్ళని, పరాయోళ్ళని లేకుండా వండి వార్చి వడ్డించేది. సంసారమన్నాక సవాలక్ష సమస్య లుంటాయి. బతుకన్నాక బాధలు తప్పవు. ఇంటి కష్టాలు వీధిలో పెట్టేది కాదు. చినరెడ్డి పెళ్ళాంలాగా భర్తని నసపెట్టి ఎరుగదు. ఇంటిమీద నగా నట్రా మొత్తం దానధర్మాల కింద పోయినా, మొగుడ్ని నిలదీసిన మనిషి కాదు. చిన్నకొడుకు చచ్చిపోయిన నాడు కూడా మొగుడ్ని నిలదీసిన మనిషి కాదు. తన కర్మనే నిందించుకునింది. పెద్దకొడుకు సేద్యంలోకి దిగినా, చిన్నకొడుకు చదువు మానలేదు. ఇంటర్ పాసై బెంగుళూరులో ఇంజనీరింగ్ చదవాలన్నాడు. కొడుకు ఇంజనీరు అయితే పెదరెడ్డికి గొప్పే కదా! అయిదెకరాల నేల అమ్మి, లక్ష రూపాయలు డొనేషన్ కట్టి కాలేజీలో చేర్పించాడు. కాలేజీలో చేర్పించాడు గానీ కూటికీ, గుడ్డకీ అంత ఖర్చవుతుందని అనుకోలేదు. నెలకు ఆరేడొందలు పంపాల్సి వచ్చేది. రైతు నెల జీతగాడు కాదు గదా? ఫలితం చేతికొచ్చిన రోజుల్లో తప్ప డబ్బెక్కడ ఉంటుంది? ముద్దురెడ్డిని అడిగినపుడంతా కాదనకుండా అడిగినంత ఇచ్చేవాడు. మూడేళ్ళు గడిచాయి. అప్పు కొండంత అయింది. ఎన్ని పుట్లు వడ్లు పండితే ముద్దు రెడ్డి బాకీ తీరేది? మానం కాపాడుకోవాలంటే భూమి అమ్మక తప్పదు. ముద్దురెడ్డే అయిదెకరాలు కొన్నాడు.

నాలుగో ఏడు చిన్న కొడుక్కి డబ్బు పంపడం కష్టమైంది. వానల్లేక సగం పంట కూడా చేతికి రాలేదు. బాకీలకే అది చాల్లేదు. మిగిలిన మూడెకరాలు అడుమానంలో ఉంది. కొత్తగా అప్పు ఎవర్నని అడుగుతాడు? కొడుక్కి డబ్బు పంపి మూడు నెలలయింది. జాబుల మీద జాబులు వస్తున్నాయి.

ఫీజు కట్టలేదని హాస్టల్లో పేరు తీసేయడంతో పెదరెడ్డి కొడుక్కి అవమానం అయిపోయింది. హాస్టల్ రూంలో ఫ్యానుకి ఉరేసుకుని చచ్చిపోయాడు.

బెంగుళూరు నుంచి ఇంజనీరై వస్తాడనుకున్న కొడుకు పీనిగై ఇల్లు చేరడంతో తల్లి తట్టుకోలేకపోయింది. ఆ దిగులు దిగులు ఆమెను వెంటబెట్టుకునే పోయింది.

పెళ్ళాం శవం నడింట్లో ఉన్న రోజున పెదరెడ్డి చేతిలో చిల్లిగవ్వ లేదు. ముద్దురెడ్డి ముందుకు వచ్చి ఆదుకున్నాడు. కర్మ ఘనంగా జరిగింది. తల గొరుగులకి రెండు పొటేళ్ళు తెగాయి. పెదరెడ్డి ఇంట్లో కార్యమంటే మాటలు కాదుగదా!

ఇంక మిగిలిన మూడెకరాల నేలమీది ఫలితమే పెదరెడ్డి కుటుంబానికి ఆధారం అయింది. అయినా, ఊళ్ళో మంచిచెడ్డలకి పెదరెడ్డి ముందుంటూనే ఉన్నాడు.

ఇంటి బాధ్యత కోడలి మీద పడింది. పెళ్ళాం పెదవి దాటేది కాదు గానీ, కోడలిది ఒకటే నస. బాకీ కట్టి కక్కాలంటూ నాయుడుపేట బ్యాంకోళ్ళు వచ్చి నెత్తిన కూర్చున్నారు. మిగిలిన నేల కూడా పోయింది.

పెదరెడ్డికిపుడు భూములు, బావుల్లేవు.

ముద్దురెడ్డి సలహా ఇచ్చాడు "పెదన్నా, నువు మా నాయినలాంటోడివి. నీది పెద్ద చెయ్యి నా సేద్యమంతా నీ చేతిమీదే జరగనీ. పంట చేతికందినాక తిండిగింజలకి లోటు లేకుండా ఇంటికి చేరస్తా. నీ కొడుకుని యాడైనా రెండెకరాలు కోరిక్కి జేసుకోమను. దిగులుండదు."

ఎదురు చెప్పడానికేముంది? సమితి రాజకీయాల్లో తీరిక లేని ముద్దురెడ్డికి భూములు, బావులు చూచుకోవడానికి పెదరెడ్డికన్నా మంచి మనిషి ఎక్కడ దొరుకుతాడు?

పెదరెడ్డి చేతి కింద సేద్యం అంటే పనుల కాలంలో మనుషులకి కొదవ ఉండదు. పంటల కాలంలో కల్లాం మీద ఈగయినా వాలదు. ఎన్ని వేలు పోస్తే మటుకు ఇంత మంచి సేద్యగాడు ముద్దురెడ్డికి దొరుకుతాడు?

అయినా, పెదరెడ్డిని సేద్యగాడుగా ముద్దురెడ్డి గానీ, ఊళ్ళో వాళ్ళు గానీ ఏనాడూ చూడరు. ఆయన మంచితనాన్ని మన్నించేవాళ్ళే కానీ, తాత త్రండుల మాదిరిగా తన పేరు నిలిచిపోయే పనేదీ చెయ్యలేక పోయానే అనేది పెదరెడ్డి దిగులంతా.

గత కాలపు ఆలోచనలతో మగతగా ఉన్న పెదరెడ్డి ఏదో అలికిడికి కళ్ళు తెరిచాడు. వడ్లు కలబెడుతున్నట్లు కసకస శబ్దం వినడింది. పొన్నుకర్ర అందుకుని లేచి కూర్చున్నాడు. వడ్ల కుప్ప వెనుక కదలిక తెలుస్తోంది. చెప్పులు వేసుకోకుండా నెమ్మదిగా నడిచాడు.

గోతాం సంచిలోకి ఎవరో వడ్లు తోడుకుంటున్నారు. పెదరెడ్డి వొంట్లో నెత్తురు వేడెక్కింది. కోపంతో ఒళ్లు బిగుసుకునింది. కొత్త శక్తి ఏదో శరీరంలోకి ప్రవేశించినట్లయింది. పొన్నుకర్రను చేతివేళ్ళు ఒడిసిపట్టుకున్నాయి. అమాంతం దొంగ మీద పడి పట్టుకున్నాడు.

పెనగులాటలో దొంగ వెనుతిరిగి చూశాడు.

పెదరెడ్డి నివ్వెరపోయాడు. ఒంట్లోని నెత్తురంతా హఠాత్తుగా హరించుకుపోయినట్లయింది. ఒళ్ళు చల్లబడిపోయింది. పొన్నుకర్ర జారి నేలమీద పడింది. ముడతలు పడ్డ ముఖం చిగురుటాకులా వణకడం మసక వెన్నెలలోనూ స్పష్టంగా కనిపించింది.

అతి కష్టం మీద పెదరెడ్డి పెదాలు కదిపాడు.

"చిన్నోడా" అన్నాడు, అంతకు మించి ఇంకొక్క మాట కూడా మాట్లాడే శక్తి లేనట్టు. ఆ ఒక్క మాటలోనే నమ్మలేనితనము. అవమానము ధ్వనించాయి.

"రాజమ్మ చెప్పింది. బిడ్డలు... ఆకిలి..." అని చినరెడ్డి అన్నాడు. తప్పు చేసినతనం, భయం చినరెడ్డి మాటల్ని మింగేశాయి. అయినా, పెదరెడ్డికి అంతా అర్థమయింది. రోషం, కోపం తన్నుకు వచ్చాయి. చివుక్కున లేచి చినరెడ్డిని ఒక్క తోపు తోశాడు.

"ఆడదాని మాటిని ఈ పాపిష్టి పనికొచ్చావా? ఎంత అప్రెదిష్ట? పెదరెడ్డి ఇంట బుట్టి మానం చెడ్డపని జేస్తావా? మీ తాత ముత్తాతల కాలం నుంచీ ఒక మచ్చ ఎరుగుదుమా, ఒక

మాట పడుదుమా? నిప్పంటి వంశంలో పుట్టి నీతి మాలిన పని జేస్తావా? ఒక్క పూట పస్తుండలేకపోయినా వంటరా యెదవా! వందల ఎకరాలు పోయినా, నీ తాత ముత్తాతలు ఎంటికితో సమానం అనుకున్నారే. నీమాదిరి మానం తప్పినారం(డ్రా" అన్నాడు పెదరెడ్డి.

"నాయినా, నేను జెప్పేదినూ. పెదమ్మి శోషొచ్చి పడిపోయింది. చినమ్మి సందేళ నుంచి ఒకటే ఏడుపు. బిడ్డల బాధ కళ్ళ జూళ్ళేక వొచ్చినా. నాలుగ్గింజలు తీసకబోతా. రాజమ్మ దంచి ఉడకేసి బిడ్డకన్నా బెడ్తాది."

చినరెడ్డి మాటలకు పెదరెడ్డి కొంత కరిగాడు.

"రే చిన్నోడా, ఏమన్నా మానంగా మాట్లాడ్తుండావా నువ్వు! ఎవురైనా జూస్తే ఇంకేమన్నా వుండాదా! పరువూ మర్రేదా ఈ ఒక్క దినంలో చెరువులో కలవదా! మనిషన్నోడికి కడుపే కైలాసం గాదు. మాట, మంచి, మర్రేద ఉండాలి. నా మాటిని ఇంటికి బో. తెల్లారి యాడ్నో ఒక దెగ్గిర నేనే నాలుగ్గింజలు తెస్తా" అని అనునయంగా చెప్పాడు.

చినరెడ్డి వినలేదు.

"నాయినా, నా మాటిను. జరుగు. బిడ్డలు ఆకిలితో అల్లాడతా ఉండారు. నాలుగ్గింజలే గదా! పెదరెడ్డి కూట్నీళ్ళకు కొట్టేసిన మన బూమి పలితమే గదా ఇది" అని గోతాం నెత్తికెత్తుకున్నాడు.

పెదరెడ్డి ఆగ్రహంతో చినరెడ్డి నెత్తిమీద మూటని ఒడిసి పట్టుకుని అరిచాడు.

'రే చిన్నోడా! నీకీ పూట దెయ్యిం బట్టింది. నీతో మాట గాదు. మర్రేదగా మూట కింద పారేసి పో" అని మూట లాక్కునే ప్రయత్నం చేశాడు.

పెదరెడ్డికి, చినరెడ్డికి మధ్య పెనగులాట జరిగింది. పెదరెడ్డి ఆగ్రహంతో రొప్పుతున్నాడు. ఆవేశంతో ఆయన శరీరం వణకిపోతూ ఉంది. పిల్లల్ని కాపాడుకోవడానికి గద్దతో పోట్లాటకి సిద్ధమైన తల్లికోడిలా ఉన్నాడు.

ఎర్రబారిన పెదరెడ్డి కళ్ళలోని పట్టుదలను చూశాడు చినరెడ్డి. నెత్తిమీద మూటను విసిరి నేలకేసి కొట్టాడు.

తండ్రివైపు తిరిగి 'థుపూ'మని ముఖాన కేకరించి ఉమ్మేసి ఊరివైపు పరుగెత్తాడు.

మసక వెన్నెలలో కోతలు పూర్తయిన వరిపొలాల మీద పడి పరుగెత్తుతున్న చినరెడ్డికి, "ఒరే కొడకల్లారా... నేను మంచోణ్ణి గాదురా. నాకు మానం, మర్రేదా వొద్దురా" అని గొంతు పగిలేలా అరవాలనిపించింది. కానీ, మాట పెగలి పెదవి దాటి రాలేదు.

✡

# కొత్త జూదం

**–డా॥ వి.ఆర్.రాసాని**

"ఇసయం తెలుసుకోని బిరీన యింటికి రారా అంటే వీడింకా రాలా... ఆడ ఏం జరిగిందో ఏమొ?"

వీధిలో ఇంటి ముందర కూర్చొని బాటవైపు చూస్తూ అసహనంగా అనుకున్నాడు నరసప్ప.

ఆ మాట యిప్పటికి లెక్కలేనన్నిసార్లు అనుకోనుంటాడు. వేసవి కాలం కావడంతో ఎండ తాకిడికి గాలి జ్వరం పడినట్టు వెచ్చగా వీస్తోంది. కొలిమిలో కాలి చల్లబడుతున్న ఇనుప ముక్కలా... భూమి కూడా వేడిగానే వుంది.

జనసంచారం లేని వీధి బిశాంబరంగా కనిపిస్తోంది.

గడపకవతలున్న హాలులో కొందరు పిల్లలు కూర్చొని వైకుంఠపాళీ ఆడుకుంటున్నారు.

"మ్మే. నాకు దాయం పడింది. నా కాయ కదిలింది" తన కూతురు ఏడేళ్ల కోకిల దాయాల్ని నేలపైన విసురుతూ, తోటిపిల్లల్లో ఉత్సాహంగా ఆడుకుంటుంటే అటువైపు చూపు మరల్చాడతను.

పిల్లలమధ్య పాములా నిచ్చెనలతో కూడిన వైకుంఠపాళీ చిత్రపటం అతనికి స్పష్టంగా కనిపించసాగింది.

"నాకు ఆరు పడింది. నా కాయ పెద్ద పామును తప్పించుకోని నిచ్చెనెక్కి పైవరసలోకి పోయింది".

పక్కింటి పరమేశం కొడుకు రమేశం రెండు మోకాళ్ల మీద గొంతుక్కూర్చొని కేరింతలు కొడుతూ ఆడుతున్నాడు.

"నా జీవితం కూడా ఈ పాముా నిచ్చెనలాట మాద్రిరై పోయిండాది. నా కూతురికి పోటీ ఆట ఆడుతున్న రమేశం మాదిరే నాకు యిప్పటి సర్పంచ్ గరడారెడ్డి, మా యిద్దరికీ ఆట మొదులై శ్యానా ఏండ్లే అయింది. పల్లెలో ముప్పయిండ్లోళ్లు తన కులపోళ్లుంటే ఇరవై

యిండ్లోళ్లు రెడ్లు. పదిండ్లోళ్లు కురవోళ్లు యింకో పదిండ్లోళ్లు గొల్లోళ్లుండారు. మూడిండ్లోళ్లు కమసలోళ్లు... అయిదారు కుటుంబాలోళ్లు బోయోళ్లుండారు. ఇరవై ఏండ్ల ముందు వరకూ అందరూ అన్నదమ్ములు మాదిరి వరసలు పెట్టుకోని పిలుసు కుంటూ, ఒకరిపనుల్లో ఒగరు సాకరించుకుంటూ వుండ్రి. అప్పట్లో ఊరినిండా పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు దండిగా వుండె. సేద్యాలూ పుంజిగానే వుండె. చుట్టుపక్కల బావులనిండా నీళ్లు తొణుకులేస్తావుండె. చెరువుల, కుంటలకింద ఇరుగారూ మడి సేద్యాలు సాగతావుండె. వానలూ లెక్కాశారంగా పడతావుండె. కానీ.. రాను రాను వానలు తగ్గిపాయ. బావులెండిపోబట్టె. వరుపుమీద వరపులు, ఈడ్చి ఈడ్చి కొడతావుండె. ఆ తాకిడికి గొడ్లు, గొర్రెలు, మేకలు ఊర్లో కనిపించకుండాపాయ. చేసేదానికి పనుల్లే. సేద్యాలకు నీళ్లులే. ఇట్టాంటి పరిస్థితిలో తెలుగుదేశం పార్టీబుట్టె. సుబ్బారెడ్డి కొడుకు గరడారెడ్డి ముందుట్నుంచీ వున్న కాంగ్రెస్ పార్టీలోనే వుండిపాయ. కానీ తెలుగుదేశం పార్టీవోళ్లు మా నాయన్ను ఒట్టేసిరి. ఊరు రెండుగా సీలిపాయ. ఎలక్సన్లు రానేవచ్చా. ఎన్నో యేండ్లనించీ రాజ్జెం జేస్తావున్న కాంగ్రెసు వోడిపోయి తెలుగుదేశం పార్టీ గెలిసె. ఆ సంవత్సరమే వచ్చిపడిన సర్పంచ్ ఎలక్సన్లో.. గరడారెడ్డి వోడిపాయ. మా నాయన సర్పంచాయె. ఇంక సూడు అన్నిట్లోనూ యిద్దరికీ పోటీనే..."

"ఆ నా కాయె నిచ్చెనెక్కేశ.." కూతురు గట్టిగా అరిచింది. పిల్లలు వేస్తున్న దాయాల చప్పుడు సఱ్రుసఱ్రున వినిపిస్తోంది. అయినా అతని కదేదీ వినిపించడం లేదు.

"ఈ ముండాకొడుకు శంకరగాడు.. యింకా రాలే. యింకా ఎంతసేపు వోడికోసం సూడాల.."

అనుకుని తిరిగి అతను బాటవైపు చూశాడు. బాటలోకి మలుపు తిరిగేచోట ఎవరో వస్తున్నారు. "శంకరంగాడేనా.." అనుకుని పరిశీలనగా చూశాడు. అతను కాదు.. బుచ్చయ్యకొడుకు పాలేటి... సంతకుబోయి.. ఏదో సంచి చేతబట్టుకొని వస్తున్నాడు.

తిరిగి అతని ఆలోచనలు తల నరాలను లాగసాగాయి.

"సొసైటీలో లోన్లు దీసి ఎండిపోయిన బాయిలో బోరింగేయిస్తి. నిండా నీళ్లు బడె. బీడు బడిన భూములు పచ్చగిల్లె. కింద పడుతుందనుకున్న సంసారం మల్లా తేరుకుండె. అది జూసి గరడారెడ్డి ఆయన బాయిలో బోరింగేశ. కానీ నీళ్లు బడలా. చేతిలో సిలుం వదిలిపాయ. అయినా వోడు శరత్తు మనిసి గదా. అప్పో సొప్పో దెచ్చి మిట్టసేన్లో బోరింగేయించె. ఓ నాలుగొందలడుగులు దిగినాంక... కీనీరుబడె. మిసను బిగించకనే పైపులో నీళ్లు తన్నకొచ్చె. దాంతో ఆయప్ప మిట్టసేన్లతోబాటు మడిసేద్యాలూ పయిర్లొకొచ్చె. కానీ ఆ నీళ్లు ఎన్నో దినాలు నిలవలే.

మమ్మల జూసుకోని సుట్ట పక్కలోళ్లంతా పోటీలుబడి బోరింగులు దెప్పించి ఏడెనిమి దొందలడుగుల లోతుదాకా భూమిని తూట్లు తూట్లుగా పొడిచి నీళ్లు తోడబట్రి. దాంతో అన్ని బోరింగులు బిగసకపాయ. పరిస్థితి యింకా దిగజారిపాయ".

"అయ్యో నా కాయెను పాముమింగేశ.." కాయను జరిపిన పరమేశం కేకేశాడు.

"ఏమ్మామా.. టవున్లో వొగే సంబరంగా వుండాది. నువ్వేమొ యీడ గొమ్మున కూసు న్నావు?" అప్పుడే అక్కడికి వచ్చిన పాలేటి పలుకరించాడు.

"ఏమి సంబరం నా కొండె" అన్నాడు నరసప్ప.

"నాయకుల సంబడం". కాస్తా వెటకారంగా అన్నాడు పాలేటి.

అతను దేన్ని గురించి అంటున్నాడో నరసప్పకు అర్థమైపోయింది. దాంతో అతని మనసులో వున్న ఆందోళన యింకాస్తా ఎక్కువైంది.

"అది సరే, శంకరగోడు కనిపించినా.." అడిగాడు.

"లేదు మామా.." అని తన యింటివైపుకు నడిచి వెళ్లిపోయాడు పాలేటి.

"అయ్యో, నన్ను గూడా పాము మింగెనే" కోకిల గొంతు విచారంగా వినిపించింది.

మళ్లీ అతను ఆలోచనల్లో మునిగిపోయాడు.

"వుండేనీళ్లలో చేబదుళ్లు దెచ్చి నేలంతా సెరుకిత్తనం నాటితే, అది నిలువెత్తు పెరిగి నాంకా, బోరు ఎండిపాయ. నీళ్లు లేక తోటంతా ఎండిపాయ. చేబదుళ్లు నిల్చిపాయ.

గరడారెడ్డి తెలివిగా, వుండే నీళ్లలో టామాటాలేసుకోని నెగ్గకొచ్చి నిలదొక్కుకుండె. ఈ మాదిరిగా నేను ఎలిసేద్దెంలో వొగిటేస్తే, ఆయప్ప యింకొగటేశ. అదున్లో ఆయప్ప వొగిటేస్తే, నేనింకొగటేస్తా వస్తి. ఈ పోటీలో వొగతూరి ఆయప్ప పైకొస్తే, నేను కిందికి పోతావుంటి. నేను పైకొస్తే ఆయప్పది కిందవతావుండె. కొన్ని దినాలకు ఆమాత్రం గూడా నీళ్లు లేక బోర్లు ఆరకపాయ. ఈ మాదిరిగా సేద్దెంపైన ఎంత పెట్టుబడి పెట్టినా నష్టమే గానీ బావుకునిందేమీ లేకపాయ. మా యిద్దరి పరిస్థితే అట్టుంటే యింక ఊర్లోవోళ్ల సంగతి సెప్పేదేముండాది.. జనాలకు తిండికీ గుడ్డకే కష్టమైపోబట్టె.

చేసేదానికి పనుల్లేకపాయ. సరైన తిండీ లేకపాయ. యింకేంజేస్తారు.. రాజకీయాలు మాట్లాడుకునేదానికి మళ్లుకుండ్రి. మనుషులకు పనులకు బదులుగా రాజకీయా లెక్కువైపాయ.

మంత్రులు ముఖ్యమంత్రుల సుట్టూ ఎమ్మెల్యేలు మంత్రులసుట్టూ తిరిగినట్టే, ఎమ్మెల్యే సుట్టకారం సిన్న సిన్న రాజకీయ నాయకులు తిరగబట్రి. ఈ సిన్న నాయకుల సుట్టూ కార్యకర్తలు తిరగబట్టి పల్లెల్లో మొల్తాడుగట్టిన ప్రతివోడూ ఏదో వొకపార్టీకి కార్యకర్తగా మారి పోబట్టె. సేద్దెం జేసుకోని బతకాల్సిన మనషులకు రాజకీయాలే సేద్దెమైపాయ.

ఆ మాదిరిగా తిరిగే కొందరికి ఊర్లో గరడారెడ్డి నాయకుడైపాయ. మరి నాకు మాత్రం మొనుసెట్లా ఊరుకో వుంటుంది? నన్ను చేరదీసే నాయకులు నాకూ వుండిపోయిరి. ఊర్లో

నేనూ కొందర్ని సేర్చుకుంటి. అట్ల గరడారెడ్డీ, ఇట్ల నేనూ మా నాయకుల కొమ్ము కాస్తా వోళ్ల తరపున ఏవేవో చిన్న చిన్న రోడ్డు పన్లు గట్రా చేయించుకుంటా నెట్టకొస్తా వుండాము.. వోళ్ల మీటింగులకు మనుషుల్ను తీసకపోతావస్తా వుండాము. వచ్చే ఎలక్సన్లో ఏదో వొగిటిస్తారని ఆశ.. అందుకోసం సేద్దెంలో పెట్టాల్సిన దుడ్లు రాజకీయాల్లో శలవ చేయాల్సి వస్తావుండాది.

ఇది ఎం.పి.టీ.సీ. ఎలక్సన్ల టైం. ఇక్కడ ఎం.పి.టీ.సీ. సీటు ఎనకబడినోళ్లకు రిజర్వేసను. అందునా లేడీసు రిజర్వేసను..

నెలనించీ అడగతావుంటే.. ఆ ఎంఎల్యే పొద్దన సెప్పినాడు. నీ బారీని నిలబెట్రాని. మరి గరడారెడ్డీ వోళ్ల నాయకుల సుట్టూ తిరగతావుండాడు. వోడెవరికిప్పిస్తాడో ఏమొ. మా కులపోళ్లకు గాకుండా వేరే ఎవురికిప్పిచ్చినా ఎట్లో వొగట్ల నెట్టకరావచ్చు. అట్లగాదని మా కులంలోనే యింకెవర్నన్నా నిలబెడితే కష్టం. వోడు నాగయ్య, వోడి పెండ్లాంకోసరం గరడారెడ్డి సుట్టూ తిరగతావుండాడు. వోడికి నామీద దాయాది మచ్చరం.. అది తెలసకరారా అనే శంకరగోన్ని టవునికి పంపినా, వోడేమో యింకా రాలా. నామినేషను డేటొచ్చే లోపల సాటికులస్తుల్ని, పార్టీవోళ్లను సరిచేసుకోవాల.. కుల పెద్ద బుచ్చయ్య మామను ముందుగానే దార్లో పెట్టుకోవాల. ఇంక ఊర్లో ఆయప్పేగదా నాకు కుడిచెయ్యి".

ఆలోచిస్తానే అరుగుమీదనుంచీ పైకిలేచి బుచ్చయ్య యింటివైపు నడిచాడు నరసప్ప.

నరసప్ప బుచ్చయ్యింట్లో అడుగు పెట్టేటప్పటికి, బుచ్చయ్య, యింకొందరు బారాకట్ట గీసి వున్న చెక్కపీటను మధ్యలో వేసుకుని దాయాలాడుకుంటున్నారు.

"ముందే పనీపాటా లేదు. పైగా ఎండాకాలం.. అందుకే జనాలు మేకాపులి మీదో, బారాకట్ట మీదో మోజు పెంచుకున్నారు"

అనుకుంటూ "ఏమ్మామ్మా! అందురూ వొగసోట కూసోని దాయాలాడుకుంటా వుండారు" పలుకరించాడు నరసప్ప.

"పనేముండాదిరా, పొద్దు పోవద్దా... రా రా కూసో" ఆహ్వానించాడు బుచ్చయ్య.

పాలేటి అప్పటికే.. కాళ్లూ చేతులూ కడుక్కొచ్చి ఆ కొటానికవతలున్న చుట్టింట్లో.. నీళ్లు తాగుతున్నాడు.

"ఏమన్నో, వదినకు ఎం.పీ.టీ.సీ. కోసం తిరగతావుంటివే. ఏమాయ" దాయాలాడు తూనే అడిగాడు పక్కింటి రంగనాథం.

"అది చెబుదామనే వస్తిరాబ్బా. మీ వదినకు సీటొస్తే మీరంతా కట్టుగా పని చేస్తారా?" ప్రశ్నించాడు నరసప్ప.

"ఎందుకు సెయ్యమన్నా. మన కులపోళ్లంతా నీ తట్టేగదా".

బుచ్చయ్య తిప్పుతున్న కాయల్ని చూస్తూ అన్నాడు రంగనాథం.

"అది అడగదామనే మామ దెగ్గిరికొస్తి" అన్నాడు నరసప్ప.

"నేనేం జెయ్యాల్రా అల్లుడా?" తల పైకెత్తి అడిగాడు బుచ్చయ్య.

"మనోళ్లందర్నీ నువ్వు మన పక్కకు కూడగట్టుకోవాల మామా. ఎట్టయినా నువ్వు కులపెద్దవి గదా... ఆ పని నీ వల్లానే ఆవుతుంది."

"అట్లేగానీ.. నీ భారీ తప్పో, మన కులంలో మాత్రం ఎంపీటీసీకి తగినోళ్లెవురుండారు సెప్పు.." దాయాల్ని చేతుల్లోకి తీసుకుంటూ అన్నాడు బుచ్చయ్య.

"యింతకీ అక్కకు సీటిచ్చినారా లేదా సెప్పు మామా" అప్పుడే యింట్లోనుంచీ కొట్టం లోకొస్తూ అడిగాడు పాలేటి.

"ఇచ్చినారబ్బా.. అది సెప్పేదానికే గదా నేనొచ్చింది".

"మంచిమాట సెప్పినావన్నా..." పైకి లేచి అభినందనంగా చేయి పట్టుకొని వూపుతూ చెప్పాడు రంగనాథం.

"ఎట్లయినా సరే. అక్కను గెలిపించుకోవాల మామా" అన్నాడు పాలేటి.

"ఆ పార్టీవోళ్లు ఎవుర్ని నిలబెట్నారంట" అడిగాడు బుచ్చయ్య.

"నాగయ్య వోడి భారీ కోసరం గరడారెడ్డి ఎనకింటీ తిరగతావుండాడంట".

"వోళ్లకిస్తే మనకు కష్టమేనే..." పాలేటన్నాడు.

"మీరిద్దురూ రాజీబడగూడదా" రంగనాథం అన్నాడు.

"వాడేమింటాడు, యినకనే గదా.. వోళ్లెనికింటి తిరగతావుండాడు"

"యింతకీ వోళ్లకు సీటిస్తారా?" ఆతృతగా ప్రశ్నించాడు పాలేటి.

"అది తెలసక రమ్మని శంకరగోన్ని టవునుకు పంపించినా, వోడింకా రాలా" అన్నాడు నరసప్ప.

"మనోళ్లను గాకుండా వేరేవాళ్లను పోటీగా నిలబెడితే వదిన ఈజీగా గెలిసిపోతుంది" తనలో తను గొణుక్కున్నట్టన్నాడు రంగనాథం.

ఆడుతున్న దాయాలాటను ఆపి అలా మాట్లాడుకుంటున్నప్పుడే ఆయాస పడిపోతూ అక్కడికొచ్చాడు శంకరయ్య.

"అద్దో. మీ బామర్ది వచ్చా.." అన్నాడు పాలేటి.

"ఏమిరా శంకరా సంగతీ" ఆతృతగా అడిగినాడు నరసప్ప.

"నీకోసం యింటికి పోయింటి బావా.. నువ్వీడుండావని మాయక్క సెప్తే యిట్లొస్తి" తెపరాయించుకుంటూ అన్నాడు శంకరయ్య.

"ఇంతకీ విషయం సెప్పురా నీ యిత్తగిల్ల" అన్నాడు బుచ్చయ్య.

"నాగయ్య భారీకి సీటిచ్చినారా?" అడిగాడు రంగనాథం.

"యివ్వలేదు".

"యింకెవరికిచ్చినారు" అడిగాడు పాలేటి.

"నాగయ్య మరదలికిచ్చినారు" నింపాదిగా చెప్పాడు శంకరయ్య. ఆ మాట వినగానే గుండెల్లో రాయిపడ్డట్టయింది నరసప్పకు.

"యిద్దరూ మన కులపోళ్లే అయితే యిప్పుడేం జేయాల" అనుకుంటూ మళ్లీ బారాకట్ట దగ్గర కూర్చున్నాడు రంగనాథం.

"మనకు మనకు టగ్గాపోరయిపాయ పో" అంటూ పాలేటి చుట్టింట్లోకి వెళ్లిపోయాడు.

"నువ్వేం భయపడొద్దులేన్నా.. బాగా కష్టపడితే నెగ్గకొస్తాం గానీ" బరోసాగా అన్నాడు దాయాల్ని చేతుల్లోకి తీసుకుంటూ రంగనాథం.

"రేపు నిదానంగా యోచిద్దాంలే, పదరా నరసా" అన్నాడు బుచ్చయ్య.

"నాయకులందరూ జేరి మాకు మాకే బెట్రిపో" మనసులోనే అనుకుంటూ వీధిలోకి నడిచాడు నరసప్ప.

ఇత్తలితో చేసిన దాయాలు నేలపైన దొర్లిన శబ్దం అతని చెవులకు సోకుతూనే వుంది..

అక్కడ... అంతవరకూ ఆగిపోయిన దాయాలాట తిరిగి ప్రారంభమైంది.

✡

# వారసత్వం

**–పండిత అ.నరసింహశర్మ**

పొలం దమ్ముపట్టి సొమ్మసిల్లిపోతూ పోలిగోడు, గుడిసెకొచ్చాడు. చీదరాగా వుంది. వొస్తూనే నీళ్లు పోసుకుంటానన్నాడు. ఎండలో కడవపెట్టి, వెచ్చచేసిన నీళ్లు కొబ్బరి డోకితో అసిరిపోస్తూ ఉంటే పోలిగాడు వొళ్ళు రుద్దుకుంటున్నాడు.

"ఇంత పొద్దు పోనాదేం?" అంది అసిరి.

"పని రోజుల్లో ఏళసూస్తే ఔతాదా?" అన్నాడు పోలిగాడు.

"ఎవడైనా పొంగిస్తే చాలు నీకు మరీ వొళ్లు తెల్దు"

"నాయుడోరి వొరకట్టు నొల్లతోలి గట్టోర్చెన్న. గొట్టవేళాది. సదును తోలి, కొటేరేసి, తోల్తెచ్చి పోతులరాటకి కట్టెన్ను. నాయుడంబలి తిని వొచ్చెండు. పన్నేకపోతే బాపన ఈది ఎళ్లమంటారు కాని ఈనాయుళ్లేటి తక్కువ? యజమానిపోడు ఎవుడైనా సేస్తే సెప్పడానికి ఇసగరు! నాయుడోడంటాడూ – పశువులు కట్టుకొయ్య నలాగుండిపోనాయి – గడ్డీనేదు ఏటీ నేదు – సూడూగవరయ్య సంతకెళ్లెండు ఆళ్లగడ్డి గూడేని కెళ్లి కసిన్ని పరకలూర్పుకొని ఆటికి దులుపు– అని పురమాయించేడు! నా నన్నానూ – అదేటయ్యా అలపింటి పనులు సెపతావు? కడియమెట్టుకొని పెద్దనాయుడివి. పదిగరిసెలు పండినా – ఆళ్లగడ్డి గూడేనికెళ్లి – దొంగతనం సెయ్యమంటావూ! సిన్నకాపు మాలోడికి సెప్పినట్టు నాకు సెప్పుతావూ? అడైతే ఎగ్గనేక సేసీవూడు. నావల్లకాదన్నాను. అని వెనకట్టి రాబోమంటే పోతులు జాపోస్తూ, నాకాసి కళ్లెట్టి, సెవులు రిక్కించి సూస్తున్నాయి. దమ్ము పట్టి పొలం పెల్లగించినాయా? ఈ ఏళ వరకూ పనిచేసి అవి ఉసూరుమంటే నాకేటి తిండెళతాది? మనసు దిటం సేసి గూడేనికెళ్లి పరకలు దొంగతనమేసి పశువులకాడ దులిపెన్ను. ఇలా గొస్తున్న, బాఁవేడి?" అని అన్నాడు పోలిగాడు. వాడికి పెద్ద కొడుకు మీదికి మనసు పోయింది.

"కజ్జెం కోమటిచ్చెండు. బావులిద్దరు అత్తల తింతున్నారు" అని ఆసిరి చెప్పింది. "నన్నంతావు కొడుక్కి కజ్జమెటితేసాలు కోయిఁటింటి నౌకిరంతా సేస్తావు".

అసిరి ఇంటి సంగతి చెపదామనుకొంది కాని వొళ్ళు రుద్దేటప్పుడు తిరుగుతూన్న కండరాల్ని చూస్తూ చెప్పవలసింది మరిచిపోయింది. నీళ్ళ పోతై వొళ్లు వొత్తుకుని పోలిగాడు గుడిసెలో దూరేడు.

"అయ్యా కజ్జం" అని పిల్లలు గోల చేస్తున్నారు. పెద్దవాడికి ఆరేళ్లు దాటాయి. చిన్నవాడికి నాలుగేళ్ళు దాటాయి. పోలిగాడు లచ్చుం నాయుడు వద్ద కాపువాడు. సాలుకి పాలకొండ పడిని పదమూడు పుట్లు జీతం. అసిరి కోమటప్పన్న దొడ్డితోపాటు కూలీ నాలీ చేసుకుంటూ సంసారం ఎత్తుతున్నాది.

అసిరికి జ్ఞాపకం వచ్చింది. "మావాఁ" అని మొగుణ్ణి పిలిచింది. పోలిగాడు పలికేడు. కాని అసిరి చెప్పడానికి సిగ్గు పడ్డాది.

"ఏటా బిడియం? ఏటి సెబుదూ?" అన్నాడు పోలిగాడు.

"పత్తేనికి పాతవడ్లు నాయుణ్ణి అడగవా?" అన్నది.

"వోలదే నీ ఆలోచన ఎప్పటికి కావాలేటి?"

"పంచాంగం బుగత అమాసకి పురుడొస్తాదని లెక్క ఏసెండు."

"నాయుడికాడ మరి మాట సెల్లదు ఊదలూ, ఆళ్ళూ, సోళ్ళూ అన్నీ మొత్తం ఎనిమిది పుట్లు ఇచ్చెండు."

"కోయిఁటాడికాడ అప్పు పెరుగుతుంది. మరేటి సేస్తావు?"

"ఏటి? అప్పా? ఎంతున్నాదేటి?"

"పెద్దోడు కాయిలాపడితే అమ్మవారికి కోక మొక్కెన్ను. అప్పుడు ఫాయిదాకి ఐదు రూపాయలు తెచ్చేన్ను. నిరుడీ ఎడల, మీ మావఁ పెళ్ళి కావిడట్టినప్పుడు పందుం గింజలు లాగుకి తెచ్చెన్ను. మీ అమ్మకి అప్పుడు కోక కొన్నావు గావా? దానికి ఐదు రూపాయలు వొడ్డీకి తెచ్చెన్ను. ఇంత బెల్లము, సింతపిక్క, ఉప్పుగల్లు, బుడ్డికి కిరసనూనె, ఇలపింటి ఇసే బివ్వాల, ఏటో నీయవ్వారం? నాకేటితెల్దు! ఇంత అద్దోన్నమా? నాకు కోకైనా లేదు. వానపడితే శాన గుడిసంతా వొరదే!"

"ఓ లేటాసింత? కూలి ఆడితే కుండాడదా? మన బాబు పెద్దాడైనాడు గదా? అప్పులడుగంటుతాయినే. మొన్న పొట్టి నచ్చాయే మూడు పుట్లిస్తాను, గొడ్లు తిరగ్గొడ్డాని కుంచమన్నాడు. ఏమైనా పై మాటొస్తే ఎవడి కాడైనా ఉంచి గిజలొట్టుకురా" అని పోలిగాడు చెప్పేడు.

ఇల్లు సవరించి కోమటి దొడ్డికి వెళ్లింది అసిరి. కోమటిల్లంతా దుమ్ముతోటుంది.

“శా, పెద్దోళ్ళంటారు. ఇల్లు సుబ్బరం నేదు! వొల్లు సుబ్బరం నేదు” అని అసిరి ఇల్లూ, వాకిళ్లూ ఎత్తిపెట్టి, అంట్లుతోమి కోమటిని పందుం పాతవడ్లు అడిగింది. కోమటి గ్రహించాడు.

“నా పని పురుడెత్తడమేటి?” అని హాస్యమాడి “పాత బాకీ బోలిడుంటే మళ్లీ కొత్త అప్పు” అని అంటూ కోమటి అప్పన్న చిట్టా తిరగేసి మొత్తం చేశాడు. ఏదుం తక్కువ రెండు పుట్ల వడ్లు. చిల్లర బాకీ మూడు రూపాయిాలు. నగదు పది రూపాయిాలు, వడ్డీ రెండు రూపాయిాలు అని చెప్పేడు.

“నాను దొడ్డి జీతం కానీ అడగనేదు. ‘లాగు’ కింద ఇరుసుకో మన్నాను. మరీ నెక్కేటి?” అన్నాది అసిరి.

“నీ దొడ్డి జీతం ఆరు రూపాయిలు మింజుమలె ముప్పందుకి ‘లాగు’ విరిచేశాను. ముప్పందుం వడ్లూ, పదిహేను రూపాయిలు ఇవ్వాలి. ఈ యప్పు తీర్చి మళ్లీ పట్టికెళ్ళు” అన్నాడు కోమటి.

“అప్పు తీర్చక మీ ఇంట పుడతామనుకున్నారేటి? పెదబాబుని ఎవడికాడేనా కంబారి తనముంచి మీ యప్పు దీర్శనా? ఏందీ మాటలు? వూరొదిలి పోతామనుకున్నానేటి?” అన్నాది అసిరి “అయితికనేం నా దగ్గరే వుంచు, నా ఆవు కాపుకి, గరికేళ్ళు తేడానికి కాపుని పెట్టాల నుకుంటున్నాను. ఎంతిమ్మన్నావు?”

“నాలుగుపుట్ల జీతం. పచ్చడం, పై వాజీబులు మీకు తెలవదే?”

“మూడు పుట్లిస్తాను. అందులో బాకీ ముప్పందుం విరిచి ఇప్పుడు పందుం ఇస్తాను అక్కడికి రెండు పుట్లయింది. దసరాకి పందుం. సంకు రేత్రికి పందుం ఇస్తాను. మీ బాబుని కంబారిగా నా దగ్గరే ఉంచు.”

“ఏ రైతు కాడైనా ఇడితే గింజలు రాబళ్ళు ఉంటాయి. మీకాడేటి పుట్టికుంచాలా పట్టింకుంచాలా? మరెందుకవన్నీ మరి పందుగింజలిచ్చి నువ్వు సెప్పినట్టేకాని. సాలు తిరిగేదాకా పనిచేస్తాడు.”

“మంచి రోజు చూసి సెపతాను. అపుడు పంపు”

“వాజీబు నేదనక ఇవ్వాల, అప్పుడెందుకు గుజ్జులు. సంకురేత్రికి అడ్డెడు పెసలు తవ్వెడు నూన. సోలడు మినుములు ఇవ్వాల కోబలినాడు మీదయఏమిచ్చినా సరే”

“సరే గింజల మాట తెమిలింది, రూపాయలు ఎప్పుడిస్తా వేటి?”

“మీకాడ నౌకరీసేసి ఎటుపోతావేటి? ముందుకు సిన్నోడు పెద్దోడయితే ఎవడికాడైనా ఎట్టి ఋణం తీర్సనా? ఋణానికి కట్టడమా?”

కోమటి అసిరికి పురిటికి పందుం పాతవడ్లు యిచ్చేడు. గింజల గంప నెత్తిమీద పెట్టుకొని అసిరి దాగరంత మొహంతో గుడిసెకొచ్చింది.

"పెద్దబాబో గంప దించేయ్యాలి. సెయ్యి యియ్యమామ్మ" అన్నాది కొడుకుతో. పెద్దకొడుకు అరుగు మీద నిలబడి చెయ్యిచ్చి గంప దించేడు.

"కొడుకు లందరు గూడి తుమ్మీదా కుంతి కోరికతీర్చి తుమ్మీదా" అని పదం పాడుతూ అసిరి కొడుకును ముద్దెట్టుకుంది.

"ఏటో కులాసా?" అంటూ సోలిగాడు గుడిసెలోంచి పైకొచ్చాడు. వడ్లు చూసి "ఎక్కడొట్టు కొచ్చేవేటి?" అనడిగాడు. అసిరి అంతా చెప్పి నగదు పదిహేను రూపాయలని తేల్చింది.

"ఇవీ మళ్ళీ పెరుగుతాయి" అన్నాడు సోలిగాడు.

"ముందుకి సిన్నోడు పెరగడా? ముందుకి ఆణ్ణి కంబారితనముంచి ముండా అప్పు తీర్సమా!" అన్నాది అసిరి.

✡

# భూమి

**–అల్లం రాజయ్య**

డిశంబరు నెల మొదటి వారం. మొక్కజొన్న పెరడు జల్లుకొచ్చింది.. తడిగట్టకుంటే కర్రలు పీసులు ఇరుకబడతాయి. ఒకవేపు వరికోతల సీజను.. మిరపతోట ముదుత పడుతున్నది. మందు కొట్టకుంటె నోట్లో మన్నే. ఎటుచూసినా ఊపిరి సలుపనంత పని. సరిగ్గా ఇలాంటి క్లిష్ట సమయంలోనే పిడుగులాంటి వార్త తెలిసింది. మా బావమరిదిని పోలీసులు అరెస్టు చేశారట.

కారణాలు ఏవైనా కనీసం చూసన్నా రావాలి. గౌరమ్మ దాదాపు పిచ్చిదైపోయింది. నాకంటే ముందే తయారయ్యింది. ఇద్దరంపోతే కోతలు మిగతా పనులన్నీ ఎలా వెళ్ళు తాయి? తరువాత ఇద్దరం నెత్తి నోరు కొట్టుకున్నా లాభం లేదు. గౌరమ్మను బతిమిలాడి నచ్చజెప్పి నేను బయల్దేరాను.

మా అత్తగారి ఊరు మా ఊరికి ముప్పయి మైళ్ళు. ఇదివరకైతే మా నాన్న కాలినడకన పోయేవాడు. మా స్థితి కొంచెం మెరుగైన తరువాత ఎడ్లబండి మీద కొన్నాళ్ళు వెళ్ళాము. ఎడ్లబండిలో కడుపుల పేగులు నోట్లెకు రావడమటుంచి, ఒక్క రోజల్లా నడకే అయ్యేది. ఈ మధ్య బస్సు వచ్చింది. ఎడ్లబండి అవస్థ తప్పిందనుకుంటే బస్సు ప్రయాణంలో వున్నాయి కష్టాలు.. మొదట అయిదు మైళ్ళు నడిచి బస్సు స్టేజ్ చేరుకోవాలి. ఆ తరువాత బస్సు ఎప్పుడు వస్తుందో భగవంతుడికే తెలియాలి. ఎదురుచూడగా చూడగా వచ్చిన బస్సు, రావడమే ఫికఫికలాడుతూ వస్తుంది. జొన్న చొప్ప బండిలో మెలిగినట్టున్న బస్సులో ఎక్కడం బహుకష్టం. తొక్కిసలాటతో బస్సు ఎక్కామంటే ఒక గండం గడచినట్లే– ఆ తరువాత బస్సు దిగిన తరువాత మళ్ళీ నడవాలి.

ఇలా ఆలోచించుకుంటూ, ఏ వేళకు చేరుకుంటానోనని రంధిపడుతూ.. మా ఊరి కాలిబాటలో నడుస్తున్నాను. గాలి ఉండి ఉండి తెరలు తెరలుగా వీస్తున్నది. గాలి ఊపుకు బాటకు రెండు పక్కలనున్న పొలాల్లోని వరి గొలుసులు రాసుకొని చాలా గమ్మత్తు చప్పుడు వినిపిస్తోంది. దూరంగా దొరగారి అందురు పొలంలో కూలోల్లు మోతలు మోస్తున్నారు.

కోతలయిపోయిన దొయ్యల్లో కొన్ని పశువులు 'బరుకూబరుకున' కొయ్యకాల్లు పీక్కుని తింటున్నాయి. వాటిని కాసేబింగి చెవుల పోరడు ఏదో పాట పాడుతున్నాడు. నా నెత్తిమీద తీతువపిట్ట "కిక్కిరికి" అనుకుంట పల్టీలు కొడుతున్నది. షావుకారు కల్లంకాడ 'తాంద్ర పాపారాయుని' కథ చెప్పుతున్నట్టున్నది. వాని గర్జన ఉండీ ఉండీ వినిపిస్తోంది. వాని పక్క, వాని భార్యలు కావచ్చు ఇద్దరు "తపుకూ తపుకు"న బుర్రలు కొడుతున్నారు. దూరంగా దొరగారి వరిమళ్ళల్లో పుల్లకోడె పుట్టజిమ్మి రంకెలు వేస్తోంది.

బాటపక్క పొలంలో బుడ్డ గోచి పెట్టుకున్నోడు ఎలుక పొక్కలు తవ్వుతూ కూనిరాగం దీస్తున్నాడు.

"పొరుక పోడుగొట్టి

మరి రాళ్ళు రప్పలేరి

బంజేరు దున్నిదోకి

తెల్లజొన్న వేసుకుంటె

ఎవ్వడు వాడెవ్వడు నాది అనేటోడు?

ఎవ్వడు వాడెవ్వడు నా భూమి అనేటోడు?"

నా మనసు చివుక్కుమన్నది. ఈ పాటలే జనాన్ని చెడగొడుతున్నాయి. కాకపోతే చూస్తూ చూస్తూ ఊబిల దిగడమెందుకు? దిగి నిండా కూరుకుపోయిన తరువాత, పెద్దల తలవడ మెందుకు? గాలికంటె వేగంగా ఇప్పుడు ఈ పాటలు చుట్టుకుపోతున్నాయి. తలవంచుకుని పన్జేసుక బతికే కూలినాలోడు తలలు రిక్కిస్తుండు, సంఘాలు గింగాలు ఊరూరా మొలచు కస్తున్నాయ్. వెనుకటినుండి వొచ్చే వ్యవహారాన్ని ఒక్క దెబ్బతో మారుస్తాననడం ఎవనబ్బ తరం. "ఒరే ఎడ్డిముండకొడుకుల్లాలా గాంధసంటోడే గంగల కలిసిపోయిండంటే?" నన్ను ఎగాదిగా చూసి "గాంధో నైరో మాకేమెరుకు సదూకున్నోనివి బుద్ధిగానెంగ లోనివనుకుంటె బాంచెగాన్ని బాంచెగాని తీర్గనే కాళ్లకాడ బడుండమంటవ్.. సాలు సాలు.." అని మావూరి మాదుగులంటారు. "తాగినోడు తాళ్ళ పన్ను కట్టుకుంటడు. కడుపునొచ్చినోడు ఓమ బుక్కుతడు. మధ్యన నాకేంది?" అనుకొని నా పని నేను చూసు కుంటున్నాను. అయినా అంతరాలు వుండొద్దంటరు. దున్నేవానికే భూమి కావాలంటరు. కూలి రేట్లు పెరుగాలంటరు. జీతాలు పెరుగాలంటరు.. వీళ్ళడిగినవన్ని పెట్టుకుంటు పోతే దొరలకు మిగిలేది చిప్పే. పెట్టకుంటే మొత్తం పనులు బంద్. కాదుపోదంటే పీకులాట. దొరింటిమీదికి దండయాత్రలు. అక్కడ నరంలేని నాలుక నానా విధాలన్నట్టు. "తీసుకున్న దండుగులకాన్నుండి, వసూలు చేసిన వంతు గొర్రెపిల్లలు" పంచుమని లొల్లి అయిన డబ్బూ, దస్కం, హోదా, అధికారం అన్నీ గల్గిన దొరలు వీళ్ళ కోర్కెలు తీర్చేటందుకు వాళ్ళేమన్న పిచ్చివాళ్ళా?

మా బావమరిది గాడెందుకు సంఘంలో కలువాలె? కలుస్తే దొరల చేతులు ముంగట బెట్టుకొని చూసుకుంటూ కూర్చుంటరా? వాళ్ళు చేసేది వాళ్ళు చేశారు. అధాలతంటే మాటలా..! అధాలత్ అంటేనే ఆధాహాలత్ ఖతమన్నమాట. కోర్టుల్లో కేసు నామనేశనే కాదు.. కేసు తెగంది. ఇల్లు మిగలదు. నేను మా గౌరితో గిదేమాటంటే అది నిలివెడెత్తు లేసింది. దానికేం తెలుసు వ్యవహారమంటే, "తొక్కు" నూరడ మనుకుంటున్నదేమొ?

క్రిందట నెల తల్లిగారింటికి పోయి వచ్చిన కాన్నుండి దానితోని మాట్లాడ వశమైతలేదు. మాటకు కారణాలు తీస్తున్నది. అదే సన్నగా అప్పుడే పాటలు పాడుతున్నది. ఇంకా నయం ఇంకోనెల అక్కడే వుంటే అన్నతో కలిసిపోయెదే? తాచెడ్డకోతి వనమెల్ల చెరిచిందని ఊరికెనే అన్నారా? "మా బామ్మర్దిగాడు తనపరిధిలో తనుంటే గిన్ని చిక్కులు వచ్చునా?" అన్నాను వుండబట్టలేక.

గౌరి మా మాటమీద అంతెత్తు ఎగిరిపడి.. "ఓ యబ్బో! మా దండి గ్యానవంతుడివి తేలినవయ్యో! నీకే గ రెండెకురాల పొలం మూడెకురాల పెరడు లేకుంటే ఎరికయ్యేది, భూమున్నోనికి భూమిలేనోని తిప్పలు నెత్తికెక్కయి. కడుపు కాలినోని కెరుక ఆకలిమంట. సదూకున్నవేమో శాత్రపురండాలు జెప్పుతున్నవ్, నేనూ చెప్పకత్త శాత్రపురండాలకేంది?"

నాకు భూముండడం నా తప్పా! ఎవరిదన్నా గుంజుకున్ననా? కొంచెం మంచి భాషలో మాట్లాడితేచాలు, ముసి ముసి నవ్వు మూతులు పొడుస్తుంది. గొల్లోనికేమెరుక మొగిలిపువ్వు వాసన. ఈ సారి అది నవ్వకుంటే.. నావేపు చూస్తున్నది.

"ఎవరి భూమి కట్టుకరాలే.. మా అయ్య రెక్కల కట్టం ఎరికేనా.." నేను..

"మాలావు కట్టుపడ్డడయ్యో! మీ అయ్య. మావోల్లు ఆడికి కూసుండి తింటండ్లా అయ్యో! గీమురిపెం ఎన్నొద్దులు.. మనకొత్తయి తిప్పల్లు"

చేతులు తిప్పుతూ వెళ్లిపోయింది. ఇక దానితోని వాదించి లాభం లేదు. నేను ఏది అందామని నోరు తెరచినా, అది గడగడ ఉపన్యాసం చెప్పుతుంది.

"ఏవూరు మంది పటేలా?" నా ఆలోచనలో నేను నడుస్తుండగా ఈ మాట వినపడి వులిక్కిపడి చుట్టూ చూశాను.

నా పక్కకు బాగా వంగిపోయిన ముసలోడు, చేతిలో ఈతపగ్గం. ఆ పగ్గం ఒక కొస దున్నపోతు ముగుదాడుకున్నది. ముసలోడు బాగా వంగి పోయివున్నాడు. అతని చర్మం ముడుతలు పడిపోయి ఊగుతున్నది. బుగ్గమీసాలు, నెత్తికి పాత గుడ్డ పేగు చుట్టుకున్నాడు. చేతులు నరాలు తేలి పుల్లల తీరుగ ఉన్నాయి. ముడ్డికి బాగా మాసిపోయిన గుడ్డపేగు అక్కడక్కడ చిరిగి వున్నది. అదైనా బాగా పైకి ఎగగట్టి కుడివేపు చెక్కుకున్నాడు. ఆ గుడ్డ పేగులో కాళ్ళు బొక్కలు తేలి, పిక్కల దగ్గర వంగిపోయున్నయి. వంగిపోయిన ఎన్నుకు

ఏదో కట్టుకున్నాడు. బహుశ రొట్టెలమూట కాబోలు. బొక్కినోరు, నోట్లో పాచిపట్టిన రెండో మూడో పండ్లు. మనిషి ఎప్పటినుండో దరిద్రం, రోగంతోని బాధపడుతున్నట్లుగా అతని వాలకమే చెప్పుతోంది. కాని గుంటల్లాంటి కండ్లల్లో ఎక్కడో కొండంత ఆశ కనపడు తోంది. అతని పాదాలు చూశాను.. డొక్కుతోలు చెప్పులకు గుడ్డ పేగులు చుట్టబడి వున్నాయి. అరిచేతి మందాన కాళ్ళమీద దుమ్ము పేరుకపోయున్నది. అంటే దూరం నుండే వస్తున్నాడన్నమాట.

ఇద్దరం పక్కపక్కగా నడుస్తున్నాం. నెత్తిమీద ఎండ చురుకుమనిపిస్తోంది. గాలి చాలా పలుచగా వీస్తున్నది. ముసలయ్య గెంటుతూ ఎడంకాలు దుమ్మతో ఈడుస్తూ నడుస్తున్నాడు. నాతో సమానంగా నడువలేక పోతున్నాడు. ఒక్కణ్ణి నడిచే బదులు తోడుంటదు కదా అని, నేను కొంచెం నడక తగ్గించాను.

"ఏవూరు మంది పటేలా" మళ్ళీ అదేమాట. ముసలయ్య నా తెల్లబట్టలు నెత్తికి నూనె, దువ్వుకోవడం చూసి అలా అన్నాడు. నిజానికి నేను పటేలును కాను. పట్వారినికాను. మామూలు రైతును.

ముసలయ్య మళ్ళీ ఊరు పేరడిగాడు.. నేను చెప్పాను.

"తమరి పేరేంది?" ముసలయ్య.

"ఆశన్న"

ఆశన్నాశన్న అన్నదమ్ములే

ఆశన్నా ఈశన్నలాలా...

దంచబోయి మీము సాత్తి కొడుకో.

ఆశన్నా ఈశన్నలాలా...

ముసలయ్య బొంగురు గొంతుతో పాటెత్తుకున్నాడు. "ఈ మనిషి ఇంకా పాటలెలా పాడగలుగుతున్నాడబ్బా!" అనుకున్నాను. ముసలోడు మొత్తానికి కలుపుగోలు మనిషిలాగే కన్పిస్తున్నాడు.

"మనదేవూరు తాత?" నేనడిగాను ఎటూ తోచక.

ముసలయ్య పాటాపి నన్ను ఎగాదిగా చూసాడు. ఊరు పేరు చెప్పాడు.

నేను కొంచెం ఉలిక్కిపడ్డాను. మా బావమరిది సంగతటుంచుతే ఆ ఊరిలో ఇటీవల జరిగిన సంఘటనలు తెలిసినవాళ్ళు ఉలిక్కి పడకుండా ఉండలేరు.

"నీ పేరేంది?" నేను.

"గంగన్న."

మేమిద్దరం మరికొంచెం దూరం నడిచాము. దున్నపోతు ఎండకు ఆఖర్ కొడుతున్నది. దాని నోటినుండి చొంగ కారుతున్నది మొత్తం దున్నపోతంతా ఈగుతూ నడుస్తున్నది. ఈ

మధ్య కాలంలో మా ఇద్దరికీ మరికొన్ని పొడి మాటలు నడిచాయి. నన్ను గంగన్న "తమరు –పటేలా?" అనడం మానుకున్నాడు. నేను అతననుకున్న "పటేలు"ను కాదని గంగన్నకు తెలిసిపోయింది.

"గంగన్న తాత, గట్ల దొరింటి మీనికి కట్టగట్టుకొని పోవడం తప్పుకాదా? పాపం, పున్నెం ఇసారంజేయద్దా? ఎనుకటినుంచి సంఘాలు లేకుంటె మనం బతుకలేదా?"

గంగన్న తాత ముఖంలో నెత్తురు చిమ్ముకొచ్చింది. పెదిమలు కొద్దిగా వనుకుతున్నాయి. ఆ ఉద్రేకంలో అతనేం మాట్లాడలేకపోయాడు.

"వాని దగ్గెర తుపాకున్నది. దొరలు తుపాకుల నెందుకు కొనుక్కొంటరు? గిసోంటి యేల్లలత్తయనే కదా! నాకెరుకలేకడుగుతున్న! అగ్గని తెలిసినప్పుడు దాన్ని ముట్టుకోవడ మెందుకు? ముట్టుకుంటే కాలదా?"

"నోరెత్తకు.." గంగన్న అరిచాడు. ఆ అరుపుకు దున్నపోతు బెదిరింది.

"జానయ్యా! కిందబడ్డా మీదబడ్డా! గరీబోనిదే తప్పు. ఊకెసప్పుడు జెయ్యకుంట మా పల్లెలకు అగ్గిపెడితే ఒడిసిపాయె. గరిబోల్లమంత మారుత్తర వియ్యకుంట సత్తం.. పీడబాత్తది.. గరీబోడు బతికుంటే ఆనికి కడుపుంటది. కడుపుంటే ఆకలుంటంది. ఆకలయితే ఆడు తెగబడుతడు.. మేం ఏం జేసినం? ఎవని కొంపల జొచ్చినం? తాలూకాల మా గరీబోల్లు సభబెడితే సభకు బోయినం. ఆడకట్టమో సుఖమో నాలుగు ముచ్చెట్లిన్నంక మాకూ సంఘం బెట్టుకోవాల్ననిపిచ్చింది.

సంఘం బెట్టుకున్నం. ఆ మాటకత్తె దొరలకు సంఘాలు లెవ్వా? నే జెప్పుత లెక్కబెట్టు. ఆప్కారోల్ల సంగం గుత్తెదార్ల సంగం, గూనకంపినీల సంగం, అడ్లగిన్నుల సంగం, మోటార్ల సంగం, అతన్‌దార్ల సంగం, సర్పంజిల సంగం, ఇంకా పట్నంలేందో సిమ్మం మూతి సంగమట. మేం గట్లనే గరీబోల్ల సంగం రైతుకూలి సంగం బెట్టుకున్నం... ఇగ ఊరి నక్కలకు కుక్కలకు మెలుదారాలు దెగిపోయేట్టు కడుపులుబ్బినయ్, దొరోల్లంత కుప్పగూడి గుజులు గట్టిండ్లు – అయ్యా ఏం జెప్పాలే – మా ఊళ్ళె ఇల్లిల్లుదిర్గి పిల్లా మేకా, ముసలి ముడిగీ, ఆడది గీడదని సూడకుంట ఎర్రిలేసిన కుక్కలోలె కనిపిచ్చినోన్నల్ల ముల్లుగుచ్చ సందులేకుంట గొట్టిండ్లు. మా తనువులు పచ్చిపుండ్లయినయి. మా దాండ్ల నలుగురిని గడికే పట్టుకపోయిండ్లు. గడీల మట్లు బాతి కట్టేసిండు – మల్ల అక్కడ దొరగొట్ట వట్టే మేం జేసిన తప్పేందో ఇక నువ్వు జెప్పు?"

"అక్‌బార్లల్ల (పేపర్లల్ల) గట్ల రాయలేదే?" నేను..

"ఏం రాసిండ్లు! రాసినోల్లెవలు?"

అక్‌బార్ల రాసిందేమిటో నేను చెప్పుకొచ్చాను.

మునలోడు పండ్లు పటపట గొరికిండు..

"ఎవలు రాయిమన్నరు గట్ల?"

"ఆళ్ళు ఒకలు రాయమంటె రాత్తరా?"

"అయితే పీక్కపోయిందేంది? అక్‌బార్లోల్లు దొరల మనుషులే అయ్యుంటరు..."

"మీ వోల్లను దొర గడీల కట్టేసిండంటవు. ఆటెనుక ఏమయ్యింది?"

"ఏమయితదో అదయ్యింది? గీ దున్నపోతే ఉన్నది. గీ దీన్ని బంజేరుదొడ్లె కట్టేత్తే నేను ఎనుకులాడబోను? ఇగ మనుషులే బోయినంక ఊళ్ళందరం గిదేం అన్నాయెం దొరా అని అడుగబోయినం.. దొంగకు దొంగ యావ– దొరకు దొర యావ– ఆడనుకున్నడు ఈళ్ళంత నా గడిమీనికి ఇజ్జానికే అత్తండ్లనుకున్నడు. గట్ల మేంతలుసుకుంటే ఆడుంటడా! ఆహా నాకెరుకలేకడుగుత ఉండడు.

పాపం బరుపూర నిండుకుంటెనేగదా నర్సిమ్మ సామి కంభాలనుంచి సెరసెర పలుగ్గొట్టి కోనచ్చి ఇరన్న కసిపుని పేగులు పీకి మెడకేసుకున్నడు. మేం గట్ల గడిదనుకపోయిన మోలేదో అని తుపాకి మొరిగింది. ఏం జెప్పాలె కొడుకా సిసిల నెత్తుర్లు గారంగ పచ్చులోలె అటిటు వురికినం– నీ బాంచెన్ తుపాకి దెబ్బ గాసుకోను మా వొంటిమీన బట్ట పేలుక సుతలేకపోయె– బంగుళా మీన్నుంచి ఒక్క తుపాకిగాదు నీ బాంచెన్ ఆశన్నా రెండు జోడు తుపాకులు– ఎటూ తోసకుంటయిపోయింది. నెత్తురుగారే తనువులు కొట్టుకోల్లు మొత్తుకొల్లు– నెత్తురుజూసిన కండ్లల్ల నెత్తుర్లు పొంగినయ్.. గంతట్లకే పోలీసోల్ల మోటర్లచ్చినయ్..."

"లేకపోతే ఎంతమంది సచ్చేటోల్లో..."

"మేమంతా గట్లనే అనుకున్నం. ఆళ్లచ్చి సేసిన పనేంది. పోలీసోల్లు నాయెం సేయరా? కండ్ల ముంగటగింత అన్నేయం జర్గుతంటె ఆళ్లసేతుల్ల తుపాకులు ఎదురు జవాబు సెప్పయా? అనుకున్నం. కని, నీపేరందన్నవ్. ఆశన్నగాద, ఆశన్నా! కొడుకా! తుపాకుల కులమొక్కటే – జాతొక్కటే – నాకనిపిత్తది. తుపాకి పుట్టుడే మనసొంటోల్లకోసం పుట్టిందేమొ నని? ఏం జెప్పాలె – కారు దున్నపోతసొంటోడు గింత జరుగుతుంటె మోటర్ల కడుపుల సల్ల కదలకుంట కూకుండి పోనుగిలాసల మొత్తుకో బట్టిండు."

"పెజలాలా! పర్ శాంతంగ ఉండాల్నె" ని–

"ఓరినీ"

"వాని తోడు దొంగ.. ఇగట్లచ్చింది కోపం జనానికి, అరికాలు మంటనెత్తికెక్కింది. ఆడికి అనక మాదిగోల్ల సమ్మక్క అని మోటరు కెదురురికింది."

"ఓ దొరా! నీ బాంచెన్ దొరా! గ బంగుల మీని దొరే గరీబోల్లను తుపాకి ఏసి సంపుతండు దొరా! మేంసప్పుడు జేయకుంటనే ఉన్నం. గ బంగులమీని దొరకు జెప్పుండ్లి దొరా!" ఓ

దిక్కు తుపాకి మొరుగుతంటే – ఇంకొదిక్కు ఈడు గదే మొత్తుకునుడు. మొత్తుకోవట్టిండు. సెవులు గోసిన కుక్కోలె. సమ్మవ్వ ఆని పక్క కురికచ్చి "ఏమాయెనయ్య తుపాకులు సేతుల బట్టుకొని" దొర తుపాకి కాలుత్తనేవున్నడు. నీ బాంచెన్ ఆశన్నా దానికి ఇగట్లచ్చింది పూనుకం కనుగుడ్లు పెకిలించింది. ఎంటికలిరబోసుకున్నది. పట పట పండ్లు గొరికింది.

"ఆడిదాన్ని నాకే కండ్లకు నెత్తురత్తంది.. తూ మొగపుటక బుట్టినవ్.. నీ సాతగాకుంటె గ తుపాకి నా సేతికియ్యి, నేను జూత్త ఆని సంగతి.."

నా మనసు మొద్దుబారిపోయింది.

"ఆడెందుకిత్తడు. ఆడెవలబంటు – ఆడె ఇచ్చెటోడయితే, దొరోడు ఇంకా కాలుపు లెందుకు సాగిత్తడు?"

"అయ్యా! అదంటే గట్లయిందనుకున్నం... అటెన్క తెల్లబట్టలోల్లు మోటర్ల మీనచ్చిండ్లు. మూతినాకుడు మాటలు మాట్లాడిండ్లు. "చ్చొచ్చొ" అన్నరు. "అయ్యో పాపం" అన్నరు.. కలం పుల్లలతోని తెల్ల కాయితాల మీన ఏందేందో రాసుకున్నరు. మాగ్గావలసింది. గీ మాటలు గావే.. ఊళ్ళె ఎవ్వనికి ఏర్గవోను జాగా లేకుంట మొత్తం భూమంత దొర ముడ్డికిందేసుకొని మమ్ముల కూలోల్ల జేసి, మా నెత్తురు పిండుకుంటండు. ఆడు గంతగనం సెల్లిచ్చుకుంటండంటే ఆనికున్నది మాకు లేందేంది? ఎరికయ్యిందా భూమి.. అచ్చినోల్లెవల్లు భూమి మాటెత్తలే.. ఇచ్చుకాయ కచ్చుకాయ మాటలకేందనుకుంటే. మూడోనాడు మల్ల పోలిసోల్లచ్చిండ్లు– ఎందుకనుకున్నవ్ ఆశన్నా! మేం ఆని బంగుల మేనికి అన్ని సంపెటం దుకు పోయినమంట– ఆడు నిచ్చంగా మా వోల్లను సంపినమాట గంగల కల్సిపోయింది. మల్ల తన్నుకుంట గుద్దుకుంట ఊళ్ళె పడుసుపోరగండ్లను, దొర ఏలుబెట్టి సూయించి నోన్నల్ల ఎంటబెట్టుక పోయిండ్లు. మల్ల ఊరు మొకం సూడకుంట జేల్లల్ల బెట్టిండ్లు.. వానవ్వల ఓట్లప్పుడు వుచ్చిన కుక్కల తీర్గ తిర్గి ఓట్లెయించుకుని ఏకు మేకయిపోయింది. మా ఓటేగిప్పుడు బాకయింది. కచ్చీర్లు గిచ్చీర్లు అన్నీ ఆళ్లయేనాయ్.." గంగన్న తాత సన్నగా వణుకుతున్నాడు – ఎండిపోయిన ఎదురు రొమ్ములు. అతని నెత్తురు మరుగుతోంది.

"అన్నాయెమే?"

"అన్నాయెమని అందరంటరు కొడుకా? మా బాధలు గీ మాటలకు తీరయి.. ఆ యింక ఏవయిందంటే ఊరుపాడుబడిపోయింది. కాష్నాలగడ్డ తిర్గ ఎవలూ మాట్లాడరు.. ఎవరు నవ్వెరుగరు. ముసలి ముతక ఆడోళ్లు ఏం పనులు జేత్తం? ఉన్న కోంద్రల్ల ఫసల్లు నాశినమయి పోయినయ్. మాకు సేతనయితది గనుకనా? ఆనికి కూలి జేసేటందుకు – సావనన్న సత్తంగని ఆని పనికి బోమనుకున్నం. ఆని పసురాలకాడ పెండ దీసినోడు లేదు. ఆని ఫసల్లు కోతలు గోసినోడు లేడు.. అయ్యా! ఆ కాష్టాలగడ్డల ఇంకా ఏమున్నదనా సర్కారు పోలీసోల్ల

దోలిచ్చింది.. ఊళ్లె "డేరా" లేసుకొన్నరు. దొర కొట్టాలల్ల మకాములు బెట్టిండ్లు. ఇక ఆళ్ళ దుట్టుతనం నే నేం జెప్పాలే.."

గంగన్న ముఖంలో బాధను నేను చెప్పజాలను.

"అయితే గంగన్న తాత మీ వోళ్లెవలనన్నా పట్టుకపోయిండ్లా..?"

"మెల్లె గడుగుతవేంది? నా కొడుకుని, అల్లున్ని పట్టుకపోయిండ్లు.."

"నీ కెందరు కొడుకులు?"

"ఎందరేడిది? ఒక్కడే కొడుకు. ఒక్కతే బిడ్డ. బిడ్డను ఉన్న ఊళ్లనే ఇచ్చి.."

ఇంకా మైలు దూరం నడిస్తే నేను బస్సు ఎక్కే స్టేజి వస్తుంది. గంగన్న చెప్పిన మాటల్లో నాకెక్కడా తప్పు కనిపించలేదు. కాని ఎందుకో జనాన్ని సమర్థించలేకపోతున్నాను.

గంగన్నకు జేల్లో ఉన్న కొడుకూ అల్లుడూ మనసులో మెదిలి వుండాలి. అతనేం మాట్లాడకుంట నడుస్తున్నాడు. అడుగులు కోపంగా పడుతున్నాయి.

కాసేపు ఇద్దరం మౌనంగా నడిచాము.. దున్నపోతు ఎండకు చాలా ఆయాసపడుతోంది. ఓ పది నిమిషాలన్నా నీల్ల మడుగులో పండుకోనిది, అది నడిచే స్థితిలో లేదనిపించింది. దాని నోటిగుండా నురుగు వస్తోంది.

"తాతా... దానికి నీళ్లన్నా పెట్టరాదు.. పాపం ఎండకు అఖరు కొడుతంది."

"నాలుగామెడ బోవాలె. ఇది మడుగు జూసిందంటె మడుగులకు బోతది.. ఇగదాన్ని లేప వశమా?"

నాలుగామెడంటె దాదాపు ముప్పయి మైళ్లన్నమా... ముసలయ్య ముప్పయి మైళ్ళు నడవాలి... గడుసు పిండమే.

ఇద్దరం కలిసి కాలిబాట ప్రక్కనున్న మడుగులో దున్నపోతుకు నీళ్ళు బెట్టాము. గంగన్న నీల్లల్లదిగి దాని ఒంటిమీద నీల్లు జల్లిండు...

మళ్ళీ నడక సాగించాడు.

"గంగన్న తాత... ఊళ్లె పోలీసోల్లున్నరంటవు. పంటలు నాశనమై పోయిన యంటవు. పనులు బందయిపోయిన వంటవు.. మల్ల గీ దున్నపోతు నేం జేత్తవే?"

"గిట్లనే ఎల్లకాల ముంటదంటవా?"

"ఆళ్ళు తలుసుకుంటె ఉంటది.."

"మరి మేం తలుసుకోము కదా! మేం బతుకాలంటె బువ్వకావాలె. బువ్వగావాలంటే దున్నకుంటెట్లయిద్ది?"

"ఎవల భూమి దున్నుతరు?"

"భూమి ఎవలదేంది? గీల్లదని రాసున్నదా? అన్నీ భూములు తొలి సినుకు బడ్డంక దున్నుతం.."

అమ్మో ముసలోడు చిన్నోడు గాదు.. ఇంత జరిగినంక కూడా మళ్ళీ భూములే దున్నతనంటున్నాడు. నాకు కాంచెం గంగన్న పట్టుదల మీద ఈర్ష్య కలిగింది.

"నువ్వు మా దుంతవ్, నిన్ను దున్ననిచ్చెటోడెవడు?"

"ఏం జేత్తరు?"

గంగన్న ముఖంలో తిక్క – మాటల్లో కరుకుదనం

"ఏం జేస్తరో నేను చెప్పాల్నా? మీవోల్లనేం జేసిండ్లు?"

"జేల్లకు పట్టుకపోతరంటవు – అంతేనా?"

గంగన్న ఆలోచనలో పడ్డాడు – నెత్తి రుమాలు ఊడబీకి భుజం మీదేసుకున్నాడు – నెత్తి బరబర గోక్కున్నాడు. అబ్బ ఇప్పటికి ముసలోని తల తిరుగుడుకు అడ్డుకట్ట వేశాననుకున్నాను.

"ఔ ఆశన్నా మనుసులకు జేల్లుంటయి నిజమే. పసురాల కేడన్న జేల్లున్నయా?"

నాకు తెలిసినంతవరకు అలాటి యేమి లేవనుకున్నాను. టక్కున బందెలదొడ్డి గుర్తుకొచ్చింది.

"బందెల దొడ్లుంటయిగదా?"

"దుత్తెరి.." భుజం మీది రుమాలు ఝాడిచ్చిండు.

"పసురాలకున్నయన్నవు బందెలదొడ్లు – మరి నాగండ్ల కేన్నన్న జేల్లుంటయా?" గంగన్న వాలకం నాకు అంతు బట్టడంలేదు.

"అదిగాదు గంగన్న తాతా! నువ్వు దున్నపోతును కొనుక్కపోతన్నవ్ నిజమే– నాగలి గడ్తవ్ నిజమే – ఏం భాగ్గెం.. ఇంత కట్టపడి నువ్వు నాగలిగడ్తె నిన్ను గొంటబోయి జేల్లదోలుతరు.."

నా కంఠం నాకే వ్యంగ్యంగా వినిపించింది.

"నన్ను బట్టుకపోతే నా బిడ్డా, కోడలు దుంతరు?"

ముసలి ముండాకొడుకు అసాధ్యుడే.

"నీ కోడలును బిడ్డను జేల్లకు పట్టుకపోతరు.."

"అయితే మా ముసల్ది నాగలిబడుతది.."

"మీ ముసలిదాన్ని పట్టుకపోతరు?"

"నా మనుమలు దున్నతరు?"

"నీ మనుమల్ని పట్టుకపోతరు"

"దున్నపోతులే నాగలి దున్నతయి"

"దున్నపోతుల బందెలదొడ్లే బెడుతరు..."

"నాగలి దానికదే దున్నుతది.."

"నాగలికి కొత్త జేల్లు కట్టిత్తరు.."

"అప్పుడు భూమి సెరసెర సెక్కలయింద్ది... 'ఇంటన్నవా' అంతవరదనుక మేం సేతులు ముంగట పెట్టుకొని కూసుంటమా?"

నేను ముసలయ్య ముఖం చూశాను.. కనుగుడ్లు పొడుచుకొచ్చినయ్.

నుదురుమీద నరాలుబ్బినయ్... కండ్లల్లో మంట.. ముసలి గంగయ్యను ఆ స్థితిలో గెలవడం అసాధ్యమనిపించింది.

నేను బస్సు ఎక్కాల్సిన స్టేజ్ వచ్చింది. నేను ఆగిపోయాను.

'గంగన్నతాత నిన్ను గెలవడం ఎవరికి తరంగాదు..' అన్నమాట నా అంతరంగంలో మారుమ్రోగుతోంది.

గంగన్న వెళ్ళిపోతున్నాడు. అతనెంట దున్నపోతు నడుస్తున్నది.. నూర్ల యుద్ధాలు చేసిన పురాణపురుషులు గంగన్న కాలిగోరుకు సాటిరారని నేననుకున్నాను.

నాలాంటివాళ్ళు, రావాల్సిన బస్సుకోసం చాలామంది అక్కడ ఎదురుచూస్తున్నారు.. గంగన్న దేనికోసం ఎదిరిచూడడు.. మేమంతా గంగన్న మార్గంలో నడిస్తే...???

✡

# రావులయ్య

**–శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి**

రాయవరము ప్రవేశించునప్పటికి రావులయ్య యిరువది యేండ్లవాడు. చదువులేదు; గాని చాల తెలివిగల వాడు. సిసింద్రీ కంటెను చురుకయిన వాడు. ఒక్క వారము దినములు మాత్రమే అతడు రోజు కూలికి వెళ్ళెను. అంతలో వెలగల తిరపారెడ్డి కోరి అతనిని తన కమతములో నుంచుకొనియెను. "పెళ్ళికి ఫాయిదా లేకుండా నూరు రూపాయలు బదులు. యేటా పాతిక రూపాయలు తీర్చుకోవటం. జీతం సంత్సరానికి రెండు పుట్ల ధాన్యం, డబ్బయి రూపాయిలూను. వక పంచెల జత, చెప్పులు. పది నాగాలు లోపయితే కట్టుకోగూడదు" అని రావులయ్య చెప్పగా రెడ్డి అంగీకరించెను.

రెడ్డి ఒంటరిగాడు. ఆరుగురు కూతుళ్ళ వెనక అతనికి యిరువురు కుమారులు పుట్టిరి; గాని నాలుగేళ్ళు పెరిగి పెద్దవాడు జారిపోయెను. ఇప్పుడు ఉన్న యేక పుత్రుడు రెండేళ్ళవాడు.

రెడ్డికి వ్యవసాయపు పనులలో వెనుకాట లేదు. అంత ధైర్యము ఏ రైతునకును లేదు. "ఉన్నదంతా పొలాల మీద చల్లేస్తే వక్కక్కప్పుడు మునిగి వూరుకుంటుంది" అని యాతనని గురించి గ్రామములోని వారు కొందఱనుకొనుచుందురు; గాని వానిని ఆతడు లక్ష్యపెట్టుట యెఱుగడు. "వాళ్ళకేం తెలుసును? యెట్టిమొకాలు. భూదేవికి పెట్టింది యెప్పుడూ వూరికేపోదు. తెల్లోడి పుణ్యమా అని గోదారమ్మకి ఆనకట్ట వచ్చేక కూడా బయమేంటి?" అని యాతడు చెప్పుచుండును.

నామాల చెఱకుతోటల దెబ్బ మఱపు వచ్చినది. రామచంద్రపురం తాలూకాలో ఇప్పుడు నల్ల మొగలి యేకచ్ఛత్రాధిపత్యము చేయుచున్నది. బెల్లము దిగుబడి యెకరమునకు ముప్పది పుట్లకు గూడ వచ్చుచున్నది. నాలుగేండ్ల నుండి రెడ్డి వరసగా సంవత్సరమునకు మూడేసి యెకరముల భూమి కొనుచున్నాడు. వరి పంట మీద అతనికి లక్ష్యమే లేదు.

ఒక్క సంవత్సరము గడచినది. రావులయ్యకు చెఱకుతోటల సాంప్రదాయమంతయు తెలిసిపోయినది. అత్తగారు తెచ్చి రహస్యముగా రెండు వందల రూపాయలు ఇచ్చినది. "నీయిష్టం. ఫాయిదా అక్కర్లేదు. ఎప్పటికేనా అసలియ్యి. నాకింత గెంజి పోస్తూ చూస్తూ వుంటే అవి నీకే" యని యామె చెప్పినది.

షాహుకారు ఇచ్చిన బెల్లపు ఖరీదు ఎనిమిది వేల రూపాయలును బోషాణములో పెట్టి వచ్చి రెడ్డి బ్రహ్మానందముతో వసారాలో కూర్చుండి భావికల్పనలు చేసికొనుచుండగా రావులయ్య వచ్చెను. "ఈయేడు యెకరం భూమి నేను తోట పెంచుకోవాలని బుద్ధిపుట్టింది. పెట్టుబడి సగం దాకా నేనే పెట్టుకుంటాను. అవసరం వచ్చినప్పుడు లోటు మీరు పెట్టాలి." అని యాతడు చెప్పగా రెడ్డి ఉలికిపడియెను. ఆ విషయముమీద ఒక గంట వాదోపవాదములు జరిగెను. మీ బాకీ యిచ్చేస్తాను. నన్ను వదిలెయ్యండి. అని రావులయ్య ఖచ్చితముగా చెప్పగా అతనిని విడువనిష్టము లేకయు చేయునది లేకయు రెడ్డి తోట వేసికొనుట కంగీకరించెను.

✡

రావులయ్యకు రెట్టింపు బలము వచ్చినది. భార్య పెరుగు, నేయి, పిడకలు అమ్మి పై ఖర్చు గడపివేయుచున్నది. అత్తగారు ఇరుగుపొరుగుల ధాన్యము దంచి వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు తోడు చేయుచున్నది. అదును వచ్చినప్పుడు బావమఱదులు వచ్చి కూలి తగ్గించుచున్నారు. రావులయ్య రాత్రి, పగలు అను విభేదము మఱిచిపోయెను.

తతిమ్మా మూడేండ్లును గడిచిపోయినవి. రెడ్డి బాకీ తీరిపోయినది. "రావులయ్యని కమతంలోనుంచి పోకుండా చెయ్యడం యెలాగా?" అని రెడ్డి ఆలోచించుచుండగా ఆతడు వచ్చి "ఇన్నాళ్ళూ నన్ను పెంచారు. రెక్కలు వచ్చాయి. ఒక యేటికి అడ్డుపడతాను. సెలవియ్యండి" అనియెను.

"నీకు న్యాయంగా వుందా?"

"ఏం లోటు వచ్చిందీ?"

"అంతానూ."

"వాయిదాకి నేను భంగం రానివ్వలేదు. మీ పనికి లోటు చెయ్యలేదు. మీరు పెట్టిన భిక్ష ఫలించింది. సొంత కమతం పెట్టుకుంటాను. ఏం తప్పు చేశానూ?"

"నువ్వు స్థిరం అని తలిచి చాలా యెత్తులు వేశాను. వొంటిగాణ్ణి చేస్తావా?"

"మీరు నాకు చేసిన సాయానికి జన్మజన్మాలా మొక్కుకుంటాము. కాని యెల్లకాలము కట్టుబళ్లలో వుండమంటే యిక కూలాడికి స్వేచ్ఛ యెప్పుడూ?"

"రావులూ! అయితే యజమాన్ని బోల్తా కొట్టిస్తానంటావా?"

"అలా అనకండి మీరు. నాకలాంటి దురుద్దేశం యెప్పుడూ లేదు. మీరు పెట్టిన అన్నం. మీకు ద్రోహం చెయ్యను."

"ద్రోహం చేశావనడం లేదు. తాడెక్కించి వదిలేశావు. నీకీ వుద్దేశం వున్నట్లు తెలిస్తే తోట పెంచకపోదును."

"నా మనస్సు తమకి విప్పి చూపించాను. ఇక నన్ను బలవంతపెట్టకండి" ఇట్లు చెప్పి రావులయ్య వెడలిపోయెను. "పద్దు లెక్క చూపించాను. నీకివ్వవలసింది యిచ్చేస్తాను. వచ్చి పట్టుకుపో" అని రెడ్డి కబురు చెయ్యగా రావులయ్య మఱల వచ్చెను. మొదట నాతనికి రెడ్డి పెద్ద కొమార్త కాన్పించెను. "ఇలా చేస్తావా?" అని యామె యడుగగా "ఏమి తప్పు చేశానూ? మీ బాబు నన్ను పెంచాడు. రెక్కలు వచ్చాయి. సొంతంగా తంటాలు పడతానన్నాను. యేం తప్పు వుందీ యిందులో?" అని యాతడు మాఱు ప్రశ్న చేసెను.

"మాబాబు నిన్ను అల్లుడ్ని చూసినట్లు చూశాడు."

"మీ బాబుని నేను రాజుని చూసినట్లు చూశాను."

"చివరికి గొంతుక్కోశావు."

"నీకంతకంటే మృదువైన మాట యెలా వస్తుందీ? నీ అక్కసు తీర్చుకో."

"తీర్చుకోడానికేం వుందీ? వుంటే మాత్రం తీర్చుకోవడం యెలాగా?"

"ఇదే పద్ధతి –"

"మాటలు నేర్చావు."

"నీ దగ్గరే."

ఆమె మఱి మాట్లాడలేదు. చాలా కోపముతో నింటిలోనకి బోయెను.

ఇంతలో రెడ్డి వచ్చి రావులయ్యను గాదె వద్దకు గొనిపోయెను. "ఇప్పుడు హఠాత్తుగా నువ్వు నన్ను విడిచిపోయినా నీ వుపకారాన్ని నేను మరవను. నీకు ఇనాముగా పుట్టెడు ధాన్యం యిస్తున్నాను" అని రెడ్డి చెప్పగా "బతికి వున్నంత కాలమూ మీ పేరు తలుచుకుంటాను" అని రావులయ్య బదులు చెప్పెను.

రెడ్డి ఈయవలసిన దంతయు ఇచ్చివేసి రావులయ్యను పంపివేసెను. ఇనాము సంగతి విని రెడ్డి పెద్దకొమార్త కోపపడియెను. భార్య "యెవరితోటీ చెప్పలేదేం?" అనియెను. "లేచిపోయిన వాడికినామేటీ?" అని యిల్లు చేరిన రెండవ అల్లుడు అనియెను.

✡

అత్తగారు వీధి తలుపులు బిగించి రాగా భార్యయగు భూలోకమ్మ మూడు కుండలు తెచ్చి ముందు ఉంచెను. రావులయ్య ధ్వని కాకుండునట్లు రూపాయలు బోర్లించి నింపాదిగా లెక్కించి "రెండు వేల పైచిల్లర" అనియెను. "ఇంకో నాలుగు వందలు అప్పుతెచ్చి వేసుకుంటే రెండకరాల భూమి" అని అత్తగారనియెను. భూలోకమ్మ మాట్లాడక ముఖము దెస చూచుచుండగా అతడు "ఏమంటావు?" అనియెను.

"మీ యిష్టం. ఆడాళ్ళకేం తెలుస్తుందీ?"

"అయినా కొంచెం చెబుదూ?"

"మా అమ్మ బూమి అంటోంది."

"నీమాట చెప్పమంటే"

"రావులూ; నామాట యిని బూమి కొను. రెక్కలు తిరం గావు."

"బూమి కొంటే పెట్టుబడి యేదే అమ్మా?"

"అప్పు తేవచ్చును."

"ఈ అప్పూ ఆ అప్పూ కలిస్తే తడిసి మోపిడవుతుంది. ఏం లాభమూ?"

"బాగా చెప్పేవు నువ్వు. మంగిపూడి వారి గరువు ముప్పందుం వాటా కౌలుకి వచ్చింది. శిస్తు రాయితీగా వుంది. పుచ్చుకుని అంతా తోట వేసేస్తాను ఈ యేడు."

"మీదటికి బోడితోటా వుంచొచ్చు."

"మాంతామా? ఏమత్తా! ఏమంటావు?"

"అలాగే చెయ్యి నాయనా!"

మంగిపూడి వారు వచ్చి మకాము వేసిరి. "రావులూ! పోనియ్యకు" అని తిరపారెడ్డి హెచ్చరించెను. రైతులందఱును యెకరమునకు తోట శిస్తు యెనుబది రూపాయలనుచుండగా నీతడు "తొంభయి" అనియెను. వారు "ఇంకో అయిదు" అనగా ఇతడు "మీమీద అయిదు" అనియెను. ఎదుటి వారు వీగిపోయిరి. పంపు రావులయ్యకు స్థిరమయ్యెను. "యెనిమిదేళ్ళ కవులూ, తోటశిస్తు తేలే వుంది. తోటలేని సంవత్సరాల్లో కుంచపు కావిళ్ళు. షరతాఖరు వూద్చడం" అని రావులయ్య చెప్పగా వారు అంగీకరించిరి; గాని "నీ సంగతి మాకు కొత్త. రెండు వందల ధరావత్తు కట్టు. ఫాయిదా యివ్వము" అనిరి. మాఱు పలుకకుండ రావులయ్య వారికి రూపాయలిచ్చివేసి కవులు కదపాలు పూర్తి చేయించుకొనియెను.

ఇనాముదారులు వెడలిపోయిన తరువాత ప్రాతరైతు "గరువు వదలను" అని యక్కడక్కడ చెప్పగా ఆమాట రావులయ్య చెవిన బడెను. "ఇది నిజమేనా? అని అడిగి రా" అని రావులయ్య పాలికాపును పంపెను. "నాకింకా రెండేళ్ళు కవులుందోయి యెఱ్ఱినాయాలా! భూమి దగ్గరికి యెలా వస్తారో చూస్తాను" అని ప్రాతరైతు చెప్పగా పాలికాపు "ఇనాందార్లు వచ్చినప్పుడు యెందుకూరుకున్నారూ" అనియెను. "నాకేమి అవసరం? నా కవులు ప్రకారం నేను దున్నుకు పోతాను" అని యాతండు మఱల చెప్పగా పాలికాపు "గొడవలు పెరుగుతాయి" అనియెను.

రావులయ్య యిది వినియెను. “బయపడకు” అని తిరపారెడ్డి ధైర్యము కొలిపెను. “వుండు. కుర్రాళ్ళని తీసుకువస్తాను” అని అత్తగారు దుగ్గుదూరు వెళ్ళెను. రావులయ్య తన బంధువల కందఱకును కబురు చేసెను. “పున్నమనాడు – చేలో ప్రవేశిస్తాను. చేతనైతే అడ్డు రమ్మను” అని యాతడు ప్రాత రైతునకు గూడ కబురు చేసెను.

నడివీధిలో వంద మంది రైతులు కూర్చుండి యుండిరి. ప్రాతరైతు అక్కడనే యుండగా ఏదో పనిమీద ఆ దారిని వెడలుచున్న రావులయ్య “పున్నం నాడు చేలో ప్రవేశిస్తాను. చేతనైతే అడ్డురా” అని గొంతెత్తి చెప్పి సింహకిశోరము వలె వెడలిపోయెను.

రావులయ్య నుద్దేశించి అనేకులనేక విధముల మాట్లాడిరి. “నిన్న గాక మొన్నొచ్చేడు. ఎంత ధైర్యమూ?” అని యొకడనెను. “కావెడు కుండలతో పొట్ట చేత పుచ్చుకువచ్చి నోడికి యెంత పెంకితనమూ?” అని యొకడనెను. “ఇంతమందిలో అంతమాట అన్నాడు. నిజంగా అడ్డెళ్ళకపోతే మనల్ని లోకువ చేస్తాడు” అని యింకొకడనియెను. “మేము వున్నాం. నువ్వు జంకకు” అనియొకడు ప్రాతరైతును హెచ్చరించెను. “కులంవాళ్ళం అందఱూ వస్తాము. డబ్బు ఎంత పడ్డా నువ్వు పెట్టుకోవాలి. చేనికాడికి యెవరు – యినాందార్లు వచ్చినా సరే పాతేస్తాము” అని వేఱొకడనియెను. “యెవ్వారంలోకి దిగితే రెండువేలకు తక్కువ కావు. ఆలోచించుకో” అని మఱియొకడనెను. “ఆ చేనే అన్నమాటేటీ? మఱి దొరకవేటి కావాలంటే? ఆ యేడుపేదో యినాందార్ల దగ్గర యేడవ లేకపోయావా? శిస్తు యెక్కువ పెడితే నీకిందే వుండిపోవునే? వారి పంపు వారి యిష్టం వచ్చిన వాడికి యిచ్చుకుంటారు. సమయంలో వొదులుకుని యిప్పుడు గంతులెయ్యడం యెందుకూ?” అని యొక వృద్ధుడనగా మఱియొక వృద్ధుడు ముందునకు వచ్చి “వాడు తెలగా వాడురా. యెందుకు పరిగెడతారు. వూరుకోండి” అనియెను. దీనిమీద చాల గందరగోళము జరిగిన తరువాత నెవరిదారిని వారు పోయిరి. “యేమంటావు? అడ్డెళ్ళడం నిరుకేనా” అని యొకడడుగగా ప్రాతరైతు “చూద్దాం” అని మాఱు పలుకకుండ వెడలిపోయెను.

✡

రావులయ్య క్రొత్త చేనిలో ప్రవేశించెను. వెంటనిరువురు బావమఱుదులు మాత్రము దండధరులై యుండిరి. ప్రక్కన కొలది దూరమునందే సొంత చేనిలో ఏదో చేయుచున్న ప్రాతరైతు చూచుచునే తలవంచికొని యూరకుండెను. ఆ దారిని వెదురుపాక వెడలుచున్న మునసబును, తిరపారెడ్డియు చూచి “ప్రవేశించావటోయి!” అని పలుకరించిపోయిరి.

రావులయ్యకు భూతృష్ట తీరలేదు. రాయవరమున షరతాఖరైన భూములన్నియు నాతడే పుచ్చుకొనియెను. గిద్దెడు భూమిలేదు; గాని గ్రామమునందలి రైతులందఱిలోను పెద్దరైతు. దొప్పెడు నివేశనము లేదు; గాని ఆతని పశువులశాలంత శాల ఆ యూరున లేదు. భూలోకమ్మ

చేతిపాలు, పెరుగు, మజ్జిగ, నేయి ప్రఖ్యాతి పొందెను. ఆమె తల్లి దర్జాకు లోటనీ, వయస్సు పెరుగుట వలన దంపు మానివేసి యింటి పనులు చేయసాగెను.

పది సంవత్సరములు గడచినవి. ఈకాలమున రావులయ్యకు వయస్సు పెరిగినది. సంసారము పెరిగినది. సంపత్తు పెరిగినది. పలుకుబడి పెరిగినది. యశస్సు పెరిగినది. సర్కారు ఉద్యోగస్థుల రాకపోకలు గూడ పెరిగినవి; గాని మత్తు పెరగలేదు. బద్ధకము. పొడచూపనైన లేదు.

"సొంత భూములు సంపాదించాలి" అని యాతనికి బుద్ధి పుట్టినది. భార్యగూడ అందులకు ప్రోత్సాహించినది. అత్తగారి మాట చెప్పనే అక్కఱ లేదు. ఒకనాడు తిరపారెడ్డి వచ్చి "రావులూ, నీ సిరీ, సంపద చూస్తే ముచ్చట అవుతోంది. కాని యెన్నాళ్ళు పొరుగింట్లో వుంటావు? యెన్నాళ్ళు కూలికొండలు దున్నుతావూ? వ్యాపారం మార్చవోయి యీపాటికీ" అని చెప్పిపోయెను.

సకలమును నిశ్చయించుకొని యొకనాడు రావులయ్య కరణముతో మాట్లాడెను. "భూములు మంచివా చెడ్డవా అంటే నేనే ఆ సంగతి చూసుకుంటాను. ఈ వూళ్ళోని భూములు నాకు తెలవనివి కావు. తగువులు తాకట్లూ యిలాంటి చిక్కులు ఏమీ లేని భూంలు అమ్మకానికి వస్తే పోనీయకండి. నాకు మీరు భూమి కొనిపెట్టండి. తరవాత రావులయ్య సాహసం పరీక్ష చెయ్యండి" అని యాతడు చెప్పగా "అద్దే! నాలుగేళ్ళ నుంచి నీచేత భూములు కొనిపించాలని చూస్తున్నాను. ఇక చూడు నా మజా" అని కరణము చెప్పెను.

ఆ సంవత్సరము అతడు తొమ్మిది యెకరముల పదునాలుగు సెంట్ల భూమి కొనియెను. ముప్పది సెంట్ల నివేశనము కొనియెను. ఇటిక మున్నగు పరికరముల సంపాదనము ప్రారంభించెను.

ఇల్లు కట్టుట వలన రెండవ సంవత్సరమాతడు భూమి కొనలేదు. మఱల నాలుగైదేండ్లు గడచినవి. సర్కారు లెక్కలు చూడగా ఇరువది యాఱు యకరముల డెబ్బదియాఱు సెంట్ల భూమి అతనిపేర నమోదు అయియుండెను.

రోడ్డునకు చేరియున్న చింతపెరటి లోని కరణముగారి బంగళా రావులయ్యయే కట్టించెనని కొందఱు కొంచెము రహస్యముగా చెప్పుకొనుట గలదు.

రాజుగారి తోటకును, మురుగు కాల్వకును నడుమ రోడ్డునకు చేరియున్న బియ్యపు మర రావులయ్య సంతత పరిశ్రమను ఆ మార్గమున బోవు వారికి బోధించుచున్నది.

✡

# దృశ్యాలు మూడు.. ఒక ఆవిష్కరణ

**–సుంకోజి దేవేంద్రాచారి**

"బిన్నే యెలబారబ్బోడా... కరెంటొచ్చే యాళయింది" ఇంటి ముందుకొచ్చి పొద్దుకల్లా ఎగజూసి చెప్పినాడు నారాయణ.

చేతిలో వున్న పుస్తకంలోనించీ చూపు మరల్చి గోడ గడియారాన్ని చూసి "తొమ్మిదే గదా.. పదికి కరెంటొచ్చేది. ఇంగా గంట వుండాదిలే. పోతాను" బదిలిచ్చినాడు భాస్కర్ ఇంట్లోనించీ.

"ఎదుర్రాయ్యే.. ఎన్నిసార్లు చెప్పాల నీకు" కసురుకున్నట్టుగా అన్నాడు నారాయణ.

అంతవరకూ వంటగదిలో పనిలేక పోయినా ఏదో పనున్నట్టు తిరుగులాడుతున్న సావిత్రమ్మ వీధి గుమ్మంలోకి వచ్చింది.

తడులు తగ్గిన చెరుగ్గడలా వున్నాడు నారాయణ. అతని వంటిపైనున్న బట్టలు వుతికినవే అయినా మాసినట్టుగా వున్నాయి. ఎడమ భుజంపైన రంగు వెలసిన టర్కీటవల్ వుంది. అతనికి ఎదురుగా ఎముకల గూడులా వున్న రెండు ఎద్దులు. వాటి మెడల్లోని పలుగులను ఎడమచేత్తో పట్టుకుని నిలబడుకోనుండాడు నారాయణ.

బక్క ఎద్దులను, భర్తను చూడగానే గుమ్మంలోనే ఆగిపోయింది సావిత్రమ్మ.

"గొడ్ల సంతకా.." అడిగినాడు గరికిపోచలా వుండే సిద్దారెడ్డి. నారాయణ సమాధానం చెప్పకముందే "ముల్లుబరగ తీసుకోలేదే" అన్నాడు తిరిగి తనే.

"ఇంట్లో పుట్టి పెరిగినోటియి. పదైదేండ్లమింటీ ఈటితో సేద్దెం చేసినా, ఏ పొద్దేగానీ ముల్లుబరుగ ముడ్డిమింద పెట్టిందిలే. నోరులేందొగటే. మనసలకన్నా ఎక్కువ" అన్నాడు నారాయణ.

అతని గొంతులో దు:ఖం ధ్వనించిందో, సంతోషం ధ్వనించిందో అర్థం కాలేదు సిద్ధారెడ్డికి. భర్త మాటలతో సావిత్రమ్మ కనుకొలకుల్లో నీళ్లు నిలిచాయి. ఇంటి లోపలివైపు తల తిప్పి పైట చెంగుతో కళ్లు తుడుచుకుంది.

"నిరుటికి వానలు పడితే ఏం చేస్తావుబా.. సేద్దిం చేయవా..?" సిద్ధారెడ్డి.

"అందాకా బతికుండాల గదాన్నా. ఈటినమ్మితే రెండు మూడు నెల్లు బత్తెమన్నా వస్తాయి. లేకుంటే ఆకలితో సస్తామేమో అనిపిస్తాంది" దిగులు ధ్వనించింది నారాయణ గొంతులో.

"నిజమే.. దిగవీధిలో అప్పులు, ఆకలితోనే గదా సుబ్బయ్య పురుగుల మందుతాగి సచ్చిపోయింది. ఏం చేద్దాం రైతుల బతుకులు అట్లుండాయి. మా కొడుకయితే వుండే నేలంతా అయిన కాడికి తెగనమ్మేసి తిరపతికి పదామంటా వుండాడు. ఇంగా ఎట్లా కాలం వస్తాదో ఏమో.. ఈసారన్నా వానలు పడతాయనే ఆశతో ఉండా. వస్తాప్పా.. పనుండాది" అక్కడి నుంచి వెళ్లిపోయాడు సిద్ధారెడ్డి.

మృత్యుమేఘాలు వూరంతటినీ కమ్ముకున్నట్టనిపించింది నారాయణకు. ఆకాశం కల్లా చూసినాడు. కొత్త చీపురుతో శుభ్రంగా ఊడ్చినట్టుంది.

"ఎదుర్రాయే ఎన్నిసార్లు చెప్పాల" కసురుకున్నట్టుగా అన్నాడు భార్యతో...

ముక్కులు ఎగబీలస్తా ఎద్దులకు ఎదురు వచ్చింది సావిత్రమ్మ.

"వోన్ని బోరు కాడికి పొమ్మని చెప్పు. కరెంటొస్తాది" అని మళ్లీ ఒకసారి చెప్పి, ఎద్దులను తోలుకుని చింతమాకలపల్లి గొడ్ల సంతకు ఎలబారినాడు నారాయణ.

సావిత్రమ్మ మౌనంగా వంటింట్లోకి పోయింది. మరో పదినిముషాలకు పుస్తకాన్ని పక్కన పెట్టాడు భాస్కర్. చెప్పులు వేసుకుని, "అన్నమెత్తుకోనిరా... నేను తోటకాడికి పోతాండా" చెప్పి బయటపడ్డాడు భాస్కర్.

దారి పొడవుకూ మలమలా నేల మాడిపోయిండాది. ఆకులు రాలిన సీతాఫలం చెట్లు చిగిరించకుండా నల్లగా కమిలిపోయిండాయి. అప్పుడే పొయ్యిలోనించీ తీసిన చింతనిప్పు మాదిర్తో వుండాడు సూర్యుడు. ఎక్కడో.. నీటి ఆదరువు వుండే దగ్గర కొంచెం కొంచెం నేల పచ్చపచ్చగా కనిపిస్తా వుండాది. అరగంటలో తోటకాడికి చేరుకున్నాడు. ఎకరా నేలలో చెరకు నాటిండారు. నీళ్లు తక్కువయ్యి అరెకరా నేలలో చెరుగ్గెడలు ఒరుగుల మాదిరి అయిపోయిండాయి. మిగిలిన అరెకరాలో కొనూపిరితో ఉన్నట్టుండాయి.

తోటనే కొంచేపు చూసి స్టార్టర్ కాడికిపోయి స్విచ్ వేసినాడు. కరెంటు రాలా, గెనం మీద వుండే కానగచెట్టు కింద నిలబడుకోని తోటనే చూస్తా వుండాడు భాస్కర్.

"అల్లుడూ.. ఎండిండే తోటను ఎంచేపు చూస్తావు.. కరెంటొచ్చిండాది మోటరెయ్యి" నీరసంగా మాటలు వినిపిస్తే తలతిప్పి చూసినాడు. ఎదురుగా సుధాకర్ నాయుడు. "కరెంటొచ్చిందా.. ఇంతకుముందు చూస్తే రాలేదే.. యాడికి పోయిన్నేవు మామా" అంటూ గబగబా పోయి స్విచ్ నొక్కినాడు భాస్కర్.

సుధాకర్‌నాయుడు ఏదో చెప్పినాడు. మోటార్ చప్పుడులో భాస్కర్‌కు వినిపించలా. పైపులోంచీ నీళ్లు సన్నగా వస్తాండాయి. పన్నోటియి పన్నెట్టే యిమిరి పోతాండాయి. యిమిరినంక నత్త నడిచినట్టు నీళ్లు కాలవంటీ పోతావుండాయి.

సుధాకర్‌నాయుడు ఫుల్లుగా నీళ్లు తాగి కానగచెట్టు కిందికి పోయినాడు. పార పక్కన పెట్టుకుని కూచ్చోనుండాడు భాస్కర్.

"ఏం మామా అన్ని నీళ్లు తాగితివే.." నవ్వుతా అడిగినాడు.

"తినింది అరక్క తాగినా అబ్బోడా..?" అన్నాడు.

అర్థం కానట్టు చూసినాడు భాస్కర్.

"ఒగ పక్క చూస్తే ఈ వానదేవుడు ఎవురో నెత్తిన మెడ్తో కొట్టినట్టు కురిసేదే మాను కున్నేడు. ఇంగో పక్క మేం పండించే జిలకర మసూర బీమన్నం ముక్కల్దాకా తినేది నువ్వు. వడ్డీలకు దుడ్డిచ్చి చక్రవడ్డీ తీసుకుంటూ జలగ మాదిర్తో మమ్మల్ను పీల్చిపిప్పి చేసేది నువ్వు. మేము అప్పులతో, ఆకలితో, అవమానాలతో సస్తాంటే తినింది అరక్క సస్తాండారు మీరు అంటావా.. కడుపుకు కూడుతిన్నోడు మాట్లాడే మాటలేనా ఇయ్యి..?" ఆవేశంగా అన్నాడు సుధాకర్‌నాయుడు పైగుడ్డతో చెమట తుడుచుకుంటూ.

భాస్కర్ బిత్తరపోయాడు. ఎవరిని తిడతా వుండాడో అర్థం కాలేదు.

"ఏంది మామా.. పిచ్చిపట్టినోడి మాదిరి మాట్లాడతుండావే" అన్నాడు.

"అవును.. నాకు పిచ్చే పట్టిండాది. నెలకు మూడు వానలు పడతాండాయి. ఎకరాకు నలభై మూటలు వడ్లు పండుతాండాయి. మూడుపూటలా ముక్కల్దాకా తింటాండాము. అప్పుల్లేవు. ఇంట్లో ఎవురూ ఎసనంతో సావలా.." అంటా వలవలా ఏడ్చేసినాడు సుధాకర్‌నాయుడు.

భాస్కర్‌కు అర్థమయ్యీ కానట్టుగా వుండాయి ఆ మాటలు. కాలవలో ఎండిన నీళ్లకు చెరుకాకులు అడ్డం పడింటే పోయి వాటిని తీసేసి వచ్చి మౌనంగా కూర్చున్నాడు భాస్కర్.

కాసేపటి తర్వాత పైపు దగ్గరికి పోయి ముఖం కడుక్కుని వచ్చి చెట్టుకింద కూర్చొని భాస్కర్‌వైపు చూసి బలవంతంగా నవ్వాడు సుధాకర్‌నాయుడు.

భాస్కర్ కూడా నవ్వి వూరుకున్నాడు. సుధాకర్‌నాయుడు మాటలు కొనసాగించాడు.

"మాది ఉమ్మడి కుటుంబం.. తెలుసుకదా అబ్బోడా. ఇప్పటికి పన్నెండు బోర్లేసినాం. నీళ్లులే. అప్పులయిపోతిమి. దినమ్మూ ఇదే ఎసనంతో మా అన్న నెలకింది కయ్యకాడ చెట్టుకు ఉరేసుకోని సచ్చిపాయ.." మాటలాపేశాడు.

గొంతుకు ఏదో అడ్డుపడ్డట్టుగా గొంతు పెగల్లేదు. తెపరాయించుకున్నాక, "వానపడలా. నీళ్లు లేకుంటే సేద్యం లేదు గదా. వానలేదు. బోరెయ్యాల్సిందే. మన ఇలాకాలో దుడ్డుండే మనిషి మీ వూరి సర్పంచేగదా. ఎవురుకి అప్పుకావాలన్నా ఆయన దగ్గరకు పోవాల్సిందే కడాసారిగా బోరేద్దామనుకున్నేం. ఈసారి నీళ్లు పడకపోతే అయినకాడికి తెగనమ్మేసి అప్పులకు కట్టేసి టౌనుకు పోతాం. ఆడ కూలి చేసుకున్నే బతికిపోవచ్చు. బోరేసేదానికి దుడ్డుకోసరమని సర్పంచుకాడికి పోతి. వూగే కుర్చీలో కూచ్చోని ఎనక్కీ ముందుకూ వూగుతా ఆయప్ప 'తినింది అరక్క రైతులు సస్తాండారు' అంటాడా. వోడు మనిసేనంటావా" మళ్లా కోపం వచ్చేసింది సుధాకర్‌నాయుడుకు.

"నువ్వేమన్నేవు మామా"

"ఏమంటాను.. కాలం మనదిగాదు. పేదోనికోపం పెదవికి చేటుగదా. గమ్మున వచ్చేసినా. ఎవురితో చెప్పుకోలా అబ్బోడా. ఇంట్లో పెద్దోళ్లమందరమూ రెండు దినాలనించీ పస్తుండాం" అతని గొంతు మూగబోయింది.

చాలాసేపు మౌనంగా వుండిపోయారు ఇద్దరూ.

"ఇంటికి పోతాండా అబ్బోడా" లేచినాడు సుధాకర్‌నాయుడు.

"వుండుమామా.. అన్నం తెస్తాది" అన్నాడు భాస్కర్.

"ఆ మాట చాల్లే అబ్బోడా. తిన్నంత తృప్తి. ఇంగోసారి కడుపు నిండుకు నీళ్లు తాగి పోతా" అని నీళ్లుతాగను పైపు దగ్గరకు పోయాడు సుధాకర్‌నాయుడు.

నీళ్లు తాగుతున్న సుధాకర్‌నాయుడిని చూస్తుంటే భాస్కర్ మనసు పాతాళభైరవితో కలబెట్టినట్లయింది.

✡

"ఈసారి దరిద్రం తీరిపోయినట్టే" అన్నాడు నారాయణ బీడీపొగ నోటినిండుకూ లాగి వదులుతూ.

చుట్టూ పరిశీలనగా చూసి "ఔన్నా" అన్నాడు నాగులయ్య కూడా బీడీ తాగుతా.

"ఈ మాదిరిగా వానపడి ఎన్నాళ్లయిందినా..మాయమ్మి పెద్దబిడ్డయిన సమచ్చరం పన్నేయి వానలు. ఆయమ్మికి పెండ్లయ్యి ఇద్దురు బిడ్డలుగూడా.." కలగజేసుకున్నాడు గంగులయ్య.

వాడుమొగం పెట్టినాక వానపడితే కళకళలాడే వేరుశెనగ చెట్టు మాదిరిగా ఉండాడు నారాయణ. పంచెను పుట్టుగోసి చెక్కిండాడు. తలకు రుమాలు చుట్టిండాడు. వంటి మీదుండే

గాడాగుడ్డ బన్నీను దుంకలు పడిండాది. మోకాళ్లదాంకా బురదుండాది. గోసి మీదా బురద చుక్కలుండాయి. మిగిలిన ఇద్దరూ దాదాపు అదేవిధంగా వుండారు.

"ఎంతన్నా... నాలుగెకరాలా..?" అడిగినాడు చేడకేసిండే మడికల్లా చూసి నాగులయ్య.

"బాయికింద ఉండేదంతే గదా. రెండెకరాలు.."

"అంతా మడే నాటేస్తాండారాన్నా.." అన్నాడు గంగులయ్య.

"నాటనీరా.. నీళ్లున్నెప్పుడు గూడా మడి నాటుకోకుంటే ఎట్ల? చెరువుకింద నాటేస్తే వుద్దరకు పండిపోతాయి కదా. మిషనెయ్యాల్నా పాడా.. ఈడన్నా కరెంటుండాల" అన్నాడు నాగులయ్య.

పొడవు నిక్కరు. బన్నీను వేసుకోని పారతో అండ చెక్కతా వుండే భాస్కర్ మోకాళ్లమింద చేతులానించుకోని తలపైకెత్తి "ఎంచేపు మీరు బీడీలు తాగేది. అన్నమేళ అయితాండాది. రాండి బిన్నే" అన్నాడు.

"వస్తాండాం లేప్పా.. అర్సద్దు.. ఈనికెప్పుడూ పనిమిందే లోకం" అని గబగబా రెండు దమ్ములు లాగి బీడీని మడి కయ్యలో ఏసి "రాండి పోదాం" అంటా కయ్యలోకి దిగినాడు నారాయణ. నాగులయ్య, గంగులయ్య బీడీలను ఆర్పి చెవుల్లో చెక్కోని కయ్యలోకి దిగినారు. మడకల దగ్గరుండే ఎద్దులు నెవురేస్త నిలబడుకోనుండాయి. బురదలో చెక్కించే ముల్లుబరగ తీసుకోని ఎడం చేత్తో మేడి పట్టుకోని "హాయ్.. హాయ్.." అని ఎద్దల్ను అదిలించినాడు నారాయణ. అతన్ని అనుసరించారు మిగిలిన ఇద్దరూ.

కనిపించేంత దూరం పచ్చగా వుండాది. పచ్చగా లేని తావనంతా నీళ్లుండాయి. చెరువులూ, బావులూ నీళ్లతో తొణికిసలాడుతూ వుండాయి. మడి కయ్యలన్నీ చేడ కేసిండారు. దాదాపు రైతులందరూ సేద్యం పనుల్లో వుండారు. కొందరు హుషారుగా పాటలు పాడతాండారు.

"అన్నో.. ఒదిన అన్నమెత్తుకోనొస్తాండాది" అన్నాడు గంగులయ్య.

"పొద్దు పదిబారలుగూడా ఎక్కలా. కడుపులో నక్కలు దూరినాయంటారా" నవ్వతా అడిగినాడు నాగులయ్య.

"ఈ పొద్దు సద్దిగూడా తాగలా.. నారాయణన్నోళ్ల పని గదా. అట్లే వచ్చేసినా." బదులిచ్చినాడు.

"రండిబ్బా.. తిందురు" కానగ చెట్టుకింద అన్నం గంపను దింపి పిల్చింది సావిత్రమ్మ.

"పాండి. పాండి.. తిందాము... ఓ..ఓ..ఓవ్..' అంటూ పగ్గాలు బిగపట్టినాడు నారాయణ. ఎద్దులు తలలు పైకెత్తి నిలబడిపోయినాయి.

ఎనక మడకలు కూడా నిలిపేసినారు. పగ్గాలను మేడికి చుట్టి, ముల్లు బరగలను పక్కనే బురదలో చెక్కి గెనంమిందికి వచ్చినారు.

"ఏం కూరొదినా.." అడిగినాడు నాగులయ్య.

"ఏదో లేప్పా.. ఊరిమిండో పచ్చిపులుసో కలిగింది చేసుకోనొచ్చిండా లేరాండి" అనింది సావిత్రమ్మ.

భాస్కర్‌కూడా అండచెక్కేది ఆపేసి గెనం మిందికి వచ్చినాడు. అందరూ కానగ పుల్లలు యించుకోని నమిలి ఇట్ల నాలుగుసార్లు అట్ల నాలుగుసార్లు తోమి బాయికాడికి పోయి నోర్లు, కాళ్లు, చేతులు కడుక్కున్నారు.

బాయినిండి పొళ్లతాండే నీళ్లను చెర్లోకి పొయ్యే వంకలోకి మళ్లించిండారు. బోరు మోటారు తీసి బాయిగడ్డన పెట్టి సంచిపట్టలతో కప్పెట్టిండారు.

పచ్చగా వుండే నారును చూసి "ఎన్నాళ్లయిందినా నారుపోసి" అడిగినాడు గంగులయ్య.

"ఈ పొద్దు శుక్రవారం కదా. రేపిటికి సరిగ్గా నాలుగు వారాలు అవుతాది" చెప్పినాడు నారాయణ.

"ఎప్పుడు నాటాలని?"

"జిలకర మసూర కదా. ఆరువారాలకు నాటదామని. చేడకేసేసి ఆకు తొక్కి వొదిలి పెట్టేసినామంటే.. మళ్ల నాటేది" అన్నాడు నారాయణ.

"ఆకేడుండాదినా.."

"చేనికాడా కానగచెట్లు, యేపచెట్లు వుండాయి గదా. వుండేకాడికి ఏసేది" అన్నాడు భాస్కర్.

అందరూ చెట్టుకిందకు వచ్చినారు. భాస్కర్ బిందె తీసుకోనిపోయి బాయిలో నీళ్లు ముంచుకోని వచ్చినాడు. వర్సగా కూచ్చొన్నారందరూ. మర్రి ఆకులతో కుట్టిన విస్తరాకులు ఇచ్చింది సావిత్రమ్మ. ఆకుల్లో నీళ్లు చల్లుకున్నాక అన్నం పెట్టి చెనిగ్గింజల ఊరిమిండి వేసింది.

అన్నం చూస్తానే "ఏంది ఒదినా.. స్టోర్ బియ్యమన్నం మాదిరిగా వుండాదే" అన్నాడు నాగులయ్య.

"స్టోర్ బియ్యం కాక ఈడ మీ అన్నేమన్నా రాజనాలు పండించినాడాప్పా" అడిగింది నవ్వతా సావిత్రమ్మ.

"పండించేదానికి మీ వొదినేమన్నా వాన కురిపించిందేమో అడుగప్పా" అన్నాడు నారాయణ ఒక ముద్ద కండ్లకద్దుకోని పక్కన పెడతా.

“ఎప్పుడూ జిలకర మసూరానే కదాన్నా పండిస్తాండారు” అడిగినాడు గంగులప్ప.

“పండిస్తే అయ్యి ఎవురో మారాజులు తినేదానికి. ఉద్యోగస్తులు, మన మండల ప్రెసిడెంటు.. ఎంపీపీలు, ఎమ్మెల్యేలు మంత్రులు తినేదానికి. మనం తినేదానికా..?” ఎదురు ప్రశ్నించినాడు నారాయణ.

“ఆరేండ్లనించీ స్టోర్ బియ్యమే తింటాండాం. ఒగోసారి అయ్యికొనుక్కోవాలన్న కష్టమయి తాండాది” చెప్పినాడు భాస్కర్.

కొంతసేపు అందరూ మౌనంగా వుండిపోయినారు.

“కూలోల్లమూ స్టోర్ బియ్యమే తినేది, రైతులూ స్టోర్ బియ్యమే తినేదా..” గొణిగినట్టుగా అన్నాడు నాగులయ్య.

“మీరే మేలుబ్బా.. పనులుండే వూర్లకు పోయి కూలిపని చేసి సంపాదించుకోని తింటారు. మేమది కూడా చేయలేమే. ఇంట్లో పుట్టి పెరిగిన ఎద్దలను అమ్ముకోని బియ్యం కొనుక్కోని తిన్నేమే” అనింది సావిత్రమ్మ. ఆమె గొంతులో జీర ధ్వనించింది. అన్నం తినేంత సేపూ ఎవ్వరూ మాట్లాడలేదు.

అన్నం తిని చేతులు కడుక్కుంటా వుండగా సుధాకర్‌నాయుడు వచ్చినాడు, మనిషి బాగా అలిసి పోయినట్టుగా వుండాడు.

“బాగుండారా.. సుధాకరా.. యాడికి పోయింటివిప్పా..” అడిగినాడు నారాయణ.

“..బీడీ ఒగటీ మామా.. తలనొప్పిగా వుండాది” చెట్టుకిందికొచ్చి అన్నాడు సుధాకర్ నాయుడు.

నారాయణ బీడీ అగ్గిపెట్టె ఇచ్చినాడు.

“అన్నం తినన్నా” అంది సావిత్రమ్మ.

“అన్నం తినేది మానేసిండామ్మ. దినమ్మూ కడుపునిండాకు మా అమ్మ నెత్తురు తాగతాండా...” అన్నాడు బీడీ ముట్టించుకొనేది కూడా ఆపేసి.

అక్కడున్న ఐదుమందీ ఆ మాటలతో బిత్తరపోయినారు. పిచ్చివాన్ని చూసినట్టు సుధాకర్ నాయుడు వైపు చూసినారు.

సుధాకర్‌నాయుడు బీడీ వెలిగించి దమ్ములాగి పొగ వదులుతూ అందరివైపూ చూసినాడు. ఆ చూపుల్లో దేనిమీదో, ఎవరిమీదో... కసి కోపం కనిపించాయి.

“ఏంది సుధాకరా.. నువ్వు చెప్పింది నాకేం అర్థంకాల..” అన్నాడు నారాయణ మెల్లగా.

“ఎందుకర్తమయితాది.. కాదు.. అయినా కానట్టేగదా వుంటావు. రెయ్యీపగలూ కడుపులు అంటగట్టుకోని కష్టపడతాండేది మేము. నెత్తురునంతా చెమటరూపంలో కార్చి జిలకర మసూర పండిస్తాండేది మేము. అయ్యి ఇంట్లో కూచ్చోని పలావన్నం వండించుకోని తింటాండేది నువ్వు. కడుపుతో ఉన్నె ఆడిబిడ్డ జిలకర మసూరన్నం కావాలమ్మా అంటే పెట్టేదానికి ఇంట్లో ఒగ పావుగూడా లేవు. మేం పండించి నోటియన్నీ తింటాండేది మేమా నువ్వా.. మా నెత్తురు కూడా తినేది నువ్వు.. మేము మడిచేస్తే తల్లి నెత్తురు తాగిందాంతో సమానం అంటావా” ఆవేశంగా అన్నాడు సుధాకర్‌నాయుడు.

భాస్కర్‌కు తప్ప ఎవ్వరికీ అర్థంకాలేదు ఆ మాటలు.

“మళ్లా ఎవురున్నా ఏమన్నా అన్నేరా మామా” అడిగినాడు భాస్కర్.

“ఎవురున్నా ఎందుకంటారు. వోడే.. ఆ ఎంపీపీ. ఇంతకుముందు సర్పంచుగా వున్నేడు కదా. ఇప్పుడు ఎంపీపీ అయ్యేలకు కండ్లకావరం పెరిగిపోయిండాది. వానలు పన్నేయి కదా. వడ్లు నారు పోసిండా. నాలుగెకరాలు మడి నాటాల. ఊరికే అయితాదా. చేడకెయ్యా లంటే దుడ్డు కావద్దా. అందుకని ఆయప్ప ఇంటికి పోతి, ఆయనంటాడు. ‘వానలు పన్నేయి.., నీళ్లుండాయిగదా అని సంబరంగా మడి నాటతాండారా.. అందురూ మడినాటితే నీళ్లు ఎన్నాళ్లుంటాయి. కరెంటు యాట్నించి తెచ్చిస్తాం.. ‘మడినాటితే తల్లి నెత్తురు తాగినట్టే’ అంటాడా?.. సరిపోయిందా నేయం. ఇన్నేండ్లు మడి చెయ్యక తిండికి లేక అల్లాడినాం. ఇప్పుడు నీళ్లుంటే మడి చెయ్యకుండా ఎట్లుంటాం. కరెంటు సరిపోకపోతే ఊళ్లెందుకుండేది. పెరికేదానికా..?” మళ్లా కోపం వచ్చేసింది సుధాకర్‌నాయుడుకు.

ఆరి పోయిండే బీడీని వెలిగించాలని నాలుగైదు అగ్గిపుల్లలు గీసినాడు. చేతులు వణుకుతుండటంతో బీడీని వెలిగించలేకపోయినాడు. బీడీని ఇసిరిపారేసి తమ వూరిబాట పట్టినాడు.

“అన్నం తినునా..’ అంటున్న సావిత్రమ్మ మాటలను కానీ

“మామా.. మామా..” అని పిలుస్తున్న భాస్కర్ మాటలనుగానీ పట్టించుకోలేదు. వెనక్కు తిరిగి కూడా చూడలేదు.

అందరూ అతడినే చూడసాగారు.

సుధాకర్ కదులుతున్న దు:ఖపర్వతంలా కనిపించాడు భాస్కర్‌కు.

ఎంపీపీ మాటలు తలచుకుంటే కోపం గొంతుదాకా తన్నుకొచ్చింది.

✡

"రామేశ్వరం పోయినా శనేశ్వరం పోలేదంట అబ్బోడా"

గెనం మిందుండే గడ్డిని కక్కులకొడవలితో కోస్తాండే భాస్కర్ పని ఆపి తలెత్తి చూసినాడు. ఎదురుగా సిద్ధారెడ్డి.

"ఏం పెద్నాయనా అట్లుంటివే" అడిగినాడు భాస్కర్.

"మడంతా నేల నెర్రెలిచ్చిండాదే. నీళ్లులేవా?" ప్రశ్నించాడు సిద్ధారెడ్డి.

"అదే నేనంటాండేది" అన్నాడు సిద్ధారెడ్డి బీడీ వెలిగించుకుంటా.

అవునన్నట్టుగా తలవూపుతూ కోసిన గడ్డిని తెచ్చి కానగ చెట్టుకింద వేసినాడు భాస్కర్.

"ట్రాన్స్‌ఫారం ఎప్పుడు బాగవుతాదంట అబ్బోడా?" అడిగినాడు సిద్ధారెడ్డి.

"స్టాకులేవంట. ఇంగా నాలుగు రోజులు పడతాదంటా వుండాడు ఎఇ" బదులిచ్చినాడు భాస్కర్.

నాలుగెకరాల్లో నాటిండే వరి మొత్తం పాలకంకి మీదుంది. పక్కన అరెకరాలో నాటిండే మిరపచెట్లు నిండుకూ మిరపకాయలున్నాయి. అయితే చెట్లన్నీ వాడుమొగం పెట్టిండాయి. వాటికాపక్కనుండే సిద్దారెడ్డి సేద్యం కూడా అట్లే వుంది.

"ఇప్పటికే నాలుగు దినాలయితాండాది ట్రాన్స్‌ఫారం కాలిపోయి. మళ్లన్నీ పగుల్లిడ్సి నాయి. తోటలన్నీ వాడుమొగం పెట్టిండాయి. ఎండచూడు ఎట్ల కాస్తాండాదో! ఇంగ నాలుగు దినాలకు రిపేరు చేస్తే.. అందాకా పాణంతో ఉంటాయా ఇయ్యి" అన్నాడు వరిపైరుకల్లా చేత్తో చూపుతా సిద్ధారెడ్డి.

"ఏం చేద్దాం పెద్దాయనా.. మన చేతల్లో పనా.. ఫీజు పొయ్యింటే ఎప్పుడో ఏసుకో నుందుము. అందురూ కెపాసిటర్లు బిగించుకుంటే కాలిపోయిండదు అంటాడు ఎఇ" అన్నాడు భాస్కర్ మళ్లీ గెనం వద్దకు పోయి గడ్డికోస్తా.

"వోళ్ల మొగంలే. అప్పటికి నువ్వు పుట్టినావో లేదో. ఇరవై ఏండ్ల ముందే చానామంది రైతులం కెపాసిటర్లు బిగించుకోనుంటిమి కదా. మీ నాయన గూడా బిగించిన్నేడు. నాలుగైదు నెల్లకు మించి పని చెయ్యలా.. అప్పుడు కాలిపోలేదా ట్రాన్స్‌ఫారాలు?"

"ఔనంట.. మా నాయన చెప్పినాడు"

"ఔనబ్బోడా.. మీ నాయన నాలుగుదినాలమింటీ కనపల్లేదే. అక్కోళ్ల ఇంటికి పోయినాడా?" అడిగినాడు సిద్ధారెడ్డి.

"యాడికీ పోలా పెద్నాయనా... ఇంట్లోనే ఉండాడు చికున్ గున్యా అంటనే.. అదొ చ్చిండాది. కీళ్లు వాపులొచ్చిండాయి. ఇట్లుండే కాలు తీసి అట్ల పెట్టకుండా వుండాడు" చెప్పినాడు భాస్కర్.

"అయ్యయ్యో అదొచ్చిందా.. ఆస్పత్రికి పోలా"

"గర్నిమిట్ట గవుర్మెంటాసుపత్రికి పిల్చకపోయిన్నే.. సూదులేసి మందులిచ్చినారు"

"పీలేరుకు పొయ్యిండకూడదా...? టౌనుకుపోతే మంచి డాక్టర్లు వుంటారు. బాగ చూస్తారు.. బిన్నే బాగయితాది" అన్నాడు సిద్ధారెడ్డి.

"పోతే బాగయితాది.. దుడ్డేదుండాది పెద్నాయినా.. మడి దున్నకాలకు, నాట్లకు, కలుపులకు అంతా అప్పేకదా. రెండుసార్లు ఎరువులు ఏసినాం. అయ్యా అప్పే ఇంట్లో ఒగ రూపాయి లేదు. టౌనుకు ఆస్పత్రికి పోయి రావల్లంటే వూరికే అయితాదా. మున్నూరు రూపాయలన్నా కాదా" దిగులుగా అన్నాడు భాస్కర్.

చాలాసేపు మౌనంగా వుండిపోయాడు సిద్ధారెడ్డి.

"ఏం చేద్దాం అబ్బోడా, మా పరిస్థితి కూడా అట్లే వుండాది. కెపాసిటరు బిగించాలని మున్నూరు రూపాయల కోసం వారం దినాలమంటీ తిరగతాండా.. యాడా దొరకలా" అని చెప్పి ఇంకో బీడీ వెలిగించాడు.

"హయ్.. హయ్.. ఎవురో గొడ్లు వదిలేసిండారే" అంటూ గెనం మింద పరిగెత్తిపోయినాడు భాస్కర్.

మిరపతోటలోకి వస్తాండే ఆవు ఆన్నే ఆగిపోయింది. రెండు క్షణాలు భాస్కర్‌నే చూసి అట్నించి అట్లే వెనక్కు పరిగెత్తింది.

"గొడ్ల మేతకు తోలుకోని పోయినోళ్లు ఎనకంటీ వుండి, ఇండ్లకు తోలుకోనొస్తే కదా" అంటా వచ్చినాడు భాస్కర్.

సాయంకాలం అవుతోంది. మేతకు పోయిండే పశువులకు వూరి దారి పట్టిండాయి. భాస్కర్ కోసిండే గడ్డిని దారాలతో మోపుగా కడతాండాడు.

"ఏం రమణా.. పందెం పుంజునెత్తుకోని పోతాండావే.. యాడన్నా పందెమా?" అన్నాడు సిద్ధారెడ్డి.

'పందేలకేడ పోతాండా మామా.. చానా ఏండ్లాయనే నిలిపేసి.. ఆ ఎంపీపీ ఇంటికి గినీ" అన్నాడు రమణ దోవలోనించీనే.

"ఎంపీపీ ఇంటికా.. ఎందుకు?"

"ఏదన్నా కష్టం తీరాలంటే గర్నిమిట్టమ్మకు పొట్టేలిని ఆగతిస్తాం కదా. అట్లే ఏదన్నా పనికావాలంటే ఈయప్పకు పందెం కోడిపుంజును ఆగతివ్వాల అట్లయితేనే పని బిన్నే అయితాది" అన్నాడు నవ్వలేక నవ్వుతా రమణ వాళ్ల దగ్గరకు వచ్చి.

"ఏం చేస్తాడు అయ్యన్నీ.. పందేలకు పోతాడా" అడిగినాడు భాస్కర్.

"ఆ.. తినేదానికి సాలవు ఇయ్యన్నీ.. ఒక కోన్ని కోసి ఏంచి పెడితే.. మందు తాగతా ఒగడే తినేస్తాడంట. ఒగ తునక కూడా మిగిలీడంట".

"ఎవరు చెప్పినారప్ప నీకు" అన్నాడు సిద్ధారెడ్డి.

"ఎవురో చెప్తే ఎట్లా తెలుస్తాది. ఆయన దెగ్గిర ఉండ్లా గుమాస్తా.. వోడు చెప్పినాడు ఒగదినం. కోడే కాదు.. దాంట్లోకి మళ్లా జిలకర మసూరాతో పలావన్నం కూడా వుండాలంట. అట్ల తిండి తినే కదా దేవరెద్దు మాదిర్తో వుండాడు" చెప్పినాడు రమణ.

"సుదాకరా.. ఏం మాట్లాడకుండా పోతాండావే.. రా పోదువుగానీ.." దోవలో పోతాండే సుధాకర్‌నాయుడుని పిల్చినాడు సిద్ధారెడ్డి.

దగ్గరకు రాకుండా దోవలో నిలబడుకోని వీళ్లవైపు చూసినాడు సుధాకర్‌నాయుడు.

"ఏంనా.. ఉరిమి చూస్తాండావే.." అన్నాడు రమణ నవ్వతా.

"ఇప్పుడే ఫుల్లుగా తాగేసి వస్తాండా.. పలావన్నం తిన్నే.. జ్యోతిలక్ష్మి సినిమా చూసినా.." అంటా వాళ్ల దగ్గరకు వచ్చినాడు.

"ఏందిరా తిక్కలోని మాదిరిగా మాట్లాడతాండావే" అన్నాడు సిద్ధారెడ్డి.

"ఎవునికి మామా తిక్క.. నీకు తిక్కేమో.. మీ మాదిరిగా నేనేమన్నా దినమ్మూ టౌనుకు పోతాండానా..? హోటల్లో పలావన్నం తింటాండానా..? మందు తాగతాండానా..? సినిమా చూస్తాండానా?" కోపంగా అడిగినాడు సుధాకర్‌నాయుడు.

మళ్లా ఏదో అయ్యింది అనుకున్నాడు భాస్కర్.

"అర్థమయ్యేటిగా చెప్పరా" విసుక్కున్నాడు సిద్ధారెడ్డి.

"నీళ్లుండాయా అబ్బోడా.." అడిగినాడు భాస్కర్‌ను.

"లేవు మామా.. ట్రాన్స్‌ఫారం కాలిపోయి మూడు దినాలయితాండాది" అన్నాడు భాస్కర్.

"ఇన్నిన్ని కోట్లు దేనికి దేనికో ఖర్చు చేస్తాండరు కదా.. అట్లే కెపాసిటర్లు కూడా బిగించేసింటే ఈళ్ల అబ్బ గంటేమిపోయిండు. అయ్యి లేకనే అంట కదా కాలిపోతాండేది" అన్నాడు సుధాకర్‌నాయుడు. అందరూ మౌనంగా వుండిపోయారు.

"మా ఊర్లో గూడా ట్రాన్స్‌ఫారం కాలిపోయి వారం దినాలయితాండాది. ఆ ఏఈకి దినమ్మూ చెప్తాన్నే పట్టించుకోలా.. పంటలన్నీ వాడుమొగం పెట్టినాయి. ఎంపీపీకి చెప్తే ఎఇని అరస్తాడు. కొత్తది బిగిస్తారని అనుకుంటి. అందుకనే వోనింటికి పోతి. అందల మెక్కాలకు

మనమెవ్వరం కానరావడం లే. పరిస్థితంతా ఇదీన్నా అని చెప్తే.. కెపాసిటర్లు బిగించుకోండి అనె. సరేన్నా.. పంటరానీ ఇప్పుడు దుడ్డేడుండాది అంటి.. దానికేం చెప్పాల. మీరే చెప్పండి" అన్నాడు సుధాకర్‌నాయుడు.

ఎవ్వరూ మాట్లాడలేదు. తిరిగి తనే మాటలందుకున్నాడు. "దినమ్మూ టౌనుకుపొయ్యి మందుతాగేది, పలావన్నం తినేది. సినిమాలు చూసేది.. ఒగరోజు మానుకో.. ఆ దుడ్డుతో కెపాసిటర్ కొనుక్కోవచ్చు అంటాడా.. మనిసేనా వోడు" కోపంగా అన్నాడు సుధాకర్‌నాయుడు.

"రైతులను చూస్తే అట్లుండాది నాయకులకు.. ఏం చేద్దాం.." అన్నాడు సిద్ధారెడ్డి.

"కండ్లకావరం మామా.. కండ్లకావరం.. యాడికి రమణా.. పందేనికా" అన్నాడు సుధాకర్ నాయుడు.

"కాదన్నా.. ఆ ఎంపీపీకిచ్చేదానికి. దుడ్డు పదివేలు కావాల. నెలనించీ తిరగతాండా. ఇప్పటికి నాలుగు పందెం కోళ్లు ఇచ్చినా.." అన్నాడు రమణ దిగులుగా.

రమణ చేతుల్లోని పుంజు "కొక్కొరో..కో.." అంటూ కూతేసింది.

సూర్యుడు పడమర కొండల మీదున్నాడు.

ఒక్కసారిగా పూనకం వచ్చినవాడిలా రమణ చేతుల్లోని పుంజును లాక్కోని దాని గొంతు కొరికి రక్తం తాగేసినాడు సుధాకర్‌నాయుడు. అందురూ బిత్తరపోయి చూస్తా నిలబడు కోనుండారు. రక్తం తాగేసినాక కోడిని ఇసిరి కొట్టి "ఏ నాకొడుకురా.. రైతల్ను తక్కువ చేసి మాట్లాడేది. వోని నెత్తురు తాగతా.. రైతంటే ఏమనుకోనుండారో.." అంటా ఏదేదో గట్టిగట్టిగా అరుస్తాండాడు సుధాకర్‌నాయుడు. మనిషి వూగిపోతాండాడు.

"వొంట్లోకి గర్నిమిట్టమ్మ వచ్చినట్లుండాది" అన్నాడు సిద్ధారెడ్డి.

అరిచి అరిచీ అక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. నీళ్లకోసం రమణ వూరివైపు పరుగులు తీశాడు.

"సుదాకరా.. సుదాకరా.." అంటూ వూపతా ఆందోళనగా పిలుస్తాండాడు సిద్ధారెడ్డి. అచేతనంగా పడి వున్న సుధాకర్‌నాయుడిని చూస్తుంటే భాస్కర్ పిడికిళ్లు బిగుస్తున్నాయి. అస్తమిస్తున్న సూర్య కిరణాలు భాస్కర్ కళ్లలో కదలాడతాండాయి.

✡

# మనమే నయం

**–కాళోజీ నారాయణరావు**

'ఇవ్వాళ్ళ ఎల్లయ్య మన మెడల పైకాణికి బదులు, బుక్కా గులాలు, బ్యారేడు జోడులకు బదులు పూలదండలు, నుదుట కుంకుమ పెట్టి కొరడా చురుకులకు బదులు వెన్నుపై దయతో చేయి తిప్పుతున్నాడేమి?' అని నల్ల ఎద్దు తెల్ల ఎద్దును ఎల్లయ్యకు తెలియకుండానే ప్రశ్నించెను. అంత తెల్ల ఎద్దు

'ఓపిక పట్టు. అంతా జరిగినట్టు జూడు. అదే తెలుస్తుంది. నాకు మాత్రం ఏమి తెలుస్తుంది' అనెను.

ఆ రోజు ఎస్‌పిసిఏ (జంతువుల యెడ జరుగు అన్యాయ నిరోధక సంఘము) స్థానిక శాఖ కార్యకర్తలు తమ సంస్థ యొక్క వార్షికోత్సవము జరుపదలచిరి. వారు నాడు పుర ప్రముఖులతో బాటు పురములోని కొన్ని ఆవులను, గుర్రాలను, ఎడ్లను, బాగా బలసిన వానిని వెతికి వెతికి ఊరేగింపు జరుపుటకు ఏర్పాటు జేసిరి. మల్లన్న సేటుగారి భర్తి బండిని లాగే పై రెండు ఎడ్లు కూడా నాటి ఊరేగింపులో పాల్గొనవలసియుండెను. అందుకనే వాటి కాపరి ఎల్లయ్య వాటికి బండికి కట్టక అందంగా అలంకరించుచుండెను.

పగలు మూడు గంటలకు బాజా బజంత్రీలతో, వాలంటీర్ల 'గార్డ్ ఆఫ్ ఆనర్లతో' చెప్రాసి మొదలు సుబేదారువరకు గల ప్రభుత్వోద్యోగులు, లక్షాధికారులు, బిచ్చగాండ్లు, అవిద్యా వంతులు, డాక్టర్లు, వకీళ్ళు వారు వీరు అననేల అన్ని కులాల, సంఘాల, మతాల, ప్రతినిధులు ముందునడవ ఎడ్లు, గుర్రాలు, ఆవులు మహా వైభవంగా ఊరేగెను. గుంపులోనున్న చాలా మంది పెద్దలకు (వారికి గల ధన సంపదలచే పెద్దలు) నాటి యా హడావుడి విషయము కథా ప్రారంభమున నున్న ప్రాణులకి తెలిసినంతే తెలియును. పాపమా నల్లెద్దుకు ఎల్లయ్య బలవంతముచే నాటి యా వుత్సవములో పాల్గొనవలసి వచ్చెను. గుంపులోని చాలా మంది పెద్దలు ప్రభుత్వము వారి ఉన్నత ఉద్యోగుల యాజ్ఞాబద్ధులై నడుచుచుండిరి. ఇంతే తేడా.

పెద్ద హడావుడితో ద్విపద, చతుష్పాదముల అపూర్వమైన గుంపు పురమందిరము జేరెను. అక్కడ అది వరకే సభకు తగిన ఏర్పాట్లు చేయబడియుండెను. ప్రభుత్వము వారి ఒక గొప్ప

ఉద్యోగి (అధికారి) అధ్యక్షత వహించెను. సంఘ కార్యదర్శి వార్షిక నివేదిక చదివి వినిపించెను. దానిలో యెన్ని వందల ముల్లు కట్టెలు విరగగొట్టినది, యెంత మంది బండ్లవాండ్లను జట్కా వాండ్లను బక్కవాటిని, గాయపడినవాటిని, ఎడ్లను, గుఱ్ఱాలను, బండ్లకు కట్టినందుకు గాను కోర్టుకెక్కించి జరిమానాలు చేయించినది (దానిచే ఆ బక్క వాటికి గడ్డికొనుటకు చిల్లిగవ్వలేక ఎన్నింటినో చంపుకొన్న సంగతి దానిలో లేదు) వివరంగా వుండెను. తర్వాత నలుగురైదుగురు పెద్దలు, జంతువులకు గల కష్టాలు, ఇబ్బందులు, వానిని మాన్పుటకు ఉపాయములను గూర్చి ఘనంగా ఉపన్యసించిరి. (యింతకు వారిలో ఎవరికి ఏ జంతవునకేమి కష్టమో ఏమి సుఖమో తెలియదు.) సభానంతరము పెద్దలందరు తమతో ఊరేగిన జంతువులను జూచిరి. వారంతా మోటార్లలో తిరుగుతూ భవనాలలో జీవనం గడిపేవారు. కావున ఆ జంతువుల జూడ వారికెంతో సరదాగా వుండెను. వారిలో కొందరికి గుఱ్ఱాలననేవో, యెడ్లననేవో కూడా తెలియదు. ఇట్లు ఈ తమాషా జరిగిన తరువాత పెద్దలందరు తమ తమ బంగాళాలకు, పశువులు తమ తమ దొడ్లకు వెడలిపోయెను. మన నల్ల తెల్ల యెద్దులు గూడా నాడు తమ జీవితములో మొదటిసారి బండి లాగని దినము (విశ్రాంతి) జరిపి యెల్లయ్య సహాయంతో తమ దొడ్డిని జేరుకొనెను. పాపం నల్లది ఉదయం తానడిగిన ప్రశ్నకు సంతృప్తికరమైన ప్రత్యుత్తరము గానక చింతతో నుండెను. అంత తెల్లది దానితో నిట్లనెను.

"నేటి 'ఫార్సు (బూటకము) నీకు బోధపడలేదేం? చెపుతాను విను. ఈ మనుష్యులలో కొందరు, అందులో ముఖ్యంగా పనిపాటలు లేకనే వందలు వేలు గడించేవారు మన క్షేమం కోసమని ఓ సంస్థ స్థాపించారు. ప్రత్యక్షంగా నిత్య జీవితంలో వారికీ మనకూ ఏమీ సంబంధంలేదు. మనతో నేరుగా సంబంధం ఉన్నవారు, మనవలన జీవనోపాధియే గాక వేలపుట్ల ధాన్యము పండించుకునేవారు, మనపై, మనము ఈడ్చె బండ్లపై స్వారీ జేయువారు మనలకు తిండి సరిగా పెట్టక కష్టపెట్టెదరనియు, మనకు రోగం వచ్చిన గాయాలు తగిలిన, చికిత్స జేయించకనే మనతో పని చేయించుకుంటారనియు, అందువలన మనమందరము చాలా ఇబ్బందుల పాలగుచున్నామనియు వీరి అభిప్రాయము. అందుకనే ఈ సంఘం వారుయెంతో ప్రయాసపడి మన కాపరులగు నరుల నుండి వేలకు వేలు ముల్లు కట్టెలను లాగికొనుచున్నారట. బక్కబడిన వాటితో, రోగాలవాటితో, గాయపడిన వాటితో పనితీసుకొను నరులను కోర్టుల కెక్కించి శిక్షలిప్పించుచున్నారట. కాని వీరికి కఱకఱ నరకబడే జంతువులపై ఏ మాత్రము దయ లేదు. ఒకేసారి చంపుట యన్న జీవిత కష్టముల నుండి ముక్తి యిప్పించుటయని వీరి అభిప్రాయము కాబోలు! తమ ఆహారమునకు ప్రతి రోజు తెల్లవారు సరికి, లక్షల కోళ్ళు, గొఱ్ఱెలు, ఆవులు, యెద్లు క్రమముగా నరకబడుచున్నను వీరికే మాత్రము ఆక్షేపణ లేదు. అట్లు జంపుటకు కావలసిన జంతువులు ఆరోగ్యము కలవి, బాగా బలిసినవి, ముసలివి కానివి, బలముగలవిగా వుండవలెను. ఇది ఏమి భూతదయయో! ఇది ఏమి దౌర్జన్య నిరోధమో వారికే తెలియవలెను. ఇంతకూ ఈ సంఘం వారు మనపై జేసిన

వుపకారమేమి? తల్లిపాలు మరచి ఏ నాలుగు పోచలో నమల నారంభించిన నాటి నుంచే మనకు ఈ నిర్బంధ జీవితము ప్రారంభము. రోజు ఒకటే కార్యక్రమం. స్వేచ్ఛయననేమో మనమెరుగము గదా. ఏ వాంఛను కూడా తీర్చుకోనివ్వక ఈ నరుడు మన జీవనమును దుఃఖమయం జేయుచున్నాడు గదా. వాడు కట్టిన గుంజవద్ద పడియుండి, వేసిన నాలుగు గడ్డిపోచలు, నమిలి, బండికి కట్టితే బండిని, నాగలికి కట్టితే నాగలిని, మోటకు కట్టితే మోటను, అది ఇది అననేల, చేయించిన పనిని తలవాల్చి జేయవలసినదే కదా! లేకపోతే యెముకలు విరగెటట్టు బాదుతాడు దుడ్డుకర్ర పుచ్చుకొని. పని చేస్తాం. చేస్తూ వచ్చాం. చేస్తూ వున్నాము. చచ్చేవరకు చేస్తాం. మనకు అన్ని కష్టాలకు మూల కారణం ఈ నిర్బంధ జీవనము. దానికి కారణం ఈ నరుడు. వీడేమి మననుద్ధరించుట ఏమి? తన జీవనాన్ని సుఖంగా గడుపుటయే పరమధర్మమని తలపెట్టి అందుకని మనలను అన్ని నిర్బంధాల పాలుజేసే నరుడా మనపై దౌర్జన్యముల నిరోధించునది. ఛీ ఛీ అంతా బూటకం. మోసం. ఏమంటావు, అంతేనా?"

ఇంతవరకూ తెల్లఎద్దు ఇచ్చె ఉపన్యాసం శాంతంగా వింటున్న నల్ల ఎద్దు ఇట్లనెను.

"అంతా నిజమే చెప్పావు కాని మనలను ఇంత కష్టపెట్టే ఆ నరుల జీవితం మాత్రం ఏమంత బాగా ఏడ్చింది. వారిలో చాలా మంది బ్రతుకు మనకన్నా అన్యాయం. అత్యల్ప సంఖ్యాకులైన భాగ్యవంతులు (అందరి కష్టాలకు మూల కారకులు) తప్ప మిగతా కోట్ల కొద్ది ప్రజల జీవితం మనకన్న ఎన్నియో రెట్లు అసహ్యాకరంగా వుంది. జంతువులలో స్వేచ్ఛగా వున్నవి సుఖంగానే వున్నవి కదా. పోగా మిగిలిన మనవంటివి. మనవంటి వాటిని గూడా అతి దేహకష్టము జేసిన తర్వాతనైతేనేమి తినుటకు గడ్డి, చొప్ప, తెలకపిండి, త్రాగుటకు నీరు, వుండుటకు కప్పుగల దొడ్లు గలవు. కాని మనుష్యులలో కోట్ల కొలది జనులకు ఎముకలు విరుగునట్లు కష్టపడినను వుండుటకు గుడిసె లేక, వారి ఆచారాను సారము దేహము దాచుకొనుటకు గుడ్డలేక, తుదకు త్రాగుటకు జలమైన లేక మలమల మాడుచు అసహ్యాకరమైన రోత పుట్టునట్టి జీవనము (కేవలము ధనాఢ్యుల దాస్యము కొరకేయన్నట్లు) గడుపుచున్నారు. వారికి మనకున్నట్లు దౌర్జన్య నిరోధక సంఘమొకటి (ఎన్‌పిసిఎ) లేదు. కనీసం తలనరికి ఒకేసారి కష్టముల నుండి ముక్తి యిప్పించు నటువంటి కసాయి ఖానాలు గూడా లేవు మనకున్నట్టు. ఇంతకూ మనమే నయము!!". ఇది విని తెల్ల ఎద్దు తెలతెల బోయెను.

✡

# అన్నదమ్ములు

**–జమదగ్ని**

"ఏమిటిరా! ఈ తగూలు. నే చెప్పినట్టూ వినక, మీ అంతటా మీరూ చూచుకోకపోతే ఎల్లా ఈ వ్యవహారం తెమలడం? రాముడూ? నువ్వన్నా ఒక దారికిరా" అన్నాడు గ్రామంలో కుల పెద్ద ముసలి పుల్లారెడ్డి.

"ఇల్లు అలా పంచితే నేనెందు కొప్పుకుంటాను తాతా! గాలీ, వెల్తురూ వచ్చే దక్షిణపు భాగం వాడు తీసుకుంటే ఈ చీకటి కోణంలో నే ఉండాలీ! వాణ్నే ఉత్తరపు భాగం తీసుకోమను" అన్నాడు చిన్నవాడు గోపాలం.

"సరే! ఇంటి విషయంలో వాడు చెప్పినట్టే కానియ్యి తాతా! పొలం మాట గూడా పరిష్కారం చెయ్యి!" అన్నాడు రాముడు.

"పొలానికి పెద్ద పంచేదేమున్నదిరా! ఉన్నవి రెండెకరాలాయి. రెండూ నాలుగు మళ్ళుగా ఉండనే ఉన్నాయి. ఇద్దరూ చెరో రెండు మళ్ళూ తీసుకోండి?"

"మళ్ళీ అదేమిటి! ఏఏ మళ్ళు ఎవరెవరు తీసుకోవాలో గూడా ఖరాఖండిగా తేల్చేసెయ్యి!"

"అయితే నువ్వు ఎగువ రెండు మళ్ళూ తీసుకో! దిగువ రెండు మళ్ళూ రాముడు తీసుకుంటాడు."

"బాగానే ఉంది! నీరు సమంగా పట్టి ఎక్కువ పంట పండే పల్లపు మళ్ళు రెండూ వాడి కిచ్చి ఎందుకూ పనికిరాని ఎగువ మళ్ళు రెండూ నన్ను తీసుకోమంటే నేనేమన్నా బాగు పడాలా!"

"తాతా! ఈ పంపకంతో నా ప్రాణం విసిగెత్తిపోతోంది. వాడిష్ట మొచ్చినట్లు కానీ ప్రతిదీని?"

"అదేమిటండీ! అంతకాడికి పంపకాలు పెట్టుకోకపోతే ఏం? అంతా ఆయనగార్నే తీసుకోమని ఊరుకోకపోయారూ" అని గది కిటికీలోనుంచి తొంగి చూస్తున్న అన్నపూర్ణ భర్త నుద్దేశించి అన్నది.

రాముడు భార్య మాట వినీ విననట్టుగా ఊరుకున్నాడు. పుల్లారెడ్డి ఆ మాటల్తో కొంచెం కదిలి న్యాయమాలోచించి "గోపాలం! నువ్వన్న మాట బాగానే ఉంది. ఎగువమళ్ళు రెండూ ఎందుకూ పనికి రావని నువ్వే అంటున్నావు కదా! అవి వాడు మాత్రం ఎట్లా తీసుకుంటాడు చెప్పు" అని మెల్లగా అన్నాడు.

దీంతో గోపాలం మండిపడి "వ్యవహారాల్లో ఆడవాళ్ళు కూడా దిగితే ఇక చెప్పేదేముంది? ఇంట్లో కూర్చుని ఏడవక వీటిల్లో వాళ్ళకెందుకంట" అంటూ ఎదురుగుండా ఉన్న గేదెకట్టు కొయ్యవంక చూస్తూ అన్నాడు.

రాముడు ఈమాట భరించలేక పోయాడు. అతని కాపాదమస్తకమూ శరీరం కోపంతో గజగజలాడింది. "తమ్ముడివని ఊరుకున్నానురా వెధవా! ఏదో చిన్న వాడివి. నీకయిష్టంగా ఎందుకు జరగాలని నేను సర్దుకుంటూ ఉంటే నోటికి వచ్చినట్లల్లా పేల్తావేం. జాగ్రత్త!" అని అన్నాడు.

"నువ్వు వెధవా గిధవా అంటే ఇక్కడ పడేవాళ్ళెవరూ లేరు. ఈ ముండమోపి బెదరింపులకు నేనేం భయపడతాననుకున్నావు కాబోలు. ఒళ్ళు దగ్గిర ఉంచుకు మాట్లాడు" అంటూ గోపాలం చొక్కా చేతులెగదీస్తూ అరుగుమీద నుంచి లేచాడు.

"కొడ్తావా ఏమిట్రా! కొట్టు చూద్దాం ఏ మాత్రం కొడ్తావో" అంటూ రాముడు ముందుకు వచ్చాడు.

"కొడ్తానా కొట్టి చూపిస్తానా! నాతో మర్యాదగా ఉండకపోతే చివరికి అంతే అవుతుంది. ఏమనుకుంటున్నావో" అని గోపాలం మరీ మీదికి వచ్చాడు.

పుల్లారెడ్డి చూస్తూ ఊరుకోలేక ఇద్దరి మధ్యకూ వచ్చి గోపాలం వంక చూచి "ఇంతకాడికి నన్నెందుకురా నువ్వు పిల్చుకు వచ్చావు? చేతులు చాలా! నా దుడ్డు కఱ్ఱ కూడా తీసుకుంటావా? భూమ్మీద నూకలు తక్కువై ఏడవబోకు" అంటూ కళ్లు పెద్దవి చేశాడు.

గోపాలానికి రెడ్డి అంటే కొంచెం గౌరవం ఉంది. కాని అతనికి ఊరంతా అన్నపక్షమే అవలంబిస్తారని అనుమానం. ఈ అనుమానంతోనే రెడ్డి చెప్పినదానికి దేనికీ సరాసరి ఒప్పుకోక ఏదో సవరణ తెస్తూ ఉంటాడు. ఈ సమయంలో రెడ్డి ముఖం చూచేసరికి అతనికి కొంచెం భయం వేసింది. వెంటనే వెనక్కి తగ్గాడు. ఇది ఆసరాగా తీసుకొని "అయితే నేనొక విధంగా తేలుస్తాను, ఇద్దఱూ వింటార్రా!" అన్నాడు రెడ్డి.

"నీ ఇష్టం వచ్చినట్టు చెయ్యి తాతయ్యా! నాకేమీ అభ్యంతరం లేదు" అన్నాడు రాముడు.

గోపాలం మాట్లాడలేదు.

"ఏరా! గోపాలం! నువ్వేమీ అవుననవు. మఱి నేనేం చెప్పినా ఎదురు చెప్తావాయె. ఎట్లా?"

"నువ్వు చెప్పు – ఏం చెప్తావో. నేనూ మాట్లాడనులే" అని అంటూ అరుగుమీద మళ్ళీ కూర్చున్నాడు గోపాలం.

"అయితే ఉత్తరపు వైపు ఎగువమడీ, దిగువమడీ ఒకరు తీసుకోండి. దక్షిణవైపు రెండు మళ్ళూ ఇంకొకరు తీసుకోండి. మఱి నీకేవైపు కావాలో చెప్పు"

"నేను ఉత్తరపు మళ్లే తీసుకుంటాను" అన్నాడు గోపాలం.

రాముడు మాట్లాడలేదు. ఉత్తరపు మడిలోకి నీటి కాలవ ఉంది. దక్షిణపు మళ్లల్లోకి నీరు రావాలంటే ఆ మళ్ళల్లోంచి రావాలి. ఆ సంగతి అన్నపూర్ణకు తెలుసు. రాముడు ఏమీ మాట్లాడకుండా తలవంచుకు కూర్చున్నాడు. అందుకని ఆవిడ మళ్ళీ నోరుచేసుకో వలసి వచ్చింది. "అయితే నీళ్లు ఆ మళ్ళలోనించి రావలసిందేనా వీటికి?" అని ఊరుకున్నది.

రెడ్డి వెంటనే అందుకుని "దానికేం? ఉత్తరపు మళ్ళు తీసుకున్న వాడు దక్షిణపు మడిలోకి కాలవ తీయించియిస్తాడు. ఏరా గోపాలం!" అన్నాడు.

గోపాలం కాదనడానికి వీల్లేకపోయింది. "సరే అట్లాగే కానియ్యి", అని ఊరుకున్నాడు.

రాముడు ఒప్పుకున్నట్టుగానే గ్రహించి పుల్లారెడ్డి "ఇక మిగిలిందల్లా వాములదొడ్డీ, ఎకరం బీడూనూ. నా మతం ఏమిటంటే, ఇద్దఱూ చెఱి ఒకటీ తీసుకోవడం మంచిదని. రాముడూ! ఈసారి నువ్వు చెప్పు, నీకేం కావాలో" అని అంటూ గోపాలంవంక చూస్తూ నిలబడ్డాడు.

రాముడు "నేనేమీ మాట్లాడను తాతాయ్యా. ఎందుకొచ్చిన అప్రతిష్ఠ ఏదో ఒక విధంగా తేల్చేసెయ్యి" అన్నాడు.

దాంతో గోపాలానికి కొంచెం కోపం వచ్చింది. అయినా కార్యం సానుకూలం అయిందాకా మాట్లాడ గూడదని కొంచెం తమాయించుకుని ఊరుకున్నాడు. గోపాలం ముఖం చూచి అతని మనో విషయం గ్రహించాలని ప్రయత్నిస్తున్న పుల్లారెడ్డి "అయితే గోపాలం! నువ్వు వాములదొడ్డి తీసుకో, వాడికాబీడు ఇయ్యి. కాని దానికి కోరడీ గీరడీలేదాయె. అందుకని ఈ యేటికి మంగళగిరి కంప పెట్టించి కంచె వేయించి ఇయ్యి; ముందునాటికదే అబాజవుతుంది. ఏమంటావ్" అన్నాడు.

"నాకు మాత్రం బీడు అక్కఱలేదా ఏమిటి?" అంటూ మూతి ముడిచాడు గోపాలం.

వెంటనే రెడ్డి "అదీ ఎకరమే. ఇదీ ఎకరమేనాయి. దీనికి చుట్టూ కోటగోడలాంటి రోఁఅం వుండె. దొడ్డినిండా వాములే పెడ్తావా? వామిమేర విడిచి మిగిలింది రెండు చాళ్ళు దున్ని విడిచిపెడితే మొలలోతు బీడు సిద్ధమౌతుంది!" అన్నాడు.

"అది మాత్రం నమ్మకమేమిటీ? అది ఎప్పుడో తాతలనాటి నుండీ దిక్కూ దిబాసూ లేక వాములలో ఉడికెత్తిన భూమి గడ్డి పట్టుతుందా ఏడుస్తుందా? అల్లా ఎందుకు? ఇందులోనూ రెండు భాగాలు చెయ్యి; అందూలోను రెండు భాగాలు చెయ్యి," అన్నాడు గోపాలం.

"అక్కడో కాస్తా అక్కడోకాస్తా ఉంటే ఆబాజు చేసుకోవడం కష్టం కాదుట్రా!"

"కష్టం అయితే అయిందిలే. అల్లా చేస్తేనే నేను ఒప్పుకుంటాను."

"ఎందుకు తాతయ్యా! ఇంత రాద్ధాంతం. వాడి ఇష్టం వచ్చినట్లు నిశ్చయం చెయ్యి. నేనేమీ ఎదురు చెప్పనన్నాగా" అన్నాడు రాముడు.

"సరే! అట్లాగే కానివ్వండి. ఇక అయిపోయినట్టేనా!" అన్నాడు రెడ్డి.

"మఱి పాత్రసామగ్రీ – గొడ్డూగోదా. అసలు ముఖ్యమైన విషయాలు విడిచిపెట్టితే ఎట్లాగా? అవి పంచనక్కఱలేదా ఏమిటి?" అంటూ గోపాలం మళ్ళీ లేచి నుంచున్నాడు.

దీంతో రాముడికి చిరాకు ఎక్కువైంది. పంపకమన్నాక అన్నీ ఒకసారే తేలిపోతే మంచిదిగదా అని సమాధాన పఱచుకొని పాలేళ్ళను కేకవేసి ఉన్న సామగ్రి అంతా దింపమన్నాడు. ఒక్క అరగంటలో చెంబూ తప్పాలా దగ్గఱ్నుంచీ బొట్టుపెట్టెలూ, భోషాణాల వఱకూ అన్నీ బైట పడవేశారు.

"తాతయ్యా! ఉన్న సామాన్లివి. నీ ఇష్టం ఇచ్చినట్లు పంచు" అని దూరంగా కూర్చున్నాడు రాముడు.

"ఇప్పుడు ఇంట్లో వాడకంలో ఉన్న సామాన్లు తనే తీసుకుంటాడా?" అని రెడ్డి వంక చూసి అన్నాడు గోపాలం.

తలవంచుకుని అరుగుమీద నెత్తిన చేతులు పెట్టుకు కూర్చున్న రాముడు ఉలిక్కిపడి "ఏమేవ్! ఆ అంట గిన్నెలతోపాటు ఇంట్లో ఉన్న వస్తువలన్నీ బైటపడెయ్యి" అని భార్యనుద్దేశించి కేక వేశాడు. అన్నపూర్ణ ఒక్కొకటే బైటకు జేర వెయ్యడం మొదలు పెట్టింది. ఒక పాలేరు వాటి నందుకుని సామానులన్నింటిలో చేరుస్తున్నాడు.

ఇంతలో గొడ్లపాకలో పాడిఆవు అరిచింది. దాని ముందు మేత అయిపోవడం చూచి మఱొక పాలేరు మేత తేవడానికి వెళ్ళాడు. పుల్లారెడ్డి సామాన్లు ఇంకా అన్నీ రాకపోవడం చూచి ముందు పశువుల సంగతి నిర్ణయం చేద్దామనుకున్నాడు. వాళ్లకు రెండావులూ, రెండు గేదెలూ, ఒక ఎడ్లజత మాత్రం ఉన్నాయి. ఆ ఎడ్ల జత వాళ్ల ఇంట పుట్టి పెరిగిందే. ఆ రెండావులూ ఏడాదివిడిచి ఏడాది కోడె దూడల్ని పెట్టాయి. అయితే అవి వీళ్ళ ఇంటికి ఏడాది హెచ్చు తగ్గుగా వచ్చాయి. అందుకని తొలి చూలు కోడెల్ని పెంచి పెద్దవి చేసి వ్యవసాయం చేస్తున్నారు. తర్వాత వాటి నన్నింటినీ ఒకటి రెండు ఏళ్ళు పెంచి చిన్న సంసారం

అయిన కారణం చేత అమ్మేసుకునేవారు. ఆవుల్నీ, గేదెల్నీ పంచడం విషయంలో రెడ్డికేమీ ఇబ్బందిరాలేదు. ఇద్దఱూ చెఱొక ఆవునీ, చెఱొక గేదెనీ తీసుకొనేటట్టు నిశ్చయం చేశాడు. కాని వాటి చిన్నతనం నుండీ తాను ఎఱిగి ఉండడం వల్ల ఆ ఎడ్ల జత పంచడం విషయంలో మాత్రం అతని మనస్సు చివుక్కుమన్నది. భూమిమీద పడ్డది లగాయితు సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా అవి రెండూ రామలక్ష్మణులలాగా కలిసి ఉన్నాయేగాని విడివిడి ఉండలేదు. వీళ్ళ తండ్రి అంకమ్మ బ్రతికి ఉన్నప్పుడు తాను గూడా ఆ ఎడ్లు కట్టిన బండి ఎక్కి చాలాసార్లు తిరిగాడు. వాటి చుఱుకు, నెమ్మదీ, అన్యోన్యం అన్నీ తనకు బాగా తెలుసు. అటువంటి జతను విడదియ్యడమేమీ బాగుండదనిపించి "ఒరే గోపాలం! ఈ ఎడ్ల జతను మాత్రం విడదియ్యబోకండి. ఎవరో ఒకరుదాన్ని తీసుకుని దానికి బదులు ముదరా ఇస్తే రెండో వాళ్ళు మఱోజత కొనుక్కోవచ్చు" అన్నాడు రెడ్డి.

"ముదరా ఇవ్వడమంటే సామాన్యమా ఏమిటి? ఇప్పుడు వాటి ఖరీదు ఎంత హీన పక్షమైనా ఎనిమిది వందలకు తక్కువ కావు, ఎక్కడి నుంచి ఎత్తుకు వస్తాడేమిటి ఎవడు మటుకు" అని విసుక్కున్నాడు గోపాలం.

ఈ మాటలు గోపాలం గట్టిగా అనేటప్పటికి ఎడ్లను పంచడం తప్పదన్న విషయం రాముడి మనస్సులో ముల్లు గుచ్చుకున్నట్టు గుచ్చుకుంది.

రాముడికీ పంపకం బొత్తుగా ఇష్టంలేదు. తండ్రి చనిపోయి ఇంకా నెల రోజులు కాలేదు పరిస్థితి అట్లా విషమించడం అతన్ని ఎంతో బాధ పెట్టుతోంది. గోపాలం ఇట్లా ప్రవర్తిస్తాడని అతను అనుకోక పోలేదు. కాని ఇంత తొందర్లో ఈ అవసరం వస్తుందని అతను ఎన్నడూ అనుకోలేదు. ఈ పంపకం జరుగుతున్నంత సేపూ అతడు మనస్సులో యమయాతన పడుతున్నాడు. తన తండ్రి మర్యాద, తన కుటుంబం ప్రతిష్ఠ అన్నీ గంగలో కలుస్తున్నట్లు అతని కళ్ళ ఎదుట భీకరంగా కనపడుతున్నాయి. భావిజీవితంలో తమ గౌరవ హీనమైన బ్రతుకులు అతనికి సాక్షాత్కరిస్తున్నాయి. తనకొక కొడుకున్నాడు. తన భార్య ఈ పంపకానికే పట్టు పడుతోంది. ఈ నెలరోజుల్లోనూ గోపాలం తన్నూ, తన భార్యనూ, అన్నమాటలు ఇన్నీ అన్నీ కావు. ఒకప్పుడు సమస్తమూ గోపాలానికి విడిచి పెట్టేసి తాను ఏదో కూలి చేసుకొని బతుకుదామని గూడా అనుకున్నాడు. కాని భార్య నిలవేసింది. కొడుకును చూపించింది. ఇటువంటి పరిస్థితుల్లో భార్యను సంతుష్టి పఱిచి కొడుకును బాగు చేసుకోవడం తన విధి అని తోచింది. అందుచేత ఈ పంపకానికి ఒప్పుకోక తప్పనిసరి అయింది. అయినా ప్రతిదానికి పేచీలుపడడం అతని స్వభావం కాదు, అందుకనే మొదటి నుంచీ ముభావంగా ఉన్నాడు. కాని ఎడ్ల జత విషయంలో అట్లా ఉండలేకపోయాడు. వాటిని చిన్నప్పటి నుంచీ తన చేతుల్తో తన బిడ్డల వలె పెంచడమే దానికి కారణం. వాటిని తానే తీసుకోవాలన్న సంకల్పం అతని మనస్సులో గాఢంగా ఉంది. అందుకని రెడ్డి ఇచ్చిన ఈ సలహా అందుకుని 'నేను ముదరా ఇస్తాను, నాకు ఇచ్చే సెయ్యి' అన్నాడు రాముడు.

"నీకేమయ్యా! ఏదో తెగనమ్మి ఇస్తావే అనుకో. నీ డబ్బు ఎవడికి కావాలి? అటువంటి ఎద్లు నాకు దొరకద్దూ. ఏదో ఒకటన్నా ఉంటే రెండోది ఎక్కడన్నా సంపాదించుకుని తంటాలు పడవచ్చు" అన్నాడు గోపాలం.

రాముడు ఈ భావానికి తట్టుకోలేకపోయాడు. గొంతు నులిమితే రెక్కలు టపటపా కొట్టుకున్న పిట్టలా గిలగిలలాడింది అతని మనస్సు. కాని ఏం చెయ్యగలడు? ఉపాయమేమీ తోచక చేతుల్తో తల పట్టుకు కూర్చున్నాడు.

ఈ విషయంలో పుల్లారెడ్డి మనసు గూడా బాగా నొచ్చుకుంది. ఏమిటిరా గతి! వీటిని విడదియ్యవలసి వచ్చేటట్లే ఉంది అని కాసేపు ఆలోచించాడు. అంతలో ఆతనికో ఉపాయం తోచింది. "ఒరే అబ్బాయిలూ! నేనేదో పెద్దవాణ్ని. మీ ఇద్దఱి మధ్యా పరిష్కారం చెయ్యడానికి వచ్చాను. ఇందులో నేను బావుకునేది ఏమీ లేదు గదా!" అని ఆగాడు.

ఈ మాటలు వినేటప్పటికి ఈ దుష్ట పరిస్థితి తొలిగే ఉపాయం ఏమన్నా రెడ్డి చెప్తుతాడేమో అన్న ఆశ రాముడికి కలిగింది. అందుచేత కొంచెం తలఎత్తి రెడ్డి వంక తిరిగి "అదేమిటి తాతయ్యా అట్లా అంటావు! ఇందులో నీకేమున్నది – ప్రొద్దుటి నుండి మా మూలాన పడుతున్న బాధ తప్ప" అన్నాడు.

"సరే దానికేంలే. పెద్ద వాళ్ళమంటూ ఉన్నాక ఆ మాత్రం అంటించుకోకపోతే ఎట్లా? అదికాదు గాని మీఱు ఇద్దఱూ ఏమీ అనుకోకుండా ఉంటే నాకొక మాట చెప్పాలని ఉంది." అని మళ్ళీ ఆగాడు రెడ్డి. "ఏమిటో చెప్పవయ్యా నసక్క" అన్నాడు గోపాలం విసుగుతో.

"నువ్వు అలా విసుక్కుని కసిరితే నాకు ఎందుకు వచ్చిందీ బెడద. నాదారిని నేపోతాను. మీ ఇష్టం ఇచ్చినట్లు అఘోరించండి!" అంటూ లేచాడు పుల్లారెడ్డి.

"ఇంతదాకా వచ్చి నువ్వు కోపగించుకుని వెళ్ళడం ఏమీ బాగా లేదు తాతయ్యా!" అన్నాడు రాముడు మెల్లగా.

ఈ మాట విని రెడ్డి ఆగాడు. "సరే! ఏమయితే అది అవుతుంది. నేను చెప్పాలిసిన మాట ఏమిటో చెప్పి మఱీ వెళ్తాను. ఒరే గోపాలం! నువ్వు కూడా బాగా ఆలోచించు. వాటిని విడదియ్యడం నేనే కాదు, ఊళ్ళో ఎవళ్ళూ అంగీకరించని విషయం. అలా విడదీసి ఎవ్వరూ లాభం పొందలేరు సరి గదా, దాని వల్ల అనర్థాలు గూడా వస్తాయి. అందుకని నామాట విను. నువ్వు వాటిని తీసుకుని వాడికి ముదరా అన్నా ఇయ్యి. వాటిని వాడికిచ్చి నువ్వన్నా డబ్బు తీసుకో, ఇది కాదంటావూ, నీ ఇష్టం వచ్చిన ధర చెప్పు. ఆ పైకం నేనివాళ ఇస్తాను. ఇద్దరూ చెఱి సగం తీసుకుని దానికి కాస్తో కూస్తో కలుపుకుని చెఱో జతా చిన్న జతలు కొనుక్కుని కాలక్షేపం చెయ్యండి" అని సమాధానం కోసం గోపాలం వంక చూచాడు రెడ్డి.

గోపాలం చఱ్ఱుమని లేచి "చాలు చాల్లేవయ్యా! నిన్నేమో పెద్ద మనిషివని తీసుకు వస్తే మా దగ్గఱ నుంచి జత కాజెయ్యాలని చూస్తావు! నువ్వెంత ఇస్తావేమిటి? మహా ఇస్తే పది

వందలు ఇస్తావేమో! పంచుకుంటే ఐదువందలు వచ్చె! తోక ఉండే గొడ్డు తొంభై పలుకుతున్న ఈ రోజుల్లో అయిదు వందలకీ అడ్డెడు గింజలు లాగే ఎద్దురాదు" అంటూ ఎడ్ల దగ్గఱకు పోయి చిన్న ఎద్దు మెడతాడు పట్టుకుని ఈవలకు లాక్కు వచ్చి గుంజకు కట్టివేస్తూ "ఇలా జరగవలసిందేగాని మఱొకరకంగా అయితే నేనసలు ఒప్పుకోను" అని ఎద్దు మీద చెయ్యి వేసి విజయ గర్వంతో నిలబడ్డాడు.

వెంటనే పుల్లారెడ్డి "నేనేం చేస్తాను. మీ కర్మం" అంటూ లేచి పోయాడు.

"సామాన్లు జేర వెయ్యడం అయింది" అన్నపూర్ణ మాటలు ఎవరూ వినిపించుకోలేదు.

కుడి చేత్తో ఱొమ్ము అదుముకుని ఎడం చేత్తో వాలిన తల నొక్కుకుంటూ లోపలికి వెళ్ళాడు రాముడు.

రెడ్డి వెళ్ళిపోవడం, రాముడు ఇంట్లోకి పోవడం, సామాన్లన్నీ బైటపడి ఉండడం చూచి గోపాలం మొదట్లో నిర్ఘాంతపోయాడు. కాసేపు ఉండేటప్పటికి అతనికి తన్ను ఎవ్వరూ ఏమీ చెయ్యలేరన్న ధైర్యం వచ్చింది. వెంటనే గోపాలం సామాన్ల దగ్గఱికి పోయి తనకు నచ్చినవన్నీ విడిగా తియ్యడం మొదలు పెట్టాడు. ఈ అలికిడి విని అన్నపూర్ణ భర్తను బైటికి పోయి చూడమన్నది. కాని రాముడు కదల్లేదు. తానే వీధి గుమ్మంలోకి పోయి నుంచున్నది. ఇంతలో నులక మంచంలో నిద్రపోతున్న పిల్లవాడు లేచి "అమ్మా" అంటూ ఏడుపు మొదలు పెట్టాడు.

"వాడట్లా ఏడుస్తుంటే నువ్వు అక్కడ నుంచోవడమేమిటి!" అంటూ కేక వేశాడు రాముడు.

"అంతా ఆయన ఇష్టం వచ్చినట్టు అక్కడ తీసుకుంటున్నాడు. మీరిక్కడ మాట్లాడకుండా కూర్చున్నారు" అని విసుక్కుంటూ లోపలికి వచ్చింది అన్నపూర్ణ.

"నాకు చేతకాదు. నీకు చేతయితే వ్యవహారం చేసుకోపో!" అన్నాడు రాముడు కోపంతో.

"ఇంత వఱకూ పంపకం నన్ను ఉద్ధరించడానికే జరిగిందన్నమాట" అని గొణుక్కుంటూ పిల్లవాణ్ణి ఎత్తుకుంది అన్నపూర్ణ.

రాముడు మాట్లాడకుండా కూర్చున్నాడు.

గోపాలం తనకు కావలసిన సామాన్లన్నీ విడిగా తీసి పాలేళ్ళ చేత పాకలో ఒక మూల పెట్టించాడు. గొడ్లపాకలో అటక మీద ఉన్న నాగళ్ళూ, మేడికోళ్ళూ, పల కఱ్ఱలూ, మైలారం జల్లలూ అన్నీ దింపించి తనకి కావలసినవి తాను తీసుకున్నాడు. ఆ పూట నుంచే వేఱింటి కాపురానికి ప్రయత్నాలు మా జోరుగా సాగించాడు. పాలేళ్ళ చేత గొడ్లపాకకు మధ్య కఱ్ఱలు కట్టించాడు. తన ఆవునీ, తన గేదెనీ, తన ఎద్దునీ తన భాగంలో కట్టేశాడు. ఇల్లు రెండు భాగాలయ్యేటట్టుగా మధ్య ప్రస్తుతానికి తడికెలు పెట్టించాడు. పాలేళ్ళను వెంబడి పెట్టుకుపోయి వాముల దొడ్లో గడ్డివామి రెండు భాగాలు చేసి తన వాటా వేరే వామిగా వేసుకున్నాడు.

చొప్ప గూడు పగల గొట్టించి తన భాగం వేటేగా కుప్ప వేయించాడు. ఆ సాయంత్రమే బయలుదేరి భార్యను తీసుకురావడానికి అత్తవారింటికి వెళ్ళాడు.

రాముడు వీటన్నింటిలో జోక్యం కలిగించుకోలేదు. తమ్ముడి ఔద్ధత్యం చూచి వాడి ఇష్టం వచ్చినట్లే జరగనిమ్మని ఊరుకున్నాడు! "తండ్రి చనిపోయి నెలకాలేదు. అప్పుడే సంసారం ఇంత బట్ట బయలైంది. ఇకముందు ఎంత యాతన పడాలో" అనే ఆ రాత్రల్లా ఆలోచించాడు. రాముడు కొంచెం పూర్వకాలపు మనిషి. పెద్ద మనిషి తరహాగా ఉంటాడు. తండ్రి బ్రతికి వున్నన్నాళ్ళూ ఆయన అడుగు జాడల్లో నడిచాడు. ఇప్పటికీ ఆయనలా బ్రతకాలని ఆయన అభిలాష. తన తండ్రి ఎంత మంచివాడు! ప్రేమతో గ్రామం అంతా తన వశం చేసుకున్నాడు. తాను పెద్ద ఆస్తిపరుడు కాకపోయినా 'దేహి' అని అడిగిన ప్రతి వాడికీ కాస్తో కూస్తో ఇచ్చి సంతృప్తి పఱిచేవాడు. వ్రాతా కోతా సాధించకపోయినా ఐహికానికీ, ఆముష్మికానికీ కావలసిన విజ్ఞానం పూర్తిగా సంపాదించాడు. గుళ్ళో పురాణాల దగ్గఱనుంచీ, గూడెంలో తోలుబొమ్మ లాటల వఱకూ అంకమ్మలేందే అయ్యేవికావు. అంతబ్రతుకు బ్రతికిన తండ్రి కడుపున పుట్టి తామిద్దఱూ ఇట్లా అయిపోవడమేమిటా అని అతని మనస్సు నిమిష నిమిషానికి బాధ పడింది.

కాని గోపాలం చిన్నప్పటినుంచీ ఎడ్డెం అంటే తెడ్డెం అనేరకం. అతడు ఒకడితో కలిసి ఎప్పుడూ ఉండలేదు. ఈ సహజ ప్రవృత్తికి తోడు జీవితరంగంలో అతడు పెరిగిన పరిస్థితులు కూడా అట్లాగే సమకూడాయి. అతడు తల్లిదండ్రుల అదుపాజ్ఞల్లో పెరిగి పెద్దవాడు కాలేదు. పుట్టిన రెండేళ్లకే తల్లి చనిపోవడం వల్ల మేనమామల ఇంటనే పెరిగాడు. తన భార్యకు ఇష్టం లేకపోయినా వాళ్ళ మేనమామ తనకు చేతనైనంత గోపాలాన్ని శ్రద్ధగానే పెంచి పెద్దవాణ్ని చేశాడు. చిట్టచివఱికి తన కూతుర్నిచ్చి చెల్లెలిమీది అభిమానంతో గోపాలానికి పెళ్లి కూడా చేశాడు. ఎంతచేస్తే ఏం, గోపాలం తన తండ్రి గౌరవమర్యాదల్లో పాలు పంచుకుని పెరగలేదు.

తెల్లవారింది. పలుదోముపుల్ల నములుకుంటూ పుల్లారెడ్డి రాముడి దగ్గఱకు వచ్చాడు. రెండువందల రూపాయలు లెక్కపెట్టి రాముడికిచ్చాడు. తండ్రి చనిపోయినప్పుడు దినవారాల ఖర్చుకు చేతిలో పైకం లేక తనకున్న ఒక్క బండినీ పుల్లారెడ్డి కిచ్చివేసి అవసరానికి ఒక వంద రూపాయలు తెచ్చాడు రాముడు. అదిపోగా బండి ఖరీదులో మిగిలిన సొమ్మిది. రెడ్డినీ, ఆ సొమ్మునూ చూచేటప్పటికి రాముడికి వెనకటి దుఃఖం అంతా నెమరుకువచ్చింది. రెడ్డిని కౌగలించుకొని 'తాతా! మా అయ్యగౌరవం ఇట్టా నిలబెట్టుతున్నాం' అని వెక్కివెక్కి ఏడ్చాడు.

రాముడి తల తనచేత్తో నిమురుతూ 'ఓరి! వెఱ్ఱివాడా! దీనికి నువ్వేం చేస్తావు? అయినా ఇట్లా ఏడ్చి ప్రయోజన మేమిటి? నీమానాన నవ్వు బ్రతుకు. ఎవరిగౌరవం వారికే ఉంటుంది' అని ఓదారుస్తూ ధైర్యం చెప్పాడు.

రాముడు కొంచెం తేఱుకొని చేతులో నోట్లవంక చూచి జ్ఞాపకం చేసుకుని "తాతా! నీతో ఒకమాట చెప్పాలి. ఇట్లా కూర్చో" అని అరుగు మీద కూర్చోపెట్టాడు.

"తాతా! నువ్వు అప్పుడిచ్చిన వందలోనూ ఎనభై దాదాపు చిన్న దినానికీ పెద్ద దినానికీ ఖర్చయినాయి. అయితే ఆ ఖర్చులో వంతులు పెట్టడం నాకిష్టంలేదు. అందుకని మిగిలిన ఈ పైకం అంతా వాడికే ఇచ్చివెయ్యి. నేనిస్తే నాతో ఏదో జగడమాడి అవీ ఇవీ కెలుకుతాడు. అదిఅంతా నేను సహించలేదు. నువ్వేవాడిచేతికీ పైకం ఇస్తే మఱేమి మాట్లాడడు. ఈ కాస్తపని నాకోసం చేసిపెట్టాలి" అని రెడ్డి చేతులు పట్టుకున్నాడు రాముడు.

"సరేలే! నీ ఇష్టం అట్లా ఉంటే అట్లాగే చేస్తాను" అని రెడ్డి లేచి, బయలుదేరాడు.

అప్పటికింకా జాముప్రొద్దు ఎక్కలేదు. రెడ్డి అలా వీధిలో అడుగుపెట్టేటప్పటికి గూడు బండీ ఒకటి వాకిట్లో నిలబడింది. గోపాలమే అయివుంటాడు, మనము ఎందుకు పలకరించాలని తనదారిన తాను వెళ్లిపోయాడు రెడ్డి. గోపాలం భార్యను లోపలికి పంపించి, పాలేరుచేత పెట్టే బేడా దింపిస్తూ, వెళ్ళుతూ ఉన్న రెడ్డివంక చూస్తూ నిలబడ్డాడు.

పరిచయం చిన్న బావతో ఎక్కువ ఉన్నా సీతమ్మకు పెద్ద బావ మీద అభిమానం ఎక్కువ. తన్ను చిన్నప్పుడు చిన్నబావ ఎప్పుడూ మొట్టికాయలు మొట్టడమేకాని ఎత్తుకున్న పాపాన పోలేదు. పెద్దబావ అట్లాకాదు. చిన్నతనంలో తన్ను ఎత్తుకొని ఏది కావాలంటే అది తెచ్చి పెట్టేవాడు. తాను గుమ్మంలో అడుగు పెట్టుతూనే, కుఱ్ఱవాణ్ని భుజాన వేసుకుని జోకొట్టుతూ అటూ, ఇటూ పచార్లు చేస్తున్న రాముడ్ని చూచింది సీతమ్మ.

"బావా! రంగయ్య కులాసాగా ఉన్నాడా?" అని అంటూ చేతులు చాచింది.

అంతలో గోపాలం లోపలికి వచ్చి సీతమ్మను చూచి "నీకు వాళ్ళతో ఏం సంబంధం! అటుపో. లోపలికి పో" అని కేక వేశాడు.

సీతమ్మ చాచిన చేతులట్లాగే ఉంచి నివ్వెఱపోయింది.

రాముడు ఱాతి బొమ్మలా నిలబడిపోయాడు.

"ఇంకా కదలవేం? నీకు కాదూ చెప్పేది!" అని గట్టిగా అరుస్తూ కళ్ళు ఎఱ్ఱజేశాడు గోపాలం.

సీతమ్మ మెల్లగా, తడబడుతున్న శరీరంతో తమ భాగంలోకి వెళ్ళింది.

కుఱ్ఱవాడు గొల్లున ఏడుపు మొదలెట్టాడు. రాముడు తలవంచుకుని లోపలికి వెళ్ళాడు.

గోపాలం కొత్తకాపురం ఈ విధంగా మొదలు పెట్టాడు. అతని వెనకనే వచ్చిన పాలేరు పెట్టే మూటా అరుగు మీద పెట్టి, అమ్మగారు కనపడకపోవడం చేత, అయ్యగారితో చెప్పడానికి భయం వేసి ఎవరితోనూ చెప్పకుండా బండి తోలుకు వెళ్ళిపోయాడు.

మఱునాటికల్లా తామర పువ్వుల్తో కలకలలాడే నిండు చెఱువు వంటి అంకమ్మ ఇల్లు తిమితిమింగిలాలతో తరంగ సంక్షుభితమయ్యే మహాసముద్రం లాగా మాఱిపోయింది. "కూడలి

కాపురం కుతకుతలూ, వేఱింటి కాపురం వెతవెతలూ" అన్నట్లయింది వారి పరిస్థితి. పాలేళ్ళిద్దఱూ పని మానేస్తామని రాముడితో చెప్పడానికి వచ్చారు. తండ్రి బతికి ఉండగా స్వంతానికి తోడు కవులు పొలం వ్యవసాయం కూడా ఉండేది కాబట్టి వాళ్ళ అవసరం వున్నది. తనకు ఇప్పుడవి అన్నీ పెట్టుకునే మనస్వాస్థ్యం లేకపోబట్టి 'సరే వెళ్లండి' అన్నాడు. దాంతో ఎవరి పని వాళ్లు స్వయంగా చేసుకోవలసి వచ్చింది. తానూ, తన భార్యా కాపురానికి కొత్త కాబట్టి కొన్నాళ్ళపాటు గోపాలం పాలేర్ని పెట్టుకుందా మనుకున్నాడు గాని తన దగ్గఱ పని చెయ్యడానికి ఎవడూ ఒప్పుకోలేదు. అందుచేత గోపాలం మగపనీ ఆడపనీ తనే చేసుకోవలసి వచ్చింది.

పంపకాలయి సరీగా రెండు రోజులే అయింది. రాముడు వీధిలోకి రావడం మానివేశాడు. ఎప్పుడూ ఇంటి పట్టునే ఉండేవాడు. తోచకపోతే అటూ ఇటూ పిచ్చి ఎత్తిన వాడిలా తిరుగుతూ ఉండేవాడు. గంటల తరబడి గొడ్లపాకలో కూర్చునేవాడు. లేచి ఇంట్లోకి రాబోతూ అప్పుడప్పుడు గోపాలం భాగంలోకి పొరపాటున అడుగు పెట్టేవాడు. ఆ సమయంలో గోపాలం ఇంట్లో లేకపోతే "రా! బావా! లోపలికిరా!" అని కేక వేసేది సీతమ్మ. ఈ కేక విని పొరపాటు తెలిసికొని చటుక్కున్న వెనక్కి తిరిగి తన భాగంలోకి వచ్చేవాడు. గోపాలం ఇంట్లో ఉంటే ఆ పొరపాటూ జరిగేది కాదు. ఒకవేళ జరిగిందో, ఎదురు మాట రాముడు ఎన్నడూ చెప్పకపోయినా, వీధిని బోయే ప్రతివారూ ఆగేటట్లు గోపాలం గట్టిగా కేకలు వేసేవాడు.

ఎంత తంటాలు పడ్డా రాముడు గృహాన్ని పాక్షికంగా చూడలేకపోయాడు. ఒక్క గృహమేమిటి? తన్ను తన పూర్వులతోటీ, తన వంశంతోటీ ఏకం చేసుకుని పెరిగిన అతని మనస్సు తన్ను తానుగా చూచుకోలేక పొయ్యేది. చెయ్యి శరీరాన్ని ధిక్కరించి తెగిపోవచ్చు. ఆ తెగి పోవడం వల్ల శరీరానికి చెయ్యి లేదన్న అప్రతిష్ఠే వస్తుంది గానీ తాను స్వతంత్రంగా బ్రతకలేదు. ఈ విధంగా అతని మనస్సు ఊహించి, ఊహించి విడివడడం వల్ల తమకు వచ్చే ప్రళయం ప్రత్యణువులోనూ సాక్షాత్కరింపజేసేది. ఒక్కొక్కప్పుడు తాము విడిపోలేదన్నట్టుగానే అతడు అనుకునేవాడు. అటువంటి సందర్భాల్లో బాహిరమైన ప్రతిబంధకాలు పంపకం విషయం జ్ఞాపకం చేసేవి.

ఒక్కొక్కప్పుడు బాధ భరించలేక దైవ ప్రార్థన చేసేవాడు. ఆ ప్రార్థనా సమయంలో అప్రయత్నంగా తన తండ్రి యావజ్జీవమూ ప్రతి నిత్యమూ నమస్కరించిన దేవుడున్న గూడు దగ్గఱకు వెళ్లబోయే వాడు. కాని దారిలో తడిక అడ్డుతగిలేది. చటుక్కున చతికిలబడి తన ఊపిరి తిత్తులలో ఒకదాన్ని కోసివేసిన బాధతో కుంగిపోయేవాడు. మఱికొన్ని సమయాల్లో అతని సర్వస్వాన్నీ తండ్రి ఆవేశించేవాడు. అటువంటి సమయాల్లో తన తండ్రి కూర్చున్న చోటూ, అతడు వాడిన చెంబూ, అతడు పట్టుకున్న కఱ్ఱా ఇట్లాంటి వాటి కోసం తహతహ లాడేవాడు. కాని అవి ఏవీ అతని భాగంలో లేవు. అతనికి దక్కింది తండ్రి హృదయం

మాత్రమే. భౌతికమైన తండ్రి ఆకారాన్ని జ్ఞాపకం చేసి ఏతద్వియోగ బాధ నపనయించే బాహ్యా వస్తువొక్కటీ అతని భాగంలో రాలేదు.

గోపాలనికీ విచారం ఏమీలేదు. కాని ఒక్కొక్క రోజు గడిచిన కొద్దీ అతనికి సంసారం బరువు ఎక్కువ కావడం మొదలు పెట్టింది. పాలేరు లేకపోయినా తనకు కావలసిన పనులన్నీ తనే చేసుకుంటున్నాడు. ఎంత చేసుకున్నా తన్ను అనుకూలించే వాళ్లు ఊళ్లో ఎవళ్లూ లేకపోవడం అతనికి కష్టం అయింది. రెడ్డి ఇచ్చిన పైకం చేతిలో ఉన్నది. ఉన్నా దాన్ని ఖర్చు పెట్టుకోవడానికి వీలులేని పరిస్థితులు వచ్చాయి. తనకాపురం కొత్తది. తానా ఊళ్ళో నిలదొక్కుకోవాలి. ఇప్పుడే పైకం ఖర్చు పెట్టితే ముందేం అవసరం వస్తుందో అని దాన్ని దాచి పెట్టాడు. దీనికితోడు తన భార్య ఎంతసేపూ అన్న పక్షాన వాదించడం కూడా అతనికి ఇష్టమయ్యేది కాదు.

ఉన్నవి ఉండగా పంపకమైన మూడోనాటి నుంచీ అతనికి ఒక కొత్త బెడద వచ్చిపడింది. ఎడ్లలో అతని ఎద్దు చిన్నది కావడంతో అది బెంగ పెట్టుకుంది. జతగా వెయ్యడం అలవాటయిన గొడ్డు కాబట్టి ఈ మూడు రోజుల నుండీ ఒంటరిగా కట్టివేస్తూ ఉండడం వల్ల మేత వెయ్యడం మానివేసింది. కొత్త వదిలితే అదే మేస్తుందని ఒకటి రెండు రోజులు ఉపేక్ష చేశాడు కాని తర్వాత గూడ అది అట్లాగే ఉండిపోయింది. దిష్టితాడు వేయించీ, నడుంతాడు కట్టించీ తంటాలు పడ్డాడు గాని లాభం లేకపోయింది. తన ఎద్దు ఇలా తీసిపోతూ ఉంటే రాముడి ఎద్దు బాగానే ఉంది. దీన్ని అతడు సహించలేకపోయాడు. తాను దుక్కలా ఉంటే తన అన్న రోజురోజుకూ శుష్కిస్తున్నాడే అన్న విషయం అతనికి తోచలేదు. అది తెలిస్తే ఈ ఎడ్ల పరిస్థితి కూడా అర్థమయ్యేది. రాముడి ఎద్దు అప్పుడప్పుడు జతవిడిచి పొరుగూరుపోయి పనిచేసి వచ్చేది. అందుకని గోపాలం ఎద్దుకు పట్టినంతగా దీనికి జత విడవడం దుఃఖం పట్టలేదు. మొదట్లో రెండు మూడు పూటలు తోటి ఎద్దుకు సానుభూతి చూపిస్తూ రాముడి ఎద్దు మేత మానివేసినా తర్వాత మామూలుగా మేతమేస్తోంది. అందుచేత రాముడికి తన ఎద్దు విషయమైన ఆందోళన ఏమీ అవసరం లేకపోయింది. కాని గోపాలం వద్ద పదిరోజులు గడిచేటప్పటికి సగానికి సగం తీసింది. అది ఎప్పుడూ రాముడి ఎద్దువంకే చూస్తూ నిలబడేది. అప్పుడు పరకా అప్పుడో పరకా నమిలినా మనఃపూర్తిగా తినని తిండి ఏంవంట బట్టుతుంది?

రాముడికి దుఃఖం కొంచెం వెనకపట్టింది. ఇప్పుడు ఇదివఅకు మాదిరి ఎప్పుడూ ఇంట్లో కూర్చోక బైటికి వచ్చి ఆ పనీ ఈ పనీ చూచుకుంటున్నాడు. ఊళ్ళో పరపతిగల మనిషి కాబట్టి వాముల దొడ్డి నుంచి మేత తేవడం, పచ్చగడ్డి మోటబావులకింద ఎక్కడైనా ఉంటే తెచ్చుకోవడం మొదలైన పనులన్నీ తాను చేసుకోకుండానే ఇతరులచేత చేయించుకుంటున్నాడు. పనిచేసుకోవడంలో అతనికేమీ కష్టం లేకపోయినా అతని దుఃఖాన్ని తిరగబెట్టే పరిస్థితులు అనుక్షణమూ తటస్థిస్తూనే ఉన్నాయి.

గోపాలం ఎద్దు ఇలా శుష్కిస్తూ ఉండడం అతన్ని ఎంతో కష్టపెట్టింది. అది రోజల్లా పోత బొమ్మలా నిలబడి కళ్ల వెంబడి నీరు కారుస్తూ ఉంటే చూడలేక పోయేవాడు. దాని

ఎదురుగుండా తన పాకలో కూర్చుని తాను గూడా ఏడ్చేవాడు. గోపాలం ఏకారణం చేతనైనా ఇంట్లో లేకపోతే తన ఎద్దును కట్టు ఊడదీసి గోపాలం భాగంలోకి తోలి అక్కడే మఱింత మేత పడేవేసేవాడు. దీని జతన ఉన్నంత సేపూ గోపాలం ఎద్దు కూడా మేతమేసేది. ఇటువంటి సమయంలో ఒక రోజున గోపాలం చూచాడు. అతనికి ఒళ్లు మండి కోపం వచ్చింది. చేతికఱ్ఱతో రాముడి ఎద్దును కొట్టుతూ 'గొడ్డు మేత కోసం అశుద్ధం తినకపోతే ఏం? దగ్గఱ ఉండి మేపుతున్నాడు పెద్దమనిషి' అని అంటూ పెద్ద గందరగోళం చేశాడు. రాముడు నోరుమూసుకొని కళ్ళ నీళ్ళు గుక్కుకుంటూ దగ్గఱికి వచ్చిన ఎద్దు వీపు మీద చేత్తో నిమిరి దాని మీద పడి భోరున ఏడ్చాడు. మఱొకమాటు గోపాలం ఎద్దు తాడు తెంపుకుని రాముడి ఎద్దుతో కలిసి మేతమేస్తోంది. రాముడు దాన్ని చూచి మఱింత మేత వాటి ముందు పడవేసి రెండు చేతుల్తో రెంటికీ అఱ్రుగోకుతూ కూర్చున్నాడు. ఇదీ గోపాలం కంట పడింది. "బుద్ధి గడ్డితినే వెదవలకు ఎన్నిసార్లు చెప్పితే ఏం లాభం? నా ఎద్దుని తీసుకువెళ్ళి తన పాకలో ఎవడు మచ్చిక చేసుకోమన్నాడు" అంటూ తన ఎద్దును లాక్కుపోయి పెద్ద అల్లరి చేశాడు.

ఇటువంటి సంఘటనలు ప్రతినిత్యమూ రాముణ్ణి కుంగదీస్తూనే ఉన్నాయి. గోపాలం ఎద్దు ఏ మాత్రమూ కోలుకోక అట్లాగే ఉండిపోతోంది. రాముడు దాని దీనస్థితి చూచి భరించలేకపోయాడు. దాన్ని బాగు చేద్దామని తాను ఏమి చేసినా గోపాలం దానికి దురర్థం కల్పిస్తున్నాడు. తన ఎద్దును గోపాలానికి ఇచ్చేస్తే ఆ ఎద్దు తప్పకుండా బాగుపడుతుంది. కాని తాను ఈ పని చెయ్యడం తన భార్యకు ఇష్టం లేదు. ఒకసారి తాను ఈ అభిప్రాయం బైటపెడితే "ఇచ్చుకోండి. ఇద్దఱమూ కాడి భుజాన వేసుకుని పొలందున్నుదాము" అన్నది. ఆవిడ అభిప్రాయం ఎట్లా ఉన్నా తాను ఇవ్వడానికే సిద్ధపడ్డాడు. కాని ఈ ముక్క తానంటే గోపాలం ఏమంటాడో! దీనికి ఏమి అర్థం కల్పిస్తాడో? మొత్తానికి అతనికి భయంగానే వుంది. అయినా ఒక రోజున ధైర్యం చేసి చెప్పుదామని నిశ్చయం చేసుకున్నాడు. అప్పుడు గోపాలం గొడ్లపాకలో అతని ఎద్దు దగ్గఱ నుంచుని ఉన్నాడు, ఆ ఎద్దు మేతమెయ్యకుండా రాముని ఎద్దువంక చూస్తోంది. అటువంటి సమయంలో రాముడు తన ఎద్దు దగ్గఱకుపోయి దాని తలతాడు ఊడదీసి నడుంమీద వేసి బయటికి తోలుతూ "గోపాలం! నీ ఎద్దు బొత్తిగా పాడైపోతోంది. దీని జతన ఉంటే అది బాగుపడుతుంది. నేను మఱొక జత కొనుక్కుంటాను. దీన్ని గూడా నువ్వు తీసుకో" అన్నాడు. వెంటనే మబ్బులేకుండానే ఉఱుములూ, మెఱుపులూ ఫెళఫెళార్భాటాలు చేశాయి. "నీ మూలాన, నీ ఎద్దు మూలాన అన్యాయంగా నా ఎద్దు పాడైంది. పెద్ద ఔదార్యం చూపించ వచ్చావు. పుచ్చుకున్న మఱునాటి నుంచీ ఊరంతా రెండు ఎద్లూ కాజేశానని నన్ను అనేందుకా! నాకు నీ ఎద్దేమీ అక్కర్లేదు. నేనే మఱో ఎద్దు కొనుక్కొంటాను" అని దూకుడుగా వెళ్లిపోయాడు. రాముడు ఏం చెయ్యగలడు? తన ఎద్దును మళ్ళీ గుంజకు కట్టుకున్నాడు.

గోపాలం ప్రవర్తన ఇంతటితో ఆగలేదు. అతడు చేసే ప్రతి పనీ, అనే ప్రతిమాటా రాముడి దుఃఖాన్ని మఱింత గాఢతరం చేస్తూనే వచ్చాయి. తన భార్యని అన్నగారి భాగంలోకి

వెళ్ళవద్దని కట్టుదిట్టం చేశాడు. భర్తకు భయపడి వెళ్ళడం అతని ప్రత్యక్షంలో మానినా మేనత్తకొడుకన్న చనువుండడం చేత పెద్దబావ పక్షాన ఎప్పుడూ వాదిస్తూనే ఉండేది. ఆ వాదనలు అప్పుడప్పుడూ చాలా తీవ్రంగా నడిచేవి. ఆ తీవ్రతలో తమతమ భావాన్ని బట్టి గోపాలం ప్రవర్తన కూడా ఉండేది. ఒక మాదిరిది అయితే అన్నను తిట్టి పొయ్యడం, కొంచెం ఎక్కువయితే భార్యనీ అన్ననీ కలిపి తిట్టి తిండి తినకుండా లేచిపోవడం, అంతకన్నా ఎక్కువయితే భార్యమీద చెయ్యి చేసుకోవడం, ఇదీ వరస. ఈ వరస రోజుకొక మాటన్నా అన్ని దశల్లోనూ జరుగుతూ వుంటుంది. ఒక రోజున పొద్దుగుంకేవేళ గోపాలం ఇంటికి వచ్చాడు. అప్పుడు సీతమ్మ రాముడి భాగంలో నుంచి బైటికి వస్తోంది. అప్పటికి రెండు రోజుల నుంచీ చంటివాడికి జ్వరం తగులోంది. సీతమ్మకవకాశం దొరకక వాణ్ణి చూడనన్నా చూడలేదు. ఆ పూట పనిమీద గోపాలం పొరుగూరు వెళ్ళాడు కదా అన్న ధైర్యంతో పెద్దబావ భాగంలోకి వెళ్ళింది. "సాయంత్రానికి తిరిగి వస్తాను, జాగ్రత" అని గోపాలం చెప్పే వెళ్ళాడు. ఎప్పుడు వస్తాడో అని సీతమ్మ భయపడుతూనే వుంది. తానిలా బైట అడుగుపెట్టిందో లేదో గోపాలం చక్కా వచ్చాడు. సీతమ్మను చూడటంతోటే గోపాలానికి ఉప్పెనలా కోపం వచ్చింది. అట్లా నిలబడి కళ్ళు పెద్దవి చేసి ముఖం కండలు ఉబ్బించి సీతమ్మ వంక చూచాడు. తలవంచుకుని మెల్లగా తమ భాగంలోకి వెళ్ళింది సీతమ్మ. దీంతో గోపాలం కోపం మఱీ ఎక్కువైంది. సరాసరి లోపలికి వెళ్ళి కంచంలో అన్నం పెట్టడానికి వంగి ఉన్న సీతమ్మ జుట్టు పట్టుకుని పైకి ఎత్తి ఛడామడా రెండు చెంపలూ వాయించాడు. చెంప మీద చెయ్యి అంటిపోయి వాతలు కనబడ్డాయి. ఆ ముఖం చూడకుండానే గోపాలం గిఱ్ఱున వెనక్కి తిరిగి బైటికిపోయాడు. ఏదో అఘాయిత్యం జరగబోతుందని రాముడు అనుకుని కుఱ్ఱవాణ్ణి జోకొట్టుతూ ఇవతలకు వద్దామని ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. ఇంతలో దెబ్బ తగలడం, సీతమ్మ ఏడవడం, గోపాలం వెళ్ళిపోవడం అన్నీ జరిగాయి. ఏడుస్తున్న కుఱ్ఱవాణ్ని మంచం మీద అల్లాగే ఉంచి రాముడు హడావిడిగా సీతమ్మ దగ్గఱకు వెళ్ళాడు. "బావా! రాబోకు. వెళ్ళిపో! వెళ్ళిపో! నిన్ను కూడా కొట్టుతారు. నేను చూడలేను, వెళ్ళిపో" అని బిగ్గఱగా అఱిచింది. రాముడు మఱదలు తల నిమురుతూ కొంచెం సేపు ఓదార్చాడు. "సీతా! వాడు ఎప్పుడూ ఇలాగే ఉండడు. వాడి అంతట వాడే మాఱతాడు. ధైర్యం వహించాలి గాని నువ్వే ఇట్లా అయితే ఇక నేనేం కావాలి? నేను ఎంత బాధపడుతున్నానో నీకు తెలియదూ" అని అంటూ ఉండగానే ఏడుస్తున్న కుఱ్ఱవాణ్ని సముదాయించడానికి వచ్చిన అన్నపూర్ణ సాధింపు మాటలు వినపడ్డాయి. "ఈ లెక్కన కుఱ్ఱవాడు గోల పెట్టుతూ ఉంటే వాడి దగ్గఱ కాస్తా కూర్చోగూడదూ? అటువంటా, ఇటు వీడి సంరక్షణా అన్నీ నేనే చూచుకోవలసి ఉండె. అయినా ఎన్నిటికని నేనేడుస్తాను! అయినా వాళ్ళ కాపేక్షలుండాలి గాని ఇటు చేసుకున్న పెళ్ళామూ లేకపోయె, కన్న కడుపు అని ఆపేక్షాలేకపోయె. ఇంతకూ మన అదృష్టం ఇల్లా తగలబడింది. ఏడవకురా వెధవా" అని విసుక్కుంటూ కుఱ్ఱవాడి పిఱ్ఱమీద రెండు అంటించి, వాడు కెవ్వుమనగా ఎత్తుకుని దూకుడుగా లోపలికి వెళ్ళింది

అన్నపూర్ణ. ఈ మాటలు రాముడి హృదయంలో శూలాల్లా గుచ్చుకున్నాయి. మాఱుమాట్లాడలేక స్తబ్ధుడై నిలబడిపోయాడు. శరపాత శిలాతలాల నడుమ పడి నలుగుతున్న శిరీష పుష్పము వలెనై అతని హృదయం చైతన్యం కోల్పోయింది. ఇంతలో గోపాలం వస్తూ ఉండడం చూచి ఏదో తప్పు చేసిన వాడిలా అప్పుడే తెలివి వచ్చిన రాముడు తన భాగంలోకి తూలుతూ తడుముకుంటూ వచ్చేశాడు.

ఈ విధంగా ఒక వంక తమ్ముడూ, మఱొకవంక భార్యా తన్ను అనేమాటల్తో జీవితం మీద అసహ్యం పుట్టి దుఃఖభారంతో ఎందుకు వచ్చిందిరా భగవంతుడా అన్నట్లు జీవయాత్ర సాగిస్తున్నాడు రాముడు. పట్టుదల గల గోపాలం ఎన్ని విషమ పరిస్థితులు వచ్చినా అట్లాగే నెట్టుకురావాలని ప్రయత్నిస్తున్నాడు. ఎన్ని విషయాల్లో సద్దుకోగలిగినా ఎద్దు విషయంలో మాత్రం గోపాలమేమీ చెయ్యలేకపోయాడు. అది నానాటికీ తీసిపోతోంది. ఇంకా కొన్నాళ్లు ఉపేక్షచేస్తే చచ్చిపోతుందేమో అని కూడా అనిపిస్తోంది. చిట్టచివఱికి గోపాలానికి ఎట్లాగైనా దాని సంగతి తేల్చుకోవాలన్న నిశ్చయం కలిగింది. దాని జతకు మఱొక ఎద్దును కొనడం తప్ప మఱే ఉపాయమూ తోచలేదు. ఎద్దును కొనడం అంటే సామాన్యమైన విషయం కాదు. అయిదు వందలన్నా ఉండాలి. బండి బాపతు రెడ్డి ఇచ్చిన రెండు వందలు తప్ప తన దగ్గఱ దమ్మిడీ లేదు. ఏమిటి చెయ్యడం. భార్య నగలమ్మడానికి తగిన స్వాతంత్ర్యం తన మేనమామ దగ్గఱ తనకులేదు. అందుకని వాటి జోలికి పోకూడదు. ఎదురుగుండా ఆవూ, గేదే కనబడుతున్నాయి. వాటినమ్మితే కావలసిన పైకం వస్తుంది. కాని మజ్జిగ చుక్కకు కరువు వస్తుంది. పల్లెటూళ్లల్లో చల్లచేసి కుడితి తొట్లలో అన్నా పోస్తారు గాని ఊరికే అసలు పొయ్యరు. అయినాసరే, ఇబ్బంది పడక తప్పదు. అమ్మితీరాలి. అమ్మకపోతే ఉన్న ఎద్దూ పోతుందేమో అన్న భయముంది. అదిగూడా పోతే తాను ఎడ్లు కొనలేదు; వ్యవసాయం చెయ్యనూ లేడు.

ఈ రోజుల్లో పాడి గొడ్డునీ, పంట పొలాన్ని అమ్మజూపితే కొనందెవరు? నిమిషాల్లో నూరు దగ్గఱ నుంచీ నూట ఎనభై దాకా పెరిగింది ఆవు ఖరీదు. పుల్లారెడ్డి తాను రాకుండా పాలేరును పంపించి "రెండు వందల ఇస్తాను ఇవ్వవలసిం"దని కబురు పంపించారు. గోపాలం ఇంకా వస్తుందేమో అని ఒక రోజు చూచి, ఇంకా ఆశ పడడం భావ్యం కాదని వాళ్ళ పాలేర్నే కేకేసి తోలుకు వెళ్ళమన్నాడు. గేదె అమ్మితే నూట ఎనభై కంటే ఎక్కువరాలేదు. వచ్చిన సొమ్ముకు ఉన్న సొమ్ము కలిపి తన ఎద్దుకు సమానమైన ఎద్దు కొనాలని భగీరథ ప్రయత్నం చేశాడు. కాని సఫలం కాలేదు. చిట్టచివఱకు తన ఎద్దుకంటే ఒక గుప్పెడు ఎత్తు తక్కువున్నదాన్ని – నాలుగుకాళ్ళ ఎద్దును కొనుక్కొనివచ్చి పాకలతో తన ఎద్దుప్రక్క కట్టేశాడు.

ఇంత చేసినా పాపమా యెద్దు బెంగవదలలేదు. తాను చిక్కినా అది కొత్త ఎద్దువంక గౌరవంతోనూ చూచేది కాదు, ప్రేమతోనూ చూచేది కాదు. ఏదో అప్పుడప్పుడు మఱీ అంతగా కడుపులో ఎలికలు దూరితే ఒక పరక ఎంగిలి పడడమే గాని ఆప్యాయంగా తినడమేలేదు.

మఱి అదేం కోలుకుంటుంది! యథాప్రకారంగా ఆ ఎద్దు తీసిపోవడం తప్ప అభివృద్ధి సూచన లేమీ కనపడడం లేదు.

✡

ఇంతలో జ్యేష్ఠ మాసం వెళ్ళింది, ఆ నెలలో అప్పుడొక వానా అప్పుడొక వానా పడి నేల అంతా చక్కగా పచ్చిక కట్టింది. అందుకని ఎడ్లను గూడా పొలం తోలుతున్నారు. పొలం తోలడం మొదలు పెట్టిన దగ్గఱనుంచీ గోపాలం ఎద్దు గూడా కొంచెం బాగుపడింది. ఈ మార్పుకు కారణం పొలంతోలడమే మాత్రమూ కాదు. కాని అందువల్ల దానికి రాముడి ఎద్దుతో పగలంతా కలిసి ఉండే అవకాశం వచ్చింది. ఒక్క ఇరవై ఏళ్ళ జైలులో ఒంటరిగా చీకటి కొట్టులో జీవితం గడిపిన వ్యక్తి బైటికి వచ్చినప్పుడు ఎంత ఆనందం అనుభవిస్తాడో అంత సుఖం అనుభవించింది. పాపమాఎద్దు. చిన్నప్పటి నుంచీ తనతో ఎదిగిన ఎద్దు తన పక్కన లేకపోవడం వల్ల ఇన్నాళ్ల బట్టీ ఎంత మథన పడిందో కాని పాపం తలత్రాడు ఊడతీసి పొలం తోలడానికి పాకలోనుంచి బైటికి పంపిన దగ్గరనుంచీ తిరిగి ఇంటికి వచ్చేవఱకూ ఒక్క క్షణం రాముడి ఎద్దును విడిచి ఉండడం లేదు. ఎంతసేపూ దాని ప్రక్కనే నడుస్తుంది. తన శరీరం దాని శరీరాని కొరుసుకునేటట్లు నడుస్తుంది. నెమరు వేసేటప్పుడు దానికెదురు గుండా పడుకుని కళ్లలో కళ్లుపెట్టి చూస్తూ ఉంటుంది. ఇటువంటి పరిచయం వచ్చి నాలుగు రోజులు కాకపోయినా అది పోయిన బలం అంతా సంపాదించుకుంది. "వుత్సాహం సగంబలం" అన్నమాటలో ఎంత నిజముంది! ఆ జతను చూచిన వాళ్లందఱూ ఎటువంటి జతరా అని ఆశ్చర్యపడకుండా ఉండరు.

తన ఎద్దులో కలిగిన ఈ మార్పుకు గోపాలం సంతోషించకపోలేదు. వ్యవసాయపు దుక్కులు సాగించడానికి ఇంకా పది రోజులు వ్యవధి ఉన్నది కదా, ఇంతలో ఇది హాయిగా బాగు పడుతుంది అని ఆశ పెట్టుకున్నాడు. దాన్ని త్వరగా బాగు చెయ్యాలన్న ఉద్దేశంతో తెలగపిండీ, మడ్డి కూడా పెట్టించాలని కూడా అనుకున్నాడు. కాని, తీరా తెప్పించి దాని ముందు పెట్టేటప్పటికి అది వాసనైనా చూడలేదు. పాప మా ఎద్దు మనస్థితి ఏమిటో కాని ఇంటికి వచ్చాక ఏ విధమైన మేతా మెయ్యదు. పొలంలో ఆ ఎద్దుతో కలిసి ఏం మేస్తుందో అంతే. ఈ విషయం గోపాలానికి కొంత నిరుత్సాహం కలిగించింది. కాని ఏం చెయ్యగలడు? అట్లాగే సమాధాన పరుచుకుని ఊరుకున్నాడు. కొత్త ఎద్దు రావడం వల్లనే తన ఎద్దు బాగు పడిందని అతని అభిప్రాయం. ఇంటి దగ్గఱ మేత మెయ్యక పోవడం బట్టి అది సరియైన అభిప్రాయం కాదని తెలుసుకోవలసి ఉన్నా తనకు వ్యతిరేకమైన ఊహ రానిచ్చేవాడు కాడు. మొత్తం మీద ఎద్దులో కలిగిన మార్పుకు సంతోషిస్తూనే ఉన్నాడు.

అది చెఱువు కింద పల్లాల ఊరు అవడం వల్ల పల్లపు దుక్కులు తొలకరిలోనే ఆరంభించినా చెఱువు నిండే వఱకూ వ్యవసాయపు పనులు ముమ్మరంగా సాగవు. తొలకరించడంతోటే

రాముడు పుల్లారెడ్డి దగ్గరకు పోయి అతని పొలంలో ఒక రోజు పనిచేసి అతని అరక అడిగి తెచ్చుకుని తన పొలం దున్నుకున్నాడు. తన ఎకరం పొలానికి కావలిసిన నారు కూడా రెడ్డి పొలంలోనే పోసుకున్నాడు. సాధారణంగా పశువుల విషయమూ, ముఖ్యంగా తన ఎద్దు విషయమూ తెలిసిన వాడు కాబట్టి రాముడు తన ఎద్దుకు మఱో ఎద్దుతో జత కలపడానికిగాని, దాని చేత పని చేయించడానికిగాని పూనుకోలేదు.

గోపాలానికి ఊళ్ళో తనకు అట్లాంటి సహాయం లభ్యమౌతుందన్న ఆశ లేదు. అందుచేత గత్యంతరం లేక తన ఎడ్లు రెంటినీ జత కలిపి దున్నుకోవలసిన అవసరం వచ్చింది. పూర్తిగా నాగలి కట్టి దున్నడం మొదలు పెట్టక ముందు రెంటినీ కాడిగట్టి అలవాటు చెయ్యాలని కఱ్ఱులేని నాగలితో ఒక రోజున ప్రయత్నం చేశాడు. కొత్త ఎద్దు జతగిట్టక గోపాలం ఎద్దు మారాం చెయ్యడం మొదలు పెట్టింది. కోపం వచ్చి నాలుగు దెబ్బలు వేస్తే రెండడుగులు వేసినా ఏమఱుపాటున ఎటో అటు లాగివేసేది. నానాయాతనా పడి మళ్ళీ స్వాధీనంలోకి తెచ్చుకుని ఎంత అరిచినా, ఎంత కొట్టినా, ముల్లు కఱ్ఱ పెట్టి ఎంత పొడిచినా అడుగుతీసి అడుగు పెట్టేదికాదు. వట్టి కాడి భుజానవేసి జతను తోలుకు వస్తే అలవాటు అవుతుందని ఇంటి వైపుకు మళ్ల వేస్తే కొత్త ఎద్దును తనతోపాటు పరిగెత్తించి మేఘాలమీద ఎగిరి పోయి, ఏ చెట్టుకో కాడి తగిల్చి, మెడతాడు తెంపుకుని భూప్రదక్షిణం చేసి అర్ధరాత్రి ఏ వేళకో యింటికి వచ్చేది. దాంతో పౌరుషం వచ్చి ఎద్దు ఇంటికి రావడంతోటే గోపాలం దాన్ని కోపంతో కొట్టేవాడు. కసి తీర్చుకున్నా ననుకుని రేపు దుక్కిలో దింపితే సరి, లాగకేం చేస్తుందని ధైర్యం వహించేవాడు.

ఆ రాత్రి బ్రహ్మాండంగా వర్షం కురిసింది. గట్లు తెగేటంతగా చెఱువులు నిండాయి. ఆబాల గోపాలం పల్లెటూళ్ళో అందఱూ తమ తమ అభీష్టాలు నెఱవేరినట్లు సంతోషిస్తున్నారు. సంస్కార వంతుడైన మానవుడు పరోపకార విషయంగా ఆర్ద్ర మనస్కుడైనట్లు భూమి సమస్తమూ బీజనిక్షేపానికి అనువైంది. నేల యీనినట్లు కర్షక జనం యావన్మందీ పంట పొలాల్లో పని చేసుకోవడానికి బయలుదేరారు.

తెల్లవారకుండానే మధ్యాహ్నం లోపల తన ఎకరం పొలం ఊడ్చెయ్యాలని రాముడు రెడ్డి అరక తోలుకుని పొలానికి వచ్చాడు. గోపాలం కూడా తన జతను వెంట బెట్టుకుని రెండు చాళ్లన్నా ఇవాళ దున్నుదామని బయలుదేరి వచ్చాడు. ఉన్న రెండెకరాల భూమికి రెండు జతల ఎడ్లతో వ్యవసాయం చేస్తున్న వీళ్ళని చూచి ప్రకృతే నవ్వుతోందా అన్నట్లుగా భళ్లున తెల్లవారింది.

గోపాలం తన జతతో దుక్కి సాగించడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నాడు. కాని ఎంత చేసినా లాభం లేకపోతోంది. గోపాలం ఎద్దు కొత్త ఎద్దుతో ఏ మాత్రమూ సయోధ్య కుదుర్చు కోలేదు. వట్టి నేలనైతే తన యిష్టం వచ్చినట్లు గంతులు వెయ్యడానికి అవకాశం వుండేది.

వరిపొలం మడిలో దుక్కి అయిన కారణం చేత బురద నేల అవడం బట్టి అటూ ఇటూ పారిపోవడానికి వీలు చిక్కడం లేదు. గోపాలం ఎద్దు ఒక కొత్త విద్య నేర్చుకున్నది. కొత్త ఎద్దుతో జత కలవక అది కాస్తా ముందుకు లాగిందంటే ఇది చటుక్కున పడుకునేది. తోక మెలిపెట్టీ, ముల్లకఱ్ఱతో పొడిచీ, ఇంకా లేవకపోతే ఆ కఱ్ఱతోనే వీపుమీద నాలుగువేసీ, వీటన్నింటికీ ఊతగా రాముణ్ని ఉద్దేశించిన తిట్లు కలిపీ ఎంతో హైరాణపడగా ఒకసారి లేచేది, చొచ్చో అని రెండడుగులు వేయించేటప్పటికి మళ్ళీ పడుకునేది. తానిలా తనదుక్కితో నానా తిప్పలూ పడుతూ ఉంటే తన పక్కనే రాముడు ఏ కష్టమూ లేకుండా పొలం దుక్కి పూర్తి చేసుకోవడం చూచి సహించలేక కోపం మఱీ ఎక్కువై ఒళ్ళు తెలియకుండా బాదడం సాగించాడు గోపాలం.

గోపాలం మనసులో ఒక పుట్టీపుట్టని ఊహ. తానుపడే కష్టమంతా చూస్తూ తనకంటే వ్యవసాయంలో ఎక్కువ అనుభవమున్న రాముడు తాను అడగకపోతే మాత్రం ఎందుకు సహాయం చేయగూడదు? కాని ఈ ఊహ రూపుకట్ట నివ్వకుండా అతని వ్యక్తిత్వం అడ్డునిలిచేది. వెంటనే వాడేమిటి, నాకు సాయంచేసేదేమిటి అనే ధోరణి ప్రబలి అంతా తనే చేసుకోవాలన్న పట్టుదల తోచి, నిర్వహించు కోవడానికి ఉపాయం తట్టక అసమర్ధతా పారవశ్య దూషితమైన ఈ ప్రవర్తనలో పడిపోయాడు గోపాలం. గోపాలాన్ని చూస్తే రాముడికి జాలీ కలుగుతోంది, కోపమూ వస్తోంది. తమ్ముడికి సాయం చెయ్యాలన్న భావం అతని మనస్సులో ఎప్పుడూ గాఢంగా ఉంటుంది. కాని చెయ్యబోతే అతడు దానికి ఏ అర్థం చెప్పి తన్ను దూషిస్తాడో అన్న భయం మాత్రం వెంబడిస్తుంది. అందుచేత జంకుతాడే కాని అసలు చెయ్యకపోవడం అతని స్వభావంలో లేదు. ఇప్పుడు గోపాలం ఎద్దువల్ల పడుతున్న యాతన చూచినదాని కంటే గోపాలం ఎద్దును పెట్టుతున్న యాతన చూచి అణుమాత్రం సహించలేకపోయాడు రాముడు. ఈసారి గోపాలం ఉగ్రం చూస్తే ఎద్దునెత్తురు కళ్ల చూస్తాడా అనిపించింది. రాముడి గుండె దడదడలాడింది. చటుక్కున కఱ్ఱులోతుగా గ్రుచ్చి, దుక్కి ఆపి వేసి వెనక్కు తిరిగాడు. గోపాలం ఇంకా కొట్టుతూనే ఉన్నాడు. ముల్లుకఱ్ఱ చేత్తోపుచ్చుకుని చకాచకా నాలుగడుగులు వేసి ఎద్దు దగ్గఱకు పోయాడు రాముడు. గోపాలం ఎత్తిన కఱ్ఱ ఎత్తినట్లే ఆగిపోయాడు. రాముడిలా వస్తాడని అతనెన్నడూ అనుకోలేదు. రాముడు సరాసరి ఎద్దు దగ్గఱకు పోయి దాని వీపుమీద రాస్తూ, ముఖంలో ముఖం పెట్టి చూచి కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. ఒళ్లంతా వాతలు లేలి వుంది. దానిమీద చెయ్యివేసి, దానికళ్ళల్లో చూస్తే తన శరీరంలో ప్రతి నరమూ ఉబికి వాతలు తేలి కలుక్కు మన్నట్టయింది. ఆ బాధ భరించలేక పోయాడు. ఒక్కమాటు దాని ముఖం మీద ముఖం పెట్టి ఏడ్చాడు. దాని మెడమీద పెట్టిన తన చేతికి కాడికట్టు తగిలింది. అప్పుడు తెలివివచ్చి మెడతాడు వదిలించి కాడి ఊడ దీసి గట్టున పెట్టాడు. గోపాలం ఏం చెయ్యడానికీ తోచక ఎత్తిన కఱ్ఱదించి కాసేపు నుంచున్నాడు. రాముడు ఎద్దును నుంచోపెట్టాలని తోకమీద నిమిరి జబ్బ చరుస్తున్నాడు. అది లేవడం లేదు గాని కలత నిద్రలో మనిషి ఉలిక్కి

పడ్డట్టు కదులుతోంది. రాముడికి కూడా ఏం చెయ్యడానికి తోచలేదు. చెఱువుకట్ట అంచున మొలిచిన పచ్చి గడ్డి పరకలు కోసి తెచ్చి అరచేతుల్లో పెట్టుకుని దానికెదురుగా కూర్చున్నాడు. గోపాలం ఒకచోట నిలబడలేకపోయాడు. రాముడక్కడుండగా ఎద్దు దగ్గఱకు పోలేకపోయాడు. చిరాకెత్తి ఒళ్లు తెలియని వానిలాగా పొలం గట్ల వెంబడి చకచకా నడవడం మొదలు పెట్టాడు.

అప్పటికి ఝాము పొద్దెక్కింది. ఎఱ్ఱగుడ్డ కట్టిన కూడు దుత్తనెత్తిన పెట్టుకుని పొలం కాపునకు అన్నం తెచ్చి పెట్టే కాపుపడుచువలె సూర్యుడు చెఱువు కట్టపైకి వచ్చాడు. బాల సూర్యకిరణ చిత్రవర్ణ సమాక్రాంతములైన శాద్వల భూములు సత్యకాలంలో కృషీవలుడు స్వయం కృషి చేత సంపాదించిన మంచి బంగారపు మేలిమికాంతుల భ్రాంతి మాత్రమే కల్పిస్తున్నాయి. కాని యిది సత్యమునంద సత్య భ్రాంతియేమో అని అనిపిస్తోంది. ఆ కాంతుల వెంబడి రాత్రి చల్లదనము సర్వస్వమూ తొలికోడి కూతలో కోల్పోయిన ఎద్దు మెడలోని కంచు గంటల సుస్పష్ట శ్రావ్యనినాదములు వినవచ్చినవి. చెఱువుతట్టు లోగట్టున మేత మెయ్యడానికి ఊళ్ళో గొడ్లన్నీ అప్పుడప్పుడే వస్తున్నాయి. రాముడి ఆవూ, గేదే కూడా వచ్చాయి. ఆవు చెఱువు కట్ట ఎక్కి మడిలో పడుకున్న ఎద్దునూ, ఎద్దుదగ్గఱ కూర్చున్న రాముణ్నీ చూచి అరిచింది. ఆ అరుపుకు గోపాలం ఎద్దు ప్రతిధ్వని చేసింది. అటూ ఇటూ తిరుగుతున్న గోపాలం ఒకసారి ఆవువంకా, ఒకసారి తన ఎద్దు వంకా చూచి ఆగాడు. అంతలో మళ్ళీ పచార్లు మొదలుపెట్టాడు. ఆవు చెఱువుకట్ట దిగి మడిలోకి రాబోతోంది. గోపాలానికి చిరాకు ఎక్కువైంది. దూకుడుతో అటూ ఇటూ నడవడంలో రాముడి మడిలో మెడమీది కాడితో బురదనేలలో దిక్కులు చూస్తూ దవడలు ఆడిస్తున్న రెడ్డిగారి ఎడ్లజత గోపాలం కంట బడింది. అతడు సరాసరి దాని దగ్గఱకు పోయాడు. అనాలోచితంగా మెడకట్టు వదిలించి కాడి ఊడదీసి గట్టున పెట్టాడు. ఎడ్లు రెండూ రెండడుగులు వేసి మడిదాటి రోడ్డు మీదికి వచ్చాయి. గోపాలం వాటి వెంబడే వెళ్లాడు. ఎదురుగుండా రాముడి ఎద్దు వస్తూ వీటిని చూచి అరిచింది. అది దూకుడుగా చెఱువు కట్టమీదికి వెళ్తోంది. గోపాలం ఎడ్లను తోలుకుని ఊళ్ళోకి వెళ్ళి పోతున్నాడు.

చెఱువు కట్ట ఎక్కి రాముడి ఎద్దు మడిలో గోపాలం ఎద్దును చూచి గట్టిగా అంభా అని అరిచింది. గోపాలం ఎద్దు కూడా దీనివంక చూచి అంభా అని మళ్ళీ అరిచింది. రాముడు ఎద్దు ఒక్క అంగలో ఉరికింది. గోపాలం ఎద్దు ఒక త్రుటిలో లేచి నిలుచుంది. త్రవ్వుతున్న బావిలో జల పొడిచినట్లు రాముడి మనస్సులో ఉత్సాహం పరవళ్ళు త్రొక్కింది. రెండెడ్లూ ఒకదాని మూతి మఱొకదానికి ఆన్చుకుని దీర్ఘకాల వియోగ దుఃఖమలిన కథా ప్రసంగములతో ఓదార్పు పొందాయి. ఒకదాన్ని ఒకటి వెంబడించి గట్లనున్న గడ్డి పరకలు కొరికాయి. ఒక్కొక్క క్షణం ఆగి ఒడళ్లు ఒరుసుకోగా గాఢ పరిష్వంగ సౌఖ్యం అనుభవించాయి. రాముడు వాటి వంకనే అనిమీలిత దృక్కులు ప్రసరిస్తూ ఆనంద తన్మయుడై నిలబడ్డాడు.

అరగంట గడిచింది. ఎడ్లు మేతమాని మువ్వలు లేని బొఱుగు పట్టెడ మ్రోగగా దవడలు ఆడిస్తూ నిలబడ్డాయి. రాముడు కాడితీసి వాటి భుజాన వేశాడు. అప్పటికింకా ప్రొద్దు నడి

నెత్తికి రాలేదు. ఇంకా గజం నీడ పడుతూనే ఉంది. వేసవికాలం కాబట్టి ఇళ్ళకు పోవలసిన సమయం. ఎండ వేడి ఎక్కువగానే ఉంది. కాని కాడి బుజాన వేసుకుని ఎడ్లు ఊరికే నుంచోక నడక సాగిస్తూ ఉండడం చూచి రాముడు ఆనాలోచితంగానే మేడికోలు కాడికి బిగించి నాగలి కొమ్ము చేత బుచ్చుకున్నాడు. దుక్కి సాగిపోతోంది. అరఘడియలో చాలు దుక్కి పూర్తి అయింది. ఎడ్లు మహదావేశంతో ముందు నడుస్తున్నాయి. రాముడు ఉత్సాహంతో దుక్కి పగ్గం పట్టుకు నడిపిస్తున్నాడు. దుక్కి రెండు చాళ్ళూ కలపడం అయిపోయింది. ఎడ్లు వాటిఅంతట అవే ఆగిపోయాయి. రాముడు తలఎత్తి చూచాడు. ప్రొద్దు నడినెత్తికి వచ్చింది.

కాని కాలం వేళ మించి పోయింది. ఇంక ఉండడానికి వీల్లేదు. రాముడు వెంటనే కాడి ఊడ దీసి ఎడ్లను విడిచిపెట్టాడు. ఎడ్లు జంట విడవకుండా ముందు నడవడం మొదలుపెట్టాయి. రాముడు తన మడిలో ఎడ్ల కోసం చూచాడు. ఎడ్లను ఊడదీసి గోపాలం తోలుకు వెళ్ళడం రాముడు గమనించలేదు. ఇప్పుడక్కడ ఎడ్లు కనబడకపోవడంతో అతడు ఒక్క క్షణం నిర్ఘాంతపోయాడు. తన తమ్ముడి ప్రవర్తన ఇంతలో ఇట్లా మారుతుందని అతడు అనుకోలేదు. రాముని స్వభావంలో మాలిన్యం లేకపోయినా తమ్ముని ప్రవర్తన అతని మనస్సులో తెచ్చి పెట్టిన కషం వల్ల గోపాలం ఈ పని చెయ్యడం ఇంకెందుకైనా యేమో అన్న అనుమానం రాకపోలేదు. కాని అతని సహజ సుస్వభావం తలయెత్తి ఈ ఊహను నిలవనియ్యలేదు. ఎడ్లు ఉల్లాసంతో జతగూడి నడుస్తున్నందుకు సంతోషమూ, గోపాలం ప్రవర్తన అర్థంకాక ఆ భావమూ పునఃపునః పర్యాప్తములై అతని మనస్సు మీద రాజ్యం చేస్తున్నాయి. మండుటెండలో పండు వెన్నెలలో వలె ఎడ్ల వెంబడి రాముడు ఊళ్లోకి నడక సాగించాడు.

గోపాలం రెడ్డిగారి ఎడ్లను ఆయన కప్పజెప్పి ఇంటికి చిరాకుతో వచ్చాడు. భర్త చిరాకూ, విసుగూ చూచి సీతమ్మకు నోట మాట రాలేదు. ఏమనడానికీ తోచక చల్లని నీళ్ళు మాత్రం తెచ్చి ఎదురుగుండా బెట్టి లోపలికి వెళ్లిపోయింది. అన్నపూర్ణ ఉదయం నుండీ వంట ఇంట్లో పనులు ఒకదాని వెంబడి ఒకటి తలపెట్టుకోవడం వల్ల తీరక యాతన పడుతోంది. కుఱ్ఱవాడు రంగయ్య ఆలస్యంగా పడుకోవడం వల్ల చాలాసేపు నిద్రపోయాడు. కాని పది గంటలయే టప్పటికి నిద్రలేచి అప్పుడప్పుడు గుక్కపట్టి ఏడవడం మొదలుపెట్టాడు. సీతమ్మ వీలు చూసుకుని అన్నపూర్ణకు తెలియకుండానే పిల్లవాణ్ని తీసుకుందామని ప్రయత్నం చేస్తోందే కాని ఆమెకు కూడా తీరడం లేదు. ఇంతలో గోపాలం రానే వచ్చాడు. గోపాలాన్ని చూడ్డంతోటే సీతమ్మకు ఈ ఊహ కాదుగదా, ఏ ఊహా తోచడం లేదు. కానీ అంతలో పిల్లవాడు గోలపెట్టడం మఱీ ఎక్కువైంది. ఆ ఏడ్పు వినబడడంతోనే ఎన్నడూ కదలని గోపాలం గూడా మనసులో ఒక కదలిక పొందాడు. అమాంతంగా లేచి నుంచున్న భర్తను చూచి సీతమ్మ హడలిపోయింది. కాని గోపాలం చరాచరా అటూ ఇటూ ఒకసారి నడిచి "ఆ లెక్కన ఏడుస్తుంటే వినపడటం లేదూ? కదలవేం" అని అంటూ సీతమ్మను చూచి కళ్లు పెద్దవి చేశాడు. సీతమ్మకు ఈ విధమైన భర్త ప్రవర్తన ఏమీ అర్థంకాలేదు. ఆ మాటల్లో ఎంత నిజమో, ఎంత అబద్ధమో

తోచలేదు. వెళ్ళడానికీ, ఉండడానికీ, కూడా భయం వేసింది. "నీకు కాదూ చెప్పేదీ" అని అంటూ గోపాలం మధ్యనున్న తడికను ఒక తన్ను తన్నాడు. తన్నుతా తెలియని పారవశ్యంలో కిందబడ్డ తడికను తొక్కుకుంటూ సీతమ్మ పరుగెత్తుకుని పోయి పిల్లవాణ్ని తీసుకుంది. అన్నపూర్ణ తడిక పడ్డ చప్పుడు విని బైటకివచ్చి ఆశ్చర్యపడి నిలబడింది.

తలలాడిస్తూ, బొణుగుల చప్పుడు ఒయ్యారంగా చేసుకుంటూ కలిసిమెలిసి పెరిగిన అన్నదమ్ముల వలె ఎడ్ల జత లోపల అడుగుపెట్టింది. గోపాలం ఆ రెండెడ్లనూ తలపగ్గాలు లాగి ఒక చోట కట్టి మేత వేశాడు.

బుజం మీది కాడితో రాముడు వచ్చి ఎడ్లను కట్టుతున్న తమ్ముణ్ణి చూచి విస్తుపోయి నిలబడ్డాడు. ఎడ్లను కట్టిన గోపాలం వెనక్కి తిరిగి అన్నను చూచి "రెండు ఝాములయ్యేదాకా పొలంలో ఏం చేస్తున్నావన్నయ్యా! ఎండ మండిపోవడం లేదూ?" అన్నాడు.

తండ్రిపోయిన ఇన్నాళ్ళకు రాముడి ముఖంలో సౌభ్రాతృ సౌఖ్య సూచక మందస్మితము వికసించింది.

✡

# చావునీళ్లు

**-జి.వెంకటకృష్ణ**

నారాయణప్ప మామ బావిలోకి జారిపడి చనిపోయినాడని ఫోనొస్తే, మామ అంత్య క్రియలకని ఎగువపల్లికి వెళ్లాను. బస్ దిగుతూనే నా చిన్ననాటి నేస్తమూ, బంధువూ కూడా అయిన రామాంజినేయులు కన్పించాడు. స్కూల్ ముందున్న బోరింగు కొడుతూ అలసి పోతున్నాడు.

'ధన్ ధన్ ధన్ ధన్' అంటూ చెవుల్లో హోరుమంటూంది శబ్దం.

'ఏం, రామాంజీ..' అని రెండుసార్లు పిల్చినా ఆ శబ్దంలో తనకు వినిపించలేదు. ఏ లోకానవున్నాడో విపరీతంగా పట్టిన చెమటల్ని తుడుచుకుంటూ బోరింగు కొడుతూనే వున్నాడు.

సరేలే మళ్లీ యింటికాడికి పోయి మాట్లాడిద్దాం, ఆలస్యమైతే మామ శవాన్ని తీసికెళ్తారేమో అనుకుంటూ దాటిపోతుంటే అప్పుడు చూశాడు.

"ఏం శీనుబావ ఎబ్బుడొస్తివి" అంటూ,

"అంతా బాగుండారో, పెద్దనాయన్ను ఆఖరిచూపు చూసేకొస్తివో" అంటుంటే ఆ మాటల్లో 'చావుకు తప్ప రావు గదా' అన్న నిష్ఠూరం ధ్వనించింది.

"ఏం రామాంజీ సన్నగయినావే, ఏం జేస్తావుండావు"

నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా, ఒక నవ్వు నవ్వినాడు. ఆ నవ్వుకు అర్థం తెలిసిపోతూ వుంది. ఎండిపోయిన నవ్వది.

అతనే ఆ వెంటనే "పదా పదా పెదనాయన్ను తోటలోకి తీసకపోతారేమో. యీటికే ఆలస్యమైంది. యిది నిండుతానే నేనూ వొస్తా" అన్నాడు.

నేను గబగబ మామా వాళ్లింటికి వెళ్లేటప్పటికి మామను ఆఖరి స్నానానికి సిద్ధం చేస్తున్నారు.

"ఏమిరా శీనూ యిబ్బుడొస్తివా.." మా నడిపి మామ వెంకటేశప్ప అరుగుమీద కూర్చొని మాట్లాడించాడు. ఆయన ముఖంలో అన్న మరణపు విషాదమేదీ కన్పించడం లేదు. అక్కడ వుండాలంటే వుండాలన్నట్లు ఉదాశీనంగా వున్నాడు.

దీనికి భిన్నంగా మా ఆఖరిమామ హడావుడిగా శవయాత్ర ఏర్పాట్లు చూస్తున్నాడు.

"ఏవిరా నీళ్లు, బిరాన తీసకరాంద్రప్పా పొద్దెక్కుతుంది. అట్లే దాసప్పను రమ్మనంద్రా, మన యిండ్లలో కార్యానికీ అసలైనోడు ఆ యప్ప" చిన్న మామ రాయుడు బావను తొందర బెటుతున్నాడు.

"నీళ్లు కొట్టకొచ్చేకి పోయిండారు. వస్తాంటార్లే..' రాయుడు బావ చెప్తుంటే,

"యిస్కూలు బోరింగా... దాంట్లో నీళ్లేడుండాయిరా.. ఎప్పుడు రావల్లా.." చిన్న మామ యాష్టపోతున్నాడు.

కాస్సేపటికి, చిన్నగా వినిపిస్తున్న ఏడుపుల మధ్య, రామాంజి తెచ్చిన నీళ్లతో స్నానం కానిచ్చి మామను పాడెమీదకు ఎక్కించడానికి సిద్ధం చేస్తుండగా, దాసప్ప రానేవచ్చాడు.

"అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా..." అంటూ జాగంటను వాయిస్తూ, తనకు వచ్చీ రాని తిరుమంత్రం అందుకున్నాడు. మామ దాయాదులందరికీ తిరునామం దిద్ది, చావు తంతు నడిపి శంఖం వూది శవయాత్రకు సమాయత్తం చేసినాడు.

"గోవింద.. గోవింద" అంటూ మామ పాడెమీద పైకి లేస్తుంటే యింటిల్లిపాదీ వొక్కసారిగా గొల్లుమన్నారు. మామ కూతుర్లూ, మనవరాళ్లూ వొకరి మీద వొకరు పడి ఏడ్చారు. ఆ విషాద దృశ్యం చూస్తున్న నా కళ్లలో కూడా నీళ్లు తిరిగాయి.

పాడె మోస్తున్న వాళ్లు "గోవింద, గోవింద.." అంటూ భారంగా కదులుతుంటే, దాసప్ప మోగిస్తున్న జాగంట మోత శవయాత్రకు నేపథ్య సంగీతమవుతుంటే, బంధువర్గ మంతా కదిలింది.

మామకెంతో యిష్టమైన వాళ్ల తోటలోని బావిగట్టున బూడ్చాలనేది ఆయన చివరి కోర్కెట. తోటకు వెళ్లాలంటే వూరి నుండి ఎంత తక్కువన్నా మూడు కిలోమీటర్లు నడవాల్సిందే. ఇదే దారివెంట ఆ తోటలోకి ఎన్నోసార్లు వెళ్లున్నాను. నిజానికి చెప్పలేనంత అనుబంధం యీ తోటతో నాకు. ఎంతో అనుబంధాన్ని, ఎంతో ఘర్షణనీ యిముడ్చుకున్న బావి అది.

గడ్డీ గాదం లేక ఖాళీ అయిన కల్లాలను దాటి, ఎండిపోయిన చెరువును దాటి వెళ్తున్నాము.

ఉదయం పదకొండు గంటల సమయమే అయినా ఎండ వాయించి కొడుతోంది. రాయలసీమలో సంవత్సరమంతా ఎండాకాలమొకటే సీజన్. వానాకాలం అనుకోని అతిథి. (ఎదురుచూస్తున్నప్పుడు మాత్రం రాదు).

అందరికీ చెమటలు కారిపోతున్నాయి. దాసప్ప మోగించే జాగంటను అధిగమిస్తూ దూరంగా బోరు వేస్తున్న శబ్దం ఒకటి విన్పిస్తూ వుంది. బండి బాట వెంబడి, శవం వెంట వస్తున్న వాళ్లు గుంపులు గుంపులుగా విడిపోయారు. శవం మోస్తున్న వారితోపాటు ఓ పదిమందీ, వాళ్ల వెనక గుంపుగా ఒక పదిమందీ, యింకింత వెనకగా ఓ ఐదారుమందీ యిట్లా ఎవరికి వాళ్లు తోచిన వాళ్లతో, తోచిన విషయాలు మాట్లాడుకుంటూ నడుస్తున్నారు.

నేను పావగడ (కర్ణాటక) నుంచి వొచ్చిన ఈశ్వరప్ప అన్నతో కలిసి నడుస్తున్నాను. మేమిద్దరమూ మిగతా అందరికంటే వెనుకబడి వున్నాము. చెరువుదాటిన తరువాత చెరువు మరవ వెంబడి కలబంద తప్ప పచ్చని మొక్కొక్కటి లేదు. రెండువైపులా కలబంద గుంపుల మధ్య వోని (సన్నని దారి)లో వెళ్తూంటే ఒక బూడిద వర్ణపు చిత్రంలో మేమూ కలిసిపోయినట్లు అన్పిస్తుంది.

“ఏం శీనూ, చెరువులు ఎండిపాయ, వంకలు ఎండిపాయ, రాళ్లుదేలిన భూములతోని ఎడారట్లా వాతావరణం కనిపిస్తాందప్పా” చుట్టూ చూస్తూ అన్నాడు ఈశ్వరప్ప అన్న.

ఈశ్వరప్ప అన్న డిగ్రీ మధ్యలోనే వదిలేసి సేద్యం జేసుకుంటున్నాడు. ఇండియా నుంచి అమెరికా దాకా ఆయనకు తెలీని విషయముండదు. ఆయన మీద ఆయనే జోకులు వేసుకుని నవ్వే ఔదార్యం కూడా వుంది. ‘నాతోని మాట్లాడ్డమే ఒక ఎడ్యుకేషన్’ అంటాడు మన గిరీశాన్ని అనుకరిస్తూ.

‘ఏం జేస్తామన్నా! మా ప్రాంతమంతా యిట్లా అఘోరిస్తా వుంది’.

“మల్లా అనంతపురం జిల్లాలో తాడిపత్రి ప్రాంతం బాగుందంటనే”

“అదీ అంతంత మాత్రమే. మా కళ్యాణదుర్గం, కంబదూర్, కనగానిపల్లి, రాంగిరి ప్రాంతాలకంటే కొంచెం మేలు”.

“పెన్నా, చిత్రావతీ పారతావున్నా యీ ప్రాంతంలో ఏం కరువబ్బా, రాయలసీమ అనేదాని కంటే కరువుసీమ అనేది కరెక్ట్ అనిపిస్తాది”.

“మీ కర్ణాటక వాళ్లు ఆల్మట్టి, పరగోడు కట్టబట్టిగదా, మాకు నీళ్లు రాకుండా జేస్తిరి. నీళ్లు ల్యాకనే కదా రాయలసీమ ఉత్త రాళ్లసీమ అయిపోయి ఎడారి అంచుల్లో నిలబడిందేది.”

“మనుషులు జేస్తాండే నీళ్ల రాజకీయాలు సరే శీనూ, మేఘాలు గూడా రాజకీయాలు జేస్తాండయి గదా. మా పావగడా, చెళ్లకెరా, బళ్లారి ప్రాంతాలుగూడా రాయలసీమ లాంటివేగదా. మాకైనా నదులు యాడ పారతాండయి. యీ నీళ్ల రాజకీయాలు మన లాంటోళ్లని మైమరపించేవే గానీ, యీ ప్రాజెక్ట్ కాంట్రాక్టులతో బాగుపడుతుండేది ఎవరనీ, పరగోడు ప్రాజెక్టుగ్గానీ, ఆల్మట్టి ప్రాజెక్టుకుగానీ మీ ఆంధ్రావోళ్లేనంటగదా కాంట్రాక్టర్లు”.

“అసలు సంగతి అదిగాదు. నదీ జలాల పున:పంపిణీ ప్రాంతావారీగా జరగాల, అప్పుడుగానీ సమస్య అంతో యింతో తీరదు” మేము మా మాటల మధ్య వుండగనే...

"గోవింద.. గోవింద.." అంటూ మామను దింపుడు కళ్లెం శాస్త్రానికన్నట్టు దింపి, ఆ తంతేదో చూసి, ఆ వెంటనే భుజాలు మార్చుకున్నారు. నడక కొనసాగింది.

ఇంతదాకా దగ్గరగా వినిపిస్తూన్న బోరు వేస్తున్న శబ్దం, యిప్పుడు ఎదురుగా కన్పిస్తోంది. ఎర్రటి పొడి ధూళి మండుటెండలో ఆ ప్రాంతమంతా అంతెత్తు వ్యాపించి భీకరాకారం దాల్చింది.

"ఎంతలోతు దిగింది..?" కర్ణాటక ఈశ్వరప్పన్న గట్టిగా అరిచినట్టు వాకబు చేశాడు.

బోరు వేయిస్తున్న తోట యజమాని లోకేశ్వరనాయుడు కల్ల దాటుకొని దారిలోకి వచ్చి,

"మూడువందల యాభై అడుగుల్లో ఉందన్నా...' అన్నాడు.

"ఎన్నించుల నీళ్లు పడ్నాయి.."

"ఒగించు గూడా లేదన్నా, ఉత్త బురద పైకొస్తాంది. ఆశతో యింగా దింపుతుండాము"

లోకేశ్వరనాయుడు మమ్మల్ని దాటిపోయి మామ శవం వెంటవున్న మా చిన్న మామతో మాట్లాడుతూ శవయాత్రలో కలిసినాడు.

"మూడొందలాయాభై అడుగులంట శీనూ, యింగెంత దింపుతాడో, అంత లోతులో వొగవేల యీ యప్పకు పడినా, పక్కబోర్ల వాళ్లగతేమి. వాళ్లవి ఎండిపోవా, యీ బోర్లలో పడేది సావు నీళ్లే సూడు శీనూ" ఆ మాటలకు నేనేమీ మాట్లాడలేక...

"మొత్తం రైతాంగమంతా సావు నీళ్లే తాగుతోందన్నా" అన్నాను.

మామ శవం తోటలోకి వచ్చేసింది.

బావిగట్టున గుంత తీస్తున్నారు. పూడ్చడం కోసం. ఆ బావి నీళ్లతో పదహైదు ఎకరాల పొలం పండేది ఒకప్పుడు. కాలంతోపాటు అది తగ్గుతూ తగ్గుతూ యిప్పుడు రెండున్నర ఎకరాలకు దిగింది. అయితే బావిలో మాత్రం ఏడుమట్ల లోతులో మూడు వందల అడుగులు బోరు దిగింది. బావికి ఆనుకొని ఆ కొంత భూమిలో మాత్రమే వరి వేసినట్టున్నారు. మిగతా భూమంతా మోడువారి వుంది. ఈ బావిలోనే నేను యీత నేర్చుకుంది. నా బాల్యంలో నీళ్లు చేతికందేంత వుండేవి. ఆ జ్ఞాపకాలను నెమరువేసు కుంటూ బావి గట్టుకు వచ్చి నిలబడి బావిలోకి చూశాను. బావినిండా చెట్లు! కాస్సేపు నమ్మలేకపోయాను. నేనున్నది కలలో కాదుకదా అన్పించింది.

"ఏరా శీనూ బావిని సూస్తాండా వా.." దూరం నుండి నా వైపు వస్తూ చిన్న మామ అంటున్నాడు. ఆయనే ఈ బావిలో నాకు యీత నేర్పించినవాడు. ఈ బావిని తవ్వడానికి చెమట చిందించిన వాడు. ఆ తర్వాత బావిమీద హక్కుకోసం ఘర్షణ పడి ఆశలు వదులు కున్నవాడు.

బావి ఎండిపోయిందని, బావిలో బోరు వేసారని తెలుసుగానీ, ఎండిపోవటం యింత దయనీయంగా వుంటుందని మాత్రం తెలియదు. నేలమీద చెట్లు మొలిస్తే ఆనందంగా చూడవచ్చునేమోగానీ, బావిలోనా చెట్లు మొలవాల్సింది? నీళ్లతో గలగలలాడిన బావి చెట్ల కొమ్మల రాపిడితో కరకరలాడుతోంది. మధ్యలో చింతచెట్టు, చుట్టూ నాలుగైదు సుంకేశుల చెట్లూ, దరుల వెంబడి రావిచెట్లతో నిండిపోయింది బావి. కొమ్మల మధ్యలో నుండి బోరుకు సంబంధించిన పైప్‌లైన్ సబ్ మెర్సిబుల్ మోటర్‌తో నేరుగా పైకి వచ్చి వుంది.

"యీ అంచులోనుండే సూర్రా జారిపడింది..." బావిని చూస్తున్న నాతో చిన్నమామ అంటున్నాడు.

"ఎట్లా జారిపడ్డాడు మామా" బావి నిండా చెట్లు మొలిచిన దిగ్భ్రమ, పెద్దమామ బావిలోకి జారిపడ్డ దిగ్భ్రమా రెండూ కలగలసి నా గొంతు వొణుకుతోంది.

"మడికి నీళ్లు కడుతున్నాడు. అంతలోనే కరెంటుపోయింది. స్టార్టర్ లేని మోటరు కదా ఎందుకైనా మంచిది ఆఫ్ చేద్దామని మోటరు రూమ్ దగ్గరకు పోతా, ఛత్వారం కళ్లు కదా, ఆ మోటరుకాడ కాలికి రాయి తగిలి కింద పడ్నాడు. కింద పడ్నోడు దొర్లి బావిలోనికి జారిపోయి నాడు. చెట్ల కొమ్మల మధ్య కాళ్లు యిరక్కపోయి, కొమ్మలు పొడుచుకొని నరకం అనుభ వించినాడు. పైకి తెచ్చేదానికి ఎంత అగసాట్లయిందో, పగోనికి కూడా వద్దు ఆ చావు. ఈ బావి తొవ్వేనా పొద్దు వొగసారి గూడా లోపలికి దిగినోడు కాదు. గట్టుమీద నుంచే మమ్మల్ని అజమాయిషీ చేస్తాండే. అట్లోంటోనికి యీ గుంతలోకే పడిసచ్చే యోగమున్యాది సూడే.."

ఆ మాటలూ, చెప్పేతీరూ వింటుంటే పెద్దమామకు యిట్లాంటి చావు రావడం, చిన్నమామ హృదయానికి శాంతి కల్గించినట్లే వుంది. ఆ శాంతికి కారణం తమ శ్రమ దోచుకున్న నేరానికి తగిన శిక్ష పడిందనే సంతృప్తి.

"బావి గండముందని చేయి చూసి శాస్త్రం చెప్పింటే, మా నాయనకి చిన్నబ్బుడు యీత నేర్పించిన్నెంట మా తాత. బావిలో నీళ్లుంటే యీత కాపాడుతుంది. కాని, నీళ్లు లేని బావిలో యీతవొచ్చీ ప్రయోజనమేమీ? గండం తప్పించుకోలేకపాయ సూడే మా నాయన. మా రైతుల బతుకు నీళ్లు లేని బావిలో యీదలాడినట్లుందయ్యా.." మా దగ్గరకొస్తూ రాయుడు బావ అంటున్నాడు.

రైతు గండాలను వినలేక బావిగట్టు మీద అటువైపు తిరిగి నిలబడ్డాను. నిస్సారంగా కన్పిస్తున్న చౌటి (చవిటి) నేలలు. వాటి మధ్య ఎండిపోయిన వంక. ఒకప్పుడు యీ చౌడు భూముల్లో నుండే వర్షాకాలంలో జవకలు (ఊటలు) పారి, ఆ వంకను నింపేవి. వంకలో కొద్దో గొప్పో నీల్లు ఎప్పుడూ వుండేవి. ఆ నీళ్లు అట్లా కిందికి పొర్లి మైలుదూరంలో వున్న పెన్నానదిలో కలిసేవి.

ఒకప్పుడు యివన్నీ పోరంబోకు భూములు. నలభైయ్యేండ్ల కింద మా మామ యీ ఊరికి పెళ్లాం పిల్లలతో, యిద్దరు తమ్ముళ్లతో కట్టుబట్టలతో వొచ్చి 'కూలికి బడి' చెప్పుకుంటూ (ప్రైవేటుగా స్కూల్ నడపడం) ఊళ్లోవాళ్ల నమ్మకం సంపాదించుకొని, జతగిత్తల్లాంటి తమ్ముళ్ల శ్రమతో యీ బంజరు భూముల్లో కంపగొట్టి, రాళ్లుయేరి, పదెకరాల భూమి యింగడిచ్చుకొని 'డీ ఫారం పట్టా' చేసుకున్నాడు.

ఆ తర్వాత బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసులో కాళ్లూ, కడుపూ పట్టుకొని బావుల పథకం కింద బావికి లోన్ సాంక్షన్ చేయించుకున్నాడు. ఇద్దరు తమ్ముళ్లూ, ఎదిగొస్తున్న కొడుకులూ కష్టపడితే రెండేళ్లలో ఏడుమట్ల బావి అంచున పదెకరాల భూమిని సాగులోకి తెచ్చుకొని వరీ, వేరుశనగా పండించినాడు. ఏటిపక్కన భూములు కావడంతో, బావిలో నీరు సమృద్ధిగా ఉండటంతో పంటలకు అడ్డులేకపోవడమూ, కష్టపడే తమ్ముళ్ల అండ ఉండడంతో ఐదేండ్లలో యీ చేనుకు పక్కనున్న ఉప్పరోళ్ల భూమి ఐదెకరాలు కొనుక్కోగలిగినాడు.

యింతలో తమ్ముళ్ల పెండ్లిండ్లు కావడమూ, తన కొడుకులు ఎదిగి రావడమూ మామలో మార్పులు తెచ్చాయి. కొడుకులూ, తమ్ముళ్ల మధ్య ఘర్షణలు మామ చాణక్యనీతిని బయటపెట్టాయి. చిన్నాన్నలని కూడా చూడకుండా తన కొడుకులు మితిమీరి ప్రవర్తిస్తూంటే కావాలని చూసీ చూడనట్లు పోవడం తమను విడగొట్టడానికేనని మా చిన్న మామలకు అర్థమయ్యింది. దాంతో వాళ్లు విడిపోవడానికి సిద్ధపడ్డారు.

భాగాలు పోతున్నప్పుడు తెలిసింది. బావి పెద్ద మామ కొడుకు రాయుడి పేరుమీద 'డీ ఫారం పట్టా' పొందిన భూమిలో ఉందని. రాయుడు బావ వాళ్ల అమ్మ వత్తాసుతో బావి తన భూమిలో వుంది కాబట్టి నీళ్లను పంచి ఇవ్వనని అడ్డం తిరిగినాడు. దాంతో చిన్న మామలిద్దరూ చాలా ఆవేశపడ్డారు. ఆ బావి మీద వాటాకోసం గలాటాలు చేసుకున్నారు. తలలు పగలగొట్టుకేనేదాకా వెళ్లింది పరిస్థితి. ఊర్లో పెద్దమనుషుల దగ్గర పంచాయతీ జరిగింది. ఎవరు అడిగినా మా పెద్ద మామ ఒక్కటే మాట చెప్పాడు. 'బావికి అయిన అప్పూ.. తమ్ముళ్లు పొలాలు యింగడిచ్చికోవడానికి అయిన ఖర్చూ తానే భరించుకుంటానని, బావిని వదిలేయమని' మిగతా యిద్దరు మామలకు వచ్చిన భూములు మిట్టమీద ఉండటంవల్ల, ఆ చేన్లకు యీ బావినీళ్లు ఎక్కటం కష్టమనీ పెద్దాయన కొడుకు పేరు మీదున్న భూమిలో బావి వుంది. కాబట్టి దానిమీద హక్కు సంపాదించడం కష్టమనీ పెద్దమనుషులు చిన్నమామలకే నచ్చజెప్పి పెద్దమామకు అనుకూలమైన తీర్పు చెప్పినారు. దాంతో చిన్నమామలు బావిమీద ఆశలు వదులుకొని వాళ్ల భాగానికొచ్చిన తలా ఐదెకరాల మెట్టభూమి మీదనే బతుకుతున్నారు. అయితే అన్న తమని మోసం చేశాడనీ యీ పొద్దుకీ అనుకుంటారు. నీళ్లు అందింటే తమ సంసారాలు బాగుపడిండు కదా అని బాధపడతారు. పెద్దమామ మాత్రం తనకు దగ్గరవాళ్లతో 'నా తమ్ముళ్లను పెంచి పెద్ద చేసి, తల్లిదండ్రులు చిన్నప్పుడే తీరిపోయినా పెండ్లీ పేరంటాలు

జేసి అంతో యింతో భూమీ, యిండ్లూ ఏర్పాటు చేయిస్తి. యింతజేసినా వాళ్లకు నామీద కృతజ్ఞతే లేదయ్యా' అని బాధపడేవాడట.

మామ మొదట్లో కళకళలాడే బావిని చూసుకొని బలే సంబరపడేవాడట. ఆ సంబరం లోనే గంపెడంత సంసారాన్ని చేసుకున్నాడు. మామకు ఆరుమంది కొడుకులు, యిద్దరు కూతుళ్లు. బావి వాళ్ల సంసారాన్ని కొన్ని సంవత్సరాలు కళకళలాడించింది. ఆ తర్వాత కళావిహీనమైపోయి అందరి రైతుల్లాగే మామనూ అప్పులపాలు చేసింది. ఎన్నో తిప్పలు పెట్టింది. చివరకు తనలోకి జార్చుకొని ప్రాణాలు కూడా తీసింది.

"గోవింద.. గోవింద.." అంటూ అరుపులు దాసప్ప జాగంట మోతా నన్ను ఈ లోకంలోకి తెచ్చాయి.

"ఏరా శీనూ, రారా.." చిన్న మామ పిలుస్తున్నాడు.

మామను పాడెమీద నుండి గోతిలోకి దింపుతున్నారు. ఆఖరి ఏడ్పుల మధ్యా ఆరడుగుల ఆజానుబాహువు, సన్నగా పొడుగ్గా మాంచి అందగాడనిపించుకున్న మా పెద్దమామ ఆఖరిసారిగా కన్పించాడు. ఆయన ముఖంమీదుగా బంధువులంతా తలా మూడు గుప్పిళ్ల మట్టి వేస్తున్నారు. ఆ తెరుచుకున్న నోట్లోకి మట్టి వెళ్తోంది. బతికున్న రైతు నోట్లోనే మట్టి పడుతున్న కాలం యిది. చచ్చిన వాడి నోట్లో పడడంలో అసంబద్ధత ఏముంది? నేనూ మూడుగుప్పిళ్ల మట్టి ఆయన పాదాలవైపు వేసి యిక చూడలేక వెనుదిరిగాను.

అందరూ చేతుల కంటిన మట్టిని కడుక్కోవడానికి నీళ్లకోసం చూస్తున్నారు. ఎదురుగా ఎండిన బావి, బోరు వేద్దామంటే కరెంటు కోతా వెక్కిరిస్తోంది. అక్కడికీ కొందరు మట్టి అంటిన చేతులను మందు వాసనేస్తున్న వరిమళ్లలోని నీటిలో అద్దుతున్నారు. చాలామంది చేతులు దులుపుకుంటూ తిరుగుబాట పడుతున్నారు. శవాన్ని బూడ్చిన తర్వాత స్నానం చేసి (మృతుని) యింట్లోకి పోయి దీపం చూడాలట. కనీసం కాళ్లూ చేతులు కడుక్కోవాలి.

మరి నీళ్లెక్కడ?

అందరూ నడుస్తూ అదే అడుగుతున్నారు.

"కాస్త నడిస్తే రెండు మూడు బోర్లుండాయి గానీ ఎక్కడయినా కరెంటు ఉండాల్సిందే కదా" రాయుడు బావ అంటున్నాడు.

ముఖం కడగాలంటే వేరే దారిలేదు. బస్టాండు దగ్గర బోరింగే దిక్కని తేలిపోయింది.

అందరూ కాళ్లీడుస్తూ నడుస్తున్నారు. చెమటతో తడుస్తున్నారు. లోకేశ్వరనాయుడు తోట దగ్గర బోరింగ్ మెషన్ హోరుమంటోంది.

"ఎన్నడుగులు" ఉండబట్టలేక అడిగారెవరో.

“నాలుగువందల యిరవై దాటుతోంది” అటువైపు నుంచీ వినిపించింది.

“దొంగనాకొ.. బోర్లు. రైతురాజ్యం దొంగల చేతుల్లో పడినట్లు రైతులు బోర్ల బొక్కల్లో పడుతున్నారు. ప్రకృతి మనిషిని నాశనం చేస్తోందో, మనిషే ప్రకృతిని నాశనం చేస్తున్నాడో గానీ, జరగాల్సిన దానికంటే అన్యాయం జరుగుతోంది. ఫలితం అనుభవిస్తాం” కర్ణాటక ఈశ్వరప్ప ఉక్రోషంతో అంటున్నాడు.

“బోర్లు వేయడం, భూగర్భజలాలు అడుగంటడం, వానలు రాకపోవడం, యిదేనా సమస్య. వచ్చేవానలు కొద్దో గొప్పో వస్తానే వున్నాయే. వచ్చిన వాటిని సద్వినియోగం చేసుకోవడం, నదుల్లోకి చేరే నీళ్లను పల్లంలోకి పడనీకుండా మెట్ట ప్రాంతాల్లోని వాళ్లకు వాటాయిచ్చే ఆలోచన చేయకుండా, రాజకీయాలు చేస్తాండారే.. దీని ఫలితం ఎట్లుం టుంది” అన్నాన్నేను.

“ఏమైతుందో కళ్లముందరే కన్పిస్తాందిగదా, నీళ్లు బదులు మానవ రక్తం పారుతుంది. దానికి మీ రాష్ట్రమే ఉదాహరణ. మహబూబ్‌నగర్ జిల్లా వాళ్లకూ కర్నూలు జిల్లా వాళ్లకూ నీళ్లకోసం జగడమంట గదా. యింగ కోస్తాంధ్రకూ తెలంగాణకూ తీవ్రయుద్ధమే జరుగు తాంది. ఎవరో పెద్దాయన అనంతపురం జిల్లాను సపరేట్ దేశమే చేయమంటున్నాడంటే, యిదంతా నీళ్లకోసమే గదా”.

“అవును ఈశ్వరప్పా నువ్వు చెప్పింది నిజమే. అందరూ వెనకబడిన వాళ్లే అయినప్పుడు బాగుపడ్డానికి వాళ్లలో వాళ్లే పోటీపడితే ఆశ్చర్యం లేదు. అంతో ఇంతో బాగుపడ్డవాడు మళ్లీ మళ్లీ తానే బాగుపడాలని చూస్తున్నాడే దాంతో వచ్చింది తిప్పలు”.

“లోకం తీరే అంత. అంత దూరమెందుకు యిబ్బిడీ నారాయణప్ప మామ అన్న దమ్ముల కథ అదే గదా… సావునీళ్ల కథ..”

మాటల మధ్యనే ఊర్లోని స్కూల్ బోరింగ్ దగ్గరకు వచ్చేశాము. ఖననానికి పోయొచ్చిన వాళ్లంతా ముఖం కడుక్కుందామని బోరింగ్ ముందు నిలబడ్డారు. మంచినీళ్ల కోసం నిలబడ్డ మట్టిబొమ్మల్లా వున్నారు… దాహంతో.

రామాంజినేయులు ఖాళీ కడవా, బకెట్ తెచ్చి కడవను బోరింగ్ కింద పెట్టి కొట్టడం ప్రారంభించాడు.

‘ధన్ ధన్ ధన్ ధన్’ అంటూ బోరింగ్ మొత్తుకుంటోంది.

కడవ మాత్రం నిండకుండా వుంది.

✡

# గ్యారా కద్దూ బారా కోత్వాల్

**–సురవరం ప్రతాపరెడ్డి**

(గ్యారా అనగా పదకొండు. కద్దూ అనగా సొరకాయ లేక ఆనగపుకాయ. బరా కోత్వాల్ అనగా గ్రామలలోని పన్నిద్దరు(12) ఆయగాండ్లు. మొగలాయి జమానాలో కర్ర యెవనిదో బర్రె వానిది అనే బాపతుగా పనులన్నీ సాగుతూ వుండెను. ఒక అమాయకుడైన కాపు తుదకు లక్షాధిపతి ఎట్లైనాడో యీ కథ నిరూపించుతుంది.)

ఒకనాడు ఒక పల్లెకాపు 11 సొరకాయలను కంబట్లో వేసుకొని ఒక గ్రామానికి అమ్ముకొనేదానికి వెళ్ళినాడు. గ్రామంలో అమ్మలక్కలు పదిమంది మూగి బేరం చేస్తూ వున్నారు. అంతలో మాలీపటేల్ వేంచేసినాడు. "ఒరేయ్! ఈడ కూర్చోమని నీకెవరు సెలవిచ్చినారు? మంచి మాటతో ఒక కాయ ఇచ్చిపో" అంటూ తానే ఒక పెద్ద కాయను లాగుకొని పోయినాడు. కాపువాడు గొణుక్కుంటూ ఉన్నాడు. అంతలోనే గోరుచుట్టుమీద రోకటి పోటన్నట్టుగా పోలీసు పటేలు హాజరైనాడు. "పట్టుకొని రారా వాన్ని. ముసాఫిర్ల లెక్కలో వానిపేరు రాయాల్సింది వుంది" అని గర్జించినాడు. తలారివచ్చి తనపాలి వకకాయ, పటేల పాలిటి వక కాయ లాగుకొనిపోయినాడు. కొంతసేపటికి పెద్ద తలారి వచ్చినాడు. "ఏయ్, మొన్న నీవంటివాడే వచ్చిండెను. పొద్దు మునిగినప్పుడు కూరగాయ లమ్మునట్లు అమ్మి రాత్రి కోమటోళ్ళ యింట్లో కన్నం వేసిండు. పద! చావిట్లో నిన్ను కట్టేస్తాన్" అంటూ తానున్నూ ఒక కాయ చేతబట్టు కున్నాడు. "అయ్యా! మారాజా! నేను దొంగను కాను. దొరను కాను. పొరుగూరు వాన్ని. ఎల్లప్పటికిన్ని వచ్చిపొయ్యేవాన్ని. ఇప్పటికే మూడు కాయలు ఎగిరిపోయినవి. మళ్ళీ నీవెక్కడనుండి ఊడి పడితివి?" అని కాపువాడు మొరపెట్టుకున్నాడు. అదే కాయతో వాని నెత్తిని పొడిచి కాయతో చక్కా పోయినాడు పెద్ద తలారి. ఈ విధంగా పూజారి, పురోహితుడు, కమ్మరి, వడ్ల మొదలైన 11 మంది ఆయగాండ్లు ఒకరి వెనుక వకరువచ్చి కాయలన్నీ లాగుకొనిపోయినారు. కాపువాడు ఏడ్చుకుంటూ గొంగడి దులుపుకొని లేస్తున్నాడు. చీకట్లోనే చేనికి పోయినట్టి కర్ణమయ్య అప్పుడేవానికి ప్రత్యక్షమైనాడు. "ఏమిరా ఏడుస్తున్నావు? నిన్నెవరేమన్నారు నాకు చెప్పు. నేనీవూరి కర్ణాన్ని. తప్పు చేసినోనికి శిక్ష యిప్పిస్తాను" అని అన్నాడు. న్యాయం విచారించే ప్రభువు ఒక్కడైనా ఈ వూరిలో ఉన్నాడురా నారాయణా అని

అనుకొని కాపువాడు తన 11 సొరకాయలు మాయమైన విధమంతా వినిపించి "అయ్యా కరణమయ్యా, నీవే నారాయణమూర్తివి. నన్నెట్లన్నా గడ్డకేయండి" అని గొంగడి ఆయన కాళ్ళమీద వేసి కాళ్ళు పట్టుకొన్నాడు. కర్ణం ఒక్క తన్ను ఝూడించి తన్ని కంబడి లాగి చంకబెట్టుకొని ఇట్లన్నాడు. "అరే లుచ్చా! అందరికీ వంతు సొరకాయ యిచ్చి నావంతు తప్పించి నావా? నేను తలారివాని కంటే పనికిరాని వాన్నా? వడ్లోని కంటే వ్యర్థుడనా? ఆ ఓనమాలురాని మాలీపటేలు నీకు ఎక్కువైనవాడా? తే! నా వంతు సొరకాయ. అదిచ్చి యీ గొంగడి తీసుకుపో" అని గ్రుడ్లెర్ర చేసుకొని కంబళి తన చంకపెట్టుకొని తన యింటికి పోయినాడు.

కాపువాడు ఎగాదిగా చూచినాడు. "నీవూ ఇంతేనా? ఈ వూరంతా ఇంతే? ఏందేశం యిది పాడుదేశం. ఇంక నా వంటి దిక్కులేనివారు బదికేదెట్లా?" అని గొణుగుతూ పట్వారివెంట కొంతదూరం దీనంగా ప్రాధేయపడుతూ వెళ్ళినాడు. "ఒరేయి! ఒక్క అడుగు ముందుకు వేస్తే నీ తలకాయ పగులతంతా (జాగ్రత్త) ఖబర్దార్?" అన్నాడు. పట్వారి కాపువాడు దిక్కుతోచకుండా నిలిచిపోయినాడు. చిన్న పిల్లవానివలె కొంతసేపు ఏడ్చినాడు. ఒకరిద్దరు ఆడవారు వాన్ని చూచి "పో నాయనా! పో! పొద్దున్నే ఎవరి ముఖం చూచినావో ఏమో! యీ వూళ్ళో అందరూ ఇట్లాంటి మారాజులే. ఇంకోమారు రావద్దు" అని బుద్ధి చెప్పినారు. కాపువాడు దీర్ఘాలోచన చేస్తూ ఇంటిబాట పట్టినాడు. "థూ, పుట్టితే పటేలు పట్వారి అయి పుట్టాలె. లేకుండా తలారిగా అయినా పుట్టాలే. ఈ బదుకు బతికినా వకటే చచ్చినా వకటే.. కాయలుపోతే పోయెకాని గొంగడి కూడా పోయింది. అందరికంటే ఆ కర్ణమోడు మరీ చెడ్డవాడు. అందు కోసమే కాటికిపోయినా కర్ణంపీడ తప్పదన్నారు పెద్దలు.. దీనికి బదలా తీయకుంటే నేను మనిషినా? అయితే బీదోన్ని ఏమి చేయగలను? ఆ తలారికి చేరెడు చేనన్నాలేదు. నాకు చేనుంది. పెండ్లాము పైన వంకి వుంది ఒకెద్దుంది. తలారికంటే తక్కువనా నేను?... దేవునికైనా దెబ్బే గురువు. నేనున్నూ ఏదో మొండి తొండిచేస్తా..." ఇట్లా ఆలోచనా పరంపరలో మునిగి నడుస్తున్నాడు. తన మోటబావిని సమీపించినాడు. బావిగడ్డపై కూర్చున్నాడు. ఇంకా దీర్ఘాలోచనలోనే ఉన్నాడు. తటాలున మెరుపుమెరిసినట్లా వాని తలలో వక ఆలోచన తళు క్కుమంటూ ప్రవేశించింది. చటుక్కున లేచినాడు. ఊళ్ళోకి పోయినాడు. చక్కగా పెండ్లాం వద్దకు వెళ్ళి "ఒసేయి! నీ వంకి ఇట్లాతే. ఇయ్యమంటే! నీకేం ఫర్వాలేదు తే. మళ్ళీ వుగాదినాటికి ఒకటికి నూరువంకీలు చేయిస్తే నాపేరు వెంకయ్య! అనూ" అని వంకీని లాగుకున్నాడు. పటేలుకు దాన్ని 200 రూపాయలకు అమ్మినాడు. పైకం తీసుకొని 10 మైళ్ళ దూరంలో వుండే పట్నం చేరుకున్నాడు. షేర్వానీలు, లాగులు, మోజాలు, పగిడీ, నడుముపట్టి, బిల్లలు మొదలైన పరికరాలు సిద్ధము చేసుకొన్నాడు. నలుగురు అరబ్బు జవానులు జతచేసుకున్నాడు. వారికి బిల్లలును తగిలించాడు. తానున్నూ బాగా వేషం వేసుకొన్నాడు. ఒక బగ్గీని కిరాయకు మాట్లాడుకొన్నారు.

రెండామడల దూరంలో ఒక పెద్ద బస్తీ ఉండింది. అది నాలుగు బాటలు కలిసే స్థలం. గొప్ప వ్యాపారి పేట. అధికారులు, మంత్రి, నవాబుకూడా ఆ మార్గంగా షికారుకు పొయ్యే స్థలం. ఆ గ్రామంలో మన కాపు దిగినాడు. ఊరబావిగట్టున ఒక పెద్ద మర్రి మానుండింది. దానికింద మేజు కుర్చీలు వేయించినాడు. జవానులను బావిపై పహిరా ఎక్కించినాడు. ప్రొద్దున్నే ఊరులోని ఆడవారు నీటికి వస్తే ఆ జవానులు "ఖబర్దార్ కడవకొక పైసాయిచ్చి నీళ్ళు తీసుకోండి" అని బెదిరించినారు. పటేలు పట్వారీలు వచ్చినారు. "ఒరేయ్! మాకు సర్కారు హుకుం అయింది. ఇదిగో ఫర్మాన్" అని ఉర్దూ ముద్రలతోనుండే ఫర్మాను చూపించినాడు కాపు. ఉండవచ్చునని గ్రామాధికారు లూరకైనారు.

దినమున్నూ పైకం బాగా వసూలు కాబట్టింది. మొదట దినం 20 రూపాయిల వరకు వసూలైంది. క్రమేణ ఆదాయం ఎక్కువైంది. "మర్రిమాన్ పరగణాసుంకం" చుట్టూ రెండామడవరకు ప్రసిద్ధి అయిపోయింది. ఇట్లా వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచినవి. ఒక నాడు సుబేదారు దౌరావచ్చి గుడారాలు వేయించినాడు. అతని నౌకరు నీటికి పోతే "పైసా లావ్" అన్నారు జవానులు. వారు ఉత్తకడవలతో వాపసుపోయి "సర్కార్! నల్గురు అరబ్బీ జవానులు పైసా యియ్యంది నీళ్ళు తీసుకోనివ్వరు. అరే సుబేదార్ సర్కారు వారికిరా! అంటే జంబియాలతో పొడిచేదానికే పైబడవస్తారు సర్కార్!" అని విన్నివించుకొన్నారు. అక్కడనే సేవలో ఉన్నట్టి పటేలు పట్వారీ లిట్లన్నారు. "హుజూర్! పదేండ్లనుండి యీ మర్రిమాన్ పరగణా సుంకం సక్రమంగా వసూలౌతుంది. అందుకు సర్కారు ఫర్మాను వుంది." "ఉంటే ఉండవచ్చును" అనుకొని సుబేదారు కూడా పైసలిచ్చి నీరు తెప్పించుకొన్నాడు.

ఒకనాడు దీవాన్ బహద్దర్‌గారు అక్కడ డేరా వేయించినాడు. అతనికిన్నీ ఇదేగతి పట్టింది. అరబ్బులు కడవకు పైసా పెట్టంది ఒక మెట్టుకూడా దిగనియ్యరు. దీవానుగారు అంతా వినుకొని ఇట్లనుకొన్నారు. "మా హుజూర్‌గారు ఫర్మానిచ్చి నారేమో లేకుంటే నా వద్దకూడా వసూలుచేసే గుండె వుందా వీనికి?" దీవాను గూడా సుంకం చెల్లించుకొన్నాడు. ఒక కాపువాన్ని పట్టేపగ్గాలు లేవు. సుబేదారేమిటీ దీవాను బహద్దరు కూడా కిక్కురుమన కుండా సుంకం చెల్లించుకొని పోయివుంటే అబ్బా ఏం దబ్బా బారా వీనిది అని జనులు చాటున అనుకునేవారు. ఇట్లా వుండంగా నవాబుగారు షికారుకు పోతూ పోతూ పొద్దుపోయిందని రాత్రికి ఆవూరులోనే ఠికానా వేసినారు. నవాబో గివాబో ఇప్పటికి కాపువానికెవ్వరున్నూ కంటికాగేటట్లు కనబడలేదు. పైసా ఆడపెట్టి బావిలోకి దిగూ అన్నాడు నవాబు నౌకరును. నవాబుకు షికాయతు అయింది. నవాబు గారిట్లా తమలోనే అనుకున్నారు. "మా దివాన్జీ మా ఖజానా భర్తీ చేసే దానికి ఈ హుకుం ఇచ్చినాడేమో. పట్నం పోయిన తర్వాత విచారించుతాను. ఇప్పుడు మాత్రం నేనున్నూ ఖానూనుకు బద్ధున్నై ఉండాల్సిందే" అని ఆలోచించుకొని తానున్నూ నీటిసుంకం చెల్లించుకొన్నాడు.

ఈ పాటికి మ(గ్రిమాన్ పరిగణాలో రెండంతస్తుల బంగ్లా పెరిగింది. గ్రామంలో సగం భూములు కాపువానివే. 100 ఎద్దుల సేద్యం సాగించినాడు. చుట్టూ 5 ఆమడ దూరం అప్పులిచ్చినాడు. నవాబుగారు తమ నగరానికి వేంచేసిన తర్వాత దివాన్జీని పిలిచి "దివాన్‌సాబ్, మీరెందుకు నీటికి సుంకం ఏర్పాటు చేసినారు? ఇది అన్యాయము కాదా?" అని విచారించినాడు. అందుకు దీవానుగారిట్లు మనవి చేసుకొన్నారు. "బందగానె ఆలీ, హుజూర్! నేనున్నూ మీతో అలాగే గుంజారిష్ (మనవి) చేసుకోవాలె అని వుంటిని. నేను కూడా సుంకం చెల్లించుకున్నాను. హుజూర్‌గారు ఫర్మానె ముబారక్ జారీ చేసి వుంటారని నేనున్నూ అనుకున్నాను". "అరే నీవూ హుకుం ఇయ్యలేదు. నేనూ హుకుం ఇయ్యలేదు. మరి ఈ 15 ఏండ్లనుండి వాడు ఎట్లా వసూలు చేసినాడు? వాన్ని గిరప్తారీ (అరెస్టు) చేయించి తక్షణం పట్టి తెప్పించు" అని నవాబుగారు ఉరిమినారు.

కాపువాడు ఇట్టి ఫర్మానుకొరకై 10 ఏండ్ల నుండి నిరీక్షించుతూనే వున్నాడు. 1000 అష్రఫీలు బంగారు తట్టలో పోసుకొని జరీపని చేసిన మఖ్మల్‌బట్టపైన మూసుకొని కాపువాడు హుజూరువానికి నజరానా సమర్పించుకొన్నాడు. నజరానా చూచేవరకు నవాబుగారు చల్లబడ్డారు. "క్యారే నీకీయెవ్వర్ నీటి సుంకం హుకుం ఇచ్చినార్?" అన్నారు నవాబ్‌గారు. "హుజూర్! గ్యారా కద్దూ బారా కొత్వాల్ హుకుం ఎట్లా ఏర్పడిందో మ(గ్రిమాన్ పరిగణా సుంకం కూడా అట్లే ఏర్పాటైంది" అన్నాడు కాపు. "ఏమంటున్నావురా? నీవనేదేమిన్నీ అర్థం కాలేదు. సరిగా చెప్పు".

"నా తప్పులంతా మాఫ్ చేస్తామని సెలవిస్తే అన్నీ మనవి చేసుకుంటాను". "సరేలే! చెప్పు చూస్తాం."

కాపువాడు తన కథంతా వర్ణించి వర్ణించి చెప్పుకొన్నాడు. హుజూరు వారు అదేపనిగా నవ్వుతూ సాంతం విని "అరే! నీవు చాలా హుష్యారు మనిషివి. నీ తప్పంతా మాఫ్ ఇకముందు నీవు మాదేవిడీ వద్ద రాత్రి గంటలు కొట్టు వుండుము. అదే నీకు శిక్ష" అని సెలవిచ్చినారు. కాపువానికి కొన్నాళ్ళ వరకు తిక్కలేచినట్లుండింది. ఏమిన్నీ ఆదాయం లేదు. అధికారం లేదు. అడిగేవారు లేరు. రాత్రులంతా నిద్రకాయవలెను. ఒకనాడు నిద్రమబ్బులో రాత్రి 11 గంటలు కొట్టేది మరచిపోయినాడు. 12 గంటలకు లేచి కొట్టినాడు. ఈ చిన్న పొరపాటుకు దేవిడీ అంతా తలక్రిందులయ్యింది.

హుజూరు వారు 8 గంటల నుండి గంటకొక బేగంగారి గదికి పొయ్యేవారు. 11 గంటలు కొట్టలేదు. 11 గంటల బేగం వద్దకి హుజూరు పోలేదు. మర్నాడు 11 గంటల బేగంగారు గంటల కాపును పిలిపించి "అరేయ్! నా గంట మరచిపోకుండా కొట్టూ వుండుము. నెలకు 50 రూపాయిలిస్తాను" అని అన్నది. "చిత్తం చిత్తం హుజూర్!" అని కాపువాడు తత్తరపాటుతో అన్నాడు. "ఈ గంటలలో ఏమో రహస్యం ఉందిరా" అని కాపువానికి

స్ఫురించింది. ఒకనాడు 9 తప్పించినాడు. ఒకనాడు 10 తప్పించినాడు. ఒకనాడు 12 తప్పించినాడు. ఏ గంట తప్పితే మరునాడే ఆ గంట బేగంగారు కాపువానికి జీతం ఏర్పాటు చేసుకొన్నది. ఈ విధంగా నెలకు 400 రూపాయీల జీతం ఏర్పాటైంది కాపువానికి. కొన్ని యేండ్ల తర్వాత నవాబుగారికి సంగతి కూడా తెలిసింది. వీడు చలాకీవాడు అని మెచ్చుకొని వాడు సుంకం వసూలు చేసిన గ్రామమే వానికినాముగా ఇచ్చి పంపివేసినాడు. చూచినారా సొరకాయ మహిమ! సొరకాయ నరుకుట అంటే ఇట్లాంటి కథలు చెప్పేదానికే అంటారు.

✡

# ఒక విలన్ ఆత్మహత్య

**-వినోదిని**

యడమ మోకాలి మీద కుడి మోకాలు అదిమిపెట్టి ముడుచుకుంది దేవమణి. పగలంతా ముళ్లు విరిగిన చెప్పు బురదలో కూరుకుపోయినట్టు నులక మంచంలో వుంది. మాగన్నుగా. మోకాలికి జానెడు పైన గాలిపోయిన బంతిని వత్తినట్టు యవరో వత్తుతా వుంటే అలవాటుగా లేచి కూర్చుంది. రఘురాంరెడ్డి. చీకట్లోకి పోతా కన్పించాడు. కుక్క నోటికి కరసకపోతన్న చెప్పులా ఆ వజాన లేచి ఆ మొయినంగానే అతనెనకబడి నడిచింది. పగలంతా సాళ్లు సాళ్లుగా దున్నిచ్చుకున్న భూమి చీకటి దుప్పటి కప్పుకొని సొయ్య లేకుండా నిద్ర పోతోంది. సాళ్ల మజ్జనున్న ఆమెని చూస్తూనే – నోరో, చేతులో, కాళ్లో, వేళ్లో, గోళ్లో, ఇంకేదో... యక్కడెక్కడి నుంచో ఆయుధాలు సర్రున లాగాడు. నాగలికి మించిన పదును. కొనతేరి వున్నయ్. తెగబలిసిన ఎద్దుకుక్క. చీల్చి పీక్కుతినడం మొదలు బెట్టింది.

✡

"దేవమణీ! రేపొద్దున ఎనిమిదింటికల్లా అందర్నీ తీసుకొని తూర్పు పొలంలో వుండమన్నాడు మా నాన్న" రేవంత్‌రెడ్డి. రఘురాంరెడ్డి కొడుకు.

"పొద్దున చెప్పిపోయావ్‌గాయ్యా, పొద్దు పోయాక యింత సీకట్లో బడి మళ్లీ రాకపోతేనేం?"

"మర్చిపోతావేమో, మళ్లీ గుర్తు చేసి పోదామని వచ్చా" వెన్నెల్లో తొట్టి దెగ్గిర గూర్చొని అప్పుడే తిన్న ప్లేట్లు కడుగుతున్న యేసుదయమ్మని చూస్తా చెప్పాడు.

"అట్నే లేయ్యా, చెప్పావ్‌గా, వస్తాంలే, పొయ్‌రాపో... చీకటి పడింది...

ఆడ చీకట్లో నిలబడ్డ మనిషెవురయ్యా?"

"వాడా... నా ఫ్రెండ్ భరత్‌రెడ్డిలే..."

అరికాళ్లలో పుట్టిన వేర్లు చెప్పుల్ని చీల్చుకొని పేడకళ్లాపు చల్లిన భూమిలోకి మూరెడు వుక్కు మేకులై దిగబడినట్టు కదల్లేక పోతున్నాడు రేవంత్‌రెడ్డి. మొన్న ఎండాకాలం సెలవలకొచ్చి

యేసుదయమ్మని చూసినప్పటి నుంచీ కాళ్లల్లో మేకులు దిగటమే కాదు. కళ్లల్లో కోరిక కూడా వరిపూకలో నిప్పుకణిక పడినట్టు రగులు కొన్తోంది.

"పోయ్యా చిన్రెడ్డీ, పో... పోయి బోజనం చెయ్యాలిగా, వస్తాంలే రేపొద్దున... పొయ్‌రాపో..." మేకులు పీకి ఆడ్నుంచి కదలడానికి యింకొంచెం టైం తీసుకున్నాడు. ఆ కొంచెం సమయాన్ని సద్వినియోగం చేసుకున్నాడు, యేసుదయమ్మని చూస్తూ.

"అయ్యలాగే సెడి బుద్ధి యీడిది గూడా! మీసాలన్నా మొలవక ముందే పక్కలోకి ఆడపిల్లలు గావాల. తేరగ దొరుకుతారని యీ యిళ్ల చుట్టూ తిరుగుతారు. మేతెయ్యనక్కర్లా, పేడదియ్య నక్కర్లా... లేగదూడలని గూడా జూడరు సైతాన్ నాకొడుకులు... నెత్తురు పిండుకు తాగుతారు, దుష్టపునాయాళ్లు..." రేవంత్‌రెడ్డి వెళ్లిన దిక్కు చూస్తా తుపుక్కున వూసింది దేవమణి.

కడిగిన గిన్నెలు తీసుకొని లోపలికెళ్లింది యేసుదయమ్మ. గిన్నెలన్నీ సర్ది వచ్చి తల్లి పక్కన బొంగుల మంచం వాల్చుకొని పొణుకుంది.

"పిల్లకింకా పదకొండేళ్లే. పసిమొహంది. అప్పుడే దారిబట్టి కాపుగాశాడు, లుచ్ఛా నాయాలు. వీడికి తెల్సుగా.... వాళ్లయ్య తొడకింద నలిగిన మనిషినని...?! వాయా వరసల్లేని నా కొడుకులు.... నీతి లేని నా బట్టలు... వాడూ అంతే... వీళ్లయ్య... సైతాన్ నా బట్ట... లూసీఫర్ ముండాకొడుకు... పదేళ్లకే కాపేసి పట్టాడు నన్ను... ఏ పంట ఎప్పుడు పాలు గారుద్దో, ఎప్పుడు పంటకొచ్చుద్దో కళ్లతోనే చూసి జెప్పే యవసాయదారులని పేరు. రైతుబిడ్డలని పేరు. ఈ యిళ్లల్లో దొరికే ఆడోళ్లకి మాత్రం పాలూ లేదు, పండూ లేదు, సచ్చూ లేదు పుచ్చూ లేదు, రోగం లేదు రొచ్చూ లేదు, మగసాలీ లేదు ముండా లేదు, పగలూ లేదు రాత్రీ లేదు..." గొంతు వొణికింది దేవమణికి. పక్కన మంచం మీద నిద్రపోతున్న కూతుర్ని చూస్తే చాలా దిగులుగా వుంది. గొప్ప దుఖ్ఖంగా వుంది. చీరచెంగుతో కళ్లద్దుకుంది. వట్టి పొడికళ్లు. ఎండాకాలపు బావి. అట్టడుగున కూసింత చెమ్మ కూడా లేదు. నీళ్లు వూరడమే దుఖ్ఖ ప్రకటన కాదని ఎన్నాళ్ల క్రితమో తడి యెత్తేసిన రెండు చెలమలు.

"యేందిమే దేవమణి... అన్నం దిన్నావా?" పక్కింటి సుగుణ.

"ఆ... యిప్పిడే... దా... నువ్ దిన్నావా?"

"పోయి తినాల" ప్లాస్టిక్ చెంబు మంచంకోడు పక్కన బెట్టి, దేవమణి ఎదురుగా నిద్ర పోతన్న యేసుదయమ్మ మంచంలో కూర్చుంది.

"వొక్కదానివే పోకపోతే నన్ను పిలవాల్సిందిగా... తోడొచ్చేదాన్ని" చెంబు చూస్తా చెప్పింది.

"నిన్ను బిలిచే చోటు కాదులేమ్మే అది... చెరువు గట్టుకెల్లి పోలా... హైవే మీదకి పోయా..." దేవమణి దగ్గర సుగుణకి దాపరికం లేదు.

"నువ్వీమజ్జ పోటల్లేదనుకుంటగా?"

"అవును గానీ, యియ్యాల తప్పలేదు. యింగంతే...! పోగోడదనుకుంటే కుదిరే బతుకులా? పనికిపోతే వాళ్లిచ్చే కూలిడబ్బులు తల్లీ ముగ్గురు పిల్లలు యిద్దరు ముసిలోళ్లూ తినడానికి సరిపోద్దా? అన్నీ పిరెం అయిపాయె, యేది కొందామన్నా భగ్గుమంటన్నే... మనూర్లో రైతులేమో కూలి పెంచరాయె!"

"అదీ నిజమేలే..." ఆలోచనగా అంది దేవమణి.

జాకెట్లోకి చెయ్యి పోనిచ్చి డబ్బులు బిగదీసి కట్టిన చేతిరుమాలు బయటికి తీసింది సుగుణ. చకచకా ముడులన్నీ విప్పింది. పది, ఇరవై, యాభై వంద రూపాయల నోట్లు కూడా వున్నాయి. వంద రూపాయల నోట్లు రెండు దీసి దేవమణి చేతిలో పెడుతూ– "రేపు పోయి స్టోర్లో బియ్యం, కందిపప్పూ దెచ్చుకో. అట్టాగే డాట్టరు రాసిన చీటీ అట్నే వుందిగా... టాబిలెట్లు, గొట్టాలు దెచ్చుకొని యేసుకో. అసలే పచ్చ బట్టవుతుందన్నావ్‌గా... చానా డేంజరమ్మే అది..."

చేతిని వెనక్కి తీసుకుంది దేవమణి.

"వొద్దొద్దు, నువ్వుంచుకో, నా దెగ్గిరున్నయ్‌లే"

"యేంది నీ దెగ్గిరుంది? యెవురిచ్చారు నీకు?"

"కూలి డబ్బులొచ్చినయ్‌లే"

"యేం కూలి డబ్బులు? యెవురో యిచ్చినరంటేనే? యెవుడూ...? పొద్దస్తమానం వాడి పొలంలో పనిజేసి వంటి నిండా మట్టి పూసుకొని వస్తావ్. పొద్దు పొయ్యాక వొంట్లోకి రోగం దెచ్చుకొని వస్తావ్. యేనాడైనా నువ్ జేస్తన్న కష్టానికి లెక్కగట్టి 'యిదిగో, యిది దీసుకో' అని మట్టసంగా చేతిలో బెట్టాడా? యిన్నేళ్ల బట్టి వాడికి చాకిరీ జేస్తన్నావే, కడుపునిండా తిన్నావో లేదో కడుపు మీద చెయ్యేసి చూశాడా? పోనీ నీతోనే సరిపెట్టుకున్నాడా?! కంటికి కొంచెం నదురుగా కన్పించిన ఏ ఆడదాన్నన్నా వదిలేడా... యాడ యాడో తగిలిచ్చుకొచ్చిన రోగాలు ఈ యిరవై యేళ్లలో ఎన్నిసార్లు నీ కంటిచ్చాడూ!"

యేమీ మాట్లాడకుండా సుగుణనే చూస్తంది దేవమణి. దళితవాడంతా యేసుదయమ్మలా నిద్రపోతోంది.

సుగణ కొంచెం గొంతు తగ్గించింది.

ఇటు చూడమ్మ, ఒక గంట.. ఒకే ఒక్క గంట, పక్క మీదికి పోయివస్తేనే యిన్ని డబ్బులొచ్చినాయే. ఒక్క రోజు కూడా యిడిసి పెట్టకుండా రోజూ నిన్ను పిలుస్తాడే... మరి నీకెన్ని రావాల?... హైవే మీద నన్ను జూసి ఆగేవాళ్లంతా లారీ డ్రైవర్లే. వారాలకి వారాలు పెళ్లాలకి దూరంగా వుండేవాళ్లు. పైగా కష్టజీవులు. ఆసాములు కాదుగా వీడిలాగా! వాళ్లే,

ఆడదాని డబ్బులు మనకెందుకులే అనుకొని ముదరశుదిగా డబ్బులిచ్చి పోతారు. మరి ఈడేందమ్మే? ఇంట్లో పెళ్లాం చాలక మదంబట్టి కొట్టుకుంటున్నాడు.... నువ్వు గూడా వాడెప్పుడు పిలిస్తే అప్పుడు పోతావ్, వొంట్లో బాగాలేదు రానని జెప్పలేవా ధయిర్యం లేదా?"

"చెబితే యేం లాభం? అంతా నష్టమే. తెల్లారిం దగ్గర నుంచి మనిషి చిమచిమలాడతా వుంటాడు. పాములాగ బుసగొడతా వుంటాడు. వాళ్లున్నారు వీళ్లున్నారని చూడడు. లేకిలేకి మాటలంటుంటాడు. యింతింతలావు బూతులు తిడతాడు. కూలి డబ్బులు సగం పట్టు కుంటాడు. యిట్టా యెన్నిసార్లు గాలా? పిలవగానే పోతే పాయె! ఇదంతా యెందుకు? వాణ్ణి జూస్తేనే ఉచ్చ గార్తయ్ నాకు, ఇంక ధైర్యం యాడది??"

"సరే, అట్లయితే మరి, మా యింట్లో అందరూ నిద్రపోయుంటారు. ఆకలవుతుంది. పోయి రెండు ముద్దలు తిని పడుకోవాల" డబ్బుల రుమాలు జాకెట్లోకి దోపుకుంటూ "ఈటితో స్టోరు బియ్యం కొనాల, పిల్లలకి పుస్తకాలు చెప్పులు కొనాల, నులక కొని అమ్మకి నాయనకి మంచాలల్లిచ్చాల. నాకు టాబిలెట్లు దెచ్చుకోవాల..." అంటూ చెంబు తీసుకొని లేచింది. గుప్పెట్లో డబ్బులు దేవమణి దిండు కింద బెట్టింది సుగుణ. దేవమణి పిలుస్తున్నా వినిపిచ్చు కోకుండా వెళ్లిపోయింది.

✡

దేవమణికి సుగుణకి అది పుట్టినూరు. సుగుణని పక్కవూరు ఇచ్చారు. ముగ్గురు పిల్లలు పుట్టాక అతను కరెంటు స్తంభం మీద నుంచి పడి చనిపోయాడు. పిల్లల్ని చదివిస్తూ తల్లిదండ్రుల్ని చూసుకుంటోంది సుగుణ.

దేవమణి పెద్దమనిషి కాకముందు నుంచి రఘురాంరెడ్డి ఎప్పుడంటే అప్పుడు ఆమెని తాటితోపుల్లోకి తీసికెళ్లేవాడు. అప్పటికి అతనికీ పెళ్లికాలా. తర్వాత పెళ్లయింది. దేవమణికి మంచి సంబంధాలు రాకపోయేసరికే కాస్త మెత్తగా వుండే మేనమామకిచ్చి పెళ్లి చేశారు. ఇద్దరు పిల్లలు పుట్టాక ఒకరోజు తెల్లవారి పొణుకున్నవాడు పొణుకున్నట్టే మంచంలో చచ్చిపోయి కన్పించాడు. పిల్లల్తో పుట్టింటికొచ్చింది దేవమణి. ఆరు నెలలకే తండ్రి చనిపోయాడు. పెద్ద కొడుకు పక్కూరు హాస్టల్లో వుండి ఏడో తరగతి చదువుతున్నాడు.

భర్త చనిపోయిన దుఃఖంలో వుండి పుట్టింటికొచ్చిన రోజే దర్జాగా యింటికొచ్చాడు రఘురాంరెడ్డి. కూలీలకి మేస్త్రీవన్నాడు. యింకేదో అన్నాడు. ఆ రోజూ వదల్లేదు. ఆ తర్వాత ఏడో రోజు తండ్రి దినమయ్యేదాక కూడా ఆగలేదు. సొంత మనుషుల కోసం అనుభవించాల్సిన దుఃఖమంతా లగ్జరీ అయిపోయింది దేవమణికి. పొయ్యిలోకి నరుక్కొచ్చే సర్కారు ముళ్లకంపలా నెత్తి మీద తన మనుషులు చచ్చిపోయిన దుఃఖముండగానే... ఏదో... నాల్గు రోజులేడ్చి దాన్ని దించుకోకుండానే... లుంగీ అంతా నడుమ్మీదకి ఎగలాక్కొని వీడు దిశమొలతో ఎదురుగా

నిలబడతాడు. మొత్తాన్నీ... ఆ కుప్ప మొత్తాన్ని దెచ్చి తల మీద పెడతాడు. కిరీటం! మొండిమొల కిరీటం!!

యెప్పుడైనా నోరు తెరిచి శేరు బియ్యమడిగితే పరిగేరుకోమంటాడు. నాలుగు రూపాయల డిగితే అప్పులంటాడు. యెంత చేతిలో బెడితే అంత. గుప్పిట మూసి చెంగేసుకొని రావడమే తెల్సు. యేందో, మెడలో మంద గుది వేసినట్టు, నోటికి చిక్కం కట్టినట్టు మూగి మొద్దయి పోయింది తను. చచ్చేదాకా యిదే బతుకా? అంతులేని వేదన. దుఖ్ఖంతో మొహం కొంగర పోయింది.

✡

"ఆనా సయితికి నా బిడ్డే దొరికిందా? నా పిల్ల యదాన బడి యాడవకపోతే దాని సంగతి, దాని కూతురు సంగతి చూసుకోవచ్చుగా, ఈసారి మాట్లాడమను అట్టాంటి బలిసిన మాటలు... దాని సంగతి చెబుతా..." పొద్దున్నే ఏడు గంటలకి గట్టి గట్టిగా అరుస్తా వుంది సుగుణ.

చిన్న తెల్ల దేశాలో గోంగోర పచ్చిమిరగాయలు ఉడకబెట్టుకొని, దాని మూత మీద కొద్దిగ ఉప్పు, ఒక పెద్దుల్లిపాయ, రెండు రెబ్బలు చిన్నుల్లిపాయ పెట్టుకొని సుగుణ వాళ్ల రోటి దగ్గర కొచ్చింది దేవమణి. బిక్కమొహంతో నిలబడుంది సుగుణ కూతురు బ్యూలా. ఏడో తరగతి పిల్ల. మంచంలో కూర్చోనుంది జోస్పీను. జోస్పీనుది నాలుగిళ్ల అవతల. పొయ్యి మంటేస్తుంది సుగుణ. పొయ్యి మీద టీ. ఆ టీ లాగా మరుగుతా వుంది సుగుణ కూడా.

"యేందిమే జోస్పీనా, పొద్దున్నే యిటొచ్చేవ్?" చిన్న డబ్బాతో నీళ్లు దెచ్చి రోలు కడుగుతూ అడిగింది దేవమణి.

"దోసకాయల కోసం బూషణం కొట్టుకాడికి పోయానక్కా. బ్యూలా ఆడ టీ పొట్లం కొంటంది. వాళ్ల తోట్లో గోంగోర వాటు పట్టుకొని బూషణం కొట్లో యెయ్యడానికి ఆడకొచ్చింది తులసమ్మ. పిల్లని జూస్తానే తిట్లకి లంకిచ్చుకుంది. 'ఏంది పిల్లా, ఇంగ పైటేసుకోవా? సిగ్గు లేదంటేనే, ఆ వజాన రోడ్లెమ్మటి బడి తరుగుతున్నావ్ అయినా నిన్నని ఏం లాభం, మీ అమ్మకి బుద్ధి లేకపోతే సరి, ఊర్లో కుర్రపిల్లలు తిరుగుతున్నారని కూడా లేకుండా నిన్నిట్లా యిడిసి పెట్టిందేంది?' అని ఆ వజాన పిల్లని బట్టుకొని ఒకటే తిట్లు..."

"గురిగింజ గింజకి దాని గుద్దకిందున్న నలుపు కనబడదంటలే... మొన్నొచ్చిన దాని పెద్ద కూతుర్ని చూశినవంటమ్మే దేవమణీ, అయిద్రాబాదులో చదువుతుందంటే... నలుగురు సావాసగత్తెల్నేసుకొని ఊర్లో... దిగిందిలే... బిర్రుగ బిగదీసినట్టు ప్యాంటూ, బుడ్డ పిల్లగాళ్లు యేసుకొనే చిన్న సొక్కా యేసుకొని ఊరంతా సెడతిరిగింది. గడ్డం కింద సగం

రొమ్ములు బయటికి కనబడతానే ఉన్నయ్. చొక్కా కింద బొడ్డు కనబడతన్నె... ఆ పాయింటు... ఎంత కిందకుందంటే... ఒక్క రవ్వ వంగిందంటే సాలు పిర్రలమజ్జ గీత కనబడతన్నె... డాయరు కూడా కనబడతన్నె... యావన్నంటే... ఊర్లో ఆసాములు యట్టున్నా సెల్లుద్ది... మన మట్ట కాదాయె. ఊరి శివర బతికే జాతి తక్కువోళ్లం గాబట్టి మప్పితంగా వంటినిండా బట్ట కట్టుకోవాల.... పసిపిల్లలయినా ముసిలోళ్లయినా... లేకపోతే సీరామశంద్రుడు లాంటి ఊర్లో మొగోళ్లంతా సిత్తకార్తె కుక్కలయిపోతారంట... తిండి లేక, సరయిన పోసిన లేక మనమెట్టానో బతుకుతుంటే... వొక్కొక్కతి డాబా మీద గుమ్మడి కాయలాగా, షాపుల్లో ఆర్లిక్సు బాటిల్లాగా... ఇంతింతెత్తున రేసుగుర్రాల్లాగా వుండి పసిబిడ్డల మీద బడి యేడుత్తున్నయ్... గుడ్డ గాల్చి మీదేత్తన్నయ్..."

"పోన్లేమ్మే సుగుణా.... యెవురి పాపాన వాళ్లే బోతారు"

"యేందిమే పోనిచ్చేది దేవమణీ.... ఈసారి కొదిలిపెడతన్నా... ఇంకోసారి నా జోతికొచ్చిందంటే కోస్తా మజ్జకి... దోసకాయ కోసినట్టు..."

"మొన్న గూడా నేను మా నాన్న సొక్కా యేసుకొని రోడ్డు పనికి పోయి, సిమెంట్ బొచ్చులు మోసి యింటికొచ్చా. మమ్మ బియ్యం దెమ్మంటే కొట్టుకాడకొచ్చా. జాకెట్టు యింతెడల్పున సంకలో పెరిగిందని సొక్కాతోనే వచ్చా! ఈ తులశమ్మ, పారిజాతం ఆ కొట్టుకాడ కూసోని నన్ను జూసి శానా యెకసెక్కం మాటలన్నారక్కా – "భలే తిరుగున్నావ్ సొక్కాలేసుకొని, ప్యాంటు గూడా యేసుకో, తల కత్తిరేయించుకొని మొగరాయుళ్లాగా తిరగరాదే– అని వొకటే మొయినంగా నవ్వేరక్కా! నాకు శానా యేడుపొచ్చింది" యిప్పుడు గూడా ఏడుపొచ్చింది జోస్ఫినుకి. యేడుపుతో మళ్లీ మొదలుపెట్టింది.

"నేను చెవులకి తమ్మపైన ఇంకో బెజ్జం కుట్టిచ్చుకున్నానని – 'వొక్క బొక్క చాలదనుకుంటనే నీకు, అన్ని బొక్కల్లోకి పెట్టుకోవాలంటే చాలా కావాలిగా. మా పొలాల్లోకి రాకుండా ఉపాది హామీ పనులకి పోతన్నావ్‌గా... బాగా సంపాయిస్తన్నట్టున్నావే... వాసన సబ్బు కూడా కొంటన్నావ్‌గా... ఎక్కడెక్కడ రుద్దుకుంటావేందీ...'– అని శానా బూతు మాటలన్నారక్కా" యేడుపాగలేదు జోస్ఫినుకి.

"మొన్నామజ్జ పేపర్లలో టీవీలలో వకటే మొయినంగా చూపిచ్చారు... ఈళ్లిద్దర్ని... యవసాయం జేసే ఆడరైతులని... యేం ఆడోళ్లూ...? ఆడోళ్లమన్న సంగతి మర్చిపోయి, మనతో, వాళ్ల మొగోళ్లకంటే అద్దుమానంగా మాట్లాడతారు... సిన్న సిన్న పిల్లల్ని తీసకపోయి, ఆ యర్రటి యండలో వాళ్ల పొలాల్లో ఆకుకూరలు బీకిచ్చి, గౌన్లలో నాలుగు మిరగాయలు పోసి ఇదే కూలంటారు..." సుగుణ మాట్లాడతానే వుంది.

పచ్చడి నూరుకొని యింటికొచ్చేసింది దేవమణి.

చర్చిలోంచి యేసు ప్రభువు రికార్డులు వినిపిస్తున్నాయ్. ఇంకొంచెం సేపటికి ఆదివారం ఆరాధన మొదలవుద్ది. యేసుదయమ్మ చర్చికెల్లి పోయింది.

"మ్మే.... దేవమణీ! కొద్దిగా నీ బైబిలియ్యమ్మే, మందిరానికెళ్లొచ్చిస్తా... అసలే యియ్యాల రొట్టారాధన..." తెల్లటి చీరా జాకెట్టు. తలకు పోసుకున్న తల. సంతోషంగా సంబరంగా, ఇంతెడల్పున నవ్వుకుంటా, అన్నింటికీ మించి ఎంతో ప్రశాంతంగా వుంది సుగుణ. బైబిలు దెచ్చి సుగుణ చేతిలో బెట్టింది.

"... ... నిన్నొక మాటడగనా సుగుణా..."

"అడుగమ్మే... యే మాటయినా నీకేగా చెబుతా"

"రాత్రి హయివే మీదకి పొయ్యావ్... తెల్లారగానే చర్చికి పోతన్నావ్... తప్పు గాదా??"

"......"

"వేషధారణ కాదా?... యేసయ్యేమనడా...?"

"యేసయ్యేవంటాడూ... హ్రుదయశుద్ధి గావాలన్నాడు... మొగుడుండీ... వాడు సాలక హయివే మీదకి పొయ్యానా నేను? కాదుగా... వేరే వూర్లలో కూలి బాగానే యిత్తన్నారు. కానీ ఈ వూర్లో ఆసాములు యిచ్చే కూలితో ఉప్పు రాదు మిరగాయ రాదు. ఒక సబ్బు రాదు. అందుకే పోతన్నా హయివే మీదకి... ఊరికే గుల బుట్టి పోతన్నానా? కారు కొనుక్కోడానికి పోతన్నానా?... చూడు... నా కాళ్లకి చెప్పులు కూడా లెవ్వు. చాల్తయనుకున్న డబ్బులు రాగానే ఇంకొక్క నిమిషం గూడా ఉండనాడ... రయ్యన ఇంటికొచ్చేస్తా... వొక్కొక్క నా కొడుకు పూటుగా తాగి శవట కంపు నూకుతా వుంటాడు. గవులు వాసనకి కక్కొస్తా వుంటది. వళ్లు యాడకాడ సీరుకుపోయి మంటలేస్తా వుంటది. పెద్ద పెద్ద రోగాలొచ్చి జేరతావుంటయ్ వొంట్లోకి..." కళ్లు చెమ్మగిల్లినయ్ సుగుణకి. దేవమణికి కూడా...

"వొళ్లు కొవ్వెక్కి, వాయి వరసల్లేకుండా– చేలల్లో, గడ్డివాముల్లో బడి దొర్లుతుంటయ్ సూడు... వాటిదమ్మే యభిచారం. దాన్ననాలి, పాపప్పనని. నేనేం తప్పు జేస్తున్నానమ్మే...? నాది తప్పే కాదు! యభిచారమే గాదు!! వేషధారణే గాదు!!! నా హ్రుదయం పవిత్రంగా వుందమ్మే... యిదిగో యీ బైబులంత...." బైబిల్ని గుండెలకి హత్తుకొని ముద్దు పెట్టుకుంది సుగుణ. కళ్లల్లో ఎక్కడలేని ప్రశాంతత. విశ్వాసం. చిరునవ్వు. సుగుణని జూస్తూ చిన్నగా హాయిగా నవ్వింది దేవమణి.

"రోజూ అట్టా నవ్వుతుండరాదమ్మే సుగుణా... చూడబుద్ధవుతుంది"

"నువ్వు మాత్రం, ఎంత బావుంటావ్ నవ్వితే.. అమ్మో, ఆరాధన మొదలైంది పోతన్నా..." గబగబా పోయింది సుగుణ.

“దేవమణక్కా”

“యేందిమే బుజ్జమ్మాయ్”

“ఒక మాట చెప్పాలని వచ్చా. మేవు వక పది మందిమి కూలికి రావట్లేదక్కా. పోయినసారి కూడా ఉయ్యాల్లో పిల్లలకి పాలిత్తానికి వప్పుకోలా. పనిటైములో పాలేందని శానా తిట్లు తిట్టేడు. పిల్లలకి గొంతెండిపాయె. మాకు రొమ్ముల్లో గడ్డలొచ్చా! అందుకే మేం రాం! ఆ మిగిలినోళ్లు కూడా నీ మొకం జూసి వస్తన్నారనుకో” చెప్తానే పిల్లోణ్ని సంకనేసుకొని గబగబా పోయింది బుజ్జమ్మాయ్.

యేం మాట్లాడలా దేవమణి. బాక్సులో కొంచెం అన్నం, గోంగోర పచ్చడి యేసుకొని టవల్ తీసుకుంది.

అందర్నీ బొడ్రాయికాడ కలుపుకొని పొలం తీసకపోవాల. ఇప్పటికే లేటయ్యింది. ఏ మాత్రం లేటయినా ఒప్పుకోడు రఘురాంరెడ్డి. ఆ నోటికి అడ్డూ అదుపూ వుండదు. చెడ్డ చెడ్డ మాటలంటాడు. అందరి ముందూ పట్టుకొని ‘బజారు లంజా ఎవుడెవుడి దెగ్గిర ఆగావే’ అంటాడు.

బొడ్రాయి కాడికి వచ్చేసింది దేవమణి. ఆడోళ్లు బాక్సులు టవళ్లతో దేవమణి కోసం ఎదురు చూస్తన్నారు. వాళ్ల వాలకం చూస్తే అప్పుడు దాకా ఏదో గట్టి విషయమే మాట్లాడు కున్నట్టున్నారు. దేవమణిని చూస్తానే శారమ్మ–

“బుజ్జమ్మాయోళ్లెవురూ రావంటున్నారుగా దేవమణీ. మేం గోడా రాకపోదుం, ఈ రగురాంరెడ్డి జేసిన పరాబవానికి! ఇంగ నీ మొకం జూసి వత్తన్నామనుకో. ఈ రెడ్డే కాదు. ఏ ఆసామైనా అంతే. అసలే వూరయినా అంతే రైతులు! ఒడుపున్నోళ్లు, బలుపున్నోళ్లు... ఏదో నాలుగు రూపాయలు కూలి పెంచమన్నామని, కొద్దిగా పొద్దుండగా బయట పడతామని అడిగితే ఎంత రాద్ధాంతం చేశాడు? ఈయన పొలంలోకి రానీయలా. అందర్నీ కూడేసి ఎవరి పొలాల్లోకీ వంగనీయలా. ఇట్టాగాదు లెమ్మని చార్జీలు పెట్టుకొని ఆటోలెక్కి పక్కూరికి పోతే వాళ్లూ పొలాల్లోకి రానియ్యలా. రెడ్డి ముందే వాళ్లతో సెల్లుఫోనులో మాట్లాడేడాయె. బతిమిలాడి బామాడి పొద్దు మూడైపాయె. తెచ్చుకున్నది తిందామంటే అన్నం సద్దివాసనొచ్చె. జవుకుడయి పాయె ఇంగది ఆ కాలవలో పార్నూకి నీళ్లు తాగి ఇళ్లకు మల్లుకుంటిమాయె... ఉన్న నాలుగు రూపాయలు చార్జీలకి పాయె... మనకి కూలి పెంచమంటే పెంచరు... వాళ్లకి మాత్రం అన్నీ చవగ్గొస్తయ్యంట, సబ్సిడీల్లో. ఇత్తనాల కాడ్నుండి ఎరువుల దాక...! పెతిదానికి లోన్లు యిస్తారంట. మాపీ కూడా చేస్తారంట” అసలే మాత్రం అపుకోలేక, రొప్పు దీర్చుకుండ చెప్పింది.

“పోనీలే సిన్నమ్మా, ఇప్పటికే చానా లేటయింది. ఇంగ పోదాం పండి చానా దూరం నడవాల”

అంతేలే అనుకుంటా అందరూ నాలుగడుగులేశారు.

సడెన్‌గా మైకులో పాటాగిపోయింది. పాస్టర్ ప్రేమానంద–

"ప్రభువు నందు ప్రియమైన గ్రామ ప్రజలకు ఒక ముఖ్యమైన వార్త. సుబ్బారెడ్డి గారి కుమారుడు రఘురాంరెడ్డి గారు తమ స్వగృహము నందు మరణించారని తెలియజేయుటకు చింతిస్తున్నాము". మైకాగిపోయింది. అప్పటికే చాలా మంది రఘురాంరెడ్డి యింటి వైపు పరిగెడుతున్నారు. ఏం జెయ్యాలో పాలుబోలా. ఆడోళ్లు ఎటోళ్లటు యెల్లిపోయారు. దేవమణి యింటి వైపు నడిచింది.

గంట గడిచే సరికే ఊరంతా గోల గోల.

అదోరకం సందడి. టీవీలోళ్లు వచ్చారు. నంబర్లోళ్లు. గుర్తులోళ్లు! పేపర్లోళ్లొచ్చారు. స్వచ్ఛంద సంస్థలోళ్లు, పోలీసులు, రైతు సంఘాలోళ్లు, గవర్నమెంటు ఆఫీసర్లు – ఊరినిండా జనమే. టీవీల్లో ఏ ఛానల్ చూసినా బ్రేకింగ్ న్యూస్‌తో యిదే వార్త.

"అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య. చేసిన అప్పులు తీర్చలేక, పంట దిగుబడి రాక, దేశానికి వెన్నెముక రఘురాంరెడ్డి పురుగుల మందును ఆశ్రయించాడు" ఒట్టి శరీరంతో చాప మీద పడుకోబెట్టిన రఘురాంరెడ్డిని చూపిస్తున్నారు. పక్కనే పురుగు మందు డబ్బా.

సాయంత్రం దాకా యిదే గోల. అన్నీ అయ్యాక సాయంత్రానికి రఘురాంరెడ్డిని వొలుకుల్లోకి తెచ్చారు. దహనం చేశారు. ఊరు సద్దు మణిగింది. ఒక రకమైన నిశ్శబ్దం.

చీకటి పడింది. దేవమణి బక్కెట్ నిండా వేడినీళ్లు పోసుకొని దడెనకకి పోయి రుద్ది రుద్ది తలకి పోసుకుంది. కాస్త మంచి చీర తీసుకొని కట్టుకుంది. బయట మంచం వాల్చుకొని కూర్చుంది. కూతుర్నడిగి ప్లేటు నిండా ఉడుకుడుకన్నం బెట్టిచ్చుకొని పొద్దున సుగుణ పంపిచ్చిన, బాగా మసాలా వేసి వండిన దున్నమాంసం కూరేసుకొని కడుపునిండా తిన్నది. ఇష్టంగా వేళ్లు నాక్కుంటూ... తృప్తిగా. చందమామంత హాయిగా చల్లగా మంచంలో పడుకుంది. వెల్లకిలా. ఆ కోడుకొక కాలు, ఈ కోడుకొక కాలు చాపింది. భరోసాగా, ధీమాగా, నిశ్చింతగా... ఎప్పుడు పట్టిందో నిద్ర, ఒంటి మీద సొయ్య లేకుండా... ఎంత సేపు నిద్ర పోయిందో...

యెవురో గట్టిగా మంచానికి కొట్టుకుంటే ఉలిక్కిపడి మెలకువొచ్చింది. చూస్తే... రేవంత్‌రెడ్డి... కాదు– కాదు. వాడి సావాసగాడు భరత్‌రెడ్డి. నిద్రపోతన్న యేసుదయమ్మ పక్క నుండి పోతా కన్పించాడు. తుళ్లిపడి కళ్లు నులుముకొని చూసింది. పరిగెత్తి పోతన్నాడు.

గుండె దడ దడా కొట్టుకుంటంది. కళ్లల్లో భయం జేరింది. అంతులేని భయం. నిద్ర పోతన్న యేసుదయమ్మని చూస్తా వుంది. ఇక నిద్ర పట్టలా దేవమణికి.

✡

# జీపొచ్చింది

**–వేంపల్లి షరీఫ్**

మిట్ట మధ్యాహ్నం ఒంటిగంటయ్యింది. మూడెకరాల నల్లరేగడి నేల నీళ్లు లేక మలమల మాడిపోతోంది. దొంగపూత కొచ్చిన శెనిక్కాయ చెట్లు మెలిగుడ్లేసుకుంటున్నాయి. పొలం వారగా వున్న ఒక చిన్న స్టార్టరు పెట్టె ఎండకు చరచరా కాలిపోతూ గుయ్యిమని శబ్దం చేస్తూ ఉన్నాయా లేవా అన్నట్టున్న బోరు పైపులోని నీళ్లను బయటకు లాగుతోంది. బయటికొచ్చిన నీళ్లు సన్నగా కారి కాలువలో పడి తాబేల్లా పాకుతున్నాయి. కాలువ్వార చెట్లన్నీ సల్లగా పచ్చదనాన్ని పులుముకొన్నాయి.

"పొలమంతా అలా అయ్యేదెప్పుడు?" వందోసారి అనుకున్నాడు వెంకట్రెడ్డి. కాళ్లు కాలకుండ అతడు కాలువలో నిలబడుకున్నాడు. నెత్తికి తడి టవాల చుట్టుకున్నాడు. చేతిలో పార. అతని మనసంతా అదోలా వుంది. ఒకవైపు ఎండుతున్న పంట. మరోవైపు బోరు లోంచి వస్తున్న ఒంటేలు ధారలాంటి నీరు.

దానికి తోడు పోతూ వస్తున్న కరెంటు.

ఆ రొన్ని నీళ్లతో కాలువ పారేదానికే గంట పడుతుంది. ఇక పంటెప్పుడు తడుపు కోవాలి? వెంకట్రెడ్డి మనసులో అనుకుంటుండగానే పొలంలో తుస్సుమంటూ కరెంటు పోయింది. ఆడుతున్న స్టాటరు కాస్తా ఆగిపోయింది. బోరు పైపులోంచి వచ్చే ఆ కొద్ది నీళ్లు ఆగిపోయాయి.

"తూ.. దీనెమ్మ.." – తిట్టుకున్నాడు వెంకట్రెడ్డి. యింక ఒక్క నిమిషం కూడా అతనికి పొలంలో ఉండబుద్ధి కాలేదు. కడుపులో చరచరమని కాలుతున్నా తెచ్చుకున్న అన్నం తినబుద్ధి కావడం లేదు. పయ్యంతా అలసటగా ఉండడం వల్లనేమో ఇంటికెళ్లి కాసేపు సల్లగా పడుకుందా మనిపించింది. తెచ్చుకొన్న సద్దిని ఎనక్కి తీసుకొనిపోయిన కరెంటును తిట్టుకుంటా మెల్లగా కాలిదావ పట్టి ఊర్లోకొచ్చాడు.

కాళ్లీడ్చుకుంటా అంతదూరం నుంచి ఊరికి చేరేసరికి ఆడంతా గోలగోలగా వుంది.

"ఏందిరా వెంకట్రెడ్డి ఇంకా ఇక్కడే ఉండావు. ఉరికెత్తురా.. పొలాల్లోకి కరెంటోలెల్నారు. కరెంటోళ్ల జీపెల్లింది. ఉరికి స్టాటరు పెట్టె దాసుకోపో.. ఉరుకూ" వెంకట్రెడ్డిని చూసి మల్లన్న అరిచాడు.

వెంకట్రెడ్డికి మొదట అర్థం కాలేదు. అర్థం అయ్యాక గుండె జారిపోయింది. కరెంటు మామూలుగా పోలేదు. కరెంటోళ్లే లైన్ ఆఫ్ చేసి పొలాల మీద పడ్డారని తెలిశాక వళ్లంతా చమటపట్టింది.

ఊర్లో సగం మందికి పైగా కరెంటు బిల్లులు కట్టని, కట్టలేని రైతులే. అందరూ ఎక్కడోళ్లక్కడ పరిగెత్తుతున్నారు. కంగారు కంగారుగా హడావుడి పడుతున్నారు.

వెంకట్రెడ్డికి ఏం చేయాలో తోచలేదు. అట్నుంచే అటే ఎనక్కి పరుగందుకున్నాడు. చేతిలో సద్ది ఎప్పుడో నేలకూలింది. కడుపులో ఆకలి, నీరసం. అయినా అతనికి కళ్లు మూసినా తెరిసినా పొలంలో ఒంటరిగా వున్న స్టార్టరు పెట్టే కనిపిస్తోంది. స్టాటరిప్పుడు అతనికి ప్రాణం. అది లేకుంటే అతనికి నిజంగానే బతుకులేదు. అదుంటేనే బోర్లో ఉన్న ఆ కొద్ది నీళ్లైనా బయటకొస్తాయి. సగం పంటైనా బతుకుతుంది.

"ఒరె దేవుడా! నేనెళ్లే లోపల కరెంటోళ్లు నా పొలం కాడికి రాకుండా చూడు సామి. వాళ్లొచ్చేలోపల నేనెల్లి నా స్టాటరు దాచుకుంటూ.." మనసులో ప్రార్థించుకున్నాడు వెంకట్రెడ్డి.

అంతలోనే అతడికి స్టార్టరు పెట్టెకున్న అతుకులు గుర్తొచ్చాయి.

"స్టాటరూడదీసేటప్పుడు జాగ్రెత్తగా ఉండాలా.. అసలే ఫీజుకడ్డీలు పగిలిపోయి వుంటాయి. ఫీజుకడ్డీ పాడూ తగిలితే పాణానికే సేటు. పాణం పోయినా పరవాలా. ఇప్పుడు గనక కరెంటు తగిలి కాలో, సేయో పడిపోతే దిక్కెవరు? అప్పులెవరు తీరుస్తారు? దప్పికై వున్న పైరుకు నీళ్లెవరు పారగొడతారు?"

వెంకట్రెడ్డికి అతడి భార్య గంగాదేవి గుర్తుకొచ్చింది.

"పని విషయంలో గంగాదేవిని ఆడమనిషి అనుకోకూడదు. కొంగు బిగించి పనిలోకి దిగితే పదిమంది పని ఒక్కతే సులబంగా చేసేయగలదు. కానీ అది ఇప్పుడు సన్నబిడ్డ తల్లే" మనసులో అనుకున్నాడు.

"అయినా ఇప్పుడు కరెంట్లేదుగా" మళ్లీ వెంకట్రెడ్డి ఆలోచనలు పొలం మీదికి మళ్లాయి.

"ఏమో ఉండొచ్చేమో? మన ఖరమ, కరెంటు లాకపోతే స్టాటరు పెట్టెలు పెరికేసి మూడు నిమిసాల్లో, దాసేస్తామని కరెంటోళ్లు మళ్లీ కరెంటు వదలనైనా వదిలిండొచ్చు. మన జాగ్రెత్తలో మనముండాల. మొన్నట్టనే కదా పక్కపొలం సంటిగాడు పాణాలు పోగొట్టు కుంది. పొలాల్లోకి వస్తున్న సొసైటోళ్ల జీపు చూసి కరెంటోళ్ల జీపనుకొని బిత్తరపోయినాడు. ఎట్టరా

దేవుడా చేసేదని సచ్చా బతుకుతా పోయి మోటారు ఆడతండంగానే స్టాటర్ పెట్టెను పట్టుకొని పెరికినాడు. ఫీజులూడబీకలేదు. అసలే నాసిరకం వైర్లాయా. యాడ చూసినా అతుకులే. గుడ్డ పీలికలు కూడా సుట్టుకోలేకపోయినాడు నాయాలు. కరెంటు తగిలి ఆడికాడే గొంతుకోసిన కోడిలాగా గిలగిలా కొట్టుకొని పాణాలు వొదిలేసినాడు. ఇంటి దిక్కుపోతే వాడి పెళ్లాం పిల్లల్లో ఒకటే బాధ. ఇప్పటికృాడా నెత్తి నోరు కొట్టుకుంటున్నారు. ఒకవేళ నేనెళ్లేసరికి జరగాల్సిందంతా జరిగిపోతే..” ఆ ఊహకు భయపడిపోయాడు వెంకట్రెడ్డి.

కరెంటు బిల్లు రెండు వేలు దాకా వుంది. దాన్ని కట్టి స్టాటరు విడిపించుకోవడం వెంకట్రెడ్డికి సాధ్యమయ్యే పనికాదు. వెంకట్రెడ్డికి గతం ఒక్కసారిగా కళ్లముందు కదలాడింది.

అతడికి ముచ్చటగా మూడెకరాల పొలం వుంది. అదీ ఎక్కడో ఊరికి దూరంగా ఓ మూలగ వుంది. అక్కడికెళ్తే రాలేరు, వస్తే పోలేరు. బండి వుంటే తప్ప. అలాంటి పొలాన్ని నమ్ముకొని కాలినడకతోనే ఈదుకొస్తున్నాడు వెంకట్రెడ్డి. దాని చరిత్ర అమాంతం కష్టాలు, కన్నీళ్లు, నష్టాలు, అప్పులు. మొన్నకు మొన్నే చుక్కలు చూసి చెమ్మకోసం బోరేశాడు వెంకట్రెడ్డి.

అసలే విపరీతమైన కరువు కాలం. ఈ కాలంలో బోరేయడానికి పూనుకోవడమంటే మాటలు కాదు. అసలు ఆ ఆలోచనే వెంకట్రెడ్డికి లేదు.

“బంగారట్ట బూమెట్టుకొని ఎందుకురా కట్టపడతావు. అదే బూమి మాకుంటేనా? ఈపాటికి యిరగదీసేవాళ్లం. మా మాటిని అప్పో, సప్పో చేసి బోరేయరా. నీ కట్టాలన్నీ పారిపోతాయి. ఎన్ని దినాలని రాని వానకోసం ఎదురుచూస్తూ పంటలేస్తావుంటావు. లెక్కుంటే పొలంలోనే వర్షం కురిపించొచ్చు. పాతాళగంగను బయటికి తీసుకురావచ్చు. ఒకసారి ఆలోసించు. అడుక్కుతిని అయినా ఓ యాభైవేలు సంపాదించుకున్నావనుకో, నీ జాత్కమే మారిపోతాది” ఏ కొంచెం కష్టం కలిగినా తరచూ మిత్రులనే మాటలు వెంకట్రెడ్డి చెవుల్లో పదేపదే గుయ్యిమన సాగాయి. ఆ మాటలు అతని హృదయాంతరాల్లో ఎక్కడో ఓ మూల ఆశలు రేపాయి.

నీరుపడితే అతని బతుకు పూలవనం. లేకపోతే అప్పుల కాష్టం. రకరకాలుగా ఆలో చించాడు. ఆధైర్యపడ్డాడు. అందరినీ సలహాలు అడిగాడు. ‘అప్పు సేసి అంతపని సేయటం మాబోటోళ్లకు మంచిది కాదురా’ అన్నారు కొందరు వెంకట్రెడ్డిని కలుపుకొని. ‘ప్రయత్నించి చూడు ఆపై దేవుడున్నాడ’ని దీవించారు మరికొందరు.

అయినా వెంకట్రెడ్డి ధైర్యం చేయలేకపోయాడు. ఆ ఆలోచనను అలాగే మనసులో వుంచుకొని కాలం గడుపుతుంటే ఓ రోజు వెంకట్రెడ్డి భార్య గంగాదేవి నోరు తెరిచి– “మావా ఎక్కడ్నుంచో ఒక సోట్నుంచి లెక్క తెచ్చి బోరేద్దాం మావా.. నాకెందుకో మన పొలంలో నీళ్లు పడ్తాయి. మన కట్టాలు తీర్తాయి అనిపిస్తాంది మావా..” అంటూ వెంకట్రెడ్డిలో ఆశలు రేపింది.

ఇక ఊరుకోలేకపోయాడు వెంకట్రెడ్డి. తన ఇల్లాలు ఏదైనా చెబితే అది కచ్చితంగా జరిగి తీరుతుందని వెంకట్రెడ్డికి ఒక చిన్న నమ్మకం. వెంకట్రెడ్డికి గంగాదేవి మీద ఎనలేని అభిమానం, ప్రేమ. తన మామకు ఎప్పుడు ఏం కావాలో అడగందే తెలుసుకొని అందించే నైజం గంగాదేవిది.

అందుకే ఆరోజు ఏదైతే అదైందని గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నాడు. వెంటనే ఆ ఊర్లో ఓ పెద్ద మనిషి దగ్గర అప్పు కోసం వెళ్లాడు. వడ్డీ ఎక్కువన్నా వెరవలేదు. డబ్బు తీసుకు న్నాడు. నోటు రాయించాడు. "నీళ్లు పడితే పొలం నాది. పడకపోతే అప్పిచ్చిన ఆసామిది" కళ్లు మూసుకుని మనసులో గట్టిగా పదిసార్లు అనుకొన్నాడు.

మరుసటి రోజే బోరు బండి వెంకట్రెడ్డి పొలంలోకి అడుగుపెట్టింది. కాటు రామయ్యను పిలిపించి ఒకటికి రెండు సార్లు అంజనం వేయించాడు వెంకట్రెడ్డి. అంజనంలో ఎక్కడా టెంకాయ గుండ్రంగా తిరగలేదు. చివరికి మనసు గుటకలు మింగుతూ వుంటే పొల మంతా కలియతిరిగి వెంకట్రెడ్డే ఒకచోటు చూపించి రామయ్యను అంజనం తిప్పమన్నాడు. అంతే టెంకాయ గిర్రున తిరిగింది. బోరు వెయ్యందే నీళ్లు పడ్డట్టు వెంకట్రెడ్డి ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

కాటు రామయ్య అంజనం వేసి కొబ్బరికాయ తిప్పితే ఇక సందేహమే లేదు. అక్కడ నీళ్లు పడ్డట్టే. అందుకే ఎక్కడున్నా వెతికి గాలించి పట్టుకొని 'నాకు పనుంది, కుదరదు' అన్నా వినిపించుకోకుండా 'వంద రూపాయలు ఎక్కువిస్తా'నని చెప్పి మరీ బతిమాలి పిలుచుకున్నాడు కాటు రామయ్యని వెంకట్రెడ్డి.

కొబ్బరికాయ తిరగడం చూసి కాటురామయ్య "ఇక్కడ కచ్చితంగా నీళ్లు పడతా యయ్యా" అని పసుపు, కుంకుమ చల్లి తిరిగిన టెంకాయనే టప్పుమని రాతికేసి కొట్టి 'శుభం' పలికాడు. అంతే బోరు బండి చెవులు మ్రోగిపోయేలా శబ్దం అందుకుంది. కాటు రామయ్య ఆనందంగా జేబులు తడుముకుంటూ వెళ్లిపోయాడు.

బోరుబండోడికి అడ్వాన్సు, కూలీలకు అన్నాలు, మామూళ్లు, మధ్య మధ్యలో వారికి కాఫీలు, టీలు, మంచినీళ్లు... వెంకట్రెడ్డి దంపతులు వారి సేవలో మునిగిపోయారు. బోరు పొలంలోనే వేస్తున్నా అది వెంకట్రెడ్డి గుండెల్లో అన్నట్టుంది పరిస్థితి. ఒక రేయి, ఒక పగలు పొలంలో బోరు బండి గొంతు చించుకొని అరిచింది. ఒట్టి శుద్ధ పొగ ఎగుర్తోంది తప్పితే మూడువందల అడుగులు దాటినా బోరు రాడ్డుకు చెమ్మ తగల్లేదు.

వెంకట్రెడ్డి దంపతుల ముఖాలు దిగులుగా మారిపోయాయి. వారి శరీరాల్లో రక్తం ఇమిరిపోయింది. అడుక్కింత బోరుబండికి రేటు పెరిగిపోతోంది. కూలీలు, బోరుబండి యజమానితో సహా అందరూ పెదవి విరిచేశారు. యింక ఎంత లోతు బోరు వేసినా డబ్బులు వృథా, శ్రమ తప్పితే నీళ్లు పడవు తర్వాత మీ ఇష్టం అని చెప్పారు.

ఏం మాట్లాడాలో తెలీక బిక్కచచ్చిన వెంకట్రెడ్డి బోరుబండికి ఆనుకొని కూలబడి పోయాడు. అతని ముఖంలో కన్నీళ్లొక్కటే తక్కువయ్యాయి. బోరు వేయడం ఆపించి వెంకట్రెడ్డి సమాధానం కోసం కాసేపు ఎదురుచూశాడు బోరు యజమాని. వెంకట్రెడ్డి ఏం పలక్కపోయే సరికి రివర్స్‌గేర్ వేయమని కూలీలను ఆజ్ఞాపించాడు. అంతలో గంగాదేవి మెల్లగా నోరు విప్పింది.

"అయ్యింకాడికయ్యింది, ఇంకో యాభై అడుగులేయండి".

"లాభం లేదమ్మా, ఇప్పుడు మానుకుంటే మీకు ఆ యాభై అడుగుల డబ్బులైనా మిగులుతాయి, లేకపోతే అంతా నష్టమే" అన్నాడు బోరు యజమాని.

గంగాదేవి ఒప్పుకోలేదు. వెంకట్రెడ్డితో చెప్పి ఒప్పించింది. వెంకట్రెడ్డి అప్రయత్నంగానే ఊ కొట్టాడు. బోరుబండి మళ్లీ ముందుకు శబ్దం అందుకుంది.

అందరూ బోరు వైసే చూస్తున్నారు. "దేముడా! ఈ గండాన్ని గట్టెక్కించు తండ్రీ. ఏదైనా నీరు పడకుంటే నా మావ బతకడు. అదే జరిగితే అందుకు కారణం నేనే. నేను నా పిల్లలం కూడా బతకం. నేను ఆశ పెట్టినందుకైనా మా పొలంలో నీళ్లు పుట్టించి నా మావను బతికించు తండ్రీ" మనసులో అనుకొని కన్నీళ్ల పర్యంతమవుతూ బోరు గుంత వైపే చూస్తోంది గంగాదేవి.

బోరు బోరున శబ్దం చేస్తూనే వుంది. అప్పుడప్పుడు రాళ్లుపడిన శబ్దం. వెంకట్రెడ్డి పొలమంతా ఎర్రటి ధూళి మేఘాలు నిండుకున్నాయి. అంతలోనే బోరుబండ గుండెల్నిండా గట్టిగా గాలి పీల్చి వదిలింది. ఆ గాల్లోంచి నీళ్లెగిరి పైకి చిమ్మాయి. అదిగో నీళ్లు వెంకట్రెడ్డి ముఖంలో రక్తం ఏ మూలగా వెళ్లిపోయిందో అప్పుడే వచ్చి చేరుకుంది. గంగాదేవి ఆనందంగా కన్నీళ్లు తుడుచుకుంది.

అక్కడున్న కూలీల్లో కూడా ఏదో తెలీని పరవశం. బోరు యజమాని కూడా కాస్తంత వుత్కంఠ తర్వాత అప్పుడు ఊపిరి పీల్చుకున్నాడు. అయితే–

"నీళ్లు చాలా లోతులో పడ్డాయి. ఒకటిన్నర యించు కన్నా ఎక్కువ రావు. అవి కూడా ఎప్పుడుంటాయో, ఎన్నాళ్లుంటాయో చెప్పలేం. వెంకట్రెడ్డి నీకు తెలుసుగా ఇప్పటికే వరసగా మూడేళ్లవుతోంది. సరిగా వర్షాల్లేవు. ఈ సంవత్సరం కూడా కురుస్తాయని నమ్మకాల్లేవు. నీళ్లున్నంతకాలం నీ అదృష్టం అనుకో".

మొత్తం నాలుగు వందలు అడుగుల వరకు బోరు దించి డబ్బులు చేతికి తీసుకుంటూ చివరిగా బోరు యజమాని అన్నమాటలవి.

నీళ్లు పడ్డాయన్న సంతోషం తప్పితే అవి ఎంత పడ్డాయి? ఎన్నాళ్లుంటాయన్నది వెంకట్రెడ్డి కెక్కలేదు. అతని బుర్రంతా ఇక మోటరెలా తేవాలా, ఎప్పుడు మోటారు పొలంలో ఆడించాలా, తన పొలంలో నీళ్లు బోర్లోంచి పాల నురగలా తెల్లగా దుముకుతుంటే చూసి ఎప్పుడు ఆనందించాలా... అని ఆలోచిస్తోంది.

"కొన్నాళ్లు బోరాడించనీకి మోటార్ని అద్దెకు తెచ్చుకుందాం మావా. తరువాత కావాలంటే నిదానంగా సొంత మోటార్ని కొనుక్కోవచ్చు" మెల్లగా అంది గంగాదేవి మోటారు కోసమే ఆలోచిస్తున్న వెంకట్రెడ్డితో.

"లేదే పిచ్చిమొఖమా. అద్దెకని తీసుకుంటే పది దినాలకొకసారి మోటారికి లెక్క కడుతూనే ఉండాల. మనం ఆడించుకున్నది లేన్ది ఎవరూ పట్టించుకోరు. కరెంటున్నా లాకున్నా.."

కరెంటు మాట వచ్చేసరికి వెంకట్రెడ్డికి ముఖం ఒక్కసారిగా, ఉన్నపలంగా కలల సౌధం నుంచి కూలిపడింది.

"అవును కరెంటు కావద్దు. కరెంటు లాకుండానే మోటరాడుతాదా ఏంది? కరెంటు మహా పిర్రెం. కరెంటోళ్లు కరెంటు కన్నా పిశేచం. అప్పుడెప్పుడో గుడిసెలో సిన్న కరెంటు బుడ్డి ఏసుకున్న పేపానికి వచ్చి సానా రాద్దేంతం సేసినారు. దేసానికి సెరుపు తెచ్చినట్టు మండిపోయినారు. వీధిన అంతా మానం తీసినారు. బంగారట్ట వైరు లాక్కుపోయినారు. నాయనా.. నాయనా.. మీకు పుణ్ణెం వుంటుంది. పిల్లోల్లు రాత్రిళ్లు నేలమీద పడుంటారు. పురుగు పుట్రా వస్తాయని గంగాదేవి బతిమాల్తే ఆడకూతురని కూడా సూడకుండా తిట్నారు. ఇష్టమొచ్చినట్టు సేసి పోయినారు. ఇంకోసారిలాజేస్తే కేసెడతామని బెదిరించినారు" గుర్తు చేసుకొని మనసులో గజగజ వణికిపోయాడు వెంకట్రెడ్డి.

తన మామలోని భావాలను పసిగట్టింది గంగాదేవి. "అందుకే నా మాటిను మావా" అంది బుజ్జగింపుగా– మారు మాట్లాడ్లేదు వెంకట్రెడ్డి. అచ్చం గంగాదేవి చెప్పినట్టు చేయడానికి సిద్ధమయ్యాడు.

వెంటనే గాలి సుదర్శనాన్ని కలిశాడు. మోటారు అద్దెకు కావాలని అడిగాడు. సుదర్శనం సవాలక్ష షరతులు చెప్పాడు. తల తిరిగిపోయింది వెంకట్రెడ్డికి.

"మోటారు బోర్లోకి దించేటప్పుడు తీసేటప్పుడు ఇరుక్కుపోతే బాధ్యత నీదే. చెక్ చేసేటప్పుడు కరెంటు వల్ల స్టాటరు కాలిపోయినా, మోటారు మాడిపోయినా, యింకా ఏ ప్రమాదాలు జరిగినా నష్టం నీవే భరించాలి. నా దగ్గరైతే ప్రస్తుతం మోటారు రెడీగా లేదు. శంకర్రెడ్డి తోటలో బోరెండిపోయింది. మోటారు తెచ్చివ్వమంటే ఈ రోజు, రేపు అంటున్నాడు. గట్టిగా మాట్లాడదామంటే పెద్ద మనిషి. ఎప్పుడు తెచ్చిస్తే అప్పుడు తీసుకోవాలి. లేదా అవసరమనుకుంటే మనమే మధ్యలో పోయి తెచ్చుకోవాలి. ఇప్పుడు నీకవసరం అంటున్నావు కాబట్టీ నీవే నీ సొంత ఖర్చులతో వెళ్లి ఆ బోరులోని మోటారును నీ బోరులోకి మార్చుకో. మూడు నెలల అడ్వాన్సు ముందే ఇవ్వాల. అలా ఇష్టమైతే సెప్పు లేకపోతే వదిలెయ్" తీరిగ్గా అన్నాడు గాలి సుదర్శనం.

షరతులకు తలూపి సుదర్శనంకు డబ్బు కట్టడం తప్పితే వేరే మార్గం లేకపోయింది వెంకట్రెడ్డికి. వెంకట్రెడ్డిని నమ్మి అంత విలువైన మోటారు అద్దెకిచ్చేవాళ్లు ఆ ఊర్లో మరెవరూ లేరు. అందుకే సుదర్శనం ఎన్ని షరతులు పెట్టినా తిరిగి మాట్లాడలేకపోయాడు వెంకట్రెడ్డి.

అక్కడ్నుంచి పది కిలోమీటర్లు దూరంలో వుంది శంకర్‌రెడ్డి పొలం. మెకానిక్ కూలీలతో అక్కడికి చేరుకున్నాడు వెంకట్రెడ్డి. మూడు పొడవాటి ఇనుప స్తంభాలను గోపురంలా నిలబెట్టి చైన్‌తో బర్‌బర్‌మని ఆరు గంటల సేపు లాగి మెకానిక్కు కూలీలు ఎండిన బోర్లోంచి మోటారును బయటికి తీశారు. వారికి కూలి చెల్లించి వారి సామాన్లను వారి స్వస్థలాలకు చేర్చి శంకర్‌రెడ్డి పొలంలోని మోటారును తన పొలంలోకి తీసుకెళ్లేసరికి తల నుంచి తోకకొచ్చింది వెంకట్రెడ్డికి. అర్ధరాత్రి ఇంటికి చేరుకున్నాడు కాని నిద్రపట్టడం లేదు.

"వున్న లెక్కంతా బోరుకు, అద్దె మోటారుకు, సేతి ఖర్చులకే అయిపాయ. ఇంకాస్త ఎగేస్తే కాని మిగిలింది కరెంటోళ్లకు కట్టనీకి సరిపోదు. బోరైతే ఏసినా, నీళ్లైతే పడ్నాయి. పాతాళంలో ఉన్న గెంగను బయటికి తియ్యడమెట్టా? నా వల్ల అవుతుందా? అనెవసరంగా శక్తికి మించిన పనిచేయడానికి పడ్డానే. దారి సూపు తండ్రి" ప్రతిక్షణం వెంకట్రెడ్డిలో ఆందోళన.

ఏదో తెలీని భయం. పిరికితనం కీడును తలపిస్తూ వెంకట్రెడ్డికి దయ్యంలా పట్టి పీడిస్తు న్నాయి. అయినా ఎప్పటికప్పుడు ధైర్యం తెచ్చుకుంటూ చేయాల్సిన పనులకు సిద్ధం అవుతూనే వున్నాడు వెంకట్రెడ్డి.

"కరెంటుకు లెక్క కట్టాలా? ఎలా కట్టాలా? ఎక్కెడ్నుంచి తేవాలా?" గుడిసెనకాల దొడ్లోకి వెళ్లాడు వెంకట్రెడ్డి. ఇంటికి పెద్ద దిక్కులాంటి కర్రెటి ఎనుము. మిలమిల మెరిసి పోతోంది. తనింటి కల్పతరువు. మౌనంగా తలవంచుకుని గడ్డి మేస్తోంది. గంగాదేవి ప్రతిరోజూ దానికి నీళ్లుపోసి పరిశుభ్రంగా వుంచుతుంది.

ఆ దృశ్యం చూడగానే బొటబొటా వెంకట్రెడ్డి కన్నుల్లోంచి నీళ్లు... ఒక్కసారిగా బోరు మన్నాడు వెంకట్రెడ్డి. ఎనుము కాళ్లు పట్టుకొని పసివాడిలా ఏడ్చాడు. తనను క్షమించమన్నట్టు వేడుకున్నాడు.

పనులున్నా లేకపోయినా, పంటలు పండినా పండకపోయినా పూటకింత పాలిస్తూ తనని తన పిల్లల్ని రోడ్డున పడకుండా కాపాడుకొస్తున్న ఎనుము. రుణపడి వుండాల్సింది పోయి దాన్ని సంతకు తరలించాల్సి వస్తున్నందుకు వెంకట్రెడ్డి గుండె నోరు కొట్టుకుంటోంది.

ఆ పొలం వొద్దు.. నీళ్లొద్దు.. ఈ ప్రపంచమే తనకొద్దు. తనకు తనింటికి ఎంతో ఇష్టమైన ఆ ఎనుమొకటి తోడుంటే సాలు అనుకున్నాడు. కాని ఆచరించలేని నిస్సహాయత అతణ్ని ఒక్కసారిగా కమ్మేసింది. పొలాన్ని నమ్ముకొని తనకున్న ఒకే ఒక్క ఆధారాన్ని అమ్ముకోవడానికి సిద్ధపడ్డాడు వెంకట్రెడ్డి.

పక్కనే రెండు పల్లెలు దాటిపోతే సంత. ఆ రాత్రి ఎనుమును తోలుకుపోయాడు. అనుకున్న రేటుకు ఎవరూ ముందుకు రాలేదు. కాని అవసరం. అడిగినంతకిచ్చేసి, వెనక్కు తిరిగి చూడకుండా ఇంటికొచ్చాడు వెంకట్రెడ్డి. ఆ రోజంతా ఏదో కోల్పోయినట్లు బాధపడుతూనే గడిపాడు.

మరుసటిరోజు అన్యమనస్కంగానే కరెంటు ఆఫీసుకు బయలుదేరాడు. కొత్త కనెక్షన్ కావాలని అప్లికేషన్ రాయించుకెళ్లి యిచ్చాడు. వారు పదిరోజుల వరకూ అవిలేవు, ఇవి లేవని ఏవేవో కారణాలు చెప్పి ఒకటికి పదిసార్లు వెంకట్రెడ్డిని తిప్పారు. అతని సహనాన్ని పరీక్షించి చివరికి పరికరాలతో పనిలోకి దిగారు. చేతివాటం ప్రదర్శించి మామూళ్లన్నారు, కూళ్లన్నారు, టిఫెన్లన్నారు, భోజనాలన్నారు, సామాన్లన్నారు. వెంకట్రెడ్డిని పీల్చి పిప్పిచేసి వదిలారు. చివరికి మెకానిక్ దగ్గరికెళ్తుంటే అమ్మోరు ముందు బలికెళుతున్నట్టు అనిపించి విషాదంగా నవ్వుకున్నాడు వెంకట్రెడ్డి.

మిగిలింది నేరుగా మెకానిక్ చేతిలో పెట్టి నువ్వేడిపించడానికి నా దగ్గరేమి మిగల్లేదనే భావంతో చేతులు ముడుచుకుని దీనంగా నిలబడ్డాడు. మెకానిక్ వెంకట్రెడ్డి వాలకం చూసి ఏమి మాట్లాడలేకపోయాడు. రంగంలోకి దిగి మోటారును బోర్లోకి దించాడు. స్టార్టరుకు కరెంటు కనెక్షన్ యిచ్చి పచ్చబటన్ నొక్కాడు. అది చూసి వెంకట్రెడ్డి మనసు 'ఏడు కొండలోడా వెంకట్రమణ' అనుకుంది.

మోటరు బొడక్... బొడక్‌మని రెండుసార్లు అరిచింది కాని నీళ్లు పైకి రాలేదు. వెంకట్రెడ్డిలో ఆతృత. నేల తల్లి కడుపులోంచి తన పొలంలో నీళ్లు దూకుతుంటే చూడాలని ఆశ. అవి తన పొలంలో దూకితే తను సంపన్నుడైనట్లే. అతని కష్టాలు తీరినట్లే. బోరు నోరు వైపే కన్నార్పకుండా చూస్తున్నాడు వెంకట్రెడ్డి.

కాసేపటి తర్వాత మెకానిక్ మళ్లీ బోర్లో వైర్లతో బిగించిన మోటారును కదిలించాడు. ఈసారి మాత్రం నీళ్లు పసిపిల్లలు ఒంటికి పోస్తున్నట్లు... బోరు గొట్టంలోంచి సన్నగా...

ఇక దూకుతాయి, ఇంకా దూకుతాయి, నీళ్లు... దూకుతాయి... అల్లంత దూరంలో ఎగిరిపడతాయి. తనెన్ని సోట్ల సూల్లేదూ... తన పొలంలో కూడా నీళ్లు అలా అల్లంత దూరంలో ఎగిరిపడాలని కోరుకోలేదూ... మరి దూకలేదే?... అనుమానంగా మెకానిక్ వైపు చూశాడు మరేదైనా చేసి నీళ్లు రప్పిస్తున్నాడేమో అని.

మెకానిక్ తన పనంతా అయిపోయినట్టు సామాను సర్దుకుంటున్నాడు. తన పొలంలో నీళ్లు యింతకన్నా ముందుకు దూకలేవని తెలిసిపోయింది వెంకట్రెడ్డికి. మాటపడిపోయింది. 'ఈ నీళ్ల కోసమేనా యింతగా కష్టపడింది. యిన్నాళ్ల కలలు కనింది'. అతనిలో బాధ, ఆవేశం, నిరాశ, నిస్పృహ, ఏడుద్దామనుకున్నాడు. ఏడవబుద్ధి కాలేదు. నీళ్లులేని కళ్లతో మెకానిక్ వైపే చూస్తుండిపోయాడు.

పరిగెత్తుతున్న వాడల్లా ఒక్కసారిగా నడిపొలాల్లో మోకాళ్లమీద కూలిపోయి వెక్కి వెక్కి ఏడ్చుకున్నాడు వెంకట్రెడ్డి. గతాన్ని తల్చుకొని... అప్పటికే ఆలస్యమైపోతోంది. మళ్లీ స్టాటరు మీది మమకారం అతన్ని పరుగందుకునేలా చేసింది. కన్నీళ్లు మాత్రం చెంపలపై నుంచి ధారాలంగా కారిపోతూనే వున్నాయి. మనసు ఒకవైపు దేవున్ని వేడుకుంటూనే వుంది. అతనితోపాటు ఆలోచనలు కూడా మళ్లీ గతంలోకి పరుగందుకున్నాయి.

వూర్లో అందరికీ తెలిసిపోయింది.

“వెంకట్రెడ్డి బోరు ఎత్తిపోయిందని, యించి నీళ్లయినా వస్తాయనుకుంటే అందులో సగం కూడా రావడం లేదని, అవి కూడా ఏ క్షణంలోనైనా ఆగిపోయి బోరు గుండె ఆగి పోవచ్చని, వెంకట్రెడ్డి కూడా యిక తమ మధ్య చాలారోజులు మెదిలే సూచనలు కనిపించడం లేదని”.

“సచ్చిపోయేదెట్లా?” అని ఆలోచిస్తూనే మూడు నెలలు బతికాడు వెంకట్రెడ్డి. అంజిగాని దగ్గరికెళ్లి గడ్డం పట్టుకున్నాడు. అతని పెళ్లాం, పిల్లల్ని ఒప్పించి ఎద్దుల్నిప్పించుకున్నాడు. ఎంత దూరమైనా సరే వెళ్లి టయానికింత పచ్చగడ్డి కోసుకొచ్చి మేపుతానని, ఎలా వుండే ఎద్దుల్ని అలా తిరిగి అప్పజెప్పుతానని మాటిచ్చాడు.

ఆ సుక్క సుక్క నీళ్లనే జాగ్రత్తగా పోగు చేసుకొని పొలం తడుపుకున్నాడు. దినమంతా పారగొట్టినా తడిసేది మూడు బోదెలే. అయినా ఓపిక పట్టాడు. అలాగే కష్టపడ్డాడు. ఆ నీళ్లున్నంత వరకైనా ఒక పంట చేతికి తీసుకుంటే తను తిన్నా, తినకపోయినా వచ్చిందాంతో అప్పుభారం సగమైనా తీర్చుకుందామనుకున్నాడు. రేయి పగలు రెక్కలు ముక్కలు చేసుకొని పొలంలో విరుచుకుపడ్డాడు. సేద్యాలు పూర్తయ్యాయి. అంజిగాడి ఎద్దుల్ని జాగ్రత్తగా అన్న మాట ప్రకారం తిరిగి అప్పజెప్పాడు. సెరివాళ్లకు (బదులు) అక్కడిన్నీ, ఇక్కడిన్నీ గింజలు అడుక్కొని పొలంలో వేసుకున్నాడు. రోజులు గడుస్తున్నాయి.

ఒకవైపు రోజురోజుకు పెరిగిపోతున్న కరెంటు చార్జీలు, మరో వైపు నిర్బంధ వసూళ్లు రైతుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎక్కడ చూసినా కరెంటోళ్ల దాడులు పొలాలపై పడి నిర్దాక్షిణ్యంగా వైర్లు, స్టార్టర్లు ఎత్తుకుపోతున్నారు. ఏమాత్రం జాలి, దయ, కరుణ చూపడం లేదు. బ్రిటీషోళ్లు పన్నులు వసూలు చేస్తున్నట్లుంది పరిస్థితి.

ఎప్పుడు ఎవరి స్టార్టరు ఎత్తుకుపోతారో, ఎప్పుడు ఎవరి గుండె పగిలిపోతుందో తెలీదు. ఒక్కొక్కరు వేలలో కరెంటు బాకీలున్నారు. అందరూ స్టార్టర్లనే గుండెలు చేసుకొని బతుకుతున్నారు. ముందు జాగ్రత్తతో కరెంటుపోగానే స్టార్టర్లను తీసి దాసేసి ఇళ్లకు వస్తున్నారు. కొందరు పొలాల్లోనే కాపలా కాసుక్కూర్చున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వెంకట్రెడ్డి ఆ రోజే కొంచెం నిర్లక్ష్యం చేసి స్టార్టరును పొలంలో ఒంటరిగా వదిలేసి ఇంటికొచ్చాడు. అదే అతని ప్రాణాల మీదికి తెచ్చింది.

ప్రాణాలకు వేలాడుతూ ఆయాసపోతూ, వగరుస్తూ, మబ్బులొస్తున్న కళ్లను మూస్తూ, తెరుస్తూ.. పొలం చేరుకున్నాడు వెంకట్రెడ్డి.

అయిపోయింది. అంతా అయిపోయింది. తనేదైతే జరక్కూడదని ఇంతవరకూ కలలు కంటూ, పడుతూ లేస్తూ, చస్తూ – బతుకుతూ వచ్చాడో అదే జరిగిపోయింది. అల్లంత

దూరం నుంచే తన పొలంలో స్టార్టరును ఊడదీస్తున్న కరెంటోళ్లను గుర్తించాడు వెంకట్రెడ్డి.

"యింగెట్ట చేసేదిరా దేవుడా"– పరుగు పరుగున వెళ్లి వారి కాళ్లందుకున్నాడు. "సార్.. అద్దె మోటార్సార్.. ఎండగాలుతున్న పైరు సార్... సుక్కా సుక్కా నీల్లు సార్.."

వాళ్లు విన్లేదు. వెంకట్రెడ్డి అరిచాడు. గీపెట్టాడు. మొత్తుకున్నాడు. తలబాదుకున్నాడు. శక్తి కొద్ది ఏడ్చి వారి కాళ్లు తడిపాడు. అయినా కరగలేదు వాళ్లు. వెంకట్రెడ్డి కాళ్లు వదలనేలేదు. తీగలా అల్లుకుపోయాడు.

"స్టార్టరెత్తుకుపోతే నేను, నా పెళ్లాం ఎల్టీన్ తాగాల్సార్... పుణ్ణెం వుంటాది సార్..."

జాలి బదులు విసుగొచ్చింది వాళ్లకు. కోపంతో మండిపోయారు. అమ్మనా బూతులు తిట్టారు. 'కరెంటేమైనా నీ అబ్బ సొమ్మనుకున్నావురా, బిల్లులు కట్టకుండా మోటరాడించు కోనీకి..."

"లేద్సార్.. పంటొస్తానే అంతా కట్టేస్తా... టైమియ్యండ్సార్.."

"ఆలోగా మా ఉద్యోగాలు పోవాలనా"– పళ్లు పటపట కొరికారు వాళ్లు. పురుగును విదిల్చినట్టు కాళ్లకు చుట్టుకున్న వెంకట్రెడ్డిని గట్టిగా విదిల్చి కొట్టారు. అల్లంత దూరంలో పడ్డ వెంకట్రెడ్డి మళ్లీ వచ్చి కాళ్లకు చుట్టుకున్నాడు. వారు మళ్లీ విదిల్చి కొట్టారు. వెంకట్రెడ్డి మళ్లీ వచ్చాడు.

వీడు సామాన్యంగా వదిలేలా లేడు అనుకున్నారు వాళ్లు. ఈసారి లేవలేని విధంగా దొబ్బాలనుకున్నారు. దొబ్బి వదిలేశారు. ఎగిరి గెనుంపై పడ్డ వెంకట్రెడ్డి మళ్లీ లేవలేదు. అంతా నిర్మానుష్యం.

వారు వడివడిగా అడుగులేసుకుంటూ వెళ్లి స్టార్టరుతో జీపెక్కి కూర్చున్నారు. జీపు స్టార్టయ్యింది. ఇప్పుడు వారికి, వారి జీపుకు అడ్డు ఎవరూ లేరు. జీపు ముందుకు కదిలింది. దుమ్ము లేపుకుంటూ వెళ్తున్న ఆ జీపు వెంకట్రెడ్డి ప్రాణాన్ని తీసుకెళుతున్న యముని వాహనంలా వుంది.

✡

# తల్లీ కొడుకులు

**–బి.ఎస్.రాములు**

ఆపల్లె రెండు జిల్లాలను కలిపే రహదారికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో వుంది. ఆ రాత్రి లారీల రాకపోకల ధ్వనులు అక్కడికి కూడా లీలగా గాలితోపాటు చేరుతున్నాయి.

ఉత్తర ప్రాంతాన్ని దక్షిణ ప్రాంతాన్ని రెండు జిల్లాలుగా చీల్చిన గోదాదరి పరవళ్ళ ధ్వనులు ఆ నిశిరాత్రిలో నిద్రపోతున్న పల్లెకు తన నిత్య చైతన్యాన్ని ఆదర్శంగా స్వీకరించమని చెవిలో గుసగుసలు పెడుతున్నట్లుగా వున్నాయి.

జిల్లా పరిషత్‌వారు వేయించిన అప్రోచ్‌రోడ్ మరమ్మతులేక పాడుబడిపోతోంది. గుంతలు గతుకులు–ఎడ్లబళ్ళు చేసిన రోడ్డుకోత– పాములా ఆ పక్కనే మెలితిరుగుతూ  కాలిబాట.

ఊరికి పడమర దిక్కుగా ఆ వాడ వుంది. ఆ వాడలో చివరి గుడిసె అది. ఆ వాడకూ ఆ చివరి గుడిసెకూ నడమ సర్పంచు పెరడుంది. అందువల్ల ఆ గుడిసె మరీ విడివడ్డట్టుగా వుంది.

చాలా ఆలస్యంగా నిద్రకుపక్రమించినా ఎందుకో తొందరగా మెలుకువ వచ్చేసింది, తల్లి మైసమ్మకు. అసలు నిద్ర పట్టిందో లేదో. కళ్లు నులుముకొని లేచికూర్చుంది.

మనుమరాలు లచ్చవ్వ గాఢనిద్రలో వున్నట్టుంది. కడుపులోకి అదుముకున్న కాళ్ళని సరిచేసి గాఢంగా నిట్టూర్చింది మైసమ్మ.

చింతకింది మైసమ్మ కూతురుకు రెండో కాన్పు కష్టమై తల్లీ పిల్ల కన్ను మూసారు. అల్లుడు ఆర్నెల్లు తిరక్కముందే రెండో పెళ్లి చేసుకొని మొదటి కూతుర్ని యిక్కడ వదిలిపెట్టి పోయాడు. మూడేళ్ళ వయసునించీ తనే సాదుతోంది. తండ్రి ఉండీ అనాథ. మేనమామ వుండీ అనాథగా బతుకీడ్వడం, దీని దురదృష్టం. మైసమ్మ దు:ఖం వచ్చినప్పుడల్లా విలపిస్తుంది. వాస్తవంగా తల్లి మైసమ్మకూడా అనాథలాగే బతుకీడుస్తోంది. ఇద్దరు అనాథలొకరి కొకరు తోడయ్యారు. ఆ మనుమరాలే ప్రస్తుతం మైసమ్మ చేదోడు వాదోడు.

ఉన్నొక్క కొడుకు 'సంగం' అంటూ తిరుగుతుంటాడు. ఇటీవల రెండు బ్యాచీలుగా వరుస అరెస్టులు జరగడంతో అరెస్టయ్యాడు. రెండు వారాలు లాకపు చిత్రహింసల అనంతరం

ఏదో కేసులో యిరికించి జైలుకు పంపారు పోలీసులు. జైలుకు పంపికూడా రెండు నెలలు కావస్తోంది. ఇంకెన్నడు విడుదలౌతాడో అని ఆ తల్లి సంగం శంకరయ్యని కన్పించినపుడల్లా ఆవేదనగా, కోపంగా అడుగుతుంటుంది.

శంకరయ్య అంటే జైలుకు పోయినవాళ్ళు పోగా, పారిపోయినవాళ్ళు పారిపోగా, వూళ్ళో సంగం కుంటుపడకుండా నడుపుతున్నవాడు. అతని ఇంటిపేరు మర్చిపోయి అందరు సంగం శంకరయ్య అని పిలుస్తుంటారు.

అయితే సంగం శంకరయ్య చిక్కడు దొరకడు. ఎన్నిసార్లు మాటుగాసినా పోలీసులకు దొరకకుండా చాకచక్యంగా తప్పించుకున్నవాడు. ఎపుడు యింటికి వస్తాడో ఎపుడు ఎక్కడకు వెళ్తాడో ఏ పనిచేస్తాడో అంతు చిక్కనీయనివాడు సంగం శంకరయ్య.

'ఈ రాత్రి శంకరయ్య వూల్లెనే వున్నడట' అన్న పుకారు విన్నా చాలు ఈ రోజు ఏదో జరుగుతుంది. ఎవరిదో పనిపడ్తాడు అని ఆ రాత్రి నిద్రకరువు చేసికొంటారు దొరలు.

దొరల్ని అదే భయంలో వుంచుతున్నాడు శంకరయ్య. అతి తక్కువగా వూర్లో పడుకుంటు న్నాడు చేన్లమీద చెలకలమీదే ఎక్కువరాత్రులు గడుపుతున్న శంకరయ్య సాయంత్రం కలిసి తనతో చెప్పిన విషయం విన్నప్పటినుంచీ తల్లి మైసమ్మ పాత కష్టాలన్నీ మరిచి మనసు వుత్సాహంతో వురకలు వేస్తోంది. అసలు ఆ సంతోషమే మైసమ్మకు నిద్రపట్టకుండా చేసినట్టుంది.

మైసమ్మ ఎప్పుడు తెల్లవారుతుందో అని ఆలస్యానికి విసుక్కుంటూ ఎదిరిచూస్తున్నది. తన సంతోషంలో పాలు పంచుకోవడానికెవరున్నారు? ఉన్నొక్క కొడుకు జైల్లోనే వుంటు న్నాడాయె. పాపం! తను శంకరయ్యను వాని విడుదల కోసం కోపగించినప్పుడల్లా ఎంత బాధపడ్డాడో! కాని శంకరయ్యది ఎంత మంచిమనసు. ఈ ముసల్దాని గురించి ఎంత కష్టపడు తున్నాడు.

శంకరయ్యే కాక సంగపోల్లందరు ఈ ముసల్దాని కోసం ఎన్ని కష్టాలనుభవించారు! ఎన్ని నష్టాలపాలైనారు.

తన భూమి తనకు యిప్పించాలని పట్టుబట్టి ప్రజా పంచాయతీ నిర్వహించి తీర్పు యిచ్చారు. వూరుమీద పడ్డ పోలీసులు తన ఒక్కదానియేకాదు. సంగపోల్లందరివి, సంగపోల్లు కానివారినికూడా ధాన్యం బావుల్లో పారబోశారు. తలుపులు విరగ్గొట్టారు. కుండలు బోకెలు, మంచాలు అన్నీ తుక్కుతుక్కు చేశారు. తనకైతే యింట్లో తినడానికి కంచం కూడా గతిలేకుండా చేసివెళ్ళారు. ఆ యింటికాడ ఓ పూట ఈ యింటికాడ ఓ పూట మనుమరాల్ని వెంటేసుకుని వెళ్ళదీసింది. ఎవరూ లేదనలేరు. ఎంత మంచోల్లు! శంకరయ్య వాళ్ళకు చెప్పి వుండాలి. ఎంత చల్లని మనసు!

శంకరయ్యను ఎంత కోపానికి వచ్చినా "మున్సిఫ్ కోర్టుల బేలు దొరకలేదు. సెషన్ కోర్టుల రెండుసార్లు పిటిషన్ పెడ్తె రెండుసార్ల కొట్టేసిరి. మల్లోసారి ఏస్తనన్నడు వకీలు. మేంజేసే అన్ని ప్రయత్నాలు తప్పకజేస్తం. నువ్వేం ఫికరు పడకు" అని సముదాయిస్తాడు.

ఏందో తన పిచ్చి! కొడుకు వీరడు విడుదలై తన యింటిపట్టునే వుంటడని, పోలీసులు వుండనిస్తరని భ్రమ. శంకరయ్య ఏపాటి ఇంటికాడ వుంటున్నాడు? అదేందోగని తల్లిపేగు గుంజుద్ది. తన కొడుకు కండ్లెదుట కనపడాల్నని, నిజంగ కొడుకు గూడ శంకరయ్య తీర్గ ఆప్యాయంగ ఉంటడా?

ఆలోచనలతో మైసమ్మ నిద్రమబ్బు వదిలినట్టుంది. గోదావరి గలగలలు, లారీల రొదలు కలగలిసి చెవిని తాకుతున్నాయి.

మెల్లగా తలుపుతీసి బయటకు నడిచింది. ఊరికి కొసన ఉండడంతో గాలి రివ్వున వీస్తోంది. వీస్తున్న గాలితో ఎక్కడో రాల్లు ఎత్తేస్తున్న శబ్దం చెవిలోకి చొచ్చుకపోతుంది.

ఏమిటో అని చెవి, దృష్టి అటువేపు సారించింది మైసమ్మ. అల్లంత దూరాన రోడ్డు మలుపు మీద దయ్యంలా ఎవరో నిలబడి ఉన్నట్టు గమనించింది.

"ఎవర్రా!" కొంచెం భయపడుతూనే గట్టిగా కేకేసింది మైసమ్మ.

"నేను రంగయ్యనే." రెండడుగులు ముందుకు వేసి మెల్లిగా చెప్పాడు రంగయ్య.

నాలుగడుగులు ముందుకేసింది మైసమ్మ. పరీక్షగా చూసింది.

ఆశ్చర్యంగా అడిగింది. "ఏం జేత్తున్నవు గీ రాత్రి?"

"ఇంకా రాత్రెక్కడున్నది, తెల్లారుతున్నది. అక్కడ పొలుమారు కాడ పోలీసు జీపు రాకుండా శంకరన్న వాళ్ళు రోడ్డుమీద బండ కుచ్చె పేరిస్తున్నరు. దొరలు ఎవరన్నా ఇటు వస్తే సూసుటానికి ఈడ కావలున్న." అన్నాడు రంగయ్య.

"రఘుపతి దొర ఎట్లత్తడు మరి." అనుమానంగా అడిగింది మైసమ్మ.

"రఘుపతి దొర రాత్రే అచ్చిండు. అచ్చి దొరలంతా కూసుండి మన పంచాయతుల ఏమ్మాట్లాడాలె, ఎట్ల మాట్లాడాలె అని ఇమ్మడిచ్చు (చర్చించు) కొన్నరు" అన్నాడు రంగయ్య.

"ఈ తాపకు పోలీసులత్తె మనం ఏ సిచ్చుంటె ఆ శిచ్చకు ఆల్లు ఒట్టువెట్టుకున్న రంటిరి గదా! మల్ల గిదేంది." అడిగింది మైసమ్మ.

"ఎందుకైనా మంచిది. మన జాగ్రత్తల మనం ఉండాలె గద." అన్నాడు రంగయ్య.

"ఈ పంచాయితిల మా పొలం మాకు వచ్చేనంటవ? రఘుపతి దొర ఒప్పుకునే నంటవ?" ఏ మూలనో అపనమ్మకం పట్టి పీడిస్తోందో లేక మరోసారి తప్పక వస్తుందని రంగయ్య నోటి నుంచి వినాలని ఉందో అడగనయితే అడిగింది మైసమ్మ.

"నీయవ్వ, గింత జేత్తున్నదెందుకే. మీ భూమి, పట్వారిగాడు పట్టా జేయించుకున్న భూమి గురించే గాదె ఇంత కత జరిగింది. గంత మంది జైల్లకు పోయిరి. గంత సామాను పోలీసులు పాడుజేసి పోయిరి. ఇగ ఏం పీక్కుంటరే.. అన్ని జేసిరి, అన్నీ జూస్తిమి. లం.. కొడుకు ఒప్పుకోకపోవడానికి అదేమన్నా వాని అయ్య సొమ్మా! తాత సొమ్మా! అది మీ భూమి, మీ భూమిలనే మిమ్ముల పాలేర్ల జేసి ఇన్ని రోజుల మంది కష్టం దిన్నది సాలదట్నా? అన్నిటికి తెగాయించి ఉన్నం మనం. మనసు ఎంత గోస వుచ్చుకోవాల్నో అంత గోస వుచ్చుకున్నరు. ఇంకేం జేత్తరు. అదిగూడ సూద్దం.."

ఆ మాటతో మైసమ్మకు ఎక్కడలేని సంతోషం కలిగింది. ఆ ఉత్సాహంలో "నేను గూడ బంద అందిత్త" అని రాబోయింది.

"నీకేం శాతనైతదే వద్దు." అని వారించిండు రంగయ్య.

రంగయ్యతో కబుర్లకు దిగింది మైసమ్మ.

రంగయ్య వయస్సు మైసమ్మ వయస్సు కొంచెం అటూ, ఇటూగా ఉంటుంది.

రంగయ్యకు తనకూ కొన్ని విషయాల్లో పోలికల్ని గ్రహించడం వల్ల కొంత స్నేహశీలంగా మాట్లాడుతుంటుంది మైసమ్మ. రంగయ్య చెయ్యెత్తు ఎదిగిన కొడుకు సంఘం పనిమీద కనబడకుండా ఎటో వెళ్ళిపోయాడు. గుండె దిటవు చేసుకున్న రంగయ్య తనకు ధైర్యం చెపుతుంటాడు.

తన కొడుకు వీరడు రంగయ్య కొడుకూ ఎంతో మంచి స్నేహితులు. రంగయ్య కొడుకు ఎంతో చక్కటి వాడు. కాలేజీ చదువుతున్నపుడు కూడా ఇంటివద్ద ఉన్నపుడు ఎడ్లను మేపెటోడు. తన కొడుక్కు వాడంటే ఎంత అభిమానం. ఒక్కనికి అని ఏమిటి వాని తోటి వాళ్ళల్లో వాడంటే ఎంత అభిమానం. వాళ్ళందరూ గలిసి వాన్ని మేపనిచ్చేవారు గాదు. వంతుల వారీగా వాళ్ళే మేపేవాళ్ళు. కథలు చెప్పుమని, పాటలు పాడుమని అక్కడ సిన్మాల గురించి కాలేజీ చదువుల గురించి మరీ మరీ అడిగి చెప్పించుకునేవారు.

ఓ రోజు రంగయ్య వచ్చి తనతో ఏమని చెప్పాడు. వాడు అందరికీ నేర్పుతున్న పాటలు, మాటలు విని ఆశ్చర్యపోయాడట. ఒకింత భయపడ్డాడు కూడా. ఆ మాటలు గుట్టల్ల అన్నల మాటల్లా ఉన్నయి. అది గూడా రంగయ్యకు తెలువకపోయేది. ఆ రోజు అవ్వమీద అలిగి అన్నం తినకుండానే వెళ్ళిపోయాడట. తాను సద్దితీసుకుపోయే సరికే వాడు మిగతా వాల్ల సద్ది తిన్నాడు. ఏదో చెప్తున్నాడు. వాళ్ళలో కొడుకు మరీ ఇంత అభిమానం సంపాదించాడని అపుడుగానీ తెలిసిరాలేదు.

అయితే ఆ రోజుల్లో సంఘం గురించి అంత పట్టించుకునే వాడు కాదు రంగయ్య. అప్పటికీ ఆ ఊళ్లో సంఘం పుట్టి చాలా రోజులే అయింది. రంగయ్య భూస్వామి కాదు,

పాలేరూ కాదు. ఉన్న రెండెకరాలు తనకు తానే సాగు చేసుకుంటున్న చిన్న రైతు. సంఘం గురించి తొలుతలో అంటీ అంటనట్టుండేవాడు రంగయ్య.

కాని కొడుకు కాలేజీ చదువు వదిలిపెట్టి అన్నల్లో కలసిపోవడం కొడుకోసం తనని పోలీసులు బాధించడం, ఆ స్థితిలో సంఘం తన గూర్చి పట్టించుకోవడం వల్ల సంఘానికి చేరువైపోయాడు రంగయ్య.

ఓ సారి వరికోతల సమయంలో కొడుకును పట్టిచ్చేదాకా నిన్ను విడువమని పోలీసులు ఇరువై రోజులు లాకప్‌లో ఉంచి 'ఆ వరి ఎవరూ కోయద్దు' అని బెదిరించినప్పుడు సంఘం ఏమైనా సరే అని సకాలానికి వరి కోసింది. లాకపు నుండి వచ్చిన తరువాత కూలీ ఇవ్వబోతే ఎవరూ తీసుకోలేదు. దాంతో రంగయ్యకు తన కొడుకు మీద వాళ్ళకున్న అభిమానం తెలిసి వచ్చింది.

ఆ అభిమానం ముందు రంగయ్య వినమ్రంగా తలవంచాడు. అప్పటినుంచీ తాను సంఘంలో ఒకడైపోయాడు.

మనుమరాలు ఏడ్పు వినిపించడంతో గుడిసెలోకి పరుగున వెళ్లింది మైసమ్మ.

"నన్నిడిసిపెట్టి ఎటువోయినవు" అని గారాబంగా మైసమ్మను చేతుల పైకొడ్తూ ఏడుస్తూ అడిగింది మనుమరాలు.

మనుమరాల్ని సముదాయిస్తూ మైమరిచిన ఉత్సాహంలో "ఇయ్యాల మన పొలం మనకిత్తరటనే" అని ఏదేదో చెప్పింది. వింటూ వింటూనే మళ్లీ నిద్రలోకి జారిపోయింది మనుమరాలు.

మైసమ్మ ఉత్సాహం నీరుగారిపోయింది. తన సంతోషం పంచుకోవడానికి ఇంకెవరున్నారు. ఉన్నొక్క కొడుకు జైల్లోనే ఉంటున్నాడాయె. తన పెనిమిటి బతికి ఉంటె ఈ విషయం విని ఎంత పొంగిపోయేవాడో. అలా గతం కళ్లముందు కదలాడింది.

తనకు వయస్సు ఈడేరిన రోజులవి. తన తల్లిదండ్రులు పెనిమిటి వద్దకు పంపకుండా మొరాయించారు. తనతో పని చేయించుకొనమరిగి "పోరిది లాత బొక్క" అని తోలించక చాలాకాలం తల్లిగారింట్లోనే ఉంచుకున్నారు.

నిజంగా అప్పుడు ఆ ఇంటి పరిస్థితే అట్లుండేది. ఏం బాకోగాని, అయ్య దొరల బాకీ ఎంత గట్టిగా తీరేదిగాదు. ఎంత జేసినా తీరేదిగాదు. ఓసారి బాకీ గట్టనందుకే దొర తన తండ్రిని కొట్టింది కళ్ళారా చూసింది. ఇప్పటికీ కళ్ళల్లో మెరుస్తూ ఉంటుంది. ఆ స్థితిలో తాను తల్లిగారింటి వద్దే ఉండి పోయింది మైసమ్మ.

పెనిమిటి మంచి వయసు మీదున్నాడు. గంగిని గుంజాడు. దొర దాన్ని పెద్ద పంచాయితీగా కావాలని పెంచాడు. ఐదువందల దండుగేశాడు. గంగికి దూరపు సంబంధం

వస్తే ఖాయం జేయించి, తులం బంగారం పెట్టాడు దొర. ఐదువందలు, తులం బంగారం దండుగు కలిసి వెరసి తమ పొలం కాజేశాడు దొర.

“అయ్యా! అప్పా!” అని బతిమిలాడుతే ఆ పొలంలో పాలేరుగా పనిచేయడానికి అంగీకరించాడు. ఆ పొలం ఏ నాటికయినా తిరిగి తమకే చెందాలని, ఇబ్బడి ముబ్బడి రాబడి తెస్తే కొన్నాళ్లకు దొర దయతలచి తమది తమకు వదిలిపెడ్తాడని ఓ గుడ్డి నమ్మకం పెనిమిటికి చచ్చేదాకా ఉండేది. దొరగూడా చూద్దామని తీయగా మాట్లాడితే నిజంగానే వస్తుందని భ్రమకు లోనై రాత్రీ, పగలూ నిద్రాహారాలు మాని పంటలు దీసారు.

కానీ పొలం తమది తమకు రాకుండానే పెనిమిటి గతించిపోయాడు. పనిచేసి చేసి నెత్తురు నీరు జేసుకుని పండించిన పంటంతా దొరపాలయింది. నెత్తురు జచ్చిన చెత్త కాటి పాయింది.

బతికి ఉంటే, ఇన్నేండ్ల తరువాతయినా తమ పొలం తమకు చెందుతున్నందుకు పెనిమిటి ఎంత సంతోషించేవాడో అనుకుంది మైసమ్మ.

పెనిమిటి చనిపోయాకనైనా దొరకు తనమీదైనా జాలి కలుగలేదు. తన కొడుకు ముఖ మయినా చూడలేదు. మీదు మిక్కిలి సంఘం పుట్టాక పల్లె నుంచి పట్నానికి మకాం మార్చిన రఘుపతి దొర, నేను పట్నంల ఉంటున్న ఇంక పల్లెలో వ్యవసాయం చూసుకునుడు కుదిరె టట్టులేదు. అమ్ముకుంటే పట్నంల ఏదన్న దంద జేసుకోవచ్చుననుకున్నాడు.

కాని సంఘం అదివరకే ఓ కట్టడి చేసింది. “దొర భూముల్ని అమ్మనీయం. కొననీయం” అని.

దొరల భూములు పూర్వం ఎవరివో, ఎవరి నుంచి లాక్కున్నారో ఆ లిటిగేషన్లను ప్రజా పంచాయితీ నిర్వహించి ఎవరికి చెందాలో సంఘం తీర్పు ఇవ్వడం ప్రారంభమైంది.

రఘుపతి దొర మిగతా దొరల్లా కాకున్నా చాలా గుంభనంగా, గంభీరంగా వుంటాడు. తొందరగా బయటపడడు. మాట పోగొట్టుకోడు. అందుకే మస్కట్‌పోయి వచ్చిన వెంకటి వద్ద మైసమ్మ పొలం అమ్మకానికి అడ్వాన్సు పుచ్చుకున్నట్టు కొంతాలస్యంగా తెలిసింది. అపుడు సంఘం పెట్టిన పంచాయితీకి దొర హాజరయి ఉంటే, ఈ సమస్య ఆ రోజే తేలిపోయేది. ఆరోజు దొర కావాలనే తప్పించుకున్నాడంటాడు సంగం శంకరయ్య.

జిల్లా కేంద్రంలో కో–ఆపరేటివ్ వంటి పదవులుండడంతో రఘుపతి దొరకు ఎపుడూ పని. అందువల్ల పల్లెకు రావడం చాలా తక్కువ. ఏదో మినిస్టరు ప్రోగ్రాంలో తోడు వెళ్లడం వల్ల ఆ రోజు రాలేకపోయానని చెప్పాడు రఘుపతి దొర.

తాను రాకున్నా సంఘం, మిగతా దొరలు కల్సి ఎట్ల నిర్ణయిస్తే అట్ల అంగీకరిస్తానని అన్నాడు. రఘుపతి దొర లేకుండా జరిగిన ప్రజా పంచాయితీలో పట్వారీ ఎనిమిదెకరాలకు

ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా, రఘుపతి దొరకేమో సంఘం నిర్ణయించిన ధర చెల్లించి మైసమ్మకు పొలం తిరిగి ఇచ్చేయాలని నిర్ణయం అయింది.

ప్రజలు దున్నుకుంటున్న ప్రభుత్వభూమిని ఎవరికి తెలియకుండా తన పేరిట పట్టా చేసుకున్న పట్వారీ శివలింగం సగానికి పైగా అమ్మేశాడు. కొన్నది పేదలే కావడంతో పట్వారి బతికిపోయాడు. సంఘం పుట్టేనాటికి అమ్మగా మిగిలిన ఈ ఎనిమిదెకరాల్ని పూర్వం నుంచి దున్నుతున్న లచ్చనికి, బైండ్ల రాజన్నకి, సాతారపు పోషయ్యకి మనిషికి ఎకరం చెందాలని మిగతా భూమి పంపకం తర్వాత చేద్దామని సంఘం నిర్ణయించింది.

సంఘం అందులో నారుపోస్తే పోలీసు క్యాంపు వేయించి విచ్చలవిడిగా అరెస్టులు చేసి కేసులు పెట్టారు. రెన్నెల్ల తరువాత కొంత అలజడి తగ్గినట్టుండంతో పోలీసు క్యాంపు వెళ్లిపోయింది. అసలు దొర ఊళ్లో లేకపోవడం, పట్వారి పినాసితనం వల్ల, క్యాంపు పోలీసులకు మర్యాద చేసేవాళ్ళు లేకపోవడం వల్ల పోలీసులు ఈ క్యాంపులో సుఖం లేదని ఎత్తేశారు.

సంగం నిర్ణయించిన పొలాల్లో వరికోతను సంగం చేపట్టింది. మూడు వందల మంది ఎర్రజెండాలతో వూరేగింపుగా వెళ్లి పంటకోశారు.

ఆ రోజు సంఘం సంబరం జరుపుకుంటే పట్వారి శివలింగం ప్రాణం ఉండగా తోలు కమిరించినట్లు బొబ్బలేస్తూ ఎగిరాడు. ఒక్కడిగా ఏమీ చేయలేనని తేల్చుకుని రఘుపతి దొర వద్దకెళ్లి మీరు పూనుకుంటే యిద్దరి భూములూ దక్కుతాయి. లేకపోతే నీళ్లారగించి దండం బెట్టాల్సిందేనని మొరపెట్టుకున్నాడు.

అన్నింటినీ ఓపికగా విన్నాడు రఘుపతి. ఓపిక పట్టాలి అన్నాడు.

"అంతా మీ దయ" అంటూ వచ్చేసాడు పట్వారి శివలింగం.

కొద్ది రోజుల్లోనే పోలీసులు సంగపోల్లందరినీ కొట్టడం, ధాన్యాన్ని బావుల్లో పారబొయ్యడం, బిందెలు, చెంబులు, సూటుకేసులు, సమస్త సామాను పగలగొట్టి సర్వనాశనం చేసిపోవడం కొందరిని తీసుకుపోయి కసితీరేదాకా లాకప్పుల్లో చిత్రహింసలు పెట్టడం, కేసులు పెట్టి జైలుకు పంపడం ఒకటివెంట ఒకటి జరిగిపోయాయి.

గీ ముసల్దాని కోసం పాపం సంగపోల్లంత తన్నులు పడ్డారు. జైల్లకుపోయారు. ఎంతో నష్టపోయారు. అయినా పట్టిన పట్టు విడవడం లేదు. తమ భూమి తమకు దక్కే వరకు వదిలేదిలేదు అంటున్నారు. అందుకే ఎన్ని కష్టాలైనా భరిస్తున్నారు.

"ఈ సారి తమ భూమి తమకు రాబోతుంది. ఇక నుండి అందులో పండించిన పంటంతా తమదే, దొర బేదఖలౌతడు"

ముసలవ్వ మైసమ్మకు ఆ భావం రావడంతో ఉత్సాహంతో కాలు నిలవడం లేదు. తన సంతోషం పదుగురిలో పంచుకోవాలని మనస్సు ఉరకలు వేస్తోంది. తలుపు దగ్గరకు వేసి బయటకు నడిచింది. రంగయ్య వారిస్తున్నా వినకుండా బండరాళ్ల చప్పుడు వేపు నడిసింది.

తెలతెలవారుతోంది. తూర్పువైపు వెలుగురేకలు విచ్చుకుంటున్నాయి.

సంగం శంకరయ్య రాళ్ళు స్వయంగా మోస్తూ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నాడు.

అందరూ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. పని దాదాపు పూర్తి కావచ్చింది. ఎవర్నీ మాట్లాడిచ్చేట్లు లేదు. చకచకా పనిచేసుకుపోతున్నారు. అందరిలో కలియ దిరిగింది మైసమ్మ.

తనమాట ఎవరూ పట్టించుకునేట్లు లేరని ఒకింత బాధపడింది మైసమ్మ. శంకరయ్య ఆప్యాయంగా పలకరించాడు.

మైసమ్మకు ఎందుకో అకస్మాత్తుగా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆప్యాయంగా శంకరయ్య చేతులు పునికింది. మాట పెగల్లేదు. కాళ్ళు పట్టుకోబోతే వారించాడు శంకరయ్య. అపుడు గానీ మైసమ్మను జనం గమనించలేదు. అప్పటికి పని కూడా పూర్తి కావడంతో వారి చుట్టూ చేరారు. అలా తెల్లవారకముందే యిళ్లకు చేరారు.

✡

ఎపుడు పంచాయితీకి వెళ్లడమా అని ఆదరాబాదరాగా పని ముగించుకొని మనుమ రాల్ని తీసుకుని బయల్దేరింది చింతకింది మైసమ్మ.

ఆ చెట్టుకింద అదివరకే కొంతమంది జమ అయి ముచ్చట్లాడుతున్నారు. అందులో ఎన్నో విషయాలు దొర్లుతున్నాయి.

ఆ ఊళ్లో సంఘం పుట్టి ఎనిమిదేళ్లయింది. ఈ ఎనిమిదేళ్లలో దొరల్ని యిలా ప్రజా పంచాయితీకి పిలువడం యిది పన్నెండోసారి. ఇన్ని కట్టుదిట్టాల్లో పంచాయితీ జరుపడం ఇది రెండోసారి.

ఆ వూరు రాగలిగే మరో రెండు బాటల్ని కూడా రాలేకుండా మూసేశారు. టెలిఫోను మోగకుండా చేశారు.

ఎవరో సైను బనీను, నిక్కరు వేసుకున్న పిల్లాడు చేతిలో కర్రతో అటు ఇటు తిరుగుతూ ఏదో తీవ్రంగా అరుస్తున్నాడు. ఆ కొద్ది సేపట్లోనే జనం గుంపులు గుంపులుగా వచ్చేసారు. తిట్లు, శాపనార్థాలు, ముచ్చట్లు ఏకకాలంలో నడుస్తున్నాయి.

'ఎహె దొర కాల్జేతులు యిరుగగొట్టాలె' ఎవరో గుంపులోంచి అరుస్తున్నారు.

"ససరాదుంగ్రి! లొల్లివెట్టకుగ్రి!" సంగం చంద్రయ్య కసిరాడు. ఏదో అరుస్తూ ఉంటే ఓ పిల్లవాన్ని ఒక్కటేశాడు. ఆ తల్లి 'ఏం పోకటచ్చిందిరో' అని సంగం చంద్రయ్యను ఈసడించింది. అంతా అంగడిగా ఉంది. ఆ అరుపుల్లో ఎవరు ఏం మాట్లాడుతున్నరో వినిపించడం లేదు.

ఎవరో "దొరలొచ్చిగ్రు" అన్నారు.

"ఎవనికిరా దొర?" ఎవరిదో కంఠం విన్పించింది. లొల్లి మగ్గింది. దొరలు ఇంకా నిలబడే వున్నారు. పదేండ్లకింద తప్పుల పంచాయితీకి ప్రజల్ని దొరలు పిలిపిస్తే ప్రజలు ఎట్ల గజగజ వణుక్కుంటూ నిలబడేవారో. సంగం రంగయ్య మనస్సులో మెదిలి పెదవులపై హాసరేఖ వెలిగి మాయమైంది.

సంగం శంకరయ్య చంద్రయ్యతో ఏదో చెప్పగానే చంద్రయ్య మరో యిద్దర్ని తీసుకొని బయటకు నడిచాడు. అందర్ని కూర్చోబెడ్తున్నాడు శంకరయ్య.

"కూసో! కూసో!" రఘుపతి దొరను గుంపులోంచి ఎవరో ఏక వచనంతో అవహేళన చేశారు. దొర ముఖం వాడిపోయింది. బీరిపోయాడు.

"ఇంక తటపటాయిస్తుడేంర? నీకూ, ఆ బండకు రుణపాత్కం ఈ నాటిదా! కూసో!" సంగం చంద్రయ్య అన్నమాట చర్నాకోల కొసలా చటుక్కున తాకినట్టుంది. అలాగే నిలబడితే యింకా ఎన్ని వినవలసి వస్తుందోనని కూర్చున్నాడు దొర. అల్లరి కొంత మగ్గింది.

ఇదే సమయమని కోమటిగోపన్న లేచాడు. "నేను అందరికీ కావలసినమాట జెపుతున్న. బావులకు, కరెంటుమోటార్లకు, ఎరువులకు మొదటినుండి అప్పులిప్పిచ్చి పల్లెను పచ్చగా జేసిందెవలు? అపుడు గీ సంగాలేడవోయినై?" అన్నాడు.

అందులో పట్వారి శివలింగం ఏదోమాట కలపబోయాడు. ఎవరో తుపుక్కున వుమ్మి వేసినట్టయి అది తనముఖం మీదే పడ్డట్టు వులికిపడి తువ్వాలుతో చెమట తుడుచుకున్నాడు. నోరుమూసుక్కూర్చున్నాడు.

ఆగి కోమటి గోపన్న మళ్ళీ అందుకున్నాడు. "మనూల్లె బతుకుతున్నంత పచ్చగ ఏ వూల్లె బతుకుతున్నరో ఒక్క వూరుసూపియ్యుగ్రి. అదంతా ఈ దొర పుణ్యంకాదా! పుణ్యాత్ముని మీద కత్తిగట్టిగ్రు. అవ్వల్ల! గిదేంన్యాయం?" నోరు నొక్కుకున్నాడు కోమటి గోపన్న.

"ఎంత పుణ్యాత్ముడో అందరికీ ఎరికేగని చెప్పిందాన్ని రికాంలేకుంట ఎన్నిసార్లు జెపుతరు? వినెటోల్లు ఎంతకని వింటరు? కొత్తగా ఏదన్న చెప్తె చెప్పుగ్రి" అసహనంగా అన్నాడు రంగయ్య.

"మొన్న గంత మందిని జేలుకు పట్టిచ్చి పుణ్యం గట్టుకోలేదా?" ఎవరో గుంపులోంచి కేక వేశారు.

“నీయవ్వ! యియ్యాల దొరను గోసి సియ్యకూర అందుతరంటివి గదనె! యింకెప్పుడే” మైసమ్మ వుదయాన వుత్సాహంలో అన్నమాటని మనుమరాలు లచ్చవ్వ సాగదీస్తోంది.

ఆ రెండు మాటలు విన్న రఘుపతి అరికాళ్ళలో వణకు ప్రారంభమైంది. జేబులోకి చేయి పోనిచ్చాడు. లైసెన్స్‌డు పిస్టల్ మునివేళ్ళలో నుంచి గుండెకు ధైర్యాన్ని సరఫరా చేయడం మొదలెట్టింది.

“బొంతచింపులు గతిలేనోనికి గంతభూమి ఏడికెల్లి అచ్చింది. దొంగలెక్కలోన్ని నిలేసి అడుగుత్రని” గౌండ్లపోసి పట్వారిని చూస్తూ రోషంగా అంది.

అవి పట్వారి శివలింగం గుండెల్లోకి సూటిగా దూసుకుపోయాయి.

“నాది! నాదే! పట్టాభూమే” అంటూ వుగ్ర నరసింహావతారం ఎత్తాడు పట్వారి శివలింగం.

“ఎవలదగ్గర గొన్నవురా బాంచెను” బైండ్ల రాజడు వెక్కిరింతగా అడిగాడు.

“నేను గంగలపడి సంపాయించినా! గోదాట్లపడి సంపాయించిన! గదంత మీకెందుకు? అది పట్టాభూమా? కాదా? ఓసారి కాయిదాల మీద సూసుకోత్రని” అని ఏదో కాగితాల కట్ట తీయబోయాడు పట్వారి శివలింగం.

“నీ కాగితాల కట్ట నువు పోగేసుకో మాకెందుకు” నడ్డి ముక్కు మైసి అందుకొంది. “నీకు అన్నంబెట్టిన చేతులకు సున్నం బెడుతావుర. నాకొడుకును పట్టిత్తావుర” శపిస్తూ దండకం చదువుతోంది.

జీపు చప్పుడు వినబడడంతో చంద్రయ్య ఆదరాబాదరాగా పరిగెత్తుకుంటూ వచ్చి అక్కడికి మెల్లగాచేరి సంగం శంకరయ్య చెవిలో “జీపు చప్పుడైంది. పోలీసులస్తున్నట్టున్నారు’ అని అన్నారు.

చంద్రయ్య రావడంతో రంగయ్యని బయటకు పంపాడు సంగం శంకరయ్య ఏదో తెల్సుకురమ్మని. “పోలీసుల్ని పిలిస్తే మర్యాద దక్కదు అని దొరలకు హెచ్చరించే వుంచారు. పోలీసుల్ని పిలిచే ధైర్యం వారికి లేదులే!” అయినా తొందరగా ముగిద్దామని వుంది శంకరయ్యకు. కాని అది బైటికి తెలీకూడదు. ఏం చేయాలో, ఎలా చేయాలో అర్థంకాక కొంతసేపు అయోమయంలో పడిపోయాడు సంగం శంకరయ్య.

పట్వారి శివలింగంకు కోపం ఆగడం లేదు. “మా పొలాలు కోతకచ్చినయి కోస్తరు. కల్లంల ఒక్కిత్తు లేకుంట జేస్తరు. మల్ల మీరే దబాయించి అడుగుతున్రా. గది చెయ్యంగ ఎరుక లేదా?” కోపం వుద్రేకంతో వణుకుతున్నాడు.

చింతకింది మైసమ్మ మళ్ళీ అందుకొంది. “ముప్పయ్యేండ్ల వట్టి మాత్రం ఎవలుజేత్తున్రు బాంచెన్”.

గుంపులోంచి ఎవరో వడిసెలరాళ్ళలా మాటలు విసిరారు. “గట్లడుగున్రి లంజ కొడుకును, గుణమస్తది. ఇన్నేండ్ల వట్టి దుక్కులసాల్లు దున్నిందెవలు? గొర్రు గొట్టిందెవలు? నాట్లేసిందెవలు? కోతలు కోసిందెవలు? బంతులు గట్టిందెవలు? అడుగున్రి”

“మీరేరా?” ఒక చిన్నదొర వెటకారంగా అన్నాడు.

“మరి యిపుడు మాత్రం గవన్ని జేసిందెవలు” లచ్చయ్య నిలదీశాడు.

“మీరే! మీరేరా!” పండ్లు కొరికాడు పట్వారి శివలింగం.

“మరి ముప్పయ్యేండ్ల వట్టి గిట్ల పని జేత్తనే వున్నం. ఏ లొల్లిలేదు. గిపుడెట్ల పోలీసులకు పట్టిచ్చిన్రు?” చంద్రయ్య అమాయకంగా అడిగాడు.

“అవు! పాపం! గట్ల జేసేది లేకుండె! మీ గోస తగులుతది.. చా.. చా..” మరో దొర వెటకరించాడు.

“నా పంట! నా పొలం! నా వడ్లు!” పిచ్చిగా అరుస్తున్న పట్వారి శివలింగంకు గుండెలో తట్టుకున్నట్టయ్యింది. తెగ దగ్గుతున్నాడు.

“పోలీసులతోటి వున్నయన్ని బావులల్ల పారబోయించిన్రుగద! మాయిగూడ మీరే ఎత్తుకచ్చుకోండ్రి. తాడుదేపోర్ర. నడుముకు గట్టి బాయిలకు విడుద్దాము. నీల్లల్ల దేవుకచ్చు కుంటడు. మానెత్తుర్లు పొలాలల్ల చిమ్ముతుంటే గట్టుమీద కూసుండి బొర్రవెచిండ్రు. ఇంకసాలదా! ఆ జేబుల పిస్తోలు తోటి మాకడుపు కాల్చినట్టు మమ్ముల కాల్చున్రి! మా పేరు మాపున్రి! మీరే బతుకున్రి. దొరా మీరే బతుకున్రి!” మైసమ్మ ఆవేశంగా ఊగిపోతున్నది.

అందరివైపు చూస్తు అన్నాడు సంగం శంకరయ్య “నడువున్రి ఎహె! ఎక్కడోల్లక్కడ పీకుండ్రి! ఇంకేమున్నదీడ! ప్రజాపంచాయితీ అంటే దొరలు చెప్పినట్టు యిన్నంక యిగ ప్రజలెందుకు పీకనా! పీకున్రి ఎక్కడోల్లక్కడ! దొరలు వూల్లె ఉండాలనుకుంటె జెల్ది తప్ప జెయ్యున్రి. వూకె వూకె అన్నదే అనుకునటానికి యిదెవలకు కొత్త! ఇది రెండో మీటింగు! చేస్తే జెల్ది చెప్పున్రి. లేకపోతే లేసిపోతం” ఆవేశంలో కూడా నిబ్బరం చూపించాడు సంగం శంకరయ్య.

చంద్రయ్య రావడం, గుసగుసపెట్టడం ముఖకవళికలు మారడం రఘుపతి దొర గమనిస్తూనే ఉన్నాడు. బహుశ పోలీసులు వస్తూ వుండి ఉండవచ్చు. మరో ఆర్నెల్లదాకా సజావుగా సాగాలంటే ఇక్కడున్న సంగం ముఖ్యుల్ని కూడా వాళ్ళకు అప్పగిస్తే సరి. తర్వాత అన్ని అమ్ముకుపోవచ్చు. అందుకోసం పోలీసులు వచ్చేదాకా సంభాషణ సాగదీయాలనుకున్నాడు.

“అయితే ఆఖరుకు నా భూమికి ఏ ధర కట్టిద్దామనుకుంటున్నరు”

“ఎకరానికి మూడువేలు”

"ఎకరానికి పదిహేను వేలకి తక్కువుండది. మూడు వేలకు ఎట్లయియ్యాలె మీరే చెప్పుస్రి" అన్నాడు రఘుపతి.

"నేను ఉన్నొక్క పొలం పోచంపాడు కాల్వ కిందవోయి మొత్తుకుంటే సర్కారు గంతే ధరగడ్తదిరా అన్న ముచ్చట మర్చిపోయినవా కొడకా" ఎవరో నిలవేశారు.

అలా చర్చ అనంతంగా సాగుతోంది. కాలం పరుగెడుతోంది.

"మరి పట్వారి శివలింగం భూమికి ఎంత ధర గడ్తరు" అడిగాడు సర్పంచు రెడ్డి.

"బజ్జె బూరు"

ఆ జావాబిన్నాక తాను నోరు తెరవడమే తప్పనుకున్నాడు సర్పంచు. "కొరివితో తల గోక్కోవడం ఎందుకు?"

అరెస్టయిన వారిని విడిపించే చర్చ వచ్చింది. రఘుపతి దొర ఆ అరెస్టులతో తనకు సంబంధంలేదని బుకాయించాడు. రఘుపతి దొరెక్కడ తనపై నెట్టుతాడోనని పట్వారి శివలింగం గజగజ వణికిపోయాడు.

"సరే! ఎవరు పట్టిచ్చిస్రో చర్చవెట్టుకుంటే యిపుడు వచ్చేదేముంది? మొన్న పంచాదికి పిలిసినపుడే చెప్పినం గద! మమ్ముల అడువుల వట్టిత్తె మిమ్ముల గదే పనిజేత్తం! అది యాది కుంచుకోస్రి! యిపుడు వాళ్లకు బేల్ తియ్యాలె. జమానతులు యియ్యాలె. కోర్టు కర్సులు పైకరుసులు అన్నీ మీరే పెట్టుకోవాలె. జమానతులు మీరే యియ్యాలె. ఆయేటి (వర్షాకాలం) పూనుతున్నది. మీరీ పని జెయ్యకపోతే మేం ఎంత కూలిచ్చినా పనిజెయ్యం – యింకోరిని పనిచెయ్యనియ్యం. పట్వారి భూమి, దొరభూమి పంచాయితి తప్ప అయి పోయినట్టే. దొర తీసుకున్న మైసమ్మ పొలం మైసమ్మకే చెందుతుంది. మల్లదాన్ని తిరగదోడేది లేదు" అందరూ చెప్పిందాని సారాంశం వివరించాడు సంగం శంకరయ్య.

మళ్లీ తర్జన భర్జనలు చెలరేగాయి.

చూసి రాను వెళ్లిన రంగయ్య వచ్చి సంగం శంకరయ్య చెవిలో ఏదో చెప్పాడు. అది సారా జీపని, పోలీసు జీపుకాదని అది అటే వాపసు పోయినట్లు తేల్చుకుని వచ్చాడు.

దాంతో శంకరయ్య ధైర్యం పుంజుకున్నాడు. చర్చ తారాస్థాయికి చేరింది. రఘుపతి దొర పిస్తోలు కోసం మరోసారి జేబు తడిమాడు.

"ఎంది దొర? ఊకె జేబుల చెయ్యి పెట్టవడ్తివి? మర్యాద దక్కది జాగ్రత్త! యింతమంది ఎగవడ్తె నువ్వూ నీ పిస్తోలు మంట్లె గలుస్తరు." శంకరయ్య హెచ్చరించారు.

"పిస్తోలుతోని కాలుస్తావురా? ఎత్తుర్ర బరిసెలు ఈని దొంగపెండ్లాం.." లచ్చుడు కంక కట్టెతో ఎగిరి ముంగిటికి వచ్చాడు.

'తియ్యర! సంచిలకెల్లి! బాంబులు' అని ఎవరో అరుస్తున్నారు.

ఆ మాటతో రఘుపతికి, పట్వారి శివలింగంకు ఉచ్చబడింది. వణికిపోయారు.

'దున్నేవానిదే'...

'భూమి'

'విప్లవం...'

'వర్ధిల్లాలె' నినాదాలతో దిక్కులు పిక్కటిల్లాయి.

పరిగెత్తడానికి తయారవుతున్నారు కొందరు. అంతా అల్లరి, గందరగోళం. కోపోద్రిక్తులయిన జనం రఘుపతి దొరమీద, పట్వారిమీద దాడి చేయడానికి సిద్ధపడ్డారు.

"మీ చేతులున్న భూములన్నీ మా చేతులకెల్లి గుంజుకున్నయే. గా భూములన్నీ మాయే! గందుకని పోయిన భూములకోసం పోరాటం జేస్తున్నం! గిదన్ల మా పానాలు పోయినా సరే గీ పోరాటం ఆపేది లేదు. మిమ్ముల నిడిసేదిలేదు. ఇన్నూరేండ్ల ఏలిన అంగ్రేజోడే మంట్లె గలిసిందు మీదో లెక్కనా!" ఆవేశంగా సవాలు చేశాడు సంగం శంకరయ్య.

ఇంకా రెచ్చిపోతున్న జనాన్ని అతి ప్రయాసమీద నిలుపగలిగాడు శంకరయ్య. లేకపోతే పరిస్థితి మరోవిధంగా ఉండేది.

భూమి ఎలాగూ దక్కేట్టు లేదు. శంకరయ్య మాటమీద ఒప్పుకుంటే కనీసం గౌరవమయినా దక్కుతుందేమోననుకుని చివరకు రఘుపతి విధిలేక ఒప్పుకున్నాడు. ఎక్కడో ఉండే దొరనే అంగీకరించాక ఊర్లో వుంటే పట్వారి శివలింగం గుడ్లు తేలేశాడు. ఆ ఊళ్లో బిచాణా ఎత్తివేయాలనుకుంటేనే అంగీకరించకూడదు. బిచాణా ఎత్తేస్తే చిప్పే గతి. మిగతా భూములు కూడా యీ ఊళ్లోనే ఉన్నాయి. వాటిని అమ్మనీయరు కొననీయరు. కాబట్టి ఒప్పుకోవడమే మార్గంగా తోచింది పట్వారి శివలింగంకు.

మిగతా దొరలను ఏమీ అనకపోయినా బుగులు బుగులుగానే ఉంది వారికి. అందుకే పేచీపెట్టకుండా జైల్లో ఉన్న వాళ్లందరికీ జమానతు ఇవ్వడానికి వాళ్ళు ఒప్పుకున్నారు. ఎలాగయితేనేం పంచాయితీ ప్రశాంతంగా ముగిసింది. ఆ రోజు జనం సంతోషం అంత ఇంతా అని చెప్ప వీలుకాదు. మైసమ్మకు మరీ సంతోషమైంది.

✡

ఆర్నెల్లు గడిచాయి.

తల్లి మైసమ్మ తన కొడుకు వీరయ్య వెంట నడుస్తోంది. మనుమరాలు లచ్చవ్వ వారి కన్నా ముందే పరిగెత్తి కొంతదూరం పోయి ఆగి వాళ్లు వచ్చేదాక వుండి తిరిగి పరుగెడుతోంది.

పచ్చగా ఏపుగా పెరుగుతున్న మక్క, నువ్వు, జొన్న, కంది చేన్లు పెరండ్లు యిరువైపులా బారులు తీరి, గాలికి కదులుతూ ప్రసన్నంగా పలకరిస్తున్నట్టుగా ఉన్నాయి.

"యింకెక్కడికిరా" తన పొలం రావడంతో ఆగిపోయింది తల్లి మైసమ్మ.

"అగో! గా యిప్పచెట్టు కనపడ్త లేదా! గదే!" అంటూ చూపిస్తూ విప్పచెట్టు వేపు చూసాడు వీరయ్య.

అక్కడ అదివరకే కొందరు చేరినట్టున్నారు. మైసమ్మ కూడా వారిని చూసింది. "ఇంకెవరో వున్నరు గదర". మీరు మాట్లాడుకుంట వుండరాదుర్రి. మన పొలం మంచిగా ఏనుకుందో లేదో చూసివస్త. నీ ఎనుకనే వస్త! పా! నువు ముందు నడు" అని వీరయ్య జవాబు వినకుండానే తమ పొలం వేపు మనుమరాలు లచ్చవ్వను తీసుకుని నడిచింది మైసమ్మ.

పొలాల ఆ చివర పక్కన వున్న విప్పచెట్టు చేరవచ్చి వెనక్కి చూశాడు వీరయ్య. తల్లి ఇంకా పొలం కాన్నుంచి బయల్దేరనే లేదు. మోకాలుమంటి బురదలో దిగబడి వంగి ఏదో పరిశీలిస్తోంది. తల్లికి పొలం మీద వున్న మమకారానికి పరవశించి పోయాడు వీరయ్య. మనవరాలు లచ్చవ్వ బురదలోకి దిగుతానంటే పొలం పాడైతదని వారిస్తున్నట్టుంది తల్లి.

ఆ పొలం కోసమే తన తండ్రి జీవితాంతం ఎలా ఆరాటపడి పోయాడో! అది ఈనాడు తిరిగి తమదై వాస్తవరూపం దాల్చింది. తల్లికి పొలం చేతికి వచ్చినప్పటి నుండీ మరో ధ్యాస లేకుండా పోయింది.

'లాల్ సలాం కామ్రేడ్' అన్న వినోద్ పలకరింపుతో తానుకూడా ఆ పొలాన్నీ, తల్లినీ చూస్తూ మైమరచిపోయాడన్నది గుర్తుకు వచ్చింది వీరయ్యకు. ఉలికిపడి 'లాల్ సలాం' అంటూ అందరినీ పలకరించాడు వీరయ్య.

సంగం శంకరయ్య రంగయ్య వినోదన్నతో పాటు కొందరు జైలునించి తనతోపాటు విడుదలైన మిత్రులు కూర్చుని ఉన్నారు.

"కామ్రేడ్! శత్రువు మీమీద ప్రయోగించిన క్రూర నిర్బంధకాండని, చిత్రహింసల్ని తట్టుకుని, సంఘాన్నీ సంఘ నిర్వహణకు సంబంధించిన రహస్య సమాచారాన్ని ఒక్కటి కూడా శతృవుకు ఆచూకీ యివ్వకుండా మీ మనస్సులోనే దాచుకుని పదిలంగా కాపాడినందుకు మీ అందరికీ విప్లవాభినందనలు." అని కామ్రేడ్ వినోద్ వారిని అభినందించారు. అందర్నీ ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు.

ఒక్కొక్కరు తమ జైలు అనుభవాల్ని పూసగుచ్చినట్టు వివరిస్తున్నారు. కొట్టిన దెబ్బలు, పెట్టిన హింసలు యింకా చెరిగిపోని గుర్తుల్ని చూపిస్తున్నారు. ఆప్యాయంగా అందర్ని తడిమి నిమిరాడు వినోదన్న.

వినోదన్న మాటలు వింటూనే సంగం రంగయ్య పొలాల మీదికి దృష్టి సారించాడు.

పొలాలు గాలికి వయ్యారంగా ఊగుతుంటే పచ్చని వెన్నెల అలలు అలలుగా ప్రవహిస్తో న్నట్టుగా ఉంది. కొన్నిచోట్ల నాట్లు పడలేదు. కొన్ని పొలాలలో నాటేసిన వరి యింకా వేరూనినట్టు లేదు. లేత రంగులో కనిపిస్తోంది.

జైలుకు వెళ్లి వచ్చిన వాళ్ళ మాట తీరులో ఏదో తేడా కొట్టవచ్చినట్టు కన్పడుతోంది. జైలుకు పోకముందటికీ యిప్పటికీ వారెంతో ఎదిగినట్టుగా స్పష్టంగా కన్పిస్తోంది. జైలుకు వెళ్లిన ప్రతి ఒక్కరూ అట్లనే అవుతున్నారు. ఆ కిటుకేమిటో వుండబట్టలేక అడిగారెవరో!

కామ్రేడ్ వినోదన్న నవ్వుతూ అన్నాడు.

"విప్లవకారుడు ఎక్కడా సమయం వృథా చేయడు. ఈ నిర్బంధ పరిస్థితుల్లో మనకు జైలే రాజకీయ పాఠశాల. అరెస్టయిన సీనియర్ కామ్రేడ్సు రోజూ ఏదో అంశం మీద క్లాసు తీసుకుంటుంటరు." నవ్వుతూ చెప్పాడు.

వివరిస్తూ వినోదన్న రంగయ్య వేపూ, రంగయ్య సంగం చూస్తున్న పొలాల వైపూ చూశాడు.

ఆ పొలాలు, పచ్చని పెరండ్లు, ఎక్కడా మట్టి కన్పించకుండా పచ్చగా పెరిగిన గడ్డి. ఏవేవో చిన్న చిన్న అడవిపూల చెట్లు, ఆ దృశ్యం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ప్రకృతి ఎంత సహజంగా అందంగా వుందీ! తన శ్రమశక్తితో ప్రకృతి అందాల్ని మానవుడు మరింత తీర్చిదిద్దినట్టుగా వుంది. అనిర్వచనీయ ఆనందంతో పొంగిపోయాడు కామ్రేడ్ వినోదన్న.

రంగయ్య దృష్టి సారించి అన్నవైపు చూశాడు. కాంతులీనుతున్న ప్రకృతి దృశ్యం ఇంకా చెదిరిపోనట్టుంది. కళ్ళు చెదిరినట్టయి రంగయ్యకు వినోదన్నలో ఒక్కసారిగా తన కొడుకు కళ్లెదుట సాక్షాత్కరించినట్టు అయింది. కలో! నిజమో! తెలియని వుద్వేగానుభూతుల్లో తన కొడుకే తనకు వినోదన్నయి పాఠం చెపుతున్న అనుభూతిలో ఒక క్షణం పుత్రోత్సాహంతో పులకరించిపోయాడు. సంతోషం, దు:ఖం జమిలితో కళ్లనీళ్ళు నిండాయి. వినోదన్నపై చేతులు వేసి చెంపలు భుజాలు నిమిరాడు.

"ఏందే బాపూ!" అంటూ ఆప్యాయంగా రంగయ్య కౌగిలో ఒదిగిపోయాడు వినోదన్న.

"ఏంలేదు" అని కళ్ళు తుడుచుకొని తనను తాను సంభాళించుకున్నాడు రంగయ్య.

ఆ తండ్రి ప్రేమకు విచలితులయ్యారు. వాతావరణం కొద్ది క్షణాలు గంభీరంగా వుండిపోయింది.

"మనం భూస్వాములతో మిలాఖతైనమట! కొందరు నన్ను ముఖం మీదనే అన్నరు. ఏం చెప్పల్నో తోయలేదు. జేల్ల ఉండి వచ్చినోల్లం. ఇవుతల ఏం జరిగిందో తెల్వదాయె." జైలునుండి విడుదలయిన కామ్రేడు సంశయ నివృత్తికై అడిగాడు.

"ఏమున్నది మనం దొరలను కొందరికి జమానతు పడమన్నం గద! గంత మందికి ఒక్కొక్కల్లకు ఇద్దరేసి జమానతుదార్లు కావాలె. భూములు జాగలున్నోల్లు మన సంగంల

గంతమంది ఎక్కడున్నరు? తాగినోడె గడ్డడు తాల్లపన్ను కోర్టు కర్సుల్లో కూడా సగం వాల్లు ఇచ్చుటానికి ఒప్పిచ్చినం గద! ఇగ గందుకు మనలందర్ని దొరల యిండ్లల్ల తింటున్రు దొరల ఇండ్లల్లనే వుంటన్రు– దొరలే ఈల్లకు పైసలిత్తున్రు – దొరలకు ఈల్లు ఏజంట్లు, గులాంలు గూండాలు అని గుడ అంటరు– అంతేనా" అంటూ శంకరయ్య వినోదన్న వైపు చూశాడు.

"అబ్బ నిజంగానే! నాతోటి మా సిన్నాయిన యింటికి పోయిన కాడ గయినె అచ్చం గిట్లనే అన్నడే" తన బాధ పూర్తిగా ఎదుటివాడికి అర్థమైనందుకు వుల్లాసపడిపోయాడు అడిగిన జైలు కామ్రేడ్?

"మనం చేస్తున్న పోరాటలు, సాధిస్తున్న విజయాలు చూసి అసూయ తోటి కొందరు గట్లనే అంటరు" అన్నాడు శంకరయ్య.

"అదిగాదె శంకరన్నా! నిజంగనే! ఎవలన్న అడుగుతె ఏం జెప్పుడే?"

వినోదన్న ఆ కామ్రేడ్ వైపు సాభిప్రాయంగా చూశాడు.

"మనసు కిందికి తొక్కి పైకి పాకిన దొరలను ఆ పై మెట్టుమీంచి తిరిగి కిందికి తీసుకరావాలె. మన పోరాటాలు పెరిగిన కొద్ది మనధైర్యం పెరుగుతున్నది. సంగం ఆజ్ఞలను దొరలు పాటించేట్టు చేయడం మనం సాధించాల్సిన విజయాలు. అవి మనం సాధిస్తున్న విజయాలు కూడా! మన ఆజ్ఞల్ని దొరలు పాటిస్తున్నరంటే అర్థమేంది? మన సంగానికి లోబడి అణిగిమణిగి వుండడమన్న మాట! ఏ సంగానికైనా యింతకన్న గొప్ప విజయం ఏముంది? ఇదే అసలు విజయం" అని వివరించాడు వినోదన్న.

అలా కొంతసేపు వివిధ అంశాలపై చర్చ జరిగింది.

"అవు అన్నా! దున్నెటోడికే భూమి ఇంకెన్నడైతది. పాలేర్ల జీతాలు, కూలీల పెరుగుదు కోసం, బంజెర్లు, దండుగుల వసూల్లు గుంజుకున్న బూములు మల్ల దీసుకునుదు గిట్ల పోరాటాలు మా జేస్తున్నం గని! అసలు పోరాటం యింకెన్నడు మొదలైతదే!" ఎవరో అడిగారు.

"ఎప్పట్నుంచో గలాంటి పోరాటాలు మొదలై కొనసాగుతంటె కొత్తగా గట్లడుగుతవేంది కామ్రేడ్! మీరు మొన్న జేసిన పోరాటం ఏంటిది?" లాలనగా అడిగాడు వినోదన్న.

"నువ్వనేదేమిటో నాకు సమజైతలేదే!" అశ్చర్యపోయి అడిగాడతడు.

"మీరు మొన్న సాధించిందేమిటి? పట్వారి శివలింగం, ఆక్రమించిన ఎనిమిదెకరాలు, రఘుపతి దొర ఆక్రమించిన పొలం మళ్ళీ తిరిగి సంగం ఆధ్వర్యంలో ఎవరిది వారికి పంచ లేదా! ఇదేమన్న తక్కువ విజయమనుకున్నారా!" అర్ధోక్తిగా అడిగాడు వినోదన్న.

"అవును నిజమే! అయితే...?"

ఆ కామ్రేడ్ అడుగుతున్నది నిజమేనన్నట్టుగా ఆసక్తిగా ఆశ్చర్యంగా, వినోదన్నను చూశారు కొందరు.

"ఎవల భూమి వాల్లకు సంగం యిప్పించినంక యింక దొరల దగ్గర భూమెక్క డుంటది?" పొడుపు కథ విప్పినట్టు అన్నాడు వినోదన్న.

"ఎట్ల?"

"దొరల దగ్గరున్న భూమంత ఎన్నడో ఒకనాడు ప్రజల దగ్గర్నుంచి గుంజుకున్నదే గద! వాల్లకు స్వంతం భూములంట యింకెక్కడియి?" అంటూ పరాయీకరణ జరిగిన క్రమాన్ని వివరించాడు వినోదన్న.

"హోర్నియక్క! కండ్లుండి గుడ్డోల్లు అంటె గిదేనేమో! అన్న జెప్పేదాకా మనకు తోయకనేపాయె! నిజమే" అన్నాడు. ఆ కామ్రేడ్సు ఆశ్చర్యం మరియు తాము సాధించిన విజయాల పట్ల గర్వంతో తబ్బిబ్బయిపోయారు వారు.

ఒక్కొక్కరు సెలవు తీసుకుంటూ వెళ్లిపోతున్నారు. చెట్టుకింద అన్న, శంకరయ్య రంగయ్య, కొడుకు వీరయ్య మాత్రమే మిగిలారు.

✡

"అవ్వ యింక రాకపోయె!" వినోదన్న వీరయ్య వైపు చూశాడు. వీరయ్య పొలాల వేపు చూశాడు. వినోదన్న కూడా అటువైపు దృష్టి సారించాడు.

ఇటీవలి వర్షానికి కరిగిపోయిన కొత్తవొడ్లని పునర్నిర్మిస్తున్నట్టుంది మైసవ్వ.

"రైతుకు భూమి అంటె, పంట అంటె ఎంత మమకారమో చూడు. మనం యిక్కడున్నమని తన కోసం ఎదిరిచూస్తున్నమని మర్సేపోయింది. తన కష్టఫలితం తనకే చెందున్నపుడు కష్టజీవి కష్టంలోనే ఆనందం పొందుతడు!" అంటూ తనకు ఆలస్యమౌ తుందన్న విషయం మరచి పరవశించి పోయాడు వినోదన్న.

"అవ్వను జెల్ది రమ్మనుపో ఆలస్యమైతంది. అక్కడ ఎదిరిచూస్తరు. జెల్దిపో" తేరుకుని మల్లీ అన్నాడు వినోదన్న.

"అబ్బో అది నేను పోతె వత్తదా! నాకంటె దానికి పొలమే ఎక్కొ" అంటూ వీరన్న రంగయ్య కేసి చూసాడు.

"రంగన్నా నువుపోతె వస్తదే" సూచనగా వినోదన్న అనడంతో నవ్వుతూ లేచాడు రంగయ్య. మనువరాలు లచ్చవ్వను అక్కడే ఉంచి మోకాళ్లవరకు అంటిన బురద, చేతు లంతా బురద. అలాగే వచ్చింది మైసమ్మ. ఈ లోకాన్ని జయించినంత సంతోషం విశ్వాసం, గర్వం అవ్వలో

తొణికిసలాడుతున్నాయి. దొర తప్ప లోకం తెలియదు మరి! దొరను జయిస్తే లోకాన్ని జయించినట్టే తల్లి మైసమ్మ దృష్టిలో.

పలకరింపులు పూర్తయ్యాక అసలు విషయంలోకి వచ్చాడు అన్న.

"అవ్వా మరి వీరన్న నీకేదో చెప్పిండట గదనే"

"నాకేం జెప్పిండు! అన్న ఏదో చెప్తనన్నడు రాయే అన్నడు"

"నా తీరు రైతాంగ కార్యకర్తగ, నక్సలైటుగ పనిచేస్తవని అంటున్నడు. ఉన్నదే వొక్క కొడుకాయె! ఏమంటవో నిన్ను గూడ విచారిస్తె మంచిది గదనె"

"నేను అద్దంటె ఆగుతారా!" ఇదంతా అవ్వ మెప్పుకోసం చేస్తున్న మర్యాద అని వారి ముఖం చూస్తేనే తెలుస్తుంది.

ఎప్పట్నుంచో అనుకుంటూనే ఉన్నా. గుండె రాయి చేసికోవాలని ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నా మైసమ్మకు దు:ఖం ఆగలేదు. తన కొడుకు తనలాగా జీవితాల పర్యంతం దోపిడీ చేయబడ్డ వాళ్ల బతుకుల బాగుకోసం పోరుపథంలో నడపడానికి వెళ్తున్నాడన్న ఊహ యింతకు క్రితం దాకా ఎంతో సంతోషాన్ని గర్వాన్ని కల్గింపజేసింది. తన జన్మ ధన్యమైందని అలా వెళ్లడం తనకు గర్వకారణమని మురిసింది. మనుమరాలి తోడుతో శేషజీవితం గడపగలనని నిర్ణయం చేసుకొని వుంది.

అందరు మెచ్చిన పిల్లవాడితో ఎంతో సంతోషంగా కూతురి పెళ్లి నిర్వహించి అప్పగింతలు కార్యక్రమం మొదలయ్యేసరికి పెళ్లి పందిరంతా విషాదఛాయలు అలుము కున్నట్టుగా ఉంది అవ్వకు కొడుకు పోతాననేసరికి. ఇక ఈ పొలం ఏమి చేసుకోను ముసలిదాన్ని అని పరిపరి విధాలపోయింది.

చిన్ననాటి నుండి కష్టాల్లోనే పుట్టి పెరిగిన కొడుకు జీవితమంతా కళ్లముందు కదలాడింది. కొడుకు ఎన్నడు సుఖపడ్డాడని! ఈ పేదదాని కడుపులో పుట్టి ఎన్ని బాధలను భివించాడు. దారిద్ర్యాన్ని మించిన బాధేముంది ప్రపంచంలో!

తన కొడుకు నేటి నుండి దరిద్రుడు కాడు. వానికి కోట్లాది పేద ప్రజల అండ వుంది. వాన్ని తమ ప్రాణాలు ఎదురొడ్డి కడుపులో దాచుకుంటారు ప్రజలు అనుకుంది తల్లి మైసమ్మ.

కాని తన చావుకైనా అందుతాడో లేదో! సంగపన్నలంతా తన కొడుకులైనాక తనకు యింకా యీ చింతలేమిటి!

అలా వివిధ భావ సమ్మిశ్రితమైన దు:ఖం వుద్వేగంతో అవ్వ కళ్లలోంచి టపటప చీరకొంగుపై కన్నీటి బొట్లు రాలి యింకిపోయాయి.

రంగయ్యకు తన కొడుకు కళ్ళల్లో మెదిలి కనుకొనుకుల్లో నీళ్లు నిలిచాయి. వారిని చూసి అక్కడ అందరికి కన్నుల్లో నీళ్ళు నిలిచాయి. ఎవరూ ఎక్కువగా మాట్లాడలేకపోయారు. కళ్లనీళ్ళు తుడిచాడు అన్న.

ఎంతోసేపటికి తేరుకుంది, తల్లి మైసవ్వ. కళ్ళనీళ్లు తుడుచుకుంది. "కన్నపేగు కొట్టు కుంటది బిడ్డా" అని ప్రేమగ కౌగిలించుకుంది.

చివరిసారిగా కొడుకును కౌగిలించుకుంది.

"మీ అయ్యపేరు నిలబెట్టాలె కొడుకా!" కన్నీళ్ళతో వీడ్కోలు తెలిపింది మైసమ్మ. భాషలో చెప్పలేని వేల భావాలు రంగయ్య, సంగం శంకరయ్య కళ్ళలో ప్రతిఫలించాయి.

పిడికిల్లెత్తి తల్లి మైసమ్మకు కొడుకు వీరయ్య లాల్‌సలామ్ చెప్పి వినోదన్న, వీరయ్య తూర్పు దిక్కు కేసి సాగిపోయారు.

✡

# ఆత్మీయత

**–అందే నారాయణస్వామి**

తొలిగా నేనా గ్రామం వరినారు నిమిత్తం వెళ్ళాను. నారు కోసం తిరిగి తిరిగి ప్రాణం బేజారైపోయింది. నారు ఎక్కడా కుదరలేదు. సూర్యుడు నడినెత్తికి వచ్చాడు! అప్పటికి తిండి తిప్పలూ లేదు! కడుపులో చరచరలాడుతున్నది. పైన నెత్తి కాలుతున్నది. భోజనం పెట్టేటందుకు ఆ వూళ్ళో బంధువులెవరూ లేరు. పోనీ పూటకూళ్ళు తిందామా అంటే అది కుగ్రామం. పెట్టేవాళ్లు లేరు. ఎవరిదో గచ్చురుగుల యిల్లు నీడగావుంటే తిరిగి తిరిగి ఆ అరుగుమీద చతికిలపడ్డాను. యివాళ్ల లేచినవేళ యెటువంటిదో గాని వచ్చినపని కాకపోగా, తిండికి గూడా మాడవలసి వచ్చింది. పోనీ ఎకాయెకి ఇంటికి వెళ్లిపోదామా అంటే అక్కడకు మా గ్రామం ఎనిమిది మైళ్లు వున్నది. ఆవాళ ఎండ చుర్రుమంటున్నది. అందులో తిరిగి తిరిగి వుండటంవల్లనూ, తిండితిప్పలూ లేకపోవడంవల్లనూ కాళ్లు తేలిపోతున్నవి. యెట్లా వెళ్లడం? మా గ్రామానికి బస్సులూ గిస్సులూ యేమీ లేవు. ఆ అరుగు మీద కూర్చుని యెట్లానా? అని ఆలోచిస్తున్నాను. యింతలో ఆ యింటి యజమాని కామాల లావుగా ఉన్నాడు. భోజనం చేసి తేపుకుంటూ బైటికి వచ్చాడు. అప్పుడు నేను 'ఏమండి! పని వుండి యీ గ్రామం వచ్చాను. భోజనం వేళ దాటి పోయింది. తిరిగి తిరిగి డస్సి వున్నాను. యీ వూర్లో పూట కూళ్లు పెట్టేవాళ్లెవరైనా వున్నారా?' అని అడిగాను, పెట్టేవాళ్లు లేరని తెలిసిగూడా. ఎందుకంటే ఇల్లూ వాకిలీ చూస్తే ధనవంతులుగానే వున్నారు. ఆయన దయదలచి 'యీ వూర్లో పూట కూళ్లు పెట్టే వాళ్లు లేరు, పోనీ పాపం! యీ పూటకు మా యింట్లో భోంచెయ్యమని అంటాడేమో' నన్న ఆశతో అడిగాను. అతడు చప్పరించి "యీ వూల్లో పూటకూళ్లు పెట్టే వాల్లెవరూలేర"ని బదులు చెప్పి లోనికి వెళ్లిపొయ్యాడు. నా ఆశ వృధా అయింది. ఇక ఎవరినడిగినా లాభం లేదనుకొని కాసేపు యెక్కడైనా పడుకొని చల్లపడ్డాక మా వూరు వెళ్లిపోదామని నిశ్చయించి అక్కడ నుంచి లేచి ఆ గల్లీ దాటి మలుపు తిరిగాను. ఆ వీధి మూడో యిల్లో నాలుగో యిల్లో అయివుంటుంది. పెంకుటి భవంతి. ముందు వసారా. ఇంటి ముందు వేపచెట్టు వున్నది. చల్లగా వుండటంవల్ల ఆ వసారాలో కాస్త వెన్ను వాలిద్దామని వెల్లాను. ఎవరో అమ్మాయి, వసారా స్థంబాన్ని ఆనుకొని తాటిపండు చీకుతూ వుంది. నేను వెళ్లి చొక్కా విడిచి కూచున్నాను.

ఇంతలో లోపలినుంచి ఒక స్త్రీ చంకన బిడ్డను యెత్తుకుని గుమ్మంలోకి వచ్చి నిలుచుంది. వయసు ముప్పై ఏళ్లుంటవి. చామనఛాయ శరీరం. ఆకుపచ్చ రంగు చీరె కట్టుకుంది. ఆమెను ఎక్కడో చూసినట్టు వుండడంవల్ల 'ఎక్కడ చూశానా' అని నెమరుకు తెచ్చుకుంటున్నాను.

ఆమె నాకేసి పరకాయించి చూసి "మీది కాజ కదూ"? అంది.

"అవునమ్మా" అన్నాను.

"నన్ను గుర్తు పట్టలేదా బాబాయ్. మనం గుంటూరు సత్రంలో వున్నాం" అంది. అప్పుడు నాకు గుర్తు వచ్చింది. దాదాపు ఏడెనిమిది ఏళ్ల క్రిందట మా ఆడవాళ్లకు సుస్తీ చేస్తే మందు తింటానికి గుంటూరు సత్రంలో వున్నాం. మేమున్న ప్రక్క గదిలోనే ఆ అమ్మాయి ఆసుపత్రిలో ప్రసవించడానికి వచ్చివున్నారు. మేము వొకళ్ల యింట్లో లేని వస్తువులు వొకళ్లను అడిగి తీసుకుంటూ ఎంతో కలిసి మెలసి వుండేవాళ్లం. తరుచు ఆమె భర్త అక్కడ వుండేవాడుకాదు. ఆమె తల్లి ఆమెతోపాటు వుండేది. నేను అప్పుడప్పుడు వాళ్లకు బజారునుంచి వెచ్చాలూ అవీ తెచ్చిపెడుతూ వుండేవాణ్ణి. ఆమె నన్ను బాబాయ్! అని పిలిచేది. అప్పుడామె బక్కపలచగా వుండేది. ఇప్పుడు కొంచెం లావయింది.

అప్పుడు నేను "జానికమ్మవా తల్లీ! మారిపొయ్యావు. గుర్తుపట్టలేకపొయ్యాను" అన్నాను.

"చానాళ్లకు కనిపించావు బాబాయ్! ఈ వూరు ఏం పనిమీద వచ్చావు?" అని అడిగింది.

"వరి నారుకోసం వచ్చానని" చెప్పాను.

"భోజనం చేశావా బాబాయ్?" అని అడిగింది.

"లేదమ్మా!" అని చెప్పాను.

"ఇంకా భోజనం చెయ్యలా! మా యింట్లో భోజనం చేద్దువుగాని రా బాబాయ్!" అంది ఆప్యాయంగా.

ఆకలితో వున్న నాకు ఆమె మాటలు ఎండి బీటలు వారిన చేలో వర్షం పడ్డట్టయింది.

"నారుకోసం తిరిగి తిరిగి వుండటంవల్ల, విపరీతంగా ఆకలిగూడా వేస్తున్నది తల్లీ!" అంటూ ఆమె వెంట లోనికివెళ్లి, పెరట్లో నుయ్యి దగ్గిర కాళ్లూ, చేతులూ కడుక్కుని, ఆమె వడ్డించగా తృప్తిగా భోంచేశాను. పప్పూ, ఘుమఘుమలాడే నెయ్యి, రెండు పచ్చళ్లు, గడ్డ పెరుగుతో చుట్టానికి పెట్టినట్లు భోజనం పెట్టింది. భోజనం కాగానే కాసేపు కునుకు తీసి లేచేసరికి ఎండ తగ్గింది. "వెళ్లివస్తా జానకమ్మా!" అని చెప్పి చంటిపిల్ల చేతులో ఒక బేడా పెట్టి, బయలుదేరి మా వూరు వచ్చేశాను.

✡

తర్వాత దాదాపు రెండు మాసాలకు గేదె తప్పిపోతే వెదకడానికి మళ్లా ఆ గ్రామం వెళ్లాను. బందిలిదొడ్లో పడ్డదేమోనని చూసుకొని, అక్కడ లేకపోతే పశులకాపర్లు, గ్రామంలో పశువులను వూరు వెలపల మందవేసే వేళకావడంవల్ల, వూరు వెలపలకు వెళ్లి, మందలో

చూశాను, అక్కడా కనిపించలేదు. ఇక తిరుగు ముఖం పట్టాను. పదిబారలు నడిచానో లేదో వెనుకనుంచి "బాబాయ్" అన్న కేక వినవచ్చింది. ఎవర్నో పిలుచుకుంటున్నారనుకుని తలవంచుకొని వెళ్లిపోతున్నాను.

"ఇదిగో బాబాయ్! నిన్నే!" మళ్లా కేక వినిపించింది. వెనక్కు తిరిగి చూశాను. జానకమ్మ నెత్తిన మూటతో మందప్రక్క బాటలో నిలుచుని వుంది. దగ్గిరికివెళ్లి "ఏం తల్లీ!" అన్నాను.

"మా యింటికి రాకుండానే వెళ్ళుతున్నావేం బాబాయ్! ఏం పనిమీద వచ్చావు?" అని అడిగింది ఆప్యాయంగా!

"గేదె తప్పిపోయింది తల్లీ! వెదకటానికి వచ్చాను. కనిపించలేదు" అని చెప్పాను.

"అట్లాగా! మా యింటికి వెళదాంర"మ్మని నన్ను వెంట పెట్టుకుని ఇంటికి తీసుకెళ్లి కాళ్లకు నీళ్లిచ్చి "భోజనం చేసి వెళ్లమ"న్నది.

"ఎందుకులే తల్లీ! యిప్పుడు పది గంటలైంది. భోజనం వేళకు యింటికి వెళ్ళిపోతాను" అన్నాను. కాదు కూడదని బలవంతపెట్టింది. రానివ్వలేదు, కాళ్ళుకడుక్కుని భోంచేశాను. జానకమ్మ పొగాకు తెచ్చియిచ్చి, "ఎండగా వున్నది యిప్పుడేం వెళతావు కాసేపు పడుకో బాబాయ్!" అంటూ మంచం వేసింది. నేను చుట్ట చుట్టుకుంటూ మంచం మీద కూర్చున్నాను. జానకమ్మ మంచం దగ్గర కూర్చుని ఆప్తులకు చెప్పినట్లు యింటి విషయాలన్నీ నాకు చెప్పింది. వాళ్ళకు పది ఎకరాల మాగాణి, నాలుగెకరాల రేగడా వున్నదట! రెండు ఎడ్ల జతలు, యిద్దరు పాలేళ్లు, అంతా స్వంత కమతం, అప్పూ సప్పూ యేమిలేదట! నిరుడు పంట అమ్మిన డబ్బు పెట్టి ఒక ఎకరం పొలం కొన్నారట. మొన్నవాళ్ల పెద్ద ఆడబిడ్డకు సారె పెట్టి పంపిస్తే ఐదువందలు అయినవట! ఆమె పుట్టిల్లు పొన్నెకల్లు. తండ్రిలేదు, తల్లీ, అన్నా వున్నారట! ఇవన్నీ చెప్పింది. నాకు అంతా మగపిల్లలేగానీ ఆడపిల్లలు లేరు. ఆడపిల్లల యొక్క అనుభూతిని యెన్నడూ చవిచూసి యెరగని నాకు ఆమె చూపుతున్న అమాయకపు ప్రేమకు హృదయం వుప్పొంగి పోయింది. ఇంతలో పొలం నుంచి కామాలు భర్త వచ్చాడు. నలభై యేళ్లుంటవి. యెత్తుసరి విగ్రహం. నన్నాయనకు పరిచయం చేసింది.

ఆయన "అట్లాగా!" అంటూ చెప్పులు విడిచి చేతిలో కర్ర మూలపెట్టి "ఏమండీ! మీ వూర్లో మంచి గిత్తలు దొరుకతయ్యా?" అని లాంఛనప్రాయంగా నన్ను పలకరించాడు.

"ఎందుకు దొరకవండీ?" అన్నాను. భర్తకు భోజనం పెట్టేటందుకు జానకమ్మ లేచి వెళ్లిపోయింది.

నేను పడుకుని కాసేపు కునుకుతీసి లేచి అవతల వసారాలో ఎడ్లకు దానా వులవలు వుడకపెడుతున్న జానకమ్మను పిలిచి "ఇక వెళ్ళివస్తా తల్లీ! మీ దంపతులు మా వూరు ఒకసారి ర"మ్మని చెప్పి చంటిపిల్ల చేతిలో చిల్లరపెట్టి వచ్చేశాను.

✡

మా స్వగ్రామం కాజ. అటు తర్వాత దాదాపు నెల రోజులకు నేను మా యింటి వీధి అరుగుమీద ఎండలో కూర్చుని ఎడ్లకు సిగమారు నేస్తూ, మా మనవడికి కథలు చెప్పుతున్నాను. అది చలికాలం, సూర్యుడు రావిచెట్టుపైకి వచ్చాడు. అప్పుడు ఉదయం తొమ్మిది గంటల వుతుంది. జానకమ్మ భర్త రామకోటయ్యగారు మా వీధిపై నుంచి వస్తున్నాడు. ఈయన యీ వూరు ఎందుకు వచ్చాడబ్బా! బహుశా ఎడ్లనిమిత్తం వచ్చి వుండవచ్చు అనుకున్నాను. ఆయన మా గుమ్మం సమీపించాడు. నన్ను గుర్తుపట్టలేదు వెళ్లిపోతున్నాడు. అప్పుడు నేను లేచి "ఏమండి! రామకోటయ్యగారు! మా యింటికి రాకుండానే వెళ్లిపోతున్నారే?" అన్నాను. ఆయన నావంకచూసి "ఓహో! మీరా!" అంటూ నా వెంట లోనికి వచ్చాడు. "కూర్చోం"డని మంచం వాల్చాను. అతను కూర్చున్నాడు, కాళ్ళకు నీళ్ళిప్పించాను. ఆయన "యిప్పుడెందుకండి కాళ్ళకు నీళ్ళు! బాకీ వుండి వచ్చాను వెంటనే వెళ్ళిపోతాను" అన్నాడు.

"మా యింట్లో భోజనం చెయ్యకుండా మీరు వెళ్లటమే! మీ వూరువస్తే చాలు మా అమ్మాయి జానకమ్మ భోజనం చేయందీ బతకనివ్వదు! మీరు వెళ్ళేటందుకు వీల్లేదు!" అన్నాను.

"భోజనానికేమొచ్చెలెండి! భోజనం సంగతి తరవాత చూద్దాం! ముందు వచ్చిన పని కానివ్వండి! మా వూర్లో ఒకడు రెండు వందలు బాకీవుండి, అత్తగారి వూరు యీ వూరైతే యిక్కడికి వచ్చేశాడు. పాలేరుగా వుంటానంటే పెళ్లికని డబ్బిచ్చాను. మా దగ్గర తీరా రెండు మాసాలైనా పనిచెయ్యలేదు ఎగకొట్టి చెప్పకుండా యీ వూరు వచ్చేశాడు. ఇప్పటికి ఐదారు మాసాలు కావచ్చింది. నోటు గూడా వ్రాయించుకోలేదు. వాడిపేరు నాగయ్య. యిక్కడ లేళ్ళవారి అల్లుడట. యీ వూరు నాకు కొత్త, మీరు కాస్త విచారించి పెట్టండి" అన్నాడు.

"నాకు తెలుసులెండి! మీ వూరితో సమ్మందం చేసింది లేళ్ల కామయ్య! అతని రెండో కూతుర్ని మీ వూరిచ్చాడు. భోజనం కాగానే వెళ్ళి కనుక్కుందాం లెండి!" అని చెప్పాను.

ఆయన ఆ పూట మా యింట్లోనే భోజనం. భోజనం కాగానే కామయ్య యింటికి వెళ్లాం. వాళ్లది పూరి యిల్లు. ఒక గదిలో అల్లుడూ, కూతురు వున్నారట! మేము వెళ్లేసరికి నాగయ్య యింట్లోనే వున్నాడు. బాకీ విషయం అడగ్గా 'యిప్పుడు చేతిలో డబ్బు లేదు రెండు నెలల్లో యిస్తా"నన్నాడు. అప్పుడు నేను రామకోటయ్యగార్ని యివతలకు పిలిచి "వీడు పనీ పాటా చెయ్యని మాచకమ్మ. మీరు నాగయ్య అంటే యెవరో అనుకున్నాను. వీన్నెందుకు ఎరగను! గంగానమ్మ గుడి దగ్గిర చీట్లాడుతూ వుంటే పొలం వెళ్లుతూ చాలాసార్లు చూశాను. వీడికి బాకీ ఎట్లా పెట్టారు? వీడి మామ వేలకు తింటున్నవాడు. ఒక కుంట పొలం కూడా వున్నది. అతనిచేత అవాల్తీ చేయించుకుంటే మీ బాకీ వస్తుంది" అని చెప్పాను. ఇంతలో యెక్కడ నుంచో కామయ్య వచ్చాడు. సంగతంతా అతనితోచెప్పి బాకీ అవాల్తీ పడమని అడిగాము! అతడు మండిపడుతూ "మొగుడు పెళ్లానికి రుణం పెట్టేది కాక పైగా అవాల్తీ కూడానా!" అంటూ అక్కడ నిలబడకుండా లోనికి వెళ్లిపొయ్యాడు. అప్పుడు రామకోటయ్యగారు నన్ను యివతలకు పిలిచి "వీడికి మా వూల్లో యిల్లూ, వాకిలీ వున్నది. అందులో వీడి అన్న

వుంటున్నాడు. అన్నలో సగం వాటా వస్తుంది. వీడిచేత నోటు వ్రాయించుకుంటే మంచిది" అన్నాడు. చూస్తే అంతకంటే గత్యంతరం కనపడలేదు. నాగయ్యను "చేతిలో వచ్చినప్పుడు యిద్దువుగాని ప్రాంసరీనోటు వ్రాసివ్వ"మని అడిగాం.

వాడు "యింతమాత్రానికి నోటెందుకు? యెగవేసి పోతామనా? గుంటూరులో పాల వర్తకం చెయ్యబోతున్నాను మీ బాకీ రెండు నెలల్లో యిచ్చేస్తాను" అన్నాడు. "చేతిలోకి వచ్చినప్పుడు యిద్దువుగాని నోటువ్రాసి యివ్వడానికేం?" అని ఎంతో దూరం చెప్పాం. వాడు ససేమిరా వ్రాసి యివ్వనంటే వ్రాసి యివ్వనన్నాడు. రామకోటయ్యగారికి కోపం వచ్చి ఘట్టిగా మాట్లాడగా, వాడు నేను వ్రాసిచ్చేది లేదు, నువ్వు చేసుకునేది చేసుకో పొమ్మన్నాడు. చేసేది లేక యిద్దరం మా యింటికి వచ్చేశాం. అప్పుడు నాకో ఆలోచన తట్టింది. మా వూరికల్లా శివయ్యగారు పెద్ద. ఆయన మాటంటే మా వూళ్ళో యిక తిరుగులేదు. ఆయనకంటే చదువుకున్నవాళ్లు వున్నారు. ధనవంతులూ వున్నారు కాని ఎంతమంది వున్నా ఆయనకే పలుకుబడి! రామకోటయ్యగార్ని వెంటబెట్టుకొని శివయ్యగారి దగ్గరకు తీసుకెళ్లాను. సంగతంతా వారితో చెప్పాను. చెప్పింది ఆయన శ్రద్ధగా ఆలకించి "నోటు వ్రాసియివ్వమన్నా వ్రాసి యివ్వలేదా? నేను కనుక్కుంటా పదండి" అని పై మీద పంచెవేసుకుని అప్పుడే మా వెంట బయలుదేరాడు. మేము కామయ్య యిల్లు సమీపించే లోపల దారి వెంబడే శివయ్యగారితో యిద్దరు ముగ్గురు కలిశారు. మేమంతా కలిసి కామయ్య యింటికి వెళ్లి గుమ్మం ముందు నిలబడ్డాం. శివయ్యగారు కామయ్యను ముందుగా పిలిచి "మీ అల్లుడిచేత వీరికి నోటు వ్రాయించి యివ్వలేకపొయ్యావు" అని అడిగాడు.

అప్పుడు కామయ్య "అయ్యో! ఎంత చెప్పినా అతడు వింటేనా! పాపం వీరు పొరుగువూరు నుంచి వచ్చారు. నోటు వ్రాసి యివ్వమని ఎంతో దూరం చెప్పాను. నా మాట వింటేనా బాబు!" అని బొంకి తన మర్యాదను కాపాడుకున్నాడు.

అప్పుడు శివయ్యగారు "మీ అల్లుణ్ణి పిలవ"మనగా కామయ్య యింట్లో వున్న అల్లుణ్ణి పిలిచాడు. అతడు వచ్చి శివయ్యగారి ఎదుటనిలబడ్డాడు. "ఏం అబ్బాయ్ వీరికి బాకీ వున్నావట" అని అడిగాడు శివయ్యగారు.

"వున్నానండి!" అన్నాడు నంగిగా నాగయ్య.

"వుంటే నోటు వ్రాసి యివ్వనన్నావటగా? బాకీ వున్నప్పుడు నోటు వ్రాసి యివ్వడానికేం? వ్రాసి యివ్వమ్మా!" అని చెప్పి, వెంట వచ్చిన వారిలో ఒకరిని నోటు వ్రాయడానికి పురమాయించి నోటు పూర్తి చేయించి రామకోటయ్యగారికి యిప్పించి వెళ్లిపొయ్యాడు శివయ్యగారు. వారి పని పూర్తి అయినందుకు అప్పుడు నాకు తృప్తి కలిగింది. రామ కోటయ్యగారు నోటు పుచ్చుకుని యింటికి వెళ్లిపొయ్యారు.

✡

మార్గశిర పుష్యమాసాలు వెళ్లి మాఘమాసం వచ్చింది. చలి తగ్గిపోయింది. పడమట చేలో వేసిన మిరపతోట కోతకు వచ్చింది. మా వూరిని ఆనుకుని రోడ్డు వున్నది. రోడ్డుకు ఆనుకొని చెరువు. చెరువునిండా తుమ్మలు, తుమ్మచెట్ల నిండా కొంగలు, ఆ చెరువుకింద కొంత మాగాణిభూమి సాగవుతున్నది. రోడ్డు మీద నిలబడితే చాలు. ఆ చెరువు, చెట్లనిండా ఆ కొంగలు, దూరాన పచ్చని పొలాలు ఆ దృశ్యం ఎంతో బాగుంటుంది. గుంటూరు వెళ్లే బస్సులు గూడా అక్కడనే ఆగుతవి. అక్కడ ఒక పెట్టె దుకాణం వున్నది. వచ్చేవాళ్లు, పొయ్యే వాళ్ళతో అక్కడ సందడిగా వుంటుంది. పడమటి పొలం వెళ్లాలంటే ఆ రోడ్డు దాటి దారిగుండా వెళ్లాలి. నేను పొద్దున్నే సద్దెన్నంతిని, మిరపతోటకు వెళదామని రోడ్డు దగ్గరకువచ్చి, పెట్టె దుకాణం దగ్గర కొబ్బరి తాడుకు చుట్ట కాల్చుకుంటున్నాను. గుంటూరు నుంచి బస్సు వచ్చి, దించేవాళ్లను దించి, ఎక్కించుకునే వాళ్లను ఎక్కించుకుని వెళ్లిపోయింది. ఆ బస్సు అటు వెళ్లడంతోనే గుంటూరు వెళ్ళే బస్సు వచ్చి నిలిచింది. దిగేవాళ్లు దిగుతున్నారు, ఎక్కే వాళ్లు యెక్కుతున్నారు. నాకా బస్సులో జానకమ్మలాగా ఒక స్త్రీ కనిపించింది. అదాటుగా చూడటంవల్లనేమోననుకుని బస్సు దగ్గిరకు వెళ్లి చూశాను. నిజంగా జానకమ్మే! నా ప్రాణం లేచి వచ్చింది. "ఎక్కడికి ప్రయాణం తల్లీ?" అని అడిగాను. ఆమె నన్నుచూసి "ఆయనగారు కూడా వున్నారు. యిద్దరం గుంటూరు పెళ్ళికి వెళుతున్నాం బాబాయ్!" అన్నది. "యీ పూటకు యిక్కడ దిగి యిద్దరూ భోజనం చేసి వెళ్ళ"మన్నాను.

"అల్లుడూ, కూతురూ మీ యింటికి ఎలా రాకుండా వుంటారులే బాబాయ్! వచ్చేటప్పుడు తప్పక వస్తాం!" అన్నది. యింతలో బస్సు కదిలింది. నేను పొలం వెళ్లిపొయ్యాను.

మూడవరోజున జానకమ్మ చెప్పిన ప్రకారం దంపతులిద్దరూ మా వూర్లో దిగి మా యింటికి వచ్చారు. ఆ రోజల్లా మా యింట్లో వుండి, మర్నాడు వెళ్లిపొయ్యారు.

మాకు పాడిలేదు. గేదె యెండిపోయింది. వారు వచ్చినప్పుడు వారికి వడ్డించిన పెరుగూ అదీ సరయింది కాకపోవడంవల్ల కించపడుతూ, జానకమ్మతో మాట సామెతగా "మాకు పాడిలేదు తల్లీ! గేదె సూడిది. మజ్జిగ నీళ్లకోసం యిబ్బందిపడుతున్నాం" అన్నాను.

అందుకామె "మాకు రెండు గేదెలు యిస్తున్నాయ్! మీ గెదె యీనిందాకా ఒకదాన్ని తోలుకొచ్చుకో బాబాయ్!" అన్నది.

"ఎందుకులే తల్లీ! యెవరో కాసిని పొస్తూనే వున్నారు. అవే సరిపెట్టుకుంటున్నాం" అని చెప్పాను.

అంతటితో జానకమ్మ వూరుకుందా! వారు వెళ్లిన మూడవ రోజుకల్లా పాలేరు చేత గేదెను మా యింటికి తోలనే తోలింది. మా గేదె యీనిందాకా వుంచుకుని తర్వాత వారి గేదెనూ, దూడనూ వారింటికి తోలి వచ్చాను. ఆ రెండు మాసాలూ యిబ్బందిపడకుండా సుఖంగా తాగాం.

మా పరిచయం బాంధవ్యంగా మారింది. రాను రాను మా రెండు కుటుంబాలకూ ఎంతో ఆత్మీయత యేర్పడింది. మా యిళ్లల్లో యెవరింట్లో యే కాస్త పని వచ్చినా రెండోవారు లేకుండా జరగదు. నాకు ఆడపిల్లలు లేని కొరత తీర్చాడు భగవంతుడు. ప్రతి పండక్కూ జానకమ్మను మా యింటికి తీసుకొస్తున్నాను.

✡

పొలం పనులు అట్లే లేకపోవడంవల్ల ఒకరోజు ఉదయం నేను మా యింటివసారాలో కూర్చుని భాగవతం చదువుతున్నాను. రామకోటయ్యగారి పాలేరు వచ్చి "మిమ్మల్ని రామ కోటయ్యగారు యేగిరం పిలుచుకు రమ్మన్నారండీ!" అన్నాడు.

"అంత అర్జంటైన పనేమిటి?" అని అడిగాను.

"అదేంటో గొడవగా వుందండి?" మిమ్మల్ని యంటపెట్టుకుని తీసుకురమ్మన్నారండీ, రామకోటయ్యగారు!" అన్నాడు పాలేరు.

నేనూ, పాలేరు వెంటనే భోజనాలు చేసి బయలుదేరాం. పెదపాలెం చేరేటప్పటికి మధ్యాహ్నం రెండు గంటలైంది. జానకమ్మగారి యింటికి వెళ్లేసరికి పిల్లలు కనిపించారుగాని, భార్యాభర్తలు కనిపించలేదు. "మీ అమ్మా నాన్న ఎక్కడికి వెళ్లారని అడగ్గా, "మా అమ్మ యింట్లో పడుకున్నది. మా నాన్న ఎక్కడికో వెళ్లాడు" అని చెప్పారు.

పాలేరు నీళ్లు తెచ్చి యివ్వగా, కాళ్లు కడుక్కుని యింట్లోకి వెళ్లాను. జానకమ్మ ఒక మూల చాపమీద పడుకుని వున్నది. దగ్గిర పెద్ద పిల్ల కూర్చుని వున్నది. ఆమె కళ్లు దించుకు పోయినవి. ఎన్నాళ్ల నుండో అన్నం తిన్నట్లుగా కనిపించింది.

"అమ్మా! తాతయ్య వచ్చేడే" అని పిల్ల చెప్పగా జానకమ్మ లేచికూర్చుని, నన్ను చూచి కంటతడి పెట్టుకుంది.

"యిదంతా ఏమిటమ్మా?" అని అడిగాను.

"ఏముంది! ఏమీ లేదు బాబాయ్!" అన్నది జానకమ్మ.

"నాకు చెప్పకపోతే ఎవరికి చెప్పుతావు తల్లీ!" అని గుచ్చిగుచ్చి అడిగిన మీదట చెప్పింది.

"విలువలేని బతుకు బతికి దేనికి బాబాయ్! యిన్ని యేళ్లు వచ్చినా తిట్లు పడటం తప్పలేదు. మొన్న నానా మాటలు అన్నారు" అన్నది.

"ఆయన అనేవాడు కాదే! అంతకోపం ఎందుకొచ్చిందమ్మా!" అని అడిగాను.

"నేనేమి అనలేదు బాబాయ్! ఆయన చెప్పిన పని చెయ్యలేదట!" అన్నది.

"ఆయన చెప్పిన పని యేమి చెయ్యలేదు నువ్వు?" అని అడిగాను.

"ఆ రోజున నిజంగానే చెయ్యలేదు బాబాయ్! ఆయన మీద నాకు కోపం రగిలిపోతున్నది. అసలు సంగతేమిటంటే మా తోడికోడలు గారిది పక్క యిల్లని నీకు తెలుసుగా! మొన్నొక రోజున యిద్దరి మధ్య వున్న దొడ్డి దడి పడిపోవడంవల్ల, మా గేదె పోయి వాళ్ల చెట్ల పాదు మేసిందని మా తోడికోడలు మమ్మల్ని తూరుపారపట్టడం ప్రారంభించింది. మేము పచ్చగా వున్నామని అసలే మేమంటే వాళ్లకు కడుపుమంట! మునుపొకసారి మా కోళ్లు వాళ్ల దిబ్బ చిమ్మేసినైయ్యని, అప్పుడట్లాగే తిడితే నేను వూరుకున్నాను. యెందాకని వూరుకునేది. నేను వెళ్లి జ్ఞానం లేని పశువు, మీ చెట్ల పొదని దానికేం తెలుసు! అని కలగజేసుకున్నాను. పెళ్లాన్ని వెనకేసుకొని మా మరిది వచ్చి నన్ను నానా మాటలు అన్నాడు. నేను బుద్ధి తక్కువ దాన్నట! అట్లా అతడు కూస్తున్నా, యీయన వింటూ యేమీ కలుగజేసుకోలేదు. బెల్లం కొట్టిన రాయిలా వూరుకున్నాడు. యిక ఎవరు యింటిమీదికి వచ్చినా అట్లా వూరుకునే వారేగా బాబాయ్!

"యిటువంటి విషయాల్లో గూడా మగవారు కలగజేసుకోకపోతే అవతలవాళ్లకు ఆడది యెంత లోకువైపోతుంది బాబాయ్! తమ్ముడుచేత అనిపించింది గాకుండా పైగా తానుగూడా తిడతాడా. ఇక యెందుకు యీ బతుకు బతికి బాబాయ్!" అని చెప్పింది జానకమ్మ.

ఆమె యీ మాటలు చెపుతూ వుండగా ఆమె కళ్లవెంట నీళ్ళు కారుతూనే వున్నవి. ఆమె స్థితిని చూసి నా గుండె నీరయింది. లోలోన బాధపడ్డాను. "మామ్మవు కదు! భార్యభర్తలు అవి వున్నాక మాట పలుకు రాకుండా వుంటుందా తల్లీ. యెవరివల్ల పొరపాటున్నా అవన్నీ సర్దుకుపోవాలి. ఎలుకనుంచి ఇల్లు చిచ్చు పెట్టుకున్నట్లు ఎవరి నుంచో మీరిట్లా కీచులాడు కోవడం బాగాలేదు. ఎట్లా చిక్కిపొయ్యావు. యెన్ని రోజులైందమ్మా! అన్నంతిని?" అని అడిగాడు.

"నాలుగు రోజులనుంచి అన్నం తినడం లేదు తాతయ్యా!" అని చెప్పింది పెద్ద పిల్ల.

"నేను తింటే యెవరికి, తినకపోతే యెవరికి బాబాయ్! ఇన్నాళ్లబట్టి తినకుండా వున్నా, నువ్వు తిన్నావా? తినలేదా? అని ఎవరైనా పలకరించిన వాళ్లున్నారా బాబాయ్! నేను చచ్చినా బ్రతికినా ఆయనకేమీ అవసరంలేదు" అన్నది జానకమ్మ.

"నీదంతా పిచ్చి వూహతల్లీ! నిన్ను గురించి ఆయనకేమీ పట్టకపోతే నన్నెందుకు పిలిపిస్తాడు?" అని సర్ది చెప్పాను.

ఇంతలో రామకోటయ్యగారు గొడ్ల సావిట్లో వుండి పిలుస్తున్నారని కబురు రాగానే, నేను లేచి సావిట్లోకి వెళ్లాను. రామకోటయ్యగారు అక్కడ మంచం మీద కూర్చుని వున్నాడు. సందె పడింది. పాలేరు బుడ్డాడు అప్పుడే పొలం నుంచి పశువులను తోలుకువచ్చి సావిట్లో ఎక్కడ కట్టేసేవి అక్కడ కట్టేస్తున్నాడు. రామకోటయ్యగారు నన్ను చూచి "రాండి! మీ కుమార్తెగారు ఏమైనా దారికి వచ్చిందా?" అని చిరునవ్వుతో అడిగాడు.

నేను ఆయన సరసన మంచం మీద కూర్చుని "ఎలా దారికొస్తుందండి! పెద్దవాళ్లయి సంసారంలో కష్టసుఖాలు యిద్దరూ సమంగా పంచుకుంటున్న ఈ యీడులో కూడా మీరు మాటలంటే నిజంగా మానుషంగల ఏ స్త్రీ సహిస్తుంది చెప్పండి?" అన్నాను.

"అదికాదండీ! మనిషిని ఎదిరిస్తే యెటువంటి వాళ్లకైనా కోపం వస్తుందంటారా? రాదంటారా? అత్తమీద కోపం దుత్తమీద చూపించినట్టు యెక్కడి కోపమో నా మీద చేపిస్తే యెట్లాగు? మొన్న తోడికోడళ్లు పొట్లాడుకుంటుంటే మా తమ్ముడు కూడా కలుగజేసుకున్నాడు. వాడసలే పనికిమాలిన వాడు. అంతా పోగొట్టుకుని అన్నిటికీ సిద్ధంగా కూర్చున్నాడు. నేను కూడా కలగజేసుకుంటే రగడ పెరిగిపోతుందని వూరుకున్నాను. ఆవిడకు నేను గూడా పోట్లాటకు వెళ్లలేదని నా మీద కోపం!" అన్నాడు.

"సరేలెండి! యేదోకోపం వచ్చి మీరన్నారుకోండి. పోనీ యిన్ని రోజులనుంచి అమ్మాయి అన్నం తినకుండా వుంటే మీరు యేమైనా తినమని అనగలిగారా? ఆడవాళ్ల మనసు చివుక్కుమంటే ఏముంది. తెగించి ఏ అఘాయిత్యమైనా చేసుకుంటే అప్పుడేమనుకుంటే ఏమిలాభం? యిప్పుడైన మీరు వెళ్లి లేపి అన్నం తినమని చెప్పండి!" అన్నాను.

"మీరు చెప్పారుగా లేస్తుందిలెండి! అందుకే మిమ్మల్ని పిలిపించాను" అన్నారు రామకోటయ్యగారు.

"అబ్బే నేను చెబితే వినే స్థితిలో లేదు. మీరు పిలవంది ఏం లాభం లేదు. అన్న వారికి మీకే ఇంత యిదిగా వుంటే, పడ్డదానికి యింకెంత కష్టంగా వుండాలి. మీరు పిలిస్తేనే గాని ఆమె కోపం తగ్గేటట్టు లేదు" అని యెంతో దూరం చెప్పి ఆయనచేత జానకమ్మను పిలిపించాను. తర్వాత జానకమ్మకు చెప్పవలసిన మాటలు చెప్పాను. ఆమె లేచివచ్చి వంట చేసింది. ఈ నాలుగు రోజులబట్టి ఏదో పెద్ద పిల్లే వుడకేస్తున్నదట.

ఆ రాత్రి జానకమ్మ భర్తకీ, నాకూ స్నానానికి నీళ్లు తోడి ఇద్దరికీ వడ్డించింది. మా భోజనాలయ్యాక ఆమె తింటుందో తినదోనని దగ్గర వుండి ఆమె చేత గూడా తినిపించాను.

రెండు రోజుల వరకు నన్ను బలవంత పెట్టి యింటికి వెళ్లనివ్వలేదు. భార్యభర్తలు లక్షణంగా మళ్లీ ఎప్పటిలాగా యింటి వ్యవహారాల్లో ఒకళ్లని ఒకళ్లు కలబలుక్కుంటున్నారు. ఆ మూడవ రోజున తొందర పనులున్నవని చెప్పి ఇంటికి వచ్చేశాను.

✡

నాకు ముగ్గురు కొడుకులు. పెద్ద వాళ్లిద్దరికీ భార్యలు కాపురానికి వచ్చారు. వాళ్లకు సంతానం గూడా. మూడోవాడి పెళ్లి అయిందిగానీ, భార్య యింకా కాపురానికి రాలేదు. మాకు వ్యవసాయమే జీవనం. స్వంత పొలం వున్నది ఒక ఎకరమే అయినా ఐదారు ఎకరాలు

కవులుకు చేస్తాం. నా భార్యకు, కోడళ్లకూ ఆడవాళల్లో యింత వరకు పొరుపులు ఏమీ లేవు. మూడోవాడి పెళ్లికి చేసిన ఋణం మాత్రం కొద్దిగా వున్నది. అట్లాగే సంసారం నెట్టుకొస్తున్నాము.

ఆ రోజున పెద్దవాడూ, చిన్నవాడూ పొద్దునే లేచి పడమటి పొలం వెళ్లారు. రెండోవాడు బండి కట్టుకుని తెల్లవారు జామునే బాడిక్కు వెళ్లాడు. నేను సద్దెన్నం తిని మాగాణి కాడికి వెళ్లాను. వర్షం పడడంవల్ల నేలంతా రొచ్చురొచ్చుగా వున్నది. ఎవరో కుర్రాళ్లు గనేల కలుగులో యెండ్రకాయలు పడుతున్నారు. మా పొలం పక్క బోదెకాలువ దగ్గర చేపలకోసం కొంగలు గుంపులు గుంపులుగా వాలినవి. పైరు, పొట్టకారుకు వచ్చింది. పొలం నలుమూలలా తిరిగి చూశాను. యీ సమయంలో యేదైనా ఎరువువేస్తే బాగుంటుందని ఆలోచిస్తున్నాను. యింతట్లో జానకమ్మగారి పాలేరు అక్కడకు వచ్చి "మిమ్మల్ని జానకమ్మగారు పిలుసుకురమ్మన్నారు" అని చెప్పాడు.

"ఏం! మళ్లా భార్యాభర్తలేమన్నా కీచులాడుకున్నారా?" అని అడిగాను.

"అసుమంటిదేమీ లేదండీ! యెందుకో మిమ్మల్ని దబ్బున పిలుసుకురమ్మన్నారు" అన్నాడు.

ఆపర్న యిద్దరం యింటికి వచ్చాం! నాకు చూస్తే తొందర పనులున్నవి. మాగాణికి ఎరువు వెయ్యాలి. అదిన్నీగాక ఆ సంవత్సరం మిరపతోటకు తెగులుపడ్డది. గుంటూరు వెళ్లి మందుతెచ్చి చల్లాలి. యివన్నీ మా వాళ్లకు తెలియవు. నేను చెయ్యవలసిందే! అయినా ఎందుకు పిలిపించారో అన్న ఆదుర్దా కొద్ది యీ పనులు ఆపుకొని భోజనాలు కానిచ్చి యిద్దరం బయలుదేరాం. పొద్దున వర్షం పడడంవల్ల దారంతా బురదగా వున్నది. కొంతదూరం వెళ్లాక మళ్లా వాన పట్టుకుంది. ఎండకు ఎండి, వానకు తడిసి మా శరీరాలు చేవతేలినై, యిటువంటి వానలు యేం లెక్క! వానలోనే ప్రయాణం సాగించాం. వడ్లపూడి చేరేసరికి వాన వెలిసింది. అక్కడ కాలువ దాటాలి. వూరుని ఆనుకుని వున్న కాలవ దగ్గరికి వచ్చాం, బల్లకట్టు అద్దరిని వున్నది. తడిసిన బట్టలు పిండుకుని బల్లకట్టుకోసం కాలవకట్ట మీద నిరీక్షిస్తున్నాం. మాతోపాటు నలుగురైదుగురు బల్లకట్టుకోసం వేచివున్నారు.

అవతల ఒడ్డునుంచి బల్లకట్టు జనాన్ని యెక్కించుకుని కదిలింది. జనం పిక్కట బిర్రుగా వున్నారు. అందులో యెవరో బైరాగి వెంట ఒక కుక్కతో గూడా బల్లకట్టు ఎక్కాడు. ఇంకా ఎవరో రెండు మేకలను గూడ యెక్కించారు. బల్లకట్టు మధ్యకు వచ్చేసరికి యెట్టాపడ్డదోగాని యెవరో పిల్లకాలువలో పడ్డది. పడి మునకలు వేస్తూ కొట్టుకెళ్లుతున్నది. అందులో, ఎక్కిన జనమంతా గల్లంతుగా ఆహాకారాలు చేయడం మొదలుపెట్టారు. ఆ పిల్ల తల్లో ఎవరో శోకాలు పెట్టడం మొదలుపెట్టింది. అంతా చూస్తున్నారే కాని ఆ పిల్లను రక్షించడానికి యెవ్వరు సాహసించలేదు. అందులో కాలవ నిండుగా పారుతున్నది. పిల్ల పది గజాలు దూరం కొట్టుకెళ్లింది. నాకు యీతవచ్చు. చిన్నప్పుడు పిల్లలమంతా పందాలు వేసుకుని మా చెరువులో యీదేవాళ్లం. ఆపర్న నేను వెనకా ముందూ చూడకుండా నీటిలో వురికి

యీదుకుంటూ ఆ పిల్లను ఒడ్డుకు తీసుకొచ్చాను. యింతలో బల్లకట్టు కూడా యివతల ఒడ్డు చేరింది. ఆ పిల్ల తల్లి ఏడుస్తూ మా దగ్గరికి వచ్చింది. “మీ బిడ్డకేమీ పరవాలేదు. ఏడవబోకమ్మా!” అని చెప్పాను. మా చుట్టూ అంతా మూగారు. వెంటనే తియ్యటంవల్ల పిల్ల నీళ్లు కూడా ఎక్కువ తాగలేదు. దిమ్మరపోవడం వల్ల ఐదు నిమిషాల వరకూ పలకలేదు. తరువాత కళ్లు విప్పి చూసి లేచి కూర్చుంది. అప్పుడు ఆ తల్లి పడ్డ సంతోషానికి మేరలేదు. వాళ్లది పెదపాలెమట. పెనమాక పుట్టింటికి చూచి రావటానికి వెళ్లుతున్నదట! నగలూ అవీ ఎవరో కలవాళ్లుగానే వున్నారు. పిల్లకు ఎనిమిది, తొమ్మిదేళ్లుంటవి. ఆమెకు యీ పిల్ల ఒక్కతే సంతానమట! “నీవల్ల మా బిడ్డ బ్రతికింది నాయనా!” అని తల్లి ఎంతో దూరం నన్ను పొగిడింది.

కుక్కను ఎక్కించినందుకు బల్లకట్టువాణ్ణి ఎక్కినందుకు బైరాగివాణ్ణి అంతా తలోమాట అన్నారు. అసలు యేమి జరిగిందంటే బల్లకట్టు కొంతదూరం వచ్చేసరికి కుక్క బైరాగి చేతులో తాడు గుంజుకుని మేకలమీదికి దూకిందట! కుక్క తమను ఎక్కడ కరుస్తుందోనని జనమంతా పత్తిగించుకున్నారట! అసలు బల్లకట్టే మునిగిపోవలసింది. కాస్తలో ప్రమాదం తప్పిందని అంతా సంతోషించారు.

బిడ్డలేచి కూర్చోగానే తల్లి ట్రంకుపెట్టి తీసి పొడిబట్టలు కట్టి కాలవ ఒడ్డున ప్రయాణికుల కోసం వేచివున్న గుఱ్ఱంబండి మాట్లాడుకుని వెళ్లిపోయారు. నా వెంట వచ్చిన పాలేరు, నేను బల్లకట్టెక్కి అవతల ఒడ్డున చేరుకుని సాయంత్రానికి పెదపాలెం చేరాం.

మేము వెళ్లేసరికి హాల్లో జానకమ్మ పెసలు బాగుచేస్తున్నది. రామకోటయ్యగారు లేడు. ఆమె ముఖం చిన్నబోయి వున్నది. మనిషి ఏమీ వుషారుగాలేదు. నన్ను చూసి ఆమె లేచి కాళ్లకు నీళ్లు తెచ్చియిచ్చింది. నేను కాళ్లు కడుకున్న తర్వాత మంచం వేసినన్ను కూర్చోబెట్టి ఆమె చెప్పింది. “యీయన లేనిపోని కక్షలు తెచ్చి పెట్టుకున్నాడు బాబాయ్! మాగాణికి నీళ్లు పెట్టడంలో తగాదాలు వచ్చి, మా పాలేరు అవతలవాళ్ల పాలేరు కొట్టుకున్నారు. వాళ్లు కొట్టుకుంటూ వుంటే తరువాత యీయన వెళ్లి సర్దాడట కూడా! ముందు వాళ్ల పాలేరే మా పాలేరును కొట్టాడట! తర్వాత యిద్దరూ కొట్టుకున్నారు.

యిద్దరికి దెబ్బలు తగిలినై. అవతలివాళ్లేం చేశారు. ఈయన్నీ మా పాలేర్ను కలిపి ఛార్జి పెట్టారు. తర్వాత ఈయన వాళ్ల నలుగురు అన్నదమ్ముల్నీ పాలేరునూ కలిపి ఛార్జీ పెట్టాడు. అంతా నానా గొడవగా వున్నది. యీ ఛార్జీలూ పాడు యెప్పుడూ ఎరగం బాబాయ్! అవతల గోరంట్లవాళ్లు సామాన్యులుకాదు. నలుగురు అన్నదమ్ములు, అంగబలం, అర్థబలం కల వాళ్లు! వాళ్లంటే గ్రామంలో అంతా దడుస్తారు. వాళ్లసలే కక్ష మనుషులు. వెనకాముందూ లేకుండా దేనికైనా సిద్ధపడే రకం! కొట్లాటలు జరుగుతాయని వూరంతా పుకారుగా వున్నది బాబాయ్! యీయన రేత్రనక పగలనక యెప్పుడుబడితే అప్పుడు పొలం నుంచి వస్తూ

వుంటాడు. వాళ్లు ఎప్పుడేం చేస్తారో! అని నాకు భయంగా వున్నది. రాత్రిళ్లు నిద్రపట్టడం లేదు బాబాయ్!" అని చెప్పింది.

నేను వాళ్లకంటే ధనవంతుణ్ణి కాదు! వాళ్ల కంటే పలుకుబడి కలవాణ్ణి కాదు! యీ తగాదా తీర్చడం నావల్ల నేమవుతుందని నన్ను పిలిపించినట్లు! పిచ్చి జానకమ్మ! ఆమెకు నాయందున్న ప్రేమ అటువంటిది. అప్పుడు నేను "అట్లయితే కక్షలు లేకుండా రాజీపడడం మంచిదమ్మా" అన్నాను.

ఇంతట్లో రామకోటయ్యగారు వచ్చారు. "ఏమిటండీ! యీ తగాదాలు? ఛార్జీల దాకా వచ్చింది" అన్నాను.

"రానివ్వండి ఏంచేస్తాం! ముందు వాళ్ల పాలేరే దెబ్బలాటకు దిగాడు. తర్వాత యిద్దరూ కలబడ్డారనుకోండి! దెబ్బలు మా పాలేరుకే ఎక్కువ తగిలినై. మేము ముందు ఛార్జీ పెట్టవలసింది. పెట్టకుండా వూరుకుంటే వాళ్లే ఛార్జీ పెట్టారు. తర్వాత మేమూ పెట్టాం. నిజానిజాలు కోర్టులోనే తేలుతై" అన్నాడు రామకోటయ్యగారు.

"ఎవరిది నిజమో ఎవరిది అబద్ధమో వాళ్లు చూడరు కదా! యీ కక్షలన్నీ దేనికి? గానీ రాజీపడండీ!" అని చెప్పాను.

"వాళ్లసలే మంచివాళ్లు కాదు. వాళ్లతో మనకు తగాదాలు దేనికి? రాజీపడండి!" అని వాపోయింది జానకమ్మ.

"మనమేం తగాదాకు కూర్చున్నాం? ముందు తగాదాకు కాలు దువ్వింది వాళ్లు! కానీ వెధవలు! నన్నేం చేస్తారో చూస్తాను! నేను మాత్రం ఛస్తే వాళ్లను రాజీ అని ప్రాధేయపడను" అంటూ రామకోటయ్యగారు చావిట్లోకి వెళ్లిపోయాడు.

"ఇదేదో రాజీ చెయ్యకపోతే కక్షలు పెరిగి కొంపలంటుకుంటై బాబాయ్! అంతా పుల్లలు వేసేవాళ్లేగానీ తగాదా సర్దేవాళ్లు ఒకళ్లూ కనిపించలేదు. అయినవాళ్లకు మా మీద యీ కేసు రావడం సంతోషంగా వుంది. మేము పచ్చగా వుండిపొయ్యామని అసలే మేమంటే వాళ్లకు సరిపడదు. నువ్వుకాకపోతే యింకా మాకెవరు బాబాయ్! నువ్వు నిలబడి యెట్లాగో రాజీ చెయ్యాలి!" అని కంటతడిపెట్టింది జానకమ్మ.

ఆ గ్రామంలో పలుకుబడి గలవాడు మునసబుగారు. ఆయన పేరు గోపాలకృష్ణయ్యగారు. యీలోగా ఒకసారి ఏదో విషయంలో ఆయనతో మాట్లాడాను. మర్నాడు ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని రామకోటయ్యగారికి పరిచితుడైన పొరిగింటి ఆసామిని తోడుచేసుకుని గోపాలకృష్ణయ్య గారింటికి వెళ్లాం. మేము వెళ్లేసరికి ఆయన వీధి అరుగుమీద దంతధావనం చేసి అప్పుడే ఇంట్లోకి వెడుతున్నాడు. మేము వసారాలో బల్లమీద కూర్చున్నాం. ఆయన బట్టలు వేసుకువచ్చి, "యేం పనిమీద వచ్చారని" అడిగాడు. యిట్లా వీళ్లు ఛార్జీలు పెట్టుకున్న

సంగతి చెప్పి "మేము రామకోటయ్యగారి తాలూకు వాళ్లం. మీరు పూనుకుని తగాదాలు లేకుండా రాజీ చెయ్యవలసిందని" కోరాను.

మునసబుగారు నేను చెప్పిందంతా విని "వీళ్ళు ఛార్జీలు పెట్టుకున్న సంగతి నేను విన్నాను. మీరు రాజీ చెయ్యమనడం బాగానే వున్నది గాని అవతల గోరంట్లవాళ్లు పెడసరం మనుషులు! చెబితే వినే బాపతుకాదు! అయినా పిలిపించి చెప్పి చూస్తాను. యిప్పుడు పనిమీద వెళుతున్నాను. సాయంత్రం పిలిపించి మాట్లాడుతాను. మీరు రేపు ఉదయం రావలసిం"దని చెప్పాడు.

ఆ మర్నాడు ఉదయం మళ్లీ మేమిద్దరం మునసబు గారింటికి వెళ్లాం. ఆయన మమ్మల్ని చూడ్డంతోనే "నేను ముందే చెప్పలేదటయ్యా! వినేరకం కాదని! రాజీమాట యెత్తేసరికి వాళ్లు మా పాలేరును చితగ్గొట్టి పైగా ఏమీ ఎరుగని మా అన్నదమ్ములు నలుగుర్నీ కలిపి ఛార్జీ పెట్టాడు. కానివ్వండి? యెంతవరకు పోద్దో చూద్దాం! అని ధిరసాలు తీశారు. తగాదాలు దేనికని ఎంతో దూరం చెప్పాను. వాళ్లు వినలేదు" అని చెప్పాడు.

మేము చేసేదిలేక తిరిగివచ్చి జానకమ్మతో ఆ విషయం చెప్పాం. ఆమె చింతకు మేరలేదు. గ్రామంలో గూడా యిద్దరు ముగ్గురు వాళ్లతో తగాదా పెట్టుకోవడం మంచిది కాదని నాకు చెప్పారు. వాళ్లు మునసబుగారి మాట కూడా వినలేదు. యిది యేవిధంగా రాజీ అవుతుందా! అన్న ఆందోళనే పట్టుకుంది నాకు. ఆ సాయంత్రం ఒకళ్లతో యీ విషయమే మాట్లాడి పై వీధినించి వస్తున్నాను. దారిలో ఒక స్త్రీ కనబడి నన్ను పలకరించింది. ఆమెను నేను గుర్తుపట్ట లేదు. నా ధ్యాసలో నేనున్నాను. ఆమె తన వెంటవున్న పిల్లతో "తాతయ్యకు నమస్కారం చెయ్యమ్మా!" అంటూ "మర్చిపొయ్యావా చిన్నయ్యా? మొన్న కాలువలోపడ్డ యీ పిల్ల ప్రాణాలు కాపాడావు! నువ్వు వుండబట్టి మా బిడ్డ మాకు దక్కింది" అన్నది.

అప్పుడు నేను "క్షేమంగా వున్నారా అమ్మా! అదే సంతోషం!" అన్నాను.

ఆమె "మా యింటికి రా చిన్నయ్యా!" అంటూ నన్ను వెంటబెట్టుకుని వాళ్ల యింటికి తీసుకువెళ్లింది. ఆశ్చర్యం! అది రామకోటయ్యగారి పైన ఛార్జీ పెట్టిన గోరంట్ల వారి యిల్లు. ఇన్నాళ్లబట్టి ఆ గ్రామం కొట్టిన పిండిలా వస్తూపోతూ వుండడంలో ఏ యిల్లు ఎవరిదో నాకు తెలుసు! వాళ్లది పెద్ద భవంతి. ఆమె లోనికి తీసుకువెళ్లి కుర్చీవేసి యెంతో మర్యాదచేసింది. వాళ్ల అన్నదమ్ముల్లో యెన్నోవాడోగాని ఆమె భర్త కామాలు! ఆమె ఆయనతో "మొన్న మన అమ్మాయి కాలవలో పడ్డప్పుడు తీసి కాపాడింది ఈయనగారే! దేవుడులా అడ్డుపడ్డాడు" అంటూ నన్నాయనకు పరిచయం చేసింది. అప్పటి నా సంతోషానికి మేరలేదు. ఆడబోయిన తీర్థమెదురైనట్లు వీళ్లతో గలిగిన యీ స్నేహానికి నాకు పెన్నిధి దొరికినట్లయింది. ఆయనగారు ఆప్యాయంగా నన్ను "స్వగ్రామం యేదండి? యీ వూర్లో బంధువులెవరైనా వున్నారా?" అని అడిగాడు.

"మాది కాజ. యీ వూళ్లో రామకోటయ్యగారు మా అల్లుడేనండి!" అని బదులు చెప్పాను.

"ఓహో అట్లానే!" అని ఆయన మందహాసం చేశారు. "ఏదో మీరు మీరు ఛార్జీలు పెట్టుకున్నారట! యిప్పుడు మనం ఆప్తులయ్యాం! ఇక మీకు మాకు తగాదా యేమిటండి?" అన్నాను.

ఆయన నవ్వి "మా అందర్నీ కలిపి ఛార్జీ పెట్టాడు కదండి మీ అల్లుడు!" అన్నాడు.

"అదే నేను చెప్పేది. యిదివరకు జరిగిందేదో జరిగిపోయిందనుకోండి! యీ స్నేహంలో ఇప్పుడు మనం ఒకళ్లమీద ఒకళ్లు యెలా చర్య తీసుకోగలం? మీ మీద మేమూ తీసుకోలేం, మా మీద మీరు తీసుకోలేరు!" అన్నాను.

"చిన్నయ్యగారికీ మనకూ తగాదా ఏమిటండి లేకపోతే!" అన్నదా యిల్లాలు భర్తతో.

రాజీ అయిపోయింది! ఆయన యింట్లో వున్న తమ్ముణ్ణి పిలిచి "వారికి మనకూ యెందుకొచ్చిన తగాదాలురా మన ఛార్జీ యెత్తి వెయ్యండి!" అని చెప్పి నాతో "మీరు కూడా మీ అల్లుడితో తన ఛార్జీ యెత్తి వెయ్యమని చెప్పండి!" అని చెప్పాడు.

అప్పటికి నా గుండె తేలిక పడ్డది. ఆమె ఆ పూట "మా యింట్లో భోజనం చేస్తేనే గాని వీల్లే"దని పట్టుపట్టింది. ఆయనగారు కూడా రానివ్వలేదు. ఆ పూట అక్కడ తృప్తిగా భోజనం చేసి సంతోషంగా బైటపడ్డాను. యింటికి వచ్చి జానకమ్మతో "రాజీ చేసి వచ్చానమ్మా" అని యీ కథంతా చెప్పేసరికి ఆమె ఆనందభరితురాలైంది. ఆ మర్నాడే యింటికి తిరిగివచ్చి ఆగిపోయిన పనులు చేసుకున్నాను.

✡

కొన్ని సంవత్సరాలు గడిచిపోయినవి. పెదపాలెం నాకు కొట్టిన పిండైంది. యిన్నాళ్లబట్టి మేము అక్కడకు వెళ్లడం, వాళ్లు యిక్కడకు రావడం యథాప్రకారం జరుగుతూనే వున్నది గానయితే మా యింట్లో ఒకళ్ళకు ఒకళ్ళకు సరిపడడం లేదు! అంతా ఉప్పత్తుల మారి సంసారం అయింది. ఆడవాళ్లు యే కాస్త పని దగ్గరా ఉప్పత్తులు పడి తగువులాడుకోవడం! పోనీ ఆడవాళ్లు అయితే ఎట్లయినా సరిపెట్టుకోవచ్చు. అది మగవాళ్ళకు కూడా వ్యాపించింది. వాళ్ళు గూడా వంతులు పడజొచ్చారు. ఒకళ్ళమాట ఒకళ్ళ మాటకు కలవడం లేదు. పోరు నష్టం పొందులాభం అన్నారు. వాళ్ళకు మాట కలవకపోవడంవల్ల పనంతా కుంటైపోతున్నది. ఒకరోజున గుంటూరు సరుకులు వేసుకెళ్లేటందుకు బాడుగవచ్చింది. నేను ఎవర్ని వెళ్ళమన్నా, వాడెళతాడని వీడు, వీడెళతాడని వాడు వంతులుపడి ఆఖరకు యెవరూ వెళ్ళలేదు. పొలం పనుల్లో గూడా యిట్లాగే వంతులుపడి జొచ్చారు. నేను చేసుకెళ్లేటందుకు పెద్దవాన్నైపోయాను. యిప్పుడు నాకు డెబ్బైయేళ్లు దాటై. వోపిక వుడిగిపోయింది. వెనకటిలాగా చాకిరీ చెయ్యలేను. యిదంతా యెందుకని నేను ఎవరి సోలడు వాళ్ళకు పోశాను. మాది ఐదుగదుల యిల్లు చెరి

రెండేసి గదుల్లో పెద్దవాడూ, రెండోవాడూ, చివరి గదిలో ముసలివాళ్లం మేమిద్దరం వుంటున్నాం. మూడోవాడు యింటిప్రక్క ఖాళీ స్థలములో వుమ్మడిమీదనే యిల్లేసుకుని వుంటున్నాడు. వున్న ఆస్తల్లా యిల్లు మాత్రమే! వున్న యెకరం పొలం మూడోవాడి పెళ్ళికి అయిన అప్పుకూ, తర్వాత వాళ్లు వుప్పుత్తులుపడి సరిగా పనిచెయ్యకపోవడంవల్ల అయిన బాకీకి సరిపోయింది. పొలం అమ్మి వాళ్లకు సరిపెట్టి వేశాం.

వాళ్ళు వేర్లు పడడంతోనే యెంతో శ్రద్ధగా ఒకళ్ళకంటే ఒకళ్ళు పోటీలుపడి పనులు చేసుకోవడం మొదలుపెట్టారు. అదివరకు పాలికి చేస్తున్న పొలం పెద్దవాడూ, రెండోవాడూ చెరిసగం తీసుకుని చేస్తున్నారు. ఆ పొలం గాకుండా యింకా చెరికాస్త పొలం గూడా కౌలుకు తీసుకుని చేసుకుంటున్నారు. మూడోవాడు వ్యవసాయం లేకుండా నంబూరు నూలు మిల్లులో అరవై రూపాయల జీతంమీద నౌకరుగా చేరాడు. వాళ్ళు అట్లా సంసారం నడుపుకోవడం సంతోషమేగాని మా ముసలివాళ్ళ సంగతి వాళ్ళకేం పట్టలేదు. అయ్యో! వీళ్ళెట్లా జీవిస్తారా! అన్న ఆలోచన గూడా వాళ్ళకు కలగలేదు. బండియెడ్లూ పెద్దవాడు ఖండించుకున్నాడు. గేదెను మాత్రం మాకు వదిలారు. యెడ్ల సిగమార్లు, మోకులు, నులక పేనడం మొదలైన చిన్న చిన్న పనులు చేసుకుని మేమిద్దరం కాలం వెళ్ల బుచ్చుతున్నాం.

ఆ రోజున జోరున వాన కురుస్తున్నది. బైటికి వెళ్ళేటందుకు వీల్లేకపోయింది. నా భార్య రెండో వాడి యింటికి వెళ్లి, కోడల్ని "తవ్వెడు గింజలు బదులివ్వమన్న"దట! "అయ్యో! మా దగ్గర యెక్కడ వున్నై! మాకే యివాళ గింజల్లే"వంటూ, ఆవలకువెళ్ళి "ప్రేమగల కొడుకుల దగ్గర తెచ్చుకోరాదు?" అన్నదట మెల్లిగా. ఆ మాటలు యీవిడకు వినిపించినవి. అంటే తమ మీద లేకండా తతిమ్మా వాళ్ళ మీద ప్రేమగా వుంటామని వాళ్ళ వుద్దేశం. యీ వుద్దేశం ఒకళ్లేకే కాదు ముగ్గురికీ అంతే! ఆఖరకు పెద్దవాడింట్లో గూడా ఆ రోజున గింజలు పుట్టలేదు. అడగటం దండగని మూడోవాణ్ణి అసలు అడుగనేలేదు. యిరుగు పొరుగు యిళ్లలో యెక్కడో బదులడిగి తెచ్చుకుని ఆ రోజు గడుపుకున్నాం.

మర్నాడు తెరిపిచ్చింది. ఎవరో మోకువేసి పెట్టమనగా వసారాలో కూర్చుని వేస్తున్నాను. జానకమ్మ రెండెడ్ల బండి కట్టుకుని వచ్చింది. అప్పటికి మేము యేర్లుపడి దాదాపు ఇరవై రోజులైంది. ఆమె బండిదిగి లోనికవచ్చి "యేర్లు పడ్డారటకదు బాబాయ్?" అని అడిగింది.

"అవునమ్మా! యెట్లా తెలిసింది నీకు!" అన్నా నేను.

"మొన్న యీ వూరునించి యెవరో వస్తే అడగ్గా యీ సంగతులన్నీ చెప్పాడు. మరి మీ యిద్దరూ యెవరి దగ్గర వుంటున్నారు బాబాయ్!" అని అడిగింది.

"యెవరి దగ్గరా లేదు తల్లీ! మా అంతట మేము వుంటున్నాం" అని చెప్పాను.

"యీ పెద్దతనంలో మీ అంతట మీరేం వుండగలరు బాబాయ్? మా యింటికి వచ్చెయ్యండి!" అన్నది.

"యెందుకులే తల్లీ! వంట్లో సత్తువ సాంతం వుడిగిపోలేదు. కొద్దో గొప్పో యింకా చాకిరీ చెయ్యగలను. యేమీ దిగుల్లేదు" అన్నాను.

"అయితే మాత్రం కూతిరి యింట్లో వుండడం తప్పా బాబాయ్? నువ్వేమీ అనుకో వద్దుర"మ్మని యెంతో దూరం చెప్పింది.

నా కడుపున పుట్టిన కొడుకులు గూడా అంత మాత్రం మాట అనలేదు. "కాదులే తల్లీ! నువ్వు చూపిన ఆదరణకు సంతోషం!" అని చెప్పి ఆమెను పంపివేశాను. నేను కాదంటే మాత్రం జానకమ్మ వూరుకుందా! వాళ్లకు పండిన ధాన్యమల్లా పంపుతూ, మా యోగక్షేమాలు విచారిస్తూనే వుంది! ఆమె నాకు నిజమైన బిడ్డ!

✡

# రేగడి మిట్ట

**–తుమ్మల రామకృష్ణ**

నగరి కాలవంటీ ఎగబడి పెద్ద చెరువు కట్టమీది కొచ్చేసరికి నారప్ప గుండె గభీమంది. భుజాన వేలాడుతున్న చెనిగిపార తీసి కిందేసినాడు. తలకు చుట్టుకున్న పైగుడ్డ తీసి మొగం తుడుచుకున్నాడు. నీరెండ కండ్లమీద పడతావుంటే చెయ్యి అడ్డం పెట్టుకోని చెరువులోకి చూసినాడు. చెర్లో నీళ్లు కయ్యాలి కిందికిపోయినాయి. తూరుపు తట్టు తిరుక్కోని తూములు పక్క చూసినాడు.

మిట్ట తూములో సుక్క నీళ్లు రాలడం లేదు. గుంత తూములో జరుగులు రాల్తా వుండాయి. గుంత తూమెత్తితే వున్న కాసిన్నీళ్లూ నెల్దినాల్లో పూడ్చుకపోతాయి. కట్టకింద కయిలోళ్లు ఎవురో గుంత తూములో సూదిరాయి యేసేసినట్లుండాది. నీళ్లల్లో మునిగి గుంత తూములో సూదిరాయి పెరకడం ఎవునెబ్బ తరమూ కాదు. పదేళ్ల కిందట ఒకసారి ఇట్లే గుంత తూములో ఎవురో సూది రాయి యేసింటే నీరు కట్టి వెంకటప్ప నీళ్లల్లో మునిగి రాయి ఎత్తబోయి ఎంతపొద్దుకూ పైకి రాలేదంట. మాలపల్లి మాలపల్లంతా రెండు పొగుళ్లు రెండు రేతుర్లు చెరువు కట్టమీద గుండెలు బాదుకున్నిందంట. ఫలితం లేకపోయింది. చెరువు ఎండిపోయినాక ఒకరిద్దరు గుంత తూములోకి లాంతర్లు ఎత్తుకుపోయి చూస్తే ఏముందీ! ఏమీలేదు. వెంకటప్ప చెరువులో మునిగిన రోజు తలకు చుట్టుకోనుండిన ఎర్రటి అంగవస్త్రం దొరికిందంట.

ఇప్పటికీ నీరు కట్టి వెంకటప్ప కొడుకులు ఎవురైనా రైతులు ఏమన్నా అంటే – 'మీ వూరోళ్ల మూలంగానే మా నాయన సచ్చిపాయ' అంటూ వుంటారు. ఎప్పుడెప్పుడు విషయాలో నారప్పకి మతికొచ్చినాయి.

చాడకేసిన నాలుగు కయ్యలు దున్ని దుక్కి చేసుకొని నాటుకోకపోతే బతకడం కష్టం. సక్రమంగా పంట చేతికొచ్చి నాలుగేండ్లు కావస్తోంది. రోజు రోజుకి అప్పులు పెరిగిపోతు న్నాయి. పదేళ్ల కిందట పది కయ్యలుండేవి. పది కయ్యలు నాలుగు కయ్యలయినాయి. వడ్డీలకు వడ్డీలు కట్టలేక చివరకు కయ్యలు రాసిచ్చినాడు. నారప్ప గొణుక్కుంటూ చెరువు కట్ట దిగి పెద్ద కాలవ తట్టుకు పోతున్న జరుగునీళ్లను నగిరి కాలవకు మళ్లించి పార కడిగి భుజానికి తగిలించుకొని వచ్చిన దోవపట్టాడు.

రేగడి మిట్ట కాడికి వచ్చేసరికి నారప్పకు కాళ్లు గుంజినట్లనిపించి వేపచెట్టు నీడలో కూర్చున్నాడు. పక్క జోబీలోకి చెయ్యి పెట్టి తడిమి తుంట బీడి ఎత్తుకున్నాడు. ముట్టించి ఒక దమ్ము గట్టిగా లాగాడు. నోటి నిండుకు పొగలాగి వదిలాడు. ప్రాణం తేలిక పడినట్లని పించింది. తేరిపార జూశాడు.

రేగడిమిట్ట. పదేళ్ల కిందట ఉత్త పల్లేరు కంపలు, బొలుసు కంపలు.. ఎనుములు, గొడ్లు వూటాడేకి తోలేవాళ్లు. ఒకరిద్దరు జొన్నలు, దనాలు చల్లేవాళ్లు. అవి కూడా పండితే పండచ్చు. లేకుంటే లేదు. ఇప్పుడు రేగడిమిట్ట నవనవలాడుతూ వుంది. ఎర్రమనాయుడి చేతిలో బంగారం పండతా వుంది. ఒక తట్టు చెరుకుతోట. ఒక తట్టు మిరపతోట, ఇంకో తట్టు టమోటా చెట్లు. ఎవురికైనా ప్రాప్తముండాల. దేవుడి మాన్యం. ఇనాము భూములు ఎందుకూ పనికి రావనుకొని శేషమోళ్లు సద్ది నీళ్లకు దారపోసుకున్నారు. ఎర్రమనాయుడు తెలివిగా సొంతం చేసుకున్నాడు. ముందుగా బోర్ వేయించినాడు. ఎక్కడలేని వూటపడింది. నేలంతా సదరకట్టి కయ్యలు కట్టించినాడు. నాలుగంచులా కల్ల వేయించినాడు. నేల మొత్తం సాగవుతూ వుంది. కంటితో చూస్తే నోట్లో నీళ్లూరేటట్లుంది. పచ్చని పైరు చూసేసరికి నారప్పకి ప్రాణం పైకి లేసొచ్చింది. ఆనందంగా బీడీ కాల్చి పైకి లేశాడు.

"ఏం మామా... అబ్బుడే లేస్తివి" గంగనబోయుడు పలకరించాడు. నారప్ప ఆలోచన ల్లోంచి బయటకొచ్చి "యాట్నుంచిరా" అన్నాడు.

"మొర వంకలో నుంచి వస్తావుండాలే మామా" అంటూ గంగనబోయుడు సమాధాన మిచ్చాడు. "ఆడేం పనిరా" మళ్లీ ఎదురుప్రశ్న వేశాడు నారప్ప. గంగనబోయుడు వులుకు పలుకు లేకుండా నిలబడుకొన్నాడు.

"కొంపదీసి వంకలో సారాయి గీరాయి కాస్తా వుండారా... కొంపలంటుకు పోతా యంద్రా" నారప్ప హెచ్చరించాడు. గంగనబోయుడు ఒక నవ్వు నవ్వి మాట మారుస్తూ "ఇంతకూ నువ్వేం పని మీద వస్తివి మామా" అన్నాడు.

"ఏమీ లేదురబ్బా. ఎలకమాను మిట్ట కాడ నాలుగ్గుంతలు చాద కలిపినా. పద్దినాలుగా ఇంటికాడికి మడికాటికి నగిరి కాలవంటీ తిరగతా వుండా. కాలవంటీ సుక్క నీళ్లు సాగి రావడంలేదు. చెరువు కాటికి పోయి గుంత తూములో వచ్చే జరుగులు కాలవకి యెగ్గట్టినా సాగి కయిలో పడితే చాలు. కయ్య కల్సుకుంటాది. పొద్దంతా పోతా వుంది. కనుమరుగైతే చాలు ఎవుడో ఒగడు మడవ తిప్పేస్తాడు. సందకాడ మల్లా నారు పెరికేదానికి కూలోళ్లను పిలవాల. ఈ ముండనీళ్లు యెంతకూ సాగి రావడంలేదు" నారప్ప కడుపులోని అక్కసు వెళ్లగక్కాడు.

"చూడు మామా నేనో మాట చెపుతా వింటావా... అబ్బా అమ్మా అంటే చెర్లో నెల్దినాల నీళ్లు లేవు. ఇన్ని బాధలు పడి ఆ నాలుగ్గుంతలు నాటకుంటే ఏమి? నాటితివే పో... అదేమన్నా

పండతాదా! వానలు పడి మళ్లీ చెరువుకు సగానికో, ముక్కాల భాగానికో నీళ్లొస్తే తప్పా నీ చేతికి పంటొస్తాదన్న నమ్మకం లేదు. నా మాటిని ఎవురికన్నా నేల టమోటాల కిచ్చేయకూడదా! కూలీలు మిగల్తాయి. చేతుల కష్టమూ మిగుల్తుంది. నాలుగు దుడ్లు చేతిలో పడతాయి".

"నువ్వు చెప్పే మాట బాగనే వుందిరా గంగా... ఉన్న ఆ నాలుగ్గుంటలూ టమోటాల కిచ్చేసి ఏమి తినేదిరా..?" నారప్ప తన మనసులోని మాట బయటపెట్టాడు.

"నీ ఎర్రిగాని నాలుగు దుడ్లు చేతిలో వుంటే ఏది కావాలంటే అది నీ కాళ్లకాడికి నడిసొస్తుంది మామా" గంగనబోయుడు రహస్యం చెప్పినట్లు చెప్పాడు.

"నిజమే అనుకో.. రైతుగా పుట్టి రైతుగా బతుకుతూ సంచి చేతపట్టుకొని అంగడి కాడికి పోయి బియ్యం, బేడలు తెచ్చుకోవాలంటే తలకాయగొట్టేసినట్లుంటాదిరా" అన్నాడు నారప్ప.

"ఏమో మామా నీ మంచిగోరే చెపుతావుండా... బేరం పట్టక రమ్మంటే పట్టుకొస్తా. రేగడిమిట్టలో ఎర్రమనాయుడిది ఇరవై ఎకరాలు మాబూసాయిబు లీజుకు తీసుకున్నాడు. కావలి కంత నేనే చేసుకుంటూ వుండా. దున్నేది, దోకేది, నాటేది, చెత్త ఏరేది, సాలెగ బోసేది, కాలవ లెగేసేది, మందులు కొట్టేది అంతా వాళ్లదే. ఉత్తనేలే మనది. ఎకరాకు నాలుగు వేలిస్తారంట. చెప్పమంటే చెపుతాను.

ఆయప్పే వచ్చి మాట్లాడతాడు".

గంగనబోయుడు నారప్పకు డబ్బాశ సూపించాడు. నారప్ప ఆలోచనలో పడ్డాడు. నారప్ప ఆలోచనల్లోంచి తేరుకుని "ఈ లీజు వ్యాపారం సాయిబూలే చేస్తావుండారా.. లేక.." నారప్ప మాట నోట్లో ఉండగానే గంగనబోయుడు మొదలుపెట్టాడు.

"నువ్వీ కాలంలో పుట్టాల్సినోడివి కాదు మామా... దుడ్లు మామా దుడ్లు... టమేటాల్లో వేల్లువేల్లు చేతికొస్తావుండాయి మామా.. సాయిబూలేంది మనోల్లేంది... డబ్బుకి, వ్యాపారానికి కులము, మతము, జాతి ఇవేమీ వుండవు మామా.. అట్లాపోయి సూడు. ఎకరాల కెకరాలు వెనకూ ముందూ చూడకుండా కొనేస్తా వుండారు. ట్రాక్టర్లు పెట్టి దున్నిస్తా వుండారు. ఎక్కడికెక్కడో బోయి నార్లు తెచ్చి నాటిస్తావుండారు. పైగా మూన్నాళ్ల పంట మామా.. కండ్లు మూసి తెరిసే లోపల చెట్లు పూతకొచ్చేస్తాయి. చూస్తా వుండగానే పిందెలు, కాయలు, పండ్లు... అద్దో అట్లా సూడు ఒగదును ఇబ్బుడిబ్బుడు పూత కొస్తా వుంది. ఒగదును కోతకొచ్చింది".

గంగనబోయుడు నారప్పకు మాబూ సాయిబు టమేటా చెట్లు చూపించాడు. నారప్ప నోట్లోకి ఈగలు పుయ్యేది కూడా గమనించకుండా టమేటా చెట్లవేపే చూస్తూ నిలబడ్డాడు. "నేనొస్తా మామా" అంటూ గంగనబోయుడు పల్లెతోవ తొక్కాడు. నారప్ప మడి కయ్యలు దిక్కు అడుగులు వేశాడు.

నారప్ప మడి గెనాలమీద తిరగతా వున్నా నారప్ప మనసు రేగడిమిట్టకాడే వుంది. మాబూ సాయిబు టమేటా చెట్లు నల్లనీలాలు గక్కుతున్నాయి. పూత.. పిందె.. కాయ... కోతకొచ్చిన దోరకాయలు గుత్తులు గుత్తులుగా చెట్లలో యేలాడుతుండాయి. కాయల బరువుకి చెట్లు తలలొంచేసినాయి– ఆలోచిస్తూ నారప్ప ఇంటిముఖం పట్టాడు.

పదిగంటల బస్సు హారను కొట్టుకొంటూ పోయింది. నారప్ప ఇంటింటికి కాలుగాలిన పిల్లిలా తిరుగుతుండాడు. తొక్కిన గడపే పదిసార్లు తొక్కుతున్నాడు.

“మీకు పుణ్యముంటాది రాండమ్మీ.. మీ కొంపలకాటికి తిరిగి తిరిగి కాళ్లరిగిపాయ. ఈ ముండ సేద్యం చేయకన్నా వుండినా బాగుండు” నారప్ప ఇంటింటికాడ ఈ మాటలే కొంచెం కొంచెం మార్చి మార్చి అంటున్నాడు. కూలోళ్లు ఒకరు కూడా ఎలబారి ఈదిలోకి రావడంలేదు.

నారప్ప కోపంగా వెళ్లి సుక్కోలపల్లి పెద్దక్క ఇంటి ముందర నిలబడుకున్నాడు.

“ఏం! మామా ఒగపక్క బస్సు కూడా తిరుక్కోని పోకుండానే వచ్చి ఇంటిముందర నిలబడుక్కుంటివి” పెద్దక్క ఎగసక్కమాడింది. నారప్పకు కోపం నసాలానికెక్కింది.

“ఇంత పొద్దవుతూ వున్నా మీకింకా ఎలబారాలనిపించలేదా?” నారప్ప మొగం చిట్లించుకుంటూ అడిగాడు.

“మీకులాగా మాకవుతాదా మామా!” పెద్దక్క సాగదీసింది. “తొందరగా ఎలబారాలని మనసులో వుండాల” అన్నాడు మళ్లీ.

“వుంటే సరిపోతుందా మామా! నిద్దర కండ్లతో లేవాల్నా, లేస్తానే పేడా చెత్తా తోయ్యాల్నా, ఆనక దిబ్బలో యేసి రావాల్నా, సట్టికుండా కడగాల్నా, నాలుగు కడవలు ఉప్పు నీళ్లు తెచ్చుకోవాల్నా, ఒక్కడవ మంచినీళ్లు ఒడ్డిపల్లి మిట్టకాడ్నుంచి యెత్తక రావాల్నా, ఆనాక పొయ్యిలో అగ్గేసి ఇంత ఉడకేయాల్నా, మేకల కాడికి పొయ్యే బిడ్డకీ, ఆవుల కాడికి పోయేబిడ్డకీ అంత పెట్టాల్నా, సాలని కొదవకి ఇంట్లో మొగోడి సంగతి చూసుకోవాల్నా. పొద్దు నాలుగు బార్లు ఎక్కకముందే ఇంటి ముందరకొచ్చి నిలబడుక్కుంటావు.. రాండమ్మే.. రాండమ్మే అంటూ కేకలేస్తావు. ఇవన్నీ ఎవరు చేస్తారు చెప్పు మామా..” పెద్దక్క వరుసగా ఏకరువు పెట్టింది.

“ఏమే పెద్దానా.. నా కండ్ల ముందర పుట్టి పెరిగితివి.. ఎన్ని మాటలు నేర్చినావే...”

“ఎన్ని నేర్చి ఏముంది మామా, ఇద్దో సూడు ఇబ్బుదేస్తా వుండా నోట్లో బొగ్గు” అంటూ నోరు యెల్లబెట్టింది పెద్దక్క.

నారప్ప ఎగదాల సందులోకి అడుగుపెట్టినాడు. రెండు కుక్కలు లొల్లోల్లోంటూ అరుస్తున్నాయి.

థూ.. రోజూ చూస్తున్నా వీటి బుద్ధి పోనిచ్చుకోవు అంటూ నారప్ప తుపుక్కున పక్కకు వుమ్మేసి

"ఏం తూరుపాయన కూతురా... నీకింకా పొద్దు కాలేదా!" అని అరిసినంత గట్టిగా అన్నాడు.

"ఇద్దో వొచ్చేస్తావుండా... గిన్నిలో సంగటేసుకోని కూసోనుండా అట్లాపోయి ఆ సందులో వాళ్లను దిగతోలుకురాబో" అంటూ తూరుపాయన కూతురు నారప్పను పురమాయించింది.

నారప్పకు కోపం రెట్టింపయింది.

ఆ సందులోకి పోతే ఈ సందులో వాళ్లను పిలబో అంటారు. దిగడాలకు పోతే ఎగడాలకు పోయి రాబో అంటారు. ఎగడాలకు పోతే దిగడాలకు పోయి పిలబో అంటారు. కాదు గీదంటే పొద్దుపక్క ఎగజూస్తారు.

నారప్ప గొనుక్కుంటూ నడీదిలోని భజిని గుడి కూసానికి అనుకోని నిలబడుకున్నాడు.

ఎగవీధిలోంచి దిగవీధిలోంచి జండామాను సందులోంచి ఒకరొగరే పైట గొంగుల్తో మూతులు తుడుచుకుంటూ వక్కాకు తిత్తులు చేతిలో బట్టుకొని అడుగులో అడుగేసుకుంటూ నడీదిలోకొచ్చారు.

"ఏమండమ్మా ఇంగా పొద్దు కాలేదా"

నారప్ప పొద్దు పక్క ఎగజూస్తూ అరిచాడు.

"ఉండు మామా, ఇంగా వస్తామన్నోళ్లంతా రానీ.. ఆలోగా బూబమ్మ అంగడికాడికి పోయి అంత వక్కా ఆకన్నా తెచ్చుకుంటాము" అంటూ నారప్ప మాటను పట్టించుకోకుండా సుక్కోలపల్లి పెద్దక్క రెడ్డెమ్మ, తూరుపాయన కూతురు వొకరెనుకొకరు అంగిడింటి దిక్కు అడుగులేసినారు.

ఎగ వీధిలోంచి ముత్యాలు.. దిగదాల ఇండ్లలోంచి ఎల్లమ్మ, పార్వతి గసపోసుకుంటూ నడీదిలో కొచ్చారు.

"ఎం! కొడకా మీకింకా పొద్దుకాలేదా?" నారప్ప ఎత్తి పొడిచాడు.

"మా పెద్దత్త.. రెడ్డెమ్మ పిన్నమ్మా.. యాడ చిన్నాయనా" ముత్యాలు అడిగింది.

"యాడంటే ఏం చెప్పేది కొడుకా అంగిడింటి కాడికి పోయినారు" నారప్ప యాష్టగా చెప్పాడు.

"నువ్వు ఇక్కడే వుండు చిన్నాయనా మేమెల్లి పిల్చకొస్తాం"

“వుంటా కొడకా! ఉండకేం చస్తానా! వుంటాను. నా అక్కరా.. మీ అక్కరా”

నారప్ప మాటలు చెవిలో యేసుకోకుండా ముత్యాలు, ఎల్లమ్మ, పార్వతి అంగిడింటి వైపు దారిపట్టారు. నారప్ప దిక్కులు చూస్తూ నిలబడుకొన్నాడు.

“ఏమండే అట్లా యెగపోసుకుంటూ వస్తావుండారు” పెద్దక్క అడిగింది.

“నీ కోసమేత్తా!” ముత్యాలు సమాధానమిచ్చింది.

“ఆడ్నే వుంటే రామా.. పరుగెత్తుకుంటూ రాకపోతే ఏమి” అనింది రెడ్డెమ్మ.

పెద్దక్కని, రెడ్డెమ్మని ముత్యాలు, పార్వతి పక్కకు పిలిచారు. పక్కకుపోయి “ఏమో చెప్పండి” అన్నారు.

“ఏమీ లేదత్తా... మాబూసాబు టమేటా చెట్లలోకి పోతే యాభై రూపాయలు కూలిస్తారంట. గంగనబోయుడు మామ వొచ్చినాడు. గంగరాతికాడ మా చిన్నత్త ఇంట్లో కూసోండాడు. మిమ్మల్ని పిల్చుకరమ్మని చెప్పంపినాడు”

ముత్యాలు చిన్నగా రహస్యం చెప్పినట్లు పెద్దక్క, రెడ్డెమ్మ చెవులో చెప్పింది.

“అది కాదమ్మీ.. రాత్రి అందరం నారప్ప మడి నాటేందుకు వస్తామని ఒప్పుకుంటిమి. పైగా వుండూరయ్యే. ఈ పొద్దు పది రూపాయలు ఎక్కువిస్తారని పోతే ఎట్లా. రేపొద్దున్న మొగాలు చూసుకోవద్దా”.

పెద్దక్క మనసులోని మాట బైటపెట్టింది.

“ఏమో అత్తా.. మేమంతా టమేటా చెట్లలోకి పోవాలనుకొన్నాం. ఆపైన నీ ఇష్టం. అంతగా పొయ్యేటిగా వుంటే నువ్వుపో..” తెగేసి చెప్పారు.

పది గంటలు బస్సు హారను కొట్టుకుంటూ తిరుక్కోనిపోయింది. ఎండ సురుగ్గా తగలతా వుంది. నారప్ప మొగం ఎర్రగా మారింది.

“ఏం మామా.. టమేటా చెట్లలోకి పోతే యాభై రూపాయల కూలిస్తారంట. అది కూడా పైటాల వరకే పని. కాయలు ఇడిపించి బుట్లల్లోకి పోయడం. నువ్వేమో మడి నాటడానికి ఇరవై రూపాయలిస్తానంటావు. పిల్లోలంతా మాబూసాబు టమేటా చెట్లలోకే పోతామంటున్నారు. ఎట్లో నువ్వే చెప్పు మామా..” పెద్దక్క కూలోళ్ల మనసుల్లోని మాట బయటపెట్టింది.

పెద్దక్క మాట వినేసరికి నారప్పకి గుండె జారినట్లయింది.

ఒకరోజు పనికాదు. మడి సేద్యం అంటే పుట్టారుగాలం పని వుంటాది. కర్ర కయ్యలో పెట్టింది మొదలు గింజ ఇంటికి తెచ్చుకొనేంతవరకూ పనే వుంటుంది. మడి సేద్దిం చేసే

టోళ్లు అట్లా కూలిచ్చి పని చేయించాలంటే కష్టం. అంత కూలీలిచ్చి నాట్లు వేయించినా పండుతుందని గ్యారంటీ లేదు. వానలు పడి చెర్లోకి సగానికన్నా నీళ్లు వస్తే పంట చేతికి అందచ్చు. లేకుంటే చేతుల కష్టం మిగలొచ్చు. దున్నింది దోకింది, నాటింది చెత్తలు తీయించిందీ, ఎరువులు వేయించిందీ, కోతలు కోయించిందీ, కుప్ప కొట్టించిందీ అన్నీ లెక్కలు యేసుకుంటే చిందబోసి యేరుకున్నట్లుగా వుంటాది మడి సేద్యం.

నారప్ప ఆలోచిస్తూ నిలబడ్డాడు.

సంవత్సరం పొడుగుకూ అయ్యే ఖర్చులు.. చేసే అప్పులు.. కట్టే వడ్డీలు.. మాబూ సాయిబు గుత్త సేద్యం.. గంగనబోయుడి మాటలు.. రేగడి మిట్టలో నవనవలాడే టమేటా చెట్లూ.. అన్నీ కళ్లముందు కదలాడాయి.

నాలుగు కయ్యలు మాబూ సాయిబుకే గుత్తకిస్తే నాలుగు దుడ్లు చేతిలో పడతాయి. రెక్కల కష్టం మిగులుతాది. పెళ్లాం బిడ్డల కష్టం మిగులుతాది. కూలీల ఖర్చులు మిగులుతాయి.

నాలుగు కయ్యలూ తనే టమేటా చెట్లు నాటుకోవచ్చు కాని తను నాటిన సంవత్సరం టమేటాలు కేజీ యాభై పైసలు అమ్ముతుంది. నాటని సంవత్సరం కేజీ టమేటాలు పది రూపాయలు అమ్మచ్చు.. పదైదు రూపాయలు అమ్మచ్చు. ఇంతకూ తనకు నీళ్లెక్కడివి. తనకి బోరెక్కడిది. తనకు పెట్టుబడి పెట్టుకోవడానికి డబ్బెక్కడిది.

నారప్ప ఆలోచనల్తో ఉక్కిరిబిక్కిరయిపోయాడు.

"ఏం మామా.. ఏమాలోచిస్తా వుండావు" పెద్దక్క పలకరించింది.

నారప్ప ఈ లోకంలోకి వచ్చాడు.

"ఏదో ఓ మాట చెప్పు మామా" రెడ్డెమ్మ రెట్టించింది.

నారప్ప 'ఊ' అన్లేదు 'అ' అన్లేదు.

నారప్ప బొమ్మలా నిలబడుకున్నాడు.

ముత్యాలు, ఎల్లమ్మ, పార్వతి, రెడ్డెమ్మ, పెద్దక్క అందరూ ఒకరి వెనుక ఒకరు రేగడిమిట్ట దోవపట్టారు.

నారప్ప ఆలోచించి.. ఆలోచించి.. అడుగులు ముందుకు వేశాడు.

ఆ అడుగులు.. నగిరి కాలవంటి మడికయ్యలు దిక్కుకా... లేక కూలోళ్లు వెళ్లిన రేగడిమిట్ట దిక్కుకా...

✡

# దేవరెద్దు

–గోపిని కరుణాకర్

మసక మసక చీకట్లో పాణాలను అరచేతుల్లో పట్టుకోని

పరిగెత్తతా వుండాను

దేవరెద్దు రంకెలేస్తా వస్తా వుండాది

దాని కండ్లు సుక్కల్లా మెరస్తావుండాయి

పాములా బుసపెడతావుండాది

మెళ్లోని మువ్వలు గణగణా మోగుతావుండాయి

తోకను పైకెత్తి

దుమ్మును పొగలా రేపుకొంటూ

కసిగా కుమ్మేయ్యడానికి కొమ్ముల్ని ఇసరతా వుండాది

బలమంతా కాళ్ళల్లోకి తీసుకోని పరిగెత్తతావుండాను

వళ్ళంతా చెమటలు పోసినాయి

నోరు పిడసకట్టింది

బొటనవేలికి రాయి తగిలింది

నెత్తురు బొటబొటా కారతా వుండాది

అరికాల్లో ముల్లు ఇరిగింది. "అబ్బా... నొప్పి".

దేవరెద్దు కొమ్ముల్ని ఇసరతా వచ్చేస్తా వుండాది.

"దేవరెద్దు సంపేస్తుంది... కాపాడండ్రోయ్... కాపాడండ్రోయ్..." గొంతు

చించుకొని అరస్తా వుండాను.

ఎవురికి వినపడడం లేదు.

కాలుతీసి కాలుపెట్టేదానికి కష్టంగా వుండాది.

కుంటతానే పరిగెత్తతా వుండాను.

చిట్లాగాలిలో ఎండినాకులా పల్టీలు కొడతావుండాను

ఎంత పరిగెత్తినా అడుగు ముందుకు పడడం లేదు

దేవరెద్దు దెగ్గిరికొచ్చేసింది

ముందుకు అడుగేద్దామంటే దారి లేదు

నా ముందర పెద్దబాయి

నిండుగా నీళ్ళతో తొణకతావుండాది

తిరిగి చూస్తే, మిందకొచ్చేసింది దేవరెద్దు

ముందు జూస్తే బాయి

ఎనక జూస్తే దేవరెద్దు

ఎగిరి బాయిలో 'దభీమని' దూకితి.

✡

నీళ్ళల్లో 'దబీమని' మునగాల్సిన బకెటి, 'టంగ్... టంగ్' మంటూ రాళ్ళకు తగులుకోని నొక్కు పోయింది. బకెట్లోకి చారెడు నీళ్ళు రావడం లేదు.

చేదబాయిని గోకిగోకి కుడితి బానను నింపతా వుండాను. గొడ్ల కొట్టంలో ఆవు "అంబా"ని అరుస్తా వుండాది.

రాత్తిరి బాగా నిద్దరపట్టేసింది. మాయమ్మ లేపేంతవరకు మెలకువ రాలేదు. బాగా లేటై పూడిసింది. పాలు పిండి సెంటరకు పొయ్యల్ల.

ఆవును పట్టకొచ్చి కుడితి తాపి కొట్టాంలో కట్టేస్తి.

ఎద్దుల్ని తీసి చింతచెట్టు కింద కట్టేద్దామని పట్టకపోతా వుండాను.

పలపలా నాలుగు చినుకులు రాలె!

తలెత్తి చూస్తి,

ఏడున్నాయో గుంపులు గుంపులుగా వచ్చి పాలకొండమింద వాలినాయి మోడాలు.

"ఈ పొద్దు తప్పకుండా వానొస్తిందని" మొనుసులో అనుకొంటి.

ఎద్దల్ని చింతచెట్టు కింద కట్టేసి మాయమ్మ దెగ్గిరికిపోతి, మాయమ్మ గొడ్డకొట్టంలో పేడకల్లుతీసి పుడకలో ఏస్తావుండాది.

"మ్మా... మ్మా... ఇట్టరా సూద్దువు" చేయి పట్టుకొని గబగబా మాయమ్మను ఈదిలోకి ఈడ్చుకొస్తి.

"పాలకొండమింద గొర్రెల్ని మందలు మందలుగా తోలినట్లుండాయి గదా మోడాలు. ఈ పొద్దు తప్పకుండా వానొస్తింది" అంటి మోడాల్ని చూపిస్తూ.

ముందు మోడాలు కల్లా జూసి, మల్ల నా కళ్ళలోకి చూసి "వాన కురిస్తిందో, లేదో తెలవదు గాని నీ కండ్లల్లో వాన కురుస్తా వుండాదిరా" అనింది.

ఎన్ని రోజులైంది మోడాల్ని చూసి.

అత్తింటి నుంచి వచ్చిన ఒక్కగానొక్క చెల్లిని చూసినట్టుంది మోడాల్ని చూస్తావుంటే.

"తలకోనమింద వానదిగితే మనకు గ్యారంటీ వాన పడితింది. ఎంగట్రవణసామీ! కరువుతీరా వానకురవల్ల. మా గాదె వడ్లగింజలతో నిండల్ల. నీ కొండకొచ్చి మొక్కు తీర్చు కుంటాను తండ్రీ" అంటా సామికొండకల్లా మల్లుకోని మొక్కుకున్నాను.

"దేవుడుండాడు వానపడకుండా యాడికి పోతింది" అంటా మాయమ్మ గొడ్డకొట్టంలోకి పోయింది. నేను మోడాల్ని చూస్తా నిలబడితి.

"ఏందిరా నాయాల, ఆకాసం కల్లా ఎగమల్లుకోని జూస్తా వుండావు?" అంటా ఎవరో బుజం మీద చెయ్యేసిరి. తిరిగి చూస్తి.

మా కిష్టమామ. రంగం పేట నుంచి పొద్దున్నే మా ఊరికి బస్సుండాది, దానికి వచ్చిన ట్టుండాడు.

"ఇప్పుడేనా రావడం మామా? అత్తా, పిల్లోల్లు బాగుండారా?" అని అడిగితి.

"మీ అత్తకేమబ్బా గుండ్రాయి మాదిర్తో వుండాది" అని అన్నేడు కిసకిసా నవ్వుతూ.

"అమ్మా... ఎవురొచ్చినారో సూడు" అంటా మాయమ్మను పిలిస్తి.

గొడ్డకొట్టంలో చెత్తవూడ్చేది ఇడిసి పెట్టేసి వచ్చింది. మా మామను చూసి "ఊర్లో అంతా బాగుండారాన్నా? మా వదినా, పిల్లకాయలు" అని అడిగింది.

"ఆ... ఆ... అంతా బాగేగాని, నువ్వేంది సెల్లె కట్టెపుల్లయ్యి పోయినావు" అన్నేడు మాయమ్మను చూసి.

“వారం రోజులు పట్టుకొన్నె జొరం ఇడసలేదు. ఈ పొద్దే అట్టా లేసి తిరగతా వుండాను” అని చెప్పింది మాయమ్మ.

మాయమ్మ, మా మామ మాట్లాడుకొంటా ఇంట్లోకి పోయినారు. నేను గొడ్డకొట్టంలోకి పోయి దూడను వొదిలినాను.

అది పరిగెత్తిపొయ్యి ఆవు పొదుగును గుద్ది గుద్ది పాలు తాగతా వుంది.

చెంబు ఎత్తకరాను ఇంట్లోకి పోతి.

“పొయ్యి ముట్టించుమా, పాలు పిండుకోని వస్తాను. మామకు కాపీ పెడుదువు” అని మాయమ్మకు చెప్పి చెంబులో కొన్ని నీళ్ళు పోసుకుని ఆవుకాడికొస్తి.

మామామ తిన్నెమింద కుచ్చున్నాడు.

మాయమ్మ పొయ్యి ముట్టిస్తావుండాది.

దూడను తీసి పక్కన కట్టేసి, నీళ్ళతో రొమ్ముల్ని కడిగి పాలు పిండతా వుండాను.

“పాలు ఎన్నిస్తిది అబ్బోడా?” అడిగినాడు మా మామ.

“పొద్దన్నే రెండు లీటర్లు, మాపటేల అర్ధలీటరు ఇస్తింది. పొద్దన్న పాలు డిపోకు పోసి, మాపటేల పాలు సేమెరుగుపెడతాం” అని చెప్పితి.

“ఆవు దేసిపు జాతిది. పొద్దన్న ఆరేడు లీటర్లు పాలిచ్చేది. పచ్చిగెడ్డిలేదు. ఎండుగడ్డీ బంగారమై పూడిసింది. వట్టి నేలను కొరకతా వుండాది” అనింది మాయమ్మ.

“చూస్తానే తెలిస్తావుండాది. బొచ్చూడి పొయ్యి బొమికలు బయటపడినాయి” అని అన్నేడు మా మామ.

పాలు పిండి కొన్ని మాయమ్మకిచ్చి, రెండు లీటర్లు కొలిసి క్యానులో పోసినాను.

మాయమ్మ కాపీ పెట్టి నాకో గలాసు, మా  మామకు ఒక గలాసు ఇచ్చింది. కాపీ తాగి క్యాను తీసుకోని సెంటరుకు యలబారితి.

నగిరికాడ డిపోకు పాలు కొలస్తారు. నాలుగు అడుగులేస్తే నగిరి వస్తుంది. ఈదిలో కొస్తి.

ఈదిలో గోపిని నారాయణ తాత ఎదురుపడినాడు. ఆ తాత చేతిలో పాల క్యానుండాది.

“ఏం తాతా ఈ పొద్దు నువ్వొచ్చినావు? అనుమంతన్న యాడికి పాయ?” అని అడిగితి.

“పీలేరు సంతకు పోయినాడు. ఎవురబ్బోడ, మీ ఇంటికి సుట్టమొచ్చి నట్టుండాడు” అని అడిగాడు.

“రంగంపేట నుంచి మాకిష్టమామ వచ్చినాడు”.

“ఏమంట వచ్చింది. ఈసారన్నా నిన్ను ఒగ ఇంటోన్ని చేస్తాడంటనా, లేదా?” అని అడిగినాడు.

నేను ముందు,

ఆ తాత నా యనక మాట్లాడుకొంటా నడస్తా వుండాం.

ఆ తాత అడిగినదానికి బదులు చెప్పకుండా మెల్లిగా నవ్విత. మొనసులో సుపద్ర మెదిలింది.

మా కిష్టమామ పెద్దకూతురు సుపద్ర. సుపద్రకు నాకు సిన్నప్పుడే మాటై పూడిసింది.

సుపద్రను ఉయ్యాల్లో ఏసిన రోజున కోడల్ని చూసి, “నా కోడలు, నా ఇంటి దీపం” అని మాయమ్మ మురిసిపోయిందంట.

చిన్నప్పుడు...

మా మామ మడక దున్నతా వుంటే నేను మేడి పట్టుకోని దున్నేవాడ్ని. మా మామ నా చేతికి మేడినందించి పక్కకు తప్పుకొంటాడు. ఏం చేస్తాడో చూద్దామని. నేను మేడినందుకోని సాలు తప్పిన మడకను సాలు కేసి ఎద్దల్ని అదిలించినాను.

మడకను బలంగా అదిమి పట్టుకోని సాలు తప్పకుండా దున్నతావుంటే, “నా అల్లుడు సేద్దింలో మొగలాయి అవతాడు. నాయాల నా కూతుర్ని నీకే ఇస్తారా” అని మీసం మెలేసినాడు మా మామ.

మొన్న సంకురాత్తిరికి రంగంపేటకు పోయినప్పుడు సుపద్ర పైటలు ఏస్తావున్నింది. సిన్నప్పుడు పిలకజడేసుకోని, సీమిడి కార్చుకొంటా వుండే సుపద్ర ఇప్పుడు వంటికి బంగారు పూతేసినట్టు మెరస్తావుండాది.

కొరక్కతినేట్టు వళ్ళు మింద సోదీనం లేకుండా చూస్తా వుంటే, ఆయమ్మి సిగ్గుపడి పూడిసింది.

పోయిన దీపావళికి రంగంపేటకు పోయినప్పుడు, మాయమ్మ కొంగుపట్టుకుని తిరిగిందంట.

“మా మామ బాగుండాడత్తా! ఏంది అట్నే వూసూసుగానే వుండాడే, నువ్వు దుడ్డు మిగలబెట్టేది మరిగి మా మామకు తిండి తగ్గించినట్టుండావు” అంటా మాయమ్మతో కుశాల పడిందంట సుపద్ర.

"నా శక్తికాడికి నా బిడ్డను సాకినా, నువ్వెట్టా సాకతావో చూస్తాగదా" అని మాయమ్మంటే.

"నా చేతికూడు తిననీ సూద్దువు. మామామ వూపురు బుడ్డమాదిర్తో వూదిపోవల్ల" అంటా పకపకా నవ్విందంట.

ఆ యమ్మి నవ్వినప్పుడు రాలిన ముత్తేలన్నింటిని మూట కట్టుకోనొచ్చి, నాకు చెప్పతావుంటే నేను వొళ్ళుమరిస్తి.

"నువ్వంటే సుపద్రకు పాణంరా. నిన్ను ఎన్నిసార్లు కలవరించిందను కొంటివి. మా మామని అడిగినాని చెప్పత్తో, మరిసిపోమాక అని ఎన్నిసార్లు గుర్తుచేసిందనుకొంటివి. నీకు నేతి అత్తిరాసాలంటే ఇష్టమని నెంబరు బియ్యం పోసి నానేసి పిండికొట్టి, నేతిలో అత్తిరాసాలు కాల్చి మూటకట్టి ఇచ్చింది" అని నేతి అత్తిరాసాల్ని చేతిలో పెట్టింది మాయమ్మ.

కొంచెం తుంచి నోట్లో ఏసుకొంటి. సుపద్ర మొనుసంత తియ్యగా, కమ్మగా వున్నింది నేతి అత్తిరాసాం.

రాయి తగులుకోని ముందుకు తూలి పడబోయి నిలదొక్కుకుంటి. ఆ తాత బొక్కినోరు తెరిసి పకపకా నవ్వినాడు. నాకు సిగ్గయిపూడిసింది.

"వయసు అట్లాంటిది అబ్బోడా! రగతం మింద వున్నెప్పుడు ఏడు గుర్రాల మింద ఒకేసారి సవారి తీద్దామనిపిస్తుంది. నేను వగిసిలో వున్నప్పటి మాట. ఒగదినం కానగమానెక్కి ఆకు కొడతా వుండాను. మడికాడికి చెలంపల్లి సినపరెడ్డికూతురు సద్ది ఎత్తుకోని వచ్చింది. ఆ యమ్మి గెనిమ్మింద వగలుబోతా నడస్తావుంటే నేను వొళ్ళు మరిస్తి. పిడికిడంత నడుము, పాల సముద్రము మాదిరి పొంగే ఎద, పిర్రల మింద పడతాండే జడ, ఓయబ్బో దాని సోకు చెప్పనలివికానిది. నేను కుచ్చోనుండే కొమ్మనే నరకతావుండాననే సోదీనమే నాకులేదు. కొమ్మతోపాటు నేను 'దబీమని' బురదమడిలో పడితి" అని ఆ తాత నవ్వతా చెప్పినాడు.

నాకైతే ఒకటే నవ్వు. కడుపు నొచ్చేలా, కండ్లల్లో నీరు కారేలా నవ్వితి. నా జన్మలో ఎప్పుడు అట్లా నవ్వలా.

సెంటర్లో పాలు పోసి ఆ తాత పనుండాదని సాయిబులపేటకు పాయ, నేను ఇంటికొస్తి.

మాయమ్మ వుడుకుడుగ్గా అన్నం వండి, కోడిగుడ్ల కూర చేసింది. మొగం కడుక్కోని మా మామ, నేను తింటిమి.

కొడవలి తీసుకోని మడికాడికి యలబారితి.

"ఏడికి అబ్బారే ఎలబారినావు?" అని అడిగినాడు మా మామ.

"మడికాడికి పొయ్యొస్తా మామ. వరి పైరు నీరు లేక ఎండిపూడిసింది. కోసి గొడ్లకేద్దామని".

"మడికాడికి మల్లబోదువులే, నీతో పనుండాది. అర్జింటుగా యలబారి ఊరికిపోవల్ల" అన్నేడు మామామ.

"ఏందన్నా అప్పుడే ఊరికి పోవల్ల అంటావుండావు?" మొగం కడుక్కోని వచ్చి కొంగుతో తుడసుకొంటా అనింది మాయమ్మ.

"బిన్నే పోవల్ల చెల్లే. ఓపినన్ని పనులుండాయి. మీకు ఓ మాట చెప్పిపోదామని వస్తి" అంటా బీడి ముట్టించినాడు.

"ఇప్పుడొచ్చినావు. అప్పుడే పూడస్తావా? రేపు పోవచ్చులేన్నా" అనింది మాయమ్మ.

"లేదు చెల్లే ఒంటికాలి మింద నిలబడి వూపిరి తీసుకొనేదానికి తీరికలేదు. ఒగమాట చెపుతాను. నువ్వేమి అనుకోగూడదు. మాయన్న మాట మారిసినాడని నిష్టూరపోమాక. ఏం చేసేది మంచి సంబంధం, పిలగోడు కొండమింద ఉద్యోగం చేస్తా వుండాడు."

"ఎవురి గురించిన్నా నువ్వు చెప్పేది?"

"మన సుపద్ర గురించి. మీ వదినికి వరసకు అన్నకొడుకు కావల్ల. కొండమింద హెలతు డిపార్ట్‌మెంటులో పనిచేస్తా వుండాడు. వచ్చే సుక్కురారం ముగుర్తం పెట్టుకొంటా వుండాము. మీరు గూడ రావల్ల" అన్నేడు సావు కబురు సల్లంగా చెప్పినట్టు.

మాయమ్మ నిప్పుమింద పడిన ఉప్పయింది.

"సుపద్ర ఎవరునుకొంటివి. నా ఇంటి కోడలు" అనింది దుఃఖాన్ని గొంతులో బిగపట్టి.

నాకండ్లల్లో నీళ్లు తిరిగినాయి.

"ఎన్నో అనుకొంటాం. మనం అనుకొన్నట్టు ఏదీ జరగదు. అంతా మన నుదుటి మింద ఆ బెమ్మ దేవుడు రాసిన రాత ప్రెకారం జరిగితింది. ఆ రాతను తప్పించేదానికి మనం ఎవురము?" ఆరిపోయిన బీడిని చెవులో చెక్కోని అన్నేడు. మా మామ తెలివిగా మాట్లాడతావుండాడు.

"నోర్ముయ్ సాలుగాని, నేర్చిన మాటలు మాట్లాడొద్దు. ఈ పెండ్లి ఎట్లా జరిగితిందో చూస్తా. పిల్లా, పిల్లగోడు ఒకరంటే ఒకరు ఇష్టపడతావుండారు. వాళ్ళిద్దరికి ఏ గుళ్ళోనో పెళ్ళి చేస్తాను" అనింది మాయమ్మ కోపంగా.

"పెండ్లి చేసి నా బిడ్డ గొంతు కోస్తావా? నీ కొడుకును చేసుకొంటే నా బిడ్డ ఏం సుకపడితింది?"

"నా బిడ్డకేం? తాగుబోతా, తిరుగుబోతా?" గద్దించి అడిగింది మాయమ్మ.

"నీ బిడ్డ బుద్ధిమంతుడే. నేను కాదనను. వానికి సదువు అంతంత మాత్తరమే. సదువుకోనుంటే కొండమింద ఉద్యోగం తీసిచ్చి, నా కూతుర్నిచ్చి పెళ్ళి చేసుందు".

"ఇప్పుడేం తక్కువ నా బిడ్డకు. భూమీ నేలా లేని బికారా నా బిడ్డా! సొంత ఆస్తి వుండాది. కష్టపడి పెండ్లాన్ని సాక్కొంటాడు."

"కష్టపడితే ఏం గుణం, చేసిన కష్టం మట్టిపాలు అవ్వాల్సిందేగాని చేతికందుతుందని నమ్మకం లేదు. నీ కొడుకును పెండ్లి చేసుకొంటే నా బిడ్డ ఎఱ్ఱటి ఎండలో కష్టపడల్ల, పస్తులతో అల్లాడల్ల, దరిద్రంతో కాపరం చేయ్యల్ల. అదే ఉద్యోగస్తుడ్ని పెళ్ళి చేసుకొంటే, రోజులు లెక్కపెట్టుకొంటావుంటే సాలు, మొదలు తేది పొద్దన్న రెండు వేల రూపాయలు ఇంట్లో వచ్చిపడతాయి. కాలి మింద కాలేసుకోని కాపరం చేస్తింది."

"ఓరి నా బట్టా! నీ మొనుసులో ఎంత కుట్ర పెట్టుకోని వచ్చినావురా! నా కడుపు కాలస్తావుండావు. నా వుసురు నీకు తగిలితింది" మాయమ్మ తిట్ల దండకం అందుకొనింది.

"చెల్లే... నిన్ను ఎన్నుమింద గువ్వను సాకినట్టు సాకితిమే. ఏ పొద్దన్నా ఇట్టుండే పుల్లతీసి అట్టేసి ఎరుగుదువా? చిన్న వగిసిలో ఎన్ని అగసాట్లు పడితివి. ఎన్ని అగమానాలు పడితివి. ఈడ్ని సాకేదానికి ఎన్ని తిప్పలు పడితివి. తాళిబొట్టుతో సహా కుదవపెట్టి పంట పండిస్తే ఏం మిగిలింది? అప్పులే కదా మిగిలింది. చేసిన అప్పులు తీర్చలేక, నీ మొగుడు పురుగుల మందు తాగి సచ్చె. సేద్దిం జూదం గదా! వద్దు చెల్లే చూసి చూసి నా బిడ్డ గొంతు కొయ్యలేను. నువ్వు ఎన్నెన్నా తిట్టు నాకు బాదలేదు. నా బిడ్డ సుఖమే నాకు ముక్కెం. వస్తా సెల్లె... వస్తా రవణయ్యా" అని చెప్పి యలబారిపోయినాడు మామామ.

మాయమ్మ నిట్టాడుకు ఆనుకోని ఏడస్తావుండాది.

నేను మడికాడికి యలబారితి.

ఈదిలోకి వస్తే ఎండ పెల్లున చెంప పగలకొట్టింది.

తలెత్తి చూస్తి.

ఒక మోడం లేదు. ఆకాశం తుడిసిపెట్టినట్టుండాది.

మడికాడి కొస్తి.

ఎండిన మడి పీనిగిలా పడుండాది.

చెరువుకింద గొడ్లు మేస్తావుండాయి.

"రేయ్ ఎంగట్రవణా తప్పుకో... దేవరెద్దు వస్తావుండాది" ఎవరో అరిసినారు. తిరిగి చూస్తి, దేవరెద్దు రంకెలేస్తా నా మీదకు వస్తా వుండాది.

పాణాలను అరిచేతుల్లో పట్టుకోని పరుగునందుకొంటి.

మోకాలెత్తు గెనాలను ఎగిరెగిరి దాటుకొంటూ, వంక బాయికాడికి చేరితి. తిరిగి చూస్తి.

దేవరెద్దు ఈపుమీదకొచ్చేసింది.

ఇరవై ఆరేళ్ళు కలలో తరిమింది. ఇప్పుడు నిజంగానే తరమతా వుండాది.

ఇది కలకాదు.

పాణాలు కాపాడుకొందామని బాయిలోకి దూకపొయ్యి, అట్నే నిచ్చెలకపొయ్యి నిలబడి చూస్తి.

"ఓరి దేవుడా బాయిలో సుక్క నీళ్ళు లేవు".

✡

# బతికి చెడిన దేశం

**–అట్టాడ అప్పల్నాయుడు**

ఒక గోనెసంచీ నిండుగా – నాలుగు పెద్దా, చిన్నా తపేళాలూ, మూడు కంచాలూ, రెండు చెంబులూ, ఓ గ్లాసూ; వాటి కింద కుంచెడు మిరపకాయల చిన్నమూటా, పదలం వుల్లిపాయలూ, చిన్న కందులు కుంచుడూ కలిపి మరో చిన్నమూటా వున్నాయి. ఉప్పుగల్లో అడ్డడు మిగిలాయి, గాని మూట గట్టలేదు. వుప్పుగల్లుకేటి బంగారమా అని పొరుగింటి ముసల్దానికిచ్చేసింది. గుగ్గిలపు కఱ్ఱతోటి చేసిన పీటచెక్క వొదల్లేక గోనెసంచీలో వెయ్య బోయింది యిల్లాలు. సంచీలో చెక్క అడ్డంగా పట్టదు, నిడువుగేస్తే సగం జాగా ఆవరించేస్తుంది.

"... బతుకు యీకాడకొచ్చినా – నాయురాలికి పీటచెక్క కావాల గావాల, కూకోని వూసులాడ్డంకి. మనఁవేటి, నీ యత్తోరింటికెళ్ళడం లేదు! అడుక్కుతిండానికెళ్తన్నాం," అని విసుక్కున్నాడు.

"...ఆఁ! అత్తోరింటిల పీటచెక్కమీద కూకోని కూకోని – తినీ తినీ సూడు, పిఱ్ఱలు యెలగబలిసినాయో," అని ఎండిన పుల్లల్లాంటి, తన కటిభాగాన్ని తిప్పి చూపి వెక్కిరించేదే! గానీ, ఆ యిల్లాలి గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. ఈలోగా, యిరుగింటి గౌరీశ్వరి, 'జేగర్తగుంచుతాను, మీరు తిరిగొచ్చిన్నాడిచ్చేస్తానంది.' పీటచెక్క వొదిలేశారు.

అప్పుడనుకున్నాడు – తిరిగొచ్చిన్నాటికి – తనకేది మిగలపోయినా, పీటచెక్క మిగల్తాదిరో అని!

ఔను, అదే మిగుల్తాదేటో? మడిచెక్కలు మిగల్తాయా? యింటి మట్టి మిగల్తాదా? పశుల సాల మిగల్తాదా, పశివి లెలగా మిగల్లేదు. పెరటిమొక్క, పెరటి వెనక నుయ్యా... మిగల్తాయా?

అసలకివన్నీ వొదులుకొని, యిరుగునొదిలి, పొరుగునొదిలి, బంధు బలగాన్ని వొదిలి బలరాంనాయుడో యెక్కడికెళ్తావ్? యెలాగ బతుకుతావ్? అనడిగింది మనసు.

ఏటి సెయ్యను మరి? యేదిదారి మరి? యిరకాటాలూ, యిక్కట్లొచ్చి యివన్నొది లెళ్తన్నాను. మళ్ళీ రానేటే మనసా? ఇలాటి ఇక్కట్లు రాఁవులోరికే రాలేదా మనసా? పాండురాజు బిడ్డలకి రాలేదా మనసా? అరణ్యవోసం ఆళ్ళకే తప్పిందిగాదు గదా మనసా...?

నిజ్జింవేనిరోరె, నిజింవేనిరా–బలరామనాయుడా–నిజిమే. గాని అరణ్యావోసం తరువాత అయివోధ్య సింవాసనం దొరికింది రాములోరికి. రాజ్జెం దొరికింది – పాండురాజు బిడ్డలకి. ఏలినవోరితోటి పోల్చుకోకురో యెర్రినాయుడో – అధికారపీఠం పోయిన అయిదేళ్ళకి, మళ్ళా పీఠమెక్కీగల్రు ఆళ్ళు; అన్నది మనసు.

'అలగంతావా, మనసా – అయితే బతికి చెడి, దేశాలు పట్టీడంకంటా యింటెనక నూతిల పడిచావటం మంచిదని – నూతిలోకి చూసేడు. నీరింకిన నుయ్యి – నల్లగా వెక్కిరించింది. అందులోని నీళ్లన్నీ మా కళ్ళల్లోగానున్నాయేటి కొంపదీసి,' అని కళ్ళు తుడుచుకున్నాడు అపుడు.

రైలులో కూచున్నప్పటి నుంచీ మనసులో పదేపదే – యిల్లూ, పొలం, ఊరూ కలదిరిగి కళ్లల్లో నీటి పొర చేరింది.

✡

గోనెసంచీ మూట దిగింది, పాతగుడ్డల్తో నిండిన పాత ట్రంకు పెట్టె పెరిగింది. అక్షర సంక్రాంతినాడిచ్చిన పుస్తకాలు, పలకలూ, వొదల్లేని ఆస్తులుగా వొంతులేసుకు మోసుకొచ్చిన కొడుకూ, కూతురూ దిగినారు. కాటికి దగ్గరా, వూరికి దూరం దాన్నిరా – దేశాలంట తిప్పుతావెందిరా అని మూలిగే ముసల్దాన్ని దించుతూ, భార్య దిగింది.

వల్లకాడు లేని దేశం లేదేతల్లీ. అసలకి వల్లకాడు కాని దేశమేదోలమ్మా? అని మనసులో గుణుసుకొని, మూటల్నీ, కుటుంబాన్నీ మరోసారి చూసుకున్నాడు బలరాం నాయుడు.

చీకటి రాత్రి వేళయినా విద్యుత్ కాంతుల్తో ధగధగా వెలిగిపోతోంది ప్లాట్‌ఫాం. పట్టణాల్లో రాత్రిగూడా పగలులాగుంటాదనుకున్నాడు. మరందుకేనేమో రాత్రీ, పొగులూ, పన్లు దొరుకుతాయన్నాడు సిమాలుగాడు!

నాలుగేళ్ళ కిందట, దేవుని మాన్యం భూమి కౌలు గొడవలు ముదరటం, కొట్లాటా, కేసులూ, కౌలు తొలగింపు అపుడొచ్చే సేడు సిమాలు! భూమి పోయింది గానీ, కేసులు పోలేదంటూ – యిలగేనా, మనం కలుస్తన్నాం అని సంబరపడతాడు, కోర్టు వాయిదాల కోసం వచ్చినపుడు. కోర్టు నుంచి, తనతో ఊర్లోకొస్తాడు. ఊరంతా చుట్టేసొచ్చి, నిద్రోతాడు. మర్నాడు నాగావళి నదిల తలస్నానం చేసొచ్చి, బయలెల్తాడు. వాళ్లూ, వీళ్లూ యిచ్చిన గుమ్మడిపండునో, చెనక్కాయల్నో, అపరాల్నో మూటగట్టుకొని డిఎమ్‌యూ రైలెక్కుతాడు.

ఏడీ సిమాలు? రైలు దిగిన కాడకొస్తానన్నాడు, యేడీ? 'భద్రం... కొడుకుల్లారో...' అన్నట్టుగా తనలాంటి వలస బతుకుల వారికి కూత వేసి చెప్తూ కదిలింది డిఎంయూరైలు.

కొడుకు చిటికెనవేలు చూపేడు తల్లికి. మూర్తం జాసి, తీర్తం బయిలెళ్తే ముంతొట్టుకు పరిగెట్టాడట యిలాటోడె. యిదా, యీడి బాధ చూడు – అని అప్పజెప్పిందామె. బలరాం నాయుడు చుట్టూ చూసేడు. పల్లెటూరు గాదు, ఖాళీజాగాలూ, తుప్పలు, డొంకలూ ఉచ్చబోసీడానికి! పట్నం మీద ఉచ్చ పొయ్యలేవురా కొడకా, ఆపుకో అన్నాడు.

అంతలో–

"యెంచేపైంది దిగీ? జేగర్త గొచ్చీసేరు గదా? రండ్రండి," అని పలకరించేడు సిమాలు. ప్రప్రథమంగా కొడుకు సమస్యని తీర్చమన్నాడు బలరాంనాయుడు సిమాలుని.

ఆ తర్వాత, మూటలెత్తుకొని బయల్దేరారు. తనుండే పేటలోనే వీరి కోసం వో గుడిసె కిరాయికి సిద్ధం జేసాడట సిమాలు. అయినా, రెండు పూటలు అతగానింట్లోనే తిండీ, తిప్పలట. కాదనొద్దన్నాడు.

చీకట్లను చీల్చి చెండాడే మెర్క్యురీ లైట్లూ, విశాలమైన రోడ్లూ, విలాసవంతమైన ఎత్తైత్తు భవంతులూ, లాడ్జీలు, సిన్మాహాళ్లు, హోటల్లూ, కార్లూ, జీపులూ, మోటారు సైకిల్లూ... ఖరీదుగా, విలాసంగా కన్పించింది నగరం.

భాగ్యమంతా పట్నాల్లోను, దరిద్రమంతా పల్లెటూళ్లలోను వున్నట్టిగుంది.

"ఔనొరే సిమాలో? పట్నాల్లంట యేటి పండిస్తార్రా" అనడిగేడు.

"పండించినోడిది గాదు, పంటని మార్కెట్టి(ంగ్) చేసినోడిది భాగ్యం," బదులిచ్చేడు సిమాలు. నాయుడికి బోధపడలే.

'మీ బతుకెలాగుంది? పెళ్ళాంబిడ్డలెలాగున్నారు?' బతుకు భోగట్టాలడిగింది నాయుడి భార్య.

నీ పెద్దలు, పేరంటాళ్ళ దయవొల్ల, నేటికి – తలదాచుకోడానికి గుడిసె, కట్టుకోను గుడ్డముక్క, కడుపుకింత కూడూ, లోటు లేదన్నాడు సిమాలు.

తృప్తి పడిందా యిల్లాలు.

అనేకానేక ప్రశ్నల్తో, యెన్నెన్నో వేధించే జ్ఞాపకాల్తో, ఆశనిరాశల్తో, బలరాంనాయుడి కుటుంబం, సిమాలు వెంట నడిచింది.

✡

నాగేటి చాళ్ళకి పొదిగిన పచ్చపొడి వుంగరంలా వుంది నారుమడి ఆకుపచ్చగా. నలువైపులా చిరతగట్లెత్తి, తనివిదీరా నారుమడిని చూసి, నూతి దగ్గరకొచ్చేడు బలరాం

నాయుడు! పొద్దు కరకరమంటోంది. పొట్టలో గూడా. ఊరిదోవ వేపు చూసేడు. చెట్లూ, చేమలూ, పక్షులూ, పశురాళ్ళమీదుగా, దూరంగా ఎర్రంచు పసుపుచీరలో స్త్రీ ఆకారం ఒకటి అస్పష్టంగా కన్పించింది.

నాయురాలు – అడుగులు లెక్కబెట్టుకొస్తంది తాపీగా, అని గుణుసుకొని, గట్టుమీది వేపకొమ్మ విరిచి, నోట్లో పెట్టుకున్నాడు. అవతలి గట్టుమీది కాగుచెట్టుమీంచి రెండు కాకులు బలరాంనాయుడు నెత్తికి నిలువెత్తున కావ్‌కావ్‌మంటూ ఎగిరేయి.

"... యింకా సల్లంది రాలేదర్రా. ఆగండి, అలాగ యెగరకండి, రెక్కలు అలిసిపోగలవు," చెప్పాడు కాకులకు.

ఆ తర్వాత పాచి గీచుకుంటుండగా – ఓ రామచిలుక రాతి చప్టా మీదకు రాబోయి, బలరామయ్యను చూసి, పక్కన కొంత దూరంలోనున్న పాత యేతాంకొమ్మ మీద వాలింది.

"... యేఁవే? నేనేటి దెయ్యాన్నా, భూతాన్నా? నన్ను చూసి అటు పారిపోనావు," అనడిగేడు పాచిపుల్ల విసుర్తూ.

రామచిలుక వులకలేదు. రెక్కలు సారించింది.

"రెక్కలిప్పితే చిలకలాగుండవు, కాకిలాగుంటావు," అని వెక్కిరించేడు.

"పాచినోటికి అంతకంటె మంచి పలుకులెలగొస్తాయిలే," అంది చిలుక.

"యేటే? పిట్టంత లేవు. నాది పాచినోరా? పాచిమాటలా? నిన్నూ..." అని తగువాడ్తూ తువ్వాలు దులిపేడు బలరాం నాయుడు.

"నోరు సాపీసి కేకలెయ్యకు, నోటిల యేరిగీగల్ను" అని హెచ్చరించి, యెగిరిపోయిందా చిలుక.

"నువ్వీసారి, యీ మడిసెక్క యిరువాయిల్లోన కనబడు సెప్తాను," అని అరిచేడు కోపంగా.

"ఎవుల్తోటీ కయ్యిం," అనడిగింది, అపుడే చేరిన భార్య.

"నీ యారాల్తోటి..." బదులిచ్చేడు బలరాం నాయుడు.

"... యారాల్ని తెచ్చే మొహమే యిది. సాల్లే. కట్టుకున్న దానికే కంచం లేదు, వుంచుకున్న దానికి మంచం అట, సాల్లే," అని మొటిమలిరిసి, సల్దన్నం పెట్టిందామె.

బలరామం నాయుడు మౌనం వహించి, సల్లంది ముద్దలు రెండు మింగీ, గెంజి గుటకేసి, యెదురుగా కూచున్న భార్యను – కూచునే బదులు, ఆ వేపచెట్టు కింద రాలిన పిక్కలేరొచ్చు కదా– అని పురమాయించేడు.

"... కోడి కూసిన జాముకాంచి, దించిన నడుమెత్తకుండా పన్జేసినాను. నీ కళ్ళెదురుగా కూకున్నానని పని పురమాయించీకు," అని నిష్టూరమాడింది, భార్య.

"కూకోని తినాలంతే-నాయుడోలింటి కోడలవ్వాలిసింది," సల్లంది ఊర్చి తాగేసి, యిగటమాడేడు, బలరాంనాయుడు.

"... మా అమ్మా నాయినలు నాయుడోరనుకునే మనువిచ్చినారట. పేరు కొసన నాయుడుంది. ఊరిల మిద్దిల్లూ, కళ్ళంవూ, బండీ బక్కలూ వున్నాయిట, యెవులివి చూపించీసినావో? సన్నప్పంచే, జరీకండువా యెరువ్వని యెవులికి తెలుస్తాది? బల్రాంనాయుడి గోరంటే భాగ్యమంతుడే అనుకున్నారు మా కన్నోరు...." దెబ్బగొట్టిందామె హాస్యంగా.

గానీ, బలరామయ్యకు మాత్రం ఆ దెబ్బ యెక్కడో తలిగింది. ఎన్నింటినో మదిలో కదిలించింది. తన బాల్యంనాటి... కళ్ళముందరి భాగ్యం, తనకు వయసెదుగుతోన్న కొద్దీ - తరిగిన భాగ్యం... కదలాడింది. చెరువుల కింద భూంవులూ, పశులమందలూ, పంటకుప్పలూ, పంటల మధ్య కదలాడిన బతుకు!

బాల్యం పోయినట్టే భాగ్యంవూ!

తన తండ్రి తనకో కథ చెప్పేవోడు. ఆ కథని - బిడ్డలకు చెప్పమనేవాడు. అతనికి అతని తండ్రి, ఆ తండ్రికతని తండ్రి, తరతరాలు చెప్పిన కథట.

నాయినా-

ఇద్దరన్నతమ్ములు, పశులూ, గొర్లూ కాపుగాసి బతికేవోరు. గుర్రమెక్కి ఓసారి నాగావళి నదొడ్డున ఆగేరట. గుర్రం దిగేరు. గుడారమేసారు. అన్న గుడారప్పనిలో వుండగా - తమ్ముడు, కంపకొట్టి తెస్తానని గుర్రమెక్కి యెళ్ళాడట. పొద్దు తిరిగింది, రాలేదట. దినాలు గడిచేయి రాలేదట. మాసాలు గడిచేయి మరి రాలేదట.

అన్న-చుట్టూ చూసేడు. నేలతల్లికి దండమెట్టాడు. గొడ్డాయి నేలని దున్నేడట. ఏటికేతమేసి ఎయిపుట్లు పండించేడు.

నాగలీ, నక్కూ, పనిముట్లు చేస్తామని కమ్మరీ, కుండా మండా చేస్తామని కుమ్మరీ, తట్టా బుట్టా చేటలని మేదరీ, యిలాగ గుడ్డలుతక చాకలీ, గెడ్డాలుగీక మంగలీ- సకల వృత్తులవోరూ చేరేరట. అన్న అందరికీ గుడిసెలేసుకొండి అన్నాడట. అందరితో అదో ఊరయ్యిందట. ఊరంతా సందడయ్యిందట. ఉమ్మడి బతుకులట, ఉమ్మడి పండగలట.

గుర్రమెక్కి యెళిపోయిన వాడు తిరిగొచ్చేడు. గానీ, తమ్ముడు కాడట. రాజునన్నాడట! అన్న- రైతు అయ్యేడట అదీ కత!

బలరామయ్య తండ్రి, "నాయినా, రాజులూ, జెమీందార్లూ, తెల్లోళ్లూ, నల్లోల్లూ, వూరిన లాగుంచలేదు. వృత్తుల్నలాగుంచలేదు. ఎయిపుట్ల భూంవినీ అలగుంచలేదు... అందికే...

అందికే... నీమీద నాకు బెంగ, నీబతుకు మీద బెంగ, నీ బిడ్డలమీద బెంగ..." అంటూ ఆ బెంగతో చనిపోయేడు.

కావ్ కావ్ మంటూ కాకులు, కంచం ముందు వాలేయి. బలరామయ్య ఆలోచనలు తెగినయి, భార్యవేపు చూస్తూ–

"... పోనీ తాతముత్తాతల భాగ్యం పోయింది. పోనీ తండ్రి నాటి భాగ్యం అదెలాగ పోయింది? కొంతనేనూ, కొంత నా తండ్రీ... పోగొట్టుకున్నాం," అనన్నాడు. ఆ యిల్లాలు నొచ్చుకుంది తనాడిన హాస్యానికి.

"ఎకరమో, సకరమో ఆ చెరువుకింద భూమినే నమ్ముకోవల్సింది, తిండికేనా హామీవుణ్ణు. అదమ్మేసి, బంజరుగొన్నాం, యెక్కువ భూమని, యేదోనాడు నాగావళికాలువో, వొనకాబడి ఆనకట్టో, జంఝావతి రిజర్వాయిరో – యిదిగో బంజరు మీదికి పారీదా అనుకున్నాం. ఇదిగీనాటికి నుయ్యి అప్పు, మోటారింజనప్పు, యేటకేటా మదుపుల అప్పు... తడిసి మోపుల మీద మోపులై పోనాయి....! ఈ నారు దీసి ఉడిపించడంకి గాని, ఎరువెయ్యడంకి గాని, యేగాణప్పు పుట్టడం లేదు మరి..." అని బాధగా పలికేడు బలరామయ్య.

పొద్దుటే యింటి ముంద జీపాపి, కేకలేసిన బేంకు అధికార్ల హెచ్చరికలు గానీ, దోవలో యెదురై పరువు దీసిన షావుకారి సంగతి గానీ, ఆ సమయంలో భర్తకు చెప్పకుండా, గుండెల్లోనే దాచుకుందా యిల్లాలు!

అపుడా మడిచెక్కకు ఆవలి గోర్జలోంచి ట్రాక్టరొకటి పత్తిలోడుతో పోతోంది. దానికమర్చిన టేప్ రికార్డర్లోంచి కొడితే సిక్స్ కొట్టాలిరా పాట విన్పిస్తోంది. దాని వెనుక, మోటార్ సైకిల్ మీద – చౌదరిగారు, యిటువేపోసారి చూసి, పలకరింపుగా చేయి ఊపి, వెళ్తున్నారు.

"... యిక యవసాయాలు – అదిగో అలాటోళ్లే సెయ్యాల. మదుపులున్నోళ్ళూ, మార్కెట్టెరిగినోళ్ళూ..." అనన్నాడు బలరామయ్య.

ఆవేదనగా చూసిందామె. బలరామయ్య నారుమడి చుట్టూ మళ్ళీ మళ్ళీ తిరగసాగేడు...

కళ్ళు తుడుచుకున్నాడు.

పొద్దుటే సిమాలు నిద్ర లేవకముందే లేచి, మునివాకిట ముడుచుక్కూచొన్న బలరామయ్య మనసునిండా నాగేటి చాళ్ళూ, నారుమళ్ళూ తిరగసాగేయి....

✡

తర్వాత సిమాలూ లేచేడు. బలరామయ్యను బయల్దేరదీసేడు. ఇద్దరూ బయల్దేరుతుంటే–

“.. కరువుకి దాసరయిపోతానంతే, పదం రావొద్దా పాడటంకి? అలాగ రైతోరి పని దప్ప మరోటి సెయ్యగల్దేటి యీ మనిసి?” అంది యిల్లాలు.

“పోనీ, ఆ పనే సూద్దుం,” అన్నాడు సిమాలు.

తనకు తెలిసిన వొక పెద్దాయన వద్దకు తీసుకెళ్ళేడు. పెద్దాయనకు క్రిష్ణానది కాలువ దిగువ కొంత భూఁమీ, నగరంలో కొన్ని మిల్లులూ, మరికొన్ని వ్యాపారాలూ వున్నాయట. మంచోడట. పేదోనికి పని చూపి ఆదుకుంటాడట.

పెద్దాయన ఖద్దరు దుస్తులే ధరించేడు. గానీ, అవి, అతని మెడలోనా, చేతివేళ్ళకీ గల బంగారు ఆభరణాల కంటే ఖరీదువి. అతని మీసాల్ని మాత్రమే చూస్తే రైతుగానూ, కళ్ళను చూస్తే వ్యాపారవేత్తగానూ కన్పిస్తాడు. అతను మౌనంగా వింటున్నాడు. సిమాలే చెప్పుకొస్తున్నాడు. బలరాంనాయుడి తాత్తంద్రుల గురించీ, గ్రామం గురించీ, బలరామయ్య గురించీ చెప్పి చెప్పి – సైగ జేసాడు, బతిమాలుకో అన్నట్లు బలరామయ్యకి.

బలరామయ్య పెద్దాయన్ని చూసేడు. చేతులు జోడించేడు.

“... బావూ బతికిచెడిన దేశమోడ్ని (బతికి చెడినవాణ్ణి అనటం ఇష్టం లేదాయనకు. తనొక్కడే చెడలేదు గదా, అని) మీ పెద్దలు, పేరంటాళ్ళ దయవొల్ల మా తాత ముత్తాతలు సల్లగ బతికేరు. గాని తాతల్నాటి భూఁవికి రాజులూ, జమీందార్లక్కుదార్లయినారు. తంద్రినాటికి తెల్లదొరలు తోడయినారు. కొత్త పంటలు, కొత్త మార్కెట్లు జత గలిసేయి. నాకొచ్చేసరికి మెట్ట భూములూ, మార్కెట్ పంటలు, మదుపులు మీద మదుపులూ జమగూడినాయి. అయినా, నిబ్బరంగా నిలబడినాను.”

“బాగుపడ్డానికి బంజర్ని వొరగట్నాను. వొస్తాదనుకున్న ఆనకట్ట రాక – అప్పుజేసి నుయ్యి దవ్వి, ఏతమెత్తినాను. అప్పు తీరదు, నూతి నీరు సాలదూ! సెప్పానుగదా బావూ – బతికిచెడిన దేశమని. ఆనకట్టల్లేని దేశమని, అప్పుల దేశమని, ఆకలి దేశమని. ఆ దేశానికి దండం ఎట్టి, యెంతకో కంతకి తమలాంటి కలిగినోరికి భూఁవులప్పజెప్పి సేనామందెలి పోనారు. కలిగినవోరు – ఆ భూముల్ల రిగ్గులు దించితే–యేతాంకి నూతి నీరందుతాదా? అందదు. మళ్ళా అప్పజేశాను. మోటారేసినాను. పంటలు మార్చినాను. మార్కేటెంట పరుగెత్తినాను. పరుగెత్తినాను. కొసకి, పడిపోనాను. నుయ్యప్పు, మోటారప్పు, మదుపులప్పు ముప్పేట గొంతుక్కి ముడేసినాయి. ఇంటిల వంటకి లేదు. ఈధిలో పరపతీ లేదు, పొలాన పంటకి మదుపు లేదు. ఏది దారి? దిగులు దిగులుగా... నారుమడి పక్క నూతికాడ సతికిలబడినాం భార్యాబిడ్డల్తో.

అపుడా–దారెంటెళ్ళిన చౌదరిబాబు చూసేడట. ఆ బాబే, ‘దిగులొద్దు, అప్పులు తీర్చేస్తాను, భూమి తనకాయివ్వండ’న్నాడు. పూలమ్మేచోట కట్టెలమ్మలేమంటే – దారి కర్చులిస్తాను

ఎక్కడో బతికి, సంపాదించి తిరిగి రండి, భూమి విడిపించుకోండన్నాడు. అది బాబూ... అలాగ... యిదిగావా యీ రెక్కల్తో వొచ్చేసినాను...'' అని చెప్పాలనుకున్నాడు బలరామయ్య.గానీ, ఆయన గొంతులో అవన్నీ కదలాడ్తున్నాయే గానీ, బయటకు రావటం లేదు. ప్రయత్నమ్మీద గొంతు పెగిల్చితే–

"... యివిగోండి బావూ యీ రెక్కలిరిసి కష్టపడతాను. మీ పశివిల్ని కాస్తాను. పంటలు పండిస్తాను, మీ భూముల్ని పచ్చ పచ్చగా చేస్తాను. మీ యింటిని పాడి, పంటల్తో కళకళలాడిస్తాను. పనిప్పించండి. నాకు పనిప్పించండి" అని మాత్రమే అనగలిగేడు.

ఆ పెద్దమనిషి "తర్వాత రండి," అనేసి లోనకెళిపోయేడు.

మొదట సిమాలు, తర్వాత సిమాలు వెంట బలరామయ్య, ఆ తర్వాత తర్వాత గంటేడోడు, రౌతోడు, చీమలోడు, యెవరెవరో... బతికి చెడిన దేశం నించి వలస వస్తూనే వున్నారు...!

✡

# పులిజూదం

**-జి.ఎస్.రామ్మోహన్**

ఎంకారెడ్డి మూడోసారి పంచె సవరిచ్చుకున్నాడు. ఏం జేసినా అది నీలుక్కుని సావడం ల్యా.

'ఈనెమ్మ'.... గంజి సరిగా పెట్టలేదని సాకల్ని తిట్టుకుంటా యాప చెట్టుకాడికి ఎళ్లబారినాడు.

'ఎంత గంజి పెట్టినా ఇంకా ఎన్నాళ్లొస్తది సామీ. ఎపుడో మీ కూతురు పెళ్లి నాటి పంచె. ఆడికీ శానా ఎక్కువ కాలం సేవజేసింది"... సాకలి మాటలు గుర్తులేక కాదు. కాకపోతే అట్టాంటివి గుర్తు చేసుకోవడమంటే ఎంకారెడ్డికి బో చిరాకు.

యాపచెట్టుకాడ అప్పటికే జోరుగా సాగుతోంది పులిజూదం. సాలోళ్ల పరంధాముడి తాజ్‌మహల్ బీడి, బలిజోళ్ల సుబ్బారాయుడి విల్స్ సిగిరెట్టూ పోటాపోటీగా పొగలు చిమ్ము తున్నాయి.

'ఒక ఆటెత్తు, రెండు సంపుళ్లు. మావా! నీ పులుల పని అయిపోయిందే'

'నా పులుల్ని కట్టెయ్యాల్నంటే నీ జేజినాయన దిగిరావాలోయ్. ఇదిగో ఈ మేకను సావకుండా చూసుకో చేతనైతే'...

మాంచి ఊపులో వున్నారిద్దరూ. పరంధాముడు రెడ్డికి పలకరింపు నవ్వు యిసిరేసి కొంచెం ముడ్డి పక్కకు జరిపినాడు కూర్చోవడానికి చోటిచ్చినట్టు. సుబ్బారాయుడు కూడా నవ్వీ నవ్వనట్టు అదో రకంగా పలకరిచ్చినాడు. ఎపుడూ రానోడు ఈడెందుకొచ్చినట్టు యీడికి?

సుబ్బారాయుడెందుకో అపశకునంలాగా అనిపిచ్చినాడు రెడ్డికి. పలకరింపులు అయినాయి గానీ ఆటైతే ఇప్పట్లో అయ్యేట్టు కనిపిచ్చడం ల్యా. ఎవురా లేసేట్టు లేరు.

'ఆ చెవి జూదం ఆడవోయ్. అది చెవిలోకి తోయవోయ్ నాయాలా'

ఎంకారెడ్డి పరంధాముడి మీదకు వొంగి సలహాలివ్వడం మొదలుపెట్టినాడు.

'ఇగో మామా. పేకాట కాడ, పులిజూదం కాడ పైయోళ్ల యవ్వారం వద్దే వద్దని నువ్వే అంటివి' పరంధాముడు గుర్తు చేసినాడు.

'అది ఆడ కూచున్నప్పుడు అంటిలేవోయ్. పెద్ద పాయింటు మాట్లాడినావ్ గాని'

సహజన్యాయాన్ని మృదువుగా గుర్తు చేసినాడు ఎంకారెడ్డి రెడ్డి అయ్యా యియ్యా మాట్లాడుతున్నాడే గాని చూపంతా పోల్రాజు టీకొట్టు మీదే ఉంది. ఒక చేతిని ఆకాశానికి మరో చేతిని బూమికి ఆనిచ్చినట్టు టీ తిరగ్గొడతా ఉన్నాడు పోల్రాజు.

'ఇంతకీ ఈ నాకొడుకు నన్ను చూసినట్టా, చూడనట్టా. చూసినా చూడనట్టు యాక్సన్ జేచ్చన్నడా'...

ఎంకారెడ్డి హృదయం రకరకాలుగా ఆలోచిస్తా ఉంది. యాడ్నో కాల్తా వుంది. అతని అవస్తను చూసి లోలోపలే వికటాట్టహాసాలు చేసుకుంటున్న పోల్రాజు ఆ ఆనందపారవశ్యాన అదాటున దొరికిపోయినాడు. చూపులు చూపులు కలిసినాయి. ఇక తప్పలేదు. చార్మినారు పాకెట్టు, కాఫీ గల్లాసు పట్టుకొని యాపచెట్టు అరుగు కాడికి నడిచినాడు.

పాకెట్టు తెరిచిన రెడ్డికి షాక్ కొట్టినట్టయింది. పదికి బదులు ఐదే.

గంభీరంగా ఉరిమి చూడబోయినాడు. పరిస్థితిని ముందే ఊహించిన పోల్రాజు 'బాబాయ్' అని పద్దుల పుస్తకం మీద చేయి వేయబోయినాడు.

'పరువు దీస్తడా యేం నా కొడుకు' రెడ్డి గుండె గుబగుబలాడింది.

గంభీరం కాస్త భయ గంభీరమైంది. చివరకు దీన గాంభీర్యంగా అవతరించింది.

రెడ్డి భయం జూసి పోల్రాజుకు ఆర్గాజానుభూతమైంది. 'పోన్లే పెద్ద నా కొడుకు' అనుకుంటా టీ కలపడంలో మునిగిపోయినాడు.

పరంధాముడు, సుబ్బారాయుడుతో సహా అడున్నోళ్లందరూ ఏమీ ఎరగనట్టు మర్యాద నటిస్తూనే అంతా గమనిస్తా ఉన్నారు రంజుగా.

రెడ్డికి వాళ్ల యవ్వారంపై అరకొరగా అనుమానమున్నా 'చీ చీ మనూరోళ్లు మరీ అంత ఎదవలు కాదులే' అని ఆ అనుమానాన్ని తొక్కేసినాడు.

ఎందుకో ఉన్నట్టుండి అతనికి జేజినాయన అబ్బారెడ్డి గుర్తుకొచ్చినాడు.

'ఆయన గుర్రమెక్కి యాపచెట్టు కాడికి ఎళ్లబారితే ఊరు ఊరంతా గప్‌చుప్పయ్యేది. కావ్ అందామనుకుని నోరు తెరిసిన కాకి గూడ కా తోనే ఆగిపోయేది. యాపచెట్టుకాడ ఆయన కొలువుతీరిస్తే బోజరాజు సబ లాగుండేది గాదూ! ఎట్టాంటి రోజులయి. ఎంత గౌరం, ఎంత మర్యాద. ఆ రోజులే యేరు. ధర్మం నాలుగు పాదాలా నడిసే రోజులయి.

ఇట్టాటి మిడిమాలపు రోజులా. నాన్న ఇన్నారెడ్డి మాత్రం... బుల్లెట్ టపటపలాడిస్తే ఎవురైనా నోరు తెరిసే వాళ్లా. అంత దమ్ములా ఎవుడికైనా'

రెడ్డి బాధాకర మధుర స్మృతులకు బ్రేక్ వేస్తూ ఊడిపడింది ఆర్టీసి బస్సు – ఎర్రదుమ్ము లేపుకుంటా.

డ్రైవర్ కొండయ్య బుయ్ బుయ్ మని రెండు సార్లు ఆరన్ మోగిచ్చి బస్సు దిగి పోత్రాజు దగ్గర కూలబడినాడు. కండక్టర్ ఉసేను పంచాయతీ పేపర్ తెచ్చి రెడ్డి చేతిలో పెట్టినాడు. నేరుగా పేపర్ తనకే ఇవ్వడం రెడ్డికి యీరుబానతో యీపు గోకిచ్చుకున్నంత సుఖంగా అనిపిచ్చింది. సుబ్బారాయుడ్ని చూడ్డంతోనే కలిగిన అపశకునానికి ఉపశమనంలాగా అనిపిచ్చింది. "పర్లేదు. యింకా ఆచారాలు మిగిలున్నాయి. ధర్మం అక్కడక్కడా వుంది." అనుకొని అభినందనపూర్వకంగా – విదురుడి కేసి క్రిష్ణ పరమాత్ముడు చూసినట్టుగా చూసినాడు ఉసేనుకేసి. ఆ తర్వాత మొదటి పేజీ ఉంచేసుకొని మిగిలినవి ఉదారంగా పంచి పెట్టినాడు.

'ఏరా కొండిగా! ఇంకో రెండుసార్లు ఆరనేస్తే మీ తాత ముల్లేమైనా పోతాండాదా? ఆ మూలున్న గౌండ్లోళ్ల యీదిలోకి యినిపిచ్చాల్నా, లేదా? ఎవురెక్కకుండా ఒట్టి బస్సునే తీసకపోవాలనుకొంటాండావా?' డ్రైవర్ కొండయ్యను మందలిస్తా ఉన్నారు కొందరు చైతన్యపూరితులైన గ్రామస్తులు.

' ఆ ఏచ్చాలేవోయ్. రెండుసార్లేం కర్మ. రెండొందల సార్లు ఏచ్చాంగానీ. ఏం కాసేపు ముందొచ్చి కూర్చుంటే మీ వూరోల్ల గని ఏమైనా తరిగిపోతాండాదా?' మాటకు మాట అంటిస్తున్నాడు కొండయ్య.

ఆ ఊరికి ఒగటే బస్సు, ఒగటే పేపరు, ఇయ్యాల్టిదాక ఒగడే నాయకుడు. ఇట్టాంటి వాతావరణంలో అక్కడికి వచ్చినాడు రామయ్య అలియాస్ రామశాస్త్రి. పొద్దుటాల్నే పొలాల నుంచి వస్తున్నట్టున్నాడు. చేతిలో కంచు చెంబు. దానికి పోటీగా నేరేడు పండులాగా మిలమిలమాడుతున్న గుండ్రని పొట్ట. బుజం మీద కాశీ తువ్వాల. నడుము చుట్టూ కావి రంగు పంచె.

రామయ్య రాగానే పోత్రాజు టీకొట్లో బెంచీల మీద కూర్చునోళ్లంతా లేచి నిలబడినారు 'దండం సోమీ' అనుకుంటా. రెడ్డి నమస్కారం పెట్టలేదు గానీ అంతకంటే మర్యాదగా నవ్వుతో మందలిచ్చి పేపర్ చేతికిచ్చేసినాడు. పరంధాముడు ఓ నమస్కార బాణం పడేసినాడు. సుబ్బారాయుడు మాత్రం వింతైన పలకరింపు ఇసిరినాడు.

'ఏం సోమీ! అంతా సుఖమేనా?'

స్వామి పొట్టను, కంచు చెంబును కొంటెగా చూస్తా సుబ్బారాయుడు అడిగిన ప్రశ్నకు మామూలుగానైతే పక్కన నవ్వులు ఇనపడాల్సిందే. అయితే ఎంకారెడ్డి యిందాకే అనుకున్నట్టు

ఊరోళ్లు పెద్దా చిన్నా తెలిసినోళ్లు. ఎందుకైనా మంచిదని నవ్వును లోలోపలే దాచుకున్నారు. స్వామేం తక్కువ తిన్నాడా! గాయం కనపడకుండా మొకాన్ని గాంభీర్యంతో కడిగేసినాడు. ఈరేంద్ర సెవ్వాగు పాకిస్తాన్ బౌలింగ్‌ను ఎట్టా ఇరగదీసినాడో పేపర్ ఎనకాల్నుంచి వంగి వంగి చదువుతున్న పిల్లకాయలను ఒక్క కసురు కసిరినాడు.

'పోండ్రా కుంకల్లారా! చిన్నా లేదు. పెద్దా లేదు. ఇంతోడికి పేపర్ గావాల. అంతోడికి పేపర్ గావాల. యాడుండోడు ఆడుండేది ల్యా. ప్రతోడికి పేపర్ గావాల. రాజకీయాలు గావాల. కలికాల మహిమ. అయినా ఒకర్నని లాభం లేదు. అంతా ఆడు చేసిన పని' ఎన్టీఆర్‌ను మనసులోనే కసిదీరా తిట్టుకుంటా పేపర్ రెడ్డికిచ్చేసి ఎళ్లబారినాడు చెంబూపుకుంటా. యిరవై యేళ్లు దాటినా గాయం పచ్చిగానే ఉన్నట్టుంది రామశాస్త్రికి.

'ఎంతైనా కర్ణపోడు కర్ణపోడే. ఆడితో చతుర్లా' నలుగురైదుగురు చెవులు కొరుక్కున్నారు సుబ్బారాయుడు కేసి అదో రకంగా చూస్తా. తనకింకా చిటారుకొమ్మన పండును కొట్టేంత గురి రాలేదని అర్థమైంది సుబ్బారాయుడుకి.

'రెడ్డీ... పులులు తీసుకుంటావా? మేకలా? అయినా రెడ్డివి గదా! పులులే తీసుకోలే.'

'గాలి ఇటు తిప్పాడు. రెడ్డికి సెలకోలతో కొట్టినట్టయింది. 'ఈడు నా మీద ఔదార్యం చూపుతాడేంది? నేను కదా, అది అందరి మీద చూపాల్సింది! అదినా హక్కు గదా!' రెడ్డి మనసు మూలిగింది.

'స్వామికేమి సుబ్బరంగా జారుకున్నాడు కానీ తనట్టా పోలేడే. ఈ యాపచెట్టు యిడిసి పెట్టలేడే. ఇది యిడిస్తే పాణం ఇడిసినట్టే గదా. ఈదుజూస్తే కడుపులో ఏదో కుట్ర పెట్టుకొనే ఈడికి వచ్చినట్టున్నాడు. అయినా అటో యిటో తేల్చేసుకోవాల్సిందే'

దీర్ఘంగా నిట్టూర్చి... "నలభై యేళ్ల నుంచి ఈ ఆటాడతాండాను సుబ్బారాయుడా. నాకేవైతేనేమి గాని పులులు నువ్వే తీసుకో. నేను మేకలు తీసుకుంటా గానీ"... ఒక్క వుదుటున అనేసి ఊపిరి పీల్చుకున్నాడు. ఇద్దరూ ఎదురెదురుగా సర్దుకుని కూర్చున్నారు.

నక్సలైట్లూ, ఉచిత విద్యుత్తూ, బిన్ లాడెన్నూ తదితర ప్రపంచ సమస్యలను కూలంకషంగా చర్చిస్తున్న పోల్రాజు టీ కొట్టులోని సకల జన సందోహం కూడా అరుగు చుట్టూ చేరతా వుంది. పరంధాముడి పని అటూ ఇటూ గాకుండా ఉంది. యింటిలో సాపు పూర్తవడానికి రెండు గజాలు మిగిలుంది. 'ముందే పూట పూటకి కటకటగా వుంటే మగ్గం మీద కాసేపైనా ముడ్డి మోపకుండా పెద్ద పోతుమొగోని మాదిరి యాపచెట్టు కాడ పెత్తనాలేందని' పెళ్లాం 'ఆ రెండు గజాలు అదే నేస్తదిలే' అని ఆడ్నే కూలబడినాడు. ఏదో పెళ్లి పందిట్లో కాటి సీను రికార్డు మోత మోగిస్తా వుంది. 'ఇచ్చోటనే.. ఇచ్చోటనే భూములేలు రాజేంద్రుల అధికార ముద్రికల్ అంతరించే' డి వి సుబ్బారావు గొంతు ఆరున్నరలో ఖంగు ఖంగుమంటోంది.

మామూలుగా సుబ్బారాయుడు యాపచెట్టుకాడికి వచ్చేవోడుకాదు. మిలట్రీ నుంచి రిటైరైనాక డ్రైవర్‌గా చేరి లారీ కొన్నప్పట్నించి ఊరులో అతని పేరు పెద్ద మనుషుల లెక్కలో చేరింది. కష్టపడి చదివించుకున్న కొడుకు అమెరికా పోయి అడ్నించి డాలర్లు పంపిచ్చడం మొదలు పెట్టినాక, దాంతో ఊర్లో వడ్డీ వ్యాపారాలు చేయడం మొదలు పెట్టినాక యవ్వారం పూర్తిగా మారిపోయింది. ఓల్ మొత్తం డివిజన్‌లోనే అమెరికా కొడుకున్న ఏకైక తండ్రిగా పేరు ఎలిగిపోతా వుంది. బేస్‌మెంట్ నుంచి అంతా సిమెంట్‌తో టౌన్నోల్ల మాదిరి జాంజాంగా మాడీ కట్టించినాడు. బీడీలనొదిలేసి సిగరెట్టుకు మారినాడు. నాటు నుంచి సీమసరుక్కు తిరిగినాడు. ఊళ్లో వాళ్ల మాటల్లో చెప్పాలంటే 'ఇయ్యాల ఆడి ఉచ్చ పెట్రోలై మండుతా వుంది.'

'రెడ్డీ, తెలంగాణ వచ్చుదంటావా?' కొండ మీంచి పులిని కిందికి దించి తొలి ఎత్తు వేసినాడు సుబ్బారాయుడు.

'వస్తే ఏంది? రాకపోతే ఏంది? మనకేమన్నా వుంటదా, ఊడుద్దా!' వుషారైన జవాబిచ్చి నానని సంబరపడినాడు రెడ్డి.

'అదేంది రెడ్డీ, మడుసులన్నాక అన్నీ తెలుసుకోవాల. అందునా పెద్దమడుసులన్నోళ్లు అవసరమా, కాదా అనుకోకుండా పేపర్లో వచ్చేయన్నీ తెలుసుకోవాల. ల్యాపోతే మనకూ మిగిలినోళ్లకూ తేడా ఏముంటది?' ఇంకో పులిని కిందికి దించినాడు సుబ్బారాయుడు.

అంతా పళ్ల బిగువున భరిస్తానే ఉన్నాడు రెడ్డి.

'మనకూ మిగిలినోళ్లకూ అని చెప్పి గుర్రాన్ని గాడిదను ఏకం జేచ్చుడా? నాలుగు రాళ్లు ఎనకేసుకోగానే పెద్ద మొగోడయిపోయినాడా, అబ్బారెడ్డి జమీందారు వంశీకులతో సమానమైపోయినాడా' అని గిలగిలలాడిపోయినాడు. ఆయువుపట్టు మీద దెబ్బ కొట్టినట్టయింది.

'రెడ్డీ... పివి నరసిమ్మారావు మేదావా? వాజ్పేయి మేదావా?' ఇంకోబాణం ఇసిరినాడు సుబ్బారాయుడు.

ఇందాకటి అనుభవం ఇచ్చిన జ్ఞానం వల్ల వెంటనే మనకెందుకు అని సమాధాన మియ్యకుండా ఒకించుక దీర్ఘంగానే ఆలోచించినాడు రెడ్డి.

'ఎవుర్ని కాదంటామోయ్. ఇద్దరూ గట్టోళ్లే' నిదానంగానైనా మాంచి ధీమాగా చెప్పినాడు.

'అదేంది రెడ్డా, అట్లనేసినావు. ఇద్దరూ గడుసుపిండాలే అని నాకు తెలీకనా. ఏదో పెద్దోడివి. ఇద్దర్లో ఎవరు ఎక్కువ మేదావి అని చెపుతావనే కదా అడిగింది' అట్నుంచి నరుక్కొచ్చినాడు సుబ్బారాయుడు.

రెడ్డికి ఎటూ పాలుపోకుండా వుంది. రెడ్డి పుటక పుట్టినాక – అందులోనూ జమీందార్ వంశాన పుట్టినాక అవతలోడు సవాల్ ఇసిరితే యెనక్కు పోయేదానికే ల్యా. అట్టని అవతలోడి దగ్గర ఏమేం ఆయుదాలుండాయో తెలుసుకోకుండా రంగంలోకి దిగాల్నంటే ఎవురికైనా కష్టమే. ఆకస్మాత్తుగా జేజినాయన అబ్బారెడ్డి గుర్తుకొచ్చినాడు. ఆయన గుఱ్రమూ, ఆ ఠీవి... ఆలోచనలతో బరువెక్కిన తలను ఒక్కసారి ఇదిల్చినాడు. ఒంట్లో సత్తువ అంతా కూడగట్టుకుని గంభీరంగా గాలి పీల్చి 'నరసిమ్మారావే ఒక మెట్టెక్కువ' అనేసినాడు.

'ఎట్టా?' పాయింట్ దొరగ్గానే కోర్టులో వకీలు అడిగినట్లు గబాల్న అడిగినాడు సుబ్బారాయుడు. అప్పటికే మూడు మేకల్ని చంపేసి ఊపు మీదున్నాడు.

'ఆయన జగమెరిగిన పండితుడు. బాగా చదూకున్నోడు'

'అంటే వాజ్పేయి సదూకోలేదనా. అయనా బెమ్మాండంగా సదివినోడే కదా'

'నరసిమ్మారావు పుస్తకాలూ అవీ రాసినాడప్పా. ఆయనతో పోలికెక్కడ?'

'ఈయన రాయలేదనా ఏంది? ఆయన రాసిన పాటలు మా కలర్ టీవీలో గూడ సూపిస్తిరే' కలర్ టీవినీ నొక్కి పలుకుతా చెప్పినాడు సుబ్బారాయుడు. అంతటితో ఊరుకోకుండా ఏమంటావు అన్నట్టు పరంధాముడి వైపు చూసినాడు.

పరంధాముడి పని శానా ఇబ్బందిగా తయారైంది.

అటు చూస్తే ఇంట్లో సాపు తెంపినాల్నించి మళ్లీ నూలు కోసం, రంగుల కోసం సుబ్బా రాయుడే గతి. ఇటు చూస్తే తరతరాల అనుబంధం. ఇస్వాసమా, బోయినమా అన్నట్టుంది పరిస్థితి. ఏం చేయాల్నో తోచక అటూ ఇటూ కానట్టు కన్ఫ్యూజింగుగా నవ్వినాడు. రెడ్డికి షాక్ కొట్టినట్టయింది.

'చీ ఇస్వాసం లేని నా కొడుకు' కడుపులో కసిదీరా తిట్టుకున్నాడు.

ప్రయత్నంగా కాలు మీద కాలు వేసుకున్నాడు. మీసాల మీదికి చేయి పోనిచ్చి మెలితిప్పుతా అదనపు గాంభీర్యం కోసం ప్రయత్నించినాడు. ఏం జేసినా సుబ్బారాయుడి మొకంలో కనిపిస్తున్న దర్పానికి సమానంగా రావడం ల్యా. కురుక్షేత్రంలో కర్ణుడి మాదిరి వుంది రెడ్డి పరిస్థితి. నమ్ముకున్నవన్నీ నట్టేట ముంచి ప్రత్యర్థి ముందు తనను నిరాయుధుడిని చేస్తున్నట్టనిపిచ్చింది. అంతటి నిస్సహాయతలోనూ ఏదో మెరుపులాగా మెరిసింది.

'ఆయన బహుబాషా కోవిదుడు. ఈ విషయంలో ఎదురే లేదు'... పాశుపతాస్త్రం యిసిరినానని అనుకున్నాడు రెడ్డి. తన జవాబుకు ఎదురే లేదనే ధైర్యంతో ఒక్కసారిగా తలెత్తి అందరి మొకాల వంకా ధీమాగా చూసినాడు.

అయితే ఆ ఆనందం ఒక్క క్షణంలో ఆవిరైపోయింది.

‘అంటే ఏంది. చానా బాసలొస్తయనేగా. సరే, అట్టయితే ఆయన కంటే నాకే ఎక్కువ బాసలొచ్చు. నేనే పెద్ద మేదావినవ్వాలి కదప్పా ఈ పెకారం’ తడుముకోకుండా అనేసినాడు సుబ్బారాయుడు. వుల్లాసంగా పెట్టెలోంచి సిగిరెట్ తీసి ఇలాసంగా ఎలిగిచ్చినాడు.

రెడ్డి మొకంలో నెత్తురంతా ఆవిరైపోయింది. ‘ఈడు మిల్ట్రీ నా కొడుకని గుర్తు లేకపోయగదా’ అని వగచినాడు. చుట్టుపక్కల జనం కేసి పరికించి చూసినాడు. అందరి చూపుల్లోనూ భరించలేని జాలి.

‘అయిపోయింది. సర్వం అయిపోయింది. తాత తండ్రుల నాటి పరువును తాను నిలపలేక పోయినాడు. జమీందారీ వంశాన చెడబుట్టినాడు. నిన్నమొన్నటి దాక తువ్వాల చేత్తో పట్టుకొని నసుగుతూ సంగినంగిగా మాట్లాడే వోడి పవర్ ముందు తాను నిలబడలేకపోయినాడు. చేతుల్లో ఇంత పెద్ద సిగరెట్ పట్టుకుని వూర్లో ఏవో పెత్తనాలు చేసుకుంటా తిరుగుతున్నాడని తెలిసె గాని ఇంత అగస్మాత్తుగా తన కోటలోకి వస్తాడని కలగంటిమా!’

జీవితంలో చాలా సంవత్సరాల తర్వాత రెడ్డి కళ్ళలో నీటిపొర కదలాడింది. అది చుక్కగా మారి కిందకి దూకకుండా ఉండడానికి అతడు తన సర్వశక్తుల్నీ కేంద్రీకరించినాడు. అయితే అప్పటికే ఆ తడి అందరికీ అనుభూతమైంది. రెడ్డి కళ్లకు జనాన్ని మోసం చేసే శక్తి లేకపోయింది. దైన్యాన్ని జయించడానికి మాటలనాశ్రయించక తప్పలేదు.

కాసేపు అయ్యా ఇయ్యా అంతూపొంతూ లేకుండా మాట్లాడినాడు. పరంధాముడితో ఒకప్పుడు నేతపని ఎంత వెలుగు వెలిగిందో చెప్పినాడు. ఊర్లో శ్రీరామనవమి రోజు తాలిబొట్టుకోసం రాముల వారి విగ్రహాన్ని పరంధాముడి జేజినాయన ఇంటికి ఎట్లా ఊరేగింపుగా తెచ్చేవారో చెప్పినాడు. ఎనకటి రోజుల్లో కులవృత్తుల కున్న గౌరవం గురించీ, పెద్దా చిన్నా మర్యాదల గురించీ అయ్యా ఇయ్యా మాట్లాడినాడు. కాలంలో వెనక్కు నడిచిన వాడి మాదిరిగా చుట్టుపక్కల వారిని పట్టించుకోకుండా ఎంతో సేపు గతాన్ని పలవరిచ్చినాడు. మనుషులను అపుడే కొత్తగా చూస్తున్నట్టు అందర్నీ వింతగా పరికించి చూసినాడు. ఆ తర్వాత హఠాత్తుగా మాటలాపేసినాడు. సుబ్బారాయుడి కేసి ఒక్క చూపు ఇసిరినాడు. ప్రపంచంలోని కసిని, ద్వేషాన్ని, అసహ్యాన్ని రంగరించుకున్నట్టుందా చూపు. అదిగో అపుడు మాత్రం సుబ్బారాయుడి ఒళ్లు జలదరించిన మాట వాస్తవం. చూపుకు అంత శక్తి వుంటుందని అతడు తొలిసారిగా తెలుసుకున్నాడు.

కాసింత మౌనం తర్వాత ‘వస్తానోయ్ పరంధాముడు’ అని ఒక మాటనేసి నెమ్మదిగా ఇంటి బాట పట్టినాడు ఎంకారెడ్డి. జొరమొచ్చి వారం రోజులు ఉపాసాలు చేసిన రోజున కూడా రెడ్డి అంత నీరసంగా నడవల్యా.

మర్నాడు కూడా యాపచెట్టు యదావిధిగా కొలువు దీరినాది. కాకపోతే అరుగు మీద రెడ్డి చార్మినార్ వాసన లేదు. సుబ్బారాయుడి విల్స్ సిగిరెట్టు పొగ మాత్రం వుంగరాలు వుంగరాలై తిరుగుతా ఉంది.

అతడు అడక్కముందే సిగిరెట్ పాకెట్టు, కాఫీ గల్లాసు పట్టుకొచ్చి యిచ్చినాడు పోల్రాజు. కండట్టర్ ఉసేను గూడ పేపర్ అతనికే తెచ్చివ్వాల్సి వచ్చింది.

✡

# స్టేటస్ సింబల్

**–ఎలికట్టె శంకరరావు**

సంద్రజెట్లు, పీకతుమ్మలు ఒక్కొక్కటి వొరుగుతున్నయ్. గొడ్డండ్లు చెట్ల మొదళ్ల మీద ఆడుతున్నయ్. చెక్క పేల్లు ఎగిరిపడుతున్నయ్.

ఓ పెద్ద బొత్త నీడన అద్దాల రామారావు కూసుండు. ఎండకు మాడ బగ్గుమంటుంటె నీడకొచ్చిండు. ఆయిన ఆలోచనలన్ని ఆ పదెకరాల సుట్టే తిరుగుతున్నయ్.

నీల్లసుక్క జూడక నోరుతెర్సిన నేల. ఇంతకాలం అడివోలిగుంది. గీత బావుండి కాల్వొస్తుంది. ఇంగ బతికి పోవొచ్చు. ఇన్నాళ్లు పడ్డ కష్టం – పెట్టుకున్న ఆశలు తీరబోతున్నయ్. ఆ ఆశతోనే పొతం జేపిస్తుండు.

'ఏం పాపులూ! ఇయ్యాల అయిద్దంటావా! ఇంకో నలుగుర్ని తీస్కరమ్మంటెనేమో దొర్కుత లేరంటివి' అద్దాల రామారావు పాపులు రావటం సూసి అడిగిండు.

పాపులు నోట్లె బీడిముక్క యిసిరి 'ఆఁగీ గింతమంది ఏం పీకుతరయ్య. కాస్త చెట్లా. ఒక్కొక్కటి గుదుమకు గుదుమోలిగుంది. రెక్కలు బోతున్నయ్. వోన్ని రమ్మన్నా గా పని ఒప్పుకున్న గీ పని ఒప్పుకున్న అన్రి' అనుకుంట దగ్గెరకొచ్చి నిలబడ్డడు.

రెండు దినాల సంది చెట్లు కొడుతుండ్రు. ఓ దిక్కు ప్రొక్లెయినర్ మొద్దులు పీకుతుంది. దానికి గూడ కూలోల్ల పెట్టొచ్చు గని గాడ్దికొడుకులు పీకలేక వొగిరిస్తరు. పొక్లెయినరయితెనె ఒక్క పూటల పొతం జేసిపోతది. తర్వాత పనిగురించి ఆలోచన జేసిండు.

'ఇంతకు కాల్వొస్తదంటరాయా' పాపులు గొంతులో అనుమానం.

'ఆఁరాకేంజేస్తది వాయ్. సర్కారు రైతుల గురించి బానే ఆలోచిస్తుండె. అయినా మనకోసం గాకున్నా తెలంగాణ అడుగకుంట వుండాలన్నా ఆ నీల్లేదో తెచ్చి తీరాలె' అద్దాల రామారావు కామంచి పుల్లలు యిర్సుకుంట అన్నడు.

పాపులు పొడుగ్గా గాలొదిలి 'ఏమోనయ్యా, తమరి నమ్మకమే మరి. యెన్టిరామారావు ముక్కమంత్రిగున్నపుడు కూడ బాటల పొంటి కాలువబొందలు సూపిచ్చి ఊరిచ్చి ఊరిచ్చి

పోయిండు. మల్ల ఈ ముక్కెమంత్రి బాటలపొంటి కాలువలైతె సూపిస్తుండు. ఏవైతదో సూడాలె మరి' అన్నడు.

'ఎప్పుడొక్క తీర్గ ఉంటాదివాయ్. అయ్యాల వేరు ఇయ్యాల వేరు. ఏ ముక్కెమంత్రి వొచ్చినా సచ్చినట్టు కాలువ పనులు చెయ్యాల్సిందే. మనకు నీల్లియ్యకుంటె ముక్కెమంత్రి సీటుకిందికి నీల్లు రావూ?' అద్దాల రామారావు రాజకీయాలు తెల్సిన మనిషోలిగ మాట్లాడిండు.

'ఏమోనయ్యా వొస్తుంది వొస్తుందని అందరు ఆశ పడుతుండ్రు. ఏండ్లకొద్ది పడావుపడ్డ భూములు కూడ పొతంజేస్తుండ్రు.' యిన్ని మంచి నీల్లు తాగిన పాపులు రుమాలు సుట్టుకొని పనికల్ల కదిలిండు.

అద్దాలాయిన కండ్లు మూసుకొని ఆలోచన్ల బడ్డడు.

తేటగ అద్దమోలిగ మెరుస్తుంది భూమి. కాలువ గలగలా పారుతుంది. పదెకరాలు నాటు బెడితె పచ్చగ నిగనిగలాడుతుంది. తృప్తిగ సూసుకుంటుండు పొలాన్ని.

అట్ల కలగంటున్న అద్దాలాయినకు దుమ్మురేపుకుంట వొస్తున్న కారు కనిపించింది. ఈ తోవన కారెవరిదబ్బా అనుకుంట అద్దాలు సరిచేసుకొని చూసిండు.

కారు వేగం తగ్గి బొత్తలకు అంత దూరాన బాటమీద ఆగింది. కార్ల నుంచి నలుగురు తెల్లబట్టలోల్లు దిగి బొత్తల రోకు కదిలిండ్రు.

ఆ మనుషులు తనకోసమేనని అద్దాల రామారావుకు అర్థమైంది. వాల్లు దగ్గెరికొచ్చిండ్రు. ఎవలూ తెల్సిన మన్సులు కారు. అయినా పలకరింపుగా నవ్విండు.

'మీరేనా రామారావు'

తెల్లబట్టలోల్ల దాంట్లె గుదిమట్టంగ వున్న వో మనిషి పిడికిలితో మీసాలు సరిచేసుకుంట అడిగిండు.

రామారావు తలూపి 'మీరు....' అన్నడు.

'నా పేరు గంగిరెడ్డి. ఈయన ప్రసాద్ డాక్టరు సూపుకుంట చెప్పిండు.

అద్దాలరామారావు తలూపి 'ఎటో పోతుండ్రు పనిమీద?' అడిగిండు.

'ఈ బాటెంట భూములు దొరుక్తయేమోనని యెల్లినం. అట్ల జాడలు దీసుకుంట దీసుకుంట వొస్తున్నం' గంగిరెడ్డి...

రామారావుకు సొంతం అర్థమైంది. ఈ నడుమ కాలువొస్తుందన్న పుకారు లేసిందగ్గెరి నుంచి బాట మీద జనాలు తిర్గుతుండ్రు. మట్టిరోడ్డయినా నల్లగొండ నుండి సక్కటి రోడ్డు.

ముషంపల్లి దాటినంక మూడు కిలోమీటర్లు. తిప్పి తిప్పి గొడితె నల్లగొండ నుంచి పన్నెండు కిలోమీటర్లు. నల్లగొండల పైసలున్నోల్ల కండ్లన్ని ఆ బాటరోకు భూములమీదనే పడ్డయ్.

'తోవ తప్పి వొచ్చినట్టుంది' రామారావు...

నల్లగొండోల్లు ఎగబడ్డంక భూములరేట్లు విపరీతంగ పెర్గిపోయినయ్. మొన్నటిదాంక ఎకరానికి పదివేలన్నా మల్లి సూసిన దిక్కులేదు. అట్లాంటిది ఆర్నెల్లల్ల ఎకరానికి అరవై వేల దాంక బేరమొస్తుంది. అప్పటికే ఊల్లె ఒకలిద్దరు అమ్మింద్రు కూడ. రామారావుకు మారుతున్న పరిస్థితులు యాదికొచ్చినయ్.

'డాక్టర్‌సాబ్‌కు ఓ పదెకరాలు కావాలె. ఏన్నన్న దొరుక్తదేమోనని...' గంగిరెడ్డి సూటిగ సూసుకుంట అడిగిండు. ఆ సూపులో నీకు పదెకరాలు వుందని తెలిసే వచ్చినం అన్న భావం.

బక్కపల్సగున్న ఆ డాక్టరు గుర్తొచ్చిండు. పిజీషియన్. గొల్లగూడ దవాకాండ్ల డాక్టరు. బెయిట ప్రయివేటు ప్రాక్టీసు. నాలుగు శేతుల సంపాయిస్తుండని పేరు. సర్దిజేసి పొయినా అయిదొందలకు తగ్గకుంట పరీక్షలు రాస్తడంట.

అంత పుక్కడి సొమ్మును ఏం చేసుకుంటరు. ఎంత దర బెట్టయినా ఇంత భూమి కొనుడు తోటో గీటో పెట్టి ఇగో దీని మీద సంపాయించిన అని లెక్కలు సూపుడు. నిజానికి అట్లాంటోల్ల యవుసాయ పెట్టుబల్లకు రాబడికి పొంతనుండదు. పంట నిండముంచినా లెక్కల్లో లాబపడ్తనే వుంటరు.

'ఆ పోయినేడే మా పక్కగెట్టాయిన అమ్మితె మిరాలగూడెం బారు షాపాయిన కొన్నడు. పదేను ఎకరాలు. అగో అదే. ఇగ సుట్టుపక్కల పదెకరాల ఏకాండి కిత్త ఎవలికి లేనట్టే' రామారావు చెప్పిండు.

ఆ విషయాలన్ని గంగిరెడ్డికి ముందే తెలుసు. భూముల బ్రోకరుగా ఆ సుట్టుపక్కల వూల్లన్ని తిరిగినోడాయె. ఎవలికెంతుంది. రేటెంత పలుకుతుంది? అని అన్ని కొట్టినపిండి.

ఇంగ సూటిగ చెప్పక తప్పింది కాదు గంగిరెడ్డికి.

'డాక్టర్ సాబ్ భూమి మీద కాయిష్ చేస్తుండు. మంచి రోకున్న భూమైతే వో వెయ్యి అటిటు అయినా పర్వాలేదంటుండు' గంగిరెడ్డి గొంతు రామారావు పదెకరాల గురించే మాట్లాడుతున్నట్టుంది.

రామారావు మాట ముచ్చట లేకుంట నిలబడే సరికి,

'నువ్వే అమ్ముతవని జాడతెలిసింది. చెప్పరాదు ఓ పైస అటో ఇటో' గాల్లె బానం ఏసండు డాక్టరు.

రామారావుకు గుండు మీద బడ్డట్టయింది. ఇంతకాలం చేసుకోవటానికి చేతినిండ పని లేక కూసుండు. ఇపుడు నీల్లొస్తున్నయన్న ఆశతోటి పొతం జేపిస్తుండు.

తన కొడుకు ఇంజనీరింగు పూర్తి చేసి వొచ్చిండు. వానికి అమెరికా పోవాలని కోరిక. దాని గురించి ఆడు రోజు పోరు బెడుతున్నా 'మనతో కాదు బిడ్డా' అని చెప్తుండు. అట్టాంటిది వీల్లొచ్చి అడిగితే యిస్తాడు.

'ఆఁ హా... నాకు అమ్మే ఆలోచనేం లేదు' రామారావు ఇంక ఆ ముచ్చెట సాలన్నట్టుగా అన్నడు.

గంగిరెడ్డి మల్లా అందుకొని 'ఎకరం అరవై వేలు పలుకుతుంది. తెల్వంది ఏముంది? డాక్టర్ సాబ్ ఒకసారే సొంతం సొమ్ము చెల్లగడ్తడు. ఆలోచించుకోరి' అన్నడు.

రామారావుకు తెలుసు 'అరవై వేలు కాదు ఈ రొండుమూడు దినాల సంది ఎనభై వేల దాంక అడిగిపోతుండ్రు. అయినా తనకు అమ్మే ఆలోచన లేదుగా' అనుకుండు.

డాక్టర్ నేల దిక్కు పట్టి పట్టి చూసిండు. మంచి ఎర్రశెల్క. మంచి సదునైన భూమి అనుకుండు.

రామారావు ఇంకోమాటకు తావియ్యక పోయేసరికి 'ఇంకో పదో ఇరవయో మన్సులేమన్నుంటె చెప్పరాదురి' అన్నడు డాక్టరు.

రామారావు మొకం నల్లగ మాడిపోయింది. కండ్లల్ల ఎర్రజీరలు కనిపించినయ్. అది చూసి గంగిరెడ్డి తలతిప్పుకుండు.

'మల్లోరొండు దినాలల్ల వొస్తం ఆలోచించుకోరి' అని యెన్కకు మల్లిండ్రు.

గాడిదికొడుకులు మందిని ముంచి అడ్డగోలిగ సంపాయిస్తరు. నీటి వాటంగ పడిపోతరు. పైసలాశ సూపిచ్చి నోటికాడి భూమిని దోసుకుంటరు. ఈల్లు ఈ ఎత్తున కోర్లపున్నం నాడు కుక్కలోలిగ ఊర్లమీద పడి తిరుగుతుంటె ఏ రైతుకు నిద్రబట్టది అనుకుండు.

అద్దాల రామారావు మంచం మీద నడుం వాల్సిండు.

నల్లగొండ బేరగాల్లు ఊల్లె గేడిదిప్పట్లు ఆడటం తనకు తెల్సు. పండుకున్నోన్ని లేపి భూమి బేరాలు చేస్తుండ్రు. పచ్చని పొలాలు రైతు సూసుకునే యాల్ల లేకుంట అయ్యింది.

తనకో బిడ్డ. పెండ్లి జేసి పంపిండు. కొడుకు ఇంజనీరింగు సీటు సంపాయించుకుండు. ఈ నాలుగైదేండ్లు ఆనికి సగేస్తందుకే నానాతిప్పలు బడ్డడు.

తన తండ్రి నుంచి వొచ్చిన భూమి. ఇన్నాల్లంటె కరువు దెబ్బకు మల్లిసూడడాయె. ఇపుడు ఆశ. ఇయ్యాల అమ్ముకొని... ఆ పైసలు మూటగట్టుకొని ఏం జెయ్యాలె?

తన కొడుకేమొ గాలిమేడలు కడుతుండె. ఇంజనీరింగు.... సాఫ్ట్‌వేరు... అని విమానంల ఎగరాలని కలలు గంటుండె.

'బాపూ' కొడుకు ఆకాశ్ గొంతు వినిపించే సరికి కండ్లు దెర్సిండు.

'బాపూ ఇండియాలో ఎంత కష్టపడ్డా వెట్టిచాకిరే. అదే అమెరికా... అయిదేండ్లల్ల పిల్ల పిల్ల తరం కూసొని తిన్నా తరగని ఆస్తి సంపాయించొచ్చు. మా ఫ్రెండ్ వాల్లన్న మూడేండ్లు అమెరికా పొయ్యొచ్చి తొంబై లక్షలు బెట్టి అపార్ట్‌మెంట్ కొన్నడు తెలుసా? అదే ఇండియాలో ఉంటె తొంబై వేలు కూడ సంపాయించలేము ఆలోచించురి'

రామారావుకు తల తిరిగింది.

'బాపూ మంచి అవకాశం పాస్‌పోర్టు కూడా వొచ్చింది. వీసాకు అప్లయ్ చేద్దాం. అమెరికాలో సాఫ్ట్‌వేర్ వుద్యోగాలు కోకొల్లలు. మన అదురుష్టం కొద్ది భూముల రేట్లు పెరిగినయ్. కొనటానికి బొచ్చెడు మంది తిరుగుతుండ్రు. ఇంకా భూమి యవుసాయమని నా భవిష్యత్తును నాశనం చేయకురి' ఆకాశ్ గొంతులో అసహనం ధ్వనించింది.

రామారావుకు వొల్లంత మంట బెట్టినట్టుగా వుంది. స్కూలు కాలేజి అని తిరిగినోనికి వీనికేం తెల్సు భూమి విలువ? ఎన్ని తాకుడ్లు తగిలినా భూమిని నమ్ముకొని వుండబట్టికే... దాన్నంత పావురంగ సూడవటికే మిగిలింది. వూల్లె యింతో అంతో ఖదరుంది. వీడు పిల్లగాడు. ఎంత సేపున్నా సదువు అమెరికా వుజ్జోగం కెరీరు అనే మాటలే తప్ప మట్టితో అనుబంధం వీని మాటల్లో కనిపిస్తుందా?

'నీ తోవ నువు చూసుకో. నీ భవిష్యత్తుకు భూమికి లింకు బెట్టకు' రామారావు కటువుగా చెప్పిండు.

✡

నాలుగు రోజుల నుంచి రోజుకోసారన్నా తండ్రికొడుకుల నడుమ ఘర్షణ జరుగుతుంది.

వూల్లె రోజుకో బేరం... పొద్దున్న వున్నరేటు పొద్దూకే సరికి పెరుగుతుంది.

ఎవలినోట విన్నా బేరాలే. రెండెకరాల ఆసాములు యిద్దరుముగ్గురు జమై ఏకాండి పదెకరాలు చేసి బేరాలు పెడ్తుండ్రు. వొచ్చేటోల్లు కూడ ఒకటి రొండెకరాలు అడిగే నాధుడు లేడు.

'ఈ బొచ్చుల యవుసాయమని ఇంతకాలం కండలు కరిగిచ్చుకున్నం? ఏం బావుకున్నం? కలల సూడని దరలు పల్కుతున్నయ్. అమ్ముకొని బేంకిలేసుకొని మిత్తి తినుకుంట పన్నా – బతుకు గడిసి పోతది'

విసిగిపోయిన రైతుల నోటెంట ఈ నడుమ వినబడుతున్న మాటలు.

రామారావు కుడితిల బడ్డ ఎలకోలిగ గిజగిజలాడుతుండు. ఇంటిముంగల కారాగిన సప్పుడుకు తొంగి సూసిండు. కొడుకుతో పాటు గంగిరెడ్డి, డాక్టరు ఇంకా ఎవలో ఇద్దరు కొత్త మనుసులు.

ఆకాశ్ కండ్లలో కొత్త మెరుపు.

రామారావు నేలకు తల్కాయేసుకోని కూసుండు.

'ఏమాలోచించిండ్రు' గంగిరెడ్డి మొకం మీదికి నవ్వు తెచ్చుకొని అడిగిండు.

రామారావు గుటకలేసిండు.

డాక్టరుకు అర్ధమైంది. మెత్తబడ్డడు ఈ కాక మీదనే వొంగుతడు అనుకుండు.

కొత్త మనిషి చనువుగా 'ఏం భూములే శిన్నాయిన. పంట పండిచ్చి బాగుపడ్డోదున్నాడే? – ఆన్నారం కాడ ఇరవై ఎకరాలు. నీటి వసర్తి కూడ వుంది. బేరమొచ్చింది. ముక్కు మొకం సూడకుంట అమ్మేసిన' నువ్వా అమ్ము అన్నట్టుగ చెప్పిండు.

గంగిరెడ్డికి ఉత్సాహం వొచ్చింది.

'డాక్టర్ సాబ్ మోజు పడ్డడు. బెయిట అరవై డెబ్బయ్ కంటె ఎక్కువ పోతలేదు నీకు తెలవంది కాదు కాని నీకు ఎనబై లెక్కన కట్టిస్తనంటుండు. ఇంగ ఆలోచించినవంటె నీయిష్టం..'

రామారావు వొంటింట్ల చేరిన కోడిపిల్లలెక్కయిండ. కొడుకు మొకం దిక్కు సూసిండు. తన మౌనానికి వాడు ఉడికి పోతుండని అర్ధమైంది.

'మా బాపు రేటుకాన్నే గుంజాయిషు జేస్తుండు' ఆకాశ్...

రామారావుకు కొడుకు తెగింపు అర్ధమైంది.

'కానియిరి' అన్నడు తల పట్టుకొని.

ఆకాశ్ మొకంలో సంబూరం. తను అమెరికా విమానం ఎక్కినట్టుగా గాల్లె తేలిపోయిండు.

'కాని ఆ రేటు పడదు' అన్నడు ఆకాశ్.

డాక్టర్, గంగిరెడ్డి మొకమొకాలు సూసుకుండ్రు.

'ఏం బాపూ లక్షకాడికయితె యిద్దాం' ఆకాశ్ తండ్రి మొకం దిక్కు సూస్కుంట అన్నడు.

రామారావు మూగెద్దు లెక్క తలాడించిండు.

కిందమీద బడ్డంక లక్షకాడికి డాక్టర్ సరే అన్నడు.

వెంట తెచ్చుకున్న స్టాంపు పేపర్ల మీద రాతలు కోతలు అయినయ్. యాభై వేల బయాన రామారావు చేతుల బడ్డది. పదిహేను రోజుల్లో రిజిస్ట్రేషన్ అని లేసి పోయిండ్రు.

✡

ఆర్నెల్లల్ల ఆకాశ్‌కు వీసా దొరికింది. విమానం టికెట్ కూడా బుక్కయ్యింది. ప్రయాణానికి ఇంకో పదిహేను రోజులు.

రామారావుకు చేతులిరిగినట్టయింది.

మట్టికి మనిషికి అనుబంధం పోతుంది. భూమి కేవలం వో లాభసాటి బేరమైంది. తను తన తండ్రి తాతలు భూమంటే ఓ పేగు బంధమనుకుండ్రు. మరి ఇపుడు...

మరి తను తన భార్య సెంటు భూమి లేని వూల్లె వూహించ లేక పోయిండు.

కొడుకు ప్రయాణానికంటే ముందే మకాం నల్లగొండకు మార్చాలనుకుండు.

వొచ్చిన డబ్బు – ఆకాశ్ ఖర్చులు పోను బేంకిల పిక్స్‌డ్ జేసిండు. ఆ మిత్తితో కట్టేసిన గొడ్డు మేత తిన్నట్టుగా తిని బతకాలె.

తప్పదు అంతకంటె వేరే ఏం చేయగలడు?

రొండు అర్రల పెంకుటిల్లు కూడా ఎవలు కొనే యాల్ల లేదు. రైతులు అందిన కాడికి అమ్ముకుని నల్లగొండకు పోతుండ్రు. వూల్లె ఎవలన్న వుండాలనుకుంటె గదా ఇల్లు కొనుక్కోవాలనుకునేది.

వొదిలిపెట్టి – వో లారీల సామానేసుకోని పొలిమెర దాటిండు.

లారీ మట్టిరోడ్డు మీద పోతుంది.

అదే కదూ తరతరాల తమ భూమి. అప్పటికే సుట్టూ ఫెన్సింగ్ చేసి నడుంగల నాలుగర్రల డాబా ఇల్లు అందంగా కట్టుంది.

భూములనేయి ఇప్పుడు రైతులు కష్టం చేసి పంటలు పండించటానికి కాదు. దోపిడి వర్గాలు డబ్బున్న దొరలకు విడిది గృహాలు. పకృతి నడుమ దావతులకు... పండ్ల తోటల పెంపకాలు.

రామారావు కండ్ల నుంచి రొండు కన్నీటి సుక్కలు రాలినయ్.

అదే తోటల్లో... ఆ వూరి జెనమే కలుపు పీకుతరు. నీల్లు కడ్తరు. కాలువలొచ్చినా నీల్లు పారినా, భూమి చేతులు మారుతుంది కాని మట్టిని నమ్ముకున్న మనిషి గీత మారదు.

రేపు తన కొడుకు కూడా అమెరికా నుంచొచ్చి ఎకరానికి ఏ రొండు లక్షలో నాలుగు లక్షలో పెట్టి వో ఎస్టేట్ కొనొచ్చు. వాని స్టేటస్ కోసం.

ఇప్పుడు భూమి రైతుది కాదు – డబ్బుది

భూమి పంట కోసం కాదు – అదో స్టేటస్ సింబల్.

✡

# మట్టి జీవితాలు

**-ఎనుగంటి వేణుగోపాల్**

"ఓరి సెంద్రిగా!" కేకేసి పిలిచిండు కొమురయ్య.

చంద్రయ్యలో ఉలుకు లేదు, పలుకులేదు. ఎండిన మొక్కలా స్తబ్ధుగా పొలంగట్టుమీద కూసున్నడు.

మేఘాల్ని మింగేసి ఆకాశం మౌనముద్ర దాల్చినట్టు, వేదనా తరంగాల్ని అంతరంగంలో అదిమేస్తూ గంభీరవదనంతో వున్నాడు.

అరచేతిని కళ్లకు అడ్డం పెట్టుకొని ఆకాశం వంక ఆశగా చూసిండు. వయసు చూపునింకా మసకబార్చకపోయినా ఆకాశం మాత్రం అలుక్కుపోయినట్టే కన్పించింది.

కురిసే మేఘం కరువయ్యింది. కనుమరుగయ్యింది. పెద్దవ్విరిచాడు.

చేయి తొలగించి కిందికి చూపు మరల్చిండు. పలిగిన అతడి గుండెలా పగుళ్లు బారి వుందా భూమి.

'ఎట్ల దున్నుడు? ఎప్పుడు సాగుజేసుడు? ఆన పడాల్నాయె, తూములు పరుగులు పెట్టాల్నాయె, బూమి తడవాల్నాయె' అనుకుంటూ ఇలఇల్లాడిండు.

గుడిపేట చిన్నపల్లె. ఆయకట్టేతర ప్రాంతమది. చుట్టుపక్కల ఊళ్ళన్నీ అంతే మండలానికి మండలం వర్షాధార పంట పొలాలే. వర్షం పడాలె, చెరువులు నిండాలె. అప్పటిగ్గాని బావులల్ల నీళ్లు కనవడ్తయ్.

అందుకనే అందర్లాగానే ఆనకోసం ఎదురుసూత్తున్నాడు చంద్రయ్య. ఆనకాలమచ్చింది. ఏదీ, సిన్న సినికు లేదు, పోనీ మృగశిరకార్తెతోనన్నా ఆనలత్తయని మురిసిపోయిండు. వూరిపొలిమేర్ల నుంచి గూడ కొంచమన్న మట్టి వాసన తగులకపాయె.

ఆవేదన సుడులు తిరిగింది. ఆలోచన్లు నరాల్ని మెలిపెట్టినయ్.

దోసిలి నిండార ఎండిన పొలం మట్టి తీసుకొని నుదురుగ్గొట్టుకున్నడు.

"అరేయ్ సెంద్రీ!" చంద్రయ్య దగ్గరకు అచ్చిన కొమురయ్య మరింత బిగ్గరగ పిలిసిండు.

ఆ పిలుపుకీసారి ఆలోచన్ల నుండి బయటపడిండు.

"ఏందిర. గీడ గుసోనేం జేత్తున్నవ్?" మందలిత్తూ పక్కనే గూసున్నడు కొమురయ్య.

దోస్తుదిక్కు నిర్లిప్తంగా చూసి "మట్టిని నమ్ముకొని బతుకుతున్నందుకు నోట్లింత మన్ను వడే కాలమచ్చెర" లోపలి బాధను బయటవెట్టిండు.

"గీడ గూసొని ఇచారం జేత్తె ఆన వడ్తదార"

"ఏం జేసుదుర కొమ్రి. గప్పట్ల గిట్లుండెనా? ఎన్కట మన అయ్యల కాలంల సినుకెనుక సినుకు సిందులు తొక్కలేద్ర"

"బగవంతునికి రైతు మీద దయలేదుర. ఎవుసాయం లేంది మనమెట్ల?"

"నువద్దిగనే. రైతుకి బూమి, బూమికి నీళ్లు గావాలె గదర. నీళ్లు లేక గోసగోస గావట్టె. నీళ్లకు కరువచ్చె. కరువు రైతుని ముంచవట్టె. మనిసి బతుకుడెట్లరా"

"అరద కాల్వలు తోడిత్తమని ఎన్నికల్ల జెప్పి మన యమ్మెల్ల గూడ గెల్సె. యాడాద్దాటె, గింతదాకా గా ఊసె రాకపాయె"

"తిందమంటె ఆళ్లకే పైసలు దొర్కుతలేవంటే గాల్లింక అరద కాల్వలు తోడిత్తరంటె కల్ల"

"మన బత్కులు గిట్లనే వుండాల్నని రాసిపెట్టుంటె ఎవలేం జేత్తరు గని. వూళ్లెకోదాం పార" అంటూ నడువుకున్న పంచెనిప్పి, ఒక మల్క దులిపి, తలపాగ సుట్టుకుంటు లేసి నిలవడ్డడు కొమురయ్య.

చంద్రయ్య దిక్కు సూసిండు లేత్తున్నడేమోనని.

సినుకు పడితె గాని మొలకెత్తనని మొండికేసిన విత్తనం లెక్క కూసున్న కాన్నుండి లెవ్వలేదు చంద్రయ్య.

"పొద్దాక్కె తెల్లార్తె సేనుకాడికి అచ్చుడు, ఎండి ఎముకల్దేలిన పొలం బూవుల్ని జూసుకుంటు కండ్లల్ల నీళ్లు పెట్టుకునుడు బగ్గనే వుందిగని మాకు లేదుర ఏడ్పు. తెల్లార్తెట్లుంటె గట్లయితది గని పా. పెండ్లాం పోరగాండ్లని గూడ పట్టించుకోవాలె గాదుర" మందలించిండు కొమురయ్య.

భారంగ లేసి కొమురయ్యతో ఇంటివైపుకి కదిలిండు చంద్రయ్య.

✡

భార్య పొద్దుటి నుండి బతిమిలాడంగ బతిమిలాడంగ పొద్దుగూకంగ బలిమీటికి కంచం ముందు కూసున్నడు చంద్రయ్య. పిల్లగాండ్లు బయటాడుకుంటున్నరు.

లచ్మి బువ్వ వెట్టింది.

ముద్ద మింగుడు వడ్తలేదు. బువ్వ కలుపుతలేదు. కెలుకుతున్నడు. కండ్లు కంచం దిక్కే వున్నా సూపులు శూన్యాన్ని తడుముతున్నయ్. పెనిమిటి స్థితికి తమ దుస్థితికి గుండె కలుక్కు మందా ఇల్లాలికి.

“తినయ్యా! ఎట్ల జరిగేదుంటే గట్ల జరుగుద్ది, కట్టాలల్ల పుట్టినోల్లం, కన్నీల్లకు బయట పడితెట్ల? కడపుని కట్టేసుకుంటే కట్టాలు తీర్తయా? నా మాటిని గింతంత ఎంగిలిపడయ్యా?” బతిమిలాడింది పెనిమిటిని.

“నిరుడు సంది ఆనల్లేక ఎవుసాయం జేయకపోతిమి. తిండి గింజల్లేక అరెకురం సేను షావుకారి కాడ కుదువ పెడ్తిమి. ఇది అప్పుకూడే. ఎట్ల మింగుడు. పెయిన వడ్తదా? తలుసు కుంటె కడుపు తరుక్కపోతుంది” బాధని పెదాలమద్దెన బిగవట్టిండు.

“బగవంతుడు మనకి అన్నాయం సెయ్యడయ్యా. గివన్నీ మతిన పెట్టుకోక ముద్ద మింగయ్యా” ఓదార్పుగ అన్నది.

కండ్లల్ల నీళ్లు సుడులు తిరిగినయ్. ఆపుకున్నడు.

బలవంతంగ రెండు ముద్దలు మింగేసి ఆరుబయటకు నడిసిండు. ఆశ సావక అలవాటుగ తలెత్తి మొగులు దిక్కు సూసిండు. పెయ్యి జలదరించింది.

వెన్నెల అద్దంలో ఆకాశమంతా మబ్బులు. కారు మబ్బులు. నల్లని గుట్టలన్నీ పోగయి ఆకాశాన్ని ఆక్రమించినట్టుగా మేఘాలు!

ఆ దృశ్యం చంద్రయ్యక కనుపాపల వుపరితలాలపై కమనీయ చిత్తురువై కదలాడు తుండగానే గాలిపొరల్ని చీల్చుకుంటూ చెవిని సోకిందా శబ్దం.

‘టప్!’

వుద్వేగాన్ని అణచుకోలేకపోయాడు.

శరీరంలోని అణువణువూ ఆనందంతో కంపిస్తుంటే –

‘లచ్మీ!’ అనరిచిండు.

ఆ కేకకి “ఏవందయ్యా?” అంటూ బయటకురికొచ్చిన లక్ష్మి స్థాణువైపోయి నిలబడింది.

ఆకాశం మూట చిట్లి నక్షత్రాలు నేలరాలుతున్నట్లు.. బొట్లు బొట్లుగా వర్షపు బిందువులు...

వుద్వేగంతో వూగిపోతున్న పెనిమిటి భుజాల్ని సుతిమెత్తగ నొక్కి వదిలింది లక్ష్మి. భార్యని దగ్గరకు తీసుకున్నడు ఆప్యాయంగ.

వర్షం వుధృతమవుతుండడంతో లోనికి నడిచారిద్దరు.

ఒక్కటొక్కటిగా పోటీపడిన చినుకులు మరిక ఆగలేదు. చాన్నాళ్లకి అమ్మమ్మ ఇంటికి వచ్చిన చిన్నారుల్లా నేలతల్లిని తడుముతూనే వున్నాయ్.

ఆగకుండ మూడ్రోజులు ముసురే ముసురు.

పల్లెలు నవ్వినయ్, వ్యవసాయం పనులు మొదలైనయ్.

చంద్రయ్య ఆనందానికి పట్టపగ్గాల్లేవు. నాగలి భుజాన వేసుకొని పొలం దిక్కు కదిలిండు. సద్దిమూట తీస్కోని లక్ష్మి భర్తకి తోడయ్యింది.

వూరు వూరంతా వుత్సాహంతో వురకలు వేసింది. ఆలస్యంగనన్నా ఎవుసాయం పనులు వూపందుకున్నయ్. నారు మడులల్ల పోసిండ్రు. నాట్లు వేసే కాలమచ్చింది.

✡

కాలం గడుస్తోంది.

వూర్లె ఎటుజూసిన పచ్చంగ పైరు. పెట్టింది మూడ్రోజుల ముసురే అయినా ఆ పల్లె తల్లికి వసంతం అచ్చినట్టయ్యింది. అందరికంటె చంద్రయ్య పొలం ఎత్తుగ, ఏపుగ పెరిగింది.

అదే మాటంటున్నడు కొమురయ్య చంద్రయ్యపొలం కాడికచ్చి,

"ఏంద్రా సెంద్రిగా ఈయేడు నీ పొలం యమ జోరుగుందేందిరా"

"అవున్రా, అంతా పైరుతల్లి దయ" అన్నడు చంద్రయ్య వరిపైరుకి రెండు చేతులెత్తి జోడించి.

"జల్దీ సేతికత్తయని అందరం 'జేజీయల్లే' కదర ఏసింది" కొమురయ్య అడిగిండు.

"అవును మల్ల"

"మాకు తెల్వకుండ నువ్వు మల్లోకటెయ్యలేదు గద" అంటూ నవ్విండు.

"గిదేందిరో గట్లంటవు. అందరం బోయె 'పొలాసఫాం' కాడ తీస్కచ్చుకున్నం గదర"

మాటల మధ్యన రాజిరెడ్డి వచ్చిండటు.

"రాజిరెడ్డి పటేలా! నాట్లేసుడైనయా?" అడిగిండు చంద్రయ్య.

"నేనీసారి మక్కేసిన." చెప్పిండు రాజిరెడ్డి.

"సగమూరు మక్కేసిన్రు. పటేల్లంత మక్కనే ఏసిన్రు. మనమేందిర సెడుబుద్ధి పుట్టినట్టు వరేసినమ్?"

మూణ్రోజులు మురిపించి మల్ల వానజాడ కనపడకపోయేసరికి వరిపైర్ల గురించి ఫికరు పెట్టుకుండు కొమురయ్య.

"సూద్దాం. గీయేడన్నా బాయిలల్ల నీటి సుక్కలు సూడకపోతమా?" ధైర్యం సెప్పిండు చంద్రయ్య.

"ఎవరదురుట్టం ఎట్టుందోలే..." కల్పించుకున్నడు రాజిరెడ్డి.

"వూర్లె ఏదో సంగతి ఇనవడ్తుంది. నువద్దిగనేనా పటేలా?" కుతూహలంగ అడిగిండు కొమురయ్య.

కొద్దో గొప్పో చదువుకున్నడు రాజిరెడ్డి. దగ్గర్లో వున్న మండలానికి తరచూ రాకపోకలు సాగిస్తుంటడు. రాజకీయ వాసన్లూ తెలుసు.

"ఏ విషయం" అడిగిండు రాజిరెడ్డి.

"అదే కాల్వ పనులు..." అన్నడు కొమురయ్య

"నిజంగనే. మన మండలం గుండా అరదకాల్వ పనులు సాంక్షనైనయ్. మొన్న కల్సినపుడు స్వయంగ ఎమ్మెల్లే సెప్పిండు" అన్నడు రాజిరెడ్డి.

"గట్లయితే మనూర్లో సింగిడి (హరివిల్లు) పొడిసినట్టె" సిన్నపిలగాన్లెక్క సంతోషం వ్యక్తపరిచిండు చంద్రయ్య.

"సాగునీటి కోసం ఎన్నాల్లయ్యిందో ఎదురు సూడవట్టి, అరద కాల్వ పున్యమా అని కొన్ని వేల ఎకురాలకి లాబమైతది. భూగర్భ జలాలు నిలువుంటయ్" చెప్పిండు రాజిరెడ్డి.

"మన ఎమ్మెల్యే మాట నిలవెట్టుకుండు" కొమురయ్య అంటుంటె మొకం పత్తిపువ్వోలె విచ్చుకుంది.

"మరి నేను పోత" అన్నడు రాజిరెడ్డి

"ఎటు బైలెల్లినవ్ పటేలా?" చంద్రయ్య అడిగిండు.

"మనూర్లె ఏ బాయిల్నన్న నీళ్లు పడ్డయా అని తిరిగి సూత్తున్న. ఇటేపు బాయిలల్ల గూడ నీళ్లు బగ్గేం లేనట్టున్నయ్" అంటూ పోయిండు రాజిరెడ్డి.

చంద్రయ్య, కొమురయ్యలవి పక్క పక్క పొలంలే. ఇద్దరూ ఎవరి పనులల్ల వాళ్లు మునిగిపోయింద్రు.

కోటి ఆశలతో ఖరీఫ్ పనులు చేపట్టిన రైతులకు తొలకరి వర్షాలతో ఆశాజనకమైన పరిస్థితులు కనబడ్డా చెరువులు, బావులల్లో ఆశించిన మేరకు నీరు చేరకపోవడంతో ఆందోళన చెందసాగారు.

మంచి పంట మాట దేవుడెరుగు, పెట్టిన పెట్టుబడి చేతికి అందుతదో లేదోనని రైతులు వాపోతున్నారు.

ఆగిన వర్షాలకు బావులు నిండక పొలాలు ఎండిపోతున్నయి. పొలాలకి నీరు కట్టుడు లేక, చేసే పనేం తోచక చంద్రయ్య పొలంవైపు బయల్దేరిండు కొమురయ్య.

అక్కడ క్రేన్‌తో బాయి పని నడుస్తుంది.

"బాయి లోతు తోడిత్తన్నవా సెంద్రయ్యా" అడిగిండు కొమురయ్య.

"కాదుర, పూడిక తీయిత్తున్న" చెప్పిండు చంద్రయ్య.

"నీళ్లూర్తయంటావా?"

"సూడాల్రా, బగవంతుని దయ, మన ప్రాప్తం. ఎదుగుతున్న వరిపైరు ఎండి ఎర్రగప్పయి పోతుంటే సూడ్లేక పోతున్నర. నీ యవ్వ! అప్పుల అప్పు పూడికైతే తీయిత్తున్న"

"ఏమోరా? నాకైతే పిస లేత్తంది. వరి ఏసేది లేకుండె. మక్కేసినా మంచిగుండేమో" బుర్ర గోక్కుంటూ అన్నడు కొమురయ్య. "అయిపాయె, గిప్పుడనుకుంటె ఏం లాబం"

"ఏమోరా! ఎవుసాయాన్ని నమ్ముకుంటె ఎండుగడ్డి పుట్టేట్టు లేదు"

"నిండా మున్గినోల్లం, సలికో, సావుకో బయపడితే ఎట్టరో" ధైర్యం చెప్పిండు చంద్రయ్య, మట్టినే నమ్ముకున్న మనిషి అతను. అప్పుడు వురిమిందో వురుము, రెండ్రోజుల్నుండి కొంత మబ్బు మబ్బుగానే వుంటంది. హఠాత్తుగా వాతావరణంలో మార్పచ్చింది.

"ఆన అచ్చేటట్టుంది" అన్నడు కొమురయ్య పైకి చూసి.

"కాలమంత అయిపోతుంటే గిప్పుడీ ఆనేందిరో? ఉన్న పొలాలు నాశనమైతయ్" కంగారుపడ్డాడు చంద్రయ్య.

వర్షం మొదలైంది...

'బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి అంతకంతకూ బలపడ్తోంది. రానున్న నలబై ఎనిమిది గంటల్లో వర్షం ఉధృతి పెరిగిపోవచ్చు' వాతావరణాన్ని ఎప్పటికప్పుడు రేడియోలు, టీవీలు ప్రకటిస్తూనే వున్నాయి.

ఏకధారగ తుఫాను వర్షం కురుస్తున్నది. చెరువులు, బావులు, కుంటలు, పొంగి పొరలుతున్నాయి. తూములు ఏరులై పారుతున్నాయి. వరద పల్లెల వాకిట నీటి ముగ్గయ్యింది.

ఏటవాలులో ఉన్న పంట పొలాలు, చేన్లు నీటి అక్కున చేరాయి.

ముంపుకు గురయ్యే గ్రామాల్లో ముత్యంపేట, సర్వపల్లి, గుడిపేట తదితర గ్రామాలను చేరుస్తూ.... గ్రామాలను వదిలిపొమ్మని తుఫాను హెచ్చరికలు వెలువడ్డాయి.

"నాడు నీరులేక కరువు ముంచింది. నేడు కన్నీరై అరద ముంచుతుంది" వాపోతూ భార్యాపిల్లల్ని ఎంటేసుకొని ఊరిజనంతో కలిసి పట్నంవైపు కదుల్తూ తలతిప్పి వెనుదిరిగి చూసిండు చంద్రయ్య.

చెరువు కట్ట తెగి పెరిగిన నీటి మట్టానికి పల్లె పల్లెంతా కాగితపు పడవలా కనపడ్డదతని కన్నీటి పొరకు.

చంద్రయ్య కోలుకోవడానికి సాన్రోజులు పట్టింది. జగిత్యాలలో వుండే సడ్డకుని ఇంట్లో తలదాచుకున్నడిన్ని రోజులు. హఠాత్తుగా పొలం యాదికొచ్చింది. వూరు కండ్లళ్ల మెదిలింది. వుండబుద్ధి కాలేదింక. ఇంట్ల చెప్పి బయల్దేరిండు.

వూరే లేదక్కడ. సగానికి సగం తుడుచిపెట్టుకు పోయింది. చెరువు ఎండినంక ఎట్లుంటదో మిగిలిన సగం అట్లుంది. పాణమంత ఇలఇల్లాడింది.

కొత్తకొత్త మనుషులు తచ్చాడ్తున్నరు. ఏదో జరుగుతంది అనుకున్నడు. పాత మొహాల కోసం లెంకుతుంటె కనపడ్డడు రాజిరెడ్డి. ఎవ్వల్నో ఎంటేసుకొని వురికచ్చినట్టు అచ్చిండు చంద్రయ్య దగ్గరికి.

"మంచిగున్నవా చంద్రయ్యా" తనే మాట కల్పిండు.

తలూపిండు.

"ఎవుసాయం సేద్దామని అచ్చినవా" అన్నడు పెద్దపెట్టున నవ్వుతూ.

బిక్కమొగ మేసిండు చంద్రయ్య.

"సేత్తవా" నవ్వాపి మల్ల వెటకారమాడిండు.

గుడ్లనీరు గుడ్లల్లనే కుక్కేసుకుని ఏం మాట్లాడలేదు చంద్రయ్య.

"నీ బాధ నాకర్థమైంది. మనూరోళ్లందరికీ ఇదే రంది గద. బూములు పోయినోళ్లందర్కి పట్టా నెంబర్లతో కోర్టుకు పోతే పైసలిత్తున్రు. అందరం అదే పన్లె ఉన్నం." కొత్త సంగతి చెప్పిండు.

"యాడికి వోవుడు?" చంద్రయ్య గొంతు పెగిలింది.

"నువ్వేడికి వోవుడ్లేదు. ఇదిగోఈ మనిషి సుదర్శనం. ఏజెంట్. మనసొంటోళ్లను వకీలు కాడికి తీస్కపోతడు. ఆడికోయినంక వకీలు సెప్పినకాడ సంతకం... అదే ఏలిముద్రేత్తె సాలు" చెప్పి సుదర్శనాన్ని పరిచయం చేసిండు చంద్రయ్యకు.

సుదర్శనం గబుక్కున చంద్రయ్య చేతిలో చేయి కలిపిండు.

"వకీలుకింత ఫీజు... సుదర్శనానికింత కమీషను... ఇచ్చుకోవాల మల్ల" కండీషన్లు ముందే చెప్పిండు రాజిరెడ్డి. సుదర్శనం తనకిచ్చే వాటా విషయం నొక్కిండు.

"గట్లనే" గొర్రెలెక్క తలూపిండు చంద్రయ్య.

సుదర్శనం తన బైక్ మీద చంద్రయ్యను వకీలుకాడికి తోల్కపోయిండు. రాజిరెడ్డి ఇంకెవలినన్న దొరకవట్టుకోవాల్ననే పనిలో ముగిపోయిండు.

వకీలు తీస్కునేది ఫీజు కాదు... పర్సంటేజి, వచ్చిందాంట్ల సగానికి సగం. ఏలిముద్రో సినంక సెప్పిండు. ఒప్పుకోక తప్పలేదు చంద్రయ్యకు. "తనకొక్కడికే గిట్ల కాదు గదా" అను కున్నాడు.

రాజకీయంగా పవరు, వకీలుగా పేరుజేయవట్టి తనకాడికచ్చినోళ్లందరికి పైసలు తొందరగనే వచ్చేటట్టు చేసిండు వకీలు. నాలుగున్నర లక్షలకు అవి పోను, ఇవి పోను వాళ్లకి వీళ్లకి పంచంగ పంచంగ చంద్రయ్యకు రెండు లక్షలు మిగిల్నయి.

మల్లెక్కడనన్న ఎవుసాయం భూమి కొందమని చూసిండు. సద్దకున్ని ఎంటేసుకొని తిరిగిండు కరీంనగర్ జిల్లా అంతా. ఏడజూసిన ధరలు బగ్గున్నయ్. భగ్గుమంటున్నయ్.

కొనబోతే కొరివి అమ్మబోతే అడవి అంటే ఇదేనేమో!

ఎకురానికి మూడు, నాలుగు లక్షలకు ఏడ తక్కువ లేవు. మరి తన పదెకురాల పొలమమ్మితే ఎంతచ్చింది?

అన్నింట్ల మునుగుడే అయితంది.

'ఛీ! మట్టి జీవితం...' అనుకున్నడు.

ఈ లెక్కన తనకాడున్న పైసలకు అరెకురం అత్తె మా ఎక్కువ. ఆ అరెకరం కొని ఏం జేసుకునుడు? భార్య పోరుకి... సద్దకుని సలహాతో... జగిత్యాలలోనే ఎక్కడో దూరాన అరగుంట ఇండ్లభూమి కొనుక్కున్నడు. గుంటకు లక్షలు లక్షలే మరి! లక్ష్మి పనేం జేసుకునుడు? చెల్లె దగ్గర బీడీలు సుట్టుడు నేర్చుకుంది. చంద్రయ్యకేమో సద్దకునెక్క ఆటో తోలాలన్పించలేదు. తెల్సినోళ్ల దగ్గర పనికి కుదిరిండు.

అది రియల్ ఎస్టేట్ బిజినెస్! అక్కడాఫీసులో చివరకు పనోడిగా కుదిరిండు చంద్రయ్య.

✡

# గిట్టుబాటు

–వల్లూరు శివప్రసాద్

"అంతకు తక్కువైతే కుదర్దు" తెగేసి చెప్పాడు కోటేశ్వరరావు.

"లక్షే?" చౌదరయ్య నోరెళ్ళబెట్టాడు.

"ఆఁ లచ్చే!" నొక్కి చెప్పాడు.

"మరీ కొండెక్కుతున్నావు!" చౌదరయ్య గొంతులో నిష్ఠూరం ధ్వనించింది.

"వస్తువు బట్టే ఇలువ గందా?"

"ఇంతకు ముందు ఎవరికీ అంత పెద్ద మొత్తం ఇచ్చింది లేదు."

"ఎవరి సంగతో నాకెందుకు? నాకు గిట్టుబాటయ్యే ధర నేను సెప్పాను."

"బాగా ఆలోచించు... ఎనభై వేలిప్పిస్తాను. అప్పటికే పదివేలు ఎక్కువిచ్చినట్లు"

"పైసా తక్కువైనా మాట్టాడొద్దు" – జేబులో నుంచి బీడీ తీసి అగ్గిపెట్టె కోసం వెదుక్కుంటూ చెప్పాడు.

"ఇంకోమాట లేదా?" బెదిరింపుగా అడిగాడు చౌదరయ్య.

"ఉండదు. ఇట్టమైతే రండి! కట్టమైతే పొండి" – అగ్గిపెట్టె కోసం లేచాడు.

ఆ ఇద్దరి మధ్య పంచలో జరుగుతున్న సంభాషణ బాణమ్మ చెవిన బడుతూనే వున్నది. మనస్సు పని మీద లగ్నం కావటం లేదు. భర్త పొలం బేరం పెట్టినట్లుగా అనిపించింది.

రైతులు పండించిన పంటలమ్మి రోజులు గడుపుకోవాల్సిందిపోయి పొలాలమ్మి బ్రతకాల్సిన గడ్డు రోజులు వచ్చినందుకు తనలో తాను కుమిలి పోసాగింది బాణమ్మ.

ఒకేడు గాకుంటే ఒకేడన్నా పంటలు బాగుండవా, ఆదాయం రాదా, అప్పులు దీరవా, ఒడ్డున పడకపోతామా అన్న ఆశ పెట్టుబడి పెట్టిస్తుంది. ఏయేటికాయేడు ఇంకా ఇంకా ఊబిలోకి దిగబడటమేగాని ఒడ్డున పడ్డది లేదు.

రైతులు గొర్రెదాటుగా ప్రత్తికి రేటొస్తుందని ప్రత్తేసి, కాదు మిరపకు ఇంకా రేటొస్తుందని మిరపేసి, కందులకు రేటుంటుందని కందేసి... అయిన కాడికి అప్పులు తెచ్చి, అదికాస్తా పురుగు మందులకు, ఎరువులకు బోస్తే ఏమాత్రం ఫలసాయం చేతికొచ్చింది!

దిగుబడున్న రోజు రేటు పలకదు. రేటున్న రోజు దిగుబడి అంతంతం మాత్రం! రైతు ఆశపడటమే గాని రెండు రకాలుగా కలిసొచ్చి బాగుపడ్డది ఎప్పుడు? వ్యవసాయం కూలి పాటన్నా గిట్టకపోతుండె! రైతన్న వాడు రేయింబవళ్ళు పంటపొలాల్లో సాగుజేసి శోకాన్ని పండిస్తున్నట్లు అయిపోయింది. క్వింటాళ్ళు, క్వింటాళ్ళు దరిద్రాన్ని దిగుబడి చేసుకొంటున్నట్లు కనిపిస్తుంది.

పుట్టిన చోటల్లా అప్పులు తేనూ, పెట్టుబడి పెట్టనూ, ఆ వచ్చిందంతా తిరిగి వడ్డీలకు గట్టనూ! ఈ నాలుగేండ్లలో మూడెకరాలు ముదనష్టమైపోయింది. మిగిలింది రెండెకరాలు. అదీ అమ్ముకొని ఏమయిపోవాలి?

బాణమ్మ కళ్ళు తడిమళ్ళు అయినాయి.

"ఏందయ్యా! పొలం బేరానికి పెట్టావా?" లోపలకు వచ్చిన భర్తను దీనంగా అడిగింది.

కోటేశ్వరరావు బీడీ ముట్టించుకుంటూ ఆమె ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పలేదు. రెండు దమ్ములు గట్టిగా పీల్చాడు.

అగ్గిపెట్టె భార్య చేతికిస్తూ కళ్లల్లోకి చూశాడు. తడి కినిపించింది.

"అవసరానికి ఏదోటి... అప్పులోళ్లని ఎన్ని పంటలకని ఆపుతాం. మాట దక్కించుకోలేక పోతే మంచినీళ్ళు పుడతయ్యేంటే!" పంచలోకి నడిచాడు.

'నిజమే! అప్పులవాళ్ళు ఇంటి మీదకు ఎగబడి ల్లలరిపెడ్తున్నారు. అంతకంటే అప్పుదీరే దారి ఏం వుంది గనక!' కంటి తడి ధారలు కట్టి బుగ్గల మీదకు జారకుండా పమిటచెంగుతో కళ్ళు అద్దుకుంది బాణమ్మ.

చౌదరయ్య ఒక పట్టాన వదలటం లేదు. కిందా మీదా పెట్టి బేరం ఖాయపర్చుకుని గాని కదిలేటట్లు లేడు. తను కొనటానికే బేరం చేస్తున్నాడేమో అనుకొంటున్నది బాణమ్మ.

ప్రయోజకత్వం అంటే చౌదరయ్యదే! ఊరొచ్చి పట్టుమని పదేళ్ళు కాలేదు! పెళ్ళాం బిడ్డలతో వస్తూ సిరంజి, నాలుగు మందుబుడ్లు చేతబట్టుకొచ్చాడు.

ఉదారంగా రెడ్డిగారి కొష్టంలో కాపురం పెట్టాడు.

ప్రతి చిన్న రోగానికి పట్నంబోయి వందలకు వందలు ఎక్కడ గుమ్మరించగలం అనుకొని అతనికే బాదేంటో చెప్పుకొని, ఇచ్చిన బిళ్ళలు మింగారు. సూదిమందు వేయించుకున్నారు.

చేతిలో పెట్టినంత పుచ్చుకుంటూ రోగాలకు, రొష్టులకు వైద్యం జేశాడు. ఏం చదివావని అడిగినవాళ్ళు లేరు. తనవల్ల కాదనుకుంటే పట్నం తీసుకెళ్ళి పెద్ద డాక్టర్లకి జూపి నయం జేయించేవాడు. కాన్పులేనా, ఆపరేషన్లేనా వూళ్లో ఎవరికి నలతగా వున్నా అతని సలహా మీదనే వైద్యం జరగాలి. ఇటూ అటూ నాలుగు రూపాయలు గుంజుకుంటాడని గుసగుసలాడినా అంతకు మించి దారి కనబడలేదు పదిమందికీ.

రెడ్డిగారి కొస్టం అమ్మకానికి పెడ్తే చౌదరయ్యే ధరిచ్చి కొనుక్కొన్నాడు. కొస్టం పడేసి పక్కా బిల్డింగ్ కట్టాడు. నాలుగు మంచాలు వేయించి ఆసుపత్రి జేశాడు. ముందుభాగంలో మందులు, ఫ్యాన్సీ వస్తువులు అమ్మేషాపు బెట్టించి బామ్మర్దిని కూర్చోబెట్టాడు. ఊళ్లో నాలుగెకరాల పొలమూ కొన్నాడు.

దశమంతుడికి ఏ వూరయితేనేం, మహర్దశే పడ్తుంది. ఎట్లయితేనేం చౌదరయ్య షావుకారని పించుకున్నాడు. పలుకుబడి పెంచుకున్నాడు.

“సరే! నీ మాట ప్రకారమే గానీ...” చివరకు తనే దిగొచ్చాడు.

చౌదరయ్య తన సొంతం కోసమే పొలం బేరం చేసినట్లు అనుకొంది బాణమ్మ.

ఉద్యోగమైతేనేం, వ్యాపారమైతేనేం, కూలినాలయితేనేం, ఎంతో కొంత అందరిపనీ బాగానే వుంది. ఎటొచ్చీ రైతే ఎటూ గాకుండా పోతున్నాడనుకొంది.

“అడ్వాన్సు కావాలి.”

“అంతా ఒకేసారి తీసుకోరాదూ?”

“పీకల మీది కొచ్చి గాదా అమ్ముకొంటుంది. ఇరవై వేలన్నా ముందు సర్దుబాటు జెయ్యి.”

కాళ్ళు లేకగాదు కాలం కలసిరాకని, కోటేశ్వరరావుతో వ్యవహారం ఆషామాషీ కాదను కున్నాడు చౌదరయ్య. ప్రొద్దుటే ప్రయాణమని చెప్పి పదిహేను వేలు చేతిలో పెట్టి వెళ్ళాడు.

“ఉన్నది కాస్తా అమ్మితే రేపు పిల్లల గతేంగాను?” అడిగింది బాణమ్మ. కోటేశ్వరరావు మాట్లాడలేదు. రెట్టించి అడిగితే బూతులు కూస్తాడని బాణమ్మకు తెలుసు. ఇప్పుడు తను ఆపగలిగింది ఏముంది?

✡

ఉదయం కోటేశ్వరరావు బట్టలు సంచిలో సర్దుకొని ఊరికి ప్రయాణమయ్యాడు.

“యాడికి?” అనడిగింది బాణమ్మ

“బెల్లం వున్న తావుకి సీమలు పోవాలగందా?”

"ఇట్టా వూళ్ళు తిరగడం ఎప్పుడన్నా వుందా?"

"ఎల్లకాలం ఒకేలాగ ఎట్టాసాగుద్దే! పొట్ట తిప్పలని అందుకు గాదు అనేది?"

వెనకటి రోజుల్లో రైతులు ఇన్ని తిండి గింజలు ముందు పండించుకొని, తర్వాత వానసాటు, గాలివాటం జూసుకొని ఏదో పై పంటలు వేసేవాళ్ళు ఆదాయం కోసం. రాబడిమాట ఎట్లావున్నా తిండి గింజలకు లోటు వుండేది కాదు. ఇప్పుడల్లా గాదు వ్యాపారం వంట బట్టించుకుని వేలం వెర్రిగా పెట్టుబడి కింద వేలు గుమ్మరిస్తున్నారు. వ్యవసాయం జూదం మాదిరి అయింది. తిండి గింజలకే ముఖం వాసిపోతున్నారు.

"నిన్నిచ్చిన డబ్బులో ఒక వెయ్యి ఇంటి కర్సులకి వుంచుకోండి. మిగతాయి ఆ ఎరువుల కొట్టు గుమస్తా వత్తాడు, డబ్బిచ్చి రశీదు రాయించుకోండి. ఈ నెలాకరుకల్లా అణాపైసల్తో బాకీ కడ్తామని సెప్పండి. నేనొస్తా మరి" – చౌదరయ్య వెంట బయల్దేరుతూ చెప్పాడు కోటేశ్వరరావు.

నాలుగు రోజులకు చౌదరయ్య వచ్చాడు. పాతికవేలు దెచ్చి బాణమ్మకిచ్చాడు. బ్యాంకీ వాళ్ళ బాకీ కింద చెల్లు వేయించమని కోటేశ్వరరావు మాటగా చెప్పాడు.

బాణమ్మకు నమ్మశక్యంగా లేదు.

"చౌదరయ్యా! అసలీ డబ్బెక్కడిది? ఇంతకీ ఆ మడిసి ఏం పనిజేత్తన్నట్టు?" – కలవరపాటుగా ప్రశ్నించింది.

"పిన్నాం. మీ కష్టాలు గట్టెక్కించే పని అనుకో. వారం పది రోజుల్లో వచ్చేస్తాడు. కంగారేం లేదు" చెప్పి వెళ్ళాడు.

బాణమ్మ ఆ సమాధానంతో సంతృప్తి పడలేకపోయింది. ఎంతో తప్పనిసరయితే గాని ఒక రోజు ఇల్లు వదలి వుండలేని మనిషి. అన్నం సహించదు. కునుకూ పట్టదు. ఇన్నాళ్ళు ఎందుకున్నట్లు?

కోటేశ్వరరావు పది రోజుల తర్వాత వచ్చాడు. మనిషి చిక్కి సగమయ్యాడు.

"ఏందట్టయ్యావు? యాలకింత తినేదారి లేక పోయినాక ఎంతొత్తే మాత్రం ఏం లాబం?"

"ఊరుగాని వూళ్ళో అన్నీ ఎట్టా కుదురుతయిలేయ్!" లేలిగ్గా తీసుకున్నాడు భార్య మాటల్ని.

సంచిలో నుంచి డబ్బు కట్టలు తీసి బాణమ్మకిస్తుంటే తీసుకోను చేతులు వణికాయి. ఒక్కసారిగా అంత డబ్బు చూసి ఎరగదు. గుండెలో దడ పుట్టుకొచ్చింది.

పొలం అమ్మిన డబ్బుగా తోచడం లేదు. మరి ఏం పనిచేసినందుకు ఇంత డబ్బు ముట్టినట్టు. ఆ డబ్బేంటో, చేసిన పనేంటో బాణమ్మకు అంతుబట్టడం లేదు.

"ఎంత పెద్ద పనిచేసి ఇంత డబ్బు సంపాయించి తెచ్చావయ్యా?" – బెరుగ్గా, భయంగానే అడిగింది.

"దోపిడీనో, దొంగతనమో జేసి తెచ్చానని దడుసుకోబాక. నేనేం కాని పనిజెయ్యలా!" – కస్సుమన్నాడు కోటేశ్వరరావు.

"లోకం మన గురించి గొప్ప సెప్పుకోకుంటే మానె, లోకువజేసి మాట్టాడకుంటే అంతేచాలు" – సణిగింది బాణమ్మ.

"శంకరయ్యా! బేంకీ కాడికి బోయి మన బాకీ ఇంకా ఎంతుందో లెక్కే యించుకురా. అట్టనే పోతా దారిలో మందులకొట్టు గుమస్తాని బాకీ లెక్క తేల్చుకు రమ్మను. ఆ కుటుంబయ్య బాకీ కూడా ఎంతయిందో లెక్క గట్టించుకురా. ఇయ్యాల అన్నీ పైసలయిపోవాల." – పురమాయించాడు కొడుక్కి.

బ్యాంకీ బాకీ, మందుల కొట్టు బాకీ, కుటుంబయ్య బాకీ, ఇంకా వూళ్ళో చిల్లర మల్లర బాకీలు సాయంత్రానికల్లా అణాపైసల్తో తేల్చి డబ్బు చెల్లించాడు కోటేశ్వరరావు.

అన్నీ పోను చేతిలో ఇంకా పన్నెండు వేలు రొక్కం మిగిలింది. మళ్లీ తొలకరికి విత్తనాలు కొనను సరిపోతాయనుకున్నాడు. కొండంత బరువు భుజాల మీది నుంచి దించుకొన్నట్లుగా మనిషి తేలికపడ్డాడు.

"ఏవే! ఈ రోజు మనకు పెద్ద పండగే! రేపు అప్పు దీర్చమని నిలదీసేవాడు లేడు. కొన్నాళ్ళన్నా గుండె మీద సెయ్యేసుకుని సుకంగా నిద్రపోతాం" – చిన్న పిల్లాడిలా సంబరపడిపోతూ చెప్పాడు బాణమ్మకు.

ఇదంతా కలా, నిజమా? అన్నట్లుంది బాణమ్మకు. కన్నవారింట అప్పుల మధ్యనే పుట్టింది. వ్యవసాయం, బండచాకిరీ, అగచాట్లు, అప్పుల మధ్యనే పెరిగింది. మెట్టినింటా అప్పుల మధ్యనే కుడికాలు మోపింది. పిల్లల్ని కన్నది. సాకింది.... పెంచి పెద్ద జేసింది... అప్పులతోనే.... అప్పు అన్న మాటే గాని మిగులు అన్నమాట ఇన్నేండ్లలో ఎన్నడూ విన్న పాపాన పోలేదు.

ఒక్కసారిగా వచ్చిపడిన ఆ డబ్బు గురించి రకరకాల సందేహాలు, భయం బాణమ్మను పీడిస్తూనే వున్నాయి.

ఏ వాస్తవం తెలుసుకోవాలని బాణమ్మ మనసు ఆత్రుత పడుతుందో అది కాస్తా వెల్లడికాకుండా దాచటం కోటేశ్వరరావు వల్ల కాలేదు.

సాయంత్రం బాణమ్మ భర్త స్నానానికి నీళ్ళు తోడింది. కోటేశ్వరరావు స్నానానికి బోతూ చొక్కా విప్పి భార్య చేతికిచ్చాడు. అప్పుడే ఆ నిజం బాణమ్మ కంట బడింది.

బొడ్డు కుడి ప్రక్కన నడుం కట్టు మీదుగా ఆరంగుళాల కత్తికోత. దానికి రెండు ప్రక్కలా జెర్రికాళ్లలా వ్యాపించిన కుట్లు. అది కంట బడుతూనే బాణమ్మ గుండె గుభేలుమంది. కడుపులో వికారంగా దేవినట్లయింది.

"ఏమ్మో! ఆ కత్తికోతేంది, కుట్లేంది? ఏం జేయించుకొచ్చావు?" – గోలగా అరిచింది.

"ఒసే! నీ పుస్తెలకేం డోకా లేదు. ఉత్తినే అరవబాక" – సర్ది చెప్పబోయాడు.

"నీ వాలకం మొదట్నుంచి నాకు అనుమానంగానే వుంది. కట్టుకొన్నదాని కంట్లో ఇట్టా కారం గొడ్తావా? సంగతేంటో సెప్పు" నిలదీసింది.

"కళ్ళూ, సెవులు, సేతులు, కాళ్లూ మడిసికి రెండున్నట్టే పొట్టలో కూడ కిడ్నీలని వుంటాయంట. అవి సెడి పేణం మీదికొచ్చినోళ్ళకు మన అసుమంటోళ్ళు ఒకటిత్తే వాళ్ళ పేణం నిలబడుద్ది. మన ఆరోగ్గేనికి వచ్చే నట్టం ఏం వుండదంట. ఎవరో పెద్దింటోళ్ళకు అవసర పడిందని చౌదరయ్య యవ్వారం జేత్తే అమ్మినా..." నింపాదిగా చెప్పాడు కోటేశ్వరరావు.

ఆ మాటలకు బాణమ్మ బిత్తర పోయింది. నిలువెల్లా చెమట పట్టి వణుకుపుట్టింది. మనిషి అవసరానికి ఇట్లా శరీరంలోని అవయవం అమ్ముకోవటం గురించి ఇంతకు ముందెన్నడూ వినలేదు.

"కాయకట్టంజేసి కాయలో, పండ్లో, గింజలో పండించి అమ్ముకొని బతకాల్సినోళ్ళం. ఇట్టా వంట్లో అవయవాల్ని అమ్ముకొని బతకాల్సిన సెడ్డ రోజులు దాపురించినయ్యా?" మొగుడ్ని పట్టుకొని బాణమ్మ గొల్లుమంది.

"ఊరుకోయే! ఏళ్ళ తరబడి సేద్దెం జేత్తన్నాం. మనం పండించిన పంటకు మనం ధర గట్టే దారిలా! ఎవడో ధర గడ్తాడు. మాకు గిట్టదని సెప్పేది లేదు. అమ్మం పొమ్మనే బెట్టు లేదు. అయిన కాడికే ధారపోశాం... కాని ఇయ్యాల... నాకు నేను లచ్చ రూపాయలు ధర గట్టా!... నిలబెట్టా! అమ్ముకో గలిగినా... ఇంత కాలానికి ఒక్క వస్తువన్నా రేటు గట్టి గిట్టుబాటు జేసుకొన్నా. అందుకు ఎంతో సంతోసంగుంది!" – ఉద్వేగంతో చెప్పాడు.

"ఆడి మొదలార! చౌదరయ్య డబ్బాశ పెట్టి ఇట్టా కొంపలు కూల్చడం మొదలు పెట్టాడా?" – శాపనార్థాలు పెట్టసాగింది.

"ఊరుకోయే! పది రూపాయలు తింటేనేం! వాడి పుణ్యాన అప్పుల నుంచి బయటపడ్డాం. దీని సిగదరగ.. సెట్టు ఏటికో కాపుకాసినట్టు, వంట్లో కూడా మళ్ళీ అవయవాలు పుట్టుకొచ్చే ఇదాయకం వుంటే బాగుంటది. ఆ మట్టిలో బోసేదంతా వంటికి పట్టిస్తే మాబాగా గిట్టుబాటవుతుందే!" – ఫకాల్న నవ్వాడు కోటేశ్వరరావు.

బాణమ్మకు మొగుడి నవ్వు మొదలు తెగిన మర్రిచెట్టు ఆకుల గలగల శబ్దంలాగ ధ్వనించింది. తుపాను గాలికి హోరెత్తుతున్న సరివితోపు ఆక్రోశంలాగ వినిపించింది.

పెళ్ళీడు కొచ్చిన పిల్లని ఒక అయ్య చేతిలో పంపేదారి లేకుండా పోయిందని కుమిలిపోతున్న బాణమ్మ మనస్సులో అప్పుడే ఒక కొత్త ఆలోచన పుట్టుకొచ్చింది.

✡

# వ్యక్తిగతం

**–జాతశ్రీ**

"ఓరారి తిర్పిగా... జాంపండు కాలిగజ్జెకట్నివురా? నీ దుంపదెగ, ఏ పనీ సక్రంగ సెయ్యవుగదు." బొంత గుడ్డ పేరుతో చతికిల కూచొని, మద్దెల తోళ్లు సరిజేసిన కొమరాలు, దాన్నో పక్క నుంచి, నీరసంగా అన్నాడు.

మాడన నిక్కబొడుచుకున్న వెంట్రుకలకు నీళ్ల తడిరాసి, ఎడమచేత్తో అదుముకుంటూ, పగిలిన అద్దం ముక్కలో చూస్తూ, తొర్రి దువ్వెనతో దువ్వుకునే తిరపాలు, తండ్రికేసి చూడకుండానే "ఓరయ్య, బసవన్న ఉషారుగలే, మంకేస్తుందు." అన్నాడు.

తిరపాలు పక్కనే కూచొని, సన్నాయి పీకల్ని పరిశీలిస్తూ, సరిజేసుకుంటున్న రాంపండు, తమ్ముడి నెత్తినో మొట్టికాయ వేసి, "నీ మడత నాలిక మట్టి గరవ, 'సుబం పలకరాయ్యంటే తద్దినాలెప్పుడన్నాట్ట. నీకు దగ్గ మిడిమేళపోడు." అన్నాడు.

తిరపాలు రాంపండుకేసి కొరకొరా చూసి, కొండముచ్చులా పళ్లిగిలించి, దూరంగా జరిగాడు.

కొమరాలు డేరాలోంచి బయటికొచ్చి, దాపున తంగెడు దుంగకు కట్టేసి వున్న గంగెద్దు కేసి చూశాడు.

గంగెద్దూ చూపు కలిపింది. తల నిలువునా ఆడిస్తూ అదోలా మూలిగినట్టుగా అరిచింది. ఆ అరుపులోని దీనత్వాన్నీ, అర్థాన్నీ పసిగట్టిన కొమరాలు కన్నుల్లో నీళ్లు తిరిగాయి. "అకలవుతుందార, జాంపండూ..." అంటూ, గోముగా దాని గంగడోలు నిమిరాడు. 'జాంపండు' అని, గంగెద్దుకు కొమరాలు పెట్టుకొన్న ముద్దుపేరు.

"ఒక్కపూట ముద్దాలిసెమయితే, అన్నీ తెల్సిన మన్సే గిలగిల్లాడతడు. నోరులేనోడు. రెండు దినాలుగ అనుంగ పిరికెడు సొప్ప నమిలింది లేదాయె! ఆడిది సుత పాణవేగద, కడుపు నకనకలాడ్తంటే అరవకేం జేస్తదు?" కొమరాలు లోలో గొణుక్కున్నట్టు అనుకున్నా, అది కాస్తా తిరపాలు చెవిన పడింది.

"నీ తల్లి, కడుపు గట్టేసుకొని, సొప్పకట్ట కొందామన్నా అమ్మేటోడే కరువాయె... ఇగ 'బసవన్న' బతికేదెట్ట?" అన్నాడు తిరపాలు.

"రేయ్, జాంపండూ... ఇయ్యాలెట్టనన్న మాట దక్కియ్యి. ఇల్లిల్లు గోస పెట్టయినా నీ కడుపు నింపుత." అంటూ, గంగెద్దు ముంగాళ్ల ముందు కూచొని, "తిర్పిగా, జాంపండు గజ్జెల పట్టీలు దేరా..." అన్నాడు కొమరాలు.

తిరపాలు బొంతసంచి లోంచి గజ్జెల పట్టీల జతలు తీసుకొస్తుంటే, గమనించిన గంగెద్దు తల అడ్డంగా ఊపింది. అలా ఊపుతుంటే పసుపురంగేసి ఉన్న దాని కొమ్ముల చివరల్లో అమర్చిన చిరుగజ్జెలు ఘల్లుమన్నాయి.

కొమరాలు గుండెలు గుభేలు మన్నాయి. "ఏంద్రా, జాంపండూ... నీకియ్యాల యామయింద్రా... ఆటకి వద్దంటున్నావేంద్రా?... మాటబోద్ది గదరా." అంటూ బేలగా గంగెద్దు కేసి చూస్తుంటే, అంతకు రెట్టింపు బేలగా తన యజమానిని చూసిందది.

"మంకేస్తండని మానుకుంటే ఆ దొర ఉరికిచ్చి సంపుతడు. కిందో, మీదో పడి మాట నిలుపుకోవాల." తండ్రితో అని "నీ దండం పెడతరా బసవన్నా, మాట దక్కియ్యి, మారాజు కాళ్లబడి నువ్ దిన్నంత సొప్పదక్కొస్త. తౌడు కుడితి పెడత, నీ మీ దొట్టు." గత రెండు రోజులుగా చెయ్యని పనికి చెంపలేసుకుంటూ అన్నాడు రాంపండు.

అయినా గంగెద్దు తల అడ్డంగా ఊపి, కాలు దువ్వే కొమరాలుకు కాలివ్వకుండా వెనకడుగేసి, దీనంగా చూసింది.

"బసవన్న నీరసంగున్నడు. ఆటాడాలంటే ఆడి వొంట్లో కాత్తె ఎత్తుండాల్నా..." తిరపాలు దాపుగా వస్తూ అన్నాడు.

కొమరాలుకు కోపం సర్రునెగసింది. "నువ్ తాల్రా... నీ మదత నాలిక దెగ, పెద్దమడ్సితో తిరకాసొస్తదని నే నౌణికి సస్తాంటే..." అంటూ గంగెద్దు ముందుకాలొకటి బలవంతంగా లాగి, తొడమీద పెట్టుకొని, ఆ కాలికి తాను రెన్నెళ్ల క్రితం మంత్రించి కట్టించిన గుర్రపు 'వెంట్రుకల తాడు'ను పైకి నెట్టి, గజ్జెల పట్టీ చుట్టి గట్టిగా ముడేశాడు.

మరో కాలందుకొని, తొడ మీదుంచుకొన్న కొమరాలు, బిడియంగా రాంపండు కేసి చూసి, "కాలు వొణికిస్తాంద్రా, జాంపండు." వణుకు లాటి స్వరంతో అన్నాడు.

"వొణికియ్యక, ఉషారు గెట్టుంటడు... రెండు దినాలుగ సొప్ప మురకజూసిండా, కాత్తె కుడితన్న తాపినవా? నీయ్యవ్వ, అగపడ్డ పచ్చిరొట్టల్లా ఆడి ముంగలేస్తివి. పారుడు సుత సురువు జేసిండు." అన్నాడు తిరపాలు.

తిరపాలు మాటల్ని లెక్కనేసుకోకుండా, గంగెద్దు కళ్లలోకి చూస్తూ, "ఏరా, జాంపండూ... నా పరువు దీస్తావురా?" దీనంగా అన్నాడు కొమరాలు.

“గుండె సెదరకురయ్యా... కిందో, మీదో పడి ఆటయిందనిపిద్దాం. గట్టిగడిగితే, బసవన్నకి వొంట్లో నలతగుందని దండం పెడదాం. మారాజు కాళ్లమీదపడి, ఓ మోపు సొప్పడుగుదాం... పంచెలూ, చీరలూ లేకుంటె మానె!” అన్నాడు రాంపండు.

“అదీ అయింది. నిన్న మాపిటేల ఈదుళ్లకెళ్లి పొయ్యొస్తా, మాట నికరానికి నిలబడి, బసవన్నకి పిరికెడు సొప్పదానం జెయ్యండి సామీ...” అంటే, మారాజు పెద్దగా నవ్వి, “బువ్వడుగు పెడత, గుడ్డడుగు యిస్త, మరీ... కావాలంటే నాల్రూపాయలు ఎక్కువడుగు. కాదన్ను... సొప్ప సంగతెత్తకు. ఊర్లె గొడ్లకి సొప్ప కరువై, వాటిని కటికోళ్లకి తోలేస్తన్రు గదరా!.. ఎనకట రైతంటే పెద్ద – పశువుల దొడ్డీ, ఊరి బయట గడ్డివాములూ ఉండేవి. యియ్యాల కనపడతన్నాయిరా?..... అన్నడురా ఆసామి.” అని కొమరాలు అంటుంటే, గంగెద్దు నలంకరించేందుకు బొంతలూ, రంగు చీరలూ బుజానేసుక వస్తూన్న తిరపాలు విని, “ఆరి గొడ్లు తినకుండనే బతుకుతున్నయటనా?” వ్యంగ్యంగా అన్నాడు.

“మరదే, రెటవతవంటే... ఆసాముల్తో మనకి సాపతేందిరా?” అన్నాడు కొమరాలు.

“దీన్ల సాపతేవుంది? బసవన్నలు బతకొద్దా... మా రాజులు పెడితెనే గద, బతికేది? మనవేమన్న కానూరిన బిచ్చమడుగుతున్నమా? తాతల్నుంచి యీ – కూనారం మన్దేగద! ఆరిండ్లల్ల పెండ్లిళ్లొచ్చినా, పండగలొచ్చినా, పురుల్లొచ్చినా, సావులొచ్చినా, బసవన్న నాడిస్తన్నం గద!” గంగెద్దు వీపున బొంత కప్పుతూ అని, ఆ పై మడతల్లో ఉంచిన రంగురంగుల చీరల్ని కప్పి, మూపురానికి చిలకాకు పచ్చరంగు బొంత టోపీ తొడిగాడు తిరపాలు. టోపీ చివరల్లో కుట్టి ఉన్న రంగు రంగుల ఊలుదారాల పూలు డాంబికంగా కన్పిస్తున్నాయి.

రాంపండు గంగెద్దు మెడలో గంటల పట్టీ కట్టాడు. పట్టీపై గంటల మధ్య అతికించిన పూలు అందంగా ఉన్నాయి. తిరపాలు కుంకుమ బొట్టు ముందుగా తాను పెట్టుకొని, అదే వ్రేలితో గంగెద్దు నొసటన పొడవాటి బొట్టు పెట్టి, నాలుగడుగులు వెనక్కేసి చూశాడు. గంగెద్దు అలంకరణ చూడముచ్చటగా ఉంది.

“ఓరయ్య, బసవన్నకి దిష్టి తగులుద్ది, గుడ్డ గాల్సి దిష్టి తియ్,” అన్నాడు రాంపండు.

కొమరాలు గంగెద్దుకేసి పరకాయించి చూశాడు. అతని కంటికి గంగెద్దు అలంకరణ కంటే, దాని ఆకలి కడుపే కనబడింది. లోతుకు పీక్కుపోయిన డొక్కలు, కండ కరిగి, బయటకు నిక్కపొడుచుకొచ్చిన ఎముకలు – అస్థిపంజరానికి బొంత కప్పినట్టుగా ఉంది. దాని కంటి చూపు దైన్యంగా, ‘దివాలెత్తిన రాయలసీమ రైతు చూపులా’ ఉంది. దాని రూపు ‘చినుకు కోసం మూడేళ్లుగా ఏడ్చీ, ఏడ్చీ, చెంపలపై ఉప్పు నీళ్ల అట్టలు గట్టిన ‘తెలంగాణా నేల తల్లిలా’, నకనకలాడే ఆకృతికి ‘ఉపమాలంకారం’లా ఉంది.

కొమరాలులో ఉద్వేగం... తన అస్సహాయతకు అద్దంలా, కన్పించే గంగెద్దును చూస్తుంటే తాను కొలిచే దేవుడే తన గుండెల్ని కసపిసా తొక్కుతున్నట్లుగా గిలగిల లాడాడు. కుడికన్ను అదిరినట్టయింది.

“ఓరయ్యా, కానియ్... వొల్లు కాకెక్కుతోంది.” అన్నాడు తిరపాలు.

కొమరాలు ఉలికిపడుతూ, తన కొడుకులకేసి ఓ మారు చూసి, డేరా బయట పడేసున్న చింపిరి గుడ్డ నందుకొని, మట్టి దులిపి, గుండ్రంగా చుట్టి, అగ్గిపుల్ల గీసి అంటించాడు. రాంపండు అందించిన పగిలిన మూకుడు చిప్పలో, మండే గుడ్డ నుంచి గంగెద్దు మొహం మీద వృత్తంలా తిప్పుతూ, తనకే వినపడేలా, చిన్నగా “ఇరుగు దిష్టి, పొరుగు దిష్టి...” అని మొదలేసి మరేదో గొణిగి, మంటపై మూడు సార్లు ఉమ్మేసి, మండేగుడ్డను దారి కడ్డంగా పడేసి, “జాంపండుని నడిపియ్యరా రాంపండూ...” అన్నాడు.

అప్పటికే రాంపండు సన్నాయి కర్రల సంచీ బుజానికి తగిలించికొన్నాడు. తంగేడు దుంగకు కట్టేసి ఉన్న గంగెద్దు ముకుతాడు విప్పి, ముందు కదుగేస్తూ, “నడవ రా, బసవన్నా...” అంటూ గంగెద్దును మంట మీదుగా అడుగేయించి, వెనక్కి చూడకుండా ముందుకు కదిలాడు. మద్దెల చంకన వ్రేలాడేసుకొని, తిరపాలూ అనుసరించాడు. కొమరాలు నిల్చొని, చెవిపై దోపుకున్న మొదుగాకు చుట్టను ముట్టించి, బుజానున్న ఎర్రంచు కండువా నెమలి పించంలా తలకు చుట్టుకొని, ఓసారి డేరాకేసి చూసి, నాలుగడుగులు వెనుకగా కదిలాడు.

ఎండ కరకరలాడుతూంది.

‘రొండ్రోజుల్నుంచి, సొప్ప నవిలింది లేదాయె, కోసెడు దూరం నడ్సి, జాంపండు ఆటాడతడో, మంకేస్తడో...’ అనుకొంటూ, ముందు నడిచే గంగెద్దును చూస్తూ.... చూస్తూ... నడుస్తూ చూస్తుంటే... టే, ఆ చూపుకాస్తా ఆకస్మాత్తుగా గతంలోకి గంతేసింది.

ఇప్పటిదా?...

రేపో, మాపో పదేళ్లు నిండే కథ!

పెద్దకొడుకు – రాంపండుకు రేపో, మాపో పదేళ్లు నిండుతాయనుకున్న రోజుల్లో కథ!!

లింగన్నగూడెం పటేల్ దొరవారి తల్లి తద్దినానికి తన తండ్రి వెంకట్రాముడితో పాటు వెళ్లి, తమ గంగెద్దును ఆడించిన తీరుకూ, వేసిన అడుగుకూ, పాడిన పాటకూ, జనమంతా ఈలలు, చప్పట్లు...! చిన్న చిన్న గంతులో, వెనక్కీ ముందుకీ నడవడాలో కాదు, ఏకంగా గంగెద్దు మొత్తాన్ని తన గుండెలపై నిలుపుకోవడం, దాని నోటిలో మెడ నుంచి ఊరంతా తిరిగిరావడం, జనాలకి చెమటలు పట్టించాయి. తను – తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి, ఆడిన ఆటకు నివ్వెరపోయిన సీతమ్మ తల్లులు – దోపిళ్లతో కాదు, చేటలతో ధాన్యం కొలిచారు.

పట్వారీ దొర పిల్చి పాతిక రూపాయలు దోసిట్లో పడేస్తే, ఆట పెట్టించిన పటేల్ దొర – ఏకంగా ఏడాది వయసున్న గిత్తదూడనే తన తల్లి పేర దానంగా ఇచ్చాడు. ఒక్కాటనుకుంటే – కులానికో ఆటా తప్పలేదు. కాపులు, కోమట్లు, వెలమలు, గంప కమ్మలు, రెడ్డోళ్లు... చిల్లర మల్లర కులాలు సుత రోజుకో ఆట! ఆ పది రోజులూ... జనాలకు మరో మాటా, మంతీ లేదు. తన ఊసులూ, గంగెద్దు ఆటలూ... మాయ ఉందని కొందరూ, గంగెద్దుకు మంత్రమేశారని మరికొందరు....

పటేల్ దొర దానం చేసిన గిత్త దూడకి, ఆనాడే "జాంపండు" అని తను పేరు పెట్టుకోవడం జరిగింది.

గంగెద్దుల కోసం ఎవరూ సాధారణంగా గిత్తదూడల్ని కొనరు. పెద్ద పెద్ద రైతులు పండుగల్లో, పెళ్లిళ్లలో, చనిపోయిన తమ పితరుల పేరున దానంగా ఇస్తారు. పనికి లొంగక, మంకేసే వాటినీ, కాడికి మర్లబడే వాటినీ, గుదిబండ వేసినా దొంగ బుద్ధి వదలని వాటినీ, అవిటితనంతో పుట్టిన వాటినీ ఇస్తారు. అలా ఇచ్చినవి మరీ ముదురువయితే, మారకం పెట్టి, లేగ గిత్తల్ని సంపాయించి, గుంటూరు దగ్గరున్న జంగంపల్లెలోని జంగం బసవన్న దగ్గర వదిలి పెడతారు గంగెద్దులవాళ్లు.

జంగం బసవన్న ఆషామషీ మనిషేం గాదు. గంగెద్దుల గురువు. లేగ గిత్తదూడల్ని అప్పగిస్తే ఆరేడు నెలల్లో రకరకాల ఆటలు నేర్పించి, గంగెద్దుగా ముద్రేస్తాడు. గిత్తలకే కాదు, ఎలుగుబంట్లకీ ఆటలు నేర్పిస్తాడు. ఈ ఆటలు నేర్పినందుకు జంగం బసవన్న గిత్తదూడ పలికే ధరలో సగం 'గురుదక్షిణ'గా పుచ్చుకొంటాడు. గిత్తదూడలు తన దగ్గరున్న కాలంలో వాటి ఆలనా పాలనా అతనే చూస్తాడు. ప్రతి శనివారం గిత్తలకి సాంబ్రాణి పొగేసి, పూజ చేసి, అరటి పండ్లూ, బెల్లం తినిపిస్తాడు. ప్రతి ఆదివారం గిత్తల చెవుల్లో ఏదో చెట్టు పసరు పోస్తాడు. ఆ చెట్టేదో ఎవరికీ తెలియదు. అతనూ చెప్పడు. ఆ పసరు కనికట్టేమిటో గాని, పోస్తూనే గిత్తదూడలు – తెల్ల ఉసిరిక తల మీద పెట్టిన పాముల్లా మారిపోతాయి.

గంగెద్దుగా ముద్రపడిన గిత్తదూడ మరో పనికి పనికిరాదు. తన యజమాని కంటి సైగలకూ, చేతి కదిలికలకూ చెర్నకోల జాడింపులకూ అది శిక్షణ పొందిన రీతిలో కదులుతుంది! అవే గంగెద్దు ఆటలు!!

జాంపండు మరీ లేతదవడంతో దానికి ఆటలన్నీ సుళువుగానే అలవడ్డాయి. దాంతో కొమరాలు కొండెక్కినంత సంబరంతో, జాంపండు మీద కొండంత నమ్మకంతో, కొడుకు రాంపండుని బుజానెక్కించుకొని, ఇంటిదాన్ని వెంటేసుకొని దేశం మీద పడ్డాడు.

ఓ ఊరా... ఓ పరగణానా? ... వానా, వరదా అడ్డగిస్తే తప్ప, తానే ఊరినా నికరంగా మూడు దినాలకు మించి నిద్ర తీసింది లేదు. మిగతా బిచ్చపు దాసరుల్లా తాగి, తందనా

లాడిందీ లేదు. గంజాయి దమ్ము లాగిందీ లేదు. ఎలకలో, పిల్లులో దొరికితే వండుక తినడం తప్ప పెద్ద 'జల్సాలు' చేసిందీ లేదు.

ఆ రోజుల్లోనే పెనగంచిప్రోలు తిరపతమ్మ దేవర తిరనాల్లో, ఆటకి పోతే పుట్టిన కొడ్డుక్కి, పురుడు చల్లగయినందుకు ఆ తల్లికి దండం పెట్టుకొని, ఆ తల్లి పేరే పెట్టుకోవడం జరిగింది. ఆడే తిరపాలు!

ఆపై – ఐదారేళ్లు తన బతుకులో గుణించుకోదగ్గ ఉప్పెన లేవీ లేకుండా గడిచింది. ఏడెనిమిది నెలలు గంగెద్దు ఆటలతో దేశం మీద, నాలుగయిదు నెలలు సొంతూరులో వుంటూ కాస్త 'కలిగినోడి'గా వరసకీ, వ్యవహారానికీ పెద్దమనిషిలా జమాయించుకొచ్చాడు.

రాంపండుకు మీసకట్టు రావడం చూసి, ఇంటి దాని మాట మీద, పోశించెర్ల పోరిని కోడలిగా మనువాడటం జరిగింది.

ఆ పోర్దాని కాలి మాయో, కనికట్టో తెల్వదు గాని, అది గుడిసెల అడుగేసిన్నాట నుండి, బంగారం లాంటి తన కొడుకు రాంపండు కాకి బంగారంలా మారిపోయాడు. తల్లిని గిట్టకపోవడం, జాంపండు ఆటకు ఎగేసి, గుడిసె పట్టున పెళ్ళాంతో కులకటం, గుడిసెలో నెమ్మది లేకుండా పోతుంటే, ఇంటిదాని పోరు పడలేక, కోడలి పోరి అయ్యనీ, కులపోళ్లనీ కూచోబెట్టి, మూడురాత్రులు పంచాయితీ నడిపించి, చివరికి ఎట్లయితేనేం, విడాకులు తీసుకోవడం జరిగింది. ఆ కోడలు పోర్దిపోతా, పోతా తననీ, తన ఇంటిదాన్నీ నోరు పట్టని తిట్లు తిట్టి, దోసిళ్లతో దుమ్మెత్తి గుడిసె కేసి గుమ్మరించి, వగలాడి ఏడ్పేడ్చుకుంటపోయింది.

ఆ 'మందార' నోటి మర్మమేందో గాని, అదన్నట్టే మూడు నెలలు తిరక్కుండానే చీకటేల పురుగు ముట్టిన తన ఇంటిది మూడు నెలలు నమిసీ, నమిసీ, వళ్లంతా పొక్కులొచ్చి, కాటి పాలయింది.

ఆ తర్వాత మారుమనవాడమని ఒకరిద్దరు చెప్పినా, మనువాడాల్సిన కొడుకుల్ని ఎదురుంగుంచుకొని, తను మారుమనువాడితే కులం ఉమ్మేస్తదనిపించి, తన ఇద్దరు కొడుకుల కోసం చెయ్యి కాల్చుకుంట బతుకుతుంటే, కుళ్లుబోతు కుల పోళ్లెవరో, తన వియ్యంకున్నెగేసి, కోడలి పోరి మనోవర్తి కోసం పంచాయితి గాయించిన్రు. "మనోవర్తి వద్దులే గాని, నా మొగుడితోనే కాపరం చేస్తా, మావనీ, మర్దినీ – అయ్యలా, అన్నలా చూసుకుంట" అని కోడలి పోరి ఏడ్చినా, తన ఇంటిదాన్ని సాపించి చంపినదాని మొహం సూట్టానికే మనసొప్పక, ఆ పోర్ది మరో మనువు పోనంత కాలం ఏడాదికి రెండు వేలు మనోవర్తి నికరం జేసుకొని, రెండేళ్ల నుంచీ, సంక్రాంతెల్లిన తొలి అమావాస్య నాడు టంచనుగా డబ్బు కడుతూనే వున్నాడు.

మూడేళ్ల నుంచీ ఇంటిది లేకపోవడం, కాలమూ కన్నెర్ర జెయ్యడం – అన్నీ కలిసి తమ బతుకు కిందెత్తునయింది. ఇంటిది బతికున్న రోజుల్లో ఆటలో వంతపాటకి భలే ఉషారుండేది.

మనిషి ఆటాడితే – మద్దెల వరసని బట్టి తానే అడుగు మారుస్తాడు. గంగెద్దు ఆటలో, దాని అడుగును బట్టి మద్దెల దెబ్బ పడాలి. అప్పుడే ఆటకి లయ, హుషారు ఉంటది.

ఇప్పుడా పని తిరపాలు చేస్తున్నాడు. లేత వయసైనందున, వాని వరసంతా 'అల్లాయి – పుల్లాయి' అన్నట్లుగా ఉంటుంది. ఆటలో సినిమా పాటలు పాడినంత తేలిగ్గా కులం పాటలు పాడలేడు. ఆడిమాటెంత పెడసరమో, మనిషీ అంతే!

తన ఆట రోజు రోజుకీ తేలిపోతుందని తెలిసొస్తుంటే, మరో దిక్కూ, దారీ, తోచని కొమరాలు, ఆటకి అంత ప్రాధాన్యత ఇవ్వకుండా, గంగెద్దుని అలంకరించి, సన్నాయీ, మద్దెలా వాయిస్తూ ఇంటింటికీ తిరిగి బిక్షమడిగే 'బిచ్చపు దాసరి'గా మారిపోయాడు. నెలకో, రెన్నెళ్లకో కాస్త పల్లె తనం కనిపించిన చోట, పెద్ద మనుషులు పలుకరించిన చోట మాత్రమే గంగెద్దు నాడించడం ఆలవాటు చేసుకొన్నాడు.

నెల క్రితం కొమరాలు కూనారంలో ఆటపెడితే చూసి, తబ్బిబ్బయిన ఆ ఊరి పెద్దాసామి, తన తల్లి సంవత్సరీకానికి మళ్లీ ఆటపెట్టమని, దినం చెప్పి, యాభై రూపాయలు 'బయానా'గా ఇచ్చాడు.

ఆ మాట నిలుపుకునేందుకే కొమరాలు – కూనారం బయల్దేరాడు తప్ప ఆటాడితే తన జోలె నిండుద్దనీ, గంగెద్దుకింత చొప్ప దొరకుకుందనే నమ్మకంతో కానే కాదు.

కొమరాఏల కాదు. వృత్తి కళాకారులందరి పరిస్థితీ అలానే ఉంది. గతంలో గ్రామం మధ్యలో అటపెట్టి, అదో హక్కులా, అనుబంధంలా చేటలతో ధాన్యాన్ని కొలుచుకున్న కళాకారులు, కళల్ని వదిలేసి కూలి బతుకులు అలవాటు చేసుకుంటున్నారు. గ్రామగ్రామాన మీసాలు మెలేసి, ఆడి, పాడి అలరించిన కళాకారులు కనిపించడం లేదు – బుర్రకథలు, హరికథలు, ఒగ్గు కథలు, బాగోతాల ఊసులేదు. జేగంటలు, జమిడికలు, అందెలు, వీరణాలు, తప్పెటలు, తంబురలు, కోలలు... ఆ వాయిద్యాలేవీ – లేవీ రోజుల్లో! ఆ కళాకారులు అర్ధాకలితో, అధో లోకపు జీవుల్లా సంచరిస్తున్నారు. వారి పిల్లలు – సత్తుగిన్నెలు పట్టుకొని, ఇల్లిల్లూ యాచిస్తూ – జీవితం కాని, కాకూడని, జీవితం – జీవిస్తున్నారు. మానవతకు సవాల్‌గా, ప్రజాస్వామ్యానికి ప్రశ్నార్థకంలా... 'అనాధ బాల్యాల్ని' అనుభవిస్తున్నారు.

ఇదీ మన జాతీయ సంస్కృతి, సంపత్తి – అని గర్వంగా చెప్పుకున్న అనుబంధాలన్నీ ఇవాళ ఆవిరైపోతున్నాయి. ఆలోచనల్లో – వ్యక్తిగతాలే తప్ప మరో రీతి మరుగైపోతూంది. వృత్తి కళాకారులకి గంజో గటకో దొరికినా, మూగజీవాలకి ఆకలి తీరే దారేదీ కనిపించడం లేదు. ఆహార ధాన్యాల కోసం గోదాములున్నాయి గాని, కోట్లాది పశువుల దాణా కోసం ఏ గోదాములూ లేవు. మన తాతలు తండ్రులు ప్రేమించిన ఉమ్మడి బతుకుల్ని, పోషించిన విలువన్నీ, పరిహాసంగా కొట్టి పారేస్తూ అనుబంధాలకు దూరంగా వ్యక్తిగతాల్ని అనుభవిస్తున్నాం! పొరుగు వాని అవసరమూ మన అవసరం లాటిదేననే ఇంగితమయినా లేకుండా.... మార్కెట్ మనస్తత్వాల్ని అనుసరిస్తున్నాం!

చినుకు పిరెమై, పంట శూన్యమై, ప్రజలకు తిండి గింజలు ఇతరేతరంగా సమకూరినా, పశువుల దాణా గురించి ఆలోచించే నాధుడే లేడు. పశువులూ – సమ్మెలో, ధర్నాలో చేస్తే తప్ప వాటిని కరుణించేవారు ఉండరేమో! ఏమో!

భిక్షగా కాదు. గడ్డి ఖరీదుక్కూడా దొరకని వైనానిక కొమరాలు నివ్వెరపోయాడు. గత రెండు రోజులుగా తన 'జాంపండు'కు పిరికెడు చొప్ప సంపాయించలేకపోయిన తన నిస్సహాయత మీద తనకే అసహ్యం!

"ఓ–రయ్య, ఊరొచ్చె, కాలాడియ్." వెనుకగా నడిచే తండ్రిని చూస్తూ అన్నాడు తిరపాలు.

పెద్దాసామి వాకిలిలోని, చింతచెట్టు నీడలో ఉన్న బండి మొగరానికి గంగెద్దుని కట్టేసి, తల గుడ్డతో మొహం తుడుచుకొన్నాడు రాంపండు.

తిరపాలు ఓ వరుస మద్దెల వాయించాడు.

కొమరాలు, రాంపండుతో పాటు పెద్దాసామి ఇంటి గడపలో నించొని, తలకున్న ఎర్రంచు కండువా తీసి పట్టుకొని, "దండం పెడత, దయగల మారాజు... బసవన్న ఆట సురువు జెయ్యనా సామీ?...." అన్నాడు.

ఇంటి వసారాలో పట్టా కుర్చీలో కూచొని, పొరచుట్ట చుట్టుకునే పెద్దాసామి "ముందగాల, నా పేరూ, నా అమ్మ పేరూ సెప్పుకుంట, ఓ సారి ఊరంతా తిరిగి రారా..." అన్నాడు.

కొమరాలుతో పాటు రాంపండూ తలూపుతూ, వంగి వంగి దండం పెడుతూ, "సిత్తం, తమరెట్టంటె... అట్టనే." అని, అప్పుడే ఇంటిలో నుంచి వచ్చిన పెద్దాసామి భార్యతో, "దండం బెడత సీతమ్మ తల్లా... బసవన్నని దయజూడాల తల్లా... నకనకలాడ్తాండు" అని, బయట పడ్డారిద్దరూ.

పనులంతగా లేని రోజుల్లో పల్లె జనానికి కాస్త తీరుబడి ఉండే వేళ – పగటి వేళ, చాలా మంది చింతచెట్టు నీడకు చేరి నిలుచున్నారు. ఊరు తిరిగొచ్చిన కొమరాలు, జనాలకు దండం పెడుతున్నాడు. అప్పటికే పెద్దాసామి ఓ పొడవాటి చెంబీతో పాటు తన పట్టా కుర్చీ వేయించుకొని, తన కుటుంబంతో సహా కూచున్నాడు.

కొమరాలుకు జానాన్ని చూసే సరికి ఉషారొచ్చింది. గంగెద్దులో మాత్రం ఉషారు మచ్చుకైనా కన్పించడం లేదు. ఆకలితో నకనకలాడుతూ నలుదిక్కులూ చూస్తుంది.

తిరపాలూ మద్దెల వాయిస్తూ, గంగెద్దు ఎదురుగా నిలుచుంటే, కొమరాలు దాని తోక మెలిపెట్టి, చెర్నకోల ఆడించి,

"డూడూ... డూడూ... బసవన్నా...

ఆసామి గోరికి దండం పెట్టు...

దొరాస్సనమ్మకి దండం పెట్టు...

చిందొర్సానికి, చిందొర వారికి...

పేరు పేరునా దండం పెట్టు..." అన్నాడు.

ఆ వెంటనే రాంపండు గంగెద్దు మొహం దగ్గర ముకుతాడు పట్టుకొని, పెద్దాసామి కేసి నడిపిస్తే, గంగెద్దు, తల నిలువునా ఆడించింది. అలా నాలుగు సార్లు... చుట్టూ నిలుచున్న జనం చప్పట్లు కొట్టారు. ఆ వెనుక గుండ్రంగా తిరుగుతూ... తలాడిస్తుంటే, గంగెద్దు తమకు దండం పెట్టినందుకు జనం ఈలలు... చప్పట్లు!

డాన్సంటూ తిరపాలు పాటెత్తు కుంటుంటే, రాంపండు దాని ముంగాళ్ల మీద తాకాడు.

"తిల్లానా... తిల్లానా... నా కసి కళ్లదానా..." పాటతో పాటు తిరపాలు మద్దెల వాయిస్తుంటే, గంగెద్దు కుమ్మరి మట్టి తొక్కినట్టు కాళ్లాడిస్తుంటే... జనం మనసారా నవ్వుతూ.. నవ్వుతూ...

ఆ పాట అవుతూనే వెనుక కాళ్లను తాకుతూ మరో పాటెత్తుకున్నాడు రాంపండు.

"సిందు, సిందు – సిందెయ్యర – నా గజ్జెల చిన్నోడా

మా రాజులు ముంగిట్లో – నా గజ్జెల చిన్నోడా

మా రాణులు వాకిట్లో – నా గజ్జెల చిన్నోడా

కంటి కింపు జెయ్యరా – నా గజ్జెల చిన్నోడా

కడుపు నిండ బువ్వ బెట్ట – నా గజ్జెల చిన్నోడా"

ఆ పాటయ్యాక, కొమరాలు గంగెద్దును మోకాళ్ల మీద నడిపించడంతో, అది పూర్తిగా డీలా పడిపోయింది.

కొమరాలు గంగెద్దు పరిస్థితిని గమనించాడు. కాని ఆట ఆపుజేస్తే పెద్దాసామి ఊరుకునే రకం కాదు. "బయానా తీసుకోవడం తప్పయిందిరా జాంపండూ..." అని లోలో గొణుక్కొని, చుట్టూ నిలుచున్న జనాలకి దండం పెట్టి, గంగెద్దు ముంగాళ్ల ముందు కూచొని, దాని నాలుగు కాళ్లూ తొడల మీద నెక్కించుకొని...

మద్దెలకు తోడు జనం చప్పట్లతో, ఈలలతో ఊరు మార్మోగింది. పెద్దాసామి మీసం పైకి దువ్వుకున్నాడు. "మరొక్క ఆట, అదొక్కటయితే మాట దక్కుద్ది, కడుపు నిండుద్ది." అనుకొని, నేల మీద తన ఎర్రంచు కండువా పరిచి, జనం చుట్టూ చేతులెత్తి పట్టుకొని తిరుగుతూ, "దయగల తల్లులు... దొరలు, దొర్సానులు... గుండెల మీద బసవన్న గంతులు

చూడండి. చూసి బెంబేలెత్తకండి. మెచ్చిన దొరలు బసవన్నకి – ఓ పంచె, ఓ చీర, కుంచెడు వడ్లు, మానెడు కందులు, బుట్టెడు మిరపకాయలు... దయగల సీతమ్మ తల్లులూ, దయజూడండి.” అంటూ వెల్లికిలా పడుకొన్నాడు కొమరాలు.

రాంపండు గంగెద్దును పట్టుకొన్నాడు. తిరపాలు మద్దెల వాయిస్తున్నాడు. జనాలు ప్రాణాలు బిగబట్టుక ఆగి చూస్తున్నారు. పొలాల నుంచి వస్తున్న వాళ్లు, ఇల్లు మరిచి నిల్చుండి పోతున్నారు. అడవి నుంచి కట్టెలు తెస్తున్నతను మోపు నిలిపి... గడ్డివాము నుంచి గడ్డి మోపుతో వచ్చినతను గడ్డి మోపు తలమించి నేలపై నిలిపి..., నిలువు గుడ్లేసుక చూస్తున్నారు. గుండెల మీద గంగెద్దు నాలుగు కాళ్లూ పెట్టుకొని మనిషి బతగ్గలడా....? అందరి మొహాల్లోనూ అదే ప్రశ్న! కుతూహలం! భయం! బాధ...

చప్పట్లతో, ఈలలతో, మద్దెల దరువుతో అప్పటి వరకూ దద్దరిల్లిన ఆ ప్రదేశం ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారిపోయింది. జనం శ్వాసను ఉగ్గబట్టారా... అన్పించేంత నిశ్శబ్దం!

రాంపండు గంగెద్దును కొమరాలు దాపున నిలిపాడు.

వెల్లికిలా పడుకొన్న కొమరాలు గంగెద్దు ముందు కాళ్లు గోముగా నిమురుతూ, ఓ కాలును ఛాతీపై ఉంచుకొన్నాడు. శ్వాసను ఉగ్గబడుతూ మరో ముందు కాలును ఛాతీపైకి లాక్కున్నాడు.

గంగెద్దుకు నీరసంగా ఉంది. చికాగ్గానూ ఉంది. బాధగా చుట్టూ చూసింది. దాని కంటికి గడ్డి మోపు కన్పించేసరికి కళ్లు రెపరెపలాడాయి. నోటిలో లాలాజలం ఊరింది. మరుక్షణం ఆకలితో నకనకలాడే గంగెద్దు, చెంగున ఎగరడంతో దాని ముందు కాళ్లు కొమరాలు చాతిని బలంగా తాకాయి. గంగెద్దు గడ్డిమోపుకేసి మరో గంతేసే సరికి, దాని వెనుక కాళ్లు మరోసారి, మరింత బలంగా కొమరాలు ఛాతిని తాకాయి.

గంగెద్దు బెదిరి, తమ మీది కొస్తుందన్న భయంతో జనం – కొమరాలు వేసిన ‘ఆఖరికేక’ను ఎవరూ వినలేదు. పట్టించుకోనూ లేదు. అందరి చూపులూ గంగెద్దు మీదనే వున్నాయి. గంగెద్దు చూపు గడ్డిమోపు మీదుంది. మరో రెండంగల్లో అది గడ్డిమోపు మీదపడి, గబగబా తినసాగింది.

కొమరాలు ఛాతిని బలంగా తాకిన గంగెద్దు కాళ్ల దెబ్బలకు అతని గుండెలు చితికి... రక్తం కదిలి... కమిలి... చిందర వందరై... ఆ క్షణమే కొమరాలు తల వాల్చేశాడు.

✡

# మృత్యువు పువ్వు

**–పంజాల జగన్నాథం**

నుదిటిపై చేయిపెట్టి ఆకాశంవైపు ఆశగా చూస్తున్నాడు కమ్మిన మబ్బులు చినుకులు ఏమైనా రాలుస్తాయా అని "చకోరపక్షిలా ఎదురు చూడ్డమే తప్ప వానలు వచ్చేవా.. చచ్చేవా.." నిష్టూరంగా విసుక్కున్నాడు వీరయ్య.

జీవితంలో ఎన్నో ఒడుదుడుకుల్ని చవిచూసిన ఆ రైతు సైతం మనో నిబ్బరాన్ని కోల్పో తున్నాడు. వీరయ్య విషన్న వదనం. ఆయన కళ్లలోని దైన్యం చూస్తూంటే అతనికి జీవితంమీదనే నిరాసక్తత. విరక్తి కలిగినట్టనిపిస్తోంది.

వీరయ్యదో రైతు కుటుంబం. అతను చేసే సేద్యమే ఆ కుటుంబానికి జీవనాధారం! సేద్యం మీద వచ్చే కొద్దిపాటి ఆదాయం, మరికొంత అప్పుచేసి తన ఇద్దరి కూతుళ్ల పెళ్ళిళ్లు ఎలాగో అయిందనిపించాడు. అంతటితో వీరయ్య బాధ్యత తీరలేదు! మనమల, మనమరాళ్ల పురుళ్లు, కేశఖండన వగైరాలు రెక్కాడితే డొక్కాడని ఆ సంసారాన్ని మరింత అప్పుల్లో కూర్చేశాయి.

వీరయ్య భార్యకు చిన్న వయస్సులోనే కాన్పయి నలుగురు పిల్లలకు తల్లయింది. ఆమె ఎముకలపోగుపై చర్మాన్ని కప్పుకొన్న ఓ జీవి. చాలీచాలని సంసారంలో కనీసం కడుపునిండా తిండిలేక సుఖమంటే ఏమిటో తెలియదు ఆమెకు. కష్టాలనే వెళ్లదీస్తూ వయస్సుకు మించిన వృద్ధాప్యం ఆమెను ఆక్రమించింది.

ఇద్దరాడపిల్లల పెళ్ళిల్లు ఎలాగో అయిపోయాయని ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో, ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ ఫెయిలయి నడి వయస్సులో నాలుగోవాడు భూమిమీద పడ్డాడు. శక్తి ఉడుగుతున్న వయస్సులో నాలుగోవాడి జన్మతో ఊహించని రీతిలో వీరయ్య నెత్తిమీద అదనపు బాధ్యతలు పడ్డాయి. మూలిగే నక్కమీద తాటికాయపడ్డ చందమైపోయింది వీరయ్య పరిస్థితి.

ఇద్దరు మగపిల్లల్లో పెద్దాడిని బాగా చదివించాలనీ, తనలాగా తన పిల్లలకి బురద బతుకులు వద్దనీ, వాళ్లు బాగా చదివి పెద్ద ఉద్యోగాలు చేయాలనీ కలలుకన్నాడు. ఆ విధంగానైనా కష్టాలు కడతేరుతాయని వాళ్లైనా సుఖపడగలరని ఆశపడ్డాడు!

పెద్దోడిని స్కూలుకు పంపిస్తున్నాడు! నిరంతరం శ్రమిస్తేకాని ఐదువేళ్లు నోట్లోకి పోని ఆ కుటుంబ పరిస్థితుల్ని చూసి వీరయ్య పెద్దబ్బాయికి చదువుకోవడానికి మనస్సంగీకరించ లేదు! తండ్రి మాట కాదనలేక స్కూలుకు వెళుతుండేవాడు!

ఓ రోజు "నాన్నా నాకు చదవాలనిలేదు. చదివినా ఈ రోజుల్లో ఉద్యోగాలు ఎక్కడి నుండొస్తాయి. నీతోపాటు నేను ఎవుసం చేస్తాను" అని వీరయ్యతో తన పెద్దబ్బాయి అన్నప్పుడు "ఒరేయ్ బిడ్డా మాయి మట్టి బతుకులు. గిట్లనే తెల్లార్తయి! నీకీ పనొద్దు బిడ్డా నువ్వు బాగా చదివి పెద్ద నౌఖరీ జేస్తే మన కట్టాలన్నీ బోతయి" అన్న వీరయ్య మాటలు తన పిల్లలపట్ల ఆయన హృదయం ఎంతగా పరితపిస్తుందో తెలుస్తోంది!

ఒంటినిండా గుడ్డల్లేక, ఒళ్లంతా మట్టి కొట్టుకుపోయి చాలినన్ని పాలులేక ఏడుస్తూ ఇల్లంతా పారాడుతున్న చిన్న కొడుకుని చూస్తే వీరయ్య మనస్సు క్షోభించేది! చేతిలో పైసలు లేక మంచి డాక్టరుకు చూపించలేని అసహాయస్థితిలో మాయదారి రోగం వాళ్లయ్యని పొట్టనబెట్టుకున్నప్పుడు వీరయ్య అనుభవించిన గుండెకోత అవ్యక్తమైనది! తనని తన దారిద్ర్యాన్ని ఎప్పుడూ తిట్టుకునేవాడు!

"ఊరు పొమ్మంటుంది. కాడు రమ్మంటుంది!" అనే స్థితిలో వీరయ్య తల్లి కుక్కి మంచంలో మూలుగుతూ ఉండేది. దరిద్రానికి ఆకలెక్కువన్నట్లు "ఒసే రాములమ్మ.. గొంత గంజి నీళ్లు బొయ్యే ఆకలైతుందే." అని కోడలిని ప్రాధేయపడ్డప్పుడు, దీనమైన ఆ అరుపులు వీరయ్య హృదయాంతరాల్లో ఎన్నోవేల సూదులు గుచ్చుకున్నంత బాధకల్గేది.

వీరయ్య అభీష్టం మేరకు పెద్దకొడుకు చదువు కొనసాగిస్తున్నప్పటికీ అవి వానాకాలపు చదువులే అయినాయి. ఈ రోజుల్లో చదువు విజ్ఞానానికే తప్ప ఉపాధి లభించదని అలాంటి చదువును ప్రయివేటుగా చదువుకోడానికి ఎన్నో మార్గాలున్నాయని తెలుసుకొన్న వీరయ్య పెద్దబ్బాయి స్కూలు మానేశాడు. పొలంపనులకు తండ్రికి సాయంగా వెళుతుండేవాడు.

ఎండలు తీవ్రమయ్యాయి. వాగులు వంకలు ఎండిపోయాయి! బావులు అడుగంటి పోయాయి! బోరింగ్‌లు వట్టిపోయాయి! నీళ్లకోసం జీవులు కటకటలాడుతున్నాయి. పశు వులకు వేయడానికి మేతలేదు. వర్షాలు సరిగా కురియక చెలకల్లో మేత సరిగా ఎదుగలేదు! రైతుల చేతుల్లో పైసల్లేవు! తినడానికి సరిగా తిండి గింజల్లేవు! పైగా పశువుల పోషణ ఒకటి. తాను దూరడానికీ కంతలేదు! మెడకో గంగడోలు అన్నట్లుంది రైతు పరిస్థితి. దూడలను వదిలితే ఎండిపోయిన పొదుగులను కుమ్మి, కుమ్మి రక్తసిక్తం చేస్తున్నాయే తప్ప పాలు రావడంలేదు.

అకాల వర్షాలే తప్ప అసలు వర్షాలు లేవు. ఉత్తర తెలంగాణా అంతా నీటి ఎద్దడి! తాగునీరూ, సాగునీరూ రెండు కరువే! నేలంతా నెర్రెలతో నోరు తెరిచి నీటికొరకు ఆవురావు రంటోంది! కొన్ని జిల్లాల్లో ఆకలి చావులు! క్షామం రక్కసి కోరలు చాచింది! పశువులు

మేతలేక కోతకు వెళుతున్నాయి. ఆకలిని భక్షించడానికన్నట్లు నోరు! లోకాన్ని చూడ్డానికన్నట్లు ముఖానికి రెండు తూట్లు! రాల్చడానికి కళ్లల్లో నీళ్లు లేక ఎండిన ముఖాలు! అంటుకుపోయిన డొక్కలు! చెరుకుగడల్లాంటి మనుషులు చెరువు ఎండిన చేపల్లా గిలగిల్లాడుతున్నారు! క్షామం విలయతాండవం చేస్తోంది!

ఒకరోజు కైకిలి జేసి ఒక్క పూటయినా కలో, గంజో తాగుదామంటే చేయడానికి పని ఇచ్చే దాతనేలేడు! రెక్కాడితేగాని డొక్కాడని జీవాలు! రెక్కల కష్టం కొనేవాడులేడు! ఒకపూట తింటే రెండు పూటలా ఉపాసం!

నీటి సాగులేకుండా పంటలు పండించే రోజులు కావివి! వ్యవసాయం జూదమైంది! సమస్తశక్తులు ధారబోసి గింజవేసింది మొదలు పంట చేతికొచ్చేవరకు రైతు పెళ్లాం పిల్లలవైపు, తనవైపు చూసుకోడు. వీరయ్య దినాం ఆకాశం దిక్కు, మబ్బులదిక్కు జూస్తున్నాడు.

ప్రకృతి వైపరీత్యం రైతన్నను 'అన్నమో రామచంద్ర' అనేట్లు చేసింది! అడపాదడపా పడే వర్షాలతో దుక్కిపొతం. పెంట, నాట్లు, కలుపు.. రైతు ఇంత చేసినా పైర్లకోత సమయానికి తుఫాను, వడగండ్లు ఆ మాత్రం పంట ధాన్యాన్ని తుడుచుకుపోయేది! పేదోడి కడుపుకి కాసంత గంజినీళ్లు, సంకటి కారం కూడా దొరికేది కాదు!

అర్థరాత్రి దాటినా నేలలోంచి ఆవిర్లు వస్తున్నాయే తప్ప చల్లగాలి లేదు! జనం నోరెండిపోయి నీళ్లకోసం పరితపిస్తున్నారు! ఏ ఊరిలో చూసినా బోర్లించిన కుండలు, బిందెలు అస్తి పంజరాల్లా కనబడుతున్నాయి. కొన్నాళ్లుపోతే ఊళ్లన్నీ కుళ్లిపోయిన వాసన వేస్తాయేమో!

"అమ్మా అన్నంబెట్టవే ఆకలయితందీ" అంటూ సాయంకాలం పొలం నుండి వచ్చిన పెద్దోడు రాములమ్మను అడిగినపుడు ఖాళీ గిన్నెలతో ఎలా సమాధానం చెప్పాలో తెలియక సతమతమయ్యే ఆ తల్లి ఆవేదన అనూహ్యం! ఎన్నిమార్లు పస్తులున్నారో వాళ్లకే తెలియదు!

ఓ మారు సంపారం గడవని దుర్భర పరిస్థితుల్లో కూలికెళ్లిన రాములమ్మ రాత్రి తిండిలేక పనిలో సొమ్మసిల్లిపోతే కనీసం జాలైనా చూపకపోగా 'చాతగాని వాళ్లు కైకిలికి ఎందుకు రావాలె? పనంతా లుక్సానయ్యే" అని జమీందారు అన్నపుడు రాములమ్మ గుండె పిండినంత పనయింది!

రాములమ్మ ఆరోగ్యం బాగా దెబ్బతింది! శుష్కించిన శరీరం, పీక్కుపోయిన ముఖం, సరిగా తిండిలేక జబ్బుకు మందులేక నీరసంగా మూలుగుతూ మంచానపడి ఉంది! ఖల్లు, ఖల్లున వచ్చే దగ్గు తెరలు రాములమ్మను ఆయాసపెడుతున్నాయి.!

వీరయ్య రాములమ్మ మంచంమీద కూచొని విసనకర్ర విసురుతూ భార్య మొహంలోకి దిగాలుగా చూస్తున్నాడు! రాములమ్మ కళ్లనుండి నీళ్లు జలజల కారుతున్నాయి. చంటాడు పక్కలోనే పొరాడుతున్నాడు! "ఒరేయ్ పెద్దోడా మీ అయ్య ఒట్టి ఎడ్డిబాగులోడురా! రెక్కలు

ముక్కలు చేసుకునుడే తప్ప ఏం తెలియదు బిడ్డా! మీ అయ్యను, తమ్ముణ్ణి నీ చేతుల్ల పెదుతున్నా!" పక్కనున్న పెద్దకొడుకు, చేతిని తన చేతిలోకి తీసుకొంటూనే అంతిమ శ్వాస వదిలింది రాములమ్మ!

✡

రాములమ్మ మరణాన్ని వీరయ్య తట్టుకోలేకపోయాడు. పిల్లల సంగతి సరేసరి! బిడ్డల్ని ఎదపై పొదిమిపట్టుకొని సంసారాన్ని ఎలా వెళ్లదీయాలా అని ఆలోచిస్తున్నాడు! వీరయ్య సంసారం చుక్కానిలేని నావే అయింది! ఎన్ని కష్టాలొచ్చినా, ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లో నైనా తనకు అండగా నిల్చి ధైర్యం చెప్పిన రాములమ్మ ఈ రోజు తనతో లేదు! తన గుండె ధైర్యాన్నంతా రాములమ్మే తీసుకెళ్లిపోయింది. రాములమ్మ లేని ఒంటరితనాన్ని వీరయ్య భరించలేకపోతున్నాడు. తను చంటాడిని, ముసలితల్లిని పోషించడమెలా అని మదనపడు తున్నాడు. తల్లి మరణంతో పెద్దోడు పిచ్చోడిలా దిక్కులు చూస్తున్నాడు! వీరయ్యకు ప్రతి నిమిషం కన్నీటితోనే కరిగిపోసాగింది! అతను మానసికంగా ఎంతో కుంగిపోయాడు.

"అయ్యా నువ్వు రెక్కలు ముక్కలు జేసుకున్న తిండికి సాల్తలేదాయే! మన బిడ్డల్ని ఆకలికి సంపవడితిమి!" అన్న రాములమ్మ మాటలు వీరయ్య హృదయాంతరాల్లో పెను తుఫానులు సృష్టిస్తున్నాయి. ఇంకా ఆ మాటలు వీరయ్య చెవ్వుల్లో గింగురుమంటూనే వున్నాయి. జరిగినదంతా జ్ఞాపకాల పొరల్లోంచి తుడిచేయడానికి ప్రయత్నిస్తున్నాడు వీరయ్య.

జీవితం ఒక అద్భుతమైన అవకాశం! కాని ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో ఒక రైతు జీవితం అతిదారుణంగా వుంది! ఈ వ్యవస్థలో రైతన్న నడక నిప్పుల మీదే! పాదాల నిండా ముళ్లుగుచ్చుకున్నా, గోళ్లూడిపోయి రక్తం చిందుతున్నా విశ్రమించని ఆరాటం వీరయ్యది. కానీ ఇప్పటి వ్యవస్థలో వీరయ్య పరిస్థితి కాళ్లూ, చేతులు కట్టేసి ఎండలో తారురోడ్డుపై దొర్లిస్తూ కొరాడాలతో కొట్టినంత భయంకరంగా వుంది.

ఏమైనప్పటికి వీరయ్య ధైర్యం కూడగట్టుకుని వ్యవసాయానికి మళ్లీ నడుం బిగించాడు. అడపాదడపా పడే వర్షాలకు అనుకూలంగా తోటి రైతుల సలహాతో మరింత అప్పుతో పంట వేశాడు. బాగా లాభాలు సంపాదించొచ్చని, దానితో అప్పులన్నీ తీర్చేయొచ్చని ఆశపడ్డాడు. పత్తిపంట సరియైన దిగుబడినివ్వలేదు.

పత్తిసాగు విషయంలో రైతులకు ప్రభుత్వం శాస్త్రీయ శిక్షణ ఇవ్వలేదు! పెస్టిసైడ్స్ వుపయోగించడంలో వీరయ్య పెస్టిసైడ్స్ వ్యాపారస్తుల పైన ఆధారపడ్డాడే తప్ప ప్రభుత్వ పరంగా వ్యవసాయశాఖ నుండి ఎలాంటి శాస్త్రీయపరమైన సలహాలు అందలేదు! ఋణ సదుపాయం లభించలేదు! బ్యాంకుల ద్వారా అల్పవడ్డీకి ఋణ సదుపాయం లభించలేదు. పరిస్థితులు రైతన్నను నడ్డి విరగొట్టే వడ్డీ వ్యాపారస్తున్ని ఆశ్రయించేటట్టు చేస్తున్నాయి. పండిన

పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించలేకపోయింది. పాలకుల చర్యలు, స్టేట్‌మెంట్లు ఆకాశంలో భూతల స్వర్గాన్ని సృష్టిస్తున్నాయే తప్ప వీరయ్యకు ఒరిగిందేమీ లేదు! అన్నీ శుష్కప్రియాలు శూన్యహస్తాలే!

కమీషన్ల వ్యవస్థలో నాణ్యత లోపించిన క్రిమిసంహారక మందులు.. కల్తీ విత్తనాలు.. పైరు ఎదుగదు! పురుగుచావదు! పత్తి మొగ్గదొడగదు! పూవు పూయదు... చీడపట్టి క్షీణించిన పైర్లలాగే రైతుల బతుకులు చితికిపోతున్నాయి. కల్తీ వ్యవస్థ మోపుతున్న వుక్కుపాదం కింద వీరయ్య ఊపిరి సలుపక నలిగిపోతున్నాడు.

వీరయ్య పిచ్చివాడిలా చేనంతా తిరిగాడు. జుట్టంతా పీక్కున్నాడు. 'చాతి' అంతా బాదుకున్నాడు. అతని గుండెల్లో అగ్ని పర్వతాలు బద్దలవుతున్నాయి. వీరయ్య మనస్సంతా కోళ్లు కెళ్లగించిన పెంటకుప్పలా ఉంది. గుండలవిసే బాధ.

సాయంకాలానికి ఇల్లు చేరాడు వీరయ్య. శీరరంనిండా సంకెళ్లు వేసినంతగా మౌనం. మూగవాడిలా ఓ మూల కూర్చున్నాడు! పిల్లలు, ముసలితల్లి బిక్కు, బిక్కున చూస్తూ చాలసేపే ఉన్నారు. వాళ్లకు కునుకు ఎప్పుడు పట్టిందో తెలియదు.

ఎన్ని ఋతువులు మారినా వీరయ్య జీవితంలో ఏర్పడిన గాయాలు మానడం లేదు! కాలం పాదరసంలా జారి దారుణంగా గాయం చేసింది వీరయ్యని.

రంగులు ఒలికిపోయిన కాన్వాస్‌లా ఉంది రాత్రి. వీరయ్యకు రాత్రంతా దాహం వేస్తూనే ఉంది, ఆకాశాన్ని తాగేయాలంతగా. దాహమున్నవాడికి ఏ నదులు చాలవు. దరిద్ర నారాయణుడి దాహానికి ఒక జీవితం సరిపోదు. కాని అసలు నీళ్లే లేవు. పనిముట్లు చేసేవాడు, చితికిపోయినా అలసిపోకూడదు. లాంతరు పట్టుకుని ముందు నడిచేవాడు నిద్రపోకూడదు. వీరయ్యకు ఒంట్లో శక్తిలేదు. అతనికి నిద్రరావడం లేదు.

మట్టి తవ్వి చెమటతో గుండెను తోడి బీళ్లమీద వీరయ్య పచ్చని అందాల్ని అచ్చు పోయాలనుకున్నాడు. కాని క్షణక్షణం ఘర్షణ పడుతూ, గాయపడుతూ రక్తంతో తడిసిన మట్టిమీద అతనికి నమ్మకం పోయింది. కొలిమిలా రగులుతున్న బ్రతుకుమీద వీరయ్య నిరాశ చేసుకున్నాడు. తెల్లారింది. వీరయ్య ఇంట్లో లేడు. ఊరంతా గాలించారు. అతని బతుకే చేనులో తెల్లారింది. రాములమ్మ చెంతకు చేరిపోయాడు. చేతిలో పెస్టిసైడ్ డబ్బా. పురుగుమందు పెరుగన్నమయింది. పత్తిపువ్వు వీరయ్య పాలిటి మృత్యుపువ్వయింది.

✡

# చిల్లపెంకులు

**–పోలవరపు కోటేశ్వరరావు**

లంక వదిలేసి పెద్ద పడవలో నలుగురితో పాటు శ్రీకాకుళం చేరిన రాజయ్య పెళ్ళాన్ని తీసుకొని యేటికట్ట దిగుతున్నాడు.

భార్య అడిగింది. “మొన్న పాడిగేదె నమ్మిన డబ్బు తెచ్చావా?”

“నీకే ఇచ్చానుగా”

“నాకెక్కడిచ్చావ్. వాటిని కంటితో కూడా చూడనివ్వకుండా దాచుకున్నావుగా”. రాజయ్య నిలబడి భార్య వంక చూస్తూ “నీకివ్వ లేదా” అన్నాడు.

“నీకు చూపు తగ్గినట్టే గేపకం కూడా తగ్గింది”

రాజయ్య ఆలోచిస్తూ కట్టమీద నిలబడిపోయాడు. నిజమే. తాను జాగర్తగా దాచాడు. పెళ్ళానికి తెలవకుండా ఇంకా కొంత డబ్బు కలిపి మొత్తం భద్రపరచాడు. అతనికి గేపకం వచ్చింది.

ఒకమాటు యేటి వంక చూశాడు. నది ఆవేశంతో పరుగెడుతోంది. ఆకాశాన్నందుకోవాలా అంటోంది. సముద్రుడి గుండెల్లో చొరబడి పోవాలా అనుకుంటోంది.

రాజయ్య మనసు ఆందోళనగా వుంది. యీ నిండేరెలా దాటాలి? డబ్బెలా తెచ్చుకోవాలి? అతనికంతా అయోమయంగా వుంది.

యిప్పుడే వత్తా వుండు అని భార్యకి చెప్పి, పడవ దగ్గరకు వెళ్ళాడు.

“యేంటి తిరిగొచ్చావ్? ఏదైనా మరసి పోయావా?” పడవ యజమాని అడిగాడు.

“మరసిపోయా” రాజయ్య నీరసంగా సమాధానం చెప్పాడు.

“పడవలోకెక్కి సూసుకో” అతను రాజయ్య వంక చూస్తూ కూర్చున్నాడు.

“పడవలో కాదు” రాజయ్య నెమ్మదిగా సమాధానం చెప్పాడు.

"ఎక్కడ మరసిపోయావ్?"

"యింట్లో"

పడవ మనిషి మాట్లాడలేదు. తాటాకు దొన్నెతో పడవ కడిగిన నీళ్ళు తోడి పోస్తున్నాడు. రాజయ్య నిలబడే వున్నాడు. పడవ మనిషి తలెత్తి చూచి, "ఏం కావాలి? నుంచున్నావ్" అన్నాడు.

"పడవ కడితే లంక దాకా వెళ్ళొద్దాం"

"తెలివి గలాడివే! యెల్లెల్లు" అన్నాడు.

రాజయ్య ప్రక్కనే వున్న నావనాళ్ల నడిగాడు. వాళ్ళొప్పుకోలేదు.

డబ్బు రెట్టింపిస్తానన్నాడు. నావ మనిషి నవ్వి, "బతికుంటే బలుసాకు తినొచ్చు. పో పో పోవయ్యా" అని యిదిలించి కొట్టాడు.

"బాబ్బాబు. ఎంత కావాలంటే అంత యిత్తా" రాజయ్య ప్రాధేయపడ్డాడు.

"చెప్పేది నీక్కాదూ పిచ్చేమన్నా పట్టిందేంటి?" అతను కసురుకున్నాడు.

రాజయ్య ఉసూరంటూ ప్రవాహం వంక చూచాడు. ఆమె తన గొడవ వినేటట్టు లేదు. పలకరించినా మాట్టాడేటట్టు లేదు. లాభం లేదనుకొని భార్య దగ్గరకు తిరిగొచ్చాడు. ఇద్దరూ మాట్టాడకుండా కాకుళేశ్వరుని గుడి దగ్గరకొచ్చారు. గుడి దగ్గరలో ఎరిగిన వాళ్లున్నారు. వాళ్ళింటికెళ్ళి తెప్ప తెచ్చాడు.

భార్య అడిగింది ఈ యేళప్పుడు తెప్పెందుకని.

అతను సమాధానం చెప్పలేదు.

"ఏటికడ్డం పడతావా యేంటి? ఐనా నువ్వంత మొండాడివే" రవణమ్మ కోపంగా అంది.

రాజయ్య భార్య వంక చూచి "నువ్వెళ్ళు నేనిప్పుడే తిరిగొత్తా" అన్నాడు.

"నీకు నీళ్ళ పిచ్చి వదిలినట్టు లేదు"

"రా పోదాం" ఆమె చెయ్యి పట్టుకు బ్రతిమాలింది. రాజయ్య భార్య వంక చూచాడు. ఆమె కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

"పోతే పోయిందిలే పాడు డబ్బు కూలి చేసుకుని బతకొచ్చు రా పోదాం" ఆమె కళ్ళ వెంట బొట్లు, బొట్టుగా నీళ్లు జారుతున్నాయి.

రాజయ్య మాట్లాడలేదు. ప్రేమగా, జాలిగా ఆమె వంక చూచాడు.

"నాకేం భయం లేదు. తిరిగొత్తా. అందాకా మీ అన్నింట్లో వుండు" అని బయలుదేరాడు. భుజాన తెప్పట్టుకొని వెనక్కు చూడకుండా వెళ్తున్నాడు.

రమణమ్మ పమిటితో కన్నీళ్లు తుడుచుకుని, అలాగే నిలబడి భర్త వంక చూస్తోంది. రాజయ్య వురుకులు, పరుగుల మీద వెళ్తున్నాడు. చకచకా యేటి కట్ట ఎక్కాడు. ఎదురుగా సూరీడు కన్పిస్తున్నాడు.

పొద్దు చాలనట్టుంది అనుకున్నాడు.

ఏటికట్ట పొడవునా జనం వున్నారు. వాళ్ళ వంక చూడనన్నా లేదు. పరుగెత్తుతున్నట్టు నడుస్తున్నాడు. లంకపల్లి దాటాడు. అప్పారావు పేట దాటాడు. ఐనపూరు దగ్గరకొచ్చాడు. వూరు దాటి పైకి వెళ్ళాడు. గోచి పెట్టుకున్నాడు. కట్టుపంచె తలకు చుట్టుకున్నాడు. తెప్పని నీళ్ళల్లోకి వదిలాడు. బొడ్డులోతు వరకు వెళ్ళాడు. ప్రక్కన తుమ్మ చెట్టు నిండా ప్రాణభీతితో పాములు చుట్టుకొని వున్నాయి. వరదలో కొట్టుకొచ్చిన వాటికి నీటిని చూస్తే చచ్చిపోతామనే భయం పట్టుకుంది. కదలకుండా రాజయ్యను చూస్తూ వున్నాయి.

రాజయ్యకు యిదేమీ పట్టలేదు. మరి రెండడుగులు వేసి తెప్పని సరిచేసుకున్నాడు. వెనుక నుండి కరకట్టమీద కాపలావాడు పిలిచాడు. "ఏయ్! ఎవరొశా? పొద్దు గూకుతుంటే. నిండేటిలో దిగుతున్నావ్?"

రాజయ్య ఆ కేక వినిపించుకోలేదు.

"ఏయ్! నిన్నే. బతకాలని లేదా? ఏంటి?"

రాజయ్య సమాధానం చెప్పలేదు. కనీసం వెనుదిరిగి చూడనన్నా లేదు.

"వోరి, వోరి వోరేయ్! వోరి నీయమ్మ కడుపు కాలా! ఆగాగు దిగబోక" కాపలా వ్యక్తి పరుగెత్తుకొస్తున్నాడు.

రాజయ్య తలెత్తి నదిని కళ్ళారా చూచాడు. పరికించి చూచాడు. "అమ్మా! మా తల్లి! నేను నీ బిడ్డను. నన్ను కాపాడు తల్లీ!" అని అతను రెండు చేతులతో కృష్ణకు నమస్కరించాడు. ఎగిరి తెప్పమీద వాలాడు. ఊపుగా తెప్ప కదిలింది. ఏటికి ఎదురీదుతున్నాడు. వడికి అది వెనుకాడుతోంది. అలలు లేచి పడుతున్నాయి. ఊపుతో వచ్చి ముఖాన కొడుతున్నాయి. ఊపిరాడక ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. పట్టుదలగా తొడల మధ్య తెప్పను బెసగకుండా పట్టుకున్నాడు. సుడులున్నచోట తప్పుకుంటున్నాడు. కొట్టుకొచ్చే చెట్లు తగలకుండా చూచుకుంటున్నాడు. సూర్యుడు కిందకు దిగుతున్నాడు. ఆకాశమంతా ఎర్రబారింది. కృష్ణ నీరంతా రంగు పూసుకున్నట్టుంది. ఆ రంగు అందంగా వుంది. రాజయ్య తల కొంచెం పైకి లేపి చూచాడు. అంతా నీరే. ఒంద్రుతో పరుగెత్తుతున్న అద్భుతమైన నీరు. ఆగక పారుతున్న అందాల నీరు.

రాజయ్య బలమంతా కూడగట్టుకుని, చేతులతో నీటిని వెనుకకు నెడుతున్నాడు. దూరంగా ఈ ఊరు లంకలోని మర్రిచెట్టు నీడలా కన్పిస్తోంది. దాన్ని పోల్చుకున్నాడు. దానిని గురి చూచి ఈదుతున్నాడు. చీకటి పరచుకుంది. ఆకాశంలో చుక్కలు తొంగి చూస్తున్నాయి. ఎక్కడో ఒకటి రెండు దీపాలు మినుకు మినుకుమంటున్నాయి. రాజయ్య యీదీ, యీదీ అలిసిపోయాడు. అలాగే తెప్పపైన పడుకున్నాడు. అతని మనసంతా ఒకే ఆలోచనతో నిండి వుంది. తాను డబ్బు దాచిన చోటుకు వెళ్ళాలి. దాన్ని తెచ్చుకోవాలి. ప్రాణాలు పోయినా ఫరవాలేదు. ఆ సొమ్ము యేటిపాలైతే తాను బ్రతికున్నా, చచ్చినాడితో జమే. మిగతా కాలమంతా ఎవరో ఒకరిమీద ఆధారపడి బ్రతకాలి. వాళ్ళు పోసే కలో, గంజోతాగి బతకాలి. వయసు మళ్ళిపోతోంది. తాను పూర్వం మాదిరిగా పనిచేయలేడు. బ్రతికుండటమంటే మిగతా వాళ్ళకు బరువు. అతనికి ఆవేదనగా వుంది. ఏమైనా తాను దాచిన డబ్బు తెచ్చుకోవాలి. ఇంతకూ తన ఇల్లు వుందో? లేదో? కొట్టుకుపోతే, ఏం చేయాలి? తన ఇల్లు మెరక మీదే వుంది. ఈ వరస చూస్తే కిట్టమ్మ చూరందుకునేటట్లే వుంది. ఇల్లు కొట్టుకుపోకముందే అక్కడకు చేరాలి. దాచిన డబ్బు తెచ్చుకోవాలి. అతను నోటితో అనుకుంటున్నాడు. ఆ మాటకు లయగా చేతులు ఆడుతున్నాయి. తెప్ప ముందుకు దూసుకుపోతోంది.

అనుకోకుండా సుడిలో పడి గిరగిర తిరిగాడు. శక్తి కొలది ప్రయత్నించి బయట వలయంలో కొచ్చాడు. వాలుకు జారి మరలా ఈదుతున్నాడు. అతను అలసిపోతున్నాడు.

ఈ నది ఎంత శక్తి గలది? తనను పూజించే బిడ్డను, తల్లి కాపాడకుండా వుంటుందా? బిడ్డ మీద తల్లికి ప్రేమ లేకుండా వుంటుందా? మా తల్లి మంచిది. మా కృష్ణమ్మ చల్లనిది అనుకున్నాడు.

లంకచాటు వల్ల నీటివేగం తగ్గింది. ప్రధానమైన వడి దాటి బయట పడ్డాడు. మరో జాలు అతన్ని చింతలంక వైపు తీసుకు వెళ్ళింది. దాన్నుండి బయటపడి, లంక పైకి వెళ్ళాడు. లోతు తగ్గింది. తెప్ప బుజాన పెట్టుకుని ముందుకు నడిచాడు.

మోకాలు లోతు నీళ్ళలో నడుస్తున్నాడు. కాలెక్కడ పడుతుందో తెలియటం లేదు. చీకటిలో ముళ్ళ పొదలు గీచుకుంటున్నాయి. రక్కెన మట్టలు రాసుకుంటున్నాయి. చిల్లకొంప కోరళ్ళు అడ్డొస్తున్నాయి. అలాగే నెమ్మదిగా తూచి తూచి అడుగులు వేస్తున్నాడు. అంచనాలు వేసుకుంటూ నడుస్తున్నాడు. నెమ్మదిగా గూడెం వైపు వెళ్ళాడు. ఎదురుగా పూరిళ్ళు కన్పిస్తున్నాయి. మెరక వాలుగా వున్న ఇళ్ళు కొంత వరకు మెరుగ్గా వున్నాయి. గూడెంలో చాలా ఇళ్ళు నీళ్ళలో చూరు వరకు మునిగి వున్నాయి.

తూరుపుగా చంద్రోదయమవుతోంది. మసక మసకగా వున్నదంతా చక్కగా కన్పిస్తోంది. రాజయ్య ఇల్లు కొద్దిగా వొరిగి వుంది. నీళ్ళ మీద గొడుగు మాదిరిగా వుంది. ఇంటి దగ్గరకు వెళ్ళాడు. ఆ గొళ్ళెం తీసి, తలుపు తెరిచాడు. ఇంట్లో తొడ లోతు నీళ్ళున్నాయి. నిట్టాడిపైన

తలగడ పీట మీద భద్రంగా దాచిన బుడ్డిచెంబు తీశాడు. ఆప్యాయంగా పట్టుకున్నాడు. ప్రేమగా ముద్దెట్టుకున్నాడు. తన కష్టఫలం కళ్ళముందు మెరుస్తోంది. వార్ధక్యపు చాకిరి నుండి కాపాడే అక్షయపాత్రలా వుంది. తిప్పి తిప్పి దాన్ని చూచుకున్నాడు. ప్రేమగా పెదాలానించి, దొరికావు! తల్లీ! అనుకున్నాడు. నెమ్మదిగా దానిని తీసి చూచాడు. వెండి రూపాయలు మెరుస్తున్నాయి. జాగర్తగా పంచె చెంగున కట్టి తలమీద పెట్టుకున్నాడు. తలగుడ్డలో భద్రంగా దాచుకున్నాడు.

వచ్చిన పని పూర్తి అయింది. ఇప్పుడెక్కడికి వెళ్ళాలి? రాత్రి ఎలా గడపాలి, దిక్కు తోచటం లేదు. ఇంటికి గొళ్ళెం పెట్టి ముందున్న వేప చెట్టు వద్దకు వచ్చాడు. ఈ రాత్రి దీని మీద తెల్లార్చు కోవచ్చునుకున్నాడు. తెప్పను పెద్ద కొమ్మ మీద దాచాడు. తాను మరికొంచెం పైకి వెళ్ళి పంగల కొమ్మ సందులో కూర్చున్నాడు.

అతని మనసు ప్రశాంతంగా వుంది. తాను ప్రాణాన్ని వొడ్డి, నిండేటి మీద ఈదు కొచ్చినందుకు ఫలితం దక్కినది. బాగా అలసటగా వుంది. కడుపు కాలిపోతోంది. రెక్కలు పీకుతున్నాయి. కాళ్ళు లాగుతున్నాయి. నాని, నాని ఒళ్ళంతా బిగుసుకుపోతోంది. చలితో వ్రేళ్లు కొంకర్లు పోతున్నాయి. అతని వళ్ళంతా విరగ్గొట్టినట్టుంది.

రాజయ్య తడిగోచి తీసి కొమ్మకు కట్టాడు.

తలకు చుట్టిన కట్టుపంచె తీసి కప్పుకున్నాడు. కొంగున ఉన్న బుడ్డి చెంబు వొళ్ళో వుంచుకున్నాడు.

తూరుపుగా వేపకొమ్మల మధ్యగా సన్నంగా చందమామ కనపడుతున్నాడు. అతనికి భార్య గుర్తొచ్చింది. ఆమె బుగ్గల మీదగా జారిపోతున్న కన్నీటి బొట్లు కన్పించాయి. అతని మనసు కరిగిపోయింది. పిచ్చిది. నేనేట్లో మునిగి చచ్చిపోతాననుకుంది! అనుకోకుండా రెప్పలు వాలిపోయాయి.

ఆ రాత్రి ఎలా గడిచిపోయిందో? అలవాటు ప్రకారం తెల్లారకముందే మెలకువ వచ్చింది.

చుట్టూ చూచాడు. తన యిల్లు అలాగే వుంది. యేరు పెరగలేదు. కొంచెం కూడా తరగలేదు. ప్రవాహంలో మార్పు లేదు. కానీ రాజయ్యకు ఏదో మార్పు వున్నట్టుగా వుంది. ఏమిటా అని ఆలోచించాడు. అతనికి స్ఫురించింది. కాకులు కూయటం లేదు. అవి వూరొదిలి ఎగిరిపోయాయి. కోళ్ళు అరవటం లేదు. చావిళ్ళలో లేగదూడలు అంబా అని అల్లరి చేయటం లేదు. మనుషుల అలికిడి లేదు. కుక్కల అరుపుల్లేవు. కనీసం పిచికల కిసకిసలు కూడా లేవు.

అంతా ప్రశాంతంగా వున్నట్టుంది. ప్రవహించే నది చేస్తున్న గర్జన మాత్రం అడ్డు లేకుండా విన్పిస్తోంది. నీటిని చూస్తే వొళ్లు పొంగే రాజయ్యకు ఆ కష్టాల్లో కూడా అందాలు కన్పించాయి.

నీటి వంక ముచ్చటగా చూచాడు. ప్రేమగా చూచాడు. అర్చన చేస్తున్నట్టు చూచాడు. ఆనందంతో పులకించిపోతూ చూచాడు.

మా తల్లి కృష్ణమ్మ ఎంత అందమయిందీ! అనుకున్నాడు.

ఎక్కడ పుట్టిందో? ఏ దేశాల మధ్య పరుగులు తీస్తూ వస్తుందో.

యింత నీరు ఎలా పట్టుకొస్తుందో!

చెట్టు దిగి క్రింది నీళ్ళల్లో కాలు పెట్టాడు. నది ఊపులు, పరుగులు కన్పిస్తున్నాయి.

నది మీదుగా మెరుస్తున్న సూర్య కిరణాలు జిలుగులు చిమ్ముతున్నాయి. అలలతో అడుకుంటున్నాయి. అమ్మకు అన్నీ అందాలే అనుకున్నాడు.

ఈ పూట ఎలాగో శ్రీకాకుళం చేరాలి. ఇక్కడుంటే పేగులు మాడిపోతాయి. ఈ రోజన్నా ఏరు తగ్గితే ఎంత బాగుండు! తెప్ప నెత్తిమీద పెట్టుకుని, గోచి గుడ్డతో గ్రామంవైపు నడిచాడు.

నది దిగువకూ, ఎగువకూ చూస్తూ రక్కెన పొద ప్రక్క నిలచాడు. దగ్గరలోనే వూరుంది. దూరంగా దేవాలయం కన్పిస్తోంది. లంకలన్నిటినీ ముంచి ఆగక పారే నీరు, అందమైన ఎఱ్ఱనీరు అతన్ని ఆకర్షించింది. అనంత సాగరంవైపు తోసుకుంటూ వెళ్తున్నావా! అత్తవారింటిలో అడుగు పెట్టాలని పరుగులు తీస్తున్నావా! అతను కళ్ళు విచ్చుకుని చూస్తూ నిలచిపోయాడు. అతని మనసులో ఎన్నో వూహలు.

మా తల్లి శక్తికి ఎదురేముంది.

మా అమ్మ కోపాన్ని ఆపేదేముందీ?

ఆమె కరుణిస్తే అంతా బంగారమే.

ఆమె కోపిస్తే అంతా నాశనమే.

ఎదురుగా సూరేడు మునిగిపోతానని ఎగబాకుతున్నాడు. భయం పోయి కోపంతో మండిపోతున్నట్టున్నాడు.

పరధ్యానంగా వున్న రాజయ్యకు ఎవరో ఏడుస్తున్నట్లుంది. పసిపాప గొంతులా వుంది. రక్కిన పొదల మాటునుండి చాలా నెమ్మదిగా విన్పిస్తోంది.

రాజయ్య ఆశ్చర్యపోతూ అటువైపు వెళ్ళాడు. అతని కళ్ళు జిగేల్‌మన్నాయి. ఊయలమంచంలో పసిబిడ్డ ఏడుస్తోంది. పొత్తిళ్ళు తడిసి పోయాయి. వంటికున్న సన్నని గౌను నానిపోయింది. హీనస్వరంతో ఆ పసికందు తన బాధను చెప్పుకుంటున్నట్లుంది.

రాజయ్య ఊయలను దగ్గరకు లాగాడు. తెల్లగా ఏకులాగా వున్న పాపకు మూడు నెలలు దాటి వుండవు. నల్లని వెంట్రుకలు వత్తుగా వున్నాయి. ఆముదం పెట్టినందున జుట్టు అణిగివుంది. కళ్ళకాటుక కరిగి బుగ్గమీద చారికలు పడినాయి. పాలబుగ్గలు ముద్దొస్తున్నాయి.

పాప కళ్ళు మూసుకునే ఏడుస్తోంది. కాదు మూలుగుతోంది.

రాజయ్య తెప్పదింపి, నీళ్ళమీద వుంచాడు. కాళ్ళ సందున దాన్ని తొక్కి పట్టాడు. పాపను చేతుల్లోకి తీసుకుని నెమ్మదిగా ఆ పాప బుగ్గల మీద ముద్దెట్టుకున్నాడు. ముఖంలో ముఖం ఆనించి ఈ బంగారు బొమ్మను ఏ తల్లి కన్నదో అనుకున్నాడు.

పాప కళ్ళు తెరిచి చూచింది. ఒక్కమాటు కాళ్ళు, చేతులు ఆడిస్తూ ఏడ్చింది. తన శక్తినంతా కూడగట్టుకొని గొంతెత్తి, కేరుకేరునా ఏడ్చింది. ఆవురావురని ఏడ్చింది. ఆశగా ఏడ్చింది.

"ఇంకెందుకమ్మా భయం! నేనున్నానుగా" అన్నాడు రాజయ్య. ఆ మాటలకు పాప ఏడ్పుమాని చూచింది. పాపం! మనిషి గొంతు విని ఎంత సమయమయిందో!

రాజయ్య ప్రేమతో ఆ బిడ్డను గుండెల కత్తుకున్నాడు. తలకు చుట్టుకున్న కట్టుపంచెతీసి, పాపకు పొత్తిళ్లుగా వుంచాడు. తడిసిన గౌను తీసి ఊయలలో వేశాడు. ఒక చేత్తో బిడ్డను పొట్టకానించి పట్టుకున్నాడు. మరో చేత్తో తెప్పను, ఊయలను కలిపి, లాక్కుంటూ వెళ్ళాడు. దగ్గరలో వున్న సావిడిలో ఊయల మంచాన్ని ఎలిసె మీదకు చేర్చాడు. తెప్పను పాపని తీసుకుని వూళ్ళోకి బయలు దేరాడు.

పాపకు పాలు పట్టాలి. ఎలా సంపాదించాలి? రాజయ్యకు ఇదే ఆలోచన. అతనికి ఆకలి, అలసట గుర్తులేదు. ఆ సంగతులు మరవున పడినాయి. పాప ప్రాణాలను కాపాడాలనే బలమైన కోరికలో ఆలోచిస్తూ వూరిలో వచ్చాడు.

గ్రామంలో యిళ్ళన్నీ తాళాలు వేసి వున్నాయి. ఒక చోట చిన్న నావ వుంది. నిన్న పెద్ద పడవలో అంతా వెళ్ళిపోతూ, నావను వదలి వెళ్లారు. ఈ రోజు తిరిగి వచ్చి, నావతో యిళ్ళన్నీ చూచుకుంటారు. అందుకే దాన్ని చెట్టుకు కట్టేశారు.

రాజయ్య వెనకా ముందు ఆలోచించలేదు. తెప్ప నావలో వుంచాడు. పంచె పరచి పాపను నావలో పడుకోబెట్టాడు. కాళ్ళ బురద కడుక్కొని గోచీతో ప్రక్కనే కూర్చున్నాడు. తాడుముడి వూడదీసి, తెడ్డుతో నావని లోతు నీటిలోకి నెట్టాడు.

వడిలో పడి నావ వాలుకు పరుగెడుతోంది. తెడ్డును చుక్కానిగా వాడుతూ నావను కాపాడుకుంటున్నాడు. ఆ వడిలో నావ తలక్రిందులు కావచ్చు. సుడిలో పడి మునిగిపోవచ్చు. కాని, రాజయ్యకు ఆ ఆలోచనే లేదు. త్వరగా వడ్డు చేరాలి. పాపకు పాలు పట్టి బ్రతికించుకోవాలి. నావ గాజుల్లంక ప్రక్కగాబడి, పెద్దేరు మధ్యకు వచ్చింది. వడిలో నావ వరిగింది. అతి కష్టం మీద దాన్ని కాపాడుకున్నాడు. పైన ఎండ చిటచిట లాడుతోంది. పంచె నుండి ఒక పొర తీసి పాపపైన కప్పాడు. తను సూరేడుకు అడ్డుగా కూర్చుని, పాపకు నీడపట్టాడు.

నావ దూకుతూ పరుగెడుతోంది. ఎక్కడా పడవలూ, నావలూ కన్పించడం లేదు. చాలా దూరంగా తెరచాపలెత్తి, పెద్ద పడవ లంకల్లో జనాన్ని వడ్డుకు చేరుస్తోంది. పాప వినాశనం దాటి నావ పరుగులు తీస్తోంది. పడమటగా పోతార్లంకలోని మండువా లోగిళ్ళు గుటగులాడు తున్నాయి. ఎండకు అతని శరీరం కాలిపోతోంది. నీటి ఆవిరికి చెమటలు ధారలు కట్టాయి. గొంతుక ఎండిపోతోంది. నాలుక పిడస కట్టింది. వంద్రు నీరు తాగేందుకు వీలు లేకుండా వుంది. అరవై సంవత్సరాలు దాటిపోయిన అతని శరీరం నిన్నటి నుండి పడుతున్న శ్రమకు ఆపటిల్లి పోతోంది. అయినా ఆ ముదుసలి తన సర్వశక్తుల్నీ కూడలాక్కుని పాపను కాపాడాలని ప్రయత్నిస్తున్నాడు. తెడ్డుతో మాటి మాటికీ నావను సరిచేసుకుంటున్నాడు. తనకేమైనా ఫరవాలేదు. ఈ బిడ్డ బ్రతికి వడ్డు చేరితే చాలు.

తల్లీ కిట్టమ్మ తల్లీ! మాయమ్మ నీవే దిక్కు. నీవే దరి చేర్చాలి. ఈ బిడ్డ ఎప్పుడు పాలు తాగిందో, ఏమో! గొంతెండి పోయి, ఏడుపుకూడా రావటం లేదు. మాతల్లీ! ఈ పాపను కాపాడు. కావాలంటే నా ప్రాణం తీసుకో. నా ఊపిరి లాక్కో. నా ఆయుస్సు ఈ పాపకు పోయి. తల్లీ! నీకు మొక్కుతా, కోటి దండాలెడతా. ఈ పాపను కాపాడు. ఈ బిడ్డను కాపాడు. అతను ప్రార్థిస్తున్నాడు. అర్థిస్తున్నాడు. రెండు చేతులతో నమస్కరిస్తున్నాడు. కళ్ళు నీళ్ళతో నిండిపోతున్నాయి. ఆదుర్దాగా ముసుగుతీసి పాప ముక్కు ముందు వేలు పెట్టి చూచాడు. గాలి పీలుస్తోంది. డొక్కలు ఎగురుతున్నాయి. యింకొంచెం సేపట్లో నావ వడ్డు పడుతుంది. అతను తలెత్తి చూచాడు. వెలువోలు వెనకకు వెళ్ళిపోయింది. కరకట్ట దగ్గరగా వుంది. వడిలేని నీటిలో తెడ్డాడిస్తూ, వెళ్తున్నాడు.

నావ నిమ్మగడ్డ తిన్నగా వడ్డు చేరింది.

వడ్డు మీదున్న వలెంటీర్లు దగ్గరకొచ్చి వివరాలడిగారు. రాజయ్య ఏమీ చెప్పలేదు. నావను చెట్టుకు కట్టేశాడు. పొత్తిళ్ళలో పాపను పొదిమి పట్టుకున్నాడు. రొమ్ముకానించి, హత్తుకున్నాడు. పాప ముఖాన్ని పరిశీలనగా చూచి, ధైర్యం తెచ్చుకున్నాడు. గోచీతోనే పరుగు పరుగున యేటికట్ట యెక్కాడు. అడుగుసాచి అంగవేస్తున్నాడు. ఆగకుండా పరుగు తీస్తూనే వున్నాడు. ఏటి కట్టమీద జనం ఆశ్చర్యంతో చూస్తున్నారు. కాని, ఎవరికీ ఏమీ అంతు పట్టటం లేదు. ఏదేదో అడుగుతున్నారు. రాజయ్యకు ఏమాటా విన్పించటం లేదు. రొప్పుతూ గూడెం చేరాడు. తనకు బాగా తెలిసిన వాళ్ళ యింటికి వెళ్ళాడు. వాకిటి ముందు నిలబడ్డాడు.

పాకలో నుండి ఒక స్త్రీ బయటికి వచ్చింది. ఎగా దిగా చూస్తూ "ఏం కావాలి?" అని అడిగింది.

"నేను రాజయ్యనమ్మా!" అన్నాడు.

ఆమె గుర్తుపట్టింది. "ఏం కావాలన్నా?" అని అడిగింది.

"పాలు, పాలు కావాలి" అతనికి మాట పెగలటం లేదు. ఆయాసం వస్తోంది.

"మాకు పాడి లేదన్నా"

"పాడికాదమ్మా! ఈ బిడ్డకు పాలు కావాలి. పాలు. నీవు ఈ బిడ్డకు చనుబాలివ్వాలమ్మా!"

ఆమె ఆశ్చర్యపోయింది. "నా బిడ్డకే చాలటం లేదన్నా" అంది.

"తప్పదమ్మా! నీకు దణ్ణం పెడతా. నీవేమీ అనుకోవద్దు. చచ్చి నీ కడుపున పుడతా. చెల్లెమ్మా! ఈ పాపకు పాలివ్వమ్మా!"

అతని కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. గొంతు పొడారి పోతోంది. మాట పెగలటం లేదు.

"నువ్వు లోపలికొచ్చి కూర్చో అన్నా, బయట ఎండ మండిపోతోంది" ఆమె మంచం వాల్చింది.

రాజయ్య ఎండిపోతున్న పెదాలను నాలికతో తడుపుకుంటూ తన చేతుల్లో వున్న పాపను ఒక మాటు చూచుకున్నాడు. ఓపిక చాలక ఆ బిడ్డ ఏడవటం లేదు. పెదాలు ఎండి నల్లబడ్డాయి. ముఖం వడలిపోయింది. బుగ్గలు కమిలి పోయాయి.

రాజయ్య కళ్ళ వెంట బొట బొట బొట్లు కారాయి. అవి ధారకట్టి పాప ముఖాన పడ్డాయి. పాప కళ్ళు తెరచి చూచి కీసురుగా ఏడ్చింది.

"చెల్లెమ్మా! త్వరగా యివ్వమ్మా! ఆలస్యమైతే ఏమైనా జరగొచ్చు" అన్నాడు. దుఃఖంతో అతని గొంతు పూడిపోయింది.

ఆమె పసిబిడ్డను అందుకుంది.

"ఎవరి బిడ్డో, ఏమో! ఏట్లో కొట్టుకొచ్చింది, గొంతు ఎండిపోయినట్టుంది. ఏడవలేకపోతోంది. డొక్కలంటుకు పోయాయి. కాలూ, చేయీ కదిలించలేకపోతోంది" అతను కన్నీళ్ళు తుడుచుకుంటూ చెపుతున్నాడు. తన బాధనంతా వెల్లబోసుకుంటున్నాడు.

ఆమె ప్రక్కకు తిరిగింది. రొమ్ము నోటికందించింది. పాప పాలు త్రాగలేదు. ఆమె రొమ్ము నొక్కి, ఆధార పాప నోట్లో పడేటట్లు చేసింది. ఆ తడికి పాప పెదవులు కదిలాయి. నెమ్మదిగా చప్పరించింది. గుటక వేసింది. పొలమారింది. దగ్గుతూ కళ్ళు తెరచి చూచింది. ఒకమారు ఏడ్చి మరల పాలు త్రాగుతోంది. కాళ్ళూ, చేతులూ కదిలిస్తూ, ఆవురావురున తాగుతోంది. చేత్తో ఆమె రవిక పట్టుకోబోతోంది.

పాలిస్తూ ఆమె ముద్దెట్టుకుంది.

ఏం జరుగుతోందో తెలియక రాజయ్య ఆదుర్దాగా అడిగాడు "పాప పాలు తాగుతోందా?"

“యిప్పుడు చప్పిడిస్తోంది” ఆమె తృప్తిగా సమాధానం చెప్పింది.

రాజయ్య కళ్లు ఈ మాటు ఆనందంతో తడిశాయి.

“పాప నిద్దరోతోంది” ఆమె చెప్పింది.

రాజయ్యకు మనసు కుదుట పడింది. అప్పుడు చూచుకున్నాడు తన వాలకాన్ని. గోచీతో అలా నిలచినందుకు సిగ్గేసింది. అక్కడు పడిపోయిన తన పంచె తీసి చుట్టుకున్నాడు.

పాపను మంచం మీద పడుకోబెట్టి, ఆమె గుడ్డ కప్పింది.

“చెల్లెమ్మా! మంచినీళ్ళు కావాలమ్మా!” అతను అడిగాడు. అప్పటికి గాని అతనికి దాహం సంగతి గుర్తు రాలేదు.

ఆమె అందించిన గ్లాసు తీసుకొని గటగట త్రాగాడు. ఎండిపోయిన గొంతు వలన పొలమారింది. అతను చేత్తో మాడుమీద కొట్టుకున్నాడు.

“నెమ్మదిగా తాగన్నా” ఆమె చెప్పింది.

రాజయ్య పొట్ట నిండా మంచినీళ్ళు తాగాడు. ఆమె ఆముదం తెచ్చి పాప మాడుకు పెడుతుంటే చూస్తూ నిలబడ్డాడు.

“నేనిప్పుడే వత్తా. అందాకా పాపను చూత్తూ వుండమ్మా!” అతను బయలుదేర బోయాడు. ఆమె వెళ్ళవద్దన్నది. “అన్నం పెడతా. తినెల్లన్నా” అంది. అతను “పాపను చూస్తూ వుండు ఇప్పుడే వస్తా” అన్నాడు. “మా వదిన ఇక్కడికే వచ్చింది. కొంచెం సేపట్లో వస్తానని, ఏటి దగ్గరకెళ్ళింది. నీ జాడ తెలియలేదని ఖంగారుగా వుంది” అంది.

రాజయ్యకు భార్య సంగతి గుర్తొచ్చింది.

ఆమె పళ్ళెంలో అన్నం పెట్టింది. రాజయ్య తినలేక పోయాడు. ఎండిపోయి, అలసిపోయిన పేగులు అతని మాట వినలేదు. చెయ్యి కడిగి పాప మంచం దగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

ఇంట్లో చాప మీద ఆమె కొడుకు నిదరబోతున్నాడు.

రాజయ్యకు వళ్లంతా నీరసం ముంచుకొస్తోంది. నిలబడటమే కష్టంగా వుంది.

పడుకోవాలని వుంది. కాని ప్రాణం వప్పటం లేదు. పాప మంచానికి ఆనుకుని కూర్చున్నాడు.

పాప హాయిగా నిదరబోతోంది. రాజయ్యకు కళ్ళు మూసుకుపోతున్నాయి. పాప వంక చూచి, ‘ఈ బిడ్డ ఎంత చక్కని బిడ్డ! కృష్ణమ్మలా ఎంత అందంగా వుంది!’ అనుకున్నాడు.

రమణమ్మ ఏటి కట్టమీద నిలబడి రాజయ్య కొరకు వాకబు చేసింది. అతన్ని గూర్చి ఏమీ తెలియలేదు. ఏట్లో మునిగిపోయి వుంటాడని దిగులు పడి, కాళ్ళీడ్చుకుంటూ వచ్చింది.

రాజయ్యను చూచేసరికి ఆమెకు ప్రాణం లేచొచ్చింది. ఎదురుగా వచ్చి భర్త ముఖంలోకి పరిశీలనగా చూచింది. ఆ కళల్లో నీరసం కనిపెట్టింది. "ఆ బుగ్గ మీద చారికలేంటి" అని అడిగింది.

రాజయ్య మాట్లాడలేదు.

"నిన్నటి నుండి ఏమీ తినలేదా?"

రాజయ్య సమాధానం చెప్పలేదు.

భర్త ప్రక్కనే చతికిలబడి, "డబ్బు దొరికిందా?" అంది.

రాజయ్యకప్పుడు గుర్తొచ్చింది. మబ్బు విడిపోయినట్టయింది. రొంటిని వెతుక్కున్నాడు. పంచంతా తడుముకున్నాడు. బుడ్డి చెంబు తగల్లేదు.

"దొరకలేదా?" ఆమె ఆదుర్దాగా అడిగింది.

అతను ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"... చెప్పవేమయ్యా? నేనను కుంటూనే వున్నా. నీకు నీళ్ళ పిచ్చి. అందుకే ఏదో వంకెట్టుకుని, ఆ నిండేట్లో ఈదటానికెళ్ళావు" ఆమె కఠినంగా మాట్లాడింది.

రాజయ్య ఆమె ముఖాన్ని పరిశీలనగా చూచి, పకపకా నవ్వాడు. పగలబడి నవ్వాడు. పొట్టపట్టుకు మెలికలు తిరిగిపోతూ నవ్వాడు.

రమణమ్మ రుసరుసలాడుతూ "నా మాటలంటేనే నీకు నవ్వులాటగా వుంటుంది. నా చేతలు కనిపించవు" అంది.

అతను నవ్వుతూనే వున్నాడు. ఆనంద బాష్పాలను చేత్తో తుడుచుకుంటూనే వున్నాడు.

"యింతకూ దొరికిందా? లేదా?" ఆమె నిలదీసి అడిగింది.

నవ్వాపిన రాజయ్య, భార్య వంక ప్రశాంతంగా చూచాడు. మంచం మీద నిద్రపోతున్న పాప కళ్ళ వంక చూచాడు. నెమ్మదిగా చెప్పాడు.

"దొరికింది. చిల్లపెంకు పోయి, సీతామాలచ్చిమి దొరికింది".

✡

# బతుకు

**–అరుణ**

పండిన వరి చేను ఒరిగి పోయింది. గట్టు మీద అంబిరాజు కూలీలను చేలోకి తొందరగా వెళ్ళమని గోల చేస్తున్నాడు. పాయకు ఐదుగురు చొప్పున మునుము పట్టారు. కోత కోసి చేతికి మించిన పనలు ఓదెలు వేస్తున్నారు. రాజనాలు పండింది చేను. వరి ఓదెలు గుట్టలు గుట్టలుగా పడిపోతున్నాయి. జనం అంతా కోస్తుంటే ఒకే మిషను అనేక కొడవళ్ళతో కోస్తున్నట్టుగా వుంది. కక్కుల కొడవళ్ళతో కోసేటప్పుడు, పనలు పడవేసే టప్పుడు చప్పుళ్ళు వినబడుతున్నాయి. ఎండ చురచుర మంటోంది. మంచు పూర్తిగా విడిపోయింది. ఆ సంవత్సరానికి కోత పట్టటం అదే మొదటి రోజు. బతకమ్మకు నడుం నొప్పిగా వుండి కాసేపు నిలబడింది. కళ్ళు చికిలించి పైవంక చూసింది. ఆకాశం నోరిప్పుకుని ఆవిలించినట్టుగా వుంది.

గట్టుమీద కూర్చున్న అంబిరాజు “కొయ్యండి! కొయ్యండి!” అంటూ తొందర చేస్తున్నాడు. బతకమ్మ మళ్ళా వంగింది. ఎక్కడ నల్గొండ జిల్లా, ఎక్కడ కృష్ణా జిల్లా. కోతలు కోసుకుని నాలుగురాళ్ళు వెనకవేసుకుందామని పొలోమంటూ వచ్చారు కూలీలు. ఏయేటి కాయేడు కొత్తగా వుంటుంది. చాలా ‘కుశాలు’గా వుంది బతకమ్మ.

“పిన్నామా! ఒక పాట పాడతావా” తన పక్కనే మునుము పట్టింది పిన్నామ.

“ఏం పాట పాడనే బతకమ్మా?”

“ఏదో ఒకటి”

పంట చేలో గొంతు ఖంగుమంటూ పాట అందుకుంది పిన్నామ. ముందు ఆమె పాడుతుంటే అందరూ అందుకుని పాడుతున్నారు.

“ఏయ్! పాటలేనా? మునుము సాగేదుందా?” అంటూ కేక పెట్టాడు గట్టుమీద కామందు.

“బెమిసి బామ్మణ్ణి కోరితే మంగలారం అన్నడంట” కిలకిలా నవ్వింది బతకమ్మ. అక్కడున్నోళ్ళంతా పకపక లాడారు.

"ఏమిటా హాస్యాలు" అన్నాడు గట్టు మీద.

"అదేంటి పిన్నామా, గిట్ట కస్సుబుస్సుమంటున్నడు" మొహం చిట్లిస్తూ అంది బతకమ్మ.

"ఏంటి తెలుత్తుది, గట్టు మీదకి గుండిగలు, గుండిగలు కాపీలు తెచ్చుకు తాగుతుంటే? పొద్దొడవక ముందొచ్చి, పొద్దోటారాగా కోతకోసి ఇంటికెల్తె తెలుత్తుది అయ్యగారి పని" అంది పిన్నామ మూతి విరుస్తూ.

మధ్యలో తలెత్తి పైకి చూసింది బతకమ్మ. పిట్టలు పంగల కఱ్ఱలాగ ఎగురురుకుంటూ పోతున్నాయి. పైనుంచి చూస్తున్న సూర్యుడు వాళ్ళ కష్టానికి తను ఏం సాయం చెయ్యకుండా సోమరిగా కూచున్నందుకు సిగ్గేసి ఎఱ్ఱబడి పోతున్నాడు. సఱ్ఱుమనే ఎండకి మధ్య మధ్య గొడుగు పట్టినట్టు తెరలేసిన మబ్బులు కూడా కొడవలి తెగి రక్తం కొల్లలయినట్లు ఎఱ్ఱబడి పోతున్నాయి. ఆకాశం మీద నుంచి గట్టు మీదకు దృష్టి సారించింది బతకమ్మ. అంబిరాజు తన వంకే గుచ్చి గుచ్చి చూస్తున్నాడు. ఒక్కసారి గుండెలు గుబగుబ లాడినయి. చటుక్కున తల తిప్పుకుంది.

"అయినా ఇదేంటి వొళ్లు తడిమినట్టు ఆబగా చూస్తున్నడు సచ్చినోడు. పెద్దాళ్లకి కూడా చిన్న బుద్దులే. పెండ్లాలున్న సచ్చినోళ్ళకి కూడా ఏం తెగులో" అంటూ గొణుక్కుంది.

"ఏంటి బతకమ్మా! నీలో నువ్వే సణిగేసుకుంటున్నవు" అంది పిన్నామ.

"ఏం లేదులే" అంటూ మాట తప్పించటం కోసం "ఏంఱ్ఱా చిన్నయ్యా! పొద్దుటేలనించి వులుకు, పలుకు లేకుండా వున్నవేంటి" అంది పక్కనున్న కుంటెంకన్నతో.

"ఆడేం పలుకుతడు, డబ్బు పోయిందే అని ఆడేడుత్తుంటే" అంది పిన్నామ బాధగా.

"మా చెమట మెతుకులు కతకేటోడే పెతినా కొడుకు" కోపంగా కుంటెంకన్న.

"ఊరుకోరా కుంటెంకన్న బగవంతుడు మన కట్టా రాసి పెట్టిండు" అంది పిన్నామ.

బతకమ్మ ఆలోచన నిన్నటి రోజు మీదకు పోయింది. బెజవాడ స్టేషనులో కుంటెంకడి డబ్బు ఎవరో జేబుదొంగ కొట్టెయ్యడం, వాడు ఏడవటం గుర్తుకొచ్చింది. ఆ తర్వాత ఈ దొర వాళ్ళ ముఠాను మాట్లాడుకోవటం, పొలోమంటూ నెత్తిమీద ఈత చాపలు, కిరసనాయిల చెక్కతో చేసిన కావడి పెట్టెలు, గోతాం మూటలతో రైలెక్కటం గుర్తుకొచ్చింది.

కోతలకి కూలీలు రావటం మూలంగా రైలు బండిలో మంచి ఒత్తిడిగా వుంది. ఎట్టాగయి తేనేం ముఠా అంతా ఒక పెట్టెలోనే ఎక్కారు. ఇసకేస్తే రాలకుండా వుంది. బతకమ్మకి ఊపిరాడకుండా వుంది. ఇంతలో ఎవరో కాలు దొక్కినట్టుగా వుంది. మరి ఇంత ఇరుకులో కాళ్ళు తొక్కకుండా వుంటారా అని సరిపెట్టుకుంది. ఇంకా తొక్కినట్టుగా వుంది. కావాలని

తొక్కినట్టుగా వుంది పరకాయించి చూస్తే ఆ తొక్కుతున్న వాడు ఎవడో కాదు. ఈ ముఠాని మాట్లాడుకున్న దొరే. ఈ అంబిరాజు సచ్చినోడే. తను తలెత్తగానే తన వంక చూసి నవ్వుతున్నాడు దొంగ సచ్చినోడు. ఆ వూళ్లో దిగారు. అంబిరాజు గారి పెంకుటి చావిడిలో బస ఆ ముఠాకి. అంబిరాజు బియ్యం కొలిచాడు అందరికీ. ఆడవాళ్ళంతా దగ్గరలో వున్న ఓ కొట్టు దగ్గిర కెళ్ళారు చిల్లర ఖర్చు తెచ్చుకోటానికి.

పది పైసలకి మిరబగాయలు యివ్వమంది బతకమ్మ.

"ఏ దేశం నుంచొచ్చావు" అన్నాడు దుకాణదారు.

"మాది నల్గొండ దొరా" అంది పిన్నామ.

"అట్టా చెప్పు. పదిపైసలకి మిరబగాయలిచ్చే తలకి మాసినోడెవడు? కిలో 16 రూపాయల మ్ముతుంటే!"

"పదహారు రూపాయలే" అంది బతకమ్మ నోరు వెళ్ళబెట్టి.

సరుకులన్నీ తీసుకుని బయటకొస్తూ "పిన్నామ! మన కాడ కిలో ఆరు రూపాయలకి కొని మనకే పదహారు రూపాయల కమ్ముతున్నారు" అంది బతకమ్మ.

"మరేంటి. మన కష్టం అంతా దళారీ సచ్చినోళ్ళు గిట్టతిని కాదే పెరిగిపోతున్నరు" అంది పిన్నామ.

ఆ రోజు చింతపండు, ఉప్పు, మిరబగాయలు రోట్లో తొక్కుకుని, ఆ తొక్కుతోనే తిన్నారు. చల్లయినా లేదు. ఆ రాత్రికి చావిట్లోనే పడుకున్నారు.

పొద్దున దొరసాని దగ్గర నీళ్ళలాంటి చల్ల ఓ పది  పైసలకి కొనుక్కున్నారు. బూజు పట్టటానికి సిద్ధంగా వున్న పాత చింతకాయ పచ్చడి కొనుక్కున్నారు. సారాకుల్లో పెట్టింది దొరసాని. అట్లా ఆలోచిస్తూనే కోత కోస్తోంది బతకమ్మ.

మునుం చివర కొచ్చేశారు. సూర్యుడు పగలల్లా తను కాపున్న గొర్రెల్ని తోడేళ్ల మేతకి వదిలేస్తున్నట్టుగా దిగులుగా, బాధగా, భారంగా వెళ్ళిపోతున్నాడు. మునుం ముగించి గట్టు ఎక్కబోయి చటుక్కున ఆగిపోయింది బతకమ్మ. ఈ అంబిరాజు దొర కొరుక్కు తినేద్దామని చూస్తున్నాడు. "అయినా ఆడివల్ల ఏమవుతుందిలే ఆబగా చూడటం తప్ప అదుష్టాలు, ముదనష్టాలు ఈళ్ళకే కలిసొస్తంటే ఎక్కడా ఒళ్ళు తెలీయటల్లేదు" అనుకుంటూ గట్టెక్కి పక్కగా తప్పుకుని వెళ్ళిపోయింది.

గట్టు మీద నడుస్తున్న అంబిరాజుని వెనుక నుంచి "చేను ఎంత వరకయిందిరా" అంటూ పిలిచాడు అంబిరాజు స్నేహితుడు చిన్ని. ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు.

“ఏరా అంబిరాజు! ఈ యేడు కూడా ఏమైనా ఛాన్సు తగిలిందటరా” అన్నాడు చిన్ని.

“ఇంకా లేదురా. కాని ఒక ఛాన్సు తగలొచ్చు” అన్నాడు నవ్వుతూ అంబిరాజు.

“ఏదీ చూద్దాం పద పిట్టని. మంచి బిగువుగా వుందా” అన్నాడు కొంటెగా.

“ఆళ్ళ దగ్గర బిగువు లేకపోతే నీ పెళ్ళాం దగ్గిరా, నా పెళ్ళాం దగ్గిరా ఏముందిరా” అన్నాడు అంబిరాజు. పకపకా నవ్వుకున్నారు వాళ్ళ హాస్యానికి వాళ్లే.

‘నాక్కూడ చూపించరోయి! ఒక్కడివే కొట్టేద్దామనుకున్నావేమో’ అన్నాడు చిన్ని.

“దొరకనీయరా ఎదవా ముందు” ఏదో పని వున్నట్టు ఇద్దరూ చావిడి దగ్గిరి కెళ్ళారు.

‘అదుగోరా! ఆ పక్కరోటి దగ్గర’.

“అబ్బ ఏం బావుందిరా కజ్జింలాగ నోరూరుతాంది”

‘మంచి చమత్కారిరోయ్’ అన్నాడు అంబిరాజు.

వరి గడ్డి మంటల్లో అన్నాలు తింటున్నారు కూలి జనం. చలిగాలి కొరుక్కుతింటూ వుంది. ప్రజల కష్టం మీద బతికే పైలా పచ్చీసు ఎదవలాగా చిరునవ్వులు చిందిస్తో వెలిగి పోతున్నాడు చంద్రుడు. దొంగ చూపులూ వాడూనూ. డబ్బు కొట్టేసిన సంగతి గుర్తు కొచ్చిందేమో నీ యమ్మ, నీ యాలి అంటున్నాడు కుంటెంకన్న. ఊరకుక్కలు కయ్యోమని వాటి సొమ్మంతా పోయినట్టు ఏడుస్తున్నాయి. వెన్నెల చూచి తెల్లారిందనుకున్నాయేమో పిట్టలు కీచుకీచు మంటున్నాయి. పక్కింట్లో ఓ ముసలిది ఖంగు ఖంగున దగ్గుతోంది.

దొర కొంత మందిని వాళ్ళింటి ఉత్తరపు వైపు వసారాలో పండుకోమన్నాడు. చావిట్లో ఖాళీ లేకపోతే, బతకమ్మ, కొమరయ్య కుంటెంకడు, వాడి పిల్లలు తల చెడిన పిన్నామ అక్కడి కెళ్ళారు ఈతచాపలు పట్టుకుని. కొంతమంది గోతాల్లో కాళ్ళు దూర్చుకుని పండుకున్నారు. కుంటెంకడు వాడి పిల్లల్ని వరసగా పడుకోబెట్టి చిరుగుల దుప్పటి కప్పి పైన పల్చగా గడ్డి పరిచాడు. ఆ పిల్లలకి తల్లి లేదు. అందరూ నిద్రలకి పడ్డారు. కొమరయ్య నెమ్మదిగా బతకమ్మ పక్కకి దొర్లాడు. ఒకే దుప్పటి కింద మాటా పలుకు లేకుండా పండుకున్నారు. వాళ్ళకి ప్రైవసీ ఎక్కడి నుంచి వస్తుంది? పొద్దోయిన తర్వాత కొమరయ్య దొర్లి విడిగా పడుకున్నాడు.

తెల్లవారు ఝాము అవుతావుంది. ఇంకా కోడి కుయ్యలేదు. ఎవరో తన ఎదురు రొమ్ము న చెయ్యేసి కుదపటంతో తుళ్ళిపడి కళ్ళు తెరిచింది బతకమ్మ. తన మొగుడు కాదు. ఎవరో ముసుగేసుకుని తన మీదకే వంగి వున్నాడు. ఇంకెవడు ఆ సచ్చినోడే. అరవాలి. అరవాలి. నోరు పెగిలి చావటం లేదు.

నోరు పెగుల్చుకుని అమ్మో, దొంగ, దొంగ అని అరిచింది. కొమరయ్య ఒక్క దూకులో లేచి పట్టుకున్నాడు దొంగని. పిన్నామ లేచింది. బతకమ్మ లేచింది. కుంటెంకడు లేచాడు.

ఎగాదిగా చూసిన పిన్నామ చటుక్కున స్పృహ తెలిసిన దానిలాగా 'హొదత్రా దొర' అంది.

తనకు తెలియకుండానే కొమరయ్య చేతులు సళ్ళిచ్చినయి. ఒక్క దూకులో పారిపోయాడు దొంగ.

ఈ అరుపులికి చావిట్లో వాళ్ళు లేచి ఆలగోలు బాలగోలుగా, అరవటం మొదలెట్టారు. పిల్లలు లేచి ఏడుపు లంకించుకున్నారు. అందరూ "ఏడి దొంగ, ఎటు పోయిండు" అంటూ ఆరాలడుగుతున్నారు.

"ఏం లేదు లేరా బతకమ్మ నిద్దట్లో జడుసుకుని అరిచిందనుకుంట" అన్నాడు కుంటెంకడు. అంతా మళ్ళీ సద్దుకున్నారు. కొంతమంది లేచి వరిగడ్డితో చలిమంట లేసుకుంటున్నారు. పిన్నామ కూడా చలిమంట దగ్గరకెళ్ళింది.

"అప్పా, నువు దగ్గిర్నే వున్నవుగందే ఏం జరిగింది?"

"నాకు మాత్రం ఏం తెలుసు" అంది చేతులు మంటకు వెచ్చబెడుతూ.

"దొంగే నంటవా, అప్పా, దొంగకి మనకాడ ఏం దొరుకుద్దే?"

"దొంగా లేదు, ఏం లేదు. పొద్దుటే అసుంటి మాటలు చెప్పుకుంటే పాపం"

"సెగలేందే పొగ ఎట్లొస్తది" అంది ఇంకో ఆడకూతురు.

"మన బంగారం మంచిదయితే కంసలయ్యేం చేస్తడు" మరొకడు.

"అయినా మనకెందుకు, ఏ కట్టెని నిప్పంటే ఆ కట్టే కాలిపోద్ది" అంది పిన్నామ.

ఈ మాటలన్నీ బతకమ్మ వింటూనే వుంది పండుకుని. కొమరయ్య ఉలుకూ, పలుకూ లేకుండా పండుకోవటం చూసి బతకమ్మ గుండెల్లో చలిమంట లేసినట్టుగా వుంది.

తెల్లారింది. కొమరయ్య తనతో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పనులన్నీ మాటా పలుకు లేకుండానే కానిచ్చింది.

"ఇదిగో, అణ్ణానికి రా" అంది. వినిపించుకోనట్టుగా వున్నాడు కొమరయ్య. అన్నం గిన్నెలో పెట్టి మళ్ళీ పిలిచింది. తల వంచుకుని అన్నం ముందు కూర్చుని ఏదో తిన్నానిపించి లేచిపోయాడు. తన వంక ఒక్కసారి కూడా తలెత్తి చూడలేదు. మనస్సు గిలగిల లాడిపోయింది. కళ్ళల్లో నీరు చిమ్మింది. అన్నం మూటలు కట్టుకొని కోతకి బయల్దేరారు. తనతో ఎవరూ అరిడిసి మాట్లాడటం లేదు.

"పిన్నామా" అని పిల్చింది.

"ఏందమ్మా రాశికాలు" అని ముఖం తిప్పుకొని మూతి మూడొంకర్లు తిప్పింది.

తను చేసిన తప్పేమిటి? గుండెల్లో బాకు కుమ్మినట్టయ్యింది.

చేను దగ్గరికి వచ్చారు. పంట కాలవ వల్లమాలిన వయ్యారంతో తనని చిన్నచూపు చూసుకుంటూ వెళుతున్నట్టనిపించింది బతకమ్మకి. చేలో దిగింది. మామూలుగా కొమరయ్య, పిన్నామ తనపాయ పట్టేవాళ్ళు. వాళ్ళిద్దరూ వేరే పాయల్లోకి వెళ్ళారు. తన పాయలో తనకి తోడు కుంటెంకడు, వాడి పిల్లలు, మూగిరత్తి మిగిలిపోయారు. బతకమ్మకి దుఃఖం ముంచు కొచ్చింది. మిగిలిన పాయల్లో ఎవరేమి మాట్లాడినా తన గురించే అనుకుంటూ వుంది. మధ్యాహ్నం భోజనాలకి లేస్తారనగా నెమ్మదిగా కదిపాడు కుంటెంకడు.

"ఏమో పోరి, దొరని నువ్వే రమ్మన్నావా" అన్నాడు.

ఇందాకటి నుంచీ పనిలో వుంటే దిగులు తగ్గినట్టుగా వుంది. ఎంకడి మాటతో పుండు మీద కారం రాసినట్టయ్యింది. ఏడుపు ముంచుకొచ్చింది. ఏడిస్తే అలుసయిపోతానని బింకంగా "నేనెందుకు రమ్మంటను" అంది.

"నువ్వు అసుంటి దానివి కాదనుకో"

బతకమ్మకి కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగినయ్. కళ్ళు మసకేసి కొడవలి వేలుకి తగిలి తెగింది. కళ్ళ నీళ్ళతో బాటు రక్తం కూడా చిమ్మింది.

అందరూ అన్నాలకి లేచారు. పెద్ద కాలవ గట్టు మీద బెడ్డలేరి కాలవలోకి విసిరేస్తున్నాడు కొమరయ్య.

"ఇదుగో అన్నం తిందువురా" అంది బతకమ్మ.

"నాకొద్దు"

"ఏం అన్నమీన అలిగితే ఏమొస్తది, నా మీద కోపంతో?"

"నీ మీద నాకెందుకు కోపం? నువ్వు ఎంతకైనా తగిందానవి!"

బతకమ్మ సమాధానం చెప్పలా, కళ్ళు మనసులోని బాధని పట్టలేక కన్నీరు బుగ్గల మీద జారిపోతున్నాయి.

"ఎందుకా ఏడుపు? చేసేయన్నీ ఎదవ పనులు. ఎందుకా బతుకు బతక్కపోతేనేం, ఛీ" తుపుక్కున ఊసాడు.

"నేనెసుమంటిదాన్నో ఇన్ని రోజులు కాపరం చేసినా తెలియలేదా? పోన్లే అన్నానికి రా" అంది చెయ్యి పట్టుకుంటూ.

“ఛీ, నన్ను అంటుకోబాకు” అంటూ పురుగుని విదిలించినట్టు విదిలించి లేచి వెళ్ళిపోయాడు.

మోకాళ్ళ మధ్య తలదూర్చి కూర్చుంది. “అక్కా, అందరూ ఎళుతున్నారు లే” అంది వెంకయ్య కూతురు.

“అక్కా నువ్వూ బావ అన్నం తినలేదు కదూ!”

బతకమ్మ మాట్లాడకుండా లేచి పాయలో నిలబడింది.

✡

కాలవ గట్టుమీద గొడ్లకాడ బుడ్డోడి కేకలకి జనమంతా గట్టెక్కారు. అప్పటికే మునుగుతూ, తేలుతూ వున్న బతకమ్మని కాలువలోంచి ఒడ్డుకు లాక్కు వచ్చారు. బాగా నీళ్ళు తాగి స్పృహ తప్పి పోయింది.

“ఎంత పని చేశావు బతకమ్మా” అంటూ ఏడుస్తోంది పిన్నామ.

డాక్టరు దగ్గరికి చేతుల మీద వేసుకెళ్ళారు. డాక్టరు బతకమ్మని చూసి నీళ్ళు కక్కించి, ఇంజెక్షన్ చేసాడు. గదిలో బల్లమీద పడుకోబెట్టారు.

“ఏం ఫరవాలేదు. ఇంకో అరగంటకి తేరుకుంటుంది” అన్నాడు డాక్టరుగారు.

డబ్బులివ్వబోయిన కొమరయ్యతో “వద్దులే, అంబిరాజుగారి పొలంలో పని చేసే వాళ్ళేగా, ఆయనే ఇస్తారు” అని మరో మాటకు అవకాశం యివ్వకుండా వెళ్ళిపోయారు.

బతకమ్మకు స్పృహ వచ్చింది. “ఎందుకే బతకా, ఆసుమంటి పని చేశావు? నేనేం అయిపోవాలే” కొమరయ్య కళ్ళ వెంట నీరు.

“నన్నెందుకు బతికించినవు, చావనియ్యకుండా. ఎందుకు నా బతుకు, చస్తే పోయేది” అంటూ ఏడ్చింది బతకమ్మ.

“గట్టనొద్దు బతకమ్మ నువ్వు బతకాలే. నువు బతుకు బతకమ్మా” అంటూ బతకమ్మను చుట్టేసి బావురుమన్నాడు కొమరయ్య. చుట్టూ వున్న అందరూ ఏడిచారు. అందరి మనస్సులోని బరువు, నైచ్యము వదిలిపోయినట్టయింది.

ఆ రాత్రి పడక కుర్చీలో చుట్టకాల్చుకుంటూ కూర్చున్న అంబిరాజు దగ్గరికి కుంటాడు, పిన్నామ వచ్చారు.

“దొరా”

“ఏంటిలా వచ్చారు? ఆ అమ్మాయి ఒంట్లో ఎట్లా వుంది?”

"మేం ఈ వూరు నుంచి ఎల్లి పోతాం దొరా"

"ఏం ఎందుకని? మధ్యలో కోత ఆపితే ఎట్లా"

"ఏందో దొరా! మా పిల్ల చూస్తే గిట్టఅయింది. ఇంక ఉండబుద్ధి కావటంలే. కూలి ఇచ్చేత్తే" అంది పిన్నామ.

"సరే మీ యిష్టం" అంటూ కూలి లెక్కజూచి సుప్తాగా యిచ్చేసాడు.

తనని రాత్రి వీళ్ళిద్దరూ గుర్తు పట్టారన్న సంగతి అంబిరాజుకు తెలుసు. తెల్లారి కోడి కుయ్యక ముందే అంబిరాజు చావిట్లో కెళ్ళాడు. చావిడి శూన్యంగా వుంది.

✡

# చేసుకొన్న కర్మ

**–డా॥ జి.వి.కృష్ణరావు**

“ఏమే, నిన్నే, దొడ్లోకి ఎవరో వచ్చినట్టుంది. కాస్త అటుపోయి చూడు.”

“ఇపుడు ఎవరొస్తారు? రాగవులు గడ్డిమోపు తెచ్చాడేమో,” అంది రాజేసిన చెత్త చుట్ట కాస్త తగలబడి పోతుందేమోనని గబగబ వంట పిడకలు విరిచి దాలివేస్తూ.

“నీ తెలివి తెల్లారింది. రాగవులైతే పాడావు ఒక్కటే అలా ఎందుకరుస్తుంది? పోయి చూడు.” భర్త మరికొంచెం గట్టిగా కూకలేశాడు.

పాలచెంబు అక్కడే వుంది. తాను దొడ్లోకి వెళ్ళితే పిల్లి ముండ ఆ కాసిని పాలు గుమ్మరిస్తేనో. లక్షువమ్మ తన కొంగుపట్టుకొని అన్నం కోసం మారాం చేసే కొడుకుతో, “అరే చిట్టాడా! దొడ్లోకిపోయి చూడమ్మా ఎవరొచ్చారో,” అంది.

చిట్టాడు మొండాడైపోయాడు. పంచె కట్టుకొన్న వెంకయ్య భార్య వేపు చూశాడు. ఆమె దాలి వేసి పాలు పిడతలో పోస్తున్నది. చేతిలో పనున్న మనిషిని యేమంటాడు? తానే విసుక్కొంటూ నీరుకావి ఉత్తరీయం మీద వేసుకొని దొడ్లోకి వచ్చేడు.

అప్పుడే కరకర పొద్దుపొడుస్తున్నది. ఎదురు ప్రొద్దుకు చెయ్యడ్డం పెట్టుకొని, “ఎవరారు?” అని వెంకయ్య గట్టిగా కేకేశాడు.

“నేనేండి.”

పెద్ద తలగుడ్డ ఎదురుగా వస్తున్నది. తేరిపార జూచిన వెంకయ్య, “నువ్వట్రా పుల్లాయ్, ఎప్పుడొచ్చా వేమిటి?” అని పరామర్శించాడు.

“ఇప్పుడే వస్తున్నా నండీ,” అన్నాడు వెంకయ్యను చూడగానే తలగుడ్డ తీసి బుజాన వేసుకొంటూ పుల్లయ్య.

“పిల్లా మేకా బాగున్నారా?”

“ఏదో మీ దయొల్ల అట్టట్టుండాము.”

“మా దయ కావలిసొచ్చినాడివైతే, ఇన్నాళ్ళు ఇటుకేసి చూడకుండా వుంటావా? మా కోసం కాకపోతె మానె, కొడుకుని ఇక్కడుంచావుగా. ఈ రెండేళ్ళలో ఒకసారన్నా చూచెళ్లావ్రా? తొత్తుకొడకా! కని బూమిమీద పారెయ్యంగానే సరా? పశువులూ కంటున్నాయీ, నువ్వూ కంటున్నావు.” వెంకయ్య తిడుతున్నా, అందులో ఒలికే వాత్సల్యానికి పుల్లయ్య మురిసిపోయాడే కాని ఏమాత్రం నొచ్చుకోలా.

“ఏం చెయ్యమంటారు దొరగారూ? ఇక్కడకొద్దామని ఎన్ని సార్లు బయలుదేరినా పడకొచ్చింది. ఒకసారి మా ఇంటోది పడకేసింది. ఇంకోసారి చంటోడికి బాగుండలా, మరోసారిగత్తే నాకు జెరమొచ్చింది. ఏమిచేసేది చెప్పండి! అదీ యిదీ లేకుంటే పనిరోజు లొచ్చిపడేయి.”

“ఇయ్యన్నీ ఎవళ్ళకి చెప్పాలో వాళ్లకి చెప్పు. నాకు చెబుతావా? కొడుకును చూద్దామన్న బెమతవుంటే ఈ రెండేళ్లలో వీలు చిక్కక పోయిందీ?” అన్నాడు వెంకయ్య.

అవును. నిజంగా కొడుకు మీద భ్రమవుంటే, ఒకసారి కాకపోతే ఒకసారన్నా పుల్లయ్యకు చూడటానికి పడకపోయిందా? వాస్తవం చెప్పాలంటే అతని మనస్సు పెద్దకొడుకు రాఘవుల మీదలేదు. దానికి కారణముంది. రాఘవులకు అయిదేళ్లు నిండీ నిండకముందే వెంకయ్య దొడ్లో పడేశాడు. పిల్లలుగల పల్లెటూరి పేదవాళ్ళకు అంతకన్నా దారేముంది. రాఘవుల మంచిచెడ్డలన్నీ ఈ పదిహేను ఏళ్ళ నుంచి ఆ ఆసామే చూస్తున్నాడు. ఆయనే, వాడికి పనినేర్పి చేయించుకొంటున్నాడు. దొరసాని వాణ్ణి ఎలా చూస్తున్నదో యేమో కాని, యీ పదమూడేళ్ల నుంచి మాత్రం ఆ దొడ్డి వదలనంటున్నాడు. పుల్లయ్య ఆ వూరి నుంచి దూరంగా వెళ్ళిపోతున్నప్పుడు కూడా రాఘవులు అక్కడ నుంచి కదలనన్నాడు. అందువల్ల వెంకయ్యకు కూడా వాడంటే మమత ఏర్పడింది. పుల్లయ్య మాత్రం ప్రతి బావాయి పున్నానికి ఒకసారి వచ్చి రావలసిన జీతం పుచ్చుకెళ్ళుతుండే వాడు.

ఇలాంటి పరిస్థితులలో తలిదండ్రులమీద రాఘవులకు బ్రమత లేదంటే ఆశ్చర్యపడ వలసింది ఏమున్నది? లక్షువమ్మే పిల్లలుగన్న తల్లి కాబట్టి సంవత్సరానికి కొకసారి బలవంతాన రాఘవుల్ని ఇంటికి పోయి చూచిరమ్మని నెట్టేది.

“ఏమేవ్, రాగవుల తండ్రి వచ్చాడే. ఆ పెద్దచెంబు తెచ్చియ్యి. మొగం కడుక్కుంటాడు,” అని వెంకయ్య కేకవేసి చెప్పాడు.

“ఏమండి దొరగారు, చిక్కిపోయారేం? కాయిలా పడ్డారా ఏమిటి?” అన్నాడు పుల్లయ్య.

“లేదురా, పోయినకొద్దీ ఏళ్ళు వస్తున్నాయి కాని పోతున్నాయా?” అంటూ వెంకయ్య దొడ్డి అరుగుమీద చతికిలబడ్డాడు.

లక్షువమ్మ కుంభకోణపు చెంబు తెచ్చి వాడిదగ్గరపెట్టి, “ఏమిరా, ఇన్నాళ్ళకా వచ్చేది? సరే, చాంతాడు బాయిదగ్గరే వుంది, తోడుకో,” అన్నది.

రైతు కుటుంబాలతో సంబంధం లేనివాళ్లకు ఆమె వట్టిచెంబు తెచ్చినందుకు కష్టం కలగవచ్చును. కాని ఆ వట్టిచెంబుకే పుల్లయ్య మురిసిపోయాడు. తనంటే దొరసానికి ఎంత చనువు!

"కొడుకు కనపడ్డాడా?" లక్షువమ్మ అడిగింది.

"ఆ కనిపించాడమ్మా, కనిపించాడు. వస్తావస్తా వాములదగ్గరకు వెళ్ళొచ్చా. అప్పుడే వాడు గడ్డి దూస్తుండాడు."

"అయితే యింకేం, దారిలోనే వాడిచెవి కొరికొచ్చావన్నమాట!" అన్నాడు ఆసామి.

"చాల్లెద్దురూ, మీకుగాగ తగిపోయింది. ఎన్నాళ్ళ కెన్నాళ్లకో చూస్తున్నప్పుడు మాటాడుకోవద్దా ఏమిటీ?" అని లక్షువమ్మ పుల్లయ్యను వెనకేసుకొచ్చింది.

"మేకారిపిచ్చి పోనీకపోతివి. పుల్లాయ్ ఎందుకొచ్చాడనుకొంటున్నా? నిన్ను చూద్ధామనీ కాదు. కొడుకును చూద్దామనీ కాదు."

"అయితే ఎందుకొచ్చాదంటారు?"

"అలా అడగండమ్మా దొరసానిగారు." పుల్లయ్య నవ్వాడు.

"ఉండరా వెదవల కొడకాంటె వెదవల కొడకా అని. ఊరికే చూచివెళ్ళటానికి వచ్చేవాడివైతే బావాయి పున్నమవెళ్ళిన నాలుగు రోజులకే రావాలి?"

"ఇప్పుడే కాస్త తీరిక చిక్కిందేమో లెండి," అన్నది భార్య.

"నీకూ యిప్పుడే తీరిక, అంతే కాదూ? అందుకనే అన్నారు మేకారిపిచ్చి అని. మరి వూరికే అంటారూ?" వెంకయ్య ఎత్తిపొడిచాడు.

"ఎవరి తెలివితేటలు వారికుంటాయిలెండి. పోరా, పోయి కాళ్ళు కడుక్కురా." లక్షువమ్మ పుల్లయ్యను హెచ్చరించి యింట్లో కెళ్ళింది.

ఇంతలోనే దొడ్లోని ఆవులు అరిచాయి. కర్రిగిత్త కట్టుకొయ్య దగ్గర ముంగాలి గిట్టతో గీరుతూ ఖణేలున రంకెవేసింది. ఆరుకారుల యెద్దు పండుకొన్నదల్లా లేచి దొడ్డివాకిలివైపు చూస్తూ నిలబడ్డది. కోడెదూడ చెంగనాలు తీసుకొంటూ వస్తున్న ముందు మోపుదగ్గరకు వెళ్ళి మూచూచి అక్కడ నుంచి మరొక గంతు ముందుకువేసింది. ఆ రెండో మోపు రాఘవులది.

ముఖం కడుక్కొంటున్న పుల్లయ్య యిదంతా చూస్తూనే వున్నాడు. లేగదూడ లగాయతు ఆయింటి ఆసామిదాకా అంతా తన కొడుకును ప్రేమించేవారే. అలాంటి జీతగాణ్ణి ఆసామి పోగొట్టుకొంటాడా అని పుల్లయ్య లోలోన ఆసపడ్డాడు.

"ఓసి నీదుంపతెగ ఉండవే, పంచె లాగుతావు," అని రాఘవులు లేగదూడను అదలించాడు అయినా అది అతని చుట్టూ తిరుగుతూ ముందడుగు వేయనీయటం లేదు, అదిచూచి,

"ఒరే చిట్టాడా! నీ బుజ్జాయి పారిపోతున్నదిరా." అని వెంకయ్య కేకవేశాడు. తల్లి చెంగు వదలి చిట్టాడు ఒక్క గంతులో దొడ్లోకి వచ్చి పడ్డాడు.

"బుజ్జాయి ఎటెల్లింది నానా?"

"అదిగో రాగవుల యెనకాల. లాక్కెళ్లి కట్టెయ్యి."

చిట్టాడు దూడ మెడలోని వెంట్రుకలతాడు పట్టుకొని లాగినా, అది రాఘవుల గోచిచెంగు నములుతూ కదల్లేదు. రాఘవులు కసిరాడు. చిట్టాడు మళ్ళీ గట్టిగా లాగాడు. లేగదూడకు పంచెకొంగు వదలక తప్పలేదు.

మోపులు చావడిచూరు వద్ద పడేసి చిన్నదొర, రాఘవులు లోపలికి లాగారు. జనపకట్టెలు మచ్చుమీద వెయ్యమని చిన్నదొరకు చెప్పి రాఘవులు వెంకయ్య దగ్గరకు వచ్చాడు.

"ఆవేళకాడ పోయి యిప్పుడా వచ్చేది?" ఆసామి కూర్చునే కేకలేశాడు.

"ఏమి చెయ్యమంటారు, గడ్డివస్తేనా? ఎన్నుగాడి తెగ్గొడతానంటే మీరేగా వద్దన్నది."

"నిజమే నాన్నా. ఒక్క పరక్కూడా రావటం లేదు. ఏం రాగవాయి రేపు తెగ్గొడదాం?" అన్నాడు చిన్నదొర.

"రేపుకాదులే, మసుపులు చేస్తుండాయి. ఈ రెండు రోజులూ పోనీ," అన్నాడు రాఘవులు.

ఆమాత్రం తెలివితేటలు తన కొడుకుకు లేనందుకు వెంకయ్య చింతపడ్డాడు.

"అరే రాగవాయి మీబాబు వచ్చాడురా," అంది అప్పుడే బయటికి వచ్చిన లక్షువమ్మ.

"వస్తే వచ్చాడులెండి. అన్నంపెట్టండి. తొందరగా అరక్కుపోవాలి. ఊళ్ళో నాగళ్ళు అప్పుడే చేలల్లోకి దిగాయికూడా," అన్నాడు రాఘవులు.

"రెండేళ్లగ్గాను ఇవాళవస్తే అలా అంటావేమిరా!" అన్నాడు చిన్నదొర.

"వస్తే వచ్చాడు. వచ్చినవాడు చూస్తాడు. చూచినవాడు చక్కాపోతాడు. నువ్వుతొందరగా గొడ్లువిప్పు?" అని చిన్నదొరను హెచ్చరించి పంపాడు.

"అరే అబ్బాయి! ఒకమాటరా." తండ్రి పుల్లయ్య పిలిచాడు. రాఘవులు మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్ళుతున్నాడు.

"ఒరే నిన్నేరా, మీ బాబు పిలుస్తున్నాడు." అని వెంకయ్య కూడా హెచ్చరించాడు.

రాఘవులు ఆసామి కెదురుగా వచ్చి నిలుచున్నాడు. పుల్లయ్య కూడా అరుగుదగ్గరకు వచ్చాడు.

"మీ బాబు నీతో ఏమన్నా మాట్లాడుతాడు కామాలురా, వెళ్ళు," అన్నాడు దొర.

"నాతో మాట్లాడే దేముంది? మీతోనే మాట్లాడటానికి వచ్చాడు. ఆరు నువ్వు మాట్లాడు కోండి."

"వాడి తిక్క ఎలా వుందో చూడండి దొరగారు. వెనకటికి నా పెళ్ళికి నేనూ పోవాలీ, అన్నాట్ట యిలాంటివాడె."

"నేను మాట్లాడే దేముంది? పెద్దోడివి నువ్వు, న్యాయం తెలిసిన దొర ఆయన, మధ్య నేను దేనికి? నేను అరక్కుపోవాలి," అని తండ్రి పిలుస్తున్న కొందికి రాఘవులు ఇంట్లోకి వెళ్లుతున్నాడు.

"ఒరే రాఘవులు! ఉండకపోతే వుండకపోయావు, కాని, అరకకాస్త కనిపెట్టిపోనీ. లేకపోతే గిత్త చెడుతుంది," అన్నాడు ఆసామి.

"అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే ఎలా? నీళ్ళు వచ్చిపడుతున్నాయి. యింకా ఏడెకరాల మెట్టసాలు అలానే వుంది. ఒక జతతో సాగాలి సంత అంటె?" రాఘవులు వెళ్లుతూ అన్నాడు.

"దాని సిగ తరిగిరి. అయినప్పుడే అవుతుందిలేరా!" అని గట్టిగా చెప్పాడు ఆసామి.

"ఈ వరసవాణ్ణి పెట్టుకొని ఎలా వేగేదండి దొరగారు," అన్నాడు పుల్లయ్య కొడుకు లోపలికి వెళ్ళింతరువాత.

"సరే, నువ్వుకూడా తిండి తిను. తరువాత మాటాడొచ్చు."

అన్నాలయ్యాక ఎవరిపనిమీద వాళ్ళు వెళ్ళారు. వెంకయ్య తూర్పింట్లో తగతాబల్ల మీద పడుకొని తాపీగా చుట్ట కాలుస్తున్నాడు. ఆసామి కింద పారేసిన పొగాకు కాడను పుల్లయ్య తుంపి నోట్లో వేసుకొంటున్నాడు.

"అదేమిటిరా, అడిగితే ఒక కాడ యివ్వకపోయాను?"

"వద్దులెండి దొరగారు. నోట్లోకి యీ కాడలే బాగుంటాయి."

అంతలో లక్షువమ్మ కూడా యింట్లోపని ముగించుకొని వచ్చి కూర్చున్నది.

"ఇదిగో దొరగారు!" అన్నాడు పుల్లయ్య.

"ఏమిటిరా?" అన్నాడు ఆలోచనలనుంచి బయటపడి ఆసామి.

పుల్లయ్య కాసేపు నీళ్లు నమిలాడు.

"ఆ నత్తులు దేనికి పుల్లయ్య! అడగదలచిందేదో అడగరాదా?" అన్నది యిల్లాలు.

"అదికాదండి దొరగారు, ఈ యేడు వాడికి పెళ్లి చేద్దామని వుంది."

"పిల్ల కుదిరిందటరా!" లక్షువమ్మ అడిగింది.

"ఇంకా లేదండి దొరసానిగారు."

"అయితే మరి నీ గోడేమిటి?" అన్నాడు ఆసామి.

"అదికాదు దొరగారు, నాలుగురాళ్లు సంపాయించుకొంటుంటేగా ఓరన్నా పిల్లనిత్తామనేది."

"సంపాయించు కొంటుండెగదరా, గోవాయికోడెలా తిరుగుతున్న దెక్కడ,"

"యాభైరాళ్లు వాడికీ, వాడి పెళ్ళానికీ ఎక్కడ చాల్తాయండి? అందుకనే యెక్కడన్నా పిల్లనడగమోతే జీతం ఏమి తెస్తుండాడేమిటి అంటుండారు."

"ఇంతకూ జీతం పెంచందే ఈయేడు నాదగ్గర వుంచేది లేదంటావు. అంతేనా?" అన్నాడు ఆసామి.

"అన్నీ తెలిసి మీరు అలా అంటే ఏమిచెప్పేది? కట్టసుకాలు మీకు తెలీనీయి కనకనా?"

"నీ కొడుక్కు పెళ్ళి చేయటమేగా నీకు కావలసింది?"

"అంతకన్నా యీ ముసలి ముండాకొడుక్కేమి కావాలి?"

"అయితే యీ పదేనేళ్ళ నుంచి యిస్తున్న జీతం ఇచ్చిపో. రేపీ వరటాలికి వాడికెలా పెళ్ళికాదో చూదాము."

"అంత గీతండీ మాకు? పిల్ల బీరకాయ, రోగాలు, నొప్పులు, గుడ్డా గోసీ, ఎప్పటికప్పుడు ఎతుక్కునేగతి తప్పటం లేదు. మీరు కాస్త చల్లని చూపు చూడాలి. మాలాంటోళ్లు బతకాలి".

వెంకయ్య కాస్త ఆలోచించి, "ఇంతకూ యామంటావేమిటి?" అన్నాడు.

"మావూరు షావుకారు రొండు జతల గుడ్డలిచ్చి డెబ్బై అయిదు రూపాయలిస్తానంటుండాడండి."

"అయితే నీ కొడుకును అక్కడే జీతానికి పెట్రా" అని వెంకయ్య గోడవైపుకు తిరిగి పడుకొన్నాడు.

"దాని దుంపతెగ, ఒక్కసారే పాతిక పెంచుతారట్రా ఎవరైనా?" అంది లక్షువమ్మ.

"నీ తోడండి దొరసానిగారు, 75 రూపాయలు రొక్కంతెచ్చి నా చేతిలో పొయ్యొచ్చాడండీ. నలుగురు కట్టిన యింటి కిందుండి చెబుతుండా."

లక్షువమ్మ మాట్లాడలేక పోయింది.

"ఒరే పుల్లాయ్, వచ్చే డబ్బు చెడగొట్టుకోవడం దేనికిరా? నిక్షేపంగా నీ కొడుకును తీసుకెళ్ళి ఆయన దగ్గర పెట్టు. మాకూ కొంచెం బరువు తగ్గుతుంది. ఈయేడు నాగాలుకూడా లేవు. రావలసినదేమిటో రేపు పొద్దున యిచ్చివేస్తాను."

"మీరల్లా దయతప్పితే మా పేదోళ్ళేమికావాలి?"

"నేనేమీ నిష్ఠూరా లెయ్యటం లేదు. సాయంత్రం రాగవులు రాగానే చెప్పి తీసుకెళ్ళు."

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. రాఘవులను తీసుకొని వెళ్లుతానంటే, లక్షువమ్మకు కన్నీళ్లపర్యంతమైంది. ఇన్నేళ్లు తమదొడ్లో ఉన్నాడు. చెప్పించుకొనకుండానే అన్నీ చేసుకొని పోతుంటాడు, "పనిమంతులు" దొరికినా నమ్మకమైన మనుషులు దొరకొద్దూ? పదో పరకో పెంచి రాఘవుల్ని అట్టే పెట్టమని భర్తకు చెబుతామనుకొన్నది. ఆయనకు తాను ప్రత్యేకంగా చెప్పవలసింది ఏమున్నది? తాను ఇంటి వద్ద వున్నా లేకపోయినా ఎలా జరిగిపోయేదీ ఆయనకు తెలియదా? సంసారమంతా యీదుకుపోయే ఆయనే యిలా అన్నాడంటే యేదో వుండివుంటుంది. ఈ భావం కలగటం వల్ల లక్షువమ్మ జీతగాణ్ణి అట్టిపెట్టవలసిందేనని పట్టుబట్టలేక పోయింది.

"అయితే దొరగారు!"

"ఏమిట్రా, గంగలో దూకమంటావా ఏమిటి?"

"అయ్యెయ్యొ అంతమాట దేనికండి? మీరు కాస్త విడమరిచి చెబితే."

"నువ్వు చెప్పలా?"

"చెప్పాను. ఇందాక వాడన్నమాటలు విన్నారుగా. మీరు వెళ్ళమంటే కాని మీ దొడ్డి వదలడండి దొరగారు?"

"అలాంటప్పుడు నేను చెబితే వింటాడా?"

"తప్పకుండా వింటాడండి. మీమీద మావాడికి మా పెద్దగురి."

"సరే యీ రాత్రి నీముందే చెబుతాను," అంటూ చటుక్కున లేచి చెప్పులు తొడుక్కొని వెంకయ్య పొలం వెళ్లాడు.

ఆ రాత్రి యింటిల్లిపాది భోజనాలు అయిన తరువాత వెంకయ్య గొడ్లకు మేతవేస్తున్న రాఘవుల్ని, వాకిట్లో కూర్చున్న పుల్లయ్యను కేకేసి దొడ్లో అరుగుమీద రడ్డిగం వేసుకుని కూర్చుని తీరిగ్గా చుట్ట ముట్టించాడు. తండ్రి కొడుకు లిద్దరు వచ్చి ఆసామి కెదురుగా కింద కూర్చున్నారు.

"అయితే రాగవులూ, మీబాబు ఎందుకొచ్చాడో కనుక్కున్నావా?" అడిగాడు ఆసామి.

రాఘవులు తలవూపాడు. ఇంతలో చిన్నదొర చిట్టాడు వచ్చి తండ్రి పక్కనే అరుగుమీద కూర్చున్నారు.

"మరి మీ బాబుకు ఏమి చెప్పా?" మళ్ళీ అడిగాడు ఆసామి.

"నేనేమి చెప్పేదండి. అన్నీ తెలిసినోరు మీరుండారుగా," అంటూ అతగాడు నవ్వాడు.

"అయితే నేను చెప్పినట్టు మీ అబ్బా కొడుకులు వినుకుంటారా?"

"మీ మాటకు ఎదురు చెప్పేదేముంది?" అన్నాడు రాఘవులు.

"న్యాయం సెలవిత్తే కాదనేదోడు దొరా?" అన్నాడు పుల్లయ్య.

"అరే రాగవులూ మీవూళ్ళో షావుకారు నువ్వు తన వద్ద జీతానికి కుదిరితే రొక్కం 75 రూపాయ లిస్తానంటున్నాడట." వెంకయ్య ఆరిపోయిన చుట్టను అవతల పారేశాడు.

"మీరేమంటారు?" రాఘవులు ఆసామివేపు చూచాడు.

"నేను చెప్పేదేముందిరా? నువ్వు నాలుగురాళ్లు సంపాయించుకొంటే నేనెలా కాదంటాను? నేను కాదంటే మాత్రం నీకెలా వుంటుంది? నలుగురూ అవుననొద్దూ? రేప్పొద్దున్నే మీ బాబు వెంటవెళ్లు. ఏదో యింతకాలం నన్ను నమ్ముకొన్నావనుకో. ఈ చిట్టాడొకటి కాదు, నువ్వొకటి కాదు. మీబాబు ఎంత చెప్పినా ససేమిరా అంటున్నావని తెలిసింది. అందుకని అంటున్నా, నిన్ను అట్టి పెట్టుకొందామని లేక పోలేదు. మరేంచెయ్యను? కాలం బాగుండ లేదు. ధరలు ముండమోసి కూర్చున్నాయి. భరాయించొద్దూ? చీకటితో లేచి మీబాబు వెంట వెళ్ళిపో."

వెంకయ్య పక్కవాటుగా తిరిగి చిట్టాడిని దగ్గరకు లాక్కొన్నాడు.

"రాగవాయి యాడకే ఎల్లేది?" చిట్టాడు తండ్రిని అడిగాడు.

"వాళ్ళింటికి?"

"వాళ్ళిల్లెక్కడ? ఇదికాదూ?"

"కాదు నాన్నా, చాలాదూరాన వుంది."

"ఎందు కెళ్ళుతున్నావు రాగవాయి? నాన్న కొట్టాడా?"

ఆసామి తప్ప మిగతావాళ్లంతా నవ్వారు.

"వాళ్ల అమ్మ దగ్గరికి వాడు వెళ్ళుతున్నాడు." అన్నాడు తండ్రి.

"మల్లా ఎప్పుడొత్తాడు" "ఇకరాడురా," అన్నాడు చిన్నదొర.

"అయితే ఎల్లొద్దు రాగవాయి. మనిద్దరం సావాసంకాదు?" అంటూ చిట్టాడుపోయి రాఘవుల మెడ వాటేసుకొన్నాడు.

"ఎల్లనుగా నువ్వుపోయి పడుకో." అన్నాడు రాఘవులు.

"అమ్మదొంగా? నన్ను మరిపిచ్చి పోదామనుకుంటున్నావులే. ఇవ్వాళ నీదగ్గిరే పండుకొంటాను" చిట్టాడు మారానికి దిగాడు.

"పోదు నాన్నా. నువ్వు పోయి యింట్లో పడుకో," అన్నాడు తండ్రి.

"నాకు తెలుసులే. ఇవ్వాళ నేను రాగవాయిదగ్గిరే పండుకొంటాను."

రాఘవులు చిట్టాడిని బుజానవేసుకొని చావట్లోకి వెళ్ళాడు.

"అరే పెద్దాడా. మీ అమ్మనుపోయి చిట్టాణ్ణి తీసుకుపొమ్మను," అని వెంకయ్య పెద్ద కొడుకును పంపాడు.

"ఏమండి దొరగారు?" పుల్లయ్య తన సంగతి జ్ఞాపకం చేశాడు.

"చెప్పానుగా. చీకటితోలేచి తీసికెళ్ళు. రావలసిన డబ్బు మీ దొరసాని కిచ్చాను. అడిగి పుచ్చుకో. ఇంకాదేనికి. పొద్దుపోలా? చాప తీసికెళ్ళి తలాకిలి అరుగుమీద వేసుకొని పండుకో."

వెంకయ్య యింట్లోకి వెళ్ళి పండుకొన్నాడు. లక్షువమ్మ పాలు తోడుపెట్టి వంటయిల్లు చక్కదిద్దుకొన్నది. తరువాత చిన్న లాంతరు తీసుకెళ్ళి దొడ్డిగేటు వేసి రాఘవుల పక్కలో నిద్రపోయిన చిట్టాణ్ణి ఎత్తుకొచ్చి తన పక్కలో పండుకోబెట్టింది. గంటలాగా దీపం వెలుగుతుంటే దాన్ని కాస్త తగ్గించింది. పెద్దకొడుకు కిందకు నెట్టివేసుకొన్న దిండు మళ్ళా వాడి తలకింద పెట్టి మోకాళ్లకు పైకిపోయిన ధోవతి సరిగా లాగి వచ్చి తన మంచం మీద కూర్చున్నది. ఆసామి యింకా పసిపిల్లవాడిలాగా మెసికట్లాడుతున్నాడు.

"యావండీ! అప్పుడే నిద్రపోయారా?" లక్షువమ్మ నవ్వింది.

"నిద్రపోయానే" అన్నాడు వెంకయ్య.

"నిద్రపోయినవాళ్ళు, మాట్లాడుతారు కామాలు, నాకు తెలీదులెండి. సరేకాని రాగవాయి ఏడుస్తున్నాడు ఏమన్నారేమిటి?"

"నేనేమనలేదే. వాడి బాబు వెంట పొమ్మన్నాను. మరేం చేసేది, భరించే శక్తి లేనప్పుడు?"

"వాడి చాకిరికి 75 రూపాయలివ్వటం కష్టమా?"

"అయితే మీ బాబేమన్నా యిచ్చాడేమో తెచ్చి యివ్వు."

"మీకు చాకిరీ చేయటమేం? మా బాబు డబ్బివ్వటమే?"

"నాకిచ్చే శక్తి లేదనేగా చెబుతున్నది?"

"నాదెగ్గిరికీ, వాడిదెగ్గిరికీ వచ్చేటప్పటికే మీకు చెయ్యిరాదు" లక్షువమ్మ నిష్ఠూరమాడింది.

"నీకు కిందుమీదులు తెలియటంలా, ఇంకా ఎన్నాళ్లకొస్తుంది గ్నానం? నీ అల్లుడికేమో అయిదేలకు నోటురాయించి యిచ్చేదాక నిద్రపట్టకపోయె. చావడికేమో వెయ్యి రూపాయలయ్యె. ఈ అప్పులన్నీ తీరి ఎలా బయటపడతామురా భగవంతుడా అనుకొంటుంటే ఈ బండకూడా నా నెత్తికే ఎత్తాలంటే? నేనూ మనిషినే." వెంకయ్య కస్సుమన్నాడు.

ఆ మాటలతో మానవురాలు మళ్ళీ నోరెత్తలా. రామనామ స్మరణ చేస్తూ లక్షువమ్మ నడుం వాల్చింది. ఆసామికి మాత్రం నిద్రపట్టలా. "మాఖం, ఫాల్గుణం – ఫాల్గుణంతో నోటు వాయిదా వెళ్ళిపోబోతూ వుంది." అంటూ వెండి సులోచనాలతో వియ్యంకుడు, "డబ్బు అవసరంగా వుందిరా అబ్బాయి," అంటూ తనవూరి షావుకారు వెంకయ్య ప్రత్యక్షమయ్యారు. అతనికి చీమలు పారుకాడినట్లయింది. అతడు ఇంకా ముడుచుకు పండుకొన్నాడు. ముడుచు కొన్న కొందికి చాలా చీమలు చుట్టూ బ్రహ్మాండంగా కోటలు పెట్టుకొస్తున్నాయి. గాభరాపుట్టింది. అతడు ఉలిక్కిపడి కూర్చుని కళ్లు తెరిచాడు. దీపకాంతి కొంత ఊరట కలిగించింది.

అయినా అతని హృదయం దడదడ కొట్టుకుంటూనే వుంది. తాను అందని వాటికి అర్రులు చాచిందెక్కడ? తీయరాని పరుగులు తీసిందెక్కడ? వియ్యంకుడికి అయిదువేలకు నోటు వ్రాసి యిమ్మన్న దెవరు? రైతన్న వాడు ఎవడు చేలోచేను తెగనరికి ఇస్తాడు? ఆ పని చేయకపోబట్టే యివ్వాళ ముడ్డికిందికి నీళ్ళొచ్చి కూర్చున్నాయి.

నిజంగా ధరలు అలా నిలబడివుంటే ఇలాంటి అప్పులు తన్ను ఏమిచేసేవి? నాలుగైదేళ్లలో తీరిపోయేవికావా? అసలు ఈ ధరలు ఎందుకు పడిపోయాయి? తాను ప్రతి సంవత్సరం పంచాంగ శ్రవణం చేస్తూనే ఉండె. ధరలు తగ్గుతాయని ఒక సిద్ధాంతి అయినా ఎందుకు వ్రాయలేదు? వాళ్లకు మాత్రం కర్మ ఎలా తెలుస్తుంది?

అయితే తాను చేసిన కర్మ ఏమిటి? తను ఎవడి కడుపూ కొట్టలేదు. తన వర్ణధర్మం తప్పిందిలేదు. తనకీ దుర్గతేమిటి? తనవూరి షావుకారికి ఆ ఐశ్వర్యమేమిటి? అతడు చేసిన పుణ్యమేమిటి? ఎందరి కొంపలు నిలువున తీశాడు? ఎన్ని దీపాలు ఆర్పివేశాడు?

వెనక జన్మంలో పున్నెం చేసుకొన్నాడేమో. అయితే దేవుడి మీద కూడ పెత్తనం చేసేది కర్మే కాబోలు. ఆ లెక్కలో దేవుడు దేనికి?

తన తెలివితేటలకు తాను దేవుణ్ణి వెక్కిరించేవాడా? వెంకయ్య భయంతో వణకిపోయాడు. క్షమించమని తనకు తాను చెంపలు వాయించుకొన్నాడు.

ఇంతకూ తాను చెయ్యవలసిందేమిటి? నిలువునా ఉన్న పొలం, గొడ్డుగోదా తెగబరికి అప్పులు తీర్చటమే. మాట దక్కించుకొని అప్పుల నుంచి బయట పడాలంటే అంతే. సరే.

అమ్ముతాడు. అమ్మిం తరువాత చెయ్యవలసిన పని? ఇద్దరు పిల్లలూ, తాను, తన భార్య. ఎలా పోషించటం! ఏ ఆసామి వద్దో జీతానికి కుదరాలి. పొలంచాకిరి తప్ప తాను చేయగలి గింది ఏముంది? పొలం లేనప్పుడు మరొక రైతు వద్ద తల తాకట్టు పెట్టుకోవలసిందేగా!

ఇంత బతుకు బతికి తాను తోటి రైతువద్ద జీతం ఉంటాడా? తాత ముత్తాతల నుంచి వస్తున్న పొలం అమ్మి బిడ్డలను బికారులను చేస్తాడా? తన తండ్రి అంత పొలం అప్పజెప్పింది అందుకేనా? అంత కన్నా ముక్కుమూసుకొంటే మూడుగడియలు పట్టదే.

వెంకయ్యకు అటు పొలమమ్మటానికి కాని, ఇటు ముక్కుమూసుకోటానికి కాని సాహసించ లేకపోయాడు. భగవంతుడనేవాడు వుంటే, వాడికి కనికరం లేకపోయిందా?

ఆ తెల్లవారుజామున పుల్లయ్యకు రాఘవులు కనిపించలేదన్న ఆతురతతో దొరను లెగ్గొట్టాడు. ఎక్కడికి కెళ్ళాడంటే ఎక్కడికెళ్లాడని యింటిల్లిపాది విస్తుపోయారు. చిట్టాడు ఆ హడావుడికి లేచి శ్లోకాలు మొదలెట్టాడు. వాణ్ణి సముదాయించేటప్పటికి లక్షువమ్మకు పెద్దలు దిగొచ్చారు. పుల్లయ్య కళ్లారచూస్తూ దొరను ఏమనలేకపోయాడు. లక్షువమ్మ భర్త సందకాడ తనకిచ్చిన యాభై రూపాయలు పులయ్య దోసిట్లో పోసి, "రాగవాయికి వచ్చిన పరవా ఏమిలేదులే," అని ఒకటికి రెండుసార్లు నమ్మకం చెప్పి సాగనంపింది.

ఆనాడు రెండుబారలు పొద్దెక్కిన తరువాత లాంతరు పట్టుకొని రాఘవులు ఇంటికివచ్చాడు.

"వచ్చాడమ్మా వచ్చాడే, రాఘవాయి వచ్చాడు. నాకు కాయకూడా తెచ్చిపెట్టాడు," అని చిట్టాడు గంతులు పెడుతూ వచ్చి తల్లి చేతికి తాటికాయ అందించాడు.

ఆమె దొడ్లోకి వెళ్లి చూచేతలికి రాఘవులు కడవలో నీళ్ళు తోడుకొని ముఖం కడుక్కొంటున్నాడు. "నీ మొగాన గుడ్డుమొలవ! యాడకెళ్లావురా?"

"పడమటి పొలాన నారుమడి ఎండిపోతుంటే, నీళ్ళు పెట్టటానికెళ్ళాను. మరిలాంతరు యెందుకు తీసుకెళ్లాననుకొన్నారు?"

"బాబు ముండాకొడుకు నీకోసమని దుంపలు దుంపలు చేసుకొస్తే మొగం తప్పిస్తావట్రా తప్పుడుగాడిదా?"

"ఏమన్నా అనండమ్మా. మీరనావచ్చు. నేను పడావచ్చు. చిన్న దొరను అనటంలా? మా బాబంటారా? ఈ పదేళ్ల నుంచి యీ బాబు ఏమయ్యాడు? రోగం వచ్చినా, నొప్పి వచ్చినా మీరు చూస్తూండారుకాని, ఆయనొచ్చి చూస్తుండాడా? చెప్పవేవమ్మా అలా చూస్తావు?"

"పుల్లయ్య మాత్రం ఏమన్నాడురా? నీ బాగుకోసమేగా చెప్పింది?"

"చాలు చాల్లెండి, మాబాగా చెప్పారు. వాళ్లకు కావలసింది నా బాగా? నా జీతం. నిజంగా నా బాగు కోరేవాళ్లయితే ప్రతేడు నా జీతం తీసుకెళ్లుతున్నారుగా. ఇప్పుడు

నాసొమ్మెంతుందో చూపించమనండి? అంతా తినేశారు. ఈ రోజున ఒక దమ్మిడీ కూడా లేదు."

"పిల్లల్ని కని పెంచటం దేనికిరా? ఏడుగడ అవుతారనేగా?"

"నిజమే, మీరు చెప్పినట్లు పెంచి పెద్దవాణ్ణి చేస్తే అలాగే. నా మంచి సెబ్బర మీరు చూశారు కాని, మావాళ్లేమన్నా చూశారా?"

లక్షువమ్మ వాదించలేకపోయింది. "అదికాదురా అలా మొగం తప్పిస్తే మీబాబు ఏమనుకుంటాడు? మేమేదో చెప్పి చేయించామనుకోడూ?"

"ఇందులో మీరు చెప్పిందేముంది? నిన్నపొద్దున్నే, "నేను రావటంలే"దని మాబాబు ముఖానే చెప్పేశాను. మిమ్మల్ని అనటానికి పనేముంది?"

"సరే ఎలాకావాలో అలాగే అవుతుందిలే. పొద్దెక్కింది. తొందరగా కానీ, రెండుముద్దలు తిందుగానీ."

రాఘవులు అన్నం తిని అప్పుడే మళ్లా అరక్కు వెళ్లాడు.

అతని ప్రవర్తనకు ఊళ్లోవాళ్లే కాదు, వెంకయ్య లక్షువమ్మలు కూడా విస్తుపోయారు. నాటినుంచి జీతగాళ్ల సంగతివస్తే రాఘవుల ప్రస్తావన రాకుండా వుండటం లేదు. ఆ ఆసామి మీద వాడికి అంత మమకారం దేనికి? అందరు జీతగాళ్లు అలా వుండరేం? అందరూ అలా ఒళ్లువంచి పనిచేయరేం? ఇవే వూళ్లో రైతులకు తీరని అంతర్జాతీయ సమస్యలు.

ఊళ్లో ఆసాములు తమ జీతగాళ్లను కూకలేసినప్పుడల్లా రాఘవుల సంగతి యెత్తే వాళ్లు. వాళ్ళుకూడా పుటికి పుటికి నాలుగు అడిగేవాళ్ళు. షరతులన్నీ గుదిగుచ్చి పెట్టే వాళ్ళు. వద్దు దంపమనగూడదు చద్దన్నం పెట్టగూడదు. చీటికి మాటికి తమ పెద్దల్ని తడవ గూడదు. ఏడాదికి జత కట్టుపంచెలు, జత పైపంచెలు ఇవ్వాలి. నెలకు సవాసేరు పొగాకు ఇవ్వాలి. అయినంత పని చేయించుకోవాలి కాని, ఆయినదానికి కానిదానికి చీవాట్లేస్తే లాభం లేదు. ఇలాంటివే యింకా ఒకటిరెండు షరతులుండేవి. రైతులు వాటిని పాటించిందీలేదు. జీతగాళ్లు రాఘవుల్లా పనిచేసిందీలేదు.

అయినా కాలవాహిని ఒక్క క్షణం కూడా ఆగలా. వర్షాకాలం వచ్చింది. మాగాని వూళ్ళు మొలబంటి బాడవలయ్యాయి. రాఘవులు చావట్లోనుంచి కదిలేవాడుకాడు. ఎప్పుడూ కట్టుపట్లు రొచ్చు కాకుండా పశువుల వుచ్చ కుండలోపట్టి బయటపారబోస్తూనో మేత వేస్తూనో వుండేవాడు. అన్నం తిన్న దగ్గర నుంచి నారపిడి, ఏగ్రా చావట్లోకి పట్టుకెళ్ళి పగ్గాలకు, ఎడ్ల సిగమోర్లకు చొప్పు పేనేవాడు. ఆ చొప్పు సవరగా వెండితీగలాగా వుండాలి. అందులో ఏమాత్రం వంక వచ్చినా సహించేవాడుకాడు. మళ్లా మొదలెత్తుకోవలసి వచ్చినా బద్ధకించేవాడు కాదు.

అతనికే అప్పుడప్పుడు అనిపించేది. తనకంతమోజు దేనికి? తాడు అందంగా లేకపోతే ఏమిపోయింది? పనిగడవటమేకదా ప్రధానం. కాని అతని మనస్సు ఒప్పుకొనేది కాదు.

ఆ గొడ్లు, వ్యవసాయం తనవి కాకపోయినా తానున్నంత కాలం సలక్షణంగా వుండాలి. అన్నట్లు ఆసామి తన్ను భరించలేనంటున్నాడుగా. ఎందుకన్నాడు? తన్ను గట్టిగా పొమ్మని చెబితే? ఆ ఎందుకంటాడు? ఆయనకు మాత్రం న్యాయం తెలీదా? ఇన్నాళ్ళు దొడ్లోవున్న మనిషిని ఎలా పొమ్మంటాడు? తాను ఒక్కడే ఆయనకు బరువవుతాడా? తనపిచ్చికాని ఎందుకు పొమ్మంటాడు?

వాస్తవం గుర్తించడానికి ఒప్పుకోని ఆ అమాయక హృదయం ఎన్నెన్నో మధురలోకాలు నిర్మించుకొంటున్నది. తనదొడ్డి కలకలలాడుతుండాలి. తన యెడ్లకు పోటీవచ్చేవి ఆవూళ్లేనే కాదు చుట్టుపక్కల వూళ్లలోకూడా వుండరాదు. తాను సేద్యంచేసిన పొలం ముప్పందు చొప్పున రావాలి. ఈయేడు ఒకటికి రెండుసార్లు దమ్ముచేసి మొక్క వేశాడు. దుబ్బుకూడా బాగానే చేస్తున్నది. జాయగా వుంటే ముప్పందుం రాలుతుంది. అందులో ఢోకాలేదు. అయినా విశాఖ చూడొద్దూ? అది కొంప తియ్యకుండా వుంటేగదా?

కాలం సవ్యంగా సాగాలనీ, తాను చేస్తున్న చేలు (ఆసామివే అయినా) బాగా పండాలనీ లోలోన వేయిదేవుళ్ళకు రాఘవులు మొక్కుకొంటున్నాడు. అంత మమత అతనికెలా ఏర్పడింది? దీనివల్ల అతనికి వచ్చే లాభమేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం శాస్త్రవేత్తలు చెప్పుకోవలసిందే.

వర్షాలతోపాటు వెంకయ్య కుటుంబానికి మంచిరోజులు కూడా వెనకబట్టాయి. వియ్యంకుడు తన కొడుకు కట్నం తాలుకు రావలసిన 68 వందలకు రిజిష్టరు నోటీసిచ్చాడు. ఊళ్ళోషావుకారు 1608 రూపాయలు ఆ నెలలో కడితే గాని వీలులేదని నిలవేశాడు. గొల్లది తనకు రావలసిన 75 రూపాయలకు లక్షువమ్మ చుట్టూ తిరిగి పోతున్నది. నాటి నుంచి లక్షువమ్మకు సూర్యచంద్రుల గతి సక్రమంగా లేదనిపించసాగింది.

వెంకయ్య కూడా ఉబ్బసపురోగినీ, శ్లేష్మంలో పడ్డ ఈగను చూచి కూడా ఈర్షపడవలసి వచ్చింది. పొరపాటున రాత్రి యేరెండు జాములకో ఒక కునుకుపట్టినా, ఋణదాతలు ప్రత్యక్షమై మా సంగతి ఏమిచేశావంటే మా సంగతి ఏమి చేశావని యమదూతల్లాగా పొడిచేవాళ్ళు. వాళ్ళపోటు తప్పించుకొన్నా గొల్ల దుర్గి వూరుకొనేది కాదు. "ఇది కూడా నీ నెత్తినే కొట్టుకో," అని పెరుగుదుత్త అతని మాడున ఎత్తికొట్టినట్లయ్యేది.

ఈ బాధ భరించలేక వెంకయ్య నిక్షేపం వంటి ఎనిమిదెకరాల రేగడ డెబ్భై అయిదు వందలకు రెండోవాడు వినకుండా సూరయ్యకు అంటగట్టాడు. నిలవున్న 11 పుట్ల ధాన్యం నాలుగువందలకు తెగబరికాడు. అయినా ఆరువందల దాకా చిల్లరబాకి ఇంకా అలాగే మిగిలింది. వెంకయ్యకు ఇంకా చెర వదలలా. ఒక నాడు రాత్రి ఆవుల్ని, ఎడ్లను అమ్ముతానని భార్యతో చూచయగా అన్నాడు.

"ఇంకా నయం, రేపు బిడ్డల్ని కూడా అమ్ముతామంటారు. అమ్మరూ మరి!" అంది లక్షువమ్మ.

"బాకీల తొందర యెక్కువైతే యేమి చెయ్యను?"

"ఏమన్నా చెయ్యండి కాని, గొడ్లను మాత్రం అమ్మొద్దు... అంతగా అయితే ముందు పంట కల్లాల్లో తీర్చుకోగూడదా?"

"రేగడచేను అమ్మేస్తే యింకా యెన్ని వందల పుట్లొస్తా యనుకొంటున్నా?"

లక్షువమ్మ వెంటనే మాట్లాడలేకపోయింది.

"ఈనాడు అమ్మినపొలం మూడేళ్ళనాడే అమ్మితే ఇంత బొందన పడేవాళ్ళం కాదుగా" భార్య ముక్కు చీదుకున్నది.

"కర్మ యిలా నెట్టుకొస్తుందని ఎవరనుకొన్నారు? పంట మీద బాకీలు తీరుతాయను కొన్నాను".

"ఇంతకూ మాకర్మ అలావుంటే మిమ్మల్నని పనేముంది?" లక్షువమ్మ పైటకొంగుతో కళ్ళొత్తుకొన్నది.

వెంకయ్య ఈ దుస్థితికి కారణం తన కర్మే ననుకొని, నెపం అంతా దానిమీదనే పారేసి నిశ్చింతుడయ్యాడు. కాని లోకం అంతటితో వదులుతుందా?

ఓడంటే అంతా ఓడేనంటారు. పొలమమ్మిన సంగతి పొక్కగానే బాకీదారులు మరీ తొందర పెట్టసాగారు. ఎన్ని అప్పులు లేనిదే ఎనిమిదెకరాల పొలమమ్ముతాడు? అప్పులు తీరిపోయేటట్లుంటే అంతచాటుగా అమ్మవలసిన పనేమి వచ్చింది? తప్పకుండా ఎంతో అప్పు ఉండి వుండాలి. ఈ వూహ తట్టగానే ఋణదాతలు మరీ రేగారు.

దానితో ఆసామికి నిప్పులమీద పొర్లాడుతున్నట్లయింది. ఒక రోజున ఎడ్ల బేరగాళ్ళు వస్తే 350 రూపాయలు పుచ్చుకొని ఎద్దునూ, గిత్తనూ, తల తాళ్లతోనే తోలిపెట్టాడు. చొప్ప తేవటానికి ఇంట్లోకి వెళ్ళితే లక్షువమ్మ పడనిస్తుందీ? అందువల్ల దొడ్లోవాళ్ళను దొడ్లో నుంచి గుప్పుడు చప్పుడు కాకుండా పంపించి వేశాడు.

పచ్చిగడ్డి తేవటానికి వెళ్ళిన రాఘవులు ఆనాడు మోయరాని మోపు వేసుకొని చెమటోడ్చు కొంటూ ఆలస్యంగా వచ్చాడు. వచ్చి మేత వేదామని పోతే యెడ్లు లేవు. అతని గుండె గుభేలుమంది. అవి ఎప్పుడన్నా ఊడదీసుకొన్నా దొడ్డి వదలిపోయే మచ్చుకాదు. ఇక ఆసామికి యెక్కడన్నా మొగమోటం ఉంటుందేమోకాని ఎడ్ల దగ్గర మాత్రం ఉండదు. ఒకవేళ అంతగా కాదనటానికి వీలులేకపోతే రాఘవుల్ని యిచ్చి తోలిపెట్టేవాడు.

ఎద్లు నేడేమైనట్లు? తొందర పనివుండి దొరే బండికట్టుకు వెళ్ళాడేమోనని రాఘవులు చూచాడు. బండి, చిరతలు చావట్లోనే వున్నాయి. నాగలి, పట్టెళ్ళు వారెణ కూడా ఎప్పటి చోటనే వున్నాయి. గొడ్లు పచ్చిమేత కోసం తాళ్ళు లాక్కొంటూ గందరగోళం చేస్తున్నా, అతడు గబగబా లక్షువమ్మ దగ్గరకు పరుగెత్తు కెళ్ళి, "ఎద్లు ఎవరు తోలికెళ్ళారు?" అని అడిగాడు.

"చావిట్లో లేవురా?"

"లేవే"

"మీ దొర బండి కట్టుకెళ్ళాడేమో".

"బండి చావిట్లోనే వుంది". రాఘవులు కాళ్ళీడ్చుకొంటూ వెళ్ళి దొడ్లో నడిమధ్య చతికిల బడ్డాడు.

లక్షువమ్మ కూడా చేతిలోని పాలచెంబు దాయతాడు నట్టింట పడేసి, "ఎద్లున్నాయటరా?" అంటూ ఆదరాబాదరా దొడ్లోకి వచ్చింది. సూదైతేగా ఉన్నా కనిపించకపోవటానికి?

"ఎద్లు ఎక్కడికో తప్పించుకు పోయాయని మీ నాన్నను పిల్చుకు రారా," అని అప్పుడే వచ్చిన పెద్ద కొడుకును పంపించింది.

"నాన్న లైబ్రరీ అరుగువద్ద లే"దని కొడుకు వెళ్ళివచ్చి చెప్పాడు.

అంతలో బాగా చీకటి పడ్డది. లక్షువమ్మ తిల్లికపెట్టి చిట్టాడికిపాల చెంబు, దాయతాడు ఇచ్చి రాఘవుల్ని దూడ నిడవమని చెప్పి పంపింది. జీతగాడు చావట్లో బండికింద గడ్డి పనమీద పండుకొని మాట్లాడలేదు. లక్షువమ్మ కూడా వచ్చి బ్రతిమాలింది. కోపపడ్డది. లాభం లేకపోయింది. పెద్దకొడుకును విడవమన్నది. వాడు తనవల్ల కాదన్నాడు. ఆడుది తానెలా ఆవుపాలు తీస్తుంది? భర్త కోసం ఎదురుచూచింది. ఎంత సేపటికి రాలేదు. ఆవు, కోడెదూడ దొడ్డి దద్దరిల్లేట్టు అరుస్తున్నాయి.

లక్షువమ్మ మనస్సు కటకట పడ్డది. చివరికి తెంపు చేసుకొని తానే దూడపలుపు తప్పించి రాఘవుల్ని అన్నానికి పిలిచింది. వాడు కదల్లా మెదల్లా. పెద్దకొడుకును పిలిచింది. వాడు మొదట్లో బెట్టుసరి పోయినా, చివరికి ఎలాగైతేనేం రెండుముద్దలు తిన్నాడు. నిద్రవస్తున్నదని చిట్టాడు తొందరించాడు. పక్కగుడ్డల కోసం గదిలోకి వెళ్ళితే మంచముమీద భర్త ముసుగు పెట్టుకొని మూలుగుతున్నాడు.

పక్కగుడ్డలు పట్టుకెళ్ళి యిద్దరి కొడుకులకు వక్క వేసి పండుకోమని లాంతరుతో గదిలోకి వెళ్ళి "సుస్తిగా వుందా ఏమిటి?" అని భర్త కణతల మీద చెయ్యి వేసింది. ఆమె వేళ్ళమీద వెచ్చని నీళ్ళు పడసాగాయి. ఆమె వులిక్కిపడింది.

"జ్వరం వచ్చినట్లుందే!"

లేదని వెంకయ్య మూలిగాడు.

"సరే, అన్నీ బాగానే కుదిరాయి. ఎడ్లుకూడా ఎక్కడికో తప్పించుకు పోయాయి."

ఉండి వుండి, "నేనే అమ్మివేశాను," అని వెంకయ్య నిట్టూర్పు విడిచాడు.

లక్షువమ్మ కొయ్యబారి కాసేపు అలాగే నిలుచున్నది. ఆమె నోటి నుంచి పల్లెత్తుమాట రాలా. తరువాత ఆ లాంతరుతో చావట్లోకి వెళ్ళి రాఘవులకు దూరంగా చతికిలబడి, "ఎడ్లను మీదొరే అమ్మాడట," అని చెప్పింది.

రాఘవులు ఉలకలా, పలకలా. అతని చూపులు వాసాలు చూస్తున్నాయి. లక్షువమ్మ ముక్కుచీదుకొంటూ కుటుంబ స్థితిగతులు, బాకీల సంగతి అంతా పూసగ్రుచ్చినట్లు చెప్పింది.

"ఆయన మాత్రం ఏమి చేస్తాడురా, మాకర్మ అలా వుంటే? మా పాపం బద్దలైంది. నువ్వు మాత్రం ఎలా అడ్డుపడుతా? లే, మా నాన్నగా, లే; రెండుముద్దలు తిందుగాని. పగలల్లా రెక్కలిరుచుకొన్నావా, ఎంగిలి పడపోతే తెల్లారిపాటికి శోషవొస్తుంది. లే అమ్మా లే?"

"నా కర్మకు మాత్రం మీరేమి చేస్తారులెండి," అన్నాడు రాఘవులు.

లక్షువమ్మ ఎన్ని చెప్పినా రాఘవుల్ని తిండికి పిల్చుకెళ్ళలేక పోయింది. ఆమె కూడా తిండి సయించక దిగులుతో చిట్టాణ్ణి ఎదురుబార కదుముకొని పండుకొన్నది.

ఆ రాత్రి రాఘవులకు శివరాత్రి అయింది. గత జీవితమంతా అతని కళ్ళముందు సినిమా ఆడింది. ఇంతకాలం తాను ఎంకయ్య దగ్గర ఎందుకుంటున్నాడు? ఇన్నేళ్ళ నుంచి చెమటోడ్చి పోస్తున్నాడే? దానివల్ల ఏమి వచ్చింది? ఆసామన్నా బాగుపడ్డాడా అంటే అదీలేదు. తనకేమన్నా మిగిలిందా? లోపలి ప్రేవులు మాత్రం బేవు బేవుమంటున్నాయి. అయితే యీ చాకిరి దేనికి? మరొక రైతు దగ్గర చేస్తేనో? ఇంతకన్నా వచ్చేదేముంది? అయినప్పుడు యీ చేటెరుగనిపాటు దేనికి? కడుపుకోసం. కేవలం పొట్టకోసమేనా? అందుకోసమేనా తాని న్నాళ్ళు బ్రతికింది? ఇలాంటి బ్రతుకు బ్రతకకపోతేనేమి? ఏ దేవుడేడ్చాడు?

ఇంతకూ తాను కోరుతున్నదేమిటి. ఎడ్లూ వ్యవసాయమేగా? అందులో సందేహం లేదు. తానింత కాలం మేపి పని కలవార్చిన గిత్తపోయిందనేగా యింత కటకట పడుతున్నది? కాబట్టి తనకు ఎడ్లు, చేతి నిండా వ్యవసాయం సలక్షణంగా వుంటేచాలు. దానితో తాను సంతృప్తి పడగలడు. తన జీవితం సుఖంగా వెళ్ళమారిపోతుంది. తన రెక్కలు, స్వాతంత్ర్యం అమ్ముకొన్నా యివి ఎందుకు దక్కటం లేదు?

రాఘవులు కూడా దీని బాధ్యత కర్మమీదనే వేశాడు? కాని ఇంత కాలం నించీ అతన్ని బంధించి ఉంచిన బంధనాలు అతనికి తెలియకుండానే కోసివేయబడ్డాయి. పోతే ఇక వాడు ఇక్కడే ఎందుకు ఉండాలి?

ఆ రాత్రి అతనికి కునుకుపట్టలా. ఆలోచనలతోనే తెల్లవారింది. లేచి కాలకృత్యాలు తీర్చుకుని, ఉతికిన గుడ్డలు కట్టుకొని, విడిచినవి మూటకట్టి ములుగర్రకు తగిలించుకొన్నాడు. నేరుగా వెళ్ళి లక్షువమ్మను పిలిచాడు. ఆమె వెంట పెద్దదొర, చిన్నదొర, చిట్టాడు దొడ్లోకివచ్చి రాఘవుల వాలకంచూచి కొయ్యబొమ్మల్లాగా నిలబడ్డారు.

“వెళ్ళుతున్నానమ్మా!” అని రాఘవులు తలవంచుకొన్నాడు.

“యాడకిరా?” లక్షువమ్మ విస్తుపోయి అడిగింది.

“ఇంతవరకు ఫలానిచోటికని అనుకోలేదు”.

“మీ బాబు దగ్గరకు వెళ్ళుతావా?” అన్నాడు వెంకయ్య.

“పోను”.

అతని ధోరణి చూచి ఎవరూ మాట్లాడలేకపోయారు.

“అయితే అన్నంతిని పోరా, రాత్రికూడా తినలేదు” లక్షువమ్మ అడ్డు తగిలింది.

అంతలో కోడెదూడ చెంగనాలు తీసుకొంటూ వచ్చి రాఘవుల గోచి చెంగు పట్టుకున్నది.

“వద్దులేండి, ఆ మాటే చాలు”.

“బాబూ నామాట వినరా”. లక్షువమ్మ రాఘవుల గడ్డం పట్టుకొన్నది.

“కాదులేండి, వస్తాను”. రాఘవులు దూడ నోట్లోనుంచి పంచె కొంగు లాక్కొన్నాడు.

చిట్టాడు బావురుమన్నాడు. కోడెదూడ అరిచింది. దానితో దొడ్లో ఆవులన్నీ ఒక్కసారిగా అంబా అన్నాయి.

అయినా రాఘవుల కాళ్ళకు పశువుల అరుపులు నాడు బందాలు వేయలేకపోయాయి.

✡

# ఎక్కడో - నిశ్శబ్దంగానే

**–కాశీభట్ల వేణుగోపాల్**

విప్లవమెప్పుడూ విస్ఫోటంతో మొదలుకాదు...

నిశ్శబ్దంగానే...

చల్లగానే...

చీకటి నీడల్లోనే...

ఒక గుండె ఆక్రోశం నించీ...

రెండు కళ్ళ తడినించీ...

ఒక బతుకుమంట నించీ... నిశ్శబ్దంగానే...

చీలిన బండల సందుల్లోంచి... చిన్న చిన్నగా వూటలాగా స్రవిస్తూ...

ఓ మహాప్రవాహమెప్పుడూ ఓ చిన్న పాయగానే మొదలయ్యేది... విప్లవమెప్పుడూ విస్ఫోటనంతో మొదలు కాదు...

"సుబ్బారెడ్యాకి పాయ మామా?"

"గుడికాటికి... పన్చాయతన్జెప్పి పాయ।"

"యెవులది పన్చాయతి?"

"గుర్రెడ్డోల్లదంట... గుడ్డేసోపు పెండ్లం... దానికొడుకూ గుంత దిగుమార రెండెకరాలిడ్స కుండున్నరంట... దాని కోసరానికి పన్చాయతంట"

"మాదిగోని పొలానిగ్గూడ పంచాయత్లు గావ్సిన దినాలొచ్చినయ్ దీనేమ్మ... ఒగ రెండెయిలు ఎక్కువ వార్నూకమన్జెప్పల్యానా గుర్రెడ్డి బావోల్లకు?"

వూరి నుంచి వచ్చిన లింగారెడ్డికీ... ముసలెంకట్రెడ్డికీ మధ్య జరుగుతున్న సంభాషణది...

"రెండెయిలేంది లింగార్డీ... నాలుగెయిలు ఎక్కవిచ్చానన్నాడు గుర్రెడ్డి...

అస్సలు మేం అమ్మేదిల్యా.... మా పొలాలల్ల మేమే సేద్దెం జేసుకుంటలేమా... మాకమ్మనీకె అస్సల అవుసరం ల్యా అనా మాదిగా మారెక్క.. దాన్కొడుకూ బిర్రున బిగదీసుకన్నారు"

"యేంది వెంకరెడ్డి మామా... బుద్ధి పుట్టెరిగిన కాన్నించీ సూల్యా సూడిది... సింతసెట్టు గట్టి మక్కెలిరగదెంగితే మాటిండా ఆ నా మాదిగ నా కొడుకూ.."

దిలాసాగా కాళ్లు నీలిగించి సిగరెట్ పెట్టెతీసి తానోటి వెలిగించుకొని ముసి లెంకట్రెడ్డి కోటిచ్చి అన్నాడు లింగారెడ్డి...

"ఆ దినాలు బోయినయ్ రోయ్ లింగార్డీ! మాలోడా! మాదిగోడా అనిబిల్చే దానికేల్యా... ఎస్సెస్టాచ్చినెంక (S.C. S.T. Act) ఉచ్చుల్పోసుకోన్చ స్తాన్యారుమన్నా కొడుకులెల్ల"

ఎద్దుల కొట్టం దగ్గర జొన్నచొప్ప నొరుకుతూన్న పిల్లి కండ్లోడికి గుండె రగుల్తోంది వాళ్ల మాటల్వింటోంటే...

వాడి చేతిలో చొప్పుననరుకుతూన్న కత్తి వాడి ఒంట్లో వేడికి పదునెక్కుతోంది.

పిల్లి కండ్లోడనబడే మాదిగ బజారన్న తండ్రీ... రెడ్ల ఫ్యాక్షననబడే యుగాల తగాదాల్లోతల నరకబడి చంపబడ్డ గుడ్డి ఏసోబూ అన్నదమ్ముల బిడ్డలూ... ఏ సోబు చనిపోయిం తర్వాత అతని భార్య మారెమ్మ వున్న రెండెకరాల్లోనే సేద్యం చేసుకుంటూ ఒక్కగానొక్క కొడుకు ఏసుపాదాన్ని ఇంటర్ వరకూ చదివించింది... ముట్టింటినే రాయి రాయి పేర్చుకుంటూ తిరిగీ కట్టుకుంది.... ఏసుపాదం దిగులుపడి పోలేదు... ప్రభుత్వమిచ్చే రాయితీల్తో ట్రాక్టర్ కొని... కాంట్రాక్ట్ పనులకి తిప్పుకోవడమే కాకుండా... చిన్నా చితకా సబ్ కాంట్రాక్టులు కూడా తీసుకున్నాడు... అతను నగరంలోనే కాపురం... మారెమ్మ పల్లెలోనే వుంటుంది. ఇప్పుడున్న స్థితికి రావడానికి మారెమ్మ యెంత యాతన పడిందో... యెంత అసహ్యాన్ని చూసిందో మోసిందో ఆమెకే తెలుసు...

పిల్లికండ్లోడనబడే బజారన్నకూ తెలుసు.... పల్లెల్లో మతం మార్పిళ్ల వల్ల మిషనరీలేమైనా బాగుపడ్డాయేమోగానీ, మాలా మాదిగల జీవితాల్లోని హైన్యాన్ని మాత్రం తొలగించలేక పోయాయి... క్రిస్టియానిటీలో కులాల ప్రసక్తే లేదుగదా అనే వాళ్ళు కరువైయ్యారు... ప్రభుత్వాల అప్లికేషన్లలో కూడా కులం క్లాసు పక్కన రాయడానికి ఈ రాజ్యాంగంలో రోజుకో కులం కలుస్తూనే ఉంది మొలుస్తూనే ఉంది.

దమన రీతుల్లో ఈ రోజుకీ సజీవ శిలాజాల్లా వేల పల్లెలున్న మహాదేశమిది.

నగర యాంత్రిక జీవితంలో...

ఎవరు ఎవరో తెలుసుకునే అవసరాలు లేక... ఇరుగు పొరుగు కూడా యాంత్రిక అనామకత్వంలో బతుకులు వెళ్లదీయడం చూసిన ఏసుపాదానికి... నగరంలో అనామకంగా బతకడంలోనే కొద్దిపాటైనా ఆనందముందనిపించేది... పల్లెలో తనకున్న పాడు గుర్తింపు అతన్ని వేధిస్తుంది.

ఇల్లూ, పొలమూ అమ్మేసి వచ్చేయమని తల్లిని అడిగాడు కూడా.... కానీ యిప్పుడు నిర్ణయం మార్చుకున్నాడు....

ఇప్పుడున్న ఆ రెండెకరాలూ రెడ్లకు కావాలి... దాని కోసం... మిమ్మల్ని ఏడిపించో, హింసించో... లేదూ తీవ్రంగా అవమానించో మిమ్మల్ని వూరు వదిలేట్లు చేస్తారు.. నా మాట విను... నువ్వు వూరొదులు కానీ వాళ్లకా భూమి మాత్రం అమ్మొద్దు అని పిల్లికండ్లోడు చెప్పిం తర్వాత.. ఆలోచించాడు ఏసుపాదం... మొన్న పల్లెకొచ్చినపుడు పిల్లికండ్లోడు చీకట్లో చెరుబుగట్టు మీద కూర్చోబెట్టి "వర్యయేసా! నువ్వు వున్న్య కాడికి అమ్మి పార్నాకి వూరిడ్సి పోతవ్... గింతప్పటి కాన్నించీ నిన్ను నా సొంత తమ్ముణ్లెక్క జూసుకున్న్యా... నా కోసరానికి నువ్వేమీ చేస్తలేవని గాదుగానీ... నీకోసం గజ్జెప్పాలాయేసా! సిన్నెమ్మ నన్ను కడుపున పుట్న్యకొడుకు లెక్కనే సాకింది... నీ కంటే ముందుగాల్నించీ యిసయాలన్నీ నేను తెల్సుకున్న్యా తమ్మా! సిన్మె యెన్ని యాస్టల బడిందో నీకంటే నాకెక్కవ దెల్చు... పీదిని పిడకలేరి నిన్ను సదివిచ్చె... గిసింతకూ.... గసింతకూ... మాదిగముండా! మాదిగ లంజాంట పిల్పిచ్చుకునే... గీ ముసిల్లంజెకొడ్కు యెంగ్రిట్రిడ్డినా బట్ట... యాడ్సక బొయ్య కల్లాలల్ల సిన్నెమ్మ నెన్నిసార్లు.. నాతోనిగా దురా యేసా చెప్పన్యీకే... నేనా కతలెల్ల జెప్పలేను... నువ్వు సేను అమ్మగాకు... గాలంజెకొడ్కులు సంపుతమన్నాసరే... సేనమ్మగాకు నీకింకా పెదిన్ని సంగతుల్దెల్చాల"ని పిల్లికండ్లలోంచి ఎర్రటి కన్నీళ్లు కారుస్తూ బజారన్న చెప్పిన విషయాల్విని పొలం అమ్మకూడదని నిర్ణయం చేసుకున్నాడు ఏసుపాదం.

ఆ రాత్రి చాలా సేపు చర్చించుకున్నరన్న దమ్ములిద్దరూ... చివరికి ఏసు చెప్పిన విషయాన్ని విస్మయంతోనూ... ఆనందంతోనూ కృతజ్ఞతతోనూ అంగీకరించాడు బజారన్న....

✡

విప్లవమెప్పుడూ విస్ఫోటంతో మొదలుకాదు...

దానికి తుపాకులు తూటాలే కావాలని లేదు...

✡

"వర్యా బిలికండ్లోడా! సొప్ప నరికినెంక మచ్చలకోల్ల రెండూ గోయ్... మా లింగార్డి సియ్యల్యాకపోతే బువ్వదిండు"

ముసిలెంకట్రెడ్డి ఫర్మానా...

వెనక దొడ్లో గింజలేరుకు తింటూన్న కోళ్లు అమాయకంగా కనిపించాయి.

పిల్లికండ్లోడికి... వాటి పీకలు కోసి ఈకలు పీకి గంపకెత్తుకున్నాడు.... దిబ్బ మీద ఈకలు చల్లేసివస్తూ లింగారెడ్డి మాటలు విన్నాడు...

"అవే మామా! గా ఏసోబు పెండ్లాన్ని పెదెన్నిసార్లు పొయ్యిన్యావ్‌గదా నువ్వు...? దాన్ని పిలంపిచ్చి సెప్పొచ్చు గదా... గుర్రెడ్డోలకాసెక్క అమ్మెయ్యే అని... యినకబోతే మొగుడ్నచ్చి ముండ మోసింది... వున్న్య అనాకొడ్కున్గాడ లేప్పార్నాకుతామని"

"కోడిని గొయ్యకూడ రాదినా కొడ్కుకు సంపతాంట... సంపమను... సంపితె గింపితె ఇంగ నన్ను సంపాయిల్సిందే యినా రెడ్డినా... లు" కసిగా అనుకున్నాడు బజారన్న.... అతడి పిల్లికండ్లు పులికళ్లలా మెరుస్తున్నాయి.

పంచాయితీనించీ సుబ్బారెడ్డి వచ్చాడు... వస్తూనే లింగారెడ్డిని చూచి "ఎప్పుడొచ్చివ్రో లింగార్డీ.... యెంసెట్ల మంచిర్యాంకు గొట్టిచ్చివి కొడుక్కి యంత కర్సాయ?" అన్నాడు.

"నెల్లూరోంది ర్యాంకు గ్యారంటీ కోచింగుల్యాయనా సుబ్బార్డీ... యాభై అంతే... అవ్ పంచాయతేం జేచ్చిరీ?"

"సోమవారానికి మల్ల సిటింగు... తెగేదిల్యా... తెల్లారేదిల్యా... ఫ్చ్... ల్యాలే లింగార్డీ మన సేతులకెల్లిపాయ... మన కమాండ్ల లేరినా కొడ్కులు... కుత్తలు బల్సినయ్... వర్యా తర్యా అన్నీ కెగూడల్యా దీనెమ్మ... గవర్మెంటుం...గా" అని బూతు తిట్టు తిట్టి "గుర్రెడ్డోల్లు రెండూ మూస్కోని గమ్మునుంటే మేలు సూడ్నాయినా...." అని తండ్రితో అన్నాడు.

వాళ్ల సర్వస్వం యెవరో దోచేసిన భావన వాళ్ల మొహాల్లో.

✡

విప్లవమెప్పుడూ విస్ఫోటించదు... నిశ్శబ్దంగానే... నీడల్లోంచే... ఓ మహాప్రవాహమెప్పుడూ ఓ చిన్న పాయగానే మొదలౌతుంది.

విప్లవం ఎక్కడా విస్ఫోటంతో మొదలు కాదు...

✡

సోమవారం... గుడి దగ్గర పంచాయతి...

గుర్రెడ్డీ... గుర్రెడ్డి మనుషులూ... సుబ్బారెడ్డి... మాజీకరణం బాపనయ్యా... పనీపాటా లేని ఇంకొందరూ కూచునున్నారు...

మారెమ్మ రాలేదు...

ఏసుపాదం రాలేదు...

అసహనంగా కోపంగా వున్నారు పెద్దమనుషులు...

చాలా సేపటికి బజారన్న వచ్చాడు...

"ఏంరా... యెంచేపు సూడాల్రా? మేమల్లా వచ్చి గంటైపోయ నీ తమ్ముణ్నీ సిన్నెమ్మనీ తోల్కరాపో"రంకెలేసాడు గుర్రెడ్డి...

"వాల్లు రారు రెడ్యా... కర్నూలు కెల్లిపొయిన్యారు.... ఆగుంతకింద రెండెకరాల్సెక్క నా పేర్న రాయిచ్చిన్యాను... గో కాయితాలు" అని తువ్వాల్లో చుట్టిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నకలు తీసిచ్చాడు... వాళ్లు ఊహించనిదది... ఏసుపాదం కర్నూలులో సెటిలైపొయ్యాడన్న విషయాన్ని ఊతంగా తీసుకుని... వాళ్లూ రొదిలేట్టు చేస్తే... ఆ రెండెకరాలూ కలిపేసుకోవచ్చు... అన్న వాళ్ల వ్యూహం బెడిసికొట్టింది...

ఓటమి.. అవమానం...

"అవే రెడ్యా పెదరెడ్డోల్లగ్గాడ ఈ యేటికే నేను జీతానికుండేటిది... ఇంగా యెన్నాల్లు జీతానికుంటవ్రా బజారో...? పెల్లి జేసుకోవా...? తినాకుడవా ఆబగమంతుడు మాకింతి చిన్న్యాడు... నువ్వీసేను జేసుకుంట సుకంగుండ్రాంట మా సిన్నెమ్మ... తమ్మీ... ఇవి నా పేర్న రాసిచ్చి పాయిరి రెడ్యా."

మరింత అవమానం... జీతగాడు రైతవుతున్నాడు.

అందరి భీకరమైన చూపుల్ని పట్టించుకోకుండా...

పెదవుల మీద చిర్నవ్వు... కళ్లలో మెరుపూ... భూజమ్మీదికెక్కికి తువ్వాల్తో అక్కడ్నించీ చిన్నగా కదిలాడు బజారన్న....

✡

నిజమే విప్లవమెప్పుడూ చిన్నపాయగానే మొదలౌతుంది.

✡

# నదీ కె పాల్

**–శశిశ్రీ**

మొదీన్ బాష ఆయన కొడుకు చాంద్‌బాష బ్రిడ్జీపై నడుస్తూ పోతున్నారు. అది సిద్దవటం పెన్నానదిపై బ్రిడ్జీ.

కర్బూజ తోటలు... పెన్నానది ఇసుక పఱ్ఱల్లో నిండుగా వున్నాయ్. కడప జిల్లాలో పెన్నానది యిరువైపుల ఇసుక తిన్నెల్లో కర్బూజ, కలింగరి తోటలు ఏడాదికి ఒకసారి పెంచుతారు. ఎంత తక్కువన్న లక్ష ఎకరాల్లో సాగు చేస్తారు.

పేదోళ్ళ సేద్యం – ఏటి ఇసుక సేద్యం. దళితులు, సాయిబులు ఎక్కువగా ఈ దోస తోటలే సాగు చేసుకుంటారు.

పెన్నలో నీళ్ళు తగ్గి – ఇసుక తిన్నెలు బయలు పడ్డాకే – వూరంతా ఒక చోట చేరి ఎవరెవరి స్థోమతను బట్టి ఇసుక నేలను పంచుకుంటారు. డెబ్బయ్ రోజులు కష్టపడితే రెండు మూడు నెలలు కాపు కళ్ళ చూసే వీలువుంటుంది.

మొదీన్ బాష ఈ మారు – పదివేల చెట్లు సాగుచేస్తున్నాడు. ఈసారి రోగాలు పెద్దగా పంటను ఆశించలేదు. దీన్తో తోటలు ఆకుపచ్చరగా – చెట్టుకు అయిదారు కాయలేసి – మిసమిస లాడుతున్నాయి.

బ్రిడ్జి పక్కనించి – ఏట్లోకి వున్న దిగుడు మెట్లు దిగి – పల్చగా ప్రవహిస్తున్న పెన్న జాలులోంచి – తపతపలాడిస్తూ తోటవైపుకు నడుస్తున్నారు. ఏట్లోని జాలులో వూరిపిల్లలు ఇసుక దందుచేపల్ని చేతుల్తోనే పట్టి ప్లాస్టిక్ సంచుల్లో వేసుకుంటున్నారు.

"ఏందిరా అబ్బి! నిన్నటికి ఈ రోజుకి ఏట్లో ప్రవాహం పెరిగినట్లుందేం. మైలవరం నించి నీళ్ళేమైనా కిందికి వదిలినారో ఏమో కదా!?" కొడుకుతో అడిగాడు.

"పెన్నేట్లో దోస చెట్లు ఎండి పోతున్నాయ్. మైలవరం డ్యాం నీళ్ళు యిడ్సి – పంటను కాపాడాలని పేపర్లో వార్తలొచ్చినాయి కదా! అందుకేమైనా కొద్దిగా యిడ్సి వుంటార్లే నాయనా?" జవాబు చెప్పాడు.

“ఆ! అవ్ అవ్... నేనూ విన్నాన్లే... అదే అయి వుంటుంది. ఏట్లో నీళ్లు చూసి చూడంగానే భయం వేసిందిరా అబ్బి! ఈ మాత్రం నీళ్లు యేట్లో పారుతుంటే చాలు –దోసకాయలకు ఢోకా వుండదు” సంతృప్తిగా అన్నాడు మొదీన్ బాష.

“నాయనా! ఇసుక దందుల్ని తీసుకుని పోయి – మధ్యాహ్నం సంగటిలోకి కూర చేయించు కుంటామా? వాళ్లని అడిగి – అయిదు రూపాయలకు తీసుకొని పోయి ఇంటికాడ యిచ్చి వస్తా” వుత్సాహంగా అడిగాడు చాంద్‌బాష.

“సర్లే. తీసుకునిపో” పరధ్యానంగానే చెప్పి ముందుకు సాగాడు.

దోసతోటకు వేసిన కటవ కంతదగ్గర కంప మండను పక్కకు తీసి – లోనికి పోయి – మళ్ళీ దారి మూసేసినాడు మొదీన్ బాష.

కర్బూజతోట ఇసుకసార్ల నించి కాపుకాసేందుకు వేసుకున్న నేలగుడిసె దగ్గరికి నడుస్తున్నాడు.

ఆడకూలీలు గుడిసె దగ్గర పనిలో వంగే ముందర – ఇళ్ళకాడ్నించి తెచ్చుకున్న సద్దన్నాలు తింటూ గోలగోలగా ముచ్చట్లు ఆడుకుంటున్నారు. మొదీన్ బాషని చూసి సద్దు మణిగినారు.

“ఏమ్మా... ఎంత మంది వస్తిరి!?” గుడిసె బయటికి మంచం లాక్కుని కూర్చుంటు అడిగాడు.

“పది మంది వచ్చినాం సామి” అందొక కూలి.

“నేను రమ్మంది పదహైదు మందిని కదా! మాటేలకంతా లారీకి ఎక్కించాల కాయలు! తక్కువమంది వస్తే ఎట్ల సచ్చేది? అదే పనిగా, ఎస్.రాజంపేటకు రాత్రి వచ్చి చెప్పి పోయింది దేనికని...” కొంచెం అసహనంతో అన్నాడు.

“మావూర్లో వాళ్ళు కూడా దోసతోటలు పెట్టుకున్యారు కదా స్వామి! వాళ్ళకు కూడా కోతలే. నిన్ను పోగొట్టు కోలేక – వూర్లో మా వాళ్ళని కాదన్లేక ఆడికి కొందరం – ఈడికి కొందరం వచ్చాం. ఎట్నో ఒకటి సాయంత్రానికి లారీకెక్కిస్తాం. కూలీ కాకుండా గుత్తకు ఒప్పజెప్పుస్వామి. మా బాధ మేం పడతాం” ఆడకూలీల పెద్ద లింకు పెట్టూ అంది.

“అట్నా...! సరే, ఏం యీమంటారో చెప్పండి!” – సమస్య పరిష్కారమైతే చాలన్నాడు.

“అయిదొందలు ముట్టజెప్పు సామీ! చాలు,” మొదీన్ బాష కళ్ళలోకి చూస్తూ అంది.

“అంటే, పదిమందికి డబల్ కూలీ గిట్టుబాటు అయ్యేట్లు అడుగుతున్నావా!?” ఆందోళనగా అన్నాడు.

“డబల్ కూలీ అనుకుంటే ఎట్లయ్యా! లారీకి అందించేదాక మాది కదా బాధ్యత. కాయలు కోయాల... సార్లలోంచి తెచ్చి కుప్పపోయాల... ఆడ్నించి లెక్కప్రకారం గంపలతో లారీకి

ఎక్కించాలా... చానా పని వుందిలేసామి. అయిదొందలు కాడికి ఒప్పుకో. ఈసారి మన సిద్దోటం దోసకాయలకు భలే గిరాకీ వుందంటలే!... ఈ పర్యాయం నీవూ నాల్గు లెక్కలు కళ్ళ జూస్తావ్..." ఒప్పించే మాటలు అందామె.

"ఇదిగో గౌరక్కా! ఒక్కమాట చెప్తున్నా – మూడొందలు ఇస్తా... ఇంగ పనిలో దిగండి" ఆఖరి మాటగా చెప్పాడు.

"మాకు గిట్టుబాటు కాదు కానీ... నాలుగొందలు యివ్వు – ఇంక నీకు ఏ కొరవ లేకుండా చూస్తాం.... అవతల నీ యిష్టం..." ఖరాకండిగా అంది గౌరక్క.

"గౌరక్కా! కూలీల డిమాండు వుందని నీ పాచిక పారిస్తున్నావ్. వూ. అట్నే యిస్తాలే కానీండి." చేసేది లేక ఒప్పుకున్నాడు మొదీన్ బాష.

"మేయ్! మీ వక్కాకులు తినడం 'బిర్నా' పూర్తిగానిచ్చి గబగబ సార్లలోకి పాండి" సాటి కూలీల్ని పనిలోకి పురమాయించింది గౌరక్క.

ఒక పెద్ద సమస్య పరిష్కారమైపోయిందని వూపిరి పీల్చుకున్నాడు మొదీన్ బాష.

తన తోట పక్కనే వున్న ఏసోబు దోసతోటపై అనుకోకుండా దృష్టి పడింది. అక్కడ ఏసోబుతో – రంతుగోపాల్ మాట్లాడుతున్నాడు బిగ్గరగా. రహమతాబాద్ దర్గా సామి వరపుత్రుడు కావడంతో గోపాల్ కాస్త రంతు గోపాల్ అయ్యాడు. పోయిన రెండేళ్ళ నుంచి హోల్‌సేల్‌గా ఆయనే కాంట్రాక్టు తీసుకుంటున్నాడు. ఈ రోజు లారీలకు కాయలు ఎత్తించే పని వుండటంతో ఒప్పందం ప్రకారం పావలా వంతు డబ్బులు ఇవ్వాల్సి వుంది. అన్ని ఎర్ర వెయ్యి రూపాయల నోట్లు పరపర ఎంచి – ఏసోబుకు ఇస్తున్నాడు.

ఏసోబు దగ్గర్నించి ఇక తన వద్దకే రంతుగోపాల్ వస్తాడని, పడిన కష్టానికి తొలి ఫలితం చేతికి దక్కపోతుందనే సంతోషం శరీరమంతా పాకుతోంది. గాలిలో తేలిపోతున్న అనుభూతి కలుగుతోందతనికి.

పక్కజేబులోనుంచి సిగరెట్ ప్యాకెట్ తీశాడు. అందులో బీడిలున్నాయి. సిగరెట్ కాలిస్తే బావుండేదనిపించింది. బీడి కాల్చి పొగ వదులుతూ – సంగటి సంగటే – వరికూడు వరికూడే! అట్నే బీడీ బీడే కానీ సిగరెట్ మజా ఎక్కడ్నించి వస్తుందనుకున్నాడు. సంతోషం కలిగితే – కోరికల్ని... రుచుల్ని పెంచుతుందంటే యిదేనేమో అనకున్నాడు మొదీన్ బాష.

కంపకటవలోంచి కంతకు అడ్డం వుండే మండను తీసి – శిల్కుపంచను సరిచేసుకుంటూ మగకులుకులు పోతూ వచ్చాడు రంతుగోపాల్. తారు డ్రమ్ములో ముంచి పైకి తీసినట్లున్న అతను వ్యాపారంలో లాభాలు కళ్లజూస్తుండటంతో నల్ల వజ్రంలా మెరిసిపోతున్నాడు.

"ఏం మొదిన్ బాష అన్నా! కాయలు కోయిస్తాండావు కదూ! ఏమాత్రం వుంటాయో..." అని మాటల్లోకి దిగాడు.

"ఇరవై వేలకు తక్కువ వుండవు. గెవ్వెరువు పోసిన దోసకాయలు మనవి. సైజుకు సైజు రుచికి రుచి సంపుకుంటాయ్. కూర్చో..." అంటూ మంచం చూపాడు మొదీన్ బాష.

"ఏడి మీ కొడుకు చాంద్ బాష. యాడికి పోయినాడు". అడిగాడు అతను.

"ఇంటికాడికి పోయినాడు. వస్తాడు. దోసకాయలు లోడు ఎక్కడ సేలానికా, మదరాసుకా ఎత్తిస్తుండావు? యాడైతే ఏముందిలే అంతలక్కల రేటు బాగుందంట!" అన్నాడు మొదీన్ బాష.

"రేటు వుండబట్టే – ఈ లారీల బాడుగ కూడా అమాంతం పెంచి పారేసినారు. ముందుగా బాడుగ కట్తే కానీ – లారీ తెచ్చి పెట్టడం లేదు. ఏంది బీడికాలుస్తుండావే... ఇదో సిగరెట్టు కొట్టు" అందించాడు రంతుగోపాల్.

"వున్నిలేబ్బా!" అంటూనే అందుకున్నాడు మొదీన్‌బాష. ఏంది యీయప్ప, మాటల్లోకి దిగినాడే కానీ డబ్బులు తీసి యివ్వడం లేదే – అనుమానం లోపల తలఎత్తింది. డబ్బు దగ్గర "మొహమాటానికి పోతే ముం... యాకిటి అవుతుంది" అడిగి తీసుకుంటేనే సరి అనుకున్నాడు.

"రంతన్నా! నా సంగతి నీకు తెలీంది కాదు. ఈసారి దోసకాపుతో కొంచెం గెట్టున పడాలనుకున్నా. ఓ పదివేలు జాస్తిగా యివ్వు. లెక్కల్లో పట్టుకుందువు గానీ" అసలు సంగతి కదిపాడు.

"నూ భలేగుండావే! ఆడి ఆడికి నేను పురమాయించడమే గగనంగా వుంది. ఎగ్‌స్ట్రా డబ్బులు యాడ్నించి వస్తాయి. కాయలు ఎత్తించినాక – సాయంకాలానికి నీకు అగ్రిమెంటు ప్రకారం రావాల్సిన డబ్బు ఇస్తాను. తెచ్చింది అయిపోయింది. మా బామర్దిని కడపకు పంపించినా. వాడు రాంగానే – లారి కదిలేముందు నీకిచ్చి పోతాలే." అన్నాడు రంతుగోపాల్.

"అయితే ఇప్పుడు లేదంటావా!...." ఆశ్చర్యంగాను ఆందోళనగాను అడిగాడు మొదీన్ బాష.

"ఆఁ హాఁ యిప్పుడు లేదులే! నన్నేసాబు తోటలోకి పోయొస్తా. ఆయప్ప ఎన్నివేలు కోయిస్చాండాడో చూసొస్తా" అంటూ మంచంలోంచి లేచి – గబగబ అవతలకి నడిచాడు రంతుగోపాల్.

"సర్లే కానీ, సాయంకాలానికి డబ్బుల సంగతి మర్సిపోగాకు. కూలీలకు యీడానికి కూడా నా అంచన లేవు". అందకండా వేగంగా పోతున్న అతన్ని వుద్దేశించి అన్నాడు మొదీన్ బాష.

"ఛూ, దీనెమ్మ! అందరికి డబ్బులిచ్చి, తీరా మా సాయిబుల తోటల కాడికి వచ్చేటప్పటికి దుడ్లు అయిపోయినాయంట! అధవచిక్కిన నా కొడుకులం! వీళ్ళు ఎట్ల ఆడిస్తే అట్లల్లా

ఆడాల్సి వచ్చింది. థూ.. థూ...” చేతికి రావాల్సిన డబ్బులు వాయిదా పడిపోయే సరికి మొదీన్ బాషకు కడుపులో తిప్పినట్లు అయ్యింది.

అప్పుడే దొంగచాటుగా నక్కినక్కి దోససారల్లోకి తోకాడిస్తూ పోతున్న కుక్కని – కాలిచెప్పు విసిరి కొట్టినాడు. కుయ్యోకుయ్యో అని అరుస్తూ అది కటవ అవతలికి పారిపోయింది. రంతుగోపాల్‌పై అక్కసు కుక్కపై తీర్చుకున్నాడు మొదీన్ బాష.

దోసకాయలు కోస్తున్న ఆడకూలీలు పని ఎంత వరకు కానిచ్చారో చూసేందుకు మొదీన్ బాష పోబోతుంటే ఆయన కొడుకు చాంద్‌బాష వచ్చాడు.

“నాయనా! ఫకర్‌దీన్ మామ ఇంటికాడికి వచ్చి వుండాడు” ఆందోళనగా తెలిపాడు.

“ఎవఁరా! ఏ ఫకర్‌దీన్ మామ వచ్చినాడు” యేదో కీడు శంకిస్తూ ప్రశ్నించాడు.

“ఏంది నాయన నీవు... ఎవరో కాదు... అక్క రమీజా వాళ్ళ మామయ్య. దోసతోట కాడికే వస్తానంటుంటే – అమ్మే... వద్దులేండి అన్నగారు... ఆయనే వస్తారు. భోంచేసి మాట్లాడుకోవచ్చు అని ఆపేసింది” విషయం వివరంగా చెప్పాడు చాంద్‌బాష.

“రెండేళ్ళకు గుర్తుకొచ్చిందన్నమాట కోడలు.... ఏమన్న చెప్పినాడా మీ అమ్మతో...” సందేహంగా గుడిసెకేస్తూ నడుస్తూ అన్నాడు.

“జరిగిపోయిందేదో జరిగిపోయింది. రమీజా మొగుడు ఖాదర్ హుసేన్ కువైట్ నుంచి వారం రోజుల్లో వచ్చేస్తున్నాడు. తకరార్లు ఏం వద్దు మీ బిడ్డను అంతా బాగ చూసుకుంటాం. ఆ మాటే ఖాదర్ హుసేన్ చెప్పినాడు – అని అమ్మతో అంటుంటే విన్నాను నాయనా!” సంతోషంగా చెప్పాడు.

రెండేళ్ళ తరువాత కూతురు అత్తింటికి ఏ గొడవలు లేకుండా పోబోతోందని తెలిసి మొదీన్ బాషకు సంతోషమేసింది.

“మన పాప కాపురానికి పోతే అంతే చాలు! అల్లా దయ.. కానీ..” మాట మధ్యలో ఆగిపోయాడు.

“ఏం నాయనా! సందేహిస్తున్నావు?” ప్రశ్నించాడు.

“రెండేళ్ళ నుంచి నా కొడుకులు వూసు లేకుండా వుండి – ఇప్పుడు గొంతు మీదికొచ్చి కూర్చుంటే ఎట్లరా సచ్చేది. అల్లుడనే నా కొడుకు కువైట్ పోడానికే పెండ్లి చేసుకొని రెండు నెలలు తిరక్కుండానే కట్నం డబ్బుల్తో విమానం ఎక్కినాడు. ఇంట్లో జరుగుబాటుకు కష్టంగా వుందని నెలకు ఒక బంగారు నగ అడగబెత్తే – మన అమ్మి యివ్వనని తిరుక్కుంది. దీన్తో కొట్టి మనింటికి తోసేసినారు. ఇప్పుడు ఆ అల్లుడు మొగోడు వస్తున్నాడని – అర్జెంటుగా

అమ్మిని పంపేయమని వస్తే ఎక్కడ సాధ్యం అవుతుంది... థూ థూ ఏం మనుషులో ఏమో"... గసపోసుకోడానికి ఆగినాడు మొదీన్ బాష.

కడవను వంచి గ్లాసుతో నీళ్ళు అందించాడు చాంద్ భాష.

"యా అల్లాహ్! ఈ కష్టాల్నించి నీవే గట్టేయాల. వాళ్ళకు వాళ్ళే యింటికొచ్చి కోడల్ని కాపురానికి పంపమంటున్నారు. మంచిదే కానీ యిక్కడ సౌకర్యం వుండొద్దు. ఎట్లబ్బా!?" తనలో తానుగా గొణుక్కున్నట్లు బాధపడసాగాడు మొదీన్ బాష.

"ఏం నాయనా! ఎందుకు బాధపడ్తుంటావు. అల్లాహ్ దయ వుండబట్టే కదా – అక్కవాళ్ళ మామ ఇంటికొచ్చి కోడల్ని కాపురానికి పంపమంటున్నాడు. పంపించడానికి మనకు యిబ్బంది ఏమి?" అమాయకంగా అడిగాడు చాంద్‌బాష.

"నీకు ఇరవై ఏళ్ళు చెట్టుకు వచ్చినట్టు వచ్చినాయే కానీ, ఆలోచన లేదు. అమ్మిని కాపురానికి పంపడానికి నాకేం లక్షణంగా పంపిస్తా... కానీ, ఆ అమ్మి నగలు కుదవపెట్టే కదా రెండేళ్ళ నుంచి ఈ దోస చెట్లు సాగు చేస్తుండాం. తీరా ఇప్పుడు నగలు ఎట్ల వస్సాయి – బీరువాలో భద్రంగా ఎత్తి పెట్టినామా – ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకోడానికి" మనసులోని మర్మం బయటపెట్టినాడు మొదీన్ బాష.

"దానిది ఏముందిలే నాయనా! ఈ దోస చెట్ల సీజన్ అయితే నగలు యిడిపించి చీరె కూడా పెట్తాం అంటే పోల్యా" సమస్యకు పరిష్కారం సూచించాడు చాంద్‌బాష.

"నీవు చెప్పినంత సులువుకాదు లేరా అబ్బీ! బిడ్డ నగలు కుదవ పెట్టుకోడానికి సిగ్గులేదా? సంసారానికి పంపాలని మనసులో వుండి వుంటే ఇట్ల పాలు పడతారా అంటే – ఈ తలతీసి ఎక్కడ పెట్టుకోవాలా!?" కుమిలిపోతూ చెప్పాడు మొదీన్ బాష.

"అక్క కాపురానికి పోవడం ముఖ్యం కానీ, మనం మాట పడ్డం ముఖ్యమా నాయనా! ఏదోసర్ది చెపుదాం. లేకుంటే వూర్లో మసీదు ఇమామ్ సయ్యద్‌సాబును పిలిపించి చెప్పిస్తే సరిపోతుందేమో ఆలోచించు" వూర్లో సాయిబుల చిన్నచితక తకరార్లు తీర్చే పెద్దాయన గురించి గుర్తు చేశాడు చాంద్ బాష.

వయసులో చిన్నోడైన మంచి సలహా యిచ్చాడనుకున్నాడు మొదీన్ బాష. ఏదో చెప్పబోతే కొడుకు నిలువరించి – "నాయనా! ఇంకఏం ఆలోచించకు. ముందు ఇంటికి బయల్దేరు. భోజనాలు అయ్యాక తీరిగ్గా సయ్యద్‌సాబ్‌తో చెప్పిస్తాం. నాకు అంతా మంచే జరుగుతుందని పిస్తోంది. పదా బయల్దేరు" అన్నాడు చాంద్‌బాష.

తనలో తాను ఆలోచిస్తూ ఇంటికి బయల్దేరాడు చాంద్‌బాషతో కలిసి.

తమ ఇంటికి వచ్చిన మామ గారిని – తలపైకి చీర చేర్చుకుని వినయంగా సలాం చేసింది రమీజా.

“నిన్ను అల్లాహ్ దయతో చల్లగా చూడాల” దీవించాడు ఫకర్‌దీన్.

వియ్యంకురాలు ఖాతున్‌బీ వైరు మంచం పరిచి – షత్రంజి – దుప్పటి వేసి కూర్చోమంది. యోగక్షేమాలు అడిగి రమీజా వాళ్ళ అమ్మకు వంట విషయంలో సాయం అందిస్తూనే ఆలోచనల్లో పడిపోయింది. కొత్తగా పెళ్ళి అయిన రెండు నెలలకే భర్త కువైట్‌కు వెళ్ళిపోయాడు.

అత్తింటి వాళ్ళు తన నగల్ని అమ్మి – ఇల్లు గడపాలని చూడ్డంతో తను గొడవ చేసింది. కోడలికి అన్నం పెట్టడం కూడా బరువే అని లేని గొడవ సృష్టించి తిట్టి కొట్టి పుట్టింటికి తరిమేశారు.

ఇంత జరిగిన భర్త ఖాదర్ హుసేన్ కనీసం ఒక్క జాబు కూడా తనకు రాయలేదు.

అత్తమామలు కూడా పీడపోయిందిలే అని వదిలి పెట్టినారు.

ఇక్కడ పుట్టినింట్లో బిడ్డ వచ్చి కూర్చుంటే – వూర్లో అయిన వాళ్ళంతా సానుభూతిపైకి చూపినట్లే ముందర చెప్పారు. వెనకపోయి భర్త విడిచి పెట్టినాడు అని కొందరు అంటే – మొగిన్ని విడిచి పెట్టిందని యింకొందరు అన్నారు.

అత్తింటిలో వుంటే – బంగారు నగలు ఒకటోకటిగా హరాయించేస్తారని యిక్కడికి వచ్చింది. ఇక్కడ మాత్రం తక్కువతిన్నారా...

కాపురానికి పోయేటప్పటికి – విడిపించి తెస్తామని నగలు తీసుకుని పోయి కుదువ పెట్టేసినారు. అత్తింటి వారిని ఎదిరించ గలిగింది కానీ పెంచి పెద్ద చేసిన వారిని ఎలా ఎదురిస్తుంది తను?

బిడ్డను ఎలానో ఒకలా కాపురానికి పంపించాలని ఈ రెండేళ్ళలో ఏమాత్రమైనా ప్రయత్నాలు చేశారా.... అంటే లేదు. ఎందుకు చేస్తారు. తాను కొట్లాడి రావడమే పుట్టింటి వాళ్ళకు వరంగా మారింది.

దోసచెట్ల సాగుకోసం పెట్టుబడి పెట్టేందుకు తన నగలు అప్పనంగా అందివచ్చినాయి. మధ్యవర్తుల్ని పెట్టి రాజీ చేస్తే – ఎక్కడ బిడ్డను అత్తింటికి పంపాల్సి వస్తుందో – పంపాల్సి వస్తే నగలు ఎక్కడ్నించి తెచ్చిస్తారు. అక్కడ అత్తింటి వాళ్ళు దౌర్జన్యంగా నగలు లాక్కోవాలని జూస్తే – ఇక్కడ పుట్టింటి వాళ్ళు ఆప్యాయంగా లాక్కున్నారు.

ఏదైతేనేం – తాను దోపిడికి గురైందనే ఆలోచన రాగానే రమీజాకు కళ్ళు చెమ్మగిల్లాయి.

తాను నమాజులో ఏడ్చి ఏడ్చి చేసిన దువా – ఆ అల్లాహ్ యిప్పటికి కనికరించినట్లుంది. కాపురానికి పోబోతోంది. పెండ్లి చేసి యిచ్చినాక – ఆడకూతురికి అత్తయిల్లే చావు వరకు తప్పదు.

కాపురానికి పంపేటప్పటికి తన నగలు తెచ్చిస్తారో లేక యింకో గొడవ చేసి తన్ను భర్తకు దూరం చేస్తారో... ఏమైనా జరగవచ్చు. కానీ, తాను నోరు మూసుకుని కూర్చోబోదు. నగలు తెచ్చి పెట్టండని గట్టిగా అడిగేయక తప్పదు. ఆవిధంగా కఠినంగా మారకపోతే ఇక తన కాపురం నిలబడదు. కష్టాలే మనిషికి తెలివితేటలు నేర్పిస్తాయి అనేది యిదేనేమో. అనుకుంది రమీజా.

"ఏమ్మే రమీజా! పిలుస్తావుంటే బెల్లం కొట్టిన రాయిలా మారు పలక్కుండా వుండావేం..." అంది తల్లి ఖాతున్‌బీ.

"ఆఁ. ఏమ్మా... పిలిచావా! ఎప్పుడు!?" ఆశ్చర్యంగా కంగారుగా అంది.

"సర్లే! ఇంట్లోకి మీ నాయన, అబ్బి, మసీదు ఇమామ్ సయ్యద్ సాబు వచ్చినాడు. వెళ్ళి – భోజనానికి దస్తర్‌ఖాన్ పరుచు" అని పురమాయించింది ఖాతున్ బి.

భోజనపాత్రలు అమరుస్తూ – "ఈ పెద్దాయన సయ్యద్ సాబ్‌ను ఎందుకు పిలిచినట్లో – పంచాయతీ చెప్పిస్తారేమో... ఏమైనా కానీ తన్ను ఎవరూ ఆపలేరు. కాపురానికి పోకుండా ఎవరేం చెప్పినా వినకూడదు" అనుకుంది రమీజా.

ఇసుక దందుల కూరతో సంగటి లొట్టలు వేసుకుంటూ తింటున్నారు.

ఎప్పుడో తెల్లవారుజామున పోయిన కరెంటు వున్న పళంగా వచ్చింది. రేడియో ముందే ఆన్ చేసి వున్నట్లుంది. ప్రత్యేక వాతావరణ హెచ్చరిక. పెన్నా పరివాహక ప్రాంతంలో వారు అప్రమత్తంగా వుండాలి. పైతట్టు భారీ వర్షాలు రావడంతో మైలవరం ప్రాజెక్ట్ వరద గేట్లు అన్ని తెరిచి పెన్నలోకి వరద జలాలు వదిలారు – అని దుర్వార్త పలికింది. భోజనం చేస్తున్న మొదీన్ బాష, చాంద్‌బాష ఆ వార్త విని అల్లకల్లోలమై పోయారు.

"యా అల్లాహ్! అంత 'సత్యనాస్' – నాశనం చేశావే... అబ్బీ! పారా నాయనా మన దోస చెట్లు ఏమైనాయో పారా" అంటూ ఎంగిలి చేత్తోనే బ్రిడ్జీ దిక్కు పరుగుదీశాడు.

మొదీన్‌బాషను – కొడుకు చాంద్‌బాష, వియ్యంకుడు ఫరక్‌దీన్ అనుసరించారు. పెద్దాయన సయ్యద్‌సాబ్ – "అల్లాహ్! నీ దయచూపు" అంటూ మసీదు వైపునకు బయల్దేరాడు.

ఉదయం జాలు మాత్రమే వున్న పెన్నాలో ఇప్పుడు ఎర్రమట్టి నీళ్ళు వుధృతంగా ప్రవహిస్తున్నాయి. చూస్తూ చూస్తూ వుండగానే బ్రిడ్జిపైకి ప్రవాహం తన్నుకొస్తోంది.

బ్రిడ్జికి అటూ ఇటూ ఆకుపచ్చగా పరుచుకుని వుండిన దోసతోటలు కనిపించడం లేదు. కాపలా కోసం వేసిన నేల గుడిసెలు... కంప... నురుగలతో ప్రవహిస్తోంది పెన్నా....

"మీ దోస తోటలో కాయలు కోస్తుండిన ఆడకూలిల్లో గౌరక్క కొట్టుకుని పోయిందంట మొదిన్ అన్నా" అని ఎవరో అన్నారు.

"అయ్యెయ్యో... ఏమైపోయిందిరా... నా బిడ్డకు కాపురానికి పంపాలని వేసిన తోట – కాపు చేతికి వస్తూ వస్తూ పోయిందేంరా.. రేయ్.. దోసకాయలు కొట్టుకుపోతున్నాయిరా... మన అమ్మి నగలు కొట్టుకుని పోతున్నాయిరా... అంతా నదికెపాల్ – ఏటిపాలు అయిపోయినాయిరా..."

అంటూ బ్రిడ్జీ పైకి వస్తున్న వరద నీటిలోకి పరుగు తీసినాడు. నీళ్ళు పెరిగి పోతూనే వున్నాయ్. మొదీన్ ఆ వరద నీటిలో పోతూనే వున్నాడు.

చాంద్‌బాష – "నాయనా, నాయనా" అంటూ గుండె పగిలేలా అరుస్తున్నా – ఆ మాటలు మొదిన్ బాషకు వినిపించడం లేదు.

✡

# ఆగిసాగిన అడుగులు

**–నల్లూరి రుక్మిణి**

అవి సంక్రాంతి రోజులు. పది గంటలు దాటి పొద్దు పైకెక్కినా మంచుపొగ కమ్మి ఊరంతా మంపు మంపుగా ముణదీసుకున్నట్టే వుంది. బజారులన్నీ చెమ్మచెమ్మగా వుండి ఇసుక, ఇటుకా అడ్డదిడ్డంగా పడి కలియ తొక్కిన మట్టిలాగా వున్నాయి. ఓ పక్క సగం సగం కట్టుబడి చేసిన ఇందిరమ్మ ఇళ్ళు వూరు ఎత్తిపోదని ఆశను కల్పిస్తూ కొత్తగా లేస్తున్నాయి.

చలిగాలికి కండువాలు భుజాల చుట్టూ కప్పుకుని ముణుకులు దగ్గరకు లాక్కుని ఓ నలుగురైదుగురు ముసలాళ్ళు జెండా చెట్టు అరుగుమీద చేరారు. కళ్ళ కింద ముడతలు తేలి, ముక్కుపుటాలూ, దవడలూ జారిపోయి – జీవం కోల్పోయినట్టున్న మొహాలతో, తలో దిక్కూ చూస్తూ గుప్పుగుప్పున చుట్టలు తాగడంలో నిమగ్నమయ్యారు.

“ఈ రోజుల్లో వూరు ఇట్నేనా వుండేదీ?... ఇళ్ళ ముందు పేడ నీళ్ళు జల్లడం కూడా ముతకైపోయిందే”... నాగన్న ఎదురుగా కనిపిస్తున్న వాకిళ్ళ వైపు చూస్తూ గొణుక్కున్నాడు.

ఇళ్ళకు చేరే గింజా గిట్టతో బండ్ల మోతలూ, ఎద్దుల గంటల చప్పుడు... అదో జీవితం! ఈ మూడు నాలుగేళ్ళగా విందామన్నా వినబడటం లేదాయె!... కోతలు, నూర్పిళ్ళు.... ఎవరి పనులు ఎంతదాకా వచ్చినయ్యో! ఎవరి పంట ఎంత ఇంటికి చేరిందోనన్న పలకరింపులతో మనుషుల కోలాహలం!... వీధులన్నీ ఎంత కళకళగా వుండేదీ?

అట్టా తలపుకు రాగా, “...ఏమబ్బా! పొలాలన్నీ అట్లా బీళ్ళు పడిపోయే! వూరక అట్లా పడేసి వుంచకపోతే!... అయ్యేవో వచ్చేదాకా ఎవరిది వాళ్ళం దున్నుకుందుం గదా!”... పైకే అన్నాడు.

“ఆ నువ్వడక్కా”... ఎకసెక్కంగా అన్నాడొక ముసలాయన.

“ఇంకెక్కడి చేండ్లు! రా! నాయనా! అయినా నీ చేని ఎక్కడుందో పుల్లగాని గుచ్చావేందిరా! నాగాయ్? ఇంకా చేనూ, చెట్టూ కలరింతగా వుందేందిరా!” కోటయ్య యాష్టగా అన్నాడు.

“అయినా ఎవురి చేను ఎక్కడుందో... ఎవురి గట్టు ఏదో ఎవురి కెరికా! అంతా మైదానం మాదిరి చదరం జేసి పారేత్తిరి. అదంతా మనం పంటలు తీసిన భూమి మాదిరిగా వుందా!

మెత్తగా గుల్లబారి వుండే నేల... దున్నక వదిలేత్తే అంతా తుప్పలూ, రేగి ముళ్లూ.... చట్టు బండై పోయింది" తిరిగి ఆయనే నిట్టూర్పుగా ముగించాడు.

"ఒరేయ్! నాగన్నా! ఎందుకురా దిగులు... మన హయాం అవనే అయిపోయింది. అసలు దిగులు పడాల్సిన ఆ పిల్లగాళ్ళు చూడ్రా! ఎట్టున్నారో! ఏ కోశానన్నా దిగులూ, విశారం వుందంట్రా! ఆ ఆట చుట్టూ చేరి ఎట్టా కేరింతలు కొడుతున్నారో! చూడూ!"

అప్పటికి పన్నెండు కావొచ్చింది. పొద్దు మబ్బుల్లో నుండి బయటికొచ్చింది. చలికి బిగుసుకుపోయిన శరీరాలు ఎచ్చటి ఎండ వేడికి విచ్చుకుంటుంటే హాయిగా అన్పిస్తోంది. ఆటల దగ్గరున్నోళ్ళ అరుపులూ, కేకలూ వినబడుతున్నాయి. పులి–మేక ఆట మంచి రంజులో వుంది. చుట్టూ జనం చేరి ఆడుతున్న వాళ్ళకు వుచిత సలహాలిస్తున్నారు. అంతకు మించి వుద్రేకపడిపోతున్నారు.

దానికి కొద్ది అవతలిగా పేకాట దుకాణం పెట్టారు. ప్లాస్టిక్ సంచులతో కుట్టిన పెద్ద పట్టా పరచి వుంది. పదిమంది పైనే వున్నారక్కడ. అక్కడా ఆడేవాళ్ళు కొందరూ... సలహాలు చెప్పేవాళ్ళు మరికొందరు. పేక కలిపి ముక్కలు వేశాక, ఒక్కొక్కటీ పేర్చుకుంటూ... జోకరు రాలేదని.... పేక కలవలేదని వేయని వాడిని వెక్కిరిస్తూ ఆట షురూ చేశారు.

వరసగా ముక్కలు కిందపడిపోతున్నాయి. ఎవడేం ముక్క తీస్తున్నాడో! ఎవడి సెట్టు ఎట్టా పేరుస్తున్నాడోనన్న రంధితో అందరిలోనూ ఒకటే టెన్షన్. ఆడకుండా అందరి పేకల్లోకి తొంగి చూస్తున్న వాళ్ళది మరోరకం.... సలహాలివ్వాలని కోరిక... ఆడుతున్న వాళ్లు అవకతవకలు చేస్తున్నారని గొప్ప బాధ.... ఒక్క మాట జారారంటే వుతికేస్తారన్న దడుపు.... అటూ, ఇటూ చూస్తానుచ్చర్లు కొడతా మరింత టెన్షన్ పడిపోతున్నారు.

ఇంతలో పులి – మేకా ఆట కాడ గల్లంతుగా కేకలు.... పులి ఆటలు కట్ 'ఇక నీ పులి కదలలేదురా! అయిపోయిందిరోయ్!...' అరిచారెవరో!

"ఒరేయ్ మేకలు పులిని కటెయ్యటమేందీ? ఆడటం చేతకాక పోతే సరి! వెధవ!" అన్నాడు, మోహన్రావు.

అతని మాటకు ఓడిపోయిన వాడికి రోషమొచ్చింది.

"అయితే నువ్వే ఆడు మరి! పోటుగాడివి" అన్నాడతను.

"ఆ ఆడిచూపిస్తా! మేకల్ని పులిచంపితే! నువ్వు ఓడినట్టు... లేకపోతే నేను ఓడినట్టు!... పందెం కాయి మరి" సవాల్ విసిరాడు.

"సాయంత్రం పేటకు పోతాంగా! నీ ఖర్చు నేనే పెట్టుకుంటా!"

తిరిగి ఆట ప్రారంభమయింది. ఆటగాళ్ళిద్దరూ సమవుజ్జీలు. గంట గడిచినా ఎవరికాయా చంపుడు పడలేదు. అందరిలోనూ ఉత్సుకత పెరిగింది. ఆట రసపట్టులో వుంది. ఆట అయితే తిండికి పోవాలని కూర్చుంటే... అది అయ్యేటట్టుగా లేదని... కొంరు లేచి పోగా, కొత్తగా మరికొందరు అన్నాలు తిని సిగరెట్లు కాల్చుకుంటూ అక్కడికి చేరారు.

ముసలోళ్ళు అటువేపు చూస్తూ!... "మా రోజుల్లో ఇట్టా పని లేనట్టుగా తోచుబడి కానట్టుగా వుండేదా? తెల్లారిందంటే పొలాన తిరుగుతుండేవాళ్ళం.... "ఈ ఈడు పిల్లలు భూమిని పగలగొట్టి పంటను పిండాల్సిందిపోయి!... ఆటలాడుకుంటున్నారు... ఆటలు" నిరసనగా గొణుక్కున్నారు.

"పనే లేకపోతే వాళ్ళు మాత్రం ఏం చేస్తారురా! మనం అనుకోటమే గానీ".... కోటయ్య సాలోచనగా అన్నాడు.

"నిజమేలే గానీ! ఇట్టా ఆడీ ఆడీ విసుగుపుడితే అప్పుడేమి చేస్తారూ!"

"చేసేదానికే ముందిరా! భూమా! పుత్రా!... ఇట్టా పనీపాటా లేకుండా పుచ్చిపోయి... ముసలం పుట్టిపోతారు... అంతకంటే జరిగేదేందీ?"....

ఆ మాటలకు వాళ్ళ మనసులు భారంగా అయ్యాయి. మౌనంగా ఒక్కొక్కరే అరుగు దిగి ఇళ్ళ వైపు అడుగులు వేశారు.

నాగన్న ఇంటికి చేరాడనే గానీ ఆట దగ్గరున్న కొడుకు చుట్టూనే తిరుగుతోందతని మనసు. తన కొడుకే కాదు వూళ్ళో నడీడు పిల్లలంతా అట్టానే వున్నారనుకున్నాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. నిలబెట్టి వున్న మంచం వేసుకుని నడుం వాల్చాడు. పడుకున్నాడనే గానీ ఆలోచనలతో కునుకు పట్టలేదు.

"అసలు వాళ్ళు గాదు... నేను మాత్రం ఏం చేస్తున్నట్టూ!"... విచారం కలిగిందతనికి, ఏ మనిషికైనా ఏం చెయ్యాలో దిక్కుతోచకపోతే బతగ్గలడా! .... అట్టా అనుకుంటుంటే లోపలేదో చెయ్యి పెట్టి కెలికినట్టు కుడితి కుడితిగా అయింది నాగన్నకు. ఏమీ పాలు పోలేదు.

లేచి కూర్చోని, "ఏమే! కాసిని మంచి నీళ్ళియ్యవే!" అన్నాడు చిన్నగా. ఎక్కడ నుండీ శబ్దం రాలేదు. కాసేపాగి "ఏమే"! అన్నాడు గట్టిగా మరోసారి.

ఆ కేకకు వాకిట్లో పడుకున్న అత్తకూ, లోపల పడుకున్న కోడలికీ మెలకువ వచ్చింది.

"ఏందంట గత్తరా! అట్టా కునుకు పట్టిందో! లేదో!" విసుక్కుంటూ లేచింది సుబ్బమ్మ. గ్లాసుతో నీళ్ళిస్తూ... "ఏం? లేచి కాసిని ముంచుకు తాగితే ఏం బోయిందీ?" అంది.

అత్త మాటలకు కొనసాగింపుగా! "ఆయనకు నిదరపట్టదుగా! అందుకే నిదరబోయే వాళ్ళని లేపొద్దూ"! అంది కోడలు, మంచి నిద్రలో వుండగా మెలకువ వచ్చిందన్న విసుగుదలతో!

కోడలి మాటకు చర్రున కోపం వచ్చింది నాగన్నకు. భార్య యిచ్చిన గ్లాసు అందుకుని రెండుగుక్కలు గొంతులో పోసుకుని గ్లాసెడు నీళ్ళూ పారబోశాడు.

దానితో సుబ్బమ్మకు చిర్రెత్తి గ్లాసు విసురుగా లాక్కుని అవతలకిపోయింది.

భార్య చర్యకు మనసు మరింత చిన్నబోయింది. 'వీళ్ళకు మంచి నీళ్ళియ్యటం కూడా కష్టమైపోయిందే' అనుకున్నాడు. లోపలంతా ఏదో రంధి రంధిగా రంధిగా చికాగ్గా అయిపో యిందతనికి. మంచం మీద కూర్చోలేకపోయాడు. దానితో మంచం మీద కండవా గట్టిగ విదిలించి భుజాన వేసుకుని చెప్పులేసుకుని బజార్లోకొచ్చాడు.

జనం కన్ను కునికేవేళ. ఊరు ఒక మాదిరి నిశ్శబ్దంగా వుంది. అక్కడొకటీ, అక్కడొకటీ టీవీ మోతలు వినబడుతున్నాయి. చిన్న పిల్లలు గోలీలాడుకుంటున్నారు. పేకాట, పులీ – మేకా దగ్గర కూడా జనం సర్దుకున్నారు.

✡

ఇంటి దగ్గర బయలుదేరినప్పటి రోషం బజారు దాటి దక్షిణానికి తిరిగేటప్పటికి చల్లారిపోయింది. ఇళ్ళు దాటి కొద్దిగా ముందుకు నాలుగడుగులు వేసి. ఊరి వెలుపలికి వచ్చాడు. ఎదర చూడగానే ఎప్పటిలాగే కొట్టిపోసిన పొలాలన్నీ రూపుమారిపోయి ఏక చదరంగా కళ్ళ ముందు దర్శనమిచ్చాయి. ఆ ఆరు లైన్ల రోడ్డును ఎప్పుడు చూసినా నాగన్నకు కడుపులో తెములుతుంది.

అంతే చటుక్కున ఉత్తరం వైపు పాత బండిబాట వేపు తిరిగిపోయాడు. అస్తవ్యస్తంగా తుప్పలు పెరిగీ... గుంటలు తవ్వీ భూమంతా గాయపడినట్టుగా వుంది.

ఓసారి చూపు దీర్ఘంగా సారించాడు.

అప్రయత్నంగా నిట్టూర్పు వెలువడింది.

తలొంచుకుని చేలకు అడ్డంగా బడి నడిచాడు. ఒకే ఒక్క కొండ గుర్తుగా మిగిలిన వేపచెట్టు దగ్గరకు చేరాడు. ఆ చెట్టు నీడెందుకో అతనికి తల్లి చెంత చేరినట్టుంటుంది. చుట్టూ కలియ చూశాడు. అంతా చిట్టడవైపోయింది. 'రైతు చేతిలో నుండి భూమి లాక్కుని ఇట్లా చెయ్యడమేందీ? తింటానికి తిండి గింజలు కూడా కరువైతే రైతు ఎన్నాళ్ళు బతుకుతాడూ?'....

'కందేనా, సెనగేనా, ఎన్ని దినుసులు; కానరాకుండా రైతును ఏడాదంతా కాపాడేయా! ఎంత నిండుగా వుండేదీ? ఇప్పుడన్నీ చూసి చూసి తినాల్సి వస్తుంది. కమ్మగా ఇంట్లో వేసుకున్న కందిపప్పు, ఇంత నెయ్యి వేసుకుంటే కంచండు తినేది కడుపు నిండా!.. తృప్తితీరా పప్పు తిని ఎన్నో ఏళ్ళయినట్టుంది:.... నాగన్నకు గుటకలు పడ్డాయి.

మనుషులతో కళకళ్ళాడే పంటలు పొలాలు... దొంగ కూడా రాని చోటులయ్యాయి. విత్తనం వేసిన కాడి నుంచి కాయ ముదిరి శనగ దున్ని కాయ కల్లం అయ్యేదాకా.... చుట్టు పట్ల ఆసాములంతా రేత్రిపూట కూడా చేలమీద పారాడతావుండేది.

శనగిత్తు ముదిరిందంటే.... పిల్లలు చేల మీద వాలిపోయేది. అప్పుడసలు కాపలా కాయటం ఎంత కష్టమయ్యేదీ?.... 'మోహనా'ను కూడా వద్దన్నా వచ్చి, కాయలు 'తంపట' వేసి పెట్టమని ఎంత గోల చేసేవాడో? నాగన్న ప్రాణం కొట్టుకలాడసాగింది.

'తంపట' వేస్తే చేతుల నిండా ఎంత మసో?... మోహనా ఆత్రం కొద్దీ ఆ కాలే కాలే బూడిదలో చేతులు పెట్టి ఏరుకుంటా.... సుర్రు మన్నప్పుడల్లా చేతులు నిక్కరకు పూసుకోవడంతో కాయలు ఏరుకోవటం అయ్యేతలకి వొళ్ళూ ఇళ్ళూ మసి మంగలం అయ్యేవాడనుకో!'.

అయినా వాడి మొహంలో వెలుగు తనకెంత కడుపునింపేది.

నాగన్న ఆలోచనలన్నీ ఎక్కడో తిరుగులాడసాగాయి.

ఎండ పుల్లలు ఏరుకొచ్చి.... శనగ మొక్కలు పీకి దాని మీద వేసి నిప్పుల్ల అంటించాడు. ఎండుకట్టె గనగనలాడతావుంటే మాడిపోకుండా కాయ అటూ ఇటూ పుల్లతో తిప్పుతున్నాడు. మోకాళ్ళ మీద చాచిన చేతులు అతనికి తెలియకుండానే అటూ, ఇటూ తిరుగుతున్నాయి. కళ్ళ వెంట కన్నీళ్ళు జాలువారుతున్నాయి.

అట్టా ఎంతసేపున్నాడో తెలియలేదు. ఇంతలో అతని ఏకాగ్రతను చెదరగొడుతూ ఎక్కడో పాము పట్టిన ఎలుక దీనస్వరం చెవుల్లో పడింది. ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చి చుట్టూ కలియ చూశాడు. ఎక్కడా జాడలేదు.

తిరిగి తన ధోరణిలో పడిపోయాడు.

ఏమైందీ జనానికి? వాడు డబ్బులిస్తామనగానే ఎందుకిచ్చారిదంతా.... జలజలా కన్నీళ్ళు పంచె మీదకు జారాయి.

ఇప్పుడు భూమీ, పంటా, కాయలేనా లేంది?... భూమితోపాటు బుద్ధులు మారిపోతున్నాయి కాదా! తనకు గానీ, ముసల్దానికి గానీ తినమని అంత చేతిలో వేసేదెవరూ! కొడుకూ కోడలూ బండేసుకోని వారానికీ పది రోజులకీ పేట పోతారు. వచ్చేటప్పుడు సంచుల నిండా తెచ్చుకుంటారు. ఏం తెచ్చుకుంటారో మరి?...

అట్టా అనుకుంటుంటే తనమీద తనకే రోతవేసింది నాగన్నకు.

నిజానికి నాగన్నకు తిండి మీద ఏనాడూ అంత ధ్యాస లేదు. ఎప్పుడన్నా పొలాన అంత నక్కదోసకాయో.... అన్ని పూసబియ్యమో తినేది. మొక్క పీకాలన్నా, పాలకంకి విరవాలన్నా ప్రాణం పోయేది. ఇప్పుడు వూరికే వుండటంతో పళ్ళు తీపులు తీసుకున్నట్టయి ఒక్కోసారి

గట్టిగా ఏదన్నా తినాలనిపిస్తోంది. 'అయితేనేం చేతిలో మనదంటూ లేకపోతే మనకు మనమే ఎంత పరాయిగా అయిపోతాం'... అనుకున్నాడు.

గతానికీ వర్తమానానికీ మధ్య ఆయనకు పొంతన కుదరడం లేదు.

నిజమే తానిప్పుడు రైతు బిడ్డ కాదు. గెడ్డ జారిపోయింది.

జరిగిపోయిన కాలం తలచుకుంటుంటే ఇక తన పనైపోయిందని... భూమి మీదకు తనొచ్చిన కార్యం ముగిసిపోయిందనిపించింది నాగన్నకు.

ఎప్పటి నుండో మంచినీళ్ళు తాగకపోవడంతో చల్లగాల్లో కూడా గొంతు ఎండిపోయి నట్టయింది. అప్పటికి పొద్దు పడమటికి వాలింది. చలికాలం! ఇంకా ఇక్కడే వుంటే చీకటి అలముకుని దారి కనబడక ఇబ్బంది పడవలసి వస్తుందని మెల్లిగా వెనుతిరిగాడు.

ఎందుకో ఇంటికెళ్ళాలంటే మనసు మొరాయిస్తోంది. కోడలితో తరచుగా ఇటువంటి అనుభవమే అతనికి ఎదురవుతోంది. ఇంట్లో వారికి తాను ఎక్కువయ్యానేమోనన్న భావం అతనిని వేధిస్తోంది.

నిన్న మొన్నటి దాకా తన మాట అంటే ఇంటిల్లిపాది ఎంతగా చెవొగ్గేవాళ్ళు.... ఈ నాలుగేళ్ళలో ఎంత మార్పు?... తనదంటూ చిల్లిగవ్వ లేకపోవడం... తను చెయ్యదగ్గ పని లేకపోవడమూ?...

నెమ్మదిగా పై కండవా తీసుకుని మొహం తుడుచుకున్నాడు.

అప్పటికి కనుచీకటి పడొచ్చింది. ఆ మట్టి బెడ్డల్లో ఎట్టెట్టా తిరిగాడో పంచె నిండా పల్లేరు గాయలు కరుచుకున్నాయి. ఇంటికి చేరేటప్పటికి సాంతం చీకటిపడి ఇళ్ళల్లో లైట్లు వేసి వున్నాయి. ఇంట్లో వాళ్ళు వాకిట్లోనే వున్నారు.

నాగన్న కనబడగానే అందరూ లోపలికి పోయారు. 'తనకోసమే' చూస్తున్నట్లున్నా రనుకున్నాడు. మౌనంగా పంచలో నిలబెట్టివున్న మంచం మెల్లామీదకు తెచ్చి వాల్చి పై కండవా దానిమీద వేశాడు. వాకిట్లోకి పోయి గాబులో నీళ్ళు ప్లాస్టిక్ డొక్కుతో తీసుకుని కాళ్ళమీద పోసుకున్నాడు. సుబ్బమ్మ ఇచ్చిన నీళ్ళు గటగటా తాగి.... వాల్చిన మంచం మీద వొరగబడ్డాడు.

అప్పటిదాకా ఎవరేం మాట్లాడలేదు. అందరికీ కోపం వచ్చిందనుకున్నాడు. కొడుకు కోడలు పిల్లలతో టీ.వీ. చూస్తున్నారు. సుబ్బమ్మ మరో మంచం మీదకు చేరి కూర్చుంది.

గంప కింద కప్పెట్టిన కోళ్ళు ఇంకా కునుకు పడక కొక్కోమంటూనే వున్నాయి. గేదెలున్న వాళ్ళు పాలు పిండటానికి దూడలను విప్పారు. దూడలు చెంగున తల్లి దగ్గరకు దూరి చేసే

ఆరాటం.... అది చూసిన తల్లుల చిరు అరుపులు... అక్కడో చిత్రమైన ధ్వని వ్యాపించి హాయిగా వుంది.

ఇంట్లో వాళ్ళు ఎక్కడి వాళ్ళక్కడ సద్దుమణిగారనుకున్నాక ముసలాడిని మందలింపుగా.... "నిన్నిప్పుడేమన్నానని.... యిచ్చిన నీళ్ళు కూడా తాగకుండా పారబోస్తివి. ఎట్లాబోతుండావో చెప్పకపోతివి! ఎక్కడికని పోయావనుకోవాలి?... దున్నేది లేక పొలమంతా పుట్టలు పెరిగిపోయి పగులే ఇంతింత తాసులు తిరుగుతుండె! ఇంత వరదాకా ఆ తుప్పల్లో దేనికుండట్టా! రాను రాను మతిపోతంది? పోయిన భూమి పోనేపోయా! ఇంకా దేని కాడికి? మనదవుద్దా? ఇంట్లో వాళ్ళ మీద కోపమొత్తే ఆ వేప చెట్టు కింద సిదిలమైపోతుంటివి! అక్కడేమన్నా తవ్వి పెట్టినవా!".... యాష్టగా అంది సుబ్బమ్మ.

"అన్నీ తవ్వి పోసినోడు ఆ వేప చెట్టెందుకు కొట్టెయ్యలేదో?" అనీ అన్నది.

మనసు కష్టపెట్టుకుని నాగన్న ఎక్కడెక్కడ తిరుగుతున్నాడోనన్న బాధ... ఆమెను ఇంతవరదాకా కలచివేసింది. ఇప్పుడేమో పైకి ఇంకేదో రొల్లుతోంది. అప్పటిదాకా కోడలిని అనలేకా... మింగలేకా వున్న బాధను భర్త మీద చూపించింది.

ఎట్టాగూ! నీళ్ళిచ్చింది తనేనాయె! ఆపై మాట అనకపోతే ఏంబోయిందీ?... ఆ మాటే తనంటే మీదపడి పెరికినంత పని చేసేవాడు. తావసం తీరిపోయేది!... అన్నది కోడలాయె! ఎదురు అనలేక, రోషమొచ్చి చెప్పుల్లో కాళ్ళు పెట్టుకుని అదే పోతపోయె!'... భర్త అలిగాడని అనుకుందామె. ఆమె కూడా కోడల్ని ఏమీ అనలేక మిన్నకుండిపోయింది.

భార్య మందలింపులు నాగన్నకు ఎక్కడో సంతృప్తిని కలిగించాయి. తన కోసం బాధపడే మనిషుందని... తనకింకా ఈ ప్రపంచంతో లింకు తెగిపోలేదని.

మోహన్రావు టీవీ చూస్తున్నా చెవులు మాత్రం బయటే వుంచాడు.

తల్లి మాట్లాడటం ఆపిందో లేదో... ఇంట్లో కొడుకు ఏదో అనడం వినబడింది. ఏమన్నదీ అర్థం కాలేదు. తననే ననుకున్నాడు నాగన్న.

"వూరుకోండి! అయిపోయిందిగా! మళ్ళీ ఎందుకూ".. కోడలు అనడం వినబడింది.

"ఏందే అయిపోయేదీ! ప్రతిదానికీ! చిన్నపిల్లాడు చేసినట్టా"... కొడుకు మాటలకు నాగన్నకు మనసులో గుచ్చుకున్నట్టయింది. సంభాషణ ఆగిపోయింది.

సుబ్బమ్మ లేచి నీళ్ళు తోడి జాలాదిలో పెట్టి వచ్చింది. నాగన్న గోచీ కట్టుకుని స్నానానికి పోయాడు.

ఇంటిలో టీ.వీ. మోత ఒక్కటే వినబడుతోంది.

✡

నాగన్నకు మనసులో ఏదో తీరని వ్యధ వెంటాడుతోంది. తరచుగా తండ్రి గుర్తుకొస్తున్నాడు. అయ్య పోయి అప్పుడే పదేళ్ళయిపోయిందనుకున్నాడు. ఇన్నాళ్ళూ పని రంధిలో ఎప్పుడోగాని తలపుకొచ్చేవాడు కాదు. తన తండ్రి చనిపోయేదాకా జీవితం మీద ఎంత ఆసక్తిగా వుండేవాడూ? ముసలివాడినై పోయానని అనుకున్నట్టే వుండేది కాదు.

పొడుగూ మట్టమూ కాని ఎత్తు... నల్లటి దేహం... బట్ట నెత్తి... మోకాళ్ళ దాకా మడిచి కట్టిన పంచ... భుజం మీద కండవాతో తండ్రి రూపం ఎదురుగా వున్నట్టే అయింది.

ఓపిక తగ్గి వూళ్ళోనే తిరుగుతున్నా ఎంతగా ఎకచకాలాడుతుండేవాడు. దారిన పొయ్యే వరసైన ఆడోళ్ళను ఏదో ఓ తులిపిమాట... "పిల్లా! నా అంత మంచోడు దొరుకుతాడంటే! నన్ను చేసుకోరాదూ" అనో, మరొకటో అనేది... "ముసిలోడివైనా చాత్రీకం తగ్గలేదే నీకు"! అని తిరిగి అనిపించుకుని నవ్వుకునేవాడు.

తండ్రిని తలచుకుంటూ తనిచ్చిన ఎకరాకు తోడు ఇందిరమ్మ ఇచ్చిన ఎకరం పెట్టుకుని... తను తల్లీతండ్రీ ఆదిగా పూటకు ఆరుకంచాలు లేసేవి. అయినా మౌలాసాయిబు అమ్మకానికి పెడితే వున్న దానికి తోడు మరింత అప్పుచేసి అదీ కలుపుకుని... ఈ ముప్పై ఏళ్ళుగా గుట్టుగా నెట్టుకొచ్చాం.

తండ్రి పక్కకు తొలగి తనకు అరక పట్టించి ఇంటి పెత్తనం ఇచ్చినా తండ్రి లేకుండా ఒక్కపని చేసెరగడు. ఇయ్యాళ ఈ పని చెయ్యాలనుకుంటే... అయ్య తెల్లారేటప్పటికి ఆ పని కాడ వుండేవాడు. శనగ విత్తనం వొలవాలన్నా, కల్లం చెయ్యాలన్నా, వామి వెయ్యాలన్నా ఆ పని ఇంట్లో అందరిదిగా వుండేది.

అయ్యుండగా తను జొన్న కోతకు కూలోళ్ళను పిలిచాడా? కొడవళ్ళు కక్కులు కొట్టించాడా? అన్నీ ఆయనే!... కంకి ముదిరి కోతకు సిద్ధమయ్యేతలకి కూలోళ్ళు కోతకు సిద్ధంగా వుండే వాళ్ళు. కోత కోసి కుప్పలు వేసిన కాడ్నించి... కల్లం చేసేదాకా ఆయనది కాని పని ఏముండేదీ?

తను పనిలోకి దిగేటప్పటికి ఆ పనికి కావాల్సిన సరంజామానంతా కూర్చి పెట్టేది. దాని మూలంగా తన పనెంత తేలికయ్యేదీ?

"ఏందుకీ ముసలాయన ఇట్లా చేలచుట్టూ... ఇంటికాడ నడుం వాల్చక"... అంటే.

"చేలో పంట పెట్టుకోని ఇంటికాడ కునుకు పట్టుద్దంటనా! వీడు రైతు బిడ్డేనా!"... మందలింపుగా అనేవాడు.

తను ఆయన్ను విశ్రాంతి తీసుకోమంటే.... ఆయన నాకు తెరిపి యివ్వాలన్నట్టుగా చేసుకొచ్చేవాడు.

అరక దున్ని విత్తనం వెయ్యడమే తన పని.... పంట ఇంటికొచ్చేదాకా కంటి పాపలా కాపలా కాసి ఇంటికి చేర్చింది ఆయనే. అయ్యా, అమ్మా పిల్లా పాపలతో కలిసిందే ఇల్లంతా అని మాత్రమే తెలుసు తమ తరానికి.

ఒకరు బరువు ఒకరు తరుగు అనేది లేకపోయే! ఎవురికి తోచిందీ... చెయ్యగలిగిందీ తలో పని చేసి బండిని లాగేది. బండి ముందుకు నడువుడే చూసుకునేది గానీ... వాడి వల్లా, వీడివల్లా లాభమా? నష్టమా? అనేది లేకపోయేది! అది అందరి సంసారం. కాడెద్దులు. రెండు బర్రెలు పాడీ, సూడీ, ఇంటి నిండా పాలూ మజ్జిగ... ఇప్పుడో?....

ఇంట్లో ఇందరున్నా ఒక్క బర్రెను మేపుకునే దానికి లేకపోయే! ఇల్లు దాటి అడుగెయ్యటానికి చోటేదీ? 'కెపారా' వాళ్ళు పొలాల చుట్టూ కంచెలు వేసి పహరాలు పెట్టనేపెట్టిరి. తమ భూముల్లో తామే దొంగతనం చేస్తామేమోనన్నట్టు!

అధికారులు వచ్చిన రోజు నాగన్న ఇంటికాడే వున్నాడు. పొలం పేరెత్తగానే ఇంతెత్తున లేచి... "అసలు మీరెందుకు వచ్చారూ! మీకెవురు చెప్పారు! మేం అమ్ముతామని"... అని వాళ్ళను సతాయించాడు.

అయినా వచ్చినవాళ్ళు తక్కువ వాళ్ళు కాదు. వాళ్ళూ చెప్పాల్సిన పద్ధతిలోనే చెప్పారు... "ఇదంతా ప్రభుత్వం దయతలచి మీకిచ్చిందే... మళ్ళీ ప్రభుత్వానికే కావలసివచ్చింది... అందుకే మేమే తీసేసుకుంటున్నాం!" అన్నారు.

"ఏందీ? మీరిచ్చిందీ? మీ ఇంట్లోది తెచ్చిపెట్టారా? ఏంది?.... మాతాత ముత్తాతల కాడ నుండి ఇక్కడ్నే వున్నాం. మా పెద్ద లేనాటి నుండో పండించుకుంటున్న భూమి... ఇదంతా కొండా గుట్టా! కనబడటంలా.... దీన్ని రెక్కలరగదీసి వాలుకు తెచ్చేటప్పటికే వాళ్ళ బతుకులు తెల్లారిపోయాయి.... ఇచ్చారంట... ఇచ్చారు. చెప్పొచ్చారు.... చాల్లే"... వచ్చిన వాళ్ళను దులిపి వొదిలాడు.

"నీతో ఏంటిలే!".... "మీ అబ్బాయితో మాట్లాడతామన్నారు."

"ఏందీ! వాడితో మాట్లాడేదీ! నేను చెప్పిందే! వాడు చెప్పేది".

ఇది జరిగిన ఆరు నెల్లకే అంతా అయిపోయింది.

పట్టాకి రెండున్నర లక్ష.. డి.కె.టి.కి రెండు లక్షల కాడికి ఇస్తామన్నారు. వాళ్ళకు తెలిసిన రేటుకు ఐదింతలు. ఎక్కడి యాభైవేలు, ఎక్కడి లక్షలు.

అదేనా! ఇంటికో ఉద్యోగం. మొదట పొలం లేకపోతే ఎట్టా, ఏం చేసుకు బతుకుతాం అన్నవాళ్ళు!.... డబ్బులూ, ఉద్యోగం అనగానే మెత్తబడ్డారు.

ఉద్యోగం మనుషుల్ని ఎంతగానో లొంగదీసుకుంది. ఉద్యోగం, ఇస్త్రీ గుడ్డలు... ఫ్యానుకింది సీటు... చెమట పట్టని శరీరం! ఓ కల... ఎవరో పూజ చేసుకున్న వాళ్ళకు దొరికేది. అలాంటిది ఇంటికొచ్చి తలుపు తడుతోందనేది వారిని ఆశకు లోను చేసింది. దానికి తోడు అసలు మీరు యివ్వకపోతే మేమే కోర్టులో డబ్బులు కట్టి తీసేసుకుంటాం అన్నారు.

అయినా నాగన్న పొలం యివ్వనని పేచీ పెట్టాడు. కానీ మోహన్రావు వూరుకోలేదు. తండ్రి మీద యుద్ధం ప్రకటించాడు. "ఈ వ్యవసాయం చేసి పెద్దోళ్ళమవుతామా? రెండెకరాల చిండా! బతికినన్నాళ్ళూ మీలాగ్గా మట్టి పిసుక్కుంటే గానీ బాగుండదా! మన మొక్కరం చెయ్యడ్డం బెడితే ఆగుద్దా! మాకు చదువున్నా లేకున్నా జరిగిపోయింది? ఈ రోజుల్లో చదువు లేకుంటే ఎందుకు పనికొస్తారూ. అప్పుడు బళ్లూలేవూ, వసతులూ లేవు. ఇప్పుడట్లాకాదు చదవాలంటే సూళ్ళూరుపేటకు పోవాల.... ఫీజులు, డ్రస్సులు, పుస్తకాలు ఎంత ఖర్చు?"

అయినా అన్నీ పెరిగిపోయినై, లోకం మీ అప్పుడున్నట్టు ఉందా? అప్పుడు అంత సంగటి తిని ఎద్దుముడ్డి పొడుచుకుంటే బతుకెల్లిపోయింది. ఇప్పుడట్లాకుదురుద్దా"!

నాగన్న మాట్లాడలేదు.

తిరిగి అతనే "ఇదేదో అనుకోకుండానో, అనుకునో నాలుగు డబ్బులు చేతిలో పడబోతుంటే అడ్డం పెడుతున్నావేంది?"

నాగన్న అయిష్టంగా మొఖం గంటు పెట్టుకు కూర్చున్నాడు.

తండ్రీ కొడుకుల సంభాషణ అత్తకోడళ్ళిద్దరూ శ్రద్ధగా ఆలకిస్తున్నారు. కాసేపు ఎవరూ మాట్లాడలేదు. ఓ నిమిషం అట్లా నిల్చొని మోహనరావు వెళ్లిపోయాడు.

కొంచెం సేపయ్యాక సుబ్బమ్మ కలుగజేసుకొని "ఊరు పొమ్మంటుంది, కాడి రమ్మంటుంది, మనకెందుకంట. వాడికీ బిడ్డలున్నారు. వాడి బిడ్డల మీద ఆపేక్ష వాడికి ఉండదా? ఇదంతా పాడుచేసుకుంటే రేపు వాడి బిడ్డలు కాదూ బజార్లపడేది...."

ఓ క్షణం ఆగింది.

తిరిగితనే "ఈ డబ్బులొస్తే పేటలో ఎరువుల కొట్టు పెట్టుకుంటా నంటూన్నాడుగా. పాడు జేసుకుంటాడా?" మందలింపుగా అంది.

ఎటువైపు నుండీ శబ్దం లేదు.

ఎప్పటికో దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తూ "మీ అందరూ ఒకటై అమ్మదామంటే నేనొక్కణ్ణి అడ్డుపెడితే ఆగుద్దా..." నిష్టూరంగా అన్నాడు నాగన్న.

ఏది ఎట్టాగన్నా జరగనీ వరసగా మూడొందల ఎకరాల వూరి పొలం అధికారుల చేతుల్లోకి పోనే పోయింది.

రైతులు పాత బాకీలు తీర్చుకోగా మిగిలిన వాటిల్లో మోటారు బండ్లు కొన్నారు. ఇంటి ఆడోళ్ళకు బంగారపు వస్తువులు చేయించి పెట్టారు. కొరవా తరవా ఇళ్ళు బాగు చేసుకున్నారు. అన్నీ పోనూ చివరికి చేతిలో మిగిలింది చిన్న మొత్తాలే.

అధికారులు ప్రొక్లయినర్లు పెట్టి గట్లూ, చెట్లూ అంతా చదును చేశారు. ఎవరి పొలం ఏదో తెలియకుండా ఇది నాది అనే గుర్తునీ, నమ్మకాన్నీ రద్దు చేశారు.

అట్టా ఓ రెండు మూడు సీజన్లు గడిచిపోయాయి. 'కెపారా' రాలేదు. ఉద్యోగం లేదు. బ్యాంకుల్లో డబ్బు కరగడం ప్రారంభమయింది. కుర్రకారుకి ఏం పని చెయ్యాలో తెలియడం లేదు. వూళ్ళో పొలం లేదు. టౌన్లో వీళ్ళు దేనికీ చెల్లలేదు.

మోహనరావు మాత్రం చిన్నగది తీసుకొని ఎరువుల కొట్టు తెరిచాడు. అయితే చుట్టుపక్కల భూములు, వ్యవసాయం తగ్గిపోవడంతో అంతగా వ్యాపారం సాగలేదు. పైగా వ్యాపారానికి కొత్త. పెట్టుబడి బిగిసిపోయినట్టయింది. చేతిలో డబ్బు ఆడక ఇబ్బంది పడసాగాడు. భవిష్యత్తు మీద ఆందోళన ప్రారంభమయింది.

మెల్లిగా అసంతృప్తి జీవితంలోకి దిగుతోంది. అన్నిటిమీదా అసహనం... డబ్బు ఖర్చైపోతే రేపెట్లా? సందిగ్ధం పొడగడుతోంది.

దానితో ముసలోళ్ళు పనీ పాటా లేకుండా కూర్చోని తింటన్నారనిపిస్తోంది. బియ్యం, పప్పు, ఉప్పులకు ఖర్చు ఎక్కువయి పోతోందని... సణుక్కోవడం పెద్దవాళ్ళ చెవుల్లో పడుతోంది.

మరో వైపు ఎప్పటికైనా 'కెపారా'! రాకపోద్దా! ఇన్ని కోట్ల ఖర్చు పెట్టిన ప్రభుత్వం 'కెపార'కి కాకపోతే ఇంకో కంపెనీకి యివ్వకపోద్దా!... పిల్లలు చదువుకుని వుంటే వాళ్ళకైనా ఉద్యోగం వస్తుందని... లోపలేదో ఇంకిపోని ఆశతో పిల్లల్ని మాత్రం బాగా చదివించాలను కుంటున్నారు. సూళ్ళూరుపేట ఇంగ్లీషు బళ్ళకు పంపుతున్నారు.

ఊళ్ళోకే ఆటో వచ్చి ఏడెనిమిది మంది పిల్లల్ని ఎక్కించుకునిపోయి... సాయంత్రం దించటం... వతనుగా వచ్చిపోతుంది. మోహన్రావు తన కొడుకునూ పేటలో చేర్చాడు.

ఇక మోహన్రావు ఎండెక్కిందాకా జెండా చెట్టుకాడో... పోలేరమ్మ గుడికాడో... లేకపోతే ఏ 'ఆట' కాడనో కాలక్షేపం చేసి... అన్నంతిని... ఓ కునుకు తీసి... మోటారు బండి ఎక్కాడంటే ఏ రాత్రికో గాని తిరిగిరాడు.

అతనే కాదు... ఆ వూళ్ళో కుర్రకారంతా అదే దోవ.

ఎటొచ్చీ ముసిలోళ్ళకే ముంచుకొచ్చిందనుకున్నాడు నాగన్న.

మనిషి జీవితం ఇంత దుర్భరమని తానెన్నడూ అనుకోలేదు. పంటలు లేకా, కరువు వాతనపడ్డప్పుడు గానీ, అయినవాళ్ళు పోయినప్పుడు గానీ... మరింకే కష్టంలోనూ నాకు

నేను బరువుగా అనిపించలేదే?... జీవితంలో దుఃఖాలూ, బీభత్సాలూ, మరణాలూ తనను కదిలించలేకపోయాయి.... ఇప్పుడు... ఇప్పుడు మాత్రమే వంటరిననిపిస్తోంది.

ఇప్పుడేమీ పనిలేనట్టు... భూమి మీద ఏ బంధమూ లేనట్టూ... ఇంత నిష్క్రియగా వుండటమేమిటీ? తన తండ్రి కున్నపాటి జీవితానురక్తి తనకెందుకు లేకుండా పోయినట్టూ?... తనకీ మనవడూ, మనవరాలూ అందరూ వున్నారుగా!...

✡

కాలం ఏ బిందువు దగ్గరా ఆగనేలేదు.

తరచుగా ముసలోళ్ళు అరుగుమీద చేరినప్పుడల్లా తమ వెతలు వెళ్ళబోసుకుంటూనే వుండారు. ఇంటింటికీ ఇవే కథలు.

"లేదు లేంద్రా! పొలం లేకపోవడమొక్కటే కాదు లేరా! అయినా భూములు పోయింది ఈ నాలుగేళ్ళ సందేగా! ఇంతలోనే ఇది రాలేదు గానీ!" సాలోచనగా అన్నాడు కోటయ్య.

రాత్రి బువ్వలు తిని గుడి అరుగుమీద చేరారు. ఉగాది వెళ్ళిపోయింది. ఇంట్లో కంటే బజార్లో చల్లగా వుంటుంది. మబ్బులు లేని ఆకాశంలో చుక్కలు ప్రకాశవంతంగా వున్నయ్యి. వెన్నెల ముసలివాళ్ళను సేద తీరుస్తోంది.

"అసలు పొలాన పనిజెయ్యడం నామోషీ కింద మారిపోవడం... చేసినా, ఏం లాభమని జనానికి అనిపించడమే మొదలనుకో!... జొన్న, కందీ పోయి... ఈ బోర్లు వచ్చి కొత్తెగ సాయం రావటం... అయ్యి ఒకేడు ధరుంటే, ఇంకో ఏడు వుండక నష్టాలు రావటం. అంతా జూదమేనయ్యో!... చేతినిండా డబ్బులున్నట్టే వుండే... అప్పులూ మిగులుతుండె"... అరుగు మీద వాళ్ళ అనుభవాల చర్చ ఎప్పటికీ సాగుతూనే వుండేది.

"అప్పులూ గిప్పులూ కాదు లేంద్రా!... అందుకే ఎగసాయం మీద మనసు బోయిం దంటారా! వట్టిమాట!... అప్పులైనా ఎవుడు లెక్క చేసిందీ?.. కొత్తెగ సాయం వచ్చాక చేతిలో దుడ్లు అడుతుండ్లా!" ఎవరో అందుకున్నారు.

"ఇంతలోనే వూళ్ళోకి టీ.వీ. వొచ్చె. టీవీల్లో ఎన్ని రకాల వస్తువులు చూడటంలా!... అయ్యన్నీ కాకపోయినా! కొన్నన్నా కొనాలంటున్నారుగా! ఆడంగులు... అసలప్పటి నుంచే... పిల్ల కాయల్లో చలవ బట్టలేసుకుని తిరగాలని కోరిక పుట్టిందిలేరా!"... కోటయ్య తన పిల్లల్ని తలచుకున్నాడు.

"అవున్రా! మావాడు చదివింది రెండో కలాసే... అయినా దానికే వాడు పొలంలోకి దిగాలంటే ఎంత ఇదైపోయేవాడూ?.... కొడుకు పనులు తల్చుకుంటూ, మావాడేందీ?...

ఈవూరు కుర్రోళ్ళ పదేళ్ళగా మట్టిలో దిగి ఎగసాయం చేసినోడేడీ?... అంతా కూలీల పెట్టేనాయె! నట్టం రాక ఏమొచ్చుద్దీ".

"అవున్లే వీళ్ళిట్లా పనిచేసే దానికి పంజలయ్యారు గనకే.... వాళ్ళూ అట్టా పొలాలు లాక్కో గలిగారు. 'ఇయ్యిపోతే ఎట్టారా? బతుకు! అనుకుంటే కట్టుగా వుండేవాళ్ళు గాదూ?... అప్పుడు వాడు మాత్రం ఏం చేసేదీ?"... కొడుకు పొలం అమ్మమని గోల చెయ్యడం నాగన్నకు జ్ఞాపకానికి వచ్చి... నిట్టూర్చాడు.

"అసలు పల్లెటూళ్ళకి ఈ ఆటోలు వచ్చి సూళ్ళూరుపేటకో, నాయుడు పేటకో పోయేది మరిగారు.... ఇగ వూళ్ళో వుండి ఎగసాయం ఏం చెయ్యబుద్దవుద్దీ".. అప్పుడే సొంతం వూరు మారిపోయింది".. ఒకరివెంట ఒకరు సంభాషణ సాగుతోంది.

"అసలు వూళ్ళల్లోకి ఆటోలు రాసాగినాక ఎవరి మాటా ఎవరూ లెక్క చెయ్యటం పోయింది. అప్పుడు సూళ్ళూరుపేటకు సినిమాకు పోవాలంటే ఏడాదికో, రెండేళ్ళకో గాని పోయేదిగాదు. పండక్కి గుడ్డలు కొనాలంటే ఊళ్ళోకి వచ్చిన మూట్ల మస్తాన్ దగ్గరే కొనేది. ఇప్పుడో? రోజూ పేటకేగా! చూసిన గుడ్డల్లా కొంటన్నారు".

ఆ మాటలు వింటుంటే తన కొడుకు రోజుకో కొత్త వస్తువు తేవడం గుర్తుకొచ్చింది నాగన్నకు. తను వున్నయ్యి కాసిని అయిపోతయ్యేమోనన్న భయంతో... ఎందుకురా! యియ్యన్నీ ఇప్పుడూ! అంటే వాళ్ళకెంత కష్టంగా వుంటుందో....

అరుగు మీద చేరారంటే ముసలోళ్ళు, ఇంటికి పోబుద్ధి కానట్టు ఏవేవో తలపోసుకోవడంతో సరిపోతుంది.

నాగన్నకూ ఇంటికి పోవాలనిపించడం లేదు. అక్కడ తనతో మాట్లాడే మనిషి లేనట్టుగా వుంటోంది. పైగా తను అడ్డంగా వున్నట్టనుకుంటున్నారేమోనన్న ఆలోచన మరింత బాధిస్తోంది.

పొద్దుటిపూట ఇంట్లోకి పోతే... కోడలెక్కడ విసురుకుంటుందోనని... దూరదూరంగానే వుంటున్నాడు. కారేజీ... బూట్లు... డ్రస్సులు... ఆటోకి ఆలస్యమవుతుందని కోడలు పడే హైరానా అంతా ఇంతా కాదు. అప్పుడు ఇంట్లోకి పోతే, వెళ్ళిన వాళ్ళ మీద విసుక్కుంటుంది. అట్టా అనిపించుకోవడం నాగన్నకు ఇష్టముండదు.

ఆమె సంగతి కన్నా మనమడు తనకు కాకుండా పొయ్యాడన్నది మరింత దిగులుగా వుంటోంది. తన తండ్రికీ – తన కొడుక్కి ఎడబాటు వున్నట్టు తన కెన్నడూ తట్టనేలేదు. తండ్రి తన అనుభవాలను మనమడికి తెలియకుండానే ఎలా అందించేవాడూ?

మోహనా బుడ్డి దీపం ముందు కూర్చోని. "అశ్వని, భరణి" అనో "చైత్రమూ, వైశాఖమూ" అనో కార్తెలూ, నక్షత్రాల పేర్లు చదువుతుంటే... అవన్నీ మనకు సంబంధించినవే గదా అనిపించేది. పుస్తకాల్లో కూడా అవే వుంటాయనిపించేది.

మోహనాను పక్కలో వేసుకుని... వాడికి ఎన్ని నేర్పాడు. వైశాఖలో గాలి విసరకుండా వుంటే – స్వాతమ్మ చల్లగా చూస్తే... అనూరాధలో ఆరోగ్యంగా వుంటయ్యిరా! పంటలూ. అప్పుడు రైతుల కళ్ళు నవ్వుతాయి... లోగిళ్ళు నిండుతయ్యి"

"... అవన్నీ లేవు తాతా దీన్లో! వట్టి పేర్లే!"... మోహనా!

"అయ్యన్నీ బొక్కుల్లో వుండవురా! అయ్యి రైతు అనుభవంలో వుంటయ్యిరా మనవడా!" నిండుగా నవ్వుకునేది... కానీ ఇప్పుడు తన మనవడికీ తనకీ మాటలే తక్కువయి పోయినయ్యి... తండ్రి గుర్తురాగా 'ఎంత అదృష్టవంతుడో! తృప్తిగా బతికి పోయాడు' మనసు బరువుగా అనిపిస్తోంది నాగన్నకు.

తన మనవడో... తనేదన్నా చెప్పబోతే.... "అసలు నీకేం తెలియదులే తాతా" అంటున్నాడు. వాడు ఆ కరెంటు బుడ్డి ముందు కూర్చొని ఏం చదువుతున్నాడో అది ఏం భాషో అర్థమే కావటం లేదు. వాడికిప్పుడు మనుషులే నచ్చటం లేదు.

ఈ పేట బడికి పోసాగాక ఎప్పుడన్నా పిలిచి పక్కలో పడుకోమన్నా.... 'వాసన తాతా వాసన' అంటున్నాడు. పక్కలోకే రావటం లేదు. తన మనమడు తనకెప్పుడో దూరమయినట్టే వుంది. ఈ రెండేళ్ళలో వాడిలో ఎంత మార్పు? .... వూరు కూడా నచ్చుతున్నట్టు లేదు....

అయినా వాడికీ నాకూ చెప్పుకునే మాటలేమున్నయ్యి! గొడ్డు గురించా! పంట గురించా! చెలక గురించా! చేని గురించా!... వాడికి ఇంకొన్నాళ్ళు పోతే వ్యవసాయమేందో, అరకలు నాగళ్ళు ఏందో ఏం తెలుస్తుందీ?

వాడు సరే! మోహనా, నేనూ ఏం మాట్లాడుకుంటున్నాం? అసలు ఇద్దరికీ దేని గురించి మాటల అల్లిక ఏర్పడుద్దీ?... మొక్క మొలిచిందనా! చీడ పట్టిందనా! పూత వేసిందనా! కాయ కాసిందనా!... పొలమే పోయాక బంధమే తెగిపోయినట్టయ్యింది...

పొలం నుండి వచ్చామంటే... నీళ్ళు పోసుకుంటా, అన్నాలు తింటా ఆ రోజు పొలాన జరిగిన సంగతులే నడిచేయి... ఇప్పుడు వాడు పేటలో ఏం చేస్తున్నాడో!... నాకు చెప్పేనా!... నేను వినేనా!... ఇక మనుషుల మధ్య కలబోతలకు కాలం చెల్లిపోయింది.

నాగన్నకు మనుషులంతా ఇక చెల్లా చెదరైపోయినట్టే వుంది. అందరినీ కలిపి కట్టి పడేసే భూమి లేదు. ఇక్కడ బతుకుదెరువు లేకపోతే ఎక్కడ దొరుకుద్దో అక్కడికి పోవాల్సిందేగా! ఇప్పటిదాకా మోహనా టౌనుకు పోయి వస్తున్నాడు. రేపటి రోజు వీడు టౌన్లోనే వుంటాడు గావచ్చు!.... ఇప్పుడిక్కడేముందనీ!...

నాగన్నకు రోజురోజుకూ – పనిలేకా, ఏం చెయ్యాలో తోచక ఏదో నిర్వీర్యత... అన్నిటి పట్ల తెలియని నిర్లిప్తత ఏర్పడసాగాయి. క్రమంగా అతని ఆరోగ్యం కూడా పనిచెయ్యక

మూలన పడేసిన యంత్రం మాదిరి తుప్పు తేలినట్లుగా... ఎక్కడి కీళ్ళక్కడ పట్టకపోతున్నాయి. చిన్న చిన్న పనులకు కూడా భార్యను కేక లేస్తున్నాడు.

ఆ రోజు,... "కండవా యియ్యవే! బజారులోకి పోయొస్తా" కేక వేశాడు నాగన్న!... సుబ్బమ్మకు వినబడలేదు. మరోసారి పిలిచాడు. ఆమె వెనక సందులో గిన్నెలు తోముతావుంది. చేతులు ఖాళీ చేసుకుని వచ్చేటప్పటికి కాస్త ఆలస్యమయింది.

సుబ్బమ్మ మీద అంతెత్తున ఎగిరాడు. "పిలిస్తే వచ్చేది లేదా! లెక్క లేకుండా పోయింది!"...

ఆమెకూ చిర్రెత్తి.. "వూరికే కూచ్చోని కేక లెయ్యకపోతే... అంత చిన్ని పని చేసుకోకూడదా? లేచి కండవా తీసుకోటానికేందీ?" అంది.

దానితో పెద్ద రభస అయింది. ఎప్పటెప్పటివో తవ్వి మరీ పోట్లాట వేసుకున్నాడు. ఈ గోలలో అత్తను మాత్రమే తిడుతున్నట్లుగా అనిపించలేదు కోడలికి. అందులో తమకేదో తగిలినట్లనిపించింది.

ఆమె కూడా మామ మీద నోరు చేసుకుంది. "ఎందుకులే అని వూరుకుంటుంటే... రోజు రోజుకు నీ సతాయింపు ఎక్కువయిపోయింది. నువ్వు చూస్తుండగా ఏదన్నా తిన్నా వూరుకోవు... కొత్త వస్తువు కొన్నా ఓర్చుకోవు! ఏందంట?... నీ సొమ్మేమన్నా పెట్టినట్టూ"...

"మొన్నటికి మొన్న ఆ డి.వి.డి. కొనుక్కొచ్చారని అంత రాద్ధాంతం చేస్తివి. ఈయన కాబట్టి సరిపోయింది.... ఇంకోరయితేనా!...." ఆమెకు అప్పటి నుంచీ కడుపులో వున్న కోపాన్నీ వెళ్ళగక్కింది.

కోడలి మాటలు నాగన్నను దిమ్మెర పోయేట్టు చేసినయ్యి. వాళ్ళు పెట్టుకునే ఖర్చులో తన సొమ్మేం లేదా?... తను కాదా ఆ భూమిని సంపాదించింది. ఈనాటికి నేను పిడికెడు మట్టి కూడా లేని బికారినా?...

రోజూ ఆ 'డబ్బా'లో వచ్చే సినిమాలు చాలక... మళ్ళీ కొత్తదేదో కొన్నారంటే కడుపు మండిన మాట నిజం... కానీ ఎవరి మంచి కోసం అన్నానూ!

దాని అవసరం ఉంది. అది కూడా వాళ్ళతో కలసిపోయినట్టుగానే వుంది అనుకున్నాడు.

మంచంలో అట్టాగే ఉండిపోయాడు. ఆ పూట బజారుకు కూడా పోలేదు.

సుబ్బమ్మ భర్తను చూస్తుంటే ఎట్టా బతికి ఎట్టా అయ్యాడు?... అని ఓ పక్క దుఃఖంగానూ, మరోపక్క రోజుల్నుబట్టి సరదాగాని ఎల్లకాలమూ మనదే ఆలోచన అనుకుంటే ఎట్టా కుదురుద్ది అనుకుంది. వాళ్లూ మనంతవాళ్లయ్యారని తెలుసుకోడేందీ మనిషి? అని లోపల్లోపల యిదైపోతోంది.

నాగన్న మంచంలో అట్లా ఎంతసేపున్నాడో!

'నా వల్ల దమ్మిడి ఎత్తు లాభం లేకపోయాక ఎవరు మాత్రం ఎందుకు లెక్కజేస్తారు? యిదేమన్నా ఎనకటి రోజులా? పెద్దా చిన్నా అనుకోవడానికి?

వాళ్ళన్నారని కాదుగాని నేను మాత్రం ఊరుకనే ఎందుకుండాల? వొంట్లో యింకా సత్త వుండాక'

ఆ రాత్రంతా ఆలోచన చేసి 'భూమంతా వాడు చుట్టబెట్టలేదుగా. ఇక్కడ కాకపోతే యింకోచోట. అటు పడమట పెంచలయ్య కాడికి పోతే ఓ ఎకరా కౌలుకన్నా దొరక్కపోద్దా! చూద్దాం...' అని ఓ నిశ్చయానికి వచ్చాడు.

రోజూ పొద్దుటే ఉండే విసుర్లూ కసుర్లూ లేకుండా పనులు నడుపుకున్నాడు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. సద్దన్నం తింటానే కండువా భుజానేసుకొని సుబ్బమ్మ వింటుండగా "ఊరికి పోతన్నా" అని గాలిలో ఓమాట విసిరి కఱ్ఱ తీసుకొని పేటరోడ్డు ఎక్కాడు.

✡

# మడకెద్దులు

–పేరూరు బాలసుబ్రమణ్యం

ఇంటెనక పందిట్లో చిన్నోడు, పెద్దోడు 'అంబా' అని అరస్తాండాయి. ఆ అరుపు ఇన్న కిష్టయ్య మేలుకున్నేడు.

సరస్వతీ కండిగలో అందరికీ కోడికూతతో తెల్లారితే కిష్టయ్యకి మడకెద్దుల అరుపులతో తెల్లారతంది.

కిష్టయ్య నిద్రలేచి గోడకి తగిలిచ్చుండే వెంకటేశులసామి కేలండరును చూసి దణ్ణం పెట్టుకున్నేడు.

దండేం మీదుండే తుండుగుడ్డని ఇదిలించి భుజాన ఏసుకుని పందిట్లోకొచ్చి మడక గిత్తలకి కుడిత్తొట్టిలో నీళ్ళు తాపించి గాటికి కట్టేసి ఈధిలో కొచ్చినాడు.

తూర్పున ఇంగా పటమెగరలేదు. ఈధిలో తిన్నిమీద కూర్చున్నేడు.

చెవిలో బీడిముక్కని తీసి నోట్లో పెట్టుకుని ముట్టిచ్చి నోటినిండా దమ్ములాగి వదిల్నేడు.

కిష్టయ్య ఒంటిగోడు. భూమిపుత్రా, కయ్యాకత్రా లేదు. ఉండే ఆస్తిపాస్తులు ఒక అద్దాపిల్లు. ఇంటెకనక పందిట్లో గిత్తలు. పందిటికి ఆనుకొని ఖాళీగుండే పశువుల కొట్టాం.

మడకెద్దులు కూడా కొనలేక సేద్దెం చేసే చిన్నా చితకా రైతులకు కిష్టయ్య తన కాడెద్దులతో దుక్కిదున్ని నాలుగు రూకలు సంపాదించుకుని పొట్ట పోసుకుంటావుంటాడు.

దుక్కిదున్నడమే కాదు. ఏ రైతు మడకగిత్తలు కొనాలన్నా కిష్టయ్యని ఎంటేసుకుని పోతే చాలు. సేద్దానికి మంచి గిత్తలు కొనిస్తాడని ఆ చుట్టుపక్కల ఊళ్ళల్లో పేరెత్తినాడు.

అందుకే సరస్వతీ కండిగలోకొచ్చి దలారి కిష్టయ్య ఇల్లెక్కడ అనడిగితే పాలు తాగే బిడ్డ కూడా చూపిస్తాడు.

కిష్టయ్య గిత్తల్ని చూస్తానే వాటి గాటి సొభావం పొడస్తాయా లేదా? లేతలా? ముదుర్లా? నోరు తెరిచి ఎన్ని పొల్లో చూసే దగ్గరనుండి వాటి సుడులు, మచ్చల వరకు గొడ్డును కింద నుంచి పైకి ఎగజూసి దిగజూసి బేరానికి కూచ్చుంటాడు.

అమ్మేవాళ్ళ కొనేవాళ్ళ ఇరుపచ్చాలకీ నాయమైన ధరజేసి ఎద్దుల్ని కొన్నోళ్ళింటికి తోలకపోయేంతవరకు అన్నీ తానై చూసుకుంటాడు.

ఎవురైనా కిష్టయ్య సొభావం తెలీనోళ్ళు ఎద్దులు తోలకొచ్చి గాట్లో కట్టేసినాక కమీషనుగా డబ్బులు ఇయ్యబోతే చాలా బాధపడిపోతాడు.

"నేనేం జేసినా? గుండ్లెత్తినానా? బండ్లెత్తినానా? మాట సకాయమే గదాబ్బా జేసినా! కావాలంటే కడుపునిండా బువ్వ బెట్టండి తినిపోతా" అని తిండితిని వెళ్ళే వాడే తప్ప ఏ రోజూ ఒకరి దెగ్గిర చెయ్యి జాపినోడు గాదు.

"కిష్టమావాఁ! రూక తక్కవలో గిత్తలుంటే చెప్పా" అంటా వొచ్చి తిన్నిమీద కిష్టయ్య పక్కలో కూర్చున్నేడు పక్కింటి నాగిరెడ్డి కొడుకు జయరాముడు.

"రూక తక్కవంటే ఎంతలో గావాలవాయ్!"

"ఒక ఐదువేలల్లో ఏడన్నా వుంటే చూడు మావాఁ"

"ఐదేలకి పొట్టేలి పిల్లలే రావువాయ్! ఇంతకీ గిత్తలు బట్టకొచ్చి యాడ ఎకరాలు దున్నాలని. నీకుండేది ఆ మూలొంకలో నాలుగ్గుంటలే కదా! నాకు దెలవకుండా యాడన్నా గొన్నేవా?"

"ఎగతాళి పడబాక గొమ్మునుండు మావాఁ! నీకు దెలవకుండా నేనేడ గొన్నే! 'చీటికి మాటికీ చిన్నాయన గిత్తలు కట్టుకుపోయి దున్నుకుంటుండాము. ఆయనేమో మన దెగ్గిర నయాపైసా తీసుకోడు. అందుకని 'నా బొందుసైనా కుదవలో వుండాది కదా! దాన్ని ఇడిపించి అమ్మేసి మిగిలిన దుడ్డుతో సొంతంగా గిత్తలు పట్టుకో'మని నా భార్య ఒకే మాపన సతపోరతండాది మావాఁ! అందుకు అడిగినా" అన్నేడు జయరాముడు.

అంతలోనే ఈధి కొళాయి కాడ బిందెతో నీళ్ళు పట్టుకొని వీళ్ళిద్దరి ముందర్నే పోతాండాది జయరాముడు భార్య శాంత.

"మ్మేయ్! శాంతా నీకు నా దెగ్గిర కూడా ఇంత బిగుమానమైతే ఎట్లమ్మే! ఊరికే నా గిత్తల్తో దున్నుకుంటన్నామని నీకంత బొగిసానంగుంటే పంట చేతికొచ్చినాక నాలుగ్గింజలు ఇస్తువులేమ్మే" శాంతతో అన్నేడు కిష్టయ్య.

"అది కాదు సిన్నాయనా..." అని ఇంకేదో చెప్పబోయింది శాంత.

"ఏదిగాదు, ఇంక నువ్వు నోరు మూసుకొని పోమ్మే! ర్రేయ్. జయరామా! చిన్నోడు, పెద్దోడు కసువు తిన్నేక పట్టుకొని పోయి మడక కట్టుకో" అన్నేడు కిష్టయ్య.

అంతలో ఈది చివర్న దెయ్యాలోడు, అక్కుర్తి రాముడు వస్తాండారు.

వాళ్ళను జూసిన జయరాముడు "మావాఁ! ఇట్లా అంటండానని తప్పుగా అనుకోబాక. దెయ్యాలోడితో సావాసం, యాపారం నీలాంటోడికి అంత మంచిది కాదు" అన్నేడు.

"జయరామా! చెడ్డోళ్ళు బతికినంత కాలం చెడ్డోళ్ళుగానే ఉండర్లేరా" అని కిష్టయ్య అంటా వుండగానే దెయ్యాలోడు, అక్కుర్తి రాముడు దగ్గిరికొచ్చేసినారు.

"ఏంరా జయరామా! తెల్లార్తో కిష్టమామ దగ్గిరుండావే దేనికి టెండరేస్తాండావు?" వచ్చీ రాంగానే అన్నేడు దెయ్యాలోడు.

"ఆ మాట అనాల్సింది నేను. టెండర్లు ఎయ్యడానికే గదా! యామారకుండా రోజూ అక్కుర్తినుండి ఒకడ్ని ఎంటేసుకుని వస్తాండేది" చురుగ్గా అన్నేడు జయరాముడు.

ఆ మాటికి దెయ్యాలోడు మొఖాన కత్తేస్తే నెత్తురు చుక్కలేదు.

అక్కుర్తి రాముడు మిడిగుడ్లేసుకుని జయరాముడ్ని మింగేసేటట్లు చూస్తాండాడు.

ఇదంతా ఇంటున్న కిష్టయ్య జయరాముడ్ని "పెద్దంతరం, చిన్నంతరం లేకుండా ఏంద్రా వాగుడు నోరు మూసుకుని పోవాయ్" అన్నేడు.

జయరాముడు తిన్నిదిగి భుజానుండే పైగుడ్డ వాళ్ళిద్దరి ముఖాన ఇదిలించి మళ్ళీ పైనేసుకొని బరబార వెళ్ళిపోయినాడు.

"నో! వోడు పొగురు చూడ్నా" అన్నేడు అక్కుర్తి రాముడు

"పిల్లకుక్క! వోడితో ఏముండాది గానీ పొయ్యిన వారం అగ్రారం నుండి తోలంపించినానే ఎఱ్రగిత్తలు. అవి అమ్ముడు పోయినాయా లేదా?" సందేహంగా అడిగినాడు కిష్టయ్య.

"కిష్టన్నా! నీ చేత్తో పట్టిస్తే అవి అమ్ముడుపోకుండా ఎట్టుంటాయన్నా! మొన్ననే అమ్మేసినా అన్నీ ఖర్చులుబోనూ నాలుగొందలు గిట్టుబాటైంది" అన్నేడు అక్కుర్తి రాముడు.

"ఆ గిత్తల్లో వలపట దానికి పొరకసుడి వున్నింది కదా! ఎట్టమ్మినావు?"

"నువ్వు నేర్పిన విద్దేన్నా! కొన్నోడు మా దూరపు బంధువు. పొరకసుడి వుండే గొడ్డు ఇంట్లోకొస్తే ఏదీ నిలవదన్నేడు. నేనొకటే జెప్పినా నీ ఇంట్లో ఏముండాదని నిలవడానికి, సుడి వుండే గిత్తలు గొంటే ధనలచ్చిమి ఇంట్లోకి జొరబడతందన్నేవే! అవి కొన్న నాలుగు నెల్లకే గదా! ఉన్నిందంతా ఊడ్చుకుపోయింది. నిలవకపోవడానికి ఇంకేం మిగులుండాదని. మనం చేతకాక చేసుకుని నోరు వాయిలేని గొడ్డుమింద సాకులు జెబ్బాక! అని నాలుగు ఇదిలించినా. అదీ నిజమేనని నోరు మూసుకోని కొన్నేడు" జరిగిన కథంతా అప్పజెప్పినాడు అక్కుర్తి రాముడు.

"రాముడా! బాగా అడిగినావురా. నోరు లేని గొడ్డుకు మచ్చలు, సుడులని ఏం చెడ్డ జరిగినా గొడ్డొచ్చిన ఏళని నింద వాటిమింద తోసేస్తారు" అని రాముడ్ని మెచ్చుకున్నేడు.

“మావాఁ! మీ మాటల్తోనే పొద్దెక్కుతాంది. బిన్నే పదండీ! రామలింగాపురంలో నాయుడు గిత్తల్ని కయ్యలోకి పోకముందే గాటి కాడుండంగానే బేరమాడాల” అని కిష్టయ్యని తొందరజేసినాడు దెయ్యాలోడు.

కిష్టయ్య ఇంట్లోకెళ్ళి అన్ని సద్దినీళ్ళు తాగేసి ఇల్లు బీగా లేసుకొని బీగం చెవి మొలతాడుకి కట్టుకోని వాళ్ళతో రామలింగాపురం బయలుదేర్నాడు.

కిష్టయ్య, దెయ్యాలోడు, అక్కుర్తి రాముడు ముగ్గురూ సరస్వతీ కండిగ పొలాల్లో గెనాలమీద నడిచి పోతాండారు.

పొలాల్లో వరికోతలు జరగతాండాయి. పొద్దున్నే సొంతగోళ్ళు కయ్యలోకొచ్చి కూ లోళ్ళు వచ్చే లోపల కోసినంత కోద్దామని పనకోసి వాది పెడతాండారు.

దెయ్యాలోడు కోస్తాండాడు కిష్టయ్య అక్కుర్తి రాముడు చెవులు తెగేటట్లు కోతలు.

దెయ్యాలోడు, అకుర్తి రాముడు పాత సావాస కాపులు. ఆ సావాసం మీద సరస్వతీ కండిగలోకొచ్చి దెయ్యాలోడ్ని పట్టుకొని వాడి గుండా కిష్టయ్యతో గిత్తలు, ఆవుల యాపారం మొదులు బెట్టినాడు అక్కుర్తి రాముడు.

కిష్టయ్యకి చుట్టుపక్కల ఊళ్ళల్లో నీతి గల్లోడని మంచి పేరు బడినాడు. కాబట్టి అక్కుర్తి రాముడికి డబ్బుల్లేనప్పుడు ముందుండి అప్పులు కూడా తోలిస్తావుండేవోడు.

రాముడు గిత్తల్ని, ఆవుల్ని వాళ్ళూరు తోలుకెళ్ళి ఆ చుట్టుపక్కల ఊళ్ళల్లో నాలుగు రూకలు లాభానికి అమ్ముకొని మాట పెకారం కిష్టయ్య గుండా సొత్తు గల్లా వోళ్ళకి డబ్బులు జేర్చేసేవోడు. అందువల్ల కిష్టయ్యకి అక్కుర్తి రాముడంటే భలే నమ్మకం.

కిష్టయ్య సొంతూరు సరస్వతీ కండిగోళ్ళే కాకుండా చుట్టుపక్కల ఊళ్ళల్లో వోళ్ళంతా కూడా కిష్టయ్యతో దెయ్యాలోడ్ని, అక్కుర్తి రాముడ్ని చూసినపుడంతా బాధపడేవోళ్ళు. దెయ్యాలోడు డబ్బు కోసరం పియ్యితినే రకమని, ఏమైనా చేస్తాడని కిష్టయ్యని ఏడ ఏమారిపించి మోసగిస్తాడోనని అనుకుంటూ వుండేవోళ్ళు.

ముగ్గురూ నడిపోడి పాదులపైన నడస్తాండారు. అక్కడ కయ్యలో గెనింమీద కూర్చోని నడిపోడు, నడిపోడి భార్య కీచులాడతాండారు.

అది చూసిన కిష్టయ్య “రేయ్! నడిపోడా ఎందుకురా అట్లా అరచుకుంటాండారు?” అని అడిగినాడు.

“ఏం జెప్పమంటావు మావాఁ! దీనెమ్మ నాయాల్ది దీనికేమో దెలిసినట్టుగా కోత రేపే కోసేయాలంటాండాది” కోపంగా పెళ్ళాంపైన ఇరుచుకు పడినాడు నడిపోడు.

"గ్గో! నాతో మాటాడు... నాయమ్మగారి జోలికిపోతే మాత్రం ఊరుకునేది లేదు"

"ఊరుకోకపోతే గెజ్జులు గట్టుకోని ఎగరతావా?!"

"రేయ్! నడిపోడా నువ్వూరుకోరా! పాపా! ఏందమ్మే నీ బాధ" అని అడిగినాడు కిష్టయ్య.

"ఏం జెప్పమంటావు పెదనాయనా! ఈ పచ్చిజూసి వారం రోజులు కోత ఆపదామంటాడు ఈ మొగోడు. మబ్బులు ముసురుకోనుండాయి. పలపలాని నాలుగు చినుకులు రాలితే వుండే గింజలు కూడా రాలిపోతాయని చెపతావుంటే ఇంటే కదా" అనింది నడిపోడు భార్య.

కిష్టయ్య ఒక వరికంకి తుంచి గింజల్ని నలిపి చూస్తా "నడిపోడా! కర్రపచ్చ గుండాది గానీ గింజ గెట్టిబడిపోయుండాది. నీ భార్య మాట ఇని కోత రేపే మొదులు బెట్టు" అనేసి బయలుదేర్నారు.

✡

కిష్టయ్య ఒకప్పుడు ఆరెకరాల రైతు. భార్య చిన్నమ్మ కష్టజీవి. ఏ ఏళకాడ వెళ్ళి అన్నమని అడిగినా నాలుగు మెతుకులు పెట్టందే పంపించని గొప్ప ఇల్లాలు. కిష్టయ్య, చిన్నమ్మలకి ఒక్కగానొక్క కూతురు లక్ష్మి. పెళ్ళి కెదిగిన బిడ్డ. అయినా గారాబంగా పెంచేవోళ్ళు.

కిష్టయ్య ఇంటెనక కొట్టాం నిండా పశువులు. ఇంట్లో గాదినిండా గింజలతో ఆ ఇల్లు కళకళ లాడుతాండేది.

కిష్టయ్య, చిన్మమ్మలు ఇద్దరూ కష్టజీవులు. పనులకాలం వస్తే తెల్లారి లేచి పశువులు తోలుకుని వెళితే కయ్యకాడ్నే దొల్లాడిపొల్లాడి మద్దేనం లక్ష్మి రెండు సంగటి ముద్దలు గొట్టి ఎత్తకపోయి పెటితే తిని పొద్దుపోయినాక వస్తరు.

ఇట్లా జరగతావుంటే ఒక దినం బండారుపల్లి గిట్టోడు కొడుకు రంగడు ఎప్పట్నుంచి మాటేసుకోనున్నేడో తెలవదుగానీ ఒకరోజు ఎవురూ లేనిది జూసి కిష్టయ్య ఇంట్లో దూరి లక్ష్మిని పాడుజేసినాడు.

ఆ అమ్మి అరుపులు ఇన్న ఊళ్లో జనం ఓడ్ని నిలేసి మద్దిస్తంజేసి ఆ పిల్ల మెడలో బొట్టు కట్టించినారు.

కిష్టయ్య, చిన్నమ్మలకు ఇష్టం లేకపోయినా బిడ్డ బతుకు ఊరంతా అగుడైపోయిందని ఓడే అల్లుడని ఒప్పిపోయినారు.

రంగడికి లేని చెడ్డలవాటు లేదు. ఒక బిడ్డ కలిగేవరకు సంసారం జేసిన రంగడు, డబ్బు తెమ్మని లక్ష్మిని సతపోరడం, కొట్టడం మొదలుబెట్టినాడు.

"నా జీవితం నాశనం జేసి అన్నేయంగా నన్ను నీ మెడన కట్టేసుకునింది జాలక డబ్బు గావాలా నీకు, ఆ మాట అడగటానికి సిగ్గులేదా?" అని ఎదురు మాటాడి ఒళ్ళు హూనమయ్యేటిగా దెబ్బలు తినేది లక్ష్మి.

ఈ విషయాలు ఆ ఊళ్ళోళ్ల దోరా ఇన్న కిష్టయ్య బిడ్డ కష్టపడకూడదని పెళ్ళాం వద్దంటున్నా కూతురు, అల్లుడు పేర ఉన్న పొలంలో సగం పొలం రాయించాడు.

చిన్నమ్మ, కూతురు బతుకు ఇట్లయిపోయిందనే దిగులుతో సగమైంది. ఏ పనిచేస్తున్నా ఎక్కడో ఆలోచిస్తావుంటుంది. ముందున్న తెంపు లేదు. మొగంలో నవ్వు లేదు.

ఒక రోజు రంగడు లక్ష్మిని కొట్టి తీసుకొచ్చి కిష్టయ్య రాసిచ్చిన పొలాన్ని అమ్మేసి సంతకం పెట్టించాడని తెలిసేటప్పటికి ఆ తల్లి కదల్లేని రాయిలా అయిపోయింది.

ఇంటిముందు జింక పిల్లలా గంతులేస్తా వుండే లక్ష్మిని తప్పతాగి రోజూ కొడతాండాడనే నిజాన్ని జీర్ణించుకోలేక మెదడు మొద్దుబారిపోయి, మతిపోయి పిచ్చిదైపోయింది చిన్నమ్మ.

కిష్టయ్య పనులన్నీ మానేసి భార్య చిన్నమ్మ ఆరోగ్యం కోసరం కొట్టాం నిండా వుండే పశువుల్ని, మిగిలిన పొలాన్ని అమ్మేసి అన్ని ఆసుపత్రులు తిరిగినాడు. మానసిక రోగానికి మందు లేదని తెలియక చెప్పిన వైద్యమంతా చేయించినాడు. దెయ్యం పట్టిందంటే నమ్మి మంత్రగాళ్ళ చుట్టూ తిరిగినాడు. యాదొచ్చినోడు ఎర్రోడని ఎవరేం జెప్పినా జేసినాడు. అన్నీ ధారబోసుకోనీ ఎన్ని జేసినా పెళ్ళాం పేనం నిలబెట్టుకోలేకపోయినాడు.

అట్లా అన్ని రకాల చెడి ఒంటరోడై, బాధలోడై, చివరికి దలారోడై ఊళ్ళు తిరగతా నలుగురికీ నాలుగు మంచి మాటలు జెప్తా అంతా నాదే అంటావుంటాడు.

✡

కిష్టయ్య, దెయ్యాలోడు, రామలింగాపురం వెళ్ళి గిత్తలు బేరంజేసి సంస్కారం గట్టి అక్కుర్తి రాముడికి తోలపించి తిరిగి సాయంత్రానికి సరస్వతీ కండిక్కి చేరుకున్నేరు.

కిష్టయ్య మొలతాడులో బీగంచెవి ఇప్పుకుంటూ ఇంటిముందరకొచ్చినాడు. తిన్నిమింద కూర్చోనున్న కూతురు లక్ష్మిని, మనవడ్ని చూసి ఆందోళనతో మొగం తెల్లబెట్టినాడు.

బీగాలు తీసి అంతా ఇంట్లో కెళ్ళినారు. అప్పటికప్పుడు అన్ని బియ్యమేసి వంటజేసింది లక్ష్మి. భోజనాలు పూర్తయినాక గుడ్డిదీపం ముందర కూర్చొని కంట్లో నీళ్ళు బయటరాకుండా జాగర్త పడతాండాది లక్ష్మి.

అది గమనించిన కిష్టయ్య లక్ష్మితో "అమ్మే! లచ్చుమ్మా! కంట్లో నీళ్ళు పైట కొంగుతో తుడిసేస్తాండావు. గుండెల్లో బాధని దేంతో తుడుస్తావమ్మా! ఏడవబాకు. ఎందుకు పంపించి నాడో చెప్పమ్మా" తన బాధని కూతురికి తెలీనీకుండా అడిగినాడు కిష్టయ్య.

“సేద్దిం సేసుకుంటాడంట నాయనా! చిన్నోడు, పెద్దోడ్ని తోలుకరమ్మన్నేడు” తలొంచుకునే చెప్పింది లక్ష్మి.

కిష్టయ్య చాలా ఆనందంగా పైగుడ్డతో కళ్ళనీళ్ళు తుడుచుకుంటా “ఇన్ని రోజులకి వోడికి సేద్దిం మీద బుద్ధి పుట్టిందంటే మీరు బాగుపడే రోజులు వచ్చినాయమ్మా! తోలక పోండమ్మా! మనగిత్తల్ని తోలక పోయి దున్ని సేద్దిం చేసుకోండి. మీ పని పూర్తయినాక నేనొచ్చి తోలకొచ్చుకుంటా” అన్నేడు.

“అది కాదు నాయనా! గిత్తల్ని సొంతంగా ఆయనికే ఇచ్చేయాలంట. మొగుడు కావాలంటే గిత్తల్తోనే రమ్మన్నాడు. అందుకే చిన్నోడు, పెద్దోడు మా నాయన ప్రాణమని రచ్చేసి తెగతెంపులు జేసుకోని వొచ్చేసినా” అని బోరున ఏడస్తా చెప్పింది.

కిష్టయ్య ఆ రాత్రంతా కంటిమీద రెప్పెయ్యకుండా ఆలోచించినాడు.

మొత్తం పోగొట్టుకున్నే. కొట్టాంతో కొట్టాం పశువులు పొయ్యినాయి. ఆస్తి పొయ్యింది. ఇంక మిగిలింది బిడ్డల్లాగా సాకతాండే చిన్నోడు, పెద్దోడే. ఇవి కూడా లేకపోతే ఎట్టా బతికేది?

బిడ్డ కాపరం బాగుంటే కూలీనాలి చేసుకునైనా బతకొచ్చులే. అల్లుడొక దారిన పడతాం డాడు అదే చాలు. ఇంక ఏరే ఆలోచన వొద్దు అనుకోని పొద్దున్నే అల్లుడ్ని పిలిపించి అన్ని జాగర్తలూ జెప్పి, పగ్గాలతో గిత్తల్ని చేత బట్టిచ్చినాడు.

అల్లుడు గిత్తల్ని తోలుకొని ముందు బోతావుంటే కూతురు బిడ్డని సంకనేసుకొని కళ్ళనిండా నీళ్ళతో బోతాండాది.

కిష్టయ్య గిత్తల్ని చివరిసారి చూసుకున్నేడు. రెండు కళ్ళకి నీళ్ళు అడ్డామొచ్చి సరిగ్గా కనబడక మసకబారిపోతాండాయి. కిష్టయ్య ఈధిలో నిలబడి దుఃఖంతో అట్టా చూస్తాంటే ఇరుగు పొరుగంతా బాధపడ్నేరు. ఆనాటితో చిన్నోడు, పెద్దోడికి కిష్టయ్య గారి రుణం తీరిపోయింది.

కిష్టయ్య వారమైనా మామూలు మనిషి కాలేకపోతాండాడు. ఏదో ధారబోసుకున్నెట్టుగా వుండేవాడు. ఏళకి సరిగా తినడం కూడా తగ్గించేసినాడు.

ఆ రోజు ఆదివారం పల్లమాల చెంగారెడ్డి సరస్వతీ కండిగలోని అల్లుడు జయరాముడు ఇంటికి వచ్చినాడు. నాయన్ని జూస్తానే జయరాముడి భార్య శాంత అమ్మగారింటి మంచి చెడ్డలు అడిగి చివర్న ఏం పనిమీద వచ్చినావని అడిగింది.

“గిత్తలు గావాలమ్మా! కిష్టయ్యని విచారిద్దామని వొచ్చినా?” అన్నేడు చెంగారెడ్డి.

ఆ మాటతో గూడా జయరాముడు మామని కిష్టయ్య ఇంటికి పిలుచుకోని బొయ్యినాడు.

కిష్టయ్య గొమ్ముని కాళ్ళు జాపి మూల కూర్చోనుండాడు. చెంగారెడ్డిని జూసి లేచి నడింట్లో మంచం వాల్చి కూర్చోమన్నేడు.

మంచం మీద కూర్చున్న చెంగారెడ్డి "కిష్టయ్యా! ఏమనుకోకపోతే నిన్నొక మాట అడగతా?" అన్నేడు. ఆ మాటకి అడుగు అన్నట్టు తలూపినాడు కిష్టయ్య.

"అంత మంచి గిత్తల్ని నీ అల్లుడికిచ్చినావు. వోడేమన్నా పెట్టుకున్నాడా! మీ వూరి దెయ్యాలోడితో కలిసి కసాయికి అక్కుర్తి రాముడికి కూటినీళ్ళకి అమ్మేసి నాడు" అన్నేడు చెంగారెడ్డి.

ఆ మాట ఇనగానే కిష్టయ్య గుండెల్లో గెడ్డపారతో ఎవురో పొడిసేస్తున్నట్లుండాది. కడుపంతా దేవినట్టుగా కళ్ళు మైగమ్మతుండాయి.

జయరాముడు వాళ్ళ మామ చెంగారెడ్డితో "నేను అనుకునింది సరిపోయింది మావాః! ఈ దెయ్యాల్నాకొడుకు సాయంత్రమైతే తాగుడు కోసరం కడుపులో ఒకటి పెట్టుకొని కసాయి రాముడ్ని కిష్టమామకి దలారోడని అబద్ధం జెప్పి ఈ చుట్టుపక్కల గొడ్లనంతా తోలుకెళ్ళి కోసి కండలుగా జేసి అమ్మేసిందేగాక, రంగణ్ని ఉసిగొల్పేసి కిష్టమామ గిత్తలకే ఎసురు బెట్నాడే! దొంగ నా కొడుకు దెయ్యాలోడు నాశనమైపోతాడు" అని నోటికొచ్చినట్టు తిడతాండాడు.

కిష్టయ్యకి అదేమీ ఇనపడలేదు. దెయ్యాలోడు, అక్కుర్తి రాముడ్ని గురించే ఆలోచిస్తాండాడు. డబ్బులు కోసం మనుషులు ఇంత మోసం జేస్తారా?

అక్కుర్తి రాముడు కసాయోడా?

నేను ఇన్ని దినాలుగా బేరాలు చేసి గిత్తల్ని, ఆవుల్ని తోలంపించింది కసాయికా?

దెయ్యాలోడ్ని ఊరంతా ఎదవన్నా, వోడిమాటలు నమ్మి నేను ఇన్ని దినాలుగా నోరులేని గొడ్లని పట్టించింది కొట్టుడికా?

ఆ గొడ్ల గోష్ఠ తగిలేనా నా చిన్నోడు, పెద్దోడు కూడా కసాయికే పొయ్యినాయి.

రూక కోసం దెయ్యాలోడు, అక్కుర్తి రాముడు ఇన్ని అబద్దాలు చెప్పి ఇంత మోసం చేస్తారనుకోలేదు. కిష్టయ్య ఇట్లా పరిపరి విధాలా ఆలోచిస్తాండాడు. గొడ్లకు జరిగిన ఘోరాన్ని తలుచుకుని కుమిలి కుమిలి ఏడస్తాండాడు.

చెంగారెడ్డి, జయరాముడు, కిష్టయ్యని ఓదార్చాలని చూసినా జరగని పనేనని తెలుసుకొని కాసేపు ధైర్యం జెప్పి వొచ్చేసినారు. జయరాముడి ద్వారా ఈ విషయం ఊరంతా తెలిసి పోయింది.

కిష్టయ్య ఒక నిర్ణయానికి వొచ్చేసి లేచి ఇల్లు బీగాలేసుకొని బస్సెక్కి కాళాస్త్రిలో దిగి ఊరు చివర్న ఏటిగట్టునుండే కసాయి అంగడి కెళ్నాడు. అప్పటికే కిష్టయ్య గిత్తల తలకాయలు

మొండెంనుంచి ఏరైపోయిుండాయి. ఆ ఘోరం కళ్లారా జూసిన కిష్టయ్య విలవిలా ఏడ్చుకున్నేడు. ముందు అనుకున్నట్టే టౌన్లోకొచ్చినాడు. ఒక తెల్ల పేపరు, పురుగుల మందు కొన్నేడు. తిరిగి సరస్వతీ కండిక్కి వొచ్చినాడు. ఇంట్లోకెళ్లి తలుపేసుకున్నేడు.

టంకు పెట్టె తెరిచి దాంట్లో అడుగునుండే ఫోటో ఒకటి తీసినాడు. రెండేళ్ల క్రితం ఎద్దల పండగ రోజు కిష్టయ్య, చిన్నమ్మ, గిత్తలతో కలిసి దిగిన ఫోటో అది. పెళ్ళాన్ని, గిత్తల్ని తనివితీరా చూసుకున్నేడు.

టౌన్లో నుంచి తెచ్చిన తెల్ల కాగితం తీసుకొని రెండు పక్కల ఏదో రాసి మడత పెట్టి, పురుగుల మందు మూతదీసి గుటగుటా తాగేసి ఆ చీటి గాలికెగరకుండా ఖాళీ డబ్బానే పెట్నాడు. అంతే రెండు నిమిషాల్లోనే గావుకేకలు పెడతా పేనంవొదిలేసినాడు కిష్టయ్య.

ఆ అరుపులు విన్న ఊరు ఊరంతా కిష్టయ్య ఇంటి తలుపు పగలగొట్నారు. కిష్టయ్య శవమై పడుండాడు. ఊరి జనమంతా కిష్టయ్య శవం దగ్గరకొచ్చి ఏడస్తాండారు.

దెయ్యాలోడిపైన కేసు బెట్టాలని కొంత మంది అంటాండారు. ఆడోళ్లు 'ఆ నాబట్టని నడీదిలో పోలుకి ఇరగదీసి కట్టేసి గుండు కొట్టించి పొరక్కట్టలతో, చెప్పులతో కొట్టాలని సాపిస్తాండారు. వయసు మీదుండే కుర్రోళ్లు 'కేసుగాదు, గుండుగాదు పదండి రాళ్లతో కొట్టి చంపేయాలోడ్ని' అంటూ దెయ్యాలోడింటివైపు బయల్దేర్నారు.

అప్పుడు ఆ ఊరిపెద్ద 'ఆగండి' అని పెద్దగా అరిచి అందర్నీ ఆపి కిష్టయ్య రాసి పెట్టిన కాయితం చూపించి గట్టిగా చదవడం మొదలు బెట్నాడు. అందరూ సూది పడినా ఇనపడేంత మౌనంగా వుండారు.

మనూళ్లో పెత్తి ఒక్కరికీ నమస్కరించి – దెయ్యాలోడ్ని ఊరంతా మోసగోడు అన్నే, వోడు మాటలని నేను నమ్మినా! అది నా తప్పు. నా తప్పు వల్ల నోరు లేని గొడ్లు ఎన్నో కసాయోడి కత్తికి బలైపొయ్యినాయి.

దెయ్యాలోడు రైతే గదా! అందురూ వోడ్ని ఛీకొడితే, వోడెట్టా మంచోడౌతాడని వోడ్ని నేను చేరదీసిందానికి, వోడు నాకు బాగానే బుద్ధి చెప్పినాడు. అందుకే నేను ఈ లోకం ఇడిసి పెట్టి ఎల్తండా, వొచ్చే జనమంటూ ఉంటే గొడ్డుగా బుట్టి రుణం తీర్చుకుంటా! నామీద మన ఊరికి గౌరవముంటే నేను సచ్చినాక సంతోషంగుండాలంటే దెయ్యాలోడ్ని ఏమీ అనొద్దు. వోడిపైన కేసు బెట్టొద్దు. వోడి కుటుంబాన్ని ఎవురూ ఆడిపోసుకోవద్దు. ఒక్కపని మాత్రం తప్పకుండా జెయ్యండి. నా శవాన్ని దెయ్యాలోడి పశువుల కొట్టాంలో పూడ్చేయండి. నా గుంటపైన ఒక మామిడి చెట్టు పెట్టండి. అది పెరగతా వుంటే వోడి గురించి, వోడు జేసిన మోసం గురించి అందరికీ తెలవాల. చెట్టు పెద్దదై కాయలు గాస్తే వోడి కుటుంబాన్నే తిన్నీయండి. ఎందుకంటే వోడిని, వోడి బిడ్డలనీ రైతు పది మందికి పట్టెడన్నం పెట్టేవోడే గానీ మోసం జేసేవోడు అవగూడదనీ నా శవం మీద నాటిన చెట్టే రోజూ గుర్తు జేస్తంది.

దెయ్యాలోడే గాదు, ఇట్టాంటి మోసగాళ్లకంతా నా కథ వల్ల కనువిప్పు కలగాల!

మన ఊరోళ్లందరికీ దణ్ణం బెడతా! చెట్టు పెద్దదై కాయలు కాచేదాకా నా ఆత్మ ఇక్కడే తిరగతా వుంటాది. మీరే నా ఆత్మకు శాంతి కలగజేయాల.

ఊరి పెద్ద చదవడం ఆపినాడు. అది విన్నేక ఒక్కరూ అడుగు ముందకెయ్యలే. ఊరందరి కాళ్లకి బంధాలు పడి పొయ్యినాయి. చాటుగా అదంతా ఇంటున్న దెయ్యాలోడు పశ్చాత్తాపంతో కుంగికుంగి ఏడస్తాండాడు. పై నుంచి కిష్టయ్య ఆత్మ చూస్తాండాది.

✡

# కొడి గట్టిన దీపం

**-మైనేని కేశవ దుర్గాప్రసాద్**

కొడి గట్టిన చుట్ట నుసి రాల్చి మళ్ళీ వెలిగిస్తూ నెమ్మదిగా కుక్కి మంచంపై మేను వాల్చాడు చంద్రయ్య. కిఱ్ఱుమంది మంచం భారంగా. కాపుతో కళకళలాడి కాలవశాత్తూ ఎండిపోయిన మామిడి చెట్టువంక చూస్తూ ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడతను. కాపు కాసినంతకాలం చెట్టును గూర్చి చెప్పుకునే వారు. కాపు పోయి ఎండిపోగానే దాన్ని తలచే వారే లేరు. ఎందుకో ఆ ఆలోచన అతనికి గతాన్ని గుర్తు చేసింది. కళకళలాడుతూ ఉండేది తన కుటుంబం, వచ్చే పోయే బంధువులతో. ఆ ఊరికి పెద్ద మోతుబరి తానే. కాని, ప్రస్తుతం? విషాదంగా నవ్వుకున్నా డతను, కాపు ఉడిగిన మామిడిచెట్టును చూస్తూ... తిరిగి ఆరిపోయిన చుట్టను బయటకు తీసి తుపుక్కున ఉమ్మి వేశాడు. మాటిమాటికి కొడిగట్టే ఆ చుట్టవంక భయంగా చూస్తూ కలుక్కుమనే గుండెలను చేతితో నిమురుకో సాగాడు చంద్రయ్య. ఎదురుగా ఉన్న ఎండిపోయిన మామిడిచెట్టు కొమ్మల మీద కాకి గూడు కట్టింది. అప్పుడే ఎక్కడి నుండో ఆహారం తెచ్చినట్టుంది. గూడులోని కాకి పిల్లలు గోల చేయసాగాయి. ఆప్యాయంగా కాకి తన నోట్లోని ఆహారాన్ని వాటికి అందించ సాగింది. గూడువంక చూస్తున్న చంద్రయ్య తిరిగి ఆలోచనలో పడ్డాడు. సృష్టి విచిత్రమైనది. అనుభూతులు, ఆప్యాయతలు అందరికీ ఒకటే. తను మాత్రం తన బిడ్డలకేం తక్కువ చేశాడు? అడిగినదల్లా కొనిచ్చేవాడు. పెద్దవాడికి అక్షరాభ్యాసం చేసినప్పుడు పెద్ద విందు చేశాడుతను. ఊరిల్లిపాదీ తరలివచ్చిందానాడు. హితైషులు ఆనాడే అన్నారు - చంద్రయ్యా, డబ్బును ఆడంబరాలకు అనవసరంగా ఖర్చు పెట్టకు అని. కాని విన్నాడాతను! ఊరికి పెద్ద రైతు. ఈ మాత్రం ఘనంగా చేయకపోతే ఎలా అన్న ఆలోచన వారి సలహాలను పెడచెవిని పెట్టించింది.

.... కుక్కి మంచం మీద పక్క కుదరలేదు చంద్రయ్యకు. నెమ్మదిగా లేచి కూర్చున్నాడు. ఆలోచనలు అతనిని ఉక్కిరిబిక్కిరి చేయసాగాయి. మళ్ళీ గతంలోకి జారిపోయాడు చంద్రయ్య. చిన్నవాడు పుట్టేనాటికి ముప్పై ఎకరాల మాగాణి పదిహేడు ఎకరాలైంది. వాళ్ళిద్దరినీ పెంచి, పెద్ద చేసి పట్నానికి పై చదువుకు పంపేనాటికి పన్నెండు ఎకరాలు మిగిలింది. స్నేహితులనేవారు - జాగ్రత్త పడరా చంద్రయ్యా, ఇకనైనా అని. కాని తను మాత్రం ఎక్కివచ్చిన కొడుకులు పట్నంలో పై చదువులు చదివి డాక్టరీ, ప్లీడరీ గిరులు వెలిగించి ఇంతకు రెండింతలు

సంపాదిస్తారు అని భ్రమపడి, ఆ భ్రమ నీడలోనే బ్రతికాడానాడు. అందుకే పెద్దవాడు, చిన్నవాడు అడిగిన దానికి ఇంకొక వంద ఎక్కువే పంపించేవాడు. కాని పరీక్షలలో మాటిమాటికీ తప్పి చదువులకూ మాకూ సరిపడదంటూ వచ్చేశారు వాళ్ళు. చదువులు నేర్వకపోయినా ఫాషన్‌లు నేర్చుకు వస్తే మందలించకపోగా వారికి వంత పాటలు పాడేవాడు తను. ఆ ఏడే వాళ్ళిద్దరికీ పెళ్ళి చేశాడు. గౌరవ ప్రతిష్టలకు మోజుపడి కట్నాలను బాగా ఇచ్చిన వియ్యంకులతో సరితూగాలని తాహతుకు మించి పెళ్ళిళ్ళుచేసి పదివేలు అప్పుపడ్డాడు. కానీ.... కానీ వాళ్ళు చేసిన పని... కలుక్కుమంది చంద్రయ్య గుండె. హృదయాన్ని చేతితో గట్టిగా అదిమిపెట్టి బాధగా మూలిగాడతడు. పది నిమిషాలలో నొప్పి సర్దుకొంది. మళ్ళీ ఆలోచనలలో పడ్డాడు చంద్రయ్య. అవును, ఆనాడు ఇప్పటికంటె గుండెలు విపరీతంగా మండాయి. వాటి నెవరో కత్తులతో ముక్కలుగా నరికినట్లుంది. ఎవరి కోసమైతే అష్టకష్టాలు పడ్డాడో, ఎవరిని చూచి తాను అనుక్షణం గర్వపడ్డాడో వాళ్ళు ఆస్తిని భాగాలు పంచమని మామల ద్వారా కబురు పెట్టారు. ఆత్మాభిమానం, వంశప్రతిష్ఠలు దానికి ఒప్పుకోకుండా చేశాయి తనని. వీలైతే కోర్టుకైనా వెళ్ళగలం అని బెదిరించిన వియ్యంకుల అడుగులకు మడుగులొత్తే కన్న కొడుకులను చూస్తే ఆశ్చర్యంతోబాటు సిగ్గు కూడా వేసింది. మౌనాన్ని అంగీకారంగా తీసుకొని భాగాలు పెట్టడానికి రోజును నిర్ణయించారు వాళ్ళు. ఆ రోజు నుండే ఆరంభమయింది గుండెలలో ఆరని ఈ అగ్ని, అది పెట్టే విపరీతమైన బాధ. పది ఎకరాలలో రెండెకరాలను తనకిచ్చి మిగిలిన ఆస్తిని, ఇంటిని సమంగా పంచుకొన్నారు కన్నకొడుకులు. అప్పును గురించి హెచ్చరిద్దామంటే ఆత్మాభిమానం ఆనాడు అడ్డు వచ్చింది తనకు. ఊరి చివర దిబ్బమీద ఇల్లు వేసుకొని భార్య జానకమ్మతో వచ్చేశాడు తను. అప్పుకింద రెండెకరాల భూమిని చెల్లు వేసుకొన్నారు బాకీదారులు. మిగిలింది... విషాదంగా నవ్వుకొన్నాడు చంద్రయ్య తిరిగి కొడిగట్టిన చుట్టవంక చూస్తూ.

అన్నానికి లెమ్మంటూ పిలుపు వచ్చింది. నెమ్మదిగా లేచి భారంగా అడుగులు వేస్తూ ఇంట్లోకి నడిచాడు చంద్రయ్య, చాప పరిచి విస్తరి వేసింది జానకమ్మ. మూకుడులోని అన్నం వడ్డించి ఆనాడు చేసిన చింతకాయ పచ్చడి పెట్టింది. నిర్లిప్తంగా విస్తరివంక చూశాడు చంద్రయ్య. గతం అనుక్షణం అతన్ని అంటిపెట్టుకొని ఉంటుంది. వెనకటి రోజుల్లో చింతకాయ పచ్చడి అంటే అసహ్యం తనకు. కాని ఈనాడు తన దరిద్రం అయిష్టాలను ఇష్టాలుగా మార్చివేసింది. బలవంతాన నోట్లో కుక్కుకొన్నాడు చంద్రయ్య అన్నాన్ని, పాత అలవాటు ప్రకారం పొరబాటుగా నోరు జారి నెయ్యి అని అడిగిన చంద్రయ్యను చూచి గుడ్లకు నీరు కుక్కుకొంది జానకమ్మ. మూకుడులో మిగిలిన అన్నం వడ్డిస్తానంటే కడుపు నిండిందంటూ లేచిపోయాడు చంద్రయ్య. అతనికి తెలుసు, అన్నం అంతా తనకు పెట్టి ఆమె పస్తు వుంటుందని. దిగాలుపడి చూస్తున్న జానకమ్మను అన్నం తినమని చెప్పి మళ్ళా బయట వున్న కుక్కిమంచంలో కూలబడ్డాడు చంద్రయ్య. ఆలోచనా ప్రవాహం మళ్ళీ అతన్ని తన సుడిగుండాలలో తిప్పసాగింది. తన దౌర్భాగ్యానికి బలి పశువు జానకమ్మ. ఆమె కలవారి ఇంటినుండే వచ్చింది. కాని తన్ను కట్టుకొన్న పాపానికి ఆమె తనతో కష్టపడవలసి వస్తుంది. జీవిత చరమాంకంలో

భార్యను సుఖపెట్టవలసింది పోయి నరక కూపంలోకి తోశాడు తను. ఏనాడూ తన మాటకు అడ్డు చెప్పలేదు జానకమ్మ. ఇది కావాలని తన నోటిమీదగా తాను అడిగేది కాదు. అందుకు ప్రతిఫలం? తానీ నాడు ఆమెకు కల్పించిన అష్టకష్టాలు. భార్యను గురించి ఆలోచిస్తూ జాలిపడ్డాడు చంద్రయ్య, ఇంకేమీ చేయలేని అసహాయ స్థితిలో.

తిరిగి చంద్రయ్య గుండెలు కలుక్కుమన్నాయి. 'ఒక వేళ నేను చచ్చిపోతే?' ఆలోచనలు అతనిని మరొక మార్గం తొక్కించాయి. ఊరి వాళ్ల మాటలకు రోషం వచ్చి అయినా కొడుకులు జానకిని ఇంటికి తీసుకుపోతారు. అప్పుడైనా ఆమె తప్పక సుఖపడుతుంది అనుకొన్నాడు చంద్రయ్య. ఎంత త్వరలో ఆమెకు దూరమయితే అంత త్వరలో ఆమె సుఖపడగలదు అన్న చంద్రయ్య ఆలోచనలు కార్యరూపం దాల్చసాగాయి. పదునైదు నిమిషాలలో అవి చంద్రయ్యను రైల్వేస్టేషన్‌లో నిలబెట్టాయి. అవే అతనికి నూతన ఉత్సాహాన్ని కలగజేశాయి. పాలు అమ్మి జానకమ్మ బియ్యం కొనడం కోసం దాచిన అయిదు రూపాయలు పెట్టి పట్నానికి టిక్కెట్టు కొన్నాడు చంద్రయ్య. వగర్చుకొంటూ వచ్చి ఆగింది రైలు. ఒక పెట్టెలో కూలబడ్డాడతడు. కాసేపటిలోనే రైలు కూతవేసి భారంగా స్టేషను వదిలి ముందుకు సాగింది. రైలు పెట్టెలో కూర్చున్న చంద్రయ్య అంతరాత్మ 'జానకీ, నన్ను క్షమించు' అంటూ పరితపించ సాగింది. గమ్యం చేరిన రైలు గమ్యంలేని చంద్రయ్యను పట్నానికి చేర్చింది. వేడి నిట్టూర్పులను వదులుతూ నెమ్మదిగా దిగాడు చంద్రయ్య. సన్నసన్నగా ప్రారంభమైన గుండెపోటును అనుక్షణం ఎదుర్కొంటూ, లేని ఓపికను కూడ కట్టుకొని ముందుకు సాగాడతడు. కాళ్ళు తేలిపోతున్నాయి. వేళ్ళు బిగుసుకుపోతున్నట్టున్నాయి. రక్తప్రసారం స్తంభించినట్లుంది. ఫర్లాంగు దూరం నడిచిన చంద్రయ్య ఇక నడవలేక పక్కనే ఉన్న చెట్టు క్రింద కూర్చున్నాడు. గుండెలలో బాధ క్షణక్షణానికి పెరగ సాగింది. బాధతో మెలి దిరిగి పోతున్నాడతడు. అప్పటి వరకు చంద్రయ్యను అంటిపెట్టుకొని నమ్మకమైన బంట్రోతులా పనిచేసిన అతని గుండె ఇంక సెలవు అన్నట్లు ఆగిపోయింది.

✡

పట్నంలో బజారు పక్కన శవాన్ని పెట్టుకొని అరుస్తున్నారు ముగ్గురు అడుక్కొనే పిల్లలు – బాబూ, మా నాన్న చచ్చిపోయాడు. దహనం చేయటానికి డబ్బుల్లేవు. కనికరించి ధర్మం చేయండి. ఈ దిక్కులేని పక్షులపై కాస్త దయ చూపండి బాబూ అంటూ. పైసలు రాలుతున్నాయి శవం పక్కన పరిచిన గుడ్డమీద. శవం గాజు కళ్ళు రాలుతున్న పైసలను చూస్తూ ఆవేదనతో కన్నీటి బొట్లు కార్చాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. శవం ఆత్మ అప్పటి వరకూ ఆహారాన్ని ఆప్యాయంగా అందించిన తల్లి పక్షిని వీడి అప్పుడే రెక్కలు వచ్చి ఎగిరిపోతున్న పిల్ల పక్షికి ఏవో సుద్దులు నేర్పాలని ఆరాట పడుతూంది.

✡

# అన్నెమ్మ నాయురాలు

**–కాళీపట్నం రామారావు**

అన్నెమ్మ నాయురాల్ని, మొట్ట మొదటిసారి, నేను బడిఈడు పిల్లవాడిగా వున్నప్పుడు చూసేను.

అప్పుడే బడి విడిచి పెట్టేరు. పిల్లలందరం మా ముందు నడుస్తున్న ఇద్దరి ఆడవాళ్లను దూసుకుపోతూ ఇళ్లకు పరిగెడుతున్నాం. ఎదురుపడ్డ ఆడమగ 'నాయురాలు, నాయురాలు' అంటూ దారితొలగి మా వెనక వస్తూన్న ఆవిడని నవ్వు మొగాలతో పలకరిస్తున్నారు. నా పక్కనున్న వాడు 'ఉండ్రా' అంటూ నా చేయి పట్టుకొని ఆపీసేడు. మేం కూడా పక్కలకి వొసిలి అబ్బురంగా కళ్లు పెద్దవి చేసుకుంటూ ఆమెవంక చూస్తున్నాం. చేత పూజాద్రవ్యాలతో వస్తూన్న ఒక పెద్దావిడ్ని, వెనక మరో ఇద్దరు ముగ్గురు పిల్లల్నీ, పెద్దల్నీ చూస్తూ నిలబడిపోయేం. ఆ పెద్దావిడ తనను పలకరిస్తున్న వారినందరినీ చిరునవ్వుతో తిరిగి పలకరిస్తూ ముందుకు పోతోంది. ఆమే అన్నెమ్మ నాయురాలని మావాడు చెప్పేడు.

ఆనాటి ఆమె మూర్తి ఇప్పటికీ నా మనోఫలకం నుంచి చెదిరిపోలేదు.

పండు తమలపాకు ఛాయ. శరీర అంగాల్లోగానీ, చర్మంలో గాని ఔన్సు కొవ్వైనా లేని కాయ శరీరం. ముఖంలో కొద్దిపాటి ముడతలు. అక్కడక్కడ వెండితీగెలు తప్పితే నల్లని జుట్టు. తెల్లని బొద్దంచు కుచ్చు గుండారు కోక కట్టు. చేతులకు బంగారు మురుగులు. మెడలో వుసిరి కాయలంతేసి పగడాలతో ఏదో బంగారు నగ, కాళ్లకు వెండి కడియాలూ అందెలు. అదీ ఆమె విగ్రహం.

ఆ తరువాత పాతిక ముప్పయి ఏళ్లకు గాని ఆవిడ్ని దగ్గరగా చూడ్డం పడలేదు.

మా వూరు ఆరు మధుర గ్రామాలతో పెద్దవూరు. అప్పట్లో చుట్టుపట్ల ఏ గ్రామానికీ లేని వసతులు – అంటే రెండు మూడు దేవాలయాలూ, చిన్న చిన్న కిరాణా కొట్లు, ఒకరిద్దరు దర్జీలు, ఒక మంచి వైద్యుడూ, పది పదిహేను మంది పెద్ద ఆసాములూ, రైతులు పండించిన మిర్చి, వేరుశెనగ, పొగాకు మొదలైన పంటలు కొని దూరపు ప్రాంతాలకు ఎగుమతి చేసే వ్యాపారులూ ఈడిగ, మేదరి, కమ్మరి, కుమ్మరి, మంగలి, చాకలివంటి వృత్తికులాల వారూ

వుండడంతో చుట్టుపట్ల అన్ని గ్రామాల వారూ ఏదో ఒక అవసరానికి మా వూరు వచ్చి పోతుండేవారు. ప్రభుత్వోద్యోగులు కూడా ఆ ప్రాంతంలో ఏ గ్రామంలో పనిబడినా అక్కడే మకాం వేసి ఆయా వూళ్లనుండి మనుషులను రప్పించుకొని తమ పనులు కానిచ్చుకొనేవారు.

ఈ ఇన్ని కారణాల వల్లే అన్నెమ్మ నాయురాలి కొత్తగ్రహారం కరణం, సముద్రపు ఒడ్డునుండే మరో గ్రామం కరణం, మరో నాలుగు గ్రామాల కరణం. మా పెత్తండ్రిగారు కూడా మా గ్రామంలోనే వుండేవారు.

ఆసరికి నేను, మావూరికి దగ్గరి బస్తీ చికాకోల్ హైస్కూల్‌లో చదువు ముగించుకొని వుద్యోగం కోసం విశాఖ చేరుకున్నాను. చేసేది మాస్టారి వుద్యోగం కాబట్టి, సంవత్సరానికి రెండు నెలలకు పైగా కుటుంబంతో సహా మా వూర్లోనే గడిపేవాడిని.

ఆ రోజుల్లో మా ఊరిక్కూడా యిప్పట్లా వినోద సాధనాలు వుండేవి కావు. జీవితం నింపాదిగా, శతాబ్దాల తరబడి సాగుతూ వచ్చిన దానికి కొనసాగింపుగా గడిచేది. ఒక ప్రాంతంవారు ఏ వూరువారయినా ఆ ప్రాంతంలో అన్ని వూళ్లవారికి ఎంతో కొంత తెలిసేది. చిన్న చిన్న సంఘటనలతో కూడా పెద్దయిళ్లల్లో ఏం జరిగినా అందరూ వాటి గురించి చెప్పుకొనేవారు.

ఆ క్రమంలోనే అన్నెమ్మనాయురాలి గతం కొంత తెలిసింది.

ఆమె నలుగురు తోడికోడళ్ల మధ్య ఆ యింటి పెద్ద కోడలుట. అత్తింటి వారికన్నా పుట్టింటి వారు సంపన్నులుట. పదమూడో ఏట మేనత్త ఇంట పెద్దకోడలిగా పాదం పెట్టింది. కాపురానికొచ్చిన మొదటి ఇరవై ఏళ్లూ ఏమి సుఖపడిందో సుఖపడింది. తర్వాత అత్తింటి కుటుంబంతోపాటూ ఆమె కష్టాలూ ఆరంభమయినాయి.

వాళ్లవూరు కొత్త అగ్రహారానికీ, పొరుగూరు యాతపేటకీ మధ్య కొంత బంజరు భూమి వుండేది. ఆ రెండు గ్రామాలూ ఎవరో ఇనాందారులకు చెందినవి. రెండూళ్ల కరణాలు గండర గండలు. రైతుకు సహజంగా వుండే భూదాహం కారణంగా రెండూళ్లవాళ్లూ రెండువైపుల నుండీ బంజరును వరకట్టుకోవడం ఆరంభించారు.

అది – ఒక్క నాటిదీ ఒక్క ఏడాదిదీ కాదు. ఐదు పదేళ్లు అంచెలంచెలుగా జరిగింది. అప్పట్లో కరణాలవి నామమాత్రపు జీతాలు. రైతుల్ని కొట్టుకు బతికేవారు. ఆ రెండు ఊళ్లూ చిన్నవే. కాబట్టి వాళ్లకి లిటిగేషన్లు తప్ప సవ్యంగా బతకడానికి మరో మార్గం ఉండేది కాదు. కౌలుదారీ చట్టాలు, హక్కులూ, బేహక్కులూ గురించి ఏ కాస్త జ్ఞానమూ లేని రైతుల దగ్గర్నుంచి డబ్బులు వసూలు చేసి ఇనాందారుల దగ్గర పట్టాలు పుట్టించారు. వర కట్టిందాంట్లో కొన్ని మళ్ల (మడుల) మీద రెండూళ్ల వారికీ పట్టాలు పుట్టాయి. మరికొన్ని మళ్ళు ఆ వూరివారు వరకట్టిన వాటిమీద ఈ వూరివారికీ ఈవూరు వారు వరకట్టిం దానిమీద ఆవూరి వారికీ పట్టాలు పుట్టాయి. నాలుగైదేళ్లు చుట్టుపట్ల పెద్దల సమక్షంలో తగువులు, తర్వాత కోర్టుల చుట్టూ తిరగడం.

అన్నెమ్మనాయురాలి కుటుంబంలో చాలా బంగారం కరణాల పాలు, ముసద్దీల పాలు, ప్లీడర్ల పాలూ అయిపోయింది. దాంతో ఆడా మగా అందరిలో కసీకావేశాలు పెరిగాయి. ఇచ్చిన తీర్పు వచ్చింది. అది ఇరువర్గాలకీ నచ్చలేదు.

కరణాలు ఎంత ఎగసన దోసినా కాళ్లు పీకేసి వున్న ఉభయ పార్టీలు అప్పీళ్ల కోసం కోర్టుకు పోయే స్థితిలో లేరు. ఇంక బలాబలాలు తేల్చుకోవలసి వచ్చింది. అన్నెమ్మనాయురాలి కుటుంబం పెద్దూరు (మావూరు) పెద్దల సమక్షంలో రాజీకి సిద్ధపడ్డా అవతలివారు అంగీకరించలేదు. రెండూళ్లవాళ్లూ కర్రలు, కత్తులు, బరిసెలు, బల్లేలు సిద్ధం చేసుకున్నారు. అక్కడ ఏడేళ్ళు సాగిన మొదటి ప్రపంచ యుద్ధం ముగిసేనాటికి ఇక్కడ మారుమూల రెండూళ్ల మధ్య కొట్లాట ఐదు గంటల్లో ముగిసింది.

అక్కడ ఆ యుద్ధ దృశ్యాలు, దాని బీభత్సం మా ప్రాంతం వారికి తెలీదుగాని, ఈ కొట్లాటలో చచ్చిపోయిన వారినీ, గాయపడ్డవారినీ చూడ్డానికి వచ్చిన చుట్టుపక్కల వూళ్ల వారు గుండెలు బాదుకున్నారు.

అటు – పది మంది చనిపోగా పాతిక మంది దాకా గాయాల పాలయ్యారు. ఇటు ఆరుగురు చనిపోగా మరికొందరు గాయాలపాలయ్యారు. ఆసుపత్రిలో మరికొందరు. అన్నెమ్మనాయురాలి ఇంట్లో మగవాళ్లంతా చనిపోయారు. ఒక్క కొడుకు మినహా.

తర్వాత నడిచిన క్రిమినల్ కేసులో ఏడుగురితోపాటు అతడికీ జీవితఖైదు పడింది.

ఆ దొమ్మీలో – అన్నెమ్మనాయురాలు తక్కిన తోడికోడళ్ల పుట్టింటోళ్లు – చాలా డబ్బు ఖర్చు చేసి తక్కువ శిక్షలతో బయటపడ్డారు.

కేసుల తర్వాత కుటుంబం కోలుకోవడానికి దాదాపు పదిహేను ఏళ్లు పట్టింది. దొమ్మీలో చనిపోయిన అన్నెమ్మనాయురాలి మరుదులు ఇద్దరిలో పెద్దమరిదికి ఒక కూతురు, రెండో మరిదికి సంతానమే లేదు. తోడికోడళ్లిద్దరూ పుట్టిళ్లకుపోయేరు. మారు మనువులు కూడా చేసుకున్నారని వినికిడి. అంత పెద్ద కుటుంబానికి జైల్లో వున్న కొడుకు అతని భార్య పదేళ్ల మనవడు మాత్రం అన్నెమ్మకు మిగిలారు. అవతలిపక్షం అంగబలంతో పాటు అర్థబలం కూడా నశించగా క్రమక్రమంగా వలసలు పోయారట.

అచంచలమైన ఆత్మవిశ్వాసంతో, పట్టుదలతో, కృషితో ఏ మగవాడికీ తీసిపోని కార్య దీక్షతతో, మాటనేర్పుతో, సూటి వ్యవహారంతో తను చెమటోడ్చి కోడలికి మనవడికి శ్రమ పట్ల గౌరవం పెంచి చిదిగిన సంసారాన్ని మూడు వూవులు ఆరు కాయలుగా లేవనెత్తింది అన్నెమ్మనాయురాలు. ఆ వూరివారిదే గాక చుట్టుపక్కల వూళ్లవారందరి మన్నన పొందింది. సౌశీల్యానికి అన్నెమ్మది పెట్టింది పేరని ఒక్క చూపుతో దుష్టులను దూరంగా వుంచడం, మరో చల్లని చూపుతో మంచివారిని ఆత్మీయులను చేసుకోవడం ఆమె ప్రత్యేకతలు అంటారు తెలిసిన వారు.

ఆమె ప్రతి శనివారం మావూరి జగన్నాథస్వామి దేవాలయానికి అర్చనకు వచ్చేది. మావూళ్లో నలుగురు కరణాళ్లలో ఒకాయన తారసపడినప్పుడు 'ఏవిఁర కరణపోడా' అని సంబోధించేది. మరొకాయన తారసపడితే 'ఏం నాయినా' అనేది. వాళ్లూరి కరణం అగుపడితే గడ్డిపోచను చూసినట్టు చూసేది. అతగాడు పలకరిస్తే ముఖం మీద ఏ భావమూ కనపడ నీయకుండా ఊ అనేది. లేకుంటే అదీ లేదు.

కష్టం సుఖం గురించి దేవాలయం అర్చకునితో చెప్పుకునేది. సమస్య వస్తే మా తండ్రి గారి సలహా తీసుకునేది. వేరేవారివద్ద నోరు విప్పేది కాదు.

దేశం స్వతంత్రం అయ్యేక – ఆ వేడుకల్లో జీవితఖైదు అనుభవిస్తున్న కొడుకుని విడిచి పెడతారన్నారు. అలానే విడిచిపెట్టేరు.

ఆ కొడుకు – బాగా ముదిరిన క్షయతో ఇంటికి వచ్చేసరికి, అర్నెల్ల బిడ్డడితో కొడుకూ, కోడలూ తల్లి అన్నెమ్మనాయురాలూ, అతని భార్యా ఎదురయ్యారు. మందూ మాకూ అడ్డమైన వైద్యాలతో ఇంటిల్లపాదీ ఎన్ని పట్రాకులూ పడినా అతడు ఏడాదికన్నా ఎక్కువ బతకలేదట. అతని చావుతో ఆ ఇంటికి పట్టిన పీడ విరగడయ్యిందనుకున్నారు జనం.

నెహ్రూ హయాంలో గ్రామీణ జీవితంలో క్రమక్రమంగా చాలమార్పులు చోటు చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశం ఉత్తర కోస్తా ప్రాంతాల్లో కూడా ఆ మార్పులు స్పష్టం కాసాగాయి. సామాజిక ఆర్థిక రంగాలలో వస్తున్నంత వేగంగా మార్పులు మానవ సబంధాలలో మాత్రం ఇంకా రావడం లేదు.

నేనప్పటికీ మా అమ్మానాన్న, మావూరు మనుషులు, మా ప్రాంతం అనుకుంటూ నెలకోసారైనా వస్తుండేవాణ్ణి. కానీ శలవుల్లో కూడా వెనకటన్నేసి రోజులు గడపడానికి వీలుండేది కాదు. నా తర్వాత తరంవారు ఏటేటా పెద్ద చదువుల కోసం చుట్టు పట్ల నగరాలకు బస్తీలకి వెళ్లి సెలవుల్లో కబుర్లు చెప్పుకోవడానికి, బేడ్మింటన్ లాంటి కొత్తాట్లకోసం రమ్మంటూ ఎంత బలవంతం చేసినా నా పెరుగుతున్న సంసారం ఇతర బాధ్యతలూ సమస్యలతో వెనుకటి వెసులుబాటుండేది కాదు.

ఆవేళ – శనాదివారాలకి మరో రెండు రోజులు సెలవులు కలిసి వచ్చేయని ఒక్కణ్ణే మావూరు బయలుదేరాను. వీధి మొదటికి రాగానే మా వాకిటి చాలా మంది జనం కనబడ్డారు. అలాంటి దృశ్యం కొత్తకాదు. అయినా పలకరిస్తున్నవారు నవ్వు మొఖాల్తో పలకరిస్తున్నారు. ఏదో పంచాయితీలా ఉందనుకున్నాను.

మా యింటి వాకిటి దగ్గర కొచ్చేసరికి ఓ మనిషి శాపనార్థాలు వినిపించేయి. "అయ్యో, మీరెవరూ బాగుపడర్రా! మీరు బాగుపడరు మమ్మల్ని బాగు పడనివ్వరు. షావుకార్లు అప్పులిచ్చి – రైతుల్ని నాశనం చేశారనుకుంటే ఇప్పుడు ఉద్యోగస్తులొచ్చి బలవంతాన అప్పుల ఊబిలో

ముంచుతుంటే ఇంక వెవసాయాలకీ రైతులకీ ఇనాశకాలమే" అంటూ ఆ మనిషి గొంతు వినిపిస్తోంది.

నన్ను చూసిన జనం 'పెదబాబొచ్చేడు దారివ్వండి...' అంటూ పక్కలకి తప్పుకుంటుంటే – 'బాబూ సెలవ్... ఇక ఆడిష్టం మీ యిష్టం...' అంటూ చీడీమెట్లు దిగి, ఆ వొసిలిని జనంలోంచి అప్రసన్నపు ముఖంతో కోకచెంగు భుజాన కప్పుకుంటూ విసవిసగా ముందుకు కదుల్తోంది అన్నెమ్మనాయురాలు. ఆవిడిది ఒక్కసారి చూస్తే మరపురాని మూర్తి. నేనూ వొసిలి దారిచ్చేను. వెంట నలుగురైదుగురు మనుషుల్తో ఆవిడ వీధిని పడగానే – మా గుమ్మంకేసి తిరిగేను. వరండా నిండా కుర్చీల్లో కొత్త ముఖాలు. ఎవరో ఆఫీసర్లు అనుకుంటాను. చుట్టూ సూదిమొన మోపనివ్వకుండా రైతులు. వెళ్లేదారి లేదనుకుంటూ పడమటి సందునుంచి పెరటి వైపుకు వెళ్లిపోయేను.

మా అమ్మ కుశల ప్రశ్నలకి జవాబులిస్తూ వీధి వరండాలో జనాల మాటలు వింటూవుంటే కొన్ని అర్థమయ్యేయి. కొన్ని అర్థం కాలేదు. చేతికి వాచీ ఉంగరాలతో వయసుకు మించిన ఏపుతో ఓ కుర్రకారు రైతుబిడ్డ మా నాన్నగారితో 'బాబూ! మా ముసిల్దాని మాటలకేటిలెండి!? ఎనబై ఏళ్లు దాటినా దాని తాపత్రయం దానికి వొదల్దు అదలాగే అంటాది. ఇదిగో కరణం, నువ్వా అపిలికేషన్ పారాలేవో నింపేసి మాయింటి కొట్టుకురా. నేను సంతకాలు పెట్టేస్తాను. మరి నేనొస్తాను బాబూ" అంటూ, అక్కడున్న పెద్దలందరికీ ఓ నమస్కారం లాంటిది పారేసి బయలుదేరిపోయేడు. అతని వెంట ఆ వూరి రైతులు మెట్లు దిగేరు.

ఆ రోజు ఆ మర్నాటికి గాని అక్కడేం జరిగింది అర్థంకాలేదు.

నెహ్రూ ప్రభుత్వం దేశ ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు చేపట్టింది. రెండు ప్రణాళికలు అమలయ్యిన తర్వాతి రోజులవి. వాటిని ప్రవేశపెట్టడంలో పాలక వర్గాల పథకమేమిటి? దేశం మొత్తం మీద వాటి ప్రభావమేమిటి?... లాంటి వివరాల జోలికిప్పుడు పోను. అవన్నీ నాకిప్పుడు అలవిగాని అవగాహనకాని విషయాలు. కాకపోతే మా ప్రాంతం మీద వాటి ప్రభావం గురించి చెప్పాల్సి వస్తే, వ్యవసాయాభివృద్ధి కోసం ప్రభుత్వం దాదాపు పదేళ్లు రకరకాల అప్పులు, అనేక రాయితీలు – బండీబక్కల లోన్లు – నూతుల లోన్లు – మృత్తికా క్రమక్షయం జరక్కుండా (వర్షాలకి, వరదలకి, భూసారం కొట్టుకుపోకుండా) గట్టు ఎత్తించడానికి లోన్లు – లాంటివి వాటిలో కొన్ని. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు – వినడానికి, పత్రికల్లో చదవడానికి, పాలక ప్రభుత్వాలు దేశంలోనూ, విదేశాల్లోను ప్రచారం చేసుకోవడానికి చాలా గొప్పగానే వుండేవి. కానీ వాటి అమలు ఫలితాలు మరోలా వుండేవి. అప్పులన్నాక హామీ వుండాలి కదా! హామీలు అన్నాక అవి మధ్యతరగతి రైతులు, పెద్దతరగతి రైతుల వద్ద మాత్రమే వుంటాయి. మధ్య తరగతి రైతులతోనూ పేద రైతులతోనూ పోలిస్తే చొరవ, తెలివితేటలు పెద్ద రైతుల వద్దనే కదా ఉంటాయి. అంచేత ప్రభుత్వాలు కల్పించే సౌకర్యాలలో ఎక్కువ భాగం పులగం మీద పప్పులా ఆ తరగతికే అందేవి.

తెలివితేటలు – సాహసం లేనివారికి, జ్ఞానోదయం తెగింపు కలిగించడానికి తెలివైన గ్రామోద్యోగులు వారికన్నా తెలివైన రెవిన్యూ వుద్యోగులు వుండనే వున్నారు. ఎవరైనా వూరికనే సహాయాలు చేయరుగదా! ఏదో తమ సంతృప్తికి ఇచ్చే తాంబులాల ఖర్చులు అప్పు తీసుకునేవారి సంఖ్యా పెరిగినకొద్దీ పర్సెంటేజీలగా రూపాంతరం చెందింది. అతి తక్కువ వడ్డీకి – వాయిదాల పద్ధతిలో తీర్మానానికి రెడీ క్యాష్ అప్పులు దొరుకుతూవుంటే పెద్ద రైతుల్లో కొత్త తరానికి తాంబూలం ఖర్చు పర్సెంటేజీలుగా మారినా అభ్యంతరం వుండేది కాదు. ఆ పర్సంటేజీల మొత్తం పెరిగితే దానివలన రైతులు నష్టపోకుండా వుద్యోగులే వాళ్ళకి దారులు సూచించేవారు. బండీ బక్కల లోను తీసుకున్న వాడికి – వాడికంతకుముందే లోను వున్నా లేనట్టు ధృవీకరించడానికి – ఒక వేళ గ్రామోద్యోగులకు అభ్యంతరాలున్నా రెవెన్యూ ఇన్స్పెక్టర్లకు, తాసిల్దార్లకు అభ్యంతరం వుండేదికాదు. వున్న నూతుల్నే నాలుగు రాళ్లతో చుట్టూ గోడ కట్టించడానికి గాని, అసలు నూతులే తవ్వకపోయినా తవ్వినట్టుగా ధృవీకరించడానికి గాని అభ్యంతరాలుండేవి గావు. అలాగే జరగని అభివృద్ధి కంతటినీ జరిగినట్టు భావిస్తూ రైతులకు అప్పులమీద అప్పులు అందే బినామీ అప్పులు ఏర్పాట్లూ జరిగిపోతుండేవి.

అంతవరకూ సులభ సంపాదన తెలియని, దానికి ఆశపడని గ్రామీణ రైతు జనం, గ్రామాధికారులు, రకరకాల వుద్యోగులు డబ్బు మీద వ్యామోహం పెంచుకుంటూ వుబ్బర డబ్బుతో తమ తాతతండ్రులు కలల్లో కూడా అనుభవించని భోగాలను అనుభవిస్తూ దగాలు, మోసాలు, నమ్మకద్రోహాలు ఏ అన్యాయమైనా న్యాయంగా భావిస్తూ ఒక కొత్త సంస్కృతికి ఆద్యులయ్యేరు. ఎక్కడో ఓ కొత్త అగ్రహారం లాంటి ఊళ్లో ఓ అన్నెమ్మనాయురాలు లేదా ఆమె తరంవారూ దీన్ని ప్రతిఘటించినా ఈ గ్రామీణ సమాజపు కొత్త సంస్కృతి క్రింద వాళ్లు నామరూపాలు లేకుండా పోయే స్థితి వచ్చింది.

అన్నెమ్మనాయురాలు ఆమె తరంవారు – వారు కలవారయినా పేదలైనా – రోజంతా వొళ్లొంచి పనిచేసేవారు. పొయ్యిలో పిడక దగ్గర్నుంచి పొయ్యి మీద గింజదాకా వుత్పత్తులు, శ్రమ విలువ ఎరిగిన వారు. గింజ ధాన్యం కాయ, పండు, పాడి ప్రతిదానిలోను దైవాన్ని చూసేవారు. అనుభవించు లేదా ఇతరులకు పంచిపెట్టు. ఒక్క గింజ వృధా అయినా, నీటి చుక్క ఒక్కటి వృధా అయినా విలవిల్లాడిపోయేవారు. ఒక యింట పొయ్యి రాజేస్తే పదిళ్లలో ఆ అగ్గి నుండి పొయ్యిలు రాజేవి. నిప్పు రాజెయ్యడానికి ఎవరో గాని అగ్గిపుల్ల వాడేవారు కాదు. కాల్చే చుట్టయినా ఒక చుట్టనుండి మరో చుట్ట అంటేది. నిప్పు పెట్టెకు బదులు చెకుముకిరాయి, దూదివత్తులు మొలని వుండేవి. ఒక పాత్ర కొంటే (కంచో, రాగో, ఇత్తడో) పదితరాలు చూడాల్సిందే. కట్టుగుడ్డలు కొంటే అందంకాదు, మన్నిక చూసేవారు. లక్షాధికారులైనా ఐదారు జతలు కట్టువస్త్రాల కన్నా ఎక్కువ వుండేది కాదు.

వారి దృష్టిలో సుఖంవేరు, భోగం వేరు. శ్రమ విలువ తెలిసిన వారు. సుఖానికి విముఖులు కారు. భోగాలంటే వైముఖ్యం. ఇహపరాలు రెండింటినీ చెరిచేది భోగం అని వారి నమ్మకం.

ఆ సంస్కృతికి వేరుపురుగు లోభం, మోహం. ఆ వేరు పురుగు పొగాకు, వేరుశనగ, మిరప, గోగు వంటి వాణిజ్య పంటల రూపంలో స్వతంత్రానికి ముందే మా ప్రాంతంలో వ్యాపించింది.

ఈ పంటల వినియోగం పండించిన చోట కాదు. రైతులు పండించిన ఈ పంటలను వ్యాపారులు కొని ఎక్కడికో ఎగుమతి చేయాలి. అక్కడ వినియోగదారుడికి, ఇక్కడ చిన్న వ్యాపారికి మధ్య పెద్ద దళారీ వుంటాడు. వారు ధర నిర్ణయిస్తారు. పండించిన రైతుకి, కొన్న చిన్న వ్యాపారికి మధ్య పెద్ద దళారీ వుంటాడు. వారు ధర నిర్ణయిస్తారు. పండించిన రైతుని, కొన్న చిన్న వ్యాపారిని నియంత్రించేవాడు ఆపైవాడు. రైతైనా చిన్న వ్యాపారైనా కోరిన ధర వచ్చేదాకా నిలువచేసుకొనే వీలులేని వాడు. అందుచేత ధరలు హెచ్చడం ధరలు పడిపోవడం మధ్య ఎక్కడో ఒక ధర వద్ద సరుకు అమ్ముకొని లాభమో, నష్టమో భరించేవారు. లాభం వచ్చినపుడు ఇంకా ఎక్కువ లాభానికీ, నష్టం వస్తే తట్టుకోవడానికి అప్పుల పాలయ్యేవారు. అందుచేత మా ప్రాంతంలో అనేక రైతులు అప్పులు పాలవ్వడం స్వతంతానికి ముందే ప్రారంభమయ్యింది.

అన్నెమ్మనాయురాలు, ఆ తరం రైతులు – అప్పన్నా నిప్పన్నా శతువుతో సమానంగా చూసేవారు. ఈ మూడింటి శేషం కూడా జీవితాలని ధ్వంసం చేస్తాయని వారి నమ్మిక. అలాంటి రైతువారీ తమ బొటనవేలుకు సిరాచుక్క అంటకుండా జాగ్రత్తపడ్డం ఒక గొప్ప విలువగా భావించేవారు.

సన్నకారు పేద రైతులు భూమిమీద వ్యామోహంతో వ్యాపారప్పంట జూదంలో దిగి కొంతకాలం వెలిగి, చివరికి ఆరి, తాత తండ్రులిచ్చిన వెండి బంగారాలు, ఆస్తులు అమ్ముకొని కొందరు కూలీలయ్యేరు. మరికొందరు వలసలు పోయేరు.

అన్నెమ్మనాయురాలు ఈ ప్రమాదాన్ని గ్రహించే జాగ్రత్తపడిందో, జీవ లక్షణమైన అపాయశంక, ఆ రైతు బిడ్డను కాపాడిందో – ఆది నుండి ఈ పంటలకు తాను దూరంగానే వుంటూ వచ్చింది. ఫలితంగా తనదేకాదు తననుసరించిన తక్కిన రైతులవీ సిరిసంపదలు ఇంతకాలం పెరుగుతూనే వచ్చేయి. అలాంటి అన్నెమ్మనాయురాలికి, ఆ సంప్రదాయానికి చెందిన రైతు కుటుంబాలకీ, ఈనాటికి, పంచవర్ష ప్రణాళికలు తెచ్చిన ప్రగతిబాట రూపంలో చుక్క ఎదురైంది. తక్కిన వారు రాజీపడ్డా అన్నెమ్మనాయురాలు రాజీ పడలేక పోయింది.

అయితే – ఆమెది ఎంత దృఢదీక్షో, ఆమె మునిమనవడిది అంత మొండిపట్టు. కొడుకూ, మనవలైనా ఎన్నడూ ఎదిరించని అన్నెమ్మనాయురాలిపై ఈ మునిమనవడు ఎదురుతిరిగేడు. తన ఎనభయ్యేళ్ల జీవితంలో తిరగు బాటెరుగని అన్నెమ్మనాయురాలు ఈ మునిమనవడి ధాటికి ఎదురు నిలవలేకపోయింది.

ఆవేళ శనివారం. నాన్నగారు తాలూకా ఆఫీసుకి ప్రయాణం పెట్టుకున్నారు. పెరటింట్లో అమ్మ వంట దాదాపు పూర్తయ్యింది. దగ్గర్లో పీట వేసుక్కూచొని నేను కబుర్లు చెప్తున్నాను. ఎవరో వీధి తలుపుకొడ్తున్న చప్పుడయ్యింది.

తలుపు తీసేవుంది. కాకపోతే – దగ్గరకు చేరవేసి, తీయడానికి నేను వెళ్తూ వుంటే ఆ వచ్చినవారే తలుపుతోసేరు. ఎదురుగా అన్నెమ్మనాయురాలు.

అదే చీరకట్టు. అదే మూర్తి. అవే అలంకారాలు. కాకపోతే – వెంట్రుకలు మరిన్ని నెరిసాయి. ముఖంమీద ముడతలు మరిన్ని పెరిగేయి. కళ్ళలో శుక్లాలు ఏర్పడ్డంవల్లో మరే కారణంచేతో చీకిగా చిన్నవిగా అవుపడ్డాయి.

నేను వెనుదిరిగి అమ్మకు ఆమెరాక తెలియజేయబోతుంటే అమ్మే వచ్చింది. 'రా అమ్మా! లోపలికి రా!' అంటూ నట్టింట్లోకి పిలిచి ముక్కాలిపీట వేసింది.

'కోడలమ్మా బాగున్నావా' అంటూ అమ్మని పలకరించి, నాన్నగారి గురించి ఆమె చాలాసేపు మాట్లాడలేదు. ఆ తర్వాత –

"ఆడికి పద్దెనిమిదేళ్లు నిండి ఆరుమాసాలైనా కాలేదు. ఆడి చేతికీ ఆస్తి అప్పగిస్తే ఆ ఆస్తి ఏమౌతాదన్న సంగతి సరే... ఆడేమవుతాడు, ఎప్పుడు చూసినా ఇంటి పట్టునుండడు. పెళ్లి చేద్దామంటే ఒప్పుకోడు. తెల్లారిలేస్తే బస్తీకి ప్రయాణం. లాడ్జీలంట హెుటేళ్లంట. ఓ మందనెంటేసుకుని రాత్రుళ్లు కూడా అక్కడే మకాం. ఏమైనా అంటే అదిగో ఆ ఎమ్మెల్యే రమ్మన్నాడు. ఆ మంత్రి వుంచేశాడు. ఆ ముదనష్టపు మంత్రి మా కులపోడే. కూతుర్నిచ్చి యీడినీ తనెంట రాజకీయాల్లోకి తిప్పుకుందామని ఆడి ఎత్తు..."

ఆమె ఆవేదనంతా వెళ్లగక్కి శాంతించాక కూడా మా నాన్నగారు మౌనంగా వుండి పోయారు.

ఉండి ఉండి ఆమె అడిగింది.

"అయితే యీ ఆస్తి అంతా ఆడికి అప్పగించీతునా"

"వద్దు. వుమ్మడి కుటుంబంలోనే అతని మూడోవంతు ఆస్తి మేరకు ప్రభుత్వం అప్పులిస్తుంది".

"ఆడు మునిగితే ఏటి, మేం మునిగితే ఏటి"

బహుశ ఆమె కళ్ళొత్తుకుంటూ ఉంటుంది.

కొంతసేపు ఆగి మా నాన్నగారన్నారు.

"అమ్మా! అన్నెమ్మా! నేనొక్కమాట చెపుతాను విను. నాకిప్పుడు అరవై. నువ్వు కనీసం పాతికేళ్ళైనా పెద్దదానివై వుంటావు. ఎక్కువ జీవితం చూసినదానివి నువ్వే. అయినా లోకాన్ని ఎక్కువగా చూసింది నేను. నీ తరం వరకూ మనుషులు ఇహంపరం దృష్టిలో వుంచుకొని జీవితం గడుపుతూ వచ్చారు. మా తరంలో ఆరంభమై పరంపై విశ్వాసం సడలుతూ వచ్చి ఇప్పటి తరాలకొచ్చేసరికి పరం నామమాత్రమై పోయింది."

"అయితే పరం లేదా?"

"నేను నువ్వనుకొనే పరం గురించి ఇదమిద్ధంగా చెప్పలేను. పరమంటే ఉత్తర లోకాలే కాదు – తరువాతది అన్న అర్థంలో వర్తమానానికీ పరం ఉంది – ఉండక ఎక్కడికి పోతుంది? అయితే దాని గురించి ఎవ్వరికీ పట్టదు."

ఇవాళ మనం చేసిన పని నాటిన బీజం రేపటికే విధంగా పరిణమిస్తుందన్న దృష్టి ఒక్కరికీ, ఒక్కరంటే ఒక్కరికీ ఉన్నట్టు కానరాదు.

అంచేత బాధ్యతలూ బంధాలూ వదిలించుకోవాలి – నా వయసువారికే అది అవసర మనిస్తోంది. నీ వయసువారి సంగతి చెప్పాలా, మనం పెంచిన పిలల్లో వృద్ధిలోకి తెచ్చిన సంసారాలే ఎంతకాలం సంరక్షిస్తూ కూర్చోగలం? వాటి భవిష్యత్తు ఎలా వుంటే అలా సాగుతాయి. అప్పుడెప్పుడో కూలని సంసారాలు ఇప్పటికీ అలాగే వున్నాయా? ఇప్పుడు కూల్తే, కూల్తున్న సంసారాలు అలాగే వుండిపోతాయా? ఆలోచించు అంటూ ప్రయాణానికి టైమవుతుండటంతో లేచారు.

అప్పటికి నెహ్రూశకం ముగిసింది. అతని కాలంలోనే వేగవంతం కావడం ఆరంభించిన దేశ పురోగతి వేగాన్ని పుంజుకొని మరింత వేగవంతమైంది. దేశంలో అన్ని ప్రాంతాలతోపాటు మా ప్రాంతానికి రోడ్లు, హైస్కూళ్లు, కరెంటు దీపాలు వగైరా వగైరాలు వచ్చేశాయి. తర్వాతర్వాత పేదలకు వుండడానికి ఇల్లు దున్నుకోవడానికి భూమి పట్టాలు వ్యవసాయాభివృద్ధికి మరిన్ని రుణాలు, స్వయం ఉపాధికి రుణాలతోపాటు సబ్సిడీలు, వనమహోత్సవాలు, అక్షర క్రాంతులు, రోడ్ల విస్తరణ, ప్రజలవద్దకే పాలనలు వగైరాలు చాలా వచ్చేశాయి.

అయితే –

ఇదంతా ప్రజల ప్రభుత్వాల స్వయంకృషితో కాదు. నెహ్రూ కాలంలోనే 'మిక్సిడ్ ఎకానమీ' పేరుతో మొదలై వందల కోట్ల నుంచి వేల వేల కోట్లు దేశ దేశాల నుంచి ప్రపంచ బ్యాంక్ దాకా అప్పులు చేయడంలో ఎదిగి ఏటా వడ్డీలే వేల కోట్లు చెల్లించే దశకు రావడంతో ఈ అభివృద్ధంతా సాధ్యమయింది.

రాజకీయాల్లో కూడా మన దేశం చాలా ప్రగతి సాధించింది. అరవైల దాకా ప్రజల విశ్వాసం చూరగొంటూ వచ్చిన సోషలిస్ట్, కమ్యూనిస్ట్, కాంగ్రెస్ వంటి బలమైన రాజకీయ పార్టీలు ఏవీ మినహాయింపు లేకుండా కొమ్మలూ రెమ్మలతో అసంఖ్యాకంగా పార్టీలు తయారయ్యాయి. అవన్నీ ఒక్కొక్క కులాన్ని ఒక్కొక్క మతాన్నీ వుద్ధరించే భారాన్ని భుజాని కెత్తుకున్నాయి. ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని పెంచే బదులు వ్యక్తి ఆరాధన, స్పర్థ, వైషమ్యాలను పెంచుతూ వచ్చేయి. ఈ క్రమంలో అన్నెమ్మనాయురాలి మునిమనవడు కూడా ఆమె జీవితకాలంలోనే రాజకీయ నాయకుడైపోయేడు. ఎమ్మెల్యే అయి మెడలో దండలతో ఇంటికి

వచ్చిన మునిమనవడిని చూసినప్పుడు మంచంమీద వున్న అన్నెమ్మనాయురాలి ముఖంలో ఆనందానికి బదులు దిగులు కనబడిందట.

ఈ నలభై యేళ్ల పరిణామంలో ఆ తర్వాత తరం విద్యావంతులతోపాటు నేనూ మా వూరికి ఎడమవుతూ వచ్చేను. అంచేత అన్నెమ్మనాయురాలెప్పుడు చనిపోయిందో నాకు తెలియలేదు. పోయే వుంటుంది.

నేను శాపానుగ్రహాలను నమ్మను. కానీ అప్పుల వూబిలో మునిగి ఆత్మహత్యలు చేసుకుంటున్నట్టు పరంపరగా పేపర్లల్లో వార్తలు చదివినప్పుడల్లా నాకు అన్నెమ్మనాయురాలు జ్ఞాపకం వస్తూ వుండేది.

ప్రజల్లో ఏర్పడుతూ వచ్చిన వర్గ స్పృహ మీద కులమత ....వర్గ ప్రాంతీయ స్పృహలను వాటి అంతర్గత శాఖోపశాఖలతో సహా పెంచే ప్రయత్నంలో ద్వేషవైషమ్యాలకు వీలు పడుతుండడం చూస్తుంటే నాకు మా తండ్రి గారి మాటలు గుర్తుకొస్తుంటాయి.

చాలా కాలం – అప్పులు చేసి తెచ్చిన ఈ డబ్బంతా ఏమవుతుందని ఆశ్చర్యపోయే నాకు టి.వి., సినిమాలలో న్యూస్ ఛానళ్లలో చూస్తున్న దృశ్యాలు జవాబిస్తుంటాయి.

వార్తల్లో – ఒక్కొక్క పెళ్లికి కొన్ని కోట్లు ఖర్చుట. టీవీలో – ఒక్క గంటలో పది ప్రశ్నలకు జవాబిస్తే కోటి రూపాయలు పొందే అవకాశమట. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్య, ప్రధానమంత్రుల్లో కుంభకోణపు ఆరోపణలు ఎదుర్కోని వారెవరు? స్విస్ బ్యాంక్ నిల్వలు గురించి వింటే గుండె పగులుతుంది.

అయితే ఇందుకు నేను విచారించను. రోజుకో నిమిషమైన శ్రమించనివాళ్లు ఇంతింతేసి సంపదలు తమ బోరకిందికి తీసుకోవడం అన్యాయమైనా – అది కూడా నన్ను బాధించదు.

దేశాభివృద్ధి అంటే సంపద అభివృద్ధి. దానికి మూలవిరాట్లు శ్రామికులు. ఆ శ్రామికుల శ్రమ శక్తి దోపిడీ కావడంతోపాటు – వారిలో శ్రమపట్ల గౌరవం లుప్తమై – లుచ్ఛాలను వారి జీవితోద్ధారకులూ – ఆటగాళ్లను వారి దేవతలుగా ఆరాధించే విధంగా దిగజారడం నన్ను చాలా బాధిస్తుంది. ఇంతకన్నా – గ్రామాలను విముక్తం చేసి నగరాలను ముట్టడించడం విప్లవ మార్గమని చెప్పిన 'మావో' సూత్రీకరణను అపార్థం చేసుకుంటున్న ప్రజా పోరాట నాయకులను చూస్తే గుండె చెదురుతుంది.

✡

# పుట్టినూరు

**–కొలకలూరి ఇనాక్**

"మా పొలాలు కాజేసేవు, మా కొంప ముంచేవు. మమ్ముల్ని దిక్కులేని పచ్చుల్ని చేసేవు. మా నోటి కాడి కూడు మింగేసేవు. నువ్వేం బాగుపడతావు, ఏం తుతెల్లుతావు. నాశనమయి పోతావు" అని తిట్టిపోశాడు శివన్నారాయణ ఏభై ఏళ్ళ క్రితం ఊరొదిలి ఏడుస్తూ పోతూ. నాటి నుంచి నేటిదాకా, కోపం వల్ల, ఊరివైపు తొంగికూడా చూడలేదు. ఇప్పుడు కూడా ఇటువచ్చేవాడు కాదు, కూతురూ, కొడుకూ తొందరచేసి బలవంతపెట్టకపోతే.

కడుపు చేతపట్టుకొని వారం రోజులు నడచి, హైద్రాబాదు చేరుకొన్నప్పుడు శివన్నారాయణ ఇరవై ఏళ్ళ యువకుడు. ఎవరేం పని చెప్పినా చేశాడు. ఏం పెట్టినా తిన్నాడు. మూటలు మోశాడు. ముఠా పనులు చేశాడు. అప్పటికే ఉన్న కాస్తంత చదువును అటూ ఇటూ పెంచుకొని, బట్టల కొట్టులో గుమాస్తాగా చేరాడు. ఎన్ని పనులు చేసినా రిజిస్ట్రారు ఆఫీసు దగ్గర డాక్యుమెంటు రైటరుగా స్థిరపడ్డాడు. పెళ్ళి చేసుకొన్నాడు. ఇల్లు కట్టుకొన్నాడు. ఇద్దరు పిల్లల తండ్రి అయ్యాడు. ఇద్దరూ ఇల్లొదిలి వెళ్ళి, ఉద్యోగాలు చేసుకొంటూ, అమెరికాలోనే పెళ్ళిళ్ళు చేసుకొని, పిల్లల్ని కని, అక్కడి పౌరులుగా మారిపోయారు.

అమెరికా పౌరులైన ఎవరికైనా, ఏదో తరంలో ఇతర దేశ పౌరసత్వం ఉండి ఉండటం వల్ల, వాళ్ళు తమ తల్లివేరు వెతుక్కోవటానికి ఇష్టపడుతూ ఉన్నట్లుగానే, కొడుకు నాగార్జున, కూతురు నందిని తమ సొంతూరు మీద మక్కువ పెంచుకొన్నారు. నిజానికి వాళ్ళ జన్మస్థలం హైదరాబాదే అయినా, తండ్రి స్వగ్రామం చూడాలని వాళ్ళకు చాలాకాలంగా ఇష్టంగా వుండేది. అమెరికా చేరాక, ఆ ఇష్టం మరీ ఎక్కువయింది.

అటుఇటుగా నలభై ఏళ్ళున్న పిల్లలిద్దరూ మనూరికి పోయి వద్దామనే అంటూ వుండే వాళ్లు. ఎప్పుడు ఎవరు ఇంటిని, సొంతూరును గూర్చి ఏమి అడిగినా శివన్నారాయణ ఏడ్చేవాడు. ఏమీ చెప్పేవాడు కాదు. వాళ్ళు మరీమరీ అడుగుతూ వస్తుంటే నాకు ఏడుపు వస్తుందనే వాడు. తండ్రిని ఏడిపించలేక వాళ్ళు ఊరుకొన్నారు.

ఇవాళ వీళ్ళు కారులో బయలుదేరే ముందు "అక్కడికి వస్తే నాకు చావాలనిపిస్తుంది" అని తండ్రి అన్నాడు. కాని వాళ్ళు వినిపించుకోలేదు. బయలుదేరారు తండ్రి, తల్లి, కొడుకు, కూతురు.

తోవపొడుగునా తండ్రి ఏడుస్తూనే ఉన్నాడు. శివన్నారాయణ సహజంగానే ధైర్యం ఉన్న మనిషి. ఎంతకష్టమైనా గుండె నిబ్బరంతో ఎదుర్కోగలిగిన మనిషి. కానీ స్వగ్రామమంటే బేలగా బెంబేలు పడిపోతున్నాడు.

ప్రయాణమంతటా తండ్రిని ఓదార్చటానికే వాళ్ళకు సరిపోయింది. శివన్నారాయణ ఆలోచనలకు అడ్డుకట్ట వేయటానికి తోవపొడుగునా ఎవరో ఒకరు ఏదో ఒకటి మాట్లాడుతూనే వున్నారు.

"కరువు కాటకాలు తాండవిస్తాయనే వాడివి పంటలు బాగానే పండుతున్నట్లున్నాయి కదా" అంటే "పండుతున్నాయి. ఈ మధ్యే సాగర్ నీళ్ళ వల్లే" అన్నాడు.

"నీ చిన్నతనంలో?"

"రాగి, సజ్జ, జొన్న, కొర్ర, సజ్జన్నం పెరుగులో ఎంత రుచో! మాకు నాలుగు పాడి గొడ్లు ఉండేయి; దివ్వైమైన వ్యవసాయం' 'మరి ఆ వ్యవసాయమంతా ఎవరు చేస్తున్నారు!' అంటే "నన్నడగొద్దు" అని ఏడ్చేశాడు.

తండ్రి ఊరొదిలిరావటం, తాత వృద్ధుడు కావటంతో వ్యవసాయం దెబ్బతిని ఉంటుందని వాళ్ళు భావించారు.

వాళ్ల కారు ముందుగా మాచెర్ల చేరింది. సందు తిరిగి కాలనీలోకి వచ్చింది. కాలనీలో తమ ఇంటిని గుర్తుపట్టాడు, శివన్నారాయణ. పడిపోయి ఉంది. ముందుగా తల్లి, అవస్థలు పడి తండ్రి చనిపోయారు. శివన్నారాయణ రెండు సందర్భాలలోనూ మాచెర్ల రాలేదు. ఇటువస్తే ఆత్మహత్య చేసుకోవాలని అనిపిస్తుందనీ, అందువల్ల రాలేకపోయాననీ చెబుతూ ఉండేవాడు.

"పడిపోయిన ఇల్లు కట్టిద్దా" మన్నారు పిల్లలు.

"ఎవరుంటారు?" అన్నాడు తండ్రి.

"మనూరు బాగుంద"న్నారు వాళ్ళు. "మాచెర్ల మా సొంతూరు కా"దన్నాడు శివన్నారాయణ. "గవర్నమెంటు ఇల్లిచ్చింది. కొంత డబ్బిచ్చింది. ఆళ్ళ బతుకులట్టా తెల్లారేయి" అన్నాడు.

"మరి నువ్వు పుట్టినూరు?"

"పోదాం! నాకు గుండె ఆగినా, నాకు సద్దామనిపించినా, సచ్చినా, మీరు దిగులు పడకూడదు" అన్నాడు.

"నేనూ పెద్దోణ్ణి అయ్యేను. బాద్దెతలన్నీ తీరేయి. ఉన్నా, ఊడినా ఒకటే" అనీ అన్నాడు.

"నువ్వింత కఠినంగా మాట్లాడుతుంటే మనం మనూరు చూడనక్కరలేదు. తిరిగి వెళ్ళిపోదామని" అని వాళ్ళంటే "నేనూ పెద్దోణ్ణి అయిపోయేను గదా, నాకూ సూద్దావనే వుంది. కానీ తట్టుకోలేనని బయిం, తీరా వచ్చేంగా, పోయి చూసే వద్దాం ఇంకెంత కాలం బతుకుతాను" అన్నాడు.

నాగార్జునసాగర్ డాం దగ్గరకు వచ్చి లాంచీ మాట్లాడుకొని, నలుగురు ఎక్కి కూర్చున్నారు. సాగర్‌లో లాంచీ ప్రయాణం మిగతా వాళ్ళకు సరదాగా ఉంది. శివన్నారాయణ కన్నీరు తుడుచుకొంటున్నాడు.

నలభై ఏళ్ళు వచ్చినా పిల్లలిద్దరూ పసిపిల్లలై నీళ్లతో ఆటలాడుతూ వుత్సాహంగా వున్నారు. వాళ్ళకది పిక్‌నిక్‌లాగా వుంది. ఐదు సముద్రాలు దాటి అమెరికా చేరినవాళ్ళకు సాగర్ నీళ్లు సరదా పుట్టిస్తున్నాయి. కావాలంటే రోజూ సముద్రం చూడగలిగేవాళ్ళకు సాగర్ నీళ్ళు అంత సంతోషం కలిగిస్తుంటే చూస్తున్న శివన్నారాయణకు కొంతకాలం దుఃఖం దూరమయింది.

"ఇంకా ఎంత దూరమం"టే "ఇంకెంత" అని బదులుచెప్పి కళ్ళు తుడుచుకొంటున్నాడు.

"అది నందికొండ. నీ పేరు. ఇది నాగార్జునకొండ. నీ పేరు! నందిని" నాగార్జున తండ్రిని ప్రేమగా చూశారు. వాళ్ళకర్థమయింది, తండ్రికి తన స్వస్థలం చాలా ఇష్టమని.

"ఈ రెండింటి మధ్య కృష్ణానది ప్రవహించేది. ఎంత వానాకాలమైనా ఫర్లాంగు కంటే వెడల్పు ఉండేదికాదు. బవుదూకుడుగా ఉరికేది నది. ఎన్నిసార్లు! ఎంత ఈత!"

"మా ఇంట్లో మచ్చుమీద యేరుసెనక్కాయ మూటలుండేయి. ఎన్ని దిన్నా తరిగేవి కావు. ఎంతగాలి... పిచ్చిగాలి, ఫేన్లు ఏం జేసును?

మా పొయ్యిపొంతలో నీళ్ళు ఎప్పుడూ యచ్చగా ఉండేయి. మా ఇంటి ముందు మెల్లా పెద్దగా ఉండేది. ఎన్ని ఆటలు! మా పొలం నేను ఎంత దూరం పరిగెత్తినా అంత దూరం మాదే! పండని పంటలేదు. గొడ్డుమేత కొదవలేదు. యేరుసెనక్కాయ, ధనియాలు, మిరపకాయలు, రాసులు రాసులు!

ఊరి మద్దెలో సెన్నకేశవసామి గుడి ఉండేది. గోపురం ఎంతెత్తు? చూడాలంటే కళ్ళు తిరిగేయి. కోతి కొమ్మచ్చి ఆడిన యేపసెట్లు సిటికేసర చెట్లు ఎంతెత్తు. దిక్కుమాలినంత ఎత్తు."

రెండు కొండల మధ్య కృష్ణానది ఇరుకుగా మారింది.

"ఈ రెండింటి మధ్య ఎంత దూరముంటుంది?" కొడుకు అడిగాడు.

"ఎంతలేదన్నా రెండు కోసులుంటుంది" అన్నాడు తండ్రి.

"ఇంకెంత దూరం?" కూతురు అడిగింది.

"ఎంతో దూరమా? దగ్గరకొచ్చేసేం" అన్నాడు శివన్నారాయణ.

"ఈ కొండ అంచున ఆపు!" అన్నాడు లాంచీ డ్రైవరుతో. ఆగింది లాంచి. "ఈ కొండకింద ఉన్న పొలాలన్నీ మనవే! ఏభై ఎకరాలు. ఈ పొలానికి బారెడు దూరంలో ఇదిగో ఇక్కడే మా ఊరు. ఈ ఊరి మధ్యలో కనిపించేదే గుడి. ఇదే గోపురం"

పిల్లలకు, తల్లికి బిత్తరగా ఉంది.

"పక్కనే కృష్ణానది. ఉరుకులు పరుగులతో ఉండేది. ఇటు చింతతోపు. అటు యాపమాన్లు. అది కృష్ణ ఒడ్డు. దాటితే కొండ. ఈ ఒడ్డున మా ఊరు. బంగారం పండే పొలాలు. రైతులు జమీందార్లు. రాజులు, పుణ్ణేతుములు ఏమయ్యారో!"

పిల్లలిద్దరూ తండ్రి మాటలో గొంతులో మార్పు గమనించారు.

"ఇక్కడ సాగర్ లోతు ఎంత ఉంటుంది?" భార్య అడిగింది.

"ఎంతోనా రెండు నిలువులు!"

"ఏంది రెండు నిలువులు, నీ పాసుగూల! రెండు వందల అడుగులకు తక్కువ ఉండదు లోతు!"

శివన్నారాయణ మాట్లాడలేదు. భార్యాపిల్లలు ఆశ్చర్యంగా ఉన్నారు.

"మీ ఊరూ, పొలాలు, చూపుతానన్నావు" అన్నారు పిల్లలు.

ఏడుస్తూ "ఇదే మా ఊరు, ఇవే మా పొలాలు" అని వేలు చూపించాడు.

"సాగర్‌లో నీళ్ళు తగ్గినప్పుడు, ఎండాకాలం సెన్నారం గోపురం సాలా ఏళ్ళు కనిపించింది. ఇప్పుడు కనబడటం లేదు. కూలిపోయి ఉంటుంది!" లాంచీ డ్రైవరు చెప్పాడు.

"కూలటం ఏమిటి? ఉంటుంది. పోయి చూసి, సోవికి మొక్కి వస్తాను" అని శివన్నా రాయణ నీళ్ళలోకి దూకబోయాడు.

పిల్లలు పట్టుకొన్నారు.

"చూసొస్తా!" అన్నాడు.

"వద్దులే" అన్నారు.

"చూపుతా!" అన్నాడు.

"వొద్దుద్దు" అన్నారు.

"నాకీతొచ్చు" అన్నాడు.

"అయినా వద్దు" అన్నారు.

"గొప్ప పోటగోడివి లేవయ్య సోఁవి. ఆగాగు! సత్తావా? నన్ను జయిలుకు పంపుతావా? మానుబావా ఆగు నాయినా ఆగు. పట్టుకొండి పట్టుకొండి" అని లాంచీని వెనక్కు తిప్పాడు డ్రైవరు.

'రండిరా సూద్దాం మా ఊరు. నన్నైనా సూడనీండ్రా. ఎంత కాలమయింది. మా అమ్మను, మా తల్లిని. మా ఊరును సూసి. నన్ను పోనీండ్రా!" అరుస్తూనే ఉన్నాడు.

తండ్రి ముఖం తడిగుడ్డతో తుడిచి బిస్కట్లు తినిపించి ఫ్లాస్కులో కాఫీ తాగించి, కూర్చోబెట్టారు.

"మా ఊరు పోనీండిరా" ఏడుస్తూనే ఉన్నాడు.

"మీ నాన్నది సెన్నారమా? ఇంకెక్కడి సెన్నారం? ఇంకెక్కడి బ్రెమలు?" డ్రైవరు నిట్టూర్చాడు.

క్రమంగా శివన్నారాయణ కన్నీరాగింది. లేచి వెనుదిరిగి చూచి 'మా ఊరు దాటి చాలా దూరం వచ్చేం" అన్నాడు.

లాంచీ వెళ్ళిపోతూ ఉంది. లాంచీ దిగుతూ "నేను పుట్టినూరు లేని సన్నాసినిరా!" అన్నాడు తండ్రి.

"ఎవడికన్నా, ఇట్టాంటి నొప్పి ఉంటదా, నాకుందయ్య, నా దరిద్దరం"

"ప్రపంచమే నువ్వు పుట్టినూరు నాన్నా!" అన్నాడు కొడుకు. 'ఈ భూమే! ఈ వసుధే నువ్వు పుట్టినూరు'

కారు దగ్గరకు నడుస్తూ, కరళ్ళెత్తి పడుతున్న నాగార్జున సాగర్‌కి రెండు చేతులెత్తి నమస్కరించాడు శివన్నారాయణ.

కారెక్కి "మా పొలాలు కాజేసి, మా కొంపముంచి, మమ్ముల్ని దిక్కులేని పచ్చుల్ని సేత్తే సేసేవుగాని, అయిదుకోట్ల మంది అన్నదమ్ములకు అన్నం పెడుతున్న తల్లి నువ్వు కలకాలం కళకళలాడుతూ ఉండుతల్లీ!" అన్నాడు శివన్నారాయణ.

కారు పరుగులు తీస్తూ ఉంది పంట పొలాల మధ్య రోడ్డుమీద.

✡

# తిరుగుడు గుమ్మి

**–గంటేడ గౌరునాయుడు**

"ఒరే అప్పలయ్య దద్దా... నీ ఎడ్లు బందిల్దొడ్డికి తోలికెలిపోతన్నార్రా...

జనపనారతో తాడు పేనుకుంటున్న అప్పలనాయుడు "ఏటీ" అని తలెత్తి చూసేడు. ఎదురుగా పిన్నింటి గుంపస్వామి...

"ఆ కమ్మాదొర నేడా? అతగాడు ట్రాక్టరు మీద నీ ఎడ్లు ఎక్కించీసి తోలికెలిపోవడంకి తయారైపోతండు. ఈరగొట్టామో, సాలూరో తోలికెళ్లి అక్కడ బందిల పెడతాడట."

గుంపసోమి మాటలకు గతుక్కుమన్నాడు అప్పలనాయుడు.

"ఏటీ... బందిల దొడ్డి మన వూరిలనేదేటి? మనూరుకాపోతే వన్నామో, కిచ్చాడో... అంతేగానీ సాలూరేటి? అంతా యిసిత్రంగా వుందిరా..."

"ఆడిష్టమట... ఆడిసేని మేసీసినాయట. ఆడిష్టమొచ్చినట్టు సేత్తాడట. యీరగొట్టం కాపోతే యిశాపట్నం తోలికెల్తాడట. యిక్కడెవుడున్నాడు ఆడ్ని అడగడాంకి? ఎక్కడ్నుంచో ఎలిపొచ్చి యిక్కడ సెలాయించెత్తన్నాడు. నాలుగు రాలున్నాయిగదా... ఆడే రాజు మరి."

ఎడ్లు వదలమని – బతిమాలినా వినలేదన్న కోపం... ఆ మాటల్లో!

"నువ్వు సూసినావేట్రా తోలికెల్డం? అక్కడ మావోడు నేడేటి? నాకీవేల దివాలగుందని ఆడ్ని తిప్పికిరమ్మన్నాను, ఎడ్లని", తనే ఎత్తే యిలగ జరక్కపోనుగదా? అన్నబాధ – అప్పల్నాయుడి ముఖంలో.

"గుంటడు... ఆడేదో ఆటసందట్లో పడిపోనాడేటో...? పొరపాటే...! ఐతేటి... నోటి కొచ్చినట్టు పేల్తాడా? ఎడ్లు టాక్టరు మీదెక్కించీడాంకి తయారైపోతాడా? నాను ఆ పక్కన వంగమొక్కలకి బోదిలెత్తుతున్నాను. వున్నట్టుండి గోల యినబడితే... ఎల్లిసూసినాను. మరెవులు మనోడే కిష్ట, ఏడుసుకోని కాళ్లాయేల్లా పడతండు. ఐతేటి... ఆడు యింతన్నాడేటి? కల్లు తాగిన కోతినాగ ఎగురుతుంతే! అప్పుడికీ నాను గభీనెల్లి అడ్డినాను. ఛస్... ఆడొట్టి నరుకూతలో

డ్నాగున్నాడు. మనది అంబలి జిల్లా ఆట. మనమందరం ఎ(రినంజాకొడుకులమట, ఒకటన్నాడా... ఒకటినేదా... మనలోకువ కనిపెట్టేసినాడాడు."

"నేపోతే ఎక్కడ తాడేపల్లి గూడేము... ఎక్కడ దలేపేట" మనం ఎ(రోలం గాబట్టే...

కుక్కిమంచంలో ఆరిగెం ముందెట్టుకొని దగ్గుతూ రామినాయుడు తాత అన్నాడు.

"ఐతిప్పుడేటి సెయ్యడంరా నాయనా..." ఆలోచనల్లో పడ్డాడు అప్పలనాయుడు. మళ్లీ రామినాయుడు తాతే అన్నాడు.

"ఒరే అక్కడెక్కడో ఆడి భూములమ్ముకోని యిక్కడ భూములు సవాగ్గ కొనేసి.... పాతికేసీ యేబయ్యేసీ ఎకరాలు టాటర్లుతోటి యవసాయం సేత్తన్నారంతే... ఆలకి మనోలే... ఆ పెసిడెంటు, ఆ వియ్యేవో... ఆల్లేదన్ను. నేపోతే యీ బిగుర్లా? మనోలున్నారంతే నాలుగు రాలు కలిగినోడ్ని సూత్తేసాలు ఆడిని దొరా... దొరా.... అని పొగిడేసి ఆకాశానికి ఎత్తెత్తారు. మరాడు ఎందుకు తగ్గుతాడు?"

"వల్లకోరముసిలోడా.. ఆ కమ్మోవోలు రాబట్టి మన పనికిరాని మెరకలు పచ్చగ కలకల్లాడిపోతున్నాయి. సూత్తే కడుపు నిండిపోద్ది. సేత్తే యవసాయం ఆలే సెయ్యాల.." రోజూ దుక్కికో, పారపనికో కమ్మదొర పొలంలోకి వెళ్లే సెదురోడు అన్నాడు... ముసిలోడు ముందున్న ఆరిగంలో చుట్ట కాల్చుకుంటూ.

ముసిలోడు స(రున లేచేడు.

"ఒరే సేతగాని నాకొడుకుల్లారా.. వొయిసినోలు గావాల?... సిగ్గునేదురా ఆమాటండాకి. ఆడిచ్చిన కూలికి కక్కుర్తి బడిపోతన్నారు, గానీ రేపాడేటిసేత్తాడో కానుకోనే పోతన్నా(రా... ఒరే... మూడడుగలే అడిగి. మాడుమీద అడుగేస్సి పాతాలంకి తొక్కీసినా(డా బలిసె(క్రవర్తినీ... వామనామూర్తి... ఔ(నా... యిన్ని మాటలాడుత(ను, అరటితోటలు యేస్సి... గొప్ప గనకార్యం సేసినట్టు మాట్లాడతన్నావు... రూపాయికి రెండంటి పళ్లు తేగలవా? సెప్మీ. అంతెందుకు, మన అప్పలయ్యే మనకి నిదర్శినము. ఈడేటైనాడు...? ఎందిరా అప్పలయ్యా?" అప్పల్నాయుడి వేపు చూసేడు... ముసలోడు.

అప్పల్నాయుడి కళ్ల ముందు గతం కదలాడింది...

వేసవిలో గుడ్డిమీద గత్తం వేయడానికి గత్తం బండి తోలికెళ్ళేడు అప్పల్నాయుడు. బండి వెళ్ళాలంటే తన గుడ్డికీ "సీతంనాయుడు మామ" గుడ్డిమీదనుంచే వెళ్ళాలి. గతంలో ఎవరికీ ఏ అడ్డంకీ లేదు. అయితే... యిప్పుడా భూమి కమ్మదొరకి అమ్మేయడంతో... గత్తం బండిని గుడ్డిమీదికి రాకుండా అడ్డీసేడు.

"అదేటండీ. తాత ముత్తాతల నుండి యిలపింటిదెపుడు నేదు. మీరేటి కొత్తగా పెడతం(డు" అడిగేడు అప్పల్నాయుడు.

“అప్పుడు అడ్డుపెట్టలేదంటే అదొకదారి. యిప్పుడు మాత్రం నా భూమి మీద నుండి బళ్ళు గానీ... పశువులుగానీ ఏవీ వెళ్ళడానికి వీల్లేదు. ఆ... ఆ తరువాత దొరచెప్పలేదూ అని నా మీద నిందెయ్యొద్దు...” నిర్మొహమాటంగా చెప్పేడు, దొర...

“యిలగైతే యవసాయాలు ఎలాగౌతాయి?... నన్నిప్పుడు అడ్డెత్తన్నావు! రేపు నీకా అవుసరం రాదా యేటీ...”

“నాకు అవసరం వచ్చినప్పుడు మాట...”

బండికి అడ్డంగా నిలబడి బండిని ఆపేసేడు దొర. మాటా మాటా పెరిగింది. నలుగురూ చేరేరు. ఆ చేరిన నలుగురూ... కమ్మదొరకు భూమిని అమ్మినవారే.. అప్పల్నాయుడ్నే కాదన్నారు... డబ్బెట్టి కొన్నోడు ఆడిష్టం... అన్నారు. అప్పటి నుండి తన గుడ్డిమీదికి వెళ్లడానికి తనకు వీల్లేకుండా పోయింది అప్పల్నాయుడికి. చుట్టూ వున్న వాళ్లు ఆలోచించకుండా రేటు పలుకుతుందని అమ్మేయడం... అప్పల్నాయుడికి యిరకాటం వచ్చిపడింది. తల్లి పసుపుకుంకం కింద వచ్చిన భూమది. ఏటా ఐదుపుట్లు నారకి తక్కువ పండేది గాదు! దాన్ని అమ్మాలంటే... మనసు ఉసూరుమంటాది. అదిగో అటువంటప్పుడు పాతకరణమూ, యిప్పటి వియ్యేవో అయిన ప్రకాశరావు... వచ్చేడు. వచ్చి... ఒక మాట చెప్పేడు.

“అప్పలయ్య మామా... ఎందుకిలగ గుడ్డిని కొర్రు వుంచీడం? ఆడా... దారివ్వడు నీకా... వ్యవసాయం కాదు.. నా మాటవిని ఆడికే యిచ్చీ” కమ్మదొరలకీ యిక్కడి రైతులకీ మధ్య దళారీల్లా వ్యవహరించింది ప్రెసిడెంటు... వియ్యేవో... లే. కొంత భూమిని ముందే కొనుగోలు చేసి పార్టీలతో బేరం కుదుర్చుకుంటారు. అటు కొన్నవోడికీ కాక, యిటు అమ్మినోడికీ మిగలక వేలాది రూపాయలు యీ మధ్యవర్తుల జేబులోకే వెళ్తాయి. అప్పుల వూబిలోంచి బయటపడాలన్న ఆతృతతో ఎవరు ఎంత దగా చేస్తున్నదీ... గమనించలేక భూమికి దూరమౌతున్నారు... మధ్యస్తం రైతులు.

“గొప్పమాట సెప్పినావల్లుడూ... నువ్వేదో... అడ్డీలు తెగ్గొడతావని అనుకున్నాను గానీ... యిలాగ ఆడిపక్క దన్నుగాత్తవనుకోనేదు. సర్నే... నాకేటి? యీ వూరికే వొచ్చినట్టుంది గాడుపు. దరమ్మ కట్టుకోండి నాయనా... నువ్వూ... ఆ పెసిరెంటూ కలిసి”... కోపమూ... బాధ... కలగలిసేయి.

“నువ్వలగంటే నేనేటి చెప్తాను మామా... ఎవళ భూమి... వాళ్ళిష్టం యిన్నాలంతే... అంతా మనోలు! ఒకలంతే ఒకలికి గౌరవమో... అభిమానమో... నేపోతే, ఏదో బంధరకమో వుండీవి. యాపారానికొచ్చినోడికి అన్నోటి... వుంతాయేటి. అందుకే యిరుకున వుండడం కన్న ఆ భూమి యిచ్చేడిమే మంచిది” వియ్యేవో మెత్తబెట్టీసేడు అప్పల్నాయుడ్ని. ఎలాగైతేనేం... తల్లి పసుపు కుంకుమ భూమిని వదులుకోక తప్పలేదు. వచ్చిన పాతికవేలు తోటి అప్పులు తీర్చగా... కొంత మిగిల్తే అది ఉప్పుకీ మిరపకాయలకీ లాగే ఖర్చైపోయింది. అప్పట్నుంచి ఆ

గుడ్డివేపు చూస్తే చాలు.... తన తల్లి సంకెళ్ళలోంచి దీనంగా చూసినట్టుంటుంది. కళ్ళు నీటితో నిండిపోయి గొంతులో ఏదో అడ్డంగా పడ్డట్టు వుంటుంది. ఆ గుడ్డిమీద జనువులు వేస్తే... మదుపులు, పాయిదాలు పోను రెండువేలో మూడువేలో వచ్చీవి. కూరకు నారకు అన్నట్టు జరిగిపోయేది.

ఎకరా పాతిక సెంట్లు మడిసెక్క వుందంటే.... యవసాయం దైవసాయం అన్నట్టు వానపడితేనే పిడికెడు గింజలు, లేకపోతే విత్తనాల గింజలు కూడా దక్కవు మళ్ళీ అప్పు...!

ఓరోజు దారి పక్క ఎడ్లు మేపుతుంటే దొర పిలిచేడు. "అప్పలయ్యా."

అప్పల్నాయుడికి పిలుపులో తేడా కనిపించింది.

"అప్పలయ్యా నువ్వేమీ అనుకోకపోతే నేను సెప్తున్నది యినుకో. నాకిక్కడ నలభై ఎకరాల భూమి వుంది. తొడుము, మాదలంగిల కూడా కొనడానికి బేరం జరుగుతుంది. నాకు సాయంగా వుండకూడదూ. నువ్వేమీ చెయ్యక్కర్లేదు. లేబర్‌తో పనిచేయించు చాలు ఒక రకంగా 'మేనేజర్' అనుకో... ఆరొందలు యిస్తా నెలకి."

దొర మాటలకి ఏం చెప్పాలో తెలీలేదు అతనికి. తను దిగే ఒక్కొక్కమెట్టు గుర్తొచ్చింది.

చేతికి అంది వచ్చిన కొడుకు... కొండకి కఱ్ఱలకెళ్ళి కాలుజారిపడి, అప్పటి నుండి అవిటోడైపోయేడు. ఏ పనీ చెయ్యలేదు. కోడలు పెద్దకొడుకుని వొదిలి ఎగువీది సిమాల్నాయుడి తోటి సంబంధం పెట్టుకోని, విషయం వీధినపడి నూతిలో గెంతీసింది. అదిగో అలా... ఇంటికి పట్టిన సుడి, పంటకి తగిలి, వానల్లేక, వానొస్తే తెగుళ్ళొచ్చీ... పంటలుపోయి, ఏడాది కేడాది దిగుదుడుపై.. కథా కార్యాలు... రోగాలు రొష్టులు... చుట్టం బంధుగులు... పెళ్ళిల్లు పేరంటకాలు... వీటితోటి ఆస్తులు ఆరాయించుకుపోయి కడాకి ఎకరా పాతిక సెంట్లుమడి... తల్లి- పసుపు కుంకుమ కింద యిచ్చిన రెండెకరాల మెట్టు... మిగిలింది. అదగో దానికే యిప్పుడు గాలొచ్చింది... ఆఖరికి చిన్నకొడుకును ఏ బి.సి. హాస్టల్‌లోనో వుంచి చదవించుదామన్నా వీలుకాని పరిస్థితిలో.... ఎడ్లు మేపుకుంటున్నాడిప్పుడు.. చిన్న కొడుకు.

"ఏమంటావ్ అప్పలయ్యా...." కదిపేడు దొర.

"తరువాత చెప్తాన్లెండి" అన్నాడే గానీ... ఏమీ తోచలేదు.

''మేనేజేరంతే మాటలేటి... యింకా ఆలోసించడమేటి, ఒప్పుకుంతూ...'' ప్రోత్సహించేడొకడు.

"ఆడిచ్చిన ఆరొందలకి ఆడిదగ్గిర పనిసెయ్యడమంతే... యింత బతుకూ బతికి యింటె నకాల సచ్చినట్టగ అదేట్నెత్తు...." వెనక్కి లాగేడొకడు.

"ఓరే... నువ్వలగే సెప్తావురా. ఓడలు బళ్ళు... బళ్ళు ఓడలు అయిపోతన్నాయి. ఏటిసేత్తాం. అల్లంగి సిరంజీవుల్నాయుడు నారాయణపురంకి మోతుబరి!.... అలాటోడు ఏటైనాడు? మనూరిల... సిల్లరకొట్టెట్టుకోని... బుర్రమీద మూటలు మోసినాడు. కరమ్మురా... కరమ్మ ఎవులు తప్పించగల్రు...?" బాధపడ్డాడు ఒకడు.

"ఏటీ? అప్పల్నాయుడు బావుకి అలగడిగినాడా దొర? అతగాడికి నాలుగు కాసులుంతే వుండొచ్చుగాక... కూటికి తక్కువైతే మట్టుగు... కరమ్మ కాలి యిలగైపోందుగాని... యీ బావు సన్నబ్బంచి సిలకట్టు గట్టి... పూరాకమీజు సేతులు మొయ్యావొదిలి... గేరాదువ్వి... మీసం తిప్పుకోని యీదిల నడిత్తే.... సూపులుసూడాల. సంకురాత్రి పండుగొత్తే వంద రూపాయల గొర్రిమాంసం... మరొక వంద మేక మాంసం.... అవీగాక దున్నపోతులాటి పందిం పుంజులురొండు తెగేవి. కనుమునాడు బరాతం అడగనోడే పోనాడు. సేతికెంతొస్తే అంత... మరి నాయిరాలమ్మో... దరమతల్లి సేతులెత్తి దండమెట్టాల...! ఏ లోకానుందో... అలాంటి అప్పల్నాయుడి బావుని ఆడిదగ్గిట పనిసూడ్డానికి వుండమన్నాడంతే... ఆహా... ఏనుగు గానుగు తిరగడమంతే... యిదే గావాల. కుంచమెల్లి అడ్డల దూరవలసిన రోజులొచ్చి నాయిరా నాయనా..." గతంలో అప్పల్నాయుడి దగ్గర నమ్మకమైన రైతుగా పనిచేసిన... సిమ్మడు.

తాతల్నాడు నేతులు తిన్నారంతే.... యిప్పుడెలా గవుద్ది? అప్పలన్నా అందరూ సెవిట్లో పోసినోలే గానీ నోటిల పోసినోలు గారు. పరకంతే పందెమేసినట్టున్న రోజులు. నెలకి ఆరొందలంతే... యేటీ? రూపాయైనా ఎలాగొత్తాది? పెస్టేజీ సూసుకుంతే పస్తుల్తోటి మాడి సవ్వాల"... తనకి తమ్ముడి వరసైన రాములు మాటలకి దిగులు వేసింది అప్పల్నాయుడికి.

"ఒరే నాయనా ఆడెవుడో మనకేల...? మనం బతకాల....! బతకడాంకి తిండికావాల. అది ఎలాగైతే మనకేల? దొరికిన కాడికి దేవుకోడమే".. పనీపాటు లేక తిరిగే మొండీది రాజు.

"ఛస్... ఎవుడ్రీడు? మనిసి పుట్టుగు పుట్టింతరవాత కసింత మనసరక ముండాల. పిసరంత పౌరుసుముండాల. కష్టపడి కూలిసేసుకొని బతికిందే బతుకుగానీ"... అని మొండీది రాజును కసిరి...

"ఓరే అప్పలయ్యా... మంచీ సెడ్డా తెలిసినోడివి. నీకు సెప్పడమేటి. నీకు ఎలాగ తిన్నగున్నాదని పించితే అలగసెయ్యి... ఎవులెన్ని సెప్పినా బతకడాంకి ఒక దారుండాల..." అప్పల్నాయుడికే నిర్ణయం వొదిలీసేడు ముసిలోడు.

ముసలోడు అలా అన్నాక మరెవరూ యేమీ అనలేదు. ఎటుచూసినా ఊరును పచ్చని మంటలేవో కమ్ముకొస్తున్నట్టు, వ్యాపార పంటలు, ట్రాక్టర్ల రొదల ముందు మౌనంగా రోదిస్తున్న నాగళ్ళు, అరిటాకుల రెపరెపల్లో... ఏవో అపశృతులు వినిపిస్తున్న భావన!

అప్పల్నాయుడు ఉన్నచోటనే కొమ్మలు నరికిన చెట్టులా నిలబడిపోయేడు. జరుగుతున్న మార్పులు అతనికి ఒంటపట్టడం లేదు. అలాగని రాజీ పడకపోతే... నష్టపోయేది?....

"తనా... కష్టపడి పని చేయడానికి అశక్తుడౌతున్నాడు. పారపని చేయాలన్నా.. ఏరుపూసి దున్నాలన్నా యిక కష్టమే... ఆరొందలకో, ఏడొందలకో.... దొర దగ్గిర కుదురుకోవడమే మంచిది"

ఒక నిర్ణయానికి వచ్చేడు.

ఆ రోజు నుంచి అప్పల్నాయుడు కమ్మదొర పొలంలో "మేనేజరు అప్పల్నాయుడు" అయ్యేడు. లేబర్‌ని పిలవడం, పని పురమాయించి కూలీ యివ్వడం వంటి పనులతో ఆరంభమై – ట్రాక్టరు నడపడం నేర్చుకుని దున్నడం వరకూ వచ్చింది. పొలంలో "బోరుకొడితే పైపులు కొనుగోలు చేసి తీసుకురావడం అప్పల్నాయుడే. అయితే కొత్తగా పనులు చేయడం మొదట్లో బాగున్నా... తరువాత్తరువాత... ఊబిలోకి కూరుకుపోతున్నట్టు ఊపిరి పీల్చుకోడానికీ తీరికలేనట్టయిపోయేడు. తన భూమి మీద తనే పాలేరై పనిచేస్తున్న భావనతో కృంగిపోయేడు.... వంచిన నడుం ఎత్తకుండా పనిచేస్తున్నప్పటికీ ఏదో ఒక మాట అనే దొర పద్ధతికి అలవాటు పడిపోయేడు. పనిసెయ్యకుంట ఎవులు మాత్రం కూకుండబెట్టి యిచ్చెత్తారు కూలీ... అని సరిపెట్టుకున్నాడు. చాకిరైతే పెరిగింది కానీ జీతం పెరగని పెద్దపాలేరైపోయేడు.. అప్పల్నాయుడు. అయితే పాలేరుకు బదులు యిక్కడ మేనేజరు పేరు!

కమ్మదొరలు చేసే కొత్త వ్యవసాయంతో సన్నకారు రైతులు, నెత్తిన కొండ చెరియలిరిగి పడినట్టు గిలగిల లాడిపోయేరు... మర్రిచెట్టు నీడలో మొక్కలైపోయేరు.... లేబరు రేట్లు తాత్కాలికంగా పెంచి, రైతుల పొలాలలోకి లేబర్ వెళ్ళకుండా కమ్మదొరలు తమ ప్రాభవం పెంచుకుంటే... ఆ కూలి రేట్లు యివ్వలేకా, స్వయంగా చేసుకోలేకా... కుమిలిపోయే రైతులు, "తెగులు పట్టిన చేలు"లా... కృశించి పోయేరు. ఊరు చుట్టూ గుబురుగా ఎదిగిన అరటి, మొక్కజొన్న ఆకుల రెపరెపల్లో వరిపొలాలు వెలవెలబోతున్నట్టు ఎరువులకీ, మందులకీ మదుపులు లేక నవ్వు చెరిగిన ముఖాలతో... చిన్న రైతులు ఆ కమ్మదొరల్నే ఆశ్రయించక తప్పలేదు ఏదో ఒక అవసరానికి.

ఇదంతా చూస్తున్న అప్పల్నాయుడికి కడుపులో దేవినట్లైంది. "పొలాల్లో బోర్లు తీయించాలంతే... మోటర్లకి కరంటు కావాలంటే... బేంకులసుట్టు, ఆ కరంటోల సుట్టూ కాళ్లు అరిగిపోయినట్టు తిరిగి నెలలు దాటినా సేయించుకోలేని పన్లు ఒక రోజు బేంకోలకీ, మరొక రోజు కరంటోలకీ... పార్టీలిచ్చేసి నిమిసాల మీద సేయించుతారు. ఆహా... డబ్బు మహిమ. అందుకే అన్నారు! బలమంతుడి సవ్వారి బగమంతుడు మోత్తాడని" మారుతున్న పరిణామాలకు మూగసాక్షిగా మారిపోయేడు అప్పల్నాయుడు.

ముసురుపట్టి చినుకులు చలిగాలితో కలిసి రాలుతున్న 'తుమ్మముళ్ళు'లా వున్నాయి. దట్టంగా మబ్బులు అలముకుని ఉదయమే అయినా పొద్దు పోయినట్టుంది. నేల బురద బురదగా... పేద రైతు అంతరంగంలా వుంది.

పొలంలో పనిచేసుకుంటున్న అప్పల్నాయుడు దగ్గర్లో... "ఏదో గోల" వినిపించి అటు చూసేడు.

సొమ్మల గుంటలు పశువులు తోలుకెళ్తుంటే కమ్మదొర అడ్డుకుని కేకలేస్తున్నాడు.

"ఎవుడ్రాడు... జబర్దస్తీగా పశువులు తోలుకొని వచ్చీడిమేనా... మెరక మీ బాబుగారి దనుకున్నార్రా?... వెనక్కి తిప్పండి... తిప్పండి."

"అదీ... మెరకమీదికి బక్కలు తోల్తే... యాడికెంది? ముసురు బెడితే బక్కలు మరెక్కడ నిలేత్తాము?" అడిగేడు ఓ గడుసు గుంటడు. పాడుతున్న పాట ఆపి బద్దల గిడుగు ఎత్తిచూసి,

"ఈ మెరక బక్కలు మేపుకోడానికే గాదేటి?" అన్న ఓ పిల్లాడి మాటలకు అడ్డుతగుల్తూ మరొకడన్నాడు.

'ఒరే యితగాను యీ మెరకకొనుకుండట అందుకే అడ్డెత్తండు.'

"ఆ! యీ మెరకనే పోతే మన బక్కల సంగతేటి? యీ ముసురు యింకెన్నాలో? యీ ముసురులాగే వచ్చిపడ్డారొసే... మన మీదకీ కమ్మావోలు" పశువులు ఎక్కడ మేపుకోవాలో అర్థం గాక సతమతమయ్యేడు ఓ పిల్లాడు.

"చెప్తే మీక్కాదూ.. వెనక్కి తిప్పండి. మరికొంతసేపు యిక్కడే వుంటే... కాళ్ళిరిచేస్తాను. ఎక్కడ మేపుకుంటారో... ఏం చేసుకుంటారో నాకు అనవసరం...."

పశువులన్నీ మెరక మీదికి రానీయకుండా వెనక్కి తగిలీసేడు దొర.

అప్పల్నాయుడి కెవరో ఛెళ్ళున కొరడాతో చాచినట్లైంది.

"అల్లోల్ల మెరక" అదెప్పుడ్నుంచో అలాగే వుంది. బ్రిత్రపాడు అల్లోలు ఆ మెరకమీద యవసాయం సెయ్యకుంట... ముసురుపడితే బక్కలకి రొక్కటమని అలగే వొదిలీసినారు. యిన్నాలకి అన్నదమ్ములు ఏర్లుపడి తగువుల్తోటి అమ్మీసినారు. ముసుర్లప్పుడు బక్కలు నిలబెట్టడానికి సెదరంత సోటు నేకుంట అయిపోయింది. ఏం గాచ్చారమొచ్చింది. ఏం గాచ్చారమొచ్చింది? విలవిల లాడిపోయేడు. అతని కళ్ళు వాన మబ్బులే అయ్యేయి.

సాయంత్రం వరకూ అన్యమనస్కంగానే పొలం పనులు చూసుకుని ఇంటికి వెళ్ళబోతున్న అప్పల్నాయుడు దొర పిలుపు విని ఆగేడు.

"అప్పలయ్యా! ఆ గేదె చూడు... పేడల్లో పొర్లి ఎలా వుందో? మేపుకు తోలుకెళ్ళిన కుర్రోడు కడక్కుండా తోలుకొచ్చేడు. నదికి తోలుకెళ్ళి... తోమీ."

అప్పల్నాయుడు కదలక... మెదలక నిలబడిపోయేడు.

"ఏందయ్యా? గేదె కడగమంటే కదలవేం..."

"నాకేనా..?"

"నీకే... ఏం" చిరాగ్గా చూసేడు దొర.

అప్పల్నాయుడికి చిర్రెత్తుకొచ్చింది.

"ఏటీ? నా నెవుల్నను కుంతన్నావు నువ్వు? పరాసికాలాడ్తన్నావేటి? ఏదో... మేనేజరు పనికన్నావనీ, పన్లు పురమాయించడమే అన్నావనీ, నాకూ కసింత వూతలాగ వుంతాదని తలొంచినాను. యిప్పుడికే నా సేత అడ్డమైన సాకిరీ సేయించుకున్నావు. అది సాలక యిప్పుడు నీగేదెలు.... పోతులూ... కడగమంతావా? యీ వేల గేదెలు కడగమన్నావు... రేపు నీ గుంటల యేరుగులు ఎత్తమంతావు. సాలు, సాలు.... "నీ యాపారం బుద్ధి యింత నీచమైన బుద్ధి అని ఎరగలేదు. బక్కల వుసురుపోసుకున్నోడివి.

మనుషుల్ని మనుసుల్నాగ సూత్తావా. నీకొక దండం. నీ పనికొక దండం! నీ పనీ వొద్దు... నీ కంబార రకమూ వొద్దు." అని విసురుగా వచ్చేసేడు.

దాహం తీర్చుకోడానికి ఏటికెళ్ళి ప్రవాహంలోకి జారిపడి తిరిగి ఒడ్డుకు చేరినట్టు ఊపిరి పీల్చుకున్నాడు అప్పల్నాయుడు.

అదొక పీడకలలా... మరపు మడతల కిందకి నెట్టేసేడు.

✡

అప్పల్నాయుడి ఎడ్లు ట్రాక్టరు మీద ఎక్కించి వీరఘట్టం తీసుకుపోవడానికి తయారౌతున్న సంగతి ఊరంతా పాకింది. జనం రామమందిరం దగ్గరా... వీధుల్లోనా చర్చల్లో పడ్డారు.

"ఏటీ గోరం....? లోకంల లేని యవసాయం ఆడొక్కడే సేత్తన్నాడేటి? బందీసాల మనూర్ల లేదా...? అసలు మనవూరిల పెద్దమనుసులున్నారా... అని!" ఒక రైతు పెద్దల్ని తప్పు పట్టేడు.

"ఓరే... పల్లకోరా... ఆడు సేసిందే సబవు. నేపోతే గుంటలు ఎంతసెప్పినా బక్కలు తిన్నగ కాసుకోరు. ఎన్నిసార్లు 'బందిల దొడ్డిల' పెట్టినా రెండ్రూపాయలే గదా... అని ఎవుడూ లెక్కచెయ్యడు... యిదే తగిన పని" ఒకడు సమర్థించేడు.

"యీడికి బక్కల్లేవు గదా... అందుకు యిలగ మాట్లాడతన్నాడు. వున్నకాడకి పాలుకీ, పంపుకీ యిచ్చేసి యిస్రాయింగా వున్నాడు.... యీడికేటి తెలుస్తాది బక్కలు - బాదలు సంగతి" సమర్థించిన వాడ్ని తిట్టేడొకడు.

"నిన్నమొన్నటి దాకా ఎలా వుండీది మనవూరు. కూటికి తక్కువైనా... కుటుంబాలకు తక్కువ లేదన్నట్లు ఒకరిదగ్గర రైతరకమున్నా... అన్నా... దద్దా... మామా... అని వరసల్తోటి ఒకరికొకరు గౌరవించుకునే పద్ధతిలో... పనులు చేసుకుంటుండేవాళ్ళం. యిప్పుడు చూడు.... ఆ కమ్మదొరలు వచ్చిం తరువాత మనవాళ్ళని మనం పనుల్లోకి పిలవలేకపోతన్నాం... ఫ్ఛ్... అంతా వ్యాపారమైపోయింది." అన్నాడు రిటైరెరయిపోయిన వుపాధ్యాయుడు, చంద్రినాయుడు...!

"ఒసీ... మా యింటి మనిసిలాటోడు... తిర్నాద... ఆడు యిప్పుడు మా యింటి కాసి సూడ్డం లేదు... అంతకంటున్నా" బాధను వ్యక్తం చేసేడొకడు.

"కాలమలగుందిరా... మరి యాపార ప్రపంచం. ఆలొచ్చింతరవాతే గదరా... అరటి తోటలు, జొన్నపొట్టలూ, పళ్ళతోటలూ... వచ్చినాయి" ఆ పరిస్థితే మెరుగంటాడొకడు.

"ఆ... ఆ... పళ్ళు బళ్లతోటి పట్నాలకెలిపోతే మనం పళ్ళీసి పెట్టీసి... పల్లకుందుంగానీ... ఆ పంటులు యాపారానికే గాని... మనలాటోలకి నప్పవు" అసలు సంగతిదీ అని తేల్చేడొకడు.

"ఈ వేళ అక్కడ ఎకరా అమ్మేసి యిక్కడ పది ఎకరాలు కొనగలుగుతున్నాడంటే... ఆ తేడా ఎందుకొచ్చిందో ఎవరైనా ఆలోచించేరా! అసలు భూదేవతకి తేడా ఏమిటి? దేశం మారిపోయిందా... కనీసం రాష్ట్రమైనా మారిందా? ఒకే భూమి. అక్కడ ఎకరా రెండు లక్షల వరకూ రేటు పలుకుతుంటే యిక్కడ మూడు నాలుగు వేలు మాత్రమే. అదిగో కమ్మదొరలు వచ్చాక మేం ఎకరా పదివేలు నుండి యిరవై వేలు వరకు పెరిగినట్లు చేసేం చూసేరా' అని పోజులు కొడుతున్నారు మనోళ్ళు కొందరు. అయినా గానీ... యిక్కడ తక్కువ రేటుకీ అక్కడ ఎక్కువ రేటుకీ... కారణం? అదిప్పుడు తెలుసుకోవాల. ఏం అక్కడ గాలివాన మొక్కలు పడిస్తే ఏపిల్ చెట్టవుద్దా? ఇక్కడ మామిడి మొక్కనాటితే... దూలగుండు తుప్పవుద్దా?.... ఏమిటీ తేడా?... భూమి రేటు అంత లెక్కా ఒక్కలాగే వుండాల..."! ఆ... తేడాలకు కారణాలు కనుగొనాలని తీర్మానం చేసేడు, అప్పుడే కాలేజీ చదువులు ముగించుకు వచ్చిన ఓ యువకుడు ఆవేశంగా.

"నువ్వన్నది బాగుందిగాన్రా బావ్... అది మన నాయకులు ఆలోసించాల" ఒకరి సూచన.

"ఆ... ఆ... ఆలుసూత్తారు! మన నాయకులా ఆలు అక్కడకెల్లి తన్నుకొడాల్తోటే సరిపోద్ది. ఏ ముఖ్యమంత్రిని ఎప్పుడు దించిద్దుమా... అని ఆలోచించీ సరికే ఐదేళ్లూ గడిసిపోతాయి. యింకా ఆలేటి సూత్తారు?" విమర్శనాస్త్రం విసిరేడొకడు.

"ఔనుగానీ... మనూరు.... కమ్మోవోలు ఎలగెలపొచ్చినారు సెప్మీ... మనోలేగదా... ఆలకి దారిసూపించింది. ఆల్నని సుకమేటి.... మన బంగారం మంచిదైతే గదా! ... సరాబోడ్ని తిట్టడమేల" ముందు వాడి విమర్శను పక్కనబెట్టి... యిప్పటి మార్పులకి మనవాళ్ళే కారణం అని తేల్చేసేడు ఒకాయన.

“ఔనర్రా... కోళ్లు తోలమంటే కోటలోని సంగతులన్నీ మీకేల్రా? అసలొదిలీసి అదీయిదీ పేల్తారేటి?” కసిరేడు రామినాయుడు తాత... ఎడ్లు మాట ఎవరూ ఎత్తరే? అన్నట్టు.

లేకపోతే ఏంటి తాత! చూస్తున్నావ్ కదా... యీ రోజు చిన్న చిన్న రైతన్నవాడు తన పొలంలో పన్లు చేయించుకోగలుగుతున్నాడా?... మన పొలాల్ల పనులు యిలాగే వుండేవా? ఒకడి పొలానికి ఒకడు వెళ్ళకూడదని అడ్డంకులు ఎప్పుడైనా వుండేవా! దారులు కట్టడిచేయడం ఏమైనా బాగుందా...? యిప్పటికే మన జిల్లా మొత్తం మీద కమ్మదొరలు భూములు కొనని గ్రామం లేదు... యింకా... వీళ్ళ బంధువులు, ఆ బంధువుల బంధువులు వచ్చేటందుకు యిక్కడ భూముల బేరాలు సాగుతున్నాయి.

మన నాయకులకు నేస్తాలు వీళ్ళే... పోలీస్టేషన్లా పలుకుబడీ వీళ్ళదే. మన మీద రేపటి అధికారం కోసం యిప్పుడే బీజం వేసుకుంటున్నారు. పీడనకు ప్రారంభమూ యిదే. యిక్కడి రైతులమైన మనము మన భూములు మీదే పాలేర్లుగా మారిపోయే పరిస్థితిని కోరి తెచ్చుకుంటున్నామేమో... యీ రోజు అప్పలయ్య తాత ఎడ్లు ట్రాక్టరెక్కించి వీరఘట్టం తోలుకెళ్తున్నాడంటే... మన పంచాయితీల్ని మన పెద్దల్ని, మన పద్ధతుల్ని తిరస్కరించి నట్టేగదా...! ఆలోచించండి.”

విద్యార్థికుడైన యువకుడు.... సూటిగా అన్నాడు. మళ్ళీ ఎప్పుడొచ్చాడో ప్రెసిడెంటు... తాను అందుకున్నాడు.

“ఒరే నువ్వు చదువుకున్నోడివని తెలుసులేరా...! అయితేటి ఆళ్ళని మనం తగిలీగలమా? వాళ్ళొచ్చింతరువాతే వ్యవసాయకంగా ఎంతో అభివృద్ధి చెందింది మన ప్రాంతం. వాళ్ళని చూసి నేర్చుకోవలసింది పోయి, బాగుపడిపోతున్నారని ఏడిస్తే ఎలాగా....? ఎంతో డబ్బు ఖర్చు పెట్టి పండించిన పంట పాడైపోతే.... ఎవరైనా వూరుకుంటారా? మనమూ కసింత ఆలోచించాల. మన భూమికి రేటు పెంచడానికి నేనెంత యాతన పడ్డాను. అదీ ఆలోచించాల.”

“ఆలోసించుతాం.. ఎందుకాలోసించమూ... ఎప్పుడూ ఒక్కనాగే వుండిపోతామా? ఎద్దు ఎప్పుడూ ఒక పక్కే తొంగుంతాదేటి? బావ్... ఆలపక్క అంత దీనిగ మాట్టాడతన్నావుగానీ... నా ఎడ్లు ఆడిసేనిమేసిత్తే.... అక్కడెక్కడకో... యీరగొట్టం బందిల దొడ్డిల పెడతా నంతండట. ఎంది? అది నువ్వు అడగనేవేటి? నువ్వడగవు. మాకు తప్పదు కదా... మాకు సేతందేటో మామే సేసుకుంతాం.”

అప్పల్నాయుడు తీవ్రంగా అన్నాడు.

“ప్రెసిడెంటూ... నువ్వేటో అనుకుంతన్నావు గానీ రేపు నీకీ ప్రెసిడెంటు పదవి వుంతాదని అనుకుంతన్నావు గావాల. అటు పెద్దోలతోటి నేస్తరికాలు కట్టీ... యిటు లేబరు జనంను పనులు చూపి మచ్చిక సేసుకోనీ.... జాగర్తపడితె... రేపు ప్రెసిడెంటు గానో... మండలా

ధ్యక్షుడుగానో, అదును కుదిరితే... ఎమ్మెల్యే.. ఎంపీ... గానో పోటీసేసినా సెయ్యొచ్చునని ఎందుకనుకోవు? ఆలు పెట్టుబడి పెట్టగలరు. జనాల్ని కొనగలరు. అప్పుడు నీ సంగతేటి సెప్మీ....?"

జోగినాయుడు మాటకు ప్రెసిడెంటు ఆలోచనలో పడ్డాడు.

"మనం మనంగా నిలబడాలనుకుంటే, మన ఆత్మగౌరవం నిలుపుకోవాలనుకుంటే, యిప్పటికైనా జాగ్రత్తపడాలి. ఆడు పందెం గుర్రాన్నని అనుకుంటున్నాడు. మన చేతిలో కళ్ళెం వుంచుకోకపోతే గొప్ప యిబ్బందులు పడిపోవలసి వస్తుంది. ఆ"

ఓ కుర్రాడు కర్తవ్యాన్ని గుర్తు చేసేడు.

సన్నసన్నగా ప్రారంభమైన చర్చ.. క్రమంగా తీవ్రతరమయ్యింది. రామమందిరం జనంతో నిండిపోయింది.

అప్పుడన్నాడు అప్పల్నాయుడు.

"యీ వేల నా ఎడ్లు 'వీరఘట్టాం' బందిలికి తీసుకెళ్ళాడు. రేపు మరొకరివి 'సాలూరు' బందీల పెడతాడు. యిప్పుడు వల్లకుంతే రేపాడు యిష్టమొచ్చినట్టగ సేత్తాడు. యిక్కడు న్నోలందరూ బక్కా బడుగువున్నోలే. ఆలోసించండి యీ బాధ నా కొచ్చిందని నేననడం కాదు. నా బైలెల్తాను... ఏమాత్రం మానస రక్తం వున్నోలైనా నా ఎనకాతల రండి" అంటూ కర్రపెట్టి లేచేడు.

"ఔను... యీ వేళతోటి యిది ఆగిపోదు. మనల్లేకపోతే మన పశువుల వుసురు మనకే తగుల్తాది. రండర్రా....

పశువలకేట్రా... మనుసులకే దిక్కునేపోతే."

"ఎక్కడ నుంచో ప్రవహించి వచ్చిన 'పెట్టుబడులు' మనముందు ఓ 'సాగరం' లాగ తయారై అలల నాలుకల్తోటి ఆహ్వానిస్తుంటే ఈతకొలను అనుకొని మురిసి పోతున్నాంగానీ.... అదొక "తిరుగుడు గుమ్మి" అనీ, అందులో పడితే గజీతగాడైనా గుటుక్కుమని పోవలసిందేననీ.... తెలుసుకోలేక పోతున్నాం. యిప్పుడే మనం 'జల్జుకోకపోతే' ఆ పెట్టుబడుల జోరు వరదై, వెల్లువై... మన వూళ్ళనే ముంచేస్తుందన్నా ఆశ్చర్యం లేదు. ముంపుకు గురికాక ముందే మన జాగర్తలు మనం తీసుకోవాల. ప్రవాహానికి ఆదిలోనే అడ్డుకట్టవెయ్యాల" రిటైర్డ్ టీచర్ చంద్రినాయుడు ఎంత మామూలుగా చెప్పినా... ఆ మాటలు కుర్రాళ్ళ గుండెల్లో... బాంబులై పేలేయి.

యువకులు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

మాటలలో చెప్పుకోలేని భావాలను కళ్ళతో స్పష్టం చేసుకున్నారు. అదంతా ఒకే భావంతో లేచి నిలుచున్నారు.

పిల్లల నుండి ముసలోళ్ల వరకూ కదిలేరు.

ఊరవతల మోటారు పంపుసెట్ల శబ్దాలు... ట్రాక్టర్లు రొద నిద్రపోతున్న పులుల గురకల్లా వినిపించేయి.

ట్రాక్టరు "ఎడ్లుతో" సిద్ధంగా వుంది.

అప్పల్నాయుడి చిన్నకొడుకు ఏడుస్తూ బ్రతిమాలుతున్నాడు. కడుపు వెన్నుకు అంటుకుని ప్రక్కటెముకలు బయటకు కనిపిస్తున్నాయి. మధ్యాహ్నం తిండిలేని ఆకలి బాధ కంటే ఎడ్లు బందిల దొడ్డికి తోలికెళ్ళిపోతున్నారన్న వేదన ఆ పసికళ్ళల్లో, ధారలై కారుతోంది.

వెలుగు మింగి చీకటి నలుదిక్కులను కమ్ముకోడానికి సిద్ధపడుతోంది. కమ్మదొర తిట్లు వినిపిస్తూనే వున్నాయి. ట్రాక్టరు ముందుకు కదిలింది.

ఏడుస్తూ వెనుక పరుగు పెట్టేడు అప్పల్నాయుడు చిన్నకొడుకు కృష్ణ... కసి పెరిగి... పరుగుతీస్తూనే ఓ మట్టి గడ్డ తీసి... కోపంగా విసిరేడు ట్రాక్టర్ మీదికి.

ఆ పిల్లాడి పరుగుకీ... ట్రాక్టరు నడకకీ మధ్య దూరం పెరుగుతూనే వుంది. యిరువేపులా, పరుగులు తీస్తున్న అరటి తోటలు పచ్చగా... పసిరిక పాములు మెలికలు తిరుగుతున్నట్లు అగుపించాయి వాడికి. గాలికి వలయాలు రేగే... అరటాకుల కదలికలు... ఏట్లోని తిరుగుడు గుమ్ముల్లా కనిపించేయి వాడికి.

రోడ్డెక్కిన ట్రాక్టర్‌ను అందుకోడానికి... జనం పొలాల గట్లు మీదుగా, అడ్డదారిలోంచి పరుగులు తీసేరు. పరుగులెత్తి కేకలేసే వారి పిలుపుల్ని పొలాల్లోని వారు అందుకున్నారు. క్రమంగా వాళ్ళంతా ఓ మానవహారంగా ఏర్పడ్డారు.

ఆ మానవహారం మధ్య మనిషి చేసిన కాసుల యంత్రం మౌనంగా నిలబడిపోయింది.

✡

# రాముల వారి గుడి ముందు

**– 'మోహన్'**

పుస్తకాల సంచీ బీరువాకింద దాచేసి, సరాసరి వంటింట్లోకి వెళ్ళబోయి, అంతగా పరిగెత్తుకొచ్చినందుకు అత్తయ్య కోప్పడుతుందేమోనన్న విషయం గుర్తొచ్చి గుమ్మంలోనే ఆగిపోయి లోపలికి తొంగి చూశాడు శివు. రంగమ్మ రొట్టెలు చేస్తూంది. చాలా సేపట్నుంచీ పొయ్యి ముందు కూర్చుని పని చేయడంవల్ల ఆమె ముఖమంతా చెమటతో తడిసి వుంది. నొసటి కుంకుమ కరిగి ముక్కు మీదుగా కారి చార ఏర్పడింది. ముఖం మీది చెమట బిందువులు పొయ్యి వెలుగులో కెంపుల్లా మెరుస్తున్నాయి.

శివు కాసేపు గుమ్మం వద్దనే ఆగి అలసట తీర్చుకుని లోపలికెళ్ళి పళ్ళెం అడుగు నుంచి ఓ రొట్టె తీసుకుని 'అతా పొప్పెయ్' అంటూ రొట్టె ముందుకు చాచాడు. రంగమ్మ చేస్తున్న పని ఆపి, తలెత్తి నొసటి మీద చెమటను మోచేత్తో తుడుచుకుంటూ "పొప్పు చెయ్‌లేదు. బెల్లం పెట్టె బీగం తీసి బెల్లం రొండుండల్దీస్కో" అంది. శివు రొట్టె తట్టలో పడేసి, అత్తయ్య మెళ్ళోని తాళిబట్టు దండకు ముడేసి వున్న తాళంచెవి తీసుకుని బెల్లంపెట్టె తెరిచి, రంగమ్మ చూడకుండా గబగబా నాలుగుండలు నిక్కరు జేబులో వేసుకుని, రెండుండలు మాత్రం చేతిలోకి తీసుకుని, తాళం వేసి, తాళంచెవి అత్తయ్యకిచ్చి, చేతిలోని బెల్లం వుండలు చూపించి రొట్టె నాలుగు ముక్కలు చేసి నిక్కరు జేబులో కూరుకుంటూ బయటికి రాబోతుంటే–

"సివా, సెంకర్రెడ్డి పెదనాయన గారింటికాడ మీ మాముంటాడు. రొట్టె తినేకి రామన్జెప్పు" అని అత్తయ్య పని పురమాయించింది. శివుకు చిరాకేసింది. సుంకులమ్మ కట్ట దగ్గర వెంకటేశూ, నరసింహుడూ, అప్పయ్య, నల్లప్ప, పాపిరెడ్డి అందరూ ఈ పాటికి కాచుకుని వుంటారు. బడొదుల్తూనే "చిల్లా–కట్టె" ఆడాలని మధ్యాహ్నమే అనుకున్నారందరూ. ఇప్పటికే ఆలస్యమయింది. "ఆడుకునేకి పోవల్ల. నేను పోనుపో. కర్రోన్ని పంపీ" అని బయటికొచ్చి "రేయ్! కర్రోడా శంకర పెదనాయన గారింటికాడ మామున్నాడంట. అత్త పిలుస్తాందని పిల్చకరాపో" అని జీతగాణ్ణి పంపేలోగా అత్తయ్య వంటింట్లోంచి బయటికొచ్చి "సెప్పిన మాటిను సివా, యెనుములు పిండుకోవల్ల, వాడు దూడల్నిడసద్దా? దావలోనే గదా, ఒగమాట సెప్పిపొయ్యేకి యెంతసేపైతాది" అంది.

శివు గత్యంతరం లేక మామను పిలవడానికి కదిలాడు.

✡

శివు 'కొలిమి మాను' దగ్గరికొచ్చేసరికీ కొలిమి తిత్తి వూదుతూ పీరా కనిపించాడు. పీరా నాయన మోదీను ఏదో కాగబెడుతున్నాడు. శివు పీరా దగ్గరి కెళ్ళి "రేయ్ పీరా చిల్లా కట్టె ఆడేకి వస్తావా?" అని అడిగాడు నెమ్మదిగా. పీరా శివు తింటున్నది చూసి అప్రయత్నంగా చెయి చాపాడు. శివు ఇచ్చిన రొట్టె ముక్క నోట్లో వేసుకుని నములుతూ తల అడ్డం తిప్పి "తిత్తూదల్ల మా నాయన పంపీడు" అన్నాడు.

పనిచేసుకుంటున్న మోదీను తలెత్తి చూసి "యేంది రెడ్డీ, ఒకనివే తింటాండావ్, నాకు పెట్టకుండా" అని చిన్నగా నవ్వాడు. శివు గోడదాటి మోదీనుకు ఓ రొట్టెముక్క, బెల్లం వుండయిచ్చి "మోదీనూ, బంగరం ములికి చేసీవా? నిన్నే చేసిస్తానంటివే" అని అడిగాడు.

"రేపు సాయంత్రికి సేసిస్తాలే రెడ్డీ. ఇప్పుడు మామగారిదే మడక్కర్రు దిగేయల్ల. పద్దన్నే దున్నేకి పోతారంట. సాయంత్రికి లెడీ కాకపోతే రెడ్డి తంతాడు" అని నచ్చ చెప్పాడు మోదీను, శివు ఇచ్చిన రొట్టెముక్క, బెల్లం నములుతూ. బొంగరం ములికి రేపు సాయంకాలానికి తప్పకుండా చేసివ్వాలని మరోసారి మోదీనుకు చెప్పి పెదనాయన గారింటి వైపు పరుగుతీశాడు శివు.

✡

శివు పీర్ల చావిడి దగ్గరికొచ్చేసరికీ శంకరరెడ్డి పెదనాయన గారింటికాడ గుంపు కనిపించింది. శివు ఆత్రంగా పరుగెత్తుకెళ్ళాడు. ఇంట్లోకి వెళ్ళడానికి వీలు లేకుండా వున్నారు జనం. దగ్గరికెళ్ళి చూశాడు. ఇంటి అరుగుమీద శంకరరెడ్డి పెదనాయన, మామ, మాడిమిద్దె కోటిరెడ్డి, నాగన్నగారి కొండారెడ్డి కూర్చుని వున్నారు. శివు మామకు కనిపించకుండా వెనుకనుండి జనంలో చోటు చేసుకుంటూ వెళ్ళి పెదనాయన ప్రక్కన కూర్చున్నాడు. అరుగుకు ఎదురుగుండా నడవలో స్తంభానికి ఆనుకుని చేతులు కట్టుకుని నించుని వున్నాడు చాకలి ఆదెన్న. అక్కడున్న జనమంతా ఆదెన్ననే చూస్తున్నారు. శివుకు అక్కడేం జరుగుతూందో పెదనాయన్నడుగుదామని పించింది. కానీ భయంవేసి మానుకున్నాడు. అంతలో కుంటి పుల్లయ్యతాత వచ్చి కూర్చుని "యేందిరా సెంకరా పంచాయితీ" అనడిగాడు.

"ఇగో మామా, వీడుండ్లా, సాకలి అనుమక్క కొడుకు ఆదిగాడు, వీనిది బండకింది పంపు, అదే తిమ్మాపరందావలో మన సెంద్రమ్మ కొడుకు నాగిరెడ్డి సేని పక్కది, ఎకరా వుందిలే. సర్కారు పన్ను కట్లేదు. పిలిపిచ్చి అడిగితే యిరవై దినాల్నుంచీ "ఈ దినం కడ్తా, రేపు కడ్తా" అంటానే యిన్ని దినాలూ జరిపినాడు. అక్కడ జూస్తే రూకలు తొందరగా కట్టమని

తాసీల్దారు పోరు. నిన్నగాక మొన్న పిలిపిచ్చి “రెండు దినాల్లో కట్టకపోతే జప్తు చేయిస్తా” నని గట్టిగా సెప్తే, ఇప్పుడే గంటకింద దుడ్లు తీసకచ్చినాడు. పెద్దనోటు “నా దగ్గిర సిల్లర్లేదురా. నువు కట్టే యేడుంబావలాకి నేనెక్కడ తీస్కరాను. నువ్వే పొయ్ సిల్లర తీస్కరా” అని పంపిస్తే మన రంగారెడ్డి కాడికిపోయ్ సిల్లర్దెచ్చినాడు. రంగారెడ్డి సిల్లరనోట్లిచ్చి నూర్రూపాయల కాయితం యిప్పించుకునేది మర్సిపోయినాడంట. రంగారెడ్డి కూడ యిప్పుడే అర్ధగంటాయవచ్చి. ఆదిగాడేమో నూర్రూపయల్నోటిచ్చినాకనే రంగారెడ్డి సిల్లరిచ్చి నాడంటాడు. ‘యిస్తే యాడికి పోతాది నాకసలియ్యనే లేదంటాడు రంగారెడ్డి’ అంటూ విషయం విశదపరచాడు శంకరరెడ్డి.

కుంటి పుల్లయ్య తాత చాకలి ఆదెన్న వైపు తిరిగి ‘యేమిచెప్తావన్నట్లు’ చూశాడు.

“బగమంతుని సాచ్చిగా నూర్రూపాయల కాయితం యిచ్చినా రెడ్డీ, మీ దెగ్గర పెద్దలు కట్టిచ్చి నింట్లో నిలబడి అపెద్దం సెప్తానా రెడ్డీ. పన్ను కట్టేకి పద్దినాలాయ యెవుర్నడిగినా బట్టుపుట్లేదు. సేనిపన్ను కట్టల్ల. పిల్లది సమర్తయి నప్పుడు తీస్కోండే సరుకుల బాకీ కట్టల్ల.

అంగిడింటి సెన్నప్ప దిన్నం యింటిమీది కొస్తాడు దుడ్లీమని. యింటిదానికి కాయిలాసేత్తే గడేకల్లాయనొచ్చి మందిచ్చి బతికిచ్చ. అదీ తీరిసింది లేదు. అదీ నేనూ చనం కూడ కూకోకుండ పన్జేత్తేగాని యాడాది పొదుగూ కూటికి జరగదు. ఇంటికాడ సూత్తే పెద్దపిల్ల తప్పనిత్తే అందరూ పసోల్లు. సేను సూత్తే యానాడూ పండింది లేదు. పండింది రోంత యిత్తనానికీ, కాండ్ల బాడిగలకీ సరిపాయ. నాకు మిగిలిందేంది, కాయికష్టం. ఈ బాకీలన్నీ తీర్చేదెట్లని వుండె గాద్దెల్లో రొండు నిన్న పద్దన్నే అనమాపరం సంతకు తోలకపొయ్ నూటికమ్మితి. నిన్న సంత సూస్కోనొచ్చేటాల్కి దీపాలు పెట్టే పొద్దాయ. పొద్దుగుంకి నాకయాల్లే అని పన్ను కట్టేకి రెడ్డింటికాడికి పొయ్యేవాన్నల్లా యింటికి పోతి. ఇయాల సీకట్లోనే సాకిరేవుకు పోతి. యేటికాన్నుంచొత్తానే బువ్వదిని పన్ను కట్టేకి వొత్తే రెడ్డి సిల్లరలేదు నువ్వే తీసకరాపో అంటే అంగడింటికి పొయ్ సెన్నప్పకియ్యాల్సిందిచ్చి సిల్లరదెత్తామని బైటికొత్తానే తలారి లింగడు గనపడి రంగారెడ్డింటికిపో, రెడ్డింటికాన్నే వుండాడు. పద్దన్నే సెనిక్కాయల్లెక్క యిచ్చి పొయ్‌నారుపో అనంటే రెడ్డోల్లింటికి పోతి. రెడ్డి బీర వొసార్లో కూకొని బుక్కులో రాసుకుంటా నోట్లు యెంచుకుంటావుండె. సిల్లరడిగితే యాడిదిరా పెద్దనోటు పట్టకచ్చినావంటూ నోటు తీసుకొని సిల్లర నోట్లు యెంచిచ్చె. గాడిదెల్నమ్మి నానని రెడ్డీక్కాడ సెప్తి. బాకీ వుండే సంగతికూడ సెప్పి సిల్లర తీసుకోని పన్ను కట్టేకి యీడకొస్తి రెడ్డీ, ప్రమాన సత్తెంగా నోటు రెడ్చికిచ్చినాకనే సిల్లర తీసుకుంటి. పిల్లలోన్ని రెడ్డీ. పిల్లలమీద ప్రమానం సేసి సెప్తాండా. నోటిచ్చినాకనే సిల్లర తీస్కుండా” అంటూ చాకలి ఆదెన్న వినయంగా, నమ్మకంగా పెద్దల ఎదుట మనవి చేసుకున్నాడు. శివు చాకలి ఆదెన్ననూ, మామనూ శంకర పెదనాయన్నూ, తాతనూ, కట్టమీది మిగతా పెద్ద మనుషుల్నీ మార్చిమార్చి చూస్తూ శ్రద్ధగా వింటున్నాడు.

“వాడు నోటియ్యలేదు సిన్నాయనా! యిచ్చింటే యెక్కడపోతాది. నాకు బాగా గ్యాపకం. సిల్లర నోట్లు యెంచిచ్చినా. నోటు తీస్కోలేదు. సెనిక్కాయల్లెక్క కూడ మూడు వేలు పెద్ద

నోట్లిచ్చి మిగతాది సిల్లరిచ్చినాడు దలాలిసాయిబూ, కావల్లంటే నువ్వే సూడు ముప్ఫై నూఱ్రూపాయల కాయితాలున్నా"యంటూ జేబులోంచి నోట్లకట్ట తీసి పడేశాడు రంగారెడ్డి.

"దాంట్లో సూసేదేందుంది. నువ్గాని అపద్ధం సెప్తావా, నూఱ్రూపాయలకాడ" నోట్లకట్ట ఎంచకుండానే రంగారెడ్డికి తిరిగిచ్చేసి ఆదెన్న వైపు తిరిగి "యేం, ఆదిగా నిజ్జంగ నూఱ్రూపాయల కాయితం యిచ్చినావా? ఒకేల మర్చిపోయ్ జోబులో పెట్టుకోనొచ్చుకుంటివా? అట్లేమైనా జరిగింటే సెప్పు. యిప్పుడైనా మునిగిపొయ్యింది లేదు. నువ్వేం కావల్లని జేసింటావా. మర్చిపోయుంటావ్" అని అనునయిస్తూ అడిగాడు కుంటి పుల్లయ్య తాత.

"లేదు రెడ్డీ, పోతానే నోటిచ్చినా, నోటిచ్చినాకనె రెడ్డి సిల్లరిచ్చె" అన్నాడు ఆదెన్న నమ్మకంగా.

"అయితే నీ దగ్గిర నూఱ్రూపాయలకాడ నేనే అపద్ధం జెప్తానంటావా?" అంటూ కోపంగా లేచాడు రంగారెడ్డి.

మామ ఆదెన్నను తంతాడేమోనని శివుకు భయం వేసింది. శంకరరెడ్డి రంగారెడ్డిని చేత్తో ఆపి నువ్వుండ మన్నట్లు సైగజేసి, ఆదెన్నవైపు తిరిగి "ఆదిగా, నువ్ నోటిచ్చి సిల్లర దీస్కున్నప్పుడు ఆడెవురైనా వుండ్రా" అనడిగాడు. ఆదెన్న ఒక్క క్షణం ఆలోచించి" "లేదు రెడ్డీ, నేను పొయ్నప్పుడు బీరవాసార్లో రెడ్డొక్కడే వుండె" అన్నాడు.

"యెట్లరామల్ల. నువ్విచ్చేది యెవురూ సూల్లేదంటావు. ఎవురూ పలికేక్కాడ లేరంటావ్ సూసినా మన్జెప్పేకి. నువ్వు యిచ్చినానన్జెప్తె ఎట్లనమ్మల్ల, తీర్పెట్ల జెప్పల్ల" అన్నాడు శంకరరెడ్డి కాస్త విసుక్కుంటూ. ఆదెన్న తలొంచుకుని నుంచున్నాడు.

"ఏం జెయ్యల్లో నువ్వే సెప్పురా ఆదిగా. వూరికే అట్ల నిలబడితే యెట్ల బెల్లంకొట్టిన రాయి మాదిరి" అన్నాడు అంతవరకూ మౌనంగా వింటూ కూర్చున్న మాడీమిద్దె కోటిరెడ్డి. ఆదెన్న వంచిన తలెత్తలేదు.

"వాడు సెప్పేదేంది! నోటీలేదులే. రంగారెడ్డేం నూఱ్రూపాయలకాడ యింతమందిలో అపద్దం సెప్తాడా? రంగారెడ్డి సిల్లరిచ్చి నోటడిగేది మర్చిపోయినాడు. యిదే సందని వీడు సిల్లర తీస్కోనొచ్చి యిప్పుడు యిచ్చినానని తప్పుడు కూతలు కూస్తాండాడు. కాకపోతే ఒకపక్క పెద్దమనిషి నోటీలేదురా అంటాంటే యినిపిచ్చు కోకుండా యిచ్చినా యిచ్చినా అని ఒకటే దబాయిస్తాడా! సొలకాల తెగేట్లు కొడ్తే వాడే వొప్పుకుంటాడు" అన్నాడు నాగన్న గారి కొండారెడ్డి తాగుతున్న బీడీముక్క కింద పడేసి కోపంగా.

"సత్తెపమానంగా రెడ్డీ నోటిచ్చే సిల్లర దీసుకుండా. నా పెండ్లాం పిల్లల మీద కావాల్సింటే ప్రమానం జేత్తా. బగమంతుని తోడు. పచ్చనాకు తోడు – ఇచ్చినా రెడ్డీ" అన్నాడు ఆదెన్న తలెత్తి.

"ఆదిగా నువ్వు సెప్పినట్లే పదాం. నిజ్జంగ నోటిచ్చి నానంటాన్నావ్. అట్లైతే కఁరుదుయ్, నీ దగ్గిర సత్యముంటే నువ్ గెలుత్తావ్. లేకపోతే రంగారెడ్డిమీద పంచాయితీ పెట్టిన తప్పుకు అయిదు నూర్లకు నోటు రాసీ రంగారెడ్డికి" అంటూ పరిష్కార మార్గం సూచించాడు మాడీమిద్దె కోటిరెడ్డి.

కఁరు దుసమనేసరికి జనంలో గుసగుసలు మొదలయ్యాయి. ఆదెన్న యేమంటాడోనని జనం, పెద్ద మనుషులుకూడ ఆదెన్న వైపే చూస్తున్నారు ఆత్రంగా. ఆదెన్న ముఖంలో నమ్మకం, ధృడనిశ్చయం కొట్టచ్చినట్లు కనిపిస్తూండగా "బగమంతుడే దిక్కు. కానీ రెడ్డీ" అన్నాడు.

శివు నెమ్మదిగా లేచి జనంలోంచి సందు చేసుకుని బయటికొచ్చి వాకిట్లో నుంచుని లోపలికి తొంగి చూస్తున్న మంగలి కిట్టప్పను "కఁరుదుసేదంటే యేందని" అడిగాడు. కిట్టప్ప వినిపించుకోలేదు. చేత్తో తట్టి పిలుద్దామని చెయ్యెత్తినవాడల్లా యెందుకో మానుకుని యింటివైపు పరుగుతీశాడు.

✡

శివు పరిగెత్తుకుంటూ యింటికి పోతూ దారిలో కొలిమ్మాను దగ్గరాగి కఁరుదుసడమంటే ఏమిటో మోదీన్నడిగి తెలుసుకుందామనుకున్నాడు. కానీ మోదీను కొలిమ్మాను కింద కనిపించ లేదు. ఇల్లు చేరేసరికి ఇంటిముందు కసువూడుస్తూ కఁరోడు కనిపించాడు. "కఁరోడా, అత్తేదీ" అనడిగాడు అలుపు తీర్చుకుంటూ. జలాట్లో ఉంది రెడ్డీ అని యేం రెడ్డీ అనడిగాడు. శివు వాని మాట వినిపించుకోకుండా ఇంట్లోకి పరిగెత్తి స్నానాలగది తలుపు తడుతూ 'అతా' అని కేకేశాడు. 'నీల్లు పోసుకుంటా వుండా రోంచేపుండు' అంది అత్తయ్య. శివు యేదో చెప్పబోయి ఆగి బయటికి పరుగెత్తుకొచ్చి "కఁరోడా కఁరుదుసేదంటే యేందిరా?" అనడిగాడు.

"కఁరుదుసేదంటే ఎవురన్న సుల్ల (అబద్ధం) సెప్తే, దొంగతనం సేస్తే... నానుండాననుకో దొంగతనం సేసింట. పెద్దమనుసులడిగితే సెయ్యలేదంటా. అప్పుడు కఁరుదుసమంటారు. మడక్కఁరు ఎఁరగా కాగబెట్టి దేవుని గుడికాడ రొండుసేతుల్తో పట్కోని దుసుల్ల. నాను సుల్ల సెప్పింటే నా సేతులు కాల్తాయి. నాను దొంగతనం సేసిండ ననుకో నా సేతులు కాలవ్" అని కఁరుదుయ్యడమంటే యేమిటో వివరంగా తెలియజేశాడు కఁరోడు, చేతిలోని కసువూడ్చే చీపురు కిందపడేసి.

ఇంతలో రంగమ్మ బయటికొచ్చి "యేందిరా సివా" అనడిగింది.

"అతా, సాకలాదెన్న వుండ్లేదా. వాన్ని కఁరుదుసమని చెప్పినారు శంకర పెదనాయన, మాడీమిద్దె కోఁటెడ్డీవాల్లు. వాడు మద్యాన్నం మామ దగ్గిర నూఁరూపాయలకు సిల్లర తీసక పోయినాడంట. నోటియ్యకుండా సిల్లర తీసక పొయ్‌నాడని మామంటాన్నాడు". ఆదెన్న "లేదు నోటిచ్చినా నోటిచ్చి నాకనే సిల్లరిచ్చినాడు రెడ్డి" అంటాన్నాడు. దానికే ఆదెన్నను కఁరుదుయ్యమంటాన్నారు" అని శంకరరెడ్డి పెదనాయన గారింట్లో తను చూసింది పూస

గుచ్చినట్లు చెప్పి "ఆదెన్న నోటిచ్చింటే మామే మర్సిపోయినాడేమో, అట్లయితే మామను కర్రుదుయ్యమన్లేదే వాల్లు. ఆదెన్ననే దుయ్యమన్రే" అని సందేహం వెళ్ళబుచ్చాడు.

"ఛూ! మీ మామకేం కర్మరా కర్రుదుసేకి. మీ మామను కర్రుదుయ్యమని సెప్పే ధైర్నం యెవురుకుంది? నూర్రూపాలకని మీ మామ అంతమంది ముందర అపద్దం సెప్తాడా? అది గాడంటే సాకలోడు, సిన్నోల్ల కెప్పుడూ సిన్న బుద్దులే. నూర్రూపాయలు మిగుల్తాయికదాని అపద్దం సెప్పింటాడు. అందుకే వాన్ని కర్రుదుయ్యమనిందేది. ఇంకెప్పుడూ అట్లడగద్దు" అని శివును మందలించింది రంగమ్మ.

"రెడ్డెమ్మా ఆదెన్న మద్దాన్నంకాడ వొచ్చినప్డు రెడ్డి బీరవొసార్లో కూకోనుండె నాను గాట్లో కసు వూడుత్తాంటి, ఆదెన్న నూర్రూపాయ్లు కాయితం రెడ్డికిచ్చ. నాను సూత్తిగదా!" అని తను మధ్యాహ్నం చూసిన విషయం చెప్పాడు కర్రోడు.

రంగమ్మకొక్క క్షణం యేమనాలో తెలియలేదు. "కర్రె నాకొడకా యాడ సూత్తాపన్జేత్తాంటివో యేందో. వూరికే సూసినానన్జెప్తావా?" అంది కోపంగా.

"నిజ్జంగ రెడ్డెమ్మా. నా కండ్లతో సూసినా. ఆదెన్న నోటిత్తానే మడిసి పక్క జోబిలో పెట్టుకోని యెంచుతాండే నోట్లల్లోటివి పది రూపాయల కాయితాలు యెంచిచ్చె" అన్నాడు నిశ్చయంగా. రంగమ్మ ఆలోచిస్తూ నుంచుండిపోయింది. 'మరిసిపొయ్‌నాడేమో నోటు తీసుకో నుండేది. పక్క జోబిలో పెట్టుకోని సూసుకో నుండడు. యిప్పుడేంజేసేది. యింత జరిగినాక ఇప్పుడు మరిసిపొయ్‌నానంటే వూర్లో వాల్లు యేందంటే అదనుకుంటారు. కర్రోడు, సివు యెవరికన్న సెప్తే మానం పోతాది' రంగమ్మకు భయంవేసింది.

"రేయ్ కర్రోడా, ఎవుర్తోనూ అనొద్దు. సూసింది సూసినట్లు మర్సిపో. యెవుర్దెగ్గరన్న అన్నావంటె సూడు, మీ రెడ్డికి సెప్పి సింతబరిక లిరిగేదాంకా కొట్టిస్తా" అని బెదిరించింది. వాడు చెప్పనన్నట్లు తల అడ్డం తిప్పాడు. అక్కడికీ భయం తీరక "యెవురికీ సెప్పొద్దు. దసె పండక్కు మీ రెడ్డికి సెప్పి కొత్తంగీ, కొత్త నిక్కర పట్టిత్తాలే" అని ఆశ చూపించి శివును పిలుచుకుని యింట్లో కెళ్ళింది. శివుకు పెట్టె తీసి పావలా రూక తీసిచ్చి "అంగిడింటికిపొయ్ పొప్పరమింట్లు కొనుక్కో సివా! యిక్కడ సూడు. కర్రోడు సెప్పింది ఎవురికీ సెప్పకూడదు. వూర్లో యెవురికన్న తెలిత్తే మీ మామకు సెడ్డపేరు. నోటిప్పిచ్చుకోందేది మరిసిపోయుంటాడు. బల్లో పిల్లోల్లక్కాడ యెవురుకీ సెప్పకూడదు. దేవున్తోడు యెవురికీ సెప్పనను" అని శివును బుజ్జగించి ప్రమాణం చేయమంది రంగమ్మ. శివు ఒక్క క్షణం తటపటాయించి కుడి చేయి తలమీదుంచుకుని "దేవున్తోడు. ఎవురికీ సెప్పను" అన్నాడు. "దేవున్తోడు పెట్టుకున్నావు సూడు. యెవుర్తోనన్న సెప్తే కండ్లు పోతాయి గుడ్డిరామునికి పొయ్‌నట్లు" అని బెదిరించింది. శివు చెప్పనన్నట్లు తలూపాడు. రంగమ్మకు తలమీది బరువు దించుకున్నట్లయింది.

✡

శివు రాములవారి గుడి దగ్గరికొచ్చే సరికీ వూర్లో జనమంతా అక్కడే గుమిగూడి వున్నారు. చుట్టుపట్ల యింటి అరుగుల మీద మిద్దెలమీద చాలామంది నుంచు నున్నారు. గుడి అరుగుల మీద వూరి పెద్దలూ, రంగారెడ్డి కూర్చుని వున్నారు. ఆదెన్న వాళ్ళకు దగ్గర్లోనే నేలమీద కూర్చుని వున్నాడు. శివు ముందు నుంచి జనంలోగుండా కాక గుడి వెనుక వైపున్న "వేపమానుకట్ట" చుట్టుకుని వచ్చి నెమ్మదిగా పెదనాయన పక్కన చేరి స్తంభం చాటున కూర్చున్నాడు. కొలిమి మానుకింద మోదీను కర్రు కాగబెడుతున్నాడు. చుట్టూ వున్న జనం రకరకాలుగా మాట్లాడు కుంటున్నారు. ఆదెన్నను సమర్థించేవాళ్ళు నెమ్మదిగా, వూరి పెద్దలకు వినిపిస్తుం దేమోనని భయం, భయంగా మాట్లాడుకుంటున్నారు. రంగారెడ్డిని సమర్థించే వాళ్ళు కావాలనే పెద్దలకు వినిపించేట్లుగా గట్టిగా మాట్లాడుకుంటున్నారు. ఆ ప్రదేశమంతా జనంతో క్రిక్కిరిసి గుసగుసలతో గందరగోళంగా, సందడిగా వుంది.

అంతలో –

గట్టిగా యేడుస్తూ అరుచుకుంటూ, జనాన్ని తోసుకుంటూ పెద్దలు కూర్చున్న చోటికి పరిగెత్తుకుంటూ వచ్చింది ఆదెన్న భార్య చాకలి పెద్దక్క. ఆమె చంకలోని నాలుగేళ్ళ కుర్రవాడు గుక్క తిప్పుకోకుండా యేడుస్తున్నాడు. వాడు నల్లగా, బలహీనంగా, ఎప్పుడూ చాకిరేవులోనే వుండటంవల్ల ఎర్రబడిన చింపిరి జుట్టుతో కారుతున్న ముక్కుతో అసహ్యంగా వున్నాడు. ఆమె నేరుగా చాకిరేవునుంచి చేస్తున్న పని మధ్యలో ఆపి వచ్చినట్లుంది. ఎగకట్టిన చీరంతా తడిసిపోయింది. జుట్టంతా రేగిపోయింది. చాలాదూరం పరిగెత్తుకుంటూ రావడంవల్ల అలసి పోయి వుంది. ఉదయం నుండీ అన్నం లేకపోయినా పనిచేయడం వల్ల నీరసించి వుంది.

పెద్దక్క ఏడుస్తున్న కుర్రవాడ్ని ఆదెన్న పక్కనే కూలేసి, తనూ కూలబడి గుండెలు బాదుకుంటూ యేడ్వడం మొదలెట్టింది. మధ్యమధ్యలో కర్రు దుయ్యడానికి ఒప్పుకున్నందుకు ఆదెన్నను తిట్టింది. "పిల్లల గతియేం కాన"ని నిలదీసింది. తప్పుకాసి వొదిలి పెట్టమని పెద్దల్ని వేడుకుంది. ఎలాగో కష్టపడి నూర్రూపాయలూ తీరుస్తానంది. ఆదెన్న దృఢంగా, రాయిలా కూర్చున్నాడు. పెద్దక్కను ఓదార్చడానిక్కూడా ప్రయత్నించలేదు. పెద్దలు కూడా యేమీ మాట్లాడలేదు. జనం కళ్ళప్పగించి చూస్తున్నారు. శివు స్తంభం చాటునుంచి భయం, భయంగా చూస్తున్నాడు.

పెద్దక్క యేడుస్తూనే గండం కాయమని దేవుళ్ళనందర్నీ పేరు పేరునా వేడుకుంది. సుంకులమ్మకు కోడిపెట్ట నిస్తానంది. దుర్గమ్మ జాతర కొస్తానంది. గంగమ్మకు చీర చదివి స్తానంది. పీర్ల పండగనాడు లాల్‌సామికి వెండి గొడుగు చదివిస్తానంది. కసాపురం ఆంజనే యునికి ఆకుపూజ చేయిస్తానంది. తిరుపతి కొండకొస్తానంది. పెద్దక్క హృదయవిదారకంగా ఏడుస్తూనే వుంది. జనం ఆత్రంగా, భయంగా, నిర్లక్ష్యంగా, నిర్లిప్తంగా, నిస్సహాయంగా, జాలిగా, సానుభూతితో చూస్తున్నారు. శివు బిక్కుబిక్కుమని చూస్తున్నాడు. ఆదెన్న మాత్రం

నిశ్చలంగా, దృఢంగా కూర్చున్నాడు తలంచుకుని. మోదీను కాగబెడుతున్న కర్రు తీసి చూశాడు. అప్పుడప్పుడే ఎర్రబారుతూంది.

“ఆదిగా, కానీరా” అన్నాడు కుంటి పుల్లయ్య తాత.

ఆదెన్న నెమ్మదిగా లేచి వూరబావివైపు కదిలాడు. కొందరు పిల్లలూ, పెద్దలూ వెంట కదిలారు. శివుకు వెళ్ళాలనిపించినా స్తంభానికి అతుక్కుపోయి కదల్లేదు. ఆదెన్న వూరబావిలో కట్టుబట్టల్తో మునిగి వచ్చాడు. వస్తూ ఆంజనేయుని గుడిచుట్టూ ప్రదక్షిణం చేసి నమస్కరించాడు. ఆదెన్న రాముల వారి గుడి దగ్గరి కొచ్చేసరికి, ఆదెన్న బావమరిది మారెన్న గుడిముందు కొంతభాగం కసువూడ్చి, నీళ్ళు చల్లి ముగ్గుతో చదరం గీసి, పసుపు కుంకుమ చల్లి చదరం నాలుగు మూలలా తాంబూలం వుంచి, టెంకాయ సిద్ధంచేసి వుంచాడు. ఆదెన్న గుడిచుట్టూ ప్రదక్షిణం చేసి, టెంకాయ కొట్టి నమస్కరించి వచ్చి గుడివైపు ముఖంచేసి చదరం మీద కూర్చున్నాడు. ఎవరో వచ్చి పెద్దక్కను పక్కకు తీసికెళ్ళారు. మోదీను కర్రు బయటికి తీశాడు. బాగా కాలిన కర్రు ఎర్రగా మెరుస్తూంది. కుంటి పుల్లయ్య తాత సైగచేస్తూనే నాగన్నగారి కొండారెడ్డి లేచివెళ్ళి కర్రు తీసుకొచ్చి ఆదెన్న ముందు నుంచున్నాడు పై చివర దృఢంగా పట్టుకుని. జనం రెప్ప వాల్చకుండా ఆత్రంగా చూస్తున్నారు. శివు గుండె అరచేతిలో పట్టుకుని చూస్తున్నాడు గుడ్లప్పగించి. పెద్దక్క ఏడుపు సన్నగా వినిపిస్తూంది.

ఆదెన్న “సివా, సెంకరా, రామా” అని గట్టిగా అరుస్తూ రెండు చేతుల్తో కర్రు పట్టుకుని కిందకు లాగాడు. ఒక్కసారిగా మాంసం కాలిన వాసన గుప్పుమంది. పెద్దక్క కెవ్వుమని అరిచింది. ఊపిరి బిగపట్టి చూస్తున్న జనంలో చలనం కలిగింది. ఆదెన్న రెండు చేతులూ ముడుచుకు పోయాయి. కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. మనిషి సన్నగా వణుకుతున్నాడు. బాధగా తలొంచుకునేసరికి కళ్ళనీళ్ళు టపటపరాలాయి.

శివు భయంతో గడ్డకట్టుకుపోయాడు. వూపిరి తీసుకోడం మరచిపోయాడు. గుండె వేగంగా కొట్టుకుంటూంది. జనం గందరగోళంగా మాట్లాడుకుంటున్నా వినిపించటంలేదు. అసలేం జరుగుతోందో కూడా తెలియలేదు చాలా సేపటివరకూ. శివులో చలనం కలిగి పరిసరాల్ని గుర్తించేసరికి కుంటి పుల్లయ్య తాత, శంకరరెడ్డి పెదనాయన, మామ అంగడి చెన్నప్పను పిలిపించి అయిదు నూర్లకు పత్రం రాయిస్తున్నాడు.

ఆ రోజు పంచాయితీలో ఆదెన్న మాత్రమే యెందుకు కర్రుదూసాడో, పెద్దమనుషులు మామనెందుకు కర్రుదుయ్యమని చెప్పలేదో, నిజం చెప్పినా ఆదెన్న చేతులెందుకు కాలాయో శివుకు అర్థమవలేదు. అత్తయ్య ప్రమాణం చేయించుకుని యెవరికీ చెప్పొద్దన్న విషయం అందరికీ వినిపించేలా గట్టిగా అరిచి చెప్పా లనిపించింది. కానీ నోరు పెగల్లేదు. నోటు రాయడం పూర్తవగానే ఆదెన్నను పిలిచారు. ఆదెన్న మౌనంగా పెద్దమనుషుల దగ్గరికి లేచి వెళ్ళి ఎడమచేయి ముందుకు చాచాడు. బొటనవ్రేలితో సహా మొత్తం చేయి కాలిపోయింది.

కాలిన బొటన వ్రేలికే "సిరా" పూశాడు మాడీమిద్దె కోటిరెడ్డి. శివు చూస్తూనే వున్నాడు నిస్సహాయంగా, నిర్వీణ్ణుడై. ఆదెన్న ఒణుకుతున్న చేతినెత్తి బొటనవ్రేలితో ప్రామిసరీ నోటుమీద కోటిరెడ్డి చూపించినచోట శివు చిన్నారి మనసుమీద చెరగని విధంగా ముద్ర వేశాడు.

ఆరోజు రాత్రికే శివుకు ఒళ్ళు తెలియకుండా జ్వరం వచ్చింది. నిద్రలో ఉలికిపడి లేస్తూ, కలవరిస్తూ, అరుస్తూ, ఏడుస్తూ వున్నాడు. రంగమ్మ శివుని కనిపెట్టుకుని శివు మంచంవద్దే కూర్చుంది. అర్ధరాత్రి దాటింతర్వాత కలవరింతలు మరింత ఎక్కువయ్యాయి. రంగమ్మ ఏడుస్తూ మంచం దగ్గరే కూర్చుంది. రంగారెడ్డి కూడా అక్కడే కూర్చున్నాడు రాత్రంతా. శివు ఒళ్ళు జ్వరంతో పేలిపోతూ వుంది. రాత్రంతా గట్టిగా కలవరిస్తూనే వున్నాడు. తెల్లవారుఝూమున రంగారెడ్డి వున్నపళంగా బండి సిద్ధం చేయించి, ఇంటిని కనిపెట్టుకుని వుండమని జీతగాళ్ళతో చెప్పి శివును, రంగమ్మనూ తీసుకుని శివుకు వైద్యం చేయించడానికి ఆ వూరికి ఆరేడు మైళ్ళ దూరంలో వున్న పట్నానికి బయలుదేరాడు.

✡

# విత్తనాలు

**–పినాకపాణి**

సాయంత్రం ముఖంమీద నల్లని చీకట్లు పారాడుతున్నాయి. చెట్లమీది కాకులు భక్తిపాటలో, బానిసత్వపు పాటలోగాని సహజంగా లేనివి పాడుతున్నాయి. ఊళ్లో జనాలు నెలల తరబడి జ్వరం మంచాలు దిగని వాళ్లులాగున్నారు. ఎవరికీ పనిలేదు. మోకాళ్ల మధ్య తలపెట్టి కూర్చున్నట్లుంది ఊరు. పనుల్లేక చేతులు జివజివలాడుతున్నాయి. ఏ టీకొట్టువాడు పెట్టాడోగాని సినిమాపాటలు రంజుమీదున్నాయి. అవి జనాలకు వుత్సాహాన్నివ్వడం లేదు, మత్తునూ ఇవ్వడంలేదు.

టైం ఆరున్నరవుతుండగా గుళ్లో జాగంటలు మోగడం మొదలయింది. అయిదు నిమిషాల పాటు ఊరు, ఊరునానుకొని శతాబ్దాలుగా పడున్న కొండలు ఆ శబ్దాన్ని ప్రతిధ్వనించాయి. ఊళ్లో కనీసం యింటికొకరైనా నీరసంవోడే ముఖాలతో గుళ్లో ఉండి వుంటారు. కానీ, వొక్కరికీ మనసు దేవునిమీద లేదు. అది ఆకలి కడుపుల్లో చిక్కుకొనిపోయి వుంటుంది.

బసప్పకు గుడితో పనిలేదు. గుడితోనే కాదు, అసలు ఏ పనీలేదు. కానీ మనసు అదేపనిగా బాధపడ్తుంది. కొండలకు వెనకవైపున బసప్ప ముత్తాత సంపాదించిన మూడెకరాల పొలముంది. ఇంటి వసారాలో గుంజకు కట్టేసిన రెండు ఎద్దులున్నాయి. సొంత భూమిలో సొంతంగా వ్యవసాయం చేసుకోవడానికి సొంత ఎద్దులు ఉండాలనేది బసప్ప యింటి సాంప్రదాయం.

ఇప్పుడు పొలంలో పంటలేదు. ఎద్దులకు మేతలేదు. తనిప్పుడు రైతునన్న అభిప్రాయం కూడా లేదు. ఎప్పుడైనా ఆ విషయం గుర్తొస్తే భయమేస్తుంది. తను రైతైతే ఎప్పుడో చచ్చి పోయేవాడే! కాకుంటే ఇప్పటిదాకా బసప్పగానే బతుకుతున్నాడు.

అయినా పొలం వెళ్లొస్తుంటాడు. వ్యవసాయం చేయడానికి కాదు. వ్యథలు పంచుకో వడానికి. భూమికి ఎప్పుడు కష్టాలే! ఆ భూమ్మీద తనకెప్పుడూ కష్టనష్టాలే! ముప్పై అయి దేళ్లు నిండని బసప్ప యాభైల్లో ఉన్నట్లుంటాడు. నెత్తి నెరవలేదు కానీ ఆలోచనలే నెరిసిపోయాయి– వెలిసిపోయాయి. సూర్యుడట్లా పడమటి కొండలవైపు ముఖం చూపగానే పొలానికని బయల్దేరాడు. గెనిమ్మీద నిలబడి పొలంలోని రేణువు రేణువును మౌనంగా

పలకరించాడు. వొంగి కుడిచేత్తో పిడికెడు మట్టి తీసుకొని పిడికిలి బిగించి తెరిచాడు. మట్టి ముద్దకాకుండా విరిగిపోయింది. వారం కిందటే విత్తనాలు వేయాల్సింది. ఇప్పటికీ కుదర్లేదు. అసలు ఈసారి వానలే ఆలస్యమై కార్తె మీరిపోయింది. మళ్లా ఇప్పట్లో వానలు కురిసేటట్లులేదు. ఎండ పళపళ కాస్తుంది. ఇట్లే ఇంకో నాలుగు రోజులుపోతే ఈ యేడు కూడా బీడు పెట్టాల్సివస్తుంది. బసప్ప మనసు వికలమైంది. వొళ్లంతా నీరసం కమ్మింది. కాసేపయ్యాక లేచి పొలంచుట్టూ నాలుగు గట్లెంట కర్ర పొడుచుకుంటూ తిరిగాడు. బాధను భుజానేసుకొని ఇంటిదారి పట్టాడు.

అతను రైతుననుకోడానికి బెదిరే భూమిబిడ్డ.

అది ఊళ్లోని రెండు ప్రధాన దారులు కలిసే చోటు. అంతేగాక చెరువుకట్టమీది నుంచి వచ్చే దారి కూడా కలుస్తుంది. అక్కడ – ఎండపొడ పడకుండా గుబురుగా అలుముకున్న యాపచెట్టు– దానికింద చుట్టూ మూడు మెట్లతో నడుముల ఎత్తున విశాలమైన గౌరమ్మరుగు. సాయంత్రం దాటి రాత్రయింది. అరుగుమీద పదిహేనుమంది దాకా కూర్చోని వుంటారు. ఎవరూ మాట్లాడటం లేదు. మాట్లాడినా ప్చ్... ఊ.. అనే నీరస పదాలే!

బసప్ప దారెంటపోతూ వాళ్లవైపు చూచాడేగాని ఎవరినీ నోరెత్తి పలకరించలేదు. అరుగు దాటింతర్వాత రోడ్డుకు ఎడమపక్క పచ్చరంగు ప్రజా టెలిఫోను కేంద్రం కనిపించింది. రోజూ చూచేదే అయినా ఆగి నిమిషంపాటు దానికేసి చూచాడు.

ఊర్లో దీన్ని పెట్టినాల్నుండి ఏ వొక్కడు మాట్లాడంగ చూడలేదు. తనేగాదు ఎవరూ చూడలేదేమో! మొదట్లో మధ్యంతరంగా టౌన్ చదువు మానేసిన కుమార్ కనిపెట్టుకోని వుండేవాడు. ఇప్పుడు వాడూ ఉండటంలేదు. వేసిన తలుపులు వేసినట్లే, తెరిచిన పాపాన పోయినోడు లేడు.. అనుకుంటూ కదిలాడు.

యింటికెళ్లేసరికి వాకిలికి తాళం తగిలించి వుంది. ఉసూరుమంటూ వసారాలోని మంచం వాల్చుకొని కూలబడ్డాడు. ఆ పక్కన కట్టేసిన ఎద్దులు బసప్పకేసి ఆబగా చూచాయి. అతను ధైర్యంగా వాటివైపు చూడలేకపోయాడు. అవి ఆకలి డొక్కలమీద తోకతో విదిలించుకున్నాయి. తల విసురుతూ టపటపా చెవులుకొట్టాయి. భుజమ్మీద తువ్వాలు చుట్టచుట్టి పడుకున్నాడు. ఆకాశంకేసి తదేకంగా చూస్తుండిపోయాడు. అమావాస్య దగ్గర కావడంతో ఆకాశం చిక్కని చీకట్లతో పేరుకుపోయింది. ఆ చీకట్లు పైనుండి తనమీదే పడ్తున్నట్లనిపించింది. గతంలోంచి మనసును వొరుసుకుంటూ స్మృతులు వలల్లా వచ్చిపడ్డాయి. అవి అలల్లా వచ్చేవేకాదు– కన్నీటి ఊటలో ఏండ్ల తరబడి నాని ఉబ్బినవి.

తొమ్మిదో ఏటనేమో ఏరువాక రోజు తండ్రి మొదటిసారిగా తనచేత మేడి పట్టించాడు. తనారోజు చిన్న పెండ్లికొడుకులా అలంకరించుకున్నాడు. కాళ్లకడ్డం పడే కావిపంచె. సిల్కు బుసుకోటు, పైన ఎర్రంచు టవలు, చేతిలో ములుగర్ర పట్టుకొని ఎద్దుల ముందు నిలబడితే

తల్లి హారతి తీసింది. తర్వాత ప్రేమగా ఎత్తుకొని ముద్దుపెట్టుకుంది. గుండెల కానించుకొని తలకట్టు సవరించింది. ఆ రోజు దున్నింది మురిపెంగా పదహారు చాళ్లే! అయితేనేం, ఆ గుర్తులు ఎన్నేళ్లయినా అట్లే నిల్చున్నాయి. అప్పటినుండి మట్టిలో తిరుగుతూ, మట్టివాసనలో తేలుతూ దర్జానుభవించడం మొదలయింది.

తెల్లారీ తెల్లారకముందే తల్లి పక్కలోనుండి లేచి వద్దన్నా వినకుండా తండ్రి వెంట పొలానికి బయల్దేరేవాడు. ఎప్పుడైనా మధ్యలో తనకు కాళ్లు నొప్పులు పుడుతున్నాయని అంటే, “అదిగో, దగ్గరికి వచ్చినం..” అని మిలమిల్లాడే పంటచేను చూపించేవాడు. అప్పుడు ‘అదిగో అమ్మ...’ అని చూపించినట్లుండేది తనకు.

ఉన్నది మూడెకరాలే అయినా నాయినకు తను రైతునన్న దర్పం వుండేది. వ్యవసాయంలో కష్టనష్టాలకు, కుడిఎడమలకు తల్లి బాధగా ఏమన్నాకూడ, ‘రైతంటే ఏమనుకున్నావ్? భూమమ్మ అప్పుడప్పుడు తన బిడ్డల్తోని ఆడుకుంటుందంతే!..’ అనేవాడు.

వాకిలి తెరిచిన శబ్దానికి ధ్యాసలోకి వచ్చి, గుడినుండా రావడం..? అనడిగాడు బసప్ప. కొడుకుచేయి పట్టుకొని లోపలికి నడిపించుకపోతూ, ఊఁ.. అంది అనంతలక్ష్మి.

ఏం గుడో! పైకే అని మంచంలో పక్కకు వొత్తిగిల పడుకున్నాడు.

...ఒకప్పుడు దేవుడు మనసులో వుండేవాడు. కానీ ఇప్పుడు నెత్తిమీదెక్కి కూర్చున్నాడు. చిన్నప్పుడు తండ్రి సాయంకాలాల్లో వొళ్లో కూర్చోపెట్టుకొని పలికించిన భజన పాటలు ఇప్పుడు వెగటుగా వినిపిస్తున్నాయి. దేవుడు బజార్లో పడ్డాక మనుషులు ఏట్లో పడాల్సొచ్చింది. సుఖంలేదు పాడులేదు. బతుకులు బుగ్గిపాలయిపోతున్నాయి. అక్కడ రామాలయంలోనేమో రోజూ జాగంటలు.. హారతిపళ్లాలు.. వాటిలో పదిపైసలు కాదుగదా, కన్నీటి బొట్లు కూడా పడవు. జనాల కంటితడి పొలాల్లో ఎప్పుడో యింకిపోయింది.

“...పలకవ్! యింత రొట్టె తిందువుగాని రా!” అనంతలక్ష్మి రెండోసారి కూడా పిలవడంతో లేవక తప్పలేదు. తలకిందున్న తువ్వాలు విదిలించి భుజానేసుకొని లోనికెళ్లాడు. భార్య రెండు పళ్లాల్లో రెండు రొట్టెలు యింత పచ్చడి వేసి పెట్టింది. గుడ్డిదీపం వెల్తుర్లో స్టీలు పళ్లాలు మెరుస్తున్నాయి. చెక్క పీటమీద కూర్చొని రొట్టె తుంచి నోట్లో పెట్టుకోబోయాడు. బైట ఎద్దులు అసహనంగా కచబిచ తొక్కులాడుకుంటూ, కొమ్ములు గోడకు కొడ్తున్న శబ్దం వినొచ్చింది. బసప్ప తిండి తినలేకపోయాడు. మోకాటిమీద అట్లే చేయి సాచి యింటి కప్పువైపు చూస్తూ కూర్చున్నాడు. చిన్న రొట్టెముక్క కొడుకు నోట్లో పెడ్తూ... పొద్దుననంగ ఎంకటేసులునన్నా యింత చొప్పో గడ్డో అడగమంటి” ఆమె యింకా పొడిగించలేకపోయింది. భర్త సమాధానంగా మాట్లాడ్తాడనుకుంది. కాని అతను నిశ్శబ్దంగా ఉన్నాడు. రెండు నిమిషాల తర్వాత.. పాపిష్టికాలమొచ్చింది గాని యింకే మన్నానా? గొడ్లకు మేతరాని పంటలు వచ్చి నెత్తినపడ్డాయి. అనంతలక్ష్మి మనసులోని గోడు వెళ్లబోసుకుంది.

బసప్ప ఏదో మాట్లాడబోయాడు. గొంతు పెగల్లేదేమో మరి ఊరుకున్నాడు. తటాలున లేచివచ్చి మంచంలో పడుకున్నాడు.

ఇంకా తెల్లారకముందే భార్య వాకిట్లో ఊడుస్తుంటే మెలకువొచ్చింది. అనంతలక్ష్మి గబగబా వంట అయిందనిపించి యింత తినింది. సత్తు కారియర్‌లో మధ్యాన్నానికని పెట్టుకొని పనికి బయల్దేరింది. నిద్ర మంచంమీద నుండి లేస్తూనే కొడుకు ఏడుపు లంకించుకున్నాడు. నాయిన కాడికిపోయ్యా! బేరీత వస్తా... అని బుజ్జగించింది.

ఆ మాటయితే అనిందిగాని తను పొద్దుగూకేదాకా రాను కాదని ఆమెకు తెలుసు. బహుశా పిల్లాడికీ తెలుసేమో! వెంటబడి ఏడుస్తున్నాడు.

ఊరికి అర్ధమైలు దూరంలో ఒక అగ్గిపెట్టెల కంపెనీ వుంది. దాన్ని పెట్టి సంవత్సరం దాటింది. పుల్లలను సర్దడానికి దాంట్లో ఆడవాళ్లను మాత్రమే తీసుకుంటారు. నాలుగు నెలలనుండి బైటపనిలేక వాళ్లిచ్చేది కొంచెమేనైనా చేరిపోయింది అనంతలక్ష్మి.

అనంతలక్ష్మి వెళ్లిపోయాక పావుగంటదాకా పిల్లవాడు కిందపడి దొర్లిదొర్లి ఏడ్చిండు. బసప్ప వాణ్ణి సముదాయించడానికి ప్రయత్నించలేదు. కాకుంటే మధ్య మధ్య “ఊరుకోరా! అమ్మ వొస్తదిలే... బువ్వదిని ఆడుకోపో...” అంటున్నాడు. తండ్రి మాటలకు కాకున్నా ఏడ్చి ఏడ్చి అలత వచ్చి మానుకున్నాడు. అయినా ఎక్కిళ్లతో గుండెలు ఎగిసిపడ్తున్నాయి. పక్కింట్లో ఉండే వాడియాడు పిల్లలు గోడకింద రాలిన ఉప్పు మట్టిని కుప్పలు చేసుకుంటూ ఆడుకుంటున్నారు. ఎక్కిళ్లు పెడ్తూనే నిక్కరు పైకి లాక్కొని ఆటల్లోకెళ్లాడు.

బసప్ప పొద్దు బాగా పైకెక్కింతర్వాత మొఖం కడిగి తిండి తిన్నాడు. కొడుకును పిలిచి యింత తినిపించాడు. తినంగానే వాడు మళ్లా ఆటల్లోకెళ్లాడు. ఇప్పుడు వాడికి అమ్మ గుర్తుకు రావడంలేదు. బసప్ప వాకిలి చిలుకేసి నాగిసెట్టి యింటికి పెద్దబజారుగుండా బయల్దేరాడు. పనిలేక చీట్లపేకలాడేవాళ్లు. బీడీలు, చుట్టలు కాల్చేవాళ్లంతా గుంపులుగా గౌరమ్మరుగుమీద కనిపించారు.

వానలు పడగానే దున్నుకోవడం, ఇత్తనాలేసుకోవడంలో క్షణం తీరికలేకుండా వుండేవాళ్లంతా అక్కడే వున్నారు. ఇంతకుముందు సేద్యం పనుల్లో పొద్దంతా కనిపించని ఆడోళ్లు కూడా బజార్లలో ముచ్చట్లు పెట్టుకోని కూర్చున్నారు.

“ఏం సిన్నాయినా! యాడికిపోతున్నావ్?” అని అరుగుమీదినుండే మల్లన్న పలకరించాడు.

“నీకు తెలీకుండా నేనేడికి పోతనోయ్?...” అన్నాడు కుశాలగా బసప్ప

“అదీ నిజమే! ఎవరు మాత్రం ఏ చేస్తారు, యిత్తనాలు రాన్దే?”

"యింకా రాలేదా?"... బసప్ప గొంతు జీరగా పలికింది. అతనికీ వచ్చి వుంటాయని గట్టి నమ్మకమేం లేదు. మొన్న పొద్దున్నే సెట్టి గుడికిపోతూ, అడిగినోళ్లందరికి రాలేదని చెప్తుంటే తనూ విన్నాడు.

ఇత్తనాలు వచ్చివుంటే ఊరు, పొలాలు ఇట్లా నిద్రపోయేవేనా? అనుకున్నాడు.

"నీ ఆత్రంగాని, ఈ అదును ఉన్నంతదాకా ఆ పైయ్యోడు పంపించడు. మొత్తంగా దున్నిన భూమి బండగట్టింతర్వాత వస్తే వస్తయ్. అయినా ఇట్లాంటి ఎవసాయంజేసి ఇంకా బతుకుదామనుకోవడం భ్రెమగాని యింకేమన్నానా? కిందటేడు పంటలో ముత్యాల్లాంటి యిత్తనాలు తీసిపెట్టుకొని అదునుమీద చల్లుకుంటేనే ఆడికాడికి బతుకులు ఎల్లమారుతుండె..."

తనకు తెలిసిందే అయినా 'అంతేనంటవా' అన్నాడు బసప్ప.

"అంతేగాక యింకెంతనుకున్నావ్? దేశంగాని దేశం నుండి రావాల్నా? వాడు ఏ యిత్త నాలు పంపిస్తాడో మనకు తెలీకపాయె! తీరా ఆ పంట మన భూముల్లో నిలుస్తదో లేదో!"

"...ప్చ్! సేద్యం జేసేటోనికి తనేం పండించేది తనకే తెలీనికాలం.. పరాయి దేశాలకు ఎత్తిపంపించాలనే పోటీకొద్ది నానాక పంటలన్నీ వచ్చినయ్. మనుషులు గొద్లు డొక్కలెంచి సచ్చేరోజులు... ఈడి పంట ఈదున్న కుదుపులకు సాల్దంలేదు గాని యింకేడికి పంపిస్తారు? ఆకలిమీద యాపారం మొదలయింది..." కదలబోయాడు.

"కొద్దిగ అగ్గిపెట్టియ్యి సిన్నాయినా!" నోట్లో బీడి పెట్టుకుంటూ అడిగాడు మల్లప్ప. అంగీ జేబు తడుముకొని తీసిచ్చాడు. బర్రన పుల్లగీసి అంటించుకొని గుప్పున పొగలాగాడు. "యాడికోపోదువ్ గాని వచ్చి కూర్చోరాదు..." అన్నాడు. "ఏం కూర్చోవడమో లేవోయ్! కాలు నిలుస్తలేదు. యింతకు యిత్తనాలు రావంటవా?" మల్లన్న పక్కనే కూర్చున్నాడు. ఇప్పటికైతే రాలేదట. యింకెప్పుడు వచ్చేది సెట్టికే తెలియాల... మల్లన్న చెప్పాడు.

బసప్ప స్థిమితంగా కూర్చోలేకపోయాడు. కడుపులో మెలిపెడ్తున్నట్లుంది. అరుగుదిగి కిందికొచ్చాడు. యింక సెట్టికాడికి పోవడం దేనికీ అనుకున్నాడు. మళ్లీ నాలుగడుగులే కదా! ఎప్పుడొచ్చేదైనా ఆయన్నే అడిగితే సరిపోతది అనుకోని ముందుకు నడిచాడు.

దారెంట మల్లన్న మాటలు చెవిలో వినిపిస్తున్నట్లే వుంది. యింక ఎవసాయం జేయ లేను. మరి బతకడమెట్లా? ఈ అప్పులనేంజేయాల?.. ఎక్కువగా ఊహించలేకపోయాడు.

ఆ రోజుల్లో పండిన పంటలో తాలు లేకుండ గట్టి గింజలు యిత్తనాలకని ఎత్తి పెట్టుకొనే వాళ్లం. అదునుమీద దున్ని చల్లుకుంటుంటిమి. యిత్తనాలను పొలానికి తీసకపోయేటప్పుడు అనంతలక్ష్మి పొరపాటున కూడా పాతగంపలో వాటిని పోయనిచ్చేది గాదు. ముందురోజే మేదరిండ్లకుపోయి కొత్త గంప కొనుక్కొచ్చేది. దానికి ఎర్రమట్టితో సున్నంతో పట్టీలు దిద్దేది.

కుంకంబొట్లు పెట్టి గంపను, యిత్తనాలను దేవుని మాదిరి పూజించేది. ఇప్పుడవన్నీ తారు మారయ్యాయి.

అసలు ఇత్తనాలకు రైతు యింకోనికాడికి పోవడం నామోషీగా తండ్రి మాట్లాడేవాడు. తన తరం వచ్చేసరికి కొత్త కొత్త రకాల పేరుతో అంగట్లో సంచులు తెచ్చుకోవడం మొదల యింది. కానీ ఇప్పుడు అమెరికానుండో యింకేడినుండో తెచ్చుకోవాల్సి వచ్చింది. పండించిం దంత తిన్నాక, అమ్ముకొనకనే గాని మళ్లీ పంట వేసుకోనీక లేకపాయె... అనుకుంటూ నాగిసెట్టి యింటి గేటు దాటి లోపలికి అడుగేశాడు. వరండాలో స్థంభానికి కట్టేసిన తెల్లకుక్క గయ్యి... మనడం మొదలుపెట్టింది. ధయ్.. అని దానిని అదిలించాడు. కుక్క మొరుగుకు సెట్టి బైటికొచ్చాడు మడిమీద. అప్పుడే భోజనం చేసినట్లుంది. ముక్కు మీది నుండి నుదురు దాక సింధూరం నామం పెట్టుకున్నాడు. బొజ్జ నిమురుకుంటూ బసప్పను పలకరించాడు.

“ఏం బసప్ప! డబ్బులు తెచ్చినావేంది?”

సెట్టిని పలకరించబోతే చిక్కువచ్చిపడ్డట్లేనని బసప్పకు తెలుసు. ఇంకో సమయంలోనైతే ఎక్కడ బాకీ అడుగుతాడోనని తప్పించుకోవడానికి కూడా సిద్ధమే! ఇప్పుడట్లాకాదు. అయినా రోట్లో తలకాయ పెట్టినాక పోటుకు బెదురుతే అయితదా? ఇప్పుడు కాకుంటే రేప్పొద్దు నయినా తీర్చాల్సిందే! అంతదాకా సెట్టి గడిగడికి పీడిస్తూనే వుంటాడు.

“యాడి డబ్బులు సామీ! నీకు తెలీకుండ వస్తున్నాయా? మా లెక్క పత్త మొత్తం నీకెరికేగదా? నీకు దాపున పైసా వస్తున్నాదా? ఒక గింజ అవతలకు పోతుందా? ఇంతకు ముందు మా ఎవసాయంలో ఎరువులు, పురుగుమందుల ఖర్చు, రాబడులే నీకు తెలుస్తుండె, ఇప్పుడల్లా కాదుగదా? యిత్తనాల కాడినుండి నీ కాతాలో లెక్క తేలకుండ మేమేం జేస్తున్నం చెప్పు..? ఆ యిత్తనాలుగూడ అంతకు నాలుగంతల ధరపెట్టి నీలాంటి డీలర్లకాడ కొనాల్సివచ్చే!.. అవిగూడ యింకా రాలేదు సామీ!” అన్నాడు.

“యాడొచ్చినయ్! ఇత్తనాలంటే మాటలా? అబ్బో! యాడాడినుండి రావాల్నో, ఎంత పెద్దకతో నీకేం తెలుస్తది...” అంటూ సెట్టి ఏవేవో చెప్పుకవచ్చాడు.

రైతులకు ఇత్తనాలు సప్లై చేయడానికి ప్రభుత్వం పెట్టిన తనలాంటి డీలర్లకు ఎన్నెన్ని కష్టనష్టాలో ఏకరువుపెట్టాడు.

బసప్ప విన్నాడేగాని, బొత్తిగా అర్థంకాలేదు.

“అయితే ఎన్ని రోజులకు వస్తయ్సామీ?” అడిగాడు.

కొస పెదాలతో కొద్దిగా నవ్వి చేతులు పైకి చూపాడు. నిమిషం తర్వాత “పోయొస్త సామీ!” అని కదిలేడు బసప్ప.

'మరి బాకీ సంగతి' గుర్తు చేశాడు నాగిసెట్టి.

"నీ బాకీ తీర్చకుండా నేనేడికిపోత సామీ! నన్ను నమ్మవు..."

సెట్టికి అదే గట్టి నమ్మకమేమో ఊరుకున్నాడు.

అయిదేళ్ల పైనుండి సెట్టిదగ్గర ఏ యేటికాయేడు అప్పు అవుతూనే వస్తుంది. తీర్చింది పోంగ మిగిలిందీ, దాని వడ్డీ, మళ్లీ చేసేది కలిపి మోపెడవుతుంది. జమేసేది తక్కువ... తీసుకోవడమే ఎక్కువ. దానికితోడు రెండేళ్ల కిందట పెట్టుబడిలో సరిగ్గా సగం పంటే చేతికొచ్చింది. సెట్టి దగ్గర తీసుకొచ్చిందానికి వడ్డీమాత్రం అడ్డం లేకుండా పెరిగిపోయింది. బాకీలో పదిపైసల వంతుకూడా చెల్లుపడలేదు. వచ్చేసారి బాగా పండకపోతదా– కొంతలో కొంతయినా తీర్చవొచ్చని ధయిర్యంగానే ఉన్నాడు. కానీ ఆ యేడు భూమికి జిట్టెడు ఎత్తున పచ్చంగ కనిపించిన మూడెకరాల పంట మట్టంగ తుడిచిపెట్టకపోయింది. బసప్ప గిలగిల్లాడేడు. అనంతలక్ష్మి నేలబట్టింది. ఆ యిత్తనాలు మన నేలకు సూటు అవలేదని కొద్దీగొప్ప చదువుకున్నోళ్లంత అన్నారు. బసప్ప వొక్కన్దేగాదు– ఊళ్లో చాలామంది పొలాల్లో పంట అతకలేదు. మళ్లా దున్ని యిత్తనాలేద్దామనుకున్నాడు కానీ, ఆకాశంలో ఒక మబ్బు ముక్క కూడా కనిపించేది కాదు. వానల్లేకుండా ఏం జేస్తాడు? నెలదాటాక అప్పుడప్పుడు నేల తడిసినా యిత్తనాలకు మళ్లా సెట్టి దగ్గర అప్పుపెట్టాల. రెండేళ్ల నుండి పైసా జమలేకుండా పీక్కురావడమే! అంతకు ముందుది ఉండనేవుంది. వడ్డీలతో కలిసి పాతికవేలు దాటిందని పోయినసారి ఇత్తనాలకు పోయినప్పుడు సెట్టిలెక్క చెప్పాడు. వచ్చే సంవత్సరం అసల్లో సగమైనా జమ వేయకుంటే పొలం రాయించుకుంటానని హెచ్చరించాడు. దాంతోటి బసప్ప మళ్లీ దున్ని వేయడానికి భయపడ్డాడు. ఇత్తనమేస్తే ఏమవుతుందో? అప్పులు పెరగడమేగాని, పంట చేతికి వచ్చేదాక నమ్మకంలేదు.

పొలంమీద రాబడి లేకుంటే సెట్టి బాకీ తీర్చే నమ్మకం కూడా లేదు. ముందు బాయి వెనక చెరువు అన్నట్లుంది బసప్ప పరిస్థితి.

ఒకప్పుడు వానలు పడగానే నాగళ్లు పరిగెత్తేవి. లక్షల లాభాలు రాకున్నా ఎవసాయమంటే భయం కలిగేదికాదు. కానీ ఇప్పుడు నాగలిని ముట్టుకోవాలంటేనే భయం. డబ్బులు కండ్లజూసేదాకా భయం. మునుగుతమో తేలుతమోనని ఒకటే పీకుడు...

అప్పటినుండి ఇప్పటిదాకా రోగాలకో, కుటుంబం గడవడానికో యింకింత అప్పు పీక్కొచ్చాడు. సెట్టి రోజు రోజు సతాయిస్తునే గొణుక్కుంటూ అడిగినదాంట్లో ఎంతో కొంత ఇస్తున్నాడు. మళ్లీ ఈసారి యిత్తనాల దగ్గర్నుండి సెట్టి ఇవ్వాల్సిందే. ఇప్పుడూ నేలతల్లి మోసంచేస్తే ఆముందుటేడుకు వడ్డీ అసలు కలిపి చంపకతింటది. మూడెకరాల్నూ అరా యించుకుంటది.

రెండేళ్లపైనుండి ఇద్దరి తిండికోసం ఇద్దరూ కూలికిపోతున్నారు. సంవత్సరం పిల్లోణ్ణి వదిలేసి అనంతలక్ష్మి మొదట బాయి పనులకు, రోడ్డు పనులకు పోబట్టింది. ఆ పనులు దొరకడం కూడా కనాకష్టం. ఒక నెల్లో పదిహేను ఇరవైరోజులు కూలీ దొరికితే, తర్వాత నెల్లో అసలు పనే వుండేదికాదు. ఆర్నెల్లకిందటే అగ్గిపెట్టెల కంపెనీలో అనంతలక్ష్మికి పని దొరికింది. బసప్పకు ఎక్కడా పనిలేదు. అక్కడక్కడ ఊరక కూర్చోవడంతో ఆలోచనలు చెదపురుగుల్లా తొలిచేవి. మనిషికి పరధ్యాస పెరిగింది. ముఖమ్మీద నవ్వు ఎప్పుడో జారి పోయింది. రోగానపడ్డట్లు చిక్కి సగమయ్యాడు. ఎప్పుడు అప్పులు, వడ్డీలు భూతాల్లా కనిపి స్తుంటాయి. భూమి దైన్యంగా ఏడుస్తున్నట్లు ఉంటుంది.

చిన్నప్పటి నుండి కష్టానికి అలవాటుపడ్డ శరీరం, మనసు పనిలేక విలవిల్లాడాయి.

పదేళ్లకిందట బసప్ప దర్జాగా సేద్యం చేసుకుంటున్నప్పుడు నాగిసెట్టి చక్కిలాలు అమ్ముకొని బతికేవాడు. చిన్నగంపలో పెట్టుకొని ఊరంతా తిరిగి అమ్మేవాడు. క్రమంగా యింట్లో చేసే చక్కిలాలనే కవర్లలో ప్యాక్‌చేసి, డొక్కు సైకిల్‌మీద చుట్టుపక్కల పల్లెలకెళ్లి అమ్మేవాడు. చిన్న చిన్న అంగళ్లవాళ్లు సెట్టి దగ్గరే కొనుక్కునేవాళ్లు... అట్లట్ల పెరిగి, రైతులకు అప్పులిచ్చి ఊరునంతా చేతిలో పెట్టుకున్నాడు. అంతలో వాళ్లను వీళ్లను పట్టుకొని ఈ డీలర్ కూడా అయ్యాడు. ఇప్పుడు సొంత మేడ, భూమి, బంగారు... లక్షలమీదున్నాడు. ఆ రోజుల్లో సెట్టి చక్కిలాలు అమ్ముకోవడమేగాని గుడివైపు వెళ్లినవాడుకాదు. ఇప్పుడు ఊర్లోకెల్లా భక్తుడు... ఊర్లో అందర్నీ భక్తుల్ను చేసేవాళ్ల నాయకుడు. ముప్పొద్దులా ముఖం మీద సింధూరం నామం పెట్టుకొని తీరాల్సిందే! గుడికెళ్లి భజన చేయాల్సిందే!

ఇప్పుడు సెట్టి ఏం మాట్లాడినా, ఎవరితో మాట్లాడినా వ్యాపార లావాదేవీలే కాకుండా రాజకీయాలూ వరదలై వస్తాయి. దేశం పాడైపోయిందని గగ్గోలు పెడ్తాడు. 'బాగు చేసేదారి ఇదీ' అని తన అభిప్రాయాల్ని ముఖం మీద గుద్దినట్లు చెప్తాడు. దేశంలో కొన్ని అరాచకశక్తులు ఉన్నాయని, అవి అంతం కావాలని ఆవేశపడ్తాడు. 'ధర్మాన్ని' నిలబెట్టినప్పుడే అది మనల్ను, దేశాన్ని రక్షిస్తుందని ఉపదేశాలిస్తాడు.

ఈ ఏడు పంచాయితీ ఎన్నికల్లో సెట్టి నిలబడ్తాడని బైట పుకారు.

పొద్దు నెత్తిమీదకొచ్చింది. బసప్ప గాలిపటం మాదిరి తిరిగి ఇల్లు చేరుకున్నాడు. నలుగురు ఎక్కడ కూర్చొని వున్నా వెళ్లి అక్కడ చోటు చూసుకుంటాడు. అయితే ఎవరితోనూ పలెత్తి మాట్లాడడు. మనసు మళ్లుతూ వుంటుంది. చూపులు ఎప్పుడూ గిలగిల్లాడ్తున్నట్లే వుంటాయి. చటుక్కున అక్కడినుండి లేచి దారిపడ్తాడు. ఎందుక్కూచున్నాడో తెలియదు. ఎందుకు వెళ్లి పోతున్నాడో తెలియదు.

బైట ఎండకో, దేనికోగాని బసప్ప కళ్లు అలసటగా వున్నాయి. యింటి పక్కనే ఉన్న యాపచెట్టునీడకు కుక్కిమంచంలో కొడుకు నిద్రపోతున్నాడు. ఆడి ఆడి అలసటయిందో..

ఆకలయిందో.. మరి గుండీల్లేని అంగీలోంచి పొట్టమీది మట్టి చారికలు కనిపిస్తున్నాయి. మంచం పట్టెమీద కూర్చొని తట్టి లేపాడు. వాడు చేతులు తల్లో దూర్చి బరుక్కునాడేగాని కళ్లు తెరిచి చూడ్లేదు. బసప్పకు కడుపులో బాధగా వుంది. కానీ అది అన్నంతింటే పోయేది కాదేమో!... తినాలనుకోలేదు. కొడుకును లేపి పెట్టలేదు. ఎప్పటికో వాడే లేచాక వెళ్లి వాకిలి తెరిచాడు. గిన్నెలమీద మూతలు తీసి అన్నం కూర పళ్లెంలో వేసిచ్చాడు.

ఎండవేడి తగ్గింది. అప్పుడప్పుడు చల్లగాలి వస్తుంది. పిల్లవాడు బైటికి పోయాడు. బసప్ప చెరువుకట్టమీదుగా కొండదారి పట్టాడు. వానలకు కొండంతా పచ్చగా కళకళలాడ్తూ కనిపిస్తుంది. రాళ్లలోంచి గడ్డి చిన్న చిన్న మొక్కలు తొలుచుకొని బైటికొచ్చాయి. ఎండుబట్టిన కొమ్మలు చిగురేశాయి. దాని ముందు, చుట్టుపక్కల ఉండే పొలాలు పంటలేకుండా పేలవంగా కనిపిస్తున్నాయి. భూమిని ముక్కలు చేస్తూ ఇది నాది – ఇది నాది అనుకోడానికి వేసుకున్న గెలియలు కూడా పచ్చబడ్డాయి. బసప్ప తిన్నగావెళ్లి గట్టుమీది కూర్చున్నాడు.

ఎవరో గెనిమల్ను ఆక్రమించుకుంటూ చొచ్చుకొని లోనికి వస్తున్నట్లు.. అలా వచ్చి వచ్చి... పొలం కుంచించుకుపోయి అదృశ్యమైనట్లు కనిపించింది.

నేలపైన చేయిపెట్టి తడిమాడు. యింకా అది వేడి సెగలు కొడ్తూనే వుంది. ఆ వేడి తన ముఖంమీదికి సోకినట్లయింది. దోసిలితో పొలంలోని మట్టిని తీసుకున్నాడు. చేతులు, ఆలోచనలు వణుకుతున్నాయి. దానివైపే తలొంచి చూస్తుండిపోయాడు.

చేతుల్లోంచి మట్టి పొడిపొడిగా జారి కిందపడింది.

✡

# ఇజ్జత్

–భాస్కరభట్ల కృష్ణారావు

రంగారావు ఓ నిశ్చయానికి వచ్చాడు. వెంటనే చేతి సంచిలో రెండు షర్ట్‌లు, ఒక ధోవతి, ఒక బనియన్, ఒక టవల్ వేసుకున్నాడు. చెప్పులు తొడుక్కుంటుండగా, తల్లి విధవావిడ, ఎదురుపడి "ఎక్కడికి వెడుతున్నావురా?" అని అడిగింది. "అడిగావూ?" అని విసుక్కున్నాడు రంగారావు. తల్లి కిక్కురు మనకుండా లోపలికి వెళ్ళిపోయింది. అప్పటికే రెండు అపశకునాలు ఎదురుపడ్డాయి. వెడుతున్న పని అవుతుందో, లేదో అనే సందేహం కలిగింది అతనికి. తీరా బయల్దేరుతూ అపశకునాలను గూర్చి ఆలోచించడం మంచిది కాదనుకున్నాడు రంగారావు. చప్పున ఇంట్లోంచి బయల్దేరాడు. వాకిలి గుమ్మం దాటాడో, లేదో ఎక్కడినించో ఒక తుమ్ము వినపడింది. తిరిగి యింట్లోకి వెడదామా అని ఒక నిమిషం ఆలోచించాడు. కాని తిరిగి వెళ్ళడానికి మనస్సు ఒప్పలేదు. నిలుచున్న చోటునుంచి కదిలాడు. సికింద్రాబాద్ స్టేషన్ దారిపట్టాడు. స్టేషన్ చేరుకునేసరికి, ఇంకా రైలు రాలేదు. టిక్కెట్టు కొని ఫ్లాటుఫారం మీదికి వెళ్ళాడు. ట్రైను అరగంట లేటని తెలిసింది.

నిప్పుకుమల్లే మెదడు రాజుకుంటున్నది, పొగలకు మల్లే ఏవో ఆలోచనలు, తన పెద్ద చెల్లెలు ఛాయ పెళ్లికి రెండు నెల్లు కూడా వ్యవధి లేదు. పెళ్ళి ఖర్చులుకాక, వెయ్యిన్నూట పదహార్లు కట్నం. ముహూర్తం కూడా నిశ్చయమైంది. బహుశా వివాహానికి మూడు వేల దాకా ఖర్చుకావచ్చు. సంబంధం చాలా మంచిది. పెళ్ళికొడుకు బుద్ధిమంతుడు. బి.ఎ. ప్యాసైనాడు. తనకు మల్లే సెక్రటేరియట్‌లో గుమస్తా ఉద్యోగం చేస్తున్నాడు. నెలకి వంద రూపాయలదాకా ఆదాయం వుంటుంది. ఏ బాదరబందీ లేదు. ఆ ఆదాయంతో భార్యాభర్తలు సుఖంగా కాలం గడపవచ్చు. తనదగ్గర డబ్బులేదు. తనకి వచ్చే ఆదాయంతో భుక్తి గడవటమే కష్టసాధ్యంగా వుంది.

ఇట్టి పరిస్థితులలో మూడు వేలు తనెక్కడ తేగలడని? ఇది కానికాలం, అప్పు ఎక్కడ పుడుతుందని? పుట్టినా, తనకు తీర్చే తాహతులేదు. ఇచ్చేవాడుకూడా ఏమి చూసి ఇస్తాడని? రఘునాథపల్లెలో తమకు ఒక బావి, పది ఎకరాల ఖుష్కీ వుంది. బావి క్రింద ఎకరం, ఎకరంన్నర తరీ వుండవచ్చు. బావి తాకట్టు పెట్టి అయిదారు వందల రూపాయలు

తీసుకురావచ్చు. అయిదారువందలు ఏ మూలకి వస్తాయని? అమ్మజూపితే మూడు నాలుగు వేలదాకా రావచ్చు. కాని ఆ భూమి కొనడానికి ఎవరైనా ముందుకు వస్తారో, లేదో – ఒక కాలంలో అది ఈనాం భూమి, తన తండ్రిపోయిన తరువాత, తనపేరన పట్టా అయింది. ఎందుకో ఈ మధ్య ఈనాం భూములన్నీ పట్టాలు అవుతున్నాయట. మల్లయ్య కుటుంబం తండ్రి తాతల కాలం నించీ, ఆ భూమి సేద్యం చేస్తున్నది. “ఈ భూమిలో పుట్టి, ఈ భూమిలో పెరిగాం” అంటాడు మల్లయ్య. మనిషి దైవభక్తి కలవాడూ, నెమ్మదైన వాడునూ, అతనికెన్నడూ తమ కౌతుపత్రం వ్రాసియ్యలేదు. పట్టుపట్టి అతనూ వ్రాయించుకోలేదు. కౌలుగింజల విషయంలో ఏదో ముఖాముఖీ మాట్లాడుకోవడం, ఇంత అని ఒక నిర్ణయానికి రావడం, అతను సరే ననడం. ఇది చాలా కాలం నుంచి వస్తున్న పద్ధతి. వంశపారంపర్యంగా వస్తున్న ఆ పద్ధతికి తను ఎన్నడూ విరుద్ధంగా వెళ్ళలేదు. విరుద్ధంగా నడుచుకోవాల్సిన అవసరం కూడా కలుగలేదు. మల్లయ్య భూమి పన్ను తనే కట్టుకుంటున్నాడు. పన్ను పోను సంవత్సరానికి పుట్టెడు గింజలు యిస్తున్నాడు. శివుడుమీది పూలు తప్పినా, అతను కౌలుగింజ లివ్వడం ఎన్నడూ తప్పలేదు. కాని గడచిన రెండు సంవత్సరాలనించీ, తనకు మల్లయ్య దగ్గరినుంచి ధాన్యం ఏమీ రావడంలేదు. ఈ మధ్యనే అతను కూతురు పెళ్ళిచేశాడు. ఖర్చులో పడ్డాడు. కాగా గోరుచుట్టుపై రోకలిపోటు అన్నట్లు పక్కనున్న కుంట గండిపడి, ఆ భూమిలో ఒక సంవత్సరం నించీ ఏమీ పండడం లేదు. కుంట గండిపూడ్చడానికి తనకుగానీ, మల్లయ్యకు గానీ తాహతులేదు. కనీసం అయిదు వందల రూపాయిలయినా కావాలి. కుంట పెద్దది అయితే ప్రభుత్వం సహాయమైనా పొందవచ్చు. తాలూకా కచేరీలో ధరఖాస్తు యిచ్చి కూడా చూచాడు మల్లయ్య. రెవెన్యూ అధికారి వచ్చి చోటు తనిఖీ కూడా చేశాడు. అది కుంట కానిదే! అతను మాత్రం ఏమి సిఫారసు చేస్తాడని? ఏదో పెద్ద బొంద.

అక్కడ వానాకాలంలో నీళ్ళు ఆగుతాయి. ఆ నీళ్ళన్నీ వరిచేనులోకి కొట్టుకొస్తాయి. ఎండాకాలంలో బావిలోని నీళ్ళు వరిపొలానికి చాలవు. ఫలితం, ఏ కారులోనూ, ఆ పొలం పండడం లేదు. మల్లయ్య తనకు కొలవవలసిన ధాన్యం కొలవడం లేదు. పాపం అతను మాత్రం ఎల్లా కొలుస్తాడని – భూమిలో ఏమీ పండనప్పుడు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న భూసంస్కరణల ఫలితంగా, అతనికి టెనెన్సీ ఫారం దొరికింది. అతనికి కూడా ఆ భూమిలో కొంత హక్కు సంక్రమించింది. ఆ భూమి నుంచి అతన్ని తొలగించడానికి వీలు లేదు. భూమిని అమ్మదలచినా మొదట అతనికి అమ్మజూపాలి. అతను ఒకేసారి ధనం కక్కాల్సిన అవసరంలేదు. చిన్నచిన్న మొత్తాల్లో కొన్ని సంవత్సరాల వరకూ చెల్లిస్తూ వుండవచ్చు. అతని పరిస్థితి ఏమాత్రం బాగులేదు. కనుక అతను ఆ భూమిని కొనుక్కోకపోవచ్చు. పైగా అతనికి కూటికీ, గుడ్డకీ జరగడం లేదని వినికిడి.

ఐనా భూమిపై తనకుగల హక్కుని వదులుకుంటాడా? భూమి వదులుకొని రాజీనామా యిస్తాడా? అసాధ్యం–భూమీ వదులుకోడు–రాజీనామా యివ్వడు. కాగా కౌలుగింజలు కొలువడు. ఈ రైతులకి భూమి అంటే అంత మమకారం ఎందుకో?

మొదట కౌలుగింజల విషయంలో వత్తిడి కలుగజేయాలి. అతను ఎల్లాగూ యివ్వలేడు. ఆ తరువాత గొడ్డో, గోదో వేలం వేయడానికి ప్రయత్నించాలి. అప్పుల వాళ్ళ బాధపడలేక, ఇటీవలనే అతను రెండు కోడెలు అమ్ముకున్నాడట. ఇక మిగిలితే ఒకటీ అర గొడ్డు మిగిలి వుండవచ్చు. ఉన్న ఒక్క గొడ్డు వేలం వేయడానికి పూనుకుంటే అతను బెంబేలు పడిపోతాడు. కాళ్ళ బేరానికి వస్తాడు. అప్పుడు నెమ్మదిగా భూమికి రాజీనామా యివ్వమని నచ్చజెప్పి ఒప్పించాలి. మొదట ఒప్పుకోడు. ఎకరమో, ఆరో ఖష్మీ దానమిస్తానంటే ఒప్పుకోవచ్చు. అప్పుడు భూమి అమ్మకానికి చూపితే నాలుగు రాళ్ళు వొస్తాయి. తన గండం గట్టెక్కుతుంది. ఈ వ్యవహారమంతా ఎంతో చాకచక్యంతో నడపాలి. దీనికి కరణం రామచంద్రయ్య సహాయం తనకు ఎంతైనా అవసరం. రఘునాథపల్లెకు వెళ్ళగానే అతన్ని ముందు పట్టుకోవాలి. ఇల్లాంటి దగుల్బాజీ వ్యవహారాల్లో అతను దక్షుడు. అతనికి ఏదో ఆశపెట్టి వ్యవహారం సానుకూలం చేయించుకోవాలి. గుట్టుగా గ్రామం నుంచి బయటపడాలి. దానితో ఆ గ్రామానికీ, తమకూ మధ్యగల సంబంధ బాంధవ్యాలు తెగతెంపులవుతాయి.

రఘునాథపల్లె, తెలంగాణాలో ఒక మారుమూలలోని కుగ్రామం. ఆ గ్రామం ఇంకా సభ్యతకు కన్ను విప్పలేదు. భూసంస్కరణలకు సంబంధించి వార్తలు ఇంతవరకు అక్కడికి ప్రాకలేదు. ఇంకా రోజులు జరిగితే పరిస్థితులు ఈ విధంగా వుండవు. విషమ పరిస్థితులు ఏర్పడక ముందే, వున్న ఆ కాస్త భూమి అమ్ముకోవడం శ్రేయోదాయకం. ఇంకా రోజులు గడిస్తే భూముల ధరలు మరీ పడిపోతాయి. దున్నేవాడికే భూమి అనే నినాదం అక్కడక్కడా ప్రాకుతుంది. అప్పుడు భూములు కొనడానికి రైతులెవ్వరూ ముందుకురారు. భూమి అమ్మివేయడం ఇప్పటికే ఆలస్యమైంది. ఇంకా జాప్యంచేస్తే అసలుకే మోసం వస్తుంది. ఛాయ పెళ్ళి నిశ్చయించుకోవడం మంచికే వచ్చింది. లేకపోతే భూమి అమ్మవలసిన అవసరం అసలు ఏర్పడేదికాదు.

రంగారావు మానసికంగా ఒక గడ్డు సమస్యను పరిష్కారం చేసి, స్టేషన్ గడియారం కేసి చూచాడు. పదిగంటల అయిదు నిమిషాలు అయింది. పది గంటలకి తను ప్లాటుఫారం మీదికి వచ్చాడు. ఒక అయిదు నిమిషాల్లో రఘునాథపల్లె చుట్టివచ్చాడు. ఎందుకో, రంగారావుకు మానసిక కాలానికి, భౌతిక కాలానికీ ఎంతో తేడా కనపడింది. మానసిక కాలం ఇట్టే వాయు వేగంగా పరుగెడుతుంది. భౌతికకాలం వున్నచోటనే వుండిపోతుంది. ఒకవేళ నడిచినా మందకొడిగా నడుస్తుంది. ఈ భేదం ఎందుకుంటుందో అతనికేమీ అర్థం కాలేదు.

రైలు... బస్సు... కాలి నడకను ప్రయాణం చేసి రంగారావు సాయంత్రానికల్లా రఘు నాథపల్లె చేరుకున్నాడు. తెచ్చిన చేతిసంచి తమ షావుకారు ఇంట్లో పడేసి, కాళ్ళూ చేతులూ కడుక్కొని తిన్నగా కరణం రామచంద్రయ్య ఇంటికి బయల్దేరాడు. రామచంద్రయ్య ఇంటి వాకిలి గుమ్మానికి రెండువేపులా రెండు పెద్ద అరుగులున్నాయి. రామచంద్రయ్య ఒక అరుగుమీద కూర్చొని ఒక రైతుతో ఏదో వ్యవహారాన్ని గూర్చి మాట్లాడుతున్నాడు. తనను

చూడడంతోనే చేతులు జోడించి "రండి, పంతులుగారు, ఇదేనా రాకడ?" అని పరామర్శించాడు. రంగారావు "దీర్ఘాయుష్యమస్తూ" అని ఏవో కుశల ప్రశ్నల్లోకి దిగాడు. రామచంద్రయ్య ఇంగితం గ్రహించి ఏవో నాలుగు మాటలు చెప్పి, తనతో కూర్చున్న రైతును పంపించివేశాడు. ఆ వెంటనే రంగారావు వేపు తిరిగి, "ఇక చెప్పండి" అన్నట్లు చూశాడు.

తను ఏ పనిమీద ఆ గ్రామానికి వచ్చిందీ రంగారావు సవివరంగా చెప్పాడు. "మీ సహాయం లేకపోతే, ఈ పని ఏ మాత్రం సానుకూలం కా"దని కూడా హెచ్చరిక చేశాడు అతను.

"దానికేమి లెండి. ఉదయమే మల్లయ్యని పట్టి తెప్పిద్దాం" అన్నాడు రామచంద్రయ్య జవాబుగా.

"అలా అంటే కుదరదు – ఇది మీరు స్వంతపనిగా భావించాలి. మల్లయ్యతో రాజీనామా ఇప్పించి మంచి ధరకు ఆ భూమిని కాస్తా అమ్మించి పెట్టాలి" అని రామచంద్రయ్య చేయవలసిన పనిని, విస్పష్టపరిచాడు రంగారావు.

"ముందు మల్లయ్య దగ్గరినుంచి రాజీనామా రాబట్టుకోవడం, మనకు చాలా ముఖ్యం – ఆ తరువాత భూమి అమ్మకం అంటారా? అది అవలీలగా నిమిషాల్లో జరిగిపోతూంది. ఈ వూరి రైతుల దగ్గర మంచి ధర పలకకపోతే, పొరుగూళ్ళనుంచి రైతుల్ని పిలిపిద్దాం" అన్నాడు రామచంద్రయ్య రాజీనామాకి సంబంధించిన వ్యవహారానికి ఎక్కువ ప్రాముఖ్యత యిస్తూ.

"ఈ వ్యవహారంలోంచి నన్ను ఎలాగైనా గట్టెక్కించండి. మీ చేతులతోనే ఛాయ పెళ్ళి చేసినవారవుతారు. కాగా మీ కష్టం నేనేమీ ఉంచుకోను. అణా పైసలతో సహా చెల్లించుకుంటాను" అన్నాడు రంగారావు. చల్లకొచ్చి ముంత దాచుకోవడం దేనికనే ధోరణిలో.

తను రెండు వందల రూపాయలు రామచంద్రయ్యకు యిచ్చేటట్టూ, అతను మల్లయ్య దగ్గర రాజీనామా యిప్పించి, ఆ పొలం, మూడు వేలూ, నాలుగువేలకి మధ్య అమ్మించి పెట్టేటట్టూ, అన్ని విషయాలు ముఖాముఖిగా మాట్లాడుకొని, రామచంద్రయ్యతో రంగారావు ఒక ఒప్పందానికి వచ్చాడు.

"ఈ రాత్రికి మీరు నిశ్చింతగా వుండండి. రేపీపాటికి మీ వ్యవహారం ఫైనల్ కాకపోతే, నన్ను మారుపేరుపెట్టి పిలవండి" అన్నాడు రామచంద్రయ్య చివరిమాటగా.

"అయితే, నాకింక సెలవిప్పించండి" అని లేచాడు రంగారావు.

"సెలవు, నమస్కారాలు" అంటూ రామచంద్రయ్య కూడా లేచాడు అరుగుమీది నుంచి.

"దీర్ఘాయుష్యమస్తు" అని కదిలాడు రంగారావు అక్కడనుంచి. మరునాడు ఉదయం ఎనిమిది గంటలకల్లా. రంగారావు కాలకృత్యాలు తీర్చుకొని, టీ తాగి, కరణం రామ చంద్రయ్య

ఇంటికేసి వెళ్ళాడు. రామచంద్రయ్య తన ఇంటిముందు అరుగుమీద కూర్చొనివున్నాడు. అప్పటికే కావలివాడిని పంపి, మల్లయ్యని పట్టి తెప్పించాడు. ఎందుకో రంగారావుకు ఎడమకన్ను అదిరింది. నిర్లక్ష్యంగా ముందుకు నడిచి, వెళ్ళి అరుగుమీద కూర్చున్నాడు. రామచంద్రయ్య నమస్కారాలకి “దీర్ఘాయుష్యమస్తు” అని ఆశీర్వదించాడు.

రంగారావుని చూసీ చూడడంతోనే “దండాలు పంతులుగారూ” అన్నాడు మల్లయ్య. – ఎందుకో రంగారావు జవాబుగా ‘దీర్ఘాయుష్యమస్తు’ అని అనలేకపోయాడు.

రెండు సంవత్సరాలనుంచి కౌలుగింజలు కొలవడం లేదు – పంతులు బాకీ గల్లా (ధాన్యం) కోసం వచ్చాడు పట్నం నుంచి. వెంటనే గల్లాయిచ్చి వ్యవహారం ఫైనల్ చేసుకో” అన్నాడు రామచంద్రయ్య నాందీప్రస్తావనగా మల్లయ్యనుద్దేశించి.

“ఇప్పుడు గల్లా యాడికెల్లి ఎల్లుతది దొరా నా దగ్గర – నాలుగురోజు లాగితే మొత్తం గల్లా గొలుస్త” అన్నాడు మల్లయ్య దీనంగా.

“రేపు రేపు అంటూ రెండు సంవత్సరాలు దాటేశావు. ఇంకా ఎన్నేళ్ళు బ్రాహ్మలకి ఎగనామం పెడతావు?” అని అడిగాడు రామచంద్రయ్య నిక్కచ్చిగా.

“కుంట గండిబడ్డది– పొలంలో చారెడిత్తలు (గింజలు) పండుతులేవు. బాయి బెట్టెబడి పోతున్నది. ఇంక యాడికెల్లి గొలుస్తు దొర గల్ల?” అని మల్లయ్య సంగతి సందర్భాలు వివరించాడు.

“బొత్తిగా లాభం లేకపోతే బావి వదిలేసెయ్యి– ఇంకెవరికైనా కౌలుకిచ్చుకుంటాడు పంతులు” అని సూచించాడు రామచంద్రయ్య.

“ఆ బాయికాడ బుట్టి, ఆ బాయికాడ పెరిగిన–సస్తే ఆ బాయి గడ్డమీదే సావాలె. గిప్పుడు (ఇప్పుడు) యేమి మొకం బెట్టుకొని వదిలెయ్య మంటవు దొరా?” అని అడిగాడు మల్లయ్య సూటిగా.

ఆ ప్రశ్నకి రంగారావు మనస్సు కలుక్కుమంది. కాని అతను ఏమీ కల్పించుకోలేదు మధ్యలో.

“నీ వెధవ వేషాలు నా దగ్గర సాగవు. కొలిస్తే బాకీ గింజలు వెంటనే కొలువు. లేకపోతే వెంటనే భూమికి రాజీనామా ఇవ్వు” అని నిష్కర్షగా చెప్పాడు రామచంద్రయ్య.

“మా తాతలకాడినుంచి ఆ బాయిజేస్తున్నం. గిప్పుడు బాయి యిడిసిపెట్టి యాడికి పోను దొరా?” అని అడిగాడు మల్లయ్య, తనకేదైనా బ్రతుకుతెరువు చూపించమన్నట్లు జాలిగా. ఆ వాక్యానికి రంగారావు హృదయం అమాంతంగా కరిగింది. “వీడిని పీడించడ మెందుకు. వదిలివేతానూ” అనుకున్నాడు మనస్సులో– కాని ఛాయ పెళ్ళి, ఒక పెద్ద సమస్యగా మారి

అతని కళ్ళముందు ఆకాశం ఎత్తున లేచింది. దానితో రంగారావు హృదయం చప్పున గడ్డకట్టింది.

“పోనీ, సొమ్మో సంబంధం, గొడ్డో, గోదా ఏమైనా వుంటే వెంటనే అమ్మి బాకీ చెల్లించు” అన్నాడు రామచంద్రయ్య మల్లయ్యని.

“నా తాన (దగ్గర) సొమ్ము, గిమ్ము యాడుంది దొరా – పొల్ల (అమ్మాయి) పెండ్లికి వలిశంత అప్పుజేసిన– అప్పులోళ్లు వచ్చి రెండుకోడెలు గొటుకపోయిన్రు. ఒక యెద్దు నాం దిని సచ్చింది. గిప్పుడు ఒక బక్క దున్నపోతున్నది నాతాన” అన్నాడు మల్లయ్య జవాబుగా.

“వీడు మంచి మాటలతో ఏమాత్రం వినేట్టులేదు. ఇంక చూస్తారెందుకు? పంగబెట్టి వీపుమీద బండ పెట్టండి” అని రామచంద్రయ్య ఆగ్రహావేశంలో కావలి వాళ్ళని వుద్దేశించి అన్నాడు.

“నీ కాలు మొక్కుత నా ఇజ్జత్ (పరువు) తీయకు దొరా, నా ఇజ్జత్ తీయకు దొరా” అని కంట నీరు పెట్టాడు మల్లయ్య. ఇద్దరు కావలివాళ్ళు మల్లయ్యని పట్టుకొని, అతన్ని వంగబెట్టి, వీపుమీద ఒక బండపెట్టారు. మల్లయ్య వాళ్లని ఏమీ ఎదిరించలేదు. యజమానికి మచ్చికపడ్డ గొడ్డుకుమల్లే లొంగిపోయాడు ఆ యిద్దరికినీ – ఆ తరువాత మల్లయ్య అవమానంతో ఇటూ, అటూ ఎవ్వరినీ చూడలేదు. నేలకేసి చూస్తున్న అతని మొహం నేలకేసి చూస్తూనే వుండి పోయింది. భూమిపైన ఏకధారగా అశ్రువులు రాలడం మొదలెట్టాయి.

రామచంద్రయ్య ఆ వ్యవహారాన్ని అంతటితో తాత్కాలికంగా ఆపి, ఇంకొక వ్యవ హారంలోకి దిగాడు యాంత్రికంగా.

రంగారావు మొహంలో కత్తి వేసినా నెత్తురు చుక్కలేదు. కూర్చున్నవాడు కూర్చునే వుండిపోయాడు.

కొంతసేపటికి కడవలతో నీళ్ళుపోసినట్టు మల్లయ్యకి చెమటలు కారడం మొదలెట్టాయి. అవమానభారంతో కరిగి నీరౌతున్నాడా అనిపించింది రంగారావుకు. అతను మల్లయ్య కేసి చూడడం మాని ఇంకొకవేపు చూడడం ఆరంభించాడు.

మల్లయ్యకి మరీ నీరసం ఎక్కువైంది. దానితో తల తిరగడం ఆరంభించింది. కళ్లు చీకట్లు కమ్మాయి. వెంటనే స్పృహతప్పి కుప్పగా కూలాడు మల్లయ్య బండతోసహా.

మల్లయ్య పడిపోవడంతోనే, అక్కడున్న ప్రజ, మల్లయ్య చుట్టూ మూగింది. కొందరు అతన్ని ఎండలోంచి నీడకి తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. మరి కొందరు “వద్దు, వద్దు” అని వారిస్తున్నారు.

మల్లయ్య పడిపోవడంతోనే, రంగారావు రామచంద్రయ్యలు, అమాంతంగా అరుగు మీదనించి క్రిందికి దూకి, అతను పడిపోయిన చోటుకి పరుగెత్తారు. ఊపిరి సలుపదేమోనని

భయపడి, జనాన్ని కొంచెం దూరంగా జరిపారు. ఒకరిని నీళ్ళకోసం పరుగెత్తించారు. ఇంకొకరిని అతని భార్యదగ్గరికి తరిమారు.

మొహంమీద నీళ్ళు చల్లిన కాసేపటికి కొద్దిగా స్పృహ వచ్చింది మల్లయ్యకు.

"ఇజ్జత్ పోయింది. ఇంక బతికేమి లాభం?" అంటూ గొణుక్కున్నాడు మల్లయ్య ఆ మైకంలోనే.

రంగారావుకి ఆ గొణుగుడికి కళ్ళ నీళ్ళ పర్యంతమైంది.

"పాపం–పట్టుమని పది మెతుకులు తిని ఎన్నిరోజులైందో!" అంటున్నారు ఎవ్వరో ఆ గుంపులో.

ఆ వాక్యం రంగారావు చెవినిపడింది. మల్లయ్య అంత బీదరికం అనుభవిస్తున్నాడని అతనికి తెలియదు.

ఇంతలోకే మల్లయ్య భార్య మల్లి – "ఏమైంది మామా?" అని గొల్లున ఏడుస్తూ అక్కడికి పరుగెత్తుకొచ్చింది. మల్లిని చూడడంతోనే చుట్టూ మూగిన జనం ఆమెకి దారి యిచ్చారు.

మల్లి, మల్లయ్యని సమీపించి చెంబులోని నీళ్ళు చేతితో మొహంమీద వత్తుగా చల్లింది. కొంగుతో మల్లయ్య మొహం తుడ్చింది.

"ఇజ్జత్ పోయింది పిల్లా" అంటున్నాడు మల్లయ్య. ఇంతలోకే ఎవరో వేడి పాలు తీసుకు వచ్చి, మల్లికి అందించారు. మల్లి పాలగ్లాసు మల్లయ్య నోటి దగ్గరికి తీసుకువెడితే, అతను వద్దన్నట్లు మొహం తిప్పుకున్నాడు.

"మల్లయ్య! కొంచెం పాలుతాగు" అని అన్నాడు రంగారావు. గుంపులో ఒకరిద్దరు కూడా అదేమాట అన్నారు. కాని మల్లయ్య వాళ్ళ మాటలు వినిపించుకోలేదు. పాలు తాగనూ లేదు.

"లే మామా మనింటికి పోదాం లే" అని మల్లి తన మెడచుట్టూ అతని చెయ్యి వేసుకొని, మల్లయ్యని నెమ్మదిగా లేపింది. మల్లయ్యని లేపడంలో మల్లికి యిద్దరు ముగ్గురు మనుషులు సహాయం చేశారు.

"పోదాం పా పిల్లా" అంటూ నెమ్మదిగా కదిలాడు మల్లయ్య.

నెమ్మదిగా నడిపించుకుంటూ, మల్లి, మల్లయ్యని యింటికి తీసుకెళ్ళింది. రంగారావు కూడా మల్లయ్య యింటిదాకా వెళ్లి వచ్చాడు.

"జ(్రంత గట్కు తాగుతావు మామా" అని అడిగింది మల్లి, ఎక్కడివాళ్ళు అక్కడికి వెళ్లిపోగానే.

"గింజలు యాడికెల్లి దీసుకొచ్చినవు?" అని అడిగాడు మల్లయ్య మల్లిని ఆతురతగా.

"యెల్లవ్వ జర్రన్ని సజ్జగింజలు పెట్టింది" అన్నది మల్లి సమాధానంగా.

"నా కొద్దు పిల్లా – నా మనస్సు బాగలేదు. నువ్వు జర్రంత దాగి, బుడ్డోడికి పెట్టు" అన్నాడు మల్లయ్య.

"నిన్న పొద్దుగల్లి దాగిన గట్క – జర్రంత దాగుమామా!" అని మల్లి ప్రాధేయపడింది.

మల్లిమాటని తోసెయ్యలేకపోయాడు మల్లయ్య. ఏదో ఎంగిలిపడ్డాడు. ఆ పక్కమీదే మల్లిని సంతృప్తిపరిచే ఉద్దేశంతో...

తండ్రిని, ముగ్గురు నలుగురు మనుషులు పట్టుకు రావడం చూచి, ఏదో జరిగిందని ఊహించి, క్షణం యింట్లో వుండని మూడేళ్ళ కుర్రవాడు రామయ్య ఆనాడు తండ్రి పక్క దగ్గరినించి కదలలేదు.

"నేను పెద్దల ఇజ్జత్ పోగొట్టిన, బుడ్డోడా నువ్వన్న నిలబెట్టాలే" అన్నాడు మల్లయ్య బుడ్డోడిని దగ్గరికి తీసుకుంటూ.

"ఏంది మామా ఆ మాటలు?" అంది మల్లి కళ్ళల్లో నీళ్ళు నింపుకుంటూ.

మల్లయ్య కాసేపు మధ్యాహ్నం పడుకోవడానికి ప్రయత్నించాడు. కాని అతనికి ఏమాత్రం నిద్రపట్టలేదు. ఉండి ఉండి, ఉదయం జరిగిన సంగతులే మాటిమాటికీ జ్ఞాపకం రావడం మొదలెట్టాయి అతనికి. పక్కమీద ఇటూ, అటూ పొర్లుతూ కాలం గడిపాడు.

సాయంత్రం చీకటి పడుతుండగా పక్కమీదినుంచి లేచాడు మల్లయ్య.

"యాడికి మామా?" అని మల్లి అడుగుతూనే వుంది. కాని మల్లయ్య మల్లిమాట వినిపించుకోలేదు. ఒక ఇత్తడి చెంబు చంకలో పెట్టుకొని, భుజాలమీది నుంచి చెంబు కనపడకుండా ఒక దుప్పటి కప్పుకొని, నీరసంగా యింట్లోంచి బయల్దేరాడు మల్లయ్య. అతను ఎక్కడికి వెడుతున్నదీ మల్లి ఇట్టే గ్రహించింది. "మనస్సు బాగలేదు పోనియి" అనుకొని మౌనం వహించింది మల్లి.

రాత్రి ఎనిమిది దాటిన తరువాత మల్లయ్య యింటికి తిరిగివచ్చాడు. చెంబు తిరిగి రాని సంగతి మల్లి ఇట్టే పసికట్టింది. చెంబు కుదువబెట్టి భర్త తాగివచ్చాడన్న సంగతి అవలీలగా తెలుసుకుంది.

"పిల్లా, బుడ్డోడు పండుకున్నాడా?" అని అడిగాడు మల్లయ్య వచ్చీ రావడంతోనే.

"ఆ" అంది మల్లి జవాబుగా.

"నువ్వు బుక్కెడు గట్కు తాగినావా?" అని అడిగాడు మల్లయ్య ఆతురతతో.

"ఇంక గట్కు యాడిది మామా? యెల్లవ్వ తాన దెచ్చిన గింజలు పొద్దునట్టె అయి పోయినయి" అంది మల్లి అనునయంగా.

"పోనీలే. ఈ పూటకు మనకు పాప్తం లేదు" అన్నాడు మల్లయ్య వేదాంతి ధోరణిలో.

"పిల్లా!"

"ఊ"

"ఒకమాట జెపుద యింటావు?"

"యేంది మామా?"

"పొల్ల పెండ్లికి దుచ్చిన చీర గట్టుకొని, జెర్ర ఆ అద్దాల రయికెను దొడుక్కో" అన్నాడు మల్లయ్య ప్రేమ ఉట్టిపడుతున్న కంఠంతో.

"ఊర పొద్దుగూకలేదు ఏంది మామ ఈ సరసాలు" అని ప్రణయకోపాన్ని నటించింది మల్లి.

"కట్టుకోకపోతే బుడ్డోడి మీద ఒట్టే" అని బలవంతపెట్టాడు మల్లయ్య.

విధిలేక మల్లి అమ్మాయి పెళ్ళినాడు తనకు భర్త తెచ్చిన ఆకుపచ్చ చీర కట్టుకొని, అద్దాల రవిక తొడుక్కుంది. ఒయ్యారంగా వచ్చి పక్కలో వాలింది.

"వనలచ్చిమి వోలున్నవు" అన్నాడు మల్లయ్య మల్లిని గట్టిగా ముద్దు పెట్టుకొంటూ.

"బుడ్డోడు పండుకున్నడో, లేదో జర్రసూడు" అని హెచ్చరిక చేశాడు మల్లయ్య కొద్దిసేపటికి.

"మెసుల్తున్నడు మామా!" అని అంది మల్లి కొంటిగా.

మల్లయ్య ఒక నిమిషంపాటు కుర్రవాడిని పరీక్షించి చూచాడు. కుర్రవాడు ఒళ్ళు తెలియకుండా నిద్రపోతూ ఉండడం గమనించి, అతని మనస్సు కుదుటబడింది.

"అబద్దాలాడుతున్నావ్ పిల్లా."

"లేదు మామా, పండుకో లేదనుకున్నా"

"పిల్లా! నీ యన్ని దొంగ ఎత్తులే"

ఆ వాక్యానికి మల్లి ఆకాశం ఎత్తున ఉప్పొంగిపోయింది.

రాత్రి రెండు జాముల తరువాత మల్లయ్య చడీచప్పుడూ లేకుండా పక్కమీద నుంచి లేచాడు. మల్లి పక్కలో మైమరచి నిద్రపోతున్నది. చీకూ చింతా లేకుండా కుర్రవాడు నిద్రపోతున్నాడు. మల్లయ్య తిన్నగా కుర్రవాడి మీదికి వాలి, అతన్ని తేలికగా ముద్దు పెట్టుకున్నాడు. మల్లి లేస్తుందేమోననే భయం కొద్దీ ఆమె దగ్గరికి వెళ్ళలేదు. దూరంగా వుండి తదేక దీక్షగా ఆమె మొహంలోకి ఒక నిమిషంపాటు పరికించి చూశాడు. ఆ తరువాత ఒక తాడుతో సహా నెమ్మదిగా పక్కగదిలోకి వెళ్ళాడు. గది తలుపులు బంధించి వేశాడు. ఇంక ఆ గదిలోంచి వెలుపలికి రాలేదు.

మల్లి తెల్లవారుజామున మగత నిద్రలో అలవాటు ప్రకారం పక్క తడిమి చూసుకుంది. పక్క ఖాళీగా వుండడం గమనించి, దిగ్గునలేచి కూర్చుంది. అవతలికెళ్ళాడో, ఏమోనని కాసేపు భర్త కోసం నిరీక్షించింది. ఎంతకూ రాకపోవడంతో లేచి యిల్లంతా వెతికింది. పడమటి గదిలోపల గడియవేసి వుండడం గమనించి, ఒక్కసారే గొల్లుమంది. ఆ ఏడ్పులకి పొరుగున వున్న నాలుగు యిళ్ళవాళ్లూ మల్లి యింట్లో పోగైనారు. పడమటి గది తలుపులు బద్దలుకొట్టారు. మల్లయ్య లోపల దూలానికి వ్రేలాడుతూ వున్నాడు.

"ఇజ్జత్ పోయింది. పాపం మల్లయ్య ఆత్మహత్య చేసుకున్నాడు" అన్నారు అందరూనూ. మల్లి ఏడ్పులు ఊరంతా ప్రతిధ్వనించాయి.

రెండురోజుల వరకూ, రఘునాధపల్లె పోలీసు అధికారుల రాకపోకలతో హడావుడిగా వున్నది.

ఎవ్వరి ప్రేరేపణతో కూడా ఆ ఆత్మహత్య జరుగలేదని నిరూపించడానికి, రామ చంద్రయ్య తలప్రాణం తోకకు వచ్చింది. రంగారావు, రామచంద్రయ్యలు చెరి రెండు వందలు తడిపి ఎక్కడి వ్యవహారం అక్కడే సర్దేశారని ఆ ఊళ్ళో గిట్టనివాళ్ళు చెప్పుకుంటారు.

బ్రతుకు జీవుడా అని నాలుగు రోజుల తరువాత రంగారావు తిరిగి పట్నం చేరుకున్నాడు. "ఊరికి వెళ్ళావేమో, ఏమైందిరా?" అని తల్లి అడిగితే, "ఛాయకి పెళ్ళి అయ్యేయోగం లే"దని నిక్కచ్చిగా చెప్పాడు. మీ సంబంధం మాకు నచ్చలేదని తెలుపుతూ పెళ్ళి కొడుకు వాళ్ళకి వుత్తరం వ్రాసిపడేశాడు రంగారావు.

ఇప్పటివరకూ ఆ పొలం అమ్ముడు పోనూలేదు; ఛాయ పెళ్ళి ఇంతవరకూ జరగనూ జరగలేదు.

✡

# ఇగ వీడు తొవ్వకు రాడు

**–పెద్దింటి అశోక్‌కుమార్**

‘ఉరికిన శాలోడు అదే అంగడి, ఉరకని శాలోడు గదే అంగడి’ అన్న శాత్రం ఇప్పుడుగాదు నేను చిన్నగున్నప్పుడే విన్న. మా అమ్మ ఎన్నోసార్లంటుండె. ఎందుకోగాని ఈ శాత్రం ఎన్నో రోజులు నా మనసుల మెదిలేది. ఇద్దరు ఒక్కటెట్లయితరని మా అమ్మనే అడిగి.

‘నీకెందుకురా ముసలక్క ముచ్చట్లు’ అని యాస్టపడ్డది. అప్పటి కది మరచిపోయినా అప్పుడప్పుడు ఎవలో ఒకల నోట వింటనే ఉన్న. మూడు నెల్లకింద బాలకిషన్ ఇంటికి వచ్చినప్పుడు ఇదే శాత్రం చెప్పిండు. ఆరోజు పొద్దుగల్లనే ఇంటి కచ్చిండు. మాట్లాడద్దనే అనుకున్న. వాళ్ళ నాయన ఎంకట్రాములు యాది కచ్చిండు. పోరడు ఎంత చెప్పినా ఇనకనేపాయె. చెప్పితే ఇననోన్ని చెడంగ సూడాలె అనుకున్న. ఇల్లు సొచ్చుకొని వచ్చినప్పుడు మాట్లాడకపోవుడు మర్యాద గాదనుకున్న.

“ఏం రా పటేలా ఎటో వచ్చినవు.. అంత మంచిగనేనా,” అడిగిన.

బాలకిషన్ నవ్విండు. నవ్వుకుంట, “ఆ.. ఏంది సారూ.. పటేలా అనవడితివి. పటేలు గిట్లనే ఉంటడా.. పేరు పెద్దిర్కం ఇల్లు జల జంత్రం” అన్నడు.

“ఎవుసం జేత్తున్నవు గదా.. ఎవుసం.. అందుకే అన్న.” నవ్వుకుంట చెప్పిన.

బాలకిషన్ నవ్వలేదు. “ఎవుసం జెయ్యక అందరచ్చి సిటీలల్ల కూసుంటె తిండి ఎక్కడి నుంచి వస్తది సారు. పైసలు తింటమా.. ఎవలో ఒకలు ఆ పని చెయ్యాలెగదా..” అన్నడు.

కొంచెపోని కొంగువడితే మంచోని మానం పోయిందట. వీనితోని శాంతానమెందుకు అనుకుని, “సరేగనీ... ఏమో వచ్చినవు.” అడిగిన.

“నీతోనే కొద్దిగ పనుండి వచ్చిన” అన్నడు.

నాకు ఏదో అనుమానమచ్చింది. ‘బుద్ధికచ్చినట్టున్నడు. ఏమన్న పని జూడు మంట డేమో..’ అనుకుని, “నాతోని.. ఏం పనిరా,” చాయి ఇస్తు అడిగిన.

"మా బాపు ఉండంగ ప్యాట్లనే తెస్తుండె. నేను అక్కడనే తెస్తున్న. చేను నాటుకచ్చింది. దుక్కిమందు లేదంటున్నరు. ఇక్కడ నాకు కొత్త గదా. ఉద్దెర ఎవలు నమ్ముతరు. మీ పేరు జెప్పిన. తోలుక రా పో అన్నరు" అన్నడు.

"అంతేనా.. సరే.. ఉండు, తానంజేసి వత్తా." అన్న. అంతట్లనే అనుమానమచ్చింది. "ఇంత పొద్దుగల్ల దుకాణాలు ఎవలు తీసింద్రు" అన్న.

బాలకిషన్ నవ్వుకుంట, "ఏమో.. పోతే గదా తెలిసేది. ఇదే మాటంటరని ఇటే వచ్చిన" అన్నడు.

నాగ్గూడా నవ్వచ్చింది. "అబ్బో..దండోనివే.. ఏమోఅనుకున్న, కడుపుల పేగులు లెక్క వెట్టే తట్టున్నవు గదా.. ఇంతమాత్రం ఇకమాతు (ఉపాయం) రాజమల్లు కున్నా బాగు పడు తుండె. ఇప్పుడు తుకం బోత్తండట. నిన్న ఇత్తునపువడ్ల కచ్చిండు. శివరాత్రి వత్తంది.. ఇప్పుడు తుకం (నారు) బొత్తే ఎన్నడు నాటు వెడుతడు.. ఎన్నడు కోత వడుతడు" అన్న.

చాయి తాగుకుంట, "కోత వడితే ఏం లాభం సారూ.. కొనేటోడుండద్దు. వాడు మార్కెట్ ఓపెన్ చేసి తక్కడ బాట్లు సదురుకుని కొనుడు మొదలుపెట్టేసరికి గదే అయిటి (తొలకరి) మూనుతది," అంటూ ఈ శాస్త్రం జెప్పిండు.

అది నాకిప్పుడు గుర్తుకు రాకపోతుండె. ర్యాలీల బాలకిషన్‌ను చూడంగనే గుర్తుకచ్చింది. అది ఎర్రటి ఎండ. రైతుల కండ్లు అంతకంటే ఎర్రగా ఉన్నయి. ఒకలకు కాళ్ళకు చెప్పులే లెవ్వు. ఒకలకు నెత్తిమీద తువ్వాల గూడా లేదు. అవి చెమటలో కన్నీళ్ళో గని కారుతనే వున్నయి.. నినాదాలు అరుపులు.

కరంటుకోతను– నివారించాలి.

చాలినంత కరంటు – ఇవ్వాలి.

ఎండిన పొలాలకు – నష్ట పరిహారమివ్వాలి.

ప్లకార్డులు పట్టుకుని ముందుకు కదులుతున్నారు. శత్రువెవరో ముందే వున్నట్టు.. అతని వునికిని గుర్తించినట్టు.. అతని మీద దాడికి వెళ్తున్నట్లు.. సైనికుల కవాతుగా ర్యాలీ. బాలకిషన్ ముందే ఉన్నడు. రైతులను ముందుకు నడుపుతున్నడు. ఎస్టీవోలో ఓ ఎరియర్స్ బిల్లు వుంటే ఇచ్చిరాంగ ఎదురైంది ర్యాలీ.

ముందు నేను బాలకిషన్‌ను చూడలె. ర్యాలీ దాటి సందులకు తిరిగిన. ఎందుకో వెనక్కు తిరగి చూసిన. అప్పుడు కనిపించిండు బాలకిషన్. బ్రేకు మీద కాలుపడ్డది. కర్రుమని స్కూటర్ పగ్గం పెట్టుదూరంలో ఆగిపోయింది. నేను విచిత్రంగా చూసిన.

బాలకిషన్ రైతులకు ఏదో బోధపోస్తుండు. ర్యాలీని ముందుకు నడుపుతుండు. తప్ప దన్నట్లు.. తప్పకుండా చేయాలన్నట్టు రైతులు ముందుకు నడుస్తున్నరు. భుజాన తుపాకులేసుకున్న ఇద్దరు పోలీసులు ముందొకరు వెనుకొకరు అర్థంగాని పనేదో చూసుకుంట చేసుకుంటున్నట్లు తొవ్వ నడుస్తుండ్రు.

నాకు చిత్రమనిపిచింది. ఏ లెక్కన చూసినా బాలకిషన్‌కు ఇప్పుడు కరెంటుతో పనిలేదు. ఎప్పుడో కోత వట్టి రాశి చేసి ఉంటడు. మిగతా రైతులకు కరంటు అవసరం ఉండచ్చు. మరి ర్యాలీల బాలకిషన్ ఎందుకున్నట్టు...?

బాలకిషన్ నన్ను చూసి నవ్విండు. నేను నవ్విన. అడుగుదామనుకున్న. దూరంలో వున్నడు. ర్యాలీ సాగిపోతుంది. అతడు వెళ్లిపోతుండు.

ఆగమాగాన ఇంటికచ్చిన. అవునా కాదా అన్న అనుమానం వచ్చి ఒకసారి మంజులను అడిగిన. బాలకిషన్ పేరు జెప్పి శాత్రం చెప్పంగనే డేటుతో సహా చెప్పి మూడు నెలలు దాటిందని చెప్పింది. ఆ లెక్కనైతే బాలకిషన్ కల్లం పొల్లు లెవ్వాలె. ఇంకా అనుమానపడు తుంటే ఇంకో విషయం గూడ చెప్పింది మంజుల. వారం కిందనే మార్కెట్‌ల కలిసిండట బాలకిషన్. 'అక్కా కోత అయింది. రేపే కొత్తకు వడ్లు పంపిస్త' అన్నడంట. అది నిజమే అనుకుని తొక్కులు నూరి ఇస్తార్లు కుట్టి పెట్టింది. ఇస్తారు ఇటు కొత్త అటు. వడ్లు లెవ్వు. మనిషి లేడు.

కూలర్ కటుక (స్విచ్) వేసి టీవీ పెట్టిన. కేబుల్ టీవీలో పగటి వార్తలు, కరంటు ఆఫీసు ముందు ధర్నా. బాలకిషన్ ముందే ఉన్నడు. నినాదాలిస్తున్నడు. ఛైర్మన్‌ను నిలదీస్తున్నడు. కారుకు అడ్డం పండుకున్నడు.

✡

మనిషికి మనిషి దొరుకని కాలం. పనున్న దినం. వరికోత అయిపోయినా బాలకిషన్ ఎందుకు ధర్నాకు దిగినట్లు..? ఇదే ప్రశ్న పుర్రెల సుడి దిరుగుతుంది. బాలకిషన్ తండ్రి వెంకట్రాములు నాకు బాగా తెలుసు. ఆ సోపతి ఇప్పుడు గాదు. పదేండ్లది. నేను మల్లారెడ్డి పేటలో ఉంటూ బండలింగంపల్లి బడిలో పనిచేస్తున్నప్పటిది. నేను బడికి పోవాలంటే గోపాల్ పల్లె దాటాలె. ఎంకట్రాములుది గోపాల్‌పల్లెనే. మా ఇద్దరి పరిచయం విచిత్రంగా జరిగింది.

ఒకరోజు రోడ్డుమీద గోధుమకంకులు ఎండవెట్టిండు ఎంకట్రాములు. పక్కపొంట జానెడు జాగ ఇడిసిపెట్టలేదు. జరంతలైతే నా బండి జారిపడుతుండె. ఆపి కోపంగా అడిగిన. "రోడ్డు నిండ పోసినవు. జెరంత తొవ్వ ఇడిసిపెడితే తప్పయిందా.. జారితే ఎట్లుండు" అని.

ఎంకట్రాములు పక్కనే ఉన్నడు. కోపంగా నా దిక్కు చూసిండు. "ఏం గాకపోతుండె. మహా అయితే కాలో చెయ్యో ఇరుగుతుండె. వారానికో నెలకో అతుక్కుంటుండె. పంట తడిసి మా బతుకులే జారిపోయినయి గదా.. ఏండ్లయినా అతుకయి" అన్నడు.

ఆ మాటలు అతడు కోపంగా అన్నా నాకు మాత్రం కోపం రాలేదు. ఎందుకో బాధ అనిపించింది. మనిషిని చూసిన బక్క పలుచగా ఉన్నడు. మొఖంలో బాధను దాచుకున్నడు. వట్టిగవోతే అలుసైతనని మనిషిని ఇరుగ జూసిన. ఎంకట్రాములు కూడా నన్ను ఇరుగ జూసిండు. "అట్ల గాకుంటె నువ్వెక్కడాగుదువు." అనుకుంట గేరు మార్చిన.

ఇది జరిగినంక వారం పదిరోజుల కనుకుంట, 8వ తరగతిలో బాలకిషన్ అనే పిల్లగాడు వరుసగా వారంరోజుల నుండి బడికి రాలేదని క్లాస్ టీచర్ చెప్పిండు. వానిది గోపాల్‌పల్లె అని తెలుసుగని ఇల్లు తెలువది. ఏమైందని ఇంటికివోతె ఇంట్ల ఎంకట్రాము లున్నడు. కడుపునిండా మాట్లాడిండు.

మరునాడు పొలం దగ్గర కనిపిస్తే బండి ఆపి ఎక్కించుకుని ఊర్లె దించిన. ఇంకో నాడు అదే టయానికి అక్కడ తయారున్నడు. ఎంకట్రాములు పొలం దగ్గర లింగంపెల్లి పొలిమర్ల ఉంది. ఏం లేదన్నా రెండు కిలోమీటర్లు.

అప్పుడు బిలో ఇన్‌ఛార్జ్ నాదే. పొద్దుమాపు స్టడీ అవర్. పొద్దున ఎనిమిదీటికి పోతే పొద్దుగూకి ఏడు దాటుతుండె. నా టయము సరిగ్గా ఎంకట్రాములు టయానికి కుదిరింది. నాట్లు కోతల మీదైతే వాడిక పెట్టుకున్నట్టే.

ఓనాడు నాలుగు మక్క కంకులు డిక్కీలో వేస్తుండె. ఓనాడు నాలుగు దోసకాయలు సంచిలో వేస్తుండె. ఓనాడు కాల్చిన చిప్పలకాయలు, ఇంకోనాడు ఓనగాయ. బండి ఎక్కింది మొదలు దిగేదాక ఏదో ఒక ముచ్చట వెడుతుండె. తన భూమి గురించి చెబుతుండె. పంట గురించి చెబుతుండె. తన కష్టసుఖాలు చెబుతుండె.

నేను పరాచికానికన్నట్లు, 'పటేలా' అంటుంటిని. అతడు నవ్వుతుండె. రాను రాను అదే అతని పేరయింది. ఎర్రగొట్టెలు, పొలాకులు, బందార్లు మొదలు అయ్యార్ ఫిఫ్టీ, బీపీటీ దాకా వడ్ల రకాల గురించి చెప్పిండు. పునాస, నీరావ పంటల గురించి చెప్పిండు. భూముల మర్మం గురించి చెప్పిండు.

ఒకనాడు బడిలేదు. అతని కొరకే వెళ్లిన. ఉండబట్టలేక అదే సంగతి చెప్పిన. అతడు నవ్వుకుంట, "నేను వారం నుంచి ఇదే పని చేస్తున్న. పొలంల నాకు పనేలేదు." అన్నడు.

ఎంకట్రాములుది మూడెకరాల వందురు (తడి) పొలం. మోకాళ్ళమంటి దిగువాటు. వాళ్ళతాత పారతోనే తవ్వతుండెనట. వెంకట్రాములు తండ్రి తట్టతోని ఉసికె మోసి పొలమంతా పరచి పోసిండట. అప్పుడు దిగువాటు పోయి ఎడ్ల నాగలి కట్టచ్చిందట.

అన్నీ చిన్న చిన్న మడ్లు. ఎంకట్రాములు చిన్న మడ్లను పెద్ద మడ్లు చేసిండట. అప్పుడుగాని ట్రాక్టరుకు తిరుగ వీలు కాలేదట. ఇవన్ని సంగతులు ఎంకట్రాములే చెప్పిండు.

మేము రోడ్డు పొంట పోతుంటే ఉపాధిహామీ పనికి పోయేటోళ్లు గుంపులు గుంపులుగా ఎదురైతరు. ఎందుకోగని వాళ్ళను చూస్తె మండుతుండె ఎంకట్రాములు.

"ఊ.. చూసినవా సారూ.. డూటీలకు వోతండ్రు. నెత్తిమీదికి పొద్దురానే రాదు ఇంట్లచ్చి పడుతరు. చెముట గారకుంట రోజు వంద," ఒకనాడు వాళ్ళను చూసి రోజూ అన్నట్టే అన్నడు.

నాకు యాస్టకచ్చింది.

"ఆ... వాళ్లిచ్చిన వందతోని వీళ్ళు మిద్దెలు గడుతరా మేడలు గడుతరా... కైకి లోళ్లు బతుకద్దా ఏంది..? చేసుకుందామంటే పనే లేకపాయె. వాడెట్ల బతుకాలె." అన్న. అప్పుడు సప్పుడు జెయ్యలే. కొద్ది దూరం పోయినంక ఏదో కొంపలు అంటుకున్నట్లు, "ఆగు సారూ.. ఆగాగు" అన్నడు.

నేను బండిని ఆపిన. ఎంకట్రాములు కిందకి దిగిండు. అక్కడ నాటుకచ్చిన పొలముంది. దాన్ని చూపిస్తూ, "నువ్వన్నది సరే. ఇది జూడు. దీన్ని ఎవ్వడు నాటెయ్యాలె. కైకిలోళ్లు దొరుకక ఇట్లనే ఉంది. కోతంటే మిషినితోని ఇట్లనో అట్లనో కోత్తం గని నాటెట్ల. నేననేది అదే.. ఇదే పండిందనుకో అందరు బతుకుతరు. గా నూర్రూపాయలిత్తె బతుకుతరా.. మట్టకు బెల్లం రాసి నాకుమంటె కడుపు నిండేదా మండేదా.. ఎన్ని రోజులిత్తవు.. ఎందరికిత్తవు.. బతుకుదెరువు జూపియ్యి. ఎవలకాళ్ళ మీద వాళ్ళే నిలవడుతరు.." అంటూ బండెక్కి, "ఇన్ని నీళ్ళో కరంటో ఇత్తె జాలు.. ఎవడూ పని అడుగడు," అన్నడు.

ఎంకట్రాములు ఆలోచనలు అట్లుండె. ఒక్కొక్కసారి నాతో వాదం బెట్టుకున్నట్టే మాట్లాడుతుండె. మంకురు మంకురు జేత్తుండె. ఇంట్ల మా అన్నగంతే. ఒక్కొక్కసారి ఎంకట్రాములు లెక్కనే జేత్తుండె. మాటలల్ల ఇద్దరిని తియ్యరాదు, పెట్టరాదు అన్నట్టుందురు.

ఒకసారి బాయి ఎండింది. బోరు ఏత్తనన్నడు. ఎన్నడు లేనిది కండ్లకు నీళ్ళు దీసుకున్నడు. అప్పు అడిగిండు. లెవ్వన్నమాట నోట్లెదాక వచ్చి ఆగింది. భయపడుకుంటనే ఇచ్చిన. ఇచ్చినంక అనుకున్న ఇవి నీళ్ళల ఏసినట్టే అని.

పంట మీద మొదలు నాకే ఇచ్చిండు. లోపలలోపల, 'అబ్బ వచ్చినయిరా' అనుకున్న. బయటకు మాత్రం మాట వరుసకన్నట్టు, "అయ్యో పారిపోదువా.. జెట్టన్నె ఇచ్చినవు" అన్న లెక్క వెట్టుకుంట.

"పతార ఉండాలె సారూ.. పతార.. మా బతుకులు బజార్ల దీపాలు. ఎప్పుడే గాలి వత్తదో తెలువది. అడ్డం బట్టుడుకు మీలాంటి రెండు చేతులుండాలె.." అన్నడు నవ్వుకుంట.

నవ్వుడు, నిబ్బరంగా ఉండుడు అతనికి పుట్టుకతోనే వచ్చినయనుకుంట. ఏసిన బోరు ఎండిననాడు, కరంటు షాకిచ్చి నీళ్ళు దాగుతున్న ఎద్దు సచ్చిన్నాడు, రాళ్ల వాన గొట్టి వరిగలుకలు జాడిచ్చిన్నాడు అతని మొఖంల నేను అదే నిబ్బరం చూసిన.

ఈ పదేండ్ల సోపతిల చాలా రోజులదాకా మా ఇద్దరి సోపతి అవసరాలు తీర్చుకునేదిగానే నేను చూసిన. లాంగ్ స్టాండింగ్ కింద నాకు సిరిసిల్లకు తబాదల (బదిలీ) అయిన్నాడు సమానంతా ట్రాక్టర్ల దెచ్చి ఇల్లు నింపిపోయిండు. చవితినాడు ఫోన్ జేత్తే ల్యాత కంకులు, బబ్బెరికాయలు, ఆకుపత్రి ఇచ్చిపోయిండు.

బిడ్డ పెండ్లి జేత్తున్ననని నాకు ఫోన్ జేత్తే జీబు కిరాయి మాట్లాడిచ్చిన. బట్టలు సామాన్లు తెలిసిన దుకాణంల ఇప్పిచ్చిన. ఎంకట్రాములు మా ఇంటి కత్తే నాకెంతో మురువతు. ఏదో పని అరుసుకుంటడని. నేను ఎంకట్రాములు ఇంటికిపోతే వాళ్ళకెంతో ధైర్యం, సారున్నడని.

సిరిసిల్ల కచ్చినంక ఆ తొవ్వ ఎరుగు దప్పినట్టయింది. ఫోన్‌ల మాట్లాడుకుంటుంటిమి. ఎంకట్రాములు మిస్‌కాల్ ఇస్తుండె. నేను ఫోన్ జేత్తుంటిని. అంతకు ముందు పొలం గురించి, పంట గురించి, బాధల గురించి చెబుతుండె. ఈసారి కొడుకు గురించే ఎక్కువ చెప్పుడు మొదలువెట్టిండు. వాడు డిగ్రీల ఫెయిలండట.

“వాడేదో తొవ్వల పడితే నా బరువు వోతుండె సారు.. సదువుకుంట లేడు. తిరుగుడు నేర్చిండు. నా బతుకు ఎట్టనో గడుత్తుంది. కనీసం వీడన్న ఏదో తొవ్వలపడితే బాగుండు గదా..?” అంటుండె.

మేము కలుసుకునుడు తక్కువయింది. ఎప్పుడన్నా ఇంటికి వోయినప్పుడు కలిసి పోతుం టిని. ఎంకట్రాములు ఏదన్నా పనిమీద సిరిసిల్లకు వచ్చినప్పుడు కలిసి పోతుండె. ఆమధ్య అల్లునికేదో ఆక్సిడెంటయిందట. కొడుకుని దుబాయి పంపిత్తనని పైరోవెట్టి (పైరవీ చేసి) లక్ష మునిగిండట. నీళ్ళులేక పొలం ఎకురం గూడా పారుతలేదట. కో–ఆపరేట్ బ్యాం కోళ్ళు అప్పుకోసం సక్తు జేత్తంద్రట.

ఒకసారి కాలిపోయిన మోటర్‌ను మెకానిక్ దగ్గరికి తెచ్చినప్పుడు ఈ కథంతా చెప్పిండు. మనిషిలో ముందటి తెగారం (తెగువ) లేదు. నవ్వులేదు. ఈడ్చుకపోయిండు. కొడుక్కు ఏదన్నా కొలువు చూడమన్నడు. ఏదో మీటింగు ఉండి నా ఆగంల నేనున్న. కనీసం ఇంటికి రమ్మని కూడా పిలువలేదు. ఇంకోసారి ఫోన్ చేసినప్పుడు ఇదే ముచ్చట చెప్పి కొడుకుకు ఏదన్న తొవ్వ చూపియ్యమన్నడు.

వాన్ని తోలుక రమ్మని డాక్టర్ చేతికింద ఉంచిన. నాలుగు రోజులుండలేదు. మెకానిక్ చేతికింద ఉంచిన. ఓనర్ మీదికే మర్రపడ్డడట. ఎస్టీడీ బూత్‌ల ఉంచిన. అందరికీ మిస్‌కాల్లు ఇచ్చుడు పెట్టిండట. కొరియర్ ఆఫీసుల ఉంచిన. ఎక్కడ పోగువొయ్య (కుదురు) లేదు. ఎంకట్రాములు మల్లా నా దగ్గరికి రాలేదు. బాలకిషన్‌ను తోలలేదు.

ఆరోజు నేను బడిలో ఉన్న లీజర్ పీరియడ్‌లో పిల్లల ఫేర్ కాపీలు దిద్దుతున్న. సెల్‌ఫోన్ రింగయింది. చూస్తే ఎంకట్రాములు. కట్ చేసి నేనే చేద్దామనుకుంటే మళ్ళీ మోగింది. ఎత్తిన.

ఎంకట్రాములు గొంతు ఎట్లో ఉన్నది. నోటి నిండా బుక్క వెట్టుకుని మాట్లాడుతున్నట్టు. "సారూ.. నా కొడుకు పైలం. అప్పుడప్పుడు తొంగిచూసి పొండ్రి. అప్పోసప్పో ఆదుకోండ్రి. వాన్ని మీ చేతుల వెడుతున్న. ఏదన్నా తొవ్వకు తేండ్రి" అని ఏడుత్తుండు.

ఏంది ఏమైందని అడిగినా చెప్పలేదు. అదేమాట. అదే ఏడుపు. ఫోన్ కట్టయింది. మళ్లీ జేత్తే స్విచ్ఛాఫ్. నా పెయ్యి మొత్తం జలజల పుట్టింది. గుండె దడదడమంది. సూదు సూదుమంట ఆరోజే ఆన్వెల్ ఇనుస్పెక్షన్. మేం మాడల్ లెస్సన్ తయారుచేసి పాఠం జెప్పుతుంటె పక్కబడి సార్లచ్చి అబ్జర్వేషన్ చేస్తరు. సాయంత్రం డిప్యూటీ డిఇవో వచ్చి చూస్తడు. లీవు వెట్టుడుగాదు. అద్దగంట అటీటుపోవుడు వీలుండది. చేతుల మూడు లెస్సన్ ప్లానులున్నయి.

ఏది ఏమన్నగానని పెద్ద సారు ఒప్పుకోకున్నా కాయిదం రాసి పెట్టి బయటపడ్డ. పొలం దగ్గరనే మంది గుంపుగా కనపడ్డరు. పోయి చూసినంక నేను మనిషినే కాలె. పొట్ట కచ్చిన చేనంతా ఎండిపోయి ఉంది. ఎండిన మడిలో ఎంకట్రాములు శవం. కొట్టుకొని కొట్టుకొని కండ్లు మూసినట్టున్నడు. వరి మొత్తం ఎండి ఇరిగిపోయింది. తలాపున ఓ దిక్కు సెల్‌ఫోన్. ఓ దిక్కు మందుడబ్బ. దు:ఖం ఆగలేదు. నేను మీదపడి ఏడ్చిన.

తెల్లారి పేపర్ నిండా వార్తలు. కరంటు కోతతోనే పొలం ఎండిపోయిందని పేపర్లు. కాదు.. భూమిల నీళ్ళు లేకే అని అధికారులు.

ఎంకట్రాములును మరచిపోవడానికి నాకు చాలారోజులు పట్టింది. అప్పుడప్పుడు ఇంటికి పోయి వస్తున్న. పోతూ పోతూ ఎంకట్రాములు చెప్పిన మాటలే నా చెవులల్ల మోగుతున్నయి. బాలకిషన్‌ను తోలుకచ్చి రెండు మూడు జాగల్ల పనిలపెట్టిన. ఎక్కడ వారం నెగులలేదు.

"ఆహా.. ఏం పొల్లగాన్ని దెచ్చినవు సారూ.. కందిరీగ. వీడు చేతుల కిందుంటే సాలు, నేనెవోసి అలుక్కున్నట్టె" అన్నరు.

నా మనసు ఇరిగింది. 'అయ్యోడుగాదు అవ్వోడుగాదు జంగమోన్ని పట్టుకుని జామేడ్సినట్టు ఈ పోరనితోని నాకేంది' అనుకున్న. నేను పట్టిచ్చుకోలేదు. ఈ పోరడు తొవ్వకు రాడు అనుకున్న. వాళ్ళమ్మ ఫోన్ చేసి ఏడుస్తుండె. నేను నచ్చజెప్పాలని చూస్తుంటిని. కాని వాడు చెడు మిత్ర మాట్లాడుతుండె. 'తీట వంగని కొడుకు. వాడే ఎన్నడో వత్తడు' అనుకున్న.

బాలకిషన్ రాలే. వాళ్లమ్మా ఫోన్‌జెయ్యలే. ఒకనాడు ఏదో పనిమీద ఊరికి పోతుంటే మాత్రం పొలంల కనవడ్డడు. దున్నుతున్నడు. నాకు చిత్రమనిపించింది. ఎంకట్రాములు గుర్తుకచ్చి బాధనిపించింది. బాలకిషన్ మీద కోపమచ్చింది.

బండి ఆపి పొలంలకు పోయిన. బాలకిషన్ నాగలి ఆపి నా దగ్గరికచ్చిండు. "దున్ని దున్ని మీ నాయన సచ్చిండు. ఇప్పుడు దున్ని నువ్వేం సంపాయించుకుంటననుకున్నవు. ఈ భూమిని జూత్తే నీకు విరక్తి పుడతలేదా," అన్న.

అంతా తండ్రి లెక్కనే. అదే తిక్క. అదేమాట. "భూమేం జేసింది సారూ.. పొడిబర్రె. మా తాతలు ఎట్ల బతికిండ్రు.. ముత్తాతలు ఎట్ల బతికిండ్రు. మా నాయినే ఎందుకు సచ్చిండు. భూమి మీద విరక్తి ఎందుకు సారూ.. భూమిని ఈ స్థాయికి తెచ్చినోళ్ళ మీద తిక్క పుడుతంది" అన్నడు.

"ఇగ నువ్వు తొవ్వకు రావు. ఒగలు చెప్పితే వినవు. నీది నీకు తెలువది. నీకు చెప్పుడు నాదే బుద్ధి తక్కువ" అన్న.

అన్నగని మనసు ఊకోలే. నాలుగైదుసార్లు ఇంటికిపోయిన. ఎవుసం వద్దని నచ్చజెప్పిన. వాల్లమ్మ గూడా వాన్ని పొమ్మని బతిమిలాడింది. బాలకిషన్ రాలే. ఇగ నేను గూడా పట్టిచ్చుకోలే.

✡

అగో.. అప్పుడు గనపడ్డ బాలకిషన్ మూడు నెలల కింద ఇంటికచ్చిండంటే ఇప్పుడు ర్యాలీల కనపడుడె.

నాకు ఒక రకంగా కోపమత్తుంది. ఒక రకంగా బాధ అనిపిస్తుంది. 'పోరడు పాడుగాను. ఎట్లయిపాయె. ఎందుకు పనికిరాకుంటాయె. ఎర్రటి ఎండల కాళ్ళు గాలంగ రోడ్లు పట్టుక తిరుగుతె అయ్యగానికి అయిమంటుంది'. టీవీల చూసి అనుకున్న.

అనుకున్నగనీ పాణం దరించలేదు. 'పిస్స పోరడు. వీడు తొవ్వకు రాడు' అనుకుంట ఎండ సల్లవడ్డంక బాలకిషన్‌ను దేవులాడుకుంట కరంటు ఆఫీసుకు పోయిన. ఇప్పుడు ధర్నా ఆర్డీవో ఆఫీసు ముందుకు మారింది.

కొనుగోలు కేంద్రాలు చాలు జెయ్యాలని ధర్నా జేత్తండ్రు. బాలకిషన్ ఆర్డీవోను నిలవెట్టి అడుగుతుండు. ఆర్డీవో నీళ్ళు మింగుతుండ్రు. అయిపోయినంక పక్కకు పిలిచిన. నేను చెప్పవోతుంటే నాకే చెప్పిండు. "ఏ వ్యవస్థకు మెడలు దించి మా నాయిన సచ్చిండో ఆ వ్యవస్థ మెడలు వంచి నేను బతుకుత. మీకు చెప్పాలనిపిస్తే ఆ తొవ్వల నాలుగు మాటలు చెప్పండ్రి" అన్నడు. బాలకిషన్ చూపు మారింది. మాట మారింది.

నెలరోజుల తరువాత రైతులు విత్తనాల కోసం గోడౌను మీద దాడి చేసిండ్రట. పేపర్ల వార్త చూసిన. బాలకిషన్ ముందటనే ఉన్నడు. నాకు దస్సుమంది. 'ఘూ.. నీయవ్వ.. వీడా.. వీడిగ తొవ్వకే రాడు,' అనుకున్న.

✡

# తిరగబడ్డ భూమి

**– ఉప్పల నరసింహం**

“ఊర్లెకు గిర్దావర్ వొస్తే ఆని సుట్టు దిర్గాలే. అమీన్ సాబొస్తే ఆని ఎనక దిర్గాలే, తహసిల్దారొస్తే సంకల కట్టె యిరికిచ్చుకుని సాకలిండ్లు, సాలిండ్లు, ఎర్రలిండ్లు, ఎనాదిలిండ్లు తర్వాయిన తిర్గాలే – ఈల్లుగాక యెల్లిగాడు, మల్లిగాడు యెవడొచ్చినా ముందుగాల నాపంగ పల్గుతది – నీళ్ళు దెచ్చుడు కాడ్నుంచి, కట్టెలు కొట్టేదాకా యిరాం లేకుంట, రెక్కకు శైన్ లేకుంట గాడ్దిలెక్క ఒకటే పనాయే నీయవ్వ, పనికున్నవారేతు.. అరె. జెరంతనన్న ఈశెత్త (శరీరం)కు ‘ఇరాం’ ఇయ్యాలే! ఎక్కడ్డి? ఎద్దుకు ముల్లుగర్ర పొడ్సినట్టె ఈడుగాకుంటె ఆడు. ఆడుగాకుంటె ఈడు ఊడిబట్టనే ఉంటరు – ఒంగడు గాకుంటె ఒకడు పని శెప్పుడేనాయే.. నీయవ్వ బతుకుకున్న వారేతు..”

అని కావలి ముత్యాలు స్వగతంలో గొణుకుంటూ వడివడిగా ముందుకు అడుగు లేస్తున్నాడు.

తనలో పెల్లుబుకుతున్న కోపాన్ని, చిరాకును, అసహాయతను, ఆవేశాన్ని మరో రూపంలో వెళ్ళగక్కలేక ముత్యాలు ప్రతిసారి ఇలాగే గొణుగుతూ పనిచేస్తాడు. ఆ బలహీనత తెలిసి చెప్పేవాళ్లుకూడా ఇంకా కొన్ని పనులు ఎక్కువ చెపుతూనే వుంటారు. ముత్యాలు తెగించి ఒక్క మాట కూడా తనపైవాళ్ళను అనలేడు.

కావలి ముత్యాలు చేతిలో కర్ర వుంది – ఆ కర్రకు ఒకవైపు ఇనుముతో తయారు చేసిన ‘బాకు’ దిగేసివుంది, దాన్నే బరిసెకర్ర అంటారు. తన నడకకు అనుగుణంగా బరిసెకర్ర వూపుతూ నడుస్తూ ఉన్నాడు. కావలి ముత్యాలు నడుస్తున్నప్పుడు లయబద్ధంగా ‘బాకు’ కదలడం ఎంతో హుందాగా వుంది. రాజుల యుద్ధాలలో ఆరితేరిన సైనికుడిలా వున్నాడు.

ఎడమ భుజంపై గొంగడి జారుతున్నప్పుడల్లా ఎగదోసుకుంటూ అడుగులేస్తున్నాడు. ఎడమచేతికి వున్న వెండి ‘కడెం’ ఎండకు ‘తళుక్కు’ మంటోంది. ఎడమచేతి వేలికి వున్న రాగి ఉంగరం సూర్యకిరణాలు పడినప్పుడల్లా మెరుస్తూ వుంది.

పిడికెడు పిడికెడు మీసాలు, వెడల్పయిన మొఖం, తలకు రుమాలు, చెవి ప్రక్కన సగం కాల్చిన మొదుగాకు ‘చుట్ట’, చెవికి రాగిపోగు, పైకి ఎగకట్టిన ముతక ధోవతి, అక్కడక్కడ

చిరిగిన ముతక కమీజు, చెప్పులులేని కాళ్ళతో బలంగా అడుగులేస్తూ, కావలి ముత్యాలు స్వగతంలో గొణుగుతూ నడుస్తూ వున్నాడు.

తెలంగాణ ప్రాంతం గ్రామాల్లో దుష్ట చతుష్టయంగా పేరుమోసిన సర్పంచ్, పట్వారి, పోలీస్ పటేల్, మాలిపటేల్ అధికార్ల ఆజ్ఞలను పాటిస్తూ, వారి వారి ఇంటి పనులుగూడా చేస్తూ, పై అధికారి ఎవరైనా వస్తే వారి సకల సౌకర్యాల ఏర్పాట్లలో తల మునకలయ్యే 'కావలి' వాళ్ళలో ఒకడు ఈ కావలి ముత్యాలు – (కొన్ని ప్రాంతాలలో వీరిని 'మస్కూర్' అనిగూడా అంటారు.)

ఈ గ్రామాధికార్లు, మోతేబరులు ఈ కావలివాళ్ళతో తమ ఇంటి పనులు ఎక్కువగా చేయించుకుంటూ వుంటారు. వాళ్ళు తమ అసంతృప్తిని ఎలా తెలియజేయాలో తెలియక ఒంటరిగా ఉన్నప్పుడు తిట్టడమో, గొణుక్కోవడమో చేస్తూ వుంటారు. ముత్యాలు గూడా అదేరకమైన అసంతృప్తిని పట్వారివద్ద వెళ్ళగక్కలేక నడుస్తూ... 'నీ యమ్మ కూరుకు పొద్దుగాల లేశి పంతులు (పట్వారి) ఇంటిముంగట దీటి సలామ్ చేస్నాగాని కైకర మొఖపోడు కసురుకుంటనే వుండడు" అని గొణుగుతూ గొల్ల కొమ్రయ్య ఇంటిముందు ఆగాడు.

వాకిట్లో ఎవరు కనిపించకపోయేసరికి "ఓ.. కొమ్రయ్య బావా.." అని పిలుస్తూ ఇంటి వసారాలోకి వచ్చాడు ముత్యాలు.

గొల్ల కొమ్రయ్య గొర్రె బూరుతో దారం వడుకుతూ కూర్చున్నాడు– కావలి ముత్యాలును చూసి 'నువ్వా?' అని 'కూసో, అట్ల పీటమీద కూసో' అన్నాడు నిదానంగా.

"నేనేం కూసుంతందుకు రాలేదే బావా!"

"పనిమీదనే వస్తే వస్తివిగాని కూసో రాదోయ్!" – కొమ్రయ్య.

"బయట పనుంది, జెల్ది పోవాల్నే" – ముత్యాలు.

"ఏహే.. పోదువు కూసోవొస – ఎప్పుడొచ్చినా గుర్రంమీదనే వస్తవు. పోకుంటే వుండి పోమంటలేనుగని కూసోని సంగతేందో శెప్పు" అన్నాడు కొమ్రయ్య దీర్ఘం దీస్తూ.

ముత్యాలు వసారాలోని గుంజకు ఆనుకుని కూర్చున్నాడు.

కొమ్రయ్య బుడ్డ గోచితో, కింద గొంగడి వేసుకుని కూర్చుని, తొడకు దారం వడికే ఏకును గట్టిగా రుద్ది తిప్పుతూ, కొర్రెబూరుతో దారం తీస్తున్నాడు. తలకు రుమాలు, చెవికి రాగిపోగు, చేతికి వెండి 'దండె కండెం' వుంది. రెండు చేతుల వేళ్ళకు రాగి వుంగరాలు వున్నాయి. నడుముకు వెండి గొలుసు వ్రేలాడుతూ వుంది. దాంతోపాటు పొగాకు తోలుసంచి వ్రేలాడుతూవుంది. కమీజు లేదు, ఛాతిమీద వెంట్రుకలు కూడా తెల్లబడ్డాయి. పిక్కలమీద చర్మం ముడతలు పడింది. మనిషి చూపులకు బలంగానే కనిపిస్తున్నాడు. మీసాలు మరింత గంబీరాన్ని తెచ్చిపెట్టాయి కొమ్రయ్యకు.

పేడ, ఎర్రమట్టి కలిపి వసారాలో అంతకుముందే అలకడంవల్ల ముత్యాలుకు అదోరకమైన తీయటి వాసన వస్తోంది. ఆ వాసనే గాకుండా ప్రతి గొల్ల కుర్మవాళ్ళ ఇంట్లో వచ్చే 'గొర్రెలమంద' వాసన వస్తోంది.

కొమ్రయ్య దారం వడుకుతూనే "ఆ ఏందోయ్, ఏం పనిమీద వచ్చినవ్ – ఏంది కత – హు..' అన్నాడు. ఆ గొంతులో బావ, బావ మరదుల వరసతో కూడిన పరాచిక భావం ద్యోతకమైయింది.

కావలి ముత్యాలు చెవి వెనకాల వున్న చుట్టతీసి చేతిలో పట్టుకోని–

"ఏంది ఏందే, పోయిన బేస్తారం పంతులు పన్ను గట్టుమన్నడని శెప్పేపోతి నీకు – నీకు అంతగనం శెప్పినా శెవుమీద 'పేనే' పారలేదు. ఆడ దినాం పంతులు నన్ను తిట్లు పెడుతుండు. 'శెప్పినావ్‌రా కొమ్రిగానికి శెప్పొచ్చినావ్‌రా' అని అడిగితే శెప్పినపంతులు, శెప్పినపంతులు అని శెప్పవట్టి– నువ్వేమో ఈడ అకరు పికరు లేకుండా జీవాలను సూసుకుంట, దారం ఏకుకుంట నిమ్మలంగ కూసుంటివి. నీ పని పరాకత్ గుంది. నేనేమో వానితోని, వీనితోని తిట్లు పడుకుంట నిష్ఠూరంగావాలే.. నీయవ్వ" అన్నాడు నిష్ఠూరంగానే.

"అరె, శెప్పినవ్‌రా, శెప్పలేదని అంటలేను గదరా.."

"శెప్పినవంటవు, పన్ను గట్టకపోతివి, వారం దినాలయిపోయె. ఆడ పంతులు నామీద గరమయితండు. ఏమనబోయినా కష్టమే, నిష్ఠూరమే. ఇక సప్పుడు జెయ్యకుంట, ఎన్ని అన్నా పడుతున్న, ఏం జెయ్యాలే ఎక్కడ సక్కి లేక 'కావలితనం' సేశినట్టుగున్నది. అండ్ల వచ్చేది ఏం లేదు. 'పైకం భాగోతులోనికి, తిట్లు మంగలోనికి' అన్న శాస్త్రముంది నా కత" హెచ్చుస్వరంతో అన్నాడు కావలి ముత్యాలు.

"అనంగానే పైసలు ఎల్తయా? నీ కతగాని రెండురోజులు అటూ, ఇటూ అయితది. పన్నులు గట్టకుంటే వూకుంటరా? కడతమోయ్ బామ్మర్ది!.." అన్నాడు కొమ్రయ్య 'బామ్మర్ది' అన్న పదాన్ని వత్తి పలుకుతూ.

కావలి ముత్యాలు చుట్ట మొదలను వొత్తుతూ "జెరంత ఇంగలమైతే ఇయ్యి" అన్నాడు.

గొల్ల కొమ్రయ్య దారం వడికే 'ఏకు'ను గట్టిగా తొడకు రుద్దుకుని వదిలేసి పొగాకు సంచిలోనుంచి కొంత జెకముక దూది, రాయి ముత్యాలు వైపు విసిరాడు. ఈ లోపుగా ఏకు గిరగిరా తిరిగి దారానికి 'కరి' పడింది. కొమ్రయ్య ఏకును అందుకుని దారాన్ని ఏకుకు చుట్టాడు.

ఎడమ చేతిలో వున్న గెర్రె బూరు, కుడిచేతిలో వున్న ఏకును కిందపెట్టి కొమ్రయ్య రుమాల్లో వున్న కరకు చుట్ట తీసాడు. తానూ రెండు బుక్కలు చుట్ట తాగుదామని– ముత్యాలు

జెకముకతో అగ్గిజేసి కొంత తన చుట్ట మొదట పెట్టుకుని, కొంత అగ్గి కొమ్రయ్యకు ఇచ్చి, తను గట్టిగా రెండు దమ్ములు లాగాడు.

కొమ్రయ్య ముత్యాలు ఇచ్చిన అగ్గిని చుట్ట మొదట పెట్టుకుని తల వంకరగా పెట్టి, నిప్పుకింద పడిపోకుండా గట్టిగా పొగపీల్చాడు. ఆ తరువాత ముత్యాలు వద్దనుంచి జెకము కరాయి తీసుకుని తన సంచిలో వేసుకుని ఏకును, గొర్రెబూరును చేతిలోకి తీసుకున్నాడు. చుట్ట నోట్లోనే వుంది.

ముత్యాలు గట్టిగా పొగపీల్చిన తరువాత వాకిట్లోకి ఉమ్మి–

"పైసల్ లేవంటవూ? మొన్ననేగదా జీవాలమ్మినవ్? పైసలేం జేస్తివి ఇంతెలమే?" అని అడిగాడు.

కొమ్రయ్య పక్కకు వున్న బూడిద పోసిన చిన్నడబ్బాలో వూసి,

"జీవాలమ్మితే ఏం ఫాయిదయింది– కట్టెటోనికి గట్టి, ఇచ్చటోన్కి ఇస్తి– తెచ్చేటివి తెస్తి. ఇంక వున్నాయి? పోయిన శివరాత్రి లగ్గాలల్ల శిన్నపొల్ల పెండ్లిజేస్తె ఐదువేల ఖర్చయింది. మల్ల అత్తగారు ఏం బెట్టలేదు, ఏం బెట్టలేదు అని శెప్పక తిర్గుతనేవున్నర్. సావుకారి దెగ్గర దెచ్చిన అప్పు ఇంక తీరనేలేదు. సాలాయన దెగ్గర తెచ్చిన బట్టల పైసలు ఇంక ఇయ్యనేలేదు. ఎన్ని జీవాలమ్మితేమి, ఎన్ని గొంగళ్ళమ్మితేముంది? ఏడి కాడికే అయితుంది సంసారం" అన్నాడు.

"మరి ఎట్లజేస్తనంటవ్ పన్నుల సంగతి?"

"ఎట్లజేశేది ఏముంది? పెద్దపోరడు ఐలయ్య అత్తగారింటికిపోయి ఏడు దినాలాయే– రేపొస్తడో మాపొస్తడో అని రోజూ యెదిరి సూస్తున్నం. ఆడు రాంగనే కద్దం పో. కట్టకుంటె యాడికన్న దెంకపోతమా?" కొమ్రయ్య.

"యాడన్న దెంకపోవుడు సవాల్‌గాదు. ఇయ్యాలగాకంటే రేపుగట్టవు పన్నులు గట్టక వూకోవుగాని, ఆడ రాకాసి మొఖపోడు పట్వారి వూకుంటాడా? 'ఏమాయెరా? పొయొచ్చి నవా? వసూలు చేస్కొచ్చినవా?" అని అడుగతడు. 'ఇయ్యాళ రేపట్ల గట్తనన్నడు పంతులు' అంటే ఇగ మోటుకూతలు కూస్తడు. నీ తల్లి ఇద్దరి పొత్తుల నేను సొట్లు దినాలే' అని కావలి ముత్యాలు వాకిట్లోకి వూసి, చుట్ట త్రాగడం ప్రారంభించాడు.

"నా దిక్కు కేలి నువ్వెందుకు సొట్లు దింటవొయి? నేనొచ్చి పంతులును కలుస్తపో. పొద్మీకె జాముల పంతులు ఇంటకొచ్చి కలుస్తఫో" అన్నాడు ఏకును తొడకు రుద్దుకుంటూ కొమ్రయ్య.

"వొస్తే వచ్చి మాట్లాడ్తవేమోగాని, దుర్గక్క కనిపిస్తలేదు యింట్ల?" అని అడిగాడు కావలి ముత్యాలు.

“పెద్దపోరడు లేకపాయే, రాత్రిళ్ళు చిన్న పోరడు, కిష్టయ్య పటేలు పొలంల మంద పెట్టిండు. పోరన్కి సద్ది తీస్కపోయింది. వస్తుండొచ్చు. శాలసేపయింది పోయి” కొమ్రయ్య.

“జెరన్ని జొన్నలు పెట్టకపోయినవ్ బావా. తమామ్ తింతందుకు లేకుంట అయినయ్” ముత్యాలు.

“జొన్నలు ఏడియోయ్. మేమే కొనుక్కోని తింటున్నం. మొన్ననే పాపిరెడ్డి దగ్గర పావుపళ్ళ జొన్నలు కొనుకొచ్చిండు పెద్దపోరడు. అవి దుడిశి పోయినయ్. ఎండవోశి, శేశి, యిసురుకోని రొట్టె చేస్తున్నది మీ యక్క” కొమ్రయ్య.

“శెల్కల పండిన జొన్నలేమాయో బావా? అప్పుడే అయిపోయినాయి?” గాలికి తనవైపుకు వచ్చిన గొర్రె బూరును కొమ్రయ్య వైపుకు వేస్తూ అడిగాడు ముత్యాలు.

“శెల్కల ఏమంత పండినయోయ్ పిలగా! రోణికార్తిల (రోహిణి కార్తెల) వాన గొట్టె. కాలుకు శేతికి యిరాములేకుంట పొద్దు, మాపు ఇంటిల్లాదులం మర్లాడి దున్ని మక్కజొన్న అలికితే, తల జుట్టు లేశేయాళ్ళకు జోరు ఎండలు గొట్టె. ఒక్క వానగూడా కొట్టకపాయె, కంకెడు కంకెడు కంకి అయితదనుకుంటే పిడ్సకట్టుకపోయినట్టయింది. శెట్టు పైకి లేవకనే పాయె. ఇగ పెరిగిన కంకులు వాకిట్ల మంచె మీద రెన్నెల్లు వుండె. సొప్ప జెరంత అమ్మి, జెరంత ఉంచుకుంటి. ఇక మా సడ్డుకుడు పడమటికేలివచ్చి.. ‘కాలంగాలేదు ఎడ్లు సచ్చిపో తున్నయ్’ అని శెప్పి ఆ యింత సొప్ప, ముత్తుం మక్కజొన్నలల్ల కేలి ఓ తూమెడు మక్కజొన్నలు తీసుకపోయిండు. మిగిలిన జొన్నలు మొన్నటిదాక మాకే ఒడిశి నయ్. అవి అయిపోయనంకనే పెద్దపోరడు పావుపళ్ళ తీస్కొచ్చిండు” అని కొమ్రయ్య డబ్బాలో వూసాడు. ఉమ్మి వూసేప్పుడు మీసాలకు అంటుకున్న తడిని రుమాలు కొసతో భుజంతోనే తుడుచుకున్నాడు.

కావలి ముత్యాలు చుట్టను నేలకు రాసి, కిందరాలిన అగ్గిని కాలితో రాసి, కరుకు చుట్టను తిరిగి చెవి వెనకాల పెట్టుకుని వాకిట్లోకి వూసాడు.

ఇంతలోనే తలపై తట్టతో దుర్గమ్మ వచ్చి “బాగున్నావురా ముత్యాలు?” అని పలకరించింది.

“ఆ.. బావున్ననక్కా!” ముత్యాలు.

“మా మర్దలు బాగుందా? పోరలు ఎట్టున్నరు?”

“అందరు బాగనే వున్నరక్కా!” ముత్యాలు.

“శాల దూరం వచ్చినవేం తమ్మి” – దుర్గమ్మ

“బావదగ్గర్కే వచ్చిన”

“అట్లనా?” అంటూ దుర్గమ్మ ‘జారట్లో’ కాళ్ళు కడుక్కొని తట్టతో ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"ఈసారి కాలమెట్లుంటదంటవే కొమ్రయ్య బావా?" అని అడిగాడు ముత్యాలు కొమ్రయ్య వైపు చూస్తూ.

"కాలం సంగతి ఎట్ల చెప్పొస్తదిరా ముత్యాలు" రెండేడ్ల నుంచైతే శెరువునిండకపాయె. శెల్కలల్ల పంటలు గూడా గట్ల గట్లనే వుండె. శెరువుకింద పొలాలు అల్కకుంట అయితిమి. పనిపాటలోళ్ళయినాము. భూములల్ల శెట్లు మొల్వవట్టే. ఈసారైనా వానలు గొట్టి శెరువు నిండితే ఏమన్న బతుకుదెరువైతది. లేకపోతే పుణ్యానికి సస్తరు మంది" జ్యోతిష్యం చెప్పినట్టు చెప్పాడు కొమ్రయ్య దారం వడుకుతూ.

"నీయవ్వ.. నేనైతే ఉరివోసుకుని సచ్చేటట్టుందే ఈసారి వానలు కొట్టకపోతే. రెండేండ్ల నుంచి పొలంల అల్కుడులేకపాయె. కళ్ళాల కాడ ఇంత బిచ్చమోలె ఇన్ని గింజలు దొరుకు. అవికూడా కరువైపాయె. మూన్నెల్ల నుంచి జీతం పైకం రాకపాయె. పైస పైసకు ఎంత తక్లీబ్ అయితుందో ఆ పరమాత్మునికే ఎరుక. అదల్ బదల్ ఎంత కాలమని దెచ్చి ఎల్లదీస్తం? ఈ బాధలు, కష్టాలు పడలేక ఎక్కడైనా దెంకపోదామన్నంత యాష్టొస్తుంది. 'వొంగలేనోడు దొంగల్ల పోయిండ'ని బదులాము యేడ పడుదునని ఇజ్జత్‌కు అన్ని బాధలు వోర్చుకుని బతుకుతున్న.." బొంగురుపోయిన గొంతుతో అన్నాడు ముత్యాలు.

"మూన్నెల్ల నుంచి జీతం రాలే బావా నీకు?" అని అడిగాడు కొమ్రయ్య. ఆ గొంతులో ఆశ్చర్యం కనిపించింది.

"నీతోటి అబద్ధమాట్తాను. రాలేదు బావా! మూన్నెల్ల నుంచి పొయ్యిలకు– పొయ్యిమీదికి శిన్న తక్లీబ్ అయిత లేదు. గిజగిజానుకుంట కాలం ఎల్లదీస్తున్నం. అది (భార్య) ఒక్క తీ ఎంతగనమని కష్టపడ్తది. ఒక్క రెక్క మీద సంసారం ఎల్లాలంటే ఈ కరువుగొట్టు దినాలల్ల ఎల్తాది?" అని దీనంగా అన్నాడు ముత్యాలు.

"మరి అడుగొద్దురా పట్వారిని" కొమ్రయ్య.

"అడిగిననే"

"ఏమంటడు మరి?"

"ఏమంటడు, తశీల్ నుంచీ ఇంక రాలెదంటడు. గిట్ల తక్లీబ్ అయితుంది. పంతులూ అంటే నన్నేం జెయ్యమంటవ్‌రా అన్నడు. ఒక్కసారి అడిగితి, రెండుసార్లు అడిగితి. అడిగినప్పు డల్ల గట్లనే అనవట్టే ఇక అడుగొద్దని సాలిచ్చుకున్న"

"తశీల్ (తహసిల్ ఆఫీసు) కన్నపోయి గిట్ల గిట్ల సంగతని శెప్పనుంటివి?" కొమ్రయ్య సలహాఇచ్చాడు.

"నాకు సదువొస్తదా, గిదువొస్తదా? ఎడంటి ఫిర్యాదు జెయ్యాలె. ఎడంట మొత్తు కోవాలే?

ఎటు తోస్తలేదు. ఈ ఐదారు రోజులు సంది అయితే పిచ్చిలేశినట్టుంది. ఏ పని చేయబోదామన్నా మనసుకు పడ్తలేదు. బెచైన్ బెచైన్‌గుంది"

తన బాధలు, కష్టాలు చెప్పుకోవడం వల్ల ముత్యాలుకు ఉదయం నుంచి ఉన్న బరువు తగ్గుతున్నట్టనిపించింది. తనలో వున్న కోపం, ఆక్రోశం, అలసట మంచులా కరిగిపోతున్నట్ట నిపించింది. ఆ ఉత్సాహంతోనే రెండడుగులు ముందుకు జరిగాడు. కింద గొంగడి జరుపుకుని కొమ్రయ్యకు దగ్గరగా కూర్చున్నాడు.

"మరి ఎట్ల జేస్తననుకుంటున్నవ్‌రా?" కొమ్రయ్య.

"ఏం జెయాల్నో తోస్తలేదే. నువ్వన్న శెప్పు, ఎట్లజేస్తే బాగుంటదో?" అని అడిగాడు ముత్యాలు.

"ఎట్లజేస్తవేంది. మనూర్ల మొన్న 'సంగం' బెట్టింద్రుగదా, సంఘంల వున్నోలను యిశా రియ్యి. వాళ్ళు ఏమంటరో తెలుస్తది." కొమ్రయ్య.

"సంగంల శేరినోళ్ళంతా మనుషులను సంపేటోల్లు, దోసుకునేటోళ్ళు అని మొన్న మా పంతులు ఎవరితోనో అంటుంటే యిన్న. ఆళ్లను యిశారిస్తే అయితదంటవా? నీ లెక్కనే మొన్న మా పాపయ్య మామ గూడా అన్నడుగాని నేను మనసు మీద పెట్టలే" తన సందేహాన్ని వ్యక్తం చేశాడు ముత్యాలు.

"మీ పంతులుజేసే దొంగ లెక్కలకు ఖిలాఫ్‌గా కొట్లాడేటోళ్ళు ఎట్ల దోసుకుంటారురా నీ మాటలుగాని. మా తమ్ముని కొడుకు బీరప్పగాడు సంగంల జేరిండు. యిప్పుడు ఆడే సంగంల పెద్దనంట. ఆడు మనుషులను సంపుతాడా? ఆని గుణం నీకు గుర్తే కదరా! నువ్ పోయి వాణ్ణి కలువ్. నీకు అన్ని సంగతులు యిప్పి జెప్పుతడు" అని కొమ్రయ్య వివరించి చెప్పాడు.

కావలి ముత్యాలుకు ఏదో కాంతి కిరణం కనిపించినట్లయింది. తాను చీకటిలో లేనని తోచింది. తనకు ఆసరాగా, ఊతగా ఒకరున్నారనిపించింది. అలా అనిపించేసరికి మనసు కాస్త కుదుటపడింది. కళ్ళు మెరిశాయి. అప్రయత్నంగా కళ్ళల్లోకి నీళ్ళు వచ్చాయి. గొంతు పొరమారినట్టయింది. కాస్త సంతోషంతో ఉక్కిరి బిక్కిరవుతూ.

"అయితే బీరప్పగాడిని కలువుమంటవావే?" అని అడిగాడు.

"కలుస్తనే మల్ల ఏదైన తోవ బుట్టది, నువ్వు వూకుంటే గిట్లనే కాలం గుజురాయించి పోతది. నిన్ను గోశిల ఏసుకపోతరు" అన్నాడు కొమ్రయ్య.

కావలి ముత్యాలుకు బీరప్పను కలవాలన్న కోరిక బలపడింది. అలా అనిపించడం వల్ల కొండంత బలం వచ్చింది. గుండెలమీద అంతవరకు గుండులా వున్న బరువు తొలగించి నట్టయింది. శ్వాస సునాయాసంగా తీసుకుంటున్నట్టు అనుభూతి చెందాడు.

"అయితే నేన్ పోయొస్త బావా!" ముత్యాలు.

"పోయొస్తవా?.. ఆ అట్లనే కొనింటి నర్సిరెడ్డి శెవులగూడ ఎయ్యి ఈ ముచ్చట – ఇద్దర్ ముగ్గురు శెవుల ఏస్తెనే మంచిది ఏ ముచ్చటైన" మరో సలహా ఇచ్చాడు కొమ్రయ్య.

"మంచిది. పొద్మీకి కలుసుకోని శెప్త" అని ముత్యాలు లేచాడు. కిందనున్న గొంగడి భుజంపై వేసుకున్నాడు. పక్కకు పెట్టిన బరిసె కఱ్ఱను తీసుకుని "ఇగ మరి నేన్ పోయొస్త బావా" అన్నాడు.

"మంచిది – పొద్మీకె జాములు వచ్చి పంతుల్ను కలుస్త ఫో"– కొమ్రయ్య.

"నీ యిష్టం– నేన్ పోతున్నా.."

"ఫో.. ఫో.."

కావలి ముత్యాలు అటు, ఇటు చూడకుండా పరుగులాంటి నడకతో పట్వారి ఇంటికి చేరాడు.

పట్వారి ప్రహ్లాదరావు వసారాలో కుర్చీ వేసుకుని కూర్చున్నాడు. అతని పక్కన మరో కుర్సీలో ఆ ఊరి స్కూల్ టీచర్ రామారావు కూర్చున్నాడు. కొద్ది దూరంలో కావలి చంద్రయ్య నిలబడ్డాడు. ప్రహరీగొడ ఈవల ఇద్దరు ముగ్గురు రైతులు నిల్చున్నారు.

ప్రహ్లాదరావు ఇంట్లోనుంచి సన్నగా రేడియోలో పాటలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు ప్రహ్లాదరావు భార్య లక్ష్మమ్మ కేకలు వినిపిస్తున్నాయి.

రామారావు, ప్రహ్లాదరావు మాట్లాడుకుంటుండగా కావలి ముత్యాలు గేటువద్దకు వచ్చాడు.

కావలి ముత్యాలును చూడగానే "ఏమాయెరా? పోయొచ్చినావరా ఆ కొమ్రిగాని దగ్గర్కి?" అని అడిగాడు ప్రహ్లాదరావు.

కావలి ముత్యాలు కిందకి చూస్తూ చేతిలోవున్న కఱ్ఱతో కింద పొడుస్తూ "పోయొచ్చిన పంతులు– అప్పటికొచ్చి కలుస్తనన్నడు" అని చెప్పాడు.

"వాడు ఏమనుకుంటుండు ఇంతకు? పది రోజుల సంది పన్ను గట్టుమంటే నీల్గుతున్నడేంది? ఇంతకు నువ్వు పోయినావా, లేదా?" ప్రహ్లాదరావు.

ముత్యాలు మనసు చివుక్కుమన్నది. పుండుమీద కారం చల్లినట్లయింది. ఒక్క క్షణం పట్వారివైపు సూటిగా చూసి,

"నా పిల్లలతోడు పంతులు. ఇప్పుడు ఆడికేలే వస్తున్న" అని కుడిచేతిని తలపై పెట్టుకున్నాడు.

"మరి ఆడికేలి వస్తున్నోనివి తన్నుకుంట గుంజుకరావొద్దురా ఆ కొమ్రిగాణ్ణి. ఇంత బీడి, సుట్ట దాగి సల్లబడి వొచ్చినావ్– నిన్ను వసూలు చేసుకురమ్మని తోలిన్నా? లేక ముచ్చటపెట్టిరమ్మని తోలిన్నారా కావలోడా?" కోపంతో అన్నాడు పట్వారి.

ముత్యాలుకు కూడా కోపం వచ్చింది– కాని పెదవుల మధ్యనే ఆ కోపాన్ని బిగపట్టి "ఎంత శెప్పాల్నో అంత శెప్పిన, ఇయ్యకుంటే నేనేం జెయ్యాలే పంతులు?" అన్నాడు.

"శేతులు లేనోళ్ళయి పీకాలే– ఏంజేస్తడంట, ఏంజేస్తడు – నువ్ ఎందుకున్నవ్‌రా చెప్పినవి శెయ్యకుంటె? ఆణ్ణి తన్నుకుంట గుంజుకరానుంటివి. వాని అయ్యసొమ్మా? అమ్మసొమ్మా? పన్నులు గట్టకపోను. ముందుగాల నిన్ను రెండు తల్గిస్తే పన్నుల పైసలు అవంతల అవే ఉరుకొస్తయ్!" అన్నాడు ప్రహ్లాదరావు కుర్చీలోంచి ఒక్కసారిలేచి. కళ్ళు ఎర్రగా మారాయి. తిట్టేటప్పుడు గొంతువద్ద నరాలు పొంగుతున్నాయి.

రామారావు, కావలి చంద్రయ్య ముత్యాలువంక దీనంగా చూసారు.

కావలి ముత్యాలు పొంగుకొస్తున్న కోపాన్ని ఆపుకుని ఒక్కసారి ప్రహ్లాదరావు వంక తలెత్తి చూశాడు. వెంటనే ప్రహ్లాదరావు–

"మెదల మీదికేసి సూస్తవేంది కావలి లంజకొడుకా! నీ తల్లీ, పెండ్లాన్ని పట్టుకుని.." అని బూతులు తిట్టాడు.

కావలి ముత్యాలు మొఖం ఎర్రబారింది. కళ్ళలో ఉక్రోషం బుసలు కొడుతోంది. ముక్కుపుటాలు ఎగురుతున్నాయి. చేతిలో కర్ర బిగుసుకుంటోంది. పాదాల క్రింద భూమి నలిగిపోతోంది. దేహమంతా వేడివల్ల పొగలు గక్కుతున్నట్టనిపించింది. ఆ చండ ప్రపంచమైన కోపంతోనే ప్రహ్లాదరావు వంక అలాగే చూస్తూ నిల్చున్నాడు. తరతరాలనుంచి వస్తున్న బానిసత్వాన్ని ఒక్కసారి తెంచుకోలేక...

కావలి ముత్యాలు అలాగే చూడడంతో పట్వారి సహనం దెబ్బతిన్నది. తన అధికారాన్ని ఎదిరిస్తున్నట్లనిపించింది. తన గౌరవాన్ని పెల్లగిస్తున్నట్టనిపించింది. ఆ కోపంతోనే "ఇంకా సూసుకుంటా నిలబడ్డవేందిరా లంజకొడకా– ఫో– బయటకు ఫో – నీ తాశిలి మొఖం..." బూతులు తిట్టాడు.

ముత్యాలు కదలలేదు – చూపులు కదల్చలేదు. ఆ చూపులకే శక్తి వుంటే ప్రహ్లాదరావునే గాదు ఆయన ఇంటిని గూడ కాల్చేయగలవు.

ఆ చూపులు ప్రహ్లాదరావు కోపానికి అగ్గిమీద గుగ్గిలం వేసినట్టయింది. ఫట్వారిని రెచ్చగొట్టాయి. ముత్యాలు అంతు చూడాలని మనసు ముందుకు తరిమింది. వెంటనే కుర్చీకి వ్రేలాడేసిన తన తండ్రి వూతకర్రను తీసుకుని ఆవేశంతో ఊగిపోతూ రెండు అడుగులు

ముందుకేసి ముత్యాలు వొంటిపై నాలుగు దెబ్బలు బలంగా వేశాడు. మరో దెబ్బ వెయ్య బోయేసరికి ముత్యాలు పట్వారి కర్రను అందుకుని రెండు ముక్కలుజేసి అవతల పారేసాడు. బాకు దిగేసిన తన బరిసె కర్రను ఎత్తాడు. అంతే – పట్వారి పరుగు పరుగున ఇంట్లోకి పరుగుదీశాడు. ఇంతలోనే రామారావు, కావలి చంద్రయ్య, గేటు ఈవలవున్న రైతులు అందరూ వచ్చి కావలి ముత్యాలను పట్టుకున్నారు. ఇదంతా క్షణంలో జరిగిపోయింది. చక చకా ఈ సంఘటనలన్నీ జరిగిపోయేసరికి అక్కడవున్న రామారావు గుండె వేగంగా కొట్టుకోసాగింది. అందరూ నిశ్చేష్టులై కావలి ముత్యాలువంక చూస్తూ నిల్చున్నారు.

కావలి ముత్యాలు అందరిని విదిలించుకుని, తనకు తగిలిన దెబ్బలను చూసుకుని బీరప్పను కలుద్దామని పట్వారి ఇంటినుంచి బయలుదేరాడు కోపంతో. అతని కళ్ళల్లో ఎదురుతిరిగిన సహనం బుసలుకొడుతోంది…

# జుట్టుమామ

**–ఎం.వి.రమణారెడ్డి**

ఇన్నేళ్లైనా నా జ్ఞాపకాల నుండి జుట్టుమామ తొలగిపోలేదు. ఎప్పుడూ కాక పోయినా, సినిమా నుండి తిరిగొచ్చే సమయంలో తప్పకుండా గుర్తొస్తాడు. గుర్తుకొస్తే మనసు బరువెక్కు తుంది. ఏదో అపరాధం చేసిన భావన నన్ను వెంటాడుతుంది. నేను చేసిన తప్పు ఇదీ అని ఇదమిత్థంగా తేల్చుకోనూలేను; దులిపేసుకుని నిశ్చింతగా ఉండనూలేను. అప్పట్లో నాది తప్పు, నేరం తెలిసిన వయసేగాదు. అతడు చనిపోయే నాటికి నా వయసు ఎనిమిదేండ్లు.

అతడు మా బంధువుల్లో మనిషి కాడు; మా ఇంట్లో పెరిగిన అనాథ. అప్పట్లో నాకా తేడాలు పెద్దగా తెలీదు. అతడు మా ఇంట్లో పెరగడమేగాక, ఇంట్లో మనిషిలాగే కలిసుంటాడు. మా అమ్మను 'అక్కా' అని పిలుస్తాడు. నాకుమల్లే నాన్నకు భయపడతాడు. సినిమాకు డబ్బు కావాలని అమ్మ దగ్గర మొండికేస్తాడు. అతడు మొరాయిస్తే మా ఇంట్లో పొద్దు నిలిచిపోతుంది. ఏ రుతువులోనైనా కనీసం నాలుగు గేదెలు పాడి గల మోతుబరి సంసారం మాది. వరిగడ్డితో వొల్లు తోమి వాటిని నీల్లతో కడగడం మొదలుకొని, పాడిపశువుల ఆలనాపాలనా మొత్తం అతనిమీదే నడుస్తుంది. పనులన్నీ వొంటిచెత్తో చేసుకుపోతాడు. మామ మా ఇంటికొచ్చిన తరువాత నన్ను సముదాయించే పనిగూడా అమ్మకు తప్పింది. కేరుమని నా ఏడుపు వినిపిస్తే, పిదికే పాలను పక్కనబెట్టి పరిగెత్తుకొస్తాడట. గేదెలకు అతడు కనురెప్ప. అతనికి నేను కంటిపాప. 'వీడికోసమే దేవుడు వాన్ని భూమిలో నుండి పుట్టించాడు' అని అమ్మ ఎప్పుడూ అంటుండేది. జుట్టుమామకు అమ్మానాన్నా లేరు. వారెవరో అతనికి తెలీదు. అందుకేనేమో అతడు భూమిలో నుండి పుట్టుకొచ్చింది.

జుట్టుమామకు చదువురాదు. నేను బిగ్గరగా పాఠాలు చదివితే అతనికి పట్టరాని సంతోషం. నన్ను చంకకెత్తుకుని రోజూ బడికి మోసుకుపోతాడు. 'ఎడపిల్లోడైనా ఇంకా ఈ చంక మోతలేమిటిరా' అంటూ అమ్మ మందలించినా వినిపించుకోడు. బడి ఎగ్గొట్టే అవకాశం లేకుండా చేస్తున్నాడని నాకు కోపం. బడి నుండి రాగానే నా కోపం పోగొట్టడానికి ఎంతగానో బుజ్జగిస్తాడు. నాకిష్టమైన కథలు చెబుతాడు. భుజంమీద కూర్చోబెట్టుకుని ఊరంతా షికారు తిప్పుతాడు. ఒక కాలు కుడివైపు, మరో కాలు ఎడమవైపు అతని ఎదమీదికి దిగేసి, మూపుమీద

నేను దర్జాగా కూర్చుంటాను. అతని జుట్టే నా చేతికి పట్టు. నాన్న ఎదురవకుండా వుంటే నా స్వారీకి ఎదురేలేదు. చూస్తే చీవాట్లు తప్పవు. 'దిగు గాడిదకొడకా. వాడు మనిషనుకున్నావా, జంతువనుకున్నావా?' ఇంటివైపు తిరిగి ఇద్దరం పరుగో పరుగు.

నేను మారాం చేసి అతని వీపున ఎక్కుతున్నానని పెద్దవాళ్ల అనుమానం. అది నిజంగాదు. నన్ను ఎత్తుకోవడం జుట్టుమామకు సరదా. నేను పైకెక్కి కూర్చుంటే ఆంజనేయునిలా వుబ్బిపోతాడు. మామ ప్రపంచానికి రెండే దిక్కులు. నేను తూర్పు, మిగతావన్నీ పడమర. అతడు మా ఇంటికి ఇంతగా కట్టుబడిపోటానికి కారణం నేనే. కేవలం పనిమనిషైతే అతన్ని కళ్ళకద్దుకుని ఎవరైనా తీసుకుంటారు. కానీ, అతనికి డబ్బుతో నిమ్మితం లేదు. సినిమా టికెట్టుకు పావలా కోసం అమ్మను ప్రాధేయపడటం తప్ప, డబ్బుతో వేరే ప్రయోజనముందని అతనికి ఆలోచనే లేదు. చివరకు ఆ సినిమా మోజే అతని ప్రాణానికి గండమైంది. ఇంకా చిన్నప్పుడు జుట్టుమామకు డబ్బంటే అస్సలు తెలీదట. పుష్పగిరి ఆలయంలో రోజంతా నన్ను ఎత్తుకు తిరిగి ఆడించినందుకు అమ్మ డబ్బులివ్వబోతే వెర్రిమొగమేసుకుని ఆమె వైపు చూశాడట. 'వాడేం చేసుకుంటాడమ్మా. ఇల్లా వాకిలా? దిక్కులేనోడు. కడుపునిండా ఇంత అన్నం పెట్టు తల్లీ' అన్నాడట అక్కడున్న సాదుల్లో వొకాయన. అప్పుడు నాకు మూడోయేడు పడింది. లేకలేక కలిగిన సంతానాన్ని గాబట్టి, ముక్కోటి దేవతలతో భరోసా తీసుకోటానికి చేసిన తీర్థయాత్రల్లో భాగంగా మేము పుష్పగిరికి వచ్చినప్పుడు ఇది జరిగింది. అమ్మానాన్నలకు జుట్టుమామ దొరికాడో, జుట్టుమామకే మా అమ్మానాన్నలు దొరికారో చెప్పడం కష్టం. బహుశా వీటిల్లో ఏదీ కాదేమో! మామ చనిపోయిన తరువాత అమ్మ నోట ఎన్నోసార్లు ఆ కథ విన్న నాకు, అవి రెండూ కాదనే అనిపించింది.

అప్పట్లో పుష్పగిరికి నేరుగా బస్సులు లేవు. ఆ రోజుల్లో బస్సు రూట్లే అరుదు. ప్రయాణాలన్నీ కాలినడకనో, ఎడ్లబండిమీదనో జరిగేవి. ఆ పుణ్యక్షేత్రానికి దగ్గర్లో మా పిన్నిగారి ఊరుంది. ఆ ఊరు బస్సురూటు మీదుంది. పిన్నమ్మగారి ఎడ్లబండ్లో పుష్పగిరి పూజలు ముగించుకుని తిరిగివస్తున్న సందర్భంలో జరిగిన సన్నివేశం. కొబ్బరిచిప్పలూ, ప్రసాదమూ అతనికి అందివ్వబోయింది అమ్మ. వద్దంటూ తల అడ్డంగా ఊపాడు. డబ్బూ అక్కరలేదు, తిండీ అక్కరలేదు, అతనికి మరేం కావాలో పాలుపోక అమ్మ తికమక పడింది. 'బాబును బండిదాకా ఎత్తుకుంటానక్కా' అంటూ అతడు దీనంగా బ్రతిమాలుకున్నాడు. అతని అమాయకత్వానికి అమ్మ నవ్వుకుంది. కాదనకుండా నన్ను అందించింది. అప్పటికి మామ పది పన్నెండేండ్ల కుర్రాడు.

బండెక్కి, దిండ్లను సవరించుకుని అమ్మ కూర్చునేదాకా నేను మామ చంకలో వున్నాను. తరువాత అమ్మ వొడిలోకి మారాను. కూర్చున్నది అమ్మ దగ్గరైనా చూపంతా మామ మీదే. అతడు బండి వెనకాలే నడిచొస్తున్నాడు. కళ్ళెగరేస్తూ, పళ్ళికిలిస్తూ నన్ను నవ్విస్తున్నాడు.

కోతి, పిల్లి, కుక్క – రకరకాల జంతుకూతలతో నన్ను కేరింతలు కొట్టిస్తున్నాడు. ఆ సంఘటన వింటూంటే నాకు కళ్ళు చెమ్మగిల్లేవి. 'కాలికింద కంపే పడుతూందో, కంకరే పడుతూందో వాడు చూసుకుంటేగదా. వీన్ని కాదని వాడు చూపుపక్కకు తిప్పుంటే వొట్టు.' అంటూ అతని ఆత్మీయతను తలచుకుని అమ్మ కంటితడి పెట్టేది. బండి మా పిన్నమ్మ ఇంటి ముందు ఆగేదాకా అట్లాగే నడుచుకుంటూ వచ్చేశాడట.

'మాఇంటి కొస్తావురా?' అమ్మ అడిగింది.

'తీసుకపోతావాక్కా?' అతడు ఆశగా అడిగాడు.

'నాలుగు మెతుకులు తిని, పంచలో పడుంటాడు. ఇంతమంది తినిపోతున్నారు. ఈ వొక్కడు మనకు బరువౌతాడా' అని నాన్నకు నచ్చజెప్పింది. మామ మా ఇంటికొచ్చేశాడు. అతడు పుట్టిందెక్కడో ఎవరికీ తెలీదు. చనిపోయిందాకా మా ఊర్లోనే, మా ఇంట్లోనే వున్నాడు.

నా తరువాత మామ కిష్టమైనవి సినిమాలు. ఒక్కోసారి రెండాటలు ఏకంగా చూసేస్తాడు. ఊరి టెంటులో సినిమా మారితే, మొదటిరోజు తొలి ఆటకు హాజరు కాకుండా ఉండలేడు. 'అప్పుడే అది పరిగెత్తిపోతుందేరా? రేపు జూస్తే బొమ్మేమైనా మారుతుందా?' అమ్మ విసుక్కుంటుంది. మామ అలుగుతాడు. అలిగి సోఫాలో కంబానికి ఆనుకుని చేరగిలబడతాడు. తలవంచుకొని దిగులుగా కూర్చుంటాడు. 'సరే, నువ్వట్లాగే కూలబడు. పనంతా నేనే చేసుకుంటా' అంటూ అమ్మ చీపురు చేతికి తీసుకుంటే చాలు, గబాలున లేచొచ్చి, చీపురు లాక్కొని పనిలో దిగిపోతాడు. అమ్మ నడుమొంచితే జుట్టుమామకు చిన్నతనం. కోపమేమో అలాగే వుంటుంది. అమ్మ నవ్వుకుంటూ పిలిచి పావలారూక చేతిలో పెడితే కోపం వదిలిపోతుంది. తలొంచుకుని జుట్టు గోక్కుంటాడు. 'నీ బుద్ధి పుట్టినట్టు తగలబడు' అనే ఆదేశం వినగానే, చంకలు గుద్దుకుంటూ పరుగులు తీస్తాడు.

నాన్నంటే జుట్టుమామకు చచ్చేంత భయం. ఆమాటకొస్తే నాకూ భయమే. ఒక్కగానొక్క కొడుకునైనా పెద్దగా చనువివ్వడు. నాన్న స్వభావమే అంత. ఇంటికి చుట్టాలొచ్చినా మర్యాదకోసం చేసే పలకరింపులే తప్ప, కలవొద్దికగా మెలగలేడు. జుట్టుమామ నాన్నకు ఎదురేపడడు. ఆయనై పిలిచినప్పుడు తప్ప, చాటున దాక్కుంటాడు. ఇక సినిమా చూసి తిరిగొచ్చినప్పుడు చూడాలి జుట్టుమామ అవస్త. నిద్రనుండి ఎక్కడ లేస్తాడోనని, పిల్లిలా అడుగులో అడుగేసుకుంటూ, నక్కినక్కి ఇంట్లోకొస్తాడు. ఆయనకు సినిమాలంటే గిట్టవు. అమ్మమాత్రం మెలుకువగా వుంటుంది. 'మొద్దుముండాకొడుకు. పొరగడుపుతో పడుకుంటాడు' అనేది అమ్మ భయం. 'ఉట్టిమీద పుటికెలో కూడుంది. తిని చావు' అంటుంది. నేనూ మెలుకువతో మామకోసం ఎదురుచూస్తుంటాను. సినిమా కథ వినటానికి, బుట్టీ, తట్టా తీసుకుని మామ పెరట్లో అరుగు దగ్గరికి జారుకుంటాడు. నెమ్మదిగా నేను అక్కడికి చేరుకుంటాను. ముద్ద కలిపి చేతిలో పెడుతూ, కథంతా చెబుతాడు. మామ కథ చెబుతుంటే అచ్చం సినిమా చూసినట్టే ఉంటుంది. 'అమ్మా, నేనూ సినిమా చూస్తానే.' తెల్లవారగానే అది నా కోరిక.

'ఎందుకు చూడవ్. మీ నాన్న రానీ, వాడూ నువ్వూ ఇద్దరూ చూస్తారు.'

'బావకు చెప్పొద్దులేక్కా. బావకు తెలకుండా బాబుకు చూపించి తీసుకొస్తాను.' జుట్టుమామ వకాల్తా. నా కోరిక తీరకుంటే మామ మనసు గిలగిలా తన్నుకుంటుంది. పొద్దుననగా అభ్యర్థన మొదలెట్టి, పొద్దుకుంకే సమయానికి తంటాలుపడి వొప్పిస్తాడు. చిన్నపిల్లలకు టికెట్టు అడగరు. నాకు చిరుతిండ్లు కొనిపెట్టడానికి మరో బేడ అదనంగా అమ్మదగ్గర తీసుకుంటాడు.

అలాటి సమయంలో వొక వొప్పందం కోసం జుట్టుమామ ఒత్తిడి చేస్తాడు.

'ఇంగ నన్ను జుట్టుగా అనవుగదూ?'

'అంటే ఏం?'

'ఆటకు తీసుకుపోను.'

'ఉహ్వా హ్వా హ్వా.' గోముతో కూడుకున్న ఏడుపు.

'అదేం కుదరదు. మామా అని పిలిస్తేనే.'

శాశ్వత ఒడంబడిక కోసం అతని ఆరాటం. నావరకు అది తాత్కాలికమైన వొప్పందం.

మామ అసలు పేరేమిటో నాకు ఇప్పటికీ తెలీదు. అమ్మకు తెలిస్తే నాకూ తెలిసేది. తన పేరేదో మామకే తెలీదేమో. ఊరంతా జుట్టుగాడనే పిలుస్తారు. ఆ పిలుపుకే అతడు పలుకుతాడు. ఆ పేరు ఎందుకొచ్చిందో ఎవరికీ తెలీదు. చిన్నప్పుడు తలమీద పిలకుండేదేమోగానీ, నాకు గుర్తు తెలిసేప్పటికి అతనిది అందమైన క్రాపింగు. క్రాపు చేయించుకోవడంలో చాలా జాగ్రత్త తీసుకుంటాడు. దాచి వుంచుకున్న సినిమా పోస్టరు మంగలికి చూపించి గాని తల గొరిగించు కోడు. నా జుట్టుమీద గూడా అజమాయిషీ మామదే. దగ్గర కూర్చుని సలహాలిస్తూ చేయించే వాడు. తల గొరిగించుకోవడం నాకు మహా చిరాకు. మంగలిని చూడగానే పారిపోయి దాక్కుంటాను. ఎక్కడున్నా వెదికి పట్టుకొస్తాడు; బుజ్జగించి కూర్చోబెడతాడు; కోప్పడే అమ్మను పంపించేసి నయంగా దారికి తీసుకొస్తాడు; కబుర్లు చెబుతూ కత్తిరింపు ముగిసేలా చేస్తాడు. అంతమంచి క్రాపింగున్నా మామను అందరూ జుట్టుగాడనే అంటారు. అమ్మా నాన్నా గూడా 'ఒరేయ్ జుట్టుగా' అనే పిలుస్తారు. పెద్దవాడని అనుకోకుండా మా బడిపిల్లలకూ అదే పిలుపు. అలా ఎవరు పిలిచినా మామకు కోపంరాదు. చిన్నపిల్లలు పిలిచినా కోపం రాదు. కానీ, నేను పిలిస్తే మాత్రం సహించలేడు. వెంటనే బుంగమూతి పెట్టేస్తాడు. 'చూడక్కా బాబు ఏమంటున్నాడో' అంటూ అమ్మకు ఫిర్యాదు చేస్తాడు. మామ అభ్యంతరం 'జుట్టు' అనే విశేషణం గురించిగాదు, 'గాడు' అనే నామవాచకం గురించి. నాతో 'మామా' అని పిలిపించు కోవాలని అతని ఆరాటం. విశేషణంతో కలిపి 'జుట్టుమామా' అన్నా నొప్పి లేదు. నాకు ఏదోవొక మామగా వుంటే చాలు. నేను మామా అని పిలిస్తే అతన్ని పట్టడానికి పగ్గాలుండవు.

గోరంత ఆ పిలుపుకు కొండంత సంబరం వచ్చేస్తుంది. నన్ను ఆకాశానికి ఎగిరేసి చేతుల్లో అందుకుంటాడు. ఊపిరాడకుండా వొత్తిపట్టుకుని ముద్దులు కురిపిస్తాడు. నేను బుగ్గలు తుడుచుకుంటూ విదిలించుకుంటే మరింత గోముగా దగ్గరికి లాక్కుంటాడు. బయటపడాలంటే 'పోరా జుట్టుగా' అనాలి. ఆ మాట వినగానే అతని ఉత్సాహం చచ్చిపోతుంది. ఒక్కోసారి ఏడుస్తాడు. ఏడుపొచ్చేంత పెద్దమాట కాదది. అతని మనసుకు అది ఎంతగా గుచ్చుకుంటుందో నాకు తెలీదు. అతన్ని ఏడిపించడం నాకొక సరదా. కన్నీటికి విలువ తెలిసిన వయసులో నేను లేను.

నేనంత చులకనగా అతన్ని ఎందుకు చూసేవాన్నో నాకే తెలీదు. సొంత మామ కాదనే అలుసేమో. కాదని నాకు ఎలా తెలిసింది. మా ఇంట్లోనే ఉన్నాడు, మాతోపాటే తింటాడు. అమ్మను 'అక్కా' అని పిలుస్తాడు. ఎదురుపడి నాన్నను 'బాబా'అని పిలువలేదుగానీ, ఆయన్ను గురించి ఎవరితో మాట్లాడినా బావగానే మాట్లాడుతాడు. ఇంట్లో అతన్నెవరూ పనిమనిషిగా చూడరు. ఐనా అతడు నాకెందుకు సొంతమామయ్యలా కనిపించలేదు? ఊర్లోవాల్లు చెప్పుకునే ఊసులవల్ల నాకా అభిప్రాయం కలిగిందా? సొంతమామయ్యలా నామీద పెత్తనం చెయ్యనందున తక్కువనిపించిందా? ఏమో. కారణమైతే చెప్పలేను. తేలిగ్గా చూసింది మాత్రం వాస్తవం. నా మీద మమకారం అతని బలహీనత. దాన్ని వాడుకోవడం అలవాటు చేసుకు న్నాను. పని చేయించుకోవాలంటే 'మామా' అని పిలుస్తాను. అవసరం తీరగానే 'జుట్టుగా' అంటూ వేళాకోలం చేస్తాను.

టెంటుకు 'బాలరాజు' సినిమా వచ్చింది. మామ తొలిరోజే చూసొచ్చి కథ చెప్పాడు.

'మామ, నాకు బాలరాజు చూపించవా.'

'ఇప్పుడే అడిగితే అమ్మ తంతుంది. పది రోజులుండు.'

పదిరోజులున్నాను. అనుమతి పట్టుకొచ్చాడు మామ. జల్సాగా సినిమాకెళ్ళాం. సగ మాటలో నిద్రబోయే అలవాటు నాకులేదు. ఇంటర్వెల్లో కలర్ సోడా తాపించాడు. వేరుసెనగలు కొనిపించాడు. సినిమా చూస్తూ వొక్కొక్కటి వొలిచి నా చేతికందిస్తాడు తప్ప, ఒక్క విత్తనమైనా నోట్లో వేసుకోడు. ఆట ఐపోయింది. బట్టలకు అంటుకున్న ఇసుకను దులుపుకుంటూ బయటికొచ్చాము. ఎప్పటిలాగే మామ నన్ను భుజాలమీదికి తీసుకున్నాడు. జనంతోపాటు ఇంటిదారి పట్టాము. వీధి మలుపు తిరిగి రామాలయం దాటుకున్నాము. దూరంలో కుక్కల మొరుగుడు వినిపించింది. పట్టించుకోకుండా ఎవరి ఇల్లొస్తే వాల్లు తప్పుకుంటున్నారు. జనం పలుచబడుతున్నారు. మా ఇల్లు దగ్గర పడుతూంది. కుక్కల మొరుగుడు పెద్దదైంది. అదిగో ఇల్లు వచ్చేసింది. మరో నిమిషంలో చేరిపోతున్నాము. అంతలోనే ఎలా వచ్చిందో వచ్చింది. చీకట్లో నుండి దయ్యంలా వచ్చి మామ మీదికి ఎగబడింది. తెల్లని వెన్నెల్లో నల్లటి కుక్క. రొప్పుకుంటూ కోరలు తెరిచి మామీదికే దూకింది. ఒక అరపూ లేదు, మొరగూ లేదు. కుడివైపు నుండి హఠాత్తుగా దాడిచేసింది.

ఆ భయంకరమైన దృశ్యం నా జీవితంలో మరువలేను. అసంకల్పితంగా నా కుడికాలు పైకి లాక్కున్నాను. వెంటనే నన్ను తన ఎడమభుజం మీదికి మార్చేశాడు మామ. మీదికి ఎగబడి అది మామను చీరేస్తూంది. నన్ను తప్పించాలనేదే తప్ప, తనకేమౌతుందో ననే ధ్యాసే అతనికి లేదు. నా కాల్లను చేతులతో దాచేశాడు. మోచేతిని జాడిస్తూ దాన్ని అదిలిస్తున్నాడు. దాని నోటికి నేను అందకుండా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

వెంట మిగిలిన సినిమా ప్రేక్షకులు బెంబేలెత్తి వీధి అరుగుల మీదికి చేరుకున్నారు. కేకలూ, పెడబొబ్బలేగాని సాయంగా వొక్కడూ కిందికి దిగడు. మా ఇంటి వాకిట్లో వెలుతురు కనిపించింది. లాంతరు తీసుకుని అమ్మ వెలుపలికొచ్చింది. వసారాలో పడుకున్న పాలేర్లను నిద్రలేపి, లాంతరు అందించింది. తుంటకర్రలతో వాల్లు కుక్కను తరిమేశారు. మామ భుజం మీది నుండి నన్ను అందుకున్నారు. 'బాబూ, నీకేం కాలేదుగదా, నీకేం కాలేదుగదా.' నా వొల్లంతా ఎడమచేత్తో మామ తడుముతున్నాడు. నా వొంటి మీద చిన్న జీరకగూడా పడలేదు. కానీ, మామకు ఏమైందో లాంతరు వెలుతురులో స్పష్టంగా కనిపిస్తూంది. ఒంటిమీది చొక్కా పేలికలు పేలుకలుగా చిరిగి గాలికి రెపరెపలాడుతూంది. కుడిచేతిమీది పేలికలు రక్తంతో తడిసి జబ్బకు అంటుకుపోయాయి. మోచేతి కింద ఇంత కండ ఊడి వ్రేలాడుతూంది. 'పిల్లోడు జడుసుకుంటాడు. తొందరగా తీసుకుపోరా' అంటూ ఎవరో కేకేశారు. నన్ను ఇంటివైపుకు తీసుకుపోయారు. అంతే. అంతకుమించి నాకు గుర్తులేదు. రెండు రోజుల వరకు నేను స్పహలో లేను. కళ్ళు తెరిచేసరికి మంచంలో వున్నాను. అమ్మ నా పక్కన్నే వుంది. 'ఏం నాన్నా, ఆకలౌతూందా?' అని అడిగింది. ఆమె మా అమ్మలాగే వుందిగానీ, మాసిపోయిన అమ్మలా వుంది. ఒడిలోకి తీసుకుంటూంటే అమ్మ స్పర్శలాగే వుందిగానీ, వొంటిమీద ఏవేవో పారాడుతున్నట్లున్నాయి. తలవంచి చూసుకుంటే వొంటినిండా తాయెతులూ, అంత్రాలూ. వెండివీ, రాగివీ, తాటాకువీ మెడనిండా దిగేశారు; చేతులనిండా ముడేశారు. 'పాలు తెచ్చేదా?' అమ్మ మల్లీ అడిగింది. 'మామ' – కోలుకోగానే నానోటపలికిన మొట్టమొదటి మాటది. అమ్మనుండి జవాబు లేదు.

ఇంట్లో సందడిలేదు. పాలేర్లు అటూఇటూ తిరుగుతున్నారు గానీ, ఉలుకూ పలుకూ లేదు. వీధి గుమ్మంనుండి నాన్న ఇంట్లోకొచ్చాడు. తలకు చుట్టుకున్న కండువా విప్పి పడకకుర్చీ మీద పడేశాడు. నా దగ్గరికొచ్చి బుగ్గలమీద చెయ్యి ఆన్చాడు. 'జ్వరం తీసింది' అన్నాడు నెమ్మదిగా, 'వానికెట్లుంది?' అమ్మ అడిగింది.

'నిన్నటికంటే మెరుగే. మాట్లాడుతున్నాడు.'

'మీరు వచ్చేశారు. వాన్ని ఎవరు చూసుకుంటారు?'

'అచ్చిగాడున్నాడు. వానికి నిలకడలేదు. ఇంటికి రావాలని సతాయిస్తున్నాడు. వేరే ఎవరినైనా పంపించాలె.'

'మల్లిగాన్ని పంపితేనో. పెళ్ళిగానోడు. నాలుగైదు రోజులైనా కుదురుగా వుంటాడు.'

'వాన్ని పిలిచి చెప్పు' అంటూ నాన్న పెరటివైపు నడిచాడు.

అమ్మ మల్లిగాన్ని కేకేసింది. వాడు ఎదురుగా వచ్చి నిలుచున్నాడు. ఏం చెప్పాలనుకుందో ఏమో, 'ఒరేయ్, వాడు దిక్కులేనోడురా' అనే మాటొక్కటి బయటికొచ్చి గొంతు పూడుకుపోయింది. పైటకొంగు నోట్లో దోపుకుని వెక్కివెక్కి ఏడ్చింది. మల్లిగానికీ ఏడుపొచ్చింది. అమ్మ కోలుకుని, కళ్ళు తుడుచుకుంది. 'నేను పోదామంటే వీనికిట్లుంది. వీన్ని విడిచిపెట్టీ పోలేను. వాన్ని చూడకుండా వుండలేను.' తిరిగి గొంతు పూడిపోయింది.

ముఖంమీదా, చేతులమీదా తుండుపంచెతో తడి వొత్తుకుంటూ నాన్న లోపలికొచ్చాడు. 'నువ్వు నాల్రోజులు ఆస్పత్రి దగ్గర ఉండరా. అచ్చిగాడు ఇల్లో అని మొత్తుకుంటున్నాడు.'

'సరేనయ్యా.'

'ఇప్పుడే బయలుదేరు.' నాన్న వసారావైపు వెళ్లిపోయాడు.

'మరచెంబుతో పాలు తీసుకుపోరా' అంది అమ్మ.

జుట్టుమామ ఆస్పత్రిలో ఉన్నాడని అర్థమైంది. మా ఊర్లో డాక్టరు ఉన్నాడు గానీ, పడకలుండే ఆస్పత్రి లేదు. కాబట్టి, పట్నం తీసుకుపోయి పెద్దాసుపత్రిలో చేర్పించి వుండాలి. పెద్దగా జబ్బొస్తే గానీ అక్కడికి తీసుకుపోరు. ఐతే, మామ కోలుకుంటున్నాడు, మాట్లాడుతున్నాడు. ఫరవాలేదు. నా ఒంట్లో నీరసం తగ్గింది.

'అమ్మా, మామను చూసొద్దామే.'

'ఐతే పాలుతాగు. నీకు తొందరగా బలమొస్తే మనం తొందరగా పట్నమెల్లి మామను చూడొచ్చు.'

నాకు జ్వరం తిరగదోడలేదు. ఐనా మంచం దిగనివ్వరు. మారాం చేసి కుర్చీలో కూర్చున్నాను. డాక్టరొచ్చి చెయ్యి పట్టుకుని చూశాడు. నాలుక కింద థర్మామీటరుంచి చూశాడు. స్టెతస్కోపుతో ఛాతీమీద చూశాడు. మరేం ఫరవాలేదని భరోసా ఇచ్చాడు. బెదిరిపోయి జ్వరమొచ్చిందని అందరూ తీర్మానించారు.

అచ్చిగాని గొంతు విని మెలుకువొచ్చింది. వాడు అమ్మతో మాట్లాడుతున్నాడు. 'అదేం కుక్కో చెయ్యంతా నమిలేసిందమ్మా. ఏల్లకాన్నుండి జబ్బకాడికి నజ్జునజ్జుగా నమిలేసింది. గట్టిపిండమై తట్టుకున్నాడు. బాబు కోసం కలవరింపమ్మా. బాబును సూడాలని వాని పానం కొటకలాడుతాంది.'

నాకూ మామను చూడాలనివుంది. మంచం దిగనివ్వడం లేదు. రోజూ ఎవరో వొకరు పట్నమెల్లి మామను చూసొస్తున్నారు. వచ్చినవాల్లంతా అదేమాట.

నన్ను మంచం దిగనిచ్చారు. ఇంట్లోకీ బయటికీ నడుస్తున్నాను.

'బాబును పట్నం తీసుకుపోవచ్చా సారూ' అమ్మ డాక్టరును అడిగింది.

'అప్పుడే వద్దులెండి. నాలుగు రోజులు ఆగండి.'

సాయంత్రం ఓబులమ్మ పట్నం నుండి తిరిగొచ్చింది. 'ఈ పిల్లోన్ని సూడకుండా వాడు బతకలేడే తల్లీ. ఎన్ని సూదులేసినా బతకడు, ఎన్ని మందులిచ్చినా బతకడు. ఇంటికి పోతానో అని మొత్తుకుంటా ఉండాడు.'

మామను జుట్టుగాడని ఇంకెప్పుడు పిలవగూడదు. ఎవరైనా పిలిస్తే తన్నాలనుకున్నాను. మామకు మంచి పేరేదైనా పెట్టమని అమ్మను అడగాలనుకున్నాను.

నాన్న పట్నం నుండి తిరిగొచ్చాడు. 'బాగా కోలుకున్నాడు. బాబును కలవరిస్తున్నాడు. బాబును అంతదూరం ఇప్పుడే వద్దంటున్నాడు డాక్టరు.'

'నేనన్నా చూసొస్తా. వాని మొగం చూడక పదిరోజులైంది. ఎట్లున్నాడో ఏమో బిడ్డ. నేను కనబడితే వానికి కొంచెం ధైర్యంగా వుంటుంది.'

'ఎందుకూ. రొండ్రోజుల్లో ఇంటికి పంపిస్తామన్నారు.'

వచ్చేస్తాడు. రెండు రోజుల్లో మామ ఇంటికొచ్చేస్తాడు. మల్లిగాడి వెంట వచ్చేస్తాడు. నాన్న వెళ్ళి ఇద్దరినీ తీసుకొస్తాడు. ఇంత దూరం మామ నడవగలడా? ఇన్ని రోజులు జబ్బు పడిన మామను నడిపించి తీసుకొస్తారా? బండ్లో తీసుకొస్తారు. అచ్చిగానికి చెప్పి బండి కట్టిస్తారు. బండి కడితే అమ్మానేనూ వెల్లొచ్చుగదా! అమ్మ గట్టిగా అడిగితే డాక్టరు వొప్పుకుంటాడు. డాక్టరు వొప్పుకుంటే నాన్న వద్దనడు. రేపు వొకటి, ఎల్లుండి రెండు – అనుకుంటూనే నిద్రపట్టింది.

రేపొచ్చింది. ఎల్లుండి కోసం ఎదురు చూస్తూ గడపమీద కూర్చున్నాను. ఇంటిల్లిపాదీ ఎవరి పనుల్లో వాల్లు తలమునకలుగా వున్నారు. నన్ను పట్టించుకునే వాల్లే లేరు. మాముంటే ఇలా వుండేదా. వీధి మలుపులో మల్లిగాడు కనిపించాడు. వాడు ఇంటికేసి గబగబా వస్తున్నాడు. మామ వెనకాలే వుండాలి. వేగంగా నడవలేక నెమ్మదిగా వస్తుంటాడు. మల్లిగాడు ముంగిట్లో కొచ్చేశాడు. నన్ను దాటుకొని ఇంట్లోకి దూరాడు. వాడెందుకో కంగారుగా ఉన్నట్టనిపించింది. మామ ఇంకా కనిపించలేదు. నేను వీధి మలుపే చూస్తూ కూర్చున్నాను. మల్లిగాడు నన్ను దాటుకుంటూ బయటికొచ్చి పరుగు తీస్తున్నట్టు తిరిగిపోతున్నాడు. నాన్నగూడా వాడివెంట బయటికొచ్చాడు. అంగీని దారివెంట తొడుక్కుంటూ మల్లిగాన్ని అనుసరించాడు. అమ్మగూడా బయటికొచ్చి నిలుచుంది. ఎందుకో వాతావరణం మారిపోయింది.

ఎల్లుండి వచ్చేసింది. ఇంటిముందు ఎడ్లబండి సిద్ధంగా వుంది. ప్రయాణానికి అమ్మ తయారుగావుంది. త్వరగా ముఖం కడిగించి నన్ను గూడా తయారుజేసింది. డాక్టరు అనుమతి దొరికిందేమో. ఇద్దరం బండ్లో కూర్చున్నాము. తోడగా ఓబులమ్మ బండెక్కింది. నొగలుమీద అచ్చిగాడు కూర్చున్నాడు. బండి పట్నంవైపు కదిలింది.

పెద్దాసుపత్రి కాంపౌండులో బండి ఆగింది. కిందికి దిగుతుండగా నాన్న ఎదురొచ్చాడు. 'పిల్లోన్ని దగ్గరగా తీసుకుపోవద్దు. డాక్టరు మరీమరీ చెప్పాడు. అది అంటువ్యాధి.' అమ్మను

హెచ్చరించాడు. మామను ఉంచిన గదివైపు నాన్న దారితీశాడు. మేమంతా ఆయన్ను అనుసరించాము. గది తలుపులు మూసున్నాయి. తలుపు తోసుకుంటూ నాన్న లోపలికి ప్రవేశించాడు. అమ్మా నేనూ తలుపు దగ్గరే ఆగిపోయాం. 'వద్దూ' అనే కేక వినిపించింది. ఇంకా ఏమో అనబోతున్నాడు మామ. దవడలు బిగిసిపోయి నోటి నుండి నురగ పైకొచ్చింది. దగ్గరికి రావద్దని తల అడ్డంగా ఊపుతున్నాడు. బాబును దగ్గరికి తీసుకురావద్దని చేతులతో సైగలు చేస్తున్నాడు. అతని రెండు చేతులూ పైకి వ్రేలాడదీసి, బెల్టుతో చువ్వలకు కట్టేశారు. ఆ కట్లతోనే చేతులు ఊపుతూ వద్దంటున్నాడు. వేళ్ల దగ్గరి నుండి భుజందాకా కుడిచేయి నల్లగా కమిలిపోయింది. కాళ్లనుగూడా బల్లకేసి కట్టేసినట్టున్నారు. గొంతువరకు తెల్లటి ఆస్పత్రి దుప్పటితో కప్పున్నారు. స్టాండుకు వ్రేలాడే సీసాల నుండి సన్న గొట్టంతో కాలినరంలోకి నీరు ఎక్కిస్తున్నారు. సీసా దగ్గర వొక నర్సు నిలుచోనుంది. మల్లిగాడు దూరంగా గోడకు చేరగిలబడి నిలుచున్నాడు.

మామను చూస్తున్నాను. ముట్టుకోవాలనిపిస్తూంది. కానీ, లోపలికి అడుగేయాలంటే భయమేసింది. దిక్కుతోచక అమ్మ ముఖంలోకి చూశాను. మామవైపు చూస్తూ ఆమె ఏడుస్తూంది.

'అటు తిరిగొచ్చి కిటికీ బయట నిలుచోమ్మా' అంది మామ దగ్గరున్న నర్సు. మామను పడుకోబెట్టిన బల్లపక్కన పెద్ద కిటికీ వుంది. దాన్నుండి మామను దగ్గరగా చూడొచ్చు.

కిటికీ దాపులకు చేరగానే అమ్మ నన్ను ఎత్తుకుంది. చువ్వలు చేత్తో పట్టుకుని లోపలికి తొంగిచూశాను. మామ నాకేసి చూస్తున్నాడు. రెప్ప వెయ్యకుండా నన్నే చూస్తున్నాడు. తన దిగులంతా తీరినట్టు చూస్తున్నాడు. ముఖంలో సంతోషం కనిపించింది. 'బాబూ' అని పలకరించబోయాడు. నోరు బిగుసుకుపోయింది. గిలగిలా తన్నుకుంటున్నాడు. మెడ కొట్టుకుంటున్నా నామీది నుండి చూపు తిప్పలేదు. మంపులు ఆగిపోయాయి. చేతులు సల్లుబడి కట్లమీది వ్రేలాడాయి. ఎగిరెగిరి పడుతున్న శరీరం బల్లకు చప్పగా అనుకుంది. నావైపే చూస్తున్న కళ్ళు చూస్తుండానే మసకెక్కాయి. మల్లిగాడు గొల్లుమన్నాడు. అమ్మ తల పక్కకు తిప్పుకుని ఏడుస్తూంది. తెల్లటి గుడ్డ చేతికి చుట్టుకుని, మామ రెప్పలు మూసేసింది నర్సు.

మామ చనిపోయాడట. ఇంతసేపు నాకోసమే బ్రతికున్నాడట. మామ చనిపోతాడని అందరికీ ముందే తెలిసినట్టుంది. నాతో ఎవరూ చెప్పలేదు. నేను కనబడకపోతే ఇంకా బ్రతికేవాడా? తీసుకెల్లమని అడిగినప్పుడు వద్దన్నారు. చెప్పకుండా నన్ను తీసుకొచ్చి మామను చంపేశారు. ఈ రోజు నేను రాకుంటే మామ బ్రతికుండునా? ఆ రోజు సినిమా చూడాలని అడక్కపోతే బ్రతికుండునా? మామ చావుకు నేనే కారణమా? ఈ ప్రశ్న నాకు ఎన్నోసార్లు ఎదురైంది. పెరిగే కొద్దీ మరిన్ని ప్రశ్నలు తోడౌతున్నాయే తప్ప, అంతరాత్మకు సంతృప్తికరమైన సమాధానం దొరకలేదు.

✡

# వానరాలే

**–బండి నారాయణస్వామి**

క్షయ సంవత్సరంలో వానలు కురసవు అని చెప్పేవాళ్లు కొంతమంది. అది క్షయ కాదు, అక్షయ! సంవత్సరంలో వానలు దండిగా కురిసితీరల్ల అని ఆశను లేబెట్టేవాళ్లు కొంతమంది. ఎవరి మాటను ఇనేది? ఎవరి మాటను ఇడిసిపెట్టేది? ఊర్లోవాళ్లకేమో శానామందికి ధైర్యం సాలలే ఇత్తనం ఏసేదానికి. అప్పటికే ఒక సంవత్సరం వర్షాలు పడక సేద్యంలో దెబ్బ తినిండిరి మల్ల పాపం!

ఈ యేడు వానలు బాగా కురుస్తాయని గవర్నమెంటోల్లు రేడియోలో చెప్పినారని కరణమయ్య ధైర్యం చెబితే పెన్నప్పకు ఆశపుట్టె. ఊర్లో చాలామంది రైతులు ఎనకడుగు ఏస్తాంటే, పెన్నప్ప ముందడుగు ఏసె.

ఒక దినం పొద్దున్నే తలకు నీళ్లు పోసుకుండె. ఉతికుండె బట్టలు కట్టుకుండె. తలకు చారెడు సమురు పూయించుకుని పెండ్లాముతో దువ్వించుకుండె. భుజంమీద సెల్లా కూడా ఏసుకొని చెల్లికెరలో చెనిక్కాయల ఆసామి దగ్గరికి ఎల్లాబారిపాయ. తీరా పోయినంక క్వింటాలు చెనిగిత్తనం వెయ్యి రూపాయలు అని రేటు వినేసరికి నోరంతా ఎల్లబెట్టె.

"వెయ్యి రూపాయలంటే ఎట్ల సావుకారీ? నిన్న సంవత్సరం క్వింటాలు చెనిగిత్తనం నీకు ఏడు నూర్లకే అమ్మితిమి కదా! మా నుంచి ఏడు నూర్లకు కొని, మల్లీ మాకే వెయ్యి రూపాయలకు అమ్మజూపితే ఎట్ల?" అని బాధపడె.

"ఏం చెయ్యమంటావురా! అది అప్పటి మార్కెట్టు రేటు. ఇది ఈనాటి మార్కెట్టు రేటు. కోర్టులో వకీలు మాట్లాడినట్ల అంత తెలివిగా మాట్లాడతాండావు కదా! మరి నిన్న సంవత్సరం పండిన చెనిక్కాయనంతా అమ్మి దుడ్లు చేసుకునే బదులు, ఈ సంవత్సరం ఇత్తనం వేసేదానికి ఎత్తిపెట్టుకోవల్ల అనే జ్ఞానం లేకపాయెనా నీకు?" అనె సురుకుముట్టుగా సావుకారు.

"నిరుడు పావలా పంట కూడా పండలేదు కదా సావుకారీ! పండిన పంటనంతా ఈ సంవత్సరం ఇత్తనం కోసం ఎత్తిపెట్టుకుంటే ఇంక సంవత్సరం పొడుగునా మేం ఏం తినేదీ? మీ అట్లా వాళ్లకు అప్పులేం కట్టేది?" అని అడిగె.

"ఆ పొద్దు ఏవో అవసరాలుండి పండిన కాయినంతా అమ్ముకుంటారు. మరి ఈపొద్దు వచ్చి మార్కెట్టు రేటు ఎక్కువ అని అంగలారిస్తే ఎట్లరా!" అనె సావుకారి.

"అంతా మా కర్మలే ధనీ!" అనె పెన్నప్ప.

"ఎన్ని పల్లాలు కావల్లరా నీకు ఇత్తనానికి?" అని అడిగె సావుకారి.

"ఐదు ఎకరాలకు అయితే ఒకటిన్నర సరిపోతాయి. పది ఎకరాలకు పంట పెట్టల్లంటే మూడు పల్లాలు కాబడతాయి. ఇక్కడ రేటు చూస్తే అగ్గి కురుస్తాంది. ఐదు ఎకరాలకు మాత్రం సల్లి, మిగతా ఐదెకరాలు బీడు పెట్టుకుందునా? లేక ధైర్యం సేసి పది ఎకరాలకూ ఇత్తనం కొండబోయి ఏస్తున్నా?" అని కొంచెం సేపు కిందా, మీదా పడి ఆలోసించె.

అప్పుడు.. పోలేరమ్మ తల్లి పైలోనిండి, దానయ్యతో చెప్పించిన మాటలు జ్ఞాపకం వచ్చె. పోలేరమ్మ తల్లి సెప్పినంక వానలు వచ్చి తీరాల్సిందే కదా? పైన దేవుడుండాడు అనుకొని ధైర్యంగా మూడు మూటలు ఇత్తనం కాయిని ఏసుకొచ్చె పది ఎకరాల్లోనూ సల్లేదానికి.

"చూడప్పా! పంట పండినంక చెనిక్కాయని మల్లీ మాకే తోలల్ల. వేరే యాపారస్తులకు తోలి మాకు అన్యాయం చెయ్యకూడదు" అని పెన్నప్ప వచ్చేటప్పుడు ఇంకొకసారి హెచ్చరించి పంపె సావుకారి.

ఒకటి కాదు, రెండు కాదు.. ఇత్తనం కాయిని మూడు మూటలు ఏసుకొచ్చిన మొగున్ని తిక్కోన్ని చూసినట్ల చూసె పెన్నప్ప పెండ్లాము.

"ఈసారి వానలు వస్తాయో, రావో అని పెద్ద పెద్ద రైతులే ఇత్తనం ఏసేదానికి జంకుతాంటే, నువ్వు మూడు మూటలు ఇత్తనం కాయిని ఎందుకు మోసుకొస్తివి సామీ? నిరుడు సంవత్సరం మాదిరి వానలు కురసకపాయ అనుకో! ఇప్పుడు ఇత్తనం మీద అప్పు చేసిన ఆ మూడు వేలూ భూమిలోకి పారేసుకున్నట్లే కదా! ఆ మూడు వేలు అప్పును ఎట్ల కడతాము? దానికి అయ్యే వడ్డీని ఎట్ల కడతాము? మన కడుపులకు ఏం తింటాము? వచ్చే సంవత్సరం మనపాప పెండ్లి ఎట్లా చేస్తాము? వద్దు, సామీ వద్దు, ఆ సేద్యమూ వద్దు, ఆ అప్పులూ వద్దు. కూలీ నాలీ చేసుకుని బతుకుదాము. వుంటే తిందాము. లేకపోతే ఇన్ని నీళ్లు తాగి పస్తులు పండుకుందాము" అని మొగునితో మొరపెట్టుకుండె.

భార్య ఏడుపు చూసి పెన్నప్పకు గుండె జారిపాయ లోలోపల.

"ఛూ నీ యమ్మ పిరికి లంజముండా! అపశకునపు కూతలు కూసినావంటే చూడు మూతిమీద గుద్దుతాను. మీ ఆడోల్ల మాటలు విని బాగుపడ్డ మొగోడెవడు?" అని చీమిడి చీదేసినట్ల మాట్లాడె భార్యని.

అయమ్మేమో నోరు మూసుకుండెగాని, పెన్నప్పకేమో ధైర్యం సాలకపాయె! 'ఆ అప్పులూ వద్దు, ఆ సేద్యమూ వద్దు' అని పెండ్లాము ఏడ్చిన ఏడ్పు చెవుల్లో గింగురుమంటా మోగబట్టె.

"ఐదెకరాలు ఇత్తుతాను, సాలు! మిగతా ఐదెకరాలు బీడుపడి ఉండనీలే! ఒక యాల వానలు రాలేదే అనుకో! మూడు వేలకు మునిగే బదులు ఒకటిన్నర వేయికి మునిగేది మేలు కదా! అని యోచన చేసె! సగం ఇత్తనాన్ని దగ్గర పెట్టుకొని మిగతా సగం ఇత్తనాన్ని ఇదే రేటుకు ఈడిగ రంగప్పకు ఇచ్చేసె, పెన్నప్ప భార్య 'అమ్మయ్య!' అని ఊపిరి పీల్చుకుండె.

కృత్తికలో సేద్యం చేసిండిరి. పునర్వసులో వానొస్తే ఇత్తనం ఏయల్లని కాసుకోండిరి. మోడాలేమో కనపడతాండెగానీ, అవి గుడ్డి మబ్బులు మాదిరి యాటికి యాటికో కొట్టుకు పోతాండె. ఒక్కటీ కిందికి దిగలే.

'ప్రపంచంలో పాపాలు పెరిగిపాయె. వానలు కురసమంటే ఎట్ల కురుస్తాయి మల్ల' అనుకుండె పెన్నప్ప.

పునర్వసు పాయ, పుష్యమి వచ్చె. వాన రాలే!

దినాలు జరగబట్టె.

కప్పలకు పెండ్లిండ్లు చేసిరి.

వానరాలే!

భారతంలో విరాట పర్వం చదివించిరి.

వానరాలే!

ఇంటికి ఒకరు గుంపుగా చేరి రాత్రి లాంతర్లు పట్టుకొని ఊర్లో సందు గొందులన్నీ తిరగతా బజన్లు చేసిరి. వానరాలే! ఊరి బొడ్డురాయిమింద నూటా ఒకటి కడవల నీళ్లు పోయించిరి. కాని వానేమో రాలే! "ఎట్లబ్బా! వానరాలే!" అని శెట్టి అంగట్లో గొంతు కూర్సుని దిగులు పడతాండె పెన్నప్ప వక్కాకు నములుకుంటా. ఆడ ఇంకా నలుగురైదుగురు రైతులు సందకాడ ముద్ద తినొచ్చి బీడీలు కాల్చుకుంటూ కూర్చోనుండిరి.

"లే పెన్నగా! నీ దగ్గర ఒకటిన్నర పల్లానే కదా ఇత్తనాలు ఉండేది పాపం! నేను ఒకటిన్నర పల్లా ఇస్తాను. కొండబోయి ఆ మిగతా ఐదెకరాల్లో కూడా సల్లుకోరా! ఆ భూమి ఏం పాపం చేసిందని దాన్ని మాత్రం బీడు పెడతావు" అనె కువ్వాడ మాడతా లింగప్ప.

బైటికి లేసిపోయి వక్కాకు ఎంగిలి వూసొచ్చి తెలివిగా నవ్వె పెన్నప్ప "వానరాలే కాబట్టి ఇత్తనం కొండబో అంటాండావు. అదే వాన గినా వచ్చింటే ఆ మాట అనేవానివా? నీది ఏం తెలివిరా లింగా! వాన ఎట్లా రాదు అనుకుని నీ దగ్గరున్న ఇత్తనాన్ని ఎవరికన్నా తగలబెట్టి దాని మింద వడ్డీ అయినా రాబట్టుకోవల్ల అని అనుకుంటాండావు. నీకే కావల్లంటే చెప్పు. నా ఒకటిన్నర పల్లా ఇత్తనం కూడా నీకే ఇచ్చి కృష్ణా, రామా అని కూలికిపోతాను నిశ్చింతగా" అనె.

“అంతే మరి! కరెట్ మాట అనె పెన్నగాడు. ఈ సేద్యాలు చేసుకునే దానికంటే కూలికి పొయ్యేది మేలు కదా, అప్పా! ఎవరికయినా కావల్లంటే చెప్పండి, నా దగ్గర కూడా ఎనిమిది పల్లాలు ఇత్తనం వుంది” అనె ఆడనే కూర్చుని బీడీ తాగుతాండే పెద్దరైతు శంకరప్ప.

శంకరప్ప మాటలు విని తృప్తిగా గాలి పీల్చుకుండె పెన్నప్ప. ‘అయితే నేను మంచి పనే చేస్తి. సగం ఇత్తనం ఆ రంగప్పకు కొలిపిచ్చి బరువు తగ్గించుకుంటిలే! శంకరప్ప వంటి పెద్ద రైతులకే గుండె సాలకపోతే ఇంక నేనెంత, నా బతుకెంత’ అనుకుండె.

“యాలట్రా! అంతా అట్ల నిరుత్సాహపడతారూ? చెల్లికెరకు చార్జీలు పెట్టుకుపోయి అప్పుచేసి ఇత్తనం తెచ్చింది ఎందుకు? భూమిలో ఇత్తేదానికా? లేక ఇంకొకరికి ఇచ్చేదానికా? చింత పడద్దండి. వాన వస్తుంది! వాన వస్తుంది!” అని ధైర్యం మాటలు చెప్పె శెట్టి.

కొంచెం సేపట్లో వాతావరణం మంచిగా మారిపాయ. గాలి నిలిసిపాయ. ‘అబ్బ! బొలె వుడుకు పెడతాందప్పా’ అని చేత్తో బనియను ఊపుకుంటూ బైటికొచ్చి ఆకాశం దిక్కు చూసె శెట్టి.

“మోడం బాగానే పట్టింది” అనె.

మెరుపులు మెరిసె.

ఉరుములు ఉరిమె.

‘అర్జునా! ఫల్గునా! పార్థా! కిరీటి!’ అని తలుసుకుండె పెన్నప్ప.

అంతా వాన గురించే మాట్లాడుకోబట్టిరి.

“తూర్పు గడ్డమింద అప్పుడు రెండు పదున్లు వాన కురిసిందంట. భూమి అంతా పచ్చగైందంట!”

“ఔనంట! ఆ పక్క అంతా ఆరుద్ర కార్తిలోనే విత్తనం ఏసినారంట.”

“పునర్వసు రాకుండానే ఏసినారే! అంత ముందుగా ఎందుకు ఏసినారబ్బా?”

“ఏమో? మల్లా మల్లా వాన వస్తుందని గ్యారంటీ ఏముంది? ముందో, వెనకో ఇత్తనం పడితే సాల్లేరా బగవంతుడా అని ఏసింటారు.”

“వాన గినా వస్తే ఇదే కరెట్ టైము ఇత్తనం ఏసేదానికి”

“ఔను మల్ల. పునర్వసు, పుష్యమి రెండూ బలం కార్తులు కదా?”

“మొన్న మొన్న... అంటే ఒక వారం దినాల కిందట పిల్లలపల్లి మింద మంచి వానంట!”

“అవును. ఆ వాన మనకు తగలాల్సింది. మధ్యలో గాలొచ్చి పిల్లలపల్లికి కొట్టుకుపాయ.”

"ప్రాప్తం, అప్పా ప్రాప్తం! వచ్చేవరకూ వానకాదు. తినే వరకూ బువ్వ మనది కాదు"

"ఈ పొద్దు మాత్రం వాన వచ్చి తీరుతుంది మామా!"

"ఔను. నాక్కూడా అట్లే అనిపిస్తాందిరా!" అంతా ఇట్లా మాట్లాడుకుంటాంటే మోడం పట్టి సన్నగా చినుకులు రాలబట్టె. పెన్నప్పకు మల్లా ఆశపుట్టె.

"ఏమో! వానలు వస్తాయేమో! ఈసారి పంటలు పండుతాయేమో! రంగప్పకు సగం ఇత్తనం ఇచ్చి పొరపాటు చేస్తినేమో! పది ఎకరాలకూ ఇత్తనం సల్లుకుంటే పంటలు పండి బాగుపడతాంటినేమో! థూ! ఈ ఆడోల్ల మాట వినకూడదు. పిరికిమందు పోస్తారు లంజలు' అని తిట్టుకుండె పెండ్లాన్ని.

అంతా బయటికి పోయి వాన వచ్చే దిక్కుకు చూస్తా నిలబడిరి.

"అదిగదిగో! తిమ్మప్ప కొండమీద బొలె కురుస్తాంది"

"బొమ్మగానిపల్లె మింద మంచి పదును వాన!"

"కొండకాడనుంచీ గాలి మన ఊరి దిక్కే తోలతాంది"

"కృష్ణా! రామా! ఆ వానని మా ఊరి దిక్కు పంపించు తండ్రీ! నీకు చేతులెత్తి మొక్కుతాము" అని పెన్నప్ప గొణుక్కుండె.

కానీ దేవుడు పెన్నప్ప మొర వినలే! క్షణంలో గాలి లేసె... తీటకల్లు పక్క కొట్టుకొచ్చే మోడాలన్నీ పులికల్లు దిక్కుకు కొట్టుకుపాయ. అంతే! పైకి చూస్తే ఒక్క మోడం లే! ఒక్క వాన చినుకు లే! రవంత సేపటికి ఎండ కూడా కాయబట్టె.

'ఎట్లా పని చేస్తివిరా బగవంతుడా! బాగా మోడాలు పట్టిండే వానని ఎగ్గొట్టిస్తివే! మా నోటి కాడ కూడు తీసేసినట్ల' అని దిగులు పడతా బీడీ ముట్టించుకుండె పెన్నప్ప.

పెండ్లాం గుర్తొచ్చె! 'పాపం! దాన్ని తిట్టినందుకు చెంప లేసుకోవల్ల. అది మంచిమాటనే చెప్పె. దాని మాట విని రంగప్పకు ఇత్తనం ఇచ్చేసినందుకు నాకు మేలే జరిగె. సగం అప్పు మీద వడ్డీ తగ్గిపాయ. అది పిరికి లంజ కాదు. నేనే ఆశపోతు నా కొడుకుని' అనుకుండె.

దినాలు గడిచె.

పుష్యమి పాయ.

ఆశ్లేష వచ్చె.

జనమంతా చప్పగ అయిపాయిరి.

"కార్తి తప్పిపాయ ఇంక వాన వచ్చినా లాభం లేదు" అనిరి.

కొత్త కార్తె మొదలైన వారం దినాలకు వాన వచ్చె.

"ఈ వానే రెండు వారాల ముందు వచ్చి ఉండకూడదా! ప్చ్!" అంటా చప్పరించేసిరి. ఆశ్లేషలో చెనిక్కాయ ఏసేదానికి చానామంది రైతులకు మనసు ఒప్పలే. దేవుడు చల్లగా చూసి నాలుగు వానలు కురిపిస్తే పంట అయిపోదా... అని కొందరేమో ఇంకా ఆశగానే వుండిరి కానీ పూర్తి ధైర్యం చేయలేకపాయిరి.

ఇరవై ఎకరాలు ఉన్నోల్లు పది ఎకరాలకే పంట పెట్టిరి. పది ఎకరాలు ఉన్నోల్లు ఐదెకరాలకే ఇత్తనం సల్లిరి. కొందరు ఉరువు సేద్యం జోలికే పోలే.

పెన్నప్ప ఐదెకరాలకు ఇత్తనమేసి మిగతా ఐదెకరాలు బీడుపెట్టె. ఇత్తనమేసిన వారం దినాలకు మొలకలొచ్చె. తల్లి గర్భంలోని మైల పూసుకుని వచ్చినట్ల మొలకలన్నీ నెత్తి మింద మట్టి పలకలు మోస్తా పైకి లేస్తాండె. రెండు మూడు దినాలు గడిచె. ఇత్తనం రెండు బద్దలై చెరి ఒక పక్క ఇడిపాయ. ఆ ఇత్తనం బద్దలు రెండూ పచ్చిపిల్ల రెక్కల మాదిరి ఆకాశంలోనికి ఎగరల్లని ఆత్రపడతా ఉన్నట్లుండె.

మఖలో వానొచ్చె. వానొచ్చిన మూడు దినాలకు కలుపు తీసి సేద్యం చేసిరి.

పుబ్బ వచ్చె. సెట్లు పూత పట్టె. రజస్వల అయిన ఆడపిల్ల మాదిరి బంగారు పొంగినట్లు మెరిసిపోతాండె. ఇంకా కొన్నాల్లు గడిచె. సెట్టు బాగా పుంజయి ఏపుగా ఎదిగి మంచి పొగరు మీద వుండె. ఆ వేరుశెనగ పూత మింద తేనెటీగలు వాలతాండె. పిల్లోల్ల సంతోషం తల్లి ముఖంలో కన్పించినట్టు ఆ వేరుశెనగ చెట్లలోని కళ మన్నులోనికి గూడా పాకిపోతాండె.

కళకళలాడే ఆ ఐదెకరాల చేను పక్కన బీడుపడిన ఇంకో అయిదెకరాల చేను ముండ మోపి మాదిరి కన్పించె పెన్నప్పకు. కొన్నాళ్లకు పూత రాలిపోయి భూమిలోనికి ఊడలు దిగుతాంటే తట్టలోకి అన్నం పెట్టినట్లే వుండే రైతుకు.

ఉత్తరలో వాన రాలే.

హస్తలో కూడా వాన రాకుండా ఎగబెట్టె.

ఒక పక్క ఊడలకు పిందెలు కాస్తాంటే ఇంకోపక్క భూమిలో తేమ లేక సెట్లు వాడబట్టె. వారం దినాలు అన్నం లేక పస్తులతో సోలిపోయిన గర్భిణీ స్త్రీ మాదిరి సెట్లన్నీ ఊడలతో పిందెలతో ఒక పక్కకు ఒరిగిపోయి ఉండె. చేను పక్క చూసిన పెన్నప్పకు తన కడుపులో ఎవరో చేయిపెట్టి దేవినట్లాయ.

చిత్తకార్తె పోతుందనగా మూడు దినాలు జడిపట్టుకుండె. పైరు రవంత కళకళలాడె. పెన్నప్పకు మల్లా రవంత ఊపిరి తిరిగె. ఆ ఆశకూడా ఎక్కువ కాలం నిలసలే.

స్వాతి పాయ.

వాన రాలే!

విశాఖ వచ్చె.

వాన రాలే!

సలి మొదలాయ. ఇంక వానమింద ఆశ ఇడిసిపెట్టె పెన్నప్ప. చిత్తలో పుట్టిన రెండో పూత ఊడలై భూమిలోకి దిగకుండానే ఎండిపాయ సెట్టుమింద. తొలి పూత మాత్రమే ఊడలు దిగి కాయలు కాసె. ఆ కాయలలో గూడా రెండు మూడు కాయలు ఒక మాదిరిగా ఉండె. ఇంకో రెండు మూడు కాయలు లొత్తలు పడిన కాయిలో గుడ్డు లోపలే సచ్చిపోయిన కోడిపిల్ల మాదిరి ముదరకపోయి నాసుగా ఉండె ఇత్తనం!

చెనిక్కట్టి పీకి కుప్పపెట్టి కాయిని ఇడిపిస్తే, ఎకరాకు మూడు మూటలు కూడా దిగలేదు పంట. 'అయ్యో దేవుడా!' అనుకుండె పెన్నప్ప.

చెళ్లికెరకుపోయి వచ్చినోల్ల దగ్గర చెనిక్కాయ రేటు విచారిస్తాండె. ఒక వారం క్వింటాలు చెనిక్కాయ అయిదునూర్లు అనిరి. రెండువారాలు పోయినంక అయిదు నూటాయాభై అనిరి. ఇంకో వారం ఆరు నూర్లు అనిరి. మళ్లీ రెండు వారాలు జరిగినంక అయిదు నూటా యాభైకి తగ్గిందనిరి.

మార్కెట్ రేటు ఎక్కుతా, తగ్గుతా వచ్చె. పెన్నప్ప మనసు 'అమ్ముదామా? వద్దా?' అని గునిసి గునిసి సంశయిస్తాండె. రేటు ఇంకా పెరుగుతుందేమో అని ఆశ పడతాండె.

మట్కా నెంబరు కోసం అర్ధరాత్రి వరకూ మేలుకున్నవానికీ, మంచి మార్కెట్ రేటు కోసం ఎదురుచూసే పెన్నప్పకూ భేదం లేకపాయ.

ఒకవారం ఆరునూర్ల రేటు వచ్చె. ఆ రేటు ఇంకా ఎక్కుతుందేమో అనుకుండె. కానీ ఆ రేటు మళ్లీ వారానికి అయిదు నూర్లా ఎనభైకి తగ్గె. రంగప్ప అదే రేటుకు అమ్ముకుని వచ్చిండె తన చెనిక్కాయని.

పెన్నప్ప భయపడె. ఆలస్యం చేస్తే ఆ రేటు కూడా దక్కదేమో అనుకుండె. మూటలు లారీకి ఎత్తుకొని చెళ్లికెరకు ప్రయాణమైపాయ. ఆడ చెనిక్కాయ తూంచిరి. కాయి లొత్తలు పడి ఉండె కదా, అవటం రాలే! క్వింటాలుకు రెండున్నర మూటలు తూగాల్సిన కాయి మూడున్నర మూటలు తూగె.

తూంచేటపుడు చెనిక్కాయలో తోకలూ, గీకలూ, పొట్టూ గిట్టూ వున్నాయని చెప్పి క్వింటాలుకు మూడు కేజీలు కాయని తరుగుకింద తీసేసుకుండ్రి!

నాసిరకం కాయ అని చెప్పి. దుడ్లు లెక్కకట్టేటప్పుడు క్వింటాలుకు పదహైదు రూపాయలు తగ్గించుకుండ్రి. ధర్మ కార్యాలకు అని చెప్పి నూటికి ఒక రూపాయి పట్టుకుండ్రి. ఇత్తనానికి ఇచ్చిన అప్పును విరగేసుకుండ్రి. అప్పు మింద పెరిగిన వడ్డీ దుడ్లను కూడా పట్టుకుండ్రి.

కడాకు షావుకారు పెన్నప్ప చేతిలో దుడ్లు పెట్టలే, ఒక పట్టీని అందిచ్చె! పట్టీలోకి చదువురాని కళ్లతో తొంగి చూసి "ఎంత వస్తుంది, ధనీ, చేతికి?" అని అడిగె పెన్నప్ప.

"నువ్వే ఇంకా ఎనభై రూపాయలు బాకీ పడతావప్పా" అనె షావుకారు నిదానంగా.

పెన్నప్ప ఏడ్చులే...

"అయిదెకరాల సేద్యానికి ఎనభై రూపాయలు నష్టం. పది ఎకరాల సేద్యానికి నూటా ఇరవై రూపాయలు నష్టం వచ్చేది. మేలే కదా! నాకు మంచే జరిగె కదా?" అనుకుండె.

"అయిదు ఎకరాల్లో నేనూ, నా పెండ్లామూ, నా కూతురూ, నా ఎద్దులు చేసిన రెక్కల కష్టం విలువ రెండువేలు, నా పెండ్లాం మాట వినకుండా ఇంకొక అయిదెకరాల్లో కూడా సేద్యం చేసింటే ఇంకొక రెండు వేల రూపాయలు మా రెక్కల కష్టంలో దండగైపోయేది. మేలే కదా! నాకు మంచే జరిగె కదా!" అనుకుండె.

అట్లా అనుకుని

పెన్నప్ప నవ్వె

తిక్కనవ్వు నవ్వె.

ఆ నవ్వు చూసి 'పెన్నప్పకు తిక్కపట్టింది' అనే అనుకుండె ఆసామి.

నవ్వు నిలిసిపోయినంక షావుకారిని ముప్ఫయి రూపాయలు అప్పు అడిగె పెన్నప్ప.

పిచ్చి పట్టినోల్లు అప్పు అడగరు కదా! అందుకని పెన్నప్పకు పిచ్చి పట్టలేదని తీర్మానం చేసుకుండె షావుకారు.

పాపం! అనుకుని జేబులోంచీ ఇరవై రూపాయలు తీసిచ్చె. ఎనభై రూపాయలతో చేరి మొత్తం నూరు రూపాయల అప్పు అని చెప్పి పెన్నప్ప పేరిట ఖాతాలో రాసుకుండె.

"దిగులు పడొద్దు అప్పా! ఎల్లకాలమూ ఇట్లే ఉండదులే! మంచి దినాలు వస్తాయిలే!" అని ధైర్యం చెప్పి పంపె.

పెన్నప్పకు సమర్త అయి మూడేళ్లు దాటిన పెద్ద కూతురు గుర్తొచ్చె.

ఆ పాప పెండ్లిని వచ్చే సంవత్సరానికి వాయిదా ఏసె.

భుజం దగ్గర పిగిలిపోయిన పెండ్లాం రవికలు గుర్తొచ్చె.

ఆ రవికను వచ్చే నెలకు వాయిదా ఏసె.

పలక కావల్ల అని పోరుపెట్టే సిన్న కొడుకు గుర్తొచ్చె.

ఆ పలకను వచ్చే వారానికి వాయిదా ఏసె.

పొద్దుట్టి నుంచి ఏమీ తినక కడుపులో కొక్కులు తోడినట్లు ఆకలి అయితాండె. ఆ అన్నాన్ని ఇంకో పూటకు వాయిదా ఏసుకుండె.

అట్ల వాయిదా ఏసుకుని చార్జీలకు పోగా మిగిలిన దుడ్లతో పిల్లోల్లకు పప్పులూ, బొరుగులూ కొనుక్కుని ఇడిచేసిన అడ్డ పంచెలో మూటకట్టుకుండె. ఆ మూటను కన్న కొడుకు మాదిరి సంకలో పొదువుకుని ఉత్త కడుపుతో బస్సెక్కి ఊరు చేరుకుండె.

దినాలు జరిగిపోబట్టె.

పని దొరికినప్పుడు కూలికి పోతాండె.

పనిలేనప్పుడు ఎల్లమ్మగుడి కట్టమింద కూర్సుని పులీ, మేకా ఆడతాండె.

ఇరవై ఏండ్ల కిందటా, ముప్ఫయి ఏండ్ల కిందటా ఏ ఏ ఊర్లలో ఎంత పెద్ద వానలు కురిసినాయో, ఏ ఏర్లు ఎట్ల పొంగినాయో ఎవరెవరో కథలు కథలుగా చెబుతాంటే నోరు ఎల్లబెట్టి వింటాండె.

మల్లీ ఆరుద్ర వచ్చె.

పునర్వసు వచ్చె.

పెన్నప్ప ఆకాశంలో మోడాలకోసం చూడబట్టె.

పంచాయతీ రేడియోలో వాతావరణం గురించి వినబట్టె.

పోలేరమ్మ తల్లి పైలోకొచ్చే దానయ్యను “వానలు వస్తాయా, రావా?” అని అడుగుతాండె.

బాపనోల్లని ప్రభవ నామ సంవత్సరంలో వానల గురించి శాస్త్రం అడుగుతాండె.

ఈసారి ఇత్తనాలు అయిదెకరాలకు సల్లుదామా? లేక పదెకరాలకు సల్లుదామా.. అని ఆలోచన సేయబట్టె.

వానొచ్చే లోపల చెల్లికెరకుపోయి ఇత్తనం కాయ తెచ్చి రడీగా పెట్టుకోవల్లని ఆత్రంగా వుండె.

దినాలు జరగబట్టె.

కప్పలకు పెండ్లిల్లు చేసే కాలం వచ్చె.

పైనున్న ఆకాశం కిందనున్న పెన్నప్పను నంగనాచి మాదిరి చూస్తానే ఉండె!

✡

# అస్రు కడిగిన ఎద్దు

**–త్రిపురనేని గోపీచంద్**

నేను ఇప్పుడీ కొట్టంలో వొకమూల పడివున్నాను. నేను ఇక్కడ ఈసురోమని పడివున్నాననే సంగతి యెవ్వరూ గమనించరు. నా చుట్టూ వున్న ఈ రొచ్చూ, నా శరీరం మీదవున్న ఈ గోమార్లూ చూశారా? అంతే – చుట్టూ కొంచెం బాగు చెయ్యాలని గానీ, చచ్చేదాకా నా వొళ్లు వీలున్నప్పుడల్లా శుభ్రపరచి నా చావు సుఖవంతం చెయ్యాలని గానీ ఎవ్వరికీ పట్టదు. పైగా చావకుండా ఇంకా ఇక్కడే వున్నానని నా యజమాని మొదలు ఇంటిల్లపాదీ విసుక్కుంటూ ఉంటారు. నాకు త్వరగా చచ్చిపోవాలనే ఉంది. ఏం చెయ్యనూ? నాకు చావు రాకుండా వుంది. నన్ను గురించి ఈ మాటే అంటూ ఉంటాడు, బక్క చిక్కి కుక్కి మంచంలో కూర్చుని వుండే నా యజమాని తండ్రి కూడా! ఆ సంగతి తరువాత చెపుతాను.

మెడలోని గంటలను గణగణ మోగించుకుంటూ ఠీవిగా మేతమేస్తున్న ఆ ఎద్దులను చూశారా? మా యజమానికి ఆ ఎద్దులంటే అమిత ప్రేమ. వాటికి జనప కట్టలూ, పచ్చగడ్డి, ఉలవలూ అన్నీ పెడతాడు. పడుకున్నప్పుడు వాటి వంటికి ఎక్కడ గలీజు అంటుకుంటుందోనని ముప్పూటలా శుభ్రం చేస్తాడు. తన సొంత చేతులతో వాటి వొంటిని రోజూ మాలిస్ చేసి నిగనిగలాడేటట్లు ఉంచుతాడు. ఊళ్ళో అందరికీ వాటిని చూపి గర్వపడతాడు.

కాని ఈ మూలపడి ఉన్న నా సంగతి మాత్రం ఆలోచించడు. నా ముందు గడ్డి వున్నదీ లేనిదీ చూడడు. ఆ ఎద్దులు తినలేక మిగిల్చి తొక్కివేసిన చెత్త తీసి పెంట పోగులో వేసేటప్పుడు నా ముందు నాలుగు పరకలు రాలుస్తాడు. వయస్సు మళ్లి కాటికి కాలు చాచుకొని వున్న నేను లేవలేక పడుకొని ఉంటే, ఆ పరకలు తినగలందులకు లేవనని వొక తన్ను తన్ని వెళ్తూ వుంటాడు. నా అంత నన్ను లేవనిస్తే ఆయనకు పోయిందేమిటో!

అయితే నా యజమాని నన్నెప్పుడూ యిలాగే చూసేవాడా అంటే కాదు. ఆ ఎద్దులను చూచినట్టు నన్నూ ఆస్తారమతంగా చూచిన రోజులు ఉన్నాయి. అప్పుడు నేను వయస్సులో ఉన్న రోజులు. నా యజమాని కోసం రాత్రింబవళ్ళు కష్టపడి పని చేయగలగిన స్థితిలో వున్న రోజులు. ఆ రోజుల్లో తన బిడ్డలకంటే మమ్ములను ఎంతో జాగ్రత్తగా చూచుకొనేవాడు మా యజమాని. నన్నూ నా జత ఎద్దును కొన్నప్పుడు ఆయన పది ఎకరాల రైతు. మా అస్రులు

కడిగే నాటికి ఆయన ఇరవై ఎకరాల రైతు. ఈ పది ఎకరాలూ ఆయన మావల్లే కొనగలిగాడని నేను చెప్పుకుంటే మాత్రం యీనాడు నా మాట నమ్మేది ఎవ్వరు?

నేనూ నా జత ఎద్దూ నా యజమాని దొడ్లో పుట్టిన వాళ్ళం కాదు. మామీద మోజుపడి, ఎక్కువ డబ్బు పెట్టి ఇంకొక గ్రామం నుంచి కొనుక్కొని వచ్చాడు. ఆ రోజు నాకింకా, కండ్లకు కట్టినట్లు జ్ఞాపకం వుంది. మమ్ములను చూచుకొని ఆయన ఎంత గర్వపడ్డాడను కున్నారు? ఏదో శాస్త్రం చెపుతారే, ముడ్డిమీద గుడ్డ నిలవలేదని – అట్లా వున్నాడు.

మా ముఖాలకు పసుపు రాసి, కుంకుమ పెట్టి, మా కొమ్ములు అలంకరించి వూరంతా వూరేగించాడు. ఊళ్లో వాళ్ళందరికీ భోజనాలు పెట్టాడు. ఊరందరికీ ఆ రోజు పండుగే. ఇంటికి వెళ్ళగానే మా యజమాని భార్య మాకు దిష్టి తీసి దొడ్లోకి తీసుకువెళ్ళింది. మాకు జరిగిన వైభవం మేమే నమ్మలేనంత విపరీతంగా జరిగింది.

ఆ సాయంకాలం ఊళ్ళో వాళ్ళంతా నా యజమాని దగ్గరకు వచ్చి, మా బలాన్ని పరీక్షించడానికిగాను, వొక పుట్టెడు వడ్లబస్తాలను బండి మీదవేసి, ఆ బండిని చెరువులో ఇటు నుంచి అటు లాగించాలన్నారు. మా యజమాని, మాకు మల్లేనే అప్పుడు వయస్సులో వున్నాడు. మా శక్తి సామర్థ్యాలలో ఆయనకు మంచి నమ్మకం వుంది. ఆయన తండ్రి 'ఎందుకు వాటిని కష్టపెట్టడం, పుట్టెడు వడ్లు ఆ ఊబిలో ఎంత మంచి గొడ్లయితే మాత్రం ఎట్లా లాగుతై?' అని వొక ప్రక్కన చెపుతున్నా వినకుండా అంగీకరించాడు.

ఆ సాయంకాలం ఊళ్ళో జనం అంతా చెరువుగట్ల మీదకు జేరుకున్నారు. స్త్రీలూ, పురుషులూ, పిల్లలూ ఊరు వూరంతా అక్కడే వున్నారు. వారిని చూస్తే మాకు అమితోత్సాహం కలిగింది. ఆ ఉత్సాహంతో జయజయధ్వానాల మధ్య తేలిగ్గా బస్తాల బండిని ఇటునుంచి అటు లాగివేశాం.

నా జత ఎద్దు అంతకుముందు రెండు సంవత్సరాల క్రిందట కాడిని కలిపిన గిత్త, దానికి బలం, పౌరుషం వున్నాయి. కాని ఇప్పుడు అదే అదృష్టవంతురాలు అనుకుంటున్నాను. తరువాత నా జతకు నా యజమాని మరొక ఎద్దును తెచ్చాడు. కొన్నాళ్ళు దానితో కూడా కలిసి పని చేశాను నేను.

నేనిప్పుడు ముసలిదాన్నయ్యాను. కాలుతీసి కాలు వెయ్యలేను. లేచి నిలబడటమే కష్టంగా వుంది. ఆకలి అనేది వుంటుంది. అది శరీరం వున్నంతకాలం వుంటుంది కాబోలు. కాని పండ్లు కదిలిపోవడం వల్ల ఆకలి తీర్చుకోడానికి కావలసిన ఆహారం తినలేకుండా ఉన్నాను. ఎండుగడ్డి నమల లేను. దండుగ అని పచ్చగడి నా యజమాని నాకు వెయ్యడు. అప్పుడప్పుడు మిగిలిన ఎద్దులు తినక విడిచిపెట్టిన జనపమోళ్ళు కొరకటం నా వశమా? నా వశంగాక పైపైన చప్పరించి విడిచిపెట్టానని ఆయనకేం తెలుసు పాపం? మోళ్ళు గనక తినలేదని చేతిలో వున్న ముల్లు కర్రతో 'నీకింత కావరమా?' అని ఎడాపెడా కొడతాడు. విన్నారా?

కాటికి కాళ్ళు చాచుకొని కూర్చున్న నాకు కావరమట! అంటే అన్నాడు. ఆయన అనటానికీ మేము పడటానికీ పుట్టాం. కాని ఈ వయసులో దెబ్బలు భరించటం కొంచెం కష్టంగా వుంటుంది. నా జత ఎద్దుతోనే పోక ముసలితనం వచ్చిందాకా బతికినందుకు నన్ను నేను తిట్టుకోవటంకంటే చేసేది యేముంది?

నేను ముసలిదాన్నయ్యాను. నిజమే, నేను పని చెయ్యలేను. నిజమే. నాకు ఎంత తక్కువ మేత వేసినా అది నా యజమానికి నష్టమే. నిజమే. కాని ఇంతకుముందు నే చేసిన పనికి, నా యజమానికి సంపాదించి పెట్టిన లాభానికి నాకు సహజ మరణం వచ్చేవరకూ బ్రతికే అర్హత లేదా? నేను చేసిన సేవకు నా పట్ల కాస్త ఆదరం చూపగూడదా? ఇవ్వాళో రేపో నేను ఎట్లాగూ కన్ను మూస్తాను. ఈ నాలుగు రోజులూ, రోజుకు నాలుగు పరకలు వేసి రెండు మంచి మాటలు మాట్లాడి పోగూడదా? అందుకు నేను నోచుకోలేదు. అది ఆశించటం కూడా తప్పే. ఎందుంటే నాదేముంది? నా యజమాని తండ్రి కూడా నా స్థితిలోనే వున్నాడంటే ఇక చెప్పవలసిందేముంది?

నా యజమాని తండ్రి చాలా మంచివాడు. అంటే పాతకాలం మనిషి. నేను ఈ యింటికి వచ్చేముందు, ఆయన తాళపు చెవులు కొడుకుకి అప్పగించాడు. అప్పటినుంచీ ఏ విషయం లోనూ జోక్యం కలిగించుకునే వారు కాదు. నా అర్రుకడిగి నన్నీ మూలకు జేర్చింతరువాత, ఆయన అప్పుడప్పుడూ వచ్చి నా దగ్గర కాసేపు కూర్చొని వెళ్లేవాడు. నా మనస్సులో వున్న కష్టం ఆయనకు తెలిసినట్లుగా ఎవ్వరికీ తెలియదు. ఎందుకంటే ప్రస్తుతం ఆయన అనుభవం కూడా ఇంచుమించు నా అనుభవానికి మల్లేనే వుంది. మేము ఎందుకు బ్రతుకుతున్నామో ఇతరులకు తెలియదు. మాకూ తెలియదు.

ఆయనకు భార్య గతించి చాలా రోజులైంది. ఆయనకు వున్నది ఒక్క కొడుకూ, కోడలూ, వాళ్లకు నలుగురు ఆడపిల్లలూ, ఒక మొగపిల్లవాడూ. కొడుకు ఆయన సంగతి పట్టించుకోడు. కోడలుకి ఆయనంటే పడదు. ఆమెకు ఆయన ఒక తగలాటంగా కనపడుతుంటాడు. వేళకు అన్నం పెట్టదు. అందరికీ పెట్టి తాను తిని అప్పుడాయన్ను పిలుస్తుంది. ఏది మిగిలితే అది వేసి పెడుతుంది. ఏదివేస్తే అది తిని ఆయన చెయ్యి కడుక్కుంటాడు. కుక్కి మంచంలో మునగదీసుకొని కూర్చుంటాడు. ఆయన సంగతే అట్లావుంటే ఇక నాదేముంది?

ఆయనకూ నాకూ అమిత స్నేహం. ఎవ్వరూ లేకుండా చూచి నా దగ్గరకు వచ్చి కూర్చునేవాడు. ఆయనా నేనూ కలిసి వుంటే నా యజమానికి తగని కోపం వచ్చేది. తన కోసం కష్టించి, యెముకలను అరగించుకొని పనిచేసిన మా యిద్దరినీ తాను చూడవలసిన విధంగా చూడటం లేదని జ్ఞాపకం వచ్చేదో ఏమో! 'నీకిక్కడ ఏం పని?' అని తండ్రిని గదమాయించేవాడు. ఆయన నెమ్మదిగా లేచి కర్రపోటు వేసుకుంటూ యింట్లోకి వెళ్ళేవాడు. నేను కండ్లప్పగించి చూస్తూ వుండేదాన్ని.

ఎవ్వరూ లేనప్పుడు ఆయన్ని చూచి నేనూ, నన్ను చూచి ఆయనా కన్నీరు పెట్టుకుంటూ వుండేవాళ్ళం. అంతకంటే మాట్లాడుకోవలసింది ఏముంటుంది మాకు. నేను మెడ చాచి ఆయన భుజం మీద పెట్టేదాన్ని. ఆయన కాసేపు నిమిరేవాడు. మేమిద్దరం చావటం చేతగాక బ్రతుకుతున్న వాళ్లం. మామాట ఎవ్వరు పట్టించు కుంటారు? మేము అందరికీ భారమే. మమ్మల్ని ఎందుకు తీసుకుపోడో భగవంతుడు! తీసుకుపోతాడు. కానియెంత త్వరగా తీసుకుపోతే అంత మంచిది.

ముసలాయన వారం రోజుల నుంచి నాకు కనబడటం లేదు. మంచం పట్టాడని ఎవ్వరో అనగా విన్నాను. ఆయన కూడా కనపడడు కాబోలు!

ఇది యిలా వుండగా ముసలి పశువుల్నీ, పనికి ఉపయోగించని పశువుల్నీ కొనటానికి ఊళ్ళోకి యెవరో వచ్చారని విన్నాను. వారు పశువులను అయినకాడికి కొని, మాంసం కోసం కసాయి కొట్టుకు తోలుతారట. రైతులకు ఈ విషయం తెలిసివుంటే తెలియనట్టు నటించి అమ్మివేస్తారట. ఎంత అన్యాయం!

ఆ పరిస్థితే వస్తే నా పీడ యేదో వొక విధంగా వొదిలించుకోటానికి నా యజమాని వెనుదియ్యడనే నా అనుమానం. మా జాతిపట్ల రైతులు యిదివరకు యింత నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించేవారు కాదు. అహోరాత్రుళ్లూ తమ కోసం పనిచేసి వృద్ధాప్యంలో అడుగుపెట్టిన మా జాతిని యెంతో గౌరవంగా చూసేవారు. మా గతం తెలియని పిల్లలు మమ్ములను ఆటలు పట్టించటానికి ప్రయత్నిస్తే, 'దాని సంగతి మీకేం తెలుసోయ్? దాని రోజుల్లో....' అని మేము చేసి ఘనకార్యాలన్నీ చెప్పి, మమ్ములను పొగిడి మాపట్ల వారికి సానుభూతి కలిగేటట్లు చేసేవారు. 'అది మన యింట్లో అడుగుపెట్టిం తరువాతే మనకు కలిసివొచ్చిందమ్మా! దాన్నేమీ అనకండి. అంటే దేవుడు మెచ్చడు' అనేది ఇల్లాలు.

ఆ రోజులు గతించినై. ఉపయోగపడినన్నాళ్ళూ ఉపయోగించుకొని, తరువాత కాటికి కాలు పట్టుకొని యీడ్చే రోజులు ఇవి. కొడుకు కన్న తండ్రిని, తల్లినే యీ పని చేస్తున్నాడు. ఇక మాదేముంది – నోరులేని జీవాలం!

నాకిప్పుడే కోరికా లేదు. ఒక్కసారి ముసలాయన భుజం మీద తల ఆన్చి కన్నీరు పెట్టుకునే అవకాశం వుంటే చాలు. ఆయన ఒక్కసారి తన చల్లని వ్రేళ్ళతో నా మెడ నిమిరితే చాలు. ఆయనకంటే ముందు నేను దాటిపోతే చాలు.

అదిగో ఆ కాకిని చూశారా, యెట్లా కుప్పిగంతులు వేసుకుంటూ వస్తూందో! నా వెన్నుమీద వున్న పుండును తడవ తడవకూ వచ్చి పొడుస్తూ వుంటుంది. దానిని నేను యెట్లా ఆపగలను? తోకకూడా లేపలేనే!

ఆ పుండుకు ఏదన్నా మందు రాయించకపోతే పోయాడు నా యజమాని. చినిగిన యే పాతగోనె గుడ్డతోనో కాస్త కప్పించకూడదా! కప్పించడు. ఆ గోనె గుడ్డని పాడు చెయ్యటం మాత్రం ఎందుకు? – అనుకుంటాడు కాబోలు.

అదిగో వస్తూ వుంది కాకి.

అబ్బా!.........

✡

# సర్కారు కిస్తు

**– మంద రామారెడ్డి**

"ఈ రసత్తానికి మన నడిపిదానికి పదకొండేండ్లు నిండుతయి. సమర్తీడుకొచ్చిన పడుచుదాన్ని ఇంట్లో పెట్టుకొని ఇట్లా పెండ్లి పేరంటమనిగూడా తలవకుండా మీకు కంటికి నిద్రలెట్లొస్తున్నయిరా నాయనా? నాదీ పెద్దప్రాణం, వూరు దూరమయింది. కాడు దగ్గరయింది. నా తల్లి తల్వాలైనా కండ్లజూస్తానో లేదో! బతికినన్నాళ్లు బతుకవోతానా! యేదో ఓ కులమింటయ్యను చూచితెచ్చి ఇంత పప్పన్నంబెట్టి దబ్బున దారవోస్తే యెందుకైనా బాగు" వంగుతూ వాలుతూ వడ్డెనతెస్తూ కొడుకు కోదండయ్యను మందలిస్తూంది తల్లి బాగమ్మ.

"తోటకాడి కెల్లి మిరపకాయలు తెంపుకునేసరికి పొద్దుకూ మాకూ సరిపోయె. ఇంట్లో పోటువడ్డ బియ్యంగూడా లేకున్నె. ఈ పూటకు నూకలు మాత్రం వుంటే వొండినా" అని స్వపక్షంగానే సమాధానం చెబుకూంటుంది భోజనం మీద గూచున్న భర్తకి భార్య రంగమ్మ, ఒకప్రక్క చంటిబిడ్డకు చన్ను నోటబెడుతూ, వేరొకప్రక్క యేడుస్తూ మారాంచేసే యెడబిడ్డను కాళ్లమీద వేసుకొని సముదాయిస్తూ.

కోదండయ్య తల్లిమాటలుగాని, భార్యమాటలుగాని వినిపించుకోవడం లేదు. బజారు తట్టు వినిపించే తప్పెటదరువు దిక్కే చెవులు వాలేశాడు. తప్పెట హటాత్తుగా ఆ యింటి మూలన ఆగగానే.. "సర్కారు కిస్తు రేపే పోవాలెనంటా, రకంగట్టని ఆసాములంతా రేపు తెల్లవారుగట్లా, రసీదు బొక్కులూ, రకం తీసుకొని కరణం పటేండ్లముందరికి చావట్లకు రావలెనంటా, తకావీరకం, కిస్తురకం అంతా కలిపి కట్టాలెనంటనో హోయ్.." అని కావలిచిన్నోని కేక వినిపించింది. అవ్వలుకిస్తు వసూలు చేసే రోజులు అవి.

నూకలబువ్వ, గోకరికాయ కూర పదిబుక్కలైనా దిన్నాడో లేదో కోదండయ్య చాటింపు విన్న తర్వాత అతనికి ఒక్క బుక్కైనా నోట్లకు వోవడం లేదు. కొడుకు వాలకం చూస్తున్న ముసలమ్మ "పాలు కాగినయి నాయనా" అని పొయ్యిమీది పాలచట్టిని ఈడ్చుకుంటూ దగ్గరతెస్తుంది. కాని "ఊహు" అని అతడు పీటమీదినుంచి లేచి చేయి, మూతి కడుక్కొని అవతలి యింట్లోకి వెళ్లిపోయాడు. "అయ్యో కొడుకా!" అనుకుంటూ ముసలమ్మ తిరిగి పాలచట్టిని తీసుకవెళ్లి పొయ్యిమీద ఉంచి మూత పెట్టుకుంది.

కుంపటిముందు కూచొని కారుచుట్టను కాల్చుకుంటూ ఆలోచనలో పడ్డాడు కోదండయ్య. తప్పెటదరువు చెవులోబడ్డ లగాయితీ అతనికి దడదడ వదలలేదు. నిన్న పొద్దుటిపూటే మాలిపటేలు నరసింహారెడ్డి పిలిపించి తన కాతాకు తగిలేరకం వివరంగా చెప్పాడు. "యర్రచెల్కకు ఇంతా, చెరువుకొమ్ము చిడతకు ఇంతా, సివారంచు చెల్కకు ఇంతా, బావి పొలానికి ఇంతా, మొత్తానికి పునాసకు ఇంతా, తరికి ఇంతా, అసలు ఇంతా, దానికి లోకల్ ఫండు ఇంతా, (జమాబంది కర్చులు, గిర్దావరు మామూళ్లు మినహా) అంతా కలిసి ఇన్నూటా ముప్పైయేడు రూపాయిల పాంచాన చార్‌పాయి" అని.

"కరువులోనే అధికమాసం అన్నట్టు తకావీరకం గూడా యిప్పుడే తగులాలా! ఇంకా నయం. ఎరువుసంచులూ, విత్తనాలూ గురించి అడుగలేదు. జిరాతి (వ్యవసాయశాఖ) వాళ్ళదే పుణ్యం. శ్రావణమాసపు వరపుల్లో నేల సెనగచేనుకు వేరుపురుగు తగులకుంటే అది బాగానే సమయానికి అక్కరొచ్చేది. అప్పుడట్లా మంచి పొట్టపాలువోసే కాలంలో జీతగాడు యెగదొబ్బి రిక్షాలాగ పట్నమెళ్లె. ఆ కాస్త వరిమళ్లు అవురుతప్పె. పిల్లల నోట్లో మన్నువడె. జ్వరమొచ్చినా బువ్వలేదు. జేజెకు పెడదామన్నా బువ్వలేదు. కాలంలో కరువు అన్నట్టు చిత్తపాశం వోసింది మొదలూ మింటికి మంటికి ఒక్కటేధార కుండతో కుమ్మరించినట్లే. ఈనిన కంకి ఈనినట్టే బుసిరాలి పాలారిపోయింది. ఈననది ఈననట్టే నిలువునా నల్లగట్టి పడిపోయింది. తిప్పి తిప్పి కొడితే జొన్నలు, సజ్జలు కలిసి ముప్పందుము ఇంటికొస్తే యేమన్నట్టు? చాటప్పులకు సరిపెట్టంగా సంక్రాంతి దాకనైనా జీవనము జరిగేటట్టులేదు. ఆమిదపు చేల సంగతి చూస్తే దినదినగండం. యెప్పుడూ దాసరి పురుగే. ఇక యాసంగిపంట వకనాటిపంట, రేపటిదానికి రూపంలేదు"

ఒకటా? రెండా? యెవనికొంపకు కన్నమేయాలి? సర్కారురకం ఆగేదెట్లా? జొన్నో సజ్జో! ఇంత పూట జరుగుతూంది. ఆయిన్ని బోర్లవేస్తే ఆవల బుక్కాదేదెట్లా? ఒకరా! ఇద్దరా! వచ్చేటోడు, పొయ్యేటోడు, బిచ్చగాడు, అచ్చగాడు అటుంచి చదువువంతులు మొదలూ, చాకలి వరకు పూటకు యేడుగురు. అమిసిన బత్తెం అయిదు సేర్లు గావాలి రోజొక్కంటికి.

నులకమంచంమీద గొంగడి అడ్డమేసుకొని కూచున్న కోదండయ్య ఇవన్నీ తలుచు కుంటూ, అట్లే నెత్తికి చేతులు పెట్టుకొని కూర్చున్నాడు. అర్ధరాత్రి మీరినా అతనికి రెప్పకు రెప్ప అంటుకోవడం లేదు.

రంగమ్మ చంటిబిడ్డను పక్కనేసుకొని పండుకొంది. యెడబిడ్డ గడెగడెకు యేడుపు సాగిస్తుంటే "దానికి కండ్లు మంటలేస్తున్నాయో ఏమో! ఈ రెండు మాపులనుంచీ దానికి నిద్రలేదూ, నాకూ నిద్రలేదు. ధారణమేమొ చేసింది. యేంజేయాలె? ఈ పాడు గాస్సునూనె వచ్చింతర్వాత ఇంత పిల్లల మాడపట్టుకు రాసేదటువోగా, కంట్లో యేసుకుందామంటే గూడా అంత ఆముదపుచుక్క గతిలేకుంటయింది" అని విసుగుతూ జోకొడుతుంది ముసలమ్మ.

కొంగ్రులా అలానే కూచున్న కోదండయ్య "కొక్కొరొకో" అన్న కోడికూత విని, గొంగడి దులుపుకొని బుజాన వేసుకొని పొలం మొగాన పొయ్యాడు.

✡

చిత్తెండ పటపట గొడుతూంది. ఆసామీలకు సగం నాగులకూ, సరినాగులకూ యిచ్చిన తిండిగింజలు తిరిగి ప్రోగుజేసి భద్రపరచడానికి పాతగుమ్ములు పూతవేయించి ఆరబెట్టిస్తూ, తాను వుల్లిగడ్డ చెరుక్కొంటూ వాకిట్లో నిల్చున్నాడు, షావుకారు మిర్యాలపాపయ్య.

యెప్పుడో వచ్చి గొంగడి మడతమీద నెట్టుగా గోడనీడలో గూచున్న కోదండయ్య సావుకారి యెప్పుడింట్లకు వస్తాడా, యెప్పుడడుగుదామా అని అనుకుంటూ చుట్టలకు పొగాకు నలక నలుచుకుంటూ చూసుకుంటూ గూచున్నాడు.

చెరిగిన ఉల్లిగడ్డలచేట చేతబట్టుకొని కోదండయ్యను చూసి గూడా చూడనట్టే దుకాణంలోకి పోతున్నాడు సావుకారి పాపయ్య.

'నీవద్దికే వచ్చినా' అంటూ వెనుకాల నడిచాడు కోదండయ్య.

'యేంపని?'

... మూడు నిమిషాలు మౌనంగా గడిచాక 'కిస్తు' అన్నాడు కోదండయ్య.

'కిస్తూ? కిస్తులేదు గిస్తులేదు'

'అట్లంటే యెట్లా?' మందస్వరంతో అన్నాడు.

"యెట్లాలేదు యాసంగిలేదు"

"గతి" దీనంగా అన్నాడు.

"గతో, గంగో, నావద్ద రాగిదుడ్డు దొరకదు"

"సర్కారురకం, ఆపేదెట్లా? యెందు కిట్లా జేస్తవ్. నీ సొమ్ము ఇదివరకేమన్నా వుంచుకున్నామా?"

"ఆగకుంటే నా యల్లుని కట్నాలా! అంతా ఉంచుకోనివాడనే. పెద్దబిడ్డ పెండ్లిజేస్తి కోరా పత్రం అట్లే మూలుగుతుంది. ఒక్క దమ్మిడి వసూలులేదు మళ్ళీ అల్లునికేదో కట్నాలన్నీ కాను కలనీ బట్టలు బాతలు యాభైకి పైగా చేసి కూచున్నావ్. విత్తనాల బాబతు గిద్దెడుగూడా గొలువలేదు. ఈ రెండు సంవత్సరాల నించీ తిండిగింజల బాపతు తీసుకపోయిన ముఖమే కాని యిచ్చిన ముఖం గాదు"

పాపయ్య సావుకారి యిచ్చిపుచ్చుకునే మోతుబరి మనిషి. అతడా వూరికి వచ్చేవాడు ఆస్తి అంటూ వెంట యేమీ తేలేదు. ఆసామిసంచిలో అద్దసేరు నూకలూ, తక్కెడా, బూట్లా

తప్ప. మొదలు చిన్న పూరిగుడిసెలో బుట్టి దుకాణంబెట్టి బతికాడు. అట్లే అట్లే నాలుగు కాసులు చేజిక్కించుకుని ఆసామీలకు నాగు గింజలీయడం ప్రారంభించాడు. బిక్క మొగపు అమ్మలక్కలకు అతడు చిల్లెరసామాను యిచ్చి లెక్కరాసే అప్పుడు సంపటం మీద బెల్లందుడ్డు, బెల్లంబాపతు దుడ్డు అని అంతకంత కల్పించి మడతరాతలు రాసి అది పెద్ద కాతాకెత్తి చూపి దానికి మిత్తిగట్టి పంటల మీద గింజలు గొలిపించుకొని ఆరు నెలలనుండీ యిచ్చుకుంటూ వచ్చాననీ బజారు ధరకు పావలా తక్కువ చొప్పున ధరలు ఖరారు చేసుకొనేవాడు. మిత్తికిచ్చిన రూపాయిలకు ముద్దతు దాటితే పెచ్చులు గట్టేవాడు. తిండిగింజలు కాగులలో బోసి, గుమ్ములలో మెత్తువెట్టి, గోనెసంచుల్లో గుట్టేసి, పాతర్లలో పూడ్చి, శ్రావణ భాద్రపద మాసాల్లో తీసేవాడు. శ్రావణ భాద్రపద మాసాలు తెలుగుగడ్డకు ప్రకృతి ప్రసాదితమైన గడ్డు కరువుకాలాలు. పాతపంటల తాలూకు చిట్టెడు గూడా మిగిలివుండవు. కొత్తపంటలు అప్పటివరకు యేమీ మెదలవు. కొడవలి పడని కత్తెరపంట లేవైనా ఉంటే కుంభవర్షాలూ, పిల్ల గోదావరులూ కలిసి సర్వమంగళం చేసే శుభదివసాలు అవి. సమయజ్ఞతగా పాపయ్య తన ఆర్థిక సూత్రప్రకారం, కడుపు కక్కుర్తిని రేపే అట్టి కాటకంలో పేద రైతులను ముప్పై మూడుమాట్లు ఇంటిచుట్టు తిప్పించుకొని, ముప్పుతిప్పలు బెట్టి అప్పులిస్తూ, సరినాగులకు రాయించుకోవడమేకాక, “గండ గరువులో కూటిగింజ లిస్తున్నాను సుమా?” అని చూపి చెప్పి, చొప్ప, గడ్డి బండ్లకొద్దీ మెప్పుగా తీసుకొనేవాడు. అంత జాణతనంతో అతడు గాదెపంటను పెంపుజేస్తూ వచ్చాడు. రెండు భవంతుల యిల్లు గట్టాడు. మూడు లగ్నాలు జేసుకున్నాడు.

కోదండయ్య కాతా తాలూకు నాగుబాబతు గింజలు కొన్ని మూడేండ్లనుండీ అట్లే పట్టుకొచ్చినై. వచ్చేవాడి వద్ద వడ్డికేడ్చే సామెతగా అతడు నలుగురిని గూర్చి నానా చేసీ గింజకు మూడు గింజలు పద్ధతిప్రకారం తీర్పు చెప్పించుకొన్నాడు. పైగా గొణుగుతూ, సణుగుతూ ‘యేదో నూటికి నూలుపోగు’ అనుకుంటూనే ఓ దాపటెద్దును దాని కిందికి తూడ్పు వెట్టుకున్నాడు.

ఇప్పుడు గూడా కోదండయ్య వద్ద అతడేదో గిరువుకో కుదవకో ఒప్పందానికో ఆశించి అలా సర్కారురకం దగ్గరకొచ్చేసరికి అడ్డగాలేసి కూచున్నాడు. ఈ కోపమంతా కోదండయ్యకు లేకపోలేదు. కాని బ్రతికే దినమంతా ముందుంది. షావుకారితోగాని, సర్కారుతోగాని కంటుగట్టుకుంటే రైతు జీవితంలో మేడి మెదలదూ, కాడి కదలదూ. అతన్ని బతిమి లాడలేక, బామిలాడలేక కోపం కొనముక్కుమీదికి వచ్చింది. అయినా చేదుమందులా దిగమింగుతూ లేచిపోయి చేతులు దొరికించుకొని, “చూడు పాపయ్యా! రేపు నలుగురు పాలివాళ్ల ముందు నన్ను గడ్డి గరిపించకు. నగేవాని ముందు జారిపడినట్టవుతుంది నా పని. ఇవి చేతులుగావు కాళ్ళు” అని అడుక్కొన్నాడు. ఉహు ఫలంలేదు. అతడు దులిపి వదిలించుకొని స్నానాలగదికి వెళ్ళిపోయాడు. కోదండయ్య చేతులు నలుచుకుంటూ వచ్చిన మొఖానపొయ్యాడు.

ఇంటికి వెళ్లి అతని కేమీతోచక నెత్తికి చేతుల బెట్టుకొని నేలలు జూస్తూ కుచున్నాడు. వంగి వంగి మోకాలు బట్టుకొని నడిచేతల్లి ముసలమ్మ దగ్గరొచ్చి, “సావుకారి యేవన్నడు

నాయినా!" అని అడిగింది. మారు మాట్లాడతోచక చింతలుజేస్తున్న కొడుకు ముఖం చూడలేక ఆమె వెనికికి మళ్లీ, "యెట్ల మాట దక్కించుకొంటావో కొడకా! తనోడనక, మనోడనక, కులమనక, తలమనక కూస్తాడా పటేలు. సర్కారుతోమాట. యెదురుగా వుంటే యెందుకైనా మంచిదికాదు. యిజ్జతు వోకుండా మొకం దప్పించాలె. 'సావుకారి ముందు సర్కారుకు చాటు' అన్నరు. ఇన్ని దినాలోలె నా వద్దనన్నా యేదన్న బంగారం వుండికాలవడిందా! అంతా గండగత్తెర వచ్చింది కొడుక్కు" అని నిట్టూరుస్తూ, మూలుగుతూ పోయింది ముసలమ్మ.

బాగమ్మకు చిన్నతనంలోనే మొగుడువోయి నెత్తినీడ లేకుంటైనా వ్రేలెడంత మొగమొల్క కోదండయ్యను నమ్ముకొని, వెంట్రుక వట్టుకొని కొండవాకినట్లు నడుపుకుంటూ వచ్చింది సంసారాన్ని. ఆకాస్త భూమికి పాలివాళ్లు పెట్టే పంచాయతీలు, చిక్కులు, కాలికి తప్పితె మెడకూ మెడకు తప్పితే కాలికీ ఉండేది ఆ రోజుల్లో. కరువనక కాలమనక అప్పుడు తులం ఇప్పుడు తులం తెగ్గొట్టి, సర్కారు తాకిడి వచ్చినప్పుడల్లా అష్టకష్టాలుపడి "చినుగని వస్త్రం" అనుకొని ఆయింతా భూమిని నిలబెట్టుకు వచ్చేసరికి ఆమె గొంతులో గుండ్లు గూడా కరిగిపోయినై. యిప్పట్లో అలాంటి బందార మేమీలేదు మాట దక్కించుకోను.

"సర్కారుకు చాటు" అన్న తల్లిమాట అతనికే మర్థమిచ్చిందో ఆ కాసేపటికే దుప్పటి దులుపుకొని బయటికెళ్లిపొయ్యాడు. అతడిపుడూళ్లోలేడు.

✡

అక్టోబరు 11వ తరీకు కిస్తువోయేరోజు. చావడిముందు అంతా హడావిడి ఉంది.

"వీనమ్మ ఊరమ్మను మాదుగులడగా అంతా చిన్నాయనలూ, పెదనాయనలూ, బావలూ, మామలూ, కొంపనిండా తనవాళ్లే, మనవాళ్ళే" అయ్యాక యెవరినేమనాలి, యెవరినేమన గూడదు? తిట్టవోతే అక్కబిడ్డా కొట్టవోతే యాకటిమనిషి. ఈ వూళ్ళో సర్కారురకం వసూలు చేసేవరకు కురుక్షేత్రంలో యుద్ధం జేసిందానికన్నా కాసంతెక్కువేగాని తక్కువగాదు. ఒకయ్య బాపనయ్య, ఒకయ్య గురువులయ్య, ఒకడు అయ్య, ఒకడు మియ్య, అంతా అయ్యలు మియ్యలు. నడుమ నాని తకతయ్యలు. ఒకడు పెద్ద పట్టాదారు, ఒకడు షావుకారు, ఒకడు ఇనాందార్, ఒకడు వతన్‌దార్. అంతాదార్లే సర్కారురకం సదారద్. కిస్తు ఇవాళ్ళ వోవాలి. పోకుంటే యిస్కేలు బరాయిందా. ఆరుగాలంజేసి నోట్లయేలు వెట్టుకున్నట్టే. తహసీల్దారు తగని మిండడు. చప్రాసివచ్చి గొంతుమీద గూచున్నాడు. రోజు రెండు రుపాయలు వాని కర్చుకు నా జేబు కాళి అవుతుంది. యెవని పెండ్లికోయ్ ఇదంతా? ఇంతైతే మా యింట్ల తినాలి, మందింట్ల పనిజేయాలి. తీర్వకువస్తే ఊరికి చేసిన ఉపకారం పీనుగుకు చేసిన సింగారం.. అరే యెల్లుగా! ఈ నల్గురు యెట్టిగాళ్ళను తోలుకపో, ఆ మదారుసావును ఇట్ల గుంజుకరా, ఆ చింతకింది ముత్తని బర్రెను గొట్కరా, అట్లే ఆ కోదండయ్య నిటపట్కరా."

మసీదుముందు మాలపటేలు మంటలై మండుతూండు. అతని దొక విచిత్ర ప్రవృత్తి. రకం వసూలుకు కూచునేరోజుల్లో బాగా తర్కించి అతణ్ణి గమనిస్తే రోజు రోజుకూ అతని

మనస్తత్వం మారుతూంటుంది. మొదట మొదట "ఆ దొరను పిలుచుకురా, ఈ దాతను పిలుచుకురా, ఆ అయ్యను పిలుచుకురా, ఈ అమ్మను పిలుచుకురా, మావను పిలుచుకురా, బావను పిలుచుకురా" అని మర్యాదపద్ధతి నవలంబించేవాడు, తర్వాత తర్వాత "ఫలానా వాణ్ణి పట్టుకురా, అదుగోవాడు, ఇదుగోవీడు" అనేవాడు. రాగారాగా రకం బంకాయి చాలా కనిపించెనా ఇగ ఆ నోటికే మొక్కాలి. కుక్కను మూతికి కట్టుకున్నట్టే కూసెవేడు.

యెట్టిమాదుగులూ, కావలికార్లూ, మచుకూరీలు, విరామం లేకుండా ఉరుకులాడు తున్నారు. కరిగట్లో నాగళ్లు గొట్టే వాళ్ళనూ, ఆమిదపు చేలలో అరకలు తోలేవాళ్ళనూ, మోటలు గొట్టేవాళ్ళనూ, మొద్దులు గొట్టేవాళ్ళనూ, ఇంకా చేనుకాడివాణ్ణీ, తలుగుపేనేవాణ్ణీ, చెట్టుకాడివాణ్ణీ, చెట్టుమీదివాణ్ణీ, గుట్టమీదివాణ్ణీ, తాడుపేనేవాణ్ణీ, తలుగు పేనేవాణ్ణీ, అందరినీ యేపనిజేయనీయకుండా యెంటదగిలి రైతులను మసీదు ముందరికి కుప్ప కూరుస్తున్నారు.

పట్టాదార్లకూ, షక్మీదార్లకూ, పట్టాదార్లకూ, కౌలుదార్లకూ మధ్యగల తగాదాలను గ్రామకరణం పరిష్కారం చేస్తూ, యెవరెవరి తాకిడి రకం వారికి వేరువేరు కాయితాలమీద వేసి... "ఇది అస్సలు రకం – ఇది లోకల్ ఫండు – ఇది బకాయ బాబతు, జమాబంది కర్చులివీ, గిర్దావరు మామూళ్ళివీ – మొత్తం ఇంతా. దీనికి కల్దారు పెచ్చు ఇంతా"– అని ఒకరొకరి గుండెలు గుభిల్లుమనేటట్టు వినిపిస్తున్నాడు.

కరణంగారి పద్దులను తలుచుకుంటే, కట్టెపుస్తెలు గట్టించేవానిలానే కన్పిస్తున్నాడు. మాలిపటేలను చూస్తే కుక్కయి కూస్తున్నాడు. షావుకారిని మందలిస్తే, అడ్డకి శేరుప్రకారం ఇండ్లు ఊడిసేయించుకుంటున్నాడు. చాలామంది బీదరైతులకు ప్రాణం ప్రాణంలో లేదు. మనసు మనసులో లేదు. తలకాయలు వంచీ నేలలు జూస్తూ పుల్లలు విరుస్తున్నారు.

మగదిక్కులేని ఆడపట్టాదార్లు కొందరు మాలిపటేలు బండ బూతలకు చెవులప్పగించి, నెత్తిగోకుకుంటూ, కాలివ్రేళ్ళు నేలరాస్తూ, మొకం బిండుకొని యేమీతోచక గోడచాటుకు నిలబడ్డారు.

పట్టుకొచ్చేవాళ్ళను పట్టుకొస్తూనే వున్నారు. తెచ్చేవాళ్లను తెస్తూనే వున్నారు. చెల్లించే వాళ్ళు చెల్లించి రశీదు బుక్కులపైన రాయించుకొని పోతున్నారు. షావుకారి మిర్యాల పాపయ్యగూడా అక్కడే కూచున్నాడు. రెండుంపావులకాడికి యిప్పుడు జొన్నలూ, రెండుకాడికి వడ్లూ, లేక మూడుకాడికి అప్పటికి ఆమిదాలూ, ఒప్పందం చేసుకున్న ఆసామీల రకం వొప్పుకొని తనపేర జమాగట్టించి రసీదు లిప్పిస్తున్నాడు. వచ్చేవాళ్ళు వస్తున్నారు. పొయ్యే వాళ్ళు పోతున్నారు.

"ఉత్తరదిశాభిముఖంగా సీతాన్వేషణకేగిన వానరమూకలా ఈ కోదండయ్యకోసం పోయిన యెట్టిగాళ్లు యేమైనట్టో? పొయ్యిందే పోకడ ఒక్కడూ రావడంలేదు" అని పురాణ ఫక్కీలో వినిపించింది కళ్ళకు సులోచనాలు తగిలించుకుంటూన్న కరణంగారి ఉవాచ.

కిస్తును సాగనంపి పీడ వదిలించుకుందామనుకుంటున్న పటేలుకు ఒకరొకరి జాప్యాలూ, నిదానాలూ, నిష్క్రమణాలూ చూస్తుంటే ఎత్తించే పీనుగును ఇంట్లో బెట్టుకున్నంత అసహ్యమేస్తుంది. పైగా కోదండయ్య విషయం స్పురించేసరికి కోపం యెక్కువైంది. కోదండయ్య దగ్గరి చుట్టం. తల్లికి తమ్ముడనిపిస్తాడు. తనకు వ్రేలు విడిచిన మేనమామ. అయితే మాత్రం అతనేం జేస్తాడు? సర్కారు హుకుం రకం. ఆ పనిచేసే బాధ్యతగల వ్యక్తులు తల్లిచన్ను గోయమంటే కోయాలి.

పొద్దున్నే పొయ్యారు కావలికార్లు, యెట్టిగాళ్ళు, కోదండయ్య పశువుల జప్తికి. ఆవులనూ, లేగలనూ కలెదోలుకొస్తున్నారు. మేకలదొడ్డి తడక తీస్తుంటే వూడుగుజల్లల్లో ఉన్న కుడుపని మేకపిల్లలు ఉరుందొక్కుతూ 'బ్యా' అంటున్నాయ్. దొడ్లోకివెళ్ళి యెడ్లనూ, దున్నపోతులనూ పగ్గాలతో పట్టుకొంటున్నారు. బొల్లికోడెమాత్రం పగ్గం కొలికిన పణకు తగులనీయకుండా, ఈగలను దులుపుకుంటూ పశువులసందుకు ఈగిఈగి పోతుంది. ముఖానికి ముక్కులా దొడ్డికి అలంకారంగా అదొక్కటేవుంది కోదండయ్యకు. అత్తగారిచ్చిన ఆరణం ఆవుది. ఆరుగురు మనుషులు చుట్టూ దొడ్డగట్టి, పగ్గాల కొలుకులు తెరచి నుచ్చకొడుతూ, పన్నాగం చేస్తుంటే బుస్సుమని యెలుగుమీదినుంచి లగుగొట్టి కంగున రంకెవేస్తూ కంచె మొగాన కాలులేపింది.

ఇక్కడ ఇంటిముందరి పాడిబర్రెను గూడా పట్టుకుపోవడానికి యిద్దరు యెట్టి మాదుగులొచ్చారు. గుంజకు కట్టిన బర్రెను విడిచి గుంజుతున్నారు. పెండకడి తీస్తున్న రంగమ్మ యేమీ అనలేక నిలువు రాయిలా నిలుచుంది. తడక లోపల తంబానికి కట్టేసిన లేగదూడ చుట్టూ గంతులేస్తూ 'అంబా' అని చెవులు బిక్కరించి అరుస్తుంది. "దూడనన్నా కుడుపలేదు నాయినా, గడ్డిగరవని దూడ అరచి చస్తది" అని బాగమ్మ బావురమంటుంటే బర్రెను తోలుకొనిపొయ్యారు యెట్టిగాళ్లు.

✡

# దళారి

–శాంతినారాయణ

"నమస్కారమన్నా రామప్పన్నా... రారా, యేం శానా దినాలకొస్తివే. పంటలన్నీ బాగనే ఉండాయేమన్నా?" చాలా ప్రేమగా అడిగాడు లారీ బ్రోకరాఫీసులో ఫోన్ దగ్గర కూచున్న సుబ్బరాయుడు.

"ఏం బాగులేప్పా, సెప్పుకుంటే సిగ్గుబోతాది" అంటూ తలకు చుట్టుకొన్న టువ్వాలు తీసి భుజం మీద వేసుకొని, బ్రోకారాఫీసులో పక్కనున్న బెంచీమీద కూచ్చున్నాడు రామప్ప. అతని పక్కనే ఇంకా ఇద్దరు ముగ్గురు రైతులు ముందే కూర్చొన్నారు.

"అదేమన్నా, అట్లంటావ్? ఈసారి వాన్లు బాగొచ్చినాయి గదా" మాటల్లోకి దిగాడు సుబ్బరాయుడు.

"వాన్లు బాగానే వచ్చినాయనుకో, అయితే యేం జేత్తావ్? పైర్లకంతా నున్నగ రోగాలు. టమేటా, ఉల్లిగడ్డ యేసుకున్న మాయట్లా రైతుల గతి ఆ దేవునికే దెల్సు. అంబంలో కుంబమని రేట్లు జూత్తామంటే ముండ మోసినాయ్. అంతో యింతో టమేటా వత్తావుంటే దాన్ని అడిగే నాతుడే లేడు. మార్కెట్టుకు పది గంపలు టమేటా యేసకొస్తే కమీసనూ గిమీసనూ పొయ్, యాభై రూపాయలు చేతికొస్తే దాంట్లో శార్జీలేమీ, పీకిన కూల్లేమి, గంపల కరీదేమి? కరువులో అదిక మాసమన్నట్లు అదేందో గంపకు పావలా దానమంట.. ఇంగ వుల్లిగడ్డ దనకుంటే అంతా గబ్బుగబ్బు లేప్పా. నాటినప్పట్నుండే సన్నబిడ్లోన్ని జూసుకున్నట్లు సూసుకుని కాపాడుకొంటే తీరా నోటికొచ్చినంక ఈ గబ్బు నాకొడుకు వానతో యాడిదాడ కుళ్లుతాంది. భూమిలో ఉండేది భూమిలోనే. పీకింది పీకినట్లే. తరిగింది తరిగినట్లే కుళ్లిపోతాంటే ఇంగేమి మొత్తుకుండేది! యాల్జెప్పల్లలేప్పా, రైతు బతుకే అద్దుమాన్న మయిపోయింది" లోనున్న బాధనంతా బయటికి కక్కేసి నిట్టూర్చాడు రామప్ప.

"రైతుకు బతుకేగాదు, అందర్దీ అట్లే అయిపోయిందిలేన్నా" ఓదార్చాడు సుబ్బరాయుడు.

"మీకేమప్పా, మారాజులూ! వాన్రాలేదని బాదుందా, ఇత్తనాలెయ్యల్లని బాదుందా, కలుపుదియ్యల్లని– మందు గొట్టల్లని బాదుందా! ఆయిగ నీడపట్టున కాలిమీద కాలేసుకొని సంపాయిత్తారు. మీకేం బాధ నాయనా?" పట్నంవాళ్ల సుఖాన్ని ఎత్తి చూపాడు రామప్ప.

“అదేమన్నా, మీరు బాధపడితే మాకూ బాధే కదా!... మీయట్లాంటి రైతులందరూ బాగుంటేనే మేము బాగుండేదీ, మా వ్యాపారం సాగేదీ... ఇంతకూ ఉల్లిగడ్డ పంట యామాత్రమన్నా?”

“యామాత్రమన్నా యాడిదప్పా, నాల్గెకరాలు నాటింటే వొగలోడు గడ్డలు కూడా నమ్మకం లేదు” అసంతృప్తిని వ్యక్తం చేశాడు రామప్ప.

“అయితే లారీ కావల్లేమన్నా?” గిరాకీ వచ్చిందన్న ఆశతో సుబ్బరాయుడు.

“అందికే గదప్పా వచ్చిండేది. ల్యాకుంటే యేం పనుంది?” వచ్చిన సంగతి చెప్పాడు రామప్ప.

“యాటికి, బెంగుళూరికా గుంటూరికన్నా?” పక్కనున్న వెంకటేశ్వర స్వామి పటానికి ఊదుబత్తినంటించి చెక్కుతూ అడిగాడు సుబ్బరాయుడు.

“యాటికో వొగసోటికి తప్పదుగిదప్పా. యీడజూత్తే ఈ మార్కెట్టోల్లు మాయట్లాంటి రైతుల్ని బతకనిచ్చేతట్లు లేరు. ఈ అనంతపురమంత ముండమోసిన మార్కెట్టు పెపంచంలో ఇంగెక్కడా ఉండదేమోనప్పా. థూథూ... మల్లా అంత మోసమా! యేదో బొత్తిగా సేతులాడకుంటే మొన్నొగ పది ప్యాకెట్లు వుల్లిగడ్డ లేసకొత్తే రేటేమో ముప్పై జెప్పినారు. తీరా జూత్తే అదీయిదీ అని యేందేందో తీసేసి ఇరవై ప్రకారం సేతికిచ్చినారు దొంగనా కొడుకులు.” మార్కెట్టు మోసాన్ని తలచుకుని దేవురించాడు రామప్ప.

“అవునన్నా నువ్వనేది కరెట్టే... ల్యాకుంటే, వొగొగుడు అంతింత సంపాదిత్తారేమన్నా? వాళ్ల బిల్డింగులేమి, వాళ్ల జల్సాలేమి... అంతా కలికాలమన్నా!” పక్కనున్న రైతు రామప్ప మాటల్ని సమర్థించాడు.

“ఇక్కడంతేనన్నా, ఒక్కటేనాడు షావుకార్లు కావల్లని జూస్తారీ లమ్డీ కొడుకులు. రైతును కడుప్మీద గొడితే బాగుపడతారేమన్నా... దేవుడనేవాడు ఊరకనే ఉంటాడా?” తన నిజాయితీని వ్యక్తం చేశాడు బ్రోకర్.

“కడుప్మీద కొడతానే వుండారు. బాగుపడతానే వుండారు గదప్పా... యాదేవుడు గాంగ యేం జేత్తాండాడు? యేందోలే, యేమనుకొని యేం లాభం?... మా తిప్పలు తప్పవుగాని, యేదో వొగ లారీ సూడు పొద్దుగలగ” తమ బాధలెవరూ తీర్చలేరన్నట్లు దిగాలుగా అడిగాడు రామప్ప.

“గుంటూరు, బెంగుళూరు పొయ్యే బండ్లేవీ లేవు గదన్నా... ఇదిగో వీళ్లు గూడా చియ్యేడు నుంచీ వచ్చినారు. బెంగుళూరికి చీనాకాయల్లోడ్లుండాయంట. యేందిలే, ఎన్ని లారీలొచ్చినా ఈ చీనాకాయల సీజన్లో సాలకొస్తాండయ్. వూరకనే నామాటిని హైదరాబాద్ కేసకపోన్నా,

రేటు గూడా బాగానే వుందంట... ఒగ్గంటలో మంచి బండి చూసి పంపిస్తా, బాడిగ్గూడా కాస్తా సలీసే గదా" ఆశపెట్టాడు బ్రోకర్.

"యాల్లేప్పా, ఐదరాబాదంటే బయమయితాది. అది శానా అద్దువాన్నం మార్కెట్టని బొగుజెప్తారు. యెట్లో గుంటూరికే జూడు, రేటు గూడా ఫర్వాలేదంటాండారు".

"అది సరేనన్నా, ఆ పక్క బొయ్యే లారీలే లేవు గదా! అదే పనిగ గుంటూరికి రమ్మంటే డ్రైవర్లు బాడిగ శానా డిమాండ్ చేస్తారన్నా. ఇంగ ఆ సిక్కుగాళ్లుండారే ఆ నాయాళ్లుససేమిరా అంటే తగ్గించుకోరు... సరే.." అని యేదో చెప్పబోతుండగనే ఫోన్ రింగయింది. సుబ్బరాయుడు రిసీవర్ పైకెత్తి, "అలో... బెంగుళూరు నుంచేనా!... యెవురు మాట్లాడేదీ... ఫకర్దీనా... సలాం భై... నేను, అనంతపురం నుండి తిరుమలా బ్రోకర్ సుబ్బరాయుడు మాట్లాడుతాండా, యేం లేదుభై... అక్కడ చీనాకాయల రేటెట్లుంది? ఆ... టన్ను నాలుగువేలా? సరుకు బాగుందిలే భై. మా ఆసాములవి రెండు లోడ్లు పంపుతాండా, మంచి రేటుతో అమ్మించు భై... అవును భై ఉల్లిగడ్డ మార్కెట్టు వీకంటాండారు, నిజమేనా... యెంతా... కింటాల్ డెబ్బై రూపాయలా? మాలు బహుత్ అచ్చా భై... ఆ... అంతేనంటావా? సరేభై, పెట్టేస్తా" రిసీవర్ పెట్టేశాడు సుబ్బరాయుడు.

ఫోన్‌లో సుబ్బరాయుడు మాట్లాడింది విని రామప్ప. "థూ దానెమ్మ" అని నిరుత్సాహ పడ్డాడు. పక్కనున్న రైతులిద్దరూ కాస్త సంతోషంగా వున్నారు.

"ఏంరా దస్తగిరీ, ఇంతాలస్యంగా వొస్తిరి! పొద్దన్నే ఆసాములొస్తారు, కాఫీగీఫీ తెచ్చే పనుంటుందని యెన్నిసార్లు చెప్పాల్రా గాడిదా?" అప్పుడే సైకిల్ బయటపెట్టి లోనికి వస్తున్న దస్తగిరిని దండించాడు సుబ్బరాయుడు.

"లేదయ్యా, అమ్మయ్య గచ్చులోకి నీళ్లు పొయ్యమంటే పోసొస్తినయ్యా" ఆలస్యానికి కారణం చెప్పాడు దస్తగిరి.

"సరే ఘనకార్యం జేసినావుగానీ, పొయ్ అన్నోళ్లకు నాలుగు మంచి టీలు తీస్కరా" ఆర్డరిచ్చాడు సుబ్బరాయుడు. దస్తగిరి వెళ్లిపోయాడు.

"మరేమన్నా, గుంటూరుకు ఫోన్‌చేసి రేటు కనుకోమంటావా యెట్టా?" రామప్ప నడిగాడు సుబ్బరాయుడు.

"సరే ఫోన్ జెయ్యప్పా, దాని బండవాలమేమో తెల్సిపోతుంది. పచ్చి సరుకు.. మల్లాయాడ..." ఫోన్ చేయడానికి ఒప్పుకున్నాడు రామప్ప. సుబ్బరాయుడు ట్రంకాల్ బుక్ చేశాడు.

రామప్ప పక్క జేబులో వున్న బీడీకట్ట బయటికి తీసి బీడి మొనభాగాన్ని రెండు వేళ్లతో ఒత్తి నోట్లో పెట్టుకుని అంటించి దమ్ములాగి పొగ బయటికి వదిలాడు. ఆ పొగలో గుంటూరు మార్కెట్టు వైపు చూస్తున్నట్టు దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

చియ్యేడు రైతులకు రెండు లారీలు ఏర్పాటు చేశాడు సుబ్బరాయుడు. ఇద్దరూ చెరి యాభై రూపాయలిచ్చారు. ఫోన్ బిల్లు ముప్పై రూపాయలిమ్మన్నాడు.

"యేందప్పా, యీడుండే బెంగుళూరికి ఫోన్ జేత్తే ముప్పై రూపాయలా" అంటూ గొణిగాడొక రైతు.

"మొన్ననే ఫోన్ చార్జీలు పెంచినారన్నా. ఇంగా మేలనుకో, టెలిఫోనాఫీసులో మనకు తెల్సినోళ్లుండారు గాబట్టి మానమయింది. అందాజుగా ముప్పై అన్నానుగానీ నాలుగైదు రూపాయలెక్కువే అయ్యింటుంది. అవన్నీ నేను పట్టించుకోనన్నా. అట్ల పట్టించుకుంటే సాయంత్రానికి యాభై రూపాయలు కాఫీ టీలకే అయితుంది.." అంటుండగనే దస్తగిరి టీలు తెచ్చాడు. వాడు అందరికీ టీ గ్లాసులందిస్తూ రామప్ప వైపు ఎగాదిగా చూశాడు. రామప్ప బెంచీపక్క భాగానికి బీడీవొత్తి ఆర్పేసి టీ గ్లాసందుకొని టీ చప్పరిస్తున్నాడు.

ఎదురుగా వున్న లారీ నీడలో నేలమీద లారీ సీట్ వేసుకొని కూర్చున్నాడు డ్రైవర్ సర్దార్‌జీ. క్లీనర్లిద్దరూ జాకీ ఎత్తి టైర్ బయటికి తీయడానికి నట్లు విప్పుతున్నారు.

దస్తగిరి ఖాళీ టీ గ్లాసులు తీసుకొని బయటికి పోతూ వుంటే రామప్ప ఆ కుర్రోణ్ణి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

"ఆవో భై, సర్దార్‌జీ" సుబ్బరాయుడు పిలిచాడు.

లారీ నీడలో కూర్చున్న సర్దార్‌జీ వచ్చాడు. అతనికి రైతుల్ని చూపించి బెంగుళూరుకు చీనాకాయలు వేసుకుపోవాలని ఉర్దూలో చెప్పాడు బ్రోకర్. లారీ బాడుగ వెయ్యి రూపాయలన్నాడు. పది పర్సెంటు తన కమీషనన్నాడు. రెండు బండ్లకూ కమీషన్ రెండొందలిప్పించుకొని జేబులో పెట్టుకున్నాడు. రైతులిద్దర్నీ డ్రైవర్‌తోబాటు పంపించేశాడు. సుబ్బరాయుడు బయటకెళ్లి వాళ్లతో ఏదో చెప్పి లోనికి వస్తూండగానే ఫోన్ రింగయింది.

రిసీవర్‌పై కెత్తి, "అలో గుంటూరా? యెవురు మాట్లాడేదీ? నమస్కారమన్నా కోట ప్పన్నా. నేను, అనంతపురం లారీ బ్రోకర్ సుబ్బరాయుడు మాట్లాడుతాండా, ఏం లేదూ, ఉల్లిగడ్డ రేటెట్లుందన్నా?... ఆ... నూటా ఇరవై రూపాయలా, రెండు మూడు రోజుల్లో రైజయ్యే పొజిసనుందా, సరేనన్నా. ఇక్కన్నుండి మా ఆసామొకాయన లోడేసుకుని వస్తాండాడు, మంచి రేటుతో అమ్మీయన్నా... సరుకా... బ్రహ్మాండంగా వుందిలేన్నా. సరే, పెట్టేస్తానన్నా" రిసీవర్ పెట్టేశాడు సుబ్బరాయుడు.

రామప్ప మొగంలో చిరునవ్వు చిందులాడింది.

"అదృష్టవంతునివిలేన్నా, నువ్వు జెప్పినట్లే గుంటూర్రేటు బాగనే వుంది. పది నిమిషాలు కూచ్చో, లారీ మాట్లాడొస్తాను" అంటూ బయటికెళ్లాడు రాయుడు. అప్పుడే ఎన్.పి. బండి వచ్చి దూరంగా గుడి దగ్గర ఆగింది.

రామప్ప మళ్లీ ఒక బీడీ తీసి నోట్లో పెట్టుకొని అంటించాడు. రెండు మూడు దమ్ములకి బీడీ బాగా అంటుకుంది. నాలుగో దమ్ములాగి పొగ బయటికి వదిలాడు. ఆ పొగల రింగుల్లోకి చూస్తూ ఉల్లిగడ్డ పంటవల్ల తన చేతికి ఎంతొచ్చేదీ లెక్క వేసుకుంటూ ఆలోచిస్తున్నాడు. తమ వుల్లిగడ్డలు చూడకపొయ్‌నా ఫోన్లో సరుకు బ్రహ్మాండంగుందన్న సుబ్బరాయుని మాటలు జ్ఞప్తికి తెచ్చుకొని మరో దమ్ములాగాడు రామప్ప. మరో ఇద్దరు రైతులు వచ్చి పక్కన కూచున్నారు.

"నేం జెప్పలేదేమన్నా గుంటూరంటే ఆ సిక్కు నాయాళ్లు రారనీ, ఆ నాయాళ్లని వొప్పించాలంటే దేవుడు దిగొస్తాడు. ఎట్లోగట్ట నొప్పిస్తే బాడిగ దిక్కులేకుండా అడుగుతారు" అంటూ లోనికివచ్చి సుబ్బరాయుడు కొత్తగా వచ్చిన రైతుల్ని మాట్లాడించి ఫోన్ దగ్గర కూర్చున్నాడు.

"యామాత్ర మడిగి నారప్పా?" బరువుగా అడిగాడు రామప్ప.

"అయ్యో, వాళ్లడిగినంతిస్తే రైతేమై పోవాలన్నా? మల్లా అంతాశా? రెండు వేలడుగు తాడు గలీజు నాకొడుకు... ఒగ్గంట సేపు కూచ్చోన్నా, యేదో ఒకటి అరేంజేస్తాను" తేలిగ్గా చెప్పాడు సుబ్బరాయుడు.

ప్రతిరోజూ ఉల్లిగడ్డ మార్కెట్టు దవునయ్యే పొజిషన్ తలుచుకొని రామప్ప ఆందోళన చెందాడు. అతనికి ఉల్లిగడ్డల మార్కెట్టును గురించి రెండు మూడేళ్ల అనుభవముంది. అందుకే మనసు వేగిరపడింది. గుంటూర్రేటు బాగానే ఉంది. బాడిగ రేటు దుబారా అయినా వేసుకుపోవడం మంచిదనిపించింది. పైగా ఇప్పుడు డబ్బుల్తో శానా కసాలాగా వుంది. శానా రోజులు పెట్టుకుంటే సరుగ్గూడా దెబ్బతింటుంది. వచ్చినంత రానీ– అనుకున్నాడు.

"యెట్లన్నా గానీ పదైదు నూర్ల కొప్పించప్పా" మెల్లగా అడిగాడు. ఆ మాటల్లో చెప్పరానంత దైన్యం. ఈ బాధల్ని తప్పించుకోలేనంత నిస్సహాయత.

"పదైదు కయితే వొప్పుకుంటాడనుకో, అయినా యెందుకన్నా అంతాత్రం? సాయంత్రం దాకా తట్టుకుంటే చెల్లికెరకు పోయిన బండ్లొస్తాయి. యాదో వొకటి మాట్లాడి రేప్పొద్దున పంపిస్తాను గదా" రామప్ప ఆదుర్దాను పరీక్ష చేస్తున్నట్లు చెప్పాడు సుబ్బరాయుడు.

గంట లోపల ఏదో ఒక లారీని పంపుతానన్న సుబ్బరాయుడు ఇంతలోనే రేప్పొద్దున పంపుతాననడం రామప్పకు ఆందోళన కలిగించింది. బాడుగ దుబారా అయినా చింత లేదనుకున్నాడు. పదైదు నూర్లకే మాట్లాడమన్నాడు. సరేనని సుబ్బరాయుడు మళ్లీ బయటికెళ్లి లారీ డ్రైవర్‌తో తిరిగొచ్చాడు. రామప్పను చూపించాడు. బాడుగ పదైదు నూర్లన్నాడు. తన కమీషన్ పది పర్సెంటన్నాడు. డ్రైవర్ దగ్గర్నుండి నూటా యాభై రూపాయలిప్పించుకొని జేబులో పెట్టుకున్నాడు. 'ఇంక నువ్వూ' అన్నట్లు రామప్ప వైపు చూశాడు బ్రోకర్.

రామప్ప లోపలి బనీన్ జేబులో నుంచీ తీసి చిల్లరనోట్ల కట్ట ఇచ్చాడు. సుబ్బరాయుడు నోట్లెంచుకుని "యాభై ఇస్తే యెట్లన్నా?" అనడిగాడు.

"ఫోన్ జేసిందొకటే గదప్పా యింగేల్సింది? పదో యిరవయ్యో యియ్యాల్సింటే, లేదు, ఇసారొచ్చినప్పుడిత్తాలే" భుజమ్మీద టువ్వాల మార్చుకొంటూ చెప్పాడు రామప్ప.

"అదేందన్నా ఇరవయ్యంటావ్, నూటికైదు ప్రకారం కమీషనే డెబ్బై. ఇంగ ఫోన్ బిల్లు కనిష్టమంటే యాభై. అంతా నూటా ఇరవై అయితుంది" లెక్క చెప్పాడు బ్రోకర్.

"గుంటూరుకు ఫోన్ చేత్తే యాభై రూపాయలేమప్పా?" బాధగా ప్రశ్నించాడు రామప్ప.

"ఇదే మీ రైతుల్తో వచ్చిండేదన్నా, ఫోన్ బిల్లు మా యింటికొచ్చినట్లు బాధపడతారు. ఇపుడు నీ యెదురుగానే ఫోన్ బిల్లెంతైందో అడుగుతాను. నువ్వే వినన్నా" అంటూ కాస్త కోపంగా రిసీవర్ యెత్తబోయాడు సుబ్బరాయుడు.

"యాలడుగుతావు లేప్పా. పది పదైదు రూపాయలకాడేమీ గానీ, మల్లా యిత్తాలే" వెగటుగా నవ్వాడు రామప్ప.

"బ్రోకరాఫీసులో అప్పుబెడితే యెట్లన్నా, మీరు మల్లా వచ్చేది సంవత్సరానికే. డ్రైవర్‌తో ఇప్పించుకుంటాను. నువ్వు బాడిగిచ్చేటప్పుడు అతనికిస్తువులే" అంటూ డ్రైవర్ దగ్గర్నుంచి డెబ్బై ఐదు రూపాయలిప్పించుకున్నాడు బ్రోకర్.

రామప్ప చిన్నగా నిట్టూరుస్తూ డ్రైవర్ వెంట బయటికి నడిచాడు. టైర్ మార్చుకొని గంట లోపల లారీ రెడీ చేస్తామని, త్వరగా పని చూసుకొని రమ్మని వచ్చీ రాని తెలుగులో చెప్పి రామప్పకు లారీ చూపించాడు డ్రైవర్.

టమేటా డబ్బు లిప్పించుకొని బిరబిరా సంత చేసుకోవల్లని రామప్ప త్వరత్వరగా మార్కెట్లోకి నడిచాడు.

ఇంకా ఐదు గంపల్లో తమ టమేటా అట్లే వుంది. సరుకు బాగా లేదనీ, అడిగే నాథుడే లేడనీ, చాలా కష్టపడి పది గంపలమ్మినామనీ కమీషను గడి ఏజెంట్ జాఫర్‌సాబ్ చెప్పుతూ ఉంటే రామప్ప నోరులేని వాడయ్యాడు. చిల్లరగా కేజీ మూడు రూపాయలమ్ము తాండారు. ఈళ్లు జూత్తే మణువు గంపను పది రూపాయలకడిగే వాళ్లు లేరంటాండారు. యెంతన్యాయం, – సరుకు బాగలేదంట! ఈనాయళ్ల కేం, నీడ్న గుచ్చోని యెన్నయినా మాట్లాడతారు' అని మథనపడ్డాడు రామప్ప.

జాఫర్‌సాబ్ అమ్మిన పది గంపల టమేటాకు నూర్రూపాయలు లెక్కవేసి కమీషన్, కూలీ గీలీ, దానంగీనం, అన్నీ తీసేసి డెబ్బై రూపాయలు రామప్ప చేతికిచ్చాడు. రామప్ప చిల్లర నోట్లను లెక్కబెట్టుకుంటూ టమేటా నాటినప్పట్నుంచీ ఎండలో దాన్ని ఎలా కాపాడిందీ. ఎన్నిసార్లు కలుపు తీసిందీ. ఎన్నిసార్లు మందు కొట్టిందీ జ్ఞప్తికి తెచ్చుకునేసరికి ఆవేదనతో అతని పెదవులెండుకుపోయాయి.

ఇంకా మిగిలిన అయిదు గంపల టమేటా విషయం మాట్లాడాడు జాఫర్. సరుకు బాగాలేదనీ, మదనపల్లి సరుకు ముందు ఇది పనికి రాదనీ, మార్కెట్టు శానా మందమై పోయిందనీ, రేపెంతకుపోతే అంతకమ్ముతాననీ, లేకుంటే ఎనిమిది రూపాయల్గంప ప్రకారం నలభై రూపాయలకు కమీషన్ పోనూ ముప్పై యారిస్తాననీ చెప్పాడు.

రామప్ప చెమట పట్టిన ముఖాన్ని టువ్వాలుతో తుడుచుకొని "మాకీ గతి కల్పించిన పాపానికి ఫలితమనుభవించ"మన్నట్లు కోపంతో ఎర్రగా తన ముఖంలోకి చూస్తున్న గంపల్లోని టమేటా పళ్లను అలాగే చూడసాగాడు కాసేపు.

అతని మౌనాన్ని అంగీకారంగా భావించి జాఫర్‌సాబ్ ఆ పళ్ల గంపలన్నీ లోపల పెట్టించి "ఖాలీ గంపలు రూపాయకొకటన్నా, వొగిరవై కట్టమంటావా?" అని అడిగాడు.

రామప్ప అనాలోచితంగా తలూపాడు. అమాలీలు గంపలన్నీ కట్టగట్టి అతని దగ్గర పడేశారు. గంపల డబ్బులుపోనూ మిగతా పదారు రూపాయలు రామప్ప కందించాడు జాఫర్. అతని చేతులు అసంకల్పితంగా అందుకున్నాయి. కాళ్లు బయటికి నడిచి మార్కెట్టు కెదురుగా వున్న కిరాణాషాపు దగ్గరికి చేరుకున్నాయి.

యూరియా సంచిలో సరుకులు మూట గట్టుకొని రామప్ప ముందుకు నడిచాడు. ఎదురుగా జామపళ్ల బండి. దాన్ని చూడగానే ఇంట్లో సన్నోడూ, పెద్దోని కొడుకులూ, నడిపోని బిడ్డలూ కళ్లముందు మెదిలారు. తాను టౌనుకొచ్చి వాళ్లకేమైనా తీసుకు పోగల్గితే జామపండ్లు మాత్రమే. బేరమాడి డజను పండ్లు తీసుకొని టువ్వాల్లో వేసుకున్నాడు.

"రామప్పామా, లారీ రెడీ అయిందంట, తొరగా రావల్లంట" ఎవరో పిలిచారు.

ఎవరో కొత్త మనిషి 'మామా' అని పిలిచేసరికి ఆశ్చర్యంగా తలెత్తి చూశాడు రామప్ప. ఎదురుగా దస్తగిరి. ఎగాదిగా చూడసాగాడు రామప్ప.

"నేను మామా, గుర్తు బట్టలేదా! దూదేకుల వొన్నూరప్ప కొడుకును" పరిచయం చేసుకున్నాడు దస్తగిరి.

"వోర్నాయాలా నువ్వా రా– నేను టీ తాగేటప్పుడే అనుకుండా వీన్నాడో చూసినట్లుందే యెవురి పిల్లోడబ్బా అని. దొంగబడవా, అప్పుడే చెప్పల్లా లేదా? మొన్నొగసారి మీ నాయిన కనిపిచ్చి నీ యిసయమంతా చెప్పితే నేనేందోలే అనుకుండా– అయితే యీడుండావన్న మాట" టువ్వాల్లో పండ్లు మూటగట్టుకొంటూ అడిగాడు రామప్ప.

"అవును మామా, మనూర్లో బతకడానికి మల్లేముంది చెప్పు" తన పనిని సమర్థించు కున్నాడు దస్తగిరి.

"మంచి పన్జేసినావు లేవోయ్. తప్పేముందిలే. అయితే సుబ్బరాయుడు దగ్గరుండావన్న మాట– సరే పదాం పద" మూట నెత్తుకోసాగాడు రామప్ప.

“కాఫీ తాగి పోదాంలే మామా, మూటిక్కడే బెట్టు. ఈ పండ్లాయన మనవాడేలే. చూస్తాంటాడు”.

కాఫీకి పిలిచాడు దస్తగిరి రామప్పను. మూన్నాలుగేండ్లకే మాట తీరూ, వేషం అంతా మారిన దస్తగిరిని చూస్తూ ఆశ్చర్యపోతూ అతని వెంట నడిచాడు రామప్ప. ఇద్దరూ పోస్టాఫీసు దగ్గరున్న షన్ముగ విలాస్‌వైపు నడవసాగారు.

“మా షావుకారి దగ్గరికి లారీ కోసమొచ్చింటివా మామా?” అడిగాడు దస్తగిరి.

“వొగ లోడు వుల్లిగడ్డలుంటే గుంటూరు కేసకపోదామని వచ్చింటి” నిండుగా చెప్పాడు రామప్ప.

“మరి లారీ కుదిరిందా?”

“లారీ యేమో కుదిరిందిగానీ బాడిగే శానా దుబారప్పా. యేం జేత్తాం– నిర్వాకం లేదు”.

“మా షావుకారేమీ తగ్గించి మాట్లాల్లేదా మామా”.

“యేం తగ్గించడమో యేమోనప్పా, లారీకని, వొత్తే కమీషననీ, ఫోన్ జేసిన దానికనీ, అదనీ, యిదనీ దుడ్లు మాత్రం బొలే గుంజుతాంరా నాయినా– సూత్తావుంటే మీ సావుకారిది మంచి శాన్సున్నట్లుంది– లెక్క బాగ సంపాయిచ్చి నాడనుకుంటా రా”.

“ఎందుకు సంపాదించడు మామా? మీలాంటి రైతులొస్తే ఆయనకు పండగ. నిజం చెప్పితే నువ్ నమ్ముతావో లేదోగానీ దినానికి రెండు వేలు సంపాదిస్తాడనుకో. సంపాదించనీ, మల్లా అంత మోసమా మామా!” రామప్ప ముఖంలోకి చూస్తూ అన్నాడు దస్తగిరి. మోసమనే సరికి యేమీ అర్థంగాక రామప్ప బిక్కమొగం వేశాడు.

“నిజం మామా, నువ్వుండూరోనివి కాబట్టి నిజం చెప్పుతాండా, ఆ ఫోన్లూ గీన్లూ అంతా అపద్ధం. ఫోన్లో గుంటూరోళ్లతో మాట్లాడేదీ, బెంగుళూరోళ్లతో మాట్లాడేదీ అంతా బూటకం. రెండు మూడుసార్లు నేను గమనించినాను. ఇంట్లో కొడుకుతో అంతా ముందే చెప్పి మీ యెదురూగ యా వూరికి ఫోన్ జెయ్యాల్లో ఆ వూరికి చేసినట్టు రింగు దిప్పడం, అర్ధగంట తర్వాత యింట్లోనుంచీ కొడుకు ఫోన్ జేస్తే గుంటూర్నుంచో, బెంగుళూర్నుంచో ఫోన్ వచ్చిందని గట్టిగా అరుస్తూ, యా రైతు ఫోన్ జెయ్యమని చెప్పింటాడో ఆ రైతు కనుకూలంగా మాట్లాడి నమ్మించడం మా షావుకారికి బ్రహ్మాండంగా తెల్సుమామా. దాంతో రైతులూ, చిన్న చిన్న వ్యాపారస్తులూ నిజమేననుకొని నమ్మి తమ మాసూలుకు మంచి రేటుందని నమ్మి లారీ కావాల్లని తొందరపడతారు. ఆ తొందర్లో కమీషన్ కోసం మా షావుకారి లారీ బాడుగ యెంత జెప్పితే అంతకే వొప్పుకుంటారు. మీ పిచ్చి కాకపోతే యేంది మామా గుంటూరుకు

పన్నెన్నూర్లిస్తే యా లారీ వాడైనా యెగురుతా వస్తాడు. ఇది తెల్సుకోకుండా మీరు బ్రోకర్ల దగ్గరికే వస్తారు. వీళ్లు మీతో కమీషన్, డ్రైవర్లతో కమీషన్ కొట్టడమే గాకుండా మామూలుగా నడిచే బాడిగ కంటే యెక్కువ మాట్లాడిన దాంట్లో సగం గుంజుతారు. లేకుంటే యేంది మామా, పది పైసలు పెట్టుబడి లేకుండా, పొట్ట చించితే అక్షరం రాకపోయినా బ్రోకరాఫీసని బోర్డేసుకున్న నాయాళ్లు యేం సంపాదించినారనీ! చెప్పితే నువ్వాశ్చర్య పోతావ్, మా షావుకారి కట్టించిన బిల్డింగు చూస్తే కండ్లు తిరుగుతాయనుకో. నాలుగు లారీలు సొంత ముండాయ్. మొన్ననే శ్రీకంఠం టాకీసు దగ్గర నాలుగు షాపులు కట్టించినాడు. గుత్తి రోడ్లో రెండెకరాల ప్లాటు కొన్నాడు. అనుకుంటే ఆశ్చర్యం మామా, ఇట్లా బ్రోకరాఫీసులు ఇంగా నాలుగైదుండా యీ వూర్లో. అందరూ యింతే– నీతేందో, న్యాయమేందో, ధర్మమేందో అంతా అయోమయం" దస్తగిరి బ్రోకర్ల కథంతా కక్కేశాడు.

ఆశ్చర్యంతో వింటున్న రామప్ప కాసేపు తేరుకోలేకపోయాడు. సుబ్బరాయుని బ్రోకరాఫీసంతా పొద్దున్నుంచీ గమనించిందంతా కళ్లముందు కనిపించింది. మరోవైపు కూర గాయలమార్కెట్టూ, టమేటా గంపలూ, జాఫర్, అతని కథా కమామిష్షూ అంతా కనిపించింది.

అప్రయత్నంగా అతని నోరు మెదిలింది. "వోరి యీనమ్మ కడుపులు గాలా, ఎంత మోసంరా, దొంగ నా కొడుకులు– థూ థూ, అంతా బద్దు నాయాళ్లే!" అని కేకరించి వుమ్మాడు.

అదేమీ పట్టించుకోకుండా బజార్లో రిక్షాలూ, సైకిళ్లూ, కార్లూ, బస్సులూ అన్నీ తిరుగుతూనే వున్నాయి. కాలేజీ విద్యార్థులు దేనికోసమో ఊరేగింపుగా వస్తూనే వున్నారు. రాజకీయ నాయకులెందుకో "రేపు అనంతపురం బంద్" అని జీపులో కూర్చొని మైక్‌లో ప్రకటన చేస్తూ వున్నారు.

✡

# పాడె

**–సొదుం జయరాం**

చిన్నపురెడ్డి కాలమైపోయాడు. పుట్టినవాళ్లు గిట్టక తప్పదు కదా? మంచానా కుంచానా పడి, తాను ఇబ్బంది పడీ, ఇతర్లను ఇబ్బంది పెట్టకుండా చాలా సుఖమైన చావు చచ్చాడు.

చావడమైతే సుఖంగానే చచ్చాడు కానీ, చచ్చిన తర్వాత ఆయన శవానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆయన్ని కడసారిగా చూడవచ్చిన వాళ్లూ ఇబ్బంది పడిపోతున్నారు.

చిన్నపురెడ్డి బ్రతికి వుండగా, ఆయన మూలంగా ఏ ప్రాణీ ఇబ్బంది పడలేదు. గ్రామంలో అందరికీ తలలోని నాల్క లాగా మసలుకున్నాడు. చదువుకున్నది వీధి బళ్లోనే అయినా, ప్రబంధాలూ, కావ్యాలూ కూలంకషంగా చదువుకున్నాడు. "కవిత చెప్పెను చిన్నప్ప కడలి తెప్ప" అనే మకుటంతో ఒక శతకం రాసి పడేశాడు. ఆ మహానుభావుడు తన్ను తాను కడలికి తెప్పనని ఎందుకనుకున్నాడో ఏమో – ఆయన్ని మోసే పాడె శ్మశానానికి వెళ్లే తెప్పలాగా ఉదయం నుంచి రెడీగా వుంది కానీ ఆ పాడె మీదికి ఆయన్ను చేర్చే మార్గం కనిపించడం లేదు.

ఆయన నిన్న ఉదయం ఏడింటికి హాస్పిటల్లో చనిపోయాడు. పదింటికే శవం జీపులో ఇంటికి చేరింది. కొడుకులూ, కూతుళ్లూ, అల్లుళ్లూ అంతా సాయంత్రానికి చేరుకున్నారు. చుట్టుపక్కల పల్లెల్లో వున్నవాళ్లూ వచ్చారు. మొత్తానికి చీమల బారుల్లా జనం వచ్చారు. బుడిబుడి ఏడ్పులు కొందరివైతే, గుండె పట్లు సడలే ఏడ్పులు కొందరివి. ఏది ఏమైతేనేంగాని, అంతిమ దర్శనం పూర్తయ్యేసరికి బాగా చీకటి పడింది. సరే, మరుసటి రోజు ఉదయం భూస్థాపితం చేద్దాం లెమ్మన్న నిర్ణయానికి వచ్చారు.

రాత్రి అయ్యేసరికి వర్షం మొదలయింది. ఆయన చావుకు ప్రకృతి కూడా చలించి పోయిందా అన్నట్లు, ఆకాశం కళ్ల నుండి ఏకధారగా వర్షం కురుస్తోంది!

అంత వర్షంలోనూ, శవయాత్రకని వూరు వూరంతా కదిలి వచ్చింది. ఐదు నిమిషాల్లో పాడె తయారయింది. దారి పొడుగునా వెదజల్లడానికి చిల్లర డబ్బులు, బొరుగులు గంపలతో సిద్ధమయ్యాయి. స్టేట్స్‌లో వున్న కొడుకు రాజిరెడ్డి వస్తూ వస్తూ గంపలతో గులాబీ పూలు

పట్టించుకొని వచ్చాడు. ఇక పూల దండలకు లెక్కే లేదు. శవానికి స్నానం చేయించి, అలంకరించి పాడె మీద గులాబీలు పరిచి పడుకోబెట్టడమే తరువాయి.

ఆ కార్యక్రమానికి అంతరాయం ఏర్పడింది. "వర్షం వస్తే వస్తుంది. కార్యక్రమం కానివ్వండి. నేను ఈ సాయంత్రమే వెళ్లిపోవాలి" అన్నాడు రాజిరెడ్డి తన చుట్టూ మూగిన జనాన్ని వుద్దేశించి. శవాన్ని చూడవచ్చినవాళ్లలో చాలా మంది రాజిరెడ్డినీ చూచి వెడుతున్నారు. తనతో మాట్లాడడానికి వచ్చిన ప్రతివాడికీ అతను త్రిబుల్ ఫైవ్ సిగరెట్లు ఆఫర్ చేస్తున్నాడు. స్టేట్స్ నుంచి చాలా సిగరెట్ పాకెట్లు తెచ్చినట్టుంది. పొగతాగేవారికి అదొక అపూర్వ అవకాశం!

రాజిరెడ్డి మాటకు ఎవరూ సమాధానం చెప్పలేదు. ఉదయం నుంచి చాలా విసుగ్గా వున్నది అతనికి. ఈ కార్యక్రమం ఎప్పుడయిపోతుందా అని ఎదురుచూస్తున్నాడు. ఎందుకనో అది ఎంతకీ తెమలడం లేదు.

"వాటిస్‌ది ప్రాబ్లం – ఏమిటి సమస్య?" అన్నాడు రాజిరెడ్డి మళ్లీ. ఇంగ్లీషులో మాట్లాడడం, మళ్లీదాన్ని తెలుగులో చెప్పడం అతనికి అలవాటు.

"వర్షం. మాలవాళ్లు ఎవరూ గుంత తవ్వడానికి వీలు లేదంటున్నారు" అన్నాడు పిచ్చిరెడ్డి. ఉదయం నుంచీ అంతా అతనే అజమాయిషీ చలాయిస్తున్నాడు.

"వాట్ నాన్సెన్స్. పే దెం హేవీ అమౌంట్. అడిగినంతా డబ్బివ్వండి. ఎందుకు రారు?" అన్నాడు రాజిరెడ్డి.

పిచ్చిరెడ్డి తలగోక్కున్నాడు తప్ప సమాధానం చెప్పలేదు.

"మామూలుగా అయితే గుంత తవ్వడానికి ఎంతిస్తున్నారు ఈ వూళ్లో?" అడిగాడు రాజిరెడ్డి. అతను వూరు ఎప్పుడో వదిలాడు. ఊరు ఆనవాయితీలు అతనికి తెలియవు.

"ఎంతన్నా ఎంతిస్తారు? నలుగురు మనుషులు గుంత తీయడానికి వెళ్తే నాలుగిరవైలు సారాయికిస్తారు. పీనుగు మీది సైనుగుడ్డో మరొకటో వాళ్లే తీసుకుంటారు. మళ్లీ దివసం రోజు ఎక్కి తొక్కేంత పప్పన్నం. అంతే" అన్నాడు పిచ్చిరెడ్డి.

"పే దెం తౌజండ్ రూపీస్. వెయ్యి రూపాయిలు కాలబెట్టండి" అంటూ జేబులో నుంచి నోట్ల కట్ట తీశాడు రాజిరెడ్డి. పిచ్చిరెడ్డి తలగోక్కుంటున్నాడు.

జనంలోంచి ఎవరో అన్నారు: "మీ డబ్బున్న వాళ్లు ఎంత డబ్బంటే అంతా మంచి నీళ్ల ప్రాయంగా యిస్తారు. రేపు ఇదే అలవాటవుతుంది. ఆచారం అడుగంటిపోతుంది. ఫలానా రాజిరెడ్డి ఇంత ఇచ్చాడు అంటారు. డబ్బు లేనివాళ్లు ఏ చావు చావాలి? ఇది ఆచారం. డబ్బుతో ముడిపెట్టకూడదు రాజిరెడ్డన్నా!" ఆచారం, సంప్రదాయం చట్టంకన్నా, డబ్బుకన్నా బలవత్తరమైనవి అని రాజిరెడ్డికి అర్థమయ్యేలా చెప్పాలని అతని ఆరాటం.

"దెన్ వాటిస్ ది సొల్యూషన్? దీనికి పరిష్కారమేమిటి?" అన్నాడు రాజిరెడ్డి రుసరుస లాడుతూ, వెలికి తీసిన నోట్ల కట్ట మళ్లీ జేబులో వుంచుకుంటూ.

పరిష్కారం దొరక్కనే ఉదయం నుంచి ఎంతగా మల్లగుల్లాలు పడ్డా మార్గం కనిపించలేదు. రాజిరెడ్డి ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేదు.

"పోనీ, గుంత తవ్వడం మన చేతగాని పని కాదుగదా–మనమే చేసుకోవచ్చు గదా" అన్నాడు రాజిరెడ్డి సమస్యకు పరిష్కారం సూచిస్తూ.

జనంలోంచి ఎవడో పకాలున నవ్వాడు. పడిపడి నవ్వాడు. ఆ నవ్వును అనుకరిస్తూ మరో ముగ్గురు నలుగురు నవ్వారు.

"వై డూ యు లాఫ్? నవ్వుతారెందుకు?" అన్నాడు రాజిరెడ్డి చిరాగ్గా.

"ఆచారం, సంప్రదాయం అంత తేలిగ్గా వదులుకునేవేనా రాజిరెడ్డీ? మన చేతనయిన పనే గనుక ఇవ్వాళ గుంత తవ్వుకుంటాం. రేపు ఇంట్లో ఎనుమో ఎద్దో చచ్చిందనుకో. దాన్ని మీరే పారేసుకోండి అంటారు. అలగా జనానికి అలుసిస్తే ఏమవుతుందో నీకేం తెలుసు?" అన్నాడు పిచ్చిరెడ్డి త్రిబుల్ ఫైవ్ సిగరెట్టు రెండోది అంటించుకుంటూ.

ఈ ఆచారంలో యిన్ని తిరకాసులున్నాయని రాజిరెడ్డికి తెలియదు. ఈ సమాధానం విన్న తర్వాత ఇక నోరెత్తలేదు. డబ్బుతో ఏ పనైనా చెయ్యవచ్చునని అతని అభిప్రాయం. ఈ ఆచారం దానికన్నా బలీయంగా వున్నట్టుంది. రాజిరెడ్డి చుట్టూ కాసేపు నీరవ నిశ్శబ్దం అలముకొంది. ఈలోగా సర్పంచ్ క్రిష్ణారెడ్డి గారు వచ్చారు. ఆయన గొడుగు బయటపెట్టి సరాసరి శవం దగ్గరికి వెళ్లాడు. ముసుగుతీసి ముఖం చూచాడు. ఆయన్ను చూడగానే ఆడవాళ్లు మళ్లీ శోకాలు మొదలు పెట్టారు. క్రిష్ణారెడ్డి ఆయనకు అత్యంత సన్నిహితుడు. ఆడవాళ్లు ఏడవటం చూస్తే ఆయనకూ ఏడుపు వచ్చింది. ఏడుపు దిగమింగి, ఏడవకూడదని అందర్నీ గదురుకున్నాడు. అంతా నోళ్లు మూశారు.

క్రిష్ణారెడ్డి బయటకు రాగానే రాజిరెడ్డి మంచం మీద నుంచి లేచి నిలబడి, "రా, చిన్నాన్నా!" అన్నాడు. క్రిష్ణారెడ్డి కూచోగానే రాజిరెడ్డి కూచున్నాడు. శవయాత్రలో జరుగుతున్న జాప్యానికి కారణాలు, ఎవరో ఆయనకు దారిలోనే చెప్పినట్టుంది.

"ఇంతకూ వంతెవరిదిరా పిచ్చిరెడ్డీ?" అడిగాడు క్రిష్ణారెడ్డి.

ఊర్లో అన్ని కుటుంబాలవాళ్లనీ మాలవాళ్లు వంతులవారీగా విభజించుకుంటారు. ఇట్లాంటి కార్యక్రమాలు ఎవరి వంతు అయితే వాళ్లు చెయ్యాలి. అదీ క్రిష్ణారెడ్డి అడిగిన వంతు విషయం.

"వంతేమో మరియమ్మది. దానికి మగదిక్కులేరు. వంతుకానివాళ్లని మనం బలవంతం చెయ్యలేం గదా? మామూలుగా అడిగితే ఒకడు జ్వరమంటే మరొకడు పులకరమంటే ఏవేవో

సొడ్లు చెబుతున్నారు. జ్వరమూ లేదు – పులకరమూ లేదు. గుడిసెల్లో కూచొని చీట్ల పేకలూ, పులిగీతాలూ ఆడుకుంటున్నారు" పిచ్చిరెడ్డి చెప్పాడు.

"మీరే ఏదో మార్గం ఆలోచించాలి" అన్నాడు రాజిరెడ్డి క్రిష్ణారెడ్డితో. ఎందుకనో ఆయన నోటంట ఈసారి ఇంగ్లీషు దొర్లలేదు.

"ఒకటే మార్గం – ముల్లుగర్ర" అన్నారు ఆ మూల నుంచి ఎవరో. క్రిష్ణారెడ్డి అటువైపు చూడకుండానే ఆ కంఠస్వరం గుర్తించాడు. అది తన ప్రత్యర్థి వర్గానిది.

"ఆ రోజులు పోయినై" అన్నాడు క్రిష్ణారెడ్డి గంభీరంగా.

"మాలవాన్ని మాట్లాడించకుండా కొట్టాలని వూరికే అనలేదు పెద్దలు. ఓట్లొచ్చినయ్‌గదా! ఆ రోజులు పోక ఏం చేస్తాయి?" అన్నాడు మళ్లీ క్రిష్ణారెడ్డి ప్రత్యర్థి ఎత్తి పొడుపుగా.

భయంతో వేశారో, భక్తితో వేశారో, డబ్బుకే అమ్ముడు పోయారో హరిజనవాడంతా క్రిష్ణారెడ్డికే కట్టకట్టుకొని ఓట్లేసింది. ముళ్లుగర్రను ఒకరు సపోర్టు చేయడానికి మరొకరు వ్యతిరేకించడానికీ అసలు కారణం అది!

"పదరా నేనొస్తున్నాను పిచ్చిరెడ్డీ" అంటూ క్రిష్ణారెడ్డి పిచ్చిరెడ్డిని వెంటేసుకొని బయలుదేరాడు.

బయలుదేరడమైతే బయలు దేరాడు కానీ వాడలో తన మాట వింటారో వినరోనన్న సందేహం పీకుతూనే వుంది. తనకు అరవై ఐదు ఏండ్లు. ఒకప్పుడు నత్తనడక నడిచిన కాలం ఇప్పుడు శరవేగంతో పరుగెడుతున్నది. ఆచారాలూ, సంప్రదాయాలూ అన్నీ అడుగంటిపోతున్నాయి. మాలవాడకూ వూరికీ మధ్య సంబంధాలు విచ్ఛిన్నమైపోతున్నాయి. పాతరోజులు వేరు. ఉత్తరకార్తెలోనూ, హస్తకార్తెలోనూ ఒకటే దడివాన కురిసేది. వాడలో బీదా బిక్కీ తిండి గింజల కోసం నానా యాతనా పడేవారు. ఊర్లోని రైతుల చుట్టూ మూగేవారు. వాళ్లు అస్తులూ పస్తులూ పడకుండా రైతు ఆదుకొనేవాడు. కొట్టినా తిట్టినా తమ కడుపు కొట్టడనే భావం వాడలో వాళ్లకుండేది. ఒక పేడపుటికెడు జొన్న కంకులు దొంగిలిస్తే కాలా చేతా పడదన్నేవాళ్లు. ముల్లుగర్ర తీసుకొని తాటవలిచేవాళ్లు. వాడలోవాళ్లకి కిక్కురు మనే ధైర్యం వుండేది కాదు. దెబ్బలు తిన్న మూడో రోజు మళ్లీ అదే రైతు పంచన కూర్చునేవారు. తాము నికృష్టంగా బ్రతుకుతున్నామనే భావన వాళ్లకు వచ్చేది కాదేమో! ఇక ఆడవాళ్లు సరేసరి. రెడ్డిసాని చెమటను తడిసిన పాతచీరెకు, పాతరవికెకు నానా వూడిగం చేసేవాళ్లు. అంతమాత్రమే అయితే ఫరవాలేదు. తెల్లారగట్ల రెడ్డి వాడలోకి వెళ్లి జీతగాళ్లను పనిలోకి పంపి, వాళ్ల స్థానంలో తను పడుకొనేవాడు. మగవాళ్లే బానిసలై బతుకుతుంటే, వాళ్ల ఆడవాళ్లకి ఒక వ్యక్తిత్వం ఎక్కడుంటుంది? పాతివ్రత్యం ఎక్కడ కాపాడుకుంటారు? కిక్కురుమనకుండా సహించే వాళ్లు. క్షోభ పడడానికీ, మథన పడడానికీ వాళ్ళకు ఒక ఆత్మ అంటూ వున్నదో లేదో ఆ పరమాత్మకే తెలియాలి!

క్రిష్ణారెడ్డి వడివడిగా నడుస్తున్నాడు. దారి దారంతా బురదమయమయిపోయింది. కాలు గిరిగిలలోతు దిబబడిపోతున్నది. ఇలా వర్షం వస్తే రోతా పీతా కాకుండా బజార్లన్నీ బండ్ల చప్పట్లు వేయిద్దామనుకున్నాడు క్రిష్ణారెడ్డి. కానీ గ్రామంలో ఐకమత్యం లేదు. రకరకాల అబ్జక్షన్లు తెచ్చారు.

"మనకెప్పుడూ ఈ బండ చప్పట్లే వున్నవా? ఇప్పుడెందుకు?" అని కొందరన్నారు. "ఎద్లు జారి కిందపడిపోతాయి. అవెందుకు?" అన్నారు మరికొందరు. "ఊరు బాగుకోసమా పాడా? కాంట్రాక్టులో మిగిలించుకోవచ్చని ప్లాను" అని మరికొంత మంది చాటుమాటుగా విమర్శించారు. ఊరు బాగుపడకపోయినాసరే ఇతరులు బాగుపడకూడదన్నది వారి మతం. క్రిష్ణారెడ్డి ఆ పని మానుకున్నాడు.

"వర్షంలో బయలుదేరినారు. ఎందాకా"

క్రిష్ణారెడ్డి చివుక్కున తలపైకెత్తి చూచాడు. చినమస్తాన్. గొడుగు పట్టుకొని ఆ బురదలో కాళ్లీడ్చుకొని తనలాగే కిందామీదా పడి వస్తున్నాడు.

"వాడదాకా" అన్నాడు క్రిష్ణారెడ్డి.

"మరి నన్ను పిలవరేం. నేను రానా?" అన్నాడు చినమస్తాన్.

"ఎద్దుని అలాల్ చెయ్యలేదట - ముర్దార్. నువ్వు తింటావా మరి?"

"పరాచికాలతో ఏం గానీ వాడలో ఏం పని?"

క్రిష్ణారెడ్డి విషయం చెప్పాడు. "ఎవర్నయినా పంపవచ్చునుకో. పని సానుకూలమవుతుందో లేదోనని నేను స్వయంగా పిచ్చిరెడ్డిని వెంటేసుకొని బయలుదేరాను"

"బాగుంది. కొండ మహమ్మద్ దగ్గరకు రాకపోతే మహమ్మదే కొండ దగ్గరికి వెళ్లాలి అంటారు. ఔనా?"

"ఔను."

"ఏమిటి ఔనండీ? రౌతు మెత్తనయితే గుర్రం మూడుకాళ్ల నడుస్తుంది. చేటు కాలం వచ్చిపడింది. పనిబాటలవాళ్లకు కళ్లు నెత్తిమీదికి వచ్చాయి. నిన్నూ నన్నూ ఎవర్నీ లెక్క చెయ్యడం లేదు. మనమే వాళ్లని పైకెత్తుతున్నాం. చేసుకున్నవాళ్లకు చేసుకున్నంత - అనుభవించక తప్పదు. వెళ్లిరండి" అంటూ విసవిసా ముందుకు దాటుకొని వెళ్లాడు.

క్రిష్ణారెడ్డి వాడవైపు నడక సాగించాడు. చినమస్తాన్ మాటల్లోని ఆగ్రహం క్రిష్ణారెడ్డికి నవ్వు తెప్పించింది. పనిబాటలవాళ్ల పేరెత్తితే ఈ మధ్య అతను ఆగ్రహోదగ్రుడై పోతున్నాడు. ఆ ఆగ్రహానికి కుదురు ఎక్కడ వున్నదో క్రిష్ణారెడ్డికి తెలుసు.

ఆ మాటకొస్తే నిన్న మొన్నటిదాకా చినమస్తాన్ స్థితి పనిబాటలవాళ్ల స్థితికంటే అధ్వాన్నంగా వుండేది. కానీ ఆ విషయం అతను మర్చిపోయాడు. అతని తప్పేం లేదు. స్థితి మారితే ఎవరైనా అంతేనేమో! చిన మస్తాన్‌కు పిత్రార్జితం ఒక పూరి కొంప తప్పితే – చెప్పుకోదగ్గ ఆస్తి మరొకటి లేదు. అర్ధరూపాయా, రూపాయా కూలి పనులకు వెళ్లేవాడు. యుద్ధాలప్పుడూ, దేశం అభివృద్ధి చెందే దశలోనూ సంపాదనకు విస్తృతావకాశాలు ఏర్పడుతాయి. చినమస్తాన్ వున్న వూరికి సమీపంలో ఒకదాని తర్వాత ఒకటి మూడు సిమెంట్ ఫాక్టరీల నిర్మాణం ప్రారంభమయింది. అవకాశాల్లేక వూరుకున్నాడు గాని చినమస్తాన్ గణన తెలిసినవాడు. నిర్మాణం జరిగే చోట మొదట లేబర్ సప్లైకి కుదురుకున్నాడు. ఊర్లో నుంచీ, వాడ నుంచీ నలభై యాభై మందిని రోజు పట్టుకెళ్లి ఫ్యాక్టరీ వాళ్లకి అప్పగించేవాడు. కూలి మనిషికి రోజుకి ఇరవై రూపాయలు గిట్టేది. ఇస్త్రీ బట్టలు నలగకుండా చినమస్తాన్‌కు కూలీల మీద కమీషన్ నూటయాభై గిట్టేది. దాంతో అతనికి తృప్తి కలగలేదు. లేబర్ సప్లై ద్వారా పెట్టుబడికి కొంత డబ్బు సమకూడింది. చిన్న చిన్న కాంట్రాక్టు వర్కులు మొదలుపెట్టాడు. సిమెంటూ, ఇనుమూ ట్రాక్టర్లకు ట్రాక్టర్లు బయటకు తరలించి అమ్ముకున్నాడు. ఈ పనులన్నీ ఒక విధంగా బాహాటంగానే చేశాడు. కాకపోతే సెక్యూరిటీ గార్డులకూ, ఇంజనీర్లకూ, ఎమ్.డీలకు కొంత వాటా ఇచ్చాడు. అంతా ఒకడే తింటే ఆ సొమ్ము అరగదు! రెండేండ్లలో పది లక్షలకు పైగానే సంపాదించాడు. అతనికిప్పుడు రెండు లారీలున్నవి. ఒక ట్రాక్టరు వుంది. వడ్డీ వ్యాపారం వుంది. పూరి గుడిసేనాడో మేడగా మారింది.

"పనిబాటల వాళ్ల మీద మన పట్టు సడలడానికి చినమస్తాన్ లాంటివాళ్లే కారణం" అన్నాడు పిచ్చిరెడ్డి. క్రిష్ణారెడ్డి ఆలోచనలు ఎక్కడో వున్నవి. అతను వెళ్లేపనిని గురించే ఆలోచిస్తున్నాడు. ఐనా, పిచ్చిరెడ్డి అన్నమాట అతను చెవిలో వేసికోకపోలేదు.

"ఎందుకని?" అన్నాడు పరధ్యానంగా.

"ఎందుకంటే – చినమస్తాన్ లారీలూ, ట్రాక్టరూ వూళ్ళో దించాడు. అతణ్ని చూచి మరికొంతమంది ట్రాక్టర్లు తెచ్చారు. ఈ బండ్లతో కూలీలకు అరవై, డెబ్బై రోజుకు కూళ్లు గిడుతున్నవి. రైతు మీద ఆధారపడటం పోయింది – ఇక ఆచారాలూ, ఆనవాయితీలూ పడుబాటుగాక ఏం చేస్తాయి?" అన్నాడు పిచ్చిరెడ్డి, ఎంతగానో దిగులుపడిపోతూ.

"కడంతకాలం ఎడ్లబండ్లే ఎక్కడ వుంటాయి? కాలం మారింది. ట్రాక్టర్లూ లారీలూ వచ్చినై. కాలంతోపాటు మనం మారడం నేర్చుకోవాలి." క్రిష్ణారెడ్డి అన్నాడు.

పిచ్చిరెడ్డికి క్రిష్ణారెడ్డి చెబుతున్నది మింగుడు పడటం లేదు. ముఖమంతా మాడ్చుకున్నాడు తప్ప మారుమాట చెప్పలేదు.

"పలకవేం?" అన్నాడు క్రిష్ణారెడ్డి.

“ఆచారాలు వదులుకోవాలా?” అన్నాడు పిచ్చిరెడ్డి పెడసరంగా.

“ముందీ సంగతి చెప్పరా పిచ్చిరెడ్డీ! మన ఆచారాలు మనం సక్రమంగా పాటిస్తున్నామంటావా? మాసూలు కాలంలో ఇంటిమాల కళ్లంలోకి వచ్చి ధాన్యం రాసికి పొలి చుట్టితే రాశి అడుగు వాళ్లకే వదిలేవాళ్లం. ఒక రాశి కింద పదుము గింజలుండేవి. మూడు రాసులకు పొలి చుడితే వానికి సంవత్సరం పొడుగునా బత్తెం దొరికేది. అవన్నీ ఇప్పుడెక్కడున్నాయో చెప్పరా?” అన్నాడు క్రిష్ణారెడ్డి.

“ధాన్యం గిట్టుబాటుగాక అవి పండించడమే మానుకుంటిమి. మనకే లేనప్పుడు ఇక వాళ్లకెక్కడనుండి వస్తాయి?”

“గిట్టుబాటు కాదని వ్యాపారపు పంటలు పండించుకుంటున్నాం. వ్యవసాయాన్ని వ్యాపారం చేశాం. ఇక షబ్బందుకులాల వాళ్లు వాళ్ల వృత్తుల్ని వ్యాపారం చేసుకుంటున్నారు. ఇంక ఆచారం ఎక్కడ చచ్చింది?” అన్నాడు క్రిష్ణారెడ్డి.

పిచ్చిరెడ్డి బెల్లం కొట్టిన రాయిలా గమ్మున వుండిపోయాడు. కాని క్రిష్ణారెడ్డి నోరు మూతపడలేదు. దారి పొడుగునా చెబుతూనే వున్నాడు. “మన పనులు మనం చేసికోవడం మనకు నామోషి. ఆ పనులు మనకు ఎవరో చేసి పెట్టాలి. శవాలకు గుంతలు తీయడానికి ఒక కులంవాళ్లు కావాలి. గుడ్డలు ఉతకడానికి మరొకరు కావాలి. ఇంట్లో పశువు చస్తే తీసుకెళ్లడానికి మరొక కులంవాళ్లు కావాలి. మనకు ఈ పనులు చేస్తున్నందుకు వాళ్లను నీచంగా చూడటం తప్ప మనుషులుగా గౌరవించడం మనకు చేతగాదు. షబ్బందు కులాలలోనూ ఆత్మాభిమానం పెరిగింది. ఆచారాలను అడ్డం పెట్టుకొని పనులు చేయించుకునే రోజులకు కాలం చెల్లిందిరా పిచ్చిరెడ్డి! అది మనం గమనించాలి.”

క్రిష్ణారెడ్డి వాగ్ధోరణి అలా ఇంక ఎంతసేపు కొనసాగేదోకాని ఇద్దరూ హరిజనవాడ చేరుకున్నారు. క్రిష్ణారెడ్డి ఒకసారి వాడంతా కలయచూచాడు. ముసలీ ముతకా, పిల్లా పీచూ వున్నారే తప్ప కుర్రకారు ఎవరూ కన్పించలేదు. తన్ను చూచి ముఖం చాటేసుకున్నారో ఏమో!

క్రిష్ణారెడ్డి ఒక ఇంటిముందు ఆగి “ఒరే ధనియాలూ!” అంటూ కేకవేశాడు. కేకవేసిన కాసేపటికి ఇంట్లో నుంచి ఒక ముసలివాడు వచ్చి క్రిష్ణారెడ్డి ముందు నిలబడ్డాడు. నిజానికి వానిపేరు ధనియాలు కాదు. తల్లిదండ్రులు పెట్టిన శుభ్రమైన పేరు డేనియల్! ఆ పేరు అలా అపభ్రంశం అయింది. రైతులు కావాలనే వాళ్ల పేర్లను అపభ్రంశం చేస్తారు.

“పిల్చినారా అయ్యా?” అన్నాడు ధనియాలు.

“అవున్రా, నీతో పనిబడింది.”

“చెప్పుబ్బా పనేందో. నా చేతనయిందయితే సేత్తాను.”

"చిన్నపు రెడ్డి కాలమై పోయినాడు. తెల్సుగదా? గుంత తీయాల. ఇద్దరో ముగ్గురో మనుషుల్ని పురమాయించు. అర్జంటు" అన్నాడు క్రిష్ణారెడ్డి టకటకా.

ధనియాలు నిమ్మకు నీరెత్తినట్టు నిలబడ్డాడు తప్ప ఉలకనూ లేదు పలకనూ లేదు. కాకపోతే కాసేపు తల గోక్కున్నాడు. కాసేపు పిర్రె బరుకున్నాడు.

"చెప్పేది నీకేరా!" అన్నాడు క్రిష్ణారెడ్డి.

అప్పుడు ధనియాలు నోరు తెరిచాడు. వాడు చెప్పిన సారాంశం ఏమిటంటే – పీనుగు మీది సైను గుడ్డకూ – దివసం రోజు పెట్టే పప్పన్నానికి గుంత తవ్వే రోజులు పోయాయి. దీనికి ఓ రేటు వుంది. ఆ రేటు చెల్లిస్తే మనుషుల్ని పురమాయించడానికి అభ్యంతరం లేదు.

ఇక క్రిష్ణారెడ్డికి కొండ దిగిరాక తప్పలేదు.

"ఎంతిమ్మంటావు?" అన్నాడు క్రిష్ణారెడ్డి.

"వెయ్యి రూపాయలిప్పించండబ్బా!" అన్నాడు ధనియాలు.

"వెయ్యా!" అన్నాడు క్రిష్ణారెడ్డి ఆశ్చర్యంగా.

"దాంతో మేం మిద్దెలూ మేడలూ కట్టం. ముగ్గురు మునుషులం. తలా మూడొందలపై చిలుకు" అన్నాడు ధనియాలు.

తప్పదు. అవసరం అలాంటిది. "సరే. క్షణాల మీద గుంత తవ్వాల. నేను వూర్లోకి పోవడం, పాడె లేవడం ఆలస్యం. వెళ్లండి" అంటూ క్రిష్ణారెడ్డి వూరివైపు నడక సాగించాడు.

క్రిష్ణారెడ్డి వూర్లోకి వచ్చేసరికి, అంతా క్రిష్ణారెడ్డి కోసమే ఎదురుతెన్నులు చూస్తున్నారు. "ఏమైంది?" అన్నారు ఐదారు మంది ఏక కంఠంతో.

"ఇక ఆలస్యం దేనికి? సాంగ్యాలు కానిచ్చి, పాడెలేవదీయండి."

అన్ని సాంగ్యాలూ అర్ధగంటలో అయిపొయ్యాయి గోవిందా గోవిందా! అంటూ పాడె పైకెత్తుతున్నారు. ముందు నడుస్తున్న దాసరి తంతె మీటుతూ తత్వం అందుకున్నాడు.

"ఆటన్నా పాటన్నా

తెరపై ఒక బొమ్మలాటన్నా"

పిచ్చిరెడ్డికి మట్టుకు తత్వమూ వినిపించలేదు. గోవిందలూ వినిపించలేదు. ఒక ఆచారానికి పాడె లేచినట్లుగా తెగ బాధపడిపోతున్నాడు!

✡

# ఊరు పొమ్మంటుంది

**–మంచికంటి**

"మీ నానొస్తున్నాడు ఆయన్నే అడుగు నన్ను ఎన్ని రకాలుగా ఏపుకు తిన్నా ఉపయోగం ఏముంది?" అంటూ బజార్లో నుండి ఇంటికి వచ్చిన రామిరెడ్డిని చూయిస్తూ రత్తమ్మ మూలన ఉన్న చీపురు తీసుకుంది కసువు చిమ్మడానికి.

"ఏందంట ఆయన గోల?" రత్తమ్మ మాటలు విని అన్నాడు రామిరెడ్డి ఇంట్లోకి అడుగుపెడుతూ.

"ఆ! ఏముంది కాలేజీలో చేరతాడంట గంటసేపుట్నుండి సతాయిస్తున్నాడు," విసురుగా వినవచ్చాయి రత్తమ్మ మాటలు.

ఆ మాట విన్న రామిరెడ్డి మనసులో కలుక్కుమంది. ఎవరైనా చదువుకోనంటే మందలించి పంపుతారు. వీణ్ణేమో చదువు మానుకోమని బలవంత పెట్టాల్సి వస్తుంది అనుకుని, "ఆ... ఆ... చదివినట్టే ఉందిలే మన నాటకం," నిట్టూరుస్తూ అన్నాడు.

"ఏంది నానా నువ్వు కూడా అట్టంటావు! మనూరోళ్ళు ఎక్కడెక్కడో రెసిడెన్షియల్ స్కూళ్ళల్లో చదివినా గూడా రాలేదు ఐదొందల మార్కులు. గవర్నమెంట్ బళ్ళో చదివినా ఐదొందలు దాటినియ్య నాకు. స్కూల్ మొత్తానికి సెకండొచ్చా. అందరూ ఒంగోలు కాలేజీల్లో చేరబోతున్నారు. నేను మామూలు కాలేజీలోనేగా చేరతాననంటంది," అన్నాడు ఏడుపు మొకంతో సుబ్బారెడ్డి.

"వాళ్ళందరతోటీ పోటీ అంట్రా మనకి. మన తాహతేందో మనమేందో కూడా తెలుసుకోవాలి గదా!" అంటూ కావిడిలో రెండు బుంగలు వేసుకుని పెద్దబాయికి మంచినీళ్ళకి బయలుదేరాడు రామిరెడ్డి.

"ఏమయ్యోయ్ ఈ పూటకి బియ్యం లేవు. ఇంకా ఎంతమందినని తిరిపెం అడిగేది," అంటూ ఇంట్లో నుండి కేక వేసింది రత్తమ్మ.

ఆ మాటలు విని పోయే పోయే వాడల్లా కావిడి భుజాన్నుండి కింద పడేసి ఇంట్లోకొచ్చి,

"బుద్ధుందా నీకు! నా తంటాలు నేను పడతన్నాను గదా! బజాట్లోకి కేకేసి మరీ చెప్పాలా! యాణ్ణో ఒక చోట అందుకో. రేపటి కన్నా ఎవుడో వొకడి కాళ్ళు పట్టుకుంటాను," అంటూ కావిడి తీసుకొని, మంచాన కూర్చొని చదువుకుంటున్న సుబ్బారెడ్డి వైపు చూస్తూ బజాట్లోకి నడిచాడు రామిరెడ్డి. ఆ చూపులో ఎన్నో రకాల భావనలు కదలాడాయి రామిరెడ్డి మనసులో.

"ఏందమ్మా ఎందుకంట నాన కాలేజీకి వొద్దంటుంది! ఎక్కడెక్కడ బండ బండోళ్ళంతా చదువుకుంటుంటే నాకేందమ్మ ఈ ఖర్మ," అన్నాడు సుబ్బారెడ్డి బాధతో వొస్తున్న ఏడుపుని దిగమింగుకుంటా.

"ఇంకా నీకు అర్థంగాకపోతే ఎట్టరా. పూటపూటా దేవులాడుకుంటంటే చూస్తానే వుండావు కదా! ఇంకా ఎందుకు మమ్మల్ని వేపుకు తింటావు," అంట్లు దొడ్లో వేస్తూ అంది రత్తమ్మ.

చదువు మానెయ్యాలన్న ఆలోచనే సుబ్బారెడ్డికి మింగుడు పడడం లేదు. గుండెల్ని పిండేసే ఆ మాటతో సతమతమైపోతున్నాడు. ఎక్కడా ఒక్క క్షణం కూర్చోబుద్ధి కాక, అసహనంగా, పిచ్చిపట్టినట్టుగా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

"అందరూ ఒంగోలు, నెల్లూరు, గుంటూరు కాలేజీల్లో చేరుతుంటే కనీసం, సింగరాయకొండ కాలేజీలోనైనా చేరడానికి దిక్కూ దివాణం లేకపోతుండే! ఇప్పుడు నేను చదువు మానేసి ఇంటి దగ్గర ఉండి ఏం చెయ్యాలంటమ్మా!" ఎగదన్నుకొస్తున్న ఏడుపుతో బాధగా అడిగాడు సుబ్బారెడ్డి.

రత్తమ్మ మాట్లాడలేదు.... ఇంట్లో ఉన్న ఆమెకూ దుఃఖం పొంగుకొచ్చింది. పాపం బిడ్డ చదువుకోవాలని ఎంత పాకులాడతన్నాడు. ఆ పిల్లని చదివియ్యలేకపోయాం. బాగా చదువుకుంటున్నాడు. ఈడినన్నా చదివిద్దామనుకుంటే కాలమిట్టా కూలబడ్డది అని దిగులు పడుతూ సమాధానమే చెప్పలేకపోయింది.

"ఏందమ్మా మాట్లాడవు అడుగుతుంటే!" అన్నాడు రెట్టించి.

"నువ్వేమో ఎట్టా చదువుకోవాలా! అని కొట్టకలాడతండావు. మేమేమో ఈ బతుకులు ఎట్ట తెల్లారాలా అని యాతన పడుతుండాము. ఊర్నిండా అప్పుల్తో కుతికెల లోతున మునిగిపోయి ఉంటిమి. ఇప్పుడు నువ్వు కూడా ఏదో ఒక పనిచేస్తే యేణ్ణీళ్లకు చన్నీళ్ళలాగా వుంటాయనే గదంట్రా ఆయన బాధపడేది," ఏడుపు దిగమింగుకుంటూ పమిట చెంగు నోటికి అడ్డం పెట్టుకుంటూ అంది రత్తమ్మ.

చదువు మానెయ్యడమన్న ఆలోచన మింగుడు పడకుండా ఉంది సుబ్బారెడ్డికి. ఎన్ని కలలు కన్నాను. స్థోమత లేకపోతే కనీసం గవర్నమెంట్ కాలేజీలోనన్నా చదువుకోవచ్చులే. టెన్త్‌లో కష్టపడ్డట్టు ఆ తరువాత కూడా కష్టపడి బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకొని కంప్యూటర్ బియస్సీ చదవొచ్చు. ఆ తరువాత ఎంచక్కా వాసు, శాయి, శీను, సుబ్బారెడ్డిలాగా

అమెరికా పోవొచ్చని ఎన్ని కలలు కన్నాను. వీళ్లేమో ఇప్పుడు చదువే మానెయ్యాలంటున్నారు. కడుపు రగలిపోతోంది.

ఇంక ఎంత అరిచి గోలపెట్టినా పంపేటట్టు లేరు. ఏదో ఒకటి చేసి చదువుకోవాలి. అమ్మో.... చదువుకోకుండా... ఇంకేమైనా ఉందా! ఆ ఆలోచనే భరించలేనిదిగా ఉంది. ఏమి చెయ్యాలి? ఎలా చెయ్యాలి? ఏమి చేసైనా చదువు మాత్రం ఆగిపోకుండా చూసుకోవాలి. ఇక్కడ ఉంటే కుదరదు. మరి ఎక్కడికి వెళ్ళాలి? ఆ రోజంతా కాలుగాలిన పిల్లిలాగా అటూ ఇటూ తిరుగుతూనే ఉన్నాడు. అసలా ఊహే ఆలోచన కందనంత, ఊపిరి ఆడనంత భారంగా అనిపిస్తూ ఉంది. కానీ ఏమి చేసైనా చదువుకోవాలన్న దృఢ నిశ్చయానికి వొచ్చాక కొంచెం స్థిమితపడ్డాడు సుబ్బారెడ్డి.

✡

"ఆ ఏందంట ఇయ్యాల పేపర్లో సంగతులు. ఇయ్యాల ఎంతమంది లెక్క. వురేసు కున్నోళ్ళు ఎంతమంది? పురుగుల మందు తాగినోళ్ళు ఎంత మంది? గుళికలు తిన్నోళ్ళు ఎంతమంది? ఊరొదిలి పెట్టిపోయినోళ్ళు ఎంతమంది? కాస్త ఇమ్మరుసుగా చెప్పు," అంటూ రచ్చబండ మీద కూర్చున్నాడు కోటేశ్వరరావు.

"పేపర్లో ఇప్పుడు ఇయ్యి దప్ప ఇంక వార్తలేముండయ్యి. ఒకప్పుడు రైతే రాజు. ఇప్పుడు రైతు పరిస్థితి ఎంత దిగజారిపోయిందో! రోజూ ఈ పేపర్ చూస్తేనే అర్థమవుతుంది. అసలు పేపరు తియ్యాలంటేనే కడుపు ఉడికిపోతుంది," అన్నాడు వెంకటేశ్వర్లు వేపపుల్ల నములుతా.

"ఇంతకీ ఇయ్యాల లెక్క చెప్పలేదు," రెట్టించాడు కోటేశ్వరరావు.

"ఏంది? అంత ఉబిద్దరంగా ఉండావు. చావుల్లెక్కకి అంత ఉబలాటం ఎందుకంట! ఇదుగో పేపర్లో సెపరేటుగా ఒక పేజీయే బెట్టారు నీలాంటివాళ్ళ కోసమే! మొత్తం ఇయ్యాల పన్నెండుమంది " చూయించాడు పేపర్ని, కోటేశ్వరరావు దగ్గరగా పెడుతూ.

"ఇంతకీ మన జిల్లా...!" అంటూ అర్థవంతంగా ఆగిపోయాడు కోటేశ్వరరావు.

"ఆ! లేకేం ప్రకాశం జిల్లా పేజీలో... ఇదిగిదిగో చిన్నపవనంట రాళ్ళపాడు రిజర్వాయర్ కింద ఐదెకరాల పొలముందంట. ఆరు సంవత్సరాలుగా వొరిసాగు లేదంట. దానికి బదులుగా పత్తెయ్యడం, దాని కోసం బోర్లు తవ్వడం. పత్తీబోయే, బోర్లల్లో నీళ్ళూ పడకపోయే!" అంటూ పేపర్లో ఉరి వేసుకున్న ఫోటో చూయించాడు.

"ఇంతకీ అప్పెంతంట?" కోటేశ్వరరావు బొమ్మ వంక చూస్తా అన్నాడు.

"ఆ! ఎంతలే ఐదు లక్షలే! నాలుగు బోర్లు వేయించేడంట. ఇంటిని కూడా అమ్మేసి, అప్పులోళ్ళకి కట్టి బావమరిది ఇంట్లో ఉంటున్నాడంట. అప్పులోళ్ళు, బేంకోళ్ళూ రామం

దాడిలాగా ఇంటిమీద పడతండారంట. దాంతో ఇదిగో ఇదీ తతంగం," పేపర్లోంచి తల యెత్తకుండానే అన్నాడు వెంకటేశ్వర్లు.

"ఇదేందే! గవర్నమెంట్ మారితే యెతలు తగ్గుతయ్యనుకుంటే పెరుగుతుండయ్యేందే!" అన్నాడు అక్కడే కూర్చొని పేపర్ వింటున్న రామిరెడ్డి.

"ఇయ్యి, ఇయ్యాల్టకియ్యాల వొచ్చినియ్యా ఏంది? ఎప్పుడో చెట్టేస్తే ఇప్పుడు కాయలు కోసుకోవటం లా! పోయిన స్వాములు రైతుల్నే పట్టిచ్చుకోకుండా సమస్యల్ని నారు పోసి, నీరుపోసి పెంచేరు. ఇప్పుడు గవర్నమెంట్ కాస్త ఆసరా ఇస్తుండేసరికి పిట్టల్లాగా రాలి పోతండారు. పెట్టేవాడుంటేనేగా దగ్గరకొచ్చేది. వాళ్ళుపోతే పిల్లాజెల్లా అన్నా నాలుగు మెతుకులు తింటారనేమో? ఏం చావులో ఎప్పటికి వొడ్డున పడతాడో రైతు," నిరాశగా అన్నాడు వెంకటేశ్వర్లు.

అప్పటిదాకా చావు వార్తలు వింటున్న రామిరెడ్డికి కడుపులో దేవినట్లు అనిపించింది. ఇంక ఎక్కువ సేపు అక్కడే ఉంటే కళ్ళు తిరిగిపడిపోతానేమో అనిపించింది. మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ ఇంటికి వొచ్చాడు. ఆరోజంతా రామిరెడ్డి మనసులో రచ్చబండ దగ్గర విన్న వార్తలే చెవుల్లో గింగురు మనసాగాయి. అవి గుర్తుకొచ్చేకొద్దీ తనలో ఇంకా శక్తి సన్నగిల్లిపోతున్నట్లుగా అనిపించసాగింది.

✡

"ఆ దీపం కునారిల్లుతా వుంది. కాస్తె సమురు పొయ్యగొడుదంటే!" అన్నాడు రామిరెడ్డి అన్నం దగ్గర కూర్చుంటూ.

"ఇంట్లో అది కూడా నిండుకుందిలే," రత్నమ్మ మాటల్లో నిరాశ ధ్వనించింది. మౌనం వహించిన రామిరెడ్డి రత్తమ్మ అందించిన అన్నం పళ్ళేన్ని దగ్గరకు లాక్కుని లోపల దుఃఖం బయటికి కనిపించకుండా, వొంచిన తల యెత్తకుండా మౌనంగా అన్నం తినసాగేడు.

"ఏమయ్యా వాడి మొకం చూస్తుంటే పాపమనిపిస్తందయ్యా! పిల్లముండని చదివియ్య లేకపోయాము. వాడినన్నా కాస్త చదివిచ్చుకుంటే మన కష్టాలు గట్టెక్కుతయ్యని అనుకుంటుంటే అదీ అడియాసే అవుతుంది కదా!" అంది రత్తమ్మ.

"అవునే అన్నీ సక్కరంగా ఉంటే నేనూ చెబుతాను మాటలు. చదువుకొని వాడు వొక పొదీషను కొస్తే మంచిదే! కానీ మూడు మూసి ఆరు అతుకుతుండాము. తెల్లారితే పొద్దుగూకేది ఎట్టరా బగమంతుడా! అని తలపట్టుకుంటుండాము."

"మొన్నా తిరపతయ్యతో మాట్లాడితే వాడికీ ఏదో రాసే పనే ఇప్పిస్తానన్నాడు. నలుగురిమీ నాలుగు రూపాయలు సంపాయిస్తేనే గదా, ఈ సంసారం గట్టెక్కేది," అంటూ చెయ్యి కడుక్కుని పళ్ళేన్ని దూరంగా నెట్టి అక్కడే కూర్చున్నాడు.

రత్తమ్మ కూడా అన్నం పెట్టుకుని ఎదురుగా కూర్చుంది.

"అదికాదయ్యా! ఆ బొచ్చుల పనులూ అయ్యా మనం చెయ్యగలమా అని భయ మేస్తుందయ్యా," అంది రత్తమ్మ.

"ఆ! ఏమీ చెయ్యొద్దులే! రోజూ ఎంతో మంది చస్తా ఉండారు. మనం గూడా ఒక డబ్బా మందు దెచ్చుకుంటే ఏ పనీ చెయ్యాల్సిన పనేలేదు. నాక్కూడా ఈ ఉక్కిష్టపు బతుకు బతికే కంటే ఎప్పుడెప్పుడు తెల్లార్సుకు పోదామా అని తొందగగానే ఉంది," అన్నాడు రామిరెడ్డి నిరామయంగా.

"అయ్యా! తండ్రీ ఆ మాట మాత్రం అనబాకయ్యా! ఎన్ని బాధలు పడ్డా విషం తాగడం మన వల్లకాదయ్యా! ఆ ఆలోచనే రానియ్యబాకు. పుట్టి బుద్దెరిగినాక ఇంత సిగ్గుమాలినతనం ఎప్పుడైనా ఇన్నామా! కన్నామా!"

"ఆ! రాలిపోక ఏంజేస్తారే! మనలాంటోళ్ళు ఏమి జూసుకుని బతకాలీ! పొలమెప్పుడో గుంటూరు పోకముందే తనఖాలోకి యెల్లిపోయిందా! బ్యాంకు లోను అట్నే ఉందా! చిల్లర మల్లర బాకీలు కాకుండా కటకంశెట్టి పద్దు అట్టనే నిలబడిపోయిందా! వాడు ఇల్లు తిరిగి రమ్మంటే మల్లి తిరిగి వొస్తన్నాడు. ఇట్టాంటప్పుడు యెవురైనా ఏం జేస్తారు? యేటెల్లకాలం యెగసాయం తప్ప ఏమీ తెలియనోడికి ఇట్లాంటి కాలం చావక చేసేదేముంది చెప్పు."

"అయ్యా బంగారంలాంటి పిల్లలు. వాళ్ళని చూసన్నా ఆ ఆలోచనలు రానియ్యబాకు. ఇంతకీ ఆ తిరపతి ఎప్పుడు వొస్తాడంట. ఫోను జేయిస్తానంటివే," అంది రత్తమ్మ రామిరెడ్డి ఆలోచనలు దారి మళ్ళించాలని.

"ఇంకా నెలబట్టుద్దంట. ఇంత బతుకూ బతికి ఇంటెనక చచ్చినట్టు, వాళ్ళ కోసం ఎదురుచూడటం జూడు. ఓడలు బళ్ళవుతయ్యి. బళ్ళు వోడలు అవుతయ్యి అంటే ఇదే మరి."

"చేను పక్కన చేనుంటే అందులో నాలుగు పందులు పెట్టుకొని ఎంత బయబక్తుల్తో వుండేవాళ్ళు. ఇంటికొస్తే పీటకోడు ఇస్తే కూర్చొనేవాళ్ళు. మజ్జిగనీళ్ళకో, గోంగూరకో వొచ్చి బతిమాలి బామాలి ఆ పూట గడుపుకునేవాళ్ళు. అట్టాంటిది ఇప్పుడు యాడేడ పొలాలు చాలకపోతుండే! మెట్టా మాగాణీ అని లేకుండా గట్లన్నీ తెగ్గొట్టుకొని చేలల్లో కలుపుకుంటా ఉండారు. అప్పటికీ ఇప్పటికీ చేలో పండాల ఇంటో తినాల. ఎప్పుడో కనప్పండక్కి గదా మనం పొట్టేలు మాంసం కొనేది! అందుకే ఆ మూర్తిగోడు గోగాకు రెడ్లు, గోగాకు రెడ్లు అని ఎగతాళి చేసేది."

"అట్టాంటోళ్ళు ఇయ్యాల కారు లోదే కాలు, ఇంట్లోదే కాలంట గదా! పుట్టినప్పటి నుండి చదువూ సంధ్యల్లేకుండా ఊరొదిలిపెట్టి పోయి కష్టపడ్డారు. పైకొచ్చేరు. పోయి

నోళ్ళు పోయినట్టు ఉండక తెలివి చొప్పున స్థలాలు కొనడం, అమ్మడం, ఇళ్ళు కట్టిచ్చి అమ్మడం నేర్చుకున్నారు. ఎక్కొచ్చారు. ఎప్పుడన్నా ఊరుదాటి పోయామా మనం! తొలేకాదశి కొలుపులకి తప్ప ఎప్పుడైనా ఊర్లో ఉండారా వాళ్ళు."

"ఏ బతుకులు ఎట్టా తెల్లారాలని రాసిపెట్టి ఉంటే అట్నే జరుగుద్దిలే" అనుకుంటూ లేసి తలుపులు వేసి బయటికి వొచ్చి వరుసగా వేసి ఉన్న మంచాల మీద పడుకున్నారు.

పడుకున్నాడన్నమాటే గాని, రామిరెడ్డికి ఒక పట్టాన నిదురపట్టలేదు. ఆకాశం వంక అదేపనిగా చూస్తున్నాడు. చుక్కలు ఆకాశానికి ఉరేసుకుని వేలాడుతున్నట్టుగా ఉన్నయ్యి అనుకున్నాడు. అటు మెసిలాడు, ఇటు మెసిలాడు. ఎంతకీ తెగని ఆలోచనలు. దారీ తెన్నూ తోచని బతుకు. ఎట్టా గట్టెక్కాలా అనే ఆలోచనలతో ఎప్పుడో అర్ధరాత్రికి నిద్ర వొడిలోకి జారుకున్నాడు.

✡

మినుము, పెసర, జొన్న, సజ్జ, వొరి, కంది పంటలు ఎటు చూసినా పచ్చగా నవనవ లాడుతూ ఉన్నయ్యి. ఆ పంటచేలల్లో ఎంతో మంది జనం. పనితోపాటు జోడీకట్టి పాట కూడా సాగుతుంది. మోటుసరసాలతో, కేరింతలతో ఆనందంగా ముందుకు సాగుతున్నారు. ఎండలో చెమటలు కారుతున్నా ఏ కోశానా కష్టపడ్డట్టు అనిపించకుండా ఉన్నవాళ్ళని జూస్తే ముచ్చటేస్తుంది. యెద్దుల గంటల చప్పుడుతో పాటు పజ్యాలు పాడుతున్న జీతగాళ్ళు ధాన్యం బస్తాల బళ్ళను హుషారుగా ఇళ్ళకు తోలుకొని వెళ్తున్నారు.

ఎంత ఆనందం, ఎంత ఆహ్లాదం, చూడముచ్చటైన పల్లె జనం ముఖాల్లో ఎటుచూసినా ఆనందం తాడవిస్తోంది. రైతులు, కూలీలు, ఆడా, మగా, పిల్లా, పెద్దా తేడా లేకుండా పనిలో నిమగ్నమై ఉండటం. ఎవ్వరిలోనూ కానరాని దిగులు. దూరంగా పచ్చని చెట్లు, మధ్య ఒంటరిగా కనిపిస్తున్న ఊరు, ముసలీ ముతకా జనాలకి కాపలా కాస్తూ ఉంది.

హఠాత్తుగా ఎటు నుంచో వొచ్చింది ఒక భయంకరమైన అల. ఊళ్ళన్నిటినీ చుట్టేసింది. తోక ఊపుకుంటూ నోరు తెరిచి కోరలు సాచింది. రైతుల్ని ఒక్కొక్కరినే మింగేయ సాగింది. చెరువులో నీళ్ళని తాగేస్తోంది. బావిలో నీళ్ళని తాగేస్తోంది. పొలాలన్నిటినీ మంత్రించి వేసింది. చేలన్నీ బీళ్ళయ్యాయి. దారులు ఎడారులయ్యాయి. ఊళ్ళు స్మశానాలయ్యాయి.

గుంపులు గుంపులుగా జనం విత్తనాల కోసం, మందుల కోసం, అప్పుల కోసం బజారుల్లో జనం, వడ్డీ వ్యాపారస్తుల దగ్గర జనం. అందరూ రైతులే రైతులు. అరే... అక్కడెందుకు పరిగెత్తుతున్నారు. ఓ... పోలీసులు... లారీలు... తుపాకులు. అబ్బో తలలు బద్దలయ్యాయి.... నెత్తురు మడుగులు కట్టింది. మంటలు మంటలు. ఆఫీసుల్లో మంటలు... పొగాకు...

మనుషులు... మంటలు... ఫర్నిచర్ ధ్వంసం. పత్తి, మిరప సురసురా మంటలు... మంటలు... మంటలు...

రోడ్లనిండా రైతులే రైతులు... ఇసకేస్తే రాలని జనం. లారీలు, బస్సులు, కార్లు ఆపేశారు. బంద్... బంద్... బంద్... బందోబస్తు పెరిగింది. రోడ్లంతా ఎర్రగా రక్తపు మరకలు.

విత్తనాలు మొలిస్తే చాళ్ళ నిండా ఏంటయ్యి? మొక్కలు కాదే! ఎముకలూ, పుర్రెలూ, కంకాళాలూ.... ఏమిటి? ఎందుకిలా అవుతుంది. ఎవరు మంత్రమేశారు? ఎవరు శపించారు?

ఆ పొలాల్లో వే, తుమ్మచెట్ల నిండా ఏలాడుతుంది రైతులేనా! నాలికలు బైటికి వొచ్చేసినయ్యి. ఆ పురుగుమందు డబ్బాలు పట్టుకొని పరిగెత్తుతున్నారేంది? ఏ మొక్కలకి కొడతారు? పంటేలేయీ కొట్టడానికి. అలా మంచినీళ్ళు తాగినట్టు తాగుతున్నారే! పాడుబడ్డ బావులు ఎక్కుతున్నారేంది? అయ్యో దూకేశారే!

వాళ్ళేంది కరెంటు తీగల్ని అంత హాయిగా ఆనందంగా నవ్వుతూ పట్టుకుంటున్నారు. లేవకుండా హాయిగా నిద్రేనా వాళ్ళకి! ఓహో ఎంత దగ్గర దారి కనుక్కున్నారు.

పచ్చటి పొలాల నిండా కుప్పలుగా ఏంటయ్యి? వొరి, జొన్న, సజ్జకువ్వలు కాదే! పుర్రెలు, కంకాళాలు, శవాటగుట్టలు. కుప్పలు కుప్పలుగా ఎవరు పోస్తున్నారు. ఏమో! ఖర్మ గాశారం రైతులు గావడమే శాపమా?

నెర్రెలు బారిన నేలలోంచి కప్పపిల్లలు, తాగడానికి నీళ్ళేయి. ఆ ఊళ్ళల్లో ఎవురు అడుక్కుంటున్నట్టున్నారు? రైతులా! భగవాన్ ఎంత దుస్థితి పట్టింది.

ఆ వురితాడేమిటి మీద మీదకు వొస్తంది? మెడకు తగులుకుందేమిటి? అయ్యో ఉరి బిగుసుకుంటుందే! ఊపిరాడ్డం లేదు. ప్రాణం పోతందే! ఇడిపియ్యండి. ఎవురన్నా వొచ్చి తెగ్గొయ్యండి. వొదలండి వొదలండి అంటూ రామిరెడ్డి ఉలిక్కిపడి లేశాడు.

చుట్టూ అందరూ పడుకుని హాయిగా నిద్రపోతున్నారు. 'ఛీ... ఛీ... ఎంత పాడుకల వొచ్చింది' అనుకుంటూ గుండెల మీద తట్టుకొని, మంచం కింద చెంబు తీసుకొని నీళ్ళు తాగి మళ్ళీ పడుకున్నాడు.

✡

"పిల్లోడేడే! నిదర మంచంతో పోయినోడు. ఇంతవరకు పత్తాలేదు," రత్తమ్మను అడిగాడు రామిరెడ్డి.

"అవునయ్యా నేను పట్టిచ్చుకోలేదు. పొద్దు నడినెత్తి మీదకు వొచ్చినా యాడపెత్తనాలు జేస్తున్నాడో. ఈ యాల్టప్పుడు యాడకీ పోడే! నిన్న జరిగిందానికి... వాడేమన్నా అయ్యో నిన్నంతా వాడు దిగులుదిగులుగా ఉండాడయ్యా," అంది గాబరాగా రత్తమ్మ.

అటూ ఇటూ చూశారు. మధ్యాహ్నమైంది. అయినా అంతు లేదు. రామిరెడ్డికి అప్పుడు అనుమానం పొడసూపింది. ఊర్లో కనిపించిన పిల్లలనందర్నీ అడుగడం మొదలు పెట్టేడు.

ఎవ్వరూ మేము చూడలేదంటే మేము చూడలేదన్నారు. ఉండ గాశారాలకి తోడు ఈడు గూడా...? ఊళ్ళో బావులూ, చెరువులూ వెతికారు. కలికివాయ అంతా జల్లెడపట్టి గాలించారు. బిట్రగుంటలో వాడి స్నేహితుల దగ్గరకి వెళ్ళారు. ఆచూకీ దొరకలేదు.

సుబ్బయ్యని తోడు తీసుకొని అపరాత్రప్పుడు సింగరాయకొండ బోయి, వాడి స్నేహితులనందర్నీ విచారించాడు. ఎవ్వరూ ఇదుగో ఇక్కడ కనపడ్డాడని చెప్పిన పాపాన పోయినోళ్ళే లేరు.

"నా గాశారాలకి తోడు ఎటుబోయాడో ఈడు. మన పరిస్థితి బాగోలేదు. చదవు మానెయ్యమన్నానంతే! పిల్లోళ్ళు చదువుకోవాలని ఎవురికి మాత్తరం ఉండదురా! కాలం కలిసిరాకే గదా!" సుబ్బయ్యతో బాధగా అన్నాడు రామిరెడ్డి బొంగురుబోయిన గొంతుతో.

"ఊరుకో రామన్నా బాధపడబాకు. బిడ్డల్ని కనగలం కానీ వాళ్ళ రాతల్ని కనలేము గదా! ఆపైవోడు ఆడిచ్చినట్టల్లా ఆడాల్సిందే," అన్నాడు సుబ్బయ్య వేదాంత ధోరణితో.

వారంరోజుల పాటు చుట్టుపక్కల అన్ని ఊళ్ళూ వెతికారు. కానీ జాడే లేదు. రత్తమ్మ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టడం లేదు. పట్టిన పట్టు విడకుండా ఏడుస్తానే వుంది. కూతురు పద్మ కూడా తమ్ముడు కనపడక ఒకవైపు, అమ్మ ఏడుపు మరొకవైపు చూసి బిక్కచచ్చిపోయింది. రామిరెడ్డి తిరుగుతూనే ఉన్నాడు. విచారిస్తానే ఉన్నాడు. అయినా ఫలితం కనబళ్ళేదు.

✡

ఊళ్ళో పిల్లలూ, పెద్దలూ, ముసలోళ్ళు, ఆడవాళ్ళు అందరూ పాపిరెడ్డిగారి ఇంటివైపు పరుగులు దీస్తున్నారు. ఇంట్లో నుండి బయటికి వొచ్చిన ఒక ముసలామె, "ఏమమ్మాయ్ ఎక్కడికీ పరిగెత్తుతున్నారు?" అని అడిగింది.

పోతూ పోతున్న ఆదెమ్మ ఆగి, "పాపిరెడ్డి ఉరేసుకున్నాడంట పెద్దామా!" అని చెప్పి వడి వడిగా పాపిరెడ్డి గారి ఇంటికి వొచ్చింది.

నడి ఇంట్లో దూలానికి వేళ్ళాడతా ఉండాడు పాపిరెడ్డి. నాలుక బైటికి వెళ్ళకొచ్చింది. మెడ వొరుసుకుపోయి వాత పడింది. తల వాలిపోయి ఉంది. పంచెంతా వొంటేలుతో తడిసి పోయింది. చుట్టూ జనాలు మూగిపోయారు.

"నాలుగు రోజుల్నుంచీ మణిసి ఒక రకంగా ఉండాడయ్యా. సరీగా కూడు గూడా తింటంలేదు. ఏందేందో పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడు తుండాడయ్యా. ఎంతెంతమందికో

కూలి చూపిచ్చినోడిని, ఇయ్యాల పెళ్ళాం పిల్లలు కూలికి పోయి తెస్తేనే కూడు, లేకపోతే పస్తు అంటానే ఉండాడయ్యా!"

"నీకెందుకు చేసేవాళ్ళం మేంగదా! బాగలేనోడివి ఇంటికాడ ఉండమంటే వినకుండా మాతో వొచ్చేడయ్యా! ఏమి మణుసులో కొచ్చిందో ఏమో! తెల్లారేతలికి ఇట్టా తెల్లార్సుకోని పోతాడు అనుకోలేదు," అంటూ కాళ్ళు పట్టుకొని చుట్టూ తిరుగుతూ, గుండెలు బాదుకుంటూ, తలకొట్టుకుంటూ ఏడుస్తోంది కమలమ్మ. ఇంటిల్లిపాది ఆమెతో గొంతు కలిపి ఏడుస్తూనే వున్నారు.

"ఇంకెందుకు చూస్తా ఉండారు! రేయ్ యల్లమందా పోయి ఆ దూలమెక్కి తాడు కొయ్యరా," అన్నాడు సింగారెడ్డి.

"నేను కాదులే! రేయ్ గోపాలా నువ్వెక్కరా," అన్నాడు యల్లమంద.

సింగారెడ్డి గోపాలుని ఎక్కమన్నట్టుగా సైగ చెయ్యడంతో, గోపాలు గబగబ దూలము పైకి ఎక్కి తాడుని కత్తితో పరపరా కోసేశాడు. కింద కొంతమంది పట్టుకొని పాపిరెడ్డి శవాన్ని బయట పంచలోకి పట్టుకొచ్చి వొరిగడ్డి మీద పండబెట్టేరు.

"పోలీసులొస్తే కోతలు గీతలు అంటారు గదా! ఈలోపే జరగాల్సింది చూస్తే పోదా!" అన్నాడు గోపాలు.

"అట్టకాదులే ఉండనియ్యండి. వాళ్ళు వొస్తేనే మంచిదిలే. ఒకరు సింగరాయకొండ పోయి ఐసు తేండి. నేను ఇంటికి పోయి పోలీస్‌స్టేషన్‌కి, యమ్మార్వోకీ ఫోన్ చేస్తాను. వాళ్ళొచ్చిందాకా ఏమీ చెయ్యొద్దు. అట్టనే ఉంచండి. రేయ్ కోటేశ్వర్రావ్ రారా పోదాం," అంటూ సింగారెడ్డి ఇంటికి బయలుదేరాడు.

"దీని తల్లి ముండమొయ్య మరీ రైతుది ఎంత ఉక్రిష్టపు బతుకైపోయింది. ఎటుజూసినా చీకటే! ఏటికేటికీ ఎందుకింత తిరగబడతంది కాలం. ఎప్పుడూ లేదు కదా ఈ అఘాయిత్యాలేంది," సింగారెడ్డితో నడుస్తూ అన్నాడు కోటేశ్వర్రావు.

"వ్యవసాయము ఒకప్పుడు మనిష్టమొచ్చినట్టుగా చేసేవాళ్ళం. సంతోషంగా ఇంట్లో అందరమూ కలిసి పనులు జేసుకునేవాళ్ళం. అవసరమైతే ఊళ్ళో వాళ్ళ బదుళ్ళతో పని గడుపుకునేవోళ్ళం. ఊళ్ళో బాగా వ్యవసాయంలో అనుభవం ఉండోళ్ళ సలహాలతో సమస్యలు తీర్చుకునేవోళ్ళం. ఎవురికి కష్టమొచ్చినా కాకుల్లాగా గుమిగూడి ఆదుకునేవాళ్ళం. పంటలకి గూడా గెమాక్సిన్ తప్ప మందులేమైనా కొట్టేమా! నియ్యి దిబ్బ ఎరువులు తప్ప ఏనాడన్నా ఎరువులు కొని యెరుగుదుమా?"

"ఇప్పుడేడ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అన్నీ అమ్మకపు సరుకైపోయినే! ఎవుడన్నా కాడెద్దులు కట్టి వ్యవసాయం జేస్తున్నాడా!"

"దీనికి తోడు అప్పుడు ఏపంటయినా తిండి గింజలకి సంబంధించిందే అయి వుండేది. లాభాలు వొచ్చినా, రాకపోయినా తింటానికి దిగులు వుండేదికాదు. ఈ పత్తి, పుగాకు, ఇయ్యి వ్యాపారం కోసం యేసే పంటలు కదా! వీటికి సకాలంలో నీళ్ళు కావాలి. ఆకాశం వంక చూసి చూసి లాభం లేక బోర్లు యేసి నేలలో ఉండ నీరంతా పీల్చి పారెయ్యడం మొదలుబెట్టారు. ఇప్పుడు వాటిల్లోనూ నీళ్ళు రావడం లేదు."

"పెట్టుబడులు పెరిగిపోయాయి. పంటలు నాశనమవతయ్యని దొరికిన కాడల్లా వొడ్డీకి అయినా సరే లాక్కొచ్చి పెట్టడమైంది. చివరికి పంట మన చేతికొచ్చేటప్పటికి గిట్టుబాటు ధర ఉండకపోవడం మామూలే!" అంటూ సింగారెడ్డి రైతు ఎందుకు చితికిపోతున్నాడో వివరంగా చెప్పాడు.

"మరి గవర్నమెంట్ ఏమి జేస్తుంది. దీనెమ్మ ఇంత మంది పిట్టలు రాలిపోయినట్టు రాలిపోతా ఉంటే నిమ్మకు నీరెత్తినట్లు ఎట్టా ఉండగలుగుతుందంట," ఆక్రోశం వెళ్ళగక్కాడు కోటేశ్వరరావు.

"ఇంతకాలం ఉండ గవర్నమెంటుకి రైతులు మనుషులుగా, వ్యవసాయం వృత్తిగా కనపడిందంటా! ఎంత సేపుటికి రోడ్లూ, రోడ్లూ, కంప్యూటర్ల పిచ్చే తప్ప. పైగా చచ్చేవోళ్ళని, తిన్నది అరక్క చస్తన్నారని ఒకడంటే, పిచ్చెక్కి చస్తన్నారని ఒకడంటాడు. ఎవురికి పిచ్చెక్కింది వాళ్ళకా! మనకా!"

"మనం పండిస్తేనే కదా ఎవుడికైనా కడుపు నిండేది. అట్టాంటిది మనల్ని పట్టుకోని నోటి కొచ్చినట్టల్లా కూసేరు కదా!"

"ఆ! పోతారు పురుగులు పడి. రైతుల ఉసురు తగిలినోడు ఎవుడూ బాగుపళ్ళేదు. సరేగనీ నేను ఇంటికి పోయి గొడ్లని ఎవరికన్నా తోలిపెట్టి వొస్తా. పోలీసులు ఎప్పటికొస్తారో!" అన్నాడు కోటేశ్వరరావు.

"ఏమో పోయి ఫోను జేస్తే గదా తెలిసేది. ఇదుగో ఎట్టా ఇంటికి పోతున్నావుగా నాలుగు అడుగులు అటేసి ఆ రామిరెడ్డిని రమ్మని చెప్పు. పాపం ఆ మనిషి కూడా బాగా దెబ్బతిని పోయుండాడు. పైగా ఈ మజ్యి కొడుకు కూడా దేశాలు పట్టుకుపోయాడు. ఇట్టాంటోళ్ళే ఒకరిని జూసి ఒకరు... కాస్త మందల కనుక్కుందాం రమ్మని చెప్పు," అన్నాడు సింగారెడ్డి.

"ఆ... ఆ.... పాపం యెతికీ యెతికీ సాలిపోయి కూచ్చున్నాడు. పాపం ఎటూ దరి దోసకుండా ఉండాడు ఆ మడిసి గూడా. సరే చెబుతాలే" అంటూ కోటేశ్వ్రరావు ఇంటివైపుగా పోతా రామిరెడ్డికి చెప్పి, ఇంటికి వెళ్ళాడు.

ఎందుకు పిల్చాడో ఏందోనని పై కండువా భుజానేసుకుని హడావుడిగా వొచ్చాడు రామిరెడ్డి.

అప్పుడే ఫోను జేసి బయటికి వొస్తున్న సింగారెడ్డిని చూస్తూ, "ఏంది మామా? రమ్మన్నా వంట," దీనంగా ఉంది రామిరెడ్డి గొంతు.

"ఆ! ఏంలేదు ఊరకనేలే కూర్చో. ఎట్టెట్ట ఉండావో. రెండు రోజుల్నుండీ వొద్దామంటే తీరడంలా. పిల్లోడి మందల తెలియలేదుగా," ఆరాగా అన్నాడు పక్కనే కూర్చుంటూ.

"యాడ సింగన్నా, యెతికీ యెతికీ అతాలు అనిగిపోతేనూ! మూడడగులు ముందుకి పోతే, నాలుగడుగులు యెనక్కి అన్నట్టుంది నా బతుకు. అట్టాంటిది మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టయ్యింది పిల్లోడుజేసిన పనికి. ఎవురికి ఎట్ట రాసి పెట్టుంటే అట్ట జరుగుద్ది... ప్చ్... ఏం చేద్దాం," అన్నాడు నిరాశగా. అప్పటికే రామిరెడ్డి కళ్ళల్లో సన్నటి నీటిపొర బయటకు దూకబోతూ అభిమానం అడ్డొచ్చి ఆగిపోతా వుంది.

"గుండె ధైర్యం కలవాడివి కాబట్టి ఆమాత్రం నెట్టుకొస్తున్నావు. ఆ పాపిరెడ్డి చూడు ఎట్టాంటి పని చేశాడో! ఏనాడన్నా ఉందా మనూరికి. ఎంత అప్పుల పాలైతే మాత్రం ఇట్టాంటి పనిజేస్తే ఎట్ట! ఆ..."

"వాడు శానా దూరం చూసేళ్ళే అన్నా. వాణ్ణి అనుకోని కూడా లాభమేముంది. రాబోయే కాలం గూడా అంత ఆశగా ఏమీ కనబడటం లేదు. అప్పులవాళ్ళకి ఎన్నిసార్లు అని వాయిదాలు చెబుతాడు. ఏదన్నా వొచ్చే వాలుంటే ఇయ్యాల గాకపోతే రేపన్నా కట్టొచ్చని ఆశైనా ఉంటది. నాలాగా నాలుగూళ్ళు అడుక్కు తినాలనుకునేవోడికి తప్పితే ఏం జూసుకోని బతుకుతారన్నా," అన్నాడు రామిరెడ్డి నిరాశగా.

"నిజమే గానీ, చావు అన్నిటికీ పరిష్కారం కాదుగదా! ఆ... మర్చిపోయాను. ఉత్తరాది పోతన్నారని తెలిసింది. ఎప్పుడు ప్రయాణం?" అన్నాడు సింగారెడ్డి.

"రోజురోజుకీ అది కూడా యెనక్కి పోతందన్నా. ఆ తిరపతిగోడు ఇదుగో వొస్తన్నా, అదుగో వొస్తన్నా అంటున్నాడు. పోయినసారి ఫోనుజేస్తే పదీ పదిహేను రోజుల్లో వొస్తానన్నాడు. ఏదీ ఇంతవరకు అంతూ పొంతూ లేదు."

"అవునూ అప్పుడు గుంటూరు దగ్గర ఏదో ఊరికి పోతివే! అప్పుడు అక్కణ్ణుండి ఎందుకొచ్చారు," అన్నాడు సింగారెడ్డికి గతం గుర్తొచ్చి.

"గుంటూరు పోయినా, గూడూరు పోయినా రూపాయికి పదిహారణాలేనన్నా. ఎక్కడ జూసినా ఏముంది? కార్తెల ప్రకారం వానలు కురవకపోతుండే. సరీగా వానలు కురిసి ఎన్నేళ్ళయ్యింది. ఎట్టోకట్ట బోర్లూ పాడూయేసి, నానా తంటాలు పడి పండిస్తే మార్కెట్ యార్డులో ఒకటే దోపిడీయే గదా! ఏందింక రైతు బతికేది! కొంతమంది అప్పులు బాధ పడలేక కిడ్నీలు కూడా అమ్ముకున్నారు. ఎక్కడికి పోయినా ఎదురెక్కి వొస్తుంటే ఏందన్నా చేసేది!"

"ఎట్టోకట్ట జాగర్తగా ఉండాలి. అసలే రోజులు బాగాలేవు. కాస్త గుండె దిటవు జేసుకో! కాలం మారిపోయిందిలే. పూర్వమెప్పుడో ధాత కరువు వొస్తే బంకమట్టి పెరుగులో కలుపుకొని తిని ప్రాణాలు నిలుపుకున్నారంట. అంత గుండెధైర్యం ఇప్పుడు ఎక్కడుంది? అందుకే ఈ విధంగా జరుగుతోంది. నువ్వు ఇయ్యన్నీ పట్టిచుకోవొద్దు రామిరెడ్డి. ఉత్తరాది పోవడం మంచిదే! అక్కడ వాళ్ళని జూసి బతకటమెట్టనో నేర్చుకోవచ్చు. అప్పులంటావా! ఇయ్యాల గాకపోతే రేపు తీరతై. తీర్చడానికి బతికి ఉండాల గదా! చచ్చి సాధించేది లేదు. మా బాకీలు యెగనూకి సచ్చేడు అనిపిచ్చుకోవడం తప్పు. మనం జేసినియ్యి బిడ్డల బిడ్డల తరాల దాకా కొట్టుద్ది. వుత్తరాది పోయేదాకా యేదన్నా అవసరముంటే తీసకపో," అన్నాడు సింగారెడ్డి.

"నీ దగ్గర నాకు మొకమాటం ఏముందిలే సింగన్నా," అన్నాడు రామిరెడ్డి, ఎన్ని అవస రాలున్నా పంటి బిగువున అదిమి పెట్టుకుంటూ, "సరే వొస్తానన్నా ఇందుకేగా పిలిచింది," అన్నాడు రామిరెడ్డి పైకి లేస్తూ.

"సర్లే జాగర్త బిగబట్టుకొని బాదలొచ్చినప్పుడు గుండె నిబ్బరంగా ఉండాలి. మనుషులకి గాక మానులకి వొస్తయ్య కష్టాలు. పైవాడి మీదెయ్యడమే బారం," అంటూ సింగారెడ్డి కూడా పైకి లేచాడు.

"అంతే అంతేలే!" అంటూ రామిరెడ్డి భారంగా అడుగులో అడుగేసుకుంటా వెళ్ళిపోయాడు.

✡

"ఇంక వొక్కక్షణం కూడా ఈ ఊళ్ళో ఉండడం నావల్ల కాదు. ఈణ్ణించి తీసకపోనన్నా తీసకపో! లేదంటే అంత విషమన్నా తెచ్చి మా గొంతులో పొయ్యి," అంది రత్తమ్మ రామిరెడ్డి ఇంటికి రావడంతో.

"ఏందే ఏమయ్యిందే ఇంతలోకీ," గాభరాగా అన్నాడు రామిరెడ్డి.

"ఇంట్లో ఉందో లేదో! తిన్నామో, తిన్లేదో మన బాదలు మనం పడతండామా, చుట్టుపక్కల వాళ్ళకి అందరికీ మనదే యవ్వారమైపోయింది. ఒకటే గుసగుసలూ, నసనసలూ. మన వల్లే పిల్లోడు కనపడకుండా పోయాడంట. ఎక్కడా కుదురుగా నిలబడమంట. అందుకే మనకీ గతి పట్టిందంట. సంసారమంతా ఆడదాని చేతిలోనే గదా వుండేది అంటుండారు. అప్పటికి నేనేందో అంతా నాశనం చేసినట్టు. అబ్బో ఈ సూటిపోటి మాటల్తో చెవులు గిడులు పడిపోతున్నాయి."

"నువ్వు ఎన్నయినా జెప్పు! అసలెందుకు! ఎట్టా పోవాలనుకుంటున్నాము గదా! తిరపతి ఎప్పుడొస్తాడోగానే పోయి ఉన్న పళంగా అడ్రస్ రాయించుకోనిరా! ఎంత తొందగరా ఈ వూరి నుంచి బయటపడితే అంత మంచిది! ఇంక నేను ఒక్కక్షణం కూడా ఈ వూళ్ళో వుండలేను," ఒకటే పనిగా యాడవడం మొదలుబెట్టింది రత్తమ్మ.

అందరికీ ధైర్యం చెప్పే ఆమే ఇయ్యాల ఇంత ఇదిగా మాట్లాడతంది అంటే ఇంక ఆగడం మంచిది కాదనుకొని అదే పోవడం వడ్డెపాలెం పోయి తిరపతి అడ్రస్ సంపాయిచ్చుకొని వొచ్చి "ఇదిగో అడ్రస్ తెచ్చేనే ఏం జెయ్యమంటావు చెప్పు," అన్నాడు రామిరెడ్డి.

"అరవకుండా ఇట్రా... పెద్ద ఘనకార్యం జేసినట్టు చాటింపు వేస్తుండావు," అంటూ లోపలికి నడిచింది రత్తమ్మ.

రామిరెడ్డి అరవకుండా లోపలికి వొచ్చాడు.

"ఈ రాత్రికి కుండా సట్టీ సర్దుకుందాం. ఎప్పుడంటే అప్పుడు బయలుదేరేమంటే అందరికీ ఇవరం జెప్పాల. అందుకనే రాత్రికి సామాన్లన్నీ సర్ది పెట్టుకుందాం. తెల్లారక ముందే రైలు టేసన్‌కి చేరుకున్నామనుకో, ఆణ్ణుంచి ఎప్పుడు రైలుబండి ఉంటే అప్పుడు ఎల్లిపోవచ్చు. నిన్ననే తాళిబొట్టు అమ్మి డబ్బులు గూడా తెచ్చి పెట్టా," అంటుంటే ఆమె గొంతు పూడుకు పోయింది. అయినా గుండెధైర్యం తెచ్చుకొంది. ఎక్కడికి పోయినా, వేటికైనా ఎదురీదాలనే దృఢ సంకల్పం ఆమెలో కనిపించింది.

చిన్నా చితకా వొండుకునేయీ, తినేయీ సామానులు గోతాలకేశారు. గుడ్డలన్నీ ట్రంకు పెట్టెలో వేశారు. ఆరోజు రాత్రయే దాకా కాలం నత్తనడక నడుస్తున్నట్టుగా అనిపించింది వాళ్ళకు. ఇంట్లో ఎవ్వరికీ కన్నుమూత బడలేదు.

ఈ వూరొదిలి పెట్టడం ఇది రెండోసారి అని రామిరెడ్డి అనుకోవడం అప్పటికి పదోసారి. ఈసారి ఎక్కడ ఎట్టా ఉన్నా తిరిగి ఈ పొలిమేర తొక్కేది లేదనుకున్నాడు. చావో బతుకో అక్కడే తేల్చుకోవాలని గట్టిగా నిశ్చయించుకున్నాడు.

రాత్రి మూడో ఝాములోకి జోగుతా వుంది. సామాన్లన్నీ నెమ్మదిగా బయటపెట్టి తలుపుకి తాళం వేశారు. రామిరెడ్డి, రత్తమ్మ, కూతురు పద్మ – ముగ్గురూ తలా రెండు మూటలు పట్టుకొని బజాట్లోకి నడిచారు.

రామిరెడ్డి ప్రాణం అక్కడే పోయినంత బాధ కలిగింది. ఉండూర్లో దొంగల్లాగా బైటికి నడవాల్సొస్తందే అని ప్రాణం కొట్టకలాడింది. రత్తమ్మ పరిస్థితీ అలాగే వుంది. అయినా మొండిధైర్యంతో ముందుకు సాగుతున్నారు. ఎవ్వరూ ఎవ్వరితో మాట్లాడ్డానికి ధైర్యం చాలలేదు. సొంత ఇంట్లోనే దొంగతనం చేసుకుపోతున్నంత అవమానంగా ఉంది. అయినా పడే బాధల ముందు ఆ అవమానం ఒక్క లెక్కలోదిగా అనిపించలేదు. ఎవరి మనసులో వారికి పుట్టెడు దుఃఖం తన్నుకొని వస్తూ వుంది.

ఒక్కో అడుగే ముందుకేస్తున్నారు. బజాట్లో లైట్లు గుడ్డి వెలుతురును విరజిమ్ముతున్నాయి. ఆ వెలుగులో మసక మసక నీడలు కదులుతున్నట్లు ఉన్నాయి. ఒక కుక్క వాళ్ళని జూసి పైకి లేసింది. అరవబోయి ఎందుకో మళ్ళీ తల కాళ్ళ సందులోకి వొంచుకుని పడుకుంది.

హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుని మళ్ళీ నడవడం మొదలుబెట్టారు. వడ్డిపాలెం, కుమ్మరిపాలెం, చాకలిపాలెం, మాలపల్లె దాటి చవటగుంట కట్టెక్కారు. ఒక్కసారి వెనక్కి తిరిగి చూశారు. ఊరంతా గుడ్డిలైట్లు వెలుతుర్లో నిద్రలో జోగుతా వుంది. అప్పుడే ఎంతో పరాయిదైనట్టు, దూరమైపోయినట్టు అనిపించింది ఊరు. ఇంక ఆ ఊరితో పేగుబంధం తెగిపోయినట్టు విలవిల్లాడిపోతూ ముందుకు సాగి రేగలగుంట చెరువు గుండా వెనక్కి తిరిగి చూడకుండా తారురోడ్డు ఎక్కారు. నడక వేగం పెరిగింది. అడుగులు వడివడిగా పడసాగాయి.

✡

# ఊబి

**–సింగమనేని నారాయణ**

వర్షం.. వర్షం..

ఒకటే వర్షం...

వెండి తీగెల్లాంటి వర్షం...

నారప్ప రెప్ప కొట్టకుండా చూస్తున్నాడు.

బజారులో నీళ్లు బిరబిరా పరుగెత్తుతున్నాయి.

వాటికేసి చూస్తూ నారప్ప ఆనందంతో తలమునకలవుతున్నాడు. చూస్తున్నకొద్దీ ప్రవాహ వేగం పెరుగుతూనే వుంది. వీధి కవతల వున్న ఇళ్లు కనిపించనంతగా వర్షం కురుస్తూ వుంది. నారప్ప గుండె సంతోషంతో కొట్టుకుంటూ వుంది. "ఇక ఫర్వాలేదు.. ఈ సంవత్సరం బతికి బయటపడినట్టే! శనక్కాయ పంట గ్యారంటీగా చేతికొస్తుంది.." గొణుక్కుంటూ మురిసిపోతున్నాడు నారప్ప.

"ఏంది నాయనా! గొణుక్కుంటా వుండావు.. తెల్లారింది.. లెయ్యి" అంటూ కిష్టిగాడు ఒక్క వూపు వూపేసరికి ఉలికిపడి గాభరాగా లేచాడు నారప్ప. లేచి చూస్తే ఏముంది? ఎదురుగా కొడుకూ, వాని వెనక రెండు పాత గాదెలూ...

"వాన.. వాన ఏదీ.." బిత్తర చూపులు చూస్తున్నాడు నారప్ప.

"ఏంది నాయనా! అట్లా సూత్తండావు..." తండ్రి ముఖంలోకి చూస్తూ అడిగాడు కిష్టిగాడు.

నారప్పకు ఏడ్వడమొక్కటే తక్కువైంది. ఎంత వాన! ఎంత వాన! అంతా ఉత్త కలేనా?

నీరసంగా పైకిలేచాడు నారప్ప.

అనుమానం ఎక్కడో పీడిస్తూ వుంటే బయటకు బచ్చి బజారు కేసి చూశాడు. నీళ్ల మొగం చూడక నూరేళ్లయినట్టుంది, ఆ బజారు వాలకం!

నిట్టూరుస్తూ నడవలోకి వచ్చాడు నారప్ప. కిష్టిగాడు వెనకాలే వచ్చి తండ్రికి ఒక బొగ్గు ముక్క అందించాడు. బొగ్గుముక్క నములుతూ పశువుల కొట్టంలోకి నడిచాడు నారప్ప.

పెద్ద కొడుకు నరసింహులు కొట్టంలో పేడా, కసువూ వూడుస్తున్నాడు. గంజూ, పేడా కలిసిన కమ్మని వాసన ముక్కు పుటాలకు తగిలింది.

నరసింహులు ఒక్కసారి తలెత్తి తండ్రి ముఖంలోకి చూసి మళ్లీ పనిలోకి మునిగి పోయాడు. కొడుకును చూస్తుంటే జాలీ, విచారం పుట్టుకొచ్చాయి నారప్పకు. బుద్ధొచ్చినప్ప ట్నుండీ ఒకటే పని వాడికి. ఎప్పుడూ ఏదోపని చేస్తున్నట్టే వుంది. గడియ తీరికగా కూచుండేందుకు లేదు. వాడికి పని.. పని .. పని.. ఎప్పుడు తెగుతుందో ఈ పని! ఆ వయసులో తనుమాత్రం తక్కువ కష్టపడ్డాడా! ఇప్పుడంటే పూర్తి బరువు పనులు చెయ్యలేడు గాని, మొత్తంమీద ఏదో ఒకపని వుండనే వుంటుంది.

కొట్టంలోంచి బయటకు వచ్చాడు నారప్ప.

ఉదయపు గాలులు చల్లగా శరీరాన్ని తాకుతున్నాయి. సూర్యుడప్పుడప్పుడే వుదయిస్తు న్నాడు. తెల్లటి వెలుగురేకలు భూమ్మీద పరుచుకుంటున్నాయి. ఎక్కడో బోరింగ్ కొడుతూన్న శబ్దం టక్ టక్ మంటూ వినిపిస్తోంది.

కిష్టిగాడు పెద్ద చెంబునిండా నీళ్లు తెచ్చి తండ్రి చేతికందించాడు. నారప్ప ఒక బండమీద కూచుని నోరూ, ముఖమూ కడుక్కొని తువ్వాలుతో తుడుచుకుంటూ ఇంట్లోకి వచ్చాడు. వంటింట్లో దట్టంగా పొగలు సుళ్లు తిరుగుతున్నాయి.

అరుగుమీద కూచొని నిద్రలేచేముందు వచ్చిన అందమైన కలను జాగ్రత్తగా నెమరు వేసుకోసాగాడు నారప్ప. వర్షపుధారలు అతని కళ్ల ముందు మెదలుతూంటే తన్మయత్వంతో పులకరించిపోయాడు. తెల్లవారు జామున వచ్చిన కలలు నిజమవుతాయంటారు. వాన నిజంగా వస్తుందేమో! ఎండిపోయి నేలకు అతుక్కుపోయిన శనక్కాయపైరు అతని కళ్లముందు దీనంగా మెదలుతోంది. నిరుడంటే విత్తనం కూడా చేతికి చిక్కలేదు. ఈసారైనా పంట చేతికొస్తుందేమో అనుకుంటే, ఈవాన ఇట్లా కలలా మిగిలిపోతోంది. 'ప్చ్" పెదవులు చప్పరించాడు నారప్ప.

కిష్టిగాడు ఇంట్లో గోడవారగా కూచుని పలకమీద ఎక్కాలు రాసుకుంటున్నాడు. రెండు కోళ్లు ఇల్లంతా గస్తీ తిరుగుతున్నాయి. వంటింట్లోంచి నారప్ప భార్య లక్ష్మమ్మ ఒక పొడుగాటి లోటానిండా కాఫీ తెచ్చి నారప్ప చేతికందించింది. పెద్ద కూతురు నరసమ్మ వంటింట్లో పొయ్యి ముందు కూచుని పుల్లలు ఎగదోస్తోంది.

నారప్ప ఎంతో ప్రీతిగా కాఫీ చప్పరిస్తూండగా లక్ష్మమ్మ "ధర్మారమన్నా పోయి రాకూడదా" అంది అక్కడే నిలబడుకొని.

"యాలా?" అనబోయి నారప్ప ఆపుకున్నాడు. ధర్మవరం ఎందుకు వెళ్లమన్నదీ అతనికి వెంటనే స్ఫురించింది. పెద్దబిడ్డను అత్తవారింటికి బట్టలు పెట్టి పంపడానికి రెండు చీరలు తేవాలి. వెంటనే అతనికి అనంతపురం వాసవీ ఎలక్ట్రికల్స్ యజమాని రామ్మూర్తి గుర్తుకొచ్చాడు. బావికి సంవత్సరం క్రితం వేయించిన కరెంటింజను బాపతు బాకీ మెదిలింది. పాత ఇంజను పూర్తిగా పనికిరాకుండా చెడిపోతే కొత్తది వేయించాడు. ఈ నెలలోగా ఎటు తిరిగీ బాకీ తీరుస్తానని నాలుగు రోజుల క్రితం వచ్చిన పెద్ద మనిషికి గట్టిగా చెప్పి పంపిన విషయమూ గుర్తుకొచ్చింది. ఏం చేసేందుకూ తెలియక అతని ప్రాణం విలవిల్లాడింది.

కాఫీ గడగడా నాలుగు గుటకల్లో తాగేసి, గ్లాసు లక్ష్మమ్మ చేతికందించి లేచి నిలబడ్డాడు నారప్ప. లక్ష్మమ్మ అతని ముఖంలోకే చూస్తూ గ్లాసు తీసుకొని వంటింట్లోకి నడిచింది.

కిష్టిగాడు కొట్టంలోంచి వెళ్లి చెంబునిండా నీళ్లు తెచ్చి, కొద్ది కొద్దిగా వంపుతూ అన్న చేతులమీద పోశాడు. నారప్ప వాళ్ల వేపు చూస్తూ నడవలో అటూ యిటూ కొద్దిసేపు తచ్చాడి, తల గోక్కుంటూ బయటకు వెళ్లే ప్రయత్నంలో అడుగులు ముందుకు వేయబోతూ వుంటే "నాయనా" అని పిలిచాడు నరసింహులు తడిచేతులు విదిలిస్తూ.

నారప్ప తలతిప్పి కొడుకు వేపు దీర్ఘంగా చూశాడు.

"బోరింగేసే వాళ్లు ఈ పొద్దు వెంగటన్న బావికేసేకి వస్తారంట" అని ఆగాడు. నారప్ప నిమిషంపాటు పూరకుండి, "వస్తే"... అన్నాడు.

నరసింహులు పంచె కొసలతో చేతులు తుడుచుకుంటూ, "మనమూ వేయిస్తే బాగుంటుంది" అన్నాడు.

నారప్పకు కొడుకు అభిప్రాయం అర్థం కాకపోలేదు. బావిలో బొత్తిగా నీళ్లు చాలటం లేదు. నాలుగు రోజులకొక్కసారి కూడా తడి పారలేదు. ఆటికీ నెలకిందట ఇన్నూరు రూపాయలు ఖర్చుపెట్టి పూడు తీయించాడు. అయినా నీళ్లు జానెడు మించి వూరటం లేదు. వర్షాల్ని నమ్ముకొని మూడెకరాల వరి నాటాడు. మామూలుగా అయితే నాలుగైదు ఎకరాలు నాటేవాడు. నీళ్లు చాలతాయో చాలవో అనే అపనమ్మకంతో ఎకరా తగ్గించి పైరు పెట్టినా దానికే నీళ్లు పారటం కష్టమైపోతోంది. ఇప్పుడుండే పద్ధతిలో అయితే రెండెకరాలూ ఎండ బెట్టుకోవాల్సిందే. బోరింగ్ వేయిస్తే నీళ్లు పడవచ్చు అనే నమ్మకమున్నా, దానికీ బోలెడు పెట్టుబడి కావాలి. ఎన్నిటికని లెక్కలు (డబ్బు) తెచ్చేది? ఈటికే యాడ చూసినా అప్పులే.

నారప్ప కళ్లముందు బావి అట్టడుగున వున్న నీళ్లూ ఎండిపోవడానికి సిద్ధంగా వున్న పైరూ మెదలుతూనే వున్నాయి. ఆ పంటా చేతికి రాకపోతే కనీసం తిండి గింజలు కూడా కొంపలో లేకుండా.. తిండి గింజలు కూడా కొనాలంటే ఎంత నామార్దా.. థూ.. థూ.. వద్దురా నాయనా.. ఈ సేద్దెమూ...

ఒళ్లంతా క్షణకాలం జలదరించినట్టయింది నారప్పకు.

నరసింహులు తండ్రి ముఖంలోకే చూస్తూండిపోయాడు.

నారప్ప మెల్లగా వచ్చి అరుగుమీద కూచుని బనీను జేబులోంచి బీడీ బయటకు తీసి పెదవుల మధ్య వుంచుకొని, నిదానంగా అగ్గిపెట్టె తెరిచి పుల్లను బయటకు లాగి, గీచి వెలిగించుకొన్నాడు. రెండు దమ్ములు లాగి గుండెలనిండా పీల్చుకొని పొగ బయటికి వదిలాడు. తను విడిచిన మేఘం లాంటి పొగను చూస్తూ "రేటెంత మాట్లాడినారంటరా!" అనడిగినాడు.

నరసింహులు వాళ్లమ్మ అందించిన కాఫీగ్లాసు చేతికి తీసుకుని అరుగుకు ఈమూల కూర్చుంటూ "అడుగు ముప్పయి రూపాయలంట.. మొదటి ఇరవై అడుగులదంకా అదే లెక్కన వేస్తారంట! అవతల అడుగుకు ముప్పయి అయిదంట...!" అన్నాడు.

"ఇంత రేటా...? నిరుడు పుల్లప్ప వేయించినప్పుడు అడుక్కు ఇరవై తీసుకున్నట్టు గుర్తు. ఈసారి బావుల్లో నీళ్లు లేక గిరాకీ పెరిగే సరికి ఈనాయాళ్లు కూడా బాగా రేటు పెంచినట్టుండారు. అందరికీ అదవ చిక్కినోడు రైతే.." నారప్ప వినపడీ వినపడనట్టు గొణిగాడు.

"అన్ని చోట్లా యిదే రేటంట.. రూపాయి కూడా తగ్గించుకోమన్నారంట.." అన్నాడు నరసింహులు.

నారప్ప మనసులో గుణించుకుంటూ లెక్కలు కట్టాడు. ఎంతలేదన్న ఎనభై అడుగులు వేయించాల్సి వుంటుందేమో! మూడు వేలయ్యేట్టుంది.. అంత లెక్క ఎవుర్నడగాలబ్బా... అన్నిటినీ ఆ శివయ్యనే నమ్ముకుంటే వడ్డీలతో ముంచేస్తాడు. అసలే కరెంటు బిల్లు ఎప్పుడొచ్చి పడుతుందా అని బితుకు బితుకుగా వుంది. ఇంతకు ముందయితే నెలనెలా బిల్లులు వచ్చేవి. ఎట్లో అగచాట్లుపడి కట్టేవాడు. బిల్లు కలెక్టరు స్ట్రయిక్ చేసి పదినెలలుగా కరెంటు బిల్లులు రాలేదు. అంతా కూడగట్టుకొని యా పొద్దు నెత్తిన పడుతుందో! రెండేళ్లయింది బొత్తిగా శనక్కాయ పంట కళ్లచూడక. చేతిలో దుడ్లే మెదలటం లేదు. ఏదో బావికింద అంతోయింతో పండుతూ వుంటే తినటానికి ఆటికాటికి సరిపోయేది. పై అక్కర్లన్నీ యిక అప్పులే! ఈసారి చూస్తే బావిలో నీళ్లు పాతాళంలో వున్నాయి. వూర్లో రైతులందరూ తలకాయలెత్తి ఆకాశానికి ఆశగా చూస్తున్నా ఒక్క బొట్టు పడలేదు. ఈసారి బావులకిందా పంటలు లేకపోతే రైతులగోడు చెప్పేకి లేదు. గవర్నమెంటోల్లు వూరికే అనేదేగాని బావుల్లో బోరింగులు వేయించకూడదా? కరువుసాయం కరువు సాయమని వూరికే అనడమేగాని ఒక్కరైతుకు పావలా చేతికొచ్చిందా? థూ... థూ... థూ.. అంతా దొంగనా కొడుకులు.

నారప్ప గొణుక్కుంటూనే బీడీ చివరిదమ్ము పీల్చి గోడకు అదిమి ఆర్పి కిందకు పారేశాడు.

నరసింహులు కాఫీ తాగటం పూర్తిచేసి గ్లాసు పక్కనపెట్టి లేచి నిలబడ్డాడు.

నారప్ప కొడుకు ముఖంలోకి దీర్ఘంగా చూసి ఏదో నిర్ణయానికి రాబోతున్నట్టుగా 'చూద్దాం లేరా' అంటూ పైకిలేచి భుజం మీద తువ్వాలు తీసి విదిలించి బయటకు కదిలాడు.

✡

నారప్ప తోటలో బావిచుట్టూ సందులేకుండా జనం మూగి వున్నారు. బోరింగ్ మిషన్ 'కుయ్'మని చెవులు చిల్లులు పడేట్టు శబ్దిస్తూవుంది. ఊరిలో రైతులు చాలామంది అక్కడ చేరి ఒకరిమాట మరొకరికి వినపడకుండా మాట్లాడుకుంటున్నారు. బోరింగ్ మిషన్ మట్టిని యీడ్చి యీడ్చి బయటకు విరజిమ్ముతూంది. మొన్న వెంగటన్న బావిలో నలభై అడుగులు దిగేసరికే నీళ్లుపడ్డాయి. అంత తక్కువలో నీళ్లు పడేసరికి రైతుల గుండెల్లో ఆశలు చిమ్ముకొని ఎగశాయి. బోరింగ్ వాళ్లకు గిరాకీలు పెరిగాయి.

"బో గట్టి నేలప్పా! ఒక్కొక్క అడుగు దిగేసరికి బ్రహ్మ ప్రళయమవుతా వుంది" అంటూ అనుభవమున్నట్టు ఒకరైతు మరో రైతుతో అంటున్నాడు.

నారప్ప బావిగట్టు మీద కూచుని లోపలికి తొంగి తొంగి చూస్తున్నాడు. ఒక్కొక్క అడుగూ అతని సంపదను తొలుస్తున్నట్టుగా వుంది. ఎంత తొందరగా నీళ్లు పడతాయా? ఎంత ఖర్చు తగ్గుతుందా? అనే చింత చేస్తున్నాడు నారప్ప. దేవుని దయకొద్దీ నీళ్లు బాగా పడితే నాలుగెకరాల పంటా చేతికొస్తుంది. ముందు ముందుకు కూడా బావిలో నీళ్లకు కటకట వుండదు. మంచిధార పడల్ల గాని.. నారప్ప వూహల చెలమలో నీళ్లు వూరుతూనే వున్నాయి.

నరసింహులూ, కిష్టిగాడూ, వాళ్లమ్మా, అక్కా, కూడా అక్కడక్కడా నిలబడి అద్భుతం జరుగుతున్నట్టు చూస్తున్నారు.

బోరింగ్ సిబ్బంది కాఫీలూ, సిగరెట్లూ, ఏకధాటిగా లగాయించేస్తున్నారు.

నారప్ప బోసిగా వున్న భార్య మెడవేపు చూశాడు. మూడు పారవలచైను ఇప్పుడు బాంకులో వుంది. రెండు రోజులు తిప్పుకుని మూడు వేలిచ్చినారు బ్యాంకువాళ్లు. తాను ధైర్యం చేసి తాకట్టు పెట్టాల్సి వచ్చింది. తానొక్కడేనా? యా రైతు యింట్లోకాంగ ఇప్పుడు బంగారు వుంది? రకరకాల అవసరాలకు ప్రతి రైతూ బంగారును బ్యాంకులో పెట్టినవాళ్లే. ఒకరికే వచ్చిన తిప్పలైతే గదా?

"నేల శానా గట్టిగా ఉందప్పా? ఉత్తరాళ్ళు వస్తున్నాయి. అడుగు దిగే సరికి గంట పడతావుంది." పక్కనే వున్న రైతు నారప్పకు వినపడేలా అన్నాడు.

నారప్ప గుండె గుబగుబలాడింది. పద్దన్నుండి పని జరుగుతూనే వుంది.

గుర్ గుర్.. డుర్ డుర్.. మని బోరింగ్ మిషన్ మొత్తుకుంటూంది.

"కోనాపురం సిద్దప్ప బావిలో నాలుగు చోట్ల దించినారంట! అయినా నీళ్లు పడలేదంట. మొత్తానికి ప్రాప్తముండల్ల.." ఆ రైతు నారప్ప చెవుల్లో వూదుతూనే వున్నాడు.

నారప్పకు మండుకొచ్చింది. అక్కణ్ణుంచి సర్రున లేచి మరోచోటికి వెళ్లి నిలబడ్డాడు.

అడ్వాన్సు ఆరునూర్లు చేతిలో పెట్టందీ బావిలోకి మెషిన్ దింపలేదు బోరింగోళ్లు. నీళ్లు పడినా పడకపోయినా ఎన్ని అడుగులు దించితే దాని కయ్యేంత లెక్కా యియ్యాల్సిందే అని కండీషను. పని జరిగినంత సేపూ బోరింగ్ సిబ్బందికి భోజనాలూ, టిఫిన్లూ, కాఫీలు – ఈ ఖర్చు కూడా. మెత్తని చట్టయితే రోజుకు అరవై అడుగులు వేస్తామన్నారు. అంతలోగానే నీళ్లు చిమ్ముకురావా అనే భరోసాతో వున్నాడు నారప్ప. నేల అనుకున్నంత మెత్తది కాకపోవడంతో సాయంత్రమయ్యే సరికి నలభై అడుగులు దింపేశారు. ఆరు గంటలు దాటగానే పని ఆపేశారు. వచ్చే జనం పోయే జనంతో సాయంత్రం దాకా తోటంతా తిరణాలలా వుంది. పని ఆపేసరికి జనం పల్చబడ్డారు. బోరింగ్ సిబ్బంది బావి గట్టున బండమీద కూలబడ్డారు. వాళ్లు బాగా అలసిపోయారు పాపం!

"ప్రాణం తీస్తూందయ్యా నీ బావి. ఉత్తరాళ్లు, మాకేం గిట్టేట్టు లేదు. వేరే బావిలో అయితే యింకో ముప్పయి అడుగులు దించిండేవాళ్లం" అన్నాడు వాళ్ల జట్టు నాయకుడు.

"ఇంక ఎన్ని అడుగులు దించితే నీళ్లు పడతాయప్పా" ఆశగా అమాయకంగా అడిగాడు నారప్ప.

"అది మేమెట్లా చెప్పుతామప్పా! వారం కిందట బండమీదపల్లెలో క్రిష్ణారెడ్డి బావిలో దించితే ముప్పయి అడుగులకే మోచేయంత బుగ్గచిమ్మింది. అంతా రైతు అదురుష్టమప్పా".

అదృష్టం అనే సరికి నారప్ప గుండె చల్లబడింది. బతుకంతా అదృష్టంతో పందెం కాసినట్టుంది.

"రాత్రికి కోడన్నా కోసిపెట్టు నారప్పా! కాఫీలు తాగి తాగి నోరంతా చెడిపోయింది.." అనడిగాడు వారిలో ఒకాయన.

"తిండిదేముంది లేప్పా! ఒకటి కాకపోతే రెండు కోసి పెడతాను" అన్నాడు నారప్ప పైకిలేస్తూ.

మరురోజు పొద్దున్నే టిఫిన్లూ కాఫీలూ అయ్యాక ఎనిమిదికల్లా పని మొదలుపెట్టారు. వారికి వూళ్లో మరో నాలుగు బావులబేరాలు కుదిరాయి.

నిన్నటంత జనం లేరు బావిదగ్గర... చుట్టు పక్కల తోటల వాళ్లు సరదా చూస్తున్నట్టు అటూ ఇటూ తిరుగుతున్నారు. నారప్ప బావిగట్టు విడవకుండా కూర్చున్నాడు. నరసింహులు బోరింగ్ సిబ్బందికి సహాయంగా చెప్పిన పనులు చేస్తున్నాడు.

లోపల నేల కొంత మెత్తగా ఉన్నట్టుందేమో. పదిగంటలు దాటే సరికి ఇరవై అడుగులు తెగింది.

మధ్యాహ్నమయ్యేసరికి మరోపది అడుగులు తెగింది.

నారప్ప ప్రాణం ఒకవైపు విలవిలలాడిపోతూంది. ఇరవై అడుగులు దాటినా నీటిపట్టు చిక్కలేదు.

"ఏం నారప్పా! మరో పది అడుగులు దించమంటావా" అనడిగాడు బోరింగ్ మనిషి.

"దించప్పా దించు... అయిందేదో అయింది" కీచుగొంతుతో అరిచాడు నారప్ప.

మరో పది అడుగులు దించేసరికి, ఉన్నట్టుండి కీచుమని గట్టిగా అరుస్తూ మెషీన్ ఆగిపోయింది.

"ఏమయిందేమయింది.." అంటూ చుట్టూ వున్న వాళ్లంతా అరిచినంత పనిచేశారు.

"బండ పడిందప్పా! ఇక కష్టమే" అన్నాడు నిస్సహాయంగా బోరింగ్ మనిషి.

నెత్తిమీద బండపడినట్టు తల దిమ్మెక్కింది నారప్పకు. సరసరా బావిలోకి దిగాడు. తలా ఒక మాట అనుకుంటున్నారు. "శానాగట్టి బండ అడ్డమొచ్చినట్టుంది" అని ఒకరూ, "ఇంక ఇక్కడ చాలించేయాల్సిందే" అని ఇంకొకరూ, "ఇంకేం నీళ్లు పడతాయబ్బా" అని మరొకరూ ఒకటే కోలాహలం!

నారప్ప బోరింగు వైపు బిత్తర చూపులు చూస్తున్నాడు.

బోరింగ్ మనుషులు ఇక ఇక్కడ ఆపేయాల్సిందే అని నిర్ణయానికి వచ్చారు. "బండ ఎంత ఘాతముందో చెప్పలేమప్పా! నువ్వు సరే అంటే ఇంకోమూల దించుతాం" అన్నారు నారప్పతో.

"నా నెత్తిమీద దించండి" అంటూ గట్టిగా అరిచాడు నారప్ప.

ఒకరిద్దరు నచ్చ చెప్పాలని చూశారు. ఇంతా ఖర్చయింది; ఇంకో ప్రయత్నం చేస్తే మంచిదని. నారప్ప ఏం మాట్లాడకుండా నిలువు గుడ్లేశాడు. నరసింహులూ వాళ్లమ్మా దిక్కులు చూస్తున్నారు దిగులుగా.

"నా ప్రాప్తమింతే అనుకుంటాను. నన్ను నిలువునా కోసినా ఇంక పైసా కూడా చాత కాదు. మిషను ఎత్తేసుకోండప్పా" అని చెప్పి నెత్తిమీద తువ్వాలు వేసుకున్నాడు నారప్ప.

సాయంత్రం అయిదయ్యేసరికి నారప్ప తప్ప ఒక్కరు మిగల్లేదు ఆ బావి దగ్గర. రావాల్సిన మొత్తమంతా లెక్కకట్టి ఖచ్చితంగా తీసుకుని తమ సరంజామా అంతా మరో బావికి తరలించారు బోరింగ్ వాళ్లు. నారప్ప ఒక్కడూ బావి గట్టునున్న బండమీద కూచుని బావివేపూ, ఎండిపోతున్న

పైరు వేపూ మార్చి మార్చి దిగాలుగా చూస్తున్నాడు. అతని కన్నుల్లో నీళ్లు చిమ్మట మొక్కటీ తక్కువయ్యింది. బ్యాంకులో తెచ్చిన మూడు వేలతో పాటు మరో మూడు వందలూ ఖర్చయ్యాయి. ఇంత ఖర్చూ ఏట్లో పిసికిన చింత పండయిందే అని అతని మనసు మూలుగుతూంది. ధైర్యం చేసి మరో మూల వేయిస్తామనుకుంటే, అక్కడ మాత్రం గ్యారంటీ ఏముంది? మళ్లీ అప్పుకోసం ఎవుడి దగ్గరికి వెళ్లేట్టు?

బండమీద నుంచీ లేచి మెల్లగా అడుగులు వేస్తూ గెనాలమీదుగా పైరు చుట్టూ ప్రదక్షిణం చేశాడు. ఇక రెండు తళ్లు పారితే వెన్నుపోయే పంట! తనవేపే ఆకలిగా చూస్తున్నట్టు అనిపించి పేగులు కదిలాయి నారప్పకు.

పొద్దు బాగా వాలిపోయింది. చింతమానుల నీడలు నారప్ప నిరాశలా నేలంతా పరుచుకున్నాయి. ఎండిన పెదాలను తడి చేసుకుంటూ తోటనుండి బయటపడి ఇంటి దారి పట్టాడు. దారిలో ఒకరిద్దరు ఏదో అడిగారు కానీ, నారప్ప ముక్కులో వూపిరి కూడా విడవకుండా వారిని దాటేశాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. కాటిలో పీనుగును పారవేసి వచ్చినంత విషాదంగానూ వుంది. నారప్ప నడవ దాటుకుని వసారాలోకి వచ్చాడు. కిష్టిగాడు సర్రున ఎదురు వచ్చి "నాయనోయ్... కరెంట్ బిల్లిచ్చి పొయ్యినారు.." అన్నాడు చేతిలో వెడల్పాటి కాగితం కదిలిస్తూ... షాక్ కొట్టినట్టుగా ఆగిపోయాడు నారప్ప.

కిష్టిగాడు తండ్రికి కాగితం అందించబోయాడు. నారప్ప దానివేపు చూస్తూ 'ఎంతొ చ్చిందిరా' అన్నాడు జీరపోయిన గొంతుకతో.

కిష్టిగాడు కాగితం కళ్లముందు పెట్టుకుని, "ఎనిమిది నూటా యాభై రూపాయలా, నలభై పైసలు రాసినారు నాయనా" అంటూ తండ్రి ముఖంలోకి చూశాడు.

నారప్ప వెర్రి చూపులతో కిష్టిగాడి నోటివేపే చూస్తూండిపోయాడు.

"ఏంది నాయనా అట్ల సూత్తండావు?" బిక్కు బిక్కుగా అడిగాడు కిష్టిగాడు. నారప్ప ఏం మాట్లాడలేదు.

✡

# తడి

**– సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి**

కల్లం కట్టవ వారన చేని గట్టున కూచుని మెల్లిగా గడ్డి పరకల్ని పెరుక్కొంటోంది చెన్నమ్మ. గోడకింద కట్టేసిన బర్రెదూడ ఆకలి చూడలేక లేని ఓపిక తెచ్చుకొని కర్ర వూతేసు కొంటూ వచ్చిందామె.

జంగిడి దొడ్లలోంచి తప్పించుకొన్న రెండు బర్రెగొడ్లు– వానకు తడిసి నల్లగా మగ్గి, కుళ్లిపోయిన వేరుశెనగకట్టె కుప్పల్ని కొమ్ములతో కుమ్ముతున్నాయి.

స్వాతి కార్తె వచ్చింది మొదలు ముసురుపట్టింది. అక్కడక్కడా తేలిగ్గా వెళ్లిపోయే మేఘాలు కుట్రపన్నినట్లు అన్నీ కలిసిపోయి ఆకాశానికి తెరగట్టాయి. సన్నసన్న పుల్ల జినుకుల్తో, యీదురు గాలుల్తో మొదలైన వాన కార్తె చివరిదాకా తగ్గలేదు.

నీళ్ల తడికి గతిలేని, వాననే నమ్ముకొన్న చేలల్లో ముక్కాలు భాగం ఎండిపోయిన పైరు యీ వానదెబ్బకు వూడలతో సహా కుళ్లిపోయింది.

పీకాలనుకొని తడేసి సిద్ధంగా వుంచుకొన్న పైరుసైతం బాగా దెబ్బతింది. పీకి కుప్పలేసిన కట్టె పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుంది. కాయలన్నీ తెల్లగా మోసులెత్తి వున్నాయి.

రాకరాక వచ్చిన యీ వాన రైతు కళ్ల చెరువుల్ని అలుగులు పొంగేలా నింపి వెళ్లింది.

నిరుటి పరిస్థితి మళ్లీ రాకుండా జాగ్రత్త పడుతున్నంతలో దయ్యంలా వచ్చిపడింది యీ వాన.

ఈ కరువుకు తోడు మనుషుల మధ్య ఆరిపోని 'పగ'లు

కడుపు నిండకున్నా పర్లేదు – కసిదీరాలి

పైరు పండకున్నా పర్లేదు – పంతం నెగ్గాలి.

పల్లె పూర్తిగా చెడిపోయింది.

నిన్న మొన్నటి దాకా బాగున్న తన వాళ్ల మధ్య కూడా పగల సెగలే.

వెనగ్గా ఏదో సవ్వడి విన్పించి తలతిప్పి చూసింది ఆమె.

సుబ్బన్న వస్తూ కన్పించాడు.

మెల్లగా నడుచుకొంటూ వచ్చి ఆమెకెదురుగా నిల్చున్నాడు.

తలెత్తి అతనికేసి చూసి మళ్లీ తలదించుకొని గడ్డి పెరుక్కోసాగింది. 'ఏదో పనిబడి వచ్చిండు. ఎనక ముందాడతాండు. సిన్నప్పట్నించీ అంతే యీడు. ఏదన్నా కావాలంటే ఎదటబడి అడగడు. తనే కనిపెట్టి అందియ్యాల'

"ఏం నాయినా?" పలుకరించింది.

"ఏం లేదమ్మా!" నసిగాడు.

"పనిబడే వచ్చినట్టుండవ్. సెప్పు నాయినా."

కొద్దిసేపు మౌనం తర్వాత గొంతు విప్పాడు.

"కేసు మనమే గెలుస్చమంట అమ్మా!"

నిశ్శబ్దంగా వుండిపోయింది ఆమె.

ఆ విషయం తల్చుకొంటేనే గుండెల్లో బాధ సుడులు దిరుగుతోంది.

"లాయరుకు ఫీజు గట్టాల." గొణిగినట్లుగా అన్నాడు.

తలెత్తి అతనికేసి చూసింది.

"సేతిలో లెక్కలేదమ్మా! యాడ దిరిగినా దొరకలే."

ఆమె కర్థం కాలేదు.

తనేం చేయగలదు?

"నీ సేతి కడేలిస్చే..." గొంతుకేదో అడ్డుపడ్డట్లుగా ఆగిపోయాడు.

అర్థమైంది ఆమెకు.

తలొంచుకుని మౌనంగా వుండిపోయింది.

కొద్దిసేపటి తర్వాత మళ్లీ కదిపాడు – "ఏమ్మా" అంటూ.

ఆమె తలెత్తలేదు.

మౌనాన్ని వీడలేదు.

గడ్డిపరకల్ని పీకటం ఆపలేదు.

తల్లి ఉద్దేశ్యం అర్థమై మరేమీ మాట్లాడకుండా వెనుదిరిగి ఇంటికి నడిచాడు.

ఆలోచనలు ఒక్కసారిగా యీగల్లా ముసురుకున్నాయి, ఆమె తలనిండా. కళ్లలో తడి కదిలింది. మెల్లిగా చెంపలమీదకు జారింది.

రాత్రి తిండి తినలేదు ఆమె – ఆకలి కాలేదంటూ.

సగం రాత్రిదాకా కంటిమీద కునుకులేదు.

ఈ ఏడాదంతా యిట్లాంటి రాత్రుల్ని చాలా గడిపింది ఆమె.

మొదటిసారి అక్కా, తను ఆసుపత్రి వరండాలో చెరోవైపు కూచుని తెల్లార్లూ ఏడుస్తూ గడపటం బాగా గుర్తుంది.

అనుకోకుండా వచ్చింది అక్క కుటుంబానికి, తన కుటుంబానికి మధ్య కొట్లాట.

నిరుడు శనక్కాయ నెల రోజుల పైరప్పుడు మొదలైంది గొడవకు మూలం.

తువ్వ చేలల్లో నెలరోజుల పైరయ్యేదాకా నీటి అవసరం వుండదు. వాతావరణంలో తేమ వుండే కాలం కాబట్టి యీమిరి పట్టుకొని వుంటుంది నేల. తవ్వకాలయింతర్వాత పైరు దొంగపూత పూసే సమయంలో ఒక పదునయితే చాలు.

అశ్లేష కార్తెలో కూడా వాన వంగలేదు. బెట్ట చేలల్లో అక్కడక్కడా పైరు వాడు బట్టింది.

మఖ వరకు చూసి చెరువు తూమెత్తుదామనుకొన్నారు రైతులంతా. ఎందుకంటే చెరువులో నీళ్లన్నీ రెండుదళ్లకే సరిపోతాయి కాబట్టి. భూమి విస్తారానికి తగిన చెరువు కాదుగాబట్టి. ఇప్పుడొక తడి వాడుకొన్నా, వర్షం రాకుంటే చెనక్కాయ పీకేటప్పుడు ఖచ్చితంగా ఓ తడి అవసరం కాబట్టి.

వారి పథకాలకు గండికొడుతూ అనుకోకుండా అశ్లేష వెళ్లుదలలో ఒకనాటి ఉదయం చెరువుకింద కలకలం రేగింది.

పార భుజానేసుకొని నేనంటే నేనని పోటీలుపడి చేలకేసి వెళ్తోన్న జనంతోబాటు తనూ బైటకు నడుస్తోన్న పెద్దమనవడు శీనును ఆపింది. "యేందోరే యిదెంతా?" అడిగింది.

"ఏముందీ? శెనక్కాయ సేనికి తడేసి వస్చా!" చెప్పాడు.

"అప్పుడే ఏం తడిరా?" ఆశ్చర్యంగా అడిగింది తను.

"అందరేస్చాన్లే!" చెబుతూ ఇల్లు దాటాడు.

తర్వాత విచారిస్తే తెలిసింది విషయం.

ఎవడెత్తాడో మరి గత రాత్రి తూమెత్తాడుట. నాలుగు చేలు పారాయి. వాడు తడేశాడని వీడూ... వీణ్ణి చూసి ఇంకొొకడు.. మరొకడూ.. వేరొకడూ, వూరంతా...

తడి మరిగిన పైరు పదిరోజులు తిరక్కుండానే మరో తడికోసం ఎదురుచూస్తుంది.

చివరి తడి లేకుండా శెనక్కాయ ఎట్లా పీకాలి?

వానొస్తుందని నమ్మకమేమిటి?

ఆ విషయాన్ని ఆలోచించి చాలా బాధపడింది తను.

కాలువ దారులన్నీ తిరునాళ్లయినాయి.

జనమంతా తొొక్కిసలాడారు. చేలగెట్లెంట పరువెత్తారు. ఎండు కాలువల్ని బురద మయం చేసేందుకు నీళ్ల కాలువల్లో పడి పొర్లాడారు.

చివరి భూముల వాళ్లు తడివ్వలేదంటూ ఆక్రోశించారు.

చిన్న చిన్న ఘర్షణలతో ఎలాగో లాగు మొదటి తడి ఐపోయింది.

ఊడల చివర్లు పిందెలుగా రూపుదిద్దుకొంటున్నాయి.

మరో పదిరోజులకు రెండవ తడి మొదలైంది.

సగం నేల తడిసే సరికి తూముకు అందకుండా పోయాయి నీళ్లు.

ఆయిల్ ఇంజన్లు తెచ్చి చెరువులోకి దించారు. పైపుల హస్తాల్ని గుంటల గర్భాల్లోకి జొనిపారు.

పాలకోసం వెంపర్లాడే పసిపాపల్లా ఆరాటపడ్డారు జనమంతా. ఇంజన్లున్న వాళ్లను బంగపడ్డారు. ఎండిపోయే పైరును చూసి లబలబ లాడారు.

మొదటిసారి తూమెత్తిన వాణ్ణి ఎలుగెత్తి తిట్టారు. తనప్పుడు బాగా తిరుగుతూండేది. చేనికాడికెళ్లి వాళ్ల అవస్థను చూసి బాధపడేది.

ఇంజన్ల గొంతెత్తి వారంరోజులు భోరుమంటూ ఏడ్చింది చెరువు. పైరు రెండవసారిగా చెరువు గుండెల్లో రక్తాన్ని కూడా పీల్చి వొట్టిదాన్ని చేసింది.

మరో వారానికే వారం రైతులంతా ఆలోచనల్లో పడ్డారు. పైకెగజూసే కొద్దీ ఆకాశం ఖాళీ చేతుల్తో వెక్కిరించడం ఎక్కువైంది. మనసంతా ఆరాటంగా వుంది. కాయలు ముద రొచ్చాయి. నోటికాడి కొచ్చిన పైరు.

'పీక్కునేందుకయినా గొర్రు సాలు చినుకులు పడితే' ఆశగా ఎదురు చూస్తున్నారు.

వానొచ్చేట్టు లేదు. నీళ్ల దారి కనబడేట్టు లేదు.

భూమిలోని కాయలు బైటకెట్లా రావాలి?

చుట్టుపట్ల నీటి ఆధారం లేదు. ఉన్న ఒక్క బోరు బావి నర్సింహారెడ్డిది. దానికి బాగా గిరాకీ పెరిగింది. రైతులంతా అక్కడ తేనెటీగల్లా మూగి వున్నారు.

ఎకరాకు మూడొందల వంతున బేరం కుదిరింది.

చాలామంది రైతులు వూరట చెందారు.

తమ చేను జ్యోతి వాగు గట్టునే వుంది. వాగులో పెద్ద గుండం వుంది. మొన్నటిదాకా చెరువులో నీళ్లుండటం వల్ల ఆ గుండం ఎండిపోలేదు.

తన కొడుకు, మనవళ్లు గుండానికి ఇంజన్ బిగించి నీళ్లేస్తున్నారు.

మాపటేల అక్క కొడుకు రంగన్న వచ్చాడు.

"చేనెండిపోతాంది. మీ గుండంలో రవ్వన్ని నీళ్లియ్యరాదంటరా!" అడిగాడు సుబ్బన్నను.

"మాకు సరిపోను మిగుల్తే దానికేం బాగ్గెం? అట్టనే యేసుకొందూలే" చెప్పాడు సుబ్బన్న.

మర్నాడు పొద్దున్నే మళ్లీ వచ్చాడు రంగన్న.

"గుండంలో నీల్లయిపోతాండయి. ఒక కయ్యన్నా తడుపుకోనీ రాదూ!" అడిగాడు.

"మా సేను ఎండబెట్టుకోవాలా" మొహమాటం లేకుండా చెప్పాడు సుబ్బన్న.

"ఒక్కొంతు నీల్లియ్. యిత్తనాలన్నా దక్కుతాయ్" బంగపడ్డాడు.

సుబ్బన్న వొప్పుకోలేదు.

రంగన్నకు ఓపిక చచ్చినట్లుంది 'గుండం ఒకరి సొత్తేమీ కాదంటూ' విసవిసా వెళ్లాడు. తనకేమి చెప్పేందుకు పాలుపోలేదు.

పూర్వం నించీ ఆ గుండాన్ని వాడుకొనేది తమవాళ్లే. ఇసుక మేట వేస్తే పూడిక తీసే వాళ్లు. జంబు కోసేవాళ్లు. ఎవరయినా చేపలు పట్టుకొంటే సగభాగం తీసికొనేవాళ్లు.

అవతల అక్క కొడుకు. ఇవతల తన కొడుకు.

పాపిష్టి కరువుగాలం. గలాభా పెట్టుకొంటారేమో? సమయానికి తన పెద్ద మనవడు శీను ఇంటివద్ద లేనిది కూడా ఒకందుకు మంచిదే. వాడొట్టి ముక్కోపి. పొద్దు వాటాలుతుండ గా చేనికాన్నించి చిన్న మనవడు చంద్ర వగిరిస్తూ పరుగెత్తుకొచ్చాడు.

అప్పుడే బస్సుదిగి కాళ్లు మొగం కడుక్కొని పళ్లెం ముందు కూచుని వున్నాడు శీను.

"అన్నా!.. నాయన్ను పెదనాయినోల్లు కొట్టిగ్రను. తలకాయ పగిలింది. నేలబడిండు.." ఇంకా ఏదో చెప్పబోతున్నాడు వాడు.

పళ్లెం ముందునించి చివాలున లేచాడు శీను. చెప్పులేసుకొని మూలనున్న కర్ర అందుకొని గడప దాటాడు.

తను "ఒరే.. ఒరే.." అంటూ ఆందోళనగా అరుస్తోంది.

తన పిలుపు విన్పించుకోలేదు.

అటో ఇటో తేలంది వాడు వెనక్కిరాడు. ఖాయంగా కొట్టుకుచస్తారు.

తనకేమీ పాలుపోలేదు. కాళ్లు చేతులు ఆడలేదు. మెల్లగా ఓపిక తెచ్చుకొని బైటకు నడిచి వాళ్లను వీళ్లను కేకేసింది. బావురుమంటూ విషయం చెప్పింది.

చాలామంది ఆడ మగ జ్యోతివాగు కేసి పరువెత్తారు.

పదిరే శరీరంతో తనూ కదిలింది.

పోలేరమ్మ చేను దాటబోయే సరికి జనం వెనక్కివస్తూ కన్పించారు.

అందరూ ఆందోళనంగా వున్నారు. ఆతృతపడుతున్నారు.

"ఏం జరిగింది నాయినా?" అడిగింది.

ఇద్దరు ముగ్గురు పలుకలేదు.

ముత్రాసు పిచ్చన్న చెప్పాడు "మీ అక్క కొడుకు రంగన్ననూ ఆయన కొడుకునూ మీ శీనయ్య తలకాయలు పగలగొట్టిండు" అంటూ.

"మా సుబ్బన్న...?"

"పలకడంలే."

కుప్ప కూలిపోయింది తను.

ఎవరో భుజానేసుకెళ్లారు. ఇంటికాడ మంచంమీద పడేశారు.

మాపటేలకు ఎలాగో తంటాలు పడి నర్సాపురం ఆసుపత్రి చేరుకొంది.

అప్పటికే తెలిసింది ఇరుపక్కలా కేసులు పెట్టుకొన్నారని.

చిన్న మనవణ్ణి అడిగింది "కేసెందుకు పెట్టిగ్రనూరా?" అని

"పెట్టకుంటే?... వాల్లు ముందు కేసుబెడ్తే మనకిబ్బంది గాదూ!" చెప్పాడు వాడు.

"ఎవరు సెప్పిన్రోరే యీ కూలిపొయ్యే ఉపాయం?"

"పెద్దిరెడ్డి మామ. ఆయనే దగ్గెరుండి కేసు బెట్టిచ్చిండు."

దీర్ఘంగా నిట్టూర్చింది తను. బాధేసింది. 'ఈపక్క పెద్దిరెడ్డి నిలబడిండంటే ఆ పక్క రామిరెడ్డి కొమ్ము కాసుంటాడు. ఈ ఉపాయమే వాల్లకూ సెప్పుంటాడు. ఇద్దరికీ బాగా ఎగదోసుంటారు. నిప్పుల్లేకుండానే కొంపలు కాల్చుతరు."

ఇద్దరి మధ్యనా చిచ్చుబెట్టేందుకు ఇన్ని యేండ్లకు వాళ్లకు అవకాశం చిక్కింది.

ఈ కేసులు ఇప్పుడిప్పుడే వొగ దెగవు.

రాత్రయింది.

ఆసుపత్రి వరండాలో ఒక మూల ఏడుస్తూ కూచుని వుంది అక్క. తనూ రెండో వైపు కూచుంది.

గుండెల్లో తుమ్మముల్లు గుచ్చుకొన్నట్లుగా వుంది.

అక్కా చెల్లెలుగా ఇన్ని రోజులూ ఎంతో అన్యోన్యంగా సంసారాన్ని గడుపు కొచ్చారు తాము. తమ కొడుకులూ, మనవళ్లూ ఒకరిమీద మరొకరు చూపించుకొనే ఆప్యాయతలకు, అనురాగాలకు మురిసిపోయారు.

కాటికి కాళ్లు చాచిన సమయంలో ఎదరైన యీకష్టాన్ని భరించాలంటే సాధ్యం కాకుండా వుంది.

తెల్లార్లూ మౌనంగా రోదిస్తూనే గడిపారు తాము.

ఒకర్నొకరు ఓదార్చుకోలేని పరిస్థితి.

రోజులు గడిచేకొద్దీ ఒంటిమీద గాయాలు మానాయి. నీళ్ల తడిలేక పైర్లు ఎండాయి. నీటి గుండాలు వొట్టి పోయాయిగాని ద్వేషాలు యింకిపోలేదు.

చెరొక నాయకుణ్ణి వెంటేసుకుని లాయర్ల చుట్టూ తెగతిరిగారు – రంగన్న, సుబ్బన్నలు. లాయర్ల చేతులు తడిపేందుకు తమ చేతుల్లో తడారి మరొకరి వద్ద చేతులు చాచారు.

కూతురి పెళ్లికని కొనిపెట్టిన బంగారాన్ని తృణప్రాయంగా అమ్మేశాడు రంగన్న.

నిరుటి సంవత్సరం పెద్దిరెడ్డితో పోటీపడి కొన్న అర్దెకరం మడికయ్యను అసలుకు తగ్గించి అతనికే వదిలాడు సుబ్బన్న.

ఇరువైపులా పౌరుషాలు నింపుతున్నారు యింకా.

తొలకరింపు లొచ్చాయి.

సేద్యాలు మొదలయినాయి.

కేసులు వొగదెగలేదు. కోర్టుకు తిరుగుతూనే ఉన్నారు.

మృగశిర కార్తెలో పెద్ద ఆవడి గాలులొచ్చి మహావృక్షాల్ని సైతం వేర్లతో సహా లేపేశాయి.

రంగన్న సుబ్బన్నల పరిస్థితి కూడా అలాగే వుంది.

పునర్వసు వెళ్లుదలకు మళ్లీ ఒక వర్షం కురవటంతో గొర్రుతోలి గుంటికపాసి పెట్టుకున్నారు రైతులు.

చెనక్కాయల్ని చేటల్లో పోసికొని కసాలుగా వొల్చుకొంటున్నారు. రాత్రిళ్లు సైతం రచ్చ బండల మీద చెనక్కాయల బుట్టల్తో కూచునే యవ్వారం చేస్తున్నారు.

పెట్టుబడులకు బరువై పాస్పేటు వగైరాలు అప్పుదెచ్చాడు సుబ్బన్న.

ఎలాగయితేనేం నేలలో విత్తనాలు పడ్డాయి.

ఏదొక వానను చూసి విత్తటం.. పెట్టుబడినంతా మట్టిలో వొలకబోయించి మేఘాలు తమాషా చూడటం మామూలైంది.

తన కొడుకు సుబ్బన్న పరిస్థితి బాగా దిగజారింది. రంగన్నకు ఇంతకంటే అధ్వానంగా వుందట. వాయిదా వాయిదాకు తమ జేబుల్ని లోతుగా తడిమే లాయర్ల చూపులకు వొణికిపోతున్నారుట యిద్దరూ.

అన్నదమ్ములిద్దరూ కలిసిమెలిసి సుఖంగా బతకటం కన్ను కుట్టిన గ్రామ పెద్దలకు ఇప్పుడు ఆనందంగా ఉంది.

కొడుకును చూస్తోంటే తనకు బాధగా ఉంది.

ఒక్కపూట నీళ్లొదిలుంటే ఇంత గొడవ వుండకపోను. రంగన్నేం పరాయివాడు కాకపోయే. తన స్వంత అక్కకొడుకే.

“ఏమ్మా కూకోనుండవ్?”

ఆలోచనల్లోంచి తేరుకొని ఉలిక్కిపడి చూసింది చెన్నమ్మ.

ఎదురుగా కొడుకు.

“ఏం లేదు నాయినా! నిద్రబట్టలే” చెప్పింది.

“సేతి కడేలడిగినానని సింత బడ్తాండావా అమ్మా! వొద్దులే. నేనే యాన్నోసోట తంటాలు బడ్తా” చెప్పాడు.

"ఎందుకొరే యీ అగసాట్లన్నీ?" బాధగా అంది.

"మనం కేసు గెల్సొద్దూ?"

"గెల్సకుంటేం?"

"వాల్లు గెలుస్చే నలుగుర్లో మనం తలెత్తుకొని తిరుగుతామా" అంటూ తన మంచం కేసి నడిచాడు.

ఆవేదనగా నిట్టూర్చింది ఆమె.

మెల్లగా మంచం మీద వొరిగింది. చీకటి ఆకాశంలోకి చాలాసేపు అలాగే చూస్తూ గడిపింది. కంటిమీదకు నిద్రరాలేదు. ముంజేతి కడియాలు తలకింద వొత్తుకొంటున్నాయి.

ఆకాశంలో స్వర్గం బాట అస్పష్టంగా కన్పిస్తోంది.

తలకింది చేతుల్ని ఎదలపైకి తెచ్చుకొని కడియాల్ని తడువుకొంది. అవి రెండూ రెండు బండి చక్రాలై స్వర్గం బాట మీద ఏవో ఆలోచనల్ని యీడ్చుకెల్తున్నట్లుగా అన్పించి మెల్లగా లేచి కూచుంది.

కొడుకు మంచం మీంచి గురక విన్పిస్తోంది.

చేతులకున్న కడియాల్ని బైటకు లాగింది. పైట కొంగులో ముడేసుకొని బొడ్లో దోపు కొంది. మంచం మీంచి లేచి వూతకర్ర అందుకొంది. కళ్లు తిరిగినట్లనిపించి కొద్దిసేపు అలాగే నిల్చుని తర్వాత కదిలింది.

చిమ్మ చీకటిగా వుంది. ఏమీ కన్పించడం లేదు. అలవాటుపడ్డ దారిగాబట్టి కొంత దూరం ముందు కెల్లి దక్షిణపు వీధిలోకి తిరిగింది.

నక్షత్రాల కాంతి పల్చగా జారుతోంది. రంగు మిద్దెలు అస్పష్టంగా కన్పిస్తున్నాయి. నడక పూత కర్రమీద సైతం భారంగా ఉంది. ఆయాసంగా ఉంది.

నర్సిహ్మారెడ్డి ఇంటిముందుకొచ్చింది. వీధికి మరోవైపున్న పిచ్చన్నకొట్టం ముందరి అరుగుమీద ఉస్సూరుమంటూ కూలబడింది.

నర్సిహ్మారెడ్డి ఇంటికి బలమైన ప్రహరీ వుంది. గొడ్డు గోదా అంతా లోపలే.

"యీడే– యీడు జేసిన తిరగడే యిదెంతా." కసిగా అనుకొంది ఆ యింటికేసి చూస్తూ.

బొడ్లోని అడపం తీసి ముడివిప్పింది. ఒక అరలోంచి దంచి పెట్టుకొన్న వక్కాకు తీసి నోట బెట్టుకొంది. మరో అరలోంచి సున్నపు పొడిని రెండు వేళ్లతో పట్టి నోట రాల్చుకుంది. అడపం చుట్టి మళ్లీ బొడ్లో దోపుకుంది. ఊత కర్ర అందుకొని లేచి మెల్లిగా నడక సాగించింది.

వెల్తూ వెల్తూ వెనక్కి తిరిగి నర్సిహ్మారెడ్డి మిద్దెకేసి చూస్తూ మెటికలు విరిచింది. "నీ వంశంగూల" అంటూ తిట్టింది.

దీనికంతటికీ కారణం వాడే.

ఈ యేడు కూడా నిరుటిలాగే వుంటుందని రైతులు భయపడ్డారు.

రంగన్న సుబ్బన్నల పరిస్థితి చూస్తున్నారు. కాబట్టి ఎవరూ తొందర పడకూడదని నిర్ణయించుకొన్నారు. దొంగ పూతపూసేదాకా ఎవరు తూమెత్తినా అపరాధం కట్టాలని కూడా తీర్మానించుకొన్నారు.

ఇన్ని కట్టుదిట్టాల్లో కూడా ఒకనాటి ఉదయం చెరువుకింద కలకలం చెలరేగింది.

తూమెత్తేడుట, చేనికి నీళ్లేసేడుట.

ఆ చేను బాలయ్యది.

అందరూ అతని మీదకు దండెత్తారు.

బిత్తరపోయాడు బాలయ్య. కుయ్యో మొర్రో అంటూ ఏడ్చాడు తనకేమీ తెలీదన్నాడు.

అతనికి తెలీకుండా అతని చేనికి ఎవరో వచ్చి నీళ్లెందుకు వేస్తారో తలబద్దలు కొట్టుకొన్నా అర్థం కాలేదు ఎవరికీ.

బాలయ్య ఏడుపులు పెడబొబ్బలు చూసి అతన్ని దోషిగా నిలబెట్టలేకపోతున్నారు. తొందరపడి మరొకడు, ఇంకొకడు నీళ్లియ్యనందుకు ఓ వైపు సంతోషిస్తున్నారు.

వివరాల కోసం ప్రయత్నించారు.

గొర్ల కాపర్లు ఓ విషయం చెప్పారు. తాము గతరాత్రి గొర్లవద్ద కెల్తోంటే ఒక మనిషి కంగారుగా బాలయ్య చేలో కన్పించాడనీ, కాలువలో నీళ్లు పారుతున్నాయనీ, ఆ మనిషి నర్సింహారెడ్డి కూలోడనీ.

రైతులకు మొదట అర్థం కాలేదు.

నర్సింహారెడ్డి తూమెత్తించి బాలయ్య చేనికి నీళ్లేయించటంలోని చిదంబర రహస్యమేమిటో ఎవరికీ బోధపళ్లేదు.

నిదానంగా ఆలోచించిన మీదుట అతని కుట్ర అర్థమైంది.

నిరుడి సంవత్సరం చెరువు నీళ్లు అయిపోయి చివరి తడికి నర్సింహారెడ్డి బోరుబావి మీదనే రైతులంతా ఆధారపడటం వల్ల అతనికి దగ్గర దగ్గర ముప్పై వేల రూపాయల్దాకా ఆదాయమొచ్చింది.

ఈ సంవత్సరం కూడా అదే ఉపాయాన్ని ప్రదర్శించాలనుకొన్నాడు.

రైతులంతా ఆగ్రహంతో వూగిపోయారు గాని అతన్నేమీ చేయలేకపోయారు. సుబ్బన్న రంగన్నల వల్ల రెండు జట్లుగా విడిపోయిన రైతు కుటుంబాల అనైక్యత నర్సింహారెడ్డికి లాభించింది.

'వాని మూలంగానే తామింత ఇబ్బందుల పాలయింది'.

దీర్ఘంగా నిట్టూర్చింది చెన్నమ్మ.

వీధి మలుపులోని నాలుగంకణాల కొట్టం ముందాగింది.

వరుసగా మంచాలున్నాయి.

తడువుకొంటూ పందిరికింద మంచం వద్ద కెళ్లింది.

అక్కడ మరీ చీకటిగా ఉంది.

కర్రమీద వొంగి మంచం మీద మనిషిని చేత్తో తట్టి లేపింది.

"ఎవరూ?" అంటూ లేచిందామె.

"నేనేలే!" చెప్పింది చెన్నమ్మ.

స్వరాన్ని గుర్తుపట్టింది ఆమె, "నువ్వంటనే అమ్మీ!" అంటూ లేచి కూచుంది. "యియ్యాల కాడొచ్చినవ్. రాయిరప్పా తట్టుకొని కిందబడ్తే ఏం గావాల" అంది.

"కాలో సెయ్యో యిరిగితే మంచంలో బడ్తా. నాల్రోజులు కూడు నీల్లుగ్గబడ్తే పానాలు బోతయ్. యీ పాడులోకం సూసే బాద తప్పుద్ది" చెప్పింది.

"సాల్సాల్లే" మందలించింది ఆమె. "కూకో..." అంది.

"పనుంది. ఇంట్లోకి పోదాంరా!"

మెల్లిగా లేచి నిల్సుంది ఆమె.

ఈ గుసగుసల సవ్వడికి రంగన్నకు మెలకువ వచ్చింది. ఇంట్లో కెల్తోన్న ఇద్దరు తల్లుల్నీ చూసి ఆశ్చర్యపోయాడు. బుడ్డి ముట్టించి అడ్డగోడమీద పెట్టి దాని ముందు నిల్చుని ఉన్న ముసలాల్లిద్దర్నీ అబ్బురంగా చూస్తూ లేచి కూచున్నాడు. మెల్లిగా వాకిట్లోకి నడిచాడు.

"అక్కా! యియిగో... యియ్యి దీస్కో.." పైట ముడి విప్పి ఆమె ముందుకు చాస్తూ అంటోంది చెన్నమ్మ.

"యాంటియే..?"

"నా సేతి కడేలులే.."

"ఎందుకూ?" విస్తుబోతూ అడిగింది.

"యియి దీసుకొని రంగన్నకు జెప్పి కేసు కొట్టేయించమను."

"యాందమ్మే నువు జెప్పేది?"

"యీ కడేలమ్మి లాయరుకిస్చే రంగన్నోల్లకు సిచ్చేయిస్చుడంట. లాయరు జెప్పిండని మా సుబ్బిగాడన్నెడు. నా సేతి కడేలమ్మి ఏనా బట్టల బొక్కన్నో కొట్టి రంగన్నకు సెడ్డజేసేది నాకు నచ్చలే. ఆ కడేలు మీకిస్చే 'అసలు కేసే లేకుండా కొట్టేయించరా' అని వచ్చినా. ఇద్దర్లో ఎవురికి సిచ్చె బడినా నేన్దట్టుకోలే నక్కా! ఎవరూ ఓడొద్దూ. ఎవరూ గెల్సొద్దు. ఓడినా గెల్సినా 'పగ'లు కలకాలముంటయ్. యీడికే సంసారాలు నాశినమైనయ్. అక్కా! నీకు దండంబెడ్తా. యీ కడేల్దీసుకొని కేసు కొట్టేయించమను" అంది కడియాలను అక్కచేతిలో పెడుతూ గద్గదంగా.

ఆమె నిలువునా కరిగిపోయింది.

"అమ్మో! ఎన్ని కట్టాలొచ్చినయ్ తల్లీ!" అంటూ చెల్లెల్ని వాటేసుకొని బావురుమంది.

చూస్తోన్న రంగన్న గుండె కూడా చెమ్మగిల్లింది. ఎండిపోతోన్న తమ బతుకుల మీదికి చివరితడిలా ఆమె వచ్చినట్లనిపించింది.

కడియాలను అందుకొని చెల్లెలి చేతులకు తొడుగుతోన్న అమ్మకేసి ఆ తడికళ్లతో చూశాదు రంగన్న.

✡

# కయ్య - కాలవ

**–'కరుణకుమార'**

లక్ష్మమ్మ గొప్ప అదృష్టజాతకురాలు. పాకనాటి కాపుకులంలో పుట్టింది. మళ్ళా అపర మహాలక్ష్మి. పూర్వ జన్మంలో ఇంత పెట్టి పుట్టిందేమో, ఈ జన్మంలో భోగం అనుభవిస్తోంది.

లక్ష్మమ్మ పుట్టింటి వారిది చాలా గట్టి సంసారం. మొగపిల్ల కాయలు లేనందువల్ల లక్ష్మమ్మకూ, ఆవిడ అక్కకూ ఒక వూళ్ళోనే మనువులు కుదిర్చి తండ్రి ఇద్దరికీ చెరి ముప్పయి వేల రూపాయల ఆస్తి ఇచ్చి మహా వైభవంతో వివాహం చేసి, వాళ్లను కాపరానికి పంపేడు. కాని కాపరానికి వెళ్లిన మరుసటి సంవత్సరమే లక్ష్మమ్మ భర్త కాలం చేసినందువల్ల అప్పటి నుంచీ ఇప్పటివరకూ ఆవిడ నిరంకుశమైన వైధవ్యాన్ని అవిచ్ఛిన్నంగా పరిపాలిస్తోంది. ఇదొక్కటే ఆవిడకు కొరత పెట్టాడు భగవంతుడు. ఇది మినహా ఆవిడ సంసారానికి ఏమీ కొఱతలేదు.

అటు పుట్టింటవారివల్ల దఖలు పడ్డ ముప్ఫయి వేల రూపాయల ఆస్తీ, యిటు అత్తింటివారి వల్ల లభ్యపడ్డ ఏభై వేల రూపాయల ఆస్తీ కలిసి, భర్త చనిపోయేటప్పటికి ఓ 80, 90 వేల రూపాయల ఆస్తికి లక్ష్మమ్మ హక్కుదారయింది. చనిపోయేముందు మంచంమీద ఇంకా తెలివుండగానే భర్త సిసలైన వీలునామా వ్రాసి ఏభై ఎకరాల మాగాణీ, డెబ్భై ఎకరాల మెట్టా, మామిడితోటా, నాలుగెకరాల పాటి మట్టిదొడ్డీ, పశువుల బీళ్లూ, పది అంకణాల మిద్దీ, ఇన్ని పాడి పశువులూ, నాలుగు వందల సన్న జీవాలూ ఒకటేమిటి, ఒకరి దగ్గరకు పోనక్కరలేకుండా అమర్చి పెట్టినట్టు ఇనప్పెట్టి బీగాలతో సహా చేతిలోపెట్టి, "నేను లేనన్న కొరత తప్ప యిక నీ కేమీ లోపం లేదు. ఇంట్లో తల అట్లా వీధిలో పెట్టుకోకుండా ఈ యావదాస్తీ నువ్వు అనుభవించుకొని జీవించు" అని అంత్యకాలాన ఆశీర్వదిస్తూ ఆవిడ భర్త అదృశ్యమైనాడు.

లక్ష్మమ్మది మొదటి నుంచీ గట్టిపిడికిలి. పొలంలో పండిన అరవై పుట్ల ధాన్యం లగాయతు దొడ్లో పశువులు వేసే పేడవరకూ సమస్తమూ ఆమె రొఖ్ఖరూపంగా మార్చి వృద్ధి చేసిన సంసారం అది. రాగులు, సజ్జలు, జొన్నలు, మిరపకాయలు, చింతపండు, మామిడికాయలు, టెంకాయలు, టెంకాయపీచు, తాటికాయలు, తాటాకు, తాటిబుర్రలు, పాలు, పెరుగు, వెన్న, నెయ్యి – ఒకటేమిటి, పాటిమట్టి, ఎరువుమట్టి, దూడా దుడుకూ సమస్తమూ రొఖంగా మార్చి చేతపట్టుకొనే అలవాటు లక్ష్మమ్మకు. అందువల్ల భూములు, దొడ్లు, బంగారునగలు, వెండి

సామానులు వగైరాల అడుమానం మీద ఇచ్చిన అప్పుపత్రాల మీదా, ప్రోనోట్ల మీదా సాలీనా వచ్చే నాలుగువేల రూపాయల నికరం వడ్డీకి తోడు, ఈ విధంగా కూడా ఎట్లా లేదన్నా సంవత్సరానికి ఇంకా 5, 6 వేల రూపాయల ఘట్టి ఆదాయం చేరుస్తూ ఆమె ఈ ముప్ఫై ఏళ్ళుగా తన ఆస్తిని రెండు లక్షలకు పైగా పెంచింది.

లక్ష్మమ్మ తోడపుట్టిన పడుచు కాపరం అంత నాదారుస్థితి కాదుకాని లక్ష్మమ్మ స్థితితో పోల్చుకుంటే వాళ్ళ స్థితి ధూపానికి ఆగదు. అయినప్పటికీ ఆవిడ అక్కకి ఒక కొడుకూ, ఒక కూతురూ కలిగి యింత సిరీసంపదతోనే కాలక్షేపం చేస్తున్నారు వాళ్ళు. లక్ష్మమ్మ అక్క కొడుకు రామిరెడ్డికి ఇప్పుడు ముప్ఫయి సంవత్సరాల వయస్సు వచ్చి పెళ్ళి చేసుకుని తన ఇల్లు తాను చక్కపెట్టుకొంటున్నాడు. లక్ష్మమ్మకు 'నా' అన్న వాళ్ళు ఎవరూ లేనందున, తన సేద్యం మంచి సెబ్బరలు విచారించడానికీ, ఇంట్లో తన కింత లెఖ్ఖా డొక్కా వ్రాయడానికీ, రామిరెడ్డి కాస్త చేతి కందివచ్చినప్పటి నుంచీ లక్ష్మమ్మ అతగాడినే రప్పించుకొని తన పనులు నెరవేర్చుకొంటూ వుంది. మొగదిక్కులేని సంసారం అయినందువల్లా, ఈ తనువులు శాశ్వతం గానందువల్లా, తలలో నాలుకలా నమ్మకంతో అంటిపెట్టుకొని వుంటే లక్ష్మమ్మ ఎప్పటికైనా తన యావదాస్తినీ అక్క చెల్లెండ్రిద్దరి సంసారాలకీ ఒక్కడే మొగపురుగు అయిన తనకు సంక్రమింపజేయకపోతుందా అని రామిరెడ్డి కొండంత ఆశ పెట్టుకొని ఉన్నాడు. అందువల్ల లక్ష్మమ్మకు చీమకాటంత బాధ కలిగిందంటే తనకు లోకమే మునిగిపోయినట్లుగా భావించుకొని, గుండెలు గవుక్కొంటూ పరుగెత్తి ముందు తన పినతల్లికి సేవచేసి ఆవిడ మెప్పుపొందుతూ వస్తున్నాడు రామిరెడ్డి.

లక్ష్మమ్మకు ఇప్పుడు ఏభైయో పడి దాటి అరవైలో పడింది. రామిరెడ్డికి నోరు ఊటలూరు తోంది; లొట్టలు వేస్తున్నాడు; సమయం కొరకు కాచుకొని బక ధ్యానం చేస్తూ వున్నాడు రామిరెడ్డి.

✡

కొండడు మాలవాడు. అనగా పంచముడు. పోనీ, హరిజనుడనే అందాం. గోచీపెట్టుకొనే ఈడులో కొండడు. లక్ష్మమ్మకాడనే బఱ్ఱెగొడ్లు కాస్తూ వచ్చినప్పటికీ వాడికి ఈడువచ్చి పెళ్ళి చేసుకొని, భార్య కాపరానికి వచ్చిన తర్వాత, వాడు లక్ష్మమ్మను వదలి యిప్పటికి పదేళ్ళుగా తన రెక్కల మీదనే ఆధారపడి, యింట్లో భార్యనీ, డెబ్బై ఏళ్ల ముసలితొక్కు తల్లి వెంకినీ పోషించుకొంటున్నాడు.

ఏ ఆసామినో ఆశ్రయించుకొని, ఎవరి కమతంలోనో అంటిపెట్టుకొని, సంవత్సరం జీతంమీద కాలం గడుపుకొంటూ వుంటే తీరేపోను కొండడికి. కాన మునూట అరవై నాలుగు రోజులూ రాత్రింబగళ్ళు చెమట వూడ్చి చాకిరీ చేసినప్పటికీ, సంవత్సరానికి ఏ పందుం, పన్నిద్దుం గింజలోకాని, జీతంరాలని నౌకరీ అవడం వల్ల కడుపు నిండక సంసారాన్ని పోషించుకోలేక వెతలు పడుతున్నాడు కొండడు.

అదీగాక ఈ ఆసాములతో అన్నీ ఇక్కట్లే. జీతగాడు వచ్చి పని చేసిన రోజులకు రోజు ఒకటింటికి ముంతెడుగింజల చొప్పున కూలి ఇచ్చి, వాడికెప్పుడైనా ఏ కడుపునొప్పో, కాలు నొప్పో వచ్చి నౌకరీకి రాలేక నిలిచిపోయిన రోజులకు రోజు ఒకటింటికి రెండు ముంతల చొప్పున వాడి దగ్గర తిరిగి ముజరాలు తీసుకుంటారు. ఇదేమి నాయమో! ఆసాములు జీతగాళ్లకూ కూలివాళ్ళకు తమ గింజలు కొలిచే ముంత వేరు జీతగాళ్ల దగ్గర నుంచి ఆసాములు ముజరా తీసుకొనేటప్పుడు కొలిచే ముంత వేరూ! మొదటిముంత చిన్నదీ, రెండో ముంత పెద్దదీని, ఇట్లాంటి దుర్భరమైన పరిస్థితుల్లో ఎన్నాళ్ళు బ్రతకగలడు కొండడు?

ఈ కళ్ళాటలు పడలేక– ఆ వూళ్ళో మాలమాదిగలకు పది కుటుంబాలవాళ్ళకూ సర్కారు వారు ఈ సందుకట్ల కొన్ని బీడు భూములు సాగుబడి చేసుకొనేటందుకు పట్టాలకు ఇస్తున్నారంటే, కొండడు కూడా తాశీలుదారుగారి దగ్గర ఓ అర్జీ గీకించి దాఖలు చేశాడు. కొండడికి గాని, వాడి అవిభక్త కుటుంబంలో మరియెవ్వరికి గాని, అంతకు పూర్వం ఎన్నడూ సర్కారు భూములు పట్టాకు ఇచ్చి వుండకపోవడం చేత ఇతరులతోపాటు వీడికిగూడా, ఒక ఏభై సెంట్లు (అరఎకరా) భూమి ఎకరా మూడు వందల రూపాయల చొప్పున ఖరీదు వేసి, అరెకరమూ నూటయాభై రూపాయలకు చొప్పున సర్కారువారు కొండడికి పట్టా కిచ్చారు. ఇంతా చేస్తే చచ్చినంత మరమ్మతు చేస్తే గాని సాగుబడికి లాయఖుకాని భూమి అది; మనిషెత్తున తుంగ బలిసిపోయి అడవున్నట్టుంది. నీళ్ళకు మిట్ట ప్రదేశం, అరగజం గడ్డతీరు తీయిస్తేనే గాని కయ్యలోకి చుక్క ఎక్కదు. నీళ్ళు పారించుకొనేటందుకు ఆ కయ్యకు ప్రత్యేకం కాలవ లేదు. సర్కారు వారు విధించిన క్రయం నూటయేభై రూపాయలూ ఖజానాలో జమకట్టంగనే, సర్కారు వారు కొండడి చేతిలో పట్టా కాగితం మాత్రం పెట్టి, నలుగురితోపాటు, వాడికి గూడా 'యిదిగో ఇదీ నీ భూమి' అని ఆ కయ్యకు హద్దులు చూపించి చక్కాపోయారు.

సెంటుకు కనీసం ఒక రూపాయి చొప్పున ఏభై సెంట్లకు ఏభై రూపాయలు ఖర్చు పెట్టితేనే గాని కయ్య మరమ్మత్తుకాదు. తుంగా దుడుసూ కొట్టించడానికే యిద్దుమో, ముత్తుమో కావలసి ఉండె; ఏరోజుకారోజు రెక్కాడితేనేకాని డొక్కాడకపోయె ఇంట్లో కొండడికి! ఈ జన్మలో తన పేరిట వోయెకరాభూమి ఏర్పడితే తన జన్మ తరించి కష్టాలు గట్టెక్కుతాయనే ఆశపడ్డాడు. కాని తీరా భూమి దాఖలు పడిన తర్వాత ఆ కయ్యను సాగుబడి చేసుకోవాలంటే తన శక్తి కణకువైన పనిలా తోచలేదు కొండడికి. ఇప్పటికి చేసిన అప్పు తలుచుకొంటేనే వాడికి శరీరం నీరయిపోతోంది. భూమి దగ్గరకు వచ్చి చూచుకొంటే దిక్కుతోచడం లేదు. భూమి సాగుబడి చేసుకోవడమా లేక అంతటితో దాన్ని విరమించుకొని మళ్లా మామూలు ప్రకారం ఏ అయ్యకాడనో జీతానికి కుదరడమా? ఈ రెంటిసందున పడి నలిగిపోతున్నాడు కొండడు. "అయిందేదో అయిపోయింది. మనకీ జన్మలో స్వంత కయ్యనీ, స్వంత సేద్యమనీ, స్వంతెద్దులనీ అనుకొనే ప్రాప్తంలేదు. ఇంతటితో ఈ కయ్యను పోకడ పెడుదా" మనుకొని నిస్పృహ చెంది పట్టా వచ్చిన మరుసటి నెలలోనే యితరులకు అమ్మకం చూపేడు.

కొండడికి పట్టాకిచ్చిన కయ్య లక్ష్మమ్మ స్వంత పట్టా భూమి నూరెకరాల ఏక ఖండంగల నట్టుకు దక్షిణపు తట్టున ఆనుకొని ఉన్నది. కయ్యసందునా, లక్ష్మమ్మ భూమిసందునా గనిమెతీస్తే, అలగ్గా కయ్య కోసరం ముప్ఫయేళ్ళకు పూర్వం లక్ష్మమ్మ భర్త రివిన్యూ అధికార్లకూ, డి.పి.డబ్ల్యూ, అధికార్లకూ లంచాల క్రింద ముప్ఫై నలభై రూపాయలు ఖర్చుపెట్టీ కూడా ఆ భూమి పట్టాకివ్వడం ఆక్షేపణకరమని అప్పట్లో సర్కారు వారు తీర్మానించడం వల్ల విఫలమనోరథు డయినాడట అది లగాయతు భర్త చనిపోయిన తర్వాత కూడా ఆశపడ్డ కయ్య చివరకు లభించకపోవడమేగాక దాని కొరకు లంచాలుగా పోసిన నలభై రూపాయలూ నట్టేట కలిసిపోయెనే అని లక్ష్మ అప్పటికి ఇప్పటికీ ఆ విషయం తల్చుకొని కుళ్ళిపోతూ వుంటుంది. ఎట్లాగైనా కయ్యలో కయ్యను కలుపుకోవాలని ఆవిడకూడా ఒకటి రెండుసార్లు ప్రయత్నించింది గాని ఆవిడ ప్రయత్నం కొనసాగలేదు. అందువల్ల ఆ కయ్యను లక్షాధికారైన తాను కోరినపుడు పట్టాకు ఇవ్వకుండా ఇప్పుడు ఒక మాలవాడికి పట్టా కిచ్చారనేసరికి లక్ష్మమ్మకు ఆపాదమస్తకమూ తేళ్ళూ జెర్రెలూ పాకినట్టయిపోయింది. తన కయ్యకింద మాలవాడు ప్రవేశించాడని విన్నప్పటి నుంచీ ఆమె అన్నం తినక మంచం పట్టింది. రాత్రింబగళ్లూ వాణ్ని దుమ్మెత్తిపోస్తోంది. వాడి వంశం నాశనం కావాలని శాపనాకారాలు పాడుతోంది.

కొండడికి చేతిలో దమ్మిడీలేక ఒక్క దున్నపోతు కాని, ఒక్క అరక కొయ్యకాని లేక రెండు వందల రూపాయలతో తెచ్చుకొన్న కయ్యను సాగుబడి చేసుకొనే దారీ తెన్నూ కనబడక దిగులుపడి ఉక్కిరిబిక్కిరయి వాడు తన్నుకులాడుకొంటూ ఉంటే, తన భూమిలో కలిసే కయ్యను తాను ఇంత ప్రయత్నించినా తెచ్చుకోలేక ఆఖరుకు తన కళ్ళయెదుట ఒక హీనజాతి మాలవాడు తన్నుకుపోతున్నాడే, ఎట్లాగబ్బా జీవించేదని యింట్లో లక్ష్మమ్మ మరణవేదన పడుతోంది.

అట్టి సమయంలో కొండడు ఆ భూమి అమ్మకం చూపాడని వినీ వినటంతోనే లక్ష్మమ్మ ప్రాణాలు లేచివచ్చినట్లుగా సంతోషించి రామిరెడ్డిచేత మాలవాడికి కబురు చేసింది, బేరమా డింది. తాను ఖర్చుపెట్టిన రూపాయలు తనకిచ్చివేస్తే ఆ క్షణంలో భూమిని వదులుకొంటానని కొండడు జవాబు చెప్పేడు. వాడా మాటలు అనేసరికి లక్ష్మమ్మ గుండెలు బాదుకొని –

“అమ్మయ్యో! నీ కెంత దురాశ పుట్టిందిరా మాలముండాకొడకా! బ్రతకడానికా నాశనం కావడానికా ఇట్లాంటి దుర్బుద్ధులు నీకు? ఈ కయ్యకు గాను నా మగడు ముప్ఫై ఏళ్ళనాడు దూటబిళ్లల్లాగ, నలభై రూపాయలు ఆ సర్కారువారి యెదాన్ని కొట్టినాడు. ఈ ముప్ఫై ఏళ్లుగా నలభై రూపాయలకూ వడ్డీ కట్టుకొంటే నూరు రూపాయలయింది. ఈ నష్టం నీ తాత ఇస్తాడనుకొన్నావా? నీ ముత్తాత ఇస్తాడనుకొన్నావా? దురాశలకు పోబోకు, దుఃఖానికి చేటు. ఎట్లాగా ఆ కయ్య నీవు మరమ్మతు చేసుకోలేవు. మరమ్మతుకు గాను నేనింకా ఏభై రూపాయలు ఖర్చు చెయ్యాల్సుంది. అప్పటికి నాకు నూటయేభయి రూపాయలవుతుంది. తెలిసిందా? నీవు ఈ సందునా ఆ సందునా కచ్చేరిచుట్టు తిరిగి డబ్బు ఖర్చు పెట్టావు కాబట్టి అందుకు భత్యఖర్చుల కింద పది రూపాయలిస్తారు. ఆ కయ్య నా పేర విక్రయించి పారెయ్యి” అన్నది.

"అమ్మయ్యో! నీ కెంత దురాశ పుట్టిందమ్మా" అని కొండడు కూడా గుండెలు బాదుకొంటూ వెళ్ళిపోయాడు.

తాను రెండు వందలు పెట్టి కొన్న కయ్యను పది రూపాయల కిమ్మని లక్ష్మమ్మ చేసిన బేరాన్ని తలుచుకొనే వరకు కొండడికి అదివరకున్న నిరాశా, నిస్పృహ వదిలి ఎట్లాగైనా సాధించి కయ్యను నిలబెట్టుకొని సాగుపడి చేసుకోవాలన్న పౌరుషం పుట్టుకొనివచ్చింది. దేవుడి మీదే భారం వేసి కొండడు ఉళ్ళోకి చక్కా వెళ్లాడు; మొదటి మారాజునే మళ్ళా బ్రతిమలాడుకొని, ఇంకో యాభై రూపాయలకు ప్రోనోటు వ్రాశాడు. ఆపైకంతో భూమి మరమ్మతు చేసి ఆ సంవత్సరం శ్రావణమాసం రాగానే వరినాటు వేశాడు. ఇరవై ముప్పై యేళ్లుగా బీడుగా ఉన్న భూమేమో – ఆ సంవత్సరం కాలం సక్రమంగా రావడంచేత నారు గుచ్చీ గుచ్చంగనే, కర్రలు నలుపుతిరిగి గంటలు కట్టి పైరు నవనవలాడుతూ ఎక్కివచ్చి, అరెకరా కయ్యా ఒక పుట్టెడు గింజలదాకా చితక పండింది. కొండడికి కొంత ధైర్యం చిక్కింది. దేవుడి కృప చల్లంగుంటే, నాలుగేళ్ళలో అప్పుతీర్చేసి బయట పడతామనుకొని. సాయంకాలం ఇంటికి పోయి, ఉడుకునీళ్ళు పోసుకొని, ఆరబయట నులకకుక్కి మీద పండుకొన్నప్పుడల్లా ఏవేవో వూహలతో మేడలు కడుతూవున్నాడు కొండడు.

కొండడితో బేరం చెడ్డప్పటి నుంచీ లక్ష్మమ్మకు దిగులుగానే వుంది. తన కయ్యలో కలిసే కయ్యను చూచి చూచి వదులుకోడానికి ఆవిడ కిష్టంలేదు; పోనీ ఎంతయినా సరే, డబ్బిచ్చి తీసుకొందా మనుకొంటే చేతులారా అన్ని రూపాయలు మాలవాడిచేతిలో పోయడానికి మనసొప్పలేదు. రోజులు గడచిన కొద్దీ ఆవిడకు కడుపులో ఈ బాధ జాస్తీ అవుతూ వచ్చింది. దానికి తోడు ఆయేడు తన నూరెకరాల నట్టువాల సగటున ఎకరానికి ఓ పుట్టెడు గింజలు పండి తన ఇంట్లో నూరుపుట్లు వేసుకొనీ కూడా తన నట్టువలో కలిసే కయ్య అరెకరమే మాలవాడికి పుట్టెడు గింజలు పండిందని తలుచుకొని ఆవిడ కడుపు దహించుకొని పోతోంది.

ఒకటి రెండుసార్లు రామిరెడ్డిని పిలిపించి "అబ్బాయీ! ఏమిగతిరా, మాలవాడు బంగారంవంటి అరెకరా కయ్యా అధ్వాన్నంచేసి తన పొట్ట పెట్టుకొన్నాడు. నేను ఏబావో ఏగొయ్యో చూసుకోవలసిందే గాని గతిలేదిక. తలకింద కొరివిలా ఈ మాలమాదిగ కొడుకుని నా కయ్యల క్రింద పెట్టుకొని నేను నలుగురిలోనూ తలయెత్తి ఈ గడ్డ మీద కాపురం చెయ్యా లేను. అన్నిటికీ నువ్వే వున్నావు. ఏం చేస్తావో చెయ్యి" అని సొదపెట్టింది "కానీలే అమ్మా! తొందర పడబోకు. వాణ్ని అక్కడ నుండి లేవగొట్టే ఉపాయం ఆలోచిద్దాంలే. కాస్త నిదానించు" అని రామిరెడ్డి ఆమె నూరడించాడు. కాని లక్ష్మమ్మ మనస్సు కుదుట పడలేదు.

జ్యేష్ఠ మాసం వచ్చింది. తొలకరించింది. రైతులు నార్లు వేసుకొంటున్నారు. పొలాల్లోకి ఎరువు బూడిద తోలుకొంటున్నారు. తొలకరితో భూమి కాస్త మెత్తపడడం చేత కొంతమంది ఆ తడిమీదే అరకలు కట్టి ఒకటి రెండు చాళ్ళు వెలిదుక్కులు చేస్తున్నారు. కొండడు కూడా

తన కయ్యలోకి ఎరువు తోలడానికి ఎవరినో ఎరవడిగి ఒక కాడి దున్న పోతులు తెచ్చుకొని బండికట్టాడు. తనూ, తన భార్యా ఇద్దరూ చెరొక గంపా తీసుకుని వో ఇరవై గంపలు జల్లిలో పోశారు. ఇక బరువు లాగలేవు దున్న లనుకొని కొండడు బండి యెక్కాడు; కొరడా ఆడించాడు; సగం దూరం బండి తోలుకు వచ్చాడు.

కొండడి కయ్యకు తూర్పునా, ఉత్తరాన్నా, పడమరా కూడా లక్ష్మమ్మ పొలం కమ్ముకువుంది. దక్షిణపు తట్టు మాత్రం సర్కారు అసలు మినహా చెరువుతొట్ట పోరంబోకు భూములున్నవి. తన కయ్యకీ పోవడానికి కొండడు లక్ష్మమ్మ భూములగుండా పోయితీరాలి. మరో మార్గం లేదు. పడమరగా ముప్పాతికమైలు పోతే చెరువులోకి పోయే డొంక వుంది కాని అది చాలా చుట్టు. సుమారు రెండు మూడు వందల ఎకరాల భూమి చుట్టుకొస్తేనే గాని కొండడా దారిగుండా తన కయ్యలోకి రాలేడు. ఎరువుబండి తోలుకొని కొండడు తన కయ్యల్లోనుంచి పోతున్నాడని లక్ష్మమ్మకు తెలిసింది. వెంటనే యిద్దరు సేద్య గాళ్ళను పంపి బండిని మళ్ల గొట్టించింది.

కొండడి కేమీ పాలుపోలేదు. బండిని ప్రదక్షిణం చేయించి తీసుకుపోదామనుకొంటే రెండు సబుర్లు తోలేవరకే పొద్దు గుంకుతుంది. ఊరికీ, తన కయ్యకీ ఓమైలుంది. అసలే దూరంగా ఉన్న తన అరెకరా భాగ్యానికీ రెండు మూడు మైళ్లు ప్రదక్షిణం తిరిగి సేద్యం చేసుకోవాలంటే, అలవయిన పనిగా కనపడలేదు కొండడికి. అందువల్ల బండినక్కడే విప్పుకొని కొండడింటికి పోయి భార్యను పిలుచుకొని, యిద్దరూ చెరొకగంపా నెత్తిన పెట్టుకొని, ఎట్లాగైతేనేం, రెండో రోజు సాయంత్రానికి అరెకరా కయ్యలోనూ ఓ ఆరుబళ్ల యెరువు మెడనరాలు మెలితిరిగేటట్టు మోసి మోసి కయ్యలో పోశారు.

లక్ష్మమ్మ కెదలో గాభరా పుట్టుకొస్తోంది. ఏ విధాన్నా మాలవాడు లోబడడం లేదు. ఆ మధ్య ఒకసారి కొండడి అరక దున్నిన పశువులు పగటి వేళ లక్ష్మమ్మ పొలంలో వున్న మంచినీళ్ళ దొరువుకాడికి నీళ్ళు తాగనుపోతే, తన దొరువులో నీళ్లు తాగడానికి వీల్లేదని ఆవిడ పశువులను మళ్ళగొట్టి బందెలదొడ్డిలో పెట్టించింది. 'దేవుడా' అంటూ పశువు 1 కి 12 అణాల వంతున నాలుగు పశువులకూ మూడు రూపాయలు కట్టి, కొండడు పశు వులను బందెనుండి విడిపించుకొన్నాడు. లక్ష్మమ్మ ఇంకా ఏమేమో చేస్తూనే ఉంది. ఎన్ని చేసినా మరుసటి సంవత్సరం కూడా కొండడు మొండికెత్తి నలుగురితో పాటు తానుకూడా సకాలంలోనే తన కయ్యను సాగుబడి చేసుకొని మొలగొలుకులు నారు గుచ్చాడు. ఆ యేడు కూడా కాలం సరిగ్గానే రావటం వల్ల సకాలంలో మూడు నాలుగు వర్షాలు కురిసి పైరు ఆరంభంలో బాగానే ఎక్కి వచ్చినా, వెన్నుతీసి పొట్టమీదికి వచ్చేవరకు వర్షం బిగించి కాలం బెట్టచేసి నీళ్లకు ఎద్దడయింది. ఎంత యెద్దడయినా లక్ష్మమ్మబోటి మారాజులు మాత్రం కాలవల్లో వచ్చే నాలుగు చుక్కలూ తమ పొలాలకే పెట్టుకొని, తమ పైరు మాత్రం ఎండిపోకుండా కాపాడుకొంటూ వచ్చారు. కొండడి కయ్యకు నీరు పారుదల అయ్యేటందుకు ప్రత్యేకం

కాల్వలేదు. మడవ తీస్తే నీళ్ళు లక్ష్మమ్మకయ్యలోనుంచి తన కయ్యలోకి రావాలి. నిరుడు ఆమె కయ్యమీది మడవ గుండానే పారించుకొన్నాడు కొండడు. ఈ సంవత్సరం మాత్రం లక్ష్మమ్మ మామూలు మడవను పూడ్చివేసి, తన కయ్యలో నీళ్ళు మాలవాడి కయ్యలోకి చుక్క రాకుండా, గనిమె గజం ఎత్తున మట్టి పోసి గట్టిపరచి, తన కయ్యలో అదనంగా నిలచే పులకనీళ్ళకు పడమటితట్టు చెరువులోకి పొయ్యేటట్టు ఇంకో కొత్తమడవ పెట్టించింది. ఆయేడు బీదల పొలాలకు నీరు చాలక పైర్లు ఎండిపోతూ వున్నప్పటికీ అదృష్టం కొద్దీ లక్ష్మమ్మ కయ్యలో మోకాలులోతు నీళ్ళు నిలవడమే కాకుండా, ఇంకా పై నీళ్ళన్నీ వచ్చిపడడం చేత అదనమై, కొత్తగా పెట్టించిన మడవగుండా అవన్నీ చెరువుతొట్టులోకి వృథాగా పోతున్నవి. చెర్వుతొట్టులోకి పోయిన నీళ్ళు తన కయ్యలోకి కాలవ తవ్వుకొని మళ్లించుకొందా మనుకొన్నాడు కొండడు. కాని తన కయ్య చెర్వుతొట్టు కంటె మిర్రుగా వుండడంచేత నీళ్లెక్కక, ఆ ప్రయత్నం చాలించుకోవలసి వచ్చింది వాడు.

ఫలితానికి వచ్చిన పైరు. ఆరు నెలలుగా చెమటవోడ్చి కష్టంచేసి పెంచుకొన్న పైరు. ఇంక లెక్కకు రెండుతళ్లు తగిలితే మళ్లా ఒకపుట్టెడు గింజలు నమ్మకంగా పండే పైరు. కాని తన కయ్యలోకి నీళ్లు వచ్చే మార్గం కనబడలేదు వాడికి. లక్ష్మమ్మ కరుణించాలె; తనకు నీళ్లు ప్రాప్తిచాలె. నీళ్ళులేక కయ్య ఎండిపోతోంది. తడి ఆరి అడుగు వేస్తే దిగబడడం లేదు. క్రమక్రమంగా చెమ్మ ఆరిపోయి కయ్యలోని వరిగంటల సందుల్లో భూమి బద్దలయి బీటలు తీస్తోంది. గనిమిమీద కూర్చుని తూర్పు ముఖంగా తిరిగి మోకాలిమీద తలెట్టుకుని, డొక్క లెగరవేస్తూ, వెక్కి వెక్కి రోదన చేసున్నాడు కొండడు. కాని యెండిపోయి బీటలు తీసిన కయ్యను మెత్తని చేయడానికి ఆ ప్రవాహం చాలలేదు.

పొద్దు నెత్తిమీదికి వచ్చింది. నీళ్ళులేక పైరు మాడిపోతోన్నట్టుగానే, పొద్దుటి నుండి చద్ది దాహమైనా లేక వాడి కడుపు కూడా మాడిపోతుంది. ఇంటికి పోయినాడు; ఇంత అన్నం గతికాడు. భార్యను పిలిచాడు. ఇద్దరూ కలిసి ఒక గూడ సంపాదించారు. నేరుగా కయ్యకాడికి పోయారు. లక్ష్మమ్మ కయ్యల్లో నుండి చెరువులోనికి పోయేనీటికి అడ్డుకట్టవేసి, ఒక సన్నని కాలవ తీసి, గూడతో పొద్దు గూకులూ నీళ్ళు ఎత్తిపోశారు. కాని వెనుకవాలుగా వున్న ఆ ప్రదేశం గుండా నీళ్ళు కయ్యలో కెక్కలేదు. అయినప్పటికీ చీకటి పడేవరకు నాలుగోవంతు కయ్య సుమారుగా తడిసింది. రాత్రి యింటికి పోయి, నీళ్ళు పోసుకుని, కూడు తిని, పది గంటలకు వెన్నెట్లో మళ్ళా కయ్యకాడికి పోయి తెల్లవారుజామున కోడికూత కూసేవరకూ నడుములు పడిపోయేటట్లు భార్యాభర్తలిద్దరూ ఆ గూడతో నీళ్ళు ఎత్తిపోస్తూనే ఉన్నారు. ఆ తడితో పైరు కొంచెంపాటుకు తిరుక్కున్నప్పటికీ, ముప్పై లంఖణాలు చేసి పథ్యం పుచ్చుకొన్న రోగి ఎక్కి వచ్చినట్టయి, అదును తప్పిన తడి అయినందున పుట్టడు గింజలు కావలసిన కయ్య అర్ధపంట పండి, ఒక పందుం గింజలు రాలింది. తనకెంత ప్రాప్తమో అంతే ననుకొన్నాడు కొండడు.

పుష్యమాసం వచ్చింది. పైర్లన్నీ పంటలకు వచ్చినై. కూలి వాండ్లందరూ కోతలకు వంగారు. వారం రోజులలో తన పైరు యావత్తూ కోయించి కుప్పలు వేయించింది లక్ష్మమ్మ. కూటికి కొరతబడ్డ యానాదులు, ఎరుకలు, మాలలు, మాదిగలు పైరు కోతయిన పొలాల్లో పన అడుగున మిగిలిన పరిగకఱ్ఱ లొక్కొక్కటే ఏరుకొని సాయంకాలానికి ఓ సందెడు కట్ట అయ్యేటట్టుగా కట్టుకొని, ఇళ్ళకు తెచ్చుకొంటున్నారు.

కొండడి తల్లి వెంకి ముసలిది అయినా పూర్వకాలపు మనిషయినందున డెబ్బయ్యోపడిలో కూడా శరీరం చేవదేరి ఇంకా దారుఢ్యంగానే ఉంది. కాయకష్టం చేసిన అలవాటు కొద్దీ, అది యిప్పుడు కూడా ఒక్క నిముషం ఇంట్లో ఊరికే కూర్చోలేదు. పొయిలోకి ఇన్ని చితుకు లేరుకురావడమో, ఇంత పేడ పోగుచేసి పిడకలు చేసుకోవడమో, ఆసాములు కుప్పలు నూర్చి ధాన్యం బండ్లమీద తోలుకొనిపోయిన తర్వాత కళ్ళంలో తడినేల కంటుకొని పోయిన గింజలను ఎత్తి పుల్లల చీపురతోనో, కందిపుల్లల చీపురుతోనో ఒక్కొక్క గింజే కళ్లంలోని మట్టి గడ్డలతో సహా గీకి గీకి, పొద్దుగూకేవరకు ఏ అర్ధశేరుగింజలో చేటలో వేసుకొని ఇంట్లోకి చేర్చడమో – ఇట్లాగే కష్టపడి సంసారానికి కాస్త సాయపడుతూనే వుంది. ఆ అలవాటు కొద్దీ, ఈ సంవత్సరం కోతలు పూర్తి అయి కుప్పలు పడడంతోనే వెంకి పది రోజుల పాటు వరికొయ్య కాలంతా తిరిగి తిరిగి ఒక అరమోపు పరిగకయ్యలు పోగు చేసి ఇంట్లో చేర్చింది.

కొండడు కూడా తన కయ్యలో పైరు కోశాడు. వెంటనే ఆపందుం గింజల పంటా పనమీదనే పిడివాటు కొట్టేదా మనుకున్నాడు. కాని పిడివాటు కొట్టితే గింజలు కఱ్ఱకంటుకొని సరిగ్గా రాలవేమో, పంట కాస్తా పలాములయి పోతుందని భయపడి, ఒక్క వారం రోజులు వెసులుబాటు చూసుకొని నాలుగు బఱ్ఱెగొడ్డుల్నీ వాటిని మళ్ళించి తొక్కిద్దామని ఆలోచన చేసి కయ్యలోనే ఒక చిన్న కుప్ప పడవేశాడు కొండడు. లక్ష్మమ్మ కూడా కొండడి కయ్యకి ఆనుకొని వున్న నూరెకరాల పంటా కోయించి, అక్కడక్కడ నాలుగు కుప్పలు వేయించింది.

✡

కోతలు ముగిసి కుప్పలు పడేవరకు రైతాంగానికి రవంత వెసిలిక చిక్కింది. ఆట్టే ఆలోచించుకోగా తన కయ్యకి దిగులు లేకుండా నీళ్ళు పారే కాలవ లేకపోవడం కొండడికి చికాకుగా తోచింది. కాలవ కావలెనంటే ఎట్లాగూ లక్ష్మమ్మ కయ్యలో నుండే తనకు రావలె. విధిలేదు కాబట్టి ముందు లక్ష్మమ్మ నడిగి ఆమె చేత కాదనిపించుకొన్న తరువాతనే పై వ్యవహారం చూచుకొందా మనుకొని ఒక రోజు కొండడు లక్ష్మమ్మ ఇంటికిపోయి "అమ్మా! నువ్వు గొప్పమారాజువి. నామీద పగబట్టితేనే బతకలేను. నీ దయవల్ల చిన్నతనంలో నాకు గంజిపోసి బతికించావు. ఇప్పుడు పెద్దవాణ్ణయిన తర్వాత కూడా నువ్వే అన్నం పెట్టాలసిన గండం వచ్చింది. అయిందేదో అయిపోయింది. కాని అమ్మా! నీకు దణ్ణం పెట్టుతా. నీ కయ్యలో నుంచి నా కయ్యలోకి జానెడు వెడల్పు కాలవగనుక ఇస్తివా, నీ పేరా దీపం పెట్టుకొని మొక్కుకుంటా" అని అడిగాడు కొండడు.

"కాలవా! నీకా! ముష్టి అరెకరాకయ్య చేతిలోకి వచ్చి రెండోయేడింకా జరుగలేదు. అప్పుడే నీ కయ్యకు కాలువలూ మడవలూ కావలసివచ్చినైగా! ఔరా! అయినా నూరు రూపాయల కయ్యా– మా నోటికాడ అన్నం– ఎత్తుకొనిపోయి నీ యెదాన్ని పెట్టుకోవడమే కాకుండా పైగా కాలవకోసరం బేరానికి వచ్చావయ్యా! ఇస్తా! కాలవ ఇస్తానులే! ఉండు; ఈ పొంగు బోర్లాపడడానికే వచ్చిందిలే నీకు. ఎందుకు పాపం అని అజ్జాయించి ఊరుకొనివుండా. ఈపాలి నా కయ్య తొక్కి చూడు, రెండు కాళ్ళూ విరగ్గొట్టిస్తా" అంది లక్ష్మమ్మ.

"నాకు ఊరికనే పనిలేదులే అమ్మా! కాలవకుగాను నీ విచ్చే స్థలానికి క్రమమైన క్రయం గట్టి, డబ్బు తీసుకొని మరీ యిద్దువు గానిలే" అన్నాడు కొండడు.

"ఛీ! నోరు మూసుకొని బయటికి పో! శుభమల్లే మంగళవారప్పూటా ఇంటిముంగిటికి వచ్చి కయ్యమ్ముకో, కాలవమ్ముకో అని వెధవ కూతలు కూస్తావు! నోట్లో పొడిపిస్తా చూడు. నా కేం గ్రహచారం పట్టలేదు, నీకు నా మళ్ళూ మాన్యాలూ అమ్ముకోడానికి ఈపాలి కాలవ సంగతి ఎత్తావంటే మాటదక్కదు. పో" అని లక్ష్మమ్మ కసురుకుంది.

ఇక లాభం లేదనుకొని కొండడు ఆ వెళ్ళడం వెళ్ళడం తిన్నగా ఆ ఫిర్కా రెవిన్యూ యినస్పెక్టరు దగ్గరకు వెళ్లాడు. అదివరలో కొండడి కయ్య పట్టాకు తెప్పించినపుడు కొంత మేత మేసిన గొడ్డుకాబట్టి రెవిన్యూ యినస్పెక్టరుకు వాణ్ని చూడడంతోనే నోరు ఊటలూరింది. కొండడు చెప్పుకొన్న విన్నపం విన్నాడు. "ఇది మనచేతిలో పని. ఎంతసేపు! ఎల్లుండి మర్నాటికి కాలవకు ఉత్తరవు తెచ్చి పెడతా"నని చెప్పి అనుకొన్న దానిలో ముందుగా సగమూ, పనిపూర్తయిన తర్వాత మిగిలిన సగమూ కొండడు తన కిచ్చేటట్టు ఖరారు చేసుకొని, మొదటి సగం అయిదు రూపాయలూ ఆ క్షణంలోనే చేతిలోకి రాల్చుకున్నాడు, 'రేపు జాగ్రత్త' అనే బ్రతుకు తెరువు తెలుసుకొన్న ఆ రెవిన్యూ ఇనస్పెక్టరు. వెంటనే తహశీలుదారుకూ, డిప్టీకలెక్టరుకూ అర్జీలు వ్రాసి పోస్టులో రిజిస్టరు చేయవలసిందని కొండడితో చెప్తూ, "ఒరే! కొండా! ఇక్కడ ఇనస్పెక్టరుని ఎలాగో తృప్తి పరచాంగదా, ఇక పరవాలే దనుకొంటావేమో. ఇవి డెల్టాకొంపలు. ప్రతీ పనికీ డి.పి.డబ్బ్యూ. వారితోనూ, మాతోనూ కూడా అవసరం వుంటుంది. తీరా ఫలితానికి రాబొయ్యే సమయంలో ఆ వోవరుసీరు ముండావాడు ఒక్క కలంపోటు పొడిచాడంటే ఆ చిక్కులోంచి పెరుక్కోలేక చావాలి. అర్జీలు పంపడంతోనే ఆవోవరు సీరుకాడికి పోయి, దణ్ణంపెట్టి చెప్పుకో. తెలిసిందా? తర్వాత నన్ను నిష్ఠూరమాడితే ప్రయోజనం లేదు" అన్నాడు!

"సరేలే అయ్యా! నా కల్లాటలు నే పడతాలే. నువ్వు మట్టుకు నిండా దయవుంచాలి" అని కొండడు దణ్ణంపెట్టి వెళ్ళి, రెండు అర్జీలకూ రెండు పావులాలూ ఇచ్చి వ్రాయించి. డిప్టీకలెక్టరు కొకటీ, తహశీలుదారుకొకటీ పోస్టులోవేసి ఇంటికి వచ్చాడు.

కొండడు వెళ్ళినమర్నాడే రెవిన్యూ ఇనస్పెక్టరు "ఇట్లా ఇట్లా వ్యవహారం జరగబోతుంది, మీ జాగ్రత్తలో మీ రుండవలసింది" అని జవాను ద్వారా లక్ష్మమ్మకు కబురు చేశాడు. లక్ష్మమ్మ

స్వయంగా వచ్చి మాట్లాడ్డానికి వీల్లేక రామిరెడ్డిని ఇనస్పెక్టరు పంతులుకాడికి పంపుతూ, కూడా పది అరటికాయలూ, పది అరటి ఆకులూ ఇచ్చి పంతులి కియ్యమని చెప్పింది. రామిరెడ్డి ఇనస్పెక్టరు పంతులుతో అంతా మాట్లాడి మనస్సుకు తెచ్చుకొని 'ఇంటికిపోయి మా పిన్నమ్మతో మాట్లాడివస్తా'నని కూర్చున్న మనిషి లేచాడు.

"ఇదిగో! ఊరికినే మంత్రాలకి మామిడికాయలు రాలేకాలం కాదని మీ పిన్నమ్మతో గట్టిగా చెప్పు. మాలవాడు ఏవేవో సిఫార్సులు తీసుకొనిపోయి పై ఆఫీసుల్లో గట్టి ప్రయత్నం చేస్తున్నాడు. పైగా సర్కారుకు హీనజాతులంటే తగని అభిమానం. ఈ తిరుగుళ్లన్నీ మీకు తెలియవు. చేసే ప్రయత్నం ఘట్టిగా చెయ్యాలని ఆమెతో నొక్కిచెప్పు. తెలిసిందా" అని పంతులనేవరకు 'చిత్తం అట్లాగేనండి' అని రామిరెడ్డి ఇంటికి పోయి లక్ష్మమ్మతో అన్ని సంగతులూ చెప్పాడు.

"ముందుగా చెయ్యి జారితే తంటాగాని నోరుజారితే పరవాలేదు. ఇచ్చి పుచ్చుకోవడాలు తర్వాత చూచుకోవచ్చు గాని, అసలు మనకు అనుకూలం అయితే కార్యం అంతా అయినతర్వాత ఇనస్పెక్టరుకు ఇరవై రూపాయలిస్తామని మాటమాత్రం పడేసి చక్కారా" అని లక్ష్మమ్మ చెప్పింది. ఆ మాటలే తీసుకువచ్చి రామిరెడ్డి ఇనస్పెక్టరు కందించాడు. ఆయన పెదవి విరిచాడు; లాభం లేదనుకొన్నాడు. కొండడు ఇచ్చుకొన్న అర్జీలు రిపోర్టు నిమిత్తం ఇనస్పెక్టరు వద్దకు రాగా ఆయన ఎటూ తేల్చకుండా, ఎవరికీ అనుకూలం లేకుండా, 'కాలవ ఇస్తే ఇవ్వవచ్చు. ఇవ్వకపోయినా కొండడికి వచ్చిన ఇబ్బంది లే'దని గోడమీది పిల్లివాటంగా రిపోర్టు వ్రాసి అర్జీలుపైకి పంపివేశాడు. ఇక పదిహేను ఇరవై రోజుల్లో తనకు అనుకూలంగా ఉత్తరువులు వస్తవని కొండడు కొండంత ఆశతో ఎదురుతెన్నులు చూస్తున్నాడు.

✡

కుప్ప లింకా ఇప్పుడప్పుడే నూర్చరు. ఉగాదికిగాని కళ్లాలు చేయడానికి కయ్య లారవు. అందువల్ల కుప్పలన్నీ పొలాల్లోనే ఉన్నవి.

లక్ష్మమ్మ రాత్రిపూట కుప్పలవద్ద మనుష్యుల్ని కాపలా పెట్టుతూనేవుంది. రోజూ రేపటి వేళనో, మాపటివేళనో ఆమె ఒకసారి కుప్పలచాయ బోయి, తన సొమ్ము భద్రంగా వున్నదో లేదో అని చూచుకొంటూనే వుంది. తగని అనుమానం మనిషి! ఎవరినీ నమ్మదు. తన మనస్సే తను నమ్మలేదు. పొలంలో సొమ్ము ఇంట్లోకి వచ్చేవరకూ ఆమెకు ఒకటే ఆలాపనగా వుంది.

ఒకరోజు పొద్దు పొడవకముందే ఆమె పొలంచాయ బోయి, కొండడి కయ్యకు సమీపంలో వున్న తన కుప్పలను తణిఖీ చూచుకొంటూవుండగా, అందులో ఒక కుప్పకు నెత్తిన నడిభాగంలో ఒక మోపు పన పెరికి బయటికి తీసినట్లు చిందరవందరగా ఆమె కళ్లకు కనిపించింది.

మరి, ఎవరైనా కావాలని రాత్రిపూట చోరీగా వచ్చి ఆ కుప్పలో ఒక మోపెడు పన తీసి ఎత్తుకొనే పొయ్యారో, లేక అంతకు ముందటి రోజు సాయంత్రం కొట్టిన సుడిగాలికి, కుప్ప కప్పడంలో ససిలేక పై భాగంలో ఒక సందెడు గడ్డి గాలికి ఎగిరేపోయిందో, లేక ఆమె అనుమానపు కళ్ళకే ఆ విధంగా కనుపించిందో చెప్పలేంకాని మొత్తానికి ఎవరో తనను అన్యాయం చెయ్యాలని, రాత్రిపూట చోరీగా తన కుప్పలో పన పెరుక్కుపోయారని లక్ష్మమ్మకు ఘట్టి నమ్మకం తట్టింది.

ఇక నెందుకు, తన రెండు లక్షల రూపాయల సంసారమూ నట్టేట కలిసిపోయినట్లు గుండెలు గుద్దుకొంటూ, ఆమె నోటికి వచ్చిన తిట్లు తిట్టుకొంటూ, వీధిన బడి గోలపెడుతూ పరుగు పరుగున ఇంటికి వచ్చీ రావడంతోనే తొందరగా రామిరెడ్డికి కబురుచేసింది. ఎదో కొంప మునిగిందనుకొంటూ రామిరెడ్డీ, రామిరెడ్డితల్లీ, రామిరెడ్డి చెల్లెలూ పరిగెత్తుకొని వచ్చేవరకు, లక్ష్మమ్మ తల విరబోసుకొని, దక్షిణపుతట్టు వసారాలో వట్టినేలను, రోజుతూ, రొప్పుతూ "అయ్యో నా కొడకా! అయ్యో రామిరెడ్డీ! కొంప గుండం వేసుకొని పోయిందిరా, నాయనా! నా సంసారానికి నేటి కిన్ని కడగండ్లు వచ్చాయిరా తండ్రీ! అయ్యయ్యో! మేరు పర్వతంలాంటి కుప్ప, అస్థులూ, చర్మమూ ఆరి పొయ్యేటట్లు కష్టం చేసి పండించుకొన్న కుప్ప, నా మొలగొలుకుల కుప్ప, బంగారంలాంటి కుప్ప నట్టేట కలిసిపోయిందిరా బాబూ! నేను గొంతుక్కి వురోసుకొని చావలసిన రోజు వచ్చిందిరా కొడకా" అని చూడవచ్చిన వాళ్ళకు అర్థం గాకుండా ఒక్కటే రోజుతూ, కంటికీ నేలకీ ఏకధారగా పెద్దపెట్టున ఏడిచింది.

"ఏందమ్మా? అసలు సంగతేమిటో చెప్పవమ్మా! ఏం జరిగిందేమిటి? నిన్న పగటివేళ పొలంచాయ పోయి చూచివచ్చాను. మన కుప్పలన్నీ భద్రంగానే ఉన్నవే! ఇప్పుడేం వచ్చిందీ?" అని రామిరెడ్డి అడిగేవరకు–

"దానికి కాలం వచ్చేటప్పటికి ఎంతలో పోవాలెరా నాయనా! నిన్న రాత్రి తెల్లవార్లూ ఎంతమంది జనం మోసినారోగాని సగం కుప్ప ఎగిరి పోయింది రా బాబూ! వీళ్ళు నాశనం గానూ! వీళ్ల కడుపులు మండిపోనూ! వీళ్ల వంశం నిర్వంశంగానూ!" అని లక్ష్మమ్మ మళ్లా అందుకొంది.

"అయితే ఎవరెత్తుకొని పోయినా రంటావు?" అన్నాడు రామిరెడ్డి.

"ఎవరని నన్నడుగుతా వెందుకయ్యా? అయ్యయ్యో! ఈ మాల మాదిగ కొడుకు నా ఇంటికి శనిగ్రహం పట్టినట్లు పట్టినాడురా బాబూ! తలకింద కొరివిలా నా కయ్యకింద వాడు ఊరికేనే చేరినా డనుకొన్నావా? మొన్న నేను వాడికి కాల విప్పలేదని వాడు నన్నప్పుడే బెదిరించి నా మీద శాబ్దీలు తీసి వెళ్లాడురా బాబూ! ఆ మాలమాదిగ కొండడు తప్ప మరొకరి పని గాదురా ఇదీ" అని లక్ష్మమ్మ మరీ ఏడిచింది.

"అట్లాగయితే నేను విచారిస్తాగాని, నువ్వూరికే రచ్చచేయబోకు! మాలవా డెక్కడకు పోతాడు? నిముషాల మీద నీ సొత్తంతా నీయింట్లో చేరుతుంది. ఏడవబోకులే. లేచి పళ్ళు తోముకొని, ఇన్ని చద్దినీళ్ళు తాగు. అయ్యయ్యో! అరచి అరచి గొంతుకు రాచుకుపోయె; ఆయాసమూ, శోషా కూడా వచ్చింది గదమ్మా తల్లి! లే! ఎండపడింది. లే!" అని రామిరెడ్డి ధైర్యం చెప్పాడు.

లక్ష్మమ్మకు విడిపోయిన జుట్టు రామిరెడ్డి తల్లి ముడివేసింది. సందిట పట్టి లక్ష్మమ్మను రామిరెడ్డి పైకి లేవదీసి చీడీమీద కూర్చోపెట్టాడు. లక్ష్మమ్మ చెదిరిపోయిన పైట సర్దుకొని, జుర్రున చీది నేలనేసి కొట్టింది. వొంటి నంటుకొన్న దుమ్మూ, ధూళీ రామిరెడ్డి తుడిచాడు. రామిరెడ్డి చెల్లెలు పళ్ళు తోముకోను నీళ్ళు పిన్నమ్మ పక్కన పెట్టింది. కళ్లు తుడుచుకొని లక్ష్మమ్మ మొగం కడుక్కొంది.

✡

రామిరెడ్డి దూరాలోచన గల మనిషి, కానైతే జబ్బురకం మనిషి కాదు. పినతల్లి చేసిన చేష్టలన్నీ తనలో విమర్శించుకొన్నాడు. అతని కసలు పినతల్లితత్వం మొదటి నుంచీ తెలవనే తెలుసు. ఇంటికి పోయి పైన గుడ్డ వేసుకుని చెప్పులు తొడుక్కొని, కఱ్ఱ చేత పుట్టుకొని రామిరెడ్డి తిన్నగా కరణం రామగుండం బసవయ్యగారి యింటికి వెళ్లాడు.

బసవయ్యగారు నిఖారుసైన నియోగిబిడ్డ. తండ్రి పేరూ, తాతపేరూ మాత్రమే కాకుండా, అసలు ఆర్వేలవారందరి పేరుప్రతిష్ఠలూ కూడా ఏకటాకీని నిలబెట్టుతున్నాడాయన. అనాదిగా వారిది పెద్ద కరణాల కుటుంబం అని పేరు పడింది. ఆయన స్వతహాగా తెలివితేటలు గల ఘటం. గ్రామంలో బసవయ్య గారి బావుటా బాగా ఎగురుతోంది. ఆవూరి మునసబు కమ్మనాయుడు, సంతకం మాత్రం ఎట్లాగో నేర్చుకొన్నాడు. బసవయ్యగారు నుంచోమంటే నుంచోవాలి, కూర్చోమంటే కూర్చోవాలి అతను. అందువల్ల ఆ గ్రామ సివిల్, క్రిమినల్, రెవిన్యూ వగైరా అధికారాలు బసవయ్యగారే చలాయిస్తూ రెండు చేతులా గ్రామంలో నొల్లుకొని తింటున్నాడు. కాని ఎంత సంపాదించినా ఆయన కుటుంబం పెద్దది; కూతుళ్ల పెళ్ళిళ్ళకీ కార్యాలకూ, వాటికీ వీటికీ చాలక, కొంతవరకు లోకులకు ఋణపడ్డాడు. అచ్చం రామిరెడ్డికే ఆయన ఆరువేలు అచ్చవలసుంది. ఆ మొగమాటం కొద్దీ తనకు గ్రామంలో ఎంత పలుకుబడి వున్నా, అప్పుడప్పుడు బసవయ్య రామిరెడ్డికి మాత్రం రవంత పక్కలు వంచుతూ వుండవలసి వచ్చింది.

రామిరెడ్డి రావడంతోనే బసవయ్య అతణ్ని ఆహ్వానించి చావడిలో ఉత్తరపుతట్టు అరుగుమీద చిరిచాపవేసి "ఏం ఇట్లా వచ్చావు, కథ" అని ప్రశ్నించాడు. "మీతోనే పని వుండి వచ్చా. నిన్న రాత్రి మా పిన్నమ్మ దక్షిణపు నట్టులోని కుప్పలో ఎవరో దొంగతనంగా పది మోపులు పన కట్టుకొని పోయారుట. దాని కోసరం ఆమె గోలెడుతోంది" అన్నాడు రామిరెడ్డి.

"పది మోపులే?"

"ఆ! పదంటే పది కాదనుకో అంతకు తక్కువే కావచ్చు. ఎంత యినప్పటికీ దొంగతనం దొంగతనమే."

"కాదుమరీ! పాపం! ఆమె సొమ్ముకు కక్కుర్తి పడ్డ గాడిదకొడుకెవడయ్యా?"

"నీతో నిజం చెప్పొద్దూ; ఎత్తుకొని పోతూవుండగా ఎవరూ కళ్ళారా చూడలేదు. మా పిన్నమ్మకేమో మాల కొండడి మీద అనుమానం."

"అబ్బే! వాడల్లాంటి పనికి పోయేవాడు కాదయ్యా, పాపం! ఎందుకు మనం మాత్రం ఒకరిమీద పాపపు మాటలు అనుకోవాలి?"

"అవును మరి. వాడి సంగతి నాకూ తెలుసు. అయితే ఆమె మాత్రం వాడే చేశాడు ఈ పని అని ఘంటా పథంగా చెప్తూతోంది. ఆమె మతం మార్చడానికి బ్రహ్మదేవుడి తరంగాదు."

"అయితే ఇప్పుడేం చేద్దామని నీ ఆలోచన?"

"చేయడానికేముంది? కొండణ్ని పిలిచించి ఆమె కుప్పలో పోయిన కట్టలు ఆమె కిప్పించి వెయ్యి."

"అంతటితో ఆమె తృప్తిపడుతుందా?"

"అదీ సందేహమే. తీరా పది కట్టలు వాడిచేత ఇప్పించినా, చోరీ చేసినందుకు వాడికి జల్మానా విధించి అది కూడా తనకే ఇప్పించవలసిందని ప్రాణాలు తీస్తుంది. ఆమెతో నక్క చావు వచ్చిపడిందయ్యా నాకు. ప్రాణాలు కొరికేస్తుంది. పాడుముండ!"

"ఎట్లాగా నీ రొట్టె విరిగి నేతిలో పడిందిలే, అసలామె సంసారానికెక్కు పెట్టి వున్నావు. మొత్తానికి నీది ధన జాతకమే."

"ఏమో! ఆ ముండ అంతరించే దెప్పటికో, మన పాచిక పారేదెప్పటికో! మరి ముందు దీని విషయం పరిష్కారం చేయాలె. ఈ పని నీ చేతిలో వుంది."

"మరీ ఇంత అన్యాయంలోకి దిగుతున్నావేమిటయ్యా, రామిరెడ్డి! ఎత్తుకొని పోతూవుండగా ప్రత్యక్షంగా చూచినట్టు సాక్ష్యమేనా వుంటే ఏదో విధంగా యేడవ్వచ్చు. ఎవడో వీధిన పొయ్యే వాణ్ని పిలిచి, నువ్వు లక్ష్మమ్మ కుప్పలో చోరీ చేశావని ఎట్లాగ నిరూపించడం? నువ్వే చెప్పు"

"సరేలే! ఈ ధర్మపన్నాలన్నీ ఏకరువు పెట్టడాని కిప్పుడేమీ సందులేదు. నాకు తెలుసు. అసలు చోరీ జరిగిందో లేదో కూడా నాకూ అపనమ్మకమే. ఇంటికి వచ్చి మా పిన్నమ్మన్ని చూడకపోతివి. పొద్దుటినుంచీ ఆమె చేసే అఘాయిత్యం చూస్తే నువ్వేమనుకొందువో! ఈ విషయంలో మట్టుకు నువ్వు పూర్తిగా నామాట దక్కించాలె. నీకు తప్పదనుకో. నా మెడకు గండకత్తెర చుట్టుకొంటే, నీకు చుట్టుకొన్నట్టు కాదూ, బసవయ్యగారూ?"

"అయితే భోజనం చేసుకొని, మధ్యాహ్నం, వాణ్ని పిలిపించి విచారించి ఏదో రకంగా తీర్మానం చేద్దాంలే. పెద్ద మనిషివి. నువ్వే స్వయంగా ఇంత నొక్కి చెప్తుతుంటే ఇక తప్పు తుందా?"

"సరే" అంటూ రామిరెడ్డి లేచి ఇంటికి వెళ్లాడు. పదకొండు గంటలయ్యేసరికి బసవయ్య పంతులు కూడా స్నానం చేసి, ఆహ్నికం పూర్తి చేసుకొని, భోజనం చేసి, మధ్యాహ్నం మూడు గంటలకు కొండడి కోసం ఇంటికి కబురుచేశాడు. బఱ్ఱెగొడ్డొకటి మేతా నీళ్లూ మేయక, పొద్దుగూకులూ అరుస్తూ పశువులమీదికి ఎగబడుతూవుంటే, దున్నపోతును దాటించడానికి దాన్ని కొండడు పక్క వూరికి తోలుకుపోయాడని ఇంటికాడ చెప్పేవరకు పోయిన మనిషి తిరిగి వచ్చి ఆ సంగతులే పంతులుతో చెప్పాడు. తాను చెప్పినపని ఏమి చేశాడో కనుక్కురమ్మని రామిరెడ్డి అప్పుడే కబురుచేశాడు. ఇక ఆలస్యం చేయడానికి వీలుండేటట్టు లేదని రామిరెడ్డిని పిలిపించుకొని, అతన్నీ, ఇద్దరు వెట్టివాళ్ళనూ కూడా తీసుకొని బసవయ్యపంతులు ఎకాయెకీని మాలవాడలో కొండడి ఇంటికి పోయినాడు. విచారిస్తే కొండడు లేడని తెలిసింది.

కొండడిది ఒక దూలం చప్పరం. మామూలు చుట్టు గుడిసెకంటె రవంత పెద్దది. లోపల కొండడి తల్లి తప్ప ఇతరులెవ్వరూ లేరు. కొండడి భార్య కూలికి పోయి ఇంటికి రాలేదింకా. దాని చంటి బిడ్డ పది నెల్లకూన, గుడిసెలో కింద గోతం పట్టామీద పండుకొని దొర్లుతూ వుంది. ఈ పది రోజులుగా తిరిగి తిరిగి ఏరుకొని తెచ్చుకొన్న పరిగలన్నీ కలిసి ఒకటిరెండు చిన్నకట్టలయ్యేవరకు, కొండడితల్లి ఆ రెంటినీ ఒక గుడిసెలో ఒక తట్టుగా వేసి, ఆ రాత్రి కూటికి గింజలు లేనందున, సందెడుకఱ్ఱలు ఆ కట్టల్లోనివి తీసి గుడిసెవాకిట ఎండబెట్టి, ఎండిన కఱ్ఱలు కొద్దికొద్దిగా తీసి కింద ఈతాకు చాపమీద వరివెన్నులు కుడికాలికింద వేసుకొని నలుపుతోంది. గింజలన్నీ రాలిన తర్వాత గడ్డిని మాత్రం ఒక పక్కగా పెట్టుతోంది.

బసవయ్యపంతులూ, రామిరెడ్డీ, సిబ్బందీ వచ్చేవరకు వెంకికి గాభరాపుట్టింది. "ఇదేందబ్బా! ఎన్నడూ రాని అయ్యవారు కూడా మాలవాండ్ల గుడిసెకాడికి ఎండలోపడి వచ్చాడే" అని దానికి అర్థం కాకుండా వుంది.

"వెంకీ! ఆఖరుకు నీకొడుక్కి ఇల్లాంటి దొంగ బుద్ధులు కూడా పట్టుబడ్డాయటే?" అన్నాడు బసవయ్య.

"ఏంది మారాజా! ఏం చేశాడయ్యా నా కొడుకు?"

"ఏం చేశాడా! నిన్న రాత్రి లక్ష్మమ్మ కుప్పలో పన పెరికి చోరీగా తెచ్చి ఇంట్లో వేసుకొన్నాడటగా? ఇదిగో రామిరెడ్డి కూడా వచ్చాడు."

"ఏ లక్ష్మమ్మ సామీ! – రామరామ! మేమట్లాంటి పాపాలకు పొయ్యేవాండ్లము కాదు సామీ! నా కొడుకు ధర్మరాజు సామీ."

"ఛీ! నోరుముయ్యి. ఊళ్ళోవాళ్ళసొమ్ము దోపిడీ చేసి, ఇంట్లో వేసుకొని కమ్మగా తిందామనుకొన్నావా? నీ సంగతి నే నెరగనూ? అసలు నువ్వే చెప్పి పంపించి ఉంటావు కొండణ్ణి, దోపిడీ చేయమని. జైలుకి పంపిస్తా చూడు."

"ఏందయ్యా సామీ! ఈ గొడవ ఈ రోజు? నాకొడుకు నిన్న పగటేళనంగా బర్రెను తోలుకొని పోయాడు నాయనా! రాత్రి వాడింటికి రాలేదు. ఆ పాపం మాకు తెలియదు సామీ! ఉంటే తింటాం, లేకుంటే పస్తు పండుకొంటాంకాని, దొంగకూళ్ళు మాకు పనిలేదయ్యా! నీకు దణ్ణం పెట్టి చెప్తుతా!" అని ఎంకి అనేవరకు వెట్టివాళ్ళ నిద్దరినీ పిలిచి "ఒరే, లోపలికిపోయి సోదా వేసి చూడండిరా; ఇంట్లో పన కట్టలుంటే బయట వేయండ" ని బసవయ్య చెప్పాడు. వెట్టివాళ్ళిద్దరూ మాలవాళ్ళే. బసవయ్య ఈ మాట అనేవరకు, ఇద్దరిలో ఒకడు కాలు ముడుకోను పోయినట్టుగా పోయి ముఖం తప్పించాడు. రెండోవాడు సందేహిస్తూ సందేహిస్తూ, ముఖం కిందికి వంచుకొని, చేతిలో కర్ర కింద టక్కున కొట్టుతూ, అడుగులో అడుగు వేసుకొంటూ ముందరికి పోతున్నాడు. అది చూచి బసవయ్య పంతులు, "నీకేమైనా సొయ్యమా ఏందిరా? గుడిసెలో సోదావేయమంటే పెళ్ళినడకలు నడుస్తావేందిరా? మెడలు విరగదన్నుతా, తొందరగా వెళ్లు" అని వెట్టివాణ్ణి అదలించాడు.

వెట్టివాడు గుడిసెలో దూరాడు.

"ఇదేంది పంతులూ ఈ అన్యాయం? పిల్లోడూ, పిల్లాకూడా ఇంటి కాడ లేకుండా చూచి నా గుడిసెకు నిప్పు పెట్టుతుండా వేమయ్యా" అని వెంకి గొల్లుమన్నది.

మాలవాడలోని మాలలందరూ కూలికి పోయి నందున, ఎవరో అక్కడక్కడ ముసిలీ ముతకా, పిల్లా జెల్లా తప్ప ఇతరులెవ్వరూ పెద్దతలకాయలు కనపడడం లేదు. వెంకి గుడిసెకాడ జరిగే గలభాకు ఆ వున్నవాళ్ళే – పిల్లాపీచూ, పదిమందీ పోగయారు. వెట్టివాడితో గూడా వెంకి గుడిసెలో దూరింది. వాడి కాళ్లావేళ్లా చుట్టుకొంది. లోపలికి పోయిన వెట్టివాడు అయిదు నిముషాల వరకూ బయటకురాలేదు. వెంకి గోలపెట్టుతోంది. దాని అవస్థ చూచే వరకు వాడికి కళ్ళవెంబడి నీళ్లు గిర్రున తిరిగినవి. సోదా వేయడానికి కళ్ళచూపు అనలేదు వాడికి.

"లోపలదూరి ఎంత సేపటికీ బయటికి రావెందువల్లరా? నీకేమైనా ముసించిందా ఏమిటి? లేక ఈ దొంగసొత్తులో నీకేదైనా భాగం వుందా? బయటికి రావేమి?" అని బసవయ్యపంతులు బయటనుండి అరుస్తున్నాడు. వెట్టివాడు బయటికి రాలేదు. బసవయ్యకు వొళ్లు భగ్గుమనింది. వెట్టివాడు మొగమాటంవల్లనో, కులాభిమానంవల్లనో సమయానికి జంకుతున్నాడని, తానిక చెయ్యి చేసుకొంటేనేగాని వీల్లేదనుకొని బసవయ్య దుడుంగున గుడిసెలోకి దూరాడు. వెంకి పరిగ ఏరి తెచ్చి పోగు పెట్టిన రెండు కట్టలూ చూశాడు.

"ఈ కట్ట లెక్కడివే వెంకీ?" అని అడిగాడు బసవయ్య.

"వరికొయ్యకాల్లో పరిగ ఏరి తెచ్చుకొన్నవి సామీ! ముసిలిముండని. నడుము పడిపొయ్యే టట్టు ఒక్కొక్క కఱ్ఱేయేరి తెచ్చుకొన్నా; ఇది దొంగసొత్తు కాదు మారాజా! నీకు దణ్ణం పెట్టుతా" అన్నది.

"తప్పుడు మాటలు కూస్తావు" అంటూ ఆయనే రెండుకట్టల్నీ బరబర బయటికి లాక్కొని వచ్చాడు. వెంకి నోరూ నెత్తీ లబలబ కొట్టుకొంటూ బసవయ్యకు అడ్డుతగిలేవరకు, మాలముండ తనను తాకుతేందేమో, ప్రాయశ్చిత్తం చేసుకోవాలెనని భయంతో, బసవయ్య తన చేతికఱ్ఱ రెండు చేతులతోనూ ఆ చివరా, ఈ చివరా పట్టుకొని వెంకి మెడ మీద బెట్టి ఒక్క నెట్టు నెట్టాడు. 'చచ్చాను దేవుడా!' అని వెంకి నాలుగు గజాల దూరంలో పడిపోయింది.

బయటికి లాక్కొనివచ్చిన రెండు కట్టలు బసవయ్య చేతనే తన ఇంటికి మోయించేవాడు రామిరెడ్డి. కాని బ్రాహ్మణ్ణి కష్టపెట్టగూడదనుకొని, తన జీతగాళ్ళలో ఒకణ్ణి పిలిపించి రెండు కట్టలూ లక్ష్మమ్మ యింటికి చేర్పించాడు.

కింద పడిన వెంకి కిందనే పొర్లుతూవుండగా, తలపెట్టిన కార్యం జయప్రదంగా కొనసాగి నందుకు సంతోషపడుతూ, బసవయ్య జారిపోయిన జుట్టు ముడివేసుకొని, కఱ్ఱ చేతబుచ్చుకొని, చేతులు ఊగిసలాడించుకొంటూ, రామిరెడ్డితో కూడా ఇంటికి వెళ్ళాడు. వెళ్ళి బావి దగ్గర ముఖాన ఉండిన గంధం పట్టెలూ, అక్షతల బొట్టూ పొయ్యేటట్టు పదిబిందెలు నెత్తికి తోడి పోసుకొని స్నానం చేసి చేతికఱ్ఱకూడా కడిగేసి, ఇంట్లోకి పోయి పట్టుగుడ్డ కట్టుకొని, విభూతి ధరించి మైలబడ్డ జందెం తీసివేసి కొత్త జందెం వేసుకొని నూట ఎనిమిది సార్లు గాయత్రి జపించాడు: తరువాత లేచి చలవమడతలు కట్టుకొని మంచి తీర్థం తీసుకొని వీథిలోకి పోయాడు. ఇంతలోనే లక్ష్మమ్మ పిలిపించేవరకు ఆమె యింటికి పోయి వీధి అరుగుమీద కూర్చొని అతనూ, రామిరెడ్డీ, లక్ష్మమ్మా ఈ ముచ్చటే ఏమిటో మాట్లాడుకొంటున్నారు. రెండు వరికట్టలూ ఇంటికి చేరినప్పటికీ పోయిన సొత్తు పూర్తిగా రాలేదని లక్ష్మమ్మ సణుగుతూనే వుంది, చెవులో పోటులాగ. "బయటకు పోయిన మొగాడు, కొండడు ఇంటికి వచ్చిన తర్వాత కొరవగూడా ఏదో విధంగా భర్తీ చేసే పెట్టుతాం లేవమ్మా, నీ సొత్తు గడ్డిపరకంత కూడా ఎక్కడికీ పోదు." అని బసవయ్య ధైర్యం చెప్పి లక్ష్మమ్మను ఓదారుస్తున్నాడు. "ఏమో నాయనా! నా ప్రాణం హరీ అనే వరకూ ఏ కడగండ్లూ లేకుండా నా తను విట్లా తెల్లవారిపోతే, నా కంతే చాలు. లోకుల సొమ్ము నాకు ఆవగింజంత కూడా అక్కరలేదు. ధర్మాత్మురాలు లక్ష్మమ్మ అని లోకం మోగిపోతున్న రోజుల్లో, ఈనాటికీ మాలముండాకొడుకు నన్ను నలుగురిలోకీ ఈడ్చాడు, వీణ్ణి పొలేరమ్మ బుగ్గి చేసుకుపోనూ" అంటూ సింహద్వారానికి పొదుగిట ఆనుకుని, కంట తడిపెట్టుకొని, పైటకొంగుతో తుడుచుకొంది లక్ష్మమ్మ.

✡

కొండడు పడమట బారెడు పొద్దుందనంగా అసురుసురై బర్రెను తోలుకొని, పొద్దుటి నుంచీ కూడులేక ఇంటి కొచ్చేవరకు, ఇల్లంతా బీభత్సంగా వుంది. వెంకి ఇంటిముంగిట దుమ్ములో పొరలాడుతూవుంది. కొండడి భార్య ఇంకా ఇంటికి రాలేదు. జరిగిన విషయం అంతా కొండడు తెలుసుకొన్నాడు. వాడి మనస్సు చీకాకయింది. కథ పెరుగుతున్నందుకు వాడు వగచాడు. అధైర్యపడ్డాడు. కాని ఇంతలో సంబాళించుకొని 'వెధవ పరిగకర్రలు నాలుగూ తీసుకొనిపోతే పోయారు. ఇంత మాత్రానికే చెడేది లేదులే' అని వాటి విషయమై దిగులుపడలేదు కాని, తాను దొంగతనం చేసినట్టు నలుగురిలోనూ అపకీర్తి పాలు కావలసి వచ్చిందే అని మాత్రం దుఃఖించాడు. ధైర్యం తెచ్చుకొన్నాడు మళ్ళా తల్లికి ధైర్యంచెప్పి. లేవదీసి ఓదార్చాడు. మరికొంత సేపటికి భార్య వచ్చింది. ముగ్గురూ కాస్సేపు కళ్ళనీళ్లు పెట్టుకొన్నారు. "ఇక ఊరుకోండి. ఇంతటితో మనం అదృష్టవంతులమే" అని కొండడు వాళ్ళని ఊరడించి, లేచి నీళ్లు పోసుకొందామని, కడపదగ్గిరకు పోయ్యేవరకు – కరణమూ, రామిరెడ్డీ పిలుచుకొని రమ్మన్నారని కొండడి తావుకు ఒక మనిషి వచ్చి పిలిచాడు. నీళ్లు పోసుకొని కొండడు లక్ష్మమ్మ ఇంటికి పోయాడు, మళ్ళా ఏం తెచ్చిపెట్టబోతున్నాడో అని భయపడుతూ. బసవయ్యా, రామిరెడ్డీ, లక్ష్మమ్మా కలిసి కొండణ్ణి పది బూతులు తిట్టి, పోలీసుకు రిపోర్టు చేస్తామని బెదిరించి, కొరత పడ్డ వరికట్టల ఖరీదుకిందా, దొంగతనం చేసినందుకు అపరాధంకిందా వాడికి పదిహేను రూపాయలు జుల్మానా విధించి, ఆ పైకం అప్పుడే రొక్క రూపంగా కట్టినాసరే, లేకుంటే లక్ష్మమ్మ పేర రూపాయికి నెలకు అణా వడ్డీ వంతున అప్పు పత్రం వ్రాసి యిచ్చినా సరే, ఏదో విధంగా తీర్మానం చేయాలని కస్తీ చేశారు. వారు చేసిన పంచాయితీకి కొండడికి కడుపు దహించుకొని పోయింది.

"నన్ను అడ్డంగా పండబెట్టి ముక్కలు ముక్కలుగా నరికినా సరే నేను మాత్రం వొక దమ్మిడీ కూడా అచ్చుకోలేను" అన్నాడు వాడు. అట్లా అనేవరకు,

"నీ మదం అణుస్తా నుండరా! ఊళ్ళోవాళ్ళ సొత్తు దొంగతనం చేసి, తేరగా ఇంట్లో వేసుకొని తినడమనుకొన్నావా" అని బసవయ్య గ్రుడ్లు వురిమి, లక్ష్మమ్మ సేద్యగాళ్ళలో ఒక గవండ్లవాణ్ణీ, ఒక గొల్లవాణ్ణీ పిలిచి "మీరు పోయి కొండడి ఇంటికాడ బర్రెగొడ్డును కొట్టుకొని రాండి. వీడేమో వొళ్ళు తెలియకుండా మాట్లాడుతున్నాడు," అని ఉత్తర్వు చేసేవరకు, ఇద్దరు సేద్యగాళ్ళూ ఆ క్షణంలోనే పోయి, కొండడు లక్ష్మమ్మకాడ వుండంగనే బర్రెను తోలుకొనివచ్చి, లక్ష్మమ్మ పశువులదొడ్లో కట్టివేశారు.

"ఏం చేసినా చెల్లుబడి అవుతుందిగదా అని మీరందరూ కలిసి చేస్తున్నారు ఈ పన్నులన్నీ, ఇంతకంటె మీరు నన్ను చెడగొట్టేదేముందీ? అన్ని పాపపుణ్యాలూ ఆ భగవంతుడే కనిపెడ్తాడు లెండి" అని లోపల కుతకుతలాడే హృదయాన్ని తన నిస్సహాయస్థితి వల్ల జనించిన వేదాంతంతో తృప్తి పెట్టుకొంటూ కొండడు ఇంటికి వెళ్ళిపోయాడు. ఇంటి దగ్గర తల్లీ భార్యా గోలు గోలుమని ఏడుస్తున్నారు. పొద్దు గుంకి ఇంటికి చేరిన మాల అమ్మ లక్కలు కూడా పోగయి దవడలు

నొక్కుకుంటూ నిలబడ్డారు. కొండడు తల్లినీ, భార్యనూ కూకలేసి ఏడుపు మానిపించి ఆ రాత్రి గంజితాగి పండుకున్నాడు.

తెల్లవారింది. కొండడు రెండు కట్టల వరికర్రలూ పోయినందుకు దుఃఖపడలేదు గాని, ఎట్లా లేదన్నా ముప్ఫయి రూపాయలు కిమ్మతు చేసే నిక్షేపం వంటి బర్రె పోయినందుకు మాత్రం కొంత విలపించాడు. వాకిట బర్రె లేక ఇల్లంతా బావురుమన్నది. ఎట్లాగైనా పైవారికి తెలుపుకొని, పోయిన బర్రెను మాత్రం తిరిగి తెచ్చుకొందామనుకొని మహా దొర్లాడినాడు. కాని భత్యఖర్చుకైనా చేతిలో దమ్మిడీ లేకపోయె! ఇక వ్యవహారం ఎట్లా జరపగలడు? అదిగాక బసవయ్య రాక్షసుడు; రామిరెడ్డీ, లక్ష్మమ్మా బలవంతులు. తాను పోయి, బర్రెను తీసుకు పోయారని ఏ పోలీసువారితోనైనా చెప్పుకుంటే, బసవయ్యా, రామిరెడ్డీ కలిసి, అసలు తన మీదికి తెచ్చిపెట్టిన దొంగతనం నేరాన్ని ఏ తప్పుడు సాక్ష్యమో సృష్టించి, పెంచి పెద్దది చేసి తుదకు తన్ను ఏ జైలులోనైనా పెట్టిస్తారేమోనని భయపడ్డాడు కొండడు. ఎప్పుడూ ఇట్లాంటి లట్టాలు పడ్డవాడు కాదు కాబట్టి. వాడికి ముందు వ్యవహారం నడపడానికి ధైర్యం చాలలేదు. తాను దొంగతనం చేసినట్టు వచ్చిన అపనిందకే సగం చచ్చి తిరుగుతున్నాడు. 'దాని తాడు తెగిరి, పోతే పోయింది బర్రె! నే నీతంటాలు పడలే'నని నిశ్చయించుకొని వూరుకొన్నాడు కొండడు.

ఇంతలోనే తన గ్రామ జమాబందీ – తాలూకా కచ్చేరికాడ డిప్టీకలెక్టరు గారు ఇక నాలుగు రోజుల్లో జరుపుతారని తెలిసింది. రైతులు తమ కష్టసుఖాలను డిప్టీకలెక్టరు దొరతో చెప్పుకోవడానికై తలా ఒక అర్జీ వ్రాసుకొని జమాబందీ రోజున దొరదగ్గరకు పోతున్నారు. కొండడు తన కయ్యకి కాలవ కోసరం పెట్టుకొన్న అర్జీల మీద ఇంకా ఉత్తరువులేమిన్నీ రాలేదు. జమాబందీలో దొరగారితో ఆ కాలవ సంగతి మొరపెట్టుకొని చెప్పుకొందామని, కొండడు కూడా ఒక అర్జీ వ్రాయించుకొని తాలూకా కచ్చేరికి పోయినాడు. దొరగారికి దణ్ణంపెట్టి తనకు కాలవ యిప్పించవలసిందని కోరగా డిప్టీ కలెక్టరు పక్కనున్న తహసీలు దారువైపు చూశాడు. "గ్రామాల్లో పార్టీలు పెంచుకొని, తగవులాడుకొని, ప్రతీవాళ్ళూ కాలవలు కావాలని కోరుతున్నారు సార్! ఈ అర్జీదారుకు అరెకరా భూమి కంటే జాస్తిలేదు. వీడికి కూడా ఒక కాలవ కావలెనంటే ఎట్లా వస్తుంది? ఒకరికి గనుక ఇచ్చినామంటే, ఇక ప్రతీ రైతూ తన ప్రతికయ్యకూ కాలవ ఇప్పించమంటాడు. ఇది సాధ్యం అయ్యే పనిగాదు సార్!" అని తహసీలుదారు జవాబు చెప్పాడు.

"అవునవును, మీరు చెప్పింది నిజమే"నంటూ డిప్టీ కలెక్టరు కొండడి వైపు తిరిగి, "నీకు ప్రత్యేకంగా కాలవ యివ్వడానికి వీల్లేదు. నీ అర్జీ తోసి వేశాం" అని ఉత్తరువు చేశాడు.

"అయ్యా! నేను బీదవాణ్ణండి; నా కయ్యకు నీళ్ళు పారించుకునే ఆధారం లేదండి" అన్నాడు కొండడు.

"గ్రామంలో వెయ్యా, రెండు వేల ఎకరాలకు నీళ్ళు పారుదల అవుతూవుంటే నీ అరెకరా కయ్యకూ నీళ్ళు రావడం లేదంటే ఎవరైనా నమ్ముతారా?" అన్నాడు డిప్టీకలెక్టరు.

"లేదు సామీ! లక్ష్మమ్మ గారూ, కరణం బసవయ్యగారూ కలిసి నన్ను అన్యాయం చేస్తున్నారు సామీ! నా మీద చోరీ నేరం మోపి నా బర్రెగొడ్డును తోలుకొని పోయారు సామీ! తమరు కటాక్షించకుంటే నా కయ్యను బీడెట్టుకుని పోవలసిందే సామీ!" అని కొండడు గోల చేశాడు.

"ఒరే! ఇది కచ్చేరీగాని, మీ మాలవాడకాదు, తెలుసునా? నీ నడవడిక మంచిదయితే గ్రామంలో ఆసాములు నీరు రానియ్యకుండా ఎందుకు చేస్తారు? అరెకరా కయ్యగలవాడివి నువ్వు లక్షాధికారులతో తగవుపెట్టుకో వచ్చురా?" అన్నాడు డిప్టీ కలెక్టరు.

"వీడు గజదొంగ సార్! వీణ్ణి కె.డి. రిజిష్టరులో చేర్చడానికి పోలీసు సబినస్పెక్టరు గారు రాసుకొనిపోయారు సార్!" అని అక్కడనే నిలబడి వున్న కరణం బసవయ్యగారు ఆ కొరవ పూరించాడు.

"గొప్పవాళ్ళతో ఎన్నడూ తగవు పెట్టుకోకూడదురా! పో! పో! ఆ లక్ష్మమ్మకాళ్లా కడుపూ పట్టుకుని నలుగురితోపాటు నువ్వుకూడా నీళ్ళు పారించుకో. పో! ఆమెతో తగవులు పెట్టుకోకు" అన్నాడు డిప్టీ కలెక్టరు దొర.

"అయ్యా! నా మీద అబద్దపు కేసు పెట్టి ఈ కరణం బసవయ్యగారు అన్యాయం చేస్తున్నాడండీ" అన్నాడు కొండడు. "జమాబందీలో అవన్నీ విచారించడానికి మాకు వీల్లేదు. నీకేదైనా అన్యాయం జరిగితే సాక్ష్యం తెచ్చుకొని మేజిస్ట్రేటులోనో, సివిల్‌లోనో దావా పెట్టుకో. మే మేమీ చేయడానికి వీల్లే"దని దొర ఇంకో అర్జీదారును పిలిచాడు. నెత్తిన గుడ్డవేసుకొని కొండడు ఇంటికి పోయాడు.

✡

జమాబందీ అయిన మర్నాడే తాలూకాలో జరిగిన సంగతంతా లక్ష్మమ్మకు తెలిసిపోయింది; మాలవాడికి బాగా జరిగిందని చంకలు తట్టుకుంది. వ్యవహారం తమకు అనుకూలమై, కాలవ ఇవ్వడానికి వీల్లేదని దొర తీర్మానం చేశాడు కాబట్టి, అనుకొన్న ప్రకారం ఫయిసలు చేయించవలసిందని రెవిన్యూ ఇనస్పెక్టరు లక్ష్మమ్మ కాడికి కబురు చేశాడు. ఇప్పుడు చేతిలో దమ్మిడీ లేదని జవాబుచెబుతూ, కొండడికి పట్టాకిచ్చిన కయ్య మార్పించి తన పేర పట్టా తెప్పించినట్టయితే దానికీ, దీనికీ కూడా కలిపి అనుకొన్నది ఇస్తాను గాని ఇప్పుడేమీ ఇవ్వడానికి వీలులేదని జవానుతో చెప్పి పంపింది లక్ష్మమ్మ. ఇంతలోనే కొండడు వచ్చి ఇనస్పెక్టరుకు దణ్ణం పెట్టి–

"సామీ! నాకు కాలవ తెప్పిస్తానంటిరి. ఆఖరుకు డిప్టీకలెక్టరు దొర ఒప్పుకోకపోయె! నా అయిదు రూపాయలూ నాకు పారెయ్యండి" అని అడిగాడు.

"ఇదేమీ వంకాయల బేరం కాదు; కొరవ అయిదు రూపాయలూ నీవు అప్పు ఇచ్చివుంటే, నీ కీపాటికి కాలవ వచ్చేవుండును. స్వల్పంలో అజ్ఞాయించినందుకు వ్యవహారం ఇట్లా అయింది. చేతికి వచ్చిన పైకాన్ని వాపసుయిచ్చే ఆచారం మనదగ్గరలేదు, పో" అన్నాడు ఇనస్పెక్టరు పంతులు. ఉసూరుమంటూ కొండడు వెళ్లిపోయాడు.

కొండడికి చెడ్డ రోజులు వచ్చినవి. లక్ష్మమ్మకు తన మీద ఇంత పగ ఎందుకో వాడికి అర్థంగాలేదు. ఆమెకు తోడు ఇప్పుడు బసవయ్యకూడ పగవాడయినాడు. కాలం కర్మంకూడా ఒనగూడినట్లయింది వాడికి. ఎవరితో పోయి చెప్పుకోడానికీ దిక్కుతోచలేదు. కయ్యకోసం తెచ్చిన అప్పు పెరిగిపోతోంది. లక్ష్మమ్మతో వ్యవహారం ముదిరిపోయింది. బసవయ్యపగ తాచుపగే; ఎప్పుడేం చేస్తాడో అని దిగులు. వెనుకటి గుండెనిబ్బరం చెడింది. ధైర్యం పలచబడుతోంది కొండడికి.

ఇంట్లో కూటికి గింజలులేక, ఆ మరునాడు చీకటితోనే తన కుప్ప తొక్కించాలని ఆ రోజు తనూ, తన భార్యా యిద్దరూ పొలంపోయి కళ్ళం బాగుచేసి వచ్చారు. మాలవాడలోనే పది పశువులని సంపాదించుకొని తెల్లవారుజామున పోయి కుప్ప పడగొట్టాలనుకుని ఇద్దరు కూలివాళ్లను మాట్లాడుకొన్నాడు. నెల పొడవంగనే లేచిపోదా మనుకొని పెందలకడనే నడుం వాల్చాడు కొండడు.

జమాబందీలో కొండడు డిప్టీకలెక్టరు దొరతో చెప్పిన నేరాలకు బసవయ్య ఉగ్రుడై వున్నాడు. "దమ్మిడీకి కొరగాని పక్షి పబ్లీకులో వచ్చి బ్రాహ్మణ్ణి నా మీద దొరదగ్గిర తంటాలు చెప్తాడా? హుం! నేను నియోగిబ్డిడను. వీడికి నా మజా తెలియదు. ఇంతవరకూ వచ్చింతర్వాత వెనక్కి తిరిగితే పంతులు ఆఖరికి మాలవాడిచేతిలో చిక్కుకొన్నాడంటారు నలుగురూనూ, ఇక గ్రామంలో వాడైనా కాపురం ఉండాలె, నేనైనా ఉండాలె. వీడి అంతు పట్టిచూస్తా" అని బసవయ్యపంతులు పరవళ్ళుతొక్కుతున్నాడు. కొండణ్ణి పిలిపించి సమక్షంలో వాణ్ణి నాలుగు బూతులు తిట్టి పంపడం అంటే ఆయనకు తృప్తి కాలేదు. శాశ్వతంగా నిలిచేటట్టు వాడికి తగిన వాత వేయాలని తీర్మానం చేసుకొన్నాడాయన. తాను వేసుకొన్న ప్లానుకు ఇక కొండడితో మాట్లాడకపోవడమే మంచి దనుకొన్నాడు. తన హృదయగోళంలో ప్రజ్వలించే క్రోధాగ్ని ప్రత్యక్షంగా బయలుపడి శత్రునాశనం చేయవలసిందేగాని దాన్ని బయటపెట్టకూడదనుకొన్నాడు బసవయ్యపంతులు.

సాయంత్ర మయింది. బీదలను హింసించే దుర్మార్గుల చర్యలను చూడలేకేమో సహస్ర కరుడు ప్రాపంచిక దృక్పథాన్నుండి చాటుకు పోయాడు. ఆ ఆసుర సంధ్యవేళ బసవయ్య రామిరెడ్డిని పిలుచుకొని లక్ష్మమ్మ ఇంటికి పోయాడు. బసవయ్యకూ లోకానికీ అంధకారం అలుముకొంది.

"పంతులూ! ఆ కయ్య మనకు దఖలుపడేటట్టు చేస్తూ. నీ ధర్మాన కాలవ పోనేపోయింది మాలవాణ్ణి మటుమాయం చేసి కయ్యలో కయ్యకలుపుకొనేదాకా నాకు నిద్రపట్టదు. పంతులూ!

ఇదిగో, ఈ పని నీచేతిలోనే వుంది" అని లక్ష్మమ్మ అనేవరకు, "తొందరపడకు. వాడికి అంత్యకాలం సమీపించిందిలే; ఇప్పుడు నేను వచ్చింది అసలు ఆ పనికొరకే" అంటూ పంతులూ, రామిరెడ్డీ, లక్ష్మమ్మా మిద్దె మీదికి పోయి, ఒక అరగంటల సేపు ఏమేమిటో గుసగుసలాడుకొన్నారు. సరేనంటే సరేననుకొని అందరూ మిద్దెదిగి కిందికి వచ్చారు. ఎవరిదారిన వాళ్ళు వెళ్లారు. బసవయ్య ఇంటికి పోయి ఉడుకునీళ్ళు పోసుకొని సాయంసంధ్య వార్చుకొని భోజనం చేసి పండుకొన్నాడు.

కొండడి ఇంట్లో కొండడు నిద్రపోతున్నాడు. బసవయ్య ఇంట్లో బసవయ్య నిద్రపోతున్నాడు. జగత్తంతా నిద్రపోతున్నది. ఒక్క లక్ష్మమ్మ తప్ప. లక్ష్మమ్మ కాదినం ఏకాదశీ పర్వదినం. నిద్రపోలేదు. జాగారం చేస్తోంది. తనతో పాటు రామిరెడ్డిని కూడా మేలుకోబెట్టి అతని వల్ల భాగవతం చదివించి వింటోంది. రామిరెడ్డికీ ఆత్రంగానే వుంది – పడుకొంటే బాగుండుననేమో.

నెల పొడిచి కొండణ్ణీ, వాడి భార్యనూ నిద్రలేపింది. కూలివాళ్ళను కేకేసి చద్దన్నం మూట కట్టుకొని, పశువులను తోలుకొని కొండడూ, వాడి భార్యా కుప్పకాడికి బయలుదేరారు. ఒక పావుగంట సేపటికి వాళ్లు కుప్పకు కనుచూపు మేరదూరంలోనికి వచ్చారు. చూస్తాడుగదా తేరిపారి కొండడు, పొగా మంటా కనపడింది – వాడికి తన కుప్ప వున్న స్థలంలో. ఇదేమా అని వాడికి గుండె బేజారయింది. నవనాళ్లూ క్రుంగిపోయాయి. ఒళ్లు తెలియలేదిక. గుండెలు కవుక్కొంటూ ఒక్కటే పేరెంతీశాడు కొండడు కుప్ప కాడికి.

వచ్చాడు కొండడు. మండుతూన్న కుప్ప కెదురుగ్గా నిలబడ్డాడు. అప్పటికే కుప్ప నలువైపులా అగ్ని హోత్రుడి సందిట్లో చిక్కుకొంది. చిటపటమంటూ బ్రహ్మాండంగా మండిపోతోంది. తూర్పుగాలి అందుకొని అగ్ని హోత్రుడికి తోడయింది. ఎవరితరం ఆర్పడమిక? ఆకాశానికంటా యెగసి పోయే ఆ మంటలకు కొండడి వొళ్ళుకూడా మంటలెక్కిపోతోంది. మొగాన నెతురుచుక్క లేదు. చూశాడు చూశాడు కుప్పకేసి; నివ్వెరపోయి వెర్రిచూపులు చూశాడు. చైతన్యం స్తంభించిపోయింది. మండుతున్న కుప్పకేసి కొయ్యబారిపోయి చూస్తూ కుప్పగూలిపోయాడు కొండడు.

✡

# భూమి దు:ఖం

**-రామా చంద్రమౌళి**

ఎంత ఆపుకుందామన్నా సుందరయ్యకు దు:ఖమాగడం లేదు. కన్నీళ్ళు ఎక్కడ నుంచి ఎగదన్నుకొస్తున్నాయో.. గొంతు దగ్గరపడి.. ఉక్కిరిబిక్కిరై పోతూ, సుడిగాలిలో ఒట్టి కాగితపు ముక్కవలె.. కడుపులో ఎవరో చేతులు పెట్టి ఊడ్చేస్తున్నట్లు నాభి దగ్గర్నుండి ఏడుపు పొంగి పొంగి.. తమాయించుకోవడం వశం కావడంలేదు. ఆరిపోయే ముందు వత్తిలా రెపరెప లాడుతూ.. మనిషి.. దు:ఖంతో సుళ్ళు తిరిగిపోతున్నాడు.

కన్నీళ్ళలో నుండే ఎదురుగా గడియారం దిక్కు చూశాడు.

రాత్రి.. మూడు గంటల పది నిమిషాలు.

చుట్టూ అంతా నిశ్శబ్దం.. ఎక్కడా ఏ అలికిడీ లేదు.

వెల్లకిలా నులకమంచంపై పడుకుని తలకింద రెండు చేతులనూ పెట్టుకుని గంటలకు గంటలు ఎప్పట్నుండో అలా పైకప్పులోకి చూస్తూ ఉండిపోయిన సుందరయ్యకు మనసంతా గొర్రుకొట్టిన పొలంలా ఉంది. గుండెల్లోకి ఎవరో ఉలులను దిగ్గొడ్తున్నట్టు... శరీరం ఖండ ఖండాలుగా విడిపోతున్నట్లు.. కళ్ళ ముందే అంతా ముక్కలు ముక్కలుగా ధ్వంసమై పోతున్నట్టు.

ఎలా జరిగిందంతా.. ఒక్క రెండు నెలల్లోనే.. ఇంత బీభత్సం.. ఇంత వ్యాపారం.. ఇంత దురాక్రమణ.. ఇంత దగా.. మనుషులు మనుషులను కొనడం.. మనుషులు భూములను కొనడం.. భూములు మనుషుల చేతుల్లో కాగితపు ముక్కలకంటే హీనంగా పీలికలు పీలికలైపోవడం.. మట్టికి రెక్కలు రావడం, ఒర్రెలు, బోళ్లు, వాగులు, గుట్టలు.. అన్నీ డబ్బుగా మారిపోతూండడం.. ఏమిటి.. ఏమిటిదంతా.

సుందరయ్యకు అంతా.. ఇంకా ఓ అర్థంగాని మాయవలెనే అనిపిస్తోంది. అతనికి ఈ భూమిని మింగేసే చిచ్చు ఎక్కడ పుట్టిందో అర్థం కావడంలేదు. ప్రశాంతంగా ఉండే తమ ఊళ్లోకి అకస్మాత్తుగా ఈ పెద్ద పెద్ద కార్లు, ఖడక్ బట్టల మనుషులు, అన్ని చేతివ్రేళ్ళకూ బంగారు ఉంగరాలు పెట్టుకున్న తెల్లసీమ పందుల్లాంటి ఘరానా వ్యక్తులు ఎక్కడ నుండి ఊడిపడ్తున్నారో అర్థం కావడం లేదు.

ఒకరోజు రెండు కార్లొచ్చాయి. సర్పంచ్‌తో, ఒక వార్డుమెంబర్‌తో రహస్యంగా మాట్లాడారు, ఆ వచ్చినవాళ్ళు. సీసాలకు సీసాలు తాగారు. ఊరి బయటికిపోయి పొలాలు, తాళ్ళు, చెరువుకట్ట, మైసమ్మగుట్ట, హనుమంతుని గుండు.. అంతా కలియదిరిగి సాయంత్రం వెళ్లిపోయారు.

ఇక మర్నాటినుండి ఏ చెట్టు కింద చూచినా గుంపులు గుంపులుగా మనుషులు.. దిక్కుమాలినవాళ్ళ చేతుల్లో సెల్‌ఫోన్లు.. హలో హలోలు.. సాయిబు హోటల్ నిండా రాత్రులకు రాత్రులు మందుసీసాలు రావడాలు.. ఎవరినోట విన్నా భూమిని అమ్ముకోవడం గురించే ముచ్చట్లు. అమ్ముకోకుంటే ముంచుకురాబోయే ముప్పు గురించి బెదిరింపులు. భయపెట్టడాలు.. భయపడడాలు.. అంతా ఓ యుద్ధ వాతావరణం.

సుందరయ్య సూటిగా సర్పంచ్ రామలింగంను అడిగాడు. "ఎందుకు ఊర్లోని జనమంతా ఇట్ల బిత్తరపడిపోతున్నారు. ఏం జరిగిందసలు" అని.

"మొన్న వాళ్ళొచ్చి చెప్పింద్రుగదా.. నువ్వినలేదా.. మన ఊరు ఊరంతా ఆ ఎస్సీజడ్‌ల పోతాందట. భూములను ప్రభుత్వం తీసుకుని మనను ఊరు ఖాళీ చేయమంటదట. మన భూములకు సర్కార్ లెక్క ప్రకారం పైసోపర్కో కట్టిచ్చి ఎక్కడన్నా పునరావాసం ఏర్పాటు చేస్తదట. గీ విషయం ఇన్నకాన్నుంచి అసలు సంగతేందని రోజూ హైద్రాబాద్‌కు తిరుగతనే ఉన్న..."

"ఏం తెల్సింది మరి."

"పోవుడైతే ఖాయమని తేలింది. ఢిల్లీ నుంచి శాంక్షనైన కాగితాలను పట్టుకుని నిన్నచ్చిండ్లు చూడు. ఆ ఎర్రటి పొడుగుకార్ల.. వాళ్ల దగ్గర అన్ని కాగితాలున్నయ్. పన్నెండు ఊర్లుపోతానై. మొత్తం నాల్గువేల ఎకరాలు కావాల్నట వాళ్ళకు. గవర్నమెంట్ మన ఊర్ల పేర్లు చెప్పి, ఆర్డరిచ్చి ఓసారి పోయి చూచుకొని రమ్మన్నదట. వచ్చిండ్లు వాళ్ళు. బాజాప్తా కాగితాలున్నయ్ వాళ్ళ దగ్గర."

"నాకర్థంగాలే.. మన ఊళ్ళను వాళ్ళకెందుకిస్తరు"

"గదే మత్‌లబున్నది. గవర్నమెంట్ అందరికీ ఉద్యోగాలు ఇప్పిచ్చి ఈ దేశాన్ని డెవలప్ చేయాలని పెద్ద పెద్ద సార్లతోని విచారించి 'స్పెషల్ ఎకనామిక్ జోన్స్' అని కొన్నింటిని ఏర్పాటు చేస్తాంది. ఈ మన ఊళ్ళన్నింటిని ఒక గ్రూప్‌కిస్తది. వాళ్లు ఈ వేల ఎకరాల జాగను సాఫ్ చేసి యిక్కడ ఐటి పార్క్ తయారుచేస్తరు. ప్రపంచంల అమెరికా, లండన్ గిట్ల అన్ని దేశాల నుంచి జనం డైరెక్ట్‌గ ఈ మన ఏరియాకొస్తరు. బ్యారం గురించి కంప్యూటర్ల మన పోరగాండ్లు బాగ హుషారు గదా. ఇగ ఇక్కడ వుద్యోగాలే వుద్యోగాలు... గట్ల.."

"అద్సరెగని.. ఎవనికో ఉద్యోగం కావాల్నని ఇక్కడ ప్రశాంతంగున్న మనల ఎల్లగొట్టుడేంది.?"

“అరె.. అదంతే బై.. పదూర్లల్ల అంతా కలిపి ఓ వేయిగడప– రేపు ఇక్కడ ఇండస్ట్రీ పడ్తే వేలమందికి వుద్యోగాలు..”

“మరి మన భూములు?”

“గదే ఇప్పుడు ముందున్న సంగతి. ఇప్పుడు మన ఊర్లె ఎకరాకెంత దరుంది. మా అంటే ఎకరాకు ముప్పయివేలు... ఉన్న సగం ఊరి భూములల్ల రాళ్ళు రప్పలేనాయె. రెండు గుట్టలే ఉండే.. గవర్నమెంట్ రేపు ఖాళీ చేయిస్తే ఎకరానికి ఇరవై వేలిస్తే మహా ఎక్కువ. నిన్న కార్లల్ల వచ్చిన ఆసామితోని మాటాడిన. మా ఊరి భూమంతా గుత్తకు కొనుక్కో.. మాకు మాత్రం మంచి రేటియ్యి.. నువ్వు ఎట్లన్న ఎవరికన్న అమ్ముకో అన్న నేను.. ఏమంటవ్ నువ్వు!”

“మనం భూమి యియ్యకుంటే ఏంజేస్తరు” అన్నాడు సుందరయ్య అమాయకంగా.

“ఏంజేస్తరా... నీ భూమి కొనరు. అందరు అమ్ముకోని పోతే నువ్వొక్కనివి వుండి ఏంజేస్తవ్. అటెంక అగ్గువసగ్గువకు ప్రభుత్వం నీ భూమిని గుంజుకుంటది. ఇట్లాంటప్పుడు నల్గురితో నారాయణ”.

“అరే.. గదేంది సర్పంచ్ సారూ.. తరతరాలుగా ఈ భూమిల పుట్టి ఈ భూమిల పెరిగి యీ భూమితోనే బతుకుతున్నోళ్ళం... ఈభూమిని యిచ్చి ఎట్లపోతం.. ఏడికి పోతం.. ఎన్ని రూపాయలిచ్చినా ఈ భూమి మన పెయ్యిల ఒక అంగం లెక్కుండె. ఎట్ల వాళ్ళ పాలు చేస్తం..”

“సుందరయ్యా.. రోజులు గట్లచ్చినై.. విచారించుకో.. నేనైతే ఆ బడాబాబులతోని మాట్లాడి ఎకరానికి నాల్గు లక్షలియ్యన్న.. ఆటెంక వాళ్ళిష్టం.. మీ అందరి ఇష్టం” సర్పంచ్ రామలింగం మోటార్ సైకిల్ స్టార్ట్ చేసిండు.

సుందరయ్యకు ఏమీ తోచక పిచ్చిపిచ్చిగా చూస్తుండగానే– సర్పంచ్ అన్నాడు. “ఒకవేళ రేటు వస్తే అమ్ముకోవడమే మంచిది సుందరయ్యా.. ఈ చాన్స్ పోతే ఈ మన ఊరికి ఇంత లోపలికచ్చి ఎకరానికి ఇరవై వేలు గూడివ్వడెవడు. చానమంది నా దగ్గరికచ్చి మంచి రేటిస్తే అమ్ముదామనే అంటాండ్లు”

“నీకెంతుంది భూమి”

“పది ఎకరాల ఇరవై గుంటలు”

“మరింకేంది నలభై లక్షలు.. ఎప్పుడైన చూస్తవా జన్మల అంత డబ్బు.. హాయి గమ్ముకొని ఎక్కడ్నో కొంత భూమి కొనుక్కుని పిల్లల్ని తీసుకొనిపోక.. ఏందయ్యా, తరతరాల భూమి అంటవ్.. నో సెంటిమెంట్.. ఆలోచించుకో..” రామలింగం వెళ్లిపోయాడు.

ఎక్కడో కుట్ర జరుగుతోందనుకున్నాడు సుందరయ్య.

ఎవడో ఢిల్లీ నుండి ఇక్కడి పదిరవై ఊళ్ళను కబ్జా చేయడమేమిటి.. ఇక్కడ ఏదో కార్ఖాన పెట్టడమేమిటి.. వాడెవడో ఎవనికో ఉద్యోగాలిస్తాడంటే తాము ఊళ్ళమ్ముకొని తమ బతుకులను మట్టిపాల్జేసి వెళ్లిపోవడమేమిటి.

అప్పటినుండి సుందరయ్య తనువంతా కళ్ళు, చెవులు చేసుకుని ఊర్లోని ప్రతి ఒక్కరినీ పరీక్షగా గమనించడం మొదలెట్టాడు.

ప్రతి సాయంత్రం.. ఎక్కడ నుండొస్తున్నాయో.. ఊరు ఊరంతా, ఆడా మగా అందరూ సీసాలకు సీసాలు తాగుతున్నారు. బిర్యానీ పొట్లాలొస్తున్నాయి, ఎక్కడినుండో. మనుషులు గుంపులు గుంపులుగా కాకుండా ఎవనికివాడే రహస్యంగా ప్రవర్తిస్తున్నాడు. ప్రతివాడూ తన కడుపులో ఏముందో బయటికి చెప్పకుండా ఎదుటివాని విషయాన్ని పసిగట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఊరు ఊర్నంతా ఓ మాయ, ఓ నిషా, ఓ కనికట్టు కమ్మేసింది.

ఎవనినోట విన్నా ఎకరాలు.. లక్షలు.. చాకలి, మంగలి, మాల, మాదిగ.. ఏ కులపోడైనా.. తమ భూమిని ఉజ్జాయింపుగా లక్షల్లోకి లెక్కకట్టుకుని.. ఆ లక్షలతో ఏంజేయాలని.. ఆ కట్టలతో ఎలా ఎక్కడ స్థిరపడాలని, ఎన్నడూ లక్షల ముఖం చూడని మనుషులు కలల కౌగిళ్ళలో ఉక్కిరిబిక్కిరైపోతూ...

✡

మొట్టమొదట మంగలి రాములు తన రెండెకరాల భూమిని అమ్మి ఇబ్రహీంపట్నం పోయి రిజిస్ట్రేషన్ చేసి ఆరు లక్షల రూపాయలను తెచ్చాడు ఒక చేతి సంచి నిండా. సాయబు హోటల్‌లో అందరికీ చూపించాడు కట్టలను.. అన్నీ వంద రూపాయల కట్టలు. చూచిన వాళ్ళందరి దిమ్మ తిరిగిపోయింది.

రాములను ఎవరో కార్లో తీసుకొచ్చి సాయిబు హోటల్ ముందర దించి వెళ్ళి పోయారు. అతను అప్పటికే పీకలదాకా తాగి వత్తి అంటించిన చిచ్చుబుడ్డిలా ఉన్నాడు. అప్పటికే అక్కడ ఎప్పట్నుండో ఎదురుచూస్తున్న మంగలి రాములు పెళ్ళాం సాయమ్మ మొగుణ్ణీ, డబ్బునూ ఒడిసి పట్టుకుని.. "ఈనోట్లు పాడుగాను. కొరుక్క తింటమా వీటిని.. ఇరవై ఏండ్ల నుండి రెక్కలు ముక్కలు చేసుకున్న భూమితల్లి పాయె.. ఈ చేతుల్తోటి నాటిన, కలుపు తీసిన, కోసిన, నాల్గు మెతుకులు తిన్న.. పాసిపాయె.. ఇయాల్టితోటి ఆ భూదేవికి మాకు ఋణం పాసిపాయె.." ఒకటే ఏడ్పు.. ఆమె విలవిలా ఏడుస్తూనే తాగి వూగుతున్న మొగుణ్ణీ, డబ్బు సంచీని నడిపించుకుంటూ.. చీకట్లో.. కనబడకుండా పోయింది కాసేపటికి.

తర్వాత నిశ్శబ్దం, ఎదురుగా.. అంతా చీకటి.

సుందరయ్య సాయిబు హోటల్లో.. గుడ్డి దీపపు వెలుగు ముందు మౌనంగా కూర్చుని ఆలోచిస్తున్నాడు.

రెండెకరాలు.. ఆరు లక్షలు, నిజానికి ఎక్కువ రేటే.

ఇంత రేటు పెట్టికొన్నోడు, వ్యవసాయమంటేనే తెలువనోడు. ఈ భూమిని కొని ఏంజేస్తడు.

తప్పకుండా అంతకన్నా ఎక్కువకు ఎవనికో అమ్ముతడు, లేదా అంతకంటే ఎక్కువ డబ్బును ఈ భూమిలో నుండి ఏదోరకంగా పుట్టిస్తడు.. ఐతే,

భూమికీ మనిషికీ.. ఒట్టి మట్టికీ, డబ్బుకూ ఉన్న సంబంధమే ఉందా. ఏండ్లకు ఏండ్లు ఈ భూమిని దున్ని, ఈ మట్టిని పిసికి, ఈ నేలపై నడిచి, ఈ గాలిని పీల్చి, ఈ పచ్చని చెట్లనీడన విశ్రమించి.. ఒక తల్లితో పిల్లలకు ఏర్పడే అనుబంధం వంటి సంబంధం సంగతేమిటి. కాలికి ముల్లు గుచ్చుకుంటే కంటికి నీరొస్తదిగదా.. మట్టిని నమ్ముకున్న మనిషికి గుండె పగిలి.. భూమి నుంచి మనిషి విడివడి వేరయ్యేదెట్లా.

ఈ అనుబంధం విలువ ఎంత. అనుబంధం ఉన్నంత మాత్రాన డబ్బుతో కొలువబడే విలువలు మారతాయా, మట్టిముంతలో ఉండే నీళ్ళు, కల్లు, బంగారం వంటి పదార్థం విలువలు మారతాయిగాని మట్టి ముంత విలువ అంతే ఉంటుందికదా. ఆనాటి రాత్రే.. సుందరయ్య ఇంటికి తిరిగొచ్చి.. అన్నం తింటూండగా పెద్దకొడుకు రాజకొంరు అన్నాడు. 'మన భూములను కూడా అమ్మదమానె' అని.

ఊరు ఊరినంతా భూమిని అమ్ముకోవడం పిచ్చి కమ్మేసింది. ఒకప్పుడు ప్రతి ఒక్కరూ భూమిని నమ్ముకున్నవాళ్లు, వ్యవసాయం పనుల మెళకువలు ఒకర్నుంచి మరొకరు తెలుసుకొని పోటీపడి పంటలు పండించి నిండుకుండల్లా పండు వెన్నెలై బతికినవాళ్లు.

ఏమిటి మైకం.. ఏమిటి డబ్బు నిషా.. మనిషికి అవసరాలకు మించిన ఇంత డబ్బు అవసరమా.. ఎప్పుడూ ఓ అయిదు, పదివేల రూపాయలకంటే ఎక్కువ డబ్బు ముఖం చూడని ఈ జనం లక్షలకు లక్షలు కట్టలు కంటబడగానే కల్లుతాగిన కోతులై పిచ్చి పిచ్చిగ చేస్తున్నరు.

"...ఏమంటనే నాయిన.. షేక్ సాయిబు నిన్న హైదరాబాద్ పోయి కనుక్కున్నడట.. వాడెవడో ఓ రెండు వందల ఎకరాలు కొని ఇగ ఊకుంటడట.. అటెంక మిగతా భూమి పడావ్ పడ్తది. ఆలస్యమైతే మనం గవర్నమెంటు చేతిల్నే పెట్టాలె. వాడేమిస్తడు మన్ను.. దీపముండగనే యిల్లు సక్కబెట్టుకోమన్నరుగదా పెద్దలు.."

సుందరయ్య అన్నంముద్ద నోట్లో పెట్టుకునేటోడు చటుక్కున ఆగి ముప్పయి ఏండ్ల కొడుకు ముఖంలోకి చూచిండు. రాజకొంరు ముఖం భూమిని అమ్ముకుంటే రాబోయే లక్షలకొద్దీ డబ్బు ఊహతో కైపెక్కి తోమిన రాతిగిన్నెలా ఎర్రగా, ఉద్విగ్నంగా ఉంది. సుందరయ్య ఏమీ మాట్లాడలేదు.. ఒక సూటి చూపొకటి చూచి, మళ్ళీ తల వంచుకుని అన్నం తినడం మొదలెట్టాడు.

ప్రక్కనే భార్య భూదేవి కుప్పబోసిన దు:ఖంలా కూర్చొని అన్నంగిన్నెల దిక్కూ, నేల దిక్కూ చూస్తోంది. హాల్లోనే గడంచె మీద రాజకొంరు యిద్దరు పిల్లలు.. రాణి, రవి నిద్రపోతున్నారు. కోడలు ప్రక్క అరుగుమీద ఏదో చెరుగుతోంది చేటతో.

సుందరయ్యకు హైద్రాబాద్‌లో హాస్టలులో వుండి డిగ్రీ చదువుకుంటున్న రెండో కొడుకు శీను జ్ఞాపకమొచ్చాడు. ఇద్దరే కొడుకులు తనకు. పెద్దోడు ఊళ్ళోనే పది ఫెయిలై ఇక తన వ్యవసాయ పనుల్లోనే వెంటున్నడు. రాజకొంరు తర్వాత పన్నేండేళ్ళకు పుట్టిన శీనుకైనా నాల్గు అక్షరాలు చెప్పించాలని పట్నం పంపి.. హాస్టల్లుంటడు. బాగానే చదువు తాన్నంటడు. సెలవుల్ల వచ్చినపుడు వ్యవసాయం పనులు చేస్తడు. హుషారే భూమి పనులల్ల.

"రెండేండ్ల కిందనే భూమినంత మీ ఇద్దరి పేర చేసిన గదరా రాజకొంరు. నీది ఎనిమిదెకరాలు.. తమ్మునికి నాల్గు. భూమి ఉంచుకునుడా, అమ్ముకునుడా మీ ఇష్టం. తమ్ముణ్ణి కూడా అడుగు...".

"రేపు పట్నం పొయ్యిరానా.."

"నీ ఇష్టమన్నగదా"

"నువ్వు మనస్ఫూర్తిగ చెప్పలేదే నాయిన.."

"ఏంజెప్పేది బిడ్డ.. నడమంత్రపు డబ్బు కట్టల కట్టలు గుట్టలోలె నెత్తిలపడి మనుషులను పాపబట్టె.. ఉన్న తావిడిచి ఏడికి పోతంబిడ్డా.. అంతా మాయ, మనుషులను మాయ కమ్మేసింది. ఎవుని మాట ఎవుడింటడు.. కానీ.."

సుందరయ్య కంచంల చేతులు కడుక్కుని లేచి బయటికి.. వాకిల్లోకి వెళ్ళిపోయాడు. బయట వెన్నెల పిండారబోసినట్టు తెల్లగా పరుచుకుని ఉంది ఊరినిండా. వూరంతా నిశ్శబ్దం. ఎక్కడో వూరకుక్క మొరుగుతోంది.

అందరి ఇండ్లలో ఇంతే. తర్జన భర్జన. లోలోపల పిసుకులాట. కుమ్ములపెట్టిన కంద గడ్డోలె.. కుతకుత ఉడికిపోవుడు. పైకి మాత్రం అంతా నిశ్శబ్దమే... నివురుగప్పిన నిప్పు.

✡

నెలరోజులు గడిచిందో లేదో.

దాదాపు అందరూ భూమిని అమ్మేశారు. వాడెవరో కార్లలో ఊరికి రావడం మానేశాడు. వీళ్ళే ఏ సర్పంచ్‌నో, వార్డుమెంబర్‌నో పట్టుకుని పోవుడు.. రిజిష్టర్ చేసుడు.. డబ్బు తెచ్చుకునుడు.

రాత్రింబగళ్ళు తాగుడు.. వూళ్ళె కొత్తగా రెండు వైన్‌షాపులు పడ్డయి.

వూరు సగంకన్నా ఎక్కువే ఖాళీ అయింది.

గూన పెంకల ఇండ్ల ముందట కొన్ని కొత్తకార్లు కనిపిస్తాన్నై. పైసున్నప్పుడే సుఖం.. ఎంజాయ్ చెయ్యి అంటున్నరు. చదువురానోళ్లు కూడా సెల్‌ఫోన్ల మాట్లాడ్తున్నరు.

సుందరయ్యకు అంతా వెనుకట విఠలాచార్య సినిమాల చూచినట్టు వింతగా, నమ్మశక్యం కాకుండా, మాయవలె.. గమ్మత్తుగా ఉంది.

రాజకొంరు సర్పంచుతోని భలే దోస్తీ చేస్తాండీమధ్య.. వాళ్ళిద్దరి చిన్నప్పుడు ఒకటే బడి.

ఐతే వూరు వూరంతా నిద్రపోతున్న కూకేటి పాము వలె ఉంది. అందరి కళ్ళలో భయం. లక్షలకు లక్షల రూపాయలను ఎక్కడ దాయాల్నో తోచని భయం. ఏమైతదోనన్న ఉద్విగ్నత.. నిన్నటిదాకా రాళ్ళు రప్పలనుకున్న భూమి లక్షలను కురిపించడం.. ఇదంతా ఏంది..?

సుందరయ్యకు గత దినం రాత్రి తనకూ, రాజకొంరుకూ నడుమ జరిగిన సంభాషణ జ్ఞాపకమొచ్చింది. అప్పుడు భూదేవి కూడా ఉంది ప్రక్కనే. మౌనంగానే విన్నది అంతా.. నిజంగానే భూదేవిలా.

"నాయినా జాగ్రత్తగ ఇను. రామలింగం చెప్పిండు. ఇగ మనూళ్ళె భూమి అంతా ఐపోయింది. ఒక్క మన పన్నెండెకరాలు, రామలింగం ముప్పయి రెండు, గా మన్నెపోళ్ళయి ఎనిమిదెకరాలు.. గిదే మిగిలింది. రామలింగం మొన్న హైద్రాబాద్ పోయి కపూర్‌సాబ్‌తోని మాట్లాడిండట. లాస్ట్ కాబట్టి మనకు ఎకరాకు ఐదు లక్షలిస్తన్నడట. మనకు జుమ్‌లా అరవై చిల్లరస్తది. ఇగ అమ్ముడమే. లేకుంటే ఒంటరోళ్ళమైపోతం. మంచి రేటే యిది. అందరికంటే ఎక్కువ. బయటికి చెప్పొద్దు. లొల్లయితది. రేపే పొద్దాల చీకట్ల రామలింగం, నేను పట్నం బయల్దేర్తానం. తమ్ముణ్ణి అట్లనే వెంటబెట్టుకొని ఇబ్రహీంపట్నంల రిజిష్టర్ చేసి రాత్రివరకు డబ్బుతోని పైలంగ ఇంటికస్త.." రాజకొంరు చెబుతూనే ఉన్నడు.

ప్రక్కన కోడలు గోడకు చేరగిలబడి వింటూనే.. "అర్వయ్ లచ్చలా.." అంది మధ్యలో.. షాక్ తిన్నట్టు.. ఉండబట్టలేక.

"ఒగ్రకే పిచ్చిదాన.." గదమాయించిండు రాజకొంరు.

ఆమె లేచి నిశ్శబ్దంగా బయటికి వెళ్లిపోయింది.

సుందరయ్యకు ఒళ్ళంతా తిమ్మిరెక్కినట్టు ఉంది. ఎవరో సుత్తెతో తలపై బలంగా బాదినట్టు. అంతా దిమ్మెక్కిపోయినట్టు.

రాజకొంరు ముఖంలోకి ఓ అర్థంలేని పిచ్చి చూపొకటి చూచి.. సుందరయ్య కూడా ఇంట్లో నుండి బయటికి నడిచాడు భారంగా.

అప్పుడు కూడా.. ఇలాగే.. ఆకాశం నుండి బంగారప్పొడి రాలుతున్నట్టు పిండి వెన్నెల. వెన్నెట్లో, వాకిట్లో నులకమంచంపై వెల్లకిలా పడుకుని...

ఆకాశంలోకి చూస్తుంటే, అన్నీ మబ్బులే.. వెండిమబ్బులు...

పిచ్చిమబ్బులు.. పిచ్చి చంద్రుడు.. పిచ్చి ఆకాశం.. పిచ్చి భూమి...

✡

"భూదేవీ ఏంజేస్తానవే.. నిద్రస్తలేదు.." అన్నాడు సుందరయ్య భార్యనుద్దేశించి.

పక్కనున్న నులకమంచంలో భూదేవి ఇటువైపు తిరిగి... "నాక్కూడ నిద్రపడ్తలేదు. ఇవ్వాల్టితోటి దిక్కులేని పచ్చులమైపోయినమనిపిస్తాంది."

"డబ్బుందిగదనే.. బస్తానిండా నోట్లే.. నీ కొడుకు తెచ్చిండుగదా"

"ఏం జేస్కుంటవ్.. బంగారాన్ని తింటవా.. తింటాన్కి నాల్గు మెతుకులు కావాలెగాని".

సుందరయ్య మాట్లాడలేదు. అతనికి రాత్రి జరిగిన సంగతులన్నీ జ్ఞాపకమొచ్చినై. ఆ రోజు రాత్రి.. పదిగంటలు దాటిందేమో.. అనూహ్యంగా తన ఇంటి ముందు వాకిట్లో కొత్త కారు సర్రున వచ్చి ఆగింది. ఎవరబ్బా అని ఆశ్చర్యంతో తనూ, భూదేవీ, కోడలు, ఇద్దరు పిల్లలు... అందరూ బిలబిలమని అరుగుపైకి ఉరుకొచ్చి చూస్తే...

కార్లో నుండి రాజకొంరు దిగుతున్నడు. దిగి డ్రైవర్‌కు రెండు వందల రూపాయల నోట్లివ్వగానే, కార్‌ను అటుయిటు సర్ది సరిగ్గా చెట్టు క్రింద నిలబెట్టి నమస్తేపెట్టి వెళ్లి పోయిండు. వాడు పోయిన తర్వాత చిన్నకొడ్కు శీను దిగిండు, చేతిలో నల్లటి పెద్ద బ్యాగ్‌తో, టకటకా ఇంట్లోకి నడుచుకుంటూ అందరూ వచ్చి.. శీను బ్యాగ్ గడంచెపైన పెట్టి... అరుగుల దిక్కున్న పెద్ద దర్వాజ మూసి..

"నాయినా.. రావే.. ఒక్కసారి ఈ బ్యాగ్‌లకు చూడు" అన్నాడు వెలిగిపోతున్న ముఖంతో. అని.. బ్యాగ్‌ను తెచ్చి తనకూ, తల్లి భూదేవికి చూపించాడు. అన్నీ కట్టల కట్టలు డబ్బు. కుక్కి కుక్కి సంచి నిండా సర్దితెచ్చింద్రు.

"దీన్ని అందాక గీ గుమ్మిలపెడ్త.. రేపు చూద్దాం.. వీటి సంగతి.."

ఈ లోగా రాజకొంరు మరో ప్లాస్టిక్ బ్యాగ్‌లో తెచ్చిన చికెన్ బిర్యానీ పొట్లాలనూ, మిఠాయి పొట్లాలను విప్పి గడంచె పైన సర్దిండు.. ఇల్లంతా బిర్యానీ వాసన, స్వీట్ల ఘుమ ఘుమ వ్యాపించింది. పిల్లలు ఎగబడి తినడం ప్రారంభించి.. సంబరం దాదాపు రెండు గంటలు..

రాజకొంరు చెప్పుకొచ్చాడు. హైద్రాబాద్‌ల ఎలా యికమత్‌గ భూమిని ఐదు లక్షలకు ఎకరం చొప్పున అమ్మిందీ, ఎలా మారుతికార్ కొన్నదీ.. ఎలా క్యాష్‌ను జాగ్రత్తగా పట్టు కొచ్చిందీ... శీనూ వంత పాడాడు అన్నతో.. ఇద్దరి ముఖాల్లోనూ డబ్బు తాలూకు అంతులేని ఆనందం. పన్నెండు దాటేదాక ముచ్చట్లు పెట్టీ పెట్టీ.. పిల్లలు కొత్త కార్లో ఆడీ ఆడీ..

రాజకొంరు శీనుకు స్వీట్‌ను తినిపిస్తూండడం ఎందుకో సుందరయ్య యాదృచ్ఛికంగా గమనిస్తూ... గమనిస్తూ...

చివరికి పన్నెండు దాటింతర్వాత..

చిన్నాయన శీనుతో కలిసి పిల్లలిద్దరూ కొత్త కార్లోనే నిదురపోయారు. రాజకొంరు, కోడలు గుమ్మిపక్కనున్న వాళ్ళ గదిలోకి వెళ్ళిపోయారు.

ఇక నిశ్శబ్దం మిగిలి.. ఎనగఱ్ఱ కింద హాల్‌లో.. సుందరయ్యా భూదేవి.

ఎవరి నులక మంచాల్లో వాళ్ళు.. ఎడతెగని ఆలోచనలు. తామిద్దరూ కొత్తగా పెళ్ళి చేసుకుని ఈ ఊరికి కాపురమొచ్చి.. బంగారం అమ్మి కొద్దిగా చెల్క సంపాదించుకుని.. ఇద్దరికిద్దరూ రెండు జతల కాళ్ళు, రెండు జతల కళ్ళు, రెండు చక్రాలు, రెండు జతల చేతులుగా వ్యవసాయం చేసి చేసి.. ఎన్ని ఎండలు.. ఎన్ని వానలు.. ఎన్ని వరదలు.. ఎన్ని కరువులు.. వాన కోసం ఎన్ని ఎదురుచూపులు..

భూమిని సొంతం చేసుకుని.. చెల్కను పొలం చేసి, రాళ్ళను చేన్లు చేసి.. భూమి పండి.. పంటలై, భూదేవి కడుపు పండి పిల్లలై.

బతుకంతా కాయకష్టం.. రాత్రింబవళ్ళు కనురెప్పలా కాపలా, రెక్కలు దించని ప్రయాణం.. ఎప్పుడో భూమి..మట్టి.. మొక్క..చెట్టు పచ్చని ప్రకృతి.. చల్లనిగాలి.. అదో లోకం.

ఎందుకో సుందరయ్యకు మళ్ళీ దు:ఖం ఒక ఉప్పెనై మంచుకొచ్చింది.

'ఇక రేపట్నుండి.. తన పొలం తనది కాదా.. తన బావి, తన పంపు, తన నీళ్ళ ట్యాంక్.. తను తీసిన పంటకాల్వలు.. ఇవన్నీ తనవి కావా..'

రాత్రి చూచిన డబ్బు సంచి మెరిసింది కళ్ళలో.

కళ్ళనిండా నీళ్ళు.. ఎగిసెగిసి వస్తున్న ఏడుపు.

నిద్రపోని కళ్ళు ఎఱ్ఱగా.. మండుతున్నాయి.

గోడ గడియారం చూశాడు సుందరయ్య.. ఐదు కావస్తోంది.

ఇక వశం కావడం లేదు. మంచంలోనుండి లేచి కిటికీలో నుండి బయటికి చూశాడు. తెలతెలవారుతోంది. చెట్టు కింద కొత్తకారు.

బట్టలేసుకుని, చేతిలోకి కఱ్ఱ తీసుకుని సుందరయ్య చెప్పులు వేసుకుంటూండగా, "ఏడ్కిపోతానౌ గింత పొద్దున." భూదేవి మాట విన్పించింది.

భార్య దిక్కు.. అతి దీనంగా చూచి.. "ఇక ఆఖరిసారి తనివితీరా పొలాన్ని చూస్కొని వస్తనే. మనసంతా కాల్తున్న కాష్టంలెక్కున్నది. భూదేవీ వస్త" అని ఒక్కడే వీధిలో నుండి.. మట్టి బాటపై నుండి.. పొలం దిక్కు.

పది నిమిషాల్లో పొలంగట్టుపైకి చేరి..

మోటార్ స్విచ్‌ను ఆన్‌చేసి.. మొన్ననే పూడిక తీయించిన బావిలో నుండి నీళ్ళు బయ్‌మని సంప్‌ల పోస్తుండగా... రెండు చేతులనూ నీటి జాలులో చొప్పించి.. చిన్న పిల్లాడిలా పులకించి.. చుట్టూ పచ్చని పొలాన్ని కలియజూసి, పొలాలు.. పొలాల కవతల తాటిచెట్లు.. పైన కట్ట, ఆపైన గుండ్లు.. గుట్టలు.. ఆపైన తెలుపెక్కుతూ తెలవారుతున్న ఆకాశం...

తన భూమి.. తన పొలం.. తన చెట్లు.. తన గట్లు.. తన ఆకాశం..,

సుందరయ్య దబాల్న పడిపోయాడు నీటి సంప్‌లో. పైన నీటిజాలు ఉధృతంగా దూకుతూనే ఉంది.

చుట్టూ.. తిరుగుతున్న సంప్ చప్పుడు, నీటి చప్పుడు, తలలూపుతున్న వరిపైరు చప్పుడు.. చల్లని గాలిచప్పుడు.. పావుగంట తర్వాత ఎవరో పరుగెత్తుకుంటూ వచ్చారు రాజకొంరు దగ్గరికి.. 'పొలందగ్గర పంప్‌ల మీ నాయిన సచ్చిపడున్నడు', అనే వార్తతో.

వార్త విన్న రాజకొంరు షాక్ తిని భోరున ఏడ్వలేదు. ఆ వచ్చినవాడు వెళ్ళిపోగానే.. కొత్త మారుతి కార్ దగ్గరికి హడావుడిగా వెళ్ళి డ్రైవింగ్ సీట్‌లో పడుకున్నట్టు ఉన్న తమ్ముడు శీను ముక్కు దగ్గర వేలుపెట్టి చూశాడు. ప్లాన్ ప్రకారమే విషం కలిపి తను ఇచ్చిన స్వీట్‌ను కడుపునిండా తిన్న తమ్ముడు.. శాశ్వతంగా వెళ్ళిపోయాడు. కారు వెనుక సీట్లో తన పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు ఇంకా.

తృప్తిగా నిట్టూర్చి రాజకొంరు గబగబా ఇంట్లోకి వెళ్ళి రాత్రి గుమ్మిలో దాచిన డబ్బు బ్యాగ్‌ను తెరిచి చూచుకున్నాడు తృప్తిగా... సంతోషంగా. నోట్ల కట్టలు దట్టంగా అలాగే వున్నాయి.

తండ్రిపోయాడు.. తమ్ముడూ పోయాడు..

ఇక డబ్బంతా తనకొక్కడికే..

ఎదురుగా నులకమంచంలో తల్లి భూదేవి వెల్లగిలా పడుకుని కనిపించింది. రాజకొంరుకు. ఆమె కళ్ళు నిశ్చలంగా ఉన్నాయి.

ఆమె బతికే ఉందో, చచ్చేపోయిందో అతనికి అర్థంకాలేదు.

✡

# కరువు పీల్చిన మనుషులు

**–పి.రామకృష్ణ**

రామమోహనరావు గారికి నమస్కారం. అనంతపురం జిల్లా విశేషాలతో పెద్ద వుత్తరం రాయమన్నారు. అనంతపురం జిల్లాకు ఇప్పుడు శేషాలే లేవు. విశేషాలెక్కడి నుంచి వస్తాయి? ఇక్కడ ఎటుజూసినా కండ్లకు కనిపించేది కరువే. కరువును గురించి చెప్పడానికి సాధ్యమవుతుందా, కండ్లతో సూడాలిగానీ. సూడ్డం కూడా సాధ్యం కాదేమోలే. ఎందుకంటే కండ్లతో సూడలేనివీ శానా వుంటాయి. మీకు జ్ఞాపకముందా? పదేండ్ల కిందట 'కరువు–కథాసాహిత్యం' అనే అంశం మీద అనంతపురంలో సభ పెట్టినప్పుడు మీరేం మాట్లాడారో? "రాయలసీమకు బాగా తెలిసిన కరువును గురించి రావల్సినన్ని కథలు రానేలేదు. ఒక్క కరువును గురించి చెప్పడానికి వంద కథలైనా చాలవు. అట్లాంటిది ఇన్ని కరువులొస్తే, ఎన్ని కథలొచ్చినాయి?" అన్నారు.

కరువును గురించి కథ రాయడమనేది నాకెప్పుడూ సమస్యే. ఏదో ఒక సెంటిమెంటును తీసుకుని, కరువును గురించి చెప్పగూడదని మల్లా మీరే అంటిరి. యాదో ఒక సెంటిమెంటు ను తీసుకోకుండా నేరుగా కరువును గురించి రాసేదెట్ట? సెట్లు ఎండిపోయినాయి. పైర్లు ఎండిపోయినాయి. తాగడానికి మంచినీళ్లు దొరకడంలా. ఇట్ల రాస్తే పత్రికలో వార్త అయిపోదా? ఆ మాటే అడిగితే, అందుకేమంటిరి! "సెంటిమెంటును ఆధారం చేసుకుంటే కరువు బృహద్రూపం మరుగున పడిపోయి, కేవలం సెంటిమెంటు మాత్రమే కనిపిస్తుంది" అంటిరి. ఇంకో మాటా అంటిరి. "కరువులో ఏ విలువలూ బతకవు. ఇక సెంటిమెంట్లు ఎట్లా బతికి వుంటాయి?" అని నాకు మీ అవగాహన మీద మొదట్నించీ గురి వుంది కనుక, ఆ విధంగా రాయాలని ప్రయత్నించి చూస్తి. ఊహూ...! కుదర్లా, నిజం సెప్పొద్దూ! "యాందో ఈయప్ప సెప్పేది? అట్టా సెప్పిన ఆయప్పే ఒక్కథ రాసి, ఎట్టా రాయాల్నో సెప్పి ఉండొచ్చుగదా! ఊరికే మాట్లాడ్తా, రాసినోళ్లనూ, రాయలనుకున్నోళ్లనూ గబ్బు పట్టిచ్చకపోతే" అని మా అనంతపురం బాషలో మిమ్మల్ని తిట్టుకొంటి. ఇప్పుడు మీరు చెప్పింది నాకు బాగా అర్థమయింది. కరువులో ఏ విలువలూ బతకవు. చాలా కరెక్టు.

కరువుల్లో బతుకుతూ ఉండీ ఈ సంగతి తెలుసుకోవడానికి నాకు పదేండ్లు పట్టె. కరువులంతగా తెలియని మీకే ఈ సంగతి ఎప్పుడో తెలిసె! ఆశ్చర్యంగా లేదూ! మీకుండదేమో

గానీ నాకుంది. సరే ఆశ్చర్యం సంగతి అట్టపోనీ గానీ, ఈ సంగతి నాకిప్పుడెట్ట తెలిసిందీ చెప్తా. ఇందులో కథల ప్రస్తావన లేదు గానీ రచయితల ప్రస్తావన వుంది. కనుక ఒక విధంగా నేను మొదట ప్రస్తావించిన 'కరువు– కథాసాహిత్యం' అన్న దాన్తో దీనికి కొంచెం దూరపు సంబంధమైనా వుంది. అనంతపురం జిల్లాలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న సంగతి మీకు తెలిసే వుంటుంది. రోజూ ఒకరో, ఇద్దరో ఆమూల్నో, ఈ మూల్నో కనపడని బకాసురునికి వరుసగా బలైపోతున్నారు. ఆ మాటకొస్తే అటు వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో, ఇటు ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో కూడా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎక్కడి రైతు, ఏ పంట వేసే రైతు అన్నది లేదు. వేరుసెనగ రైతు, పత్తిరైతు, పొగాకు రైతు... అందరికీ ఇప్పుడు కనిపిస్తున్నది ఆత్మహత్య! అదే వాళ్ల అన్ని సమస్యలకూ పరిష్కారం.

రాయలసీమవాళ్లకు కరువులు కొత్తవేం కావు. అబ్బబ్బల తరం నుంచీ వున్నవే. అప్పుడప్పుడూ వచ్చేటివి కావు. ఏదో ఒక ప్రాంతంలో ఏటా ఉండేవే. కాకపోతే మోతాదులో తేడా. ఇక్కడ తీవ్రంగా వుంటే, అక్కడ కొంచెం తక్కువ తీవ్రత. అంతే, ఎన్ని కరువులొచ్చినా రైతులవి మొండి బతుకులు. 'వచ్చే ఏడు'ను నమ్ముకుంటూ వందల ఏండ్లుగా బతుకుతూ వచ్చినోళ్లు. వాళ్లు ఒక్కరోజు పొరుగూరుకు పోయిరావాలన్నా.. ఆరోగ్యం బాగలేకపోతే టౌన్లో వున్న ఆస్పత్రికి పోయిరావాలన్నా పొలం పని కుంటయితాదని పోలేని వాళ్లు వాళ్లు. అటువంటి వాళ్లు శాశ్వతంగా తమ పొలాలనూ, కుటుంబ సభ్యులనూ, బాధ్యతలనూ వదిలి వెళ్లారంటే ఎటువంటి పరిస్థితిలో వుండి వుండాలి వాళ్లు? ఆ సంగతి ఆలోచించ కుండా ప్రభుత్వం ఇచ్చే పరిహారంకోసం ఆత్మహత్యలు చేసుకుంటున్నారనడం ఎంత అమానుష పరిహాసం!

రైతులను ఈ దీనస్థితి నుంచి ఎట్లా తప్పించాలా అని అనంతపురం జిల్లాలోని రచయితలమూ, కళాకారులమూ ఆలోచించాం. నిజానికి రైతుల సమస్యల విషయంలో మేం చెయ్యగలిగింది ఏమీ లేదు. ఏ ఒక్క సమస్యకూ మా వద్ద పరిష్కారం లేదు. కానీ, "ఆత్మహత్య మీ ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదు" అని వాళ్లకు అర్థమయ్యేట్టు చెప్పాలన్నదే మా ప్రయత్నం. బతికినప్పుడంతా ప్రభుత్వ నిరాదరణకూ, మరణించాక (ఆత్మ హత్యలు చేసుకుని!) క్రూర పరిహాసానికి గురికావడం కన్న, అప్పులిచ్చినవాళ్ల తిట్లనూ, బెదిరింపులనూ భరిస్తూనైనా బతికి వుండి మీ వాళ్లకు తోడుగా వుండటం మేలు కదా" అని చెప్పదలిచాం. "ధైర్యం తెచ్చుకోండి. లేదా మొండిగానైనా బతకండి. ఆత్మహత్యలు చేసుకోకండి" అదీ మా ప్రచారం. "సాయుధ పోరాటానికి సిద్ధం కండి" అని మా తీర్మానంలో చేర్చనందుకు ఇద్దరు ముగ్గురు అలిగి వెళ్లిపోయారు. రైతులను ఇప్పుడున్న పరిస్థితిలో సాయుధపోరాటం చేయమనడం ఎంత అసంబద్ధంగా, హాస్యాస్పదంగా వుందో వివరించి, వాళ్లను ఒప్పించలేక పోయాం. మమ్మల్ని ప్రభుత్వ అనుకూలురుగా, రైతు వ్యతిరేకులుగా తిడుతూ వాళ్లు వెళ్లిపోయారు. ఆ విధంగా మేం కొన్ని రోజులు గ్రామాలు తిరిగి ప్రచారం చేశాం. అందువల్ల ఎంతవరకూ ప్రయోజనం కలిగిందో చెప్పలేం. ఏ సమస్యకూ పరిష్కారం చూపించకుండా

“ధైర్యం తెచ్చుకోండి” అంటే. తెచ్చుకోవడం అంత తేలిక కాదని మాకప్పు డర్థమయింది. అంతేగాదు, ధైర్యం తెచ్చుకుని ఆ తర్వాత ఏం చేయాలో చెప్పకుండా, “వూరికే ధైర్యం తెచ్చుకుని వుండండి” అని చెబుతున్నట్టనిపించి లోలోపల సిగ్గుపడిపోయాం.

ఇదివరకటి కరువుల్లో ఆత్మహత్యలు చేసుకోని రైతులు ఇప్పుడెందుకు చేసుకుంటున్నా రన్నదీ ఈ సందర్భంలోనే అర్థమయింది. ఇప్పుడు రైతుల బతుకులు వాళ్ల చేతుల్లో లేవు. చావులు మాత్రమే వాళ్ల చేతుల్లో వున్నాయి. ఆర్థిక సరళీకరణ వాళ్ల బతుకుల్ని కష్టతరం చేసి, చావులను సరళం చేసింది. నకిలీ పురుగు మందులు, పురుగుల్ని చంపి రైతులను బతికించవు కానీ, రైతులను మాత్రం చంపగలవు. కరెంట్ వాళ్ల బతుకులకు వెలుగునివ్వదు. కానీ, వాళ్ల బతుకుల్ని కటిక చీకట్లో కలిపేందుకు గ్యారంటీగా పనిచేస్తుంది. వాళ్ల చేతుల్లో లేని వాళ్ల పంటల ధరలు వాళ్ల బతుకుల్ని ‘ధరహాసం’తో వెక్కిరిస్తాయి. (ఆత్మహత్యల్ని ప్రభుత్వ పక్షం పరిహసించినట్టు). తలకు మించిన వడ్డీలతో తెచ్చిన అప్పుతో తవ్వుకున్న బావులు వాళ్ల బతుకుల్నే మింగుతాయి. ఒక్క వాన కురిస్తే బతికిపోతాం అనుకున్న రైతులకు ఇప్పుడటు వంటి భరోసా ఏదీ లేదు. ఆ ఒక్క వాన కురిసినా తీరని వంద సమస్యలున్నాయి. ఆ సమస్యలన్నిట్నీ తీర్చే మార్గంగా చావు మాత్రమే కనిపిస్తోంది. ‘చావు పరిష్కారం కాదు’ అన్నది బయటివాళ్ల మాట ద్వారా కాక, వాళ్ల బతుకుల్లో రుజువైతే తప్ప, ఆత్మహత్య ఆలోచన వాళ్లనుంచి వైదొలగదనిపించింది.

ఈ విధంగా మా ప్రయత్నం బెర్నార్డ్ షా చెప్పినట్టయింది. షా ఒకసారి ఖైదీల పరిస్థితి ఎలా వుందో తెలుసుకోవాలనుకున్నారట. షా అంతటివాడి కోరికను జైలు అధికారులు తిరస్కరించలేరు కదా! పైగా, ఆయన్నుంచి అభినందనలు పొందితే అది తమకు ‘క్రెడిట్’ అవుతుందాయె. అందువల్ల అందుకేర్పాట్లు చేయడమే కాక, షా వెంట వుండి ఖైదీలను చూపించారు. మౌనంగా పరిశీలించిన షా బయటికొచ్చారు. జైలు అధికారుల కోరికపై ‘విజిటర్స్ బుక్’లో ఇలా రాశారట. “వీళ్లను ఇలా నిర్బంధించడం అమానుషం. విడిచి పెట్టడం అపాయకరం. సంస్కరించడం అసాధ్యం.” అలాగే రైతుల ఆత్మహత్యలను చూస్తూ ఊరుకోవడం అమానుషం. వాళ్లకు ధైర్యం కలిగించకపోవడం అపాయకరం. వాళ్ల సమస్యల్ని పరిష్కరించడం అసాధ్యం.

ఆ పర్యటనలో ఇంకో దారుణమైన విషయం తెలిసింది. అది మీరు “కరువులో ఏ విలువలూ బతకవు” అన్నారే దాన్ని రుజువు చేసేది. ఒకరోజు అన్నం తిందామని అందరం కదిరిలో ఒక హోటల్‌కు పోతిమి. అక్కడ సోఫాలో ఒకామె కూచొని ఒక ముసలాయన్తో మాట్లాడతా వుండె. ఆమెను చూసి, ‘పాపేనా?’ అనుకుంటా వుంటి (ఈ పాపెవరో మీకు తెల్దు గదా పాపం!) అంతలో ఆమె లేచి పోబోతూ, “సిన్నాయనా! నువ్వా” అని. “అమ్మెట్టుండాది? అందరూ బావుండారా?” అని ఆప్యాయంగా అడిగె. “బావుండారు” అని, అక్కడికెందుకొచ్చిందీ చెప్తి. “రెండయితాంది. నువ్వు భోంచేసి రా సిన్నాయనా. నేను ఈ

యప్పను పంపించి మల్లా వస్తా" అంటే, "ఎవరాయప్ప" అనడిగితి. "మా నాయన గదా సిన్నాయనా" అని, ఆయప్పను తోడుకొనిపాయె. "అట్టయినాడా!" అని ఆశ్చర్యపోతి. అన్నం తింటూ వున్నా. అప్పటి పాప నాయన జ్ఞాపకం వస్తున్నాడు. ఆయప్ప పేరు రామప్ప నాయుడు. ఇంత పొడుగు మీసాలతో రామప్ప రావణప్ప మాదిరుండేవాడు. వాళ్ల వూరి దగ్గర తమకు భూములున్నాయన్న పొగరు, అనంతపురంలో మా పక్కింట్లో వున్నా చూపించేవాడు. రామప్ప భార్య – ఆమె పేరేందో జ్ఞాపకం లేదు. ఆమె కూడా చాలా ఘరానాగా వుండేది. అట్లా జ్ఞాపకం చేసుకుంటూనే అన్నం తిని హెూటల్ ముందు గదిలోకివచ్చేసరికి పాప కూచొని వుంది. నా ఆశ్చర్యం ఇంకా పోలా. "మీ నాయన అట్టయినాడా" అంటి. "అయినాడు" అన్నట్టు పాప నవ్వి తలూపింది. "నువ్వు జెప్తివి గదా సిన్నాయనా, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న సంగతి. మా నాయన చేసుకోలా, అంతే తేడా" అని కొంచెం ఆగి ఊపిరి పీల్చుకుని వదిలింది. ఆమె విశ్వాసం నాకు వెచ్చగా తాకినట్లనిపించింది. "చేసుకునున్నా బావుండేది" అంది. ఆ మాట ఆమె నాతో అన్నట్టుగా లేదు. ఎన్నోసార్లు ఆ మాటను ఆమె లోపల్నో, బయటికేనో అనుకున్నట్టుగా వుంది. ఆత్మహత్యలు చేసుకోవద్దని రైతులకు మేం చెబుతుంటే, వాళ్ల నాయన ఆత్మహత్య చేసుకునేంటే బావుండేదంటోంది పాప! అలా అనవద్దని ఆమెను వారించలేకపోయాను కానీ, ఆమె ముఖంలోకి పరిశీలనగా చూశాను. పాప కూడా మారిపోయింది. ముఖం నల్లగా కమిలినట్టుంది. కళ్లకింద అంతకంటే నల్లని చారలు. అక్కడక్కడా తలలో తెల్లబడుతున్న వెంట్రుకలు. ఈమెను చూస్తూ అప్పటి పాపను జ్ఞాపకం చేసుకుంటున్నాను. తానెవర్నో పెళ్లి చేసుకుంటానంటే, కొడవలి తీసుకుని నరుకుతానని వాళ్ల నాయన మీదికొచ్చి నప్పుడు, దెబ్బలు తిని ఏడుస్తున్నప్పుడు కనిపించిన పాపను జ్ఞాపకం చేసుకుంటున్నాను. నా ఆలోచనని, నాలో తిరుగుతున్న జ్ఞాపకాలను పాప కనిపెట్టినట్టుంది. "వారానికీ, పది రోజులకూ వస్తాడు. బ్రోతల్ హౌస్‌లో వున్న కూతురు దగ్గర డబ్బు అడుక్కోవడానికి, బస్సు చార్జీలు కూడా ఇస్తే మరింత సంతోషం".

పాప ఎవర్ని గురించి చెబుతున్నదీ అర్థమయింది.

"బ్రోతల్ హౌస్‌లో వున్న కూతురు" ఎవరో మరి కొంతసేపటికి అర్థమయింది. "పాపా" అని అరిచానో లేక నోట మాటే రాలేదో తెలియదు. ఎందుకలా జరిగిందో ఆమె ద్వారా తెలుసుకోవడం అమానుషం అనిపించింది. గంగా కూలంకష అంచెలంచెలుగా పవనాంధో లోకానికి చేరిన సంగతి వివరంగా తెలుసుకోవాలా? ఆమెకూ చెప్పాలని ఉన్నట్టు లేదు. "ఈ యప్పను చూస్తా ఉంటే నాకెట్టనో వుంది సిన్నాయనా! ఇంతకంటె కొడవలి తీసుకుని నన్ను నరకడానికొచ్చెనే ఆయప్పే బావుండె."

ఆ తర్వాత మేం ఏం మాట్లాడిందీ చెప్పడం అనవసరం. అయినా నాకు జ్ఞాపకమూ లేదులే. జ్ఞాపకమున్నదల్లా ఆమె అన్న ఆ మాటే. పాప కనిపించడానికి రెండు రోజులు ముందు కరువును గురించే మాట్లాడుకుంటా, మేం ఒకూరికి పోతా వుంటే నర్సిమ్ములు అనే

ఆయన, "ఈ కరువులో కొందరైతే ఆడోళ్లను వ్యభిచారానికి అంపిస్తున్నారంటన్నా" అంటే "ఛ నోర్ముయ్" అని కేకలేశాం.

"ఎంత కరువొస్తే మాత్రం రైతులట్టా పనిచేస్తారా?" అని రంగనాథం అనె.

"రైతులని కాదు. కరువు ఒక్క రైతులకే వస్తాదా..." అని అతనేదో చెప్పబోయాడు కానీ, ఎవరూ వినిపించుకోలేదు.

కొంతసేపయ్యాక గురుమూర్తి, "నర్సిమ్ములు చెప్పింది అబద్ధం కాదు" అని సన్నగా అనె.

"ఆ ప్రస్తావనే వద్దు. మనం వచ్చిన పనికీ, దానికీ సంబంధం లేదు" అని అయిదారు గురం ఒక్కసారిగా అంటిమి. దాన్తో ఆ ఇద్దరూ ఊరకుండ్రి. ఎక్కడ కరువొచ్చినా, ఎక్కువగా నష్టపడేది స్త్రీలు, పిల్లలేనట. స్త్రీలకు ఇటువంటి హింస కూడానా? నర్సిమ్ముల్ని వారించ డంలో అటువంటిది జరగదన్న నమ్మకం కంటే, వినడం ఇష్టం లేకపోవడమే ఎక్కువగా వుండేదేమో!

పాప అన్న మాట నన్ను చాలారోజులు వెంటాడింది. ఇప్పటికీ వదల్లేదు. అయితే, ఇప్పటికి ఒక అర్థానికి వచ్చాను. దాన్ని విశ్లేషించడం కొంత కృతకంగానూ, పల్లెపాటను సంస్కృతీకరించడమంత వికారంగానూ, కళారహితంగానూ వుంటుందేమో! ఇది సామాజి కాంశం కనుక, కళా నియమాల్ని అతిక్రమించి, ఆలోచించక తప్పదు. మామూలుగానైతే, ఒకప్పుడు తనను చంపుతానని మీదికొచ్చిన మనిషి ఇప్పుడిచ్చింది పుచ్చుకొని పోతున్నందుకు, "బుద్ధొచ్చెనా, నీకు బుద్ధొచ్చెనా!" అని సంతోషించాలి. కానీ, ఈ మనిషే పాపకు నచ్చలేదు. ఎందుకు?

ఈ బుద్ధి, లేదా ఈ మార్పు అతనికి సంస్కారరీత్యా వచ్చింది కాదు. తాను ఇష్టపడిన వాడిని పెళ్లి చేసుకుంటానన్న కూతుర్ని నరుకుతానన్న తండ్రి ఫ్యూడల్ తత్త్వమున్నవాడు. కూతురు జీవితాన్ని తానే నిర్ణయించాలనుకున్న నిరంకుశుడు, అహంకారి, మూర్ఖుడు. అయినా, వాడు మనిషి. తన జ్ఞానం మేరకు ఎంతో కొంత కూతురు క్షేమం కోరుతున్నవాడు. మనిషి, మంచీ చెడ్డల మిశ్రమమనుకుంటే, చెడ్డవాడూ మనిషే. ఆ లెక్కన అప్పటి రామప్ప నాయుడు మనిషే.

ఇప్పటి రామన్న నాయుడిలో మంచీ లేదు, చెడూ లేదు. కూతురును గురించిన ఆలోచన అసలే లేదు. ఆకలీ, దప్పికా మాత్రమే వుండి... మనిషి రూపంలో వున్న డొల్ల. కరువు మనిషిలో వున్న మనిషితనాన్ని పీల్చేసి, ఆకలీ దప్పికల డొల్లల్ని మిగిలిస్తుంది. అటువంటి డొల్లల్ని చూస్తుంటే సానుభూతితో పాటు అనివార్యంగా అసహ్యమూ కలుగుతుంది. ఇథియోపియాలోనో, సోమాలియాలోనో, లేక ఏ ఆఫ్రికా, ఆసియా దేశాలలోని కరువు డొల్లల్నో

చూసినప్పుడు మనకు కలిగేది సానుభూతీ, జుగుప్స "ఆయప్పను చూస్తోంటే ఎట్టనో వుంది" అని పాప అన్నదే ఆ 'ఎట్టనో' ఇట్టనే.

అటువంటి డొల్లలు ఏ విలువల్ని నిలుపుకోగలుగుతాయి? కరువు, ప్రకృతిలోనూ, మనిషి ప్రకృతిలోనూ తెచ్చే మార్పులకు ఒక పొంతన వుంది. మొదటి దశలో మంచి నీరు దొరకదు. ఆ తర్వాత మురికి నీరో, బురద నీరో దొరికి, అదీ లేకుండాపోతుంది. భూగర్భ జలాలు కూడా ఇంకిపోతాయి. అలాగే మనిషి కూడా అంచెలంచెలుగా ఆఖరుకు తాను మనిషినన్న సంగతే మరచిపోయే స్థితి ఏర్పడుతుంది.

కరువు ప్రకృతి వనరుల్నీ, మనిషినీ నాశనం చేస్తుందన్నప్పుడు, కరువు ప్రకృతి వనరుల్ని ధ్వంసం చేస్తుందా. ప్రకృతి వనరులు ధ్వంసమై కరువొస్తుందా... అన్న చర్చ వస్తుంది. చివర్న చెప్పిందే జరుగుతుంది. కాకపోతే ఒక పరిస్థితిని నిర్దిష్టంగా గుర్తించేందుకు మనం 'కరువు'అని చెప్పుకుంటున్నాం. అయితే, మనం కరువును నిర్దిష్టంగా గుర్తిస్తున్నామా?

లేదనే చెప్పవలసి వుంటుంది. 'కరువు నష్టం ఇంత' అని ప్రభుత్వాలు అంచనా వేస్తుంటాయి. (ఆ అంచనా కూడా సరైనదిగా ఉండదన్న దాన్ని అలా ఉంచుదాం). ఆ అంచనా ఆ ఏడాదిలో కలిగిన పంట నష్టం గురించే.

మనిషికి జరిగిన నష్టం గురించి ఏ లెక్కలు చెబుతాయి? శతాబ్దాల, సహస్రాబ్దాల మానవ చరిత్ర సాధించిన నాగరికతకూ, సంస్కృతికీ, నిలుపుకున్న విలువలకూ కలిగిన నష్టమెంతో, అందుకు పరిహారమెంతో, ఎవరు చెల్లించారో.. ఎవరు ఆలోచిస్తున్నారు?

ఆదిమ దశ నుంచీ ప్రకృతితో పోరాడి ఇంత అభివృద్ధిని సాధించిన మనిషి. మళ్లీ ఆదిమ ప్రాకృతిక దశలోకి.. ఆకలి దప్పికల అనాగరిక దశకి పడిపోవడమెంత విషాదకరం! ఇది కదా... కరువులో వున్న విషాదం!

అనంతపురం — మిత్రుడు

20-02-2003 — ఎస్.నారాయణ

✡

# హైనా

**–కె.ఎమ్.రాయుడు**

సూర్యుడు ఆకాశం నడిబొడ్డుమీద తిరుగుతున్నాడు. కంటికి ఆనకుండా చెట్లనీడల వెనుక నేల వేడెక్కుతోంది. వర్షం వారం రోజులకు ముందు వచ్చినా వాతావరణంలో మార్పులేదు. గాలివీచినా వేడిగావుంది. ఈ మధ్య పడిన వర్షంతో బాలారిష్టాన్ని దాటుకొని వేరుశెనగ పంట గుట్టలతో సహితం పచ్చగా పరుచుకుంది.

సద్దిబుట్ట తీసుకొని బయలుదేరిన భార్యను గమనించాడు నారాయణప్ప. దాంతో పారను అక్కడే వేసి తలకు చుట్టుకున్న తువ్వాలను వూడతీశాడు. కాలువలో పారే నీళ్లతో ముఖం కడుక్కొని చెట్టు కిందికి నడిచాడు ముఖాన్ని తుడుచుకుంటూ. అతని చుట్టూ దూరంగా చేన్లలో కదులుతున్న కళ నారాయణప్పలోనూ కనిపిస్తోంది.

వసుంధరమ్మకు ఆరోగ్యం అంత బాగాలేదు. మిగిలిన అరకయ్యా పారబెట్టి తనే భోజనానికి ఇంటికి రావాలని అనుకున్నాడు. కానీ కరెంటు చాలాసేపు రాకపోవటంతో పనిసాగక వెళ్లలేకపోయాడు.

తన వద్దకొస్తున్న భార్యకేసి జాలిగా చూస్తూ వుండిపోయాడు నారాయణప్ప. పెళ్లినాటి పోలికలు ఏవీ ఆమెలో నేడు కనిపించవు. ఎంతో బలిష్టంగా పసిమి రంగులో ఆ రోజు కాంతిగా కనిపించేది. ఆనాడు తను పరీక్షగా చూసింది. పనిపాటకు వొదుగుతుందా? ఇంట్లో అందరితో వొద్దికగా కలిసిపోతుందా? అనే. ముక్కు, తన ముఖమూ, రంగూ ఆ తరువాతనే పట్టింపులోకి వచ్చాయి. పది సంవత్సరాల కాలంలోనే బాగా వయసు పెరిగిపోయినట్టు అగుపిస్తుంటే నమ్మలేకపోతున్నాడు. నగల మాట ఎలా వున్నా పని పాటలతో మనిషి సగమయింది.

"ఏందయ్యా! అట్లా చూస్తాండావ్? తిక్కనా?" ముసిముసిగా నవ్వుతూ సద్ది బుట్ట నారాయణప్ప ముందు దించింది వసుంధరమ్మ. ఆ నవ్వులో మాత్రం ఇంకా జీవం చావలేదనిపించింది నారాయణప్పకు.

"ఆ.. తిక్కే నిన్ను చూస్తా వుంటే."

“పక్కవూర్లో డాక్టరు వుండాడు చూపిచ్చేదా?”

“ఊ..”లే అన్నట్టు మునివేళ్లమీద నిలబడ్డాడు నారాయణప్ప. ఈ వేళాకోళానికి మాత్రం కరువు లేదు.

చెంబు తీసుకొని నీళ్లకోసం పంపు దగ్గరికి వెళ్లింది వసుంధరమ్మ. ఈ మధ్యనే కొత్తగా ఏట్లో ఈ బోర్ వేయించాడు నారాయణప్ప. వర్షాలు పడి ఏరు పారితే నీటికి సమస్య వుండదు. వర్షాలు సరిగా పడని సంవత్సరంలో సేద్యానికి చాలా కష్టం. అందుకే ఇక్కడ ఏడు ఎకరాలు వున్నా మూడు ఎకరాల్లో సేద్యం చేస్తున్నాడు నారాయణప్ప. ఈ మూడు ఎకరాల్లో పంట పెట్టాలనే బోర్ దగ్గర ఉదయం నుంచి వుండిపోయాడు.

ఇక్కడ బోర్ వేయించకముందు, తాతలనాటి బావే అండగా వుండేది. మిషను పెడితే పంపు పట్టకుండా నీళ్లు వచ్చేవి. ఆ బావిని గురించి గొప్పగా వూర్లో చెప్పుకొనేవారు. అయితే వర్షాలు తగ్గటంతో వూట పాతాళానికి కృంగిపోయి అర్ధ ఎకరా పారటం కూడా గగనమయింది. రిగ్గు వేయించాడు. అందులో నీళ్లు పడలేదు. కానీ అప్పు మాత్రం నారాయణప్ప గుండెల్లో ఊరింది. డబ్బు బాధ అలా వున్నా తాతలనాటి బావి ఎండి పోయిందని తలచుకున్నప్పుడు గుండె కలుక్కుమంటుంది నారాయణప్పకు.

భోంచేసేందుకు నీళ్ల చెంబును నారాయణప్ప ముందు పెట్టింది వసుంధరమ్మ.

“నేనే వస్తాంటి కదా! సద్ది యాలతెస్తివి?” అనునయంగా ప్రశ్నించాడు నారాయణప్ప.

“వానొచ్చినా ఒక్క పొద్దులిడసవా?” దెప్పిపొడిచింది వసుంధరమ్మ.

వారం రోజుల నుంచి నారాయణప్ప ముఖం తీరే మారింది. కడుపునిండా తిండి, కంటినిండా నిద్రతో తృప్తిగా వున్నాడు. అందుకు కారణాలు లేకపోలేదు. శెనిక్కాయ బాగా వూరాలని, కాపు బాగా రావాలని మూడు నాలుగుసార్లు కాయచుట్టూ గడ్డి ఏరించాడు. అంతకు ముందుచెక్కల గుంటకను తోలాడు. ఎరువులు బాగా వేశాడు. తీరా వాన రాక పోవటంతో ఏళ్లుగా తరుగుతూ వస్తున్న సంసారం, అప్పులతో కదల్లేని దుర్దశకు చేరుకుంటుందే అని భయపడ్డాడు.

రోజూ నిద్రపోకుండా భజనలు మొదలు పెట్టించాడు నారాయణప్ప. అందులో తనూ పాల్గొన్నాడు. ఇట్లయినా ఆ భగవంతునికి దయకల్గి వాన కురవాలని ఆశపడ్డాడు. తమ వూరిలో వాన కురవాలంటే మూలపడిన చెప్పులు, పాతచాటలు, తెడ్డూ, గుండూ లాంటివి వేరే వూర్లోని పొలిమేరల్లోకి వేయాలి. అవి వర్షాన్ని ఆవూర్లో పడకుండా చేసే శక్తులుగా పల్లె గుర్తిస్తుంది. ఆ ఆచారాన్నీ పాటించాడు నారాయణప్ప. ఎంతోనిష్టతో రాత్రుళ్లు భోంచేసేవాడు కాదు.

తెల్లవారు జామునే లేచి అందరితో కలిసి, స్నానాలు చేసి పరగడుపుతో చుట్టూ పదిపల్లెలు తిరిగి అన్ని గుళ్లలోనూ కాస్సేపు భజన చేసి వచ్చేవాడు. ఒక్కోరోజు పచ్చి గంగయినా మింగకుండా భజనల్లో లీనమయ్యేవాడు. దాంతో తిండి, సరైన నిద్ర, విశ్రాంతి చాలక నీరసించిపోయాడు. అప్పుడప్పుడు జ్వరం కూడా కాసేది. పరిస్థితుల్ని అధిగమించటం కోసం బాహ్యశక్తులతో పరిష్కారాల్ని సరిచూస్తూ, తన శక్తినే మరచిపోతాడు నారాయణప్ప.

“ఇట్లా కూడు తింటే పనులు చేసినట్లే” ఇదంతా వసుంధరమ్మకు నచ్చేదికాదు.

“పనులు చేసి పాముకునింది ఏముందిలే. పనులు చేసినోడు ఎవడు పైకొచ్చినాడు”

“ఇట్లా కూడు తినకుండా కూర్చుంటే వానొస్తుందిలే”

“ఒస్తుందో సస్తుందో నాకు ఆకలిగా లేదు. నీక్కాదు చెప్పేది” వసుంధరమ్మ కాస్త వొత్తిడి చేస్తే విసుక్కునేవాడు నారాయణప్ప.

“వూర్లోవాళ్లంతా వుండారు. నువ్వు చేయకుంటే ఏమీ? ఒంట్లో బాగా లేదు. కదలకుండా వుండమంటే వినవు.”

“చేన్ల పక్క చూస్తే ఏడుపొస్తాంది. చేన్లు ఎండిపోతాండాయి. మోడంలో చినుకు జాడలేదు. ఆ దేవున్నయినా నమ్ముకోకుంటే దిక్కు యాడ వుంది?” ఆ బాధలో చిత్తశుద్ధి వుంది.

నారాయణప్ప కళ్లల్లోంచి తడి వసుంధరమ్మ కళ్లల్లోని కన్నీటిని పిండింది.

నారాయణప్ప ప్రయత్నంలోని అంతర్యం తెలియనిది కానీ, అర్థం చేసుకోలేనిది కానీ, కాదు వసుంధరమ్మ. ముంగారు వర్షాలు పడకముందు పశువుల మేతకు చాలా కష్టంగా వుండేది. వర్షాలు సరిగా రాక, పంట సరిగా పండక మేత చాలలేదు. పశువుల్ని పస్తులు పెట్టలేక మేతకోసం దూరపు గుట్టల్లోకి వెళ్లాల్సి వచ్చేది. రోజూ ఇద్దరు కూలీలను వెంట పెట్టుకొని తెల్లవారుజామునే బయలుదేరేది వసుంధరమ్మ. ఎండపడితే పనిసాగదు. అందుకే చాలామంది జట్లుగా ఆ వేళకే వెళ్లేవారు. ఆ గుట్టల్లో ఆ మాత్రం ఎండుగడ్డి దొరక్కపోయి వుంటే చాలా పశువుల ప్రాణాలు విలవిలలాడేవి. పశువుల మేతను ఎక్కడని కొనేది? కొనబోతే అది కొరివిలా వుంది. కొందరు ఈ బాధలు పడలేక పశువుల్ని కసాయి కత్తులకు బేరం పెట్టకపోలేదు. ఇదంతా మరిచిపోలేదు వసుంధరమ్మ.

తట్టలో అన్నంపెట్టి నారాయణప్ప ముందుకు జరుపుతూ అంది వసుంధరమ్మ.

“సూరన్న జాబు రాసినాడు.”

భోంచేస్తున్న నారాయణప్ప ముఖం వెలిగిపోయింది.

“చెప్పలేదే? ఏమి రాసినాడు.”

ఆసక్తిగా అడిగాడు నారాయణప్ప.

సూరన్న టీచర్‌గా ఇంతకు మునుపు ఈ పల్లెలోనే పనిచేశాడు. పిల్లలకు బాగా చదువు చెప్పే టీచరుగా గుర్తింపబడ్డాడు. నారాయణప్ప మంచితనంవల్ల అతనికి బాగా దగ్గరయ్యాడు. సూరన్నను ఈ మధ్య వేరొక వూరికి మార్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. దాని ఫలితంగా ఈ పల్లెకే సూరన్నను బదిలీచేశారు.

"సూరన్నను ఇదే వూరికే మార్చినారంట" అంది వసుంధరమ్మ.

"పిల్లల్లో చదువు మల్లా కుదురుకున్నట్టే.. ఇంకా ఏం రాసినాడు."

"ఏదో హైనా అంట. పల్లెల్లోకి వచ్చి పిల్లోల్లని ఎత్తుకొని పోతాదంట. దాన్ని, చంపటానికి రోజూ జాగరణ అయిందంట. పులులూ, సింహాలూ, వినినాం. ఇదేమి జంతువో. అనుకుంటే భయమేస్తాంది. మీవైపు రాలేదా! అని రాసినాడు" వివరించింది వసుంధరమ్మ. ఏదో భయం నారాయణప్పను అలుముకుంది.

✡

దట్టంగా చీకటిలో రాత్రి మసి ఆరబోసినట్టుగా వుందిపల్లె. గాలి ఎండలో నీరసించి ఆకులతో కదలటం లేదు. గుట్టల గంభీరం బూడిదయినట్టు కనిపించడం లేదు. ఇంటి ముందు మంచంపై పడుకొని పొర్లుతున్నాడు నారాయణప్ప. ఐదు రోజుల నుంచి సరిగా నిద్రలేకపోయినా నిద్రపట్టం లేదు.

రోజూ ఆకాశం చీకటితో శుభ్రంగా అలికి చుక్కలబొట్లు పెట్టినట్టుగా వుంది. వాన మబ్బులు అడుగుపెట్టే అవకాశం మచ్చుకయినా కనిపించడంలేదు. ఈ మధ్య పడిన వర్షమే చివరిదని ముందే ఊహించలేకపోయాడు. ముందు వచ్చిన వర్షపు తీరునుబట్టి మరీ రెండు పదున్లు అవుతాయని, పంటంతా చేతికి వస్తుందని నమ్మాడు. గింజింకా వూరకనే వాన మరీ రాకపోవటం, అంతం మాత్రంగా వచ్చేపంటకు పురుగు పట్టటం చూస్తుంటే అప్పులూ, వడ్డీలూ గుర్తుకొచ్చి భయం పట్టుకుంది నారాయణప్పకు

అంతేకాక శెనిక్కాయ కాలు పంట వచ్చినా శెనిగకట్టె రాదని తేలిపోయింది. ఈ సంవత్సరం కూడా మేతకు– కష్టమవుతుందని– నారాయణప్పకు దిక్కుతోచటం లేదు. అనావృష్టి ఇలా ప్రతి సంవత్సరం తీవ్ర రూపంతో జీవితాన్ని అనేక కష్టాలపాలు చేస్తోంది. నిరాశలకు గురిచేస్తోంది.

చివరకు ప్రతి సంవత్సరం జీవితం ఎలా ఎండమావుల్లో పడవ ప్రయాణంగా మారుతుంటే దిగులు చుట్టుకుంది నారాయణప్పకు.

పనిమీద పల్లె వదిలి టౌనుకొస్తే తన మనస్సంతా పల్లెమీదే వుంటుంది. రెండు రోజులు టౌనులో పడక వేయాల్సి వస్తే మనసు విలవిలలాడిపోతుంది. ఎంతో అవసర మయితే తప్ప బంధువులు ఎంత బలవంతం చేసినా నిలువలేడు.

దొడ్లో పశువుల్ని సరిగా కట్టేసినారో లేదో? మేత వేసేది మరిచిపోయినారో ఏమో? అవి నోరులేని జీవాలు! ఎవర్ని అడుగుతాయి? కరెంటు వచ్చిందో లేదో? ఆ పవర్‌స్టేషన్‌కు ఎప్పుడూ ఏదో రోగం. నీళ్లు ఈ దినం పారకపోతే గడ్డి బలిసిపోతాది. పైరు దెబ్బతింటుంది. కూలోళ్లు కలుపుకు వస్తామనిరి, వచ్చినారో లేదో?

ఇలా ఎప్పటికప్పుడు ఏవో అవసరాలు, పనులూ, వొత్తిళ్లూ చుట్టుముట్టి తనకు ఎక్కడా సుఖంగా నిద్రపట్టకుండా కటకటాలు లేని బందీని చేస్తాయి. ఫలితంగా నిరాశ మిగులుతుంది. ఈ పరిస్థితులలో పిల్లల్ని ఎట్లా ఈదుకురావాలో తలచుకునన్నప్పుడు వాళ్లు దయనీయంగా కళ్లముందు మెదలుతారు.

పోతే. నారాయణప్పను ఐదురోజుల నుంచి మరో దిగులు కూడా తీవ్రంగా వెంటాడుతోంది. ఈ తీవ్రతలో కరువు కాస్తా మరుగుపడింది. హైనా వూర్లో కనిపిస్తోంది. అప్పుడప్పుడు మరిపించినట్టు జొరబడి పిల్లల్ని ఎత్తుకు పోయేందుకు ప్రయత్నిస్తోంది. అందుకే హైనాను చంపేందుకు ఆయుధాలతో పల్లెలో సిద్ధమయ్యారు. ఈ విషయంలో నారాయణప్ప కూడా పట్టుదలతో వున్నాడు.

“హైనా చిక్కకపాయె” తనలో తాను గొణుక్కొన్నాడు నారాయణప్ప. అందులో ఎంతో అసంతృప్తి వుంది.

“చిక్కకుంటే వుండనీలే. అందర్నీ చంపనీలే” అంటూ అరుగుమీదికి విసురుగా వచ్చింది వసుంధరమ్మ. ఆ గొంతులో ఆవేశం పొంగుతోంది.

“యాలనీకంత మంట. యాల అంతకోపం?” అన్నాడు నారాయణప్ప వసుంధరమ్మ ఆవేశానికి రెచ్చిపోతూ.

“వానలు రావు. ఈ చెఱువులు నిండవు. ఈ పంటలు పండవు. పండినా నోటికాడికి వచ్చిందాకా నమ్మకం లేదు. ఈ ఏడు పల్లె యిడిస్తే తప్ప నేను ఊరుకోను. బ్యాంకులోల్ల అప్పులూ, వడ్డీలతో ఏ ఏడుకాఏడు తెల్లారుతుంది. అవి మనల్ని అట్లా ముంచవూ... పైకీ తేల్చవూ. ఇంకా బతికేది ఎన్నడు?”

“ఏంది నువ్వనేది?” చిరాగ్గా, కరుగ్గా అన్నాడు నారాయణప్ప. మంచంమీద తల కూడా వాల్చడానికి మనసొప్పలేదు.

బ్యాంకులు మంచికోచెడ్డకో అప్పులు ఇవ్వకుండా వుంటే పేదరికం ఎంత భయంక రంగా మీదికి దూకేదో నారాయణప్పకు బాగా తెలుసు. అయితే భార్య కోపం ఎక్కడికో పోతోందో తెలిసి తీవ్రంగా అడ్డుకోవాలనే నారాయణప్ప ప్రయత్నం.

"ఈడే వుంటే వుండే భూములు కూడా పోతాయ్. పిల్లోల్లు అడుక్కొంటూ తిరుగుతారు. పట్నంలో ఈడికంటే బాగా బతుకుతా వున్నారు. ఎన్నిసార్లు చెప్పినా నాక్కాదంటావు. తూ.. తూ... బతుకొద్దు యాదన్నా చెరువో బాయో చూసుకొని సచ్చేది మేలు" అంది వసుంధరమ్మ బుసలు కక్కినట్టు.

నారాయణప్ప ఓర్చుకోలేకపోయాడు. ఆ మాటలు పల్లెమీదో పిల్లలమీదో వున్న అతనికే తెలియని అనుబంధాల్ని ముక్కలుగా చెదరగొట్టినట్టు అనిపించింది.

"చాల్లే ఇంక నోర్మూసుకుంటావా లేదా?" అంటూ చెంగున లేచాడు. మాటలతోపాటు చేయి అమాంతం వసుంధరమ్మ చంపమీద చళ్లుమనింది. ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"ఆమె అన్న మాటల్లో తప్పు వుందా నారాయణప్పన్నా"

ఆ మాటలు వింటూ అటువైపు చూశారు నారాయణప్ప. వసుంధరమ్మ కళ్లల్లో నీళ్లు కొంగుతో తుడుచుకొని, అరుగుమీది నుంచి లేచింది వసుంధరమ్మ. జరిగిన విషయాన్నంతా మరుగుపరుస్తూ.

"సూరయ్యా! రా! ఇక్కడ, మంచంమీద కూర్చో" అంటూ ఆహ్వానించాడు నారాయణప్ప. మంచంమీద కూచున్నాడు సూరన్న. అరనిమిషం ఆగి తిరిగి విషయం అందుకున్నాడు.

"పేదరికాన్ని ఆసరా చేసుకునే ప్రభుత్వాలూ మంత్రులూ పుట్టుకొస్తారు. పేదరికం నశిస్తే ఈ వ్యవహారమే వుండదు. ఏ దేశంలో నయినా ఇంతే జరిగేది. అందుకే ప్రభుత్వాలు పుట్టినాక అవి నశించకుండా వుండే పనులే చేస్తాయి. బ్యాంకుల అప్పులూ, వడ్డీలూ, సబ్సిడీలూ, చిల్లర సహాయాలు అన్నీ అవే. మనల్ని కలిసికట్టుగా చేరకుండా పేదరికాన్ని పూర్తిగా తొలగించకుండా– అట్లా చావకుండా ఇట్లా బతక్కుండా శవాల్లా నడిపిస్తాయి. కాబట్టే హైనాను ఎదుర్కోవటానికి కలిసికట్టుగా కరువును ఎదుర్కోవటానికి కలవం. పిల్లలకు భవిష్యత్తు లేకుండా హైనా చేస్తే, ఎవరికీ భవిష్యత్తు లేకుండా కరువుచేస్తుంది. ఎన్నో వేలరెట్లు హైనా కంటే కరువు భయంకరమైనా ఎందుకు అడ్డుకోలేమో మూలాన్ని ఆలో చించం" అంటూ చెప్పుకొచ్చాడు సూరన్న ఉద్రేకస్థితిలో నారాయణప్పకు. ఆ మాటల సారం గాల్లో కలవటం లేదని భావించాడు సూరన్న.

"హైనా వూర్లో కనిపించిందంట. అందరూ సిద్ధమయి వస్తున్నారు. వెళ్దామా నారాయణ ప్పన్నా" హైనాను చంపటానికి తీసుకెళ్లాలని వచ్చినా భార్యభర్తల మధ్య సాగుతున్న కోప తాపాల్ని చూసి వెంటనే ప్రస్తావించలేకపోయాడు సూరన్న.

ఇంతలో సందడి పెరిగే సరికి నారాయణప్పా, సూరన్న వీధిలోకి వచ్చారు.

ముందు వస్తున్న కొందరి చేతుల్లో దివిటీలు, బ్యాటరీలు వెలుగుతున్నాయి. ఆ వెలుతుర్లో అందరి చేతుల్లోని బలమైన కర్రలూ, గొడ్డళ్లూ, కొడవళ్లూ, రాళ్లూ మెరుస్తున్నాయి. చిన్న

పిల్లలు పండిన వృద్ధులు తప్ప ఆడవాళ్లు కూడా లేకపోలేదు. ఆ సమూహాన్ని చూస్తే పల్లే కదలి వచ్చిందా అనే విధంగా వుంది.

హైనా ఐదు రోజులకు ముందు వూరవతల కంపచెట్ల దగ్గర కనిపించిందంటే నమ్మలేదు. అయితే వూర్లోపడి ఓ పిల్లవాన్ని ఎత్తుకొని పోయేందుకు ప్రయత్నించినప్పటి నుంచి పల్లె అంతా వుడికిపోతోంది. ఇంటి దగ్గర పెద్దవాళ్లు లేకపోతే పక్కయింట్లో విడిచి రావటమో లేదా గడియవేసి ఇంట్లోనే ఆడించటమో చేస్తున్నారు. హైనా జాడ కనిపించిందని అంటే పెద్దవాళ్లకు సరిగా కంటికి నిద్రపట్టదు. చుట్టూ కలయతిరుగుతూ అందరూ జాగరణ చేస్తారు.

నారాయణప్ప ఇంట్లో వున్న బల్లెం తీసుకుంటే, సూరన్న చేతుల్లోకి దివిటీని అందించారు ఒకరు. సమూహం అరుపులతో, కేకలతో, అల్లరితో, అలజడితో వేడెక్కి ముందుకుపోతోంది.

కొంతమంది అటూ కొంతమంది ఇటూ కేకలు వేస్తూ వూరంతా వూరి బయట అంతా గాలిస్తున్నారు. హైనాను వెంటాడే వుత్సాహంలో తీవ్రత పుంజుకుంది నారాయణప్పకు. అతని చూపులో, నడకలో, పరుగులో, మెలకువలో తీక్షణత వుంది. దాంతో ఏదో మాట్లాడాలని అనిపించినా మౌనం వహించాడు సూరన్న.

కాని నారాయణప్ప వెనక పనిచేస్తున్న శక్తి ఏదో గమనిస్తూ, అతని వెంట అడుగుల వేగం పెంచాడు.

చీకట్లో మెల్లగా అలికిడి సోకింది. దివిటి కోసం కూడా కాచుకోక చీకట్లో పరుగుతీశాడు నారాయణప్ప. ఎవరికోసం ఎదురుచూడలేదు. అలికిడి వినిపించిన దిశకు అడుగుల వేగం పెంచాడు. ఒక దశలో నారాయణప్ప గొంతు అలజడిని సృష్టించింది. ఆ అలజడిలో బల్లెపు పోట్ల ధ్వని శృతి కలిపింది. నారాయణప్ప చేయి స్పీడుగా కసి పట్టినట్టు హైనా ఒంటి మీద ఆడింది. నారాయణప్ప హైనాను ఎలా చూస్తున్నాడో స్ఫురించింది సూరన్నకు. అప్పటికే గుర్తించలేని స్థితిలో హైనా ముక్కలయింది. ఇదంతా దగ్గరగా చూడలేక ప్రక్కకు తిప్పుకున్నాడు. ప్రధానంగా నారాయణప్ప స్పందించిన తీరు విచారాన్ని రగిలించింది సూరన్నకు.

ఇంతలో ఉత్సాహంతో అందరూ అక్కడికి చేరుకున్నారు. హైనా చచ్చాక ఆ రాత్రి సూర్యోదయం ఎప్పుడవుతుందా అని అందరిలోనూ, ముఖ్యంగా నారాయణప్ప ముఖంలో అంతులేని ఆరాటం కనిపిస్తోంది. ఒక్క సూరన్నకు తప్ప.

✡

# భస్మాసుర హస్తం

**–కాలువ మల్లయ్య**

"డొడ్డాంక డొం డొడ్డాంక డొం" మాదిగ పీరయ్య ఊరు చాటింపు చేస్తున్న ధ్వని వింటున్న నర్సిరెడ్డి గజగజ వణికిపోయాడు. డప్పుపై కట్టెతో కొడుతున్న దెబ్బ తన హృదయంపై సమ్మెటపోటులా తగులసాగింది. బాధగా, భయంగా వుంది. "ఇన్నోల్లైవలో ఇననోల్లైవలో సర్కారు దగ్గెర పాతబాయి పూటిక తీసుటానికి తీసుకున్న బాకి గట్టన్నట. ఇదువరకు లోటీసులిచ్చినా ఇయ్యనొల్లందరు కచ్చీరు కాడ జమ గావన్నట. రేప్పొద్దుగాల బాకి గట్టకుంటె గొడ్డుగోదను, ఏదుంటె అది ఏలం ఏత్తరట. రేపు బేంకోల్లు అసూల్ల కత్తండ్రట. ఓహో" అని చాటింపు చేస్తూ పోతున్నాడు పీరయ్య.

డప్పు చాటింపు ధ్వని, పీరయ్య మాటలు విన్న నర్సిరెడ్డి తలపట్టుకొని కూర్చున్నాడు. అతని మనోవేదన వర్ణనాతీతం. "రేపు బాకి గట్టకుంటె ఎద్దునన్న, ఏదన్న ఏలం ఏత్తరు. నా పజీతు పోతది. పజీతు పోయినంక ఇగ బతుకుడెట్ల? ఎంత తిప్పలపడ్డా పైసలు దొరుకుత లేకపాయె. ఇగ ఏం జెయ్యాలె" అని పరిపరి విధాలుగా ఆలోచించసాగాడు. అతని మొదట్లో రకరకాల ఆలోచనలు.

"సర్కారోల్లు బక్క రైతులకు సాయం జేత్తుండ్రని ఇన్నగని ఆళ్లుగూడ కొమటోని తీరుగనే ముక్కుపిండి అసూల్జెయ్య వట్టిరి. మిత్తి తక్కో ఉంటదనుకుంటిగని మిత్తేడ తక్కోవున్నది? గీకొమటోడు, సర్కారోల్లు ఒక్కటే అనిపిత్తంది. ఎల్లెంబి బేంకుల బాకి అట్లనే ఉండె. మల్లగీ పూడిక బాకి నెట్లగట్టాలె? ఉన్న కోండ్రమ్ముకోని చిప్పలు వట్టుకొని బతుకతన్నా నాత్రి పగలు గడియరికాం లేకుండ పన్జేసినా, ఎంత పంట పండిచ్చినా, మట్లె మన్నె దుబ్బల దుబ్బై బొర్లినా లాబమేముంది? రోజు రోజుకు బాకీలు పెరుగుడేనాయె. నీ యవ్వ ఈటి కన్నిటికి కిటుకెక్కడుందో సమజయిత లేదు. గవురిమెంటు ఎన్నో తీర్ల సాయం జేత్తన్నని మొత్తుకున్నదేగని సేసిందెక్కడ కనిపిత్తలేదు. గయినెవ్వలో సెప్పినట్టు ఆళ్ళు నిజంగనే సాయం జేత్తె నా అసోంటోల్ల బతుకు గిట్లెందుకుంటది? అటు కొమటయినె బాకి, ఇటు సర్కారు బాకీ అడకత్తెర్ల పోక తీరుగయిపాయె బతుకు. నీ యవ్వ ఈ బాకీలన్నీ ఎట్లదీరాలె? నేనెట్ల బతకాలె? పోరగాండ్ల నెట్లు సాదుకోవాలె?" అని రకరకాలుగా ఆలోచించసాగాడు నర్సిరెడ్డి. ఆలోచనా భారంతో

అతని హృదయం బరువైంది. కడుపులో బండెడు దు:ఖం, నిస్సహాయత. ఆలోచిస్తూ బ్రతుకును భారంగా ఊహిస్తూ తాను గవర్నమెంటు బాకీలెందుకు తెచ్చుకోవాల్సి వచ్చిందో జ్ఞాపకం తెచ్చుకున్నాడు నర్సిరెడ్డి.

ప్రకృతిపై ఆధారపడి వ్యవసాయం చేసేవాళ్ళ కిక్కట్లు తప్పవు. చేతికొచ్చింది నోటి కొస్తుందన్న నమ్మకం లేదు. విరగకాసిన పల్లి చేను పీకే సమయంలో వర్షాల్లేకుంటె సగం పంట భూమిపాలవుతుంది. కోతల కొచ్చిన వరి పొలాల సమయంలో పెద్ద గాలిదుమారం లేస్తే పంట నేలపాలవుతుంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చేనుకు తెగులు తగులుతే రైతు నోట్లో మన్నే పడుతుంది. అతివృష్టి, అనావృష్టి విలయతాండవాలుండనే వున్నయి. అన్నీ సానుకూలమయి పంట పండితే మాత్రం లాభమేముంది? కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి లాగుంటుంది. మందు బస్తాలకు, అన్ని ఇతర సామాన్లకు విపరీతమైన ధరలు. కాని రైతు అమ్మే సమయంలో ధాన్యానికి ధర శూన్యం. అదే ధాన్యం రైతు చేతిలోనుంచి దళారీల చేతిలోనికి పోయింతర్వాత మితిమీరిన ధర. ఆలస్యంగా అమ్ముకుందామంటే ఆర్థిక ఇబ్బందులు. పల్లికాయలమ్మే సీజన్‌లో ధరుండదు. కాని పల్లి నూనెకు ఆకాశమంటే ధర. తానమ్మిన పల్లికాయలనుండి తీసిన నూనెనే రైతు మూడు రెట్లెక్కువ ధరపెట్టి కొనుక్కోవాలి.

మూడు వందల రూపాయలకు క్వింటల్ పల్లికాయ ధర. కిలో నూనెకు పదిహేను రూపాయలు. క్వింటల్ పల్లి గానుగాడిస్తే దాదాపు ఏభై కిలోల నూనె వస్తుంది. అందులో నుండి వెళ్లిన పల్లిపిండి, దర మిషన్ ఖర్చులకు తీసివేసినా ఏభై కిలోల నూనె ఉంటుంది. అంటే ఒక్క క్వింటాల్ పల్లికాయపై దళారికి దాదాపు నాలుగు వందల యాభై రూపాయల లాభం. అలాగే క్వింటల్ వడ్లు ధర దాదాపు వంద రూపాయలు. అదే వడ్లనుండి ఏభై కిలోల బియ్యం వస్తాయి. బియ్యం కిలో ధర మూడు రూపాయల పైనే. తవుడు మొదలైనవి గిర్నీ ఖర్చులకు పోగా దళారీకి ఉత్త పుణ్యానికి ఒక క్వింటల్ వడ్లపై ఏభై రూపాయల లాభం.

పంట పండించడానికి ఏడాది పొడుగునా చాకిరీ చేసిన రైతు, వినియోగదారుడూ దారుణంగా దోపిడీకి గురియౌతున్నారు. ఉత్పత్తితో సంబంధంలేని మధ్య దళారీలు పంది కొక్కుల్లా బలుస్తున్నారు. ఎవరో ఇచ్చిన ఉపన్యాసంలోని మాటలు ఆకళింపు చేసుకున్నాడు నర్సిరెడ్డి. అప్పుడతని మాటల గురించి అంతగా ఆలోచించలేదుగాని ఇప్పుడు తన పరిస్థితి, తనలాంటి వాళ్ళ పరిస్థితి చూస్తే ఇందులో నగ్న సత్యమున్నదనిపిస్తుంది. దీర్ఘంగా నిట్టూర్చాడు నర్సిరెడ్డి.

ఇలాంటి అవకతవక ఆర్థిక విధానాల సుడిగుండంలో కొట్టుమిట్టాడాడు. మధ్య తరగతి రైతు నర్సిరెడ్డి. మొదలు అప్పు చేయడమంటే మహాపాపంగా భావించేవాడు. అయినా అప్పుచేయక తప్పలేదు. కలుపుతీయడానికి, విత్తనాలకు, మందు బస్తాలకు డబ్బు అవసర మొచ్చేది. అప్పు తప్ప వేరే మార్గం లేదు. పోగా ఒకసారి పంట పండేది. మరోసారి ఎండేది.

దానికితోడు పెరుగుతున్న సంసార బాధ్యతలు. ఎంత పంట పండించినా షావుకారి అప్పు తీరేది కాదు. షావుకారు చిత్రగుప్త లెక్కల తికమకలో క్రమక్రమంగా మధ్య తరగతి రైతుగా ఉన్న నర్సిరెడ్డి భూములమ్ముకొని పేదరైతుగా మారిపోయాడు. ఇదివరకు రెండు నాగల్లు కట్టేవాడు. ఇప్పుడు ఒక్క నాగలే కదుతున్నాడు. అప్పులు పెరుగుతూనే ఉన్నాయి. షావుకారి కబంధ హస్తాల్లో ఇరుక్కొని కొట్టుకుంటున్నాడు నర్సిరెడ్డి.

రెండేండ్లు వరుసగా కరువొచ్చింది. అప్పులు మరింత పెరిగాయి. ఆ సంవత్సరం చెరువునిండింది. పంట బాగానే పండింది. వేసంగి పొలం కోసి, బంతి కట్టి, వడ్లు తూర్పారవట్టి రాశిగా పోసి ఆ రాశిని తృప్తిగా చూసుకున్నాడు నర్సిరెడ్డి. రాశి కల్లంలోనే ఉంది. ఎండ విపరీతంగా వుంది. పొద్దంగిన తర్వాత ఇంటికి తీసుకుపోవాలని ఆలోచిస్తు న్నాడు. ఆపారం అంగిజేబులో ఉన్న చుట్టదీసి చెకుముకి రాతితో అగ్గిరాజేసి చుట్టపై పెట్టుకున్నాడు. చుట్టచప్పరిస్తూ బండికింద నీడకు కూర్చున్నాడు. తృప్తిగా చుట్టపొగ వదులుతూ రాశి దిక్కే తదేకంగా చూస్తున్నాడు. అతని ముఖంలో ఎంతో తృప్తి. తాను కష్టపడి, చెమటోడ్చి, బొక్కలు కలి కలిగాంగ పండించిన పంటను చూసుకుంటే ఆనందంగా ఉంది. బండిగారె నానుకొని కొంగునెత్తిమీదేసుకొని నర్సిరెడ్డి భార్య కూర్చొన్నది.

ఉన్నట్టుండి నర్సిరెడ్డి భార్య "ఇగో ఇగో" అంది.

గారె సందుల నుంచి భార్యను చూస్తూ "ఏంది?" అన్నాడు నర్సిరెడ్డి.

"ఇయ్యేడు మన లచ్చవ్వ లగ్గం జేత్తామా?" అన్నది సంకోచిస్తూ. నర్సిరెడ్డి కాండ్రకిచ్చి ఉమ్మి చుట్ట ఆర్పి కిందపెట్టి –

"ఏందే, ఏ మెరుగనట్టు మాట్లాడవడ్తివి. లగ్గ మంటె ఏందనుకుంటున్నవు? పిల్లగాండ్ల పరాశికాలా?" అన్నాడు.

"ఇయ్యేడు పంటో తీరుగానే పండింది గద. పొల్లమీద నాలుగిత్తులు పడితే మన రంది పోతది. ఆటెనుక మొగ పొల్లగాండ్లే నాయె. కట్టం సేసుకుంట ఆళ్ళే బతుకుతరు"

"నిచ్చమేగని అట్టిగనే అయితాదె. రెండేండ్ల నుంచి సెరువునిండక ఓ సావుసచ్చి పుడ్తిమి. కొమటయినె బాకి అట్లనే వుండే. పెచ్చులకు తెచ్చినయి కట్టన్నాయె. గివ్వన్ని బాకీలు వెట్టుకొని కార్జెం ముందట పెట్టుకుంటే ఎట్లుంటదె?" అన్నాడు నర్సిరెడ్డి.

"కొమటయినె ఆగడంటవా? కొన్ని రోజులు?"

'ఆగెటట్టు కనిపిత్తలేదు"

"పొల్లకు పద్నాలుగేండ్లు దాటవట్టె. ఇగ లగ్గం సేసుడెప్పుడు?" అన్నది విచారిస్తూ నర్సిరెడ్డి భార్య.

"పద్నాలుగేండ్లకే ముసల్దయిపోతన్నాదె? గీ అడ్లన్నీ బీట్లె అమ్ముకత్తె కొమటయినె బాకి సగం తీరుత దయిండాలె. మక్కలతోని మన తిండికెళ్ళ దీసుకుందాం. దేవుడు మన్నించి అచ్చే ఏటిగ్గాడ గిట్లనే పంట వండితే గప్పుడు సూద్దాం లగ్గం సంగతి" అన్నాడు నర్సిరెడ్డి.

నర్సిరెడ్డి భార్య గారె పక్కనుంచి బండి వెనుక వైపు జరిగింది. నర్సిరెడ్డిని సూటిగా చూస్తూ "నువ్వు గట్లనే అనుకుంటావో పొల్లగండ్లు దొరకరు. మన కాపుదనపు కులంల పెద్దమనిషి గాకమునుపే లగ్గాల్జెయ్య వట్టిరి. సూసుకుంటుంటె పొల్లగాడేడ దొరుకుతడు?" అన్నది.

"ఆ!. నీ మాటలు గని కులమేం గొడ్డువోలేదు తియ్యి. ఏదో గంతకు తగ్గ బొంత మాదొరుకుతడు" అంటూ బజారు దిక్కు చూసిన నర్సిరెడ్డి గతుక్కుమన్నాడు.

యమధర్మరాజులా షావుకారి కుంచం బిందె చేతులు పట్టుకొని, ఆ బిందె కంటె పెద్దగానున్న బొర్ర ఊగుతుండగా వస్తున్నాడు. అతని వెనుక ఇద్దరు మనుషులు జనుప సంచుల కట్టలు చేతుల్లో పట్టుకొని వస్తున్నారు. వాళ్ళను చూడగానే నర్సిరెడ్డి పైప్రాణం పైన్నే పోయింది. బండి క్రిందినుంచి లేచివచ్చాడు. అతని భార్యకూడా లేచి నిల్చున్నది. షావుకారి కల్లంలోకి రానే వచ్చాడు.

అతడోసారి సరాయించి–

"ఏమోయ్ నర్సిరెడ్డి, బాగున్నవా?" అన్నాడు నవ్వుతూ. అతడు నవ్వుతుంటే నర్సిరెడ్డికి భయంగా వుంది. అతడెందుకొచ్చిండో తెలుసు. షావుకారి కెదురుగా వచ్చి–

"ఆ!– గిట్లున్న షావుకారి" అన్నాడు.

"పురాగ నల్లపూసవై పోయినవేమోయ్, కనిపిత్తనే లేవు" అని కుంచం బిందెకింద పెట్టాడు.

"ఏం జెయ్యాలె షావుకారి. ఎవుసప్పని సేసెటోనికి తీరి సత్తదా? మల్ల ఇది కల్లాలు లేసే దెవుసమాయె. పొద్దందాక, తెల్లందాక కల్లంకాన్నే ఉండవడితి" అన్నాడు నర్సిరెడ్డి.

షావుకారి రాశిదిక్కు తేరిపార జూసాడు. నర్సిరెడ్డి నుద్దేశించి "అయితె మానాయెగని నా బాకి కట్టుదున్నదా లేదా?" అన్నాడు, పూట పండులా నిగనిగలాడుతున్న బొర్రను నిమురుకుంటూ.

"ఎందుగ్గట్ట? గీ అడ్లమ్ముకచ్చి కదుత"

ఆ మాటలకు షావుకారి గయ్‌మని లేచిండు.

"ఎక్కన్నోయ్ అమ్ముకచ్చేది? ఊళ్ళె నేను లేనా?" అన్నాడు, ఆ వడ్లు కొనే హక్కు తనకే ఉన్నట్టు.

“ఉన్నవు నిచ్చుమేకని, బీట్లెకు వోతె నాలుగు పైసలెక్కో అత్తయని ఆసె” అన్నాడు నర్సిరెడ్డి.

“బండి గట్టుకోని రెండెడ్లు గట్టుకోని పతాకం (ప్రత్యేకం) మనిషిపోతే అత్తాయి పైసలు ఏమెక్కో అత్తయి” అన్నాడు వ్యంగ్యంగా, షావుకారి.

షావుకారి వెంబడొచ్చిన మనుషులు సంచుల కట్టలు క్రింద పారేసి కూర్చున్నారు. నర్సిరెడ్డి భార్య ఇంటినుంచి ఉరికొచ్చిన నాలుగేండ్ల కొడుక్కు పాలిస్తూ నిలుచున్నది.

“బండెడ్లు ఇంట్లయేకద షావుకారి. కల్లాలు లేసినంక ఇగ పురుసతేనాయె. ఇక్కడికంటె ఎంతెక్కో అచ్చినా నయ్యమే” అన్నాడు నర్సిరెడ్డి.

“ఏం కాపుదన పోనివోయ్. బీట్లె నీ సుట్టాలున్న రనుకుంటున్నావా, ఎక్కో పైసలిచ్చుటానికి? అటు అమాలోల్లు, ఇటు మచ్చు సూసెటోల్లు తలింత దొబ్బుతరు. జోకుల, లెక్కల్ల అన్నిట్ల ముంచుతరు. ఇంటెనుక సెట్టు మందులకు పనికిరాదన్నట్టున్నది కత. ఊళ్ళున్న నన్నిడిసిపెట్టి పట్నంలో అమ్ముకుంటడట పిలగాడు” అన్నాడు షావుకారి, ఎలాగైనా నర్సిరెడ్డి ప్రయత్నం మాన్పించాలని.

“బీట్లె ధర పెడితే నీకే ఇత్త షావుకారి” అన్నాడు తుదకు నర్సిరెడ్డి.

“పెట్టకుంటేంజేత్త. లోకం మీదున్న ధరపెడుత. అయినాగని బాకి తీసుకునెటప్పుడున్న మాట ఇచ్చెటప్పుడుండదోయ్. తీసుకునేటప్పుడు కొమటోడు బెల్లమేగని బాగ్గట్టుమంటె అల్లం” అని ఇక ఆలస్యం చేయడం ఇష్టంలేక, “అరె ఎంకటిగా, సంచులిటు పట్టుకురా. అరే చెంద్రా, గా అంచె తీసుకొని వడ్లు బిందెల పొయ్యి” అని తనతో వచ్చిన మనుషులకు పని పురమాయించి వడ్లురాశి దగ్గర బిందె పట్టుకొని కూర్చున్నాడు షావుకారి. చంద్రయ్య అంచెతో బిందెతో వడ్లుపోస్తుంటే షావుకారి లెక్క పెడుతూ ఎంకటయ్య పట్టుకొన్న సంచిలో పోస్తున్నాడు. షావుకారిని వారించి లాభంలేదని తెలిసియున్న నర్సిరెడ్డి నిస్సహాయంగా నిల్చున్నాడు. నర్సిరెడ్డి భార్య గుడ్లవెంట నీళ్ళురాగా కొడుకుని హృదయానికి హత్తుకొని నిలుచున్నది. కొంచెమాగి నర్సిరెడ్డి–

“షావుకారి ధర మాట్లాడకపోతివి. ఏం లేకపాయె. కొలుసుకనే పోవడితివి. గిట్లెట్ల?” అన్నాడు.

నర్సిరెడ్డి మాటలు విన్న షావుకారి కొలవడం ఆపి అతని దిక్కొకసారి ఉరిమి చూసాడు. “చెప్పితి గదనోయ్, ఊళ్ళున్న ధర పెడుతనని” అని తిరిగి కొలవడం ప్రారంభించాడు.

చేసేదేం లేక చూస్తూ నిలబడ్డాడు నర్సిరెడ్డి.

నర్సిరెడ్డి భార్య రాశి దగ్గర కొచ్చి –

"బిందె పెద్దగున్నటున్నది గద షావుకారి" అన్నాది.

"ఆ! పెద్దగున్నది. నువ్విత్తన్నవు ఎయి పుట్లని నీ కోసం సేయించిన" గద్దరించినట్లుగా అని కొలుస్తున్నాడు షావుకారి.

కొనేటప్పుడు పెద్దవి, అమ్మేటప్పుడు చిన్నవి కొలపాత్రలుంచుకోవడం, జోకేటప్పుడు సామానువేసే తక్కెడ క్రింద అయాస్కాంతాలుంచి మోసం చేయడం పల్లెటూళ్ళలో మామూలే.

"ఆరు ఆరు" అని మరో కుంచం పోసి "ఆరున్నొక్కటి" అన్నాడు. మరో కుంచం పోసి "ఏడు" అన్నాడు. ఇదేవిధంగా పదిహేడు వ్దద, ఇరవై ఏడు వద్ద కూడా జరిగింది. బహిరంగంగా దోపిడీ జరుగుతున్నా అమాయకంగా నిలుచున్నాడు నర్సిరెడ్డి.

ఇరవై సంచులు నింపి కళ్లెంలో ముష్టిగా కొంత ధాన్యం వదిలి "పుట్టి ఇద్దుమయినయి యాదికుంచుకో" అని వాటిని కుట్లేసి నర్సిరెడ్డి బండెడ్లతోనే ఇంటికి ఔరగొట్టించాడు షావుకారి.

తాను పండించిన ధాన్యంపై తనకే అధికారం లేకుంటే నిర్వికారంగా చూస్తుండేవాడు నర్సిరెడ్డి. ఇదేవిధంగా కల్లంమీదనే ఎన్నోసార్లు ధాన్యమంతా కొలుచుకుపోయేవాడు షావుకారి. షావుకారి చెప్పిన ధరకే ధర కట్టడం. ఏదైనా గొడవ జరిగితే దొర, ఊళ్ళోని పెద్ద మనుషులు షావుకారికే సహాయంగా మాట్లాడటం మామూలే. షావుకారి డబ్బుకు చక్రవడ్డీ. ఎంత పంట పండించినా బాకీ తీరేది కాదు. అవుసరాలు, మళ్ళీ బాకీ చేయడం. తిరిగి చర్విత చర్వణం. ఈ విధంగా భూములమ్ముడుపోయి స్వంత నాగలికి సరిపోయే భూమి కూడా లేక కౌలుకు దున్నడం వరకొచ్చాడు రెడ్డి.

చివరిసారిగా తాను షావుకారికి కట్టే బాకీ విషయంలో తగాదా వచ్చింది. తాను తీసుకున్న పదిహేనువందల బాకీని రెండు వేల ఐదు వందలన్నాడు. తానిచ్చిన మిత్తిని కూడా లెక్క చెయ్యలేదు. అది చివరకు పంచాయతీకి దారి తీసింది. ఎప్పటిలాగే సర్పంచ్, పెద్ద మనుషులు షావుకారినే సమర్థించారు. కాగితంలో ఉన్నట్టుగా కట్టాలన్నారు. తననే మందలించారు. షావుకారి దగ్గర బాకీలతో విసిగిపోయాడు రెడ్డి.

అలాంటి సమయంలో గవర్నమెంటు బాకీల గురించి పైరవికారి లక్ష్మణరావు నర్సిరెడ్డికి చెప్పాడు. ఊళ్ళోవాళ్ళు కూడా గవర్నమెంటు బాకీలు తీసుకోవడం మొదలుపెట్టారు. గవర్నమెంటయితే తక్కువ వడ్డీకి బాకీలిస్తారని గవర్నమెంటు బాకీలు తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. సాధ్యమైనంతవరకు ఊళ్ళోబాకీలు తీసుకోవద్దనుకున్నాడు.

తన దైన్యస్థితికి నిట్టూర్చాడు నర్సిరెడ్డి. రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడ్డా తన బ్రతుకెందుకు రోజు రోజుకూ అధ్వాన్నమవుతుందో అతనికి అర్థం కావడంలేదు. ఈ ఊరి కొచ్చినపుడు బుట్టి దుకాణం పెట్టుకొని మిరపకాయ బజ్జీలమ్ముకొన్న షావుకారి నేడు లక్షాధికారి! తనలాంటి వాళ్ళ నెందరినో కొంటాడు.

మళ్ళీ ఆలోచనలో పడ్డాడు నర్సిరెడ్డి.

భూమి గిర్మిపెట్టి ఎల్.ఎమ్.బిల బాకీ తీసుకున్నాడు. తనకు మంజూరైన బాకీ ఐదువేలు. ఊళ్ళె పటువారికి, పైరవికారికి, గిరువవారికి, బేంకుక్లర్కుకు, బేంకు ఛైర్మన్‌కు వరుసగా లంచాలిస్తూపోగా 1500 ఖర్చయ్యింది. అంటే 5000 బాకీకి 3500 ముట్టింది. కాని 5000 ముక్కుపిండి వసూలు చేస్తారు. యాడాది కేడుమార్ల చొప్పున పదేండ్లు కట్టాడు. మళ్ళీ బాకీ తీసుకున్నాడు. గవర్నమెంటు అప్పుల్లో మిత్తి తక్కువెక్కడుందో అర్థం కాలేదు నర్సిరెడ్డికి. పోగా సరియైన టైమ్‌లో కట్టకపోతే అపరాధపు వడ్డీ. బేంకుద్యోగుల జబర్దస్తీ. ఎంత కరువొచ్చినా బలవంతంగా ఋణాలు వసూలు జరిపేవారు. గవర్నమెంటు బక్క రైతులకెట్ల సాయం సేత్తందో అతనికి తెలియలేదు. వద్దన్నా వినకుండా చేండ్లో బంటాలు తీసారు. దానివల్ల భూసారం మాట దేవుడెరుగు. రెండు వెయిల బాకీ మీద పడ్డది. పాత బాయి పూటికలు తీయదానికని 500 ఖర్చుపెట్టి 2000 బాకీ తీసుకున్నాడు. వీటికి తోడు ఊళ్ళో కొన్ని బాకీలుండనే ఉన్నవి. ఎంత తీసుకోవద్దనుకున్నా తప్పని పరిస్థితి రోజు రోజుకూ బ్రతుకు దుర్భరమవుతుంది. అటు (ఎల్ఎంబీ) బాకి, బంటాల బాకి, పూటికల బాకి, ఊళ్ళో బాకీల విషవలయంలో గొంతువరకు కూరుకపోయాడు నర్సిరెడ్డి.

తన స్థితికి తనలోతానె చింతించుకుంటూ దీర్ఘనిట్టూర్పు వదిలాడు నర్సిరెడ్డి.

"ఇప్పుడేం జెయ్యాలె? అటు ఎలెంబి నోటీసొచ్చింది. ఇటు ఊళ్లే బాకి గట్టుమని లొల్లిజేత్తండు. అటు బేంకు బాకి. సర్కారు బాకి తప్పది. ఇవ్వన్ని ఎట్లగట్టాలె? ఎంత కట్టపడ్డా ఎండల వానల, సలిల, రేత్రి, పగలు మంట్లె, దుబ్బల బొర్లుకుంట అరువ మోటు కట్టం సేసినా ఇంట్ల మనుషులంత పెయ్యి దాసుకోకుండ పనిసేసినా గింతే కావట్టె. నాకేమన్న కల్లు దాగుడలవాటుందా? పాకాడితినా? లంజెలకు పెడితినా? ఏమన్న దుబారా ఖర్సుసేత్తినా? కలో గంజో కుండల గలది దాక్కుంట ఎంత కట్టపడ్డా గిట్లనే కావట్టె. ఎంత గుట్టుగ బతికినా బాకీలు పెరుగనే వట్టె. సర్కారు పేదోల్ల కోసం ఏమోమో సేత్తం దని సెప్పుతండ్రు. గీ బాకీ కోసం ఏం జేత్తరు? కాని ఇదువరకు ఎలెంబి బాకీ భూమమ్మి కడితి. సర్కారోల్లు కూడ కటికొల్లకంటె ఎక్కనే సెయ్యవట్టిరి. అయిన మనుపంటే సేసిరి గని ఇప్పుడుగూడ సేత్తరా? లేనోల్లకు భూములిత్తన్నమని, బక్కొల్లకు సాయం జేత్తన్నమని బాగ సెప్పుతండ్రుగద. సరే రేపొల్లచ్చి తలదీసి మొలేత్తరా? సూత్త, దేవుడ్దయ ఎట్లుంటె గట్లయితది" అని తనకు తాను సముదాయించుకున్నాడు నర్సిరెడ్డి.

తెల్లవారి పనిచేసే ప్రభుత్వం, రైతులపాలిట కల్పతరువు, మాటల్లో సోషలిజం స్థాపించే పాలకుల క్రిందనున్న బేంకు అధికారులు ఊళ్ళోకి వసూల్లకొచ్చారు. రైతులంతా ఆ ఏడు గవుసుపోయి వరిపంట పోయిందనీ, బొంత పురుగు తగిలి పెసరు పోయిందనీ, ఏ పంట సరిగా రాలేదని చెప్పారు. వచ్చే పంట మీద కడుతామని బ్రతిమిలాడారు. కాళ్ళా వేళ్ళా

పడ్డారు. ఐనా అధికారులు వినలేదు. కొంతమంది పేద రైతులతో సహా నర్సిరెడ్డి కొట్టుకున్నాడు. మొత్తుకున్నాడు. ఏడ్చాడు. ఆరునెల్ల గడువివ్వమన్నాడు. ఇదివరకే గడువిచ్చాం, ఇక కుదరదన్నారు. నాగటెద్దుపోతే తాను బ్రతకలేనన్నాడు. అయినా వాళ్ళ మనసు కరుగలేదు. నర్సిరెడ్డి ఎద్దును, మరికొంతమంది పేదరైతుల వస్తువులను వేలంవేసి అపరాధ వడ్డీ మరియు వాళ్ళ బత్తా, జేబు ఖర్చులతో సహా అన్నీ వసూలు చేసుకొని బాకీ చెల్లుబాటు చేసుకున్నారు.

నాగటి మీదెద్దుపోయి తన కాలిరిగినట్టు కాగా నర్సిరెడ్డి, అతనిలాంటి పేద రైతులు నిస్సహాయంగా నిలుచున్నారు. ఏడ్చి ఏడ్చి నర్సిరెడ్డి కళ్ళనుండి నీళ్ళు రావడం ఆగిపోయాయి. అతనికంతా వింతగా కనబడుతుంది.

తన యాభై ఏండ్లు జీవితం, తాను పడ్డ కష్టాలు, అప్పుల సుడిగుండంలో తా ననుభవించిన ఇక్కట్లు జ్ఞాపకం చేసుకున్నాడు. ఇంకా తీరని గవర్నమెంటు బాకీలు, ఊళ్ళో బాకీలు అతని మనస్సులో గిర్రున తిరిగాయి. ఎటుచూసినా చీకటి. తన బ్రతుకంతా చీకటిగా కనబడుతుంది. తన పిల్లల భవిష్యత్తు కూడా అంధకారంగానే కనబడుతుంది. తన ఎద్దును వేలం వేసిన ఐదు రోజుల తర్వాత పట్నం పోయొస్తానని భార్యకు చెప్పి పోయాడు. రాష్ట్ర వ్యవసాయమంత్రి ఇస్తున్న ఉపన్యాసం వింటూ స్టేజి దగ్గర కూర్చున్నాడు. కాలేజీ గ్రౌండంతా మందితో నిండి ఉంది. మంత్రి ఉపన్యాసం జోరుగా సాగుతుంది. తమ ప్రభుత్వం సన్నకారు రైతుల కొరకు చేసే సహాయాన్ని, పేదోల్లకు ఇచ్చే భూముల గూర్చి చెబుతూ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నాడు. ఆ మాటలు వింటున్న నర్సిరెడ్డికి కోపం, ఆవేశం, దు:ఖం ఆగడం లేదు. గబగబా మంత్రికెదురుగా పరుగెత్తాడు. స్టేజిని సమీపించాడు. మంత్రికెదురుగా నిల్చొని చేతులు పైకెత్తి “ఇగో మంత్రిదొర! గవిరిమెంటు పేదోల్లకు, బక్క రైతులకు మాదండి లాభం సేత్తందని సెప్పుతన్నవు. అప్పులిచ్చి ఆదుకుంటందన్నవు. భూములిత్తందన్నవు. ఇవన్ని పచ్చి లఫంగి మాటలు. పంటల్లేక కరువుల, కట్టంలున్నా ఎలెంబోల్లు మీద గూసుండి పైసలసూల్చేసుకపోయింద్రు. మొన్న నా యింటి మీదవడి పజీతు తీసి ఎద్దునేల మేసింద్రు. నా అసోంటళ్ళందరి మానందీసి అసూల్జేసుకపోయింద్రు. పజీత్ పోయినంక బతికెందుకు? ఇగో, నేను మా రైతులందరికి బుద్ధచ్చేటట్టు ఎండ్రిన్ తాగుతున్న” అని రొండిలో నుంచి ఎండ్రిన్ డబ్బతీసి ఎత్తి నోటిదగ్గర పెట్టుకొని కొంత తాగిండు. ఇంతలో సభలో కలకలం ఎవరో వచ్చి డబ్బ గుంజి పారేసింద్రు. నర్సిరెడ్డిని హాస్పిటల్లో వేసి మంత్రి వెళ్ళిపోయాడు. డాక్టర్లు నర్సిరెడ్డితో ఎండ్రిన్ కక్కించారు. నర్సిరెడ్డి బతికాడు. కాని ఆత్మహత్య నేరం క్రింద జైల్లో పడేసారు. తర్వాత విడుదల అయి బయటకు వచ్చాడు. విడుదలయ్యొచ్చిన నర్సిరెడ్డికి జీవిత సత్యాలను విడమర్చి చెప్పాడో యువకుడు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, ఆ సమస్యలకు గల కారణాలను, పరిష్కార మార్గాలను ఇదివరకెవ్వరూ చెప్పనంత వివరంగా చెప్పాడు. ఆ యువకుని మాటలు విన్న తర్వాత నర్సిరెడ్డి ఆలోచనా విధానంలో మార్పొచ్చింది.

"బ్లాక్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి ఎలెంబిల, ఏరే బాంకులల్ల ఇరువై వేల బాకున్నట్టు తెలిసింది. ఇంక సర్పంచు కూడ బాగానే బాకి వున్నడు. నూర్ల ఎకరాలు ముద్దికింద పెట్టుకోని బాకి గట్టకున్నా ఆళ్ళనేం సేసినోడులేడు. గంతెందుకు, పైరవికారి లక్ష్మినారాయణ గొల్లోల్లకు గొర్లిప్పిత్తనని ఇరువై వేలు తింటే ఏంజేసింద్రు? ఆని యేమన్న పీకింద్రా? మరి ఈ గవిరిమెంటు నా అసోంటోళ్ళ బక్కోల్ల ఎంబడే ఎందుకు పడ్తది? పెద్దోడు సర్కారు నెంత ముంచినా దిక్కులేదు. నా అసోంటి బక్క రైతుల్దగ్గరైతే తన్ని వసూల్జేత్తరు. అంటే ఈళ్ళ కానూన్లు వున్నోన్ని, లంగను ఏంజెయ్యవన్నమాట"

అంటే – ఈ గవర్నమెంటెవ్వంది? ఆ పిలగాడు సెప్పినట్టు ఉన్నోల్లది. జమీందార్లది. భూసాములది. దళార్లది. ఈ గవిరిమెంటుకూ, కసాయివాళ్ళకూ, దోపిడీ దొంగలకూ భేదం లేదు. ఈళ్ళంతా ఒక్కగూటి పక్షులే. సన్న రైతులకు, పేదోల్లకు సాయం సేత్తనని సెప్పుతున్న గవురిమెంటు మాటలు మోసం.

అయితే, తనలాంటి వాళ్ళు గట్టెక్కాలంటే ఏం చేయాలి?

అని రకరకాలుగా ఆలోచించసాగాడు నర్సిరెడ్డి.

"అప్పులు రైతులపై భస్మాసుర హస్తం లాంటివి. రైతుల పేదల కూలీల సమస్యలకు పరిష్కార మార్గం పోరాట మొక్కటే..." యువకుని మాటలు నర్సిరెడ్డి చెవుల్లో గింగురు మంటున్నాయి. అతడా మాటల గురించే దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

✡

# అంబా

**–కె.సభా**

"ఒక్క తడి చాలనుకొంటాను. రెండో తడి ఒక్క వరసైనా పరవాలేదు. ఏం చెయ్యాలో తోచడం లేదు" అంటూ నెత్తిన చేతులు పెట్టుకొని కూచున్నాడు పున్నయ్య. సిద్ధులమ్మ దిగాలు పడిపోయింది.

పాలు పోసుకొంటున్న కంకులు. మరో పదిరోజులు పోతే చాలు. బంగారం వంటి పంట. ఆ నాలుగు గుంటల మడిమీదనే వారి బ్రతుకు ఆధారపడింది. అందుకే ఆలూ, మగడూ వెయ్యావుల కోనకెళ్ళి నలభై మోపులు పచ్చాకు తెచ్చి వేశారు. రోడ్డులో చింతాకంతా వూడ్చిపోశారు. పందిళ్ళ చెరువులో పాచితోసి గంపల కొద్దికీ తెచ్చిపోశారు. బలిసిపోయిన కలుపు తీసేటప్పుడు సిద్ధులమ్మ చెవుల్లో గూబా వర్లమ్మి శనగపిండి తెచ్చి కలిపారు. ఇన్ని చేస్తే పైరు నవనవలాడుతూ ఎదిగివచ్చింది. ఊటొంకలో గాదె బావిలో నీరు తోడి పైరును కాపాడారు. ఊట నిలిచిపోయింది. గాదె బావిలో చుక్క నీళ్లు లేవు. ఇంక నీళ్లెక్కడున్నాయి? చింతాకుల జానయ్యను బ్రతిమలాడి, బ్రతిమలాడి ఓ పూట నీళ్లు కావాలన్నాడు. జానయ్య బావికీ పున్నయ్య పొలానికీ రెండు ఫర్లాంగులేనా వుంటుంది.

జానయ్య బావి పన్నెండు మట్లు. పన్నెండో మట్టులో గజం లోతు నీరుంది. జానయ్య రెండెకరాల మడికి అందీ అందని నీళ్లు, రాత్రంతా తిరుగుడు కపిల తొలిప్రొద్దున్నే చద్దిపూట వరకూ తోలితే ఎనిమిది గుంటలు తడిసీ తడవనట్టు పారుతుంది. అక్కడికి నీళ్లు మునకలో మాత్రం మూరెడు లోతుంటాయి. మళ్లీ రాత్రి వరకూ నీళ్లు వూరితే ఆ వెనుక కపిలగట్టాడు. ఇట్లా అఘోరించే జానయ్య మాత్రం నీళ్లెట్లా విడుస్తాడు? అయినా పున్నయ్య ముఖం చూచి ఒక్క తడికి మాత్రం ఒప్పుకొన్నాడు. ఆ నీళ్లు మడికి తెచ్చేదెట్లా? రెండు ఫర్లాంగుల దూరం వుంది. ఆ మధ్యలో మూడు మిట్టలున్నాయి. నీరు పల్ల మెరు గునుగానీ మిట్ట నెరుగదు గదా! ఈ మిట్టలేకాకుండా ఒక పెద్ద కాలువ అడ్డం వుంది.

పున్నయ్య ఇంకో మనిషిని కూలి యిచ్చి పెట్టుకొన్నాడు. రెండు పూటలు సంగటేసి రూపాయిన్నర యిస్తేగానీ మంచి మనిషి దొరకడు. కన్నిగాడు వచ్చాడు కూలికి. ఇద్దరూ పొద్దున్నే ఏటి గట్టుకు వెళ్లి ఒక మొగలితుండు తెచ్చారు. దాని మధ్యలో బూజూ చెత్తా తీసేసి

పెద్ద తూము చేసి కాలవకు అడ్డంగా పెట్టారు. గుజ్జేరయ్య చేని దగ్గర చిన్న ఏతం గుంత వుంది. జానయ్య బావి నుండి ఆ గుంత వరకూ కపిల నీరు వస్తుంది. అక్కడి నుండి ఆ నీళ్లను కన్నిగాడు ఏతాముతో ఎక్కిస్తే అది పిచ్చయ్య మడి కొసవరకూ పోతుంది. మళ్లీ గజం ఎత్తు మిట్ట వస్తుంది. ఆ మిట్టకాడనుండి గూడేస్తే ఆ నీళ్లు లచ్చయ్య కటవ వరకూ పోతుంది. అక్కడ ఇంకో పెద్ద మిట్ట ఎక్కాలి. ఒక చిన్న గుంతచేసి పెద్దబానతో ముంచి ముంచీ పోస్తే సరాసరి మడికి వెళ్లిపోతుంది. ఇంకో ఆడమనిషి ఉంటే సిద్ధులమ్మతో పాటు గూడ వేయడానికి సరిపోతుంది. నీళ్లు ముంచిపోయడానికి ఇద్దరు పెద్దకొడుకులు సరిపోతారు.

✡

ఎత్తుకొన్నాడు – పున్నయ్య మోకూ, తొండం తాడూ జానయ్య బావికి అందదు. అది లోతు ఎక్కువ. అంచేత జానయ్య మోకునూ, తొండం తాటినీ కట్టాడు. సిద్ధులమ్మ కన్నిగానికీ, చిట్టెమ్మకూ సంగటేసి రెండు వక్కపేళ్లు, తమలపాకులూ పిడికెడు పొవ్వాకు దుగ్గూ యిచ్చి పనిలోకి దింపింది.

పున్నయ్య మోట తోలడం ఆరంభించగానే కన్నిగాడు కాలవలో చెత్తా చెదారాన్ని పారతో చెక్కివేస్తూ, నీటితోపాటు గుజ్జేరయ్య చేనిదాకా వెళ్లాడు. అక్కడ ఏతాం అందు కొన్నాడు. యముడు ఒక్కణ్ని చంపితే ఏతాము ముగ్గుర్ని చంపేస్తుందంట. ఐనా కన్నిగాడు కొంచెం మొరటు మనిషి గనుక అంత లావు బాననూ తానొక్కడే ముంచి పోసేయడానికి పూనుకొన్నాడు. పున్నయ్య మూడో కొడుకు పదేళ్ల కుర్రాడు చిన్న వెదురు గెడెను పట్టుకొని ఏతాం దూలం మీద తెలిసీ తెలియని గంతులేస్తూంటే నీళ్లు సాగాయి. సిద్ధులమ్మ పార తీసుకొని నీళ్లకు దారి చేస్తూ పిచ్చయ్య మడికొన వరకూ వెళ్లగా అక్కడ పెద్ద కొడుకు వీరయ్య పారను అందుకొన్నాడు. సిద్ధులమ్మా, చిట్టెమ్మా గూడ వేయడం ఆరంభించారు. మిట్టమరీ ఎత్తుగా ఉంటే వీరయ్య దగ్గర పారందుకొని కొంచెం వాటం చేసి మళ్లీ పని ఆరంభించగానే నీళ్లు సాగాయి. వీరయ్య చరచరా నీళ్లతోపాటు లచ్చయ్య కటవదాకా వెళ్లాడు. అక్కడ చిన్న గుంతలో నీళ్లు నిలవగానే తమ్ముడు మల్లిగానితో పాటు పెద్ద బానతో నీళ్లు ముంచిపోయడం ఆరంభించాడు.

"రారన్న రారో రామన్న రారో" అంటూ పున్నయ్య గిత్తల్ని లాలిస్తూ మోట తోలు తున్నాడు. ఏదో ఎగగసలో దమ్ము వదలకుండా కన్నిగాడు ఏతాము నీరు తోడుతుంటే చిన్న కుర్రాడు చక్రయ్య "ఏతాము పాతాళానికి ఏతాము" అంటూ పాడుకొంటూ అటూ ఇటూ గెంతుతున్నాడు. సిద్ధులమ్మకు అది ఏడోమాసం కావడం వల్ల అంత వేగంగా చేతులు కదలడం లేదు. గూడ గూళ్లు లాగివేస్తున్నా జానయ్య నీళ్లు విడిచాడనే సంతృప్తితో ఆమె నీళ్లు చల్లుతూ నిలబడింది. మిగిలిన ఇద్దరు కుర్రాళ్లూ వీరయ్యా, మల్లయ్యా పల్లంలో నీళ్లు నిలవకుండా ఎత్తిపోసేస్తున్నారు.

మరి రెండు గుంటల మేర నీళ్లు సాగాయి. జానయ్య ఒకసారి బావికల్లా వచ్చాడు. అతనికి పున్నయ్య స్థితిని చూస్తే ఎంతో పరితాపం కలిగింది. నాలుగు గుంటల మడికోసం ఎంత శ్రమ! రెండు గిత్తలూ, ఆలూ మగడూ, ముగ్గురు పిల్లలతో పాటు ఇద్దరు కూలీలు! ఇంతా కష్టపడి చేస్తే నాలుగు గుంటలూ నాలుగు బస్తాలు రాలడం దుర్లభం! నీరు కట్టి, తోటి, వెట్టి, పంబల, పూజారి, చాకలి, మంగలి, కరమల, వడ్ల వగైరా వారికే వాదెల క్రింద బస్తా గింజలు పోతాయి. ఇక శనగపిండి తెచ్చినందుకు కూలీలకు పన్నుకూ రెండు బస్తాలు పోతే మిగిలేది ఒక బస్తానే. ఆ బస్తా గింజెలెన్నాళ్లకు వస్తాయి పాపం! అనుకున్నాడు జానయ్య. ఆ మాటకు వస్తే తాను ఆరెకరాల మేర సేద్యం చేస్తుండి మాత్రం ఏం గిట్టుతున్నది. మొన్న పెద్ద పండగనాడు కూడా ఒక పొట్టేలైనా తెచ్చి కోసుకునే యోగం లేకపోయింది. చిన్నోడు కోడిపుంజును పట్టుకొచ్చి పందుగైందనిపించాడు. కనుమునాడు అమ్మాయిని అత్తగారి వూరికి పంపుతూ ఒక గజం రవికె గుడ్డ అయినా యివ్వలేకపోయాడు. ఎందుకిట్లా అయినాయి పాడు బ్రతుకులు అనుకుంటూ ఒక నిట్టూర్పు విడిచి వెళ్లిపోయాడు.

ఇంకా బారెడు ప్రొద్దుంది. పున్నయ్య మోట తోలుతూనే వున్నాడు. కన్నిగాడూ చక్రయ్య ఏతాం వేస్తూనే ఉన్నారు. సిద్ధులమ్మ, చిట్టెమ్మ గూడను వదలనే లేదు. వీరయ్య, మల్లయ్య మాత్రం అప్పుడప్పుడు ఒక్క నిమిషం ఆగినా గుంతలో నీళ్లు నిలబడకుండా ముంచి పోసేస్తున్నారు.

మడి బాగా తడిసింది. అర్థంగుళం మేర నీళ్లు కూడా నిలిచాయి. నాలుగు మూలలూ అందుకొన్నవిగానీ ఉత్తరం వైపు కొస ఐదారు బారలు తేమ మాత్రం తగిలింది. ఇంకో పావుగంట శ్రమపడితే చాలు.

అయిపోయింది. ఆ పావుగంట కూడా అయిపోయింది. వీరయ్య గబగబా మడి చుట్టూ తిరిగి ఇంక చాలంటూ నాన్నకు కేకేశాడు. ఆ కేక అందేలోగా దబదబమంటూ శబ్దం విన్పించింది. అందరూ బావి దిక్కుకేసి చూశారు. ఆ శబ్దానికి పిచ్చయ్య చేనిగట్టులోని నేరేడు చెట్టులోనున్న పిట్టలన్నీ కలకలమంటూ బెదురుతూ పైకిలేచాయి. ఈ దారుణాలూ ఘోరాలు చూడ్డమే నా పనిగా వున్నదని నసుగుకొంటూ సూర్యుడు సిగరాకుల కొండ చాటుకు వెళ్లిపోయాడు.

కన్నిగాడు పరుగెత్తుకొంటూ బావిదగ్గరకు వెళ్లాడు. బిక్కుబిక్కుమంటూ ఒక గిత్త మాత్రం గట్టున నిలబడి ఉంది. బావిలోకి తొంగి చూశాడు. తెల్లగా ఏదో మెదులుతూ వుంది నీటిలో. నీళ్లు కూడా ఎర్రగా కన్పిస్తున్నాయి. అరక్షణం మ్రాన్పడి నిలిచి నోరు తెరచి గట్టిగా "అయ్యో! అయ్యయ్యో!" అంటూ అరిచాడు.

గూడను పారవేసి సిద్ధులమ్మ ఆవురావురుమని పరుగున వచ్చింది. చిట్టెమ్మ కూడా పడిలేచి బావి గట్టుకు వచ్చేసింది. ఆ పాటికే కన్నిగాడు బావిలో దిగాడు. వాడు ఆజాను

బాహుడు గనుక తొడబంటి నీటిలో చీకటిలో తారట్లాడుతూ పున్నయ్యను ఎత్తి భుజాన వేసుకొన్నాడు. పున్నయ్యకు స్పృహలేదు. అంటే ఇరవై నాలుగు గజాలు. డెబ్బై రెండు అడుగుల లోతుకు మనిషి పడ్డప్పుడు ఏం జరుగుతుంది? ఏమో! నడుము విరిగిందో! కపాలం పగిలి మెదడు చెదిరిందో! లేక అడ్డుగా ఏ మెట్లమీదనో పడి గుండె బ్రద్దలైందో!

వీరయ్యా మల్లయ్యా గబగబా దిగిపోయారు బావిలోకి. వుండబట్టలేక సిద్ధులమ్మ దిగబోతే చిట్టెమ్మ గట్టిగా పట్టుకొని చుట్టుపట్ల వారికోసం కేకలేసింది. ఐదారుమంది ఆ కటిక చీకట్లో బావి దగ్గరకు వచ్చారు. వారిలో ఒకడు చావు పరుగున వూళ్లోకి వెళ్లి సంగతి చెప్పగానే చాకలివాడి దివిటీలతో సహా వంద మంది మోకులు కర్రలూ తీసుకొని వచ్చారు. ముందుగా పున్నయ్యను పైకి తీసుకొచ్చారు. పూజారి నర్సయ్య మంత్రం వేసి నిమ్మకాయ పిండిన వెనుక పున్నయ్య కళ్లు తెరిచాడు. పున్నయ్య బ్రతికే వున్నాడని తెలిశాక అతణ్ణొక తట్టలో కూచోబెట్టి కావడి కట్టి వూళ్లోకి పంపబోతే గిత్తను పైకి తీసేవరకూ ఇక్కడే ఉంటానన్నాడు పున్నయ్య.

దరువు దగ్గరనుండి దారాలు దించి ఒక కొనకు గిత్తను దారాలకు కట్టారు. అది బెదురుతో విలవిలా తన్నుకొంటోంది. నీళ్లంతా దివిటీల వెలుతుర్లో నెత్తురుగానే కన్పిస్తున్నది. ఎంత నెత్తురు కలిసిందో దాని కుడి కొమ్ము విరిగిపోయింది. బోరగిలా పడ్డదేమో! ఎడమ కాలు వూనడం లేదు. ఎక్కడో బెణికి వుంటుంది. ఎలాగో గంట సేపటికి గిత్తను కూడా పైకి తీశారు.

అంతా వూరు చేరుకొనేలోగా మాటు మణిగింది. పున్నయ్యకు నడుము పడిపోయింది. కూచోడానికి వీలుకాదు. పడుకుంటే పొందడం లేదు. గిత్తకు మాత్రం కాలికి కట్టుకట్టారు. జానయ్య చెప్పాడు. కోడికూర వండి కొంచెం సారాయి తెచ్చిపెట్టమని. కోడి దొరుకుతుంది గానీ సారాయి దొరకడం కష్టం. కన్నిగాడు నేను తెస్తానంటూ వాడివద్ద ఉన్న ముప్పావలాతో పాటు సిద్ధులమ్మ యిచ్చిన రూపాయి తీసుకొని వెళ్లాడు. ఎక్కడో దొంగతనంగా కాచేవారి దగ్గర నుండి తేవాలి. అక్కడికి ఆరుమైళ్లలో శేషాపురం దగ్గర బోయగూడెంలో అమ్ముతారట. అదీ తగినవారు వెడితేనే దొరుకుతుంది. తెల్లగా ఎర్రగా ఉన్న వాళ్లకు ఆ వాసన కూడా తగలదు.

ఈలోగా పున్నయ్యను ఆస్పత్రికి తీసుకెడితే బావుండునని కొందరన్నారు. ఆస్పత్రి వున్న వూరు అక్కడికి పదిహేను మైళ్లుంది. తొమ్మిది మైళ్లు బండిలో వెడితే అక్కడ నుండి బస్సులో వెళ్లవచ్చు. బండి దొరకవద్దా? బండి ఏ మహారాజైనా ఇవ్వవచ్చు. ఎద్దు లెవరిస్తారు? పనుల కాలంలో ఎవరి గొడ్లకూ తీరుబడి లేదు. తోలకాలూ, గానుగలూ ఎడతెరపిలేని సమయం, ఎవరు ముందుకు వచ్చినా వారి మడి ఎండిపోతుంది. గానుగ ఆడకం నిలిచి పోతుంది. ఉన్న కాడి గిత్తల్లో ఒక గిత్త పడిపోయింది. అది కాలుకట్టి, కొమ్ము నిలిచి పైకి

లేస్తుందనే నమ్మకం గూడా లేదు. ఒకవేళ బండీ ఎద్దులు దొరికినా ఆస్పత్రి వైద్యమంటే నోటి మాటలా? అక్కడ దొరలూ దొరసానులూ పచ్చగా వున్నవారినే పలుకరించడం కష్టం. ఇక పల్లెటూరంటే చెప్పడమెందుకూ? ఏ దోమలో నల్లులో అన్నట్లు విసుక్కొంటుంటారు. ఏదో ఒక పచ్చకాగితం ఉంటే పున్నయ్యను బ్రతికించుకోవచ్చు. అమ్మ బాబో! వందరూపాయలు ఎట్లా వస్తాయి? పోనీ పది రూపాయలున్నా ధర్మాసుపత్రిలో ప్రాణం నిలుపుకోవచ్చు. పది రూపాయలెవరిస్తారు?

సిద్ధులమ్మ చెవులు తడుముకొన్నది. కర్నపూలు నిరుడు పురుడు పోసుకొనేటప్పుడు అమ్మివేసింది. కమ్మలు, గాజులు అమ్మి ఇప్పుడు బావిలో పడిన గిత్తనుపట్టింది. గూబా వరులేమో శనగపిండికి సరిపోయింది. ఇంకేముంది? నల్లగాజులూ శవ్వాకూ, మెడలో నల్లపూసలూ, పుస్తె మాత్రం వుంది. అదొక్కటే బంగారుగా వుంది. ఆ బంగారును అమ్మి పసుపుకొమ్ము కట్టుకోవచ్చు. కానీ దాన్ని అమ్మడానికి భర్త ఒప్పుకొంటాడా?

ఆమె అనుకున్నట్లే జరిగింది. పున్నయ్య మండిపడ్డాడు. నాలుక కరచుకొన్నాడు. నేను ప్రాణంతో వుండగానే ఇట్లా బుద్ధి పుట్టిందేమిటే అంటూ విరుచుకొనిపడ్డాడు. అతని ఆత్మాభిమానం అటువంటిది. చివరికి బాగున్న గిత్తను అమ్మడానికి కూడా ఒప్పుకోలేదు.

"నా కేమీ ఫరవాలేదు. ఒకటి రెండు రోజుల్లో బాగైపోతుంది. ముందు ఆ గిత్తకు పచ్చగడ్డి తెచ్చిపెట్టు. కోడిగ్రుడ్లు పట్టు వేస్తే దానికి వళ్లునొప్పులు పోతాయి. ఆ పని చూడు ముందు. ఎందుకలా దిగాలు పడికూచున్నావు? ఇందుకే భయపడితే ఎలాగా? ఏందో అదృష్టం మంచిది కాబట్టి ఇక్కడికే బ్రతికి బయటపడ్డాము. అందుకు సంతో షించాలి. నిరుడు ఏకాదశి పండగనాడు ఆ బాలయ్య గతి ఏమైంది?" అన్నాడు పున్నయ్య.

సిద్ధులమ్మకు బాలయ్య జ్ఞప్తికి వచ్చాడు. బాలయ్య మనిషే పత్తాలేకుండాపోయాడు. దొరువు దొర్లుకున్నప్పుడు ఆ బండలక్రిందే చిక్కిపోయాడు. తన పసుపు త్రాడు గట్టిది కాబట్టి మగడు ప్రాణంతో బయటపడ్డాడు. ఆ మాత్రం రక్షించినందుకు ఇలవేలుపు ఏడు కొండల వాడిని తలచుకొంటూ గిత్తకు కోడిగ్రుడ్లు సొనపట్టు వేయటానికి కొట్టంలోనికి పోయింది.

ఇంతలో కన్నిగాడు శేషాపురానికి పోకుండానే దారిలో ఒక ఆసామి వద్ద రెండు ధరాములు సారాయం తెచ్చాడు. మల్లయ్య దాసరాపల్లెకు వెళ్లి ఒక కోడిపుంజును పట్టుకొని వచ్చాడు. ఆ రాత్రి మూడో జాములో నాలుగు కోడి తునకలు తిని రెండుగుక్కలు సారా త్రాగి మత్తుగా, మగతగా కన్నులు మూసుకొని పడుకొన్నాడు పున్నయ్య.

మళ్లీ తెల్లవారింది. పున్నయ్య బ్రతుకులో ఎన్నో పొద్దులు పొడిచాయి. మరెన్నో ప్రొద్దులు పోయాయి. ఎన్ని రోజులు గడిచినా చీకటి మాత్రమే చిందులాడుతోంది. కలిగిన వారికి ఎప్పుడూ వెన్నెలే. లేనివారికి ఎప్పుడూ చీకటే.

ఆ రోజు సిద్ధులమ్మ మడి దగ్గరకు వెళ్లింది. పొట్టగ్రలు నవనవలాడుతూ కన్పిం చాయి. పైరు బాగా పుంజుకొన్నది. నీటికోసం బీటలువారి దాహం దాహం అంటూ తపించిన వరి చేను ఇప్పుడు తృప్తిగా నవ్వుతూ కన్పించింది. ఆ మడిని చూడగానే సిద్ధులమ్మ అన్ని కష్టాలనూ మరచిపోయింది. దక్షిణ దిక్కున చెదిరిపోయిన కల్లను కాస్తా సరిగా నెట్టి తాను తీసుకెళ్లిన దిష్టికుండను పెట్టి ఇంటికి వచ్చింది.

పున్నయ్య బారెడు ప్రొద్దెక్కిన వెనుక మేలుకొన్నాడు. అతనికి నడుము లేనట్టే తోస్తున్నది. నడుములో ఎముకల పూసలు గుల్లలైపోయినట్టు తోస్తున్నది. ఇరుగు పొరుగు సలహాలతో వేడివేడి నీళ్లుపోసింది సిద్ధులమ్మ. మంచినూనె చింతాకు పట్టువేసింది. చెప్పినవారి వైద్యాలన్నీ చేసుకొంటూ నాలుగు రోజులు గడిపారు.

ఇంతలో రాత్రిపూట చేనికి కావలి కాయవలసివచ్చింది. ఆ పిడికెడు గింజలూ దొంగలు దూసుకుపోతే కష్టపడి మాత్రం ఫలితమేముంది? పున్నయ్య కదల్లేని స్థితిలో వున్నాడు. ఆ పంట రాలిందంటే ఆ ధాన్యంలో ఒక బస్తాను కళ్లంలోనే కొలిచి ఆ డబ్బుతో ఆస్పత్రికి వెళ్లి రావాలని సిద్ధులమ్మ ఆలోచన. ఈ ఆలోచనకు పున్నయ్య కూడా సమ్మతించాడు. వారం రోజులు రాత్రుల్లో కావలి కాయాలి? వీరయ్య, మల్లయ్య పసిబిడ్డలు. ఒకనికి పన్నెండు. ఇంకొకనికి పద్నాలుగు సంవత్సరాలు. ఏ కాలానికెలా ఉంటుందో తెలియదు. దయ్యాలూ, భూతాలూ మిత్తవల కథలలా వుంచి నలుగురు దొంగలుపడినా ఆ లేదర బిడ్డలెలా ఎదుర్కోగలరు?

వీరయ్య మాత్రం మాకేమీ భయం లేదమ్మా! ఇద్దరూ పెందలకాడే సంగటి తిని పొలానికి వెడతామని చెప్పారు. పున్నయ్య ఆలోచించి కన్నిగాణ్ణి పిలిపించాడు. వాడికో గంప వడ్లు యిస్తానని ఒప్పుకొని చేను కాపలా కాయడం ఆరంభించారు.

ఇంకొక తడి పలచగా పారి వుంటే గింజ కండబెట్టి మరికొన్ని ఎక్కువ రాలేవి. వెన్నులో పాతికవంతు జల్లు గింజలుపడ్డాయి. మడి కోతనాడు మాత్రం పున్నయ్య ఇంటివద్ద వుండలేకపోయాడు. కానీ అతడు పైకీ లేవలేకపోయాడు. రెండు మూడుమార్లు పైకి లేవబోయి క్రిందపడ్డాడు. ఆ రోజు ఇంటి వద్ద చక్రయ్య కూడా లేడు. ముగ్గురు బిడ్డలూ, కన్నిగాడూ, చిట్టమ్మా ఇంకో ఇద్దరు ఆడవాళ్లు మడికోస్తుంటే సిద్ధులమ్మ పదకొండుకే సంగటి చేసుకొని శనగ్గింజలు వూరిబిండి చేసుకొని వెళ్లిపోయింది.

కొట్టంలో కొమ్ము విరిగిపోయిన గిత్త అంబా అంటోన్నది. నిజానికది ఏడుస్తున్నది. కొమ్ము విరిగిన చోట పెద్ద రంధ్రం పడి చెత్తబెట్టింది. పెద్దపెద్ద పురుగులు గొలగొల లాడుతూ తలను బాధతో విసిరినప్పుడల్లా జలజలమని నేల రాలుతున్నాయి. కచ్చాకూ పుచ్చాకూ నూరి కట్టడంతో అది బాగా పుచ్చి రణం పెద్దదైపోయింది. మనుషులాసుపత్రియే రెండు ఆమడల దూరంలో ఉంటే ఇక పశువుల ఆసుపత్రి ఎక్కడున్నదో ఆ పల్లెకే తెలియదు.

గాలమ్మోరు పోసిన గొడ్లు ఎన్నో నేల రాలిపోతుంటాయి. ఈనలేని పశువులు గాటిలోనే కాళ్లు తన్నుకొని చచ్చిపోతుంటాయి. నామెక్కిన కోడెల గతి చెప్పనే పనిలేదు. ఆ దశలో పున్నయ్య గిత్తకు మాత్రం ప్రత్యేకంగా వైద్య సదుపాయమేముంటుంది?

అది తలను గాటి గోడకేసి కొట్టుకొన్నది. చేరెడు చీమూ నెత్తురూ పురుగులూ చింది పోయినవి. నట్టింటిలో పడి వున్న పున్నయ్య దానిని చూచి ప్రాణం తల్లడిల్లిపోగా పైకి లేవబోయి మళ్లీ క్రిందపడినా వూరుకోలేక దేకుతూ దేకుతూ వాకిటకు వచ్చాడు. అలాగే మెల్లగా ప్రాకుతూ వెళ్లి గిత్తను అందుకున్నాడు. అది మోరను వంచింది. మెల్లగా గాటిలో నున్న కసువుతో పుండును తుడుస్తుంటే అది పసిబిడ్డలా కన్నీరు కారుస్తూ ఉండిపోయింది. అతని హృదయం ఎలాంటిదో ఆ గిత్తకు తెలుసు. ఆ కోడె గుండె లెలాంటివో ఆ పున్నయ్యకే తెలుసు. రెండు ప్రాణాలూ బాధలో వున్నా రెండు ప్రాణాలు అల్లల్లాడుతున్నా క్షణకాలం ఏదో చెప్పరాని, వర్ణించడానికి ఈ జగత్తులో ఎవ్వరికీ వీలుకాని ఆనందాన్ని అనుభ వించాయి.

అది నెమ్మదిగా కసువుపోసలు నములుతూ నిలబడింది. అతడు సంతృప్తితో ప్రాకుతూ ప్రాకుతూ ఇంటిముంగిటికి వెళ్లాడు. ఇంతలో చక్రయ్య పొలం నుండి వచ్చాడు. "అయ్యకు నీళ్లో నిప్పులో కావలసి ఉంటాయి. ఒక్కసారి వెళ్లిరారా" అని సిద్ధులమ్మ చెప్పి తరిమితే వాడు వచ్చాడు. నాన్నకు నీళ్లిచ్చి గాటిలో గిత్తకు కసువు విదిలించాడు.

"అంతా అయిపోయిందారా చిన్నోడా?" అన్నాడు మూలుగుతూ పున్నయ్య. "కోత మాత్రం అయిపోతుంది నాన్నా. రాత్రికి వాదెలమీదే వుంచి పొద్దున్నే ఎండినాక మధ్యాహ్నం" అంటూ వెళ్లిపోయాడు చక్రయ్య. మడికోస్తూ ఉంటే వాడికో రకమైన ఆనందం.

ఆ రాత్రి వాదెలమీదనే ఉంచారు పంటను. కన్నిగాడితో పాటు సీతయ్యను కూడా పంపించాడు. చక్రయ్య పదేళ్లవాడైనా నేనూ అక్కడే పండుకుంటానని పట్టుబట్టాడు. వీరయ్య, మల్లయ్య, చక్రయ్య ముగ్గురూ కన్నిగాడికీ, సీతయ్యకూ సంగటి తీసుకొని, వక్కాకూ దుగ్గూ బీడీలు కూడా ఒక కట్ట తీసుకొని వెళ్లారు. వాళ్లనలా పంపి సిద్ధులమ్మ పున్నయ్యకు అన్నం పెట్టింది. అన్నం సగంతిని ఏదో కడుపులో దేవినట్టుందని పున్నయ్య పైకి లేవబోయి మామూలు ప్రకారం క్రింద పడిపోయాడు. ఒక్కసారి విరేచనమైంది. మళ్లీ పావుగంటకల్లా మళ్లీ ఒక్కసారి విరేచనమైంది. ఈమారు వట్టి నెత్తురే పడ్డంతో సిద్ధులమ్మ భయపడి పోయింది. వెంటనే పసుపుగుడ్డలో కానీ రూకకట్టి ఏల్యమోనికి మీదెత్తి కట్టింది. ఇల్లు దీర్ఘం వెళ్లి వస్తానని మ్రొక్కుకున్నది. పుట్టింటి దేవత నూకాలమ్మకు కూడా దండం పెట్టుకొన్నది. ఇంటి పేరంటాలకు సాష్టాంగపడింది.

ఏ దేవుడు దయ తలచాడో! ఏ దేవత కనికరించిందో! ఆ రాత్రి పున్నయ్య ఏ తొందరా లేకుండా పడుకొని నిద్రపోయాడు. సిద్ధులమ్మ అతడు నిద్రపోయాక చేటెడు రాగులు తీసి నడవలోనున్న తిరగలి వద్ద కూచున్నది. పొద్దున్న సంగటి కావాలి. ఆ ఒక్క పూటా అట్లా

నిబ్బరించగలిగితే మళ్లా నాలుగు నాళ్లపాటు మగవాడి వళ్లు బాగాపడే మార్గాన్ని చూడవచ్చు. ఆమెకది ఏడో నెల గర్భం గదా! వేకువనుండి క్షణం తీరికలేదు. రెక్కలూడిపోతున్నాయి. ఆ చల్లని చలి గాలిలో గూడా చెమట రాగిపిండి తడిసిపోతున్నట్లు కారుతున్నది. అయినా తప్పదు. ఆ రాగులు విసిరాక కాస్సేపు నడుం వాలుద్దామను కొంటుంటే గాటిలో గిత్త అంబా అంటూ పిలిచింది. పాపం దాని నొప్పి ఎలా ఉందో! నోరున్నా చెప్పగలదు. మూగ ప్రాణం. కొట్టంలోకి వెళ్లి "పడుకోరా బుజ్జినాయనా! రేపు పేటకు పంపి ఫినాయిలు తెమ్మంటాలే. ఆ వాసన సమురు పోస్తే పురుగులన్నీ చచ్చి పోతాయి" అంటూ చెవిదగ్గర చెప్పింది. అది తలను అటూ ఇటూ త్రిప్పి సరేనన్నట్లు మోరను గాటికానించి పడుకొన్నది. సిద్ధులమ్మ లోపలికి వెళ్లి కొంగుపరచుకొని చిన్న కునుకు తీసింది.

పున్నయ్య జీవితంలో మళ్లీ ప్రొద్దుపొడిచింది. ఆ ప్రొద్దుకొక ప్రత్యేకత వుంది. అతని శ్రమ ఫలాన్ని చూడగలిగిన రోజది. భళ్లుమని తెల్లవారేలోగా పాచి పనంతా చేసి సిద్ధులమ్మ మడికాడికి వెళ్లింది. అక్కడ ముగ్గురు బిడ్డలూ ఆదమరచి నిదురోతున్నారు. కన్నిగాడు మాత్రం వేపపుల్ల నోట్లో పెట్టుకొని గనిమ మీద కూచున్నాడు. సీతయ్య చలిమంట ముందు కూచుని బీడీ త్రాగుతున్నాడు. సిద్ధులమ్మ పిల్లల్ని లేపింది. ముగ్గురునీ ఇంటికి వెళ్లి చద్దితిని రమ్మన్నది. సీతయ్యనూ, కన్నిగాన్ని ముఖం కడుక్కొని యింటికి వెళ్లమన్నది. ఆమె పిల్లలు వచ్చేవరకూ అక్కడే ఉండి చద్ది పొద్దుకు ఇంటికి వచ్చి ఎసురుపెట్టింది. చకచకా సంగటి ముద్దలు చేసి, నాలుగు ఎండు చేపలూ, వంకాయ వరుగులూ పులుసు కూర చేసి మగనికి అన్నం పెట్టింది.

"మామూలు వాళ్లకంతా ఇచ్చెయ్. గింజలు ఇంటికి వచ్చాక అమ్మే కథ చూద్దాము. కళ్లంలో మాత్రం కొలవకేం" అన్నాడు పున్నయ్య. కళ్లంలో గింజలమ్మితే ధాన్యం నిలవదని అతని నమ్మకం.

ఆ చిన్న నాలుగు గుంటల మడికీ ఇంత శ్రమ చేయాలన్నదట్లా వుంచి అక్కడ వాదెల వద్దకు వచ్చిన మామూళ్లవాళ్లు ఎందరు!.

నీరు కట్టువానికో వాదె, మంగలికో వాదె, చాకలికో వాదె, తోటికో వాదె, వెట్టికో వాదె, పంబలోనికో వాదె, కరమ లతనికో వాదె, ఎడ్ల అతనికో వాదె, పూజారికో వాదె, పోగా మిగిలింది రాలగొట్టారు. తిరిపానికి వచ్చిన వారు ఐదారుగురున్నారు. వారితోపాటు రెండు అంగడి గంపలు. ఏడాదికో ఏకాదశి అన్నట్టు ఆనాడు చక్రయ్య రెండు వడలు తిన్నాడు. తవ్వెడు గుగ్గిళ్లు తీసుకొన్నాడు. వీరయ్య మల్లయ్య చెరో ఇడ్లీ తీసుకొన్నారు. వీటికంతా కలిపి మామూలుగా బళ్లెడు వడ్లు అంగడి గంపకు పోసి తిరిపానికి వచ్చిన వారికి చెరో చేటెడు ధాన్యం పంచింది సిద్ధులమ్మ.

ఇక మిగిలింది కళ్లం మాలది. ఆమె కరక్కాయల వడ్లు ఏరిపోసుకొంటుంది. కళ్లంలో తోకలాగా మిగిల్చిన ధాన్యాన్ని వూడ్చుకొంటుంది. వీరినంతా తృప్తిగా పంపకుంటే రేపే పనీ

సాగదు. మడకకొయ్య కావాలంటే వడ్లాయన బాడిసె తీసి చెక్కాలి. కర్రు కావాలంటే కరమలాయన వోపిగ్గా చేయాలి. వంక సాగినపుడు నీరు కట్టేవాని అవసరం ఉండనే వుంది. ఏ దేవరకో పెట్టినపుడు, పిల్లలకే కిసురో తగిలినపుడు పూజారి లేకుంటే ఎట్లా? ఉండేదొక పేలికైనా చాకలివాడు గుంజిపెట్టాలి. నెలకో మార్రైనా మంగలి గడ్డం గీకాలి. మరి వాళ్లకంతా కడుపు సాగవద్దూ?

సిద్ధులమ్మ మిగిలిన మూడు బస్తాల గింజలను గంపలతో ఇంటికెత్తించింది. ప్రొద్దు పోయేలోగానే గింజలు యిల్లు చేరాయి.

ఆ రాత్రి నట్టింటిలో పోసిన ధాన్యాన్ని సంతృప్తిగా చూశాడు పున్నయ్య. అమ్మయ్య! అనుకొన్నాడు. ధర్మాత్ముడు జానయ్యే గనుక నీళ్లు ఒకపూట వదలకుండా వుంటే తన మడి ఎండిపోవలసిందే గదా! అతని కడుపున పుట్టియైనా ఋణం తీర్చుకొంటాననుకొన్నాడు పున్నయ్య.

ఆ ఉదయమే బస్తా వడ్లు అమ్మి ఆస్పత్రికి వెళ్లాలని సిద్ధులమ్మ సెట్టిగారింటికి వెళ్లింది. బస్తా వెల పన్నెండు రూపాయలా నాలుగణాలు. ఎక్కువ దమ్మిడీ కూడా ఇవ్వలేనన్నాడు సెట్టి. కొత్త ధాన్యం అంతకంటే వెలపలకదు. అందులోనూ అవి పాలం సంబావు వడ్లు. ఏ తిరుమణో చిన సంబావులో అయితే ఇంకో రూపాయ ఎక్కువ వచ్చేది. పొద్దున్నే సంచి తీసుకొని రమ్మని చెప్పి ఇంటికి వచ్చింది సిద్ధులమ్మ.

అందరూ సంగటి తిని అలసటతో పడుకొన్నారు. సిద్ధులమ్మ మాత్రం పున్నయ్యకు వళ్లు పడుతూ ఉంది. అతడు మెల్లగా మూలుగుతూ వున్నాడు. అర్ధరాత్రి కావచ్చింది. కొట్టంలో గిత్త అంబా అంటూ అరిచింది. సిద్ధులమ్మ అటు వెళ్లింది. అప్పుడు జ్ఞప్తికి వచ్చిందామెకు. గత రాత్రి పేటకు పంపి ఫినాయిల్ తెప్పిస్తానని చెప్పింది గదా! పనుల తొందరలో మరచేపోయింది. "తెల్లారగానే మందు నూనె తెప్పిస్తానని" ఆప్యాయంగా గిత్తతో అంటూ కాస్తా గడ్డి విదిలించి లోనికి వచ్చేలోగా పున్నయ్య వాంతి చేసుకొన్నాడు. అతన్ని గోడకు ఆనించి ఆ వాంతినంతా శుభ్రం చేసేలోగానే రెండవసారి వమనం చేసుకొన్నాడు. ఈమారు వట్టి నెత్తురుపడింది.

సిద్ధులమ్మ అదిరిపోయి వీరయ్యను లేపింది. వీరయ్య మల్లయ్య కూడా లేచారు. చక్రయ్య కూడా మేలుకొన్నాడు.

"గింజలు అన్నీ ఇంటికి తెచ్చేశారా? మామూళ్లన్నీ ఇచ్చేశారు గదా" పున్నయ్య.

"నీ ముందే ఉందే రాశి. ఎందుకట్లా మాట్లాడుతావు?" అన్నది ఒళ్లు నిమురుతూ సిద్ధులమ్మ.

"సిద్ధీ... సిద్ధీ... గిత్తకెలా ఉందో చూసిరా... ఎవరో ఈడుస్తున్నారే దాన్ని... చూడు చూడు..." అన్నాడు పున్నయ్య.

సిద్ధులమ్మ గబగబా కొట్టంలోకి వెళ్లింది. అది గాటిలో పడి విలవిలమని తన్నుకొంటోంది. “ఒరేయ్ వీరా” అంటూ కేకేసింది. వీరయ్య మల్లయ్యను అక్కడే నాన్న దగ్గరుంచి కొట్టంలోకి వెళ్లాడు. గిత్త అంబా అంటూ అంటూ రోదించింది. దాని నాలుక పైపైకి వచ్చి మళ్లీ లోపలికి ఈడ్చుకపోతోంది. కన్నుల్లో నీళ్లు ధారాపాతంగా వస్తోంది.

“సిద్ధీ... సిద్ధీ... సిద్ధీ...” అంటూ గట్టిగా పిలిచాడు పున్నయ్య. సిద్ధులమ్మ పైకి లేచింది... గిత్త నాలుగు కాళ్లూ బారచాపి మోరు క్రిందికి వాల్చింది. దాని తల వాలిపోయింది. చలనం లేదు. ఇక ఉండదు.

“గిత్త... గిత్త...” అన్నాడు పున్నయ్య.

“పోయింది... చచ్చిపోయింది నాన్నా...” అన్నాడు వీరయ్య.

“ఆ...” అంటూ మరీ వెనక్కి వాలిపోయాడు పున్నయ్య. “నాన్నా నాన్నా నాన్నా” అంటూ ముగ్గురు కొడుకులూ అతనిమీద పడ్డారు. సిద్ధులమ్మ రెండు చేతులతోనూ గట్టిగా గుండెలను బాదుకొన్నది.

గాటిలోని రెండవ గిత్త “అంబా” అంటూ మరీ గట్టిగా అదే అరవడం ఆరంభించింది! అరుస్తూనే ఉంది! అంబా! అంబా! అంబా!.

✡

# నన్ను క్షమించు కన్నా!

**–జి. ఆర్. మహర్షి**

ప్రియమైన కన్నా!

ఈ రోజు నువ్వు నన్నొక ప్రశ్న అడిగావు. దానికి సమాధానమే ఈ వుత్తరం. నీ ప్రశ్నలో న్యాయముంది. బహుశా ప్రతి మధ్యతరగతి తండ్రీ తన బిడ్డలనుంచి ఏదో ఒకరోజు ఈ ప్రశ్న ఎదుర్కోక తప్పదేమో!

నువ్వు మంచి మార్కులతో పాసయ్యావు. అయినా నువ్వు కోరిన కోర్సులో సీటు రాలేదు. తక్కువ మార్కులొచ్చిన నీ మిత్రులు డొనేషన్లు కట్టి చదువుతున్నారు. ఆ దు:ఖంలో నువ్వు నన్ను ప్రశ్నించావు.

"నువ్వు డబ్బెందుకు సంపాదించలేదు నాన్నా?" అని నిలదీశావు.

ఇప్పుడు నేను చెపుతున్నది నా ఒక్కడి కథ కాదు. మనవూరి రైతులందరిదీ.

మా నాయన నాకు పదెకరాల భూమిని ఇచ్చాడు. అది బంగారం పండే నేలని అందరూ అనేవాళ్లు. మా అమ్మ బంగారాన్నంతా ఆ భూమి మింగేసింది.

వానదేవుడు బలే పిసినారి, చినుకు విదిల్చేవాడు కాదు.

మనవూరి భూములకు కాలువనీళ్లు వస్తాయని మా నాయన కాలం నుంచి అంటూనే వున్నారు.

"నా బతుకంతా వానకోసం ఎదురు చూడటానికే సరిపోయింది. మబ్బులవైపు ఎంత ఆశగా చూసేవాన్నంటే, చూసి చూసి నా కళ్లలో నీళ్లొచ్చేవి. అందుకే నాకు చత్వారం వచ్చుంటుంది. అవి జాలిలేని మబ్బులు. వాటి గుండెల్లో కొంచెం కూడా తడిలేదు. మాది ఎండిపోయిన కాలం. నువ్వు అదృష్టవంతుడివి. కాలువ నీళ్లతో మారాజులాగా సేద్యం చేసుకుంటావు" అనేవాడు మా నాయన.

జీవితమంతా కాలువకోసం కలవరించాడు మా నాయన. ఆయన నాలుగు మాటలు మాట్లాడితే ఒక మాట కాలువగురించే అయివుండేది.

ప్రతి విషయాన్ని కాలువతో ముడిపెట్టి మాట్లాడేవాడు.

'ఇంటిని రిపేరు చేయించుకుందాం నాయనా!' అని నేనంటే–

“ఎందుకురా తొక్కులాడుతావు? కొంచెం నిదానంగా వుండు. కాలువ నీళ్లు రానివ్వు. మాంచి మిద్దె కట్టుకుందాం” అనేవాడు.

కాలువ నీళ్లొస్తే సంవత్సరానికి ఎన్ని పంటలు వేయాల్నో అంచనాలు వేసేవాడు. వరిలో ఏ రకం నాటితే బాగుంటుందోనని అందరిని సలహాలు అడిగేవాడు.

“బంగారు కడ్డీలు బియ్యమైతే బ్రహ్మాండంగా వుంటాయి. నోట్లో పెట్టుకుంటే నమిలే పనిలేకుండా కరిగిపోతాయి. పండ్లులేకపోయినా బాధేలేదు. రాగిసంకటి తినితిని ప్రాణం రోసిపోయింది. కాలువనీల్లొస్తే రోజూ వరన్నమే!”

“ఎకరాకు ఎన్ని మూటలు వడ్లొస్తాయి? నాటే రకాన్ని బట్టి, కష్టాన్ని బట్టి వుంటుందిలే. ఇంటి వాడకానికి కనీసం పది మూటలు అవసరం. పది సరిపోవేమో! పన్నెండు వేసు కుందాం. రైతు ఇంటికి నలుగురు వచ్చీపోయే వాళ్లుంటారు. అయినా కొనిన బియ్యమైతే చూసుకొని వాడుకుంటం. పండిన బియ్యమేకదా, ఒక సేరు అటో ఇటో!”

“కాలువొస్తే శనొదిలిపోతుంది. ఇప్పటిమాదిరి అమాసకి, పున్నానికి నాలుగు ముక్కలు మాంసం వండుకొని, గోకిగోకి తినే దరిద్రముండదు. వారానికి రెండు కోళ్లు కోసుకొని తినొచ్చు. మెత్తటి ముక్కల్ని నూనెలో వేయించుకొని తింటూ వుంటే నా సామిరంగా, ఇంద్రభోగమంటే అదేకదా!”

ఇలావుండేది ఆయన ధోరణి.

ఆయన మంచం మీద కొనప్రాణంతో వున్నప్పుడు, నన్ను దగ్గరికి పిలిచి “నీళ్లు” అన్నాడు తులసి తీర్థాన్ని నోటి దగ్గరికి తీసుకెళ్లాను. నా చెయ్యిని తోసేసి “కాలువ నీళ్లు వచ్చాయా?” అని గొణిగాడు.

రాలేదన్నాను. ఆ మాటతో ఆయన ప్రాణం పోయింది.

రాజకీయ నాయకులకు కాలువ ఒక ఆయుధం. దాని గురించి చెప్పిచెప్పి మమ్మల్ని వూరించేవాళ్లు. ట్రాక్టర్లతో, లారీల్లో మమ్మల్ని తోలుకొని వెళ్లి ధర్నాలు, వూరేగింపులు చేయించారు. మమ్మల్ని వీధుల్లోకి లాగి కేకలు వేయించిన వాళ్లందరికీ అధికారం వచ్చింది. ఇప్పుడు వాళ్లు మంత్రి పదవులకోసం కొట్టుకుంటున్నారు.

కాలువకోసం ఎదురుచూసి చూసి రైతులు కార్చిన కన్నీళ్లన్నీ ఒకచోట కలిపివుంటే అటువంటి కాలువలు రెండై వుండేవి.

కాలువంటే ఒక ఎండమావి – అంతే!

వానదేవుడు కన్ను తెరిస్తే ధరలు మోసం చేసేవి. విత్తనం వేసేటప్పుడు వేరు శెనగకి మంచి రేటుండేది. విత్తనాలు విత్తి, రూపాయలు ఏరుకోవచ్చని ఆశపడేవాళ్లం.

పంటచేతికొచ్చే సరికి ధర పాతాళంలో వుండేది. కల్లంనుంచి చెనిక్కాయ మూటలతో ఇంటికొచ్చే సరికి, పెళ్లాం బిడ్డలకంటే ముందు అప్పులోళ్లు ఎదురొచ్చేవారు. ఇంట్లో కూటినీళు మెతుకులు తాగినా అప్పులోళ్లదగ్గిర మాత్రం మానం కాపాడుకోవాలి కదా! పంటను అయినకాడికి అమ్మేవాళ్లం. రైతుల దగ్గర పంటంతా అయిపోయేసరికి ధర ధగధగమని మెరిసేది.

కష్టపడిన ప్రాణాలు ఉసూరుమనేవి. వ్యాపారస్తుల ఇంట్లో బంగారు పొగ లేచేది.

ప్రతి ఏడూ ఇదే పరిస్థితి. ఒకసారి పంట బిడ్డలాగా ఎదిగొచ్చింది. అందరమూ గుండెలనిండా గాలి పీల్చుకున్నాం. రెండేళ్లు పంటలు లేకున్నా బతకొచ్చనుకున్నాం. సంతోషపడినంత సేపు నిలవలేదది. పంటకు తెగులొచ్చింది. అప్పులు చేసి మందులు కొట్టాం. పంటపోయి అప్పు మిగిలింది. తరువాత తెలిసింది. మేము కొట్టినవి కల్తీ మందులని!

రైతు పరిస్థితి మూగెద్దుకంటే అన్యాయం. ఎద్దుకి కోపమొస్తే కొమ్ముతోనైనా పొడుస్తుంది.

మనకు జత ఎద్దులుండేవని నీకు తెలుసు. ఈ భూమండలాన్నంతా దున్నేశక్తి వుండేది వాటికి. ఒక సంఘటన గుర్తుందా? అప్పుడు నీకు తొమ్మిది పదేళ్ల వయసు. ఒకరోజు నా ఎదురుగా ఎద్దుల్ని చెలకోలతో కొట్టావు, నా ప్రాణం గిలగిలలాడింది. 'మూగజీవాలను కొట్టకూడదు నాయనా!' అని మంచిగా చెప్పాను. నువ్వు వినలేదు. మరో దెబ్బ వేశావు. నీ చేతిలోని చెలకోలాను లాక్కొని నీ.. వీపుమీద ఒక్కటి పీకాను. వాత తేలింది. మీ అమ్మ పరిగెత్తుకుంటూ వచ్చింది.

నిన్ను వాటేసుకుని "నువ్వు మనిషివా, పసరానివా?" అని నన్ను తిట్టింది. నేను తలవంచుకుని వెళ్లిపోయాను.

ఎద్దులంటే నాకు ప్రాణం!

పొరుగూళ్లకు పోయినపుడు, పెళ్లాం బిడ్డలకంటే ఎక్కువగా ఎద్దులే గుర్తొచ్చేవి. వేళకు మేతవేశారో లేదో? కుడితి తాగించారో లేదో? ఇవే ఆలోచనలు. బస్సుదిగిన తరువాత ఇంట్లోకంటే ముందు ఎద్దుల కొట్టంలోకి వెళ్లేవాన్ని.

రెండేళ్లకిందట వూర్లో కరువొచ్చింది. మేతనేది కనిపించకుండాపోయింది. వూర్లో ఎద్దులన్నీ ఎముకల పోగులయ్యాయి. చాలామంది తమ పశువులను కసాయోళ్లకి అమ్ము కున్నారు. నేను అమ్మలేదు. నా ఎద్దుల్ని బతికించుకునే దానికి భూమ్మీద ఇంత మేతను దేవుడు

మిగల్చకపోతాడా అని వాటిని తోలుకొని కొండలన్నీ తిరిగాను. ఇంత గడ్డి కనపడితే బంగారంలాగా కోసుకొచ్చాను.

ఆ సమయంలో నీ దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజులకీ, పుస్తకాలకీ డబ్బులు కావాలని రాశావు. విషం తాగాలన్నా నా చేతిలో పైసా లేదు. అప్పు పుట్టదు. గుండెను రాయి చేసుకొని ఎద్దుల్ని తీసుకొని బయలుదేరాను. కసాయి సాయిబు చేతిలో ఎద్దుల పగ్గాల్ని పెట్టాను. ధర అడగలేదు. బేరం చేయలేదు. మాట్లేదేశక్తి లేదు. మాట్లాడితే వెక్కి వెక్కి ఏడుస్తానని భయం.

నిన్ను జమీందారుల బిడ్డలాగా పెంచలేకపోవచ్చు. కాని రైతుబిడ్డ మాదిరి పెంచడానికి నేనూ, మీ అమ్మా కూలివాళ్లమయ్యాం. ఎర్రటి ఎండలో మట్టితట్టలు మోశాం.

నువ్వు సెలవలకి ఇంటికొచ్చినపుడు టవున్లోవుండి చదువుకోకుండా ఇంటికెందుకు వస్తావని అరిచేవాణ్ణి. నువ్వు వెళ్లేవరకూ తరుముకునే వాన్ని. ఇంటి పరిస్థితులు నీకు తెలియడం నాకిష్టం లేదు.

నీ కోసం మేము చాలా కష్టాలు పడ్డామని చెప్పడం నా ఉద్దేశం కాదు. పిల్లల కోసం కష్టపడటంలో తల్లిదండ్రులకి ఆనందముంది.

మన పొరుగూళ్లో హైస్కూల్ వుండడంతో నేను కూడా పదవ తరగతి వరకూ చదువుకున్నాను. ప్రయత్నం చేసివుంటే ఆ రోజుల్లో నాకు ఏదో ఒక ఉద్యోగం వచ్చుండేది. కాని నాకు ఇష్టంలేదు. నేను భూమిని నమ్ముకొని బతికేవాణ్ణి. సేద్యం నా కల.

పెద్దలు ఒకమాట అనేవారు – "చిన్న డబ్బులుంటే చిల్లర అంగడి పెట్టుకో. ఎక్కువ డబ్బులుంటే మండీ వ్యాపారం చేసుకో. ఇంకా ఎక్కువ డబ్బులుంటే ఆడపిల్లని కను" అని చెప్పేవారు.

కాని నా దగ్గర డబ్బులు లేకపోయినా ఆడపిల్లని కన్నాను. మీ అక్క పెళ్లి చేయాల్సి వచ్చింది. ఆమె కోసం ఐదు ఎకరాల భూమిని అమ్మాను. నా ప్రియమైన బిడ్డని, భూమిని ఒకేసారి పరాయివాళ్ల చేతిలో పెట్టాను.

నిజానికి నాకంటే ఎక్కువ కష్టం చేసిన వ్యక్తి మీ అమ్మ. కోడికంటే ముందే లేచేది. గొడ్డుకంటే అన్యాయంగా కష్టం చేసేది. ఆమె ఎంత ఒద్దికగా సంసారాన్ని సాకిందంటే, దారిలో నడిచేటప్పుడు కంపపుల్ల కాలికి గుచ్చుకుంటే, ఆ పుల్లను పీకిపారెయకుండా ఇంటికి తీసుకొచ్చేది. కాలిబాధ లెక్క చేయకుండా, పొయ్యిలోకి ఒక పుల్ల వచ్చి చేరిందని తృప్తిపడేది.

ఆమెకిప్పుడు ఆరోగ్యం బాగాలేదు. అయినా ఆరోగ్యంగా వున్నట్టు నటిస్తూ వుంది. ఆమెకి ఏ జబ్బూ లేదని నేను కూడా చెపుతున్నాను. డాక్టర్ల దగ్గరకి వెళ్లి పరీక్షలు చేయించాలంటే

భయం. వేల రూపాయలు ఖర్చవుతాయని అంటారేమోనని భయం. రోగం గురించి తెలుసుకొని నయం చేయించుకోలేకపోవడం కంటే తెలుసుకోకుండా వుండటమే అదృష్టం.

నువ్వు బాగా చదువుకొని గొప్పవాడివి కావాలని నాకేవేవో ఆశలుండేవి. కాని ఇప్పుడిప్పుడే ఈ చదువులమీద నాకు భ్రమలు తొలగిపోతున్నాయి.

డబ్బుంటే మరింత చదువు. చదువుంటే మరింత డబ్బు. ఇదొక సూత్రం.

ఎదుటిమనిషి దు:ఖాన్ని అర్థం చేసుకునే శక్తి ఈ చదువులకుందా?

మన రంగయ్య మామ తెలుసు కదా, బండి తోలుకొని బతుకుతాడు. పాపం, వాడికి ఒకటే ఆయాసం. బండిలాగే ఎద్దులకంటే వాడే ఎక్కువ గస పోస్తున్నాడు. వాడిని టవున్లో గవర్నమెంట్ ఆస్పత్రికి పిలుచుకొనిపోయాను. డాక్టరు ఏవేవోరోగాల పేర్లు చెప్పాడు. మా కర్థంకాలేదు. తరువాత రెండు వందలు లంచమడిగాడు. ఇది మాత్రం అర్థమయ్యింది.

రంగయ్య మామ డాక్టర్‌ని ఎగాదిగా చూసి, నన్ను బయటికి తీసుకొచ్చి "రెండు వందలకి ఎన్ని కోళ్లొస్తాయిరా?" అని అడిగాడు.

కోడికి, డాక్టర్‌కి ఏమి సంబంధమో నాకు అర్థంకాలేదు. అయినా నాలుగైదు కోళ్లు వస్తాయని చెప్పాను.

"ఆరు నెలలనుంచి కోడిమాంసం తినాలని ప్రాణం తనకలాడుతావున్నా, డబ్బుల్లేక నోరు కుట్టుకుని బతకతా వుండాను. రెండు వందలు డాక్టర్‌కు ఇచ్చేదానికంటే, ఇంటికి పోయి కోడి కోసుకుని తినేది మేలుకదా! పోతే రోగం పోతుంది. లేదంటే ప్రాణం పోతుంది. అయినా కోడి మాంసం తినిన తరువాత ప్రాణం పోతేనేం?" అన్నాడు.

సరే, ఆ సంగతి వదిలెయ్యి. బలహీనుల్ని పేదవారిని దోచుకోవడమే చదువుల యొక్క అంతిమలక్ష్యంగా మారినపుడు ఈ చదువులకు కొంచెం కూడా అర్థం లేదు.

నాకు ఆయుష్షు పెంచమని దేవుణ్ణి ఎప్పుడూ మొక్కుకుంటూ వుంటాను. నాకేమైనా జరిగితే అప్పులు నీ నెత్తిన పడతాయి. ఆ భారాన్ని నువ్వు మోయలేవు. అప్పులు తీర్చడానికైనా నేను బతికుండాలి. నీ మనసు బాధపెడితే నన్ను క్షమించు కన్నా!

✡

# బతుకు

**–మేరెడ్డి యాదగిరిరెడ్డి**

రాత్రి ఊర్లో దండోరా వేశారు. మైనందాసు తన పాత డప్పు తీసుకుని ఏసుకున్న నాటుసారా కిక్కుల్లో చిందేస్తూ బజారు, బజారు తిరిగి డప్పు మోగించి మరీ చెప్పాడు. చిందేయటంలో దాసుది వెరైటీ. మందేసి చిందేస్తే చూడాలి మరి పెండ్లికైనా చావుకైనా దాసు డప్పు మోగాల్సిందే, ముందు నడవాల్సిందే. తండ్రి తాతల నుండి వస్తున్న డప్పు వాయిద్యంలో దాసు దిట్ట అనిపించుకున్నాడు.

"రేపు పొద్దుగాల ముత్యాలమ్మ చెట్టు దగ్గర అదే పంచాయితీ ఆఫీసుముందరకి తహశీల్‌దారు వస్తుండు. భూమిలేనోల్లకు భూములిస్తరట. అందరూ రావాలహో" ఊరంతా తిరిగి మరీ మరీ చెప్పాడు. పంచాయతీ సెక్రటరీ యిచ్చిన ఇరవయి రూపాయల నాటుసారా వేసుకుని మరీ చెప్పాడు. అలాగని దాసు రోజూ తాగడు. ఎవరైనా పదీ పరకా యిచ్చినప్పుడే కాసింత నాటు వేస్తడు. సరదా మనిషి.

జనం గుంపులుగా చెట్టు కిందికి వచ్చారు. పెద్దా చిన్నా ఆడా మగా అంతా ముత్యాలమ్మ చెట్టు నీడన చేరారు. ఊరి మధ్య పెద్ద మర్రిచెట్టు. దానికింద ముత్యాలమ్మ గుడి. అదే ముత్యాలమ్మ చెట్టు. ఊరిలోని పెద్ద చెట్లన్నీ బొగ్గు బట్టీల పాలయ్యాయి. ఈ చెట్లు జోలికి మాత్రం ఎవరు రాలేదు. ముత్యాలమ్మ దేవతకు కోపమొస్తుందని ఆకు కూడా ఎవ్వరూ ముట్టుకోరు. శ్రావణ మాసంలో బోనాలు, బతుకమ్మ పండగపుడు బతుకమ్మల సందడి అన్నీ ఆ చెట్టుకిందే. పిల్లల ఆటాపాటా ఆడవాళ్ల చప్పట్లు, మగవాళ్ల కోలాటాలు, భజనలు, బాగోతులు, తోలు బొమ్మలాటలు, పిచ్చకుంట్ల కథల చిరుతల రామాయణాలు, ఊరు మంచి చెడు, ఆలుమగల పంచాయతీలు, గట్ల పంచాయతీలు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు, భూ తగాదాలు, రాజకీయాలు ఇరుగు పొరుగు ముచ్చట్లు అన్ని ఆ చెట్ల నీడనే.

ఆ పక్కనే అంగన్ వాడీ బల్లో చిన్నపిల్లల ఏడ్పులు, సర్కారు బల్లో పంతుల్ల పాఠాలు, పిల్లల చప్పుల్లు తెల్లారితే వెరసి ఊరు ఊరంతా అక్కడవున్నట్లే ఉంటుంది. పేపరు చదివేవాల్లు, ముచ్చట్లు వేసేవాల్లు ఎవరి పనిలో వారు వున్నారు.

ఉదయం పదిగంటలయింది. పది కుర్చీలు తెప్పించి చెట్టు కింద వేయించాడు పంచాయతీ సెక్రటరీ. పంచాయితీ ఆఫీసు పక్కనే వుంది. బయ్యిన దుమ్ము లేపుకుంట వచ్చిన జీపు చెట్ల కింద ఆగింది. తహశీల్‌దారు, ఆర్.ఐ., సర్వేయర్ ఫైల్లు పట్టుకుని కింది దిగారు. డ్రైవరు జీబును దూరంగా స్కూల్ దగ్గర చెట్టు కింద పెట్టాడు.

భూమి లేని పేదలకు ఎసైన్‌మెంట్ భూమి పంచుదామని తహశీల్‌దారు సిబ్బంది వచ్చారు. వాల్లకంటే ముందుగానే పంచాయితీ సెక్రెటరీ, రెవిన్యూ సెక్రెటరీ, పంచాయితీ ప్రెసిడెంట్‌తో కలిసి భూమి లేని పేదలను పిలిపించారు. అందరు ఆత్రంగా ఎదురుచూస్తూ నిలబడ్డారు. ఎవరెవరికి భూమి వస్తుందో అని ఈ దఫా పట్టాలు ఆడవారి పేరు మీదే ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశం మేరకు పాసు బుక్‌లు ఆడవారి పేరుమీదే తయారు చేశారు.

లిస్టులోని పేర్లన్నీ రెవిన్యూ సెక్రటరీ చదివి వినిపించాడు. ఒక్కొక్కరిని రమ్మని చెప్పాడు. భూమి కోసం వచ్చిన వారంతా ఒకరి వెంట ఒకరు తహశీలుదారు దగ్గరకు వచ్చారు. ఒక్కోక్కరికి పాస్‌బుక్ పట్టా సర్టిఫికెట్ అందించాడు. భూమి పట్టాలు పాస్‌బుక్‌లు అందుకున్న ఆడవారి ముఖాలు సంతోషంతో వెలిగిపోతున్నాయి. దాసు భార్య మల్లీశ్వరికి కూడా పాస్‌బుక్ పట్టా సర్టిఫికెట్ ఇచ్చారు.

“ఇదిగో చూడండి ఇది ప్రభుత్వ భూమి. భూమిలేని పేదలు బాగుపడాలని ప్రభుత్వం మీకు ఈ భూమి యిచ్చింది. భూమిని బాగు చేసుకుని పంటలు పండించుకోవాలి. అందరికి బోర్లు వేసి యిస్తాం. మీరిప్పుడు కూలీలుగారు, రైతులు. బాగా కష్టపడి పంటలు పండించి సుఖంగా బతుకండి. మీరు ఈ భూమి అమ్మచూపినా, పడావు పెట్టినా ఈ భూమి వేరే వారికి ఇవ్వబడుతుంది. సర్వేయర్ వచ్చి ఇప్పుడే మీకు భూమి కొలిచి రాళ్లు వేసి మీకు స్వాధీనం చేస్తాడు.” లేచి నిల్చున్న తహశీల్దారు తన ఉపన్యాసం పూర్తి చేసి కుర్చీల కూర్చొని ముఖం తుడ్చుకున్నాడు.

పాస్‌బుక్‌లు ఇచ్చిన వారినంతా గ్రామ కార్యదర్శి పక్కకు పిలిచాడు. తలా ఐదొందలు మొత్తం పది మంది దగ్గర ఓ ఐదు వేలు వసూలు చేశాడు. దీనికి పాత పట్వారి రాఘవరావు తన వంతు సహాయ సహకారాలు అందించాడు.

రాఘవరావు ఆ ఊరికి పాత పట్వారి. ఆ ఊరి వాడే. తండ్రి తాతలు పట్వారిగా పనిచేశారు. తనుకూడ కొంతకాలం పట్వారిగా పనిచేశాడు. రామారావుగారు ముఖ్యమంత్రిగా పట్వారి వ్యవస్థ రద్దు చేయడంతో ఆయన పట్వారిగిరి ఊడిపోయింది. కొంతకాలం వి.ఏ.ఓ.గా కూడా పనిచేశాడు.

ఎర్రగా బక్క పల్చగా ఉంటాడు. రింగులనెత్తి, కళ్లద్దాలు, నెరిసిన జుట్టుకు ఎప్పుడు రంగు వేస్తుంటాడు, తెల్లటి ధోవతి, సిల్కు లాల్చీ మడతలు నలగనీయడు. రిటైరయినా ఇప్పటికి ఆ చుట్టుపక్కల భూముల లావాదేవీలన్నీ ఈయన చుట్టే తిరుగుతాయి. భూముల

కొలతలు వేస్తాడు. భూ తగాదాల కోసం జనాన్ని తన చుట్టూ తిప్పుకుంటాడు. అందుకు పాత రికార్డు కూడా కొంత తన దగ్గర పెట్టుకున్నాడు. ఊరిలోకి ఏ అధికారి వచ్చినా భోజన పానాదులు అన్నీ రాఘవరావు ఇంట్లోనే. ఊరివారంతా కరణం పంతులని పిలుస్తారు. తన తండ్రి తాతలు సంపాదించిన రెండొందల ఎకరాల భూమి సీలింగు కంటే ముందే తెలివిగా అమ్మి హైదరాబాదులో ప్లాట్లు కొన్నాడు. కొడుకు పేరు మీద తన పేరు మీద పెట్టుకున్నాడు. ఎటువంటి ఆఫీసరునైనా మాటలతో ఇట్టే బుట్టలో వేసుకుంటాడు. ఊరు ఊరంతా తన చుట్టు తిప్పుకుంటున్నాడు.

ఊరి పక్కనే పెద్దవాగు. ఆ పక్కనే వందెకరాల ప్రభుత్వ బంచరాయి భూమి. అందులో చాలా వరకు గతంలోనే చాలా మందికి ఎసైన్‌మెంట్ ల్యాండ్ పంపిణీ చేశారు. మిగిలిన భూమి ఇప్పుడు మల్లీశ్వరితో కలిపి పది మందికి పంచారు. తలా రెండెకరాలు, ఇరవయ్యెకరాలు పంపిణీ చేశారు.

ఒకప్పుడు ఆ వాగు మూడు వందల అరవయిరోజులు జలకళ వుట్టిపడేది. ఇసుక తోలుడు విపరీతమైన బోర్లు వేయడంతో వట్టిపోయింది.

రెండు బైకుల మీద సర్వేయర్, ఆర్.ఐ., కార్యదర్శి, మస్కూరు వచ్చారు. గొలుసు తీసి చకచకా కొలచి రాళ్ళు వేశారు. ఎవరి భూమి వారికి చూపించారు. హద్దులల్లో రాల్లు పాతుకొమ్మని చెప్పారు. అంతా కొలిచి రాళ్లు పాతే వరకు మధ్యాహ్నమయింది. ఎవరి భూమికి వారు హద్దుల రాళ్లు వేసుకున్నారు.

అంతా ఓ చెట్టు కిందకు చేరారు. సీసాలల్ల తెచ్చుకున్న నీళ్లు తాగారు. సెక్రటరీ అందరిని పిలిచాడు. "చూడండి సర్వేయర్ గారు పొద్దుట నుండి ఎండలో మీ భూములన్నీ కొలిచాడు. ఎంత కష్టపడ్డాడో మీరే చూశారు ఏదో మీకు తోసినంత తలా ఓ రెండొందలియ్యండి" హుకుం జారీ చేశాడు.

"సార్ పొద్దున్నే తలా ఐదొందలిచ్చినం గదా" తువ్వాలుతో ముఖం తూడ్సుకుంటా దాసు అన్నాడు. మల్లీశ్వరి పక్కనే నిలబడింది. "చూడండి పొద్దుట మీరిచ్చిన పైసలు అన్నీ ఆఫీసోల్లకు పై వాళ్లకు పోతాయి. మాకు చిల్లి గవ్వ కూడా రాదు. మాకే మొస్తది. మేం పడ్డకష్టం చూసింద్రు కదా. రేపేదయినా చిక్కొచ్చినా మల్లీ మేమే వచ్చి సరిజెయ్యాలి". సెక్రటరీ నిష్టూరంగా మాట్లాడారు. ఇంతలో కరణం పంతులు రాఘవరావు రానే వచ్చాడు. అందరికి సర్దిచెప్పి తలా వంద రూపాయలు యిప్పించాడు. ఓ వెయ్యి రూపాయిలు సర్వేయర్ చేతులో పడ్డాయి.

మధ్యాహ్నం అంతా రాఘవరావు ఇంట్లో భోం చేసి వెళ్ళారు.

దాసుది పూరిల్లు. చుట్టు కంప పాతి తడికె పెట్టుకున్నాడు. ఎప్పుడో కట్టుకున్న ఇల్లు అది. కప్పు పోయినప్పుడల్లా కమ్మలు తెచ్చి కప్పుకుంటున్నాడు. భార్య మల్లీశ్వరి, కొడుకు

చంద్రం ఆరవ తరగతి, బిడ్డ నీరజ నాల్గవ తరగతి. ఆ ఊరి బడిలోనే చదువు. తల్లి చంద్రమ్మ ఫ్లోరిన్ నీళ్ళు తాగి నడుం వంగిపోయింది. కర్ర లేందే నడువలేదు. చాలా కాలం రాఘవరావు గారింట్లో వూడ్చి చల్లి వచ్చేది. ఈ మధ్యనే మానేసింది. దాసు, మల్లీశ్వరి కూలిపనితోనే కడుపు నింపుకుంటున్నారు.

తాము రైతులమయ్యాం. కూలి బతుకు పోయి హాయిగా వ్యవసాయం చేసుకుని బతుకవచ్చు. నలుగురికి పెట్టవచ్చు, నలుగురిలో తలెత్తుకొని తిరవచ్చు. తన పిల్లలు ప్రైవేటు బడిలో చదివించుకోవచ్చు. తన స్లాబ్ వేసుకుని పక్కా ఇల్లు కట్టుకోవచ్చు. ఓ బైక్ కొనుక్కొని తను మల్లీశ్వరి టింగురంగా అంటూ తిరిగి రావచ్చు. తన ఇంటినిండా వడ్లు, కూలీలు పని మనుషులు మంచి బట్టలు, భార్యాబిడ్డలకు వంటి నిండా బంగారు నగలు ఆ రాత్రి భార్యభర్తలు కలల్లో తేలిపోయారు. ఇంట్లో పండగ చేసుకున్నారు.

తనకు యిచ్చిన భూమినిండా రాళ్లు రప్పలు, సర్కారు తుమ్మచెట్లు, ఎగుడు దిగుడు. కాలు తీసి కాలు పెట్టలేనంత కంపచెట్లు. మల్లీశ్వరి, దాసు, ఇద్దరు పిల్లలు ఓ వారం పది రోజులు కష్టపడి చెట్లన్ని కొట్టి మొదలు తీసివేశారు. రాళ్ళన్నీ ఏరి కుప్పలు పోశారు. పిల్లలు ఓ పది రోజులు బడికి ఎగనాం పెట్టారు. నడుము వంగిన ముసలమ్మ చంద్రమ్మ గూడా కట్టె పొడుసుకుంటూ రాళ్ళు ఏరిపోసింది. భూమిని చదును చేసుకున్నారు. ఎంత కష్టపడ్డా వాల్ల ముఖాలు సంతోషంతో వెలిగిపోతున్నాయి. భూమి తమ స్వంతమయిందని.

సర్కారు వారి బోరింగు బండి వచ్చింది. భూమి పంచిన పది మంది రైతులు భూములలో బోర్లు వేశారు. ఒక్క మల్లీశ్వరి భూమిలోనే బోరు బాగా పడింది. ఫుల్‌గా నీళ్లు వచ్చాయి. అన్ని నీళ్ళు ఆ ఊరిలో ఎవరి బోర్లలో రాలేదంటారు జనం. ఓ నలుగురికి మామూలు నీళ్లు వచ్చాయి. ఇంకో నలుగురికి అసలు నీళ్లు రాలేదు. బండ వచ్చింది.

దాసు, మల్లీశ్వరి ఆనందానికి హద్దుల్లేవు. చుట్టుపక్కల వాళ్లు దాసు అదృష్టవంతుడని తెగపొగిడారు. బోరు వేసినంత సేపు రాఘవరావు పంతులు అక్కడే వున్నాడు. ఈ నీళ్ళను చూసేసరికి రాఘవరావు కండ్లు తిరిగిపోయాయి. రాఘవరావు నాలుగు బోర్లు కలిపినా ఇన్ని నీళ్ళు లేవు.

పాస్‌బుక్ బ్యాంకులో పెట్టి ఓ ఇరవయి వేల రూపాయిలు అప్పుగా తెచ్చాడు దాసు. బోరుకు మోటారు కొనుక్కొచ్చాడు. ఐదు వేలు కరెంటు డి.డి. కట్టాడు. కొత్తగా బోర్లు వేసిన వాల్లంతా డి.డి.లు కట్టారు. ఓ అయిదు వేలు కరెంటు వాల్లకు మామూల్లకింద ముట్ట చెప్పారు. ఓ వారం రోజుల్లో కొత్త ట్రాన్స్‌ఫారం వచ్చింది. దాసు మోటారు బిగించాడు. కొబ్బరికాయ కొట్టి ఆన్ చేశాడు. ఫుల్ నీళ్లు వచ్చాయి. ఆ నీళ్లతో ఇంటిల్లిపాది స్నానాలు చేశారు. పిల్లల కేరింతలే కేరింతలు.

ట్రాక్టరు కిరాయికి పెట్టి దున్నించిండు. పొలమంతా నీళ్లు పెట్టాడు. చదును చేయించాడు. వరాలన్నీ భార్యాభర్తలు సరిచేసుకున్నారు. మల్ల నిండా నీళ్ళు పెట్టారు. పొలమంతా నున్నగా తయారు చేశాడు. ఎటు చేసినా నీళ్ళే నీళ్ళు.

విత్తనాలు కొనుక్కొచ్చి నారు పోశారు. భార్యాభర్తల చీకటితో లేచింది మొదలు సాయంత్రం వరకు వద్దావరం పెట్టుకుని పొలమంతా నున్నగా చేసి పెట్టుకున్నారు. చేతిలో వున్న కొద్దో గొప్పో కూలి డబ్బులు అయిపోయాయి. ట్రాక్టరు కిరాయి ఇవ్వాలి. పెట్టుబడికి చేతిలో చిల్లగవ్వలేదు. పైసల కోసం కాలు కాలిన పిల్లిలా తిరిగుతున్నాడు దాసు, మల్లీశ్వరి.

వీరి అవసరం రాఘవరావు పంతులు కనిపెట్టాడు. దాసు పొలం పక్కనే రావు గారి తోట పొలం. తన పొలానికి పోయే దారి కూడా అదే. దాసు పొలం గట్టు రావు పొలం గట్టు కలిసే వున్నాయి. ఉదయం సాయంత్రం కాసేపాగి దాసు బోరు పోసే నీళ్ళు చూస్తూనే వున్నాడు. వాళ్లతో ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూనే వున్నాడు.

రాఘవరావుకు ఎప్పుడూ నీళ్ళ కరువే. ఓ పది బోర్లంటే వేశాడు. అందులో ఓ నాలుగు బోర్లు ఓ మోస్తరు నీళ్ళు వస్తున్నాయి. ఓ రెండు బోర్లు తోటకు నీళ్ళు పారుతున్నాయి. ఎండాకాలం వచ్చిందంటే తోటకు ఓ రెండు కిలోమీటర్ల దూరంలో నీళ్ళు కొన్ని పారిస్తూ వుంటారు. ఇప్పుడు ఆయన కళ్ళన్నీ దాసు బోరు నీళ్ళమీదే.

దాసు బోరు పక్కన రాయి మీద కూర్చుని మల్లీశ్వరి తెచ్చిన అన్నంతిని చెయ్యి కడుక్కుంటున్నాడు. ఇంతలో రయిన రాఘవరావు మోటారు సైకిలు వచ్చి ఆగింది. బైక్ ఆపి దిగాడు.

"ఏమోయి దాసూ నీపనే బాగుంది. పది రోజుల్లో పొలమంతా దున్ని పెట్టావు. నీ నారు ఏతకు వచ్చింది. ఏమమ్మా మల్లమ్మా నారు ఎప్పుడు పీకుతున్నారు. ఈ యేడు ఊరికంటే ముందు నీదే నాటు పటేట్టుంది. అదృష్టవంతులు. నా పొలమయితే ఇంత వరకు సగం కూడా తడువలేదు. నారు ముదిరిపోతుంది. బోర్లు ఆగి ఆగి పోస్తున్నాయి. ఏం జెయ్యాలో తోస్తలేదు" లాల్చి జేబులో నుండి సిగిరెట్ తీసి వెలిగించాడు రాఘవరావు.

ఇది వరకయితే మొగోల్లను ఒరేయి అని, ఆడవారిని ఒసేయి అని పిలిచేవాడు. ఏందిరా, రావె, పోవె అనేవాడు. ఈ మధ్య నాలుగయిదుసార్లు యువకులు ఎదురు తిరిగారు. వార్నింగు కూడా యిచ్చారు. అప్పటి నుండి తన ధోరణి మార్చుకున్నాడు. లోపల ఎంత కుళ్ళువున్నా బయటకు మాత్రం మర్యాదగా మాట్లాడుతున్నాడు.

"ఏముంది పంతులు గారూ! పొలమయితే తడిసింది. నారయితే పెరిగింది. వద్దావరం తీసి పెట్టుకున్నాం. చేతిల చిల్లిగవ్వ లేదు. ట్రాక్టరు కిరాయి పదివేలయింది. ఇప్పుడు అడుగుపిండి గావాలె. కలుపు గూళ్ళుగావాలె" టిపిన్ గిన్నె మల్లీశ్వరికిస్తూ అన్నాడు తువ్వాలుతో మూతి తుడ్చుకున్నాడు.

"ఏం జెయ్యాలో తెలుస్తలేదయ్యా. చేతులున్న కూలి పైసలు అయిపోయినవి. పిల్లకు కాల్ల పట్టీలు చేయిద్దామని దాసుకున్న పైసలు కూడా విత్తనాల వడ్లకిచ్చిన. అక్కడ ఇక్కడ ఓ అయిదారు వెయిలు బదులు తెచ్చినం. ఇంక యాడ అప్పు పుట్టెటట్టు లేదు. మీరయినా ఈ భూమిని గిర్విల పెట్టుకొని పెట్టుబడికి పైసలప్పిచ్చురి" మల్లీశ్వరి అన్నది. దేనికోసమయితే ఎదురు చూశాడో రావు అదే జరిగింది. తనకు కావలసింది కూడా అదే. "దానికింత పరేషానెందుకు మల్లమ్మ, పక్క పక్క పొలాల వాల్లం. ఆ మాత్రం సాయం చేయకుంటె ఎట్ల ఎంతగావాల్నో అంత తీసుకోండ్రి. పంట పండినంక ఇచ్చేయండ్రి". రాఘవరావు చేతిలోని సిగిరెట్ పడేసి కాలి చెప్పుతో నలిపివేశాడు.

భార్యాభర్తలిద్దరు ఆశ్చర్యంగా రాఘవరావు వైపు చూశారు. అనుకోని వరమిచ్చిన దేవుడనుకున్నారు. ఇద్దరు చేతులెత్తి దండం పెట్టారు. తమ సమస్య ఇంత త్వరగా తీరినందుకు సంతోష పడ్డారు. ఇక అప్పుకు డోకా లేదనుకున్నారు. మీకు ఎప్పుడు అవసరం పడ్డా ఎన్ని డబ్బులు అవసరం పడ్డా ఇంటికి రాండ్రి. మొఖమాట పడొద్దు. సైకిలు స్టార్ట్ చేసి తన తోట వైపు వెళ్ళాడు.

తమ సమస్య ఇంత త్వరగా పరిష్కారమయినందుకు, ఊపిరి పీల్చుకున్నారు దాసు దంపతులు. రాఘవరావు తమ పాలిట దేవుడేనని అతని మంచి తనాన్ని పొగుడుతూ ఇల్లు చేరారు దాసు, మల్లీశ్వరి.

రాఘవరావు దగ్గర భూమి తాకట్టు పెట్టి ఓ ఇరవయి వేల అప్పు తెచ్చాడు దాసు. ట్రాక్టరు కిరాయిలు పదివేలు యిచ్చాడు. పొలం చదును చేసి అడుగు పిండి వేసి నాటు వేయించాడు. రోజు చీకటిలో దాసు పొలానికి వస్తే, ఇంట్లో పని చేసుకుని పిల్లలను బడికి పంపి, అత్తకింత అన్నం పెట్టి దాసుకింత టిఫిన్ బాక్సులో పెట్టుకొని పొలానికి వస్తుంది మల్లీశ్వరి. సాయంత్రం వరకు పొలం పనులు చేసుకొని చీకటి పడ్డాక ఇల్లు చేరుతున్నారు.

పై పాటుగా యూరియా రెండుసార్లు చల్లాడు. గుళికలు చల్లాడు. పురుగుమందు స్ప్రే చేశాడు. వరి బాగా పట్టింది. పొలంలో కలుపు ఇద్దరే తీసుకున్నారు. మల్లీశ్వరి బయట కూలీ పనులు పూర్తిగా బందు చేసింది. అరుగు వేసినట్లు పచ్చగా చూడ ముచ్చటగా వుంది. పొలంలో దిష్టి బొమ్మలు పాతాడు దాసు. అందరి కళ్లు దాసు పొలం పైనే. పొలం చూసుకొని ఆలుమగల ఆనందమే ఆనందము. కలల్లో మునిగి తేలుతున్నారు.

వర్షాలు బాగుపడి నీళ్లుండటం వల్ల ఎండిపోయిన బోర్లన్ని జలకళనందుకున్నాయి. అందరు మోటార్లు బిగించి పొలాలు సాగు చేశారు. పడావుపడ్డ పాత బావులన్ని మోటార్లన్నీ నడిపించి నాట్లు వేశారు. వూరి చుట్టూ ఎటు చూసినా పచ్చటి పంట పొలాలే.

ట్రాన్స్‌ఫారం మీద ఓవర్ లోడ్ అయింది. అర గంట అరగంటకు ఫీజు పోవుడు, ట్రాన్స్‌ఫారం ట్రిప్పు కావడం మొదలయింది. ఎండలు ముదిరాయి. పొలాలు పొట్టకొచ్చాయి.

నీళ్ళు బాగా తాగుతున్నాయి. సర్కారిచ్చే రెండు సార్ల కరెంటు అప్పుడప్పుడు ట్రాన్స్‌ఫారం ఫీజు కొట్టేయడంతో రైతుల కరెంటు కష్టాలు మొదలయ్యాయి.

రైతులంతా కలసి కరెంటోల్లను నిలదీశారు.

“ఎక్కడ పడితె అక్కడ బోర్లేసి ఎవరు పడితే వాల్లు కరెంటు తీగలకు వైర్లు తగిలించి మోటార్లు నడుపుకుంటుంటే మేమేం చేయం. కరెంటు సాంక్షన్ వున్న వాల్లు పదిమందయితే లేనివాల్లు పదిహేనుమంది. ఇష్టమొచ్చినట్లు కరెంటు వాడుకుంటున్నారు. లేని బరువెత్తితే అది మాత్రం ఏం మోస్తుంది. ట్రాన్స్‌ఫారం ఓవర్‌లోడయింది. ట్రిప్ అవుతుంది. మీరు మీరు చూసుకోండ్రి” తమ తప్పేం లేదన్నట్టు కరెంటు వాళ్లు మాట్లాడి తప్పుకున్నారు.

నాల్రోజులకు ఓ శుభ ముహూర్తాన పెద్ద శబ్దం చేస్తూ మంటలతో ట్రాన్స్‌ఫారం పేలిపోయింది. పొలాలల్లో తిరుగుతున్న రైతులంతా ఉరుకులు పరుగుల మీద ట్రాన్స్‌ఫారం దగ్గరు వచ్చారు. ఇంకా పొగలు వదలుతూనే వుంది. ట్రాన్స్‌ఫారం బందుచేసి ఫ్యూజులు వేసి మళ్ళీ ఆన్ చేశారు. ట్రాన్స్‌ఫారం చడీ చప్పుడు లేదు.

నాలగయిదు సార్లు ఫోన్ చేస్తే సాయంత్రానికి లైన్‌మెన్ వచ్చి చెక్‌చేసి ట్రాన్స్‌ఫారం కాలిపోయిందని చావు కబురు చల్లగా చెప్పాడు. ట్రాన్స్‌ఫారం విప్పుకొని నల్లగొండ డివిజన్ ఆఫీసుకు తీసుకపోవాలని చెప్పాడు.

రైతుల గుండెల్లో రాయిపడ్డట్టయింది. ఇప్పటికి వచ్చి పోయే కరెంటుతో సగం పొలాలు ఆరిపోయాయి. పొలాలల్లో చుక్క నీరు లేదు. బిర్రుపొట్ట మీద పొలాలు, రైతులలో కలకలం. ఆందోళన, అప్పటికి చీకటిపడింది. దిగాలుగా ఎవరింటికి వారు వెల్లిపోయారు.

తెల్లవారి పదిగంటలకు లైన్‌మెన్, హెల్పర్ వచ్చారు. రైతులంతా ఓ ట్రాక్టరు కిరాయికి మాట్లాడి తెచ్చి కూర్చున్నారు. తలా ఓ చెయ్యి ట్రాన్స్‌ఫారం విప్పి ట్రాక్టర్ మీద వేసుకుని నల్లగొండ డివిజను ఆఫీసుకు తీసుకెళ్ళారు. వీళ్ళు పోయే సరికి అక్కడ ఓ ఇరవయి ట్రాన్స్‌ఫారాలు సీరియల్‌గా పడి వున్నాయి. రైతులంతా శవ జాగరణ చేస్తున్నట్లు చెట్ల కింద గుంపులు, గుంపులుగా కూర్చున్నారు. ఏ ఊరి వారిని మందలించినా కరెంటు కష్టాలే, కన్నీల్ల కథలే.

రోజులు గడిస్తే పొలాలెండిపోతాయి. పొట్ట గవుసు పోయి తాలు పోతుంది. అప్పుల వడ్డీలకు కూడా సరిపోవు. రైతులంతా తలా ఐదొందలు వేసుకొని ఓ ఐదు వేలు వసూలు చేసి కరెంటు వాల్లకు మామూల్లు ముట్ట చెప్పారు. వాల్ల తొందర వాల్లది.

మరో రెండు రోజులకు గాని ట్రాన్స్‌ఫారం వూరిలోకి రాలేదు. చీకటి పడ్డా రైతులంతా ట్రాన్స్‌ఫారం బిగించారు. ఈ రాత్రన్నా మోటార్లు నడిస్తే కొంతలో కొంతయినా తడుస్తుందని వాళ్ళ ఆశ.

దాసు ఉరుకుల పరుగుల మీద వెళ్ళి తన మోటారు స్విచ్ ఆన్ చేశాడు. చప్పుడు లేదు. పక్కవాళ్ళ మోటార్లు నీళ్ళు పోస్తున్న చప్పుడు. స్టాటర్ ఎర్ర బటన్ పచ్చ బటన్ మార్చి మార్చి ఓ పదిసార్లు వత్తాడు. అయినా చప్పుడు లేదు. ఫ్యూజ్ పీకి సరిచూసి ఫీజు బిగించి ఆన్ చేశాడు. అయినా లాభం లేదు. దాసు మోటారు నడువలేదు. ఐదు రోజులయింది. పొలమంతా నెర్రె బాసింది. భయం భయంగా సైకిలందుకొని మెకానిక్ దస్తగిరింటికి వెళ్ళాడు. ఆయన పొద్దుననగా నల్లగొండకు పోయి ఇంకా రాలేదని ఆయన భార్య చెప్పింది. "గురుడు మందేసుకుని ఏ రాత్రికి వస్తాడో" దాసు ఆలోచనలో పడ్డాడు. దిగులుగా ఇల్లు చేరి విషయం భార్యకు చెప్పాడు. ఆ రాత్రి ఆ ఇంట్లో ఎవరు సరిగా నిద్రపోలేదు.

చీకటితోనే లేచి దస్తగిరి ఇంటికి చేరాడు దాసు. తెల్లవారితే ఆయన ఎటుపోతాడో ఎవ్వరికి తెలవదు. ఆ ఊళ్ళో వున్నది మెకానిక్ ఆయనొక్కడే. అప్పటికే ఇద్దరు ముగ్గురు రైతులు ఆ ఇంటి ముందు కూర్చున్నారు. దస్తగిరి లేచి ముఖం కడుక్కుని పానాల సంచి తీసుకుని బయటకొచ్చాడు. దాసు రాత్రి వచ్చిన విషయం దస్తగిరికి భార్య చెప్పింది. దస్తగిరి, దాసు చెరో సైకిలందుకుని బోరు దగ్గరికి చేరారు. మిగతా రైతులకు వస్తానని చెప్పి పంపించాడు దస్తగిరి.

దస్తగిరి స్టాటర్, మోటార్ చెక్ చేశాడు. మార్చి మార్చి చూశాడు. వైర్లు కట్ అయినవేమో అని కేబుల్ వైరు చూశాడు. స్టాటర్, మోటార్ కాలిపోయిందని చెప్పాడు. ఇంకో ఇద్దరి ముగ్గురి మోటార్లు కాలిపోయినట్లు చెప్పాడు. ట్రాన్స్‌ఫారంతో పాటే మోటార్లు కాలాయని దస్తగిరి వారికి చెప్పాడు.

అసలు సంగతేమిటంటే హెచ్.టి. లైను తెగి ఎల్.టి. లైను మీదపడి ట్రాన్స్‌ఫారం, మోటార్లు కాలిపోయాయని లైన్‌మెన్ సెలవిచ్చాడు. కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరాడు దాసు. పండ్ల పుల్ల నములుతూ నులకమంచం మీద కూర్చున్నాడు. ముసలమ్మ చంద్రమ్మ చాటలో బియ్యంలో రాళ్ళు ఏరుతూ కూర్చుంది. మల్లీశ్వరి చాయ్ చేసుకుంటూ పొయ్యి ముందు కూర్చుంది. పొగతో కండ్లు ఎర్రబడ్డాయి. వెంట్రుకలు ముఖం మీదికి వచ్చాయి.

"ఏమయ్యా మోటారు నడిసిందా."

"ఇంకెక్కడి మోటారే. మోటార్లు, స్టాటర్లు కాలిపోయాయని దస్తగిరి చెప్పిండు."

"అయ్యో రామా, పొలమెండిపోదా, ఇప్పుడెట్లా, ఆదుర్దాగా అడిగింది" మల్లీశ్వరి.

"ఏం జెయ్యాలో దోస్తలేదు. చేతిల పైస లేదు. బయట యాడ పుట్టెటట్టు లేదు. పంతులు రాఘవరావు కొడుకు దగ్గరికి పట్నం పోయిండు. పది రోజుల దాకా రాడట. ఏం జెయ్యాలనో దోస్తలేదు" భార్యతో అన్నాడు.

“చేసేటందుకేముంది. ఆడ ఈడ చేసిన అప్పులు మస్తుగయినవి. ఇప్పుడెవ్వరు ఇయ్యరు. ఈ దిద్దులు తీసుకుని అమ్మి మోటరు బాగు చేయించుకురా” గబ గబ తన చెవుల దిద్దులు తీసి దాసు చేతిలో ఎట్టింది మల్లీశ్వరి.

ఓ నిమిషం మల్లీశ్వరి వైపు అలానే చూస్తూ ఇష్టం లేకున్నా దిద్దులు తీసుకోక తప్పలేదు దాసుకు.

ఒకరికొకరు తోడుగా రైతులంతా కాలిపోయిన మోటర్లు బోర్ల నుండి బయటకు తీశాడు. ఓ ఆటో మాట్లాడుకుని మెకానిక్ దస్తగిరిని తీసుకుని నల్లగొండ చేరారు. దాసు దిద్దులు అమ్మి మోటారు, స్టాటరు బాగు చేయించుకుని సాయంత్రం వరకు ఇల్లు చేరాడు.

పొద్దున్నే ఒక్కొక్కళ్ళు మోటర్లను బోర్లల్ల దించారు. దాసు మోటరు ఐదు పైపులు దిగి మొరాయించింది. ఇంకో ఐదు పైపులు మోటరు కిందికి దిగాలి. దస్తగిరి మోటరును కిందికి మీదికి నాలుగయిదు సార్లు గుద్దినా కిందికి దిగలేదు. దిగాలుగా చూస్తూ కూర్చున్నడు దాసు.

“ఇదిగో దాసు బోర్లో రాయి ఇరికింది. మోటరు కిందికి పోదు. నల్లగొండకు పోయి బోరు సాపు చేసేటోల్ల తీసుకురా, లేకుంటే ఇక నీ బోరు ఇంతే.” సైకిలెక్కి రయిన వెళ్ళిపోయాడు దాసు. మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టయింది దాసు పరిస్థితి.

దాసు వెంటనే నల్లగొండకు పోయి బోర్లు సాపు చేసే వాళ్ళను తీసుకొచ్చి బోర్లో ఇరికిన రాయిని తొలిగింపు చేశాడు. సాయంత్రం వరకు మోటరు దింపి నీరు బయట పోయించాడు దాసు.

ఆ రోజు రెండు గంటలు మోటరు నడిచిందో లేదో మళ్ళీ లైను బ్రేక్‌డౌన్. ఆ రోజంతా కరెంట్ రాలేదు. దాసు పొలమంతా నెర్రెబట్టింది. ఎన్ని నీళ్ళు పోసినా మొదటి మడి దాటడం లేదు. పొలమంతా ఎండిపోయి ఆ కారు సగం పంట కూడా రాలేదు. పండిన పంట ఖర్చులకే సరిపోలేదు.

నాలుగేండ్లు గడిచే సరికి అప్పులు ఇబ్బడి ముబ్బడి అయ్యాయి. కరణం పంతులు రాఘవరావు అప్పు వడ్డీతో డెబ్బయి వేలయింది. భూ తనఖా బ్యాంకులో మోటరు కోసం తెచ్చిన అప్పు వడ్డీ ముప్పయి వేలయింది. చిల్లరగా ఇంకో పదివేల అప్పులయ్యాయి. భార్య మీద నగలు, దిద్దులు, కాళ్ళ పట్టీలు, తల్లి గంటీలు అన్నీ అమ్మి పెట్టాడు. మొత్తం మీద అప్పు లక్ష దాటింది.

ఈ నాలుగేండ్లలో ఎప్పుడూ సరిగా పంట చేతికి రాలేదు. ఓసారి దోమపోటు, ఇంకోసారి అగ్గి తెగులు, ఓసారి కరెంటు లేక పోండిపోవుదు. కష్టపడి పండించినా గిట్టుబాటు ధర రాక అయిన కాడికి దళారికి అమ్ముకోవడం. అతివృష్టి, అనావృష్టి, రాళ్ళ వానలు నిలువునా దాసును ముంచేశాయి.

ఈ నాలుగేండ్లలో ఒక్క పదివేల రూపాయిలు రాఘవరావుకు వడ్డీ బాపతు యిచ్చాడు. అప్పుల వాళ్ళు తిరిగి పోతూనే వున్నారు. ఇదిగో ఈ అప్పుల ఊబి నుండి ఎలా బయట పడాలో వాళ్ళ కర్థం కావడం లేదు.

రాను రాను రాఘవరావు బోర్లలో నీళ్ళు పూర్తిగా తగ్గిపోయాయి. తోట వాడుకొచ్చింది. పొలానికి తోటకు నీళ్ళు ఏమాత్రం సరిపోవడం లేదు. దాసు బోరు మాత్రం వేసిన్నాడు ఎన్ని నీళ్ళు పోసిందో అన్ని నీళ్ళు ఏమాత్రం తగ్గలేదు. 'దాసు అప్పులలో నిలువునా మునిగి వున్నాడు. తన తోటకు నీళ్ళు అవసరం. ఇదే అదును' అనుకున్నాడు రావు.

అనుకున్నదే తడువుగా ఓ రోజు పొద్దునే తన అనుచరులు ఊరి పెద్దలనబడే నలుగురిని తీసుకుని దాసు ఇంటికి చేరాడు రాఘవరావు.

దాసు ముఖం కడుక్కుంటున్నాడు. మల్లీశ్వరి పొయ్యి మీద ఎసరు పెట్టింది. పిల్లలు బడికి తయారవుతున్నారు. ముసలమ్మ ఇల్లు వూడ్చుతుంది. కట్టెలు మండక ఇల్లంతా పొగ కమ్ముకుంది.

"ఏమోయి దాసు ఏం చేస్తున్నావు" బయటి నుండి రావు పిలుపు.

లేకుంటే వీళ్ళు మంచాల మీద నుండి లేవరు. అందుకే రాఘవరావు ఎవరింటికి పోయినా బయట నుండే పిలుస్తాడు.

"పంతులుగారా రాండ్రి రాండ్రి" లోపల నుండి రెండు ప్లాస్టిక్ కుర్చీలు తెచ్చి వేశాడు. పొయ్యి ముందు నుండి మల్లీశ్వరి లేచి వచ్చింది. కుర్చీలో రాఘవరావు పెద్ద మనుషులు మంచం మీద కూర్చున్నారు.

"దాసూ ఈయ్యేడు నీ పొలం బాగుందోయి" పలకరించాడు రావు. "ఏముంది పంతులుగారు. ఎంత చేసినా ఓ కారు కాకుంటే ఓ కారు దెబ్బగొడతనే వుంది. ఏటేటా అప్పులెక్కువయితున్నయ్. బ్యాంకు అప్పు, మీ దగ్గర అప్పు అట్టనే వుంది" చేతులు నలుపుతూ అన్నాడు దాసు.

"ఏముందయ్యా కూలి చేసుకున్నాడే బాగున్నం. ఈ మాయదారి యవసాయం బెట్టుకున్నం అప్పులతో వురిబెట్టుకునే రోజొచ్చింది. కూలి చేసుకున్ననాడు కలో గంజో దాగినం. వున్ననాడు దిన్నం. లేనినాడు వుపాసం పన్నెం. ఏం దోస్త లేదు. ఏంజేయాల్నో దోస్తలేదు." మల్లీశ్వరి కండ్లు ఎర్రబడ్డాయి. కండ్లల్లో నీళ్ళు ఏ క్షణ్నాయినా బయటకొచ్చేటట్టున్నాయి. కొంగుతో కండ్లు తుడుచుకుంది.

"ఏం జేస్తం మల్లమ్మా, యవసమే గిట్టున్నది. పదరకల యవసం జేసిన నా పరిస్థితి గట్టనే వున్నది. ఏం జేద్దాం. కాలమే గట్టొచ్చింది" రావు అన్నాడు.

"ఇదిగో చూడు దాసూ, మల్లమ్మా నా కొడుకు బిడ్డ పెండ్లి కుదురిందనే నిన్ననే పోను జేసిండు. వరపూజ వుంది పైసలు పంపమన్నడు. మీరెట్టనన్న జేసి ఓ వారం రోజులల్ల నా పైసలు నాకియ్యాలె" రాఘవరావు మాటలు వినేసరికి దాసుకు, మల్లీశ్వరికి నోట మాట రాలేదు. కండ్లు గిర్రున తిరిగినట్లయింది. తమాయించుకుని కింద కూర్చున్నాడు దాసు.

"ఇప్పటికిప్పుడు అంటె ఎట్ల అయ్యగారూ" అన్నాడు దాసు.

"నువ్వు ఏం జేస్తవో నాకు తెల్వదు. నాలుగేండ్లు ఆగిన నాకవతల పిల్ల పెండ్లి నాకు మాత్రం పైసలు గావాలా" ఎన్నడు లేనిది రాఘవరావు నోటి వెంట కాస్త కోపంగానే వచ్చాయి మాటలు.

"చూడు దాసు నీ అక్కరకు పంతులుగారు అడిగినప్పుడల్లా పైసలు యిచ్చిండు. నాలుగేండ్లాగిండు. ఇప్పుడు మనుమరాలు పెండ్లి. ఎట్లన్నచేసి మాట నిలబెట్టుకోవాలి" వచ్చిన పెద్ద మనుషులు రావుకు వత్తాసు పలికారు.

దాసు, మల్లీశ్వరి గుడిసెలోకి వెళ్ళి మాట్లాడుకొని బయటకు వచ్చారు.

"పంతులుగారు ఇప్పుడు మా దగ్గర చిల్లి గవ్వలేదు. నగా నట్రా అమ్మి ఈ యవసాయానికే పెట్టినం. అప్పులల్ల మునిగినం. మీరే ఆ రెండెకరాల పొలం దీసుకొని ఏదో ఓ ధర చేసుకోండ్రి. బ్యాంకు అప్పుంది. బయట అప్పులున్నయి" దాసు, మల్లీశ్వరి ఒకేసారి అన్నారు.

తన కల నెరవేరింది. తనకు కావలసింది గూడా అదే. అదే మాట వారి నోట వచ్చింది. మనస్సులో తెగ సంతోషపడి పోయాడు రావు. దాసు బోరు తనదవుతుంది. తన నీటి కరువు తీరబోతుంది.

"నాకెందుకమ్మా భూమి, నా భూమి చేసే దిక్కేలేదు. అయినా మీది అసైన్‌మెంట్ భూమి. సర్కారు భూమి. వేరే వాళ్ళకు పట్టాగాదు. నేనేం జేసుకోను" బెట్టుగా మాట్లాడాడు రాఘవరావు.

ఆ భూమిని ఎలా పట్టా చేయించుకోవాలో రావుకు బాగా తెలుసు. ఈ మాటలు విన్న దాసు మల్లీశ్వరి గుండెల్లో రాయిపడ్డట్లయింది. వారి నోట మాట రాక అలా చూస్తూ వుండిపోయారు. పది నిమిషాలు అలానే ఎవరు మాట్లాడకుండా వుండిపోయారు. దిక్కులు చూస్తూ నిలబడ్డారు దాసు, మల్లీశ్వరి.

"పంతులు గారూ ఏదో విధంగా మీరే ఆ భూమిని తీసుకుని వాళ్ళను ఒడ్డున పడెయ్యండి. వాళ్ళ దగ్గర మనకు తెల్వకుండా ఏముంది. ఆ రెండెకరాల భూమి తప్ప" వచ్చిన పెద్ద మనుష్యులు నచ్చ చెబుతున్నట్లు మాట్లాడారు.

కాసేపు బెట్టు చేసి చివరకు లక్ష రూపాయలకు రెండెకరాల భూమి యిచ్చేటట్లు మాట్లాడుకున్నాడు. తన డెబ్బయి వేలు పోను, బ్యాంకు ముప్పయి వేలు తనే చెల్లిస్తానన్నాడు.

స్టాంపు పేపరు మీద రాయించుకొని భార్యాభర్తల సంతకాలు తీసుకున్నాడు. వచ్చిన పెద్ద మనుష్యుల ముందు ఒప్పందం చేసుకొని వారితో సాక్షి సంతకాలు చేయించుకున్నాడు రావు.

భూమి అమ్ముడయిందని తెలిసి చిల్లర అప్పుల వాళ్ళు దాసు ఇంటి ముందు బైఠాయించారు. అందరితో మాట్లాడి తనుంటున్న ఇంటి జాగా పదివేలకు అమ్మి అందరి బాకీలు తీర్చాడు దాసు.

మూటా ముల్లె సర్దుకుని పిల్లలు, తన తల్లిని వెంట బెట్టుకుని ఉన్న ఊరు విడిచిపెట్టి బతుకు దెరువుకు పట్నం బాట పట్టారు దాసు, మల్లీశ్వరి.

✡

# వాన కురిస్తే...!

**–కేతు విశ్వనాథరెడ్డి**

వాన కురుస్తే! వొక్కవాన అదునుకు కురుస్తే!!

ఆశ నిండిన కళ్లతో ఆకాశంలో కదులుతున్న మబ్బుల్ని చూస్తూ అనుకున్నాడు పాపయ్య.

వాన కురుస్తే మిరపకు పులక అవసరం వుండదు. సెనక్కాయ విత్తవచ్చు. సేద్యాలయి నాయి, నిమ్మచెట్లకు నీళ్ల పారకం బాధ తప్పుతుంది.

తొమ్మిది మట్లు తెగినా, ఒక అరెకరం కూడా పారకానికి రాని నీళ్లున్న బావిని చూస్తూ గాలికి గిలగిలలాడుతున్న మిరప మొక్కల్ని చూస్తూ, భవిష్యత్తు చెప్పని చీనీ చెట్లను చూస్తూ పాపయ్య ఆశగా అనుకొన్నాడు వానకురుస్తే!

అవును, యీ యేడైనా వానలు అదునుకు బాగాపడితే, యెకరం మిరపచెట్లు దండిగా కాస్తే, ధరలు పలికితే, మూడెకరాల్లోని పై సెనిక్కాయ బాగా పండితే, యీ తోట్లోనే పై పైరువల్ల నాలుగైదు వేలు చేతికొస్తుంది. యీసారి చెట్లను కాపుకు వదిలితే, వానలు వచ్చి బావిలో నీళ్లెక్కితే, నిమ్మచెట్లమీద తొలికాపుకే హీనంగా నాలుగయిదు వేలు చేతికి రాల్తుంది. వెలి పైరంతా ఖర్చులకుపోనీ, యేడెకరాలలో జొన్న, పదహైదెకరాల్లో తీగ సెనక్కాయ, పత్తి, యీయేడు సగానికిపైగా బాకీలు తీరతాయి. తప్పక తీరతాయి. బాకీల కన్నా దరిద్రమూ లేదు. నరకమూలేదు. బాకీలున్న యే కుటుంబమూ యీ రోజుల్లో ముందుకు రాదు. బాకీలున్న మనిషి మనిషికాడు. తానేం మనిషి? తనకూ, తమ కుటుంబానికి వొకప్పుడున్న మర్యాద యిప్పుడుందా? యీనాడా గౌరవం, మర్యాదా యెక్కడున్నాయి? వాళ్లందరూ 'నీ దగ్గర డబ్బులేదు కాబట్టి, నీ కాస్తి తరిగిపోయింది కాబట్టి, నీకు బాకీలున్నాయి కాబట్టి, నిన్ను గౌరవించడం లేదు' అని ముఖం మీద అనరు. కానీ వెనక అనేకరకాల మాటలంటారు. అవమానిస్తారు. హింసిస్తారు. అందుకే తాను డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఆశకొద్దీ అప్పుచేసి బావి తవ్వించాడు. నమ్మకం కొద్దీ నిమ్మచెట్లు వేసినాడు. కానీ ఆశచెడ్డది. ఆశ అన్యాయం చేస్తోంది. నమ్మకం చెడ్డది. నమ్మకం ముంచుతోంది. వానల్లేవు. అన్ని బావులలో మాదిరే యీ బావిలోనూ నీళ్లు లోతుకు, యింకా లోతుకు పోతున్నాయి. యెక్కడికి

పోతున్నాయో? నిమ్మ చెట్లే కాస్తే, చేసిన అప్పులు ఒక లెక్కకాదు. తన ఆశా, నమ్మకమూ నెరవేరే విషయం యేమో కానీ అప్పుల దయ్యం తన్ను పట్టుకుంది. తన వంశంలో యేదో పద్ధతిలో, యేదో కారణానికి, యేదో దశలో అప్పులు చేయందెవరు? అవును. చేయక తప్పేదేముంది? మెట్టన్నమ్ము కొన్నవాళ్లు యెవళ్లూ బాగుపడరు. యెప్పుడూ బాగుపడరు. వానలు అదునులో వస్తే బాగుపడతారు.

పాపయ్య బాధగా ఆలోచిస్తున్నాడు.

"నిమ్మచెట్లేసి యెన్నాళ్లయింది?"

ఆ దోవన పక్కూరికి పోతున్న వొకరెవరో అడిగారు. యీ ప్రశ్నతో పాపయ్య లోకంలో పడినాడు.

"అయిదేళ్లయింది".

"కాపుకు విడిచినారా? భూమి బ్రహ్మాండమయిన భూమి. చెట్లకు బాగా లాయికీ అయిందే. యింతకూ చెట్లను చూస్తే నీటి పారకం తక్కువైనట్లుందే. బావిలో నీళ్లు తక్కువొస్తున్నాయా?" మళ్లీ ప్రశ్నించినాడు.

చెట్లకు భూమి లాయికీ అయిందన్నప్పుడు యెంతో ఉత్సాహంగా తన పథకాలను అన్నీ చెప్పాలనుకొన్న పాపయ్య, నీళ్ల సంగతి యెత్తే వేళకు నీళ్లుగారిపోయి 'ఆ' అని ముక్తసరిగా సమాధానించినాడు. దారిని పోతున్న వాళ్లంతా బావి దగ్గరకు వచ్చి నిలబడి నారు. యిందాకా ప్రశ్నించిన పెద్ద మనిషే తన ధోరణిలో చెప్పుకుని పోయినాడు.

"వుహూ లాభం లేదు. యీ వానలు సరిగ్గా కురవని కాలంలో నిమ్మచెట్లు పెట్టు కోవడం దండగ. వొట్టి బుద్ధి తక్కువ. మా వూళ్లో ఒకప్పుడందరూ చీనీ చెట్లమీద యెగబడిన వాళ్లే, నీళ్లు చాలక చెట్లు కొట్టేసుకుంటున్నారు. ఒక్క బావికే యిరవై వేలు ఖర్చుపెట్టిన వాళ్లున్నారు నీళ్లుంటేనా?"

పాపయ్యకు అతనితో మాటలలో దిగడం యిష్టం లేదు. వాళ్లకు దూరంగా తోటలోకి నడిచినాడు. ఆ పెద్ద మనిషి పక్కున్న వాళ్లతో తోటల్ని గురించీ, బావుల్ని గురించీ యింకా మాట్లాడుతూనే కదిలిపోయినాడు.

పీడ వదిలింది.

అవి పాపయ్యకు యిష్టంలేని మాటలు. మనసుకు కష్టం కలిగించే మాటలు– వాన్ని చంపాలన్నంత కోపం వచ్చింది.

లేకపోతే వాడేం మొనగాడా? నీళ్లెక్కడబడేదీ తెలిసిన శాస్త్రగాడా? తనకన్నీ తెలీదను కున్నాడా? తానిదంతా ఆలోచించలేదనుకున్నాడా? అదేపనిగా స్వామివార్ని పిలిపించి లగ్నం

పెట్టి చేలో యిటువైపు యీ గట్టున బావి తవ్విస్తే, ఆ వెధవ లాభం లేదంటాడా? తన బావి సంగతి వాడికేం తెలుసు?

పాపయ్యకు చిరాకూ, కోపం కలిగినాయి. ఒకచోట పడిపోయిన గోడమీద కంపను తొలగించుకొంటూ తోటలోకి ఆ సమయంలో దొంగగా రావాలనుకుంటున్న దున్నపోతు మీద బలంకొద్దీ రాయి విసిరి కసి తీర్చుకున్నాడు.

వాడు చెప్పిందీ నిజమేనేమో! అయినా తొమ్మిదిమట్లు దిగినా నీళ్లు సరిగ్గా పడలేదంటే యింకెక్కడ పడతాయి? స్వామివారితో యీ విషయమే అంటే ఆయనన్నారు!

'తప్పకుండా పడతాయి. దేవికూడా అదే చెప్పింది. పైగా నేను లగ్నం పెట్టిన వేళా విశేషం అట్లాంటిది. తూర్పు దిక్కున ఆ చిన్న వూటవుందే అటువైపు బోరింగు వేయించు, బుగ్గపుట్టాల, నీళ్లు లోపల్నుంచీ యెగదన్నకపోతే, జల ఉబక్కపోతే నన్నడుగు. పదాస్పవరు యింజనులు రెండు, నాల్గించి బొంగుల్తో కొట్టినా తరగవు చూడు. వీరారెడ్డి బావిలో నేను నీళ్లు పడతాయని చెప్పితే పళ్లేదా? వాక్కు తప్పదు పాపయ్యా'.

నిజమేనేమో! లేకపోతే నా ఖర్మేమో! బోరింగు వేయించాల. లోపల చట్టువుందో, బండ వుందో! స్వామివారి వాక్కుబలం! బోరింగు వేయించాల. కనీసం నలభై యాభై అడుగులు దించాల. కానీ డబ్బు.. డబ్బు యెక్కన్నుంచి తేవడం? పాతప్పులే తీర్చడానికి భయంగా వుందే. కొత్తప్పుల్ని తేవడమెట్టా? తీర్చడమెట్టా? తేవడం, తీర్చడం, తేవడం, బతుకింతేనా?

వానలు దండిగా పడితే ఈ బాధలుండవు. ఈ భయాలుండవు. వానలు కురిస్తే బావికి నీళ్లెక్కుతాయి. బావిలో నీళ్లెక్కితే నిమ్మచెట్లు ఒక్క కాపుకు విదిలించి కొడతాయి. పైర్లు బాగా పండుతాయి. అట్లాంటప్పుడు మొగవానికి ఒక పదహైదు వేల అప్పులెఖ్ఖా పత్రమా? వడ్డీల్తో సహా నీతికి నిజాయితీకి కట్టుబడి బాకీల్ని తీర్చే గుణం తమ వంశ రక్తంలోనే వుంది.

పాపయ్య వంశ రక్తం గర్వంతో కులికింది.

తన అబ్బ అణా పైసల్తో అప్పు తీర్చినాడు. ఆస్తి అమ్మి తీరిస్తేనేంగాక. తన తండ్రి చచ్చిపోతూ 'ఋణం వుంచుకోకూడదు – అందులోనూ బంధువుల దగ్గర'– అంటే తాను కమామిషికి వచ్చిన మొదట్లో పదెకరాలు అమ్మి వడ్డీతో సహా తీర్చినాడు. యింత నిక్కచ్చిగా బాకీలు తీర్చేవాళ్లు యీ రోజుల్లో లేరు. అదే మరొకళ్లయితే నా ఆస్తులు యెవళ్లో పేరబెట్టుకొని, సొమ్ము వెనకేసుకొని, దొంగబాండుల్ని పుట్టించి, అయిపీ పెట్టి సంపాదించు కుండేవాళ్లు. నీతికీ, అభిమానానికీ కట్టుబడకుండా డబ్బు సంపాదన యెందుకు? డబ్బు లేకపోతేనేంగాక, ఆస్తి తగ్గిపోతేనేంగాక, తమ కుటుంబానికి పరువుంది; ప్రతిష్ట వుంది. పరువు ప్రతిష్ట లేనివాళ్ల దగ్గర యెంత డబ్బుంటే నేం? అంగడి రామిరెడ్డికి కావల్సినంత డబ్బుంది. దొంగ సారాయమ్మి, దొంగ సల్ఫేటమ్మి, నానా దొంగ గడ్డీ తిని మిగిలించిన డబ్బుంది. ముచ్చొడ్డీలకిచ్చి సంపాదించిన

డబ్బుంది. కొంపలు కూల్చిన డబ్బుంది. యీ రోజుల్లో యెంత నీతిని విడిస్తే, యెంత సిగ్గుని విడిస్తే యెంత యితర్లను మోసగిస్తే అంత డబ్బు సంపాదించవచ్చు.

రామిరెడ్డి, అతని డబ్బూ, సంపాదనా, స్మృతిలో మెదిలే సరికి పాపయ్య మనస్సు అసహ్యంగా నిండిపోయింది.

వాడి దగ్గర వెయ్యి రూపాయలు వీల్లేక, యిబ్బందులకు తట్టుకోలేక, వడ్డీకి తెచ్చినాడు. ముచ్చొడ్డీకి, నూటికయిదు రూపాయలకు, యెవరికీ తెలియకుండా– కట్టకడపటకు కడుపున పుట్టిన కొడుక్కు– పెద్ద కొడుక్కు– తెలీకుండా తెచ్చినాడు. అప్పులు చెయ్యకుండా బతకడం అసాధ్యమైపోతాంది. యేవో ఖర్చులు తగులుతున్నాయి. పెళ్లిళ్ల ఖర్చులు, యింటి ఖర్చులు, చదువుల ఖర్చులు, రోగాల ఖర్చులు, చావు ఖర్చులు, వానల్లేక ఖర్చులు మరేవో ఖర్చులు, బాకీలు, కానీ ఇట్లాంటి బాకీలు, రామిరెడ్డి దగ్గర తెచ్చిన్లాంటి బాకీలు, పగవాడు కూడా చేయకూడదు. వాడు ప్రతినెలా వడ్డీ తీసుకుంటూనే వాయిదా మాత్రం సంవత్సరం పెట్టినాడు. యింక మూన్నెళ్లు– మూన్నెళ్లకు వాయిదా ముగుస్తుంది. వాన కురిస్తే మిరపకాయలు తొలికోత తెగేసరికి వాడి డబ్బు వాడి మొఖాన కొట్టాలి. లేకపోతే వాడు గుంటనక్క. యిట్లాంటి వాళ్ల దగ్గర అప్పులు చేయకూడదు.

పాపయ్యలో దైన్యం ఆవరించింది.

ఆకాశంలో చెడుగుడు ఆడుతున్న మబ్బులు, విడిపోతున్న మబ్బులు, కలుస్తున్న మబ్బులు. గాలి, పూనకం పట్టినట్లు వీసే గాలి, వురుము, వురుము.

“అర్జునా; అర్జునా!”

మెరుపు, మెరుపు. కళ్లను చెదరగొడుతున్న మెరుపు. చినుకులు, చినుకుల చిటపట.

పాపయ్య హృదయం ఆనందంతో పులకించింది.

చినుకులు, పెద్ద చినుకులే. తప్పకుండా యీవాళ పెద్దవానే పడుతుంది. మిరపచెట్లకు పులక, సెనక్కాయ విత్తనం. బావిలో నీళ్లు. నిమ్మచెట్ల పాదుల్నిండా నీళ్లు. యీ కార్తెలోనే పెద్ద వానలు పడతాయని పంచాంగంలో వుంది. యీ కార్తె నిన్న మొదలైంది. పంచాంగం తప్పదు. వాన కురవడం తప్పదు.

గబగబా నెత్తిమీద వల్లెవేసుకొని పాపయ్య ఇంటి ముఖం పట్టినాడు. యెక్కువవుతున్న గాలి విసురు, ముసురుకొస్తున్న చీకటి. విసిరికొడుతున్న గాలి. ముఖంమీద చురుక్కుమనే చినుకులు. అంతంతమాత్రం చూపులున్న పాపయ్య. తనశరీర యజ్ఞఫలాన్ని పితృ ఋణ గృహబంధు దేవతలకు అర్పించిన పాపయ్య, తత్రుపాటులో వొక చేనిగట్టు తగిలి కిందపడి నాడు. పాపయ్య దీనంగా మూలిగి, మోచేతులతో మోకాలి చిప్పల్ని బిగదన్ని మెల్లగా లేచినాడు. గుండె దడ మొదలైంది.

మళ్లీ వస్తుందా? గుండె పోటేమైనా మళ్లీ వస్తుందా? వాన కురుస్తే చాలు. మళ్లీ రానీ, తాను చస్తేనేం? బాకీలు తీరకుండా చావకూడదు. సంసారాన్ని తలెత్తుకొనేట్లు చేసి మరీ చావాలి. ఛీ పాడు ఆలోచన. వానమీద యీ గాలికెందుకు కసి? కానీ వాన వస్తుంది. వస్తోంది.

పాపయ్యకు అవ్యక్తమైన భయమూ, ఆనందమూ కలిగినాయి.

ఆలోచనలతో వూరు చేరుకుని నిట్టూర్చినాడు.

పంచాయతీ ఆఫీసులో రేడియో వినాలి. యీ దినం వాన కురుస్తుందని, పెద్ద గాలీ వానా వస్తాయని రేడియోవాళ్లు తప్పక చెప్పుతారు. పాపయ్య పంచాయతీ ఆఫీసు ప్రవేశించినాడు. అక్కడ రాజకీయాలు, వొకళ్ల కొంపల్ని తీసుకునే రాజకీయాలు. మంచివీ, చెడ్డవీ, అన్ని రకాలవీ రాజకీయాలు.

“యేం మామా తోటకాన్నుంచేనా?” సుందర్రెడ్డి అడిగినాడు.

“ఆ.. యీవాళ పెద్దవానే రావచ్చు. వార్తల్లో యేం చెప్పినారూ?” సమాధానం కోసం నలువురివైపూ పాపయ్య చూసినాడు. నలువురూ వాన రావచ్చునంటే ఆత్మ తృప్తి. వస్తుందని వాళ్లంటారు.

“ఆ.. ఆ రాయలసీమలో భారీ వర్షం పడే సూచనలున్నాయట? రేడియో వాళ్ల మాట యివాళ నిజమయ్యేట్లే వుంది.” ఒక యువకుడన్నాడు.

“రేడియోలో చెప్పినారా? అయితే యిక తప్పకుండా పడుతుంది. మోడం కూడా దండిగా వుంది.” ఆశనూ, ఆసక్తినీ ప్రకటించాడు పాపయ్య.

“పాపయ్యన్నా! రేడియోలో చెప్పినట్లు వానొస్తే దేవుల్లెందుకయ్యా. ఈ పాటికి మనమిట్లా వుండేవాళ్లమా చెప్పు” కరణం అందుకొన్నాడు.

కరణానికేం దొబ్బుతెగులూ ‘మనమం’టాడు. మధ్యలో తనకేమైంది? చచ్చేవాళ్లు తనలాంటివాళ్లు కానీ! నక్కలా బతుకుతున్నాడు. పాపయ్య లోలోన వుడుక్కున్నాడు.

“కలికాలం. బ్రహ్మంగారు చెప్పినట్లు యిపుడు రాజ్యం యేలుతున్న దెవరు?” కరణం మళ్లీ ప్రారంభించినాడు.

“యిప్పుడు తత్తావలతో యేంగానీ, యీ పదిరోజులూ బజన్లూ, పానక పందేరం యేర్పాటు చేస్తే బాగుండదా? పాపయ్య మామ విరాటపర్వం సదువుతాడు. యేమంటావు మామా?” సుందర్రెడ్డి అడిగినాడు.

పాపయ్య సమాధానం చెప్పకముందే కరణం ఉత్సాహంగా అన్నాడు.

“అనేదేముంది? పాపయ్యన్న యెపుడైతే యేది కాదన్నాడూ? వూళ్లో సందాలిప్పుడే మొదలుపెడ్దాం”

"యీ చెక్క భజన్లు చేయడం కంటె కాస్తా మంచి పని చెయ్యకూడదా? యింతకు ముందు చేసిన భజనలు చాలవా? వానా వానా.. బావుల్లో నీళ్లో అని యేడుస్తుంటాం కదా? యేం పెద్ద బ్రహ్మాండం? యితర దేశాల్లో యిన్నూరు మున్నూరడుగుల లోతునుంచీ నీళ్లు బయటికి తెస్తున్నారు. మనం యేడెనిమిది మట్లకే యేడుస్తాం. తాలూకాకు పది రిగ్గులు దించమను. అగ్గువగా బావులు తవ్వించమను. భూమిలో నీళ్లు లేకేం? పోనీ మన చెరువును మర్యాదగా కట్టి వుంటే, కనీసం బావుల్లోనైనా నీళ్లుండకపోయేవా? అయిదు లక్షలు పోశారుకదా? చాకలోళ్లు గుడ్డలుతుక్కోడానికి కూడా నీళ్లు నిలబడవు. యెట్లా నిలబడతాయి. పోసిన మట్టి కొట్టుకొని పోతోంటే? దీన్ని గురించి పట్టించుకోరు. యీ చెరువే వుంటే, ఆ గండికోట ప్రాజెక్టే కట్టివుంటే, పోనీ ఆ తుంగభద్ర యెగువ కాలువ వచ్చి వుంటే మనకిన్ని బాధలుండేవా? వానదేవుడో అంటూ భజన్లు చేస్తారు. కానీ అసలు సమస్యల్ని పట్టించుకోరు". ఆవేశంగా పట్టాభి అన్నాడు. పట్టాభి విజ్ఞానియైన నిరుద్యోగి. వుద్రేకి.

"అవునయ్యా నీ కేకలయితే బావుండాయి. యీ సంగతి యెవర్నడగాలి?"

యితరులను వాదనలోకి దింపడం కరణానికి యెంతో యిష్టం. వాదనలో తనెలాగా దొరకడు. కానీ యితర్ల పిలక తనకు దొరుకుతుంది. దొరికితే అవసరమైనప్పుడల్లా నాటకం ఆడించవచ్చు.

"ప్రభుత్వాన్ని" పట్టాభి తెంచినట్టు సమాధానమిచ్చినాడు.

"ప్రభుత్వమంటే యెవరు? మన రెడ్డి గంగిరెడ్డి. మన ప్రెసిడెంటు సిద్ధయ్యనాయుడు. గంగిరెడ్డి బావమరిది చెరువు కాంట్రాక్టరు. సిద్ధయ్యనాయుని బంధువు యింజనీరు. వీళ్లనడగ్గలమా చెప్పు?" కరణం లౌక్యాన్నంతా ప్రదర్శించినాడు.

"అడగలేకేం? మన ప్రభుత్వంలో మరొకరిని మరిచిపోయినావే" గంభీరంగా పట్టాభి అన్నాడు.

"యెవర్ని?"

కుతూహలంగా ప్రశ్నించాడు కరణం. చర్చ పాకాన పడుతోంది. పట్టాభి అంతు తేల్తుంది. ఒక ఆట ఆడించవచ్చు అని మురిసిపోయినాడు కరణం.

"నిన్నే – ప్రభుత్వంలో వాళ్లు చక్రాలయితే, చక్రాల్ని తిప్పే తెలివితేటలు నీలాంటి వాళ్లవికదా!" పట్టాభి చురక తగిలేసరికి కరణానికి కోపం వచ్చింది.

"పెద్దంతరం, చిన్నంతరం లేదు. గుడ్డొచ్చి పిల్ల నెక్కిరిస్తాది. పిదపకాలం, పిదప బుద్దులు" గొణుగుతూ కరణం అస్త్ర విసర్జనం చేసినాడు.

యీ రకం వాదనలు యెక్కడికి దారితీస్తాయో పాపయ్యకు అనుభవమే.

వీటివల్ల ప్రయోజనం లేదు. "నాకు వొంట్లో బాగాలేదు" అని పాపయ్య వీధిలోనికి వచ్చినాడు. ఒకటి రెండు చినుకులు పడుతూనే వున్నాయి.

పట్టాభిమాటల్లో నిజం వుంది. రిగ్గుల సంగతి గొప్పగా చెప్పుకుంటున్నాడు, యీ మధ్య. కానీ మంచినీటి బావులే తవ్వుతారట. నిజంగానే ప్రభుత్వానికి శ్రద్ధ వుంటే యిన్ని అవస్థలుంటాయా? పట్టాభి అన్నట్లు వానలు భజనలవల్ల వస్తాయా? పూర్వం వచ్చేవి. యిప్పుడేమో భజనలవల్ల వాన వచ్చినా రాకపోయినా రాజకీయాలొచ్చాయి– వూళ్లో తప్పక యెగవవీధి భజనగుంపు. దిగువవీధి భజనగుంపుల మధ్య చెరువు నిలిచివుంటే బావుల్లో నీళ్లుండేవి. వంక కడ్డంగా కట్టదల్చిన చెరువు కాబట్టి. ఒక పెద్ద వాన కురిసినా చెరువులో నీళ్లు దండిగా వుండేవి. చెరువు నిలిస్తేనా? అదెందుకు నిలుస్తుంది? తుంగభద్ర కాల్వవొస్తే తన భూమి అయిదెకరాలు పారుతుంది. అది వచ్చేదెప్పుడు? అందరూ దొంగలే. యీ మనుషులు బాగుపడరు. యీ వూరు బాగుపడదు. యీ దేశం బాగుపడదు. అందరూ చస్తారు. అప్పుల్తో చస్తారు. పనికిమాలిన రాజకీయాలతో చస్తారు.

పాపయ్య మనసులో కసి. గుండెల్లో మంట.

పాపయ్య యింటికి చేరుకొని భార్యను ఆత్రంగా అడిగినాడు.

"పైన గవాసులూ అవీ వేయించినావా? గుమ్మళ్లేమైనా పడ్తాయేమో? మిద్దెమీద సవుదుంది కదా!"

"ఆ.. యీ వాన వచ్చిందా సచ్చిందా?" పాపయ్య భార్య వేదాంతం పలికింది.

యేమైనా వానవస్తే యీ యింట్లో వుండడం యిబ్బంది. యీసారి వానలు బాగా కురిస్తే, పంటలు బాగా పండితే మిద్దె వూడబీకి తిరిగి కప్పించాల. దంతెలు పుచ్చిపోయి నాయి. నాయన కొత్త మిద్దె కట్టాలనుకున్నాడు కానీ కట్టకుండానే వెళ్లిపోయినాడు. తాను కొత్తది కట్టకపోయినా పాతదైనా పదిలం చెయ్యాల. యివాళ యీ మోడాన్ని చూస్తే పెద్దవానే పడుతుంది. గుమ్మళ్లు పడతాయేమో! పడితే రాత్రంతా జాగారం తప్పదు.

భార్య సణుక్కుంటూ చెంబుతో నీళ్లిచ్చింది. చెంబందుకొని మసి కట్టుకుంటున్న కిరసనాయిలు దీపంవైపు చూస్తూ "పెద్దోడెక్కడికి పోయినాడూ!" పాపయ్య ప్రశ్నించినాడు.

"నీ వెంతకూ రాకపోయే తలికి నీ కోసం తోటదగ్గర కొచ్చినాడే. యెదురుపల్లేదా? అంత పొద్దు పోయిందాక ఆ తోట దగ్గర వుండకపోతే కారిపోయిందా?"

పాపయ్య భార్యకు జీవితం విసుగునిచ్చింది తప్ప, యింకేమీ యివ్వలేదు.

పెద్దకొడుక్కు తనమీద తగని ప్రేమ. తన కొడుకులంతా అట్లాంటివాళ్లే. యిప్పుడీ చీకట్లో తనకోసం తోట దగ్గర కెళ్లినాడు.

"వాడు వానలో చిక్కుకుంటాడేమో?" భార్య వడ్డిస్తూ వుంది.

పాపయ్య భోజనం ముగించి యింట్లోంచి బయటికి వచ్చి ఆకాశంవైపు చూచినాడు. చుక్కల్లేవు. మోడమట్లానే వుంది. ఒకటి రెండు చినుకులు రాల్తూనే వున్నాయి. పెద్దవాన రానందుకు పాపయ్య విసుక్కున్నాడు.

యీ వాన మళ్లీ యేమైనా యెగదంతుందా? వస్తున్నా వస్తున్నా అని తెగ పూరిస్తుంది. యెగదంతుంది. లేదు, యీ రోజు తప్పకుండా పెద్దవాన వస్తుంది. పంచాంగంలో వుంది. రేడియోలో చెప్పినారు. తన మనసు చెపుతూంది. వాన తప్పదు.

నిద్ర వస్తూంది.

యింట్లోకి వెళ్లి మంచంమీద పడుకున్నాడు.

వుబ్బరంగా వుంది. తెగ వుబ్బరంగా వుంది. గాల్లేదు. వానొస్తే తర్వాత చూసుకోవచ్చు. పాపయ్య మంచం బయటవేసుకొని పడుకున్నాడు. పగలంతా తోటకాడ పని. ఆలోచనలూ ఆశలూ నిరాశలు. అలసిపోయిన పాపయ్యకు వెంటనే నిద్ర కమ్మింది.

నిద్రలో పాపయ్యకు ఒక కల వచ్చింది. పెద్ద వాన పడుతోంది. చెరువు నిండింది. తోటపక్కన్నే గట్టుల్ని యెగదంతూ పారుతున్న కాలవ. బావిలో నీళ్లు. పాదుల్లో నీళ్లు. యింట్లో నీళ్లు. వీధిలో నీళ్లు. తనమీద నీళ్లు. యెక్కడ చూచినా నీళ్లు. తాను రాసిచ్చిన బాండు కాగితాలన్నీ నీళ్లల్లో కొట్టుకొని పోతున్నాయి. యెర్రటి మిరప్పండ్లు, బాగా వూరిన సెనక్కాయలు, చీనీపండ్లను మద్రాసుకు మోసుకపోతున్న లారీలు. రూపాయలు. అన్నీ రూపాయలే. రూపాయల్ని తాను వెదజల్లుతున్నాడు. అంగడి రామిరెడ్డి ఆబగా యేరుకుంటున్నాడు. కానీ వాడు నీళ్లల్లో కొట్టుకొనిపోయి చెరువులో మునిగిపోతున్నాడు. మునిగిపోతున్నాడు. పోతున్నాడు.

వున్నట్టుండి వురిమిన వురుముకు కల చెదిరింది. మంచంలోంచి దిగ్గున భయంతో లేచిన పాపయ్యకు గుండె వేగంగా కొట్టుకొంది. ఆర్తనాదం చేసి పాపయ్య మంచంలోనే కూలిపోయినాడు.

ఆకాశంలోంచి ఆ రాత్రి వానపల్లేదు. యింట్లో వాళ్ల కళ్లల్లోంచీ పడింది. వానతో చెరువులు నిండలేదు. యింట్లో వాళ్ల గుండెలు చెరువులయినాయి. పాపయ్య శవాన్ని చేయించిన స్నానపునీళ్లు కాలువలు గట్టినాయి.

ఉదయం వూళ్లోవాళ్లంతా పరామర్శించడానికి వచ్చినారు. పాపయ్య పెద్దకొడుకు మల్లయ్యను పక్కకు పిలిచి సుందర్రెడ్డి అన్నాడు.

“యిప్పుడు విచారించి లాభమేముంది? జరిగే పని చూడాల. పాపయ్య మామ బతికినన్నాళ్లూ బయటపడకుండా బతికినాడు. కొంత అప్పుల బాధేదో వున్నట్లుంది. నాతో అనేవాడు యెప్పుడన్నా. నాయనలోతు మనిషి. నీకేమైనా చెప్పినాడా?”

పాపయ్య తనక్కూడా బాకీ వుండే సంగతి సుందర్రెడ్డి చెప్పకుండా జరిగే పని చూడమని మల్లయ్యకు చెప్పినాడు. మల్లయ్య దు:ఖాన్ని దిగమింగుకొంటూ అన్నాడు.

"నేనెప్పుడూ నాయన యేం చేసినా వొక్కమాట అడగలేదు. అప్పులున్నాయని తెలుసు. యెంతుండాయో తెలీదు. యెన్ని బాకీలున్నా తప్పకుండా తీరుస్తాను మామా. తీరుస్తాను. మా వంశం సంగతి నీకు తెలీదా? గొంతులో ప్రాణం వున్నంతవరకు ఒకరికి బాకీలు యెగవేయం."

అంగడి రామిరెడ్డి భుజం మీద చేయి వేసి మల్లయ్యతో నెమ్మదిగా అన్నాడు.

"చూడు మల్లయ్య! యీ మద్దెన మీ నాయన నా దగ్గర చేసిన బాకీని గూర్చి దిగులు పెట్టుకోవద్దు. తొందరేం లేదులే. నిదానంగా చూసుకోవచ్చు. దివసం అయ్యాక అంతగా అయితే రాతకోతలూ అవీ వుంటే చూసుకోవచ్చు".

రామిరెడ్డి కూడా మంచోడే. యిలాంటి వాళ్లు వుండబట్టే తన యింటి గౌరవం నిలిచింది. మల్లయ్య కళ్లు కృతజ్ఞతతో మెరిసినాయి.

రామిరెడ్డి ఆత్రగాడు కాదు. గాలానికి బాగా చిక్కిన తర్వాత చేపను బయట వేస్తాడు. యీ చేప బాగా దొరుకుతుంది. రామిరెడ్డి మనసులో అంకెలు దొర్లుతున్నాయి.

దివసాలు ముగిసినాయి. మల్లయ్యకు యింటి విషయాలన్నీ నెమ్మదిగా పడుతున్నాయి. తండ్రి మరణానికి ముందు మల్లయ్య పొలం పనులను గూర్చి మాత్రమే ఆలోచించేవాడు. తండ్రిదే పెత్తనం కాబట్టి. యిప్పుడు పొలం పనులూ, యింటి బాధ్యతలూ, బాకీలూ డబ్బు, బాధలూ.

నెల రోజుల తర్వాత మల్లయ్య ఒకరోజు తోట దగ్గరకు వెళ్లినపుడు బావి గట్టున నిలబడి అనుకున్నాడు.

నాయన పోయినాక వొక వాన వచ్చింది. యింకొక మంచివాన కురుస్తే యీ మిరపచెట్లకు కాయ బాగా పడుతుంది. ధరలున్నాయి. సెనక్కాయతీగ బాగా సాగుతుంది. ధరలు పెరుగుతున్నాయి. నిమ్మచెట్లకు పూత వస్తుంది. రెండు మూడు లారీలు కాస్తాయి. బావిలో నీళ్లు సరిపోతాయి. అన్నీ కుదిర్తే యేముందీ? బాకీలు సుమారుగా తీర్చవచ్చు. బాకీలెంతబాధ! బాకీలు తీర్చాలి.

బావిలోకి చూస్తూ, ఆకాశంవైపు చూస్తూ, ఆ మధ్య వచ్చిన ఒక వానతో బతకలేక చావలేక అవస్థపడుతున్న మిరపచెట్లను చూస్తూ, నీరెత్తని నిమ్మచెట్లను చూస్తూ అనుకున్నాడు.

వొక్క వాన కురిస్తే! మరొక్క వాన కురిస్తే!!

✡

# తలపాగా స్వగతం

**-కాట్రగడ్డ దయానంద్**

నేను తలపాగాని!

మోకాళ్ళు దాటని పంచె, ముతక బనీను, బనీను జేబులో నాలుగు పుగాక్కాడలు, మాసిన గడ్డమూ, మట్టి శరీరమూ, నెత్తిన కిరీటం...

నేను తలపాగాని! మట్టితోనూ, మట్టినే నమ్ముకున్న జీవుల్తోనూ నా సహచర్యం. సూర్యుడికంటె ముందే పొడిచి, చంద్రోదయం తర్వాతెప్పుడో విశ్రమిస్తాను.

సూర్యచంద్రుల ప్రస్తావనొచ్చింది కాబట్టి చెబుతున్నాను! అసందర్భప్పక్షి అని కొట్టి పారేస్తారేమో!

నేనిప్పుడు అస్తమయాల గురించి మాత్రమే చెప్పదలచేను. సూర్యచంద్రులతో పోటీపడి చరించడం వల్లనేమో ఋతువు మారినప్పుడల్లా అస్తమయం కావడమే నా జీవితం! ఒకసారి కాదు! వందల వేల సార్లు!! మొదటిసారి చచ్చిపోవడం ఎవరికైనా బాధే! తర్కించాల్సి వుంటుంది! మధించాల్సి వుంటుంది!! వెనకా ముందూ ఆలోచించాల్సి వుంటుంది. తర్వాత తర్వాత చావు మాత్రమే నిరంతర జీవితంలో భాగమవుతుంది.

నేనిప్పుడు నా మరణాల గురించి మీతో చెప్పదలచుకున్నాను. నాకు మట్టే ప్రపంచం!

దిగంతాల మధ్య. ఆకాశమే కప్పుగా. పచ్చదనాల మట్టి తోడే నా జీవితం.

నాకు జీవితమిచ్చింది ఈ మట్టి. శ్రమ సౌందర్యానంతరం నిద్రపుచ్చి లాలించే తల్లి ఈ మట్టి. నా కష్టసుఖాలకు నిరంతరం వెన్నంటి వుండే నా ఆత్మబంధువు ఈ మట్టి.

నా కష్టం ఈ మట్టి. నా జీవితం ఈ మట్టి.

భూమిని సాగుచేసిన తొలి రోజులు.

రాళ్ళూరప్పలేరేను. కంపాముళ్ళూ తీసేను. నాగలి పట్టి కొంద్రవేసి నా తల్లి గర్భం చీరేను. ఆగ్రహించలేదు మట్టి. అనుగ్రహించింది. చదును చేసి పిండిచేసి తొలకరి పదునుకు

బంగారు ముద్దని చేసేను. జొన్నలు వేసేను. రాసులు రాసులు పండేయి. ముప్పొద్దులా సంకటి – ఇంటిల్లిపాదికీ కడుపు నింపింది నా మట్టితల్లి.

వరిగెలు వేసేను. రాగులు వేసేను. జారిపోయే గింజలు, ధగధగలాడే గింజలు. ఒక పూట సంకటి. ఒక పూట వరిగె అన్నమూ.

అమ్మా, నాన్నా, భార్య, పిల్లలూ... మట్టితోడే లోకం – మట్టితోటే ప్రపంచం –

బుడమొద్లు వెదబెట్టేం! దంచితే ఇంటినిండా పరుచుకున్న ఎర్రెర్రటి బియ్యం!

ఇంటిల్లిపాదికీ ఒకపూట సామి బువ్వ – అన్నం కోసం వెదుకులాట – ఒడ్లు కోసం వెంపర్లాట – మట్టీ, నీళ్ళు నిరంతరం ఒకదాన్నొకటి పెనవేసుకుని హొయలు హొయలుగా కులికే దగ్గర పండే ఒడ్ల కోసం ఆరాటం –

ప్రయాణం ప్రయాణం.

బండి నిండా జొన్నలు. వరిగెలు.

సద్ది తాగుతూ గెడ్డలు తింటూ మూడు రోజుల ప్రయాణం – జొన్నలకు ఒడ్ల మారకం. వరిగెలకు ఎర్రగెడ్డల మారకం.

ఎత్తుకు ఎత్తు మారకం!

జీవితమంటే నాదే! ఎంత హాయిగుందో, ఎంత పచ్చగుందో!

హరిదాసు హరెల్ల రంగ హరి పాటల మాధుర్యం, డూడూ బసవన్నల కదలికల వింత విన్యాసం, కాటిపాపలోడి చేతికర్ర విచిత్ర లాస్యం, చెంచులోల్ల చేతిగంటా. శిరస్సున నెమలి ఈకల విచిత్ర కదలికల సౌందర్యం...

జీవితమంటే నాదే, నాదే!

ఋతువు మారింది. అదును తప్పింది.

ఆ సంవత్సరం పదునయ్యే వానల్లేవు.

విత్తిన గింజల మొలకల అజాపజా లేదు. పంటల్లేవు. నా మట్టి తల్లి మొఖం చాటేసింది.

ఆకలి! ఆకలి!!

మరుసటి సంవత్సరం పండిన జొన్నలకు మారకం లేదు.

ఊళ్ళన్నీ తిరిగి తిరిగి అరెత్తు మారకానికి వడ్లు తెచ్చుకోవడం... అర్ధాకలి, అర్ధాకలి!!

మరుసటి సంవత్సరం అరెత్తు మారకమూ లేదు. ఊళ్ళన్నీ తిరిగి తిరిగి మళ్లీ తిరిగి వచ్చి కాసులకు జొన్నల అమ్మకం....

మారకానికి బదులు కాసులు కాసులు.

నా మట్టి నా శ్రమ. నా పంట అంతా కాసులమయం. అమ్మితే వచ్చేవి కాసిని. కొంటే కావాల్సినవి మరిన్ని! అంతా కాసుల దయ.

తొలిసారి నా అస్తమయం అప్పుడే!

జొన్నలు లాభంలేదు. వరిగెలు లాభం లేదు. లాభ నష్టాల గురించి ఆలోచించాల్సిన దుర్దశ, తినాలి కదా! కడుపులు నిండాలి కదా! కాసులు కావాలి కదా! పండించే వాటికి కొనుక్కునేవి రానప్పుడు లాభనష్టాల బేరీజు తప్పదు.

తిండిగింజల్ని వదిలి సుదూర తీరాలకు తరలి వెళ్లిపోయే పంటలవైపు ప్రయాణం!

ధనియాల పంట కమ్మటి సుగంధ పరిమళం. పచ్చటి మొక్కల మీద పట్టపగలే తెల్లటి వెన్నెలపూత – చూస్తేనే కడుపు నిండే రాశుల రాశుల ధనియాలు – జల్లెడ పట్టి, మట్టి పెళ్ళలేరి తూకమేసే పంట.

మిర్చిపంట – గుత్తులు గుత్తులుగా మొక్కలకు వేలాడే ఎర్రెర్రటి పంట – ఇంటి నిండా పంట వాసన, గుప్పుగుప్పుమని ముక్కుల్ని మండించే ఘాటు వాసన...

ఆనందం... ఆనందం... అది మాత్రం ఎన్నాళ్ళు? ఒక సంవత్సరం పంట లేదు. మరు సంవత్సరం రేటు లేదు. ఆ తర్వాత తుఫాను. తుఫాను.. తలపాగాలను మరుభూమిలో మూకుమ్మడిగా సమాధి చేసిన తుఫాను. సముద్రం ఉప్పొంగి పచ్చదనాన్ని కబళించిన తుఫాను. నా సర్వస్వాన్నీ, సమస్తాన్నీ తనతో తీసుకెళ్ళిన తుఫాను. మళ్ళీ చచ్చిపోయాను. మళ్ళీ మళ్ళీ చచ్చిపోయాను. నేనిప్పుడు నా అస్తమయాల గురించే చెప్పదలచుకున్నాను.

ఋతువు మారింది. పొగనారు వచ్చింది. మత్తువాసన, గమ్మత్తయిన డబ్బు వాసన.

బంగారం ముద్ద నా మట్టి. పొగనారును అద్భుతంగా ఆలింగనం చేసుకుంది.

దళసరి ఆకులు... రెండు అరచేతుల వెడల్పు ఆకులు – జిడ్డు జిడ్డుగా నల్లనల్లగా వొంటిని చుట్టుకుపోయే ఆకుల పత్రహరితం.

పగలు లేదు, రాత్రి లేదు. ఆకుల్ని పుటుక్కున తెంచి బండ్లకు బండ్లు తాళ్ళతో అల్లటం – బ్యారన్లలో ఆకును కాల్చడం – ఏడేడు సముద్రాల కావలికి పంపడం. సందడి సందడి... కాసులు కాసులు... నోట్లు నోట్లు పల్లెనిండా ఆనందం, ఆర్భాటం... రోడ్డొచ్చింది. పట్నం దగ్గరైంది. బస్సులొచ్చేయి. ఇంటినిండా అనవసర ఆర్భాటాలు వచ్చేయి.

మళ్ళీ సంవత్సరం రంగు తగ్గింది. రేటు లేదు.

ఆ మరుసటేడు అదును తప్పింది. ఇల్లు ఒట్టిపోయి మెడలు బోసివయేయి.

ఆ సంవత్సరం బాగానే పండింది. మంచి రేటే వచ్చింది. బ్యాంకుల్లో అప్పులు తీరుతాయనుకుంటే వాడు పుగాకు కంపెనీనే ఎత్తేసేడు.

అమ్మిన డబ్బు ఇంటికి చేరనే లేదు. పుగాకు గోడౌన్లు తుఫానులో కొట్టుకుపోయాయని అబద్ధపు వర్తమానం... లక్షలకు లక్షలు దివాలా తీయించిన కంపెనీలు.... మూకుమ్మడిగా తలపాగాల తలలు ముంచేసిన వైనం.

అప్పు తీర్చలేదని బ్యాంకుల వత్తిడి, జీపుల హడావుడి.

అప్పు తీర్చలేదని ఇల్లు వేలం... ఇంట్లో సామాను బజార్లో వేలం.. అవమానం... అవమానం!

మళ్ళీ చచ్చిపోయాను.

నేనిప్పుడు నా అస్తమయాల గురించే చెబుతున్నాను.

ప్రయాణం ప్రయాణం... సుదూర తీరాలకు అలసటలేని ప్రయాణం. రెక్కలున్నాయి గదా! మట్టిని బంగారం చేసే సువర్ణ విద్య తెలుసు కదా!

వ్యవసాయం వ్యాపారం. వ్యాపారం వ్యవసాయం!

మళ్ళీ బంగారం కోసం దేవులాట. నల్లబంగారంతో తెల్లబంగారం కోసం వెంపర్లాట.

ఎంత అద్భుతమైనదీ మట్టి! దేన్నైనా తనలో ఇముడ్చుకుంటుంది.

దేన్నైనా ప్రకాశవంతం చేస్తుంది. పరిమళాన్ని చేస్తుంది. ఫలభరితం చేస్తుంది. నల్లటి విత్తుని తెల్లటి బంగారం చేస్తుంది.

సంతోషం ఆనందం. గెలిచేననే అనుకున్నాను. మళ్ళీసారి తెల్లదోమ ముసిరింది. మందుల కొట్ల చుట్టూ ప్రదక్షిణాలు మొదలయ్యేయి. మళ్ళీ మరింత వెయ్యాలి. ఖర్చులు పోను మరింత మిగల్చాలి. లాభపడాలి.

వానలు లేవు. నీళ్ళ కోసం దేవులాట. ఒకటి... రెండు... మూడు బోర్లు. చుక్క నీరు లేదు. మార్వాడీ దగ్గర బాకీలు మాత్రం పెరిగేయి.

రకరకాల పురుగులు, రంగురంగుల పురుగులు – మందుల్ని తాగేసి తెగ బలిసిన పురుగులు.

మందుల్లో కల్తీ – తల వంచింది తెల్లబంగారం.

విత్తనాల్లో కల్తీ – తలఎత్తిన దానికి రేటు లేదు. అన్యాయమని బజార్లో వెర్రికేకలు... అరుపులు... కాల్పులు.. కాల్పులు.. తెగిపడ్డ తలపాగాల తలలు.

అప్పులు. అప్పులు, కుదువలో ఇల్లూ బంగారం, పస్తులు, పస్తులు పెళ్ళికాని ఆడపిల్లల దైన్యపు చూపులు, లాభం లేదు, లాభం లేదు.

పురుగుల్ని చంపలేని మందు మా బతుకులకు తప్పక ఆసరా అవుతుందన్న ధీమా!

చచ్చిపోతున్నాను చచ్చిపోతున్నాను.

నేను చచ్చిపోయినప్పుడల్లా ఎవడో ఒకడు మరింతగా ఊపిరి పోసుకుంటున్నాడు. మరింతగా ధగధగలాడుతున్నాడు. వాళ్ళను బతకనివ్వండి.

విత్తనాలకు కల్తీ మందులకు ధర నిర్ణయించేది వాళ్ళు! మేము పండించే పంటకు ధర నిర్ణయించేదీ వాళ్ళే!

వాళ్లని మాత్రం బతకనివ్వండి. చావు నాకు కొత్తగాదు. దినదినం అస్తమానం అవమానాల్తో, అప్పుల్తో, పస్తుల్తో చచ్చేవాడ్ని.

తలపాగాలెన్ని రాలితే మీకేం!

మా చావు మీకు మూకుమ్మడి వెర్రి!

మా చావు మీకు వెలకట్టించి ఇచ్చే నోట్ల కట్టలు.

మళ్ళీ బతుకనేది లేకుండా చంపండి.

నేనే రాలిపోయిన చిట్టచివరి తలపాగా కావాలి. అస్తమయాల గురించే కదా చెబుతున్నాను. మళ్లీ వుషోదయం లేని అస్తమయం అనుగ్రహించండి! అనుగ్రహించండి! అ... ను...గ్ర... హిం.... చం.... డి!!

✡

# పొలం అమ్ముకోవడమంటే...

**-మల్లీశ్వరి**

నేను రాజమండ్రిలో పి.జి చేస్తున్నపుడనుకుంటా మా నాన్నగారు నాకో ఉత్తరం రాసారు. "వ్యవసాయం చెయ్యలేకపోతున్నాననీ, పొలం మొత్తం అమ్మేసి అప్పులు తీర్చి మిగిలిన డబ్బుని మా అక్కా చెల్లెళ్ళ పేరన బాంకిలో వేస్తానని" ఉత్తరంలో సారాంశం. మిగతా విషయాలేం పట్టలేదు కానీ పొలం అమ్మడం అన్న మాటే తలకెక్కి చాలా మనేద పట్టుకుంది నాకు.

పొలం అమ్మడమేంటి!!! మమ్మల్ని మేం అమ్ముకున్నట్టు!!!

అసలు మేమంటే మా కుటుంబం అంటే... పుస్తకాల్లో చెప్పినట్టు అమ్మ, నాన్న, పిల్లలూ మాత్రమే కాదుగా...

ఇటుకా ఇటుకా పేర్చి గోడ కట్టినట్టూ, నాలుగు గోడలపై కప్పు వేసి ఇంటిని చేసినట్టూ పొలాలూ, గేదెలూ, కోళ్ళూ, కుక్కలూ, పిల్లా, మేకా అన్నీ కలిస్తేనే మా కుటుంబం. మేవంతా కలిసి ఒక యూనిట్. ఆ యూనిట్‌కి పునాది పొలం.

పునాదే కూలిపోతే!!!

మా నాన్నగారి ఉత్తరం చదివినపుడు చాలా ఏడుపొచ్చింది. మేం ఎట్లా చెపితే అట్లా విన్న మహా బుద్ధిమంతులైన పొలాలని పోగొట్టుకున్న దుఃఖం చాలా రోజులు వెంటాడింది. పొలంతో ఉండే అనుబంధం తల్చుకున్నపుడల్లా కళ్ళల్లో నీరు జ్ఞాపకాల సుడులై తిరుగుతుంది.

మా పరగడ చేలో మొక్కజొన్న పంట వేసినపుడు పాలుగారే లేత మొక్కజొన్న కంకుల మీద రంగురంగుల పిట్టలు వాలేవి. వాటిని తరిమే పని మాకు అప్పజెప్పేవారు. పిట్టల బుజ్జి పొట్టల ఆకలిని తీర్చాలా, పంటని కాపాడుకోవాలా అన్న ఆలోచనలతో తల్లకిందులై పోయేవాళ్ళం.

మెరక చేలో చెరుకు పంట వేసేవారు. చెరుకు కట్టుళ్ళకి వచ్చిన పనివారికి కూడా లొంగకుండా, పదడుగుల ఎత్తులో ఏపుగా ఎదిగిన చెరుకు తోట వూళ్ళోవాళ్ళ మాటల్లో ఆశ్చర్యంగానూ, మా నాన్నగారి కళ్ళల్లో గర్వంగానూ మారేది.

చింత చేలో విరగకాసిన దోసకాయల్ని బస్తాలకెత్తించి హనుమాన్ జంక్షన్ మార్కెట్‌కి తీసుకువెళ్ళేవాళ్ళు. డిమాండ్ లేక దారి ఖర్చులు కూడా రాక పంటంతా మార్కెట్లో వదిలి నాన్నగారు ఉట్టి చేతుల్తో ఇంటికొచ్చినపుడు సకారణంగానే ఇంట్లో చిటపటలు మొదలయ్యేవి.

నారయ్య చేలో దుబ్బుల నిండా గుత్తులు గుత్తులుగా కాసిన వేరుసెనగ పంటని ఇంటికి తెచ్చి ఎండబెట్టి, వరండా నిండా పది పదిహేను మందిమి కూర్చుని కుడి చేత్తో ఎడమచేత్తో ఒకేసారి కాయల్ని టప్ టప్ మని నేలకేసి కొట్టి వొలిచేపుడు నలుగురు కలిసి పాడుకునే జానపద గేయాలు ఎంతో ఉత్సాహపరిచేవి.

దుక్కి దున్నడం, నాట్లు వేయడం, కలుపు తీయడం, కోతలు కోయడం ఇట్లా పొలం పనులన్నింటిలోనూ ఏవో బాధలూ, కష్టాలూ, సంతోషాలూ అన్నీ కలగలిసి సంవత్సరం పొడుగూతా జీవిస్తున్నట్లే ఉండేది.

పొలం అమ్మేశాక నాన్నగారు ఇంట్లోంచి బైటకి రావడం తగ్గిపోయింది. ఆ తర్వాత రెండు మూడేళ్లకే గేదెలన్నింటినీ అమ్మేసారు.

ఎందుకంటే....

ఇదివరలో గేదెల్ని కాసే మనిషికి సంవత్సరానికి ఇన్ని బస్తాల చొప్పున వడ్లు కొలిచేవారు. పొలం అమ్మేశాక వడ్లు కొని జీతం కట్టడం కష్టమైపోయింది. గేదెల మేతకి అవసరమైన పచ్చగడ్డి, చిట్టు, తవుడూ అన్నింటికీ పొలమే ఆధారం. అదే పోయాక గేదెల్ని సాకడం పెద్ద సమస్య అయి కూర్చుంది.

గేదెల్ని అమ్మేసాక పాల మీద నెల నెలా వచ్చే రాబడి పోవడమే కాక తినడానికి కమ్మటి పెరుగూ, తాగడానికి చిక్కటి పాలూ కరువయ్యాయి.

ఇంకా పెద్ద నష్టం...

పైసా ఖర్చు లేకుండా కేవలం పశువుల పేడతో నడిచే గోబర్ గ్యాస్ ప్లాంట్ దెబ్బకి మూతపడి మార్కెట్లో గ్యాస్ సిలిండర్లని కొనుక్కోవడం మొదలుపెట్టాం.

ఉత్పత్తి స్తితి నుంచి కొనుగోలుదారులుగా మాత్రమే మిగిలిపోయే స్తితికి ఎపుడు చేరుకున్నామో, ఏం జరుగుతోందో ఏంటో అర్థమయ్యే లోపు ఒక్కొక్కటీ ఖాళీ అయి శూన్యంలో వేలాడుతున్న భావన.

ఇంటి ఆవరణలోకి, గేదెల చావడిలోకి తేళ్ళో, కాళ్ళజెర్రులో వస్తే ఎక్కడున్నా లటుక్కున పట్టేసి ముక్కుతో కొరికి చంపేసే కోడి పుంజులూ, పెట్టలూ చూస్తూ చూస్తూ ఉండగానే మాయం అయిపోయాయి.

ఇపుడు మా ఇల్లు బీడుబడిన పొలంలాగా, వొట్టిపోయిన ఆవులాగా, పందెంలో రెక్కలు తెగిన కోడిపుంజులాగా దీనంగా, నిస్సహాయంగా ఉంటుంది.

పొలాలూ, గొడ్డూ, గోదా, కోడీ మేకా స్థానంలోకి టీవీలు, ఫ్రిజ్జులూ, సెల్‌ఫోన్లూ వచ్చిచేరాయి. అవి పోవడానికీ, ఇవి రావడానికీ మధ్య ఏం జరగనట్టు అన్పిస్తుంది కానీ...

పాతికేళ్ళ ముందూ పాతికేళ్ళ తర్వాతల్ని బేరీజు వేయాల్సి వస్తే–

అదునులో కురిసే వానలకీ, అదుపు తప్పిన సునామీకీ ఉన్నంత తేడా కన్పిస్తుంది నాకు.

✡

# మావూరి మహా నాటకం

**-పాతూరి విష్ణు**

ఏప్రిల్ నెలాఖరు. పది గంటలకే ఎండ పెటపెటలాడిపోతోంది. అన్నాలు తినేసి అందరం పేకాడేదానికి ముప్పారి దేవరింట్లో చేరాం. పెళ్ళిళ్లు అయిన వాళ్ళందరూ సీక్వెన్స్ ఆడతా వుంటే పెళ్ళికెదిగిన మేమంతా ఢంకా పలాస్ ఆడతా వుండాం. ఆడేవాళ్ళకంటే చూసేవాళ్ళే ఎక్కువమంది వుండారు. మేమంతా ఆటలో నిమగ్నమై వుండాము. ఇంతలో గోపాలంగాడు అట్టా రోడ్డువైపుకి చూసి "ఒరే రాముడూ మీ నాన్నరా..." మెల్లగా అన్నాడు.

అంతే నా పక్కన కూర్చున్న నల్లపనేని రాముడు పేకముక్కలు గబుక్కున కింద పడేసి అంతే వేగంతో లేచి నా వెనక్కి చేరి రోడ్డుకేసి చూసి "గోపాయ్... దొంగనాకొడకా... ఎక్కడరా మానాన్న. నీ మూలంగా బంగారం లాంటి పందెం పారేశా" అని కోపంగా అంటూ మళ్లీ నా పక్కన కూర్చున్నాడు ఆడేదానికి.

"ఛత్... గొడవాపండ్రా" అంటూ "చూడండి. అంజయ్య మామ వస్తున్నాడు" అన్నా నేను.

అల్లంత దూరంలో ముప్పా అంజయ్యమామ కఱ్ఱ పోటేసుకుంటూ వస్తున్నాడు. మామకు వయసు యాభై ఐదు పైనే వుంటాయి. ఆరడుగుల భారీ మనిషి. జుట్టంతా తెల్లబడిపోయింది. దిట్టమైన మనిషి అవడం వల్లనేమో ఈ మధ్యే మోకాళ్ళ నొప్పులు చేసి కఱ్ఱ వూతంలేకుండా నడవలేక పోతున్నాడు. మామ పెద్దవాడైనా పేకాటలో మాత్రం మా జట్టే. ఈయన కాకుండా మా కుఱ్ఱాళ్ళ బ్యాచ్‌లో ఆడే ఇంకో ఇద్దరు ముసలాళ్ళు వుండారు. ఈ ముసలాళ్ళు ముగ్గురికీ పేకాటలో ఏనాడూ డబ్బు వచ్చిందిలే, దొబ్బేసుకుని ఇంటికి పోవడం తప్ప. మామతో పరాచికాలు ఆడటం అంటే మాకు భలే సరదా. మాటకు మాట అంటించడంలో మామ మహా దిట్ట.

దేవరింట్లోకి అట్టా వచ్చీరాంగానే "ఏందిరా... ఖాళీ ఇస్తారా లేదా" అన్నాడు.

"ఖాళీలేదు గోంగూర లేదుగానీ, పెద్దోడివి నువ్వే స్కూలికి లేటుగా వస్తే ఎట్టా చెప్పు?" అన్నా నేను.

"నీ యత్త ఇంటి దగ్గర నుంచి రానివ్వొద్దంటరా." అంటూ నాకు చురక తగిలించాడు.

అంజయ్యమామను ఏమీ అనకుండా నానోరు ఊరుకోదు గదా. "ఏంమామా. మీ ముప్పారు ఇంతమంది వూళ్లో వుండారు కదా. తలా ఇంత చందాలు ఏసుకోని దేవరింటికి సున్నం కొట్టించరాదూ. చూడు గోడలకు సున్నం రాలిపోయి ఎంత చండాలంగా కనపడుతున్నాయో" అన్నానో లేదో రాముడందుకుని,

"ముసలోడా, సున్నాలే కాదు నేలమీద కూర్చుని పేకాడతా వుంటే లుంగీలకు మట్టి అంటతా వుంది" అన్నాడు.

"ఒరే పాతూరోడా, నువ్వన్నట్టే మన అద్దంకమ్మ తిరుణాల్లకు సున్నం కొట్టిద్దాం, పోరా" అన్నాడు.

"తిరుణాల్లు ఎప్పుడే?" అని ఆసక్తిగా అడిగాన్నేను.

తిరుణాల్లు అనంగానే రాముడికి ఎక్కడ లేని హుషారు వచ్చినట్టుంది. పేక కలిపి అందరికీ పంచుతా "ఒరే అబ్బాయ్... ఈసారి తిరుణాలకు మనం డ్రామా ఏద్దాంరా. తిరుణాల్లకు ఎప్పుడన్నా చూడు శ్రీక్రిష్ణ తులాభారమో, రాయబారమో ఏస్తా వుండారు. కుర్రాల్లం ఈసారి సాంగిక నాటకం ఏద్దాం" అని ప్రపోజల్ పెట్టాడు.

పంచిన పేకముక్కలు ఎత్తుకుంటూ "నువ్వు రెడీరా.... ఇంకా జనాలు కావద్దా." అన్నా నేను పందెం ఏమీ లేక ముక్కలు కింద పడేస్తూ.

రాముడిగ్గూడా పందెం పడలేదనుకుంటా. వాడూ ముక్కలు పారేసి "ఏరా... నువ్వు రెడీనా... నువ్వూ..." అంటూ నాటకం వేసేదానికి అభిప్రాయ సేకరణ మొదలెట్టాడు.

నేను రెడీ అంటే నేను రెడీ అంటూ ఒక ఐదుగురు నాటకం ఏసేదానికి సిద్దపడ్డారు.

మరుసటి రోజు ఉదయాన్నే రాముడు నిజంగానే గుంటూరెల్లి మధ్యాహ్నానికల్లా ఐదారు పుస్తకాలు కొనుక్కోని సరాసరి దేవరింటికే వచ్చేశాడు. వచ్చీ రావడంతోనే వాడి దెగ్గర పుస్తకాల కోసం ఎగబడ్డారు.

"ఒరేయ్ ఉండంఢ్రా.. లాక్కోవద్దు.చినిగి పోతాయ్..." అంటూ తలా ఒక పుస్తకం ఇచ్చి "మంచిది చూసి పెట్టండిరా" అన్నాడు.

"నీ.. అందులో మళ్ళీ మంచిది. కళ్ళు మూసుకుని చేతికి ఏది వస్తే అది నాటకం వేయండ్రా" అని ఎగతాళిగా అన్నా.

"ఒరేయ్... విష్ణాయ్... ఒకతన్ను తన్నా. నువ్వు చెయ్యవు, ఇంకొకళ్ళని చెయ్యనివ్వవు." కోపంగా అన్నాడు రాముడు.

"ఆఁ తన్నేవులేరా" అంటూ నేను గూడా పుస్తకాలు చూసేదానికి మళ్ళుకున్నా.

ఎస్‌పి భయంకర్, సర్దార్ పాపారాయుడు, వేటగాడు, రాజా-రమేష్, దొంగా - దొరా... ఇట్లా సినిమా పేర్లతోనే ఉన్నాయ్ పుస్తకాలన్నీ. పుస్తకం మొత్తం చదివే పనిలేదు. ఒక పేజీ తిప్పితే చాలు. దానిలో పాత్రలు, తీరు తెన్నులు గురించి మొదట్లోనే రాసి వుంది. ఒక దాంట్లో కామెడీలేదని, ఇంకోదాన్లో పాత్రలు తక్కువగా వున్నాయని, పుస్తకాలన్నీ పరిశీలించి ఆఖర్న 'రాజా - రమేష్'ను నాటకం వేసేదానికి ఎన్నుకున్నారు.

ఇందులో క్లుప్తంగా కథ ఇదీ- రాజా, రమేష్ ఇద్దరూ అన్నదమ్ములు. చిన్నప్పుడు వాళ్ల నాన్నను ఆ వూరి మోతుబరి చంపేస్తాడు. ఈ మోతుబరే నాటకానికి విలనన్నమాట. రాజా రమేష్‌లు పెరిగి పెద్దవాళ్ళయి ఆఖర్న విలన్ని చంపడంతో కథ ముగుస్తుంది. దిసీజ్‌ది స్టోరీ. ఇద్దరు కమెడియన్లు, హీరోయిన్, వాళ్ళ కుటుంబ సభ్యులు, చిన్నా చితకా మొత్తం కలిపి ఒక పది పాత్రల దాకా వున్నాయి. మళ్ళీ వొక వ్యాంప్ కూడా. మిగిలిన పుస్తకాలు కూడా ఇంతకంటే భిన్నంగా ఏమీలేవు.

సేమ్ స్టోరీ... టైటిల్ చేంజ్... క్యారెక్టర్స్ నేమ్స్ చేంజ్...

ఇద్దరు హీరోల పాత్రలకు రాముడ్ని, సుబ్బారావు గాడ్ని, విలన్‌గా గోపాలంగాడ్ని, డైరెక్టర్‌గా అంతకు ముందు నాలుగైదు పౌరాణిక నాటకాలు వేసిన అక్కేశ్వర్రావ్‌ను ఎన్నుకున్నారు. మిగతా వాళ్లు ఎవరు ఏ పాత్రలు వెయ్యాలి అనే నిర్ణయం చకచకా జరిగిపోయాయి. పనిలో పనిగా అంజయ్య మామను ఆర్గనైజర్‌గా, ఎవరైతే రిహార్సల్స్‌కు రారో వాళ్లను పిల్చుకొచ్చే పనిని నాకప్పగించారు. నాటకానికయ్యే ఖర్చును పాత్రధారులంతా సమానంగా పంచుకోవాలని అనుకున్నారు. నేను నోరు మూసుకుని వుండకుండా "పోర్షన్‌ను బట్టి చందాలు వేసుకోండ్రా. మద్దెలో తగాదాలు రాకుండా వుంటాయి" అన్నా.

"నువ్వు పుల్లలు పెట్టకుండా నోరు మూసుకుంటావా?" అని రాముడు కసిరే సరికి మనకెందుకురా బాబూ అనుకుంటూ మెదలకుండా వుండిపోయా.

అదే రోజు రాత్రి ఎనిమిది గంటలకు అన్నాలు తినేసి అందరం లక్ష్మయ్య బాబాయ్‌వాళ్ల కొట్టం దగ్గరికి చేరాం. ఆయన ఇంటి ముందరే కొట్టం కూడా. మేము వెళ్లే సరికి గొడ్లను బయట కట్టేసి శుభ్రంగా వూడ్చి నీళ్లు చల్లి పెట్టి వుంచాడు దుమ్ము లెగవకుండా. మేము వచ్చింది చూసి రెండు తెల్లగోతాలతో చేసిన పట్టలు తెచ్చి నేల మీద పరిచాడు. ఒక యిద్దర్ని పిల్చుకు వెళ్ళి ఇంట్లో నుంచి ఒక కుర్చీ, ఒక టేబుల్ కొట్టంలోకి తెచ్చి పెట్టి వెళుతూ "ఒరేయ్... బీడీలు, సిగరెట్లు కాల్చేటప్పుడు జాగ్రత్తగా వుండండి. అసలే ఎండాకాలం" అంటూ హెచ్చరిక చేసి వెళ్ళాడు. డైరెక్టరుగా ఎన్నుకున్న అక్కేశ్వరరావ్ అన్నాయ్ అందర్నీ వుద్దేశించి "మీరంతా అట్లా కూర్చుంటే మాట్లాడతా." అన్నాడు.

మేమందరం నేలమీద పరచిన పట్టామీద కూర్చున్నాం. ఆయన మాత్రం నిల్చుని "మీరంతా కుర్రాళ్ళు. ఈ రోజు వున్న వుత్సాహం రేపుండదు. తిరణాలకి నాటకం వెయ్యాలని అంటున్నారు. ఇంకా నెల రోజులే టైముంది. ప్రతిరోజూ రిహార్సల్స్‌కి రావల్సిందే. ఒక రోజు వచ్చి ఇంకో రోజు ఎగ్గొడితే డైరెక్షన్ చేయడం నావల్ల కాదు. ఏ విషయం చెప్పండి" అంటూ చిన్నక్లాసు తీసుకున్నాడు.

"నువ్వు ఎలా చెబితే అలా చేస్తాం." అన్నాడు రాముడు అందరి తరఫున వకాల్తా పుచ్చుకుంటూ.

"అన్నాయ్.. ఇంకొక విషయం" అంటూ కూర్చున్న రాముడు లేచి నుంచొని "మొన్న దసరాకు లేమల్లెపాడులో నాటకం వేశారు. అందులో సినిమా పాటలు కూడా పెట్టుకున్నారు. భలే బాగుంది. మన నాటకంలో కూడా పాటలు పెట్టుకుందాం" అన్నాడు.

"పాటలంటే స్టెప్పులుంటాయి. నాకు రావుకదరా మీకు నేర్పేదానికి" అన్నాడు డైరెక్టరు.

"అదేం ఇబ్బందిలేదులే. మనం ఎటూ హీరోయిన్‌ను మాట్లాడుకోవాలకదా. ఆ యమ్మాయే నేర్పుతుంది. లేమల్లెపాడోళ్లు కూడా అట్టాగే చేశారంట" అని రాముడనేసరికి "సరే మీ యిష్టం .... అలాగే కానీండి. ఒక పూజ ప్రారంభించి రిహార్సల్స్ స్టార్ట్ చేద్దాము" అన్నాడు డైరెక్టరు.

ముందుగా పెద్దోడు అంజయ్య మామ చేత కొబ్బరికాయ కొట్టించి ఆ తర్వాత ఇద్దరు హీరోలు, విలన్ చేత కొబ్బరికాయలు కొట్టించి రిహార్సిలు ప్రారంభించారు. మొదటి రోజు కొద్దిసేపు రిహార్సిలు అయి ఎవరిళ్లకు వారు వెళ్ళిపోయారు.

వీళ్ల నాటకం పుణ్యమాని మాకు మంచి కాలక్షేపం దొరికింది. రాత్రి ఎనిమిది గంటలకల్లా అన్నాలు తినేసి బాబాయ్ వాళ్ళ కొట్టంలో దూరేది. రిహార్సల్ చేసినంత సేపు చూసేది, బోరు కొట్టిందనుకో గోతాలపట్ట ఒకటి తీసుకుని కొట్టం ముందర వేపచెట్టు కింద పరిచి దానిమీద వాలిపోయేవాళ్లం. ఎండాకాలం పనీపాటా లేకపోవడం వలన రిహార్సల్ చూసేదానికి చాలా మంది పోగయ్యేవారు. కొద్దిసేపు రిహార్సల్ చూడ్డం మరికొద్ది సేపు చెట్టుకింది కాలక్షేపం చేయడం. నేనయితే అలా కబుర్లాడతా కబుర్లాడతా చల్లగాలికి అక్కడే నిద్రపోయేవాణ్ణి.

రిహార్సల్ జోరుగా సాగుతోంది. అందరూ యమా స్పీడ్‌గా నేర్చుకుంటున్నారు. పోర్షన్‌లు కూడా అందరికీ బాగానే వచ్చేశాయి. రాత్రిళ్ళు కొట్టంలో రిహార్సల్ జోరుగా జరగతా వుంటే పగలు దేవరింట్లో కథ ఎట్లా వుందో చెప్తా – అందరూ సీరియస్‌గా పేకాడుతూ వుండగా ఆట మధ్యలో రాముడు పేకముక్కలు కింద పడేసి తనకు వరసైన వాన్ని చూసుకుని "ప్రియా బుగ్గలు ఎంత నున్నగా వున్నాయో. ఒక్కసారి ముద్దెట్టుకోనా" అంటూ డ్రామాలో డైలాగు చెప్పి వాడి బుగ్గలు పట్టుకోపోతాడు.

ఇంకో మూల నుంచి గోపాయ్‌గాడు పళ్ళు పటపట కొరుకుతూ "ఈ భుజంగం కోరుకున్న ఏ ఆడదీ కాదనలేదు. ఆ రాధ నన్నే అవమానిస్తుందా? దాన్ని నలిపేస్తా. హ్హా... హ్హా..." అంటూ విరగబడి నవ్వతా ఉంటే ఇంకో మూల నుండి ఇంకొకడు వీళ్ళ గోల భరించలేక "ఒరే... రేపు స్టేజీ మీద ఏడుద్దురు కానీ, ఇప్పుడాపుతారా లేక అందర్నీ బయటకు పంపమంటారా?" అంటూ పక్కనే పేకాడే పెద్దోళ్లు కోపగించుకుంటే కొద్దిసేపు మెదలకుండా వుండేది. ఆ తర్వాత కత మళ్ళీ మామూలే.

ఈ లోపు అంజయ్య మామ నాటకం వేసే వాళ్ళ దగ్గర చందాలు వసూలు చేశాడు. హీరోయిన్‌ను మాట్లాడేదానికి చిలకలూరిపేటకు ఒక ఇద్దరు, మైక్ సెట్టింగులు మేకప్ వాళ్లు ఆర్కెస్ట్రా వాళ్ళ కోసం ఇంకో ఇద్దరు గుంటూరెళ్లి అడ్వాన్స్‌లు ఇచ్చి వచ్చేశారు. పనిలో పనిగా వాళ్ళకు నచ్చిన పాటలను రికార్డింగ్ చేయించుకొని క్యాసెట్‌లు కూడా పట్టుకొచ్చారు.

అనుకొన్నట్టుగానే ఒకవారం ముందుగా జూనియర్ శివరంజని (హీరోయిన్) చిలకలూరి పేట నుంచి దిగింది. హీరోయిన్ వచ్చిన సంగతి అందరికీ తెలిసినట్టుంది. ఆ రోజు రాత్రి కొట్టం జనంతో నిండిపోయింది. ముందుగా ట్రూప్ మొత్తాన్ని పరిచయం చేసుకుంది.

"డైరెక్టర్‌గారూ... నాకు పోర్షన్ బట్టీ పెట్టాల్సిన పనిలేదు. ప్రామ్టింగ్ చెప్తే అల్లుకుపోగలను. మీ వాళ్లు ... స్టెప్పుల్లో వెరీ పూర్ అని చెప్పారు. కాబట్టి ఈ రోజు నుంచి డ్యాన్సులు ప్రాక్టీస్ చేద్దామా" అని నైసుగా వుంది.

ముందుగా రాముడితో డ్యాన్స్ ప్రాక్టీస్ ప్రారంభించారు. రాముడికి ఎఎన్ఆర్ అంటే ప్రాణం. వాడు అన్ని ఎఎన్ఆర్ పాటలే రికార్డింగ్ చేయించుకొచ్చాడు. టేప్ రికార్డర్‌లోనించి 'వందనం అభివందనం' పాట వస్తోంది. దానికనుగుణంగా స్టెప్పులు ఎలా వేయాలో చేసి చూపుతోంది. ఆమె చెప్పినట్టుగా రాముడు కాళ్ళు చేతులూ ఆడిస్తా వుండాడు.

"ఆఁ ఆఁ అలా కాదు. ఇలా... ఆఁ ఓకే. ఏదీ, ఇలా భుజం మీద రెండు చేతులు వేయి. కాళ్లు అలా కదపాలి. ఆఁ... అలాగే... ఓకే.... ఏదీ నా నడుంమీద రెండు చేతులు వేసి, అబ్బా.... ఏమయ్యా నడుంమీద చేతులు వేయమన్నాను కానీ నలపమనలేదయ్యా. కొంచెం అంటీ అంటనట్లు వేయ్" అంటూ రాముడికి డ్యాన్సులు నేర్పతా వుంటే నాకు గుండెలు పిండేసినట్లయింది. నాకూ ఆ ఛాన్స్‌లేదే అని మనసు బాధగా మూలిగింది. ఆ పాట అయిన వెంటనే సుబ్బారావుగాడు (రెండవ హీరో) డ్యాన్సుకు రెడీ అయ్యాడు. వాడు ఎన్‌టిఆర్ అభిమాని. టేప్ రికార్డర్‌లో పాటకు అనుగుణంగా స్టెప్పులేస్తున్నాడు. ఎన్‌టిఆర్ సినిమాలు చూసి చూసి తిరుణాలలో జరిగే రికార్డింగ్ డ్యాన్సులు చూసిన అనుభవంతో హీరోయిన్‌తో సమానంగా స్టెప్పులేస్తున్నాడు. వాడి గెంతులు చూసి కొట్టంలో జనం ఒకటే ఈలలు. వాడు ఇంకా రెచ్చిపోయి ఎన్‌టిఆర్‌ను తలదన్నేట్టుగా హీరోయిన్‌ని ఆ పిర్రా ఈ పిర్రా వాయించే స్తున్నాడు. వాడి జోరుకు హీరోయిన్ జడిసి వాడితో డ్యాన్ చేసేదల్లా ఆపి "ఏమండీ... మీకో

నమస్కారం. ఎన్‌టిఆర్ కంటే రెండాకులు ఎక్కువే చదివినట్టున్నారే. కొంచెం జోరు తగ్గించండి. లేకపోతే ఒళ్లు హూనమై ఈరోజే మంచం ఎక్కాల్సి వస్తుంది" అంటూ నాటకీయంగా రెండు చేతులూ జోడించే సరికి జనమంతా ఒకటే నవ్వులు.

"జూనియర్ శివరంజనే ఇంత బాగా వుంటే సీనియర్ శివరంజని ఇంకెంత బాగుంటుందో..." జనంలోంచి ఎవడిదో తీయటి మూలుగు.

"ఆఁ... మీ నాయనమ్మ లాగుంటుందిరా... నోరు మూసుకోని రిహార్సల్ చూడవోయ్..." మరొకడి విసురు.

ఆరోజంతా డ్యాన్సులు నేర్చుకునే పనే. ఇద్దరు హీరోలు విలన్ ఒకళ్లు మార్చి ఒకళ్లు డ్యాన్సులు నేర్చుకుంటా వుండారు. ఒంటి గంటవుతా వుంది. రిహార్సల్ ఆపివేసి ఇళ్ళకు వెళ్ళబోయే సమయంలో పుట్టింది ముసలం. ఇద్దరు హీరోలు, విలనూ హీరోయిన్‌తో ఆడేది పాడేది చూసి మిగతా పాత్రధారులందరికీ రిమ్మతెగులు పట్టుకొంది. హీరోయిన్ తండ్రిపాత్ర వేసేవాడు, అన్న పాత్ర వేసేవాడు దగ్గరి నుంచి ముసలి నౌకరి పాత్ర వేసేవాడు కూడా హీరోయిన్‌తో పాట పెట్టమన్న వాళ్ళే. వీళ్లందరి డిమాండు చూసి డైరెక్టర్‌కు చిర్రెత్తుకొచ్చింది.

"అందరికీ పాటలా... ఇదేమన్నా నాటకమా, లేకపోతే రికార్డింగ్ డ్యాన్సా? ఇలాగయితే డైరెక్షన్ చేయడం నావల్ల కాదు" అంటూ అలిగి వేపచెట్టుకింద కూర్చున్నాడు.

"మాక్కూడా పాటలు పెట్టారా సరే. లేకపోతే నటించేది లేదు" అని మిగతా వాళ్ళు భీష్మించుకున్నారు.

అందరికీ పాటలు పెట్టుకునేందుకు సర్ది చెప్పి ఒప్పించే సరికి రాముడికి తలప్రాణం తోక్కొచ్చింది. అంతటితో గొడవ సద్దుమణిగిందనుకుంటే పొరపాటే. ఇదే విషయం హీరోయిన్‌తో చెప్పే సరికి గఁయ్‌మని లేచింది.

"ఏమండీ రామారావుగారూ, అడ్వాన్స్ యిచ్చే రోజు మీరేం చెప్పారు. ఇద్దరు హీరోలకి చెరో ఐదు పాటలు, విలన్‌కి రెండు పాటలన్నారా లేదా? చెప్పండి. ఇప్పుడేమో అందరికీ పాటలంటున్నారు. నా వల్ల కాదండీ. రేప్పొద్దున్నే పేటకెళ్లిపోతా" అంటూ మూతి నల్లంగా పెట్టుకోని వేపచెటుకింద ఉన్న రాళ్ళ గుట్టమీద కూర్చుంది.

అంజయ్యమామ మధ్యలో కల్పించుకుని "చూడమ్మాయ్... కుర్రాళ్ళు వుత్సాహ పడుతున్నారు. ఏదోలా ఈ ఒక్కసారికి కానీ." అని అనంగానే "ఏందండీ కానిచ్చేది.... నడుం పట్టుకోవయ్యా అంటే నలిపేస్తాడొకాయన. వాటేసుకుంటే వదలడు ఇంకొకాయన. వీళ్లతోనే సస్తావుంటే మళ్ళీ వీళ్లందరితోనా. నా వల్ల కాదండీ" అంటూ ఏమాత్రం తగ్గకుండా కూర్చుంది.

ఇట్టా కాదులే అనుకున్నాడో ఏమో డ్రామా వేసే వాళ్లందరినీ పక్కకు తీసుకెళ్ళిన అంజయ్య మామ కొంచెం సేపు గుసగుసలాడి మళ్లీ హీరోయిన్ దగ్గరికి వచ్చి "ఏదో పెద్దాడ్ని చెబుతున్నా. నువ్వు కాదంటే డ్రామా ఆగిపోద్ది. నీకెలాంటి ఇబ్బంది లేకుండా చూసే బాధ్యత నాది. నీ కష్టం మేముంచుకోము. ముందు మాట్లాడుకున్నదానికంటే డబ్బు ఎక్కువ ఇప్పించే పూచీ నాది. ఈ ఒక్కసారికి ఒప్పేసుకోమ్మా" అని కొంచెం బతిమాలే ధోరణితో చెప్పాడు.

డబ్బు ఎక్కువిస్తామనేసరికి మెత్తబడి "పెద్దాయన చెప్పాడని ఒప్పుకుంటున్నా. మీరందరూ నేను చెప్పినట్టు నడుచుకోవాలి. తేడా వచ్చిందో మధ్యలోనే పేటకెళ్ళిపోతా. డబ్బులు కూడా స్టేజీ ఎక్కక ముందే ఇచ్చెయ్యాలి" అంటూ షరతులతో ఒప్పుకునే సరికి అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మళ్ళీ తనే అందుకుని "రేపట్నుంచి పగలు కూడా డ్యాన్సు ప్రాక్టీస్ చేద్దాం. వీళ్లందరికీ నేర్పాలంటే టైం చాలదు కదా" అంది.

'నీ ఎంకమ్మా... పగలేంది. టైం మూడవతా వుంది. మా వాళ్లు ఇప్పుడు కూడా రెడీనే' అని మనసులోనే అనుకున్నా.

"వీళ్ళేసే నాటకం కంటే ఈ రోజు జరిగింది భలే వుందిరా" అనుకుంటూ జనాలంతా ఇళ్లదారి పట్టారు.

మరుసటి రోజు వుదయం పది గంటలకే రిహార్సల్ ప్రారంభమయింది. ఒకళ్ళ తరవాత ఒకళ్ళకి డ్యాన్స్‌లు నేర్పుతా వాళ్ళతో నానా అవస్థలూ పడుతోంది హీరోయిన్. మధ్య మధ్యలో ఒక ఐదు నిమిషాలు రెస్ట్ తీసుకోవడానికి కూర్చోవడం ఆలస్యం. ఎవడో ఒకడు కూల్‌డ్రింక్ తెప్పించేవాడు. వాడు తెప్పించాడని వీడు, వీడు తెప్పించాడని ఇంకొకడు పోటీలు పడి ప్రతి అరగంటకోసారి కూల్‌డ్రింక్‌లు తెప్పిస్తావుండారు.

"బాబోయ్! ఇంక తాగలేనండీ! కడుపు బరువెక్కుతా వుంది" అని అంటే,

"కూల్‌డ్రింక్‌లు తాగలేకపోతే, కొబ్బరి బొండాలు తాగండి" అంటూ బోండాలు తెప్పించేవాళ్ళు. హీరోయిన్ కూర్చుంటే కూల్‌డ్రింక్, నిల్చుంటే కొబ్బరి బొండాం లెక్కన సాగుతోంది. ఇదంతా చూసిన నేను "ఏం మామా! మనం కూడా చిన్నా చితకా పనులు చూసిపెడుతున్నాం గదా! ఒక్కరోజన్నా నీకూ – నాకూ అన్ని నీళ్ళన్నా ఇచ్చిన నా కొడుకున్నాడా" అని ఎగతాళిగా అంజయ్య మామతో అంటే "నువ్వు కూడా చీరకట్టుకురావే మొకమా, అన్నీ క్యూలో వస్తాయి" అని పెద్దగా నవ్వుతా అన్నాడు. ఇంత ఎండాకాలంలో ఈ ఆర్రోజులూ హీరోయిన్ నీళ్లు తాగితే ఒట్టు. కూల్‌డ్రింక్‌లు, కొబ్బరి బొండాలు తప్ప.

నాటకం యేసే రోజు రానే వచ్చింది. ఆ రోజు పొద్దున్నే రెండిడ్లీ తినేసి, కాఫీ తాగుతున్నా–

ఇంతలో ఒక పిల్లాడొచ్చి, "అన్నాయ్... నిన్ను తొందరగా దేవరింటికాడికి రమ్మంటున్నారు" అని చెప్పి వెళ్ళిపోయాడు. దేవరింటికి వెళ్లే సరికి అక్కడంతా సందడి సందడిగా

వుంది. చేతిలో మైక్‌తో ఎడ్లబండిలో నారయ్య కూర్చొనుండాడు. కాన్వాస్ చెప్పడంలో నారయ్య మొనగాడని మా వూళ్ళో పేరు. "ఒరేయ్! లేమల్లెపాడు, మాదిగపల్లె, మాలపల్లెలో కాన్వాస్ చేసుకురండి" అంటూ నారయ్యనుద్దేశించి రాముడు అనగానే నారయ్య చేతిలో మైకును ఒకసారి ఉఫ్ ఉఫ్ మని ఊది...

ప్రేక్షక మహాశయులారా... రండీ... చూడండీ... చూసి ఆనందించండి. ఈ రోజు రాత్రి... పది గంటలకు మన వూరి గ్రామంలో.... శివాలయం గుడి దగ్గర... ఎప్పుడా... ఇంకెప్పుడా... అని మీరెదురు చూస్తున్న గొప్ప సాంఘిక నాటకం... రాజా – రమేష్... ఇందలి పాత్రలు పాత్రధారులూ –

రాజా – నటసామ్రాట్ నల్లపనేని రామారావుచౌదరి

రమేష్ – నటసార్వభౌమ సుబ్బారావు చౌదరి

భుజంగం – స్టేజీ టైగర్ గోపాలం

పాత్ర పేరు, ఆ పాత్ర వేసేవాడి పేరు చెబుతూ ఆఖర్న హీరోయిన్ గురించి చెబుతూ.

రాధ – చిలకలూరిపేట చిలక.. మార్కాపురం పలక... మన ఊరి బావిగిలక... అబ్బా! జూనియర్ శివరంజని – అంటూ తమాషాగా కాన్వాస్ చేస్తూ లేమల్లెపాడుకేసి సాగిపోయాడు.

"ఏరా రాముడూ వీడు లేమల్లెపాడులో కూడా 'మన వూరి గ్రామంలో' అని చెప్పడుగదా!" అని అనుమానం వ్యక్తం చేసా.

"జోకులొద్దుగానీ చాలా పనుంది పదా" అన్నాడు.

నారయ్యను అటు పంపించి మేము స్టేజీ పనిలో పడ్డాం. నాలుగు టైరు బళ్ళను తీసుకొచ్చి శివాలయం దగ్గర ఒకదాని పక్కన ఒకటి చేర్చి, ఊళ్ళో పోగేసుకొచ్చిన బొంగులతో స్టేజీ కట్టే పని ప్రారంభించాం. పదకొండు గంటలకి స్టేజీ పని ఒక కొలిక్కి వచ్చింది. అదే సమయానికి నారయ్య కాన్వాస్ ముగించుకొని గుడికాడికి వచ్చాడు.

"ఒరేయ్ నారయ్యా... బండిని దేవరింటి దగ్గర ఇడిసి భోజనాలకి వెళ్ళిరండి, మళ్ళీ సాయంత్రం ఊళ్ళో కాన్వాస్ చేయాలి" అంటూ రాముడు నారయ్యకు పని పురమాయించి, మేమంతా అన్నాలు తినేదానికి వెళ్ళాం.

సాయంత్రం అయిదు గంటలకు స్టేజీ అలంకరణ వాళ్ళు, ఆర్కెస్ట్రా వాళ్ళు లైటింగ్ వాళ్ళు, మేకప్ వేసేవాళ్ళు అంతా వచ్చేశారు. ఏడు గంటలకల్లా మిగతా స్టేజీ పని అంతా పూర్తయింది. స్నానాలు, భోజనాలు కానిచ్చి తొమ్మిది గంటలకు స్టేజీ వెనక్కు చేరారందరూ. నేను సాకలోని మాదిరిగా బట్టల మూటను తీసుకోనొచ్చి వాళ్ల దగ్గర వేసి "జాగ్రత్త రోయ్...

మీ కోసరమని వూళ్ళో కాలేజీకి పోయే కుర్రాళ్ళ దగ్గర ఫేంట్లూ, షర్ట్లూ పోగేసుకొచ్చినా. ఎవరికి ఏది సరిపోతాదో చూసుకోండి. నాటకం అయిపోతానే వాళ్లకు జాగ్రత్తగా చేర్చాల" అన్నాను.

"సరేలేరా.. పాటలు లేకుండా వుంటే ఇన్ని ఫేంట్లు అవసరం ఏముంది. అన్నీ జాగ్రత్తగానే వుంటాయిలే" అన్నాడు రాముడు.

నాటకం వేసే వాళ్లంతా నేను తెచ్చిన బట్టల మూటను విప్పి ఎవరికి సరిపోయేది వారు తీసుకుంటున్నారు.

స్టేజీ వెనుక చుట్టూ పట్టాలు కట్టి గదిలా తయారు చేశాం, వీళ్ళంతా మేకప్ వేసుకునేదానికి. మాకంటే ముందే అంజయ్య మావ ఒక తెల్లగోతాల పట్టా తీసుకుని వచ్చి కూర్చొని వున్నాడు. మా వూరి మంగలాయన వరసబెట్టి గెడ్డాలు చేస్తావుంటే, మేకప్ వేసేవాళ్ళు వేస్తా వుండారు.

ఈ తతంగం కొద్ది సేపు చూసిన మామ "ఒరేయ్ మీకు అడ్డం ఎందుకు గానీ స్టేజీ ముందర కెళ్ళి కూర్చుంటూరా" అని వెళ్ళిపోతా వుండాడు.

"మామా... నాక్కూడా ఖాళీ అట్టిపెట్టు, వీళ్లు స్టేజీ ఎక్కంగానే నేను గూడా వస్తా" అని సీటు రిజర్వ్ చేయించుకున్నా.

పదిన్నర అవుతావుంది. ఒకసారి తెర పక్కకు తొలగించి చూసా – జనాలు బ్రహ్మాండంగా వచ్చారు. శివాలయం దగ్గర నుంచి లైబ్రరీ దాకా జనంతో రోడ్డు నిండిపోయింది. అందరూ స్టేజీ ఎక్కబోయేసరికి, పదకొండయ్యింది. నేను కూడా డ్రామా చూసేదానికి అంజయ్య మావ పట్టామీదికి చేరిపోయా.

డ్రామా బిగిన్ అయింది. ఐదు నిమిషాలు గడిచిందో లేదో హీరో, హీరోయిన్‌లకు పాట. రాముడు, జూనియర్ శివరంజనిలు డాన్స్‌లు చేస్తా వుంటే జనంలోంచి ఒకటే అరుపులు, ఈలలు.

రిహార్సలప్పుడే వీళ్ళందరినీ బాగా చదివేసినట్టుంది హీరోయిన్. రాముడు వాటేసుకోవాలని ఒకడుగు ముందుకేస్తే హీరోయిన్ రెండడుగులు వెనక్కు వేస్తావుంది. దొంగా – పోలీస్ ఆట మాదిరిగా సాగుతోంది వీళ్ల వ్యవహారం.

రెండు పాటలు అయినాయి. విలన్ డెన్ సీన్ జరుగుతా వుంది. విలన్ భుజంగం, అతడి అసిస్టెంటులు ఇద్దరున్నారక్కడ.

భుజంగం అసిస్టెంట్‌తో "ఒరే జగ్గూ..." అన్నాడు గట్టిగా.

"ఎస్ బాస్..." అంటూ జగ్గూ కుడికాలిని పైకెత్తి ధన్‌మని నేలను తాటించి కుడిచేత్తో సేల్యూట్ చేశాడు. ఆధాటుకి ఫేంటు ఊడిపోయింది. ఊడి పోయిన ఫేంటును పైకి లాక్కుంటా వాడు తెర వెనక్కి పరుగో పరుగు.... జనంలోంచి ఒకటే నవ్వులు.

"ఏరా.... ఫేంటు లూజుగా వుందనుకో... పైన మొలతాడు ఏసుకోవడం కూడా తెలీదంటరా..." అన్నాడు అంజయ్య మామ నవ్వతా.

ఒక గంట గడిచింది. గోపాలంగాడు, హీరోయిన్ డాన్స్ చేస్తావుండారు. గోపాలం స్టెప్పులకు జనం నుంచి బ్రహ్మాండమైన రెస్పాన్స్. జనం అరుపులు కేకలతో గోలగోలగా వుంది. ఒక్కసారిగా గోపాలం గాడు మోకాలుదండేసి చేతులు గాలిలోకి ఆడిస్తా వుండాడు. జనంలోంచి అదే స్పందన. వాడింకా బలంగా చేతులూపుతూ ఏదో అంటున్నాడు. వాడి మాటలు వినిపించనంతగా ఆర్కెస్ట్రా జోరు. జనం హోరూను. నాకెందుకో అనుమానం వేసింది. వాడి ముఖంకల్లా చూస్తే హుషారుగా ఉన్నట్టు లేదు. బాధగా వున్నట్టుంది. చేతులు గాల్లోకి ఊపడం మాని తల బాదుకోసాగాడు. ఏందో జరిగిందని ఒక్కసారిగా జనం నిశ్శబ్దమయ్యారు. వాళ్ళతోపాటు ఆర్కెస్ట్రావాళ్ళు.

"ఒరే... నాకొడకల్లారా... టైరుబళ్ళ మధ్య నా కాలు ఇరక్కపోయి నేనరస్తావుంటే మీరు ఇనిపించుకోరేంరా" అంటూ బాధగానూ, కోపంగానూ తిడుతున్నాడు వాడు. జనమంతా ఒకటే నవ్వులు. డైరెక్టర్, హీరోయిన్ వాడ్ని పైకి లాగి, సపర్యలు చేసి మళ్ళీ నాటకం బిగిన్ అయ్యేసరికి అరగంటపైనే పట్టింది.

పది నిమిషాలు నాటకం నడిస్తే ఆ వెంటనే పాట. మళ్ళీ ఒక పది నిమిషాలు నాటకం. మళ్ళీ పాట. ఈ విధంగా నాటకం సుత్తిగా సాగుతోంది. మొదట్లో పాటలకొచ్చిన రెస్పాన్స్ రాను రాను తగ్గిపోయింది. టైమ్ చూస్తే రెండవుతోంది. నాటకం సగం కూడా పూర్తి కాలేదు. అక్కడక్కడా జనాలు లేచి పోతున్నారు. ఇది చూసి తెర వెనకుండే డైరెక్టర్ స్టేజీ ముందుకొచ్చి "ప్రేక్షక మహాశయులకు విజ్ఞప్తి, మీరందరూ నాటకం పూర్తయ్యేదాకా వుండి మమ్ములను ఆనందింప జేయ ప్రార్థన" ప్రేక్షకులను వేడికొని తెరవెనక్కి వెళ్ళిపోయాడు. నా వెనుక కూర్చున్న ఒకళ్ళిద్దరు లేచిపోయారు. మా పట్టా మీద కొంచెం ఖాళీ వచ్చింది. నేను రెండు కాళ్ళూ జాపుకుని చేతులు తలకింద పెట్టుకుని నాటకం చూస్తూ వుండా. పగలంతా పనిచెయ్యడం వల్లనేమో చల్లగాలికి మెల్లగా నిద్రలోకి జారుకున్నా.

"ఒరేయ్! పాతూరోడా, లేరా, లే నాటకం అయిపోవచ్చింది" అనేసరికి వులిక్కిపడి లేచా. చూస్తే తెల్లంగా తెల్లారిపోయింది. కళ్ళు నులుపుకుని స్టేజీ వైపు చూసా, ఇంకా ఆఖరి సీను జరుగుతా వుంది. వెనక్కి తిరిగి చూస్తే ఆశ్చర్యం. ఒక్కడంటే ఒక్కడూ లేడు. శివాలయం దగ్గర కాపురం వుండేవాళ్ళు, ఇళ్ళముందర ఊడ్చుకుంటా వుండారు. మా పట్టా మీద నలుగురైదుగురు పిల్లలు నిద్రపోతావుండారు.

"ఏంది మావా, ఒక్కడు కూడా లేడు" అని ఆశ్చర్యపోతా అడిగా.

"ఇప్పుడేందిరా! అందరూ ఎప్పుడో వెళ్ళిపోయారు... నాటకం రీతిగా వుందంట్రా ఏదో మనోళ్ళుగదాని కూర్చున్నాగానీ, లేకపోతే నేనూ ఎప్పుడో వెళ్ళిపోయేవాడ్ని" అన్నాడు మామ.

"చూడు మావా... ఈ సీను అయ్యేంత వరకూ నేను కూడా వుండానే అనుకో స్టేజీ ఇప్పుదీసే పని చెబుతారు. నా వల్ల కాదు" అని నేనూ ఇంటికేసి బయలుదేరా, నా వెనకే అంజయ్య మామ.

"ఒరేయ్... మీరిద్దరన్నా నాటకం పూర్తిగా చూసి పొండిరా" అంటూ వెనకనుంచి రాముడు మైకులో అరుస్తున్నాడు.

✡

# జీవనం

**–డాక్టర్ లంకిపల్లె**

**తూ**ర్పున తేజోపటలం తెల్లగా ఉంది. మసక చీకటి తెరలు తొలగి పోతున్నాయి. అరుణ దరహాస రేఖలు ప్రకృతిని చిలిపిగా మేల్కొలుపుతున్నాయి. మట్టిని బంగారం చేసే వెలుగు. పైరుకు పచ్చదనం ప్రసాదించే పసిడి వెలుగు. పక్షులు కిలకిలా రవాలతో సుప్రభాతం పాడుతున్నాయి. కొంగలు గుంపులుగా బయలుదేరాయి – పైరుల మీద దాడి చేయటానికి.

అప్పుడే నిద్రలేచిన జీవయ్య 'ఉఫ్'న వళ్ళు విరుచుకొన్నాడు. ఆరడుగుల మనిషి మరో అరడుగు పెరిగాడులా అనిపించింది. విసురు గాలికి చిట్టెదురు గూమి కిటకిటలాడినట్లు పటపటమన్నాయి నరాలు. తలక్రిందుల నిలబెట్టిన త్రిభుజంలా వెడల్పాటి ఎద ఉవ్వెత్తున లేచింది. వయస్సు నలభై దాటినా పట్టుసడలని కండరాలు గట్టిగా కుదుముల్లా బిగుసుకొన్నాయి. దీర్ఘంగా శ్వాస వదలి ఉత్తేజంగా పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ బావిగట్టున మోటారు దగ్గర కెళ్లాడు. బావి బిడుగుమీద పాము నోట్లో వెనక్కాలు విరుక్కుపోయిన కప్ప అరుస్తూ వుంది. రాయితీసి బిర్రుగా విసిరాడు. రాయి గురితప్పింది. లేకపోతే పాముతల పచ్చడయ్యేది. పెద్ద నీటిపాము బావిలోకి దూకింది. కప్ప నీటి ఉపరితలానికి లాగుతూ గుక్క తిరక్కుండా అరుస్తూ ఉంది. పాము నీటి అడుక్కు గుంజుతూ ఉంది. జీవయ్య మరోమారు వంగి రాయి అందుకొన్నాడు. పైకి లేచేలోపల పాము కప్పను నీటి లోపలికి లాక్కెళ్ళింది. రోదన, రబస అణిగింది.

మోటారు దగ్గర బోర్డుకు బిగించిన బల్బు వెలగలేదు. కరెంటు రాలేదు. రాత్రంతా ఎదురుచూశాడు, కరెంటు వస్తుందేమోనని. నిదురంతా కలత నిద్రగానే గడిచింది. కరెంటు రాలేదు. మూడెకరాల పైరుపారాలి. ఎప్పుడు కరెంటు వస్తుంది? మడి ఎప్పుడు పారుతుంది? – జీవయ్య నిట్టూర్చాడు.

జీవయ్య పొట్టకర్ర మడివైపు నడిచాడు. వెన్ను నోట కరచుకొన్న వరిభూమి కనపడకుండా నీలాలు పారుతూ ఉంది. కాని, అక్కడక్కడ బీళ్ళు; ఎలుకలు దయలేని శత్రువుల్లా దాడిచేశాయి. పొట్టకర్రలో తీపి ఉంది. తియ్యదనం రుచి చూడటానికే కొరికేస్తున్నాయి – పొట్ట నింపుకోవటానికి కాదు. పొలంలో నీరుంటే వాటి దాడి అంత ఉధృతంగా ఉండేది కాదు.

అగడ్తలేని కోటను శత్రువులు సునాయాసంగా ముట్టడించి పాగా వేసినట్లు నీరులేని మడిలో దారులుపడా నడిచి, పళ్ళకు పదును పెట్టాయి. పైరు నాశనం చేశాయి. ఎలుకల మందు పెట్టాడు. లాభం లేకపోయింది. ఎలుకలు కూడ దొంగ మరిగిపోయాయి. ఇక మిగిలింది ఒక్కటే మార్గం. వాటి ఇరువులన్ని శోధించాలి, కలుగులన్నీ లోడాలి. శత్రుశేషం లేకుండా చేయాలి. అందుకే యానాది భుజంగం కోసం నాలుగుమార్లు తిరిగాడు. ఉదయం తప్పకుండా వస్తానన్నాడు. వాడు సోమరి. సుఖజీవి. బాగా తిని పడుకొంటే రేయి, పగలు తేడా లేదు, గుర్రుపెట్టి నిద్రపోతాడు. మరి చెప్పిన మాటలెలా గుర్తుంటాయి? ఆత్మబంధువు ప్రాణా పాయంలో ఉన్నప్పుడు డాక్టరు కోసం ఎదురుచూసినట్లు భుజంగం కోసం వళ్ళంతా కళ్ళు చేసుకొని చూశాడు జీవయ్య. దూరంగా ఆపద్బాంధవుడిలా కనబడ్డాడు భుజంగం. కరుకోలకు మట్టిదుత్తను తగిలించుకొని వేగంగా తనకంటె ముందుగా పరుగెత్తే నీడను తొక్కుకొంటూ వస్తున్నాడు. జీవయ్య మెల్లగా గాలి పీల్చాడు.

భుజంగం ఎండు చెరుకాకు దుత్తక్రింద భాగం రంధ్రం దగ్గర పెట్టాడు. మిగత దుత్త నిండుగా పచ్చిగడ్డి, ఆకులు దురికాడు. అగ్గిపుల్ల గీచి రంధ్రం ద్వారా చెరుకాకు ముట్టించాడు. ఎలుక బొరియ బాగా ఉన్న చోట దుత్త మూతి దూర్చి తడిమట్టితో సందులన్నీ మూశాడు. దుత్త రంధ్రం ద్వారా గుప్పుగుప్పున ఊదాడు. కలుగులన్నీ పొగరాకుండా బిగించాడు. అరగంట ఆగి ఆగి ఊదరగొట్టాడు. కరుకోలతో బొరియలన్నీ తవ్వి కుళ్ళగించాడు. పెద్దవి, పిల్లలు ముప్పై ఎలుకలను దుత్తకేసుకొన్నాడు. ఎలుకకు పడి వడ్లు లెక్కన వడ్లు తీసుకోవటానికి జీవయ్య ఇంటికి బయలుదేరాడు. భుజంగానికి ఆ రోజు పండుగ. వరి పండినా, పండకపోయినా అతనికి కూలి గిట్టింది. జీవయ్య కరెంటు కోసం ఎదురు చూస్తూ మోటారు దగ్గర కూచున్నాడు.

✡

గోనెసంచి చంకన పెట్టుకొని వచ్చాడు, తమలపాకుల వ్యాపారి. నిస్తేజంగా నవ్వాడు జీవయ్య. వ్యాపారికి జీవయ్య నవ్వు కొత్తగా తోచింది; అర్థంకాలేదు. ఇద్దరూ ఆకుతోటవైపు నడిచారు. ఆకుతోట సుడులు వాడిపోయాయి. ఆకులు వెలవెల పోయాయి. బేతాల కథల్లో చెట్టుకొమ్మల శవాల్లా ఉన్నాయి; తమలపాకులు వాడి వత్తులై.

"ఏమయింది జీవయ్యా? కళకళలాడే ఆకుతోట తలక్రిందులయింది?" ఆశ్చర్యంగా అడిగాడు వ్యాపారి.

"వారం రోజులయింది తడిపారి. కాలిపోయిన మోటారు కాయిలి కట్టించటానికి ఇన్ని రోజులు పట్టింది."

"వారం రోజులా? అసలు కాయిల్ ఎందుకు పోయింది?"

బరువుగా నిట్టూర్చాడు జీవయ్య.

"కరంటు సరిగా రావటం లేదు నెలగా. కాయిల్ కాలిపోయింది. వెంటనే పట్టణం వెళ్ళాను, సామానులు తేవటానికి. ఆ రోజు రాత్రి అయింది. అంగళ్ళు మూసేశారు. మరుసటి రోజు 'బంద్' ఆట. అంగళ్ళు తెరవలేదు. సామాను తెచ్చి కాయిల్ కట్టే మనిషి కోసం ఒక రోజంతా గాలించాను. కట్టిన తరువాత ఆరటానికి రెండు రోజులు; నిన్న సాయంత్రానికి పని పూర్తయింది. అప్పటి నుండి బావి గట్టున కరంటు కోసం కళ్ళు కాయలు కాచేలా కూచున్నాను."

వ్యాపారి బేరం పోయింది; లాభం పోయింది. దురదృష్టాన్ని తిట్టుకొంటూ వెళ్ళాడు. వారానికి ఏభై కట్టల ఆకులు కోసే తోట. కట్ట కనీసం రూపాయకు తగ్గని మంచి ఆకులు. ఇక ఏమాత్రం వాడినా ఎండిపోతుంది. ఆకుతోట పెంపకం పసిపాప పెంపకం లాంటిది. మరేం చేయాలి?

ఎకరం చెరకుతోట పైదండాల పైరు. కాకిని కొట్టి వేలాడతీసినట్లుంది. పది రోజుల క్రితం వరకు నల్లతేమ తీయకుండా పారింది. కర్పూరం లాంటి బెల్లం పది బండ్లు కావలసింది. బాగా వాడి పోయింది. మరీ వాడిపోతే కడవలలో కూడ నిలువదు పుర్రుబెల్లం. బెల్లం ఆడిన ఖర్చు కూడా రాదు. పడిన శ్రమ బూడిదలో కలిసిపోయినట్లే.

బావిదగ్గర సుజాత సద్దిచెంబు దించింది. మడిఅంతా కలయజూసింది. పెద్ద కళ్ళు మరింత పెద్దవి చేసి. తండ్రి కన్పడలేదు. బావిగట్టున మోటారు దగ్గరకెళ్ళింది. ఆశ్చర్యపడి ఆగింది. చలనం లేని బొమ్మలా జీవయ్య!

"నాన్నా!"

మెల్లగా పిలిచింది సుజాత. పిలుపులో మార్మిక స్పర్శ ఉంది. చల్లటి చలిగాలికి కదిలే పైరులా కదిలాడు జీవయ్య. కూతుర్ని చూశాడు. ఆలోచనల నీలినీడలను అదుక్కు తొక్కిపట్టాడు. ఉత్సాహంగా లేచాడు.

"ఏమ్మా! నువ్వు వచ్చావు" చిరునవ్వులతో అడిగాడు.

"ఏంలేదు నాన్నా, మరి... బావ వచ్చాడు. అమ్మ కాఫీ పెట్టిస్తూ ఉంది."

పెళ్ళీడు సుజాత బావ తలపు వచ్చినా మాట వచ్చినా సిగ్గుతో ముడుచుకుపోతుంది.

పంపుసెట్టు దగ్గర తొట్టినీళ్ళతో ముఖం కడుక్కొని వచ్చాడు జీవయ్య. తల్లిదండ్రుల మురిపాలలో పెరిగిన సుజాత ముద్దుగా మాట్లాడుతూ సద్దిఅన్నం పెట్టింది. జీవయ్య కడుపు చల్లబడింది.

"ఏమిటి, నాన్నా! కళ్ళు అంత ఎర్రగా ఉన్నాయి? రాత్రి నిద్ర పోలేదా?"

"కరంటు వస్తుందేమోనన్న కలవరంతోటి నిద్ర సరిగా రాలేదమ్మా."

"నాన్నా! మరి తెల్లవారదనుకొన్నారా? పగలంతా పనిచేసి రాత్రి నిద్రలేకపోతే ఆరోగ్యం ఏంగాను?"

"తెల్లవారక ఏం చేస్తుందమ్మా! తెల్లవారింది. అయినా పొలం పారలేదే?"

"ఏమిటి నాన్నా, మరీ అంత నీరసంగా మాట్లాడుతున్నారు?"

పట్టుబడిపోయాడు జీవయ్య. ఎంత దాచాలన్నా దాగని బాధ – అతనిలో గూడుకట్టుకొన్న బాధ మాటల్లో బయటపడింది. సన్నగా నవ్వుతూ అన్నాడు.

"చూడమ్మా! ఈ పచ్చని పైరులో ఎన్ని ఆశలు గుప్తంగా దాగి ఉన్నాయో తెలుసునా? ఈ సంవత్సరం నీ పెళ్ళి జరగాలి. మీ అన్నయ్య పై చదువు కొనసాగించాలి."

సంతోషంగా మిలమిలలాడే కళ్ళతో సిగ్గుపడుతున్న కూతురిలో పెళ్ళికళ చూశాడు జీవయ్య. కాబోయే అల్లుడు రెండేళ్ళు కాలేజీలో చదివి, చదువు వంటబట్టక ఇంటికి తిరిగివచ్చాడు. అప్పటికి వంటబట్టిన అలవాట్లు రెండే – సిగరెట్లు కాల్చటం, సినిమాలు చూడటం. మరే దురలవాట్లు అబ్బనందున సంతోషించారు అతని అమ్మా, నాన్న. కడుపులో చల్ల కదలకుండా వడ్ల మిషన్‌లో కూచొని డబ్బు సంపాదిస్తున్నాడు. కట్నం కానుకలు లేకపోయినా పెండ్లిమాత్రం ఘనంగా జరిపించాలంటున్నారు జీవయ్య బావ, అక్క. సుజాత పెళ్ళి జీవయ్య కొక తియ్యటి కల. నారు నీటిని ఆధారం చేసుకొని పెరిగినట్లు అతని కలలన్నీ తన ఫలసాయం పైనే ఆధారపడి వున్నాయి.

తండ్రి మరణించేనాటికి జీవయ్య వయస్సు పదమూడేళ్ళు. అప్పటికే రెండేళ్ళుగా మోకుమీద కూర్చొని కపిలి తోలితోలి తొడ కాయగాచింది. తండ్రి మరణించాడు. అప్పు మిగిలింది. జీవయ్య జుట్టు మణేగారి గుప్పెట్లో పెట్టి వెళ్ళాడు తండ్రి. మణేగారి పంజానుండి జుట్టు విడిపించుకోవటం సామాన్య విషయం కాదు. అమ్మను వొప్పించి రెండెకరాల చెరువు అందమడిని, మణేగారికి కలసి వొచ్చేది, అయినకాడికి అతనికే అమ్మేశాడు. అప్పు తీర్చాడు. రెండు సంవత్సరాలు పొలంలో రేయింబవళ్ళు పనిచేశాడు. వచ్చిన ఆదాయంతో బావి త్రవ్వాడు. ఒకమారుగా అయిదు బండ్ల బెల్లం పైరు చేశాడు. అనుకోకుండా అదుపుతప్పి ధరలు పెరిగాయి. అక్క పెళ్ళి చేశాడు – పదేళ్ళ వయస్సు – మెరపు తీగలా తిరిగింది. బావ కొన్ని రోజులకు ఆస్తినమ్మి వడ్లమిషను పట్టుకొన్నాడు. వళ్ళు వంచకుండా చక్కటి జీవనోపాధి.

జీవయ్యకు చిన్నవయస్సు నుండి బురదలో పొర్లాడటం – ఋతుచక్రంతోపాటు వచ్చే మార్పులతో పెరగటం, తన్మయం చెందటం – ఇష్టమైనవి. మట్టిని నమ్మి మోసపోయింది

లేదు. ప్రమోదభరితంగా ఏడాదికి ఏడాది మించి పైరు పెడుతున్నాడు. పంటలు ఇనుమడించి పండుతున్నాయి. కాలగమనంలో ఎన్నో మార్పులు వచ్చాయి. సకాలంలో వర్షాలు పడటం లేదు. పంటలకు కొత్త తెగుళ్ళు వస్తున్నాయి. కపిల పాతబడింది. ఆయిలు ఇంజన్లు వచ్చాయి. ఆయిల్ ధరలు పెరిగాయి. కరెంటు మోటార్లు వచ్చాయి. పల్లెలకు కొత్త వెలుగు వచ్చింది. మార్పు కనుగుణంగా వ్యవసాయంలో ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల కోసం క్రాంతి పథంలో పయనించే రైతు జీవయ్య.

క్లాసులో ఎప్పుడూ జీవయ్యకంటే వెనుకబడే మణేగారి కొడుకు కాలేజీ చదువు ఎలాగో వెలిగించాడు. పెద్ద ఉద్యోగస్తుడయ్యాడు. పక్కింటి రాజు పొలం అమ్మి పట్టణంలో అడుగు పెట్టాడు. రెండు చేతులా సంపాదిస్తున్నాడు. లక్షాధికారి అయ్యాడు. తన కళ్ళముందే కాలం కొందరిని కళ్ళు తిరిగేలా పైకి నెట్టుతూ ఉంది. మరికొందరిని కనికరం లేకుండా కాళ్ళక్రింద తొక్కిపెడుతూ ఉంది. పెద్ద ఉద్యోగం చేస్తున్న మణేగారి కొడుకు, లక్షలు సంపాదిస్తున్న రాజు ఆ డబ్బు కట్టలు మింగటం లేదు. మట్టిలో పంట, ఆ పంట వంటనే తింటున్నారు. మట్టిని పంటగా మార్చగల శక్తి సంపన్నుడు జీవయ్య. అది అతనికి ఆనందం.

జీవయ్య మడిచుట్టూ యాంత్రికంగా తిరిగాడు. తెల్లవారినా అతనిలో చీకటితెరలు తొలగలేదు. అరుణకిరణాలు కోపాన్ని పెంచాయి. వేసవి ఎండ పెరిగేకొద్దీ అతనిలో కోపం పెరిగింది. ఆశ నీడలా కురచబడుతూ ఉంది. నిస్పృహ పేరుకొంటూ ఉంది. బావి దగ్గర కూచున్నాడు. బావిలో నీరు తళతళా మెరుస్తూ ఉంది. బల్బును చూశాడు. బల్బు మండుతు న్నట్లనిపించింది. దిగ్గున లేచాడు, బోర్డును సమీపించాడు. భ్రమ! కరెంటు లేదు. బల్బు మండలేదు. నీరెండకు బల్బు మండుతున్నట్లనిపించింది. జీవయ్య హృదయం బాధతో సుడులు తిరిగింది.

✡

పచ్చిగడ్డి కోసి మోపు బిగించాడు జీవయ్య. మోటారువైపు చూపుసారించాడు. తోటి రామయ్య కనిపించాడు. తనకోసం వెదుకుతున్నట్లున్నాడనుకొని జీవయ్య మోటారువైపు నడిచాడు.

"జీవయ్యా! పైరు ప్రాణం లేకుండా వాడిపోతూ ఉంది!"

నమ్మలేనట్లు చూశాడు రామయ్య.

"మోటారు రిపేరు. ఈ రోజు ఎలాగైనా పైరు పారగట్టాలి."

"జీవయ్యా! ఇన్‌స్పెక్టర్, కరణం రమ్మంటున్నారు."

"చూస్తున్నావుగా, పైరు ఎండిపోతూ ఉంది. కరెంటు ఏ క్షణమైనా రావచ్చు మడికి నీరు పెట్టాలి."

"కాని బాబూ, వాళ్ళు నా ఉసురు పోసుకుంటారు. తమరు రాకపోతే నన్ను మరలా తరుముతారు. నా పాదాలు అరిగిపోతున్నాయి. మోకాళ్ళలో మూలగ సచ్చిపోయింది. ఎండకు తిరగలేను."

అది తిరుగులేని వారంటు!

జీవయ్యకు అతని బాధ అర్థమయింది. తను వెళ్ళక తప్పింది కాదు. గడ్డిమోపు చివాలున లేపి నెత్తి కెత్తుకొన్నాడు. ఇంటి దగ్గర మోపు దింపి, భజనమందిరం వైపు నడిచాడు. సర్కస్సులో కొండంత ఏనుగును ఆడిస్తున్న మరిగుజ్జు మనిషిని నోరు తెరుచుకొని చూస్తున్న 'బఫూన్'లా చూశాడు తోట వెంట వస్తున్న జీవయ్యను కర్నం. బొచ్చు తీసి ఎండబెట్టిన టెంకాయలా వుంది కర్నం తల. తప్పుడు లెక్కలు కొట్టి కొట్టి, వ్రాసి వ్రాసి అంధత్వం దాపురించింది కాబోలు, సోడాగ్లాసు మందం అద్దాలు వేసుకొన్నా చూపు కన్పడేటట్లు లేదు. అందరి జుట్లు ముడిపడితేనే నా బ్రతుకుతెరువు అన్నట్లు అతని పిలక విడివడని జడగట్టింది.

"జీవయ్యను చూసి నేర్చుకోండయ్యా! మట్టిలో బంగారు పండిస్తాడు. మాబోటివాళ్ళను ఒక కంటితో చూచుకొంటాడు. మా ప్రాణాలు తీయక అడిగిన తక్షణం శిస్తు చెల్లిస్తాడు."

కర్నం మాటలతో చిక్కటి సాలెగూడు అల్లాడు. జీవయ్యకు డబ్బు సర్దుబాటు ఇబ్బందిగానే ఉంది. కాని, కర్నం వేసిన ముందరికాళ్ళ బంధం తప్పించుకోవడానికి వీలుకానిది. ఎంత కట్టాలో చెప్పాడు కర్నం. జీవయ్య ఇంటికెళ్ళి రసీదు పుస్తకం, డబ్బు తీసుకొన్నాడు.

"అన్నయ్య జాబు రాశాడు, నాన్నా! డబ్బు రెండువందలు పంపమన్నాడు. బాగానే చదువుతున్నాడట."

సుజాత మాటతో మరికొంత డబ్బు తీసుకొన్నాడు. ఇక మిగిలింది పది రూపాయలే. పది రూపాయలు ఏ అవసరానికి ఆదుకొంటుంది?

"నాన్నా! అమ్మ అన్నం తిని వెళ్ళమంటూ ఉంది."

"వస్తానమ్మా – మనియార్డరు పంపి, కిస్తీకట్టి."

జీవయ్య పోస్టాఫీసుకెళ్ళి బి.ఎస్.సి. చదువుతున్న కొడుక్కి మనియార్డరు పంపి, శిస్తు చెల్లించటానికి వచ్చాడు. కర్నం కీచుగొంతు కఠోరంగా ఉంది.

"ఏమిటయ్యా, మీ బాధలు? సుఖానికైనా హద్దు ఉండాలి. తొలికోడి కూతతో వెళ్ళి కపిల తోలుతున్నారా? లేదు. ప్రొద్దు మొలిచాక కళ్ళు పులుముకుంటూ వెళ్ళి బటన్ నొక్కితే బావిలో నీరు ఏరులా బయటికొస్తుంది. ప్రభుత్వం పుణ్యమా అని పొలానికి ఎరువు, ఎరువుకు అరువు, తెగుళ్ళకు మందు అందుబాటులో ఉన్నాయి. కాదంటారా? గుంట వరిమడి చేస్తే రెండు, మూడు మూట్లు రాలే కొత్త రకాలు. మరికొన్ని కొత్తరకాల పేర్లు విన్నారా? సినిమా తారల పేర్లులా – హంస, పద్మ."

ఖంగున గొంతు పగిలిపోయేలా దగ్గాడు. ఆయాసం ముంచుకొచ్చింది. అంత అవస్థలోనూ ఎవరి దగ్గరో ముక్కుపొడి డబ్బా అందుకొన్నాడు. మరి దొరుకుతుందో లేదో అన్నట్లు మరింత పొడి బాగా దట్టించాడు. అసలే అనాకారి. చూడటానికే అసహ్యంగా మారింది కర్నం ముఖం.

కర్నం జీవయ్య దగ్గర రసీదు పుస్తకం, డబ్బు అందుకొన్నాడు. ఏవో అంకెలు గిలికాడు. అతని అధికారము పోయింది. అయినా ఇన్‌స్పెక్టర్‌కు సహాయం. అసలు శిస్తు రద్దయింది కాదా, అని ఎవరో అన్న మాటపైన రెచ్చిపోయాడు కర్నం. ఉద్యోగం పోయినప్పటి నుండి జనాలపై మండిపడుతున్నాడు. ఆగిపోయిన సంభాషణ సాగించాడు.

"అందుకే మీ పొగరనచటానికే ఉపాయం ఆలోచించారు బుర్రలున్న పెద్దమనుషులు. అదే ఆదాయంపై పన్ను. చట్టం కాబోతూ ఉంది. అప్పుడు మీ ఆట చూడాలి."

అయోమయంగా అర్థం కాక చెవులు రిక్కించారు రైతులు. మాంత్రికుని మాయాజాలానికి కట్టుబడిపోయిన అమాయక రాజకుమారుల్లా చేతులు కట్టుకొని నిలుచున్నారు. ఎందుకు కర్నం రైతులతో చెలగాటం ఆడుతున్నాడు? రైతు సొమ్ము ముప్పొద్దులా తిని రైతుకే ద్రోహం తలపెట్టే మనిషి! విశ్వాసం లేని మనిషి. కడివేస్తే తిని కాలు కరచే కుక్క అరుదు. కాని మనుషుల్లో ఈ దుర్గుణం పేరుకుపోతూ ఉంది. పకడ్బందీగా లెక్కలున్నప్పుడే రైతులను పీడించుకుతినే మనుషులు! అలాంటివారికి రైతు సంవత్సరాదాయం లెక్క కట్టే అధికారం వస్తే రైతు జీవితం బండబారిపోదూ?! వీరు కాకపోతే మరొకరు; మరొక డిపార్టుమెంటు. పరాన్నభుక్కులు – పెద్దమనుషులు – ఎంతమంది రైతు నెత్తిమీదికెక్కి నాట్యం చేస్తారో! జీవయ్య రసీదు పుస్తకం ఇల్లు చేర్చి అన్నం మాట మరచి పొలం చేరాడు.

పంపుసెట్టు దగ్గర బల్బు మండుతూ ఉంది. పగలే చీకటి – ఆ చీకటిని పారద్రోలే వెలుగును నేనే అన్నట్లు జీవయ్యలో చైతన్యం పుంజుకొన్నది. పరుగుతో వెళ్ళి స్టార్టర్ నొక్కాడు. మోటారు బుర్రుమంది. నీరు వెల్లువలా కాలువనిండా పారింది. జీవయ్యలో ఉత్సాహం, సంతోషం, తొందర ముప్పిరిగొన్నాయి. ఇక గంటల్లో పని. పైరు కళకళలాడాలి. జీవయ్యలో ఆనందం నృత్యం చేసింది. పరుగున పార అందుకొన్నాడు. మడవ మిరపతోట మీద ఉంది. ఆ హడావుడిలో ఏ పైరుకు ఎప్పుడు నీరు పెట్టాలనే విషయం మరుగునపడింది. పూత పిందెతో బరువుగా వాలిన మిరపరెమ్మల మధ్య నీరు పాదరసంలా పారింది. అరగంటకు పారేతోట ఎండిపోయినందువల్ల గంటకు పారింది. ఆకుతోట పారేటప్పటికి రెండు గంటలు పట్టవచ్చు. మోటారు ఆగింది. కరెంటు ఆఫ్ అయింది. జీవయ్యలో సంతోషం నీటిమడవ తిప్పినట్లు ఆరిపోయింది.

బావి దగ్గర మామిడిచెట్టు నీడన కూచున్నాడు జీవయ్య. చూపు అప్పుడప్పుడూ బల్బు మీద పడుతూనే ఉంది. ఆలోచనలు పరిపరి విధాల చెలరేగుతున్నాయి. పరధ్యానంగా వున్న జీవయ్య ఎదుట నిలబడిన భార్యను చూచి పేలవంగా నవ్వాడు. అరిటాకు కోసుకవచ్చి భోజనం పెట్టింది, బంగారు.

"కరెంటు వస్తే" అన్నాడు జీవయ్య.

"నే నున్నానుగా" అన్నది చిరుకోపంతో.

జీవయ్య అన్నం తిన్నాడు. కరెంటు రాలేదు.

"అల్లుడి రాక – విశేషం" అన్నాడు భార్యను చూస్తూ.

"ఏముంది. సంవత్సరాది వస్తూ ఉందిగా బొందుదారం, చీర పెట్టటానికి పిలుపు."

"వెళ్తున్నావా?"

"తమ ఉత్తర్వు లేనిదే" కొంటెగా అన్నది.

"ఉఁ హూ!" అన్నాడు.

"ఇప్పుడు ఎలా వెళ్ళటం. మడి తిరగబారిన తరువాత వీలు చూచుకొని వస్తానన్నాను."

"నీ పేరే కాదు – మనసూ బంగారమే."

"కొత్తగా తెలుసుకొన్నారా?"

చిరునవ్వుతో పైట సర్దుకొని వెళ్ళింది బంగారు.

అటే చూస్తూ కూచున్నాడు జీవయ్య. బంగారు తోడు నీడగా ఉండబట్టే పొలం బంగారు పంట పండుతూ ఉంది – అనుకొన్నాడు మనసులో. చెట్టుమీద చిలకలు కిలకిలా మాట్లాడుకొంటున్నాయి. చిలకల భాష అర్థమయితే? వాటి పలుకుల్లో మాధుర్యం జాలువారుతూ ఉంది.

జీవయ్య బావ తోడబుట్టు బంగారు. ఆమె అందానికి, అంతస్తుకు జీవయ్య కంటే మంచి సంబంధమే స్థిరపడేది. బావ బంగారు నిర్ణయం చెప్పినపడు ఆశ్చర్యపడ్డాడు జీవయ్య. తానుగా వలచి, కలసి వచ్చే సంబంధం! కాదనలేకపోయాడు. కాని, ముద్దుగా పెరిగిన బంగారు మోటు సంసారం ఎలా సాగిస్తుందన్న భయం ఒక మూల మూలుగుతూనే వుండేది. జీవయ్యతో పెళ్ళి జరిగింది. కొత్త సంసారం తొలకరి వాగులా సాగింది. జీవయ్య భయం మటుమాయమయింది. రేయింబవలు నీడలా జీవయ్యతో ఉండేది బంగారు. ఇంటి పనులు క్షణాల మీద ముగించి పొలంలో చేదోడు వాదోడుగా నిలిచేది. చక్రంలా తిరిగేది. అదృష్టం కొంగు బంగారమయింది. కష్టేఫలే! జీవయ్య కష్టం వృథా పోలేదు. ధాన్యం గరిసెలు నిండింది.

ఇదే చెట్టు చల్లని నీడలో పెళ్ళయిన కొత్తలో అడిగాడు–

"బంగారు! నాలో ఏం చూసి ఇష్టపడ్డావు?"

బంగారు సిగ్గుతో ముడుచుకపోయి ముసిముసి నవ్వులు నవ్వింది.

"చెప్పాలా?"

"ఊఁ."

"తప్పదా?"

"బలవంతం చేయను."

"పచ్చని పైరును ప్రేమించే మీలోని పసితనం చూసి... గుండె బలం చూసి."

బంగారు సిగ్గుతో మురిసిపోయింది; మొగ్గయి జీవయ్య ఎదమీద వాలిపోయింది. పైరులో పచ్చదనంలా అతనిలో కలసిపోయింది. బిడ్డలు పుట్టారు. ఆమెకు ఇంటి దగ్గర రెండు చేతులకు సరిపోయే పని.

✡

జీవయ్య చెరకు తోటలోకి దూరాడు. ఎద్దులకు మోసులు పెరికి మోపుకట్టాడు. ఎండిపోయిన చెరకు మొదళ్ళకు చెదలు పట్టుతూ వుంది. చెదలు కొట్టిన చెరకు కర్రలు ఎర్రబారిపోయాయి. తోటలో తేమవుంటే చెదలుపట్టదు. కష్టంలో నష్టం. బాధపడి ప్రయోజనం లేదు. మోసుల మోపు నెత్తికెత్తుకొని చెరకుతోట బయటికొచ్చాడు. కాకిగోల చెవులు బ్రద్ధలు కొట్టేలా విన్పడింది. మోసులు గట్టుపైన వేసి పారజూశాడు. పదికాకులు చేరి పాలపిట్టను ముట్టడించాయి. ఒకటొకటిగా మార్చి మార్చి తన్నుతున్నాయి. పాలపిట్ట నేలకొరిగి రెక్కలార్చి అరుస్తూ ఉంది. పాలపిట్ట కన్నీటితో కాకి గుండె కరిగేనా? మట్టి పెళ్ళ విసిరాడు జీవయ్య. కాకులు వెనక్కు తగ్గాయి. దగ్గర కెళ్ళాడు. గాయపడిన పాలపిట్ట లేవలేక జాలిగా చూసింది. జీవయ్య గుండె చెరువయింది. పాలపిట్టను చేతికందుకొన్నాడు. తమ ఆస్తినెవరో దోచుకున్నట్లు కాకులు ఒక్కుమ్మడిగా అరిచాయి. ఎడం చేత్తో మరో రెండు మట్టిపెళ్ళలు విసిరాడు. కాకులు ఎగిరిపోయాయి. పంపుసెట్టు దగ్గర తొట్లో నీటిని పాలపిట్టమీద చల్లి, వళ్ళు నిమిరాడు. పాలపిట్ట సేద తీరింది. మామిడిచెట్టు క్రింద కూర్చొని పిట్టను వదిలాడు. గుబులుగా కూచుంది, భయం భయంగా చూసింది. జీవయ్య గుండె కదిలింది. ఉదయం నిద్రలేచినప్పటి నుండి జీవయ్య సంఘర్షణ చూస్తున్నాడు. అంతర్గత సంఘర్షణకు ప్రేరణ జరుగుతూ ఉంది. బాహిరంగా జరిగే సంఘర్షణ రోజూ ప్రకృతి ఒడిలో ఏదో రూపంలో జరుగుతూనే వుంటుంది. ఈ రోజు అతనిలో జరుగుతున్న హృదయ సంఘర్షణ వింతగా ఉంది. జీవయ్య అంతర్గత సంఘర్షణ నిర్జీవపు నవ్వులా బయటపడింది. పాలపిట్ట తేరుకొని చెట్టుకొమ్మను చేరింది.

కళ్లే కన్పడనంత పెద్ద నల్ల కళ్ళద్దాలతో గుర్తుపట్టటానికి వీలుకాని వ్యక్తి జీవయ్య జాడను విసుగ్గా వెతుక్కుంటూ వచ్చాడు. అతను సమీపిస్తూ ఉంటే అసలే మనస్సు బాగా లేని జీవయ్య వళ్ళు మండింది. గ్రామ పునరుద్ధరణ కార్యక్రమంలో రైతు పరిరక్షకుడుగా

పనిచేయటానికి ప్రభుత్వము నియమించిన వ్యక్తి. గ్రామ దేవతల లిస్టులో కొత్తగా చేరిన శక్తి. కలుపు తీయటానికి వరి ముదురుతూ వుంటే యూరియా పర్మిట్ అడిగితే మూటకు పది రూపాయలు కానుకగా అడిగిన పెద్దమనిషి. ఏపుగా పెరిగే పైరుకు తెల్లచీడ ముసురుకొన్నప్పుడు మందు కొట్టటానికి స్ప్రేయర్ అడిగితే రిపేరులో ఉందని చెప్పి, మణేగారికి పంపించిన రైతు సేవకుడు. గ్రామాభివృద్ధి ఆఫీసరు మోయలేని భారీ శరీరాన్ని – బురద నీటిలో ఈదుకొస్తున్న బాతులా గసపోస్తూ మోసుకొచ్చాడు.

"జీవయ్యా! ఇక్కడ కళ్ళు మూసుకొని కూర్చున్నావా? ఎంత దూరం తిప్పి ఏడిపించావయ్యా, మహానుభావా?"

జీవయ్య ముభావంగా కూచున్నాడు. వ్యర్థ ప్రసంగం పనిచేయదని అసలు విషయం బయటపెట్టాడు ఆఫీసరు.

"ఏం లేదు, జీవయ్యా. పొయ్యిలోకి పుల్లదొరకటం లేదు. మా సహాయం కోసం ఎదురు చూసేవారే కాని మాకు పూచికపుల్ల సహాయం చేసే నాథుడు ఈ గ్రామమంతా టార్చి వేసి వెదికినా కన్పడలేదు. రేంజరుతో మాట్లాడి ఎండుకట్టెలు కొట్టటానికి అనుమతి తీసుకొన్నాను. కూలీలను సిద్ధం చేశాను. కట్టెలు ఇల్లు చేర్చటానికి రేపు నీ బండీ, ఎద్దులు కావాలి."

జీవయ్యకు ఏం చెప్పాలో తోచలేదు. కాదని ఖచ్చితంగా చెప్పాలని వుంది. కాని చెప్పలేదు. ఈ దళారి సంతకం లేనిదే రైతు అవసరాలు కొన్ని తీరవు. కాదనలేక అవునన్నాడు. భూతంలా కదిలాడు ఆఫీసరు.

"ఏమిటి! పంపుసెట్టు దగ్గర కూచున్నావు? వొట్టి శవజాగారం ఎందుకు? ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి గంటన్నరయింది. ఇక వారం రోజులకు కాని తయారవుతుందన్న ఆశ పెట్టుకోకు."

ఆ మాటతో జీవయ్య హృదయం మండింది.

✡

జీవయ్యకు బుద్ధి తెలిసినప్పటి నుండి క్షామదేవత దర్శనం అప్పుడప్పుడూ జరుగుతూనే ఉంది. కరువు కాటకాల ఒత్తిడి ఎదుర్కొంటూనే ఉన్నాడు. నీటి ఎద్దడి ననుసరించి పైరు పెట్టుకొని కడకగ్ర ఎండిపోకుండా పండించాడింతవరకు. కరువు – అది వర్షాల మీద ఆధారపడి ఉంది. వర్షాలు దైవధీనాలుగా సంతృప్తిపడే రైతాంగం. కాని జీవయ్య ఎదుర్కొంటున్న సమస్యలు మనుషులు కల్పించింది. కర్తవ్యాన్ని సరిగా నిర్వహించని మనుషులు, డబ్బుకు అమ్ముడుపోయిన మనుషులు! అధికార దర్పంతో డాబుసరిగా బ్రతకటం నేర్చుకొన్న మనుషులు! ఈ మనుషుల చేతుల మీదుగా తిరిగే యంత్రాలు. డబ్బుకు దాసోహమని 'లోడ్'కు మించి కనక్షన్లు ఇస్తే మోటారు కాయిల్ కాలిపోక ఏమవుతుంది? ట్రాన్స్‌ఫార్మర్ మండిపోక ఎలా

నిలుస్తుంది? దైవాధీనం ప్రకృతి విపరీతాలు – దయలేని మనుషుల మధ్య సామాన్య రైతాంగం అడకత్తెరలో పోకచెక్క.

వ్యవసాయదారుని మిత్రులెంతమంది? శత్రువులెంతమంది? మిత్రుల కంటే శత్రువులే ఎక్కువ. పరోక్షంగా, ప్రత్యక్షంగా ఎంతోమంది శత్రువులు. చీడ, మిడత, రెక్కపురుగు, నక్క, ఎలుక, పక్షి – ప్రత్యక్ష శత్రువులు. చీడపురుగులను రూపుమాపవచ్చు. అగ్గిరోగానికి మందు ఉంది. మెడవిరుపు రోగాన్ని ఆపి పంటను పండించవచ్చు. ఎలుకలను ఏరి పారెయ్యవచ్చు. పచ్చని పైరుకు చిచ్చు, రైతుకు శత్రువు ఎవరు? క్రిములు కావు, కీటకాలు కావు, ఎలుకలు కావు, పక్షులు కావు – మనుషులు, రైతు చేతికూడు తిని బ్రతికే మనుషులు. జీవయ్య మనస్సు కల్లోలితమయింది. కరెంటు వచ్చింది; ఎంతసేపు? పొలం పారింది; ఎంత? మిరపతోట! కాని... జీవయ్య తన కళ్ళను నమ్మలేనట్లు చూశాడు మిరపతోటను. పూతపిందె నిలువున రాలిపోయిన తోట! లేబ్రాయంలో గాజు, పూస, బొట్టు పోగొట్టుకొన్న స్త్రీలా ఉంది. మొదటిసారిగా జీవయ్యకు తన మతిమరుపు మీద పట్టరాని కోపం వచ్చింది. బాగా వాడిపోయిన మిరపతోటకు మిట్టమధ్యాహ్నం ఎండలో నీళ్ళు కడ్తే ఏమవుతుంది? పూతపిందె నిలుస్తుందా అంతా మట్టిపాలయింది.

మసక చీకటి పడుతూ ఉంది. అరచేతి గీతలు అగుపడటం లేదు. కాయకష్టంతో గట్టిపడిన అరచేయి ఫలితాన్ని అందుకోలేకపోతూ ఉంది. గట్టిగా పిడికిలి బిగించాడు. అదృష్టం అరచేతినుండి జారిపోతున్నట్లనిపించింది. గుంటనక్కలు చెరుకు తోటలోకి పరుగులు తీశాయి. గుడ్ల గూబలు అసహ్యంగా అరుస్తున్నాయి. భూతప్రేతాలను పిలుస్తున్నాయి. జీవయ్య మనస్సునిండా భయం. పొలం ఎండిపోతే ఎంత? ఒక సంవత్సరం కష్టం పోతుంది – అంతేగదా? అందుకే ఎందుకింత క్రుంగిపోవాలి? జీవితంలో ఎన్ని ఒడుదుడుకులు చూడలేదు? భీకరమైన కరువు కాటకాలు భీష్మించి గాండ్రించినప్పుడే చలించలేదు. మరి ఈరోజు ఎందుకింత డీలాపడిపోవాలి? జీవయ్య ఎదురు ప్రశ్నలు వేసుకుంటూనే ఉన్నాడు. జావలా జారిపోతున్న కొండంత ధైర్యాన్ని కూడబట్టుకొంటూనే ఉన్నాడు. మనస్థైర్యాన్ని నిలకడ జేస్తున్నాడు. కండబలం మీద రేపటికి గట్టి పునాదులే వేసుకొంటున్నాడు. కాని, ఆశ్చర్యం! అంతు తెలియకుండా పునాదులు పూడిపోతున్నాయి. మసకచీకటి దట్టంగా అలముకొంటున్న కొద్దీ మనసులో విషాదం నిండుగా ముసురుకొంటూ ఉంది.

జీవయ్య గట్టు దిగి, పొట్టకర్ర మడిలో అడుగులు వేశాడు. బండలా ఉంది గుల్లమడి. మరి కొంత దూరం నడిచాడు బరువుగా. బీటలు వారింది నేల! జీవయ్య గుండె జల్లుమన్నది. గుండె పగిలినట్లే బాధవేసింది. తెల్లవెన్ను! జీవయ్యను చూసి విధి విషాదంగా నవ్వినట్లే వుంది. పసిపాపను పోషించినట్లు పెంచిన ఆకుతోట, మిరపతోట, వరి.... తను పెంచిన బిడ్డలు చూస్తున్నట్లే తేలకళ్ళు వేసినట్లు, భూమిమీదకు వాలిపోయినట్లపించింది. అకాల

మృత్యువు గుప్పెట్లో చిగులుకొన్నట్లనిపించింది. పాము కాటేసిన మనిషిలా అడుగు ముందుకు పడక మడిమధ్యనే కూచున్నాడు, జీవయ్య. విషం నరనరాల పాకిన వ్యక్తిలా జీవకళ తప్పిన పైరు మధ్య – ఆరడుగుల జీవయ్య మూడడుగుల భూమిలోకి క్రుంగిపోయినట్లయ్యాడు. క్షణాల్లో నరాల పటుత్వం సడలింది. కండరాలు పట్టు తప్పాయి, వయస్సు పెరిగిపోయింది జీవయ్యకు.

వాడిపోయిన పైరును తడిమింది అప్రయత్నంగా చేయి. తెల్ల వెన్ను చేతికి చిక్కింది. జీవయ్యకు ధైర్యం అదుపు తప్పింది. ఉన్మాదిలా అయ్యాడు. గుప్పున పొంగింది హృదయం. వళ్ళు జలదరించింది. కళ్ళు వర్షించాయి. వడగళ్ళులా కన్నీటి బొట్లు బొటబొటా రాలాయి. కాని... కన్నీటితో పొలం పారేనా? పంట పండేనా? నిర్జీవంగా వెల్లికిలా చతికిల పడ్డాడు, జీవయ్య. చీకటి నల్లటి ముసుగు దట్టంగా కన్పింది.

చీకటి తెరలు చీల్చుకొంటూ స్త్రీ – మబ్బుల మాటున విద్యుల్లతలా! చేతిలో టార్చితో ఆమె! ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన వార్త విని బంగారు ఆభరణాలమ్మి ఆయిల్ ఇంజను కొనమని కాబోయే అల్లుణ్ణి పంపింది. ఇల్లు చేరని భర్తను వెదుక్కొంటూ వచ్చింది జీవయ్య అర్ధాంగి బంగారు! భయంతో బెదురు చూపులతో పొలం గాలిస్తూ ఉంది, భూమిని పవిత్రం చేసి పుణ్యలోకాలు ప్రసాదించే గంగాతరంగిణిలా!

✡

# జేబులోడు

**–నక్కా విజయరామరాజు**

**కా**గితాల సుధాకర్‌కి చదువబ్బక, పనీపాటా లేకుండా సావాస గాళ్ళతో తిరుగుతున్నాడని పెద్ద గుమస్తా బాయిగోడి చిన్నయ్యతో చెప్పి అత్తలూరి గోపాలరావు గారి దగ్గర చిన్న జీతగాడిగా చేర్పించింది అతని అమ్మమ్మ ఆదెమ్మ. మేనమామలు పని అంతంతగా వుండి ఎవరి బతుకులు వారివన్నట్టుండేవాడు. తండ్రి పేరు వినడమే గానీ చూసింది లేదు. అత్తలూరి గోపాలరావు గారికి పాడిగేదెలు, దున్నలు, దూడలు, మాళీగేదెలు, ఆవులు, ఎద్దులు కలుపుకొని వందకి పైనే వుండేవి. వాటిని మొదుగుమెట్ట, లంకదిబ్బ, గుదికట్ట, పిచ్చికల గుంట, మర్రివాగుల్లో మేపుకు రావడం, పైడెమ్మ చెరువులో కడగడం, గొడ్ల చావిట్లో కట్టేసి, మేతేసి పశువుల కొట్టం ఊడ్చే పనయిపోగానే పొలికట్ట మూలన పడేసి, పూలతోట పని చూడ్డం. సుధాకర్ ఏ పని చేసినా శ్రద్ధగా చేస్తాడని గోపాలరావు గారి భార్య సుభద్రమ్మ గారు సాయంత్రం పూట పూల మొక్కలకు నీళ్ళు పోసే పని అప్పగించేది. మిగిలిన జీతగాళ్ళయితే పూలు తెంపి కొమ్మలు విరగ్గొడతారని. ఆ పనయిపోయి ఇంటికి బయలుదేరబోతుంటే ఏ గారో, పునుగో, చక్రమో చేతిలో పెట్టేది. అవి రెండైతే ఒకటి తిని, రెండోది అమ్మమ్మ కోసం ఇంటికి తెచ్చేవాడు సుధాకర్.

పనీపాటల్లో శ్రద్ధ చూపడం వల్ల అరక దున్నటం దగ్గర్నుంచి బండి తోలటం దాకా, వరికుప్పలు నూర్చడం దగ్గర్నుంచి గడ్డివాములు వేయడం దాకా పొలం పనులన్నీ తొందరగా నేర్చుకుని పద్దెనిమిదేళ్ళకే పెద్ద జీతగాడై సంవత్సరానికి ఇరవై వడ్ల బస్తాలు సంపాదిస్తున్నాడు సుధాకర్. ఆ ఎండాకాలమే ఇంటూరులో మొద్దు యాకోబు కూతురు రాణితో పెళ్ళి కూడా అయిపోయింది. దొరగారి దొడ్లో పనయిపోగానే ఎటు పోకుండా నేరుగా ఇంటికొచ్చేవాడు.

అత్తలూరి గోపాలరావు గారు వున్నంతకాలం ఆడుతూ పాడుతూనే గడిచిపోయింది సుధాకర్‌కి. సొంత మనిషిలా చూసుకునేవాడాయన. పండగలకి పబ్బాలకి బట్టలు పెట్టి, ఖర్చులకు డబ్బులిచ్చేవాడు. చేతికి ఎముకే లేని మనిషి. అందుకే అంతకన్నా ఎక్కువ వడ్లు ఇస్తామని మిగిలిన ఆసాములు ఆశ చూపినా ఆ దిక్కైనా చూడలేదు సుధాకర్.

✡

అత్తలూరి గోపాలరావు గారు చనిపోయిన తర్వాత ఆ దొడ్లో ఉండలేకపోయాడు సుధాకర్. ఆయన పిల్లలు తలా కొంతపొలం పంచుకుని రేపల్లె, తెనాలి, చెరకుపల్లి, పొన్నూరు, గుంటూరుల్లో సెటిలైపోయారు.

ఆ ఏడాది ఖాళీగా ఉండటం దేనికని, వేరే వాళ్ళ దగ్గరికి కూలీ పనుల కెళ్ళడం ఇష్టంలేక బాడవలో ఆకురాతి గంగాధర్రావు పొలం రెండెకరాలు మగతాకేశాడు. వరి ఆ సంవత్సరం విరగపండింది. దుబ్బుకి ఏభై కంకులేసింది. ఖర్చులు పోను మిగిలిన డబ్బుల్తో రెండు దున్నపోతులు కొన్నాడు. తర్వాతి సంవత్సరం నాలుగెకరాలు కౌలుకి తీసుకున్నాడు. ఆ ఏడాది కూడా ఇబ్బడిముబ్బడిగా పండాయి చేలు. వడ్లు, మినుములు అమ్మితే బోలెడు డబ్బులొచ్చాయి. అంత డబ్బు ఇంతకు ముందెప్పుడూ చూడలేదు. కొంత డబ్బుతో చెరకుపల్లిలో ఎడ్లబండి చేయించాడు సుధాకర్.

మూడో ఏడాది ఇంకో రెండెకరాలు ఎగ్రస్టాగా కౌలుకు తీసుకుని సాగు చేశాడు. ఆ ఏడాది వరి దిగుబడి తగ్గినా, మినుము విరగ్గాసింది. వాటినమ్మగా వడ్లకన్నా ఎక్కువ డబ్బు వచ్చింది. దాంతో పెళ్ళానికి బంగారు గాజులు, గొలుసు చేయించాడు. బండి కిరాయి కూడా బాగానే తగిలేది. క్షణం ఇంట్లో వుండేవాడు కాదు. కిరాయికి అటు చెరకుపల్లో, ఇటు రేపల్లో వెళ్ళేవాడు. పొలాలు కౌలుకివ్వడానికి రైతులు సుధాకర్ ఇంటికే రావడంతో అతనికి ఊళ్ళో గౌరవం పెరిగింది. హోటల్కెళ్తే పలకరించి కూర్చోమని కుర్చీ శుభ్రం చేస్తున్నారు.

ఇంకో ఐదెకరాల పొలం వేశాడు. ఎకరాకు ముప్పై బస్తాలకు పైగా పండాయి వడ్లు. రెండో పంటలో మినుములు ఎకరాకు నాలుగు బస్తాలపైనే పండింది. అవి అమ్మగా వచ్చిన డబ్బు చూసి సుధాకర్కి కళ్ళు బైర్లు కమ్మాయి. డబ్బును చూసి అతని పక్కన పనిపాటా లేని పొరంబోకు కుర్రోళ్ళు చేరారు. అప్పట్నుంచి వాళ్ళతో కలిసి రేపల్లె, తెనాలి వెళ్ళి కొత్త సినిమాలు చూడ్డం, మిలిట్రీ హోటల్లో చికెన్ బిర్యానీలు, మటన్ పలావ్లు తినడం, సారా, బ్రాందీలు తాగడం అలవాటయింది. అప్పటిదాకా పది రూపాయలు ఖర్చు పెట్టడానికి భయపడేవాడు, సిగరెట్ పాకెట్కి వంద రూపాయలివ్వడం మొదలెట్టాడు. మత్తులో వుంటే చిల్లర కూడా అడిగేవాడు కాదు సుధాకర్.

✡

సుధాకర్ భట్టిప్రోలు దుర్గా పిక్చర్ ప్యాలెస్లో మొదటి ఆట 'బందిపోటు' సినిమా చూసి వస్తూ పార్వతీ టాకీసు ఎదురుసందులో వున్న కోటయ్య సారా కొట్లో దాహం పుచ్చుకుని వస్తుంటే కలిశాడు పెద్దబ్బులు. ఇద్దరూ మానేపల్లె చెరువు దాకా వచ్చారు. "కొంచెం పనుంది, నాతోపాటు పార్వతీ టాకీసు దాకా వత్తావా?" అన్నాడు పెద్దబ్బులు. తనొకటి తాగి సుధాకర్కి రెండు డ్రాములు పోశాడు పెద్దబ్బులు. వద్దన్నా పక్కనే ఉన్న వెంకటేశ్వర్లు మిలిట్రీ హోటల్లో చికెన్ బిర్యానీ తినిపించాడు. సుధాకర్ ఊపు, జేబు బరువు చూసి దంగైపోయాడు పెద్దబ్బులు.

ఇద్దరూ నడవలేకపోతున్నారు. తూలుతూ పెద్ద వంతెన దాకా వచ్చి జానీ సోడా కొట్టు దగ్గరున్న అబ్రహాం రిక్షా ఎక్కారు.

ఊళ్ళో పెద్దబ్బుల్ని అందరూ జేబులోడనే పిలుస్తారు. వాడి ముందు మాత్రం పెద్దబ్బులు గారు అని గౌరవంగా పిలిచేవారు. చుట్టుపక్కల ఊర్లలో చిన్నాచితకా దొంగతనాలకు పెట్టింది పేరు పెద్దబ్బులు. కొత్తగా భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్ కొచ్చిన ఎస్.ఐ వెంకటేశ్వర్లు ఇట్లాంటి చిల్లర దొంగల్ని మక్కెలిరగదీశాడు. అప్పట్నుంచి అన్నీ వదిలేశాడు గానీ తాగుడు, పేకాట వదల్లేదు. రోజూ సాయంత్రం ఒకసారి పోలీస్‌స్టేషన్‌లో కనబడాలనే ఒప్పందం మీద వదిలేశాడు ఎస్.ఐ. పెద్దబ్బుల్ని. పెద్దబ్బులు సూక్ష్మగ్రాహి. ఎదుటి మనిషి కెపాసిటీని ఇట్టే పసిగట్టేస్తాడు. అందుకే సుధాకర్ జేబు బరువు చూసి పట్టేశాడు. రిక్షా టి.ఎం.రావు హైస్కూలు నుంచి, సాలిచెరువు, ముసలమ్మ సత్రం దాటి గౌండ్ల అర్జునుడి ఇంటి దాకా చేరేసరికి చాలా విషయాలు చెప్పాడు పెద్దబ్బులు, సుధాకర్‌కి.

"ఎంతకాలం ఈ మట్టి పిసుక్కుని బతుకుతావు తమ్ముడు, ఇంతకాలం చేసిన కష్టం చాలు. ఇకనన్నా సుఖపడు. కష్టపడకుండా డబ్బులు సంపాదించే దారులు చాలా వున్నాయి లోకంలో" అన్నాడు పెద్దబ్బులు ముద్దముద్దగా.

"నాకు పొలం పనులు తప్ప ఇంకే పనులు రావుగదండీ అబ్బులు గారు" అన్నాడు సుధాకర్.

"మనం నేర్చుకోవాలే గానీ ఏ పనైనా వచ్చుద్దీ బ్రదర్... ఏమంటావ్ అబ్రాం?" అన్నాడు పెద్దబ్బులు.

"అవునండీ అబ్బులు గోరు" అన్నాడు రిక్షా తొక్కుతున్న అబ్రహాం.

"ఈ అబ్రహాన్నే తీసుకుందాం. పుట్టగానే రిక్షా తొక్కడం నేర్చుకున్నాడా? తర్వాత్తర్వాత నేర్చుకోలా? ఇంట్రెస్ట్ వుండాలి బెదరూ" అంటూ చార్మినార్ సిగరెట్ పొగ సుధాకర్ మొహంలోకి వదిలాడు.

"అవునండీ అబ్బులుగారూ" అన్నాడు సుధాకర్ ఇతని మాటకెందుకు ఎదురు చెప్పాలన్నట్టు.

"గారూ, గోరు... జాంతా నై, ఇప్పట్నుంచి మనిద్దరం ఫ్రెండ్స్ కలిసి తాగాం, కలిసి తిన్నాం, కలిసి ఒకే రిక్షా కూర్చున్నాం. ఫ్రెండ్‌షిప్‌లో గారు, గోరు అండీ గిండీ జాంతానై అరేయ్, ఒరేయ్ అనుకుంటేనే నిజమైన ఫ్రెండ్స్" అన్నాడు ముద్దముద్దగా పెద్దబ్బులు.

రిక్షా దిగి హాండిల్ బార్ పట్టుకుని సాలిచెరువు దగ్గర మెరక ఎక్కుతున్న అబ్రహాంతో "మాట్లాడవేంరా అబ్రాం" అన్నాడు పెద్దబ్బులు.

"అవునండీ... అబ్బులు గోరూ" అన్నాడు ఆయాస పడుతూ అబ్రహాం.

"సరెలెండి... అబ్బులు" అన్నాడు సుధాకర్.

"అదే వద్దంది! అండి గిండీ... ఏందెహే! మనం మనం ఫ్రెండ్స్‌ంరా సుధా" అన్నాడు పెద్దబ్బులు సుధాకర్ భుజం మీద చెయ్యేసి.

సుధాకర్‌కి కొంచెం ధైర్యం వచ్చింది. "షరే లేరా, అబ్బులుగా" అన్నాడు కొంచెం గట్టిగానే.

"అదీ, ఇప్పుడు మనం రియల్ ఫ్రె.. ఫ్రె... ఫ్రెండ్స్! ఏరా అబ్రం?" అన్నాడు అబ్బులు.

"అవున్రా అబ్బులు" అన్నాడు అబ్రహాం గట్టిగా, రిక్షా గాలి వాటుగా తొక్కుతూ.

"సారీ! నువ్వట్టా అనగూడదు. మేమే ఫ్రెండ్స్, మేమంటే సుధాకర్, నేను అట్టా అనుకోవాలా" అన్నాడు అబ్బులు.

"అట్టాగేనండి" అన్నాడు అబ్రహాం నాలుక్కరుచుకుని. రిక్షా షావుకారి పిచ్చయ్య గారి ఇల్లు దాటి అయ్యంగారి ఇంటి దగ్గరకొచ్చి ఆగింది.

"రేపు అంటే టుమారో ఈవినింగ్ రథం షెంటర్లో పాపారావు కొట్లో వేడి వేడి వుల్లిపాయ గారెలు తింటూ మిగిలిన విషయాలు మాట్లాడుకుందాం మా ఇల్లు వచ్చినట్టుంది. టాటా... బై... బై... గుడ్‌నైట్... టేక్ కేర్" అంటూ తూలుతూ రిక్షా దిగాడు పెద్దబ్బులు. రిక్షా ముందుకు కదిలింది.

"ఈడాపు అబ్రాం అన్నా! నేను రిక్షాలో ఇంటిదాకా ఎళ్తే ఎవురన్నా సూత్తే బాగోదు" అని రిక్షా దిగి డబ్బులిచ్చాడు సుధాకర్.

"ఈ అబ్బులుగోడు కేడీ నాయాలు. ఈడెక్కడ దొరికాడు నీకు? ఈడితో సావాసం మంచిదికాదు. ఈడు ఊళ్లో చాలా మందిని ముంచాడు బెదరూ ఈడితో జాగరత" అని హెచ్చరించాడు అబ్రహాం.

సుధాకర్ ఇవేమీ పట్టించుకోకుండా ఇంటికెళ్ళి ముసుగు తన్నేసరికి తొలికోడి కూసింది.

✡

కనగాల మసీదులో సాయిబు అజ వెయ్యకముందే నిద్రలేచే సుధాకర్, బారెడు పొద్దెక్కినా మంచం దిగలేదు. సుధాకర్ భార్య రాణి కోళ్ళ గంపలు లేపి, వాకిలి ఊడ్చి, కల్లాపి చల్లి ముగ్గులు పెట్టేసి, బట్టలు వుతుక్కోవడానికి పైడెమ్మ చెరువు కెళ్ళిపోయింది.

ఇంటి ముందున్న చింతచెట్టు కింద నులక మంచం అల్లుతున్నాడు సుధాకర్ తాత వెంకటసుబ్బయ్య. ఇంగ్లీషు తుమ్మ, ఎండుపుల్లల్తో పొయ్యి రాజేస్తోంది ఆదెమ్మ.

"ఏం తాతా! ఒక్కడివే మంచం అల్లుతున్నావ్, నులక వుండ ఎయ్యడానికి ఏ పిల్లోడు దొరకలేదా?" అన్నాడు పెద్దబ్బులు పక్కనే నిలబెట్టిన నులక మంచం చిటకేసర చెట్టుకింద వాల్చుకుంటూ.

"సుధాకర్ ఇంకా నిద్రలేవలేదా?" అనడిగాడు చార్మినార్ సిగరెట్ ముట్టిస్తూ.

"పొద్దు పొద్దున్నే జేబులోడు ఎందుకొచ్చాడబ్బా? సుధాకర్‌తో ఈడికి పనేంటి?" అని మనసులోనే అనుకుంటూ – "ఇంకా నిదరలేవలేదండీ అబ్బులుగారూ! ఎదవసన్నాసి, రాత్తిరి పుల్లుగా తాగొచ్చినట్టున్నాడు. మామూలుగా అయితే అంతగా తాగడు. ఏ ఎదవ సన్నాసి కలిశాడో?" అన్నాడు నోట్లో చుట్టముక్క తీసి తుపుక్కున వూస్తూ. నులక వుండని కాళ్ళతొట్టిలో వేసి మంచానికి ఆ వైపు వెళ్ళాడు వెంకటసుబ్బయ్య. ఆసులో పుల్లలాగా ఆయనే అటు ఇటు తిరుగుతూ నులక మంచం అల్లుతున్నాడు.

ఆయన మాటలకి ఉలిక్కిపడ్డాడు పెద్దబ్బులు. "కుర్రోడు గదా! ఫ్రెండ్స్ కలిసుంటారు" అన్నాడు సిగరెట్ పొగ వదుల్తూ. చింతచెట్టు కింద నూకలు కెలుకుతున్న కోళ్ళ గుంపును చూసి "అరకోళ్ళు ఏవన్నా వున్నాయా తాతా?" అన్నాడు మాట మారుస్తూ.

"కోళ్ళ సంగతి ఆడి అమ్మమ్మ చూసుకుంటది. చింతకాయలు కావాలంటే చెప్పు గోవాడ తిరనాల అయిపోయినాక కోస్తా, మా చెట్టు కాయల పచ్చడి ఎండెన్‌గా వుంటది. అత్తలూరి గోపాలరావు దొరగారిక్కూడా మా చెట్టు కాయల పచ్చడంటే పేనం" అంటూ ఇంటి ముందు విరగ్గాసిన చింతచెట్టు గొప్పతనాన్ని చెప్పసాగాడు వెంకటసుబ్బయ్య.

నిద్దరలేచిన సుధాకర్ ఇంటెనక్కెళ్ళి రాత్రి తాగిందంతా కక్కేసి పొంత కుండలో వుడుకు నీళ్ళు నోట్లో పోసుకుని పుక్కిలించి వూసి, వేప పుల్లనములుతూ తాత దగ్గరికొచ్చి కూర్చున్నాడు.

"ఏరా! రాత్తిరి తాగిందంతా దిగిందా?" అన్నాడు కోపంగా వెంకటసుబ్బయ్య.

"నీకెప్పుడు అదే యావ. గుండెలో పసరు చేరిందిలే! బీడీలు తగ్గిచ్చాలి" అన్నాడు వేపపుల్ల నములుతూ సుధాకర్. అప్పుడు చూశాడు చిటకేసరచెట్టు కింద నులక మంచం మీద కూర్చొని సిగరెట్ తాగుతున్న పెద్దబ్బుల్ని. నోట్లో వేపపుల్లని మధ్యకు రెండు బద్దలుగా చీలి నాలుక గీసేసి అవతల పడేసి పొంతకుండలో నీళ్లు పుక్కిలించి, "ఎప్పుడొచ్చారండి అబ్బులుగోరు?" అన్నాడు ఆయన దగ్గరకెళ్ళి.

"ట్రాక్టర్ కోసం లోన్ కావాలన్నావుగా, రేపల్లె స్టేట్ బ్యాంకీలో నాకు తెలిసిన మనిషున్నాడు. మనూరు సాలీలబ్బాయి. బ్యాంకీలో పన్జేస్తున్నాడు. ఎల్దామా?" అన్నాడు పెద్దబ్బులు.

పెద్దబ్బులు ఏం మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు సుధాకర్‌కి. ట్రాక్టర్ కోసం తానెప్పుడు లోన్ అడిగింది గుర్తుకు రాలేదు. రాత్రి తాగిన మత్తులో ఏమన్నా వాగేనేమోననుకున్నాడు. "ఎట్టాగండీ, పల్లపు పొలాల్లో గట్లకి గెడ్డ పెట్టాలా, బాడవ పొలంలో పాటిమట్టి తోలాలి.

మాపిటేల కవుతరువు ఎంకటేశ్వర్లు గారి కొబ్బరి మొక్కలకి అల్లూరి కాలవ ఓంద్రుమట్టి తోలాలి గందా! ఇపుడు రేపిల్లి కుదర్దులెండి. అయినా ట్రాక్టర్ పని నాతో కాదులెండి" అన్నాడు సుధాకర్.

"ఇటురా" అని అతన్ని కొంచెం దూరంగా కొబ్బరితోట దాకా తీసుకెళ్ళాడు పెద్దబ్బులు. "ఏరా రాత్తిరి చెప్పింది మర్చిపోయావా?" అన్నాడు అబ్బులు.

"మరీ జనం మధ్యలో పట్టుకొని నిన్ను – అరే, ఒరే అంటే బాగోదుకదండీ, పెద్దోళ్ళు... నన్ను వదిలేయండి అబ్బులుగోరూ" అన్నాడు సుధాకర్.

"దాని గురించి కాదేహె, తాగిన మైకంలో అనేకం మాట్లాడుకుంటాం... అవన్నీ పట్టించుకుంటే ఎట్లా? కష్టపడకుండా డబ్బులు సంపాదించే మార్గాలున్నాయని చెప్పానే! దాని గురించి నీకు వివరంగా చెప్పాలి రేపల్లె పోదాం పదా! ఈ పనులన్నీ ఎప్పుడు వుండేవేగా" అన్నాడు పెద్దబ్బులు.

"మీ తాత వింటే తిడతాడని ట్రాక్టరు లోను అన్నా" అంటూ చార్మినార్ సిగరేట్ ముట్టిస్తూ పెద్దబ్బులు. సుధాకర్‌కి ఒకటివ్వబోయాడు తీసుకోలేదు.

"జీలకర్ర ఎంకటసామి హోటల్లో ఇడ్డీలు తినొత్తా తాతా" అని అబద్ధం చెప్పి పెద్దబ్బుల్తో బయల్దేరాడు సుధాకర్.

ఇద్దరూ రేపల్లె చేరి శంకర్ విలాస్‌లో ఇడ్లీ, మినపట్టు తిన్నారు. కాఫీలు తాగుతుండగా ఆపుకోలేక, "ఇందాక ఇంటి దగ్గర కొబ్బరితోటలో ఏదో సంగతి చెబుతానన్నావుగా అబ్బులుగారు ఏందది?" అడిగాడు సుధాకర్.

ఇక్కడ కాదు బైటంటూ సైగ చేసి బిల్లు కట్టడానికి పది రూపాయల కొత్త నోటిచ్చాడు పెద్దబ్బులు సుధాకర్ చేతికి. రైల్వేస్టేషన్ దాటి, బాలాజీ ట్యుటోరియల్ కాలేజీ మీదుగా రైలు పట్టాల పక్కన నడుస్తూ చాలా దూరం తీసుకెళ్ళాడు పెద్దబ్బులు సుధాకర్‌ని. అక్కడ ఎవ్వరూ లేరు. దూరంగా చేలల్లో గొడ్లు మేస్తున్నాయి.

"నీకిందాక హోటల్లో బిల్లు కట్టడానికిచ్చాను పదిరూపాయల నోటు అదేందనుకున్నావు?" అడిగాడు పెద్దబ్బులు. అర్థం కానట్టు చూశాడు సుధాకర్.

"అదేరా కోయంబత్తూరు నోటంటే" అన్నాడు పెద్దబ్బులు.

"అంటే?" అమాయకంగా అడిగాడు సుధాకర్.

"మనోల్లంతా దొంగనోట్లు అంటారే అదే అది" అన్నాడు అబ్బులు ఇంకో చార్మినార్ ముట్టిస్తూ.

"నీకేడది?" ఆత్రంగా అడిగాడు సుధాకర్.

"దానికి ఏజెంట్లుంటారు. మన డబ్బు పది రూపాయలిస్తే వాళ్లు వందిస్తారు. వెయ్యిస్తే పదివేలు. అంటే పదిరెట్లన్నమాట" చెప్పాడు పెద్దబ్బులు గట్టిగా దమ్ములాగి.

"పోలీసులెవురన్నా పట్టుకుంటే" భయంగా అడిగాడు సుధాకర్.

"ఇప్పుడే చూశావుగా హోటల్లో ఇచ్చిన పది రూపాయల నోటు – ఎవ్వరూ గుర్తుపట్టలేరు. ఇంకా భయం దేనికీ? నిన్ననే ఆ ఏజంట్లు మద్రాసు నుంచి వచ్చారు. ఇక్కడే లాడ్జింగులో దిగారు. పొన్నూరు, గూడవల్లి, చెరకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లె, తెనాలిలో వున్నోళ్ళంతా రెండు, మూడేళ్ళకే పొలాలు కొని, ఇంతింత బిల్డింగు లెట్టాకట్టారనుకున్నావ్! అంతా ఈ కోయంబత్తూరు నోట్ల మహిమేరా!" చెప్పాడు పెద్దబ్బులు.

ఆలోచనలో పడ్డాడు సుధాకర్. అప్పటికే చాలా దూరం వచ్చారు వాళ్ళు.

"తొందరేం లేదు ఆలోచించుకుని రేపురా! పార్టీ ఇంకా రెండు రోజులుంటది. ఈ విషయం మూడో కంటికి తెలీకూడదు. అంత రహస్యం. చివరికి నీ పెళ్ళానికి కూడా" హెచ్చరించాడు పెద్దబ్బులు.

✡

అట్నుంచే పల్లెకోన మీదుగా చేలకడ్డం బడి పెద్దారం డొంక దాటి లంకదిబ్బ మీదుగా ఇంటికొచ్చాడు సుధాకర్. ఆ రాత్రి నిద్రపట్టలేదు. అన్నం తినబుద్ధి కాలేదు. పంట అమ్మగా వచ్చిన పైకం ఖర్చుల కోసం, కౌలు బాకీలు తీరుద్దామని ఇంట్లోనే పెట్టాడు. అది ముప్పై వేల దాకా వుంది. పదిరెట్లంటే లక్ష రూపాయలపైనే! మనసులోనే లెక్కలు కట్టాడు. తను లక్షాధికారై పోయినట్టు, అత్తలూరి గోపాలరావు గారి కన్నా పెద్ద మేడ కట్టినట్టు, నల్లద్దాలు పెట్టుకుని, సూటూ బూటేసుకుని కారులో తిరుగుతున్నట్టు కలలుగన్నాడు సుధాకర్.

ఇంట్లో ఎవ్వరికీ ఎక్కడికెళ్ళేది ఒక్క మాటైనా చెప్పకుండా, పొద్దుపొద్దున్నే లేచి రేపల్లె శంకర్ విలాస్ చేరుకున్నాడు సుధాకర్. అక్కడే కాచుక్కూర్చున్నాడు పెద్దబ్బులు. అతను తెచ్చిన డబ్బు తీసుకొని, "ఆ ఎదురుగ్గా కనిపించే బాలాజీ లాడ్జింగులోనే ఏజెంట్లు దిగింది. కొత్తోళ్ళు ఎవరన్నా వస్తే వాళ్ళు అనుమానిస్తారు. నువ్విక్కడే వుండు అర్థగంటలో పని పూర్తి చేసుకుని వస్తా" అని వెళ్ళాడు పెద్దబ్బులు.

అర్థగంటయింది. గంటయింది. రెండు గంటలయింది. అయినా పెద్దబ్బులు అయిపులేదు. సుధాకర్ టిఫిన్ కూడా తినకుండా అబ్బులు కోసమే ఎదురు చూస్తున్నాడు. టీ తాగి ఇంకో గంట దాకా కూర్చుని చూసి, పెద్దబ్బులు రాకపోతే బాలాజీ లాడ్జింగు దగ్గరకెళ్ళి లోనికి తొంగి చూశాడు. అబ్బులు కనబడలేదు. కొంచెం సేపాగి ధైర్యం చేసి లోనికెళ్ళి అక్కడున్న మనిషినడిగాడు. "అబ్బులుగారు వచ్చాడండి" అని.

"అట్టాటోల్లెవరూ రాలేదే!" అన్నాడా మనిషి.

"మద్రాసు నుంచి, ఎవరో వత్తానన్నారని, ఆళ్ళని కలుత్తానని అన్నాడండి అబ్బులుగోరు" అన్నాడు సుధాకర్ నీళ్ళు నవుల్తూ.

"మా లాడ్జింగుకి మద్రాసు నుంచి పాసెంజర్లా?" అంటూ పక్కున నవ్వి, "ఏ వూరండీ తమరిది సత్తెనపల్లా?" అన్నాడు లాడ్జింగు మనిషి ఎకసెక్కంగా గళ్ళ లుంగీ మోకాలు దాకా ఎగ్గట్టిన సుధాకర్ వంక చూస్తూ.

తలొంచుకుని ఇంటికొచ్చేశాడు సుధాకర్. నేరుగా అబ్బులు ఇంటికెళ్ళాడు, తాళం వేసుంది. పక్క ఇంట్లో అడిగితే రెండ్రోజుల నుంచి కనబడలేదని చెప్పారు. సాయంత్రం వెళ్ళాడు. రెండో రోజు వెళ్లాడు. మూడో రోజు వెళ్ళాడు. అబ్బులు జాడలేదు. అప్పుడర్థమైంది. ఏదో మోసం జరిగిందని. ఇంట్లో చెప్పలేదు, చెబితే పెళ్ళాం రచ్చరచ్చ చేస్తుందని. కౌలుదారులు డబ్బు కోసం ఇంటికి వస్తున్నారు. అడగ్గా అడగ్గా తాతతో పెద్దబ్బులు చేసిన మోసం చెప్పాడు సుధాకర్. ఆయన వూరంతా టాంటాం చేశాడు. వూరిలో విషయం పొక్కింది. ఎరువులకి, పురుగుమందులకి, అప్పులిచ్చి నోళ్లు ఇంటి మీదికి రాసాగారు. బండి, దున్నపోతులు, భార్య నగలమ్మేసి అప్పులు తీర్చేశాడు. భార్య అలిగి పుట్టింటికి వెళ్ళిపోయింది. ఊళ్లోకొస్తే జనమంతా వింతగా చూడసాగారు సుధాకర్ని. దుకాణాల్లో, హోటల్లో డబ్బులిస్తే మార్చి మార్చి చూస్తున్నారు.

✡

తొలకరి వానలు పడ్డాయి. మళ్ళీ వ్యవసాయం చేద్దామంటే వూళ్లో పైసా అప్పు పుట్టలేదు. కౌలుకు పొలం ఎవరూ ఇవ్వలేదు. వూళ్లో మొహం చెల్లక ఆకురాతి గంగాధర్రావు లారీ మీద క్లీనర్గా బెజవాడ వెళ్ళిపోయాడు సుధాకర్.

✡

పెద్దబ్బులు మాత్రం మల్లెపూవు లాంటి లాల్చీ పైజామా వేసుకుని కనగాల సత్తార్ సాయిబు అత్తరు చల్లుకొని చార్మినార్ సిగరెట్ కాలుస్తూ జాలీగా వూళ్లో తిరుగుతున్నాడు. అతని వెనకాల జనమంతా జేబులోడని, కేడీనాయాలని, దొంగనోట్లు మార్చేవాడని చెవులు కొరుక్కున్నా ఆయన ఎదురుపడ్డప్పుడు మాత్రం అబ్బులు గారూ అని గౌరవంగానే పిలుస్తున్నారు. పెద్దబ్బుల్ని రాబోయే ఎలక్షన్లో పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు చేయడానికి రెండు పెద్ద పార్టీలు తమ పార్టీలో చేరమని బ్రతిమాలుతున్నాయి.

✡

# వలస

–ఇనయ్‌తుల్లా

"కరిడికొండకు బస్సెప్పుడొస్తుంది తాతా?

పాత కళ్ళద్దాలను సవరించుకుంటూ, ఆరిపోతున్న స్టవ్‌కు పంపు కొడుతూ 'టీ'ని కలియబెడ్తున్న ఆ తాత నేను ప్రశ్నడిగిన కొద్దిసేపటికి తలపైకెత్తి చూశాడు. నేనడిగిన ప్రశ్న అతనికి చాలా విచిత్రంగానూ వింతగానూ తోచినట్లుంది. చూపుడువేలుతో అద్దాల్ని సవరిస్తూ...

"యావూరు సారూ మనది?" అన్నాడు.

ప్రశ్నకు ఎదురు ప్రశ్న వేసినందుకు నా 'ఇగో' కొంచెం దెబ్బతినింది. ఇన్‌షర్టును ఇంకొంచెం సర్దుకుంటూ 'కర్నూలు' అన్నాను. "కరిడికొండకు బస్సు రాదు సారూ. కొంచేపు కుచ్చో. వ్యాను యిట్ట లోనికిపోయింది. మల్ల తిరిగొత్సాది. దానికి పోదువుగాని" అన్నాడు.

ఆ హోటల్‌లో పాత తడికెలు, తడికెల నిండా సినిమా బొమ్మలు, బండలతో కట్టిన అరుగులు. విశ్వం చెప్పే మాటలు గుర్తొచ్చినాయి నాకు. నువ్వు మా వూరికి వెళ్ళే రోడ్డు మీద దిగీ దిగంగానే ఒక మల్టీస్టార్ (అంటే అన్ని సినిమహీరోల బొమ్మలుండే) హోటల్ నీకు స్వాగతం పలుకుతుంది. దానిలో ఉండేది అన్నీ సిల్వర్ గిలాస్‌లేగాని దాని పేరు మాత్రం 'మహాలక్ష్మి విలాస్' అని అతడు తన ఊరి గురించి చెప్పిన జోకులు ఒకసారి మళ్ళీ నెమరేసుకున్నాను. హోటల్‌లో కూర్చున్న వాళ్ళలో ఒకరిద్దరు తప్ప ఒంటి మీద అంగీలు తొడుకున్నవాళ్ళు ఎక్కువ మంది లేరు. ఒకాయన మాత్రం అక్షరక్షరం అతి కష్టమ్మీద కలుపుకొని పేపర్లో వార్తలు చదువుతుంటే చుట్టూ కూచున్నవాళ్ళు 'టీ' చప్పరిస్తూ వింటున్నారు. కొంతమంది పిల్లలు పేవర్లలోని సినిమా పేజీల మీద పడి మాట్లాడుకుంటున్నారు.

"వా! ఇక్కడ సూడిలె బాలకిస్న బొమ్మ. ఆ మీసం కట్టు, ఆ డ్రస్సు సొయ్యం మన రొడ్డి లెక్కనే ఉన్నడు. సూపర్ ఉందంటే ఈ సిలిమ" మాట్లాడుకుంటున్నారు పదైదు పదారేళ్ళ పిల్లలు. ప్రక్కన సద్దులు పెట్టుకున్నారు. గౌండా పనిచేసేవాళ్ళ లాగున్నారు.

టీ తాగుదామనుకున్నా కాని యిక్కడ టిఫిన్ ఏముంటుందో కాస్త వెరైటీగా తిందామనుకొని "టిఫిన్ ఏమైనా ఉందా తాతా!" అడిగాను. "ఇంత ఎండపన్యాంక టిఫిన్ ఉండత్సారూ!

ఇంగ లేటైనంక దొరికేది టీ ఒగటే" అన్నాడు. "ఇంత ఎండపన్యాంక టిఫిన్ ఉండత్నారూ! ఇంగ లేటైనంక దొరిగేది టీ ఒగటే" అన్నాడు "సరే టీ యిచ్చేయ్" అన్నాను.

"ఏమో సామీ మీ పట్నమాసమోల్లకు మా టీ నచ్చుతాదో లేదో తాగి సూడు "అంటూ టీ గ్లాసిచ్చాడు ఆ హోటల్ కుక్, సప్లయర్ కం ప్రొప్రెయిటర్ అయిన తాత.

"ఎవురింటికి పోవల్ల సారూ?" అడిగాడు. "వెంకట సుబ్బారెడ్డి ఇంటికి" అన్నాన్నేను. అదేమిటోగాని అంతవరకూ మామూలుగా పలకరించిన తాత వెంటనే "కూచ్చోసారూ... రేయి జర్గండిరా. మీకు పొద్దుమూకులు సిలిమ బొమ్మలే. ఇంగ పనికిపోండి" అంటూ గౌండా పిల్లల్ని పక్కకి పంపి తన వల్లెతో అరుగుమీది దుమ్ము దులిపినాడు.

"రొడ్డింటిక్యా సామి" పక్కనే టీ తాగుతున్న మరొకాయన అడిగాడు. అవునన్నాను తాత చూపించిన ఆరుగు మీద కూర్చుంటూ.

"పెదరొడ్డి కోసమా – చిన్నెడ్డి కోసమా సామి" అడిగాడింకొకాయన టీ గ్లాసు ప్రక్కన పెడుతూ.

"వెంకట సుబ్బారెడ్డింటికి" అన్నాన్నేను ఆ చిన్నా పెద్ద ఎవరో తెలియక.

"ఆ! అంటే పెదరొడ్డేలే. నేనొచ్చేతపుడు ఉండ్యె. అలారుదిన్నె మాదిగోల్లది పంచ్యాతి చెప్తుండె. ఆపీసర్లు గూడ శానామంది కూసోనుండ్రి. మన పత్తికొండ ఎస్సై 'ఆలపరెడ్డి' గూడ ఉండె. యియాలేందో జనమబూమి మీటింగుందని మాట్లాడుకుంటుండ్రి" చెప్పుకుపోతున్నాడా ఊరతను.

'ఆలపరెడ్డి' పేరు విని ఆశ్చర్యపోయాను. హైబ్రిడ్ జన్నలను 'అయ్యపరెడ్డి' జన్నలన్నట్లు 'ఆల్‌ఫ్రెడ్'ను ఆలపరెడ్డిగా మార్చింటారనుకున్నా.

"రొడ్లోల్లేనా సారు మీరు గూడ?" ఒకాయన దగ్గరగా వచ్చి అడిగాడు. "కాదు నేను విలేఖరి.... ఆయనతో పనుండి వెళ్తున్నా" అన్నానేను.

ఇంతలో "వచ్చ్యె – వచ్చ్యె" శబ్దాలు. "యియ్యాల బలేటు కొట్టుకొచ్చినాడ్రా. ఎవరు డ్రైవరు?"

"వాడు బండ సంజన్న కొడుకు సింపిరినెత్తి శీనుగాడు"

"ఆ! వాడైతే మోత మోగిస్తడులే బండిని, ఇగో నాలుగు సీటీలు పట్టు"

ఈ మాటల్ని పట్టి నేనెక్కాల్సిన వ్యాను రాబోతుందని గ్రహించాను. గబాగబా టీ త్రాగేసి తాతకి చిల్లరివ్వబోయాను. తాత డబ్బులు తీస్కోలేదు. బయటికెళ్ళి వ్యాను కోసం చూశాను. అక్కడెక్కడనో టర్నింగ్ దగ్గర వస్తున్నట్లుంది. చెట్ల మధ్యలోంచి దాని టాప్ మీద కూర్చున్న

జనమే కనిపిస్తున్నారు తప్ప వ్యాను కనిపించలేదు. దగ్గరగా వచ్చింది. దాని టైర్లు స్టీరింగ్ తప్ప మరే పార్టు కనపడకుండా మొత్తం జనమే ఎక్కారు. జనం దిగుతున్నారు. కరిడి కొండ మట్టంతా దులిపేస్తున్నారు. వ్యానులో నుండి దిగుతున్నవాళ్ళలో సగంమందికి పైగా పెద్దపెద్ద మూటలతో సామాన్లతో దిగుతున్నారు. చంకలో పిల్లలు, కొంచెం పెద్ద పిల్లల చేతుల్లో చేటలు, బిందెలు, బకెట్లు కనిపించాయి.

"పదిమందికి ముప్ఫైరూపాయలా కుదరదు. త్యా యాభై రూపాయలీ" – వ్యాను డ్రైవరు గట్టిగా అరుస్తున్నాడు.

"యాదోలే సామీ. బతకనీక పోయేతోల్లం. కొంచెం సూసి తీస్కో అంతగా అయితే గుంటూరు పనికి పోయొచ్చినంక యిస్తాములే" అంటూ బ్రతిమాలు కుంటుంది ఒకామె. "సంచులల్లో దాసిపెట్టింటరు దుడ్లుతీ" అరుస్తున్నాడు డ్రైవరు. ఒక ముసలామె బొడ్డులో దోపుకున్న చిన్న సంచీలో నుండి మడతలు పడిన నోట్లు తీసింది. వీళ్ళందరూ గుంటూరుకు పనికి పోతున్నారని తెలిసి అశ్చర్యమేసింది. చూస్తున్నంత లోపే మళ్ళీ ఫుల్లైపోయింది వ్యాను. కొత్త సినిమా టికెట్ల సంబరమే మళ్ళీ యిక్కడ కనిపించింది నాకు. ఆ కసరత్తు చేయడం చేతకాని నేను వ్యాను ముందు అటూ ఇటూ తిరుగుతూ బయటే మిగిలిపోయాను.

"సార్! సార్" డ్రైవర్‌కు ఎడమ ప్రక్కన కూర్చున్నతను కేకేసి పిల్చాడు. ఇందాక హోటల్లో నన్ను పలకరించినతను. "రొడ్డోల్లింటికి పోతున్నడంట కూచోపెట్టుకో" అంటూ "రా సార్ నేను పైకి పోతాలే." నేను వద్దంటున్నా లాగి కూచోపెట్టాడు. సరే కూచున్నాను. ఆగి పోతుందేమో అన్నంత నిదానంగానూ, దెబ్బకు కరిడికొండలో పడుతుందేమో అన్నంత స్పీడు గానూ పోవటం ఆ వ్యానుకే చెల్లు. జన్మభూమిలో బెస్ట్ పంచాయితీగా ఎంపికైన కరిడికొండ రోడ్డు మహత్యం నా నడుములకు బాగా తెలిసొచ్చింది. "12 గంటల్లో అంగన్‌వాడి పాఠశాల నిర్మాణం" "24 గంటల్లో రోడ్డు నిర్మాణం" "జన్మభూమిలో కరిడికొండ ముందంజ" అంటూ పేరుమోసిన పత్రికల్లో బాక్సులు కట్టి రాసిన వార్తల్లోని వాస్తవాలు ఒక్కొక్కటి నాకు అర్థమవుతున్నాయి. అయితే వెంకటసుబ్బారెడ్డితో ప్రత్యేక ఇంటర్వ్యూ చేయమని నన్ను పంపిన 'జనవాణి' మేనేజ్‌మెంట్ నా రిపోర్ట్‌కు ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. ఇంతలో ఒక మలుపు దగ్గర సడన్ బ్రేకు. అవతల నుండి వరుసగా జీపులు. ఆమధ్య ఒక టాటాసుమో, ఒక ట్రాక్స్.

"అగో! అగో! పెదరొడ్డి నడుంగల గూసున్నాడు."

"ఏం! సంగనోట్లు జీపులొచ్చేవియాల."

"యియాల దేవనకొండలో మీటింగ్."

"ఎవరుత్సండరో."

“ఇంగవరెరొత్సరిలే! మన రొడ్డే. జన్మభూమి మీటింగ్ జెప్తడంట యియ్యాల. కటారు కొండ, దూదికొండ, అలారుదిన్నె ఈ పల్లెల్లోల్లంత కలిసి 150 కేజీల దండ సేపిత్సుండ్రి నిన్న”

వ్యానులో.... జనం గుసగుసలు.

జీపులు, టాటాసుమో, ట్రాక్స్.... ఒక దాని వెనుక ఒకోటి మా వ్యాను ముందర నుండి వెళ్ళిపోయాయి. ఆ వాహనాలన్నింటి మీద ‘బైసాని’ అని పెద్దక్షరాలతో రాసి ఉంది. జులపాలు, బవిరిగడ్డాలు, పెద్దపెద్ద మీసాల వందిమాగధులు జీపుల నిండ ఇరుక్కోని, వ్రేలాడుకొంటూ రెడ్డికి రక్షణగా వెళ్ళడం... అదొక వైభవం. ఆ జీపుల కీ కీక్ శబ్దాల మోత కాసేపు ఆ వాతావరణాన్ని నిశ్శబ్దపర్చింది. నేనొచ్చిన పనికి బ్రేకు పడింది. అయినా ఊళ్ళో విశ్వనాథం ఉన్నాడు కదా. చాలారోజుల్నించి ఊరికి రమ్మని పిల్చిపిల్చి విసిగిపోయాడు. ఈ ఇంటర్వ్యూ సాకుతోనైనా ఒకరోజు వాడింట్లో ఉండిపోయి ఉదయాన్నే పని చూసుకోవచ్చుననుకున్నా. రోడ్డు కిరువైపులా నవ్వుతున్న నాపచేన్లు. పండుతున్న పచ్చచేలు అక్కడక్కడా విసిరేసినట్టు కనిపిస్తున్నాయ్. మళ్ళీ మాట్లాడుతున్నారు వ్యానులో జనం.

“ఎవర్దిరా ఈ జొన్నసేను కంకులు శానా అద్వాన్నంగుండయ్.”

“ఇద్యా. నేసె రామునిది. బలిజ రంగన్న కాడ గుత్తకు దీస్కోని ఏస్కోండడు. అది ఇంత అవతారంగ వచ్చింది.”

“ఏమో... ఈ యేడు రైతల్కి శానా శని పట్టుకొంది. శనిక్కట్టి సేతికి రాకపాయె. కందికట్టె కాటికి పాయ అన్నట్టుంది. ఒరెనీ! కంకి కాలపెట్ట. మాకాలంలో కంకి సూడాలట్లే. కొయ్యనీక పోతే కొడేలికి తిరగబడ్తుండె. పొద్దున సంగటి తిని పత్తికొండ సంతకు పోతే మల్లసగరు బొద్దుదంక అకలైతుండ్యా” వ్యానులో కూర్చున్న వాళ్ళ మాటలు వింటుంటే కొత్త పుస్తకం చదివినట్లుందినాకు.

ఇంతలో దిగ(రి దిగ(రి ఊరొచ్చింది. అన్నాడు డ్రైవరు. జనం దిగుతున్నారు. నా దగ్గర డబ్బు తీస్కోనన్నాడు. డ్రైవరు సరే దిగి కొంచెం ముందుకు కదిలాను. మ(రిమాను కింద రచ్చకట్ట. పులిజీతం ముగ్గురాడుతున్నారు. చుట్టూ జనం మూగారు. నేను దగ్గిరగా వెళ్ళి “విశ్వనాథం యిల్లెక్కడ?” అన్నాను.

పులిజీతం అడుతున్నవాళ్ళు సడన్‌గా నావైపూ నా బ్యాగువైపూ చూశారు. ఒకాయనేమో “ఎవరూ! యిస్పనాగం... అట్టాటి పేరుండేటోడు ఈ వూర్లోనేలేడే” అన్నాడు.

లేడా! ఆశ్చర్యపోయాను. క్షణం ఆగి... అతను “తిరుపతిలో చదువుకొని ఈమధ్యనే ఊరికి వచ్చి ఉంటున్నాడు” అన్నాను.

"ఏంటోల్ల పిల్లోడు?"

కులం! యిద్దరం కలిసి రూంలో ఉన్నాంగాని అది నేనెప్పుడూ అడగలేదు. విశ్వనాథం చెప్పలేదు. మరొకాయన దగ్గరగా వచ్చి "వో! అవులే... తెలుగోల్ల పిల్లోడు కదా. గంజి నాగన్న కొడుకు... కాశిగాడు" – "రేయ్ ఇక్కర్రారా!" అంటూ గోలీలాడుతున్న వాళ్ళలో ఒకన్ని పిల్చి "మీకు పర్యేటు చెప్తాడు సూడు తెలుగుగేర్లో – వాయన ఇల్లుజూపీ" అన్నాడు. "థ్యాంక్స్".... "సారీ"... కొన్ని అర్బన్ పదాలు అలవాటుగా వాడాను. వాళ్ళు అదోమాదిరిగా చూస్తుంటే వాటికి ట్రాన్స్‌లేషన్ చేతకాక – మంచిది... వస్తా అంటూ ఆ పిల్లవాడి వెంట నడిచాను.

"బుర్ర్.... కీక్...." అంటూ రెండు చేతుల్తో ఆ పిల్లాడు స్టార్ట్ చేసిన ఉత్తుత్త బగ్గీతో ముందు పరిగెడుతున్నాడు. బండపరుపు ఉన్న గల్లీలోని ఒక ఇంట్లోకి పోయి మళ్ళీ పరుగెత్తు కొచ్చాడు. విశ్వనాథం అలియాస్ కాశిగాడు అడ్డపంచె దించుతూ గబగబా వచ్చాడు. "హలో! హలో! అబ్బబ్బ! ఎన్నాళ్ళకు జరిగింది నీ దర్శనం" కాశి చేతులు కలుపుతూ నన్ను రిసీవ్ చేసుకున్నాడు. సంచి ఓ మూలనపెట్టి, "మొత్తానికి దొరికావు. ఉండవేమో అనుకుంటూ వస్తున్నా"

"నేనా... నిన్ననే చేరింది నీ ఉత్తరం... ఏరే ప్రోగ్రాం ఉన్నా నీ కోసం ఆగిపోయా" అంటూ చెంబులో నీళ్ళందించాడు కాశి. కాళ్ళు మొహం కడుక్కొని పంచె బనీనులో దిగిపోతే అప్పుడు కాస్త హాయిగా అనిపించిది. అరుగు మీద కంబడి పరిస్తే వ్యానులో ఉతకబడిన శరీరాన్ని అక్కడ ఆరేశాను. ఉద్యోగ సోపానాలు, ఎంప్లాయ్‌మెంట్ న్యూస్, గ్రూప్ 1, గ్రూప్ 2, పుస్తకాలు కాశి పుస్తకాల గుట్టలో కనిపిస్తున్నాయి.

"ఓహో! కాశీ! త్వరలో ఆఫీసరయ్యే లక్షణాలు నీలో తన్నొచ్చినట్టు కన్పిస్తున్నాయ్. ఏ డిపార్ట్‌మెంట్ సెలెక్ట్ చేసుకున్నావేమిటి?" చాలారోజుల తర్వాత కాశితో జోకులు మొదలు పెట్టాను. "డిపార్ట్‌మెంటా పాడా! ప్రస్తుతానికి గృహము, వ్యవసాయ శాఖ వెలగబెడ్తున్నాను. అయినా నాకీ తంటాలు తప్పవు. నీలాగా జనవాణి, యువవాణిలో పనిచేసే టాలెంట్లు మాకు లేవుగదబ్బా. ఎవని గడ్డమో, కాలో పట్టుకొని ఉద్యోగం సంపాయించుకోకపోతే ఈ పల్లెలో బత్కలేం" కాశికి చదువు, ఉద్యోగం, పెళ్ళి... చక్రంలో రెండవ మజిలీ కోసం వెంపర్లాడుతున్నాడు. కాసేపు మళ్ళీ పి.జి. కాలేజి రోజులు.... హాస్టల్ జీవితం నెమరేసు కున్నాం. నవ్వుకున్నాం. కాశి వాళ్ళమ్మ చెంబెడు మజ్జిగ తెచ్చింది. తాగితే కడుపు ఎ.సి. రూంలాగా చల్లగైంది. భోజనాలయ్యాక కాసేపు సేద తీర్చుకున్నాను.

✡

సాయంత్రం ఇద్దరం కలిసి చెర్వుగట్టుకెళ్ళాం. హాస్టల్‌రూంలో గోడమీద కవిత్వం గుర్తుచేశాడు కాశి. చెర్వుగట్టుపైని బండి వస్తుంది. బండిలో నుండి బ్రహ్మంగారి తత్వం

వినబడుతోంది. చెర్వులో కొద్దిగా నీళ్ళున్నాయి. నల్లటి భూమిలో పగుళ్ళు వెక్కిరిస్తున్నాయ్. "ఈ పూళ్ళో బావులు, బోర్లు లేవా!" కాశిని అడిగాను. "పూర్లో అంతా 10, 15 ఎకరాల రైతులే. ఇద్దరో ముగ్గురో బావులు, బోర్లున్నవాళ్ళు. ఎక్కువ కురువ, బలిజ, వడ్డె కులాలున్నాయి. ఒకప్పుడు బోయ బీరప్ప నాయుడు కుటుంబం బాగా ఆస్తిగల కుటుంబం. రెడ్లతో ఫ్యాక్షన్ నడిపి ఇల్లు పొలాలు పోగొట్టుకున్నాడు. అలా చాలా బోయ కుటుంబాలు ఊరు వదలి వెళ్ళిపోయినాయి. ఇప్పుడతని మనుమడు అర్లప్పనాయుడు రెడ్డివైపే ఉండి ఉన్న కొన్ని పొలాల్ని కాపాడుకొని జీవనం సాగిస్తున్నాడు".

"ఊళ్ళో 200 ఎకరాల పొలం ఉంది – బైసానికి.

"బావి, బోరు, ట్రాక్టర్లు – బైసానివి."

"బంగళాలాంటి ఇల్లు బైసానిది."

"మండలాధ్యక్షపదవి – బైసానిదే. దాదాపు బంజారుహిల్స్‌ని ఈ హిల్స్‌లో ప్రత్యక్షం చేయగల దిట్ట బైసాని వెంకట సుబ్బారెడ్డి" చెప్పుకుంటూ పోతున్నాడు కాశి.

"అది సరే. మీ ఊళ్ళో జన్మభూమి పథకం కింద 100 రోజుల్లో స్కూలు, 12 గంటల్లో అంగన్‌వాడి కేంద్రం కట్టి రికార్డు సృష్టించారట కదా! ఏదీ ఓసారి వాటిని చూద్దాం పద" అన్నాను.

"రేపెలాగూ రెడ్డిగారిని కలిసి ఇంటర్వ్యూ చేసే పని ఉందిగదా! ఆయన నీకవన్నీ చూపించి, ఫుల్‌గా బిర్యాని కొట్టించి, ఇంకా ఇంకా... నీవు జర్నలిస్టుగా ముదిరింటే.... సకల మర్యాదలు చేసి పంపుతాడు"... కాశి కొంచెం ఎగతాళిగా అన్నాడు.

"ముదిరింటే నీ యింటికొచ్చి మజ్జిగెందుకు తాగుతానువై. మనకంత సీన్‌లేదులే గాని ముందవేవో చూద్దాం పద" అన్నాను. ఇద్దరం అక్కడినుండి కదిలాం. స్కూలు దగ్గరి కొచ్చాం. ఇంకా ఫినిషింగ్ పనులు జరుగుతున్నాయి. "అదిగో ఆపైన నిలబడుకోనున్నాయన వెంకటసుబ్బారెడ్డి తమ్ముడు వెంకట నాగిరెడ్డి."

ఆయన ఆర్డర్లు జారీ చేస్తున్నాడు. జరీపంచె పైకి కట్టి గంజి పట్టిచ్చిన ఖద్దరంగీ. ముంజేతికి గొలుసు. సిగరెట్ దమ్ము లాగిస్తున్నాడు. కాశి నమస్తే అన్నాడు. ఎడమచేయి కొంచెం పైకెత్తాడు రెడ్డి. మళ్ళీ ఆ కూలీలకు పని పురమాయిస్తూ మధ్య మధ్యలో బూతులు తిడ్తున్నాడు. ఎదురుగానే 12 గంటల్లో కట్టిన అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఊళ్ళో గవర్నమెంటు కట్టడాలంటూ ఏవైనా జరిగితే అది ఖచ్చితంగా నాగిరెడ్డికివ్వాల్సిందే. కొంచెం ముందుకు కదిలాం. రచ్చకట్టపైన చిలక పంచాంగం అందరూ ఆసక్తిగా వింటున్నారు. శివాలయంలో పెట్టిన రామాంజనేయ యుద్ధం పద్యాలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇంటికొచ్చేటప్పటికి సాయంత్రం 6.30 అయింది. కాశీయింట్లో పిల్లల సందడి. ట్యూషన్ పిల్లలు నిండుకు పోయారు.

“ఓహో! మంచి ఫ్యాక్టరీ నడుపుతున్నావే. సాయంత్రం మంచి కాలక్షేపమే” అన్నాను. “కాలక్షేపమా పాడా? ఈ చీమిడి ముక్కుగాళ్లు లొడుగుబుడుగు నిక్కరగాళ్లు... వాళ్ళకు అ – ఆలు. ఎక్కాలు వచ్చేదేమోగాని చెప్పిచెప్పి నా కొచ్చినవి కూడా పోయేటట్టున్నాయ్” అన్నాడు కాశి.

“సార్!...” ఒక పిల్లాడు బనీను, నిక్కరు... మెడలో అంత్రాలు... పలకపట్టుకొని సిగ్గు లొలకబోస్తున్నాడు.

“ఓయ్! ఏమిటి అన్ని అంత్రాలేసినవ్” అన్నాను నేను.

“వాడు పైపాడు జరమొచ్చి సచ్చిపోతుండె. అంత్రమేసినంక బత్కినాడు” వాడి అక్క చెప్పింది. వింతగుంది. “కాశీ! పైపాడు జరమేమిటదీ!” అన్నా.

“ ‘టైఫాయిడ్’ కొచ్చిన తిప్పలది” కాశీ చెప్పాక నాకు నవ్వాగలేదు. పదేళ్ళ పిల్లవాడు పై నుండి క్రిందవరకు పదులుగా ఉండే బనీను మాత్రమే వేసుకున్నాడు. వంతు ప్రకారంగా వాడి పలక తీస్కొచ్చిన్నాడు. “ఇదేమిట్రా – ఏమీ రాయకుండా తెచ్చినవ్?” కాశీ కొంచెం గట్టిగా అరిచాడు. వాడు పలకకుండా చేతులు రెండు కట్టుకొని తల నేలకేసి కనురెప్పలు పైకి పెట్టి చూస్తూ నిలబడినాడు.

“ఓయ్! ఏందట్ల బెల్లం కొట్టిన రాయిలెక్క నిలబడినవ్” కాశీ ఇంకొంచెం గట్టిగా అడిగేసరికి వాడు ఏడుపు లంగించుకున్నాడు.

“ఇంటికి పోతా... బువ్వ...” రాగాలు తీస్తూ ఏడుస్తున్నాడు. పక్కింటి పిల్లాడు అందుకున్నాడు “సార్! వాడు పైటాల బువ్వ తినలేదు సార్”

“ఎందుకు?”... అడిగాను.

“వాల్లమ్మ కూలికిపోయింది. వాల్ల నాయనకు కాల్లు చేతులిర్గినయ్... ఇంగ బువ్వ చేయనీక ఎవరున్నారు?” అన్నాడు పక్కనున్న పిల్లవాడు.

“ఏందీ. కాళ్ళు చేతులిర్గినయా. ఎట్ల ఇరిగినయ్. కింద పడినాడా....” కాశి ఆశ్చర్యంగా అడిగాడు. “లేదు సార్...” అంటున్నారు గాని పిల్లలెవ్వరూ పల్కడం లేదు. ఆ పిల్లవాడు కట్టుకున్న చేతుల్తో ముక్కు తుడ్చుకుంటూ “రొడ్డల్లు...రొడ్డోల్లు...” అంటూ ఏడుపు కొనసాగిస్తున్నాడు.

“ఓహో! నూకూర్చో. బజారీ!... ఏం జరిగిందిరా...” ఒక పెద్ద పిల్లోణ్ణి అడిగాడు కాశి.

“ఇగో! వాల్ల నాయన బడికట్టే పనికి రాకుండ రైలు కట్టపనికి పోయినడు. దుడ్లొస్తయ్ అని. అందుకనీ... రొడ్డోల్లు పిల్సి”... పిల్లవాడు ఇంకా పొడిగిస్తుంటే ఆపేసి “సరే నూ

కూర్చో" అన్నాడు. కారణం కాశికి పూర్తిగా అర్థమైంది. కాశి నాకు మిగిలిందంతా ఇంగ్లీషులో చెప్పాడు. విషయం వింటుటే విషం మింగినట్లుంది. రాయలసీమలో రెడ్లు తమ పేర్లకు ముందు పులిబిడ్డలు, తోడేళ్ళు అని రాసుకోవడమే కాదు నిజంగా చేసి చూపిస్తున్నారని ప్రత్యక్షంగా అర్థమైంది. ఆ పిల్లవాణ్ణి దగ్గరగా పిల్చి పేరడిగాను. చెప్పలేదు. సంచిలోంచి కెమెరా తీశాను. "ఒకసారి నవ్వు. నీ ఫోటో తీస్తాను" అన్నాను. ఫ్లాష్ లైటింగ్‌కి నవ్వాడు. "యిప్పుడు చెప్పు నీ పేరు..." అడిగాను.

"కిష్టగాడు"... చెప్పాడు.

"మీ నాయన పేరు..." అడిగాను.

"ఎర్రమద్ది"... పేరు నాకు నచ్చింది. జన్మభూమి ప్రోగ్రాం క్రింద రెడ్డి కట్టిస్తున్న బడికి కూలీ లేకుండా పనిచేసే కట్టడిపెడితే కాదని కూలికోసం రైల్వే బ్రాడ్‌గేజి పనికిపోయిన 'ఎర్రమద్ది' నిజంగానే గొప్పవాడనిపించింది నాకు. ఇద్దరం భోంచేసి మిద్దెక్కినాము.

"కాశీ!... ఇంతకీ ఆ స్కూలు స్థలం... అంగన్‌వాడీ స్థలం రెడ్డి యిచ్చాడా..." అడిగాను.

"యివ్వడం... అది వాళ్ళ ఇంటావంటా లేని అలవాటు. ఒకే ఒక కలంపోటుతో వేరేవాళ్ళ స్థలాలు లాక్కోవడమేగాని స్థలాలు దానం చేయడం... కలలో కూడా జరగదు. ఆ స్కూలు స్థలం అయిదెకరాలు ఒక కురువ కుటుంబానిది. అన్నదమ్ముల మధ్య పేచీ వచ్చింది. రెడ్డి దగ్గరికి పంచాయితికొచ్చారు. చాలాసేపు వాదులాట జరిగింది. చివరికి రెడ్డి 'రేయ్! ఇదేం బాగాలేదుగాని యిద్దరు గలిసి ఆ చేను బడికి రాసియ్యండి పొండి' అని ఆర్డరేసాడు. అంతే స్థలం రిజిస్టర్ అయింది. స్కూలు భవనం శంకుస్థాపనలోగాని, భవన నిర్మాణ శిలా ప్రతి స్థాపనలో గాని వాళ్ళ పేర్లు లేవు. స్థలదాత... 'బైసాని వెంకటసుబ్బారెడ్డి' గ్రామ విద్యాకమిటి ఛైర్మన్ అని తాటికాయంత అక్షరాలతో చెక్కించారు. చూసి అన్నదమ్ములిద్దరూ గుటకలు మింగడం తప్ప ఏం చేయలేదు. ఆపై ఒక వాలంటరీ సొసైటీ పెట్టించాడు. దాని పేరు మీద వసూలైన లక్షలలో నుండి 30 శాతం... పడేశాడు. స్కూలు నిర్మాణానికి పదిలక్షలు శాంక్షన్ అయ్యాయి. కాని దానికి యిసుక... కవాడికొండ వాళ్ళు... రాయి... కనకదిన్నెవాళ్ళు... సిమెంటు ఒంటిమిట్టవాళ్ళు ఫ్రీగా లారీలతో దింపారు... కూలీ లేకుండా ఊరిలో ఇంటికొక్కరు వచ్చి శ్రమదానం చేశారు. పేరుకు పేరు... డబ్బుకు డబ్బు... 'ఫ్యాక్షన్ వీడి చదువుల తల్లి బడికి' పేపర్లో వార్తలు" కాశీ కథ చెబుతుంటే విఠలాచార్య సినిమా గుర్తొచ్చింది నాకు. వేలికున్న ఉంగరం రుద్దితే ధన్‌మని రాక్షసుడు ప్రత్యక్షమై హీరోగారికి అన్నీ అమర్చినట్లు, రెడ్డిగారు ఫ్యాక్షన్ రింగు రుద్దితే చాలు అరచేతిలో వైకుంఠం ప్రత్యక్షమైతుంది.

నాకు రాత్రంతా నిద్రపట్టలేదు. ఎర్రమద్దిని చూడాలనిపించింది. మాట్లాడాలని మనసులో తపన. తెల్లారింది. స్నానమైంది. "ఓయ్! రెడ్డిదగ్గర నేన్జెప్పినవన్నీ ఎత్తకు. జాగ్రత్తసుమా"

కాశీ వార్నింగ్ ఇస్తుంటే "ఓయ్ జర్నలిస్టుకే చెప్పొచ్చావా... అవన్నీ మాకు తెల్సులేవై!..." అంటూ రెడ్డి దగ్గరికి బయల్దేరా.

✡

మూడంతస్తుల మేడ. పైన పెద్ద డిష్ గిన్నె... సింటెక్స్ ట్యాంక్. మూడో అంతస్తు నుండి బచ్చుకుక్క మొరుగుతోంది. కర్నూల్లో ఒక క్లాసికల్ ఏరియా నుండి తెగిపడిన ఆపార్టమెంట్‌లాగా ఉంది ఆ బంగలా.

గేటు దగ్గరే, "ఎవరు...ఎవరు కావాల..." ప్రశ్నలకు సమాధానం చెప్పాను. "రొడ్డి పూజ చేత్తున్నడు యీడగూసో..." ఒక జులపాలాయన కుర్చీ చూపించాడు. చాలా కొద్దిమందే కుర్చీల్లో కూచున్నారు. గుంపులు గుంపులుగా అక్కడక్కడ మాట్లాడుకొంటున్నారు. టాటాసుమో... జీపులు వరుసగా ఆగి ఉన్నాయ్. నలుగురైదుగురు పిల్లలు హోలీడే డ్రస్సుల్లో క్రికెట్ ఆడుకుంటున్నారు. నేను కూర్చున్న హాల్లో పెదరంగారెడ్డి ఫోటో... సుబ్బారెడ్డి ముఖ్యమంత్రితో, రాష్ట్రపతితో దిగిన ఫోటోలు షోకేసుల్లో నుండి తొంగి చూస్తున్నాయ్.

చాలా సేపటికి ఒక పిల్లవాడు యాష్ట్రే తెచ్చి టీపాయ్ మీద పెట్టాడు. ఫ్రిజ్ బాటిల్ తెచ్చి పెట్టా. కుర్చీల్లో వాళ్ళకు టీ వచ్చింది. అందరితోపాటు నేనూ తాగాను. యాష్ట్రే... రాగానే – అందరూ మాటలు ఆపి లోపలికి చూడడం మొదలు పెట్టారు. పేపర్లు చదువుతున్న వాళ్ళు అవి మడతపెట్టి సిద్ధంగా కూచున్నారు.

రంగంలోకి వెంకటసుబ్బారెడ్డి ప్రవేశించాడు. ఒక్క ఉదుటున అందరూ లేచి అప్రయత్నంగా నమస్కారాలు పెట్టేశారు. నేనూ అదే చేసినా... సింహాసనంలాంటి తన కుర్చీలో సుబ్బారెడ్డి దేహం నిండుగా ఉంది.

"ఏరా... దయ్యందిన్నె బాయోల్లు వచ్చినారా?" ఎవర్నో అడిగాడు.

చేతులు కట్టుకున్న ఒకాయన "వచ్చినార్రొడ్డి... ను ఫోన్ జేస్తే ఆటికి బోతం రొడ్డి" అన్నాడు. "ఆ! మీరు ఎస్.ఐ. దగ్గరికి పోండి. నేను ఫోన్ చేస్త" అతని వెంట ఒక గుంపు వెళ్ళిపోయారు.

రెడ్డి ఫోన్లో... "నమస్తే, అవునవును... రాత్రి లేటాయె. తీస్కోని పోయినారు... అవును... వాళ్ళు వస్తున్నారు... లేదు... లేదు... వాళ్ళిద్దర్ని... ఆ! పంపిచ్చెయ్యి... ఉంట మల్ల..." ఆ పదాలతోనే ఏం మాట్లాడాడో అందరికీ బాగా అర్థమైపోతుంది. ఇంకొకయన వచ్చి నెత్తిగీరుతూ నిలబడినాడు... "ఏరా... కాదురా... ఎస్.పి. సంగతి తెల్సుగదా మీకు. మల్ల ఎవడ్రావాడు... అట్ల జేసినోడు. ఏం మీరంతా వూరిడ్సాలనుకుంటున్నారా! మీ వూరిదెప్పుడిదే పాడు పంచాయితి. ఇగో... కరి పండగనాడు మొండోడు... సత్తిగాడు ఇద్దరిని ఉండొద్దని చెప్పు"

సిగరెట్ పట్టుకున్న రెండు వేళ్ళతో రెడ్డి వార్నింగిచ్చాడు. సరే! రెడ్డి అంటూ తల ఊపుతూ వాడు వెళ్ళిపోయాడు.

నావైపుకు దృష్టి మలిచాడు. నాకు అప్పుడే మాట్లాడి వెళ్ళిపోవాలని లేదు. చాలా యింట్రెస్టింగ్‌గా ఉంది. వినడానికి, చూడడానికీ...

"మీరు... చెప్పండి" అన్నాడు నాతో.

"నేను 'జనవాణి' అని ఒక మాసపత్రికలో పనిచేస్తున్నాను" విజిటింగ్ కార్డిచ్చాను. "జన్మభూమి గురించి సమీక్ష రాస్తూ మీ వూరిలో జరిగిన ప్రోగ్రెస్ గురించి రాయాలనుకున్నాం. అట్లే మీతో ఇంటర్వ్యూ తీసుకుందామని..." పొడిపొడిగా మాట్లాడినా.

ఖద్దరు ఫుల్ షర్టును మడతల పెడుతూ... "మీరు పేపర్లలో చదివే ఉంటారుగదా! మేము ప్రత్యక్షంగా చెప్పేదేముంది. మేము ఒక వాలంటరీ సొసైటీ తరపున ఊళ్ళో చాలా పనులు చేపట్టినాం. హైస్కూలు, అంగన్‌వాడి, రోడ్లు... రేయ్ నర్సి... మనవి. ఆ జన్మభూమి ఫోటోలు తెచ్చియ్యి" అన్నాడు.

"జన్మభూమి గురించి మీ అభిప్రాయం..." అన్నాను.

"జన్మభూమి చాలా బెస్ట్ ప్రోగ్రాం... కంట్రాక్టర్లకు తినబెట్టకుండా ప్రజలే ముందుకు వచ్చి శ్రమదానంతో అన్నీ నిర్మించుకోవడం... అసలు ఇది మొత్తం దేశానికే ఆదర్శం కదా..."

"అంటే దీనిలో కంట్రాక్టర్ల ప్రమేయం ఏమీ లేదంటారా?" అడిగాను.

"లేదు. ముఖ్యంగా మా ఊరు ఒకప్పుడు ఫ్యాక్షన్‌తో ఉడికిపోయింది. జన్మభూమిలో అందరూ కలిసికట్టుగ పనిజేసినారు. బడి కట్టుకున్నారు. నీరు మీరులో పూడికలు తీస్కున్నారు. ఇప్పుడు ప్రశాంతంగా బత్కుతున్నారు" అన్నాడు.

ఇంతలో ఒక జీప్... నిండా జనం దిగారు. "రేయ్... ఆ 'దండోరా' వాళ్ళ జీపు వచ్చినట్లుంది.... ఇద్దర్ని మాత్రమే లోపలికి పంపు..." అన్నాడు.

"సరే... నేను వెళ్తానండి..." లేచాను.

"పత్రిక ఏదన్నారు?" అడిగాడు రెడ్డి. పత్రిక పేరు చెప్పి బయటపడ్డాను.

✡

"ఓన్నా... రాత్రి ఫోటో దీస్తివి గద ఎప్పుడిస్తవు..." కాశి ప్రైవేటు పిల్లవాడు ఒకడు వచ్చి అడిగాడు.

"అదా... అది మీ సారుకిస్తగానీ, మీకిప్టిగాని ఇల్లు చూపిస్తవా" అన్న. ఎర్రమద్దితో మాట్లాడాలని.

"అగో... ఆ సింతమాను పక్కన ఉండే తడిక వాకిలిల్లే..." పిల్లాడు చూపించాడు. పోదాం రా పిల్చుకునిపోయాను. కిష్టిగాడు నన్ను చూసి పరుగెత్తుకొచ్చాడు. కెమెరా ఉన్న నా సంచీనే చూస్తున్నాడు. నవ్వుతున్నాడు.

"ఎవరు నాయనా..." కిష్టిగాని అమ్మ లోపల్నుంచి తొంగి చూసింది.

"అగో... ఈయన... మా సారు వాళ్ళింటికి వచ్చినాడు. నిన్న పోటో తీసినాడని చెప్తి కదా... ఈయనే తీసినేది" కిష్టిగాడు చెప్పాడు.

"ఓహో! అంటే ఫోటోలు తీసేటాయన కదా... కూచ్చో నాయనా..." కిష్టి వాళ్ళమ్మ అరుగు చూపించింది. నేను స్టూడియో వాడిలాగా అనుకోబడడం... మేలే అన్పించింది. కొంచెం మంచి నీళ్ళియ్యమ్మా... అన్నాను. వ్యానుకు పోవాలేమొకదా నాయినా... కూచో వస్తదిలే... అమె చాలా ఆప్యాయంగా మాట్లాడింది. మంచినీళ్ళు తాగుతూ "ఎట్లుందమ్మా వీళ్ళ నాయనకు. ఏదో దెబ్బలు తగిలాయని చెప్పాడు" అన్నాను.

ఆమె వెంటనే చాలా జాగ్రత్తగా "అగో – వద్దంటే ఆ రైలుకట్ట పనికిపోయినాడు. అది మనకి అలవాటులేని పని. గంపనెత్తుకొని ఆ రాళ్ళ మీద అట్లే కూలబడినాడంట. దెబ్బలు తగిల్నయ్. అగో మంచం మీద పడుకున్నాడు" అని చూపించింది.

"ఎర్రమద్ది" ఏం మాట్లాడలేదు. చాలా గంభీరంగా ఉన్నాడు. నేనే కలుగజేసుకుని "బాగుందా ఆరోగ్యం" అన్నాను. "ఫోటో తీయనా ఒకటి" అడిగాను. కిష్టిగాడు సంబరంగా... దగ్గరికొచ్చి "నన్ను మా నాయనను ఒక ఫోటో తీ..." అన్నాడు.

"వద్దు..." ఎర్రమద్ది గదమాయించాడు. "మాక్యాల ఫోటోలు... కూలి నా కొడుకులకు ఎచ్చులెక్కవైంది అంటారు." నేను కెమెరా తీయబోయినాను. కిష్టి వాళ్ళమ్మ "వద్దులే నాయనా... యాదో మాకవి అచ్చుబాటురావులే" అనింది.

"సరే! మరి ఈ కాళ్ళు చూపించుకోవడానికి డాక్టర్ దగ్గరికి పోరా..." అడిగాను.

"పోతుండం యియ్యాల... అక్కడ వేరే దేశం.... పరమటికి పోతం..." అంటుందామె.

"అంత దూరం ఎందుకు?" అడిగాను.

ఆమందుకుంది "ఏం జేస్తవ్ నాయనా – కడుపు కాలినోల్లం. మీ లెక్క వున్న మారాజులమా... కడుపు పట్కోని యాడ యింత ముద్ద దొర్కితే ఆటికి పోతాం. యాదో యిన్నాల్లు మా రెడ్డోల్ల పున్నెమా అని బత్కినం" కొంత వణుకుతున్న గొంతుతో ఆమె చెప్తోంది.

"మరిప్పుడేమైంది..." నేనందుకున్నాను.

"ఎన్నాళ్ళని... ఊర్లో పంటలు లేవు. పనులు లేవు. మొత్తం మా మాదిగ కుటుంబాలన్నీ బత్కనీక పోతుండయ్" చెప్పిందామె.

"ఎందుకు జన్మభూమి పేరు మీద మీ వూర్లో పనులు బగానే జరుగుతున్నయ్ గదా..." అడిగాను.

"దాండ్లతో మా కడుపునిండదులే నాయినా..." ఆమె అంటుండంగా ఊర్లో ఏదో దండోరా మొదలైంది.

"ఊర్లో యవన్మందికి తెలియజేయడమేమనగా ఈనెల 26వ తేదీ మన వూరిలో కలెక్టర్ మీటింగ్ ఉంది. మన ఊరు జన్మభూమిలో ఫస్ట్ వచ్చినందుకు మన ఊరికే బహుమానాలిస్తరు. కాబట్టి ఆరోజందరూ మీటింగ్‌కు రావాల్సిందిగా తెలియజేస్తున్నాం..." తప్పెట మ్రోగుతోంది.

"వస్తానమ్మా" అంటూ నేను బస్టాండువైపు కదిలాను. మఱ్రిమాను కింద ఆరోజు చాలామంది మూటలు, సామాన్లు కట్టుకొని కూచున్నారు.

"ఏరా... అందరూ మాటాముల్లె సర్దినారు" ఒక పెద్దమనిషి అడుగుతున్నాడు.

"బత్కనీక పోతాండం సామీ.... పిల్లాజెల్లా అందరూ..." అన్నాడొకాయన. అందరూ వ్యాన్ కోసం ఎదురు చూస్తున్నారు.

ఒక తల్లి పాలుతాగే పిల్లోని మీద మిసుక్కుంది. "ఏందిరా... పొద్దుమూకులు గుంజుతున్నావ్.... ఏదుందని.... నాకాడ సారముంటేనా.... నూ తాగేది..." కొంగుమూసి పసిపిల్లోన్ని బుజ్జగిస్తోంది.

✡

# పొలిమేర దాటెళ్లిపోయింది

**-వంశీ**

రాజమండ్రి నించి భద్రాచలం వెళ్తుంటే పాపికొండలకి ముందు కుడిపక్క తగిలే కొండమొదలు అనే ఊళ్ళో టీచరు ఉజ్జోగం చేస్తున్నాడు చినశంకరం.

సంక్రాంతి నెలపట్టి మూడువారాలు దాటేసింది. పండక్కి రమ్మని ఉత్తరం వచ్చింది అత్తారి ఊరయిన పసలపూడినించి. భార్య విమలకూడా అక్కడే ఉంది. దాంతో రెండు మూడు రోజులు ముందే బయలుదేరిపోవాలని అనేసుకున్నాడు కొత్తగా పెళ్ళయిన చినశంకరం.

✡

అప్పుడే తెల్లవారుతుంది. ఆకాశం ఎత్తులో ఎదురుగా కనిపిస్తున్న పాపికొండల మీంచి సుళ్ళు తిరుగుతా వీస్తుంది గాలి. ఇటు కొండమొదల్లో జాలరోళ్ళు, అవతల శిరువాకలో వున్న జాలరోళ్ళు కలిసి గోదార్ని ఎడాపెడా పంచుకుని వేసుకున్న వలల మీద ఇలాయి బుడ్లు మినుకుమినుకు మంటా వెలుగుతున్నాయి.

మిలట్రీరంగు ట్రంకుపెట్టితో ఆ రేవులో కొచ్చాడు చినశంకరం. భద్రాచలం నించి రావాల్సిన మన్యంరాణి పేరుగల లాంచీ ఇంకా రాలేదు. ట్రంకుపెట్టి నేలమీద పెట్టి రేవులోకెళ్ళి దోసిట్నిండా నీళ్ళు తీసుకుని తాగేసి వచ్చేడు. "ఇక్కడిగాలిలోనూ, మట్టిలోనూ, నీళ్ళలోనూ ఎందులోనూ కల్తీ లేదు. పవిత్రమైన ఆ గోదావరి మాత నివాసం ఇక్కడే గదా'' అనుకుంటుండగా డబ్ డబ్ మంటా లాంచీ వస్తున్న చప్పుళ్ళు వినిపించినియ్యి. గాలి బాగా పెరిగింది. కదుల్తా చప్పుడు చేస్తున్నాయి నీళ్ళు.

రేవులోకొచ్చి ఆగింది మన్యంరాణి లాంచి. సరంగు తోగుమ్మిబాలయ్య గెడెయ్యడానికి ముందే గట్టు మీంచి పెట్టితో పాటే అమాంతంగా ఎగురుకుంటా లాంచీలోకి దూకేసేడు చినశంకరం.

లాంచీ లోపల గుమాస్తా పాదం రవణమూర్తితో "టికెట్టు రాజమండ్రికి" అని చెప్పి కేవు ఇచ్చి ఆయిలు మరకల్తో ఉన్న బల్లమీద జరిగి కూర్చున్నాడు.

ఆవేళ భద్రాచలంలో ఆడొస్తున్న రాజమండ్రి పౌరాణిక నాటకాల ట్రూపోళ్ళతో నిండిపోయింది లాంచీ. ఎండు మిరపగాయల బస్తాలూ, చింతపండు బుట్టలూ, అరిటిగెలలూ, ఎవరో పాటకపు పెళ్ళోళ్ళ గుంపుతో నిండిపోయి ఉంది లాంచీ టాపు. దానిమీదికి కాస్సేపున్నాకా పైకెళ్ళొచ్చులే అనుకుని లోపలే సర్దుకున్నాడు.

"ఎందాకా?" అడిగేడు నాటకాల ట్రూపు కాంట్రాక్టరు పాపారావు.

చెప్పేడు చినశంకరం.

"అరె పసలపూళ్ళో ప్రతి గణపతి నవరాత్రులకీ ప్రోగ్రామ్సు చేస్తుంటాం గదా? అవి చేయించే రెడ్డిగారింట్లో భోజనం ఒకసారి చేస్తే మర్చిపోలేవండి ఒక్కసారి వారిలోగిట్లో భోం చేసి చెయ్యికడుక్కుని చచ్చిపోవచ్చు. అంత గొప్ప రుసి అంత గొప్ప జనం అంత గొప్ప ఊరు" అంటా చాలా చెప్పుకుపోతున్న కాంట్రాక్టరు "ఆవూరి గురించి ఇంకా చాలా తెలుసండి అబ్బాయిగారు... ఎందుకంటారేమో ఎన్నేళ్ళనించో ప్రోగామ్సు లాడుతున్నావండి పసలపూడిలో..." అంటా ఇంకా చాలా మాటాడుకుంటా పోతుంటే సంబరంగా అతన్నే చూస్తున్నాడు చినశంకరం.

✡

కాలవగట్టు దగ్గిరాగిన బస్సులోంచి దిగిన చినశంకరం ట్రంకు పెట్టి పట్టుకుని దిగువలో ఉన్న వూళ్ళోకి నడక మొదలెట్టేడు.

రథం ముగ్గులు, మల్లెపందిరి ముగ్గులు, ఏనుగుపాదం ముగ్గులు ఒకటేంటి రకరకాల ముగ్గులు ఒంచిన నడుం ఎత్తకుండా నడవడానికి పిసరంత సందులేకండా ముగ్గు లేసేస్తున్నారు ఆడపిల్లలు. చిన్నచిన్న సందులన్నీ కల తిరిగిన హరిదాసు బ్రహ్మయ్యగారి వీధిలో కొచ్చేసరికి చిన్నపిల్లలంతా కల్సిదండ కట్టేసేరు. రెడ్ల ఇళ్ళకి పెరుగులకీ పాలకీ వెళ్తున్న చిన్న కులాల పిల్లలు గోపాలస్వామి గుడి గోడ పక్కన రాలిన పారిజాతం పూలు ఏరుకుంటున్నారు. చింతపిక్క రంగు ఎత్తయిన గచ్చు అరుగులూ, బర్మాటేకు స్తంభాలు ద్వారబంధాలకి ఎడాపెడా జక్కం వీరన్నలాంటి వడ్రంగి శిల్పులు చెక్కిన నెమళ్ళు, తొండాలు పైకెత్తి నీళ్ళు చిమ్ముతున్న ఏనుగుల బొమ్మలతో నిండి ఉన్నాయి. ఇక వైభోగంతో వెలిగిపోతున్న మండువాలోగిళ్ళు అద్దాల మేడలు గాలిమేడలూ సరేసరి.

అత్తారింటి ముందు కొచ్చేటప్పటికి బామ్మరుదులూ మరదళ్ళూ చుట్టూ మూగేసేరు. పాలేరు అప్పన్నొచ్చి బెడ్డింగూ ట్రంకుపెట్టి లోపలికి పట్టుకుపోయేడు. మామగారు మంచీ చెడ్డా అడుగుతుంటే కాళ్ళు కడుక్కోమని కూజా బిందెడు నీళ్ళు తెచ్చింది అత్తగారు. తలుపు వెనక నిలబడున్న భార్య విమల ఆ సందులోంచే నవ్వుతా టపటపలాడిస్తుంది తన వెడల్పాంటి కంటి రెప్పలు.

మధ్యాహ్నం,

గోర్మిటీలు, బెల్లంపూతరేకులూ, పాలపూరీలు, పాకుండలూ రకరకాల పిండి వంటలు. దబ్బకాయ పులిహోరా, ఆవపెట్టిన అరిటిపువ్వుకూర, పనసపొట్టుకూర, కందిపచ్చడి, అత్తగారలా కూరేస్తుంటే ఎక్కిసం అయిపోయినా మొత్తానికెలాగో లాగించి పందిరి పట్టి మంచం ఎక్కి పడుకున్న మనిషి తిరిగి లేచేసరికి చీకటి పడిపోయింది.

కందికంపతో కట్టిన స్నానాలదడిలో కెళ్ళి వేడినీళ్ళు నెత్తిమీద దిమ్మరించుకుంటుంటే ఆ శీతాకాలం రాత్రి చెప్పలేనంత హాయిగా ఉంది. ఎన్ని చెంబుల నీళ్ళు పోసుకున్నాడో.

స్నానం అయ్యాక, బట్టలేసుకుని చలిగాలిలో అలాగ పంచాయితీ ఆఫీసు వేపెళ్తుంటే, రాములోరిగుడి అరుగుల మీద కూర్చున్న ఊళ్ళో పెద్దోళ్ళు సిల్లోబొల్లోమంటా చిన్న పిల్లలు సందడి సందడిగా ఉంది. ఈలోగా పంచాయితీ బోర్డు ఆఫీసు స్తంభానికి కట్టిన స్పీకర్లోంచి వార్తలొస్తున్నాయి. ఊరి మొత్తానికి ఒకటే రేడియో.

"ఎంత అందంగా ఉందీ ఊరు. ఎక్కడ చూసినా ఎంత సంబరంగా ఉందీ" అనుకుంటా నడుస్తున్నాడు చినశంకరం.

✡

భోగి ఆవేళ. "ఒకసారి విమలా నేనూ కల్సి మా చిన్నక్కయ్యగారి ఊరు వెళ్ళొస్తావండి" అన్నాడు చినశంకరం.

"ముక్కనుమ తర్వాత వెళ్ళగూడదా?" అన్నాడు మామ నర్సిమ్మూర్తిగారు.

"మళ్ళా దీపాలవేళకి వచ్చేస్తాం లెండి" అని భార్యతో బయల్దేరుతుంటే మాసిపోయిన గుడ్డల మూటట్టుకుని వస్తున్న బూరయ్య పెళ్ళాన్ని కాస్త ఎదురు రమ్మంది అత్తగారు సీతారావమ్మ.

కాలవ దగ్గర కొచ్చాక రేవులో ఆగున్న గూటి పడవ ఎక్కి "పెడపర్తిరేవుకి" అని కేవు ఇచ్చేడు.

వెడల్పాటి ఆ గోదావరి కాలవలో గూటి పడవ నెమ్మదిగా వెళ్తుంటే కాలవకి ఎడాపెడా పచ్చటి వేప చెట్లు, మామిడిచెట్లు, గానుగచెట్లు నిద్రగన్నేరు చెట్లూ, ఏ పక్కకి చూసినా పచ్చదనం. దూరంగా ఎక్కడో పొలాల్లో తాటాకు గుడిశలు వాటి కొప్పుల్లోంచి వస్తున్న పొగ, పులగుర్త రేవు దగ్గర కొత్త బటలు కట్టుకున్న నలుగురు ఆడపిల్లలు మొన్నే వండిన కొత్త బెల్లంతో చేసిన పరమాన్నం, బూర్లూ, ఇత్తడి గిన్నెల్లో పెట్టుకుని వాటి మీద అరిటాకు ముక్కలు కప్పుకుని వయ్యారంగా నడుచుకుంటా వెళ్తున్నారు. వాళ్ళనే చూస్తున్న చినశంకరం "అవి తీసుకుని వాళ్ళెక్కడి కెళ్తున్నారంటావ్?" అన్నాడు.

"బంధువులిళ్ళకి... వాళ్ళు వండుకున్నవి వీళ్ళకి కూడా పంపిస్తారు" అంది విమల.

ఇంకొంచెం ముందుకెళ్ళేక "ఒహోం... ఒహోం" అన్న కేకలు వినిపించినియ్యి.

ఆడోళ్ళని పల్లకి ఎక్కించుకున్న బోయీలు మోసుకెళ్తున్నారు వెడల్పాటి పొలంగట్లమీంచి.

పెడపర్తి రేవులో ఆగింది గూటి పడవ.

అక్కడ్నించి జట్కా ఎక్కి ఊళ్ళో ఉన్న చిన్నక్క ఇంటికెళ్ళాడు.

ఆవు పేడతో అలికి ముగ్గులు పెట్టిన అరుగులు. పసుపు రాసి బొట్లెట్టిన గడపలు మామిడాకుల తోరణాలు కట్టిన ద్వారబందాలు, సాంప్రదాయంతో కళకళలాడుతుంది ఊరు. కాళ్ళు కడుక్కోడానికి పాలేరుతో ఇత్తడి గంగాళంచెంబు పెట్టించింది వాళ్ళ చిన్నక్క. చిలక్కొయ్యకి తగిలించున్న గళ్ళ తువ్వాలందించాడు బావ.

లోపలికొస్తున్న వాళ్ళిద్దర్నీ కూర్చోమని రెండు ముక్కాలి పీటలు వేసారు.

కాస్సేపయ్యాకా "పక్కనే ఉన్న రామవరంలో ఉన్న పెద్దక్కని కూడా చూసిరా బాగోదు" అంది చిన్నక్క.

సవ్వారీబండి సిద్ధం చేసేడు బావ.

ఎక్కకుండా అలా చూడబుద్దేస్తుంది ఆ సవ్వారీ బండిని. ఆరోగ్యంగా ఎత్తుగా ఉన్న ఎద్దులకాళ్ళకి గజ్జలూ, మెళ్ళో గంటలూ, మోపురం చుట్టూ భుజాలకి రంగు రంగుల రిబ్బన్లూ కట్టారు. ఒంపు తిరిగున్న ఎద్దుకొమ్ముల మొసాలకి కంచు రింగులు తొడిగేరు. బండిలోపల దళసరి జమ్ఖానాలు పరిచారు.

"మరి వేళవుతుంది బయల్దేరండి" అని చిన్నక్కనేసరికి ఆ బండెక్కారు.

ఘల్ ఘల్ మంటా బలభద్రపురం ఎర్రకంకర దుమ్ము లేపుకుంటా పచ్చా పచ్చని చెట్ల నీడల్లో ఉన్న పెడపర్తి దాటి కుతుకులూరు చెరువు మీదుగా ఆ సవ్వారీ బండి వెళ్తుంటే అత్తారిళ్ళకి ఆలశ్యంగా వస్తున్న కొత్త పెళ్ళి కొడుకులు అప్పుడే జట్కా బళ్ళు దిగుతున్నారు. పొరుగూరు అల్లుళ్ళయిన ఆవూరి కుర్రోళ్ళు సుబ్బరంగా కడిగి ఆయిలు పెట్టిన సైకిళ్ళ ఊచలకి మామిడాకులు కట్టి పాటలు పాడుకుంటా పోతున్నారు. సారె నింపిన ఇత్తడి బిందెలకి పసుపుగుడ్డలు కట్టి వాటిని కావిళ్ళలో పెట్టి ఆవూర్నించి పొరుగూరికి పరుగులాంటి నడకతో మోసుకుపోతున్నారు. రామవరం ఊళ్ళోకి రాగానే వెలుగుతున్న భోగిమంటలు దాటుకుంటూ, తెలుకులగానుక పాక దాటుకుంటూ చినశంకరంగారి పెద్దక్కయ్య ఇంటి దగ్గరాగింది సవ్వారిబండి.

ఆ ఇంటి ముందు ఒకటే జనం.

వాళ్ళ మధ్యలో ఊరి ప్రెసిడెంటు నల్లమిల్లి పద్దయ్యారెడ్డిగారు. ఆయన పక్కన చినశంకరం పెద్దబావ. ఆ వూళ్ళో ఆయన్ది పోస్టుమేస్టరుజ్జోగం. పోస్టాఫీసు వీధరుగు మీద గదిలో ఉంది.

తెల్లవారుఝామున వూరికుర్రోళ్ళు దొంగతనంగా తలుపులు బద్దలు కొట్టి పోస్టాఫీసులో టేబులూ కుర్చీ భోగిమంటలో పారేసారట. వాళ్ళెవరో తేలక తల పట్టుకున్న ప్రెసిడెంటు గారికి నవ్వూ ఏడుపూ కలిపొచ్చేస్తున్నాయి.

బండి దిగిన చిన శంకరాన్ని చూసి అన్నీ మర్చిపోయిన పెద బావ లోపలికి తీసుకెళ్ళాడు. ఇద్దరికీ తలంటు పోసి పట్టుబట్టలూ పండుగ భోజనం పెట్టింది పెద్దక్క.

✡

ఇంతసేపూ చెప్పింది నిన్నా మొన్నటి కథగాదు. ఎప్పటిదో అసలు ముసలోడయిన చిన శంకరం గారు కాలం చేసే నాటికి నేను పుట్టేలేదు. ఇదంతా పెద్దోళ్ళెవరో చెపితే విన్న కథ. అందమైన ఆనాటి అందమైన చినశంకరంగారి జీవితాన్నీ అందమైన మా కాలవ కింద పల్లెటూళ్ళని వాటి మధ్యలో మరీ అందమైన పసలపూడి గ్రామాన్నీ చెక్కు చెదరని సాంప్రదాయాల్నీ, కట్టుబాట్లనీ, మావాళ్ళ అమాయకత్వాన్నీ మానవ సంబంధాల్నీ హాయిగా నెమరేసుకుంటా చాలా ఏళ్ళ తర్వాత ఊళ్ళోకి దిగేను.

నడుస్తుంటే సుబ్బారాయుడు గుడి దగ్గర ఎదురైన ఆదియ్య నన్ను గుర్తుపట్టి పలకరించేదు. బుర్రకథ దళంలో హాస్యం చెపుతాడతను. బాగా ఒంగిపోయిన అతన్ని చూస్తా “ఇప్పుడు చెప్పడం లేదా బుర్రకథలు?” అనడిగితే బాధగా నవ్వుతూ “ఇప్పుడు మన కథలు ఇనే జనం ఏరి అబ్బుగారూ?” అంటా ఒకప్పుడు హరికథలూ, బుర్రకథలూ, పౌరాణిక నాటకాలూ కాలక్రమేణా అయ్యన్నీ పోయి తర్వాత విడియో కేసెట్లూ టీవీలు. ఆ ప్రోగ్రామ్సన్నీ చూస్తున్న జనాల్లో రకరకాల మార్పులండీ అంటూ బాధగా గత కాలాన్ని తల్చుకుంటుంటే మా పక్క నించెళ్తున్న మిషనుకుట్టు త్యాగరాజుగాడు నన్ను చూసి సైకిలు దిగి పలకరించేడు. నవ్వుతా ఆడిభుజం మీద చెయ్యేసేను. ఆ మాటా ఈమాట అయ్యేక “మన చిన్నప్పటి స్నేహితుడు అదేరా మనకంటే చాలా పెద్దోడు కోనాలోళ్ళ రాజు ఎలాగున్నాడు” అన్నాను.

“ఇద్దరు మగపిల్లలు ఆడికి. పెళ్ళిళ్ళు చేసేసేడు. ఆ కొడుకులు ఆళ్ళ పెళ్ళాం పిల్లలు తప్ప రాజునిగానీ నీరుడు జబ్బుతో బాధపడే వాళ్ళావిడ్నిగానీ చూడ్డం లేదు ఇక కోడళ్ళయితే ఈ అత్తమావలు ఎప్పుడొదుల్తారా అన్నట్టున్నారు” అన్నాడు.

“ఇలాంటి మనుషులు ఇంతకు ముందు మనూళ్ళో లేరే”.

“ఇప్పుడు వూర్నిండా ఇలాంటోళ్ళే. మొన్నా మధ్య దేవాంగుల పేటలో బళ్ళ బాల సుబ్రమణ్యంగారు పోతే శవం నట్టింట్లో ఉండగానే ఆస్తి గురించి కొట్టుకు చచ్చేరంట వాళ్ళ పిల్లలు... ఆనాటి సంబందాలిప్పుడు లేవు” అన్నాడు.

ముందుకి నడుస్తున్నాం.

చుడీదార్లూ మిడీలు వేసుకున్న ఇద్దరు పిల్లలు కేనటిక్ హోండా వెనకాలెక్కి మాముందు నించెళ్ళేరు. గోపాలస్వామి గుళ్ళో పూజారిగారి కోడలు నైటీ వేసుకుని నారంజకాయల సైకిలోడితో బేరమాడుతూ ఈలోగా తేగలకట్ల తట్ట మనిషెత్తుంటే దాన్ని పిలుస్తుంది స్టయిలుగా.

ఆ మనిషిని చూస్తున్న నాతో "రోజులు చాలా మారిపోయినియ్యి ఆ కట్టు ఆ బొట్టు ఇప్పుడు కనపడదు పద" అని కదిలేడు త్యాగరాజు.

వాడ్రేవు భానుమూర్తిగారి మండువాలోగిలంతా ఖాళీగా ఉంది. బాగా ముసల్దయిపోయిన భానుమూర్తిగారి పెదక్క వెంకాయమ్మ గారు మట్టుకి అరుగుమూల కూర్చుని ఏ కళాలేని గాజుకళ్ళతో వెళ్తున్నది ఎవరా అన్నట్టు జూస్తుంది మమ్మల్ని. ఒకప్పుడు ఎంత కళకళలాడేది ఈలోగిలి అంటున్న నాతో "భానుమూర్తిగారు పోయేక ఫేమిలీలో జనం మొత్తం హైదరాబాదెళ్ళిపోయేరు. అసలు జనం ఊళ్ళో ఉండడం లేదు. పిల్లలు చదువులకనీ, వుజ్జోగాలకనీ వలస పోతున్నారు. పెరుగుతున్న జనాబావల్ల ఈ మాత్రం జనంతో ఉందీ ఊరు" అన్నాడు ఆదియ్య.

ఊళ్ళో ఏ పక్క జూసినా కెనటిక్ హోండాలూ, స్ప్లెండర్లూ కనపడ్తున్నాయి. నడుస్తున్న మా పక్కనించి ఒక ఇండికాకారు స్పీడుగా వెళ్ళిపోతే క్వాలిస్ దానికి ఎదురొచ్చింది. "ఇప్పుడు జట్కాలూ సవ్వారీ బళ్ళు లేవు గదా?" అంటే "ఏకాలంలో ఉన్నావురా బాబూ" అంటా నవ్వేసేడు త్యాగరాజుగాడు.

"పూర్వం పండగరోజులొస్తే పొద్దుటే పుంతరేవు దగ్గర నీళ్ళల్లో దిగుతా ఎంతమంది జనం వుండేవారు... ఇప్పుడు ఇళ్ళలో కట్టుకున్న బాత్‌రూముల్లోనే స్నానాలు. ఆడోళ్ళు ముఖాలకి పసుపు రాసుకోవడం లేదిప్పుడు రకరకాల క్రీములు, కొంకిడికాయలకి బదులు షాంపూలు చూసేవుగా పూజారిగారి కోడల్ని" అన్నాడు త్యాగరాజు.

సంతపేటలో ఒకప్పుడు ధాన్యం మిల్లుండేచోటు ఇప్పుడు ఖాళీగా ఎత్తుగా పచ్చగడ్డి మొలిచి ఉంది. మాసిన పంజాబీడ్రస్సు వేసుకున్న ఒక పిల్ల రెండు గేదెల్ని అక్కడ మేపుతా గొల్లలతూము దగ్గర ఎవరో పాతిల్లు పడగొట్టి మోడ్రన్ బిల్డింగ్ కట్టుకున్నారు. ఆవేళ గృహప్రవేశం అనుకుంటాను. వరసగా టేబుల్స్ వేసి ఉన్నాయి. కూర్చుని భోంచేస్తున్న జనాల ముందుకి అన్నం గిన్నెతో వచ్చిన కుర్రాడు "కొంచెం వైట్‌రైస్ వడ్డించమంటారా?" అంటున్నాడు. భాషలో ఎంత మార్పు? అనుకుంటుండగా, ఆ జనాల్లోంచి అప్పుడే భోంచేసి బయటికొస్తున్న చింతా సుబ్బారెడ్డి గారూ విశ్వనాథరెడ్డి గారూ నన్ను జూసి వాళ్ళ మేడలోకి రమ్మన్నారు. వాళ్ళ కూడా వెళ్తున్నాను. మేస్త్రి వీరాస్వామిగారింటి ముందు బాకా మట్టుకి ఊదుతూ కనపడ్డ గంగిరెద్దుల వాడి పక్కన ఎద్దులేదు. "ఎందుకు" అంటే "మాకే గడవడానికి

కష్టంగా వుంటే ఇకదాన్నెక్కడ మేపం బాబయ్యా?” అని ఎదురడిగేడు. అతన్నే చూస్తా వుండిపోయిన నాతో “తోలు బొమ్మలాటోళ్ళు దొమ్మరాటోళ్ళూ మన విశ్వనాధంగారి పొలంలోకి కూలి కొచ్చేరామధ్య” అన్నాడు ఆదియ్య.

స్వరాజ్యరెడ్డి గారూ, కర్రెంకయ్యగారూ, కర్రిసుబ్బిరెడ్డిగారూ వాళ్ళబ్బాయి రాముగారూ బ్రాహ్మణరెడ్డి గారిలాంటి వూళ్ళో సందడి చేసే మనుషులంతా కాలం చేసేరంట. ఊరి గత వైభవం గురించి చెప్పుకుంటా పోతుంటే సత్తి సూర్యనారాయణరెడ్డి గారి మనవడు చిట్టిలోపల కొచ్చేడు. చాలా వ్యాపారాలు చేసిన అతను ఇప్పుడొక కొత్త వ్యాపారం చేస్తున్నాడట. చాలా లాభసాటిగా ఉందంట ఆ వ్యాపారం.

ఏంటన్నాను.

“పట్నాలకి పోయినోళ్ళు పోగా ఊళ్ళల్లో మిగిలినోళ్ళు పాతకాలం కోటల్లాంటి గాలిమేడలూ, మండువాలోగిళ్ళు పడగొట్టేసి లేటెస్ట్ టైపు బిల్డింగులు కట్టేసుకుంటున్నార్రా... ఇదిగో ఆదియ్యా... ఆ పాత ఇళ్ళు పడగొట్టి కొత్త బిల్డింగులు కట్టుకుంటున్నప్పుడు ఆ కాలంనాటి పాత సామాన్లేం ఉంటాయో చెప్పు?” అని అడిగేడు.

“చాలా ఉంటాయి గదా. పందిరి పట్టి మంచాలూ, పెద్ద పెద్ద ఇత్తడి గొలుసుల్తో వేళ్ళాడే ఉయ్యాళ్ళు, నెగిషీలూ చెక్కిన ద్వార బంధాలూ, చిలక్కొయ్యాలూ, ముక్కాలి పీటలూ, మరచెంబులూ, ఇత్తడి హారికెన్ లాంతర్లూ భోషాణం పెట్టెలూ... ఇలా చెప్పుకుంటా పోతే చాలా వుంటాయి” అన్నాడు.

“ఆ సామానంతా గాదుల సావిళ్లలోనో దొడ్లో ఉన్న పాకల్లోనూ పారేసి లేటెస్ట్ సామాన్లు కొనేసుకుంటన్నారు మనోళ్ళు.... నేనా పాతసామాన్లు కొని హైదరాబాదు... మద్రాసూ, ఢిల్లీ ఎక్స్‌పోర్ట్ చేస్తున్నాను... అక్కడ్నించి వాటిల్లో కొన్ని అమెరికా అదీకూడా వెళ్తున్నాయట” అన్నాడు.

అంటే మనదీ అన్పించింది మొత్తం పొలిమేర దాటి వెళ్ళిపోతుందన్నమాట. ఇలా పోతే ఒకనాటికి మచ్చుకి కూడా ఏదీ మిగల్దు కదా?

“ఇవ్వేళ రాజేశ్వరస్వామి తీర్థం. గుర్తుందా” అన్నాడు త్యాగరాజు.

“రథం లాగుతుంటారీ పాటికి పదండి” అనేసి కదిలేను.

లక్కపిడతలు, చెక్క బొమ్మలూ అమ్మే దుకాణాలూ, చెక్రం ఆటలూ, గుండాటలూ, రంగులరాట్నం, నువ్వుపప్పు జీళ్ళు, కర్జూరం దుకాణాలూ ఇత్తడి సామాన్లూ, పింగాణీ సామాన్ల కొట్లూ తీర్థమధ్యలో చెక్క భజనలు చేసే బాల భక్త సమాజం కుర్రోళ్ళూ... ముఖ్యంగా చుట్టుపక్కల ఊళ్ళనించి సవ్వారీ బళ్ళమీద ఒంటెద్దు బళ్ళమీదా దిగే జనాల్తో సందడి సందడిగా

ఇసకేస్తే రాలకుండా వుండేది రాజేశ్వరస్వామి తీర్థం. చంటిపిల్లలు తప్పిపోతే ఆళ్ళు దొరకడానికి టముకు వేయించాల్సి వచ్చేది. అలాంటిది ఈవేళ అక్కడొక్కడూ అక్కడొకడూ అన్నట్టు పల్చపల్చగా ఉన్నారు జనం. ఆనాటి దుకాణాలూ, ఆ అందచందాలూ మచ్చుకైనా కనపడ్డం లేదు. "ఏంటిలా ఉంది తీర్థం జనం అసలు లేరేంటి?" అన్నాను.

"ఈ మాత్రం జనవన్నా ఉన్నందుకు చాలా సంతోషించాలి మనం" అన్నాడు త్యాగరాజు.

"ఇవ్వేళ లక్ష్మివారం మనూరి సంత... తీర్థంలో జనం బొత్తిగా లేరని సంతని తీసుకొచ్చి ఇక్కడ కలిపేసేరు వూరిపెద్దలు" అన్నాడు ఆదియ్య.

ఏం మాటాడకండా కాసేపు అలాగే ఉండిపోయిన నేను పల్చని జనం మధ్యలో కనిపిస్తున్న దేవుడి రథం దగ్గర కెళ్ళేను.

దారు శిల్పాలతో నిండిపోయి ఉన్న మా రాజేశ్వరస్వామి రథానికి ముందు ఎడాపెడా నాలుగు అంగుళాల కైవారంతో పొడుగ్గా ఉండే ఈ రెండు పెద్దాపురం తాళ్ళనీ చెరో వందేసి మందీ లాగేవారు వెనకటికి. లాగడానికి సంబరపడే చాలా మంది కుర్రోళ్ళు తాడు లేక మిగిలిపోయేవారు. అలాంటిది.

ఇవ్వేళ మా దేవుడి రథం రెండు తాళ్ళనీ వందల మంది జనాలు లాగడానికి బదులుగా ఎర్రరంగు మహేంద్రా టాక్టరు లాగుతుంది.

నేనెప్పుడూ ఏడవలేదు గానీ, ఆ దృశ్యం చూస్తున్నప్పుడు మట్టుకి నా కళ్ళల్లోంచి కన్నీళ్ళు జలజలా రాలిపోయినియ్యి.

✡

# పంట సేలు

**–మాగోఖలే**

మోతుబరి పల్లెటూరు పిచ్చికలగుంట తూర్పు దిక్కున పొలిమేరకాడ రాస్తా పక్కన పెద బసవయ్యగారి మనగాడైన ఆరెకరాల మాగాణి భూమికి మయాన కోటప్ప కొండలకి మల్లే వుండ మూడు వరికుప్పల సుట్టూతా...

"నాయుడోరింటికాడ

నల్ల తుమ్మ సెట్టుకింద

నాయుడే మన్నాడే పిల్లా!"

అని ఈలపాట పాడ్తా వుశారుగా తిరుగుతుండాడు నరసివులు కొడుకు రాములు.

రాములు నాయన నరసివులు పెద బసవయ్యగారి ఆ ఆరెకరాలు భూమిని పదేనేళ్ళ పైచిలుకు నుంచి కౌలుకు సేసుకుంటున్నాడు. పెద బసవయ్యగారికి యిసువంటి మాగాణి పొలం పిచ్చికలగుంటకి ఉత్తరం, దచ్చినం, పడమర దిక్కుల్న యింకా డెబ్బయ్యెకరాలకి పైసిలుకుండది. అయితే ఆ యవారాలన్నీ నరసివులు కక్కర్లా. తనూ, తన పెల్లాం, కొడుకు రాములు, కూతురు అచ్చి, మొగుళ్లు పోయిన తన అప్పా, చెల్లెలు కలిసి కౌలుకు సేసుకుంటుండ యీ ఆరెకరాలే సొరగంకన్న పదిరెట్లెక్కువ.

ఈయేడు పెబలకుమల్లే వుండ తమ మూడు వరికుప్పలు నూరుస్తావుంటే బంగారం కక్కాల్సిందే ననుకుండాడు రాములు, ఈలేసుకుంటా.

'గవర్నమెంటోరు మంచోరు! ఆరికి మా అసువంటి కష్టం సేసుకుంటున్నోరి సంగత్తెలుసు! కౌల్దారి సట్టంమీన ముద్దరగుద్ది పేపర్లో ఏపించారు! ఆ సట్టం పకారం కౌల్దారుకు పంటలో సగానికి సగం వొచ్చుద్ది. అదట్టా వుంచి ఎనకటికి మల్లే ఆసామి కౌల్దార్ను మాటకు ముంగల పీకిపారెయ యీలుగాదు!

'తాము ఏటా ఎకరానికి పదేను బత్తాల కౌలిస్తుండారు పెద బసవయ్యకు. కిందటేడు గాలోన తిరగా బోర్లా కొట్టటాన ఎకరానికి పదిబస్తాలే దక్కింది. అయ్య అప్పు సానా సేశాడు!

పంటలో సగానికి సగంవొస్తే అయ్య కోటయ సామికి పెబ కడ్తానన్నాడు. రాక యాడికి పోద్ది! గవర్నమెంటోరు ముద్దరేసిన సట్టం పేపర్లో ఏపిచ్చారంటే యిగదానికి తిరుగులేదు – బెమ్మదేవుడు అడ్డాం వొచ్చినా!'

రాములు యింకోపాలి మూడు వరికుప్పల్ని కిందనుంచి పైదాకా సూసి

"అదిగో దారక, ఆలమందలయిగో–" అని కుష్టరాయబారంలో అర్జునుడి పద్దెం యిసుర్తుండాడో లేదో – "ఖడే బర్ఘదే!" అంటా ఒక్క పాలి రాస్తామీన్నుంచి గొడ్డ పిల్లకాయ అరుపు ఇనబడేతలికి వులిక్కిపడి ఎనక్కి తిరిగి సూశాడు.

పాతిక, ముప్పయ్ బర్రెగొడ్డు ఆటికెనకమాల గొడ్డపిల్లకాయ, ఆళ్ళ మద్దెన పై కెగ్గట్టిన ఎర్రకోక, నల్లరెయిక, సంకన పేడపల్లిక, కాళ్ళ కడాల్తో ఆడుకుంటా వొస్తుండ ఆలివేలును గాలం ఏసి పట్టినట్టు సూసిన రాములు కన్నార్పకుండా అటనే రాస్తాపక్క సింతసెట్టుకిందకొచ్చి నుంచుండాడు.

గొడ్డమందను రాస్తాపక్క పచ్చిగరిక పీక్కుతింటానికి వొదిలేసి 'కోతికో జిల్లా' రంటూ సింతసెట్టుకు కాస్తే అవకాడ గానిగసెట్ల మీనకు గొడ్డపిల్లకాయ ఎగబడ్తా వుంటే రాముల్ని సూసీసూడనట్టు సింతసెట్టుకింద పిల్లకాలవ ఒంతెన మీనకొచ్చి కూకుండది పేడపల్లికతో అలివేలు.

ఓరగా బిగజుట్టిన తలగుడ్డ, తలగుడ్డ కింద గిరజాలు, కోసముక్కు, సన్న మీసకట్టు, ఎగదంతున్న ఎదుర్రొమ్ముకు బిగదీసుకున్న బనీను, ఎగ్గట్టిన పంచ, సేతిలో ఎదురుకర్ర, తలతల మెరుస్తుండ కళ్ళతో అదేపనిగా పొడుస్తుండట్టు సూస్తున్న రాముల్ని ఓరకంటితో సూసి "కల్లు కాత్తా రాలి కిందపడేను!" అంది అలివేలు. తలగుడ్డ వూడదీసి దులిపి బుజానేసుకుని సింతసెట్టు కానుకుంటా పళ్లు బయటపడేట్టు సప్పుడు గాకుండా నవ్వాడు రాములు.

తల పక్కకు తిప్పుకుని సప్పున నవ్వుకున్న అలివేలుకు వున్నట్టుండి గుండెలో ఏందో జల్లుమన్నది.

"ఖడే బర్ఘదే!" ఆనరుస్తా ఏనాదిపిల్ల రామి జడెగరేసుకుంటా పేడ పల్లికతో బోడికొమ్ముల బర్రెగొడ్డు దగ్గరికి లగెత్తింది. అలివేలుకు రామి "బర్ఘదే" అనరవటం యినపళ్ళేదు.

"ఏం అలివేలుపిల్లా. బాగుండావా?" అని పలకరిచ్చాడు రాములు. బనీను జోబిలోంచి బీడీ, నుప్పెట్టె తీసి ముట్టించుకుంటా.

"నన్ను పిల్లాగిల్లా అనమాక!" అంది అలివేలు.

"అయితే పెద్దదాని వయ్యావన్నమాట! మరి నీ పెల్లెప్పుడంటా?" అన్నాడు రాములు.

"ఏం, నీ జోబిలో కాసిని పెల్లి కొడుకులేమైనా వుండారా?" అంది అలివేలు.

"అంతమంది లేరుగాని ఒకడుండాడు సూసుకుంటావా?" అన్నాడు రాములు మల్లీ సప్పుడు గాకుండా నవుతా.

"ఇక సాల్లే వూరుకో!" అంది అలివేలు, రెండు సేతుల్తో మోకాళ్ళను వాటేసుకుంటా.

"ఎఱ్ఱకోక గట్టావే!" అన్నాడు రాములు.

"సాల్లే వూరుకో!" అంది అలివేలు వొళ్ళో తలదాచుకుంటా. కోక కట్టుకోటం మొదలు పెట్టిన అలివేలుకు వొక్కపాలి ఎఱ్ఱకోక వొల్లంతా పీకినట్టయింది.

"రాగవయ్య మల్లీ నీ జోలికొచ్చాడా?" కూసేపుండి అన్నాడు రాములు, తుబుక్కున వుమ్మ్యాస్తా.

"ఆడిజిమ్మడ! ఆడి పుటమార! సచ్చినోడికి దెబ్బకు దెయ్యం బారింది! ఆనాడు నువు నన్ను రచ్చించావు! ఆడు నా కోకబట్టుకుని లాగుతాడని నాకు తెలవనన్నా తెలవదు! చీంబోతు! అక్కుపచ్చి! నువు గుద్దిన గుద్దుకు సావిడెత్తుకు ఎగ్గిరిపడ్డాడు – యిహిహిహి! మొన్న నేను కోవటి దుకానానికి ఎల్తా వుంటే ఎదరపడి కొరకొర సూత్తాపొయ్యాడు!" అంది అలివేలు.

ఆనాడు తను సెరువులో బట్టలు గుంజుకుని వొస్తావుంటే సెరువుపక్కన గొడ్డసావిడి పెండెందగ్గిర ఆంబోతల్లే నుంచుండ పెదబసవయ్య తమ్ముడు రాగవయ్య "ఇదిగో, బంతిపూలు కావాలా? గొబ్బిపూలు గూడా వుండయ్ కోసుకుపో" అని తనని నిలేసి వూరిచ్చాడు. అంతక్కిందటి దినం తను సెరువు నుంచి తిరిగొస్తూ పెదబసవయ్యగారి గొడ్డసావిడి ముంగల బంతిపూలు, గొబ్బిపూలు యిరగబూసుండం పెండెంలోంచి సూసి, కూసేపు తచ్చాడి యింటికి పోయింది. ఆ దినం రేత్తిరి దోసెడంత బంతిపూలు కల్లోకొచ్చినై తనకు.

"వూ, కోసుకో!" అన్నాడు రాగవయ్య. తను సల్లగా పెండెందాటి సావిడి ముంగల కెల్లి నాలుగు బంతిపూలు వొల్లో ఏసుకుందో లేదో రాగవయ్య ఏనికీడ్తే వొచ్చి తనకోక బట్టుకొని సావిట్లోకి గుంజుతుండాడు! తనకి కాల్లొనికినై! ఒల్లు సెవట గారింది!

ఒదల మంది తను.

"ఏహెరా" అన్నాడు రాగవయ్య గట్టిగా గుంజుతా.

పెండెం పెటపెటమని ఆ ఇగ్రహం అవ్వాయి సువ్వకిమల్లే వొచ్చీన రావటం 'తభీమని' వొక గుద్దుగుద్దేతలికి దున్నకుఱ్ఱకు మల్లే ఎగిరి కిందపడ్డాడు రాగవయ్య.

ఓరగా సుట్టుకున్న తలగుడ్డ, ఆ తలగుడ్డ కింద నల్లటి గిరజాలు, కోసముక్కు, సన్నటి మీసకట్టు, ఎగదంతున్న రొమ్ములమీన బిగదీసిన బనీను, సేతిలో ఎదురుకఱ్ఱ, పంచపైకెగ్గట్టి

మెరుస్తుండ కళ్ళతో తన సెయిపట్టుకుని ఇంటికాడి దింపి పోయాడు. కూసేపుటికి గాని తనకు తెలవలా ఆ మడిసి నరిసివులు కొడుకు రాములని.

"మా పంటకుప్పలు సూశావా అలివేలా?" అనడిగాడు రాములు.

"సూశా. ఈఏడు మీ పంట బలేపండింది" అంది అలివేలు.

"తస్సదియ్య యీపాలి ఎకరానికి రెండుపుట్టు గింజ రాలాల" అన్నాడు రాములు.

"నిజంగా అంతవుద్దా రాములా?" అంది అలివేలు.

"మెల్లిగా అంటావేం అలివేలా? అదట్టావుంచు. గవర్నమెంటోరు పేపర్లో ఏపిచ్చిన కవులు సట్టం లెక్కన యీపాలి పంటలో సగం మాకు రావాల" అన్నాడు రాములు పంటకుప్పల్ని గెట్టిగా చూస్తా.

"మరి మా అయ్య అట్టా అన్నాడేం రాములా?" అంది అలివేలు.

"మీ అయ్య ఏమన్నాడు అలివేలా" అనడిగాడు రాములు.

"పేపరీలో ఏసిన ఇసువంటి సట్టాలు వూరకనే పుల్చుగారిపోతయ్యన్నాడు! గవర్నమెంటోరి నౌకర్లొచ్చి పంటకల్లాలకాడ నిలబడి పంటలో సగానికి సగం కొలిపిత్తే తనీ సట్టాన్ని నమ్ముతానన్నాడు" అంది అలివేలు.

"మీ అయ్యకి చరీగా తెలవదు పెదబసవయ్యగారు బహు పెద్దమడిసి. ఈ సట్టం బొహుగెట్టిది" అనంటావున్నాడు రాములు.

"ఖడే బర్ఖడే" అని అరుసుకుంటా, సింతసెట్టు పక్కనుంచే వుసిగా లగెత్తింది ఏనాదిపిల్ల రామి.

✡

ఏడాది సెక్రం తిరిగిపోయినట్టు తిరిగిపోయింది. నెర్రపగిల్న పిచ్చికల గుంట మాగాణీ పొలాల్లో ఓపక్క ఏతాలెత్తి నారుమళ్ళు సాగుతావుంటే యింకో పక్కనుంచి గొర్రెలమంద పెంట, నయి పోగుపెంట తోల్తుండారు రైతులు, జీతగాళ్ళు, కూలిమడుసులు.

తూర్పు దిక్కు రాస్తా పక్కన పెదబసవయ్యగారి ఆరెకరాల పొలంకాడ పలుగుతో గెడ్డ యిరవనొచ్చిన రాములు రాస్తామీన పిల్ల కాలవ ఒంతెనపక్క సింతసెట్టు కిందనే నిలబడిపోయి పెదబసవయ్యగారి పొలంకెల్లె అదేపనిగా సూస్తుండాడు.

పెదబసవయ్యగారి పొలంలో గెడ్డ బహు నల్లగా వుంది! బెత్తెడెడల్పున నెర్రెయిచ్చిందా పొలమంతా! ఆవజాన నెర్రె యిచ్చిన బూవిలో బంగారం పండుద్ది! ఆడ పండిన పంటకుప్పలు

కోటయ సావి పెబలకుమల్లే వుంటయ్! రాస్తామీన వొత్తా పోతావుండే జనం ఆటినే సూస్తాపోతారు! ఆ పంటకుప్పల్ని నూర్చి నిలువెత్తు రాసిబోసి తూర్పార పడ్తావుంటే నీరెండలో దగ దగ మెరుసిద్దా గింజ! ఆ గింజతో అయ్య యీ పదేనేళ్ళ నుంచి యింటి కరుజులు సద్దుతా వుండాడు! ఆ గింజ రుసి తమకు తెలిసినంతగా వూళ్ళో జనానికి తెలవదు!

"ఒరె, రాములు యీడే వుండాడే! ఏం రాములా? ఇశ్వామిత్రులోరికిమల్లే ఏందో తపసు సేసుకుంటున్నావల్లే వుందే?" అని పలకరిచ్చాడు రత్తాయితో పొలం పోతుండ కూలి మడిసి రమణాయ్.

"ఏంది రాములా, గెడ్డపొలుగు తెచ్చావు ఏంది కత? ఈ ఏడు మీరీ పెద బసవయ్యగారి పొలం కౌలుకు సెయటం లేదంట, నిజమేనా?" అనడిగాడు రత్తాయ్.

"నాకు తెలవకడుగుతా, మీ అయ్య నిన్ను పెద బసవయ్యగారికాడ జీతానికి కుదిరిచ్చాడంట నిజమేనంట్రా రాములూ" అనడిగాడు రమణాయ్.

తుబుక్కున వుమ్మేసి, బనీను జోబిలోంచి నుప్పెట్టె, బీడీ ముక్క దీసి ముట్టించుకున్నాడు రాములు, మాట్టాడకుండా.

"పెద బసవయ్యగారు మిమ్మల్ని కౌల్నుంచి దేనికిరా తీసేసింది రాములా?" అనడిగాడు రమణాయ్.

"ఆ పెద బసవయ్య మీన అయ్యకు యింకా బెమత తీర్లా! పై ఏడు పెద బసవయ్య మనసు మారి మల్లీ మాకు కౌలుకిత్తాడని ఆరికాడ నన్ను జీతానికి కుదిర్చాడు అయ్య!" అన్నాడు రాములు.

"పొలం బీడుగట్టి పంట బాగా పండడం లేదంట! తనే సొంత కమతం సేసుకుంటున్నాడు!"

"ఈ పెద బసవయ్యగారి పొలం బీడు కట్టున్నదంటే ఎవరన్నా నమ్ముతారంట్రా? కిందటేడు యీ పొలం ఎకరానికి ముప్పందుం పైసిలుకు పండిందని వూళ్ళో అందరికీ తెల్సుగా" అన్నాడు రమణాయ్.

"ఎనకటికి 'దున్నకుంట్ర యీనిందంటే దూడ పలుపు యాడుందో ఎతకమన్నారంట!' పొలం బీడు కట్టున్నదని ఆ పెద్ద మడిసంటే మీ అయ్య సేతులు కడుక్కునొచ్చేశా డంట్రా రాములా? నలుగురు పెద్దమడుసుల ముంగల యవార మేందో తేలవక్కర్లా?" అని అన్నాడు రత్తాయ్.

"మరి గవర్నమెంటోరు పేపర్లో ఏపిచ్చిన పకారం కౌల్దారును తీసి పారెయగూడదుగా?" అనడిగాడు రమణాయ్.

"మరి ఆ సట్టం పకారమే కౌలు రేటు సగానికి సగం వుండా అనుకుంటే కింద టేడు మనూరి ఆసాములంతా పాత కౌలు రేటు లెక్కనే పీక్కుంటిరిగా! ఏం రాములా మీకూ అంతే జరిగిందా?" అనడిగాడు రత్తాయ్.

"సట్టం పేరెత్తుతే మర్రాద దక్కదన్నాడు పెదబసవయ్య! సట్టం సంగతి దేవుడికెరుక, వుండకౌలు వుండట్టన్నా అంతే సాలన్నాడు అయ్య! సివరికి రెంటికీ సెడింది యవారం! పదినేళ్ళ నుంచి సేత్తుండ కౌలు యీవజాన వుత్త పున్నానికి దక్కకుండా పోద్దని అయ్య కల్లోకూడా అనుకోలా!" అన్నాడు రాములు తుబుక్కున వుమ్మేస్తా.

"ఈ ఏడు తప్పినా పైఏడు సగం కౌలురేటు తప్పదని మనూరి ఆసాములంతా కూడబలుక్కుని యీపన్జేత్తుండారు. అంకమ్మ గారి అంకినీడు పొలం జేత్తుండ రామలింగయ్య ఎప్పటికిమల్లే యీ ఏడు కూడా పెంటదోలను యిట సేలోకిపోతే ఆ యవారమేందో తనే సూసుకుంటాను పెంట తోలక్కర్లేదు పొమ్మన్నాదంట అంకినీడు! రాంలింగయ్య కాత్తె మోరాయించే తలికి మెడ మీన నూకి బయటికి నెట్టాడంట ఆంకినీడు! యిగ చూసుకోండి యవారం ఎట్ట సెడదిరిగిందో!" అనంటున్నాడు రత్తాయ్.

"సట్టం చేసిన గవర్నమెంటోరికి యవారం యిట్ట అడ్డం తిరిగిందని తెల్చిందా అంటా–" అనంటున్నాడు రమణాయ్.

కిర్‌కిర్‌మంటా కిర్రుసెప్పుల్తో పెద్దపెద్ద అంగలేసుకుంటా వొచ్చి, తుబుక్కున వుమ్మేసి సేతిలో ఎదురు కర్రతో ఆడ నిలబడ్డాడు పెద బసవయ్య గారి తమ్ముడు రాగవయ్య.

"ఏందిరోయ్ రమణాయ్, రత్తాయ్? సిసలైన రైతు మనగాళ్లు సేరి సిన్న మీటింగేందో నడుపుతూండారే? ఏంది కత? గవర్నమెంటోరి సట్టం గిట్టం అనంటుండారే? ఒల్లు సెడుద్ది కాత్తె బర్రంగా వుండండి!" అని రాముల్నో సూపుసూసి "ఏందిరా నువు యీడ చేస్తుండదీ? సేల్లో గెద్ద యిరవను ఎప్పుడనంగా వొచ్చావురా నువూ?" అనడిగాడు రాగవయ్య, బుసవిడుస్తా.

తాగుతుండ బీడీముక్క పెదాల్తో అటనే తుబుక్కున వుమ్మేసి మాట్లాడకుండా రాగవయ్యకల్లె సూశాడు రాములు.

"పదవేందిరా సేలోకీ?" మల్లీ అడిగాడు రాగవయ్య, రాములు సూపుకు నిల్దొక్కుకుంటా.

"ఏ సేలోకీ?" అనడిగాడు రాములు, అటనే సూస్తా.

"నువు మాకాడ జీతానికి చేయటం లేదంట్రా?" మల్లీ అడిగాడు రాగవయ్య.

"ఎవరన్నారూ?" అనడిగాడు రాములు.

"పొల్లురాల్తయ్ మాట చరీగా రానీ" అనంటుండాడు రాగవయ్య.

"ఖడే బర్ఖడీ!" అని ఏనాదిపిల్ల రామి అరిసిన కూసేపటికి పుట్ట పగిల్నట్టు ఎల్లుకొచ్చిన గొడ్డ పిల్లకాయ ఆ సుట్టు పక్కలకు సదురుకుంటావుంటే ఎఱ్ఱకోక పైకెగ్గట్టి, పేడ పల్లిక సంకన బెట్టుకొని రాములుకు కాత్తె ఎనకమాల కొచ్చి నిలబడింది అలివేలు.

తన ఒల్లంతా కెలుకుతున్న అలివేలు మల్లీ యియాల రాములు పక్క కొచ్చి నిలబట్టం సూసిన రాగవయ్యకు నరాలు పటపటమన్నాయ్.

పొద్దస్తమానం ఎఱ్ఱకోకతో కళ్ళల్లో మెదల్తుండ అలివేలును రాగవయ్య కోక పట్టుకు లాగడం – బొమ్మలోకి మల్లే సప్పున అగుపించినట్టయి, రాగవయ్యను కిందనించి పైదాకా కొలిసి సూశాడు రాములు.

"సేలోగెడ్డ యిరవ్వంట్రా?" అనరిశాడు రాగవయ్య.

"ఎందుకైనా మంచిది నాజోలికి రామాక" అన్నాడు రాములు.

"యదవా నీ రఖతం తాగుతా!" అని అరుస్తా రామ రావణా యుద్దంలో రావణాబ్బెమ్మ దూకినట్టు సేతిలో ఎదురుకఱ్ఱ ఎత్తి ఎగ్గిరి దూకిన రాగవయ్యను మద్దెలోనే తభీమని గుద్దిన గుద్దుకు బారెడు ఎత్తెగిరి, మూడు బారల దూరాన పడిలెగిసి, గొడ్డపిల్లకాయతోపాటు రావణాయ్, రత్తాయ్ పగలపడ్తావుంటే సేలల్లో గనువులెంటపడి నాగాయ్ డొంకమీనకుండా అదే మయిన వూళ్లోకి లగెత్తుకెళ్లాడు రాగవయ్య.

"యవారం సెడింది! రాగవయ్య వూళ్లోకెల్లి రామలాళ్ళు ఆసాముల మీద తిరగబడి కొడ్తుండారని గబ్బు లేవదీత్తాడు!" అన్నాడు రమణాయ్.

"లెగవదీత్తే తీశాళ్ళే! ఈ పాపం ఎప్పుడైనా పండాల్సిందే!" అన్నాడు రత్తాయ్.

ఎనకమాల ఏందో ఎచ్చగా తగిల్నట్టయ్ తిరిగి సూసిన రాములుకు పక్కనే ఎఱ్ఱగా అలివేలు అగుపించింది.

"నువు ఆరికాడ జీతానికి కుదిరావా రాములా?" అని సన్నగా అడిగింది అలివేలు.

"ఎవరు – నేనా? అదుగో సూడు–" అనంటూ కిందపడ్డ గెడ్డపలుగును పైకెత్తి బలంకొద్దీ యిసురుగా పెదబసవయ్య ఆరెకరాల మాగాణి సేలోకి యిసిరేసి "ఒరే రమణాయ్, రత్తాయ్! మీరు వూళ్లోకి ఎల్లినప్పుడు ఆరి గెడ్డపలుగు సేలో యిసిరేసివుండది వొచ్చి తీసికెల్లమని ఓ మాట సెప్పి పోండి!" అనన్నాడు రాములు, సేతులు దులుపుకుంటా.

✡

# మా ఊరు ఎత్తేస్తారా...!

**-ఎద్దుల సత్యనారాయణరెడ్డి**

'ఫ్యాక్టరీలు వస్తాయంటా మా నేలలు ఎత్తుకొంటారంటా, మా ఊరు కూడా ఎత్తేస్తారంటా అవునా' టీ అంగడిలో టీ తాగేకొచ్చిన రామప్ప టీ తాగుతున్న గోపాలప్పను దీనంగా అడిగె.

'అవునంటా అదే మాట్లాడుతుండారు ఇక్కడ' గోపాలన్న చెప్పె.

'అట్లయితే మేమే దావలా పొయ్యేది గోపాలన్నా'.

'గౌరుమెంటోళ్ళు ఎత్తితే మనమేమి చేసేకైతుంది రామప్పా', వెంకటేశప్ప ఎగతాళిగా అనె.

'నీకేమి వెంకటేశప్పా నీ సొత్తు మిగిలిపోతుంది. దానికే అట్ల మాట్లాడతావు' అనె రామప్ప.

'సేద్యం చేసేకి అయ్యేలేదు. ఏడన్నా పొడైపోనీలే' రామప్ప టీ అంగడిలో మరో గొంతు, ఎక్కాసముగా వినిపించె.

'అట్లకాదు మనం తరతరాలుగా వుండేవాళ్ళుము. మన సొత్తు, ఇండ్లు ఎత్తుకొంటే ఎట్లా? గౌరమెంటోళ్లకి కండ్లు లేదా? మన తాత ముత్తాతల కాలం నుండి భూమి తల్లికి కష్టపడి పెద్దోళ్ళు కాలేదా? దేశమంతా ఫ్యాక్టరీలైతే గంజికి మార్గమేమి?' ఆవేదనతో పలికె ఇంగొక గొంతు.

'మనకు వుద్యోగాలిస్తారు. సంబళం వస్తుంది. ఏమి మనకు కొదవ' వెంకటేశప్ప

'ఏం వుద్యోగాలిస్తారు. మనము చదువుకొన్నోళ్ళా. నా వయస్సు 58 ఏళ్ళు నేను మూడోక్లాసే చదువుకొనింది, నాకేం పని ఇస్తారు?' గోపాలప్ప అడిగె.

'నీకు కాదు నీ కొడుకులకు ఇచ్చేది పని' వెంకటేశప్ప బదులు చెప్పె.

'నా కొడుకులకు చదువు అబ్బలేదు. వాళ్ళకు దున్నేది తప్ప ఏమీ తెలియదు. వాళ్ళకెవురిస్తారు పనులు. ఆ నాకొడుకులు ఇచ్చేదేమి? మేం చేసేదేమి? వ్యవసాయం చేసుకొనే మేము రాజులు మేమే, మంత్రులు మేమే. మమ్మల్ని అడిగే వారెవురప్పా' రామప్ప అనె.

'ముందట్లో మూకొండపల్లి, జూజువాడి, బ్యాడరపల్లి, చిన్నయెళసగిరి ఊర్ల దగ్గర తోటలు ఎత్తుకొని ఫ్యాక్టరీలు పెట్టి వాళ్ళకి పనులు ఇవ్వలేదంటనే?' అబుడే వచ్చిన మునెప్ప అనె.

వాళ్లకతే అట్లుంటే ఇంక మనకెక్కడ పని ఇచ్చేది. ఇస్తేగిస్తే దొడ్లు కడిగేది, రోడ్లు వూడిసేది, గేట్ల దగ్గర వుండేది తానే! దిగువసీమ నుండి వచ్చే వారికి మాత్రమే పనులిచ్చేది. ఇప్పుడు ఆ వూరోళ్ళు వీధుల్లో తిరుగుతున్నారు. అదే గతి మనకు పట్టేది' గోపాలప్ప చెప్పె.

'అంతేకాదు బత్తలపల్లి, పేరండపల్లిలో కూడా రెండోకిత భూములు ఎత్తుకొన్నారంటా వారి బిడ్డలకు కూడా పని పాటా లేదంటా వారు రోడ్లపై తిరుగుతున్నారంటా', రామస్వామి మధ్యలో అందుకొని గోపాలప్పకు మద్దత్తు ఇచ్చే.

'వ్యవసాయమంటే సాదారణమా! రైతు ఎంతమందికి బోనం పెడుతాడు. ఎన్ని కోట్ల జీవరాసులు వ్యవసాయం చేసే దాన్నుంచి బతుకుతాయి. దోమలు, మిడుతులు, గువ్వలు, కాకులు, పులుగూ, పుట్ర ఎన్ని జీవాలు మన పంటలు తింటాయి, ఏమి కతా, అట్లా వ్యవసాయాన్నే వద్దంటే గౌరమెంటోళ్ళకి దేవుడు మంచిది చేస్తాడా? మనం పండిస్తే తానే భోజనం తినేకైయ్యేది. భూములు పెరుక్కొంటే రాగులు ఎట్ల పండేది, వడ్లు ఎట్ల పండేది, ఆవులకు కసువుకు ఎక్కడికి పోయేది' మునెప్ప అనె.

'అవునవును ఈడ ఇట్లా మాట్లాడుతారు. పోరాటానికి రమ్మంటే మాత్రం ఎవరూ రావద్దండా' అంగడి యజమాని రగు కసిరె.

'ఏం చేసేది రగూ, తోటలో నిండుగా పంటలు. వాటిని చూసుకోవాల తానే. నీళ్ళు కట్టేది, చెత్తదోకేది పనులు వుంటాయి కదా' గోపాలప్ప అంటుండగా,

'నేలలు పోయినంక పంటలు ఏడ పండిస్తారు. పంటలు చూసుకొనే వుండండా వాళ్ళు నేల్లు ఎత్తుకొని పోతారు అంతే' వయసు చిన్నోడు ఎవురో అనె.

'ఏమయ్యా మీరే చెప్పండా. తలవరు కష్టపడి దుడ్లు ఖర్చుచేసి నేలలు పోకూడదని మీటింగు పెడితే జనాలే రాలేదు. ఎట్లా చెప్పండా?' రగు ఆవేశంతో అడిగె.

'మీటింగ్‌కు పోవాలప్పా, లేకుంటే ఎట్లా? తలవరుకు గాశారమా? వాయనది ఏమైనా నేల పోతుందా' నారాయణప్ప సానుబూతి మాట్లాడె.

అంతలోనే తలవరు అక్కడికి వచ్చి, 'ఏమప్పా మాట్లాడతా వుండేది' అని అడిగె.

'స్పెషల్ ఎకనామిక్ జోన్ విషయం', రగు బదులిచ్చె.

'మనమంతా టీ అంగడితావ మాట్లాడుకోవలసిందే. ప్రభుత్వం దాని పని అది చేసుకొంటా పోతుంది. సెజ్జు అని 5 వేల ఎకరాలను స్వాధీనం చేసుకొనేందుకు ప్రభుత్వం పని ఆరంభించింది. మాదవ అగ్రహారం, తమ్మంద్రపల్లి ఈ రెండూర్లను ఎత్తేస్తుంది. 5 వేల

కుటుంబాలు నాలుగు పంచాయితీల్లో బయటకు పోవలసి వస్తుంది. వుద్యోగాలు ఇస్తామని మాయ మాటలు చెప్పి ఇక్కడ మనల్ని ఒప్పించేందుకు చూస్తుంది. రియల్ ఎస్టేట్ బ్రోకర్లు మాత్రం ఎకరాకు 5 లక్షలు ఇస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ భూమిని స్వాధీనం చేసుకొనేందుకు టిడ్కో సంస్థకు పని అప్పగించింది. ప్రభుత్వ విలువ మాత్రమే మనకు ఇచ్చేది. పంటలు పండించే భూములు లేవని అంతా బీడు భూములేనని, జిల్లా కలెక్టర్ రికార్డులు తయారు చేసి పైకి పంపించె. 3600 ఎకరాలకు మ్యాపులను టిడ్కో వారు తయారు చేసి పెట్టిండారు. రెండు మూడు రోజుల్లో మదరాసు నుండి అధికార్లు చూసేందుకు వస్తారు. నేను మన పక్కవూరి ఎమ్మెల్యే మదరాసులో మంత్రిని చూసి, ఇక్కడ మావూరులో పంపుసెట్లతో టమోటా, వుర్లగడ్డలు, కోసు, బీన్సు, అరటి పండిస్తున్నామని, హోసూరు రైతు బజార్‌లో అమ్మే కాయగూరలన్నీ ఈ ప్రాంతంలో పండేవని ఇక్కడ సెజ్జు ఏర్పాటు చేయరాదని సూచించినాము. మనమంతా ఎదురు తిరిగితే తప్ప మన భూములు వారు వదలిపెట్టేదిలేదు. మంత్రి ఈ విషయం పరిశీలిస్తానని చెప్పిరి". తలవర చెప్పుతుండగా మరో వ్యక్తి అడ్డు తగిలె.

'మన ప్రాంతంలో ఫ్యాక్టరీలు వస్తే మన వూరు అభివృద్ధి అవుతుంది. మన భూములకు విలువ వస్తుంది. మన వూరికి రోడ్డు వేస్తారు. మంచిదౌతుంది. దీనికి అడ్డుతగులొద్దు' నారాయణరెడ్డి హితబోధ చేసె.

'మూకొండపల్లి తావ ఏర్పాటైన సిప్‌కాట్‌లో జరిగిన అభివృద్ధి ఏమి? స్థానికులకు ఒరిగింది ఏమి? వున్న భూములమ్ముకొని ఖర్చులు చేసి ఇప్పుడు కూలికి పోతున్నారు. హోసూరు అభివృద్ధిలో స్థానికుల పాత్ర ఏమి? ఎన్ని కంపెనీలు మూసివేశె. ఎంతమంది వుద్యోగులు వీధుల్లోకి వచ్చె. పోతేపోని ఇవి బీడు భూములా? బంగారు పంటలు పండే భూములే కదా! అవునవును నారాయణరెడ్డి భూములుపోతే ఆ బాధ ఆయనకు తెలుస్తుంది. వాళ్ళ భూములు మిగులుకొంటాయి కదా! వాళ్ళ భూములకి విలువ వస్తుంది. ఇప్పుడు వీళ్ళ భూములు సీదేవాళ్ళు లేదు' అంటా నల్గురి గొంతులు ఒకేసారి ఆవేశంగా వినబడె.

'మా భూముల్నే ఫ్యాక్టరీలకు ఎత్తుకొన్నీ మేమంతా ఇచ్చేస్తాం'. నారాయణరెడ్డి అంటుండగా 'మీ భూములు ఎత్తేల్దు అని తెలుసు. అందుకే ఇప్పుడంటావు,' రగు జోక్యం చేసుకొన్నాడు.

'ఫ్యాక్టరీలు వస్తే ఇక్కడి వారికి మిగిలేది గబ్బుగదురే, భూమిలోపల నీళ్ళు తోడేస్తారు. నేలలు మిగిలితే కూడా పంటలు పెట్టేకి అయ్యేల్దు'.

'1963లో కరెంటు కోసం దుడ్లు కట్టినోళ్ళకు ఇంకా కరెంటు రాలేదు. లక్ష రూపాయలకు పైనైతుంది కరెంటు తీయాలంటే. అకలాయంగా మానేళ్ళను పెరుక్కొంటే ఎట్లా చిక్కన్నా!' మునెప్ప అనె.

'వచ్చే ఫ్యాక్టరీలు ఎట్లావి అనుకొంటారు, వేలూరు, వానియంబాడి దగ్గర వుంటాయే అట్లా తోళ్ల ఫ్యాక్టరీలు వస్తాయంటా. మన వూరంతా గబ్బుపట్టి పోతుంది. మనమంతా ముక్కు మూసుకొని బయటికి పోవాల. అంతేకాదు తినుబండారాలు తయారుచేసే కంపెనీనంట, పండ్లు అన్నీ ఇక్కడికి వస్తాయి. కుళ్ళిపోయిన గబ్బుతో చుట్టూ అంతే' తలవరు చెప్పె.

'ఎట్లాప్పా ఇట్లైతే మన వూళ్ళు ఎంత బాగుండాయి. మన్ను వాసన, పంటలు పచ్చగా ఆనందంగా వుండే నేళ్ళలో ఫ్యాక్టరీలు కడితే ఎట్లా! మన్ను వాసనట్లా శ్రేష్టం వేరేది లేదు. ఇట్లాంటిదాన్ని మనము వదులుకోవాలా. కష్టపడి పనిచేసి మద్యాన్నం ఎండలో గెనంమీద కానుగచెట్టు నీడలో నిద్రపోతే ఎంత హాయిగా నిద్ర పడుతుంది. కానుగచెట్టు నీడ కన్నతల్లి ఒడి ఒకటే అంటారు. వానాకాలంలో వానపడే గుర్తులు మనకు ఎంత బాగా తెలుస్తుంది. ఇప్పుడే చూడండా మన అబ్బోళ్ళ కాలంలో పొయ్యిమింద సంగటికి ఎసురు పెడితే ఎంత దూరం గమ్ములు వచ్చేది. ఇప్పుడు మనం సరిగ్గా సేద్యాలు చేయకా గౌరమెంట్ ఎరువులు వాడి పండించే రాగుల్తో కెలికితే ఆ గమ్ములే లేదు. మా అమ్మ పొయ్యిపైన వెన్న సుదిగిస్తూ వుంటే మన వూరంతా గమ్ములు వచ్చేది. కాని ఇబుడు ఆ నెయ్యి వాసన' వస్తుందా!' గోపాలప్ప పాత జ్ఞాపకాలు చెప్పుకొనె.

'అక్టోబర్, నవంబర్ నెలలో చేనుల దగ్గరికి పోతే చూసేదానికెంత సంతోషంగా వుంటుంది గోపాలప్పా! చేనుల్లో ఎర్రినూగులచెట్లలో పసుపు పువ్వులు, రాగిచేన్ల సాళ్లల్లో జొన్నకడ్ల పువ్వులు, రాగి ఎన్నులు ముద్దలు ముద్దలుగా ఎంత అందంగా పెరిగి వుంటాయి. గెనాల్లో కసువు, సెనగ సెట్లు, సీతాకోక చిలుకలు, బసవణ్ణలు, రకరకాల పురుగులు ఈ కాలంలో ఎంత హాయిగా బదుకుతాయి', మునెప్ప చెప్తుతుండగా అందరు నిశ్శబ్దంగా వింటున్నారు. 'హోసూరు దగ్గర ఫ్యాక్టరీలు అయ్యి మన వూర్లే ఇప్పుడు మారిపోయే! తాగే నీళ్ళకోసం ఎన్ని దోసుళ్ళు పడుతున్నాము. ముందు కాలంలో వానలు లేకుంటే మళరాయుని పండుగ చేస్తే వానలొచ్చేవి. ఇప్పుడు ఆ పండుగ చేసేవారే లేరు. చేస్తే కూడా వాన పడేది లేదు" గోపాలప్ప దీనంగా మాట్లాడె.

'మన ఊరు పట్నమైపోతుంది. ఎక్కడోళ్ళంతా ఈ వూరికి వచ్చి చేరుతారు. మనమంతా ఇంకా పట్నమోళ్ళు అయ్యిపోతాము కదా గోపాలన్నా' వాసు అడిగె ఎగతాళిగా.

"వూ! పట్నమోళ్ళ బతుకు తెల్లారిపోయింది! పట్నంలో బతికేవాళ్ళకు మనశాంతి వుందనుకొంటారా? బెంగుళూరులో వుండేవాళ్లంతా దూరంగా పొయ్యి అక్కడ గెస్ట్‌హౌస్‌లు కట్టుకొని శని, ఆదివారం నాడు బెంగుళూరు వదలి పరుగెత్తి పోతుంటారు. మన రోడ్డులోనే ఒక లాయర్ బంగళా కట్టుకొని శని, ఆదివారం ఇక్కడికి వస్తుంటాడే, మనం చూడలేదా? పట్నంలో ఏముంది అక్కడ పెరిగే పిల్లలకు ఆకాశంలో నక్షత్రాలు తెలీదు, చందమామ

తెలీదు, పౌర్ణమిలో వెన్నలంటే తెలీదు. మానవ సంబంధాలే వారికి తెలీదు. వారిదంతా యాంత్రిక జీవనమే కదా!" అనె తలవరు.

'భూములు సర్వే చేసేందుకు త్వరలోనే వస్తారంటా' ఆనందరెడ్డి మధ్యలో వచ్చి విషాద పలుకు వినిపించె.

'ఈసారి ఎవురైనా వస్తే వూరుకొనేది లేదు. వూరు వూరంతా కలిసి అడ్డేస్తాం. జైలుకు పోయేకి కూడా మేమంతా రెడీ. తలవరు ఎనుక మేము వుంటాము' అనె రవి.

'గోపాలప్పా, చిక్కన్న, రమేష, వాసు, రవి అంతా కలిసి వూర్లో మాట్లాడుతాం. తోటోనికి చెప్పి రేవు వూరునంతా పిలుపించండా! తలవరే రేపు నీవు కూడా వుండప్పా' అనే రగు... తిరుగుబాటు ధోరణితో.

✡

# ఈరడింటో పెళ్ళి

**–అక్కినేని కుటుంబరావు**

కూతుర్ని తీసుకుని జగన్నాథంగారింటి కొచ్చాడు బండీరడు.

బండీరడు – బండవీరడుగాని బండి వీరడు కాదు.

"దొరసానమ్మగోరూ దొరుండాడ?" అని యింట్లోకి ఓ కేకేశాడు.

దొరసానమ్మగారు లోపల ఎక్కడో ఉంది. దొర బైటికొచ్చాడు.

"ఏరా బండీర! ఏంటి సంగతి?" అని బండీరడ్ని అడిగి, పక్కనున్న లచ్చిని చూసి "ఇదెవర్రా?" అన్నాడు జగన్నాథం.

"ఇది నా కూతురుండే. లచ్చి" అన్నాడు బండీరడు.

"బండీరడి కూతురూ, బండీరడి కూతురూ అంటే యేంటో అనుకున్నా, నీ కూతురు గుర్రంలా బాగుందిరా!" అన్నాడు లచ్చివంక తినేసేట్టు చూస్తూ.

"ఏంటోలెగండి దొరా! అంతా పిచ్చొల్లు" అన్నాడు బండీరడు. అంతకన్నా యింకేమనాలో తోచక.

"పిచ్చొల్లేంటిలే... మంచోల్లే. సినిమాలో అమ్మాయిల్లాగా వుంది. ఆ రంగు రంగుల బట్టలూ అదీ... ఊ... బాగుంది. చాలా బాగుందిరా" అన్నాడు దొర.

జగన్నాథానికి అరవై యేళ్లు. ఇంత బాగానూ వున్న మనమరాళ్లున్నారు. పట్నంలో చదువుకుంటున్నారు కాబట్టి యింకా షోగ్గా కూడా వుంటారు. అయితే తన మనమరాళ్ళ గూర్చీ, వారి అందాల గూర్చీ భార్యతోనూ, కూతుళ్ళతోనూ మాట్లాడేటప్పుడు "అమ్మళ్ళకేమే. బంగారబ్బొమ్మలు. చిదిమి దీపం పెట్టొచ్చు, నా మనుమరాళ్ళు గాదూ!" అంటాడు.

బైటి వాళ్ళమ్మాయిల్నయితే... అదీ తమకింద పనిచేసే మనుషుల పిల్లలయితే సినిమా అమ్మాయిల్లాగానూ, బాగా బలిసి సవారికి సిద్ధంగా వున్న గుర్రాల్లాగానూ కనపడ్తారు. అవతలి వాళ్ళు 'అదేం' అనే అవకాశం లేదు కాబట్టే యింకా ఎలానైనా కన్పడతారు.

బండీరడు నసిగి నసిగి... "దీనికి పెళ్ళి సేద్దారి అనుకుంటన్నా దొరా. నిన్నే గుడివాడ నుంచో సంబంధమొచ్చింది. కుఱ్ఱాడు రిక్షా లాక్కుంటన్నాడు. రోజుకు నాలుగురాళ్ళు కళ్ళ సూత్తన్నాడు. మరి తమరితో సెప్పి ఎట్టాగోట్టా దీనికా మూడుముళ్ళూ..." అని ఊరుకున్నాడు బండీరడు.

"అప్పుడే దీనికి పెళ్ళేందుకురా. నాల్గేళ్ళు నీ దగ్గరుంచుకుంటే కూలీనాలీ చేసి నాలుగు డబ్బులు కూడబెట్టుకుంటుందిగా."

"అదేంటుండే. ఇంతకు మునుపే గదుండే నువ్వు గుఱ్ఱంలాగుందన్నావు"

"అన్నాన్లే. మరి అది గుఱ్ఱంలా కనపడింది నా కళ్ళకి. సరే. దీనికి కళ్ళెమెయ్యాల్సిందే. అదిసరేగానీ, ఈరా? ఇంతందమైందాన్ని పైయ్యూరుకి పంపడమేంట్రా. మనూళ్ళో దీన్ని పెళ్ళాడతామన్న మగాళ్ళే దొరకలేదంట్రా" అన్నాడు.

జగన్నాథానికి ఆ నిమిషాన సంఘాన్ని ఎదిరించి విప్లవాత్మకమైన పనొకటి చేస్తే బాగుంటుందనిపించింది. అదేమిటంటే లచ్చిని తను 'ఉంచుకుంటే' బాగుంటుందని. కాని మళ్ళీ ఎన్నో తలనెప్పులు. ఒకటి 'మాల్లంజై'పోయింది. రెండు – అంతా ఈ వయసులో నీకిదేం బుద్ధి అంటారు. మూడు – పెళ్ళాం, పిల్లలూ, అల్లుళ్ళూ, కోడళ్ళూ, చివరికి మనమలు, మనుమరాళ్ళు అందరి ముందు తలొంచుకు తిరగాల్సి రావొచ్చు.

"ఛీఛీ అయినా దీంతో మనకేంటి" అనుకుని తన విప్లవాత్మకమైన నిర్ణయాన్ని మార్చుకున్నాడు.

దొర మౌనాన్ని చూసి ఏమనాలో తోచక బండీరడు "ఎయ్యి రూపాయలు" అన్నాడు.

"ఎయ్యా? ఎయ్యెక్కడ్నుంచి తేనురా! అయినా నేనియ్యకపోతే నీకు దొరకవా?" అని లచ్చెంక చూసి "ఏమే" అన్నాడు జగన్నాథం.

దొరకంది లచ్చికా, బండీరడికా అనే అనుమానం యిద్దరికీ వచ్చేట్టు.

కాసేపు లచ్చెంక చూసిచూసి, "ఏరా" అన్నాడు, ఆ ప్రశ్నకి సమాధానం ఈరడే ఇవ్వాలన్నట్టు.

"ఎక్కడ దొరుకుతుయ్యుండే. నీ దగ్గరే లేవంటున్నావ్. ఇక ఊళ్ళో నీకన్నా మొవాసులున్నారా?" అని దొరని ఉబ్బేశాననుకొని మహా సంబరపడ్డాడు బండీరడు.

"సర్లేరా... నీకు చెల్లంకుల్లో కాత్తేదో ఏడిసినట్టుందిగా పొలం."

"ఆ ఉంది లెగండి. చిటికెడు చిట్టు కూడా అవదు. మీ సేను సరసనేగా"

"ఏం తగలడిందోలే. నా కయన్నీ ఎక్కడ గుర్తుండి చస్తయ్ గాని.. ఎయ్యేం చాల్తయ్‌రా, పదిస్తర్లన్నా లేపవ్?"

"లేపప్పోతే కులపోళ్లూరుకుంటారేంటుండే"

"మరెయ్యేం సాల్తయ్‌రా!"

"ఏదో...."

"ఏంటేదో... నా మాటిను. నీకిదొక్కటేగా పిల్ల. ఒక్కగానొక్క పిల్ల పెళ్ళి చేత్తన్నావ్. నువ్వు మళ్ళీ పెళ్ళిళ్ళు చెయ్యబోయావా? నలుగురికి పెట్టబోయావా? కాదూ కూడదంటే మళ్ళీ నువ్వే పెళ్ళి చేసుకోవాలి..." అని బెకబెలాడాడు జగన్నాథం.

ఈరదు కూడా పగలబడి నవ్వి "ఆ! ఇక నాకదొక్కటే తక్కువ. ఈమాట మీ మాలదిందంటే నాకీ నాలుగు మెతుకులు కూడా పెట్టదూరుకోండే" అన్నాడు ఖుషీ అయిపోయి.

లచ్చి కిలకిల నవ్వింది.

ఆ నవ్వు చూసి జగన్నాథం "ఓసి నీ అందమార! ఏం నవ్వు నవ్వావే" అన్నాడు. అదే సమయంలో లచ్చి జబ్బ మీదొక దెబ్బ వేస్తే బాగుణ్ణని అతని మనసు లబలబలాడింది గాని ఆ పిల్ల దూరంగా ఉండడం వల్ల కుదరలా, లేచి వెళ్దామన్నా, ఆమెను దగ్గరకు రమ్మందామన్నా బాగుండదనుకుని ఊరుకున్నాడు.

"... మరందువల్ల... మీ మాలపల్లి మాలపల్లీ ముక్కుమీద వేలు వేసుకునేట్టు చెయ్యరా. నువ్వు మళ్ళీ చెయ్యబోయి చేత్తావా? ఆ పెళ్ళి వైభోగం చూసి నీ అల్లుడు అదిరిపోవాలి. ఆ దెబ్బతో నీ కూతుర్ని పువ్వుల్లో పెట్టి చూసుకోవాలి."

"ఆఁ నాకెందుకు లెగండే అంత బరువు నే మొయ్యలేను. ఎత్తలేని ఎత్తులు నాకెందుకుండే. ఏదో ఓ ఎయ్యిప్పిత్తే మా తిప్పలు మేం పడతం"

"ఓర్నీ. అందుకేరా అందరూ నిన్ను బండీరడనేది. ఏటని గోసినా ఎండగట్టి తిందామనే గాని పరులకింత పెడదామని ఉండదేరా? ఒక్కగానొక్క కూతురి పెళ్ళి చేత్తా కానీ ఖర్చు లేకుండా, పది మందినీ పిలవకుండా చేద్దామనే చూత్తన్నావ్. కట్టుకుపోతావేరా ముసల్నాకొడక? బండనాకొడక" అని దొంగనవ్వులు నవ్వుతూ జగన్నాథం అనేసరికి –

పైగా 'ఏటనికోసినా ఎండగట్టి తింటావుగాని...' అనేసరికి, తన్ను ఘోరంగా అవమానించినట్టూ, తద్వారా మాలపల్లినే అవమానించినట్టూ, ఆ మాటకొస్తే అసలు మానవజాతినే అవమానించినట్టుగా భావించి బండీరడు పౌరుషం తెచ్చేసుకున్నాడు.

"ఏంటుండే. మీరు కూడా అట్లా మాట్టాడతన్నారూ? ఎక్కడతేముండే డబ్బూ? ఎయ్యి రూపాయలియ్యమంటే నువ్వే ఎనకాముందూ ఆడతన్నావు గంద. ఇంకెవడు నా మొఖం చూసి డబ్బిత్తాడుండే?" అన్నాడు బండీరడు.

"ఉరేయ్. ఏదో మాటవరసకన్నాలేరా! ఎయ్యికాదు నాలుగు వేలిత్తే మాత్తరం నువ్వెక్కడి కెల్తావుగానీ. నీకు నిజంగా డబ్బు దొరకదనే తేలిగ్గా పోనిద్దామనుకుంటున్నవా?" అని అన్నాడు జగన్నాధం.

"అంతేగదుండే మరీ"

"సరే అయితే. నీకెంత కావాలంటే అంత. ఎప్పుడు కావాలంటే అప్పుడు వచ్చి తీసికెళ్ళరా. సరేనా!"

"సరేనుండే."

"మరింకే. మైకూగియ్‌కూ తెప్పించి మాంఛి అంగూ ఆర్భాటాల్తో చెయ్యి కూతురి పెళ్ళి. నీకేంటి? అందర్లా కాదు. సెంటో కుంటో పొలముంది. వంటో భగమంతుడిచ్చిన శెక్తుంది. నీకేం తక్కువ. ఇటు చూత్తే ఒక్కగానొక్క కూతురు. నువ్వు మళ్ళీ పెట్టబోయావా? నీవాళ్ళు తినబోయారా? పెళ్ళంటే ఈరడింటో పెళ్ళే పెళ్ళి. అని మాలపల్లిలోనేగాక కమ్మటూర్లో కూడా చెప్పుకునేట్టు చెయ్యి. నిన్నాక్షేపించేవాడు లేడు. మొన్న చూశావుగా రామయ్యగారింటో పెళ్ళి. ఒక్కడ్ని పిలిచాడా, ఒక్కడొచ్చాడా? కమ్మోడన్నమాటేగాని కమ్మపెళ్ళిలాగా వుందా? ఆయన్నసీ లాభం లేదనుకో. 'తింటే చూడు తిప్పుళ్ళాట తినకపోతే చూడు దేవుళ్ళాట'నీ ఎటు చూసినా అప్పులూ వాళ్ళూనూ! నీకే? మాలాడివన్నమాటేగానీ మాలపల్లిలో తల్లో నాలుకలాగా ఉన్నోడివేగా, నామాటిని శుభ్రంగా ఖర్చు కెరవకుండా చేసెయ్ పిల్ల పెళ్ళి. నే చెబ్తున్నాగా" అని నోట్లో చుట్టని పీల్చి అది ఆరిపోయిందని గమనించి, చుట్టని తీసి నేలకేసి రాసి, చేతులబన్నీ జేబులోంచి అగ్గిపెట్టె తీసి రెండుసార్లు గీశాడు.

వెలగలా.

మూడోసారి – వెలిగి వెంటనే ఆరిపోయింది.

"ఉసే, నీ పేరేంటో..."

"లచ్చుండే"

"అదేలే. ఇటురా. కాస్త గాలికడ్డంగా నుంచో."

లచ్చొచ్చి గాలికడ్డంగా నుంచుంది. జగన్నాధం అగ్గిపుల్ల గీశాడు. అది వెలగలా!

మళ్ళీ గీశాడు.

మళ్ళీ వెలగలా.

కాని విరిగింది.

“తుఫ్, దొంగలంజా కొడుకులు. డబ్బులు దొబ్బటమేగాని, సరైన సరుకొక్కటీ యివ్వరు” అని వ్యాపారస్తులందర్నీ పేరుపేరునా తిట్టి మరోపుల్ల గీశాడు.

తిట్టుకి జడిసినట్టు పుల్ల వెలిగింది. చుట్ట అంటించుకుని, మండే అగ్గిపుల్లని లచ్చి లంగాకి అంటించబోయినట్టు నటనచేసి – లచ్చి భయపడుతోంటే నవ్వి –

“నీ దుంపతెగా!” అనే మాట సాయంతో ఆ పిల్ల జబ్బమీదో దెబ్బేసి, ఆమె శరీరపు గట్టితనానికి ముచ్చటపడి మరో దెబ్బ వేసేంతలో లచ్చి దూరంగా వెళ్ళి నుంచుంది.

“సరేరా... ఈర... నీకెప్పుడు కావాలంటే అప్పుడు ఎంత కావాలంటే అంత యిస్తా. దీన్ని పంపు. మళ్ళీ అక్కడ్నుంచిక్కడదాకా నువ్వెందుకు” అన్నాడు జగన్నాధం.

“సరే నుండే...” అని వీరడు బైల్దేరాడు. తండ్రి వెంట కూతురూ వెళ్ళబోతూ ఒక్కసారి జగన్నాథాన్ని చూసింది మామూలుగానే. కానీ ఆ చూపుతో జగన్నాధం కుడితిలో పడ్డ ఎలకలా గైపోయాడు.

‘సంఘాన్నెదిరిద్దాం’ అనుకున్నాడు. వెంటనే “ఇదిగో... ఉసే... నీ పేరేంటో” అన్నాడు.

“లచ్చుండే” అంది వెళ్ళబోయేదల్లా ఆగి వెనక్కి తిరిగి.

“అదేలే... సరేలే, వెళ్ళు” అన్నాడు.

ఇంట్లో ఉన్న ముసలి భార్య –

ఇంట్లో ఉన్న జబ్బు భార్య –

పునిస్త్రీ చావు కోసం నోము నోస్తున్న భార్య – గుర్తొచ్చింది.

“దేవుడున్నాడో లేడో” అనే మీమాంసలో పడ్డాడు జగన్నాధం.

“ఒక వేళ ఉంటే భక్తుల కోర్కెల్ని తీర్చడంలో జాప్యమెందుకు చేస్తాడో. తన భార్య ఎంత భక్తురాలు. ప్చ్...” అనుకుంటూ భగవంతుడ్ని తన భార్యకి పునిస్త్రీ చావు ప్రసాదించడంలో తాత్సారం చేస్తున్నందుకు విసుక్కుని లోనకెళ్లి పైపంచె తెచ్చుకుని దులుపుకుంటూ బజార్న పడ్డాడు జగన్నాధం.

✡

“ఆరేసుకోబోయి పారేసుకున్నాను హరి హరి హరీ” అంటూ ఎవరో ఆడకూతురు పారేసుకున్నందుకు తెగ సంతోషపడిపోతోంది, ఈరిగాడింటికాడ్నుంచి మైకులో.

మాలపల్లంతా ఒకటే సందడి. ఎవళ్ళకాళ్ళు ‘తెల్లారతందా పొద్దూకుతందా’ అని ఒకటే భయపడ్తున్న రోజుల్లో ఒక రోజున ఈరిగాడు మాలపల్లంతట్నీ భోజనాలకీ, పెళ్ళికీ పిలిచాడు.

పిలిచిందే తడవుగా మాలపల్లంతా వచ్చి ఈరిగాడింటి మీద పడ్డారు. పిల్లాపాపా చేరి తమక్కావల్సిన పాటలు ఉన్నవాటిల్లోంచి యెంచుకుని వేయించుకుని, విని, మైకతనితో తిట్లు తిని...

పెద్దాళ్ళంతా ఒకచోట చేరారు.

"ఈరిగాడే ఈరిగాడు. లచ్చి పెళ్లే పెళ్లి" అని ఏకగ్రీవంగా తీర్మానించారు.

"ఇటువంటి పెళ్ళి మాలపల్లిలో ఇంతకుముందు సూడలేదు" ఎనభై ఏళ్ళ ఎంకయ్య అన్నాడు.

"మాలపల్లిలో ఏటి? కమ్మటూర్లో మాత్రం ఎంతమంది యింత ఖర్చు పెడ్తన్నారు. మరీ బలిసిన రైతుల్నొదిలేస్తే, అంతా 'తూతూ' మంత్రం చేసెయ్యటల్లా" అన్నాడు చింతడు.

"ఆళ్ళు మాత్తరం ఏం సేత్తార్లేరా! డబ్బు.... అంతా డబ్బులో వుంది. కమ్మదొరయినంత మాత్రాన డబ్బెక్కడ్నుంచొత్తంది. డబ్బుల్లేకుండా మైకు దగ్గరకెళ్లి 'నేను కమ్మదొరని. పాట పాడమంటే పాడతందా?' 'ఇయిగో రూపాయలు. పాడు అంటే చల్ మోహనరంగా' అని పాడతం మొదలెడ్తంది గాని" అన్నాడు ఈరేశం.

అంతా గొల్లున్నవ్వారు.

"అంతే అంతే" అని ఏకగ్రీవంగా డబ్బు మహత్యాన్ని వేనోళ్ళ కొనియాడారు.

"ఈరడంటే ఏదో బండాడు కాబట్టి ఎనకా ముందూ చూడకుండా చేశాడు గాని యిట్టా యిక ముందు కూడా మన మాలపల్లిలో ఎవడూ పెళ్ళి చేయలేడు" అని జోస్యం చెప్పారు.

"ఓరి సర్లే ఊరుకోండిరా ఆడు బండాడు కాబట్టి కింద మీద తెలవక ఖర్చు చేత్తన్నాడు. ఏలకి ఏలు అప్పెట్టా తీరుత్తామనే బయంలేదు. మనకింత ధైర్యం ఎక్కడ్నుంచి వత్తంది" అన్నాడు యాకోబు. ఇతను ఈమధ్యే కూతురి పెళ్ళి చేశాడు. అయినవాళ్ళని కూడా పిలకుండా, పిలుద్దామని ఉన్నా చేతిలో పైసా లేదు. ఏం చేస్తాడు?

యాకోబు అన్న మాటకి బండీరడి మేనత్తకొడుకూ, భార్య తమ్ముడూ అయిన నల్లెంకడికి కోపమొచ్చింది. "ఓరి యాకోబూ, నువ్వు నీ కూతురి పెళ్ళి కెవరినీ పిలవలేదని మేమేమీ అనంలేరా! ఎందుకా ఉలికిపాటు? మా బావకీ అక్కకీ సెంటో కుంటో పొలముంది. ఒంటో కాత్తో కూత్తో ఛెక్తుంది. పొలంలో నాలుగ్గింజలు పండిచ్చుకుని తిండికి జరుపుకున్నా కూలో నాలో చేసుకుని నాలుగు డబ్బులు ఎనకేసుకోగలమనే ధైర్యంతోనే ఒక్కగానొక్క కూతురి పెళ్ళి గనంగా చేసుకుంటన్నారు. అప్పిచ్చిన మారాజు జగన్నాథం గోరికిలేని భయం నీకెందు కురా. అప్పెట్టా తీరుత్తారని" గడగడ అన్నాడు నల్లెంకడు.

అతని కోపం చూసి అందరూ తగ్గారు. ఎంకయ్య మాత్రం "అంతేలేరా! ఆడి వంటో ఛెక్తుంది. నాలుక్కాలాల పాటు కష్టపడి అప్పు తీర్సుకుంటాడు" అన్నాడు.

అందరూ "అంతే. అంతగాకేంటిలే" అన్నారు.

✡

పెళ్ళయిన నెలరోజులకి జగన్నాథం బండీరడ్ని పిలిపించాడు.

"ఏంటుండే" అనుకుంటూ వచ్చాడు ఈరడు.

"ఏంలేదు లేరా ఈరా! పెళ్ళి మా గనంగా చేశావంటగా. అంతా మా గొప్పగా చెప్పుకున్నారనుకో" అన్నాడు జగన్నాథం.

"అంతా మీ దయుండే" అన్నాడు ఈరడు.

పులి మంచితనాన్ని పొగిడే మేకలాగా.

తోడేలు మంచిదనుకుంటున్న కోడిలాగా.

"నా దయేముందిలేరా. భగమంతుడి దయుండాలి. నీ పిల్ల పెళ్ళి నువ్వు చేసుకున్నావ్. అందరికీ సంతోషమే" అన్నాడు.

సీతారాముల పెళ్ళి లోకానికే పెళ్ళి!

"మీ అండదండలుండయ్యి గాబట్టే నేను చెయ్యగలిగాను గదుండే" అన్నాడు ఈరడు.

"దాన్దేముందిలేరా. నీకు వంట్లో భగమంతుడిచ్చిన శక్తుంది. నువ్వూ నీ పెళ్ళామూ. కూతురంటావా సుఖం గుంటంది. నీ అల్లుడు కూడ మంచాడేనంటలే. గుడివాడలో కనుక్కున్నా. మరి లెక్కలు చూశానురా. చెల్లంకుల్లో కుంటన్నరా నా కమ్మినట్టు కాగితాలు రాయించా. ఊళ్ళో వున్న ధరకి ఒక వంద ఎక్కువే ఏశా! మరి అది పోగా నువ్వింకా ఆరున్నొక్క వందలు బాకీ వుంటావు. దీని మీద యేలిముద్రలెయ్యి యిటొచ్చి..." అంటున్నాడు జగన్నాథం.

బండీరడు తాతల్నాటి చెల్లంకుల్లో పొలం తాతల్ని వెతుక్కుంటూ వెళ్లిపోతున్నట్టుగా భయపడిపోయాడు.

"అదేంటి దొరా అట్టా అంటావు. పొలం అమ్ముకునేటట్టయితే ముందే అమ్ముకోలేక పోయానా? మీ దగ్గిర కొచ్చి అప్పెందుకడుగుతాను. కూలో నాలో చేసుకుని మీ అప్పు వడ్డీతో సహా అణాపైసల్తో సహా తీరుత్తాగాని. పొలం అమ్మేది లేదుండే" అన్నాడు.

అన్నాడే గానీ జగన్నాథం తన పొలం లాగేసుకుంటాడనే భయంతో వీరడి మనసు అల్లకల్లోలం అయిపోతోంది.

జగనాన్నధం తాపీగా అన్నాడు – "నువ్వు కూలీనాలీ చేసి ఎంత సంపాదిస్తావు? నువ్వెంత తింటావు. నాకెంతిస్తావు? నువ్వు ఎన్ని జన్మలు సంపాదిత్తే నా అప్పు తీర్చగలవురా ఎ|్రాడా? వడ్డీ పెరిగిపోతా వుంటంది. అందుకే, ఇప్పుడు పొలం నాకమ్మెయ్యి. తర్వాత సంపాదిచ్చినప్పుడు రా. నీ పొలం నీకే యిత్తా. దీనివల్ల నీకు వడ్డీ తప్పుతుంది."

"అది కాద్దొరా..."

"అరేయ్! నాక్కోపం తెప్పించమాక...." అని జగన్నాథం లేస్తున్నాడు.

బండీరడు 'నా పొలం నా పొలం' అంటూ పిచ్చికేకల్తో ఊర్లోకి పరిగెత్తాడు.

✡

# అదృశ్యం

**–పలమనేరు బాలాజీ**

బ్యాంకు కళకళలాడుతోంది. బ్యాంకు ముందు, లోపలా జనం గుంపులు గుంపులుగా చేరిపోయారు. బ్యాంకు ముందు స్థలం చాలకపోవటంతో స్కూటర్లు, కార్లు రోడ్డు వారగా నిలిపి ఉన్నాయి. "సుస్వాగతం, రుణమేళా, హౌసింగ్ లోన్స్, పర్సనల్ లోన్స్, కార్‌లోన్స్" అని రాయబడ్డ రంగురంగుల బ్యానర్లు ఠీవిగా బ్యాంకు ముందు గాల్లో ఎగురు తున్నాయి.

"చూస్తివాన్నా, ఉద్యోగులు, యాపారాలు చేసుకునే వాళ్లకి పిలిచి పిలిచి మర్యాదగా లోన్లిస్తాండారు. యాడైనా రైతుకి లోనిస్తామని ఒక బ్యానరు గుడ్డయినా కట్టి నారేమో సూడు" అన్నాడు శీనయ్య.

అతడికి బదులు చెప్పే ప్రయత్నం చెయ్యలేదు మునస్వామి.

"బ్యాంకు లోనంటే మాటలానా, బ్యాంకు చుట్టూ తిరిగి కడాకు కాదనిపించుకునే దానికంటే మన సింగిరోల్ల శివన్న కాడ బాండు కాయితం రాసిచ్చి పట్టా పుస్తకాలు పెట్టేసి, ఎంతకావల్లంటే అంత తీసుకునేది మానం కదా. మనూరోల్లు చాలా మంది అట్లే చేసినారు. వడ్డీగిడ్డీ అని చూడొద్దు. తెంపుగా దుడ్డు తెచ్చుకుందాం రానా అంటే నువ్వు నామాట యినకుండా బ్యాంకు చుట్టూ తిరగతానే వుండావు"

నిష్టూరంగా అన్నాడు శీనయ్య.

ఆ మాటల్ని విననట్లుగా మౌనంగా వుండిపోయాడు మునస్వామి.

తాను ఏం మాట్లాడినా దానికి తగిన రీతిలో చెప్పాల్సింది చెప్పి ఎట్లాగైనా తనను శివన్న దగ్గరకు తీసుకుపోగల సమర్థుడు శీనయ్య అనే విషయం మునస్వామికి బాగా తెలుసు.

అంతకంతకూ బ్యాంకులో రద్దీ పెరుగుతూనే వుంది. రుణాలు పొందిన వాళ్లు వెలిగి పోతున్న మొహాలతో బరువైన బ్యాగులతో హుషారుగా బ్యాంకు లోంచి బయటకు వస్తున్నారు. బ్యాంకు లోపల వెళ్లాలనుకున్న మునస్వామి బ్యాంకు లోపల సందడిని చూసి మనసు మార్చుకుని, రోడ్డు దాటి బ్యాంకుకు ఎదురుగ్గా ఉన్న అమీర్ టీ అంగట్లోకి నడిచాడు.

అతడ్ని వదిలే ఉద్దేశం తనకేమాత్రం లేనట్లుగా వచ్చి పక్క బెంచీపైన కూర్చున్నాడు శీనయ్య. మునస్వామి వారిస్తున్నా వినకుండా టీ చెప్పాడు శీనయ్య.

టీ అంగడి కూడా బ్యాంకు లాగే సందడిగా ఉంది. బ్యాంకు పనిపైన వచ్చిన రైతులందరూ టీ అంగడి లోపలా, ముందరా చేరి మాట్లాడుకుంటున్నారు.

ఉదయం పదకొండు కాకముందే తన అవతారాన్ని మార్చుకున్న ఆనాటి దినపత్రిక చేతులు మారుతోంది.

టీ మరకలు పడిన టేబుళ్ళపైన, బెంచీలపైన ఈగలు ముసురుకుంటున్నాయి. జనం ఎక్కువ కావడంతో ఉక్కకగా అనిపించింది మునస్వామికి.

టీ వచ్చింది ఇద్దరూ టీ చప్పరించసాగారు.

"బోరు పాయింట్ పెట్టించేస్తివాన్నా" మునస్వామిని మాట్లాడించే ప్రయత్నం చేసాడు శీనయ్య.

ఈసారి శీనయ్య ప్రయత్నం ఫలించి మునస్వామి నోరు విప్పాడు.

"బంగారం లాంటి పాయింట్ పెట్టించేసినా శీనయ్య! ఒకరు కాదు ఇద్దరు కాదు ముగ్గురి దెగ్గిర పాయింట్ పెట్టించినా. కాప్పల్లి ఎంకట్టరెడ్డి, బొమ్మిదొడ్డి పీరుసాయిబు, జియాలిజిస్టు ముగ్గురూ ఈశాన్యంలోనే పాయింటు పెట్టినారు. చీలంపల్లి అయ్యివోరు కూడా ఖాయంగా నీళ్లు పడతాయనే చెప్పినాడు"

బోరు విషయం ప్రస్తావనకు రాగానే మునస్వామికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చేసినట్లుంది. విప్పారిన మొహంతో చెప్పుకుపోతున్న మునస్వామి మాటలకు శీనయ్య అడ్డొచ్చాడు.

"అట్లయితే ఇంకేంనా ఈ దినం ఏకాదశి, శుక్రవారం. చానా మంచిరోజు. పదా... పోయి బోరుబండికి అడ్వాన్సు ఇచ్చేసొద్దాం"

ఆ మాటలతో మునస్వామి ఉత్సాహంపై నీళ్లు చిలకరించినట్లయ్యింది.

"లోనింకా శ్యాంక్షన్ కాలేదు శీనయ్య. ఈ దినం ఏ సంగతీ చెప్తామన్నాడు మేనేజరు" నీరసంగా చెప్పాడు మునస్వామి.

మునస్వామి మొహంలో తప్పిపోయిన కళ ఇప్పుడు శీనయ్య మొహంలోకి వచ్చేసింది.

"ఊరికే ఎందుకునా బ్యాంకోడి చుట్టూ తిరిగి లేదనిపించుకుంటావు. శివన్న దెగ్గిరికి పోదాం పదా, గంటలోగా నీకు ఎంత కావాలంటే అంత దుడ్డిప్పిస్తా" అన్నాడు శీనయ్య వుత్సాహంగా.

తన మొహంలోని భావాలు కనిపించకుండా చప్పున తల తిప్పుకున్నాడు మునస్వామి.

గతంలో శీనయ్యతో తాను పడిన బాధలన్నీ ఒక్కసారిగా గుర్తొచ్చాయి అతడికి.

రెండో కూతురు కాన్పుకని పుట్టింటికి వచ్చినప్పుడు చేతిలో పైసా లేకపోవటంతో శీనయ్య ద్వారా శివన్న దగ్గర డబ్బు మునస్వామి చేతికి వచ్చిన క్షణం నుంచి అతడ్ని వేధించుకు తిన్నాడు శీనయ్య.

ఏదో ప్రాణాలపైకి వచ్చిందని, అవసరమని చెప్పి, సతాయించి ఆ అయిదువేల్లోంచి ఓ వెయ్యి రూపాయలు చేబదులుగా తీసుకున్నాడు శీనయ్య.

అంతే ఆ వెయ్యీ చేతికి వచ్చిన క్షణం నుంచి మునస్వామికి కనిపించటం మానేసాడు శీనయ్య.

ఆ వెయ్యికి కూడా మునస్వామే వడ్డీ కట్టుకున్నాడు. వడ్డీ రాకపోయినా అసలు వస్తే చాలనుకున్నాడు.

తిరిగి తిరిగి అప్పుడు నూరు, అప్పుడు యాభై లెక్కన ఎనిమిది వందలు వసూలు చేసుకున్నాడు మునస్వామి.

మిగిలిన రెండు వందల దగ్గర శీనయ్య గొడవ పెట్టుకునేసాడు.

తేదీలతో సహా వివరంగా లెక్కలన్నీ చెప్పినా... శీనయ్య వినకుండా మొండిగా వాదించటంతో ఆ రెండు వందలకి నీళ్ళు వదిలేసాడు మునస్వామి.

శివన్న దగ్గర అప్పు అనగానే ఇవన్నీ గుర్తొచ్చి శీనయ్య దగ్గర నోరు విప్పకూడదనే అనుకున్నాడు. కానీ బోరు విషయం ప్రస్తావనకు వచ్చేసరికి మాట్లాడకుండా వుండలేకపోయాడు మునస్వామి.

గడ్డారు శంకరయ్య పలకరింపుతో ఆలోచనల్లోంచి తేరుకున్నాడు మునస్వామి.

"ఈ యిరవదాకా బ్యాంకులో బికారోడి మాదిరి నిలబడి నిలబడి వస్తాండాన్నా, కాళ్లు పీకతావుండాయి. నోరు తెరిసి ఏమప్పా వచ్చిండావే అని మేనేజరు అడిగింటే చెప్పు? కడాకు రైతంటే యాడేకానీ మతింపే లేకుండా పోయింది కదన్నా" అన్నాడు శంకరయ్య.

మౌనంగా తలాడించాడు మునస్వామి.

"ఏం మామా ఇంతకూ ఏమంటా వుండాడు మేనేజర్" కుతూహలంగా అడిగిన శీనయ్య వైపు చురుగ్గా చూసాడు మునస్వామి.

శంకరయ్య మొహానికి పట్టిన చెమటను తువ్వాలుతో తుడుచుకుంటూ చెప్పసాగాడు.

"లో ఒల్టేజీతో మోటరు కాలిపోయింది కదా. బోరు ఏసుకుందామంటే అయ్యేట్లుగా లేదు. ఉండేబోరే లోతు చేద్దామనుకుంటే, ముడ్డిచుట్టూ ముప్పై ఆరుసార్లు తిప్పించుకుని మేనేజర్ ఇప్పుడు సావు కబురు సల్లగా చెప్తాండాడు" అని అన్నాడు.

జగ్గులోంచి గొంతులోకి నీళ్ళు ఒంపుకున్నాడు. గుండీలు విప్పి చొక్కా వదులు చేసుకుని మెడపైన నీళ్లు చిలకరించుకున్నాడు.

అది చూసీ చూడగానే అమీర్ బాయ్‌కి కోపం వచ్చేసింది. "ఏందినా నీళ్లు పోసుకుంటావుండావ్, బిందె రూపాయిచ్చి కొంటా వుండాం తెల్సా" అన్నాడు విసురుగా.

"హోటల్లో జనాలు తాగే నీళ్లకన్నా నువ్వు పాలల్లో కలిపే నీళ్లే ఎక్కువగా వుండాయని అందరికీ తెల్సులే భాయ్ ఇంకో స్ట్రాంగ్ టీ ఈ మా శంకరయ్యకి" అన్నాడు శీనయ్య మధ్యలో జోక్యం చేసుకుంటూ.

"ఈయప్ప మాటలిని మా ఆడోళ్ల నగలు కూడా కుదవ పెట్టిస్తి కదనా, కడాకు రైతులకి లోన్లిస్తే కట్టేది లేదని నాకు లోను ఇచ్చేది లేదనేసినాడునా మేనేజరు" అన్నాడు శంకరయ్య.

"నగలెందుకు కుదవ పెడ్తివి మామా" అడిగాడు శీనయ్య.

"నెత్తిపైన శనేశుడు కూసోని ఆడిస్తా వుంటే ఇంకేం చేసేది శీనయ్యా. అంతా నా ఖర్మ. నగలు ఇచ్చేది లేదని మళ్లింకా ఇడిపించేది ఇప్పట్లో అయ్యేది కాదని మా ఆడోళ్లు నీలగతా వుంటే దాన్ని నాలుగు తిట్టి మరీ నగలు కుదవ పెట్టేస్తి. ఇప్పుడు బాకీ కావల్లంటే పాతబాకీ లేమీ వుండకూడదని మేనేజరు అంటే సరేనంటి. అదీ గాక వడ్డీమాఫీ అవుతుందని అసలు మొత్తం కట్టేస్తి. మళ్లీ కదా నాకు అసలు కత తెల్సింది" అన్నాడు శంకరయ్య.

టీ రావడంతో చెపుతున్న విషయాన్ని అర్థాంతరంగా ఆపి టీ చప్పరించసాగాడు.

శీనయ్య బీడి ముట్టించుకున్నాడు. ప్లాస్టిక్ కవర్‌లోంచి వక్కాకు తీసుకుని నోట్లో వేసుకుని నమలసాగాడు మునస్వామి.

"నగలు కుదవపెట్టి పాతబాకీ మొత్తం కట్టేసినంక అప్పుడు బుక్కుచూసి మేనేజరు వడ్డీ మాఫీ కాదని తేల్చిచెప్పేసినాడు." నిష్ఠూరంగా చెప్పసాగాడు శంకరయ్య.

"అందరి బాకీలకి వడ్డీ మాఫీ చెయ్యరంట. అది కూడా ఎవురికీ పూర్తిగా వడ్డీ మాఫీ చెయ్యరంట. పోయిన ఏడాది ఏప్రిల్ సెప్టెంబర్ మధ్యలో లోన్లు తీసుకొండేవాళ్లు అసలు మొత్తం కడితే వడ్డీలో ఇరవై శాతం మాఫీ చేస్తారంట. అంతమాత్రానికి వడ్డీ మాఫీ అని గవర్మెంటోడు ఒకపక్క, బ్యాంకోడు ఇంకోపక్క ఓ... అని ఊదరకొట్టేస్తాండారు"

నోరు తెరుసుకుని వింటుండిపోయాడు మునస్వామి. అంత స్పష్టంగా వివరంగా విన్నాక మరింకేం వివరాలు అడగాలనిపించలేదు. అతడికా సమయంలో ఎన్నెన్నో అనుమానాలు కలిగాయి. అన్నీ మనసులోనే దాచుకున్నాడు.

వర్షాల్లేక పంటలు పండక కరువు ధాటికి అల్లల్లాడుతున్న రైతులు వడ్డీమాఫీకి ఆశపడి సొత్తుల్ని తాకట్టు పెట్టి మరీ అప్పుల్ని తీర్చే ప్రయత్నంలో మరో రకంగా అప్పులపాలు కావటం ఎంత దారుణం అనిపించింది.

“బ్యాంకోల్లు మాత్రం ఇంకేం చేస్తారు మామా, బ్యాంకులు కూడా నష్టాల్లోనే ఉండాయి. రైతులు ఈ కరువు కాలంలో అప్పులు కట్టలేరని బ్యాంకోల్లకి బాగా తెలుసు. అయినా బాకీలు వసూలు చేసుకోవల్లంటే ఇంత కంటే మరో మార్గం లేదుకదా” అన్నాడు అదోరకంగా నవ్వుతూ శీనయ్య.

“ఈ బాదలన్నీ పడే బదులు గొమ్మునా ఆ శివన్న కాడికి పొయ్యి అప్పు తెచ్చుకునేది మానం అనిపిస్తాండాదిన్నా” అన్నాడు శంకరయ్య.

ఆ మాటలతో శీనయ్యకు ఎక్కడలేని హుషారొచ్చేసింది. “అదే మంచిది మామా అసలు మన మునసామన్నను కూడా శివన్న కాడికే రమ్మంటా వుండా. ఏం నా వస్తాండావా” అడిగాడు శీనయ్య నవ్వుతూ.

“లేదులేప్పా, బ్యాంకులో ఒకసారి మాట్లాడినంక శివన్న కాడికీ వస్తాలే” అన్నాడు లేచి నిలబడుతూ మునస్వామి.

“సరేన్నా మేం పొయ్యొస్తాం” అంటూ లేచి ముందుకు కదిలాడు శీనయ్య. కసాయివాడి వెంట వెళ్లే గొర్రె పిల్లలా అతడ్ని అనుసరించాడు శంకరయ్య.

అమీర్‌భాయ్ దగ్గర నిలబడి శీనయ్య జేబులు తడుముకుంటూ వుంటే అతడ్ని వారించి టీ డబ్బులు శంకరయ్యే చెల్లించాడు.

శీనయ్య వెంట మంత్రించిన వాడిలా నడుస్తున్న శంకరయ్య వైపే చూస్తూ అమీర్‌భాయ్ కిసుక్కున నవ్వాడు.

“మొత్తం పైన పలాతన్ మనిషినా శీనయ్య. కష్టపడకుండా ఊర్లో జనం పైన పడే బతికేయాలనుకుంటాడు.”

బ్యాంకు ఆవరణలోకి అడుగుపెట్టాడు మునస్వామి.

రంగు రంగుల కాగితాలతో అలంకరించిన బ్యాంకు ఏదో మాయలోకంలా భ్రమింప చేస్తుంటే ఆ రద్దీని చూస్తూ తడబడే అడుగులతో బ్యాంకులోపలికి అడుగుపెట్టాడు.

✡

“ఇంత బతుకూ బతికి తపోవనం మునస్వామి బోరు ఏసుకోలేక, నేల బీడు పెట్టుకున్యాడంటే అది వినేదానికి యింక మనం ఈడ ఉండేపనిలే” అన్నాడు మునస్వామి.

"ఏం బోర్లో ఏమో, ఎన్నిన్ని వేస్తారు? ఇప్పటికి నాలుగుసార్లు బోర్లు వేసినారు కదా, యాడే కానీ నీళ్లు కనపడినాయా? ఊరికే అత్యాశకుపోతే ఏమవుతాది? దేనికైనా టైం కలిసి రావల్ల" బియ్యం చెరుగుతూ అంది మంగమ్మ.

"ఏందిమే అట్లంటావు. బోరు ఏసుకోకపోతే, నీళ్లే లేకపోతే ఇంక మనం పండించేదేం వుంది?" అడిగాడు మునస్వామి.

గొంతు సవరించుకుంది మంగమ్మ.

"నా కళ్లతో చూస్తానే వుండా కదా, నువ్వేం పండించేది. పంట పంటకి ఎంత మిగల్తా వుండాదో, ఎంత అప్పవతా వుండాదో నాకు తెలిసిందే కదా" వ్యంగ్యంగా అంటున్న మంగమ్మ వైపు కోపంగా చూసాడు మునస్వామి.

"టమోటాలు పాయ, రేషం కడ్డీలు, పట్టు పురుగులు పాయ, ఆఖరికి చెనిగిచెట్లు కూడా పశువుల మేతక్కూడా పనికి రాకుండా ఎర్రగా మాడిపాయ. మేతక్కరువొచ్చి గొడ్డూ గోదా అమ్ముకున్యాక ఇంక బోరేసుకుని మళ్లీ ఏం అదృష్టముండాదని సూడల్ల" మంగమ్మ మాటల్ని ఇక వినలేకపోయాడు మునస్వామి.

"ఇంతకీ బ్యాంకోల్లు ఏమన్యారు?"

"బోరు కోసం అయితే లోను ఈరంట, ఇంకేదైనా క్రాప్‌లోన్ అయితే ఇస్తారంట, అదికూడా ఇప్పుడప్పుడే తెగేటట్లు లేదు. ఆ శీనయ్యొకడు. మళ్లింకా శివన్న కాడికే అప్పు కోసం రమ్మంటా వుండాడు" అన్నాడు మునస్వామి.

అనేసి భార్య వైపు చూశాడు. అతడు ఆశించిన విధంగా ఆమెవైపు నుండి ఎలాంటి సమాధానం రాకపోయేసరికి నిట్టూర్చి బీడి వెలిగించుకున్నాడు.

కాసేపటి తర్వాత గొంతు సవరించుకుని అన్నాడు "ఏమ్మే... అయ్యిందేదో అయిపోయింది. బ్యాంకులుండేది మనలాంటోళ్ల కోసం కాదని తెల్సిపాయ. ఆ శివన్న కాడికి పోతే జలగలా వడ్డీ కోసం రక్త పీల్చేస్తాడు" అని కాసేపాగి "పోనీ ఏదైనా బంగారం వుంటే చూడుమే, కుదవ పెట్టి అయినా దుడ్డు తీసుకుందాం. అయిన కాడికి మనకి వడ్డీ అన్నా తగ్గుతాది కదా" గొంతు తగ్గించాడు మునస్వామి.

ఆ మాటతో మంగమ్మ మొహం జేవురించింది.

"పాడు సేద్యం రాచ్చేసి మాదిరి నా బంగారాన్నంతా మింగేసింది. ఈ సేద్యమూ వద్దూ పాడూ వద్దు. టౌన్లోకి పొయ్యి టీ అంగడి పెట్టుకున్యా జరిగిపోతుంది. టిఫినంగడి పెట్టుకున్యా జరిగిపోతుంది.... అనంటే ఇంటే కదా, సొత్తుల్ని మింగేసిందేది సాలకుండా రాబోయే కాలానికి ఈ సేద్యం మనుషుల్ని కూడా మింగేసేటట్లుండాది. అయినా కుదవ పెట్టేదానికి

ఇంకా నాకాడ ఏం మిగిలిండాది? తిరిపెం బతుకు తప్ప, థూ... ఇదీ ఒక బతుకేనా" కోపంతో వణికిపోతూ అంది మంగమ్మ.

ఇద్దరి మధ్యా హఠాత్తుగా ఏర్పడిన నిశ్శబ్దాన్ని చెదరగొడుతూ లోపల గదిలోంచి చందుగాడు బిగ్గరగా పాఠం చదవసాగాడు.

"గ్రామీణాభివృద్ధికి, గ్రామీణ పరపతికి బ్యాంకులే మూలం. రైతు దేశానికి వెన్నెముక... భారతదేశంలో ప్రజల జీవనాధారం వ్యవసాయం".

పాఠం వింటూనే పూనకం వచ్చిన వాడిలా కదిలాడు మునస్వామి.

పుస్తకంలో తలదూర్చి బిగ్గరగా చదువుతున్న కొడుకు చేతుల్లోంచి పుస్తకాన్ని లాగి అవతల పారేశాడు.

"ఎదవ నాకొడకా ఏందిరా తప్పుడు కూతలు కూస్తాండావు. ఇదీ సదువేనా... థూ.." కొడుకుపైన ఉమ్మేశాడు.

చందూగాడు భయపడిపోయాడు. కళ్లవెంట నీళ్లు కారిపోతున్నాయి.

ఎప్పుడో పోయిన కరెంటు వచ్చినట్లుంది. రేడియోలో వార్తలు వస్తున్నాయి.

"ప్రభుత్వం భూమి, నీరు, చెట్లు చట్టాన్ని అమలు చేస్తోంది. కొత్తగా బోర్ల తవ్వకంపైన నిషేధం విధిస్తోంది. భూగర్భ జలాలు అధిక బోర్ల కారణంగా అదృశ్యమైపోతున్న కారణంగా బోర్లపై నిషేధం విధించడమైంది".

వార్తలు వింటూ శిలా ప్రతిమలా నిలుచుండిపోయాడు మునస్వామి.

నీటి ఆదరవు లేకపోతే పొలం బంతాటకు తప్ప మరింక దేనికీ పనికిరాదన్న సత్యం మనసులో మెదిలింది.

రైతుకు జీవనాధారం వ్యవసాయం, వ్యవసాయానికి మూలాధారం నీరు. నీటికి ఆధారం బోరు. రైతు పంచప్రాణాలకు సమస్త ఆశలకు మూలం బోరు.

బోర్లు ఫెయిలైన చోట అప్పుల బాధల్ని భవిష్యత్ భయాల్ని తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న రైతుల ముఖాలు గుర్తొచ్చాయి మునస్వామికి.

వ్యవసాయరంగం అంటే ప్రభుత్వానికి అంత నిర్లక్ష్యం ఎందుకు? భూగర్భ జలాల్ని పెంచేందుకు ప్రయత్నం చెయ్యాల్సిన ప్రభుత్వం బోర్లపైన నిషేధం విధించి రైతుల నోట్లో మట్టి కొట్టాలని ఎందుకు అనుకుంటోంది? బోరు రైతుకొక ఆశ. బోర్లు వద్దంటే రైతు ఆశల్ని చంపెయ్యటమే. ఎంతకూ ఆలోచనలు తెగటం లేదు.

కొత్తలో బోర్లు వెయ్యరాదంటే పొలాలకు నీళ్లు ఎక్కడ్నుంచి వస్తాయో చెప్పి తీరాలని, ప్రభుత్వాన్ని నిలదీయాలనిపించింది అతడికి. ఇప్పటికి ఉండే బోర్ల నుండి వచ్చే నీటిని ఊర్లో రైతులందరికి సమంగా పంపిణీ చెయ్యటం సాధ్యమైన పనిగా అతడికి అనిపించలేదు.

మరింకే పరిష్కారమూ అతడికి తోచలేదు. ప్రభుత్వం ఇప్పుడు నిషేధం విధించింది బోర్లపైన కాదు, రైతులపైనా, వ్యవసాయం పైనా అని అనిపించింది.

అదృశ్యమైపోతున్నది భూగర్భ జలాలు కాక వ్యవసాయమే అని అనిపించింది.

బోర్లు, నీళ్లు లేకపోతే ఏం పండించాలో ఎట్లా బతకాలో అతడికి అర్థం కాలేదు. అంతా అయోమయంగా అనిపించింది. భవిష్యత్‌ను తలుచుకునేసరికి ఒళ్లంతా క్షణంలో చెమటలు పట్టేసింది. గొంతు తడారిపోయింది. అప్పులు గుర్తొచ్చాయి. అన్ని చోట్లా అప్పులే, పైగా వడ్డీలు. తల విదిలించి కొడుకువైపు భయం భయంగా చూస్తూ...

“బద్రం నాయినా...” అనబోయాడు. కానీ మాటలు గొంతుదాటి రాలేకపోయాయి.

కాళ్లూ, చేతులు, నోరు వంకర్లు పోతున్నట్లు అనిపించింది.

సమస్త ప్రపంచం అతడి కళ్ల ముందు నుంచి అదృశ్యమైపోతుంటే, మునస్వామి దబ్బున కిందపడిపోయాడు.

✡

# కరువు

**–నూకా రాంప్రసాద్ రెడ్డి**

ఆ మేఘానికి మేమంటే ఎందుకంత చిన్నచూపో? నీళ్లో రామచంద్రా అని మేమల్లాడుతుంటే ఒక పక్క ఉధృతంగా వానలు కురిసి వరదలొస్తున్నాయి. ఇదంతా చూస్తుంటే మేఘం గిరిగీసుకుని వర్షిస్తోందని పెద్ద అనుమానం.

ఈ సంవత్సరం కూడా నైరుతీ ఋతుపవనాలు మోసం చేశాయి. అదనుకు పదును పడే సూచనలు కన్పించడం లేదు. రైతుల బతుకుల్లో ప్రతికూల పవనాలు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయువ్య దిశకు విస్తరించే తుపాన్లుగా మారాయి.

"ఏందిరా సంటోడా, ఆలోశ్యన్లో పడ్ద్యావ్, పరీచ్చల్లో పస్టొచ్చినావు గదా, వుజ్జోగం వచ్చాదిలే. సద్దినీళ్లు తాగి, సేనికానిడి కన్నా పోయి రా" మా నాన్నకు నేను ఉద్యోగం రాదేమోనన్న బెంగతో కన్పించానేమో, నాకు ఉద్యోగమే చేయాలన్న నిబంధనేదీ లేదు. వానలు కురిసి మరమ్మతులకు నోచుకోని చెరువు నిండితే, మా బావిలోకి నీళ్లొస్తే నాకు అదే పెద్ద ఉద్యోగం. నేనెన్ని నగరాల్లో చదువుకున్నా దేశమంతా తిరిగినా నేనెప్పటికీ అచ్చమైన పల్లె మనిషినే. పల్లెటూరి పిల్లోడినే, మా పల్లెంటే మా పొలాల వాసన అంటే ఎందుకో నాకన్నిటికంటే ఇష్టం.

చద్దితిని చేను దగ్గరకు బయలుదేరాను. మాకుండేది పదమూడు ఎకరాలైనా బావిలో నీళ్లు లేకుంటే బోరులో నీళ్లుండడంతో ఏదో మూన్నాళ్లూ కాలం గడుపుకొస్తున్నాం. బోరులో కూడా నీళ్లు తక్కువ గావడంతో నాలుగైదేండ్లుగా వరి వేయడం మానుకున్నాం.

ఆరు ఎకరాలు శెనక్కాయ విత్తనం వేసి, మిగిలిన భూమినంతా బీడుగా వదిలేసినాం, మిగతా రైతుల్తో పోల్చుకుంటే కొంతలో కొంతైనా ఫర్లేదన్పిస్తుంది.

మా శెనక్కాయ చేనులో ఆడవాళ్లు గట్టిగా మాట్లాడుతూ, కలుపు తీస్తున్న దృశ్యాన్ని చూసిగాని నేను వాస్తవంలోకి రాలేదు.

కలుపుతీస్తూ లయాత్మకంగా అలవోకగా పాడుతున్న కూలీల జానపదాలు, చేను పక్కనున్న రోడ్డుమీద కంకరకొట్టే సంగీతమూ వింటూ వుంటే మా అమ్మ రాగి సంగటి ముద్దలు గంపలో వేసుకుని వచ్చింది. నేను వెళ్లి కూలీలను పిలుచుకొచ్చాను భోజనానికి.

సంగటి ముద్దలు అందరమూ ఎడమ అరచేతుల్లో పెట్టుకొని సంగటి ముద్ద మధ్యలో గుంతలు చేసుకుని అందులో కూరను వేసుకుని తినడం అలవాటు. తెల్లవాయల కారమైతే సంగట్లోకి దాని రుచేవేరు. ఒక్కక్కరు రెండున్నర ముద్దలు తింటారు.

"ఇంగ వచ్చే కొద్దీ నీళ్లు తక్కువైతాయంట. మన బోరులో గూడా నీళ్లు తగ్గుకుపోతాండా యంట. మీ అయ్య పట్టించుకునే రకం కాకపోయ. నువ్వేందన్న వుజ్జోగం చూసుకుని ఈన్నుంచి బైటపడమని చెప్పి చెప్పి సాలైంది"

నిశ్శబ్దాన్ని చీలుస్తూ అమ్మ అన్న మాటలకు గొంతులో ఎర్రకారం ఇరుక్కున్నట్లైంది.

"ఏం రా శేఖరూ, ఉలకవూ పలకవూ నేన్జెప్పేదేమైనా సెవికెక్కుతాంద్యా లేదా."

ఈసారి మాట్లాడక తప్పింది కాదు.

"నీళ్లు తగ్గితే మనమేంజేస్తామ్మా. వానలు కురవకపోతే నీళ్లెట్లావస్తాయి. సుబ్బారెడ్డి వాళ్ల భూమిలో డెబ్భై ఎనభై అడుగులేసినా ఒక చుక్క నీరు కూడా పడలేదని తెల్సింది" అమ్మతో గొంతు కలిపాను.

"అందుకేరా, చెప్పేది. వానలు పడవు. మనం లచ్చిందేవికి పెండ్లజెయ్యాలంటే యోర్ని అప్పడగాల. అందరి బ్రతుకులూ తిని సెయ్ కడుక్కున్న్యట్లుండాయ్. మీ అయ్య ఎరువులోల్లకే బాకీ కట్టలె. ఇచ్చేటోళ్లు గునికి ఈరేమో. కక్కల్యాక మింగల్యాక వుండాడు మీ అయ్య. నువ్వేమో 'భూమి భూమి' అని కలవరిచ్చావ్. యింగేం వుపయోగం లేదబ్బీ, వుజ్జోగమో పాడో ఏదో ఒకటి చూసుకుంటేనే"

అమ్మ మాటలకు జవాబివ్వకుండా మౌనంగా వుండిపోయాను. చెల్లెలు లక్ష్మి పెండ్లి గురించి అప్పుల్లో కూరుకుపోయిన ఇంటి పరిస్థితి గురించి తెలీని పట్టించుకోని అమాయకుడినేమీ కాదు. ఏదో ఆశ సీజన్‌లో నాలుగు చినుకులు పడ్తాయని. అమ్మను పలకరించడం ఇష్టం లేక దూరంగా వెళ్లి పిచ్చి మొక్కలు పీకుతూ గట్టుమీద కూర్చున్నాను.

ఆకాశానికేసి "గంట రెండైంటాది" అని అమ్మ చెప్పగానే ఎర్రటి ఎండలోనే ఇంటికి నడిచాను.

మా ఇంటి ముందు పెద్ద వేపచెట్టు. దానికింద విశాలమైన అరుగు వుంది. మా ఇంటి దగ్గరకొచ్చేసరికి అరుగుమీద కూర్చుని వున్నారు నానా రకాల మనుషులు.

నా చిన్నప్పుడు మా ఇంటి అరుగుమీద భారత భాగవత రామాయణాలు చర్చింప బడుతుండేవి. మా అబ్బ (నాన్న నాన్న) ఊరి పెద్దోళ్లంతా కలిస్తే సందడి సందడిగా కళగా వుండేది. మా అమ్మపూటకెన్ని కాఫీ గ్లాసులు కడిగేదో.

గుండె బరువంతా దించేసుకున్న వాళ్లు అరుగుమీదే వేపచెట్టు నీడలో చల్లగా పడుకునే వారు.

నేను వెళ్లి అరుగుమీద కూర్చున్నాను.

"ఈ దఫా చెనిక్కాయ్ ఇత్తనోల్లు మారాజులే. వానలు పడేదిల్య మనం బతికేదిల్య" వెంకట్రెడ్డి మామ దిగులుగా అన్నాడు.

"అందరి పరిస్థితి అట్నే వుందిలే ఎంకట్రెడ్డీ. వాన ఇంత మోసం చేస్తాదని ఎవరను కున్నారు. మేమేసిన ఆరుతడికే నీళ్లు తక్కువైనాయి. చేసేదేముంది. ఎట్టైతే అట్టగాని" నిండా మునిగిన వాడికి చలేముందన్నట్లు మాట్లాడినాడు మా నాన్న.

తలకింద చెయ్యి పెట్టుకుని పడుకుని వింటున్న సుబ్బయ్య తాత లేచి కూర్చుని,

"ముందు గాల్నె అదనుకు సినుకు రాలె. ఎట్టనో ఉన్నట్టుండి ఆడోళ్లు ప్యాన్నీల్లు సల్లినట్లు న్యాల తడ్సింది. దాంతో మనోల్లంతా తొందరపడి బేగిన దుక్కి దున్ని ఇత్తనమేసిరి. ఇంగంతే సంగతులు ఇత్తనమేసి సాతికార్తెకు నెలదాటింది. ఇప్పుడన్నా ఒక్క పదును వానైనా సినుకు రాల్తే మేలే" సుబ్బయ్య తాత మాటలకు రామాంజనేయులనే యువకుడు అడ్డుపడి "శెనిక్కాయ్ ఎట్టుంది కలుపు తీసిచ్చినావా?" అసందర్భంగా ప్రశ్నించాడు.

సుబ్బయ్య తాతకు ఒళ్లు మండింది.

"ఏం వాయ్ రామాంజిగా, అవలాయ్ గుంద్యా చెనిక్కాయ్‌తోపాటు అందరూ ఎండి పోతాంటే చెనిక్కాయెట్టుందంటావ్. పంట ఎదుగుదలెల్యాకుంటె కలుపెట్టే తీపిచ్చావ్వాయ్ నేన్జేపిచ్చుకోవాల ముందు గుండు. నీకంతా ఎగసెక్కెమె. సిమెంటు పాట్టరీలోకి పనికి పోబట్టి నీకు దిక్కు తేల్చేతట్టు లేదే".

రామాంజిగాడు మారు మాట్లాడకుండా అరుగు వెనక చిన్న పిల్లలు బంగరాలు తిప్పుతుంటే అక్కడికెళ్లి నిల్చున్నాడు.

"పప్పు పురుగు పడ్తాంది. మనూర్లో ఇత్తనమిత్త నోళ్లంతా పప్పు అమ్మేసినారు" అన్నాడు నాన్న.

అమ్మడమే మంచిదన్నట్లు చూసారు అరుగు మీద వాళ్లంతా.

"పోయిన దఫా చెనికట్టెన్నా మిగిలింది. బొందు పెరికి పసులకైనా పెడ్తిమి. ఈ దఫా అదీ ల్యాకపాయె, బాడుగల్యాక ఉండిన ఒక కాడి ఎద్దులమ్ముకుంటి. ఈ ఎనుములకు యాన్నుంచి గడ్డి త్యావాల్నో" ఆకాశం వైపు దిక్కులు చూస్తూ అన్నాడు వెంకట్రెడ్డి మామ.

వానలు రావు!

అప్పులు తీరవు!

శుభకార్యాలు జరగవు...!

గంగమ్మ జాతరలు కప్పల ఊరేగింపుల మీద నమ్మకం కుదరక మానేసినారు. సంవత్సరానికెప్పుడో తినే మాంసం కూడా మరచిపోయినారు. 'తాతలు తాగిన నేతుల సంగతి' పునరావృతం చేసుకోవడం తప్ప చేసేదేమీ లేదు.

"రేయ్ అబ్బీ శేఖరూ?" పిలిచాడు సుబ్బయ్య తాత. సమాధానంగా నవ్వాను.

"రేయ్, కిట్టకాల్వ గురించి మన రైతులంతా కలెట్టరాఫీసుకాడ గొడవ పన్న్యారంటా, నీకేమైనా తెల్సిండ్యా. అవున్రా శేఖరూ, మననీళ్లు మనకిడిసే దానికే ఆల్లకేందిరా నొప్పి అట్టాటప్పుడు ఈ పాజెట్టని ఇన్ని నీళ్లు ఇడుస్తామని గెవర్నమెంటోళ్లు లెక్కగట్టి సెప్పిరి కదా. మర్సిపోయినారా అప్పుడే" అన్నాడు తాత.

"నిజమే తాత, కె.సి.కాల్వ గురించి రైతులంతా కలెట్టర్‌తోనే గొడవ పెట్టుకున్నారు. గోదావరి, కృష్ణానదుల్లో నీళ్లు ఎప్పుడూ వుంటాయని గోదావరి తీర ప్రాంతాలకు వచ్చే వరదనీరు కేవలం ఒకరోజు వరదనీరు సరిపోతాయని కలెక్టర్‌తో చెప్పినారు. కృష్ణా మిగులు జలాలను మనకు మళ్లించడంలో ఆలస్యం జరుగుతోందని మన రైతులంతా ధర్నా చేసినారు. నీళ్లకోసం నిరాహారదీక్షలు చేసి ఆస్పత్రిపాలైన నాయకులంతా అధికార మత్తులో వుండి మనల్ని మరిచిపోయినారని తీవ్రంగా నినాదాలు చేసినారు తాత. పేపర్ల నిండా ఈ వార్తలే తాతా" జరిగిన విషయం వివరించాను.

"ప్రాజెక్టులు దండిగా వుండాయంట గదరా మనకు" అన్నాడు సుబ్బయ్యతాత జిబ్బా చొక్కాలోంచి బీడీ తీసుకుంటూ.

"ఆ.. వుండాయిలే, సొమ్మొకనిది సోకొకనిది. డ్యాములన్నీ మనై. నీళ్లన్నీ వాళ్లకే పోతాయి. ఎవరికో తాగే దానికోసం మనకు గుక్కెడు నీళ్లు తాగేదానికి గతిలేదు. పేరుకే అన్నీ వుండాయని. సంవత్సరం పొడుగుంత కాల్వకు నీళ్లిడిస్తే గౌర్నమెంటోళ్ల సొమ్మేం పోయింది" పకపక నవ్వాడు వెంకట్రెడ్డి మామ.

"చెనిక్కాయ్ ఈ సారెంతుంటాదో రేటు" అందరి వైపు చూస్తూ అన్నాడు మానాన్న.

"ముందు నీకు రేటు కొచ్చింది తొందర. మేమంతా పంటల్యాక సచ్చాంటె. కొడుకు పుట్టక తలికే గుడ్డలు కుట్టేంచినాడంట నీయట్టాటోడు. పంటల్లేవు కూల్లులేవు. మీ ఇంటి సంగతే తీసుకో, ఎన్నిమందలు ఆవులు జీవాలు వున్నాయి. ముద్ద పప్పుగడ్డ పెరుగు మీరిప్పుడు తింటాండారా. కాఫీ నీళ్లే మర్చిపోయినాం. యింగమజ్జిగ కత సెప్పబట్టుదు" నిట్టూర్చాడు వెంకట్రెడ్డిమామ.

మా నాన్న ఏమీ మాట్లాడలేదు. తిరిగి వెంకట్రెడ్డి మామ మళ్లీ అందుకున్నాడు.

"అప్పోసొప్పో జేసి పంట బేచ్చిమి. బేసినాక పొరబాట్న వానొచ్చి పంట పండిందనుకో, చేతికాడికొచ్చిన పంట నోటికాడికి అందకుండా పోతాది".

"నిజమే మామా, నువ్వు చెప్పేది. దేశంలో అన్ని విధాల మోసపొయ్యేది రైతే. ఎవడైతే ఒక వస్తువును తయారుచేస్తాడో ఆ వస్తువు ధర నిర్ణయించే అధికారం వాడికే వుంటుంది. విత్తనాలు కొనుక్కోవడానికి డబ్బు వడ్డీకి తెచ్చుకుని, ఎరువులకోసం పెళ్లాం పిల్లోళ్ల చెవుల్లోకిగూడా లేకుండా ఇంట్లో బంగారంతా కుదువపెట్టి పంటను నమ్ముకుంటాడు. మనబోటి రైతులంతా ఎరువుల దగ్గరే బాగా మోసపోతున్నాం. పంట చేతికొచ్చిన తర్వాత, దళారీల చేతుల్లో పడకుండా ఉండలేం. దళారీలను కాదంటే ఇండ్లల్లోనో గోడౌన్లలోనో ముగ్గిపంట పాడైపోవాల్సిందే. పట్టించుకునే మొగోడుండడు. చివరకు బలపాలు తయారుచేసే వాడు గూడా ధర నిర్ణయిస్తున్నాడు. రైతు నిర్ణయించిన ధరకే ఎందుకభ్యంతరం చెప్తారో" ఉపన్యాసంలా ముగించాను.

"అవున్రా అబ్బీ, మనం పెట్టిన రేటుకే దేశం కొనుగోలు చేసే రోజు రావాల్రా".

"ఆ పడమర జూడండి మబ్బు పట్టినట్టుంది" అంటున్న మానాన్న మాటలను సుబ్బయ్య తాత పట్టించుకోకుండా.

"ముప్పై ఏండ్లుగా పడ్తానే వుంది మబ్బు. అది మబ్బుగాదురా మన బెమ. ఆకాశం మెరుచ్చాందంటే అక్కడ్యాన్నో పడేదానికి. మనం శెని నా కొడుకులం మన క్యాడపడ్తాది రా, వానా మీ నాయన్నే అడుగు, మీ నాయన పుట్టినప్పట్నుంచి మనూరి శెరువు ఎన్ని దపాలు నిండినాదో" సుబ్బయ్య తాత ఒంటిమీదున్న తువ్వాలు తలకింద పెట్టుకుని ఒరిగి పడుకున్నాడు.

మా నాన్న సాయంత్రం 'మబ్బుపట్టింద'ని చెప్పినమాట నిజం కాలేదు. రాత్రి భోజనం చేసి అమ్మతో కరవు దండకం చదివించుకుని పడుకున్నానే గాని నిద్రపట్టలేదు. అమ్మచెప్పింది నాకిప్పుడు బాగా స్పష్టమవుతోంది.

సుబ్బయ్య తాత వానలు రావంటాడు. వాన మాటే ఎత్తవద్దంటాడు. అమ్మ సంగతి సరే సరి! మట్టిమీద మమకారంతో ఇక్కడే వుంటే శెనిక్కాయ పంటలా నా బతుకూ ఎండిపోకతప్పదు. ఇది ఎడారి స్వప్నం. ఎటుచూసినా కరువు. అణువణువూ మహా ఎడారిగా మారుతున్న కరవుభావన.

కరవు.. కరవు.. కరవు..

✡

# వినోద ప్రదర్శన

**–మధురాంతకం రాజారాం**

"నా జీవితమంటే ఏమిటి? నేను సత్యంతో చేసిన సాధనలే గదా!" అన్నాడు మహాత్ముడు.

రంగయ్యను గురించి చెప్పవలసి వస్తే అతడి జీవితమంతా బాహ్య పరిస్థితులతో సలిపిన పోరాటమేనని చెప్పవచ్చు. భూమితో పోరాటం, అప్పులవాళ్లతో పోరాటం, బిడ్డలతో పోరాటం, చివరకు తన భార్యతో గూడా పోరాటమే.

పితృపారంపర్యంగా రంగయ్యకు లభించిన భూస్థితి కొద్దిపాటిది. రెండెకరాల మడిచెక్క. ఒకటిన్నర ఎకరా మెట్టనేల. మెట్టసాగు దైవాధీనం. ఉన్న మడిగూడా ఏటి కాలువక్రింద గానీ, చెరువుక్రిందగానీ లేదు. దానికి బావినీరే ఆధారం. దాన్ని బావి అనడం కన్నా పెద్ద గొయ్యి అనడమే సమంజసం. ఆ బావికి దరి నిలవదని ఎప్పుడో తేలిపోయింది. వాన కురిసినప్పుడల్లా దరి కరిగి కరిగి బావిలోకి జారిపోతుంది. ఏడాదికొకసారి పూడెత్తకపోతే బాన నీటిలో మునగదు. ఇద్దరు కుర్రాళ్లు, ఇద్దరు కూతుళ్లు పెరిగి పెద్దవాళ్లై పోతున్నారు. వీళ్లకు పెళ్లిళ్లు చేయాలి. ఈ కొడుకులకు గూడా పిల్లలు పుడితే వాళ్లకు ఆస్తి ఏ మూలకు చాలుతుంది? మరి కొంత ఆస్థి ఏర్పాటు చెయ్యాలి. అందుకు దారి? ఇదుగో ఈ బావికి ఖచ్చితంగా దరి మలిపించి కాలుపురాళ్లతో కట్టించి ఓ పంపుసెట్టు బిగించాలి. ఆ కయ్యలో మిరపతోట, ఈ కయ్యలో పసుపు, ఆ పాదిలో అరటిచెట్లు, కొనమడిలో తమల పాకులతోట, మిగిలినదంతా వరిపైరు, లేదంటే ఓ అయిదు గుంటల కయ్యలో చెఱకు తోట, గనుములవెంట కొబ్బరిసెట్లు. ఈ చిరకాల స్వప్నం నిజమయ్యేదెప్పుడు? ఈలోగా లోతు బావిలో అనుదినమూ కబిల తోలవలసి వుండడం వల్ల ఎంతమంచి గిత్త లయినా రెండేళ్లలో బక్కచిక్కి ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. వాటిని అయినకాడికి తెగనమ్మాలి. మళ్లీ వందలు పోసి కొత్తగిత్తలు కొనాలి. ఇందుకు డబ్బు? అప్పు చెయ్యడమే గత్యంతరం. బావిగట్టున పూడు మట్టిదిబ్బ పెరిగినట్లే అవతల అప్పులు కూడా పెరుగు తున్నాయి. రాత్రుళ్లు ఈ సంగతి తలచుకుంటే రంగయ్యకు నిద్రపట్టదు. ఈ అంతులేని ఆరాటాన్ని అర్థం చేసుకున్న దెవ్వరు? రంగయ్య తెల్లవారుజామునే లేస్తాడు. ప్రొద్దుపుట్టేదాకా కబిల తోలుతాడు. ఆ తరువాత మేడి పట్టుకొంటాడు. అండ చెక్కుతాడు. బండి కడతాడు. ఏ పనీ లేకపోతే కత్తి చేతపట్టుకొని

కట్టెల కోసం అడవికి వెళతాడు. ఇందాకా నేను చెప్పింది పొరపాటు. రంగయ్య పోరాటం ముఖ్యంగా దరిద్రంతో. నా చిన్నతనంలో మా వైపున ఉట్లతిరణాల అన్న పేరుతో ఒక వేడుక జరుగుతుండేది. సన్నటి కొయ్య కంభం ఒకటి. దానికి మరింత నున్నగా బంకమట్టి పూత. శరీరానికి ఆముదం పూసుకున్న మనిషి ఒకడు ఆ కొయ్య నంటిపెట్టుకొని ప్రాకి దాని అగ్రపీఠంలో వున్న బహుమతిని అందిపుచ్చుకోవాలి. పై కెక్కడం పట్టు దొరకక క్రిందికి జారిపోవడం కంభం చుట్టూ రాసి పోసి వుంచిన బంకమట్టిలో పడిపోవడం, ఎంతకూ తెమలని ఈ వ్యాసంగం చూపరుల పాలిటికి పెద్ద తమాషాగ వుండేదన్న మాటమాత్రం కాదనలేను. బహుశా దారిద్ర్యంతో రంగయ్య పడుతున్న కుస్తీగూడా లోకులకలాగే గోచరించి వుండవచ్చు.

నీకు నామీద బొత్తిగా సానుభూతి లేని పక్షంలో నేను నిజంగా కడుపు చించుకున్నా సరే, నీకది గారడీ విద్యగానే కనిపిస్తుంది. అప్పులు లేకుండా బ్రతకడం, పస్తులు లేకుండా తినడం ఈపాటి ప్రయత్నాన్ని దురాశగా భావించనక్కరలేదు. కానీ రంగయ్యను లోకులు ఆశబోతుగా వ్యవహరించడం  నా చెవులతో నేను విన్నాను.

ఆ కుటుంబం లోకులపాలిట కొక వినోద ప్రదర్శనగా తయారు గావడానికి వీలయి నంతలో రంగయ్య భార్యాబిడ్డలు గూడా సహకరించారనే చెప్పాలి. ఒళ్లు వంచి పని చెయ్యడంలో మంగమ్మ రంగయ్యకు తీసిపోదు. ఎడతెగని పనుల మూలంగా ఆవిడకు వున్న రెండు చీరల్లో ఒకటి వుతికి కట్టుకోవడానికిగానీ, చింపిరి తలను దువ్వి ముడి వేసుకోడానికిగానీ, నుదుట బొట్టు పెట్టుకోడానికి గానీ తీరికుండదు. ఎటొచ్చీ ఆమె నాలుకకు వాడి హెచ్చు. ఈ కుటుంబంలో లేమి వుంది. అది రంగయ్య సృష్టించినది కాదు. కానీ మంగమ్మ అలా భావించదు. ఇంట్లో ఏ వస్తువు కొరతపడినా, ఏ కోరిక తీరకపోయినా ఎడా పెడా వాగడమే– అది గొంతు కాదు. పెద్ద మైకు. పెండ్లివారి విడిదిలో నుంచి మైకు ద్వారా వినవచ్చే పాటలను ఎలాగైతే వినగలరో, అంత ఆనందంగానే మా వూరివాళ్లా మంగమ్మ మాటలను వినగలరు. ఈ రేడియోలో వాల్యుము తగ్గించడానికి గానీ, లేదా పూర్తిగా నోరు మూయించడానికిగానీ రంగయ్యకు తెలిసిన చిట్కా ఒక్కటే. శ్రుతి మీరినప్పుడల్లా అతడు మంగమ్మను నమ్మకంగా పిడిగ్రుద్దులతో సత్కరించేవాడు. అప్పుడిక చూచుకోవలసిందే తమాషా. అతడివేమో పెడబొబ్బలు, ఆమెవేమో హాహా కారాలున్నూ, ఆక్రందనలు. ఈ హంగామా అంతా నాలుగు గోడలమధ్య జరిగినా యిదొక శ్రవ్యరూపకం. అలా గాకుండా బాహాటంగా బయటనే జరిగినట్టాయెనా అప్పుడది దృశ్యనాటిక.

రంగయ్య కొడుకుల్ని గురించి నికరంగా ఒకమాట చెప్పవచ్చు. వాళ్లు తండ్రికన్నా కొన్ని దశాబ్దాలు వెనుక పుట్టినవాళ్లు. న్యాయం, ధర్మం, సత్యం మొదలైన నైతిక విలువల పట్ల తండ్రికున్నంత నమ్మకం వాళ్లకుండక పోవడం సహజమే! వాటిని నమ్ముకోవడం వల్ల

తండ్రి బ్రతుకు ఎంత వైభవోపేతంగా వున్నదో వాళ్లెరుగుదురు. అందువల్ల చేతి ఖర్చుకు డబ్బు అవసర మనిపించినప్పుడల్లా వాళ్లు చేతులు ముడుచుకొని కూచోకుండా కొంచెం కొంచెంగా స్వప్రయోజకత్వాన్ని వెలగబెడుతూ వచ్చారు. ఒక అరటిగెల, ఒక తట్ట తమలపాకులు, పది కొబ్బరికాయలు. కానీ అదేం గ్రహచారమోగానీ రంగయ్య కొడుకులు తస్కరించి, తస్కరించిన కొద్ది గంటలకే పట్టుబడిపోయేవారు. వెంటనే రచ్చపైన పంచాయితీ, వాది ఫిర్యాదు, నేర ప్రతిపాదన, సాక్షుల కథనం, పెద్ద మనుషుల విచారణ, మొండికెత్తినట్టుగా రంగయ్య తిరగబడడం, బెదిరింపులు, పదో ఇరవయ్యో చెల్లించుకోవడాలు– ఈ కోర్టు సీను తిలకించడానికి ఆబాల గోపాలమూ వచ్చి రచ్చదగ్గర గుమిగూడేవారు. నిజం చెప్పొద్దూ మా వూళ్లో సినిమా థియేటరులేని కొరత యిలాంటి పంచాయితీల వల్ల తీరిపోతుండేది.

అప్పట్లో నేను హైస్కూలులో చదువుకుంటూ వుండేవాడిని. హైస్కూలు నుంచి కాలేజీకి వెళ్లాను. ఆ తర్వాత ఉద్యోగంలో చేరాను. ఎప్పుడైనా సెలవుల్లో ఇంటికి వెళ్లినప్పుడే రంగయ్యను గురించి తెలుసుకునే అవకాశం.

సచ్చి సేయంగల విన్నపాలతో రంగయ్య పెద్ద కూతురికి పెళ్లి చేశాడు. ఇంట్లో జరుగుతున్న మొదటి శుభకార్యం గదా! సాటి బంధువుల్లో నామోషీ లేకుండా వుండడం కోసం ఓ వెయ్యి రూపాయలు అప్పుకూడా చేశాడు. ఆ అప్పు కాస్తా తీరేదాకా యింట్లో యింకొక శుభకార్యం మాటెత్తడానికి వీల్లేదని తనలో తాను నిర్ధారించుకున్నాడు. కానీ ఆమాత్రం ఓపరికం చిన్న కూతురికి లేకపోయింది. ఆమె ఓ కుర్రాడి వెంట లేచిపోయి, చక్కా గుడిలో పెళ్లిచేసుకుంది. సినిమాలోనూ, సాహిత్యంలోనూ ప్రేమవివాహాలు కంట గించుకోబడలేదు. కానీ రంగయ్య దగ్గరకు వచ్చేసరికది మనిషి తలెత్తుకు తిరగడానికి వీల్లేని నామర్దా పనిగా చిత్రింపబడింది. ఆ పిల్లకు పిల్లవాడికి మొదట మనసులెలా కలిసిందీ, ఆ మోజు ఏయే విధాలుగా విస్తరించింది. వాళ్లు లేచిపోవలసిన పరిస్థితి ఎలా ఏర్పడింది. అందుకు వాళ్లు పన్నిన పథకం, దాన్ని అమల్లో పెట్టిన తీరు, ఆ విషయం తెలిసేసరికి రంగయ్య అగ్గిమీద గుగ్గిలం కావడం యిదంతా పరస్పరం చెప్పుకుని సంతో షించడానికి వీలుగా మా వూరివాళ్లకొక ఆరు నెలల మేత దొరికింది.

ఇంతలో రంగయ్య పెద్దకొడుకు తానేమీ నెలతక్కువగా పుట్టినవాడు కాదని నిరూపించ దలచుకున్నట్టుగా కథానాయకుడి పార్టు ధరించి రంగంలో దిగాడు. ఇంతకూ అతడు చేసింది అనుచితమైన పనికాదు. ఓ పొరుగూరి అమ్మాయిని పెళ్లాడతానన్నాడు. వీళ్లకూ వాళ్లకూ ఏదో దూరపు బంధుత్వం గూడా వుంది. కానీ ఇందులో ఒక యిబ్బంది వున్నట్లు తోచింది. ఆ కుటుంబంపట్ల రంగయ్యకు సదభిప్రాయంలేదు. తన కొడుకు ఆ యింటికి అల్లుడు కావడానికి అతడు ససేమిరా వీల్లేదన్నాడు. ఆ కొడుకు ఆరు నూరైనా, నూరు ఆరైనా ఆ

పిల్లను చేసుకోక తప్పదని తిరుగుబాటు చేశాడు. రంగయ్య వుక్రోశం పట్టలేక ఆస్థిలో వాడిభాగం వాడికి పంచి పెట్టేశాడు. వాడి దారిని వాణ్ణి వెళ్లమన్నాడు. అప్పటికి తానేదో రాజ్యాన్ని జయించినట్టుగా కొడుకు పెళ్లి పీటలమీదికి సిద్ధమయ్యాడు. పులిమీద పుట్రలా భర్తమాట కాదని ఈ పెళ్లికి కాస్తా మంగమ్మ గూడా హాజరైపోయింది.

కొడుకేగాదు, కట్టుకున్న భార్యగూడా తనమాటలకు లోబడి వుండడంలేదు. లోకుల యెదుట రంగయ్యకు తల కొట్టివేసినంత అవమానమైపోయింది. వాడు నా కొడుకేగాదు, ఆవిడ నా పెళ్లాం కాదు– అని భీషణంగా పంతంబట్టి కూర్చునే దాకా లోకం రంగయ్యను సమర్థించలేదు.

ఈ విధంగా అతడు తన పాత్రౌచిత్యాన్ని కాపాడుకున్నట్టుంది.

అన్నదమ్ములు వేరు కాపురాలు పెట్టేశారు. పెద్దవాడికి పూరిల్లు వచ్చింది. చిన్నవాడికి గుడిసె దక్కింది. భూస్థితిలోనూ అలాగే చెరిసగం. అప్పుల్లోనూ ఇంతే. తల్లిదండ్రుల్ని గూడా అలాగే పంచుకున్నారు. మంగమ్మ పెద్దకొడుకు వైపున వుండిపోయింది. రంగయ్య చిన్నవాడి వాటాకు వెళ్లాడు.

ఈ విచిత్ర పరిణామం లోకుల కాలక్షేపానికెంతగా వుపకరించిందని? నాటకంలో అనుకోని మలుపు కదటండీ మరి!

'భలే గమ్మత్తురా ఈవేళ చెప్పనలవిగాదు చూచి తీరవలసిందే రంగయ్య అవతారం' వెకిలి నవ్వుతో ఉపక్రమణిక.

'ఏం జరిగిందేం జరిగింది?' పదిమందిలోనూ పెల్లుబికే కుతూహలం!

'పెద్దవాడు నాటిన చెరుకుతోట బాగా ఏపుగా పెరిగిందిలే! ఆవు గొడ్డుకు కావలసినంత మేత కావలసి వచ్చిందేమో! రంగయ్య యెవ్వరూ లేనిది చూచి ఓ మోపెడు చెరుకు మోసులు కోసుకున్నాడు. మోపు తలకెత్తుకుని తోట దాటుకుని పోతున్నాడో లేదో మంగమ్మ ఎదురైంది. 'హవ్వ హవ్వ యింతపనికి పూనుకున్న మనిషివి నువ్వు తలపైన రాయి వెయ్యవా? నీదీ ఒక నరజన్మేనా? ఇది ఒక బ్రతుకేనా?' అంటూ మంగమ్మ కారుబారు చేసిందిలే! వడగండ్లలా రాలిపోయాయి మాటలు. ఇచ్చేది యిస్తేగానీ యిది తగ్గిరాదను కున్నాడు. రంగయ్య మోపు క్రిందికి గిరవాటుపెట్టి ఎగిరి మంగమ్మ వైపుకు దూకాడు.

'పడ్డాయా గుద్దులు?

తగిలాయా తన్నులు?

జుట్టుముడి వూడిపోయిందా?'

చెబుతున్నానుగా! ముసలాడు పైకి దూకేస్తున్నాడని పసిగట్టేసరికి మంగమ్మ వున్నట్టుండి ఈవలికి తప్పుకుంది. దూకిన విసురులో రంగయ్య వెళ్లి అడుసుమడిలో పడిపోయాడు. నా సామిరంగా, ఒళ్లంతా బురదే! బట్టలంతా బురదే! ముఖమంతా బురదే! బురదలో దొర్లి లేచిన బర్రెగొడ్డే నయం. లేచి వచ్చాడంటే సున్నంలోకి లేకుండా ఎముకలు విరగ గొడుతాడని మంగమ్మదొకటే పరుగు.

ఈనాటి కిదైందా, రేపటి కాలక్షేపానికి రంగయ్య బ్రతుకులోనుంచీ సరికొత్త సంఘటన ఒకటి పుట్టుకొచ్చింది.

దూర ప్రాంతానికి బదిలీ కావడంవల్ల రెండేళ్లపాటు నేను మా వూరివైపు వెళ్లడం కుదరలేదు. ఒకసారి మా అమ్మే మమ్మల్ని చూచిపోవడానికి వచ్చింది. కాలపురుషుడు రంగయ్యను ఎలా అనుగ్రహిస్తున్నది ఆమె ద్వారా తెలుసుకోగలిగాను.

'ఏం రంగయ్యరా నాయనా! ఉడిగిపోయాడు. నిరుడిలాంటప్పుడు అడవిలోనుంచీ బండి తోలుకొస్తూ వుండి చక్రం క్రింద పడిపోయాడు. తుంటి నలిగిపోయింది. కాలు తీయవలసిందే నన్నారు. ఏదో అతడి పాలిట దేవుడుండి అంతపని జరగలేదు. కుంటివాడుగా మిగిలాడు. కొయ్యపైన గానీ నడువలేదు.'

'మంగమ్మ ఎలా వుంది?'

'మంగమ్మ ఎక్కడుంది? ఆవిడపోయి ఆరు నెలలైంది. పుణ్యాత్మురాలు. మొగుడు బ్రతికుండగానే పసుపూ కుంకుమతో వెళ్లిపోయింది. ఆవిడ కళ్లు మూసిందని తెలియగానే రంగయ్య ఆవు అరచినట్లుగా అరచేడట్రా బాబూ! వారం రోజులు తిండీ నీళ్లు ముట్టుకోలేదట!'

చివరిసారిగా రంగయ్యను చూచింది ఏర్పేడు బస్‌స్టాండులో. ఆఫీసు పనిమీదుగా నెల్లూరు వెళ్లి వస్తుండగా బస్సక్కడ కాసేపు ఆగింది. సిగరెట్ల కోసం బస్సు దిగి బంకు వైపు వెళ్తుండగా ఎవరో పిలిచారు. తిరిగి చూద్దునుగదా! ఒక మానవ కంకాళం ప్రత్యక్షమైంది. మొలకొకటే బట్ట, వంగిపోయిన వెన్నెముక, గుంటలుపడిన దవడలు, లోతుకు పోయిన కళ్లు.

'బాగున్నారా చినబాబూ! ఎంతకాలానికి కన్పించావు! చిన్నమ్మా పిల్లలూ అంతా కులాసాయే కదూ?'

'పిచ్చి రంగయ్యా! నువ్వింకా తోడి మానవుల క్షేమ సమాచారాలు విచారించే స్థితిలోనే వున్నావా' అనుకున్నాను.

తల్లిపోయిన తర్వాత తండ్రికి తిండిపెట్టే విషయంలో అన్నదమ్ములిద్దరికీ సరైన ఒప్పందం కుదరలేదట! పడీ లేచీ ఆఖరకు ఈ రోజొకడు పెడితే, రేపొకడు పెట్టేటట్లుగా వంతులు

వేసుకున్నారట! కానీ ఆ సత్కార్యం గూడా సజావుగా జరిగేటట్లు లేదు. తిండి పెట్టడంలోకన్నా పెట్టకపోవడంలోనే ఆ యిద్దరికీ పోటీ ఎక్కువైందట!

'ఫర్వాలేదు బాబూ! నాదేముంది? రాముడున్నాడు, రాజ్యముంది. ఈ ముసలికట్టె కింత తిండి దొరక్కపోదు. ఒక్కటేనయ్యా నాకు దిగులు. పుట్టినవాళ్లిద్దరు కొట్టుకు చస్తున్నారు. చీటికి మాటికీ జగడాలు! నాల్రోజులకొకసారి మధ్యస్థాలు. బ్రతకడానికి ఇళ్లంటూ ఏవో వున్నాయి. కానీ బ్రతుకంతా వీధిపాలే అయిపోయింది.'

నాకిప్పుడర్థమైంది. రంగయ్యకిక ప్రదర్శనలో పాల్గొనే ఓపిక లేదు. అతడు రేపో మాపో తన వేషం విప్పి పెట్టేస్తాడు. కానీ వినోద ప్రదర్శనం నిరంతరాయంగా సాగిపోవ డానికి యింకా అక్కడ అతని కొడుకులున్నారు. కోడళ్లున్నారు. వాళ్లకూ బిడ్డలుంటారు, ఇంకా పుడతారు. తాతకట్టి పెట్టిన పూరి కొంపల్లోనే వాళ్లు గోడలు పెట్టుకుంటారు. నేలను ముక్కచెక్కలు చేసి పంచుకుంటారు. కానీ ఆమాత్రం స్థితిగతులైనా ఎంతకాలం నిలుపుకుంటారు? బ్రతుకు వాళ్లచేత రకరకాల వేషాలు వేయిస్తుంది. ప్రేక్షక మహాశయులు తనివి తీరేటట్లుగా ఈ ప్రదర్శనాలు తిలకించవచ్చు. ఆలస్యం చేసినా ఆశాభంగమన్న మాట లేదు. ఎంతసేపు చూసినా టిక్కెట్టు లేదు!

✡

# పరిగె

**–వట్టికోట ఆళ్వారు స్వామి**

సాయంత్రము 7 గంటల సమయము. ఖైదీలను గదుల్లో పెట్టి తాళము వేసి వరండాలో జవానులు మాటా, మంతీ సాగించారు. తాము ఉద్యోగము చేసిన వివిధ జైళ్ళలో చేసిన దౌర్జన్యాలను ఘనకార్యాలుగా, ఖైదీలు చేసే సాహసచర్యలు, వాని నణచుటకై అవలంబించే వివిధ పద్ధతులను తమ అమూల్య అనుభవాలుగా చెప్పుకుంటున్నారు జవానులు.

ఖైదీల గది నుండి ఒక ఖైదీ ఏడ్పు వినబడింది. ఎంతసేపటి నుండో ఉప్పొంగి వస్తున్న ద్ణుఖాన్ని ఆపుకుంటున్నప్పటికి, హద్దుదాటి విధిలేక పెద్దగా ఏడ్వాల్సి వచ్చింది. అయినప్పటికి “ఇది జైలు, ఏడ్వటానికి కూడా స్వాతంత్ర్యము లేదు  ఎదురుగా వరండాలోనున్న జవానులు ఏమంటారో” అనే భయము కూడా ఆ ఏడ్పులో ధ్వనిస్తున్నది.

ఆ గదిలో తమ తమ స్థలాల్లో కూర్చొని, తమ బయటి ప్రపంచాన్ని తలచుకుంటున్న యితర ఖైదీలు ఏడుస్తున్న ఖైదీ – మల్లయ్య వైపు సానుభూతితో, ఆశ్చర్యముతో దృష్టి మరల్చారు.

జవానులు “ఏమిటోయ్! అల్లరి” అని తమ కర్తవ్యాన్ని లాంఛనంగా అమల్లో పెట్టి, ఆ ఖైదీ ద్ణుఖాన్ని సామాన్య విషయంగా, అట్టివెన్నొ తమ అనుభవానికి వచ్చినట్లు నిర్లక్ష్యంగా, తిరిగి మాటా మంతీ సాగించారు. “ఈ ఖైదీలు కూర్చొని మాట్లాడటానికి కూడా అవకాశ మివ్వరు” అని ఒక జవాను విసిగాడు.

ఖైదీలు వారే కుటుంబానికి, మతానికి, కులానికి, గ్రామానికి సంబంధించిన వారైనా వారంతా ఖైదీలు. నేటి ఒకే విష సమాజ వృక్షానికి కాసిన కుక్కమూతి పిందెలు.

మల్లయ్య ఖైదీ వద్ద ఇతర ఖైదీలు మూగారు. మల్లయ్య ఏడ్పు కొద్దిగా తగ్గింది. కాని చుట్టు ఖైదీలంతా ఆప్తులుగా చేరేవరకు తిరిగి ద్ణుఖము పొంగి వచ్చింది. ఎక్కి ఎక్కి ఏడ్వసాగాడు.

“ఏమి జ్ఞాపకమొచ్చిందో” ఒక ఖైదీ సానుభూతిగా అన్నాడు.

“జేలుకు వచ్చి ఏడిస్తే ఏమి లాభం? మొదటనే హుషారుగా ఉండాలే.” ఒకడు ధర్మపన్నాలు పలికాడు.

"మూడు నెలలకే ఇంత బుగులు పడతారోయ్! నా సగం వయసు జైల్లో గడిచింది. ఇంకా జైల్లోనే ఉన్నాను నేను. ఇంకా ఎన్నిసార్లు రావలసి ఉందో" ఒక జేలు పిట్ట పలికింది.

"ఎందుకేడుస్తున్నావు మల్లన్నా" చాలా దీనంగా ఒక ఖైదీ పరామర్శ చేశాడు.

తన తండ్రి మంచములో పడి మూల్గుతుండగా ఎక్కిఎక్కి ఏడుస్తున్న తనను తన తండ్రి పరామర్శ చేసిన దృశ్యం మల్లయ్య కండ్లల్లో ఆడింది.

మల్లయ్య ఖానాపురం వంతుమాదిగ. తల్లి చిన్నప్పుడే ప్రసూతి రోగంతో మరణించింది. పొట్టకు చాలని కష్టంతో జీవితమెల్ల కండలు కరిగించి చావుకు కాళ్ళు చాపి మంచములోపడి ఉన్న ముసలితండ్రి. తల్లి చస్తూ వదలిపోయిన ఆడ పసికూనను ప్రేమతో పెంచి పెద్ద చేసిన చెల్లెలు – యిదే అతని కుటుంబము. తండ్రి ముసలివాడైనందున గ్రామ బేగారి పని మల్లయ్య మెడబడ్డది. తండ్రి మంచము పట్టాడు. పది, పన్నెండేడ్ల చెల్లెలు పెండ్లి భారం. మంచం పట్టిన తండ్రి చికిత్స – ముఖ్యంగా కుటుంబ పోషణ భారం మల్లయపై బడ్డది. బేగారి చేసిన తర్వాత దొరికే కొద్ది సమయములో ఇతర కూలిపని చేసుకోవడం కూడా ఒక్కొక్కప్పుడు సాధ్యం కాకపోయేది. మల్లయ్య ఒక్కొక్కప్పుడు ప్రభుత్వాధికారుల బరువులకు పోవడం చెల్లెలు గ్రామ బేగారి పని చేస్తే, తండ్రిని చూసుకోవడం జరుగుతుండేది. ఒక్కొక్కసారి బేగారి చేసిన తర్వాత వేరే కూలి లేక దినమంతా పొట్ట మాడ్చుకునే ఉండాల్సి వచ్చేది. తంటాలుపడి తండ్రికి మాత్రం పేరుకు నోరు తడిపేవాడు.

మల్లయ్య ఒకనాడు బరువుకు పోయి సాయంత్రము ఇంటికి చేరుకున్నాడు. తండ్రి ఆరోగ్యము మరీ చెడిపోయింది. ప్రమాదస్థితిలో నున్నాడు. చెల్లెలు ఏడుస్తూ కూర్చున్నది. ఒక వైపు కడుపుమాడ్తున్నది. రెండోవైపు తండ్రి దూరమయ్యేస్థితి వచ్చింది. వస్తున్న దుఃఖాన్ని మల్లయ్య ఆపుకొని చెల్లెలును సముదాయించి, ఆరాత్రికై ఏ విధంగానైనా ఇంత ఆదరవు సంపాదించడానికి ఇల్లు వదలి బయలుదేరాడు.

ఆలోచిస్తూ మల్లయ్య గ్రామం వెలుపలికి పోయాడు. పొలాల్లో కుప్పలు పేరుస్తున్నారు. మెల్లగా ఒక కళ్లం వద్దకి చేరాడు.

ఆ రోజంతా పొలాలలో పనిచేసిన కూలీలు తమ కూలి తక్కువ దొరికినందుకు భూస్వామితో బేరాలు చేస్తున్నారు. భూస్వామి లోభత్వానికి విసిగి, బిచ్చము గింజలకై ప్రాధేయపడ్తున్నారు. భూస్వామి ఎంగిలి మెతుకులు దులిపినట్లు ఇన్ని గింజలు కూలి వాండ్ల ఒళ్ళో చల్లాడు. ఆ దృశ్యమంతా చూస్తున్న మల్లయ్య నిరాశ చెందాడు. కష్టపడినవాండ్లకే కూలి సరిగా యివ్వక బిచ్చము గింజలు కూడా ఏడుస్తూ పెడ్తునప్పుడు తన కొక గింజకూడా ఆశలేదని నిరాశతో కొయ్యకాలు పొలాలవైపు వెళ్ళాడు.

పనులు ముగించుకొని భూస్వాములు, జీతగాండ్లు కూలీలు గ్రామం ముఖం పట్టారు.

ముసి, ముసి చీకట్లో ఒక్కొక్క పరిగెకర్రను పోగుచేసుకొని కట్టగా కట్టి ఆనాటి రాత్రికి ఆదరవు దొరికినందున తన ప్రయోజకత్వానికి గర్విస్తూ వీరునిగా ఉత్సాహంగా ఇంటిదోవ పట్టాడు. తండ్రిని తలచుకొని, ఏర్పడిన ఆపద జ్ఞాపకము రాగానే ఉత్సాహానికి, గర్వానికి చెంప పెట్టయి కుంగిపోయాడు.

మార్గ మధ్యమున్న అక్కడక్కడ చిన్న చిన్న గుట్టలుగా పేర్చి ఉన్న వరికుప్పలను, తన చంకలోని పరిగెకట్టను పోల్చుకున్నాడు. ఈర్ష్య పడ్డాడు.

"అవి ఎంత పెద్దగా నున్నప్పటికి ఈ కట్టకిందికి రావు. పనికిరావు. కుప్పలు కుక్కగొడుగులు" అనుకుంటు ముందుకు సాగాడు.

"ఎవరోయ్, అటుపోయేది" ఒక కుప్ప వద్ద నుండి ధ్వని వచ్చింది.

మల్లయ్య నిలబడ్డాడు. నలువైపుల పరికించాడు.

ఒక ఆజానుబాహుడు మెడ మీద అడ్డంగా చేతికర్రను ఆనించుకొని కర్ర రెండు చివరలు పట్టుకొని మల్లయ్యవైపు వస్తున్నాడు.

"ఎవడ్రా నీవు? ఎక్కడ నుంచి తెస్తున్నావు ఆ కట్టను?"

"పొలాల్లో పరిగెను కట్ట కట్టాను" మల్లయ్య తన నిర్దోషిత్వాన్ని గట్టిగా ఎరుకపరిచాడు.

"ఓహో! నీవు వస్తావని పరిగె కట్టి పెట్టామోయ్. ఈ కుప్పలన్ని పరిగెకట్టి పేర్చినవే. ఏమి వగలమారి మొగాడివిరా?"

"పరిగె ఏరుకోవడం తప్పేనా?" తనకు కలిగిన అన్యాయముపై, ఆ వ్యక్తి యొక్క అంతులేని స్వార్థముపై ఆశ్చర్యమును కనబరచు ధ్వనితో మల్లయ్య అన్నాడు.

"ఇంకా నీల్గుతున్నావు? పెట్టు అక్కడ ఆ కట్టను" కర్ర లేపాడు.

మల్లయ్య ఇక లాభం లేదని గ్రహించి, దీనంగా తన దీనస్థితిని తండ్రి గతిని తెలిపాడు, బ్రతిమిలాడాడు.

మల్లయ్య బ్రతిమాలాడడంతో, తప్పకుండా ఆ కట్ట దొంగలింపబడిందనే గట్టి నమ్మకం ఆ వ్యక్తికి కలిగి "ఎవడికి పుట్టావురా?" అని ఇంకా రౌద్రముతో కర్ర లేపి కొట్టబోయాడు.

ఇక నిలబడితే లాభము లేదని పరిగెకట్టెను చంకలో గట్టిగా పట్టుకొని కాలికి బుద్ధి చెప్పాడు. ముందు మల్లయ్య వెనుక ఆ వ్యక్తి గ్రామ ముఖం పట్టారు.

మల్లయ్య తండ్రిని చేరుకోవాలె. పరిగెకట్టను ఎలాగైనా రక్షించుకోవాలె. చెల్లెలుకు, తండ్రికి రాత్రికి ఇన్ని మెతుకులు పెట్టాలె అనే నిశ్చితాభిప్రాయమునకు తన బలాన్ని చేయూతనిచ్చి, సర్వశక్తులనుపయోగించి వడిగా పరుగెత్తుతున్నాడు.

గ్రామములో మార్గమధ్యమునున్న చావిడి వద్దకు వచ్చేవరకు చెల్లెలు కండ్ల నీళ్ళు తుడుచుకుంటూ ఒక గోడ ప్రక్కన నిలబడి వుంది. పోలీసు పటేలు బండ బూతులు తిడ్తున్నాడు.

సాయంత్రం మల్లయ్య పొలాల వైపు వెళ్ళిన తర్వాత మల్లయ్య కొరకు పోలీసు పటేలు కబురంపాడు. ప్రక్క గ్రామం అత్యవసర పనిమీద వంతుపోవలసి వుంది. ఇంట్లో మల్లయ్య లేనందున తండ్రి ప్రమాదస్థితిపై ఏడుస్తూ కూర్చున్న చెల్లెలును సేతుసింధీ తీసుకెళ్ళాడు. చెల్లెలును వంతకుపొమ్మని ఒత్తిడి చేస్తున్నాడు. చెల్లెలు ఏడుస్తూ తన తండ్రి అవస్థ పోలీసు పట్టేలుకు తెలుపుతు ఉంది.

ఇంతలో అన్న మల్లయ్య పరుగెత్తుకు రావడం తనను పోలీసు పటేలు ఎర నుండి రక్షించడానికని భావించింది.

కాని ఇద్దరూ వలలో చిక్కారు. మల్లయ్యను చూడగానే బావురుమని ఏడుస్తూ మల్లయ్య పంచ చేరింది.

ఇంతలో వెనుకనుండి పరుగెత్తి వస్తున్న వ్యక్తి అమాంతంగా మల్లయ్య వీపుపై బలంగా చేతికర్రతో దెబ్బ వేశాడు.

“చస్తిన”ని మల్లయ్య, అతని చెల్లెలు కిందపడిపోయారు. ఒకరిపై ఒకరు పడి ఏడుస్తున్నారు.

మల్లయ్య వెంబడించిన ఆ వ్యక్తి పోలీసు పటేలు ముందు ఆ పరిగెకట్టను పెట్టి అది తన వరికుప్ప నుండి మల్లయ్య దొంగలించాడని ఫిర్యాదు చేశాడు.

పడి ఏడుస్తున్న మల్లయ్యను చెల్లెలు నుండి వేరు చేసి చావిడి స్తంభానికి కట్టారు సేతుసింధీలు. చెల్లెలును బలవంతంగా వంతుకు పొమ్మని తిరిగి పోలీసు పటేలు బలవంత పెట్టసాగాడు.

“దీని తండ్రికి ఎట్లా ఉందోయ్” క్రూర పాలకయంత్రములో భాగమై మానవత్వాన్ని చంపుకొని ఛండపాలన చేస్తున్న ఆ పోలీసు పటేలు నోటి నుండి మానవత్వాన్ని జ్ఞప్తికి తెచ్చు ఒక వాక్యము వెళ్ళింది.

“ముసలితొక్కు ఆరునెలలైంది మంచాన్నిబట్టి. చావక, బ్రతక్క ఉన్నాడు. బ్రతికే ఆశలేదు. కాని ఆ రోజే చస్తాడని అనుకోవడానికి వీండ్లేం బ్రహ్మకొడుకులా? ఒళ్ళంగక ఏదో వగలు” సేతుసింధీ పోలీసు పటేలుకు జవాబు చెప్పాడు.

ఇంట్లో తండ్రి – ఇవన్ని తన జీవిత అనుభవాలే అన్నట్లు నిర్లక్ష్యంగా పడి ఉన్నాడు పరధ్యానంలో స్మృతి తప్పి.

తుదకు చెల్లెలును బలవంతము చేసి ప్రక్క గ్రామానికి వంతుకు పంపారు. ఝామురాత్రి వేళ బిక్కురు, బిక్కురు మనుకుంటూ దిక్కులు చూస్తూ చెల్లెలు వంతుకు బయలుదేరింది.

తండ్రికి అండగా వున్న చెల్లెలు దూరమైంది. మల్లయ్య నిర్బంధంలో ఉన్నాడు. తండ్రిని కండ్ల చూస్తానో లేదో అని బాధపడ్తున్నాడు మల్లయ్య.

తెల్లవారి మల్లయ్యను పోలీస్‌స్టేషన్‌కు పంపాడు పోలీసు పటేలు. దొంగనేరము క్రింద మల్లయ్యకు మూడు నెలలు శిక్షైంది.

తండ్రి, చెల్లెలు సంగతి ఏమైందో తెలియదు.

ఒకనాడు జేలు పనిమీద మల్లయ్య బజారుకు పొయ్యాడు. అంగడిలో ఒక పరిచయస్తుడు కనబడ్డాడు. జవానును బ్రతిమిలాడి అతన్ని కలిసికొని మాట్లాడితే తండ్రి మరణించాడనీ, చెల్లెలు ఊరువిడిచి ఎక్కడికో వెళ్ళిపోయిందని, ఇల్లు పాడుపడిందని తెలిసింది.

ఉబికి వస్తున్న పట్టరాని దుఖాన్ని బహు కష్టంగా ఆపుకున్నాడు. పెద్దగా ఏడిస్తే పదిమంది కూడ్తారు. దయతలచి మాట్లాడ అవకాశమిచ్చిన జవానుకు మాట వస్తుంది.

లోపల, లోపల కుమిలిపోతున్నాడు. అన్నంతిని గదిలోకి చేరిన తర్వాత ఇక ఏడ్వవచ్చునుకున్నాడు. సర్వ స్వతంత్రుడునని భ్రమపడి పెద్దగా ఏడ్చాడు.

“మా చెల్లెలు ఏమైందో.” తపిస్తున్నాడు హృదయంలో.

✡

# గుడిసెలు! గుడిసెలు!

**–ముదిగంటి సుజాతారెడ్డి**

చీకటి పడింది. ఇంట్లో గ్యాసుతో వెలిగే బల్బులు వెలుగును విరజిమ్ముతున్నాయి.

నాగయ్య ముందటేడు కొడుకు పెండ్లికి ముందల్నే పెంకుటిల్లంతా సవరించాడు. గోడలకు రంగులు వేయించాడు. దూలాలకు, మొగరాలకు, కిటికీలకు, తలుపులకు వార్నిషు పూయించాడు. అప్పుడే గోబరు గ్యాసు పెట్టించాడు. ఆ గ్యాసుతో ఇంటినిండా బల్బులు వెలుగుతున్నాయి. వంటకు గ్యాసు అయింది. పిడకలతో, కట్టెలతో పొగ బాధ తప్పింది కాంతమ్మకు.

గ్యాసు పొయ్యికి దగ్గరగా పీట మీద కూర్చొని కాంతమ్మ జొన్నరొట్టెలు చేస్తున్నది. ఆమె భర్త నాగయ్య ఆమె జొన్న రొట్టెలు చేస్తే ఇష్టపడతాడు.

కాంతమ్మ జొన్నరొట్టెలు గుడ్డ పేలికలంత పల్చగా చేస్తుంది. పొడి పిండి చల్లుతూ అరచేతితో చకచకా రొట్టెలు చరుస్తుంది కాంతమ్మ.

పొద్దంతా చెలకలో దుక్కులు దున్ని వచ్చిన నాగయ్య నీళ్ళ గోలెం దగ్గరకు పోయి ఒంటిమీద రెండు చెంబుల నీళ్ళు పోసుకుని, ధోవతి మార్చుకొని వచ్చి కాంతమ్మకు దగ్గరగా ఉన్న పీటమీద కూర్చున్నాడు.

"వచ్చే ఏడు నాగలితో కాక ట్రాక్టరుతో దుక్కులు దున్నిద్దామె" అన్నాడు భార్యతో నాగయ్య.

"దానయ్య ట్రాక్టరు తెచ్చిండట గద! కిరాయిలకు తోలుతున్నడంట. చణంలో ఎకరం భూమిని దున్నతదట అని ఇన్న. ఇగ ఎడ్లు, నాగలి మూలబడే రోజులొచ్చినయి" అంది తలెత్తకుండానే రొట్టెలు చరుస్తున్న కాంతమ్మ.

ఇంతలో కోడలు సరోజ మామ ముందు తలె తెచ్చిపెట్టింది. తలెలో పప్పు వడ్డించింది. ఉల్లిగడ్డలు సన్నగా ముక్కలుగా కోసి తపుకులో తెచ్చి తలె పక్కన పెట్టింది. బర్రెపాలు పిండడానికి పెద్ద గుండు చెంబుతో పెరడులో ఉన్న గొడ్లపాక దిక్కుపోయింది.

"పిల్లా! కోల్లను సరిగ్గా కమ్మిన్నో లేదో జర సూడు" అంది కాంతమ్మ పెరట్లోకి పోతున్న కోడలుతో.

నాగయ్య ఉడుకు ఉడుకు జొన్నరొట్టెలు పప్పుతో తింటున్నాడు. మధ్య మధ్య వుల్లి గడ్డలు నములుతున్నాడు.

"పొలంల బోరుకాడ ఉల్లిగడ్డలు నాటిన. బాగ ఉల్లిపొరక వొచ్చింది. ఒకరోజు తెచ్చివొండవే. ముదిరిపోతయి. జొన్నరొట్టెలలో గా కూర కమ్మగుంటదె" అన్నాడు నాగయ్య.

వేడి వేడి జొన్నరొట్టెలు ఎన్ని తిన్నాడో నాగయ్యకే లెక్కలేదు. చివరకు బేవు తీసి "ఇక సాలే" అని లేచాడు.

నాగయ్యకు ఇప్పుడు తరి పొలం వుంది. వడ్లు పండుతున్నాయి. రెండు పూటలా వరి అన్నం తినవచ్చు. కానీ, అతనికి రాత్రిపూటయినా జొన్నరొట్టెలు లేందే ఎట్లాగో వుంటుంది. చిన్నప్పట్నుంచీ జొన్న గటుక, జొన్నరొట్టెలు తినడమే అలవాటు. పొలం కొన్నాక కాంతమ్మ పగటి పూట వరి అన్నం వండడం మొదలుపెట్టింది.

"ఏందే ఇది? జొన్నలుండగ గీ వరి అన్నం ఎందుకే?" అని అన్నాడు నాగయ్య మొదట్లో.

"అందరూ ఇప్పుడు రెండు పూటలు వరి అన్నమె తింటున్నరు. వీల్లింక జొన్నగటుక తింటున్నరంటె నీ కొడుక్కు ఎవరూ మంచి ఇంటి పిల్లనియ్యరు" నవ్వింది కాంతమ్మ.

వరి అన్నం తిన్న కొత్తలో నాగయ్యకు కాస్సేపటికి ఆకలేసేది. కానీ, ఇప్పుడు అలవాటు పడిపోయాడు. రాత్రిపూట మాత్రం ఆ ఇంట్లో జొన్నరొట్టెలు మాత్రం ఉండవలసిందే.

ఇంతలో పట్నంపోయిన శీతయ్య వచ్చాడు. పెరడులో ఉన్న బావి దగ్గర సరోజ నీళ్ళు చేది బొక్కనతో పోస్తుంటే స్నానం చేశాడు. వచ్చి తండ్రి పక్కనే సరోజ వేసిన పీటమీద కూర్చున్నాడు. సరోజ భర్త ముందు తలె పెట్టి, పప్పు వడ్డించి ఉడుకు ఉడుకు జొన్నరొట్టెలు తెచ్చి తలెలో పెట్టింది. ఉల్లిగడ్డ ముక్కలున్న తపుకు తలె పక్కన పెట్టింది.

కాంతమ్మ సరోజ వైపు తృప్తిగా చూసింది. "పిల్ల పనిమంతురాలు! ఇక ఇంటికి దరిద్రమనేది ఉండదు" అనుకుంది.

సరోజ పేదింటి పిల్లయినా, పనిమంతురాలు అనే ఇష్టపడి కట్నం కానుకలను ఆశపడకుండా కాంతమ్మ కొడుక్కు చేసుకుంది.

'నాకు వాడు ఒక్కడే! ఒకరి ముందల చెయ్యి సాపకుంట, అప్పు లేకుంట బతుకుతున్నం. ఏడు కాన్పులు పోయినంక శీతయ్య పుట్టి బతికిండు. వాడు కడుపుల పడంగనే కులదేవత శీతలమ్మకు మొక్కుకున్న. ఆ తల్లి పేరు పెట్టుకుంట అని. వాడు బతికి బట్టకడ్తుండు. సరోజ తల్లిదండ్రులు కట్నమెక్కువ ఇయ్యరని తెలిసిగూడ గీ పిల్లయితే బాగుంటదని చేస్కున్నందుకు పిల్ల బుద్ధిమంతురాలె తేలింది" రొట్టెలు చరుస్తూ కాంతమ్మ ఆలోచనల్లోకి వెళ్ళిపోయింది.

"నువ్వు పట్నం పోయిన పని ఏమైందిర" అడిగాడు నాగయ్య కొడుకు వైపు చూస్తూ.

"బోరు ఏసెటోల్లు కలిసింగ్రు. వొచ్చి బోరు ఎప్పుడంటె గప్పుడేస్తమంగ్రు. కానీ..." ఆగాడు శీతయ్య.

పదెకరాల చెలకలో ఇంతవరకు వర్షం మీద ఆధారపడే పంట పండుతోంది. ఇప్పుడు ఆ చెలకలో బోరు వేయించి పత్తి, మిర్చి పండించాలనుకున్నారు తండ్రీ కొడుకులు.

"కానీ... అంటున్నవ్ ఏమైందేంది? పైసలు బాగ అడుగుతుంగ్ర" అడిగాడు నాగయ్య. ఆయన పీట మీదినుంచి లేచి సరోజ అందించిన నీళ్ళ చెంబు అందుకుని చెయ్యి కడుక్కొని, నోట్లో పోసుకుని పుక్కిలించి ఊశాడు.

"కాదే నాయిన! తోవల దేవేందర్ కలిసిండు. మన ఊరి పక్కన విమానాలు ఆగేది గదే ఏరోడ్రోమ్ పెద్దది కడ్తరంట. మన ఊరోల్లయి భూములన్నీ సర్కారు తీస్కుంటదని సెప్పిండు. కలెక్టరు సొయాన గాయనకు సెప్పిండంటనే. మనంబోరేసి, దండుగయితమేమొ"

"ఆ గట్ల ఎప్పట్నుంచో నీ పుట్టక కాడి నుంచి అంటున్నరు. గట్లని ఎవసాయం మాను కుంటమ!" నాగయ్య సరోజ అందించిన తువ్వాలకు చేతులు తుడుచుకున్నాడు.

నాగయ్యకు అరవై ఏళ్ళు దగ్గరపడుతున్నా ఒంట్లో సత్తువ ఏం కమ్మికాలేదు. అతని తండ్రి చచ్చిపోయినప్పుడు ఏమంత పెద్దోడు కాదు. ఒక్కడే వ్యవసాయంలోకి దిగి పనులు చేసుకున్నాడు. ఇప్పటికీ అదే సత్తువ అతనిలో చావకుండా వుంది. నాగయ్య తేనెటీగలాగా డబ్బు కూడబెట్టి కొడుకు వ్యవసాయానికి అందివచ్చేసరికి పదెకరాల చెలక జతకు అయిదెకరాలు తరి పొలం కొన్నాడు. కొడుకు పెళ్ళయి ఏడాదయింది. మనుమడు పుట్టే తలకు ఇంకా అయిదెకరాల భూమయినా కొనాలని ఆశగా వుంది నాగయ్యకు.

"గట్ల గాదె నాయన! గీ సారి భూములు నిజంగనే పోతయంటున్నరే! భూములు కొలిసెటోల్లు తొందర్లనే వొస్తరనీ, గది ఖాయమనీ దేవేందర్ సెప్పిండే" అన్నాడు శీతయ్య.

"దేవేందర్ అంటె పట్నంల కలెక్టరు ఆఫీసుల పనిచేస్తడు గాయనేనా?" నాగయ్య అడిగాడు.

"అవునే గాయినే! భూములు తీస్కొని సర్కారు పైసలు కట్టిస్తరంటనే" శీతయ్య గొంతులో ఎందుకోగాని ఉత్సాహం ధ్వనించింది.

"ఎన్ని పైసలిస్తరు. బజారు ధర కట్టిస్తర ఏమన్ననా? అయినా గా పైసలేం చేస్కుంటం! బంగారం అసొంటి భూమి మల్లకొంటమ?" నాగయ్య గొణిగాడు. వెంటనే గొంతు పెద్దగా చేసి, "అయినా సర్కారోల్లు పైసలిచ్చిందాక మనమేం గావాలె" అన్నాడు నాగయ్య. చూపులు శూన్యంగా కనిపించాయి.

నాగయ్య పోయి యింటికి ముందున్న అరుగుమీద కూర్చున్నాడు రోజులాగానే. చేతిలోని పొగాకు కాడను మరో చేతి వేళ్లతో ముడతలు లేకుండా చక్కంగ సాగదీసి, వాసన చూసి, ఆ వాసనకు తృప్తిపడ్డాడు. కాసేపు అతని మనసు ఏ చీకాకూ లేకుండా అయింది.

పెద్దిరెడ్డి ఇచ్చిన పది పొగాకు మొక్కలకు నాగయ్య నిరుడు చెలకలో ఓ మూల నాటాడు. ఎఱ్రభూమిలో పొగాకు ఎదగదని అన్నారందరూ. కానీ, అదేం మహిమోగాని ఆ పది పొగాకు మొక్కలు ఏపుగా పెరిగాయి. ఆ పొగాకు ఏడాది పొడుగునా తండ్రీ కొడుకులకు సరిపోతుందని కాంతమ్మ జాగ్రత్తగా దబ్బణంతో, సుత్లీదారానికి కుచ్చి మడచి బస్తాలో వేసి చుట్టి పెట్టింది. ఆ చుట్టలోంచే నాగయ్య తనకు సరిపోయే ఒక్క కాడ కాక కాంతమ్మ కంట్లో పడకుండా నాలుగు కాడలు తీసుకొని వచ్చి అరుగులు మీద కూర్చున్నాడు. ఎప్పటిలాగే రైతులు నలుగురు ఆ అరుగుల మీదికి చేరారు. నాగయ్య వాళ్ళకు పొగాకు ఇచ్చాడు. అందరూ ఆ పొగాకును నాగయ్య ఇచ్చిన మోదుగాకుల్లో వేసి చుట్టలు చుట్టి తాగుతూ మాటల్లోకి దిగారు. ఆ రోజు వాళ్ల మాటల్లోని విషయం రోజూలాగే పంటలు, ఎరువులు, చీడ పురుగుల గురించి కాదు, భూములను సర్కారోల్లు తీసుకొని ఏరోడ్రోమ్ కడుతున్నారన్నదే!

"దేవేందర్ గీ ముచ్చట మావోడికి పట్నంల కలిసి సెప్పిండట. కలెక్టరు సొయాన వానికి గీ సంగతి సెప్పిండట" అన్నాడు. అతని గొంతు నీరసంగా ఉంది. వేళ్ళ మధ్య చుట్టను రోజులాగా ఆయన వేగంగా తిప్పుతూ పొగను పీల్చడం లేదు.

"దేవేందర్ ఎవడు? కలెక్టరాఫీసుల పన్జేస్తడు ఆడేనా! ఏతులమారి ఆడు. ఆడు చెప్పింది ఏదీ నమ్మకంగ ఉండదు" అన్నాడు రామలింగయ్య.

"అంతేనంటవ లింగయ్య బావా" అన్నాడు నాగయ్య. అతని గుండెలోంచి ఏందో బరువు దించినట్లయింది.

"సరేలే. సర్కారోల్లు భూములు తీస్కుంటే ఊకనే తీసుకోరు. పైసలు కట్టి ఇస్తరు. ఇస్తె మంచిదే! ఎంత కష్టం చేసుకున్నా మిగులని ఎదుగు బొదుగూ లేని గీ ఎవసాయాలు మానుకుని బిజినెస్సులోకి దిగుదాం. బిజినెస్సులో లాభాలే లాభాలు అనుకో!" పెద్దగా నవ్వాడు వెంకటరెడ్డి.

"ఏం బిజినెస్సో! తెల్వని దందల కెట్ల దిగుతం" అన్నాడు రామలింగయ్య అనుమానంగా.

"తెల్వదంటె నేర్సుకుంటం! మా మేనల్లుని పట్నంల చూసిన గద! బిజినెస్సంటె గదేమంత కష్టమైన పనిగాదు. ఆరామ్‌గా చల్లని అఱ్ఱల కూసోని – గీ ఎవసాయంల వుంటే మోటు కష్టముంటద ఏమన్నన" అన్నాడు వెంకటరెడ్డి చుట్టపొగను గాలిలోకి వదులుతూ.

"చాయ్ హోటల్ పెట్టుకున్న గీ ఎవసాయం కన్న నయమే గీ రోజుల్ల" అన్నాడు కిష్టయ్య.

ఎవరూ ఏం మాట్లాడలేదు. మళ్ళా అందుకున్నాడు.

"నేను పట్నంల కలెక్టరాఫీసు కాడ సూసిన గద! చెట్టు కింద చాయ్ అమ్మెటోడు మనకన్న ఎక్కువ సంపాయిస్తున్నడు" నవ్వాడు కిష్టయ్య.

"ఎట్లయిన తరతరాల నుంచి వొస్తున్న ఎవసాయం మనది. గదెట్ల మానుకుంటమే కిష్టయ్య" అన్నాడు నాగయ్య దిగులుగా.

"విమానాలు ఆగే దగ్గర భూములు పోయినోల్లకు నౌకరీలు యిస్తరంటనే నాయిన! దేవేందర్ సెప్పిండు" అన్నాడు శీతయ్య. తల్లీ, భార్య తీరికగా ముచ్చట్లు పెట్టుకుంటు తింటుంటే శీతయ్య వచ్చి అరుగుల మీదికి చేరాడు.

"ఇంకేంది. ఇంటికొక్కనికైన నౌకరీ పెట్టిచ్చాలె అని అందాం" అన్నాడు కిష్టయ్య గంభీరంగా.

"మనం ఎవసాయాలు చేస్కొని మారాజులెక్క బతికెటోల్లం. గిట్ల ఊడిగాలు సేయడం మనతోటి ఏమైతది" అన్నాడు నాగయ్య. అతని గొంతులో నిస్పృహ ధ్వనించింది.

"ఎప్పటికొక్క తీరుగుంటద నాగయ్య మామ" అన్నాడు వెంకటరెడ్డి.

శీతయ్యకు ఇక అక్కడ కూర్చోబుద్ధికాలేదు. సరోజ అర్రల తన కోసం ఎదురు చూస్తుంటది అని మనసులో మెదలంగనే శీతయ్య లేచి లోపలికి వెళ్ళిపోయాడు.

"పంట పండిచ్చిపోసుడు తప్ప మనకేం పనులొస్తయని నౌకరీలు చేస్తం" నిట్టూర్చాడు నాగయ్య.

"గదే మెల్లంగ అలవాటయితది" అన్నాడు వెంకటరెడ్డి.

"అంతేమరి! కాలంతోటి మనం" అన్నాడు కిష్టయ్య చుట్ట ఘాటును తుపుక్కున వుమ్మేస్తూ.

"చూద్దాం ఏమైతదో" అన్నాడు నాగయ్య లేస్తూ. ఇంకా అతనికి భూములు సర్కారు తీసుకుంటదని నమ్మకం కలగడం లేదు.

"గిన్ని భూములు సర్కారు తీస్కొని ఏం చేసుకుంటది" అతనికి నమ్మశక్యం కాకుండా వుంది.

అందరూ లేచి ఇంటితోవ పట్టారు. కానీ, అందరి మనసుల్లో భూములేమైతదో అన్న సమస్యే మెదులుతున్నది.

శీతయ్యకు దేవేందర్ చెప్పిన కొన్నాళ్ళకే ఊరికి బుల్‌డోజర్లు వచ్చాయి. బుల్‌డోజర్లతో గవర్నమెంటు ఉద్యోగులు వచ్చారు. వాళ్ళవెంట పోలీసు బలగం లాఠీలతో దిగింది. ఇంజనీర్లు అంతకుముందే వచ్చి గుప్‌చుప్‌గా గట్లను పెట్టారు. రైతులకు ఉత్తరాలు వచ్చాయి. దాన్నుంచి వాళ్ళు తేరుకోకముందే బుల్‌డోజర్లు వచ్చాయి. ఇన్నాళ్ళు రైతు కుటుంబాలు ఆడ మగా

రెక్కలు ముక్కలయ్యేటట్లుగా పొతంజేసిన భూములన్నిటినీ చదును చేయడం మొదలుపెట్టాయి. చెలకలు, పొలాలు ఏకమయ్యాయి. బుల్‌డోజర్లు పెద్ద చప్పుడులు చేస్తూ రాక్షసుల్లా కదుల్తూ కాస్సేపట్లో గట్లను మాయం చేసి భూములను చదును చేస్తుంటే ఊర్లో వాళ్ళందరూ అక్కడ చేరారు. నోరు తెరుచుకుని బుల్‌డోజర్లను చూస్తుండిపోయారు. పిల్లలు వాటివెంట పరిగెత్తడం మొదలుపెట్టారు. కానీ ఒక్కొక్క చెలక, పొలం, చెట్లు, చేమలు చకచక చదునుకావడం చేసి మగాళ్ళు దిగాలు పడిపోయారు. దిక్కుతోచలేదు వాళ్ళకు. ఆడవాళ్ళు లబోదిబోమని ఏడ్వడం మొదలుపెట్టారు.

రెండోరోజు బుల్‌డోజర్లు ఊరిమీద కూడా పడ్డాయి. ఇళ్ళు కూడా నేలమట్టం అవుతాయని చూసి ఊరివాళ్ళందరూ పోయి బుల్‌డోజర్లకు అడ్డంగా నిల్చున్నారు.

“గా పైసలు ఎప్పుడిస్తరో మనం అడుగనే లేదు” అని రైతులు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

వెంకటరెడ్డి కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

“మనం గీ అన్యాయాన్ని ఎదిరించి కొట్లాడ్దాం” అన్నా కిష్టయ్య పిడికిలి పైకి లేపి. అందరూ అతనివైపు ఆశగా చూశారు.

నాగయ్య మంచంలోంచి లేవలేక అక్కడికి రాలేదు. శీతయ్య వచ్చాడు. అతను ఏం మాట్లాడలేదు.

“నౌకరీలు ఇస్తమంద్రి గదాన్ని ఎవరు అడుగలేదు” అనుకున్నాడు శీతయ్య. పైకి ఏమీ అనలేదు.

రోజులు గడిచిపోతున్నాయి.

సర్కారు ఇచ్చే రేషన్ బందయింది. తమ పరిస్థితిని చెప్పుకుందామన్నా ఎవరూ సర్కారు ఉద్యోగులు ఆ ఛాయలకు రావడంలేదు. బుల్‌డోజర్లు ఇంకా తమ పనిని చేసుకుంటూ పోతున్నాయి.

ఒకప్పుడు పచ్చని చేనులు, పొలాలు, చెట్లు చేమలతో నిండిన భూములు ఇప్పుడు మిట్టపల్లాలు లేకుండా చదునై భూమి ఆకాశాన్నంటే దాకా ఎర్రగా, నల్లగా ఒక్క రాయీ రప్పా లేకుండా కనిపిస్తున్నాయి. ఎవరి చెలక ఏదో, ఎవరి పొలం ఏదో జాడలేకుండా పోయాయి.

ఒకరోజు గుడిసెల్లో ఉండే వాళ్లందరూ మీటింగు పెట్టుకున్నారు. ఆవేశంతో పోయి బుల్‌డోజర్లకు అడ్డుగా నిలబడ్డారు.

"మా భూముల పైసలు ఇయ్యందే ఈటిని నడువనియ్యం. మాకు పక్కా ఇండ్లు కట్టిచ్చి ఇస్తమంటిరి ఏవి? మా సంగతేందో సూడకపోతే ఈటిని కదులనియ్యం" అన్నారు గట్టిగా.

ఇది విని కంట్రాక్టరు ఎయిర్ కండిషన్ కారులో కూర్చున్నవాడల్లా ఉరుక్కుంటూ అక్కడికి వచ్చాడు.

"అయ్యబాబోయ్. మీ భూములకిచ్చే డబ్బు సంగతి నాకు తెలియదండి. అవన్నీ ఇచ్చే వాళ్ళు వేరే ఉన్నారండి. నేను కాంట్రాక్టరునండి. కావలిస్తే మీకు కూలిపని ఇస్తానండి. చేసుకోండి. అంతేగాని, నాకేం తెలియదు బాబోయ్" అని కాంట్రాక్టరు నివేదించుకున్నాడు.

జనంలో కొందరికి అతను చెప్పింది సమంజసమే అనిపించింది. తిండిలేక మలమల మాడేకన్నా ఏదో ఒక పని చేసుకున్నది మేలనుకున్నారు. కంట్రాక్టరు దగ్గర మట్టి మోసే కూలీలుగా చేరారు.

ఆ రాత్రి గుడిసెల మధ్య ఉన్న కాస్త ఖాళా జాగాలో అందరూ పోగయ్యారు.

"సర్కారు మనకిస్తమన్న భూమి పైసలు ఇంతవరకియ్యలేదు. ఎవరూ గిక్కడికి వచ్చి మన గోస చూస్తలేరు. అందుకని రేపు మనమే పోయి కలెక్టర్ను ఇసయమేందో అడుగుదం" అన్నాడు కిష్టయ్య.

అందరూ ఒప్పుకున్నారు.

మర్నాడు అందరూ కలెక్టరాఫీసు ముందు గుంపులుగా చేరారు. "కలెక్టర్ను కలవాలె" అన్నారు.

"కలెక్టరు లేడు" అని ప్యూను చెప్పాడు. అది వాళ్ళు నమ్మి, ఆఫీసు ముందు కలెక్టరు వచ్చిందాక ఉంటామని బైఠాయించారు. ఇంతలో లాఠీలతో  పోలీసులు వచ్చారు. వాళ్ళు చుట్టూ దడి కట్టి నిలబడ్డారు. పోలీసులను చూడగానే కొందరు జడుసుకున్నారు. మెల్లగా అక్కడి నుంచి జారుకున్నారు. కూలీ పనుల్లోకి వెళ్లిపోయారు. మిగిలిన జనం కలెక్టరాఫీసు ముందు పొద్దుగూకె దాక నిశ్శబ్దంగా బైఠాయించారు. అప్పటికీ కలెక్టరు రాలేదు.

జనం మర్నాడు వచ్చారు. కలెక్టరాఫీసు ముందు బైఠాయించారు. ఆ రోజూ కలెక్టరు రాలేదు. అట్లా వారం రోజులు గడచిపోయాయి. కలెక్టరు ఢిల్లీకి వెళ్లాడని తెలిసింది. ఇన్ని రోజులు ఇట్లా కూర్చుంటే ఎట్లా అని చాలామంది దొరికిన కూలిపనుల్లోకి వెళ్ళిపోయారు. శీతయ్య, కిష్టయ్య, ఇంకా కొందరు మాత్రమే మిగిలారు.

ఆఖరికి ఒకరోజు కలెక్టరును వాళ్లు కలిశారు. వాళ్ళు చెప్పుకున్న గోడును విన్నాడు కలెక్టరు. ఒక ఉత్తరం రాసి ఇయ్యమన్నాడు. వాళ్లు అదేవిధంగా రాసి ఇచ్చారు.

"మీకు డబ్బు వెంటనే అందేట్టు చూస్తాను" అని హామీ యిచ్చాడు కలెక్టరు. అంతే వాళ్ళు మళ్ళా పోయినప్పుడు కలెక్టరు ఎప్పుడూ ఆఫీసులో దొరకలేదు. దాంతో జనంలో కొందరు విసిగిపోయారు.

"గా పైసలు వొచ్చేనాటికే ఒస్తాయి. గిట్ల ఆఫీసుల పొంటి తిర్గుతుంటె మనం, మన పోరలు బతికేదెట్ల" అని దొరికిన పనుల్లోకి దిగిపోయారు.

వెంకటరెడ్డి చిన్న హోటల్లో ఊడ్చే, తుడ్చే పనికి కుదిరాడు. జీతం పొంగ హోటల్లో గదుల్లో దిగినవాళ్ళ సామాన్లు మోసినందుకు కొంత మీది ఆదాయం ఉంది అతనికి.

రామలింగయ్య పైపుల దుకాణంలో పైపులు చేరవేస్తూ రిక్షా నడపడం మొదలుపెట్టాడు. అట్లా తలా ఓ పని చూసుకుని చేరిపోయారు. కిష్టయ్య, శీతయ్యలు తప్ప అందరూ భూములకు వచ్చే డబ్బు గురించి ఆలోచించడం మానుకున్నారు. "వొచ్చెనాడు అయ్యే వొస్తయి" అని మనసును సమాధానపరుచుకున్నారు.

కాలం గడిచిపోతున్నది.

వానాకాలం రాగానే గుడిసెల తడికెల కప్పుల మీద ప్లాస్టిక్ కాగితాలు చేరాయి. అవి గాలికి లేచిపోకుండా ఇటుక పెడ్డలు పెట్టారు. వానాకాలం పోయి చలికాలం రాగానే చుట్టూ వున్న తడికల గోడలకు గోనెసంచులు వేలాడదీశారు. గుడిసెల వాసులకు తెల్లరేషను కార్డులు వచ్చాయి. పొయ్యిలోకి కట్టెలు దొరకక గుడిసెల్లో గ్యాసు నూనె స్టౌలు వచ్చి చేరాయి.

"మాకు పైకం ముట్టేదాకా ఈటిని కదలనియ్యం! మా భూములను, పంటలను, చెట్లను, చేనుగట్లను నాశనం చేసింద్రు. ఆఖరికి మా ఇండ్లూ కూల్చేస్తున్నరు.

మేమెక్కడ ఉండాలె! మాకిచ్చే పైకం ఇయ్యలేదు. మేం గీ మెషీన్లను నడువనియ్యం" అన్నాడు కిష్టయ్య ఆవేశంతో ముందుకువచ్చి నిలబడి.

"గంతే గీ మెషీన్లను నడువనియ్యం" అన్నాడు వెంకటరెడ్డి పెద్దగా గొంతెత్తి.

కట్టలు కట్టలుగ కాగితాలున్న ఫైలు చేతిలో పట్టుకొని ఒక గవర్నమెంటు ఆఫీసరు పరిగెత్తుకుంటూ వచ్చాడు వాళ్ళముందుకు.

"మీరేం బాధపడకండి. గవర్నమెంటు మీకందరికీ పక్కా ఇళ్ళు కట్టించి ఇస్తుంది. మీకొచ్చే డబ్బు కూడా గవర్నమెంటు తొందర్లోనే ఇచ్చే ఏర్పాట్లు చేస్తుంది. వెంటనే మీకందరికీ తడికెలతో టెంపరరీగా అదిగో అక్కడ ఇళ్ళు కట్టిస్తున్నాం" అని దూరంగా ఖాళా జాగాను చూపించాడు ఆ ఆఫీసరు.

"మా భూములనూ పంటలను నాశనం చేసింద్రు. మా నోట్లె మన్ను పోసింద్రు. గిప్పుడేం తింటం మేము" అని ఆవేశంగా అరిచాడు కిష్టయ్య.

కిష్టయ్య నాలుగుసార్లు పట్నంపోయి వచ్చినవాడు. దునియ చూసినవాడు. మాట్లాడగలిగే ధైర్యమున్నవాడు. ఆఫీసరు కిష్టయ్య వైపు చూశాడు.

“మీ భూముల ధరలు తొందరగా ముట్టేట్లు నేను వెంటనే కలెక్టరుతో మాట్లాడ్తాను. రేపే మీకు తడికెల ఇళ్ళు కట్టిస్తాం. గవర్నమెంటు మీకు కావాల్సిన బియ్యం, పప్పు మొదలైన రేషను వెంటనే ఫ్రీగా ఇచ్చే ఏర్పాట్లు చూస్తానని మినిష్టరు హామీ ఇచ్చారు. మీరేం దిగులుపడొద్దు. మీకేం నష్టం కాకుండా గవర్నమెంటు చూస్తుంది” అన్నాడు ఆఫీసరు ప్రశాంతంగా.

ఆ ఆఫీసరు మాటలకు జనం కాస్త చల్లబడ్డారు. భూముల పైసలు ఎక్కడికీ పోవని సమఝయింది వాళ్ళకు. ఊరటపడ్డారు.

సూర్యోదయంతోనే తడికలు, వెదురు బొంగులతో నిండిన లారీలు వచ్చాయి. కాసేపట్లో ఖాళీ జాగాలో వందల కొద్దీ గుడిసెలు లేచాయి. ఆ ఊరి జనమే కాదు. భూములు, ఇండ్లూ పోయిన చుట్టుపక్కల నాలుగు ఊర్ల జనం ఆ తడికల గుడిసెల్లోకి చేరారు.

“కష్టపడి కట్టుకున్న ఇల్లు కండ్లముందే కూలిపాయె” అని వెక్కివెక్కి ఏడ్చాడు నాగయ్య.

ఆయనకు ఆ తడికెల గుడిసెలో ఏం బాగాలేదు. ఒక్కటే అర్ర. అందులోనే వంట. అందులోనే అందరూ పడుకోవడం. గుడిసెనానుకొని గుడిసె. ఇక పక్కన ఖాళా జాగానే లేదు. గుడిసె ఎదురుగా తోవ విడిచిపెట్టి వరుసగా గుడిసెలు! ఎటు చూసినా గుడిసెలు ఎటూ మెసిలేందుకు జాగా లేదు.

నాగయ్యకు ఎవరో ఛాతీమీద పెద్ద బరువు పెట్టి కూర్చున్నట్లుగా అయింది. పులకరం మొదలయింది. రాత్రిళ్ళు ఒకటే కలవరింతలు.

“నన్ను చెలకకాడికి పోనియ్యండ్రి! అయ్యో! పొలం ఎండిపోతున్నది. పోయి నీళ్ళు పెట్టాలె” అని మంచంలోంచి ఎగిరెగిరి లేస్తున్నాడు. కాంతమ్మ, శీతయ్య రాత్రిళ్ళు అతని పక్కనే ఉంటున్నారు. పొద్దున డాక్టరు దగ్గరికి పోదామంటే నాకేమైందంటాడు. కదలడు. ఒంట్లో ఎంత బాగాలేకున్నా చెలక దగ్గరికి పోయే నాగయ్య పులకరానికే మంచంలోంచి లేవకుండా అయ్యాడు. ఒంట్లో సత్తువ లేకుండా అయింది.

శీతయ్య ఒకరోజు గుడిసెకే ఒక డాక్టర్ని తీసుకొచ్చి తండ్రికి చూపించాడు.

డాక్టరు పరీక్షించి, “మీ నాయనకు జబ్బేం లేదయ్య, కాస్త షాకుతో అట్లా అయ్యాడు. అంతే! అదే సర్దుకుంటుంది” అని కొన్ని మందులు రాసిచ్చి వెళ్ళిపోయాడు.

గుడిసెలు లేచిన కొన్ని రోజులకు ఒకరోజు అక్కడికి జిల్లా కలెక్టరు వచ్చాడు. మూడు జీపుల్లో అతని వెంట సర్కారు ఉద్యోగులు దిగారు. వాళ్ళు దబదబా గుడిసెలకు దగ్గర్లోనే ఒక వేదిక తయారుచేశారు. ఒక కుర్చీ, ఒక మేజా తెచ్చి వేశారు. ఆ కుర్చీలో కలెక్టరు కూర్చున్నాడు. అతని ముందు పెద్ద కాగితాల కట్టలు పెట్టారు. కలెక్టరు స్వయంగా ఒక్కొక్క కాగితం తీసి ఒక్కొక్క పేరు పిల్చి వాళ్ళ భూముల వివరాలు వినిపించాడు. ఆయన వినిపించిన

భూముల పట్టాలు గందరగోళంగా ఉన్నాయి. రైతులు దున్నుతున్న భూములు రైతుల పేర్ల లేవు. నాగయ్య కొత్తగా కొన్న పొలాన్ని కొడుకు పేర పట్టా చేయించాడు. కానీ ఆ పొలం అతని పేర లేదు.

కలెక్టరు చదివిన వివరాలు విని రైతులందరూ "గివన్ని అన్నాలంగ ఉన్నయి" అని మొత్తుకున్నారు. రైతుల్లో పెద్ద కలకలం లేచింది. రైతుల పేర కొన్నే భూములున్నట్లు తేలింది రికార్డు కాగితాల్లో.

"గిదంత అబద్ధం. మా తండ్రి, తాతల కాన్నుంచి దున్నుతున్న భూములు మాయి కావంటె ఎట్ల" అని అరిచారు.

"కాగితాల మీద రికార్డుల్లో లేకపోతే మేమేం చేయలేం! ఇప్పుడు నేను చదివి వినిపించిన భూములకే రైతులకు డబ్బు అందుతుంది" అన్నాడు కలెక్టరు. ఒక్కొక్క రైతుకు ఎంత డబ్బు వస్తుందో కలెక్టరు లిస్టు చదివాడు.

అడ్డికి పావుసేరు లెక్కన తమ భూములు అమ్ముడుపోవడం చూసి రైతులు నిశ్చేష్టులయ్యారు. నోట మాట రాలేదు.

"ఇది బజారు ధరకన్నా చాలా తక్కువ. గిట్ల అన్నాలం చేయొద్దు మమ్ముల్ని. అడ్డగోలు ధరలు కడ్తున్నరు మీరు" అన్నాడు కిష్టయ్య లేచి నిలబడి.

"ఇందులో ఏం అన్యాయం లేదు. బజారు ధర ఏమిటో అదే మీకు ఇస్తున్నాం" అని కలెక్టరు అక్కడి నుండి కదిలాడు. వెళ్ళి జీపులో కూర్చున్నాడు.

జీపు కదిలింది. కాసేపట్లో వచ్చిన ఉద్యోగులందరూ జీపుల్లో వెళ్ళిపోయారు. జీపుల వేగానికి లేచిన దుమ్ముల్లో రైతులు మిగిలిపోయారు.

మనుమనికి ఇరవై ఎకరాల భూమిని ఇచ్చి పోతాననుకున్న నాగయ్య ఆఖరికి ఆ మనాదితోనే చచ్చిపోయాడు. కాంతమ్మ పొద్దున్నే కట్టె సాయంతో పోయి మెయిన్ రోడ్డు మీదున్న మిఠాయి షాపు బయట కూర్చుంటుంది.

మిఠాయి షాపుకు వచ్చేపోయేవాళ్లు దయతలచి ఆమె ముందున్న రాతెండి పళ్ళెంలో చిల్లర వేసిపోతారు. ఆ చిల్లరంతా పోగుచేసుకొని చీకటైనంక కాంతమ్మ గుడిసెకు చేరు కుంటుంది. కోడలు పెట్టిన అన్నం తిని గుడిసెలో ఓ మూల ముడుచుకొని పండు కొంటుంది.

సరోజ నాలుగిళ్ళల్లో పనిమనిషిగా పనిచేస్తున్నది. పొద్దున్నే పోతే మధ్యాహ్నానికి గుడిసెకు వస్తుంది. మళ్ళా సాయంత్రమూ ఇళ్ళల్లో పనికిపోతుంది. ఇద్దరు పిల్లలు స్కూలుకు పోతున్నారంటే సరోజ కష్టమే అని చెప్పాలి.

శీతయ్య ఏ పనికీ వంగడు. ఎప్పుడైనా కూలికిపోయి సంపాదిస్తే ఆ సంపాదనతో ఆ రాత్రి తాగి వస్తాడు. సరోజను కొడ్తాడు. అడ్డం వస్తే పిల్లల్నీ బాదుతాడు.

సరోజా పిల్లల ఏడ్పులతో, కాంతమ్మ అరుపులతో గుడిసె దద్దరిల్లుతుంది. ఇరుగు పొరుగు ఎవరూ ఈ విషయంలో తలదూర్చరు.

గుడిసెల్లో జీవితం ఓ పద్ధతిలో సాగిపోతున్నది. గుడిసెల్లో, గుడిసెల చుట్టూ మురికి పేరుకుపోతున్నది.

"సర్కారోల్లు ఎప్పుడో అప్పుడు మా గోడు ఇంటరు. మా పైసలు మాకిస్తరు. పక్కా ఇండ్లు కట్టిచ్చి ఇస్తరు" అన్న ఆశమాత్రం ఆ గుడిసె వాసుల్లో చావకుండా ఉంది.

అట్లా చావకుండా కిష్టయ్య ఏవో వార్తలు మోసుకొస్తుంటాడు కూడా.

అప్పుడప్పుడు మునిసిపల్, అసెంబ్లీ, పార్లమెంట్ ఎలక్షన్లు, బై ఎలక్షన్లు వచ్చినప్పుడల్లా వాళ్ళ ఆశలు మళ్లా చిగురుస్తుంటాయి. కిష్టయ్య ఏ పార్టీకి వేయమంటే ఆ పార్టీకే వోటు వేస్తారు, గెలిపిస్తారు.

ఆ గుడిసెల మధ్య కిష్టయ్య గుడిసె చిన్న డాబాగా మారింది.

కానీ, మిగతావాళ్లకు పక్కా ఇళ్ళు మాత్రం రాలేదు. రోజులు గడుస్తున్నాయి. కానీ, పరిస్థితులు మాత్రం మారడం లేదు.

గుడిసెలకు పక్కన కొంచెం దూరంగా అందమైన ఇంటర్నేషనల్ ఏరోడ్రోమ్ వచ్చింది. జగజగమనే విద్యుత్‌కాంతులు, జెట్ విమానాల మోతలు ఆ గుడిసెల వాళ్లకు మరో ప్రపంచం ఎంతో దూరం లేదనే ఆశలు కలిగిస్తుంటాయి.

విమానాల్లోంచి దిగి బయటకు రాగానే దేశ విదేశీయుల కండ్లు మొట్టమొదట ఎదురుగా ఉన్న వందలాది గుడిసెల మీదనే పడతాయి.

"హో! ఇండియా! డర్టీ!" అంటారు విదేశాల నుంచి దిగిన దేశీయులు.

"పూర్ ఇండియా! వై సోమచ్ పావర్టీ" అంటూ ఆశ్చర్యపోతారు విదేశీయులు.

✡

# వెతల నడుమ చదువు

**–గరిశకుర్తి శ్యామల**

ఒరేయ్! నారాయణా! నారిగా! ఏందిరా పిలిత్తే పలకవు. నేను పొలం కాడికిపోతున్న.. లేరా.. కొడకా! లే...

రంగమ్మ పిలుస్తూనే ఉంది. నారాయణ ముసుగుదన్ని పడుకున్నాడుగానీ, తల్లి మాటలకు ఉలుకూ, పలుకూ లేదు.

రంగమ్మ కంచంలో అన్నం పెట్టుకొని నాలుగుముద్దలు నోట్లో కుక్కుకొని, చద్దిమూట చంకలపెట్టి, గంప, కొడవలి పట్టుకొని బయటకు వచ్చింది. ఏమనుకుందో ఏమోగానీ, వెనుదిరిగి అంగలో వాకిట్లోకి వచ్చి లోపలికి తొంగి చూసింది, కొడుకులో కదలికలేదు.

"ఒరేయ్! నారీ! నేను పొలానికి పోతున్న, లేచి బుక్కెడు దినుకొడుకా! నిన్నంతా కూడు ముట్టకపోతివి. బతిలాడి, బతిలాడి రాత్రి ఒక్క ముద్ద నీతో తినిపించేటప్పటికి నాకు సుక్కలు గనవడ్డయి... నా మాట విని బుక్కెడంత, సల్లవడుకొడుకా! నీ 'బాంచనైతరా'! నన్ను 'గోసపుచ్చుకోకు' కొడుకా!..." మనసాగని రంగమ్మ మంచందాకా వచ్చి బతిమి లాడింది. నారాయణ మొండి వైఖరితో విసుగువచ్చిన రంగమ్మ, "నేపోతున్న... మరి నీ ఇష్టం.." అంటూ రంగమ్మ పొలానికి పోయింది.

రంగమ్మ పొలం గట్టుమీద నడుస్తుంది. ఇంకా పదడుగులు పోతే తాను కలుపేసే పొలం వస్తది.

"ఏందో! ఈ జన్మంతా కష్టం తప్పేటట్టు లేదు" నిట్టూరుస్తూ ముందుకు అడుగులు వేసింది రంగమ్మ... ఈ రోజు రంగమ్మ మనసేం బాగాలేదు. చిన్ననాటి నుండి కష్టపడుతానే వుంది. ఆలోచిస్తూనే పనిలోకి దిగింది రంగమ్మ.

మధ్యాహ్నం రెండు గంటలు కావస్తుంది. పొలంలోంచి గట్టుమీదికి వచ్చిన రంగమ్మ! బోరింగు దగ్గర కాళ్లు, చేతులు కడుక్కొని, చెట్టు నీడకు చేరి చద్దిమూట విప్పింది.

పొద్దుగాల ఏం కూరజేయలే. రాత్రి వండిందే నారాయణకు తీసి మూతపెట్టి, మిగిలింది భర్త రామస్వామికి పెట్టింది. రామస్వామి మంచంలో కూచోని, పెళ్లాం పెట్టింది తిని, మళ్లీ

ముడుచుకొని పడుకున్నాడు. పొరుగూరికి పోయి తెలిసిన నాలుగిళ్ళల్లో పాలు పోసి ఊరు చేరుతది రంగమ్మ.

పొద్దున ఎప్పుడో నాలుగ్గంటలకు లేచి పాచిపని చేసుకొని, స్నానం చేసి, ఇంత అన్నం ఉడకేసి పాలు పోయడానికి పోతుంది తను... పొరుగూర్లో పాలుపోసి వచ్చేవరకే పొద్దెక్కుతది. మళ్లీ పొలంకాడికి ఉరకాల్నాయె. ఏదోగింత తొక్కో కారమో పెట్టుకుని నాలుగు ముద్దలు కుక్కకొని పొలంకాడికి రావాల్నా! ఆలోచిస్తూ 'తొక్కు' కలిపిన ముద్ద నోట్లో పెట్టుకుంది రంగమ్మ.. గొంతులో 'భగ్గు'మన్నది. ఒకటే మంట, గొంతులో, కడుపులో... ఈ మద్దె గదేంటో కడుపులో మంట, నొప్పి... రంగమ్మ కళ్ల నుండి నీళ్ల చుక్కలు చెంపలమీదికి జారినాయి. అమ్మా! "కారందినకు, పులుపు తినకు, పల్లెల్లో పాడికి, నెయ్యికీ కరువుండదు కదా! ఇంత పెరుగో, పాలో పోసుకొని తినమ్మా! కడుపులో 'పుండు' వున్నది. తెలిసిన డాక్టరు కనుక ఏదో సలహా చెప్పిండు. కానీ, ఆయనకేం తెలుసు తనింటి పరిస్థితి కూర మిగిలిన రోజు మిగిలినట్టు, లేకపోతే పచ్చడి మెతుకులే... రంగమ్మ గబగబా తినేసి, చల్లటి నీళ్లతో కడుపుమంట పోగొట్టాలని ఆశపడుతూ పొలంలోకి దిగింది.

✡

రంగమ్మకు చిన్నగా వున్నప్పుడే పక్కూరి రామస్వామితో తండ్రిలేని రంగమ్మకు, తండ్రి వంతు బాధ్యత తనమీద వేసుకున్న తల్లి పుల్లమ్మ మనువు కుదిర్చింది. తలవంచి తాళి కట్టించుకున్న రంగమ్మ పన్నెండేళ్లకు అత్తింట్లో అడుగుపెట్టింది. అప్పటినుండి అత్తతోగాని, ఆడబిడ్డతోని పడరాని పాట్లు పడింది. ఆడబిడ్డ పెళ్లయి అత్తవారింటికి పోయినాక, రంగమ్మ కష్టాలు కొంత తీరినవనే చెప్పాలి. భర్త రామస్వామి చాలామంచి వాడు. మౌనంగా పనిచేసుకుంటూ పోయే రామస్వామిని జూచి అందరూ లౌక్యం తెలియ దు, మంచివాడు, అమాయకుడు అంటారు. మంచి, చెడూ ఏదీ పట్టించుకోడు. పనులకింత కుడిదిపెట్టి పాలుపిండడం, వాటిని మేపుకొని రావడం, ఇంతవరకే రామస్వామి పని.

ఈ మధ్యే వయసుమీద పడిన రామస్వామికి అనారోగ్యం తోడై ఏ పనీ చేతగాక ఇంటి దగ్గరే వుంటున్నాడు. రామస్వామి, అతని తల్లి మగపిల్లవాడు కావాలని పట్టుపట్టడం, ఏమూలో రంగమ్మకు గల ఆశతో ఎదురుచూడటం వల్ల వరుసగా నలుగురూ ఆడపిల్లలకు తల్లియైంది రంగమ్మ. ఆఖరున ఏ దేవుడు కన్ను తెరిచాడో మగ పిల్లవాడు కలిగాడు. పిల్లవాడు పుట్టిన వేళా విశేషమేమోగాని, అత్తకూడా 'ఆరళ్లు' మానేసింది.

✡

రంగమ్మ పొలం పని ముగించుకొని ఇంటిదారి పట్టింది. "రంగమ్మా! ఓ రంగమ్మా! ఏందమ్మో పిలిత్తే పలుకవు" వెనుక నుండి సూరమ్మ పిలుపుతో వెనుకకు తిరిగి "ఏంది సూరమ్మా!" అంటూ ఆగింది. సూరమ్మ, రంగమ్మ వీధి మలుపు దాకా కష్టం, సుఖం

మాట్లాడుకుంటూ వస్తున్నారు. ఇంతలో తెలిసిన వాళ్లు కనబడితే సూరమ్మ ఆగిపోయింది. రంగమ్మ ముందుకడుగులు వేసింది.

రంగమ్మా! "నీ కొడుకు గదేదో సదివిండట గదా! పదమూడో, పద్నాలుగో నాకు తెల్వదుగానీ, ఇంకేం? నీ కొడుక్కు సర్కారు నౌకరు దొరుకుతది...." ఔ, గానీ కొడుకు పెళ్లిజేత్తవా ఏంది? పిల్లను జూసినవా? నీకేందమ్మా! బిడ్డల పెండ్లిండ్లు జేసినావు. కొడుకు పెండ్లి జేత్తివా. ఇగ కొడుకూ, కోడలూ, నెత్తిమీద బెట్టుకొని సూసుకుంటరు. మేం గనబడతమా ఇగ... 'రెండు రోజుల క్రింద రాములమ్మ వీధిలో నిలబెట్టి అడుగుతుంటే ఏం జెప్పాల్లో తెల్వక..." గదేంది రాములమ్మ! గట్లంటవు? కొడుకు నౌకరిజేత్తే నాకేం బెడతదు? పట్నంలో నీ కొడుకు గంత పెద్ద నౌకరీ జేత్తండు నీకేం బెడతాండు. పొలగాండ్లను కన్నందుకు సాదుకోవాలే... గంతే... రాములమ్మతో పైకి అన్న రంగమ్మ లోలోపల కొడుకు బాగా చదువుతున్నడని, మాట వింటాడని మురిసిపోయింది.

రంగమ్మ అత్తగారింటికి వచ్చేసరికి భూమి, జాగలు, పొలాలు బాగానే వున్నాయి. అంతేగాక లేకలేక కలిగిన కొడుకు నారాయణ కాలుమీద కాలేసుకుని సుఖపడతాడని పాలోళ్లు అమ్మిన పొలాన్ని కూడా తానే కొన్నది. రామస్వామి వయస్సులో ఉన్నప్పుడు మొగుడు పెళ్లాలు మనుషుల్ని పెట్టుకొని పొలం పనులు చేయించుకున్నారు. రాను రాను నీళ్లకరువు వచ్చిపడింది. వానలు లేవు. నీళ్లు అందకపొలంలో వేసిన విత్తనాలు అటే పోయినాయి. ఇరుగుపొరుగు సలహా విని బావి తవ్వించింది. అప్పటి నుండే రంగమ్మ కష్టాలు మొదలైనవని చెప్పాలి. నాలుగైదు ఎకరాల పొలం... బావి త్రవ్వినా నీళ్ళు పడలేదు. పొలంలో రెండుచోట్ల బోర్లు వేయించింది. దీనివలన అప్పులపాలైంది గానీ, నీళ్లు మాత్రం పడలేదు. నీళ్ల వసతిలేక పొలం 'బీడు'పడింది. 'మేత'కు లేక కొన్ని బర్లను అమ్మింది. యాడాది (ముందుగానే) జీతం అడిగి తీసుకున్న పాలేరు మోసం చేసి పారి పోయినాడు. పొలం పనిలేదని నాలుగు ఎద్దుల్ని అమ్మింది. ఇదంతా ఒక ఎత్తు. ఆడపిల్లల పెళ్లిళ్లు, ఇతర ఖర్చులు ఒక ఎత్తు. కొడుకు ఎదిగి వచ్చిండు, తన కష్టాలు తీరుతయి అనుకున్నది రంగమ్మ.

"నారాయణా! ఈ రోజు పొలంలోకి రాకొడుకా! కలుపులున్నయి" రంగమ్మ మాట పూర్తికాక మునుపే నారాయణ అందుకున్నాడు.

"అమ్మా! నన్ను పొలానికి రమ్మనకు, నాకు పొలం పనులు చేతగావు. నాకు ఇష్టం కాదు కూడా. నేను కాలేజీలో చేరి చదువుతా..."

కొడుకు పదో తరగతి ఫస్ట్‌లో పాసైనాడని పదిమందికి చెప్పుకొని మురిసిన రంగమ్మ సంతోషం మీద నారాయణ మాటలు పొంగేపాలమీద నీళ్లు చల్లినట్లైంది.

"గదేంది నారిగా! గట్లంటవు. మీ అయ్యకు రోజు రోజుకూ చాతనైతలేదు గదా! నీకంటే ముందు పుట్టిన నీ అక్కలు పెండ్లిండ్లు చేసుకొని అత్తగారిండ్లకు పోయిరి. ఉన్న ఒక్క కొడుకువూ, నీవు ఆసరగాకపోతే, ఎట్లా కొడుకా!"

తల్లిమాటలకు తల అడ్డంగా త్రిప్పుతూ "నేను పొలంకు రానమ్మా! ఇంటరు చేస్తా. డిగ్రీ చదువుతా. ఉద్యోగం చేస్తా." నీకు నాన్నకు చాతనైతే చేసుకోండి. లేకపోతే పొలాన్ని అమ్ముకోండి. ఇంకోసారి నన్ను మాత్రం పొలం పనులకు రమ్మని పిలువకు."

ఖచ్చితంగా తన అభిప్రాయం చెప్పాడు నారాయణ. ఇది జరిగి కూడా ఐదేళ్ళు గడిచిపోయింది. ఇక కొడుకు గూర్చి ఎలాంటి ఆశ పనికి రాదనుకున్నది రంగమ్మ. అలాగని కొడుకు చెప్పినంత సులభంగా పొలాన్ని అమ్మలేకపోయింది. నీళ్ల వసతి కలుగక పోతుందా! అని ఆశతో ఎన్ని ప్రయత్నాలు చేసినా అప్పుచేసి తెచ్చిన డబ్బు బావికి, బోర్లకు ఖర్చయింది. దీనికితోడు నలుగురు ఆడపిల్లల పెళ్లిళ్లూ, పురుళ్లూ, వెంట్రుకలూ అంటూ వచ్చిపోతుంటే అప్పుకు అప్పు తోడైంది. పోనీ కొంతపొలం అమ్ముదామంటే బీళ్లు ఎవరుకొంటారు? ఎవరికైనా నీళ్ల వసతే కదా కావల్సింది.

ఒకనాడు యాడాది తిండి గింజలు ఇంటికి వచ్చేవి. కూలీలను పెట్టుకొని పనులు చేయించుకున్న రంగమ్మ అప్పులు, వడ్డీలు, కట్టలేక సతమతమవుతుంది. పైగా తిండి గింజలతో సహా ఉప్పుతో తొమ్మిది కొనాల్సి వస్తుంది. మంది పొలంలోకి కూలీకి పోవాల్సిన గతి పట్టించినావు. ఏం దేవుడవో? అని దేవుణ్ణి తిట్టబోయి తిట్టాలో వద్దో తెలియక రోజులు ఈడుస్తుంది రంగమ్మ. ఒకే ఒక్క ఆశ. కొడుకు, చదువు అయిపోను వచ్చింది. 'ఏదో నౌకరి' చేసి వేణ్ణీళ్ళకు చన్నీళ్ళలా తోడవుతాడని ఆశపడ్డది రంగమ్మ.

✡

"అమ్మా! నేను డిగ్రీలో ఫస్ట్‌క్లాస్‌లో పాసయినాను". కొడుకు ముఖం సంతోషంతో వెలిగిపోతుంటే, తన కష్టాల్ని తాత్కాలికంగా మరచిన రంగమ్మ ఆ రోజు కొడుకు ఇష్టం వచ్చిన వంటకాల్ని చేసిపెట్టి కడుపునిండా కొసరి, కొసరి తినిపించింది. ఇంకేం తన భారం కొంత తీరిపోతుందని లోలోపల పొంగిపోయింది.

"అమ్మా! నేను బియిడి రాశాను. నాకు 'రాంకు' వచ్చింది. మనకు దగ్గరలో వున్న కాలేజీలో నాకు సీటు ఇస్తామన్నారు. కానీ... లక్షా యాభైవేలు కట్టాలమ్మా..." ఐదో, పదో అన్నంత తేలికగా అన్నాడు, ఈతరం యువకులను ప్రతినిధియైన నారాయణ. రంగమ్మకు పిడుగులాంటిదైనది.

నారాయణ మాట వింటూనే రంగమ్మ గుండెలో రాయి పడ్డట్లయింది... "ఏందిరా కొడుకా! అయ్యజూత్తే గట్లున్నడు. అక్కల పెండ్లిండ్లు జేత్తిమా! పొలం బీడుపడె. అప్పుల పాలైతిమి. నీకు తెల్వంది ఏముంది కొడుకా! గిప్పుడేమో 'బిడి', 'బిడి' అంటూ గదేదో చేత్తాననవడితివి. నేను యాడకుపోవాలే!"

"గంత అప్పు నాకేడపుడతది కొడుకా!" పొంగివస్తున్న ఏడుపును ఆపుకుంటూ అన్నది రంగమ్మ.

"ఏమో నాకు అదేమీ తెలియదు. నేను మాత్రం 'బియిడి' చేసి తీరుతాను. పొలం నాకోసమే గదా! పొలం అమ్మేయి నేను ఉద్యోగం చేసి నిన్ను, నాన్నను పోషించుతాను."

కొడుకు మాటలకు రంగమ్మ "ఏందిరా కొడుకా! ఒక్కటిగాదు, రెండుగాదు లక్ష రూపాయలకు యాడికి బోవాల? నా మాట విను. వచ్చేయేటికి బిడి చేద్దువుగానీ, ఏదన్నా నౌకరు చేసుకోబిడ్డా..!"

అమ్మా! నారాయణ కోపంతో చిందులు తొక్కుతూ "నీవల్ల కాకపోతే చెప్పమ్మా! నేనే ఎవరి కాళ్లైనా పట్టుకొని 'బియిడి' చేస్తాను"

నిష్ఠూరంగా మాట్లాడిన కొడుకు మాటలకు నొచ్చుకున్న రంగమ్మ "గదేందిరా! కొడుకా! గట్లంటవు. నీవు చదువుతే నాకు మాత్రం సంబరం కాదా! కానీ... సరే తెలిసిన వాళ్లని అడిగి చూస్తా..." రంగమ్మ అప్పటికి అలా కొడుకు తృప్తికి అన్నదిగానీ అసలే అప్పుల్లో వున్న తనకు నమ్మి అంత డబ్బు ఎవరిస్తారు? ఎవరిని అడిగితే బాగుంటుందా అని తెలిసిన వాళ్లందరినీ గుర్తుకు తెచ్చుకున్నది రంగమ్మ.

నాలుగు రోజులుగా మౌనంగా తన పనులు తాను చేసుకొని పోతున్న తల్లి ఏమైనా డబ్బు ప్రస్తావన తెస్తుందేమోనని ఆశగా చూస్తున్న నారాయణ తల్లిని నిలదీసినాడు. డబ్బు పుట్టించడం తనవల్ల కాదని చెప్పిన తల్లి మాటల ప్రభావమే ఈనాటి నారాయణ ముసుగుపెట్టి పడుకోవడం, అన్నం మీద స్ట్రయికూ... పొలం నుండి వచ్చిన రంగమ్మ ఇంట్లో నారాయణ కనబడతాడేమోనని చూసింది. ఇంట్లో లేడు. రాత్రి పసులకు కుడితిపెట్టి, రామస్వామి పాలుపిండితే వాటిని ఉట్టిమీద జాగ్రత్త చేసి కొడుకు రాకకోసం చూస్తూ కూచుంది. దిగులుగా ఇంట్లోకి అడుగుపెట్టిన కొడుకును చూసి రంగమ్మ మనసు బాధతో నిండిపోయింది. ఒక్కగానొక్కబిడ్డ అక్కల పెళ్ళిళ్లు, పురుళ్లు పుణ్యాలని అంతా తుడిచి పెట్టినట్టయింది. పైగా పొలం గూర్చి చేసిన అప్పులు.. వడ్డీలు.. ఛీ.. ఛీ.. ఏం బ్రతుకు. 'చదువుకోరా కొడుకా అంటే, ఎన్ని వసతులు వుండి కూడా కొందరికి చదువే అబ్బదు. తన కొడుకు ఎంతమంచిగా చదువుకున్నాడు. ఒక్క పరీక్షలో కూడా తప్పలేదు. తన కొడుక్కేంది? దొరబాబులా వున్నాడు. కొడుకు వంక ప్రేమగా చూసింది.

'వాడేం కాని కోరిక కోరాడని'! 'చదువుకుంటానన్నాడు, 'నిన్ను, అయ్యను సుఖపెడతా నన్నాడు. ఎట్లన్నజేసి వాని కోరిక దీర్చాలే... బిడి చేత్తాడంట చేయని. ..కొడుకు కావాలని ఎన్నికలలు కన్నది తను. లోలోపలే ఆలోచిస్తున్న రంగమ్మ.

"నారాయణా! అక్కా వాళ్ల ఊరికి రేపు పోతా అక్కడ ఎవర్నిన్న అడుగుతా.. ఎట్లన్న జేసి నీకు పైసలు తెచ్చి కడతా కొడుకా! బువ్వ తిందుగానీ.. దా.. 'బిడి' చేద్దువుగానీ, నీ ఇష్టం కొద్దీ చదువుదుగానీ రా..." కొడుకును బతిమాలి ఆ రాత్రి భోజనం పెట్టింది. వారం రోజులు కాలికి బలపంగట్టుకొని తిరిగి, తిరిగి ఒక లక్ష రూపాయల అప్పు తేగలిగిన రంగమ్మ కొడుకుతోని కాలేజీకి వెళ్లి డబ్బు కట్టి, తృప్తిగా ఊపిరి పీల్చుకుంది.

కొడుకు కళ్లలోని వెలుగును చూసి తన కష్టాలను మరిచింది, వాడి భవిష్యత్తును ఊహించుకుంటూ...

✡

# మా నాయిన ట్రిక్కు నేర్వని కత

-ఖదీర్‌బాబు

మా యింటి ముందర యిస్కూటరాగి 'పీప్‌పీప్' మంటా రెండుసార్లు హారను మోగించ్చిందంటే నల్లెంకారెడ్డి వచ్చినట్టే లెక్క.

నల్లెంకారెడ్డి (నల్ల+వెంకారెడ్డి) ఎప్పుడొచ్చినా యిస్కూటరాపి స్టాండేసి యింట్లోకి రాడు. బయిట్నే హారను కొట్టి పిలస్తాడు మా నాయిన్ని.

'మోటారులో నీళ్లు రావడంలా కరీం భాయ్! రొంతొచ్చి చూడవా? అర్జెంట్' అన్నాడు, హారను శబ్దానికి మా నాయిన బయటికి రాంగానే.

ఎవురైనా పని చెప్పిన ఎమ్మట్నే స్క్రూడైవరూ కటింగ్ ప్లేరూ ఎత్తుకొని పరిగెత్తేరకం కాదుగదా మా నాయిన. అందుకని 'ఎందుకనా?' అని అడిగినాడు నిమ్మళంగా.

'అదే తెలియడంలా కరీంభాయ్. సుచ్చేస్తే గిర్ర్‌మని సౌండ్ వస్తా వుందిగానీ లోపల మోటారు తిరగతావుందో లేదో అర్థం గావడంలా, ఎమ్మట్నే వెళ్లి చూడవా. ఒకేళ వైండింగు కాలి పొయ్యుంటే మార్చే పని మొదులుబెట్టేద్దూగాని. ఎంతయితే అంతిచ్చేస్తా' అన్నాడు నల్లెంకారెడ్డి.

మా నాయిన ఒక్క మినిట్టు ఆలోచించి 'అట్టాగేలే. చూస్తా' అన్నాడు.

'పాలుమారకుండా ఎమ్మట్నే వెళ్లు. ఏ సంగతీ హాలుకాడికొచ్చి చెప్పు. అవతల ఇంటర్ బెల్లుకి టైమవతా వుంది' అంటా ఇస్కూటర్ స్టార్ట్ చేసి వెళ్లిపోయినాడు నల్లెంకారెడ్డి.

నల్లెంకారెడ్డి మా నాయినకు చాలా కాలంగా తెలుసు. ఆయనింటి పేరు ఏందోగాని మనిషి నల్లగా వుండేసరికి మాకాయన 'నల్లెంకారెడ్డి' అయినాడు. ఆయన కూడా ఒకప్పుడు బాగా బీదరికం అనుభవించినాడంటగానీ వెంకటేశ్వరా హాలులో క్యాంటీను లీజుకు తీసుకున్నాక దేవుడి దయవల్ల కలిసొచ్చింది. మా యింటికి దగ్గిరగానే పెద్ద ఇల్లు కట్టినాడు. రొంత ఎనకేసినాడు. ఆ యింటికి మా నాయిన వైరింగు చేసినంత కాలం రోజూ మా యింటి ముందర ఇస్కూటరాపతా వుండేవాడు నల్లెంకారెడ్డి.

డబ్బుకు పర్వాలేని నల్లెంకారెడ్డి లాంటి మనిషికాడ వైరింగుపనికి, మోటారు పనికి ఎంతంటే అంత తీసుకుకోవచ్చుగా మా నాయిన? అట్ట చేయడు. ఎట్ట చేస్తాడో చూడండి.

కాసేపు తాలినాక ‘ రే... రొంత తోడు రారా’ అంటా నా చేతిలో సామాన్ల బుట్ట పెట్టి, నల్లెంకారెడ్డి యింటికి బయల్దేరినాడు మా నాయిన.

బావి గట్టునే బిగించి ఉంది నీళ్ల మోటారు. దాని దగ్గిరికెల్లి, పసిబిడ్డ పొట్టనొక్కి చూసే డాక్టరు లాగా కొసేపు అటూ ఇటూ తట్టి, సుచ్చేసినాడు మా నాయిన. ‘గుయ్’మంటా సౌండు అదిరిపోయింది గానీ నీళ్లు రాలా. తేడాగా వున్న ఆ సౌండు వినంగానే ప్రాబ్లమేందో అర్థమైపోయింది మా నాయినకి.

అంతే, రెండే రెండు నిమిషాల్లో మోటార్నిప్పి రెండే రెండు నిమిషాల్లో రిపేరు పని పూర్తి చేసినాడు. మోటారు బిగించి మళ్లీ సుచ్చేయగానే జలజలమంటా నీళ్చొచ్చి తొట్టిలో పడినాయి.

‘యింక పా’ అన్నాడు మా నాయిన, ఆ నీళ్లలోనే చేతులు కడుక్కుంటా.

నాకు బలే బాదయిపోయింది. నిజ్జానికి ఆ మోటారుని విప్పి, మా అంగడికి తీసికెల్లి, అంతా బాగానే వున్నా వైండింగు కాలిపోయిందని అబద్దం చెప్పవచ్చు మా నాయిన. వైండింగ్ వైరు కొనాలని చెప్పి ఎగస్ట్రాగా మూడు వందలు అడిగి తీసుకోనుండొచ్చు. కొత్తగా వైండింగు చేసినట్టుగా యాక్షను చేసి మళ్లా అదే మోటారును అట్నే బిగించి యింకో వంద రూపాయలు చార్జీ చేసుండొచ్చు. మామూలోళ్లకి తెలియని పని కదా. ఎట్ట చెప్తే అట్ట విని ఎంత చెప్తే అంత యిస్తారు. నల్లెంకారెడ్డియితే ఎన్ని వందలడిగినా కళ్లు మూసుకొని యిచ్చేస్తాడు.

కానీ మా నాయిన అట్టా చేయకుండా అదే దోవన ఎంకటేశ్వర హోలుకాడికి తీసుకెళ్లాడు నన్ను.

‘ఏం కరీం భాయ్? నీళ్చొచ్చినాయా?’ అన్నాడు నల్లెంకారెడ్డి, మమ్మల్ని చూస్తానే.

‘రాక యాడకి పోతాయా’ అన్నాడు మా నాయిన నవ్వతా.

‘పోనీలే. బాద తప్పింది. ఎంతిమ్మంటావా?’ అన్నాడు క్యాంటీను గల్లా పెట్టెలో నుంచి పదులు, ఇరవైలు తీస్తా.

‘ఆ సంబడం పనికి డబ్బులెందుకు గానీ నుంచి స్ట్రాంగుగా టీ ఒకటేసి. వీడికి కావాలంటే రెండు పులిబంగరాలు పెట్టీ’ అన్నాడు మా నాయిన.

మా నాయినకు టీ. నాకు పులి బంగరాలు. అదీ మా నాయిన సంపాదన.

యిప్పుట్నించే కాదు. ముందు నుంచీ కూడా మా నాయిన వాటమే అంత. చేసిన పనికి ఒక్క నయాపైసా ఎక్కువ తీసుకోడు. ఎక్కవ తీసుకోబళ్లేదుగానీ కరెక్టుగా అయినా తీసుకోవాలి కదా. అదీలా.

మా కావలికి చుట్టుపక్కల జలదంకి, సిరిపురం, అల్లూరు, మద్దూరు పాడులాంటి పల్లెటూర్లుండాయి. ఆ వూర్ల రైతులు పొద్దున్నే మా యింటికొచ్చి, టీలు తాగే అలవాటు లాకున్నా మా నిద్ర లేచేదాకా సుందరయ్య బొంకుకూడ టీలు తాగతా కూచుంటారు. మా నాయిన లేచినాక దగ్గరుండి పొలాల్లో నీళ్ల మోటార్ల రిపేర్లకి పిలచక పోతారు. పాపం వాళ్లు బలే అమాయకులు గదా. కరెంటు పనిలో ఏమి మోసం చేసినా వాళ్లకు అర్థంకాదు.

అయినాగానీ 'చ! కష్టం చేసుకునే వాళ్ల సొమ్ము మనకు బళ్లా' అంటా నయాపైసా ఎక్కవ తీసుకునేవాడు కాదు మా నాయన. అదట్ట పోనిచ్చి ఒక్క సారి రిపేరు చేసొచ్చినాక మళ్లీ రిపేర్లకని రైతులు వస్తే, మా నాయిన యింటి నుంచి కదలకుండా 'యిదిట్ట చెయ్యి, అదట్ట చెయ్యి' అని కాయితం మీద బొమ్మ గీసిచ్చి మందల చెప్పి పంపించేవాడు. మా నాయిన చెప్పినట్టు చేయంగానే వాళ్లకు నీళ్లొచ్చేవి. అందుకని రైతులకు మా నాయినంటేనే బలే గురి. సచ్చిగీపెట్టినా యింకో కరెంటు పనోడికాడికి పొయ్యేవాళ్లు కాదు.

యిదంతా చూసి మా అమ్మకు కడుపు కాలిపోతా వుండేది. 'యీ మనిషి యిట్లా తిక్కలుగా వుండబట్టేకదా మనం ఒక్క మిద్దే కట్టగలిగాము. సరిగ్గా సంపాయిచ్చుంటే మూడు మిద్దెలు కట్టుండే వాళ్లం కదా' అనేది.

ఆ మాటకి సిగరెట్టు పొగతో పాటు ముసిముసిగా నవ్వతా ఉండేవాడు మా నాయిన.

కరెంటు పనోళ్లకు యిండ్ల వైరింగులోనే బలే డబ్బులొస్తాయి. వైరింగుకు కావలసిన సామాన్లని కొనిపించేటప్పుడే అవసరానికి మించి ఎక్కవ సామాన్లు కొనిపిస్తారు కొంతమంది కరెంటు పనోళ్లు. వాడేటివి వాడి తక్కినవన్నీ రహస్యంగా అమ్మక నూకేస్తారు. (అంటే నాలుగు వైరు కాయిల్సు కావాల్సి వుంటే ఆరు కొనిపిస్తారు మన చేత. వాడేది నాలుగు. అమ్ముకునేవి రెండు). మా నాయిన మాత్రం యింటి ప్లాను చూసి, ఈ యింటికి యిన్ని సామాన్లు అవసరమవతాయి అని లిస్టు చెబితే ఆ లిస్టే ఫైనలు. ఒక్క సామాను ఎక్కవయ్యేది కాదు. ఒక్క సామాను తక్కవయ్యేది కాదు.

మా నాయిన రాసిన లిస్టును చూసి అశోకా ఎలక్ట్రికల్స్ సుబ్రమణ్యం (కరెంటు సామాన్ల అంగడాయన) తల పట్టుకునే వాడు. 'నాలుగు సామాన్లన్నా ఎక్కువ రాయ్ కరీంభాయ్. కమీషనన్నా వస్తది కదా' అనేవాడు. మా నాయిన నవ్వేవాడే కాని రాసేవాడు కాదు.

అట్టాంటిది– మా అన్న చదువు మానేసి మా నాయినకాడ పనిలో చేరినాక ఎవరు చెడగొట్టినారో ఏమోగానీ ఒక రోజు మేము వైరింగు చేస్తా వున్న యింట్లో నుంచి ఒక వైరు కాయిల్ ఎత్తకొచ్చేసినాడు రహస్యంగా.

మా నాయిన గమనించలా. యింటికొచ్చినాక చూసి ఒణికి పోయినాడు. అదే వైరుని విప్పి మా అన్నను తన్నినాడు చూడూ – ఒళ్లు వాతలు తేలిపోయింది.

'నువు యిప్పుడే యిట్టా చేస్తే రేపు నీకు పనెవరు యిస్త్రార్రా హరాము నా కొడకా. నమ్మకం పోయినాక పనోడు బతికినా ఒకటే సచ్చినా ఒకటేరా' అని, మనిషి ఎర్రంగయిపోయి కళ్లల్లో నీళ్లు తెచ్చేసుకున్నాడు. అంతే. ఆ మాటలు అట్నే కూచుండిపోయినాయి మా అన్న మనసులో. మళ్లీ వాడు ఎక్కడా పూచిక పుల్ల తాకలా.

మా ఇస్కూలు వదిలినాక ఒక్కోరోజెళ్లి మా అంగడి కాడ కూచునే వాణ్ణి నేను. మా అన్నలాగా పనికి తిరుక్కోకుండా శుద్దంగా చదువుకుంటా వుండానని బలే మర్యాదగా చూసేవాళ్లు నన్ను మా అంగడికాడ. ఒక రోజు యిట్టాగే కూచోనుంటే బర్త చనిపోయిన ముసలి శెట్టెమ్మొకామె వచ్చింది మా అంగడి కాడికి. మా అంగట్లోకి అట్టా యిట్టా చూస్తా 'నాయినా! ఒక్క సీరియల్ సెట్టుకి బాడుగ ఎంత?' అని అడిగింది మా నాయిన్ని.

'రోజుకి రెండు రూపాయలు' అన్నాడు మా నాయిన.

'టీబులైటుకీ'

'నాలుగు'

అప్పుడా శెట్టెమ్మ ఒకటికి నాలుగుసార్లు వేళ్లు మడిచి లెక్క లేసుకొని 'నాయినా! రేపు మా యింట్లో రెండు సీరియల్ సెట్లు, రెండు ట్యూబ్‌లైట్లు వెయ్యవా' అనింది.

ఆ లెక్కకి మా నాయిన నవ్వినాడు.

'అబ్బో! పెద్ద డెకరేషనే. ఏంది కతా శెట్టెమ్మా' అన్నాడు వేళాకోళంగా.

'నా కూతురి పెళ్లి నాయిన. తంటాలు పడి ఎట్నో చేస్తా వున్నా. నా కూతురు మనసు కష్టపెట్టుకుంటుందనిగానీ లాకుంటే యీ లైటింగు కూడా చేయించలేను నాయినా' అనిందామె, నిజం చెప్పేస్తా.

మా నాయిన కరిగిపోయినాడు.

'అంగడిలో పడుండే లైట్లు మీ యింటికేస్తే నాకు పోయేదేమీ లేదుగానీ యింకేమీ చెప్పబళ్లేదు పో. ఆరు సీరియల్ సెట్లు, ఆరు టీబులైట్లు వేస్తాను పో' అంటా మాటిచ్చినాడు. అన్నమాట ప్రకారమే పోయి వేసొచ్చినాడు.

యిట్టా చేస్తా వుంటాడు కాబట్టే మా నాయిన కాడ పని నేర్చుకున్న పిలకాయలు ఇస్కూటర్లెక్కి తిరగతా వుంటే, మా నాయిన మాత్రం అట్లాసు సైకిలెక్కి పోతా వుంటాడు పనికి. మద్దూరు పాడుకు కూడా సైకిలు తొక్కుకునే వెళ్లే మా నాయిన బాదను చూసి, మా అమ్మ తాళలాక 'ఎట్నోకట్ట చేసి లూనాయో బూనాయో కొనుక్కోరాదా' అనంటే 'యిప్పుడు అదొక్కటే తక్కువ మనకి' అనేవాడు మా నాయిన.

మా ఊళ్లో రేడియోలు రిపేరు చేసే సీనియర్ సాయిబొకాయన యానాదోళ్లు రిపేరుకి తెచ్చిచ్చే రేడియోల్లో సామాన్లు నూకేసి, యాభై రూపాయల రేడియోని నూటాభై రూపాయలకి అమ్మేసి వేలు సంపాదించేసినాడు తొందరగా. ఆయనకాడికి రేడియోపోతే పర్వేటాస్పత్రికి జబ్బు మనిషి పోయినట్టేనని అందరూ అనుకుంటా వున్నా రిపేర్లకి మాత్రం గిరాకీ తగ్గేదికాదు.

ఆ మనిషి మా నాయిన సంపాదించే తీరు చూసి ఒక రోజు బలే సలహా యిచ్చినాడు.

'కరీం భాయ్! మనం చేసేది ఎలక్ట్రికల్ పని. అసలికి 'ఎలక్ట్రిక్' అనే పేరులోనే 'ట్రిక్కు' ఉండాది. మనం ట్రిక్కు చేసే డబ్బులు సంపాదించాలి. సత్తెకాలానికి పోతే బతకలేము' అన్నాడు.

ఆ మాటలకి నవ్వి యింటికొచ్చి సంగతి చెప్పినాడు మా నాయిన. బాగుపడే సలహానే కదా యీ మనిషి నవ్వతా వున్నాడేంది అనుకున్నాం యింట్లో.

కొన్ని రోజులకి 'ట్రిక్కు'లు చేస్తా డబ్బులు సంపాదించిన సాయిబు చనిపోయినాడు. ఆ వార్త విని 'పోయినాడు దొంగ నా కొడుకు' అనుకున్నారు మా ఊర్లో.

అప్పుడర్థమైంది మాకు నా నాయిన 'ట్రిక్కు' ఎందుకు నేర్వలేదో, మా నాయిన దారినపోతా వుంటే అందరూ మరేదగా 'కరీంభాయ్' అంటా ఎందుకు సలాము చేస్తా వుంటారో.

✡

# ఎవరిది?

**–అమరేంద్ర**

అతని మాటలు విని దొరగారు మండిపడ్డాడు. ఇంతకాలం నుంచీ తమవల్ల జీవనం చేస్తున్న సింహాద్రి లేశమైనా విశ్వాసం లేకుండా ఇంత సాహసించి అంటాడని అనుకోలేదు. ముసలివాడు ఏమైనా మతి తప్పి మాట్లాడాడేమో అనుకుందామా అంటే ఇదంతా ధిక్కారంగా కనపడుతోంది. తలుచుకున్న కొద్దీ దొరగారి కోపం మితిమీరి పోతూంది. సింహంలాగా 'యెవరి కోసం వదుల్తావ్?' అని గర్జించి, అరుగు మీది నుంచి లేచి యింట్లోకి వెళ్లిపోయాడు. సింహాద్రి పిడుగు దెబ్బతిన్న వాడిలాగా అక్కడే కుప్పన కూలబడి పోయాడు. గుండె దడదడలాడుతోంది. కళ్లు గిఱ్ఱున తిరుగుతున్నయ్. మిన్ను విరిగి ముక్కలు ముక్కలై, మీద విరుచుకు పడుతున్నట్లుంది. మెల్లగా లేచి, బరువుగా అడుగులు వేసుకుంటూ గుడిసెకి చేరుకున్నాడు. దూరాన్నుంచే మనుమడు "తాతా!" అని అరుస్తూ తప్పటడుగులతో పరుగెత్తుకొని వచ్చాడు. "అంబా" అంటూ గంతులేస్తూ లేగదూడ, దగ్గరకి వచ్చి బెదురు చూపులతో నిలబడింది. సింహాద్రి గుండెల్ని పగలకొట్టుకుంటూ, ఆక్రోశం వెలువడుతోంది. "ఈ గుడిసె, ఈ పాక, ఈ పశువులు యింక యే నీడలో నిలబడతయ్? ఇంక యీ జగత్తులో ఏ ఆధారం చూసుకొని తాను తన కుటుంబంతో జీవించగలడు?" ముసలి కళ్లలోంచి జలజల నీళ్లు రాలినయ్. మనుమడు తెల్లబోతూ, తాతకేసి చూసి, యింట్లోకి పరుగెత్తాడు.

కూతురు వచ్చి పిలిచింది. కోడళ్లు వచ్చి బతిమాలారు. కొడుకులు దగ్గిరకు వచ్చి పిలిచారు. మనుమడు తాత చేతులు పుచ్చుకొని రమ్మని లాగాడు. కాని సింహాద్రి కదలలేదు. వీరంతా తనని అన్నానికి రమ్మని బతిమాల్తున్నారు. కాని, ఆ అన్నం యిక తనకెక్కడ నుంచి వస్తుంది? మారుగా వెక్కివెక్కి యేడ్చాడు. పొలంలో పనిచేసి అలసి వచ్చిన కొడుకులు చిరాకుగా "యేం కొంప మునిగింది?" అన్నారు. సింహాద్రి యేడుపు ఆపుకోలేక తడబడుతూ అన్నాడు "మునిగింది. ఇంకెక్కడి కొంప? కూలిపోతోంది." "యేమిటి?" "నాయనో! చెప్పలేను. నా గుండె చెరువైపోతోంది. ఇక మనకొంప కూలిపోతుంది. మనం పక్షుల్లాగా అల్లాడి పోతాము."

కూతురు దగ్గిరకు వచ్చి మెల్లిగా అడిగింది "ఏమిటి బాబూ?" అని. "ఇంకేం బాబు తల్లీ. అంతా అయిపోయింది; మన అన్నం, మన జీవనం..."

ఆనాడు పొద్దున్నే దొరగారు కబురు పంపాడు. సింహాద్రి గబగబా వెళ్లి దణ్ణం పెట్టి కూర్చున్నాడో లేదో, పిడుగులాటి మాట చెవిని పడింది. ఆపాదమస్తకం గజగజ వణికి పోయాడు. అమాంతం దొరగారి పాదాలు పుచ్చుకొని కంపించిపోతున్న కంఠంతో "బాబూ చంపెయ్యకండి. నా అన్నం బోర్ల తొయ్యకండి. బాబూ నా కొంప కూల్చబోకండి." అని ఎంతో బతిమాలుకున్నాడు. దొరగారు "వీల్లేదు. వీల్లేదు. స్వంత వ్యవసాయం చేస్తాను" అన్నాడు. "బాబూ, మీ పాదాల దగ్గర బతుకుతున్నాం. మీ పేరు చెప్పుకొని, మీరు పెట్టిన అన్నం తిని బతుకుతున్నాం. ఒక్కసారిగా నోట్లో మట్టి కొడతారా స్వామీ?" దొరగారు ఆగ్రహంతో "మారు చెప్పటానికి వీల్లేదు. పొలం వదిలెయ్యాల్సిందే." సింహాద్రి కూలబడి పోయాడు. దుఃఖం పొంగుకొస్తోంది. నోటమాట రావటం లేదు. దొరగారు "ఎల్లుండి మా నాగళ్లు పంపుతున్నాను." అని లేవబోయాడు. సింహాద్రి అప్రయత్నంగా "నా ఘటం వుండగానే!" అని లేచి నిలబడ్డాడు. దొరగారు మండిపడ్డాడు.

సింహాద్రికి మనస్సు మనస్సులో లేదు. "నిజం! నిజం! తన ఘటం వుండగా తననెవ్వరూ ఆచేలోంచి తొలగించలేరు. ఎవరికీ శక్యంకాదు. కాదు. మరుపు మాయమైపోయి, ఎన్నో ఎన్నో తలపు కొస్తున్నయ్. తన జీవితంలో యిన్ని సంవత్సరాలు ఆతల్లి చలవలో క్షణాలలాగా గడిచిపోయినయ్. ఆతల్లే, తన నింతవరకూ బిడ్డలాగా కాపాడింది. తాను కాటకానికి తాళలేక ఇరవై రెండోయేట, తూర్పుదేశం నుంచి, భార్యతో కలిసి, ఆ వూరు చేరటం, ఇంకా యెన్నో యెన్నో అప్పటి సంగతులు, మనస్సులో గిరగిర తిరుగుతున్నయ్.

భార్య తలపుకు రాగానే, సింహాద్రి గుండె భగ్గుమంది. ఆవూరు చేరగానే, ఆమె ఒక శాస్తుర్లు గారింట్లో పని చేసేందుకు కుదిరింది. వారి దొడ్లోనే ఒక చిన్న పాక వేసుకున్నారు. తను కూలి చేసుకుంటూ ఉండేవాడు. దినాలు క్షణాలలాగా గడిచిపోయినయ్. వయసులో ఉన్న తన భార్య, తానూ ఎంతో అన్యోన్యంగా కాలం గడిపేవాళ్లు.

ఒకనాడు శాస్తుర్లుగారు "సింహాద్రీ ఏం పని చేస్తున్నావ్" అని అడిగారు. సింహాద్రి "ఏం లేదు స్వామి" అని వినయంగా చెప్పాడు. శాస్తుర్లు గారు సింహాద్రిని వెంటపెట్టుకొని ఊరిబైట ఉన్న ఒక దిబ్బ మీదికి తీసికోవెళ్లి, "సింహాద్రీ, దీనిమీద యేమైనా పండించుకోరాదూ? ఊరికెనే ఉంటోంది?" సింహాద్రి పొంగిపోతూ "బాబూ బతికించారు. మీ పేరు చెప్పుకొని గూట్లో దీపం నోట్లో ముద్ద..." అన్నాడు.

ఆ క్షణం నుంచే సింహాద్రి సింహంలాగా ఆ దిబ్బనంతా పలుగులతో పొడిచాడు. పారలతో తవ్వాడు. చెమటలు ధారలు కట్టినయ్. తొలిసారి ఆ దిబ్బ మీద బెండగింజలు చల్లాడు. దూరంగా ఉన్న చెరువునీళ్లు కావిళ్లతో మోసుకు వచ్చి కాలవలు పారించాడు. మొక్క నాటుకోగానే అదునున మంచి వర్షం కురిసింది. శాస్తుర్లుగారు చూపించిన యీ దోవకి భగవంతుడు కూడా తోడ్పడుతున్నాడని, సింహాద్రి పొంగిపోయాడు. అతనూ భార్యా అస్తమానం తోటలోనే కుదుళ్లు చేస్తూనో, నీళ్లు పోస్తూనో, కలుపు తీస్తూనో, చీడ పట్టిన

ఆకులను తుంచివేస్తూనో, గడిపేవారు. మొక్కలన్నీ కాయలతో వంగిపోయినయ్. ఆ తోటకేసి చూస్తుంటే సింహాద్రికి తన పాదాల కింద నిద్రపోయే ఈ భూమిలో, ఒక చల్లటి తల్లిదాగి వున్నదని, ఆమే తనను చేతులెత్తి చల్లగా దీవిస్తున్నదనీ తోచింది. శాస్తుర్లుగారి కుటుంబం లేకపోతే, తనూ భార్యా యేమైపోయే వాళ్లో! అనుక్షణం శాస్తుర్లు గారికి మొక్కుకుంటూ వుండేవాళ్లు. ఆయన పిల్లలందరూ, తన బుజాలమీదా, తన భార్య చేతుల్లోనూ పెరిగి పెద్దవాళ్లయారు.

మరొక యేడు జొన్న వేశాడు. అడవిలాగా పెరిగింది. బంగారం లాగా నిగనిగలాడే కంకులు వేసింది. సింహాద్రీ, భార్యా, తమ శక్తినంతా, ఆ నేలకు ధారపోశారు. సింహాద్రి యువక రక్తమంతా, కండల పటుత్వమంతా, ఆ నేలకే అర్పించాడు. ఇది చూసి, సంతోషించి, శాస్తుర్లుగారు ఎంతో శ్రమపడి ఆ చేను ఆయకట్టులో జేర్పించారు. ఆ యేటి నుంచీ, ఆ చేలో, వరిపైరు మిసమిస. ఊడ్పుల రోజులన్నీ సింహాద్రి పొలం గట్టునే గడిపేవాడు. భార్య గడ్డి కోసుకు వెళ్లటానికి వచ్చేది. ఇవతలి గట్టున గడ్డికోసి, మోపుకట్టి, అవతలి గట్టు కన్నం చూసి రావటానికి వెళ్లేసరికీ, చప్పట్లు చరచి పిలిచేది. "ఏదీ నువ్వు కోసిన మోపు? దొంగలెత్తుకోపోయారు." సింహాద్రి గబగబా పరుగెత్తుకు వచ్చేవాడు. "ఏమైపోతుంది? యిప్పుడేగా ఇక్కడ పెట్టివెళ్లింది?" అంటూ దగ్గరికి వచ్చాక, సింహాద్రి కళ్లలోకి చూస్తూ భార్య ఫక్కున నవ్వేది. అన్నివైపులా మోపు కోసం వెదికి, చివరికి బోదెలోను తేలిపోతున్న గడ్డిమోపును చూసి, – "ఓసి టక్కరుపిల్లా!" అని నవ్వుతూ వెళ్ళిపోయేవాడు. ఆకాలం తలపుకు రాగానే, ఏదో చల్లటిగాలి తాకినట్లు, ఒళ్లు పులకరిస్తుంది.

తొలకరి వానలు దిగినాక, నాగళ్లు కట్టాక, నేలలోంచి వచ్చే, సుగంధంతో ఆ చల్లటి తల్లి, తనని ఆశీర్వదిస్తోందని మురిసిపోయేవాడు. వరి నాటుకోని, ఉదయకాంతులతో మంచు బిందువులతో కదలి ఆడుతుంటే, తన ఒళ్లు మరచిపోయేవాడు. వరి కంకులు, గాలిలో ఒయ్యారంగా కదులుతూ, అంతటా, బంగారుకాంతులు మెరిపిస్తుంటే సింహాద్రి చేతులెత్తి భూదేవికీ, శాస్తుర్లుగారికీ పదేపదే మొక్కుకొనేవాడు. భార్యతో యెన్నోసార్లన్నాడు. "ఆతల్లి మనకి బువ్వ పెడుతోంది. మనలను బిడ్డల్లాగా కాపాడుతోంది." భార్య బదులు చెప్పేది "ఆ తల్లి చలవే లేకపోతే మన మీపాటికి ఎక్కడుండే వాళ్లమో!"

సింహాద్రికి కలిగిన సంతానమంతా, ఆ పొలంలోనే కష్టపడి, ఆమె చలవలోనే, పెరిగి పెద్దవారయారు. చేను గట్టున నిలబడి, సింహాద్రి యెన్నోసార్లు పరవశుడైపోతూ తానొక పసిపిల్లడై పారాడుతున్నట్లు, భూదేవి తల్లివలె తనను చల్లటి చేతులతో ఎత్తుకొని ముద్దాడుతున్నట్లు, తలపోసేవాడు. ఆనందంతో కళ్లల్లో నీళ్లు తిరిగేవి.

అప్పుడు బతుకులో లేదనేమాట లేదు. గుడిసెనిండా ధాన్యం. యింటి చుట్టూ మేకలు అరుస్తూ, కోళ్లు కూస్తూ తిరుగుతూ వుండేవి. పాకలో మోరలెత్తి, ఎడ్లు రంకెలు వేస్తుండేవి.

పిల్లలు కట్టిన మువ్వలు ఝల్లుమనిపిస్తూ లేగదూడలు చిందులు తొక్కుతుండేవి. సింహాద్రికి మరీ రూఢి అయిపోయింది. కాటకానికి తాళలేక వచ్చిన, యీ దిక్కులేని దంపతులను, బిడ్డలలాగా దగ్గిరకి తీసి దీవించిన, ఆ భూదేవి కరుణే యిదంతా. ఆమెకే దయరాకపోతే, తానేమైపోయేవాడు? భూదేవినేకాదు. శాస్తుర్లుగారిని తలుచుకోని క్షణంగాని, వారి పాదాలకు దణ్ణం పెట్టిరాని దినం కాని లేదు. తలుచుకుంటే అప్పటి వూరే వేరనిపిస్తుంది. అప్పటి మనుష్యులే వేరు. ఎక్కడ చూసినా సిరి, చిందులు తొక్కుతూ కనిపించేది. తూర్పు రేక లగపడక మునుపే, పెద్ద దొరలంతా, స్నానాలు చేసి చెరువు రేవులో సంధ్యావందనం చేస్తుండేవారు. దినమంతా వేదమంత్రాలు ప్రతిధ్వనించేవి. సాయంకాలం, దేవాలయంలో, శాస్తుర్లుగారు పురాణం చెబుతూ వుంటే పక్షులు కూడా నిలబడి ఆలకించేవి. రాత్రి అంతా నిద్రకు మళ్లినాక అవధాన్లు గారు కంఠమెత్తి దాశరథీ శతకం చదువుతుంటే, కంచుగంటలు గణగణ మోగినట్టుగా వుండేవి. ప్రతి గడపా, తోరణాలతోనూ, తీర్చిదిద్దిన ముగ్గులతోనూ, కన్నుల పండువగా వుండేది.

ఆ రోజులన్నీ, ఇప్పటి దినాలతో పోలిస్తే, కలలాగా కనపడుతున్నయ్. ఆ కాలం అంతా, మారిపోయింది. ఊళ్లో పెద్దఘటాలు, ఒక్కొక్కరూ వెళ్లిపోయారు. తండ్రుల మాదిరి, పిలకల్లేకుండా సంధ్యావందనం లేకుండా యింగ్లీషు చదువులు చదువు కొచ్చిన చిన్నదొరలంతా పెత్తనం ఆరంభించారు.

దేవుడులాటి శాస్తుర్లు గారు కూడా లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. సింహాద్రి కళ్లు చీకట్లు కమ్మినయ్. అతనూ, భార్యా, తండ్రిని కోల్పోయిన బిడ్డల్లాగా, వెక్కి వెక్కి యేడ్చారు.

దినాలు గిఱ్ఱున తిరిగినయ్. గ్రామమంతా మారిపోతోంది. వేదమంత్రాలు లేవు. చెరువురేవులో సంధ్య వార్చేవారు లేరు. గుడి మండపంలో పురాణాలు లేవు. ఆ వూరి నుంచి సిరి తొలగిపోయిందేమో అనిపిస్తుంది. ఆ యేటి పంటను చూసి భూదేవికి కోపం వచ్చిందేమోనని బెదిరిపోయాడు సింహాద్రి. శాస్తుర్లు గారి కొడుకుకి కట్టుబడి కొలవగా తనకేం మిగిలింది? తనూ పిల్లలూ బ్రతికేదెల్లా? అరుగుమీద కూర్చుని ప్రొద్దున్నే స్నానం లేకుండా కాఫీపానం చేస్తున్న చిన్న దొరగారిని కట్టుబడి తగ్గించండని బ్రతిమాలుకున్నాడు. శాస్తుర్లుగారు తనను బిడ్డలాగా ఆదరించారు. చిన్నప్పుడు తన బుజాలమీద యెక్కి తిరిగిన చిన్న దొరగారు మాత్రం అతన్ని గడ్డిపరకలాగా, చూస్తారు. ఇంతలో, కలరా! ఆ పిశాచమే, సింహాద్రి కొంప కూల్చింది. ఊరిలో మిగిలివున్న సిరిని కాస్తా తన కాళ్ళ కింద మట్టగించింది. సింహాద్రి కుంగిపోయాడు. నేలకు అణగారిపోయాడు. కూతురు, కొడుకు, భార్యా, – శోకాలు పెడుతూ తల నేలకేసి బాదుకున్నాడు. "నన్ను కూడా తీసుకుపో". ఇంతకాలం, తోడునీడగా నిలిచిన భార్యకూడా పోయేసరికి, అతని గుండె చెదిరిపోయింది. ఇక ఈ దుఃఖమంతా ఒంటరిగా యెల్లా భరించటం? అతని మనసు విరిగిపోయింది. శక్తి చచ్చిపోయింది. బొమ్మలాగా బతికివున్నాడు.

గిరగిర తిరిగిన స్మృతి చక్రం ఒక్కసారిగా, నిలిచిపోయింది. ఆపుకోలేని శోకం లోపలి నుంచి పొంగుకొస్తోంది.

"దొరగారు రమ్మంటున్నారు నిన్ను." సింహాద్రి మారుమాటాడలేదు. కొడుకులు వచ్చి, వెళ్లి రమ్మని బలవంతం చేశారు. సింహాద్రి కదలలేదు. కొడుకులిద్దరూ వెళ్లారు. సింహాద్రి గుండె నీరైపోయింది. "తల్లీ నిన్నెలా వదిలిపోగలను. పరాయివాడిలాగా యెలా తొలగి పోగలను?" అని పదేపదే అనుకుంటూ, జలజల రాలుతున్న, కన్నీళ్లతో అక్కడ నుంచి కదలలేకపోయాడు.

దొరగారింటి నుంచి కొడుకులు తిరిగి వచ్చారు. వారి ముఖాలు చూసి సింహాద్రి బేజారై పోయి ప్రశ్నించాడు. "దేనికి పిలిచారు?" కొడుకులు ఎంతో అవలీలగా చెప్పారు. "మనకెందుకు. వారి పొలం వారికే వదిలేద్దాం" అని. సింహాద్రి కూలబడిపోయి, గుండెలు బాదుకున్నాడు. "నా ఘటం ఉండగా..." అని గొంతు చించుకొని అరిచాడు. ఇంట్లోంచి మాటలు వినపడుతున్నయ్. పొలం వదిలిపెడితే దొరగారు కొడుకులిద్దరికీ చెరొక వందా యిస్తామన్నారట. సింహాద్రి మీద పిడుగుల వర్షం కురిసింది. సుడిగాలిలో ఎండిన ఆకులాగా అతని మనస్సు గిరగిర తిరిగిపోయింది. ఏ తల్లి యింతకాలం అన్నం పెట్టిందో, ఆమెను వదలి, పరాయి వాళ్లలాగా వెళ్లిపోవటానికి 'లంచం! ఛీ...' మనస్సు తుపానులో కెరటాల్లాగా ఉప్పొంగింది.

"ఛీ దుర్మార్గులారా! ఇక మీ ముఖం చూడను" అని అరిచి కఱ్ఱ తీసికొని, తూలుతూ సోలుతూ అడుగులు వేశాడు. కళ్లు తిరిగి పోతున్నయ్. కాళ్లు గజగజ వణకిపోతున్నయ్. అప్పటికే దొరగారి నాగళ్లు చేలో దిగినయ్. ఎక్కడలేని శక్తీ తెచ్చుకొని సింహాద్రి, ఒక్క పరుగు తీసి దున్నిన మట్టిని గుప్పెళ్లతో తీసికొని కళ్లకద్దుకుంటూ అడ్డంగా పడుకున్నాడు. నాగళ్లు ఆపారు. ఎందరు లేవమన్నా సింహాద్రి లేవలేదు. గట్టు మీద నిలబడ్డ చిన్న దొరగారు, గబగబా వచ్చి "ఏమిటిది?" అన్నారు. సింహాద్రి దొరగారి కేసి దీనంగా చూస్తూ, వణుకుతున్న కంఠముతో, నీళ్లు నిండిన కళ్లతో, "బాబూ యీ తల్లి ఒళ్లో బతికాను. యీ తల్లి ఒళ్లోనే నన్ను చావనివ్వండి." అంటుండగానే, నిలువు గుడ్లు పడ్డయ్. మట్టితో ఉన్న గుప్పెళ్లు బిగుసుకు పోయినయ్.

దొరగారు అప్రయత్నంగా కన్నీళ్లతో "సింహాద్రీ!" అని ఒక్క కేక పెట్టారు.

సింహాద్రి వీపుమీద చిన్నప్పుడు తాను గుఱ్ఱపు స్వారీ చేసిన రోజులు గుర్తుకు వచ్చి దొరగారి గుండె జలదరించింది. ఒక్క క్షణం "ఈ పొలం యెవరిది?" అన్న ప్రశ్న అతని మనస్సులో మెరిసిపోయింది. ఎవరిది? ఈ పొలం ఎవరిది? నిజంగా ఎవరిది?

✡

# ఎంకన్న

**–డా॥ పి.యశోదారెడ్డి**

ఈసారి తప్పక సీతక్క కట్తది. లేదు; మళ్ళసారికి; కాదు లేదు; కట్టనే లేదు సీతక్క. ఏం దిది? ఏం లేదు. కర్ణపురాజయ్య మందల కంటికి ఆనే కొడెలున్నవి; కొన్నాళ్లు ఆమందల గల్పి సూస్తే? సూడుండి తప్పేముంది? అయిన గని ఏమి లేదు. ఎక్కడలేదు. అయ్యోకత! ఎట్లమరి? ఆఁ ఎట్ల లేదు. గిట్లలేదు. మరీ అపురూపరం ఎక్కువైంది. గడెం గడ్తే సరి. రోగం గుదుర్తది. కట్టిసూడుండి.

సరె! సీతక్కను గడెం దోలిగ్రు. ముక్తమ్మ జూసింది. ఆవలీవల వడ్డది. సీతక్క మెడమీది కాణి తన మెడ మీద వెట్టినట్లనిపిచ్చింది. బిర బిర నడ్సింది మిర్పగుడ్డెంలకు, “ఇదేం? కట్కెతనం రా నాయిన? గున్న ఏన్గ సొంటి సీతక్కను గడెం గట్టిగ్రు? మీకు చేతు లెట్లొచ్చెరా తండ్రి? సీతక్కేం గొడ్డు వోదు. ఈయాళ్ళ గాకుంటె రేపాయె; ఎల్లుండి ఆయె. నిన్ననే చెల్లెలు కారటు రాసింది– నా సీతక్క ఎట్లుంది? అని చెల్లె! నీవు గుమ్మడిపండును గన్నవు గదా? ఇంగ సీతక్క రామలక్ష్మణుల వెడ్తది, ఉండు, అని రాసిన. ఆ పిల్ల పాపం: ఎండిపట్టెడ చే పిచ్చి పెట్టుండి అని ముప్పై రూపాయలు పంపింది. పట్టెడేమొ గాని సీతక్క మెడలొంచి బరువు వెడ్తిరి ఇడ్వుండి గడెం” అని ఇడ్పిచ్చింది.

ఎంకట్రాంరెడ్డి శ్రీరంగాపురం బోయి వొచ్చిండు. వొస్తవొస్త రెండు వేలువోసి రొండు కోడెలు తెచ్చిండు. ఒగటి తెల్లకోడె. ఇంగోటి బొల్లి కోడె. కోడెలు రొండు మాంచి పొగర్ల ఉ ండవి. తెచ్చుకం తెచ్చుక మే ఎంకట్రాంరెడ్డి బావ నాగిరెడ్డి సుట్టపు సూపున వొచ్చి నోడు తెల్లకోడెను నా కిచ్చెడి దంకగా దని పట్టువట్టిండు. సరెనన్నడు ఎంకట్రాంరెడ్డి. కోడెను గొట్కపోయిండు, నాగిరెడ్డి. ఇంగ బొల్లికోడెను ‘ఎంకన్న’ అని పిల్సి, ఎంకట్రాంరెడ్డి మందల గల్పింగ్రు గాసగాండ్లు.

సీకటివడంగనె ఎండ్లమాలెల గట్టిగ్రు ఎంకన్నను. తెల్లారింది పసుల పోరలొచ్చి, మెడ పల్పు లిడ్సి, గాడి సాపుజేసిగ్రు. పల్పు ఇడ్వబోతె బస్సు మన్నడు ఎంకన్న, ‘అమ్మో! ఈ కొత్త గుబ్బు రేపు కోళ్ళుగుయ్యంగ మోటగడ్తె, బర్తిమోస్తె, మోకాళ్ళబంటి ర్యాగట్ల గుంటకదిర్గిన్నాడు

గద ఎక్కయ్యేది? ముందున్నది బిడ్డ ముసుళ్ళ పండుగ!" అని నోరున్న మనిషితోటి పంతాలు వల్కినట్లు వల్కుకుంట మెడతలుగు ఇడ్సిండు, బాలిగాడు.

ఎంకన్న అంకేసిండు. ఊరన్న ఊరు నాదిచ్చింది. కొట్టాలల్ల ఉన్న ఆవులన్నీ సెవులు నిక్కపొడ్సుకున్నవి. పెయ్యలు కట్లుదెంపుక్కునవి. ఎక్కడ్డీ అంకె? ఇచ్చిత్రంగ ఉండది! బసువణ్ణి అంకెవెట్టి నట్లుండది. ఆ ఊళ్ళె ఉన్న నాసి రకపు కోడెలన్నీ కోసుదూరం ఉర్కినవి. ముక్తమ్మ కొట్టంల గట్టిన సీతక్క సెవులల్ల అంకె వడ్డది. సుట్టు జూసింది సీతక్క. సక్కగ బాట వట్టింది. పసుల మందలగల్సి యాణ్ణుండో కొత్తకోడె వాస నొచ్చింది. బెదురు సూపులు జూస్కుంట నడుస్తుండది సీతక్క. ఇంతట్లనె పక్క కోట బుర్జుమల్పు దాటి ఎంకట్రెడ్డి మంద గదిలింది. మంద కంతకు మాణిక్యమోలె ఎంకన్న వొస్తుండడు. సుట్టు కలెజూసుకుంట. ఇంతట్లనె ముర్క చూసిండు; ఎంకన్న. కొమ్ముల్తోటి బూమిని గుమ్మి మన్ను ఎగజిమ్మిండు. పక్క మందల వొయ్యారంగ నడుస్తుండది సీతక్క. సీతక్క జూసింది ఎంకన్నను. సిగ్గువడ్డది. ఇంగింత వొయ్యారంగ మెడ గంటలు గణగణ మనంగ దిప్పుతుండది. పక్కలపోంటి నడ్సే ఆవుదూళ్ళ కాళ్ళు నల్గ దొక్కుతుండది. "ఇదేంది? సీతక్క ఎన్నడులేంది నాట్కం దొక్కుతుండవు?" అన్నట్లు తోటి పసురం ముందు నడుస్తుండది. మళ్లోసారి అంకేసిండు ఎంకన్న. సీతక్కపై జలదరిచ్చింది. పటేలోళ్ల కోడెలొచ్చి సీతక్క పక్కపోంటి నిలవడ్డవి. సీదరిచ్చుకోని బిర బిర నడ్సి తప్పిచ్చుక తిర్గింది సీతక్క. మందకు అడ్డమొచ్చి నిలవడ్డడు ఎంకన్న. ఎన్కపట్లు వట్టింది సీతక్క. కొంతవడి బాట గాసిండు ఎంకన్న. ముందునడ్సిండు. ఎన్కకొచ్చిండు పక్కపోంటి నడ్సిండు; జోడుగ గదిలిండు ఎంకన్న.

సీకట్లు వడ్డవి. భారీ ఎడ్లు దాణ దింటుండవి. బఱ్లు కుడ్తి దాగుతుండవి. పాలువిండుకోని దూళ్ళను ఇడ్సిన్రు, దినాం తీర్గ ముక్తమ్మ వొచ్చి కొట్టంల జూస్తె సీతక్క గుంజ ఖాళీ గండ్లవడ్డది. అయ్యో! బాలిగా, సీతక్కేదిరా? అని అడిగింది. బాలడు, బయపడ్డడు. "ఈ యాళ్లెందుకో సీతక్క సెప్పినట్లు ఇనక యాడ్కో తొలుగు తుండది. అదిలిచ్చి కొట్టుకొచ్చిన మందల్నే గల్సిండె." అన్నడు. ఇంతట్లనే "ఎన్నడు లేంది ఎట్ల దప్పిచ్చెరా? మెకం గిన ముట్టలేదు గదా?" అని అడ్గింది ముకమ్మ. "నాసత్తె ప్రమాణమయ్యా, మందలల్ల నా సొతాగ జూసిన" అని వాడు జెప్తుంటె ఎంక్ట్రామయ్య గాసగాడు ఎల్లడొచ్చి, "దొరుసాని మీరు బేపిక రుండుండి. మీ సీతక్క మా కొత్త కోడెలేదు. ఎంకన్న ఆ ఎంకన్న ఎంట వొచ్చింది. మా కొట్టం ల్నె ఆగింది" అన్నాడు.

ముక్తమ్మ ముసిముసి నగింది. ఇంతట్లకే ఆడ్కివొచ్చిన నారాయణ తోటి "ఇంటిరా? వుత్త పున్యానికి సీతక్క మెడన కాడివెడ్తిరి. కంటికి ఆన్తే మా సీతక్క కాదన్నదా?" అన్నది.

మర్నాడు మాపటికి ఎంకన్న ఎంట బెట్టుకోని సీతక్క ముక్తమ్మ పసుల మాలెల కొచ్చింది. సీతక్క మాలె సిన్నది. కట్టపస్గడి లేదు. తడ్కతల్పు ఉండది. ఎంకన్న ఎత్తుకు, దుంకుకు తడ్క

తల్పు గూలి పడ్డది. తర్పి దూడలన్నీ తోకలు ల్యావట్టి దగ్గెర్కి గుంపు గూడినవి. ముక్తమ్మ జూసింది. నారాయణ ఎంకట్రాంరెడ్డి కాడ్కి పసుల పోరణ్ణి దర్కి, కోడెను గొట్క పొమ్మన్నడు. ముల్లుగఱ్ఱలు వట్టుకోని ఇద్దరుగాస గాండ్లొచ్చిన్రు. ముట్టనియ్యడు పట్టనియ్యడెంకన్న. పగ్గాన్ని దగ్గెరికే రానియ్యడు పెద్ద పామోలె బుసలు గొడ్తుండడు. ఎంకన్నను పగ్గాన పట్టవోయిన దిక్కుకెల్ల అడ్డం దిర్గుతుండది కాట్కెకండ్ల సీతక్క.

ఇదంత చిత్రంగ జూస్తుండది ముక్తమ్మ. అటు ఇటు అదిరిచ్చి పగ్గాలు బట్ట శాతగాక జీతగాళ్లు ములుగఱ్ఱలు బూమి కానిచ్చి “ఇయ్యాళ్ళ మేం గాదు గద. హరిబ్రమ్మాదులొచ్చినా ఎంకన్నను ఈడికెల్లి కదిలియ్యలేరు. ఈ మకరు కోడెను సీతక్కను తప్పజేయ ఎవ్వరివశం? ఇంగ మేం బొయ్యి దాణబుట్టి వట్టుకొస్తం. ఈ మాపటికి ఈణ్ణే ఉండనియ్యిండి” అన్నరు. ఈ మాటిన్న నారాయణ “ఒక్కనాటి దాణ వెట్ట లేక గాదురా! అరుసుణ్ణి జూసి పురుసుణ్ణివో గొట్టు కొనె అన్నట్లు ఈ ఎంకన్న ఱంకెలు ఇని మా బక్కలన్ని మిడి గుడ్లేసి కూలె టట్టున్నవి గదరా! పంచాయితి గూల.” అని అంటుంటె, “ఆఁ! ఏం పంచాతి పటేలా? మళ్ళ ఆవుటియాళ్ళకు ఏనుగులోలె కోడెలను వెడ్తది సీతక్క అని అన్నరు జీతగాళ్ళు. ముక్తమ్మ ఆ మాట ఇని. “మీకు దండం బెడ్తగని పదుండి పోదం” అని అంటుంటె. ఎక్కడోళ్లక్కడ వోయిన్రు.

నెల్లాళ్లైయింది. ఎంకన్నను పగ్గాన వట్టిన నరుడే లేడా వూళ్ళ సీతక్క కట్టింది. డొక్కలు బిలిసి నున్నగ నిగ నిగ మంటుడది. ఊళ్ళశనా మంది ఎంకన్న ఇత్తనపు కోడె వోలె ఉంటె బాగుండు ననుకున్నరు. అనుకోరు? మరి? ఎంకన్న ఎత్తు లక్ష్మి పుట్టింది సీతక్కకు. ఊరన్న ఊరు నిలవడి సూస్తరు లక్ష్మిని. కాటిక కండ్లు మట్కే సీతక్క సాలు. ఎత్తు ఒడుపు అంత ఎంకన్ననే. దిష్టితగుల్తదని లక్ష్మి మెడల జీడిగింజలు కురువ దారంల ఏసి కట్టించింది ముక్తమ్మ. పాలనురుగోలె ఉన్న లక్ష్మి మెళ్ల నల్లటిదారం ఇంగింత దిష్టిగొట్టే టట్లు జేసింది. ఇసొంటి పెయ్య దూడను యాడ జూడలేదంటే యాడ జూడలేదని అందరన వట్టిన్రు. గని దోసిళ్ల నింద పైకం గుమ్మరిచ్చి ఎంకన్నను దెచ్చి పని పాట లేకుండ అడ్డగోలిగ ఊరి మీద ఇడ్వమంటె ఎంకట్రాంరెడ్డికి ఇష్టంగా లేదు. పోసిన పైకం బూడంగ పసురం కష్టం జేసి కొన్నోడికి ఆదెరువు గావాలె. పెట్టిన బండాలం పోంగ దినాం ఎంకన్నను గూసోవెట్టి మేప్కమంటే తెల్లేన్గును ఇంట్ల గట్టేసుకున్నట్లె. అందుకని ఎంకన్నను ఎద్దు జేసిన్రు.

పగ్గానికి జిక్కిండు ఎంకన్న. కాడికి మెడ వొంచిండు ఎంకన్న. కర్రెట్ల నడిసిండు ఎంకన్న. గడెం బోయిండు ఎంకన్న. యాపనికి ఎన్కవోడు ఎంకన్న. ఎంకన్న పనిల మున్గి తేల్తుండడు.

“ఇదేం సిత్రమమ్మ సీతక్కకు ఒక్కటే ఈత, ఎన్కటి జన్మంల ఈ సీతక్క మంచి పుట్టువే వున్నట్లున్నది లేకుంటే, వావి వరుసలు లేని పసురానికి ఈ కట్టువాటేంది?” అని ఒగరు అంటే, “ఆఁ! ఈ ఆవు సాలే అంత గావొచ్చు. అయింది కాంది కై గట్టి చెప్పుకం అలువాటైంది మందికి, లేకుంటె నోరు లేని పసురం ఎంకన్నను దప్పిచ్చి ఏరే పసురాన్ని బారనియ్య దంటె

ఎట్ల? అనే టోడు అంటే ఇనే టోడన్నా ఎట్ల ఇంటడు?" అని అన్నరు ఇంకొగరు. ఏమొ? యాది నిజమో యాది అవద్దమో గని సీతక్క మళ్ల కట్టనేలేదు.

సీతక్కను జూసినప్పు డల్ల ముక్తమ్మకు అచ్చం ఆ సీతమ్మ తల్లిని జూసినట్లే అయ్యేది. లోలోపట్లనె చెంప లేసుకొని దండం బెట్టుకొనేది. అడ్పదడ్ప ఎంకన్న మందల గల్సి పోతుంటె, ముక్తమ్మ మనుసుల ఏందో మెదిలేది. ఆ ఊళ్ల దగ్గెర దగ్గెర వెయ్యి ఆవుంది. గని ఒక్క ఆవు అన్న లక్ష్మి అసుంటి పెయ్య దూడను గని, కోడె ల్యాగను గని వెట్టలేదు. ఇంతకు ముక్తమ్మ అంశవంతురాలు. లక్ష్మి పెయ్యదైనా వెయ్యి రూపాలుజేస్తది. లక్ష్మి ఈంతె నిలువెత్తు కోడెలు. ఈ కోడెల్ను గొనాల్నంటే మూలకున్న గుర్గులన్ని పీకాలె; లేకుంటె పాత గుమ్ములన్న మెత్తులు దీయాలె. దేనికన్న పెట్టి పుట్టాలె అని మంది అనుకో వట్టిన్రు.

దినాలు గడ్సినవి. ఏండ్లు దాటినవి. ఎంకన్న మూపురం బిగువు సళ్లింది. గంగడోలు ముడ్తలు వడ్తుండది. అయినా మందల కైనోడె ఎంకన్న ఆ యాళ్లా సీతక్క గట్టుకు వోయింది. సీకట్ల ఇంటికి రాంగ యా పురుగుముట్టిందో! కూలవడ్డది గట్టున. పసుల పోరడు జూసుకోలేదు. పసులు ఇంటికి కొచ్చినవి. అలువాటు సొప్పున ముక్తమ్మ వొచ్చి కొట్టంల పారజూసింది. సీతక్క లేదు. పన్నెండేండ్ల ముచ్చట ఒక్కసారి ముక్తమ్మ కండ్లల్ల మెదిలింది. కాళ్లు వొణుకుడు పుట్టినవి. అనుకోకుండ కండ్ల పొంటి నీళ్లొచ్చినవి. సీతక్క రాకపోతె ఇంట్ల అందరంత పట్టిచ్చుకోలేదు; ముసలి గోవు అదే వొస్తది. గని ముక్తమ్మ కాళ్లు నిలవడలేదు. ఎందుకన్న మంచిదని ఎంకట్రామయ్య పసులమాలె జూసి రమ్మని కురుమణ్ణి దరిమింది. ఆడికి వొయ్యి అర్సుకొనెట్యాళ్ళకు ఎంకన్న గూడ రాలేదు. సరె ఇద్దరు జీతగాండ్లు గలిసి గట్లకు బాటవట్టిన్రు. అడ్డం దిడ్డం బండరాళ్ళన్ని దాటి మెత వడ్డకాడ జూసిన్రు. పసులజాడ గాన్రాలేదు. చెకిముకి గొట్టుకుంట పొదల మాటున అల్కిడి అయిన తావున జూసిన్రు కాన్రాలే. అలుగు దుంకుడుకాడ జూసిన్రు. కాన్రాలేదు. ఏమో! యా మెకం గవిలకు ఈడ్సుక పోయిందో ఏమో! రొండుపసరాలు జవ దగ్గినవే ఆయెగదా! తెల్లారగట్ల జూతం అని ఇంటిమొకం బట్టిన్రు. ఇంతట్లనే ఎంకన్న అలికిడి ఇనొచ్చింది. అటుదిక్కు పోయి సూసె వరకు సీతక్క లేవ లేకుండ కూలపడ్డది. ఎంకన్న బాట సూపుకుంటు రొండడుగులు నడుస్తడు; మళ్ళ ఎన్కకొస్తడు. ఇట్లా సీతక్కను ఇంటికి దోల్కపోవాల్నని తండ్లాడు తుండడు. ఇట్లీ సీతక్కను, ఎంకన్నను జూసి కురుమడు ఆడ్నే ఉండి, బాలడు ఇంటికి ఉరికిండు. బండిదెచ్చి సీతక్కను ఏస్కపోయిన్రు. ఎంకన్న ఎంటవోయిండు.

దాసరి కనుకప్ప వొచ్చి వసుర్లు వింది సీతక్క నోట్ల వోసిండు. ఇంత కింతకు సీతక్క పండ్లు కర్సకపోతుండవి. నోరు దెరువక పోతే పీకెగొట్టం బెట్టి వసురువోస్తుండరు. సీతక్క కొత్త తవుడు దిని నా వెక్కిన గొడ్డు తీర్గ బిగిచ్చుకుంటుండది. ఎక్కడోళ్ళక్కడ పోయిన్రు.

తెల్లారింది. దబ దబ ముక్తమ్మ వొచ్చి నిలబడ్డది. ఇంతదాంక ఎంకన్న ముక్తమ్మ ఇంట్లనే ఉన్నడు. ఈ సంగతి ఎవ్వరు పట్టిచ్చుకో లేదు. సీతక్క గిజగిజగింజుకున్నది. తన్నుకున్నది.

మూత్రిచ్చింది. తేలేసిక కండ్లుదెరిసి పెద్దగ జేసి చూసింది. ఎంకన్న గండ్ల వద్ద దేమొ! తోకాడిచ్చింది. ఎంకన్న అంబా! అన్నాడు. ఇదంత జాస్తున్న ముక్తమ్మ తన కండ్లను తానే నమ్మలేదు. అనుకో కుండనే రొండుచేతులు జోడిచ్చింది.

సీతక్క వడ్డది అనంగనె పెద్దింటోడు వొచ్చిండు. సచ్చిన గొడ్డును గదిలిచ్చాలని. ఎంకన్న అడ్డం నిలవడ్డడు. కొమ్ముల తోటి కుమ్మవోతడు. సూడసిత్రం గుంది ముచ్చట. నారాయణ వొచ్చిండు. ఎంకట్రామయ్య వొచ్చిండు. రావలసి నోళ్లొచ్చిన్రు. ముక్తమ్మ సీతక్కను మన్నుజేత మన్నది. మొగోళ్ళిద్దరు నెత్తు లొంచుకోని కండ్లు దుడ్సుకున్నరు. ముక్తమ్మ నల్గుర్ని పిలిసింది. సీతక్కను గడిగిన్రు. కొమ్ములు పూజిచ్చిన్రు బండిల దీస్కపోయి సందం జేసిన్రు.

ఎంకన్న ఇంటికి గదిలిండు. పసుల మాలెల నిలవడ్డడు. ఎంకన్న దాణ దినలేదు. గాటిల గడ్డి ముట్టలేదు. తనమెళ్ళ తలుగు ఉండదో లేదో? పెండకడి ఏయలేదు; పంచితిల లేదు. తెల్లారింది. ఎంకన్న నిట్టనీల్గిపోయిండు. సూసింది సూడంగనే పోరదు ఉరుక్కుంటవోయి ముక్తమ్మకు ఎంకన్న సంగతి జెప్పిండు, ఇండ్లు యాడ్వి యాడవెట్టి నారాయణను దోల్కోని ముక్తమ్మ ఎంకన్న కాడికి వొచ్చి చూసింది. నిజంగనే ఎంకన్న లేడు. అడ్కివొచ్చి నిలవడ్డ ఎంకట్రామయ్యను జూసి "అన్నా, ఎంకన్న సీతక్క కాడ్కి వోయిండన్నా" అని మొకాన కొంగు పెట్టుకోని బాపురుమన్నది. అనుకోకుండ ఎంకన్న గొడ్డు అన్నమాట మరిసి అందరు ఓ అని ఎడ్సిన్రు.

లోకంల లేని ఈ సిత్రం జూడ ఊరన్న ఊరుకట్టున గదిలిన్రు. "ఇవి పసురాలు గావు; దేవలోకం పుట్టుకలు" అన్నరు. ఆడోళ్లంత "సామితల్లి గౌరమ్మ సీతక్క తీరు సావు మా కియ్యి" అని పుస్తెవొట్లు కండ్లకద్దుకున్నరు. "సీతక్కకన్న పుణ్యం ఎంకన్నది రా. జంటమీన ఎంత ఆరివారం ఉంటేమట్కు ఇదేం అదునుకాలం గన్క నా? యాదో పిట్టల జంటల పెంటి వోతె పోతు బత్కడు. పోతు వోతే పెంటి నిల్వదు–అనంగ ఇన్నంగని; తల్లి పిల్లకు ఏరుతారు జూడని యీ గొడ్ల ముచ్చట కండ్లముందల జూసిన, ఏందో మైస్కరం తీర్గనె ఉండది" అని అన్నరు.

ఆ యాళ్ల ఎవ్వరు పనిపాటలు అర్సుకోలేదు. తిండి తిప్పలనలేదు. తన మనోడు వోతే నల్గురు నాల్గు చేతులేసినట్లు అందరు అన్నీ జమజేసిన్రు. బుక్కయారయ్య బుక్క గులాలు దెచ్చిండు. నారాయణ ప్యాట్లకు మనిషిని దర్మి పూలదండలు దెప్పిచ్చిండు. ఎంకట్రామయ్య గులాం రసూల్ తాన పన్నీరుసీస దెప్పిచ్చిండు. పిలవకుండనే బైండ్లోండ్లు గవ్వలబింకి దెచ్చిన్రు. హరిదాసు ఎక్తారు వట్టుకొచ్చిండు. కావలి రాంలు నడుంగట్టి గజ్జలకట్ట దెచ్చి నిలవడ్డడు. బజంత్రీలు సన్నాయిపీకె దెచ్చిన్రు. తప్పెట్లొచ్చినవి. ఏమి పండుగ! ఏమి? లొల్లి! ఏమి సంబురం! ఆ నాడు కులం, తలం లేదు. చిన్నా పెద్దా లేదు. ఒకరి చేతుల పని ఒగరు అందుకుంటుండరు.

అంత తయారైంది. పెద్దబండి వొచ్చింది. మామిడి ఆకుతోటి పూజిచ్చి తెచ్చిగ్రు. మనిషికి జేసినట్లు ఆఖరుసారి ఎంకన్నకు జేయవల్సిన అలంకారం అంత జేసిగ్రు. అయ్యగారొచ్చిండు. మంత్రపునీళ్ళు సల్లిండు. గోవిందా గోవింద అనుకుంట ఎంకన్నను బండి ఎక్కిచ్చిగ్రు. బండిమెల్లగ రథం గదిలినట్లు గదిలింది. ఊరబాయి కాడికొచ్చిగ్రు. సీతక్కను మన్నుజేసిన కాడ్నే పక్కపోంటి తోగిగ్రు.

ఎంకన్నను తాళ్ళు గట్టి మెల్లగ దించిగ్రు. ఉప్పు బస్తాలొచ్చినవి. తొలిసారి పిడికెడు ముక్తమ్మ ఏసింది. మంది ఇర్సుకపడ్డరు. ఆడి మొగతలా పిడికెడు రొండు బస్తాలు కండ్లు మూసి తెరిసె ట్యాళ్ళకు అయిపోయినవి. ఎంకన్నకు అందరు ఋణ పడ్డట్లు తలా ఓ పిడికెడు మన్నేసిగ్రు. సీతక్క పక్కన ఎంకన్న పండుకున్నడు. అందరు బాయికాడ్కి నడ్సిస్తానాలు జేసి ఇంటికొచ్చిగ్రు. సీతక్కకు ఎంకన్నకు గలిపి ఒకటే అరుగు గట్టి గచ్చుజేసిగ్రు.

ఊళ్ళ ఏ తల్లి నీళ్ళాడినా, యా పిల్లకు కొత్తగ పెండ్లయినా పొలిమేరరాళ్లు గట్టినా సీతక్క అరుగు లెక్క సీతక్క అరుగు సుట్టూ గున్నమామిళ్లేసిగ్రు, కాతాపూతా నిండుగుంటవి ఆ చెట్లు ఆవూళ్ళ ఎవ్వరివీ గావు ఊరందరివీ ఆ చెట్లు. ఏవూరి నుండి వొచ్చి పొయ్యే బాటసార్లు సద్దిముల్లెలు ఇప్పుకోని, సీతక్క అర్గుమీద గూసోని తిని, ఊరబాయినీళ్లు దాగి సీతక్క ఎంకన్న కతలు సిత్రంగ జెప్పుకుంటరు.

✡

# దొంగ బర్రెగొడ్లు

**-వై.సి.వి.రెడ్డి**

దొంగ బర్రెగొడ్లు పైర్లను పాడుచేస్తున్నాయి. వాటికి గుదె కట్టెలు కూడా కట్టరు. మంచి ఎత్తు గోడల్ను కూడా ఎగిరిపోతాయి. రెండు వరసలు కంప పాతినా కొమ్ములు అడ్డం పెట్టుకొని ప్రాణాలకు తెగించి దూరుతాయి. బాగా ఏపుగా పెరిగిన పైర్లనే తింటాయి. ఇతరులను ఎట్లా నష్టపరచాల్సింది వాటికి బాగా తెలుసు. దొంగ బర్రెగొడ్లు జొన్న చేలో పడినాయంటే సంగటి ముద్దల్లాంటి ముద్దకంకుల్నే తింటాయి. చేనికావలి ఎవరున్నా వాటికి లెక్కలేదు. దెబ్బలకు కూడా బాగా తట్టుకొంటాయి.

ఊరిలో అదుపు తప్పిపోయింది. ఎవరికీ భయంలేదు. భక్తి లేదు. ఎవరంతకు వాళ్లు వీరులూ, శూరులూ. ఏమన్నా అంటే వూరిలో పార్టీ పుడుతుంది. ఎట్లబ్బా పైర్లు దక్కించుకొనేది. కల్లాల్లో పొట్టువాములకు జొరబడి రాత్రిపూటల్లో తిని పోతూ వుంటే దిక్కులేదు. ఎక్కడికని కావలి పోవాల. ఈ సంసారం దిన దినానికి బరువైపోతూంది. ఊర్లో బందెలదొడ్డి వుంది. ఎందుకూ పనికిరాని రెడ్డీ వున్నాడు. బందె వసూలు చేయలేదు. ఎవరువచ్చి అడిగినా విడిచిపెడ్తాడు.

పేద రైతులకొచ్చింది కష్టం. వాల్లకన్నీ కష్టాలే. కష్టపడి పెట్టుకొన్న పైర్లు నాశనమవుతా వుంటే చూస్తూ వూరుకోవాల. భూములమ్ముకొని ఏదైనా టౌను జేరితే ఏదో బతకవచ్చు. ఇంతకంటే చెడతామా. బెడదలుండవు. ఉండూరు వదలిపోవాలంటే మనసొప్పదు. అట్లని యిక్కడ బాధలుపడాలంటే సాధ్యం కావడం లేదు. ఎట్లబ్బా అని దుప్పటి ముసుగులో బాధపడ్తూ గొనుక్కుంటున్నాడు రామయ్య.

రామయ్య సామాన్య రైతు. భార్య సీతమ్మ. ఒక మగపిల్లవాడు, ఒక కూతురూ వున్నారు. కూతురు ఎదిగికూర్చుంది. తోబుట్టువు రాములమ్మ మొగున్ని పోగొట్టుకొని రామయ్య ఎదాన పడింది. ఆమె రామయ్య కంటే పెద్దది. నడిప్రాయం మనిషి. రామయ్యకు వ్యవసాయప్పనుల్లో సహాయ పడుతూ వుంటుంది. ఇంటి పనులూ చూసుకొంటుంది. ఇంటిల్లిపాది బాగ కష్టపడతారు. తిండికీ గుడ్డకూ లోటు లేకుండా చేసుకొంటారు.

వాళ్లకు 10 ఎకరాలు పొలం వుంది. అందులో కొంతబావి క్రింద వుంది. వానాకాలం గింజపైర్లు పెట్టుకొంటారు. ఎండాకాలం డబ్బు పైర్లు పెట్టుకొంటారు. బొటా బొటిగా సంసారపు ఖర్చులకు సరిపోయేంత ఆదాయం వస్తుంది. వానలురాని సంవత్సరాల్లో బాగా యిబ్బంది పడిపోతారు. ఒకొకసారి బొందు కరువులూ వస్తాయి. అప్పుడు సన్నోల్లు విలవిలలాడిపోతారు. కరువుల్లో బతకడం సాధ్యమే కాదు. కరువంటే బరువు బండ నెత్తికెత్తుకున్నట్లే. పనులూ వుండవు.

వానలు రాకుంటే కొంతమంది పెద్దరెడ్లకు వుసి వస్తుంది. పరోక్షంగా దోపిడీ చేసేందుకు వసతి కుదురుతుంది. సన్నరైతులకు ఒకటి రెండుసార్లు తిప్పుకొని, అప్పులివ్వను మొదలు పెడ్తారు. ఎక్కువ వొడ్డీలకు యిస్తారు. ఎంత వడ్డీ అయినా బతికితే సాల్లే అని సన్నోల్లు తెచ్చుకొంటారు. రామయ్యా, పోయిన కరువుల్లో దఫాలుగా రెండు మూడెకరాలు భూమిని పోగొట్టుకున్నాడు. రామయ్యకు మునుపటికంటే కుటుంబంలో సమస్యలు ఎక్కువవు తున్నాయి. ఎదిగిన కూతురు యింట్లో వుంది. ఆమెను ఒకయ్య చేతిలోపెట్టి బరువు దించుకోవాల. సీతమ్మ రాములమ్మ ఏకమై ప్రతిదినమూ పాపపెళ్లి విషయం జ్ఞాపకం చేస్తుంటారు.

"ఏమీ కాబట్టదు తినడమూ తోటకాడికో దొడ్డికాడికో పోవడమూ పిల్ల సంగతి ఎత్తుకోవా" అని అంటూ వుంటారు. "ఎదిగిన పిల్లది యింట్లో వుంటే ఎదాన కుంపటి వున్నట్లే" అని కూడా పోరుపెడ్తారు. డబ్బు లేకా, సరైన సంబంధం దొరక్కా కాలం దొర్లిస్తున్నాడు రామయ్య. పెళ్లి సందర్భంగా యింట్లో రచ్చపడుతూ వుంటారు. ఈ మధ్య సీతమ్మ అలిగి పండుకొంటూ వుంది. ఆమె ధ్యాసంతా పిల్ల పెళ్లి చేయాలని. అందరూ ఆ సమస్యనే మనన చేసుకొంటూ వున్నారు. సమస్య పరిష్కారం ఎట్లా అని తీవ్రంగా ఆలోచిస్తున్నారు. రాత్రివేళల్లో నిత్యమూ యిదే సమస్యతో సతమతమవుతున్నారు. రామయ్యకు మాత్రం అప్పుడప్పుడు దొంగ బర్రెగొడ్లు జ్ఞాపకం వస్తాయి. ఉలిక్కిపడి లేస్తాడు. వెంటనే "నేను తోటకాడికి పోతున్నా" అని వెల్లిపోతాడు పసుల తాకిడి జాస్తిగా వున్న వూర్లో పైరు దక్కించుకోవడం సన్న పనేం కాదు.

ఒకరోజు రామయ్య అక్క "ఏరా తోటలెట్లన్నాపోనీ, చేన్లు ఎట్లయినా పాడయిపోనీ పిల్లదాని సంగతి ఆలోచిస్తావా లేదా" అని రామయ్యను నిలేసింది. "వూర్లో వరసైనోల్లు దండిగా వున్నారు. ఒక ఎకరాతోట వ్రాయిస్తే ఎవరైనా చేసుకొంటారు. పెండ్లి కర్చులకు బంగారుకూ గుడ్డాగుసురుకు అయిదు వేలయితే సరిపోతాయి. గంగిరెడ్డన్నను అప్పు అడుగు నిదానంగా తీర్చుకొందాము. అంతగా అయితే భూమి ఆయంకపెట్టు పిల్లకంటేనా" అని గట్టిగా చెప్పింది.

"మనకుండేది ఒక నలుసు బతకలేకపోతాడా, భూమి అమ్మి అయినా అమ్మి పెళ్లి మాఘమాసం మూర్తాల్లో చేసి తీరాల్సిందే" అని సీతమ్మా తీవ్రంగా అనింది.

రామయ్యకు గంగిరెడ్డి, వీరారెడ్డి, రంగారెడ్డి ముగ్గరూ మనసులో మెదిలినారు. "అందరూ అందరే ఊల్లోల్ల సొమ్ములకు ఒక్క పొద్దులుండే వారే. తనకు చనువున్నది వీళ్ల ముగ్గరితోనే.

గంగిరెడ్డి నసుకుడు ఎప్పుడూ పంగిస్తూంటాడు. వీరారెడ్డి కఠినంగా వుంటాడు. రంగారెడ్డికి కొంచెం మెతక. యిస్తే కొన్నాళ్లు తట్టుకొంటాడు. వడ్డి యిస్తావుంటే తొందర చేయడు. అయితే వొడ్డిమాత్రం ప్రతి సంవత్సరం తప్పకుండా కట్టాల" అని అనుకొంటూ దుప్పటి బుజాన వేసుకొని రంగారెడ్డి యింటికి పోయినాడు. ఆయకమో అమ్మడమో తప్పదు. అని గట్టిగా నిర్ణయించుకొన్నాడు. అట్లయితేనే ఐదు వేలు డబ్బు వచ్చేది. భూమి ఆయకం పెట్టి, అయిదారేళ్లు కష్టపడితే తీర్చుకోలేమా అని కూడా పోయినాడు.

సమయానికి రంగారెడ్డి యింట్లోనే వుండినాడు. రామయ్య పోతూనే రంగారెడ్డి ఆప్యాయంగా పలకరించి కూర్చోమన్నాడు. నీళ్లు నములుతూ రంగారెడ్డితో డబ్బు విషయం ఎత్తినాడు రామయ్య. రంగారెడ్డి కొద్దిసేపు ఆలోచించి "రామయ్య! నీవడిగినంత నా వద్ద లేదు. పిల్లదాని పెళ్లంటున్నావు. శుభకార్యానికి లేదనలేకుండా వున్నాను. రెండు వేలు సర్దుతాను. మిగతాది ఎక్కడైనా సవరించుకో. రెండు రూపాయల ప్రకారం వొడ్డి. ప్రతి సంవత్స రాంతంలోనూ వొడ్డీ నిలుపకుండా యిస్తూ వుండాల. ఒక ఎకరాతోట ఆయకం రాయించాల" అని చెప్పినాడు. అంతా నావల్ల కానేకాదనీ తెగేసి చెప్పినాడు. చేసేదిలేక రామయ్య ఒప్పుకొన్నాడు. కృతజ్ఞత చెప్పుతూ రామయ్య నేరుగా వీరారెడ్డి యింటికి పోయినాడు.

వీరారెడ్డి యిదేవరస. అతిప్రయాసగా రెండువేలయితే సర్దుతానన్నాడు. ఆయన నాకూ ఒక ఎకరాతోట ఆయకం పెట్టాలని అడిగినాడు. "రంగారెడ్డి వద్ద కరారు అయింది పోను మిగిలిన ఎకరా కట్నం క్రింద యివ్వకపోతే పెళ్లికాదు. చేను పెట్టాలే నువు మంచిదనకుంటే పెళ్లికాదు" అని వినయంగా చెప్పుకున్నాడు. వీరారెడ్డి ఆలోచించి ఆలోచించి నాలుగెకరాలు పెట్టాలన్నాడు. మూడేళ్లకు కచ్చితంగా బాకీ కట్టాల. పెళ్లి కార్యమని నీవు ఒంటిమాట మనిషివనీ యిస్తున్నాను. వొడ్డీ 2-50 వేసుకొంటాను. తోట పెట్టినట్లయితే రెండు రూపాయలే వేసుకొనేవాన్ని. చేనిగుడ్డాలకు విలువలు సరిగ్గాలేవు. నీకు తెలియందే ముంది. నా దస్తరానికి వూనము వచ్చేపనిచేయద్దు అని మరీమరీ హెచ్చరించి పొమ్మన్నాడు. సరేనని తలూపాడు రామయ్య. విధిలేదు. యింకొక వెయ్యి కావలసివుంది. ఆ వెయ్యి సవరించుకోకపోతే పెళ్లికాదు. గంగిరెడ్డిని చూడాలని అక్కడి నుండిపోయి గంగిరెడ్డితో ప్రస్తావించినాడు. గంగిరెడ్డి చాలసేపు మోడిపెట్టినాడు. దూరపు బంధువు కాబట్టి న్యాయ నిష్ఠూరంగా మాట్లాడి యింట్లో ఆడవాళ్లతో కూడా చెప్పించి ఒప్పించుకొన్నాడు. గంగిరెడ్డి "నాకూ రెండెకరాలు చేను ఆయకం పెట్టాల లేకుంటే యింట్లో ఆడోళ్లు వొప్పుకోరు". అని సాగనంపుతూ గట్టిగా చెప్పినాడు. విధిలేక రామయ్య సరేనన్నాడు. ఎట్లో ఒకట్ల డబ్బు సరిపోయింది. ఇక పాప పెళ్లి జరుగుతుంది. అని అనుకొని బరువుగా నిట్టూర్చి నాడు. ఇంటికి పోతూనే అందరికి డబ్బు విషయం చెప్పినాడు. వాళ్ల ముగ్గురికి ఆయకాలు ఎట్లెట్ల పెట్టాల్సింది కూడా చెప్పినాడు. సీతమ్మా రాములమ్మా ఏమయినాకానీ పిల్ల పెళ్లి కావాల. డబ్బు సరిపోయింది. ఇక పెళ్లి ఆగదు అని ఎంతగానో సంతోషపడినారు.

మాఘమాసం మూర్తాల్లో పెళ్లి ఖాయపెట్టున్నారు. వరుడూ వాళ్లకు పాత బంధువే. పిల్లోడూ బాగున్నాడు. తోట ఎకరా రాయించేట్లు ఏర్పాటు. ఉన్నంతలో పెళ్లి బాగా జరిగిపోయింది. అందరితోనూ రామయ్య మెప్పు పొందినాడు. "ఫరవాలేదు పిల్లను మంచోనికే యిచ్చినాడు. పెళ్లి ఖర్చు కూడా బాగా పెట్టినాడు" అని అందరూ అన్నారు.

పెళ్లి అయిపోయింది. బాకీ మండే కుంపటిలాగా వుంది. తన్నుకున్నా సంవత్స రాంతంలో వొడ్డీ చెల్లించలేకపోయినాడు. ఎంతో వినయంగా రంగారెడ్డికి చెప్పుకోవాల్సి వచ్చింది, ఏ ఏటికా ఏడు పంటలు సరిగా తీయలేకపోతున్నాడు. అప్పుల్లో సంసారమెక్కి రాదన్నట్లు అనిపించింది రామయ్యకు. సమయానికి వ్యవసాయం పెట్టుబడికే తక్కువ వస్తుంది. పైగా ఎక్కువ వొడ్డీలు. రామయ్యకు దిక్కు తెలియలేదు. మూడేళ్లు జరిగింది. భూములు అమ్మి బాకీ తీర్చే పరిస్థితి వచ్చింది. సీతమ్మకు రాములమ్మకు రామయ్యమీద జాలి. ఏంచేస్తారు. పెళ్లి అయిందని సంతోషం ఒక ప్రక్కన బాకీ తీర్చలేము. భూములు పోతాయి అని దిగులు. ఎంత ఆలోచించినా భూములమ్మక తప్పలేదు. వొడ్డీ మొదలు కలిసి పెదింతయింది. మూడున్నర ఎకరాలు వెలిపొలం అమ్మి బాకీలకు ఇచ్చినాడు. రంగారెడ్డికి వీరారెడ్డికి పూర్తి చెల్లు యిచ్చినాడు. గంగిరెడ్డికి మాత్రం వొడ్డీ యిచ్చినాడు. అసలు వెయ్యి మిగిలింది. గంగిరెడ్డి సాధింపు మొదలయింది. "అందరికీ బాకీతెంచి నాకు మాత్రం నిలపినావు' అని అంటూ వుంటాడు.

రామయ్యకు మిగిలిన భూమి – ఒక ఎకరాతోట– నాలుగున్నర ఎకరా చేనువుంది. ఒక వెయ్యి రూపాయలు అప్పు మిగిలింది. రామయ్య వ్యవసాయం దాదాపు కుంటుపడింది. ఇతరులపై ఆధారపడి పైర్లు పెట్టుకొంటూ వున్నాడు. ఆ వెయ్యి అప్పుతీరే దారి కనబడలేదు. ఎక్కువ వొడ్డీ ఐందానివల్ల భూమిపోయింది. ఇంకా కొంతపోవచ్చు. అని అనుకొంటూ వుంటాడు రామయ్య. పిల్లోన్నిక చదివించలేదు. ఇంట్లో అందరికీ అదీ ఒక దిగులు. వాడు ఒకయ్యకు పనికి పోవాల్సిన దుర్గతి వస్తూ వుంది. అది ఎంతో దూరంలేదు. సీతమ్మ రాములమ్మ ఆలోచనల్లో అలసిపోతుంటారు.

రామయ్య యింతకుముందు దొంగ బర్రెగొడ్లను గురించి ఆలోచించేవాడు. ఇప్పుడు అప్పులిచ్చిన వాళ్లను గురించి ఆలోచిస్తున్నాడు. అవి కావలివుండి తోలితే పోతాయి. మరి అప్పులోళ్లో! అని విసుక్కుంటూ గొనుక్కుంటూ వుంటాడు.

✡

# పగలూ రేయి శ్రమ పడుతున్నా

**– తుమ్మేటి రఘోత్తమరెడ్డి**

ఓదెమ్మ చెప్పిందంతా విని – చేయి కడుక్కుని లేస్తూ.. 'బాయి పనంటె మాటల్గాదె సెల్లె! లేటైతె లేటాయెగని– కసరెక్క ముదురాలె.. ఎట్లన్నజేసి ఈ సాలుకు ఈన్నే.. ఇగమల్లగా పటేల్కెవుంచు.. గాయినకిందైతెనె వుంటడు–పోరడు కసుబుసువన్న ఆ పటేలయితె ఏ అనడు" అన్నాడు సాయిలు.

సాయిలు తిన్న కంచం ఎత్తుతూ– ఓదెమ్మ.. "వుంచుటానికేందే అన్నా! ఉంచుత– కని వీడు చక్కగా ఉంటాండట్నే నిన్నటికి వారం రోజులాయె! ఎవలో–ఎవలో.. ఎక్కడ్నుంచి అచ్చింద్రోగని అన్నా! వీడు వీని సోపద్దార్లు వాళ్ళను గల్సింద్రు. ఏవనుకున్నరో ఏందోగని మొన్న – సంగవట ఏందో సంగవని వెట్టి పాలేరు తనాలు బందువెట్టిచ్చింద్రు. నిన్నటి దాక ఊరికి మాదిగిండ్లకు నడువ అగ్గిజూపుతె బగ్గున మండెటట్టుండె!– ఆఖరికి అటుజేసి ఇటుజేసి నెలక్కుంచెడు జీతం, సాలుకు యాభై రూపాల పెట్టువడి పెంచుకున్నరు.. ఊళ్ళె పటేండ్లకు వీడంటె కడుపుమండుతాంది. ఇక వాళ్ళ పటేల్గాడ గుర్రుగనే వున్నడు. మునుపటోల్గె పన్జేత్తలేడని ఇక గట్ల వాడేందో వాని తిరుగుడేందో? నా పానంల పానం వుంటలేదన్న! ఆడైతె వాని బతుకేందో వాడన్న బతుకుతడు. ఈడ నాలుగురెక్కలిరుసుకోని ఎన్ని పుల్లెందలువడ్డా పొయి కింది కుంటె పొయిమీది కుండది. పొయి మీదికుంటె– పొయికింద కుండది" అంది ఓదెమ్మ.

పై పంచెతో చెయి తుడుసుకుంటూ వచ్చి గడంచెల కూర్చుంటు సాయి...

"ఈడికంటె ఆడ కొద్దిగ పరుకుంటదనుకో! అదీ సంపాదన్లనే– దాని మందం కట్టం వుంటదనుకో! ఇగాడ దొరల్దాతల తలదన్నే బాయిదొరలుంటరు– ఇసోంటోడు ఈడున్నా ఏడున్నా ఊకోడే. వాని తత్త్వవే అంత!" అన్నాడు.

"ఏందోనె–నాకు సమజైతలేదు" కుండలు ఉట్లపై సర్దుతూ ఓదెమ్మ అంది.

"సముజేందె సముజు? పటేలింటికి నేనత్తపా.. ఎన్నడో యిరువై యేండ్ల కింద జూసిన – ఓ పాల్జూసినట్లుంటది" అన్నాడు సాయిలు.

'సరె' అన్నది ఓదెమ్మ. ఇద్దరు ఇంట్లోంచి బయటికి నడిచారు. ఓదెమ్మ పక్క గుడిశెలోని కొడుకును కేకేసి పిల్చి...

'మల్లేసు! రేపట్నుంచి మల్లతీర్నే తీరదు బిడ్డా! కసతుమ్మల్ల మొకానవోయి మోపెడన్ని పుల్లల్జాసుకురా– నేను పటేలింటిదాక పొయ్యొత్త– మావ పొయ్యత్తావంటాడు' అంది.

మల్లేసు బయటకువచ్చి "మాపోతవో" అన్నాడు.

తల తిరిగే ఎండ– ఓదెమ్మ ముందు నడుస్తోంది. వెనుక సాయిలు నడుస్తున్నాడు నెత్తిమీద పాతగుడ్డతో– రెండతుకుల కొంగులేని పాత చీరతో– రేగిపోయి తెల్లబడ్డ వెం ట్రుకల్తో– చిరిగిన రవికెతో ఓదెమ్మ ఓచేయి రొండికి ఆనించుకొని నడుస్తోంది. సాయిలు చూస్తున్నాడు. హఠాత్తుగ, చెప్పుల్లేని ఓదెమ్మ కాళ్ళపై చూపుబడ్డది.

"సెప్పు సింపుల్లేవే.. సెల్లే" అని అడగలేకపోయాడు కాని– "ఎవల్తోనన్న సెప్పులు కొని పంపాలె" అని మనసులో అనుకున్నడు.

ఊరికి..ఊళ్లోంచి విసిరివేసిన హరిజనవాడ యిండ్లకి దాదాపు 'కేక'పెట్టు దూరం– మట్టిరోడ్డుంది.. దానిపై చెప్పుల్లేని పేదపాదాలని చురుక్కుమని పించె వేడి వేడి దుబ్బుంది– ఎవరో తుమ్మపొరక గుంజుకపోతున్నట్టుంది. దబ్బనాల్లాంటి ముండ్లుకూడ వున్నాయి. దారి పొడుగునా తాడిచెట్టు.. చెట్టుమీది ఆకులు కదల్డంలేదు. ఆకులమీది పిట్టలు మాత్రం కిలకిల్లాడుతున్నయ్!

సాయిలు పరిసరాల్లో కలిగిన మార్పుల్ని చూస్తున్నాడు. ఇరువయ్యేండ్లలో.. ఊరిలో కలిగిన మార్పుల్ని చూస్తున్నాడు శ్రద్ధతో–

"మోటలుండే మునుపు– కరెంటు మోటర్లచ్చినయ్! ఇక తూర్బాజు మాదిగిండ్లులేసి పడువటి బూజు కోటర్సులుగట్టిచ్చింద్రు! ఊళ్ళే పానాదులు (పానాదులు= దారులు) కసమంచిగ జేసింద్రు! లైట్లు పెట్టిచింద్రు! గంతే! ఊళ్ళే గుడిశెలు గూనకప్పటిండ్లు ఇరువై ఏండ్లకింద కంటె అద్వాన్నంగానే వున్నె. ఒక్కాసామి గూడ నాలుగు బెంగుళూరు పెంకలేసి కట్టలేదు సెల్లె!" అన్నాడు సాయిలు.

"ఏడేసెటట్టున్నదే అన్నా! ఇన్నొద్దుల కాలమా! అన్నా! పంటల్–ఫలాల్ లెవ్వాయె! వుంటె ధరల్లేకపాయె" అంది ఓదెమ్మ.

"ఓదెవ్వా–గాతెల్లిల్లెవల్దె? కొత్తగ్గట్టినట్టున్నరు".

"అదా! కోమటి లింగయ్యది" నడుస్తూనే చెప్పింది.

ఇద్దరూ మరికొంత దూరం నడిచి ఓ ఇంటి గడుకొయ్యల ముందాగినారు. కొయ్యలు తీసుకుని లోపల్కి వెళ్ళారు. సాయిలు నుదుటికి చేయి అడ్డంపెట్టుకుని చీకటిగా అగుపిస్తున్న

ఇంట్లోకి చూశాడు. రాంరెడ్డి మోదుగు ఆకుతో చుట్టచుట్టుకుంటున్నాడు మంచంమీద కూర్చుని. సాయిలుకు కొద్దిగా కష్టమైంది పోల్చుకోవడానికి. ఎప్పుడో తన చిన్నతనంలో ఇరువై ఏండ్లకింద జూసె మరి! మనిషి రేగడి మట్టిబొమ్మలా నల్లగ.. చిక్కిపోయున్నాడు. దర్వాజ ముందు ఓదెమ్మ సాయిలు నిలబడేసరికి.. ఇంట్లో చీకటి కమ్మింది. "ఎవరో.. వచ్చింది?" అన్నట్టు తలపైకెత్తి చూశాడు రాంరెడ్డి.

"దండం పటేలా..!" అన్నాడు సాయిలు.

రాంరెడ్డి సాయిల్ను గుర్తుపట్టకపోయినా.. ప్రతి నమస్కారంజేస్తూ.. కళ్ళు, నుదురు చిట్లించి చూస్తుండిపోయాడు. ఆయన మంచం పక్కగా.. కూర్చున్న తెల్లకొంగలాగ తెల్ల వెంట్రుకల్తో.. తెల్ల చీరలో.. రవికెతో.. కాస్త మకిలిపట్టిన తెల్లని వెండిగాజుల్తో రాంరెడ్డి తల్లి కూర్చొని పాత పరుపు తాలుకు దూది పింజుతోంది. ఆవిడ ముక్కుమీదికి ఆవిడంత వయసున్న కళ్ళజోడొకటి జారివుంది. ఆవిడ అందులోంచే చాలా తమాషగ, దీక్షగ, బోసి నోరు ఇటూ అటూ ఆడిస్తూ దూదిపింజుతోంది. ఆవిడకు కొంచెం చెముడు. అందుకే వచ్చిన సాయిలు, ఓదెమ్మల గమనించకుండ తన పనిలో తానుండి పోయింది.

ఓదెమ్మను సాయిల్ను మార్చి మార్చి చూస్తున్న రాంరెడ్డి సాయిల్ను గుర్తుపట్టలేక పోయాడు.

"మా అన్న.. సాయన్న బాంచెన్" చివరికి ఓదెమ్మ తెలియచెప్పింది.

"ఎవలూ? సాయిలా?" రాంరెడ్డి ఆశ్చర్యంగ నోరుతెరిచాడు. "ఎప్పుడో ఇరువై ఏండ్ల కిందవాయె. అప్పుడు గింట్లుండెనా? నెత్తికి జడలుకట్టిన ఎంటికల్తో ఇంత బుడ్డగోసి వెట్టుకోని గింతాంతుండె ఆ!" వేలుతో చూపిస్తూ అన్నడు.

ఇప్పటి సాయిలు వేషం చాలావేరుగా వుంది. తెల్లధోవతి అంగి, కాళ్ళకు ఓ‌తీరు చెప్పులు. కాని మనిషిని పరీక్షగా చూస్తే కొద్దిగ పాలిపోయినట్టు అగుపిస్తున్నాడు. బహుశా చిరకాలంగా, బొగ్గుబాయిలో పన్జెయ్యడం మూలంగానో ఏమో! ఆరోగ్యం దెబ్బతిన్నట్టు గున్నడు.

అప్పటిగ్గాని ముసలావిడ తలపై కెత్తి చూసింది కాదు. చూసి అద్దాలు ఎగదోసుకుంటూ "ఎవరూ?" అంది బిగ్గరగా. సమాధానం చెప్పింది ఓదెమ్మ. దానిమీదట ఆ ముసలావిడ నాడెన్నడో పోయాడని, ఇప్పుడేం పన్జేత్తాండని, పిల్లలెంతమందని ఏకరువు పెట్టింది. పనిలో పనిగా పాత దూది ఇంత తీసి ఓదెమ్మ ముందు విసిరింది. ఆమె తత్వం ఆమెదే!

సాయిలు, రాంరెడ్డిని ఉద్దేశించినట్టు సమాధానాలు చెప్పాడు. ముసలావిడకు కొన్ని వినపడకపోయినా మళ్ళీ మళ్ళీ అడగలేదు. అదే ఆమె చెముడులోని మంచి గుణం!

"ఎన్నడచ్చినవ్? మల్లెన్నడుబోతవ్?" రాంరెడ్డి.

"పొద్దుగాల్నె అచ్చిన, రేబ్బోవాలె. ఎల్లుండి జీతాలు" సాయిలు.

"ఏందిరో? రాక రాకచ్చి రేబ్బోతెట్లరో? ఓ రెండ్రోజులన్నుండకపోతే? గంతుండ బుద్ధిగాకుంటైనాయిరా మా పల్లెటూళ్ళు ఆ!"

"అదె పటేలా? ఇక్కడ పుట్టిక్కడ పెరిగినోన్ని జీతాలెల్లుండే గంద్కని" సాయిలు సంజాయిషీ.

"పోయినంక తెచ్చుకోరాదా? లేక కొడుకున్నోల్తియ్యరా? అన్నట్టు కొడుకేం జెత్తాండు?"

"కొడుకంటే, ఒగడు పెద్దసదువే సదివిండు. రైటర్పని కక్కెరకచ్చేదిగని ఇంక కొలువు దొరుకలేదు. నౌకరికోసం తిరిగి తిరిగి యాట్టకచ్చినప్పుడల్లా నీయవ్వ నౌకరి దొరకదది కాదు. పోదునేంగూడ నీలెక్క బాయిపనే సేత్తనంటడు. ఇగ ఇంకోడు ఏడోటి సదువుతాండ" న్నాడు సాయిలు.

"నీకేందిర సాయిలూ, మారాజు మారాజువైనవ్. ఆ!" ఎటో చూస్తూ అన్నాడు రామిరెడ్డి.

"ఏమ్మారాజులవయ్యా? సేసిన్నాడ్సేసినంత!"

"మాకు గట్లగూడ లేదుగదరా. గడియ రికాములేదు గవ్వ రాకడ్లేదు అన్నట్టు" చుట్ట కొరుకుతూ అన్నాడు రామిరెడ్డి.

"అదెనయ్యా తవరికేవైంది? ఓ పాలేరు, ఎదిగిన కొడుకు బంగారంవోల్గె కిందికో మీదికో రొండు నాగంట్ల శాత! ఆ! యాల్లకింతదిని అజ్యెయ్యి, ఇజ్జెయ్యి అన్సెప్పుడుదప్ప. శాతనైనన్ని రోజులు యింత పన్జేసుడు తప్ప!"

"గట్లనే అన్పిత్తదిరా సాయిలూ, దూరపు కొండలు నున్నగుంటయట!" సాలోచనగ అన్నాడు రాంరెడ్డి నిట్టూరుస్తూ.

మిరపకాయల గంపను తవ్వుతున్న కోళ్ళను..

"ష్హో... ష్హో..." అంటూ అదిలించాడు రాంరెడ్డి. ముసలావిడ వయసావిడలా గబాల్న లేసి.. "ఉష్హో మీగ్గత్తరవుట్ట! ఉష్హో" అని కోళ్ళను ఇంటిబయట పడగొట్టివచ్చి ఓదెమ్మనుద్దేశించి

"ఏవె.. ఓది! గమిర్పకాల్గొంచ వోకపోతివి. ఆడవారేత్తె కోళ్ళు, బాతుల్, కుక్కల్నక్కల్ కళ్ళం కళ్ళం జెయ్యవట్టె! ఆ!" అన్నది.

"అదె బాంచెన్! ఎందుగ్గొంచవోను?" దూదిపింజుతూ ఓదెమ్మ.

"అదెందుగ్గొంచవోద్ది? కావన్నంటె మర్రి మనకే పెట్టెటట్టున్నది. దానికి మిర్పకాయలో? బిషాదా!" రామిరెడ్డి వెటకారంగ.

"ఆ... నువద్దే. నాకు తోటలాయె!... పెరండ్లాయె! గాతూంగుళ్ళైదు మిర్పకాయలో లెక్కా?" కొద్ది రోషంతో ఓదెమ్మ.

సాయిలేమో ఏమి అర్థంగానట్టు చెల్లెలి కేసి, రాంరెడ్డి కేసి, మూలనున్న మిరపకాల గంపకేసి మార్చి మార్చి చూడసాగాడు.

"తోటల్లేపాయె! పెరండ్లు లేకపాయె ఆ మరీ మిర్పకాయ లెందుగ్గొంచవోనట్టు? ఈడికి తోటలీటువోయి నెలరోజులాయె! ఆ వాటితోని వాకింట్ల పెద్ద అంగడైతాంది." కాస్తా కోపంతో రాంరెడ్డి అన్నడు.

"పండనేడు పండకనేపాయె! పండినేడన్న ఓ నాలుగ్గాయ లెక్కువ పెట్టకపోతిరి! పూర అద్వాన్నం జెయ్యవడ్తిరి." కొద్దిగ ముఖం మాడ్చుకుని ఓదెమ్మ అంది.

"ఇంకేంబెడ్తరే? పెట్టే తీర్గవెట్టిన పంటనువట్టి."

"ఆర్గాలం నేన్నాపోరడు అర్వమోటు కట్టంజేత్తానమ్ తవరికెరుకలేందే వున్నది? పండనేడు నిరుడు గిన్ని వెట్టుండి గన్ని వెట్టుండని నేనేం తఖురార్జెసిన్నా? తవరికి తెల్వందేవున్నది? పండినేడు మాకట్ట సుఖంజూడకపోతరా అని ఊకుంటి. దేవుడుమన్నించి నాలుగ్గాయలు పండినేడు కూడ గట్లనే అంటె ఇక నేన్నా పోరడు బతికేదెట్ల? తవరే సెప్పుండ్రి" అన్నది ఓదెమ్మ.

రాంరెడ్డి ముఖంల రంగుమారింది ఆవేశంతో.

"అవునే... పండనేడు నువ్ రెక్కల కట్టానికేకాదు మీదికెల్లి వెయిలక్ వేయిలు పెట్టుబడికి మునిగిన దానికేవంటావ్" ఓదెమ్మ ఏమీ మాట్లాడలేదు. రామిరెడ్డి మళ్ళీ కాస్తా నిమ్మళంగ చెప్పడం మొదలెట్టాడు.

"ఓది! నువ్ దుర్గన్ని పెండ్లిజేస్కొని దగ్గెర దగ్గెర ఇరువై ఏండ్ల కచ్చింది. ఈ ఇరువై ఏండ్లనుంచి నువ్ సూత్తనే వున్నవ్ – ఇండ్ల పన్జేస్కుంట!

"పాలేర్కు వెట్టక పసులోన్కి వెట్టక, బిచ్చగానికి వెట్టక అచ్చగానికి వెట్టక ఈ ఎగుసాయం జేసి నేనేం ఎనకేస్కున్నవో నీకెర్కలేదా? అవ్వ అయ్య పంచిచ్చిన భూమి జాగల్నుంచి అయిదెకరాలమ్మి ఆడివోరగండ్ల పెండ్లిల్జెసినగని రెక్కలమీదెల్ల దియ్యకపోతిని! ఇద్దరు మొగపోరగాండ్లయితే అయిదో పదో సదివి అగో నీ కొడుకోల్గె ఎద్దుముడ్డి పొడువవట్టిరి! నిన్నుగానక వాళ్ళనేం పెద్ద సదువుల్జదివిపిచ్చిన?

"అడ్డవైన గుడిశెల పొంట తిరిగింది లేదు. లొళ్ళుల్ల పంచాయిదుల్ల వున్నది లేదు. కాయిపాయి తిని సెడగొట్టింది లేదు. తాడిసెట్లకొరిగి తాగి తందనాలాడిందిలేదు. ఊళ్ళే వున్నడోలేడో అన్నట్టు మెదుల్కత్తిని."

"పుట్టి బుద్దెరిగిన్దగ్గర్నుంచి దిగే దోతుల్జోడ! మొన్నటిదాక ఎంకటకిట్టం నేసినయె. ఈమధ్య గిరాకీలేక వాడు బందుజేసినంక దుకాండ్ల కొనుడైతాంది. ఇగ గదేపొద్దింత మాపింతకూడు. వుంటె యింత నల్ల లేకుంటే కొనేదిలేదు! కొత్త పాచ్చందుల మాకు మీలెక్క గడ్కేగతి!

“నా పెండ్లయి యిరువై ఏండ్లుకత్తాంది మీపటేల్సాని మెడకు ఏవన్న కంటెలు గొలుసులు కనిపిచ్చినయా. ఏనాడో పెండ్లి అయినంక అమ్మజేయించిన పుస్తెలతాడు తప్ప!

“మిమ్ములగాదనెవలకన్న అప్పుల కిత్తినా? మిత్తీలకిత్తినా? నువ్ సూసుకుంట రాలేదుర సాయిలూ! ఆనాటికీనాటికి ఊరు ఏంమారిందో! ఒక్క కాపుదన పోదు గడ్డితీసి పెంక లేసిండా?” అన్నాడు రామిరెడ్డి.

“నిజవే” అన్నట్టు సాయిలు తల నిలువుగా ఆడించాడు. ఇంతలో చేతిలో తాడు.. గొడ్డలి, నెత్తికి చుట్టుకుని ఓదెమ్మ కొడుకు మల్లేశువచ్చి మావ సాయిలు పక్క కూర్చున్నాడు.

రామిరెడ్డి మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు.

“చూసినవ్ గదర సాయిలు! నాడు మోటలుండె. అయిలింజనులు, ఇప్పుడిప్పుడు కరెంటు మోటర్లచ్చినయ్! ఎనుకట మోటల్గొట్టి ఇంతింత సంపాయించినమ్‌గని ఈనాడు అదీలేదు!

ఇగ ఇన్నొద్దుల కాలం గాకపోయె! అంతం లేకుంట కూళ్ళు పెరిగె!.. జీతాలు పెరిగె! పెరిగితె పెరిగె అదెపాయె! కడుపుకు బతుకనియ్ అనుకుంటె పండిచ్చిందానికి పాసెగతాయె! అదెపాయె రెక్కల కట్టానికి సెడ్తానవా అంటె అదీలేదు! వెయిలకు వెయిలు వెట్టి మందుమసాల్లు సల్లుడు కావట్టె ఇయ్యాల్రేపు మందెయ్యంది మన్నె గతాయె!

“అటుజేసి ఇటుజేసి పండిచ్చి బండెడు వడ్లు బీటుకు కొంచవోతె రెండే రెండు మందు బత్తాల్రాకపోయె! ఇగ ఎగుసవెట్ల సేసేదిరా? నీ తల్లి! అమ్మవోతె అడివాయె! కొనవోతె కొరివాయె!

“ఈ ఎగుసాయం జేసి ఎనుకేసుకున్నదేంది? బాయిల్దవ్విన్నా? భూవులు గొన్ననా, లేక ఇండ్లు గట్టిన్నా? మీకు వెట్టక మిమ్ముల గానక ఆ... ఆగో నిరుడు పూర్తిగా కూలి మీద వడ్తమని ఇండ్లిప్పిన.. ఇంతవరకు మల్ల గుడిశెల మీద గూన పెంకలెయ్యలేదు. ఇల్లచ్చి పందిరేస్కకున్నట్లయింది.

“ఆడివోరగండ్లు... వాళ్లకు పెట్టేది పోయింది. వాళ్ళ దగ్గర్నుంచే వేయిలకు వెయిలు అప్పుల్దెచ్చి ఈ దరిద్రపెగుసాయంల పెట్టవడ్తి. ఈడికి మా పెద్ద దానికి పది పదిహేను వెయిలు బాకి. కాయిదంలేదు కతుపలేదు నాగటి మీదికి ఎద్దు లేదంటే ఇగో బాపంట జెట్నిచ్చె!

“ఎంత తీస్కో వద్దనుకున్నా.. ఆపత్కు ఇచ్చేటోడు లేక తీసుకునుడు అయింది. బాకి వుంటె తీరుత్త లేకుంటె దాని బాకిల వడిసత్త.. రేప్పొరగాండ్లు తిట్టుకుంటనో తిమ్ముకుంటనో తేర్సుకుంటరు. తడిసి ముప్పందువైనట్టు అయితె అయింది.

“మీ సెల్లేమో నన్ను కంటుజేత్తది సాయిలూ.. గతిలేక సేసుడుగని ఏం లాభంరా ఎగుసాయం? పై సంపాదన లేకపోతే ఎగుసం దండుగ! ఆవలోడు సూడవోతె రెండు నాగండ్ల

శాత! ఏవైతాంది అంటరు. మోసెటోని కెరుకట కావడి బరువు" అంటూ రాంరెడ్డి తన ఇరువై ఇరువై అయిదేండ్ల రైతు జీవితంలోని కష్టాలు నష్టాలు పూసగుచ్చినట్లు సొద వెళ్ళబోసుకున్నాడు. మల్లేశు శ్రద్ధగ వింటున్నాడు.

కొద్దిసేపాగి సాయిలు అన్నాడు.. "వున్న మారాజులంత పట్నాలపొంట బడి యాపారాలు చెయ్య భూములు జాగలమ్ముకొని వుడాయించబట్టిరి. ఓ మాటకు తవర్జెప్పింది నువద్దే! ఈ రోజుల్ల బాయిపనికి అచ్చెటోళ్ళల శానమంది కాపుదనపు మారాజులే! మారాజోల్లె ఎగుసాయం చేసుకోక గీపాడు పని కెందుకొత్తరయ్యా? అంటె ఎగుసాయాలు సక్కగ గడిత్తె గీపని కెందుకత్తం అని అంటరు"

"అంటవ్ మరి?" అన్నడు రాంరెడ్డి. ఓదెమ్మ మాట్లాడలేదు. కొద్దిసేపు ఇల్లంత నిశ్శబ్దంగ ఉన్నది. వంటింట్లో కొద్దిపాటి శబ్దం! ఏదో సర్దుతున్నట్టు!

ఎవరి పెదిమలు కదలకపోవడం చూసి మాట్లాడుకోవడం మానినట్టుందని.. ముసలా విడ మళ్ళీ దూది పింజుడులో మునిగింది.

"పోరన్సంగతేవంటారు?" అసలు వచ్చిన సంగతి అడిగింది... ఓదెమ్మ. "పోరడా! అక్కర్లేదని నాడెసెప్తి" అన్నడు రాంరెడ్డి.

"అదె పన్జెయ్యడనా?" నిష్ఠురంగ అంది ఓదెమ్మ.

"పనా! ఔ.. వాడిప్పుడు పనేంజేస్తడు! సంగంల లీడరాయె! అచ్చేపోయె సార్లను కలువన్నాయె! నాట్లప్పుడు కూలోళ్ళను పురెక్కిచ్చి పనులు బందు వెట్టిచ్చన్నాయె! సాలాకర్న పాలేర్లను బంధువెట్టిచ్చన్నాయె! వాడు పాలేరుంటె ఇవన్నెట్ల గడుత్తయ్!"

"కడుపు నొచ్చినోడు వోమ బుక్కుతడని మీరే అంటరు.. నేను పురెక్కిత్తె వాళ్ళు ఎక్కుతరా? ఎవల కడుపుతిప్పలు వాళ్ళు పడ్తరు.." అని మల్లేశు అనే సరికి, ఓదెమ్మ.. వ్యవహారం ఎక్కడ బెడిసి కొడుతుందోనని బయపడి "నువ్ కస నోర్మూసుకో.." అని చీదరించుకుంది.

"అసలు పాలేర్లనే పెట్టతల్చలేదు! ఏంజెయ్యాలె పెట్టుబడి అందదంది! తరంగాంది తలెత్తుకోనా? అవుతల ఇత్తీదనానికి దరల్లేకపాయె! పెద్ద గుర్రాలకు వెట్టినట్టు యాడాదికి జీతం బోంగ అయిదు నూర్ల పెట్టువడి యాడతెచ్చిచ్చేది? పెండ్లాం పోరగాండ్ల కుదువబెత్తె గిట్టనే!" అన్నడు రామిరెడ్డి.

"గంత మాటెందుగ్గని.. పాలేర్ను వెట్టకుంట ఎగుసవెట్ల నడుత్తది?" సాయిలు.

"గొడ్లకాసె పోరడుంటడు. మా సిన్నోడుంటడు. ఏదో శాతనైనంత దాక నేను సేసుకుంట. అందరం కలిసి అందిన కాడికి దున్నుకుంటెపాయె. తతిమ్మది బీడుపడుంటది. ఎవడన్నా కొడుతడా? ఏం జెయ్యమంటవ్? అందకపోతె! దున్నుకుంటం అంటరా? దున్నుకోంఁడి

అంట! దున్నుకోని నేనేం బావుకున్న కనుక! అంతే గని పాలేర్లని పెట్టువడులని నేను బోర్లపడలేను. వాడెవడో సెప్పినట్టు మూడొద్దుల బాగోతానికి మూతి మీసాల్గొరిగించు కున్నట్టు అయిద్ది!" అన్నాడు రాంరెడ్డి.

"పుట్లకు పుట్లు కాదుగాని సాయిలూ.. ఆవల దినుసు పండినంక పండిన దినుసుకు ధరున్నంక మమ్ముల గింత గీవాలన్నా జీతాలు వెంచుండ్రని. తడిబట్టను వడివెడ్తె నీళ్లెల్తయ్ గని పొడిబట్టను వడివెడ్తె నీళ్ళెట్ల ఎల్తయ్రా?"

"అయినా ఈ ఎర్రజెండల్వట్టుకోని తిరిగెవోల్లకు గింతగూడ నెనరు లేదేందిర? మరి గొర్రె బలుత్తే గొల్లోనికి లాభం! అన్నట్టు ఎగుసాయదార్ల కొరగ్గాడ కొట్లాడుదాం, వాళ్ళ ఇత్తిదనానికి తగిన ధరచ్చెటట్టుగా సర్కారోన్తోనో గావోకటోన్తోనో కొట్లాడ్తాం రాండ్రి అని పిల్వరెందుకురా? మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టు.. జీతాలు వెంచువనుడు కైకిళ్ళు పెంచువనుడు తప్ప మా కాపుదనపోళ్ళ గురించి పట్టించుకోరేందిర? ఆ... వీనవ్వ కర్మం పెండ్లాం ముండమొయ్య... మేవే చేసినాంర పాపం.." అంటూ చుట్టచేత బట్టుకొని "గింత అగ్గిదేవమ్మా" అంటూ ఇంట్లోకి కేకవేశాడు.

మల్లేశు కలుగజేసుకుని..

"కర్మం ఎక్కడిదయా పటేలా? ఒక్కమాట! మా కడుపాకలి మీకులేదు. మీ సంగతి వేరే. అయిన బట్ట గట్టన్నని. ఆడోళ్ళకు నగలు నాడాలు సేయించన్నని కొడుకుల పెద్ద సదుపుల్జదివిపియ్యన్నని. బిడ్డల పెద్ద పెద్ద మారాజులకియ్యన్నని. మీ ఆపతి. తిన్న పూటన్న సరిగ తిండి లేని మాకూ మీకు పొంతనెక్కడిదయ్యా పటేలా?

"... కాని పటేలా– పసిపిల్ల ఆకలయితే అమ్మా.. అంట కేకేత్తది. అట్ల కేకేకెయ్యన్నవి ఎవల్జెపుతరు? ఏపార్టీ చెప్పుద్ది. నడువుండ్రి... మీ కాపుదనపోల్లంత తగిన ధరల్రావన్నని బయటికి రాండ్రి... ఒక్క నెలరోజులు దినుసు మార్కెట్లకు కొట్టకుంట ఆపుండ్రి– మీతోని మేం రాకపోతె అప్పుడనుండ్రి. సర్కారోన్తోని కొట్లాడితె మీరు మేం కలిసే కొట్లాడుదాం. దానికేంది? దేనికదే. అసలు జీతాలని కూళ్ళని మేంమీతో కొట్లాడకపోతే మీరు ఈ సర్కారు ఈ షావుకార్లు కలిసి దోసే దోసుడు పట్టించుకుందురా? ఎంతదోసినా తిండి మందం కిందికో మీదికో వుంటన్నయి కనుక సప్పుడులేదు సరిలేదు. అదికూడ లేన్నాడు పటేలా మా లెక్క మీరుకూడా బజాట్ల కత్తరు. ఆయంక అందరం అత్తం, అందరిముందు ఎర్ర జండుంటది! లేకుంటే వాడెవడో చెప్పినట్టు ఒకడు సెట్టుక్కువంటె ఎక్కినోడు.. దిగువంటె గూడ తప్పక దిగుతాడు. కాని ఆకలయినోడు పండ్లు తినేదాక దిగడు. ఎందకంటెవాడు ఆకలికోసం చెట్టెక్కిండు కనుక. గంతేకని పటేలా గీసోడు తవ్వేడుకు కొట్లాడే మామీద కోపం గుంటెట్ల?" మల్లేశు మాటలకు ఎవరూ బదులు చెప్పలేదు. రాంరెడ్డి కూడా మాట్లాడలేదు.

"పటెల్సాని కనిపియ్యకపాయె ఇంతసేపు" అన్నడు సాయిలు.

"వున్నదున్నది... పెద్దకొడుక్కు మూటముల్లె కడ్తాంది" అన్నడు రాంరెడ్డి.

"ఎందుకు బాంచెన్.." మూతిముందుకి సాచి అంది ఓదెమ్మ. రాంరెడ్డి మవునంగ వూరుకుండి పోయాడు.

"బాయి పనికిరమ్మని బెల్లంపల్లి నుంచి వుత్తరం అచ్చిందట, పోతడట!" అన్నడు.

"బాయిపనంటె ఏంపని?" సాయిలు అడిగిండు.

"ఇంకేం పని... తట్ట మోసుడైంది."

'తవరు పొమ్మన్నరా?' ఆశ్చర్యంగ అడిగిండు సాయిలు. పొమ్మనెట్ల జెప్పాలె ఇంతను భవించి పోకనెట్ల చెప్పాలె? నేస్జంపాయించింది లేదా గాపనికెందుకందునా? ఓ దిక్కు లేనోని తీర్గపొయ్యి బొగ్గుబాయిల తట్టమొయ్యవందునా!

"తాత ముత్తాతల్దగ్గర్నుంచి కిందికో మీదికో ఎగుసంజేస్కుంట ఒకనింటికి పోకుంట బతికినం. అట్నో ఇట్నో నా కాలం గడ్సింది. వుంటె ఎల్లువానున్నదా పోనియ్" అని బాధగా చెప్పాడు.

అంతట్లోకె.. ముల్లెమూటతో వచ్చిన కొడుకు రాంరెడ్డి దగ్గెర మౌనంగ నిలబడ్డడు. యించుమించు మల్లేశు వయసే! అతనివెనకే లోలోపల ఏడుస్తూ.. ఇనుప గంటెలో అగ్గి తీసుకొని వచ్చింది రామిరెడ్డి భార్య.

"పోతాన బాపు" అన్నడు కొడుకు. ఒక్కక్షణం రామిరెడ్డి కడుపులో చేయిపెట్టి దేవినట్టు అయింది. "పోయిరా" అన్నాడేకాని ఆ కంఠం పూడుకపెయింది. ముసలామె, తల్లి కళ్లు తుడుచుకుంటున్నరు.

వెల్తున్న రామిరెడ్డి కొడుకు చేతిలోంచి సంచి తీసుకొని కొద్దిదూరం నేనువస్తానని మల్లేశు బయలుదేరిండు.

"ఓ రకంగ మీరు బాయి పనికిపోవుడే మంచిది. అక్కడ ఎగుసాయదార్ల గురించి బాగ ఆలోసించుండ్రి. యియ్యాల్రేపు బయటకి రాందే ఏం జరుగుతలేదు. అని మీరే తెల్సుకుంటరు– ఒక్కమాట! మీతోపాటు ఆర్గాలం మేం వుంటం. గది మాత్రం యాది కుంచుకోండ్రి" అని చెప్పి సంచి యిచ్చేసి తుమ్మచెట్ల దిక్కు నడిచిండు.

రాంరెడ్డి కొడుకు ఓసారి యింటి దిక్కు తిరిగి చూసిండు. యింట్లోని వారంత ఇంకా తనవైపే చూస్తున్నట్టు కన్పించారు. అందరి కండ్లు నీటితో నిండినయి.

నేడు రామిరెడ్డి పటేల్ కొడుకుపోతుంటె సరిగ్గా యిరువై ఏండ్ల కింద ఆఖరికి సాగనంపే దిక్కుకూడ లేకుండ తాను బాయిపనికి పోవడం గుర్తొచ్చి సాయిలు కూడా ఏడ్చిండు. అట్లనే తన కొడుకు పోతాడని గుర్తుకు తెచ్చుకుని ఓదెమ్మ ఏడ్చింది.

✡

# బిచ్చగాడు

**-పి.చంద్**

ఎండలు మండి పోతున్నాయి. ఎండలకు భయపడి జనం అంతగా బయటికి రావడం లేదు. మధ్యాహ్నం రెండు గంటల వేళ కరీంనగర్ బస్టాండ్ అరకొర జనంతో ఉంది. నేను వెళ్ళాల్సిన హుస్నాబాద్ బస్సు మరో అరగంట వరకు కాని రాదని చెప్పారు ఎంక్వైరీలో..

ఉష్ణ తాపానికి తట్టుకోవటానికి ఫంకా తిరిగే చోట బెంచి మీద చతికిలపడ్డాను. ఎక్కడి నుంచి చూసాడో ఏమో కాని వెంకటేశం నా ముందుకొచ్చి నిలిచేదాకా గుర్తు పట్టలేదు.

'ఎక్కడికి' అంటూ దగ్గరగా వచ్చిండు.

'ఇంటికే' అన్నాను వెంకటేశంను పరీక్షగా చస్తూ. మనిషి కొద్దిగా లావు అయినట్లుగా కన్పించిండు. దాదాపుగా నాలుగు సంవత్సరాల క్రింద చూసిన.. మళ్ళీ ఇవ్వాళ కన్పించిండు.

"అది సరే కాని నువ్వే పని మీద వచ్చినవు?" అన్నాను పరీక్షగా చూస్తూ.

ఖరీదైన తెల్లని ఖాది బట్టల్లో ఇస్త్రీ నలగకుండా యువరాజకీయ నాయకుడులా వున్నాడు వెంకటేశం. నా ప్రశ్నకు చిరునవ్వు విసిరి "అబ్బ ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే ఇట్లా ఉంటే మేలో ఎలా ఎంటుందో కదా? ముందు పోయి చల్లగా ఓ కూల్‌డ్రింక్ తాగుతాము పదా, తర్వాత తీరిగ్గా మాట్లాడుకోవచ్చు" అంటూ ఆహ్వానించిండు.

కాస్త మోహమాటపడ్తూనే వెంట వెళ్లాను.

కూల్‌డ్రింక్ చప్పరిస్తూ "ఇంతకు నువ్వేపని మీద వచ్చినవో చెప్పనైతివి" అన్నాను.

గడ గడ కూల్‌డ్రింక్ తాగేసి సీసా కౌంటర్ మీద పెట్టి జేబులో నుండి వంద కాగితం తీసి ఇచ్చిండు.

"గోల్డెన్ స్కీం ఏజెంటుగా చేస్తున్నా" అన్నాడు.

"అంటే" అన్నాను.

“అదంతా పెద్ద కథ కాని అది నీతో అయ్యే పనికాదు. నీకు చెప్పినా దండుగా” అంటూ నవ్విండు.

“అదేదో చెప్తే కదా అర్థమయ్యేది” అన్నాను మళ్లీ.

“ముందో పదకొండు వేలు కట్టె.. ఆ తరువాత మరో ముగ్గుర్ని చేర్పిస్తే ఆ తర్వాత డబ్బులే డబ్బులు” అంటూ ముక్తసరిగా ముగించిండు.

నాకు చూచాయగానైనా అర్థమైంది. ఆ మధ్యనే ఇటువంటి స్కీం పట్టుకొని మా చుట్టపోదు ఒకడు వచ్చి చాల సోది చెప్పిండు. అయ్యా ఇదినాతోని అయ్యే పనికాదు అని చెప్పి తప్పించుకునే సరికి తలప్రాణం తోకకు వచ్చింది.

“అయితే నీవు ఇంకా ఇటువంటి పనులు మానుకోలేదన్నమాట” అన్నాను. గతంలో ఫైనాన్స్ పెట్టి పాతిక లక్షలకు జనం మీద టోపీపెట్టింది గుర్తు వచ్చింది.

నువ్వోపిచ్చోడివన్నట్లుగ మరోమారు నవ్విండు. ‘ఇందులో మానుకోవడానికి మొదలు పెట్టడానికి ఏముంది? ఏదోవిధంగా నాలుగు డబ్బులు సంపాదించాలి. అంతే’ అన్నాడు. వెంకటేశము మాటల్లో నిజం లేకపోలేదు. పదో తరగతి వరకు మేము ఇద్దరము కల్సి చదువుకున్నాము. ఆ తర్వాత వెంకటేశం చదువు సాగలేదు. అసలు వానికి చదువు మీద శ్రద్ధలేదు. ఇంటరు అయ్యింది అని అన్పించుకున్న తరువాత ఇదిగో ఇటువంటివి ఏదో ఒకటి చేసుకుంటూ వచ్చిండు. కొన్ని రోజులు ఫైనాన్స్ నడిపించిండు. అటు తరువాత ప్లాట్ల బిజినెస్ చేసిండు. హైదరాబాద్, విజయవాడ రోడ్ల పొడావు పడావు భూమిని అడ్డికి పావుషేరు చొప్పున కొని ప్లాట్లు చేసి అమ్మిండు. ఆ మధ్యన ప్లాట్ల బిజినెస్ గాలిలా పాకింది. ఆ గాలిలో తాను కొట్టుకుపోయి, వీడి మాటలు నమ్మి తాను ఒక ప్లాటు తీసుకుంటే ఇప్పుడు కొన్న ధరకే అమ్ముతామంటే కొనే నాధుడే కన్పించడం లేదు.

“ఫైనాన్స్ సంబంధించి అదేదో కేసు, అరెస్టు అంటూ విన్నాను” అన్నాను.

అదంతా మామూలే అన్నట్టుగా మరోమారు నవ్వి “ఏదేమయితది... నడుస్తానే వుంటాయి అదంతసరేగానీ సిస్టర్, పిల్లలు బాగేనా? పిల్లగాండ్లు ఏం చదువుతాండ్లు”.

“పెద్దోనిది గుంటూరు రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ అయిపోయింది. చిన్నోడు ఈ సంవత్సరము టెన్త్ అయిపోయింది. వాన్ని మళ్ళీ ఎక్కడ చదివించాలా? అని గుంజాటన పడ్తున్న. పెద్దోన్కి రెండేండ్లకు ఎనభై వేలు అయింది. చిన్నోనికి లక్ష దాటేట్టు వుంది” అన్నాను.

“సంపాదించేదంతా పిల్లలకే కదా! ఇప్పుడు ఖర్చు పెట్టకుంటే ఆ తరువాత పెట్టినా లాభము లేదు” అన్నాడు.

“ఏమో తల ప్రాణము తోకకు వస్తుంది” అన్నాను.

ఇంతలో హైటెక్ హైదరాబాద్ బస్సు వచ్చి ప్లాటుఫారము మీద ఆగింది. అది చూసి వెంకటేశము “నా బస్సు వచ్చింది మరోసారి తీరిగ్గా మాట్లాడుకుందాము. ఇదిగో ఎప్పుడైనా హైదరాబాద్ వస్తే మా ఇంటికి రాకుండా పోవద్దు. దిల్‌షుక్‌నగర్‌లో కొత్త ఫ్లాటు తీసుకున్న. ఫ్యామిలీ కూడా షిఫ్టు చేసినా” అంటూ జేబులోని విజిటింగ్ కార్డు తీసి ఇచ్చి “నువ్వు హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ఇదిగో ఈ ఫోన్‌కు రింగ్ చెయ్యి. నేను అయినా వస్తా లేకుంటే కారిచ్చి మా డ్రైవర్‌నైనా పంపిస్తా మరిచిపోకు” అంటూ బస్సు కోసము పరుగెత్తిండు.

వాడు పోయిన దిక్కుకే చూస్తుండిపోయాను. వెంకటేశము నాకు ఎప్పుడు అర్థంకాని పజిల్ లాగే అన్పిస్తడు. ఒకరోజు ఇదంటడు మరోరోజు అదంటడు. వాడు ఎప్పుడు ఏం చేస్తాడో అర్థము కాదు. కాని ఒక్కటిమాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు. వాడు ఏది చేసినా ఈజీగా డబ్బులు సంపాదించడము ఎలాగో వానికి తెల్సినంతగా ఎవరికి తెల్వదు అన్పిస్తుంది. నిజానికి అటువంటి వాళ్ళదే కాలము మరి. వాన్ని తప్పుపట్టి ఏం లాభము. కాలమే అట్లా వచ్చింది. లేకుంటే ఇంత మోసాలు, దగా, కుట్రలు జరుగుతున్నా అందుకు పాల్పడిన దానికి ఎవనికి శిక్షలు అమలు జరగనప్పుడు వాడు కాకుంటే మరొకడు.

హుస్నాబాద్ బస్సు వచ్చి పాయింట్ మీద ఆగింది. అది తప్పితే మరోగంట వరకు వేచి చూడాలి. వడివడిగా నడుస్తు పోయి కండక్టరు వెనుక కిటికి ప్రక్క సీటు సంపాదించాను. డ్రయివరు, కండక్టర్ టీ తాగడానికి క్యాంటీన్ కేసి నడిచారు. మరో పావు గంటకు కాని బస్సుపోదని కండక్టరు పోతు పోతు చెప్పిపోయిండు. చేసేది ఏం లేక కిటికిలో నుండి బయటికి చూస్తుండిపోయాను.

సరిగ్గా ఆ సమయంలోనే నేను కూచున్న కిటికికాడికి వచ్చి యాచిస్తూ చెయ్యి చాపిండో ముసలివాడు. అతను నోరు విడిచి ఏమి అడగలేదు. కుడి చేతిని నొసలుకు ఆనిస్తూ దండం పెడ్తూ చెయ్యిచాసిండు. అతను నాకు చాలా విచిత్రంగా కనిపించిండు. అతని ఆకారము విచిత్రంగా ఉంది. అతనికి అరువై సంవత్సరాల వయస్సు పైబడి ఉంటుందేమో. ముఖము ముడ్తలుపడి ఉంది. నెత్తిమీద పాతకాలపు రైతులు చుట్టుకునే తలపాగ వుంది. అది మాసిపోయి చిరుగుల పేలికలా వుంది. అతను తొడుక్కున్న అంగి చిరిగి వుంది.

బ్రతుకంతా కాయకష్టము చేసినట్టుగా అతని చేతులు నరాలు తేలి పొగబారిపోయి నట్టుగా ఉన్నాయి. ఒక మాటలో చెప్పాలంటే అతనికి అడుక్కోవడము ఇష్టము లేనట్టుగా తప్పనిసరిగా అడుక్కుంటున్నట్లుగా అన్పించింది. అప్రయత్నంగా నే జేబులో చెయ్యి పోనిచ్చి రూపాయి బిళ్ల ఆయన చేతిలో వేసాను. కృతజ్ఞతపూర్వకంగా అతను దండం పెడ్తూ నావైపోసారి చూసి ముందుకు కదిలిండు.

నేను ఎక్కడో అతన్ని చూసినట్టుగా అన్పించింది. ఎక్కడ చూసాను? ఎవరతను? అస్సలు జ్ఞాపకము రావటము లేదు. కానీ నాకు అతను పరిచయం ఉన్నట్టుగా అన్పించ సాగింది. ఒక్క క్షణం ఆయన ఎవరో తెలుసుకోవాలనే అన్పించసాగింది. సీట్లో నుండి లేచాను. కానీ అప్పుడే వచ్చిన కండక్టర్ చేతిలో వున్న టికెట్ బాక్స్‌తో టక టకలాడిస్తూ రైట్ రైట్ అంటూ అరిచిండు.

నా ప్రయత్నాన్ని బలవంతంగా అణుచుకుని సీట్లో చతికిలపడ్డాను. కిటికి నుండి తల బయటపెట్టి అతను వెళ్ళినవైపే పరికించి చూసాను. దూరంగా మరోచోట నిలబడి ఎవరినో యాచిస్తున్నడు. అతను చీదరింపుగా చేతులు ఆడిస్తూ వెళ్లిపొమ్మంటున్నాడు. ఆ ముసలివాడు అక్కడి నుంచి మరోచోటికి కదిలిపోతున్నాడు.

బస్సు బయలుదేరింది. అంత వరదాక విపరీతమైన ఉక్కపోతగా ఉన్నదల్లా బస్సు కదిలే సరికి చల్లగాలి సోకి హాయి అన్పించింది. అతను కన్పించేంత వరకు అటువైపే చూస్తుండిపోయాను. కండక్టర్ వచ్చి టికెట్ అడిగే సరికి నా ఆలోచనకు అంతరాయ కల్గింది.

టిక్కెట్ తీసుకున్న తరువాత నా ఆలోచన అప్రయత్నంగా మళ్ళీ ఆ ముసలివాని గురించే ఆలోచించసాగింది. కాని ఎంత గింజుకున్నా జ్ఞాపకము రావటము లేదు. నా ఆలోచనలు మళ్లించుకోవటానికి నేను చేసిన ప్రయత్నము విఫలమై మళ్ళీ మళ్ళీ నా ఆలోచనలు అతని చుట్టు ముసరసాగాయి. చాలా సేపటికిగానీ గుర్తుకురాలేదు. మా ఊరివాడే. మావాడ కట్టువాడే. ఆయిన తెలుకుంట లచ్చయ్య. మా ఇంటికి రెండిండ్లు ఆవతలే వాళ్ళుండేది. ఆయన కొడుకు రాజమల్లు. నాతోటి వాడే. ఐదో తరగతి వరకు రాజమల్లు, నేను కల్సే చదువుకున్నాము. ఐదో తరగతి తరువాత ఆరో తరగతికి నేను ప్రక్క ఊరికిపోయిన. కానీ రాజమల్లు ఐదో తరగతికే పులిస్టాప్ పెట్టి తండ్రితోని వ్యవ సాయంలో దిగిపోయిండు. పండక్కి పబ్బాలకు ఇంటికి పోయినప్పుడు రాజమల్లు కలిసేవాడు. చిన్నప్పుడు వాళ్లింటి వెనుక చింతక్రింద ఆటలాడుకునే వాళ్ళము. రాజమల్లు నాన్న లచ్చయ్య నేను ఎరిగి ఉన్నప్పటి నుండి కష్టపోతే. వాళ్ళకున్న రెండు ఎకరాల చెలుక, ఊరి చెరువు క్రింద ఇరవై గుంటల పొలము. అదే సర్వస్వము. తెల్లారి లేసింది మొదలు చీకటి పడేదాక ఆయన రెక్కలు ఎప్పుడు రికాముగా వుండేవి కాదంటే నిజం. పనో పనంటు జీవితమంతా కష్టము చేస్తూ బ్రతికిండు. ఎప్పుడైనా ఎవరికైనా పిడికెడు పెట్టినోడే కాని చేయి చాపి అడిగింది లేదు. అటువంటి లచ్చయ్య అడుక్కుంటూ కనిపించే సరికి కడుపులో ఏదో దేవినట్టుగా అన్పించింది.

ఆ మధ్య ఊరికిపోయినప్పుడు రాజమల్లు పురుగుల మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నడని తెలిసి అవాక్కయిపోయిన. వాడు చిన్నప్పుడు ఎంత గడుసోడు, ధైర్యవంతుడుగా ఉండెనో నాకు ఇప్పటికి గుర్తు. చిన్నప్పుడు ఒకరోజు గడ్డివాములకాడ ఆడుకుంటూ వుంటే జెర్రిపోతు కన్పిస్తే దాని తోకపట్టి గిరగిర తిప్పి చింతచెట్టుకు విసిరి చంపిండు. అటువంటి రాజమల్లు పురుగుల మందు త్రాగి చనిపోయిండంటే నమ్మబుద్ధి కాలేదు.

ఆ పైన రెండేండ్లుగా సరిగా వర్షాలుపడలేదు. పోయిన ఏడు వేసిన వేరుశనగ పంట అడికి అడికే అయ్యింది. ఈ ఏడు పత్తిపంట వేస్తే ఎన్ని మందులు కొట్టినా పురుగు చావలేదు. పూత పూయలేదు. కాత కాయలేదు. ఏం చేస్తడు మరి చావకుంటే అంటూ వూరివాళ్ళు చెప్పుకొచ్చిండ్లు.

ఆ తర్వాత బ్యాంకు వాళ్ళు ఇచ్చిన అప్పుక్రింద వాళ్ల భూమిని జప్తు చేసుకున్నారని తెలిసింది. రాజమల్లు ఇద్దరు పిల్లలను పట్టుకొని లచ్చయ్య ఊరు విడిచి పెట్టిండని తెలిసింది. కానీ లచ్చయ్య నాకు ఈ విధంగా కనిపిస్తాడని ఊహించలేదు. ఎందుకో అప్రయత్నంగా నా కళ్ళవెంట నీళ్ళూరసాగినవి. మనసు కుత కుతలాడసాగింది.

వెంకటేశము, లచ్చయ్యకు మధ్య ఏదో అర్థంకాని పోలిక. ఎంత దుర్మార్గమైనది ఈ లోకం. ఎవడు కష్టము చేస్తాడో వాడికి తిండిలేదు. వెంకటేశం ఏం కష్టపడ్డాడని అన్ని కోట్లు సంపాదించిండు. ఏది న్యాయం ఏది అన్యాయం. నా బుర్ర వేడెక్కి పోతోంది.

✡

# అడివి

**–సడ్లపల్లె చిదంబరరెడ్డి**

"తొలికోడి కుయ్యకున్నట్లె వొస్తివి. ఇంతేన నీళ్లు పారిండేది?" అని కొల్లమ్మ భర్త కదిరెప్పను ప్రశ్నిస్తూనే మోసుకొచ్చిన సంగటి గంపను చేనిగట్టుపై దించి, తాను తోలుకొచ్చిన ఎనుమును అటుపక్కగా ఓ చెట్టుకు కట్టేసింది.

"నేనేమి జేతు లబలబా అంటాని నోరన్న కొట్టుకొందున? నీళ్లొచ్చి అట్ల సేన్లేకి తగుల్తానె లటుక్కున కరెంటు పోతా వుంది. ఒచ్చిన్నీళ్లు ఒచ్చినట్లె కాలువలోనె ఇమిరిపోతావుండివి" అని విసుక్కొంటు తాగుతున్న బీడీని పారేసి, చేతిలోని పారను కాలువ దగ్గర వుంచి బురద చేతులు కడుక్కొని వచ్చి గంప దగ్గర కూర్చున్నాడు.

కొల్లమ్మ కదిరెప్పకు రాగిముద్ద, ముల్లంగిగడ్డల చెట్ని తట్టలో వడ్డించింది.

మొదటి కబళం తుంచుకొని భక్తితో కళ్ల కద్దుకొని అక్కడే ఆశగా చూస్తున్న కుక్క ముందుకు విసరి–

"ఊఁ నువ్వుగూడ తిను" అన్నాడు కదిరెప్ప.

"ఏడిది తింటావులే. ఈ సెరకుతోట సూస్తే కడుపులో నిప్పులు పోసినట్లుంది. రేశం పుల్లలు నాటింటే ఇంతసేపుకి ఒగుపంటయినా వొస్తావుండె. 'దానికి పసిబిడ్డ శాకిరీ ఎవురు సేస్తార్లే' అని జెప్పి సెరకు తొక్కితివి. అదన్నా ఎండలు బలుసుకుండ వుండినపుడు అయింటే బాగా మొలుస్తావుండె. ఇపుడు యండ అగ్గయి కారుతావుంది. మొలిసిన మోసులు మొలిసినట్లె సుడి ఎండుకు పోతావుండివి" అని భర్త మీద విసుక్కొంటూ ఉండగానే అటుగా అంజినరెడ్డి వచ్చాడు. "ఏడిది కొల్లమ్మా వాన్ని అట్ల తిడతావుండావు? వాడు బతకల్ల అని పంట పెట్టిండాడు కాని పాడైపోవల్ల అని కాదు. ఒగొగు టైం ఒగొగుపంట దెబ్బతింటుంది. అంతమాత్రానికే అట్ల బేజారు సేసుకొంటెయట్ల?" అన్నాడు.

"నీ కూతురుది యపుడూ వుండేదేలే మామ! అదట్లున్ని సేతులు కడుక్కొ ముల్లంగి గడ్డల ఊరబిండి శానా బాగుంది ఒగముద్ద తిందువు" అన్నాడు కదిరెప్ప.

"అయ్యో! మనింట్లో తినకుండ వుండే ఓళ్లని అట్ల తినమంటె మనకు పాపమొస్తుంది ఊరుకో!!" అంది కొల్లమ్మ మెల్లగా.

"ఏడిది కొల్లమ్మా అట్లంటావు. పంట నీ కడుపులో పండిందేదైతే తినగూడదేమోగాని, పండిందేదంతా బూమితల్లి కడుపులో, నీళ్లు కూడా ఆ తల్లే ఇస్తుంది. ఆ తల్లి ఇచ్చిండే బువ్వనే అందరూ తినుకొంట నీదా కులము, నాదీ కులము అంటాని దూరము దూరము బతికేది సూస్తే మనమింకా అడివి మనుషులేనేమో అనిపిస్తుంది.

"ఇపుడు సూడు పొద్దున్నె దినామూ పాలుపోసి పోతావు. ఆ పాలతోనే కాఫీ సేసుకొని తాగుతాము. మజ్జిగసేసి ఇంట్లొ అందరూ తింటాము. అట్లా తవడ బువ్వతింటే మాత్రం ఏమౌతుంది?" అంటూ తలకు చుట్టుకొన్న టవల్ తీసి గట్టు మీద వేసి దానిపై కూర్చున్నాడు.

"అయ్యో ఊరికే అట్లంటిలే పెద్దయ్యా. నువ్వు యా పొద్దు మాత్రం మాతో తక్కువగా సూసిండావు. అట్లా జనాలింకా ఆడాడవుండారని ఒగొొగుతూరి నాకు రేగిపోతుంది" అని మాట కలిపింది కొల్లమ్మ.

"అదట్ల వుంచి మీ పెద్దయ్యకి ముల్లంగి గడ్డలన్నా పీకీపో ఒగపూటకి శారకన్నా అవుతాయి" అని భార్యను పురమాయించాడు కదిరెప్ప. దానికి అంజినరెడ్డి కొల్లమ్మను వద్దని చెప్పి "వంకాయి సెట్లకి నీళ్లు పెడుతావుంటె నీతోట్లో ముల్లంగి గడ్డలు గ్నాపక మొచ్చి ఇట్లే ఒస్తి. సెరకుతోట జూస్తె అట్ల అగ్గిబడింది. అది అవుతుందో పోతుందో ఆ దేవునికే తెలీదు. తీర్ల మీదుండే ముల్లంగి గడ్లన్నా అమ్ముకొంటె కరెంటు శార్జీల కన్నా గిట్టుతుంది. ఆదిడిసి పెట్టి ఒగొొగు దినము ఒగొొగురికి ధర్మరాజాకట్ల దానము సేస్తావుండావంట. ఇంత వూరిలో నీకు వుద్దరగా ఏడిది పుడతావుంది. దానధర్మాలకి కాలం గాదిది. అంతా దుడ్లు కాలము. దుడ్లుండే వాని దగ్గరికి తోకాడిచ్చుకొంట అందరు కుక్కలమాదిరి ఒస్తారు. అదే దుడ్లు లేనోన్ని అందరూ, గతిలేనోడని కుక్కల మాదిరి మొరుగుతారు.

నిన్న ఇందూపురం మార్కెట్‌లో వంకాయిల దుడ్లు రావలిసింటే పొయ్యింటి, కేజీ ముల్లంగి నాలుగు రూపాయలు. అందరూ కండ్ల కద్దుకొని కొనుకుపోతావుండ్రి. నామాటిని ఈ గడ్లన్ని ఎవరికైనా అమ్మేయి" అన్నాడు అంజినరెడ్డి.

"అట్లా పన్లు మాకేదవుతాయి. అంతా కూకోవుండే తాకే జరిగిపోవల్ల" భర్తను చూస్తూ హేళనగా అంది కొల్లమ్మ.

"నా మానమెందుకు తీస్తావులేయే. మీ పెద్దయ్య సెప్పినట్లె కాని" అంటూ తట్టల సగం ముద్దను భార్యకోసం వదిలేసి కాలువలో చేయి కడుక్కున్నాడు కదిరెప్ప.

అంజినరెడ్డి అక్కడి నుంచి లేచి టవల్ విదిలించి భుజం మీద వేసుకొని తన పొలం వైపు వెళ్లిపోయాడు.

"ఇందూపురం నుంచి ఎవురోవొచ్చి అడిగేవొరుకూ యాల, మనమే తీసుకొని పోతే ఆడ కొనుకోర ఏమి?" అని భర్తని పురమాయించింది కొల్లమ్మ.

ఆ రోజు సాయంత్రమే కదిరెప్ప ముల్లంగిని ఆకులతో సహా తీసి అడుగున టెంకాయ మట్టలు వేసి పెద్ద పెద్ద మోపులుగా కట్టి తెల్లవారుతూనే బజారుకు బయల్దేరాడు.

వాటిని చూసిన రైతులంతా "ఫరవాలేదు లేప్పా దొంగలు తూకమేసుకొన్నా, యంతలేదన్నా నూరుకేజీల గడ్డవుతాయి. కేజీ రెంద్రూపాలయను కొన్నా ఇన్నూ ద్రూపాయలొస్తుంది. ఏడిదో సంతకర్చులకన్నా జరుగుతుంది" అని మాట్లాడుతున్నంతలో ఒక లారీ వచ్చింది.

దానిని ఆపి గడ్డల మోపులన్నీ అందులో వేశాడు. సగం దూరం పోతూనే లారీ అతను కదిరెప్పను లగేజీ అడిగాడు.

తన ఊరి నుండి హిందూపురానికి బస్సు ఛార్జీ నాలుగు రూపాయలు. ఐదు మోపులకు తనకూ కలిపి ఇరవై రూపాయలిచ్చాడు కదిరెప్ప. అందుకు లారీ అతను ఒప్పుకోలేదు. కదిరెప్ప మరో ఐదు రూపాయలివ్వబోయాడు.

లారీ డ్రైవరు మారుమాట్లాడకుండ లారీని ఆపేశాడు. "ఇది ఎద్దులబండి కాదు. మూడు లక్షలు పోసి తెచ్చిండే లారీ!! యాభై రూపాయలిస్తే ఇవ్వు లేకుంటే 'ఒరే కరీం డోర్ తీసి ఆ మోపులన్నీ కిందకు నూకరా' అంటూ క్లీనర్‌ను ఆదేశించాడు.

"ఏమన్నా కాసిన్ని ముల్లంగి గడ్డలకే యాభై రూపాయలడుగుతావు. మాయట్లా సన్నాబన్నా రైతులు యట్ల బతకల్లన్నా...." అని కదిరెప్ప తన కష్టాలు చెప్పుకొనే ప్రయత్నం చేశాడు.

అయినా అతని మాటలన్నీ వేటగాడి ముందు ఉడుము కన్నీళ్లే అయినాయిగాని డ్రైవర్ డిమాండ్ చేసినంత మాత్రం ఇవ్వక తప్పలేదు.

లారీ వచ్చి మార్కెట్ బయట ఆగింది. క్లీనర్ వెనుక డోర్ తీసి మోపును క్రిందకు త్రోసి

"రైతుల్ పంటల్ పెట్టల్లా మాదీ జనాల్ తినల్లా రెడ్డీ నీదీ పేరు మీద మాదీ ఇంట్లో సాంబార్ చేస్తాం" అంటూ కదిరెప్ప నిర్ణయానికి అవకాశమివ్వకుండ చేతికందినన్ని గడ్డలు లాక్కొని పోయాడు. అతగాడు చొరవగా దోచుకుపోతున్న దానికి కదిరెప్పకు ఒళ్లు మండిపోయినా నిస్సహాయుడిగా చూస్తుండిపోయాడు.

అంతలో కూలీలు వచ్చి "యావూరన్న మంది గడ్డలు బాగా ఊరిండివే" అంటూ ఎత్తుకోబోయారు.

"మీరేమీ మొయ్యొద్దప్పా నేనే మోసుకుపోతా" అని మోపుల మీద చెయ్యి వెయ్యబోయాడో లేదో పందుల్లా బలిసిన రెండు ఆవులు పాముల్లా బుసలు కొడుతూ వచ్చి నోటికందినన్ని గడ్డలు ఆబగా లాక్కొని తినసాగాయి.

ఎంత అదిలించినా, మోచేతుల్లో పొడిచినా అని ఏమాత్రం లెక్క చెయ్యడం లేదు. అపుడు కూలీలు కదిరెప్ప నుద్దేశించి

"సూడన్నా మార్కెట్టుకు నువ్వు కొత్తోని మాదిరి వుండావు. ఈ కూరగాయలు నువ్వే నెత్తిమీద మోసినా, ఈ ఆవులు అన్నీ తినేసినా మా ముగ్గురికీ నువ్వు కూలీమాత్రం ఇవ్వాల్సిందే, ఎవ్వరి సరుకులు వాళ్లు మోసుకుపోతే దీన్నే నమ్ముకోనుండే మేమెట్ల బతకల్ల" అని దబాయించారు తమ మాటకు తిరుగులేదన్నట్లు.

రోటిలో తలదూర్చి, రోకటి పోట్లకు జంకడమైందుకన్నట్లు కదిరెప్ప గుటకలు మింగుతూ వాళ్లననుసరించాడు.

కూలీలు ముల్లంగిని తెచ్చి మార్కెట్‌లో ఒక మూలలో వేశారు.

అప్పటికే సమయం ఉదయం 8 గం॥లు దాటిపోయింది. రకరకాల కూరగాయలు, పళ్లు కుప్పలుగా పోసి బేరం చేసేవాళ్లు చేస్తున్నారు. తూకం వేసేవాళ్లు వేస్తున్నారు. కాని కదిరెప్ప ముల్లంగిని మాత్రం అడిగే నాథుడే లేడు.

దిగాలుగా నిలబడ్డ కదిరెప్ప దగ్గరకు అడపాదడపా ఎవరయినా వచ్చినా "గడ్డలు శానా బాగా దిగిండివి గాని క్యారెట్లు, బీట్‌రూట్లు తినే కాలంలో ఈ ముల్లంగి ఎవరు కొంటార్లేప్పా" అని ముందుకు సాగిపోయే వారేగాని బేరమాడిన పాపానికి ఒక్కరూ పోలేదు.

ఏదో పనిబడి మార్కెట్టుకు వచ్చిన అంజినరెడ్డి కదిరెప్పను గమనించి దగ్గరికొచ్చాడు. అంతలో ఒకామె అక్కడికి వచ్చి "ఏమన్నా లాటంతా కొంటాను యంతకిస్తావో సెప్పు" అని అడిగింది.

"నువ్వు ఒగుమాట అడుగమ్మా" అన్నాడు కదిరెప్ప.

"ముప్పై రూపాయలకిస్తావేమన్నా" అని ఆమె అడుగుతూనే కదిరెప్ప నెత్తిన పిడుగు పడినట్లయింది. నోటమాట పెకల్లేదు. ఇవ్వనన్నట్లు నిస్పృహతో చేయి తిప్పాడు.

అంజినరెడ్డి కల్పించుకొని "సూడు కదిరెప్పా నిన్ను ముల్లంగి గడ్డలు అమ్మమన్నాను గాని. ఇట్ల మోసుకోనొచ్చి గాదు. రెండు దినాలు కాసుకోనుంటె ఎవరయినా ఒస్తావుండ్రి. సేనిదగ్గర అమ్మింటే అది పది రూపాయలొచ్చినా కడుపులోని సల్ల కదిలేది కాదు. రైతులంతా కలిసి యాపారస్తుల్ని మన దగ్గరకే ఒచ్చేటట్లు సేసుకోవల్లగాని ఇట్ల వంటింటి కుందేలు మాదిరి సిక్కగూడదు.

ఇపుడు అవసరం మంది అవకాశం వాళ్లది! యనకటికి పల్లెటూరుల్లో కష్టం జేసే జనాలు, అడవుల్లో జంతువులు వుండేవి. ఈ జనాల్ని అవి సంపుకు తినేవి.

ఇపుడు అడవుల్లేవు. అడవి జంతువులు అసలుకే లేవుగాని, అడువులట్లా పట్నాలుండావి. ఆ పట్నాల్లో జంతువులట్లా యాపారస్తులుండారు. యీళ్లు జంతువుల మాదిరి మనల్ని సంపుకు తిన్నా బాగుండేదేమోగాని, అట్ల సంపరు. మన కష్టాన్ని మాత్రమే దోసుకొని తినే ఏర్పాట్లు బాగసేసుకోనుండారు. ఈ దుర్మార్గము గొర్రెలాకట్ల బతికే మన రైతులుకు తెలీదు" అన్నాడు తన అనుభవాన్నంతా అరచేతిలో ఇమిడ్చి చూపినట్లు.

"ఏడిదోను మామ నీ మాట్లింటావుంటె నాకు కడుపులో నుంచి సంకటం పొంగుకోనొస్తా వుందిగాని ఏమి మాట్లాడల్లో తెలీదు" అన్నాడు అమాయకంగా.

అంతలో అక్కడికి ఒక రిక్షా వచ్చి ఆగింది. అందులో ఎర్రగా పొడుగ్గా, తెల్లని బట్టలతో మెరిసిపోతున్న ఒక ఆసామి దిగాడు. అతడు దిగుతూనే సంచుల సంచుల కూరగాయలు రిక్షాలో చేరుతున్నాయి.

అతన్ని గతంలో కదిరెప్ప ఎక్కడో చూసినట్లు గుర్తుకు తెచ్చుకోసాగాడు.

ఔను ఒకసారి బెంగుళూరి నుండి వస్తూ కారు చెడిపోవడంతో అతను కదిరెప్ప ఊరి దగ్గరే దిగాడు. మిట్టమధ్యాహ్నం ఆకలి దాహంతో తపించిపోతున్న అతన్ని ఎవ్వరూ పట్టించుకోక పోవడంతో తన ఇంటి దగ్గరున్న కొబ్బరి చెట్ల నుండి ఎళనీర్లు, తినడానికి కొన్ని చెరకులు తెచ్చి ఇచ్చాడు. అవి పరమానందంగా స్వీకరించిన ఆసామి తాను హిందూపురంలో ఫలానా హోటలు యాజమానినని, ఎపుడయినా అటుగా వస్తే హోటలుకు రమ్మని చెప్పడం గుర్తుకు వచ్చింది. అదే విషయాన్ని ఆ ఆసామి కూడా గుర్తుకు తెచ్చుకున్నట్లు కదిరెప్పను సమీపించాడు.

"నీదే నా ఈ ముల్లంగి" అన్నాడు, తెల్లని అడ్డపంచెను ఎగగట్టుకొంటూ.

"ఊనుస్వామి..." అంటూ కదిరెప్ప తన గోడు వెళ్లబోసుకున్నాడు.

మారు మాట్లాడకుండా అతను తాంబూల చర్వణం చేస్తూ నోరు పైకెత్తి అదేదో తెలుగు కాని భాషలో అక్కడి మనుష్యులను పురమాయించాడు.

మరుక్షణం సరుకంతా హోటల్లోని వంటగది చేరింది.

కదిరెప్పకు నెత్తిమీది నుండి పెద్దకొండను దించినట్లయింది. పులుల నోట చిక్కుకున్న అతన్ని హోటలు యజమాని పరమ వీరుడిగా ప్రత్యక్షమై రక్షించినట్లు ఆనందించాడు. అంజనరెడ్డికి ఏ భావమూ కలుగలేదు. యాంత్రికంగా డబ్బు కోసం హోటలుకేసి నడుస్తున్న కదిరెప్పను అనుసరించాడు.

అప్పటికే సమయం 11 గం॥లు దాటినట్లుంది. హోటలులో అడుగు పెడుతూనే కదిరెప్పకు ఆకలి గుర్తుకు వచ్చింది.

"మామా ఏమేమి కావల్లో తిను" అన్నాడు హుషారుగా.

"నాకాకలి లేదప్పా. పొద్దున తిన్న సంగటి ఇంకా అరగనే లేదు" అన్నాడు అంజినరెడ్డి.

"అయితే నాకాకలవుతా వుంది మామా" అని అన్నం తిన్నాడు. భార్యకూ, పిల్లలకూ, మూడు మసాలా దోసెలు పార్సిలు కట్టించుకున్నాడు.

"మామా యంత ఒగ మున్నూరు రూపాయలు అడుగుదామా?" అన్నాడు డబ్బుల కోసం హోటలు యజమాని దగ్గరికి నడుస్తూ.

"అడిగేదానికి ఇంక మనసేతిలో ఏముందప్పా. ఆయప్ప ఇచ్చినంత తీసుకోల్లగాని" అన్నాడు అంజినరెడ్డి.

"ఏం మామ అట్లంటావు. ఆయప్ప శానా మంచోని మాదిరి ఉండ్లేదా!" అన్నాడు కదిరెప్ప.

అంజినరెడ్డి మారుమాట్లాడలేదు. ప్రొప్రయటరు దగ్గరకు చేరారు.

"ఏమప్పా యజమాండూ బాగా తృప్తిగా తింటివో. ఊనప్పా మీ యట్లా రైతులు తిని బాగుంటేనే గదా మాయట్లా వాళ్లు గూడ బతికేది" అని అంటూ ఇరవై రూపాయలు తీసి టేబిలు పై ఉంచాడు.

కదిరెప్ప చుట్టూ చూశాడు. ఆ ఇరవై రూపాయలు తీసుకోవడానికి ఎవరైనా ఉన్నారేమో అని. ఊ... హుం... అక్కడ తాను అంజినరెడ్డి తప్ప మరెవ్వరూ లేరు.

తన శ్వాసకోశాలనెవరో తెంచేసి నట్లనిపించింది. అయినా తమాయించుకొని "ఏమి స్వామీ 300 రూపాయల సరుకు లోపలేసుకొని అడుక్కుతినే వానికిచ్చినట్లు ఇరవై రూపాయలిస్తా వుండావు" అన్నాడు.

"నువ్వేచెప్తితివి కదప్పా ఎవరో 30 రూపాయలకే బేరమాడారని? నువు తిన్న భోజనానికి దోశలకు ముప్పై రూపాయలౌతుంది. ఏదో పాపంలే అని ఇరవై రూపాయలు ఎక్కువగా ఇస్తున్నాను. దానికి సంతోషించు" అంటూ క్యాష్ బాక్స్‌లోని నోట్లు లెక్కించే కార్యక్రమంలో నిమగ్నమయ్యాడు.

అప్పుడు కదిరెప్ప కూడా ఆటవికుడే అయి వుంటే తన ఎదురుగా వున్న నగర మృగాన్ని కత్తితో పొడిచో, గొడ్డలితో నరికో తన అసమ్మతి తీవ్రతను వ్యక్తం చేసుకొనేవాడేమో కాని – అలా చేయలేక తన శ్రమ ఫలితాన్ని బలియిచ్చి, మరింత శ్రమను మరో బలికోసం కూడదీసుకోవడాని కన్నట్లు జీవచ్ఛవంలా ఊరిదారి పట్టాడు.

✡

# కొరివీ... అడివీ

**–మొలకలపల్లి కోటేశ్వరరావు**

పదిహేను రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు.

ఒక రోజు తెరిపి ఇచ్చినట్లే ఇచ్చి, తరువాత రోజు ధమధమ వాన బాది పారేస్తోంది.

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం వలన వర్షాలు అని రేడియో వాళ్లు చెపుతున్నారు. ఒక అల్పపీడనం సమసిపోయిన వెంటనే మరో అల్పపీడనం పుట్టింది.

బాపయ్యా, వరమ్మల గుండెలు గుబగుబలాడిపోతున్నాయి. రాత్రే కుండపోత వాన కురిసింది. మళ్ళీ పుట్టిన అల్పపీడనం వలన వానలు పడితే ఇక మిరప తోటలు వురకేసి పోవడం ఖాయం.

“ఇంతమట్టుకి కురిసిన వానలు చాలు, ఇంతటితో పోతే బాగుణ్ణు! సముద్రంలో ఇంకో చోట పుట్టిందటగా! ఇంకా వానలు పడితే మునిగిపోతాం!” అంది వరమ్మ ఆందోళనగానూ, విచారంగానూ.

“ఇంకెందుకు పడతయ్యి లేవే వానలు! కార్తె ఇయ్యాల్టితో పోయిద్ది! అయినా ఆ మీద ఎన్ని రోజులు కురిసిద్దేంది వాన? సముద్రంలో పుట్టింది ఎటోకటు పోయిద్దిలే, మనకి రాదు!” అన్నాడు బాపయ్య ధీమాగా.

“రేత్రి ఎంత వాన కురిసిందయ్యా! ఉండపొలం అంతా మిరప యెయ్యొద్దయ్యా అంటే నా మాటినకుండా మొత్తం అదే వేస్తివి! వానలు ఇంకా ఎక్కువ అయితే ఏమయిద్ది మన యవారం? ఇంక లేచే పనేనా?”

“ఏహై అరవ్వాకవే! ఏమయిద్దేంది? దానబ్బడాల పెట్టిన కర్చులు మట్టుకి రావెట్టా? నువ్వూరక బయపడవాక, ఏం కాదుగానీ....”

“నిజంగా మన మిరపతోటలు యెట్టున్నయ్యయ్యా? బలిగోరతన్నయ్యి! పీడాకారపు వాన మనకోసమే దాపురించినట్టుగా వుంది?.. దయిద్రపు వాన!” అంది వరమ్మ వానని తిడుతూ, తమ మిరప తోటల్ని తలుచుకుని విచారంగా.

“నేను పొలం కల్లి పోయ్యేస్తానే! పొద్దుట్నించీ పోదామనుకుంటుంటే జల్లులు పడతానే వుండె!”

“నల్లగా ముసుర్లు కమ్ముకొస్తన్నయ్యి! ఇంక పొద్దు కూడా ఎంతుందయ్యా? ఇప్పుడు పొలం పోయి మాత్రం ఏం చేస్తా?”

“కాదే, పొయ్యి చూసి రావాలి! ఎంత సేపుట్లో పోయొస్తాను?”

“నీ మతమే మతం! పైన వానవచ్చేటట్టుగా వుంది!”

“రానియ్యి! తడిస్తే మొక్క మొలుస్తాంయేందీ?”

అని బాపయ్య గొడుగు తీసుకుని బయలుదేరాడు.

“ఈ మడిసి ఒకరు చెబితే యినే మడిసి అయితే కదూ, పెడద్రపు కొలిమి!” అంది వరమ్మ పిల్లలతో.

పొలం వెళ్ళేదారి బురద బురదగా, తొక్కిడి తొక్కిడిగా, రొచ్చు రొచ్చుగా వుంది. అడుగు తీసి అడుగు వేస్తే మోగాటి లోతున కాలు దిగబడిపోతోంది.

“మిరప మొక్కలు ఎలా వున్నాయో! చేలోకి పైచేలోనించి నీళ్లు వచ్చి పడ్డాయేమో! చేలు కోసకపోయినయెమో!” అని మధనపడిపోతూనే, బురదలో కాలు లాక్కుంటూ, పీక్కుంటూ వడివడిగా వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నాడు.

పొద్దు ఎక్కువ లేదు. చీకట్లో తిరిగి రావడం ఇబ్బంది

ముందు ముందు కాలం ఎలా వుంటుందో! ఇప్పటికే తను చాలా పెట్టుబడి పెట్టాడు. ఇంకా పెట్టాలి.

తమకి వున్న పొలం మొత్తం మిరప వేయడం భార్యకి ఏమాత్రం ఇష్టం లేదు. అప్పుడు అనుకున్న విషయం మనసులో మెదిలింది.

“మొత్తం మిరప పంట ఒక్కటే ఏసుకుంటే ఎట్టయ్యా? రేపు ఏది పోయి ఎట్ట వచ్చినా దెబ్బతింటాం! రెండెకరాలు మిరప వేసుకొని మిగతా రెండెకరాలూ ఇంకొక పైరు పెట్టుకుందాం!” అంది వరమ్మ.

“కాదే, మొత్తం మిరప వెయ్యాల్సిందే ఇయ్యేడు!” అన్నాడు తను.

“యేస్తాం. ఒకాళ దండగలు వస్తే ఏమయిద్ది మనపని!”

“దండగలు ఎందుకు వస్తయ్యే?”

“ఎందుకురావేందీ! ఒకేడు వున్నట్టు కాలం ఒకేడు వుండిద్దీ? ఎందుకొచ్చిన చావు, రెండు రకాల పైర్లు పెట్టుకుంటే, ఒక దాంట్లో పోయినా ఒక దాంట్లో మిగుల్తయ్!”

"చిల్లర మల్లర పంటల్లో ఎంత మిగిల్నా ఎకరాకీ రెండు మూడు వేల కంటే ఎక్కువ మిగలవే! అదే మిరప అయితే వస్తే ఒక లాటు వస్తయ్యి! ఇయ్యేటికి నా మాటకి ఎదురు చెప్పవాకు! మొత్తం మిరప వెయ్యాల్సిందే. ఈ పూరికొంప పీకి పారేసి డాబా కట్టుకోవాల్సిందే!" అన్నాడు తను.

భార్య సణుగుతున్నా, గొణుగుతున్నా లెక్క చేయకుండా మొత్తం మిరపే వేసాడు.

పోయినేడు వూళ్లో కొద్ది మంది రైతులే మిరప వేసారు. వాళ్ళలో తను ఒకడు.

ఒక ఎకరం పొలంలో కొంత గొడ్లుకి మేతపెట్టి, 75 సెంట్లు మిరప వేసాడు.

ఆ 75 సెంట్లు పొలానికే 12 క్వింటాళ్ల మిరపకాయలు అయ్యాయి. క్వింటాల్ 42 వందల రేటు వుంది. ఆ రేటుకి అమ్మితే తనకి 40 వేలు వచ్చాయి.

కొంత మంది అయితే 47, 48 వందలకీ అమ్ముకొన్నారు. తను 48 వందలకీ అమ్ముకున్నట్లయితే ఇంకా ఆరేడు వేలు కలగా వచ్చి వుండేవి.

తనకి వచ్చిన 50 వేలల్లో 20 వేలు కర్చులు పోయినా, నికరంగా 30 వేలు మిగులు కనిపించింది. ఎప్పుడూ, ఏ పంటలోనూ అంత డబ్బు తనకి వచ్చి ఎరుగడు.

పోయినేడు మిరప మీద వచ్చిన డబ్బుల ఆశతోనే తను ఇయ్యేడు మొత్తం అదే పంట వేయాలని నిర్ణయించుకున్నాడు.

బాపయ్య వాళ్ళు ముగ్గురు అన్నదమ్ములు. పెద్దతను ట్రాక్టర్ డ్రైవర్. ఆయన బాగానే సంపాయించాడు. డ్రైవర్ పని చేస్తూనే డబ్బు కూడ బెట్టుకుని, స్వంతంగా పాత ట్రాక్టర్ కొనుక్కున్నాడు. ఇప్పుడు దాని మీద రోజుకి రెండు మూడు వందలు లేనిదే నిద్రపోడు.

రెండో అతను గొర్రెలు కాస్తుంటాడు. అతనికి స్వంతంగా 60 గొర్లు వున్నారు. వాటి మీద ఏడాదికి కనీసం 30 వేలకి తక్కువ ఆదాయం రాదు. అన్నదమ్ముల్లో తను ఒక్కడే భూమిని నమ్ముకున్నవాడు. తనూ, భార్యా ఎప్పుడూ పొలంలో చాకిరీ చేస్తూ వుంటారు. అయినా అందరి కంటే తామే లొటుకులో వున్నారు.

తల్లిదండ్రులు ఇచ్చిన ఇల్లు చిన్నది. ఆ ఇంట్లో మూడు కాపురాలు వుండడం కుదరదు. అన్నలకి ఆ ఇల్లు ఇచ్చి తను వేరుగా పూరి కొష్టం వేసుకుని వుంటున్నాడు. ఇల్లు వదులుకున్నందుకు కొంత పొలం తనకి ఎక్కువ వచ్చింది.

మూడేళ్ళ క్రితం ఎండా కాలంలో నిప్పంటుకుని సగం వూరు తగలబడిపోయింది. అప్పటి నుంచీ తనకి భయం పట్టుకుంది.

పిల్లా పాపలతో వుండే ఇల్లు. ఏ నిమిసంలో ఏం జరుగుతుందో తెలియదు. వీలైనంత తొందరగా పూరికొష్టం పీకిపారేసి చిన్న డాబా వేసుకోవాలని తన తాపత్రయం!

అన్నీ సక్రమంగా వుంటే నిరుడు వచ్చినట్లు డబ్బులు వస్తే చిన్న డాబా వేసుకోవడం తనకి ఇబ్బంది కాదు.

ఇద్దరూ పని చేసే ఈడులో వున్నారు. పనిలో వంగారంటే నలుగురు మనుషుల పెట్టు పని చేస్తారు.

ఇంతవరకూ బాపయ్య తన పొలంలో మగ కూలి మనిషిని పెట్టి ఎరుగడు. ఎప్పుడైనా అవసరమైతే తను ఎవరికైనా బదులుపోయి, మళ్ళీ వాళ్ళతో బదులు పని చేయించుకుంటాడు.

ఒకరి మీద ఆధారపకుండా పనిచేసుకోగలననే ధైర్యం వుండ బట్టే తను మొత్తం మిరప పంట వేసుకున్నాడు.

ఆలోచిస్తూ చేను సమీపంలోనికి వెళ్ళాడు బాపయ్య.

కొద్ది దూరం నించే దిష్టి పిడత వెక్కిరిస్తూ కనపడింది.

"దారిన వస్తాపోతా అందరి కళ్లూ మన మిరప తోట మీదనే వున్నయ్యయ్యా! దిష్టి పిడత పెట్టకపోతే లాభం లేదు! కుమ్మరోళ్ళింటికి పోయి ఒక పిడత కొనక్కరా! సున్నం పూసి చేలో పెడదాం!" అంది వరమ్మ.

అప్పటికప్పడే బాపయ్య కుమ్మరోళ్ళింటికి వెళ్ళి కుండ కొనుక్కుని వచ్చి సున్నం పూసి చేలో నిలబెట్టాడు.

చేలోకి వెళ్ళిన బాపయ్య మొక్కల్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు.

కొన్ని మొక్కలకి తెగులు సోకింది. ఆ మొక్కలు పసిమి వర్ణంలోకి వచ్చాయి. ఆకుముడత కూడా కనపడుతోంది. "మొత్తానికి రకరకాల తెగుళ్ళు సోకినయి!" అనుకున్నాడు.

బాపయ్యకి ఉన్న నాలుగు ఎకరాల పొలం నాలుగు చోట్ల వుంది. నాలుగు పొలాలూ చూసాడు. అన్ని పొలాల్లోనూ ఆ తెగులు కనపడుతోంది.

ఎవరికైనా చూపెట్టి ఏం మందు వాడమంటారో కనుక్కుందామని, నాలుగు కొమ్మల్ని తెంచుకుని ఇంటికి తీసుకు వచ్చాడు. బాగా చీకటి పడిపోయింది.

"పొలాలు ఎట్టున్నయ్యయ్యా?" వరమ్మ అడిగింది.

"అంత బాగాలేవే? ఏదో తెగులు వచ్చింది. ఇవిగో చూడు!" అని తెచ్చిన కొమ్మలు ఇచ్చాడు.

"ఇప్పటికే కర్చు ఎక్కువ అయింది మనకి! ఈ తెగులు పోవటానికి ఎంత మందు పోవాలో, ఏంపాడో! రేపు తినేదేందో, పెట్టేదేందో గానీ కర్చులు మాత్రం తడిసి మోపెడ వతన్నాయి!" అంది వరమ్మ.

వానకి ముందు మిరప తోటల్ని చూసుకుంటూ వరమ్మ ఎంతో ఆనందపడిపోయింది. తోటలు ఎంతో బాగున్నాయి. పచ్చగా కళకళలాడిపోతూ, ఏపుగా పెరుగుతూ పిందె, పూతలతో నవనవలాడిపోతున్నాయి. వాటి పోకడని చూసి ఆనందపరవశురాలైంది.

కుండపోతగా కురిసిన వర్షాలు ఆ ఆనందాన్ని విచారంగా మార్చివేసాయి.

ఆ రాత్రి వరమ్మకీ, బాపయ్యకీ సరిగా నిద్రపట్టలేదు.

మరుసటి రోజు వుదయమే తను తెచ్చిన కొమ్మలు తీసుకుని యలమంద వాళ్ళ ఇంటికి వెళ్ళాడు బాపయ్య.

యలమంద నాలుగేళ్ళ నించీ మిరప వేస్తున్నాడు. చదువుకున్నవాడు. ఆయన ఈ పంటలో కొంత తిని వున్నాడు. మంచి చెడ్డలు తెలుసు. ఆయనకి తాను తెచ్చిన కొమ్మలు చూపెట్టాడు.

"షావాలెస్ కంపెనీ వాళ్ళది కొత్త మందు వచ్చింది బాపయ్య ఈ తెగులుకి. దాని పేరు మర్చిపోయా! ఆ మందు వాడితే దెబ్బకి తిప్పుకునిద్ది ఈ తెగులు! నేను నిరుడు ఆ మందు యేసా! మా చేలు ఎట్టున్నయో, ఏమో! నేను చేలు చూసి నాలుగు రోజులవతంది! వాన తెరిపి లేకపోయా!"

"కేజీ ఎంత వుండిద్దీ మందు?"

"కేజీ పొడి వచ్చి 8 వందల రూపాయిలనుకుంటా! ఎకరానికి కేజీ లెక్కన రెండు వరసలు వెయ్యాలి మందు!"

మరో అతను వద్దకు కూడా వెళ్ళాడు బాపయ్య. ఆయన కూడా అదే మాట చెప్పాడు. ఆలస్యం చేయకుండా వెంటనే తెగులు మందు వాడమని చెప్పాడు.

ఊళ్లో మందులు కొట్లలో అడిగితే ఆ మందు లేదు. వాళ్ళు అప్పు ఇస్తారు. కానీ రూపాయిది రెండు రూపాయిలు కట్టుకుంటారు. రెండు రూపాయిల వడ్డీ కూడా తీసుకుంటారు. అయినా వాళ్ళ వద్ద లేదు.

చేతిలో డబ్బు కూడా లేదు.

వెంటనే బాపయ్య మనసులో లక్ష్మయ్య కదిలాడు. తనకి ఎలాగూ ముందు ముందు డబ్బు అవసరమనే వుద్దేశంతో మిరప వేయడానికి ముందు లక్ష్మయ్యని కలిశాడు. అవసరమైతే తనకి 20 వేల వరకూ అప్పు ఇస్తానన్నాడు.

లక్ష్మయ్య పెద్ద వడ్డీ వ్యాపారస్తుడు. వడ్డీల మీదనే చాలా సంపాయించాడు. రోజువారీ వడ్డీ కట్టుకుంటాడు.

నెల రోజుల క్రితం నీళ్ళ ఇంజన్ చెడిపోయింది. అప్పుడు నాలుగు వేలు అవసర మయ్యాయి. తను వెళ్ళి అడిగిన వెంటనే ఇచ్చాడు. 4 వేలకి రోజుకి 6 రూపాయిల వడ్డీ.

సరిగా పంట పండితే ఈ వడ్డీలూ గిడ్డీలూ దెబ్బకి తుడిచి పెట్టుకుపోతాయి పెద్ద లెక్కలోనికి రావు.

లక్ష్మయ్య దగ్గరకి వెళ్ళాడు బాపయ్య. పరిస్థితి అంతా వివరించి చెప్పాడు.

"డబ్బుకి బాగా కటకటగా వుంది బాపయ్యా! చాలా మంది రైతులు అడిగి పోతన్నారు. అడిగిన వాళ్ళందరికీ ఎక్కడ తెచ్చి ఇస్తామనుకో! నీకేం, మంచి పద్దు! మాటకి కట్టుబడి వుండేవాడివి నువ్వు! సరే, నీ క్కావలసినంత తీసుకో! మళ్ళీ నాకు వీలైనంత తొందరగా తిరిగి ఇవ్వు!" అని లక్ష్మయ్య, బాపయ్య అడిగిన 8 వేలూ ఇచ్చినాడు. 8 వేలకి రోజుకి 16 రూపాయిల వడ్డీ.

డబ్బు తీసుకుని, టౌనుకి వెళ్ళి 8 కేజీల మందు కొనుక్కు వచ్చాడు బాపయ్య. ఇంటికి వచ్చిన వెంటనే మందు ట్యాంకు భుజానికి ఎత్తుకున్నాడు. వరమ్మ అనుసరించింది.

వరమ్మ మందు కలిపి నీళ్ళు పోస్తుంటే బాపయ్య మందు వేయడం మొదలు పెట్టాడు.

వానకి భూమి బాగా నానింది. కాలు దిగబడుతున్నా, కష్టంతో కాలు లాక్కుంటూ బాపయ్య పట్టుదలగా మందు వేసాడు. నాలుగు ఎకరాలూ నాలుగు రోజులు పట్టింది.

నేల ఆరిపోతున్న కొద్దీ పంట తిప్పుకోవడం మొదలుపెట్టింది. వారం రోజుల తరువాత మళ్ళీ రెండో వరస కూడా మందు వేసాడు.

నెల రోజులకి తోటలు మళ్ళీ మామూలు స్థితికి వచ్చాయి.

వరమ్మా, బాపయ్యా ముఖంలో నవ్వులు పూశాయి. చలిగాలి ఎక్కువ కావడంతో భూమిలో పదును పీక్కుపోయింది. 20 రోజులకి తోటలకి నీళ్ళు పెట్టాల్సి వచ్చింది.

"10 బస్తాలు సత్తవ మందు తీసుకొొచ్చి చల్లి నీళ్ళు పెడదామే! కాయ బాగా వచ్చింది. నీళ్ళు పెడితేనే కాయ వూరేది!"

'10 బస్తాలు ఎందుకయ్యా! చివరిసారి ఎకరానికి బస్తా లెక్కన 4 బస్తాలు చల్లి నీళ్ళు పెడదాం!" అంది వరమ్మ.

"కానియ్యవే, ఎకరానికి రెండు మూడు బస్తాలు పడకపోతే యట్ట! కుండలో కూడు కుండలోనే వుండాల, పిల్లోడు దుడ్డుగా వుండాలంటే ఎట్ట? సత్తవలేకపోతే కాయ ఏం వూరిద్ది? సత్తవ పెట్టాలి!"

"ఏందయ్యా పెట్టేదీ! అందరికీ ఎకరాకీ పురుగు మందులు 10, 11 వేలవతంటే మనకీ 14 వేలా? అందరికీ సత్తువ మందులు ఎకరానికి మూడు వేలయితే మనకి నాలుగు వేలా? దేనికైనా హద్దూ పద్దూ వుండాల!" అని వరమ్మ గయ్యిమని లేచింది.

బాపయ్య తను తింటానికీ, బట్టలకీ, ఏమైనా స్వంతానికి మాత్రం రూపాయి ఖర్చు పెట్టడు. పొలానికి అయితే మాత్రం ఖర్చు పెట్టడంలో వెనకాడడు. వరమ్మని బాధించే విషయం అదే.

బాపయ్య తను అనుకున్నట్లే సత్తువ మందు తెచ్చి చల్లి నీళ్లు పెట్టాడు. చివరికి బాపయ్య శ్రమ ఫలించింది.

మిరప పంట బ్రహ్మాండంగా పండింది. ఒక చెట్టుకే తట్టెడు కాయలు అవుతున్నాయి.

ఊళ్లో మిరప తోటల ప్రస్తావన వస్తే ఎవరైనా ముందు బాపయ్య చేలే చెపుతున్నారు.

భార్యాభర్తలు రోజూ 20 మంది కూలీల్ని తీసుకుపోయి మిరపకాయలు కోయిస్తున్నారు. ఊరి ప్రక్కనే ఒక చేలో కల్లం చేసుకొని మిరపకాయలు ఎండ బెట్టకుంటున్నారు. రాత్రి పూట బాపయ్య కల్లం దగ్గిరే పడుకుంటాడు.

ఊళ్ళో చాలా మంది మిరప వేయడంతో కూలీలకి డిమాండ్‌గా వుంది. పోయినేడు ఇచ్చిన కూలి 12 అయితే ఈ ఏడు 30 రూపాయలు. బాపయ్యకి రోజూ 5, 6 వందలు కూలి అవుతున్నది.

లక్ష్మయ్య దగ్గరకి వెళ్ళి బతిమాలి, బామాలి అప్పు తెచ్చి కూలీలకి ఇస్తున్నాడు.

మిరపకాయ కొనుగోలుకి వ్యాపారులు రంగ ప్రవేశం చేసారు. 2 వేలు చేసి కొంటున్నారు.

ధర విషయం వినడంతోనే వరమ్మా, బాపయ్యా ఆందోళన చెందారు.

"ఇదేందయ్యా ఇంత యిద్దూరం! రెండు వేలేందీ? నిరుటికంటే ఇయ్యేడు మనకేమన్నా కర్చులు తగ్గినయ్యేంది?"

"డబ్బుకి ఇబ్బందిగా వుండోళ్ళు అమ్ముకుంటున్నార్లేవే! కాయ కూడా సరిగా ఆరలా! ముందు ముందు రేటు బాగానే వచ్చిద్దిలే!" అన్నాడు బాపయ్య. మనసులో మాత్రం భయంగానే వుంది.

"నిరుడు మొదట్లోనే 37, 38 వందలు చేసికొన్నారు. చివరికి ఐదేలు దాకా పోయింది. మరీ ఇంత తక్కువ రేటేందీ?" అంది వరమ్మ.

బాపయ్య 4 ఎకరాలకీ 60 క్వింటాళ్ళు మిరపకాయలు అయ్యాయి.

రేటు పెరుగుతుందీ, పెరుగుతుందీ అని వీళ్ళు ఆశతో ఎదురు చూస్తున్నారు కానీ రోజు రోజుకీ రేటు తగ్గిపోతున్నది. ఇదే తక్కువ రేటు. ఇంత కంటే ఇంకేం తగ్గుతుందిలే అనుకుంటున్నారు. కానీ తక్కువకి కూడా పరిమితి లేకుండా తగ్గుతోంది.

"ఇంకేం వచ్చిద్దిలే రేటు? తూకాలు తగ్గిపోతయ్యి! కాయ రంగు మారిపోతుంది! తెచ్చుకున్న డబ్బుకి వడ్డీలు పడతన్నాయి! అన్నీ దండగలే! లాభం కనపట్టంలా! అమ్మి పారేస్తే పీడా వదిలిపోతాయి!" అని బాపయ్య మందుల కొట్టు అతనికి మిరపకాయలు మొత్తం అమ్మేసాడు. 15 వందలు ధర.

60 క్వింటాళ్ళకీ 90 వేలు వచ్చాయి.

తను వాడిన పురుగు మందులూ ఎరువులకి 70 వేలు బాకీ తేలాడు. కొట్లో బాకీ 70 వేలు చెల్లు పెట్టుకుని 20 వేలు చేతికి ఇచ్చాడు అతను.

బ్యాంకుల్లో బంగారం పెట్టి తెచ్చుకున్న డబ్బూ, సొసైటీ లోనూ, మందుల కొట్లో బాకీ, లక్ష్మయ్య దగ్గిర తెచ్చిన డబ్బూ, కూలీనాలీ అన్నీ లెక్క చూసుకుంటే మిరప పంట మొత్తానికి లక్షా 30 వేలు ఖర్చయింది.

నికరంగా 40 వేలు బాకీ తేలాడు.

చేబదుళ్ళూ, చిల్లర కొట్లలో బాకీలూ, 10 వేలు పోయాయి. తిండి గింజలూ, గొడ్ల మేతకి 10 వేలు, లక్ష్మయ్య బాకీ నిలిచిపోయింది.

"మొత్తం ఒక పైరే వేయొద్దయ్యా దేవుడా అంటే నా మాట ఆలకిచ్చా? ఇప్పుడు చూడు, లచ్చుమయ్య బాకీ ఎట్ట తీర్చాలీ, ఏం చేయాలీ?"

"మిగతా పైర్లు ఏసుకున్నోళ్ళు తిన్నారేంది? ఏం పంట ఏసుకున్నా, ఏ రైతు పనీ వుసిగా లేదు. నిరుడు 22 వందలు అమ్మిన మినుములు 11 వందలు ఇప్పుడు! నిరుడు 20 వందలు అమ్మిన కందులు 9 వందలు! అన్నింటి పని అట్నే వుంది! ఇంకా రైతు బాగుపడేది ఎక్కడా? మనం కొనేవాటికి అడ్డగోలుగా ధరలు పెంచితిరీ, మనం అమ్మే వాటికి అడ్డగోలుగా తగ్గిస్తిరీ! మనం చేసేదేంది ఇంక?"

"ఇంకో పైరు ఏసుకుంటే ఇంత దండగలు పడి వుండే వోళ్ళం కాదుగా?"

"రేటు వుంటే అసలు దండగలు ఎందుకు వచ్చేయే! కర్చులు పెరిగితే పెరిగినయ్యి, కనీసం నిరుటి రేటు వుంటే ఇంకో లక్షన్నర రాకపోయినయ్యి! 40 వందలు ఎక్కడా, 15 వందలు ఎక్కడా? రేటులోనే లక్షన్నర పై చిలుకు తేడా కనపడుతండే! నిరుటి రేటు వుంటే బాగానే డబ్బులు రాకపోయినయ్యా చిన్నదో, చితకదో డాబా కట్టుకుని వుండకపోయామా?" అన్నాడు బాపయ్య.

బాపయ్య చేతిలో చిల్లిగవ్వలేదు. బాగా దిగులు పడిపోయాడు.

మిరపకాయలు అమ్మి డబ్బు ఇవ్వలేదని ఇంటి మీదకు వచ్చాడు లక్ష్మయ్య. గొడవ చేసాడు. తరువాత రోజు పెద్ద మనుషుల్ని తీసుకు వచ్చాడు.

బాపయ్య మాట పడే మనిషి కాదు. లక్ష్మయ్య బాకీకి బాపయ్య ఎకరం పొలం కండింపు చేసాడు.

భూమిని నమ్ముకుని ఏడాది పొడుగునా రెక్కలు ముక్కలు చేసుకుని బంగారపు పంట పండించిన నేరానికి బాపయ్య ఎకరం పొలం సమర్పించుకోవలసి వచ్చింది.

✡

# మా ఊరి కథ

**–రేగులపాటి కిషన్‌రావు**

ఆ రోజు నేను కరీంనగర్ నుండి చింతల్‌ఠాణం వచ్చాను. మాది మధ్య మానేరు ముంపు గ్రామం. ఊరు ఉత్తర భాగం నుండి ఒకప్పుడు వేసవిలో కూడా గలగల పారేది మానేరు. కొన్నాళ్ల నుండి ఏరు పారుదల తగ్గింది. వర్షాకాలంలో వర్షాలు కురిసినప్పుడే ఏరుపారుతున్నది. మిగతా రోజులలో ఇసుకదిబ్బలే. కాల క్రమంలో కరువు కాటకాలు ఏర్పడడంతో బావులు, బోరుబావులు ఏర్పాటు చేసుకున్నాము.

మావూరి భూములు ఎ,బి,సి గ్రేడులలో వర్గీకరించి ప్రభుత్వం ప్రకటించిన ధరలలో నష్టపరిహారాన్ని చెక్కుల రూపంలో ఇచ్చేశారు.

కుటుంబ సర్వే, ఇండ్ల ల్యాండ్ సర్వే చేస్తున్నారని మా పెద్ద తండ్రి కొడుకు రామారావు ఫోన్ చేసి చెప్తే ఇక్కడకు వచ్చాను. సాయంకాలం వేళ ఊరు రూపురేఖలు చూద్దామని తెలిసిన వాళ్లతో మాట్లాడుదామని ఊరిలో దక్షిణం వైపు నడక సాగించాను.

మా ఇల్లు గ్రామ పంచాయతీ కార్యాలయానికీ, తేలు భద్రయ్య గిర్నికి చాలా దగ్గరగా ఉంది. అవి రెండూ బుగ్గవోయిని కుంట అంచు భాగములో ఉన్నాయి. భద్రయ్య ఇంటి ప్రక్కనే అతని గిర్నీ. ప్రస్తుతం ఆ గిర్నీ ఒక్కటే ఊరంతటికీ ఉపయోగపడుతున్నది.

ఈ కుంటనే మా వూరి హుస్సేన్‌సాగర్. ఇది ఊరు మధ్యలో ఉంది. మా చిన్ననాడు ఈ కుంటనిండా నీళ్లుండేవి. కుంట నిండినప్పుడు, దక్షిణ ప్రాంతం వాళ్లు ఉత్తర ప్రాంతానికి, ఉత్తర ప్రాంతం వాళ్లు దక్షిణ ప్రాంతానికి వెళ్లాలంటే కష్టంగా ఉండేది. కుంట పడమటి దిక్కునుండి నీళ్లు వచ్చే కాలువ. వర్షాకాలంలో కుంట నిండినప్పుడు ఆ కుంట కాలువ దాటాలంటే దోతులు, చీరలు పైకి పట్టుకొని వెళ్లడం, ఆడవాళ్ళు సిగ్గుపడి కాలువ దాటకుండా ఆగిపోవడం, ముఖ్యంగా మగవాళ్లు పరిసరాలలో లేనప్పుడే దాటడం, కొన్ని కొన్ని సందర్భాలలో మగవాళ్ళు గాలాలు వేసి చేపలు పట్టుతూ ఉండగా ఆడవాళ్ళు ఆ కాలువ దాటాల్సి వస్తే, గోచి పెట్టుకొని దాటుతూ ఉండడం, అయినా తొడలవద్ద బట్టలు నానుతూ ఉండడం జరిగేది.

ఈ కుంటలోనే కమ్మరి బాలయ్య, సింగరయ్య, ఎరుకల సాయబు, తేలు కొండయ్య మొదలగువాళ్లు గాలాలువేసి చేపలు పట్టేవాళ్లు. వర్షాకాలంలో కుంటనిండా నీళ్లుండేవి. శీతాకాలం ముగిసేసరికి కుంట ఎండిపోయేది. అప్పుడు మేము చాలా మందిమి కుంట లోపలి వైపు వెళ్లి జానెడు లోతు నీళ్లలో చేపలు పట్టేవాళ్లం. చింతలకుంట, కొత్తకుంట, మొగుల్లకుంట, బంజేరుకుంట ఇలా అన్ని కుంటలు వానాకాలంలో నిండడం, వేసవి ప్రారంభంలో నీళ్లు ఎండిపోతున్న సమయంలో చేపలు పట్టడం చేస్తుండేవాళ్లం. ఆ రోజుల్లో బకీట్లలో, గంగాళాలలో నీళ్లు సగం నింపి, ఆ చేపలను అందులోవేసి రోజూ కొన్ని శుభ్రంగా కడుక్కొని, కోసుకొని, వండుకొని అన్నములోనే, కాకుండా రొట్టెలలో కూడా తినేవాళ్లం. వేసవి కాలంలో కళ్లాలు లేచిన తర్వాత, ఏటి కాలువ నీటితో చింతలకుంట నింపేవాళ్లు. ఆ కుంటలోనే మేము ఈత నేర్చుకున్నాము.

పచ్చగడ్డి దొరికే రోజుల్లో తోటకు వెళ్లడం, బర్రెలకు గడ్డి కోసుకొని రావడం సాయం కాలాల్లో ఎడ్లకు ఉలువపప్పు అంచెలలో వేసి పెట్టడం, చీకటి కాగానే బర్రెపాలు పిండడం, ఆ పాలను మా అమ్మ కాగ బెట్టడం, ఆ వేడి పాలనే అన్నంలో పోసుకొని తినడం ఇవన్నీ మరచిపోలేని జ్ఞాపకాలే.

మా ఊరి అనుభవాలు కథలుగా చెప్తే ఎన్ని రోజులైనా పడుతుంది. మా ఊరి కుంటలు నిండని కరువు కాలాల్లో, సరే అప్పటికి నేను యుక్త వయస్సులో ఉన్నాను. ఏతం పోయడం మోట కొట్టడంలాంటి కష్టమైన పనులు చేసి పంటలు పండించేవాళ్లం.

మా బర్రెలు జంగిడి బర్రెలతో ఉదయమే ఊరవతలికి వెళ్లేవి. మధ్యాహ్నం వరకు పరుపు బండమీద మందపెట్టేవాడు బర్రెల కాపరి కొమురయ్య. తిండి వేళకు తిని ఆ బర్రెలను బీడు భూములలో తిప్పేవాడు. సాయంత్రం అవి ఇళ్లకు తిరిగి రాగానే, వాటిని తలుగులతో కట్టేసి, గడ్డివేసి దీపాలవేళ పాలు పిండుకునే వాళ్లం. ఆ విషయం చెప్పాను కదా!...

✡

నేను ఆనాటి నా అనుభవాలను నెమరు వేసుకుంటూ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందుకు వచ్చాను. ఈ బిల్డింగ్ కుంటకట్ట దగ్గర ఉన్న పరంపోగులో శంకర్‌రావు సర్పంచ్‌గా ఉన్న రోజుల్లోనే నిర్మింపబడినది. ఈ కార్యాలయం పడమటి వైపున పెద్ద మర్రిచెట్టు వుండేది. ఆ చెట్టు కిందనే సున్నపుడంగు ఉండేది. అక్కడనే వలయాకారపు కాలువలో డంగు రాయి చక్రాన్ని ఎడ్లతో లాగించి సున్నం సిద్ధం చేసి ఇండ్లు కట్టడానికి ఉపయోగించేవాళ్లు.

ఆ మర్రిచెట్టు లాయర్ కమలాకర్‌రావుది. ఆరోజుల్లో లాయర్ వృత్తి చేసిన మా వూరి తొలి లాయర్ ఆయనే. ఇప్పుడంటే మరో ఇద్దరు యువకులు లాయర్ వృత్తిలో ప్రవేశించారు. ఈ చెట్టుకింద లోగడ బిచ్చగాళ్ళు, గంగిరెద్దులోళ్లు, కోతులనాడించెటోళ్లు, కిన్నెరెరుకలోళ్లు,

బుడుబుడుకలోళ్లు, బాగోతులోళ్లు, పుసవేర్లోళ్ళు, దొమ్మరోళ్లు, సంక్రాంతి ముందు కుండలు అమ్ముకునే కుమ్మరోళ్లు, ఉల్లిగడ్డలు, కందగడ్డ బండ్లతో తెచ్చి అమ్ముకునెటోళ్లు దిగేవాళ్లు. వాళ్లు ఏపని గురించి వచ్చేవారో ఆ పని పూర్తికాగానే వెళ్లిపోయేవాళ్లు.

ఆ చెట్టుమీద కోతులు, ఉడుతలు, కొంగలు, కాకులు, పాలపిట్టలు, పిచ్చుకలు, పావురాలు ఇంకా ఎన్నో రకాల పక్షులు కొంతసేపు ఉండిపోయేవి. కొన్నిరకాల పక్షులు గూళ్లు కట్టుకొని నివసించేవి. తిండికోసం వచ్చేవికొన్ని, తిండి కోసం వెళ్లేవి కొన్ని...

నేను నడుస్తూ నడుస్తూ తేలుకొండయ్య కొడుకు దుకాణం దాటి, కోమటి నవీన్ దుకాణం వద్దకు వెళ్తుండగా సత్యం కలిశాడు. కాసేపు ఊరి ముచ్చట్లు మాట్లాడుకున్నాం. సత్యం అంటే ఎవరనుకుంటున్నారు? మా ఊరువాడే. ఆ రోజుల్లో బడికి వచ్చినట్టే వచ్చి బడిలోనే కట్టెపలక వదిలేసి గడ్డి వాముల చాటుకు వెళ్లి దాక్కునేవాడు. ఒక్కోరోజు బడికి వెళ్తానని చెప్పి చింతపలక కాయలకో, జామ కాయలకో, మామిడి కాయలకో వెళ్లి బడికి డుమ్మాకొట్టేవాడు. అతనికి చదువుపట్ల శ్రద్ధలేకపోవడంతో అతని తల్లిదండ్రులు రెండవ తరగతి మధ్యలోనే చదువు మాన్పించారు. పెరిగాక వ్యవసాయ రంగములో స్థిరపడ్డాడు. వాళ్లు ముగ్గురన్నదమ్ములు. చిన్న ఇంటిలోనే సర్దుకునేవాళ్లు. వాళ్ల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. పంట వచ్చేలోగానే ఇంటిలో కరువు రాక్షసి వచ్చి నృత్యం చేస్తుండేది.

ఆ అన్నదమ్ములకు ఎదురు చూడగా ఎదరు చూడగా ముప్పయి ఏండ్లు దాటాక పెళ్ళిళు అయ్యాయి. పెద్దాయన పరమేశ్వర్‌కు ఒక్కతే కూతురు. సత్యంకు యాభై ఏండ్ల వయస్సులో కూతురు పుట్టింది. నా మనుమడు, అతని కూతురు ఇప్పుడు ఆరవ తరగతే చదువుతున్నరు. తాత కావలసిన వయస్సులో తండ్రి అయ్యాడని ఊళ్లో అమ్మలక్కలు అప్పుడప్పుడు చెప్పుకొంటారు.

సత్యం పెద్దగా తెలివి కలవాడు కాదు. అన్నదమ్ములు వేరుపడి మనిషికో గుడిసె వేసుకున్నారు. మనిషికి అర ఎకరం భూమి పంచుకున్నారు. స్వంతభూమిని సేద్యం చేసుకోవడంతోపాటు మరో ఎకరమో, ఎకరంనరనో కౌలుకు దున్నేవాళ్లు. బర్రెలు పెంచుకోవడం, దేశీయ కోళ్లను పెంచుకోవడంతో ఆదాయం కొంత పెరిగింది. వరికోతల సమయంలో కూలీలుగా మారి పనిచేసి సంపాదించుకునేవాళ్లు.

సత్యం ఇంకోరోజు మేకలను తోలుకొని ఇంటివైపు వెళ్తూ కనిపించాడు. అతడు నాలుగు సంవత్సరాలక్రితమే, మాఇంటికి కొంతదూరంలోనే, ఇల్లు కట్టుకున్నడు. సత్యంను అడిగాను “మేకలను, ఎక్కడ మేపుతవు” అని, అతడు చెప్పాడు. “దొంగలబోరుకు, కొచ్చెగుట్టకు, దుంకుడురాళ్లకాడ, మెగుల్ల గుట్టమీద ఇలా అన్ని గుట్టలను తిరిగి మేపుకొని వస్త”.

దొంగల బోరంటే గుర్తొచ్చింది. మేము హైస్కూల్ చదివే రోజుల్లో దసరా సెలవులు ఇచ్చినప్పుడు గుట్టలెక్కి చింతపలక్కాయలు సేకరించి తెచ్చుకునేవాళ్లం. దొంగల బోరన్నాను కదా! అక్కడికి వెళ్లి దొంగల గుహను కూడా చూసి వచ్చేవాళ్ళం. పూర్వకాలంలో దొంగలు ఊర్లు దోచుకచ్చి ఆగుట్టమీద ఉన్న గుహలలో దాగుండేవాళ్లట. దోచిన డబ్బులు, బంగారం, వెండి ఆభరణాలు అక్కడే ఏదో ఓచోట పాతర పెట్టి దాచుకొని, అవసరమున్నప్పుడు వచ్చి తీసుకపోయి వాడుకునే వాళ్లట.

ఓ రెండు గుట్టల మధ్య ఉన్న పీఠభూమిలో ఓకుంట కూడా ఉంది. ఆ కుంట నీరుతోనే తెనుగువాళ్ళు వానాకాలం వ్యవసాయం చేసుకునేటోళ్లు.

మొగుల్లకుంటకు దక్షిణ భాగంలో మొగుల్లగుట్ట ఉంది. ఆ గుట్ట, కుంటల మధ్య మాకున్న నాలుగెకరాల భూమిలో మక్క వేసేవాళ్లం. ఆ గుట్టకు నైరుతి భాగాన ఉన్న ఆరెకరాల భూమిలో ఎడ్లను మేపేవాళ్ళం.

మాకు మూడెకరాల పొలం ఉండేది. నా చిన్ననాడు వానాకాలం, వేసంగి రెండు కార్లు వరి పంటలు పండేవి. మా బాపు ఊళ్లో అవ్వలు దర్యా రైతుగా పేరుపొందాడు. జంగిడి బర్ల పెండ కొని పొలాలలో వేసేవాడు. కష్టపడి పనిచేసి పెద్ద మొత్తములో పంటలు పండిచేవాడు. మా బాపు తన అన్నలతో వేరుపడ్డాక, మాకు పాముల నర్సయ్య పాలేరుగా కుదిరాడు. అతడు మోరుదొప్పు మనిషిగా పేరుపొందాడు ఊళ్లో. అయినా మూడు సంవత్సరాలు మా వద్దనే పనిచేశాడు. అతనికి ఏదో జబ్బు చేసింది. మందుల ఖర్చులకు మా బాపు డబ్బులు ఇచ్చేవాడు. అతని ఆరోగ్యం కోలుకోలేదు. అతడు జీతం మానేశాడు. తర్వాత శేర్ల నర్సయ్య పాలేరుగా కుదిరాడు. నాలుగు సంవత్సరాలు పంటలు బాగా పండడంతో పెద్ద పంపులో ఎకరం, చేరీలో అర బిగుడుభూమి కొన్నాము. మరో పాలేరు అవసరం అయ్యాడు. బడుగు భూమయ్య పాలేరుగా కుదిరాడు. ఇద్దరూ చక్కగా పనిచేసే స్వభావం కలవాళ్లు. మా తండ్రి వాళ్లు సంతృప్తిపడే విధంగా వడ్లు, మక్కలు, వులువలు, కందులు, పెసళ్లు... ఇలా ఏ పంట పండిస్తే ఆ పంటలో కొంతభాగం వాళ్లకు కొలిచి ఇచ్చేవాడు.

శేర్ల నర్సయ్య మావద్ద పాలేరుగా ఉంటూనే చీర్లవంచ కాలువకింద ఎకరం భూమి కొన్నాడు. కొన్నాళ్ళకు బడుగు భూమయ్య పాలేరుగా పని విరమించుకొని బొంబాయి, ఢిల్లీ, మద్రాసు, కలకత్తా నగరాలకు వెళ్లి కూలీ పనులు చేసి డబ్బులు సంపాదించి ఇంటికి పంపించేవాడు.

నా ప్రాథమిక విద్య అయిదవ తరగతి వరకు మా ఊరిలోనే చదివాను. నేను మా చిన్న రాములు, పెద్దరాములు, బియ్యాలబాలయ్య, భారతి, వసుంధర, సుజాత, అంతవ్వ ఇంకా చాకలి జంబయ్య, మల్లయ్య, అనుపురం లక్ష్మయ్య, శ్రీనివాస్ అందరం కలిసి మా క్లాసులో పన్నెండు మందిమే. అయిదవ తరగతి వరకు ఊళ్లో ఉన్న కొట్టం బడిలోనే చదివేవాళ్లం.

మా ఊరి దూదేకులాయన చెప్రాసిగా ఉండేవాడు. వేములవాడ గంగారాం సారు, చీర్లవంచ తిరుపతి సారు, తాడూరి నర్సయ్య సారు, మడతనపేట సంజీవరావు సారు మాకు ప్రాథమిక విద్యా గురువులు.

ఈ గురువులు గుట్టలవైపు లేదా మానేరు వాగు ఇసుకలోకి తీసుకవెళ్లి ఆటలు ఆడించిన సందర్భాలు ఉన్నాయి. ఆ రోజుల్లో కోదండం ఎక్కే శిక్షలు మొద్దు విద్యార్థులు అనుభవించే వాళ్ళు. నేను చదువులో క్లాసులో సెకండు ర్యాంకులో ఉండేవాణ్ని. భారతి అని చెప్పానే ఆమె క్లాసులో ఫస్టు ర్యాంకులో ఉండేది.

సుజాత అని చెప్పాను కదా! వాళ్లకు బురుజు వుంది. ఆ బురుజు వాళ్ల ఇంటికి అయిదారు గజాల దూరంలో దక్షిణ భాగాన ఉంది. వాళ్ల ఇంటి ప్రహరీగోడ అటు బురుజు దక్షిణ అంచువరకు, ఇటు తూర్పు గోడ సరిహద్దు వరకు ఉంది. ఆ బురుజు ఎప్పుడు కట్టారో, ఎవరు కట్టించారో మా ఊళ్లో ఆధారాలు లేవు. ఆ బురుజు సుజాత తండ్రిగారైన సత్యనారాయణరావుదని మాత్రం అందరికీ తెలుసు. అది చాలా ఎత్తైన బురుజు. అంత ఎత్తైన బురుజు మధ్య మానేరు ప్రాజెక్టు పూర్తి అయితే ప్రాజెక్టు నీళ్లలో మునిగిపోతుంది. అది తలచుకుంటే సోషియల్ స్టడీస్ బోధించిన ఉపాధ్యాయునిగా నాకు బాధ కలుగుతుంది. ఆ ప్రాజెక్టు పూర్తి అయితే ఎవరెక్కడ ఉంటారో, ఏయే వుపాధి, ఉద్యోగాలలో జీవిస్తారో, మా భవిష్యత్తు జీవితం ఎలా ఉంటుందో తలచుకుంటే మనస్సు అల్లకల్లోలమవుతుంది. ప్రభుత్వం నష్టపరిహారము ఇచ్చేమాట నిజమేకానీ, మా గ్రామ సంస్కృతి, మా ఊరి జ్ఞాపకాలు, మా ఊరి పరిసరాలు, కట్టడాలు, ఆలయాలు ఊరిలోని కుటుంబాల మధ్య ఉన్న అనుబంధాలు, వివిధ వృత్తులవారి మధ్యగల స్నేహాలు, ఇచ్చిపుచ్చు కోవడాలు ఇవన్నీ చెల్లా చెదరవుతాయి కదా!

బురుజుకు కొద్దిదూరంలోనే కూలిపోయిన మా కొట్టం బడి ఉండేది. ఆ బడి కూలి పోయే దశలో ఉండగానే ఊరవతల కొటీరు బండమీద ఒకే ఒక గది గల బడికట్టించారు. అందులోనే అయిదు క్లాసులు నిర్వహింపబడేవి. గ్రామ జనాభా పెరగడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఈ బడి ఊరు చివర ఉంది. దీనిని విస్తరించడానికి వీలులేని పరిస్థితిలో, ఊళ్లోని అన్ని ప్రాంతాల వారికి అందుబాటులో ఉండేవిధంగా, లోగడ జంగిడి బర్రెలను మంద పెట్టే స్థలాన్ని ఎన్నుకొని విశాలంగా ఏడు తరగతులు నిర్వహింపబడేలా పాఠశాల బిల్డింగు కట్టబడింది.

తూర్పు రోడ్డు ఉత్తరం అంచున పాపారావుగారి కోనేరు, ధర్మశాల చాలాకాలం నాటివి, నా చిన్ననాటి నుంచి చూస్తున్నవే. ఈ ధర్మశాలలో ఎందరెందరో బాటసారులు భిక్షువులు సేదదీరేవారు. రెండు మూడు రోజులు నివాసం ఉండి వెళ్లిపోయేవాళ్లు. ధర్మశాల ప్రక్కనే

కోనేరు ఉండడం వలన నీటి సౌకర్యం, వంట చేసుకునేవాళ్లకు చక్కని అవకాశం. నేను ఈ ప్రాంతాన్ని చూడడానికి వెళ్లినపుడు గంగిరెద్దులవాళ్లు వంట చేసుకుంటూ కనిపించారు.

మరుసటి రోజు సాయంత్రం మానేరు వాగు వరకు వెళ్దామని బయలుదేరాను. హన్మాండ్ల గుడి దాటి ముందుకు నడవసాగాను. ఊరు ఉత్తర చివర పీతిరి కాలువ, దానినానుకొని కొటీరు బండ. ఈ బండమీదనే గుడి కట్టించకముందు వ్యవసాయదారులు వరికుప్పలు పెట్టి కళ్లాలు లేపుకునేవాళ్లు. కొటీరు బండ దాటగానే పోచమ్మ బండ. ఇది చాలా విశాలంగా ఉన్న పరుపుబండ. ఈ బండమీదనే పోచమ్మ గుడి ఉంది. ఈ గుడి వుత్తరం దిక్కు, వరికుప్పలు పెట్టుకోవడాలు, నువ్వు పరుపులు పరచుకోవడాలు, జొన్న కంకి కొట్టుకోవడాలు, కంది కట్టలు కొట్టుకోవడాలు, మక్కకంకులు ఎండపోసుకోవడాలు, వరి బంతులు, ఉలవ బంతులు కట్టుకోవడాలు చేస్తుంటారు, మా ఊరి చాలామంది రైతులు.

పోచమ్మ బండ దాటగానే చీర్లవంచ కాలు. ఆ కాలువ మా చిన్ననాటి రోజుల్లో వేసవి కాలంలో కూడా వేగంగానే పారుతూ ఉండేది. మేము మండు వేసవిలో ఆ కాలువలో ఈత కొట్టేవాళ్లం. చింతలకుంటలో మే నెలలో ఏటి కాలువతో నీళ్లు నిలువచేసి ఆ కుంట కింద ఉన్న భూములలో సేద్యం చేసేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితిలేదు. ఆ రోజుల్లో ఆ కుంట నీటిలోనే మేమంతా ఈత నేర్చుకున్నము. వ్యవసాయదారులు ఆ కుంటల్లోనే ఎడ్ల పెయ్యి కలిగేవాళ్లు.

చీర్లవంచ కాలువకట్ట దాటగానే మానేరువాగు. ఆ వాగులో మేము కబడ్డి, కోకో, లోన్‌పాటు, లాంగుజంపు మొదలగు ఆటలు ఆడేవాళ్లం.

✡

నేను ముప్పయి మూడు సంవత్సరాలు టీచర్‌గా సర్వీసు చేసి పదవీ విరమణ పొందాక కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాను. చెప్పాను కదా! మాది ముంపు గ్రామమని, పదే పదే ఇక్కడకు వస్తున్నానని... ఇంట్లో కూర్చుంటే ఏమి తోచకపోవడంతో బజారుకు వచ్చాను. సత్యం వాళ్ల ఇంటి ముందున్న వేపచెట్టు కింద కూర్చుండి ఉండడం కనిపించింది. అతని వద్దకు వచ్చి ముచ్చట ప్రారంభించాను. మాటల మధ్యలో అడిగాను. "మన ఊరు మునిగిపోతుంది కదా! డబ్బులు వచ్చాక ఎక్కడ ఉండాలనుకుంటున్నావు".

అతడు విచారం నిండిన స్వరంతో చెప్పాడు "నాలుగు నెలల క్రితం నేను మా మేకలు కొట్టుకొని గుట్టకు వెళ్లాను. ఉన్న పది మేకల్లో ఎనిమిది ఒకవైపు, రెండు మేకలు ఒకవైపు మేస్తున్నాయి. ఎనిమిది మేకలు వేగంగా ముందుకు పోసాగాయి. ఓ చెట్టు కింద ఉన్న రెండు మేకలను ముందుకు తోలుకపోవడానికి వెళ్తుండగా ఆ చెట్టు కొమ్మ గాలికి వచ్చి నా ఎడమ కన్నుకు తాకింది. కన్ను దెబ్బతింది. ఇల్లు కట్టుకుంటే మొత్తం పనిపూర్తి కావడానికి

చాలీచాలని డబ్బుతో నాలుగేండ్లు పట్టే. చేతిల డబ్బు అంతంత మాత్రమే ఉంది. హైదరాబాద్‌లో మా తమ్ముని కొడుకు కాంట్రాక్టర్ వద్ద గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఆ యజమానికి నమ్మకం కుదిరేటట్లు పనిచేస్తుంటడనుకో. ఆ కాంట్రాక్టర్ తమ్ముడి కంటి వైద్య నిపుణుడని, అతని వద్దనే ట్రీట్‌మెంట్ చేయిస్తనని, తక్కువ ఖర్చుతో కన్ను నయమవుతుందని, వాడు ఫోన్ చేసి చెప్పిండు. వచ్చే సోమవారం హైదరాబాద్ పోత. వారం రోజులు మేకలు గొల్లమల్లయ్యకు అప్పచెప్పి పోత...”

సత్యం ఇంట్లోకి వెళ్లిపోతుండగా మా చిన్ననాటి వేములవాడ హైస్కూల్లో చదివినప్పటి రూమ్మేటు మాధవరావు కనిపించాడు.

“ఏం మాధవరావు మీ వ్యవసాయం ఎలా నడుస్తున్నది? భవిష్యత్తులో ఎక్కడ వుండాలనుకుంటున్నావు?”

“నా పరిస్థితి నీకు తెలువదా అన్నా! ఆడపిల్లల పెళ్ళిళ్లు చేయడానికి ఉన్న భూమి అమ్మేత్తి, తీగల రాజయ్య బాపు పొలం చెయ్యవట్టి పదేండ్ల నుండి, పొలం బావి మంచి ఊటగలది. పంటలు మంచిగనే పండవట్టే. భూమి పాలు, ఖర్చులు పోను మిగిలిన పంటతోనే ఇన్నేళ్ల బట్టి బ్రతకవడితిమి. రాజయ్య బాపు మంచి మనిషి. వాళ్ల పెద్దకొడుకు లింగారావు సిరిసిల్ల డిపోలో డ్రైవర్‌గా పనిచేయవట్టే. చిన్న కొడుకు వెంకట్రావు ఎన్.టి.పి.సి.లో పనిచేయవట్టే. ఇక్కడ వీళ్లిద్దరు ముసలోళ్లేనాయే. ఆ పెద్ద మనుషులు నన్నాదుకుంటరు. వాళ్లకు నా చేతనైన సాయం చేస్త, ఇన్నేళ్లు ఎట్లనో కష్టపడి వ్యవసాయం చేసిన, నేను నా భార్య ఎట్లనో బ్రతుకుతున్నము. ఇప్పుడు నాక్కూడా అరవై ఏండ్లు వచ్చే. మునపటి తీరుగ పెయ్యిల ఉషారుతనం లేదు. ఏదో నెట్టుకత్తున్న” అన్నడు.

“మీ ఇంటి నష్టపరిహారం ఎస్టిమేషన్ ఎంత వచ్చింది?” అడిగిన.

అతడు చెప్పిండు.

“ఇంకా ఊరు విశేషాలేమిటి” అడిగిన.

“ఏ మున్నయన్నా! అందరూ విచారంగనే ఉన్నరు. ఊరు మునుగుతదంటే మస్కట్, దుబాయి, సౌదీ పోయినోళ్ల ఇంటి మనుషులైతే మరింత బెంబేలు పడుతుండ్రు. మన ఊరినుండి ఫారిన్ పోయినోళ్లు మూడు వందలమంది కంటే ఎక్కువనే ఉన్నరన్నా! వాళ్లతోటి పైరవీకార్లే ఎక్కువ లాభపడ్డరు. కొంతమంది సంపాదించి ఇండ్లు కట్టుకున్నారు. కొందరు భూములు కొన్నరు. కొందరు జైల్లపాలై వస్తున్నరు కద! వాళ్ల కుటుంబాలైతే రెంటికి చెడ్డ రేవడి గతి అయిందనుకో..” వానల్లేక, వాగులు పారక, బావులు తవ్విన తగినన్ని నీరు ఊరక వ్యవసాయాలు నడవక ఊళ్లో ఎవరిని పలకరించినా ఊరు మునిగిపోతుందని విచారం వ్యక్త పరచేవాళ్లే, స్వంత సమస్యలు వెల్లబోసుకునేవాళ్లే, ఎవరి గురించి అడిగినా, రాసినా కథ అవుతుంది.

మా మాధవరావు గురించి రాసినా, మాదిగ దుర్గయ్య గురించి రాసినా, మాల మల్లయ్య గురించి రాసినా, తెనుగు వీరయ్య గురించి రాసినా, ఎరుకల ఎల్లయ్య గురించి రాసినా, కమ్మరి సింగరయ్య గురించి రాసినా, వడ్ల శంకరయ్య గురించి రాసినా, దూదేకుల కాజమ్మ గురించి రాసినా, నాగురించి నేను రాసుకున్నా కథే అవుతుంది.

మేము చెప్పే మా బాధల గాథలు విని, చదివి మీరు మాత్రం మరచిపోకండి.

✡

# పరి‘పాల’న

**–వేంపల్లి రెడ్డి నాగరాజు**

అనగనగా ఓ న్యాయాధికారి. ప్రతి రోజూ ఉదయం నిద్ర లేస్తూనే ఆ రోజు దినపత్రికలోని తాజాదనాన్ని వేడి వేడి పొగలు, సెగలు చిమ్మే కాఫీతో కలిపి ఆస్వాదించడం ఆయన అలవాటు. ఇంకా బాగా చెప్పుకోవాలంటే బెడ్ కాఫీతో గొంతు తడవనిదే పొద్దు పొడవలేదని భావించి మంచం దిగడానికి కూడా ఇష్టపడని వ్యక్తి.

గత ముప్పై ఏళ్లుగా నిరంతరాయంగా కొనసాగుతున్న జడ్జి గారి ఈ కాఫీ అలవాటుకు ఒక రోజు సడెన్‌గా బ్రేక్ పడింది. అది డిశంబర్ రెండవ వారం. అసలే చలిపులి గజగజా వణికించేస్తున్న కాలం. రోడ్లన్నీ మంచు దుప్పట్లు కప్పుకున్న కాలం.

రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనలు, ఇరుపక్షాల వాదోపవాదాల గురించి ఆలోచిస్తూ నిద్ర కూడా సరిగ్గా పట్టక పక్కమీద దొర్లి ఉదయం నాలుగింటికే లేచి కూర్చున్నారాయన. లేచి గంటదాటినా, ఐదు గంటలు దాటుతున్నా అలవాటు ప్రకారం కాఫీ ఘుమఘుమలు ముక్కు పుటాల్ని సోకలేదు.

మరో అరగంట వేచి చూశారు.

పూర్తిగా పీల్చి పిప్పి చేసి పక్కన పడేసిన పేపర్‌నే అందుకుని మరోసారి తిరగేసి గిరాటేశారు.

అయినా కాఫీ వస్తున్న ఛాయలు కన్పించలేదు.

ఆలోచనలతో అలసివున్న మనసుకు చిరాకేసింది. అంతే ఒక్కసారిగా ఇల్లంతా దద్దరిల్లిపోయేలా ‘కాఫీ’ అంటూ కేకపెట్టారు.

అయ్యగారి కేకవిని పూజగదిలో నుండి అమ్మగారు, వంటింట్లో నుండి పనిమనిషి పరుగు పరుగున పడక గది చేరుకున్నారు.

ఆరు గంటలు కావస్తున్నా ఇంకా కాఫీ ఎందుకు రాలేదంటూ ఆగ్రహంతో ఊగిపోయారు జడ్జిగారు.

అష్టోత్తర స్మరణలో ఉన్న అమ్మగారు పనిమనిషి వైపు చూశారు.

కాఫీ ఇవ్వకపోవడంలో తన తప్పేమీ లేదంది పనిమనిషి.

మరెందుకు ఆలస్యమైందన్నట్టుగా చూశారు జడ్జిగారు.

పాలవాడు ఇంకా రాకపోవడమే కారణమని చెప్పింది గడగడా వణకుతూ.

పాలవాడు చేసిన తప్పుగా తప్పుకు తప్పనిసరిగా శిక్ష ఉండాలని భావించే వ్యక్తి ఆయన. అయితే విచారించి గాని శిక్ష వేయకూడదన్న వివేకం గలవాడు. అందుకే అత్యవసరంగా పాలవాడిని హాజరు పరచమన్నారు. ఆదేశాలు అమలయ్యాయి. విచారణ మొదలయ్యింది.

✡

"రోజూ నాలుగింటికే పాలు తెచ్చేవాడివి. ఈ రోజు ఇంకా ఎందుకు తీసుకురాలేదు?" ఆగ్రహంతో ఊగిపోతూ అరిచారు జడ్జిగారు.

"పాలు పితికేందుకు ఆవు పొదుగు దగ్గరకు పోతే తంతోంది దొరా. ఎన్ని సార్లు వెళ్లినా ఇదే తంతు" వాచి ఉన్న మొహాన్ని తడుముకుంటూ చెప్పాడు పాలవాడు.

అయితే ఆవును కూడా ప్రవేశపెట్టమన్నారు దొరవారు.

మాట అయ్యగారి నోట్లో ఉండగానే నౌకర్లు, చాకరు పరుగు పరుగున వెళ్లి ఆవును, దాంతోపాటు దూడను తీసుకుని వచ్చారు.

ముప్పై ఏళ్ళ ఉద్యోగానుభవంలో ఎందరో పశువుల్లాంటి మనుషులను విచారించి వుండడం వల్ల జడ్జిగార్కి పశు భాష కూడా బాగానే వచ్చు. అందుకే ఆవుతో దాని భాషలోనే మాట్లాడడం మొదలెట్టారు.

"ఎందుకు పాలివ్వలేదు?"

గత రాత్రి తమ పశుజాతి సమిష్టిగా తీసుకున్న నిర్ణయమే దానికి కారణమంది ఆవు తాపీగా.

"పాలివ్వకూడదని మీ సంఘం ఎందుకు నిర్ణయించుకుంది?" మళ్లీ ప్రశ్నించారు జడ్జిగారు.

"పాలించే పేరుతో నాయకులుగా అవతారమెత్తిన మీ మానవజాతి వైఖరి నచ్చక" బదులిచ్చింది ఆవు నెమరేస్తూ.

"నాయకుల వల్ల మీకొచ్చిన నష్టమేంటి?" కళ్లద్దాల్లోంచి సూటిగా చూస్తూ మరో ప్రశ్న సంధించారు జడ్జిగారు.

"మా మనుగడకే ప్రమాదం ముంచుకొస్తోంది కాబట్టి" తోకను వీపుపై రాపాడిస్తూ చెప్పింది ఆవు.

“అంటే?” సందేహంగా చూశారు జడ్జిగారు.

మౌనం దాల్చిన ఆవు చెప్పడం ఇష్టం లేనట్లుగా మొహం పెట్టింది.

“మీరిలా పాలివ్వకుంటే మాలాంటి కాఫీ రాయుళ్ల పరిస్థితి ఏంటి? పాలు తాగే పసిపిల్లల సంగతేంటి? దేవుడుకు క్షీరాభిషేకాలు, పంచామృతాల నైవేద్యాల మాటేమిటి? విందు భోజనాల్లో కమ్మని పెరుగు, ఘుమఘుమలాడే నెయ్యి వాసనలు, పాలకోవాలు, పూతరేకులు లేకుండా ఎలా? శోభనం పెళ్లికూతుళ్ళ చేతుల్లో పాలగ్లాసులు లేకపోతే ఆ తంతంతా బోసిపోదా?” నిగ్గదీసి అడిగారు జడ్జిగారు.

ఇక తప్పదన్నట్టుగా నోరు విప్పింది ఆవు.

“మీ మానవజాతిలో పరస్పర విద్వేషాలు రగిలినప్పుడు ప్రత్యర్థి వర్గాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మల్ని తగులబెట్టే దుష్ట సంప్రదాయం వున్నందునే మా పశుజాతి యావత్తూ సహాయ నిరాకరణ చేస్తున్నాయి” చెప్పింది.

అర్థంకాక అయోమయంగా చూశారు జడ్జిగారు.

“దిష్టిబొమ్మల తయారీకి మా ఆహారమైన ఎండుగడ్డిని వాడుతున్నారు. ఒక్కో బొమ్మ తయారు చేసేందుకు కనీసం నాలుగు పశువుల మేతను ఉపయోగిస్తున్నారు. దాన్నంతటినీ క్షణాల్లో కాలబెట్టి బూడిద చేసేస్తున్నారు” అంది ఆవేదనగా ఆవు.

జడ్జిగారు ఆశ్చర్యంగా చూస్తూ ఇంకా చెప్పమన్నట్టు చూశారు.

“గత ఎన్నో ఏళ్లుగా దేశవ్యాప్తంగా అనేక సందర్భాల్లో కొన్ని లక్షల దిష్టిబొమ్మల్ని తగులబెట్టారు. ఇప్పటికీ మీ వ్యాపారం కోసం పచ్చని అడవుల్ని నిలువునా నరికి రియల్ ఎస్టేట్లుగా మార్చి వర్షాలు రాకుండా చేస్తున్నారు. ఫలితంగా పచ్చగడ్డి దొరక్క కరువుతో అల్లాడుతున్నాం. పొలాల్ని సాగు చేయక, చేసినా గడ్డి ఇచ్చే పంటల్ని పండించని మనుషులకు – దిష్టి బొమ్మల రూపంలో మా ఆహారాన్ని బూడిద చేసే హక్కు, అధికారం ఎవరిచ్చారు?”

జడ్జిగారు మిడిగుడ్లు వేసుకుని ఆవు చెప్పేదంతా వింటున్నారు.

“పైపెచ్చు కోట్లు విలువచేసే గడ్డిని తిన్న ఓ పెద్దమనిషికి న్యాయస్థానం ఏ శిక్ష విధించింది?” చివరి ప్రశ్న తనమీదకే సంధించిందనిపించింది జడ్జిగారికి.

ఇంతలో వీధిలో ఏదో కలకలం వినిపించింది.

ఎవరో నిరసన కారులు తమ ప్రత్యర్థి రాజకీయ పార్టీకి చెందిన ఓ నేత దిష్టిబొమ్మకు నిప్పు పెట్టి బిగ్గరగా అరుస్తున్నారు.

గడ్డితో చేసిన దిష్టిబొమ్మ నుండి నాల్కలు చాచుతూ ఎగసిపడుతున్న మంటల్లాగే న్యాయాధికారి మెదడులో ఆవు వేసిన ప్రశ్నలు రగులుకొని మండుతున్నాయి.

✡

# పచ్చి కరువు

**-ఎం.హరికిషన్**

ఏపుగా పెరిగిన పొగాకు నారకేసి చూస్తుంటే చంద్రయ్య గుండె తరుక్కుపోతోంది. పెండ్లాం బిడ్డలు మైలు దూరం నుంచి ఆపసోపాలు పడ్తా బోరింగ్ కాన్నించి బిందెల్తో నీళ్లు తెచ్చి పోస్తా వున్నారు. రోడ్డుమీద గాలికి దుమ్ము ఎగిసెగిసి పడతా వుంది. కనుచూపు మేరలో ఎక్కడా పచ్చగడ్డి జాడే కనపడ్డంలేదు.

చంద్రయ్య నుదిటికి పట్టిన చెమట తుడ్చుకుంటూ తలెత్తి ఆకాశమొంక చూశాడు. ఒక్క మబ్బు తునకా కనబళ్లేదు. పెళ్లీడుకొచ్చిన బిడ్డ బిందెతో నారపై నీళ్లు చిలకరిస్తా వుంటే గుండె పిండేసినట్లయింది. అంతలో ఊరి బైటి బీడుపొలం గుర్తుకొచ్చి కండ్లలో నీటిపొర కమ్ముకుంది.

'యవసాయం గుడ్డోని చేతిలో రాయిలా మారెగదా' అని నిట్టూర్చి జేబులోంచి బీడి ముక్క తీసి ముట్టించాడు. పొగ గుప్పు గుప్పున వదుల్తా నెమ్మదిగా ఆలోచనల్లోకి జారిపోయాడు.

రుతుపవనాలు ఈ యేడు ముందే మొదలవుతాయని టీవీలో వార్త విని రైతులు సంబరపడ్డారు. చంద్రయ్యకు పోయినేడు పత్తేస్తే చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనైంది. అవ్వ వడికిన నూలు తాత మొలతాటికి సరిపోయినట్లు పెట్టిన కాడికి తిరిగి రావడమే గగనమైపోయింది. ఈసారైనా మంచి వానలు పడ్తే పిల్ల పెండ్లి చేసి యెళ్లగొట్టు కోవాలనుకున్నాడు. తన పదెకరాలకుగాను మరో పదెకరాలు గుత్తకు తీసుకున్నాడు.

రైతులందరూ ఎదురు చూస్తున్నట్లుగానే తొలకరిలో బ్రహ్మాండమైన వానొచ్చింది. నేలతల్లి తడిసి ముద్దయింది. రైతుల ఒళ్లు ఆనందంతో పులకరించాయి. గడాలు భుజాల మీదికెక్కాయి. ఎడ్లు ఒళ్లు దులపరించుకోని ముందుకు సాగాయి. చంద్రయ్య కూలీల్ని పిలంపి, పెండ్లాం బిడ్డల్తో చేనులోకి దిగాడు. ఇరవై ఎకరాలూ చదును చేసి విత్తడానికి అనువుగా తయారుచేశాడు.

పొగాకు విత్తనాలు సుబ్బారెడ్డి దగ్గర అప్పు తెచ్చుకొని, మడులు కట్టి ఇంటికాన్నే ఖాళీ జాగాలో నార పెంచడం మొదలుపెట్టాడు. పదిరోజుల్లో భూమి నుంచి మొలకలు తలెత్తి చిరునవ్వులు చిందించాయి. నెమ్మదిగా ఒళ్లు విరుచుకొని పైపైకెదగసాయి.

చంద్రయ్య వానకోసం ఎదురుచూడ్డం మొదలుపెట్టాడు. నెల గడిచింది. వాన రాలేదు. అప్పుడప్పుడు చిన్న చిన్న తుంపర్లొచ్చినా భూమి పైపాయ కూడా తడవలేదు. నెమ్మదిగా బావుల్లో గంగింకిపోవడం మొదలైంది. భూమి నెర్రలు విచ్చుకోసాగింది. ఎనకయ్య పండగొచ్చింది. నీళ్ల కుంటలో నిమజ్జనమైపోయింది. జోకరయ్య వూరూరూ తిరిగి ఒట్టి కుంటకు చేరుకున్నాడు. మాలపున్నమి గూడా దాటిపోయింది. కానీ వాన మాత్రం రాలేదు.

జనాలు దేవుళ్లకు మొక్కుకోవడం మొదలుపెట్టారు. గుళ్లో చెక్కభజనలు చేశారు. గంగమ్మకు పూజలు చేశారు. శివలింగంపై బిందెలకు బిందెలు నీళ్లు పోశారు. రాత్రంతా జాగరణ చేస్తా విరాటపర్వం పద్దెనిమిది రోజులూ చెప్పించుకున్నారు. వూరిడ్చి బైలు పొలాల్లో వనభోజనాలు చేశారు. గోరుకప్పను పళ్లెంలో పెట్టి ఈదీదీ తిప్పారు. వాన మాత్రం రాలేదు. మబ్బులు వచ్చినట్టే వస్తున్నాయ్. కమ్ముకుంటున్నాయ్. ఆశలు రేకెత్తిస్తు న్నాయ్. వూరిస్తున్నాయ్. అంతలోనే గాలికి చెదిరిపోతూ దాగుడుమూతలాడుతున్నాయ్.

ట్రాక్టర్ శబ్దంతో చంద్రయ్య ఆలోచనల్లోంచి బైటకొచ్చాడు. నీళ్ల డ్రమ్ముల్తో దుమ్మురేపు కుంటూ శంకర్రెడ్డి ట్రాక్టరు చంద్రయ్యను దాటిపోయింది. అది దాటిపోయేంతవరకూ కనుచూపు మేర అలాగే చూడసాగాడు. నెమ్మదిగా మనసులో ఒక ఆలోచన మొలకెత్తింది. క్షణాల్లో మానుగా మారి వూడలు దిగింది. కాసేపు కిందామీదా పడి లెక్కలు వేసుకున్నాడు. ఒక నిర్ణయానికొచ్చి బీడీ ఆర్పేసి ఇంటికి చేరుకున్నాడు.

భార్య లక్ష్మమ్మ అన్నం చేస్తా వుంది.

మంచమ్మీద కూలబడి పెండ్లాం కేసి చూస్తూ 'ఏమేవ్.. శంకర్రెడ్డి నీళ్లు పారుమంచాల చెరువు నుంచి డ్రమ్ముల్తో తెప్పించి నాట్లేస్తున్నాడంట. మనమూ అట్లాగే చేద్దాం. ఇంకో వారం దాట్తే నారకు చెండొచ్చేస్తాది. ఎందుకూ కొరగాకుండా పోతాయ్. రేపు నార నాట్టానికి కూలీల్ని పిలు. నీళ్లకత నేచూస్తా' అన్నాడు.

ఆ మాటింటానే లక్ష్మమ్మ అదిరిపడింది. గయ్యిన లేస్తా 'ఏందయ్యోవ్.. పులిని చూసి నక్కవాత బెట్టుకున్నట్టూ... ఆళ్లంటే మారాజులు, ఏమైనా చేస్తారు. మనకూ ఆళ్లకూ పోలికా... ఊరందరిదీ ఒక దార్తైతే వులిపిరి కట్టెది ఒక దారనీ... యేం మనమొక్కరమేనా.. ఊళ్లో చిన్న చిన్న రైతులందరూ గమ్మున ఆకాశమొంక చూస్తా వున్నారు. నారపోతే పోనియ్. మళ్లా కొనుక్కోవచ్చు' అనింది.

అప్పటికే ఒక నిర్ణయానికొచ్చేసిన చంద్రయ్య పెండ్లాం మాటలు ఏమాత్రం చెవిలోకి ఏస్కోలేదు.

'సేవ్... నువ్ కిందా పైనా మూస్కోని గమ్మున నే చెప్పిన పని చెప్పినట్టు చెయ్. మొగోన్ని నాకు తెలీదా. యేం చెయ్యాల్నో కుండలో కూడు కుండలోనే ఉండాలి బిడ్డలు

గుంద్రాయిల్లా వుండాలి అంటే కుదుర్తాదా. ఈ వారం కాకపోయినా వచ్చేవారమన్నా ఖచ్చితంగా కురిసి తీర్తాది. దేముడేం గుడ్డోడు కాదు' అంటూ పనులు పురమాయించి సుబ్బారెడ్డి దగ్గరికి అప్పుకోసం బైలుదేరాడు.

సుబ్బారెడ్డి విషయం తెల్సుకోని కాసేపాలోచించి 'నా మాటిను చంద్రయ్యా... ఇల్లలక గానే పండుగ కాదు గదా... కాలాలసలే బాగాలేవు. గడ్డపారలే గాలికెగిరిపోతుంటే గడ్డి పరకలు ఎగుర్లాడినట్లు యెందుకట్లా ఉరుకులాడ్తున్నావ్? ఇప్పటికే నీ అప్పు తడిసి మోపెడైంది. పోయిన సంవచ్చరమిచ్చిందానికి ఇంతవరకూ వడ్డీ గూడా జమెయ్యలేదు. మళ్లా కొత్త అప్పంటున్నావ్.. నువ్వు యాడికీ పోలేవనుకో. కానీ ఓ వారమాగు. చుట్టపక్కల వూళ్లన్నిట్లోనూ వానపడ్తానే వుంది. దేముడు కండ్లు తెరిచి చూడాల్నేగానీ ఎంతసేపు. నిమిషాల్లో కళకళలాడిపోతాది. నారదేముంది. పోతేపోనియ్. కొత్తది కొనుక్కోవచ్చు. నాట్నాక వానగాని ఆలస్యమైందనుకో... చేతులారా దుడ్లు మన్నులో పోసినట్లయితాది. కాస్త ఆలోచించు' సలహా యిచ్చాడు.

చంద్రయ్య అదేమీ పట్టించుకోకుండా 'రెడ్డీ... గాడిదల్తో సేద్యం చేస్తా కాలితన్నులకు జడిస్తే ఎట్లా చెప్పు. నేనైతే నాట్లెయ్యాలని నిచ్చయం చేసుకున్నా. నార చచ్చినాక వానొస్తే మాత్రం కొత్తనార వూకె దొరుకుతాదా. ఇప్పటికే చాలామందివి చెండ్లొచ్చేసి పనికి రాకుండా పోయినాయ్. అందరూ ఒక్కసారిగా ఎగబాక్తారు. తొక్కిసలాట పెరిగేకొద్దీ రేటు అమాంతం కొండెక్కి కూచుంటాది. తుమ్ముకుంటూ పోతే సొంఠి పిరమైనట్లు కూలీల రేట్లు కూడా ఎగిసెగిసిపడతాయ్. ఇప్పుడైతే సగం రేటుకే వొస్తారు. అప్పుడు పెట్టే డబ్బేదో ఇప్పుడే నీళ్లకే పెడ్దామనుకుంటున్నా. ఆకాశం చల్లగానే వుంది. చెమ్మ కూడా తొందరగా ఆరిపోదు. అంతలోపు వానెలాగూ వచ్చేస్తాది' అంటూ పట్టుపట్టి చూపిచ్చిన చోట వేలిముద్రేసి అప్పు తెచ్చుకున్నాడు.

మర్నాడు పొద్దున్నే చంద్రయ్య నీళ్ల డ్రమ్ముల్తో చేనుకి చేరుకున్నాడు. అప్పటికే లక్ష్మమ్మ నారకట్టల్తో, కూలీల్తో పొలంలో సిద్ధంగుంది. చేనుకి పూజ చేసి టెంకాయ కొట్టి పనిలోకి దిగారు. కూలీలు ఒకరు నీళ్లు పోస్తా వుంటే మరొకరు చకచకా నాట్లేయసాగారు. లక్ష్మమ్మ దగ్గరుండి అజమాయిషీ చేయసాగింది. సాయంత్రం పొద్దుగూకే వేళకి నాటడం పూర్తయింది. చంద్రయ్య కూలీలకంతా డబ్బులు పంచి పంపిచ్చినాడు. గట్టుమీద నిలబడి తృప్తిగా ఒకసారి చూసుకొని పెండ్లాం బిడ్డలతో ఇంటికి చేరుకున్నాడు. దేవుని మీద భారమేసి ఆకాశమొంక చూడ్డం మొదలుపెట్టాడు.

నెమ్మదిగా వారం దాటిపోయింది. వానరాలేదు. మొక్కలు సోలడం మొదలుపెట్టాయి. మళ్లా ఒకసారి డ్రమ్ముల్తో నీళ్లు తెప్పిచ్చి పోపిచ్చాడు. మోడాలు కనబడ్తున్నాయేగానీ వాన మాత్రం రావడం లేదు.

గుండె బిక్కు బిక్కుమనడం మొదలుపెట్టింది.

'ఛూఛూ... తప్పు చేస్తినేమో... పెండ్లాం బిడ్డలు నెత్తీనోరూ కొట్టుకున్నా వినకపోతి. సుబ్బారెడ్డి చెప్పినా చెవినేసుకోకపోతి. నాటి రెండువారలైపాయ. వానదేముడేమో కనికరించడం లేదు. వడ్డీ డబ్బుల్తో ఎన్ని నీళ్లని తెచ్చేది. అందరి మాదిరి గమ్మున కూకోక పెద్ద పాలెగాని లెక్క అతికం పని చేసినందుకు తగిన శాస్తి జరిగేటట్టుంది' అని గుంజాటన పడసాగాడు. నెమ్మదిగా కాళ్లీడ్చుకుంటూ వూరి మధ్య రచ్చబండ కాడికి చేరుకోని అరుగు మీద కూలబన్నాడు.

కాసేపటికి ఓబులేసునాయుడు అటుగా వచ్చాడు. చంద్రయ్యను చూసి 'ఏందిరోయ్.. అట్లా కూలబన్నావ్... చేనెట్లా వుంది' పలకరిస్తా పక్కన కూచున్నాడు.

'ఏం చెప్పమంటావ్‌లే నాయుడూ... కరువులో కవలపిల్లలు పుట్నట్లు పంటేమో వాడిపోతా వుంది. వడ్డేమో పెరిగిపోతా వుంది. ధైర్నం చేయడమేమో చేస్తిగాని ఇప్పుడు ఎందుకు చేస్తినా అని విచారిస్తున్నా. ఐనా ఈ బైలు పొలాన్ని నమ్ముకోవడమూ... గుడ్డోన్ని దారి చూపియ్యమనడమూ రెండూ ఒకటే. అటు పోయినేడు తెగించి సొసైటీ లోను తెచ్చి బోరింగేపిస్తే ఏమైందో తెల్సుగదా. పిల్లోడుచ్చపోసినట్లు నీళ్లు పన్నాయి. అది గూడా నాలుగు నెల్లే' జీరబోయిన గొంతుతో దిగాలుగా జవాబిచ్చాడు.

నాయుడు చంద్రయ్య భుజం తడ్తా 'రోట్లో తల బెట్నాక రోకటి దెబ్బలకు జడిస్తే ఎట్లా చెప్పు. మొన్న తూడిచెర్లలో మాంచి వానొచ్చి భూమి సితసితలాడి పోయిందంట. కూలీలు దొరక్క చుట్టుపక్కల వూరోళ్లను అడిగినంతిచ్చి పిలిపిచ్చుకున్నారంట. అంతెందుకు పోయినారం మిద్దూర్లో, కనకయ్య కొట్టాల్లో నీళ్లు దోనెలెక్కిపారినాయ్. పగిడాల్లోనైతే మొక్కలు మోకాలంతెత్తు ఎదిగినాయ్. ఇంక మనూరే మిగిలింది. ఈరోజు గాకపోతే రేపు. ఖచ్చితంగా కుర్సి తీర్తాది. నువ్వేం దిగులు పెట్టుకోకు' అన్నాడు.

అంతలోనే దూరాన్నుండి పురుముల శబ్దం చిన్నగా చెవులను సోకింది. తలెత్తి చూస్తే పడమట నల్లని మొబ్బులు ముసురుకొని కనబన్నాయి.

ఓబులేసునాయుడు అట్టాగే చూస్తూ "ముచ్చుమర్రికెళ్లి మోడాలు బ్రమ్మాండంగా దిగినాయ్. వాన చంపుకొంటున్నట్టుంది. పడమట పిసరంత మబ్బు పడ్తే పాతాళం దాకా వానంట. మనకు గూడా పన్నా పడ్తాది' అన్నాడు.

కాసేపటికే చల్లనిగాలి వూరిని చుట్టుముట్టుకోని జనాలను ఆప్యాయంగా స్పర్శించింది. నెమ్మదిగా ఆకాశంలో మబ్బులు ముసురుకోసాగాయి. చంద్రయ్య ఆకాశమొంక చూస్తా 'దేవుడా... కాస్త మమ్మల్ని గూడా దయ చూడు సామీ' అని మొక్కుకున్నాడు. ఇండ్లల్లో హొటళ్లలో ఉన్న రైతులందరూ వీధుల్లోకొచ్చి ఆశగా ఆకాశమొంక చూడసాగారు.

అంతలోనే ఈదురుగాలి రివ్వున పైకి లేచింది. 'ఛూ.. దీనమ్మ.. ఈ గాలికి మబ్బులేం నిలబడ్తాయ్' ఒకడు తుపుక్కున వుమ్మేశాడు.

గాలి మరింత పెరిగింది. చెట్లు దయ్యాలు పట్టినట్లు సివాలెత్తి వూగసాగాయి. దుమ్ము ఆకాశానికెగసింది. చూస్తూండగానే మబ్బులు ఊరివైపు వేగంగా రావడం మొదలుపెట్టాయి. క్షణాల్లో చీకటి ముసురుకుంది.

ఆకాశం నుంచి మొదటి చుక్క భూమిని చల్లగా తాకింది.

భూమమ్మ ఆశగా నోరు తెరచింది.

సన్నని తుంపర మొదలై... వుంటుంటనే వురుములు, మెరుపులతో భీకరంగా మారిపోయింది. ఆకాశానికీ, భూమికి మధ్య చిక్కటి వారధి ఏర్పడింది. నేలతల్లి ఎన్నాళ్ల నుంచి దాహంగుందో ఆవురావురుమని తాగసాగింది. నీళ్లు దోనెలెక్కి పారసాగాయ్. నిద్రపోతున్న కాలువలు వులిక్కిపడి వురకడం మొదలెట్టాయి. భూమమ్మ తాగీతాగీ ఇక తాగలేక పసిపిల్లోని లెక్క కక్కడం మొదలుపెట్టింది. నేలంతా చిత్తడి చిత్తడయిపోయింది. సాయంత్రం మొదలైన వాన మరుసటిరోజు సాయంత్రానికి గానీ తెరిపియ్యలేదు. తరువాత రోజు పొద్దున్నే వూర్లో యెడ్ల గజ్జెలు ఘల్లుమన్నాయి. గడాలు పొలాలకేసి బారులు తీరాయి. యాడచూసినా ఒకటే హడావుడి. కూలీల కోసం, నార కోసం జనాలు పరుగులు దీసిరి.

చంద్రయ్య ఆనందం అంతా యింతా కాదు. గట్టుమీద నిలబడి చేనుని చూస్తా వుంటే పచ్చని పెండ్లి మంటపంలా కనబడింది. మొక్కలు బలం పుంజుకోని నిటారుగా, గర్వంగా ఆకాశం కేసి తలెత్తి చూస్తా వున్నాయి. భూమి బాగా పదునెక్కింది. మిగతా వాళ్ల పొలాలకేసి చూశాడు. కొన్నిట్లో నాట్లు పడ్తున్నాయ్. మరికొన్నిట్లో విత్తనాలు పడ్తున్నాయ్.

వాటిని చూసిన కళ్లతో మోకాలెత్తు ఎదిగిన తన చేనును చూస్తే సంబరంగా అనిపిస్తోంది. తరువాత రోజు చేనంతా పాపిచ్చి, కసి తీపిచ్చాడు. ఎరువుల అంగట్లో బాకీ తెచ్చి భూమి మందులు ఏపిచ్చాడు. వారానికల్లా ఆకులు పెద్దగా మంచిరంగుకు తిరిగాయి.

'చిత్తకార్తెలో ఇంకో మంచి వాన కురిస్తే చాలు. ఆ తరువాత చలికాలమొచ్చేస్తాది. మంచు కురుస్తాది. భూమి పదునారదు' అనుకున్నాడు.

'ఏం చంద్రయ్యా... గట్టుమీద నిలబడి తెగ మురిసిపోతున్నావ్. పంట బ్రమ్మాండంగా కలకలలాడ్తోందే. అందరికంటే ముందే చేతికొస్తే నక్కను తొక్కినట్లే. ఏది ఏమైనా బలే ధైర్నం చేశావ్లే' పక్కపొలం వీరన్న మెచ్చుకోలుగా అన్నాడు.

'ఆ నాదేముందిలే.. యేదో ఆ దేవుడు దయ చూడబట్టిగానీ ఓ రెంద్రోజులు ఆలస్సెం చేసుంటే యేమైపోదునో గదా' అంటూ ఆకాశమొంక చూసి మొక్కుకుంటూ చిరునవ్వులు చిందించాడు.

'పిల్ల పెండ్లి చేయాలనుకొంటున్నావంట గదా... ఏదైనా సమ్మందం చూస్తివా' ప్రశ్నించాడు.

'ఆ.. ఆ... చూస్తున్నా. నన్నూరి దగ్గరి పూడిచెర్లలో మాంచి సమ్మందముందంట. మొన్న మా చిన్నాయన చెప్పినాడు. పెద్ద మనుషులను పిల్లను చూడ్దానికి రమ్మని పిలంపాలి. పంట చేతికొచ్చి దుడ్లాడ్తే సంక్రాంతి తర్వాత మంచి దినాలు చూసి చేసేస్తా' జవాబిచ్చాడు.

'మమ్మల్ని పిలవడం మర్చిపోమాకు' అంటూ నవ్వుతూ వీరన్న ఆన్నించి వెళ్లిపోయాడు.

చంద్రయ్య ఇంటికి చేరుకున్నాడు. రోజులు నెమ్మదిగా గడవసాగాయి. దినాలు కాస్తా వారాలయ్యాయి. నెమ్మదిగా భూమి తడారడం మొదలుపెట్టింది. చిత్తకార్తె ప్రవేశించింది. వాన మాత్రం రాలేదు. మొక్కలు వడలిసోలడం మొదలుపెట్టాయి. రైతుల్లో మళ్లీ ఆందోళన పెరిగింది. 'ఒక్క వాన కురిపిచ్చు స్వామీ' అని ఎదురుచూపులు చూడ్డం మొదలుపెట్టిరి.

అంతలో బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. రాయలసీమలో గూడా భారీ వర్షాలు పడొచ్చని పేపర్లలో వార్తలొచ్చాయి. మధ్యాన్నానికల్లా నల్లని మొబ్బులు కమ్ము కున్నాయి. సాయంత్రానికి పూర్తిగా ముసురుకుంది. చిమ్మచీకటై పోయింది. వాన ఒక్కసారిగా పెలపెలమని విరుచుకుపడింది. పెద్ద పెద్ద చినుకులతో కుండపోతగా కురిసింది.

దానిని చూసి 'దెబ్బకు చెరువు సగానికి సగం నిండిపోయింది. ఇక కరువు తీరినట్టే' అనుకున్నారు జనం. చంద్రయ్య చేను మళ్లా కలకలలాడింది. ఇంక వాన లేకపోయినా దిగుల్లేదు. పంట చేతికందినట్లేనని సంబరపన్నాడు.

కానీ నాలుగు రోజులకే మళ్లా వాన, భూమి తడారకముందే ఇంకోవాన. ఎడతెరిపి లేకుండా వానలమీద వానలు. ఆగ్నికి ఆజ్యం తోడైనట్లు అల్పపీడనాలు, రుతుపవనాలు ఒకదాన్తో ఒకటి కలిసిపోయాయి. ఆకాశంలో సూర్యుడు కనపడ్డం మానేశాడు. వాగులూ వంకలూ పరుగులెత్తసాగాయి. చెరువులు గండ్లు పడసాగాయి. పొలాలు నీళ్లతో నిండిపోసాగాయి. ఎక్కడ చూసినా మిద్దెలు కూలిన వార్తలే. పంటపొలాలు మునిగిపోయిన కబుర్లే. 'వట్టి కరువుపోయి పచ్చి కరువు వచ్చేటట్లుంది' అనుకోబట్టిరి.

వాన ఆగాలని దేమునికి పూజలు చేయడం మొదలుపెట్టిరి. దేముడు దయ తలచలేదు. వాన తెరిపిచ్చినట్లు ఇస్తూనే మళ్లా దంచి కొట్టసాగింది. రైతులు మొఖాలు నెమ్మదిగా వడలడం మొదలుపెట్టాయి.

వారం రోజుల తర్వాత వాన తెరిపిచ్చింది. చంద్రయ్య వురుకులు పరుగుల మీద చేనుకి చేరుకున్నాడు. చేనుని చూస్తానే గుండెలో రాయి పన్నట్లయింది. కాలూ చేయీ చచ్చుబన్నట్లు కూలిపోయాడు. పొలమంతా నీళ్లు నిండిపోయున్నాయ్. మొక్కలు భూమికి కరుచుకోని ఆకులు కుళ్లిపోయాయి. బుడుకులాన్నా ఒక్క మొక్కా నిటారుగా కనబళ్లేదు. చేనంతా పిచ్చి మొక్కలు అడ్డదిడ్డంగా పెరిగిపోయినాయ్. పురుగులు కలకలలాడు తున్నాయ్. చేలోకి కాలుపెడ్తే చాలు మడమల వరకు సర్రున దిగిపోసాగింది.

'ఛూ... నీయవ్వ' అంటూ ఆకాశం కేసి కాండ్రించి ఉమ్మేశాడు చంద్రయ్య. 'దినమూ చచ్చేటోనికి ఏడ్చేటోడెవడు' అనుకుంటూ గట్టు మీన్నే వాలిపోయాడు. కండ్లలో నీళ్లు తిరిగాయి. సాయంత్రం వరకూ అట్లాగే వూటలూరుతున్న కండ్లతో వుండిపోయాడు. పొద్దువాలుతుంటే నీరసంగా అడుగులు వేస్తా ఇంటికి చేరి మంచమ్మీద కూలబడిపోయాడు.

పెండ్లీడు కూతురు గుర్తుకొచ్చింది. సుబ్బారెడ్డి దగ్గర తెచ్చిన అప్పు గుర్తుకొచ్చింది. ఎరువుల బాకీ కదలాడింది. సొసైటీలోను గుర్తుకొచ్చింది. బాధగా కండ్లు మూసుకున్నాడు. కనెప్పల కింద నుంచి నీళ్లు ఆగకుండా కారిపోసాగాయి.

మొగుని పరిస్థితి చూస్తుంటే లక్ష్మమ్మ గుండె తరుక్కుపోయింది. పోయినేడు టమోటా వేసి కోత కూలీ కూడా గిట్టక గంపలకు గంపలు మార్కెట్లోనే పారబోసి చేనులో పురుగుల మందు తాగి చచ్చిపోయిన రంగయ్య గుర్తుకొచ్చాడు. అప్పుమీద అప్పు తెచ్చి బోరు మీద బోరు వేసి నీళ్లు పడక, అప్పు తీర్చలేక ఆ బాయిలోనే పడి చచ్చిపోయిన ఎల్లన్న గుర్తుకొచ్చాడు.

లక్ష్మమ్మ గుండె భయంతో బిక్కుబిక్కుమంటూ కొట్టుకోసాగింది. మొగుడు ఏమగా యిత్యం చేసుకుంటాడో ఏమోనని కండ్లలో వత్తులేసుకోని రాత్రంతా కాపలా కాసింది.

తరువాత రోజు పొద్దున్నే సూర్యుడు సురసురలాడ్డం మొదలుపెట్టాడు. చంద్రయ్య మంచం దిగలేదు. ఎవరితోనూ ఒక్కమాటా మాట్లాడలేదు. కాళ్లు ముడ్చుకోని పైకప్పుకేసి చూస్తా వుండిపోయాడు. చచ్చినా బతికినా ఈ మట్టితోనే గదా అనుకుంటూ లక్ష్మమ్మ మనసు చిక్కబట్టుకోనింది. బైటకొచ్చి ఆకాశాన్నీ నేలనూ చూసింది. తిరిగి లోపలికొచ్చి మొగుని మంచం వద్దకు చేరి తట్టి లేపుతూ.

"యేందబ్బా.. అట్లా కూలబడ్తివి. మనసులకు గాకపోతే మానులకొస్తాయా కష్టాలు.. లేలే.. ఇట్లాటప్పుడే ధైర్నంగుండాల. పిల్లపెండ్లి ఈ సమ్మచ్చరం కాకపోతే వచ్చే సమ్మచ్చరం చేయొచ్చు. మించి పోయిందేమీ లేదు. కొంగు తడిచినోళ్లకు చలిగానీ కోకంతా తడిచినోళ్లకు చలేమి... లేలే... పొగాకు పోతే పోనియ్. జొన్నేద్దాం. జొన్నకిదే అదును. భూమి పదునారక ముందే తొందరపడాల. తర్వాత విచారించి లాభం లేదు. లేసిపోయి జొన్నిత్తనాల గురించి విచారించి చేనుకాడికి చేర్చు' అనింది.

చంద్రయ్య కండ్లు తెర్చి పెండ్లాం మొగం వంక చూశాడు. ఆమె కండ్లల్లో ఆశ మినుకు మినుకుమంటా ఒక మూల వెలుగుతూ కనబడింది.

'నీకే చెబ్తున్నది. లేచి ఒక్కసారి బైటకు పోయి చూడు. రైతులందరూ మల్లా మొదట్నించీ సేద్దం చేయడానికి సిద్ధం చేస్తున్నారు. రైతు పుట్టుక పుట్నాక యిట్లాంటి చిన్న చిన్న దాండ్లకల్లా యెదపడ్తే మనం యవసాయం చేసినట్టే... బదికినట్టే.. దేముడు కండ్లు తెర్చి చల్లగా ఒక్క

చూపు చూడాల్నేగాని.. ఈ కష్టాలెంత సేపు' అంటూ వంటింట్లోంచి రొట్టె తీసుకొచ్చి ముందు పెట్టింది.

చంద్రయ్య నెమ్మదిగా లేచి కాళ్లూ చేతులూ కడుక్కోని రొట్టె తిని నీరసంగా దిగాలుగా బైటకొచ్చాడు. రోడ్ల మీద ఎడ్లగజ్జెలు ఘల్లుమని వినబన్నాయి. పొలాలకేసి పలుగుపారలతో బారులు దీరిపోతున్న రైతులు కనబన్నారు. వాళ్లను చూస్తుంటే చంద్రయ్యకు తెలియకుండానే వొంట్లోకి ఎక్కడలేని సత్తువ వచ్చి చేరింది. నీరసం ఎగిరిపోయింది. అడుగుల వేగం దానంతటదే పెరిగింది.

✡

# నాయిన కూతురు

-వి.ప్రతిమ

"కుహూ... కుహూ" అంటూ కోయిల కూసింది....

రెండుసార్లు కాదు... మళ్ళీ మళ్ళీ అరిచింది.

నాకెందుకో ఈ కోయిల గొంతు అంత మార్దవంగా అన్పించదు.

"మా మామిడి చెట్టు మీది కోయిల సరిగ్గా యిలానే అరిచేది" అంటాడు సతీష్ గర్వంగా...

"మా పెరటి మామిడి చెట్టు మీది కోయిల గొంతు బాగా మార్దవంగా వుండేది... అది ముదురు ఎరుపు రంగులో వుండే మామిడి చిగుళ్ళనీ, దోసిలి యింకా విడవని జామ చిగుళ్ళనీ తినేది... అందుకే దాని గొంతులో అంత మార్దవం..." అంటాను నేను....

"కాదు కాదు... అచ్చంగా కోయిల యిలానే కూస్తుంది" రెట్టిస్తాడు సతీష్.

అది తన అభిప్రాయమైతే కావొచ్చు.. నన్ను ఒప్పించాలని చూడ్డం దగ్గరే వస్తుంది పేచీ అంతా...

పొంగుతున్న పాలకింద మంటనార్పి వెళ్దామనుకుంటుండగానే మళ్ళీ అరిచింది కోయిల... ఈసారి దాని గొంతులో ఏదో వికృతమైన మార్పు. కోయిల్లా కాకుండా తీతువులా వుంది అరుపు...

పొంగకుండానే పాలనాపి నేను ముందు గదిలోకి పరిగెత్తే లోపునే మావగారు తలుపు తీయడం "ఎక్కడ చచ్చారంతా" అంటూ దూకుడుగా సతీష్ లోపలికి రావడం ఒకేసారి జరిగిపోయాయి....

ఒకసారి నాకేసి ఎగాదిగా చూసి చీదరగా మొహం పెట్టాడతడు.

బొడ్డులో దోపి పైకెగ్గట్టిన చీర, దానికింది నుండి కన్పిస్తోన్న లో లంగా, చెమటతో తడిసిన కాటన్ జాకెట్టు, చామన ఛాయ ముఖంమీద కారుతోన్న కుంకం బొట్టూ, చేతిలో మసిగుడ్డా, తలకూడ చెదిరి వుందేమొ తెలీదు...

ఫుల్‌గా మేకప్పుతో వంట చేయడానికి యిదేమన్నా యాడ్‌ఫిల్మ్ షూటింగా?

కాసేపటిగ్గానీ అతడి చూపులోని ఉరుము తాలూకూ సందేశం అందలేదు నాకు. "యింకా బయల్దేరలేదా?" అన్న పిడుగు పడేదాకా...

నవ్వడానికి ప్రయత్నించి ఓడిపోయినట్లున్నాను....

నన్ను ప్రయాణం కట్టిస్తోన్న కారణమేదో గుర్తొచ్చి రెండురోజులుగా నీళ్ళు పట్టని తోటకూరకాడలా వడలిపోయాను.

లేని ఓపికని తెచ్చి పెట్టుకుని సతీష్‌క్కావల్సిన భోజన సదుపాయాలన్నీ అమర్చి పెట్టి హడావిడిగా స్నానాల గదిలోకి పరిగెత్తాను.

తుఫానులో వానమబ్బులా ఎడతెరిపి లేని ఆలోచనలతో నా మనసు నిండిపోయింది... నాయినకు ముగ్గురు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్ళు.

చిన్నప్పుడే నాయిన నాయిన చనిపోవడంతో తమ్ముళ్లనీ, చెల్లెళ్లనీ సాకి సంతరించి పెళ్ళిళ్ళు చేసి తర్వాత తను పెళ్ళి చేసుకున్నాడంట.

పెద్ద తమ్ముడికి చదువు రాకపోతే కాళహస్తి రైస్‌మిల్లులో పనికి పెట్టాడు... చిన్నాయినలిద్దరినీ బి.ఎ. వరకూ చదివించాడంట ఆ రోజుల్లోనే... మా వూరి నుండి మొదట డిగ్రీ తీసుకున్నది నా తమ్ముళ్ళే అని గొప్పగా చెప్తుండేవాడు నాయిన....

రెండో చిన్నాయిన గూడూర్లో సినిమాహాలు లీజుకి తీసుకుని అక్కడే కాపురం పెట్టుకుని తన బతుకేదో తను ఎల్లీదుకునే వాడు.

చిన్న చిన్నాయన మాత్రమే ఊళ్ళో వుండి అందరి పొలాలనూ దున్ని పెడుతుంటాడు...

✡

ఊరికి చేరువవుతూంటే ఒక పరిమళ భరితమైన ప్రాణవాయువేదో నను చుట్టేసి చెవుల్లో గుసగుసలు పోతోంది.

టపటపమంటూ నాలుగు చినుకులు పడ్డ తర్వాత భూమిలో నుండి ఆవిరయి లేచే మట్టి వాసన నాయిన్ని గుర్తుకు తెస్తుంది.... నాన్నకా వాసనంటే చాలా యిష్టం...

అమ్మ తాతయ్యకు ఒక్కటే కూతురు కావడంతో నాన్న ఇల్లరికం వెళ్ళి పేటలో వుండడం మొదలుపెట్టాక చాలరోజులు ఈ మట్టివాసన కోసం విలవిల్లాడే వాడు... ఆ తర్వాత మా యింటి దగ్గరలో రెండెకరాలు కొని సేద్యం చేయడం మొదలుపెట్టాడు. కూరగాయల పాదులు పెట్టేవాడు... అరటితోట... అందులోనే మరికొన్ని పండ్ల చెట్లు నాటేవాడు. తాతయ్య వ్యాపారాన్ని అందిపుచ్చుకుంటూనే వ్యవసాయాన్ని కూడా వొదిలిపెట్టలేదు నాన్న....

నాన్న నా జీవితానికో ఎస్సెట్... ఆయన నేర్పించిన మంచి, చెడూ, నాన్న తాలూకా బాల్య స్మృతులూ, మొత్తంమీద నాన్న తండ్రి తనం యిచ్చిన తాత్త్వికత నాతో జీవితమంతా తోడుగా నడుస్తూనే వుంది...,

"పెదరెడ్డి కూతురు కదా దారెట్టకన్పడ్డాదమ్మో" మా యింటి పక్కనే వున్న శంకరయ్య పొలం గట్లు మీదనుండి గడ్డిమోపు మోసుకొస్తూ నాకు దారివ్వడం కోసం కిందికి దిగాడు.

చిరునవ్వుతో నేను సమాధానం చెప్పక ముందే గూళ్ళకు తిరిగి వెళ్ళే పక్షులు కొన్ని కిలకిలమంటూ నన్ను పలకరించి వెళ్ళాయి...

బస్సు దిగి నేరుగా యింటికెళ్ళకుండా ఈ భుజాన సంచితో పొలం గట్లంబడి అప్రయత్నంగా అడుగులు వేయడం నాకే వింతగా వుంది...

నా చిన్నప్పుడయితే టెంకాయతోపులో దిగి చెరువు గట్టు మీద దాదాపు ఒకటిన్నర మైలు నడిచి మా ఊరు చేరుకోవలసి వచ్చేది... చెరువు నిండా సూర్యకిరణాలు పడి మిలమిలలాడుతూ నీళ్ళు కదులుతుండేవి.... చాలాసార్లు చెరువు గట్టు బురదతో నిండి జారడంతో... దొమ్మరి పిల్ల తాడు మీద నడిచినట్లుగా అడుగులేసే వాళ్ళం...

ఆ చెరువు కింద పద్నాలుగు వందల ఎకరాల ఆయకట్టు వుండేది. ఇప్పుడు ఎండి బీటలు వారిన చెరువు గుండెల మీది నుండి పడిన సిమెంటు రోడ్డు... బస్సు ముప్పూటలా ప్రయాణీకుల్ని ఊరిలో దింపుతోంది....

"చీకటి పడ్తావుండాది... పురుగూ, పుట్రా ఉంటాయి తల్లా.... భద్రంగా బో..." అంటూ ఎదురొచ్చిన చాకలి చెంగమ్మ నెత్తిమీద ఏదో నిండిన గంపతో బరువుగా అడుగులు వేస్తూ గట్లు "ధన్... ధన్" మంటూండగా ఊరివైపు సాగిపోయింది...

అంటే చిన్నాయిన కయ్యకాడ్నే వున్నాడన్నమాట...

ప్రపంచాన్ని కాపలా కాసి కాసి కమలా పండులా మారిపోయిన సూర్యుడు కొండచాటు కెళ్ళిపోయాక కూడ చిన్నాయిన ఆ మట్టిలోనే తడువులాడుతూ వుండివుంటాడు... ఎవరూ లేకుండా చూసి వరిపైరును ప్రేమగా నిమురుతాడు... ఆ గాలిని పదే పదే గుండెల్నిండా నింపుకుంటాడు.

"ఏం బుజ్జమ్మా చానా దినాలకొచ్చినావే పిలకాయిలు బాగుండారా?" నాయిన దాయాది సుబ్బారెడ్డి ఎదురై పలకరించాడు.

"బాగుండారు చిన్నాయనా... ప్రశాంతి వాళ్ళంతా బాగుండారా?" అందరి గురించీ పేరుపేరునా విచారించి ముందుకు సాగుతోంటే–

"అచ్చం పెదరెడ్డిని చూసినట్టే వుండాదబ్బా... అయినా పెదరెడ్డి చిన్నంగా చేసినాడా వూరికి... మనం మర్చిపోగలమా?... కాలవలు తవ్వించినాడు... రాముడి గుడి కట్టించినాడు... పిలకాయలకు చదువు లేదనకుండా బడి కట్టించాడు... ఆయయ్యని మర్చిపోతే దేవుడ్ని మర్చిపోయినట్లే కదా..." సుబ్బారెడ్డి పక్కనే నడుస్తోన్న వ్యక్తి సాలోచనగా అంటున్నాడు... అతని పేరేమిటో నాకు గుర్తు రావడం లేదు...

సరిగ్గా యివే మాటల్ని సతీష్ నాకు ప్రతీ రోజూ గుర్తు చేస్తుంటాడు.

"మీ నాయిన ఊరికి బడి కట్టించి, గుడి కట్టిచ్చి, కాలవలు తవ్వించి అడిగినోళ్ళకంతా లేదనకుండా యిచ్చి.... ఆ పెద్దాయిన పెంటతిని సంపాదించిందంతా ధారపోసి పొయినాడు. అత్తసొమ్ము అల్లుడు దానం చేయడమంటే యిదే కదా... తెలీక చేసుకుని పడ్తావుండాను" పదేళ్ళయి పోయినా, నాయిన చచ్చిపోయి నాలుగేళ్ళయిపోయినా సతీష్ రోజుకు ఒకసారయినా పశ్చాత్తాపం ప్రకటిస్తుంటాడు.

సతీష్ చాల తెలివయిన వాడు. అర్థశాస్త్రంలో అగ్రగణ్యుడు. ఆ క్రమంలో బంధాలన్నింటినీ నరికేసుకుంటూ వెళ్తోన్న సంగతిని ఏమాత్రం పట్టించుకోడు.

పొలం మీది గాలి నిలువెల్లా స్పృశిస్తూ నా ఆలోచనల దారిని అటు, ఇటు మారుస్తోంది.

పొలం నుండి యింటికి తిరిగి వెళ్తున్న వాళ్ళలో సగం మంది నాకు తెలీడం లేదు... ఊళ్ళో ఒక తరం మారిపోయింది... వ్యవసాయం మారిపోయింది.. ఊరు మారిపోయింది. పద్ధతులు మారిపోయాయి... ఎవరికి వాళ్ళకి డబ్బుకోసం తీరని ఆరాటం.... వెంపర్లాట... ఇవన్నీ కూడ చిన్నాయినే చెప్పాడు క్రితం సారి పేటకొచ్చినపుడు...

చుట్టూ కోతలు పూర్తయిన పంట పొలాలు బుడిపెలు బుడిపెలుగా నేలకి ఒక కొత్త అందాన్నిస్తున్నాయి... దూరంగా నూరుస్తోన్న కుప్పల మీది నుండి తేలివచ్చి దుమ్ముతో కూడిన వడ్లపొట్టు నా ముఖాన్ని తాకి కలవరపెడ్తోంది.

నిజానికిది కుప్పల సమయమని నాకు తెలీదు.

చిన్నాయిన యిచ్చే గుత్తవ (కౌలు) డబ్బులు చాల తక్కువగా వుంటున్నాయనీ, ఊళ్ళో అంతా ఎకరాకి పది బస్తాలిస్తోంటే చిన్నాయిన అయిదు బస్తాలే యిస్తున్నాడనీ, ఈ విషయమై గట్టిగా మాట్లాడి రమ్మనీ... ఆ దామాషా ప్రకారం యివ్వనట్టయితే వేరే వాళ్ళకి మన పొలం కౌలుకి యిచ్చేస్తామని బెదిరించి మరీ రమ్మని సతీష్ నన్నీ ప్రయాణం కట్టించాడు.

"సంవత్సరమూ యిదే మాటా? .... యిట్టయితే ఎప్పటికి పూర్తవుతాది రెడ్డా?... ఆవడ్డీకి ఆశపడే కదా మీ రైతులందరికీ అడిగీ అడగకుండానే పెట్టుబడులు పెడుతుండాను... నా దగ్గర మాత్రం మూటలు కట్టి పెట్టుండానా చెప్పండి?... తీసుకున్నది ఈ సంవత్సరం

కాకపోయినా పై సంవత్సరమయినా యిచ్చేస్తోంటే మళ్ళీ మళ్ళీ పుడతాది... నేను దాసిపెట్టి దాసిపెట్టి మీకిచ్చి నా కష్టమంతా యిట్ట మట్టిలో పోయిడానికా?... ఇదేం బాగలేదు రంగాడ్డీ.... రేపు మాత్రం వొడ్లు కొలిచి తీరాల్సిందే...” నెమ్మది నెమ్మదిగానే చిన్నాయిన్ని గుచ్చుతున్నాడు సుబ్రమణ్యం శెట్టి.

శెట్టి మాటా, గొంతూ, మనిషీ నాకు బాగా గుర్తు... శెట్టి మా ఊరికొచ్చి అంగడి పెట్టినపుడు చిన్నాయన చాలా సహాయం చేశాడు... వూళ్ళోకి అంగడి రాక ముందు కిలో మీటరు దూరంలో వున్న రోడ్డు మీదికి వెళ్ళాల్సి వచ్చేది, దేనికయినా... లేదంటే శ్రీకాళహస్తికి బస్సెక్కి వెళ్ళి తెచ్చుకోవాలి... ఎవరికి ఏ చిన్న జబ్బు చేసినా కనీసం చిన్న జ్వరం మాత్ర కూడా దొరికేది కాదు.

సన్నగా, రివటలా వుండే శెట్టి తర్వాత్తర్వాత నల్లగా తుమ్మమొద్దులా తయారయ్యాడు... అప్పటికే వ్యవసాయ ఖర్చులు బాగా పెరిగిపోవడంతో రైతులకి కొంచెం కొంచెంగా అప్పులివ్వడం రుచి చూపించాడు.

ఒకప్పుడు మా పొలంలో పండే వేరుశెనగా, మొక్కజొన్న పంటలే కాకుండా మా యింటి కూరగాయలు కూడా శెట్టింటికెళ్ళేవి... చిన్నమ్మ చేయి చాలా పెద్దది.... అటువంటిది పెట్టుబడుల కోసం చిన్నాయిన శెట్టి ముందు చేయి చాపాల్సిరావడం ఊహించలేనిది... నేను జీర్ణించుకోలేనిది..

“ఏం చేస్తాం శెట్టీ ప్రతిదీ కొని చేయాల్సి వచ్చె వ్యవసాయం... ఇంతకు ముందు మాదిరిగా వుండాదా?... సొంతదారులు చేసుకుంటేనే ఏమీ మిగలడంల్యా... యింక కోరుకి (కౌలుకి) చేస్తే ఏం మిగల్తాది చెప్పు?” నొచ్చుకుంటున్నట్లుగా అంటూన్న చిన్నాయిన గొంతూ, చేతులూ రెండూ వొణుకుతున్నాయి... ఎండకు వొడబడిపోయిన తమలపాకులా వుంది చిన్నాయిన మొహం.

అప్పటికే నేను వాళ్ళ దగ్గరగా వచ్చేశాను. ఆ మసక చీకట్లో వాళ్ళు నన్ను పోల్చుకున్నట్లుగా లేదు...

“నిజమే కాదన్లా... నీక్కాడ వొకదాని మీదొకటి వొచ్చి పడ్డాయి... గూడూర్లో లక్షణంగా సినిమాహాలు లీజుకు చేసుకుంటుణ్యాడు కదా రామచంద్రయ్యా... ఆ మాయదారి క్యాన్సరొచ్చి ఎత్తుకుపోయింది.. ఆయన పిలకాయిల్ని సాకి సంతరించి పెళ్ళిళ్ళు చేస్తివి... వాటన్నింటికీ నీ పొలాల్ని అమ్ముకుంటివి. కోరుకి చేస్తే ఏం మిగల్తుండాదీ రోజుల్లో... నాక్కాడ తెలుసు. అట్టని నేను మాత్రం ఎంత మందికని అప్పులిచ్చేది?... రేపు తప్పకుండా వొడ్లు కొలిచేయి...” చిన్నాయిన పరిస్థితికి నొచ్చుకున్నట్టుగానే ఖరాఖండీగా అప్పుకట్టమని హెచ్చరించాడు శెట్టి...

చిన్నాయిన ఏదో జవాబు చెప్పబోతూ నన్ను చూసి “ఏంది చిన్నీ యియ్యాల్టప్పుడు?...

అయిదుగంటల బస్సుకొచ్చినావా?... ఈ చీకట్లో యిక్కడికెందుకొచ్చావమ్మా? .... యింటికి పోగూడదా?" కొంచెం ప్రేమ, కొంచెం భయం, కొంచెం జాగ్రత్త కలగలిపి చిన్నాయిన మందలిస్తుంటే కళ్ళాద్దాలలో నుండి ఆయన కళ్ళు వున్నదానికంటే పెద్దవిగా కన్పించి మెరుస్తున్నాయి.... కట్టుకున్న అడ్డపంచె, బనీను మాసిపోయినా ఆ కను చీకట్లో తెల్లగానే కన్పిస్తున్నాయి.

"బాగుండావ బుజ్జమ్మా..." పలకరించాడు శెట్టి..."పుణ్యాత్ముడుగద పెదరెడ్డి... అట్టాటోళ్ళంతా భూమ్మీద ల్యాకుండా పోబట్టే వానలు కురవడం లేదు. మిన్నుకురవక చేలుపండదు... కన్ను కురవక బతుకు పండదు అని సామెత... ఇప్పుడు వానల్లేక రైతుల కళ్ళు కురుస్తుండాయి. మీ చిన్నాయిన చూడు ఎట్టాటోడు ఎట్టయిపోయినాడో... పాతికేళ్ళు సర్పించిగా వుండి వూరినేలినోడు గదమ్మా మీ చిన్నాయిన.." అంటూనే "వస్తా రంగాడ్డీ రేప్పొద్దన వొడ్లు కొలిచెయి... రెండో మాటొద్దు... కావాలంటే నెలదాలి మళ్ళీ అప్పు తీసుకో నేను గాని యియ్యనంటుండానా?" చాలా ధర్మపరుడిలా చిన్నాయిన వద్ద సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు శెట్టి.

అప్పటికి బాగా అలసి పోయినట్టున్నాడు చిన్నాయిన.

"పదమ్మా యింటికి పోదాం... మీ చినమ్మ గూడ యిప్పుడే పోయింది. ఆమెకీ బాగల్యా... చెయలేకుండా వుండాది... ఒక్క మనిషి పుట్టడం లేదనుకో పనికి... ఈ కరువు పనులంటే, బడి బాటంటే, చదువులయిపోయి మనిషి దొరికేది కష్టంగా వుండాది... మాకా వయసయి పోయి వూరు పొమ్మంటుండాది, కాడు రమ్మంటుండాది. శిల్పగ్గాన పెళ్ళి చేసేసినామంటే అవతల వున్నా, లేకున్నా అడిగే వాళ్ళు లేరు..." చిన్నాయిన గొంతులో యింత వైరాగ్యం నేను యిది వరకెన్నడూ వినలేదు.

అయినా ఆ విషయం పట్టించుకోనట్లుగా "చిన్నాయినా.. ప్రభుత్వం అందరికీ విద్య వుండాలని కోరుకోవడం... డ్రాపవుట్స్‌ని వెతికి పట్టుకుని బడిబాట పట్టించడం యిదంతా మంచిదే కదా.. మరి మనకి పనివాళ్ళు దొరకడం లేదని ప్రభుత్వం అందరికీ విద్య నేర్పిస్తానంటే తప్పు పట్టకూడదు గదా...." ప్రశ్నించాన్నేను...

నవ్వాడు చిన్నాయిన నిట్టూరుస్తూ

ఆ తర్వాత పెద్ద సేద్యగాడు వీరాస్వామితో ఏదో చెప్పాసాగాడు.

అయ్యో ఈ ప్రశ్న అడిగి చిన్నాయిన్ని యిబ్బంది పెట్టానేమోనని నేను మదనపడ్తూండగానే చిన్నాయిన వీరాస్వామికి పొలం అప్పగించి "పదమ్మా నువు రాకపోతే నేను యిక్కడే పడుకునేవాణ్ణి..." అంటూ పెద్ద టార్చి లైటు తీసుకుని నా ముందు వేస్తూ నడిపించాడు చిన్నాయిన...

పౌర్ణమి రోజులు కాబోలు చెట్ల సందుల్లోంచి వెన్నెల జాలువారుతూ టార్చి వెలుతురుతో కలిసి నేలమీద తారట్లాడుతోంది... నాలుగడుగులు వేశాక చిన్నాయిన మాట్లాడ్డం మొదలు పెట్టాడు.

"అందరికీ విద్య అన్న విషయం మంచిదేకానీ ఈ విద్య అటు ఉద్యోగానికీ, యిటు పనికీ కాకుండా పోతావుంది... ఈ టెన్త్‌క్లాసు చదువుల వల్ల ఇటు వ్యవసాయం చేయడానికి ముదుర్లు... అటు ఉద్యోగం చేయడానికి లేదర్లు అవుతున్నారు మనుషులు... మొత్తంమీద వ్యవసాయానికి కూలీలను లేకుండా చేసి సేద్యాన్నీ, రైతునీ కూడ మూల పారేయడమే ప్రభుత్వ ఉద్దేశం. వీటన్నిటికీ కట్టుబడి వుంటేనే తప్ప ప్రపంచ బ్యాంకు అప్పులీదు మరి... చాలా వున్నాయిలే దీని వెనక..."

"అయితే యిదంతా ప్రతి ఒక్కరికీ కనీసం పాఠశాల విద్యయినా వుండాలి అన్నది ప్రభుత్వం శ్రద్ధకాదా?" అన్నాన్నేను నోరు వెళ్ళబెట్టి....

"కానే కాదు ప్రపంచ బ్యాంకు శ్రద్ధ... రైతులు వ్యవసాయం చేయలేక వాళ్ళంతట వాళ్ళుగా పొలాల్ని వదిలి పెట్టేట్టు చేసే పని చాలాకాలంగా మానవ హక్కుల పేరుతో జరుగుతూ వొస్తోంది. ఒక మాట చెప్తాను విను పోయిన సంవత్సరం అంటే రెండు వేలా ఎనిమిదిలో ప్రపంచ బ్యాంకు ప్రచురించిన ఒక రహస్య నివేదికలో స్పష్టంగా ఏం చెప్పిందంటే భవిష్యత్ తరాలు వ్యవసాయం వైపు వెళ్ళకుండా నిరోధించే దిశగా ప్రభుత్వ విధానాలు వుండాలి... అందు కోసం విద్యను వాడుకోవాలి" అని చెప్పింది. యింతకంటే రుజువు ఏంకావాల? బాల కార్మిక వ్యవస్థ, నిర్బంధ ప్రాథమిక విద్య, మధ్యాహ్న భోజన పథకం యివన్నీ కూడ బాలల్ని వ్యవసాయం నుంచి దూరం చేయడానికే" చివరి వాక్యాలను ఒత్తిపలుకుతున్నట్టుగా అని వూపిరి పీల్చుకున్నాడు చిన్నాయన...

చిన్నాయిన అటు పేటకొచ్చినపుడు గానీ, ఇటు కాళాస్తికో, తిరుపతికో పోయినప్పుడు గానీ చాలా పుస్తకాలు కొని తెచ్చుకోవడం చిన్నమ్మ చేత తిట్లు తినడం నాకు బాగా గుర్తుంది. రైతులకి గిట్టుబాటు ధర ఎందుకుండడం లేదు అన్న విషయాన్ని తెలుసుకోవడానికి ఆర్థిక విధానాల దుంపతెంచాడు చిన్నాయన. రైతులంతా చిన్నాయన వద్దకు వచ్చి వ్యవసాయంలోని లోతుపాతుల గురించీ, జరుగుతున్న మార్పుల గురించీ ప్రస్తావించి విషయం తెలుసుకునేవారు.... జిల్లాలో ఎక్కడ రైతు సదస్సు జరిగినా చిన్నాయన్ని పిలవకుండా వుండరు. డిగ్రీ దాకా చదివితేనేం... ఎన్ని విషయాలు అవగాహన కొస్తేనేం చివరికి చిన్నాయిన కూడా వ్యవసాయాన్ని వొదిలిపెట్టాల్సిన స్థితి వస్తోంది... ప్చ్.

"ఇప్పుడు ఉపాధి హామీ అంటున్నారే అదయితే రైతుకి వారసత్వాన్నే మిగల్చని మరో కల్పతరువు ప్రపంచబ్యాంకుకి.. ప్రత్యేక ఆర్థిక మండళ్ళు అదే సెజ్జులంటున్నారే అవీ అంతే..." నాకు అర్థమవుతోందో లేదోనన్నట్లుగా నవ్వాడు చిన్నాయిన.

చాలా అర్థమయినట్లుగా మొహం పెట్టి "మరిప్పుడు సహకార సేద్యానికి యిచ్చేస్తే మీకు రిస్కే లేకుండా పోతుంది కద చిన్నాయనా..." అన్నాన్నేను.

"నాకు నేల్యాడుండాది తల్లీ.... నేనిప్పుడు కౌలు రైతుని" నవ్వాడు చిన్నాయన సుదీర్ఘంగా గాలి లోపలికి పీల్చుకుంటూ....

దిగులుతో చాల సేపు నోటి మాట రాలేదు నాకు.

'దున్నే వాడిదే భూమి' అన్న మాట కాగితాల వరకేనా? కౌలు రైతులకు ఎటువంటి చట్టాలూ వర్తించవా? ... ఇన్సూరెన్స్ రాదు... ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలయినా నష్టపరిహారాలుండవు... ఇప్పుడంతా ఉద్యోగాలు చేసుకుంటూ గ్రామాల్లో భూమిని కౌలుకిచ్చేస్తున్నారు. నాలాగా, సతీష్‌లాగా.

నా ఆలోచనలను కదిలిస్తూ,

"చేసే వాడికేమీ వుండడం లేదు చిన్నీ... మాగాణి భూముల్లో నన్నా అయితే కూలి గిడతాది.. మెట్ట నేలల్లో కనీసం అది కూడా వుండదు... ఇప్పుడు కౌలుకి పొలం యిస్తానంటే తీసుకునే వాళ్ళే లేరు..." ఒకింత ఆగాడు చిన్నాయిన.

మళ్ళీ వెంటనే,

"మీ నాయిన మహానుభావుడు... బతికుండేదాక ఏ పొద్దూ ఈ నేలలోంచి గింజ వొడ్లు ఎత్తుకుపోయి ఎరగడు.. ఇప్పుడు అల్లుడు గమ్మునుంటాడా చెప్పు?" అన్నాడు గొంతు బొంగురు పోతూండగా...

నాకు కలగూడు పడ్డట్టయింది.

ఆ విషయాన్ని గురించే గట్టిగా మాట్లాడ్డానికి సతీష్ నన్ను పంపించాడంటే చిన్నాయిన ఏమనుకుంటాడో? నాయిన పోయిన దగ్గర్నుండీ గుత్తవ డబ్బు యిస్తూనే వున్నాడు చిన్నాయిన... నువ్విస్తున్నది చాలదు.. ఎకరాకి పుట్టెడు వొడ్లు కొలవమని ఖచ్చితంగా అడగడానికొచ్చాన్నేను... నీకు డొక్కలంటుకు పోయినా, పేగులు బయట పడ్డా సరే... పీక్కుతినడానికి సిద్ధపడి వచ్చాన్నేను... అనుకుంటుంటే గొంతుకేదో అడ్డుపడి దగ్గొచ్చింది.

"అదిగో చూడు... ఈగాలికి దగ్గొస్తావుంది... పద చిన్నమ్మని కషాయం పెట్టమంటాను..." అంటూ చిన్నాయిన వడివడిగా అడుగులు వేయసాగాడు.

నా కూతుళ్ళిద్దరూ ఎనిమిదో క్లాసు చదువుతున్నా సరే చిన్నాయినకు నేనింకా చిన్నబిడ్డనే...

ఇంటికెళ్ళేసరికి వాకిట్లో పొయ్యి మీద చారెడు బియ్యం కుతకుతా వుడుకుతున్నాయి. చిన్నమ్మ నన్ను చూసి గతుక్కుమన్నది.

పొలంలో పండిన వన్నీ ఊరంతటికీ పంచిపెట్టే వుదారమైన చేయి చిన్నమ్మది.

నాకీపూట అన్నం పెట్టడం కోసమే గతుక్కుమన్నదో, నేను గుత్తవ డబ్బులు వసూలు చేయడానికొచ్చానని గతుక్కుమన్నదో అర్థంకాక ఆమె మౌనం నన్ను చీలుస్తోంది... ఆ రాత్రి చాలా సేపటిదాకా నాకు నిద్ర పట్టలేదు... దోమల వల్ల అనుకున్నారు చిన్నాయినా, చిన్నమ్మా..

✡

చుట్టుపక్కల వాళ్ళంతా వాకిట్లో చేరి చిన్నాయిన చదివి విన్పించే పేపరు వార్తలు వింటూండగా మెలకువ వచ్చింది నాకు. ఒకసారి కళ్ళు తెరిచి మళ్ళీ కళ్ళు మూసుకున్నాను గోడ వైపు తిరిగి...

"షేర్లంటుండారు కానీ వాటి గురించి రైతులకేం తెలస్తాది?... ఇప్పుడున్న పరిస్థితిలో మాత్రం సహకారమంటే గట్లు తెగ్గొట్టి భూమినంతా ఏకం చేసి కార్పొరేట్ కంపెనీల కందిస్తారు... మామూలు రైతుల్ని దిష్టిబొమ్మల్ని చేసి కమర్షియల్ రైతుల ముందు పెడతారు... వీళ్ళంతా పెద్ద కవతాల్లో కూలోళ్ళుగా, లేదంటే ట్రాక్టరు డ్రైవర్లుగా మారిపోతారు." చిన్నాయిన తన చుట్టూ చేరిన రైతులతో మాట్లాడుతున్న మాటలు నిద్రమత్తులో లీలగా నా చెవులను తాకుతున్నాయి....

ఎండెక్కే కొద్దీ కాకుల అరుపులు తగ్గాల్సింది పోయి ఎక్కువయి హాహా కారాల్లా విన్పిస్తున్నాయి...

"పోయినసారి వున్నట్టుండి వానొచ్చి బుడ్డలన్నీ కయ్యిలోనే బుడబుడా రాలిపోయి... ఈ సారి చినుకు వానల్యాక వరంతా వొరిగిపాయ.. ఆ నాలుగు వొడ్లు శెట్టికి కొలిచేస్తే సంవత్సరమంతా ఏంతిని బతకాలి... అదిగో అప్పుడే మా పెదబావ కూతురొచ్చి కూర్చోనుండాది... ఆ యమ్మకేం చెప్పాల? కష్టమొక్కటే మిగల్తుండాది" పెరటివాకిట్లో ఎవరితోనో ఏడుస్తున్నట్లుగా లోగొంతుకతో చెప్తోంది చిన్నమ్మ...

నాకెందుకో చిన్నమ్మ మీద కోపం రాలేదు.

నలుగురన్నదమ్ములు పిల్లలూ సెలవులకొచ్చి పడితే ఎంతో ఓపిగ్గా చేసిపెట్టే చిన్నమ్మ ఏ క్రమంలో యింతగా కుంగిపోయిందో... ఎందుకింతగా మారిపోయిందో... పరిస్థితులెందు కింతగా దిగజారిపోయాయో తలుచుకుంటే జాలితో పాటు తీరని దిగులు.

"బతుకంతా యిట్నే అయిపాయ... ఎప్పుడూ నాది నాది అనుకోని చెయిల్యా... అందరిదీ అనుకున్నాం మొగుడూ పెళ్ళాం... యిప్పుడు ఎవుర్ది వాళ్ళు చూసుకుంటుండారు. బిడ్డ చదువు కూడ కాకపాయ". కాళహస్తిలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోన్న చిన్నకూతురు శిల్పని తలుచుకుని ఏడుస్తోంది చిన్నమ్మ....

తలెత్తి నిలబడి మారాకు వేస్తోన్న మడికి గబుక్కున చీడ సోకినట్లుగా వుందామె మనసు.

"సాయంత్రం కొలస్తామని చెప్పుబో... పొద్దటికీ, సాయంత్రానికీ వొడ్డీ పెరిగిపోదు..." శెట్టి దగ్గర్నుండి వచ్చిన మనిషితో కాబోలు కట్టు తెగిన అసహనంతో అరుస్తున్నాడు చిన్నాయిన...

వాకిట్లో చిన్నాయిన అరుపులూ... పెరటి వాకిట్లో చిన్నమ్మ ఏడుపూ కలగా పులగంగా నా గుండెను కోస్తున్నాయి...

చెరువులో అలల్లా ఆలోచనలు నాలో అలజడి రేపుతున్నాయి...

ఒక నిర్ణయానికొచ్చిన దానిలా గబుక్కున పైకి లేచాను. పది గంటల బస్సుకి తిరిగి వెళ్ళిపోతున్నానని తెలిశాక చిన్నమ్మ కొంత ఫ్రీగా మాట్లాడ్డం మొదలుపెట్టింది...

"ఈ పొద్దు ఆదివారమే కదా బుజ్జమ్మ అయిదు గంటల బస్సుకి పోగూడదా...?" అని బతిమాలుకుంది... అటెళ్ళి నాలుగు చెనక్కాయలూ ఇటెళ్ళి నాలుగు అరిటి పళ్ళూ నా బ్యాగ్‌లో సర్దింది...

నవ్వుతూనే వీడ్కోలు చెప్పి బయల్దేరాను... కానీ రాగిమాను వద్దకి బస్సెక్కించడానికొచ్చిన చిన్నాయిన కంట్లో నీటి పొర చూసి చలించిపోయాను.

"మాసిక వేసిన కపిల గిన్నెలోంచి నీళ్ళు కారిపోయినట్లుగా ఏ పొద్దుటి డబ్బులా పొద్దే ఖర్చయిపోతున్నాయి చిన్నీ... మిగులు కళ్ళ జూసి ఎన్నేళ్ళయిందో?" పూడుకుపోతున్న గొంతుతో చిన్నాయిన సంజాయిషీ చెప్పబోయాడు...

నాకు ఎందుకో గుండెలు పగిలేలా ఏడవాలనిపించింది...

అదుపు చేసుకుంటూ, చిన్నాయిన్ని వారిస్తూ నా నిర్ణయాన్ని వెలిబుచ్చాను.

"చిన్నాయినా నాకు గుత్తవ డబ్బులొద్దు... మీరున్నంత వరకూ తీసుకోను మీ తదనంతరం సతీష్ ఆ పొలాన్ని అమ్ముకుంటాడో, తలకుపోసుకుంటాడో నాకు తెలీదు... నేను నిజ్జంగానే చెప్తున్నాను డబ్బు తీసుకురావద్దు.. ఏదయినా వుంటే ఫోన్లో మాట్లాడండి... చూడాలన్పిస్తే బడికిరండి..." యింటికి మాత్రం రావొద్దు అన్న శ్లేషని పలికిస్తూ ఖచ్చితంగా చెప్పాను.

సతీష్ వద్ద చిన్నాయిన మాటలు పడడం నేను సహించలేను.

కనీసం యిదయినా నేను చేయగలనన్పించింది. మరి కాసేపుంటే ఏడ్చేస్తానని కాబోలు ముందే వచ్చిన బస్సు నన్నా ప్రమాదం నుండి తప్పించింది.

నిండిన కళ్ళు తొణక్కుండా, చిన్నాయిన వైపు తలతిప్పకుండా బస్సెక్కి కూర్చున్నాను... లోలోపల ఒక గొప్ప నిశ్చింత... బస్సు కదలగానే ఒళ్ళెరగకుండా నిద్ర పట్టేసింది...

ఇంటికి చేరుకునే సరికి పన్నెండున్నరయింది.

జరగబోయే రామరావణ యుద్ధానికి సిద్ధపడుతూ కాలింగ్ బెల్ మీద వేలుంచాను. ఈసారి అతి కష్టం మీద పోయి గొంతులోని మార్దవాన్ని వెతుకులాడుతూ.. తెరవబడ్డ తలుపులోంచి లోపలి కడుగుపెట్టాను.

"అమ్మా..." అంటూ మానస, మౌనిక నన్ను చుట్టేశారు.

✡

# చింత కింది మల్లయ్య ముచ్చట

**–పూడూరి రాజిరెడ్డి**

ఏం జెప్పాలె?

నా దగ్గరేమున్నది చెప్పుటానికి, చెప్పుకునుటానికి?

నీకేమన్నా పిసనా? కత రాత్తావు! కత. నా మీద ఏం రాత్తవు?

కతంటే రాములవారి మీద రాయాలె. క్రిష్ణ పరమాత్ముని మీద రాయాలె.

ఏందీ... బేత్రీన్ ఉంటదంటావ్.

(నులకమంచం వంచి) అయితే ఇగవటు చెప్త. యాష్ట లేకుంట ఇను.

(చుట్ట ముట్టించడానికి ఆగి) నా జల్మానికి ఏం కారుణం లేదు.

కారుణం ఉండుటానికి నేనేమన్నా శిశుపాలున్నా? నరిసింహ సామినా?

నేను, నా యెనుక ఇద్దరు ఆడివిల్లలు, ఓ మొగ పోరడు.

తమ్ముడు కడుపుల వడ్డప్పుడే మా అవ్వ చచ్చిపోయింది.

నేను చెప్పేది నువ్వు అవద్దమనుకోవద్దు. గప్పట్నుంచి ఇంట్ల నేనే ఆడివిల్లనైన. అన్నం అండిన. అలుకు జల్లిన. కడుపలు గడిగిన. ముగ్గేశిన. మా చెల్లెండ్లకు తానం బోశిన. జెడలేశిన. మా పెద్దచెల్లె లచ్చవ్వ ఎదిగి, ఇంత కూరపొయ్యిమీద ఏసేదాకా ఈ ఆడివిల్ల పనులన్నీ నేనే జేసుకచ్చినె.

లచ్చిమికి అన్నం అండుడంటే శివాంత బయం లేదు. అన్నం అంటే ఏందో అనుకునేరు. మక్కగట్క.

పాలువోసుకుని తిన్నా, పెరుగు వోసుకున్నా ఆ రుసే వేరు.

కాని మాకు పాలు వెరుగు రోజు దొరుకుతాది?

కుండ ఏడ మీద వడ్తదోనని లచ్చిమి తెగబయపడు. ఆ కుండ లేత్తెనా దానికి! పోరికి పెయ్యిల పాణమే లేదు. కడుపునిండ ఏమన్న తింటెనా?

అయినా తినుటానికి ఏముండె?

తింటే తొక్కేసుకొని గదే గంటెడు గట్కనే. తాగితే గిలాశెడు నీళ్లే.

(వచ్చిన కుక్కను కట్టెతో అదిలించి) అప్పుడెంత? నా మనువనోలె ఉంటి. ఇంక నాకు కచ్చురానికి ఆటతాడు గట్టరాకపోవు.

గీదానికే మా కొత్త లింగన్న పరాష్కం ఆడు. 'నేర్చుకోకపోతే నీకెవలు పిల్లనిత్తరోయ్' అనుకుంట.

పెండ్లనంగనే నాగ్గూడ లోపల్లోపల సంబురం అనిపిత్తుండె.

ఓపారి ఏమైందటే... బడి ఇడిసివెట్టంగనే మొదలు వెట్టటోల్లయ్యా... అదేందీ గాబాలాట.

నాకు ఆళ్లతోటి ఆడాల్నని తెగసంబురం. సావుకారి కొడుకు, సర్పంజి మనువడు, పల్లెమీది రాములు... ఒక్కొక్కలు ఏమాడుదురు!

బాలు గాల్లనే ఎగురుతుండె.

వోనాడు గిట్లనే ఆట జూసుకుంట నిలుసున్ననయ్యా.

యాడికేలచ్చిండో మా నాయిన. ముల్లిగట్టె వట్టిండు, ఇయ్యరమయ్యర ఈపు ఇమానం మోగిచ్చిండు.

"వావ్వో వాయ్యో సత్తినే సత్తినే..."నాకు కండ్లల్ల నీళ్లు దుంకెనే దుంకె.

"గాడిదికే. పొక్కలకెట్లత్తదిర బువ్వ? నేను దొరగారోళ్లకు కైకిలి వొమ్మని శెప్పిన్నా. కైకిలి కంబలి జేసుకునేటోళ్లకు ఇట్ల నడుంల మీద సేతులు వెట్టుకొని నిలుసుంటే పనైతాదిర" అనుకుంట పొట్టుపొట్టు సంపిండయ్యా.

ఇగ గవ్వే ఆకరు దెబ్బలు మా నాయినతోటి. ఆనాటుసుంది మల్ల బాలాట సూడవోలేదు.

గప్పట్నుంచి అరికోతలకు వోయిన. ఇంటిపనికి వోయిన. గుట్టనుంచి కట్టెలు గొట్టుకచ్చిన. బీడీలోళ్లకు తునికాకు తెంపుకచ్చిన. ఇప్పపువ్వు ఏరిన. బాయిలు తోడుటానికి వోయిన. బంతులు గట్టిన. గడ్డికోశిన. గడ్డికుప్పలేశిన. కంపగొట్టిన. ఎనుగులు నాటిన. మొరం జారగొట్టిన. ఏం జెయ్యలేదయా?

మునుం వడితె ఇద్దరిపెట్టు వట్టుకపోయిన. మబ్బుల నాగలి గడితె పగటీలిదాక మంచినీళ్లు ముట్టలె. అచ్చు గొడితే సాలు గీత గీసినట్టు రావాలె. బర్లపాలు పిండితె సూత్తుండంగ సర్వ నిండాలె.

నాయాల్ది! 'చింతకింది మల్లిగాడురా పనోడంటే' అనిపిచ్చుకున్న.

ఔగనీ ఇదంత పేపర్‌కేత్తవా?

అయితెవాయెగానీ మొదుగాలు కాళ్లు, చేతులు గడుక్కో. నాలుగు బుక్కలు తిందువు.

ఏందీ! అద్దా?

(లోపలికి పెద్ద కోడలికి కేకేసి) "ఔనే... పద్మవ్వ... రెండు కోపులు శాయ వెట్టె..."

ఊఁ... ఏం జెప్తున్న... ఆఁ... కర్సు గలిసత్తదని నాది, మా పెద్దచెల్లెది లగ్గం ఒకటేసారి జేసిండు మా నాయిన.

లగ్గమంటె ఏంది? 'మల్లన్న' కాడ నాలుగు అచ్చింతలు ఏసింద్రు, సాత్రమోలె.

ఎట్ల జేత్తె ఏందిగానీ మా పిల్లను జూత్తె నాకు నోట్లె నీళ్లురినై. ఆలా ధరియుండె.

ఈ కైకిలి జేసుకునేటోన్ని ఎట్ల ఇట్టపడ్డదోగాని దాని సింగారం యేరె.

పోడర్లు రాసు. శిక ముదువకుంట ఒంటి జడేసుకును. ఎప్పుడన్న తానం జెయ్యక దగ్గరికి వోతె కసురుకును.

అదేందో అది కసిరినా మంచిగనేవుండు. అదో మాటన్నా పడబుద్దవు.

దాని దగ్గర ఓ పాడిగుణం ఉండెనయా.

రూపాయుంటే కాపాడది.

కూరగాయలు తెచ్చుకుందామంటది. 'గట్క అద్దు, వరన్నం గావా'ల్నంటది.

"తొక్కుతోటి ఎల్లదా? ఎల్లిపాయ మిరం నాలుకకు ఆనదా" అని నేను.

"ఉన్నంతల మంచిగుండాలె" అని అది.

ఇప్పుడు మంచిగుండక ఏమైందే మనకు?

సుట్టం అత్తెనట– ముద్దవప్పేసి, రొండు కోడిగుడ్లు ఉడికేత్తదట. ఒగటి సుట్టపాయినెకట. ఒకటి నాకట. ఇట్ల దిన్నంక పైసలు నిలుత్తయా? గందుకే ఒగనాడు బాగ కోపమచ్చిందయా.

"బద్మాషిదానా! నీకు కాపాయం దెల్వది. నా ఇల్లు నాశినం జేత్తున్న"వని ఓ దెబ్బేసిన్నయా.

"నీ తలపందు వలుగ. నీ సేతులకు జెట్టలు వుట్ట. నీ ఇంట్ల పీనుగెల్ల" అని ఏడుసుకుంట అది వన్నది.

పాపం... అది గుడ్డు దానికని ఏసుకోలె. అది నివద్దనేగానీ చిన్న చెల్లె లగ్గానికి జేసిన అప్పు గట్లనే వుండె. ఓ దిక్కు మిత్తి వెరుగవట్టె. కొన్ని రోజులు కడుపు గట్టుకుంటేంది?

సచ్చి ఏ సర్గాన ఉన్నడోగని మా నాయిన ఒకటే మాటన్నడయా...“పెండ్లాన్ని గొట్టినోడు మొగోడు కాదురా. మాటతోని మెప్పియ్యాలె”.

ఆ మాట నేను ఎప్పటికి యాది మరువ.

అట్ల పొలం మొకేలి వోయద్దమా! మా శెల్క జూద్దువు పా!

అటు ఎనుగు పొంట నడువకు. రేణముండ్లుంటయి.

ఇటు మీదికేలి లంబాడిబోడ... ఇంకొంచెం నడిత్తె సంపతేనె... అటువోతె మల్లెగుట్ట... ఒంటితట్ట ఒర్రెలంటే గటే ఉంటయ్...

శిల్పలకాయలు, పరికి పండ్లు, జీడికాయలు మత్తుగ దొరుకుతయ్...

పొయ్యిల కట్టెలకో, లగ్గపు కట్టెలకో గుట్టకు అద్దుం గదా. సద్ది దెచ్చుకోకపోతే ఏం జేద్దుం?

ల్యాత ఈతచెట్టును మొదట్లకు నరుకుదుం.

తెల్లగ గుజ్జు.

ఆకలి గీకలి అన్ని వోవు.

నువ్వు శిన్నప్పుడు ఇటు మొకేలి అచ్చినమటే... రాలేదా?

ఇంతకుముందు దసురకూ సంకురాంతికన్న అచ్చిపోదురు, ఇప్పుడు పట్నం కేలి అచ్చుటానికి మీకు ఏడ తీర్పాటం అయితంది?

(టమోటా చెట్లల్లో తిరుగుతూ) అవుగనీ అమిరికా అంటే ఏడుంటదయ్యా... పొద్దు వట్టుకోని ఇట్లవోతె... పొద్దు గూట్లెవడెవరకు ఆడికి చేరవోతమట గదా!

నవ్వుతవేందయ్యా...

గిట్లనే మాటమీదికేలి మాటత్తె... మా నారిగాడు అనుండె, ‘అమిరికా రాచ్చాసుల దేశం. మనం పొద్దును జూసినప్పుడు వాళ్లు జూడరు. దేవుడు ఆల్లను అట్ల కట్టు జేసిండూ’ అని.

ఏమయ్యా కూలవడితివీ? గీయింత దానికే కాళ్లు గుంజుతున్నయా?

అటు ఒడ్డుమీద గూసుండు. మీ వయిసుల మేం ఎట్లుంటిమి?

(కాయ తెంపడానికి వంగి) ఓ మబ్బులలేశి, కట్టెలు నెత్తిమీద వెట్టుకుంటే పొద్దు పొడిశేటాల్లకల్ల ఎముడాల జేరుదుం. అప్పుడు మోటర్లు ఏడున్నయి?

(వంగినవాడు తెంపకుండానే లేచి) నీకు ఇంకో ముచ్చట జెప్పాలె.

నీకు మీ కన్రెడ్డి పటేల్ ఎరికేనా?

నాకు మాత్రం ఏం దెలుసుగనీ మా నాయిన జెప్తుండె.

ఆయినొక్కడే కుంట తవ్వించడట.

ఆ తిమ్మపురం పొంటి కుంట ఉంది సూడు, అది కన్రెడ్డికుంట అనే పేరు వోయింది. ఆయిన కొడుకు లింగయ్య, అంటే మీ రాజయ్య తాతకు తాత, ఇటు నర్సింగపురం అచ్చి ఊరు వొందిచ్చిండు.

(తెంపి నాకోటి ఇచ్చి) లింగయ్య పటేలు సిరుసుల్ల అంగట్ల ఎద్దును గొనుక్కొని, ఏందీ? సిరుసుల్ల నుంచి ఇట్ల వడచ్చి, ఓ పొంటెసేపు నాగలి గట్టునట. ఆల్ల చెత్తలు వేరు, అప్పటి తిండి వేరు.

ఇప్పటియి... పేరుకే కాతగాని... దీనితల్లీ... రుశే లేవు (కొరికి ఊస్తూ).

నేను జెప్పేది మనుసున వడుతున్నవా?

మా శిన్నోడు గ..ప్పు..డే ఆరోదో...ఏడోదో... వట్టిండు (ఆలోచనే మాటలుగా ధ్వనిస్తోంది).

మీ నాయినకు నౌకరయి,  మీ ఇల్లుకిల్లు అటు పట్నం మొకేలి వోయింది గూడ గా సాలె.

నా ఇంటిది మంచంల వడ్డదయ్యా. దాన్ని జూత్తె ఇయ్యాల్లనో రేపో అన్నట్టుంది.

ఇగ ఏం జేత్తు? నా గతి ఏం గావాలె?

పైసకు ఎనుకాడితె నలుగురు నా నోట్లె ఉంచరా?

దాన్ని మంచి దావఖానకు కొంచవోయిన.

పరీచ్చలు జేసింద్రు. మందులు రాసిచ్చిన్రు. పత్యాలు జెప్పింద్రు. అన్నీ జేసిన, శెప్పినయి శెప్పినట్టు.

కాని ఏం జేసినా  అది బత్కలె. బగవంతుడు నా యందు లేడు. దాన్ని కొంచవోయిండు. దాంతోని నా ఎకురం బూమిని గూడ కొంచవోయిండు. కైకిలికి వోయి, కౌలు జేసి, బొక్కలు సున్నం జేసుకొని కొనుక్కున్న బూమి. దీనితల్లీ బూమి పోతెవాయె. అదన్న దక్కకపాయె గదా. అదే నా కలకల!

ఓ సారూ... నీకు గివ్వన్ని ఎందుకు వనికత్తయిగనీ గిదొక్కటైతె మంచిగ రాసుకో. నేను ఎవన్నీ ముంచలే. ఎవని తెరువుకు వోలె. ఒగని తిండికి ఆశ పడలె. చింతకింది

మల్లయ్యంటే మాట మీద నిలవడుతడు అని పేరు దెచ్చుకున్న. 'వాడురా మనిషి' అనిపిచ్చుకున్న.

✡

నేను చూసినప్పట్నుంచీ మల్లయ్య అలాగే ఉన్నాడు. అదే ముసలితనం, అదే ధోవతి, ముతక బనీను, తలకు రుమాలు...

ఆదిమ మానవుడు (అనాగరిక అర్థంలో కాదు)– ఈ భూమ్మీద మొట్టమొదలు పుట్టింది– ఈయనేనేమో అనిపించేది, చిన్నప్పుడు సాంఘిక పాఠం విన్నప్పుడు.

ఈయనకు అలసట రాదా? ఈయన ముచ్చట్లకు అంతే లేదా? ఈయన మాటను కాదనేవాళ్లు ఎవరైనా ఉంటారా? ఈ భూమి, దేవుళ్ల పుట్టుపూర్వోత్తరాలు అన్నీ ఈయనకు తెలుసేమో అనిపించేది– ఇంకో దశలో.

ఆయనకు తెలిసినవి– తర్వాత్తర్వాత నేను తెలుసుకున్న వాటితో పోల్చుకుంటే కాంట్రడిక్షన్ ఉంది. అయినా వాటిని నేను స్వీకరించాను.

ఏ సెలవుల్లోనో, ఎవరిదైనా పెళ్లిలాంటి శుభకార్యమో ఉంటే– మా ఊరికి వెళ్లినప్పుడు ఆయన్ని గమనిస్తుండేవాణ్ని. నా కుతూహలాన్ని ఆయన ముందు ఎప్పుడు ప్రదర్శించినా కొత్త విషయాలేవో చెబుతుండేవాడు.

ఈయన మీద ఏదో రాయాలి. ఇలాంటివాణ్ని లోకానికి పరిచయం చేయాలి అన్న 'దుగ్ధ' మాత్రం జర్నలిజంలోకి వచ్చాకే కలిగింది.

కాని ఎలా రాయడం?

భౌతికంగా ఇలాంటివాళ్ల 'అభివృద్ధి' కనిపించదు. వీళ్లను దేనికీ మోడల్‌గా చెప్పలేము. అందుకని కథ ఇలా ముగిస్తే 'తృప్తి'గా ఉంటుందనిపించింది.

✡

అయిపోయిందయ్యా. ఇగ రేపో మాపో.

దేవుడు ఎప్పుడు కొంచవోతడో. నామంచం ఎప్పుడు ఇరుగుతదో.

నేను ఉంటేంది? పోతేంది? ఎవరికిపట్టి?

"అగో గట్లంటవేందే, మేములేమాయె"అంటడు నా చిన్నకొడుకు.

గదీ నిజమే.

నాకు కొడుకులు లేరా? కోడండ్లు లేరా? మనువలు లేరా? మనువరాండ్లు లేరా?

చింతకింది మల్లిగాడంటే ఏందిప్పుడు?

నాలుగు బర్లున్నయి. నాలుగు ఆవులున్నయి. గొర్రె, మాక. బూమి. బాయి. దానికి కరంటు. మా నాయిన నాకు కశ్కెడు బూమి ఇయ్యలె.

నేను దాన్ని నాలుగెకురాలు జేసిన.

నేను వెట్టిన చింతచెట్లు కాతకచ్చినయి. నేను నీళ్లు వోసిన మామిడిచెట్టు కాయలు తొక్కులకు పనికత్తున్నయి. పోరగాండ్లకు తినేటన్ని జామకాయలు. రొండు తింటెనే కడుపునిండె అరటిపండ్లు. నాకు ఇంకేం గావాలె?

✡

మల్లయ్య ఇంటివెనకాలి 'కళ మామిడి' రుచి నాకు తెలుసు. ఆయన శ్రమించి కొనుక్కున్న నాలుగెకరాల గురించీ తెలుసు.

అయితే జీవితంలో అంతర్భాగంగానే భూమిని సంపాదించాడు తప్ప, అదో లక్ష్యంగా పెట్టుకుని కాదు.

కాబట్టి ఇదే 'లాజికల్ ఎండ్' అనిపించట్లేదు. పైగా ఆయన దృక్పథంగానీ, ప్రాపంచిక చింతనగానీ తెలియట్లేదు. అందుకని కథలో ఒకచోట ఈ మలుపును చేర్చితే బాగుంటుందనిపించింది.

✡

ఎంత శమ జేసినా నా ఇల్లు తెల్లగ్గాదేమయ్యా.

ఊళ్లె ఎందరో మంచిగయింద్రు. మిద్దెలు లేవవట్టె. తెల్లబట్టలు తొడుగవట్టిరి. మా సావుకారి సుబ్బయ్య జూడు. నా తోటోడేనో, నాకన్నా యాడాది అటో ఇటో. ఎప్పుడు జూసిన దుకానంలనే కూకుంటడు. నేను అంచిన నడుము ఎత్త. వారం పదిరోజులకో తాప ఊళ్లు తిరుగుతడు. చుట్టకు పొగాకు తెచ్చుకునుటానికి తప్పిత్తె నేను మా ఊళ్లకే వోను.

వాళ్ల ఇల్లుకు ఇల్లు ఏడాదికోసారన్నా తిరుపతికి వోయత్తరు. మా ఇంటిది లొల్లివెడితె ఎముడాల రాజేశునికాడికి ఒక్కసారి తోల్కవోతి.

ఆయిన పెండ్లం ఎంత నున్నగున్నది? ఎండకువోయి నా ఇంటిది ఏడికి ఇగ్గుకచ్చింది?

నేనేమన్న పైస దుబార జేత్తనా. తాగుడు బుక్కుడు అలవాటుందా? నువ్వెన్ని గంటలు పనిజేత్తున్నవు. నేనెన్ని గంటలు జేత్తున్న. ఇంత ఫరాకు ఉంటదావయ్యా లోకంమీద?

ఏందీ వాళ్ల తలుకాయ పెద్దదా?

నాలుగచ్చిరాలు సదువుకోంగనే వాళ్లది పెద్దగైపోయిందా?

నీయవ్వ నా కొడుకు సదువుతలేడా? నేను సదివిత్తలేనా?

మొన్న ఆరోదిల ఈడే మొట్టమొదలచ్చిండట. ఆ సుబ్బయ్య కొడుక్కు ఈడే లెక్కలు దీసిత్తడట. చింతకింది మల్లిగాని కొడుకా? ఇంకేమన్ననా?

✡

శావుకారిని అణచివేతకు సింబల్‌గా భావిస్తుంటారు.

ఆయన కొడుక్కి మల్లయ్య కొడుకు లెక్కలు చెప్పడం ద్వారా ఓ మానసిక ఆధిపత్యం సంపాదించినట్టయింది.

కాని ఇక్కడితో ముసలాయన హీరో అయిపోతాడా? అయితే ఆయన జీవితంలో సంఘర్షణ ఉన్నమాటను కాదనలేం. కాని 'అబ్బా! ఎదుర్కొని నిలబడ్డాడు' అనిపించేంతగా ఏమీ అనిపించలేదు. అందుకని ఆ సంఘర్షణను అంగీకరిస్తూనే తన స్వశక్తిని నమ్ముకోవడమనే పాజిటివ్ సైన్ వచ్చేట్టుగా కథను మలచాలనుకున్నాను.

✡

నా పెద్దకొడుకు ఏదో చెప్తడు. వాని ఆలోషనే ఏరు. వాని తరీకనే ఏరు.

మనుషులంతా సమానమట. ఈ బూమ్మీద, గాలిమీద నీకెంత పొత్తుందో నాకూ అంతే పొత్తున్నదట. వాని సదువు సంక నాకినట్టె ఉన్నది. మనుషులు సమానం ఎప్పుడయింద్రు?

మా నాయిన జమానాల గాలె. నా తరంలగాలె. అయితరని అనుకునుడె.

"ఎవల్నో ఉద్ధరించుటానికి మనల్ను ఈదిల వడేత్తున్నరు. మనల్ని కిందికి తొక్కి ఎవ్వణ్నో నెత్తికి ఎక్కించుకుంటున్నరు" అంటడు.

"ఇల్లు గట్టించుకునేటోనికే ఇల్లు, కట్టెటోనికి గుడిశనే. పంట తినేటోనికే పరమాన్నం. పండించెటోనికి సలిబువ్వే" అని చెప్తడు.

"పైసలున్నోనికే పైస గూడుతున్నది. లేనోనికి లేనేలేదు. దనలచ్చిమి పేదోని ఇంటికి అచ్చుటానికి ఎనుకముందు ఆడుతున్నది, సక్కంగా అరుసుకోరని..." అని ఏదాంతంలకు వోతడు.

"ఇవ్వన్నీ శెప్పుడు దేనికి? నీకు శాతనైతే సంపాయించురా" అంట.

పోటీ అంటడు. పెట్టువడులంటడు.

"నీ తెలివికి నువ్వు కూడా పోటీవడురా మరి" అంట.

"ఆటగాళ్లకు ఉరుకుడు పోటీ ఉందనుకో. ముందు బూట్లయితే ఉండాలె గదా. మనకు ఆ బూట్లే లేకపాయె" అంటడు.

వాడు కాలికేత్తె మెడకేత్తడు. మెడకేత్తే కాలికేత్తడు. ఇన్ని చిక్కులు నాకు తెల్వదిగాని... అయ్యా! నేను రెక్కల కట్టం నమ్ముకున్నోన్ని.

✡

ఈ కథను ఇక్కడితో ఆపేయొచ్చు.

'రెక్కలకట్టం నమ్ముకున్నోన్ని' అని మల్లయ్యతో తన స్వయంకృషిని చెప్పించినట్టయింది.

కాని నా నగర జీవితంలోని మురికినీ, కాలుష్యాన్నీ, ఇరుకుతనాన్నీ కొద్దిగానైనా చొప్పించకపోతే పల్లె జీవితం ఎలివేట్ కాదు. కాబట్టి ఈ సిమెంటును తిట్టాలి, అక్కడి గాలిని మెచ్చుకోవాలి... దీనికోసం ఆయన నోటితోనే నగరజీవితం మీద 'థూ' అని ఊసేట్టుగా ఓ సన్నివేశం సృష్టిస్తే అదిరిపోతుందనిపించింది.

కాని ఎలా?

ఆయనెప్పుడూ హైదరాబాద్ చూడలేదు. కనీసం కరీంనగర్ కూడా చూసివుండడు. ఈ బట్టల మీద, కోల్పోతున్న విలువలమీద ఆయన కామెంట్ ఉంటే పేలుద్ది...

చివరగా 'నా భవిష్యత్ ఆయనలో కనిపిస్తోంది' అని ఒక వాక్యం ఉంటే– ఆయన్ని ఆదర్శనీయుడిగా మలచవచ్చు.

కాని ఆయనకు ఇలాంటి సంస్కృతీ సంప్రదాయాల గొడవలు తెలియవు. కనీసం తన జీవితంలో ఒక్క సినిమానైనా చూళ్లేదు.

పోనీ– మనం గాడిలో పడి కొట్టుకుపోతున్నాం– కీర్తి సంపాదించాలి, డబ్బు పోగెయ్యాలి– ఇవేవీ ఆయనలో లేవు అంటే?

ఆయన సంతోషాన్ని భౌతిక ప్రమాణాలు నిర్ణయించలేదు అని రాస్తే?

ఆయన దేనికీ ఫిర్యాదు చేయలేదు. ఆయనకు ఆయన ఎప్పుడూ సమస్య కాలేదు. తనలోకి తాను ముడుచుకుపోయి ఉన్నాడు. జీవితాన్ని యథాతథంగా అంగీకరించాడు అంటే?

ఆయనను ఓ రుషిలా చిత్రిస్తే?

లౌకిక విషయాలన్నింటికీ అతీతుడిగా వర్ణిస్తే?

కాని ఆయన చుట్ట కాల్చుతాడు. కల్లుగుడాలంటే ఇష్టపడతాడు. 'బొక్కకూర' చేసినరోజు పండగనుకుంటాడు.

ఆయన విరగబడి నవ్విన రోజులున్నాయి. కళ్లు చెమ్మగిల్లిన సందర్భాలున్నాయి. మరి ఎలా?

పోనీ ఆయన బాల్యాన్ని కాస్త 'అందంగా' ప్రెజెంట్ చేసినా బావుంటుంది కదా!

గురువారినూతిలో స్నానాలు... సైకిల్ తొక్కడం నేర్చుకున్నప్పుడు ప్రపంచాన్ని జయించిన ఫీలింగ్... ఈత నేర్చుకున్నప్పుడు మడమ మీద ఏర్పడిన బొబ్బ...

కాని తాతకు సైకిల్ రాదు. ఈత వచ్చుగానీ గాయం కాలేదు.

ఓసారి తాను పొలం గట్టుమీద నడుస్తున్నప్పుడు కాళ్ల సందునుంచే పాము పోయిందట. ఇంకోసారి బావి తవ్వడానికి వెళ్లినప్పుడు పైనుంచి గడ్డ కూలిందట. ఇట్లాంటివేవో చెప్పాడుగానీ చెప్పడంలో అదో పెద్ద విషయం కానట్టు ధ్వనించింది.

కథను ఉద్వేగంగా మలచడానికి అవసరమైన ఒక్క ప్రమాణమైనా దొరక్కపోతుందా... అని నేను ఆయన జ్ఞాపకాల పొరల్లో గాలించగా గాలించగా ఒక్క విషయం చిక్కింది.

ఒకసారి కట్టెలకోసమని అడవికి వెళ్లాడట. అక్కడ ఎలుగుబంటి (ఆయన భాషలో గుడ్డేలుగు) కనబడిందట.

"ఏం చేశా"వని ఉద్వేగంగా అడిగాను.

"బూరుగు చెట్టు చాటుకు దాక్కున్నా"నని చెప్పాడు.

అయిపోయింది!

దానితో పోరాడితే బాగుండేది. దాన్ని వెంటబడి తరిమివుంటే మజా ఉండేది.

కాని అవేవీ చేయలేదు.

జీవితాన్ని యథాతథంగా కాగితం మీదకు ట్రాన్స్‌ఫర్ చేయడం కష్టం. కొంచెమైనా డ్రామా పడాలి.

'ఇంత జాగ్రత్త'గా రాస్తాను కాబట్టే, నాకు ఎంతో కొంత గుర్తింపొచ్చింది.

మొన్న ఎవరో– పెద్దాయనే– "మీరు బాగా రాస్తున్నారు" అన్నప్పుడు నేను కథకుడిగా మంచి ముద్రే వేసుకున్నాను అనిపించింది. వేసుకోకుండా ఎలా ఉంటానూ అనికూడా అనిపించింది.

"మీ రైటింగ్ ఫిలాసఫీ ఏంటి?" అని ఆయన ప్రత్యేకంగా అడక్కపోయినా నేను మంచి మంచి పదాలు పేర్చి చెప్పాను.

"నన్ను నేను పునర్నిర్వచించుకోవడం కోసం, పునర్నిర్మించుకోవడం కోసం నేను కథ రాస్తాను. నన్ను నేను బహిర్గతం చేసుకోవడానికీ, ఆ క్రమంలో ఏదైనా సత్యం తెలుసుకుంటానేమోనని రాస్తాను."

ఇందులో నేను ఏం సత్యం తెలుసుకోగలిగాను?

జీవితాన్ని జీవితంలా చూడకుండా నాటకీయంగా ఉండాలనుకునేవాళ్లకి... మల్లయ్య జీవితం ప్రత్యేకించి ఏమీ చెప్పదు. అందువల్ల ఆయనకు వచ్చిన లోటు ఏమీలేదు. జీవితానికి అర్థం, పరమార్థం, లక్ష్యం, సాహసం,... ఇట్లాంటివేవో వుండాలని అనుకోవడం వల్ల నాకు కలిగిన భంగపాటుకు ఆయన బాధ్యుడు కాదు. ఆయన్ని నా ఫ్రేమ్‌లోకి ఇమడ్చాలనుకోవడం భావ్యం కాదనిపించింది. అందుకే కథ రాసే ప్రయత్నాన్ని విరమించుకున్నాను.

✡

# స్వేదం ఖరీదు...?

**–రెంటాల నాగేశ్వరరావు**

ఉదయం నుండి తలెత్తకుండా టమోటో తోటలో, పళ్ళు కోస్తూ, కూలీలను అదిలిస్తూ, పండ్లను ఒక ప్రక్క, పచ్చివి ఒక ప్రక్క రాసిగా పోస్తూ, మధ్య మధ్యలో కనిపించిన కలుపు మొక్కలను పీకివేస్తూ, పొద్దు ఉండగానే వెళ్ళిపోతున్న కూలీలను చూస్తూ, 'అపుడే పొద్దుగుంకిందా?' అని తనలో తనే గొణుక్కుని, నుదుటిన అరచేయి జేర్చి మేఘాలేమైనా వస్తున్నాయేమోనని చూసి, లేకపోవటంతో దీర్ఘనిశ్వాసం తీసుకొని, పైపంచెతో ముఖం తుడుచుకుని తోటగట్టుకు చేరుకున్నాడు శేషయ్య.

"ఏందయ్యా ఇంత సేపు?? కూలోళ్ళంతా ఇంటి కెళ్ళాక – పొద్దు వాలాక–" కొంచెం విసుగ్గా అంది వరలక్ష్మి, సత్తుచెంబుతో తండ్రికి మంచినీరందిస్తూ, కొద్దిదూరంలో ఇంకా పళ్ళుకోస్తున్న తల్లికేసి జాలిగా చూస్తూ. నిజానికామె అప్పటిదాకా పళ్ళు కోసింది. చెంబందుకుని, నోటి నిండా నీళ్లుపుక్కిలబట్టి, బుగ్గలు ఊరించి లోపలి నీటితోనే పళ్లనోసారి కడిగి, మూతిని చిన్నసున్నాలా చేసి, ఉమ్మేసి, కొద్దినీళ్లతో ముఖం, చేతులు కడుక్కుని, తరువాత మిగిలిన నీళ్ళుతాగి, చెంబందిస్తూ కూతురికేసి చూశాడు శేషయ్య.

'పదారేళ్ళకే గెడకర్రలా పెరిగింది. ఈ యేడేనా దీని పెళ్ళి చేయాల... ఈ ఏడు తోట బాగా కాపు పట్టింది. రేటేమో – కిలో ఏడెనిమిది అమ్ముతోంది పట్నంలో... ఆ డబ్బుతో పెళ్ళి చేయొచ్చు... ఏ ఇంటికిల్లాలవుద్దోగాని, చిదిమి దీపం పెట్టుకోవచ్చు....' అని మనసులోనే అనుకుని, 'తన దిష్టే తగుల్తుందేమో' ననుకొని చూపు త్రిప్పుకుని, పైపంచెతో మళ్ళీ ముఖం తుడుచుకున్నాడు శేషయ్య.

అంతలో పైట చెరగులో పళ్ళేరుకు వచ్చి, రాసిలో పోసి పెనిమిటికేసి చూసింది.

"మీరెళ్ళండి... నేను వీటిని గంపల్లోకెత్తి, బండిలో ఇంటికి చేరుస్తాను..." కూతురికేసి తిరిగి అన్నాడు. ఆ పూట వంటలోకి రెండు టమోటో పళ్ళు. గట్టున వున్న మిరపచేలో నాలుగు పచ్చిమిరపకాయలు కోసుకొని, సత్తుపళ్ళెంలో వేసుకొని, పైన గడ్డిగుడ్డ కప్పి, పమిటను తలపై వేసుకుని, దానిపైన పళ్ళెం వుంచి, 'త్వరగా రా! చీకట్లో పురుగూ పుట్రా వుంటాయి–'

అని పెనిమిటితో అని, కూతుర్ని 'రమ్మన్న'ట్లుగా కళ్లతో సైగ చేసి, ముందుకు కదిలిందా ఇల్లాలు. అప్పటికే చీకటి పడిపోయింది.

వాళ్ళెళ్ళినకేసి రెండు క్షణాలు చూసి, గంపల్లోకి పళ్ళు ఎత్తటం ప్రారంభించాడు శేషయ్య.

అంతలో బ్రోకరు చినవీరయ్య అటుకేసి వచ్చాడు, గ్లాస్కో పంచెకొస, సిల్కు లాల్చీ జేబులో దోపి, ఫిల్టరు సిగిరెట్ త్రాగుతూ,

"ఏం శేషయ్య మావా? పళ్ళెత్తుతావేటి? ఈ ఏడు పంట బాగానే దిగినట్లుందే?"

"ఆ ఏం పంటలే చినవీరయ్యా! అయినా రేటెట్లున్నదేమిటి?" అడిగాడు.

"కిలో అర్ధరూపాయి పడుద్దిలే–" సిగిరెట్ పొగ విలాసంగా పీలుస్తూ అన్నాడు.

"అదేమిటి పట్నంలో ఎనిమిది రూపాయలుందటగా? పేపర్లో ఏశారంట.... రేడియోలో చెప్పారు–"

"ఆ ఆళ్ళట్టనే చెబుతార్లే – నీ ఇష్టం... చివరికి ముప్పావలా అయితే సరుకంతా ఎత్తుకుంటా..." అనేసి ముందుకడుగు లేశాడు చినవీరయ్య. శేషయ్య మాట్లాడలేదు. పెద్దగా నిట్టూర్చి తన పనిలో మునిగిపోయాడు. అతడిలో ఆలోచనలు రేకెత్తాయి. పదేళ్ళ క్రితం శేషయ్య పేరు శేషగిరిరావు. పదెకరాల ఆరుదళ్ళ నల్లరేగడికి ఆసామీ. నేలతల్లినే నమ్ముకుని బ్రతుకుతున్నాడు. శేషగిరిరావు – శేషయ్య అయ్యాడు.

అదే పదేళ్ళ క్రితం – చినవీరయ్య పేరు చినవీరిగాడు. నెత్తిన బుట్ట పెట్టుకుని, ఇల్లిల్లూ తిరిగి కూరలమ్మేవాడు. సెంటు పొలమూ లేదు. ఉండటానికి గుడిసె కూడా లేదు. కష్టపడ్డ రోజుల్లో చినవీరిగాడికీ పొట్ట గడవటమే కష్టంగా వుండేది. స్వేదం చిందించటం మానేసి, బ్రోకరేజి మొదలెట్టాక చినవీరిగాడు – చినవీరయ్యగారు అయ్యేడు. ఊరి మధ్యలో డాబా, నాలుగెకరాల మాగాణీ సంపాదించాడు!

అంతలో మరో సన్నకారు రైతు ఆనందరావు అటు వచ్చేడు. పదో తరగతిదాకా చదువుకొని వ్యవసాయం చేసుకుంటున్నాడు. పాతికేళ్ళుంటాయతడికి.

"శేషయ్య మావా! ఈ బ్రోకరు మనల్ని మోసం చేస్తున్నాడు. మనం వీడికమ్మేకంటే– మనమంతా కలసి లారీలో సరుకు పట్నం తీసుకుపోదాం. అక్కడ కిలో ఎనిమిది రూపాయలుంది నీవు సరేనంటే లారీ మాట్లాడుకొస్తాను..." కాసేపు ఆలోచించి సరేనన్నాడు శేషయ్య.

అర్ధరాత్రికల్లా లారీ తెచ్చాడు ఆనందరావు. సరుకంతా దానిలో వేసుకుని, ఐదారుగురు రైతులు పట్నం బయల్దేరారు. లారీ బాడుగ అందరూ పంచుకునేట్లుగా ముందుగానే నిర్ణయించుకున్నారు. ఆనందరావు దేవుడిలా తమని ఆదుకుంటున్నాడని సంతోషించేరు.

పట్నంలో పెద్ద మార్కెట్‌కి కొంచెం దూరంగా లారీ ఆపి, అందరూ మార్కెట్‌కేసి నడిచారు. అప్పటికే బారెడు పొద్దెక్కింది.

దూరంగా వుండి రేటెంత వుందో కనుక్కుని రమ్మని ఒకతన్ని పంపేడు ఆనందరావు. వెళ్ళిన రైతు పది నిముషాల్లో తిరిగి వచ్చాడు.

"కిలో పది రూపాయలు" సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతూ అన్నాడతను. అందరిముఖాలూ చేటంత అయ్యాయి. తృప్తిగా తనలో తానే నవ్వుకున్నాడు శేషయ్య. మనసులోనే దేవుడికి దండం పెట్టుకున్నాడు. 'కష్టపడేవోడి చెమటకు ఖరీదు రాకుండా పోద్దా!?' అనుకున్నాడు. ఈ పంటతో కూతురి పెళ్ళి చేసి గుండెలమీద బరువు దింపుకోవచ్చుననుకున్నాడు.

బేరం మాట్లాడిరమ్మని ఆనందరావుని పంపి, తాపీగా చుట్టలు వెలిగించుకున్నారు కొందరు రైతులు.

గంటయినా తిరిగి రాలేదు ఆనందరావు.

శేషయ్య కదిలి మార్కెట్లోకెళ్ళాడు. ఓ ప్రక్క గదిలో చినవీరయ్య ఎవరితోనో మాట్లాడుతున్నాడు. "టమాటోలు... కిలో పావలా... కిలో పావలా..." మార్కెట్లో అరుస్తున్నారు చిల్లర వర్తకులు. మార్కెట్‌కి వచ్చిన వాళ్ళు ఆశ్చర్యపోతూ తొందరపడుతూ అంతా టమాటోలు కొనుక్కుంటున్నారు.

నిర్ఘాంతపోయి చూశాడు శేషయ్య. అంతలో చిన వీరయ్య అటుకేసి వచ్చాడు. "ఏం శేషయ్యమావా! సరుకుతెచ్చావేంటి?? ఇరవై పైసలుకైతే నేనేకొంటా రేటు బాగా పడిపోయింది. నిన్న ముప్పావలా కడిగినా ఇవ్వలేదు నువ్వు–" చిద్విలాసంగా నవ్వుతూ, తప్పంతా శేషయదేనన్నట్లు మాట్లాడి వెళ్ళిపోయాడు చినవీరయ్య.

తెల్లబడిన ముఖంతో అటు వచ్చాడు ఆనందరావు. "వీళ్ళేదో మోసం చేస్తున్నట్లుంది..." ఫోన్‌లో మాట్లాడుతున్న పెద్ద బ్రోకర్ వేపు చూస్తూ అన్నాడు ఆనందరావు.

"మరేం చేద్దాం??" శేషయ్య అడిగాడు.

"కొంచెం ఆగుదాం... కొద్ది సేపట్లో సరుకంతా అయిపోతుంది. తిరిగి రేట్లు పెరుగుతయ్యేమో–" నీరసంగా అన్నాడు.

"టైము పడితే లారీ బాడుగ పెంచాలి–" అన్నాడు లారీ డ్రైవర్. నీరసంగా తలూపాడు ఆనందరావు.

మధ్యాహ్నానికల్లా సరుకంతా అయిపోయింది. ఆశగా చూస్తున్నారు రైతులు. వారి ముఖాల్లో చిరు చెమటలు. అంతలో టమాటోలతో నాలుగు లారీలు దిగాయి. వాళ్ళలో తెలిసిన వాడిని ప్రక్కకు తీసుకెళ్ళి ఏ రేటున అమ్మారని అడిగాడు. "కిలో మూడు రూపాయలు" చెప్పాడా రైతు.

ఆనందరావు ముఖం వెలిగిపోయింది. శేషయ్య కళ్ళలోకి జీవం వచ్చింది. లోడులన్నీ దిగి మార్కెట్లో కెళ్ళాయి.

తాపీగా, కొంచెం ధైర్యంగా మార్కెట్‌లోనికి అడుగు బెట్టాడు శేషయ్య. "టమాటోలు... కిలో ఇరవై పైసలు" అరుస్తున్నారు మార్కెట్లో. శేషయ్య తల తిరిగిపోయింది. 'అదేవిటి మూడు రూపాయలకు కొని, ఇరవై పైసలకు అమ్ముతున్నారు??' ఆశ్చర్యపోయాడు. అతడి నొసలు ముడివడింది. ఆనందరావు మళ్ళీ బ్రోకర్ దగ్గరకు వెళ్ళాడు. కిలో పదిహేను పైసలకు కొంటానని చెప్పాడతను ఫోన్‌లో మాట్లాడుతూ. "ఆ రేటున మరో పదిలారీలు రాబోతున్నాయి" ఫోన్ పెట్టేసి అన్నాడు.

ఏంచేయాలో అర్థంకాలేదు ఆనందరావుకి.

"ఈ రాత్రికి చూద్దాం" ఆశగా అన్నారు రైతులు. ఈ లోకంలో 'ఆశ'తో బ్రతికేవారు – ఎల్లప్పుడూ రైతులేనేమో!! తొలకరి కురవాలని ఆశ, కొన్న విత్తనాలన్నీ మొలవాలని ఆశ! పురుగుమందులు కల్తీవి కాకుండా పనిచేయాలని ఆశ! ఎరువుల ధరలు పెరగకూడదని ఆశ! వానలు సకాలంలో కురవాలని ఆశ! పురుగు పట్టకూడదని, కలుపు పెరగకూడదని ఆశ! పంట మంచి దిగుబడిరావాలని ఆశ! పంటకు రేటుండాలని ఆశ!

కాని – ఏ ఆశా సక్రమంగా తీరదు. నిరాశను మిగులుస్తుంది. కనీసం తన కష్టానికి తగిన ప్రతిఫలం రావాలని ఆశ! కానీ – అదీ తీరదు.

తెల్లవారేసరికి టమాటోలు కొన్ని పాడయిపోవటం ప్రారంభించాయి. ఇక సరుకు వుంచుకోవటం ఇష్టంలేక ఆనందరావుని వచ్చిన రేటుకు అమ్మేయమని చెప్పారు.

వచ్చిన డబ్బు లారీ బాడుగకు కూడా సరిపోలేదు!

ఆనందరావుని ఛార్జీలకు డబ్బు అడిగేరు కొందరు రైతులు.

సరుకంతా మార్కెట్‌లోకి వెళ్ళిపోయాక, ఊరికే చూద్దామని మార్కెట్‌లోకి వెళ్ళారు రైతులంతా కలిసి.

"టమాటోలు కిలో పన్నెండు రూపాయలు...." అరుస్తున్నారు చిల్లర వర్తకులు. ఆనందరావు తల దించుకున్నాడు. శేషయ్యకి అదేవిటో అర్థంకాలేదు.

ఎందుకిలా జరిగింది? అతడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

పై పంచెతో కళ్ళు తుడుచుకుంటూ నడుస్తున్న శేషయ్యకు పరిచయమైన కంఠంలా వినిపించి ఆగాడు.

"అదేంటి! రేటు ఒక్కసారిగా పెంచేశారు?" నవ్వుతూ అంటున్నాడు చినవీరయ్య.

"మరెలా? నిన్న కిలో మూడు రూపాయలకు కొని, ఇరవై పైసలకు అమ్మాం. ఆ నష్టమంతా ఎలా పూడాలి...? నీ కమీషనూ, నా లాభం ఎలా రావాలి?" నవ్వుతూ చెప్పాడు పెద్ద బ్రోకర్.

"అద్గదీ- తెలివంటే మీదే- ఇలా రైతులే ఎగబడి మార్కెట్‌కి డైరెక్టుగా సరుకు తెస్తే మీరెలా బ్రతకాలి... మేం ఎలా బ్రతకాలి?" నవ్వేడు చినవీరయ్య.

శేషయ్యకు కోపం వచ్చింది. కాని పేదవాని కోపం పెదవికి చేటు గదా!? అందుకే గుడ్ల నీరు గ్రక్కుకున్నాడు.

మార్కెట్‌కి వచ్చిన ప్రజలకు తెలీదు.... నిన్న టమోటోల రేటు ఒక్కసారిగా ఎందుకు పడిపోయిందో, ఈ రోజు ఒక్కసారిగా ఎందుకు పెరిగిందో? దీనిని నియంత్రించే వారెవరూలేరు.

శేషయ్య అడుగులో అడుగువేస్తూ నడుస్తున్నాడు నీరసంగా. అతడి కళ్ళకు ఏపుగా ఎదిగిన కూతురు, పెరిగిన మందుల ధరలు కనబడుతున్నాయి. కాని ఎండలో, వానలో, చీకటిలో తను పడుతున్న కష్టానికి తన చెమటకు కనీస ధర రాదెందుకో?

అతడి కర్థమయింది అలా ఎందుకు జరుగుతుందో. కాని ఏం చేయగలడు? ఎపుడూ కాడిబట్టి ఎరుగని, ఒక్క చెమట బిందువు చిందించని మంత్రులు 'రైతు బిడ్డలు'గా ఎందుకు చెబుతున్నారో అర్థమయింది. కాని, మార్క్స్ – మధ్య 'గతి' వాళ్ళని నమ్మకండి, చెమట నిజంగానే నిందించే వారినే నమ్మండి' అని ఎందుకన్నాడో అతడికి తెలియదు. తెలిసే అవకాశమూలేదు. అందుకే ఇవ్వాళ్టి శేషయ్య రేపటి శేషిగాడు అవుతాడు.

✡

# చింతల తోపు

**–పాపినేని శివశంకర్**

“కిట్టమ్మా! గోపాల బాలా కిట్టమ్మా! ఎహే... కిట్టమ్మా!...”

ఊరమ్మటి చింతల తోపు సీయిందం గోయిందంగా వుంది. ఉత్తరవేపు దరిన పెద్ద చింతచెట్టు దగ్గర జనం చానా మంది జేరారు. ఒకేపు ఆడపిల్లలు, ఇంకో యేపు కుర్ర కారు. కట్ట కింద నర్సిమ్మ కూతురు మాలక్ష్మి – పదేను పదారేళ్లుంటాయ్యేమో – ఉయ్యాల బల్లమీద నుంచోని రయ్ రయ్న ఊగుతుంది. ఉయ్యా లంటే ఉయ్యాలా? పాతిక బార్ల మోకు ఎత్తాటి చింతకొమ్మకి గట్టారు. నేల మీద నడుమెత్తున అడ్డబల్ల. దానికి గట్టిన తాడు బట్టుకోని ఊపుతున్నాడు సుబ్బాయ్. చూసేవాళ్ల కళ్లు తిరిగిపోయ్యేట్టు, పైన చిటారుకొమ్మకి తగిలిద్దేమో అన్నంత ఊపు దెచ్చుకోని ఊగుతుంది మాలక్ష్మి. పిల్లలు కేరింతలు గొడతన్నారు. పెద్దాళ్లు నోరు దెరుచుకోని చూస్తన్నారు.

రాత్రి బడ్డ వానజల్లుకి నేలంతా చిత్తడి చిత్తడిగా వుంది. తోపునిండా తంగేడు చెట్లేంది, జిల్లేడు చెట్లేంది, లంజతుమ్మ చెట్లేంది, పిచ్చికుసుం చెట్లేంది – పొదలకు మల్లే పెరిగినియ్. తోపు ఆ మూలనించి ఈ మూలకి కాలిదారి. ఆ దారి గుండా కృష్ణమూర్తి, వాడి సావాసగాడు నరసయ్య వస్తున్నారు. వుంద్రాళ్ళ తద్దె వుయ్యాల సందడి జూద్దామని. ఇద్దరూ బడెగ్గొట్టారు. అడుగులు బడ్డ నల్లమట్టి దార్లో నడుస్తుంటే ‘చర్... చర్...’ మని మోతొస్తంది.

వీరయ్యగారి చింతలతోపు ఇప్పుడిది గాదు. ఎప్పుడు బుట్టిందో. కృష్ణమూర్తి ముత్తాత వీరయ్య. ఊరి కానుకోని పడమటన తోపు మొదలయిద్ది.

పదిహేను గజాల కొకటి లెక్కన – కొన్ని పడిపోంగా డెబ్బై చెట్లన్నా వుంటయ్. కృష్ణమూర్తి వాటినెప్పుడు లెక్కబెట్టినా తేడా వచ్చేది. బడిలేని పూట సావాసగాళ్లని వెంటేసుకొని తోపులోకి జేరాల్సిందే. సన్నటి చిటారుకొమ్మకి గూడా కృష్ణమూర్తి పాకుతాడు. ఏ చెట్టుకెక్కువ కాయలుంటయ్యో, దేన్నెక్కటం తేలికో వాడికి బాగా తెలుసు. చెట్టు మొదలుపైన కొమ్మలు చీలిన చోట ఏనాలుగా గూకోని పళ్లు పులిసిపొయ్యేటట్టు చింతకాయలు తింటా, ఆ దార్నే పొలాలకి బొయ్యేవాళ్లని దడిపించటం వాడికి మా యిష్టం. అందరూ గలిసి కాస్త ముదురు

చింతకాయలు కోసి, మూటగట్టి కోమటి కొట్టుకి తీసుకెళ్తే జేబు నిండా సెనగపప్పు పోస్తాడు సీతారావయ్య.

కృష్ణమూర్తి అల్లంత దూరంలో కనబడంగానే పుట్టయ్యగారి నారాయణ పాటెత్తుకున్నాడు ఎగతాళిగా. 'కిట్టమ్మా! గోపాల కిట్టమ్మా...' అంటా. అమ్మా నాన్నా వాణ్ణి ముద్దుగా 'కిష్టమూర్తీ' అని పిలుస్తారు. నాన కెప్పుడైనా కోపమొస్తే 'ఇట రారా కిట్టాయ్' అంటాడు. ఊళ్లో అంతా 'కిట్టమూర్తి' అనే పిలుస్తారు. నారాయణకి మాత్రం ఎందుకో అలుసు. కృష్ణమూర్తికి చర్రున కోపమొచ్చింది.

"నిన్నేం జేశానమ్మా నేను? అవపడ్డప్పుడల్లా ఏడిపిత్తావ్?" అన్నాడు ఉక్రోషంతో.

"వాణ్ణి గూడా నువ్ 'నారాయ్' అని పిలువు తిక్క వొదులుద్ది" చెప్పాడు నరసయ్య.

"పోవాయ్" అంటూ నారాయణ ఉయ్యాల దగ్గిరికి పరిగెత్తాడు. ఉయ్యాల మీద ఒక్కళ్లు, ఇద్దరిద్దరు ఊగుతున్నారు. వాళ్లని ఊపటానికి మగపిల్లలు పోటీ పడుతున్నారు.

"నేం గూడా ఊపొద్దన్నాయ్?" అనడిగాడు కృష్ణమూర్తి సుబ్బాయ్ని.

"బక్కపీసువి, నువ్వేం ఊపుతా?" అన్నాడు సుబ్బాయ్ పళ్లికిలిస్తా.

కృష్ణమూర్తి మొకం చిన్నబుచ్చుకున్నాడు.

"పొనీలే, నన్నూపుతాడు" అంది శేషయ్య గారి చిన్నమ్మాయ్, ఉయ్యాలెక్కుతా.

కృష్ణమూర్తి కుశాలగా ఉయ్యాల తాడందుకున్నాడు "ఊప్..." అంటూ వెనక్కి లాగి, ముందుకు తోశాడు.

"బాగా ఊపాలి పిలగాడా!" అంది చిన్నమ్మాయ్. పేరుకి చిన్నమ్మాయే గాని ఇరవయ్యేళ్లకి తక్కువుండవ్. చామన చాయ. మిసమిసలాడతంది. ఇంకా పెళ్లిగాలా. మిలట్రీలో ఉన్న వాళ్ల బావ రావాల. బాండు మేళం మోగాల.

అట్టట్టా చిన్నమ్మాయ్ ఊపు దెచ్చుకుంది. ఇంక కృష్ణమూర్తి ఊపే పన్లేక ఎడంగా నిలబడ్డాడు. చిన్నమ్మాయ్ ముందు కెళ్లేటప్పుడు కాళ్లు బాగా జాపుకోని, వెనక్కి బొయ్యేటప్పుడు కాళ్లు ముడుచుకోని రయ్ రయ్యని ఊగుతూంది. 'వామ్మో! దీనికి బయ్యమే లేదు' అనుకుంటా, నోరు దెరుచుకోని చూస్తన్నాడు. ఇంతలోకి ఎదురుగాలికి చిన్నమ్మాయ్ లంగా పైకి లేచింది.

'యాక్కిరాయిలే! జిల్లాయిలే, జీడిపప్పులే!' కృష్ణమూర్తి చేతివేళ్లు మెలికలేసి చూపిస్తా ఎగిరాడు. 'హి హి హీ!' ఇకిలించాడు నరసయ్య. ఆడా మగా అంతా పగలబడ్డారు.

"ఛీ పాడు పిల్లడా!" అంది చిన్నమ్మాయ్ గబక్కన ఉయ్యాల దిగి,

"ఉయ్యాలెక్కంగానే సరిగాదే పిల్లా! ఒడుపూ, వాటం దెలవాల" అన్నాడు గడ్డంకింద కర్రబెట్టుకు చూస్తన్న ముసలాయన.

"మాలావు చెప్పొచ్చావులే. పెళ్లయితే అదే తెలుసుకుంటది" అంది ఆడవాళ్ల గుంపులో నుంచి వెంకట సుబ్బమ్మ. (దాని మొగుడు దేశాలమీద బొయ్యాడు.) ఆడపిల్లలంతా కిసుక్కుమన్నారు. చిన్నమ్మాయ్ సిగ్గు పడింది.

"ఒరేయ్! చింతసెట్లకి ఆడాడ కాయలుండయ్‌రా. కోసుకుందామా?" అడిగాడు నరసయ్య కృష్ణమూర్తిని.

"అన్నీ వానగాయలు" అన్నాడు కృష్ణమూర్తి చెట్ల కొమ్మల్లోకి పరీక్షగా చూసి.

"అయితే మాలే, వానగాయలే బాగుంటాయ్ తింటానికి" అన్నాడు నరసయ్య.

"సరే పా" అన్నాడు కృష్ణమూర్తి.

బర్రున ముక్కు చీది, జారుతున్న లాగు పైకి లాక్కున్నాడు.

వాళ్లకి తోడు ఇంకిద్దరు సావాసగాళ్లు తగిలారు. తోపుకి ఇంకో మూలకెళ్లి, తలో చెట్టెక్కారు. కృష్ణమూర్తి జేబునిండా కాయలు కోసుకొని, పెద్దకొమ్మ మొదట్లో కూర్చున్నాడు. ఎక్కడియ్యో బర్రెలు వొచ్చి చెట్టుకింద నీడకి నిలబడ్డయ్.

వానలు వెనకబడ్డయ్. పెసర, నువ్వు పంటల కాలం వచ్చింది. వరదయ్య అరెకరం నువ్వు, అరెకరం పెసర వేశాడు. పెద్దవానకి నువ్వు చేను ఊరకే పోయింది. వెనక చిక్కు అయినంతలో కాస్త పెసరే చేతికొచ్చింది. అదీ గింజలు బాగా ఊరలా. ఎండిన కాయల్ని చావిడి పంచలో పరదా పట్ట మీద పోసి, ఇద్దరు కూలీలు బడితల్తో కొడతంటే అటు ఇటు గింజలు చిందుతున్నాయి. ఏరుకోని తింటన్నాడు కృష్ణమూర్తి. పని చెయ్యటం లేదనుకోకుండా మధ్య మధ్య గింజల్ని కుప్ప కాడికి పోగు జేస్తన్నాడు. ఆదివారం గాటాన బడి లేదు. కమలమ్మ పిల్లని చంకనేసుకోనొచ్చింది. "అబ్బాయ్! కొట్టుకెళ్లి అర కిలో బెల్లం దీసుకురా."

"డబ్బులియ్యి, ఎల్లొత్తా" అన్నాడు కృష్ణమూర్తి.

"సీతారామయ్య కొట్టో మన పొద్దుంది లేరా, అందుట్లో రాసుకుంటాళ్లే. పాయ్‌రా" చెప్పాడు వరదయ్య.

మూలనున్న బండి గాను దీసుకోని, సీలకర్రతో తిప్పుకుంటా ఒక్క లగూ దీశాడు కృష్ణమూర్తి. గుడికి పడమటగా కోమట్ల వీధిలో ఉంది సీతారామయ్య కొట్టు. ఊళ్లోకల్లా అదే పెద్ద కొట్టు. కొట్లో యిద్దరు ముగ్గురు మనుషులుండేపాటికి కృష్ణమూర్తి పక్కగా నుంచున్నాడు.

"ఏందబ్బాయ్, ఏం గావాలా?" అడిగాడు సీతారామయ్య ఎవురికో జొన్నలు కొలుస్తా.

"అర కిలో బెల్లం దెమ్మన్నాడు మా నాన."

"అట్టనే దీసుకెల్లు" అని పక్కనే పట్ట మీదున్న బెల్లాన్ని కత్తితో పగలగొడతా, "ఏం జదువుతున్నా?" అనడిగాడు.

"ఐదు" చెప్పాడు కృష్ణమూర్తి ఉషారుగా. అంతకన్నా ఊళ్లో స్కూల్లో పెద్ద క్లాసు లేదు.

సీతారామయ్య బెల్లం పొట్లం గట్టి ఇస్తా, "మీ నాన ఇంటి దగ్గరే వుండాడా?" అనడిగాడు.

"కొట్టం దగ్గిర పెసలు గొడతన్నారు."

"మాయెటేల యింటికొత్తానని జెప్పు"

కృష్ణమూర్తి తలూపి అట్టనే నిలబడ్డాడు.

"ఇంకేంది?" అడిగాడు సీతారామయ్య.

"కొసురు బెట్టవా?" అడిగాడు కృష్ణమూర్తి మెల్లిగా.

"ఓర్నీ, అదా సంగతి?" సీతారామయ్య చిన్న బెల్లం ముక్క చేతిలో బెట్టి, "నే జెప్పిన మాట మర్సిపోకుండా జెప్పు" అన్నాడు.

కృష్ణమూర్తి తలూపి బెల్లం ముక్క నోట్లో వేసుకొని, చేతిలో పొట్లంతో ఇంటికి పరిగెత్తాడు.

'ఓర్నీ పిల్లాడు గంతలాడ! పడతావ్‌రా" అంది కమలమ్మ కొడుకును జూస్తా.

"అమా! ఇయ్యేడు చదువైపోతే ఆరో క్లాసు చదివిస్తానంటివే?" అనడిగాడు రొప్పుతూనే.

"ఏందో నాయనా! పంటలు జూత్తే ఇట్టుండయ్. పైవూళ్లో చదువులంటే మాటలా?" అంది కమలమ్మ, పొయ్యి దగ్గర చతికిలబడతా.

కృష్ణమూర్తి మొకం ముడుచుకున్నాడు. నాలుగు రోజుల కిందట కోదండం పంతులుగారు ఏదో పనిమీద ఇంటికొచ్చినప్పుడు చెప్పిన మాటలు గుర్తుకొచ్చినియ్యి కమలమ్మకి. పిల్లాడు బాగా చదువుతున్నాడనీ, పైకొస్తాడనీ చెప్పాడాయన. ఊళ్లో హైస్కూలు లేదు. నాలుగు మైళ్ల దూరంలో తుళ్లూరులో ఒకటి, ఆరు మైళ్లలో తాడికొండలో ఒకటీ ఉండయ్. తుళ్లూరులో కమలమ్మ చెల్లెలుంది. కొడుకుని అక్కడుంచి చదివించొచ్చు, వాళ్లు సరేనంటే. 'ఏమోలే. అప్పుడు సంగతి' అనుకుంది కమలమ్మ, పొగలొట్టంతో పొయ్యి రాజేస్తా.

రాత్రి పొద్దుబోయింది. కృష్ణమూర్తి పుస్తకాలు ముందేసుకోని కుస్తీ పడుతున్నప్పుడు కోమటి సీతారామయ్య వచ్చాడు. అప్పుడే ఉడుకుడుకు నీళ్లు బోసుకోని, ఉతికిన పంచె కట్టుకోని, పెంకుటింటి ముందు మెల్లాలో మంచం మీద కూచున్నాడు వరదయ్య. ఇంటి ముందు వేపచెట్టు మీదగా గాలి మెల్లిగా దోలతంది. ఎక్కడో కీచురాయి 'గీ'మంటంది. బయటంతా గబ్బు గియ్యం.

"ఏంది వరదయ్యన్నా! మరీ నల్లపూసైపొయ్యావు" అంటా వచ్చాడు సీతారామయ్య.

'నల్ల పూసవ్వటమంటే ఏందబ్బా?' అనుకున్నాడు కృష్ణమూర్తి. లోపల్నుంచి కమలమ్మ వచ్చి 'కూకో అన్నయ్యా!' అని స్టూలు చూపించింది. సీతారామయ్య కూర్చున్నాడు.

'ఏంలే. పనుల్లో బడి అటేపు రాలా ఈ మద్దెల' అన్నాడు వరదయ్య.

"పెసలు గొట్టావా? ఎన్నయినయ్యేందీ?"

"మా అయితే రొండు కింటాళ్లవుతయ్యేమో. ఎప్పుడు కప్పుడు శాకిరీ దప్ప సేతిలో కొచ్చేది కనపట్టంలా" నిట్టూర్చాడు వరదయ్య.

"కాలమట్టుంది మరి. సరిగానీ కొట్టో ఖాతా పెరిగిపొయ్యింది. ఏమన్నా జమెయ్యరాదా?" అడిగాడు సీతారామయ్య మెల్లిగా.

"ఈ పెసలమ్మితే సూద్దాంలే."

"రేటెంతుందేం?"

"ఆరేడొందలుంటదేమో."

"అదేదో నాకే అమ్మెయ్యరాదా? పైవాడికిచ్చి అవస్త బడేకంటే ఊళ్లో బేరం. నాల్రూపాయలు తగ్గినా నమ్మకం గందా?"

వరదయ్య ఆలోచనలో బడ్డాడు. సీతారామయ్య కమ్మాలంటే రేటు తగ్గించి అమ్మాల. అమ్మినా ఇప్పుడు చేతిలోకి వచ్చేదుండదు. పొలానికి మళ్లీ ఎతుక్కోవాల్సిందే. అదే బయటి వాళ్లకమ్మితే నాలుగు డబ్బులు చేతులో పడతయ్. సీతారామయ్య బాకీ పొగాకు పంటలో చూడొచ్చు. అందుకని వరదయ్య మెదలకుండా ఊరుకున్నాడు. అతని ఆలోచన పసిగట్టాడేమో, సీతారామయ్య మళ్లీ రెట్టించలేదు. రైతుల్ని పీడించే వాడు గాదు తను. 'పొదుగు కోసి, పాలు దాగుతామా?'

"నీ పైకమేడకీ పోదు లేవయ్యా! ఇందుట్లో కాపోతే రేపు పొగాకు పంటలో తీరవలేమా యేంది?" అన్నాడు వరదయ్య.

"పొగాకు? సదేలే. ఇంక అయినట్టే. పోయినేడు పొగాకులో లాబాలు దీసినోళ్లు మనూళ్లో ఎవురుండారో జెప్పు. మెరకవీధి నాగేశ్వరరావూ, కిట్టయ్యగారి సుబ్బయ్యా పొలాలమ్ముకు పొయ్యారు గందా? ఇంకా పొగాకు మీద ఆశబెట్టుకుంటావేందీ నీ పిచ్చిగాని. ఇయ్యేడు నలుగురైదుగురు పత్తి ఏస్తన్నారుగా, నువ్వు గూడా ఎయ్యరాదా?" అన్నాడు సీతారామయ్య. పెసల బస్తాల పక్కన తాలు పెసలు గుప్పెడు తీసుకొని పొట్టు ఊది, నోట్లో యేసుకున్నాడు.

"మరే అన్నయ్యా! నేను గూడా శతపోరతన్నా పొగాకొద్దని. ఈయనేడ? పెళ్లాం మాటింటేగా?" అందుకుంది కమలమ్మ.

"ఒట్టి మొండి ఘటం గదమ్మా" అన్నాడు సీతారామయ్య నవ్వుతా.

భార్య మాటలు పట్టించుకోలేదు వరదయ్య. "ఇయ్యేడు రేటు కాస్త అందుకుంటే చాలు, బాకీలన్నీ చుప్తాగా తీరిపోతయ్" అన్నాడు. పొగాకు కాడతీసి, మద్దెలో ఈనెతీశాడు.

ఇంతలోకి పక్క వీధి సూరయ్య పెద్ద కొడుకు రామారావు వచ్చాడు. చేతుల్లో ఏందో కాగితాలుండయ్. రామారావు బియ్యే చదివాడు. వుద్యోగం లేదు. ఇంటి పట్టునే తండ్రికి సాయంగా నాలుగెకరాల పొలం చూసుకుంటన్నాడు.

"ఏందిరోయ్ పెద్ద పనిమీదే వచ్చినట్టుండావ్?" అడిగాడు వరదయ్య. చుట్టకొన కొరికి నోట్లో బెట్టుకొన్నాడు.

"ఏముంది మావా? సాగర్ నీళ్లు మన పొలాలకి మళ్లించాలని గవర్నమెంటుకి కాగితం. అందరి చేతా సంతకాలు చేయించి ఇద్దామని. వ్యవసాయ మంత్రి మంగళగిరి వచ్చేదుందంట. అప్పుడు కలుసుకోని ఇవ్వాల" చెప్పాడు రామారావు. వరదయ్య మంచంమీదే కాళ్లకట్టన కూకున్నాడు.

"మొత్తం మీన ఏదో ఒకటి తలపెడతానే వుంటావు. నీ అసుమంటోళ్లు ఊరికిద్దరుంటే సాలు, దేశం బాగుపడుద్ది" అన్నాడు సీతారామయ్య.

"ఈ కాగితాల వల్ల ఏమవుద్ది? ఇంతకు ముందు ఎన్నిసార్లు ఊరోళ్లం కిందా మీదా పడలేదు?" అన్నాడు వరదయ్య తేలిగ్గా.

"మరే. ఏడేళ్ల నుంచీ ఈ తంతు జరుగుతూనే వుందాయె. ఒకడేమో ఇయ్యన్నీ మెరకచేలు, నీళ్లెక్కవంటాడు. వుంకోడేమో పంపింగ్ స్కీమ్ పెట్టిద్దామంటాడు. అంతా అరిసేతులో వైకుంటమే. ఐదు మైళ్ల దూరంలో కిష్ట కాలవ పారతన్నా చుక్క నీళ్లు అందవాయె." అన్నాడు సీతారామయ్య.

ఈ మాటలన్నీ కృష్ణమూర్తి శ్రద్ధగా వింటున్నాడు గానీ సంగతి సరిగ్గా అర్థంగాలా. "ఆ పొగాకు కంపెనీలోళ్లే కాలవ రాకుండా జేశారంటగా?" అందుకుంది కమలమ్మ.

"ఈసారి గట్టి ప్రయత్నం చేద్దాం. ఎలక్షన్లు దగ్గర బడతన్నయ్ గదా? అంతా ఒక కట్టు మీదుంటే గవర్నమెంటుని ఒక పట్టు పట్టొచ్చు. కానీ మావా! సంతకం పొడువ్. ఎమ్మటే పై వీధికెల్లాల" తొందర పెట్టాడు రామారావు.

"మీ మావది ఏలిముద్ర గదబ్బాయ్!" అంది కమలమ్మ నవ్వుతూ.

"ఓసోస్! అక్కడికి నీకేందో సంతకం సేతయినట్టు" అన్నాడు వరదయ్య సరసంగా.

"నాకు సంతకం వచ్చు నానా! నేను రాసేదా?" అడిగాడు కృష్ణమూర్తి ఉషారుగా.

వరదయ్య నవ్వాడు. “రేపు పెద్దయినాక అట్టనే రాద్దువు లేవాయ్” అన్నాడు రామారావు.

కమలమ్మ లోపలికెల్లి కాటిక్కాయ తెచ్చింది. వరదయ్య చుట్ట అవతల పారేసి, ఎడమ చేతి బొటనవేలికి కాటిక రాసుకోని. రామారావు పేరు రాసిన చోట వేలి ముద్ర వేశాడు.

“ఈ పిల్టాడెట్టా సదువుతున్నాడో, కాత్త పట్టించుకోయ్యా! నీకు పుణ్ణెముంటది” చెప్పింది కమలమ్మ రామారావుతో.

“స్కూలు ఫస్టు వీడేనంటన్నారు పంతులుగారు. అయినా శనాదివారాలు నా దగ్గరికి రారా కిష్టమూర్తీ! లెక్కలు జెపుతా.”

కృష్ణమూర్తి బుద్ధిగా తలూపాడు. రామారావు బాబాయ్ (అట్లానే పిలుస్తాడు కృష్ణమూర్తి) తనకి లెక్కలు చెపితే ఇంకేం? బాగా చదువుకోని కలక్టరై పోవచ్చు.

రామారావు లేచాడు. సీతారామయ్య కూడా బయల్దేరాడు. తండ్రీ కొడుకుల్ని అన్నాలకి లెగవమంది కమలమ్మ. బయట గాలి బిగదీసింది.

✡

అనంతారం నుంచి పొగనారు మూటలు దెచ్చాడు వరదయ్య. బుల్లి బుల్లి మొక్కల్ని చూస్తుంటే కృష్ణమూర్తికి కుశాలగా ఉంది. రెండెకరాలకి సరిపొయ్యే నారు దెచ్చాడు వరదయ్య. కమలమ్మకి ఇష్టం లేకపొయ్యినా ఇయ్యేడు పొగాకే వేసి, ఐసా పైసా తేల్చుకోవాలనుకున్నాడు. ఊళ్లో ఐదారుగురు రైతులు కొత్తగా పత్తి వేశారు.

పొగనాట్లకి తను గూడా వెళ్లాడు కృష్ణమూర్తి. ఇంటి దగ్గిరుండి చెల్లెల్ని ఆడిచ్చురా అని అమ్మ చెప్పినా విన్లేదు. వాళ్ల నాన్న పలుగుతో తవ్విన పాదుల్లో నీళ్లు పొయ్యటం, నీళ్లు అయిపోంగానే చేనికి దక్షిణపేపు దరినున్న కుంటలో మట్టి కడవతో నీళ్లు దేవటం కృష్ణమూర్తి పని. నలుగురు కూలీలున్నారు. పొద్దుగూకే వేళకి నాట్లు అయిపోయినియ్.

నాటిన మొక్కల్లో కొన్ని బతక లేదు. వరదయ్య మళ్లీ కొంత నారు దెప్పించి పడిపాదులేశాడు. అప్పుడు మళ్లీ చేనికెళ్లాడు కృష్ణమూర్తి. మొక్కలు కలకలలాడతన్నయ్. పట్టుకుంటే చేతికి జిడ్డు జిడ్డుగా అవుతుంది. “ఇయ్యేం కాయలు గాత్తయ్ నానా?” అడిగాడు కృష్ణమూర్తి వరదయ్యని. పెసర, మినుముకు మల్లే ఇయ్యిగూడా కాయలు గాయాలిగా?

‘ఇయి కాయల కోసం గాదురా? బాగా పెరిగింతర్వాత ఆకు నరికి, బేరన్‌లో కాలుత్తాం. ఆమైన చెక్కులు గట్టి అమ్మేత్తాం’.

“అమ్మితే”

“అయి కొనుక్కున్నోళ్లు వాటిని చూర జేసి, సిగరెట్లు తయారు జేసి, అమ్ముకుంటారు.”

కృష్ణమూర్తికి ఇదేం నచ్చలా. ఆకుల్తో సిగరెట్లు తయారుజేత్తారా? యాక్కిరాయ్‌లే! ఇయ్యేం మొక్కలు! తింటానికి పనికిరాకపోతే ఇంకెందుకు?

దీపాల మాస వొస్తందంటే కృష్ణమూర్తికి బొవ్ కుశాలగా వుంది. మందులు గాల్సొచ్చు. దివిటీలు తిప్పొచ్చు. ఆదివారం నరసయ్యతో గలిసి, గొడ్లను గాసే సుబ్బాయ్ వెంట దివిటీల కోసం పడమట పొలాన బీళ్లకెల్లాడు కృష్ణమూర్తి. గడ్డి మోకాటెత్తు పెరిగుంది.

"క్లె! క్లె! దీటీలు ఊరికినే కట్టి పెడతానేందీ? మీ సేలో నాలుగైదు ఏరుసెనగ మండలైనా పీక్కురావాల. వంగ తోట కాడ వరస గాదు." అని చెప్పాడు సుబ్బాయ్ కళ్లు గిరగిరా తిప్పుతా.

"మా సేలో ఏరుసెనగ లేదు. పొగాకేశారు" అని చెప్పాడు కృష్ణమూర్తి.

"మా సేలో ఏశారుగా? పొయ్యి తెద్దాం, పా" అని నరసయ్య లేచాడు.

ఇద్దరూ చేలకడ్డం బడి, వాగు దాటి, శేషయ్యగారి చేనికెళ్లి, వాటెడు వేరుసెనగ మండలు పీకారు. దార్లో వాగు నీళ్లలో జాడిచ్చారు. కాయ ఇంకా ఊరలా. తప్పకాయలే ఎక్కువ. అవే తీసుకొచ్చి సుబ్బాయ్ ముందుబెట్టారు. ముగ్గురూ మండల్నుంచి కాయలు పీకి, ఒలుచుకోని తిన్నారు. తర్వాత సుబ్బాయ్ మాంచి నల్లతుమ్మ చెట్టు చూసి, జవరంగా ఉన్న కొమ్మలు నాలుగు కొట్టాడు. బార బార ముక్కలు నరికాడు. తోలు దీసి, మొదుట్లో చీల్చి, ఒక్కొక్కటే బొంగు ముక్కలు దాంట్లో గుచ్చి, బిగ్గొట్టి, చుట్టూతా రెండు మూడు కడాలు వేసి, పొద్దుబొయ్యే యేళకి మూడు దివిటీలు తయారుజేశాడు. అవి వంకర లేకుండా జవరంగా ఉండయ్. అప్పుడుదాకా నరసయ్య, కృష్ణమూర్తి ముల్లుగఱ్ఱ దీసుకోని, ఎడ్లని మళ్లేస్తన్నారు. ఆమైన ఇద్దరూ దీటీలు తీసుకోని బైలెల్లారు.

దూరంగా కృష్ణమూర్తి వాళ్ల పొగతోట కనబడతంది. చేలో కలుపు దీస్తన్నారు గావాల.

"అరేయ్! నేను మా చేను మీదగా ఎల్తాను గానీ దీటీలు దీసుకెల్తావా ఊళ్లోకి" అనడిగాడు కృష్ణమూర్తి నరసయ్యని.

"పోమ్మా! ఇయ్యన్నీ నేనెట్టా మోసుకెల్లేది?" అన్నాడు నరసయ్య.

"అంతే లేరా! మా నాన రోలు, రోకలి చేయిత్తన్నాడు. ఒక పూట నీకియ్యొద్దూ?" ఆశ చూపించాడు కృష్ణమూర్తి.

నరసయ్య సంబరంగా "అట్టయితే తీసుకెల్తా" అని ఒప్పుకోని, దివిటీలు బుజం మీన పెట్టుకోని, కదిలాడు.

చేలో మల్లె చానా పెరిగింది. వరదయ్య, కమలమ్మ, వెంకట సుబ్బమ్మ, ఇంకో కూలమ్మాయి కలుపు దీస్తన్నారు. కమలమ్మ కొడుకును జూస్తానే, "అబ్బాయ్!" అంది.

చెట్టు సందుల్లోంచి చినుకులు మీద పడతంటే అమ్మ దగ్గరికి జరిగాడు కృష్ణమూర్తి. చేతుల్లో తూనీగ వదిలేశాడు. వాడి తలమీద కొంగు గప్పింది కమలమ్మ. మసక చీకట్లో తోపును చూస్తుంటే వాడికెందుకో తెలవని దిగులయ్యింది. బయ్యమేసింది.

“అమ్మా! రాత్రిపూట తోపులో దెయ్యాలుంటయ్యే?” అడిగాడు అమ్మని.

“నీ మొకం పిచ్చి పిల్లాడా!” అని కమలమ్మ వాణ్ణి దగ్గరికి తీసుకుంది.

“మరి నరసయ్యేందే అట్ట జెప్పాడు? వాడొకమాలి కొరివి దెయ్యాన్ని జూశాడంట.”

“అయ్యన్నీ పిచ్చి మాటల్లే” చెప్పింది కమలమ్మ తేలిగ్గా.

“మన సింతలతోపు ఎప్పుడు మొలిసిందే?” అమ్మ కొంగుతో మొకం తుడుచుకున్నాడు.

“ఏ మూడు తరాలైందో?” చెప్పింది కమలమ్మ.

వాన తగ్గింది. ఇద్దరూ ఊళ్లోకి కదిలారు. కొట్టంలో గొడ్డకి మేతేసి ఇంటికెళ్లారు.

✡

దీపాల పండగ రానే వచ్చింది. వరదయ్య కొడుకు కోసం కంసాలితోటి రోలు, రోకలి చేయించాడు. కృష్ణమూర్తి గంధకం, పొటాష్ కొనుక్కోని కఱ్ఱ చివర రోట్లో వేసి, తాడుతో రోకలి బిగిచ్చి, వినేవాళ్ల చెవులు దిబ్బిళ్లు బడేటట్లు ‘ధనా ధన్’ మని మోగిచ్చటమే మోగిచ్చటం. సీతారామయ్య కొట్టో కాసిని మతాబులు, కాకరపువ్వొత్తులు, టపాకాయలు కొనిపిచ్చుకున్నాడు. అమాస రాత్రి కృష్ణమూర్తి నరసయ్య ఇంకా వాళ్ల ఈడువాళ్లు కొంతమంది దీటీలు వెలిగిచ్చుకోని, వీధులమ్మట ‘దివ్వీ దివ్వీ దీపావలీ, మల్లీ వొచ్చే నాగుల చవితీ’ అని అరుచుకుంటా బోటిరాళ్ల మీదకి బొయ్యి, రాత్రి పొద్దు బొయ్యిందాకా చేతులు నెప్పి పుట్టేట్టు తిప్పారు. ఊళ్లో పండగ సందడి పెద్దగా లేదు. తొలకరి పంటలు బాగుంటే పండగ వెలిగిపొయ్యేది.

కృష్ణమూర్తి ఇంటికొచ్చి అన్నం దిని, నిద్రబొయ్యేపాటికి జాము రేత్రయ్యింది. తెల్లారి ఎండెక్కిన తర్వాత నిద్దర లేచాడు. కళ్లు నులుముకొని బయటికొచ్చేపాటికి వేపచెట్టు కింద నాన, రామారావు ఏందో మాట్టాడతన్నారు.

“నే ముందే చెప్పలా? ఈ కాగితాల వల్ల పనేమవుద్దని” అంటన్నాడు వరదయ్య. నోట్లో వేపపుల్ల నమిలి తుపుక్కున ఊశాడు.

“అయితే అవనీ, కాకపోతే కాకపోనీ. మన పని మనం జెయ్యాల గదా? పని గాకపోవటం కంటే మంత్రి గారి వైనమే ఘోరంగా ఉంది. ఇంతమంది మంగళగిరి బొయ్యి, కాగితమిస్తే సరిగ్గా చూణ్ణయినా చూశాడా? అటు ఇటూ దిప్పి, తర్వాత చూద్దామని, పర్యటనకి ఆలిసెమవుతుందని కారెక్కి పొయ్యాడు. ఏడికి బోతార్లే. ఓట్ల కోసం మళ్లొస్తారుగా? ఊరంతా

ఒక కట్టు మీనుంటే ఏమైనా జరగొచ్చు" అన్నాడు రామారావు. కృష్ణమూర్తికి వాళ్ల మాటలు బాగా అర్థం గాలా. 'ఓటు' అనే మాట వాణ్ణి పట్టుకుంది.

"ఓటంటే ఏంది బాబాయ్?" అనడిగాడు.

రామారావు నవ్వి, ప్రభుత్వం, ఎన్నికలు, ఓట్ల సంగతి మూడు ముక్కల్లో తేలిగ్గా చెప్పాడు. సాయంత్రం లెక్కలు చెప్పించుకోటానికి రమ్మన్నాడు.

"ఇయ్యాల బడికెల్లేదుందా?" అడిగాడు వరదయ్య కొడుకుని.

కృష్ణమూర్తి బుద్ధిగా తలూపి, మొకం పుల్లకోసం గబగబా చెట్టెక్కాడు.

✡

చలికాలం. పొగ తోటలు ఎక్కొచ్చినియ్యి. 'ఇయ్యేడు బాకీలు చుప్తాగా తీరిపోతయ్‌లే. పిల్లాణ్ణి కూడా సదివిద్దాం' అని చెప్పాడు వరదయ్య కమలమ్మతో.

మార్గశిరంలో గాలివాన రావటంతో రైతుల గుండెలు దడదడలాడినియ్. పెద్ద వాన గాకపోయినా భుజాలెత్తు పెరిగిన పొగతోటలు దెబ్బతిన్నయ్. ఎక్కువమంది హెచ్.ఆర్. రకమే వేశారు. తెగుళ్లకి తట్టుకుంటదని. అయినా వానలకి మచ్చ తెగులు తప్పలేదు. రంగూ, నాణ్యం తగ్గిపోతయ్. కొత్తగా వేసిన పత్తి చేలు మాత్రం వానలకి తిప్పుకోని బాగుండయ్. ఎకరానికి దిగుబడి పన్నెండు క్వింటాళ్లకి తగ్గదంటన్నారు. పొగాకేసి తప్పు జేశానా అని దిగులుబడ్డాడు వరదయ్య. పొగతోటలు సరిగ్గా కాకపోతే అప్పులు దీరటం కష్టమే. పొగాకు ఎగుమతులు బాగుంటయ్యనే అందరూ అనుకోటం. రేటు అందుకుంటే తిరుగులేదు.

సీజన్ మొదలైంది. వరదయ్య ఇంటి పక్క సాంబయ్యతో గలిసి పొగాకు బేరన్ చెరి సగం లెక్కన అద్దెకు తీసుకున్నాడు. బేరన్ గొట్టాలు బాగు జేయించాడు. కొట్టం దగ్గిర పందిరేశాడు. పొయ్యికి బొగ్గు తోలించాడు. డబ్బు పెగలకపోతే బొగ్గుకి సాంబయ్యే సర్దాడు. ఆకు విరవటానికి మూతా బళ్లమీద బయల్దేరటం, తెల్లగా తెల్లారేపాటికి పొగాకుతో బళ్లు రాటం, ఆడకూలీలు రొండు రొండు ఆకులు అందిస్తుంటే మగాళ్లు వాటిని పురికొసకి మెలేసి చకచకా గుఱ్ఱాలకి కట్టటం, ఆకు కఱ్ఱల్ని బేరన్‌లో సర్దటం, పొయ్యిలో బొగ్గేసి మండించటం. ఇదంతా కృష్ణమూర్తికి చిత్రంగా వుంది. అన్నిట్లోకి ఆకులు పురికొసకి తొందరతొందరగా మెలేసి, గుఱ్ఱాలకి కట్టటం చానా అబ్బరంగా ఉంది. పొద్దున్నే వీధి మలుపులో పొన్నాయి చెట్టు కింద రాలిన పూలు తెంపి బూరచేసి ఊదుకుంటా బేరన్ దగ్గరికి పోవటం, పొయ్యి ముందు చలిగాచుకోటం వాడి కలవాటై పొయ్యింది. వరదయ్యకి పనుల్లో చెయ్యాడక బేరన్‌లో బొగ్గేసే పనికి సుబ్బాయ్‌ని పెట్టుకున్నాడు. సుబ్బాయ్ చావల్‌తో పొయ్యి తలుపు దీసి, బొగ్గేస్తుంటే తనూ వేస్తానని పట్టుబట్టాడు. 'ముందు చావల్ని మొయ్యి, సూద్దాం' అన్నాడు సుబ్బాయ్.

కృష్ణమూర్తి వల్ల గాలేదు. కాకపోతే అప్పుడప్పుడు బేరన్‌లో తగిలించిన టెంపరేచర్ గొట్టం తాడుతో లాగి, అద్దంలోనుంచి చూసి, 'తొంభై యేడు' అని చెప్పేవాడు. ఒక్కో రోజు సుబ్బాయ్ ఎక్కడియ్యో జొన్న కంకులు దెచ్చి ఊచ బియ్యం గొట్టి, చావల్లో పోసి, బేరన్ పొయ్యి బొగ్గుల మీద వేయించేది. అయి కృష్ణమూర్తికి బొవ్ రుచిగా ఉండేయి.

పొగాకు బేరన్ దిగింది. కొట్టం దగ్గరే పందిరేసి గ్రేడింగ్ మొదులుబెట్టారు. మజ్జానం స్కూల్లో ఇంటిబెల్లు కొట్టంగానే కృష్ణమూర్తి కొట్టం దగ్గిరికి పరిగెత్తేవాడు. చెల్లెలు నిద్రపోతంటే కమలమ్మ గూడా గ్రేడింగ్ చేస్తంది. వరదయ్య చెక్కులు గడతన్నాడు. వెంకట సుబ్బమ్మ, ఇంకా ముగ్గురు ఆడ కూలీలు వుండారు. వెంకట సుబ్బమ్మ కెందుకో కృష్ణమూర్తంటే వుచ్చిలి.

"పిల్లాడేందమ్మా అట్ట సిక్కిపోతన్నాడు రోజు రోజుకీ" అంది కమలమ్మతో.

"యాలకి బువ్వ దింటేగా? వాడి ఆటలేందో, వాడేందో" చెప్పింది కమలమ్మ.

"బళ్లో అందరికన్న ఈయనే మిగులంటగా? పిలగాడా! నువ్వు కలట్టరైం తర్వాత నన్ను పెళ్లి జేసుకుంటావా" అనడిగింది వెంకట సుబ్బమ్మ నవ్వుతా.

"ఆ రమ్మన్నారు తిమ్మన్న బంతికి. నిన్నేం జేసుకోను" తెగేసి చెప్పాడు కృష్ణమూర్తి. కూలీలు నవ్వారు. వాడి మొకం కందగడ్డ అయ్యింది. అటెల్లి గాబు దగ్గిర గిత్తలకి నీళ్లు బెట్టాడు.

పది చెక్కుల కన్నా కాలా పొగాకు. కాల్పు సరిగా లేదు. మాంచి మిసమిసలాడే ఒకటో నంబరు తక్కువే. రేట్లు ఎట్ట బడతయ్యోనని వరదయ్యకి దిగులు బట్టుకుంది.

✡

ఎండలు ముదురుతున్నయ్. కృష్ణమూర్తికి పరీక్షలు దగ్గర బడ్డయ్. పిల్లాడిపై చదువు సంగతి చూడమంది కమలమ్మ. ఊళ్లో హైస్కూలు లేదు. టౌన్లో చదువంటే మాటలా? ఇంటి పరిస్థితి బాగా లేదు. పొగాకు అమ్మలేదు. వడ్డీలు పెరిగిపోతన్నయ్. పెళ్లాం మాటలకి ఊ కొట్టి ఊరుకున్నాడు వరదయ్య.

తుళ్లూరునుంచి వరదయ్య తోడల్లుడు తిరపతిరావొచ్చాడు చుట్టం చూపుగా. ఆ మాటా ఈ మాటా అయ్యింతర్వాత కృష్ణమూర్తి చదువు సంగతి అడిగాడు. సంగతి దెలుసుకోని, "మా వూళ్లో ఐస్కూలుందిగా? ఆడ బడెయ్యరాదా? ఈడూ మా వోడు తోడు తోడుగా సదువుకుంటారు" అన్నాడు.

కమలమ్మకీ మాట బాగానే వుంది. 'సొంత చెల్లెలే గందా ఆడుంది? తనంటే ఆపేక్ష. బాగానే జూసుకుంటది పిల్లాణ్ణి. సక్కంగా సదువు కుంటున్న పిల్లాణ్ణి ఎయ్యో యిబ్బందులజెప్పి మానిపిత్తే, అయ్యకి మల్లే ఎద్దుముడ్డి బొడుసుకోవాల్సిందేగా?' అనుకుంది.

"సరే, సూద్దాంలే" అన్నాడు వరదయ్య.

"ఇంకా సూసేదేందన్నయ్యా? మళ్లీ స్కూలు దెరిసేలోపు మీ మరదలొచ్చి పిల్లాణ్ణి దీసికెల్లిద్ది. చాకిరీ చేసి జేసి, మనమేం ఊడబొడిచాం గనక? ఆళ్లయినా సదువుకుంటే ఏదో ఒక దారి జూసుకుంటారు" అని చెప్పాడు తిరపతిరావు.

"మరే" అంది కమలమ్మ.

✡

ఊళ్లో పుకారు బుట్టింది. పొగాకు రేటు పడి పొయ్యిందని. ఎగుమతి ఆర్డర్లు ఆగిపొయ్యినయ్యంట. ప్రభుత్వం నిర్ణయించిన దాని కన్న రైతులు ఎక్కువ పొగాకేశారనీ, డిమాండ్ లేక కొనుగోళ్లు తగ్గినయ్యనీ రకరకాల సంగతులు వింటన్నాడు వరదయ్య. ఒకేపు బాంకి వడ్డీ, కొట్లో ఖాతా పెరిగిపోతన్నాయ్. పొగాకు చెక్కులన్నీ పంచలో పడుందయ్.

గుంటూర్లో పొగాకు రైతుల సమావేశం. రామారావుతో కలిసెల్లాడు వరదయ్య. రైతు నాయకులు, ప్రభుత్వాధికారులు, బోర్డు అధికారులు అంతా జేరారు. రైతులు వుద్రేకంగా వుండారు. వేరే దేశాల నుంచి ఆర్డర్లు వచ్చేదాకా ఓపిక పట్టాలని అధికారులు జెప్పారు. ఈ లోపు ప్రభుత్వమే ఎస్.టి.సి. ద్వారా పొగాకు కొనాలని రైతు నాయకులు పట్టుబట్టారు. పైపై హామీలైతే దక్కినియ్.

"అంతా దొంగనాయాళ్లే. పొగాకు బోర్డులో రైతుల పేరు మీద యాపారస్తులుంటమేంది?" అన్నాడు వరదయ్య. "ఇంకా రైతులందర్నీ కూడగట్టి వుద్యమం జేస్తే గాని పని జరగదు" చెప్పాడు రామారావు. 'రైతుల్లో కట్టుబాటు లేదు గందా' అనుకున్నాడు వరదయ్య.

రామారావు కాలికి బలపం గట్టుకోని, చుట్టుపక్కల ఊళ్లన్నీ దిరిగాడు. ఊళ్లో కుర్రకారుని కదలేశాడు. మొత్తం మీద రైతులు కదిలి రాస్తారోకోలు జేశారు. టౌన్లో నిరాహార దీక్షలు జరిగినయ్. చివరాఖరకి పొగాకు కొంటానికి ఎస్.టి.సి. రంగంలోకొచ్చింది. అయితే అప్పటికే బాకీలు తట్టుకోలేని రైతులు ప్రైవేటు వ్యాపారస్థులకి అయిన కాడికి పొగాకమ్ముకున్నారు.

వేలం కేంద్రాలు దెరిచిన వుషారు రైతుల్లో నాలుగు రోజులు గూడా నిలవలా. బంగారం లాంటి ఒకటో నెంబరు పొగాకు గూడా పదేను వందలకి మించి పలకలేదు. వరదయ్యకి పొగాకంతా అమ్ముడు బొయ్యింది గానీ పట్టుమని ఎనిమిదేలు వచ్చేపాటికి గగనమైంది. అయ్యే ముక్కులోకి చాలతయ్? కొట్టో బాకీ, బాంకి బాకీ, సీజన్ ఖర్చుల కోసం పట్నంలో మందుల కొట్టో దెచ్చిన బాకీ – అన్నీ కళ్లముందు గిర్రన దిరిగినియ్.

"అంతా మోసం. ఆరుగాలం మనం సెమటోడ్చి పండిత్తే ఆడెవుడో వచ్చి కనా కష్టంగా రేటు గట్టటమేంది? రామారావు జెప్పినట్టు ఇదంతా దోపిడీయే" అన్నాడు వరదయ్య కమలమ్మతో.

కమలమ్మ మనాదేసుకుంది. రేపుణ్ణుంచి ఇల్లు గడిసేదెట్టా?

✡

"ఇయ్యాల తోపులో కోతికొమ్మచ్చి ఆడుకుందాం రా. చానా మంది వత్తన్నారు." అని పిలిచాడు నరసయ్య కృష్ణమూర్తి ఇంటి దగ్గిరకొచ్చి.

మిట్ట మజ్జానం. కమలమ్మ లోపల పనిలో వుంది. చెల్లెలు నిద్రపోతంది. పంచలో కోడిపిల్లల అలికిడి తప్ప చీమ సీటుక్కుమంటల్లా. వరదయ్య ఇంట్లో లేడు. కృష్ణమూర్తి ఒక్క లగూ దీశాడు.

తోపులో నీడగానే వుంది. పిల్లలు పదిమందిదాకా తయారయ్యారు. కాసేపు పండిన చింతకాయలు కోసుకు తిన్నారు. తర్వాత పంటలేస్తే, అందరూ పండిపొయ్యి, రాముడు దొంగయ్యాడు. చింతచెట్టు మొదులు దగ్గిర నరసయ్య గిరి గీసి, కర్రపుల్ల కాలికింద నుంచి దూరంగా విసిరాడు. ఆ పుల్ల తేటానికి రాముడు పరిగెత్తగానే అందరూ గబ గబా చెట్లెక్కారు. రాముడికెవరూ చిక్కటంలా. ఒక్కొక్కడు కొమ్మల్లోంచి గభీల్న దూకి, వాడికందకుండా గిరిలోకి పరిగెత్తుతున్నాడు. ఇంతలోకి చిటారు కొమ్మ మీద నుంచి నరసయ్య పెద్దగా కేకేశాడు.

"అరే కిట్టమూర్తీ! అక్కడేందో ఏలాడతంది, సూడరా."

కృష్ణమూర్తి పరీక్షగా చూశాడు. ఇద్దరు ముగ్గురు పిల్లలు మళ్లీ చెట్టెక్కారు. దూరంగా ఇంకో చింతచెట్టు కొమ్మకి ఎవురో ఏలాడబడ్డట్టుంది. అంతా గబగబా అక్కడికి పరిగెత్తారు. చింతచెట్టు కింద కొమ్మకి, నేలకి గజమెత్తున నారాయణవాళ్ల నాన పుల్లయ్య శరీరం వేళ్లాడతుంది. పైపంచకి ఉరేసుకున్నాడు. ఎప్పుడు ప్రాణం బొయ్యిందో, కళ్లు దెరుచుకోని, నాలిక బయటికొచ్చి, అంతా భయంకరంగా ఉంది. కృష్ణమూర్తికి చిరు చెమటలు బట్టుకొచ్చినయ్. పిల్లలంతా భయంతో గుండెలు దడదడ లాడతా, 'వామ్మో! వామ్మో' అనుకుంటా ఊళ్లోకి లగెత్తారు.

ఊరంతా గుప్పుమంది. జనమంతా పొయ్యి చూశారు. అప్పులెక్కువై ఉరేసుకున్నాడు పుల్లయ్య. పొగాకేసి ఆరిపొయ్యాడు. ముగ్గురాడపిల్లలు, నారాయణ గాక. ఎవురికీ చెప్పకుండా రాత్రికి రాత్రే ఈ ఘోరం జేశాడు. నారాయణ గోల గోలగా ఏడుస్తుంటే కృష్ణమూర్తికీ ఏడుపొచ్చింది. పుల్లయ్యతాత తనంటే ఎంతో ఆపేక్షగా వుండేవాడు. బాగా చదువుకోమని చెప్పేవాడు.

"పుల్లయ్య తాత ఎందుకు చచ్చిపొయ్యాడు నానా?" అని ఆ రాత్రి అడిగాడు తండ్రిని. పక్కనే రామారావు గూడా ఉండాడు. వరదయ్య మాట్టాడలా.

"గవర్నమెంట్ చంపేసిందిరా" చెప్పాడు రామారావు గంభీరంగా.

కృష్ణమూర్తి కళ్ల ముందు పుల్లయ్య తాత శరీరమే కనబడతంది. రాత్రి నిద్రలో జరమొచ్చింది. కలవరింతలు మొదులుబెట్టాడు. కమలమ్మ కళ్లనీళ్లు పెట్టుకుంది. దిష్టి తీసింది. వరదయ్య డాట్టర్ని లేపి తీసుకొచ్చాడు. సూదిమందిచ్చాడు డాట్టరు. రెండో రోజు మాయెటేళకి గాని జరం తగ్గలా.

✡

ఎన్నికల సందడి మొదలైంది. గోడల మీద కాగితాలంటిచ్చారు. మైకులు, జీపులు వచ్చిపోతన్నాయ్ ఊళ్లోకి. జీపులు రాంగనే పిల్లకాయలు వెంటబడి కాగితాలందుకొంటన్నారు. బైటి అడావుడి దప్ప ఊళ్లో వుషారు లేదు. వరసగా నాలుగేళ్ల నుంచి పంటలు దెబ్బతింటంతో రైతులంతా దిగాలుబడ్డారు. పుల్లయ్య తాత చావు చాన మంది రైతుల గుండెల మీద దెబ్బ తీసింది.

అప్పుల మద్దెన వరదయ్య కేంజెయ్యాలో పాలుబోవటంలా. కుంట చేను అరెకరం బేరం బెట్టాడు. ఎంతకాలం ఈ రొండు మూడెకరాల్తో, పండీ పండక యీడగిల బడతం? ఉన్నట్టుండి వరదయ్యకి చింతలతోపు కొట్టేద్దామనే ఆలోచనొచ్చింది. పుల్లయ్య అందులో వురేసుకున్నప్పటి నుంచి తోపుమీద భ్రమ పోయింది. దానిమీద రాబడీ లేదు. సుబ్బరంగా రెండెకరాల పత్తి చేనవుద్ది. అంతా కలుసుబాటుగా వుంటే వచ్చే యేటికి బాకీలు తీరిపోతయ్. పెళ్లానికీ ఆలోచన జెప్పాడు.

“పిచ్చా, చాదస్తమా? తాతలనాటి తోపు కొట్టేద్దామంటా వేంది? కలిసొత్తే యీ పొలం జాలదా?” అంది కమలమ్మ. అయినా వరదయ్యకి ఆ ఆలోచన పోలా.

కృష్ణమూర్తికి ఐదో తరగతి పరీక్షలై పోయినియ్. వుండే పదిమంది పిల్లల్లో వాడే ఫస్టు. కోదండం పంతులు గారు పనిమాలా ఇంటికొచ్చి, వాణ్ణి హైస్కూల్లో జేర్పిచ్చాల్సిందేనన్నారు. కమలమ్మ గూడా పట్టుబట్టింది. ‘ఏందిరా సదువుతావా?’ అని వరదయ్య అడిగితే, కృష్ణమూర్తి ‘ఓ’ అన్నాడు. తొందరగా చదువుకోని, డాక్టరు గావాల. అప్పుడు వురేసుకునేవాళ్లని గూడా బతికియ్యొచ్చు.

ఆ రోజు మాయెటేల రాములవారి గుడి దగ్గర కృష్ణమూర్తి, ఇంకా సావాసగాళ్లు గోలీలాడతన్నారు. మండపంలో పదిమంది దాకా పెద్దాళ్లుండారు. ఒక్కొక్కళ్లే జనం పోగవుతున్నారు. గోలీలాటలో కృష్ణమూర్తికి మాంచి గురి ఉంది. పొద్దుగూకేపాటికి ఆటలో జేబు నిండా గోలీలు జేరినియ్. తర్వాత పిల్లలంతా గోలీలా ఆపేసి ‘వాలింకి’ ఆట మొదలుబెట్టారు. నరసయ్య కాలితో గుండ్రంగా పెద్దగిరి గీస్తా, తిరుగుతా పాడతంటే తక్కిన పిల్లలు అందుకొన్నారు.

“వాలిం కోలింకే”

"చంద్రా వాలింకే"

"చెట్టును గొట్టేదెవురు"

"చేమల పుల్లాయ"

"పిట్టని గొట్టేదెవురు?"

"గుట్టల గురవాయ"

"వాణ్ణి గొట్టీ..."

"వాణ్ణి గొట్టీ..."

"వీణ్ణి గొట్టీ..."

"వీణ్ణి గొట్టీ..."

"గోపయ్యగారి చిన్నెంకణ్ణి గొట్టండో"

అందరూ చిన్నెంకడి మీద బడంగానే వాడు గిరి బయటికి పారిపొయ్యాడు. గిరి చుట్టూతా అటు దిరిగీ, ఇటు దిరిగీ లోపలున్న వాళ్లని బయటికి లాక్కెళతన్నాడు. లాక్కెళ్లేటప్పుడు 'దబిడీ దిబిడీ' దెబ్బలు బాగనే పడతన్నయ్. అంతా గోల గోలగా ఉంది.

"అరే మీ ఆటలాపండ్రా" ఎవురో పెద్దాయన అరిచాడు, మండపంలోంచి. పిల్లలు ఆటలు కట్టిపెట్టారు.

ప్రెసిడెంటు వెంకట్రామయ్య గుడి మండపంలోకి రాంగనే రైతుల మల్లగుల్లాలు మొదలయినయ్. ఎవురో వచ్చి మండపంలో మైకు బెట్టారు. దాదాపు ఊళ్లో రైతులంతా మండపం దగ్గిరికి జేరారు. వరదయ్య ఒకేపున నిలబడ్డాడు. కృష్ణమూర్తికీ, నరసయ్యకీ సంగతేందో తెలవలా.

అంతలోకి 'బయ్'న నాలుగు కార్లొచ్చి మండపం పక్కన ఆగినయ్. నల్లగా నిగనిగలాడతన్న లావాటి శాల్తీని జూసి, 'అదుగో మంత్రిగారొచ్చారు' అన్నారెవరో. రెండో కార్లోంచి దిగినాయన్ని జూసి, 'ఆయనే ఎలక్షన్ కాండిడేటు' అనుకున్నారు. చుట్టూ దిరిగి, అందరికీ దణ్ణం బెట్టి, మంత్రి, అభ్యర్థి కుర్చీల్లో కూకున్నారు. ముందు ప్రెసిడెంటే మైకు దీసుకోని, అందర్నీ 'మన' పార్టీకి ఓటెయ్యమని అడిగాడు. తర్వాత మంత్రిగారు అందుకోని, రైతుల సమస్యలు ప్రస్తావించి, తొందర్లో వాటిని దీరుస్తానని వాగ్దానం చేశాడు.

"ఎప్పుడో జేసేది తరవాత సంగతి. ఇప్పుటికేం జేశారో చెప్పండి. నాలుగేళ్ల నుంచి రైతుల పరిస్థితి గోరంగా ఉంది. ఇయ్యేడైతే గుల్లగుల్లయి పొయ్యారు. పొగాకుకు రేటు లేకుండా జేసి, ఈ గవర్నమెంటే మా కొంప ముంచింది" అన్నాడొక రైతు వుద్రేకంగా.

అభ్యర్థి మొకం నల్లబడింది. మంత్రి నవ్వలేక నవ్వాడు.

"ఇప్పుడెట్టాగూ పొగాకు సీజన్ అయిపొయ్యింది గదా? వచ్చేయేడు ముందు నుంచే ఎగుమతి ఆర్డర్ల కోసం ప్రయత్నిద్దాం. మీకు గిట్టుబాటు ధర దొరికేట్టు చెయ్యటం నాదీ పూచీ" అని చెప్పాడు నిభాయించుకుంటా.

"ఇట్టాంటి మాటలు నమ్మే ఈ కాడికొచ్చాం. మీరు, ఈ పొగాకు కంపెనీలోళ్లూ కుమ్మక్కై ఇదంతా జేత్తన్నారు. పొగాకు ఎగుమతుల పేరన దేశాల్నే మోసం జేసిన వాళ్లని మీరేం జేశారు? ఈ అభ్యర్థి వాళ్ల చుట్టమేగా? కంపెనీలు పెట్టిన వాళ్లు పదేళ్లలో కోటీశ్వరులై పొయ్యారు. ఏళ్ల తరబడి చాకిరీ జేత్తన్న రైతులేమో మట్టిగొట్టుకు పొయ్యారు. ఐదు మైళ్ల దూరంలో కిష్ట కాలవుంటే అది రాకుండా జేశారు. ఈ నల్ల నేలల్లో పొగాకేస్తే బంగారం పండిద్దనీ, ప్రతి రైతూ లక్షాధికారి అవుతాడనీ, అరిసేతుల్లో వైకుంఠం చూపించారు. ఇప్పుడీ చుట్టుపక్కల వూళ్లల్లో జరుగుతున్నయ్యి తాకట్టులూ, జప్తులూ, వురేసుకోవటాలూ. ఇంకా ఏం జూసి మీకు ఓటెయ్యమంటా?" అని రామారావు నిలదీశాడు. అభ్యర్థి బిత్తరపోయి చూస్తన్నాడు.

"ఈళ్లంతా దొంగనాయాళ్లు" అన్నాడొక రైతు. ఆ మాట మంత్రి చెవిన పడింది. అసలే బి.పి. వుద్రేకం ఆపుకోలేకపొయ్యాడు.

"చెప్పేది వినకుండా మీరు మరీ మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారు" అన్నాడు తీవ్రంగా.

అప్పుడు దాకా మండపం కంబానికానుకోని ఈ మాటలన్నీ వింటన్న వరదయ్యకి కోపం నసాళాని కంటింది.

"ఏంది ఇంకా నువ్వు జెప్పేది నా..." అంటా చేతిలో ఉన్న ముల్లుగఱ్ఱ పైకెత్తాడు. కళ్లెఱ్ఱబడ్డయ్యి. బుసలు గొట్టాడు.

మంత్రికీ, అభ్యర్థికీ దడ బుట్టింది. ప్రెసిడెంటుతో ఏందో మాట్టాడి, మంత్రి గబగబా కారెక్కాడు. వరదయ్య తుపుక్కున వుమ్మేశాడు.

పిల్లలంతా 'హే' అని గోలకి లేచారు. కార్లు బోతంటే ఎనకమాలే పరిగెత్తారు. కృష్ణమూర్తికి వుక దెలిసినప్పట్నుంచి వాళ్ల నానకి అంత కోపం రాటం జూళ్లా. ఎందుకోగానీ వాడికీ వుక్రోషం వచ్చింది. మాంచి రాయి దీసుకోని, వెనకమాల కారు అద్దం పగిలేటట్లు గురిజూసి విసిరాడు.

రైతులు మండపం దగ్గరే మల్లగుల్లాలు బడ్డారు. ఈ నేలలన్నీ మాగాణి అయితే తప్పితే మన బాధలు తీరవన్నాడు రామారావు. సాగర్ నీళ్ల కోసం గవర్నమెంటుని పట్టుబట్టాల్సిందేనని ఇంకో రైతు మాట్టాడాడు. అప్పుడు దాకా ఊళ్లోకి ఏ పార్టీ వాళ్లనీ అడుగు పెట్టనియ్యొద్దను

కున్నారు రైతులు. చుట్టుపక్కల ఊళ్ల రైతుల్నీ కలుపుకోవాలనే ఆలోచనొచ్చింది. ప్రెసిడెంటు పక్షానున్న నలుగురైదుగురు తప్పిచ్చి తక్కిన రైతులందరిదీ ఒకటే మాట.

✡

ఒక రోజు నరసయ్య లగెత్తుకుంటా వొచ్చి, “అరే, మీ సింతలతోపు కొట్టేత్తన్నార్రా” అని చెప్పాడు.

వాడికేం అర్థం గాలా. తోపు కొట్టెయ్యటమేంది? అది లేకపోతే ఏవుంది? వాడి ఆటలూ, పాటలూ అన్నీ తోపుతో ముడిబడి వుండయ్. ఇద్దరూ తోపుకేసి పరిగెత్తారు.

అప్పటికే కూలీలు సగం చెట్లు పడగొట్టారు. కొమ్మలు రంపాలతో కోస్తన్నారు. వరదయ్య దగ్గిరుండి పని జేయిస్తన్నాడు. చెట్లు పడిపోయిన చోటంతా బోసిగా, నీడలేకుండా వెల్తురుగా, అయనా వెలితిగా కనబడతంది. కృష్ణమూర్తికెంతో యిష్టమైన పెద్ద చింతచెట్టు పడిపొయ్యి, వాడి వంకే దీనంగా జూస్తన్నట్టుంది. వాడికి కళ్లమ్మట నీళ్లు దిరిగినయ్.

‘నానా!’ అన్నాడు వరదయ్య దగ్గిరికి బొయ్యి.

“ఏందిరా” అడిగాడు వరదయ్య, కూలీలు జేసే పనివంకే జూస్తా.

“చెట్లెందుకు గొట్టేత్తన్నారు?”

“ఇయ్యన్నీ వుండేం వుద్దరిత్తన్నయ్‌లే. కొట్టేసి సేను జేద్దామని. వచ్చే యేడు పత్తి ఎయ్యొచ్చు” చెప్పాడు వరదయ్య. కానీ తన మాటల్లోనూ విచారమే.

కృష్ణమూర్తి ఇంకేం మాట్లాళ్లేక పొయ్యాడు. దిగాలుగా ఇంటికొచ్చాడు. కమలమ్మ పంచలో కూకోని, చేటలో బియ్యంలో రాళ్లేరతంది. పక్కనే పిల్ల గిలక్కాయతో ఆడుకుంటంది.

కృష్ణమూర్తి తల్లి పక్కన జేరి, “అమా! తోపు కొట్టేత్తన్నారే” అన్నాడు.

“ఏందో నాయనా! ఏం జెయ్యటానికీ కాళ్లేతులాట్టం లేదు. పంటలు జూత్తే అట్టుండయ్. బాకీలు దీరలా. తోపు గొట్టేసి పొలం జేద్దామని మీ నాన. తరాల నాటి తోపు. మీ ముత్తాత ఎందుకేశాడో యేశాడు. పచ్చగా వున్న చెట్లని గొట్టి సేను జేసేదేంది? మాయదారి మడిసి, సెపితే యినడాయె. ఇంటికేందో శని బట్టుకుంది” అంది కమలమ్మ.

చాన్నాళ్ల దాక కృష్ణమూర్తి ఏందో పోగొట్టుకున్నాడికి మల్లే దిగాలుగా వుండిపొయ్యాడు. ఎగురుతున్న తూనీగ రెక్కలిరగ దీసినట్టయింది.

తుళ్లూరునుంచి కమలమ్మ చెల్లెలు కుమారి వొచ్చింది, కొడుకుతోపాటు. వాడి కొత్త బట్టలు, నాజూకు చూసి కృష్ణమూర్తి సిగ్గుపడ్డాడు. తనకి మంచి గుడ్డలే లెవ్వు. ఉన్నయి

మాసిపోయినియ్. ఒక్కటే దాపుడు చొక్కా. కుమారి కొడుకు మాత్రం బిడెం లేకుండా కాసేపుట్లోనే కృష్ణమూర్తితో కలిసి పొయ్యాడు. వాడికి తన సీసం గోలీలు, పెద్ద గోలీలు చూపిచ్చాడు కృష్ణమూర్తి. ఇద్దరూ నరసయ్యతో కలిసి ఆడుకోటానికి బొయ్యారు.

కుమారి ఆ రోజుండిపొయ్యింది. ఆ తెల్లారి కృష్ణమూర్తిని దీసుకెళ్తానంది. పిల్లాడు పైకి చదవబోతన్నందుకు కమలమ్మకి సంబరంగా ఉన్నా పంపిచ్చటానికి బాధపడింది.

"ఇక నుంచీ అబ్బాయ్ నీ కొడుకేనే" అని కళ్లనీళ్లు పెట్టుకుంటా చెల్లెలికి అప్పజెప్పింది.

కృష్ణమూర్తి బిక్కమొకమేసుకున్నాడు. వాడి తల నిమిరి, దగ్గిరికి తీసుకుంది కుమారి.

"ఈడకీ ఆడకీ ఎంత దూరం? ఎప్పుడైనా రావొచ్చు, పోవచ్చు గదక్కాయ్!" అంది. వరదయ్య కళ్లు దుడుచుకున్నాడు చాటుగా. ఊరికెళ్లిపోతున్నట్టు సాహసగాళ్లకి చెప్పొచ్చాడు కృష్ణమూర్తి. నరసయ్య వాడమ్మటే వుండాడు.

ఊరు దాటి డొంకదారిని బోవాల. వరదయ్య సవారి బండి గట్టాడు. కృష్ణమూర్తికి లోపలంతా చెప్పలేని దిగులుగా వుంది. వాడి చిన్నతనమంతా ఆ ఊరుతో అల్లుకుపొయ్యింది. ఇప్పుడెవురో తెంపేస్తన్నారు. మళ్లీ ఎన్నాళ్లకో? బండి ఊరు చివర చెరువు కట్టమీద కొచ్చినాక వొక్కసారి వెనక్కి దిరిగి చూశాడు కృష్ణమూర్తి. ఊరు ఊరుగానే సడీ సప్పుడు లేకుండా వుంది. ఊరు మీన చింత తోపు మాత్రం కనబట్టంలా. అంతా ఏందో వెలితి.

'కిట్టమ్మా! గోపాల కిట్టమ్మా!...' అంటా ఎవరో పాడతన్నట్టనిపించింది కృష్ణమూర్తికి. వెనక్కి దిరిగి చూశాడు. ఎవురూ లేరు. వాడి కళ్లమ్మట గిరగిరా నీళ్లు దిరిగినియ్.

✡

# ప్రత్యర్థి

**–మధురాంతకం నరేంద్ర**

రోడ్డు కవతలివైపున్న డాబా హోటలునే చూస్తూ, బైపాస్ రోడ్డు కడ్డంపడి నడవబోయిన వీరమరెడ్డి, దీపాలు వెలిగించుకున్న లారీ వొకటి రోడ్డుపైన దూసుకుపోవడం చూసి, చిటికెలో తప్పిపోయిన ప్రమాదానికి నివ్వెరపోయి ఆగిపోయాడు. నల్లగా పొడుగ్గా వున్న అతడి ఆకారానికి చొక్కా పాంట్లూ చిన్నవిగా కనబడుతున్నాయి. ముఖంలో తుమ్మ ముళ్ళలాంటి గడ్డం పెరిగిపోయివుంది. నూనెను మరచిన తెలుపూ నలుపు రంగుల జుట్టు కోళ్లు కెలికిన దిబ్బలా చెలరేగిపోయివుంది. మొరటుబారిన అవయవాలతో వీరమరెడ్డి వూరి బయట విసిరేసిన వీరగల్లులోని పాత బొమ్మలా వెలవెలబోతున్నాడు.

ముందుకు కదలబోయిన వీరమరెడ్డిని వెనకనుంచీ వాటేసుకున్న వ్యక్తి “నన్ను పిలవకుండానే పార్టీనా అన్నా? అదన్యాయం” అంటూ తన మాటలకూ నవ్వులకూ పోటీ పెట్టాడు.

“ఛత్... నువ్వా దేవరాజూ! వొదులు ముందు” అని కస్సుమన్నాడు వీరమరెడ్డి.

సన్నగా, పొట్టిగా వున్న దేవరాజు తన చేతుల్ని వదులు చేస్తూ “యిడిసి పెడతాన్లేన్నా! యిదే ఆడమనిషిగాని అబ్బలించుకోనుంటే యిట్లా కసురుందువా నువ్వు?” అంటూ తన నవ్వును కొనసాగించాడు.

“నిన్నెవురూ వక్కాకు బెట్టి పిలవలేదు. పోపో...” అంటూ వీరమరెడ్డి విదిలించిపారేశాడు. అదేదో సరాగమైనట్టుగా దేవరాజు పకపకా నవ్వేసి “అట్లనద్దన్నా! యెంతయినా వొకే యాపారంలో వుండేటోళ్ళం.... కుక్కతల గూడా యెప్పుడో వొకప్పుడు అవసరానికి పనికొస్తాదంటారు పెద్దోళ్ళు...” అన్నాడు.

వీరమరెడ్డి నడుముపైన చేయి పెట్టుకుని, తెలుపూనలుపూ కలగలిసిన మీసాన్ని మెలేసి “యేదో పార్టీల పోవిడిచెప్తావుండావని దగ్గిరికి చేర్చినాను. పైసా చేతిలో లేకుండా తిరిగే నువ్వా, వేలకు వేలు పెట్టుబడి పెట్టుండే నేనూ వొకటేనంటావా బాంచెత్...” అని గర్జించాడు.

“దుడ్డుదేముండాదన్నా! కుక్కను గొట్టినా దుడ్డే రాలితింది....” అని తానూ మీసం తిప్పుతూ దేవరాజు ముందుకొచ్చాడు. “పల్లెలో వుండే నేలల్లో వచ్చే ఫలితాలు చాలవనీ, వానలు కురవలేదనీ, గిట్టుబాటు ధరలు రాలేదనీ రకరకాల సాకులతో ఆశబోతు రైతులంతా తిరపతికొచ్చేసినారు. సేద్యాలు జేసిన ట్రాక్టర్లని బాడిగలకు తిప్పుతా టౌను సోకులకు అలవాటు పడిపోయినారు. వాళ్లందురి నడమా నలిగిపోతావుండావని జెప్పిగదా నేను నీకు వద్దంటే చానాగా బేరాలు పట్టుకోనొస్తావుండాను... తెలివిగా టయింజూసి, పార్టీలను లగవుగా యిరికించుకునే దాంట్లోనే వుండేది తెలివంతా?”

రోడ్డు కవతల చెట్టూ చేమల మధ్య, వెదురు తడికలతో, వెదురు కఁరల కంచెలతో కట్టిన డాబా హోటలు వేటగాడు పక్షులకోసం పన్నిన వలలా కనబడుతోంది. యింకా జనసంచారం పుంజుకోని డాబా హోటలు కేసి ముకం చిట్లించుకుని చూస్తూ వీరమరెడ్డి రెండడుగులు వెనక్కేశాడు. అదే అదనుగా దేవరాజు వో అడుగు ముందుకేసి “నిన్న పొద్దన కిష్టానగరం మూడో యీధిలో గుంతదవ్వి, శంఖుస్థాపన జేసినారు. వచ్చేవారంలో షెడ్డేస్తారు. మళ్లొచ్చేవారంలో యింటిపని ఆరంభం జేస్తారు” అన్నాడు.

పొంగుతున్న పాలపైన నీళ్లను దిమ్మరించినట్టుగా వీరమరెడ్డి నీరసపడిపోయాడు. కలవరపడుతూ ముఖాన్ని అవతలకి తిప్పుకుని ‘మేస్త్రీ ఎవరు?’ అని అడిగాడు.

అతడి మాటలు వినబడనట్టుగా “లారీలేమీ రావాటంలేదు. గబగబా రోడ్డు క్రాస్ జేసెయ్యన్నా!” అంటూ దేవరాజు వీరమరెడ్డి కంటే ముందుగా డాబా హోటలు గుమ్మందగ్గిర కొచ్చి నిల్చున్నాడు.

రోడ్డుపైన అప్పుడప్పుడూ వెళ్తున్న వాహనాలు తప్ప మరో పొలకవేమీ లేనిచోట, డాబాహోటలు కోడి పిల్లల నెత్తుకు పోవడం కోసం నక్కినిల్చున్న గండు పిల్లిలా నిశ్శబ్దంగా వుంది. ఆరుబయట కుర్చీలనూ, టేబుళ్ళనూ సర్దుతున్న హోటలు వెయిటర్లు కొత్త యుద్ధ వ్యూహాన్నేదో పన్నుతున్నట్టుగా కనిపిస్తున్నారు.

ఆస్‌బెస్టాస్ షీట్లు పరిచిన దీర్ఘచతురస్రాకారపు షెడ్డులోపల వంటవాళ్ళూ, మేనేజర్లూ మంతనాలు చేస్తున్నారు. గోడకవతల యెర్రగడ్డలూ, కారెట్లూ, దోసకాయలూ ముక్కలుగా తరుగుతున్న ముసలి ఆడవాళ్ళు, యేర్పాట్లు మొదలు పెట్టకమునుపే అలసిపోయినట్టుగా రొప్పుతున్నారు.

రోడ్డుకు దగ్గరిలో, వెదురుకఁరల కంచె పక్కన, కుర్చీలో కూర్చున్నాక “ఆ మేస్త్రీ యెవురో చెప్పుముందు!” అని కోపంగా అడుగుతూ సిగరెట్టు వెలిగించుకున్నాడు వీరమరెడ్డి.

దేవరాజు ముసిముసిగా నవ్వి, చేయిచాపి, “లేక లేక డాబాకొచ్చుండావు. యెవురికి పార్టీ యీబోతా వుండావో అది చెప్పు” అన్నాడు.

వీరమరెడ్డి కోపంతో పళ్ళు కొరుక్కుంటూ సిగరెట్టు పెట్టెలోంచీ వొక సిగరెట్టు మాత్రం లాగి, టేబుల్‌పైకి విసిరేశాడు.

"అగ్గిపెట్టె యీకపోతే పుణ్యం మొత్తంగా రాదన్నా!" అంటూ దేవరాజు యికిలించాడు. వీరమరెడ్డి మరింతగా ముఖం ముడుచుకుని అగ్గిపెట్టెను గిరవాటేశాడు.

చీకట్లో బైపాస్ రోడ్డు కవతలున్న సవిటి కర్రలూ, ముండ్లచెట్లూ స్పష్టంగా కనపడడం లేదు. వాహనాల వెలుతురు పడినప్పుడు రోడ్డు పక్కన ప్లాట్లను కాపాడుతున్న రాతికూసాలూ, హద్దురాళ్ళూ దిగ్గున మెరిసి, అంతలో మాయమైపోతున్నాయి. దూరంగా గుడ్డిగా వెలుగుతున్న దీపాలు వుప్పరపల్లె ఆనవాలు చెబుతున్నాయి. శేషాద్రి కొండలవరకూ వ్యాపించిన చీకటిని వూరిలోని దీపాలు తరమగొడుతున్నాయి. చీకట్లో నల్లగా తయారైన శేషాద్రి కొండలపైన మెట్ల దీపాలు శంఖుచక్రాల దీపాలతో భేటీ వేస్తున్నాయి.

గాఢంగా పీల్చిన సిగరెట్టు పొగను రెండు నిముసాల తర్వాత ముక్కుల్లోంచీ జెట్ విమానంలా వదులుతూ పక్కకు తిరిగాడు దేవరాజు. వెంటనే పైకిలేచి పెద్దగా చప్పట్లు చరిచి "న్నోవ్! నిన్నే!.... నిన్నేనా.. మునిరత్నమన్నా! యిదిగో... యిక్కడ... రారా! అని గొంతుచించుకున్నాడు.

మరోసారి దేవరాజు పిలిచాక రోడ్డుపైన మోపెడ్‌లో వెళ్తున్న వ్యక్తి ఆగిపోయాడు. వెనక్కి తిరిగిచూశాక మోపెడ్ దిగాడు. యింకోసారి దేవరాజు పిలిచాక మోపెడ్ తోసుకుంటూ వెనక్కు రాసాగాడు.

"యీ పొద్దు నువ్వు నక్కతోకను తొక్కేసి వచ్చినట్టుండావన్నా! మాట్లాడతావుండంగానే వచ్చేసినాడు జూడు. ఆ మనిషే మేస్త్రీ మునిరత్నంరెడ్డి... కిష్టానగరం కొత్తింటి మేస్త్రీ!" అంటూ దేవరాజు వుత్సాహంతో కేరింతలు గొట్టాడు.

"యిప్పుడెందుకు పిలిచినావా మనిషిని? దార్లో పొయ్యేవాళ్ళకంతా పిలిచి పార్టీ యిచ్చేదానికి నేనేమీ సలివేంద్రం పెట్టుకోలేదు..." అని వీరమరెడ్డి మొరుసుకున్నాడు. అతడి ధోరణి పట్టించుకోకుండా "ఆ మనిషిని మొన్ననే మనలైన్లోకి రాదీసినాను. యిప్పుడు తెలివిగా కొంచెం పట్టుబిగించేద్దాం... నూరో యిన్నూరో ఖర్చు బెట్టేదానికి జంకితే యింటిపని వొప్పించుకునేది కుదరదు..." అని వాదించాడు దేవరాజు. ఆ తరువాత గబగబా డాబా హోటలు ముఖద్వారం దగ్గరికొచ్చి మునిరత్నంరెడ్డి భుజంపైన చేయివేశాడు.

వీరమరెడ్డి జేబులోంచీ డబ్బులు పైకితీసి, వణుకుతున్న పెదవులతో లెక్కబెట్టాడు. తరువాత నోట్లు జేబులోకి తోసేసి, నీరసంగా కుర్చీలోకి సోలిపోయాడు.

"రాన్నా! నిన్న పొద్దన నీతో చెప్పినాను జూడూ! ఆయినే యీ వీరమరెడ్డి. యీయనిది కలికిరి కాపక్క తూరుప్పల్లి. చూసేదానికా మాదిరుండాడు గానీ ఆ వూర్లో ఆయనదే పెద్ద

సేద్యం. అడిగితే కాదంటాడు గానీ యిరవయ్యి ముప్పయ్యి యెకరాలకు పైన్నే వుంటింది. అయితే అంతా చేన్లే గదా! పడతాలేస్తా సేద్యమే జేసినాడు యిన్ని దినాలూ! కొడుకు డిగ్రీ జదవతా వుండాడు. కూతురుగూడా చదవతా వుండాది. వాళ్ళకోసరమని సేద్యం యిడిసిపెట్టేసి, తిరపతి కొచ్చి కాపరం బెట్టేసినాడు. వూర్లోవుండే ట్రాక్టర్నుదెచ్చుకోని బాడిగలకు తిప్పతా వుండాడు." వచ్చి పక్క కుర్చీలో కూర్చున్నాక గూడా దేవరాజు మాట్లాడుతూనే వున్నాడు.

వేరువేరు శరీరాల భాగాల్ని చేర్చి వొకటిగా తయారు చేసినట్టు కనబడుతున్న మునిరత్నం రెడ్డి పెదవుల్ని చెవుల వరకూ సాగదీసినవ్వి, "మా యింజనీరు సారు సిమెంటురాళ్ళు తోలమని యెవురికో చెప్పినానన్నాడు" అన్నాడు.

"రేపుటినించీ మావాళ్ళ ట్రాక్టరొస్తిందని నువ్వంటే ఆ యింజనీరు కాదంటాడా చెప్పు?" దేవరాజు పెదవులు చప్పరించి, చేతులు పెద్దగా తిప్పుతూ ప్రశ్నించాడు. "నో! యీ మునిరత్నంరెడ్డి చిన్న పిల్లోడు మాదిరి గనపడతావుండాడని యేమారద్దు. యీ మనిషికి వాళ్ళ పల్లెలో యిల్లూ, గొడ్డూ గోదా, సేద్యంగీద్యం అన్నీ వుండాయి. అవి జాలదని యీ బేల్దారీ పనిలో దిగినాడు. దిగిన నాలుగైదేండ్లల్లోనే మొగలాయని పేరెత్తుకున్నాడు... యిది తొలీయిల్లే ననుకో.... యింకో రెండు మూడేండ్లయినంక జూసుకో.... పెద్ద పెద్దోళ్ళుగూడా యీ మేస్త్రీనే కావాలని పడిగాపులు పడతారు..."

మునిరత్నం పెళ్ళికొడుకులా సిగ్గుపడుతూ "నేను పోతానన్నా! తుమ్మలగుంటలో చిన్న పనుండాది" అన్నాడు.

"పోతావా? నీ పాసుగూలా! యాడికి పోతావు?" దేవరాజు తెచ్చిపెట్టుకున్న కోపంతో కసిరాడు. "ముందు ముందు నువ్వు యెన్నెన్నో యిండ్లకు మేస్త్రీ గావాల్ల.... ఆ యిండ్లకంతా మా అన్నే ట్రాక్టరుతోలాల... నువ్వట్ల గొమ్మునా గుర్చుంటే యెట్లన్నా? నువ్వే జెప్పు..."

వీరమరెడ్డి నీరసంగా ముందుకువంగి "వుండన్నా! వుండు..." అని గొణిగాడు.

"యిదో మేనేజరూ! యెవురాడ? మేమొచ్చి యెంచేపయ్యింది? యింకా యెవురూ రాలేదే?" అంటూ దేవరాజు గట్టిగా అరిచాడు.

చుట్టూ దట్టంగా దిగిన చీకటిలో డాబా హోటలు దీపాల వెలుతురు కాకి బంగారంలా తత్తళిస్తోంది. ఆస్‌బెస్టాస్ షెడ్డులోపలి స్టవ్వుముందు పొడవాటి టోపీ తగిలించుకున్న వంటవాడు రకరకాల రొట్టెలు తయారు చేస్తున్నాడు. పళ్లాలల్లో సీసాలు, తినుబండారాలూ మోసు కెళ్తున్న వెయిటర్లు కుర్చీల్లో కూర్చున్న వ్యక్తులకు తెచ్చిపెట్టుకున్న వినయంతో సమాధానాలు చెబుతున్నారు.

జారిపోతున్న పాంటును చొక్కాపైకి లాక్కుంటూ వచ్చిన మేనేజరు చిన్న పుస్తకాన్నీ బాల్‌పాయింట్ పేనా రీఫిలూనూ చేతబట్టుకుని "చెప్పండిసార్!" అని అడిగాడు.

"చెప్పన్నా? యేం తెప్పించమంటావు?" దేవరాజు తానే ఆతిథ్యమర్యాదలు మొదలు పెట్టాడు.

"యాద్దైనా వొకటేలే నాకు!" మునిరత్నం మళ్లీ సిగ్గుపడ్డాడు.

వీరమరెడ్డి కోపంతో వురిమి చూశాడు.

"మా రెడ్డన్న అట్లాగాదు. తక్కవబ్రాండును తాకడు. రాయల్‌స్టాగ్ వొకపుల్లు.... సోడాలు మూడు... తినేదానికేముండాది?...."

"చికెన్ ఫ్రై... కౌంజులు... మటను... ఫిష్..."

"మూడు కౌంజులు... అది యిప్పటికి... మల్లారా..."

వీరమరెడ్డి జేబును పట్టుకుని మౌనంగా వుండమన్నట్టుగా దేవరాజుకు సైగచేశాడు.

"మా వీరమరెడ్డన్నను అల్లాటప్పా మనిషని అనుకోవద్దన్నా! చేస్తావుండే సేద్యం యిడిచిపెట్టి, ట్రాక్టర్లు తెచ్చి యీ వూర్లో బాడిగలకు తిప్పే వాళ్ళు చానాగానే వుండారు. మా రెడ్డిని గూడా వాళ్ళగాట్లో గట్టద్దు. ఆ యీయనెట్లాంటోడో తెలియాలంటే తూరుపల్లికి పో... అక్కడ అడిగి చూడు...." దేవరాజు చెప్పుకుపోతూనే వున్నాడు.

"నోర్మూయ్యరా ముందు. యిదే మా వూర్లోగానయ్యుంటే నీకిట్లా నా పక్కన గుచ్చునే ధమ్ములున్నుండునా?" చాలా సేపటి నుంచీ అణచిపెట్టుకున్న కోపమంతా వొకసారిగా గట్లు తెచ్చుకున్నట్టుగా వీరమరెడ్డి యెగిరి దూకాడు. "చూడు మునిరత్నంరెడ్డీ! వీని భట్రాజు బుద్ధి యాడికి పోతాది? మావూర్లో వుండే బలిజోళ్లూ, జంగమోళ్ళూ, గొల్లోళ్లూ, సాకలోళ్లూ, మంగలోళ్లూ నాముందర నిలబడేదానికే వణికి చస్తారు. పుట్టి భూమ్మీదపడినప్పటినించీ గుంతలోకి పొయ్యేదాకా, పొద్దనలేచినప్పుటినించీ, రేత్రి నిద్రపొయ్యేదాకా నా మోచేతినీళ్ళు తాగే జనం, నా ముందర తలెత్తతారా? యీ వూర్లో వీళ్ళకు కొమ్ములొచ్చేసినాయి. పోతేపోనీ అని చూస్తావుంటే పేట్రేగిపోతా వుండారు. నాక్కోపం వచ్చిందంటే రెండుగా నరికి పారేస్తా తూత్తెరీ..."

వొక్కసారిగా వీరమరెడ్డి కెందుకంత కోపమొచ్చిందో అర్థంగాక పోవడంతో దేవరాజు బెంబేలు పడిపోయాడు. అంతలోనే తేరుకుని "చూస్తివా మునిరత్నమన్నా! వీరమరెడ్డి పోయిన తడవ యెలక్షన్లలో వాళ్ళూరి పంచాయితీ బోర్డుకు పోటీ గూడా జేసినాడంట. పదిరవైవోట్లలో తప్పొయ్యిందిగానీ లేకపోతే యిప్పుడు చక్రం తిప్పతా వున్నుంటాడు..."

అని సరాగమాడుతూ నవ్వబోయాడు.

ఆనాటి వోటమి గుర్తుకొచ్చినట్టుగా వీరమరెడ్డి వుగ్రరూపం దాల్చేశాడు. "చూడు మునిరత్నం రెడ్డీ యీ బట్రాజుగాని అతికారం! ఆ యీధీ యీ యీధీ తిరిగి, కొత్తగా

యింద్లెవురు కడతావుండారో తెలుసుకోనొచ్చి మాకు పోవిడిజెప్పేపని యీ మనిషిది. వూర్లల్లో వుండే కయ్యాకాలవా అమ్ముకోని వేలకు వేలు దుడ్డుబోసి ట్రాక్టర్లు బేరంజేసిందేమో మేము! మేమూ వీడూ సమానమంటాడే యీ పోసుగోలు మనిషి!....”

డాబా ముందు పెద్ద మోటరు బైకు ఆగగానే వీరమరెడ్డి అదే కోపంతో పైకిలేచి “నాయుడూ! ఇక్కడ ఇక్కడ...” అని అరిచాడు. మోటారు బైకు తాళమున్న పొడవాటి ప్లాస్టిక్ తీగను విలాసంగా వూపుకుంటూ నాయుడు దగ్గరికి రాగానే “రా విశ్వనాథమన్నా! యీ పొద్దు పార్టీ నీ కోసమని యింతవరకూ తెలవలేదు నాకు...” అంటూ జారిపోయిన వుత్సాహాన్నీ పైకితోడుకోబోయాడు దేవరాజు.

“అరరే! మేస్త్రీ మునిరత్నంరెడ్డీ! నువ్వుగూడా యిక్కడ్నే చేరినావా?” విశ్వనాథనాయుడు మునిరత్నంరెడ్డికేసి వంకరగా చూసి చిలిపినవ్వు నవ్వాడు.

వీరమరెడ్డి కోపాన్ని అణచుకోవడం కోసం మౌనంగా కూర్చుని రొప్పసాగాడు.

విశ్వనాథనాయుడు కూర్చోగానే కుర్చీ చిన్నదైపోయినట్టుగా కనబడుతోంది. పోతురాజును గుర్తుకుతెస్తున్న తెల్లటి మీసాన్ని వేలితో దువ్వుకుంటూ “కొత్తిల్లు ఆరంభం అయిందంట గదా మునిరత్నం రెడ్డీ! ట్రాక్టరెప్పుడు అంపించమంటావ్?” అని అడిగాడు.

దేవరాజు యెవరో చక్కిలిగింతలు పెడుతున్నట్టుగా కిసకిసా నవ్వి “వాళ్ళింజనీరెవురో ట్రాక్టరోడ్ని తోలినాడు. నేను వీరమరెడ్డన్న ట్రాక్టరు బేరం తెచ్చినాను. యిప్పుడు నువ్వు మూడో ట్రాక్టరోడయినావు... వొకింటికి యిన్ని ట్రాక్టర్లతో తోలాల్సినంత పనేముంటాది?” అని యెకసెక్కమాడాడు.

సమయం చూసి మాట్లాడుతున్నట్టుగా “తొండవాడ సీనరేజోళ్లకు చెప్పినాన్లే వీరమరెడ్డీ! రేపుట్నించీ చూసీ చూడనట్టు పోతారు. లేదంటే యెప్పుడైనా పదో యిరవయ్యోవాళ్ళ ముఖాన పారెయ్యి!” అన్నాడు విశ్వనాథనాయుడు. తరువాత హుందాగా నవ్వి “పాపం, కొత్తగదా! వీరమరెడ్డి ట్రాక్టర్ను వాళ్ళు రానీటం లేదు. నా చేతల్లో వుండే సహాయం చేసినాను...” అన్నాడు.

“అందుకేనా యీ పొద్దు మా రెడ్డి నీకు పార్టీయిస్తావుండేది” దేవరాజు జరిగినదంతా మరచిపోయినట్టుగా పెద్దగా నవ్వేశాడు. “అదీ నాయుడి మాటకుండే పవరు.... నాయుడి ప్రతాపం జూడాలంటే వాళ్ళూరు బోడింబాయికే పోవాల.... ఆ పక్క నేల యెప్పుడూ నీళ్ళతో పుంజుగా వుంటాది. అయితే యవసాయంలో వచ్చే వరుమానంతో నాయుడు గొమ్మునుంటాడా? తిరపతికొచ్చి కాపరంబెట్టి మూడేండ్లు దాటుంటాది. యిప్పుడు మూడు ట్రాక్టర్లు రోడ్లపైన తిరగతా వుండాయి. గుల్ల, సిమెంటు, యిసిక, యిటికరాళ్ళు – యేంగావాలన్నా మేస్త్రీలు ముందుగా విశ్వనాథనాయుడ్నే తలుచుకుంటారు. మాట జెప్పినాడంటే పొద్దన మూడో గంటకు గావాలన్నా లోడు ట్రాక్టరు ప్లాటు ముందు రెడీగా వుంటింది...”

వెయిటర్ ట్రేలో తీసుకొచ్చిన సీసాలూ, గ్లాసులూ, ప్లేట్లూ టేబులుపైన సర్దాడు.

"మొత్తం నాలుగుగ్లాసులు తెచ్చినావే! అయితే మా నాయుడు వచ్చింది చూసినా వన్నమాట!" దేవరాజు వెయిటర్ను మెచ్చుకున్నాడు.

"యెప్పుడూ నోటికే పనిపెడితే చాలదు. కొంచేపు చేతులకు గూడా పనిపెట్టు" అంటూ వీరమరెడ్డి దేవరాజును యీసడించుకున్నాడు.

అదేదో ప్రశంస అయినట్టుగా మురిసిపోతూ దేవరాజు సీసామూత తెరిచి గ్లాసుల్లోకి వంచసాగాడు.

చీకట్లోంచీ పుట్టుకొస్తున్నట్టున్న మనుషులనంతా డాబా దీపాలు దగ్గరికి లాక్కుంటున్నాయి. రోడ్డుపైన వెళ్తున్న వాహనాలు దీపాల వెలుగులో చీకటి వెంట పరిగెడుతున్నాయి. శేషాద్రికొండకింద మినుకుమినుకు మంటున్న దీపాలు మత్తులో జోగుతున్నాయి. కొండల దగ్గరి నుంచీ బైపాస్ రోడ్డు వరకూ చెరువుగా మారిన చీకటి గడ్డగట్టుకుపోయినట్టుగా కనబడుతోంది.

గ్లాసులోని ద్రవాన్ని సగం తాగిన తర్వాత, వేడిగాలిని పెదవులగుండా వదులుతూ "మా వూర్లో గుర్రాన్నీ గాడిదనూ వొకటని అనరు.... వోట్లప్పుడు నేనెంత జెప్తే అంతే! కాదంటే తలలు తెగిపోతాయి. వూర్లో యే రంపు జరిగినా పంచాయతీ బెట్టి నన్నే తీర్పు జెప్పమంటారు... ప్చ్... యీవూర్లో మట్టూ మర్యాదలేదు... యిదంతా గంగలగాడు... చిన్నంతరం పెద్దంతరం లేదు..." అని వాపోయాడు వీరమరెడ్డి.

"ఆ సంగతి యెందుకు చెప్తావులే రెడ్డీ! యిక్కడందరికీ పోగాలమే!" విసుగ్గా గ్లాసును ఖాళీ చేసేశాక విశ్వనాథనాయుడు నిట్టూర్చాడు. "మా వూర్లో నేను యీధిలో నడస్తావుంటే యిండ్లలో ముడుక్కుంటారు. కడగొట్టోళ్ళు చెప్పులేసుకోని వూర్లో కదుగుబెట్టరు.... యీవూరికొచ్చినాంక ఆ కతే మారిపోయింది.... యీ యాపారంలోకి దిగినాంక వుండేది గూడా వూడిపోయ్యింది... యిప్పుడు జరగతావుండేదంతా వాళ్ళకాలం.... మనం గుక్కిళ్ళు మింగతా వుండాం... అంతే..."

"యీ వూర్లో మాత్రం నాయుడికేమీ తక్కవలేదులే రెడ్డీ!" అధికారమంతా తనదే అయినట్టుగా దేవరాజు రంకేశాడు. "కొడుకూ కూతురూ కాలేజీల్లో చదవతావుండారు. యిట్నే కాలం జరిగిందంటే వాళ్ళిద్దరూ అమేరికాకో దేనికో పోతారు. వాళ్ళు అంపించే దుడ్డుతో నాయుడు కాలుమింద కాలేసుకోని కుర్చుంటాడు. పైగా యిప్పుడు ట్రాక్టర్లతో వచ్చేది చాలదని రియెలెస్టేటులోకి గూడా దిగుండాడు...."

మేస్త్రీ మునిరత్నంరెడ్డి ఆబగా రెండో గ్లాసును ఖాళీచేసి "బిన్నాగా పోవాలన్నా! తుమ్మల గుంటలో కొంచెం పనుండాది" అన్నాడు.

"ఆ వూర్లో మునిరత్నమన్నకు సెకండు సెటప్పుండాది. అందుకే అంత తొందర" అంటూ దేవరాజు కన్నుగీటాడు. సిగ్గుపడుతున్న మునిరత్నంరెడ్డి భుజాన్ని చరిచి "నువ్వుమాత్రం తక్కవేంగాదు లేన్నా! అగ్రారంలో భూములూ.... తిరపతిలో యిండ్లూ... వుండేది వీరులు శూరులు మాదిరి యిద్దురు కొడుకులు... అంతా లాభమే గదా నీకు? బాగా చదవాల్నేగానీ వాళ్ళిద్దుర్నీ కలెక్టర్లు జెయ్యవా నువ్వు?" అన్నాడు.

"యెందుకు జెయ్యనన్నా! మాకు బీసీ గూడా వుండాది" అన్నాడు మునిరత్నంరెడ్డి కళ్ళు వెలిగిపోతుండగా

"రెడ్లంటే వోసీనే... నువ్వెట్ల బీసీ అయితావు?" వీరమరెడ్డి పొరబాటును సహించనన్నట్టుగా హుంకరించాడు.

"మేము కొండరెడ్లులేన్నా... అందుకని..."

వీరమరెడ్డి అతణ్ణి చీమను చూసినట్టుగా చూసి "అట్ల జెప్పు! అందుకే అట్లుండావు... డాబూ దర్పంలేవు..." అని పెదవులు చప్పరించాడు.

వున్నట్టుండి కుర్చీకింద మంటేదో పుట్టినట్టుగా మునిరత్నంరెడ్డి దబ్బున పైకి లేచి "గొమ్ముగా వుండానని నన్ను చేతగాని మనిషని అనుకోవద్దు... నా పనితనం దేంట్లో జూపించమంటావో చెప్పు.... దేంట్లోగానీ యెనక్కడుగేసేది నా రగతంలోనే లేదు" అని గాండ్రించాడు. అప్పుడే నింపిన గ్లాసును వొక గుక్కలో తాగేసి, మీసాల కంటుకుని రాలుతున్న తుప్పర్లను పట్టించుకోకుండా "యిల్లు గట్టమంటావా, ఆఫీసు గట్టమంటావా, సినిమా కొటాయి గట్టమంటావా... దేనికైనా సై... అంతెందుకు? మీరంతా యింకా రెండోగలాసే... నేను మూడోది గూడా ముగించేసినా... అదీ నాదెబ్బ" అని గీపెట్టాడు.

దేవరాజు వీరమరెడ్డి వైపుకు వంగి "అప్పుడే మందుజాస్తీ అయినట్టుండాది... మనిషి కిందులు మీదుగా వుండాడు" అన్నాడు. అతడి మాటలు పట్టించుకోకుండా, కోపాన్ని అణచుకోడానికి పెదవులు కొరుక్కుంటూ "భలే మొగోడేలే నువ్వు! మా వూర్లో మందులో నన్ను మించినోడు లేడు. వొకే వొక గుక్కలో ఆరుబీర్లు తాగేసి యేమీ తాగనట్టుగా యెలబారిపోతాను" అన్నాడు.

వాళ్ళిద్దర్నీ కలయజూశాక విశ్వనాథనాయుడు పగలబడినవ్వి "వొరేయ్ దేవరాజులూ! పోయిన జాతరప్పుడు నేనెన్ని బీర్లు రా తాగింది?" అని అడిగాడు.

"అప్పుడే మర్చిపోతానాన్నా! మొత్తం తొమ్మిదిగదా!" అన్నాడు దేవరాజు పరవశంగా.

"ఆరు తాగినోడికి తొమ్మిదొకలెక్కా! అనుకోవాల్నేగానీ వూదిపారేస్తా..." వీరమరెడ్డి ముఖం కోపంతో జేవురించుకుపోయింది.

"నీవల్ల కాదు..." విశ్వనాథనాయుడు వెక్కిరిస్తున్నట్టుగా నవ్వాడు.

"తాగితే అప్పుడేం జేస్తావు? వోడిపోయినానని వొప్పుకుంటావా?..."

"వోడిపోతే గదా?..." "రేయ్... యెక్కడ్రా మేనేజరు..."

వీరమరెడ్డి పెట్టిన గావుకేకకు డాబా హోటలు మొత్తం వులిక్కిపడింది. షెడ్డులోపల రొట్టెలుకాలుస్తున్న వంటమనిషి తిరిగి చూశాడు. చుట్టూ కుర్చీల్లో కూర్చున్న వాళ్ళు వెనుదిరిగి చూసి నవ్వసాగారు.

జారిపోతున్న పాంటును పైకి లాక్కుంటూ, డాబా హోటల్లోంచీ పుడుతున్న శబ్దాలకంతా కేంద్రంలా నిల్చున్న వీరమరెడ్డి దగ్గరికొచ్చాడు మేనేజరు.

"చెప్పునాయుడూ! యెన్ని బీర్లు తాగమంటావో చెప్పు..." రౌద్రంతో జబ్బచరుస్తూ అడిగాడు వీరమరెడ్డి.

"నన్నెన్ని తాగమంటావో నువ్వే చెప్పు... నీకంటే వొకటి జాస్తీగా తాగకపోతే అప్పుడడుగు..." విశ్వనాథనాయుడు రోషంతో మీసం మెలేశాడు.

యిద్దర్నీ వెక్కిరిస్తున్నట్టుగా నవ్వి "తాగే మొగోళ్లేలే! అయితే ముందుగా దుడ్డెవురు బెట్టుకుంటారో అది తేల్చండి" అన్నాడు మునిరత్నంరెడ్డి.

"యెవురు వోడిపోతే వాళ్లే భరాయించాల..." వీరమరెడ్డి మాటలు రాళ్ళలా దొర్లాయి.

"అట్లయితే నువ్వే పెట్టుకోవల్సి వస్తాది" నాయుడు వెనక్కు తగ్గలేదు.

"అయితే యిద్దురూ దుడ్డు నా చేతికియ్యండి... యెవురు గెలిస్తే వాళ్ళకిస్తాను..." మునిరత్నంరెడ్డి మధ్యవర్తిపాత్రలోకి పూర్తిగా దిగేశాడు.

వీరమరెడ్డి జేబులోంచీ నోట్లు తీసి, లెక్కబెట్టి "మొత్తం యెనిమిది నూర్లు" అంటూ టేబులుపైన పడేశాడు. విశ్వనాథనాయుడు జేబులోని డబ్బులు రెండుసార్లు లెక్కబెట్టి, ముందుకు విసురుతూ "యేడునూర్లు" అన్నాడు. దేవరాజు నోట్లన్నింటినీ కళ్ళకు అద్దుకుని మునిరత్నంరెడ్డి కందించాడు.

మునిరత్నంరెడ్డి నోటితో లెక్కలు గట్టి "యిప్పుడు తాగిందానికే ఆరునూర్లయ్యుంటాది. మిగిలిందాంతో యెన్ని బీర్లొస్తాయి?" అని దబాయించాడు. కావల్సిన సమాచారమందినట్టుగా మేనేజరు వెళ్ళిపోయాడు.

వీరమరెడ్డి కాలుపైన కాలేసుకుని అదే పనయినట్టుగా మీసం తిప్పసాగాడు. విశ్వనాథనాయుడు కాళ్ళు బార్లాజాపుకుని, కవ్విస్తున్నట్టుగా తొడలపైన చరచసాగాడు. సీసాలో

మిగిలిన ద్రవాన్ని తన గ్లాసులో వంచుకున్నాక "యీ పొద్దు యెవరు గెలస్తారో వాళ్ళకే ట్రాక్టర్ల పనిస్తాను" అని రెట్టించాడు మునిరత్నంరెడ్డి.

వొకరివెంట వొకరు వచ్చిన వెయిటర్లు టేబులుపైన రెండు వరసల్లో పది బీరు సీసాలు నిలబెట్టారు. వెయిటరు చేతిలోంచీ వోపనర్ లాక్కుని, మూత గాలిలో కెగిరిపడేలా తెరిచి, సీసాను పైకెత్తి, గుటగుటా తాగేశాడు వీరమరెడ్డి. ఖాళీ సీసాను టేబులపైన శబ్దమొచ్చేలా పెట్టి యిపుడేమంటావన్నట్టుగా తొడ చరిచాడు. విశ్వనాథనాయుడు మరో సీసాను పైకెత్తి, పెదవుల చివర్లలోంచీ ద్రవం చిందుతోండగా వొక గుక్కలో తాగేశాడు.

"సగం బీరుకిందనే పొయ్యింది. తాగితే చుక్కకింద పడగూడదు" అని దబాయిస్తూ వీరమరెడ్డి రెండో సీసాను పైకెత్తి పెదవులకు కరచుకుని, అయిదు నిముషాలదాకా కిందికి దించకుండా వుండిపోయాడు.

"వొగ సీసాయితాగేదానికి అంతసేపా? అట్లతాగేది నా మీసానికే అవమానం" అని కవ్విస్తూ విశ్వనాథనాయుడు రెండో సీసాను మూడు నిముషాల్లోనే ముగించేశాడు.

వీరమరెడ్డి వణుకుతున్న చేతుల్తో మూడో సీసా మూతను తెరిచి, రెండు గుక్కలు తాగాడు. తరువాత సిగరెట్టు వెలిగించుకుని మరో రెండు గుక్కలు మింగాడు.

మూడో సీసా మూత తెరుస్తూ "యిప్పటికి గూడా మా వూరికొస్తే యెమ్మెల్యే మా యింట్లోనే దిగతాడు. నేనెంత జెప్తే అంతే!" అని రౌద్రంతో తలాడించాడు విశ్వనాథనాయుడు.

తాగుతున్న సీసాను కిందికి దించి "వొకసారి తూరుప్పల్లి కొచ్చి అడుగు... యెలక్షన్లప్పుడు మాయింటిముందరెన్ని పొట్టేళ్లు తెగిపడ్తాయో! కొండల్లో గాంచిన నాటుమందు రుచెప్పుడైనా జూసినావా నువ్వు?" వీరమరెడ్డి పెద్దగా చేతులూపాడు.

"అసలే విస్కీ తాగుండారు. దానిపైన మూడు బీర్లయిపొయినాయి. యీ పొద్దుకు చాల్లేన్నా..." అంటూ దేవరాజు బ్రతిమాలాడు.

"మేము మిగిలిస్తే నువ్వు తాగేయాలనా? చూడు పల్లెరెడ్డీ! యీ బట్రాజుగాడు పలాతన... యేమారితే మొత్తం వారేస్తాడు..." వీరమరెడ్డి బుసలుగొడుతున్నాడు.

మునిరత్నంరెడ్డి యెందుకో మళ్ళీ సిగ్గుపడుతున్నాడు.

నాలుగో సీసా మొదలు బెడుతూండగా పెద్దగా వెక్కిళ్ళు రావడంతో విశ్వనాథనాయుడు తబ్బిబ్బయిపోయాడు. వీరమరెడ్డి వెక్కసంగా నవ్వి "నాతో పెట్టుకుంటే అంతే!" అని పేట్రేగుతూ మరో రెండు గుక్కలు పీల్చాడు. యింతలో పెద్ద త్రేన్పుతన్నుకు రావడంతో వుక్కిరిబిక్కిరయిపోయాడు. పైకి లేచి, పడుతూ లేస్తూ షెడ్డు కవతలికి వెళ్ళి "రేయ్! టాయిలెట్టు యెక్కడ్రా" అని ఘోషించాడు. వీరమరెడ్డి తిరిగిరాగానే విశ్వనాథనాయుడు షెడ్డుకవతలికి పరిగెత్తాడు.

విశ్వనాథనాయుడు తిరిగొచ్చేసరికి కాళ్ళు బార్లా జాపుకుని తలను భుజంపైన వేలాడేసుకుని కూర్చున్న వీరమరెడ్డి "మా తూరుపల్లి రెడ్లంటే అడల్... దెబ్బకు దెబ్బ.. కాస్కో..." అని గొణుగుతున్నాడు.

"మా బోడింబాయి అనిమిని నాయుళ్ళను గురించి విచారించు... అప్పుడు తెలిస్తుంది మా జోరు... కానీ... నువ్వో... నేనో..." విశ్వనాథనాయుడు నాలుకను మడచిపెట్టి కొరుకుతూ వీరంగం తొక్కబోయాడు.

వీరమరెడ్డి వాలిపోతున్న కనురెప్పల్ని బలవంతంగా పైకెత్తి "యింకో రెండు బీర్లు దెప్పించుకావాలంటే... తెప్పించు..." అని అరిచాడు.

వెయిటరొకడు పరిగెత్తుకొచ్చి "కొంచెం మెల్లింగాన్నా... ఆ పక్కనుండే వాళ్ళకు యిబ్బందిగా వుండాదంట!" అని గునిశాడు.

"యెవుడ్రా యెవుడికిరా నేను యిబ్బందిగా వుండేది?" అంటూ వీరమరెడ్డి పైకి లేచి గణాచారిలా వూగిపోసాగాడు.

మేనేజరు పరిగెత్తుకొచ్చి "అదేంలేదులేన్నా! మీరు కూర్చోండి" అని చేతులు పట్టుకున్నాడు.

"అయితే రెండు బీర్లు అంపిస్తావా లేదా చెప్పు" వీరమరెడ్డి అతడితో బేరాలు మొదలుపెట్టాడు.... అతడ్ని వదలించుకుని పారిపోతున్న మేనేజరు వెనక పరిగెత్తి "బిల్లెంతయిందో చూడు... దుడ్డు మిగిలితే మళ్లా గావాల్సుంటే బీర్లు తెద్దువుగానీ!" అని మొత్తుకున్నాడు దేవరాజు. దీపం కింద నిలబడి లెక్కలేస్తున్న మేనేజరు భుజాలపైన్నుంచీ తొంగిచూసి "అప్పుడే పదిహేనుదాంకా అయుండాది. యింక మమ్మల్నందర్నీ తిప్పించీ మర్లించీ గొట్టినా రెండు మూడు నూర్లకంటే జాస్తీగా వుండదు..." అని గీపెట్టాడు.

దేవరాజు తిరిగొచ్చేసరికి కుర్చీలో కూర్చున్న వీరమరెడ్డి నోట్లోంచీ చొంగలు కారుతున్నాయి. అటువైపు కుర్చీలో చేరగిలబడిన విశ్వనాథనాయుడు త్రేన్పులు ఆపుకునే ప్రయత్నంలో అనవసరంగా నవ్వుకుంటున్నాడు. ఖాళీ అయిన విస్కీసీసాలోకి మండుతున్న అగ్గిపుల్లను విసిరేస్తూ మునిరత్నంనాయుడు ఆడుకుంటున్నాడు. బిల్లుతోబాటూ పరిగెత్తుకొచ్చిన మేనేజరు "దుడ్డిచ్చేసిపోండన్నా!" అని వేడుకున్నాడు. మునిరత్నంరెడ్డి జేబులోంచీ తానే డబ్బును తీసి, లెక్కబెట్టి మేనేజరుకిచ్చాక "నీ టిప్పు పది తీసుకోని మిగిలిన ముప్పయి యిట్ల పారెయ్యి..." అన్నాడు దేవరాజు.

మునిరత్నంరెడ్డి పైకిలేచి, అరిచేతుల్తో ముఖం రుద్దుకున్నాడు. "నేను పోవాల..." అని గొణుగుతూ డాబా హోటలు బయటికి నడచాడు. మేనేజరు దగ్గరి నుంచీ చిల్లర తీసుకున్నాక "వుండుండు మేస్త్రీ! వీళ్ళిద్దర్నీ యిల్లు జేర్చేదానికి నా వొక్కని వల్లేమయితింది?" అని అరుస్తూ దేవరాజు బయటకు పరిగెత్తాడు. అప్పటికే మునిరత్నంరెడ్డి మోపెడు చీకట్లోకి దీపపుకాంతిని గుచ్చుతూ పారిపోతోంది.

రోడ్డుపక్కన పారేసిన పాత రాతి విగ్రహంలా దేవరాజు డాబా హోటలు ముందు నివ్వెరపోయి నిల్చున్నాడు.

శేషాద్రి కొండలపైన వెలుగుతున్న మెట్ల దీపాలవరస కూడా మత్తులో వున్నట్టుగా వంకరటింకరగా సాగుతోంది. గుంపులు గుంపులుగా వున్న నక్షత్రాలు ఆకాశంలో డాబా హోటలేదో వున్నట్టుగా భ్రమింపజేస్తున్నాయి.

తన వెనక ధభీమని పెద్ద వస్తువేదో పడినట్టుగా శబ్దం రాగానే దేవరాజు వులిక్కిపడి తిరిగిచూశాడు. కిందపడిన మోటారుబైకు పక్కన నేలకు అతక్కున్నట్టుగా వున్న తలతో విశ్వనాథనాయుడు కుప్పలా కూలబడివున్నాడు. దేవరాజు పెద్దగా నిట్టూర్చాక లోపలినుంచీ సోడా నీళ్ళు తీసుకొచ్చి అతడి ముఖంపైకి చిమటాలా విసిరికొట్టాడు. మరో రెండుసార్లు సోడానీళ్ళు చిమ్మాకగానీ విశ్వనాథనాయుడు కళ్ళు తెరవలేదు. యీసారి దేవరాజు చెంబుడునీళ్ళు తీసుకొచ్చి అతడి తలపైన దిమ్మరించాడు.

విశ్వనాథనాయుడు యింకా కలగంటున్నవాడిలా తలతిప్పి “నేను ఆరు... నువ్వెన్ని?... యెవురు గెలిచింది?... నువ్వా? నేనా?” అంటూ దేవరాజు చొక్కాపట్టుకున్నాడు.

“అన్నా! నేను దేవరాజు... వీరమరెడ్డిగాదు...” అంటూ దేవరాజు గింజుకున్నాడు.

“యెవుడైతే నాకేంది.... గెలిచిందెవురు? చెప్పు”

“మనం యిప్పుడు హోటలు బయిటికొచ్చేసినామన్నా!...” యిప్పుడు మనం యింటికి పోవాల... పద... యింట్లో మీ ఆడోళ్ళు యెదురుచూస్తావుంటారు... పదపోదాం...”

బలవంతంగా పైకి లేవబోయిన విశ్వనాథనాయుడు అంతలోనే నిస్సారంగా కుప్పకూలి “యింటికా... యిల్లు... యిల్లు” అని పలవరించాడు. తరువాత జేబులో చేయిపెట్టి “నాదుడ్డు... దుడ్డేద?” అని ఘోషించాడు.

“బండిని నువ్విప్పుడు తోల్లేవు.... ఆటోను పిలుస్తానుండు. యింటికి పోదువు” మాట్లాడుతూనే దేవరాజు దూరంగా నిల్చున్న ఆటోను చేయెత్తి పిలిచాడు.

“యింటికాడ... యింటికాడ...” వినరాని మాటేదో విన్నట్టుగా విశ్వనాథనాయుడు పలవరించసాగాడు. “అయితే నీకిల్లనేది వొగటుంటాదనీ, అక్కడ పెండ్లాంబిడ్డలు కాపెట్టుకోనుంటారనీ యింతవరకూ మర్చేపొయినావాయేంది? పద... పద...” దేవరాజు కళ్ళు చిట్లించుకుని విసుగ్గా కసిరాడు.

“రేయి యిల్లు... యిల్లు... రేయ్... నా ఆరునూర్లు... రేపు ట్రాక్టరు డీజలు... గ్యాసు సిలెండరు.... తండల్ వడ్డీ... మూడువేలు... బాంకీలోను... రెండువేలు... రేయ్... నా ఆరునూర్లు...” నేలపైన కాళ్ళు జాపుకుని, పిడికెళ్ళతో మట్టిని పైకి విసురుతూ విశ్వనాథ నాయుడు అల్లరిపిల్లాడిలా యేడవసాగాడు.

"దుడ్డు దేముండాదిలేన్నా! రేపు నువ్వే సంపాయిస్తావు... పద... ముందు ఆటో యెక్కు.. యింటికిపోదారి..." అంటూ దేవరాజు విశ్వనాథనాయుడి చేతుల కింద తన చేతులు దూర్చి బలమంతా వుగ్గబట్టి పైకెత్తాడు. ఆటో డ్రైవరు అతణ్ణలాగే పట్టుకుని ఆటోలోపలికి చేరవేశాడు.

"చెర్లోపల్లె... రోడ్డు పక్కన్నే యిల్లు.... పేరు విశ్వనాథనాయుడు... రోడ్డులో యెవుర్నడిగినా చెప్తారు... భద్రంగా యిల్లు జేర్చు...." అంటూ దేవరాజు జాగ్రత్తలు చెప్పాడు.

"చార్జీ డెబ్బయ్యయిదు..." అన్నాడు ఆటోడ్రైవరు.

"యెంతో వొకంత... వాళ్ళింట్లోనే యిస్తారు... యింక బయిల్దేరు..."

విశ్వనాథనాయుడు త్రేన్పులూ వెక్కిళ్ళూ తన్నుకొస్తుండగా "నా ఆరునూర్లు... రేయ్..." అంటూ యేడ్చేశాడు.

తూలుతున్న మనుషులు తనను తోసుకుంటూ రోడ్డుపైకి వెళ్ళేవరకూ దేవరాజు ఆటో వెళ్ళిన వైపే చూస్తూ వుండిపోయాడు. తరువాత నిట్టూరుస్తూ డాబా హోటల్లోకి తిరిగొచ్చాడు.

ఖాళీసీసాలతో, చిందరవందరైన తట్టలతో కళ్ళంలా తయారైన టేబులుపైన తలపెట్టుకుని వీరమరెడ్డి గురకపెడుతున్నాడు.

"మీరు బిన్నాగా సీట్లు ఖాళీ జెయ్యాలసార్. టయిమయిపోతా వుండాది." అంటూ మేనేజరు వేడుకున్నాడు.

దేవరాజు కూజానీళ్ళను వీరమరెడ్డి తలపైన కుమ్మరించాడు. వెంటనే అతను నీళ్ళల్లో తడిసిన కుక్కపిల్లలా తలను విదిలించసాగాడు. సీసాలో మిగిలిన సోడా నీళ్ళను దూరం నుంచీ అతడి ముఖంపైకి చిమ్మాడు దేవరాజు.

వీరమరెడ్డి సగం కళ్లుతెరిచి "యెవుడ్రా?... బీరు... యెక్కడ్రా?" అని గొణిగాడు.

దేవరాజు అతడి చెవి దగ్గరికి వంగి "ఆ నాయుడు అంతా డంబాచారం.... లోపలంతా డొల్లే.... ఆరునూర్ల కోసరం ఆడది మాదిరిగా యేడ్చేసిపొయినాడు" అన్నాడు. వీరమరెడ్డి కదల్లేదు. మరింతగా అతడి చెవి దగ్గరికి వంగి "అన్నా! పైకిలెయ్యి! యింటికి పోదాం పద... యిల్లు... నీ పెండ్లామూ, బిడ్డలూ కాసుకోని చూస్తావుంటారు..." అని అరిచాడు.

తలపైకి జలపాతమేదో పడినట్టుగా వీరమరెడ్డి వులిక్కిపడి కళ్ళు తెరిచాడు. రకరకాలుగా వంకర్లు తిరుగుతున్న పెదవులతో "యిల్లు... యిల్లు.... పెద్దమ్మి... చిన్నోడు" అని కలవరించసాగాడు.

"అదేన్నా... వాళ్ళంతా నీకోసరం కాపెట్టుకోనుంటారు... పోదాం పద... అర్ధరాత్రయిపొయ్యింది"

తెలిసీ తెలియని అపస్మారక స్థితిలో వీరమరెడ్డి జేబులోకి చేయి పెట్టాడు. ఖాళీ చేతుల్ని పైకితీసి వుఫ్‌మని పెద్దగా గాలివూది, దీనంగా ముఖం పెట్టాడు.

"నీ భార్యా... బిడ్డలూ... యిల్లు... పోదాం పద..."

"పెద్దమ్మి కాలేజీ ఫీజురా... చిన్నోడు... పరీక్షఫీజు... యింటి బాడిగ... శెట్టంగిడి బాకీ.... తండల్ వడ్డీ" మాట్లాడుతూ మాట్లాడుతూనే వీరమరెడ్డి వెక్కిళ్ళు పెట్టసాగాడు.

అతణ్ణి విసుగ్గా చూసి, కిసుక్కుమని నవ్వేసి "పార్టీయిచ్చింది, సెలవుజేసింది నువ్వే గదా! ఆ విశ్వనాథనాయుడు గూడా దుడ్డో అని యేడస్తానే యింటికి పొయినాడు. నువ్వా తలకిందులై యేడస్తావుండావు... చేసిన నిర్వాకం చాల్లేగానీ పోదాం పద!" అని మందలించాడు.

"నాతో యెవురు పోటీ కొచ్చినా అంతే! యేడ్చే కావాల్ల... అదీ నా దెబ్బ!" అని గాలిలోకి పిడిగుద్దులు విసురుతూ వీరమరెడ్డి బోరుమని యేడవసాగాడు.

✡

# గూడు శెదిరిన గువ్వ

**–టి. ఆర్. శ్రీనివాసప్రసాద్**

పైటాల పొద్దాయె.

తమాటా తోటలా పాదులు శేస్తా ఉండిన బక్కిరెడ్డి ఆపని ముగించి, శెనక పక్కలా యేసి పెండ్లాము వస్తుండాదో లేదోనని ఊరినింకా వచ్చే కాలిదావ పక్క చూసినాడు. కానీ శాంతమ్మ జాడ కనిపించలేదు.

'ఇదొగటి, పైని గేరి నింకా కిందిగేరి కొచ్చేతలికి నూరుమందితావ మట్లాడుకోని వస్తుంది. తీరా ఈడికొచ్చేతలికి మాపుసారయితుంది' పెండ్లాన్ని తిట్టుకొంటా కిసాయి నింకా పొగాకుని ఎత్తుకోని, పక్కలా వుండే కానుగుమాను నీడలా కూకొని, పొగాకుని పాయలు పాయలుగా చేస్తా వుండాడు.

'ఏమప్పా గౌడా, పొద్దిన్నే ఎవుర్నో తిట్టుకొంటా ఉన్నెట్టుండావు. నన్నేనా' దగ్గర్లా తెలిసిన గొంతు యినిబిచ్చే తలికి తలతిప్పి పక్కకు చూసినాడు బక్కిరెడ్డి, ఎబుడొచ్చెనో, నగతా కానుగుమాను తాకి వస్తా వుండాడు ఖాదర్.

'ఓ ఖాదరన్నా, ఎంచేపాయ నువ్వొచ్చి. నేను సూడనేలే, బెంగుళూర్లా శిన్నోళ్లందురూ బాగుండారా?' పొగాకు పాయను ఖాదర్‌కు ఇస్తా పలకరించినాడు బక్కిరెడ్డి.

ఖాదర్, బక్కిరెడ్డికి శిన్నబుడునింకా స్నేహితుడు. ఇద్దురిదీ ఒగే ఊరు. ఆర్నెల్లబుడు తమిళనాడు ప్రభుత్వము వీళ్లుండే ప్రాంతాన్ని 'సెజ్'గా ప్రకటించె. దాన్తో శాద్యము నేలలకు విపరీతమైన వెలలు పెరిగె. అబుడు బక్కిరెడ్డి తోట పక్కలా వుండే తన రొండెకరాల నేలను అమ్ముకొని బెంగుళూరుకు కాపురం యెల్లిడిశె ఖాదరు. బెంగుళూర్లా ఖాదరు కొడుకులు టెంపోలు కొనుక్కోని అవిటిని నడుపుకొంటా జీవనము సాగిస్తా వుండారు. ఖాదరు, కొడుకుల జతలా ఆపనీ ఈపనీ శేసుకోని ఉండిపోయె. ఎబుడన్నా ఊరుమింద గ్యానం వచ్చినబుడు ఇట్ల వచ్చిపోతుంటాడు.

జతగాళ్లిద్దురూ మంచీ శెడ్డా మాట్లాడుకొంటా వుండంగానే, మక్కరిలా సద్ది ఎత్తుకోని శాంతమ్మ వచ్చింది. 'ఇగో ఇంగమీట ఆయింట్లా మీ అమ్మనన్నా వుండమను లేదంటే నన్ను

వుండమను. మేమిద్దురూ ఒగే దూలం కింద కలిసుండేది కలవరములా మాట. కడసీ తూరి శెప్తా వుండాను' అత్తమింద కోపాన్ని మక్కరిమింద సూపించి, దాన్ని యిసురుగా దించతా అనింది శాంతమ్మ.

పెండ్లాము కోపము గురించి తెలిసిన బక్కిరెడ్డి ఏమీ మాట్లాడలేదు. మొగుడు బదులు శెప్పక పోయే తలికి, శాంతమ్మకి ఇంగ రవుంచి కోపము జాస్తి ఆయె. ఖాదర్ పక్క తిరిగి, 'ఇదుగో ఖాదరన్నా, న్యాయం నువ్వే శెప్పు, ఇన్నేండ్లుగా ఈ నేల కోసరము రెయ్యీ పగులూ కష్టం పడింది ఎవురు, మేము కాదా? ఇబుడు నేలలు వెలలు జాస్తి అయిందని పేటలో ఆరాముగా కూకోనుండే వీళ్ల అక్కలకు కూడా నేల్లో బాగమియ్యాల్నంట, అట్ల యియ్యకాపోతే గాస్తులను పిలిపించి, వీళ్లమ్మ పంచాయితీ పెట్టిస్తుందంట. అట్లే శెయినీ, ఎవుని పక్క న్యాయముందో ఈ నేల తల్లికి తెలుసు, ఆ గుళ్లో వుండే బసవేశ్వరునికి తెలుసు' బుసు కొట్టుకోని శెప్పె శాంతమ్మ.

'ఆయె, మొదులు బోజనము పెట్టు. పాపము ఖాదరు ఎబుడు తినెనో ఏమో' అన్నాడు బక్కిరెడ్డి మాట మార్శేకి యత్నము శేస్తా. రవుంచి సేపుకి శాంతమ్మ నిదానించి, బోజనము పెట్టింది.

వుర్లగడ్డల పల్యము నంజుకోని, వులవుల శారులో వుడుకు ఆరని సంగటిని అద్దుకోని తింటా వుండారు బక్కిరెడ్డి, ఖాదరు.

'ఎట్లనో ఖాదరన్న తప్పించుకొనె. మంచి వెలకి నేల అమ్ముకోని, ఇబుడు బెంగుళూర్లా బైస్కోపులు సూసుకొంటా ఆరాముగా వుండాడు' ఆకులా అన్నము పెడతా అనె శాంతమ్మ.

'యా ఆరాము శాంతమ్మా, మా ఆరాము ఆ అల్లాకే తెలుసును. నేలలు అమ్ముకొని బెంగుళూరు శేరితిమి. ఈడ నేల అమ్మిన దుడ్లుకు బెంగుళూర్లా ఏమి కొనేకి అయితింది. ఆ దుడ్డుకు ఇంగ రవుంచి అప్పుశేసి టెంపోలు కొనిరి నా కొడుకులు. శేతిలా నాలుక్కాసులు ఆడతా వుండె కదా, పని శేసేది యిడిసిపెట్టి, ఆడ కూకొని ఈడ కూకొని కాలం తోసేస్తా వుండిరి. కూకొని తింటే అయితుందా, అప్పు తెచ్చిన దుడ్లుకి వడ్డి కూడా కట్టేకి కాలేదు. అప్పులోళ్లు వొచ్చి టెంపోలు ఎత్తుకోని పొయిరి. ఈడ నేలలూ పోయె, ఆడ టెంపోలూ పోయె. కడసీకి ఇబుడు ఆటో డ్రైవర్లుగా పని శేస్తా వుండారు. ఇదీ మా ఆరాము' ఉసూరు మంటా అనె ఖాదరు.

మాపుసారి కంటా ఆమాటా ఈమాటా శెప్పుకోని, ఆమీటకు బెంగుళూరుకు యెల్లిడిసె ఖాదరు. శేనుతావ పన్లు ముగించుకొని బక్కిరెడ్డి ఇల్లు శేరేతబుటికి, పొద్దు దేవర ఇల్లు శేరి శానా పొద్దాయె. ఇంటి జగిలిపైన బావ కోసరము కాసుకోని కూకోనుండాడు బక్కిరెడ్డి బామర్ది నారాయణ.

'నిన్ని సూసేకి తోట తావుకే వస్తామని అనుకొంటా వుంటి. మీ బావొచ్చే పొద్దాయె, ఈడనే కూకోమని అత్తమ్మ శెప్పె. ఇగో ఇంతలోనే నువ్వు వచ్చిస్తివి.' నగనగతా అనె నారాయణ.

'ఆవులకి కసువు యేసి వస్తానుండు నారాయణా' అంటా ఆవులింటి తావకి పోయె బక్కిరెడ్డి. నారాయణ జగిలిపై నింకా లేశి బావ యెనకనే వచ్చి, 'ఏం బావా నేను శెప్పిన మాటను ఏంజేస్తివి, ఏమైనా యోశన శేసిండావా, లేదా' అని అడిగె బక్కిరెడ్డిని. బక్కిరెడ్డి ఏమీ శెప్పకుండా కలకుండా ఉండిపోయె.

నారాయణ ఈ నడుమ నేలలు అమ్మేవాళ్లకి కొనేవాళ్లకి నడాన దళారీపని శేస్తా వుండాడు. ఇబుడూ అదే పనిమింద బక్కిరెడ్డి తావుకి వచ్చిండాడు.

'ఇంగా ఎంతకాలము ఈ నేలని పట్టుకోని యేలాడతావు బావా, వెల వచ్చినబుడే సూసి అమ్ముకోవాల. ఈడ ఒగ ఏకరా అమ్మిన దుడ్లుతో మా వూరి తావ నాలుగేకరాలు కొనొచ్చు. నువ్వు ఊఁ అను, ఆ మీటకి అంతా నేను సూసుకొంటాను' తిరగా అనె నారాయణ.

'కానీరా, ఇబుడే కదా వచ్చిండావు, మొదులు బోజనము శేస్తువు పదా, అన్నెంక మాట్లాడుదాము' అంటా ఇంటి పక్క అజ్జుపెట్టె బక్కిరెడ్డి.

ఆ ప్రాంతాన్నంతా 'సెజ్'గా గౌరుమెంటు ప్రకటించినబుడు నింకా బక్కిరెడ్డి మనసు మనసులో లేదు. ఆ పొద్దునింకా ఆయప్పకి సరిగ్గా బోజనము తినేకి, సరిగ్గా నిద్రపొయ్యేకి కాలేదు. బామర్ది జతలా బోజనానికి కూకున్నాడే కానీ ముద్ద దిగితే కదా. ఏమో అట్ల తిని, శెయ్యి కడిగి రచ్చతావుకి నడిశె బక్కిరెడ్డి. అబుటికే రచ్చతావ మాడీ ఇంటి మునసామి, నాగేంద్రప్ప, గోపాలరెడ్డి, రామన్న ఇట్లా కొందరు కూకోని మాట్లాడుకోనుండారు. బక్కిరెడ్డీ పోయి వాళ్ల జతలా కూకొనె. రవుంచేపుకే వాళ్ల మాటల్లా సెజ్జు గురించి వచ్చె.

'నాకు మాత్రము సెజ్జు వచ్చేది మంచిదే అనిపిస్తా వుంది రామన్నా, నేలలకంతా అంతో ఇంతో వెలలు వచ్చినట్లాయె. కంపెనీలు పెట్టిన మీటకి వాటిల్లా మనకు ఇంటికి ఒగరికి వుజ్జోగము ఇస్తారంట. ఇన్ని దినాలూ మనము ఎండలో వానలో కష్టపడి మిగిలిండేది ఏమి శెప్పు. ఈ సెజ్జు పుణ్యమా అని ఇంగమీట అందరూ ఆరాముగా వుండొచ్చు' అనె నాగేంద్రప్ప.

ఆ మాటల్నింటా తడశేకి కాలేదు బక్కిరెడ్డికి. 'ఏందిరా నువ్వు మాట్లాడేది. నువ్వు కాపోళ్ల ఇంట్లా పుట్టినోనివేనా, ముప్పయేండ్లకి ముందర ఓసూరు పక్కలా ఇదే మాదిరిగా నేలలు కొని గౌరుమెంటోళ్లు సిప్‌కాటు శేసి, కంపినీలకి ఇచ్చిరి కదా. ఆడంతా ఏమాయె? ఆ నేలల్ని అమ్మిన ఒగ రైతన్నా వుద్దారమాయెనా? ఆ కంపెనీల్లా ఆ వూరోళ్లకి వుజ్జోగాలు శిక్కిపోయెనా? అట్లా శిక్కిండే ఒగటి రొండు వుజ్జోగాలు ఎట్లావి, కాపీలు టీలు మోసేవి, శెత్తలు వూడ్సేవి, దొడ్లు కడిగేవి, ఇట్లావి తానే. యాడనింకానో వచ్చిన జనాలు అంగళ్లు పెట్టుకొని, ఓటళ్లు పెట్టుకొని బాగుపడిరి. పుట్టి పెరిగిన వూర్లా ఓటళ్లు పెట్టి బోజనము

అమ్మేకి ఒక రైతు శేతలా అయితుందా? కడసీకి ఆ పల్లెల్లా వాళ్లంతా గూడు శెదిరిన గువ్వల మాదిరిగా బెంగుళూరు శేరి సన్న సన్న కూలి పనులు శేసి బతకతా వుండారు. నా మాట నిజిమా తవళా అనేది మూకండపల్లి నింకా పేరండపల్లి కంటా పొయ్యి ఇలావరి శేసుకోని రాపో. ఆ పల్లెల్లా బాగుపడింది నూటికి ఇద్దరు ముగ్గురు. మిచ్చమందురూ అకలాయముగా పాడైపొయిరి. రేపు మన్నాడు ఈడ సెజ్జు వచ్చినా జరిగేది ఇదే. ఇంట్లా పీనిగపడితే పూడ్సి పెట్టేకి కూడా జాగా వుండేలేదు. మా కత యిడిశిపెట్టు, రేపు బతకాల్సినోనివి నువ్వు. అది మాత్రం మర్శిపోవద్దు' విసురుగా లేశి నిలబడి అనె బక్కిరెడ్డి.

'నువ్వు కూకో బక్కిరెడ్డన్నా, వోడు శిన్నోడు, బుద్ధి లేక ఏమేమో మాట్లాడతాడు. అయినా గౌరుమెంటోళ్లని ఎదిరిచ్చి ఏమి శేసేకి అయితింది శెప్పు' బక్కిరెడ్డిని సుదారిస్తా అనె రామన్న.

'లేదులే రామన్నా, పొద్దిన్నే మసలకే లేశి తమాటా తోటకు నీళ్లు కట్టాల, నేను పోతాను' అంటా ఇంటిదావ పట్టిన బక్కిరెడ్డి, రవంచదూరం నడిశినంక నిలిశి యెనిక్కి తిరిగి చూశె.

రచ్చపైనుండే రాగిమాను ఆకుల సందుల నింకా యెండ్లెలుగు జనాలమింద పడతా వుంది. మాపుసారి కంటా గెనాలమీద పచ్చి కసువును మేసిన ఆవులు రెండు రచ్చపక్కలా పనుకోని అరగన్నుతో నెమరేస్తా వుండాయి. 'ఈ కితా సంకురాత్రికి కుచ్చుల పండగ పెద్దగా శెయ్యాలప్పా మనూర్లా' ఎవురో అంటా వుండారు. రామన్న యావుదో శెప్తాంటే, అందరూ పెద్దగా నగతా వుండారు. వాళ్ల నగవులకి రాగిమాను పైనుండే గూళ్లల్లోని గువ్వలు వులిక్కిపడి, రెక్కలు టపటప కొట్టుకొని, సర్దుకొని ముడుక్కొంటా వుండాయి.

'ఇంగ కొన్నాళ్ళు అయినంక ఈడ కూకొనే దానికి మానులూ వుండేలే, కూసేకి గువ్వలూ వుండేలే, మాట్లాడేకి మనుషులూ వుండేలే, కంపినీలు, కంపినీల నింకా వచ్చే పొగా, గబ్బు మాత్రం వుంటాయి' అనుకొంటా ఇంటిపక్క తిరిగినాడు బక్కిరెడ్డి.

బక్కిరెడ్డి ఇల్లు శేరేతలికి, మొగుని కోసరం కాసుకోని కూకోనుంది శాంతమ్మ.

'ఏమి శెబితివి మా తమ్మునికి?' అడిగింది శాంతమ్మ.

'యా విషయము?' తెలిసినా తెలియనట్లే అడిగె బక్కిరెడ్డి.

'ఇంగా యా విషయము అని అడుగుతా వుండావే, నేల అమ్మేకి, కొనే మనిషిని తోడుకొని వస్తాననె కదా, దాని గురించి' శెప్పింది శాంతమ్మ.

బక్కిరెడ్డి ఏదో బదులు శెప్పేతబుటికి, పక్క ఇంట్లా నింకా దబ్బు దబ్బుమని శబ్దము యినిబించింది. ఆ శబ్దము యెనకాల్నే పెద్దగా కిర్లేది, ఏడిశేది యినిబించింది. ఆలూ మొగుడూ ఇద్దురూ వాకిలి తీసి బయటికి వచ్చిరి.

పక్కింట్లా వుండే వెంకేటశుడు తాగొచ్చి వాళ్ళప్పని కొడతా వుండాడు. వాళ్లమ్మ అడ్డం పోతా వుండాది. ఆయమ్మకీ యేట్లు పడతా వుండాయి.

'ఆ నేలని నా పేర్లా రాసేకి నీకేమిరా, నేను దాన్ని అమ్ముకొంటాను, ఇంగా ఏమైనా శేసుకొంటాను, నీకేల?' అంటా కొడతా వుండాడు వెంగటేశుడు. బక్కిరెడ్డి, ఇంగా ఇద్దరు ముగ్గురు పొయ్యి బలవంతముగా యిడిపించి, వెంగటేశున్ని ఇంట్లా పనుకోబెట్టిరి.

బక్కిరెడ్డి బయటికొచ్చి, 'పోనీ యిడీ మామా, ఏదో శిన్నోడు తెలీక నీమింద శెయ్యి శేసుకొనె, నువ్వు మనసులో పెట్టుకోవద్దు, నీ కొడుకే కదా, ఓర్చుకో' అని సుదారిచ్చినాడు.

'నేను ఏడస్తా వుండేది వోడు నన్ను కొట్టెనని కాదురా. వోడొట్టి తాగుబోతు, ఈ నేలన్నా వుంటే నాలుగు గింజలు పండి, కడసీ కాలంలా గంజైనా తాగి అందరూ బతకొచ్చని ఆశ పడితిని. నేల్లకి వెలలు వచ్చేతలికి అమ్మేయాలని ఎగుర్లాడతా వుండాడు. యాదవుల కులంలా ముసలం పుట్టినట్లా, ఈ సెజ్జులొచ్చి తల్లికీ బిడ్డకీ కాకపోయె, తండ్రికీ కొడుక్కీ కాకపోయె. బగమంతుడా, ఇంగా ఎన్నెన్ని సూడాల్నో ఈ కళ్లల్లా' గొనుక్కొంటా లోగాకి పోయె ఆయప్ప.

'సరి పద, పొద్దిన్నే శానా పనుంది. బిర్నాగా లేయాల' అంటా లోగాకి నడిశె బక్కిరెడ్డి. శాంతమ్మ కూడా లోగాకి వచ్చి పనుకొనింది.

పనుకోనుండారే కానీ ఆలూ మొగుడికి నిద్రవస్తా లేదు. ఏదో దిగులు, ఏమో బేజారు, శాంతమ్మ పక్కలా నిద్రపోతా వుండిన బక్కిరెడ్డి కొడుకు బయట గలాటాకు లేశి కూకున్నాడు.

'పనుకోరా శిన్నా, రేపు పొద్దిన్నే బిర్నాగా లేయాల, ఇబుడే శానా పొద్దయింది' అనింది శాంతమ్మ కొడుకుతో. వానికీ నిద్ర వచ్చినట్లు లేదు. నాలుగో తరగతి సదివే ఆ శిన్నోడు, 'అమా మనూరికి అదేమో సెజ్జు వస్తుందట, మనమంతా ఈ వూరిడిశి ఇంగొక వూరికి పోవాల్నంట, అవునా మా' అని అడిగె.

'అవున్రా' శెప్పింది శాంతమ్మ.

'అమ్మా, ఒగేళ మనము పొయిన జాగాకి కూడా సెజ్జు వస్తే మా?' తిరగా అడిగినాడు శిన్నోడు.

ఆమాట యాడో తగిలింది శాంతమ్మకి. 'ఆ సుద్ది నీకేలరా, కలకుండా కండ్లు మూసుకోని పనుకో' గదిరి పక్కకు తిరిగి పనుకొనింది శాంతమ్మ.

'గూడు శెదిరిన గువ్వకి ఒగ వూరేమి, ఒగ దోవేమి, గూడు దొరికే తావుని తడుక్కొంటా పోతానే వుండాల' లోలోపల గొనుక్కొంటా వుండాడు బక్కిరెడ్డి.

✡

# భూమి పుత్రుడు

**–ఐతా చంద్రయ్య**

కరకర పొద్దుబొడిచి బారెడెక్కి గయ్యాలి పెళ్ళామ్మీద గంగిరెడ్డు మొగుడి కోపంలా చిటపటలాడ్తుంది. మక్కచేను మధ్య ఎత్తైన మంచె. ఆ మంచె కింద గొంగడి, గొంగడి మీద తిరుపతి చేతికీ, మూతికీ మధ్య బీడీ మీద బీడీ కాలి మసైపోతోంది. చూపులు మక్క కర్రల మీద తచ్చాడుతున్నై.

తల్లీదండ్రీ లేని అనాథ బాల లాగుంది చేను, రంగుమారి వాడిపోయిన ఆకులు దండానికి ఆరేసిన తుండుగుడ్డల్లాగున్నాయి. ఫ్చ్... కంకిపట్టే దశ. పెళ్లీడు కొచ్చిన నిరుపేద కన్నెపిల్లకు కళ్ళు బోయినట్టు వానచినుకు లేక పొట్టకొచ్చిన చేను మట్టిగొట్టుకు పోతోంది.

మఘ రైతుకు పగ అని ఎవరన్నారోగాని అది అక్షరాలా నిజమైంది. మఘపోయి పుబ్బ వచ్చింది. అయినా వానజాడలేదు. చెరువు తడారిపోయింది. పొలాలు బీటలుబారి నోళ్ళు దెరిచినై. నోరు తెరిస్తే నోరెడు ఎండ. గడ్డిలేక పశువులు పరేశానై పోతున్నై.

"ఏంది తిరుపతన్నా గట్ల జూత్తున్నవ్?" వెనకనుంచి వచ్చి పలకరించాడు మల్లారెడ్డి.

బీడీ పొగతోబాటు గుండెల్లోంచి ఓ గట్టి నిట్టూర్పు వెలువడింది. జీవంలేని చూపులు మల్లారెడ్డి వైపు మళ్లినై.

"పచ్చదనం మాయమైన చేనుం జూత్తుంటే పానం గిలగిల కొట్టుందిరా మల్రెడ్డీ!" అంటూ మల్లారెడ్డి చేతి సాయంతో లేచి తుపుక్కున ఉమ్మేశాడు. కరుకు బీడీ కిర్రు చెప్పుకింద నలిగిపోయింది. ఇద్దరూ ఇంటిమొహం పట్టారు.

"మక్క కర్రల్ని జూత్తుంటే మనసు పాడైపోతుంది. వరి కర్రల్ని జూత్తుంటే కడుపుల చల్ల జేసినట్టైతుంది. ఏ జన్మల ఏ పాపం చేసినమో!"

"...ఎంత జూచినా గంతే ఉందన్నా!"

"సొరాజ్జెమొచ్చి చానేండ్లయిందిగాని అదెక్కడుందో మనకింకా దెల్వదురా!"

"అక్కడెక్కన్నో వరదలొచ్చి ఊర్లు కొట్టకపోవట్టె. మనం వానల్లేక చావ వడ్తిమన్నా!"

"రోహిణిల వానలు పడ్తే రోకలిబండలోలె కంకు లొస్తయంటరు కానీ, ఏది... వాననే లేకపాయె. భూమిలేసిన ఇత్తనాలు బాయిలేసిన బండల్లె అటే పాయె!"

"నాలుగేండ్లనుంచి మన గడ్డమీద గదే ఆటనాయె. ఇంగ యవసాయం ఎట్లా జెయ్యాలెనో, మనమెట్లా బతకాల్నో..." మల్లారెడ్డి మనసు విలవిల్లాడింది.

"ఓట్లతోని సీట్లకెక్కిన పెద్ద మనుషులకు చీమకుట్టినట్టు గూడ లేదాయె. ఎలక్షన్లు వచ్చినప్పుడు నోటికొచ్చినట్టు జెప్పిరి. మనం గొర్రెలోలె తలకాయూపితిమి. గిదేందని అడగకపోతిమి. దేనిమీద గుద్దుమంటే దానిమీద గుద్దిపారేస్తిమి..."

మాటల మధ్యలో వూళ్ళోకొచ్చేశారు. సూర్యప్రతాపం పదునెక్కింది. జనసంచారం లేక బజారు, బంజరు భూమిలాగుంది.

ఇంట్లోంచి పగలు బయటకు రావాలంటే పగబట్టిన పామును జూచినట్టు నరాల్లో వింత ప్రకంపనాలు. ఇంట్లో కూచుంటే ఇంటిమీద గుడ్డలు చెమటకు తడిసి ముద్దలైపోతున్నై.

గల్లీలో పదిమంది పిల్లలు కప్పతల్లి పాడుకుంటూ ఇల్లిల్లు దిరుగుతున్నారు. ఇద్దరు పిల్లలు రోకలిబండను చెరోవైపు భుజానికెత్తుకున్నారు. దాని మధ్యలో బట్టపేగుతో కట్టిన కప్పపిల్ల.

"వానల్లు కురవాలె వానదేవుడా!

వరిచేన్లు పండాలె వానదేవుడా!

చినుకు చినుకు రాలాలె వానదేవుడా!

చెరువులన్ని నిండాలె వానదేవుడా!

వానదేవుడా! ఓ వానదేవుడా!"

పాడుతూ ఇంటిముందు నిల్చున్నారు. ఇంటి ఇల్లాలు కడివెడు నీళ్ళు దెచ్చి రోకలిబండమీదా, దాన్నెత్తుకున్న పిల్లలమీదా కుమ్మరించింది. ఇదేవిధంగా ఇంకో ఇల్లు... ఇలా చేస్తే వానదేవుడు కరుణిస్తాడని నమ్మకం. మరోరోజు ఈశ్వరాలయం గర్భగుడిని సగంవరకు మూసేసి ఇంటికొక్కరు బిందెతో బయల్దేరారు.

అడుగంటుతున్న మోటబావుల నుండి నీరు దెచ్చి గర్భగుడిలో పోశారు. భర్తకు జలాభిషేకం జరిగితే భార్య గంగమ్మ సంతోషిస్తుందని విశ్వాసం.

రోజులు గడుస్తున్నాయేగాని పరిస్థితిలో మార్పులేదు.

మోటబావుల్లో నీళ్ళున్నాయనే ధైర్యంతో వరి అలికేశారు. నెలక్రితం, పగలు కరెంటు రాదు. ఏ రాత్రో వచ్చి రైతుల్ని కబడ్డీ ఆడిపిస్తుంది. చుట్టం చూపులా ఇట్టే వచ్చి అట్టే మాయమైపోతోంది. లోవోల్టిజితో ఇంజన్లు కాలిపోతున్నై. కరెంటుకోత రైతుల గుండెకోత కొచ్చింది.

పుబ్బ దాటింది. బావుల్లోని నీరు మాయమైపోతోంది. రైతు నెత్తికి చేతులొచ్చినై. చేదబావుల్లో గంగరాళ్ళు బోసిబోతున్నై. తాగునీటికి కరువొచ్చింది. వేరే ఊళ్ళనుండి నీళ్ళు దెచ్చి అమ్ముతున్నారు.

"నాయినా! మన మక్క చేనెట్లుందే?"

రెండు నెలలు అమ్మమ్మ వూళ్లో ఉండి ఆ రోజే వచ్చిన కూతురు పద్మ– సాయంత్రం అరుగుమీద కూచున్న తిరుపతి నడిగింది. పెళ్లికెదిగిన కూతుర్ని చూడగానే మొహం మాడిపోయిన మక్క కర్రలాగైంది. ఆకాశం వైపు చూస్తున్నాడు.

"గా పిల్ల గట్లడిగితే చెప్పవేందిరా తిరుపతీ!" అదే అరుగుమీద మరోపక్క గోడకొరిగి కూచున్న తండ్రి అడిగాడు. ఎనభయ్యేళ్ల వృద్ధుడతడు. చుట్ట దమ్ము గట్టిగా లాగి వదిలాడు. దగ్గుతో ఆయాసం వచ్చేసింది.

"నీ కొడుకునేం జెప్పుమన్నవ్ మామా? పేరుకు వానాకాలమైనా ఎండ కాలం కంటే అన్యాయమైపాయె. మక్కచేను మంట్ల గలిపె. వరిపేరుకు లేకుండాపాయె. అప్పు పుట్టవాయె. పొయ్యిమీద కుండెక్కుడే కష్టమైపాయె. ఇంగదాని పెండ్లెట్ల జెయ్యాల్నో!" భార్య దేవమ్మ కళ్లు మసకబారినై.

"అన్యాలమైపాయె బిడ్డా!" ముసలాయన చేతిలోంచి చుట్ట జారిపోయింది. ఆరాటం ఆకాశాన్నందుకుంది.

"చేను చూసొస్తానంటే చాతగాకపాయె. కట్టె పట్టుకుని ఇంట్ల దిరుగుడే కష్టమైపోవట్టె"

"నేనింకేం జెయ్యాలె నాయినా?" తిరుపతి కాళ్లుజారి అరుగు కిందికి వేళ్లాడినై. "రోహిన్ల వాన వడె. దుక్కిదున్నితిమి. నీ కోడలూ, నేను రెక్కలు ముక్కలు జేస్కుంట ఇత్తనాలేస్తిమి. సంచెడు మందు జల్లితిమి. నాల్గురోజులాగి నాల్గు చినుకులు పడె. మక్క మందులకు చేసిన అప్పుల పెరిగిపోతున్నై గాని పంట రాకపాయె. అప్పులోడు గుంజులాడ వట్టె..." తిరుపతి గొంతులో బొద్దింకలు పాకుతున్నట్టుంది.

"ఉత్తర వానలురిమికొడితే పాములు తరిమికొడ్తయంటరు. ఏది మామా ఉత్తర గూడా ఉత్తదైపాయె. దేవుడు పగపట్టినట్టుంది..!" దేవమ్మ కళ్ళల్లో నీళ్లు దిరిగినై.

"పాపం పెరిగిపోయిందమ్మా! ఇంగ్లీషోల్ల జమానా జూస్తి. నైజం జమానా జూస్తి. పల్లెల్ని పట్టించుకునేటోడె లేడు. మాటలు జెప్పి మూటలు దొబ్బిపోతుండ్రు. ముందటి జమానల

గిట్ల లేకుండె. నాలుగైదేండ్లకోసారి కాలం బోయినా అటెన్క పుష్కలంగా వానలు పడేవి. ఇప్పుడేమో నాలుగైదేండ్లకోసారి గూడా కాలంగాకపాయె. గడ్డిలేక పశువుల్ని ప్యాక్టరీ కమ్మవట్టిరి...” ఆకాశం వైపు చూస్తూ తెల్లని గడ్డం పుయిక్కుంటుంటే ముసలయ్యకు దగ్గుతెర ముంచుకొచ్చింది. మాటలాగిపోయినై.

“మరి తిండిగింజలెట్ల నాయినా?” పద్మ గుండె బేజారైపోయింది.

“ఏదన్నా కూలి పంజేసుకుంటే బాగుండు”

“కూలి పనులిక్కడెక్కడ దొరుకుతై బిడ్డా? పట్నం బోవాలె?”

దేవమ్మకు కడుపులో దేవినట్టుంది.

“ఔన్నాయినా! పట్నంబోక తప్పదు!” తిరుపతి అందుకున్నాడు. “అక్కడేదన్నా కూలినాలి దొరుకుద్ది. పొట్ట నిండుద్ది. పద్మ పెండ్లిగూడ అక్కడనే చెయ్యొచ్చు!”

ముసలయ్య వెన్నుపూసలో వానపాము పాకింది.

“మరి.. మనభూమి..?” భృకుటి పీటముడి పడింది. నుదిటిమీద అనుభవరేఖలు అల్లిబిల్లిగా అల్లుకుపోయినై.

“కష్టకాలమొచ్చింది మామా!” పొత్తికడుపులోంచి ఎసరులా పొంగుకొస్తున్న దు:ఖాన్నాపు కోవడం దేవమ్మకు కష్టమైపోయింది.

“నిన్ననే పట్నం నుంచి మనకు అప్పిచ్చిన సావుకారొచ్చిండు. ఐతే అప్పు దీర్చు, లేక పోతే భూమి అమ్ముమని తగాదా చేసిండు. మన భూమిల ఆయిల్ మిల్లేస్తడట నాయినా!”

“ఐతే.. నువ్వేమన్నావురా?”

“ఇంకా.. అనేదేముందీ? భూమి అమ్మేసి బయానా దీసుకున్న. అప్పులు పోంగా మిగిలిన పైసల్తోని పద్మ పెండ్లి జేస్తాం!” చావు కబురు చల్లగా చెప్పేసి రుమాలుతో కళ్లద్దుకున్నాడు.

ముసలాయన నెత్తిమీద పిడుగుల వర్షం కురిసింది. కడుపుల పేగుల్ని కరకర కోసినట్టనిపిస్తుంది.

రాత్రయింది. అన్నం సయించలేదు. బూడిద కుప్పమీద కుక్కలాగ కుక్కి మంచంమ్మీద ఎంతసేపు దొర్లినా నిద్ర రావడంలేదు.

ఇల్లు గడవాలంటే ఈ ఇంట్ల పుట్టి పెరిగిన దున్నపోతుల్ని అమ్మితిమి. అవి మేతకు పోయినయో, కోతకు పోయినయో తెల్వకపాయె. ముత్తాతల కాలంనుండి అన్నంబెట్టిన భూమి అమ్ముడైపోయిందా? చిన్నప్పుడు నేనాడుకున్న భూమి, నా చెమటతో తడిసిన మట్టి,

నన్ను కన్నతల్లిలా ఆదుకున్న అన్నపూర్ణ... నాది కాకుండా పోయిందా? చచ్చిన నా తాతా, తండ్రీ, నా భార్య అందులోనే బూడిదైపోయింద్రు. నేను ఛస్తే నా శరీరం పరాయి భూముల పాలుగావాల్నా? భూమాతా! తల్లీ! నా మీద– కోపమొచ్చిందమ్మా? నిన్ను నమ్ముకున్న రైతు నిలువుదోపిడి కావల్సిందేనా? నీకూ, నాకూ ఋణం తీరిపోయిందమ్మా! రక్తంలోని ప్రతి అణువూ రంపపుకోతకు గురవుతోంది. ఎదలోంచి తన్నుకొచ్చిన వేదన కరిగి కంటిధారలై దిండును తడిపేస్తుంది.

దగ్గు...ఒకటే.. దగ్గు.. ఖణేల్ ఖణేల్మనే దగ్గు. ఇల్లంతా దద్దరిల్లుతోంది. దమ్ము ఆడడం కష్టమైపోతోంది.

"ఏమైంది నాయినా?" తిరుపతి పరిగెత్తుకొచ్చాడు.

శ్రీరాముడు బంగారు లేడికై పరుగెత్తాక 'హా'! లక్ష్మణా!' అన్న పిలుపు విన్న సీతలా కలతచెందింది దేవమ్మ. పద్మను లేపి పక్కింటికి పంపించింది.

జనాలంతా మంచం చుట్టూ మూగారు.

"హమ్మ! హయ్యా.. హబ్బో...!" ఒక్క నిమిషం తెరిపిస్తే నాలుగు నిమిషాలు దగ్గుతున్నాడు ముసలయ్య.

"ఏమైంది మామా?" దేవమ్మ తల పట్టుకుంది.

"భయమైతుంది తాతా!" బావురుమని ఛాతీ నిమిరింది పద్మ.

ముసలయ్య ఆయాసం ఎక్కువైంది. గొంతు మొద్దుబారిపోతోంది.

"ఏ..యేడ్వ.. వొ..ద్ద...మ్మా..!" వణుకుతున్న చేతులు మనమరాలి తల నిమిరాయి. దగ్గుతో ఛాతీ ఎగిరెగిరిపడ్తోంది. దమ్ము పెగలక కడుపు కొలిమి తిత్తిలాగైంది.

"నా..భూ...భూమి... నా...భూ...మి....భూ...." మరో పెద్ద దగ్గుతెర, రాళ్లు గొడ్తున్న సుత్తి దెబ్బల్లా.

గొంతు తెగ్గోసిన మేకలా భూమిపుత్రుడు కొట్టుకుంటున్నాడు. తిరుపతి, దేవమ్మ, పద్మలు గుండెలు బాదుకుంటున్నారు. దగ్గూ, దమ్మూ ఒకేసారి ఆగిపోయినై. నోరు తెరుచుకుంది– పిట్ట పిల్లలా.

✡

# గొడ్లు

–పులికంటి కృష్ణారెడ్డి

"నీ దుడ్లు నీ కిచ్చేస్తా!... నా గొడ్లు నాకిచ్చేయ్!... ఊఁ.. చెప్పు. నీ దుడ్లు నీ మొకాన కొడ్తా!.. నా గొడ్లను నాకు తోలేయ్!"

రెండు భుజాల్ని ఒడిసి రెండు చేతులతో పట్టుకొన్నాడు. మాట రెట్టిస్తూ, మనిషిని అమాంతంగా కుదిపేస్తూ అడుగుతున్నాడు. అతని పిడికిళ్లలో ఇరుక్కొన్న భుజాలు నలిగి పిండైపోతాయేమో? అనుకోకుండా ఎదురైన సంఘటన. తట్టుకొని నిలబడలేక తనక లాడుతూ తేల కండ్లు పడుతుంటే తెప్పరిల్లి ప్రయత్నపూర్వకంగా చూపును వాడిపై నిలిపాను.

కట్టిన గుడ్డ మాసింది. మాసిన గుడ్డ చీలికలు పేలికలుగా చినిగింది. జుట్టు రేగింది. కండ్లల్లో కసి వుంది. ఒళ్లు మసిబారినట్లు దుమ్ము నిండింది. మాటల్లో కరకుతనముంది. చేతుల్లో బలముంది. చూపుల్లో అగ్గి కురుస్తూ వుంది.

అతడెవరో నాకు తెలియదు. నేనెవరో అతనికి తెలియదు. అయినా, మిడిసి పడుతున్న ఎండలో నా గతి పిల్లినోటికి చిక్కిన ఎలుకగతే అయింది.

"ఊఁ.. చెప్పు. నీ దుడ్లు నీ మొకాన కొడ్తా!.. నా గొడ్లను నాకు తోలేయ్!"

బదులు చెప్పలేని నిస్సహాయ స్థితి!

ఉన్నట్లుండి అతడు నా భుజాల్ని వదిలిపెట్టాడు. 'బ్రతుకు జీవుడా!' అనుకొన్నాను. కాని, అంతలోనే మేక మెడకింద చన్నుల్లాంటి నా చొక్కా కాలర్లని రెండు చేతులతో పట్టుకొన్నాడు. ఆ కాలర్లని వడేసి నాగొంతుకు బిగిస్తూ!..

'ఉ.. ఇస్తావా, లేదా చెప్పు.

నీ దుడ్లు నీ కిసిరి పారేస్తా! నా గొడ్లను నాకు తోలేయ్!'

ఉరిమురిమి చూస్తూ, పండ్లు పటపట కొరుకుతూ కాలర్లని నా మెడకు బిగిస్తున్నాడు. ఆ రోజు వాడి చేతిలో నా చావు మూడిందని నిర్ణయించుకొన్నాను.

'నాకేమీ తెలియదు. నన్నొదిలిపెట్టు' అని అడుక్కోవడానికి కూడా నోరు పెగల్లేదు. అవకాశం అసలే లేదు.

పొద్దు నడిమిట్టన వుంది. ఎండ చంద్రనిప్పులు చెరుగుతూ వుంది. ప్రక్కనే స్వర్ణముఖి. నీళ్లను మింగి ఇసుకను నెమరేస్తున్నది. తారురోడ్డు నుండి మట్టిబాటకు మట్టిబాటనుండి కాలిబాటకు బస్సు మీద ఆ తరువాత కాలిబాట నుండి ఏటికి కాలి నడకమీద అంచె లంచెలుగా సాగింది నా నడక. అయితే ఆ ఏరు దాటేసరికి దేవుళ్లే దిగివచ్చినంత పని అయింది.

ఆ ఏట్లో!... అబ్బబ్బ! ఎర్రని ఎండ. ఎండలో మిలమిలా మెరుస్తూ ఏటి ఇసుక. ఆ ఇసుకలో నడక. గుదికాళ్లకు, చెప్పులకు మధ్య పడిన ఇసుక రేణువులు కొన్ని పైకెగిరి నాకు అభిషేకం చేస్తుంటే– కొన్ని వేమన్నగారి పద్యాన్ని మతికి తెస్తున్నాయి. ఆ పోరు పడలేక రెండు కాళ్లల్లో చెప్పులు ఒక్క చేతికి తీసుకుంటే పైనా కిందా కాలిపోతూ వుంది. ఏటిమీది వడగాడ్పులు గూబల్ని అదరగొడుతున్నాయి. కాళ్లు ఇసుకలో కూరుకుపోతున్నాయి. ఏటిలోనే ప్రాణం ఎగిరిపోతుందనిపిస్తున్నది. ఎలాగో ఆ ఏరు దాటితే పెనంలో నుండి అగ్గిలో పడ్డట్టుగా వీడి చేతుల్లో పడ్డాను. బతికినంత బతుకు బతికి కడకు దిక్కులేని చావు చావాల్సి వచ్చిందే? అని గుండె కుములుతూ వుంది. పోనీ – గజేంద్రుడిలా మొరపెట్టుకున్నా దేవుళ్లు దిగివచ్చే కాలమా? కాదే!

ఊరుకాని ఊర్లో దిక్కూ దరీ లేనిచోట నేనొక పసల పోలిగాణ్ణి!

నా దీనావస్థ అర్థమైనట్టుగా ఉన్నట్లుండి వాడు నా చొక్కా కాలర్లని వదిలిపెట్టాడు.

'గండం తప్పింది' అని అనుకొంటూ ఉంటే వాడు నిలువునా కూలబడి నా రెండు కాళ్లను పొదివి పట్టుకొన్నాడు.

'మా యబ్బతోడు. నీ దుడ్లు నీకు పువుల్లో పెట్టిచ్చేస్తా! నా గొడ్లను నాకు తోలేయ్. నీకు పున్నెం ఉంటింది.'

ఏడుపుతో కలిసి మాటలు. మాటలతో కలిసి ఏడుపు. గుండెల్ని చీల్చుకొని వస్తున్నా యి. ఆకు అల్లాడని ఆ ప్రశాంత వాతావరణంలో వాడి ఏడుపుతో గుండెలవిసిపోతున్నాయి.

ఆ అవస్థలోనుండి ఆశ్చర్యంలోపడి ఆశ్చర్యంలో నుండి తేరుకొనే సరికి వాడు ఎగిరిపడి పైకిలేచాడు. నా మొగంలో మొగం పెట్టి 'నిన్ను నమిలేస్తా!' అన్నంత తీక్షణంగా ఒక్కచూపు చూశాడు. ఆ చూపు వెన్నెముకలో ప్రశ్నగా బుసకొట్టింది. ఎంతసేపు? ఒక వక్క కొరికినంత సేపు. ఆ తరువాత అమాయకంగా నన్ను చూస్తూ విరగబడి నవ్వుతున్నాడు.

'వాడెవడో యదవ నా కొడుకు!– నా గొడ్లను తోలకపోతే నిన్నడిగితే పాపం! నువ్వేం జేస్తావ్? నేనొక పిచ్చినా కొడికిని' అని అంటూ జుట్టుపీక్కున్నాడు. తల కొట్టుకున్నాడు. అంతే! ఎలా వచ్చాడో అలానే దూసుకుపోతున్నాడు వడిశెల రాయిలాగా!

కయ్యా కంపా లెక్కపెట్టకుండా కాలికొద్దీ పరుగెత్తుతున్న వాడిని చూస్తూ నిలబడ్డాను.

'అయ్యోపాపం! ఎవడోవాడు– వాడి గొడ్లను ఎవడు తోలుకొనిపోయాడో? ఏమో?' అన్న సందేహం నిట్టూర్పుగా మారితే–

ఆ చెట్టుక్రింద నిలబడి ఆలోచిస్తున్నాను. వాడిమీద సానుభూతి కంటే నా మీద నాకే ఏవగింపు కలుగుతూ వుంది. లేకుంటే దోవన పోతున్న జగడం ఇంటిదాకా అన్నట్లు నా కెందుకీ గొడవలన్నీ!...

ఆ రోజు ఉదయం.. నిద్ర లేస్తూనే ఒక దినపత్రిక చేతికి తీసుకొన్నాను. చేతికి వచ్చీ రాక మునుపే మొట్టమొదటి పేజీలో పతాక శీర్షికలో కంటపడింది. 'రాయలసీమలో కరవు రక్కసి కరాళనృత్యం' అని.

ఆ మాట మనసులో మెదిలే సరికి పత్రిక చదవడానికి బుద్ధిపుట్టలేదు. సీమలో తిష్టవేసిన కరువు రక్కసి నిర్దాక్షిణ్యంగా నా గుండెని పట్టి పిండుతున్నట్టనిపించింది. పత్రిక మడిచి పక్కన పెట్టాను. ఆలోచనలకు పగ్గాలు విడిచిపెట్టాను.

అప్పుడు నాకు గోచీ పెట్టుకునే వయస్సు. ఆ వయస్సులో రాయలసీమలో కరువు వచ్చింది. ఆ నాటి పరిస్థితి నా లేత గుండెమీద పదిలంగా పచ్చ పొడిచింది. ప్రయత్నించి తుడిచినా పోయేది కాదది. అందుకే ఇంకా నాకు కండ్లకు కట్టినట్లు కన్పిస్తూ వుంది. వరుసగా నాలుగైదేండ్లు వర్షాలు పడలేదు. చెరువులు వొళ్లు ఆరవేశాయి. బావులు అడుగంటాయి. ఈ బావులమీద చెరువులమీదనే కదా రాయలసీమ సేద్యం ఆధారపడింది. ఏ తొలికోడి కూసే వేళకాడనో మోటగట్టి నోరులేని గొడ్లను ఆ బారిలో వెనక్కు, ముందుకు లాగుతూ పాతాళగంగను బానకు బాన పైకితెస్తే– నోటికి చేతికి అందడం అంతంత మాత్రం. ఇక వానలే లేకపోతే నీళ్లెక్కడి నుండి రావాలి? కబిలెక్కడ కట్టాలి? సేద్యం ఎలా కొనసాగాలి? పంటలెలా పండాలి?

'ఆకలో రామచంద్రా!' అని అల్లాడిపోయారు జనం. ముంతడు గంజికోసరం గంజి కేంద్రం వద్ద పడిగాపులు కాశారు. 'ఆకలి' అంటే అంత పెట్టడమే కానీ, చేయిచాచి ఎరుగని రైతుబిడ్డలు గంజి కేంద్రాల వద్ద పడిగాపులతో అభిమానాన్ని చంపుకోలేక అడవుల మీద పడ్డారు. దేవదారు ఆకు తెచ్చుకున్నారు. ఆ ఆకు ఉడకబెట్టి తిన్నారు. వెదురు బియ్యం వండుకు తిన్నారు. కలబంద గడ్డలతో కడుపులు నింపుకొన్నారు. కొన్ని ఊళ్లకు ఊళ్లే వలసపోయాయి. పుట్టి పెరిగిన ఊరిని నడయాడిన మట్టిని వదలలేని వాళ్లు మాత్రం ఈల కరచి నిలబడ్డారు. చచ్చినంతమంది చావగా తప్పించుకొన్నవాళ్లు ఆయుస్సు గట్టి దనుకొన్నారు.

రాయలేలిన ఈ సీమలో వీధుల్లో రత్నాల్ని రాసులుపోసి అమ్మిన సీమలో సంకటి సలిబిండికి నోచుకోని ఈ సీమవాసులు నేడు గత వైభవాల నీడల్లో మేడలు కట్టుకొంటున్నారు. ఆ మేడల్లో నిగిడి నీలిగి చస్తున్నారు. పుట్టిన తరువాత ఎప్పుడో ఒకప్పుడు చావడం ఖాయమని కామందులు మందుమైకంలో వేదాంతాలు వల్లిస్తున్నారు.

ఆలోచిస్తూ మేడమెట్లు దిగుతున్నాను.

"వంకాయలు.. బెండకాయలు.. టొమాటాలు.. కూరలు.. ఆకుకూరలు"

నవనవలాడుతున్న కాయకూరల్ని.. ఆకు కూరల్ని.. నాలుగు చక్రాలబండిపై కుప్పలు కుప్పలుగా రాశిపోసి... బండిని వీధి ప్రక్కగా నిలబెట్టి పక్కన నిలబడి... కూరగాయల పేర్లను పేరుపేరునా వొత్తొత్తి పలుకుతూ సరకు నాణ్యాన్ని మాటల్లో చిలుకుతూ కూరగాయ లమ్ముతున్నాడు ఒక వ్యక్తి.

మేడమెట్లు దిగుతూ అటువైపు చూశాను.

ఆ బండిమీద కూరగాయల్ని ఏరుకుంటున్న జవరాండ్ర చేతి వేళ్లకంటే అందంగా వున్నాయి బెండకాయలు. వాళ్ల ఎదమీద వంపుల్ని ఎత్తి చూపుతున్నట్లున్నాయి నవనవ లాడుతున్న వంకాయలు. ఉదయకాంతిలో ఉలిక్కిపడుతున్న బుగ్గలతో పోటీపడుతున్నాయి టొమాటాలు. చెదిరిన ముంగురులకు సాదృశ్యంగా ఉన్నాయి ఆకుకూరలు!

ఆ దృశ్యం చూపులకు గాలం వేస్తే రెప్పార్చకుండా చూస్తున్నాను.

కరవు రక్కసి కరాళనృత్యం నన్ను వెక్కిరించింది.

ఇంటి ముందర నవనవలాడుతూ కూరగాయలు. ఇంటిలో కొళాయి తిప్పితే ఎగజిమ్ముతున్న నీళ్లు. ఇంటి నుండి అడుగు బయటపెడితే అడుగుకొక్క బారు. బారులో బీరు. బీరుకాకుంటే హొటల్లో మోరు. సినిమా హాళ్ల దగ్గర టిక్కెట్ల కొరకై పోరు. క్లబ్బుల్లో నగ్న నృత్యాల జోరు... ఏది ఆగింది? ఎప్పుడు ఆగింది?... ఈ కరువు కోసరమని!

చేతిలో డబ్బుంటే కొండమీది కోతి దిగి రమ్మంటే వచ్చే రోజులివి!

పట్టణాల్లో ఏదోవిధంగా పొద్దుగూట్లో పడేసరికి చేతిలో డబ్బు పడుతుంది. బతుకు ఏదోవిధంగా కొనసాగిపోతూ వుంటుంది. ఈ మనస్తత్వాలకు ఊహాసౌధాలే ఊపిరి. కరువు కాటకాలను గురించి ఆలోచించడానికి తీరిక వుండదు. కోరిక అసలే వుండదు. పత్రికా ముఖంగా చూసి నోరు చప్పరించడం తప్పితే!

పల్లెరా! పల్లెరా! ఇది పాడిపంటల ముల్లెరా! పల్లవిని కరువు రక్కసి తిరగ రాస్తే సరసాలకు నవరసాలకు కేంద్రాలు కదా పట్టణాలు. అందుకే కరవు రక్కసి వాతపడిన పల్లె ప్రాంతాల్ని కండ్లార చూడాలన్న కోరిక మనసులో మొగ్గతొడిగింది– ఒక విలేఖరిగా.

ఆ కోరిక ఫలితమే మిడిసిపడుతున్న ఎండలో నేనా మర్రిచెట్టు కింద నిలబడడానికి కారణం. ఆ చెట్టుకింద నా అనుభవం పగవాడికైనా వద్దురా తండ్రీ! అనిపించింది. అప్పటి పరిస్థితి నాకు నాకే దయనీయంగా వుంది. అయినా వృత్తి ధర్మం.

కనుచూపు మేరలో ఒక వూరూ నాడు కంటపడలేదు. ఆ కాలిదోవ... పొయ్యే కొద్దికీ పోతూనే వుంది. పోనీ, ఎవరినైనా అడిగి తెలుసుకుందామంటే పారాడే పాములే పుట్టల్లో గుట్టుగా వుండే ఆ ఎండలో మనిషి మసలడం లేదు. ఆ ఏటికి కొంత దూరంలో ఎండి నెర్రెలు చీలిన జానాబెత్తుడు కయ్యలు.. ఆ కయ్యల్లో బట్టతల మీద తేసిపోయిన జుట్టు మాదిరి మలమల మాడిపోతున్న పైర్లు.. ఏటిఒడ్డున చాకిరేవు.. ఆ రేవులో చిందరవందరగా పగిలిన కుండ పెంకులు... వాడడమేలేదని వాపోతున్న పొయ్యి- బహుశా ఆ ప్రాంతం ఏదో ఒక వూరి పొలిమేరగా ఉండవచ్చుననిపిస్తూ వుంది.

పొలిమేర అయితే ఒకదారి అంటూ వుండాలి కదా! లేదే! అని దిక్కులు చూస్తున్నాను.

అంతలోనే ఒక మందగొడ్లు ఆ చెట్టు నీడను చేరుతున్నాయి. కొన్ని కాళ్లీడ్చుకొంటూ నడుస్తున్నాయి. కొన్ని నాలుగడుగులు వేసి నిలబడి వొగిరిస్తున్నాయి. కొన్ని లేగదూడలు మాత్రం ఒక్క లగువులో వచ్చి ఆ నీడలో తెటికల పడుతున్నాయి.

ఆ గొడ్లు కళేబరాలై కండ్లలోనే ప్రాణం నిలుపుకొన్నట్లున్నాయి. బయటపడిన బర్రెము కలు కరువు రక్కసి కర్కశంగా గోళ్లతో రక్కిన గుర్తుల్లా వున్నాయి. అడుగంటిన కడుపులు కరవు రక్కసి పాద ఘట్టనతో పడిన పల్లాల మాదిరి వున్నాయి.

రాళ్లు సంగీతం పలికిన సీమలో కరువు రక్కసి రాతిగుండెల్ని చెక్కుతున్నందుకు సాదృశ్యంగా దృశ్యం!

తడారిన నా గొంతు పిడచగట్టుకపోతూ వుంది.

ఒక గొడ్డు మూత్రం పోస్తూ వుంటే మరొక గొడ్డు ఆప్యాయంగా మూతిపెడుతూ వుంది. అంతలోనే టప్‌మన్న శబ్దం చెవినపడింది. అటు తిరిగి చూశాను. ఒక గువ్వపిల్ల విలవిల్లాడుతూ కిందపడింది. అది కింద పడేలోపుగా దాని ప్రాణాలు పైకెగిరిపోయి నట్లుంది. తల్లి గువ్వ అరుస్తూ తల్లడిల్లిపోతూ వుంది. తలపైకెత్తి ఆ తల్లి గువ్వను చూశా ను. తల్లి గువ్వది కాకిశోకంగా వుంది. ఆ కొమ్మల మాటున తలదాచుకున్న గువ్వలు మెడలు వాలేసి ఇప్పుడో ఇక కాసేపటికో అన్నట్లున్నాయి. చెంగు చెంగున ఎగురుతూ కొమ్మల మీద కోలాటాలాడుకునే ఉడతలు గోడమీద బల్లుల్లా కొమ్మలకు అతుక్కున్నాయి.

ఎద్దు మెడమీద కాడిబెట్టి రైతు మేడిపిడి చేత పట్టితే-

ఆకుల మాటున మెడలు వాలేసిన గువ్వలు... వెన్నుల మీద చిందులు!

కొమ్మలకు అతుక్కుపోయిన ఉడతలు... ఒక నర్తకురాలి కాలిమువ్వలు!!

చెట్టుకింద వొగిరిస్తూ పడి వున్న పశువులు తల్లిచేత శిశువులు!!!

సకల జీవరాసులు జీవించడానికి మట్టిని బువ్వగా మార్చే రైతుమూర్తి– నేడు నడుములు విరిగి మూలపడ్డాడు.

"ఏ ఊరు నాయినా మీది?"

నా ఆలోచన ఆ మాటతో తెగిపోతే తిరిగి చూశాను.

ఎప్పుడు వచ్చాడో ఏమో? ఒక పండు ముదుసలి. కొంకిదోటి నేలకానించి రెండు చేతుల మోపున ఆ దోటికట్టె మీదికి వాలబడి నన్నొక వింత మనిషిలా చూస్తూ అడుగు తున్నాడు. విల్లులా వంగిన అతన్ని చూస్తుంటే.. కరువు రక్కసి అతని ఒంటిమీదనే కాపురం చేస్తున్నట్లుంది. రెప్పార్పకుండా చూస్తూ నిలబడ్డాను.

"ఏ ఊరయ్యా అంటే చెవుల్లో ఏసుకోకుండా ఏందట్లా చూస్తా ఉండావే? ఏం కనపడ్తా ఉండాదబ్బా ఈ వొక్కుకట్టెలో?"

అక్షరానికి అతడికి మధ్య ఆమడల దూరమని తెలుస్తూనే వుంది. అయినా నా చూపుల్ని ఎంతబాగా చదవ గలిగాడు? అన్న ఆశ్చర్యంలో పడిలేవడం ఎంతసేపు?

ఊరు పేరు చెప్పాను.

"అయితే నీళ్లూ నిప్పులు దొరకని ఈ మూలకాడు కొంప కెందుకొచ్చినట్లబ్బా?"

"మిమ్మల్ని చూసిపోదామని, తాతా!"

ఆ మాట చెవిని పడుతూనే తాత అదోరకంగా చూసి ఇంకొక రకంగా నవ్వుతున్నాడు.

వెన్నెముకను అంటుకొన్న నాభినుండి వెలువడుతున్నదా నవ్వు. ఆక్రోశించే ప్రేవులు చేస్తున్న ఆక్రందనలా ఉందా నవ్వు. ఎముకల గూటిని వెనకకు ముందుకు కదిలిస్తున్నదా నవ్వు. అయితే జీవ రహితమైనదా నవ్వు!

"ఎందుకు తాతా అలా నవ్వుతున్నావ్?"

"మణిసి యేడవలేనప్పుడు నవ్వితే ఆ నవ్వు ఇట్లానే ఉంటింది నాయినా! మమ్మల్ని సూడాలని వచ్చినావంటా వుండావే. ఏమి సూద్దామని వచ్చినావయ్యా? తాగేదానికి నీళ్లా? తినేదానికి తిండా? కట్టుకునేదానికి గుడ్డా? లేదు. కంటిగింపుగా పైరుపచ్చలా? ఏం వుండాదని? అద్దో అట్టాజూడు ఎండ. ఆ ఎండ మండినట్టు మండిపోతా ఉండాయే మా బతుకులు. ఈ బతుకుల్నేం చూస్తావ్? నీడ పాటిన నిమ్మళంగా కూసుంటే కోరింది కోరినట్లు

నడిసొస్తిందే? అట్లాంటోళ్ల బతుకుల్నయ్యా చూడాల్సింది. వాళ్లను వదిలేసి ఈ బతుకుల్నా? చూడు. ఏమి చూస్తావో చూడు. అయ్యో నా మతిమండిపోనూ! ఇంతకు మునుపే ఈ చెట్టుకిందనే చూస్తివి కదా నాయినా ఒక బతుకును!"

ఆయాసం వచ్చినట్లుగా ఆగాడు తాత.

"తాతా! తాతా! అదే అడగదామనుకుంటా వుంటే నువ్వే అన్నావు. ఎవరు తాతా వాడు?"

"వాడి బతుకెందుకులే నాయినా!"

నిట్టూర్చాడు తాత. నిట్టూరుస్తూ నిలబడలేకపోయాడు తాత. నిలబడలేక వెళ్లి ఆ చెట్టుకింద కూలబడ్డాడు తాత. కూలబడి చెట్టుబోదెకు వాలబడ్డాడు తాత.

ఆ పిచ్చోడి కథను విందామన్న కోరికకు కాళ్లొస్తే వెళ్లి తాత పక్కన కూర్చున్నాను.

"ఎండన పడి వొచ్చినావు. పాపం! నోరెండక పొయ్‌నట్టుండాదే! గొంతట్ట తడుపుకో, నాయినా!" చంకలోని సొరకాయ బుర్రను తీసి అందించాడు తాత.

గుక్కెడు నీళ్లు!

బతుకులో రకరకాల రంగునీళ్ల రుచి మరిగిన వాడిని. అయినా ఆ గుక్కెడు నీళ్ల రుచి! నీళ్లకు అంత రుచి వుంటుందని అప్పటివరకు నా అనుభవానికి రాలేదు. అదొక అనుభూతి.

అందుకే మనస్సులోనే చేతులెత్తి నమస్కరించాను, ఆ పల్లె మనస్తత్వానికి! నాగరికత ముసుగులో నలుగుతున్న వాణ్ణి కదా మరి?

ఆ చెట్టు బోదెకు ఆనుకొన్న తాత రెండు చేతుల్ని వెనక్కు పెట్టి, అరచేతుల్ని జత జేర్చి తలకు ఆపుగా పెట్టుకొన్నాడు. చెట్టుకు చేరగిలబడి కాసేపు అలానే శూన్యంలోనికి చూస్తున్నట్లు కూర్చున్నాడు. ఆ పిచ్చోడి ప్రసక్తి తెచ్చేసరికి తాత గుండె కండ్లల్లో కరిగి ఎర్ర జీరకమ్ముకొంటే నాకు చూపడం ఇష్టం లేనట్లుగా– కాసేపు కండ్లు మూసుకున్నాడు.

ఎముకల గూడేమి వెళ్లగక్కుతుందో? అని ఎదురుచూస్తూ కూర్చున్నాను.

తాత వులిక్కిపడ్డట్టుగా ఈ లోకంలో పడ్డాడు. సర్దుకొని కూర్చున్నాడు. సొరకాయ బుర్ర చేతికందుకొని గుక్కెడు నీళ్లతో గొంతు తడుపుకొన్నాడు. తడిసీ తడవని గొంతును తెపరాయించుకొన్నాడు. నీళ్లు గొంతు వెంబడి జారడానికన్నట్లుగా!

నా ఆతురత కండ్లల్లో ఆశగా మోసులు వేస్తుంటే తాత గ్రహించినట్లుంది.

"అదో! అట్టా చూడు నాయినా! పరుగు దూరంలో బోడిగుట్ట. కనిపించలా? ఆ బోడిగుట్ట కిందనే చింతచెట్లు. ఆ చెట్ల కిందనే ఊరు. పేరంటావా– ఉప్పరపల్లె"

తాత చూపించిన దిక్కువైపు చూశాను. మైలున్నర రెండు మైళ్ల దూరం వుండవచ్చు. ఒక బోడిగుట్ట. గుండ్లతో బండ్లతో నిండుకొని వుంది. ఆ బండలు మండుతున్న ఎండలో తిరుమల కొండమీది బోడిగుండ్లు మాదిర మిలమిలా మెరుస్తున్నాయి. ఆ గుట్ట కిందనే ఒక గుంపు చింతచెట్లు. ఆ ఊరిని కాపలా కాస్తున్నదెయ్యాల మాదిరి దర్శనమిస్తున్నాయి. అయితే వూరుమాత్రం కనిపించడంలేదు.

"ఆ ఊరికి నలభై గడపలుండాయి. గడప గడపకూ అంతోఇంతో కయ్యాకాలవ వుండాది. ఆడ కోటికి పడగెత్తి నోళ్లు లేరు. కూటికి లోటైనవాళ్లూ లేరు. ఎవరి రెక్కల కష్టం వాళ్లది. ఎవరెవరి బతుకులు వాళ్లోళ్లవి నాయినా!"

తాత అనుభవంతో పండాడు. పండిన అనుభవం మాటల్లో పండుతూ వుంది. మారు పలక్కుండా వింటూ కూర్చున్నాను.

"మా వూళ్లో నల్లమ్మోళ్లంటే, నాలుగు మడకల సేద్దిగాళ్లు. నాలుగు రూకలు సేతిలో తిరగతా వుండేవాళ్లు. ఒకరి కంత పెట్టి తామంత తినగలిగినోళ్లు. ఆ ఇంట్లో నా కండ్ల ముందర్నే పుట్నాడు నాయినా నర్సిగాడు. వాడు బుద్దెరిగిన నాటినుండి వాడిబుద్ధిని గెవనిస్తానే వుండా. నోరులేని గొడ్లంటే వాడట్లానే పాణం ఇడ్సిపెట్టేసే రకం!

అదేమి యిచ్చిత్రమో కానీ, నాయినా! అదెట్లాంటి సెగట గొడ్డయినా సరే– బుడం కాయంత బుల్లోడు వాడెగిరి ఈపుమింద కూసుంటే కొమ్ము అట్టాయిట్టా అనేటివిగాదు. వాడు తోకబట్టి గుంజతావుంటే కాలట్టా జాడించేవి కావు! ఆ అలుసు చూసుకోని ఆవల దగ్గిర మేకల దగ్గిర వాడాడిందాట! పాడింది పాట!!

చిన్నప్పుడు వాడి చిలిపిచేష్టలన్నీ ఇన్నీ కాదులే. ఈ సెట్టుకింద కూసోని సందేళదాక సెప్పుకుంటా వుండచ్చు. నల్లమోళ్ల నర్సిగాడంటే గోపాలకిష్టుడనే వోళ్లు ఊళ్లో వాళ్లంతా!

అట్టాంటోడికి ఒక జత కోడె దూడల్ని మేపాలని మునాస పుట్టింది నాయినా! వాళ్లకేమి? లేనోళ్ల సంగతేమో కానీ, ఉన్నోళ్లు తల్సుకుంటే తాళలేరు. లేడికి లేచిందే పరుగన్నెట్టుగా పరమట పలమనేరు పర్సకు పొయ్నాడు. జోడు కోడెల్ని పట్టుకోని వచ్చినాడు. ఒకదాన్ని చూసినట్టు ఇంకొకటి చూసేదానికి కండ్లేచాలవు నాయినా! ఒక్క అమ్మ కడుపులోనుండి ఒల్చుకోని వచ్చినట్టుండేవి!

అసలే వాడికి పసువులంటే పాణం గదా. పరసలో ఏరికోరి కలేసిన గిత్తలు. కొమ్ములు సివ్వినాడు. కుప్పులు తొడిగినాడు. కుప్పులకు కుచ్చులు కట్టినాడు. నడువుకు నల్లెంటికి దారం కట్టినాడు. మెడకు మెడపట్టెళ్లేసినాడు.

అప్పిటికే వాడు ఇద్దరి బిడ్డల తండ్రి, అయితే కూడా యే పొద్దన్నా పెండ్లాం సిగ సిక్కు తీసిందా? సిక్కుదీసిన సిగలో సీవిన్ని సెండుమల్లెలు తురిమిందా? అని తల్సిన పాపాన పొయ్యుండదు.

మల్లెపూలంటే మతికొస్తా వుండాది. కురు కురు మీసాలొచ్చే పాయాన మా యాడది కడుపుతో వుండి మల్లెపూల మింద మోజుపడింది. నువ్వు నిజంజెప్పినా యింటావు. అపద్దం జెప్పినా యింటావు అబ్బోడా! ఆమడదూరం అరగెంటలో నడ్సినాను".

అనుభూతి విభూతి పులుముకొన్నట్టు తాత ముఖం వెలిగిపోతూ వుంది.

కడుపార తాగడానికి దోసెడు నీళ్లు లేవు. తినడానికి పిడికెడు కూడు లేదు. ఒంటినిండా గుడ్డలేదు. దినమూ ఆ గొడ్ల వెంబడి ఎండన పడి వరటకపోయిన ఒళ్లు.. గుంతలు పడిన కండ్లు.. కరువు కాటకాల వాతపడి నలుగుతున్న బతుకు! అయినా, వలపు తలపుతో ఆ ముసలి ప్రాణం పులకరించిపోవడం– అనుభూతికి మనిషిమీద ఎంత అధికారం వుందనిపిస్తూ వుంది.

ఆ క్షణంలో వీధి వాకిటికానుకొని చూపుల్ని వీధికి గుచ్చి నాకోసరం ఎదురుచూసే శ్రీమతి చుట్టూ తిరగడానికి పరుగులెత్తిన చూపులు తాత మాటతో చెట్టుకిందికి చేరుకొన్నాయి.

"అబ్బోడా! గొడ్డుబోతోడికి కూడ బిడ్డలంటే బెంగ. ఆ మాటకొస్తే నువ్వయినా నేనయినా ఇట్లా కన్నగసాట్లు పడ్తా వుండేది కనుక్కుణ్ణె బిడ్డలకోసరమే గదా! నర్సిగాడిక్కూడా ఒక్కరి కిద్దరు బిడ్డలు. వాడి పాసుగూల! ఆ బిడ్డల వుచ్చి మిందకంత సమురుందో? లేదో? అని చూసుకునే వాడో లేదోకానీ, పొద్దు మొలిసీ మొలవక ముందే బుడిగ సమురు ఆ గొడ్ల మింద కుమ్మరించి రుద్దతా కూసునేవోడు.

'ఒరే నర్సిమ్మా! మా ఎద్దు మంచిది. మా ఎద్దు మంచిది! అని కొమ్మెత్తి ముక్కులో దోపుకుంటే ముక్కు చినిగి పొయ్యిందంట. అట్టుండాది గదరా నీ యవ్వారం!' అని దోవనపోతా వుండే వాళ్లెవరైనా అంటే– ఒక ఎర్రినవ్వు నవ్వతా ఎడమ సెయ్యెత్తి కుడిమీసం మిందబెట్టి, కుడిచేత్తో ఎద్దు ఈపును తట్తా– 'హు! ఈగెవాల్తే నా సామిరంగా! జారిపోవద్దంట్రా!' అనేవాడు.

వాడట్లా అంటా వుంటే వాడిపెగ్గెను పదిబండ్ల కెత్తాల్సిందే నాయినా!

వాడే అట్టా మాదిరనుకుంటే... ఆ గొడ్లు కూడా అంతే! వాడు మేపెయ్యాల్సిందే! వాడు నీళ్లు తాపాల్సిందే! వాడు గాటకట్టి తవుడు పెట్టాల్సిందే!

వాడు గెడియ కంటపడకపోతే అరిసి ఆగడం చేసేవి ఆ గొడ్లు!!

ఒకసారి ఏవీలేదు. నర్సిమ్ముడికి జరం తగిలింది. కాళ్లూ సేతులు కుక్కలు బీకినట్లు పీకతా వుండాయని వాడట్లా మంచాన పడినాడు. ఇంకజూడు, నాయినా! ఆ గొడ్ల గెతి. ఒకర్ని పగ్గమట్టా పట్టనిచ్చినాయా? నీళ్లమొకం చూసినాయా? గెడ్డిపోచట్టా కొరికినాయా? కొంపలు మునిగినట్టు అవ్వి కట్టు గూటాన పడి కన్నీళ్లు కారస్తావుంటే అదొక ఇంత మాదిర ఊరూ నాడూ ఒకటై చూసింది.

ఆ గొడ్ల గోడు చూడలేకనే వాడు మూడోదినానికంతా ముక్కతా మూలగతానే లేసి తిరిగినాడు.

మనిషికి మనిషికీ మధ్య లేని ఆత్మీయతానురాగాలు మనిషికి గొడ్డుకు మధ్య కట్టు కథలాగ తోస్తూంటే నా కండ్లల్లో ఆశ్చర్యం పూలు పూస్తున్నాయి.

తాత దేనికోసమో వెదుకుతున్నట్లుగా అటు ఇటు చూశాడు. కొంకిదోటి చేతికందు కొన్నాడు. ఆ దోటి కట్టెను తిప్పించి వీపు గోక్కోవడానికి ప్రయత్నిస్తున్నాడు. దురద తీరనట్లుంది. మర్రిచెట్టువంక ఆశగా చూశాడు. అది బుడపలు తేలి వుంది. లాభం లేదనుకొన్నాడేమో? 'రాములూ!' అని ఒక్క అరుపు అరిచాడు.

ఒక్క తరుపు మెరుపులా వచ్చి తాత ముందు నిలబడింది– నన్నాశ్చర్య పరుస్తూ!

తాత వీపు చూపించాడు. ఆ వీపుమీద చెమట కారి కారి ఎండకు ఉప్పు తేలింది. ఆ వీపును ఆప్యాయంగా నాకుతూ వుందా నోరులేని గొడ్డు. సహించినట్లుగా వీపును అందిస్తున్నాడు తాత.

ఆ గొడ్డుకున్న గుండెలు...

కోట్లకు కోట్లుగా నిధులు కరువు పనులకని విడుదల చేస్తుంటే ఆ నిధుల్ని మధ్యే మార్గంలో మాయం చేసే మహనీయులకుంటే?...

అలాంటి మహనీయులపైన ఈగ వాలకుండా సంరక్షిస్తున్న సహృదయులకుంటే! నీకుంటే? నాకుంటే??...

నా మనసు నోరై అడుగుతూ వుంది. ఎవడున్నాడు సమాధానం చెప్పగలిగే మొగలాయి? పెదవి విరుపులో తొంగిచూసి తొలిగిపోతున్న నిస్సహాయత.

“అట్లా పాణానికి పాణంగా సాకతావుంటే ఈ మాయదారి కరువు వచ్చిపడింది. ఇంక జూడబ్బోడా వాడగసాట్లు! కుక్కలకెరిక!”

తాతవైపు చూశాను. వీపు దురద తీరినట్లుంది. రాముడు వెళ్లిపోతున్నాడు. పై తుండుగుడ్డను మెలిబెట్టి రెండు చేతలతో రెండుచివరల్ని పట్టుకొని వీపుమీద తడిని రుద్దుకొంటూ చెబుతున్నాడు.

“తెల్లారేయాళకు నాలుగ్గట్టల వరి కసువు.. మద్దేణాల కాడ నోటికి ఉప్పంగా అయిదారు కట్టల రాగిచొప్ప... నాలుగుబార్ల పొద్దుకాడ కాలాడాలని ఎలదోల్తే గెనిమల మింద గెరిక్కసువు.. పొద్దుగుంకేటప్పుడు బుట్టెడు తవుడూ, గానిగపిండి.. జావురేత్తిరికాడ రొండుమోపుల పచ్చిగెడ్డి– యిట్లా తింటావుండిన గొడ్లకు ఈ కరువుకాలంలో ఎట్లా తెచ్చేసేదంత మేపు?

అయినా వాడి తిప్పలు వాడు పణ్ణాడు. కొన్నంతకొన్నాడు. 'ఈ కరువు కాలంలో మణుసులకు తిండి దొరికేదే వొక గండంగా వుంటే– నువ్వు కొంపనిట్లా సదరం జేసిగొడ్లకు బెడ్తే యింక బతికేదెట్ట?' అని కొంపలో రంపు రగలబడేటప్పటికి నాయినా! వాడు అడువుల మింద పణ్ణాడు.

మామండూరు అడవి వుండేదేడ? దగ్గిర దావాదమా? తొలి కోడి కూసేయాళకాడ దోసిడు కూట్నీళ్లు నోట్లో పోసుకొని ఎలబారిపోతే పొద్దు తిరిగేయాళకు మోపు కసువు దెచ్చేవోడు. ఆ ఒక్క మోపు కసువు ఆ గొడ్ల కేడికి సాల్తింది నాయినా! చాలనప్పుడు అట్టా యిట్టా జూసి దొంగిలించేదానిగ్గూడ ఎనకాడ లేదు వోడు.

అద్దో! ఈ పొద్దు కురిస్తింది వాన. రేపు కురిస్తింది వాన! అని ఆకాశంకల్లా ఎగజూసెగ జూసి యాసారి పొయ్‌నాము. ఇంక వానలు కురవ బొయ్యేదిలేదు. మణిసీమట్రా బతకబొయ్యేది లేదు. గొడ్లకింత మేపు దొరకబొయ్యేది లేదు. గొడ్డు గోదా కట్టుగూటాన పడి చావాల్సిందే! అనుకునేకుందికి కోడె దూడల్ని అమ్మేయాలనుకుణ్ణాడు నర్సిగాడు. ఎట్లా తన గాట్లో కసువు లేదు. కసువుండే గాటికైనా పోనీలే! అని సరిపెట్టుకుణ్ణాడు.

వాడట్లా అనుకుంటూ ఉండంగానే ఊర్లో ఒక ఆసామి దిగబడడమూ కల్సి మాట్లాడుకుణ్ణెట్టు జరిగిపాయ

"కోడెదూడ లిస్తావా?" అడిగినాడాసామి.

ఆ ఆసామిని ఎగాదిగా చూసినాడు నర్సిగాడు.

ఆ ఆసామి ఎనిమిది మూరల మల్లుపంచె 'సైకిలు కట్టు' కట్టినాడు. పంచెకట్టు మింద తెల్లటిఅరచొక్కా తొడిగినాడు. సుంగిడిసి తలగుడ్డ సుట్టినాడు. ఏలేలికీ వుంగరాలూ.. ఎడమసేతికి గడియారం.. కుడిసేతిలో బెత్తం.. బాగా ఎసులుబాటుండే రైతో లేకుంటే మారుబేరాల దళారో అనిపిస్తా వుండాడు.

"ఇస్తాను సూడు" అన్నాడు నర్సిగాడు.

ఆసామి సూసినాడు అబ్బోడా! కొమ్ము తీరు సూసినాడు. పలు వరస కట్టి సూసినాడు. కాటిక్కండ్లేవో అని కండ్లు సించుకోని చూసినాడు. సుడీ గిడీ ఉండాదేమో గెవనించినాడు. ఒక గాట్నుంచి ఇంగొక గాటికి మార్చే మంచోడి మాదిర్తో మీసం మెలేస్తా, ఎంత? అని అడిగినాడు.

బొట్నేలిని మడిసి అరిచేతిని చూపించినాడు. నర్సిమ్ములు నాలుగేలు అన్నెట్టుగా.

"తీసుకో!" అన్నాడాసామి.

అబ్బోడా! ఆడబిడ్డను సాకి సంతరిస్తాము. సల్లంగా బతకాలని ఎవుడో ఒకడి సేతిలో పెడ్తాం. తీరా ఆ బిడ్డె ఇల్లొదిలిపొయ్యేటప్పుడు ఇల్లెగిరి పొయ్యేటట్టు ఏడస్తాం. నర్సిమ్ముడి గెతిగూడా అట్లనే అయ్యింది. మాట జారేదానికేమో జారేసినాడు. దుడ్లు తీసుకోమనేకుందికి వాడి సంగటం దేవుడికెరిక!

దుడ్లు చూస్తాడు. గొడ్లను చూస్తాడు. ఆసామిని చూస్తాడు. ఎట్లా సెప్పలేక సెందలేక అట్లా యిట్లా సూస్తాడు. సేతులు నలుపుకుంటాడు. జుట్టు పీక్కుంటాడు. ఎట్లా తోసక ఎ[్రిగా సూస్తా నిలబడుకుణ్ణాడు.

"ఇద్దో దుడ్లు తీసుకోని ఎంచుకో!" ఆసామి తొందరపెడ్తా వుండాడు.

ఆసామి సెయ్యి చాపతావుంటే నర్సిమ్ముడి సెయ్యి ముడచకపోతా వుండాది. అందుకే పెండ్లాన్ని రమ్మని గావుకేకపెట్నాడు. ఎందుకో? ఏమో? అనుకోని ఆ ఇల్లాలు ఉన్న పళంగా వచ్చి నిలబడ్తే 'దాని చేతికిచ్చేయ్!' అని అంటా మొకం సూపించలేకుండా మొకాన గుడ్డేసుకోని పారిపొయ్నాడు.

యాడేడ తిరిగినాడో ఎట్టెట్టా ఏడ్సినాడో? తిండి తిప్పలు లేకుండా తిరిగి తిరిగి ఆ మరసటి నాడు పొద్దుగూట్లో పడే యాళకాడ ఇంట్లో అడుగుబెట్టి అట్లానే రెప్పార్చకుండా నిలబడిపొయ్నాడు.

గాటినిండా కసువు. ఆవురావురని తింటా కోడె దూడలు!

వాడి కడుపు నిండిపొయ్యింది.

"ఆసామికి ఇంకా పదిగాండ్ల గొడ్లు కావాలంట! నువ్వట్లా పోతానే దుడ్లు నాచేతికిచ్చేసి నాడు. సందేళకు బండి కసువు తోలించినాడు. పదిగాండ్లు కొనాలని పాయకట్టు మింద పణ్ణాడు. ఆయరవదాకా మన దూడల్ని మన గాట్నే కట్టేసుకోమన్నాడు." పెండ్లాం మాటల్తో నర్సిమ్ముడి మణుసు కుదటపడింది.

వారం తిరక్కముందే ఆసామి పాయకట్టంతా కాలికి బలపం కట్టుకోని తిరిగి తిరిగి బాగా కండమిందుండే పదిగాండ్లను పట్టకచ్చినాడు. నర్సిగాడింటి ముందర్నే గూటాల్దించి కట్టేసినాడు.

నర్సిముణ్ని పట్టేదానికి పగ్గాల్లేవు నాయినా! అసలే వోడికి పసువులంటే పాణంగదా? అవన్నీ తన గొడ్లే అనుకుణ్ణాడు. ఆ గొడ్లకంతా మేపేసేదీ వాడే! నీళ్లు జూపేదీ వాడే! పేడకళ్లెత్తేసేదీ వాడే! ఆ ఊపులో వాడు గొడ్లను అమ్మేసిన సంగతే మర్చిపొయ్నాడు.

వాడి పిచ్చిలోపడి వాడు కొట్టకపోతా ఉంటే ఒకనాడు బల్లుమని తెల్లారేళకు ఒక లారీవొచ్చి ఇంటిముందర నిలబడింది. ఆ లారీని సూసేకుందికి యాడలేని అక్కర గలిగింది ఆసామి

మింద నర్సిమ్ములికి. ఎందుకంటావా అబ్బోడా! వాడు కోడెదూడల్ని పట్టింది పలమనేరు పర్సలో గదా? పలమనేరంటే పదామడల దూరం. ఆడ నుండి మూడు పొగుళ్లు మూడు రాత్రిళ్లు దూడల్ని నడిపించుకొనే వొచ్చినాడు. ఇప్పుడాసామి అడుగు కింద బెట్టకుండా గొడ్లకేమాత్రం దెప్పరం తగలకుండా లారీమిందెక్కించి తోలకపోతా ఉండాడంటే మణిసి ఎంత మంచోడు? అని అనుకుణ్ణాడు. చెయ్యెత్తి దణ్ణం పెట్టుకుణ్ణాడు. దగ్గిరుండి కోడెదూడల్ని లారీకెక్కించినాడు.

డైవోరెక్కి కూసుణ్ణాడు.

"అయ్యా! అయ్యా!! ఒక్క నిమిశం నిలబడండయ్యా! నా గడప దాటిపోతా ఉండే గొడ్లు. ఏ గడపలో కాలు బెట్తాయో? ఏమో? ఆ గడపలో పాలు పొంగాల! టెంకాయ సుట్టికొట్టాల. ఎర్రనీళ్లు దిగదీసి పొయ్యాల. వస్తానుండండయ్యా!!" అంటూ ఇంట్లోకి పరిగెత్తినాడు నర్సిమ్ములు.

గంగాళం తట్టెత్తుకుణ్ణాడు. దాంట్లో అన్ని నీళ్లుపోసుకుణ్ణాడు. చిటికెడు పసుప్పొడి రవ్వంత సున్నం ఏసి కలగలపతా ఉండాడు.

"అంబా!" అని గుండెలు అవిసిపొయ్యేటట్లు అర్సినాయి కోడెదూడలు. ఆ అరుపుతో ఇంటి కప్పెగిరి పోతిందేమో అనిపించింది. వాడు అర్సి నాడబ్బోడా! చావు అరుపు అర్సినాడు. సేతిలో తట్ట సేతిలో ఉండంగానే ఒక్క లగువులో వచ్చి వాకిట్లో పణ్ణాడు.

లారీ ఎలబారిపోతా ఉండాది!

లారీలో వాడి కోడెదూడలు. కుప్పగా కూలబడుండాయి. వాణ్ణి సూస్తానే లేవ జూస్తాయి. లెయ్యలేక "అంబా! అంబా!" అని గొంతు చించుకుంటాయి. మల్లా మోర ముందుకు సాస్తా లేసేదానికి ముంపతాయి. లెయ్యలేక కుప్పగా కూలబడ్తాయి. గుండెలవిసేటట్లు 'అంబా' అని అరస్తాయి. మల్లా లేసే దానికి ముంపతాయి. ఎట్లా లేస్తాయి నాయినా? మోకాలి చిప్పలు ఇరగ్గొట్టుంటే?

లారీలో ఎక్కిన ఆసామి మణుసులు కొందురా గొడ్లకు మోకాలిచిప్పలు ఇరగ్గొడ్తా వుంటే, కొందరు కండ్లు పొడిసేస్తా వుండారు. ఆ లారీలో ఆ గొడ్ల చావు అరుపులు ఏమని సెప్పమంటావు నాయినా? లారీ చుట్టూ చేరినోళ్లు– అయ్యో! అయ్యో! అంటా వుంటే అయ్యో లేదు. గియ్యో లేదు. రేప్పొద్దన గొంతులు కోసే గొడ్లకు ఇప్పుడు మోకాల్చిప్పలు తీసేస్తే మునిగిపొయ్యిందేముంది? పదండ్రా?" అన్నాడాసామి.

లారీ ఆగమేగాల మింద పోతా ఉండాది.

ఆ లారీలో నుండి రగతం నాయినా! పై మొబ్బు సినుకల్లా పడ్తా ఉండాది.

నర్సిమ్ముడి చేతిలో గంగాళం తట్ట జారిపడిపొయ్యింది. వాడు కుప్పగా కూలబడినాడు. 'బొరో!'మని ఏడస్తా నెత్తుర్లో తడిసిన మట్టిని దోసిడు జవురుకుణ్ణాడు. 'ఒరే! నీ యాలితాడు తెగ. నీ నోట్లో ఈ మట్టి పడా! నీ దుడ్లు నీకిచ్చేస్తా. నా గొడ్లు నాకిచ్చేయ్!' అంటూ ఆ లారీ ఎంటపణ్ణాడు. ఎంత దూరమని పరిగెత్తతాడు. నాయినా! యాడనో ఒకసోట బోర్ల బొక్కల పడనే పణ్ణాడు. తల దిమ్మదిరిగేటట్టు దెబ్బ తగలనే తగిలింది. ఆ పొద్దుట్నుంచీ ఇంతే! 'నీ దుడ్లు నీకిచ్చేస్తా! నా గొడ్లు నాకిచ్చేయ్!' అని కనిపించిన వాణ్ణంతా అడగతా వుంటాడు. ఎవరిస్తారు? ఎట్లా ఇస్తారు??"

తాత గొంతు పూడుకుపోయింది.

నా మనస్సులో మనసు లేదు. నన్నాచెట్టు కింద వదలి అదెప్పుడో ఆ 'పిచ్చోడి' వెంటపడింది. ఎంత ద్వేషించినానో అంత అభిమానిస్తున్నాను వాడిని.

"ఏందో నాయినా! ఆ గొడ్లను మడక కడతాము. మోట కడతాము. పొలాల్లో పంట పండిస్తాము. ఆ పంటను కోసుకుంటాము. కొదవకా గొడ్లనూ కోసుకోని తింటాం. పిడికెడు కసువు కడవ కుడితి నీళ్లు వాటి మొకాన గొట్టి బతికినప్పుడేమో అట్లా సతాయిస్తాం. సచ్చినాక ఇదో ఇట్లా కాళ్ల కిందేసి తొక్కతాము?"

తాత లేచి నిలబడి కాళ్లకు చెప్పులు తొడుక్కోవడానికి యత్నిస్తున్నాడు.

నేను తాత గుండెని అందుకోవడానికి ప్రయత్నిస్తున్నాను.

కానీ... కానీ... తాత చెప్పులకింద నలుగుతూ నాగుండె కన్నీళ్లుగా కరిగి!

✡

# నిరసన

**–కె.వరలక్ష్మి**

"ఇయ్యాల సూన్నారాయణమూత్తి మొకవైనా సూణ్నేదు"

సణుక్కుంది ముసిల్ది. "పొద్దుటేల్నుంచి ఆకాశానికీ బూవికీ తెరకట్టేసింది వోన"

వంగిపోయిన వెన్నెముక మధ్యభాగాన్ని గోడకానించి ముడుచుకుపోయి కూర్చుంది. పళ్లన్నీ ఊడిపోయిన బోసినోట్లో ఏదో ఉన్నట్టు నముల్తోంది.

పక్కనే ఇటుకల పొయ్యి మీద పెద్ద మూకుడు పెట్టి బూరెలొండుతోంది ముసిల్దాని కోడలు గంగమ్మ. పూర్ణాన్ని పిండిలో ముంచి మరుగుతున్న నూనెలో పొంగుతున్నాయి బూరెలు. పొయ్యికటువైపు కూర్చున్న మంగమ్మ పెద్ద చట్రంతో బూరెల్ని వేయించి తీస్తోంది.

కొంచెం అవతలగా పూర్ణం ముద్ద ఉన్న పళ్లెం చుట్టూ నలుగురైదుగురు ఆడాళ్లు కూర్చుని ఉండలు చేస్తున్నారు.

"ఓలమ్మీ, ఉండలు సిన్నై సెయ్యండి. అసలే ఊరి బంతి. అడిగినన్ని బూర్లెయ్యకపోతే తప్పడతారు కులపోళ్లు" అంది గంగమ్మ, వండి గుట్టగా పోసిన బూరెల్ని పళ్లెంలోని పూర్ణాన్నీ మార్చి మార్చి చూసి బేరీజు వేస్తూ.

"ఓలి గంగమ్మా, సల్లారిన బూరొకటి నాకెట్టోలమ్మి" అడిగింది ముసిల్ది ఆశగా.

"బూరీలేదు గారీలేదు, నోరు మూస్కుని గమ్మునుండు" కసురుకుంది గంగమ్మ. ఒక్క క్షణం ఊరుకుని ముసిల్ది సన్నగా ఏడుపు లంకించుకుంది. "ఓరి తమ్ముడో నారయ్యో... నాకన్నా ముందే ఎలిపోనావెందుకురో..."

ఉండలు చుడుతున్న నారయ్య మనవరాలు లక్ష్మి కిసుక్కున నవ్వింది. ఆ పిల్ల నవ్వు చూసి అందరికీ నవ్వొచ్చింది. సందర్భం కాదని బలవంతంగా ఆపుకున్నారు.

అరచేతి నిండా పూర్ణం తీసుకుని కళ్లు కనపడని ముసిల్దాని అరచేతిలో కుక్కి ఏమెరగనట్టు వచ్చి కూచుంది లక్ష్మి. ముసిల్ది యాలకపొడి వాసన్ని పసికట్టేసింది. టక్కున ఏడుపాపేసి

ఎడం చేతిలోని పూర్ణాన్ని కుడి చేత్తో కొంచెం కొంచెం తీసుకుని నోట్లో వేసుకుని చప్పరించడం మొదలు పెట్టింది.

"నీకు మంచి మొగుడొత్తాడే లచ్చిం తల్లీ" అని నవ్వింది గంగమ్మ.

తోటపల్లి కొండల్లోని ఆ వూర్ని గొల్లపాలెం అంటారు. ఉన్న నూటొక్క గడపా గొల్లలవే. రాములయ్య గారి అరుగు మీద దుకాణం పెట్టి వెచ్చాలమ్మే కోమటి జగన్నాథం, చెక్క బడ్డీ కొట్లో క్షవురాలు చేసే మారయ్య, వారానికో రోజొచ్చి బట్టలు పట్టుకెళ్లే రజకులూ అంతా పొరుగూరి నుంచే వస్తారు. ఆఖరికి శుభానికీ అశుభానికీ నేనున్నానంటూ పంచె బిగించి పౌరోహిత్యం నెరిపే పంతులు పేరయ్య కూడా పక్కనే ఉన్న శాంతి ఆశ్రమం నుంచి వస్తాడు.

ఆ ఊరి మగపిల్లలంతా గోచీ పెట్టుకోవడం నేర్వక ముందునుంచే మేకల వెనక కొండకోనల్లో తిరగడం నేర్చుకుంటారు. ఆ వూరి ఆడపిల్లలు అయిదేళ్లకే అడ్డెడు బియ్యం వుడికే అన్నం గిన్నెని వారుస్తూ ఉంటారు. ఎక్కడో క్రమం తప్పిపోయి బడికెళ్లాలనుకునే బుడతలు నాలుగు మైళ్లు నడిచి శాంతి ఆశ్రమం నడిపిస్తున్న బడికెళ్తూ ఉంటారు.

అలా తప్పిపోయి చదువు పాలబడిన వాడే నారయ్య నాలుగో కొడుకు నాగేశం. అతగాడు బస్తీలో మున్సిపలాఫీసులో ఆఫైగా పన్జేస్తూ రెండు చేతులా ఆర్జిస్తున్నాడు. నాగేశం పెళ్లాం నళిని మెడనిండా చేతులకీ, చెవులకీ కొట్టొచ్చినట్టు కనపడే బంగారం ముద్దల్ని దిగేసుకుంది. కాళ్లకి బెత్తెడు వెడల్పు పాంజీలు పట్టీలు పెట్టుకుంది. తనపై ముగ్గురు తోడికోడళ్లూ ఆ కొండల్లోనే పుట్టి పెరిగిన వాళ్లు కావడం, పొట్ట కోసినా అక్షరం ముక్కరానివాళ్లు కావడం వల్ల వాళ్లంటే చిన్నచూపు నళినికి. ఆవిడ బస్తీలో ఇంగ్లీషు మీడియంలో ఎనిమిదో తరగతి చదివింది. పై ముగ్గురూ చదువురానివాళ్ళైనా నోరులేని వాళ్లు కారు, కాని ఎప్పుడో ఏ శుభకార్యాలకో తప్ప ఆ ఊళ్ళో అడుగుపెట్టని నళిని అంటే కాస్త భయం లాంటిదేదో ప్రదర్శిస్తుంటారు ముఖమ్మీద. వెనకాల మూతివిరుపులూ, ముక్కువిరుపులూ మామూలే.

నళిని తండ్రి పోలీస్ డిపార్ట్‌మెంటులో యస్సైగా చేసి రిటైరైనవాడు. అతగాడికిప్పటికీ ముక్కా, గ్లాసూ లేందే ముద్ద దిగదు. అదిగో ఆ పనిమీదే బలిసిన కోడిపెట్టకి ఈకలు పీకే కార్యక్రమంలో నళినీ వాళ్లమ్మా నిమగ్నమైపోయి ఉన్నారు.

రెండో కోడలు బూరెమ్మ పూర్ణం చేస్తున్న చేత్తోనే బుగ్గలు నొక్కుకుంది. "అవ్వ! ఇదెక్కడైనా ఉందా? ఇయ్యాల కోళ్లూ, కుక్కలూ తిండం, మాదసలె బేపన మతం" అంది అక్కడి వాళ్లకి మాత్రమే వినపడేలా. వాన కురుస్తూనే ఉంది. ఇంటెనకాల అన్నం గుండిగలు ఉడుకుతున్న గాడిపొయ్యి, పైన వేసిన నాలుగాకుల పందిరినీళ్లూ, నేలమీద ప్రవహించే వాననీళ్లూ వెళ్లిపోయి సుయ్యిసుయ్యిమని ఆరిపోతోంది. కాని బాగా ఎండిన అడవికట్టెలు కావడం వలన ఊదినప్పుడల్లా గప్పుమని మంటలేస్తోంది.

పెద్దకోడలు సింవాచెలం తలమీదేసుకున్న పాత కోకగుడ్డని మరోసారి పిండింది. పొయ్యి ఊదీ ఊదీ ప్రాణం చాలొస్తోందావిడకి. పొగకి కళ్లూ, గొంతూ మండిపోతున్నాయి. నడుం బాగా సలుపుతోంది. ఉక్రోషం పట్టలేక 'ఓలచ్మీ' అనరిచింది.

చేతిలో పూర్ణం ఉండని జారవిడిచి వానలోకి పరుగెత్తింది లక్ష్మి.

కొండల్లో వాన! మహ చల్లటి వాన!

"వ్వొవ్వొవ్వొ" అని ఒణుక్కుంటూ వచ్చిన కూతుర్ని చూసి సింవాచెలం కోపం గాలికెగిరిపోయింది. ఆ పిల్ల కట్టుకున్న ఎర్ర లంగా జాకెట్టు తడిసి ముద్దయిపోయాయి. మార్చి కట్టుకోవడానికి మరో జత లేవన్న మాట గుర్తుకొచ్చి పిచ్చి కోపం వచ్చేసింది సింవాచెలానికి.

"నీకేవన్నా బుద్ధుందంటే, వానలోకొచ్చి ఉన్న గుడ్డలు కాస్తా తడిపేసుకుంటావా?" అంది. గట్టిగా అరవాలనుకున్నా పొద్దుట్నుంచి ఉపవాసం వల్ల గొంతు లేవలేదు.

"నువ్వేకదే పిలిసేవూ..." అంది లక్ష్మి ఎందుకన్నా మంచిదని ఒకడుగు వెనక్కేసి.

దూరంగా చింతచెట్టు కిందనించి మలుపు తిరిగి ఇంటివేపొస్తున్న మగవాళ్లు కన్పించేరు. "ఓలమ్మో, ఆళ్లొచ్చేస్తన్నారు. ఇంకా ఏపనీ తెవల్లేదు. ఎల్లెల్లు, ఆళ్లకి కాళ్లు కడుక్కోటానికి నీళ్లెట్టు" అని కంగారు పడిపోయింది సింవాచెలం. మావగారి దినకార్యాల బాధ్యతంతా పెద్దకోడలిగా ఆవిడే భుజాన్నెత్తుకుంది. మూడోకోడలు చంటిబిడ్డ తల్లి. పురిటిమంచం మీదుండడం వలన ఆవిణ్ని ఎడంగా పెట్టేరు.

ఆ తోటపల్లి కొండల్లో నారయ్య పుట్టి ఎనభై ఏళ్లు దాటిపోయాయి. చచ్చిపోయే ముందురోజు దాకా మేకల్ని తోలుకుని కొండల్లోకి వెళ్తూనే ఉండేవాడు. చెయ్యెత్తు ఆజానుబాహువు నారయ్య. వయసులో ఉన్నపుడు అద్దెడు బియ్యం అన్నాన్ని అతిచులాగ్గా తిన్న జఠరాగ్ని అతనిది. పిల్లలు పుట్టి సంసారం పెరిగేక కొంత వడి తగ్గించుకోవాల్సొచ్చింది.

తాత తండ్రులిచ్చిన అరెకరం కొండ్రనీ ఆరెకరాలు చెయ్యడానికి నానా పాట్లూ పడ్డాడు నారయ్య.

నలుగురు కొడుకుల తర్వాత పుట్టినకూతురు ముచ్చటపడిందని ఆశ్రమం బళ్లో పదోతరగతి చదివించేడు. ఆ ఊరి చరిత్రలో అంత ఎక్కువ చదువు చదివిన ఆడపిల్ల నారయ్య కూతురు అన్నారవే. అన్నవరం రైల్వేస్టేషన్లో పోర్టరుగా పనిచేసే పోలిగాడు కోరి మనువాడేడు అన్నారాన్ని. ఉన్నంతలో కూతురి పెళ్లి వైభవంగా చేసి అత్తోరింటికి అంపకం పెట్టేడు నారయ్య. ఆ తర్వాత చుట్టు గుడిసె పడగొట్టి నలుగురు కొడుకులకీ నాలుగు గదులొచ్చేలా పెంకుటి లోగిలి కట్టేడు. కొడుకుల పెళ్లిళ్లు చేసి వాళ్లకి పిల్లలు పుట్టేక ఎవరి మేకల్ని వాళ్లకి పంచిచ్చి వేరు కాపరాలు పెట్టించేడు.

ఎవరింట్లో ఓ ముద్ద తిన్నా గడిచిపోతుందనే వేళకి నారయ్య భార్య కాలం చేసింది. ఆ మరుసటేడు కూతురు తలచెడి ఇద్దరు పిల్లల్తో తండ్రి పంచకొచ్చి చేరింది. అక్కడి నుంచి మొదలయ్యేయి నారయ్య పాట్లు. పంటంతా కూతురికి పెట్టేస్తున్నాడో అనే గోల మొదలైంది. ఇంటికొచ్చిన ధాన్యాన్నీ, కొత్తగా పుట్టిన మేకపిల్లల్నీ వెయ్యి కళ్లతో చూసుకోవడం మొదలు పెట్టారు కొడుకులు.

నాగేశం ఎలాగా బస్తీలో ఉంటాడు కాబట్టి తండ్రినీ, చెల్లెల్నీ ఆ వాటాలో వేరు పెట్టేరు. ఒళ్లు మండి నలుగురు కొడుకులకీ నాలుగెకరాలు రాసిచ్చేసి మిగిలిన రెండెకరాల్నీ తన పేరుతోనే ఉంచుకున్నాడు నారయ్య. కరణాన్ని సలహా అడిగి అయిదు రూపాయల స్టాంపు పేపరు మీద ఆ రెండెకరాలూ తన తదనంతరం తన కూతురికి చెందాలని రాయించేడు రహస్యంగా. అది బయటికి పొక్కనే పొక్కింది.

ఇంటికి కట్టేటప్పుడే కొడుకులకి రాసిచ్చేయడం వలన ఇంట్లో తన వాటాకి అద్దె కట్టమని ఒత్తిడి తెచ్చేడు నాగేశం. పౌరుషానికి పోయి ఇల్లు ఖాళీ చేసి పొలం గట్టున చుట్టు గుడిసె వేసుకుని కూతుర్నీ, పిల్లల్నీ తీసుకుని వెళ్లిపోయాడు నారయ్య. పులిమీది పుట్రలా ఏలేరునుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కెళ్లే కాలవొచ్చి నారయ్య భూమిలో ఒక ఎకరాన్ని మింగేసింది. ఆ దెబ్బ అతన్ని బాగా కృంగదీసింది. ప్రభుత్వం దయతలచి ఇచ్చిన కాంపన్సేషను డబ్బుతో ఆరు మేకల్ని కొనుక్కుని మళ్లీ బతుకు నిచ్చెనలో మొదటి మెట్టుకొచ్చేడు నారయ్య.

రెండేళ్లైనా గడవకుండానే అతనికి పిలుపొచ్చింది. 'ఆరోజెందుకో మేకల్ని కొండల్లోకి మళ్లనియ్యలేదు. గుడిసె గుమ్మంలో కూర్చుని కొండ్ర గట్టు మీద మేకల్ని వదిలిపెట్టాడు. మేకల్ని చూస్తున్న కళ్ళల్లోంచి జీవుడు ఎప్పుడెగిరిపోయాడో ఏమో! కాలవలోంచి నీళ్లు ముంచుకొస్తున్న అన్నారం నెత్తిమీది కడవనలాగే వెనక్కొదిలేసి 'అయ్యా' అని పరుగెత్తుకొచ్చి మీదపడిపోయింది.

అక్కడే మట్టిలో ఆడుకుంటున్న పిల్లలిద్దరూ బిత్తరపోయి ఏడుపు లంకించుకున్నారు.

కబురు తెలిపినా తమ్ముడు నాగేశం వచ్చే వరకూ శవాన్ని చూడ్డానికి కూడా రాలేదు కొడుకులెవరూ. నాగేశం వచ్చిన గంటకి అందరూ కల్సి ఏదో నిర్ణయించుకుని నారయ్య భౌతికకాయాన్ని గుప్పెడు బూడిద చేశారు.

ఆ మూల అరుగు చివర మోకాళ్లలో తల పెట్టుకుని ఒకటే కుమిలిపోతోంది అన్నారం. ఆమెకిప్పుడే ప్రపంచమంతా చిమ్మచీకటిగా ఉంది. ఎటూ దారీ తెన్నూ కానరాక అగమ్యగోచరంగా ఉంది.

"అమ్మా ఆకలే" అంటూ కుచ్చిళ్లు పట్టుకుని వేళ్లాడుతున్న పిల్లల్ని రెండంటించి దూరంగా కూర్చోబెట్టింది.

గంట క్రితం జరిగిన తతంగతం తల్చుకుంటే సిగ్గుతో ఒళ్లు చచ్చిపోతోంది అన్నారానికి.

చాపమీద పచ్చగా పసిమించిపోతున్న పులిహోర గుట్టవైపు చూస్తే దుఃఖం పొంగివచ్చింది. గడిచిన పది రోజులుగా పిల్లలూ, తనూ ఏం తిన్నారో, ఎలా పన్నేరో ఆ దేవుడికే ఎరుక. పలకరించే మరో మనిషి లేక దుఃఖంతో మతిచెడినట్లయింది. అందుకే ఇంకా ఆ గుడిసెలో ఒంటరిగా ఉండలేక తెల్లారకముందే లేచి ఇంటికి నీళ్లోసుకుని, ఉతికిన చీరకట్టుకుని పిలవని పేరంటానికొచ్చింది అన్నారం.

'నా తండ్రి దినకార్యానికి నన్నొకరు పిలిచేదేంటి' అనుకుంది. అన్నారం ఆ వాకిట్లో అడుగుపెట్టేటప్పటికే గాడిపొయ్యి రాజేసి వంటలకుపక్రమిస్తున్నారు. అన్నారాన్ని చూసి కూడా చూడనట్టే ఊరుకున్నారంతా. ఏదో ఓపన్లో కల్పించుకుందామని ప్రయత్నించబోతే చేతిలోని గిన్నెను గుంజుకుంది వదినగారు. నిశ్చేష్టురాలై కూర్చుండిపోయింది.

ఎప్పుడు తెల్లారిందో, ఎంత పొద్దెక్కిందో తెలీలేదు అన్నారానికి. పిల్లలు ఆకలో అని ఏడుస్తుంటే సిగ్గువిడిచి పెద్దొదిన్ని అడిగింది.

"ఒదినీ, పిల్లలు ఆకలికేడుస్తున్నారు. కుసింత తిండానికేవైనా..."

అన్నారంవేపు చూడకుండానే "ఇయ్యాళ పెట్టుపోతల కాడ నా పెత్తనవేం లేదమ్మా, మీ సిన్నొదిన్నడుగు" అంది సింవాచెలం తప్పించుకుంటూ.

"ఏవుందీ, కుసింత పెట్టటానికీ..." అని దీర్ఘం తీసింది నళిని.

"కొంచెం పులిహోరం తీసుకునేదా?"

పక్కనించి నళిని వాళ్లమ్మ అందుకుంది "ఏం తల్లీ, ముసిలాయన బతికున్నంత కాలం ఆయన నోటికాడ కూటిని కూడా లాక్కుని తిన్నది సాల్లేదా? ఇప్పుడింక సచ్చేకైనా నాలుగు మెతుకులు ఆ జీవికి ముట్టనియ్యరు కాబోలు నువ్వూ, నీ పిల్లలూనూ.... ఎంగిలి మంగలం చేసుకుంటారా ఎవరైనా, అదీ దినకార్యాల కాడ, అవ్వ" అని బుగ్గలు నొక్కుకుంది.

"నళినమ్మా, జాగర్తగా చూసుకో తల్లీ, లేపోతే నీ మొగుడూ ఎనకా ముందూ చూడకుండా పెడుతున్న ఈ కర్చంతా బూడిదలో కలిసిపోద్ది" అని హెచ్చరించింది.

అన్నారానికి ఒళ్లు చచ్చిపోయినట్లయింది. తనచేత ఇలా అడిగించిన పిల్లల మీద విపరీతంగా కోపమొచ్చింది. వాళ్లని పట్టుకుని నాలుగు బాదేసి, అలిసిపోయి అశక్తతో కూలబడింది. తన నిస్సహాయతకు ఏడుపొచ్చింది.

"ఓరి మాయదారి దేవుడా, ఈ బూమ్మీద ఆడదానిగా ఎందుకు పుట్టించేవురా? పుట్టి పెరిగిన పుట్టిల్లే ఇంత పరాయిదైపోయేలాగ ఎందుకు రాసేవురా ఎదవరాత? అన్నదమ్ముల

అత్తగార్లకున్న హక్కు కూడా ఆడబిడ్డలకి లేకుండా చేసేవేంరా? నీ కడుపు మాడా" అనుకుంటూ మరింత దుఃఖపడింది.

రుద్రభూమికెళ్లినోళ్ళంతా తిరిగొచ్చేరు. నారయ్య నలుగురు కొడుకులూ జుట్లూ, మీసాలూ తీయించుకుని చిత్రంగా ఉన్నారు. తల్లి పోయినప్పట్లాగా అన్నదమ్ములు నలుగురి మీదా పడి ఏడవాలనుంది అన్నారానికి. వాళ్లు కనీసం రెప్పయినా ఎత్తి ఆమెని చూడడం లేదు.

ఆ వానలో తాటాకు గొడుగేసుకుని సగం తుడుచుకుంటూ వచ్చేడు పంతులు పేరయ్య. ఇక్ష్వాకుల కాలంనాటి రంగు వెలిసిపోయిన పరలోకం తెరవిప్పి దులిపి, గోడకి మేకులు కొట్టించి, కట్టేడు. తెర ముందు అడ్డాకుల్లో స్వయంపాకాలు నింపించేడు. అరటాకుల్లో అన్నాన్నీ, వండిన పిండి వంటల్నీ వడ్డింపించేడు. అగరొత్తులు వెలిగించి, సాంబ్రాణి ధూపం వేశాడు. నువ్వులూ నూనె కలిపిన పిండి ముద్దల్ని మూడు తరాలకి పెట్టించి మంత్రాలు చదవడం కొనసాగించేడు. మధ్యలో ఆపి, "నారయ్య బాబుకింకా ఏవేం ఇష్టాలో అన్నీ తెచ్చి పెట్టండి" అన్నాడు.

"అయ్యకి కోడికూర ఇష్టం, నాలుగు ముక్కలేస్కునిరా" అన్నాడు పెళ్ళాంతో నాగేశం.

ఎదురింటి వాళ్ల పొయ్యి మీద రహస్యంగా వండుతున్న కోడికూరని నలుగుర్లోకీ తెమ్మంటున్నాడని కొరకొరా చూసింది నళిని మొగుడి వంక. దోరగా కాల్చిన మొక్కజొన్న కండెల్ని తెచ్చి అక్కడ పెట్టి దణ్ణం పెట్టింది లక్ష్మి.

ఎవరికి గుర్తొచ్చినైవాళ్లు తెచ్చి అక్కడ పెడుతున్నారు.

అరుగు మీద ఒంటరిగా కుమిలిపోతున్న అన్నారాన్ని దగ్గరికి పిల్చింది ముసిల్దాయి.

"ఓలమ్మన్నోరవా, నీ బాబు బతికున్నంతకాలవూ ఈ ఎదవలందరూ ఆడి సొమ్ము తిన్నోళ్లేగాని ఆడికింత ఏడీ ఎచ్చనా సూసెరగరు. ఇయ్యాలాడు తినందానికి ఎవులేవెట్టి ఏం లాబంలే, నువ్వదే పనిగా ఏడకో వెర్రితల్లి. సూడు, ఈ లంకపుగాకు సుట్టముక్క అక్కడెట్టీసిరా, నా తమ్ముడికిదంటే పేనం" అంది.

చుట్టముక్కని గుప్పట్లో పట్టుకుందేగాని, అన్నారం అడుగు కదిపి లోపల కెళ్లలేకపోయింది.

వాన ఆగిపోయింది.

క్రమంగా ఊరి జనవంతా కదిలొచ్చేరు. కూలీనాలీకెళ్లిన వాళ్లు కూడా వచ్చి భోజనాలు ముగిసేసరికి దీపాలవేళైంది. పిల్లలెప్పుడు తినొచ్చేరో చేతిలో చెరో బూరీ పట్టుకుని అన్నారం ఒళ్లోపడి అదే పనిగా నిద్దరోయేరు.

పొయ్యి సెగన కూర్చున్న ముసిల్దాయి తనపక్కనే ఆకేయించి, అన్నారాన్ని ఎంగిలి పడమని మందలించింది. కళ్లు వర్షిస్తూండగా కాస్తంత పరవాన్నం నాలుక్కి రాసుకుని చెంబెడు నీళ్లు తాగింది అన్నారం.

దీపాలు పెట్టేసరికి కొడుకులూ, కోడళ్లు తప్ప బైటివాళ్లెవరూ ఆ ఇంట ఉండకూడదన్నారు. నాగేశం అత్తామావా ఎదురింటిలో పడక ఏర్పాటు చేసుకున్నారు.

"నువ్వు కూడా ఇక్కడుండకూడదమ్మా, పరాయింటి కోడలివి కదా" అన్నారెవరో. అన్నారం గుండె కలుక్కుమంది. పిల్లలిద్దర్నీ చెరో రెక్కా పట్టుకుని అలుముకుంటున్న చీకట్ల మధ్య పొలం గల్ల వెంట పడి తన గుడిసెకేసి నడిచింది అన్నారం.

గుడిసె తడక తీస్తూనే నులకమంచంలో వాలిపోయింది. పిల్లలిద్దర్నీ చెరోపక్కా పొదువుకున్నా ఆమెకి ధైర్యం కలగడం లేదు.

తనకింక దిక్కెవరు? ఈ పిల్లల్ని ఎలా పెంచి పెద్ద చెయ్యాలి? తండ్రి ఇచ్చిపోయిన ఎకరం కొండ్రనీ ఎలా సాగు చేయించాలి? రేపట్నుంచి ఈ మేకల్ని ఎవరు కాపు కాస్తారు?

ఈ బుడతడు ఎప్పటికి ఎదిగి తనకో మగ దిక్కవుతాడు?

ఈ కాలవ తవ్వేక ఇంకో బెడదొచ్చి పడింది. కొండ కోనలోని జనవంతా ఏదో ఒక రాత్రి వేళ దండు మాదిరొచ్చి అక్కడక్కడా గుర్తింపు రాళ్ళు పాతేసిపోతున్నారు. ఎవడు రాళ్ళు పాతుకున్న బూవి ఆడిదేనంట. తనొకసారి బయపడతా ఉంటే తండ్రి నవ్వేసి అన్నాడు.

"ఓలి పిచ్చి తల్లీ, మన ఎకరం కొండ్రలో ఎవడొచ్చి రాయి పాతుతాడే? ఎప్పుడో వందలెకరాల్ని అన్నేయంగా మింగేసినోళ్లకి బుద్ధి సెప్పాలని ఇదంతా సేత్తన్నారు. కాలం మారింది. ఆలకీ దైర్నవొచ్చింది. కట్టీ కట్టిపేడూ కలిత్తే బలవొత్తాది. మనిసికి మనిసి తోడుంటే దైర్నవొత్తాది."

బైటి చీకటంతా అన్నారం తల్లోనే గూడు కట్టుకున్నట్టుంది. ఇలకోళ్లు అదేపనిగా గీపెడుతున్నాయి. ఎక్కడో పాముకి దొరికిపోయిన కప్ప నిస్సహాయంగా కెక్కుకెక్కుమంటోంది. కాలవకవతల కొండల్లో ఎక్కడో పులి గర్జించింది. ఉండుండీ మందలోని మేకపిల్లొకటి "మే..." అని అరుస్తోంది.

ఆలోచనల్తో నిద్రపట్టక అటు మెసలీ ఇటు మెసలీ అన్నారం చివరికో నిర్ణయానికొచ్చింది. కోపమా పాడా? వాళ్లు తన తోడబుట్టిన వాళ్లు. ఏదో తండ్రి మీది కోపంతో తనతో అలా ప్రవర్తిస్తున్నారు కానీ వాళ్లకేం తనతో శత్రుత్వమా? రేపే నాగేశాన్ని అడిగేస్తుంది, "ఒరే చిన్నన్నయ్యా, నువ్వెలాగా ఇక్కడుండవు కాబట్టి నీగది పట్టున కాస్త వండుకుతినే వీలు కల్పించరా" అని, వాడేం రాయా కాదందానికి. పోనీ అన్నాడే అనుకో, ఇరవయ్యో ముప్పైయ్యో అద్దె అడుగుతాడేమో, అడగనీ, ఏడాదికో మేకనిచ్చేస్తే ఎక్కీతక్కేను. ఈ అడవిలో కాపరం నావల్ల కాదు. పిల్లలిద్దర్నీ ఆశ్రమం బళ్లో వేసి చదివించుకోవాలి. మనసుని నెమ్మదిగా ఆశవేపు మళ్లించుకుని ధైర్యం తెచ్చుకుంది అన్నారం. పిల్లల అందమైన భవిష్యత్తుని కళ్లముందు చిత్రించుకోడానికి ప్రయత్నిస్తూండగా కనురెప్పల మీదికి నిద్ర కమ్ముకొచ్చింది.

"అన్నోరవమ్మా... అన్నోరవమ్మా..." చాకలి ఈరయ్య కేకలకి ఉలిక్కి పడి లేచింది అన్నారం.

నిన్నోపాలి ఆ ఇంటికి రమ్మంటన్నారు" అని చెప్పేసిపోయాడు ఈరయ్య. అన్నారం వెళ్ళే సరికి కులపెద్దల్తో సహా అన్నదమ్ములు నలుగురూ అరుగులమీద కూర్చుని ఉన్నారు.

"రామ్మారా, నీ కోసవే సూత్తన్నాం" అన్నాడు చింతయ్య తాత. ఎవరూ లోపలికి రమ్మని పిలవక, ఎక్కడ నిలబడాలో తెలీక ఇంటి ముందున్న మావిడి చెట్టుకింద నిలబడి పోయింది అన్నారం. ఈ పంచాయితీ ఏంటో అర్థం కావడం లేదామెకి. లోకంలో ఎన్నెన్ని మతలబులుంటాయో ఇంకా తెలీదు అన్నారానికి. చుట్టాలూ, వారి తాలూకా వక్రమార్గాలూ అసలే తెలీవు.

"నువ్వుంటున్న ఇల్లూ పొలమూ, అన్నాయ్యాళ్లకీ ఎప్పుడప్పగిస్తావోనని అడుగుతున్నారు" అన్నాడు సత్తెయ్య మావ ఒకసారి దగ్గి గొంతుక సవరించుకుని.

గతుక్కుమంది అన్నారానికి. తలపైకెత్తి అన్నదమ్ముల ముఖాల్ని చూసింది. లోకంలోని కాఠిన్యాన్నంతా నింపుకున్నట్టున్నాయి వాళ్ల మొహాలు. ఏడేసేళ్ళ ఎడంతో కన్నది తల్లి అందర్నీ. మగవాళ్లుగా పుట్టిన ధీమా వెలిగిపోతోంది వాళ్ల ముఖాల్లో.

కళ్లు దించుకుంటూ "మావా, ఆట్ని మా అయ్య నాకిచ్చేడు" అంది అన్నారం గొంతు పెగుల్చుకుని.

"నీకియ్యాల్సినవేంటో నీ పెళ్ళి నాడే ఇచ్చేసేం. ఆ రోజుల్లో ఎయ్యినూట పదహార్లంటే మాటలా? ముక్కుపిండి మరీ వసూలు చేసేడు నీ మొగుడు. అయ్య నీకిచ్చేసిన అమ్మ బంగారం రెండు కాసులుండాలి. నీకిచ్చిన సారీ సీరా అయ్యే నీసొత్తు. అంతకన్నా ఆశించొద్దు. నిన్న అయ్యదినానికి ఎంతైందనుకుంటన్నావు? ఎవడు చేతిది పెట్టుకుంటాడు? ఆ ఎకరం కొండ్రా, ఆ మేకల మందా అమ్మితే గాని ఈ అప్పు తీరదు" ముక్కుపుటాలు అదురుతూండగా వుక్రోషంగా అన్నాడు నాగేశం. పట్నంలో మున్సిపాల్టీ ఉద్యోగంలో అతను చాలా సంపాదించేడని చెప్పుకుంటారు. పట్నంలో మంచి ఇల్లు కట్టేడు.

"అయ్య నాకు రాసిచ్చేడు" అంది మళ్లీ పట్టుదలగా అన్నారం. "ముక్కు పచ్చులారని వయసులో పెళ్లి చేసి నా మొగుడికేవిచ్చేరో, నా ఒంటికేం బెట్టేరో నాకేం తెల్దు. నా మొగుడు తాగి తాగి అంతా ఆర్పేసేడు. ఆఖర్న గుండాగి చచ్చేడు. ఆడు నాకు మిగిల్చింది ఈ ఇద్దరు పిల్లల్నే."

"దానికి మమ్మల్నేం జెయ్యమంటా?" అన్నాడు మూడోవాడు అనంతం.

"నా బిడ్డల్ని ఎలా పెంచుకోవాల?"

“అది మా బాధ్యత కాదు”

“సింతయ్య తాతా, ఇది తలసెడొచ్చింది. అన్నదమ్ములవని మా కడుపోకాళ్లో పట్టుకునేడొచ్చు గదా, అప్పా అయ్యె ఎల్లకాలం ఉండిపోతాడని ముసిలోడ్ని పట్టేసింది. ఆడిసేత దొంగరాతలు రాయించేసుకుంటే సెల్లిపోతాయేటి? కాలవొచ్చేక బూవిరేటు పెరిగిందసలే” అన్నాడు పెద్దోడు.

అదీ వాళ్ల ఉక్రోషం.

“అయినా ఆడోళ్లకాస్తులు పంచిపెట్టడం మీ తరతరాల్నుంచెప్పుడైనా ఎరిగున్నారా?” ప్రశ్నించేడు రెండోవాడు ఊరిపెద్దల్ని.

“ఓరి బాబా, పిల్లల్తో ఉన్నాదది, ఒదిలెయ్యండ్రా” అన్నాడు సత్తెయ్య జాలిగా నెమ్మదిగా

“నీకేం, నీదిగాదు గనక ఎన్నైనా చెప్తావు. అవసరవైతే కోర్టుకైనా ఎల్తాంగాని వదిలేదు లేదు” అన్నాడు నాగేశం పట్టుదలగా.

“తాత ముత్తాతల కాణ్నుంచీ ఏ నాయవైనా మనమద్దనే నికరమవ్వాలిగానీ, కోర్టులూ జడిజీలూ మన సోదిలో గూడా లేవు” అన్నాడు చింతయ్య కొంచెం కోపం తెచ్చుకుని.

“పోనీ పిల్లది సిన్నవొయసే కదా, మారు మనువు సేసేత్తే...” ఎవరో అన్నారు.

“నేనొప్పుకోను” అరిచింది అన్నారం. “ఒక మొగోడితో నా బతుకిలాగ తగలబడిపోయింది. మరో మొగోణ్ణి మనువాడి నేనేం బావుకోవాల? ఈ పిల్లల గతేం గావాల?”

ఎవరూ మాట్లాడలేకపోయారు.

నవారు మంచంలో గోడకి చేరబడి కూర్చున్న నాగేశం మావగారు కళ్లు చికిలించి ఎగతాళిగా నవ్వుతూ ఇలా అన్నాడు. “అయితే ఒక పనిచెయ్యి, చచ్చిపోయే ఏళకి నీ బాబు నీకాడే ఉన్నాడు గాబట్టి, నాయంగా కొడుకులకి రావాల్సిన తన వాటా ఆస్తి నీకు ఇచ్చేసేడు కాబట్టి ఈ కర్చు మొత్తం నువ్వెట్టుకో. ఏవల్లుడూ పాతికవేలు పైమాటేగదా” ఎక్కడికి పోతావ్ అన్నట్టు చూస్తున్నాడు.

తన బతుకెంత లోకువైపోయిందో అర్థమైంది అన్నారానికి. కళ్లల్లోకి చిమ్ముకొస్తున్న నీళ్లని పెదవులు బిగబట్టి ఆపుకుంది. ఒక్కసారి తలెత్తి పరిశీలించింది. నులక మంచంమీదా, కుర్చీ బల్లల మీదా కాళ్లు పైనెట్టుకుని మీసాలు మెలేస్తూ కూర్చున్నారు మగాళ్లు. తలుపుల వెనకా, తప్పేలాలకిందా అణిగి మణిగి ఉన్నారు ఆడోళ్లు.

అప్పుడూ అంతే, ఏనాడూ సుఖపెట్టని మొగుడనేవోడు చచ్చిన్నాడూ ఇదే ఆటవిక న్యాయం అమలు జరిగింది. తన ఇష్టాయిష్టాలు కనుక్కోకుండానే బొట్టు చెరిపేసి, గాజులు పగలేసి,

ముతక చీర కట్టి మూలన కూర్చోబెట్టేరు. కాలం మారిపోయిందంటున్నారు. ఎక్కడ? ఏ బస్తీలోనో ఏదో ఓ మూల ఒక ఆడకూతురు ధైర్యం చేసి బొట్టు నిలుపుకుంటే అయిపోయిందా? ఈ మొగోళ్ల ఎదవమాటలకి ఆడది తల దించుకుంటున్నంత వరకూ ఈ జులుం రాజ్యమేలతానే ఉంటాది.

రాత్రి అడివిలోంచి విన్పించిన పులి గర్జన గుర్తుకొచ్చింది అన్నారానికి. అది ఒళ్లు జలదరింపజేసిన తీరు గుర్తుకొచ్చింది.

పాముకి ఆహారంగా చిక్కిపోయి కప్పచేసిన నిస్సహాయపు ఆర్తనాదమూ గుర్తుకొచ్చింది.

ఆవేశంతో అన్నారానికి మొహంలోకి రక్తం పొంగుకొచ్చింది. విడిపోయిన జుట్టుని గోళ్లతో సరిచేసుకుని ముడిపెట్టుకుంది. ఏదో చెయ్యాలి, ఈ ఎదవలందరూ గొల్లుమనేలా ఏదో ఒకటి చెయ్యాలి. కసిగా అటూ ఇటూ చూసింది.

నిన్న అమ్మోరి నైవేద్యం కోసం మావిడి చెట్టు మొదట్లో పూసిన కుంకుమ పులి చంపిన జంతువు నెత్తుర్లాగా ఎర్రగా మెరుస్తోంది. దాన్ని నాలుగు వేళ్ల తోనూ తీసి నుదుట అద్దుకుంది. కూర్చున్న వాళ్లందరి వేపూ నిర్లక్ష్యంగా చూస్తూ, "మీ దిక్కున్న చోట చెప్పుకోండి, ఏ కోర్టుల కెళ్తారో ఎళ్లండి. ఆ పొలం గట్టున ఎవడడుగు పెడతాడో చూత్తాను" అంది.

పెద్ద పెద్ద అంగలేస్తూ వెళ్లిపోతున్న ఆమెని ఆపడానికెవరికీ స్పృహ రాలేదు. బిత్తరపోయి చూస్తూ ఉండిపోయారంతా. ఏనాడూ నోరెత్తి గట్టిగా మాట్లాడి ఎరగని అన్నారమేనా అని ఆశ్చర్యపోతున్నారు ఆడోళ్లంతా.

✡

# వేరు తొలిచే పురుగు

**-కె.వి.నరేందర్**

వేరుశనగ చేనులో రైతు రామిరెడ్డి మాటలు వింటున్న బొంతపురుగులన్నిటికీ ఒక్కసారిగా గుండెలు జారిపోయాయి.

వేర్లలో ఇప్పుడిప్పుడే తయారవుతున్న రసాన్ని ఎప్పుడెప్పుడు పీల్చేద్దామా అని ఆతృతగా చూస్తున్న వాటికి ప్రాణభయం పట్టుకుంది.

ఆ ఎరువు పడ్డ రెండు, మూడు గంటల్లో పురుగులన్నీ మాడి మసైపోవల్సిందే. ఆ భయంతో కొన్ని పురుగులు పక్క చేనులోకి పరుగు పరుగున నడుస్తున్నాయి. కొన్ని ఇప్పటికే హద్దు దాటేసాయి కూడా.

ఒక్క బొంతపురుగుకి మాత్రం వెళ్లాలన్పించలేదు. ఇంతకు ముందు చల్లినపుడు ఆ మందు తమని చంపలేదు. అనారోగ్యానికి గురి చేసిందంతే. నాలుగురోజుల్లోనే కోలుకోగలిగాయి. బలహీనంగా వున్న కొన్ని మాత్రం చచ్చిపోయాయి. ఆ సంవత్సరం పంట కొంచెం దిగుబడి తగ్గింది కాని, మార్కెట్లో రేటు వుండటంతో రామిరెడ్డి అప్పుల బాధనించి తప్పించుకోగలిగాడు.

బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ అడిగిన మొత్తాన్ని చెల్లించుకొని ఈ ఏడాది మళ్లీ రుణం తీసుకున్నాడు. ఆ మధ్య ఎ.ఎ.ఓ పల్లి చేలోకి వచ్చి ఇవి వేరు తొలిచే పురుగులని.... ఇంగ్లీష్‌లో రూట్‌గ్రబ్ అని, వోలో అని, ట్రిక్కా అని ఏవేవో పేర్లు చెప్పాడు. అవన్నీ రామిరెడ్డికి అర్థంకాలేదు. గొంగళి పురుగుల్లా వుంటాయి కాబట్టి బొంత పురుగులనే పిలిచేవాడు.

రాత్రి పన్నెండు గంటలకొచ్చే త్రీఫేజు కరెంటు కోసం పదకొండింటికే వచ్చి పడుకొని, పన్నెండింటికి మోటార్ ఆన్ చేసి మూడు గంటలకల్లా కరెంటు పోగానే ఇంటికెళ్లిపోయేవాడు.

బొంతపురుగు ఆ రాత్రంతా రామిరెడ్డినే చూస్తూ గడిపేది.

మోటర్ ఆన్ చేసాక రామిరెడ్డి ఆకాశంలో చుక్కలు చూస్తూ కునుకు తీసే వాడు. రామిరెడ్డి ఆలోచనల్ని చాలా రోజులుగా అది పసిగడుతూనే వుంది. ఈ పంట దిగుబడి వస్తే

హైద్రాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న కొడుక్కి టర్మ్ ఫీజులు పంపాలి. బిడ్డకి మరో రెండేళ్లకైనా పెళ్లి చేయాలి. అప్పుడు ఈ చేను అమ్మక తప్పదేమోనని గుబులు. మట్టిని పిడికిట్లో తీసుకొని బాధగా చూసుకునేవాడు. ఒక్కోసారి చిటికెడంత మట్టిని నోట్లో వేసుకునేవాడు.

అది చూసి బొంతపురుగు నవ్వుకునేది.

అయిదువందలిస్తే ఆదర్శరైతుని చేస్తానంటూ అగ్రికల్చరల్ ఆఫీసరు రెండు మూడుసార్లు వచ్చినా – నా దగ్గర పైసల్లేవు, నన్నిట్ల బతుకనియ్యుండ్రి అని కోపంగా చెప్పేవాడు. ఒక్కోసారి రాత్రంతా అందర్నీ తిట్టుకుంటూ కూచుండేవాడు. తమనెక్కడ తిడతాడోనని బొంతపురుగు భయపడేది. బతకడానికి వేరుశెనగ వేరు రసం పీల్చడం తప్పనందుకు రామిరెడ్డిని చూస్తూ బాధపడేది.

మోటార్ ఆన్ చేసిన అరగంటకు చేతిలో టార్చిలైట్‌తో ఎల్లయ్య వచ్చి కూచుండేవాడు. మట్టి గురించీ, మందుల గురించీ మాట్లాడుకునే వాళ్లు.

రైతు సంఘంలో జరుగుతున్న అక్రమాల గురించి ఆవేదన పడేవాళ్లు. భూములన్నీ కౌలుకిచ్చి ఖాళీగా తిరిగే తిరుపతిగాడు ఆదర్శరైతు ఎట్లయితడో అర్థంగాక, చివరికి సర్పంచికి మనం ఓటెయ్యనందుకే మన పేరు రాయలేదని, వూర్లె రాజకీయాలు బాగా అయ్యాయని, మొత్తం చెడిపోతున్నారని ముచ్చట్లు పెట్టుకునేవాళ్లు.

ఒక్కోసారి వెన్నెల వెలుతుర్లో చూసినపుడు వాళ్ల కళ్లల్లో తడి తళుక్కుమనేది. పంట వేసింది మొదలు మార్కెట్‌కి తరలించి చేతుల్లో డబ్బులు పడేంతవరకు ఏదో బతుకు భయం, అర్థంకాని అభద్రత.

తాము బతకడానికి ఈ చేను తప్ప మరో చోటు లేనందుకు బొంత పురుగు విపరీతంగా బాధపడేది.

అప్పుడప్పుడు వీళ్లకు తోడు పక్కపొలం యజమాని జలంధర్ వచ్చేవాడు. ఎల్లయ్య తన పత్తి చేను గురించి చెప్పేటోడు. బోల్‌గార్డ్ పత్తి విత్తనాలు వేసినా గులాబీరంగు కాయతొలిచే పురుగు పుట్టుకొచ్చిందని, విత్తనం మీద నమ్మకం పోయిందనీ అనేవాడు. మొన్‌సాంటో కంపెనీ కూడా మోసం చేసిందే రామన్నా అని కుంగిపోయేవాడు.

విత్తనం ఇప్పటిదాకా పురుగుని జయించింది కాని ఇప్పుడు పురుగే విత్తనాన్ని జయించే పరిస్థితి వచ్చిందని రామిరెడ్డి అనేవాడు. పత్తి విత్తనాల ప్యాకెట్ ధర ఇది వరకు ఆరువందల యాభై రూపాయలుండె బోల్‌గార్డ్ – 2 అని ఇప్పుడు వచ్చిన వాటి ధర తొమ్మిది వందలు చేసిండ్రు. అంటే కంపెనీకి వంద కోట్ల లాభమని జలంధర్ మట్టిలోనే చేతి వేళ్లతో గీస్తూ లెక్కలు వేసేటోడు.

ఆ లెక్కలు చూసి బొంతపురుగు నవ్వుకునేది.

వాళ్ళు రాత్రి మూడు గంటలకు కరెంటు పోయాక ఒక్కోసారి గట్టుమీద గడ్డికుప్పలో పడుకునేవాళ్లు. ఒక్కోసారి ఆ టైంలో కూడా ఓ తేనె టీగ గుయ్‌మంటూ వాళ్ల చుట్టూ తిరిగేది. రామిరెడ్డి కోపంగా పంచెతో దాన్ని అదిలించేవాడు. అయినా తేనెటీగ వాళ్లని వదలకుండా వాళ్ల చుట్టే తిరుగుతూ రొద పెట్టేది.

ఓ రోజు బొంతపురుగు అడిగింది. అర్ధరాత్రి ఎందుకలా తిరుగుతావ్, హాయిగా వెళ్లి నీ గూట్లో పడుకోక అని.

అది బాధగా చెప్పింది "మా ఇంటికెళ్లే దారి మర్చిపోతున్నాను. పువ్వుల్లోంచి తేనె తీసుకున్నాక రోజూ ఇంటిదారి మర్చిపోయి ఎక్కడెక్కడో తిరుగుతున్నాను. వాళ్లు చూపిస్తారన్న ఆశతో తిరుగుతుంటే అదిలించుకుంటున్నారు" అని.

బొంతుపురుగుకి మరింత బాధేసింది.

"అదుగో.... ఎల్లయ్య చేనులో వున్న సెల్‌టవర్‌కి కదా నీ గూడు వుంది. జాగర్తగా వెళ్లు" అని చెప్పింది.

"ఏమనుకోకుండా దారి చూపించి పుణ్యం కట్టుకోనా" అని బతిమిలాడింది. అది గాల్లో ఎగురుతుంటే, తాను గబగబా నేలమీద నడిచిదారి చూపించింది.

బొంతపురుగుకి రోజూ ఇదో డ్యూటీ అయింది. సెల్ టవర్ దగ్గర చిన్న చిన్న తేనెటీగలు చచ్చిపడి వుండటం చూసి "నా బిడ్డలారా... ఎందుకు చచ్చిపోతున్నారే" అంటూ బిగ్గరగా ఏడ్చేది. ఈ మనుషులకు తేనె పంచినా, మాకు విషాన్ని పంచుతున్నారెందుకో అంటూ కుమిలి కుమిలి ఏడ్చేది.

బొంతపురుగుకి కూడా దుఃఖం ఆగేది కాదు. అయినా తమాయించుకొని... వెనక్కి వచ్చేది.

నిన్న రాత్రి అలాగే వస్తుంటే... పిచ్చుక కన్పించింది. ముగ్గురు బిడ్డల్ని రెక్కల కింద దాచుకొని, గట్టు మీద కూచొని మౌనంగా ఏడుస్తోందది.

పిల్లల్ని ప్రేమగా ముక్కుతో నిమురుతూ, చిన్న పురుగులు కన్పిస్తే చటుక్కున కరిచి పిల్లల నోట్లో పెడుతూ వెక్కి వెక్కి ఏడుస్తోంది. పిల్లలు తినటం మర్చిపోయి బిక్కమొహాలేసుకొని తల్లినే చూస్తున్నాయి.

"మొన్నటిదాకా ముగ్గురు బిడ్డలు పుట్టబోతున్నారని ఆనందంగా కిచకిచ అనుకుంటూ తిరిగేదానివి – వరిగడ్డిని తీసుకపోతూ పిల్లలు పట్టుపరుపుల్లో నిద్రపోవాలని ఆతృత పడేదానివి. ఇంత రాత్రి గూడు విడిచివచ్చి ఎందుకేడుస్తున్నావ్" అంది బొంత పురుగు.

పిచ్చుక చెప్పడానికి తటపటాయించింది.

"నువ్వేడిస్తే పిల్లదేదుస్తున్నారు. ఏమైంది చెప్పు" అంది రెట్టించి. చివరికి ఏడ్పుని బిగపట్టుకొని చెప్పింది పిచ్చుక.

"మగ పిచ్చుక గూట్లోంచి తరిమేసింది."

"ఎందుకు?"

"ఈ పిల్లలు తన బిడ్డలు కాదంటోంది. ఎవరికి కన్నావో అంటూ గూట్లోంచి గెంటేసింది" అంది.

బొంతపురుగు జాలిగా పిచ్చుక పిల్లల వైపు చూసింది. నిజమే.... పిల్లలు నల్లరంగులో వున్నాయి.... వాటి రెక్కలు వంకర తిరిగి వున్నాయి.... చాలా బలహీనంగా వున్నాయి... సరిగా నడవలేకపోతున్నాయి.

బొంత పురుగుకి ఏం చెప్పాలో అర్థం కాలేదు.

సెల్ టవర్ పక్కనే వున్న తుమ్మ చెట్టు మీది గూడులోంచి మగ పిచ్చుక కోపంగా చూస్తూనే వుంది.

"దేవుడి సాక్షి... నేనే తప్పూ చేయలేదు" అంది.

మగపిచ్చుక ధబేల్న గూడు తలుపేసుకుంది.

"మరిప్పుడేం చేస్తావ్"

"ఈ పిల్లల్ని వదిలేసి ఎక్కడికైనా వెళ్లిపోతాను" అంటూ ఏడుస్తూ ఎగిరిపోయింది.

పిల్లలు చీకట్లోనే బిక్కుబిక్కుమంటూ కిచకిచ అరుస్తూ చేనులో తలో దిక్కుకి పోతున్నాయి. వాటిని చూస్తే బొంత పురుగుకి రామిరెడ్డినో, ఎల్లయ్యనో, జలంధర్‌నో చూసినట్టుగా అన్పిస్తోంది.

జలంధర్ నాలుగు రాత్రుల్నించి తన పొలం దిక్కే రావట్లేదు. అతను రామిరెడ్డి కన్నా, ఎల్లయ్య కన్నా చిన్నవాడు. ముప్పయ్ ఏళ్లు కూడా వుండవు. రైతుని దోచుకునే దేశం ఎప్పుడూ బాగుపడదంటూ ఆవేశంలో వూగిపోతుంటాడు.

మొన్న యూరియా బస్తాలకోసం జగిత్యాలలో జరిగిన ధర్నాలో లాఠీచార్జి జరిగింది. అందరికన్నా ముందున్న జలంధర్ మీద రెండు మూడు లాఠీలు విరిగాయి. కుడి చెయ్యి ఫ్రాక్చరయ్యింది. ఎడమ పాదం మీద బలంగా గాయమైంది. అంతగా దెబ్బలు తిన్నా రెండు యూరియా బస్తాలకి మించి దొరకలేదు. పద్దెనిమిది బస్తాలు చల్లాల్సిన చోట రెండు బస్తాలతో ఎలా సరిపెట్టుకోవాలని ఆ రెండింటిని కూడా అక్కడే వదిలేసి వచ్చాడు.

"కాలం కల్సొచ్చినప్పుడు ప్రభుత్వాలు సహకరించవు. ప్రభుత్వాలు సహకరించినప్పుడు కాలం కల్సిరాదు. థూ... నీయవ్వ... రైతు బతుకు" అంటూ రెండు యూరియా బస్తాల్ని ఈడ్చి తన్ని, తిరిగొచ్చేసి మంచమ్మీదే ఇంటి వద్ద వుంటున్నాడు. సరైన ఎరువులు పడక జలంధర్ పొలంలోకి వరినారు పిచ్చుక పిల్లల్లా డీలా పడిపోయాయి. జలంధర్‌ని డాక్టర్ నలభై రోజుల వరకూ మంచం దిగొద్దని చెప్పాడు.

జలంధర్ లేక రామిరెడ్డికి, ఎల్లయ్యకి ఏమీ తోచట్లేదు. జలంధర్ నాన్న ఇలాగే అర్ధరాత్రి పొలానికి నీళ్లు పెట్టి ఇంటికి వెళ్తుంటే పాము కుట్టి చనిపోయాడు. ఆ బాధ వల్ల ఇంట్లోంచి సెల్‌ఫోన్ తోని కరెంట్ మోటర్ స్టార్టయ్యేలా కనిపెట్టాడు. వ్యవసాయ పరిశోధనాలయం కెళ్లి చెప్పినా ఎవరూ పట్టించుకోకపోవటంతో మూలన పడేసాడు.

బొంతపురుగు జలంధర్ పొలం పాడైపోతున్నందుకంటే, కొత్తగా పెళ్లయినోడు కదా పాపం అని జాలిపడింది.

"వొరే జలంధరూ... కొడుకో బిడ్డనో పుడితే డాక్టర్ని చేస్తావా ఇంజనీర్‌ని చేస్తావా" అని రామిరెడ్డి పరాచికాలాడితే, గర్వంగా చెప్పేవాడు 'రైతుని చేస్తానే పెద్దబాపూ' అని

పక్కనే సిటీలో అగ్రికల్చరల్ రీసెర్చి సెంటరుందని, అది పదేళ్లనించీ వుందనీ జలంధర్ చెప్పేవరకూ రామిరెడ్డికీ, ఎల్లయ్యకీ తెలీదు. వ్యవసాయాధికారులు కన్పిస్తే నిలదీసేవాడు. పత్తిపంట గురించి తెల్సుకోవాలని గుజరాత్‌లోని అమ్రేలీ, భావ్‌నగర్, జునఘడ్, రామ్‌కోట్ లాంటి జిల్లాలు తిరిగొచ్చాడు.

బోల్‌గార్డ్ – 2ని రైతుల మీద రుద్ది అదనంగా వంద కోట్లు సంపాదించాలనే దురాశతో విత్తన కంపెనీలు పనిచేస్తున్నాయని పత్రికల్లో వ్యాసాలు రాసినా ఎవడూ స్పందించలేదు.

'ఈ ఎవుసంలో ఏమొస్తుంది. సిటీకెళ్లి బిజినెస్ పెట్టుకుందామని' కొత్త పెళ్లాం జోరీగలా రొదపెడుతుంటే మంచంమ్మీదే పడుకొని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఇప్పటికి ఇరవై రోజులైంది జలంధర్ రాక. మరో ఇరవై రోజులయితేగాని రాడు అనుకుంది బొంతపురుగు.

అప్పుడూ రాకపోతే!

వస్తాడు.

ఏమో... ఇంక రాకపోవచ్చు.

బొంతపురుగుకి ప్రతిరోజూ ఇదే టెన్షన్. చేను గట్టెక్కి జలంధర్ వస్తాడేమోనని పొలం వైపు చూస్తుండేది. తేనెటీగ దారి తప్పి కన్పిస్తే దాన్ని ఇంటి దగ్గర దింపి, సెల్‌ఫోన్ టవర్‌ని కూల్చేయాలని ఆవేశంగా దాన్ని పట్టుకొని వూపేది. అది కదలకపోయేసరికి దానిమీద వుమ్మేసి వచ్చేది.

ఆ రోజు రాత్రి రామిరెడ్డి బదులు ఎల్లయ్య వచ్చి మోటరు ఆన్ చేశాడు. తెలతెలవారుతుంటే కరెంటు మోటార్ దగ్గర పడుకున్న ఎల్లయ్య దగ్గరికి ఓ పాప పరిగెత్తుకుంటూ వచ్చింది.

వస్తూనే, ఆయాసంతో పిడుగులాంటి వార్త చెప్పింది "చిన్నాన్నా, బ్యాంకోల్లు నోటీసులు పంపింగ్రంట. రామిరెడ్డి బాపు పురుగుల మందు తాగి చచ్చిపోయిండు' అని.

ఎల్లయ్యకన్నా ముందు బొంత పురుగుకి గుండెలు జారిపోయాయి. ఎల్లయ్య నుదురు కొట్టుకుంటూ మోటర్ స్విచ్చాఫ్ కూడా చేయడం మర్చిపోయి "ఓరి బ్రమ్మదేవుడా, రైతుల రాతల్ని ఇప్పసారా తాగినంక రాస్తావారా! నీ గుళ్లె దీపం ఆరిపోనూ" అంటూ ఏడ్చుకుంటూ పరిగెత్తిపోయాడు.

బొంతపురుగు మనసు కూడా కకావికలం అయింది.

తుమ్మచెట్టు మీద గూడులోని మగపిచ్చుక మరోదాంతో జత కడుతోంది. వాటి కిచకిచలు కంపరం పుట్టిస్తున్నాయి. చచ్చిపోయిన ఒక పిచ్చుక పిల్లకి చీమలు పడుతున్నాయి.

పురుగుకి కళ్లలో రామిరెడ్డి కనబడుతున్నాడు. మట్టిపెల్లని నోట్లో వేసుకొని తన్మయత్వంతో చప్పరించే అతడి ముఖం కనపడుతోంది.

పురుగు మనసు ఆగలేదు.

చివరిసారిగా రామిరెడ్డిని చూసొస్తే... అనుకుంది. అవును... చూడాలి. ఇన్నాళ్లూ అతని చేనులో బతికింది. ఎప్పుడైనా తన కెదురైతే ప్రేమగా తిట్టి మెల్లగా తీసి దూరం విసిరేసేవాడు కాని చంపాలని మాత్రం అనుకోకపోయేది. అలాంటి రైతుని ఆఖరిసారిగానైనా చూసిరావాలి అనుకుంది.

ఇన్నాళ్లూ పట్టుపరుపుల్లాంటి మట్టి పొత్తిళ్లలో తిరిగిన బొంత పురుగుకి రోడ్డెక్కేసరికి ఆయాసం వచ్చింది. సిమెంట్ రోడ్డు మీద నడవలేకపోతోంది. అయినా సరే, బొంతపురుగు వేగంగా నడుస్తోంది.

పచ్చని ఆకుల కింద పరుండే దాని శరీరం ఎండకి కందిపోతోంది. మొదటిసారి ఊరుని చూడగానే దానికొక వింత లోకాన్ని చూసినట్టుగా అన్పించింది. రామిరెడ్డి ఇల్లెక్కడా అనుకుంది. వందల పాదాలు ఏడుస్తూ పరిగెడుతుంటే ఆ పాదాల వెనకబడి పరిగెత్తింది.

ఆ ఇంటి ముందు షామియానా వేస్తున్నారు. ఏడ్పులు ఆకాశాన్నంటుతున్నాయి. అందరి కాళ్ల సందుల్లోంచి మెల్లగా ఇంట్లోకి దూరింది. అరుగు మీద ఉన్న రామిరెడ్డి శవాన్ని చూసింది.

దాని కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి.

అంత ప్రశాంతంగా చేనులో ఏనాడూ రామిరెడ్డి నిద్రపోలేదు అనుకుంది. భార్యాపిల్లల ఏడ్పులు ఆపటం ఎవరితరం కావట్లేదు.

శవం పక్కనే కూచుండి ఓదారుస్తున్న నీలకంఠం సేటుని చూడగానే బొంత పురుగు ఆవేశం కట్టలు తెంచుకుంది.

మనసంతా కుతకుతా ఉడికిపోయింది.

వాడే కదా రామిరెడ్డిని నమ్మించి నకిలీ ఎరువులు అంటగట్టింది. ఆ ఎరువుల బస్తాల్లో మట్టి, సుద్దపిండి తప్ప ఇంకేం లేదు. వాటిని చల్లే కదా పోయినేడు రైతు తీవ్రంగా నష్టపోయింది.

ముప్పయ్‌వేల రూపాయల ఎరువుల్లో సగానికెక్కువ నకిలీ ఎరువుల్ని అంటగట్టింది వాడే. వూర్లో చాలా మంది రైతులు నకిలీని మొదట గుర్తుపట్టలేదు. తమ జాతిని చంపలేని ఆ ఎరువులు నకిలీయని మొదటసారి గుర్తుపట్టింది తనే కదా.

నీలకంఠం దొంగ ఏడ్పు నటిస్తున్నాడు.

బొంత పురుగు వాడి దగ్గరగా వెళ్లింది. వాడి మొహంలోకి చూస్తూ బిగ్గరగా అరిచింది.

"రేయ్, మేం వేరుని మాత్రమే తొలిచేసి తింటాంరా. కాని మీరు ఈ దేశపు తల్లివేరుని తొలిచేస్తున్నారు. మేం కాయల్లోని రసాన్ని మాత్రమే పీలుస్తాం రా. కాని మీరు రైతుల రక్తాన్ని పీలుస్తున్నారు" అంటూ గబగబా వెళ్లి వాడి పాదం మీద గట్టిగా కరిచింది.

నీలకంఠం సేటుకి ఏదో చిటుక్కున కుట్టినట్లయి కిందికి చూశాడు. బొంతపురుగు నెత్తురు చిందేలా కరుస్తోంది. ఎడం చేత్తో విదిలించాడు. ఆ దెబ్బకి అది పక్కకి పడిపోయింది.

అయినా అది అరుస్తూనే వుంది.

"పురుగులు పాడుగాను. చేన్లల్ల చెలుకలల్ల వుండేవి, ఊర్లెకి కూడా రావట్టే. పాపపు కాలం దాపురిచింది. ఈ పురుగులతోనే రామిరెడ్డి పానం తీసుకునే" అంటూ కుడికాలి చెప్పుతీసి కోపంతో మంటతో బలంగా నలిపేశాడు.

బొంతపురుగు బాధగా అరిచింది. నుజ్జునుజ్జయిపోతూ చెప్పు కింద చితికిపోయింది.

ఆ ఇంట్లో...

మిన్నంటిన ఏడ్పుల మధ్య కూడా, పురుగు చేసిన ఆక్రందన ఒక్క రామిరెడ్డి ఆత్మకు మాత్రమే విన్పించి వుంటుంది.

✡

# కృషితో అస్తి దుర్భిక్షమ్

**–పి.పాపిరెడ్డి**

ఎద్దు కొమ్ముల మీద పొద్దు పొడిచింది.

మిట్ట మధ్యాహ్నం నిప్పులు చెరిగే సూర్యుడు రంగయ్య నడి నెత్తిమీద నాట్యం చేస్తున్నాడు. చెమటతో ముద్దయిపోయిన రంగయ్య మేడి వదలకుండా కాడి తోలుతూనే ఉన్నాడు. తన ముద్దు బిడ్డ స్వేదంతో ఆర్ద్రమైన పుడమితల్లి వేడిగా నిట్టూరుస్తుంది. ఇంతలో పెద్ద కొడుకు లింగయ్య చద్ది తీసుకురాగా కాడి వదలి ఇద్దరు భోజనానికి కూర్చొన్నారు. "ఈ సంవత్సరం కూడా మన అప్పులు తీరేటట్లు లేవు నాన్నా. పైగా మరి కాస్తా పెరిగేటట్లున్నాయి" అన్నాడు లింగయ్య ఆవేదనగా.

"అవునురా, అట్లాగే ఉంది. గడిచిన రెండేండ్లు వర్షాలు లేక పంటలు ఎండిపోతుంటె అప్పులు తెచ్చి బోరుమీద బోరువేసి వరి పండించామా. వడ్లకు ధర రాక వచ్చినకాడికి చాల్లే అని వదిలేస్తిమి. రాత్రింబగళ్ళు కష్టపడి పొగాకు పండిస్తే అదికాస్తా మన పాలిటి 'పగాకు' అయింది. కంది పండింది ఫరవాలేదు అనుకుంటె వాటిని అడిగే దిక్కే లేదు. కాస్త ముందుగా వర్షాలు పడ్డాయి పైర్లు యేద్దామంటే పెట్టుబడికి డబ్బులేదు."

"సొసైటీ లోను వస్తది గదయ్యా" అన్నాడు లింగయ్య సాలోచనగా. "సొసైటీ వలీగాడు వదిల్తేకదా వచ్చేది. వాడి ఫైనాన్సులో మూడు రూపాయల వడ్డీకి పాతికవేలు తెస్తిమి. పెయిడ్ సెక్రటరివాడే, ఫైనాన్సు వాడిదే. చావుబ్రతుకులు రెండు వాడి చేతుల్లో ఉన్నట్లు ఇట్లా ఇచ్చి అట్లా జమ వేసుకుంటాడు."

"అక్కేమొ తన పెద్దకూతురి పెండ్లికి పాతిక వేలన్నా యివ్వకపోతె ఎట్లా అంటుంది. చెల్లెలు సారెపెడ్తే గాని సంసారానికి పోనంటుంది. చిన్నదేమొ మూలన కూర్చుంది. దానికేదో తొందర్లోనే సంబంధం చూడాలి. చదివించడం చాతకాక చిన్నోడిని ఆపేస్తిమి. బరువు బాధ్యతలు మోయడం తప్ప బతుకులో సుఖపడేదేముంది?" లింగయ్య మాటల్లో నిర్వేదంతోపాటు నిష్టూరం కూడ కలిసింది.

కొడుకు మాటలకు రంగయ్య ముఖంలోని ముడుతల్లో ఆవేదన తొంగి చూసి అది కాస్తా ఆక్రోషంగా మారింది. "మనమేమి ఊరుకున్నామట్రా. రోజూ సలవ పంచలు కట్టుకొని

పలావులు తింటూ ఎవారాలు చేస్తున్నామంటావా. వంటి నిండ బట్టలేదు. పచ్చడి మెతుకులతోనే పొట్ట నింపుకుంటున్నాము. మనమేదో దుబారా చేసినట్లు, నువ్వొకడవే బరువు మోస్తున్నట్లు మాట్లాతావేంది? భూమి మీద పడ్డ ప్రతోడు బరువు మోయక తప్పదు; బతికినంత కాలం బాధలు పడకా తప్పదు." అన్నాడు రంగయ్య వాస్తవిక ఇబ్బందులకు కొంత వేదాంతాన్ని జోడించి. "మనిషిని నమ్ముకొన్నోడు మోసపోతాడేమొ కాని మట్టిని నమ్ముకొన్నోడెప్పుడూ మోసపోడు. మన తాత తండ్రులు భూమిని నమ్ముకొని బతికారు. పది మందిని బతికించారు. మనకు కూడ ఏదో ఒక రోజు మన రోజు రాకపోదు." ఆశావాదాన్ని ఆశ్రయించి కొడుక్కి భవిష్యత్తు మీద భరోసా కల్పించడానికి ప్రయత్నించాడు రంగయ్య.

కాని లింగయ్య ఇష్టంలేని పెళ్ళాంతో కష్టంగా కాపురం చేసినట్లు నిష్ఠూరంగా అన్నాడు. "మా తాత భూస్వామి. భూమిని నమ్ముకొని బతికాడు. పది మందిని బతికించాడు అన్నావు బాగానే ఉంది. కాని ఆ భూమితోపాటు పుట్టెడు అప్పులిచ్చి వెళ్ళాడనే విషయం మరిచిపోతున్నావు. మనంకూడ ఆ భూమిని నమ్ముకొని కష్టం చేసి కండలు కరిగించినా ఆ అప్పులు తీర్చలేక తల్లిలాంటి భూమిని అమ్ముకోవాల్సి వచ్చింది. అయినా నీకింకా భూమిమీద ఆశ చావలేదు. మమకారం పోలేదు. ఈ సంగతి తెలిసినోడు కనుకనే బాబాయి ఈ భూమాతకు ఒక దండం పెట్టి నగరానికి వెళ్ళి దర్జాగా బతుకుతున్నాడు."

"వాడి సంగతి ఎత్తకు. నాకు వళ్ళు మండిపోద్ది. సిగ్గు లజ్జ వదిలిపెట్టి, మాన మర్యాదలు అమ్ముకొని, ఏడుపు కూడు తినేకంటె పాచి పని చేసుకొని నీతిగా బతకడం మేలు. నీవు రైతు బిడ్డవు. లెఖ్ఖ తీసుకొని కాదు. రెక్కలు నమ్ముకొని బతుకు సరిసరే నీవు ఎద్దులు తోలుకొని వెళ్ళు. నేను కంచె సరిచేసి వస్తా"

లింగయ్య వెళ్ళాడు కాని లింగయ్య వదిలిన బాణం తాలూకు బాధ మాత్రం వదల్లేదు. ఇట్లాంటి బాణాలు ఎంతోమంది ఎన్నోసార్లు తనమీద ఎక్కుపెట్టి వదిలారు. కాని తన గుండె బండలాగుండి బాణాలే వంగిపోయాయి. కాని తన ధైర్యం సడలిపోలేదు. కాని ప్రస్తుతం పరిస్థితుల ప్రాబల్యం వల్ల అది కొంచెం మెత్తబడిందేమో బాణం అంతగా గుచ్చుకోకపోయినా నొచ్చుకోవడం ఎక్కువైంది.

తనకు, తన తమ్ముడు రాంరెడ్డికి ఆర్థిక స్థితిలో వాస్తవంగా హస్తిమశకాంతరం తేడా వుంది. తనేమో తాతతండ్రుల వృత్తిని నమ్ముకొని కాడిని మెడకు బెట్టుకొని సంసార బండిని లాగుతున్నాడు. ఎంత ప్రయత్నించినా బండి వెనక్కే వెళ్తుంది. భూమమ్మ మోసం చేస్తుందా? తన వృత్తి తప్పా? తన వృత్తి తప్పైతే ఈ దేశం అన్నపూర్ణ ఎట్లయింది? అన్నాన్ని అమ్ముకుంటున్న రోజుల్లో కూడ అతిథిని దేవుడిగా భావించి ఆదరించే ఔన్నత్యం ఎట్లా అబ్బింది? తప్పు భూమిది కాదు. వృత్తిది కాదు. తప్పంతా నీతులు చెప్పి గోతులు తవ్వే నేతలది. రైతుల రక్తం

పీల్చే అధికార రాబందులదీ. రైతు లేనిదే రాజ్యం లేదని తెలిసి కూడ తమ కాళ్ళను తామే నరుక్కొనే రాజకీయ బధిరాంధులను తలచుకొని రంగయ్య మనసు బాధాపరితప్తమైంది.

ఆ రోజు రాత్రి దేవాలయం దగ్గర సుబ్రహ్మణ్యశాస్త్రి గారి పురాణ పఠనం జరుగుతుంది. ఇంతలో కారులోంచి దిగాడు రామిరెడ్డి. అత్తరు గుప్పుమంది. వజ్రాల ఉంగరాలు కరంటు కాంతిలో తళుక్కుమన్నాయి. మేఘంలో మెరుపులా మెడలో గొలుసు, తళతళమనే డ్రస్సు, కడిగిన గుండ్రాయిలాంటి ముఖంలోని వర్చస్సు రామిరెడ్డి దర్జా చెప్పకనే చెప్తున్నాయి. జన్మభూమిమీద మమకారమొ, తన పరపతి, పలుకుబడి పది మందికి తెలియజెయ్యాలనే తపనో, లేక తమ పుట్టిపెరిగిన గ్రామం ప్రస్తుత పరిస్థితుల కనుగుణంగా పైకి రాలేకపోతుందనే పరితాపమొ ఏదో గాని మొత్తంమీద రామిరెడ్డి అప్పుడప్పుడు తన స్వగ్రామానికొచ్చి, పది మందిని పలుకరించి, వెళ్ళడం ఆయనకు అలవాటు. అనుకోకుండా ఆయన ఆ రోజు రావడం, అదే సమయంలో పంతులు గారి పురాణ కాలక్షేపం సందర్భంగా గ్రామస్తులందరు ఒకచోట చేరి వుండడం అది ఒక అందివచ్చిన అదృష్టంగా అన్పించింది రామిరెడ్డికి. పంతులు, ప్రజలు ఎంతో ఆదరంగా కుర్చీ వేసి రామిరెడ్డిని కూర్చోబెట్టారు.

రెడ్డి వచ్చాడు గనుక పంతులు గారు మరల మొదలు పెట్టి ఉపోద్ఘాతంగా "కృషితో నాస్తి దుర్భిక్షమ్" అనుసూక్తిని అందరు పాటిస్తే మన దేశం తిరిగి సౌభాగ్యవంతమవుతుందని, మన పూర్వీకులు ఈ సూక్తిని పాటించినందువలనే వ్యవసాయం ప్రధానంగా గల మన దేశం ప్రపంచంలో అన్నపూర్ణగా పేరుగాంచినదని, కనుక అందరు 'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అనే సూక్తిని అక్షరాలా పాటించాలని సెలవిస్తుండగా రామిరెడ్డి బళ్ళున నవ్వాడు. అందరు ఆశ్చర్యంగా చూశారు. రామిరెడ్డి అందుకున్నాడు.

"మీలాంటి పెద్దలు దేవాలయంలో అందులో దేవుని ఎదుట ఇలాంటి మాటలు చెప్పడం న్యాయం కాదు పంతులు గారు. మీరంటే అనుభవం లేక అన్నారంటే అర్థం ఉంది, కృషిలో తల పండిన వీరంతా ఎట్లా వింటున్నారనేది నా ప్రశ్న. వీళ్ళంతా నిత్య కృషీవళులే. వీళ్ళల్లో బాగుపడిన వాడిని ఒక్కన్ని చూపించండి."

"అదేమిటండి రెడ్డిగారూ! మీ తాత తండ్రులు తరతరాలుగా వ్యవసాయం చేసి పల్లెలను పోషించిన పెద్ద రైతులు. పంట కళ్ళాలు చేస్తే చేటలకొద్ది ధాన్యాన్ని జనానికి పంచిన ధర్మదాతలు. మీ తాతగారు వందెకరాల భూస్వామి. ఆకలి అన్నమాట వినబడకుండా అన్నదానం చేసిన మహానుభావుడు."

శాస్త్రిగారి వాగ్ప్రవాహాన్ని అడ్డుకుంటూ అన్నాడు రామిరెడ్డి. "అవునండి పంతులు గారు. మా తాత నాగిరెడ్డి గారు వందెకరాల భూస్వామి. ఆయన కొడుకు పాతికెకరాల పెద్ద రైతు. ఆయన కొడుకు ఐదెకరాల సన్నకారు చిన్న రైతు. రేపు ఆయన వారసులు భూమిలేని వ్యసాయ కూలీలు. చూడండి. తరతరాల నుండి కృషిలో తరించిన ధన్య జీవుల సంసారంలో

తాత భూస్వామి అయితే మనమడు కూలీగా స్థిరపడ్డాడు. ఇంతెందుకు అక్కడ కూర్చున్నాడే మా అన్నగారు శ్రీమాన్ రంగారెడ్డిగార్ని చూడండి. ఆయన చెమట చుక్కను నమ్ముకున్న నిత్య శ్రామికుడు. కాని ఆయన జీవితంలో కన్నీరు తప్ప పన్నీరు కనపడడం లేదే. ఆయనే కాదు, ఆయన లాంటి ఎంతోమంది అప్పుల ఊబిలో దిగబడిపోయి పరువు కోసం ప్రాణాలు బిగపట్టుకొని ఉన్నారు. 'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అనేది పాత సూక్తి. 'కృషితో అస్తి దుర్భిక్షమ్' అనేది నేటి సూక్తి."

రామిరెడ్డి తర్కానికి పంతులుగారు కొంచెం తబ్బిబ్బు పడ్డారు. అయినా సర్దుకొని అన్నారు. "కష్టే ఫలి అనేది మీకు తెలియంది కాదు రెడ్డిగారు. కష్టపడ్డ వానికి ఫలితం తప్పక లభిస్తుంది."

"కష్టపడే వాడికి ఫలితం లభిస్తే ఇంతమంది రైతులు ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటారు పంతులు గారు? ఇంకెంతో మంది చావలేక బ్రతుకుతున్నారు."

రామిరెడ్డిలో ఏదో ఆవేశం తన్నుకు వస్తుంది. ఏదో చెప్పలేని ఉద్విగ్నత ఆయన నరనరాలలో లావాలా ప్రవహిస్తుంది. ఆయన జీవితంలోని నిష్ఠుర సత్యాలు ఒక్కటొక్కటిగా వెలికి రావడం మొదలుపెట్టాయి.

"నా విషయమే చూడండి పంతులుగారు. గ్రాడ్యుయేట్‌నయ్యాక పనిచేస్తే పనికిరానని మా అన్నతో వివాదం పడి పట్నం వెళ్ళాను. నేను శాపగ్రస్త కులంలో పుట్టాను గనుక నాలాంటి అగ్రవర్ణ సామాన్యునికి ఏ ఉద్యోగం రాదని తెలుసు. అందుకే ఒక బార్‌లో మందు బాబుల సేవలో చేరిపోయాను. మందు సేవకొచ్చిన మా మామ అప్పటికి మామ కాలేదనుకోండి– నన్ను చూసి, నాలో యేమి సుగుణాలు కన్పడ్డాయొ తెలియదు కాని రేపు ఇంటికి రమ్మని అడ్రసిచ్చాడు. మొట్టమొదట మా ఆవిడ– ఆవిడ అప్పటికి మా ఆవిడ కాలేదనుకోండి– ఎదురుగా ధైర్యంగా నిలబడ్డ మొట్టమొదటి మొగవాన్ని నేనే. అంతకుముందు అనేకమంది ఆమెను చూసి హాస్పిటల్లో చేరిన వారున్నారు. భూతప్రేత పిశాచాది మాంత్రికులను ఆశ్రయించిన వారున్నారు. కొంతమంది జీవితం మీద విరక్తి చెంది సైన్యంలో చేరి దరిమిలా వీరచక్ర పరమవీర చక్రల్లాంటి అవార్డు పొందినవారున్నారు. నా విషయంలో కూడా ఇలాంటి ప్రమాదాలు తప్పవని ఆశిస్తున్న వారి నమ్మకాన్ని వమ్ము చేసి నేను మత్స్య యంత్రాన్ని ఛేదించిన పార్థునిలా నిలబడేసరికి వారు విస్తుపోయి, ఆ తర్వాత ఆనందపడి పిచ్చమ్మను నాకిచ్చి పెండ్లి చేశారు. ఆ తర్వాత ఆమె పేరు సౌందర్యగా మార్చాననుకోండి. అసలు సౌందర్యకు ఆమెకు తేడా ఏముంది? ఆమెకున్నవన్ని ఈమెకున్నాయి. కాకపోతే కాస్త కూర్పులో తేడా అంతే. ఈ విషయం గుర్తించక ఎంతోమంది వెతుక్కుంటూ వచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకున్నారు. వాస్తవంగా నేను చూసింది మా ఆవిడను కాదు. మా ఆవిడ వెనుక వున్న వాళ్ళ నాన్నగార్ని, ఆయన పనితనాన్ని, పరపతిని. ఆయన ఖాళీ చేతుల్తో నగరానికి వచ్చి కోట్లు కూడబెట్టాడు. కష్టపడి సంపాయించింది అనుకుంటె పొరపాటు. ఇతరుల

కష్టార్జితాన్ని పునాదిగా చేసుకొని తన మేథస్సుతో మేడలు కట్టాడు. అలాంటి లక్షణాలు నాలో పుష్కలంగా ఉన్నాయని తొలి చూపులోనే పసిగట్టడం ఆయన మేథా సంపత్తికి నిదర్శనం.”

పురాణ కాలక్షేపం కంటె రామిరెడ్డి ఆత్మకథా కాలక్షేపం జనాన్ని బాగా ఆకట్టుకున్నట్లుగా ఉంది. అందుకే అందరు ఊపిరి బిగపట్టి ఆసక్తిగా వింటున్నారు.

మంచినీళ్ళు తాగి రామిరెడ్డి మరల మొదలుపెట్టాడు. “అప్పటి నుండి నేను కూడా మా మామగారి అడుగుజాడలలో నడిచి ఆ మేడమీద మరో రెండు అంతస్తులు వేసి మా పేటకు లీడరునయ్యాను. నా ముగ్గురు కొడుకుల్లో పెద్దోడు ఖద్దరుకట్తే రెండోవాడు పచ్చజెండా పట్టాడు. మూడోవాడు కమలాన్ని నమ్ముకున్నాడు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా కాంట్రాక్టుల్లో, కమీషన్లలో మా వాటాకు, కోటాకు లోటు లేకుండా ఏర్పాటు చేశారు.

పెద్దమ్మాయి జయప్రదను ఒక బడా కాంట్రాక్టరుకిచ్చి గాంధీ బజారులోని బ్రాంది షాపు, ఒక అనాథ శరణాలయాన్ని వ్రాసిచ్చాను. రెండో అమ్మాయి జయసుధను ఒక ప్రజాసేవకునికి ఇచ్చి గల్ఫ్ దేశాలకు కూలీలను సరఫరా చేసే వ్యాపారాన్ని అప్పజెప్పాను. అందరం సుఖంగా హాయిగా ఉన్నాము. కృషిని నమ్ముకొన్న మా అన్నను, కృషిని వదిలేసిన మమ్ములను ఒకసారి బేరీజువేసి చూడండి పంతులుగారు. కృషితో దుర్భిక్షం తప్పదు అనేది తప్పక అంగీకరిస్తారు.” అన్నాడు రామిరెడ్డి.

జనమంతా స్థబ్దుగా కూర్చొన్నారు. చెమటలు పట్టిన రంగారెడ్డి, సెంటు పూసుకున్న రామిరెడ్డి త్రాసులో చెరో ప్రక్క కూర్చున్నట్టుగా, రామిరెడ్డి ముందు రంగారెడ్డి దూదిపింజలా తేలిపోతున్నట్లుగా అన్పించింది.

ఎంత సోదాహరణంగా వివరించినా రామిరెడ్డి వాదన పంతులుగారి మనసుకు నచ్చలేదు. “మీరు కోట్లు కూడబెట్టినా కూటికి మాత్రం రైతును ఆశ్రయించవలసిందే కదా రెడ్డిగారు. ధాన్యంతో తప్ప ధనంతో ఆకలి తీరదు కదా. అందుకే రైతు మానవ జాతికి వెన్నెముక అనేది నిత్యసత్యం.” అన్నాడు పంతులు గారు దృఢంగా.

రామిరెడ్డి సానుభూతిగా నవ్వి “నిజమే పంతులు గారూ. రైతు జాతికి వెన్నెముకే. కాని స్వార్థపరులైన అధికార, అనధికార ప్రముఖులతో ఆ వెన్నెముక రుజాగ్రస్తమైంది. మొలవని విత్తనాలిస్తారు. నకిలీ మందులిస్తారు. పచ్చచొక్కో, ఖద్దరులాల్చో సబ్సిడీలు కొట్టేసి అదునుపోయిన తర్వాత అప్పులమీద ఎరువులిస్తారు. ఈ సమాజపు వేరు పురుగులను అధికార్ల ‘తడి’చేతులు పట్టుకోవు పట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోదు. పండిన పంట రైతుల చేతులు దాటిన తర్వాత మద్దతు ధరలు ప్రకటిస్తారు. ఎగుమతులకు లైసెన్సులిస్తారు. రైతులు తాళికట్టిన మార్కెటు యార్డులు, బోర్డులు రంకు మొగుళ్ళకు అమ్ముడిపోయి రైతులకు “పేపరీలో ఏసిన ఇసువంటి సట్టాలు వూరకనే పుల్చుగారిపోతయ్యన్నాడు! గవర్నమెంటోరి నౌకర్లొచ్చి

పంటకల్లాలకాడ నిలబడి పంటలో సగానికి సగం కొలిపిత్తే తనీ సట్టాన్ని నమ్ముతానన్నాడు" అంది అలివేలు.

"మీ అయ్యకి చరీగా తెలవదు పెదబసవయ్యగారు బహు పెద్దమడిసి. ఈ సట్టం బొహుగెట్టిది" అనంటావున్నాడు రాములు.

"ఖడే బర్ఖదే" అని అరుసుకుంటా, సింతసెట్టు పక్కనుంచే వుసిగా లగెత్తింది ఏనాదిపిల్ల రామి.

✡

# కరువొచ్చె... కక్షలూ వచ్చె

–పాలగిరి విశ్వ ప్రసాద్

చేల కట్టల వెంబడి గడ్డి అంతా పైపై సృంగులన్నీ ఎర్రంగ ఎండిపోయి ఎర్రమన్ను పూత పూసినట్లుంది. అట్లాంటి గడ్డినే ఆపోతా పెరుక్కొని తింటా వుండాయి యెద్దులు.

మళ్ళా ఈ మాత్రం గడ్డెన్నా దొరుకుతాదో లేదోనని దీక్షగా తింటా వుండే యెద్దుల్ను చూస్తాంటే కడుపు కోసక పోతాఉన్నెట్టుంది రామారెడ్డికి. “బట్టకోడె ఒక్కటే జొన్నర పొట్టు తింటాండె. అట్లాడిది రొంటెకూ కలిసి జొళ్ళ పొట్టన్నా పెట్టలేకుండా. ఏం కరువో! ఏం కాలమో, తీ!” బాధపడతా నిట్టూర్చినాడు.

చెట్టుకింద కూర్చోనుండే తావునుంచే మోర పైకెత్తి మోడం దిక్కు జూసినాడు. తాపసం పట్టలేక ఘడియకోసారి ఆయప్ప చూడ్డమే గానీ, ఆడేమన్నా ఒక్కరవ్వ గుడ్డి మోడమన్నా వుంటే గదా!

ఏకిన దూది విసిరేసినట్లు పొగమాదిరుండే మోడాలు యాడికో పరిగెత్తుతా వుండాయ్. అవి తప్ప నిచ్చి వానొచ్చే చూపేం కానరాలే. ఉబ్బరపు యెండేమో మాడు పగలకొడతా వుంది.

“రేపోమాపో ఈ గొల్ల కార్తి గూడా పోతాంది. ఈ వాన ఇంగేముస్చాదబ్బా!” రామారెడ్డికి ఉసూరుమనిపిచ్చింది. పయిమింది తుండుగుడ్డతో ముఖం తుడుచుకొని “పొద్దుతిరిగి నట్లుంద”ను కుంటా లేచినాడు.

బిళ్ళలు బిళ్ళలుగా యెండిపోతాండే సెనక్కాయ చేనిదిక్కు చూడను గూడా బుద్ధిపుట్టలే. ఆ వల్ల మూలన యెవరియో రెండు ఎనుములు – అబ్బని సొత్తంతా గుట్టబోసినట్లు చేలో బడి మేస్తా ఉండాయ్. దాంట్లెను చూస్తానే, అప్పటి దాంకా నీరసచ్చుగా వుండినే అతని పయి కోపంతో జలదరించింది.

పండ్లు పటపటా కొరుకుతూ, వొంగి చేతినిండా రాయి దీసుకుని ఆవల్లకు ఉరికినాడు. “థయ్... నీయమ్మ... మిమ్మల్ను మాదిగింటికీడ్సా... పొలం పైరు మిందుంటే ఎవర్తే

మిమ్మల్నిడ్సింది. లంజా కొడుకులు – రయితులైతే ఈ కాలం పొలం మిదికిడుస్చారా?... మేపుకు అంత గతి లేకుంటే వాళ్ళ పెండ్లాలను యాడన్నా పండబెట్టగూడ్దా?... ఉలోళ్ళ సేలల్లోకి తోలకుంటే!.... " అని అరుచుకుంటా, రొప్పుతా ఎనమల్ను వెంటబడినాడు.

మనిషి ఉరుకుతా రావడం పసిగట్టినే ఎనుములు మోర పైకెత్తి రామారెడ్డి దిక్కు ఒకసారి చూసి, వాతేసిన దాంట్లె మాదిరి చెంగరి బింగిరని యెగిరి, ఆమైన ఒకటే పరుగు దీసుకున్నేయి.

రామారెడ్డి దాంట్ల వెంబడే రోంత దూరం పరిగెత్తి.. ఇంగ పరుగెత్తలేక రాళ్ళు విసురుతా నిలబడినాడు. ఎనుములు కంటిచూపు దాటెల్దాంక – దాంట్లెను, దాంట్లె రైతల్ను, వాళ్ళ వంశాల్ని పాడు తిట్లు తిడ్తానే ఉండె.

ఒక దిక్కు వానరాక పైరు ఎండిపోతాంటే, ఉండే రోంత పైరునూ ఊళోళ్ళ పశువులు మేసిపోతాంటే – ఎవరికైనా కడుపు కాల్తాది మళ్ళ.

ఎనుములు కనబడకుండా పోతానే తిరిగి యెద్దులకాడి కొచ్చి పగ్గాలు చేతికి దీసుకొని, యెద్దల్ను యింటి మొగానికి మళ్ళిచ్చినాడు. వచ్చే దావలో వడ్డోని వొంకలో నీళ్ళేమన్నా వుండాయేమోనని పారచూస్తే, యాడా నీళ్ళ చుక్కలేదు. ఎద్దులు యెండతాకిడికి బుస పోసుకుంటాంటే, ఉసూరంటా యింటి మొగం పట్టినాడు.

ఎద్దుల్ని గాటిగట్టేసి, చెంబెడు నీళ్ళు తాగి – "బువ్వ తినకుండా మాళ్ళా యాడికిప్పుడు?" అని పెండ్లాం పిలుస్తా వున్నా వినిపిచ్చుకోకుండా, బయటపడి నేరుగా రంగారెడ్డి కాడికి పోయినాడు.

రంగారెడ్డి అప్పుడే బువ్వదిని యింటి ముందర వేపచెట్టు కింద అరుగు మింద కూర్చొని, పక్కనుండే క్రిష్ణారెడ్డితో "అబ్బ! ఏం యెండ కాస్సొందెన్నాబ్బ! వాన మటుకు వచ్చేటక లేదు" అంటా వుండగనే, అదర బాదర ఆడికొచ్చిన రామారెడ్డి "అబ్బీ! రంగా! పొలంలో ఎనముల్ను సూడుపో! కాయిలి కాండ్లు లేక పొలమంతా నాశనమయి పోతాంది. ఇట్నే ఇడిసి బెట్తే యెట్లబ్బీ? ఎట్నోకట్ట వూర్లో అందర్తో మాట్లాడి ఆ కాయిల కాళ్ళను బెట్టు. ఆ రోంత మేపన్నా దక్కిచ్చు కోకుంటే పసల్ను మైదుకూరు సంతకు దోలాల్సిందే!" అని వగర్చినాడు, రంగారెడ్డిలో మట్టుకు ఉలుకు లేదు – పలుకులేదు.

ఉలకడానికీ, పలకడానికీ – కాయిలి కాళ్ళను బెట్టేది మాటల్తో అయ్యే పనైతే గదా! ఏలంటే? – చుట్టుపట్ల అన్ని వూర్ల మాదిరే ఆ వూర్లో పార్టీ వుంది మరి. లేకుండా వుండను – ఆడేమన్నా గాంధీ తాతలుండారా, యేమన్నానా?

ఆ వూర్లో వుండేదీ మామూలు జనమే. కరువులతో కటకట లాడతా చదువు సందెల్లేక, రాజకీయ నాయకులు చెప్పినట్టల్లా ఆడే మట్టి బుర్ర మడుసులే ఆడా వుండారు. అందుకే ఆ వూర్లో గూడా పార్టీ వుంది.

పార్టీ వుండాది కాబట్టి కూటికీ, కూరాక్కూ రాకపోయినా అప్పుడప్పుడు ఖూనీలు గూడా చేసుకున్నేరు

ఈ మధ్యనే రంగారెడ్డి అన్న రామనాథరెడ్డి ఖూనీ అయినాడు. ఖూనీ కన్న రెండు నెలల ముందర వూరు శాంతంగానే ఉండె.

శాంతంగా వుంటే గవుర్మెంటు చేతులు మారేదెట్లా?... చేతులు మారక పోతే అవుతల రాజకీయ పార్టీకీ, దాన్ని నమ్ముకున్న నాయకులకు జరుగుబాటయ్యే దెట్లా?... అందుకే పంచాయితి ఎలక్షన్లొచ్చినయ్.

"ఎలచ్చన్లలో ఈసారి ఎట్లయినా ఆ ముసిలి పెసిడెంటును పడగొట్టాల. మీ వూరి పంచాయితి మన సేతల్లోకి రావాల" అని ఎమ్మెల్లే రోషం బోసి కైపెక్కిచ్చినాడు.

ఆ కైపుమిందనే రామనాథరెడ్డి తమ గుంపులో అందర్తో మాట్లాడి, చదువుకున్నోడని తమ మేనల్లుడు శ్రీరాంరెడ్డిని నిలబెట్టి, గట్టి తగులే తగిలి రవ్వంతలో ఓడిపోయినారు.

చావుదప్పి కన్నులొట్ట పోయినట్లు ఆడికాడికి గెలిచే సరికి, ముసిలి ప్రెసిడెంటుకు మనసులో యే మూలనో రామనాథరెడ్డి మింద అగ్గి అంటుకున్నేది. దానికి తోడు ఎమ్మెల్యేకు ప్రత్యర్థిగా వుండే నాయుడొచ్చి– "ఛీఛీ! ఏంది కొండారెడ్డీ! ఇట్లయింది. నువ్వూ, నేనూ ఎన్ని దొంగ తిరగళ్లో పడ్తే తప్ప మీ పంచాయితి నిలబెట్టుకోలేనంత పనెయ్యిందే! ఇంగ ఈ రాంనాథరెడ్డి గాడ్ని బతకనిస్తే నీకు బరువే. సూడు మళ్ళ!" అని ఆ యగ్గి మింద యింత గబ్బు నూనె గుమ్మరిచ్చినాడు. మంటలు లేచినయ్. ఆ మంటల్లో – పదేండ్లప్పుడు తన మూడో కొడుకును... పెండ్లయి యేడాది కూడా దాటని వాణ్ణి... నడివీధిలో ఈటెల్తో చెక్కి లేవనెత్తిన దృశ్యం కనబడింది... తను పుట్టిచ్చిన వాడు – తన కన్నా ముందు – తన కండ్ల ముందర్నే తనకలాడతా నీలుక్కపోతే, ఆ దృశ్యం ఏ తండ్రి కండ్లల్లో చెదిరి పోతాది?.... ప్రెసిడెంటు కండ్లల్లో గతం కదిలింది.... అంతే!

వూర్లో నుంచి పేటకు బోయే దావలో రామనాథరెడ్డి ఖూనీ అయినాడు. రామనాథరెడ్డి గుంపుకు రంగారెడ్డి లీడరైనాడు. ఇంత జరిగినాంక 'ముసిలి పెసిడెంటు పెత్తనం ఇంగ సాగనియ్య గూడద'ని రంగారెడ్డి గుంపోళ్ళు అనుకున్నేరంటే అనుకోరా మారి!

అనుకోవడమే ఆలశ్యం – "ఇప్పట్నుంచి బందెలెక్కా, పుల్లరి లెక్కా పెసిడెంటు కాడ గాకుండా, వూర్లో నలుగురు పెద్ద మన్చుల్ని బెట్టి వాళ్ళ సేతికియ్యాల. అట్లయితే కాయిలి కాండ్లను బెట్టి బందె నడుపుదాం. లేకుంటే వొద్ద"న్నేరు.

మరి ప్రెసిడెంటు గుంపోళ్ళు తక్కువా? – "ఇన్నేండ్లా లేని పద్ధతి ఇప్పుడేంది? ఎప్పటి మాదిరే పుల్లరి, బందె పెత్తనమంతా మాదే. అట్లగాకుంటే కాయిలే వొద్ద"న్నేరు.

ఈ మాటలు ఎవరిండ్ల కాడ వాళ్ళనుకున్నే... ఈడియి ఆడా, ఆడియి ఈడా చేర్చి పుణ్ణెం గట్టుకుండే నారదులుండారు గాబట్టి... యెదట బడి అనుకున్నెట్టే, చానా రోషంగా అనుకున్నేరు.

అందుకే ఈ యేడాది కట్టుబాట్లు లేక వూర్లో కాయిలికాండ్లు లేక, పొలంలో దొంగ పనలకు తిర్నాలయింది.

ఇదంతా రామారెడ్డికి తెలియక కాదు – తెలుసు. అయినా కడుపులో భగ్గుమంటాంటే, ఉండబట్ట లేక వొచ్చి రంగారెడ్డికి చెప్పినాడు. ఇయన్నీ మనసులో మెదిలి రంగారెడ్డి, వులకలే – పలకలే.

"ఏంబ్బీ! పలకవ్?" రామారెడ్డి గొంతులో యెవరి మిందనో కోపం – దేని కోసమో దిగులు – ఏంజేయడానికి లేదనే బాధ – అన్నీ ఉండయ్.

"ఏం బలకాలన్నా? నీకు తెలందేందుంది? నిన్నగాక మొన్న మన అన్నను పొట్టన బెట్టుకుంటే, అదెంతా మర్చిపోయి వాళ్ళకే వూరి పెత్తనమిచ్చి బందె నడిపి కాయిలి కాండ్లను బెట్టమని చెప్పమంటావ్?" రంగారెడ్డి కూడా రవ్వంత కోపంగానే అనె.

రంగారెడ్డి కోపం జూసేమో, రామారెడ్డి ఆ పైనేం మాట్లాడ్లేక పాయె. పక్కన్నే వుండే క్రిష్ణారెడ్డి కలగ జేస్కొని "మన దిక్కుండే వాళ్ళనే, ధైర్యంగా వుంటామనే వాళ్ళను యిద్దర్ని, మనమే కాయిలి బెడ్తే ఏమయితాది?" అన్నేడు.

"ఏమయితాది! అవతోళ్ళు అతానికైనా వాళ్ళ పసల్నిడిసి పొలం మీద తోల్తారు. దాంట్లెను బందెకు తోలుకొచ్చే టప్పుడల్లా చిల్లర కొట్లాటలయి తంటయ్."

రంగారెడ్డి తుండు గుడ్డ పయి మీద విసురుకుంటా నిబ్బరంగా ఆ మాటనేసరికి క్రిష్ణారెడ్డికి మంట పుట్టింది. "అని నువ్వనుకుంటే ఎట్లా? ఎనమల్నుయిడిసి తోలడానికి వాళ్ళు దినేది బువ్వా? –దొంకల్లో దేమన్నానా? ఏం వాళ్ళు రైతులకు పుటినోళ్లు గాదూ?" అని ఎగిరినాడు. అప్పటికి ఇవతలోళ్ళంతా చక్కగ యోచన చేస్తాన్నెట్టు !

గురివింద గింజ తన కిందుండే నలుపు తనెరక్క, 'నేనె(రదాన్న'ని ఎగిరినట్టు – రోషంతో యెదుటోళ్ళను తప్పులు బడతా కూర్చోవడంతోనే తెల్లార్తాంది గానీ, సరిగ్గా ఆలోసించి బాగుపడదామని ఎవరికీ తోచదు. ఒకరని గాదు – రెండు గుంపుల్లో యిదే తంతే!

ఆడికి, ఆ బందె సుద్ది చాలిస్తామనుకున్నేడేమో – రంగారెడ్డి గూడా "సర్లెయితే! మన గుంపులో అందరితో మాట్లాడి దండవారేయిచ్చి రేత్తిరికి సావిట్లో కూర్చుందాంలే!" అన్నేడు.

ఆయప్ప ఆ మాటలు ఆడికి తుంచుతా వుండగనే శ్రీరాంరెడ్డి అటుగా వొచ్చినాడు.

అతగాడిని చూస్తానే, క్రిష్ణారెడ్డి – "ఏం వోయ్! ఎమ్మెల్లే కాడికేమన్నా పోయిన్నేవా? గవుర్మెంటు కరువు బత్తెమేందన్నా యిస్తాదేమో ఎమ్మెల్లేను అడగ్గూడదూ? మీ మామగారు చానా యిబ్బంది పడ్తాన్నెట్టుంది" అంటూ అడిగినాడు. అప్పటికి క్రిష్ణారెడ్డికి యే యిబ్బందీ లేనట్టూ, ఆయప్పకు కరువు రానెట్టూ!

శ్రీరాంరెడ్డి అరుగు మీద కూర్చుంటా అన్నేడు "మామగా రొక్కరేనేం? రాయల్సీమంతా యిబ్బంది బడతాంది. అయినా మనకు కరువులొచ్చినా బత్తేలూ రావు... బొగ్గులూ రావు. సస్తే పాడె గట్టుకోను గూడా లెక్కియ్యరు. మన సావేందో మనం సావాల్సిందే".

ఉత్తరాదిన తుఫానులొస్తే గవర్నమెంటోళ్ళే రాష్ట్రమంతా చెందాలడిగి వాళ్ళను ఆదుకుంటారు. ఈ జిల్లా కలెక్టరు గూడా వూరూరా దిరిగి చెందాలు సేకరిచ్చినాడు. ఏ ఆఫీసుల కాడ జూసినా హుండీలు పెట్టి, పనిబడి పోయినోళ్ళందర్తో బలవంతపు చెందాలు తీసుకున్నేరు – ఆఫీసర్లే.

మరి ఈడ కరువొస్తే ఏ గవర్నమెంటూ – ఏ నాయకులూ – ఏ అధికార్లూ పూసుకొని చెందాలడగరు. వీళ్ళ నాదుకోరు. అట్లెందుకో వీళ్లకు అంతు బట్టదు.

శ్రీ రాంరెడ్డిని ఆ మాటే అడిగితే, అతనంటాడూ – "మనం యెనక బన్నోళ్ళం. మన బతుకు మనం బతకాడానికే పెద్ద పోరాటమయితాంది. ఇంగ ప్రభుత్వాలతో ఏం పోరాడ్తం?– ఏం ఉద్యమాలు చేస్తం? – మనకా స్తోమత లేదు, ఓట్లేయడానికి తప్పనిచ్చి దేనికీ పనికి రానోళ్ళం. మన్లో మనం కొట్టుకుంటా ఎట్టైనా రెండు పార్టీలకు చెరిసగం ఓట్లేస్తాం. అందుకే మనకు సాయం చెయ్యకపోయినా ఈ గవుర్మెంటుకు వొచ్చే నష్టమేం వుండదు. నష్టముండదు గాబట్టి సాయం చెయ్యరు. అయినా, ఎవడైనా ఉండేవానికే సాయం చేస్తాడు గానీ, లేనోనికీ – యెనకబన్నోనికీ ఎవడూ చెయ్యడు. అది లోకం రీతి. అంతెందుకు మనూర్లో మాలా మాదిగోళ్ళనూ మనమెట్ల చూస్తాండామో అట్లనే రాష్ట్రంలో రాయల్సీమ బతుకులంటే మాలా మాదిగోళ్ళ కన్నా కనకట్టంగా ఉండయ్ – ఈ గవుర్మెంటుకు, ఈ నాయకులకూ".

"ఈ రాజకీయాల్లో బడ్తే తెగేది గాదు గానీ ---" అంటా రామారెడ్డి, క్రిష్ణారెడ్డి దిక్కు జూసి "ఏంబ్బీ! జొన్నలు రేటెట్టుండాయంట?" అని అడిగినాడు.

క్రిష్ణారెడ్డి మొఖం ఆ పక్కకు దిప్పుకుంటా – "ఏం రేటోలే! రైతుకు అమ్మబోతే అడివీ, కొనబోతే కొరివయితాంది. జొన్నల మార్కెట్టు మంద మొచ్చిందంట. ఆ సెట్టి నూట నలభై రూపాయలకన్నా జాస్తి పెట్టనంటాండాడు." అంటూ నిట్టూర్చినాడు.

రామారెడ్డికి చెర్రుమనింది – "ఏం మందమంట? ఈ పెద్ద నా కొడుకులందరూ యాన్నో బొంబాయ్‌లోనో, ఢిల్లీలోనో కూచ్చుండేదీ – ఆడ రేటు బెట్టి దేశమంతా ఫోన్లు జేసి చెప్పేది. ఆ రేటమ్మడి ఈడ ఈళ్ళు కొంటాండేదీ! రోజొక రకం రేటు... ఛూ.. దీనెమ్మ!

అయినా దేశంలో అన్ని వస్తువులకు తయారు జేసినోడూ, అమ్మేవాడూ రేటు బెడ్తాడే! అదేం కర్మరా! రైతు పండిచ్చిన తిండి గింజలకు మటుకు రైతు రేటు బెట్టకుండా, కొనే నా కొడుకులే రేట్లు బెట్తారు?" అంటా ఆయప్ప ఎవరి మిందనో వుండే మంటను క్రిష్ణారెడ్డి మింద చూపిచ్చినాడు.

క్రిష్ణారెడ్డి నవ్వుతా "ఇదేందిది? నామీద ఎగుర్తాడు? నేనే మన్నా పి.వి. నర్సిమ్మారావ్‌నా? – లేక మన్మొకన్సింగునా యేందో కమీషను దీస్కొని తూకలేసేవాన్ని. నన్నడుగుతే ఏం లాబం? రేపు మనెమ్మెల్లే హైద్రాబాద్ నుంచి వచ్చినాంక అడుగు" అనె.

"ఎవన్నడిగినా మన బతుకులింతే గానీ, ఉప్పూ మిరపకాయ గ్గూడా లేదు. జొన్నలన్నా అమ్ముదామంటే, నువ్వామాట అంటండవ్! అంత అద్దుమానంగా రేటు కాలబడితే యాడమ్ముతావ్ తీ! సంగటో, కారమో దిని కండ్లు మూసుకుంటే రేటున్నెప్పుడే అమ్మచ్చు" అని రామారెడ్డి దిగులుగా యింటి మొగం పట్టినాడు.

రంగారెడ్డి "ఏన్నా! పోతండవ్? కూకుందురా!" అంటే, "ఇంగా బువ్వ గూడా తిన్లేబ్బీ! ఆ పొలం కాయిలి మాటే మాట్లాడదామని చేనికాడ్నించి యిట్నే వొచ్చినా. ఆ యిసయం మనాళ్ళందర్తో మాట్లాడిందు" అంటా రామారెడ్డి దాటి పోయినాడు.

✡

రేత్తిరి తొమ్మిది గంటలప్పుడు ఒక్కక్కరే వూరి చావిట్లోకి జేరుకున్నేరు. రంగారెడ్డి గుంపోళ్ళే గాకుండా వూళ్ళోని రైతులంతా వొచ్చినారు. అవతల ప్రెసిడెంటు గుంపోళ్ళు ఇంగారాలె.

క్రిష్ణారెడ్డి పక్కనే వుండే రంగారెడ్డితో "అవతలోళ్ళు ఇంగా రాలేదే! మనమే చెర్చ మొదులుబెడదామా?" అంటే, "ఇంగా ఇంచేపు చూస్తాంలే!" అన్నేరెవరో, తమ గుంపులో గూడా శ్రీరాంరెడ్డి ఇంగా రాలే గాబట్టి 'సర్లే' అనుకున్నేరు.

✡

బువ్వ తింటానే చొక్కా తొడుక్కొంటా వుండే శ్రీ రాం రెడ్డిని జూసి "చావిట్లోకేనా?" అనడిగింది శ్రీ కళ – శ్రీ రాంరెడ్డి పెండ్లాం.

పెండ్లయి యేడాది కూడా కాలే. చిన్నప్పుట్నుంచీ పట్నంలో పెరిగి, చదువుకున్నేదే అయినా – బంధుత్వం వుండడంతో చిన్నప్పట్నుంచీ యిష్టపడిన శ్రీరాం రెడ్డినే చేసుకున్నేది.

పెండ్లాం మాటకు జవాబు చెప్పకుండా ఆ మనిషి తన పనిలో తనుండాడు. ఆమె వుక్రోషంగా – "ఊర్లో పంచాయితీలు పెట్టుకొని, నలుగురూ కలిసి ఒక మాట మింది కొచ్చి పనులు జేసుకుండే రకముందా? ఆ చావిట్లో మాటా మాటా పెంచుకొని కొట్టుకోవడానికే

ఇప్పుడిదెంతా పెట్టుకున్నేరు" అనింది. అప్పటి గ్గాడా శ్రీరాం రెడ్డి ఉలుకూ, పలుకూ లేకుండా, గాడిపాట నుండే మచ్చు మింద నుంచి ఈటె తీసి, దుమ్ము తుడిచి వాకిలి చాటున పెట్టి "దీన్ని ఈడ్నే ఉన్నియ్యి" అంటా చెప్పులేసుకున్నేడు. పైన యేడనోవుండే ఈటెను తీసి పంచలో పెట్టే సరికి ఆమె మనసు ఉగ్గబట్టుకోలేకపోయింది. అడ్డం యెదట పడి – "చదువుకున్నోనివి. వూర్లో అందరికీ చెప్పేది పోనిచ్చి, నువ్వే ముందు తయారయితా వుండావ్! ఏంటికి నీ చదువు?" అంటా నిలదీసింది.

శ్రీ రాం రెడ్డి పొడిచే చూపు జూసి, "నోర్మూసుకొని వుండు" అంటా పక్కన బడి దాటిపోయినాడు.

✡

ఆడ ప్రెసిడెంటు ఇంటి కాడనేమో – 'సావిట్లోకి పోదామా! వొద్దా' అని చానా సేపు వూగిస లాడినారు. ఆఖరుకేమో "మనం లేకుండా వూర్లో పంచాయితీలు జరగబడితే, మన పెత్తనమేం గావాల!" అనుకొని చావిడి కాడికి పోదామనే తీరుమానం జేసినారు.

ముందు – ఉత్త చేతులతోనే పోదామనుకున్నేరు. అయితే ఎవడోకడు గిలిగాడుండనే వుంటాడు గదా! ఉడత పెత్తనం పూసుకొని – "ఏందన్నా! మీకేం లోకం దెలుస్తాందా, లేదా? నిన్న గాక మొన్న రాంనాధ రెడ్డి ఖూనీ పడె. అవతలోళ్ళింకా ఉడుకు మిందనే వుంటారు. ఇట్టాటప్పుడు వాళ్ళెదరకు ఉత్త సేతుల్తో బోతా మంటారే! ఒకటేసారి గుంపునంతా గుండం జేస్చామను కుంటా వుండారా యెట్లా?" అని గీరినాడు.

"ఔన్నిజవే!, ఔన్నిజవే!" అన్నేరు తందానాగాళ్ళు. సరే! చెడ్డ తల్చి మంచి చూడమన్నేరు గదా పెద్దోళ్ళు. కొందరి చేతల్లో నన్నా యారముట్లుండాలనుకొని కట్టెలు, ఈటెలు, యాట కొడవండ్లు చేత బట్టి కదిల్రి.

ఇంకేందుంది, అగ్గిపుల్ల గీకినట్టయింది.

చేతల్లో యారముట్లతో చావిట్లో కొచ్చిన వాళ్ళ హంగామా జూసి క్రిష్ణారెడ్డి, రామారెడ్డితో – "అన్నా! ఈ నా కొడుకులంతా పంచాయితి కొచ్చినట్లు కాన్రాలె. ఆ సేతల్లో ఈటెలూ, కత్తులేంటికి? నాకేందో అనుమానంగా వుంది. నేడు గూడా మన యూరముట్లన్నీ తీస్కోనొస్తా!" అంటా, రామారెడ్డి వారిస్తా వున్నే వినకుండా, అవతల కూర్చోనుండే బాలిరెడ్డినీ, జయరాముడ్నీ, సుబ్బరాయుడ్నీ, చెంచి రెడ్డినీ లేవదీసక పోయినాడు..

చావిట్లో ఒకరిద్దరు ముసిలోళ్ళు మటుకు "ఈ వూరేం బతికి బట్టకట్టే రకంగాదులే!" అనుకుంటా నేలకేసి చూస్తా కూర్చుండిరి.

“అందరూ వూరక కూచ్చుంటే యెట్ల? యెవరో వొకరు సెప్పండి” అని యెవరో ఎత్తిడి చాలక, రంగారెడ్డి లేచి నిలబడతా – “ఊళ్ళో మీ యందరికీ తెలందేం లేదు. సెనక్కాయ రౌనెళ్ళ పైరయింది. వాన్రాక ఆ సెట్లకు యిప్పుడి దాంకా వూడలు గూడా దిగలే. సెట్లన్నీ యెండి పోతాండయ్. ఇట్టాటి కరువులో వూళ్లోని పనికిమాలినోళ్ళు కొందరు పసల్ను పైరు మిందికి యిడిసి పెడ్తాండారు. ఉండే రోంత పైరూ వూలోళ్ళ పసులు మేసిపోతే, మళ్ళా పసులకు మేపు గూడా వుండదు. అందుకే యాటా మాదిరే కాయిలి కాండ్లను పెడదాం” అన్నేడు.

ఎవరూ ఏమీ మాట్లాడలే. ఇట్లాటి చోట రెండు గుంపుల్లోని పెద్దోళ్ళు మాట్లాడాల్సిందే తప్ప, వూర్లో జనం కలగజేసుకోరు. యేలంటే, గ్రామ పార్టీలో యేదో వొక గుంపుకు తమను గూడా జమ కడతారేమోనని భయం. అందుకే “యాలొచ్చిన పీడలే!” అని ఎవరూ మాట్లాడలే.

రవ్వంత సేపుండి ప్రెసిడెంటే ఎత్తినాడు– “కాయిలి కాండ్లను బెట్టొద్దని ఎవడన్నేడు? నేను కాయిలి కాండ్లను పెట్టింటే, మీ గుంపోళ్ళే వొద్దన్నేరని వాళ్ళు మానుకున్నేరు.”

వెనకంబడే రంగారెడ్డి అందుకున్నేడు. “మేం కాయిలి కాండ్లను వొద్దన్నేమని ఎవడనింది? అబద్దాలాడి వూర్లో మమ్మల్ని చెడ్డ సెయ్యొద్దు. బందె లెక్క నీ సేతికి యియ్యకుండా, వూర్లో పెద్ద మనుసుల్ని బెట్టి వాళ్ళ సేతికియ్యాలని జెప్పినం. అట్లయితే కాయిలే మానుకోండి అని కాయిలి కాండ్లను నువ్వే మాన్పిచ్చినవ్.”

ఒక క్షణం ఎవ్వరూ ఏమీ మాట్లాడలే. కొందరేమో యేందో గొణుక్కుంటా ఉండిరి– “ఆకులో బెట్టమని ఒకడూ, బోకిలో బెట్టమని ఒకడూ – దేంట్లో బెట్టినా పంచాయితీ తెగేదంత కన్నా లేదు!” అని.

అయితే పైకి యెవ్వరూ ఏమీ మాట్లాడలే.

ఒక క్షణమున్నేంక ప్రెసిడెంటు యింత జంపున నిట్టూర్చి – “అట్లయితే మీరంతా సక్కనోళ్ళూ, నీతైనోళ్ళూ, మేం మట్టుకే దొంగ నా కొడుకుల మంటావ్? వూరి సొమ్ము తింటాండేది మేం మటుకే నంటావ్?” అంటా చెతురు బలికినాడు.

ఆయప్ప చెతురుకు వీళ్ళకు మండిందేమో – “మేమనేదేంది! ఎవరు దొంగనాకొడుకులో వూర్లో అందరికీ తెల్సు” అంటా రామారెడ్డి యింతెత్తున లేచినాడు.

అప్పటి దాంకా వూరికే చూస్తా వుండే ప్రెసిడెంటు రెండో కొడుకు మల్లారెడ్డి కలగ జేసుకున్నేడు – “ఏందిరా తెల్సేది? ఊర్లో మేం మంచోళ్ళం అనుకోబట్టే గెల్చింది. అది సేతగాక మామింద బడి యేడుస్తారే? సేతగానోళ్ళు సేతగానెట్టు పడుండండి. మీరు ప్రెసిడెంటయినా పొద్దు మాట్టాడ్దురు.” అన్నేడు.

“ఎవర్రా సేతగాన్నా కొడుకులు? మీరు... మీరే సేతగాన్నా కొడుకులు. సేతగాకనే నాయ్డుగాన్తో కల్సి కుట్రబన్ని మాయన్నను దొంగ దెబ్బ తీసి సంపినారు”. అంటా రంగారెడ్డి, రామారెడ్డి ముందుకు తోసుకొచ్చినారు.

అప్పుడికే రెండు గుంపులోళ్ళ మనుషుల్లో సెగ రాజుకున్నేది.

“ఏం గోరం సూడాల్సొస్తాదో! యెందుకు తీ! పాడు!” అనుకుంటా వుండే ముసిలోళ్ళు మటుకు లేచి పోను మొదులు పెట్టిరి.

అసలు – ముందు, వాళ్ళకు మేత గురించి, కాయిలి గురించి కాబట్టింటే గదా! ఆ కాయిలి మింద, బందె మింద తమ పెత్తనమే వుండాలని యిద్దరికి వుండాది. అది కుదిరేది గాదు. “మనుసులకు తిండెట్లా లేదు – వుండే పసల మేతనన్నా కాపాడుకుందాం” అని మాట్లాడుకోవడానికి వొచ్చి, అసలిది విడిచి పెట్టి ఆవేశాల్లో పడిరి. పాతయన్నీ తవ్వుకోని మాటామాటా పెంచుకున్నేరు.

ఇంతలోనే యారముట్ల కోసం బోయిన క్రిష్ణారెడ్డీ, బాలిరెడ్డీ, జయరాంరెడ్డీ, చెంచిరెడ్డీ వొచ్చి గుంపులో కలిసినారు.

ముందు జాగ్రత్తగానే వొచ్చిన ప్రెసిడెంటు గుంపోళ్ళ చేతుల్లోని యారముట్లు గాల్లోకి లేచినాయ్....

అరుపులు... పరుగులు.... ఉరుకులు... తలకాయలు పగిలిన చప్పుళ్ళు.

రవ్వంత సేపట్లోనే చావిట్లో బీభత్సం! “కోబలీ... ! నరుకు...! సంపు....! సెక్కండి నాకొడకల్ను..!” అరుపులు. దెబ్బలకు తట్టుకోలేక పరుగులు పెట్టినారు.

చీకట్లో కొట్టుకోవడానికి ఎవరు యెవరో తెలీక రెండు గుంపులోళ్ళు పరిగెత్తి మిద్దెలెక్కినారు. ప్రెసిడెంటు గుంపోళ్ళు ప్రెసిడెంటు మిద్దెక్కినారు. ఆ మిద్దెకు యెదురుగా వుండే రామనాథరెడ్డి మిద్ది మిందికి యివతలి గుంపోళ్ళెక్కినారు.

ఆ చీకట్లో రెండు మిద్దెల మిందనుంచీ బాంబుల పుట్టచెండ్ల మాదిరి వొచ్చి పడతా వుండాయ్... ఆఖరుకు మబ్బున యేం కాన్రాక ‘బాంబులాట’ చాలిచ్చి, రెండు గుంపు లోళ్ళు మిద్దెల మిందనే కూర్చుండిరి.

పోలీసోల్లకు తెలియకుండా వుంటాదా? ఆడుండేది నాల్గుమైళ్ళు. ఈడ బాంబు లేసుకుండేప్పుడే ఆడ తెల్సి వుంటాది. తెల్లారు ఝాము కల్లా యర్రగుంట్ల నుంచి జీపు వొచ్చి దిగినారు. రెండు గుంపులోళ్ళు చీకట్లో ఎవరికి దొరికిన దావ వాళ్ళు బట్టుకొని పరిగెత్తినారు.

మళ్లా అందరూ తప్పించుకుంటే యెట్ల? కేసు రాయిచ్చే వాడెవడు?... అది వాళ్ళకూ తెలుసు.

అందుకనే దండిగా దెబ్బలు తగిలినవాళ్ళూ, ప్రాణం మిందికొచ్చినోళ్ళూ మట్టుకు పోలీసోళ్ళకు చిక్కి కేసు రాయిచ్చినారు.

ఊర్లో పోలీసోళ్ళు క్యాంపేసినారు.

✡

వూరు వల్లకాడయి పోయినట్లాయె. వూర్లో నల్గురు కలిసి కూర్చొని మాట్లాడు కుండేదే లేకపాయ. ఇవతల గుంపులో బాలిరెడ్డి, అవతల మల్లారెడ్డి బాంబు దెబ్బలు తగిలి పెద్దాస్పత్రి పాలైనారు. యివతలోళ్ళు, అవతలోళ్ళు వూరు విడిచి పాయిరి. వూర్లో వుంటే యే ఝామున పోలీసోళ్లొచ్చి యిండ్లమింద బడి ఈడ్చక పోతారోనని భయం. ఇంగ వీళ్ళిద్దరి చేలదిక్కు మొఖం చూపడానికి క్కూడ మొగోడు లేకపాయె. ఇంగేముంది – బోగమిండ్లు కొల్లబోయింది. కాటిక్కాలు చాంపుకొని వుండే ముసిలోడు గూడా గోసిప్పుకుని వురికెత్తడవే. అనేవాడూ, అడిగేవాడూ లేక వూరందరి పశువులు వీలిద్దరి చేలల్లోనే.

వూరు విడిచి రంగారెడ్డి గుంపోళ్ళేమో, యేడనో గుట్ట కిందుండే పల్లెలో నెలువైన ఆయప్ప యెవరో వుంటే, వాళ్ళింట్లో తలదాచుకుంద్రి.

శ్రీరాం రెడ్డి మట్టుకు ఎమ్మెల్లేకాడికి, పోలీస్టేషన్‌కు, వకీల్ కాడికి తిరిగి – తిరిగి, పోలీసోళ్ళ తాకిడి లేకుండా – తాము వూరికి బోయి వుండేటట్లూ – నాల్రోజులయినాంక కోర్టుకు హాజరయ్యేటట్లూ మాట్లాడినాడు. పెద్దాస్పత్రి డాక్టరుకు కూడా ఎమ్మెల్లేతో ఫోన్ చేయిచ్చి, డాక్టర్ సర్టిఫికెట్ అనుకూలంగా వచ్చేటట్లు మాట్లాడినాడు. కేసు 307 సెక్షన్ రాసినట్లూ, హాజరయితానే బెయిలు రాదు గాబట్టి కొన్నాళ్ళు జైల్లో వుండాలనీ, అందుకే ఈలోగా వూరికి పోయి ఏమన్నా పనులుంటే, ముఖ్యంగా లెక్క చక్కబెట్టుకుండే పని చూసుకోమని వకీలు చెప్పినాడు. ఈ విషయాలన్నీ శ్రీరాం రెడ్డి పోయి తమవాళ్ళతో చెప్పినాడు "ముఖ్యంగా యిప్పుడు లెక్కతో పని. ఎపుడు జూసినా లెక్కకు చెయ్యి జాంపుతండాడు. లెక్కలేంది యే పనీ కావడంలే" అని చెప్పేసరికి,

క్రిష్ణారెడ్డి కేకరిచ్చి మూసి "థూ... దీనెమ్మ బతుకులు సెడ. యాదుండే నా కొడకలకూ మన బతుకులంటే యెర్రిదాని సండ్లకన్నా లోకువయి పాయనే!" అనె. అంతే మళ్ళ ఎర్రి దానికి సండ్లొచ్చి నాయంటే, వూర్లో వొయిసి నా కొడకలందరకీ చంకల కింద చక్కిలిగిలి పెట్టినట్లుంటాది.

ఇప్పుడు వీళ్ళ బతుకులను గూడా పోలీస్టేషన్ కాడా, కోర్టుకాడా, మండలాఫీసు కాడా అదాటయిన వాడల్లా పిసుకుతా ఉండాడు.

'ఈ కరువు కాలంలో ఇప్పుడీ బాడ్కోవ్ ఖర్చులకు లెక్కేడ తేవాలబ్బా!' అంటా చింత చేస్తా కూర్చున్నేరు.

ఆఖరుకు యేడా తెగక, – "ఊరికి బోయి అందరం జొన్నలమ్ముకుందాం పాండి" అన్నేడు రామారెడ్డి. ఇదే మనిషి మూన్నాళ్ళప్పుడు – 'కారెమో, సంగటో తిని కండ్లు మూసు కుంటే రేటున్నప్పుడే అమ్మచ్చు" అన్నేడు.. ఇప్పుడీ మాటలు అనవలసి వొచ్చింది.

అంటానే, క్రిష్ణారెడ్డి అందుకునె– "నేను సెట్టితో మాట్లాడినా. వాడిప్పుడు నూటముప్పై కన్నా జాస్తి లేదన్నేడు. మన కర్మ... ఈ టైంలో రేట్లు రోజు రోజుకు పడిపోతుండయ్" – అప్పుడే ఏమయింది? దయ్యం బట్టింది – ఇంగెన్ని మెట్టుదెబ్బలు తినాల్నో!

"నూట ముప్పై గాకుంటే, నూటిరవయే గానీపో, మన అవసరమట్లుంది... మనం కష్టం జేసి ఈ యాపారం జేసే నాకొడుకల్నూ, పోలీస్నాకొడకల్నూ, కోర్టు నాకొడకల్నూ, రాజకీయం నా కొడకల్నూ బతికియ్యాల. మన రాత అట్లుంది"– రామారెడ్డి.

అందరి మొగాల్లో దిగులు నల్ల మోడం మాదిరి కమ్ముకునింది.

ఆ వాతావరణం మార్చాలని శ్రీరాం రెడ్డి – "ఆస్పత్రి కాడికి పోయింటి... బాబ్రెడ్డన్నకు బాగుంది. అయితే ఇప్పుడే డిశ్చార్జి అయితే అవతలోల్లకు బెర్న బెయిలొస్తాదని – ఎమ్మెల్లేతో ఫోన్ చేయిచ్చి ఆస్పత్రిలోనే ఉన్నిచ్చుకోమని డాక్టరుకు చెప్పిచ్చినా. పొద్దాక ఆస్పత్రిలో వుండడానికి యాసిరక అనిపిస్తే, బయట తిరగొచ్చు – ఇబ్బందేం లేదు. పోలీసోళ్ళ కండ్లల్లో బడకుంటే చాలు"

శ్రీరాం రెడ్డి మాటలు ఎవరికీ వూరట కలిగించినట్లు లేదు.

ఉప్పూ, మిరపకాయక్కూడా కట కటలాడ్తా వుండినా రేటు తక్కువని కడుపులెండ గట్టి దాచి పెట్టుకోనుండే జొన్నలు, ఆయిన కాడికి అమ్మడానికి వాళ్ళకు యేడుపొస్తావుంది. యేడ్వడ మొకటే తక్కువ. అయినా చేసేదేం లేక, తమకు ఆశ్రయమిచ్చిన వేమారెడ్డికీ, వాళ్ళింట్లో వాళ్ళకు చెప్పి తమ వూరి దావ పట్టినారు.

శ్రీరాం రెడ్డి బుర్రలో ఆలోచన్లు ముసురుకుంటా ఉండాయ్ – "ఈ కక్షలు మాసిపోయే దెప్పుడో... అనాదిగా యీడ కక్షలుండయ్.... అనాదిగా యీడ కరువులుండయ్... కరువుకూ, కక్షలకూ కాన్రాని సంబంధముందేమో! ఏం పనీ లేని మనిషి బుర్ర దయ్యాలకు కొంపంటారు. అట్లాటి మనిషి దురలవాట్ల దిక్కో, రాక్షసత్వం దిక్కో మళ్ళుకుంటాడేమో... కరువుల్తో!

చేయడానికి ఏం పన్లేక, అన్నిట్లో వెనకబడి ఆలోచించే ఇంగితం గూడా లేక రాయల్సీమ రైతు, తన అసహనాన్ని అణుచుకుండే దెట్లనో తెలియక కక్షల దిక్కు మళ్ళినాడేమో! ఈ కక్షలకు తోడు అగ్గిలో నూనె బోసినట్టు యీ రాజకీయాలొకటి... థూ..."

తక్కినోళ్ళు కూడా యేందో ఆలోచించుతా వున్నట్టే వుంది. నిజమే, ఆలోచనలు రాక ఏం చేస్తాయ్ మళ్ళ!... జొన్నలమ్మిన లెక్కేమో కేసులకే చాలదు... ఇంకో దిక్కు చూస్తే,

యెండిన పైర్లలో నయాపైసా రాదు... ముందుకు పైర్లు బెట్టడానికి పెట్టుబడెట్ల? అప్పుడిదాంకా బతికేదెట్ల? తలో ఎకరా భూమి అమ్మాల్నేమో! అయినా ఈ కరువుకాలంలో భూములెవరు కొంటారు?...

ఈ ఆలోచనల్నన్నీ యిప్పుడే... యీ రవ్వంత సేపే... మళ్ళా కుక్కతోక వొంకరే. రెన్నాళ్లుంటే ఈ ఆలోసెన్లన్నీ గుడ్డతో తుడ్చినట్టు పోతయ్. అప్పుడు...

"ఏమన్నా గానీ – భూములూ, ఇండ్లూ, పెండ్లాం, పిల్లోళ్ళూ... ఏదేమన్నా గానీ మనం వొంగి పోగూడదు. అవతలోళ్ళను నాశనం చేయాల. మనం చచ్చినా సమాధానమే. ఈ పొద్దు చూస్తే మర్నాటికి మూన్నాళ్ళు... మూన్నాళ్ళ బరువులు దించుకుంటే అంతా మర్చిపోతారు. అంతే"... అనుకుంటారు అక్కసుగా, పౌరుషంగా.

✡

ఊర్లో కొచ్చిన రేత్తిరికే అందరూ శ్రీరాంరెడ్డి యింట్లో గుంపయినారు. మాడీలో వాకిండ్లు వేసుకొని చర్చలు మొదలు పెట్టినారు. గుంపులో ఉండే వాళ్ళందరూ భూమిని బట్టీ, సంపాదనలను బట్టీ ఖర్చుకు చెందాలేసుకోవడం మింద మాట్లాడ్తా వుండారు.

విసురుగా వాకిలి దొబ్బుకొని శ్రీకళ లోగా కొచ్చింది.

శ్రీకళ విసురుగా లోగా కొచ్చేసరికి అందరూ చర్చలు చాలించి ఆమె దిక్కు చూసినారు. – "ఏం?" అన్నెట్లు.

ఆమె నిబ్బరంగానే అడిగినాది – "నేను చిన్నదాన్ని అడుగుతండాను అనుకోవాకండి అసలు మీరెందుకీ కొట్లాట పెట్టుకొండేది? మనుషులకు తిండానికి లేకున్నా, పసలకన్నా మేపు వుండాలని పంచాయితి మొదులు బెట్టి – కొట్టుకోడానికీ, ఆఖరుకు చంపుకోవడానికి సిద్ధపడ్నేరు. మీరూ–మీరూ కొట్టుకొని – పూర్లంబడి, జైళ్ళంబడి పోతే యీడ మీ పసలకు మేపు వుంటాదనుకున్నేరా? మీ కొట్లాల్తో చేలల్లో మేపును కాపాడుకున్నేరా?..."

ఇంగా యేందో అడగబోయింది.

తమకన్నా చిన్నది – అందునా ఒక ఆడపిల్ల తాము చేస్తాండే దాన్ని తప్పులు బట్టడం, వాళ్ళకు మింగుడు పడలే. వాళ్ళ అహం మింద గొడ్డలితో వేసినట్లయింది. చెప్పాలంటే, ఆమె అడిగే ప్రశ్నలకు జవాబులు గూడా వాళ్లకాడ లేవు.

రామారెడ్డి పొడిచే చూపు చూస్తా – "అమ్మేయ్! నోర్మూస్కొని బయిటికి పో!" అన్నేడు. అప్పుడి దాంకా నిబ్బరం జూపిన శ్రీకళకు శివాలెత్తింది. అమ్మవారు పూన్నెట్లు ఆవేశపడింది.

"మా ఆడోళ్ళందరు ఇన్నేండ్లూ నోర్మూస్కొని, మీకు తందాన తాన అంటాండ బట్టే యిట్లయింది. మీరేమో మీ పాటికి మీరు కొట్టుకొని జైళ్ళంబడిబోతే, ఇండ్లకాడ మీ పెండ్లాం

పిల్లోళ్ళు ఏ చావు చస్తాందారో మీకేమన్నా తడ్తాందా?... తట్టదు. ఎప్పుడో మీ నాయనగారు వాళ్ళను చంపినారని – మీ పిల్లోళ్ళు వాళ్ళ పిల్లోళ్ళను చంపడం... వాళ్ళ పిల్లోళ్ళు మీ పిల్కోళ్ళను చంపడం... ఇట్టనే తరతరాల నుంచీ అర్థం పర్థం లేని పౌరుషాలు చూపిచ్చు కోవడమే మీకు తెలిసేది. మీరు దేనికోసమైతే కక్షలు పెంచుకున్నారో, ఆ గమ్యాన్ని ఈ కక్షల్తో చేర తాండారా? లేదా?... అనేది మీకు తట్టదు. రేపొద్దున మీ పిల్లోళ్ళు – మా యబ్బగారూ, మా నాయనగారూ బొబ్బిలి పులులు... పల్నాటి సింహాలు... అందుకే మేం యీ సిమెంటు ప్యాక్టరీల్లోకీ, రాళ్ళగనల్లోకీ కూలికి పోతావుండాము – అని చెప్పుకుంటా మురిసి పోతార్లెండి. అప్పుడు దాంకా కొట్టుకుంటా నాశనమయితానే వుండండి...”

ఆమె గొంతులో యేడుపు జొరబడి మాట జీరబోయింది.

శ్రీరాం రెడ్డి విసురుగా లేచి కొట్టేవాని మాదిరి మండిపడతా – “నువు ముందు బయటికి పోతావా? లేదా?” అన్నేడు.

అప్పుడు దాంకా యెంతో పౌరుషంగా – ఎవర్నెవర్ని యాడ చిక్కిచ్చుకొని కొట్టాల్నో! ఎవర్ని చంపాల్నో! ఆ పనులకు చెందాలు యెంత వేసుకోవాల్నో – అని చర్చించు కుంటాండే వాళ్ళ మనసులు, ఆమె మాటలతో విరిగిపోయినయి.

అందరి తలల్లో శూన్యమేర్పడింది.

పక్కగదిలో శ్రీకళ సన్నంగ వెక్కెక్కి యేడుస్తా వున్నెట్టు, వినపడతానే వుంది. బరువెక్కిన వాళ్ళ మనసుల్లో... యేడనో... యేమూలనో... అడుగు మట్టాన... మసక మసగ్గా ఒక ప్రశ్న రూపు దాలుస్తావుంది.

“ఔన్రా! మనం దేని కోసం కొట్టుకుంటాన్నెట్టు?”

✡

# మూడు పదున్ల వాన

**–వేంపల్లి గంగాధర్**

కమ్ముకున్న మొబ్బులన్నీ విచ్చుకున్నా అంకిరెడ్డి మనసును అల్లుకున్న చీకట్ల పొరలు విచ్చుకోవవడం లేదు. తన గురించి తాను ఆలోచిస్తూనే భార్య గురించి, కొడుకు గురించి మథన పడుతూ ఎద్దుల్ని తోలుకుంటూ ఇంటిదారి పట్టినాడు. తాను ఇంట్లో లేని రెండు రోజుల్లో ఆ జాబు వస్తే భార్య సుభద్రమ్మకు తిక్కలేస్తుందని అంకిరెడ్డి భయం. జాబు రాకుండా వుండాలని మొక్కుకున్నాడు. తల ఇదిలించుకున్నాడు.

'సుభద్రకు ఏం చెప్పాలి....

అది వొట్టి తిక్కది. చెప్పిన మాట ఒక్కటి విని చావదు. అది చెప్పిన మాట వింటూ వచ్చింటే సంసారం ఇట్ల ఎందుకు ఎలగబడి వుండేది. బ్రహ్మాండంగా వుండేది. అందరి మాదిరి బతికేటోళ్ళం...' అనుకుంటూ ఎద్దుల్ని అదిలించుకుంటూ వస్తున్నాడు అంకిరెడ్డి.

రెండేపమాన్ల కాడ రామిరెడ్డి ఎదురుగొచ్చె. "ఏందిరోయ్ అంకిరెడ్డి.. ఎద్దుల్ని అమ్మాలని సంతకు తోలకపోయి... మళ్లా ఎనిక్కి తెస్తాండవేంది. ఇప్పుడే మీ ఇంటికాన్నుంచే వస్తాండ. ఎద్దుల్ని అమ్మింటాడు. లెక్క తీస్కోని వస్తాడు. రేప్పొద్దనే మళ్లా తిరుపతికి పోతాడని ఇప్పుడే చెప్పింది సుభద్రమ్మ. నువ్వేమో మళ్ళా ఎద్దుల్ని ఎనక్కి తోలుకోని వస్తాండావు..."

"ఓన్నా... వాళ్ళు సంతలో అంతా దొంగనాకొడుకులన్నా. పదైదువేలు, పదారువేలు చేసే ఎద్దులు నాయాళ్ళకు ఏడువేలకు ఇయ్యాలంటన్న. ఎట్లిస్తాం అంత చవగ్గా. నేను ఆఖరుకి పదివేలన్నా ఇమ్మని గట్టిగ్గాచ్చున్నా. కానీ నాయాళ్ళు ఐదునూర్లు గూడా పెంచలే సూడన్నా..." అని వివరంగా చెప్పినాడు.

"అంతేమల్ల. అమ్మను పోతే అడివి, కొనను పోతే కొరివి. ఏదయినా అంతే" అని కాసేపాగి...

"మరి తిరుపతికి పోను లెక్కెట్లా చేస్తావు. ఒక పదివేలు కావాల్సింటే నా దగ్గర వుంది తీసుకో. పని గర్సని. మళ్ళా ఉసి పడినాక ఇస్తువుగాని" అన్నాడు రామిరెడ్డి.

రామిరెడ్డి అన్నమాట ఊరట కలిగింది. కానీ వెంటనే వడగాలి తగిలినట్లు రామిరెడ్డితో లెక్కతీసుకుని తన ఆస్తినంతా రామిరెడ్డికే సమర్పించుకున్న ఇస్మాయిలు గాడు మతికొచ్చినాడు.

ఇస్మాయిలు కులానికి తక్కువోడయినా తనకంటే సంసారం బాగున్నోడే. వాడే ఇరుక్కొని తనకలాడినాడు. తెలిసి తెలిసి పులినోట్లో తలకాయ ఎందుకు ఇరికించడం అనుకున్నాడేమో... "సరేలేన్నా అంత అవసరం ఉంటే వస్తాల్లేన్నా" అని ఎద్దుల్ని అదిలిస్తూ బయలుదేరినాడు అంకిరెడ్డి.

పెద్దమోరీలు దాటి సుబ్బిరెడ్డిగారి సేన్లో కాలిదావ పట్టినాడు. ఇంకో పదినిమిషాల్లో ఇండ్లు చేరతాడు. నిముషాలు గడిచే కొద్దీ ఇళ్ళు దగ్గరపడేకొద్దీ... మెదడంతా కంపరంగా వుంది.

అల్లంత దూరంనుంచే సుభద్రమ్మ రోట్లో ఏదో వేసి దంచుతున్న శబ్దం అంకిరెడ్డిని కదిలించింది. కారం కాబోలు... కారమంత మంటగా వుంది సుభద్రమ్మ మొహం..

గాటిపాట్న ఎద్దుల్ని కట్టేసినాడు. బక్కెట తెచ్చి నీళ్ళు పోసి, తౌడు, దానా కలిపి మూతి దగ్గర ఉంచినాడు. అది వంచిన మోర ఎత్తకుండా తాగుతుంటే అంకిరెడ్డి ఆనందం నిండిన చూపుతో సంబరంగా కన్నార్పకుండా దానితట్టే చూస్తా నిల్చున్నాడు. ఓర కంట సుభద్రమ్మను చూసినాడు. నిప్పుల్ని రాజేసి చిదుగు మండిచ్చినట్లుంది ముఖం.

ఎద్దులకు నీళ్ళు తాపి తుండుగుడ్డ విదిలించి తాటిమీదేసి ఇంట్లోకి పోబొయినాడు.

"సెప్పుకోను రోంతన్నా బుద్ధి వుండాల. తల వూంచుకుంటా ఉత్తసేతల వురికెత్తుకొచ్చి నాడంట. యా పని పట్టుకున్నా యింతేనా. మొగజన్మ మెత్తినాక రోంతన్నా రోషముండొద్దు. ఆ పక్క ఈ పక్క వాళ్ళను సూసెన్నా బతకాల్నా లేదా.." ఎత్తుకుంది సుభద్రమ్మ పల్లెంతా అదిరిపోయేట్టు.

"ఏందే అట్లంటావు. వాళ్ళు దుడ్లకు అడుగుతే బంగారట్ల ఎద్దుల్ని ఇచ్చి రావాల్నా..." అన్నాడు.

"దుడ్లకేంటికి అడుగుతారు. పదివేలన్నా ఈకపొయినారా"

"పదివేలే. ఆరువేలు దాటలే నాయాండ్లు"

"నీ మొగం చూస్తే అంతే చెబుతారు ఎవరయినా"

రోటికాడికి వచ్చి నిల్చున్నాడు.

మొగంలోకి చూసినాడు.

క్రోధం.

చాలా సేపు చూడలేకపోయినాడు.

అది తన మీద కోపం కాదనీ తెలుసు. కొడుకుమీద మమకారం కొద్దీ వచ్చిన కోపమే సుభద్రమ్మకు. అయితే తను మాత్రం ఏం చేయగలడు. అమ్మాలనే పోయినాడు. ధర కుదర్లే. ఎనక్కు వచ్చినాడు. రేపు సంతకన్నా అమ్మాలనే అనుకున్నాడు. సుభద్రమ్మ మాత్రం ఏం చేయగలదు. కొడుకు లెక్క పంపమని జాబురాసి వారం దాటిపాయె.

✡

సేనికాడ పెద్దేపచెట్టుకింద బండపైన తుండుగుడ్డ తలకింద పెట్టుకోని పడుకున్నాడు.

"వాడిని ఎంసిఏ యూనివర్శిటీలో చేరిపించొద్దని ఆ రోజు పట్టుపట్టినా. కానీ సుభద్రమ్మ వినిందేలేదు. చేర్చాలంటే చేర్చాలంది. ప్రతి సెమిస్టరుకు డబ్బు పంపాల. ఇంకా మూడు సెమిస్టర్లుండాయి. లెక్క యాన్నుంచి తేవాల" ఇదే ఆలోచన అంకిరెడ్డికి కునుకు పట్టకుండా చేస్తోంది.

ఎద్దులు గుర్తుకొచ్చినాయి.

"మాంచి దేశెపెద్దులు. కొనేరోజు కోడెల రెడ్లు వీటిని పట్టించడానికి ఎంత బాధపడినారో. పన్నెండేళ్ళు అర్రొంచకుండా పనిచేసినాయి. దాన్ల రుణం ఎట్లా తీర్చుకోవాల్నో తెల్దు... అమ్మడం ఎట్లా. సుభద్ర వినదు. వాడూ వినడు. వీళ్ళకేం మోసే ఎద్దుకు తెలుసు కామాను బరువు. ఎట్లన్నాగాని ఇపుడు వాడికి ఏడువేలు ఫీజు కట్టాల్సిందే.. తప్పదు"

మరుసటి వారం సంతలో ఎద్దులమ్మి లెక్కతీస్కోని తిరుపతికి బయల్దేరినాడు. ఇంట్లో తినడానికి సరిగ్గా లేని పరిస్థితులు. వీడికేమో ఒక్కసారి ఏడువేలు గుమ్మరిచ్చిరావాల. ఈ తిక్కది ఫీజు కట్టాల్సి వచ్చినప్పుడల్లా ఏదో ఒకటి అమ్మమంటుంది. అన్నీ అమ్మినాక ఏం తిని బతకాలనుకుందో. ఓ వాడు బాగా సదివితే మంచి ఉద్యోగం వస్తుందని, అమ్మ నాయన్ను పూలల్లో పెట్టుకుని సూసుకుంటాడని అనుకుంటుందేమో. దీన్నె... దీనికి ఎన్ని చెప్పినా విని సావదు. ఏ ఉద్యోగస్తుడు అమ్మా నాయన్ను సాకుతున్నారబ్బా... ఈ నా కొడుకులు, అమ్మా నాయన్ను ఇంట్లో పనిమనుషులని పరిచయం చేస్తాండరు దొంగ నాయాండ్లు. ఇట్లాంటోళ్ళను నమ్మి అంతా పోగొట్టుకుంటే నాశనమే అనుకుంటా అలాంటి ఆలోచనల చుట్టే పరిభ్రమిస్తున్నాడు అంకిరెడ్డి ప్రయాణంలో.

యూనివర్శిటీ హాస్టల్ ముందు నిరంజన్‌ను రమ్మని చెప్పి చప్టామీద కూర్చొని ఎదురు చూస్తున్నాడు. వచ్చిపోయే యువకుల్ని, రాసుకుంటూ పోయే జంటల్ని, కొన్ని వికృతాకారాల్ని చూస్తూ 'ఎర్రిమాలోకం' అనుకున్నాడు మనసులో.

చప్టామీద ముందొచ్చి నిల్చున్న వ్యక్తిని గమనించలేదు.

"నాన్నా" అన్నాడు.

తీక్షణంగా ఒకసారి నిరంజన్ వైపు చూశాడు.

పూర్తిగా మారిపోయాడు. జులపాలు చెవుల మీదనుండి మెడమీదనుండి భుజాల గాలికి విసురుగా కదులుతున్నాయి. ఎడమవైపు చెవి తమ్మెకు బంగారు కమ్మ తళుక్కుమంది. అంకిరెడ్డి మనసు కళుక్కుమంది. తొడల్దాకా గౌల్లోల మాదిరి చేతుల్లేని మందం చొక్కా, చేతిలో సెల్‌ఫోన్. నోట్లో ఏదో గుట్కా లాంటిది నములుతూ... కళ్ళముందు నిరంజన్... తన కొడుకే!

"ఓరని..." అన్నాడు.

"ఇదేందిరా నాయనా. ఏందిరా ఇట్ల... కొండలో కోతిమాదిరి మారిపోయినావు. కనుక్కోలేకపోయిన గదరా. ఈ జులపాలేంది, కమ్మలేంది, నిక్కరేంది, చొక్కా ఏంది, సెల్లేంది. మనకు అవసరమట్రా...." అనేశాడు అంకిరెడ్డి.

మౌనంగా వుండిపోయాడు నిరంజన్.

"ఏవేవో... ఆ తిక్కది ఇంటికాడ నీ గురించి గొప్ప గొప్పగా సెప్తుంది. నువ్వు జూస్తే యిట్టా వుండావు" అసహనంగా తల విదిల్చాడు అంకిరెడ్డి.

"నాన్నా! ఇక్కడ అందరూ ఎట్లుండారో మనం కూడా అట్లనే వుండాల. లేకుంటే మనల్ని సిన్న చూపు సూస్తారు. పలకరించరు. చూడరు. ఏమీ చెప్పరు. అందుకే అందరి మాదిరి వుంటేనే రోంత మర్యాద వుంటుంది. మనింటికాడ మనమెట్లున్నా అనేవాళ్ళుండరు. ఇక్కడట్లుంటే కుదరదు నాన్నా" అన్నాడు తలొంచుకుని నిరంజన్.

ఏమనాలో పదాలు దొర్లలేదు.

సంగటి... చినిగిన చొక్కా, పాత చాప, గుడ్డిదీపం... కారే ఇళ్ళు... ముక్కురాయి, కమ్మల్లేక బోసిపోయిన సుభద్రమ్మ ముఖం... పెళ్ళీడుకొచ్చిన కూతురు సుమలత.... ఒక్కొక్క దృశ్యం గిర్రున కళ్ళల్లో తిరిగినాయి. ఇక్కడికి తెచ్చిన లెక్కతో కొన్ని అవసరాలైనా తీరుతాయి అనుకున్నాడు మనసులో.

తెచ్చిన లెక్కను తడిమినాడు.

బాధ లేసింది.

"సరేరా... ఇయన్నీ కాదు ముఖ్యం. నువ్వు సదివి బాగుపడమని నిన్ను పంపించిందీటికి. నువ్వు సూస్తే ఇన్ని ఇకారాలు పడ్తాండావు. ఏమోబ్బ నాకు తెల్దు. బ్రహ్మాండమైన మార్కుల్తో పాసయి రావాల" అన్నాడు.

తలూపాడు నిరంజన్.

తడిమిన లెక్కను బయటకు తీసినాడు.

నిదానంగా ఎంచి ఏడువేల ఐదునూర్లు ఇచ్చినాడు.

"ఇంకో ఐదునూర్లు ఇయ్యి నాన్నా రికార్డులు కొనాలి" అన్నాడు.

"ఇంకో చెవికి కమ్మ కొనుక్కోవు కదూ" అన్నాడు.

"లేదునాన్నా. రికార్డులు ఈ నెలాఖరుకు చూపించాల" అన్నాడు.

వంద కాయితాలు ఐదు ఎంచి ఇచ్చినాడు.

"నిరంజన్‌కు జై" అన్నారు కిటికీలోంచి కొందరు స్నేహితులు.

"జై" అంటే అనుకుంటూ కదిలాడు అంకిరెడ్డి.

✡

"మా అన్నతో ఏం చెప్పాలనుకుంటున్నావు..." చనువుగా అంది సుభద్రమ్మ.

"సుమలతను అడిగినావా..." అన్నాడు అంకిరెడ్డి.

"మన బిడ్డ మన మాట కాదని అనదులే. బావ పేరెత్తితే ముసి ముసి నవ్వులు నవ్వుతాంది. ఇంకేమడగాలి" అంది.

కుటుంబ బాంధవ్యాల గురించిన యోచన మనసులో కదిలింది.

సుభద్రమ్మ సుమలతను తన అన్నకొడుకు సుబ్బిరెడ్డికే ఇచ్చి పెండ్లి చెయ్యాలని ఎన్నో ఏండ్లనుంచి అంటానే వుంది. అడపాదడపా సుమలతతో అందిగూడా. అదే ధ్యాసలో సుబ్బిరెడ్డి వచ్చిపోవడాలు కూడా జరుగుతూనే వుంది. అన్నీ తెలిసి తన అన్న 'పిల్లనియండని' రావడం విడ్డూరమే. ఎటూ అదేగదా జరిగేది. ఓహో పెద్ద మనుషులయితే కట్నకానుకలు మాట్లాడతారనేమో... అయ్యుండొచ్చు.

ఆ మధ్యన సుభద్రమ్మ సుబ్బిరెడ్డికి ఇవ్వాల్సిన కట్నం గురించి చిన్నగా ఎత్తిడిసింది.

"తిక్కమొగమా... మేనరికానికి మళ్ళీ కట్నమా!" అని ముఖంలోకి చూసినాడు.

"ఎంత మేరకికమయినా ఇతరోళ్ళు సూసేందుకైనా ఇయ్యాలకదా. ఊరికనే పెండ్లి చేసుకుంటే వానికేం విలువుంటాది. మన శక్తి కొద్ది మనం ఇయ్యడం ధర్మం. అదే వాడు యాడ పెండ్లి చేసుకున్నా రెండు లక్షలకు తక్కువ లేకుండా ఇస్తారు. మనమైనా మనమ్మిని ఇతరావాళ్ళకు ఎవరికియ్యాలన్నా రెండు మూడు లక్షలన్నా ఇయ్యాల. అదేదో ఈనికి ఇస్తే వాళ్ళకూ మనకూ ఇద్దరికీ బాగుంటుంది" అంది.

"నా మాట విను. యాభైవేలు ఇస్తామని చెప్పు. అప్పోసొప్పో చేసి ఇద్దాము. మేనల్లుడికి కట్నమేందే. ఈ మాట నేనన్నానన్ని మీ అయ్యతో చెప్పుపో. అటో ఇటో చెబుతాడు" అన్నాడు కాస్త కోపంగా సుభద్రమ్మ వైపు చూస్తూ.

"నువ్వంతా ఇట్నే చేస్తావు. ఎదిగిన పిల్లకు కట్నం కూడా ఇచ్చుకోలేవు. నేను ఎన్ని ఆలోచన్లు చెప్పినా వినుకోవు" అని విసుక్కుంది.

"ముందే అన్నీ మాట్లాడి సూసినా మేనరికమనే... కనీసం లక్షన్నర అయినా ఇయ్యమంటా వుండారు" అంది.

వాళ్ళు ఏమీ చెప్పివుండరు. ముందు ఇదే చెప్పి వుంటాది. రూకలు చేతిలో లేకున్నా కొడుకును యూనివర్శిటీల్లో సదివించాలంటుంది. కట్నాలిచ్చి బిడ్డ పెండ్లి సెయ్యాలంటుంది. ఈ లెక్కకు మంచి ఉద్యోగస్తుడైనా దొరుకుతాడు. సుభద్ర... సుమలత... బాధ పడతారా? పరి పరి విధాల పరుగులు తీస్తోంది అంకిరెడ్డి మనసు.

గడ్డిలేని గాడిని చూస్తూ ఎద్దుల్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. ఏముంది. ఆస్తిలో ఒక్కొక్కటి చిన్నగా కరిగిపోతాంటే... ఇట్లనే అన్నీ పోతే మన బతుకేంది!

"సుమలత ఎదిగి ఇప్పటికే ఏడేండ్లు దాటిపాయ. ఒకరి సేతిలో పెడితే మనకూ బాగుంటుంది. ఆ పెట్టేదేదో మనోడికే అయితే ఇంకా నిమ్మళంగా వుంటాది. ఎవునికో ఇస్తే వాడు తిడతా, కొడతా వుంటే అది మన దగ్గరికొచ్చి ఏడుస్తావుంటే లేనిపోని కథ. నీకెట్లా అనిపిస్తే అట్నే జెయ్యి" నులక మంచానికి ఆనుకుని కూర్చుంటూ చెప్పింది సుభద్రమ్మ.

మాటల్లో స్వాంతన వుంది. నెమ్మది వుంది. ఎత్తుగడ వుంది.

"లెక్క ఎట్లా చేద్దామంటావ్" అన్నాడు అంకిరెడ్డి నులక మంచంపైన కూర్చుంటా.

"ఏముంది. ఏటి సాలుపు ఎనిమిదెకరాల్లో మూడెకరాలు అమ్మితే సరిపోతాది" చెప్పింది లో గొంతుతో.

కడుపుకు పట్టెడు మెతుకులు పెట్టే భూమి అమ్మాల్నా!

నిరంజన్ కొత్త విషయంతో ఉత్తరం రాశాడు. వాడి మిత్రుడు అమెరికాలో స్థిరపడినాడట. అవకాశం వెతికి వీడ్ని రమ్మని ఫోన్ మీద ఫోన్ చేసినాడట. వీడికి అమెరికా పోవాలంటే డబ్బు కావాలని... సారాంశం.

ఉత్తరం చదివినప్పటి నుంచి సుభద్రమ్మ ఒకటే పోరు పెడుతోంది. అందరిలాగే వాడూ అమెరికా వెళ్తే డాలర్లవాన కురుస్తుంది అంటది. వాడు విమానం ఎక్కేసరికి అవసరమయ్యే డబ్బు గురించి ఏమీ అనదే.

“మరి లెక్క ఎట్లా చేద్దాం” అంకిరెడ్డి.

“ఎట్లా... పాప పెళ్ళికి నాలుగెకరాలు అమ్మాలంటున్నాం గదా. దానితో తోడు ఇంకో రెండెకరాలు అమ్మితే వాడు అమెరికా పోయి సుఖపడతాడు” అంది.

కోపం తలకెక్కింది.

“తంతా... నియ్యమ్మా! ఇంకో మాట మాట్లాడితే. వుండే భూమంతా అమ్ముకుని ఇంగ బతికేదెట్లా”

✡

మొత్తం అరెకరాల భూమి అమ్ముడైంది. వచ్చిన లెక్క వచ్చినట్లు ఖర్చయింది. కట్నానికని, కొడుకు అమెరికా ప్రయాణానికని, పెండ్లి ఖర్చులకని, బంగారానికని భూమంతా కరిగిపోయి ఖర్చుల కింద ఆవిరైంది.

సంబరంగా పెళ్లి ముగిసింది.

పులకించిపోయింది సుభద్రమ్మ.

నిరంజన్ అమెరికా వెళ్ళిపోయాడు. ఇంకా అక్కడ్నుంచి సమాచారమేదీ లేదు.

అక్కడక్కడా ఊర్లో.. ‘అంకిరెడ్డి భూమి అమ్మేశాడు. ఎద్దుల్ని అమ్మేశాడు’ అనే మాటలు విని అంకిరెడ్డి ముఖం చిన్నదై పోయింది.

✡

వర్షం బాగా కురిసింది. భూమి చదునైంది. రైతులంతా కాడెమాన్లు, బండ్లూ, శుభ్రం చేస్తాండరు. ఇంటి ఆడవాళ్ళు పసుపు కుంకాలతో ఎద్దులను బండ్లను పూజిస్తున్నారు. దిష్టితీసి టెంకాయలు కొడుతున్నారు. కదిలే బండ్లకు ముత్తయిదువలు ఎదురొచ్చి శుభ సూచకాన్ని తెలుపుతున్నారు. పల్లె పల్లెంతా సంబరం. పండగ వాతావరణం.

అంకిరెడ్డి కాడెమాను బయటకు తీసినాడు.

‘ఎక్కడ పెడతాడు. చేతికి తీసుకుని దుమ్ము దులిపినాడు. మనసంతా వెలితి. చల్లగైంది. తేలికైంది. కళ్ళల్లో నీళ్ళు చిట్లినాయి’

సుభద్రమ్మ కాఫీ తెచ్చిచ్చింది.

“పటు... పటయ్యా సామీ.. భలే దుమ్ము దులిపినావుగానీ. ఎవరికో ఒకరికి గుత్తకు ఇచ్చెయ్యి భూమి. ఎంతో కొంత ఇస్తారు. దానికి తోడు అమెరికా నుండి మనోడు లెక్క పంపుతాడు. ఇంట్లో నీడపాటున వుందువు. కాడెమాను లోపల పెట్టు” అంది.

వారం తర్వాత పక్క చేను పురుషోత్తం రెడ్డికే గుత్త కుదిరింది.

ఇంక అంకిరెడ్డికి సేనిదగ్గర పనిలేదు

✡

వాన... వాన కురుస్తానే వుంది.

రైతులంతా 'మూడు పదున్ల వాన, పడిందంటాండరు. ఏటి సాలువున పొలాలన్నీ నెమలివాగు వంకకు వచ్చే నీళ్ళ తాకిడికి పొలపవారి కొట్టుకొని పోయినాయి. ఎండిపోయిన వీరాపురం వంక మీసం మెలేసింది.

రాజసంగా పారతాంది.

భూమిని గుత్తకు తీసుకున్నోడు పైసా గూడా ఇయ్యలేనని చేతులెత్తేసినాడు.

అంకిరెడ్డి చేతులు నలుపుకుంటూ కూర్చున్నాడు.

మళ్ళీ మెరుపులు... ఉరుములు.

మూడు పదున్ల వాన.. .... వాన దా...టి.... ఇంకా కురుస్తూనే వుంది.

తన గుండె లోతుల్లో... లోలోతుల్లో!

సంసారంపై దిగులు పట్టుకుంది.

అమెరికా వెళ్ళడానికి నిరంజన్ ఎంత ప్రయత్నించినా చిన్న అవకాశం కూడా దొరకలేదని ఉత్తరం. తను మోసపోయానని ఇంటికి తిరిగి వస్తున్నట్లు సారాంశం.

సుభద్రమ్మవైపు చూసినాడు.

దీనెమ్మ ఇదే అంతా చేసింది.

ఉన్న ఎద్దుల్ని అమ్మిచ్చె, సేనునూ అమ్మిచ్చె, ఎద్దులన్నా వుంటే సంతకు బండి కడితే టిప్పుకు రొండునూర్లు లెక్క వచ్చేది. ఇప్పుడు చూడు.

కోపం... కోపం... సుభద్రమ్మ మీదికి తన్నే ఉమ్మసతో విసురుగా పోయి...

"లం... ముండా... యింగోమాట ఎప్పుడన్నా మాట్లాడితే కాలిమెట్టు యిరుగుతాది. నన్ను నాశనం జేసిపెట్టినావు. సంసారం... సంసారమని నన్ను బజారు పాలు చేసినావు. యింగేముండాదే నాకాడ. లోకంలో ఎవరికీ లేని సొక్కమైన కొడుకు నీకే వుండాడా? ఆ లమ్డీకొడుకు కోసం బంగారం లాంటి భూమి అమ్మిచ్చినావు. నా బంగిరేగితే నేను మనిషిని కాను. యింగనన్న మట్టసనంగా పడివుండు. మంచికి నా అంత మంచోడు లేదు. చెడుకు

నా అంత చెడ్డోడు లేదు. ఏమనుకున్నావో" అని అంకిరెడ్డి ఉగ్రరూపం దాల్చినాడు. అంతకోపం ఆ ముఖంలో ఎప్పుడూ చూసింది లేదు. ఎప్పుడూ ప్రశాంతంగా, నిర్మలంగా, శాంతమూర్తిలా వుండే అంకిరెడ్డి నరసింహావతారం ఎత్తినట్లుంది.

కోపంతో ఊగిపోతాండే అంకిరెడ్డిని పక్కింటి శారదమ్మ భుజాలు పట్టుకొచ్చి నులకమంచం మీద కూర్చోబెట్టింది. బిరబిరా లోనికి వెళ్ళి కుండలోని చల్లనీళ్ళు ముంచుకొచ్చి చేతికందించింది. రోంతసేపు నిశ్శబ్దం... నిశ్శబ్దం... నిశ్శబ్దం... శబ్దం... శబ్దం... సుభద్రమ్మ గొంతు విప్పింది. కుచ్చిళ్ళు ఎగ్గట్టుకుని పైటకొంగు బొగ్గిట్లో బిగించి కళ్ళు ఎర్రగా చేసుకుని దుఃఖం నిండిన గొంతులో కోపాన్ని, ఆర్ద్రతను కలగలుపుకుని అంకిరెడ్డిని తిట్టడం మొదలుపెట్టింది.

"నా గురించి ఏమనుకుంటుండావు. నీ ఇష్టం వచ్చినట్లు అంటే బాగుండదు చూడు చెప్తాండ, ఒక్కగానొక్క కొడుకుమీద మమకారం కొద్దీ ఆశపడిన గానీ లేకుంటే నాకేమైనా తిని సొయ్యమా? పట్నంలో ఎవరో పాయికారి నాకొడుకు మోసం చేస్తే అబ్బిగాడు ఏం చేస్తాడు? కష్టపడి సదివియ్యాలని ఏ తల్లికైనా వుండదా. అన్నీ అమ్మించానని ఆమంతన ఎగుర్తాండవే... నేనేమన్నా అయన్నీ అమ్మి మూటముళ్ళె ఊడ్చుకుని నా పాడెమీద ఏసుకుని పోను జేసినానా... ఏంది? లోకానికి విరుద్ధంగా జేసింది ఏముంది? సంసారం కోసమే కదా ఆత్రపడింది. పది మందిలో మనమూ రోంత తలెత్తుకు తిరగాలనే కదా నా ఆరాటం. నేను నోరుండే ఆడదాన్నే ఒప్పుకుంటా. తటిక్కన మాటంటే పడను. సూడు. నీకు సాకడం బరువైతే చెప్పు నా రెక్కల్లో యింగా సత్తువుండాది. మగ్గం ఆడించుకోనైనా కుటుంబాన్ని బతికించుకుంటా" సుభద్రమ్మ కోపంతో ఊగిపోతా కళ్ళు తిరిగి పడిపోయింది.

లేపి నీళ్ళు తాపి నిమ్మలంగా మంచంలో పడుకోబెట్టాడు. మళ్ళీ నిశ్శబ్దం... నిశ్శబ్దం...

✡

సాయంకాలమైంది.

ఆకాశం నిండా నల్లమబ్బు మోడాలు ముసురుకుంటున్నాయి.

అంకిరెడ్డి మనసు నిండా ఎన్నెన్నో ఆలోచనలు ఒకదానికొకటి అల్లుకుంటూ తనువంతా కమ్ముకుంటాండయి. ఆ చలిగాలిలోనే తుండుగుడ్డ భుజానికేసుకుని బయలుదేరినాడు. అట్నే నడుచుకుంటా నాయుడు ఆకుతోట దావన్నుంచి పాపిరెడ్డి సమాధి పక్కలోని కాలి దావ గుండా పోయి వీరాపురం వంక మోరీపై కెక్కి కూర్చున్నాడు.

వంక నిండుగా పారతాంది. గత పదేళ్ళ కాలంలో వంకకు యిన్ని నీళ్ళు రావడం, యింత ఉధృతంగా ప్రవహించడం ఇదే మొదటిసారి. మూడు పదున్ల వాన... మూడు...

పదున్లు... ఒకవైపు భార్య పోరు మరోవైపు కొడుకు ఆశలు ఇంకో వైపు కూతురి బాధ్యత... వెరసి మూడు పదున్లు... తన జీవితం కొట్టుకుపోయింది.. గమ్యం లేకుండా!

కురుస్తున్న వాన... రైతులందరి కళ్ళల్లో ఆనందం. ఈసారి భూమితల్లి మోసం చేయదు. రైతును కాపాడుకుంటుంది. మరి నన్ను?

అంకిరెడ్డి కళ్ళల్లో కాంతి లేదు.

ఏవేవో జవాబులేని ప్రశ్నలు సుడిగుండాల్లా..

పైన ఆకాశంలోని నల్లమోడాలు కరుగుతాండయి.

చిన్నగా చినుకులు కురసడం మొదలైంది.

తనకేమీ పట్టనట్లు వీరాపురం వంక ఉధృతంగా ప్రవహిస్తా అలలతో తొణికలేస్తాండాది.

ఎర్రటి నురగతో సుడులు కొడతాంది.

కళ్ళనుంచి ఉబికి వస్తున్న కన్నీళ్ళు తుడుచుకుని పైకిలేచాడు అంకిరెడ్డి.

తుండుగుడ్డ మోరీపైనే మిగిలిపోయింది.

✡

# వ్యసనం

**–ఎస్.వి.ప్రసాద్**

'వాడు' నడుస్తున్నాడు.

నడుస్తూ ఆలోచిస్తున్నాడు – ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

ఆలోచనలకే గనక పేలే శక్తి ఉంటే వాడి తల ఈపాటికి బాంబులా పేలుండేది.

చావాల్నా... బతకాల్నా? చావాల్నా... బతకాల్నా?...

ఈ ప్రశ్న ఎన్నోసారి వేసుకునుంటాడో మరి... లెక్కపెట్టలేదు.

చస్తే... చస్తే ఇంకేముంది? అప్పుల్లేవు, ఆకళ్లేవు... ఈ ప్రపంచమే లేదు.

ఎంత ఆనందం. 'ఆనందమానందమాయెనే'... గట్టిగా పాడసాగాడు.

మెల్లగా గొంతు పెంచాడు. గొంతు చించుకుంటున్నాడు. ఆ ఆనందంలోని తన్మయత్వాన్ని ఇప్పుడే ఆస్వాదిస్తున్నాడు.

జుయ్‌మని గాలి వీస్తోంది. హఠాత్తుగా ఆగాడు. జేబు తడుముకున్నాడు. వంద రూపాయల నోటు భద్రంగా ఉంది.

'ధర్మవరం ఇంకా రెండు కిలోమీటర్లుంటుంది. అక్కడ సర్టిఫికెట్లు ఫోటోస్టాట్ చేయించాల. పురుగుల మందు డబ్బా కొనాల. ఊరికొచ్చాక బ్యాంకులో లోను డబ్బులుతీసుకోవడం – అప్పులోళ్లకు ఇచ్చేయడం... ఆ తర్వాత... ఆ తర్వాతేముంది... రాత్రికి ఇంటిల్లిపాదీ తలా ఇంత పురుగుల మందు తాగడం...

ఆ తర్వాత– బ్యాంకు వాళ్లు దిక్కుమాలిన భూమిని జప్తు చేసుకుంటారా? చేసుకోనీ.

అదంతా. తల్చుకోగానే వాడి ముఖం వికసించింది.

ఇదే వంద రూపాయల నోటు మరి కాసేపట్లో పురుగుల మందుగా మారుతుంది.

పురుగులు... పురుగులు... చావాలి.

ఊహూ... పురుగులు ఎప్పటికీ చావవు. అవి మందుల్ని, కాఫీ టీల్లా చప్పరిస్తాయి. ఆనందంగా తాగుతాయి. అందుకే, అందుకే ఆ పురుగుల మందు తాను తాగాలి. తాగి చావాలి.

అప్పుడు పురుగులపై గెలుపు తనదే.

చంపడానికి తయారు చేసిన మందులు తాగి కూడా పురుగులు చావలేదు. కానీ తాను చావగలుగుతాడు – మరి గెలుపు తనదెందుకు కాదు.

రాష్ట్రంలోని పురుగు పురుగీమణులారా! ఈ సందర్భంగా మీకు మనవి చేసేదేమంటే మిమ్మల్ని చంపాలని వాడే కీటక నాశనులు, పురుగు మందులు మిమ్మల్నేం చేయవు.

వాటిని కల్తీ చేసి మీ ప్రాణాలు రక్షించడానికి చాలా మంది కరుణామయులు ఉన్నారు.

అందుకే– అందుకే పురుగు సోదరులారా నేనే ఛస్తా– మీ పై గెలుపు సాధిస్తా.

ఒక్కసారి తల విదిలించాడు వాడు. 'ఏమిటిదంతా.... ఏమిటీ పిచ్చి పిచ్చి ఆలోచనలు... మరింకేం ఆలోచించాలి'...

రేపీపాటికి తన భార్యా ఇద్దరు పిల్లలతో సహా పైలోకాలకు... రేపే...

రేపు.. రేపు!

తువ్వాలు గుడ్డ కింద పడిపోయింది. వంగి తీసుకోబోయాడు.

ఎదురుగ్గా నేల.

చెప్పుకాలితో బలంగా తన్నాడు నేలని.

మళ్లీ మళ్లీ తన్నాడు.

'థూ' అని ఉమ్మేశాడు.

పైన ఆకాశం ధగధగ మండిపోతోంది.

'నీయమ్మ... మేఘాల్లారా... యాడ దాక్కున్నారు. నా పైరు చేతికి వస్తుంది చూడు... అప్పుడు రాండి నాశనం చేసేకి.. థూ మీ బతుకులకి అగ్గిబెట్టా'... శాపనార్థాలు పెట్టాడు.

చెప్పుతీసి సత్తువ కొద్దీ ఆకాశం వైపు విసిరాడు.

అది ఎటో ఎగిరిపడిపోయింది.

ఇంకా కసితీరనట్టన్పించింది. ఒక వంకర నవ్వు నవ్వాడు. సినిమాలో విలన్‌లా నవ్వే ప్రయత్నం చేశాడు.

నిటారుగా నిలబడి – ఆకాశం వైపునకు ఉచ్చ జిమ్మాడు! కాస్తంత ఎత్తు ఎగిరి నేల మీద పడ్డాయవి.

ఇంకా వేగంగా జిమ్మాడు.

ఆకాశాన్ని, భూమిని అవమానించాడు తను. చాలు ఈ జన్మకిది చాలు.

అవి చేసిన అవమానాల ముందు ఇదో లెక్కా.

కిందటేడు వర్షాలు కురవక నాశనం.

అంతకు ముందు వర్షాలు ఎక్కువై నాశనం.

ఒక పక్క నాశనం, మరో పక్క అవమానాలు.

'పంట చచేతికొస్తానే అప్పు మొత్తం తీరుస్తానన్నా' అని ఏటా శంకరప్ప గాడి కాళ్ళు పట్టుకోవడమే.

'మేము యాడన్నా కొట్టుకొచ్చాం అనుకుంటాండావేం లే... దొంగ లంజకొడకా ఎప్పుడూ ఇవే నాటకాలు నీవి. వేలు వేలు అప్పు ఎవుడు చేయమనె నిన్ను?' – శంకరప్ప.

'నేనేమన్నా తాగుతాండానా? ఇస్పేటాకులాడతాండానా? అంతా భూమ్మిందే పెడతాండా. నాశనమైతాండా. ఈసారి ఎట్లన్నా చేసి నీ అప్పు తీరుస్తా నన్నా'

'నా అప్పు తీర్చల్ల.. ఎట్లన్నా చేసుకో' ఈ మాటంటూ శంకరప్పగాడు తన పెళ్లాం పక్క చూసిన చూపు...

అది గుర్తు రాగానే వాడి రక్తం మరిగిపోయింది. గాలి వీస్తున్నా వాడికి ఒంటినిండా చెమటలు పడ్తున్నాయి.

చుట్టూరా ఓసారి కలియచూశాడు.

విత్తనాలు చల్లిన గుర్తుగా అక్కడక్కడా వేరుశన మొలకలు.

చేన్లోని ఓ మొలక దగ్గరకెళ్లాడు.

వంగి ముద్దు పెట్టాడు.

'ఏం కావాల్రా నీకు' అని అడిగాడు దాన్ని.

'నాకు వర్షం కావాలి. వర్షం వర్షం'... ఆ మొలక ప్రాధేయపడింది.

పగలబడి నవ్వాడు.

'నా కొడుకు విమానం కావాలన్నట్లుంది నీ కోరిక.. 'తిక్కముండా... వర్షం మనకోస మొస్తుందా! తప్పు తప్పు నిన్నూ నన్నూ నాశనం చేయాలనుకుంటేనే వస్తుంది వర్షం. ఇట్లా పెద్ద కోరికలు కోరకూడదు. తెల్సిందా...

'ఈ వెర్రినాయన నీ కోరిక తీర్చలేకపోయి నాడురా... అందుకే అందుకే ఇక నీకు నా మొఖం చూపించను - ఎల్లిపోతా... శాశ్వితంగా ఈ ప్రపంచమే వొదిలిపెట్టి పోతా... వొదిలిపెట్టిపోతా' వాడి గొంతు జీరబోయింది.

ఏడుస్తున్నాడు వాడు..

హృదయవిదారంగా ఏడుస్తున్నాడు.

గుండెలు బాదుకున్నాడు- నోరు కొట్టుకున్నాడు.

దొర్లి దొర్లి ఏడుస్తున్నాడు.

ఇంతలో భూమ్యాకాశాలు గుర్తొచ్చాయి.

వాడిలో కోపం కట్టలు తెంచుకుంది.

లేచి, మళ్లీ ఉచ్చపోశాడు.

కసిగా పోశాడు.

వాసన.. ముక్కుపుటాలకు కమ్మగా సోకిందా వాసన.

కోడికూర కంటె మంచి వాసన, నేతిబువ్వకంటే కమ్మటి వాసన... ఏంటది... ఏంటది?'

ఎగబీల్చాడు... సమ్మగా అన్పించింది.

'దీనెమ్మ... మట్టి తడిస్తే ఎంత మంచి వాసన'

ఉచ్చలో తడిసిన మట్టి వాసన వాడి ముక్కుపుటాల్ని అదరగొట్టింది.

వంగాడు.. వంగి ఆ వాసనను ఆనందంగా పీల్చాడు.

ఆకాశం వైపు చూశాడు.. 'దొంగలంజకొడకా నువ్వెప్పుడు పోస్తావురా ఉచ్చలు? ఎప్పుడు చూపిస్తావురా వాసన?' పొలికేక పెట్టాడు.

తిరిగి నడక సాగించాడు. ఒంటికాలి చెప్పుతో నడుస్తున్నాడు.

నడుస్తూ ఆగుతూ నడుస్తూ ఆగుతూ అరగంట నడిచాడు.

ధర్మవరం వచ్చేసింది. గోడల మీద సినిమా పోస్టర్లు కన్పించాయి.

నోరెళ్లబెట్టి చూస్తుండిపోయాడు.

హీరోయిన్ పైన పడిన హీరో...

ఒకచోట గాలిలో ఎగురుతున్న కార్లు...

మరో చోట రెండే రెండు గుడ్డ పీలికలతో హీరోయిన్...

ఠక్కున వాడి దృష్టి పోస్టర్ల మీద నుంచి రోడ్డుమీద వెళ్తున్న అందమైన కారుపై పడింది.

కారు– కారు నడుపుతోంది. – ఆ కారు నడుపుతోంది బాలాజీగాడే కదూ.. అవును వాడే... ఇంతకు ముందు మోటారు సైకిలుండేది వాడికి... ఇప్పుడు కారు..

నకిలీ విత్తనాలు, కల్తీ మందులు అమ్మి బేవార్సు కొడుకు ఎదిగిపోతున్నాడు, ఎదిగి పోతున్నాడు.

ఎదిగికాదు, నాశనమై.

థూ ఎదవబతుకు

కాలికి మిగిలిన రెండో చెప్పును కూడా బలంగా అటువైపు విసిరాడు.

అదృష్టవశాత్తూ జనాలెవ్వరూ లేరు. దూరంగా పడిందా చెప్పు.

మళ్లీ గోడవైపు చూస్తే... ఎదురుగుండా పోస్టరు...

హీరోయిన్‌పై హీరో...

కసితో కోపంతో నిలువెల్లా ఒణికిపోయాడు వాడు.

కాస్త దూరంలో పేడ కన్పించింది.

మరుక్షణంలో అది పోస్టరు మీదుంది.

సరిగ్గా హీరోయిన్ ముఖం పైన పడిందా పేడ. హీరో దాన్ని నాకుతున్నట్లు అన్పించింది వాడికి.

కసిగా నవ్వి నడక సాగించాడు.

ఫోటోస్టాట్ సెంటరు ముందు ఆగాడు.

'కరెంటు లేదు. గంటకు వస్తుంది అప్పుడు రా' అన్నాడు ఫోటోస్టాటోడు.

'వందలు వందలు కరెంటు బిల్లులు జనాల మీద వేస్తూనే ఉన్నారు... మళ్లా గంటలు గంటలు కట్టు' అక్కసు వెళ్లగక్కాడు వాడు.

వెళ్లబోతుంటే – ధర్మవరంలోనే చదువుకుంటున్న తనూరు గోవిందు కనబడ్డాడు.

'నువ్వు పోన్నా. పదిగంటల బస్సుకు ఊరికొస్తాండాను. నేను తీసుకొని వస్తా – డబ్బు ఇచ్చేసి పో– మనకు తెల్సినోడేలే' అన్నాడు గోవిందు.

జేబులోంచి వంద రూపాయల నోటు తీశాడు వాడు.

'పంటలు లేవు, పంటలు లేవు అంటారు. చూడు అన్న వంద నోటు ఎట్ల తీసినో.. మీరే మేలప్పా'– ఫోటోస్టాటోడు.

ఆ మాటన్నందుకు వాణ్ణి కత్తితో పొడిచి చంపాలన్పించింది వాడికి.

'ఫ్యాన్లకింద ఆరేసుకుని కుచ్చున్న నా కొడుక్కు మా కష్టమేం తెలుస్తాది. ఎంతమంది కాళ్ళు పట్టుకుంటే ఈ అప్పు దొరికింది. వీడికా సంగతి తెల్సా? ఈ అనంతపురం జిల్లాలో అప్పు చెయ్యనోడు రైతే కాదు' గొణుక్కుంటూ రోడ్డు మీద పడ్డాడు వాడు. కొంచెం దూరం నడవగానే ఎరువుల దుకాణం కన్పించింది. 'పురుగుల మందు కావల్ల' అడిగాడు వాడు.

షాపతను ఇచ్చాడు.

'పురుగులు చస్తాయా?'

'ఒక్క పురుగు కన్పిస్తే మళ్లా తీసకరా– నేను తాగుతా' నమ్మకంగా చెప్పాడు షాపోడు.

ఆ బాలాజీగాడికంటే కొంపలు ముంచేవాడిలా కనబడ్డాడు వాడికి.

డబ్బులిచ్చి బయటపడ్డాడు.

చచ్చే ముందు పెళ్లాం. పిల్లలకు బిర్యానీ తిన్పించాలని అనిపించింది వాడికి.

మిలట్రీ హోటల్ అల్లంత దూరం ఉండగానే కమ్మని వాసన.

'దీనెమ్మ ఎదవ జీవితం – ఎన్నాళ్లయింది...

ఎన్నాళ్లా కాదు కాదు.. ఎన్ని నెలలైందో కోడి ముక్క పంటి కింద పడక.

లోపలకు అడుగుపెట్టాడు.

వాసన పదిరెట్లయింది.

ప్లేట్లలో కోడిమాంసం...

నోట్లో నీళ్లూరాయి వాడికి. దిగమింగాడు.

కోడి తన్ను పిలుస్తున్నట్లపించింది.

'ఏమప్పా, ఏంగావల్ల' హోటలోడు.

'కోడి పలావు. పార్సల్ కట్టు' చెప్పాడు వాడు.

'కొంచెం సేపు కుర్చో'

వాడు కూచున్నాడు. వాడి దృష్టి వరుసగా పేర్చిన ప్లేట్లపై పడింది.

ఎర్రగా కాల్చి మసాలా దట్టించిన కోడి మాంసం.

మళ్లీ నోట్లో నీళ్లు...

'అదేంది' నీళ్లు మింగతా అడిగాడు వాడు.

'చికెన్ రోస్టు. కావల్నా- ప్లేటు పదే' హోటలోడు.

'ఒకటీ'

'వచ్చేస్తోంది- రోస్టు వచ్చేస్తోంది'

ఆ.. వచ్చేసింది.

లెక్క పెడితే ఎనిమిది ముక్కలున్నాయి.

ఒకటి తీసి నోట్లో వేసుకున్నాడు.

'ఆహా... ఆహా ఏం రుచి'

పళ్ల కింద ముక్క నలుగుతుంటే మరో చేత్తో ఉల్లిపాయ తీసి కసుక్కున కొరికాడు.

'అబ్బా... స్వర్గం కన్పిస్తోంది' మరో మూడుసార్లకు అన్నీ గుటుక్కుమన్పించాడు.

తృప్తిగా నీళ్లు తాగి తేన్చాడు.

ప్లాస్టిక్ కవర్లో బిర్యానీ పొట్లం, పురుగుల మందు వేసుకొని నడుస్తున్నాడు వాడు. పొలాల మధ్య దారిలో ఊరివైపు సాగుతున్నాడు.

కాస్త  నిస్సత్తువ అన్పించింది. కడుపు నిండా అన్నం తిని ఎన్నాళ్లయిందో. అలాగే మొండిగా నడుస్తున్నాడు.

అదిగో తన ఊరు కన్పిస్తుంది.

ధర్మవరంలో తిన్న కోడిముక్కలు ఎటెళ్లాయో... నీరసం... నీరసం...

కాళ్లు మొరాయిస్తున్నాయి- ఓపిక నశించింది. నెప్పులు... కళ్లు తిరిగినట్లయింది.

చింతచెట్టు కింద కూలబడ్డాడు.

కళ్లు బైర్లు కమ్ముతున్నాయి.

కళ్లు మూసుకుపోతున్నాయ్... పోతున్నాయ్...

అలాగే పడిపోయాడు వాడు.

చాలా సేపటిక్కానీ కదల్లేదు.

ముఖం మీద నీళ్లు చిలకరించినట్లయితే అప్పుడు లేచాడు.

'ఎక్కడున్నాడు తను–

ధర్మవరం వెళ్లాడు... వస్తూ వస్తూ...

వాసన వాసన..

ఇక్కడ పడిపోయాడు. హమ్మయ్య గుర్తొచ్చింది. టైమెంతయిందో– ఎంతసేపు పడిపోయాడో...

వాసన అవును 'వా... స....న'...

ఒక్క ఉదుటున ఈ లోకంలోకి వచ్చాడు వాడు. నోరెళ్లబెట్టాడు. ఆశ్చర్యపోయాడు.

వాసన– ఆ వాసన.. మట్టి తడిసిన వాసన.

అంటే వర్షం...వర్షమా వస్తోంది...

ఇంతవరకూ గమనించలేదా తను.

చిన్నగా చినుకులు రాల్తున్నాయి.

చెట్టు కింద నుంచి దూరంగా వచ్చి ఆకాశం కేసి చూశాడు.

నల్లటి మబ్బులు...

'రావల్ల రావల్ల... మీ కాళ్లు పట్టుకుంటా రాండ్రా రాండి... ఒరే ఒరే మా ఊరి మీదకే రాండ్రా... మీ కాళ్లు మొక్కుతా... ఎల్లిపోకండ్రా'... అరుస్తున్నాడు వాడు.

వర్షం పెద్దదైంది.

ఎండి ఎండి భూమి వదలిన పగుళ్ల లోతులను తాకుతూ అడుగు అడుగు పొరల్లోకి పోవాలన్న ఆరాటంలో నీరు–వర్షం నీరు.

దోసిలి పట్టాడు వాడు. దోసిట్లోని నీళ్లను నోట్లో పోసుకున్నాడు.

చికెన్ ముక్క రుచి బలాదూరన్పించింది.

ఆనందంతో గంతులేశాడు.

భూమ్మీద పడి గట్టిగా కావలించుకున్నాడు.

'అమ్మా, తాగే... కడుపారా తాగే.. తాగి మా చిన్ని మొక్కలకు ప్రాణం పొయ్యే'...

ఆకాశం వంక చూసి చేతులెత్తి నమస్కరించాడు.

వర్షం నీళ్లలో దొర్లాడు.

రైతు జీవనాడి.

రైతు ప్రాణధార.

రైతు సర్వస్వం – నీటి చుక్క.. వాన నీటి చుక్క.. ఒక్కో చుక్కా భూమిని సంగమిస్తుంటే అందులో ఆనందం, తాదాత్మ్యం అంతా ఇంతా కాదు.

వర్షం మరింత ఉధృతమైంది. చూస్తుండగానే వర్షం నీరు కాలువలు గట్టాయి.

'నీళ్లు నీళ్లు"... పిచ్చిగా అరుస్తూ ఆనందిస్తూ ఎగురుతున్నాడు వాడు.

వాడికా క్షణంలో అప్పులూ అవమానాలు బాధలూ... ఏం గుర్తు రాలేదు.

వర్షం వచ్చిందంతే...

చెట్టు కింద పురుగుల మందు, బిర్యానీ గుర్తొచ్చాయి. ప్లాస్టిక్ కవర్లో ఉండటం వల్ల బిర్యానీ పొట్లం తడవలేదు. పొట్లం విప్పి చేతినిండా తీసుకుని ఆబగా తినసాగాడు.

బిర్యానీలోకి వర్షం నీళ్లు కలుస్తున్నా వాడు లెక్క చేయలేదు. మొత్తం ఖాళీ చేశాడు.

కడుపు నిండినట్లన్పించింది. తన జీవితంలో మొదటిసారిగా తృప్తిగా తిన్న భావన కల్గింది.

వర్షం నీళ్లతోనే చేతులు కడుక్కున్నాడు.

పొలాల నిండా నీళ్లే – ఎక్కడ చూసినా వర్షం నీరే.. కన్నుల పండువగా ఉందా దృశ్యం.

వాడు ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతున్నాడు.

పురుగుల మందు డబ్బాను చేతుల్లోకి తీసుకున్నాడు.

'భలే... కనిపెట్టార్రా మమ్మల్ని... పంటలు పండితే పురుగులు, పండకపోతే రైతులు చావడానికి'... డబ్బాను ముద్దుపెట్టుకున్నాడు.

'ఇంక నీ అవసరం ఇప్పుడు లేదులే. మా చిన్ని మొలకలు పెద్దవైతే అప్పుడు నీకు పని' తువాలు గుడ్డ తీసి డబ్బాను అందులో పెట్టి ముడేశాడు.

ఊరివైపు పరుగు ప్రారంభించాడు.

ఈ దెబ్బతో మొలకలు పొలాల్లో చిందులెయ్యల్ల. బంగారం... బంగారం పండల్ల...

అప్పుడు అప్పులన్నీ తీరతాయి. గర్వంగా తలెత్తుకుంటాడు తను.

రైతు– భూమిపుత్రుడు

రైతే రాజు–మహారాజు

గెలుస్తాడు–తను గెలుస్తాడు.

వర్షం వస్తూనే ఉంది.

కాలువలై నీరు పారుతూనే ఉంది.

పంట చేతికొచ్చే వరకు నమ్మకూడదని వాడికి తెల్సు. కానీ ఆశ...

మళ్లీ లాటరీకి సిద్ధమయ్యాడు వాడు.

వ్యసనం

వ్యసనం

వ్యవసాయ వ్యసనం....

✡

# ఎండమావులు

**– తాడిగిరి పోతరాజు**

'పదిమందితో చావు పెళ్లితో సమానం. మన పల్లెసీమల్లో రైతు కుటుంబాల్లో పెళ్లిళ్లే పెళ్లిళ్లు'– వసుంధర

సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బై పోసాగింది ఆమె.

భర్త ప్రయోజకత్వంతో మురిసిపోయిన ఆమె మొగని ముఖంపై చూపుని నిలిపింది. అర్ధాంగి ముఖంలోని ఆనందపు కాంతులను చూసిన అతను, రెట్టింపు ఉత్సాహంతో ఆ మాటలు మళ్ళీ అన్నాడు...మేధావిలా ఫోజు పెడుతూ.

"ఈ దెబ్బతో మన దశ తిరిగిందనుకో...ప్రతి ఏటా పుచ్చతోట పెట్టకుంటే మనం ఎప్పుడో బాగుపడేవాళ్ళం....నీయవ్వ...ఆ దిక్కుమాలిన వడ్ల పంట. దానితో ఒక గోస కాదు....వరి కర్రలు కోసుడు....పంజ కట్టలు కట్టుడు...కల్లం చేసుడు...అందులోకి పంజ కట్టలు మోసుడు...ఎడ్లతో గడ్డి తొక్కించుడు...తొక్కిన గడ్డి పనలు పనలుగా తీసుడు...గడ్డి తియ్యంగ తియ్యంగ ఎక్కడో అడుగున ఇన్ని వడ్లగింజలు తేల్తయి...బావి తవ్వంగ తవ్వంగ అడుగున నీళ్ళ జల కనబడ్డట్టు.....నీయవ్వ...పెద్ద రామాయణం....పుచ్చపంటకు ఈ సాకిరీ ఏంలేదు.... ఇటు కాయలు తెంచుడు...అటు అమ్ముడు...గంతే – ఎంత సుకం..."

మాటల్లో పరవశత్యం. ఆత్మవిశ్వాసం. అతి విశ్వాసం.

ఆనందం పట్టలేక నిటారుగా నిలబడి, మూడు మూళ్ళ జరీ అంచు పంచెను తలపాగా చుట్టి దాని అంచును నెమలి పింఛంలా తిప్పి నొసటిపై భాగాన నిలిపాడు – రాజు కిరీటంలా...

"యాల, పొద్దుగాల్నే అమ్ముకొని ఇల్లు సేరదాం....జల్దీ కానివ్వు...బండెక్కు..."

"ఎండలు పాడుగాను...ఈ యాడాది మరీ...ఎన్ని మంచినీలు తాగినా ఎటుబోత న్నయో... ఒక్కటే అగర్త – (వేడి)" అంటూ బండిపైకెక్కి పుచ్చకాయలపై కూర్చుంది మల్లమ్మ.

బండి కదిలి ఊరు దాటి, పొలిమేర్లలోకి చేరింది.

పొలిమేర్లలో సూర్యుడు...వెనుతిరిగి చూడని మిలిటరీ ఆఫీసర్‌లా పైపైకి పోతున్నాడు. నాల్గు బారల పొద్దు...అప్పుడే ఎండ చిటచిట.

పొలిమేర్ల నుండి గుట్టల వరకూ పరచుకున్న భూదేవి.

వాన చినుకు కోసం తపించిపోతూన్న పుడమితల్లి ఆకాశం వంక ఆశగా చూస్తోంది – భర్త ప్రేమానురాగాలకు తపించి పోతూన్న ఇల్లాలిలా....గ్రీష్మఋతువు కావటం వలన రేగడి భూములన్నీ ఇంతింత లోతున నెర్రెలు కొట్టినయి.

నెర్రెలను తప్పించుకొని నడుస్తూన్న బండి – దుమ్ము రేపుతున్న ఎడ్ల గిట్టలు. ఎడ్లను అదిలిస్తున్న చోదకుని కేకలు. కేకలకు భయపడిన పాదరహిత ప్రాణులు – పాములు నెర్రె కలుగుల్లోకి ఉరకసాగాయి. మనిషి రాకడను పసికట్టిన చతుష్పాద ప్రాణులు – తమ చిన్న చిన్న పాదాలతో ఉరుకుతున్నాయి – తొండలు, ముంగిసలు, ఉడుతలు.

"తెల్లతాసు(త్రాచుపాము)ను సూడవే. ఇటు....ఇటు....నీయవ్వ – వెండి వడ్డాణంలాగ – తళతళ మెరుస్తోంది...."

"మనల్ని సూసి భయపడ్డటుంది..." – దానివంక చూస్తూ అంది మల్లమ్మ.

"మనిషిని సూత్తే – తోటి మనిషికే భయం...నోరు వాయి లేని జీవులు అవి...పాపం, ఆటి జాగర్తలో అవి ఉంటయి...మనిసికి దూరంగా..."

బండి మలుపు తిరిగి – మట్టిరోడ్డుపై కొచ్చింది.

మలుపులో సర్కార్ తుమ్మలు – పిచ్చి తుమ్మచెట్టు – నీళ్ళూ నిప్పులూ లేకపోయినా, అన్ని కాలాల్లో పచ్చగా ఉండే పిచ్చితుమ్మలు – జడలు జడలుగా వేలాడుతున్న వాటి కొమ్మలు వారిపైకి వ్యాపించాయి. ఆ కొమ్మల నిండా పదునైన బాకుల్లాంటి ముళ్ళు.

"తలవొంచుకోవే...నీయవ్వ...ముల్లు గుచ్చిందంటే వింజిషన్ చేయించుకోవాలి.... బద్మాష్ ముళ్ళు."

కొమ్మలు దాటేవరకు తల వంచుకొని పైకి చూసింది.

మట్టిదొంకపై నుండి కంకర రోడ్డుపై కొచ్చింది బండి.

రోడ్డుకు ఇరువైపులా మంచితుమ్మలు నల్ల తుమ్మలు. శిశిరంలో ఆకులు రాల్చుకుని దాహం దాహం అంటూ ఆకాశం వైపు చూస్తున్న నల్ల తుమ్మలు. వాటి మధ్యన మేతకొరకు తచ్చాడుతూన్న మేకలు, గొర్రెలు – వాటికి ఎడంగా, గడ్డీ–గాదం వెతుక్కుంటూ బర్రెల మంద. పక్కటెముకలు ఊగించుకుంటూ నేలను స్పృశిస్తూ నడుస్తున్నాయి.

“పిచ్చి మేకలు…ఈ దిక్కుమాలిన తుమ్మలో ఏముందంట?…ఒక పువ్వా లేదు..పూతా లేదు…దయ్యాల్లా నల్లగ నిలబడినయి” మల్లమ్మ వ్యాఖ్యానించింది.

“మల్లవ్వా….గట్టనకే!…మంచిగ మాట్టాడు….కాపోల్లం మనం. నల్ల తుమ్మలు – మామంచి తుమ్మలు….‘మనకు కావాల్సిన నాగలిదుంప కాడిమాను, గంటక సెక్కలు, గొర్రు సెక్కలు…బండి సెక్రాలు – దాని ఆకులు – బండినొగ, అన్నిటినీ అందించేది నల్లతుమ్మే…. ఎవసాయానికి అక్కెరకొచ్చే ఇసిరెలను సప్లయి జేసే బంగారుతల్లి…తుమ్మంటే వుక్కు…. వుక్కు ముక్క..” – అంటూ తన భుజంపై నున్న కండువను చరిచి చూసుకున్నాడు.

“దీని దెబ్బకు ఏకులం కట్టె కూడా సరిపోదు…తుమ్మ చెట్టు రైతుకు తమ్ముడు… ఎరికేనా?… హయ్ – అంటూ ఎడ్ల తోకలపై చెయ్యి వేశాడు.

ఎడ్ల కాళ్ళు వేగం అందుకున్నాయి.

కంకర రోడ్డు దాటిన బండి సిమెంటు రోడ్డుపై కెక్కింది.

సిమ్మెంటు రోడ్డు పట్టణానికి తీసుకెళ్ళే రాచబాట.

దూరాన పట్టణం – ఎత్తైన భవనాలతో సెల్ టవర్లతో, ఫ్యాక్టరీ గొట్టాలతో అస్పష్టంగా కనిపిస్తోంది. పట్టణం చుట్టూ ఎండమావులు. ఆకాశం నుండి ఏటవాలుగా దిగుతూన్న సూర్యకిరణాలు తళతళా మెరుస్తూ కొండల వైపు పరుగెడుతున్నాయి.

చెరువులోని అలల్లాగ భ్రమకొలుపుతూన్న మరీచికలు.

మయసభల్లాంటి పట్టణాలకు రమ్మని ఆహ్వానించే మృగతృష్ణలు.

వగలతో, వయ్యారాలతో తళుకు బెళుకులతో మురిపించే పట్టణానికి చేరువైతున్న సంబరంలో ఎడ్ల తోకలపై చెయ్యివేసి మెలి తిప్పాడు. ఆ భూమిపుత్రుడు. సిమ్మెంటు రోడ్డుపై గిట్టలు మోపలేని ఎడ్లు ఏటవాలుగా తమ కాళ్ళను రోడ్లపై తన్నిపట్టి బరువు బండిని ఈడ్చుకు పోసాగాయి.

రయ్యిరయ్యిన దూసుకుపోతూన్న బస్సులకు, ఆటోలకు దారినిస్తూ రోడ్డు మూలన ఒదిగి ఒదిగి నడవసాగాయి ఎడ్లు – సంపన్నులను చూసి, బెదిరిపోయిన పేదవాళ్ళలా…

పుచ్చకాయల భర్తీ బండి చౌరస్తా చేరింది.

“హో….వ్వ…” అంటూ ఆగిన బండి నొగలను బలంగా పైకెత్తి భుజంపై నిలబెట్టు కున్నాడు. కాడి క్రింద నిలబడిన ఎడ్లు పక్కకు తప్పుకున్నాయి. భుజంపై నుండి నొగలు దించి నేలపై పెట్టాడు. కాడిమానుకు వేలాడుతూన్న జోళ్ళు ఊడదీసి (ఎడ్ల మెడపట్టెడలు) బండి నాటు కొయ్యకు తగిలించాడు.

జల్లలోని పుచ్చకాయల వంక ప్రేమగా చూశాడు.

పచ్చనిరంగుతో మిసమిసలాడుతున్నాయి – రుబ్బుడు పాత్రాల్లాగ.

ఒక్కొక్క తీగెకు ఒక్కటే పండు....తీగకు రెండు కాయలు కాస్తే ఇల్లంతా బంగారమయి పోను.... తాను మూడు నెలలు కష్టపడ్డ ఫలితం. బండి నిండా పుచ్చకాయలు.

కన్నతల్లి తన సంతానాన్ని అపురూపంగా, ఆప్యాయంగా చూసినట్లు ఒక్క క్షణం చూసి....“దిగిరావే ...” అన్నాడు...పుచ్చకాయలపై ఒదిగి కూర్చున్న భార్య నుద్దేశించి.

నాటు కొయ్యలు ఆసరాగా చేసుకొని, నొగ తొట్టికి అల్లిన కొబ్బరి తాళ్ళను పట్టుకొని మెల్లగా నేలపై జారింది. కుచ్చిళ్ళు విదిలించుకొని గోచి బిగించింది. పమిట చెంగు తలపైన సర్దుకొంది.

అతను బండికి తగిలించిన ఐదు లీటర్ల ప్లాస్టిక్ క్యాన్ అందుకొన్నాడు. తువ్వాలు తడిపి, నీళ్ళను పిండి, తడిపొడిగా ఉన్న రుమాలు, చెవుల చుట్టూ తిప్పి తలగుడ్డ చుట్టాడు. తడిపిన రుమాల నుండి గాలి, సూర్యకిరణాలు ఫిల్టర్లై చెవి గూబలలోకి చల్లటి గాలి ఇంకిపోసాగింది. కండిషన్డ్ ఎయిర్.

ఒక్కొక్క చక్రానికి, ఒక్కొక్క ఎద్దును కట్టివేసి వరి గడ్డిపరకలు వాటి ముందు చిమ్మాడు.

“పుచ్చకాయలు...పుచ్చకాయలు...అయిదు రూపాయలకొకటి....అగ్గువ – అగ్గువ (చౌక)...రావాలి...రావాలి....సవక...సవక...” అని పెద్ద పెద్దగా అరవసాగాడు.

మల్లమ్మ చేతిలో పుచ్చకాయ ముదురుపచ్చరంగుతో నిగనిగా మెరుస్తోంది. ఒక ముక్క కోసి ప్రదర్శించసాగింది. ఎర్రని స్పాంజిల్లాంటి కండ. అందులో నల్లగా మెరుస్తూన్న గింజలు. చుక్కలు చుక్కలుగా ఎర్రని నీరు. చూపరులకు నోరూరించే ప్రదర్శన. చల్లని, తియ్యని, పుల్లని – పుచ్చ – వేసవి తాపం తీర్చే మధుర ఫలం.

“నాలుగు రూపాయలకిస్తావా? నేను రెండు కొంటా” – ఒక పుచ్చకాయను చేతిలోకి తీసుకొని బేరమాడసాగాడు – ఒక నడివయసు వ్యక్తి.

“దేనికయినా నాయముండాలి సారూ!....అక్కడ అటు సూడండి. రాశి పోసుకొని కూర్చున్న మారు బేరగాడు...‘ఒక్కొక్కటీ పది రూపాయలకు తక్కువమ్మటం లేదు....మా వద్ద అయిదుకు కొని పదికి అమ్ముతున్నాడు. ఇంకా అతడు సూడండి...కరీంసాబ్ పండ్ల దుకాణంలో కిలోల లెక్కన ‘జో’కి (బరువు తూచి) అమ్ముతున్నాడు. పండించేది మేము.... అమ్ముకునేది ఆళ్ళు....అయిదుకు తక్కువ లేదు – నువ్వు – రెండు కాదు – రెండొందలు కొను...కాయలు తెంపుకొని మండుటెండలో ఈడకొస్తే...మేం, మీకు లోకువైపొయ్యాం....” – ఖచ్చితమైన తన నిర్ణయాన్ని చెప్పాడు.

"అదంతా కొనే బేరంకాదులే....ఎల్లమను...ఎల్లమను..." అంటూ భర్త వంక చూస్తూ, "సోది ముచ్చట్లు పెట్టుకోకు, జనంతో...మన సోది వాళ్ళకెందుకు?...మన కట్టం విని కరిగిపోయ్యే రకం కాదు ఈ పట్నపోళ్ళు" – అంటూ నాలుగు దులిపింది.

"అవ్వా....మూడు కాయలు" – అంటూ పదిహేను రూపాయలు చేతిలో పెట్టింది, లంచ్‌కి ఇంటికి పోతున్న ఓ ఆఫీసరమ్మ.

చీరె మడతలలో చెక్కిన గుడ్డ సంచిని పైకి లాగి ఆమె ఇచ్చిన పదిహేను రూపాయలు అందులో కుక్కి మళ్ళీ ఆ సంచిని నడుంలో దోపుకుంది.

"ఏరుకో బాంచెను...ఏరుకో మంచివి..." ముసిముసి నవ్వులతో, "నీదే బోణి. నీ సేతి సలవ వలన జల్దీ జల్దీ అమ్ముడుపోతే...యాల పొద్దుగాల్నే ఇల్లు సేరతాం...అవ్వా!" – అంది.

"అగ్గువ – అగ్గువ" – అతని కేకలు.

ఒక్కక్కరే బండి చుట్టూ మూగసాగారు. గిరాకీ పెరిగింది. మారుమాట్లాడకుండ అయిదూ, పదీ చేతిలో పెట్టి కాయలు కొనుక్కుపోసాగారు. మంది ఎక్కువగా పోగయ్యారు. మల్లమ్మ బండిపైకెక్కి కాయలు అందించటం – అతను అమ్మటం – వాళ్ళిచ్చిన పైసలు గుడ్డసంచిలో కుక్కుకోవటం – మొదలైన పనులతో సతమతమైపొయ్యారు – ఆలూ మగలు.

గ్రీష్మఋతువు – రోహిణీ కార్తె – రోళ్ళు పగిలే ఎండలు.

మల్లమ్మ తలపై కప్పుకొన్న పమిట చెరుగు ఎండ ధాటికి ఆమెను కాపాడలేకపోతోంది. రవికంతా చెమటతో తడిసి ఒంటికి అతుక్కుపోసాగింది.

మెడ చుట్టూ చెమట. ముఖమంతా చెమట – చెమట గడ్డం క్రింద బిందువులు, బిందువులుగా మారి, చుక్కలు చుక్కలుగా రవికను తడపసాగింది. కుడిచేత్తో పుచ్చకాయలు భర్తకందిస్తూ – ఎడంచేత్తో స్వేదాన్ని తుడుచుకోసాగింది.

అతనూ నెత్తిన చుట్టుకున్న రుమాలు ఊడదీసుకొని చెమట తుడుచుకున్నాడు. మళ్ళీ నీళ్ళతో తడిపి, విదిలించి – తల గుడ్డ చుట్టు కున్నాడు.

పడమట నుండి వడగాలి.

ఆ వడగాలులకు ఇద్దరి ముఖాలూ పీక్కుపొయ్యాయి. ఎండ తీవ్రతకు జనం పల్చబడ్డారు. గిరాకీ తగ్గింది. జన సంచారంలేని రోడ్డు. నిర్మానుష్యమైన తారురోడ్డు మిలమిలా మెరుస్తోంది ఎండలో – కొండచిలువను చంపి, దాన్ని వెల్లికిలా పరుండబెట్టినట్లు రోడ్డుపై అడపా దడపా తిరిగే ఎర్ర బస్సులు – ఆటోలు.

ఆ నాల్గు రోడ్ల కూడలి (చౌరస్తా)లో ఒంటరిగా నిలబడిన డా॥ అంబేద్కర్ సిమ్మెంటు గద్దెపై నిశ్చలంగా నిలబడి చెయ్యెత్తి ప్రజలకు సౌంజ్ఞ చేస్తున్నాడు. ఆ వేలు చూపిస్తూన్న దిశను గమనించలేని ప్రజలు తల దించుకొని తమ దారిన తాము వెళ్ళిపొయ్యారు.

అతను బండి నాటు కొయ్యకు వ్రేలాడుతున్న ప్లాస్టిక్ నీళ్ల సీసాలు అందుకున్నాడు. ఒకటి భార్యకిచ్చి – రెండవది తన నోట్లో పెట్టుకున్నాడు. 'సల సల' – కాగుతూన్న ఆ నీటిని గుక్క మిగలకుండ ఖాళీ చేశాడు. అరచేతిలో నీళ్ళు పోసుకొని ముఖం తడుపుకున్నాడు.

"ఈ....అగ్గి కురుస్తూన్న ఎండకు మొగోడ్ని నేనే సుడిబడిపోతున్నా. నువ్వు ఎట్టా తట్టుకుంటున్నావే...ఆపేచ్చణ పాడుగాను...పైసలు పోగుచేసుకోవటంలో మనసు బెట్టి – చిటచిటలాడుతున్న ఎండను పట్టించుకోవటం లేదు నువ్వు....ఎవడైనా కొంటే ఆడికి పావుసేరు పారబోసి ఇంటి ముఖాన పోదాం."

"పండించిన పంట అమ్ముకోవటం చేతకాకపోతే ఎట్టానయ్యా! కాపోల్లం మనం. ఎండకు, వానకు భయపడితే...మన బతుకులు తెల్లారినట్టే! ఎవరైనా కాయల కోసం అస్తున్నారేమో అటు సూడు" – అంటూ ఆమె తేరిపార చూడసాగింది.

"నేను ఎడ్లకు నీలు తాపి, ఆ ఇస్కూలు గోడ పక్కన కట్టేసి మేత ఏసి వత్తా. ఎండకు ఎట్టా రొప్పుతున్నాయో సూడు. అవి డొక్కలెగరేత్తన్నయి...నువ్వు బండి దిగి కింద కూసో....నీయవ్వ....ఈ సిటీలో సెట్టుండదు...సేమా ఉండదు....ఇగ్గో నువ్వు బండి కింద కూసోని సద్ది – ఒక బుక్కతిను...నేను ఎడ్లను కట్టేసి అచ్చినాంక తింటా....మరిరాంగ (వచ్చేటప్పుడు) నీకో సల్లటి తంబుసెప్పు తెచ్చేదా?...." బొటనవేలు పైకెత్తి సంజ్ఞ చేశాడు.

"దానికి ఎన్నిపైసలవుతయి?" – బండి కింద దిగి కూర్చుంటున్న ఆమె అంది.

"పన్నెండు రూపాయలు"

"వామ్మో...పన్నెండు రూపాయలే"....ఎదుర్రొమ్ముపై బాదుకుంటూ, "మూడు పుచ్చ కాయలమ్ముకుంటేనేగానీ, ఆ పైసలు మళ్ళీ జమగావు. నాకేం వద్దు ఇగ్గో....నీవొక సింగిల్ ఛాయి తాగి – నాకొక సింగిల్...తే...ఇగో అయిదు రూపాయలు... అంటూ..."రాంగ మంచినీళ్ళు తీసుకురా...." అని గోనెసంచితో ఇన్సులేట్ చేసిన అయిదు లీటర్ల ప్లాస్టిక్ క్యాన్ అందించింది.

ఎడ్లను తోలుకుంటూ, హైస్కూల్ గ్రౌండ్ వైపు నడిచాడు – అతను.

మల్లమ్మ టిఫిన్ క్యారియర్ గిన్నెలు ఊడదీసింది. ఒక గిన్నె భర్త కొరకు పక్కన బెట్టి మరొక గిన్నె మూత తీసి అన్నం పైన ఉన్న పండు మిరపకాయల తొక్కు (పచ్చడి)ను కసాబిసా కలిపి, రెండు బుక్కలు (పెద్ద పెద్ద ముద్దలు) నోట్లో పెట్టుకొంది.

"ఏవలవ్వా?...బండికాడ..." ఓ నడివయసు ఆడమనిషి గొంతు.

"............"

"రెండు పుచ్చకాయలు..." - అంటూ క్రిందనున్న మల్లమ్మ వైపు చెయ్యి చాచింది, పది రూపాయల నోటుతో.

పచ్చడితో ఎర్రగా మెరుస్తూన్న కుడిచేతి వేళ్ళను ముడుచుకొని, వెనక్కి పెట్టుకొని, ఎడం చేత్తో నోటు అందుకుని...."రెండు మంచివి నువ్వే ఏరుకో..." - అంది ముద్ద మింగుతూ.

కాయలు తీసుకొన్న ఆమె...."ఇప్పుడు తింటున్నావ్, అవ్వా...పొద్దువంగుతుండంగ...." అంది.

"మాదొక దరిద్రపు బతుకు....తినటానికి నోసుకోని బతుకు - సద్ది కట్టుకోని, అందులోకి ఇంత ఆవకాయ తొక్కో - నిమ్మకాయ తొక్కో  ఏసుకేని చెలక ముఖాన వురుకుడే... వురుకుడు." ప్రశ్నించిన మనిషి - కాయలు తీసుకొని రోడ్డు దాటింది. మల్లమ్మ ముద్ద మింగుతూ తనలో తాను మాట్లాడుకోసాగింది, పైకి వినిపించేలాగ.

"ఏం ఎండలు - ఏం ఎండలు - బాంచెను...సీసాలో నీళ్ళు కూడా సలసల కాగి పోతున్నాయి" - అంటూ సీసాలో నీళ్ళు గటగటా త్రాగి మిగిలిన నీళ్ళు ముఖానికి చల్లుకొని పమిట చెంగుతో తుడుచుకుంది.

ఎండ తగ్గింది...కానీ వడగాలి ఇంకా వీస్తూనే ఉంది.

సూర్యుని చుట్టూ మబ్బు కమ్మి....కొద్దిగా చల్లబడింది. పుచ్చకాయలకు జనం ఎగబడసాగారు. రెండో మనిషి ఆసరాలేక, కాయలు అమ్మటంలో ఇబ్బంది పడసాగింది. రూపాయలు లెక్కబెట్టుకుంటూ, ఎవరి కాయలు వాళ్ళు ఏరుకోటానికి అనుమతిస్తూ....- "మా మగాయన...ఎడ్లు తోలుకొని అటే పోయిండు....ఏం మనిషో, ఏందో...?" - అని గొణుక్కుంటూ..."నాకు సూపిచ్చి తీసుకోండ్రి" అని జనాన్ని హెచ్చరించసాగింది.

అంతలో భర్త బండి దగ్గర కొచ్చాడు. వారు కట్టె - (చర్నకోల) - భుజాన వేసుకొని.

"ఎడ్లను కట్టేసి అటే పోతివి....ఇక్కడ నాకొక్కదానికే....గోస....గోస కాబట్టె. ఒక చేత్తో పైసలు తీసుకొనుడు...ఇంకో చేత్తో కాయలందించుడు....ఎటుబోయినవ్...ఇంతసేపు..." - చిర్రుబిర్రులాడింది.

"గోలిగాయలాడుకుంటున్నా....నీయవ్వ..." - అని కన్నెర్ర చేశాడు అతను.

మొగని గొంతులో అసహనం కనిపెట్టిన మల్లమ్మ రుసరుసలాడుతూన్న అతని ముఖంపై నుండి చూపు క్రిందకు వాల్చుకుంది.

ఎడమ మోకాలిపై ఎగగట్టిన ధోవతి. చెమటతో తడిసి వీపుకు అంటుకుపోతూన్న బన్నీను. జాలిగా చూడసాగింది.

“ఈ ఎండలో మన ఊరి నుండి....ఇక్కడికి నడిచొచ్చేసరికి ఎడ్లకు చొంగకారబట్టె, వాటిది మనలాంటి పానమే...నోరూ వాయిలేని జీవులు....నోరుంటే మనల్ని నీళ్ళడుగు.... వాటికి నీళ్ళు బెట్టాలని బోరింగుల సుట్టూ తిరిగిన. నా రెక్క బొక్క నొచ్చిందాక బోరింగ్ కొట్టిన. ‘కటుకు – కటుకు’ – అంటయి కాని సుక్క నీల్లు ఇవతలకు కక్కిన పాపాన పోలేదు. సివరాఖరికి...ఆ రంగనాయకుల గుట్టుకాడికి పోయి అక్కడ కరెంటు మోటర్ నడుత్తాంటే ఎడ్లకు నీల్లు తాపుకొచ్చిన....మనకు సుతా నీల్లు తెచ్చిన...” – ప్లాస్టిక్ క్యాన్ అందించాడు.

రెండవ నీళ్ళ క్యాను బండి నాటకు తగిలించి...

“ఇగో – నేసెప్పేది ఇను...యాడికో ఓకాడికి ఆ కరీంసాబ్‌కు పారబోసి మన ఇంటి ముఖాన పోదాం... ‘ఈ అమ్మకంలో లగు – బిగు – ఆళ్ళ కెరుక.... నడిరోడ్డుపైన ఎండలో నిలబడి అమ్ముకోవటం మనతో కానిపని” ..... ఒక నిర్ణయానికొచ్చినట్టు ధ్వనించసాగింది అతని కంఠం.

భర్త ముఖంలో విసుగు, కోపం గమనించిన మల్లమ్మ అనునయంగా మాట్లాడసాగింది. “గట్టయితే గట్టనే కానివ్వు... ముందు సల్లబడు... ఎప్పుడో పొద్దుపొద్దుగాల తిన్నకూడు” – అంటూ అతని కోసం దాచి ఉంచిన గిన్నె అందించింది.

ఎర్రగా మండుతున్న ఆ పచ్చడి మెతుకులను కసాబిసా పిసికి, మూడు బుక్కలలో గిన్నె ఖాళీ చేశాడు. ‘క్యాన్’ పైకెత్తి గటగటా నీళ్ళను గుటకేసి క్యాన్ ఖాళీ చేశాడు. మూతి తుడుచుకోని,

“అగ్గువ – అగ్గువ...పుచ్చకాయలు....ఐదు రూపాయల కొకటి” – అంటూ దారినపొయ్యే జనాన్ని పిలవసాగాడు. చల్లబడటం వలన జనసంచారం మొదలైంది. వేసవి శలవులు కావటంవలన, బడిపిల్లలు – పంతుళ్ళు – పంతులమ్మలు గుమిగూడసాగారు. గుమస్తాలు, పెద్ద పెద్ద ఉద్యోగస్తులు – సైకిళ్ళపై, స్కూటర్లపై గుంపు గుంపులుగా బండిని చుట్టుముట్ట సాగారు.

ఆమె రూపాయలు అందుకోవటం – అతను కాయలందించటంలో సతమతమై పోసాగారు. బండిపై ఎగబడుతూన్న జనం – ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన జనం రోడ్డుపై మూగసాగారు. గుంపును తొలగమని హెచ్చరిస్తూ బస్సుల, ఆటోల హారన్లు.

“ఏయ్...ఎవరిదయ్యా బండి...?” – తెల్లగుడ్డల పోలీసు ప్రత్యక్షం.

"అయ్యా...నాదే...నాదే...!" చేతులు దగ్గరకు తీసుకున్నాడు దణ్ణం పెడుతూ.

"రోడ్డు మీద నుండి బండి తియ్యి – ముందు తెనుగోళ్ళా మీరు?"

"కాదు – కాపోల్లం. నా పేరు ఈరారెడ్డి...ఇంకా కొద్దిగా మిగిలినయి కాయలు... అమ్ముకొని ఎల్లిపోతాం...రూల్సు మాట్టాడితే మేం బతికేది ఎట్టాగ?....తమరు దయ సూడాలి..."

"పటేల్ వన్నమాట. సరే వీరారెడ్డీ...జల్దీ అమ్ముకోమరి..." అని గుంపుగా చేరిన ప్రజలను చెదరగొడుతూ

"రోడ్డు దిగండి ముందు...బస్సులు పోనీయండ్రి...ఇటు – ఇటు" – అంటూ లాటీ తిప్పాడు, జనాన్ని అదుపులో పెట్టిన ట్రాఫిక్ పోలీసు, తన విధి నిర్వహణలో నిజాయితీని ప్రదర్శిస్తూ...

"రోడ్డు మీద నుండి బండి తియ్యవయ్యా ముందు" – బండి చక్రంపై బలంగా ఒక దెబ్బ వేశి రోడ్డు వైపు నడిచాడు.

కృతజ్ఞత నిండిన కళ్ళతో అతనిని చూస్తూ రెండు పుచ్చకాయలు చంకలో పెట్టుకొని అతని వెనక నడిచాడు.

"ఉంచండి...ఇంటివద్ద తమ పిల్లల కోసం".... అంటూ ఆ పుచ్చకాయలను డా॥ అంబేద్కర్ పాదాల చెంత ఉంచాడు.

"మరి ఆమీన్‌సాబ్‌కు...." – అంటూ అయిదు వేళ్ళు విప్పాడు.

"వారికి సుతా...(కూడా)" అంటూ ఊరికిపోయి ఐదు పుచ్చకాయలు తెచ్చి డా॥ అంబేద్కర్ గద్దెపై పెట్టి – అమీన్‌సాబ్ వంక చూసి వినయంగా చేతులు జోడించాడు.

టాప్‌లేని జీపులో స్టీరింగ్ పట్టుకొని ఒక కాలు భూమిపై పెట్టుకొని అధికార దర్పంతో ఠీవిగా చూస్తూన్న తెల్లగుడ్డల సబిన్స్‌పెక్టర్ ప్రసన్నవదనుడయ్యాడు. మౌనంగా దణ్ణం స్వీకరించిన సంకేతంగా తల నిలువునా ఆడించాడు.

"ఆయన అడగకముందే...ఐదు పుచ్చకాయలు తీసుకెళ్ళి ఆడబెట్టి అచ్చినవ్. మనకేమైనా పున్యానికి (పుణ్యానికి) అచ్చినవా పుచ్చపండ్లు''....వస్తూన్న భర్త వంక చూస్తూ చిర్రుబుర్రులాడింది ఆమె.

"నీయవ్వ...నీకు తోచదు...సెబితే ఇనవు...ఆడ మున్సిపాలిటీ జాగాలో బండి దించితే బండికి వంద రూపాయల శిస్తు కట్టమని 'చిట్టీ' – ఇచ్చిపోతాడు గుమస్తా....పైగా మనల్ని అడగకుండానే బండెక్కి అయిదారు కాయలు అందుకుపోతాడు...మామూలనిసెప్పి... వాళ్ళకన్న...ఈళ్ళు బెటర్..." – అంటూ ఆకాశం వైపు చూశాడు.

చీకట్లు ముసురుకోసాగాయి. వీధుల్లో నిలబడ్డ ఫ్లోరోసెంట్ దీపాలు కళ్ళు రెపరెప లాడిస్తున్నాయి.

"నేను పోయి ఎడ్లను తోలుకొస్తా"....నసిగాడు అతను.

"పో...మరి నాతో చెప్పుడెందుకో...?"

వీరారెడ్డి చూపులు ఆమె చీరలో చెక్కిన గుడ్డసంచిపై నిశ్చలంగా నిలబడ్డాయి.

"పో...మరి...ఇంకా ఎందుకు నిలబడ్డావ్?....." రెట్టించింది.

"రాంగ...ఒక పావు బాటిల్ తెచ్చుకుంటా..." చేతి వేళ్ళు విప్పి - జానెడు గుర్తుగా చాపి కొలతగా చూపించాడు.

"ఇంటికాడ...వాడిక బింకు (చిన్న కల్లుముంత) రెడీగా ఉంటది కదా?...ఇంకా ఇదెందుకు?"

"అది రోజూ ఏసుకొనేదేకదా!...బతుకులో సరదా సంబరం ఉండాల్నా...వద్దా? ఎండలో తిరిగి తిరిగి నా మాడంతా కుతకుతలాడి పోతాంది. ఒక్క పావు...ఒక్క పావు...ఏసుకుంటేనే తప్ప నా కాళ్ళూ రెక్కలూ సల్లబడవ్. రేపు పొద్దున్నే లేసి మామూలుగా పనిజేసుకోవాలంటే ఈ పూట సల్లబడాలి....పొద్దుట్నించి కట్టం జేసినోడ్ని...ఒక్క పావు ఏసుకుంటే తప్పా?...."

భర్త మాటల్లో రీజనింగ్‌తో ముచ్చటపడిన మల్లమ్మ గుడ్డ సంచి బయటికి లాగి ముసిముసి నవ్వులతో ఒక పచ్చనోటు చేతిలో పెట్టింది. పచ్చనోటు తెచ్చిన నిషాతో పెద్దపెద్ద అంగలు వేస్తూ రోడ్డు దాటాడు.

✡

బండి కదిలింది.

పుచ్చకాయలు లేని ఖాళీ బండిని, ఎడ్లు అవలీలగా గుంజుకు పోసాగాయి. ఇంటికి పోతున్న ఆనందంతో ఆ నందీశ్వర ద్వయం పెద్ద పెద్ద అంగలు వేస్తూ అదిలించే అవకాశ మియ్యకుండ దారి పట్టినయి. మబ్బుల్లేని నిర్మలమైన ఆకాశంలో చుక్కలు మెరుస్తున్నాయి - ఆశల్లాగ.

భార్యా భర్తలిద్దరూ ఊహలలో తేలిపోసాగారు.

మల్లమ్మ చీరె కుచ్చీళ్ళలో గుడ్డ సంచి.

ఆ సంచి నిండా నోట్లు - అయిదు రూపాయలు - పది రూపాయలు. కొన్ని వంద రూపాయలు. పైసలు - పైసలు. ఉబ్బి తబ్బిబ్బయిపోతున్న మల్లమ్మ నడుంపై చెయ్యివేసికొని

తడిమి చూసుకుంది. చేతికి గుడ్డ సంచి మెత్తగా తగిలింది. పట్టలేని సంతోషంతో మొగని వంక చూసింది. అతని చూపు నాటుకొయ్యకు తగిలించిన జనపనార సంచిపై కేంద్రీకృతమై ఉంది. అందులో క్వార్టర్ బాటిల్. తడిమి చూస్తున్నాడు – ఆ సంచిని.

"ఏందీ....ఇల్లు చేరేవరకూ ఆగలేకపోతున్నావా?"...పకపకా నవ్వుతూ వేళాకోళంగా అంది.

తన మనసులోని మర్మం ఆమె గ్రహించినందుకు సిగ్గుపడుతూ...

"అదికాదే...గతుకుల్లో నాటుకొయ్యకు గుద్దుకొని...సీసా గిట్టా పగిలిందేమోనని... మల్లవ్వా! తెల్ల కల్లు ఈ ఎర్ర సరుకు ముందు బలాదూర్....సీమ సరుకు – సీమ సరుకే..." – అన్నాడు.

అప్పుడే పైకొస్తున్న క్షీణ చంద్రుడు. మిలమిలా మెరుస్తూన్న చంద్రకాంతిలో, వాళ్ళ ముఖాలు మరింత కాంతివంతంగా ఉన్నాయి. బండి డొంకదారి పట్టింది. తనను గమనించ కుండా చుక్కలను చూస్తూన్న భర్త దృష్టి మరల్చుతూ...

"ఈ పైసలు ఏంచేద్దామనుకుంటున్నావ్?...మన దగ్గర పైసలు జమయినయని, పసిగడితే మన సుట్టపోల్లు... 'అప్పు' లిమ్మంటారు. నువ్వు అసలే ఉబ్బులింగడివి...నన్నుగాంగ అడుగుతున్నారని...అందరికి పందేరం చేస్తావ్..ముందు కైలాసం సేటు దగ్గర బాకీ కట్టు. పుచ్చకాయల విత్తనాల బాకీ...డి.ఏ.పి. పిండి బస్తాల బాకీ....సేటుమన ఇంటిమీద కొచ్చి మన ఇజ్జత్ తియ్యకముందే బాకీ కట్టుకుంటే మంచిదిగదా!"

"ఆడిదేముందిలే...ఈసారి కోతలో బాకీ సర్దుతానంటే...సప్పుడు సెయ్యకుండ ఎల్లి పోతాడు...ఉద్దెర (బాకీ) పెట్టటం ఆడికి తప్పదు. తీసుకోక మనకు తప్పదు. ఆడి బతుకు మన మీద – మన బతుకు ఆడి మీద ఆధారపడిన బతుకులు. ఎగసాయం సేసిన న్నాళ్ళు...ఆలూ మగల లెక్కన కలిసుండే బతుకులు"

"వాయిదా తప్పితే...మిత్తికి మిత్తి (వడ్డీకి వడ్డీ) కట్టుకోడా?"

"పుచ్చకాయలు – పంట పండాలేగానీ...డబల్ మిత్తి కడ్తా – ఎడంసేత్తో ఇసిరి పారేత్తా – ఆడి మిత్తి"

"నేను మరిసిపోయినా...నీతో సెప్పనికి....మొన్న నువ్వు ఊరికి పోయినప్పుడు...కరెంటు లైన్‌మాన్ అచ్చి నన్ను పరేషాన్ – పరేషాన్ చేసిండు. కరెంటు బిల్లులు పాత బాకీలన్నీ కట్టకపోతే పీసులు పీక్కుపోతానని...పోల్ ఎక్కి వైర్లు కట్ చేత్తానని. మోటర్ నడవకుండా – స్టార్టర్ – పీక్కుపోతానని....ఈరంగం ఏసిండు....ఆడి కేకలకు ఇంటి సుట్టూ జనం పోగయ్యారు...కల్లు తాగి సల్లబడమని, పది రూపాయలు సేతిలో బెడితే....మళ్ళీ వచ్చేవారం ఇవ్వాల్టి దినం కట్టాలని, సెప్పి పోయిండు...."

ఆమె మాటలు పూర్తికాకుండానే...."ఆడేనా?....ఆ పేడి మూతిగాడ్డి. ఆడు మన ఊరొచ్చి నప్పుడల్లా నా దగ్గర కుండ కల్లు తాగుతాడు. ఆడి కల్లు కింద కట్టిన పైసలు లెక్కసూత్తే కరెంటు బిల్లు ఎప్పుడో తేలిపొయ్యేది. ఆడే పెద్ద వింజనీరులాగ నీల్గుతాడు....వాడు పుట్టించి దంటనా, కరెంటు – ఆడి తాత పుట్టించిండంటనా?....ఇగో...నేనిప్పుడే సెబుతున్నా... కరెంటు మనిషులొస్తే మా మగాయన ఇంట్లో లేడని ఆళ్ళని ఎల్లగొట్టాలి.... ఎక్కువ తక్కువ మాట్లాడకు ఆళ్ళతో...ఆళ్ళకు కట్టాల్సిన పైసలు పక్కకు పెడతాంలే... కరెంటుతోనే మన బతుకు.....కరెంటోళ్ళే డేంజర్ లమ్డికొడుకులు...."

"మిగిలిన పైసలు ఏం చేత్తావ్?....అంజుమన్ (కో ఆపరేటివ్) బ్యాంక్ బాకీ కూడా కట్టి మళ్ళీ ఎత్తుకుందాం!.....సప్పుడు సెయ్యవ్?" – గట్టిగా అంది.

"సర్కారు అప్పే కదా!....మెల్లగా తీర్చుకుందాంలే..." – నిర్లక్ష్యమైన జవాబు.

"సర్కారీ బాకీ – అదే మన కొంప ముంచుద్ది...పయివేటు బాకీ తెచ్చుకుంటే బాంచను – బాంచను – (యువర్ స్లేవ్ – యువర్ స్లేవ్) అంటే...వడ్డీ మనిషయితే 'ఈ ఏడు ఎల్లుబడి లేదంటే' నోటు తిరగరాసుకొని ఏలిముద్ర వేయించుకొని...వచ్చిన దారినే ఎల్లి పోతాడు. సర్కారోడు గట్టా కాదు. నెంబర్ ఏక్ బద్మాష్. తడిగుడ్డలతో గొంతు కోస్తాడు. 'వడ్డీ మాఫీ' అని ఒక మంక.... 'పాత బాకీలు మాఫీ' అని ఒంకొక మంక – ఊరిచ్చి... ఊరిచ్చి అరచేతిలో వైకుంఠం సూపిత్తాడు. కాసాకరికి – వడ్డీ మీద వడ్డీ కట్టి – తీసుకున్న ఐదు వేలకు పది వేలు – డబుల్ అయిందని నోటీసు తలుపుకు అంటించి పోతాడు... బావా... ఎందుకొచ్చిన కుక్కపీకులాట.... సర్కార్‌తో.... మనం ఇంట్లో దాచిపెట్టుకుంటే ఈ పైసలు గుడ్లుపెట్టి పిల్లలు సేత్తయ్యా సెప్పు.... రేపు బ్యాంకుకు పోయి సెక్రటరీకి బాకీ కట్టి రసీదు తీసుకో..."

"ఈ కాయలే సివరి కాతన్నట్టు మాట్టాడుతున్నావేందే....ఇంకా మూడు కోతల పుచ్చ కాయలున్నయి చేనిలో...వాటితో అన్ని బాకీలు కట్టినాంక....వచ్చే ఏడాది ఎవసాయానికి పెట్టుబడికి పైసలు మిగుల్తయి...."

"మరిప్పుడు ఈ పైసల్నేం చేస్తావ్ మరి?...మన బిడ్డ పేరున 'పిక్స్' – (ఫిక్స్) సేద్దాం బ్యాంక్‌లో....దాని లగ్గం నాటికి అక్కర కొస్తయి...."

"అది ఇప్పుడు రెండో తరగతే కదా!....దాని లగ్గం కోసం ఇప్పట్నించే ఉరుకులాట – ఎందుకులే!"....

"బాకీలు తీర్చుకుందామని నేను ఎంత మొత్తుకున్నా...నీకు చెవి పక్కన పేను బారినట్టుగ కూడా లేదు....ఏంది నీ సంగతి..." – బండినాటు పట్టుకొని లేచి నిలబడి భర్త భుజం పట్టుకొని గట్టిగా ఊపింది.

"కూసో....కూసో....నిలబడమాకు...పడిపోతావ్....ఒక సెల్‌ఫోన్ కొనుక్కుందాం. దానితో ఫోటోలు కూడా తియ్యవచ్చు. నిన్ను – మన బుజ్జిని, మన సుట్టాల పిల్లల్ని... ఇంకా....మన పాత టి.వి.ని మార్చి పెద్దది కలరా టీ.వీ...తెస్తా!"

అలంకరణ సామాగ్రి కొరకు, వస్తు సంపద కొరకు అర్రులు చాచే స్త్రీ సహజమైన బలహీనతతో, ఆమె చప్పట్లు చరిచి తనకు వంత పాడుతున్నందన్న ఆశ తల్లక్రిందులయింది.

"ఏందీ...!" అంటూ మల్లమ్మ దీర్ఘం తీసింది. ఆమె కోపం నసాళాని కెక్కినట్టు గొంతు గీరబోయి వణక సాగింది.

"అదా సంగతి...సెల్లు ఫోను కొంటావా?...చెప్పవ్ మరి!...సెల్లు ఫోనూ లేదు. సొల్లు ఫోనూ లేదు....దేనికయ్యా నీకు సెల్లు.... వేలూ, లచ్చలూ సంపాదించే, డాకటర్ గాడివా?.... వింజనీరువా?...కాలు కింద బెట్టకుండ కార్లలో తిరిగే మినిష్టర్‌గాడివా?.... తెల్లగుడ్డలేసుకుని పదిమందిలో తిరిగే సర్పంచ్‌వా?...ఎద్దు ముడ్డి పొడుసుకొని బతికే కాపోనివి....నీ కెందుకు సెల్లు....? దాన్ని కుదవబెట్టుకొని అప్పిచ్చే వాడెవడూ లేడు....అమ్మితే కొనేవాడూ లేడు...సెల్లంట...సెల్లు.....దిక్కు మాలిన సెల్లు..." నొక్కి – పలుకుతూ దీర్ఘం తీసింది.

గయ్యిన లేచిన భార్యను ఉపశమింపచేస్తూ...."ముందు కూసో...పడిపోతావ్..." – అన్నాడు.

ఆమె కూర్చోలేదు.

"చెప్పేది నీక్కాదా?...కూసోని మాట్టాడు...కిందబడితే సత్తావ్?" – ఆమె రెక్క బట్టుకుని గద్దించాడు.

గతుకులలో పడిన బండి....కుదుపులతో అటూ ఇటూ ఊగుతోంది.

"కూసోను...సత్తే....నేనే సత్తా...నీకేంది?..." – అని రెట్టించి కోపంగా చూడసాగింది. విశాలమైన ఆమె కళ్ళు మిలమిలా మెరవసాగాయి. కలత చెందిన ఆమె మనసు – తన కళ్ళలో ప్రతిఫలించసాగింది. మరుక్షణం ఆమె బుగ్గలపై కన్నీరు...టపటప రాలసాగింది.

కంకర రోడ్డు దాటిన బండి అడ్డబాట చేరింది.

అడ్డబాట వద్ద చీలిన తొవ్వలు – దారులు – అడ్డబాట నుండి కుడివైపుకు తిరిగితే వీరారెడ్డి ఊరు. ఎడమ వైపుకు తిరిగితే మల్లమ్మ తల్లిగారి ఊరు – ఒకవైపు మెట్టినిల్లు – రెండో వైపు పుట్టినిల్లు.

ఎడ్లు నిలబడిపోయినయి. అడ్డబాటపై... ప్రకృతి పిలుపులు (నేచర్ కాల్స్) – ఆ పిలుపులకు ప్రతిచర్యగా, ధారగా లయ బద్ధంగా వాటి మూత్ర విసర్జనం – నిశ్శబ్దాన్ని ఛేధిస్తూ. ఆ విరామంలో ఇద్దరూ తమ తమ ఆలోచనలకు పదును పెట్టుకోసాగారు.

భార్య మాటల్లో జీవిత సత్యాలను ఖండించిలేని అశక్తత – అతనిది.

ఆ మాటల్లో....జీవిత అనుభవాల వడపోత....తమ మనుగడలో అడుగడుగునా పొడసూపే ఆర్థిక అభద్రత. తమ భౌతిక జీవనంలోని ఒడిదుడుకులు – ఆకస్మిక పరిణామాలను గూర్చిన ఖచ్చితమైన అంచనా. ప్రాథమిక అవసరాలకు, విలాసాలకు మధ్యనున్న విభజన రేఖను స్ఫురింపచేసే విశ్లేషణ....అన్నీ తీసిపారేయాల్సిన విషయాలు కావు....కానీ....కానీ సెల్‌ఫోన్ కోరిక....నయంకాని సుఖవ్యాధిలా వెంటాడుతోంది. కోరిక తీర్చుకోవాలనే పట్టుదల – విక్రమార్కుని భుజాలపై కూర్చున్న బేతాళుడిలా ఉంది.

భార్య వంక చూశాడు. నిలబడే ఉంది....ఆగని కన్నీళ్ళు.

ఆమెను తన దారికి తెచ్చుకొనే వ్యూహంలో భాగంగా కొత్తపల్లివి ఎత్తుకొన్నాడు.

"మల్లవ్వా....దేనికే ఏడుపు....మనిషి సచ్చిపోయినట్టు...నువ్వు సుతా ఆలోసించు.... మనూళ్ళో సెల్‌ఫోన్ లేనిదెవరికో సెప్పు.... సుతారీ (తాపీ మేస్త్రి) రాజమల్లుకు సెల్లు...మంగలి లస్మయ్యకు సెల్లు....కమ్మరి బెమ్మయ్య కొడుకు ఈరాచారికి సెల్లు...ఇటుక బట్టీలు పెట్టే మాదిగ ఎంకటయ్యకు సెల్లు....ఏ వాడకు పోయినా ఆడా మొగా తేడా లేకుండా 'హల్లో'... 'హల్లో' – అని చెవులకాడ పెట్టుకుంటంటే....నాకు సెల్లులేదంటే. నా ఇజ్జత్ పోతంది....మన బతుకు...ఎక్కడ వేసిన గొంగడి అక్కడే....మనం డెవలప్పయ్యేది ఎప్పుడు...?" – సెల్లు లేకపోవటం, తమ పరువు ప్రతిష్టలకు సంబంధించిన విషయమని, పోల్చి పోల్చి చెప్పాడు.

ఆమె ఉలక లేదు. పలక లేదు. రెప్పకొట్టని చూపులు. నిప్పులు చిమ్ముతూన్న చూపులు. ఆ చూపులు తట్టుకోలేని అతడు ఆకాశం వంక చూవాడు. చందమామ ముఖం చాటు చేసి మబ్బుచాటు కెళ్ళింది. ఆమెకు ఎలా నచ్చచెప్పాలో పాలుపోక ఆలోచనలతో సతమతమౌతూ దిక్కులు చూడసాగాడు.

"అవ్వా....ఇయ్యాల....రేపు...(నౌ ఎ డేస్)..." – మాటలు పూర్తి చెయ్యలేకపోయాడు.

..................

ఆధునిక యుగంలో...అవి కనీస అవసరాలని చెప్పలేని ఆశక్తత 'సమాజం'లో నాగరికులుగా చెలామణీ కావటానికి అవి ప్రాథమిక అర్హతలని చెప్పలేని నిస్పహాయత. స్టేటస్ సింబల్స్‌గా గుర్తింపు పొందిన వస్తువాహనాలపై లెక్కరివ్వలేని నిరక్షరాస్యత.

"ఇయ్యాల....రేపు...." – అని ....మాటలు రాక – మాటలు తెలియక, వ్యాక్యాల్ని పూర్తిచెయ్యలేకపొయ్యాడు.

ఆమె 'గభీ' – మని బండి దూకింది.

"అవతలికి పోతావా?...." – అంటూ బండి దిగాడు.

"................."

"పోవా?......మరి....బండెందుకు దిగినావ్...?"

"పోను....ముందు నాకీ సంగతి సెప్పు....డెవలప్పు....డెలవప్పని లొట్టి మీద కాకి లెక్కన వొ(్రుతున్నవ్ కానీ.... డెవలప్పంటే.... అప్పులూ సొప్పులూ లేకుండా బతకటమే – డెవలప్పు – ఎరికయ్యిందా?... ముడ్డి సుట్టూ అప్పులు పెట్టుకొని... సెల్‌ఫోన్లు, కలర్ టీ.వీ.లు కొనుక్కొంటే డెవలప్పు కాదు....సోయి లేకుండా మాట్లాడకు...." నిశ్చలమైన కంఠంతో తీవ్రంగా హెచ్చరించింది – మరో ప్రశ్నకు తావివ్వకుండా.

చుట్టూ పరికించి చూశాడు.

మలమూత్ర విసర్జన చేసిన ఆ వృషభ ద్వయం కుడివైపు బాట పడ్డాయి. అలవాటు పడిన ఇంటి దారి. పగలంతా – ఆకలితో, దప్పికతో ఆర్లాడిన ఆ మూగజీవులు, మేత కోసం నీళ్ళ కోసం తపిస్తూ యజమానులను విస్మరించి ముందుకు పోసాగాయి.

"ఎడ్లు ఆగడం లేదు...మనం ఇంటికి పోయినాంక....అన్నీ...పద" – బ్రతిమాలాడు.

"సెల్లుగానీ...కలర్ టీ.వీ.గాని కొనని నాకు మాటివ్వు.... ముందు... అట్టయితేనే ఇంటికొత్తా...ఈ రోజు నాల్గు పైసలు మిగిలినవని ఎగాదిగా కరుసుపెట్టుకొంటే ఎట్టా నయ్యా"... కండిషన్ పెట్టింది.

"హో..వ్వ"...ఎడ్ల వంక చూపు తిప్పుకున్నాడు. పెద్ద గొంతుతో అతని హెచ్చరిక. హెచ్చరికను లెక్క చెయ్యని ఆ నందీశ్వరులు ముందుకు సాగిపోసాగాయి – వడి వడిగా.

ఆమె ఇంకా మాట్లాడుతూనే ఉంది....

"ఇగో...నా బొండిగ (కంఠం)సూడు. నా మెడలో తులం బంగారం లేదు...నా లగ్గం అయినప్పటి నుంచీ ఇదే నల్లపూసల పుస్తెల తాడు....నేను ఈ పైసలతో సెంద్రఆరం చేయించుకుంటానన్నానా?...నక్లీసు చేయించుకుంటానన్నానా?" అంటూ నిద్రాణమై ఉన్న తన కోర్కెలను అస్పష్టంగా బయట పెట్టింది.

అతని కోర్కెలతో పోల్చి చేసిన ఆ విశ్లేషణ అతనికి కోపం తెప్పించింది. ఇంటి యజమానిగా, తన చేతిలో ఉన్న సాంప్రదాయక ఆయుధం చేతబట్టాడు....

"నేను మొగోడ్ని" – అన్నాడు.

....నేను సాకిరీచేసి, కుటుంబాన్ని సాకేటోడ్ని....మండుటెండలో పార బట్టుకొని మడి నుండి మడికి నీళ్ళు పారించినవాడ్ని – అద్దరేత్రనక, అమావస్యనక, కరెంటు కోసం, బాయి కాడికి పోయినోడ్ని...నా రెక్కల కట్టంతో కుటుంబాన్ని సాదేటోడ్ని నేను. రేపు

అప్పయినా, గప్పయినా తీర్చుకునే వాడ్ని నేను. నా ఇష్టం...నా పైసలతో నేను ఏమన్నా చేసికుంటా...నువ్వెవలవే? నాకు ఎదురు సెప్పటానికి...ఆడదానివి...." – అంటూ ఆవేశపడసాగాడు.

"నేనెవల్లనా?...నేనెవల్లనో నీ కెరికలేదా?...మంచిగ మాట్లాడు...కోడికూతతో నీకన్న ముందు నిదర లేసినదాన్ని. కొట్టంలో పెండకళ్ళ తీసినదాన్ని. బర్రెల పాలు పిండిన దాన్ని. ఎసట్లో బియ్యం పోసి ....గస బోసికొంటూ (ఆయాసంతో రొప్పుతూ) నీ కోసం తొక్కు నూరిన దాన్ని. అంబటేల దాటి పోయిందని, మొగుడు ఆకలితో అల్లాడిపోతాడని ఉరుకులు, పరుగులుతో నీకు సద్దిగిన్నె తెచ్చిన దాన్ని....నువ్వు సద్ది తింటాంటే, కరెంటు పోతదని పార బట్టుకొని నీల్లు....మళ్ళల్లోకి తిప్పిన దాన్ని...నువ్వు నన్ను సాకుతున్నావా?...ఈ పైసలు నీ రెక్కల కట్టమా? – అయితే తీసుకో...." అంటూ బొడ్లో దోచిన గుడ్డసంచి పైకిలాగి నేలపై విసిరి కొట్టింది.

"నీయవ్వ...పైసలు నేల మీద పారేత్తవా?...ఎంత పొగరే" – అంటూ చెయ్యి పైకెత్తాడు. అసంకల్ప ప్రతీకార చర్య. ఉద్దేశరహిత సహజాతం.

"ఏంది...కొడతావా?...కొట్టు..." – అని రెట్టించింది. ఆత్మాభిమానంతో కూడిన ప్రతి ఘటన. రాలిపోతూన్న పమిట చెరుగు నడుంకు దోపుకొని నిటారుగా నిలబడ్డది. శరీర కష్టం స్ఫురింపచేసే అంగసౌష్టవంతో.

"చేసింది తప్పు....మల్లా మాట్లాడతావ్?"....అంటూ చెంపపెట్టు పెట్టాడు.

బుసబుస పొంగి వస్తూన్న దుఃఖం – కోపంతో ఊగిపోతూన్న మల్లమ్మ అతని ముంజేతిని పట్టుకొని మణికట్టును గట్టిగా కొరికింది.

"ఆం...ఆం" – అంటూ చేతిని విదుల్చుకోసాగాడు.

మళ్ళీ కొడతాడేమోననే భయంతో ఆమె పరుగు లంకించుకుంది. చూస్తూ చూస్తుండగానే అతనికి అందనంత దూరం ఉరికి ఒక్క క్షణం ఆగి వెనక్కి తిరిగి చూస్తూ –

"ఇగ్గో – నేను మా తల్లిగారింటికి పోతన్నా...నువ్వు దేనికోసం దెబ్బకొట్టావో తేలుస్తా... పెద్దమనుషుల ముందు పంచాయితీ పెట్టి నీ సంగతి తేలుస్తా!...నేనేం తప్పు చేశాను దెబ్బ కొట్టటానికి నువ్వు..." అంటూ చీరెను గిలకలపైకి లాక్కుని గతగతా ఉరక సాగింది

ఆమె...

కాలి కడియాలు వెన్నెల్లో ధగధగ మెరవసాగాయి. 'కణ' 'కణ' మని శబ్దం చేస్తూ దూరంగా పోసాగాయి.

ప్రశాంత ప్రకృతి. ఎండిపోయిన కొమ్మపై కూర్చొని గూడు విడిచిన ఒంటరి పక్షి తన తోడు కోసం కూ...కూ...అని అరుస్తోంది. తన వద్దకు రమ్మని పిలిచే సంకేతాలు – ఆ అరుపులు.

ఇటు.....ఎడ్లు

అటు........భార్య

అతను...దిక్కుతోచక, ఒంటరిగా....అడ్డబాటపై....

✡

వారం రోజులు గిర్రున తిరిగిపొయ్యాయి. తల్లిగారింటికి పోయిన మల్లమ్మ, అజా పజా లేవు. తానే స్వయంగా ఆ ఊరు పోయి రమ్మని బతిమాలితే, మరీ లోకువైపోతానని అభిమానం అడ్డుగా నిలువ సాగింది. భార్యను గూర్చిన ఆలోచనలతో సతమతమౌతూ, తన రోజువారీ పనులు ప్రారంభించాడు...

ఆ రోజు.

పాలు పిండి, పాలకేంద్రంలో పోసిరావటానికి, తపేలా అందుకున్నాడు. పొదుగుపై నీళ్ళు చల్లి....చెయ్యి పెట్టగానే ఎగిరి తన్నింది. వెన్ను నిమిరి, వీపు గోకి మళ్ళీ కూర్చున్నాడు. గుండ్రంగా తిరుగుతూ చిందులు తొక్కసాగింది.

"నీయవ్వ...పచ్చిగడ్డి మేపితే తప్ప పాలియ్యవన్నమాట....పచ్చిగడ్డి కోసుకొచ్చేది... అది... దాని తల్లిగారింటికి పోయింది... నువ్వు సుతా ఆ ఊరెల్లిపో"....అంటూ దాని వీపుపై ఒక్క పెట్టు పెట్టాడు తాటిమట్టతో.

భార్యను గూర్చిన ఆలోచనలు మళ్ళీ ముసురుకోసాగాయి.

'....ఆమె లేకపోతే బర్రె పాలియ్యదు. ఆమె వెళ్ళిపోయిన ఈ వారం రోజుల్లో ఇల్లంతా బోసిపోయింది. ఇంట్లో దీపం ఆరిపోయినట్టుగా అయింది. దాని పుట్టింటికి పోయి రమ్మని బుజగరిస్తే వెంటబడి వస్తది....కానీ అక్కడ దాని అన్నదమ్ములు – నలుగురు.

"మా చెల్లెలిపై ఎందుకు చెయ్యి చేసుకున్నా"వని ....మీసాలు మెలివేస్తారు – బావ మరుదులు.

"నా బిడ్డను కొట్టి – ఎందుకు ఎల్లగొట్టావ్?...ఏం తప్పు చేసిందని..." – మామ తన ముంజేతి వెండి మురుగులు పైకి నెట్టుకుంటూ నిలదీస్తాడు – ఆ ఊళ్ళో వాళ్ళను తట్టుకోవటం

చాలా కష్టం....అందువలన ఈడ నుంచి నల్గురు పెద్దమనుషులను వెంట తీసుకుపోవాలి కల్లు..సారా...తాగిపించి....అనుకుంటూ పచ్చిపులుసు చింతకాయ పచ్చడితో తిండి ముగించాడు.

గడాంచా (ఇనుప తీగెలతో అల్లిన – తుమ్మ కట్టె మంచం) వాల్చుకొని నడుం వాల్చాడు. బయట ఎండ తీక్షణత. తన మనసులో ఆలోచనల తీక్షణత. బయట ఎండ తాపాన్ని తట్టుకోలేని రైతులు ఇళ్ళకు చేరుకుంటున్నారు. చెలకలలో ఎరువు తోలుతూన్న ఎరువు బండ్లు చెట్ల క్రింద ఆగిపోయినయి. చెట్లపై చేరిన కాకులు నోళ్ళు వెళ్ళబెడుతున్నాయి. జంగలికి పోయిన బర్రెలు ఇళ్ళకొచ్చి గోళాలపై బడుతున్నయి. నిద్రపట్టని వీరారెడ్డి లేచి పుచ్చ చేని వైపు నడిచాడు – నీళ్ళ కోసం.

గాలి స్థంభించింది.

సూర్యుడు నిప్పులు చెరిగిపోస్తున్నాడు. సూర్యబింబం క్రింద కొండలు, గుట్టలు – గుట్టలపై నల్లని మేఘాలు...ఆకాశపుటంచులవరకూ వ్యాపించిన ఆ మేఘాలు ఒక దానిని మరొకటి తరుముకుంటూ వస్తున్నాయి. గుట్టలను 'ఢీ' కొంటున్నాయి.

నల్లని మేఘాలు సూర్యుని కప్పిపారేశాయి. పట్టపగలే మెరుపులు – గాలిలో తిరిగే గడుసు దయ్యాలు పళ్ళికిలించినట్లు. ఆకాశాన్ని చించి ముక్కలు ముక్కలు చేస్తూన్న మెరుపులు.

అప్పటి వరకూ స్థంభించిన గాలి – దెబ్బతిన్న తాచులా పడగ విప్పింది. దుమ్ము, ధూళి, ఆకు అలంతో కూడిన సుడిగాలి. గుండ్రంగా తిరుగుతూ, సుడులు, సుడులుగా పైకిలేస్తూ కుప్పకూలుతూన్న సుడిగాలి. సుడిగాలిని చుట్టుముడుతున్న వడగాలి.

ఆ సుడిగాలి నుండి టపటప రాలుతున్న చినుకులు.

"సుడిగాలికి కాలు నిలబడక, నిలబడిన చోటులోనే మునిగాళ్ళపై కూర్చున్నాడు – కళ్ళు మూసికొని. కూర్చున్న అతనిపై పెద్ద పెద్ద చినుకులు – ఆ చినుకులతో పాటు వీపును బాదుతోన్న రాళ్ళు – తెల్లని కొవ్వురాళ్ళు – వడగళ్ళు. ఆకాశం నుంచి దూసుకువస్తున్న మంచు ముక్కలు.

రక్షించుకోటానికి చేతులు తప్ప వేరే ఆధారం లేదు. రెండు చేతులతో ముఖం కప్పుకున్నాడు. గాలి ఉధృతిని, వడగళ్ళ ధాటిని తట్టుకోలేని నిస్సహత...మెల్లగా లేచి, కాలు నిలదొక్కుకుంటూ బావి ప్రక్కనున్న కరెంటు స్థంభం వద్దకు నడిచాడు.

ఘనీభవించిన వర్షం....చలి....చలి...వెన్నుపూస నుండి వణుకు. కరెంటు స్థంభం ప్రక్కన నక్కి తలను స్థంభానికి మోటించి మునిగాళ్ళపై కూర్చున్నాడు.

తరుముతూన్న గాలి....గాలిని తరుముతూన్న వడగళ్ళు.

వీపంతా పచ్చడి – పచ్చడయింది. నొసటి నుండి కారుతున్న వర్షపు ధారను చేతితో తుడుచుకుంటూ, స్థంభం చాటుగా పుచ్చ చేనును పరిశీలించాడు.

గుండెలు పగిలిపోయినయి.

పుచ్చచేని నిండా తెల్లని కొవ్వురాళ్ళు. మంచుగడ్డలు...ఇంతెత్తున పేరుకుపొయ్యాయి. తనను ఊరించి, ఊరించి, ఊగించిన పుచ్చకాయలు. వడగళ్ళ దెబ్బలకు తలలు పగిలిన పుచ్చకాయలు – లోపలి గుజ్జు బయటకొచ్చి రక్తసిక్తమై పొయ్యాయి – యుద్ధభూమిలో రక్తసిక్తమైన క్షతగాత్ర సైనికుల్లా.

ఆకాశాన్ని చీల్చిపారేస్తూ ఈ మూల నుండి, ఆ మూలకు మెరుపు – తన తలపై మెరుపు.

"ఢాం" – అంటూ పిడుగు – మెరుపు వెనక పిడుగు – లిప్తపాటులో – తన వేపచెట్టుపై చలి పిడుగు. చెవులు పగిలిపొయ్యేలా విస్ఫోటనం.

అప్పటి వరకూ...గాలితో, వర్షంతో పోరాడిన తన వేపచెట్టు, పూనకంతో, జడలు విరబోసుకొని గాలిలో ఊగిన తన వేపచెట్టు – నిలువుగా చనిపోయింది. నేలకూలి పోయింది... చీలి పోయింది – రెండు ముక్కలుగా.

విలయతాండవం చేసిన వర్షం – గాలి వెనక్కి తగ్గాయి. చిన్న చిన్న చినుకులు – జల్లులు.

కరెంటు స్థంభాన్ని విడిచి పెట్టాడు ఆ అల్పజీవి. గుండెలు బాదుకుంటూ, తడిసి ముద్దయిన నేలను కసా బిసా తొక్కుకుంటూ ఉన్మాదిలా...ఊరివైపు ఉరకసాగాడు.

✡

మరుసటి రోజు...

కోడికూతతో నిద్రలేచిన మల్లమ్మ. మెట్టినింటి తొవ్వ తొక్కింది. ఉరుకులు, పరుగులతో భర్త ఊరు చేరింది. ఆమె వెనుక తన బిడ్డ – ఏడెనిమిది సంవత్సరాల పిల్ల – కొత్తలంగా, జాకెట్టు, చెప్పులు లేని కాళ్ళతో పరుగులాంటి నడకతో – తల్లి వేగాన్ని అందుకోలేక, ఆమెను అనుసరించసాగింది.

పొద్దుపొడుపుతోపాటు, మల్లమ్మ తన ఊరు చేరింది.

నిన్నటి వడగళ్ళ వానతెచ్చి పెట్టిన ఉపద్రవం – బీభత్సం చూస్తూ తన ఇంటివైపు నడక సాగించింది.

విరిగిపోయిన వేపకొమ్మలు....వంగిపోయిన కరెంటు స్థంభాలు, తెగిన తీగెలు ...పైకప్పు లేచిపోయిన ఇళ్ళు....వర్షానికి నాని నాని కూలిపోయిన గోడలు. వరద వలన పేరుకు పోయిన చెత్తా చెదారం – పెంటకుప్పలు. ఊరంతా మురికి – గబ్బు.

ప్రతి గడపకు అశ్రుతోరణాలు వేలాడుతున్నాయి.

తడిసిపోయిన ధాన్యం కల్లాలు – వాటిని చూసి దిగాలుపడుతూన్న అన్నదాతలు, బండ మీద పోసిన మొక్కజొన్న కంకులు – మొలకలెత్తినయ్యన్న ఏడుపులు. వానకు, దరి, నాని నాని కరెంటు మోటర్ బావిలో పడ్డదన్న ఆర్తనాదాలు.

ఆమె రాకను ఎవరూ గమనించలేదు. గమనించే పరిస్థితి లేదు – ఎవరి దుఃఖం వారిది. ఎవరి బాధలు వారివి...ఇంకొకరి

దుఃఖం ఓదార్చే తీరికలేని తన తోటి పల్లెవాసులు.

దుఃఖం....

నెత్తి కొట్టుకోవటం, రొమ్ములు బాదుకోవటం – కన్నీళ్ళతో నేలను అలకటం... మొదలైన బాహ్య రూపాలతో తన ఊళ్ళో తిష్ఠ వేసింది.

వీధిలో నిలబడి తన ఇంటిలోకి చూపులు సారించింది.

పంచపాళిలో 'గడాంచా' మంచం – మంచంపై పరచిన వరి గడ్డిపరకలు. వాటిపై షోలాపూర్ బొమ్మల చద్దర్ (దుప్పటి)...చద్దర్‌పై రోగి. అటువైపు గోడవైపు తిరిగి పడుకున్నారు. రోగి వీపు నిండా ఎండిపోయిన రక్తపు చారికలు. వాటిపై తెల్లగా అద్దిన సున్నపు పూతలు – పసుపు అద్దిన గాయాలు. ప్రథమ చికిత్స తాలూకు చిహ్నాలు. లిప్తపాటులో ఆ రోగిని పోల్చుకుంది.

నెత్తి బాదుకుంటూ – విసరుగ్గా లోని కెళ్ళింది. పాదాల సవ్వడి విన్న అతను ఇటు తిరిగాడు. వెల్లికిలా....

"పాపిష్టిదాన్ని నేను...బాంచెను...నిన్ను వొదిలిపెట్టి పోవటం నా తప్పు...నేనుంటే ఇంత గోరం జరిగేది కాదు...నేనుంటే నిన్ను బాయి కాడికి పోనిచ్చేదాన్ని కాదు...ఈ దెబ్బలేంది?.." – అంటూ గాయాలను తడుముతూ, అతని మీద పడి గుండెలవిసిపొయ్యేలా ఏడ్వసాగింది.

గుండెమంటలారిపే కన్నీళ్ళు అతని ఛాతిపై ఇంకిపోసాగాయి.

"ఊకోవే...ఊకోవే...." – అంటూ ఆమె తలను తన ఛాతిపై పెట్టుకొని తలను నిమర సాగాడు. మంచంపైన ఏడుస్తున్న తల్లిదండ్రులను చూస్తున్న బిడ్డ – బిగ్గరగా ఏడ్వసాగింది.

ఏడుపు –

అందరికీ తెలిసిన భాష – లిపి లేని భాష – విశ్వవ్యాపితమైన భాష – హృదయమున్న ప్రతిదానిని ఏడిపించే భాష – దుఃఖానికి మాధ్యమంగా ఏడుపు భాష.

ఆ ఏడుపులు విన్న ఇరుగూ పొరుగూ ఒక్కొక్కరూ ఆ ఇంటిలో చేరసాగారు. సానుభూతిగా వాళ్ళ ఏడుపులు – మౌనంగా వాళ్ళ ఏడుపు – సామూహిక దుఃఖం.

ఆ మౌనాన్ని ఛేదిస్తూ...."ఊకోవే...మల్లవ్వా...బిడ్డా...నువ్వంటే మాత్రం ఏం సేత్తావ్? వాన పాడుగాను....అక్కెర బడ్డప్పుడు కురిసి సావదు....అక్కెర లేనప్పుడు ఇయ్యర – మయ్యర సంపి నాశనం చేస్తది....చెడగొట్టు వానలని...మన పెద్దలు సెప్పినవి ఇవే..." వయస్సు మళ్ళిన రఘుపతి, మల్లమ్మ తలపై చెయ్యివేసి నిమురుతూ అన్నాడు.

"వాన పాడుగాను....దొంగోడొచ్చినట్టు వొచ్చింది....ఏ టీ.వీ. వాళ్లూ సెప్పల – ఏ పేపరోళ్లూ రాయల" – పొరుగింటి మాలక్ష్మి.

"పాపం – ఈరన్న...సంటి పిల్లల్ని సాకినట్లు సాకిండు పుచ్చకాయిల్ని....నాల్గు నెలలు...కొసాఖరికి ఇది ఫలితం....ఆడి సాకిరీ, అంతా మట్టిపాలయింది. దిక్కుమాలిన వడగళ్ళు....ఇందులో ఎవుర్ననేదేముంది? – మన రాత' – నొసలు కొట్టుకున్నాడు మరొక పెద్దమనిషి.

"అవునే....నాన్నా....ఇందులో ఎవుర్ననేది ఏముంది? దేవుడు....పాపకారి దేవుడు. ఆయనే మా నోట్లో మన్ను బోసిండు...ఈ ఏడాది అప్పులు తీరతయి... వచ్చే ఏడాదికి పెట్టుబడికి, సేతిలో నాల్గు పైసలు మిగుల్తయని ఆశపడ్డాం....నా బిడ్డ నోట్లో మన్ను బోసిండు" – మరొక్కసారి ముక్కు చీదుకుంది.

"ఊరుకో...ఊరుకో...ఏడిసి మొత్తుకుంటే ఏం లాబం...పదిమందితో సావు పెళ్ళితో సమానమన్నారు పెద్దలు. ఒక్క మన ఊరి మీదనే పడలేదుగా వడగళ్ళు...దేశమంతా, ఇటు గొరెల్లి నుండి జిల్లేళ్ళ గడ్డదాకా....అటు వంగర గుట్టల దాకా....ఒకటే రాళ్ళు"

"ఇక వరిపొలాల సంగతి వింటాంటే....గుండెలు అవిశిపోతయి...నోటికాడి కొచ్చిన వడ్ల పంట – గాసం (ఆహారం) ఈ పున్నమి దాటితే వరికోత పడదామనుకుంటూంటే... అంతలోనే ఈ వాన...మల్లవ్వా...బిడ్డా! – నువ్వు గడియకొకసారి 'పాపకారి దేవుడు...పాపకారి దేవు'డంటే నాకు మంచిగనిపిస్తలేదు బిడ్డా....అడుగు తప్పితే పిడుగు తప్పుతుందన్న మాట నీ మొగని విషయంలో సత్తెం...నిన్న ఆ పిడుగు మీ సెట్టు మీద పడ్డది....ఆయాలకు ఆడు సెట్టు కింద నిలబడి ఉంటే ఏమయ్యేదో నీ బతుకు.... నీ నల్లబూసలు మట్టిలో కలిసి పొయ్యేవి.... తొందరపడి భగమంతుడ్ని 'ఆడు – ఈడ' ని నోరు పారేసుకోమాకు" అన్నాడు ఊరిపెద్ద రఘుపతి.

ఆ మాటలు విన్న మల్లమ్మ ఉలిక్కి పడ్డది – తన మీద పిడుగు పడ్డట్టు.

మస్తిష్కంలో హై వోల్టేజి...ఆ మాటలన్న పెద్దమనిషి ముఖంలోకి తత్తరపాటుతో చూసింది. గబగబా లోనికెళ్ళి అద్దంలో చూసుకుంది.

ఏడ్చి – ఏడ్చి జిడ్డుకారుతూన్న ముఖం. కనుబొమల మధ్యలోని కుంకుమ పక్కకు గీతలా చెదరి పోయింది. పమిట చెరుగుతో ముఖాన్ని శుభ్రంగా తుడుచుకొంది. భరిణిలోనున్న కుంకుమ తీసుకొని గుండ్రంగా బొట్టు దిద్దుకుంది.

ఉదయిస్తూన్న సూర్యబింబంలా గుండ్రని బొట్టు, ముఖానికి నూతన కాంతి తెచ్చిపెట్టింది. పసుపు తాడును బయటికి తీసి తాళిని రెండు కళ్ళకు అద్దుకుంది.

బొట్టు పెట్టెను తనాభి(గోడలో అమర్చిన చెక్క అల్మారా)లో పెడుతున్నపుడు – తన చీర మడతలలో దాచిన తన గుడ్డ సంచి చేతికి తగిలింది – ఆ రోజు రాత్రి తాను నేలకేసి కొట్టిన సంచి. మట్టి కొట్టుకొని ఎర్ర మన్నుతో ఉంది. సంచిపై తాను బిగించిన ముడి – అందులోని, నోట్లూ – చిల్లర యధాతతంగా ఉన్నాయి.

ఆ గుడ్డ సంచిని కళ్ళ కద్దుకుంది.

సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బైపోసాగింది.

✡

రైతు లెక్క జూస్తే
ముల్లుగర్ర కూడా
మిగలదు.